గోడలేని బడి.. వినపడదా గోడు

విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తామని నాడు-నేడులో పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మిస్తామని చెప్పిన జగన్ ప్రభుత్వం అంతా బాగున్న బడులకే నిధులు మంజూరు చేసింది. శిథిలావస్థకు చేరిన పాఠశాలల భవనాలను విస్మరించింది. ఫలితంగా లోతట్టు ప్రాంతాలతోపాటు మండల కేంద్రాలకు సమీపంలోని పలు పాఠశాలలు పూరిపాకలు, రేకుల షెడ్లలో నడుస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన రంపచోడవరానికి 2.5 కి.మీ. దూరంలో బొర్నగూడెం గ్రామం ఉంది. ఇక్కడ గిరిజన ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలమైంది. స్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో విద్యార్థుల తల్లిదండ్రులు పూరిపాకను ఏర్పాటు చేశారు. ఇందులోనే ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజనమూ ఈ పాకలోనే చేయాల్సి వస్తోంది. వర్షాకాలం కావడంతో తరగతుల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎండ కాస్తే తరగతులు నిర్వహించడం, వర్షం కురిస్తే సెలవు ప్రకటించాల్సి వస్తోంది. పక్కా భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఐటీడీఏ అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ వానాకాలం చదువులు ఇంకా ఎన్నాళ్లని ప్రశ్నిస్తున్నారు.

– న్యూస్‌టుడే, రంపచోడవరం

పూరిపాకలోనే తరగతుల నిర్వహణ

ఇకపై సేవలన్నీ ఒకేచోట

గిరి గ్రామాల్లో బహుళ సముదాయ కేంద్రాలు

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో ఏళ్లుగా చిన్నారులు పడుతున్న కష్టాలకు కేంద్ర ప్రభుత్వం చెక్ పెట్టింది. విద్య, అంగన్‌వాడీ, వైద్య సేవలు పొందేందుకు ఇన్నాళ్లు ఇంటి వరండాలు, పూరి పాకలే దిక్కయ్యేవి. కూటమి ప్రభుత్వం చొరవతో పీవీటీజీ గ్రామాలకు బహుళ సముదాయ కేంద్రాలు మంజూరయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 125 కేంద్రాలు మంజూరు కాగా అల్లూరి జిల్లాలో 66 కేంద్రాలకు రూ.43.56 కోట్లు కేటాయించారు. వీటిలో పాడేరు డివిజన్‌లో 35, రంపచోడవరం డివిజన్‌లో 31 ఏర్పాటు కానున్నాయి. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు రూ.60 లక్షల చొప్పున ఖర్చు చేయనున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తికాగా త్వరలోనే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది.

కష్టాలకు చెక్: అభివృద్ధికి దూరంగా ఉన్న గిరిజన తండాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిసారించాయి. రోడ్డు, రవాణా సదుపాయాల్లేని ఆదివాసీ పల్లెలకు విద్య, వైద్యం, ఇతర సేవలందించాలంటే ఎంతో కష్టంగా ఉండేది. ఆయా గ్రామాల్లో మౌలిక వసతుల్లేమితో పూరి పాకలు, వరండాల్లోనే సేవలందించాల్సి వచ్చేది. కొన్నిచోట్ల పూరి పాకలూ లేక చెట్టు, పుట్టను ఆశ్రయించాల్సి వచ్చేది. బహుళ సముదాయ కేంద్రాల ఏర్పాటుతో అంగన్‌వాడీ, విద్య, ఆరోగ్య సేవలు ఒకే చోట అందనున్నాయి. గ్రామసభల నిర్వహణ, డ్వాక్రా, మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించేందుకూ వీలుగా వీటిని నిర్మించనున్నారు. ఈ కేంద్రాలన్నీ ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరుకు అందుబాటులోకి వచ్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

చింతూరు చేరాలంటే చింత

రెండు రాష్ట్రాలను చుట్టిరావాల్సిందే..!

చింతూరు, న్యూస్‌టుడే

ఒడిశా - ఆంధ్రప్రదేశ్‌ను అనుసంధానం చేసే జాతీయ రహదారి వర్షాలకు చిత్తడిగా మారింది. అడుగు తీసి వేయలేనంత అధ్వానంగా ఉంది. మూడేళ్ల కిందట రహదారి విస్తరణ పనులు చేపట్టారు. అప్పటికే ఉన్న ఏడు మీటర్ల రోడ్డును నిబంధనల ప్రకారం పది మీటర్ల వెడల్పుతో చేపట్టిన విస్తరణ ఇప్పటికీ పూర్తి కాలేదు.

వర్షాలకు చిత్తడిగా జాతీయ రహదారి

★ చింతూరు మండలం ఎర్రంపేట నుంచి ఒడిశాలోని మోటు గ్రామానికి ఈ రహదారి మీదుగానే వెళ్లాలి. కల్లేరు పంచాయతీ కుయిగూరు, కల్లేరు, సూరన్నగొందితోపాటు పలు గ్రామాల ప్రజలు చింతూరు రావాలన్నా ఈ దారే దిక్కు. విస్తరణ పనులు కొలిక్కి రాకపోవడంతో రహదారి రాకపోకలకు వీలుగా లేదు. భారీ వాహనాలు మినహా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు ముందుకు సాగే పరిస్థితి లేదు. ఎర్రంపేట నుంచి కల్లేరు వరకు 14 కి.మీ. విస్తరణ పూర్తికాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. 'ఈ ఏడాది జనవరిలోగా పనులు చేయాల్సి ఉండగా.. 2026 మార్చిలోగా పూర్తి చేసేలా గుత్తేదారు అనుమతి పొందారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చిత్తడిగా ఉన్న చోట మెటల్ వేసి రోలింగ్ చేయిస్తా'మని జాతీయ రహదారి విభాగం ఏఈ చక్రవర్తి చెప్పారు.

★ **ఆటోకు రూ.వంద ఇచ్చి వస్తున్నాం:** కల్లేరు నుంచి చింతూరు రావాలంటే ఒడిశాలోని మోటు, ఛత్తీస్‌గఢ్‌లోని కుంట మీదుగా సుమారు 22 కి.మీ. ప్రయాణించాల్సి వస్తోంది. జాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే 6 కి.మీ. ప్రయాణిస్తే చింతూరు చేరుకోవచ్చు. రహదారి విస్తరణ పనులు పూర్తికాకపోవడం, వర్షాలకు దారంతా చిత్తడిగా మారడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లు బురదలో కూరుకుపోతున్నాయి. నిత్యావసర సరకులు, వైద్యం కోసం చింతూరు రావాలంటే ఆటో ఛార్జిగా రూ.వంద చెల్లించి చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. **– అరుణ, సుశీల, కల్లేరు**

ముంపులోనే గండిపోశమ్మ ఆలయం

జలదిగ్బంధంలో ఆలయ మండపం

దేవీపట్నం, న్యూస్‌టుడే: గోదావరి నీటిమట్టం గండి పోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం నుంచి స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. వరద తగ్గినా ఆలయం ముంపులోనే ఉంది.. మైదాన ప్రాంతాల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు కొండపై నుంచే అమ్మవారిని దర్శించుకున్నారు. డి.రావిలంక - దండంగి గ్రామాల మధ్య వరద ఉద్ధృతి కొనసాగుతోంది. అమ్మవారి ఆలయం రేవు నుంచి మూడు బోట్లలో 120 మంది పర్యాటకులు పాపికొండల విహారయాత్రకు వెళ్లారని కంట్రోల్ రూం అధికారులు తెలిపారు.

గో'దారి' చూసుకుంటున్నారు!

కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు, గోదావరి, శబరి నదులకు పోటెత్తుతున్న వరద కూనవరం వాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వరద ముంచెత్తితే బయటకు వెళ్లేందుకు దారులన్నీ మూసుకుపోతాయన్న భయంతో ముందుగానే సామగ్రిని ఎగువ ప్రాంతాలకు తరలిస్తున్నారు. రెండు రోజులుగా ఇళ్లలోని సామగ్రిని సర్దుకుని ట్రాక్టర్లపై ముంపు రహిత ప్రాంతాల్లో అద్దె ఇళ్లకు మారుతున్నారు.

– న్యూస్‌టుడే, కూనవరం

కూనవరం నుంచి సామగ్రితో వెళ్తున్న ట్రాక్టర్

పొల్లూరు పరవళ్లు

మోతుగూడెం, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు చింతూరు మండల పరిధిలోని పొల్లూరు జలపాతం కొద్దిరోజులుగా పరవళ్లు తొక్కుతోంది. సీలేరు నది నిండుగా ప్రవహిస్తోంది. శని, ఆదివారాల్లో సందర్శకుల రద్దీ పెరిగింది. ధారాలమ్మ పిక్నిక్ స్పాట్, పొల్లూరు ఎగువ, దిగువ జలపాతాలు, ఫోర్‌బే, పికప్, డొంకరాయి జలాశయాలు, విద్యుత్కేంద్రాల వద్ద సందర్శకులు సందడి చేస్తూ స్వీయ చిత్రాలు తీసుకున్నారు. జలపాతాలు, సీలేరు నదిలో జలకాలాడుతూ ఆనందంగా గడిపారు. అక్కడే సామూహిక భోజనాలు చేశారు.

యువతకు కువైట్‌లో ఉద్యోగావకాశాలు

అనకాపల్లి: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మెన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఏపీ (ఓఎంసీఏపీ) థట్ రుయా http://thatruya.com) భాగస్వామ్యంతో కువైట్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు తెలిపారు. సిరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్, సీలింగ్ వర్క్స్‌లో ఐటీఐ/డిప్లమో చేసిన వారు అర్హులన్నారు. 3-5 ఏళ్ల అనుభవం, 25 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న వారు ఈనెల 12లోగా http://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బయోడేటాను skillinternational@apssdc.in కు మెయిల్ చేయవచ్చన్నారు. వివరాలకు 99888 53335కు ఫోన్ చేయవచ్చన్నారు.

చదువు.. ఏదీ ఆదరవు?

మన్యంలోని చాలాగ్రామాల్లో పాఠశాలలు లేకపోవడంతో అక్కడి బాలలు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. వాగులు, వంకలు దాటుకుంటూ బడికెళ్లాల్సిన పరిస్థితి. పెదబయలు మండలం సీకరి పంచాయతీ కౌరుపల్లి గ్రామంలో సుమారు 35 కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ పాఠశాల లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలోని బందిగుంట పాఠశాలకు సుమారు 25 విద్యార్థులు వెళ్తున్నారు. మార్గమధ్యలో పొలాలు, గెడ్డలు దాటుకుంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల భారీ వర్షాలకు గెడ్డలు దాటేందుకు సాహసం చేయాల్సి వస్తోంది. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు కరవయ్యాడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, పెదబయలు గ్రామీణం

గెడ్డ దాటుతూ పందిగుంట పాఠశాలకు వెళ్తున్న కౌవురుపల్లి విద్యార్థులు

మూడు కి.మీ.లు నడిస్తేనే..

పైనంపాడు పంచాయతీ మూలపట్టంలో పాఠశాల లేకపోవడంతో ఇక్కడి విద్యార్థులు కాంగుపుట్టు గ్రామంలోని బడిలో చదువుతున్నారు. ఆరుగురు విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరం కొండమార్గంలో కాలినడకన బడికి చేరుకోవాల్సి వస్తోంది. వర్షాలకు చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి పరిష్కారం చూపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అనంతగిరి

నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

వాగులోకి మురుగు.. ప్రజారోగ్యం కనుమరుగు

ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వ శాఖలు ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి. ముందుచూపు లేకుండా అభివృద్ధి పనులు చేపడుతుండటం ప్రజలకు శాపంగా మారుతోంది. మంజూరైన నిధులను ఖర్చు చేయాలన్న ఆలోచన తప్ప.. భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందుల గురించి ఆలోచించడం లేదు. గ్రామాల్లోని మురుగునీరంతా కొండ వాగుల్లో కలిసేలా కాలువలను నిర్మించడమే ఇందుకు నిదర్శనం. కొండ వాగులపై ఆధారపడి తాగునీటి అవసరాలు తీర్చుకునే వారంతా నీరు కలుషితమై అనారోగ్యానికి గురవుతున్నారు. స్థానిక చెలకవీధితో పాటు గిరిజన సంక్షేమ బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల నుంచి వచ్చే మురుగునీరు పోయేందుకు ఇటీవల కాలువలు నిర్మించారు. మారేడుమిల్లి నుంచి వేటుకూరు వెళ్లే రహదారి కూడలి వద్ద ఉన్న వాగులో మురుగు కలిసేలా కాలువలు నిర్మించి వదిలేశారు. ఫలితంగా మురుగునీరంతా నేరుగా వాగులోకి వెళ్తోంది. ఆయా శాఖల అధికారులు స్పందించి వాగులో మురుగు నీరు కలవకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మారేడుమిల్లి

గిరిజన ఐక్య వేదిక అధ్యక్షుడిగా రామారావు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా **కొక్కుల రామారావు** ఎన్నికయ్యారు. గూడెంకొత్తవీధి మండలం లకవరపుపేటకు చెందిన ఈయన విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగం చేస్తూ పదవీవిరమణ చేశారు. గిరిజన ఉద్యోగుల సంఘంలో జిల్లా, రాష్ట్ర స్థాయి హోదాలో పనిచేశారు. విశాఖ ఎంవీపీ కాలనీలోని గిరిజన భవనంలో ఆదివారం ఐక్య వేదిక అధ్యక్ష ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా రామారావును ఎన్నుకున్నట్లు జాతీయ అధ్యక్షుడు వివేక్‌వినాయక్ ప్రకటించారు.

కనుమల్లో స్వర్గం.. కనుచూపుమేర సోయగం

చుట్టూ పచ్చని కొండలు.. మధ్యలో వరదనీటి ప్రవాహం మాచ్‌ఖండ్ ప్రాజెక్టు సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఏకధాటి వర్షాలకు మాచ్‌ఖండ్ జలవిద్యుత్కేంద్రానికి చెందిన డుడుమ జలాశయం నీటిమట్టాలు ప్రమాదస్థాయికి చేరడంతో వరదనీటిని కిందకు విడుదల చేస్తున్నారు. వడివడిగా పరుగులు తీస్తున్న వరదనీరు.. పచ్చదనం మధ్య ఇలా దర్శనమిస్తోంది. లోయలో ఒకవైపు విద్యుత్తు వెలుగులు ప్రసరింపచేసే మాచ్‌ఖండ్ జలవిద్యుత్కేంద్రం మరో అదనపు సోయగం. ఒనకఢిల్లీ నుంచి విద్యుత్కేంద్రానికి వెళ్లే మార్గంలో వ్యూపాయింట్ వద్ద కనిపించిన దృశ్యమిది.

– న్యూస్‌టుడే, ముంచంగిపుట్టు గ్రామీణం

విశ్రాంత ఉద్యోగుల సమావేశం 9న

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: విశ్రాంత ఉద్యోగుల జిల్లా స్థాయి సమావేశం ఈ నెల 9న పాడేరులో జరగనుంది. మోదకొండమ్మ కల్యాణ మండపంలో నిర్వహించే సమావేశంలో సంఘ అభివృద్ధి, భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించనునట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రొబ్బా నాగభూషణరావు, శ్రీహరిరావు ఆదివారం తెలిపారు.

ప్రసవాల నమోదు తప్పనిసరి

డుంబ్రిగుడ, అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆసుపత్రిలో జరిగే ప్రసవాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదుచేసి.. శిశువులకు జనన ధ్రువపత్రాలు అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విశ్వేశ్వరనాయుడు సూచించారు. డుంబ్రిగుడ పీహెచ్‌సీని ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, మందుల గదిని పరిశీలించారు. మలేరియా కేసుల నమోదుపై ఆరా తీశారు. ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు కచ్చితంగా అందుబాటులో ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అంతకుముందు అనంతగిరి పీహెచ్‌సీని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. మలేరియా నివారణకు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారిణి జ్ఞానేశ్వరికి సూచించారు. సీహెచ్‌డబ్ల్యూలను ఆశా కార్యకర్తలుగా మార్చాలని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు కోరారు.

అనంతగిరి పీహెచ్‌సీలో రోగితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విశ్వేశ్వరనాయుడు

(c) eenadu

పెన్సిల్ మొనలతో శ్వేతసౌధం



నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లుకు చెందిన సూక్ష్మ కళాకారుడు డాక్టర్ గట్టెం వెంకటేష్ తన ప్రతిభతో మరో మారు ఆకట్టుకున్నారు. అగ్రరాజ్యం అమెరికాలోని వైట్‌హౌస్ (శ్వేత సౌధం) నమూనాను పెన్సిల్ మొనలతో అద్భుతంగా మలిచారు. ఆ మేరకు 2 సెం.మీ. ఎత్తు, 4 సెం.మీ. వెడల్పున దీన్ని తయారు చేయడానికి మూడు గంటల సమయం పట్టినట్లు వెంకటేష్ చెప్పారు. – న్యూస్‌టుడే, నక్కపల్లి

సీతా'తోక'చిలుక

సాధారణంగా సీతాకోక చిలుకలు రంగులతో పెద్ద రెక్కలతో ఎగురుతూ అందరినీ ఆకట్టుకుంటాయి. నక్కపల్లి మండలం రేబాకలోని గూడుపమ్మ ఆలయం వద్ద తోకలా ఉన్న రెక్కలతో ఓ సీతాకోకచిలుక ప్రత్యక్షమైంది. దీన్ని అంతా ఆసక్తిగా తిలకించారు. – నక్కపల్లి, న్యూస్‌టుడే

ఉద్యాన రైతులకు తోడుగా..

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానానికి ఊతం ఇస్తున్న ప్రభుత్వం ఈసారి మరింత ప్రోత్సాహం అందించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం సామూహికంగా పండ్ల మొక్కల పెంపడానికి శ్రీకారం చుట్టనుంది. ఉపాధి ద్వారా పండ్ల తోటల పెంపకం ఏటా చేస్తుండగా, వివిధ రకాల మొక్కలు అందిస్తున్నారు. ఈ ప్రక్రియను ఒకేసారి చేయడం ద్వారా మరిన్ని సత్ఫలితాలు రాబట్టడానికి ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. సంబంధిత శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సామూహిక కార్యక్రమంగా చేపట్టాలని ఆదేశాలిచ్చారు. మూడు నెలలుగా అమలుపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. రైతులతో మాట్లాడి ఎక్కువ మంది మొక్కలు నాటేలా చర్యలు చేపట్టారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపి రెండు వేల ఎకరాలకు ఆమోదం తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం 1100 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు సన్నద్ధమయ్యారు. ఇలా చేయడం ద్వారా రైతుల్లో మరింత చైతన్యం పెరిగి పండ్ల తోటల పెంపుపై దృష్టి పెడతారనేది ప్రభుత్వ లక్ష్యం.

నర్సరీల్లో సిద్ధంగా వివిధ రకాల పండ్ల మొక్కలు

13 రకాల జాతుల మొక్కలు

రాష్ట్ర వ్యాప్తంగా 13 రకాల పండ్ల జాతులకు ప్రాధాన్యం ఇవ్వగా.. జిల్లాలో నేల స్వభావం, దిగుబడులు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని కొబ్బరి, మామిడి, జీడి, డ్రాగన్ ఫ్రూట్, సపోటా, బొప్పాయి, జామ, పామాయిల్, సీతాఫలం మొక్కలను కేటాయించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న 20 నర్సరీల్లో వీటిని సిద్ధంగా ఉంచారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారు.

రైతుల ఖాతాలకు నగదు జమ..: ఉపాధి పథకంలో పండ్ల తోటలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు తగ్గట్లుగానే ఏర్పాట్లు చేశారు. ఇక్కడ కేటాయించిన తొమ్మిది రకాల మొక్కల్లో రైతులు నచ్చినవి వేసుకుంటే, ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాన్ని వారి ఖాతాల్లో జమచేస్తాం. జిల్లాకు 600 ఎకరాలు లక్ష్యం కాగా, రెట్టింపుస్థాయిలో చేస్తున్నాం. కమిషనర్, కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశాం. – పూర్ణిమాదేవి, డ్వామా పీడీ

ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత ప్రవేశాలకు వేళాయే..!

నాలుగు కళాశాలల్లో మిగులు సీట్లు 600

వేంపల్లె, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు ట్రిపుల్ ఐటీలలో 600 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి విద్యార్థుల మెరిట్ జాబితాను తయారు చేసి ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి మొత్తం 4400 సీట్లు ఉన్నాయి. ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1100 సీట్లు ఉండగా దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ కోటా కింద 360 సీట్లు పోను నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1010 చొప్పున 4040 సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలలో ఉన్న సీట్లకు మెరిట్ జాబితా విడుదల చేసి జూన్ 30 నుంచి జులై 5వ తేదీ వరకు ఇడుపులపాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేశారు. కౌన్సెలింగ్ తర్వాత ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 878 సీట్లు భర్తీ కాగా 132 సీట్లు మిగిలిపోయాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలో 1010కి 869 భర్తీ కాగా 141 సీట్లు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 867 భర్తీ కాగా 143, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు 826 సీట్లు భర్తీకాగా 184 సీట్లు మిగిలాయి. ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో జాప్యం, ఇక్కడి విద్యపై ఆసక్తి లేని కారణంగా చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడంతో 600 సీట్లు ఖాళీ ఏర్పడింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ కేంద్రంగా రెండో విడత ప్రవేశాలకు సంబంధించి రెండో జాబితాను అధికారులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

ఇడుపులపాయల ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కార్యాలయం

11, 12 తేదీల్లో రెండో విడత ప్రవేశాల జాబితా :ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలలో మిగిలిపోయిన 600 సీట్ల భర్తీకి తదుపరి మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 11, 12 తేదీల్లో వెబ్‌సైట్‌లో వెల్లడిస్తాం. ఈ మేరకు రెండో విడత జాబితా సిద్ధం చేసే పనిలో తమ సిబ్బంది ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. ఆ లోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తాం. – **ఆచార్య సంధ్ర అమరేంద్రకుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ**

పీఆర్సీ కమిటీ నియమించి ఐఆర్ ప్రకటించాలి

మాట్లాడుతున్న చిన్నబ్బాయి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల వేతన సవరణ కమిటీని నియమించి, మధ్యంతర భృతిని ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి డిమాండ్ చేశారు. అనకాపల్లి సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పీఆర్సీ గడువు ముగిసి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం వేతన సవరణ సంఘాన్ని నియమించకపోవడం సరికాదన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, గౌరవాధ్యక్షులు పి.వెంకటరావు, సహాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, కోశాధికారి జోగా రాజేష్, ప్రకాష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగా సామగ్రి పంపేందుకు ఏర్పాట్లు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: యోగాంధ్ర సందర్భంగా కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో విశాఖకు తీసుకొచ్చిన సామగ్రిలో మిగిలిన వాటిని వెనక్కి పంపనున్నారు. మొత్తం 5 లక్షల యోగా మ్యాట్‌లు, 5 లక్షల టీషర్ట్‌లు తీసుకొచ్చి ఏయూ జిమ్నాస్టిక్ మైదానంలోని భవనంలో భద్రపర్చారు. వాటిల్లో 1.50 లక్షల మ్యాట్లు, 1.50 లక్షల టీషర్టులు మిగిలిపోయాయి. తొలుత వాటిని ఉమ్మడి విశాఖ జిల్లా పాఠశాలల విద్యార్థులకు అందజేయాలని జిల్లా యంత్రాంగం భావించింది. తాజాగా కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నుంచి కలెక్టరేట్‌కు వచ్చిన ఆదేశాలతో ఆ సామగ్రిని పది ట్రక్కుల్లో దిల్లీకి తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

సిద్ధం కండి.. సరిగా ఎంపిక చేసుకోండి!

నేటి నుంచి ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ

ఈనాడు, విశాఖపట్నం: ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రారంభం కానుంది. ఈ నెల 10 నుంచి 18 వరకు వెబ్ ఐచ్ఛికాల నమోదుకు అవకాశం కల్పించారు. దీని కోసం విద్యార్థులు ముందుగానే సిద్ధం కావాలని నిపుణులు చెబుతున్నారు. కళాశాలల ర్యాంకింగులు, ప్రాంగణ నియామకాలు జరుగుతున్న తీరు, గతేడాది ఎంత మంది ఉద్యోగాలు సాధించారు? తదితర వివరాలు తెలుసుకుని ఎంపిక చేసుకోవాలని సూచిస్తున్నారు.

మూడు హెల్ప్‌లైన్ కేంద్రాలు: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ కెమికల్ కళాశాల, పాడేరు ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాలల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సమస్యలు, సందేహాలు ఉంటే విద్యార్థులు నేరుగా ఆయా కేంద్రాల్లో నివృత్తి చేసుకోవచ్చు. వీటితోపాటు మంగళగిరిలోని హెల్ప్‌డెస్క్ నంబర్లు 7995681678, 7995865456, 9177927677లను సంప్రదించవచ్చు.

ఉమ్మడి జిల్లాలో కళాశాలలు: 25
మొత్తం సీట్లు: 14,682
ఈఏపీసెట్‌లో అర్హత సాధించినవారు: 30,521

అందుబాటులోకి కొత్త బ్రాంచిలు: ఈ ఏడాది కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) కోర్సులు పెరిగాయి. సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్‌తోపాటు సీఎస్ఈలో కృత్రిమ మేధ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్, క్వాంటం కంప్యూటింగ్ బ్రాంచులు అందుబాటులోకి వచ్చాయి.

ఎంపికలో అప్రమత్తత అవసరం: బ్రాంచీలు, కళాశాలలను ఎంపిక చేసుకునేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలి. రెగ్యులర్ కోర్సులతో పోలిస్తే సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులకు ఫీజు ఎక్కువగా ఉంటుంది. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఏడాది నుంచి క్వాంటం కంప్యూటింగ్ కోర్సు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. – ఆచార్య చిట్టిబాబు, అసిస్టెంట్ ప్రిన్సిపల్, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల

నేడు మంత్రి పార్థసారథి మాడుగుల రాక

విశాఖపట్నం: మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం విశాఖ రానున్నారు. ఇక్కడి నుంచి ఉదయం 11 గంటలకు మాడుగుల వెళ్లి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

అప్పన్న స్వామికి బంగారు పుష్పం బహూకరణ

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామికి అనకాపల్లి మండలం సిరసపల్లి గ్రామానికి చెందిన భక్తుడు అల్లాడరపు త్రిమూర్తులు దంపతులు 17.500 గ్రాముల బరువైన బంగారు పుష్పాన్ని బహూకరించారు. ఆదివారం సింహగిరిపై ఈవో వేండ్ర త్రినాధరావుకు పుష్పాన్ని అందజేశారు. అధికారులు దాత కుటుంబానికి స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఈవో త్రినాథరావుకు బంగారు పుష్పాన్ని అందిస్తున్న దాత త్రిమూర్తులు కుటుంబం

కఠిన ఆంక్షల నడుమ సేవలెలా..?

సింహాచలం, న్యూస్‌టుడే: కఠినమైన ట్రాఫిక్ ఆంక్షల నడుమ భక్తులకు సేవలు ఎలా అందించాలని గిరి ప్రదక్షిణలో సేవలు ముందుకొస్తున్న పలు సేవా సంస్థల ప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. సింహాచలం దేవస్థానం కార్యాలయ ఆవరణలో ఆదివారం సేవా సంస్థల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ నగర వ్యాప్తంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో పాటు సేవా శిబిరాలు ఏర్పాటుపై కూడా నియంత్రణ విధిస్తే ఎలాగంటూ ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ ఇలాంటి నిబంధనలు లేవన్నారు. ఆహార పదార్థాలను శిబిరాల వద్దకు తీసుకెళ్లడానికి వాహనాలను అనుమతించాలని కోరారు. వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రాఫిక్ అంతరాయాలకు అవకాశం లేని విధంగా స్టాళ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాహనాల రాకపోకలకు పూర్తిస్థాయిలో అనుమతి లేదని స్టాళ్లు ఏర్పాటు చేసే సంస్థలు ముందు రోజే సామగ్రిని తరలించుకోవాలని సూచించారు. దీనిపై సంస్థల ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓ దశలో ట్రాఫిక్ పోలీసులు, సేవా ప్రతినిధుల మధ్య కొంత వాగ్వాదం జరిగింది. చివరకు పోలీసులు సానుకూలంగా స్పందించినా స్పష్టమైన హామీ ఇవ్వలేదు. సమావేశంలో ఈవో వేండ్ర త్రినాధరావు, ఏఈవో ఆనంద్‌కుమార్, ఈఈ సీహెచ్‌వీ రమణ, డీఈఈ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు సూచనలిస్తున్న ట్రాఫిక్, దేవస్థానం అధికారులు

అస్తవ్యస్తంగా ట్రాఫిక్.. తప్పని అవస్థలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సెజ్ కేంద్రమైన అచ్యుతాపురంలో ట్రాఫిక్ రోజురోజుకు అస్తవ్యస్తంగా మారుతోంది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో వాహనాలు నిలిచిపోతున్నాయి. అచ్యుతాపురం కూడలిలో పైవంతెన నిర్మాణ పనులు జరుగుతుండటంతో సెజ్ రోడ్డులో రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. సెజ్ నుంచి వచ్చే వాహనాలను సెజ్ కాలనీ మీదుగా మళ్లించారు. కొండకర్ల నుంచి రాకపోకలు సాగించే సమయంలో వాహనాలు ముందుకు కదలడంలేదు. ముఖ్యంగా వారపు సంతరోజుల్లో ఇబ్బందులు రెట్టింపు అవుతున్నాయి. సోమ, బుధ, శుక్రవారాల్లో రాముడుపాలెం రోడ్డులో జరిగే బజారు వల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. సమస్య పరిష్కారానికి పోలీసులు చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.



అచ్యుతాపురం కూడలిలో నిత్యం ఇదే పరిస్థితి

వాణిజ్య పన్నులశాఖలో ఇష్టానుసార బదిలీలు..!

ఈనాడు, విశాఖపట్నం: ఆర్థిక శాఖ విడుదల చేసిన మార్గదర్శకాలకు విరుద్ధంగా వాణిజ్య పన్నులశాఖలో బదిలీలు చేపట్టడం వివాదాస్పదమవుతోంది. కొందరు ఉన్నతాధికారులు తమకు నచ్చినట్లు బదిలీలు చేశారనే విమర్శలు వస్తున్నాయి. అనుకూలంగా ఉన్న వారిని అదే డివిజన్‌లో కొనసాగించడం, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చినా.. అనుకూలంగా లేరని కొందరిని దూర ప్రాంతాలకు బదిలీ చేశారని సమాచారం. విశాఖ-2 డివిజన్‌లోని ఆరు సర్కిళ్లలో కేవలం ఒక సహాయ కమిషనర్ మినహా మిగిలిన వారందర్నీ దూరంగా బదిలీ చేశారు. విశాఖ-1 డివిజన్ పరిధిలో ఏడు సర్కిళ్లు ఉంటే ముగ్గుర్ని ఇక్కడే కొనసాగించారు. ప్రభుత్వం అయిదేళ్లు ఒకే చోట పనిచేసిన వారికి బదిలీ తప్పనిసరి అంటే.. ఇక్కడ ఒక ఏడాది సర్వీసు పూర్తి చేసిన వారికీ స్థానచలనం కలిగించడం గమనార్హం.

జాయింట్ కమిషనర్‌గా శేషాద్రి

ఈశాఖలోని పలువురు అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. విశాఖ-2 డివిజన్ జాయింట్ కమిషనర్‌గా టి.శేషాద్రిని నియమించింది. ఆయన అనంతపురం నుంచి వచ్చారు. విశాఖ-1 డివిజన్‌కు ఇన్‌ఛార్జిగానూ కొనసాగనున్నారు. పలువురు డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లకు స్థానచలనం కలిగింది.

అడుగు జారితే అంతే..

దేవీపట్నం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ (వెనుక జలాలు) నేపథ్యంలో గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద గోదావరి ఎక్కువ లోతుంటుంది. ఆదివారం ఆలయానికి వచ్చిన భక్తులు కొందరు గోదావరి నదిలో ప్రమాదకరమైన ప్రాంతంలో స్నానాలు చేయడంతో పలువురు భయాందోళన చెందారు. ఏ మాత్రం అడుగు జారినా ప్రమాదం తప్పదని స్థానికులు చెబుతున్నారు. ఆలయాధికారులు, పోలీసులు రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గోదావరిలో స్నానాలు చేస్తున్న భక్తులు

గిరిజన చట్టాలను పరిరక్షించుకుందాం

బాబూరావునాయుడిని సత్కరిస్తున్న ఆదివాసీ జేఏసీ నేతలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో చట్టాలు, హక్కులపై ఆదివాసీలు ఉనికి కోల్పోతున్నారని వీటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ డాక్టరు టి.బాబూరావు నాయుడు పేర్కొన్నారు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో ఆదివారం ఏపీ ఆదివాసీ జేఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బాబూరావునాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా 'ఉనికి కోల్పోతున్న ఆదివాసీలు' అనే అంశంపై పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం ఆదివాసీ సంక్షేమంపై భవిష్యత్తులో తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా బాబూరావునాయుడును సత్కరించారు. ఆదివాసీ జేఏసీ నేతలు కంగల శ్రీనివాసు, తెల్లం శేఖర్, మడకం వరప్రసాద్, కారం రామన్నదొర, పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి, మొట్టడం రాజబాబు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత లొద్దిపాలెం జట్టు

రంపచోడవరం, న్యూస్‌టుడే: సీతపల్లిలో నెల రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. సోదె వినోద్‌కుమార్, ధర్మకుమార్ నిర్వాహకులుగా వ్యవహరించిన ఈ పోటీలలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి 46 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన తుదిపోటీలో లొద్దిపాలెం, దేవీపట్నం జట్లు తలపడగా లొద్దిపాలెం జట్టు విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన లొద్దిపాలెం జట్టుకు రూ.10 వేలు, రన్నర్‌గా నిలిచిన దేవీపట్నం జట్టుకు రూ.అయిదు వేలతోపాటు ట్రోఫీలను జనసేన పార్టీ వీర మహిళ పండా వరలక్ష్మి అందించారు. తెదేపా నాయకులు కుంజం బాపన్నదొర, కొమరం రామన్నదొర, గ్రామస్థులు బొరగ బాలుదొర, సత్యనారాయణ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జనసేన పార్టీ నేత వరలక్ష్మి తదితరులు

ఏడాదిలో అభివృద్ధి శూన్యం

రంపచోడవరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా అభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి విమర్శించారు. వైకాపా మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర నివాసంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గడచిన ఏడాదిలో నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. ఎమ్మెల్యే ఎక్కడ పర్యటించినా తనను, ఎమ్మెల్సీ అనంతబాబును స్మరించడం తప్ప చేసిందేమీలేదన్నారు. సర్పంచి మంగా బొజ్జయ్య, మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, ఎంపీపీ బందం శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యురాలు ఉలవల లక్ష్మి పాల్గొన్నారు.

సమాన వేతనం ఇవ్వాలి

పాడేరు, న్యూస్‌టుడే: రెగ్యులర్ ఏఎన్ఎంల మాదిరిగానే రెండో ఏఎన్ఎంలు కష్టపడుతున్నారని, వారికి సమాన వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. ఆదివారం పాడేరులో జరిగిన రెండో ఏఎన్ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 15 ఏళ్లుగా మారుమూల గిరిజన గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నప్పటికీ జీతాలు పెంచడం లేదన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సుందరరావు, శెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

FINANCIAL SERVICES
రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

ఇబ్బందులు అధిగమిస్తూ సంక్షేమ పాలన

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఒక్క ఏడాదిలో ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ అయిదేళ్ల సంక్షేమాన్ని అందించిందని తెదేపా నాయకులు పేర్కొన్నారు. సంకాడ పంచాయతీ డింగిరాయి, చిత్తమామిడి, కుమ్మరపల్లి, చినజడుమూరు గ్రామాల్లో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. పెసా కమిటీ ఉపాధ్యక్షుడు బాబూరావు, నేతలు మామిడి నాగేంద్ర, గోవిందరావు, చంటిబాబు పాల్గొన్నారు.



డింగిరాయిలో పథకాలు వివరిస్తున్న తెదేపా నాయకులు

పామాయిల్ సాగుతో ఆర్థికాభివృద్ధి

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో పామాయిల్ తోటల సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని ఉద్యాన శాఖ అధికారి కె.ముత్తయ్య, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆయిల్‌పాం కంపెనీ డీజీఎం ప్రకాష్ పేర్కొన్నారు. ఆయిల్ పామ్ తోటల విస్తీర్ణంలో భాగంగా ఉసిరి జొన్నలలో ఉద్యానశాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆయిల్ పామ్ కంపెనీ సంయుక్తంగా రైతులతో సమావేశం జరిగింది. సర్పంచి చోడి నూకరాజు దొర, అధికారులు శ్రీనివాస్, కార్తీక్‌రెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఫార్మా ఉద్యోగి దుర్మరణం

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వవార్డు పరిధిలో రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు దువ్వాడ జీఆర్పీ పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలం తులగాం గ్రామానికి చెందిన వజ్రారపు సురేశ్(28) పరవాడ మెట్రోకెమ్ ఫార్మా కంపెనీ ప్రొడక్షన్ విభాగంలో పని చేస్తూ లంకెలపాలెంలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో లంకెలపాలెంలో రైలు పట్టాలు దాటుతుండగా విశాఖ నుంచి విజయవాడ వెళ్లే రైలు ఢీకొని మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు ఆదివారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై లక్ష్మి పేర్కొన్నారు.

సురేశ్ (పాతచిత్రం)

రేగుపాలెం - నర్సీపట్నం రోడ్డు సమీపంలో...

పాయకరావుపేట, న్యూస్‌టుడే: రైలు ఢీకొన్న ప్రమాదంలో ఆదివారం ఒకరు దుర్మరణం చెందాడు. తుని రైల్వే ఎస్సై జి.శ్రీనివాసరావు అందించిన కథనం ప్రకారం... రేగుపాలెం, నర్సీపట్నం రోడ్డు సమీపంలో పట్టాలు దాటుతున్న 50 ఏళ్ల వ్యక్తిని రాజమహేంద్రవరం నుంచి విశాఖ వైపు వెళ్తున్న రైలు ఢీకొందన్నారు. మృతుని వద్ద ఏవిధమైన ఆధారాలు లభ్యం కాలేదన్నారు. తెలుపు రంగు చొక్కా, సిమెంట్ రంగుపై నలుపు చుక్కల ఉన్న షార్టు ధరించాడని, నాగుల చవితి టవలు ఉందన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రి శవగారంలో భద్రపరిచామని ఎస్సై జి.శ్రీనివాసరావు చెప్పారు.

వాహనం ఢీకొని వృద్ధుడు..

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట మండలం బయ్యవరం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. కశింకోట ఎస్సై కె.లక్ష్మణరావు కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం బొరిగివలస గ్రామానికి చెందిన రాజాపు గురన్న (64) రహదారి దాటుతుండగా బొలెరో వాహనం ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అనకాపల్లి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై మృతుడి గ్రామస్థుడు ముద్దాడ శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ అల్లు స్వామినాయుడుతో సహా ఎస్సై రెండు బృందాలుగా ఏర్పడి పరారైన వాహనం కోసం గాలింపు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

గొలుసు దొంగ అరెస్టు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: మధురవాడ ప్రాంతంలో ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు తెంపుకొని పారిపోయిన దొంగను పీఎంపాలెం నేర విభాగం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వివరాలను క్రైం సీఐ బి.ఎస్.ఎస్.ప్రకాష్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. కొమ్మాది వైఎస్సార్ కాలనీకి చెందిన కొత్తకోట వరలక్ష్మి (65) ఈ నెల 2న సాయంత్రం కాలనీలో రోడ్డుపై ఒంటరిగా నడిచి వెళ్తున్నారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి రూ.2 లక్షల విలువ చేసే 2 తులాల బంగారు గొలుసును లాక్కొని ద్విచక్రవాహనంపై పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. భీమిలి మండలం కాపులుప్పాడకు చెందిన గుడ్ల ఆదినారాయణ (25) చోరీకి పాల్పడినట్లు గుర్తించి శనివారం అదుపులోకి తీసుకుని అతని నుంచి బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని రిమాండ్‌కు తరలించి బాధితురాలికి బంగారం గొలుసు అప్పగించామని సీఐ తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన ఏఎస్ఐలు కె.బాబా, అమర్‌శేఖర్, పీసీలు మల్లిక్, గణేష్, రమేష్‌లను ఆయన అభినందించారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ బి.ఎస్.ఎస్.ప్రకాష్

చికిత్స పొందుతూ ప్రాణాలొదిలిన యువకుడు

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాకలో ఓ యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. సీఐ కె.కుమారస్వామి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెనికి చెందిన చింతాకుల సతీష్ (22), తల్లి మంగ, సోదరుడుతో కలిసి ఏడాది క్రితం అమ్మమ్మ గారి ఊరు ఉపమాక వచ్చి ఇక్కడే నివాసం ఉంటున్నారు. సతీష్ హెటెరో పరిశ్రమలో కాంట్రాక్టర్ వద్ద వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు మద్యానికి బానిసగా మారడంతో గురువారం తల్లి మందలించింది. అదే రాత్రి మేడ మీదకు వెళ్లిన ఇతడు కొంతసేపటికి కేకలు వేస్తూ వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా, గడ్డిమందు తాగినట్లు గుర్తించారు. వెంటనే నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి తునిలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. ఇతడు చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెచ్‌సీ వెంకటరావు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

సతీష్ (పాతచిత్రం)

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి.. భార్యకు గాయాలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: తగరంపూడి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. గ్రామీణ ఎస్సై నాగేశ్వరరావు కథనం ప్రకారం రావికమతం మండలం మెట్టవానిపాలెంకు చెందిన బలిరెడ్డి ప్రసాద్ (45), ఉష దంపతులు ద్విచక్ర వాహనంపై తుమ్మపాల వస్తున్నారు. వెనక నుంచి గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొట్టింది. ప్రమాదంలో ప్రసాద్ మృతిచెందగా, ఉషకు గాయాలయ్యాయి. ఈమెను ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు.

ముగ్గురికి గాయాలు

అనకాపల్లి పట్టణం: కొత్తూరు వద్ద శనివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఓ వాహనంపై వెళ్తున్న దంపతులు రెడ్డి అమూల్‌నాయుడు, పద్మతోపాటుగా మరో వాహనదారుడికి గాయాలయ్యాయి. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

నాటక పుస్తకాల డిజిటలీకరణ అభినందనీయం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: నాటకం కోసం జీవితాన్ని అంకితం చేసిన బాదంగీర్ సాయి తీపి గుర్తుగా పదివేల నాటక పుస్తకాలు డిజిటలీకరణ చేసి అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని విశ్రాంత ఐఏఎస్ అధికారి గుమ్మళ్ల బలరామయ్య కొనియాడారు. రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అధ్యక్షతన మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మన్నం వెంకటరాయుడుతో కలిసి శ్రీనగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో ఆదివారం 'తెలుగు నాటక డిజిటల్ గ్రంథాలయం' వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. దాడి వీరభద్రరావు మాట్లాడుతూ పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గుతున్న తరుణంలో నాటకాలను డిజిటలీకరణ చేయడం ప్రశంసనీయమన్నారు. అంతకుముందు పౌర గ్రంథాలయం ఎదుట సుదర్శన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'టామీ టామీ టామీ' నాటికను ప్రదర్శించారు. విశ్రాంత ఐపీఎస్ అధికారి అత్తిలి సుధాకర్, రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకులు వి.వి.రమణమూర్తి, సినీ దర్శకుడు ఎం.వి.రఘు, కొల్లి మోహనరావు, మేడా మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పలువురు నాటక నటులను సన్మానించారు.



వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు గుమ్మళ్ల బలరామయ్య, సుధాకర్ తదితరులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	86	78
లైవ్	108	98
డ్రెస్డ్	157	166
స్కిన్‌లెస్	178	176

(c) eenadu

మంత్రి లోకేశ్ పంపిన టీషర్ట్స్ ధరించిన రింతాడ ఉపాధ్యాయులు, విద్యార్థులు

కృతజ్ఞతలు లోకేశ్ సార్..!

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: యోగాంధ్ర విజయవంతమై గిన్నిస్‌బుక్ రికార్డు సాధించడంలో అల్లూరి జిల్లా గిరిజన విద్యార్థుల భాగస్వామ్యం ప్రత్యేకం. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గిరిజన సంక్షేమ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేకంగా టీషర్ట్స్, యోగా సామగ్రి పంపిణీ చేయించారు. టీషర్ట్స్, సామగ్రి పాఠశాలలకు అందడంతో విద్యార్థులు వాటిని ధరించి లోకేశ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతున్నారు. గూడెంకొత్తవీధి మండలం రింతాడ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థినులు ఆదివారం ప్రదర్శనగా ఏర్పడి థ్యాంక్యూ లోకేశ్ సార్ అంటూ నినదించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, వ్యాయామ ఉపాధ్యాయురాలు రామలక్ష్మి, గంగాభవాని, ఉపాధ్యాయుడు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సందడే సందడి

మేఘాలకొండపై..

చింతపల్లి మండలం చెరువులవేనంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. విడవకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మన్యానికి పర్యాటకుల రాక తగ్గింది. వాతావరణం కాస్త మారడంతో ఆదివారం పరిమితంగా పర్యాటకులు వచ్చారు. తాజంగి, లంబసింగి, చెరువులవేనం ప్రాంతాల్లో సందడి నెలకొంది. మంచు, ప్రకృతి అందాలను వీరు ఆస్వాదిస్తూ వ్యూపాయింట్ల వద్ద ఫొటోలు తీసుకున్నారు. వంజంగి మేఘాలకొండ వద్ద పర్యాటకుల సందడి మొదలైంది. ఇక్కడి పొగమంచు అందాలు వీక్షించేందుకు ఆదివారం మైదాన ప్రాంతం నుంచి సందర్శకులు పెద్ద ఎత్తున వచ్చారు. – న్యూస్‌టుడే, పాడేరు పట్టణం, చింతపల్లి

చెరువులవేనంలో..

భారీ వర్షం.. రహదారులు ఛిద్రం

పెదబయలు గ్యాస్ గోదాముకు వెళ్లే దారిలా..

పెదబయలులో జీసీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న గోడౌములతోపాటు, భారత్ గ్యాస్‌గోదాముకు వెళ్లే దారి చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. ఈ మార్గంలో గతంలో సిమెంటు రోడ్డు నిర్మించినా.. వర్షం కురిస్తే నీరు నిల్వ ఉండి చిన్నపాటి చెరువును తలపిస్తోంది. – పెదబయలు, న్యూస్‌టుడే

విడవకుండా కురుస్తున్న వర్షాలకు పెదబిడ్డ నుంచి గుమ్మ వరకు మట్టి రోడ్డు చిత్తడిగా మారింది. గుమ్మ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు బియ్యం సరఫరా చేసే వాహనం అక్కడకు చేరుకోలేక వెనుతిరగాల్సి వచ్చింది. ద్విచక్రవాహనదారులు అవస్థలు తప్పడం లేదు. – అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

మంప పంచాయతీ మైదిపనుకుల గ్రామానికి వెళ్లే రహదారులు బురదమయంగా ఉండడంతో పాదచారులు, వాహనచోదకులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దొంతులు సమీపం నుంచి మైదిపనుకుల మధ్యలో రోడ్డు అధ్వానంగా తయారైంది. పెద్దపెద్ద గుంతలేర్పడటంతోపాటు కొన్నిచోట్ల రహదారి కోతకు గురైంది. పలుమార్లు నాయకులు, అధికారులకు తెలిపినా ఫలితం లేకపోయిందని అక్కడి గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – కొయ్యూరు, న్యూస్‌టుడే

అరకులోయ మండలం నందిగుడ, బస్కి, బీటీ రహదారి పనుల్లో జాప్యంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి నిర్మాణానికి పంచాయతీరాజ్ నిధులు రూ.3.30 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారు మట్టి పోసి వదిలెయ్యడంతో వానలతో ఈ రోడ్డు బురదమయంగా మారిందని గిరిజనసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బాలదేవ్ అన్నారు. సీసీ ర్యాంపుల నిర్మాణ ప్రాంతాల్లో మట్టి తీసి మెటల్ వెయ్యకుండా వదిలెయ్యడంతో వాహనాలు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. – అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే

బురదమయంగా మారిన రోడ్డు చూపుతున్న గ్రామస్థులు

మారేడుమిల్లిలో రోగులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రామారావు

ఆరోగ్య పరిరక్షణపై అప్రమత్తం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ప్రస్తుత వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాజమహేంద్రవరానికి చెందిన వైద్య నిపుణుడు డాక్టర్ జీవీ రామారావు సూచించారు. స్థానిక సత్యసాయి సేవా కేంద్రం వద్ద ఆదివారం సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని, రోగులకు సేవలు అందించారు. మారేడుమిల్లి మండలంతోపాటు, వై.రామవరం మండల ఎగువ ప్రాంతానికి చెందిన సుమారు 300 మంది రోగులకు వైద్య పరీక్షలతో పాటు, మందులు ఉచితంగా అందించారు. ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు చేశారు. సంస్థ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, రమేష్, రామ్మోహనరావు, వీరయ్య, సేవాదళ్ సభ్యులు గురునాథరెడ్డి, రమణారెడ్డి, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

అ వీ ఇ వీ

సమ్మెపై ప్రచారం

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: కార్మిక సమస్యలపై ఈనెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ, కార్మిక సంఘం నాయకులు జోషి కోరారు. సమ్మెపై ఆదివారం సుంకరమెట్ట సంతలో ప్రచారం నిర్వహించారు. కార్మికులంతా సమ్మెలో భాగస్వాములు కావాలని కోరారు. కనీస వేతనం, ఉపాధి పథకంలో 200 పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

నిత్యావసర సరకుల పంపిణీ

దేవీపట్నం, న్యూస్‌టుడే: మండలంలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన శరభవరం గ్రామానికి చెందిన మిట్టపల్లి వెంకటేశ్వర్లుతో పాటు ఆయన కుమారుడు అనిల్‌ను ఆదివారం జన సైనికులు పరామర్శించారు. నియోజకవర్గ జనసేన నాయకులు పండా వరలక్ష్మి దంపతులు, పార్టీ మండలాధ్యక్షుడు దారపు రాయుడు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులతోపాటు కొంత ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జనసైనికులు కర్రి మహేష్, సూరిబాబు, జగ్గారావు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపుపై చర్యలు తీసుకోరా?

చింతూరు, న్యూస్‌టుడే: అటవీ భూముల్లో ఆక్రమణల తొలగింపుపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను ఆరోపించారు. చింతూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అటవీ భూముల ఆక్రమణలు తొలగించాలని డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేసినా అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

పరిశీలకుల తీరు సరికాదు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పాడేరు నియోజకవర్గంలో తెదేపా పరిశీలకుల వ్యవహరిస్తున్న తీరు వల్ల విభేదాలు తలెత్తే పరిస్థితి ఉందని తెదేపా మండల మాజీ అధ్యక్షుడు బేరా సత్యనారాయణ అన్నారు. ఆదివారం చింతపల్లిలో తెదేపా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గ్రామ, మండల కమిటీల్లో ఒకవర్గానికి పదవులు కట్టబెట్టారని ఆరోపించారు. మండల కమిటీ ఎన్నికను పాడేరులో నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. కిముడు లక్ష్మయ్య, బండిరమణ, రాజారావు, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: తెదేపా మండల అధ్యక్షుడి ఎన్నికలో నిర్వహణ తీరుపై ఆ పార్టీ రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి కొర్ర బలరాం, దేవాపల్లి సర్పంచి బుజ్జిబాబు, నాయకులు నక్కా తిరుమలరావు, పండ్ల సూరిబాబు ఆదివారం కోరారు. పాడేరులో నిర్వహిస్తే సహకరించబోమని తెలిపారు.

ప్రభుత్వం దృష్టికి కుమ్మరపల్లి సమస్యలు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురై, కనీస సౌకర్యాలు నోచుకోని కుమ్మరపల్లి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని జనసేన నాయకుడు ఊలం ఈశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఆ గ్రామంలో జనసేన బృందం పర్యటించింది. రహదారి, పాఠశాల భవనం సక్రమంగా లేవని గుర్తించినట్లు తెలిపారు. నేతలు దుచ్చరి కోటిబాబు, జర్త బాబూరావు, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

చింతపల్లి రామాలయంలో భక్తుల పూజలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లిలో ఆదివారం తొలిఏకాదశి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివాసీలు తమ యాన్నె స్థానికంగా ఉన్న దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఉపవాస దీక్షలను చేశారు. దీనితో వివిధ ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు రామాలయం, శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. దారాలమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి రామాలయంలో పూజారి జగన్ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులు మేష్ శెట్టి, మల్ల నాగు, రమణ తదితరులు పాల్గొన్నారు.

అలంకరణలో దారాలమ్మ

మోదకొండమ్మ ఆలయంలో రద్దీ..

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి, ఆదివారం కావడంతో పాడేరు మోదకొండమ్మ అమ్మవారి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. క్యూలైన్లో బారులుతీరారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దాతల సహాయంతో భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేసినట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటిబాబు తెలిపారు.

పాడేరు మోదకొండమ్మ ఆలయంలో..

వైభవంగా ఘటాల ఊరేగింపు

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరులో మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం జీపు జాత పండగ నిర్వహించారు. జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దుర్గమ్మ, మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు తలపై ఘటాలు పెట్టుకొని మోదకొండమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. యూనియన్ నాయకులు, జీపు డ్రైవర్లు, యజమానులు పాల్గొన్నారు.

ఊరేగింపులో జీసీసీ ఛైర్మన్ శ్రావణ్‌కుమార్ తదితరులు

ఘనంగా సామూహిక సీమంతాలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక యూనియన్ బ్యాంకు ఆవరణలో ఆదివారం దాసరి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 126 మందికి సామూహిక సీమంతాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న భద్రాద్రి కొత్తగూడెం, అనకాపల్లి శోహం పీఠాధిపతులు అరుణానంద స్వామీజీ ముందుగా తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి పూజలను నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. దాసరి ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు వెంకట్ ఉత్కూరు, రాట్నాల సూర్య, తోట రామకృష్ణ, కాటమరెడ్డి, గిరిజన పూజారులు కడబాల మోహనరావు, గుర్రేటి కృష్ణారెడ్డి, నల్లమిల్ల వెంకట రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డి

మంచినీటికి.. మండల కేంద్రానికి!

తాగునీటి కోసం డుంబ్రిగుడ వచ్చిన మహిళలు

డుంబ్రిగుడ సమీపంలోని జాకరవలసలో తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఆ గ్రామ మహిళలు కిలోమీటరు దూరంలోని డుంబ్రిగుడ వచ్చి తాగునీరు మోసుకెళ్తున్నారు. ఈ గ్రామంలో తాగునీటి పథకం మూలకు చేరి ఏడాదవుతోంది. అక్కడి ఊటగెడ్డను ఆశ్రయించి అవసరాలు తీర్చుకునేవారు. ఇటీవల వర్షాలతో ఊటనీరు కలుషితమైంది. సర్పంచి, కార్యదర్శికి విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కష్టాలు తీర్చాలని వారు కోరుతున్నారు. – డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

ప్రమాదకరంగా ప్రయాణాలు

జాతీయ రహదారిలో అరకు- పాడేరు మార్గంలో ప్రమాదకర ప్రయాణాలు సాగుతున్నాయి. ప్రైవేటు వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్నారు. గిరిజనులు జీపులపై వేలాడుతూ, ఆటోల వెనుక నిల్చుని ప్రయాణాలు సాగిస్తున్నారు. పోలీసు అధికారులు స్పందించి వీటికి అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. – డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

ఘాటీలో నేలకొరిగిన చెట్లు

రహదారి అడ్డంగా పడిపోయిన వృక్షాలు

సీలేరు, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండలం ధారాలమ్మ ఘాటీలో దారాలమ్మ అమ్మవారి ఆలయం దిగువ భాగంలో ఆదివారం ఉదయం రహదారికి అడ్డంగా రెండు భారీ వృక్షాలు పడిపోయాయి. దీంతో రెండు గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులు, ప్రయాణికులు చందాలు వేసుకుని.. గిరిజనులతో చెట్లను తీయించారు. వాహనాలు ముందుకు కదిలాయి.

జాతీయ రహదారిలో బోర్డు ఏర్పాటు

కొయ్యూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి-516ఈలో ఊర్లు, కిలోమీటర్ల దూరం తెలిపే బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం తోటలూరు- పాతకృష్ణదేవిపేట సమీపంలో యంత్ర సహాయంతో పెద్ద బోర్డు అమర్చారు. వాహనచోదకులకు ఇబ్బంది లేకుండా వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు రహదారి నిర్మాణ సిబ్బంది తెలిపారు.

తోటలూరు- పాత కృష్ణదేవిపేట మధ్యలో..

పర్యాటకుల క్షేమానికి ప్రాధాన్యం

పోచవరం రేవులో పర్యాటకుల జాబితా పరిశీలిస్తున్న ధికారులు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: నిబంధనలు కచ్చితంగా పాటిస్తే, పర్యాటకుల పర్యటన క్షేమంగా సాగుతుందని ఏపీ టూరిజం జీఎం సీహెచ్ నాంచారయ్య నిర్వాహకులకు, పర్యవేక్షణ సిబ్బందికి సూచించారు. ప్రస్తుత వరదల నేపథ్యంలో గోదావరి వరవడి, బోట్లు సామర్థ్యం, టూరిజంకు ఎంత అనుకూలత ఉంటుందని, అంశాలను ఆదివారం ఆయన పరిశీలించారు. పోచవరం పర్యాటక రేవు నుంచి 211 మందితో పేరంటపల్లి వచ్చిన నాలుగు బోట్లును ఆయన తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం రక్షణ సామగ్రి, పర్యాటకుల లైఫ్ జాకెట్లు, బోట్లు లైసెన్స్‌లు ఎలా ఉన్నాయని పరిశీలించారు. ప్రతీ రోజు పర్యాటకుల సంఖ్యపై స్థానిక కంట్రోల్ రూమ్ మేనేజర్ రాజేశ్‌ని అడిగారు. అకస్మికంగా గాలీవాన వస్తే చేపట్టే జాగ్రత్తలను నాంచారయ్య ప్రశ్నించారు.

ఎమ్మెల్యే పర్యటన నేడు

ఎటపాక, న్యూస్‌టుడే: ఎటపాక, సీతంపేట, నెల్లిపాక గ్రామాల్లో ఇంటింటికీ 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్యే శిరీషాదేవి పాల్గొంటారని తెదేపా మండల అధ్యక్షులు పుట్టి రమేష్‌బాబు, పార్టీ సీనియర్ నాయకులు పాటి చలపతిరావు, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తోటపల్లిలో దివంగత నేత ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ, అదే గ్రామంలో నూతన సచివాలయం ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు.

జీవో నం.51 రద్దు చేయాల్సిందే

చిట్టంపాడు వద్ద గిరిజన సంఘం నాయకులు, స్థానికుల ఆందోళన

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: అనంతగిరి మండలం పెద్దకోటలో హైడ్రోపవర్ ప్రాజెక్టుకు అనుమతులిస్తూ జారీచేసిన జీవో నం.51ను రద్దు చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. కండ్రుం పంచాయతీ జాకరవలసలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు జీవో ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, నాయకులు రాంచందర్, రాజు, భాస్కర్‌రావు, జగత్ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: సుంకరమెట్ట పంచాయతీ పిరిబంద గ్రామంలో సర్పంచి చిన్నబాబు, దుక్కగుడ గ్రామంలో గిరిజన సంఘం నాయకులు గురుమూర్తి ఆధ్వర్యంలో గిరిజనులు జీఓ ప్రతులు దహనం చేసి నిరసన తెలిపారు. ఆదివాసీ చట్టాలకు వ్యతిరేకంగా ఇచ్చిన జీఓను ప్రభుత్వం రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

అనంతగిరి, న్యూస్‌టుడే: అనంతగిరి మండలం చిట్టంపాడు గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన సర్వేను అడ్డుకుంటామని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర అన్నారు. చిట్టంపాడులో ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రదేశాన్ని గిరిజన సంఘం నాయకులు, స్థానిక ప్రజలు ఆదివారం పరిశీలించారు. హైడ్రోప్రాజెక్టుతో పర్యావరణం దెబ్బతింటుందని పేర్కొన్నారు. జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుతో సుమారు 10 వేల మంది గిరిజన ప్రజల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని చెప్పారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్‌దేవ్, టోకూరు సర్పంచి మోస్య, నాగులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని జడ్డంగి ఎస్సై చినబాబు అన్నారు. దోనెలపాలెంలో ఆదివారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. గంజాయిసాగు, రవాణా, విక్రయాలకు దూరంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ రుణ యాప్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. గొలుసు దుకాణాలు నిర్వహించరాదన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. రహదారి భద్రతా నియమాలు వివరించారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్సై చినబాబు

దస్త్రాలు లేని వాహనచోదకులకు జరిమానా

గంగవరం, న్యూస్‌టుడే: దస్త్రాలు లేని వాహన చోదకులకు జరిమానా విధించడం తప్పదని ఎస్సై బి. వెంకటేష్ అన్నారు. గంగవరం వై జంక్షన్‌లో ఆదివారం వాహనాలు తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, దస్త్రాలు సక్రమంగాలేని వాహన చోదకులకు అపరాధ రుసుములు విధించారు. ట్రిబుల్ రైడింగ్ చేస్తున్న యువకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. హెచ్‌సీ చిట్టిబాబు, సిబ్బంది శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.

గంగవరంలో తనిఖీలు చేపడుతున్న ఎస్సై వెంకటేష్, సిబ్బంది

చోరీల నివారణకు గస్తీ

సీలేరు, న్యూస్‌టుడే: రాత్రి పది గంటల తరువాత సీలేరు పురవీధుల్లో ఎవ్వరూ సంచరించరాదని ఎస్సై రవీంద్ర సూచించారు. సీలేరులో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో శనివారం రాత్రి నుంచి పోలీసు గస్తీతోబాటు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనవసరంగా ఎవరూ బయట తిరిగినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారం తమకు ఇవ్వాలని కోరారు.

కుక్కలకు టీకాలు తప్పనిసరి

కాశీపట్నంలో టీకా వేస్తున్న పశువైద్యాధికారి గణేశ్వరరావు

హుకుంపేట, న్యూస్‌టుడే: పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు తప్పకుండా వేయించాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజ రవికుమార్ పేర్కొన్నారు. బాకూరు పశువైద్యశాలలో జూనోసిస్ దినోత్సవం సందర్భంగా కుక్కలకు టీకాలు వేశారు. వైస్ ఎంపీపీ కొండలరావు, వైద్యాధికారి చరణ్, సిబ్బంది ప్రవీణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీపట్నం, అనంతగిరి పశువైద్యకేంద్రాల్లో పశువైద్యాధికారి గణేశ్వరరావు, సిబ్బంది కుక్కలకు టీకాలు వేశారు. 68 పెంపుడు జంతువులకు టీకాలు వేశామని తెలిపారు. జూనియర్ వెటర్నరీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు ప్రాంతీయ పశువైద్యశాలలో 138 కుక్కలకు టీకాలు అందించామని డాక్టర్ పి.వేణుమాధవ్ తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్. రాజారవికుమార్ మాట్లాడుతూ.. జంతువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లైవ్‌స్టాక్ అధికారి సురేష్, ఏహెచ్ఏస్ శ్రీను, ఉమ, రామకృష్ణ, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ పశువైద్యశాల వద్ద జునోసిస్ డే నిర్వహించారు. వెటర్నడీ డీడీ షేక్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో సంక్రమిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రేబీస్, బ్రూసెల్లోసిస్, ట్యూబర్‌కులోసిస్ తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. వెటర్నరీ సిబ్బంది బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాల అమల్లో నిర్లక్ష్యం

మోతుగూడెం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ చట్టాలు అమలుపై నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నాయని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు అన్నారు. సంఘ ఎనిమిదో మహాసభ ఆదివారం లక్కవరం గ్రామంలో రాజయ్య, రాజ్ కుమార్, చిన్నయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రామారావు మాట్లాడుతూ కేంద్రంలోని భాజపా ప్రభుత్వం పెసా చట్టం అనుమతి లేకుండా కార్పొరేట్ సంస్థలకు దౌర్జన్యంగా ఖనిజ సంపదను దోచి పెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం టైగర్ జోన్ పేరుతో ఏజెన్సీ గ్రామాలను ఖాళీ చేయాలని కుట్రలను పన్నుతోందని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో తునికాకు సేకరణపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందన్నారు. చింతూరు మండలానికి 17 మందితో కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా నాగేష్, రాజయ్య, ఉపాధ్యక్షులుగా రాజ్‌కుమార్, నాగార్జున, సహ కార్యదర్శులుగా మల్లేష్, చిన్నయ్యలను ఎన్నుకున్నారు.

మహాసభకు హాజరైన గిరిజనులు

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు : 89853 66570, అరకులోయ: 63034 86346
రంపచోడవరం: 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక ఐటీడీఏ క్వార్టర్స్ వద్ద వర్షపునీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. – **ఐటీడీఏ ఉద్యోగులు, రంపచోడవరం.** ✔: వర్షపునీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటాం. – **రమణ, ఏవో, ఐటీడీఏ, రంపచోడవరం**

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెం నుంచి నేలకోట, రైతులు పొలాలకు వెళ్లే రహదారికి అడ్డంగా మూడు నెలల క్రితం ఓ భారీ వృక్షం నేల కూలింది. దీన్ని తొలగించకపోవడంతో చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తోంది. **– వేగి దారాబాబు, మోతుగూడెం** ✔: వర్షాలు తగ్గిన తర్వాత ఉపాధి హామీ కూలీలతో దానిని తొలగిస్తాం. – **మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి, మోతుగూడెం**

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగిలో 99 భవనాల సముదాయం నుంచి ఐసీడీఎస్, ఆశ్రమ, గురకుల పాఠశాలలు, కళాశాలకు వెళ్లే మార్గం రాళ్లు పైకి తేలి అధ్వానంగా ఉంది. – **శివ. రాజవొమ్మంగి.** ✔: సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.– **యాదగిరీశ్వరరావు. ఎంపీడీవో. రాజవొమ్మంగి.**

అరకులోయ, న్యూస్‌టుడే: గన్నెల పంచాయతీ సబకలో తాగునీటి పథకం మరమ్మతులకు గురవడంతో ఇబ్బందులు పడుతున్నాం. – **అప్పన్న, గ్రామస్థుడు,** ✔: తాగునీటి పథకానికి మరమ్మతులు చేయిస్తాం. – **లవరాజు, ఎంపీడీవో, అరకులోయ**

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీపట్నంలో చాలావరకు వీధిదీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. – **గ్రామస్థులు,** ✔: త్వరలో అన్ని వీధుల్లో దీపాలు ఏర్పాటు చేయిస్తాను. – **రామశంకర్, గ్రామ కార్యదర్శి**

జి.మాడుగుల, న్యూస్‌టుడే: సొలభం మార్గంలో కంఠవరం సమీపంలో కల్వర్టు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అటుగా వెళ్లేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. – **పిన్నయ్య, కంఠవరం,** ✔: కొత్త కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు పెడతాం.– **సంతోష్, పీఐయూ, ఏఈ, జి.మాడుగుల**

(c) eenadu

దేవదేవాయ.. దివ్య రూపాయ

తొలి ఏకాదశి సందర్భంగా మంగళగిరి పానకాల లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి దిగువ సన్నిధిలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామిని భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేయించారు. స్వామి, అమ్మవార్లు బంగారు గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ సహాయ కమిషనర్ కోగంటి సునీల్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, నగర ప్రముఖులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. -న్యూస్‌టుడే, మంగళగిరి

మంగళ గౌరి.. మహంకాళి

ఆషాఢ మాసం సందర్భంగా దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులోని మహంకాళి అమ్మవారిని ఆదివారం గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. సుమారు 5 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేయించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.
-న్యూస్‌టుడే, కంఠంరాజు కొండూరు(దుగ్గిరాల)

ఆ నీళ్లు.. అనారోగ్యానికి ఆనవాళ్లు!

- గతంలో కలుషిత జలాల కాటు
- వర్షాకాలం నేపథ్యంలో అప్రమత్తత అవసరం

ఈనాడు, అమరావతి

మధ్యాహ్నం వేళ శీతల పానీయం తాగడానికి సోడా బండి వద్దకు వెళ్తున్నారా? బండి నిర్వాహకుడు వాడే నీరు స్వచ్ఛమైనవేనా?

సాయంత్రం పానీపూరీ తినడానికి వెళ్లారా.. అక్కడ ఏ నీరు వాడుతున్నారో మీకు ఏమైనా అవగాహన ఉందా?

పండ్ల రసాల దుకాణాల్లో వాడే ఐస్ గడ్డలను ఏ నీటితో, ఏ పరిస్థితుల్లో పరిశ్రమలో తయారు చేశారో తెలుసుకున్నారా?

కలుషిత నీరు మన ఆరోగ్యాన్ని గుల్ల చేస్తోంది. జిల్లాలోని పుర, నగరపాలికల్లో పైమార్గాలు ప్రజారోగ్యాన్ని పాడు చేసే కారణాలుగా మారాయి. గుంటూరులో రోజుకు 135 ఎంఎల్‌డీ నీరు సరఫరా చేస్తున్నట్లు అధికారిక లెక్క. కానీ 120 ఎంఎల్‌డీ ప్రజలకు అందుతోంది. తక్కెళ్లపాడు నీటిశుద్ధి కేంద్రం నుంచి నివాసాల వరకు నీటి నాణ్యతా పరీక్షలు మొక్కుబడిగా మారాయి. ప్లాంటు నుంచి సరఫరాకు వెళ్లే నీటిలో స్వచ్ఛత ఎంత అనేది ప్రశ్నార్థకమే. ఒకే ఒక్క ప్రయోగశాలలో కేవలం ముగ్గురు సిబ్బంది మాత్రమే ఉన్నారు. వారు ప్రతి గంటకూ నీటి పరీక్షలు చేయడం కష్టం. చివరికి 42 రిజర్వాయర్ల పరిధిలోనూ పరీక్షలు మొక్కుబడే. పైగా మురుగు కాలువల్లో పైపులైన్లు, లీకేజీలు నీటి కాలుష్యాన్ని పెంచుతున్నాయి. పొన్నూరు, తెనాలిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వాటర్ ప్లాంట్ల ద్వారా శుద్ధి జలాన్ని అందిస్తున్నట్లు వ్యాపారులు ప్రచారం చేస్తున్నా.. కొందరు సరిగా శుద్ధి చేయని నీరు విక్రయిస్తున్నారన్న విషయం గతంలోనే అధికారుల పరిశీలనలో స్పష్టమైంది. కనుక వర్షాకాలం నేపథ్యంలో అందరూ అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది.

తనిఖీలు అత్యవసరం

సోడా బండి

❖ గుంటూరులో 2018, 2024 సంవత్సరాల్లో కలుషిత నీటి కారణంగా 14 మంది అతిసారంతో ప్రాణాలు కోల్పోయారు. వందల మంది ఆసుపత్రి పాలయ్యారు. అప్పట్లో తనిఖీలు చేపట్టిన యంత్రాంగం.. నగరంలోని పానీపూరీ, సోడాబళ్లలో వాడే నీటినీ తనిఖీలకు పంపారు. కొంతకాలం ఆంక్షలు విధించారు. మినరల్ వాటర్ ప్లాంట్లనూ మూయించారు. నాణ్యత పాటించాలని సూచించి తరువాత అనుమతించారు.

❖ ఆహార కల్తీ నియంత్రణ విభాగంతో పాటు, ప్రజారోగ్యం, పురపాలకం, రెవెన్యూ, వైద్యారోగ్యశాఖ.. ఇలా అందరికీ ఇందులో బాధ్యత ఉంది. వంతులేసుకుని ఎవరూ పట్టించుకోని పరిస్థితి. ఇప్పటికైనా ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది. రానున్నది వర్షాకాలం... గత ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది. జిల్లాలోని పంచాయతీలు, పట్టణాల్లో వైద్యారోగ్య సిబ్బంది నీటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ కె.విజయలక్ష్మి తెలిపారు. కలుషిత ఆనవాళ్లు కనిపిస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరఫరా నిలిపి వేయిస్తున్నట్లు ఆమె చెప్పారు.

నేలపట్టులా.. సంరక్షణకు మెట్టులా!

ఈనాడు పరిశీలన

- ఉప్పలపాడు పక్షుల కేంద్రం అభివృద్ధిపై అటవీ శాఖ దృష్టి
- బర్డ్ కన్జర్వేషన్ రిజర్వ్ కింద నోటిఫై చేయాలని ప్రతిపాదన

ఈనాడు, అమరావతి

తిరుపతి జిల్లా నేలపట్టు బర్డ్ శాంక్చురీ తరహాలో పెదకాకాని మండలం ఉప్పలపాడు వలస పక్షుల రక్షిత కేంద్రాన్ని అభివృద్ధి చేసే దిశగా అటవీ శాఖ అడుగులు వేస్తోంది. ఈ కేంద్రాన్ని వన్యప్రాణుల సంరక్షణ చట్టం- 1972ని అనుసరించి 'ఉప్పలపాడు బర్డ్ కన్జర్వేషన్ రిజర్వ్' కింద నోటిఫై చేయాలని అధికారులు జిల్లా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

అలరిస్తున్న విదేశీ విహంగాలు

ప్రయోజనం ఏంటి?

■ పక్షుల రక్షిత కేంద్రం అంటే ఎవరూ వాటిని వేటాడకుండా, పట్టుకోకుండా రక్షించే ప్రదేశం మాత్రమే. ప్రస్తుతం ఉప్పలపాడు ఆ కోవలోనే ఉంది.

■ కన్జర్వేషన్ రిజర్వ్ కింద చేర్చితే ఆ ప్రాంత పర్యావరణ వ్యవస్థను కాపాడి పక్షుల సంఖ్య పెరగడానికి చర్యలు తీసుకుంటారు. అవి ఆరోగ్యకరంగా జీవించే పరిస్థితులు కల్పిస్తారు. సుదీర్ఘకాలం అక్కడి వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తారు.

■ పరిసర ప్రాంతాల్లో పక్షులకు అనువైన వ్యవసాయం చేసేలా చూడడం, కాలుష్యాన్ని తగ్గించడం, వాటి రక్షణ పరంగా ప్రజల్లో అవగాహన పెంపొందించడం వంటివి చేపడతారు.

■ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన వెళ్లింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆమోదముద్ర వేస్తే.. భవిష్యత్తులో కేంద్ర అటవీ శాఖ నుంచి ఈ కేంద్రం అభివృద్ధికి విరివిగా నిధులు మంజూరవుతాయి.

ఏడాదికి రూ.6 లక్షల ఆదాయం

● సుమారు 9.52 ఎకరాల విస్తీర్ణంలో ఉప్పలపాడు విదేశీ పక్షుల రక్షిత కేంద్రం ఉంది. 25 రకాల పక్షి జాతులు ఆశ్రయం పొందుతున్నాయి.

● 1996-97 నుంచి ఇది రాష్ట్ర అటవీ శాఖ పర్యవేక్షణలో ఉంది. పక్షుల సంరక్షణ, సంతానోత్పత్తి పరంగా స్థానికులు భాగస్వామ్యం వహిస్తున్నారు.

● 2024-25లో ఈ కేంద్రం ద్వారా రూ.6 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

● దీనిని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా అధ్వానంగా మారింది. చెరువు గట్టు పడిపోవడం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది.

ఎన్నో సారూప్యతలు

నేలపట్టు, ఉప్పలపాడు కేంద్రాలకు సారూప్యతలున్నాయి. రెండూ చెరువులు. చుట్టూ పొలాలు, జాతీయ రహదారికి ఆనుకుని ఉన్నాయి. పక్షులు రెండుచోట్లా సంతానోత్పత్తి చేస్తున్నాయి. ప్రస్తుతం దీనిని అభివృద్ధి చేయాలని అటవీ శాఖ ప్రణాళిక రూపొందించింది. దీనిపై గుంటూరు జిల్లా అటవీ శాఖ అధికారిణి హిమశైలజ 'ఈనాడు'తో మాట్లాడుతూ.. ఉప్పలపాడు వలస పక్షుల రక్షిత కేంద్రాన్ని బర్డ్ కన్జర్వేషన్ రిజర్వ్ కింద నోటిఫై చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిపారు.

మరోసారి ఏఎన్ఎంల కౌన్సెలింగ్

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏఎన్ఎం గ్రేడ్-3గా పని చేస్తున్న వారికి తిరిగి సోమవారం కౌన్సెలింగ్ ఏర్పాటు చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయలక్ష్మి ఆదేశాలిచ్చారు. గత వారం రోజుల నుంచి రాత్రింబవళ్లు కార్యాలయంలో కూర్చొని బదిలీల కౌన్సెలింగ్ పూర్తి చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏఎన్ఎం (గ్రేడ్-3)గా పని చేస్తున్న సుమారు 200 మందికి ఐదేళ్ల పదోన్నతులిచ్చి వివిధ పోస్టుల్లో నియమించారు. అయినప్పటికీ జీవోల నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్‌లో వీరు పదోన్నతి పైన పని చేస్తున్న స్థానాలను కూడా ఖాళీల జాబితాలో చూపించారు. చాలామంది వాటిని ఎంపిక చేసుకున్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఇది సరైన విధానం కాదని, అందువల్ల కౌన్సెలింగ్‌ను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని ఆదేశించారు. దీంతో మళ్లీ 900 మంది ఏఎన్ఎంలకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు తెచ్చుకున్నవారి పరిస్థితి ఎలా ఉంటుందో వేచి చూడాల్సి ఉంది. మరికొందరు ఇతర మార్గాల ద్వారా ప్రయత్నాలు చేసుకోవడం గమనార్హం. తాజాగా నిర్వహించే కౌన్సెలింగ్ మరింత పారదర్శకంగా జరుగుతుందని సమాచారం. అందువల్ల సీనియర్లకు వారు ఎంపిక చేసుకున్న సచివాలయాల్లో పోస్టింగులు వస్తాయని భావిస్తుండడం గమనార్హం.

7, 8 తేదీల్లో 'మిషన్ గ్రీన్' జోన్ల ఏర్పాటుపై సమావేశాలు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: గుంటూరు నగరంలో పచ్చదనం పెంచేందుకు 'మిషన్ గ్రీన్', వీధి వ్యాపారులకు జోన్ల ఏర్పాటుపై స్టేక్ హోల్డర్స్, సీనియర్ సిటిజన్స్ సంఘాలు, సూచనలు స్వీకరించేందుకు సోమ, మంగళవారాల్లో సమావేశాలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు స్టేక్ హోల్డర్స్‌కు, అవే అంశాలపై మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో సమావేశం ఉంటుందని తెలిపారు.

యువతలో మార్పు తీసుకొచ్చేందుకు కృషి

నగరంపాలెం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు బానిసలై నిర్వీర్యమైపోతున్నారని ఏపీ ఈగల్ వింగ్ అధిపతి, ఐజీ ఆకే రవికృష్ణ తెలిపారు. గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో డ్రగ్స్ నివారణపై యువతకు అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. రవికృష్ణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్లే సమాజంలో నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. నేరాలను అరికట్టేందుకు ఏపీ ప్రభుత్వం ప్రత్యేక ఈగల్ పోలీసు విభాగాన్ని ఏర్పాటు చేసిందన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, గంజాయి సాగు చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర కోశాధికారి రామచంద్రరాజు మాట్లాడుతూ చెడు వ్యసనాల బారిన పడిన యువతలో మార్పు తీసుకొచ్చేందుకు ఈగల్ వింగ్, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల విద్యార్థులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రవికృష్ణ ప్రారంభించారు. మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మట్టుపల్లి మోహన్, ఈగల్ వింగ్ ఎస్పీ నగేష్‌బాబు, డీఎస్పీ అరవింద్, తెనాలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ భానుమతి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో ఈగల్ వింగ్ అధిపతి ఆకే రవికృష్ణ, రామచంద్రరాజు తదితరులు

జోన్-4లో కొనసాగుతున్న పనులు

రాజధానిలో ఎల్‌పీఎస్ లేఔట్లు సిద్ధం

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతుల రిటర్నబుల్ ప్లాట్లు అభివృద్ధికి లేఔట్లు సిద్ధమవుతున్నాయి. రైతులకు ఇవ్వనున్న ప్లాట్ల అభివృద్ధికి అమరావతి అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జోన్ల వారీగా సీఆర్‌డీఏ టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. ఆదివారం అనంతవరం సమీపంలో జోన్-4లో ఆర్‌వీఆర్ సంస్థ ఎల్‌పీఎస్ లేఔట్ల పనులను ప్రారంభించింది. ప్రస్తుతం జేసీబీలతో జంగిల్ క్లియరెన్స్ పనులు జరుగుతున్నాయి. తొలుత ప్రధాన రహదారులను నిర్మించనున్నారు.

నాణ్యత డొల్ల.. రహదారి గుల్ల!

గుంటూరు నగరంలోని రెడ్డిపాలెం ప్రధాన రహదారి అడుగు భాగం అంతా కొట్టుకుపోయింది. సార్వత్రిక ఎన్నికల ముందు నాటి వైకాపా ప్రభుత్వం ఓట్ల కోసం హడావుడిగా చేపట్టిన పనులు ఏడాదికే పాడైపోయి అప్పటి పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. సిమెంట్ రహదారి కింద కంకర పొరలు సరిగ్గా వేయక పోవడం.. నాణ్యత లోపం కారణంగా ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకే అంతా కొట్టుపోయింది. రహదారి కింద డొల్లగా మారింది. భారీ వాహనం రహదారిపై వెళ్తే పగిలిపోతుంది. రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. - ఈనాడు, గుంటూరు

రావమ్మా.. గోదారమ్మా..!

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : పట్టిసీమ నుంచి గోదావరి నీటి విడుదలను ఆదివారం మరింత పెంచారు. శనివారం 8 పంపుల ద్వారా 2,382 క్యూసెక్కులు ఇవ్వగా.. సాగునీటి అవసరాల రీత్యా ఆదివారం 16 పంపుల ద్వారా 5,564 క్యూసెక్కులు విడుదల చేశారు. అవి ప్రకాశం బ్యారేజీకి చేరడానికి సమయం పడుతుంది. సోమవారం రాత్రి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కృష్ణా నదిలో పులిచింతల ప్రాజెక్టు పవర్ హౌస్ నుంచి 5,000 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి మట్టానికి గాను 11.2 అడుగులు ఉంది.

కాల్వలకు 7,389 క్యూసెక్కులు.. కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు ప్రకాశం బ్యారేజీ నుంచి 7,389 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 7,084, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 305 క్యూసెక్కులు ఇస్తున్నారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,707, ఏలూరు 1,110, బందరు 1,259, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,008 క్యూసెక్కుల చొప్పున నీరు ఇస్తున్నారు.

ఇంకుడు గుంత.. పల్లెల్లో స్వచ్ఛత

జిల్లాలో 12 వేలు నిర్మించేలా కార్యాచరణ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

రోజురోజుకూ కిందకు పడిపోతున్న భూగర్భ జలాల సంరక్షణ, మురుగు పారుదల సరిగ్గా లేక ఇబ్బంది పడుతున్న కాలనీలు పరిశుభ్రంగా ఉంచేలా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆ మేరకు కార్యాచరణ రూపొందించి వడివడిగా ముందుకు సాగుతోంది. జల సంరక్షణ.. స్వచ్ఛత లక్ష్యాలను సాధించడానికి గ్రామాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడమే మార్గమని భావించింది. తొలి దశలో ఉపాధి హామీ కార్డు ఉండి, నివాస ప్రాంతాల్లో మురుగు కాలువలు సరిగ్గా లేని గృహస్థులకు అవగాహన కలిగించి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇంటి ముందు మూడు అడుగుల లోతు గుంత తవ్వి, అందులో మూడు ఒరలు దించుతారు. అందులో లావు, మధ్య, సన్న రకాల కంకర వరుసగా పేర్చుతారు. ఆపై ఇసుక పోసి ఇంకుడు గుంత రూపొందిస్తారు. గుంతపైన మూత, పైపు ఏర్పాటు చేస్తారు. ఆ ఇంటిలోని వాడుక, వాన నీరు గుంతలోకి వెళ్లేలా చూస్తారు. ఈ విధానం ద్వారా వాడుక నీరు, వాన నీరు గుంతలో ఫిల్టర్ అయి భూగర్భంలోకి చేరుతుంది. వాడుక నీరు రోడ్డు మీదకు వెళ్లి.. అక్కడ మడుగు ఏర్పడి అపరిశుభ్రత నెలకొనే ఇబ్బంది తప్పుతుంది. నివాసితులు ప్రతి నెలకు ఒక మారు ఇంకుడు గుంతపై మూత తీసి, నీరు ఫిల్టర్ అయ్యాక పైకి చేరిన తెట్టును తొలగించుకుంటే సరిపోతుంది. ఒక్కో గుంత ఏర్పాటుకు రూ.6 వేలు ఖర్చు అవుతుంది. ఆ మొత్తాన్ని నీటి యాజమాన్య సంస్థ భరిస్తుంది.

ప్రత్తిపాడులో ఇంటి ముందు ఇంకుడు గుంత

నెలాఖరులోగా లక్ష్యం పూర్తి

తొలి దశలో జిల్లాలో 12 వేల ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం. ఇప్పటికే 6 వేల గుంతల నిర్మాణం పూర్తి చేశాం. ఈ నెలాఖరులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలనే కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం. ఆసక్తి ఉన్న అర్హులు తమ పంచాయతీ కార్యాలయ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి.

– వి.శంకర్, పీడీ జిల్లా నీటి యాజమాన్య సంస్థ

జడ్పీ భూమి స్వాధీనానికి అడుగులు

ఆర్‌అండ్‌బీకి కేటాయించిన గత ప్రభుత్వం

జిల్లా పరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వ హయాంలో జిల్లా పరిషత్తుకు చెందిన భూమిని ఆర్‌అండ్‌బీ శాఖకు కేటాయించగా.. దానిని తిరిగి జడ్పీ సొంతం చేసుకునేలా అడుగులు పడుతున్నాయి. గత పాలకులు రూ.కోట్ల విలువైన భూమిని నామమాత్రపు ధరకు ఆర్‌అండ్‌బీ శాఖకు కట్టబెట్టి జడ్పీకి నష్టం చేకూర్చారు. నాటి జీవో రద్దు చేయాలని పల్నాడు జిల్లా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు లేఖ రాయడంతో జడ్పీ అధికారులు ప్రభుత్వానికి అప్పీల్ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

టోల్ ప్లాజా కోసం లీజుకు..

పిడుగురాళ్ల మండలం తుమ్మల చెరువు గ్రామం సర్వే నంబరు 251లో జడ్పీకి 2.71 ఎకరాల భూమి ఉంది. దానిని మెస్సర్స్ నామ్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్‌కు చెందిన టోల్ ప్లాజా నిర్వహణ కోసం ఏడాదికి రూ.2,43,900 చెల్లించేలా 2013లో కేటాయించారు. 2018, అక్టోబరు 31 వరకు జడ్పీకి లీజు చెల్లించారు. 1, నవంబరు 2018 నుంచి 31, అక్టోబరు 2021 వరకు ఏడాదికి రూ.3,25,192 చొప్పున లీజు నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినా చెల్లించలేదు. 31, అక్టోబరు 2021తో లీజు గడువు పూర్తయింది. 1, నవంబరు 2023 వరకు రూ.12,64,546 నామ్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ బకాయిలు చెల్లించాల్సి ఉంది.

★ జడ్పీకి చెందిన 2.71 ఎకరాల భూమికి రవాణా, ఆర్‌అండ్‌బీ శాఖ రూ.9.50 లక్షలు జిల్లా పరిషత్‌కు చెల్లించేలా రెవెన్యూ శాఖ జీవో ఎం.ఎస్.నం.76 జారీ చేసింది. జడ్పీకి ప్రమేయం లేకుండానే ఆ ప్రక్రియ కొనసాగడం గమనార్హం. వైకాపా ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి సిఫార్సుతో భూమిని బదలాయించారనే ప్రచారం ఉంది. అప్పటి పల్నాడు జిల్లా కలెక్టరు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. జడ్పీ అధికారులూ మిన్నకుండిపోయారు.

యరపతినేని లేఖతో..

గత ప్రభుత్వం జడ్పీ భూమిని ఆర్‌అండ్‌బీకి కేటాయించడంపై విచారణ చేసి జీవో రద్దు చేయాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు జడ్పీ సీఈవో వి.జ్యోతిబసుకు ఇటీవల లేఖ రాశారు. ఈ నెల 4న జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశం అజెండాలో దానిని చేర్చినప్పటికీ చర్చించలేదు. చర్చ జరగకున్నా అజెండాలో చేర్చినందున జీవోని పునః సమీక్షించాలని ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు సీఈవో జ్యోతిబసు 'న్యూస్‌టుడే'కి తెలిపారు.

ఆయిల్ ఇంజిన్లకు ఎదురుచూపు

పంపిణీ ఆపేసిన వైకాపా పాలకులు

పొన్నూరు, చేబ్రోలు న్యూస్‌టుడే

పొన్నూరు పట్టణ పరిధి నిడుబ్రోలుకు చెందిన కె.సురేంద్ర 20 ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నారు. ఆ భూమి సాగునీటి కాలువకు శివారులో ఉంది. నీరు అందక ఆయిల్ ఇంజిన్‌పై ఆధారపడి సాగు చేస్తున్నాం. రాయితీపై ఇంజిన్ అందజేస్తారని తెలిసి మూడేళ్ల నుంచి వ్యవసాయ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. ఈ ఏడాదైనా ఇస్తారని ఎదురుచూస్తున్నారు.

★ జిల్లాలో 61,257 హెక్టార్లలో వరి సాగు చేస్తారని అంచనా. పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని, తెనాలి, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, పెదనందిపాడు, దుగ్గిరాల తదితర మండలాల్లో సాగు నీటి కాలువల చివరి భూములకు నీరు అందడం లేదు. రైతులు ఆయిల్ ఇంజిన్లను అద్దెకు తెచ్చి నీరు అందిస్తున్నారు. 2014-2019 మధ్య అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ ఆహార భద్రత పథకం కింద ప్రతి మండలానికి 25 నుంచి 40 ఆయిల్ ఇంజిన్లు అందించగా.. ఒక్కొక్క దానిపై రూ.10 వేల రాయితీ ఇచ్చారు.

మాటలతో మభ్యపెట్టి.. కాలం గడిపేసి..

☛ 2019-2024 మధ్య ఇంజిన్లు ఇవ్వలేదు. వాటిని రాయితీపై ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. అప్పటి వైకాపా నేతలు, అధికారులు మాటలతో మభ్యపెట్టి ఐదేళ్లలో ఒక ఇంజిన్ కూడా ఇవ్వలేదు. రైతులు ఎక్కువగా 5 హెచ్‌పీ ఆయిల్ ఇంజిన్లు కోరుకుంటారు. మార్కెట్‌లో ఒక్కో దాని ధర రూ.28 వేల నుంచి రూ.35 వేల దాకా పలుకుతోంది. ☛ కొందరు తక్కువ ధరకు ఇంజిన్లు అందజేస్తామని మాయమాటలు చెప్పి నాణ్యత లేనివి అంటగడుతున్నారని, వాటికి డిమాండ్ ఏర్పడినప్పుడు ప్రైవేటు వ్యాపారులు ధరలు పెంచుతున్నారని అన్నదాతలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంజిన్లతో పాటు సెక్షన్ పైపులు, ట్రాలీ కూడా ఇవ్వాలని కర్షకులు కోరుతున్నారు.

☛ దీనిపై వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రామకోటేశ్వరి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిపాదనలు కోరడంతో పంపించామని చెప్పారు.

ఇచ్చినవి చెబుతున్నారు.. తీసుకున్నవి దాచేస్తున్నారు

పటమట, న్యూస్‌టుడే: అద్వికా ట్రేడింగ్ కంపెనీ స్కాంలో ఏజెంట్లు, బాధితులు చెప్పిన లెక్కలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. లెక్కలు దాదాపుగా కొలిక్కి వచ్చినా.. కొంతమంది ఏజెంట్లు, పెట్టుబడిదారులు కంపెనీలో పెట్టిన మొత్తాన్ని పోలీసుల ముందు రూపాయలతో సహా వెల్లడిస్తున్నారు. కానీ కంపెనీ ఎండీ ఆదిత్య నుంచి వడ్డీ, కమీషన్ రూపంలో తీసుకున్న నగదు గురించి మాత్రం పొంతన లేని లెక్కలు చెబుతున్నారు. దీంతో పోలీసులు కంపెనీ బ్యాంకు ఖాతా లావాదేవీల ద్వారా అసలు లెక్కలు తేల్చనున్నారు. ఇందు కోసం బ్యాంకులకు లేఖలు రాసిన విషయం తెలిసిందే. మరోవైపు విచారణలో ఆదిత్య వ్యవహార్తశైలితో నిధులు కచ్చితంగా పక్కదారి పట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు. హవాలా రూపంలో దుబాయ్‌కు తరలించిన నగదును అక్కడే పెట్టుబడులు పెట్టడం లేదా వేరే ఖాతాల ద్వారా తిరిగి ఇంకా ఎక్కడైనా పెట్టుబడి పెట్టి ఉంటాడని పోలీసులు అంచనాకు వచ్చారు. దీని ప్రకారమే దర్యాప్తు వేగవంతం చేశారు. గోల్డెన్ లీఫ్‌పై అనుమానాలు.. పెట్టుబడిదారులను తప్పుదోవ పట్టించేందుకు ఆదిత్య దుబాయ్ వెళ్లి అక్కడ గోల్డెన్ లీఫ్ అనే ఫేక్ ట్రేడింగ్ కంపెనీ స్థాపించి డిజిటల్ కరెన్సీని డిపాజిట్ చేసినట్లు తొలుత పోలీసులు గుర్తించారు. కానీ అందులో ఖాతాలున్న ప్రతి ఒక్కరికి గత ఏడాది వాలెట్‌లోని నగదు విత్‌డ్రా చేసుకునే తేదీ నవంబర్ 2గా చూపించింది. అదే సమయానికి ఆదిత్య కంపెనీ డైరెక్టర్లతో కలిసి దుబాయ్ వెళ్లారు. ఈ విషయాన్ని కొంతమంది డైరెక్టర్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వారికున్న అనుమానాలు సైతం పోలీసులకు తెలిపారు. దీంతో గోల్డెన్ లీఫ్ లెక్కలు తేల్చేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. దీనికి సంబంధించి అంతర్జాతీయ బ్యాంకు, కంపెనీల నిబంధనల ప్రకారం గోల్డెన్ లీఫ్ వివరాలకు సంబంధిత శాఖలకు పోలీసులు మెయిల్ పెట్టారు. ఈ వివరాలన్నీ వస్తే అసలు గోల్డెన్ లీఫ్ నకిలీదా కాదా అనేది తేలనుంది.

తెనాలి రోడ్డు విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణ

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరిలోని వడ్లపూడి సెంటర్ నుంచి మిద్దె కూడలి వరకు, గౌతమ బుద్ధా రోడ్డు నుంచి ఆంజనేయస్వామి మిద్దె సెంటర్ వరకు తెనాలి రోడ్డు విస్తరణ నేపథ్యంలో ఆయా మార్గంలోని దుకాణ, గృహ యజమానుల అభిప్రాయాలను వేర్వేరుగా నగరపాలక అధికారులు ఆదివారం సేకరించారు. గౌతమబుద్ధా రోడ్డు నుంచి మిద్దె సెంటర్ వరకు 60 అడుగులు వెడల్పుగా రోడ్డును విస్తరించాలని సంకల్పించారు. మొత్తం 127 మంది ఆయా సమావేశాలకు హాజరయ్యారు. మొత్తం 112 నిర్మాణాలను గుర్తించగా.. వాటిలో ఉన్న ప్రార్థనా మందిరాలు, ఆక్రమణలు, ముస్లిం శ్మశాన వాటికల నిర్వాహకులతో చర్చించారు. తిరిగి మరో సమావేశం నిర్వహించిన అనంతరం అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.

పొగాకు రైతుకు సాంకేతిక ఇబ్బందులు

విక్రయాలకు ఫోన్ సందేశం కోసం ఎదురుచూపులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే

నల్లబర్లీ పొగాకు సాగు చేసిన రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. ఎన్నడూ లేని విధంగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించి గత నెల 20వ తేదీ నుంచి కొనుగోళ్లను ప్రారంభించింది. నిన్నటి వరకు పొగాకు కొనుగోలు చేసేందుకు ఎవరొస్తారా అని ఎదురుచూసిన రైతులకు కూటమి ప్రభుత్వం మార్గదర్శకంగా నిలిచింది. అయితే క్షేత్ర స్థాయిలో మాత్రం రైతులను సాంకేతికపరమైన సమస్యలు వెంటాడుతున్నాయి. రైతు సేవా కేంద్రంలో వివరాలు నమోదు చేసుకున్న రైతులకు రోజులు గడుస్తున్నా సరకు అమ్ముకునేందుకు తేదీ సమాచారం రాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు	: గుంటూరు, పెదకాకాని
నల్లబర్లీ పొగాకు సాగుదారులు	: 3,653
సాగు విస్తీర్ణం	: 13,544 ఎకరాలు
ఇప్పటి వరకు అమ్ముకున్న రైతులు	: 231
అమ్మిన పొగాకు	: 760 మెట్రిక్ టన్నులు

చుట్టుగుంటలోని కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన బేళ్లు

మూడు గ్రేడులుగా నిర్ణయించి..

పొగాకు పంటకు గతేడాది ధర ఎక్కువగా ఉండడంతో రైతులు నల్లబర్లీ పొగాకు సాగు చేశారు. కొనుగోలు చేస్తామని చెప్పిన వ్యాపారులు పంట చేతికొచ్చే సమయానికి చేతులెత్తేశారు. రైతుల ఆందోళనను గుర్తించిన కూటమి ప్రభుత్వం.. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టింది. పొగాకు నాణ్యతను బట్టి మూడు రకాల గ్రేడులు నిర్ణయించారు. హై గ్రేడ్‌కు రూ.12 వేలు, మీడియం రూ.9 వేలు, లోయర్ గ్రేడ్‌కు రూ.6 వేలు చొప్పున కొనుగోలు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల నుంచి కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లే సమాచారం రాకపోవడంతో రైతులు కలవరపడుతున్నారు.

నాణ్యత పేరుతో తిరస్కరణ

కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన పొగాకు నాణ్యత నిర్ధారణలో అధికారులు ఇబ్బంది పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. ఎక్కువ పొగాకును లోయర్ గ్రేడ్‌గా నిర్ణయిస్తున్నారన్నారు. హమాలీ, రవాణా ఖర్చులే క్వింటాకు రూ.600 వరకు అవుతున్నాయని, రూ.12 వేలకు కొనుగోలు చేస్తేనే గాని గిట్టుబాటు కాదన్నారు. కొన్ని బేళ్లను నాణ్యత పేరుతో తిరస్కరిస్తున్నారని వాపోతున్నారు. రోజుకు పరిమిత మోతాదులో కొనుగోలు చేయడంతో మరింత ఆలస్యమవుతోందని ఆవేదన చెందుతున్నారు.

ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత ప్రవేశాలు

నాలుగు విద్యాలయాల్లో మిగులు సీట్లు 600

వేంపల్లె, న్యూస్‌టుడే

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు ట్రిపుల్ ఐటీలలో 600 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి విద్యార్థుల మెరిట్ జాబితాను తయారు చేసి ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి మొత్తం 4400 సీట్లు ఉన్నాయి. ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1100 సీట్లు ఉండగా దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ కోటా కింద 360 సీట్లు పోను నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1010 చొప్పున 4040 సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలలో ఉన్న సీట్లకు మెరిట్ జాబితా విడుదల చేసి జూన్ 30 నుంచి జులై 5వ తేదీ వరకు ఇడుపులపాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేశారు. కౌన్సెలింగ్ తర్వాత ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 878 సీట్లు భర్తీ కాగా 132 సీట్లు మిగిలిపోయాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలో 1010కి 869 భర్తీ కాగా 141 సీట్లు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 867 భర్తీ కాగా 143, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు 826 సీట్లు భర్తీకాగా 184 సీట్లు మిగిలాయి. ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో జాప్యం, ఇక్కడి విద్యపై ఆసక్తి లేని కారణంగా చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడంతో 600 సీట్లు ఖాళీ ఏర్పడింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ కేంద్రంగా రెండో విడత ప్రవేశాలకు సంబంధించి రెండో జాబితాను అధికారులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

ఇడుపులపాయల ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కార్యాలయం

11, 12 తేదీల్లో రెండో విడత ప్రవేశాల జాబితా

ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలలో మిగిలిపోయిన 600 సీట్ల భర్తీకి తదుపరి మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 11, 12 తేదీల్లో వెబ్‌సైట్‌లో వెల్లడిస్తాం. ఈ మేరకు రెండో విడత జాబితా సిద్ధం చేసే పనిలో తమ సిబ్బంది ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. ఆ లోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తాం. - **ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ**

‘ఉద్యోగులకిచ్చిన హామీలు ఏమయ్యాయి..?’

తాడేపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచినా ఉద్యోగులకిచ్చిన హామీలు అమలు చేయలేదని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి ఆరోపించారు. ఆ ఫెడరేషన్ కో-అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డితో కలిసి గుంటూరు జిల్లా తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఆదివారం మాట్లాడుతూ.. హామీల అమలు చేయకపోగా రెగ్యులర్‌గా రావాల్సిన డీఏలు, ప్రమోషన్లు కూడా ఇవ్వలేదన్నారు. ఉద్యోగుల సమస్యలు తెలుసుకునేందుకు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ ఏర్పాటు చేయలేదన్నారు. అనేక కేసుల్లో నిందితురాలిగా ఉన్న వివాదాస్పద కలి మీద కేసు పెడితే.. అది తప్పుడు కేసు అంటూ పోలీసుల మీదే తిరిగి కేసు పెట్టడం ఉద్యోగుల పై వేధింపులు పరాకాష్ఠ అన్నారు. సీపీఎస్, జీపీఎస్ విధానాలను సమీక్షించేందుకు ఇంత వరకు కమిటీ ఊసే లేదన్నారు. పెన్షనర్ల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఉద్యోగులకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రావూరి సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, అలీ, అనిల్, కరిముల్లా, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటరామిరెడ్డి, పక్కన జమాల్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి

చరవాణుల వినియోగంతో చదువుపై ప్రభావం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: బడుల్లో చరవాణుల వినియోగం పెరిగిపోయి పిల్లల చదువులపై ప్రభావం చూపుతోందని, రకరకాల యాపులు, అప్‌లోడ్, డౌన్‌లోడ్, ఆన్‌లైన్ శిక్షణలతో ఉపాధ్యాయుల సమయం అంతా హరించుకుపోతోందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తెనాలిలో ఆదివారం నిర్వహించిన సంఘ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంకేతికపై అవసరానికి మించి ఆధారపడితే అన్ని విధాలుగా నష్టాలు తప్పవన్నారు. పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను ఒక ఈవెంట్‌గా కాకుండా విద్యార్థులకు నాణ్యమైన చదువు అందించే చక్కటి కార్యక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ బడులపై నమ్మకంతో తమ పిల్లలను చేర్పిన తల్లిదండ్రుల నమ్మకానికి అనుగుణంగా నాణ్యమైన విద్యను అందించడానికి అవసరమైతే అదనంగా ఒక గంట కేటాయించుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రావు, హనుమంతరావు, మల్లేశ్వరరావు, కళాధర్, వెంకటేశ్వర్లు, దౌలా ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

రక్త మార్పిడి సమయంలో అప్రమత్తత అవసరం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: రక్త మార్పిడి విషయంలో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంగళగిరి ఎయిమ్స్ అదనపు ఆచార్యులు చైతన్యకుమార్ సూచించారు. గుంటూరు వైద్య కళాశాల పెథాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రాంతీయ వైద్య విద్య కార్యక్రమం జింకానా ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా చైతన్య కుమార్ మాట్లాడుతూ రక్త మార్పిడి సమయంలో వచ్చే చర్యలపై జాగ్రత్త వ్యవహరించాలన్నారు. సర్జికల్‌లైన రక్తాన్ని అందుబాటులో ఉంచడం ఆందరి కర్తవ్యంగా భావించాలన్నారు. రక్తానికి ప్రత్యామ్నాయాలను అభివృద్ధి చేయడంలో శాస్త్రవేత్తలు చేస్తున్న కృషితో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ప్రయోగశాలలో తయారుచేసిన కృత్రిమ రక్తం.. ఇప్పటి వరకు మన దేశంలో అందుబాటులోకి రాలేదన్నారు. రవికిరణ్, రంజిత వివిధ అంశాలపై ప్రసంగించారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారు. కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ శ్రీధర్, పూర్వ ప్రిన్సిపల్ పద్మావతిదేవి, ఆచార్యులు విజయశ్రీ, పూర్ణమ్మ, సహాచార్యులు రమణకుమారి, వివిధ వైద్య కళాశాలల విద్యార్థి వైద్యులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న శ్రీధర్, పక్కన విజయశ్రీ, పద్మావతిదేవి, రమణకుమారి, చైతన్యకుమార్

రైతులకు సకాలంలో ఎరువులు అందించాలి

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలోని రైతులకు సకాలంలో ఎరువులు అందించేలా ముందస్తు ప్రణాళికతో ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి వడ్రాణం హరిబాబు అన్నారు. జిల్లా కోర్టు రోడ్డులోని సహకార మార్కెటింగ్ సొసైటీ కార్యాలయంలో డీసీఎంఎస్ ఉద్యోగుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వడ్రాణం హరిబాబు మాట్లాడుతూ రైతులకు డీసీఎంఎస్ అందరూ నిలవాలన్నారు. ఉద్యోగులు దరా క్రమశిక్షణతో పని చేసి రైతులకు సేవలందించాలన్నారు. సొసైటీల వ్యాపారాల అభివృద్ధిని ఉపేక్షించేది లేదని, గతంలో ఎవరైనా అటువంటి మార్గంలో ఉంటే వెంటనే ప్రవర్తన మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ బీఎం హరిగోపాలం, ఇఫ్కో జిల్లా మేనేజర్ రఘుసురేంద్ర, డీసీఎంఎస్ ఆఫీస్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి వడ్రాణం హరిబాబు

తెనాలికి పూర్వ వైభవం తేవాలి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కళల కాణాచి తెనాలికి పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా నాటక, నాటికల ప్రదర్శనను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్టు తెనాలి శాఖలు సంయుక్తంగా ఆదివారం రాత్రి తెనాలి రామకృష్ణ కవి కళా క్షేత్రంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడారు. సమాజంలోని పరిస్థితులను ఇతివృత్తంగా మలచుకుని రూపొందించిన నాటికలను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారన్నారు. ఉత్తమ నగర చైతన్య కూర్పులతో, విజయవాడ న్యూ స్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ ఆర్కెస్ట్రా అసోసియేషన్, యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ వారి నాటికలు అలరించాయి. న్యాయవాది కె.లక్ష్మీ జగదీశ్వరరావు, మాజీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ట్రస్టు నిర్వాహకులు ఈదర వెంకట పూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు, పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.ఎల్. కాంతారావు, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు, పనాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ తదితరులు

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

గుంటూరు విద్య: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం 2025కు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో సీవీ రేణుక తెలిపారు. ఈనెల 13 లోపు ఆన్‌లైన్‌లో http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు ఎంటీఎస్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్.. : క్లస్టర్ ఖాళీలను ఎంచుకున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులకు ఖాళీలు ఉన్నచోట్ల, అత్యవసరమైన పాఠశాలల్లో పోస్టింగ్ ఇచ్చేందుకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో రేణుక ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు డీఈవో కార్యాలయానికి చేరుకోవాలని పేర్కొన్నారు.

జెండా ప్రతిష్ఠలో విచారణ గురువు ఫాతిమా మర్రెడ్డి, సంఘ పెద్దలు

14 నుంచి కార్మెల్ మాత ఉత్సవాలు

ఫిరంగిపురం గ్రామీణం: ఫిరంగిపురంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో కార్మెల్ మాత జెండా ప్రతిష్ఠ మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. బాలయేసు కథెడ్రల్ దేవాలయం నుంచి ఊరేగింపుగా కార్మెల్ కొండ వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా విచారణ గురువు ఫాతిమా మర్రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14, 15, 16 తేదీల్లో కార్మెల్ మాత ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం నుంచి ప్రతి రోజూ ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని తెలిపారు. సహాయ విచారణ గురువులు, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

‘ఎన్‌డీఏ ఏడాది పాలన అప్పులమయం’

మంగళగిరి, న్యూస్‌టుడే: ఎన్‌డీఏ ప్రభుత్వ ఏడాది పాలనలో అప్పులు తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. గుంటూరు జిల్లా మంగళగిరి సీపీఐ కార్యాలయంలో పట్టణ పార్టీ మహాసభను ఆదివారం నిర్వహించారు. తొలుత ఆ పార్టీ నాయకుడు రావుల శివారెడ్డి విగ్రహానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ పతాకాన్ని బాపనపల్లి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. . అధికారంలో ఉన్నంత కాలం జగన్ తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు రాలేదన్నారు. తన మాటే వేదంగా భావిస్తూ ఎవరు ఏం చెప్పినా వినకుండా పాలన సాగించి చివరికి పతనమయ్యారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సినిమాలకు పరిమితమయ్యారని, చౌక బియ్యం అక్రమ రవాణాపై హడావుడి చేసిన ఆయన ఒక్క లారీని కూడా సీజ్ చేయలేదన్నారు. ఆయనలో పదవిలోకి వచ్చిన తొలినాళ్లలో ఉన్న ఉత్సాహం కనపడడం లేదని విమర్శించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యుడు జంగాల అజయ్‌కుమార్, నియోజకవర్గ, పట్టణ కార్యదర్శులు చిన్నితిరుపతయ్య, అన్నవరపు ప్రభాకర్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ముసునూరి సుహాస్, జాలాది జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న రామకృష్ణ, వేదికపై నాయకులు

ఆటోను ఢీకొన్న కారు.. అయిదుగురికి గాయాలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: సీడ్ యాక్సెస్ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో అయిదుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట సమీపంలోని మురికిపూడికి చెందిన కుటుంబ సభ్యులు తాళ్లాయపాలెం శైవక్షేత్రానికి వచ్చారు. అక్కడి ఆలయంలో స్వామిని దర్శించుకుని వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి సీడ్ యాక్సెస్ రహదారిపై ఆటోలో బయలుదేరారు. ఆదే సమయంలో వెంకటపాలెం వైపు నుంచి గుంటూరు వల్లూరివారితోటకు చెందిన కె.హరినాథ్ భార్యతో కలసి కారులో వస్తూ ఆటోను ఢీకొట్టారు. దీంతో ఆటో పల్టీకొట్టి పక్కన కాలువలోకి బోల్తా కొట్టింది. కారు చక్రం ఊడి ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులకు గాయాలు కావటంతో వారిని ట్రాఫిక్ పోలీసులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాలువలోకి బోల్తా కొట్టిన ఆటో

సదరం స్లాట్ల బుకింగ్‌కు కష్టాలు!

పని చేయని సర్వర్లు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఈ నెల 5 నుంచి దివ్యాంగులు సదరం స్లాట్లు బుకింగ్ చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రచారం చేసింది. దీంతో అర్హులు శనివారం సచివాలయాలకు వెళ్లగా సర్వర్లు బిజీ అని చూపడంతో నిరాశ చెందారు. ఆదివారం మీసేవ కేంద్రాల్లో సైట్ పనిచేస్తోందని తెలియడంతో క్యూ కట్టారు. అక్కడ కూడా సైట్ ఓపెన్ కాక దివ్యాంగులు నిరాశతో ఇంటి బాట పట్టారు. మరో వైపు ఈ నెల 8తో గడువు ముగుస్తుందని విస్తృత ప్రచారం జరుగుతోంది. ఆదివారం మధ్యాహ్నం నుంచి కొన్ని కేంద్రాల్లో స్లాట్‌లు బుకింగ్ అవడంతో వాటికి డిమాండ్ పెరిగింది. ఇదే అదనుగా ఆయా నిర్వాహకులు రూ.400 నుంచి రూ.500 వరకు వసూలు చేశారు. అధికారులు స్పందించి సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో సర్వర్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రైవేటు పాఠశాల డైరెక్టర్ బలవన్మరణం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: భవిష్య శ్రీధర్‌గా పల్నాడు ప్రాంతంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఎందరికో విద్యాబుద్ధులు నేర్పారు. అప్పుల ఊబిలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అవుతూ.. చివరికి బలవన్మరణం పొందారు. గుంటూరు నగరానికి చెందిన శ్రీధర్(50) పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన ఉమాకల్యాణిని ప్రేమ వివాహం చేసుకున్నారు. 2000 నుంచి సత్తెనపల్లిలో నివాసం ఉంటూ.. ఇద్దరూ ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేశారు. 2013లో సొంతంగా విద్యాసంస్థను నడపాలనే ఆలోచనతో భవిష్య పాఠశాలను ఏర్పాటు చేశారు. వేలాదిమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. పాఠశాలకు ఈఎస్ఐ, పీఎఫ్ బకాయిలు ఉండటంతో ఇటీవలే ఆ శాఖ అధికారులు వచ్చి ఓ భవనానికి తాళంవేసి వెళ్లారు. దీనికితోడు ఆర్థిక సమస్యలు పెరగడంతో ఆయన కొంతకాలంగా మనోవేదన చెందుతున్నారని స్నేహితులు తెలిపారు. ఈక్రమంలోనే శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన సాయంత్రం వరకు తిరిగి రాలేదు. ఆయన భార్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అదృశ్యం కేసు నమోదు చేశారు. అనంతరం శనివారం రాత్రి విజయవాడలోని ప్రకాశం బ్యారేజీపై ద్విచక్ర వాహనం నిలిపి కృష్ణానదిలోకి ఓ వ్యక్తి దూకాడని అటుగా వెళ్తున్న వాహన చోదకులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఆ వాహనం చిరునామా ఆధారంగా అది శ్రీధర్‌కు చెందినదిగా పోలీసులు గుర్తించి సత్తెనపల్లి స్టేషన్‌కు సమాచారం అందించారు. ఆదివారం ఉదయం ఈతగాళ్లతో నదిలో గాలించగా మృతదేహం లభ్యమైంది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు సంతానం కాగా, పెద్ద కుమార్తె తేజస్విని అమెరికాలో ఎంఎస్ పూర్తిచేసి ఉద్యోగ అన్వేషణలో ఉంది. రెండో కుమార్తె నవ్యస్విని గుంటూరులో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతోంది.

శ్రీధర్ (పాతచిత్రం)

రేషన్ బియ్యం స్వాధీనం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నల్లచెరువుకు చెందిన చల్లా వెంకటేష్ గోరంట్ల, నగరాలు ప్రాంతాల్లోని పేదల నుంచి రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి పేరేచర్లలోని కోళ్లఫారాల ప్రాంతంలో ఎక్కువ ధరకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. నల్లపాడు పోలీసులు అక్కడకు చేరుకుని వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 107, రిటైల్ ధర - 129, చికెన్ విత్‌స్కిన్ - 187, చికెన్ స్కిన్‌లెస్ - 213.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 106, 114, 125 చికెన్ విత్ స్కిన్ - 204 చికెన్ స్కిన్‌లెస్ - 214.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 570 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటనపై ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన దాసరి శ్రీను(45) అదే గ్రామంలోని ఒక ప్రయివేట్ పాఠశాల బస్సు సహాయకుడిగా పని చేస్తుంటారు. శనివారం సాయంత్రం మేరికపూడిలో మొహర్రం వేడుకలు జరిగాయి. శ్రీను..మరో ముగ్గురు కలిసి ఆటోలో మేరికపూడి వచ్చారు. కాసేపటికి తిరిగి ఇంటికి బయలుదేరారు. గ్రామ శివారుకు వెళ్లే సరికి నరసరావుపేట నుంచి గుంటూరు వెళ్తున్న మినీ లారీ అతివేగంగా, అజాగ్రత్తగా వస్తూ ముందు వెళ్తున్న బస్సును అధిగమించబోయి ఆటోను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటో పల్టీ కొట్టింది. చోదకుడు శ్రీనుకు తీవ్ర, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం శ్రీనును మరో ఆటోలో నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. వైద్యులు పరీక్షించి శ్రీను అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన మినీ లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతుడికి భార్య పద్మ, కుమార్తె ఉన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

91.9FM Vijayawada Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

BUSINESS OFFER
టైలరింగ్ వర్క్స్ ఇంటి వద్దనే పనిచేసే స్త్రీలు కావలెను. వారికి క్లాత్ ఇచ్చుటకు స్టాక్ పాయింట్స్ పెట్ పార్టనర్స్ కావలెను. ✆ 7093632399.

FINANCIAL SERVICES
రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

PEOPLE CARE
OLD AGE HOME
రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

REAL ESTATE
GENERAL
A.P. రాజధాని అమరావతిలో ల్యాండ్ పూలింగ్‌లో గజం 5000/-, కాజాలో గజం 10,000/-, అమరావతిలో గజం 7000/-, మంగళగిరిలో గజం 12000/- 96035 30555.

HOUSE FOR SALE
GENERAL
బాపట్ల పట్టణము మెయిన్‌రోడ్ మరియు నేషనల్ హైవే మధ్యగల రోడ్డు ప్రక్కన గల పటేల్ నగర్ 1వలైనులో బీజెపి ఆఫీస్ ప్రక్కన 5.5 సెంట్ల విస్తీర్ణములో గల 2 అంతస్థుల డాబా అమ్మకమునకు కలదు. ✆ 99498 43944, 94416 49539.

PLOT FOR SALE
GENERAL
విశాఖలో/ అనకాపల్లిలో NRI ఫామ్ ల్యాండ్స్ వేయుటకు ఇన్వెస్ట్ పార్టనర్స్ కావలెను. సంప్రదించండి. ✆ 73864 14017/ 70936 32399.

JOBS
Wanted B-Pharmacy/ D-Pharmacy candidates to work in a pharmacy in Guntur city. Pci registration mandatory. And wanted packing & delivery boys, Q: 10th. 63009 75241.

Wanted Primary, High School Telugu, English and Physics Teachers Contact Immediately. Perecherla Ph : 97017 59405, 99123 77669.

Required Accountant with Tally Knowledge for a Company Salary: 20000 to 30000. Contact: 95023 82228.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో + వ + మంచి జీతం+ఇన్సెంటివ్స్ కలవు. 99590 21122 / 99590 31122.

గుంటూరు నగరంలో ప్రముఖ స్కూల్లో Classical Dance, Western Dance, Chess Masters & Primary Teachers కావలెను. ✆ 9447660603

అకౌంటెంట్ కమ్ ఆఫీసు అసిస్టెంట్ కావలెను. బి.కాం., 3 సం॥లు కంప్యూటర్ అకౌంట్స్‌పై అనుభవం. తెలుగు, ఇంగ్లీష్ భాషలపై పరిజ్ఞానం, రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

గుంటూరులోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వారి APCRDA అప్రూవ్ ప్లాట్లు మార్కెటింగ్ చేయుటకు టీం లీడర్స్ & ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. ఆకర్షణీయమైన జీతం/ మంచి కమీషన్ ఇవ్వబడును. ✆ 95731 51860.

త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 85209 80099, 85208 74499.

గుంటూరులోని ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేయుటకు సూపర్ వైజర్ కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత కలదు. ✆ 70753 38338.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

WANTED
పల్నాడు జిల్లా వినుకొండలోని ప్రభుత్వ చీఫ్ విప్ గారి కార్యాలయంలో ఈ క్రింద పేర్కొన్న ఉద్యోగాలకు దరఖాస్తులు కోరటమైనది. ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును ఈ క్రింది మొబైల్ నెంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపగలరు. అనుభవం మరియు అర్హతను బట్టి మంచి జీతం ఇవ్వబడును.
ఖాళీలు
1. పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ & సోషల్ మీడియా స్పెషలిస్ట్
2. కంప్యూటర్ ఆపరేటర్ (ఇంగ్లీష్ డ్రాఫ్టింగ్)
3. వ్యక్తిగత సర్వర్
దరఖాస్తులు పంపవలసిన మొబైల్ నెంబర్: 96183 22244
కావున ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 12వ తేదీలోగా మీ దరఖాస్తులు పంపవలసినదిగా కోరటమైనది.

ENGINEERING
పల్నాడు జిల్లా తాళ్లపల్లె గ్రామం మాచర్ల దగ్గర్లో పనిచేయుటకు సివిల్ ఇంజనీర్ కావలెను. Exp 3 సం॥ జీతం: 35000/-. Cont: 8688010673

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తెనాలి

• తెనాలి • పొన్నూరు

విద్యార్థులకు నగదు బహుమతి

నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పదో తరగతిలో 580 మార్కులకు పైగా సాధించిన ప్రభుత్వ బడుల విద్యార్థులకు తెనాలి జాబిల్లి సేవా సంస్థ నగదు బహుమతులు, జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందించింది. పట్టణంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఏడుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2 వేల వంతున బహూకరించారు. సంస్థ అధ్యక్షుడు ఏ.ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడు కొసరాజు వెంకట్రావు, వ్యవస్థాపకుల్లో ఒకరైన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కళాశాల్లో వన మహోత్సవం

మొక్కలు నాటుతున్న విద్యార్థులు, కళాశాల యాజమాన్యం

కొల్లిపర, న్యూస్‌టుడే: మొక్కలు నాటే కార్యక్రమం విద్యార్థుల్లో ఆనందాన్ని, కళాశాలకు నూతనశోభను తెచ్చిపెట్టాయని శ్రీకళానిలయం కార్యదర్శి బొమ్మారెడ్డిప్రభాకరరెడ్డి అన్నారు. వనమహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కొల్లిపర గ్రామంలోని ఏఆర్ఆర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నడకబాట (వాకింగ్‌ట్రాక్) చుట్టు విద్యార్థులు మొక్కలు నాటారు. తమపాకెట్‌మనీ వెచ్చించి మొక్కలు కొనుగోలు చేశారు. పర్యావరణం పట్ల తమకున్న ఆసక్తిని చాటుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి రైల్వేస్టేషన్‌లోని ఆటో స్టాండ్ డ్రైవర్లలో కొందరు ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. గమ్యస్థానాలకు చేరడానికి అధిక రుసుము డిమాండ్ చేస్తున్నారు. ఒప్పుకోక పోతే దుర్భాషలాడుతున్నారు, ఇతర వాహనాలను రానివ్వడం లేదు. రాత్రి సమయంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. **- నాగలింగం, తెనాలి** ✔ ఆటో స్టాండ్ డ్రైవర్లతో మాట్లాడతాం. సమస్యను పరిష్కరిస్తాం. దౌర్జన్యాలు చేస్తే ప్రయాణికులు స్టేషన్‌లోనే ఉన్న రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. **- వెంకటాద్రి, రైల్వే ఎస్సై**

? పట్టణ కొత్తపేటలో నూతన నిర్మాణాల సందర్భంగా రోడ్డుపైన తరచూ పొక్లెయిన్‌తో కంకర, మట్టి తరలిస్తుండటంతో రోడ్డు దెబ్బతింటుంది. **- స్థానికులు, కొత్తపేట** ✔ రోడ్డు దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటాం. **- లక్ష్మీపతిరావు, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్**

స్పందనకు వందనం

● పట్టణ నాజరుపేటలో కొబ్బరి బోండాల చెట్ల వల్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానికులు ఈ నెల 4న విద్యుత్తు విభాగ అధికారులకు తెలిపారు. స్పందించిన సిబ్బంది వాటిని తొలగించారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

దివ్యాంగులకు మానవత సేవ

లబ్ధిదారులకు మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మానవత సేవా సంస్థ తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం ఇద్దరు దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు అందించారు. సంస్థ ఛైర్మన్ డాక్టర్ కొలసాని రాంచంద్, అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్, కల్యాణి, వెంకట్, వాసు, ఎస్వీ.శర్మ, సాంబశివరావు, మల్లిఖార్జునరావు, అర్జున్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్లు గుల్ల.. మరమ్మతులు డొల్ల

పనులు చేసినా ఆగని నీటి వృథా

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే

పట్టణ పరిధిలో తాగునీటి పైపుల లీకు మరమ్మతుల్లో డొల్లతనం బహిర్గతమైంది. మున్సిపల్ అధికారులు ఇప్పటికే పనులు చేయించిన గాంధీ ఇర్విన్ పార్కు వద్ద, పాలాద్రి కాలువ వద్ద తాగునీటి పైపులు మరోసారి లీకై నీరు వృథాగా పోతోంది. నీళ్లు కలుషితమయ్యే ప్రమాదం ఉందని జనం ఆందోళన

గాంధీపార్కు వద్ద రోడ్డుపై నీరు

పాలాద్రి కాలువ వద్ద ఇలా..

గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం వద్ద..

వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పరిధిలోని తాగునీటి పంపిణీ పైపు లైన్లు 1,30,110 మీటర్లు. మున్సిపల్ ఇంజినీర్లు లీకులను అరికట్టేందుకు పనులు చేపట్టారు. అవి మొక్కుబడిగా చేశారన్న విమర్శలు విన్పిస్తున్నాయి. మరమ్మతులకు తీసిన గుంతలు పూడ్చి కాంక్రీటు వేయకుండా వదిలేయడం, వీటి మీదుగా భారీ లోడు వాహనాలు రాకపోకలు సాగించడంతో భూగర్భంలోని పైపుల పై ప్రభావం పడటం సర్వసాధారణం అయ్యింది. సీసీ రోడ్డు కింద భూగర్భంలోని తాగునీటి పైపులైను లీకై ఉబికి వస్తున్న నీటిని గుర్తించి బాగు చేయిస్తే సరిపోతుంది. కానీ ఆ రోడ్డు దెబ్బతినే వరకు పట్టించుకోవడం లేదు. వీఎస్ఆర్ కళాశాల నుంచి ఐతానగర్ వెళ్లే మార్గంలో సుమారు రూ.50వేలతో తాగునీటి గొట్టం మరమ్మతులు చేయించాక కాంక్రీటు పనులు చేపట్టకుండా నల్లమట్టి పోసి సరిపుచ్చారు. ఫలితంగా నీటి వృథాకు అడ్డుకట్ట పడకపోగా, ప్రజాధనం వృథా అయ్యిందని, ఇప్పటికైనా పూర్తిస్థాయిలో పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తొలి ఏకాదశి పూజలు

పొన్నూరు, చేబ్రోలు, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పూజలను ఆదివారం పొన్నూరు పట్టణం, మండల పరిధిలోని పలు దేవాలయాల్లో వైభవంగా నిర్వహించారు. జనార్దనుడికి ప్రత్యేక పూజలు చేశారు.

కోదండ రామస్వామికి తులసీదళార్చన

కొల్లిపర, న్యూస్‌టుడూ: తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలోని శ్రీదేవిభూదేవి సమేత శ్రీజనార్దన స్వామి ఆలయంలో పండగ వాతావరణం సంతరించుకుంది. ఆదివారం సూర్యోదయమే స్వామివారి ప్రత్యేక పూజాదికార్యక్రమాలను అర్చకులు పరాశరం జగన్నాథాచారులు నిర్వహించారు. స్వామివారిని తులసి, బంతి చామంతి తదితర పూలమాలలో అలంకరించారు. పండగ ఔన్నత్యాన్ని, విశేషాలను భక్తులకు వివరించారు. తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు.

పీర్ల ఊరేగింపు: పొన్నూరు, న్యూస్‌టుడే: మొహర్రం సందర్భంగా ఆదివారం పట్టణంలోని జీబీసీ రహదారిలో పీర్లను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

ఆదర్శప్రాయుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ

కొల్లిపర, న్యూస్‌టుడబే: రాజకీయ దురంధరుడు, న్యాయవాది, సామాజిక కార్యకర్త శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆదర్శప్రాయులని భాజపా మండల అధ్యక్షులు మండ్రు మురళి అన్నారు. ఆదివారం శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకైన పాత్రను పోషించారని కొనియాడారు. రెండుపర్యాయాలు మంత్రిగా, అఖిలభారతీయ హిందుమహాసభకు అధ్యక్షుడిగా సేవలందించారన్నారు. కార్యక్రమంలో మునగాలకృష్ణమూర్తి, ఆరిమండరామిరెడ్డి, బొమ్మువెంకటరెడ్డి, కొల్లిపరసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆదివారం నందివెలుగు గ్రామంలో భాజపా కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తోటకూర కోటేశ్వరరావు ఆధ్వర్యంలో చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రామస్వామి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఏకాదశి పూజలు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: తొలిఏకాదశి సందర్భంగా ఆదివారం పట్టణంలోని పలు ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు వేకువ జామున ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మహనీయుల త్యాగాలతోనే రిజర్వేషన్లు

బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించిన రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం తదితరులు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: మహనీయుల త్యాగాలతో అనుభవిస్తున్న రిజర్వేషన్ల ఫలాలు కిందిస్థాయి వారికి చేరువ చేయాల్సిన బాధ్యత మనపై ఉందని..వీటితో ఇప్పటికే అధిక లాభం పొందిన వారు తర్వాతి వారి కోసం త్యాగం చేస్తేనే సార్థకత చేకూరుతోందని ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం అభిప్రాయపడ్డారు. మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఏఎన్‌యూలోని ఆయన విగ్రహానికి ఆదివారం రిజిస్ట్రార్ సింహాచలం, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కత్తి రమేష్‌బాబు, అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య రత్నాకర్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీడీఈ సంచాలకులు ఆచార్య వెంకటేశ్వరరావు, మహాత్మాపులే అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య త్రిమూర్తి రావు, కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ వంజుబాబు, సీఈ శివప్రసాద్, నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని ప్రధాన కూడలి వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పలువురు నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధునిగా, దేశ ఉప ప్రధానిగా, వివిధ శాఖల మంత్రిగా బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని బాబూ జగ్జీవన్‌రామ్ కమిటీ, తెనాలి ప్రతినిధులు పేర్కొన్నారు. తెనాలిలోని విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అధ్యక్షుడు మేకల సురేష్, సద్గుణ రావు, కమలాకరరావు, రవికుమార్ పాల్గొన్నారు. ◆ తెనాలి మండలం కొలకలూరులో డెస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన నివాళి కార్యక్రమంలో డాక్టర్ రత్నాకర్, ఉన్నం ధర్మారావు, శరత్, వెంకయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు. ◆ పట్టణంలోని ఎస్సీఎస్టీబీసీమైనారిటీ ఐక్య వేదిక కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్, ఏకలవ్య మహరాజ్ చిత్రపటాలకు అక్కిదాసు కిరణ్‌కుమార్, దేవరకొండ శంకరరావు, రవిచంద్ర, మహేష్, శ్రీనివాస్, కోటేశ్వరరావు, పవన్‌కుమార్, రామాంజనేయులు నివాళులు అర్పించారు.

చెట్లకొమ్మలు.. నిప్పురవ్వలు

తెనాలి మండలం కఠెవరం గ్రామంలోని వంతెన సమీపంలోని కాలనీలో విద్యుత్తు స్తంభంపైకి చెట్ల కొమ్మలు, పిచ్చితీగలు ఎగబాకి ప్రమాదకరంగా మారాయి. చిన్న పాటి గాలి వచ్చినా కొమ్మలు, తీగల రాపిడి వల్ల నిప్పు రవ్వలు పుడుతున్నాయి. దీంతో అధికారులు విద్యుత్తు సరఫరా సైతం నిలిపేస్తున్నారు. పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు సమస్యను తెలియజేసినా ఫలితం ఉండటం లేదని స్థానికులు వాపోతున్నారు. వానాకాలం, సమస్య మరింత పెరుగుతుందన్న ఆందోళనను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

బీసీ సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: బీసీ సంక్షేమ సంఘం జగ్గడిగుంటపాలెం గ్రామ నూతన కమిటీ ఎన్నిక నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామంలోని కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా వంగర సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా కోటిస్వామి, కార్యదర్శిగా యుగంధర్ ఇతర కమిటీ ప్రతినిధులను ఎంపిక చేసి వారికి నియామకపత్రాలు అందించారు.

www.kimssikhara.com

KIMS SIKHARA HOSPITALS

కిమ్స్ శిఖర హాస్పిటల్స్ గుంటూరుకు చెందిన ప్రముఖ సినియర్ కార్డియాలజిస్ట్ (గుండె వైద్యనిపుణులు) కన్సల్టేషన్ కొరకు తెనాలి లో అందుబాటులో ఉంటారు.

డా॥ నాగ శ్రీ హరిత పర్వతనేని

MD (Osm), DM (SVIMS), FESC, FSCAI, FACC

Ex. Associate Professor Guntur Medical College

Sr. Interventional Cardiologist

Director – Cardiac Sciences

ప్రతి మంగళవారం నాడు

సమయం: ఉ॥ 10 గం॥ నుండి సా॥ 6 గం॥ వరకు

అందుబాటులో ఉంటారు.

ECG, 2D Echo, TMT సదుపాయం కలదు

స్థలం : ఆశ్రిత సూపర్ స్పెషాలిటి కేర్

7-5-31, లెక్చరర్స్ కాలని, ప్రకాశం రోడ్,

బ్యాంక్ ఆఫ్ బరోడా దగ్గర, గంగానమ్మపేట, తెనాలి.

అపాయింట్‌మెంట్ కొరకు సంప్రదించండి.

ఫోన్ నెం: 97057 53356 | 99661 90493

నమూనా పార్కు.. నాణ్యతా లోపాలు..!

అభివృద్ధిని విస్మరించిన వైకాపా ☛ వసతుల్లేక సందర్శకుల అవస్థలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే

2014–19 తెదేపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికే ఒక నమూనాగా ఉండేలా ఎన్టీఆర్ ఫైకస్ పార్కు అభివృద్ధి పనులు చేపట్టారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా పార్కు అభివృద్ధిని నిర్లక్ష్యం చేసింది. అసంపూర్తి పనులు, పూర్తి అయిన పనుల్లో నాణ్యతా లోపాలు సందర్శకుల పాలిట శాపంగా మారాయి. ఇటీవల పార్కులో ప్రవేశానికి సందర్శకులను అనుమతించారు. లోనికి వెళ్లిన సందర్శకులు, వాకర్స్‌ను ప్రమాదకర నిర్మాణాలు, ఏపుగా పెరిగిన పచ్చిక భయపెడుతోంది. దీనిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి అందుబాటులోకి తేవాలని సందర్శకులు కోరుతున్నారు.

వీధి దీపం ఇలా

రూ.1.70 కోట్లతో నిర్మాణం..

పట్టణంలోని పది పార్కుల్లో ఫైకస్ పార్కుకు ఒక ప్రత్యేకత ఉంది. తెదేపా హయాంలో వీఎస్ఆర్ ఎన్వీఆర్ కళాశాల వద్ద రూ.1.70కోట్లతో 3.30 ఎకరాల్లో పార్కు నిర్మాణ పనులు చేపట్టారు. అరుదైన రావి జాతి అనుబంధ మొక్కల పెంపునకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పార్కు అభివృద్ధి ఆగింది. అప్పటి ఎమ్మెల్యే అభివృద్ధి పార్కు అభివృద్ధి హామీ గాలికి వదిలేశారు. పార్కులోని వాకింగ్ ట్రాక్ గోడలు నాసిరకంగా నిర్మాణం చేయడంతో కుప్ప కూలి రాళ్లు కనుమరుగయ్యాయి. విద్యుత్తు స్తంభాలు, దీపాలు విరిగి నేలవాలాయి.

ట్రాక్ మధ్యలో నడుస్తున్న వాకర్స్

కొన్ని దీపాలు మాయమయ్యాయి. బహిరంగ వ్యాయామ పరికరాలు బిగించిన ప్రదేశంలో పచ్చిక తొలగించక పోవడంతో విష పురుగులు సంచరిస్తున్నాయి. అభివృద్ధి పనులు పూర్తి చేయకపోవడం, పార్కులో ప్రవేశానికి సందర్శకులను అనుమతించకుండా చాలా సంవత్సరాలు గేటు వేసి ఉంచడంతో అధ్వానంగా మారింది.. నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు దీపాలు, ఇతర సామగ్రి మాయమైనా పట్టించుకోలేదు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేపట్టి సందర్శకులను అనుమతించాలని స్థానికులు కోరుతున్నారు.



పారదర్శక దర్యాప్తు కోరుతూ వినతి

గుంటూరు నేరవార్తలు: పొన్నూరు రూరల్ మండలం మన్నవ గ్రామ సర్పంచి నాగేశ్వరరావుపై దాడి ఘటనపై పోలీసులు పారదర్శకంగా దర్యాప్తు చేయాలని మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఎస్పీని కలిసిన వారిలో వైకాపా పొన్నూరు ఇన్‌ఛార్జి అంబటి మురళీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే శివకుమార్, ఆ పార్టీ నాయకుడు వనమా వజ్రబాబు ఉన్నారు.

వేధింపులపై ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ పట్టణ గంగానమ్మపేటకు చెందిన మహిళ ఆదివారం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బహిరంగ మద్యపానంపై కేసు

తెనాలి టౌన్: కఠెవరం శివారులో ఆదివారం బహిరంగ మద్యపానం చేస్తున్న వారికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి కేసు నమోదు చేశారు.

జనరేటర్ మాయంపై..

చేబ్రోలు, న్యూస్‌టుడే: వేజండ్ల గ్రామానికి చెందిన పఠాన్‌జానీ సైదా ఖాన్ దుకాణం వద్ద ఉండాల్సిన జనరేటర్ ఆదివారం మధ్యాహ్నం కనిపించలేదు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

టీకాతోనే రేబిస్ నివారణ

తెనాలిలో టీకా వేస్తున్న సహాయ సంచాలకుడు నరేంద్రబాబు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: రేబిస్ వ్యాధి ప్రాణాంతకమని, టీకానే నివారణోపాయమని పలువురు పశుసంవర్ధకశాఖ అధికారులు పేర్కొన్నారు. ఆదివారం జూనోసిస్ దినోత్సవం సందర్భంగా తెనాలిలోని పశువైద్యశాలల్లో ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో పాల్గొన్నారు. కుక్క కరిచిన భాగాన్ని వెంటనే సబ్బుతో శుభ్రంగా కడిగి ఎండ తగిలేలా ఉంచాలని సదరు అధికారులు సూచించారు. అదే రోజు టీకా వేయించాలన్నారు. కరిచిన కుక్క బతికి ఉందా, చనిపోయిందో పరిశీలించాలని చెప్పారు. తెనాలి పశు వైద్యశాలలో ఏడాది పాటు ఉచితంగా అందిస్తున్న ఈ టీకాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కుక్కల పెంపకందారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ పెదరావూరు డివిజన్ ఉప సంచాలకులు వై.పద్మావతి, సహాయ సంచాలకులు గోగినేని నరేంద్రబాబు, బొంతు నాగిరెడ్డి పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

పొన్నూరు, న్యూస్‌టుడే: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రోటరీక్లబ్ జిల్లా పూర్వపు గవర్నర్ వడ్లమాని రవి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఒక ప్రయివేటు కల్యాణ మండపంలో రోటరీక్లబ్ నూతన అధ్యక్షుడుగా జీఎంఎస్ గుప్తా, కార్యదర్శిగా వై.వీరయ్య, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వడ్లమాని రవి మాట్లాడుతూ రానున్న కాలంలో విద్యార్థుల చేత నేస్తం కార్యక్రమంలో భాగంగా కోటి మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత చేపడతామన్నారు. క్యాన్సర్ బారిన పడిన మహిళలకు ఉచితంగా వ్యాక్సిన్లు అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

యోగా గురువులకు సత్కారం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: శ్రీఆంజనేయం ధ్యాన యోగా మండలి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ మారీసుపేటలోని కల్యాణ మండపంలో వ్యాస దీక్ష విరమణ, వేదవ్యాస స్మృతి, గురు పూజా మహోత్సవం, యోగాసన ప్రదర్శన, సహపంక్తి భోజన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులను వృద్ధాప్య దశలో చూడని వారు, భార్య చేతిని విడిచిన వారు ఎన్ని యజ్ఞాలు, పూజలు చేసినా ముక్తి పొందలేరన్నారు. యోగా సాధకులు కిషోర్ గురూజీతో పాటు ఇతర శాఖల గురువులను ఘనంగా సత్కరించారు. వివిధ విభాగాల్లో సేవలు అందిస్తున్న వారిని సన్మానించి నగదు బహుమతులు అందించారు. తెనాలి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ ఆత్మీయ అతిథిగా హాజరై తన యోగా అనుభవాలను పంచుకున్నారు. జిల్లాలోని యోగా సాధకులు హాజరయ్యారు.

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

కాపలాదారుడి నియామకం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: నాగులపాడులోని చెరువుకు పంచాయితీ అధికారులు కాపలాదారుడిని నియమించారు. గత నెల 24న 'ఈనాడు'లో 'ఇక్కడ ఇంతే ...' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాపలాదారుడిని నియమించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందనకు వందనం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ★ ప్రత్తిపాడులో మసీదు సెంటర్ ఎదురు మురుగుకాల్వలు పూడిపోయి మురుగు పారుదల లేదు. దుర్వాసన వచ్చి దోమలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 6న ప్రచురితమైన కథనానికి పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి షేక్.ఖాజా స్పందించి కాల్వల పూడిక తీయించారు. ★ గొట్టిపాడు శివారు ఉన్నవ రోడ్డు పక్కనే చెత్తా, వ్యర్థాలు పడేస్తున్నారు. వీటిని తొలగించకపోవడంతో దుర్గంధంతో రాకపోకలు సాగించేటప్పుడు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 6న ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి కళ్యాణి స్పందించి చెత్తా, వ్యర్థాలను తొలగింపజేశారు.

తుళ్లూరు, న్యూస్‌టుడే: తుళ్లూరు లైబ్రరీ సెంటర్‌లో ప్రధాన రహదారిపై తాగు నీటి పైపు వాల్వు తరచూ లీకులు ఏర్పడి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని 'మేమున్నాం...మీకు తోడుగా' శీర్షిక ఈ నెల 4న 'ఈనాడు'లో వచ్చిన కథనానికి పంచాయతీ సిబ్బంది స్పందించారు. పంచాయతీ కార్యదర్శి ఆర్.రమణ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రధాన రహదారిపై తాగు నీటి పైపు లైనుకు కొత్త వాల్వును బిగించారు. ★ ఐనవోలు గ్రామంలో సైడు కాలువలో మురుగు పేరుకు పోయిందని ఈ నెల 4న 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షిక వచ్చిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి సాంబిరెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులతో కాలువలను శుభ్రం చేయించారు.

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ? ప్రత్తిపాడులో మహబూబ్‌నగర్ కాలనీ రోడ్డు వద్ద చెత్తా, వ్యర్థాలు కుప్పలుగా పడేస్తున్నారు. కుక్కలు చేరి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. -స్థానికులు. ✔ పారిశుద్ధ్య కార్మికులతో చెత్తాచెదారం తొలగింపజేస్తాం. -షేక్.ఖాజా, ఇన్‌ఛార్జి కార్యదర్శి. ? వంగిపురంలోని ఎస్సీ కాలనీలో కాలువలు పూడిక తీయడం లేదు. మురుగు పారుదల లేక నీరు నిలిచి దోమల బెడద నెలకొంది. -స్థానికులు, వంగిపురం. ✔ కాల్వలు పూడిక తీయించి మురుగు నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటాం. -పి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, వంగిపురం.

తాడికొండ, న్యూస్‌టుడే: ? నిడుముక్కల గ్రామ శివారు రహదారిపై వ్యర్థాలు తగలబెడుతున్నారు. పొగ వ్యాపించి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. -దుర్గ. ✔ గ్రామ శివారు పేరుకున్న వ్యర్థాలను డంప్ యార్డుకు తరలిస్తాం. -సాయిలీల, ఈవోపీఆర్డీ. ? గరికపాడు గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ ప్రజలు అవస్థలు పడుతున్నారు. -వాసు . ✔ గ్రామంలో వీధి దీపాలు సిబ్బందితో తనిఖీ చేయించి మరమ్మతులు నిర్వహిస్తాం. -నాగమల్లేశ్వరరావు, విద్యుత్తు ఏఈ

వేగం పుంజుకోక.. జలం అందుకోక..

రాజధాని గ్రామాల్లో నత్తనడకన తాగునీటి సరఫరా పనులు ★ సీఆర్డీఏ చొరవ చూపాలని స్థానికుల విజ్ఞప్తి

తుళ్లూరు, న్యూస్‌టుడే

నిధులు కేటాయించిన గ్రామాలు	18
జనాభా	50,000

రాజధాని గ్రామాల్లో తాగునీటి సరఫరా నిమిత్తం చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. మొత్తం 18 గ్రామాల పరిధిలో రహదారుల మరమ్మతుల కోసం రూ. 5.11 కోట్లు, తాగు నీటి సరఫరాకు రూ. 10.75 కోట్లు, వీధి దీపాల ఏర్పాటుకు రూ.16.50 లక్షల చొప్పున సీఆర్డీఏ కేటాయించింది. వీటిలో రహదారుల బాగుజేత, వీధి దీపాల పనులు మాత్రమే పూర్తయ్యాయి. తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామంటూ ఇటీవల మందడం గ్రామంలో స్థానికులు బకెట్లతో ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు.

ప్రణాళికలకే పరిమితం..

హరిశ్చంద్రపురం గ్రామంలో గ్రామీణ తాగు నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో రెండు సమగ్ర రక్షిత తాగు నీటి పథకం ప్రాజెక్టులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటి ద్వారా తుళ్లూరు మండలంలోని గ్రామాలతో పాటు తాడికొండ గ్రామానికి పైపుల ద్వారా తాగు నీరు అందిస్తున్నారు. వర్షాలు పడి కృష్ణానదికి వరద వచ్చినప్పుడు తరచూ మోటార్లు మునిగి పోవటం, బురద నీరు రావటంతో సరఫరా నిలిచిపోతుంది. హరిశ్చంద్రపురం వద్ద కృష్ణానదిలో సురక్షిత ప్రాంతంలో ఫుట్‌బ్రిడ్జిలు నిర్మించి మోటార్లు ఏర్పాటు చేయడానికి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ ప్రణాళికలు రూపొందించి సీఆర్డీఏ అధికారులకు అప్పగించారు. అయినప్పటికి అక్కడ గుత్తేదారులు పనులు ప్రారంభించలేదని విమర్శలు వస్తున్నాయి. సీఆర్డీఏ డీఈ వేణుగోపాల్ మాట్లాడుతూ గుత్తేదారుడు కొన్నిరోజులు పనులు నిలిపివేయడంతో జాప్యం జరిగింది. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. త్వరలో పూర్తి అవుతాయని చెప్పారు.

మందడంలో ఏర్పాటు చేస్తున్న తాగు నీటి పైపులు

పాత పైపులే ఆధారం..

గ్రామాల్లో 30 ఏళ్ల కిందట వేసిన తాగు నీటి పైపులకు తరచూ లీకులు ఏర్పడుతున్నాయి. దీంతో అత్యవసర ప్రాంతాల్లో సీఆర్డీఏ తాగు నీటి పైపుల నిర్మాణం చేస్తోంది. మందడం గ్రామంలో తాగు నీటి పైపుల ఏర్పాటు పనులు నెమ్మదిగా సాగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయపూడిలో కృష్ణానది నుంచి పైపుల ద్వారా ... తుళ్లూరులో ట్యాంకు నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. నిర్మాణాలకు వాటర్ క్యూరింగ్ సరిగా చేయటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చాలా చోట్ల పైపులు, వాల్వులు, మోటార్లు, స్టోరేజీ సంపులు, ట్యాంకులు, ఫిల్టర్ బెడ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. సీఆర్డీఏ చొరవ చూపి గుత్తేదారులు త్వరితగతిన తాగు నీటి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తుళ్లూరులో తాగు నీటి ట్యాంకు నిర్మాణం

ఐనవోలుకు చెరువు నీరే దిక్కు..

ఐనవోలు గ్రామంలో భూగర్భ జలం ఉప్పగా ఉంటుంది. వినియోగానికి పనికిరావు. కొండవీటి వాగు నుంచి గ్రామంలోని చెరువులోకి వచ్చే నీటిని ట్యాంకుల్లోకి ఎక్కించి వాటినే పంచాయతీ అధికారులు ఇంటింటికి సరఫరా చేస్తున్నారు. టిడ్కో గృహాలకు ఆ నీటినే అందిస్తున్నారు. కనీసం ఫిల్టర్ కూడా చేయకుండా తాగు నీరుగా సరఫరా చేస్తున్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు ఎనలేనివి

మంగళగిరిలో నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను తాడేపల్లిలోని వాసవీ నివాస్‌లో ఆదివారం భాజపా నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒకే దేశం, ఒకే జెండా, ఒకే రాజ్యాంగం అన్న నినాదంతో కశ్మీర్‌లో నిరాహార దీక్ష చేసిన మహా నాయకుడు ముఖర్జీ అని కొనియాడారు. జన సంఘ్ స్థాపించి దేశాభివృద్ధికి కృషి చేశారన్నారు. పట్టణ భాజపా అధ్యక్షుడు టంకశాల ఈశ్వర్‌నాయుడు, ఉపాధ్యక్షుడు శివకొండారెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, యువ మోర్చా అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేద్దాం

దుగ్గిరాల, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9న జరగనున్న సమ్మెను జయప్రదం చేద్దామని సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు పిలుపునిచ్చారు. సమ్మెకు సన్నద్ధతలో భాగంగా ఆదివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించాలి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రూ. 6400కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. యశ్వంత్ రఘువీర్ డిమాండు చేశారు. ప్రత్తిపాడులో ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 100రోజుల్లో బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నాయకులు అజయ్, సాయి గణేశ్, కిరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పూజలు చేస్తున్న రాజధాని మహిళలు

దుగ్గిరాల : ఈమనిలో ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు..

అమరావతి విశ్వనగరం కావాలని పూజలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా రాజధాని గ్రామం మందడంలో రైతులు, మహిళలు గ్రామ దేవత పోలేరమ్మకు సారె, పొంగళ్లు సమర్పించారు. 2వ దశ రాజధాని భూ సమీకరణకు ఎటువంటి ఆటంకాలు ఏర్పడకూడదని పూజలు చేశారు.

కనక దుర్గమ్మకు ఆషాఢ సారె

తాడేపల్లి, న్యూస్‌టుడే: తొలి ఏకాదశిని పురస్కరించుకుని విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారికి ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం శివాలయం వీధికి చెందిన మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. తొలుత సోమేశ్వర స్వామి దేవాలయంలోని పార్వతి అమ్మవారికి తొలుత సారె సమర్పించి మేళతాళాలతో కాలినడకన అమ్మవారిని జపిస్తూ విజయవాడ బయలుదేరారు.

ఈమని(దుగ్గిరాల), న్యూస్‌టుడే: ఈమనిలోని గ్రామ దేవత గంగానమ్మకు ఆదివారం ఆర్య వైశ్య మహిళా మండలి సభ్యులు ఆషాఢ సారె సమర్పించారు. స్థానిక శివాలయంలో అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు.

తాడేపల్లి: ఊరేగింపుగా వస్తూ..

విష్ణు రూపాయ.. వాసుదేవాయ

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

ప్రత్తిపాడులో శ్రీసీతారామ, లక్ష్మణ స్వామి

న్యూస్‌టుడే బృందం: మంగళగిరి, తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల వ్యాప్తంగా ఆదివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు విష్ణు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. విష్ణు సహస్ర నామ పారాయణ, విశేష అభిషేకాలు నిర్వహించారు.

దుగ్గిరాల రైలు పేటలో శ్రీవారికి అలంకరణ

వైభవం..సింగరయ్య తిరునాళ్ల

సింగరయ్యను దర్శించుకుంటున్న భక్తులు

మేడికొండూరు, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి సందర్భంగా పేరేచర్ల శివారు సింగరయ్య (లక్ష్మీనరసింహ) తిరునాళ్ల మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. భక్తులు పొంగళ్లు చేసి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భారీ అన్న సంతర్పణ జరిగింది. పేరేచర్లలో తెదేపా, వైకాపా కార్యకర్తలు వేర్వేరుగా భారీ విద్యుత్తు ప్రభలు కట్టారు. పలకలూరు గ్రామానికి చెందిన దాత ఇంద్ర తన సొంత ఖర్చుతో మజ్జిగ పంపిణీ చేశారు. ఇనుప చక్రాల బండిపై ప్రభ ఉంచి పొట్టేళ్లు కట్టుకుని ఊరేగింపుగా వచ్చిన సన్నివేశం చూపరులను ఆకట్టుకుంది.

శిథిలం.. వినియోగిస్తే పదిలం

తుళ్లూరులో 2014-2019 మధ్య సీఆర్డీఏ కార్యాలయంగా వినియోగించిన భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భవనంపై ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగాయి. ఆ ప్రాంతం ముళ్లచెట్లతో చిట్టడవిలా మారింది. రాత్రి వేళ మందుబాబుల అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గోడలు నెర్రెలు కొట్టి వర్షానికి తడుస్తూ ఎండకు ఎండుతూ పాడై పోతుంది. సీఆర్డీఏ పాత భవనాన్ని తొలగించి నైపుణ్య శిక్షణ కోసం అక్కడ నూతన భవనాలను నిర్మాణం చేస్తే ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, తుళ్లూరు

కూలిన చెట్టు..తప్పిన ముప్పు

మోరంపూడి (దుగ్గిరాల), న్యూస్‌టుడే: మోరంపూడిలో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో పాత పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న పెద్ద చెట్టు కూలింది. పక్కనే ఉన్న దుకాణంపై, బ్రహ్మంగారి గుడి మీద పడింది. షాపు యజమాని పొదిలి శంకరరావు అప్పుడే దుకాణం తెరిచి బయటకు వచ్చారు. ఆ సమయంలో జనం తాకిడి కూడా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

నూతన కమిటీ ఎన్నిక

మల్లేశ్వరరావు, శంకర్‌లను సత్కరిస్తున్న తెదేపా నాయకులు

రేవేంద్రపాడు (దుగ్గిరాల), న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం రాత్రి జరిగింది. అధిక సంఖ్యలో హాజరైన కార్యకర్తల మధ్య అధ్యక్షుడిగా కూరగంటి మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా శంకర్ ప్రమాణస్వీకారం చేశారు. పార్టీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ఎంపీపీ షేక్ జబీన్, ఉన్నం యూన్సీరాణి, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల మధుబాబు, వాసిరెడ్డి శ్రీనివాసరావు, కాసరనేని జశ్వంత్, జి. శ్రీనివాసరావు, వీరశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

బోయపాలెం(ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకెళితే.. గత పదేళ్ల కాలం నుంచి బోయపాలెం ప్రాంతాల్లో సుమారు 60 ఏళ్ల వయస్సున్న ఓ వ్యక్తి పనులు చేసుకుంటూ రోడ్డుపై నిద్రిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి అతడు జాతీయ రహదారి దాటుతుండగా అతి వేగంగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ వ్యక్తి వివరాలు తెలియరాలేదని, ఢీకొట్టిన వాహనం ఆచూకీ గుర్తించే పనిలో ఉన్నామని ఎస్సై నాగేంద్ర చెప్పారు.

యువకుల ఘర్షణ.. ఒకరికి గాయాలు

పుల్లడిగుంట(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: పుల్లడిగుంట గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున రెండు వర్గాలకు చెందిన యువకులు ఘర్షణకు దిగారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో కొందరు యువకులు వాట్సప్ గ్రూపులో జులై 5వ తేదీ రాత్రి పొద్దుపోయేదాక పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. రాత్రి ఒంటి గంట దాటాక ఆ యువకులు పర్చూరు రోడ్డుపై ప్రధాన కూడలిలో ఘర్షణకు దిగారు. సమాచారం అందుకున్న సీఐ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్ది ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనలో ఒక వ్యక్తికి గాయాలు కాగా గుంటూరులోని ఆసుపత్రికి తరలించారు. ఘర్షణకు దారి తీసిన పరిస్థితులపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

పొన్నూరు, న్యూస్‌టుడే: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రోటరీక్లబ్ జిల్లా పూర్వపు గవర్నర్ వడ్లమాని రవి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఒక ప్రయివేటు కల్యాణ మండపంలో రోటరీక్లబ్ నూతన అధ్యక్షుడుగా జీఎంఎస్ గుప్తా, కార్యదర్శిగా వై. వీరయ్య, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

అవీ ఇవీ

'ఇంటింటికీ సుపరిపాలన'

తుళ్లూరు, న్యూస్‌టుడే: 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ఆదివారం నేలపాడు గ్రామంలో తుళ్లూరు మండలం తెదేపా అధ్యక్షుడు ధనేకుల వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగింది. కూటమి నాయకులు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

ఎన్‌ఆర్‌ఐ ఉదారత

పెదనందిపాడు: నాగులపాడులోని మూడు సామాజిక వర్గాలకు చెందిన శ్మశానవాటికల్లో ముళ్లకంప దట్టంగా మొలిచి చిట్టడివిని తలపిస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ ఆళ్ల వెంకట్ పొక్లెయిన్‌తో ఆయా ప్రాంతాలను శుభ్రం చేయిస్తున్నారు. ఈ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి.

నిత్యావసర సరకుల పంపిణీ

మంగళగిరి, న్యూస్‌టుడే: పెదవడ్లపూడి గ్రామానికి చెందిన సెయింట్ విన్సెంట్ డిపాల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సెయింట్ మైకెల్ పుణ్యక్షేత్రం ఆవరణలో ఆరు దత్తత కుటుంబాలకు నిత్యావసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. ఫాదర్ శౌరిబాబు, సొసైటీ ప్రెసిడెంట్ పి ఏసుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం నేడు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ 31వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం వట్టిచెరుకూరు మండలంలోని కుర్నూతల ఐదో మైలులో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం మండల కో ఇన్‌ఛార్జ్ బి. నాగేశ్వరరావు మాదిగ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, పలువురు ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు.

స్కూటీలో పాము కలకలం

తాడేపల్లి: తాడేపల్లిలో ఆదివారం రాత్రి ఇంటి ముందు నిలిపిన ఓ స్కూటీలో పాము చేరటంతో దాని యజమాని ఆందోళనకు గురయ్యారు. గమనించిన ఇంట్లోని వారు భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికుల సహాయంతో పామును చంపివేయడంతో ఊపిరి పీల్చుకున్నారు.

రాష్ట్రాభివృద్ధిపై సమగ్ర నివేదిక రూపొందిస్తాం

మంగళగిరి, న్యూస్‌టుడే: విద్యుత్తు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలని, పెంచిన విద్యుత్తు ఛార్జీలు తగ్గించడంతోపాటు అదానీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం మంగళగిరి పట్టణ సీపీఐ మహా సభలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి నిపుణులతో చర్చించి సమగ్ర నివేదిక రూపొందిస్తామని చెప్పారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఒకరినొకరు పొగుడుకోవడం మినహా రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. ఈ ఏడాది ఆగస్టు 23, 24, 25 తేదీల్లో సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలు ఒంగోలులో జరుగుతాయన్నారు.

వసతులకు దూరంగా.. వెతలకు దగ్గరగా

మేడికొండూరు, ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే

అంగన్‌వాడీ కేంద్రాల దుస్థితి ఇదీ

వైకాపా పాపం పిల్లలకు శాపంగా మారింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు విద్యా రంగం అభివృద్ధికి కృషి చేస్తున్నామని అప్పట్లో గొప్పలు చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ విస్మరించారు. దీంతో నేటికీ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో తెదేపా ప్రభుత్వ పాలనలో మేడికొండూరు చంద్రబాబు కాలనీ, పేరేచర్ల లక్ష్మీనరసింహ కాలనీల్లో కేంద్రాల నిర్మాణం తలపెట్టారు. పనులు మధ్యలో ఉండగా వైకాపా అధికారంలోకి వచ్చింది. దీంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఎండావానలకు తడుస్తూ నిర్మాణాలు దెబ్బతింటున్నాయి. దీనికి తోడు అసాంఘిక కార్యక్రమాలు, మందుబాబులకు ఆయా ప్రాంతాలు అడ్డాగా మారాయి. తాడికొండ నియోజకవర్గంలో మొత్తం 250 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. 41 కేంద్రాలు సొంత భవనాల్లో, 136 అద్దె గదుల్లో, 77 కమ్యూనిటీ భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో మొత్తం 7,268 మంది చిన్నారులు ఉన్నారు.

మేడికొండూరులో అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రం

సొంత భవనాలు కరవు

పలు చోట్ల కేంద్రాలకు సొంత భవనాలు కరవయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లో గదులు, అద్దె ఇళ్లు, కమ్యూనిటీ భవనాల్లో చదువులు చెప్పాల్సిన దుస్థితి నెలకొంది. వాటిల్లో కొన్ని చోట్ల గదులు ఇరుకుగా ఉండటం, గోడలు పగుళ్లివ్వడంతో కొద్దిపాటి వానకే లోపలికి నీరు చేరుతోంది. కొన్నిచోట్ల మరుగుదొడ్ల వసతి లేకపోవడంతో చిన్నారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల నీటి వసతి లేక పోవడంతో దూర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు లేదా నీళ్ల క్యాను రూ.10 నుంచి రూ.20లు చొప్పున కొనుగోలు చేసుకుంటున్నారు. దీనిపై సీడీపీవో అనురాధ మాట్లాడుతూ ఆయా కేంద్రాలకు సంబంధించి భవనం స్థితిగతులు మండల అధికారులు దృష్టికి తీసుకెళ్లామని, మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తాడికొండ నియోజకవర్గంలో ఇలా..

మండలం	కేంద్రాలు	సొంత భవనాలు	అద్దె గదుల్లో	సామాజిక భవనాల్లో	పిల్లలు
మేడికొండూరు	53	06	28	19	1,577
ఫిరంగిపురం	69	08	46	15	1,879
తాడికొండ	69	14	33	22	1,962
తుళ్లూరు	63	13	29	21	1,850

పీ-4లో భాగస్వామ్యం కావడం ఆనందదాయకం

సుబ్బారావును సత్కరిస్తున్న తెదేపా నాయకులు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో స్వర్ణాంధ్ర-2047 (పీ-4) కార్యక్రమంలో భాగస్వామి కావడం ఆనందంగా ఉందని ప్రవాసభారతీయుడు జంపాల సుబ్బారావు అన్నారు. పేద కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో రూపొందించిన ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్ తనకు కమిటీ సభ్యుడిగా బాధ్యతలు అప్పగించారని తెలిపారు. దుగ్గిరాల వన్ సేవా ట్రస్ట్ ద్వారా చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకుని తమకు ఈ అవకాశాన్ని ఇచ్చారని సుబ్బారావు తెలిపారు. ఆయన్ను ఆదివారం స్థానిక తెదేపా నాయకులు సత్కరించారు.

సమ సమాజ స్థాపనకు జగ్జీవన్‌రామ్ కృషి

తాడేపల్లిలో తెదేపా పట్టణ అధ్యక్షులు వెంకట్రావు ఆధ్వర్యంలో..

తాడేపల్లి: సమ సమాజ స్థాపనకు, దేశ అభివృద్ధికి భారత ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు చిరస్మరణీయమని తెదేపా తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు కొనియాడారు. తాడేపల్లిలోని తెదేపా కార్యాలయంలో ఆదివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు వైకాపా కార్యాలయంలో మండల కన్వీనర్ చల్లా హనుమంత్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.

దుగ్గిరాల, న్యూస్‌టుడే: దుగ్గిరాలలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి తెదేపా మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పూలదండలు వేసి నివాళులర్పించారు.

గొప్ప శిష్యుడు ఏకలవ్యుడు

ఫిరంగిపురంలో నివాళులర్పిస్తున్న నాయకులు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: లోకంలో గొప్ప శిష్యుడు ఏకలవ్యుడేనని వక్తలు పేర్కొన్నారు. ఏకలవ్యుని జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక రైలుపేట వెళ్లే దారిలో ఉన్న ఆయన విగ్రహానికి ఎరుకల సంఘం నాయకుడు గరిక శ్రీనివాసరావు, తెదేపా మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీ ఎంపీపీలు వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, ఉన్నం ఝాన్సీరాణి తదితరులు పూలదండలు వేసి నివాళులర్పించారు.

ఫిరంగిపురం గ్రామీణం: ఫిరంగిపురం ఒకటో వార్డు ఎస్టీ కాలనీలో ఆదివారం నాయకుడు మేడా రామకృష్ణ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

కొర్రపాటి వంశీయుల సందడి

పాలపర్రు (పెదనందిపాడు) న్యూస్‌టుడే: పాలపర్రులో ఆదివారం ఉత్సాహంగా ఉల్లాసంగా కొర్రపాటి వారు సందడి చేశారు. స్థానిక సూర్యేశ్వర, సోమేశ్వర స్వామి దేవాలయాల ప్రాంగణంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి కొర్రపాటి వంశీయులు అన్నీ ప్రాంతాల నుంచి తరలి వచ్చి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం నవ్యసాయి ప్రదర్శించిన భరత నాట్యం అలరించింది. నిర్వాహకుడు శివశంకర్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు తమ కుటుంబాల తరపున సాయం అందిస్తామని, గ్రామాభివృద్ధికి కూడా సహకరిస్తామని చెప్పారు.

IN THE COURT OF THE IIIrd ADDITIONAL JUDICIAL FIRST CLASS MAGISTRATE OF CHITTOOR

D.V.C.No. 13 of 2024

Between: Kanipakam Pavani Kumari ... Complainant

And:

Pusuluri Manjusha and Others ... Respondents

NOTICE TO THE RESPONDENTS NO.1

To

Pusuluri Manjusha, W/o Kanipakam Chaitanya, D/o Pusuluri Sankararao, D.No.1-267, Pedavadlapudi Village, Mangalagiri Mandal, Guntur District.

Sir/ Madam,

Please take notice that the above case is filed against you under Domestic Violence Act 2005, and said case stands posted to 30.07.2025 for your appearance.

If you fail to appear either in person or through an advocate on 30.07.2025 at 10.30 A.M., before, the Court of the III rd Additional Judicial First Class Magistrate of Chittoor, the matter will be decided in your absence.

Sd/- M.DAMODARAM,

Advocate for Petitioner. Ph. No. 94402 21693

(c) eenadu

గుంటూరు తూర్పు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నగరపాలక సంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు, వినతులపై అర్జీలు స్వీకరణ నిమిత్తం సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ (0863-2224202) కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం కౌన్సిల్ హాల్‌లో ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు.

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 34, వంగ 24, బెండ 23, పచ్చిమిర్చి 34, కాకర 30, క్యారెట్ 41, క్యాబేజీ 21, బీర 20, దొండ 36, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుళ్లు 34, దోస 15, పొట్ల 18, చామదుంప 28, మునగ 10, గోంగూర 8, తోటకూర 15, చుక్కకూర 15, కొత్తిమీర 25, బీట్‌రూట్ 37, కీర 34, క్యాప్సికం 70, అల్లం 60, ఫ్రెంచి బీన్స్ 64, సొర 12, అరటి 7 - **న్యూస్‌టుడే, పట్నంబజారు**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

★ ఆర్టీసీ కాలనీ ప్రధాన రోడ్డులో మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగు పారుదలకు ఆటంకంగా మారిందని స్థానికుడు మల్లికార్జున 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో కాలువల్లో పూడిక తీయించారు.

★ ప్రశాంతినగర్ రెండో లైన్‌లో రెండురోజులుగా చెత్త కుప్పలు తొలగించక పోవడంతో పారిశుద్ధ్యం దిగజారిందని స్థానికుడు సతీష్ 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. సమస్యను ప్రజారోగ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో చెత్తకుప్పలు తీయించారు.

స్పందనకు వందనం

- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ(గుంటూరు)

మొక్కలు తెచ్చారు.. మూలకు చేర్చారు!

నగరంలో పచ్చదనం పెంపుపై కొరవడిన ప్రణాళిక

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే

ఈ ఏడాది పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలో అయిదు లక్షలు మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కమిషనర్ ప్రకటించారు. ఇందులో భాగంగా ముందుగా కడియం నర్సరీల నుంచి 30 వేలు, సామాజిక అటవీ శాఖ నుంచి 3వేల మొక్కలు తెప్పించారు. వాటి కోసం రూ.40 లక్షలు మేర వెచ్చించారు. జూన్ మొదటి వారంలో తెప్పించిన వాటిలో ఎన్ని క్షేత్రస్థాయిలో నాటారో కూడా అధికారుల వద్ద లెక్కలు లేని పరిస్థితి. కడియం నర్సరీల నుంచి తెప్పించిన పండ్ల మొక్కలను డివిజన్ల వారీగా కార్పొరేటర్లు చెప్పిన వారికి ఇచ్చారు. వాటిని ఇళ్లలో, ముంగిట నాటి సంరక్షించాలని సూచించారు. అయితే మామిడి మినహా మిగిలిన వాటిని తీసుకునేందుకు ఎవరు ముందుకు రాలేదు. దీంతో అనేక మొక్కలు ఇప్పటికీ రిజర్వాయర్లు, గాంధీ పార్కు ఆవరణల్లో పడి ఉన్నాయి. కొన్ని సంరక్షణ సరిగా లేక ఎండిపోయాయి. ఈ కారణంగా రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతోంది.

పర్యావరణం దినోత్సవం సందర్భంగా తెప్పించిన మొక్కలు

ఉద్యాన విభాగం కార్యాచరణే లేదు.. గుంటూరుకు హరిత సౌందర్యం తెస్తామని అధికారులు చెప్పుకొస్తున్నా.. ఆ మేరకు కార్యాచరణ కనిపించడం లేదన్న విమర్శలు న్నాయి. జీఎంసీ ఉద్యాన విభాగంలో ఏడీహెచ్ స్థాయి అధికారి ఉన్నా వారి నుంచి ఇప్పటి వరకు ఎటువంటి ప్రణాళికలు లేవు. మూడు నెలల కిందట ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కడియం నర్సరీ నుంచి సుందరీకరణకు వినియోగించే విలువైన మొక్కలను (ఒక్కోటి రూ.1500పైన) తెప్పించారు. అప్పట్లో మొక్కల పేరుతో రూ.30 లక్షలకు పైగా బిల్లులు చేశారు. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేసిన అధికారులు నగరంలో ఏ ఒక్క రహదారిని పచ్చగా తీర్చిదిద్దిన దాఖలాలు లేవు. ఈ విషయమై ఇటీవల కౌన్సిల్ సమావేశంలో తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అధికారుల తీరుపై మండిపడ్డారు. అయిదు లక్షల మొక్కలు నాటే అంశంపై ఏడీహెచ్ శాంతి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఉన్నతాధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారని, ఆ వివరాలు త్వరలో తెలియజేస్తారని చెప్పారు.

సుపరిపాలనలో - తొలి అడుగుకు అపూర్వ స్పందన

వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'సుపరిపాలనలో-తొలి అడుగు' కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. ఆదివారం పదో డివిజన్‌లో సుపరిపాలనలో-తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఏడాదిలో చేసిన మంచి పనులు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించారు. పుస్తకాలు ఇచ్చారా..'తల్లికి వందనం' నగదు పడిన విషయం మీకు తెలుసా.. అని అడిగి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మీరావలి, తెదేపా నాయకులు గాలి సతీష్‌బాబు, రియాజ్, జమీర్, గౌస్, దుర్గాప్రసాద్, హెచ్.గుప్తా, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, కిరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలి

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బసవలింగారావు అన్నారు. ఆదివారం మాజేటి గురవయ్య కళాశాల హాల్‌లో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయినులు రుక్మిణి, కరుణకుమారిల అభినందన సభ నిర్వహించారు. అతిథులుగా ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, ఎంఈవోలు ఖుద్దూస్, జ్యోతికిరణ్, మహమ్మద్ ఖాసింలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, సభ్యులు మూర్తి, దాస్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పేదలకు సేవలు వెలకట్టలేనివి'

పింఛన్లు అందజేస్తున్న డాక్టర్ సురేష్‌కుమార్, కేవీ బ్రహ్మం, మహంకాళి శ్రీనివాసరావు

పట్నంబజారు, న్యూస్‌టుడే: పేదలను ఆదుకునేందుకు సేవా సంస్థలు ముందుకు రావాలని డాక్టర్ కోట సురేష్‌కుమార్ అన్నారు. ఆర్యవైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ (ఆవోపా) అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్నంబజారులోని సంస్థ కార్యాలయంలో 108 మంది పేదలకు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ పేదలకు ఆవోపా చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. ఆవోపా అధ్యక్షుడు కేవీ బ్రహ్మం మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో ఏటా ఉచితంగా బియ్యం, నిత్యావసర సరకుల పంపిణీ, పేద మహిళలకు కుట్టు మిషన్లు, గ్రంథాలు అందజేస్తున్నామన్నారు. అనంతరం పలువురు వైద్యులు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఛార్టర్డ్ అకౌంటెంట్ తూనుగుంట్ల రామారావు, రాధాకృష్ణయ్య, మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, వెంకట బ్రహ్మం, మిరియాల మోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో 598 మార్కులు సాధించిన హాసిని అనే విద్యార్థినికి ఆవోపా వారు రూ.5వేలు అందజేశారు.

పెంపుడు జంతువులకు టీకా తప్పనిసరి

టీకా వేస్తున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, డీడీ రత్నజ్యోతి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పెంపుడు జంతువులకు తప్పనిసరిగా యాంటీ రేబిస్ టీకా వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి విజయలక్ష్మి సూచించారు. ఆదివారం కొత్తపేట పశువుల ఆసుపత్రిలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా హాజరైన డీఎంహెచ్‌వో విజయలక్ష్మి చేతుల మీదుగా ఉచితంగా టీకా వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు కేవీవీ సత్యనారాయణ, ఉప సంచాలకులు ఎం.రత్నజ్యోతి మాట్లాడారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే రేబిస్ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. టీకాలు వేయించుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సహాయ సంచాలకులు చక్రవర్తి, జగదీష్, ప్రతాప్‌కుమార్, గురువారెడ్డిలు దాదాపు 500కు పైగా శునకాలు, పిల్లులకు టీకాలు వేశారు. వ్యాధి నివారణ కేంద్రం సహాయ సంచాలకులు తనూజ, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు: ఎస్పీ

బ్రాడీపేట వైపు ట్రాఫిక్ మళ్లింపుపై డీఎస్పీలు, సీఐలతో చర్చిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: శంకర్ విలాస్ పైవంతెన నిర్మాణ పనుల నేపథ్యంలో వాహనదారులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం బ్రాడీపేట వైపు ప్రారంభించిన వంతెన నిర్మాణ పనుల ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం కంకరగుంట బ్రిడ్జి, మూడు వంతెనల మార్గం, కొత్తపేట శివాలయం వద్ద ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను చూశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే రహదారులు, ప్రధాన కూడళ్లలో తగినంత మంది సిబ్బందిని కేటాయించాలన్నారు. ప్రజలు కూడా తమ వంతుగా పోలీసులకు సహకరించాలని కోరారు. ఎస్పీ వెంట డీఎస్పీలు రమేష్, అరవింద్, సీఐలు అశోక్‌కుమార్, సింగయ్య, ఆళహరి శ్రీనివాస్ ఉన్నారు.

పారదర్శక దర్యాప్తు కోరుతూ వినతి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పొన్నూరు రూరల్ మండలం మన్నవ గ్రామ సర్పంచి నాగేశ్వరరావుపై దాడి ఘటనపై పోలీసులు పారదర్శకంగా దర్యాప్తు చేయాలని మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్పీని కలిసిన వారిలో వైకాపా పొన్నూరు ఇన్‌ఛార్జి అంబటి మురళీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే శివకుమార్, ఆ పార్టీ నాయకుడు వనమా బాలవజ్రబాబు ఉన్నారు.

వేతనాలు పెంచాలని డిమాండ్

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: జీఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే వేతనాలు పెంచాలని ఏపీ మున్సిపల్ కార్మికుల సంఘం నగర కార్యదర్శి మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఆదివారం నల్లచెరువులోని కార్యాలయం వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 7న జీఎంసీ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పేదలపై ప్రేమ, కరుణ చూపాలి

బిరియాని వడ్డిస్తున్న డిప్యూటీ మేయర్ సజీల

పట్నంబజారు, న్యూస్‌టుడే: మొహర్రం సందర్భంగా చిన్నబజారులోని ఏక్ మినార్ మసీదు సెంటర్లో మాజీ కార్పొరేటర్ మటన్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ షేక్ సజీల హాజరై ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అల్లా చూపిన బాటలో నడవాలన్నారు. పేదలపై ప్రేమ, కరుణ చూపాలన్నారు. కార్యక్రమంలో షేక్ షౌకత్, ఖలీల్, లియాఖల్ తదితరులు పాల్గొన్నారు.

చినమహాలక్ష్మమ్మకు ఆషాఢ సారె

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కొత్తపేట చినమహాలక్ష్మమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. తొలుత మహిళలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని, అమ్మవారి వద్ద సారె ఉంచి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

10న సాయి సత్య వ్రతాలు

పట్నంబజారు : పాతగుంటూరు మెయిన్‌రోడ్డులోని గుంటి విఘ్నేశ్వరస్వామి, సాయిబాబా ఆలయాల్లో ఈ నెల 10న గురుపౌర్ణమి సందర్భంగా 108 మంది దంపతులచే సాయి సత్య వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

శ్రీవారికి లక్ష తులసీ దళార్చన

పాతగుంటూరు కొత్త రామాలయంలో..

వేదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో భక్తులకు అన్నదానం చేస్తున్న అశోక్‌కుమార్, చిన్ని

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: నగరంలోని పలు ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. లాలాపేట వేంకటేశ్వరస్వామి, కొత్తపేట జగన్నాథస్వామి, భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి, నాజ్‌సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం సెలవురోజు కావడంతో పిల్లలు, పెద్దలు కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల నిర్వాహకులు తొలి ఏకాదశి ప్రత్యేకమైన పాలపిండి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఉత్సవ ఏర్పాట్లను దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుభద్ర పర్యవేక్షించారు.

ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పట్నంబజారు, న్యూస్‌టుడే: పాత గుంటూరులోని అంకమ్మ తల్లి, గుంటి విఘ్నేశ్వరస్వామి, కొత్తరాముల వారి, సుద్దపల్లి డొంక రోడ్డులోని తిరుపతమ్మ, గోపయ్య స్వామి వార్ల ఆలయాల్లో తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

పట్నంబజారు, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా వాసవీ క్లబ్ గుంటూరు ఆధ్వర్యంలో వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఏటా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో దేవరశెట్టి చిన్ని, పారేపల్లి బాబ్జి, దొరెడ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి లక్ష తులసీ దళార్చన

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం నెహ్రూనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష తులసీ దళార్చన నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చారు. దీవి నరసింహ గోపాలాచార్యుల ఆధ్వర్యంలో శ్రీభాష్యం లక్ష్మణాచార్యుల బృందం శాస్త్రోక్తంగా లక్ష తులసీ దళార్చన చేశారు. భక్తులు భారీగా పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు కె.సాయికృష్ణ, పసుపులేటి సాంబశివరావు, కార్యదర్శి శివరామకృష్ణప్రసాద్, కోశాధికారి శ్రీనివాసరావులు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించండి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం బ్రాడీపేటలోని కార్యాలయంలో సంఘం జిల్లా 11వ మహా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సంక్షేమ బోర్డు లేకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు బాధిత కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణంలో స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరారు. జులై 23, 24 తేదీల్లో గుంటూరులో సంఘ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు నేతాజీ, సత్యనారాయణ, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, లక్ష్మణరావు, ముత్యాలరావు, దీవెనరావు, వలి, బాబూరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ

ప్రభుత్వ పథకాలు అందేలా కృషి

కార్యక్రమంలో జనసేన నాయకులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: స్థానిక నెహ్రూనగర్‌లో 56వ డివిజన్ అధ్యక్షుడు పులిగడ్డ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం 'చాయ్‌తో జన సైనికులు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని నిర్ణయించారు. నగర కార్యదర్శి త్రిపురకుమార్, నాయకులు రామకృష్ణ, శ్రీనివాస్, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అడుగు తడబడితే అంతే..!

మురుగు కాలువ పనులు సాగతీతతో అవస్థలు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే

బొంగరాలబీడు నాలుగో వీధిలో మురుగు కాలువ నిర్మాణ పనులు సాగతీతతో నానా అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అసలే ఇరుకైన రోడ్డు. ఇరువైపులా కాలువల నిర్మాణ పనులు చేపట్టడంతో సమస్యగా మారింది. ఇళ్ల ఎదురుగా వేసిన ఎత్తుబల్లలు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి. పనులు ప్రారంభించి 20 రోజులు అవుతున్నా చురుగ్గా నిర్మాణాలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ముందు మెట్లు పగులకొట్టడంతో బయటకు రావాలంటే బల్లలపై ఫీట్లు చేయాల్సిన పరిస్థితి నెలకొందంటున్నారు.

ఇంట్లో నుంచి బయటకు వచ్చేందుకు వృద్ధుడి అవస్థలు

ఆర్థిక స్తోమత లేని వారు చెక్క మెట్లను కూడా ఏర్పాటు చేసుకోలేకపోతున్నారు. మరికొన్ని ఇళ్లకు ఎత్తుగా ఉన్న మెట్లు తొలగించడంతో కిందకు దిగడానికి వృద్ధులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఒకరిద్దరు సాయం పడితే గాని కిందకు దిగలేరు. కాలువ కోసం తవ్వకాలు చేసిన చోట చెక్క బల్లలు, ప్లాస్టిక్ డబ్బాలు ఏర్పాటు చేసుకున్నారు. వాటిపై అడుగు తడబడితే ఇక అంతే సంగతులు. రాత్రివేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది.

రహదారికి రెండువైపులా తవ్వేశారిలా..

యంత్రాలతో పగులకొట్టడంతో సిమెంట్ రోడ్డు పగుళ్లిచ్చి పాడైపోయింది. అత్యవసర పరిస్థితుల్లో ఎవరినైనా ఆసుపత్రులకు తీసుకెళ్లాలంటే వీధి లోపలకు ఆటోలు సైతం రాలేని విధంగా తయారైంది. తవ్వకాలతో తాగునీటి పైపులు పగిలిపోవడంతో కొత్త వాటిని ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో పనులు ప్రారంభించడంతో మరింత ఆలస్యమవుతున్నాయి. స్థానికులు పడుతున్న ఇబ్బందులపై అధికారులు స్పందించి త్వరితగతిని పనులు పూర్తి చేసేలా చూడాలని కోరుతున్నారు.

ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా వసుంధర

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రధానాచార్యులుగా వి.వసుంధర ఆదివారం బాధ్యతలు చేపట్టారు. 1987లో వెల్లటూరు పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సుగా ప్రభుత్వ సర్వీసులో చేరారు. 1991, ఆగస్టులో జీజీహెచ్‌కి బదిలీపై వచ్చారు. 2008లో అధ్యాపకురాలిగా పదోన్నతిపై విశాఖపట్నం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు వెళ్లారు. 2018లో సహాయ ఆచార్యులుగా ఉద్యోగోన్నతిపై కర్నూలుకు బదిలీ చేశారు. అక్కడ పని చేస్తుండగానే మచిలీపట్నంలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా పని చేశారు. అనంతరం 2021లో ఆచార్యురాలిగా పదోన్నతిపై నెల్లూరు మార్చారు. తాజాగా ప్రిన్సిపల్‌గా ఉద్యోగోన్నతిపై గుంటూరులో చేరారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా ఉన్న స్లీవమ్మ నుంచి ఆమె నూతన బాధ్యతలు తీసుకున్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, అందుకే అందరూ విద్యావంతులు కావాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు నూతలపాటి నాగేశ్వరరావు అన్నారు. శ్రీవిశ్వకర్మ పేద విద్యార్థి సంక్షేమ సంఘం 28వ వార్షికోత్సవం అరండల్‌పేట శ్రీ ఆంధ్ర రాష్ట్ర ఏపీఏ విశ్వబ్రాహ్మణ సమాజ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన వ్యవస్థాపకుడు గోనుగుంట శేషగిరిరావు మాట్లాడుతూ 28 ఏళ్లుగా దాతల సహకారంతో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, రాత పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వేద ఉపాధ్యాయుడు ఆలూరి సుబ్రహ్మణ్యశర్మ, చిత్రకారుడు పాములపాటి శివరామకృష్ణలను గౌరవ పురస్కారాలతో సత్కరించారు.

ఇంజినీరింగ్ విభాగంలో బదిలీలు

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: పని సర్దుబాటులో భాగంగా జీఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో అధికారులను బదిలీలు చేస్తూ కమిషనర్ శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. అమృత్, 1, 2.0, ఏపీఎండీపీ 1, 2, పీవీకే నాయుడు మార్కెట్ తదితర ప్రాజెక్టుల పనులు ఏఈ పి.శైలజ, డీఈఈ టీవీ రమణలకు అప్పగించారు. హెడ్ వాటర్ వర్క్స్ తక్కెళ్లపాడు, సంగం జాగర్లమూడి, ఉండవల్లి, మంగళగిరి పంప్‌హౌస్‌ల నిర్వహణను ఏఈ ఎం.విజయబాబు, డీఈఈ ఈ.శ్రీనివాస్‌లకు ఇచ్చారు. ఎలక్ట్రికల్‌కు ఏఈలుగా అబ్దుల్ గౌస్, పి.మధుసూదనరావు, డీఈఈగా ఎం.రమేష్‌బాబును నియమించారు. హెచ్‌డీగా ఉన్న డీఈఈ నాగభూషణంకు డ్రాయింగ్ విభాగం ఒక్కటే ఉంచారు. వెహికల్ షెడ్, ఘన వ్యర్థాలు, స్లాటర్ హౌస్ నిర్వహణ బాధ్యతలను ఏఈ టీవీ మణికంఠ, డీఈఈ జె.సతీష్‌కుమార్‌లకు అప్పగించారు. మొత్తం 18 మంది ఏఈల్లో 9 మంది రెగ్యులర్ ఏఈలు కాగా మరో 9 మంది మౌలిక సదుపాయాల కార్యదర్శులను సీనియార్టీ ప్రాతిపదికన నియమించారు.

గాజా కోసం సంఘీభావం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గాజా కోసం మౌనం పేరిట ప్రపంచ వ్యాప్తంగా ఇచ్చిన నిరసన కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, కార్యదర్శివర్గ సభ్యులు రవి కోరారు. ఆదివారం బ్రాడీపేటలోని కార్యాలయంలో వారు మాట్లాడారు. జిల్లా ప్రజలు రోజూ రాత్రి 9 నుంచి 9-30 గంటల వరకు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి సంఘీభావం తెలపాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తింపు

పట్నంబజారు, న్యూస్‌టుడే: నల్లచెరువు 12వ లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం లాలాపేట పోలీసులు గుర్తించారు. మృతుడి వయసు సుమారు 35 సంవత్సరాలు ఉంటుంది. అతని ఒంటిపై టీ షర్ట్ ఉంది. మృతుడి బంధువులు లాలాపేట పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సీఐ శివప్రసాద్ తెలిపారు.

'మా హాస్టలు కథలు' పుస్తకావిష్కరణ

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాల 1977 బ్యాచ్ వైద్యులు, రచయిత నక్కా విజయరామరాజు రచించిన 'మా హాస్టలు కథలు' పుస్తకాన్ని బాలుర వసతి గృహంలో కళాశాల ఉప ప్రిన్సిపల్ శ్రీధర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాను చదువుకునే రోజుల నుంచి ఇప్పటి వరకు హాస్టలులో ఒప్పంద విధానంలో పని చేస్తున్న ఎలక్ట్రీషియన్ చంద్రారెడ్డికి రూ.1.5 లక్షల నగదును విజయరామరాజు అందజేశారు. ఇదే బ్యాచ్‌కు చెందిన కాలేషావలితో పాటు పలువురు వైద్యులు ఇటీవల వైద్య కళాశాలలో డైనింగ్ హాల్‌లో బల్లలు, కుర్చీలకు రూ.10 లక్షలు సాయం చేశారు. కార్యక్రమంలో విజయసారథి, కాలేషావలి, కేశవ్, అమృతపాణి, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

జీవ జలం రోడ్డు పాలు!

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: స్థానిక కోల్డు స్టోరేజ్ రోడ్డు, సంగడిగుంట వద్ద తాగునీటి పైపు లీకవుతోంది. ఈ కారణంగా ఉదయం వేళలో నగరపాలక సంస్థ అధికారులు సరఫరా చేస్తున్న తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతోంది. నెలరోజులుగా ఈ పరిస్థితి ఉన్నా. . స్థానిక సచివాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి లీకులకు మరమ్మతులు చేసి తాగునీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు సిటీ, రాజీవ్‌గాంధీ నగర్ 9వలైను, డోర్ నెం.37-8-630/1 కాపురస్తుడు పఠాన్ మొహిద్దీన్ గారి కుమారుడు అమీరుల్లా గారికి చెందిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నెహ్రూనగర్ బ్రాంచి అకౌంట్ నెం.31038015276 తాలుకు సంతకములు కలిగిన ఖాళీ చెక్కులు 917013, 917014, 917015, 917017, 917018 నుండి 917022, 661326, 661327 మరియు కొన్ని సంతకములు కలిగిన ఖాళీ ప్రామిసరీ నోట్లు, ఒరిజినల్ ఆధార్ కార్డు, పాన్ కార్డు వగైరాలు ఒక బ్యాగ్‌లో పెట్టుకొని తన ఇంటి వద్ద నుండి ఊరు వెళ్ళడానికి **దీ.30-06-2025**న ఆర్.టి.సి.బస్టాండుకు వెళ్ళు క్రమంలో మార్గమధ్యంలో పోయినవి.సదరు విషయం గమనించి వచ్చిన మార్గంలో ఎంత వెతికినా దొరకలేదు. కావున సదరు సంతకములు కలిగిన, ఖాళీచెక్కులు,ప్రామీసరీనోట్లు, ఒరిజినల్ ఆధార్,పాన్‌కార్డు గల బ్యాగ్ ఎవరికైనా దొరికిన యెడల నా క్లయింటుకు అందజేయుగలరు.అట్లు గాక సదరు సంతకములు కలిగిన ఖాళీ చెక్కులు, ప్రామీసరీ నోట్లు ఎవరైనా దుర్వినియోగం చేసిన నా క్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ & క్రిమినల్ చర్యలుకు బాధ్యులు కాగలరు.

ఆరణి శ్రీనివాస రావు, అడ్వకేట్,
4/2 అరండల్ పేట, గుంటూరు,సెల్:92915 44093

(c) eenadu

గుంటూరు పశ్చిమ

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 33, వంగ 34, బెండ 24, పచ్చిమిర్చి 38, కాకర 44, బీర 38, క్యాబేజి 23, క్యారెట్ 42, దొండ 37, బంగాళాదుంప 27, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుడు 34, దోస 18, సొర 15, పొట్లకాయ 19, అరటికాయ 7, చామదుంప 28, బీట్‌రూట్ 37, కీరదోసకాయ 39, బీన్స్ 84, క్యాప్సికమ్ 72, కొత్తిమీర 20, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 30, అల్లం 58, వెల్లుల్లి 110. - న్యూస్‌టుడే, పట్టాభిపురం

పాఠశాల ఆటోలా.. పుష్పక విమానాలా..!

పరిమితికి మించి విద్యార్థుల తరలింపు

పట్టాభిపురం, న్యూస్‌టుడే

ఆటోలో పిల్లల్ని కుక్కేస్తున్నారిలా..

ప్రమాదకరంగా ప్రయాణిస్తూ..

ఏం చేస్తున్నారు: కొందరు 10 నుంచి 15 మంది వరకు పిల్లల్ని వాహనంలో కుక్కుతున్నారు.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..:

అభివృద్ధికి విద్య సోపానం

ఉపకార వేతనాలు అందుకున్న వారితో నిర్వాహకులు

వైభవంగా సాయిసత్య వ్రతాలు

పూజ చేస్తున్న మహిళలు

శ్యామాప్రసాద్‌ముఖర్జీ పోరాటం చరిత్రాత్మకం

ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జూపూడి రంగరాజు

పనుల్లో జాప్యం.. అవస్థలు నిత్యం..

దిగా సాగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని వాహనచోదకులు వాపోతున్నారు. పనులు చేపట్టేందుకు రోడ్డుపై పోసిన కంకరతో వాహనాలు అదుపు తప్పి కింద పడుతున్నారని.. రోడ్డంతా కూడా ఎత్తుపల్లాలుగా ఉండడంతో వాహనాల రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని చోదకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గోరంట్ల

రోడ్డుపైకి యూజీడీ మురుగు

పొంగుతోంది. మురుగంతా రోడ్డుపై ఉండడంతో పాటు అక్కడ విపరీతంగా దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదంటున్నారు. అధికారులు స్పందించి యూజీడీ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గోరంట్ల

పేదలకు ఉచిత వైద్య సేవలు

మందులు పంపిణీ చేస్తున్న ప్రభాకర్

మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. గోరంట్లకు చెందిన డాక్టర్ తేజస్వి పేదలకు సేవ చేయాలన్న సంకల్పంతో ఈ శిబిరం నిర్వహించారన్నారు. డాక్టర్ తేజస్వి మాట్లాడుతూ గుండె సంబంధిత ఈసీజీ, 2డి ఎకో వంటి పరీక్షల ఉచి

13న 'ఏ షామ్ మస్తానీ' సినీ సంగీత విభావరి

గీతాంజలి ఆర్కెస్ట్రా నిర్వాహకుడు అమ్మ పండు సహకారంతో ప్రసిద్ధ గాయనీ గాయకులతో విభావరి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాడుతా తీయగా ఫేం శ్రీలలిత కూడా గీతాలు ఆలపిస్తారన్నారు. కార్యక్రమానికి రావాలనుకున్న వారు వెంకటేశ్వర విజ్ఞాన మందిరం కార్యాలయంలో ఉచిత ఎంట్రీ పాసులు పొందవచ్చన్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

పట్టాభిపురం, న్యూస్‌టుడే

అశోక్‌నగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలక సంస్థ కాల్వలు నిర్మించకపోవడంతో స్థానికులు ఎవరికి వారు తమ ఇళ్ల ముందు కాల్వలు ఏర్పాటు చేసుకున్నారు. అవి ఒకే స్థాయిలో లేకపోవడంతో మురుగునీరు కొన్ని ప్రాంతాల్లో ముందుకు కదలడం లేదు. కాల్వలు ఎగుడుదిగుడుగా ఉండడం, వాటిపై ర్యాంపులు నిర్మించడంతో పారిశుద్ధ్య సిబ్బంది పూడిక తొలగించడం కష్టంగా ఉంటుంది. శివలీల అపార్ట్‌మెంట్ ఎదురు రోడ్డులో సైడు కాల్వలు కనిపించకుండా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి చిన్నపాటి అడవిని తలపిస్తున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారై మురుగునీటితో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమలు ప్రబలి రాత్రిళ్లు నిద్ర పట్టడం లేదని, రోగాల బారిన కూడా పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

అశోక్‌నగర్‌లోని శివలీల అపార్ట్‌మెంట్ ఎదురు రోడ్డు సైడు కాల్వలో పెరిగిన పిచ్చిచెట్లు

అధ్వానంగా అడ్డరోడ్లు..

ఈ ప్రాంతంలో అడ్డరోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల కాలంలో అన్ని ప్రాంతాల్లో అడ్డరోడ్లను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాంత రహదారులను మాత్రం పట్టించుకోలేదంటున్నారు. రెండోలైనులోని రెండో అడ్డరోడ్డు గుంతలమయంగా తయారవడంతో స్థానికులే వాటిని పూడ్చుకున్నారు. మిగతా అడ్డరోడ్లు ఇదేవిధంగా పల్లంగా ఉండడంతో చిన్నపాటి వర్షానికే తటాకాలను తలపిస్తున్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు వాపోయారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నా మా ప్రాంతంలో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ మాత్రం అభివృద్ధి చెందడం లేదని, తాము పడుతున్న వెతలను పలుమార్లు నగరపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అతీగతీ లేదని ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నా సమస్యల్ని ఎందుకు పరిష్కరించడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సైడు కాల్వల నిర్మాణానికి, రోడ్ల అభివృద్ధికి అంచనాలు రూపొందించి నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రెండో లైనులోని రెండో అడ్డరోడ్డు దుస్థితి ఇలా..

భక్తి ప్రపత్తులతో తొలి ఏకాదశి పూజలు

గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు

గోరంట్ల వెంకటేశ్వర స్వామి

గుంటూరు సాంస్కృతికం, పట్టాభిపురం, గోరంట్ల, ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినం నగరంలోని పలు వైష్ణవ దేవాలయాల్లో ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయాల వద్ద దైవ దర్శనం కోసం వేకువ జాము నుంచే భారీ సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఆలయ నిర్వాహకులు దైవ దర్శనం కోసం వచ్చిన భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. బృందావన్ గార్డెన్స్, గోరంట్ల, కృష్ణనగర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో శ్రీవారిని చూడముచ్చటగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్తంభాలగరువులోని పోలేరమ్మ తల్లి అమ్మవారికి సారె వేడుక నిర్వహించారు. భక్తులు ఊరేగింపు నిర్వహించి పోలేరమ్మ తల్లికి సారె సమర్పించారు. వెంకట రమణ కాలనీలోని శ్రీకోదండరామాలయంలో శ్రీసీతారామచంద్ర స్వామికి సహస్రనామార్చన, శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన జరిపించారు.

❖ మల్లారెడ్డినగర్ శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయం ప్రాంగణంలో శ్రీరామలింగేశ్వరస్వామి, పర్వతవర్ధిని, విద్యాసరస్వతి అమ్మవార్లకు కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు.

కృష్ణనగర్‌లో ..

వెంకటరమణ కాలనీలో..

పోలేరమ్మ తల్లి

సామాజిక సంక్షేమానికి హోమాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి ఆలయంలోని యాగశాలలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం విశేష హోమాలు జరిగాయి. తొలి ఏకాదశి సందర్భంగా సామాజిక సంక్షేమం కోసం 15 మంది రుత్వికులు లక్ష్మీగణపతి, చండి, రుద్ర హోమాలు చేశారు. చివరగా పూర్ణాహుతి నిర్వహించారు. ఈ క్రతువులో కాకాని తహసీల్దార్ కృష్ణకాంత్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

చండీ హోమం చేస్తున్న రుత్వికులు

పెరిగిన నడుము నొప్పి బాధితుల సంఖ్య

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఆధునిక జీవనశైలి ఫలితంగా ఇటీవలి కాలంలో నడుమునొప్పి బాధితుల సంఖ్య బాగా పెరిగిందని ఆర్థోపెడిక్ సర్జన్ యలవర్తి రాకేష్ కిరణ్ తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో రాకేష్ కిరణ్ మాట్లాడారు. శక్తికి మించి బరువులు లేపడం, వెన్నును తరచూ ఇబ్బందికరమైన భంగిమల్లో వంచడం, చాలా ఎక్కువసేపు కుర్చీల్లో జారగిలపడినట్లు కూర్చొని ఉండిపోవడం వంటివన్నీ నడుము నొప్పి తెచ్చిపెట్టేవేనన్నారు. వీటికితోడు ఊబకాయం, పొగ తాగడం, శారీరక శ్రమ లేకపోవడం కూడా నడుము నొప్పికి దోహదం చేసే అంశాలేనన్నారు. సమావేశంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సదస్సు సమన్వయకర్త సాయిరామ్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న రాకేష్ కిరణ్

ప్రజల గుండెల్లో జనసేనకు ప్రత్యేక స్థానం

నగరంపాలెం: రాష్ట్ర ప్రజల గుండెల్లో జనసేన పార్టీకి ప్రత్యేక స్థానం ఉందని, పవన్ కల్యాణ్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొర్రపాటి నాగేశ్వరరావు అన్నారు. శ్రీనివాసరావుతోటలో జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి ఆధ్వర్యంలో ఛాయ్ విత్ జనసైనిక్స్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ పవన్ లాంటి గొప్ప నాయకుడి అడుగుజాడల్లో నడవడం ప్రతి జనసైనికుడికి, వీరమహిళలకు గర్వకారణమన్నారు. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు కేటాయించాలని, ఇందుకు కూటమి నేతలు సహకరించాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు అడపా మాణిక్యాలరావు మాట్లాడారు. కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, సంకూరి శ్రీను, పార్టీ నగర కార్యదర్శులు మెహబుబ్‌బాషా, కొత్తపేట ప్రసాద్, పుల్లంశెట్టి ఉదయ్, మారుతికిశోర్, సూరి, సాయి, శ్రీను, వాసు, కోటయ్య, రమణ, భూషయ్య, వెంకటేశ్వర్లు, బాలాజీ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నారాయణతీర్థుల తరంగ గానార్చన

గుంటూరు సాంస్కృతికం: లక్ష్మీపురం త్యాగరాజస్వామి కళా మందిరంలో ఆదివారం గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో నారాయణ తీర్థుల జయంత్యుత్సవాలు జరిగాయి. తొలుత భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్ర రాజు, త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిశోర్ కార్యక్రమాలను ప్రారంభించారు. నారాయణ తీర్థుల తరంగాలను ఎం.వై.శేషురాణి, పి.లలితాదేవి, డాక్టర్ కె.మృణాళిని, ఎం.మాధవీ కృష్ణ, జి.శ్రీవల్లి గానం చేశారు.

'మా హాస్టలు కథలు' పుస్తకావిష్కరణ

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాల 1977 బ్యాచ్ వైద్యులు, రచయిత నక్కా విజయరామ రాజు రచించిన 'మా హాస్టలు కథలు' పుస్తకాన్ని బాలుర వసతి గృహంలో కళాశాల ఉప ప్రిన్సిపల్ శ్రీధర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాను చదువుకునే రోజుల నుంచి ఇప్పటి వరకు హాస్టలులో ఒప్పంద విధానంలో పని చేస్తున్న ఎలక్ట్రీషియన్ చంద్రారెడ్డికి రూ.1.5 లక్షల నగదును విజయరామరాజు అందజేశారు. ఇదే బ్యాచ్‌కు చెందిన కాలేషావలితో పాటు పలువురు వైద్యులు ఇటీవల వైద్య కళాశాలలో డైనింగ్ హాల్‌లో బల్లలు, కుర్చీలకు రూ.10 లక్షలు సాయం చేశారు. కార్యక్రమంలో విజయసారథి, కాలేషావలి, కేశవ్, అమృతపాణి, వి.మురళి, శివయ్య, డిప్యూటీ వార్డెన్ శివగోపాల్‌తో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

పౌర నిఘాతోనే నగర సమస్యల పరిష్కారం

గోరంట్ల, న్యూస్‌టుడే: నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి, పారిశుద్ధ్య సమస్యలకు పౌర నిఘాతోనే పరిష్కారం సాధ్యమని ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి అన్నారు. గుంటూరులోని జనచైతన్య వేదిక కార్యాలయంలో గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ సభ్యుల సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి సామాజిక విశ్లేషకుడు టి.ధనుంజయరెడ్డి అధ్యక్షత వహించారు. ఓరుగంటి నారాయణరెడ్డి మాట్లాడుతూ మూడేళ్లుగా నగరంలోని 62 మంచినీటి ట్యాంకులను పరిశీలించి.. వాటిలో పేరుకుపోయిన మురికిని తొలగించడంలో సంఘం కృషి చేసిందన్నారు. 1,975 మంది పారిశుద్ధ్య కార్మికులు, 57 ట్రాక్టర్లు ఉన్నప్పటికీ పారిశుద్ధ్య సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ పౌర సమస్యలకు పటిష్ఠమైన గ్రీవెన్స్ సెల్ రూపొందించాలన్నారు. వీధి వ్యాపారులకు ప్రత్యేక కూడళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి 350 గృహాలకు పారిశుద్ధ్య కార్మికులను కేటాయించి, వారి వివరాలను ఇంటి యజమానులకు అందించడం ద్వారా పౌర నిఘా పెరిగి సత్ఫలితాలు వస్తాయన్నారు. మానవత సంస్థ కార్యదర్శి కె.సతీష్‌బాబు, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడారు. సమావేశంలో మానవత ఛైర్మన్ పావులూరు రమేష్, రేట్ పేయర్స్ సంఘ కార్యదర్శి ఆర్.అంజిరెడ్డి, సంయుక్త కార్యదర్శి వి.సదాశివరావు, శ్యామలానగర్ పార్క్ వాకర్స్ సంఘ నాయకుడు కనపర్తి రాఘవరావు, విశ్రాంత ఫార్మసిస్ట్ అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నారాయణరెడ్డి

జీవన సాఫల్య పురస్కారం అందజేత

విజయవాడలో ఆదివారం రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గుంటూరుకు చెందిన సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆర్.మురళి బాబూరావుకు జీవన సాఫల్య అవార్డు అందజేశారు. - న్యూస్‌టుడే, విజయవాడ

పరిమళించిన మానవత్వం

నెల్లూరు: నిండు గర్భిణి.. బతుకుదెరువుకు నగరానికి వచ్చింది. అర్ధరాత్రి పురిటినొప్పులు రావడంతో కుప్పకూలిపోయింది. అదే సమయంలో అటుగా వెళుతున్న కోటంరెడ్డి బ్రదర్స్ టీమ్ సభ్యుడు బిరదాల సుభాష్ గమనించి సపర్యలు చేశారు. వివరాల మేరకు.. గుంటూరు నుంచి ఓ మహిళ నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో పని కోసం ఓ గర్భిణి వచ్చింది. శనివారం అర్ధరాత్రి దాటాక రెండు గంటల సమయంలో అకస్మాత్తుగా నొప్పులు వచ్చి కింద పడిపోయింది. రక్తస్రావం అవుతుండగా.. అటుగా వెళుతున్న సుభాష్‌కు తాను గర్భిణి అని చెప్పగా.. 108, అక్కడే ఉన్న పోలీసులు, వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. అరగంట పాటు సేవలు అందించి అంబులెన్స్‌లో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు.

అలరించిన చిన్నారుల నృత్యాభినయం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళావేదికపై గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన కూడిపూడి నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. శ్రీనృత్య ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకుడు భాగవతుల వెంకట రామశర్మ, సౌమ్య దంపతుల శిష్య బృందం ఈ ప్రదర్శనలిచ్చింది. అనంతరం సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ చిట్టినేని అఖిలేష్ క్యాన్సర్ వ్యాధి గురించి ప్రసంగించారు. దేవస్థానం పాలకమండలి అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. వెంకట రామశర్మ, సౌమ్య దంపతులను గుళ్లపల్లి సేవా సంస్థ సభ్యులు, దేవస్థానం పాలకమండలి సభ్యులు సత్కరించారు. కార్యక్రమాన్ని నిఘంటు రచయిత పెద్ది సాంబశివరావు, సంస్థ వ్యవస్థాపకుడు గుళ్లపల్లి సుబ్బారావు, గుళ్లపల్లి రాఘవేంద్రరావు తదితరులు పర్యవేక్షించారు.

దావా సమన్లు

మహారాజశ్రీ గుంటూరు 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం. 75 / 2023

బిట్వీన్:
బడే రాజా మహేష్ రెడ్డి. ...వాది
మరియు
కొసనం రమణా రెడ్డి. ....ప్రతివాది

టు,
కొసనం రమణా రెడ్డి, S/o.లక్ష్మా రెడ్డి, నివాస డోర్ నెం.28-35-131/6,ఏ.టి.అగ్రహారం 16వలైను, గుంటూరు.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు పై కోర్టు నుండి దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:22-07-2025కి వాయిదావేసినారు. కావున ఆ రోజున ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల అక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడును. (శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:22-07-2025

గుండవరపు పద్మ వల్లి,
వాది తరపు అడ్వకేట్, గుంటూరు. సెల్: 9440144441

(c) eenadu

పండగ నాడు.. సారె చూడు..

తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఒకవైపు క్యూలైన్లలో రద్దీ ఉండగా.. మరోవైపు పెద్దసంఖ్యలో మహిళలు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించేందుకు తరలివచ్చారు.

– ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

రావమ్మా.. గోదారమ్మా..!

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : పట్టిసీమ నుంచి గోదావరి నీటి విడుదలను ఆదివారం మరింత పెంచారు. శనివారం 8 పంపుల ద్వారా 2,382 క్యూసెక్కులు ఇవ్వగా.. కృష్ణా డెల్టా సాగునీటి అవసరాల రీత్యా ఆదివారం 16 పంపుల ద్వారా 5,564 క్యూసెక్కులు విడుదల చేశారు. ఇవి నగరంలోని ప్రకాశం బ్యారేజీకి చేరడానికి కొంత సమయం పడుతుంది. దీనిపై సోమవారం రాత్రి ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కృష్ణా నదిలో పులిచింతల ప్రాజెక్టు పవర్ హౌస్ నుంచి 5,000 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి మట్టానికి గాను 11.2 అడుగులు ఉంది.

కాల్వలకు 7,389 క్యూసెక్కులు

కృష్ణా డెల్టా కాలువలకు ప్రకాశం బ్యారేజీ నుంచి 7,389 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 7,084, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 305 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,707, ఏలూరు 1,110, బందరు 1,259, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,008 క్యూసెక్కుల చొప్పున నీరు ఇస్తున్నారు.

దస్త్రం ముట్టనివ్వరు.. నిషేధం పెట్టనివ్వరు!

ఈనాడు, అమరావతి

విజయవాడ లోటస్‌ల్యాండ్ ప్రాంతంలో దుర్గగుడి భూముల పరిరక్షణను అధికారులు పూర్తిగా పక్కన పెట్టేశారు. ఈ భూముల పూర్తి వివరాలతో జిల్లా రిజిస్ట్రార్, రిజిస్ట్రేషన్ల ఐజీకి దస్త్రం పంపిస్తే వాటిని నిషేధిత జాబితాలో పెడతారు. క్రయవిక్రయాలు ఆగిపోతాయి. ఈ ప్రక్రియకు ఓ వారం సమయం పడుతుంది. కబ్జాకు గురైన 11.54 ఎకరాల భూములు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి చెందినవేనంటూ స్పష్టమైన ఆధారాలున్నాయి. అయినా అవి ఒకరి నుంచి మరొకరికి చేతులు మారుతూ వెళ్తున్నాయి. రూ.200 కోట్ల విలువైన ఈ భూములను స్వాధీనం చేసుకోవడం పక్కన పెడితే.. కనీసం నిషేధిత జాబితాలో పెట్టడానికీ అధికారులు చొరవ తీసుకోవడం లేదు. దీనికి ప్రధాన కారణం ఈ భూముల్లో పాగా వేసినోళ్లంతా బడా బాబులే.

★ 2023 డిసెంబరులో ఈ కబ్జా విషయం వెలుగులోకి రాగా కొన్నాళ్లు దేవాదాయశాఖలో నుంచి ఈ దస్త్రం బయటకు రాకుండా ఆపేశారు. ఆ తర్వాత దేవాయశాఖ నుంచి విడుదలై.. ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ విభాగానికి చేరింది. గత రెండు నెలలుగా అక్కడే మూలుగుతోంది. దుర్గగుడి భూములను ఆక్రమించినది వాస్తవమేనంటూ తేల్చి కూడా ఇప్పటికి తొమ్మిది నెలలవుతోంది. ఈ భూముల పరిరక్షణ కోసం విజయవాడకు చెందిన సామాజిక కార్యకర్త కృష్ణారావు సహా మరికొందరు ఏడాదిన్నరగా పోరాటం చేస్తున్నారు. ప్రక్రియను జాప్యం చేయడానికి రెవెన్యూ అధికారులు కొత్తవాదన తెరపైకి తీసుకొచ్చారని, వీటికి సంబంధించి కొన్ని కేసులున్నాయని, ఆ వివరాలన్నీ సంపాదించాకే వీటిపై ముందుకెళ్లాల్సి ఉందని చెబుతున్నారని కృష్ణారావు మండిపడ్డారు. దేవాదాయశాఖకు చెందిన ఈనాం భూములు ఎన్ని కేసులున్నా అవన్నీ దేవస్థానానికి చెందుతాయంటూ గతంలోనే సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలున్నా కబ్జా చేసినోళ్లకు అండగా ఉంటున్నారంటూ మండిపడ్డారు.

రూ.200 కోట్ల భూమిపై తెరవెనుక లాబీయింగ్

ఆర్డీవో కార్యాలయంలోనే మూలుగుతూ..

దుర్గమ్మకు చెందిన సత్యనారాయణపురంలోని పాత సర్వే నంబరు 118, ఆర్ఎస్ నంబరు 112లోని ఈ భూముల పరిరక్షణ కోసం త్వరగా జాబితాను రిజిస్ట్రేషన్ల శాఖకు పంపించాలంటూ ఇప్పటికే దేవాదాయశాఖ కమిషనర్ కూడా రెవెన్యూ శాఖకు నివేదిక పంపించారు. ప్రస్తుతం విజయవాడ ఉత్తర మండలం ఎమ్మార్వో నుంచి ఈ భూములకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన దస్త్రం ఆర్డీవో కార్యాలయానికి చేరింది. ప్రస్తుతం అక్కడే దస్త్రం మూలుగుతోంది. ప్రస్తుతం ఈ 11.54ఎకరాల్లో 127మంది పాగా వేశారు. వీరిలో కొందరు ఆక్రమించుకున్న వాళ్లుండగా, మరికొందరు వేరేవారి దగ్గర కొని మోసపోయినవాళ్లు ఉన్నారు.

కబ్జా కోరల్లో మరో 10 ఎకరాలు..

ఇప్పటికే ఆక్రమించినట్టు అధికారులు గుర్తించిన 11.54 ఎకరాలతో పాటు కొత్తగా మరో 10.38 ఎకరాల భూమి తెరపైకి వచ్చింది. రీసర్వే నంబరు 145, పాత సర్వే నంబరు 180లోని టైటిల్ డీడ్ నెం.131 పరిధిలోని ఈ 10.38 ఎకరాల భూమి దుర్గగుడికి చెందినదేనని ఈనాం రిజిస్టర్‌లో నమోదై ఉన్నట్టు సమాచారం. ఈనాం రిజిస్టర్, ఆర్ఎస్ఆర్ రికార్డు ఇవ్వాలంటూ స.హ దరఖాస్తులు చేసినా అధికారులు మాత్రం ఇవ్వడం లేదు.

ఆపద వేళ.. ఆదుకునేలా!

ఫసల్ బీమాతో రైతుకు ధీమా

న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

వైకాపా హయాంలో బీమా విషయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రధానంగా ప్రకృతి విపత్తుల సమయంలో అందించే బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తానని చెల్లించలేదు. దీంతో ఆపదలో ఆదుకునే బీమా సాయం అందక తీవ్రంగా నష్టపోయారు. ఇలాంటివి పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం ఫసల్ బీమా పథకంలో భాగంగా మార్గదర్శకాలు విడుదల చేసింది.

వరికి గ్రామం.. పసుపునకు జిల్లా

జిల్లాలో 1.75లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతున్నాయి. రైతులు అందరూ బీమా చేయించుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కృష్ణా జిల్లాకు ఈ ఖరీఫ్‌లో వరి, పసుపు పంటలకు బీమా చేయించుకునేందుకు అవకాశం కల్పించారు. వరి గ్రామ యూనిట్‌గా, పసుపు పంటకు జిల్లా యూనిట్‌గా పథకాన్ని అమలు చేయనున్నారు.

అర్హులందరికీ పరిహారం

బీమా పరిహారం రైతులకు అందించే క్రమంలో గత విధానాలు సక్రమంగా లేకపోవడంతో చాలా మంది రైతులు అర్హత ఉన్నా పరిహారాన్ని పొందలేకపోతున్నారు. సాధారణంగా పంట కోతకు వచ్చే సమయంలో అధికారులు పంటపొలంలో అక్కడక్కడా కొన్ని చదరపు అడుగుల విస్తీర్ణంలో కోతకోసి దిగుబడులు అంచనా వేస్తారు. అప్పటికి దిగుబడులు బాగానే ఉంటాయి. ఆ తరవాత వచ్చే ప్రకృతి విపత్తుల కారణంగా చేతికొచ్చిన పంటను సైతం కోల్పోవాల్సి వస్తోంది. దీనిని పరిగణనలోకి తీసుకోకపోవడంతో పరిహారం పొందలేకపోతున్నారు. కోతల తరవాత ధాన్యం విక్రయించే వరకు జరిగే నష్టాలనూ ఈ పథకంలో పరిగణనలోకి తీసుకుంటారు.

✪ రైతులు వినియోగించుకోవాలి: ఎస్వీవైఎస్ మనోహరరావు, జిల్లావ్యవసాయశాఖాధికారి

రైతులతో పాటు పంట సాగు హక్కు పత్రాలు పొందిన కౌలు రైతులూ బీమా పథకానికి అర్హులే. వరి సాగు చేసే వారు ఆగస్టు 15లోపు, పసుపు సాగు చేసేవారు జులై 31వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలి.

పంట	బీమా మొత్తం		చెల్లించాల్సిన ప్రీమియం	
	ఎకరాకు	హెక్టారుకు	ఎకరాకు	హెక్టారుకు
వరి	రూ.41,550	1,03,750	రూ.830	రూ.2,075
పసుపు	రూ.1,10,000	2,75,000	రూ.1,100	రూ.2,750

ప్రీమియం తక్కువ.. ప్రయోజనం ఎక్కువ

రైతుల కోసం ఫసల్ బీమాకు ముందు అనేక పథకాలు ఉన్నా వాటి కంటే భిన్నంగా తక్కువ ప్రీమియంలో ఎక్కువ ప్రయోజనం పొందేలా ఈ పథకంలో ఏర్పాట్లు చేశారు. గతంలో వరికి ప్రీమియం 12.50శాతం ఉంటే ప్రభుత్వం 7.50 శాతం రాయితీ ఇస్తే రైతులు తమ వాటాగా 5శాతం చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు 2 శాతం చెల్లిస్తే సరిపోతుంది. రబీలో అయితే 1.5 శాతమే రైతుల నుంచి వసూలు చేస్తారు. మిగిలిన ప్రీమియానికి సంబంధించిన నగదును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరిస్తాయి. ఇక పసుపు పంటకు 1 శాతం ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. తుపాను వరద, ముంపు వంటి విపత్తులకు ఇది వర్తిస్తుంది. పంట రుణాలు తీసుకునే వారికి బ్యాంకులే ప్రీమియం చెల్లిస్తాయి. రుణాలు తీసుకోని రైతులు కామన్ సర్వీసు సెంటర్లు, గ్రామ సచివాలయాలు. తపాల కార్యాలయాలను సంప్రదించి ప్రీమియం చెల్లించవచ్చు.

పీర్ల ఊరేగింపు

త్యాగానికి ప్రతీక మొహర్రం

మొహర్రం సందర్భంగా ఆదివారం మచిలీపట్నంలోని కోనేరు సెంటరులో రక్తతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్బలా మైదానంలో జరిగిన మారణ హోమాన్ని గుర్తు చేసుకుని అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలని, త్యాగానికి ప్రతీక మొహర్రం అని ముస్లిం మతపెద్దలు పేర్కొన్నారు. -మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

గ్రేడ్‌ల ప్రాధాన్యతకు తిలోదకాలు

అస్తవ్యస్తంగా కార్యదర్శుల బదిలీలు

న్యూస్‌టుడే, కలెక్టరేట్(మచిలీపట్నం): సచివాలయ కార్యదర్శుల బదిలీ ప్రక్రియ పలువురిని విస్మయానికి గురి చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిర్వహించాల్సిన బదిలీలను అపహాస్యం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవో అధికారాలు ఇచ్చిన నేపథ్యంలో పది నెలల కిందట క్యాడర్ స్ట్రెంత్ సమస్య లేకుండా చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ట్రెజరీ డైరెక్టరేట్ జిల్లాలో రద్దు చేసిన దాదాపు 500 స్థానాల్లో కొందరికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఒకే స్థానానికి ఇద్దరు కార్యదర్శులను నియమించడం, ఉన్నవారికి బదిలీ లేకుండా కొత్త వారిని వేయడం వంటి ఉత్తర్వులు కార్యదర్శుల్లో కలవరం పుట్టిస్తున్నాయి.

విచిత్రం ఏమిటంటే.. ఉమ్మడి కృష్ణా పరిధిలోని సచివాలయ కార్యదర్శులను బదిలీ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి బదిలీలకు నోచుకోని వారు స్థానచలనం పొందవచ్చని ఆశపడ్డారు. ఈ క్రమంలో అధికారులు కార్యదర్శుల నుంచి బదిలీ ఆప్షన్లు కోరుతూ అర్జీలు స్వీకరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, సీనియార్టీల ప్రకారం కోరుకున్న స్థానాలకు బదిలీ అవుతుందని భావించిన వారికి చుక్కెదురైంది. కృష్ణా, ఎన్టీఆర్‌లతో పాటు ఏలూరు జిల్లాలో విలీన మండలాలకు సంబంధించిన 414 మందిని బదిలీ చేశారు. విచిత్రం ఏమిటంటే ఉన్న బదిలీ ఆదేశాల్లో కొన్ని సచివాలయాల్లో పని చేస్తున్న కార్యదర్శుల స్థానంలో కొత్త వారిని నియమించి పాత వారిని ఎక్కడికీ పంపలేదు. దీంతో కొత్త వారు బాధ్యతలు ఎలా తీసుకుంటారనేది ప్రశ్నార్థకం. కొన్ని పంచాయతీల్లో గ్రేడ్-5 కార్యదర్శులకు అవకాశం ఇవ్వకుండా ఇటీవలే వచ్చిన గ్రేడ్-6 కార్యదర్శులను నియమించారు. మలపరాజుగూడెం, ఆముదాలలంక, నాచుగుంట, కొక్కిలిగడ్డ, అవనిగడ్డ- 3 వంటి సచివాలయాల్లో ఇద్దరికి చొప్పున పోస్టింగ్ ఇచ్చారు.

కొత్తవారు వస్తే విధులు ఎలా?: కూచికాయలపూడి, బల్లిపర్రు, చంద్రాల, చినకళ్లేపల్లి, కంచడం సచివాలయాల్లో పని చేస్తున్న వారిని బదిలీ చేయకుండా ఆ స్థానాల్లో కొత్త వారిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కొత్తవారు వస్తే విధుల్లో ఉన్న కార్యదర్శులు అదే సచివాలయంలో కలుపుకొని పనిచేయాలా? అనే సమస్య ఎదురవుతోంది. ట్రెజరీ డైరెక్టర్ రద్దు చేసిన స్థానాల్లో నియమితులైన వారికి వేతనాలు ఎవరు ఇస్తారనేది చూడాలి.

సఫారీలో షికారు.. సరికొత్త హుషారు

పర్యాటక సర్క్యూట్లపై సర్కారు ప్రత్యేక దృష్టి

ఈనాడు, అమరావతి

పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి కార్యాచరణ సిద్ధమైంది. విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న భవానీద్వీపం, కొండపల్లి కోట, కృష్ణా పరివాహక ప్రాంతంలోని ఆలయాలు, అటవీ ప్రాంతాల్లోని ట్రెక్కింగ్ జోన్లు, జలపాతాలు.. ఇలా అన్నింటిపైనా దృష్టి సారించి పర్యాటక ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించి ప్రాజెక్టులను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనిలో భాగంగా కొత్త పర్యాటక సర్క్యూట్లపైనా దృష్టి పెడుతున్నారు. ప్రధానంగా కొండపల్లి అటవీ ప్రాంతంలో.. జంగిల్ సఫారీ, బయో డైవర్సిటీ పార్కు, నేచర్ ట్రయల్స్, మూలపాడు బటర్‌ఫ్లై పార్కు వద్ద 250 హెక్టార్లలో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధానం..

ఎన్టీఆర్ జిల్లాకు ఆతిథ్య, సేవా రంగంపైనే ప్రస్తుతం 60శాతానికి పైగా ఆదాయం వస్తోంది. ప్రస్తుతం సేవా రంగంలోనే ఏటా 70శాతం వృద్ధి ఉంటోంది. దీనిని భారీగా పెంచేందుకు ఇక్కడ పుష్కలంగా అవకాశాలున్నాయి. విజయవాడలోని దుర్గగుడి, పెనుగంచిప్రోలు తిరుపతమ్మ, నెమలి వేణుగోపాలస్వామి, వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి, కృష్ణా నదికి పక్కనే ఉన్న మంగళగిరిలోని పానకాలస్వామి.. ఈ ఆలయాలన్నింటినీ కలిపి ఏడాదికి కనీసం రెండు నుంచి మూడు కోట్ల మంది భక్తులు సందర్శిస్తున్నారు. వీరిలో అధికశాతం మంది వచ్చిన వాళ్లు వచ్చినట్టే దర్శించుకుని వెళ్లిపోతున్నారు. వీరిని పర్యాటక ప్రదేశాల వైపు ఆకర్షించేలా సౌకర్యాలు కల్పిస్తే గణనీయంగా ఆదాయ వృద్ధికి అవకాశం ఉంటుంది. దీనిపైనే ప్రస్తుతం అధికారులు దృష్టి సారించారు.

భవానీద్వీపంపై ప్రత్యేక దృష్టి

కృష్ణా నదిలోని భవానీద్వీపాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. భవానీ ద్వీపం అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికల్లో భాగంగా తాజాగా బోటులో ప్రయాణించి వెళ్లి సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. పర్యాటకుల కోసం ద్వీపంలో ప్రస్తుతం ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్లు, మేజ్ గార్డెన్, బోటింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆలయ, ఎకో పర్యాటకానికి పుష్కలంగా అవకాశం ఉందని, కొత్త సర్క్యూట్లను అభివృద్ధి చేయడంపై ప్రధానంగా దృష్టి పెట్టినట్లు తెలిపారు.

కృష్ణా నదిలో బోటు ఎక్కి భవానీద్వీపం, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

దశలవారీగా అభివృద్ధి.. ప్రకృతి వనరులను వినియోగించుకుని ఇప్పటివరకూ లేనివిధంగా సరికొత్త అనుభూతి ఇచ్చేలా ప్రాజెక్టుల రూపకల్పనపై దృష్టి పెట్టారు. విజయవాడలోని గాంధీహిల్, అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం, బాపూ మ్యూజియం, అక్కన్న మాదన్న, మొగల్రాజపురం గుహలు, కొండపల్లి ఖిల్లా.. వీటన్నింటినీ దశలవారీగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ప్రత్యేకంగా పర్యాటక ప్యాకేజీలు

ఆలయ, ఎకో పర్యాటక సర్క్యూట్లను అభివద్ధి చేయడంతో పాటు సందర్శకులు ఆయా ప్రాంతాలకు చేరుకునేందుకు వీలుగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేకంగా పర్యాటక ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

ఇచ్చినవి చెబుతున్నారు.. తీసుకున్నవి దాచేస్తున్నారు

పటమట, న్యూస్‌టుడే: అద్విక ట్రేడింగ్ కంపెనీ స్కాంలో ఏజెంట్లు, బాధితులు చెప్పిన లెక్కలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. లెక్కలు దాదాపుగా కొలిక్కి వచ్చినా.. కొంతమంది ఏజెంట్లు, పెట్టుబడిదారులు కంపెనీలో పెట్టిన మొత్తాన్ని పోలీసుల ముందు రూపాయలతో సహా వెల్లడిస్తున్నారు. కానీ కంపెనీ ఎండీ ఆదిత్య నుంచి వడ్డీ, కమీషన్ రూపంలో తీసుకున్న నగదు గురించి మాత్రం పొంతన లేని లెక్కలు చెబుతున్నారు. దీంతో పోలీసులు కంపెనీ బ్యాంకు ఖాతా లావాదేవీల ద్వారా అసలు లెక్కలు తేల్చనున్నారు. ఇందు కోసం బ్యాంకులకు లేఖలు రాసిన విషయం తెలిసిందే. మరోవైపు విచారణలో ఆదిత్య వ్యవహారశైలితో నిధులు కచ్చితంగా పక్కదారి పట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు. హవాలా రూపంలో దుబాయ్‌కు తరలించిన నగదును అక్కడే పెట్టుబడులు పెట్టడం లేదా వేరే ఖాతాల ద్వారా తిరిగి ఇంకా ఎక్కడైనా పెట్టుబడి పెట్టి ఉంటాడని పోలీసులు అంచనాకు వచ్చారు. దీని ప్రకారమే దర్యాప్తు వేగవంతం చేశారు.

గోల్డెన్ లీఫ్‌పై అనుమానాలు.. పెట్టుబడిదారులను తప్పుదోవ పట్టించేందుకు ఆదిత్య దుబాయ్ వెళ్లి అక్కడ గోల్డెన్ లీఫ్ అనే ఫేక్ ట్రేడింగ్ కంపెనీ స్థాపించి డిజిటల్ కరెన్సీని డిపాజిట్ చేసినట్లు తొలుత పోలీసులు గుర్తించారు. కానీ అందులో ఖాతాలున్న ప్రతి ఒక్కరికి గత ఏడాది వాలెట్‌లోని నగదు విత్‌డ్రా చేసుకునే తేదీ నవంబరు 2గా చూపించింది. అదే సమయానికి ఆదిత్య కంపెనీ డైరెక్టర్లతో కలిసి దుబాయ్ వెళ్లారు. ఈ విషయాన్ని కొంతమంది డైరెక్టర్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వారికున్న అనుమానాలు సైతం పోలీసులకు తెలిపారు. దీంతో గోల్డెన్ లీఫ్ లెక్కలు తేల్చేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. దీనికి సంబంధించి అంతర్జాతీయ బ్యాంకు, కంపెనీల నిబంధనల ప్రకారం గోల్డెన్ లీఫ్ వివరాలకు సంబంధిత శాఖలకు పోలీసులు మెయిల్ పెట్టారు. ఈ వివరాలన్నీ వస్తే అసలు గోల్డెన్ లీఫ్ నకలీదా కాదా అనేది తేలనుంది.

కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే : కలెక్టరేట్‌లో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని యధావిధిగా నిర్వహిస్తామని కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం తెలిపారు. జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ పరిష్కార వేదిక ఉంటుందని చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమీపంలోని మండల, డివిజన్ కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పిస్తే అధికారులు తగు చర్యలు తీసుకుంటారన్నారు. కాల్ సెంటరులోని 1100 నంబరుకు ఫోన్ చేసి అర్జీలు నమోదు చేసుకోవడంతో పాటు దాని స్థితిగతులను తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు.

మా ఇంటి నేస్తాలు..

ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం విజయవాడలో పశువుల ఆస్పత్రిలో శునకాలకు రేబిస్ నివారణ టీకాలు వేశారు. పెంపుడు జంతువులను వాటి యజమానులు బుజ్జగిస్తూ.. ఆస్పత్రికి తీసుకొచ్చారు.

- విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

(c) eenadu

ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత ప్రవేశాలు

వేంపల్లె, న్యూస్‌టుడే

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు ట్రిపుల్ ఐటీలలో 600 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి విద్యార్థుల మెరిట్ జాబితాను తయారు చేసి ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి మొత్తం 4400 సీట్లు ఉన్నాయి. ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1100 సీట్లు ఉండగా దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ కోటా కింద 360 సీట్లు పోను నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1010 చొప్పున 4040 సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలలో ఉన్న సీట్లకు మెరిట్ జాబితా విడుదల చేసి జూన్ 30 నుంచి జులై 5వ తేదీ వరకు ఇడుపులపాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేశారు. కౌన్సెలింగ్ తర్వాత ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 878 సీట్లు భర్తీ కాగా 132 సీట్లు మిగిలిపోయాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలో 1010కి 869 భర్తీ కాగా 141 సీట్లు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 867 భర్తీ కాగా 143, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు 826 సీట్లు భర్తీకాగా 184 సీట్లు మిగిలాయి. ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో జాప్యం, ఇక్కడి విద్యపై ఆసక్తి లేని కారణంగా చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడంతో 600 సీట్లు ఖాళీ ఏర్పడింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ కేంద్రంగా రెండో విడత ప్రవేశాలకు సంబంధించి రెండో జాబితాను అధికారులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

ఇడుపులపాయల ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కార్యాలయం

నాలుగు విద్యాలయాల్లో మిగులు సీట్లు 600

11, 12 తేదీల్లో రెండో విడత ప్రవేశాల జాబితా

ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలలో మిగిలిపోయిన 600 సీట్ల భర్తీకి తదుపరి మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 11, 12 తేదీల్లో వెబ్‌సైట్‌లో వెల్లడిస్తాం. ఈ మేరకు రెండో విడత జాబితా సిద్ధం చేసే పనిలో తమ సిబ్బంది ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. ఆ లోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తాం. **- ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ**

అనధికార లోడు.. ఆదాయం బోలెడు!

క్రమబద్ధీకరణకు చక్కటి స్పందన

గుడివాడ, న్యూస్‌టుడే

విద్యుత్ శాఖ అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ఇస్తూ చేసిన ప్రకటనకు చక్కటి స్పందన లభించింది. దీని కోసం మార్చి 1 నుంచి జూన్ 30 వరకూ దరఖాస్తులు ఆహ్వానించింది. దీంతో విద్యుత్ వినియోగదారులు ఎక్కువ మంది ముందుకు వచ్చారు. మచిలీపట్నం విద్యుత్ సర్కిల్‌లో 13888 సర్వీసులకు 24136.66 కిలోవాట్ల అదనపు లోడు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకొన్నారు. దీంతో మచిలీపట్నం విద్యుత్ సర్కిల్‌లో రూ.2,97,12,899 ఆదాయం లభించింది. గుడివాడలో రూ.1.26 కోట్లు ఆదాయం వచ్చింది.

లోడు లెక్కించేది ఇలా..

ఇంట్లో ఉన్న విద్యుత్ పరికరాల వినియోగాన్ని బట్టి విద్యుత్ లోడు అంచనా వేసి దాన్ని కిలోవాట్లలో లెక్కిస్తారు. ఒక కిలో వాట్‌కు విద్యుత్ శాఖకు సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, డెవలప్‌మెంట్ రుసుము రూ.2వేలు, దరఖాస్తుకు రూ.50, అదనపు ఖర్చులు రూ.250లను చెల్లించాలి. అంటే అదనంగా కిలోవాట్‌కు చెల్లించాల్సిన రుసుము రూ.2500 అయితే.. 50 శాతం రాయితీతో 1250 వసూలు చేశారు. ఎంత అదనపు లోడు ఉన్నా క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ఇచ్చారు.

వివిధ డివిజన్లలో అదనపు లోడు క్రమబద్ధీకరణ వివరాలు పరిశీలిస్తే...

డివిజన్ పేరు	సర్వీసులు	అదనపు లోడు (కిలోవాట్లు)	ఆదాయం (రూపాయల్లో)
మచిలీపట్నం	3672	6615.14	81,56,899
గుడివాడ	5976	10248.42	1,26,09,100
ఉయ్యూరు	4240	7273.10	89,46,900

ఓల్టేజీ సమస్యల పరిష్కారానికి కృషి

గుడివాడ డివిజన్‌లో అదనపు లోడు క్రమబద్ధీకరణకు విశేష స్పందన లభించింది. సుమారు రూ.1.26 కోట్ల ఆదాయం వచ్చింది. దీంతో ఓల్టేజి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నాం. అవసరమైన చోట అదనపు లోడు నియంత్రికలు ఏర్పాటు చేస్తున్నాం. అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి ప్రయత్నిస్తున్నాం. **- జి.బి.శ్రీనివాసరావు, ఈఈ గుడివాడ డివిజన్**

జనసంద్రం.. జగన్మాత క్షేత్రం

ఇంద్రకీలాద్రి: జగన్మాత కొలువైన ఇంద్రకీలాద్రికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడం, తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఆషాఢ సారె తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. దుర్గగుడి ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ మెట్ల మార్గం ఉదయం నుంచి భక్తుల వాహనాలతో కిటకిట లాడాయి. రికార్డుస్థాయిలో 80వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. ఉదయం నుంచి దేవస్థానంలో సేవా సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులు, అదనపు విధులు కేటాయించిన అధికారులు మధ్యాహ్నం మూడు గంటల వరకు భక్తులను నియంత్రించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వాహనాలు నిలిపేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

తొలి ఏకాదశి సందర్భంగా పోటెత్తిన భక్తులు

కనకదుర్గమ్మకు సారె సమర్పిస్తున్న మహిళలు

వీరమ్మ తల్లికి ఆషాఢ సారె సమర్పణ

ఉయ్యూరు : ఉయ్యూరులోని వీరమ్మతల్లి అమ్మవారికి ఆదివారం ఆషాఢ సారె సమర్పణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. భారీ సంఖ్యలో మహిళలు చీర సారెలతో ఉత్సవ ఆలయం నుంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాల నడుమ ఊరేగింపుగా అమ్మవారి మెట్టినింటికి తరలివెళ్లారు. ఉభయ పూజలు చేసి, అమ్మవారికి సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, నగర పంచాయతీ ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని), భక్తులు పాల్గొన్నారు.

ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

స్కేటింగ్ రోల్‌బాల్ విజేతకు స్వాగతం

కొండిపాలెం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని వడ్లమన్నాడు శివారు కొండిపాలేనికి చెందిన ఆర్మీ సైనికుడు మోటపర్తి రాంబాబు, చైతన్య దంపతుల కుమారుడు శ్రీకాంత్‌కు ఆదివారం గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఇంటర్ చదువుతున్న అతడు కెన్యాలో జరిగిన జూనియర్ స్కేటింగ్ రోల్ బాల్ పోటీలలో మన దేశం తరపున ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహించాడు. ఈ పోటీలలో మన దేశం ప్రపంచకప్ సాధించింది. ఈనేపథ్యంలో ఆదివారం సాయంత్రం శ్రీకాంత్ స్వగ్రామానికి రాగా గుడ్లవల్లేరు నుంచి ఓపెన్‌టాప్ జీపులో ఊరేగింపుగా గ్రామస్థులు స్వాగతం పలికారు. కేక్ కోసి అభినందనలు తెలిపారు.

ఊరేగింపులో శ్రీకాంత్‌తో కేకు కోయిస్తున్న దృశ్యం

పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తగ్గించండి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తగ్గించాలని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ కోరారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పంచాయతీ రాజ్ కార్యదర్శుల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మరింత జాప్యం చేయకుండా సత్వరమే వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. స్పెషల్ గ్రేడ్ పంచాయతీ అధికారులను... పంచాయతీ కార్యదర్శుల నుంచే నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రోజూవారీగా పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు సమయపాలనలో మార్పులు చేయాలని, వీడియో కాలింగ్ చేస్తున్న విధానాన్ని తొలగించాలని కోరారు. గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వం ఇస్తున్న రూ.6వేల వేతనం చాలకపోవడంతో కార్యదర్శులు అదనంగా చెల్లించాల్సి వస్తోందని చెప్పారు. మొత్తం 6 గ్రేడ్లుగా ఉన్న పంచాయతీ కార్యదర్శులను మూడు గ్రేడ్లుగా చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.వి.డి.ప్రసాద్ మాట్లాడుతూ.. ఇటీవల పంచాయతీ కార్యదర్శుల పదోన్నతులు అవినీతిరహితంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. పని గంటల విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న విద్యాసాగర్, వేరెళ్ల ప్రసాద్, రమణ, హేమంత్‌కుమార్‌రెడ్డి, వెంకటాద్రి తదితరులు

శాకంబరిగా శ్రీకొండలమ్మ తల్లి

అలంకరణలో శ్రీకొండలమ్మ తల్లి

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని ప్రసిద్ధ వేమవరం శ్రీకొండలమ్మతల్లి దేవస్థానంలో ఆషాఢ ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించారు. దాతల వితరణతో అమ్మవారిని, ఆలయ ఆవరణలు, మండపాలను 12 టన్నుల కూరగాయలు, పండ్లతో అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఈవో ఎ.కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కూరగాయలతో నిండిన అమ్మవారి మండపం

అమరవీరుల ఆశయ సాధనకు కృషి

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : అమరవీరులు ఏ ఆశయాల కోసం ప్రాణాలు అర్పించారో వాటి సాధనకు అందరూ కృషి చేయాలని పలువురు ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. కర్బలా మైదానంలో జరిగిన మారణ హోమాన్ని పురస్కరించుకొని ఆదివారం బందరులోని కోనేరు సెంటరులో చెస్ట్ బీటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరోహె మీరన్‌షా, గిరోహె హుసైనీ, గిరోహె హజ్రత్‌హుజ్జత్‌ల ఆధ్వర్యంలో రక్తతర్పణ చేశారు. సజ్జాదియా సంస్థ ఆధ్వర్యాన ఇనుగుదురుపేట జైహింద్ పాఠశాల ప్రాంతంలోని గాడీఖానాలో రక్తతర్పణ కార్యక్రమాలు చేపట్టారు. మంత్రి కొల్లు రవీంద్రతో పాటు కూటమి నాయకులు, పలువురు ప్రముఖులు అమరవీరులకు నివాళులర్పించి అలంకు దట్టీ సమర్పించారు. రక్తతర్పణ చేస్తున్న వారికి మంత్రి రవీంద్ర నీళ్లు పోసి, గాయపడిన వారికి కట్టుకట్టారు. పీర్ల ఊరేగింపు కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

గాయపడిన వ్యక్తికి కట్టుకడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

అపురూప నేస్తం.. ఆనంద పరవశం

జూనోసిస్ దినోత్సవం సందర్భంగా లబ్బీపేటలోని ఎన్టీఆర్ వెటర్నరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదివారం శునకాలకు రేబిస్ టీకాలు వేశారు. యజమానులు శునకాలను ద్విచక్రవాహనాలు, కార్లపై ఎక్కించుకుని తీసుకొచ్చారు. టీకాలు వేయడానికి వేచి ఉండడంతో ప్రాంగణం అంతా సందడి నెలకొంది. వివిధ జాతుల శునకాలను పలువురు ఆసక్తిగా తిలకించారు. అపురూపంగా పెంచుకునే శునకాలకు టీకాలు వేసేటప్పుడు వాటికి బాధ కలుగుతుందని కొంతమంది యజమానులు విలవిల్లాడడం గమనార్హం. **- న్యూస్‌టుడే, విజయవాడ సిటీ**

మేమూ వచ్చాం..

జర్మన్‌షెఫర్డ్‌తో యజమాని...

పిల్లిని తీసుకొస్తూ...

13న నదీతీరంలో ఫ్లోర్ పెయింటింగ్ పోటీలు

భవానీపురం, న్యూస్‌టుడే: పర్యాటకులకు, సందర్శకులకు కొత్త అనుభూతులను పంచాలనే ఉద్దేశ్యంతో ఈ నెల 13న భవానీపురంలోని హరిత బరంపార్కు వద్ద ఫ్లోర్ పెయింటింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. బరంపార్కు వద్ద యోగాంధ్ర కార్యక్రమం, పెయింటింగ్ పోటీలకు సంబంధించి గోడపత్రికను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీశ మాట్లాడుతూ కృష్ణానదీతీరంలో కళాత్మక సౌందర్యం, సామాజిక భాగస్వామ్యం పెంపొందించేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. మరిన్ని వివరాలకు 7075196840లో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాల్సిందే

గండిగుంట (ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే : పీఆర్సీ, సరెండర్ లీవ్‌లు, గ్రాట్యూటీ బకాయిలు చెల్లించడంతో పాటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ కోరారు. గండిగుంటలోని ఎన్జీవో హోంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక బకాయిల చెల్లింపుల కోసం త్వరలో ఉద్యమం చేస్తామని చెప్పారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు విద్యారంగంలోని వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఇమ్మానియేలు, ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు ఎం.వి.ఎస్.ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాయి శ్రీనివాస్

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక ఆదివారం విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కె.వినాయకం, గౌరవాధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా జి.ప్రభావతి, ఆర్థిక కార్యదర్శిగా కె.భానుప్రకాష్, సహాధ్యక్షుడిగా మోహన్, అదనపు కార్యదర్శిగా కె.శేషాద్రితో పాటు మరో 25 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

వినాయకం

ప్రభావతి

మరణించీ.. నలుగురికి వెలుగునిచ్చి...

నాగాయలంక: కుటుంబ సభ్యుల ఔదార్యంతో నలుగురి జీవితాల్లో వెలుగులు ప్రసరించనున్నాయి. వివరాల్లోకి వెళితే.. స్థానిక తలశిల నాగ పుష్పవతి(70), పెద్ద కమ్మవారి పాలేనికి చెందిన కొక్కిలిగడ్డ చంద్రమ్మ(75) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారి కళ్లు మరో నలుగురికి చూపునిస్తాయని కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. సుదర్శి మానవత సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనగంటి నారాయణల ఆధ్వర్యంలో విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి నేత్రాలను దానం చేశారు. టెక్నీషియన్ సాయి, సిబ్బంది ఆదివారం కార్నియాలు సేకరించారు.

నాగ పుష్పవతి

చంద్రమ్మ

రూట్స్ హెల్త్ ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయం

కరెన్సీనగర్: గత 12 ఏళ్లుగా పేదలు, క్యాన్సర్ వ్యాధిగ్రస్థులకు రూట్స్ హెల్త్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని రాష్ట్ర మంత్రి ఎస్.సవిత అన్నారు. మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్లకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి మంత్రి సవిత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వైద్య రంగానికి ముఖ్యమంత్రి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు 'యోగాంధ్ర-2025' పేరుతో గిన్నిస్ రికార్డు నమోదయ్యేలా చేశారన్నారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రూట్స్ ఫౌండేషన్ సేవలు అద్వితీయమన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడారు. ఈ సందర్భంగా గుంటూరుకు చెందిన సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆర్.మురళి బాబూరావుకు జీవన సాఫల్య అవార్డు అందజేశారు. మరో ఆరుగురికి ఉత్తమ డాక్టర్ల అవార్డులతో సత్కరించారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడికి రూ.10 వేలను ఫౌండేషన్ నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో సినీహీరో సుమన్, రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఛైర్మన్ పోలవరపు విజయభాస్కర్, ఆంధ్రా హాస్పిటల్స్ ఎండీ రమణమూర్తి, డాక్టర్ సమరం, డాక్టర్ మురళీకృష్ణ, సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఎ.వై.రావు, ఎస్ఎల్వీ డెవలపర్స్ ఛైర్మన్ పి.శ్రీనివాసరాజు, నగరానికి చెందిన పలువురు వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి సవిత

డాక్టర్ మురళి బాబూరావుకు జీవన సాఫల్య అవార్డు అందజేస్తున్న సినీ నటులు సుమన్ తదితరులు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 110, 118, 129 చికెన్ విత్ స్కిన్ - 210 చికెన్ స్కిన్‌లెస్ - 220.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 570 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్టు

ఉంగుటూరు(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: ఇళ్ల ముందు, కూడళ్ల వద్ద నిలిపిన ద్విచక్ర వాహనాలను గుట్టుచప్పుడు మాయం చేస్తున్న ముగ్గురు మైనర్లు, ఓ వ్యక్తిని ఉంగుటూరు పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. స్టేషన్ పరిధిలోని వేంపాడుకు చెందిన తుల్లిమిల్లి సీతారామయ్య తన ద్విచక్ర వాహనాన్ని గత నెల 25న రాత్రి ఇంటి వరండాలో పార్కు చేశారు. మరుసటి రోజు చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పెద్దపారుపూడికి చెందిన ముత్యాల మనోజ్ కుమార్, మరో ముగ్గురు మైనర్లు ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించి గాలింపు చేపట్టగా.. ఆదివారం ఉదయం అనుమానంగా తిరుగుతూ కనిపించారు. అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకొన్నారు. నిందితులు మనోజ్‌కుమార్, మైనర్ల నుంచి గతంలో గుంటూరు, కంకిపాడు ప్రాంతాల్లో చోరీ చేసిన మరో నాలుగు ద్విచక్ర వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై యూ.గోవింద్, సిబ్బంది నాగరాజు, నవీన్‌బాబు, దిలీప్‌కుమార్‌లను సీఐ శివప్రసాద్, ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

FINANCIAL SERVICES

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలలోపు ఫైనాన్స్ చేయబడును. అన్ని తరగతుల వారు బ్యాంకులో స్థిరాస్తిపై లోన్ తీసుకున్న వారికి Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్‌లోన్ చేయబడును. ✆ 96665 47338.

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

MARRIAGE SERVICES

FUNCTION HALLS

Rs.300/- Per plate, A/c Function Hall for Marriages, Receptions, Engagement, Birthday Celebrations with capacity of 50 to 600 Nos. Hotel Kosala, Eluru Road, Governorpet, Vijayawada. Contact: 88855 32877, 88855 32655.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

REAL ESTATE

A.P. రాజధాని అమరావతిలో ల్యాండ్ పూలింగ్‌లో గజం 5000/-, కాజాలో గజం 10,000/-, అమరావతిలో గజం 7000/-, మంగళగిరిలో గజం 12000/- 96035 30555.

HOUSE FOR SALE

మచిలీపట్నం- ఇంగ్లీష్ పాలెంలో ఇండిపెండెంట్ House అమ్మకానికి కలదు. కావలసిన వారు ఈ క్రింది నంబరుకు సంప్రదించగలరు. నో మీడియేటర్స్, డైరెక్ట్ కస్టమర్స్ ఓన్లీ ✆ 9346741252.

PLOT FOR SALE

CRDA అప్రూవల్‌తో లోబడ్జెట్‌లో Open Plots అమ్మకానికి కలవు. పరిటాల, కంకిపాడు, సూరంపల్లి, నూజివీడు, వీరవల్లి దగ్గర. స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 90309 56555.

JOBS

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. బో+వ+మంచి జీతం+ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

Wanted Lady Teachers LKG to 5th All Subjects & 6th to 10th : N.S, P.S, Hindi. ★ Ideal (EM) High School, Ratnamamba St., Mogalrajpuram. ✆ 95023 59059.

త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను/పేషంట్స్/ చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 85209 80099, 85208 74499.

రిలయన్స్ స్టోర్స్: విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం - ఏరియాలో పనిచేయుటకు అనుభవమున్న ఎలక్ట్రీషియన్స్ కావలెను. Q: I.T.I./ డిప్లొమా, ఎలక్ట్రికల్ మాత్రమే. ✆ 99495 51172, 98660 61501.

ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థకు ఫైనాన్షియల్ అడ్వైజర్‌గా/ బిజినెస్ పార్టనర్‌గా పార్ట్/ ఫుల్ టైం వర్క్ చేయుటకు స్త్రీ/పు అభ్యర్థులు కావలెను ✆ 62699 79999/ 90105 97707.

వర్క్ ఫ్రం హోమ్ డేటా ఎంట్రీ: ప్రముఖ ఔట్‌సోర్సింగ్ సంస్థ నందు ఇంటి వద్ద ఉండి పార్ట్/ ఫుల్ టైం ప్రాజెక్ట్ వర్క్ చేయుటకు Laptop/Desktop, స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు కావలెను. ✆ 87126 36572

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

రాజాని పరామర్శించిన కొనకళ్ల

లక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నారాయణరావు తదితరులు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : తెదేపా శిష్టకరణ సాధికారత రాష్ట్ర ఛైర్మన్ అక్కుమహంతి రాజా తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు ఆయన ఇంటికి ఆదివారం వెళ్లి పరామర్శించారు. తెదేపా నాయకులు బత్తిన దాసు, యార్లగడ్డ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

❖ నగరంలోని జిల్లా పరిషత్ కూడలి నుంచి మాచవరం వరకు ప్రధాన రహదారి మధ్యలో గుంతలు పడ్డాయని వాహనదారులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు గుంతలు పూడ్చించారు. ❖ బందరులోని పరాసుపేట నుంచి దిమ్మెల సెంటర్‌కు వెళ్లే దారిలో రోడ్డు పక్కనున్న చెత్తను తొలగించడం లేదని స్థానికులు 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారులకు తెలిపారు. వారు స్పందించి సిబ్బందిని పంపి చెత్త తొలగింపజేశారు.

- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

బాధితులను ఆదుకోవడం బాధ్యత

గూడూరు, న్యూస్‌టుడే : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం బాధ్యతగా భావించాలని మానవ హక్కుల సంస్థ ప్రతినిధి పడవల మోహన్ త్రినాథ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పోలవరం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద బాధితురాలు మురాల లక్ష్మీకుమారికి జనసేన నాయకులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కూటమి నాయకులు కారుపర్తి మల్లి, కనపర్తి వెంకన్న, సమ్మెట చిన్ని, మునగాల మార్కండేయులు, పిచ్చుక విజయుడు, కటకం వెంకన్న, భగవాన్ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్ర స్థితిగతులు మార్చేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం నగరంలోని మూడవ డివిజన్‌లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదని చెప్పారు. బందరు నియోజకవర్గంలో ఎనిమిది వేల బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. అనంతరం సచివాలయంలో ఉద్యోగులతో సమీక్షించారు.

బందరు: ఉద్యోగులతో సమీక్షిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

పల్లెపాలెంలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

పల్లెపాలెం(కృత్తివెన్ను), న్యూస్‌టుడే : లక్ష్మీపురం పల్లెపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తెదేపా కార్యకర్త బొడ్డు ఏడుకొండలు కుటుంబ సభ్యులకు రూ.5 లక్షలు మంజూరు చేసిన లేఖను అందించారు.

బంటుమిల్లి, న్యూస్‌టుడే : కొర్లపాడులో నిర్వహించిన కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొని ఇంటింటా పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

స్థలం ఆక్రమించారంటూ ఫిర్యాదు

గూడూరు, న్యూస్‌టుడే : తమ స్థలాన్ని ఆక్రమించారంటూ టి.శైలజ అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని ముక్కొల్లు గ్రామంలో తమ కుటుంబానికి చెందిన పొలం మధ్యలో రోడ్డు వేసే క్రమంలో స్థలాన్ని ఆక్రమించడంతో పాటు అక్కడ ఉన్న సమాధిని కూలగొట్టారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై అధికారులు విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

భవనాలు ఇంతేనా.. పూర్తయ్యేనా?

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే

బందరు మండలం పలు గ్రామాల్లోని భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఆగాయి. ఏళ్లు గడుస్తున్నా వాటిని పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ సమస్యను ఆయా గ్రామాల ప్రజలు గత వైకాపా పాలకుల దృష్టికి తీసుకెళ్లగా అదిగో ఇదిగో అనడమే కానీ పట్టించుకున్న వారే లేరు. దీంతో క్రమేపీ భవన నిర్మాణాలు కునారిల్లిపోవడంతో ఆయా ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు.

సుల్తానగరంలో అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రం

ఏళ్ల తరబడి అలానే..

పెదకరగ్రహారంలో పంచాయతీ భవనం లేక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో దాత ఒకరు రూ.10 లక్షలు ఇచ్చేందుకు ముందుకు రావడంతో వాటికి కొంత ప్రభుత్వ నిధులు జత చేసి భవనం నిర్మించేందుకు అప్పటి పాలకులు నిర్ణయించి 2005లో పనులు ప్రారంభించారు. రెండస్తుల మేర పిల్లర్లతో స్లాబుల వరకూ పనులు పూర్తి చేశారు. ఆనాటి నుంచి నేటి వరకూ మిగిలిన పనులు పూర్తి చేసేందుకు ఎవరూ చొరవ తీసుకోలేదు. కొద్దిపాటి వ్యయంతో వినియోగంలోకి వచ్చే అవకాశం ఉన్నా అందుకు కనీసం కృషి చేసేవారు లేకపోవడంతో ఈ దుస్థితి కొనసాగుతోందని గ్రామస్థులు వాపోతున్నారు.

బొర్రపోతుపాలెంలో పిల్లర్లతో..

వివిధ దశల్లో ఆగి..

ప్రస్తుతం చాలా వరకు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె గదుల్లోనే కొనసాగుతున్నాయి. వీటికి సొంత భవనాల కోసం తెదేపా హయాంలో ప్రతిపాదనలు చేసినా, తర్వాత ప్రభుత్వం మారడంతో అవి అమలుకు నోచుకోలేదు. కొన్నిచోట్ల స్థల సేకరణ దశలో ఆగిపోతే ఇంకొన్ని చోట్ల నిర్మించిన భవనాలను కూడా అసంపూర్తిగా వదిలేశారు. బొర్రపోతుపాలెంలో పంచాయతీ భవనం నిర్మాణానికి 2018లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఆ తర్వాత వైకాపా సర్కారు రావడంతో పనులు నిలిచాయి. కూటమి ప్రభుత్వంలోనైనా ఆ భవన నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ధర వరలు

టమాట 36, వంగ 28, బెండ 20, పచ్చిమిర్చి 38, కాకర 42, క్యాబేజీ 22, క్యారెట్ 42, దొండ 33, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 26, గోరుచిక్కుడు 34, దోస 18, సొర 10/8, అరటికాయ 8/7, చిక్కుళ్లు 48, బీర 26, చామదుంప 30, మునగ 10/08, కంద 58, బీట్‌రూట్ 32, కీరదోస 40, బీన్స్ 82, క్యాప్సికం 82, అలసందలు 40, చిలకడదుంప 36, కొత్తిమీర 16/08, పుదీనా 15/5 సోమవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి. ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఎస్టేట్ అధికారి బలిచక్రవర్తిని 91823 61295లో సంప్రదించవచ్చు. – న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)

సినిమాలు

రేవతి : జురాసిక్ వరల్డ్
మినీ రేవతి : మార్గన్
సిరికృష్ణ : కుబేర
సిరివెంకట్ : తమ్ముడు
- న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

పరీక్ష కేంద్రంలో బారులు తీరిన అభ్యర్థులు

సజావుగా బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష

పెడన, న్యూస్‌టుడే : నందమూరు వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష ఆదివారం సజావుగా జరిగింది. మధ్యాహ్నం 2-4 గంటల మధ్య జరిగిన ఆన్‌లైన్ పరీక్షకు 180 మంది అభ్యర్థుల్ని కేటాయించగా 170 మంది హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డా.బీఆర్ఎస్ రెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఈ పరీక్షను నిర్వహించింది. పరీక్ష కేంద్రం అడ్మిన్‌గా పి.అశోక్ కుమార్ వ్యవహరించారు.

బందరులో మాట్లాడుతున్న రామకృష్ణ

కృత్తివెన్నులో రైతు సంఘాల నాయకులు

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే : ఎన్డీయే ప్రభుత్వం మతోన్మాద, విచ్ఛిన్నకర విధానాలు అవలంబిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. సీపీఐ మచిలీపట్నం ఏరియా 25వ మహాసభ ఆదివారం బెల్ కంపెనీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో లింగం ఫిలిప్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ శత వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాల కోసం మోదీని ఎందుకు నిలదీయడం లేదని సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. పెన్మెత్స దుర్గాభవానీ, మోదుమూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వ పోకడలకు నిరసనగా ఈనెల 9న చేస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘ నాయకులు కోరారు. బంటుమిల్లి మండలం నుంచి కృత్తివెన్ను వరకు ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గురువుతో సమానంగా జెండాను గౌరవించండి

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ గురువుతో సమానంగా కషాయ జెండాను గౌరవించాలని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర నాయకుడు జి. యుగంధర్ అన్నారు. ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లు అయిన సందర్భంగా నగరంలోని ఓ వేడుక మందిరంలో ఆదివారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్‌లో జెండా కీలకమన్నారు. దేశవ్యాప్తంగా హిందూ ధర్మ పరిరక్షణకు ఆర్ఎస్ఎస్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ 1925లో స్థాపించిన ఆర్ఎస్ఎస్ దేశవ్యాప్తంగా విస్తరించి సేవలు అందించడం చాలా అభినందనీయమన్నారు. మచిలీపట్నం, పెడన, చల్లపల్లి తదితర ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు కోనేరు బలరామ్, చంద్రశేఖర్, డా.శ్రీహరి ప్రసాద్, డా.బి. ధన్వంతరి ఆచార్య, కొమరగిరి చంద్రశేఖర్, డా.ఉదయ్ శ్రీనివాస్, న్యాయవాదులు కూనపరెడ్డి శ్రీనివాస్, వడ్డి జితేంద్ర పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న బాలాజీ, వేదికపై ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, అతిథులు

సంస్థల సేవలు ప్రశంసనీయం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే : స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయమని తెదేపా రాష్ట్ర నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. హ్యూమనిటీ ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గూడూరు మండలం ఆకులమన్నాడుకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి అబ్దుల్ ఇమ్రాన్‌కు ఆదివారం ల్యాప్‌టాప్ అందించారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు షేక్ నూర్జహాన్‌బేగం, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ ఇస్తున్న గోపీచంద్, కమిషనర్ బాపిరాజు

అరకొర నీరు.. కష్టాల సాగు

పెడన, న్యూస్‌టుడే

పుల్లపాడులో నీరు లేక ఎండుతున్న నారు

ఖరీఫ్ సాగు చేసే అన్నదాతలకు నీటి ఇబ్బందులు తప్పడం లేదు. వరి ప్రధానమైన మండలంలో 8,850 హెక్టార్ల విస్తీర్ణంలో పంట సాగు చేపట్టగా నారుమళ్ల దశలో నీటి కొరత ప్రధానంగా మారింది. కాలువల్లో నీటి ప్రవాహం తగినంతగా లేక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. అరకొరగా కురుస్తున్న వర్షాలు సాగునీటి అవసరాలను తీర్చలేక పోతున్నాయి.

విత్తనాలు మొలకెత్తడం లేదు

ఈ సీజన్‌లో రైతులు ఎంటీయూ 1224 రకం విత్తనాలను అత్యధికంగా వినియోగిస్తున్నారు. అక్కడక్కడ నాట్ల విధానాన్ని కూడా కొనసాగిస్తున్నారు. ప్రధానంగా చెన్నూరు, ఉరివి, లంకలకలవగుంట ప్రాంతాల్లో దీన్ని అవలంబిస్తున్నారు. ఇప్పటి వరకు 694 హెక్టార్లలో వెద పద్ధతిలో సాగు చేపట్టగా, 159 హెక్టార్లలో నారును నాట్ల కోసం సిద్ధం చేస్తున్నారు. వెద రైతులతో పాటు నారు పెంచుతున్న వారికి నీటి కష్టాలు మొదలయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో నారు ఇప్పటికే ఎండిపోతోంది. వెద పొలాలకు నీటి తడులు అందక విత్తనాలు మొలకెత్తడం లేదు.

తూడుకాడతో నిండి..

పెడన మండలంలోని వివిధ గ్రామాలకు న్యూబీఎస్ఎస్, రామరాజుపాలెం బ్రాంచి కాలువల నుంచి నీరు సరఫరా అవుతోంది. బంటుమిల్లి ప్రధాన కాలువలో కమలాపురం లాకుల నుంచి మొదలయ్యే న్యూబీఎస్ఎస్ కింద దాదాపు 10 వేల ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. రామరాజుపాలెం బ్రాంచి పరిధిలోనూ 10 వేల ఎకరాలు సాగవుతున్నాయి. అయితే కాలువల్లో నీటి ప్రవాహం తగినంతగా లేకపోవడం కొన్ని బ్రాంచి కాలువలు తూటుతో నిండడంతో రైతులకు సాగు నీరు అందడం లేదు.

తగ్గిన ప్రవాహం

బంటుమిల్లి ప్రధాన కాలువలో కమలాపురం లాకుల వద్ద నీటి ప్రవాహం 500 క్యూసెక్కులు ఉంటేనే బ్రాంచి కాలువలకు సాగునీరు తగినంతగా ఉంటుంది. అయితే ఈ ప్రవాహం 350 క్యూసెక్కులకు తగ్గడంతో న్యూబీఎస్ఎస్ కాలువ పరిధిలోని రైతులకు నీటి కొరత ఏర్పడింది. రామరాజుపాలెం బ్రాంచిలోనూ ఇదే పరిస్థితి. నిడుమోలు లాకుల నుంచి తగినంతగా ప్రవాహం లేక దిగువకు నీరు అందడం లేదు. ★ దీనిపై మండల వ్యవసాయాధికారి సజ్జా జెన్నీ స్పందిస్తూ.. నీటి కొరతపై ఇప్పటికే ఇరిగేషన్ అధికారులకు సమాచారమిచ్చామన్నారు. త్వరలో సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు.

పైడమ్మ ఆలయంలో మహిళా భక్తులు

పెడనలో ఊరేగింపుగా వస్తూ..

వైభవంగా ఏకాదశి పూజలు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : తొలి ఏకాదశి సందర్భంగా నగరంలోని పలు దేవాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొని దేవతామూర్తులకు పూజలు జరిపించారు. బచ్చుపేట వెంకటేశ్వర స్వామి, ఈడేపల్లి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి 1008 అరటి పండ్లతో అలంకరించారు.

అరటిపండ్ల అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి

నిజాంపేటలో విజయ వనవలమ్మ

మాట్లం కోదండ రామాలయంలో భజన చేస్తున్న భక్తులు

వార్షిక మహోత్సవాలు ప్రారంభం

మాట్లం(కృత్తివెన్ను), న్యూస్‌టుడే : మండలంలోని మాట్లం శ్రీకోదండ రామాలయంలో వార్షిక మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తుల భజన కార్యక్రమం ఆకట్టుకుంది.

గ్రామ దేవతలకు ఆషాఢ సారె

పెడన, న్యూస్‌టుడే : తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం పలు ప్రాంతాల్లో భక్తులు గ్రామ దేవతలకు ఆషాఢ సారెలు సమర్పించారు. స్థానిక 12వ వార్డు కాపుల వీధి భక్తుల ఆధ్వర్యంలో పెడన గ్రామ దేవత పైడమ్మకు సారెను అందజేశారు. ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కమలాపురం గ్రామ దేవత గంగానమ్మకు గ్రామస్థులు సారె తీసుకొచ్చారు.

జనసంఘ్ సిద్ధాంతకర్త శ్యామా ప్రసాద్ ముఖర్జీ

మచిలీపట్నం(గొడుగుపేట), గూడూరు, న్యూస్‌టుడే : శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలు స్ఫూర్తిదాయకమని భాజపా రాష్ట్ర నాయకుడు పంతం గజేంద్రరావు అన్నారు. జనసంఘ్ సిద్ధాంతకర్త శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం నగరంలోని భాజపా జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షులు నాగలింగం అయోధ్య రామయ్య, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల రాము, నాయకులు తోటరంగనాథ్, ధూళిపాళ్ల శ్రీరామ చంద్రమూర్తి, మాదిరెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చలపతిరావు సేవలు ఎనలేనివి

చిన్నాపురం(మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే : చిన్నాపురం గ్రామ సర్పంచిగా 15 ఏళ్ల పాటు జన్ను చలపతిరావు అందించిన సేవలు ఎనలేనివని పలు రాజకీయ పార్టీల నాయకులు అన్నారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా గ్రామంలోని విగ్రహం వద్ద పలువురు నివాళులర్పించారు. చిన్నాపురంలో జరిగిన కార్యక్రమంలో జన్ను రాఘవరావు, బాల భాస్కరరావు, రాజులపాటి వెంకటేశ్వరరావు, కొండలు, జన్ను వివేక్ తదితరులు పాల్గొన్నారు.

చలపతిరావు విగ్రహం వద్ద వివిధ పార్టీల నాయకులు

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు

బంటుమిల్లి, న్యూస్‌టుడే : ముల్లపర్రు రెవెన్యూ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేస్తున్న జేసీబీ, ట్రాక్టర్లను రెవెన్యూ సిబ్బంది ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ శివశంకర్, వీఆర్వో బండ్రెడ్డి గంగాజలం గ్రామస్థుల సమాచారం మేరకు దాడి చేసి మట్టి తోలకాలను ఆపారు. పట్టుకున్న వాహనాలను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. మండలంలోని పెందుర్రు, ముల్లపర్రు తదితర గ్రామాల్లో వైకాపా హయాంలో విచ్చలవిడిగా మట్టిని విక్రయించుకొని సొమ్ము చేసుకొన్న వారే కూటమి ప్రభుత్వంలోనూ రెచ్చిపోతున్నారు. కూటమిలోని పార్టీల పేర్లు చెప్పి అధికారులను, ప్రశ్నించే వారిని బెదిరిస్తున్నారు. అడ్డుగా వెళ్లిన వారిపై దాడులకు దిగుతున్నారు. ఇటువంటి వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం.

జేసీబీ, ట్రాక్టర్ల వద్ద ఆర్ఐ శివశంకర్, రెవెన్యూ సిబ్బంది

పంట కాలువలకు మరమ్మతులు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : సాయిరాజ్ పంట కాల్వ మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయని సాగునీటి శాఖ ఏఈ లక్ష్మీతులసి తెలిపారు. గుడ్లవల్లేరు నుంచి ఈదుమూడి వరకు పది కి.మీల మేర రూ.4 లక్షల వ్యయంతో పనులు చేపడుతున్నామన్నారు. కాల్వ పరిధిలో డ్రాప్ పద్ధతిలో వంతుల వారీగా అందజేస్తున్నామని వివరించారు. కౌతరం, వడ్లమన్నాడు, కొత్తూరు, భీమునిగుంట, కవిపురం, నందిగామ మీదుగా ఈదుమూడి వరకు ఈ కాల్వ ఆయకట్టు ఉందని చెప్పారు.

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : నిడుమోలు పరిధిలో దగ్గుమిల్లి ఎడమ కాల్వలో 3.8 కి.మీల మేర తూడు తొలగింపు కార్యక్రమం జరుగుతుందని సాగునీటి శాఖ ఏఈ సాధిక్ తెలిపారు. అన్ని కాల్వల్లో తూడు తొలగింపునకు రసాయనాల పిచికారి పూర్తి అయిందన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు తగదు

బంటుమిల్లి, న్యూస్‌టుడే : మండల కేంద్రం బంటుమిల్లిలో ఆదివారం సీఐటీయూ, సీపీఎం, రైతు సంఘం, పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తు ఈ నెల 9న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు

పెడన, న్యూస్‌టుడే : ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ఆదివారం రేబిస్ నిరోధక టీకాలు వేశారు. పెడనలో 85 శునకాలకు టీకాలు వేశామని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా.కె.బాబూరావు తెలిపారు.

పెడనలో శునకానికి టీకా వేస్తున్న బాబూరావు

గూడూరు : ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం పశువుల ఆసుపత్రిలో శునకాలకు ఉచిత రేబిస్ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల టీకాలు వేస్తున్నందున వినియోగించుకోవాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎన్.నరసింహులు అన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

మొహర్రం పండగ కాదు

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే : మొహర్రం అంటే పండగ కాదని, దుఃఖ దినమని అజ్మీర్ బాబా సేవా సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్‌పీర్ అన్నారు. మొహర్రం సందర్భంగా ఇమామ్ హుస్సేన్, ఆయన అనుచరులకు నివాళులర్పించారు. ఇమామ్ హుస్సేన్ ఆత్మబలిదానంతో ఇస్లాం ధర్మం కొలుకుందన్నారు. ఆంధ్ర జాతీయ కళాశాల సమీపంలోని పిల్లలకు దుస్తులు, బిస్కట్లు పంపిణీ చేశారు.

శ్రద్ధాంజలి ఘటిస్తున్న సమాజం సభ్యులు

నిర్వహణ లోపం.. కళావిహీనం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రధాన కూడళ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇవి ఆహ్లాదంగా ఉండాలన్న లక్ష్యంతో తెదేపా హయాంలోనే అభివృద్ధి చేశారు. వాటిలో కొన్ని కూడళ్లలో చేపట్టిన పనులు చివరి దశకు చేరిన సమయంలో వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదు. దీంతో అవి పాడైపోయాయి. వివిధ సంస్థల ప్రతినిధులతో పాటు స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

స్పందన కరవు

పరాసుపేట కూడలిలో వాటర్ ఫౌంటెన్‌తో పాటు విద్యుత్తు వెలుగులు చిమ్మేలా చర్యలు తీసుకున్నారు. కొంత వరకు పనులు కూడా చేశారు. మిగిలినవి చేయడానికి రూ.5 లక్షలతో ప్రతిపాదనలు చేసి టెండర్లు పిలిచారు. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం రావడంతో ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో ఆయా పనులు పూర్తి చేస్తారేమో అని స్థానికులు ఎదురు చూడటమే తప్ప అధికారుల నుంచి స్పందన లేదు. చిలకలపూడి కూడలి అలానే తయారైంది. చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ విరిగాయి. లక్ష్మీటాకీసు కూడలి చుట్టూ ఉన్న గోడలు పగిలిపోతున్నాయి. బైపాస్ కూడలి అధ్వానంగా మారింది. ఇలా వివిధ ప్రాంతాల్లోని అస్తవ్యస్తంగా తయారయ్యాయి. గతంలో చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయడంతో పాటు మధ్యలో గ్రీనరీ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించేవారు. ప్రస్తుతం వాటి గురించి పట్టించుకోకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అతిథి గృహ ప్రాంతంలోని కూడలిలో పాడైన ఫౌంటెన్

అన్ని చోట్లా అంతే

కోనేరు సెంటరు మినహా ఏ కూడలిలోనూ పచ్చదనం కనిపించడం లేదు. మూడు స్తంభాల కూడలిలో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్‌ను పట్టించుకోక అలంకారంగా మారింది. ఈ క్రమంలో దానికి అనుబంధంగా ఏర్పాటు చేసిన పైపులు, ఇతర పరికరాలు పాడైపోయాయి. క్రమేపీ చుట్టూ ఏర్పాటు చేసిన టైల్స్ ఊడిపోతున్నాయి. ఆర్అండ్‌బీ అతిథి గృహం ప్రాంతంలోనిది ఇదే పరిస్థితి. ప్రస్తుతం కూడళ్లన్నీ ఫ్లెక్సీలతో నిండాయి.

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

సమ్మె జయప్రదం చేయండి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలపై ఈనెల 9న చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ, ప్రజాసంఘ నాయకులు తెలిపారు. ఈమేరకు గన్నవరం పట్టణంలో వామ పక్ష నాయకులతో కలిసి కరపత్రాల పంపిణీ ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న లేబర్ కోడ్‌లను కేంద్రం రద్దు చేయడం దుర్మార్గమని.. దీంతో కార్మికులు తీరని అన్యాయం జరుగుతుందని, సత్వరమే వాటిని రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, మిరప నాగేశ్వరరావు, సూరగాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థికి అభినందన

సాయికుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన బాపులపాడు మండలం రంగన్నగూడెం విద్యార్థి దేవరకొండ హేమంత్ సాయికుమార్‌ను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అభినందించారు. వీరవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో 580 మార్కులు సాధించిన హేమంత్ సాయికుమార్‌కు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ప్రవేశం లభించింది. ఆదివారం సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు రంగన్నగూడెం వచ్చిన ఎమ్మెల్యే విషయం తెలుసుకుని ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం

★ యనమలకుదురు మెయిన్ రోడ్డులో కొన్ని రోజులుగా చెత్త తీయక పోవడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. ఈ విషయమై స్పందించిన శానిటరీ అధికారి సుధాకర్ సిబ్బందిని పంపి చెత్త తొలగించి, బ్లీచింగ్ చల్లించారు.
-న్యూస్‌టుడే, యనమలకుదురు(కానూరు)

★ తిప్పనగుంటలో మురుగు రహదార్లపైకి ప్రవహిస్తూ, దుర్గంధం వస్తోందన్న విషయాన్ని పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు తెలియజేయగా, శుక్రవారం పూడిక తీయించి, బ్లీచింగ్ చల్లించారు. ★ మడిచర్లలో బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను సక్రమంగా తొలగించని విషయాన్ని పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్లగా శుక్రవారం పారిశుద్ధ్య కార్మికుల చేత తొలగింపజేశారు. - **న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్.**

యాంటీ రేబిస్ టీకాలు తప్పనిసరి

ఉయ్యూరు, న్యూస్‌టుడే: పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు ఎం.రాజశేఖర్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకొని ఉయ్యూరు పశు వైద్యశాలలో శునకాలకు ఆదివారం రేబిస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో ఉయ్యూరు నగర పంచాయతీ ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని) పాల్గొన్నారు. మండలంలో 130 శునకాలకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారిణి డి.వీణ తెలిపారు.

కంకిపాడు, న్యూస్‌టుడే: కంకిపాడు మండలంలోని అన్ని యూనిట్, గ్రామీణ పశువైద్యశాలల్లో ఆదివారం 500లకుపైగా శునకాలు, పిల్లులు, ఇతర పెంపుడు జంతువులకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేశారు.

గన్నవరం గ్రామీణ, హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే: గన్నవరం పట్టణంలోని ఎన్టీఆర్ వెటర్నరీ పశు వైద్య ఆసుపత్రిలో డా.కె.సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 227 పెంపుడు శునకాలకు టీకాలు వేశారు. ❖ బాపులపాడులో ఏడీహెచ్ ప్రమీలారాణి ఆధ్వర్యంలో కుక్కలకు టీకాలు వేశారు.

సాకారం దిశగా.. కలల వారధి..!

పోరంకి-తాడిగడప వంతెన నిర్మాణానికి తాజా అంచనాలు


బందరు కాలువపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదిత స్థలం ఇదే

తొలగించాల్సిన ఆక్రమణలు

పెనమలూరు, న్యూస్‌టుడే: బందరు కాలువపై పోరంకి-తాడిగడప వంతెన నిర్మాణ ప్రతిపాదన తిరిగి పట్టాలెక్కింది. ఈ వారధి నిర్మాణానికి ఏళ్ల కిందట శంకుస్థాపన జరిగింది. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ పనులను అటకెక్కించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ఇందులో భాగంగా వంతెన ప్రతిపాదిత ప్రాంతాన్ని మూడు రోజుల కిందట పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, కలెక్టర్ బాలాజీ, ఆర్‌అండ్‌బీ, జలవనరుల శాఖ ఎస్ఈలు భాస్కరరావు, వెంకటేశ్వరరావు, ఉన్నతాధికారులు పరిశీలించారు. పనులు పట్టాలెక్కి.. నిర్మాణం పూర్తయితే తాడిగడప పట్టణం, పెనమలూరు, పెదపులిపాక, చోడవరం గ్రామాల అభివృద్ధి ఊపందుకునే అవకాశం ఉంది.

పెరగనున్న నిర్మాణ వ్యయం

పోరంకి కాలువ నుంచి హిందూ శ్మశాన వాటిక వెళ్లే రహదారి చివరలో వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. 2018లో తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.30 కోట్లతో అంచనాలు రూపొందించారు. అనంతరం అవి కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వారధి నిర్మించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో అంచనాలు రూపొందించే పనిలో సంబంధిత శాఖ అధికారులు ఉన్నారు. అయితే వ్యయం గతం కంటే పెరిగే అవకాశం ఉందంటున్నారు. ఏడు మీటర్ల వెడల్పు, 40 మీటర్ల పొడవు, కాలువలో మూడు పిల్లర్లు, వంతెనకు రెండు వైపులా 100 మీటర్ల చొప్పున అనుసంధాన రహదారులు నిర్మించాలి. దీనికి దాదాపు రూ.40 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు.

బందరు రోడ్డుకు అనుసంధానం

పోరంకి వద్ద బందరు కాలువపై తాడిగడప కలుపుతూ నిర్మించనున్న వంతెనతో పెనమలూరు, తాడిగడప పట్టణం, పెదపులిపాక, చోడవరం గ్రామాలను బందరు రోడ్డుకు అనుసంధానం చేయడం సులువవుతుంది. అంతేకాకుండా ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి రాకపోకలు సాగించే వారికి కూడా సౌకర్యంగా ఉంటుంది. ప్రభుత్వం వంతెన నిర్మాణం చేపట్టడమే కాకుండా అనుసంధానంగా పట్టణం, మరో మూడు గ్రామాలను కలుపుతూ రహదారి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో అధిక శాతం మంది రైతులు రహదారి నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారని వారు గుర్తుచేస్తున్నారు. ఎమ్మెల్యే బోడే ప్రసాద్ చొరవ తీసుకొంటే ఆ ప్రక్రియ సులభతరం అవుతుందని అభిప్రాయపడుతున్నారు.

ఉపకార వేతనాల పంపిణీ

బోళ్లపాడు (ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: ఎంతో సహృదయంతో దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని బోళ్లపాడు సర్పంచి తుమ్మూరు సురేశ్ రెడ్డి అన్నారు. తుమ్మూరు పిచ్చిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో బోళ్లపాడులో 50 మంది విద్యార్థులకు రూ.లక్ష ఉపకార వేతనాలను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ తుమ్మూరు నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో అసాంఘిక శక్తులపై నిఘా

పునాదిపాడులో డ్రోన్ ఎగురవేసి పరిశీలిస్తున్న సీఐ మురళీకృష్ణ, ఎస్సై సందీప్

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: సాంకేతికతతో అసాంఘిక శక్తుల ఆటకట్టిస్తున్నారు.. కంకిపాడు పోలీసులు. ఇందులో భాగంగా కోడి పందేలు, జూద శిబిరాలపై నిఘా ఏర్పాటు చేశారు. సీఐ మురళీకృష్ణ, ఎస్సై సందీప్‌లు తమ సిబ్బందితో కలిసి ఆదివారం గొడవర్రు, పునాదిపాడులో డ్రోన్ ఎగురవేసి పరిశీలించారు. అనుమానిత ప్రాంతాలకు సిబ్బందిని పంపి జూదరుల ఆటకట్టించారు.

విద్యపై దృష్టి సారించాలి

మంతెన (కంకిపాడు), న్యూస్‌టుడే: సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు విద్యపై దృష్టి సారించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జిల్లా బాధ్యుడు నరసింహారావు అన్నారు. మండలంలోని మంతెనలో మండల స్థాయి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ బలోపేతం, ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల శాఖ బాధ్యుడు లాం ప్రతాప్, స్థానిక ప్రతినిధులు కలపాల రాజేష్, జీవన్, మండాల ప్రభాకర్, లాం రాజా, మువ్వ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

భవనం లేక దిగులు.. ఆరుబయట విధులు!

నిరీక్షిస్తున్న రోగులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం ఎప్పుడు అందుబాటులోకి వస్తుందనేది జవాబు లేని ప్రశ్నగా మిగిలిపోయింది. ఈ కారణంగా ఆరుబయట నాలుగేళ్ల నుంచి వైద్యులు, రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రూ.1.82 కోట్లతో చేపట్టిన శాశ్వత భవన నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడంతో రోగులకు ఓపీ చీటీలు రాయడం మొదలుకుని, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశాలు, సమీక్షల నిర్వహణ కూడా ఆరుబయటే నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికార్లు, ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వత భవనం త్వరితగతిన అందుబాటులోకి వచ్చేలా చూడాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆధ్యాత్మిక పరిమళాలు

ఆలయాల్లో ఏకాదశి పూజలు

యనమలకుదురు(కానూరు): యనమలకుదురు రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారికి వెలగపూడి సాంబశివరావు దంపతులు ఆషాఢ సారె సమర్పించారు. ఆదివారం పెద్ద ఎత్తున భక్తులతో కలిసి అమ్మవారికి సారె అందించారు. పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఛారిటబుల్ ట్రస్టు ఫౌండర్, ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు ఆధ్వర్యంలో ప్రసాదాలు అందజేశారు.

ఉయ్యూరు గ్రామీణం: తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం గండిగుంట అయ్యప్పస్వామి దేవాలయంలోని సాయిబాబా ఉపాలయంలో మహిళలు సామూహిక సత్యవ్రతాలు నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధన చేశారు.

పెనమలూరు: పెనమలూరు అంకమ్మతల్లి ఆలయంలో ఆదివారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులు శివాలయం సమీపంలోని రావి చెట్టుకు పూజలు చేసి, మేళతాళాలతో అమ్మవారికి సారె సమర్పించారు. కుంకుమార్చనలు చేశారు.

గన్నవరం గ్రామీణం, హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: గన్నవరం మండలంలోని చెంచుల కాలనీలో కొలువైన శ్రీలక్ష్మితిరుపతమ్మ ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ❖ ఆత్కూరు కనకదుర్గమ్మ ఆలయంలో గ్రామ మహిళలు ఆషాఢసారె భారీ ప్రదర్శనగా వెళ్లి సమర్పించారు. ❖ హనుమాన్ జంక్షన్‌లోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి 108 లీటర్ల ఆవు పాలతో అభిషేకం నిర్వహించారు. విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు దాతగా వ్యవహరించారు.
❖ మడిచర్ల శ్రీకోదండ రామాలయంలో దేవతా మూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు.
❖ కాకులపాడు, వీరవల్లి, ఆరుగొలను, కానుమోలు, తదితర గ్రామాల్లోనూ ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో వేడుకలు నిర్వహించారు.

గండిగుంట సాయిబాబా ఆలయంలో సత్యవ్రతాలు

యనమలకుదురులో సారెతో ఆలయానికి వస్తున్న భక్తులు...

హనుమాన్‌జంక్షన్‌లో..

తాడిగడప సమగ్రాభివృద్ధే లక్ష్యం

కానూరు, న్యూస్‌టుడే: తాడిగడప పురపాలిక పరిధిలోని నాలుగు సర్కిల్స్ పూర్తి స్థాయి అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. ఆదివారం సాయంత్రం కానూరు ఉమాశంకర్‌నగర్, అమరావతికాలనీలలో నూతనంగా నిర్మించిన రహదారులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఏడాది కాలంలో పురపాలక సంఘ పరిధిలో రూ.40 కోట్లతో మౌలిక వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అన్ని ప్రాంతాల్లో డ్రెయిన్లు, రహదారులు, పైపులైన్లు, ఇతర వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెలగపూడి శంకరబాబు, అనుమోలు ప్రభాకరరావు, షేక్ బుజ్జి, దోనేపూడి రవికిరణ్, పీతా గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

యనమలకుదురులో నివాళులర్పిస్తున్న శివరామప్రసాద్, సురేష్, వీరాస్వామి

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి

యనమలకుదురు(కానూరు), న్యూస్‌టుడే: బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలని గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామప్రసాద్ అన్నారు. ఆదివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని యనమలకుదురులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సురేష్, వీరాస్వామి, మొక్కపాటి శ్రీనివాస్, బలగం నాగరాజు, శశికాంత్, నాగార్జున, శేషు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం, ఉంగుటూరు మండలాల్లో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. గన్నవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేవరపల్లి విక్టర్‌బాబు, తేలప్రోలులో రవి కుమార్, జగ్జీవన్‌రామ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. పలు చోట్ల ఆయన విగ్రహానికి కూటమి నాయకుల ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. హనుమాన్‌జంక్షన్‌తో సహా పలు గ్రామాల్లో పార్టీలకతీతంగా నాయకులు నివాళులర్పించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: శాంతి భద్రతలకు విఘాతం కల్గించే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హనుమాన్‌జంక్షన్, వీరవల్లి ఎస్సైలు సురేష్, శ్రీనివాస్ హెచ్చరించారు. ఎస్పీ ఆర్.గంగాధర్ ఆదేశాల ప్రకారం ఆదివారం ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న హనుమాన్‌జంక్షన్ ఎస్సై సురేష్

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనం నడిపిన వారికి జైలు శిక్ష తప్పదని వీరవల్లి ఎస్సై ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి వీరవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పలుచోట్ల ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఇటీవల కాలంలో ఎనిమిది మందిని తాగి వాహనం నడుపుతున్నందుకు అదుపులోకి తీసుకుని నూజివీడు కోర్టులో హాజరుపర్చగా, ఒకరికి నాలుగు రోజులు జైలు శిక్ష విధించగా, మిగతా ఏడుగురికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు స్వీయ జాగ్రత్తలు పాటించాలన్నారు.

అద్దె గూడు.. అవస్థలు తోడు!

చాలీచాలని గదుల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

సుందరమ్మపేటలో ఇరుకుగా కూర్చున్న పిల్లలు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఇరుకైన గదులు, ఆటలాడుకునేందుకు స్థలం కరవు, బయటకొస్తే రహదారి ప్రాంతం. ఇదీ.. ఉయ్యూరు నగర పంచాయతీలోని అంగన్‌వాడీల కేంద్రాల దుస్థితి. పట్టణంలో దాదాపు 65 శాతం కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా వాటికి సొంత గూడు సమకూరడం లేదు. ఫలితంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అవస్థలు పడుతున్నారు

రూ.5వేల వరకు అద్దె చెల్లింపు

సమగ్ర మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కంకిపాడు ప్రాజెక్టు ఉయ్యూరు సెక్టార్ పరిధిలో పట్టణంలోని 20 వార్డుల్లో 29 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 1005 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు 1090 మంది ఉన్నారు. ఒకటి, రెండు వార్డుల్లో తప్ప. మిగిలిన వార్డుల్లో చాలా వరకు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇరుకైన గదులు, ఆడుకోడానికి వీలులేని వరండాల్లో నిర్వహిస్తున్నారు. 11 ప్రాంతాల్లోనివి మాత్రం సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. జనతాబజార్ ప్రాంతంలోని కేంద్రం దాత సమకూర్చిన భవనంలో నడుస్తోంది. ఒక్కో దానికి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ఆ శాఖ అద్దె చెల్లిస్తోంది.

తల్లుల ఆందోళన

ఉయ్యూరు పట్టణంలోని ఇండియన్ బ్యాంకు ప్రాంతం, బడేసాహెబ్ చెరువు, గురజాడ డొంక, లక్ష్మీటాకీస్ సెంటర్, సుందరమ్మపేట, కాటూరు రోడ్డు, సాయిమహల్ ఏరియా, ఉర్దు స్కూల్ ఏరియా, ఎస్సీ వాడ, మార్కెట్ ఏరియా, ఎగినిపాడు, కొబ్బరితోట, వీరమ్మతల్లి గుడి ఏరియాతో పాటు మరి కొన్ని ప్రాంతాల్లోని అంగన్‌వాడీలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి సొంత భవనాల అయితే ఆట వస్తువుల ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. అలాగే చాలా కేంద్రాల భవనాలు రోడ్లను ఆనుకొని ఉండటంతో పిల్లలు కేంద్రంలో నుంచి నేరుగా రోడ్డుపైకి వచ్చేస్తున్నారని తల్లులు ఆందోళన చెందుతున్నారు.

కొబ్బరితోట ఏరియాలో అద్దె భవనంలో కేంద్రం

అవకాశాలు ఉన్నా..

ఉయ్యూరు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. నగర పంచాయతీ, ఐసీడీఎస్ శాఖలు సంయుక్త కార్యాచరణతో ముందుకెళితే సొంత భవనాల నిర్మాణం కష్టమేమీ కాదు. లేఅవుట్లలో సామాజిక స్థలాలిస్తే బాగుంటుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. అద్దె భవనాల్లోని కేంద్రాల్లో పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతలు కూర్చునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

స్థలాలు అందుబాటులో లేకే..

పట్టణంలో ప్రభుత్వ స్థలాల అందుబాటులో లేనందున సొంత భవనాలు నిర్మించలేకపోతున్నాం. ఎవరైనా సమకూర్చితే సొంత భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపుతాం.
-బేబీ సుకన్య, సీడీపీవో, ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు.

దీపారాధన అంటుకొని మహిళకు తీవ్ర గాయాలు

పెనమలూరు, న్యూస్‌టుడే: పూజలో నిమగ్నమైన విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలి చీరకు ప్రమాదవశాత్తు దీపారాధన అంటుకోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . పెనమలూరుకు చెందిన ఆతుకూరి కనకదుర్గ విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు. ఆదివారం ఉదయం ఇంట్లో పూజ చేస్తుండగా.. ప్రమాదవశాత్తు చీరకు దీపారాధన అంటుకోవడంతో తీవ్రంగా గాయపడింది. నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

ఇరువర్గాల ఘర్షణలో ముగ్గురికి..

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: పోలీసు స్టేషన్‌కు ఎందుకెళ్లారంటూ ఇరువర్గాల మధ్య తలెత్తిన వివాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన గన్నవరం మండలం జక్కులనెక్కలంలో ఆదివారం చోటుచేసుకుంది. 'వీళ్లని కొట్టాలి' అని అన్నారని ఒకవర్గం.. అనలేదని మరోవర్గం మధ్య ఉదయం స్వల్ప వివాదం తలెత్తింది. ఈ విషయమై గ్రామానికి చెందిన సరిపెల్లి ప్రీతాం కైలాష్ అనే యువకుడు తన తండ్రిని తీసుకొని గన్నవరం పోలీసు స్టేషన్‌కు వెళ్లి తాను అనని మాటను.. అన్నానని ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు చేశాడు. దీంతో స్టేషన్‌కు ఎందుకెళ్లావంటూ కె.రాంబాబు, రాజశేఖర్, క్రాంతి, పృథ్వి, వినోద్, రూబెన్ మరికొంతమంది యువకులు కైలాష్ ఇంటికెళ్లి అతడిపై, కుటుంబ సభ్యులు భగవంతుడు, నాగార్జునలపై దాడిచేసి గాయపరిచారు. సమాచారం అందుకున్న పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. గతంలో చోటుచేసుకున్న స్వల్ప వివాదమై కక్షతోనే కావాలని వివాదం లేపారని బాధితులు తెలిపారు.

తెదేపా మండల అధ్యక్షుడికి..

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కింద పడిపోయిన తెదేపా మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం ఉదయం జరిగింది. రవీంద్ర జగన్నాథపురంలోని తన ఇంటి నుంచి మోటార్ సైకిల్‌పై పొలానికి వెళుతున్న సమయంలో వాహనం అదుపు తప్పడంతో ముందుకు పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడి తల, ముఖం, మెడపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తాడిగడపలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్.. ఆసుపత్రికి వెళ్లి రవీంద్ర పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

తాడిగడపలో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

కంకిపాడు పులిరామారావునగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తూ..

పెదపులిపాకలో..

సుపరిపాలనపై హర్షాతిరేకాలు

కంకిపాడు గ్రామీణం: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఆదివారం కంకిపాడు పులిరామారావు నగర్‌లో మాజీ ఎంపీపీ, క్లస్టర్ ఇన్‌ఛార్జి దేవినేని రాజా, నియోజకవర్గ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణ, తెదేపా గ్రామ అధ్యక్షుడు చిట్టూరి నాగేశ్వరరావు, క్లస్టర్ కోకన్వీనర్ పులి శ్రీనివాసరావు, యూనిట్ ఇన్‌ఛార్జి శ్యామ్, పంచాయతీ ఉపసర్పంచి రాచూరి చిరంజీవి తదితరులు పర్యటించారు. ప్రజలకు పథకాల గురించి వివరించారు.

కంకిపాడు, న్యూస్‌టుడే: కంకిపాడులో ఆదివారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' ఇంటింటి ప్రచారంలో తెదేపా నాయకులు యలమంచిలి కిషోర్ బాబు, చలవాది రాజా గురవయ్య, అన్నే రామారావు, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వణుకూరు(పెనమలూరు): వణుకూరు, పెదపులిపాక గ్రామాల్లో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం సందడిగా సాగింది. వణుకూరు కార్యక్రమంలో పెనమలూరు క్లస్టర్ తెదేపా నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్, పార్టీ గ్రామ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాస్‌లు సంక్షేమ పథకాల అమలు తీరు అడిగి తెలుసుకున్నారు. పెదపులిపాక దాసరి హరినీడు, ముసునూరి శ్రీనివాస్, ముసునూరి శ్రీధర్‌లు ఇంటింటా కలియతిరిగారు. సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు.

కూటమి ప్రభుత్వం.. ప్రజా పక్షం...

పెనమలూరు, కానూరు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ప్రజాపక్షమని బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాంప్రసాద్ పేర్కొన్నారు. పెదపులిపాక- యనమలకుదురు మధ్యలోని మార్కండేయనగర్, చింతలకట్ట ప్రాంతాల్లో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. వైకాపా పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక లోటును నెమ్మదిగా పూడ్చుతూ వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు సంగెపు రంగారావు, మొక్కపాటి శ్రీనివాస్, బలగం నాగరాజు, వీరాస్వామి, జన్ను నాగరాజు, షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టులో ఉచిత బస్సు ప్రయాణం

తాడిగడప(కానూరు), న్యూస్‌టుడే : ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రంలోని మహిళలకు కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేస్తుందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన తాడిగడప కార్మికనగర్ కట్టపై పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఆటోడ్రైవర్లు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం వారికి రూ.15వేలు ఇస్తుందన్నారు. కూటమి ప్రభుత్వంలోనే ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, కమిషనర్ షేక్ నజీర్, నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్: నిజమైన సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెదేపా నాయకులు చిరుమామిళ్ల సూర్యం, దయాల రాజేశ్వరరావు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం పెరికీడు, కానుమోలు గ్రామాల్లో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. నాయకులు వేగిరెడ్డి పాపారావు, చింతల వెంకట శివఅప్పారావు, కొమ్మారెడ్డి రాజేష్, దన్నే దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

శ్రద్ధాంజలి

కీ॥శే॥ తాతినేని గోపయ్య గారు, పోరంకి
57వ వర్ధంతి సందర్భముగా మీ పేరు ఆచంద్రతారార్కం నిలిచివుండేలా
పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ మీ సంస్మరణలో ముందుకు సాగుతున్నాము...
- తాతినేని కోటేశ్వరమ్మ
డా॥ తాతినేని సత్యనారాయణ (లేటు) - సత్యవతి (లేటు)
డా॥ తాతినేని గోపినాథ్ - సౌజన్య
తాతినేని శ్రీసత్య దేవాన్ష్
చెరుకూరి శరత్‌చంద్రబోస్ - భాగ్యలక్ష్మి
డా॥ పర్వతనేని కిషోర్‌బాబు - డా॥ గోపికాలక్ష్మి
పర్వతనేని ధ్రితిశ్రీ, రిషిక్ సాయి
ప్రిన్సిపాల్, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది
SRI KRISHNAVENI EDUCATIONAL INSTITUTIONS
TATINENI GOPAIAH MEMORIAL EDUCATIONAL ACADEMY
PORANKI, VIJAYAWADA, Ph : 0866 - 2581117, 9246837117
srikrishnavenikalasala@gmail.com srikrishnaveni.ac.in
34 Since 1991

(c) eenadu

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
గుడివాడ: 89775 35999 పామర్రు: 80085 74684 అవనిగడ్డ: 80085 74679
స్పందనకు వందనం

• అవనిగడ్డ ఏడో వార్డు మసీదు సమీపంలో డ్రెయిన్ పొంగి రహదారిపై ప్రవహిస్తోందని, చెత్త కుప్పలు తొలగించలేదని పంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు దృష్టికి 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా తీసుకెళ్లగా వెంటనే స్పందించి డ్రెయిన్ పూడిక తీయించి, చెత్తకుప్పలను డంపింగ్ యార్డుకు తరలించారు. • అవనిగడ్డ 3వ వార్డులో ఎన్టీఆర్ క్రాంతి కళాశాల వెనుక రోడ్డులో పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించాలని పంచాయతీ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే డంపింగ్ యార్డుకు తరలించారు. • అవనిగడ్డ మిల్కుబజార్, కేంద్రం పక్కన చెత్త పేరుకుపోయి రహదారి మీదకు వస్తోందని పంచాయతీ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే సిబ్బంది వచ్చి చెత్త కుప్పలను డంపింగ్ యార్డుకు తరలించారు. - న్యూస్‌టుడే, అవనిగడ్డ.

• పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామ శివారులోని శివపురం వాటర్ పైపులైను లీకుపై స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి సాగరరాణి స్పందించి వెంటనే మరమ్మతులు చేయించారు.
• లక్ష్మీపురంలో వీధిలైట్లు వెలగక పోవడంతో గ్రామస్థులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా కార్యదర్శి సాగరరాణి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్యదర్శి వెంటనే వీధిలైట్లు వేయించారు. • వెంట్రప్రగడ గ్రామ శివారు పులవర్తిగూడెంలో రోడ్డుపైకి డ్రైనేజీ నీళ్లు వస్తున్నాయని గ్రామస్థులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా తెలియజేశారు. స్పందించిన కార్యదర్శి సిబ్బందితో పూడిక పనులు చేయించారు. - పెదపారుపూడి, న్యూస్‌టుడే

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

నంగేగడ్డ(నాగాయలంక), న్యూస్‌టుడే: మండలంలోని నంగేగడ్డ గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు ఆదివారం మండల తెదేపా అధ్యక్షులు మెండు లక్ష్మణరావు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. గ్రామ తెదేపా అధ్యక్షులు తాడేపల్లి వెంకట సాంబశివరావు, అమ్ముల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

విషసర్పాలకు ఆలవాలంగా కోనేరు

పారిశుద్ధ్య చర్యలు శూన్యం

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థాన కోనేరు నిర్వహణను యంత్రాంగం వదిలేసింది. నిర్వహణ లోపం, ఆక్రమ, వెరసి అపరిశుభ్రత తావిస్తోందని భక్తులు వాపోతున్నారు. కోనేరు చుట్టూ దట్టంగా పిచ్చిమొక్కలు మొలిచి విషసర్పాలు సంచరిస్తున్నాయని ప్రత్యక్షంగా చూసిన భక్తులు తెలిపారు. కోనేరులోనే పార్కింగ్ ఏరియా ఉంది. దాన్ని రోజూ శుభ్రపరచాల్సి ఉంది. శుభ్రపర్చే బాధ్యత దేవస్థానానిది. అదే మాయిషే లోపంపై భక్తులు వేలెత్తి చూపుతున్నారు. పచ్చిక ఏపుగా పెరిగి అటు వైపు వెళ్లాలంటే భయభ్రాంతులకు లోనవుతున్నారు. భక్తులు అల్పాహారాలు, భోజనాలు చేసిన విస్తరాకులు విచ్చలవిడిగా పడేస్తున్నారు. వాటివల్ల పక్షులు సంచరిస్తున్నాయి. పార్కింగ్ ప్రదేశంలో పడేసిన వాటర్‌బాటిళ్లు, ప్లాస్టిక్ క్యారీబ్యాగులు, టిన్ల వద్దా తోపాటు గ్లాసులు చిందరవందరగా పడేస్తున్నారు. వాటిని పారిశుద్ధ్య కార్మికులు శుభ్రపరచట్లేదు. భక్తులు ఉపయోగించే శౌచాలయాల నిర్వహణ లోపభూయిష్ఠంగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆలయ అధికారులు, సహాయ అధికారులు, సిబ్బంది కేవలం ఆలయం, కార్యాలయాలకే పరిమితమవుతున్నారని, క్షేత్రస్థాయి పరిస్థితులను చేయపోవటం వల్ల కోనేరు నిర్వహణ లోపభూయిష్ఠంగా ఉంటున్నది బహిరంగ విమర్శ.

కోనేరు చుట్టూ దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు

పారేసిన భోజన విస్తరాకులు

సమస్యల్ని ఓపికగా వినండి

కార్యక్రమంలో తెదేపా నేత బొబ్బా గోవర్దన్

మోపిదేవి, న్యూస్‌టుడే: 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయా కుటుంబాలు చెప్పిన సమస్యలను ఓపికగా విని క్రోడీకరించి స్పష్టంగా నమోదు చేయాలని తెదేపా నేత బొబ్బా గోవర్దన్ సూచించారు. సమయదు, బూత్ ఇన్‌ఛార్జిల సమావేశం మోపిదేవిలో ఆదివారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు నడకుదిటి జనార్దనరావు, ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, నాయకులు కర్రా సుధాకర్, రావి రత్నగిరి, నాదెళ్ల శరత్‌చంద్రబాబు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం కిటకిట

నాగమల్లి చెట్టువద్ద ముడుపులు కడుతున్న భక్తులు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవిలో స్వయంభూగా వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం ఆదివారం కిటకిటలాడింది. 14వేల మంది భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రూ.9.62 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో శ్రీరామవరప్రసాదరావు వివరించారు. ★ అవనిగడ్డ మండలం అశ్వరావుపాలెం వాస్తవ్యులు పండ్రాజు వెంకట సాయిశివరావు, పండ్రాజు నాగ వెంకట సాంబశివరావు, కొత్తపేటకు చెందిన దివ్యవెంకట కుమారి, నిశాంత్‌కుమార్‌ రిలు నిత్యాన్నదాన పథకానికి ఆసరాగా ఆలయ గ్రామ అయిన కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావుకు కార్యాలయంలో అందించారు. ★ బాపట్ల జిల్లా రేపల్లె గ్రామస్థులు డి. రామ-జన్మిరాణి దంపతులు గోపాల గడ్డి కొనుగోలు నిమిత్తం రూ.10,116లు, నిత్యాన్నదాన పథకానికి రూ.10,116 అందజేశారు.

అమ్మవార్లకు ఘనంగా ఆషాఢ సారె

ఘంటసాల, న్యూస్‌టుడే: భద్రావతీ సమేత భావనారుషి స్వామి ఆలయంలో అమ్మవారికి సారెను భక్తులు అందజేశారు. పెన్నేరమ్మ అమ్మవారికి, జలధీశ్వరాలయంలో బాలపార్వతీ అమ్మవారికి, వేణుగోపాలస్వామి ఆలయంలో రుక్మిణమ్మ అమ్మవారికి సారెను సమర్పించారు.

అవనిగడ్డ: విష్ణాలయంలో అనుపంకిత దర్శకర్త పోతురాజు భాస్కరరావు ఆధ్వర్యంలో బాలాజీ రాజ్యలక్ష్మీ అమ్మవారికి ఆషాఢ మాస సారెను సమర్పించారు.

అవనిగడ్డ (గ్రామీణం): వేకనూరులోని సూర్యదేవాలయంలో ఉపాసమ్మిని అమ్మవార్లకు గ్రామస్థులు సారెను సమర్పించారు.

కోడూరు (అవనిగడ్డ): విశ్వనాథపల్లిలో అద్దంకి నాంచారమ్మ వారికి తోట రామమోహనరావు, కుమారి తదితర తోట వారి వంశీకులు, కోడూరులో గ్రామ దేవత గంగానమ్మతల్లికి కోడూరు కాపుల కాలనీవాసులు, తూర్పు వైపు భక్తులు, మాచవరం గ్రామంలో అక్కిలక్ష్మమ్మ కుంచేవర అంకాలమ్మ తల్లి, అమ్మగారి తల్లికి ఆక్కిబత్తు వంశీకుల సారె సమర్పించారు.

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక విజయవాడ రోడ్డులోని బుధ్యమ్మ ఆశ్రమంలో వేంచేసి ఉన్న పర్వతవర్ధని అమ్మవారికి గాంధీనగరం రిజిస్ట్రార్ కార్యాలయం పక్కబజారులో ఉన్న సాయి భక్త బృందం సారె సమర్పించారు.

చల్లపల్లిలో శ్రీసంపతాలమ్మ అమ్మవారికి ఆషాఢ సారె తీసుకువచ్చిన మహిళలు - చల్లపల్లి, న్యూస్‌టుడే

కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాఢ సారెను తీసుకవెళుతున్న భక్తులు - నాగాయలంక, న్యూస్‌టుడే

రాజ్యలక్ష్మి, గంగానమ్మ తల్లికి సారె సమర్పించిన మహిళలు

కూచిపూడి: భట్ల పెనుమర్రు గ్రామ మహిళల ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సందర్భంగా గ్రామంలోని శ్రీగంగానమ్మ తల్లి, శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారికి సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, అరటిపళ్లు, చలిమిడి, పాల పొంగళ్లు, పట్టువస్త్రాలు వంటివి తీసుకొచ్చారు.

బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ భోగాది శివ విష్ణువర్ధన్

నాగాయలంక: నాగాయలంక జడ్పీ పాఠశాలలో సీనియర్ బేస్‌బాల్ ఎంపిక కృష్ణా జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ ఎంపిక ప్రక్రియను నాగాయలంక రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ భోగాది శివ విష్ణువర్ధన్ ప్రారంభించారు. ఈ పోటీలలో జిల్లా నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారుల వ్యాయామ ఉపాధ్యాయులు గాజుల లక్ష్మీ ప్రసాద్, బడే వెంకటేశ్వరరావు, చిల్లా సుబ్బారావు, సనకా శ్రీకాంత్, బడే పాండు లింగ ప్రసాద్, రేపల్లె శ్రీధర్ ఎంపిక కమిటీగా ఏర్పడి 32 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 12,13,14వ తేదీలలో సత్య సాయి జిల్లా కదిరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో కృష్ణాజిల్లా తరఫున పాల్గొంటారని జిల్లా సెక్రటరీ సరా శ్రీనివాసరావు తెలిపారు.

గురువుతో సమానంగా జెండాను గౌరవించండి

మచిలీపట్నం(గొడుగుపేట): ప్రతి ఒక్కరూ గురువుతో సమానంగా కాషాయ జెండాను గౌరవించాలని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర నాయకుడు జి.యుగంధర్ అన్నారు. ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లు అయిన సందర్భంగా నగరంలోని ఓ వేడుక మందిరంలో ఆదివారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్‌లో జెండా కీలకమన్నారు. దేశవ్యాప్తంగా హిందువుల హక్కులు, హిందూ ధర్మ పరిరక్షణకు ఆర్ఎస్ఎస్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ 1925లో స్థాపించిన ఆర్ఎస్ఎస్ దేశవ్యాప్తంగా విస్తరించి సేవలు అందించడం అభినందనీయమన్నారు.

బడుగుల సంక్షేమానికి జగ్జీవన్‌రామ్ కృషి

జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న తెదేపా నాయకులు

పామర్రులో నివాళులర్పిస్తున్న కుమార్‌రాజా

అవనిగడ్డ, న్యూస్‌టుడే: దివంగత భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి విశేష కృషిచేశారని ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు చెప్పారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు కర్రా సుధాకర్, బండే రాఘవ, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గుడ్‌మెన్ పేటలో...

పామర్రు, న్యూస్‌టుడే: బడుగు, బలహీన వర్గాలకు జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు ఎనలేనివని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక చాట్లవానిపురంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన ఇన్‌ఛార్జి తాడిశెట్టి నరేష్, జిల్లా ప్రొజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మన్ గణేష్, చాట్ల రమేష్ పాల్గొన్నారు.

గుడివాడ: పట్టణంలోని గుడ్‌మెన్ పేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆయన వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ నేత కంచర్ల సుధాకర్, కోడమల గంగాధరరావు, సైమన్ బాబు, ఏలీషా, అద్దంకి మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు. తెదేపా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, వెనిగండ్ల రామకృష్ణ(నాని), తదితరులు పాల్గొన్నారు.

నాంచారమ్మ తల్లికి తొలి ఏకాదశి పూజలు

పారాయణలో వేద పండితులు, అర్చకులు

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు శ్రీశక్తిపీఠ అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి తొలి ఏకాదశి పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. తొలుత సారె సమర్పించారు. వేదపండితులు, అర్చకులు 40 మంది పాల్గొని ఉదయం నుంచి రాత్రి వరకు వేదమంత్రోచ్ఛరణల మధ్య పూజలు కొనసాగించారు. ఆలయ నిర్వాహకులు కూరపాటి కోటేశ్వరరావు, సాంబశివరావు, నాగేశ్వరరావు, బుజ్జి పాల్గొన్నారు.

రూ.94 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

ఈనాడు కథనానికి స్పందన

సైడ్ వాల్స్‌ను తొలగిస్తున్న పొక్లెయిన్

తోట్లవల్లూరు: పెనమకూరులో ఏనుగులకోడు డ్రెయిన్‌పై ఉన్న వంతెన అభివృద్ధికి రూ.94 లక్షలతో పనులు చేపట్టామని ఆర్అండ్‌బీ ఏఈ మల్లికార్జునరావు తెలిపారు. 'వంతెన ప్రమాదకరం..వదలని ప్రచారం' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై 2023లో లోకాయుక్తలో శ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదు చేశారు. దీంతో వంతెన అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని ఆయన చెప్పారు.

కూటమి ప్రభుత్వంతో రాష్ట్ర సమగ్రాభివృద్ధి

శివాలయంలో జనసేన నాయకురాలు బర్లపూడి క్రాంతి

గుడివాడ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని జనసేన నాయకురాలు బర్లపూడి క్రాంతి పేర్కొన్నారు. స్థానిక భీమేశ్వరాలయంలో ఆదివారం ఆమె ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యత ఇస్తుందన్నారు. తాను తన తండ్రి ముద్రగడ పద్మనాభాన్ని వ్యతిరేకించి జనసేనలో చేరినా ఏ మాత్రం బాధ లేదన్నారు. పవన్ కల్యాణ్ వెంటే ఉంటామన్నారు. డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, సౌజన్య, మున్సిపల్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, తాడిశెట్టి నరేష్, చేకూరి జగన్ మోహన్‌రావు, డాక్టర్ గోర్జి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు ఉచిత వ్యాక్సినేషన్

కుక్కకు టీకా వేస్తున్న దృశ్యం

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: ప్రపంచ జునోసిస్ డేను పురస్కరించుకుని ఆదివారం డివిజన్ పశువైద్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత ఏఆర్‌వీ వైద్యశిబిరాన్ని ఏఎంసీ ఛైర్మన్ పి. రవికుమార్ ప్రారంభించారు. లయన్స్‌క్లబ్ సౌజన్యంతో మొత్తం 150 కుక్కలు, పెంపుడు జంతువులకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేశారు. వైద్యాధికారి హనుమంతరావు, లయన్స్ అధ్యక్ష కార్యదర్శిలు ఎం. పెరుమాళ్లు, కె.నవాబ్, కోశాధికారి పి. చిట్టిబాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

అవార్డులు పొందిన విద్యార్థులు

గురజాడ (పమిడిముక్కల): ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించాలని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ రాష్ట్ర కో కన్వీనర్, మాజీ సర్పంచి జంపాన శ్రీనివాస గౌడ్ అన్నారు. గురజాడలో జరిగిన కార్యక్రమంలో ఇటీవల పది, ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 19 మంది విద్యార్థులకు విద్యారత్న అవార్డుల పేరిట పతకాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. సాల్మన్ రాజు, ఇమ్మానియేలు, రామచంద్రరావు పాల్గొన్నారు.

నిధులున్నా పనులు చేయరేమి?

❑ దుస్థితిలో కొమరవోలు డ్రెయిన్ ❑ మూడు మండలాల రైతుల అవస్థ

చంద్రాల(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే

నిధులున్నా పనులు చేయకపోవడంతో మూడు మండలాల రైతులు ఇబ్బంది పడుతున్నారు. డ్రెయిన్ మొత్తం డెక్క, జమ్ము నిండిపోయి ఎక్కడ భారీ వర్షాలు పడితే తమ వరి నారుమళ్లు మునిగిపోతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పామర్రు మండలం పెదమద్దాలి వద్ద ప్రారంభమయ్యే కొమరవోలు మేజర్ డ్రెయిన్ పామర్రు మండలం నుంచి గుడివాడ రూరల్ మండలం మీదుగా గుడ్లవల్లేరు మండలంలోని వరిపొలాల మురుగును తీసుకుని విన్నకోట వద్ద పోల్‌రాజ్ డ్రెయిన్‌లో కలుస్తుంది. ఎవరూ పట్టించుకోకపోవడంతో పామర్రు మండలంలోని రైతులు తలా కొంత వేసుకుని ఆ ప్రాంతంలో తవ్వకం చేసుకున్నారు. పీసీ కమిటీ పరిధిలోకి వచ్చే ఈ డ్రెయిన్‌లో డెక్క, తూడు నిర్మూలనకు నిధులు కేటాయించారు. కానీ ఇంత వరకూ పనులు చేపట్టలేదు.

చంద్రాల ప్రాంతంలో కొమరవోలు డ్రెయిన్ దుస్థితి

దీంతో డ్రెయిన్ మొత్తం డెక్క, జమ్ము, తూడులతో నిండిపోయి కీకారణ్యంగా మారింది. భారీ వర్షాలు కురిస్తే నీరు కదలక తమ చేలు నీట మునుగుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. 2023 జూలైలో భారీ వర్షాలతో నారుమళ్లు, వెదజల్లిన చేలు నీట మునిగి నాశనమయ్యాయని, అధికారులు సత్వరం స్పందించి పనులు చేయించాలని రైతు ప్రముఖులు అడుసుమిల్లి రామ్మోహన్‌రావు కోరారు.

రోడ్లపైనే పశువుల విహారం

వాహనదారులకు అవస్థలు

బస్‌స్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై సేదతీరుతున్న పశువులు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన గుడ్లవల్లేరులో పదుల సంఖ్యలో పశువులను రోడ్లపైనే వదిలేయడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దుకాణాల వద్ద కూడా అడ్డుగా మారడంతో వ్యాపారాలకు అవరోధంగా మారి దుకాణదారులు నష్టపోతున్నారు. పశువులను పట్టుకుని బందెలదొడ్డిలో ఉంచాల్సిన పంచాయతీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో పశువుల యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

సీసీ రోడ్లకు ఇనుప గేట్లు!

సీసీ రోడ్లకు ఇనుప గేట్లు అమర్చిన దృశ్యం

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: హంసలదీవి పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.18 లక్షలతో 300 మీటర్ల పొడవున సిమెంటు రోడ్లు నిర్మించగా వాటికి ఇనుప గేట్లు పెట్టడం ఆ ప్రాంత ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రజల ఉపయోగం కోసం నిర్మించిన రహదారిపై ఎక్కడా లేని విధంగా హంసలదీవిలో మూడు రహదారులకు ఇనుప గేట్లు పెట్టడం పట్ల ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ విజయకుమార్‌ని వివరణ కోరగా తాము గేటు పెట్టించలేదన్నారు. దీంతో దేవస్థానం వారు గేట్లు పెట్టించారేమోనన్న అనుమానాల్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

మూడు నెలలుగా అందని సరకులు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : మూడు నెలల నుంచి గర్భవతులు, బాలింతలకు ఇవ్వాల్సిన సరకులు సక్రమంగా ఇవ్వకుండా డీలరు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, తహసీల్దార్, డీటీ, వీఆర్‌వోల దృష్టికి తీసుకెళ్లినా ఎవ్వరూ స్పందించడం లేదని గరికపర్రు-1 అంగన్‌వాడీ టీచర్ ఎం.లావణ్య వాపోయారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ 'అంగన్‌వాడీ కేంద్రంలో ఐదుగురు గర్భవతులు, ఒక బాలింత ఉన్నారు. వీరికి డీలరు ఒక్కొక్కరికి మూడు కేజీల రైస్, కేజీ కందిపప్పు, అర లీటరు ఆయిల్ ప్యాకెట్ ఇవ్వాలి. కానీ, స్టాక్ రావడం లేదని ఇవ్వడం లేద'ని ఆరోపించారు. తోట్లవల్లూరు సెక్టారు పరిధిలో 20 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అందులో 19 అంగన్‌వాడీ కేంద్రాలకు సక్రమంగా సరకులు ఇస్తూ గరికపర్రు-1 కేంద్రాన్ని మాత్రం ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి మూడు నెలల సరకులు ఇప్పించాలని ఆమె కోరారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మృతుడు మాణిక్యం (పాత చిత్రం)

గుడివాడ, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం సాయంత్రం వాంబే కాలనీలో జరిగింది. గుడివాడ వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని వాంబే కాలనీకు చెందిన దనిశెట్టి కృష్ణ కుమారుడు మాణిక్యం (37) మద్యానికి బానిసయ్యాడు. సరిగా పనికి వెళ్లడం లేదు. భార్య కుటుంబాన్ని పోషిస్తూ ఉంటుంది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు. ఏమయిందో ఏమో కాని, ఆదివారం మాణిక్యం ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈమేరకు ఎస్.ఐ పి.గౌతమ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘర్షణ నేపథ్యంలో కేసు

పామర్రు, న్యూస్‌టుడే : శివరామా థియేటర్ కాంప్లెక్స్ ఆవరణలోని అమలేశ్వరి ఎలక్ట్రానిక్స్ దుకాణం వద్ద షాపు యజమాని కాసాని శ్రీనివాసరావుకు, చాట్లవానిపురానికి చెందిన చాట్ల చిన రమేష్‌కు ఈ నెల 5న ఘర్షణ జరిగిందని ఎస్సై రాజేంద్రప్రసాద్ ఆదివారం తెలిపారు. ఇరువురూ పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

గుడివాడ: ముస్లింలు ఆదివారం మొహర్రంను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం భక్తులు మసీదులలో ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. మసీదులలో మత పెద్దలు ప్రసంగించారు. పీర్లను ఊరేగించారు.

కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే : మండలంలోని పలు ముస్లిం గ్రామాలలో ఆదివారం మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పమిడిముక్కల: మొహర్రం సందర్భంగా అలీనఖీపాలెంలో ముస్లింలు పీర్లను ఊరేగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కర్బలా యుద్ధంలో అసువులు బాసిన అమరవీరుల గాథలను తలచుకుంటూ రక్తతర్పణలు చేశారు.

సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పామర్రు, న్యూస్‌టుడే : స్థానిక 154, 155, 156 అసెంబ్లీ బూత్‌ల పరిధిలో ఆదివారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పాల్గొన్నారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

నాట్యక్షేత్రంలో నర్తనం నయనమనోహరం

కూచిపూడి, న్యూస్‌టుడే : నాట్యక్షేత్రమైన కూచిపూడి అగ్రహారంలోని నాట్య శిల్పారామంలో ఆదివారం రాత్రి ప్రదర్శించిన నాట్య ప్రదర్శనలు నయనమనోహరంగా సాగాయి. తొలి ఏకాదశి సందర్భంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కళారత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి, భరత నాట్యాంశాలు ఆహుతులను అలరించాయి.

వేగ నియంత్రణ అవసరం

పులిగడ్డ చౌరస్తాలో ఏర్పాటు చేసిన డ్రమ్ములతో సీఐ, ఎస్సై

అవనిగడ్డ గ్రామీణం: జాతీయ రహదారిపై వాహనాలకు వేగనియంత్రణ అవసరమని అవనిగడ్డ సి.ఐ యువకుమార్ అన్నారు. ప్రమాదాల నివారణకు జాతీయ రహదారి 216పై పలు ప్రాంతాల్లో రేడియం స్టిక్కర్లు అంటించిన డ్రమ్ములను ఆయన ఆదివారం ఏర్పాటు చేయించారు. పులిగడ్డ చౌరస్తా, పులిగడ్డ- పెనుమూడి వారధి సమీపం, మోపిదేవి మలుపుల వద్ద డ్రమ్ములను ఉంచారు. వాహనదారులు మితిమీరిన వేగంతో వాహనాలను నడిపి ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. ఎస్సై కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరికం దూరం

సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కొండపల్లి శ్రీనివాస్

గుడివాడ, న్యూస్‌టుడే: విద్యతోనే పేదరికాన్ని రూపు మాపవచ్చని, దళిత వర్గాల పిల్లలు ఉన్నత విద్యతో వారి జీవితాలలో వెలుగు ప్రసరింప చేసుకోవాలని గుడివాడ వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ఎన్జీవో హోంలో బాబూ జగ్జీవన్ రామ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పది పరీక్షా ఫలితాలలో ఉత్తమ మార్కులు సంపాదించిన 10 మందికి ఒక్కొక్కరికీ 5 వేల రూపాయల నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎం.ఆర్.పి.ఎస్ రాష్ట్ర నేత కంచర్ల సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దారు పి.ఎల్.ఎన్.రాజకుమారి, ప్రొఫెసర్ విజయ్ కుమార్, గుడివాడ మార్కెట్ యార్డు ఛైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు, జనసేన నేత కొదమల గంగాధర్, ఆందుగుల యేసుపాదం, అద్దంకి మాణిక్యాలరావు, కలపాల కిరణ్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

గుడివాడ ఏలూరు రోడ్ D.No: 11/162-1, ప్రస్తుతం Hyd జూబిలీహిల్స్, షేక్‌పేట రోడ్, ప్లాటు నెం. 62లో నివాసముంటున్న దండమూడి (లేటు) అమర మోహన్‌దాసు గారి భార్య గారికి చెందిన సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ద.నెం. 5119/2025న రిజిష్టర్ అయిన ఆస్తి దస్తావేజులు నెం. 712/1976 గుడివాడ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ఎదురుగా ఫొటోస్టాట్ నిమిత్తం ది.12/6/2025న వెళ్ళుచుండగా దారి మధ్యలో పోయినవి. అవి ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

ఇట్లు : దండమూడి అనిత
W/o (లేటు) దండమూడి అమరమోహన్‌దాసు
హైదరాబాదు. సెల్: 94406 18160

(c) eenadu

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
సోమవారం జులై 7, 2025

సఫారీలో షికారు.. సరికొత్త హుషారు

పర్యాటక సర్క్యూట్లపై సర్కారు ప్రత్యేక దృష్టి

ఈనాడు, అమరావతి

పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి కార్యాచరణ సిద్ధమైంది. విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న భవానీద్వీపం, కొండపల్లి కోట, కృష్ణా పరివాహక ప్రాంతంలోని ఆలయాలు, అటవీ ప్రాంతాల్లోని ట్రెక్కింగ్ జోన్లు, జలపాతాలు.. ఇలా అన్నింటిపైనా దృష్టి సారించి పర్యాటక ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించి ప్రాజెక్టులను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనిలో భాగంగా కొత్త పర్యాటక సర్క్యూట్లపైనా దృష్టి పెడుతున్నారు. ప్రధానంగా కొండపల్లి అటవీ ప్రాంతంలో.. జంగిల్ సఫారీ, బయో డైవర్సిటీ పార్కు, నేచర్ ట్రయల్స్, మూలపాడు బటర్‌ఫ్లై పార్కు వద్ద 250 హెక్టార్లలో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధానం..

ఎన్టీఆర్ జిల్లాకు ఆతిథ్య, సేవా రంగంపైనే ప్రస్తుతం 60శాతానికి పైగా ఆదాయం వస్తోంది. ప్రస్తుతం సేవా రంగంలోనే ఏటా 70శాతం వృద్ధి ఉంటోంది. దీనిని భారీగా పెంచేందుకు ఇక్కడ పుష్కలంగా అవకాశాలున్నాయి. విజయవాడలోని దుర్గగుడి, పెనుగంచిప్రోలు తిరుపతమ్మ, నెమలి వేణుగోపాలస్వామి, వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి, కృష్ణా నదికి పక్కనే ఉన్న మంగళగిరిలోని పానకాలస్వామి.. ఈ ఆలయాలన్నింటినీ కలిపి ఏడాదికి కనీసం రెండు నుంచి మూడు కోట్ల మంది భక్తులు సందర్శిస్తున్నారు. వీరిలో అధిక శాతం మంది వచ్చిన వాళ్లు వచ్చినట్టే దర్శించుకుని వెళ్లిపోతున్నారు. వీరిని పర్యాటక ప్రదేశాల వైపు ఆకర్షించేలా సౌకర్యాలు కల్పిస్తే గణనీయంగా ఆదాయ వృద్ధికి అవకాశం ఉంటుంది. దీనిపైనే ప్రస్తుతం అధికారులు దృష్టి సారించారు.

భవానీద్వీపంపై ప్రత్యేక దృష్టి: కృష్ణా నదిలోని భవానీ ద్వీపాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. భవానీ ద్వీపం అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికల్లో భాగంగా తాజాగా బోటులో ప్రయాణించి వెళ్లి సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. పర్యాటకుల కోసం ద్వీపంలో ప్రస్తుతం ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్లు, మేజ్ గార్డెన్, బోటింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆలయ, ఎకో పర్యాటకానికి పుష్కలంగా అవకాశం ఉందని, కొత్త సర్క్యూట్లను అభివృద్ధి చేయడంపై ప్రధానంగా దృష్టిపెట్టినట్లు తెలిపారు.

కృష్ణా నదిలో బోటు ఎక్కి భవానీద్వీపం, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

దశలవారీగా అభివృద్ధి.. ప్రకృతి వనరులను వినియోగించుకుని ఇప్పటివరకూ లేనివిధంగా సరికొత్త అనుభూతి ఇచ్చేలా ప్రాజెక్టుల రూపకల్పనపై దృష్టి పెట్టారు. విజయవాడలోని గాంధీహిల్, అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం, బాపూ మ్యూజియం, అక్కన్న మాదన్న, మొగల్రాజపురం గుహలు, కొండపల్లి ఖిల్లా.. వీటన్నింటినీ దశలవారీగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ప్రత్యేకంగా పర్యాటక ప్యాకేజీలు

ఆలయ, ఎకో పర్యాటక సర్క్యూట్లను అభివద్ధి చేయడంతో పాటు సందర్శకులు ఆయా ప్రాంతాలకు చేరుకునేందుకు వీలుగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేకంగా పర్యాటక ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

పండగ నాడు.. సారె చూడు.. తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడింది. ఒకవైపు క్యూలైన్లలో రద్దీ ఉండగా.. మరోవైపు పెద్దసంఖ్యలో మహిళలు దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించేందుకు తరలివచ్చారు. – ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

దస్త్రం ముట్టనివ్వరు.. నిషేధం పెట్టనివ్వరు!

ఈనాడు, అమరావతి

విజయవాడ లోటస్‌ల్యాండ్ ప్రాంతంలో దుర్గగుడి భూముల పరిరక్షణను అధికారులు పూర్తిగా పక్కన పెట్టేశారు. ఈ భూముల పూర్తి వివరాలతో జిల్లా రిజిస్ట్రార్, రిజిస్ట్రేషన్ల ఐజీకి దస్త్రం పంపిస్తే వాటిని నిషేధిత జాబితాలో పెడతారు. క్రయవిక్రయాలు ఆగిపోతాయి. ఈ ప్రక్రియకు ఓ వారం సమయం పడుతుంది. కబ్జాకు గురైన 11.54 ఎకరాల భూములు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి చెందినవేనంటూ స్పష్టమైన ఆధారాలున్నాయి. అయినా అవి ఒకరి నుంచి మరొకరికి చేతులు మారుతూ వెళ్తున్నాయి. రూ.200 కోట్ల విలువైన ఈ భూములను స్వాధీనం చేసుకోవడం పక్కన పెడితే.. కనీసం నిషేధిత జాబితాలో పెట్టడానికీ అధికారులు చొరవ తీసుకోవడం లేదు. దీనికి ప్రధాన కారణం ఈ భూముల్లో పాగా వేసినోళ్లంతా బడా బాబులే.

★ 2023 డిసెంబరులో ఈ కబ్జా విషయం వెలుగులోకి రాగా కొన్నాళ్లు దేవాదాయశాఖలో నుంచి ఈ దస్త్రం బయటకు రాకుండా ఆపేశారు. ఆ తర్వాత దేవాయశాఖ నుంచి విడుదలై.. ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ విభాగానికి చేరింది. గత రెండు నెలలుగా అక్కడే మూలుగుతోంది. దుర్గగుడి భూములను ఆక్రమించినది వాస్తవమేనంటూ తేల్చి కూడా ఇప్పటికి తొమ్మిది నెలలవుతోంది. ఈ భూముల పరిరక్షణ కోసం విజయవాడకు చెందిన సామాజిక కార్యకర్త కృష్ణారావు సహా మరికొందరు ఏడాదిన్నరగా పోరాటం చేస్తున్నారు. ప్రక్రియను జాప్యం చేయడానికి రెవెన్యూ అధికారులు కొత్తవాదన తెరపైకి తీసుకొచ్చారని, వీటికి సంబంధించి కొన్ని కేసులున్నాయని, ఆ వివరాలన్నీ సంపాదించాకే వీటిపై ముందుకెళ్లాల్సి ఉందని చెబుతున్నారని కృష్ణారావు మండిపడ్డారు. దేవాదాయశాఖకు చెందిన ఈనాం భూములు ఎన్ని కేసులున్నా అవన్నీ దేవస్థానానికి చెందుతాయంటూ గతంలోనే సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలున్నా కబ్జా చేసినోళ్లకు అండగా ఉంటున్నారంటూ మండిపడ్డారు.

రూ.200 కోట్ల భూమిపై తెరవెనుక లాబీయింగ్

ఆర్డీవో కార్యాలయంలోనే మూలుగుతూ..

దుర్గమ్మకు చెందిన సత్యనారాయణపురంలోని పాత సర్వే నంబరు 118, ఆర్ఎస్ నంబరు 112లోని ఈ భూముల పరిరక్షణ కోసం త్వరగా జాబితాను రిజిస్ట్రేషన్ల శాఖకు పంపించాలంటూ ఇప్పటికే దేవాదాయశాఖ కమిషనర్ కూడా రెవెన్యూ శాఖకు నివేదిక పంపించారు. ప్రస్తుతం విజయవాడ ఉత్తర మండలం ఎమ్మార్వో నుంచి ఈ భూములకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన దస్త్రం ఆర్డీవో కార్యాలయానికి చేరింది. ప్రస్తుతం అక్కడే దస్త్రం మూలుగుతోంది. ప్రస్తుతం ఈ 11.54ఎకరాల్లో 127మంది పాగా వేశారు. వీరిలో కొందరు ఆక్రమించుకున్న వాళ్లుండగా, మరికొందరు వేరేవారి దగ్గర కొని మోసపోయినవాళ్లు ఉన్నారు.

కబ్జా కోరల్లో మరో 10 ఎకరాలు..

ఇప్పటికే ఆక్రమించినట్టు అధికారులు గుర్తించిన 11.54 ఎకరాలతో పాటు కొత్తగా మరో 10.38 ఎకరాల భూమి తెరపైకి వచ్చింది. రీసర్వే నంబరు 145, పాత సర్వే నంబరు 180లోని టైటిల్ డీడ్ నెం.131 పరిధిలోని ఈ 10.38 ఎకరాల భూమి దుర్గగుడికి చెందినదేనని ఈనాం రిజిస్టర్‌లో నమోదై ఉన్నట్టు సమాచారం. ఈనాం రిజిస్టర్, ఆర్ఎస్ఆర్ రికార్డు ఇవ్వాలంటూ స.హ దరఖాస్తులు చేసినా అధికారులు మాత్రం ఇవ్వడం లేదు.

సూర్యుడి చుట్టూ వలయం

సూర్యుడి చుట్టూ నల్లటి వలయం, దానికి అంచులా బంగారు రంగులో మరో వృత్తం దర్శనమిచ్చాయి. దుర్గగుడి గోపురం వద్ద ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు కనిపించింది. ఆకాశంలో మంచు స్ఫటికాలు కాంతి విక్షేపణం చెందడం, సూర్యకాంతి 22 డిగ్రీల కోణంలో పడినప్పుడు ఇలా ఏర్పడుతుందని లయోలా కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి తుమ్మల శ్రీకుమార్ తెలిపారు.

- ఈనాడు, అమరావతి

WANTED TEACHERS
For Maths, P.S
up to X FULL TIME
బెజవాడ రాజారావు హైస్కూలు
అరవిందవీధి, విద్యాధరపురం
VJA-12. © 0866-2411914

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 7వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతి పత్రాలు స్వీకరించనున్నట్టు వివరించారు. ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందులో సమాచారం తెలుసుకునేందుకు 1100 నంబరుకు ఫోన్ చేయవచ్చన్నారు.

రావమ్మా.. గోదారమ్మా..!

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : పట్టిసీమ నుంచి గోదావరి నీటి విడుదలను ఆదివారం మరింత పెంచారు. శనివారం 8 పంపుల ద్వారా 2,382 క్యూసెక్కులు ఇవ్వగా.. కృష్ణా డెల్టా సాగునీటి అవసరాల రీత్యా ఆదివారం 16 పంపుల ద్వారా 5,564 క్యూసెక్కులు విడుదల చేశారు. ఇవి నగరంలోని ప్రకాశం బ్యారేజీకి చేరడానికి కొంత సమయం పడుతుంది. దీనిపై సోమవారం రాత్రి ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కృష్ణా నదిలో పులిచింతల ప్రాజెక్టు పవర్ హౌస్ నుంచి 5,000 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి మట్టానికి గాను 11.2 అడుగులు ఉంది.

కాల్వలకు 7,389 క్యూసెక్కులు: కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు ప్రకాశం బ్యారేజీ నుంచి 7,389 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 7,084, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 305 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,707, ఏలూరు 1,110, బందరు 1,259, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,008 క్యూసెక్కుల చొప్పున నీరు ఇస్తున్నారు.

మా ఇంటి నేస్తాలు.. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం శునకాలకు రేబిస్ నివారణ టీకాలు వేశారు. ప్రేమగా పెంపుడు జంతువులను వాటి యజమానులు బుజ్జగిస్తూ.. ఆస్పత్రికి తీసుకొచ్చారు. దీంతో అక్కడ సందడి నెలకొంది. - విజయవాడ సిటీ

గ్రేడ్‌ల ప్రాధాన్యతకు తిలోదకాలు

అస్తవ్యస్తంగా కార్యదర్శుల బదిలీలు

న్యూస్‌టుడే, కలెక్టరేట్(మచిలీపట్నం)

సచివాలయ కార్యదర్శుల బదిలీ ప్రక్రియ పలువురిని విస్మయానికి గురి చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిర్వహించాల్సిన బదిలీలను అపహాస్యం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవో అధికారాలు ఇచ్చిన నేపథ్యంలో పది నెలల కిందట క్యాడర్ స్ట్రెంత్ సమస్య లేకుండా చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ట్రెజరీ డైరెక్టరేట్ జిల్లాలో రద్దు చేసిన దాదాపు 500 స్థానాల్లో కొందరికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఒకే స్థానానికి ఇద్దరు కార్యదర్శులను నియమించడం, ఉన్నవారికి బదిలీ లేకుండా కొత్త వారిని వేయడం వంటి ఉత్తర్వులు కార్యదర్శుల్లో కలవరం పుట్టిస్తున్నాయి.

విచిత్రం ఏమిటంటే.. ఉమ్మడి కృష్ణా పరిధిలోని సచివాలయ కార్యదర్శులను బదిలీ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి బదిలీలకు నోచుకోని వారు స్థానచలనం పొందవచ్చని ఆశపడ్డారు. ఈ క్రమంలో అధికారులు కార్యదర్శుల నుంచి బదిలీ ఆప్షన్లు కోరుతూ అర్జీలు స్వీకరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, సీనియార్టీల ప్రకారం కోరుకున్న స్థానాలకు బదిలీ అవుతుందని భావించిన వారికి చుక్కెదురైంది. కృష్ణా, ఎన్టీఆర్‌లతో పాటు ఏలూరు జిల్లాలో విలీన మండలాలకు సంబంధించిన 414 మందిని బదిలీ చేశారు. విచిత్రం ఏమిటంటే ఉన్న బదిలీ ఆదేశాల్లో కొన్ని సచివాలయాల్లో పని చేస్తున్న కార్యదర్శుల స్థానంలో కొత్త వారిని నియమించి పాత వారిని ఎక్కడికీ పంపలేదు. దీంతో కొత్త వారు బాధ్యతలు ఎలా తీసుకుంటారనేది ప్రశ్నార్థకం. కొన్ని పంచాయతీల్లో గ్రేడ్-5 కార్యదర్శులకు అవకాశం ఇవ్వకుండా ఇటీవలే వచ్చిన గ్రేడ్-6 కార్యదర్శులను నియమించారు. మలపరాజుగూడెం, ఆముదాలలంక, నాచుగుంట, కొక్కిలిగడ్డ, అవనిగడ్డ- 3 వంటి సచివాలయాల్లో ఇద్దరికి చొప్పున పోస్టింగ్ ఇచ్చారు.

కొత్తవారు వస్తే విధులు ఎలా?: కూచికాయలపూడి, బల్లిపర్రు, చంద్రాల, చినకళ్లేపల్లి, కంచడం సచివాలయాల్లో పని చేస్తున్న వారిని బదిలీ చేయకుండా ఆ స్థానాల్లో కొత్త వారిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కొత్తవారు వస్తే విధుల్లో ఉన్న కార్యదర్శులు అదే సచివాలయంలో కలుపుకొని పనిచేయాలా? అనే సమస్య ఎదురవుతోంది. ట్రెజరీ డైరెక్టర్ రద్దు చేసిన స్థానాల్లో నియమితులైన వారికి వేతనాలు ఎవరు ఇస్తారనేది చూడాలి. మొత్తం మీద అస్తవ్యస్తంగా ఉన్న బదిలీ ఆదేశాలపై కార్యదర్శులు, సంఘ నాయకులు ఉన్నతాధికారులను కలిసే ప్రయత్నంలో ఉన్నట్టు సమాచారం.

ఇచ్చినవి చెబుతున్నారు.. తీసుకున్నవి దాచేస్తున్నారు

పటమట, న్యూస్‌టుడే: అద్విక ట్రేడింగ్ కంపెనీ స్కాంలో ఏజెంట్లు, బాధితులు చెప్పిన లెక్కలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. లెక్కలు దాదాపుగా కొలిక్కి వచ్చినా..కొంతమంది ఏజెంట్లు, పెట్టుబడిదారులు కంపెనీలో పెట్టిన మొత్తాన్ని పోలీసుల ముందు రూపాయలతో సహా వెల్లడిస్తున్నారు. కానీ కంపెనీ ఎండీ ఆదిత్య నుంచి వడ్డీ, కమీషన్ రూపంలో తీసుకున్న నగదు గురించి మాత్రం పొంతన లేని లెక్కలు చెబుతున్నారు. దీంతో పోలీసులు కంపెనీ బ్యాంకు ఖాతా లావాదేవీల ద్వారా అసలు లెక్కలు తేల్చనున్నారు. ఇందు కోసం బ్యాంకులకు లేఖలు రాసిన విషయం తెలిసిందే. మరోవైపు విచారణలో ఆదిత్య వ్యవహారశైలితో నిధులు కచ్చితంగా పక్కదారి పట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు. హవాలా రూపంలో దుబాయ్‌కు తరలించిన నగదును అక్కడే పెట్టుబడులు పెట్టడం లేదా వేరే ఖాతాల ద్వారా తిరిగి ఇంకా ఎక్కడైనా పెట్టుబడి పెట్టి ఉంటాడని పోలీసులు అంచనాకు వచ్చారు. దీని ప్రకారమే దర్యాప్తు వేగవంతం చేశారు.

Advika trading company

గోల్డెన్ లీఫ్‌పై అనుమానాలు.. పెట్టుబడిదారులను తప్పుదోవ పట్టించేందుకు ఆదిత్య దుబాయ్ వెళ్లి అక్కడ గోల్డెన్ లీఫ్ అనే ఫేక్ ట్రేడింగ్ కంపెనీ స్థాపించి డిజిటల్ కరెన్సీని డిపాజిట్ చేసినట్లు తొలుత పోలీసులు గుర్తించారు. కానీ అందులో ఖాతా ఉన్న ప్రతి ఒక్కరికి గత ఏడాది వాలెట్‌లోని నగదు విత్‌డ్రా చేసుకునే తేదీ నవంబర్ 2గా చూపించింది. అదే సమయానికి ఆదిత్య కంపెనీ డైరెక్టర్లతో కలిసి దుబాయ్ వెళ్లారు. ఈ విషయాన్ని కొంతమంది డైరెక్టర్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వారికున్న అనుమానాలు సైతం పోలీసులకు తెలిపారు. దీంతో గోల్డెన్ లీఫ్ లెక్కలు తేల్చేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. దీనికి సంబంధించి అంతర్జాతీయ బ్యాంకు, కంపెనీల నిబంధనల ప్రకారం గోల్డెన్ లీఫ్ వివరాలకు సంబంధిత శాఖలకు పోలీసులు మెయిల్ పెట్టారు. ఈ వివరాలన్నీ వస్తే అసలు గోల్డెన్ లీఫ్ నకలీదా కాదా అనేది తేలనుంది.

గుణదల చోరీపై దర్యాప్తు ముమ్మరం

మధురానగర్, న్యూస్‌టుడే : గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన భారీ చోరీపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. స్థానిక పోలీసులతో పాటు సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగారు. నేరం జరిగిన విధానాన్ని బట్టి.. పాత నేరస్థులపై ఆరా తీస్తున్నారు. గతంలో ఇదే తరహాలో జరిగిన నేరాల్లో పట్టుబడిన నిందితుల వివరాలు సేకరిస్తున్నారు. గతంలో నగర శివారులో చెడ్డీగ్యాంగ్ దోపిడీకి పాల్పడిన ఘటనను పోలి ఉండడంతో.. ఆ దిశగాను దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. ముగ్గురు నిందితులు నేరం చేసినట్లు తేలడంతో ఫుటేజీలను తనిఖీ చేస్తున్నారు. టవర్ డంప్ సమాచారం సేకరిస్తున్నారు. వీటినన్నింటినీ క్రోడీకరిస్తున్నారు. కాగా ఈ చోరీ.. చెడ్డీ గ్యాంగ్ ముఠా చేసే విధంగా ఉండడంతో ఆ దిశగాను దర్యాప్తు చేస్తున్నారు. వీరు ఒక నేరంతో సరిపెట్టుకోరని, మరోచోట చేసే అవకాశం ఉండడంతో నగరవ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. శివారు ప్రాంతాలైన గుణదల, పాయకాపురం, భవానీపురం తదితర ప్రాంతాల్లో శనివారం రాత్రి బీట్లు పెంచారు. గుణదల స్టేషన్ పరిధి శివారులోని విల్లాలు, అపార్ట్‌మెంట్లను జల్లెడ పట్టారు. అక్కడ ఉన్న సెక్యూరిటీలను అప్రమత్తం చేశారు.

చెల్లిస్తే బాగు.. సాఫీగా సాగు!

రూ. 20కోట్ల బకాయిలకు రైతుల నిరీక్షణ

ఈనాడు, అమరావతి

రబీ ధాన్యం కొనుగోలు సొమ్ము చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. వైకాపా పాలనలో ధాన్యం కొనుగోళ్లు కూడా సవ్యంగా చేయకపోవడం, కూటమి సర్కారు లక్ష్యానికి మించి కొనుగోలు చేయడంతో నిధుల సమస్య తలెత్తింది. ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో పెట్టుబడికి సొమ్ము లేక అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

లక్ష్యం పెరగడంతో భారం.. వైకాపా పాలనలో గత రెండేళ్లు రబీలో ధాన్యం కొనుగోళ్లు చేయలేదు. గత ఐదేళ్లలో ఒక సీజన్‌లో కొన్న అత్యధిక ధాన్యం 15వేల మెట్రిక్ టన్నులు. ఈ ఏడాది 10వేల మెట్రిక్ టన్నులే కొనుగోలు లక్ష్యం. గతంలో ఇతర రాష్ట్రాల్లో వరి సాగు ఎక్కువ ఉండకపోవడంతో జిల్లా నుంచి ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం పొరుగు రాష్ట్రంలో వరి సాగు పెరగడంతో ధాన్యం బయటికి వెళ్లలేదు. పైగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే సొమ్ము జమ చేయడంతో రైతులు ప్రభుత్వానికే ధాన్యం అమ్మేందుకు పోటీపడ్డారు. దీంతో అధికారులు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 77వేల మెట్రిక్ టన్నులకు పెంచారు. లక్ష్యం ఊహించని రీతిలో పెరగడంతో నిధుల సమస్య తలెత్తింది. రైతులకు చెల్లించాల్సిన రూ.177 కోట్లలో రూ.147 కోట్లు ధాన్యం కొన్న 24గంటల్లోపే చెల్లించారు. వారం కిందట మరో రూ.10 కోట్లు జమ చేశారు.

జిల్లాలో..
- ✦ ధాన్యం కొనుగోలు: 77వేల మెట్రిక్ టన్నులు
- ✦ మొత్తం చెల్లించాల్సిన సొమ్ము:రూ.177కోట్లు
- ✦ ఇప్పటివరకు చెల్లించిన మొత్తం: రూ.157 కోట్లు
- ✦ ఇంకా చెల్లించాల్సిన బకాయిలు: రూ.20కోట్లు
- ✦ ధాన్యం అమ్మిన రైతులు: 6,287
- ✦ బకాయిలు రావాల్సిన రైతులు: 622

పాత కంచల(నందిగామ)లో ధాన్యం లోడు (పాత చిత్రం)

622 మంది నిరీక్షణ.. ఏప్రిల్‌లో కొనుగోలు ప్రక్రియ ప్రారంభించారు. జూన్ 22తో ముగిశాయి. 75 కేజీల ధాన్యం బస్తాకి రకాన్ని బట్టి రూ.1725-రూ.1740 వరకు చెల్లించారు. దీంతో రైతులు మొత్తం బకాయిలు చెల్లిస్తారని భావించారు. సొమ్ము వస్తే ఖరీఫ్‌లో విత్తనాలు, నారుమళ్లకు వాడుకునేందుకు ఉపయోగించుకోవచ్చు అనుకున్నారు. కొందరు బ్యాంకుల్లో, వడ్డీలకు తెచ్చిన అప్పులు చెల్లించి వడ్డీ భారం తగ్గించుకోవచ్చని నిరీక్షిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు.

'వారం రోజుల్లో బకాయిలు మొత్తం రైతుల ఖాతాల్లో జమవుతాయి. రైతులు ఆందోళన చెందొద్దు' అని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సతీశ్ తెలిపారు.

ADITYA DEGREE COLLEGE, GUDIVADA
ADITYA ACHIEVERS DAY-2025
మన గుడివాడ డిగ్రీ కళాశాలల చరిత్రలో మొట్టమొదటిసారిగా 2024-25 విద్యాసంవత్సరంలో బహుళ జాతి (MNC) కంపెనీల క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా ఆదిత్య డిగ్రీ కళాశాల 96 ఉద్యోగాలు (92%) సాధించి రికార్డ్ సృష్టించారు
రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఇది ఒక రికార్డు వరుసగా 4వ సారి 10,000కు పైగా ఉద్యోగాలు కల్పించిన ఏకైక విద్యా సంస్థ
2024-25 విద్యా సంవత్సరంలో 15120+ ఉద్యోగాలు సాధించిన ఆదిత్య డిగ్రీ విద్యార్థులు
"Placement in Aditya is not a chance - it's a choice"
ఈ సంతోష సమయంలో అత్యధిక ప్లేస్‌మెంట్స్ సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించుటకు ది. 07-07-2025 సోమవారం మధ్యాహ్నం 12.30 ని.లకు అభినందన సమావేశం ఏర్పాటు చేయుట జరిగినది.
వేదిక: టి.టి.డి. కళ్యాణ మండపం రాజేంద్రనగర్, సికిండ్ లైన్, గుడివాడ
ముఖ్య అతిథి | గౌరవ అతిథి | విశిష్ట అతిథి | ప్రత్యేక అతిథి

అభినందన సమావేశానికి ఆహ్వానం
www.aditya.ac.in/degree
ADITYA DEGREE COLLEGE
GUDIVADA
CELL :7396517666, 8019837666

వరుణ్ బజాజ్

తల్లులకు (మదర్స్ డే) తండ్రులకు (ఫాదర్స్ డే)
ఇంజినీర్లకు (ఇంజినీర్స్ డే) డాక్టర్లకు (డాక్టర్స్ డే)
టీచర్లకు (టీచర్స్ డే)
మరి మన ఆటోసోదరులకు కూడా
జులై 9 ఆటో డే (ఆటో దినోత్సవం) ఉందని తెలుసా !...
ఈ రోజుని అత్యంత వైభవంగా జరుపుకుందాం...
ఈ ఆటో దినోత్సవాన్ని ప్రతి స్టాండ్‌లో నిర్వహించుకుని దీని గొప్పతనాన్ని తెలియజేయండి.
ప్రతి ఆటో సోదరుడు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ప్రతి సంవత్సరం ఈ జులై 9 న ఆటో డే జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నాము.
ఆటో డే సందర్భంగా... ఈ ఒక్క రోజు (జులై 9) న ప్రతి బజాజ్ ఆటో కొనుగోలుపై మీ వరుణ్ బజాజ్ అందిస్తోంది...
ఇన్సూరెన్స్ ఉచితం
ఖాకీ చొక్కా ఉచితం
మ్యాట్స్ ఉచితం
వరుణ్ బజాజ్ రెవెన్యూ వార్డ్, Opp: స్టాలిన్ బిల్డింగ్, ఆటోనగర్ ఏరియా, విజయవాడ
© 98850 02241, 85007 37173, 97032 19995

(c) eenadu

ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత ప్రవేశాలు

వేంపల్లె, న్యూస్‌టుడే

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు ట్రిపుల్ ఐటీలలో 600 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి విద్యార్థుల మెరిట్ జాబితాను తయారు చేసి ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి మొత్తం 4400 సీట్లు ఉన్నాయి. ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1100 సీట్లు ఉండగా దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ కోటా కింద 360 సీట్లు పోను నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1010 చొప్పున 4040 సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలలో ఉన్న సీట్లకు మెరిట్ జాబితా విడుదల చేసి జూన్ 30 నుంచి జులై 5వ తేదీ వరకు ఇడుపులపాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేశారు. కౌన్సెలింగ్ తర్వాత ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 878 సీట్లు భర్తీ కాగా 132 సీట్లు మిగిలిపోయాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలో 1010కి 869 భర్తీ కాగా 141 సీట్లు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 867 భర్తీ కాగా 143, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు 826 సీట్లు భర్తీకాగా 184 సీట్లు మిగిలాయి. ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో జాప్యం, ఇక్కడి విద్యపై ఆసక్తి లేని కారణంగా చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడంతో 600 సీట్లు ఖాళీ ఏర్పడింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ కేంద్రంగా రెండో విడత ప్రవేశాలకు సంబంధించి రెండో జాబితాను అధికారులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

ఇడుపులపాయల ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కార్యాలయం

నాలుగు ట్రిపుల్ ఐటీల్లో మిగులు సీట్లు 600

11, 12 తేదీల్లో రెండో విడత ప్రవేశాల జాబితా

ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలలో మిగిలిపోయిన 600 సీట్ల భర్తీకి తదుపరి మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 11, 12 తేదీల్లో వెబ్‌సైట్‌లో వెల్లడిస్తాం. ఈ మేరకు రెండో విడత జాబితా సిద్ధం చేసే పనిలో తమ సిబ్బంది ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. ఆ లోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తాం. - ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ

విద్యుత్తు బిల్లులకు చెక్..!

పరిశ్రమల్లో కెపాసిటర్లు సరిచూసుకోండి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే

☛ **విజయవాడ** నగర శివారులోని పిండి మరకు ప్రతి నెలా రూ.6వేల విద్యుత్తు బిల్లు వచ్చేది. జూన్‌లో ఒక్కసారిగా రూ.26వేలు రావడంతో యజమాని లబోదిబోమన్నారు. అధికారుల వద్దకు పరుగులు తీస్తే.. కెపాసిటర్ లేకపోవడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైందని చెప్పి సరిచేశారు.

☛ **గవర్నర్‌పేటలోని** ఒక బంగారు దుకాణం యజమాని అవసరం లేకపోయినా కెపాసిటర్ పెట్టుకున్నారు. ఆయన వాడే లోడ్‌కు 1.5 ఏవీఏఆర్ కెపాసిటర్ పెట్టుకుంటే సరిపోతుంది. ఎలక్ట్రీషియన్ మాటలు విని అవసరం లేకపోయినా 6 కేవీఏఆర్ కెపాసిటర్ పెట్టేశారు. నెలా నెలా రూ.20వేలు వచ్చే బిల్లు రూ.70వేలు అయ్యింది.

... ఈ రెండు ఉదాహరణల్లో విద్యుత్తు బిల్లులు ఎక్కువ రావడానికి కారణం కెపాసిటర్లే. ఒకరికి కెపాసిటర్ లేక బిల్లు ఎక్కువ వస్తే.. మరొకరు అవసరం కన్నా ఎక్కువ కెపాసిటర్ పెట్టుకుని బిల్లు ఎక్కువ వచ్చేలా చేసుకున్నారు.

మన వాడుకభాషలో చెప్పాలంటే.. వినియోగించే విద్యుత్తును నియంత్రించే ఉపకరణమే కెపాసిటర్. పరిశ్రమలు, హీటర్లు, లిఫ్టులు ఎక్కువగా ఉండే సంస్థల్లో, ఒకటి రెండు మోటార్లు వినియోగించే చిన్న చిన్న కర్మాగారాల్లో కెపాసిటర్లను బిగించుకోవాలి. మోటార్లు ఆన్‌చేయగానే కావాల్సిన దాని కన్నా అధిక విద్యుత్తును తీసుకుంటాయి. అక్కడ కెపాసిటర్ పెట్టుకుంటే.. అధికంగా తీసుకునే విద్యుత్తును నియంత్రిస్తుంది. పెట్టుకోకపోతే కావాల్సిన దాని కన్నా ఎక్కువ విద్యుత్తును తీసుకుంటుంది. ఇలా నాలుగైదు సంస్థలు ఎక్కువ విద్యుత్తును వాడేస్తే.. దాని పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై భారం పడుతుంది. తద్వారా గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతుంది. ఒక్కోసారి ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజులు పోయే అవకాశం ఉంది. కెపాసిటర్ లేని వారికి ఇలా అదనంగా వాడేసే విద్యుత్తుతో పాటు పెనాల్టీ పడిపోతుంది. సాధారణంగా వచ్చే బిల్లు కన్నా అదనంగా మూడు రెట్లు వరకు బిల్లు వస్తుంది.

పిండిమరకు వాడుతున్న కెపాసిటర్

ఏపీఈఆర్‌సీ నిబంధనల ప్రకారం..

విద్యుత్తు నియంత్రణ మండలి 2022 సంవత్సరంలో కొత్త నిబంధనలు తెచ్చింది. దీని ప్రకారం కెపాసిటర్లను పరిమితికి మించి ఎక్కువ పెట్టుకున్నా.. అపరాధ రుసుము విధించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనివల్ల ఎక్కువ బిల్లులు రావడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. దీనిని గమనించిన అధికారులు.. పరిమితి పెంచి కెపాసిటర్ పెట్టుకున్నవారిని గుర్తించి మార్పిస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ

నగరంలో ప్రతి నెలా వాణిజ్య, పారిశ్రామిక కనెక్షన్లకు, అధిక విద్యుత్తు వినియోగించే సంస్థల బిల్లులు.. అధికారులే దగ్గరుండి నమోదు చేసి ఇస్తారు. ఎవరైనా కెపాసిటర్ పెట్టుకోకపోయినా, అదనపు కెపాసిటర్ పెట్టుకున్నా.. తగిన సూచనలు చేస్తున్నారు. భవిష్యత్తులో వచ్చే ఇబ్బందులను వివరిస్తున్నారు. సాధారణంగా కెపాసిటర్ సామర్థ్యం బట్టి రూ.500ల నుంచి రూ.10వేల వరకు ఉంటుంది. అదే పరిశ్రమలకు వినియోగించే ఆటోమేటిక్ కెపాసిటర్ అయితే రూ.30వేల నుంచి రూ.60వేల వరకు ఉంటుంది. ఈ ఖర్చు పెట్టుకుంటే.. బిల్లులు నియంత్రణలోనే ఉంటాయి. తడిచి మోపెడయ్యే పరిస్థితి రాదు. ఎవరికైనా ఈ అంశంలో సందేహాలుంటే.. వారు తమ ప్రాంత విద్యుత్తు ఏఈని సంప్రదించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

అపురూప నేస్తం.. ఆనంద పరవశం

జూనోసిస్ దినోత్సవం సందర్భంగా లబ్బీపేటలోని ఎన్టీఆర్ వెటర్నరీ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్‌లో ఆదివారం శునకాలకు రేబిస్ టీకాలు వేశారు. యజమానులు శునకాలను ద్విచక్రవాహనాలు, కార్లపై ఎక్కించుకుని తీసుకొచ్చారు. టీకాలు వేయడానికి వేచి ఉండడంతో ప్రాంగణం అంతా సందడి నెలకొంది. వివిధ జాతుల శునకాలను పలువురు ఆసక్తిగా తిలకించారు. అపురూపంగా పెంచుకునే శునకాలకు టీకాలు వేసేటప్పుడు వాటికి బాధ కలుగుతుందని కొంతమంది యజమానులు విలవిల్లాడడం గమనార్హం. - న్యూస్‌టుడే, విజయవాడ సిటీ

మేమూ వచ్చాం..

జర్మన్‌షెఫర్డ్‌తో యజమాని...

పిల్లిని తీసుకొస్తూ...

జనసంద్రం.. జగన్మాత క్షేత్రం

తొలి ఏకాదశి సందర్భంగా పోటెత్తిన భక్తులు

ఇంద్రకీలాద్రి: జగన్మాత కొలువైన ఇంద్రకీలాద్రికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడం, తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఆషాఢ సారె తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. దుర్గగుడి ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ మెట్ల మార్గం ఉదయం నుంచి భక్తుల వాహనాలతో కిటకిట లాడాయి. రికార్డుస్థాయిలో 80వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. ఉదయం నుంచి దేవస్థానంలో సేవా సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులు, అదనపు విధులు కేటాయించిన అధికారులు మధ్యాహ్నం మూడు గంటల వరకు భక్తులను నియంత్రించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వాహనాలు నిలిపేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

కనకదుర్గమ్మకు సారె సమర్పిస్తున్న మహిళలు

రూట్స్ హెల్త్ ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: గత 12 ఏళ్లుగా పేదలు, క్యాన్సర్ వ్యాధిగ్రస్థులకు రూట్స్ హెల్త్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని రాష్ట్ర మంత్రి ఎస్.సవిత అన్నారు. మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్లకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి మంత్రి సవిత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వైద్య రంగానికి ముఖ్యమంత్రి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు 'యోగాంధ్ర-2025' పేరుతో గిన్నిస్ రికార్డు నమోదయ్యేలా చేశారన్నారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రూట్స్ ఫౌండేషన్ సేవలు అద్వితీయమన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడారు. ఈ సందర్భంగా గుంటూరుకు చెందిన సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆర్. మురళి బాబూరావుకు జీవన సాఫల్య అవార్డు అందజేశారు. మరో ఆరుగురికి ఉత్తమ డాక్టర్ల అవార్డులతో సత్కరించారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడికి రూ.10 వేలను ఫౌండేషన్ నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో సినీహీరో సుమన్, రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఛైర్మన్ పోలవరపు విజయభాస్కర్, ఆంధ్రా హాస్పిటల్స్ ఎండీ రమణమూర్తి, డాక్టర్ సమరం, డాక్టర్ మురళీకృష్ణ, సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఎ.వై.రావు, ఎస్ఎల్‌వీ డెవలపర్స్ ఛైర్మన్ పి.శ్రీనివాసరాజు, నగరానికి చెందిన పలువురు వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి సవిత

డాక్టర్ మురళి బాబూరావుకు జీవన సాఫల్య అవార్డు అందజేస్తున్న సినీ నటులు సుమన్ తదితరులు

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక ఆదివారం విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కె.వినాయకం, గౌరవాధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా జి.ప్రభావతి, ఆర్థిక కార్యదర్శిగా కె.భానుప్రకాష్, సహాధ్యక్షుడిగా మోహన్, అదనపు కార్యదర్శిగా కె.శేషాద్రితో పాటు మరో 25 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

వినాయకం

ప్రభావతి

శాకంబరి ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఈనెల 8 నుంచి 10 వరకు నిర్వహించనున్న శాకంబరి ఉత్సవాలకు ఏర్పాట్లను ఆదివారం ముమ్మరం చేశారు. ఆలయప్రాంగణంలో కూరగాయలు, పండ్ల దండలు కట్టేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల ముడు రోజులకు 20టన్నుల కూరగాయలు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే దాతలు, రైతులు ఇచ్చిన కొన్ని కూరగాయల మూటలను తీసుకువచ్చి మల్లికార్జునమహామండపంలో ఉంచారు. వాటిని ఈవో శీనానాయక్ పరిశీలించారు. 7వ తేదీ రాత్రికి కూరగాయల దండలు కట్టేందుకు మూడు షిఫ్టుల్లో 300 మంది మహిళలను నియమించారు. నిమ్మ, టమాట, దోస, బెండ, వంకాయ, బంగాళదుంప, క్యారెట్ వంటి కూరగాయలతోపాటు ఆకుకూరలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ కూడా అమ్మవారి అలంకరణకు వినియోగిస్తారు.

దాతలు ఇచ్చిన కూరగాయలు పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

దుర్గగుడి మార్గంలో ఆటోల నిషేధం

విద్యాధరపురం: శాకంబరి ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 8, 9, 10 తేదీల్లో దుర్గగుడి మార్గంలో ఆటోలను నిషేధించినట్లు వన్ ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి గుడి సమీపంలోని కుమ్మరిపాలెం, సీతమ్మ వారి పాదాలు, గద్ద బొమ్మ సెంటర్ల నుంచి ఘాట్ రోడ్డు వైపునకు ప్రవేశం లేదన్నారు. మల్లికార్జున మహామండపం నుంచి కెనాల్ రోడ్డులో ఆటోలకు ప్రవేశం లేదని ఈవిషయాన్ని ఆటో డ్రైవర్లు గుర్తించి పోలీసులకు సహకరించాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తగ్గించండి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తగ్గించాలని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ కోరారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పంచాయతీ రాజ్ కార్యదర్శుల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మరింత జాప్యం చేయకుండా సత్వరమే వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. స్పెషల్ గ్రేడ్ పంచాయతీ అధికారులను.. పంచాయతీ కార్యదర్శుల నుంచే నియమించేలా చర్యలు తీసుకోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. రోజురోజుకూ పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు సమయపాలనలో మార్పులు చేయాలని, వీడియో కాలింగ్ చేస్తున్న విధానాన్ని తొలగించాలని కోరారు. గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వం ఇస్తున్న రూ.6వేల వేతనం చాలకపోవడంతో కార్యదర్శులు అదనంగా చెల్లించాల్సి వస్తోందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలన్నా.. రహదారుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నా.. దానికి అవసరమైన యంత్రాలు ఇవ్వాలని కోరారు. మొత్తం 6 గ్రేడ్లుగా ఉన్న పంచాయతీ కార్యదర్శులను మూడు గ్రేడ్లుగా చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.వి.డి.ప్రసాద్ మాట్లాడుతూ.. ఇటీవల పంచాయతీ కార్యదర్శుల పదోన్నతులు అవినీతిరహితంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. పంచాయతీ వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలు గ్రామాల అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. పని గంటల విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.వి.రమణ, పంచాయతీ కార్యదర్శులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.టి.వి.రమణ, ఉపాధ్యక్షుడు హేమంత్ కుమార్‌రెడ్డి, కోశాధికారి కె.వెంకటాద్రి, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విద్యాసాగర్. వేదికపై ప్రసాద్, రమణ, హేమంత్‌కుమార్‌రెడ్డి, వెంకటాద్రి తదితరులు

తిరుపతమ్మ దేవాలయంలో వైభవంగా పూజలు

శాకంబరిగా తిరుపతమ్మ, గోపయ్య స్వాములు

సీతారాముల ఉత్సవ మూర్తులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం తొలి ఏకాదశిని పురస్కరించుకొని పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవాలయంలో ఆదివారం శాకంబరి పూజలు వైవభంగా నిర్వహించారు. సుమారు 20 టన్నుల కూరగాయాలు, ఆకుకూరలు, ఫలాలతో తిరుపతమ్మ, గోపయ్య స్వాములతో పాటు, ఆలయంలో కొలువై ఉన్న గ్రామదేవతలు, సీతారాముల ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు.. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని రైతులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఉత్సవాల్లో ప్రత్యేకమైన కదంబ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ జె.శ్రీనివాసరావు, ఈవో కిశోర్‌కుమార్, ఈఈ రమాదేవి, ఏఈవో జంగం శ్రీనివాస్, ఏఈలు రాజు, అరవింద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాపు రిజర్వేషన్ల సాధనకు మరో ఉద్యమం

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: రాష్ట్రంలో అన్నివిధాలా వెనుకబడి ఉన్న కాపు కులస్థుల రిజర్వేషన్ల కోసం మరో ఉద్యమం చేపడుతున్నట్లు రాష్ట్ర కాపు ఐకాస అధ్యక్షుడు చందు జనార్దన్ తెలిపారు. కాపులు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్యాచరణ రూపొందించేందుకు ఐకాస ఆధ్వర్యంలో వివిధ కాపు సంఘాల నేతలు, రాధా, రంగా మిత్రమండలి నాయకులు, ఉద్యమకారులు విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చందు జనార్దన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో ఉన్న కాపులు విద్య, ఉపాధి, రాజకీయపరంగా పూర్తిగా వెనుకబడి ఉన్నారని వాపోయారు. కాపు, తెలగ, ఒంటరి కులాలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కృష్ణా జిల్లాకు దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని, కాపు కార్పొరేషన్‌కు ప్రతి సంవత్సరం రూ.3 వేల కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణ నుంచి ఏపీలో కలిసిన 7 ముంపు మండలాల్లోని మున్నూరు కాపుల సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై న్యాయపరమైన అంశాలను సమీక్షించడానికి సీనియర్ న్యాయవాదులతో సబ్ కమిటీ వేయాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐకాస నాయకులు ముత్యాల రాందాసు, ఆకుల శ్రీనివాస్, నెలిబండ్ల రాజు, కోటా శ్రీనివాస్, మార్కండేయులు, సుంకర సాంబశివరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చందు జనార్దన్. చిత్రంలో రాందాసు, శ్రీనివాస్, రాజు, సాంబశివరావు తదితరులు

13న నదీతీరంలో ఫ్లోర్ పెయింటింగ్ పోటీలు

భవానీపురం, న్యూస్‌టుడే: పర్యాటకులకు, సందర్శకులకు కొత్త అనుభూతులను పంచాలనే ఉద్దేశ్యంతో ఈనెల 13న భవానీపురంలోని హరిత బరంపార్కు వద్ద ఫ్లోర్ పెయింటింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. భవానీపురంలోని హరిత బరంపార్కు వద్ద యోగాంధ్ర కార్యక్రమం, పెయింటింగ్ పోటీలకు సంబంధించి గోడపత్రికను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీశ మాట్లాడుతూ కృష్ణానదీతీరంలో కళాత్మక సౌందర్యం, సామాజిక భాగస్వామ్యం పెంపొందించేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో పెయింటింగ్ పోటీలు ఉంటాయని వెల్లడించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047, పీ4 విధానం, సే నోటు సింగిల్ యూజ్ ప్లాస్టిక్, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర, సేవ్ వాటర్, రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్, హరితాంధ్ర అంశాలపై పోటీలు ఉంటాయని తెలిపారు. నగరవాసులు తమ కళాప్రతిభకు పదును పెట్టి ప్రజలను జాగృతం చేసేలా చిత్రాలను వేసి తీరానికి కొత్త శోభను తీసుకురావాలని కోరారు. విజేతలకు నగదు బహుమతులతో పోటు అవార్డులతో సత్కరించటం జరుగుతుందని వెల్లడించారు. చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. మరిన్ని వివరాలకు 7075196840లో సంప్రదించాలని కోరారు.

☛ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నది ఒడ్డున కలెక్టర్, అధికారులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏపనైనా చేయవచ్చని, నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. వీఎంసీ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా ఆయుష్ అధికారి రత్నప్రియదర్శిని, డీపీఎం కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

నదీతీరంలో అధికారుల యోగాసనాలు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 110, 118, 129 చికెన్ విత్ స్కిన్ - 210 చికెన్ స్కిన్‌లెస్ - 220.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 570 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

17న బీసీ సంక్షేమ సంఘం మహాసభ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఈ నెల 17న విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు తెలిపారు. ఆదివారం గవర్నర్‌పేటలోని సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సభకు కేంద్ర మంత్రులు రావు ఇంద్రజిత్‌సింగ్, రామ్మోహననాయుడు, నేషనల్ ఓబీసీ కమిషన్ ఛైర్మన్ హన్సరాజ్ గంగాణరామ్ అహీర్‌తో పాటు బీసీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నారని వివరించారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళల సబ్ కోటా తదితర అంశాలను సభలో చర్చిస్తామని చెప్పారు. సంఘీయులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎంతో వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఏపీలో 140 బీసీ కులాలు ఉంటే కనీసం 20 శాతం రిజర్వేషన్లు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో 34 శాతం ఉన్న బీసీ కోటాను 24 శాతానికి తగ్గించారని పేర్కొన్నారు. ఉద్యోగులకు పదోన్నతుల్లో క్రీమిలేయర్ విధానం ఇబ్బందికరంగా మారిందని, దీన్ని ఎత్తివేయాలని కోరారు. 42 శాతం రిజర్వేషన్లు, రక్షణకు ప్రత్యేక చట్టం రూపొందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సభ గోడ పత్రికలు ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ ఆవుల నరసింహారావు, ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్, యలమందరావు, నాగుల్‌మీరా, దివాకర్, నగర మహిళా అధ్యక్షురాలు గీతా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సభ గోడపత్రిక ఆవిష్కరిస్తున్న వెంగళరావు యాదవ్, నరసింహారావు, కృష్ణమోహన్, యలమందరావు, గీతాకృష్ణ తదితరులు

91.9 FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

FINANCIAL SERVICES

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలలోపు ఫైనాన్స్ చేయబడును. అన్ని తరగతుల వారు బ్యాంకులో స్థిరాస్థిపై లోన్ తీసుకున్న వారికి Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్‌లోన్ చేయబడును. ✆ 96665 47338.

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్సియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

MARRIAGE SERVICES

FUNCTION HALLS

Rs.300/- Per plate, A/c Function Hall for Marriages, Receptions, Engagement, Birthday Celebrations with capacity of 50 to 600 Nos. Hotel Kosala, Eluru Road, Governorpet, Vijayawada. Contact: 88855 32877, 88855 32655.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

REAL ESTATE

A.P. రాజధాని అమరావతిలో ల్యాండ్ పూలింగ్‌లో గజం 5000/-, కాజాలో గజం 10,000/-, అమరావతిలో గజం 7000/-, మంగళగిరిలో గజం 12000/- 96035 30555.

HOUSE FOR SALE

మచిలీపట్టణం- ఇంగ్లీష్ పాలెంలో ఇండిపెండెంట్ House అమ్మకానికి కలదు. కావలసిన వారు ఈ క్రింది నంబరుకు సంప్రదించగలరు. నో మీడియేటర్స్, డైరెక్ట్ కస్టమర్స్ ఓన్లీ ✆ 9346741252.

PLOT FOR SALE

CRDA అప్రూవల్‌తో లోబడ్జెట్‌లో Open Plots అమ్మకానికి కలవు. పరిటాల, కంకిపాడు, సూరంపల్లి, నూజివీడు, వీరవల్లి దగ్గర. స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 90309 56555.

JOBS

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. బో+వ+మంచి జీతం+ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

Wanted Lady Teachers LKG to 5th All Subjects & 6th to 10th : N.S, P.S, Hindi. ★ Ideal (EM) High School, Ratnamamba St., Mogalrajpuram. ✆ 95023 59059.

త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 85209 80099, 85208 74499.

రిలయన్స్ స్టోర్స్: విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం - ఏరియాలో పనిచేయుటకు అనుభవమున్న ఎలక్ట్రీషియన్స్ కావలెను. Q: I.T.I./ డిప్లొమా, ఎలక్ట్రికల్ మాత్రమే. ✆ 99495 51172, 98660 61501.

ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థకు ఫైనాన్షియల్ అడ్వైజర్‌గా/ బిజినెస్ పార్టనర్‌గా పార్ట్/ ఫుల్ టైం వర్క్ చేయుటకు స్త్రీ/పు అభ్యర్థులు కావలెను ✆ 62699 79999/ 90105 97707.

వర్క్ ఫ్రం హోమ్ డేటా ఎంట్రీ: ప్రముఖ ఔట్‌సోర్సింగ్ సంస్థ నందు ఇంటి వద్ద ఉండి పార్ట్/ ఫుల్ టైం ప్రాజెక్ట్ వర్క్ చేయుటకు Laptop/Desktop, స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు కావలెను. ✆ 87126 36572

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

తిరువూరు
• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? కోదూరు గ్రామంలోని కాలువల్లో నెలల తరబడి పూడిక తీయక మురుగు పేరుకుపోవడంతో దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నాం. -ఎం.శ్రీనివాసరావు, గ్రామస్థుడు
✔ సమస్య మా దృష్టికి వచ్చింది. తక్షణమే పారిశుద్ధ్య సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించి, బ్లీచింగ్ చల్లించి దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. -శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి.

స్పందనకు వందనం

వెల్లటూరు గ్రామంలో కృష్ణా వాటర్ ట్యాంకుల వద్ద ట్యాప్‌లు తుప్పు పట్టి పాడైపోయాయని స్థానికులు సమస్యను న్యూస్‌టుడే దృష్టికి తీసుకురాగా పంచాయతీ కార్యదర్శి ఈ విషయాన్ని వివరించారు. స్పందించారు. సిబ్బందిని పంపి కొత్త ట్యాప్‌లను ఏర్పాటు చేసి నీటి సరఫరా పునరుద్ధరించారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు
★ రాయనపాడు ఆశోక్‌నగర్‌లో తాగునీరు సక్రమంగా రావడం లేదని పంచాయతీ అధికారులకు తెలపగా సిబ్బందిని పంపి పరిష్కరించారు. ★ గొల్లపూడి శ్రీనివాసనగర్‌లో నివాసాల మధ్య చెత్త పేరుకుపోయిందని అధికారులకు వివరించగా చెత్తను తీయించారు. -గొల్లపూడి, న్యూస్‌టుడే. ★ కొండపల్లి గాయత్రీనగర్ కాలువలో చెత్త నిలిచిపోయిందని స్థానికులు తెలిపిన సమస్యపై పారిశుద్ధ్య అధికారులు స్పందించారు. ఆదివారం ఆ ప్రాంతంలో కాలువల్లో పూడికలు తీసి చెత్తను తొలగించారు. పారిశుద్ధ్య మేస్త్రీ శ్రీను పనులు పర్యవేక్షించారు. -న్యూస్‌టుడే, కొండపల్లి

135 మందికి వైద్య సేవలు

గొల్లపూడి, న్యూస్‌టుడే: హెల్ప్ హస్తం ఆధ్వర్యంలో గొల్లపూడి బొడ్డురాయి సెంటర్ వద్ద ఉన్న సామాజిక భవనంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 135 మందికి నరాలు, గుండె, గ్యాస్, నేత్ర సంబంధిత వ్యాధులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి యాంజియో గ్రాం ఉచితంగా చేస్తామని తెలిపారు.

ఆలయంలో భగవద్గీత పారాయణం

మైలవరం, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ద్వారకా తిరుమల దత్తత దేవాలయమైన స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళలు భగవద్గీత పారాయణం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనగా, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడి ఎన్నిక

మైలవరం, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ మండలశాఖ అధ్యక్షుడిగా చెన్నోజు సతీష్‌కుమార్‌ను ఆదివారం నిర్వహించిన మండల శాఖ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి షేక్ నవాబ్‌జానీ, సోలా రామచంద్రరాజు ప్రకటించారు. జిల్లాల ఉపాధ్యాయ విభజన చేసిన అధ్యక్షుడు పి.గోపాల్ స్థానంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పుల్లారెడ్డి, గోపాల్, వెంకటేష్, సూరిబాబు, జెడ్.నరసింహారెడ్డి, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు సారె సమర్పణ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం పురస్కరించుకుని రుద్రవరం గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారికి మహిళలు ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, సారె సమర్పించి.. ప్రసాదాలు నివేదించారు. పాల పొంగళ్లు, బోనాలతో ప్రదర్శనగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

సారెతో వస్తున్న మహిళలు

కూటమి చూపు.. సాంకేతికత వైపు

ఆర్పీలకు త్వరలో ట్యాబ్‌లు

కొండపల్లి, న్యూస్‌టుడే: మెప్మా పరిధిలోని డ్వాక్రా సంఘాల సభ్యులకు సేవలు వేగంగా అందాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం డిజిటల్ విధానానికి అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే ముందుగా రాష్ట్రంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వారీగా మహిళా సంఘాల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు స్లమ్ సమాఖ్య రిసోర్స్ పర్సన్లకు గెలాక్సీ ఎ9+5జీ ట్యాబులు ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే ఆయా పురపాలికల్లోని మెప్మా కార్యాలయాలకు వాటిని సరఫరా చేశారు.

సొంత చరవాణులతో ఇక్కట్లు

కొండపల్లి పురపాలికలో 1105 ఎస్‌హెచ్‌జీలు ఉండగా 35 మంది ఆర్పీలు ఉన్నారు. మెప్మా పరిధిలో స్లమ్ సమాఖ్య రిసోర్స్ పర్సన్లు మహిళల వివరాలను వారి చరవాణుల్లో ఆన్‌లైన్‌లో పొందుపరచడానికి, మెప్మాకు సంబంధించిన పలు రకాల యాప్‌లను చరవాణిలో డౌన్‌లోడ్ చేసుకుని వాటి ద్వారా మహిళల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అనుసంధానం చేస్తున్నారు. ఒక్కో సారి అవి సక్రమంగా పని చేయక ఇచ్చిన లక్ష్యాల మేరకు వివరాలను అనుసంధానం చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని గమనించిన ప్రభుత్వం అడుగు ముందుకు వేసింది. ● జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లోని ఆర్పీలకు, మెప్మా సిబ్బందికి ట్యాబులను అందజేయనుంది. ఇప్పటికే కార్పొరేషన్లలో వీటిని ఆర్పీలకు అందజేయగా.. త్వరలో మున్సిపాలిటీల్లో కూడా పంపిణీ చేయనున్నారు. ఒక్కో ట్యాబ్ విలువ రూ.31 వేల వరకు ఉంటుందని అంచనా.

ఆన్‌లైన్‌లో అనుసంధానం

కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత పథకాలు, మొబైల్ బుక్ కీపింగ్, ర్యాపిడో ఎలక్ట్రికల్ వాహనాలు, స్వయం ఉపాధి కింద వృత్తిగత, బృంద రుణాలు, అర్హత చేయూత, కొత్తగా స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు వివరాల ఉపయోగపడుతుంది. బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు, మహిళా సంఘాల సభ్యుల ముఖ ఆధారిత వివరాలు, ఓపెన్ నెట్‌వర్క్, పర్ డిజిటల్ కామర్స్ రుణాల వివరాలు, లావాదేవీలు, అప్పటికప్పుడు తీసుకునే నిర్ణయాలను అనుగుణంగా ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో అనుసంధానం చేస్తారు. - మెప్మా సిటీ మేనేజర్ శ్రీధర్

వెంకటాచలుడికి లక్ష విరజాజులతో అర్చన

తిరువూరు, న్యూస్‌టుడే: పాత తిరువూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటాచలస్వామి గుడిలో ఆదివారం రాత్రి అర్చకులు టీవీ కృష్ణమాచార్యులు, భక్తుల ఆధ్వర్యంలో లక్ష విరజాజి పూలతో అర్చన, విష్ణుసహస్రనామ పారాయణం ఆలాపన నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రజలు స్వామివారిని దర్శించుకున్నారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళి

గంపలగూడెం, న్యూస్‌టుడే: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం గంపలగూడెంలో భాజపా నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఎ.క్రాంతికుమార్, యుగంధర్, సూర్యప్రకాశ్, టీపీ.రామారావు, గోపాలకృష్ణ పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం భాజపా కార్యాలయంలో శ్యామాప్రసాద్ చిత్రపటానికి నాయకులు రమణారెడ్డి యుగంధర్, భవానీ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.

గంపలగూడెంలో నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

పొందుగలలో కరపత్రాలు అందిస్తున్న తెదేపా నాయకులు

శ్రీరాంపురంలో ఇంటింటా ప్రచారంలో...

మైలవరం, రెడ్డిగూడెం, గొల్లపూడి, గంపలగూడెం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కూటమి నాయకులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులపై తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో కూటమి నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలకు రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

గొల్లపూడి సూరాయిపాలెంలో...

ఊటుకూరులో..

పురపాలికను ప్రగతి పథంలో నడిపించాలి

కొండపల్లి, న్యూస్‌టుడే: పురపాలికను అభివృద్ధిలో నడిపించాలని కొండపల్లి ఛైర్మన్ చిట్టిబాబును చిన్ననాటి స్నేహితులు కోరారు. కొండపల్లి కాపురం శివారు జిల్లా పరిషత్ పాఠశాలలో 1984-85లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ బ్యాచ్‌కు చెందిన ఛైర్మన్ చిట్టిబాబును స్థానిక కల్యాణమండపంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ స్నేహితుడు పురపాలికకు మొట్టమొదటి ఛైర్మన్‌గా ఎన్నిక కావడం సంతోషకరమన్నారు. పాలక బోర్డు లేక నాలుగేళ్లుగా అభివృద్ధికి నోచుకోని పురపాలికను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పరచాలని కోరారు. అనంతరం ఛైర్మన్ చిట్టిబాబు మాట్లాడుతూ.. స్నేహితులకే కాకుండా పురప్రజలకు అందుబాటులో ఉంటానని, అభివృద్ధికి తన వంతు కృషి తప్పనిసరిగా ఉంటుందన్నారు.

ఛైర్మన్ చిట్టిబాబు దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఉచితంగా రేబిస్ టీకాలు

గొల్లపూడిలో కుక్కలకు టీకాలు వేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడి పశువైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం శునకాలు, పిల్లులకు ఉచిత రేబిస్ టీకాలు వేశారు. పశుసంవర్ధక శాఖ ఎన్టీఆర్ జిల్లా సంయుక్త సంచాలకులు హేమలతాదేవి, డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ సునంద తదితరులు పాల్గొన్నారు. మల్లేల, చింతలపాడు(తిరువూరు), న్యూస్‌టుడే: మండలంలోని మల్లేల, చింతలపాడు పశువైద్యశాలల్లో వైద్యాధికారులు డి.అభిలాష్, టి.శ్వేత ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేశారు. అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యజమానులకు సూచనలు చేశారు. వీఎల్వో ఎం.గోపాలకృష్ణ, వీఏఎన్ ఎన్.రాఘవరావు, సిబ్బంది సంధ్యారాణి, నాగేంద్రబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బోధనేతర పనులు మినహాయించాలి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.సాయి శ్రీనివాస్ అన్నారు. ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఇబ్రహీంపట్నంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు బోధనేతర వ్యవహారాలను మినహాయించి బోధన వరకే పరిమితి చేయాలన్నారు. అప్పుడే పాఠశాలల్లో మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు కనిపిస్తాయన్నారు. 12వ వేతన సవరణ కమిటీని నియమించి ఐఆర్‌ను ప్రకటించడంలో ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 62 సంవత్సరాల వయోపరిమితి పెంచి వారిని రెగ్యులర్ విధానంలో నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు విక్రమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుగ్రహప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మద్దులపర్వ గ్రామంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా దోమల నివారణ మందును ఆదివారం రాత్రి పిచికారీ చేయించారు. పీహెచ్‌సీ సిబ్బంది నాగేశ్వరరావు, ప్రతాప్, ఆశా కార్యకర్తలు పర్యవేక్షించారు.

ఎత్తిపోతలు.. ఉత్తిపోతలేనా

మండలంలోని గడ్డమణుగు శివారు మునగపాడు బైపాస్ రోడ్డు పక్కనే మోటరుగడ్డ సమీపంలో ఏర్పాటు చేసిన తారకరామ ఎత్తిపోతలు.. ఉత్తిపోతలగానే మిగిలింది. 2018 లో మునగపాడు గ్రామంలోని గ్రంధివాని చెరువుకు నీరు ఎత్తి పోసేందుకు పైపులైన్, మోటార్లు ఏర్పాటు చేసి షెడ్ నిర్మించారు. ఇది కాస్త గతేడాది వచ్చిన వరదల సమయంలో షెడ్ మొత్తం కొట్టుకుపోయి పైపులైన్, మోటార్లు మాత్రమే మిగిలి ఉండి దుస్థితికి చేరింది. ఈ ఘటన జరిగి దాదాపు సంవత్సరం కావస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. తక్షణమే నీటి సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

పంచాయతీలో పాతుకుపోయారు...

ప్రభుత్వ కార్యాలయాల్లో ఐదేళ్లుగా పని చేస్తున్న ఉద్యోగులు ఎవరినైనా బదిలీ చేయాల్సిందే, ఎంతటివారైనా తప్పనిసరిగా వేరొక ప్రాంతానికి పంపాల్సిందే అంటూ కొన్నాళ్ల కిందట ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ...గొల్లపూడి గ్రామ పంచాయతీలో పని చేసే ఉద్యోగులకు మాత్రం ఆ ఉత్తర్వులు వర్తించని పరిస్థితి నెలకొంది. ఒకటి కాదు రెండు కాదు పదేళ్లు పైగానే గొల్లపూడి గ్రామ పంచాయతీలోనే వారు విధులు నిర్వర్తిస్తున్నారు. గొల్లపూడి పంచాయతీలో పని చేస్తున్న ఉద్యోగికి చందర్లపాడుకు బదిలీ చేస్తూ జూన్ 9న డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులు వచ్చి 20 రోజులు దాటుతున్నా కూడా సదరు ఉద్యోగి అక్కడకు వెళ్లి జాయిన్ కాలేదు. ఇక్కడి నుంచి రిలీవ్ అవ్వలేదు. ఆ ఉద్యోగిని గొల్లపూడిలోనే ఉంచేలా కొందరు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రికార్డులు సరిగా నిర్వహించడం లేదనే కారణంతో అప్పటి అధికారులు కొన్ని రోజుల పాటు ఆ ఉద్యోగిని సస్పెండ్ కూడా చేశారు. ఆ తర్వాత అప్పటి ప్రజాప్రతినిధుల సహకారంతో తిరిగి విధుల్లో చేరారు. అలాగే మరో పదవిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగి కూడా పదేళ్లుగా పంచాయతీలోనే పని చేస్తున్నాడు. ఎనికేపాడుకు కొన్నాళ్ల కిందట బదిలీ చేసినా అక్కడకు వెళ్లి చేరకుండా గొల్లపూడిలోనే ఉంటున్నారు. ఈ విషయమై డీపీవో లావణ్యకుమారిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా ఐదేళ్లు దాటి పని చేసే ఉద్యోగులు బదిలీపై వెళ్లాల్సిందేనని పేర్కొన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.
- న్యూస్‌టుడే, గొల్లపూడి

గొల్లపూడి పంచాయతీ కార్యాలయం...

అందుబాటులోకి తెస్తే.. ఆరోగ్యమే

వాకింగ్ ట్రాక్‌లో పెరిగిన కంప చెట్లు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే వాకింగ్ చేయాలని వైద్యులు సూచిస్తుంటారు. అయితే అందుకు తగ్గట్టుగా కొండపల్లిలో సౌకర్యమైన స్థలం లేకుండా పోయింది. ఈ విషయాన్ని గతంలో ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ దృష్టికి పురవాసులు తీసుకెళ్లడంతో గజరాజు చెరువు ప్రాంతంలో ఒక ట్రాక్‌ను సిద్ధం చేయించారు. కొంతకాలం దాన్ని స్థానికులు ఉపయోగించుకున్నారు. కొద్దికాలానికి వర్షాలు పడడంతో ట్రాక్ పరిసరాల్లో పిచ్చిచెట్లు దట్టంగా పెరిగిపోయాయి. అయితే పురపాలిక అధికారులు, సిబ్బంది దానిపై దృష్టి సారించకపోవడంతో వాకింగ్ ట్రాక్ మరుగున పడిపోయింది. దీనిపై కొత్తగా ఎన్నికైన ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు దృష్టి సారించి తిరిగి వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పుర వాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కొండపల్లి

పాలసంఘం ఎన్నికల బహిష్కరణ

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘంలో ఖాళీగా ఉన్న సభ్యుల స్థానాలకు నిర్వహిస్తున్న ఎన్నికలను తెదేపా బహిష్కరిస్తున్నట్లు ఏఎంసీ మాజీ ఛైర్మన్ వజ్రాల కుమార్‌రెడ్డి ప్రకటించారు. నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నదని, ఎన్నికల విషయంలో ఎన్నికల అధికారి ఎం.వెంకటేశ్వరరావు బైలాకు విరుద్ధంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నందున, వైకాపాతో కుమ్మక్కవడంతోనే తాము ఎన్నికలను బహిష్కరిస్తున్నామని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ గడువు కుదించారని, ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా ఎన్నికల అధికారిని నియమించారని, జూన్ నిర్వహించాల్సిన ఎన్నికను బైలా నిబంధనలకు విరుద్ధంగా, జిల్లా సంఘం అనుమతి లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వాస్తవానికి గత నెలలో ఖాళీగా ఉన్న సభ్యుల నియామకానికి సమావేశం ద్వారా ఎన్నిక నిర్వహించాలని భావించగా, రెండు వర్గాల ఆందోళనతో వాయిదా వేశారు. మరోసారి ఎన్నికకు నోటీసు ఇవ్వగా, పోలీసులు రక్షణ కల్పించలేమని చెప్పారంటూ రెండో పర్యాయం వాయిదా వేయడంతో, ఈసారి ఏకంగా కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియకు శ్రీకారం చుట్టగా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ అధికార తెదేపా బహిష్కరణతో ఏ మలుపులు తిరుగుతుందోనన్న ఆసక్తి నెలకొంది.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

మైలవరం, న్యూస్‌టుడే: అప్పుల బాధతో ఓ రైతు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని చంద్రగూడెంలో చోటు చేసుకుంది. ఎస్సై కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గనిపిశెట్టి వేణుగోపాల్(42) శుక్రవారం పొలం పనికి వెళ్లి కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే విజయవాడకు తీసుకెళ్లగా..అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఆదివారం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. వ్యవసాయం కలిసి రాక అప్పుల బాధతోనే తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని వేణుగోపాల్ భార్య ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారని వెల్లడించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

దేశాభివృద్ధికి జగ్జీవన్‌రామ్ కృషి

మైలవరంలో నివాళులు అర్పిస్తున్న తెదేపా నాయకులు

తిరువూరులో....

న్యూస్‌టుడే, బృందం: తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. దేశాభివృద్ధిలో ఆయన చేసిన కృషిని కూటమి, వైకాపాతో పాటు పలు పార్టీల నాయకులు స్మరించుకుంటూ ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ★ దేశానికి జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి మాజీ మంత్రి దేవినేని ఉమా పేర్కొన్నారు. గొల్లపూడిలోని కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు.

వైకాపా విస్తృత స్థాయి సమావేశం

మాట్లాడుతున్న వేణుగోపాలరెడ్డి, పక్కన స్వామిదాసు

తిరువూరు, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపురం కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాసు అధ్యక్షతన నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చంద్రబాబు సూపర్- 6 హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వైకాపాను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని సూచించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ ఎన్.సుధారాణి, మోదుగుల వేణుగోపాలరెడ్డి, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో తొలిఏకాదశి సందడి

అనుముల్లంకలో సీతారామచంద్రస్వామి

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని వైష్ణవాలయాల్లో ఆదివారం ఏకాదశి పర్వదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరువూరు, పెనుగొలను, అనుముల్లంక, ఊటుకూరు, గంపలగూడెం, గోసవీడు, వినగడప, మెట్టగుట్ట ఆలయాల్లో భక్తులు హరేరామ నామ సంకీర్తన, విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు.
రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గ్రామాల్లో తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గ్రామాల్లోని దేవాలయాల్లో భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వినగడపలో పంచముఖ ఆంజనేయస్వామి

రెడ్డిగూడెం శ్రీరాజగోపాలస్వామి దేవాలయంలో..

పూజలందుకున్న నెమలి కృష్ణుడు

నెమలి (గంపలగూడెం), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన నెమలిలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి పర్వదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకులు తిరునఘరి గోపాలాచార్యుల ఆధ్వర్యంలో స్వామి మూలవిరాట్‌ను పంచామృతాభిషేకాలు నిర్వహించి సువర్ణాభరణాలతో అలంకరించారు. అధికారులు, పాలకవర్గం పర్యవేక్షణలో ఏకాహ దీక్షతో హరే నామ సంకీర్తన ప్రారంభించారు. భక్తులకు పేలాల పిండితో పాటు పలు రకాల ప్రసాదాలు పంపిణీ చేశారు.

తట్ట మట్టి వేయక.. తంటాలు చూడక..!

గత ఐదేళ్ల నిర్లక్ష్యం నేడు శాపంగా మారిందంటున్న ప్రజలు

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని ప్రధాన రహదారులు మోకాళ్ల లోతు గుంతలతో అధ్వానంగా మారి ప్రయాణికులకు ప్రత్యక్ష నరకం చూపిస్తున్నాయి. గత ఐదేళ్ల పాలనలో గుంతల్లో తట్ట మట్టి కూడా వేయకపోవడంతో నేడు తంటాలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రహదార్ల అభివృద్ధిపై దృష్టి సారించి తమ అవస్థలు తొలగించాలని కోరుతున్నారు.

గడ్డమణుగు సమీపంలో గుంతలు తేలి ఇలా..

బిల్లుల జాప్యంతో..: గత ఐదేళ్లలో జి.కొండూరు నుంచి గంగినేని గ్రామం వరకు 15 కిలోమీటర్ల మేర రహదారి గుంతలు ఏర్పడి ప్రయాణానికి వాహనచోదకులు నానాతంటాలు పడ్డారు. ఈ క్రమంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గతంలో మంజూరైన న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు నిధులు రూ.34 కోట్లతో రహదారి అభివృద్ధి పనులు ప్రారంభించింది. గంగినేని వైపు నుంచి రహదారి పనులు మొదలుపెట్టి గ్రామాల్లో సీసీరోడ్డు, గ్రామం వెలుపల బీటీ రహదారిగా చెరువుమాధవరం గ్రామం వరకు పూర్తి చేశారు. కాని జి.కొండూరులోని గెయిల్ గ్యాస్ కంపెనీ నుంచి చెరువుమాధవరం వరకు దాదాపు 3 కిలోమీటర్ల మేర అధ్వానంగా తయారైనా బిల్లులు చెల్లింపులో జాప్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి.

5 కి.మీ మేర అవస్థలే: విజయవాడ -విస్సన్నపేట ప్రధాన రహదారిలో భాగంగా ఉన్న మండలంలోని వెల్లటూరు కందులపాడు గ్రామాల మధ్య దాదాపు 5 కిలోమీటర్ల మేర రహదారి గుంతలు ఏర్పడి దారుణంగా తయారైంది. నిత్యం ఈ రహదారి నుంచే నియోజకవర్గంలోని ప్రజలు విజయవాడకు చేరుకుంటారు. గత వైకాపా పాలనలో ఈ రహదారి అభివృద్ధిని విస్మరించడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. చినుకు పడితే చాలు వాటిల్లో నీరు నిలిచి వాహనచోదకులు నరకయాతన పడుతున్నారు. రహదారి విషయమై సహాయక ఇంజినీర్‌ను న్యూస్‌టుడే వివరణ కోరగా త్వరలోనే రహదారి అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

వెల్లటూరులో చెరువును తలపిస్తూ..

18వ వార్షికోత్సవం
LATA HOSPITAL
MATERNITY & GENERAL HOSPITAL

Dr. K.LATA M.B.B.S., DGO
Dr. M.RAVINDRANATH M.B.B.S., M.D., FCCP
Dr. Prof. P.ANIL KUMAR D.Ch. DNB (Paed)
సభాపతిరోడ్, అలంకార్ బేకరి వెనుక భవానీపురం, విజయవాడ-12.
95737 44545
0866-2414545

(c) eenadu

విజయవాడ తూర్పు

కార్పొరేషన్లో నేడు వినతుల స్వీకరణ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతోపాటు మూడు సర్కిళ్లలోనూ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమం ద్వారా నగర ప్రజలు సమస్యలు, మౌలిక వసతుల కల్పనలో ఇబ్బందులను వినతుల రూపంలో అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని కమిషనర్ సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

స్పందనకు వందనం

- మూడో డివిజన్ గుణదల సెంటర్‌లో భూగర్భ డ్రెయినేజీ మ్యాన్‌హోల్ పొంగుతోందని స్థానికులు శ్రీనివాసరావు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా ఏఈ దీక్షితులు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పూడిక తీయించారు.
- 5వ డివిజన్ క్రీస్తురాజపురం ఫిలిం కాలనీ మూడో రోడ్డు ఎదురుగా వ్యర్థాలు పేరుకుపోయాయని స్థానికులు నాగేంద్రప్రసాద్ శానిటరీ అధికారి కేవీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చెత్త ఎత్తి వేయించారు.
- ఆటోనగర్ ఎదురుగా ఎలక్ట్రిసిటీ కాలనీలో 13-57/102 విద్యుత్తు స్తంభానికున్న దీపం గత కొంత కాలంగా వెలగడం లేదని స్థానికులు దుర్గా ప్రసాద్ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. **- న్యూస్‌టుడే, కరెన్సీనగర్**

కళ తప్పిన వర్టికల్ గార్డెన్

వైకాపా పాలకులు పట్టించుకోని ఫలితం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

పిల్లర్లకు అమర్చిన మొక్కల కుండీలు పాడైపోయాయిలా..

వైకాపా పాలకుల నిర్లక్ష్యం..నిర్వహణ లోపం కారణంగా నగరంలో ప్రప్రథమంగా అభివృద్ధి చేసిన వర్టికల్ గార్డెన్ నేడు కళ తప్పింది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో 65వ జాతీయ రహదారి వెంట కృష్ణానది సమీపంలో దీన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పాడైపోయిన గార్డెన్‌ను పునర్నిర్మించేందుకు పాలకులు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉండగా కృష్ణానదిలో ఎఫ్-1, హెచ్-2వో క్రీడాపోటీలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా కనకదుర్గ పైవంతెన కింద విశాలమైన స్థలం ఆక్రమణలకు గురికాకుండా వర్టికల్ గార్డెన్‌ను అభివృద్ధి చేసేందుకు రూ.12.30 కోట్లతో అంచనాలు రూపొందించారు. అందులో రూ.9 కోట్లు ఖర్చు చేసి, మెజారిటీ పనులు పూర్తిచేశారు. సుందరంగా తీర్చిదిద్దారు. ఫలితంగా అప్పట్లో ఇది సందర్శకులు, చిన్నారులను బాగా ఆకర్షించింది. ఆదివారం, సెలవు దినాల్లో వందల సంఖ్యలో సందర్శకులు వచ్చేవారు. ఆతరువాత ప్రభుత్వం మారిపోవడంతో గార్డెన్ నిర్వహణ గాడి తప్పింది.

నిర్వహణ విస్మరించి.. గార్డెన్‌కు అనుబంధంగా పైవంతెన పిల్లర్లకు అమర్చిన కుండీలు, మొక్కలు పాడైపోయిన పక్షంలో తిరిగి అమర్చడం, నీరు పెట్టడం వంటి నిర్వహణ బాధ్యతలను అప్పట్లో గుత్తేదారుకు తెదేపా ప్రభుత్వం అప్పగించింది. రెండేళ్లు పూర్తయ్యాక గుత్తేదారు నిర్వహణ వదిలేశారు. దీనిపై విమర్శలు రావడంతో కొంతకాలం కార్పొరేషన్ సిబ్బంది ద్వారా గార్డెన్ నిర్వహించి ఆపై విస్మరించారు. ఫలితంగా మొక్కలు ఎండిపోయాయి. కుండీలు దాదాపుగా పాడైపోయాయి. వాటి స్థానే కొత్తవి అమర్చాల్సి ఉన్నా, శ్రద్ధ చూపలేదు.

వైకాపా వదిలేసింది..: జాతీయ రహదారికి అనుబంధంగా అభివృద్ధి చేసిన వర్టికల్ గార్డెన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల్లో దాదాపు రూ.3.50 కోట్లు మిగలగా..వైకాపా పాలకులు ఆ నిధులను దారి మళ్లించారు. ఇక్కడ గుర్తించిన 15 ప్రాంతాల్లో సెల్ఫీ పాయింట్లను సుందరంగా తీర్చిదిద్దాలి. ఓపెన్ జిమ్, ఆర్ట్ గ్యాలరీ, స్కేటింగ్ రింక్, విద్యుద్దీపాలు, ఫుడ్‌ప్లాజా, రాక్, విద్యుత్తు, మ్యూజికల్ ఫౌంటెయిన్లను పూర్తి చేయకుండా నిలిపేశారు. నిర్వహణ పట్టించుకోలేదు. దీంతో వర్టికల్ గార్డెన్ పాడైపోయింది.

శునకాలకు క్రమతప్పక టీకాలు వేయించాలి

టీకా వేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పక్కన రాజశేఖర్, ప్రేమ్‌చంద్ తదితరులు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్న శునకాల వల్ల వ్యాధులు రాకుండా ఉండాలంటే వాటికి క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. జునోసిస్ దినం సందర్భంగా ఎంజీరోడ్డులోని ఎన్టీఆర్ వెటర్నరీ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్‌లో శునకాలకు రేబిస్ నివారణ టీకాల అందజేతను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ ఏటా పెద్ద సంఖ్యలో ప్రజలు కుక్కకాటుకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పశుసంవర్ధక శాఖ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ టి.దామోదరనాయుడు మాట్లాడుతూ టీకాలు వేయించడం ద్వారా ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ సంయుక్త సంచాలకులు డాక్టర్ ప్రేమ్‌చంద్, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ హనుమంతరావు, సహాయ సంచాలకులు డాక్టర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక ఆవిష్కరణలతో మెరుగైన చికిత్స

సావనీర్ విడుదల చేస్తున్న చిన్నపిల్లల వైద్యులు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: నూతన ఆవిష్కరణలతో మెరుగైన చికిత్స అందించే అవకాశాలు, నైపుణ్యాలను యువ వైద్యులు అందిపుచ్చుకోవాలని రెయిన్‌బో హాస్పిటల్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ రామ్‌ప్రసాద్ సూచించారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, నేషనల్ నియోనేటాలజీ ఫోరం సహకారంతో విజయవాడ రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నేప్-2025 పేరుతో నిరంతర వైద్య విద్య (సిఎంఈ)సదస్సు స్థానిక నోవాటెల్ హోటల్‌లో ఆదివారం జరిగింది. నవజాత శిశువులు, చిన్న పిల్లలకు సంబంధించి అనేక నూతన చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయని రామ్‌ప్రసాద్ తెలిపారు. సైంటిఫిక్ సెషన్‌లో శిశువుల్లో వ్యాధి నిర్ధారణ, ఆధునిక చికిత్సా విధానాలు, పలు ప్రత్యేక శస్త్రచికిత్సలపై పలువురు చిన్నపిల్లల వైద్యులు దృశ్యమాధ్యమంలో వివరించారు. వైద్యుల సూచనలు, సలహాలను వివరించే సావనీర్‌ను వైద్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెయిన్‌బో ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ రమేష్ కంచర్ల, డాక్టర్ దినేష్‌కుమార్, డాక్టర్ వి.ప్రసాద్ మాట్లాడారు. దాదాపు 400 మంది చిన్నపిల్లల వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. హాజరైన వారికి 2 క్రెడిట్ అవర్స్ ఇచ్చారు. సదస్సులో వైద్యులు బి.ఎస్.సి.సి.రాజు, శ్రీధర్, వంశీ శివరామరాజు, వీణ అక్కినేని, శ్రీకాంత్ దోమల, శివసత్య కొర్రపాటి, టి.రమేష్‌కుమార్, హేమకుమార్, బ్రజేష్నా, జి.పూజ, బి.పవన్ కుమార్, వైభవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్ టోర్నీ

విజేతలతో సెంట్రల్ ఏసీపీ దామోదర్, చిత్రంలో ఖాశీం తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక నలంద విద్యానికేతన్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నీలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 450 మంది ఉత్సాహంగా తలపడ్డారు. వివిధ కేటగిరీల్లో జరిగిన పోటీలో తొలి అయిదు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ముగింపు కార్యక్రమానికి ఏసీపీ (సెంట్రల్) కె.దామోదర్ హాజరై విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు బహూకరించారు. గ్లోబల్ చెస్ అకాడమీ డైరెక్టర్ ఎస్‌కే ఖాశీం, ది విజయవాడ చెస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అక్బర్ పాషా, ఎం.రాజీవ్ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పించిన నాయకులు

సామాజిక పరివర్తనకు జగ్జీవన్‌రామ్ కృషి

ఆటోనగర్, న్యూస్‌టుడే: సామాజిక పరివర్తన కోసం బాబు జగ్జీవన్‌రామ్ నిత్యం కృషి చేశారని తెదేపా రాష్ట్ర కార్యదర్శి సింహాద్రి కనకాచారి అన్నారు. ఆదివారం ఆటోనగర్‌లోని తెదేపా జిల్లా కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ వర్ధంతి నిర్వహించారు. తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కనకాచారి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, నాయకులు ఎస్‌ఎం షైజాన్, బొల్లా వెంకటేశ్వరరావుగౌడ్, పామర్తి కిషోర్‌బాబు, బత్తుల దుర్గారావు, మల్లెల రామకృష్ణ, జాస్తి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండండి

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పటమట, న్యూస్‌టుడే: పిల్లల ఆరోగ్యాన్ని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ సూచించారు. ఆదివారం అశోక్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన చిన్న పిల్లల ఉచిత వైద్య శిబిరాన్ని గద్దె అనురాధ, క్రాంతికుమార్ ప్రారంభించారు. చిన్నారులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధుల సమయమని, చిన్నపిల్లల తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యులు గౌతమి, అడుసుమిల్లి రాజేష్, శ్రీగిరి, కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, నాయకులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్ష

నమూనా ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి దడాల శేషయ్య, పాపారావు తదితరులు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను జమ్మిచెట్టు కూడలిలోని మోడరన్ అకాడమీలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి దడాల శేషయ్య హాజరై మోడల్ పరీక్ష ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు పరీక్ష ఎలా రాయాలి. ఎలా చదవాలి అనే అంశాలను న్యాయమూర్తి వివరించారు. కార్యక్రమంలో బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాషా, మోడరన్ అకాడమీ ఛైర్మన్ సుంకర పాపారావు, ఐలు జిల్లా గౌరవాధ్యక్షుడు ఆలూరి సుధాకరరావు, ప్రధాన కార్యదర్శి సంపర దుర్గా శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు సి.వి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, పరీక్ష సమన్వయకర్తలు ఎఎస్ శ్యామ్‌సుందర్, అల్లం పద్మనాభం పాల్గొన్నారు.

కారుపై విరిగి పడిన కొమ్మ

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : బెంజిసర్కిల్ సమీపంలో జ్యోతి కన్వెన్షన్ సమీపంలో భారీ చెట్టు ఉంది. దానికి సంబంధించిన ఒక కొమ్మ ఆదివారం ఉదయం విరిగి అక్కడ నిలిపిన కారుపై పడింది. దీంతో కారు దెబ్బతింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: గుణదల సబ్‌స్టేషన్ పరిధిలో తీగల మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రభావంతో కనకదుర్గనగర్, కామినేనినగర్, శ్రీగణేష్ నగర్, శ్రీరామచంద్రనగర్ పరిసర ప్రాంతాల్లో కరెంటు ఉండదని వెల్లడించారు.

సమ్మె గోడపత్రికల ఆవిష్కరణ

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఈనెల 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెకు భవన నిర్మాణ కార్మికులంతా సిద్ధం కావాలని సీఐటీయూ నగర నాయకులు వి.బి.రాజు అన్నారు. మహానాడు రోడ్డులోని భవన నిర్మాణ కార్మికుల కార్యాలయంలో సమ్మె గోడపత్రికలను ఆదివారం ఆవిష్కరించారు. రాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 4 లేబర్ కోడ్లు తీసుకొచ్చి సంక్షేమ బోర్డును ప్రమాదంలో పడేసే ధోరణిలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అప్పన్న, జి.రమణమూర్తి, ఎల్.వి.రాజు, జి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో సంక్షేమ పథకాల విప్లవం

కరపత్రం అందజేస్తున్న గద్దె రామ్మోహన్ తదితరులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సంక్షేమ పథకాల విప్లవం మొదలైందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నాలుగో డివిజన్ వెటర్నరీ కాలనీ, బ్యాంకు కాలనీలోని 72వ బూత్ పరిధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గద్దె మాట్లాడుతూ ఎన్నికల ముందు చెప్పినట్లు పింఛను పెంపు, తల్లికి వందనం, మూడు గ్యాస్ సిలిండర్ల పథకాలు అమలయ్యాయన్నారు. వచ్చే నెల 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జాస్తి సాంబశివరావు, గుళ్లపల్లి నాగేశ్వరరావు, వడ్లపట్ల గోపాలకృష్ణ, చలసాని సుబ్బారావు, కొసరాజు రవి, కొర్రపాటి సురేంద్ర, చలసాని రోజా, రాజామణి తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ సేవలో డీజీపీ

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఆటోనగర్‌కు నీటి సరఫరాపై ఆశలు

ఆటోనగర్, న్యూస్‌టుడే

పూర్తి చేసిన నీటి ట్యాంకు

ఆటోనగర్ కార్మికులకు తాగునీటి సదుపాయం ఎండమావిగానే మారుతోంది. రూ.కోట్లు ఖర్చు చేసి ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా తాగునీటి సమస్య పరిష్కారం కావడం లేదు. ఎన్నికల ముందు వైకాపా నేతలు హడావుడిగా వాటరు ట్యాంకు ప్రారంభించారు. 16 నెలలు దాటినా ఇప్పటికీ తాగునీరు అందించలేదు. కూటమి ప్రభుత్వ నేతలు దాహం తీర్చే ప్రయత్నాలు చేస్తుండడంతో కార్మికులు వారిపై ఆశలు పెట్టుకున్నారు. ఆటోనగర్ కార్మికులకు తాగునీరు అందించేందుకు 12 ఏళ్ల కిందట ఆటోక్లస్టర్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాయి. దీంతో గంగిరెద్దుల దిబ్బ వాటర్ ప్లాంట్ నుంచి ఇక్కడకు పైపులైన్ ద్వారా నీటిని తీసుకొచ్చి అందించేలా మొత్తం 24 కిలోమీటర్ల మేర పైపులు వేశారు. కుళాయిలకు కావాల్సిన వాల్వ్ తదితర అన్ని పనులు పూర్తి చేశారు. దీనికి సుమారు రూ.3.2 కోట్లను గుత్తేదారు సంస్థకు చెల్లించారు. కొన్ని నెలలు కార్పొరేషన్ నుంచి ఆటోనగర్‌కు నీరు సరఫరా చేశారు. కానీ బిల్లుల చెల్లింపులో కార్పొరేషన్ రకరకాల ప్రతిపాదనలు పెట్టడంతో విసిగిపోయిన ఆటోక్లస్టర్ పాలకవర్గం మిన్నకుండిపోవడంతో అప్పటి నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది.

రూ.3.32 కోట్లతో ట్యాంకు నిర్మాణం..: కార్పొరేషన్‌తో సంబంధం లేకుండా బోరు నీటిని ట్యాంకుకు ఎక్కించి దాని ద్వారా ఆటోనగర్ కార్మికులకు నీరివ్వాలని 2022లో మరో పథకం ద్వారా రూ.3.32 కోట్ల ఖర్చు చేసి 6 లక్షల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంకుతోపాటు ఆర్వో ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. పదేళ్ల కిందట భూమిలో వేసిన పైపులైన్ల పరిస్థితిపై అంచనా లేకుండా ట్యాంకు నిర్మాణం చేపట్టారు. ఇప్పుడు చాలా ప్రాంతాల్లో పైపులైన్ వాల్వ్ కనపడట్లేదు. దీనికితోడు ఆటోనగర్‌లో భూగర్భ జలాలు కలుషితమయ్యాయని, వాటిని తమకు తాగునీరు కింద ఎలా ఇస్తారంటూ కొంత మంది యూనియన్ నేతలు ప్రశ్నిస్తున్నారు.

త్వరలో ఆటోనగర్‌కు నీరిస్తాం..

ఆటోనగర్‌లో భూగర్భ నీరు తాగేందుకు వీలు పడదని కార్మికులు మా దృష్టికి తెచ్చారు. దీనిపై ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి వాటర్ ట్యాంకు పరిశీలించాం. ఎంపీ నిధుల నుంచి శివనాథ్ రూ.కోటి ఇస్తామన్నారు. వాటితో వాటర్ ట్యాంకుకు కార్పొరేషన్ నీరు సరఫరా చేసేలా పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నాం. దీనిపై ఇప్పటికే కలెక్టర్ ద్వారా వీఎంసీ అధికారులకు ఉత్తర్వులు వెళ్లాయి. ఆటోనగర్ కార్మికులకు త్వరలోనే కార్పొరేషన్ నుంచి నీరు అందజేస్తాం.

- గద్దె రామ్మోహన్, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే

మొక్కుబడి పనులు.. రాకపోకలకు అవస్థలు

రహదారిపై గుంతలు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : పీవీపీ మాల్ రోడ్డు నుంచి ఉడ్‌పేట, శిఖామణి సెంటర్‌కు వెళ్లే రహదారిలో తాగునీటి కుళాయి కనెక్షన్ల కోసం రహదారిని తవ్వారు. పైపులైన్లు వేశాక మొక్కుబడిగా పూడ్చారు. దీంతో ఆప్రాంతంలో గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నామని వాహనదారులు చెబుతున్నారు. సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్తు తీగలతో బెంబేలు

హైటెన్షన్ రోడ్డులో ఇలా

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీ హైటెన్షన్ రోడ్డులో ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు దడ పుట్టిస్తున్నాయి. గతంలో స్తంభాలు ఏర్పాటు చేయగా, రోడ్డు విస్తరణలో వాటిని తొలగించారు. అప్పటి నుంచి తీగలను అలాగే వదిలేశారు. ఫుట్‌పాత్ ప్రాంతంలో ఉండడంతో తరచూ వాహనాలు తీగలపైనుంచి వెళ్లడంతో నుజ్జుగా మారాయి. వాటి నుంచి విద్యుత్తు సరఫరా అవుతుందేమోనని స్థానికులు బెంబేలెత్తుతున్నారు. ఇలాంటి వాటికి రక్షణగా గతంలో ప్లాస్టిక్ డబ్బాలు ఏర్పాటు చేశారు.

వాల్వ్ లేక.. ఇక్కట్లు తీరక..

తాగునీటి వాల్వ్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతమిదే..

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీ వాటర్ ట్యాంకు రోడ్డులో తాగునీటి పైపులకు అమర్చే యంత్రం ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం జలాలు వృథాగా పోతున్నాయి. ఏడాది కాలంగా పైపులకు వాల్వ్‌ను అమర్చ లేదు. ఇటీవల వాటర్ ట్యాంకు రోడ్డును సీసీ రహదారిగా మార్చాలని కార్పొరేషన్ యోచించి నిర్మించారు. ఈ ప్రాంతంలో మాత్రం తారు వేసి వదిలేశారు. కాలనీలో తిరిగే వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

ధర వరలు

వంకాయలు-28, టమాటా-35, బెండ-24, పచ్చిమిర్చి-42, కాకర-42, బీర-26/36, క్యాబేజీ-22, క్యారెట్-32/42, దొండ-32, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-26, గోరు చిక్కుళ్లు-34, దోస-18, సొర-10, పొట్ల-20/25, అరటికాయ-8/7, చామదుంప-28, అల్లం-60, మునగ-10/12, ఆకు కూరలు (కట్ట)-3, కంద-58, బీట్ రూట్-32, కీరదోస-40, బీన్స్-84, క్యాప్సికమ్-82, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-7/14, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-12/10, జాలం మామిడి-20/25 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి.

- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

10న గురుపౌర్ణమి వేడుకలు

విజయవాడ సిటీ: లబ్బీపేటలోని శిర్డీ సాయిబాబా మందిరంలో ఈనెల 10న గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు పరాశరం రవికుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయిబాబా, దత్తాత్రేయ స్వామి వారికి వివిధ రకాల పుష్పాలతో అలంకారం, హోమాలు, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదానం, సాయంత్రం 5.30 గంటలకు గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

విద్యపై దృష్టి సారించాలి

మంతెన (కంకిపాడు), న్యూస్‌టుడే: సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు విద్యపై దృష్టి సారించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జిల్లా బాధ్యుడు నరసింహారావు అన్నారు. మండలంలోని మంతెనలో మండల స్థాయి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ బలోపేతం, ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల శాఖ బాధ్యుడు లాం ప్రతాప్, స్థానిక ప్రతినిధులు కలపాల రాజేష్, జీవన్, మంచాల ప్రభాకర్, లాం రాజా, మొవ్వ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు సారె సమర్పణ

కృష్ణలంక, న్యూస్‌టుడే: రాణిగారితోటలో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మకు స్థానిక మహిళలు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. చీర, పసుపు, కుంకుమ, మిఠాయిలు, పండ్లు, గాజులతో ఆలయం వద్దకు చేరుకున్న మహిళలు సారెను సమర్పించారు. కల్యాణ్ కిషోర్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో వేముల దుర్గారావు, వెంకటేశ్వరరెడ్డి, శ్రీను, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు తొలగింపు

కరెన్సీనగర్: గుణదల విష్ణునగర్‌లో విద్యుత్తు తీగలకు చెట్ల కొమ్మలు తగిలి ప్రమాదకరంగా మారిన వైనంపై 'తీగలకు కొమ్మలడ్డు... తొలగిస్తే మేలు' శీర్షికన ఈనాడులో ఆదివారం వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. గుణదల ఏఈ దుర్గాప్రసాద్ నేతృత్వంలో సిబ్బంది కొమ్మలు తొలగించారు. అధికారులు వెంటనే స్పందించినందుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈనాడు కథనానికి స్పందన

ప్రైవేటు పాఠశాల డైరెక్టర్ బలవన్మరణం

ఆర్థిక సమస్యలే కారణమని అనుమానాలు

శ్రీధర్ (పాత చిత్రం)

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: భవిష్య శ్రీధర్‌గా పల్నాడు ప్రాంతంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఎందరికో విద్యాబుద్ధులు నేర్పారు. అప్పుల ఊబిలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అవుతూ.. చివరికి బలవన్మరణం పొందారు. గుంటూరు నగరానికి చెందిన శ్రీధర్(50) సత్తెనపల్లికి చెందిన ఉమాకల్యాణిని ప్రేమ వివాహం చేసుకున్నారు. 2000 సంవత్సరం నుంచి సత్తెనపల్లిలో నివాసం ఉంటూ.. ఇద్దరూ ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేశారు. 2013లో సొంతంగా విద్యాసంస్థను నడపాలనే ఆలోచనతో భవిష్య పాఠశాలను ఏర్పాటు చేశారు. వేలాదిమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. పాఠశాలకు ఈఎస్ఐ, పీఎఫ్ బకాయిలు ఉండటంతో ఇటీవలే ఆ శాఖ అధికారులు వచ్చి ఓ భవనానికి తాళంవేసి వెళ్లారు. దీనికితోడు ఆర్థిక సమస్యలు పెరగడంతో ఆయన కొంతకాలంగా మనోవేదన చెందుతున్నారని స్నేహితులు తెలిపారు. ఈక్రమంలోనే శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన సాయంత్రం వరకు తిరిగి రాలేదు. ఆయన భార్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అదృశ్యం కేసు నమోదు చేశారు. అనంతరం శనివారం రాత్రి విజయవాడ నగరంలోని ప్రకాశం బ్యారేజీపై ద్విచక్ర వాహనం నిలిపి కృష్ణానదిలోకి ఓ వ్యక్తి దూకాడని అటుగా వెళ్తున్న వాహన చోదకులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఆ వాహనం చిరునామా ఆధారంగా అది శ్రీధర్‌కు చెందినదిగా పోలీసులు గుర్తించి సత్తెనపల్లి స్టేషన్‌కు సమాచారం అందించారు. ఆదివారం ఉదయం ఈతగాళ్లతో నదిలో గాలించగా మృతదేహం లభ్యమైంది. విజయవాడ వన్‌టౌన్ పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు సంతానం కాగా, పెద్ద కుమార్తె తేజస్విని అమెరికాలో ఎంఎస్ పూర్తిచేసి ఉద్యోగ అన్వేషణలో ఉంది. రెండో కుమార్తె నవ్యస్విని గుంటూరులో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతోంది. ప్రైవేట్ పాఠశాలల సంఘం సత్తెనపల్లి తాలుకా బాధ్యుడిగా ఆయన క్రియాశీలకంగా ఉన్నారు. లయన్స్‌క్లబ్‌లో కీలక బాధ్యతలు చేపట్టి సామాజిక సేవలోనూ పాలుపంచుకుంటున్నారు. పేద విద్యార్థుల చదువులకు ఫీజుల విషయంలోనూ ఉదాసీనంగా ఉంటారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు.





(c) eenadu

విజయవాడ పశ్చిమ

జగన్నాథ సేవలో డీజీపీ

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

కార్పొరేషన్లో నేడు వినతుల స్వీకరణ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతోపాటు మూడు సర్కిళ్లలోనూ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమం ద్వారా నగర ప్రజలు సమస్యలు, మౌలిక వసతుల కల్పనలో ఇబ్బందులను వినతుల రూపంలో అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని కమిషనర్ సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందనకు వందనం

❖ టీచర్స్‌పేట అడ్డరోడ్డులో కుక్కల స్వైర విహారం అధికంగా ఉందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. ఆదివారం వార్త ప్రచురితమవగా, స్పందించిన వెటర్నరీ విభాగం అధికారులు కుక్కలను పట్టుకెళ్లారు.

❖ సంతోషీమాత ఆలయం చిట్టినగర్ అడ్డరోడ్డులో మంచినీటి సరఫరా కావడం లేదని స్థానిక సమాచారంతో స్పందించిన మంచినీటి విభాగం అధికారులు నీటిని సరఫరా చేశారు.

❖ వాగుసెంటర్ బ్రహ్మంగారి మఠం మెట్ల మార్గంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని స్థానికుల సమాచారంపై స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులను మురుగు తీయించారు.

❖ కేజీఆర్ పెట్రోల్‌బంక్ వద్ద గల పక్కకాలువల్లో పూడిక తీయక రోడ్డుపై మురుగు పొంగిపొర్లుతోందని వార్త ప్రచురితమవగా, స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు.

? పూర్ణానందంపేట సీకేరెడ్డి రోడ్డులో కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. - **అనూష, స్థానికురాలు** ✔ పరిశీలించి వాటిని పడతాం. - **సోమశేఖర్ అసిస్టెంట్ వెటర్నరీ అధికారి**

? పూర్ణానందంపేట నాడార్ వీధిలో మంచినీటి సరఫరా కావడం లేదు. - **అశోక్, స్థానికుడు** ✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **రామకృష్ణ, మంచినీటి విభాగం ఏఈ**

? సామారంగం చౌకీ మెయిన్‌రోడ్డు, హిందూ హైస్కూల్ వద్ద కాలువల్లో పూడిక పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. - **అనిల్, తిరుపతిరావు, స్థానికులు** ✔ పరిశీలించి పూడిక తీయిస్తాం. - **యోగేంద్ర, స్థానిక శానిటరీ అధికారి**

? కొత్తపేట యాదవపురివారి వీధిలో మెట్ల మార్గం ధ్వంసం అయింది. - **శ్రీకాంత్, స్థానికుడు** ✔ పరిశీలించి మరమ్మతులు నిర్వహిస్తాం. - **సురేఖ, సర్కిల్-I ఈఈ**

- విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే

నాడు నేడు నత్తేనయం..!

● ఆగిన నిర్మాణాలతో విద్యార్థుల అవస్థలు

● పనులు పూర్తి చేయాలని తల్లిదండ్రుల వినతి

చిట్టినగర్, న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పేరుతో పాఠశాలల్లో చేపట్టిన భవనాల నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. దాదాపు ఏడాదికి పైగా పనుల్లో పురోగతి లేకపోవడం, త్వరితగతిన పూర్తికి అడుగులు ముందుకు పడకపోవడం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. అరకొర నిధులు, అసంపూర్తి పనులతో సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమిప్రభుత్వం చొరవ తీసుకుని పాఠశాలల భవన నిర్మాణాలు పూర్తి చేసి మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చూడాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

పుచ్చలపల్లి లీలా సుందరయ్య పాఠశాల ఆవరణలో..

మట్టా లాజరస్ పాఠశాలలో..

రెండేళ్లకుపైగా లేని పురోగతి..

కలరా ఆసుపత్రి సెంటర్ ఎదురువీధిలోని కనకదుర్గమ్మ ఆలయం పక్కనే పుచ్చలపల్లి లీలా సుందరయ్య నగరపాలక ప్రాథమిక పాఠశాల ఉంది. నాడు-నేడు పథకం కింద రెండు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. రెండున్నరేళ్ల గడిచినా నిర్మాణం పూర్తికాలేదు. పునాది, పిల్లర్ల దశ దాటి ముందుకు కదల్లేదు. ఒకే గది ఉన్న పాత భవనానికి మరమ్మతుల చేశారు. మిగతా విద్యార్థులు రేకుల షెడ్లలోనే ఉంటున్నారు. వర్షం పడితే పాఠశాల ప్రాంగణంలో నీరు నిలుస్తోంది. నిధులు మంజూరు చేసి ఆగిన నిర్మాణాలు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పుచ్చలపల్లి పాఠశాల	మట్టా లాజరస్ పాఠశాల
విద్యార్థులు 45 మంది	135 మంది
నిర్మాణం కోసం నిధులు రూ.42 లక్షలు	రూ.35 లక్షలు
ఖర్చు చేసింది రూ.27లక్షలు	రూ.25 లక్షలు
తలుపులు, కిటికీలు బిగించాలి	పిల్లర్ల దశలో ఉంది
కావాల్సిన నిధులు రూ.15 లక్షలు	రూ.10 లక్షలు

● మట్టా లాజరస్ నగరపాలక ప్రాథమిక పాఠశాల అదనపు గదుల నిర్మాణం, కింది భాగంలో ఫ్లోరింగ్, మరుగుదొడ్లు, ఇతర పనుల నిమిత్తం రూ.35 లక్షలతో పనులు చేపట్టారు. ఐదులో భాగంగా భవనంపై రేకుల షెడ్డు వేశారు, గోడలు కట్టి ప్లాస్టరింగ్ చేశారు. కేవలం తలుపులు, కిటికీలు, గ్రీన్ బోర్డులు(బ్లాక్ బోర్డుల బదులు) పెయింటింగ్ పనులు మిగిలిపోయాయి. పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది.

నిధులు రాగానే పనులు

పుచ్చలపల్లి లీలా సుందరయ్య పాఠశాల, మట్టా లాజరస్ పాఠశాలలలో చేపట్టిన భవన నిర్మాణ పనులు నిధుల కారణంగా నిలిచాయి. పాఠశాలలో చిన్న మరమ్మతులు, నీటి సమస్య లేకుండా చేశాం. ఆగిపోయిన నాడు-నేడు భవన నిర్మాణాల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడుతాం.

- శ్రీనివాసరావు, ఏఈ

9న రథం సెంటర్‌లో మహాప్రదర్శన

పాదయాత్రలో సీఐటీయూ నాయకులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: కార్మికుల హక్కులను కాపాడాలని, బానిసలుగా మార్చే లేబర్‌కోడ్లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 9న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ పశ్చిమ నగర కమిటీ ప్రధాన కార్యదర్శి ఉమా నారాయణ పిలుపునిచ్చారు. టైలర్‌పేట, నన్నేసాహెబ్‌వీధిలోని మోటారు హమాలీ కార్మిక భవన్ నుంచి ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, విద్యుత్తు భారాలు తగ్గించాలని కోరారు. స్మార్ట్ మీటరు ఏర్పాటును విరమించుకుని, అసంఘటిత కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. 9న పశ్చిమ నగరంలోని రథం సెంటర్ నుంచి మహాప్రదర్శన జరుగుతుందని, కార్మికులంతా హాజరు కావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఇతర యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

చిట్టినగర్, భవానీపురం, విద్యాధరపురం, న్యూస్‌టుడే: దేశంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిన మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని భాజపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రిగా అభివృద్ధికి బాటలు వేశారని, బహుజనుల కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. భాజపా నాయకులు లంకా దినకర్, షేక్‌బాజీ, నాయకులు పాల్గొన్నారు. ✶ అలానే భాజపా సిద్ధాంతకర్త శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ✶ 49వ డివిజన్ బ్రైజర్‌పేటలో తెదేపా సీనియర్ దళిత నాయకులు కామా దేవరాజ్, తెదేపా నాయకులు పల్లెపోగు ప్రసాద్ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ✶ సితార సెంటర్‌లోని జనసేన కార్యాలయంలో తిరుపతి అనూష, సురేష్, రామకృష్ణ, గణేష్, వినోద్‌కుమార్ పాల్గొని నివాళి అర్పించారు. ✶ పాతబస్తీ బ్రాహ్మణ వీధిలోని వైకాపా కార్యాలయంలో ఎస్సీ సెల్ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

భాజపా కార్యాలయంలో నాయకుల నివాళి

ఆలయాల్లో ఏకాదశి శోభ

ఇంద్రకీలాద్రి, చిట్టినగర్, న్యూస్‌టుడే: జగన్మాత కొలువైన ఇంద్రకీలాద్రి, నగరంలోని ఇతర ఆలయాల్లో ఆదివారం తొలి ఏకాదశి సందడి కనిపించింది. ఉదయం నుంచి భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఒక వైపు సారె తీసుకువస్తున్న మహిళలు, మరోవైపు ఏకాదశి రోజున అమ్మవారి ఆశీస్సులు తీసుకునేందుకు భక్తులు పోటెత్తారు. చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో, మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో, వీఎంసీ కాలనీలోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో, ఆంజనేయవాగులోని శ్రీవీరాంజనేయ స్వామివారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వచ్చి తమ ఇష్ట దైవాలను దర్శించుకుని తరించారు. ❖ పాలఫ్యాక్టరీ వద్ద శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీవిజయదుర్గాంబిక దేవికి గణపతి సేవా సమితి ఆధ్వర్యంలో ఆషాఢ మాస సారెను సమర్పించారు. అలాగే చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారికి, భీమనవారిపేటలోని గంగానమ్మ అమ్మవారికి, కుండల మార్కెట్ వద్ద ఉన్న గంగాదుర్గ మారెమ్మ అమ్మవార్లకు కూడా సారె సమర్పించారు.

విజయదుర్గ అమ్మవారు

నియంత్రిక.. ప్రమాదవీచిక



పాతబస్తీ వించిపేట ప్రధాన మార్గంలో ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. విద్యుత్తు తీగలు బయటకొచ్చి, చుట్టూ ఉండాల్సిన రక్షణ ఫెన్సింగ్ ఊడిపోయి ఉంది. దీంతో ఈమార్గంలో రాకపోకలు సాగించి బాటసారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని, ప్రమాదకరంగా వేలాడుతున్న తీగలు సరిచేయాలని కోరుతున్నారు.

- విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే

పెంపుడు కుక్కలకు టీకాలు

భవానీపురం: కుక్కలను పెంచే ప్రతి ఒక్కరూ తప్పని సరిగా యాంటీ రేబిస్ టీకాలను వేయించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని భవానీపురం ఐరన్‌యార్డులోని జీవకారుణ్యం ఆశ్రమంలో యాంటీరేబిస్ టీకాలను ఆదివారం వేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇంట్లో కుక్కలు, ఇతర జంతువులను పెంచే వారు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు టీకాలు వేయించాలని సూచించారు. పెంపుడు, వీధి కుక్కలకు టీకాలను వేశారు.

చందనం కొనుగోలుకు రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామికి సమర్పించేందుకు చందనం చెక్కల కొనుగోలుకు విజయవాడ కేదేశ్వరపేటకు చెందిన భక్తులు కేవీఎల్ హరినాథ్, కవిత దంపతులు రూ.1,00,001 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో ఆలయ పర్యవేక్షకుడు జీవీఎస్‌కే ప్రసాద్‌కు అందజేశారు. అధికారులు దాత కుటుంబానికి స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

త్యాగాలకు ప్రతీక మొహర్రం

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: మొహర్రం అంటే త్యాగాలకు ప్రతీక అని 2వ పట్టణ పోలీసు స్టేషన్ సీఐ చినకొండలరావు అన్నారు. ఆదివారం పాతబస్తీ పంజాసెంటర్‌లో ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీఐ మాట్లాడుతూ..మొహర్రం అంటే ముస్లిం సమాజానికి నూతన సంవత్సరం మాత్రమే కాదని, త్యాగాలను గుర్తు చేసే మాసమని అన్నారు. షర్బత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముస్లిం సంఘాల పెద్దలు మోహమూద్, వాజీద్‌ఖాన్ పాల్గొన్నారు.

ఊరేగింపులో సీఐ చినకొండలరావు, ముస్లిం సంఘాల నేతలు

కళ తప్పిన వర్టికల్ గార్డెన్

వైకాపా పాలకులు పట్టించుకోని ఫలితం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

వైకాపా పాలకుల నిర్లక్ష్యం..నిర్వహణ లోపం కారణంగా నగరంలో ప్రప్రథమంగా అభివృద్ధి చేసిన వర్టికల్ గార్డెన్ నేడు కళ తప్పింది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో 65వ జాతీయ రహదారి వెంట కృష్ణానది సమీపంలో దీన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పాడైపోయిన గార్డెన్‌ను పునర్నిర్మించేందుకు పాలకులు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉండగా కృష్ణానదిలో ఎఫ్-1, హెచ్-2వో క్రీడాపోటీలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా కనకదుర్గ పైవంతెన కింద విశాలమైన స్థలం ఆక్రమణలకు గురికాకుండా వర్టికల్ గార్డెన్‌ను అభివృద్ధి చేసేందుకు రూ.12.30 కోట్లతో అంచనాలు రూపొందించారు. అందులో రూ.9 కోట్లు ఖర్చు చేసి, మెజారిటీ పనులు పూర్తిచేశారు. సుందరంగా తీర్చిదిద్దారు. ఫలితంగా అప్పట్లో ఇది సందర్శకులు, చిన్నారులను బాగా ఆకర్షించింది. ఆదివారం, సెలవు దినాల్లో వందల సంఖ్యలో సందర్శకులు వచ్చేవారు. ఆతరువాత ప్రభుత్వం మారిపోవడంతో గార్డెన్ నిర్వహణ గాడి తప్పింది.

పిల్లర్లకు అమర్చిన మొక్కల కుండీలు పాడైపోయాయిలా..

నిర్వహణ విస్మరించి.. గార్డెన్‌కు అనుబంధంగా పైవంతెన పిల్లర్లకు అమర్చిన కుండీలు, మొక్కలు పాడైపోయిన పక్షంలో తిరిగి అమర్చడం, నీరు పెట్టడం వంటి నిర్వహణ బాధ్యతలను అప్పట్లో గుత్తేదారుకు తెదేపా ప్రభుత్వం అప్పగించింది. రెండేళ్ల పూర్తయ్యాక గుత్తేదారు నిర్వహణ వదిలేశారు. దీనిపై విమర్శలు రావడంతో కొంత కాలం కార్పొరేషన్ సిబ్బంది ద్వారా గార్డెన్ నిర్వహించి ఆపై విస్మరించారు. ఫలితంగా మొక్కలు ఎండిపోయాయి. కుండీలు దాదాపుగా పాడైపోయాయి. కొత్తవి అమర్చాల్సి ఉన్నా, శ్రద్ధ చూపలేదు.

వైకాపా వదిలేసింది..: జాతీయ రహదారికి అనుబంధంగా అభివృద్ధి చేసిన వర్టికల్ గార్డెన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల్లో దాదాపు రూ.3.50 కోట్లు మిగలగా. వైకాపా పాలకులు ఆ నిధులను దారి మళ్లించారు. ఇక్కడ గుర్తించిన 15 ప్రాంతాల్లో సెల్ఫీ పాయింట్లను సుందరంగా తీర్చిదిద్దాలి. ఓపెన్ జిమ్, ఆర్ట్ గ్యాలరీ, స్కేటింగ్ రింక్, విద్యుద్దీపాలు, ఫుడ్‌ప్లాజా, రాక్, విద్యుత్తు, మ్యూజికల్ ఫౌంటెయిన్లను పూర్తి చేయకుండా నిలిపేశారు. నిర్వహణ పట్టించుకోలేదు.

ప్రైవేటు పాఠశాల డైరెక్టర్ బలవన్మరణం

ఆర్థిక సమస్యలే కారణమని అనుమానాలు

సత్తెనపల్లి, విద్యాధరపురం: భవిష్య శ్రీధర్‌గా పల్నాడు ప్రాంతంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఎందరికో విద్యాబుద్ధులు నేర్పారు. అప్పుల ఊబిలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అవుతూ.. చివరికి బలవన్మరణం పొందారు. గుంటూరు నగరానికి చెందిన శ్రీధర్(50) సత్తెనపల్లికి చెందిన ఉమాకల్యాణిని ప్రేమ వివాహం చేసుకున్నారు. 2000 సంవత్సరం నుంచి సత్తెనపల్లిలో నివాసం ఉంటూ.. ఇద్దరూ ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేశారు. 2013లో సొంతంగా విద్యాసంస్థను నడపాలనే ఆలోచనతో భవిష్య పాఠశాలను ఏర్పాటు చేశారు. వేలాదిమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. పాఠశాలకు ఈఎస్ఐ, పీఎఫ్ బకాయిలు ఉండటంతో ఇటీవలే ఆ శాఖ అధికారులు వచ్చి ఓ భవనానికి తాళంవేసి వెళ్లారు. దీనికితోడు ఆర్థిక సమస్యలు పెరగడంతో ఆయన కొంతకాలంగా మనోవేదన చెందుతున్నారని స్నేహితులు తెలిపారు. ఈక్రమంలోనే శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన సాయంత్రం వరకు తిరిగి రాలేదు. ఆయన భార్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అదృశ్యం కేసు నమోదు చేశారు. అనంతరం శనివారం రాత్రి విజయవాడ నగరంలోని ప్రకాశం బ్యారేజీపై ద్విచక్ర వాహనం నిలిపి కృష్ణానదిలోకి ఓ వ్యక్తి దూకాడని అటుగా వెళ్తున్న వాహన చోదకులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఆ వాహనం చిరునామా ఆధారంగా అది శ్రీధర్‌కు చెందినదిగా పోలీసులు గుర్తించి సత్తెనపల్లి స్టేషన్‌కు సమాచారం అందించారు. ఆదివారం ఉదయం ఈతగాళ్లతో నదిలో గాలించగా మృతదేహం లభ్యమైంది. విజయవాడ వన్‌టౌన్ పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు సంతానం కాగా, పెద్ద కుమార్తె తేజస్విని అమెరికాలో ఎంఎస్ పూర్తిచేసి ఉద్యోగ అన్వేషణలో ఉంది. రెండో కుమార్తె నవ్యస్విని గుంటూరులో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతోంది. ప్రైవేట్ పాఠశాలల సంఘం సత్తెనపల్లి తాలుకా బాధ్యుడిగా ఆయన క్రియాశీలకంగా ఉన్నారు. లయన్స్‌క్లబ్‌లో కీలక బాధ్యతలు చేపట్టి సామాజిక సేవలోనూ పాలు పంచుకుంటున్నారు. పేద విద్యార్థుల చదువులకు ఫీజుల విషయంలోనూ ఉదాసీనంగా ఉంటారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు.

శ్రీధర్ (పాత చిత్రం)

సుపరిపాలనతో ప్రజలకు సంక్షేమ ఫలాలు

మల్లికార్జునపేటలో ప్రచారం చేస్తున్న తెదేపా నాయకులు

విజయవాడ వన్‌టౌన్, చిట్టినగర్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సుపరిపాలన అందుతోందని, ప్రజలకు సంక్షేమ పథకాలు-అభివృద్ధి ఫలాలను అందజేస్తున్నామని తెదేపా కూటమి నేతలు అన్నారు. పాతబస్తీలోని పలు ప్రాంతాలలో ఆదివారం స్థానిక నేతలతో కలిసి ఇంటిఇంటి ప్రచారం నిర్వహించారు. ❖ పాతరాజరాజేశ్వరీపేటలో తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి ధనేకుల వెంకటసుబ్బారావు సారథ్యంలో నిర్వహించారు. ధనేకుల వెంకటహరికృష్ణ, బడేషా, సందక సురేష్, ఆకుల దుర్గారావు పాల్గొన్నారు. ❖ పాతబస్తీ సామారంగం చౌకీ, కొత్తపేట ప్రాంతాలలో తెదేపా జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సోలంకి రాజుజైన్ సారథ్యంలో అడ్డూరి లక్ష్మణ, అమరా గోపాలకృష్ణ పాల్గొన్నారు. ❖ పాతబస్తీ మల్లికార్జునపేట కొండ ప్రాంతంలో కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, దేవర కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. ❖ 49వ డివిజన్ తెదేపా అధ్యక్షుడు బడుగు వెంకన్న ఆధ్వర్యంలో బ్రైజర్‌పేటలోని పలు వీధుల్లో తెదేపా నాయకులు ఇంటింటికి తిరిగి సంక్షేమం, అభివృద్ధిపై కరపత్రాలను పంపిణీ చేశారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు

భవానీపురం, న్యూస్‌టుడే: భర్త వేధిస్తున్నాడని భార్య భవానీపురం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. గొల్లపూడి మైలురాయిసెంటర్ వద్ద జి.శ్రీవాణి తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటోంది. ఆమెకు రామకోటేశ్వరరావుతో 2018లో వివాహమైంది. కొన్నాళ్లుగా భర్త శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో గొల్లపూడిలోని పుట్టింటికి వచ్చేసింది. అక్కడకు భర్త వచ్చి డబ్బులు కావాలంటూ వేధిస్తున్నాడని శ్రీవాణి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని బాలిక అదృశ్యం

చిట్టినగర్ న్యూస్‌టుడే: తల్లి మందలించిందని బాలిక అదృశ్యమైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వైఎస్ఆర్ కాలనీకి చెందిన బాలిక 8వ తరగతి వరకు చదివి ఇంట్లోనే ఉంటోంది. ఇంట్లో పనులు చేయకుండా చరవాణిలో మాట్లాడటం చేస్తోందని ఈనెల 4న తల్లి మందలించి బాబాయి ఇంటి వద్ద వదిలేస్తానంది. అదేరోజు తల్లి నిద్రపోతున్న సమయంలో బాలిక ఇంటి నుంచి వెళ్లి పోయింది. ఆదివారం వాట్సాప్ కాల్ చేసి తాను ఒడిశాలో ఉన్నానని, తన గురించి వెతక వద్దని చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కొత్తపేట పోలీసులు తెలిపారు.

సోదరుడు కనిపించలేదని..

భవానీపురం, న్యూస్‌టుడే: అన్నయ్య కనిపించటం లేదని తమ్ముడు భవానీపురం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. గొల్లపూడిలోని ఎస్ఎస్ఎస్‌కాలనీలో బాలాజీ(23) కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈనెల 6న బాలాజీ ఇంటి నుంచి బైటకు వెళ్లి తిరిగి రాలేదు. గొల్లపూడిలోని ఎన్టీపీఎస్ కాలువ వద్ద బాలాజీ ద్విచక్రవాహనం తాళం పడి ఉందని, ప్రమాదవశాత్తు కాలువలో పడి ఉంటాడేమో అని అనుమానం వ్యక్తం చేశారు. తమ్ముడు గురువిష్ణు ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగా సాధనకు మ్యాట్లు అందజేత

చిట్టినగర్: కేఎల్‌రావు పార్కులో అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్, నగరపాలక సంస్థ, శ్రీరామాంజనేయ యోగా సేవా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న యోగా సాధకులకు ఆదివారం క్రీడాయి అసోసియేషన్ ప్రధానకార్యదర్శి రఘురాం ఆధ్వర్యంలో యోగా మ్యాట్లు పంపిణీ చేశారు. అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్ తప్పింది.. కాలు కదలకుంది

కేఎల్‌రావుపార్కులో అసంపూర్తిగా పనులు ★ విశ్రాంతికి బల్లలు లేక అవస్థలు

చిట్టినగర్, న్యూస్‌టుడే: కేఎల్‌రావుపార్కులో వాకింగ్ ట్రాక్ పూర్తి స్థాయిలో నిర్మాణం చేయకపోవడంతో వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. ట్రాక్‌పై ఎర్రమట్టి, దానిపై ఇసుక వేసి వదిలేశారు. ఇటీవల వర్షాలు పడటంతో అక్కడ నీరు నిలిచి బురదమయంగా మారింది. దీంతో నడవటానికి అవస్థలు పడుతున్నారు. రోలర్‌తో చదును చేయడంతోపాటు ట్రాక్ వెంబడి సుందరీకరణ పనులు చేయాల్సి ఉంది.

ఇసుకలో నడవడానికి తిప్పలు పడుతున్న వాకర్లు

నడిస్తే ఇబ్బందిగా ఉంది

కేఎల్‌రావు పార్కులో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి. ప్రస్తుతం ఉన్న దారి అధ్వానంగా ఉండటంతో నడవడానికి చాలా ఇబ్బందిగా ఉంది. మట్టిపై ఇసుక ఎక్కువగా వేయడంతో కాళ్లు దిగబడుతున్నాయి. చదును చేసి నడకదార్లకు అసౌకర్యం కలగకుండా చూడాలి. ఓపెన్ థియేటర్ నిర్మిస్తే ఎంతో ప్రయోజనం. **-ఉయ్యూరు ధనుంజయరావు, వాకర్**

పనులు పూర్తి చేయాలి

ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా నడకకు వస్తున్నా. ట్రాక్ సరిలేక పార్కులో నడిచేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. క్రమ పద్ధతిలో ట్రాక్ పనులు పూర్తి చేయాలి. వృద్ధులు కూర్చుని విశ్రాంతి తీసుకోవడం కోసం అక్కడక్కడా బల్లలు ఏర్పాటు చేస్తే మంచిది. **-ఎన్.విజయలక్ష్మి, గృహిణి**

త్వరలో చర్యలు చేపడతాం..

పార్కులో వాకింగ్ ట్రాక్ విషయమై నగరపాలక సంస్థలోని పార్కుల విభాగం ఏఈ విష్ణును వివరణ కోరగా పనులు కొనసాగుతున్నాయని, ఎర్రమట్టి, ఇసుక వేశామని, వర్షం పడినప్పుడు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ట్రాక్ వెంబడి బల్లలు ఏర్పాటు చేస్తామన్నారు. ఓపెన్ థియేటర్ టెండర్ ప్రక్రియ పూర్తి అయ్యిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.



విజయవాడ మధ్య

వంకాయలు-28, టమాటా-35, బెండ-24, పచ్చిమిర్చి-42, కాకర-42, బీర-26/36, క్యాబేజీ-22, క్యారెట్-32/42, దొండ-32, బంగాళ దుంప-28, ఉల్లిపాయలు-26, గోరు చిక్కుళ్లు-34, దోస-18, సొర-10, పొట్ల-20/25, అరటికాయ-8/7, చామదుంప-28, అల్లం-60, మునగ-10/12, ఆకు కూరలు (కట్ట)-3, కంద-58, బీట్ రూట్-32, కీరదోస-40, బీన్స్-84, క్యాప్సికమ్-82, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-7/14, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-12/10, జాలం మామిడి-20/25 **(నిన్నటివి).**
నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. - ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
63036 11232

స్పందనకు వందనం

పాయకాపురం: వాంబేకాలనీ హెచ్ బ్లాక్, వార్డు సచివాలయం వెనుక వీధిలో డ్రెయిన్ పూడిపోయిందని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీనిపై 'ఈనాడు'లో ఆదివారం వార్త ప్రచురితమైంది. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు.. కార్మికులతో పూడిక తీయించారు.

☛ ఉడా కాలనీకి వెళ్లే రహదారిలో గుంతలు ఏర్పడ్డాయని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆదివారం ప్రచురితమైన వార్తకు ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. దారిలో గుంతలను పూడ్చించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

? రామకృష్ణాపురం పాత తపాలా కార్యాలయం రోడ్డులో ఆర్అర్‌డబ్ల్యూఏ 430 వద్ద గల విద్యుత్తు పోల్ (నం: 30/246/34) దీపం వెలగడం లేదు. రాత్రివేళ అంధకారంతో గత కొద్ది రోజులుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీపం ఏర్పాటు చేయాలి. **- కె.వి.సుబ్బరాజు, స్థానికుడు**

✔ క్షేత్రస్థాయిలో పరిశీలించి కొత్త దీపం ఏర్పాటు చేస్తాం. **- ఎం.బాలసుబ్రహ్మణ్యం, ఏఈ, వీఎంసీ**

? అజిత్‌సింగ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీ 113వ బ్లాకులో కుక్కల బెడద బాగా ఎక్కువగా ఉంది. రోడ్డుమీద వెళ్తున్న వారి వెంటపడుతున్నాయి. **- నిర్మల, స్థానికురాలు**

✔ తగిన చర్యలు తీసుకుంటాం. **- డాక్టర్ సోమశేఖర రెడ్డి, వీఏఎస్, వీఎంసీ - న్యూస్‌టుడే, సీతారాంపురం**

రహదారి అధ్వానం

నందమూరి నగర్, వానపాముల వారి వీధిలో రహదారి అధ్వానంగా మారింది. అటుగా రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో అదుపు తప్పి పడిపోతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి సరి చేయించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్**

బాబా మందిరానికి విరాళం

సత్యనారాయణపురం (గాంధీనగర్) : ముత్యాలంపాడులోని శిర్డీ సాయిబాబా ఆలయానికి ఆదివారం శ్రీనగర్ కాలనీకి చెందిన దాత గరికపాటి శ్రీనివాసరావు, జ్యోతి దంపతులు.. గోవు, గోవు గ్రాసం కోసం రూ.60వేలను విరాళంగా అందజేశారు. కమిటీ గౌరవాధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. గోపూజలు చేసేందుకు నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారని తెలిపారు. దాతలకు బాబా ప్రసాదం అందజేసి, శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ కోశాధికారి ఎం.సత్యశ్రీహరి పాల్గొన్నారు.

జగన్మాత సేవలో డీజీపీ

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

10న గురుపౌర్ణమి వేడుకలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : లబ్బీపేటలోని శిర్డీ సాయిబాబా మందిరంలో ఈనెల 10న గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు పరాశరం రవికుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయిబాబా, దత్తాత్రేయ స్వామి వారికి వివిధ రకాల పుష్పాలతో అలంకారం, హోమాలు, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదానం, సాయంత్రం 5.30 గంటలకు గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

చిచ్చర పిడుగులు
రాష్ట్ర, జాతీయ స్థాయి తైక్వాండోలో ప్రతిభ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే

చిన్నచిన్న పిల్లలు.. చదువుతో పాటు తైక్వాండోలో చక్కగా రాణిస్తున్నారు. ఆసక్తి, అభిరుచికి తోడు.. తల్లిదండ్రులు ప్రోత్సహిస్తుండడంతో ప్రతిభ చాటుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆకట్టుకున్నారు. అంతర్జాతీయ స్థాయి పతకాలపై గురిపెట్టారు. దీనికోసం శిక్షకుడు ఎం.అంకమ్మరావు పర్యవేక్షణలో సాధన చేస్తున్నారు.

పసిడి పతకాలు కైవసం

సత్యనారాయణపురానికి చెందిన **గుంటూరు యోగ్యశ్రీ మహాలక్ష్మి..** 5వ తరగతి చదువుతోంది. తండ్రి అరుణ్‌కుమార్ వ్యాపారి. తల్లి పావని విమల గృహిణి. పాఠశాలలో కొందరు తైక్వాండో సాధన చేయడం ద్వారా ఆసక్తి పెంచుకుంది. తల్లిదండ్రులను ఒప్పించి ఒకటో తరగతి చదివే రోజుల్లోనే శిక్షణకు ప్రవేశించింది. రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకు మూడు పసిడి, నాలుగు రజత, మూడు కాంస్య పతకాలు సాధించింది. గత ఏడాది ఆగ్రాలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఒక పసిడి, ఒక రజత పతకాన్ని చేజిక్కించుకుంది. గత నెలలో తాడిపత్రిలో.. రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడు పసిడి పతకాలు సొంతం చేసుకుంది. హరిద్వార్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో తలపడి ఒక పసిడి, ఒక కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. చదువులోనూ బాగా రాణిస్తోంది. భవిష్యత్తులో ఐఏఎస్ అవుతానని చెబుతోంది యోగ్యశ్రీ మహాలక్ష్మి.

సోదరి స్ఫూర్తితో విజయాలు

సత్యనారాయణపురానికి చెందిన **గుంటూరు మౌనిష్** ఆరో తరగతి చదువుతున్నాడు. తండ్రి మాధవ్ వ్యాపారి. తల్లి ఇందు గృహిణి. సోదరి స్ఫూర్తితో మూడో తరగతి చదివే రోజుల్లో తైక్వాండో సాధనలో ప్రవేశించాడు. అదే ఏడాది జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. అప్పటి నుంచి పతకాల సాధనలో వెనుదిరిగి చూడలేదు. రాష్ట్ర స్థాయిలో రెండు పసిడి, ఒక కాంస్య పతకం గెలుచుకున్నాడు. గత నెల 23 నుంచి 25వ తేదీ వరకు హరిద్వార్‌లో జరిగిన జాతీయ సబ్ జూనియర్ తైక్వాండో పోటీల్లో తలపడి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. చదువులోనూ ముందంజలో ఉన్నాడు. ఆర్మీలో ప్రవేశించి.. దేశానికి సేవ చేస్తానంటున్నాడు మౌనిష్.

అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటుతా..

అంబాపురానికి చెందిన **జి.లియా సోనల్** 6వ తరగతి చదువుతోంది. తండ్రి రాజారావు పాస్టర్. తల్లి శశికళ గృహిణి. రెండో తరగతి చదివే రోజుల్లోనే తైక్వాండో పట్ల ఆసక్తితో ప్రవేశించింది. రోజూ ఒక గంట సాధన చేస్తోంది. సెలవు రోజుల్లో మూడు- నాలుగు గంటల పాటు కష్టపడుతోంది. ఆంధ్రా లయోలా కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో రజత పతకం గెలుచుకుంది. తర్వాత జిల్లా స్థాయి పోటీలో పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. గత ఏడాది అనంతపురం జిల్లా తాడిపత్రిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రజతం గెలిచింది. ఇటీవల జిల్లా స్థాయి పోటీల్లో పసిడి పతకం సొంతం చేసుకుంది. తాడిపత్రిలో జరిగిన రాష్ట్ర స్థాయిలో పసిడి పతకం గెలుపొందింది. ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఒక పసిడి, ఒక కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో తలపడి దేశానికి పతకం అందిస్తానని ధీమా వ్యక్తం చేస్తోంది లియా .

కార్పొరేషన్లో వినతుల స్వీకరణ నేడు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతోపాటు మూడు సర్కిళ్లలోనూ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమం ద్వారా నగర ప్రజలు సమస్యలు, మౌలిక వసతుల కల్పనలో ఇబ్బందులను వినతుల రూపంలో అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని కమిషనర్ సూచించారు.

సమస్యల పరిష్కారానికి 'తొలి అడుగు'

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : ఏడాది వ్యవధిలోనే ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించేందుకు, సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు తెదేపా అధిష్ఠానం 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించింది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు శనివారం వాంబే కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ముగ్గురు మహిళలకు వినికిడి సమస్య ఉందని ఆయనకు తెలియజేశారు. ఆయన స్పందించి.. గంటల వ్యవధిలోనే సొంత నిధులతో వినికిడి యంత్రాలు సమకూర్చారు. అదే రోజు రాత్రి కృష్ణవేణి, షారోన్ బ్లెస్సి, పార్వతిలకు అందజేయగా.. వారు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 60వ డివిజన్ క్లస్టర్ ఇన్‌ఛార్జి కంచి ధనశేఖర్, రామరాజు, ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విప్ ఉమామహేశ్వరరావు, బాలస్వామి, సాంబశివరావు తదితరులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : 23వ డివిజన్ తెదేపా కమిటీ రూపొందించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కరపత్రాలను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. ఏడాదిలో అమలు చేసిన సంక్షేమ పథకాలపై తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి సరికొత్త కరపత్రాలు రూపొందించారు. వీటిని బొండా ఉమా ఆవిష్కరించి, మాట్లాడారు. తెదేపా నాయకులు ఇంటింటికీ వెళుతుంటే.. ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. పథకాల అమలుపై స్పందన బాగుందని, ఇదే స్ఫూర్తితో ఉత్సాహంగా మరిన్ని పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. బాలస్వామి మాట్లాడుతూ.. డివిజన్‌లో ప్రజలు ఇచ్చిన సూచనల మేరకు కొత్త కరపత్రాలు రూపొందించామని తెలిపారు. నవనీతం సాంబశివరావు, కోటి, సింగం వెంకన్న, గంటా కృష్ణమోహన్, రత్న తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు.. జగ్జీవన్‌రామ్

గురునాథం, నరసింహారావు తదితరుల నివాళి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : పదవులకే వన్నె తెచ్చిన మహోన్నత నేత బాబూ జగ్జీవన్‌రామ్ అని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు వి.గురునాథం పేర్కొన్నారు. ఆదివారం ఆంధ్రరత్న భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్, బంగ్లాదేశ్ యుద్ధం సమయంలో రక్షణమంత్రిగా సమర్థంగా విధులు నిర్వహించి నాటి ప్రధాని ఇందిరాగాంధీ మన్ననలు పొందారని కొనియాడారు. వ్యవసాయశాఖ మంత్రిగా ఆయన తెచ్చిన సంస్కరణలు.. ధాన్యం ఉత్పత్తిలో భారత్‌ను ఆసియాలోనే అగ్రగామిగా నిలిపాయని చెప్పారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ అనేక మంత్రి పదవులు అలంకరించి, తన అమూల్యమైన సేవలు దేశ ప్రజలకు అందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేముల శ్రీనివాస్, షేక్ అన్సారీ, జాన్‌మిస్త్రీ, కండెల వరప్రసాద్, పీటర్ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిపురం (సీతారాంపురం) : స్థానిక 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత ఆధ్వర్యంలో ఆదివారం గిరిపురంలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. పండ్లు పంచిపెట్టారు. కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

పాటలు పాడుతున్న గాయకులు

రాగాల పల్లకిలో..

గాంధీనగర్, న్యూస్‌టుడే : భానుశ్రీ మ్యూజికల్స్ ఆధ్వర్యంలో 'ఏదో ఒక రాగం పిలిచింది వేళ' పేరుతో 12 గంటల పాటు నిర్వహించిన సినీ సంగీత విభావరి శ్రోతలను రాగాల పల్లకిలో విహరింపజేసింది. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఏకధాటిగా చిత్రగీతాల గానం కొనసాగింది. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, చిత్ర పాడిన పాటలతో.. శ్రోతలను అలరించారు. గాయకులు భానుశ్రీ, సయ్యద్ అలీ, రసూల్‌బాబు, శైలజ, సూర్య, విక్కి, కృష్ణదాస్, విజ్జుసోనీ, సాయిప్రసాద్, నండూరి వెంకటేశ్వరరావు, అలీషా, ఎం.సుధాకర్, మీనాక్షి తదితరులు తమ గాత్రంతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు.

శాకంబరిదేవిగా అమ్మవారు

శ్రీలలితా సహస్రనామ పారాయణంలో భక్తులు

మాచవరం, న్యూస్‌టుడే : మాచవరం వెంకటస్వామి వీధిలోని కనకదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అమ్మవారు శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం పలువురు భక్తులు శ్రీసత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారని ధర్మకర్త కలగర బాపినీడు తెలిపారు. అమ్మవారిని పలు రకాల కూరగాయలతో అలంకరించారు. సాయంత్రం 150 మంది ముత్తైదువులు పాల్గొని శ్రీలలితా సహస్రనామ పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

గాంధీనగర్, న్యూస్‌టుడే : ముత్యాలంపాడులోని శిర్డీ సాయిబాబా ఆలయం, కోదండ రామాలయం తదితర ఆలయాల్లో ఆదివారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. విష్ణుసహస్రనామ పారాయణం, వేదపఠనం జరిగాయి. బాబా మందిర కమిటీ గౌరవాధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి పర్యవేక్షణలో భక్తులకు అన్నదానం చేశారు.

ఈ వీధిలో నడిచేదెలా?

కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డులో.. నవరంగ్ థియేటర్ ఎదురుగా గతుకుల మయంగా మారిన రోడ్డు వాహన చోదకులకు పరీక్ష పెడుతోంది. ఇక్కడ భూగర్భ డ్రైనేజీ పైపులైను నిమిత్తం 20 రోజుల క్రితం గుంతలు తవ్వారు. పైపులైను వేసిన తర్వాత సరిగా పూడ్చకపోవడంతో.. ఇటీవల కురిసిన వర్షాలకు దారి గతుకులమయంగా మారింది. రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి, దారిని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గవర్నర్‌పేట**

బోర్డుతోనే సరిపెట్టారు..!

నందమూరి నగర్ ఆకుల బాపనయ్య వీధిలోని ఖాళీ స్థలం లోతట్టుగా ఉంది. వర్షం నీరు నిల్వ ఉండడంతో తటాకాన్ని తలపిస్తోంది. దుర్వాసనతోపాటు దోమలు, విష సర్పాలు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుకు సమస్య వివరించగా.. చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వారు హెచ్చరిక బోర్డు పెట్టి మమ అనిపించారు. విష సర్పాల బారి నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్**

ఆదమరిస్తే.. ప్రమాదమే..!

స్థానిక 24వ డివిజన్, బోయపాటివారి వీధిలో యూజీడీపై మూత.. రోడ్డుకు సమాంతరంగా లేదు. అక్కడ గుంతలా ఉంది. చోదకులు ఆదమరిస్తే ప్రమాదాల బారిన పడక తప్పదు. యూజీడీ మూత సరిచేయాలని చోదకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సీతారాంపురం**

వాహనాల వేగ నియంత్రణ ఏదీ?

పాయకాపురం, పైపుల్‌రోడ్డు కూడలిలో వేగ నిరోధకాలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. నిత్యం టిప్పర్‌లు ఎక్కువ సంఖ్యలో తిరుగుతున్నాయని, వాటి వేగానికి కళ్లెం వేయాలని, ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను అమలు చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పాయకాపురం**

ప్రజల హృదయాల్లో మంగళంపల్లి స్థానం సుస్థిరం

గానం చేస్తున్న కళాకారుడు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : తెలుగు ప్రజల హృదయాల్లో మంగళంపల్లి బాలమురళీకృష్ణ సుస్థిర స్థానం పొందారని పలువురు సంగీత ప్రియులు, వక్తలు కొనియాడారు. సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో ఆదివారం దుర్గాపురంలోని భాగవతుల హైట్స్ ప్రాంగణంలో బాలమురళీ కృష్ణ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వరపరిచిన కృతులతో స్వరార్చన చేశారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంగీత విద్వాంసులు మాట్లాడుతూ.. శాస్త్రీయ సంగీతానికి ఆయన చేసిన కృషి అమోఘమని కొనియాడారు. ఆరేళ్ల వయసు నుంచే సంగీత కచేరీలు ప్రారంభించి.. దేశ, విదేశాల్లో అవార్డులు, పురస్కారాలు పొందారని కొనియాడారు. ప్రముఖ సంగీత విద్వాంసులు డి.వి.మోహనకృష్ణ, మోదుమూడు సుధాకర్‌తో పాటు సంగీత కళాకారులు లంక తేజస్వి, విద్యాసాగర్, సాత్విక, నీలకంఠశాస్త్రి, పూర్ణవల్లి, శ్రీరంజని, వెంకట విశ్వనాథ్ తదితరులు వివిధ కృతులను ఆలపించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు చిట్టా విశ్వేశ్వరరావు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు
మా గురువుగారు
శ్రీ ఆత్కూరి మల్లికార్జునశర్మ గారి
80వ జన్మదిన మరియు వారి దంపతుల వివాహ షష్టిపూర్తి సందర్భంగా హార్దిక శుభాకాంక్షలు
CA కుందా రామనారాయణ

ప్రింటింగ్ పరిశ్రమ కార్మికుల ప్రయోజనాలు పెంచాలి

సమావేశమైన బసవయ్య, మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ఫణి తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికులతో సమానంగా ప్రింటింగ్ కార్మికులకు ప్రయోజనాలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పెంట్యాల బసవయ్య కోరారు. ఆదివారం విజయవాడలోని ఓ హోటల్‌లో 'ప్రింట్ లీడర్‌షిప్ సమ్మిట్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో ప్రింటింగ్ పరిశ్రమ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. తెలంగాణ తరహాలో.. ఏపీలోనూ ప్రింటింగ్ యూనిట్లకు విద్యుత్తు క్యాటగిరీ 2 నుంచి 3కి మార్చాలని, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రింటింగ్ సబ్జెక్టులు చేర్చాలని, బీటెక్ ప్రింటింగ్ కోర్సు ప్రవేశపెట్టాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లతో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో ప్రింటింగ్ కోర్సులు ప్రవేశపెట్టాలని, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రారంభిస్తున్న ఎంఎస్ఎంఈ పార్కుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎంఎస్ఎంఈ ఉద్యమ్ పోర్టల్‌లో తయారీదారులుగా పేర్లు నమోదు చేసుకోవాలని, కార్మికుల వివరాలను ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ప్రింటింగ్ సంస్థల యజమానులకు ఆయన విజ్ఞప్తి చేశారు. విజయవాడ మాస్టర్స్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో.. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, కోశాధికారి ఎస్.శ్రీనివాసరావు, ఎన్.నాగేశ్వరరావు, ఇ.ఫణి, బి.టి.ఎస్.మల్లేశ్వరరావు, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్ష

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను జమ్మిచెట్టు కూడలిలోని మోడరన్ అకాడమీలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి దడాల శేషయ్య హాజరై మోడల్ పరీక్ష ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు పరీక్ష ఎలా రాయాలి..ఎలా చదవాలి అనే అంశాలను న్యాయమూర్తి వివరించారు. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాషా, మోడరన్ అకాడమీ ఛైర్మన్ సుంకర పాపారావు, ఐలు జిల్లా గౌరవాధ్యక్షుడు ఆలూరి సుధాకరరావు, ప్రధాన కార్యదర్శి సంపర దుర్గా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

మధురానగర్, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలంటే కార్మిక వర్గం ఐక్యంగా పోరాటాలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. ఆదివారం బి.ఆర్.టి.ఎస్. రోడ్డులోని సంఘ కార్యాలయంలో రైల్వేస్టేషన్ పార్శిల్ ఆఫీస్ ఆటోస్టాండ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నర్సింగరావు, సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల శ్రమను దోపిడీ చేసేలా చట్టాలు మారుస్తోందన్నారు. ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ సభ్యుడు బి.సన్యాసిరావు అనారోగ్యంతో చనిపోగా.. ఆయన భార్య లక్ష్మికి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎం.హనుమంతరావు, పి.తిరుపతయ్య, ఎం.కొండ, జె.సూర్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ప్రభుత్వ సహకారం

గాంధీనగర్ : కళాకారులకు కూటమి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెదేపా మాజీ కార్పొరేటర్ పి.త్రిమూర్తిరాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బెజవాడ మ్యూజికల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. గాయకులు పలు తెలుగు చిత్రాల్లోని పాటలను శ్రావ్యంగా ఆలపించారు. సాంబశివరావు, విజయలక్ష్మి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి పిలిచి కత్తితో దాడి

వెల్దండ (గ్రామీణం, న్యూస్‌టుడే: వివాహేతర సంబంధం నెపంతో ఒకరిపై కత్తితో దాడి చేశారని ఎస్సై కురుమూర్తి వివరాలు తెలిపారు. విజయవాడ, అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన చిలకమర్తి బాలసుబ్రమణ్యం కొంతకాలంగా హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో కేర్‌టేకర్‌గా పనిచేస్తున్నారు. వెల్దండ మండలం రాచూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ తన తల్లికి గాంధీ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అక్కడ పరిచయమై సహకరించిన బాలసుబ్రమణ్యంను శనివారం రాత్రి కృతజ్ఞతాభావంతో ఆ మహిళ ఆమె భర్తతో కలసి ఇంటికి పిలిచి విందు ఇచ్చారు. ఆదివారం తెల్లవారుజామున తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నావంటూ బాలసుబ్రమణ్యంపై కత్తితో భర్త ఎం.సదుమంతుడు దాడి చేయడంతో మూడు చోట్ల గాయాలయ్యాయి. కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అక్కడ ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదుమంతుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బహుజన రాజ్యం ఏర్పాటు చేస్తాం

రాఘవయ్యపార్క్ కూడలి (కృష్ణలంక), న్యూస్‌టుడే : రానున్న రోజుల్లో రాష్ట్రంలో బహుజన రాజ్యం ఏర్పాటు చేస్తామని బీఎస్పీ జాతీయ కోఆర్డినేటర్, మాజీ రాజ్యసభ సభ్యుడు రాజారామ్ అన్నారు. ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం బీఎస్పీ జోనల్, జిల్లా, నియోజకవర్గాల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం, జాతీయ అధ్యక్షురాలు మాయావతితో కలిసి పనిచేసిన నాయకులు రాష్ట్రంలో అధికంగా ఉన్నారని చెప్పారు. వారితో కలిసి బహుజన రాజ్యం ఏర్పాటు చేస్తామన్నారు. 2024 ఎన్నికల హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర కోఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్సీ అతర్ సింగ్‌రావు మాట్లాడుతూ.. నాయకులు గ్రామాలకు వెళ్లి బూత్ స్థాయి కమిటీలు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.గౌతమ్‌కుమార్ అధ్యక్షత వహించారు. సమావేశంలో జానకి ప్రసాద్, గురప్ప, మల్లకల్, పుష్పరాజ్, సంపదరావు తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి

కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో ఆదివారం రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని.. లేకపోతే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐలు తమ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లతో మాట్లాడారు. గంజాయి ఇతర మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దని, వాటి విక్రయాలు, రవాణా తదితర విషయాల్లో జోక్యం చేసుకుంటే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

80 వసంతాల వేడుక

ఎనభై వసంతాల వెయ్యి పున్నముల
పుణ్య దంపతులు జ్యోతిష్యరత్న
ఆత్కూరి మల్లికార్జున శర్మ (A.M.S)
శ్రీమతి లలిత గార్ల
వివాహ షష్టిపూర్తి, A.M.S గారి
జన్మదిన 7-7-2025 న
సుమార్చనలు, శుభాకాంక్షలు.
విజయవాడ శాతవాహన కళాశాల విశ్రాంత గణిత శాఖాధ్యక్షులు, ఉప ప్రధానాచార్యులు
కుమారులు: Prof. Dr.A.V.N.చంద్రశేఖర్ - కోడళ్ళు: అనురాధ
మనుమడు : ఎ. శివసాయి కృష్ణ
రాజశేఖర్ ప్రభు - శ్రీలక్ష్మి శైలజ
మనుమలు-మనుమరాళ్ళు : ఎ. శ్రీలలిత సంజన, ఎ. సాయి శశిధర్
కుమార్తె: బాల చంద్రకళ - అల్లుడు: కోనూరు ఫణిసాయి శివ శ్రీనివాస్
మనుమలు-మనుమరాళ్ళు : కె. శ్రీకర్, కె. శ్రుతి
మరియు బంధుమిత్రులు, జ్యోతిష్య మిత్రులు, అభిమానులు, శిష్యులు - ప్రశిష్యులు

శ్రద్ధాంజలి



కీ॥శే॥ తాతినేని గోపయ్య గారు, పోరంకి
57వ వర్ధంతి సందర్భముగా మీ పేరు ఆచంద్రతారార్కం నిలిచివుండేలా
పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ మీ సంస్మరణలో ముందుకు సాగుతున్నాము...
- తాతినేని కోటేశ్వరమ్మ
డా॥ తాతినేని సత్యనారాయణ (లేటు) - సత్యవతి (లేటు)
డా॥ తాతినేని గోపినాథ్ - సౌజన్య
తాతినేని శ్రీసత్య దేవాన్ష్
చెరుకూరి శరత్‌చంద్రబోస్ - భాగ్యలక్ష్మి
డా॥ పర్వతనేని కిషోర్‌బాబు - డా॥ గోపికాలక్ష్మి
పర్వతనేని ధ్రితిశ్రీ, రిషిక్ సాయి
ప్రిన్సిపాల్, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది
SRI KRISHNAVENI EDUCATIONAL INSTITUTIONS
TATINENI GOPAIAH MEMORIAL EDUCATIONAL ACADEMY
PORANKI, VIJAYAWADA, Ph : 0866 - 2581117, 9246837117
34 Years

(c) eenadu

ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత ప్రవేశాలు

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కార్యాలయం

నాలుగు ట్రిపుల్ ఐటీల్లో మిగులు సీట్లు 600

వేంపల్లె, న్యూస్‌టుడే

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆర్కే ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 600 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి విద్యార్థుల మెరిట్ జాబితాను తయారు చేసి ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి మొత్తం 4400 సీట్లు ఉన్నాయి. ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1100 సీట్లు ఉండగా దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ కోటా కింద 360 సీట్లు పోను నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1010 చొప్పున 4040 సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలలో ఉన్న సీట్లకు మెరిట్ జాబితా విడుదల చేసి జూన్ 30 నుంచి జులై 5వ తేదీ వరకు ఇడుపులపాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేశారు. కౌన్సెలింగ్ తర్వాత ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 878 సీట్లు భర్తీ కాగా 132 సీట్లు మిగిలిపోయాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలో 1010కి 869 భర్తీ కాగా 141 సీట్లు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 867 భర్తీ కాగా 143, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు 826 సీట్లు భర్తీకాగా 184 సీట్లు మిగిలాయి. ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో జాప్యం, ఇక్కడి విద్యపై ఆసక్తి లేని కారణంగా చాలా మంది విద్యార్థులు ప్రైవేటు జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడంతో 600 సీట్లు ఖాళీ ఏర్పడింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ కేంద్రంగా రెండో విడత ప్రవేశాలకు సంబంధించిన రెండో జాబితాను అధికారులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

11, 12 తేదీల్లో రెండో విడత ప్రవేశాల జాబితా

ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలలో మిగిలిపోయిన 600 సీట్ల భర్తీకి తదుపరి మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 11, 12 తేదీల్లో వెబ్‌సైట్‌లో వెల్లడిస్తాం. ఈ మేరకు రెండో విడత జాబితా విడుదల చేసి తదుపరి ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. ఆ లోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తాం. - ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ

విద్యుత్తు బిల్లులకు చెక్..!

పరిశ్రమల్లో కెపాసిటర్లు సరిచూసుకోండి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే

☛ విజయవాడ నగర శివారులోని పిండి మరకు ప్రతి నెలా రూ.6వేల విద్యుత్తు బిల్లు వచ్చేది. జూన్‌లో ఒక్కసారిగా రూ.26వేలు రావడంతో యజమాని లబోదిబోమన్నారు. అధికారుల వద్దకు పరుగులు తీస్తే.. కెపాసిటర్ లేకపోవడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైందని చెప్పి సరిచేశారు.

☛ గవర్నర్‌పేటలోని ఒక బంగారు దుకాణం యజమాని అవసరం లేకపోయినా కెపాసిటర్ పెట్టుకున్నారు. ఆయన లోడ్ 1.5 కేవీఏ అయితే.. కెపాసిటర్ పెట్టుకుంటే సరిపోతుంది. ఎలక్ట్రీషియన్ మాటలు విని అవసరం లేకపోయినా 6 కేవీఏఆర్ కెపాసిటర్ పెట్టేశారు. నెల నెలా రూ.20వేలు వచ్చే బిల్లు రూ.70వేలు అయ్యింది.

... ఈ రెండు ఉదాహరణల్లో విద్యుత్తు బిల్లులు ఎక్కువ రావడానికి కారణం కెపాసిటర్లే. ఒకరికి కెపాసిటర్ లేక బిల్లు ఎక్కువ వస్తే.. మరొకరు అవసరం కన్నా ఎక్కువ కెపాసిటర్ పెట్టుకుని బిల్లు ఎక్కువ వచ్చేలా చేసుకున్నారు.

మన వాడుకభాషలో చెప్పాలంటే.. వినియోగించే విద్యుత్తును నియంత్రించే ఉపకరణమే కెపాసిటర్. పరిశ్రమలు, హీటర్లు, లిఫ్టులు ఎక్కువగా ఉండే సంస్థల్లో, ఒకటి రెండు మోటార్లు వినియోగించే చిన్న చిన్న కర్మాగారాల్లో కెపాసిటర్‌ను బిగించుకోవాలి. మోటార్లు ఆన్‌చేయగానే కావాల్సిన దాని కన్నా అధిక విద్యుత్తును తీసుకుంటాయి. అక్కడ కెపాసిటర్ పెట్టుకుంటే.. అధికంగా తీసుకునే విద్యుత్తును నియంత్రిస్తుంది. పెట్టుకోకపోతే కావాల్సిన దాని కన్నా ఎక్కువ విద్యుత్తును తీసుకుంటుంది. ఇలా నాలుగైదు సంస్థలు ఎక్కువ విద్యుత్తును వాడేస్తే.. దాని పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై భారం పడుతుంది. తద్వారా గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతుంది. ఒక్కోసారి ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజులు పోయే అవకాశం ఉంది. కెపాసిటర్ లేని వారికి ఇలా అదనంగా వాడేసే విద్యుత్తుతో పాటు పెనాల్టీ పడిపోతుంది. సాధారణంగా వచ్చే బిల్లు కన్నా అదనంగా మూడు రెట్లు వరకు బిల్లు వస్తుంది.

పిండిమరకు వాడుతున్న కెపాసిటర్

ఏపీఈఆర్‌సీ నిబంధనల ప్రకారం..

విద్యుత్తు నియంత్రణ మండలి 2022 సంవత్సరంలో కొత్త నిబంధనలు తెచ్చింది. దీని ప్రకారం కెపాసిటర్‌ను పరిమితికి మించి ఎక్కువ పెట్టుకున్నా.. అపరాధ రుసుము విధించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనివల్ల బిల్లులు రావడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. దీనిని గమనించిన అధికారులు.. పరిమితి మించి కెపాసిటర్ పెట్టుకున్నవారిని గుర్తించి మార్పిస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ

నగరంలో ప్రతి నెలా వాణిజ్య, పారిశ్రామిక కనెక్షన్లకు, అధిక విద్యుత్తు వినియోగించే సంస్థల బిల్లులు.. అధికారుల దగ్గరకు నమూనా చేసి ఇస్తారు. ఎవరైనా కెపాసిటర్ పెట్టుకోకపోయినా, అదనపు కెపాసిటర్ పెట్టుకున్నా.. తగిన సూచనలు చేస్తున్నారు. భవిష్యత్తులో వచ్చే ఇబ్బందుల నుంచి వివరిస్తున్నారు. సాధారణంగా కెపాసిటర్ సామర్థ్యం బట్టి రూ.500ల నుంచి రూ.10వేల వరకు ఉంటుంది. ఆటో పరిశ్రమలకు వినియోగించే ఆటోమేటిక్ కెపాసిటర్ అయితే రూ.30వేల నుంచి రూ.60వేల వరకు ఉంటుంది. ఈ ఖర్చు పెట్టుకుంటే.. బిల్లులు నియంత్రణలోనే ఉంటాయి. తడిచి మోపెడయ్యే పరిస్థితి రాదు. ఎవరికైనా ఈ అంశంలో సందేహాలుంటే.. వారు తమ ప్రాంత విద్యుత్తు ఏఈని సంప్రదించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

లారీ.. ట్రాక్టర్ ఢీ

ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

వేణు (పాతచిత్రం)

వత్సవాయి, న్యూస్‌టుడే: వత్సవాయి ప్రధాన రహదారిలో ఆదివారం తెల్లవారుజామున లారీ.. ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై ఉమామహేశ్వరరావు వివరాల మేరకు.. వత్సవాయికి చెందిన ముఠా కార్మికులు మునేరు నుంచి ఇసుక రవాణా చేసేందుకు ఆదివారం తెల్లవారుజామున ట్రాక్టర్‌తో బయలుదేరారు. వత్సవాయి ప్రధాన రహదారిలోని హోటల్ వద్ద టీ తాగేందుకు ఆగారు. అంతలో వెనుకగా వస్తున్న లారీ ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ప్రమాదంలో ట్రాక్టర్ ట్రాక్ పక్కకు పడిపోవడంతో దాని కింద పడిన చల్లా వేణు (25) అక్కడికక్కడే మృతిచెందాడు. బాలు, చల్లా రాముడు, రాంబాబుకు గాయాలు కావడంతో స్థానికులు జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. వీరిలో బాలును మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి పంపారు. చల్లా వేణుకు భార్య, ఏడాదిలోపు వయసున్న కుమారుడు ఉన్నాడు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాపు రిజర్వేషన్ల సాధనకు మరో ఉద్యమం

విజయవాడ (గాంధీనగర్): రాష్ట్రంలో అన్నివిధాలా వెనుకబడి ఉన్న కాపు కులస్థుల రిజర్వేషన్ల కోసం మరో ఉద్యమం చేపడుతున్నట్లు రాష్ట్ర కాపు ఐకాస అధ్యక్షుడు చందు జనార్దన్ తెలిపారు. కాపులు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్యాచరణ రూపొందించేందుకు ఐకాస ఆధ్వర్యంలో వివిధ కాపు సంఘాల నేతలు, రాధా, రంగా మిత్రమండలి నాయకులు, ఉద్యమకారులు విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చందు జనార్దన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో ఉన్న కాపులు విద్య, ఉపాధి, రాజకీయపరంగా పూర్తిగా వెనుకబడి ఉన్నారని వాపోయారు. కాపు, తెలగ, ఒంటరి కులాలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కృష్ణా జిల్లాకు దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని, కాపు కార్పొరేషన్‌కు ప్రతి సంవత్సరం రూ.3 వేల కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు

మాగల్లులో శునకానికి టీకా వేస్తున్న డాక్టర్ సాగరిక

నందిగామ, న్యూస్‌టుడే: ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శునకాలు, పిల్లులకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. నందిగామ పశువైద్యశాలలో ఆదివారం స్థానిక పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ కృష్ణకుమారి టీకాలు వేయడాన్ని ప్రారంభించారు. పశువైద్యశాఖ ఉపసంచాలకుడు మోజెస్ వేస్లీ మాట్లాడుతూ.. పశువులు, పెంపుడు జంతువుల నుంచి మశూచి, గాలికుంటు, రేబిస్, యాంత్రిక్స్, తామర, బ్రూసెల్లోసిస్, క్షయ వంటి వ్యాధులు సంక్రమిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు, నాయకులు పాల్గొన్నారు.

చందర్లపాడు: చందర్లపాడు, ముప్పాళ్ల, తోటరావులపాడు పశువైద్యశాలల్లో ప్రపంచ జునోసిస్ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెంపుడు జంతువులైన కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేశారు. వైద్యాధికారులు ప్రదీప్, నీరజ, అర్చన, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నందిగామ గ్రామీణం: మాగల్లు పశువైద్యశాలలో ఆదివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పశువైద్యాధికారిణి సాగరిక పెంపుడు శునకాలకు టీకాలు వేశారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

జుజ్జూరులో ముస్లిం యువకుల సందడి

జుజ్జూరు(వీరులపాడు), న్యూస్‌టుడే : ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే మొహర్రంను ఆదివారం ముస్లిం సోదరులు నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త మనుమడు ఇమామ్ హుస్సేన్ బలి దానానికి గుర్తుగా మొహర్రంను ప్రతి ముస్లిం సోదరుడు చేసుకుంటారని మత పెద్దలు తెలిపారు. జుజ్జూరు మసీదు వద్ద.. వీరులపాడు, వెల్లంకి గ్రామాలలో నిర్వహించిన వేడుకల్లో స్థానిక ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పీర్ల ఊరేగింపు

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో పీర్ల పండగను ఆదివారం ముస్లిం సోదరులు నిర్వహించారు. స్థానిక భారత్ టాకీస్ రోడ్డులోని పీర్ల చావిడి వద్ద పండుగకు భారీగా భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీర్లను స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, ముస్లిం నాయకులు దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. భారీ అన్నదానాన్ని కృష్ణకుమారి ప్రారంభించారు. స్థానిక గాంధీసెంటర్‌లో యువకులు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ కరీముల్లా, భవన నిర్మాణ కార్మికుల సంఘ అధ్యక్షుడు షేక్ ఫిరాన్, నిర్వాహకులు సమీర్, అబ్బాస్‌ఆలీ, జమీర్, నాగుల్‌మీరా పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ ఇమామ్‌జానీ, తెదేపా పట్టణ అధ్యక్షుడు యేచూరి రామకృష్ణ, కార్యదర్శి కాసర్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనసంద్రం.. జగన్మాత క్షేత్రం

తొలి ఏకాదశి సందర్భంగా పోటెత్తిన భక్తులు

కనకదుర్గమ్మకు సారె సమర్పిస్తున్న మహిళలు

ఇంద్రకీలాద్రి: జగన్మాత కొలువైన ఇంద్రకీలాద్రికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడం, తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఆషాఢ సారె తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. దుర్గగుడి ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ మెట్ల మార్గం ఉదయం నుంచి భక్తుల వాహనాలతో కిటకిట లాడాయి. రికార్డుస్థాయిలో 80వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. ఉదయం నుంచి దేవస్థానంలో సేవా సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులు, అదనపు విధులు కేటాయించిన అధికారులు మధ్యాహ్నం మూడు గంటల వరకు భక్తులను నియంత్రించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వాహనాలు నిలిపేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

శాకంబరి ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు

దాతలు ఇచ్చిన కూరగాయలు పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఈనెల 8 నుంచి 10 వరకు నిర్వహించనున్న శాకంబరి ఉత్సవాలకు ఏర్పాట్లను ఆదివారం ముమ్మరం చేశారు. ఆలయప్రాంగణంలో కూరగాయలు, పండ్లు దండలు కట్టేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల ముడు రోజులకు 20టన్నుల కూరగాయలు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే దాతలు, రైతులు ఇచ్చిన కొన్ని కూరగాయల మూటలను తీసుకువచ్చి మల్లికార్జునమహామండపంలో ఉంచారు. వాటిని ఈవో శీనానాయక్ పరిశీలించారు. 7వ తేదీ రాత్రికి కూరగాయల దండలు కట్టేందుకు మూడు షిఫ్టుల్లో 300 మంది మహిళలను నియమించారు. నిమ్మ, టమాట, దోస, బెండ, వంకాయ, బంగాళదుంప, క్యారెట్ వంటి కూరగాయలతోపాటు ఆకుకూరలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ కూడా అమ్మవారి అలంకరణకు వినియోగిస్తారు.

దుర్గగుడి మార్గంలో ఆటోల నిషేధం

విద్యాధరపురం: శాకంబరి ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 8, 9, 10 తేదీల్లో దుర్గగుడి మార్గంలో ఆటోలను నిషేధించినట్లు వన్ ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి గుడి సమీపంలోని కుమ్మరిపాలెం, సీతమ్మ వారి పాదాలు, గద్ద బొమ్మ సెంటర్ల నుంచి ఘాట్ రోడ్డు వైపునకు ప్రవేశం లేదన్నారు. మల్లికార్జున మహామండపం నుంచి కెనాల్ రోడ్డులో ఆటోలకు ప్రవేశం లేదని ఈవిషయాన్ని ఆటో డ్రైవర్లు గుర్తించి పోలీసులకు సహకరించాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తగ్గించండి

మాట్లాడుతున్న విద్యాసాగర్. వేదికపై ప్రసాద్, రమణ, హేమంత్‌కుమార్‌రెడ్డి, వెంకటాద్రి తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తగ్గించాలని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ కోరారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పంచాయతీ రాజ్ కార్యదర్శుల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మరింత జాప్యం చేయకుండా సత్వరమే వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. స్పెషల్ గ్రేడ్ పంచాయతీ అధికారులను.. పంచాయతీ కార్యదర్శుల నుంచే నియమించేలా చర్యలు తీసుకోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. రోజురోజుకూ పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు సమయపాలనలో మార్పులు చేయాలని, వీడియో కాలింగ్ చేస్తున్న విధానాన్ని తొలగించాలని కోరారు. గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వం ఇస్తున్న రూ.6వేల వేతనం చాలకపోవడంతో కార్యదర్శులు అదనంగా చెల్లించాల్సి వస్తోందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలన్నా.. రహదారుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నా.. దానికి అవసరమైన యంత్రాలు ఇవ్వాలని కోరారు. మొత్తం 6 గ్రేడ్లుగా ఉన్న పంచాయతీ కార్యదర్శులను మూడు గ్రేడ్లుగా చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.వి.డి.ప్రసాద్ మాట్లాడుతూ.. ఇటీవల పంచాయతీ కార్యదర్శుల పదోన్నతులు అవినీతిరహితంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. పంచాయతీ వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలు గ్రామాల అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. పని గంటల విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.వి.రమణ, పంచాయతీ కార్యదర్శులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.టి.వి.రమణ, ఉపాధ్యక్షుడు హేమంత్ కుమార్‌రెడ్డి, కోశాధికారి కె.వెంకటాద్రి, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ దేవాలయంలో వైభవంగా పూజలు

శాకంబరిగా తిరుపతమ్మ, గోపయ్య స్వాములు

సీతారాముల ఉత్సవ మూర్తులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం తొలి ఏకాదశిని పురస్కరించుకొని పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవాలయంలో ఆదివారం శాకంబరి పూజలు వైభవంగా నిర్వహించారు. సుమారు 20 టన్నుల కూరగాయాలు, ఆకుకూరలు, ఫలాలతో తిరుపతమ్మ, గోపయ్య స్వాములతో పాటు, ఆలయంలో కొలువై ఉన్న గ్రామదేవతలు, సీతారాముల ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు.. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని రైతులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఉత్సవాల్లో ప్రత్యేకమైన కదంబ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ జె.శ్రీనివాసరావు, ఈవో కిశోర్‌కుమార్, ఈఈ రమాదేవి, ఏఈవో జంగం శ్రీనివాస్, ఏఈలు రాజు, అరవింద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ నియోజకవర్గ కమిటీ ఎన్నిక

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట నియోజకవర్గం సీపీఐ కమిటీ ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో కమిటీ ప్రతినిధుల పేర్లను ప్రకటించారు. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా అంబోజి శివాజీ, కార్యదర్శులుగా కనకపూడి బాబూరావు, పోతుపాక వెంకటేశ్వర్లు, సభ్యులుగా జూనెబోయిన శ్రీనివాసరావు, నీలకంఠం శివప్రసాద్, వల్లంకొండ బ్రహ్మం, పొన్నం నరసింహారావు, పద్మాల వెంకటేశ్వర్లు, కటారపు కన్నయ్య, గొర్రెపాటి కుమారి, మెటికల శ్రీను, కరిసే మధు, షేక్ జానీలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 110, 118, 129 చికెన్ విత్ స్కిన్ - 210 చికెన్ స్కిన్‌లెస్ - 220.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 570 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

గొల్లమూడిలో పుష్పాలంకరణలో శంభులింగేశ్వరస్వామి

గుడిమెట్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

నందిగామ గ్రామీణం, జగ్గయ్యపేట, చందర్లపాడు, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పలు దేవాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. నందిగామ ముక్కోటి మండపంలో రామాయణ ప్రవచనాన్ని కాసుల రాధాకృష్ణశర్మ పారాయణం చేశారు. నిర్వాహకులు డి.వెంకట రత్నమాచార్యులు, డి.ధన్వంతరి, అధోక్షజా చార్యులు తదితరులు పాల్గొన్నారు. ✦ స్థానిక రామలింగేశ్వరస్వామి దేవాలయం, సాయి అయ్యప్ప దేవాలయం, గీతామందిరాల్లో పూజలు నిర్వహించారు. పల్లగిరిపై కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం, త్రిశక్తి మందిరాలను భక్తులు దర్శించుకున్నారు. ✦ గొల్లమూడి శివాలయంలో శంభులింగేశ్వర స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ✦ మాగల్లు 108 అడుగుల లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ✦ గుడిమెట్ల సమీపంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందర్లపాడు, పొక్కునూరు, కాసరబాద, ముప్పాళ్ల, కోనాయపాలెం గ్రామాల్లోని దేవస్థానాల్లో ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. ✦ జగ్గయ్యపేట ప్రాంతంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పట్టణంలోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. తిరుమలగిరి స్వయంభూ వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయానికి వేలసంఖ్యలో ఇరు తెలుగు రాష్ట్రాల భక్తులు తరలివచ్చారు. ముక్త్యాలలోని ఉత్తరవాహిని క్షేత్రంలో పెద్ద సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు నదిలోని పురాతన ముక్తేశ్వరునికి, గ్రామంలోని భవాని ముక్తేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్నారు.


మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని విశ్వాసము కాపాడుకొంటిని : 2 తిమోతి 4:7.8

ఆదరణ కూడిక

మహోన్నతమైన వ్యక్తిత్వం, కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించి, ఆదర్శవంతమైన జీవన విధానంతో అందరి మన్ననలు పొందిన కళామతల్లి ముద్దుబిడ్డ, యడవల్లికి గురజాడ సాహిత్య పురస్కారం పొందిన కీ॥శే॥ పోపూరి పుల్లయ్య గారి మరణం మాకు తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ ప్రభువుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ పోపూరి పుల్లయ్య గారు
తుర్లపాడు, చందర్లపాడు మండలం
జననం: 01-01-1953 - మరణం: 29-06-2025

భార్య: పోపూరి వెంకటరావమ్మ

కుమారులు	కోడళ్ళు
పోపూరి వంశీ	- అనమ్మ
పోపూరి బోస్‌బాబు	- సుకీర్తి
పోపూరి సురేష్	- స్నేహ

కుమార్తె: బిక్క మారతమ్మ-దిబ్బారావు (లేటు)

ఆదరణ కూడిక: ది: 07-07-2025 సోమవారం ఉ॥ 10 గంటలకు చందర్లపాడు మండలం, తుర్లపాడు గ్రామంలో మా స్వగృహమునందు జరుగును. కావున తెలియజేయడమైనది. ✆ 81063 98967

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి

న్యూస్‌టుడే బృందం: వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన పోరాటం చరిత్రలో శాశ్వతంగా నిలిచి పోతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట గ్రామీణం: నివాళులు అర్పిస్తున్న ఉదయభాను

పెనుగంచిప్రోలులో ..

కేతవీరునిపాడులో..

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

FINANCIAL SERVICES

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలలోపు ఫైనాన్స్ చేయబడును. అన్ని తరగతుల వారు బ్యాంకులో స్థిరాస్తిపై లోన్ తీసుకున్న వారికి Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్‌లోన్ చేయబడును. ✆ 96665 47338.

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్సియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

MARRIAGE SERVICES

FUNCTION HALLS

Rs.300/- Per plate, A/c Function Hall for Marriages, Receptions, Engagement, Birthday Celebrations with capacity of 50 to 600 Nos. Hotel Kosala, Eluru Road, Governorpet, Vijayawada. Contact: 88855 32877, 88855 32655.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

REAL ESTATE

A.P. రాజధాని అమరావతిలో ల్యాండ్ పూలింగ్‌లో గజం 5000/-, కాజాలో గజం 10,000/-, అమరావతిలో గజం 7000/-, మంగళగిరిలో గజం 12000/- 96035 30555.

HOUSE FOR SALE

మచిలీపట్టణం- ఇంగ్లీష్ పాలెంలో ఇండిపెండెంట్ House అమ్మకానికి కలదు. కావలసిన వారు ఈ క్రింది నంబరుకు సంప్రదించగలరు. నో మీడియేటర్స్, డైరెక్ట్ కస్టమర్స్ ఓన్లీ ✆ 9346741252.

PLOT FOR SALE

CRDA అప్రూవల్‌తో లోబడ్జెట్‌లో Open Plots అమ్మకానికి కలవు. పరిటాల, కంకిపాడు, సూరంపల్లి, నూజివీడు, వీరవల్లి దగ్గర. స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 90309 56555.

JOBS

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. బో+వ+మంచి జీతం+ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

Wanted Lady Teachers LKG to 5th All Subjects & 6th to 10th : N.S, P.S, Hindi. ★ Ideal (EM) High School, Ratnamamba St., Mogalrajpuram. ✆ 95023 59059.

త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 85209 80099, 85208 74499.

రిలయన్స్ స్టోర్స్: విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం - ఏరియాలో పనిచేయుటకు అనుభవమున్న ఎలక్ట్రీషియన్స్ కావలెను. Q: I.T.I./ డిప్లొమా, ఎలక్ట్రికల్ మాత్రమే. ✆ 99495 51172, 98660 61501.

ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థకు ఫైనాన్షియల్ అడ్వైజర్‌గా/ బిజినెస్ పార్టనర్‌గా పార్ట్/ ఫుల్ టైం వర్క్ చేయుటకు స్త్రీ/పు అభ్యర్థులు కావలెను ✆ 62699 79999/ 90105 97707.

వర్క్ ఫ్రం హోమ్ డేటా ఎంట్రీ: ప్రముఖ ఔట్‌సోర్సింగ్ సంస్థ నందు ఇంటి వద్ద ఉండి పార్ట్/ ఫుల్ టైం ప్రాజెక్ట్ వర్క్ చేయుటకు Laptop/Desktop, స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు కావలెను. ✆ 87126 36572

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందిస్తున్న భక్తులు

శివాలయానికి విరాళం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేటలోని పాలేటి ఒడ్డున ఉన్న అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరాలయానికి చేపట్టిన కృష్ణాశిలా దేవాలయ నిర్మాణానికి జగ్గయ్యపేటకు చెందిన తుమ్మపల్లి ముత్తయ్య, లక్ష్మీ దంపతులు ఆదివారం రూ.1,11,116 విరాళంగా అందించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు నీలిశెట్టి వాసు, సంకాభాస్కర్ తదితరులు వారి నుంచి చెక్కును అందుకొని రశీదు, ప్రసాదం అందజేశారు.

శాకంబరి పూజలకు కూరగాయల వితరణ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయంలో నిర్వహించిన శాకంబరి పూజలకు అవసరమైన ఫలాలు, కూరగాయలు సమకూర్చిన దాతలను జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను అభినందించారు. ఆదివారం ఆలయానికి వచ్చిన ఆయన శాకంబరికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దాతలను అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించారు. తెలంగాణలోని మధిరకు చెందిన గురుస్వామి తోక కృష్ణ దాతల సహకారంతో 20 క్వింటాళ్ల కూరగాయలు అందజేసినట్లు ఆలయ అర్చకులు ఉదయభానుకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ప్రధాన అర్చకుడు గోపిబాబు, అర్చకులు సూరిబాబు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

వత్సవాయి, జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం మండలంలోని దబ్బాకుపల్లి, పెంటాలవారిగూడెంలో నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఏడాది పాలనలో అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ.. ఏడాది కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధి పరుగులు తీస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి జొన్నలగడ్డ రాధాకృష్ణమూర్తి, తెదేపా మండల అధ్యక్షుడు వడ్లముడి రాంబాబు, నాయకులు పెంటాల శ్రీనివాసరావు, శ్యామ్, రామారావు, వెంకటేశ్వరరావు, నవీన్, ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు. ● జగ్గయ్యపేట పట్టణంలోని 16వ వార్డులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని చెప్పారు. అనంతరం ప్రభుత్వ పథకాల వివరాలను తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. కౌన్సిలర్ ఎన్.వెంకట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మేకా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలతో కలిసి గోడ పత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

కూటమితోనే రాష్ట్రంలో ప్రగతి పథం

వృద్ధురాలికి కరపత్రాలు అందిస్తున్న కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ రఘురాం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని వేదాద్రి గ్రామంలో జిల్లా తెదేపా అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అధోగతికి గురైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రాష్ట్రం ప్రగతిపథంలోకి అడుగు పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో కట్టా వెంకటనరసింహారావు, ముల్లంగి రామకృష్ణరెడ్డి, బాణావతు రవి, జగజ్జీవన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చందర్లపాడు: బొబ్బెళ్లపాడు, తుర్లపాడు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని తెదేపా నాయకులు ఆదివారం నిర్వహించారు. ఎన్ఎస్పీ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి ఏడాదిలో చేపట్టిన పనులు వివరించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం పెనుగంచిప్రోలులోని తూర్పు బజార్‌లో నిర్వహించారు. తెదేపా మండల అధ్యక్షుడు చింతల సీతారామయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు.

నందిగామ గ్రామీణం: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెదేపా రాష్ట్ర కార్యదర్శి యలగాల నూకానమ్మ తెలిపారు. ఆదివారం కేతవీరునిపాడులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు.

దేశ నిర్మాణంలో స్థానిక సంస్థలే కీలకం

హరియాణా గవర్నరు దత్తాత్రేయకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఛైర్‌పర్సన్ కృష్ణకుమారి

నందిగామ, న్యూస్‌టుడే: దేశ నిర్మాణంలో స్థానిక సంస్థలదే కీలక పాత్ర అని స్థానిక పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి తెలిపారు. భారత పార్లమెంట్, హరియాణా ప్రభుత్వం సహకారంతో జాతీయ స్థాయిలో గురుగ్రామ్‌లో ఈనెల 3, 4 తేదీల్లో నిర్వహించిన రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర అనే అంశంపై సదస్సుకు ఏపీ నుంచి నందిగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్ కృష్ణకుమారి హాజరై తిరిగి వచ్చారు. ఈసందర్భంగా ఆదివారం ఆమె నందిగామలో మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులపై అన్ని విషయాల్లోనూ బాధ్యత ఉందని చెప్పారు. సదస్సులో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసి మాట్లాడడం ఆనందంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యల ఆధ్వర్యంలో నందిగామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

'సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తాం'

మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

నందిగామ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నందిగామలో పురపాలక సంఘ ఇంజినీరింగ్ కార్మికులు వినూత్న నిరసన తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు చేతిలో ప్లేట్, చెవిలో పువ్వులు పెట్టుకుని ఆందోళన చేశారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కోట కల్యాణ్ శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, ఉద్యోగ విరమణ అనంతరం ప్రయోజనాలు కల్పించాలని కోరారు. ఈనెల 12 లోపు సమస్యలు పరిష్కరించకపోతే అదే రోజు అర్ధరాత్రి నుంచి సమ్మె చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.గోపాల్, సంఘ అధ్యక్షుడు పి.రవి, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ప్రతినిధులు కె.శ్రీను, డి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు **EVERGREENS R HEIGHTS, rep. by its Managing Partner, Mandali Baby Rama Krishna and others** వారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని బొల్లా మరియమ్మ గారు క్రయం పొంది, ది. 05-10-1998న శ్రీ కంచికచర్ల సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో దస్తావేజు నెం. 1866/1998 రుగా రిజిస్టరు చేయించుకొని అనుభవించుచున్నారు. వారికి చెందిన షెడ్యూలు దాఖలా ఆస్తిని నా క్లయింటు క్రయము పొందుటకు నిర్ణయించు కొనియున్నారు. కావున సదరాస్తిపై, ఎవరికి ఎటువంటి ఆక్షేపణలు గాని, వాజ్యములు గాని, వివాదములుగాని మరియే ఇతర అభ్యంతరములు యున్ననూ, యీ ప్రకటన తేది నుండి 10 రోజులలోగా వ్రాత పూర్వకముగా రిజిస్టరు పోస్టుద్వారా యీ క్రింద చిరునామాకు తెలియ జేయవలెను. ఆపై వచ్చు క్లయిములు నా క్లయింటును బైండు చేయజాలవు.

షెడ్యూలు : కృష్ణా జిల్లా, శ్రీ కంచికచర్ల సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా కీసర గ్రామ పంచాయితీ ఏరియాలోని కీసర గ్రామ సర్వే నెం. 151 రు దాఖలా యం. 1.00 సెంట్లు భూమికి హద్దులు : తూర్పు : గారపాటి శేరోజమ్మ గారి భూమి, దక్షిణం : గారపాటి వీరనాగులు, పడమర : బొల్లా కుమారి గారి భూమి, ఉత్తరం : కారం ఏసుపాదం, యీ హద్దుల మధ్య యం. 1.00 సెంట్లు భూమిన్నీ మరియు అందలి యావత్తు ఈజ్‌మెంటు హక్కులతో సహా.

ఇట్లు,
వి.వి.పి. ధర్మారాయుడు, అడ్వకేటు
లోటస్ ల్యాండ్ మార్క్, సెక్టార్-1, రోడ్డు నెం. 6,
హౌస్ నెం. 38, ఆయోధ్యనగర్, విజయవాడ - 520003
సెల్ నెం. 9849964983

ప్రకటన

నా క్లయింటు **EVERGREENS R HEIGHTS, rep. by its Managing Partner, Mandali Baby Rama Krishna and others** వారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని నంద్రు వరమ్మ గారు క్రయం పొంది, ది. 05-10-1998న శ్రీ కంచికచర్ల సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో దస్తావేజు నెం. [illegible]

ఇట్లు,
వి.వి.పి. ధర్మారాయుడు, అడ్వకేటు
సెల్ నెం. 9849964983

ప్రకటన

నా క్లయింటు **EVERGREENS R HEIGHTS, rep. by its Managing Partner, Mandali Baby Rama Krishna and others** వారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని గారపాటి మరియమ్మ గారు క్రయం పొంది, ది. 23-01-1999న శ్రీ కంచికచర్ల సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో [illegible]

ఇట్లు,
వి.వి.పి. ధర్మారాయుడు, అడ్వకేటు
సెల్ నెం. 9849964983

ప్రకటన

నా క్లయింటు **EVERGREENS R HEIGHTS, rep. by its Managing Partner, Mandali Baby Rama Krishna and others** వారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూలు ఆస్తులను సంగీత బాలస్వామి గారు క్రయం పొంది, ది. 26-03-2008న శ్రీ కంచికచర్ల సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో [illegible]

ఇట్లు,
వి.వి.పి. ధర్మారాయుడు, అడ్వకేటు
సెల్ నెం. 9849964983

ప్రకటన

నా క్లయింటు **EVERGREENS R HEIGHTS, rep. by its Managing Partner, Mandali Baby Rama Krishna and others** వారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని సిద్దెల పరిశుద్ధమ్మ గారు క్రయం పొంది, ది. 05-10-1998న శ్రీ కంచికచర్ల సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో [illegible]

ఇట్లు,
వి.వి.పి. ధర్మారాయుడు, అడ్వకేటు
సెల్ నెం. 9849964983

ప్రకటన

నా క్లయింటు **EVERGREENS R HEIGHTS, rep. by its Managing Partner, Mandali Baby Rama Krishna and others** వారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని కలతోటి కుమారి గారు క్రయం పొంది, ది. 28-09-1998న శ్రీ కంచికచర్ల సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో [illegible]

ఇట్లు,
వి.వి.పి. ధర్మారాయుడు, అడ్వకేటు
సెల్ నెం. 9849964983

ప్రకటన

నా క్లయింటు **EVERGREENS R HEIGHTS, rep. by its Managing Partner, Mandali Baby Rama Krishna and others** వారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని బొల్లా కుమారి గారు క్రయం పొంది, ది. 05-10-1998న శ్రీ కంచికచర్ల సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో [illegible]

ఇట్లు,
వి.వి.పి. ధర్మారాయుడు, అడ్వకేటు
సెల్ నెం. 9849964983

ప్రకటన

నా క్లయింటు **EVERGREENS R HEIGHTS, rep. by its Managing Partner, Mandali Baby Rama Krishna and others** వారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని బీదం కృష్ణవేణి గారు క్రయం పొంది, ది. 06-10-1998న శ్రీ కంచికచర్ల సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో దస్తావేజు నెం. 1937/1998 రుగా రిజిస్టరు [illegible]

ఇట్లు,
వి.వి.పి. ధర్మారాయుడు, అడ్వకేటు
సెల్ నెం. 9849964983

ప్రకటన

నా క్లయింటు **EVERGREENS R HEIGHTS, rep. by its Managing Partner, Mandali Baby Rama Krishna and others** వారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా [illegible]

ఇట్లు,
వి.వి.పి. ధర్మారాయుడు, అడ్వకేటు
సెల్ నెం. 9849964983

గరుడాద్రి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తకోటి

గిరి ప్రదక్షిణలో భక్తజన సందోహం, ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఆషాఢ తొలి ఏకాదశి సందర్భంగా ఉపమాక వెంకన్న ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. కొండపై నిజరూపానికి, ఉత్సవ మూర్తులకు ప్రధానార్చకులు ప్రసాదాచార్యుల ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉత్సవ మూర్తులకు తిరుమంజన సేవ అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఉమ్మడి విశాఖతో పాటు కాకినాడ జిల్లా నుంచీ భక్తులు తరలివచ్చారు. కొండపైకి వెళ్లే మెట్ల మార్గం కిటకిటలాడింది. రాజయ్యపేటకు చెందిన వాసవీక్లబ్ ప్రతినిధులు బాదం పాలు పంపిణీ చేశారు. సాయంత్రం గిరి ప్రదక్షిణ వేడుకగా సాగింది. భారీగా తరలి వచ్చిన భక్తులతో అర్చకులు ప్రదక్షిణను ప్రారంభించారు. అనంతరం భక్తి పాటలు ఆలపిస్తూ భజనలు చేస్తూ గరుడాద్రి పర్వతాన్ని చుట్టివచ్చారు.

వ్యవసాయ ఉపకరణాల ప్రదర్శన 11న

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: వ్యవసాయాభివృద్ధే లక్ష్యంగా, రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చేరువ చేసే యత్నంలో భాగంగా ఈనెల 11న పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో ఆధునిక వ్యవసాయ ఉపకరణాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు సభాపతి అయ్యన్నపాత్రుడు ఆదివారం తెలిపారు. ఉపకరణాలు, యంత్ర పరికరాల వినియోగం, ప్రయోజనాన్ని అధికారులు, వ్యవసాయ సిబ్బంది వివరిస్తారన్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీతో వీటిని కొనుగోలు చేయవచ్చన్నారు.

సంస్కరణల్లో లోపాలు.. పిల్లల చదువులకు శాపాలు

దేవరాపల్లి, న్యూస్‌టుడే

క్షేత్రస్థాయిలో పూర్తి వనరులు లేకుండా తీసుకొచ్చిన సంస్కరణలతో చిక్కులు తప్పడం లేదు. గతంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానమూ ఇందుకు అతీతం కాదు. పాలకులు దృష్టిసారించకపోతే చిన్నారుల చదువులు అగమ్యగోచరంగా మారే ప్రమాదముంది. పాలకులు, విద్యా శాఖ యంత్రాంగం కలిసికట్టుగా ముందుకు సాగకపోతే పేద విద్యార్థులు ఉచిత విద్యకు దూరమయ్యే ఆస్కారముంది.

పిల్లలున్నారు.. పాఠశాల మూతపడింది : మారేపల్లి శివారు ఎస్.చేనులపాలెం గ్రామంలో పాఠశాల భవనాలున్నాయి. ఇక్కడ పిల్లలు లేరంటూ గత ప్రభుత్వం ఈ పాఠశాలను మూసేసింది. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయుడిని చింతలపూడి పాఠశాలకు పంపారు. అక్కడ్నుంచి మర్రివలస పాఠశాలకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఈ గ్రామంలో 8 మంది బడిఈడు పిల్లలున్నారు. పాఠశాలను పునఃప్రారంభిస్తే పిల్లల్ని బడికి పంపుతామని గ్రామస్థులు చెబుతున్నారు.

పాఠశాల మూతపడటంతో చదువుకు దూరమైన పిల్లలతో తల్లిదండ్రులు

బడి ఉంది.. బాలలు లేరు : కాశీపురం శివారు చంద్రయ్యపేటలో ప్రాథమిక పాఠశాల ఉంది. రెండు భవనాలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మించారు. ఏడాది కిందటి వరకు ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేశారు. ప్రస్తుతం ఒకరే ఉన్నారు. ఈ పాఠశాలలో ఇద్దరు పిల్లలుండే వారు. వారిలో ఒకరు గురుకుల విద్యాలయంలో చేరారు. మరో విద్యార్థి ప్రైవేటు పాఠశాలకు వెళ్లిపోయాడు. విద్యార్థులు లేకపోవడంతో ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయిని సంధ్యారాణిని తెనుగుపూడి పాఠశాలకు తాత్కాలికంగా పంపారు.

బడి ఉంది.. భవనం లేదు : చింతలపూడి శివారు నేరళ్లపూడిలో ప్రాథమిక పాఠశాల ఉండేది. భవనం శిథిలమవడంతోపాటు విద్యార్థులు నడిచి వెళ్లడానికి దూరమవుతుందన్న ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో ఈ పాఠశాలను బోడిగరువు గ్రామానికి మార్చారు. 31 మంది విద్యార్థులు చదువుతుండగా ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పాఠశాలకు భవనం లేకపోవడంతో వర్షం పడక పోతే రచ్చబండ మీద, వర్షం పడితే స్థానికంగా ఓ ఇంట్లో తరగతులు నిర్వహించాల్సి వస్తోంది.

ఓ ఇంటిలో విద్యార్థులకు పాఠం చెబుతున్న ఉపాధ్యాయుడు

ఊరిలో బడికి ఆటోలో..: దేవరాపల్లిలో ఎన్నో ఏళ్లుగా ప్రాథమిక పాఠశాల నడుస్తోంది. ఇటీవల కాలంలో ఈ పాఠశాలను 1, 2 తరగతులకు పరిమితం చేసింది. దీంతో ఇక్కడ చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థుల్లో కొందరు ప్రైవేటు పాఠశాలల్లో చేరగా, మిగతా వారు ఇదే గ్రామంలోని హరిజన చేరి పాఠశాలకు నెలకు రూ.600 ఆటోకి చెల్లించి వెళ్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..: జిల్లాలోని పాఠశాలల్లో సమస్యలను నివేదిక రూపంలో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శికి పంపాం. ప్రభుత్వ ఆదేశానుసారం నిర్ణయం తీసుకుంటాం.

– జి.అప్పారావునాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి, అనకాపల్లి

నకిలీ మకిలీ

అసలును తలదన్నేలా కల్తీలు

ఎలమంచిలి, న్యూస్‌టుడే

ఉమ్మడి విశాఖ జిల్లాలో నకిలీ మద్యం, సిగరెట్ల తయారీ యథేచ్ఛగా నడుస్తోంది. కంపెనీ బ్రాండ్లను తలపించేలా తయారు చేస్తున్నారు. ఎవరూ గుర్తించలేనంతగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం అధికారులను విస్మయానికి గురిచేస్తోంది. హైదరాబాద్ నుంచి స్పిరిట్ తదితర మత్తు పదార్థాలను దిగుమతి చేసుకుని పరవాడలో నకిలీ మద్యం తయారు చేసి అచ్యుతాపురం మండలంలో విక్రయిస్తున్నారు.

⏭ అచ్యుతాపురం పారిశ్రామికవాడను లక్ష్యంగా చేసుకుని అక్రమ మద్యం తయారీ ముఠాలు పనిచేస్తున్నాయి. గొలుసు దుకాణాల్లో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. ఏది అసలు మద్యం, ఏది నకిలీ అనేది తెలుసుకోలేనంతగా మార్కెట్‌ను ముంచెత్తుతున్నారు. అనకాపల్లి జిల్లాలో ఏసీ ప్రీమియం బ్లాక్ ఎక్కువ వినియోగంలో ఉంది. దీన్ని గమనించిన ముఠా ఈ బ్రాండ్ పేరుతో నకిలీ మద్యం తయారు చేసి విక్రయించడం ప్రారంభించారు. ఇద్దరు వ్యక్తులు పెద్ద ఎత్తున మద్యం రాకెట్ నడుపుతున్నారంటే వీరి వెనుక పెద్ద తలకాయలే ఉన్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గొలుసు దుకాణాలకు అచ్యుతాపురంలోని లైసెన్స్‌డ్ దుకాణాల నుంచే మద్యం సరఫరా అవుతోంది. వీరి కనుసన్నల్లోనే వ్యాపారం జరుగుతోంది. బయట నుంచి మద్యం వచ్చిందని తెలిస్తే వీరే దాడులు చేయిస్తారు. అలాంటిది లైసెన్స్‌డ్ దుకాణాల యజమానులు నకిలీ మద్యం విషయంలో చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

⏭ ఒడిశా నుంచి ముడి సరకు తెచ్చి విశాఖలో నకిలీ సిగరెట్లను ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. రూ.280 విలువ చేసే గోల్డ్‌ఫ్లాక్ ఫిల్టర్ సిగరెట్ ప్యాకెట్ దుకాణదారులకు రూ.80కే విక్రయిస్తున్నారు. ఈ విషయాన్ని ఐటీసీ ప్రతినిధులు గుర్తించి దుకాణాలపై దాడులు చేసి నకిలీ సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ రాకెట్ నడుపుతున్న వ్యక్తులను పీఎం పాలెం పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. అనకాపల్లి జిల్లాలోని పలు ప్రాంతాలకు నకిలీ సిగరెట్లు సరఫరా అవుతున్నట్లు సమాచారం.

స్వాధీనం చేసుకున్న స్పిరిట్ క్యాన్లు

⏭ అచ్యుతాపురంలో గతంలో నకిలీ మద్యం తయారు చేస్తూ దొరికిపోయిన వారున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పరవాడ కేంద్రంగా తయారీ ప్రారంభించి ఇక్కడ అమ్మకాలు చేపట్టారు. గతంలో ఇక్కడ చీప్ లిక్కర్‌ను ఖరీదైన లిక్కర్‌లో కలిపి మోసం చేసేవారు. ఇప్పుడు ఏకంగా తయారీనే ప్రారంభించారు. తాజాగా పట్టుబడిన నిందితుల్లో ఒకరు నకిలీ మద్యం అమ్మకాల కేసులో పాత నేరస్థుడిగా అధికారులు గుర్తించారు. వీరి వెనుక ఎవరున్నారన్న దానిపై పోలీసులు కూపీలాగుతున్నారు.

⏭ పరవాడ, అచ్యుతాపురంలలో పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. ఈ రెండు మండలాల్లో రికార్డు స్థాయిలో కార్మికులు పని చేస్తున్నారు. అమెరికాను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ మోసాలకు అచ్యుతాపురం వేదికగా మారింది. ఈ కేసు మరిచిపోక ముందే నకిలీ మద్యం కేసు తెరపైకి వచ్చింది. ఈ కేసులో ఎలమంచిలి ఎక్సైజ్ పోలీసులు రెండు రోజుల కిందట ఇద్దరి నిందితులను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.

అరికడతారా.. వెలకడతారా..!

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా కాలం చెల్లిన వాహనాలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. క్వారీ రాళ్లు, కంకర, మట్టి అధిక లోడుతో రయ్‌మంటూ దూసుకెళ్తున్నాయి. వీటిని కట్టడి చేయాల్సిన అధికారులు హెచ్చరికలకే పరిమితమవుతున్నారు. అడపాదడపా జరిమానాలు విధిస్తూ సరిపెడుతున్నారు. బడాబాబుల కనుసన్నల్లో మైనింగ్ జరుగుతుండటంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. లారీల్లోంచి బండరాళ్లు జారి పడుతుండటంతో వెనుక వచ్చే వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నెల ఒకటో తేదీ రాత్రి రాంబిల్లి శివారు ప్రాంతానికి చెందిన ఈరుగుల కృష్ణ అచ్యుతాపురం వైపు వెళ్తుండగా.. జంగాలపాలెం వద్ద బండరాళ్ల లోడు లారీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆయన కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు.

క్వారీ లారీల రాకపోకలతో రాంబిల్లి రహదారి ఇలా..

★ అనకాపల్లి, రావికమతం, రోలుగుంట మండలాల్లో రాతి క్వారీలు అధికంగా ఉన్నాయి. వాటి నుంచి పరిమితికి మించిన లోడుతో బండరాళ్లను లారీల్లో తరలిస్తున్నారు. ఒక టిప్పరు 25 టన్నుల రాళ్లనే తీసుకెళ్లాలి. ఇందుకు భిన్నంగా అధిక బరువుతో రేయింబవళ్లు వందల సంఖ్యలో లారీలు ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిలో అధిక శాతం లారీలు పొరుగు జిల్లాలు నుంచి వచ్చేవే ఉంటున్నాయి. వాటిని ఒక్కసారీ ఆపి అధికారులు తనిఖీలు చేయడం లేదు.

ఎలమంచిలిలో నంబర్ ప్లేటు లేకుండా వెళ్తున్న వాహనం

★ అచ్యుతాపురం పరిసరాల్లో రాత్రయితే రిజిస్ట్రేషన్ నంబర్లు లేని లారీల్లో మట్టిని తరలిస్తున్నారు. రాంబిల్లి పరిసరాల్లో చీకటి పడితే కొంత మంది ముఠాగా ఏర్పడి సమీపంలోని కొండలను, చెరువుల నుంచి ప్రైవేటు లేఅవుట్లకు మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

★ రవాణా శాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా క్వారీ రాళ్లు, మట్టి తరలిస్తున్న వాహనాలపై ఈ ఏడాది 293 కేసులు నమోదు చేశారు. లారీలు, ట్రాక్టర్ల యజమానుల నుంచి జరిమానా వసూలు చేసి వదిలేశారు. నిబంధనల ప్రకారం రెండుసార్లకు మించి పట్టుబడినా, కాలం చెల్లిన వాహనాలు రోడ్డెక్కినా వాటిని శాశ్వతంగా సీజ్ చేయవచ్చు. ఇప్పటివరకు ఒక్క వాహనాన్నీ అలా సీజ్ చేయలేదు. వాహనం పట్టుబడితే నిమిషాల్లో నేతల నుంచి ఫోన్లు వస్తుండటంతో.. కంటితుడుపుగా జరిమానా వేసి వదిలేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై జిల్లా రవాణా శాఖ అధికారి మనోహర్‌ను సంప్రదించగా.. 'అధిక లోడ్‌తో రాకపోకలు సాగించే లారీలపై కేసులు నమోదు చేస్తున్నాం. జరిమానా విధిస్తున్నాం. కాలం తీరిన వాహనాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తా'మని చెప్పారు.

యువతకు కువైట్‌లో ఉద్యోగావకాశాలు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మెన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఏపీ (ఓఎంసీఏపీ) థట్ రుయా http://thatruya.com/) భాగస్వామ్యంతో కువైట్‌లో నిర్మాణ రంగానికి సంబంధించి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు తెలిపారు. సిరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్, సీలింగ్ వర్క్స్‌లో ఐటీఐ/డిప్లమో చేసిన వారు అర్హులన్నారు. అభ్యర్థులకు 3-5 ఏళ్ల అనుభవం తప్పనిసరి, 25 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న పురుష అభ్యర్థులు రెండు సంవత్సరాల కాలపరిమితి ఉద్యోగాలకు ఈనెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి నెలకు 200 నుంచి 250 కువైట్ దీనార్లు (భారత కరెన్సీలో రూ. 56 వేల నుంచి రూ.70 వేల వరకు) వేతనం ఉంటుందన్నారు. వీసా, విమాన టికెట్లు, వైద్య సదుపాయాలు, నివాసం తదితర ఏర్పాట్లను కంపెనీ చూసుకుంటున్నారు. అభ్యర్థులు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్, ఐటీఐ/డిప్లమా సర్టిఫికెట్, అనుభవ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు http://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. బయోడేటాను skillinternational@apssdc.in కు మెయిల్ చేయవచ్చన్నారు. వివరాలకు హెల్ప్‌లైన్ నంబర్ 99888 53335కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు.

మరింత తగ్గిన ఆయిల్‌పామ్ ధర

రోలుగుంట, న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ ధర రెండు నెలలుగా పతనం దిశగా పయనిస్తోంది. దీంతో రైతుల్లో కలవరం మొదలైంది. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో భీమునిపట్నం, దేవరాపల్లి, అనకాపల్లి, ఎలమంచిలి, ఎస్.రాయవరం, పాయకరావుపేట, కోటవురట్ల, నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం. మాకవరపాలెం, రోలుగుంట, రావికమతం, చీడికాడ, మాడుగుల మండలాల్లో సుమారు ఐదు వేల హెక్టార్లలో రెండు వేల మంది రైతులు ఆయిల్‌పామ్ సాగుచేస్తున్నారు. దేశంలో నూనెగింజల ఉత్పత్తి ఆధారంగా ప్రతి నెలా 5వ తేదీన ధర నిర్ణయిస్తుంటారు. ఈ ఏడాది జనవరి మొదలు ఏప్రిల్ వరకు టన్నుకు రూ.20 వేల వరకు ధర పలకగా.. మే నుంచి తగ్గుతూ వస్తోంది. జూన్‌లో టన్ను రూ.18,760, జులై నెలకు సంబంధించి టన్నుకు రూ.17,370 ధరగా నిర్ణయించారు.

సచివాలయ భవనమే విద్యాలయం

సచివాలయంలో బాలలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: కోమళ్లపూడి పంచాయతీ బుదిరెడ్లపాలెంలో ప్రాథమిక పాఠశాలను గ్రామ సచివాలయ భవనంలో నిర్వహిస్తున్నారు. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉండటంతో వాటిని కూల్చేశారు. కొత్త భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. దీంతో పాఠశాలను పక్కనున్న సచివాలయ భవనంలోని ఓ గదిలోనే ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. అందరికీ ఒకేచోట పాఠాలు చెబుతుండటంతో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి పాఠశాలకు నిధులు మంజూరు చేసి భవనాలు నిర్మించాలని గ్రామస్థులు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇక్కడ 22 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారు.

పంటల సాగుకు పెట్టుబడి సాయం

'అన్నదాతా సుఖీభవ' అర్హులు 1.33 లక్షల మంది

ఈకేవైసీ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

నర్సీపట్నం, అచ్యుతాపురం, న్యూస్‌టుడే : అన్నదాతా సుఖీభవ పథకం అర్హుల జాబితా విడుదలైంది. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 1.33 లక్షల మంది లబ్ధిదారులుగా ఎంపికయ్యారు. జిల్లాలో 3.07 లక్షల మంది రైతులు ఉండగా రెవెన్యూ రికార్డుల్లో ఆధార్ సంఖ్యతో అనుసంధానమైన వారు 2.5 లక్షల మంది వరకు ఉన్నారు. 60-80 వేల మంది వరకు కౌలు రైతులు ఉన్నారు. వైకాపా ప్రభుత్వ పాలనలో వీరికి సాయం అందలేదు. కూటమి ప్రభుత్వం వీరికీ సాయం అందించాలని నిర్ణయం తీసుకుంది.

మూడు విడతల్లో రూ.14 వేలు : రైతులకు గతంలో కంటే అదనపు లబ్ధి చేకూరేలా కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయనుంది. వైకాపా సర్కారు హయాంలో రైతు భరోసా కింద రూ.13,500 అందజేశారు. ఇందులో పీఎం కిసాన్ కింద రూ.6 వేలు, అప్పటి ప్రభుత్వం 7,500 ఇచ్చింది. ఈ సొమ్ము రూ.20 వేలు చేస్తామన్న కూటమి ప్రభుత్వ హామీలో భాగంగా రూ.14 వేలు మూడు విడతల్లో అందించనుంది. దీనికి పీఎం కిసాన్ రూ.6 వేలు జత అయితే మొత్తం సాయం ముందుగా ప్రకటించిన విధంగా రూ.20 వేలు కానుంది.

10లోగా ఫిర్యాదు చేయాలి: చాలామంది రైతులకు భూములున్నా వెబ్‌ల్యాండ్‌లో వివరాలు సక్రమంగా లేవు. భూములకు ఆధార్ సంఖ్య అనుసంధానం కాకపోవడంతో వీరి వివరాలు అన్నదాత వెబ్‌పోర్టల్‌లో కనిపించడంలేదు. కొందరు రైతులు చనిపోవడంతో వారి వారసుల పేర్లు నమోదుకాలేదు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెబ్‌ల్యాండ్‌లో పేర్లను సరి చూసుకోవాలని అధికారులు చెబుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి ఈనెల 10 లోగా ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

23 వేల మంది సమాచారం పరిశీలన

వెబ్‌ల్యాండ్‌లో గత ఏడాది నమోదైన వారందర్నీ అర్హులుగా గుర్తించారు. ప్రస్తుతం జిల్లాలో 1.33 లక్షల మంది ఎంపికయ్యారు. ఆధార్‌లోని వివరాలతో సరిపోని సమాచారానికి సంబంధించి 23 వేల మంది వివరాలు తహసీల్దార్ల పరిశీలనలో ఉన్నాయి. అర్హులైన వారంతా లబ్ధి పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

– మోహనరావు, జిల్లా వ్యవసాయాధికారి, అనకాపల్లి

తాత్కాలిక అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వివిధ విభాగాల్లో పని చేసేందుకు తాత్కాలిక అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్ వెలువడింది. వీటికి సంబంధించిన వివరాలను ఏయూ వెబ్‌సైట్‌లో శనివారం రాత్రి నుంచి అందుబాటులో ఉంచారు. ఏడాది కాల పరిమితితో పని చేసేందుకు యూజీసీ, ఏఐసీటీఈ, పీసీఐ, ఎన్‌సీటీఈ, సీఓఏ నిబంధనలకు లోబడి అర్హతలు కలిగిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అందులో పేర్కొన్నారు.

(c) eenadu

పెన్సిల్ మొనలతో శ్వేతసౌధం



నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లుకు చెందిన సూక్ష్మ కళాకారుడు డాక్టర్ గట్టెం వెంకటేష్ తన ప్రతిభతో మరోమారు ఆకట్టుకున్నారు. అగ్రరాజ్యం అమెరికాలోని వైట్‌హౌస్ (శ్వేత సౌధం) నమూనాను పెన్సిల్ మొనలతో అద్భుతంగా మలిచారు. ఆ మేరకు 2 సెం.మీ. ఎత్తు, 4 సెం.మీ. వెడల్పున దీన్ని తయారు చేయడానికి మూడు గంటల సమయం పట్టినట్లు వెంకటేష్ చెప్పారు. - న్యూస్‌టుడే, నక్కపల్లి

సీతా 'తోక' చిలుక

సాధారణంగా సీతాకోక చిలుకలు రంగులతో పెద్ద రెక్కలతో ఎగురుతూ అందరినీ ఆకట్టుకుంటాయి. నక్కపల్లి మండలం రేబాకలోని గూడుపమ్మ ఆలయం వద్ద తోకలా ఉన్న రెక్కలతో ఓ సీతాకోకచిలుక ప్రత్యక్షమైంది. దీన్ని అంతా ఆసక్తిగా తిలకించారు. - నక్కపల్లి, న్యూస్‌టుడే

ఉద్యాన రైతులకు తోడుగా..

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానానికి ఊతం ఇస్తున్న ప్రభుత్వం ఈసారి మరింత ప్రోత్సాహం అందించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం సామూహికంగా పండ్ల మొక్కల పెంపడానికి శ్రీకారం చుట్టనుంది. ఉపాధి ద్వారా పండ్ల తోటల పెంపకం ఏటా చేస్తుండగా, వివిధ రకాల మొక్కలు అందిస్తున్నారు. ఈ ప్రక్రియను ఒకేసారి చేయడం ద్వారా మరిన్ని సత్ఫలితాలు రాబట్టడానికి ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. సంబంధిత శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సామూహిక కార్యక్రమంగా చేపట్టాలని ఆదేశాలిచ్చారు. మూడు నెలలుగా అమలుపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. రైతులతో మాట్లాడి ఎక్కువ మంది మొక్కలు నాటేలా చర్యలు చేపట్టారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపి రెండు వేల ఎకరాలకు ఆమోదం తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం 1100 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు సన్నద్ధమయ్యారు. ఇలా చేయడం ద్వారా రైతుల్లో మరింత చైతన్యం పెరిగి పండ్ల తోటల పెంపుపై దృష్టి పెడతారనేది ప్రభుత్వ లక్ష్యం.

నర్సరీల్లో సిద్ధంగా వివిధ రకాల పండ్ల మొక్కలు

13 రకాల జాతుల మొక్కలు

రాష్ట్ర వ్యాప్తంగా 13 రకాల పండ్ల జాతులకు ప్రాధాన్యం ఇవ్వగా.. జిల్లాలో నేల స్వభావం, దిగుబడులు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని కొబ్బరి, మామిడి, జీడి, డ్రాగన్ ఫ్రూట్, సపోటా, బొప్పాయి, జామ, పామాయిల్, సీతాఫలం మొక్కలను కేటాయించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న 20 నర్సరీల్లో వీటిని సిద్ధంగా ఉంచారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారు.

రైతుల ఖాతాలకు నగదు జమ..: ఉపాధి పథకంలో పండ్ల తోటలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు తగ్గట్లుగానే ఏర్పాట్లు చేశారు. ఇక్కడ కేటాయించిన తొమ్మిది రకాల మొక్కల్లో రైతులు నచ్చినవి వేసుకుంటే, ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాన్ని వారి ఖాతాల్లో జమచేస్తాం. జిల్లాకు 600 ఎకరాలు లక్ష్యం కాగా, రెట్టింపుస్థాయిలో చేస్తున్నాం. కమిషనర్, కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశాం. - పూర్ణిమాదేవి, డ్వామా పీడీ

ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత ప్రవేశాలకు వేళాయే..!

నాలుగు కళాశాలల్లో మిగులు సీట్లు 600

వేంపల్లె, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు ట్రిపుల్ ఐటీలలో 600 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి విద్యార్థుల మెరిట్ జాబితాను తయారు చేసి ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి మొత్తం 4400 సీట్లు ఉన్నాయి. ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1100 సీట్లు ఉండగా దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ కోటా కింద 360 సీట్లు పోను నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1010 చొప్పున 4040 సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలలో ఉన్న సీట్లకు మెరిట్ జాబితా విడుదల చేసి జూన్ 30 నుంచి జులై 5వ తేదీ వరకు ఇడుపులపాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేశారు. కౌన్సెలింగ్ తర్వాత ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 878 సీట్లు భర్తీ కాగా 132 సీట్లు మిగిలిపోయాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలో 1010కి 869 భర్తీ కాగా 141 సీట్లు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 867 భర్తీ కాగా 143, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు 826 సీట్లు భర్తీకాగా 184 సీట్లు మిగిలాయి. ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో జాప్యం, ఇక్కడి విద్యపై ఆసక్తి లేని కారణంగా చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడంతో 600 సీట్లు ఖాళీ ఏర్పడింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ కేంద్రంగా రెండో విడత ప్రవేశాలకు సంబంధించి రెండో జాబితాను అధికారులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

ఇడుపులపాయల ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కార్యాలయం

11, 12 తేదీల్లో రెండో విడత ప్రవేశాల జాబితా :ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలలో మిగిలిపోయిన 600 సీట్ల భర్తీకి తదుపరి మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 11, 12 తేదీల్లో వెబ్‌సైట్‌లో వెల్లడిస్తాం. ఈ మేరకు రెండో విడత జాబితా సిద్ధం చేసే పనిలో తమ సిబ్బంది ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. ఆలోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తాం. - ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ

పీఆర్సీ కమిటీ నియమించి ఐఆర్‌ను ప్రకటించాలి

మాట్లాడుతున్న చిన్నబ్బాయి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల వేతన సవరణ కమిటీని నియమించి, మధ్యంతర భృతిని ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి డిమాండ్ చేశారు. అనకాపల్లి సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పీఆర్సీ గడువు ముగిసి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం వేతన సవరణ సంఘాన్ని నియమించకపోవడం సరికాదన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, గౌరవాధ్యక్షులు పి.వెంకటరావు, సహాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, కోశాధికారి జోగా రాజేష్, ప్రకాష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగా సామగ్రి పంపేందుకు ఏర్పాట్లు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: యోగాంధ్ర సందర్భంగా కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో విశాఖకు తీసుకొచ్చిన సామగ్రిలో మిగిలిన వాటిని వెనక్కి పంపనున్నారు. మొత్తం 5 లక్షల యోగా మ్యాట్‌లు, 5 లక్షల టీషర్టులు తీసుకొచ్చి ఏయూ జిమ్నాస్టిక్ మైదానంలోని భవనంలో భద్రపర్చారు. వాటిల్లో 1.50 లక్షల మ్యాట్లు, 1.50 లక్షల టీషర్టులు మిగిలిపోయాయి. తొలుత వాటిని ఉమ్మడి విశాఖ జిల్లా పాఠశాలల విద్యార్థులకు అందజేయాలని జిల్లా యంత్రాంగం భావించింది. తాజాగా కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నుంచి కలెక్టరేట్‌కు వచ్చిన ఆదేశాలతో ఆ సామగ్రిని పది ట్రక్కుల్లో దిల్లీకి తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

సిద్ధం కండి.. సరిగా ఎంపిక చేసుకోండి!

నేటి నుంచి ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ

ఈనాడు, విశాఖపట్నం: ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రారంభం కానుంది. ఈ నెల 10 నుంచి 18 వరకు వెబ్ ఐచ్ఛికాల నమోదుకు అవకాశం కల్పించారు. దీని కోసం విద్యార్థులు ముందుగానే సిద్ధం కావాలని నిపుణులు చెబుతున్నారు. కళాశాలల ర్యాంకింగులు, ప్రాంగణ నియామకాలు జరుగుతున్న తీరు, గతేడాది ఎంత మంది ఉద్యోగాలు సాధించారు? తదితర వివరాలు తెలుసుకుని ఎంపిక చేసుకోవాలని సూచిస్తున్నారు.

మూడు హెల్ప్‌లైన్ కేంద్రాలు: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ కెమికల్ కళాశాల, పాడేరు ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాలల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సమస్యలు, సందేహాలు ఉంటే విద్యార్థులు నేరుగా ఆయా కేంద్రాల్లో నివృత్తి చేసుకోవచ్చు. వీటితోపాటు మంగళగిరిలోని హెల్ప్‌డెస్క్ నంబర్లు 7995681678, 7995865456, 9177927677లను సంప్రదించవచ్చు.

ఉమ్మడి జిల్లాలో కళాశాలలు:	25
మొత్తం సీట్లు:	14,682
ఈఏపీసెట్‌లో అర్హత సాధించినవారు:	30,521

అందుబాటులోకి కొత్త బ్రాంచిలు: ఈ ఏడాది కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) కోర్సులు పెరిగాయి. సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్‌తోపాటు సీఎస్ఈలో కృత్రిమ మేధ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్, క్వాంటం కంప్యూటింగ్ బ్రాంచులు అందుబాటులోకి వచ్చాయి.

ఎంపికలో అప్రమత్తత అవసరం: బ్రాంచీలు, కళాశాలలను ఎంపిక చేసుకునేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలి. రెగ్యులర్ కోర్సులతో పోలిస్తే సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులకు ఫీజు ఎక్కువగా ఉంటుంది. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఏడాది నుంచి క్వాంటం కంప్యూటింగ్ కోర్సును అందుబాటులోకి తీసుకొస్తున్నాం. - ఆచార్య చిట్టిబాబు, అసిస్టెంట్ ప్రిన్సిపల్, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల

అప్పన్న స్వామికి బంగారు పుష్పం బహూకరణ

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామికి అనకాపల్లి మండలం సిరసపల్లి గ్రామానికి చెందిన భక్తుడు అల్లవరపు త్రిమూర్తులు దంపతులు 17.500 గ్రాముల బరువైన బంగారు పుష్పాన్ని బహూకరించారు. ఆదివారం సింహగిరిపై ఈవో వేండ్ర త్రినాథరావుకు పుష్పాన్ని అందజేశారు. అధికారులు దాత కుటుంబానికి స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఈవో త్రినాథరావుకు బంగారు పుష్పాన్ని అందిస్తున్న దాత త్రిమూర్తులు కుటుంబం

కఠిన ఆంక్షల నడుమ సేవలెలా..?

స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు సూచనలిస్తున్న ట్రాఫిక్, దేవస్థానం అధికారులు

సింహాచలం, న్యూస్‌టుడే: కఠినమైన ట్రాఫిక్ ఆంక్షల నడుమ భక్తులకు సేవలు ఎలా అందించాలని గిరి ప్రదక్షిణలో సేవలకు ముందుకొచ్చిన పలు సేవా సంస్థల ప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. సింహాచలం దేవస్థానం కార్యాలయం ఆవరణలో ఆదివారం సేవా సంస్థల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ నగర వ్యాప్తంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో పాటు సేవా శిబిరాల ఏర్పాటుపై కూడా నియంత్రణ విధిస్తే ఎలాగంటూ ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ ఇలాంటి నిబంధనలు లేవన్నారు. ఆహార పదార్థాలను శిబిరాల వద్దకు తీసుకెళ్లడానికి వాహనాలను అనుమతించాలని కోరారు. వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రాఫిక్ అవాంతరాలకు అవకాశం లేని విధంగా స్టాళ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాహనాల రాకపోకలకు పూర్తిస్థాయిలో అనుమతి లేదని స్టాళ్లు ఏర్పాటు చేసే సంస్థలు ముందు రోజే సామగ్రిని తరలించుకోవాలని సూచించారు. దీనిపై సంస్థల ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓ దశలో ట్రాఫిక్ పోలీసులు, సేవా ప్రతినిధుల మధ్య కొంత వాగ్వాదం జరిగింది. చివరకు పోలీసులు సానుకూలంగా స్పందించినా స్పష్టమైన హామీ ఇవ్వలేదు. సమావేశంలో ఈవో వేండ్ర త్రినాథరావు, ఏఈవో ఆనంద్‌కుమార్, ఈఈ సీహెచ్‌వీ రమణ, డీఈఈ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ట్రాఫిక్.. తప్పని అవస్థలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సెజ్ కేంద్రమైన అచ్యుతాపురంలో ట్రాఫిక్ రోజురోజుకు అస్తవ్యస్తంగా మారుతోంది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో వాహనాలు నిలిచిపోతున్నాయి. అచ్యుతాపురం కూడలిలో పైవంతెన నిర్మాణ పనులు జరుగుతుండటంతో సెజ్ రోడ్డులో రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. సెజ్ నుంచి వచ్చే వాహనాలను సెజ్ కాలనీ మీదుగా మళ్లించారు. కంపెనీల నుంచి రాకపోకలు సాగించే సమయాల్లో వాహనాలు ముందుకు కదలడంలేదు. ముఖ్యంగా వారపు సంతరోజున ఇబ్బందులు రెట్టింపు అవుతున్నాయి. సోమ, బుధ, శుక్రవారాల్లో రామన్నపాలెం రోడ్డులో జరిగే బజారు వల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. సమస్య పరిష్కారానికి పోలీసులు చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

అచ్యుతాపురం కూడలిలో నిత్యం ఇదే పరిస్థితి

నేడు మంత్రి పార్థసారథి మాడుగుల రాక

విశాఖపట్నం: మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం విశాఖ రానున్నారు. ఇక్కడి నుంచి ఉదయం 11 గంటలకు మాడుగుల వెళ్లి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

వాణిజ్య పన్నులశాఖలో ఇష్టానుసార బదిలీలు..!

ఈనాడు, విశాఖపట్నం: ఆర్థిక శాఖ విడుదల చేసిన మార్గదర్శకాలకు విరుద్ధంగా వాణిజ్య పన్నులశాఖలో బదిలీలు చేపట్టడం వివాదాస్పదమవుతోంది. కొందరు ఉన్నతాధికారులు తమకు నచ్చినట్లు బదిలీలు చేశారనే విమర్శలు వస్తున్నాయి. అనుకూలంగా ఉన్న వారిని అదే డివిజన్‌లో కొనసాగించడం, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చినా.. అనుకూలంగా లేరని కొందరిని దూర ప్రాంతాలకు బదిలీ చేశారని సమాచారం. విశాఖ-2 డివిజన్‌లోని ఆరు సర్కిళ్లలో కేవలం ఒక సహాయ కమిషనర్ మినహా మిగిలిన వారందర్నీ దూరంగా బదిలీ చేశారు. విశాఖ-1 డివిజన్ పరిధిలో ఏడు సర్కిళ్లు ఉంటే ముగ్గుర్ని ఇక్కడే కొనసాగించారు. ప్రభుత్వం అయిదేళ్లు ఒకే చోట పనిచేసిన వారికి బదిలీ తప్పనిసరి అంటే.. ఇక్కడ ఒక ఏడాది సర్వీసు పూర్తి చేసిన వారికీ స్థానచలనం కలిగించడం గమనార్హం.

జాయింట్ కమిషనర్‌గా శేషాద్రి

ఈశాఖలోని పలువురు అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. విశాఖ-2 డివిజన్ జాయింట్ కమిషనర్‌గా టి.శేషాద్రిని నియమించింది. ఆయన అనంతపురం నుంచి వచ్చారు. విశాఖ-1 డివిజన్‌కు ఇన్‌ఛార్జిగానూ కొనసాగనున్నారు. పలువురు డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లకు స్థానచలనం కలిగింది.

AUTO

VEHICLES FOR SALE

Creta 2022 Run 72000 Diesel * TATA Punch 2022 Run 7000 Petrol Owner Dirven for Sale. ✆ 9849113313, 8333859555.

BUSINESS SERVICES

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

BUSINESS OFFER

టైలరింగ్ వర్క్స్ ఇంటి వద్దనే పనిచేసే స్త్రీలు కావలెను. వారికి క్లాత్ ఇచ్చుటకు స్టాక్ పాయింట్స్ పెట్ పార్టనర్స్ కావలెను. ✆ 7093632399.

TENDER

SALVAGE DISPOSAL
Sealed quotations are invited from the prospective salvage buyers on the damaged 8L SS 304L + Hastelloy C-22 Clad Oxidation Reactor along with fire affected accessories, other materials at the premises of M/s. Vasant Chemicals Pvt Ltd., APSEZ, Atchutapuram, Anakapalli Dist.,
Please contact Mr. S. Prasad Raju, (Cell: 91540 30397) for inspection, the sealed quotations may reach to the undersigned within 7 days.
D.S.Prasad Babu
Surveyor/Loss Assessor, Block-A, Flat No.S-1, Ramalaxmi Estates, Pedawaltair, Visakhapatnam-530 017.
Mobile: 98481 97742

EENADU Classifieds

FINANCIAL SERVICES

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలలోపు ఫైనాన్స్ చేయబడును. అన్ని తరగతుల వారు బ్యాంకులో స్థిరాస్థిపై లోన్ తీసుకున్న వారికి Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్‌లోన్ చేయబడును. ✆ 96665 47338.

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

REAL ESTATE

FLAT FOR SALE

KOMMADI

North East Facing 2BHK 1200 Sft, Pooja, Dressing Room, Car Parking at Kommadi. Rent 7 to 8,000/- PM. Spot Reg. Bank Loan available. Ph: 8121100599.

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

North- East Corner Building for Sale. Ready to Move. 121 Sq.Yds. (Cellar+ G+1) 60 Ft., Double Rd., Facing. Prime Location at Atchutapuram ✆ 9885824528.

PLOT FOR SALE

GENERAL

Prime Site 72 & 54 Cents at Dabbanda Near Simhachalam 18km from RTC Complex, Vizag. Contact: 8333859555, 9440320255.

VUDA approved plots in PM Palam 346 sq.yds and 300 sq.yrds near Sabbavaram for sale. Contact: 8978326333.

విశాఖలో/ అనకాపల్లిలో NRI ఫామ్ ల్యాండ్స్ వేయుటకు ఇన్వెస్ట్ పార్టనర్స్ కావలెను. సంప్రదించండి. ✆ 7386414017/ 7093632399.

SECOND SALE

మిథున్ ఏజన్సీ కొనబడును పాత A/Cలు, సెంట్రల్ A/Cలు, ఇన్వెర్టర్ బ్యాటరీలు, ఫ్రిజ్, వాషింగ్ మిషన్స్, ఫర్నిచర్, ఆన్‌లైన్ UPSలు కొనబడును. Cont : 8309745364.

JOBS

శ్రీరామ్ గ్రూప్‌లో విశాఖజిల్లా అంతటా ఎంప్లాయిస్ కావలెను. BDES 15-Inc., BDMs-24K+ Inc. Exp. Min. 2 Yrs. Age: 25-35. Any Degree. 9666331353.

TVS షోరూమ్ అనకాపల్లి నందు పనిచేయుటకు ఆటోమొబైల్ రంగంలో అనుభవంగల మేనేజర్స్, అకౌంటెంట్ కావలెను 20000/- + Inct. ఇవ్వబడును. ✆ 8341546429.

త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 85209 80099, 85208 74499.

ప్రైవేటు బ్యాంకులో పనిచేయుటకు క్లర్క్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్, BDM, CRMS కావలెను. జీతం 18k, స్పాట్ జాయినింగ్. ✆ 7995439539.

FACULTY/ TEACHERS

Wanted Lecturers Physics Chemistry Computer Science, Civics, Economics, Commerce, English. ✆ 9849216362, 7386487509.

Wanted Exp. Lady Teachers for LKG, UKG & 6th - 9th English, Social & Computers. Cont : Success 'n' Success School, Rly. New Colony, Ph : 9492641179.

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డులు కావలెను. అర్హత: 10th, హిందీ మాట్లాడాలి, జీ॥18 వేలు+రూమ్, విజయనగరం జిల్లా గరివిడి కంపెనీలో డ్యూటీ. Ct. RSR ✆ 7702959468, 8790411889.

TOURS AND TRAVELS

K.S.N. శర్మ టూర్స్. రామేశ్వరం యాత్ర స్పెషల్. శ్రీశైలం, తిరుపతి, అరుణాచలం (గిరి) మొదలగు 23 ప్రదేశములు. ఈ నెల 13 వ తేది రాత్రి బయలుదేరును. Con.: K. సత్యనారాయణ 9440367464. P. సత్యనారాయణ 9948715355.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రైలు ఢీకొని ఫార్మా ఉద్యోగి దుర్మరణం

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వవార్డు పరిధిలో రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు దువ్వాడ జీఆర్పీ పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలం తులగాం గ్రామానికి చెందిన వజ్రారపు సురేశ్(28) పరవాడ మెట్రోకెమ్ ఫార్మా కంపెనీ ప్రొడక్షన్ విభాగంలో పని చేస్తూ లంకెలపాలెంలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో లంకెలపాలెంలో రైలు పట్టాలు దాటుతుండగా విశాఖ నుంచి విజయవాడ వెళ్లే రైలు ఢీకొని మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు ఆదివారం ఉదయం ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై లక్ష్మి పేర్కొన్నారు.

సురేశ్ (పాతచిత్రం)

రేగుపాలెం - నర్సీపట్నం రోడ్డు సమీపంలో...

పాయకరావుపేట, న్యూస్‌టుడే: రైలు ఢీకొన్న ప్రమాదంలో ఆదివారం ఒకరు దుర్మరణం చెందాడు. తుని రైల్వే ఎస్సై జి.శ్రీనివాసరావు అందించిన కథనం ప్రకారం... రేగుపాలెం, నర్సీపట్నం రోడ్డు సమీపంలో పట్టాలు దాటుతున్న 50 ఏళ్ల వ్యక్తిని రాజమహేంద్రవరం నుంచి విశాఖ వైపు వెళ్తున్న రైలు ఢీకొందన్నారు. మృతుని వద్ద ఏవిధమైన ఆధారాలు లభ్యం కాలేదన్నారు. తెలుపు రంగు చొక్కా, సిమెంట్ రంగుపై నలుపు చుక్కల ఉన్న షార్టు ధరించాడని, నాగుల చవితి టవలు ఉందన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రి శవగారంలో భద్రపరిచామని ఎస్సై జి.శ్రీనివాసరావు చెప్పారు.

వాహనం ఢీకొని వృద్ధుడు..

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట మండలం బయ్యవరం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. కశింకోట ఎస్సై కె.లక్ష్మణరావు కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం బొరిగివలస గ్రామానికి చెందిన రాజాపు గురన్న (64) రహదారి దాటుతుండగా బొలెరో వాహనం ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అనకాపల్లి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై మృతుడి గ్రామస్థుడు ముద్దాడ శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ అల్లు స్వామినాయుడుతో సహా ఎస్సై రెండు బృందాలుగా ఏర్పడి పరారైన వాహనం కోసం గాలింపు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

గొలుసు దొంగ అరెస్టు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: మధురవాడ ప్రాంతంలో ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు తెంపుకొని పారిపోయిన దొంగను పీఎంపాలెం నేర విభాగం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వివరాలను క్రైం సీఐ బి.ఎస్.ఎస్.ప్రకాష్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. కొమ్మాది వైఎస్సార్ కాలనీకి చెందిన కొత్తకోట వరలక్ష్మి (65) ఈ నెల 2న సాయంత్రం కాలనీలో రోడ్డుపై ఒంటరిగా నడిచి వెళ్తున్నారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి రూ.2 లక్షల విలువ చేసే 2 తులాల బంగారు గొలుసును లాక్కొని ద్విచక్రవాహనంపై పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. భీమిలి మండలం కాపులుప్పాడకు చెందిన గుడ్ల ఆదినారాయణ (25) చోరీకి పాల్పడినట్లు గుర్తించి శనివారం అదుపులోకి తీసుకుని అతని నుంచి బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని రిమాండ్‌కు తరలించి బాధితురాలికి బంగారం గొలుసు అప్పగించామని సీఐ తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన ఏఎస్ఐలు కె.బాబా, అమర్‌శేఖర్, పీసీలు మల్లిక్, గణేష్, రమేష్‌లను ఆయన అభినందించారు.

కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ బి.ఎస్.ఎస్.ప్రకాష్

చికిత్స పొందుతూ ప్రాణాలొదిలిన యువకుడు

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాకలో ఓ యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. సీఐ కె.కుమారస్వామి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన చింతాకుల సతీష్ (22), తల్లి మంగ, సోదరుడుతో కలిసి ఏడాది క్రితం అమ్మమ్మ గారి ఊరు ఉపమాక వచ్చి ఇక్కడే నివాసం ఉంటున్నారు. సతీష్ హెటిరో పరిశ్రమలో కాంట్రాక్టర్ వద్ద వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు మద్యానికి బానిసగా మారడంతో గురువారం తల్లి మందలించింది. అదే రాత్రి మేడ మీదకు వెళ్లిన ఇతడు కొంత సేపటికి కేకలు వేస్తూ వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా, గడ్డిమందు తాగినట్లు గుర్తించారు. వెంటనే నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి తునిలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. ఇతడు చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెచ్‌సీ వెంకటరావు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

సతీష్ (పాతచిత్రం)

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి.. భార్యకు గాయాలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: తగరంపూడి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. గ్రామీణ ఎస్సై నాగేశ్వరరావు కథనం ప్రకారం రావికమతం మండలం మెట్టవానిపాలెంకు చెందిన బలిరెడ్డి ప్రసాద్ (45), ఉష దంపతులు ద్విచక్ర వాహనంపై తుమ్మపాల వస్తున్నారు. వెనక నుంచి గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొట్టింది. ప్రమాదంలో ప్రసాద్ మృతిచెందగా, ఉషకు గాయాలయ్యాయి. ఈమెను ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు.

ముగ్గురికి గాయాలు

అనకాపల్లి పట్టణం: కొత్తూరు వద్ద శనివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఓ వాహనంపై వెళ్తున్న దంపతులు రెడ్డి అమూల్‌నాయుడు, పద్మతోపాటుగా మరో వాహనదారుడికి గాయాలయ్యాయి. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

నాటక పుస్తకాల డిజిటలీకరణ అభినందనీయం

వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు గుమ్మళ్ల బలరామయ్య, సుధాకర్ తదితరులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: నాటకం కోసం జీవితాన్ని అంకితం చేసిన బాదంగీర్ సాయి తీపి గుర్తుగా పదివేల నాటక పుస్తకాలు డిజిటలీకరణ చేసి అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని విశ్రాంత ఐఏఎస్ అధికారి గుమ్మళ్ల బలరామయ్య కొనియాడారు. రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అధ్యక్షతన మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మన్నం వెంకటరాయుడుతో కలిసి శ్రీనగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో ఆదివారం 'తెలుగు నాటక డిజిటల్ గ్రంథాలయం' వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. దాడి వీరభద్రరావు మాట్లాడుతూ పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గుతున్న తరుణంలో నాటకాలను డిజిటలీకరణ చేయడం ప్రశంసనీయమన్నారు. అంతకుముందు పౌర గ్రంథాలయం ఎదుట సుదర్శన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'టామీ టామీ టామీ' నాటికను ప్రదర్శించారు. విశ్రాంత ఐపీఎస్ అధికారి అత్తిలి సుధాకర్, రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకులు వి.వి.రమణమూర్తి, సినీ దర్శకుడు ఎం.వి.రఘు, కొల్లి మోహనరావు, మేడా మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పలువురు నాటక నటులను సన్మానించారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	86	78
లైవ్	108	98
డ్రెస్‌డ్	157	166
స్కిన్‌లెస్	178	176

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: సోలోబాయ్, రామచంద్ర: మారెన్, శ్రీసత్య: 3డబ్ల్యూబీకే సత్యనారాయణ స్క్రీన్-1: కన్నప్ప, స్క్రీన్-2: జూరాసిక్ వరల్డ్, వెంకటేశ్వర: చంద్రేశ్వర, పరిసాయి: కుబేర, షిర్డి సాయి: తమ్ముడు, అచ్యుతాపురం: స్క్రీన్-1: కుబేర స్క్రీన్-2: కన్నప్ప

బాలిక వైద్యానికి ఆర్థికసాయం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: కొత్తపోలవరంలో పక్షవాతానికి గురై మంచానికి పరిమితమైన పెదమాళ్ల నూకరత్నం వైద్య ఖర్చులకు స్పందన ఫౌండేషన్ సభ్యులు రూ.8 వేలు ఆర్థికసాయం అందించారు. ఫౌండేషన్ ఛైర్మన్ ఈపూరి బుచ్చిరాజు, మాజీ సర్పంచి నల్లపరాజు వెంకటరాజు, సభ్యులతో కలిసి ఆదివారం నూకరత్నం కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. నిత్యాన్నదానం చేస్తున్న సాగిరాజు లక్ష్మిని ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

భక్తిశ్రద్ధలతో మొహర్రం

అనకాపల్లి పట్టణం, పాయకరావుపేట, నక్కపల్లి, న్యూస్‌టుడే: మొహర్రంను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనకాపల్లి జామియా మసీదులో ముస్లింలు నమాజ్ చేశారు. పేటలో ఉపవాస దీక్ష చేపట్టి దానధర్మాలు చేపట్టారు. పెదబొడ్డగట్ల, పెదదొడ్డిగల్లు, చినబొడ్డగల్లు గ్రామాల్లో పీర్లను ఊరేగించారు.



పేటలో పీర్ల వద్ద ప్రార్థనలు

అ వీ ఇ వీ

దేవరంలో మంత్రి అనిత పర్యటన నేడు

నక్కపల్లి, న్యూస్‌టుడే: మంత్రి వంగలపూడి అనిత సోమవారం దేవరంలో పర్యటించనున్నారని పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొంటారని అన్నారు.

గ్రామస్థుల నిరసన

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: గ్రామస్థుల ఉమ్మడి అవసరాలకు వదిలిన స్థలంలో భవన నిర్మాణానికి చేస్తున్న ఏర్పాట్లను ఆదివారం గ్రామస్థులు అడ్డుకుని నిరసనకు దిగారు. నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు విస్తరణ అభినందనీయం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కృషి అభినందనీయమని కాంగ్రెస్ నాయకులు తనకాల అనంతరావు, ఎంపీ రాహుల్ తెలిపారు. అచ్యుతాపురంలో ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం ఈ నాయకులు కలిసి అభినందించారు. సముద్రంలో గల్లంతైన చోడపల్లి యర్రయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని, అర్హులందరికీ తల్లికి వందనం సాయం అందించడానికి కృషి చేయాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించరూ!

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోన లక్ష్మణ ఆధ్వర్యంలో కార్యాలయం అధికారికి వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి జోన్ కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

గోకివాడ మాజీ సర్పంచి మృతి

రాంబిల్లి, న్యూస్‌టుడే: గోకివాడ మాజీ సర్పంచి ద్వారపురెడ్డి అప్పారావు (86) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారు జామున మృతి చెందారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. సర్పంచిగా 27 ఏళ్లు సేవలు అందించారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆదివారం జరిగిన ఆయన అంతిమ యాత్రలో పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

వంద మందికి నేత్ర పరీక్షలు

రాంబిల్లి, న్యూస్‌టుడే: దిమిలిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 100 మంది రోగులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. శస్త్రచికిత్సలకు 25 మందిని ఎంపిక చేసి ఆసుపత్రికి తరలించారు. మనఊరు-మనవంతు సేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది రోగులను పరీక్షించారు. శిబిరం మేనేజరు అరుణకుమార్, ట్రస్టు సభ్యులు బి.మాణిక్యం, జి.నానాజీ, బి.ప్రేమసాగర్, కె.రమేష్ పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: దివంగత తెదేపా నాయకులు లాలం భాస్కరరావు అందించిన సేవలు మరువరానివని తెదేపా నాయకులు అన్నారు. ఆదివారం లాలం భాస్కరరావు వర్ధంతి పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో లాలం కుటుంబ సభ్యులు రోగులకు పండ్లు, రొట్టెలు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్.నరేష్, లాలం రమేష్ శశికాంత్, ఆర్.రాజు తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి

అనకాపల్లి పట్టణం, లక్ష్మీదేవి పేట, పాయకరావుపేట, న్యూస్‌టుడే: బాబూ జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి పోచపల్లి వెంకటరావు పేర్కొన్నారు. పట్టణంలోని చోడవరం బస్టాప్ వద్ద ఆదివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టుమూరు మంగరాజు, కొల్లి చిన్నఅప్పారావు, నాయకులు పాల్గొన్నారు. పేటలో ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జి గంపల చినరాజు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

నినాదాలు చేస్తున్న కార్యకర్తలు

ఆక్రమించి.. అద్దెలకిచ్చి..!

ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. నిబంధనలు పట్టించుకోకుండా అడ్డగోలుగా ప్రధాన రహదారిపైనే నిర్మాణాలు చేపడుతున్నా అటు రెవెన్యూ, ఇటు పంచాయతీ, ఇతర శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారు. పేట ప్రధాన రహదారిని ఆక్రమణల్లోనే వెతుక్కోవాల్సిన పరిస్థితి వస్తోంది.

– పాయకరావుపేట, న్యూస్‌టుడే

ఉనికి కోల్పోతున్న పేట ప్రధాన రహదారి

పేట ప్రధాన రహదారి

✦ జిల్లా సరిహద్దు ప్రాంతంగా ఉన్న పాయకరావుపేట పట్టణానికి ఆక్రమణలే శాపంగా మారాయి. పూర్వం పట్టణం మధ్య నుంచి 2.1 కి.మీ. పొడవైన జాతీయ రహదారి ఉండేది. అప్పట్లో రోడ్డు కోసం 30 నుంచి 35 మీటర్ల వెడల్పుతో భూమి సేకరించారు. హద్దులు నిర్ణయించారు. అప్పటి అవసరాల మేరకు ఏడు మీటర్ల వెడల్పుతో రహదారి ఏర్పాటు చేశారు. 16వ నంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఊరు బయట నుంచి వేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని రోడ్డును కొత్తరూపు తీసుకొచ్చేందుకు అప్పట్లో నిర్ణయించారు. 2015లో దీన్ని పురపాలకు బదలాయించారు. రూ.6.5 కోట్లతో రెండు వరుసల రహదారి వేసేందుకు నిధులు కేటాయించారు. అనంతరం కోర్టు వివాదాలతో పనులు నిలిచిపోయాయి. మళ్లీ 2022లో ఉన్న ఏడు మీటర్ల రోడ్డుపైనే సుమారు రూ.రెండు కోట్లు ఖర్చుచేసి తారురోడ్డు వేశారు. విస్తరణ పక్కన పెట్టేశారు. అప్పటి నుంచి రోడ్డు స్థలాన్ని వ్యాపార కూడలిగా మార్చేశారు.

✦ ఇరువైపులా ఇళ్ల ముందున్న రోడ్డు స్థలంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. కొంతమంది తాత్కాలికంగా షెడ్లు నిర్మించేశారు. రోడ్డు అంచుల వరకు దుకాణాలు రోడ్డు మీదకు వచ్చాయి. వ్యాపార సంస్థల యజమానులు రోడ్డుపైనే సామగ్రి ఉంచుతున్నారు. కొంతమంది రోడ్డు స్థలాన్ని ఆక్రమించి ఆపై వేరే వారికి దర్జాగా అద్దెకు ఇస్తున్నారు.

నిత్యం ట్రాఫిక్ అవస్థలే..

వేలాది మంది నిత్యం తుని, పాయకరావుపేటకు వస్తుంటారు. వాహనాలు పెద్దసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. కొనుగోలుకు వచ్చిన వారు వాహనాలను రోడ్డుపైనే ఉంచుతున్నారు. వీటికి తోడు ఆటోలతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా ఆక్రమణల పర్వానికి అడ్డుకట్ట వేయాల్సి ఉంది. కాగా ఈ విషయాన్ని పంచాయతీ కార్యనిర్వహణాధికారి లవరాజు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. ప్రధాన రహదారిని పరిశీలించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేస్తామన్నారు.

కూడళ్ల అభివృద్ధిపై నీలినీడలు

అనకాపల్లిలో నెహ్రూచౌక్

కలెక్టరేట్, న్యూస్‌టుడే

అనకాపల్లి జిల్లాగా ఏర్పడి ఏళ్లు కావస్తున్నా అభివృద్ధి మాత్రం అంతంతమాత్రంగానే ఉంది. నాటి వైకాపా ప్రభుత్వంలో అనకాపల్లి రూపురేఖలు మార్చేస్తామని ఊదరగొట్టినా ఆచరణలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది.

● అనకాపల్లిలో మూడు ప్రధాన కూడళ్లు ఉన్నాయి. పెరుగుబజార్, ఎన్టీఆర్, నెహ్రూచౌక్ ఉన్నాయి. ఇక్కడ నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్టీఆర్ కూడలిలో 40 అడుగుల విస్తీర్ణంలో ఉన్న రహదారిని 80 అడుగుల పెంచాలని, ఎల్లయ్యకాలువపై స్లాబు వేయాలని ప్రతిపాదించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ 9 చదరపు అడుగులు పెంచడానికి చర్యలు ఆరంభించినా ఫలితం లేకపోయింది. నెహ్రూచౌక్ అభివృద్ధికి ఆక్రమణదారులకు నోటీసులు సైతం జారీ చేశారు. ఏళ్లు గడుస్తున్నా ఒక్కడ అడుగు కూడా ముందుకు పడలేదు. రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రమవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కూడళ్ల వద్ద వాహనాలు తిరగడానికి అవస్థలు తప్పడం లేదు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

కూటమి ప్రభుత్వం పైనే పట్టణ ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. జనాభా పెరుగుతున్నా అభివృద్ధి జరగడం లేదు. జిల్లా ఏర్పడ్డాక కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయంతో పాటు జిల్లాకు సంబంధించిన 100కి పైగా శాఖలు కొలువుదీరడంతో అనకాపల్లిలో జనాభా పెరిగింది. స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నవారు అధికమయ్యారు. ఉద్యోగుల సంఖ్య కూడా పెరగడంతో వాహనాల రద్దీ అధికమైంది. కూడళ్ల వద్ద గతంలో పెద్దగా ట్రాఫిక్ సమస్య ఉండేది కాదు. నేడు సిగ్నల్ పడితే వాహనాలతో ఇవి కిక్కిరిసిపోతున్నాయి. పాదచారులకు అవస్థలు తప్పడం లేదు. అధికారులు వీటి అభివృద్ధిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా రోడ్డు అంచు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: అధికారుల నిర్లక్ష్యం వాహన చోదకులకు శాపంలా మారింది. చక్కటి రోడ్డువేసి సైడు బెర్మలు వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గోపాలపట్నం నుంచి సత్యవరం వెళ్లే దారిలో సుమారు 100 మీటర్ల పొడవైన సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఊరు వెలుపల చెరువు వద్ద వంపు మార్గం ఉంది. దాదాపు అడుగున్నర ఎత్తు రోడ్డు నిర్మించారు. ఇరువైపులా సైడు బెర్మలు వేయడం మరిచారు. నెలలు గడుస్తున్నా దీన్ని పట్టించుకోవడం మానేశారు. వంపు మార్గం కావడంతో వాహన చోదకులు రోడ్డు అంచు వరకు వెళ్లి బోల్తా పడుతున్నారు. ఏమరుపాటుగా ప్రయాణించినా, ఎదురుగా పెద్ద వాహనాలు వచ్చినా ఇక్కట్లు తప్పడం లేదు. అధికారులు స్పందించి సైడు బెర్మలు గ్రావెల్ వేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి.

వసతి గృహానికి రక్షణ ఏదీ?

కశింకోట బీసీ బాలుర వసతి గృహం

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట బీసీ సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ప్రహరీ సమస్య వెంటాడుతోంది. ఇక్కడ 82 మంది విద్యార్థులు 3 నుంచి 10వ తరగతి చదువుతున్నారు. పూర్తిస్థాయిలో సంక్షేమాధికారిని నియమించక పోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇన్‌ఛార్జి అధికారితో నెట్టుకొస్తున్నారు. వసతిగృహ అభివృద్ధికి ఒక కర్మాగారం రూ. 15 లక్షలు, గత ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షల సహకారం అందించినా అసంపూర్తిగా నిలిచిన ప్రహరీని పూర్తి చేయలేదు. అధికారులు దృష్టి సారించి పూర్తిస్థాయిలో సంక్షేమాధికారిని నియమించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విధ్వంసం నుంచి వికాసం వైపు..

మునగపాక, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో వికాసం వైపు పరుగులు పెట్టించిందని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మునగపాక మండలం ఒంపోలు, అరబుపాలెంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మండల తెదేపా అధ్యక్షుడు పెంటకోట విజయ్ అధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో నాగేశ్వరరావు, మండల తెదేపా నాయకులు ఇంటింటికి వెళ్లి సంక్షేమపథకాలను ప్రజలకు వివరించారు. జిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, నాయకులు భీమరశెట్టి శ్రీనివాసరావు, డొక్కానాగభూషణం, కర్రి సాయికృష్ణ పాల్గొన్నారు. తిమ్మరాజుపేటలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, రాజాన రమేష్ కుమార్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దివంగత తెదేపా నాయకుడు లాలం భాస్కరరావు వర్ధంతి సందర్భంగా తెదేపా నాయకులు మౌనం పాటించి ఆయన సేవలను కొనియాడారు. నాయకులు కర్రి ఆదిబాబు, చినబాబు, శివబాపునాయుడు, భాగ్యలక్ష్మి, ఆడారి మంజు, పెంటకోట విజయ్ పాల్గొన్నారు.

అనకాపల్లి/ పట్టణం, కొత్తూరు, న్యూస్‌టుడే: భట్లపూడిలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. భట్లపూడి, శంకరం, రేబాక, గోపాలపురం గ్రామాల్లో లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. తుమ్మపాల కొత్తపేట వీధిలో తెదేపా నేత దాడి రత్నాకర్ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. తెదేపా రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షులు మాదంశెట్టి నీలిబాబు పిళ్లా వారివీధిలో, 83వ వార్డులో తెదేపా ఇన్‌ఛార్జి బొద్దపు ప్రసాద్, సంపతిపురంలో తెదేపా మండల ప్రధాన కార్యదర్శి నంబారి శ్రీను, సర్పంచి నంబారి నాగమణి ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. పిల్లా తారకేశ్వరరావు, కాండ్రేగుల జగదీష్ పాల్గొన్నారు.

తుమ్మపాలలో ప్రచారం చేస్తున్న దాడి రత్నాకర్, నాయకులు

ఒంపోలులో కూటమిప్రభుత్వం ఏడాదిపాలనలో సంక్షేమం, అభివృద్ధి గూర్చి ప్రజలకు వివరిస్తున్న నాగేశ్వరరావు

పాయకరావుపేట, నక్కపల్లి, న్యూస్‌టుడే: డీఎల్‌పురంలో తెదేపా మండలశాఖ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమాన్ని వివరించారు. నాయకులు గింజాల శ్రీను, ధూళి హరిప్రసాద్, సత్తిబాబు, చినకాసు పాల్గొన్నారు. పేట తెదేపా కార్యాలయంలో తెదేపా మండల శాఖ అధ్యక్షుడు చించలపు ప్రదీప్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ఇంటింటికి వెళ్లి పథకాలపై అవగాహన కల్పించాలని చెప్పారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలు ఆదర్శం

విద్యార్థినికి బహుమతి అందిస్తున్న నాయకులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని భాజపా కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు. విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. నాయకులు గొంతిన భక్తసాయిరాం, కూండ్రపు నాయుడుబాబు, మేరుగు కాసుబాబు, కర్రి వెంకటస్వామినాయుడు, ధర్మిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను అనకాపల్లిలో ఘనంగా నిర్వహించారు. భాజాపా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా భాజాపా జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ శ్యాం ప్రసాద్ ఆశయసాధనకు అనుగుణంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయలన్నారు. కార్యక్రమంలో భాజాపా నాయకులు కర్రిరామకృష్ణ, వుడా రమేష్, పొలమరశెట్టి నాగేశ్వరరావుచ బొడ్డేడ నాగేశ్వరరరావు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

రాంబిల్లి, న్యూస్‌టుడే: ఈ నెల 9న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.లోకనాథం కోరారు. మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం ఆటో ప్రచారం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు, నాయకులు చందక రామకృష్ణ, నారాయణరావు, కాశియ్య, బద్ది భాస్కరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ పరిహారం ఇవ్వండి

నక్కపల్లి, న్యూస్‌టుడే: పరిశ్రమల ఏర్పాటులో భాగంగా నిర్వాసితులైన అందరికీ అధికారులు పరిహారం చెల్లించడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆరోపించారు. మూలపర్రలో ఆదివారం ఆయన రైతులతో కలిసి మాట్లాడారు. అధికారులు ఇళ్లను తొలగించినప్పుడు ఇందులో ఉన్న అర్హులను పూర్తిస్థాయిలో జాబితాలో చేర్చలేదన్నారు. దీని కారణంగా అనేకమంది పరిహారానికి దూరమవుతున్నారని, తక్షణం న్యాయం చేయాలన్నారు. సమావేశంలో ఎం.రాజేశ్, దుర్గాప్రసాద్, నానాజీ, కుమార్, బాబ్జి, చిన్ని, ప్రసాద్, రామ గణేష్, హేమలత, చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస గోవింద.. శ్రీ వేంకటేశ గోవింద

అచ్యుతాపురం, అనకాపల్లి పట్టణం, లక్ష్మీదేవిపేట, కొత్తూరు, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి సందర్భంగా పూడిమడక జగన్నాథస్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మహిళలు సంప్రదాయ వస్త్రాలను ధరించి ఆలయానికి చేరుకున్నారు. చేపల తాతయ్య ఆధ్వర్యంలో పులిహోర, మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. మళ్లవరంలో గుర్రప్ప, మడుతూరులో చింతాలమ్మ గ్రామదేవతల పండగలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. మళ్లవరంలో గుర్రప్ప అమ్మవారి ఆలయం నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేసిన్నట్లు ప్రకటించారు. జనసేన జిల్లా కార్యదర్శి మోటూరు శ్రీవేణి, సర్పంచి పిన్నంరాజు వాసు, కరెడ్ల ప్రకాశ్, బాబ్జీ, చిన్ని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో దుర్గాదేవి

పూజల్లో భక్తులు

★ అనకాపల్లి మండలం రాజుపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. మహిళలు దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవస్థాన ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఈవో మురళీకృష్ణ పాల్గొన్నారు. సత్యనారాయణపురం కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కోటిపల్లి వెంకట రమణ కిశోర్, అధ్యక్షుడు యడ్ల త్రినాధరావు, అన్నదానం కమిటీ ఛైర్మన్ దుడ్డ శ్రీనివాసరావు ప్రతినిధులతో సమావేశమయ్యారు.

పాయకరావుపేట, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: పాయకరావుపేటలోని పాండురంగ స్వామి ఆలయంలో భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. అడ్డురోడ్డులోని దుర్గాదేవిని శాకంబరిగా అలంకరించారు.

ఘనంగా జగన్నాథస్వామి తిరుగు రథయాత్ర

అనకాపల్లి పట్టణం, మునగపాక, న్యూస్‌టుడే: జగన్నాథస్వామి తిరుగు రథయాత్ర ఆదివారం ఘనంగా జరిగింది. అనకాపల్లిలో పూజలు అందుతున్న జగన్నాథస్వామి అగ్గిమర్రిచెట్టు వద్ద ఆలయానికి చేరుకున్నారు. రథయాత్రను జనసేన ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ ప్రారంభించారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. డీఎస్పీ శ్రావణి, సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. గవర సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, దేవస్థాన ఉత్సవ కమిటీ ఛైర్మన్ దాడి బుజ్జి, ధర్మకర్తలు పాల్గొన్నారు. మునగపాకలో గోనల్లో నీరు నింపి జేగంటలు మోగిస్తూ ఊరేగింపు నిర్వహించారు. భక్తులతో వీధులన్నీ కిటకిటలాడాయి. నాగులాపల్లిలోనూ ఈ పండగను ఘనంగా నిర్వహించారు. స్వామిని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు దర్శించుకొన్నారు.

యాత్రను ప్రారంభిస్తున్న రామకృష్ణ

మునగపాకలో నీరు తీసుకొస్తున్న భక్తులు



మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722	పాయకరావుపేట-
ఎలమంచిలి- 80085 74726	80085 74750

అనకాపల్లి, న్యూస్‌టుడే: ?: అనకాపల్లి రైల్వేస్టేషన్ రోడ్డులో చిన్న వర్షం పడినా నీరు నిలిచిపోతోంది. – కాండ్రేగుల జనార్దన్, అనకాపల్లి, ✓: కాలువ నిర్మించి నీరు నిలిచిపోకుండా చేస్తాం. –బీవీ రమణ, జోనల్ కమిషనర్

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: దర్జీనగర్ వద్ద రహదారి అధ్వానంగా ఉంది. పెద్దపెద్ద గోతులు పడ్డాయి. – పరమేశ్, దర్జీనగర్, ✓: వర్షాలు తగ్గిన వెంటనే మరమ్మతు పనులు చేపడతాం. – ప్రభు, ఆర్‌అండ్‌బీ జేఈ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ?: ఎలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్ ఇన్, అవుట్ గేట్ల వద్ద ఆక్రమణలు పెరిగిపోయాయి. బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. –ఎన్.రమణ ఎలమంచిలి, ✓: ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. – ప్రసాదరాజు, కమిషనర్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ?: సెజ్ రోడ్డులో తుప్పలు పెరిగిపోయాయి.– పాత్రుడు, అనకాపల్లి, ✓: తుప్పలు తొలగిస్తాం. – సూర్యనారాయణ డీజెడ్ఎం, ఏపీఐఐసీ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాయకరావుపేట ఉన్నత పాఠశాల గేటు ముందు వర్షపు నీరు నిల్వ ఉంటోంది. రాకపోకలకు ఇబ్బంది వస్తోంది. – కె.రవి, స్థానికుడు, ✓: నీరు నిల్వ లేకుండా చర్యలు చేపడతాం. – లవరాజు, ఈవో

విద్యతోనే ఉన్నత స్థితి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరినీ విద్య ఉన్నతస్థితికి తీసుకువెళ్తుందని గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గండేపల్లి వెంకటరావు పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం ఈ సంఘ జిల్లా స్థాయి మహాసభలో పదో తరగతి విద్యార్థులు సింహాద్రి అలేఖ్య, సౌమ్యసత్య, ఎ.జశ్విత, జి.హాసిని, ఇంటర్ విద్యార్థులు రత్నామణి, నేహా, ప్రణీత్, చేతన్‌కు బంగారు పతకాలు అందజేసి సత్కరించారు. సంఘం కార్యదర్శి కొమ్మనాపల్లి వాసు, కోటేశ్వరరావు, ఇతర మండలాల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సత్కారం పొందిన విద్యార్థులతో సభ్యులు

పెంపుడు శునకాలకు టీకా తప్పనిసరి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: పెంపుడు శునకాలకు తప్పనిసరిగా యాంటీ రేబిస్ టీకా వేయించాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీనగరం పశువైద్య కేంద్రంలో ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బి.రామమోహనరావు మాట్లాడుతూ జంతువులను తాకిన వెంటనే చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. జిల్లాలో 80 పశువైద్య కేంద్రాల్లో 24వేల టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వారంలోపు ఎప్పుడైన పెంపుడు శునకాలకు టీకాలు వేయించాలన్నారు. పశుగ్రాస వారోత్సవాల గోడప్రతులను ఆవిష్కరించారు. ఆర్డీఓ షేక్ ఆయిషా, ఏడీ సౌజన్య పాల్గొన్నారు.

ఎలమంచిలిలో కుక్కలకు టీకాలు వేస్తున్న గంగాధర్

పాయకరావుపేట, కోటవురట్ల, ఎలమంచిలి, న్యూస్‌టుడే: పేట పశువుల ఆసుపత్రి వద్ద ఏడీ వి.శ్రీధర్ ఆధ్వర్యంలో 70కి పైగా కుక్కలకు ఏంటీ రేబిస్ టీకాలు వేశారు. కోటవురట్ల పశు వైద్యాశాలలో ఏడీ నరేష్ శునకాలకు టీకాలు వేశారు. ఎలమంచిలి ప్రశువైద్యశాలలో కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేసే కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు ప్రారంభించారు.

(c) eenadu

తీసిన గోతులు.. మూసేదెప్పుడు

రోలుగుంట, న్యూస్‌టుడే: బుచ్చెంపేట సమీపంలోని నిండు గొండ మీదుగా రోలుగుంట వెళ్లేదారిలో రహదారికి ఇరువైపులా తీసిన గోతులు వాహనదారులకు, పాదచారులకు అమ్మో అనిపిస్తున్నాయి. దాదాపు పది అడుగుల లోతున ఉన్న ఈ గుంతలతో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామదేవత మరిడమ్మ ఆలయానికి సంబంధించిన ముఖద్వారం పునర్నిర్మాణం కోసం తీయించిన గోతులను త్వరలోనే మూయించేస్తామని బుచ్చెంపేట నాయకుడు ఉలబాల రాము తెలిపారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

మొక్కల సంరక్షణ భళా

ఇటీవల కురుస్తున్న వర్షాలకు చీడికాడ మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటుతున్నారు. వీటిని పశువులు పాడవకుండా ప్రత్యేకంగా మొక్కలు చుట్టూ కర్రలను పాతి.. గ్రీన్ నెట్‌ను చుట్టి పచ్చదనాన్ని సంరక్షిస్తున్నారు. రహదారుల్లో ప్రయాణికులను ఆకట్టుకుంటున్న మొక్కల చిత్రాలను 'న్యూస్‌టుడే' క్లిక్ మని పించింది. – న్యూస్‌టుడే, చీడికాడ

జి.కొత్తపల్లి-పెదగోగాడ రోడ్డుకు ఇరువైపులా మొక్కలకు గ్రీన్ నెట్‌ను చుట్టారు ఇలా..

గొంతులు ఎండుతున్నాయ్..!

వారం రోజులుగా నిలిచిన నీటి సరఫరా

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండల కేంద్రంలోని బీసీ కాలనీలో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఇక్కడ కాలనీ ప్రజలు వారం రోజులుగా తాగునీటికి అల్లాడిపోతున్నారు. స్థానిక వెలుగు కార్యాలయం సమీపంలో జల్‌జీవన్ మిషన్‌లో రక్షిత మంచినీటి పథకం నిర్మించారు. ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేశారు. ఆరునెలల క్రితం రక్షిత మంచి నీటి పథకం నుంచి ఇంటింటికీ ఏర్పాటు చేసిన కుళాయిలకు నీటిని సరఫరా చేశారు. ఈ క్రమంలో రక్షిత మంచినీటి పథకం నుంచి లీకులు వస్తున్నాయని వారం రోజులగా నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో మండల కేంద్రం చీడికాడలోని అత్యధిక జనాభా ఉన్న బీసీ కాలనీ ప్రజలు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో నీటికోసం అల్లాడిపోతున్నారు. బిందెడు నీళ్లకోసం పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాలనీ మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీళ్లకోసం మోటార్లు ఉన్న ఇళ్ల వద్దకు, చేతిబోర్ల వద్దకు రోజూ పరుగులు తీస్తున్నారు. అధికారులు స్పందించి వారం రోజులుగా పడుతున్న నీటి కష్టాలు ఇప్పటికైనా తీర్చాలని కోరుతున్నారు.

చీడికాడ బీసీ కాలనీలో రక్షిత మంచినీటి పథకం

గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ కనకమ్మను 'న్యూస్‌టుడే' సంప్రదించగా రక్షిత మంచి నీటి పథకం కొత్తది కావడంతో భవిష్యత్తులో లీకులు కాకుండా తుదిదశ పనులు చేస్తున్నామని, దీనికోసం నీటి సరఫరా నిలిపివేశామన్నారు. రెండు రోజుల్లో రక్షిత మంచినీటి పథకం నుంచి కుళాయిల ద్వారా తాగునీటిని అందిస్తామని చెప్పారు.

ప్రగతి దిశగా అడుగులు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: బడుల్లోని విద్యార్థుల చదువుల పురోగతి వివరాలు తెలుసుకునేందుకు ప్రగతి కార్డులు సిద్ధమయ్యాయి. త్వరలో చేపట్టనున్న మెగా తల్లి దండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం(పేటీఎం)లో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయి. పిల్లల్లోని వివిధ అంశాల్లోని సామర్థ్యంపై వీటి ద్వారా అంచనాకు రావచ్చు. గత విద్యా సంవత్సరం పరీక్షల్లో వచ్చిన మార్కులు, ఆరోగ్య వివరాలు తదితర వాటితో ఇవి సమగ్రంగా రూపుదిద్దుకున్నాయి. కూటమి ప్రభుత్వం గతేడాది తల్లి దండ్రుల సమావేశాలను ప్రయోజకరంగా నిర్వహించగా ఈ ఏడాది దాన్ని విస్తృతం చేస్తున్నారు. ఈ నెల 10న చేపట్టనున్న వీటిల్లో అందజేయడానికి వీలుగా కార్డులు సిద్ధం చేస్తున్నారు.

▼ జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల చదువుల తీరును ఈ కార్డుల్లో పొందుపరచనున్నారు. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో 1 నుంచి 10 తరగతుల చదివిన వారికి ఫార్మెటివ్, రెండు సమ్మెటివ్ పరీక్షల్లో వచ్చిన మార్కులు వీటిలో పేర్కొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన అన్ని రకాల వైద్య పరీక్షల వివరాలు నమోదు చేయనున్నారు.

▼ బాలల అభ్యసన సామర్థ్యాలతో పాటు వారిలోని భావ వ్యక్తీకరణ, భవిష్యత్తు లక్ష్యాలు, బలాలు, బలహీనతలకు తోడు మానసిక ఆరోగ్యం, వివిధ సామాజిక అంశాలపై అవగాహన స్థాయి సైతం నిక్షిప్తం చేస్తారు. వీటి ద్వారా పిల్లలపై ఒక అంచనాకు వచ్చే తల్లి దండ్రులు వారిలోని లోపాలను సరిదిద్ది చదువులో మరింతగా మెరుగుపడేలా చర్యలు తీసుకునేలా అవకాశముందని భావిస్తున్నారు.



విద్యార్థుల సామర్థ్యం అంచనాకు కార్డులో పేర్కొన్న వివిధ అంశాలు

విద్యార్థుల ప్రగతిపై సమీక్షకు దోహదం..:

ఈ నెల 10న చేపట్టనున్న మెగా పేటీఎం విద్యార్థుల ప్రగతిపై సమీక్షకు దోహదపడుతుంది. జిల్లాల్లో మొత్తం 1,474 విద్యా సంస్థల్లో ఆ రోజు నిర్వహించే సమావేశాల్లో 2,09,411 మంది విద్యార్థులు, 6,087 మంది ఉపాధ్యాయులు పాల్గొనున్నారు. తల్లిదండ్రులందరికి తమ పిల్లల కార్డులు అందజేస్తారు. జిల్లాలోని అన్ని మండలాల విద్యాశాఖాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వీటిని పకడ్బందీగా నిర్వహించాలి.
– జయప్రకాష్, సమగ్ర శిక్షా ఏపీసీ, అనకాపల్లి

పరిశ్రమల ప్రాంతానికి రహదారి!

మాకవరపాలెం, న్యూస్‌టుడే: పయనీర్ పరిశ్రమ పరిసర ప్రాంతాల్లో కొత్తగా రానున్న పరిశ్రమలకు రహదారి కల్పించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. 15 ఏళ్ల క్రితం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో పయనీర్ పరిశ్రమకు అప్పగించిన భూముల్లో కాకుండా మిగిలిన సుమారు 300 ఎకరాలను పరిశ్రమలకు అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ సరైన రోడ్డు లేక ఎవరూ ముందుకు రావడంలేదు. బీడీఎల్ పరిశ్రమ ఏర్పాటుకు భూమి అప్పగించేందుకు, రహదారి ఏర్పాటుకు సంబంధించి కలెక్టర్ విజయకృష్ణన్ ఇటీవల స్థల పరిశీలన చేశారు. రామన్నపాలెం ఏలేరు కాలువ వరకు 64 అడుగుల రోడ్డు, కాలువపై వంతెన నిర్మాణ పనులకు తహసీల్దారు వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివారం సర్వే నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దారు, ఆర్ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న తహసీల్దారు వెంకటరమణ

అ వీ ఇ వీ

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను అంధకారం చేసుకోవద్దని గ్రామీణ సీఐ రేవతమ్మ సూచించారు. యరకన్నపాలెంలో ఆదివారం రాత్రి మత్తు పదార్థాల వినియోగం, గంజాయి, సైబర్ మోసాలు, పోక్సో చట్టాలతోపాటు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేయడంపై స్థానికులకు అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఎస్సై రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడి మృతి

నాతవరం, న్యూస్‌టుడే: తెదేపా నాయకుడు మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు లాలం అచ్చిరాజు ఆదివారం మృతి చెందారు. తెదేపా ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి పనిచేసిన ఆయన పార్టీలో పలు హోదాల్లో పనిచేశారు. అచ్చిరాజు పనితీరును గుర్తించిన అయ్యన్నపాత్రుడు అప్పట్లో నర్సీపట్నం మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించారు. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన ఆదివారం సాయంత్రం మృతి చెందారని పార్టీ నేతలు తెలిపారు. అచ్చిరాజు మృతిపై సభాపతి అయ్యన్నపాత్రుడు. తాండవ కమిటీ ఛైర్మన్ కరక సత్యనారాయణ సంతాపం వ్యక్తం చేశారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: దేవరాపల్లి ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో మృతిచెందిన సోములు అనే అనాథకు దహన సంస్కారాలను జరిపి పారిశుద్ధ్య కార్మికులు మానవత్వాన్ని చాటుకున్నారు. కుటుంబ సభ్యులు ఎవరూ లేని వ్యక్తి కొన్నేళ్ల నుంచి దేవరాపల్లిలో ఉంటున్నాడు. ఇతనికి మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు పింఛను కోసం అన్ని ధ్రువపత్రాలు చేయించి పింఛను సౌకర్యం కల్పించారు. పింఛను సొమ్ముతో పాటు కట్టెలు అమ్ముకొని జీవనం ఈయన ఆదివారం మృతి చెందారు.

బకాయిలు విడుదల చేయండి

దేవరాపల్లి, న్యూస్‌టుడే: పల్లె పండగ బకాయిని వెంటనే విడుదల చెయ్యాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండు చేశారు. బకాయిలు చెల్లించక పోవడంతో అభివృద్ధి పనులన్నీ నిలిచిపోయాయని ఆయన అన్నారు. అనకాపల్లిలో రూ.143 కోట్లు విలువైన పనులు జరిగితే కేవలం రూ.11 కోట్లు మాత్రమే బిల్లులు చెల్లించారని ఆయన ఆదివారం విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించిన నిధులు విడుదల చేసి పనులు పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

సంస్థాగతంగా బలపడేలా పనిచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు తదితరులు

చోడవరం, న్యూస్‌టుడే: గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం చేసేలా పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాల మేరకు పని చేయాలని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. సంస్థాగత ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని స్థానిక సీతరామకల్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ సమావేశం జరిగింది. గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, పార్టీ పరిశీలకుడు గొంప కృష్ణ, ఎన్నికల పరిశీలకుడు నీలం బాబు, వేగి పరమేశ్ నాలుగు మండలాల పరిశీలకులు, గూనూరు మల్లునాయుడు, గెడేల సత్యనారాయణ నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు. ▼ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రాజు పార్టీ నాయకులతో కలిసి జన్నవరం, కొత్తూరు, చాకిపల్లి, రామజోగిపాలెం, తిమ్మన్నపాలెం గ్రామాల్లో పర్యటించారు.

దేవరాపల్లి : గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గొర్రుపోటు రామ్మూర్తి నాయుడు పేర్కొన్నారు. మండలంలోని కాశీపురంలో జనసేన పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ మండలంలోని 27 పంచాయతీల్లో పార్టీ కార్యకలాపాలు విస్తృతం చేయడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. సమావేశంలో జనసేన జిల్లా కార్యదర్శి గుమ్మడి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయుడు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: సామాజిక సమానత్వం, అణగారినవర్గాల హక్కుల సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ నేటితరానికి ఆదర్శమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం కొత్తవీధి రోడ్లోని విగ్రహం వద్ద నాయకులతో కలిసి నివాళి అర్పించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నంగిన వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏబీఎల్ స్వామి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు యాకా శివ, కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, రేవు రాము నివాళి అర్పించారు.

చోడవరం, న్యూస్‌టుడే: బాబూ జగ్జీవన్‌రామ్ తాను చేపట్టిన అధికార, పార్టీ పదవులకు చక్కగా పాలన చేసి వన్నె తెచ్చారని మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లాధ్యక్షుడు ఖండేల వెంకటరావు అన్నారు. పట్టణంలోని ఇందిరా కాలనీలో ఉన్న బాబూజగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఆయన వర్ధంతిని ఆదివారం జరిపారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తల ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని గుడ్డిపలో ఆదివారం భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గల్లా రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గల్లా రాజేశ్వరరావు, బూత్ కమిటీ సభ్యులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకుల నివాళి

సందడే సందడి

చింతపల్లి మండలం చెరువులవేనంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ఇటీవల విడవకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మన్యానికి పర్యాటకుల రాక తగ్గింది. వాతావరణం కాస్త మారడంతో ఆదివారం పరిమితంగా పర్యాటకులు వచ్చారు. తాజంగి, లంబసింగి, చెరువులవేనం ప్రాంతాల్లో సందడి నెలకొంది. మంచు, ప్రకృతి అందాలను వీరు ఆస్వాదిస్తూ వ్యూపాయింట్‌ల వద్ద ఫొటోలు తీసుకున్నారు. వంజంగి మేఘాలకొండ వద్ద పర్యాటకుల సందడి మొదలైంది. ఇక్కడి పొగమంచు అందాలు వీక్షించేందుకు ఆదివారం మైదాన ప్రాంతాల నుంచి సందర్శకులు పెద్దఎత్తున వచ్చారు. – న్యూస్‌టుడే, పాడేరు పట్టణం, చింతపల్లి

పెంపుడు జంతువులకు రేబీస్ నివారణ టీకాలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నర్సీపట్నం పశువైద్య కేంద్రంలో 115 పెంపుడు జంతువులకు ఉచితంగా రేబీస్ టీకాలు వేశారు. కార్యక్రమాన్ని తెదేపా కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువైద్య సహాయ సంచాలకుడు డబ్ల్యూ రాంబాబు, పలువురు పశువైద్యులు, గోపాలమిత్రలు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి, చోడవరం: పెంపుడు జంతువుల సంరక్షణతో పాటు ప్రజల రక్షణకు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దేవరాపల్లి పశువైద్యాధికారిణి గాయిత్రి దేవి పేర్కొన్నారు. కుక్కలకు ప్రత్యేక టీకాల వేసే కార్యక్రమాన్ని పశువైద్యశాలలో చేపట్టారు. జైతవరంలో పశుసంవర్ధకశాఖ సహాయకుడు శ్రీనివాసరావు 20 టీకాలను వేశారు.

మాడుగుల గ్రామీణం: మాడుగుల మండలంలోని అన్ని పశు వైద్య శాలలో మరియు రైతు సేవా కేంద్రాలలో పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు పాల్గొన్నారు. మాడుగులలో 36, కేజేపురంలో 38, ఎం.కోడూరులో 46, కింతలివల్లాపురంలో 31 టీకాలు వేశారు.

చోడవరం: చోడవరం పశుసంవర్ధక ఆసుపత్రి సహాయ సంచాలకుడు గిడుతూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీకాల కార్యక్రమం జరిగింది. ఆదివారం చోడవరం ఆసుపత్రితోలో 250 రేబీస్ టీకాను అందజేశారు.

రోలుగుంట: పెంపుడు శునకాలు కారణంగా కొన్ని ప్రమాదకర వ్యాధులు మనుషులకు సంక్రమిస్తాయని ఈ కారణంగా ఏటా ఎంతోమంది మరణిస్తున్నారని రోలుగుంట పశువైద్యాధికారి నూకేశ్వర రావు పేర్కొన్నారు. రోలుగుంట పశువైద్య కేంద్రంలో శునకాలకు ఉచిత టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. 600డోసుల మందు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

పెంపుడు కుక్కకు టీకా వేయిస్తు న్న తెదేపా కౌన్సిలర్ చింతకాయల పద్మావతి

బీజామృతంతో విత్తనశుద్ధి మేలు

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: బీజామృతంలో వరి విత్తనాలను శుద్ధి చేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం నర్సీపట్నం ప్రాంత ఇన్‌ఛార్జి రమ అన్నారు. ఆదివారం వేములపూడిలో రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. దీని వల్ల తెగుళ్లను తట్టుకుంటుందని, నూరు శాతం మొలకలు వస్తాయని వివరించారు. ఎంపీటీసీ సభ్యుడు బోళెం రామప్రసాద్ పాల్గొన్నారు.

రావికమతం, న్యూస్‌టుడే: పొలాల్లో వరి విత్తనం వేసే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయంలో బీజామృతం ద్వారా వరి విత్తన శుద్ధి చేసే విధానంపై సంబంధిత శాఖ సిబ్బంది రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఆదివారం రావికమతంలో వరి నారు వేసే రైతులకు బీజామృతంతో శుద్ధి చేయడం, తెగుళ్లు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్ర స్థాయి సిబ్బంది గణపతి, సన్యాసి నాయుడు, దొరబాబు, లావణ్య, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అంతటా వైకుంఠ శోభ

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి దేవాలయంలో ఆదివారం జగన్నాథుడు శేషపాన్పులో కొలువుదీరారు. శయన ఏకాదశి పర్వదినం కావడంతో దశావతారాలు చివరిరోజు శేషపాన్పుగా శ్రీరంగనాథ అంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

మాడుగుల, న్యూస్‌టుడే: మాడుగులలో తొలి ఏకాదశి సందర్భంగా కొలువైన జగన్నాథుడి రథోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది నూతనంగా నిర్మించిన ఇంద్రద్యుమ్నం భవనంలో పది రోజులు సేవలందుకొని ఆదివారం రథంపై సుభద్ర జగన్నాథ బలరాములతో భక్తులు రథంపై ఆలయానికి తీసుకొచ్చారు.

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తకోటలో మరిడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా ఆదివారం గ్రామ పురవీధుల్లో గరగల ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈనెల 10న గురువారం అమ్మవారి పండగ ఘనంగా జరుగుతుంది. డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ సత్యదేవ్, మాజీ ఉప సర్పంచి గున్నాజీరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నర్సీపట్నం, నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: తొలి ఏకాదశ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం పురపాలికలోని ఆలయాలన్నీ కళకళలాడాయి. స్థానిక వేంకటేశ్వర స్వామి దేవాలయంలో చందనోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. స్వామి చందన అలంకరణ దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాతను కూరగాయలతో అలంకరించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సాయంత్రం పిండివంటలతో భక్తులు సారె సమర్పించారు.

దేవరాపల్లి, న్యూస్‌టుడే: దేవరాపల్లిలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. పంచామృతాభిషేకం ఘనంగా జరిగింది. అభిషేకాల అనంతరం స్వామి వారితో పాటు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

చోడవరం పట్టణం: స్థానిక ఆపదహర వెంకటేశ్వరుని దేవాలయంలో శ్రీవారి అక్షయపాత్ర అన్న సమారాధన సేవా సొసైటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ జరిగింది.

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం తొలి ఏకాదశి పుణ్యదినం పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చోద్యంలో కనకదుర్గమ్మను కూరగాయలతో అలంకరించారు. కృష్ణదేవిపేట, జోగుంపేట, గొలుగొండ, కొత్తమల్లంపేట సాయిబాబా, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసిన భక్తులు మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

మాకవరపాలెం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీకృష్ణుని కాలనీలోని కృష్ణుని ఆలయంలో సమరసత సేవా సంఘం ఆధ్వర్యంలో తలసిదళాలతో అభిషేకాలు జరిపారు. తామరం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి పూజలు నిర్వహించారు. సమరసతా సేవా సంఘం కన్వీనర్ రత్నమాల, రఘుబాబు పాల్గొన్నారు.

చోడవరంలో జగన్నాథ స్వామి

కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ముందు సారె

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743, చోడవరం - 80085 74732, మాడుగుల - 80085 74740 చీడికాడ - 80085 74742

రోలుగుంట, న్యూస్‌టుడే: బలిజిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రానికి సమీపంలోని పాడైన బావిని చాలాకాలంగా కూల్చకుండా వదిలేశారు. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశముంది. – నూకరాజు, బలిజిపాలెం, గుండుబాడు పంచాయతీ, ✔: తక్షణమే దృష్టిసారిస్తాం. నిరుపయోగంగా ఉన్న ఈ బావిని పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం.– మామిడి అప్పలనరస, సర్పంచి, గుండుబాడు

రోలుగుంట, న్యూస్‌టుడే: బలిజిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రానికి సమీపంలోని పాడైన బావిని చాలాకాలంగా కూల్చకుండా వదిలేశారు. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశముంది. – నూకరాజు, బలిజిపాలెం, గుండుబాడు పంచాయతీ, ✔: తక్షణమే దృష్టిసారిస్తాం. నిరుపయోగంగా ఉన్న ఈ బావిని పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం.– మామిడి అప్పలనరస, సర్పంచి, గుండుబాడు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: శివపురంలోని ఆంజనేయ గుడి ప్రాంతంలో వీధి దీపం వెలగడం లేదు. పిల్లలు, వృద్ధులు రాత్రుళ్లు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. – రామబ్రహ్మం, శివపురం, ✔: సిబ్బందిని పంపించి దీపం వెలిగేలా చూస్తాం. – ఎం.రవి, మున్సిపల్ ఏఈ

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: నాగాపురం, కుమారపురం ప్రాంతాల్లో నిత్యం కోతులు మూకుమ్మడిగా పంటలు నాశనం చేస్తున్నాయి. పండ్లతోటలు, పాయిల్ తోటలు నాశనం చేస్తున్నాయి. – కొలగాని రామారావు, నాగాపురం ✔: కోతులు అధికంగా ఉన్న ప్రదేశాల్లో గూళ్లు ఏర్పాటు ద్వారా పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టే ప్రయత్నం చేస్తున్నాం. – సత్యనారాయణ, డీఆర్వో, కృష్ణదేవిపేట

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: సమస్య: నాగాపురం, కుమారపురం ప్రాంతాల్లో నిత్యం కోతులు మూకుమ్మడిగా పంటలు నాశనం చేస్తున్నాయి. పండ్లతోటలు, పాయిల్ తోటలు నాశనం చేస్తున్నాయి. – కొలగాని రామారావు, నాగాపురం ✔: కోతులు అధికంగా ఉన్న ప్రదేశాల్లో గూళ్లు ఏర్పాటు ద్వారా పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టే ప్రయత్నం చేస్తున్నాం. – సత్యనారాయణ, డీఆర్వో, కృష్ణదేవిపేట

నర్సీపట్నం, న్యూస్‌టుడే: స్థానిక కాపు వీధిలోని రోడ్డు పక్క పబ్లిక్ కుళాయికి మూతలేక తాగునీరు వృథా అవుతోంది. నీరు పోకుండా కర్ర ముక్క బిగిస్తున్నా ఫలితం ఉండటం లేదు. – చిన రాజమ్మ, నర్సీపట్నం ✔: సిబ్బందిని పంపించి కుళాయికి మూత బిగించేలా ఏర్పాట్లు చేస్తాం. – ఎం.రవి, మున్సిపల్ ఏఈ, నర్సీపట్నం

అనాథలకు చేయూత

చీడికాడ, న్యూస్‌టుడే: అనాథ పిల్లలకు ఫ్రెండ్స్ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. కోనాం సమీపంలో ఉన్న పాడేరు మండలం చలుగు పంచాయతీ దబ్బగరువు గ్రామానికి చెందిన దంపతులు ఇటీవల అకాల మరణం చెందారు. దీంతో నిరాశ్రయులైన వారి పిల్లలకు అనకాపల్లి జిల్లాకు చెందిన ఫ్రెండ్స్ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థకు చెందిన బృందం గ్రామానికి వెళ్లి నిత్యావసర సరకులు, దుస్తులతో పాటు కొంత ఆర్థిక సాయం అందజేశారు.

బాధిత కుటుంబానికి సాయం

నాతవరం: మర్రిపాలెం గ్రామంలో క్రికెట్ ఆడుతూ ప్రమాదానికి గురైన ఉపేంద్ర అనే యువకుడి కుటుంబానికి హెల్ప్ ఫర్ పూర్ పీపుల్స్ పేరట కె.శివ తన మిత్రులు కలిసి ఆదివారం నిత్యావసరాలు అందించారు. ఈ కుటుంబం నిరుపేద స్థితిని గమనించి రూ.10 వేలు విలువైన సరకులు అందించామన్నారు.

విద్యాసామగ్రి అందజేత

చోడవరం, న్యూస్‌టుడే: ప్రతి సభ్యుడు సేవాభావంతో మెలగాలని వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ అన్నారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆదివారం వాసవీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సరస్వతి పూజ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు పూజ అనంతరం విద్యాసామగ్రి అందజేశారు. దాదాపు 2565 మందికి సామగ్రిని ఇచ్చారు. క్లబ్ గవర్నరు కొల్లూరి పూర్ణిమ, ఐఈసీ ఆఫీసర్ కలగర్ల శేషగిరిరావు, ప్రాంతీయ సమన్వయకర్త పసుమర్తి ఆశోక్, యూత్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేస్తున్న వాసవీ క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ, జిల్లా క్లబ్ గవర్నరు పూర్ణిమ

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

వడ్డాదిలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు నాయుడు

రోలుగుంట, న్యూస్‌టుడే: న్యాయపరమైన డిమాండ్ల సాధనకు ఈ నెల 9న చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో రోలుగుంటలో ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు రోలుగుంట, కుసర్లపూడి తదితర గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో సీపీఎం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: సీఐటీయూ ఆదివారం ప్రచారజాత నిర్వహించారు. వడ్డాది, బంగారుమెట్ట, బుచ్చెయ్యపేట, విజయరామరాజుపేట గ్రామాల్లో కార్మికులతో కలిసి ప్రచారం చేశారు. సీఐటీయూ నాయకుడు ఎస్వీ నాయుడు మట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. కార్మికులందరూ పెద్దఎత్తున పాల్గొని సమ్మెను విజయవంతం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, విజయకుమార్, ఏసురాజు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: గొలుగొండ, నాతవరం మండలాల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. పాతమల్లంపేట, నిమ్మగెడ్డ, గదబపాలెం, కరక ప్రాంతాల్లో ఆదివారం మైక్ ప్రచారం చేశారు. ఈ జాతాను ఉద్దేశించి సీఐటీయూ డివిజన్ నాయకులు శివ మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన లేబర్ బిల్లు కోడ్‌ను రద్దు చేయాలని కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడంతోపాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు 200 పనిదినాలు కల్పించడంతో పాటు రోజువారీ వేతనం రూ.500 చెల్లించాలన్నారు.

రావికమతం, న్యూస్‌టుడే: సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం రావికమతం, మేడివాడ, టి.అర్జాపురం, కొత్తకోట గ్రామాల్లో జీపు జాత నిర్వహించారు.

IN THE HONOURABLE COURT OF THE IV ADDITIONAL DISTRICT & SESSIONS JUDGE: AT VIZIANAGARAM.
E.P.No.11/2025 IN O.S.No.38/2021
Between:
1. Kovvuri Vikas Reddy
2. Kovvuri Lathcha Reddy
......DHrs/Plaintiffs
AND:
Bokam Nageswara rao
.......JDr/Defendant
To,
Bokam Nageswara Rao,
S/o. Sanibabu. Residing at Tavvavanipalam, Sabbavaram Mandal, Visakhapatnam.

NOTICE

Please take notice that the above name DHrs has filed the above Execution Petition against the JDr for execute the sale deed and registered the same on the file of Hon'ble IV Additional District and Session Judge, Vizianagaram. Andhra Pradesh State and for the reason of non service of notice to JDr, this notice to be published in the Paperenabling the JDr to appear before this Honourable Court as per the orders of the Honourable Court.

So, the JDr should appear before this Honourable Court on 18-07-2025 at 10:30 AM either individual or Advocate as per the orders of the Hon'ble IV Additional District And Sessions Judge, Vizianagaram. In default of Your appearance on that date the E.P will be heard and determined your absence basing on the material available in the Court.

P.V.V. Gajapathi & K.S.Bhavani,
Advocates,
near Pydithallamma vari Temple Street, Rly. Station Road, Vizianagaram

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు

పెందుర్తి, న్యూస్‌టుడే

లక్ష్మీకాంత్ స్క్రీన్-1- **జురాసిక్ వరల్డ్** (మార్నింగ్, ఫస్ట్ షో), **కన్నప్ప** (మ్యాట్నీ, సెకెండ్ షో) స్క్రీన్-2 - **తమ్ముడు**

సబ్బవరంలో సినిమా చిత్రీకరణ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో రజనీ కల్యాణం సినిమా చిత్రీకరణ మొదటి షెడ్యూలు పూర్తయినట్లు ఆ సినిమా డైరెక్టర్ రజనీ కల్యాణ్ తెలిపారు. రెండో షెడ్యూలును అంతకాపల్లి గ్రామంలో మండల మాజీ తెదేపా అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు ఆదివారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈచిత్రంలో నటీనటులంతా కొత్త ఆర్టిస్టులేనని డైరెక్టర్ పేర్కొన్నారు.

నేటి నుంచి బీఎల్వోలకు శిక్షణ

పెందుర్తి, న్యూస్‌టుడే: భారత ఎన్నికల సంఘం, ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పెందుర్తి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారిణి పి.శేషశైలజ తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 299 మంది బీఎల్వోలు ఉండగా రోజుకు 50మంది చొప్పున బ్యాచ్‌ల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఓటరు జాబితాల నిర్వహణ, ఎన్నికల ప్రక్రియపై ఏఈఆర్‌వోలు బీఎల్‌వోలకు శిక్షణ అందిస్తారని వివరించారు. పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో ప్రారంభించనున్న ఈ శిబిరం ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం నాయుడుపాలెం పంచాయతీ మెట్టపాలెంలోని మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడద వెంటాడుతోంది. –స్థానికులు. ✓: వెంటనే పరిశీలించి పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రత చర్యలు చేపడతాం. –ధర్మారావు, ఈవోపీఆర్డీ, పరవాడ

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం పంచాయతీ సాయినగర్ కాలనీలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. –ఎన్.గోపాల్, సాయినగర్‌కాలనీ, సబ్బవరం. ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతాం. –వై.రాజేశ్వరరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

?: పెదగొల్లలపాలెంలో చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించకుండా గెడ్డలో పడేస్తున్నారు. –స్థానికులు, గొల్లలపాలెం. ✓: ఇక మీదట వ్యర్థాలు గెడ్డలో పడేయకుండా తగిన చర్యలు తీసుకుంటాం. –చైతన్య, ఈవోపీఆర్డీ, సబ్బవరం

వేపగుంట, న్యూస్‌టుడే: ?: ప్రహ్లాదపురం సమీప పల్లినారాయణపురంలో భూగర్భ డ్రైనేజీ గోతులు ప్రమాదకరంగా మారాయి. –నీలకంఠరావు, పల్లినారాయణపురం. ✓: సంబంధిత విభాగం సిబ్బందితో పనులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. –హేమవతి, జోనల్ కమిషనర్

స్పందనకు వందనం

ఎట్టకేలకు వ్యర్థాల తొలగింపు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పెదముషిడివాడ పంచాయతీ నక్కవానిపాలెంలో పేరుకుపోయిన వ్యర్థాలను ఎట్టకేలకు తొలగించారు. ఇక్కడి కాలువలో చెత్త నిల్వల కారణంగా దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని ఇటీవల స్థానికులు 'ఈనాడు- మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకురాగా దీంతో అధికారులు స్పందించారు. కాలువలోని పూడిక తీయించి శుభ్రత చర్యలు చేపట్టారు.

బోధన భేష్... ఫలితాలు అదుర్స్...

ప్రగతి పథంలో పెదముషిడివాడ జడ్పీ ఉన్నత పాఠశాల

తరగతి గదిలో విద్యార్థులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పెదముషిడివాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రగతి పథంలో పయనిస్తోంది. ఇక్కడ 6 నుంచి పదోతరగతి వరకు 320 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. నాణ్యమైన బోధనతోపాటు అధునాతన సైన్స్ ల్యాబ్‌లు, ఫర్నీచర్, విశాలమైన మైదానం తదితర వసతులు ఉన్నాయి. బాల బాలికలు వీటిని సద్వినియోగం చేసుకుని పదిలో ప్రతిభ చాటడమే కాక జిల్లాస్థాయి కబడ్డీ, ఖోఖో, సైన్స్ ఫెయిర్ పోటీల్లోనూ రాణిస్తూ ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంటున్నారు.

★ 2024-25 విద్యా సంవత్సరంలో 85 మంది పదో తరగతి పరీక్షలు రాయగా 83 మంది పాసై 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 34 మంది 500లకు పైగా మార్కులు సాధించారు. వీరిలో అర్చి వెంకటజయ 595, పల్లా అనుష్క 592, డి.మహేశ్వరి 585 మార్కులు సొంతం చేసుకుని కలెక్టరు, డీఈవో చేతులమీదుగా అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో 98శాతం, 2022-23లో 90 శాతం ఉత్తీర్ణత సాధించారు.

★ గత మూడేళ్ల కాలంలో ఈ పాఠశాల నుంచి ట్రిపుల్‌ఐటీకి 17 మంది ఎపికయ్యారు. 2024-25 విద్యా సంవత్సరంలో వెంకటజయ, అనుష్క, మహేశ్వరి, సునందని, జె.రమ్య, పి.నరేంద్ర ట్రిపుల్‌ఐటీ ప్రవేశాలకు ఎపికయ్యారు. 2023-24లో అయిదుగురు, 2022-23లో ఆరుగురు అర్హత సాధించినట్లు పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి.

★ కేంద్ర ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు ఏటా నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ ప్రతిభా పాటవ ఉపకార వేతన పరీక్షకు గత నాలుగేళ్ల కాలంలో 13మంది ఎంపికయ్యారు. 2024-25లో ఒకరు, 2023-24లో ఇద్దరు, 2022-23లో 5గురు, 2021-22లో ఐదుగురు అర్హత సాధించారు. వీరికి ఇంటర్మీడియట్ పూర్తయ్యేవరకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.12వేలు చొప్పున నాలుగేళ్లపాటు వీరి బ్యాంకు ఖాతాల్లో నగదు జమవుతుంది.

ఉపాధ్యాయుల సమష్టి కృషితో...

విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధించి వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నాం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఎన్‌ఎంఎంఎస్ ఉపకారవేతన పరీక్షకు ప్రత్యేక శిక్షణ, పదోతరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. ఉపాధ్యాయుల సమష్టి కృషితో చక్కటి ఫలితాలు సాధిస్తున్నాం. అన్ని వసతులతో స్థానికంగా ఈ పాఠశాల అందుబాటులో ఉన్నందున 6 నుంచి పదో తరగతి వరకు చదివే పిల్లలంతా వ్యయప్రయాసల కోర్చి దూరప్రాంతాలకు వెళ్లకుండా ఈ బడిని సద్వినియోగం చేసుకోవాలి.

–కె.కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు, పెదముషిడివాడ, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల

వైద్య శిబిరాలకు స్పందన

రక్తదానం చేస్తున్న యువకులు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం వంగలి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో రక్తదాన, ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. తాసుబిల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో 50మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కంటి వైద్య శిబిరానికి 150 మంది రోగులు హాజరయ్యారు. వారికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. స్థానిక నాయకులు సహకరించారు.

బొగ్గు లారీ బోల్తా

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం సోమునాయుడుపాలెం సమీపంలో ఆదివారం ఓ లారీ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. గంగవరం పోర్టు నుంచి బొగ్గు లోడుతో పాలవలసలోని హిందుజా పవర్ ప్లాంటుకు వెళ్తున్న లారీ సోమునాయుడుపాలెం వద్దకొచ్చేసరికి అదుపు తప్పి బోల్తా పడింది. లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

11న కార్మికుల టోకెన్ సమ్మె

కార్పొరేషన్: మహా విశాఖ నగర పాలక సంస్థ మంచినీటి సరఫరా కార్మికుల వేతనాల పెంపు, బకాయిల విడుదలకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో 11న టోకెన్ సమ్మె నిర్వహించి, 16 నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తామని గ్రేటర్ విశాఖ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు, ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యం తెలిపారు. ఇటీవల సమ్మె చేసినప్పుడు మేయర్ ఇచ్చిన హామీ మేరకు సమ్మె విరమించామని, 3వ తేదీ నాటికి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పినా.. నేటికీ ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. ఇదే అంశాన్ని మున్సిపల్‌శాఖ కమిషనర్, సంచాలకులు సంపత్‌కుమార్‌కు లేఖ ద్వారా తెలియజేశామని కార్మిక నాయకులు పేర్కొన్నారు.

వైకాపా నుంచి తెదేపాలో పలువురి చేరిక

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం వెన్నెలపాలెం గ్రామానికి చెందిన పలువురు వైకాపా నాయకులు ఆదివారం తెదేపాలో చేరారు. వారందరికీ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెదేపా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తెదేపాను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తెదేపాలో చేరినట్లు వారు వెల్లడించారు.

పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

సంక్షేమానికి కూటమి పెద్దపీట

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక 74వ వార్డులో ఆదివారం సుపరిపాలన-తొలి అడుగు పేరుతో ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచిపెట్టారు.

ముగిసిన నృత్యోత్సవాలు

తమిళనాడుకు చెందిన నివేదిత ప్రదర్శన

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : నగరంలోని పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యభామ యువ నృత్యోత్సవాలు ఆదివారం ముగిశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తమిళనాడుకు చెందిన నివేదిత సతీష్‌కుమార్ భరతనాట్య ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దివ్యశ్రీ, జైష్ణశ్రీరెడ్డి కూచిపూడి ప్రదర్శనతో సత్తా చాటారు. ప్రతిభ చూపిన వారికి సత్యభామ జాతీయ అవార్డుల పేరిట జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, నిర్వాహకులు బత్తిన విక్రమ్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ అతిథి అధ్యాపకుల్లో కలవరం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గత కొన్ని నెలలుగా అతిథి అధ్యాపకులు సహా అనుబంధ ఆచార్యులు, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, ఒప్పంద సహాయ ఆచార్యుల పోస్టులను తొలగిస్తారంటూ జరుగుతున్న ప్రచారం కార్యరూపంలోకి వస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఎయిడెడ్ అధ్యాపకులను వెనక్కి పంపారు. అలాగే ఒప్పంద సహాయ ఆచార్యులు అగ్రిమెంట్‌పై సంతకాలు చేయాలన్న వివాదం కొనసాగుతోంది. తాజాగా తాత్కాలిక ప్రాతిపదికన(ఏడాది కాలానికి) అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయడంతో వీళ్లందరిలో కలవరం నెలకొంది.

సుమారు 400 మందిపై ప్రభావం: ఏయూ అధికారులు తాజాగా తీసుకున్న నిర్ణయం కారణంగా సుమారు 400 మంది అతిథి అధ్యాపకులు, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, ఒప్పంద సహాయ, అనుబంధ ఆచార్యులపై ప్రభావం పడనుంది. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న అతిథి అధ్యాపకులను గత ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తొలగించారు. వారంతా ఎన్నో పోరాటాలు చేసినప్పటికీ విధుల్లోకి తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆచార్య ప్రసాదరెడ్డి వీసీ పదవికి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన ఆచార్య జి.శశిభూషణరావు ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యుల బృందం వీరందరికీ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని విధుల్లోకి తీసుకున్నారు. ఇప్పుడు వీరంతా బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని ఏయూ అతిథి అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సురేష్ మీనన్ పేర్కొన్నారు.

కొంతమంది స్వచ్ఛందంగానే బయటకు: ఏయూలో ఉత్తరాంధ్ర వాసులకే తొలి అవకాశం ఇవ్వాలని వీరంతా కోరుతున్నారు. వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ ప్రకటించడంతో దేశవ్యాప్తంగా ఎవరైనా వచ్చి చేరే అవకాశం ఉందని అంటున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో ఆచార్య ప్రసాదరెడ్డి సీట్లు భారీగా పెంచారు. దీంతో అదనపు ఫ్యాకల్టీని నియమించుకోవాల్సి వచ్చింది.

వివిధ ప్రైవేటు కళాశాలల్లో పనిచేస్తున్న వారి అనుభవం గుర్తించి వారిని విధుల్లోకి తీసుకున్నారు. వారంతా ఎప్పటికైనా తమకు క్రమబద్ధీకరణ జరుగుతుందని ఆశించారు. గత కొన్ని రోజులుగా ఏయూలో జరుగుతున్న పరిణామాలు చూసిన తర్వాత వారిలో కొంత మంది స్వచ్ఛందంగా బయటకు వెళ్లిపోయారు. ఇన్నేళ్లు ఏయూనే నమ్ముకున్న తమను సాగనంపితే కుటుంబాలు వీధిన పడే పరిస్థితి వస్తుందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● శునకాలకు యాంటీ రేబిస్ టీకాలు

పెందుర్తి, న్యూస్‌టుడే: ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెందుర్తి ప్రభుత్వ పశు వైద్యశాలలో ఉచిత యాంటీ రేబిస్ టీకాల ప్రక్రియ చేపట్టారు. ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వి.జగన్‌మోహన్‌రావు, సిబ్బంది 327 శునకాలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సబ్బవరం మండలంలో..

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలోని సబ్బవరం, ఆరిపాక, గుల్లేపల్లి, అంతకాపల్లి పశువైద్య కేంద్రాల్లో 97 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేసినట్లు సబ్బవరం ప్రాంతీయ పశు వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ కె.ఉషాకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం పశువుల ఆసుపత్రిలో శునకానికి యాంటీ రేబిస్ టీకా వేస్తున్న డాక్టర్ ఉషాకుమారి

● గ్రామాల్లో 'ఇంటింటికీ తెదేపా'..

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలం వాలిమెరక జుత్తాడ గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ తెదేపా కార్యక్రమం జరిగింది. గ్రామంలోని 106, 107 పోలింగ్ బూత్‌ల పరిధిలో సీనియర్ నాయకులు కునిగంటి కనకరాజు, ఎర్ర సత్తిబాబు, ముదునూరి కిరణ్‌కుమార్ రాజు తదితరులు ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో కూటమి పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. నివాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పి.దేవుళ్లు, ఎస్.రాజు, వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వవార్డు పరిధి పెదపాలెంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చిలనాయుడు ఆధ్వర్యంలో తెదేపా శ్రేణులు ఇంటింటికీ తిరిగి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రినాథుడికి వైభవంగా స్వర్ణ తులసీదళార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీవరాహలక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం స్వర్ణ తులసీదళార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేతుడైన గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు తులసీదళాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

బంగారు తులసీ దళాలతో స్వామిని పూజిస్తున్న అర్చకుడు

వేడుకగా రథోత్సవం

చింతలగ్రహారం(వేపగుంట), న్యూస్‌టుడే: చింతలగ్రహారంలో జగన్నాథస్వామి తిరుగు రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కృష్ణాలయ ప్రాంగణం నుంచి స్వామివారిని గ్రామంలోని రామాలయం వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లి తిరిగి కృష్ణాలయం వద్దకు తీసుకువచ్చారు. ఉదయం స్వామివారు భక్తులకు కల్కి అవతారంలో దర్శనమిచ్చారు. అనంతరం జరిగిన రథోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కల్కి అవతారంలో జగన్నాథుడు

భక్తిశ్రద్ధలతో సహస్ర ఘటాభిషేకం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం గొర్లెవానిపాలెం ఉమారామలింగేశ్వర, లక్ష్మీ సత్యనారాయణమూర్తి ఆలయంలో వేద మంత్రాల నడుమ సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త గొర్లి అచ్చింనాయుడు తదితరులు పాల్గొన్నారు. * సబ్బవరంలోని శ్రీకృష్ణ మందిరంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరాడ శ్రీనివాసరావు, పల్లా తాతారావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వేంకటాద్రిపై తొలి ఏకాదశి వైభవం

ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు

పెందుర్తి, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేంకటాద్రిపై కొలువుదీరిన శ్రీనివాసుడి సన్నిధి ఆదివారం భక్తజన సందోహంగా మారింది. అర్చకులు వేకువజామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు జరిపారు. ఈ సందర్భంగా స్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి సహస్రనామార్చన, ధూపదీప సేవలు చేపట్టారు.

★ పెందుర్తి మండలం రాంపురంలోని సాధూమఠం సమీప శ్రీరమా సత్యనారాయణ స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు మురళీశర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో దేవతామూర్తులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

10న గురు పౌర్ణమి ఉత్సవం

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: ఈ నెల 10వ తేదీన చినముషిడివాడ శ్రమశక్తినగర్ పోర్టుకాలనీ శిరిడీ సాయినాథుడి ఆలయంలో గురు పౌర్ణమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు కాలనీ అసోసియేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా 9వ తేదీన సాయంత్రం 5.30 గంటల నుంచి సాయిబాబా ఉత్సవ విగ్రహంతో 11 సార్లు ఆలయ ప్రదక్షిణ జరుగుతుందన్నారు. 10వ తేదీన ఉదయం క్షీరాభిషేకం తదితర ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అన్నసమారాధన ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా వెంకన్న గిరి ప్రదక్షిణ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఈ.భోనంగి ఫార్మాసిటీ పునరావాసకాలనీ కొండపై కొలువైన శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి ఆలయ గిరిప్రదక్షిణ ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరికృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో దేవతామూర్తులను తొలుత రథంపై ప్రతిష్ఠించారు. సాయంత్రం 4 గంటలకు గిరిప్రదక్షిణ స్వామి వారి పాదాల వద్ద ప్రారంభమై తిరిగి అక్కడకు చేరుకోవడంతో పరిసమాప్తమైంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: రవినగర్ శేషాద్రి శిఖరంపై కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలిఏకాదశి పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శేషపాన్పుపై స్వామివారి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. 95వ వార్డు లక్ష్మీపురం పోర్టుకాలనీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.

మరిడిమాంబకు జేజేలు

వరలక్ష్మీనగర్(వేపగుంట), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వవార్డు వరలక్ష్మీనగర్ పరిసర ప్రాంతాల ఆరాధ్యదైవం మరిడిమాంబ అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా జరిగింది. సాయంత్రం పురవీధుల్లో ఊరేగింపు ఘనంగా చేపట్టాక రాత్రి అనుపోత్సవం నిర్వహించారు. కోలాటం తదితర ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్పొరేటర్ ముమ్మన దేముడు, పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, బండారు అప్పలనాయుడు తదితర నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పరవాడ: పరవాడ మండలం రావాడ పంచాయతీ జల్లెలపాలెం పరిసర ప్రజల ఆరాధ్య దేవత శ్రీమరిడిమాంబ అమ్మవారిని ఆదివారం శాకంబరి దేవిగా అలంకరించి పూజించారు.

భీమిలి యువతి అమెరికాలో దుర్మరణం

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భాజపా భీమిలి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు చిన్న కుమార్తె శివాన్విత (18) అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందారు. ఈమె కాలిఫోర్నియా రాష్ట్రంలో తన అక్కతో పాటు నివాసముంటోంది. అక్కడి యూనివర్సిటీలో బీఏ సైకాలజీ రెండో సంవత్సరం చదువుతూ పార్ట్‌టైం ఉద్యోగం చేస్తోంది. ఈమె ఉన్నత విద్యకోసం రెండేళ్ల కిందట అక్కడికి వెళ్లారు. రామానాయుడు కుటుంబం పదేళ్ల కిందట వరకూ అమెరికాలో ఉంటూ.. భీమిలి పరిసర నాలుగైదు మండలాల్లో తమ ప్రతినిధుల ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆ తర్వాత భీమిలికి వచ్చిన ఆయన 2024 ఎన్నికలకు ముందు భాజపాలో చేరారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆయన అమెరికాలోనే ఉన్నారు. రామానాయుడు స్వస్థలం విజయనగరం జిల్లా అన్నంరాజుపేట గ్రామం కాగా వీరి కుటుంబం భీమిలిలో స్థిరపడింది.

చందనం కొనుగోలుకు రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామికి సమర్పించేందుకు చందనం చెక్కల కొనుగోలుకు విజయవాడ కేదేశ్వరపేటకు చెందిన భక్తులు కేవీఎల్ హరినాథ్, కవిత దంపతులు రూ.1,00,001 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో ఆలయ పర్యవేక్షకుడు జీవీఎస్‌కే ప్రసాద్‌కు అందజేశారు. అధికారులు దాత కుటుంబానికి స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అప్పన్న సన్నిధిలో మాజీ మంత్రి కనుమూరి

సింహాచలం, న్యూస్‌టుడే: ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు ఆదివారం సతీసమేతంగా సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం అందజేశారు.

మహిళల సామూహిక పారాయణం

సింహాచలం, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరానికి చెందిన వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలు ఆదివారం సింహగిరిపై సామూహిక పారాయణం చేశారు. ట్రస్ట్ చీఫ్ డైరెక్టర్ సునీత కొఠారి నేతృత్వంలో విష్ణు సహస్రనామాలు, లక్ష్మీ నృసింహ కరావలంబం, అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కో-ఆర్డినేటర్లు మానేపల్లి లక్ష్మి, నాగలక్ష్మి, విజయ, రాధాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ మద్యం సీసాల కలకలం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం నాయుడుపాలెం పంచాయతీ బండారుపాలెం-గంగునాయుడుపాలెం రహదారి పక్కన ఆదివారం పలుచోట్ల గుట్టలుగా ఉన్న ఖాళీ మద్యం సీసాలు కలకలం రేపాయి. ఇటీవల పరవాడ కొత్తకాలనీలోని ఓ ఇంట్లో గుట్టుగా సాగుతున్న నకిలీ మద్యం తయారీని అధికారులు గుట్టు రట్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖాళీ సీసాల గుట్టలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. సబ్బవరం ఆబ్కారీ సీఐ అనిల్ కుమార్ వద్ద విషయం ప్రస్తావించగా ఖాళీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామని అన్నారు.

వెంకటాద్రినగర్‌లో సమస్యల తిష్ఠ

దర్పణం

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని సుజాతనగర్ సీ-2 జోన్ వెంకటాద్రినగర్ రెండవ వీధిలో పలు సమస్యలు తిష్ఠ వేశాయని నివాసితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీ ఏర్పడి ఏళ్లు గడిచిపోతున్నా మౌలిక వసతులు సమకూరడం లేదని వాపోతున్నారు. ఇక్కడి రెండో వీధిలో రోడ్లన్నీ గోతులమయం కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కా కాలువలు లేకపోవడంతో ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోయి దుర్వాసన, దోమల బెడద వెంటాడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీలో రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోయి పాములు, కీటకాల బెడద అధికంగా ఉంటోందని అంటున్నారు. ఇక్కడ వ్యక్తిగత గృహాలతో పాటు బహుళ అంతస్తు భవనాలు అధికమయ్యాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కనీస మౌలిక వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.



కాలనీలోని ఓ రహదారి ఇలా..

కాలువ లేకపోవడంతో పేరుకుపోయిన మురుగు

నూతన కార్యవర్గం ఎన్నిక

కొత్తగా ఎన్నికైన సభ్యులు

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ 98వవార్డు సింహపురి లేఅవుట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షులుగా గోవిందరావు, ఉపాధ్యక్షులుగా సిరికినాయుడు, కోశాధికారిగా కొవ్వూరు జగన్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా పడాల ప్రవీణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా కన్నం వెంకటరమణారావు ఎంపికయ్యారు. సభ్యులుగా కె.ఈశ్వరరావు, జి.త్రినాథ్, జీవీవీ హరనాథ్, కె.నాగరాజు, రాఘురాజు; సలహాసంఘ సభ్యులుగా వర్మ, కనికిరెడ్డిలను ఎన్నుకున్నారు. మాజీ సలహాదారు శ్రీనివాసరావు నూతన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: నరవలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి ఆదివారం జరిగింది. స్థానిక పెద్దలు, యువకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీసెల్ అధ్యక్షుడు వంగలపూడి గణేశ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

(c) eenadu

భక్తజన సందోహం

భక్తుల పొర్లు దండాలు

భక్తులతో పోటెత్తిన గూగూడు

➠ ముగిసిన కుళ్లాయిస్వామి పెద్దసరిగెత్తు ➠ నేడు జలధికి తరలనున్న పీర్లు

నార్పల, న్యూస్‌టుడే : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయి స్వామి క్షేత్రంలో పెద్దసరిగెత్తును అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కుళ్లాయిస్వామి పెద్దసరిగెత్తును తిలకించడానికి భక్తులు ఆంధ్ర, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచి విశేషంగా తరలివచ్చారు. ఆదివారం ఉదయం నుంచే భక్తులు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి జంట దేవాలయాల్లో పూజలు చేసి గోవిందనామస్మరణను మారుమోగించారు. వివాహం కాని యువత, రోగపీడితులు, సంతానం లేక బాధపడుతున్న నూతన దంపతులు అగ్నిగుండం ముందు పొర్లుదండాలతో మొక్కులు తీర్చుకున్నారు. గూగూడు చుట్టుపక్కల గ్రామాలైన రంగాపురం, నరసాపురం, మూగేతిమ్మంపల్లి, నడింపల్లి, గంగనపల్లి గ్రామాల నుంచి భక్తులు మట్టికుండలతో పానకాలు తీసుకువచ్చి అగ్నిగుండంలో వేసి మొక్కులు చెల్లించారు. చిరకాల కోరికలు తీరిన భక్తులు చక్కెర, కొబ్బెర చదివింపులతో పాటు హుండీల్లో కానుకలు సమర్పించారు. కల్యాణ కట్ట వద్ద భక్తులు తలనీలాలు సమర్పించి, కోనేరులో స్నానాలు ఆచరించారు. ఆదివారం రాత్రంతా భక్తులు గూగూడు పీర్లచావిడి ముందు జాగారం చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత కుళ్లాయిస్వామిని పీర్ల చావిడి నుంచి బయటకు తీసుకొచ్చి గ్రామంలో ఊరేగించారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు పీర్లు అగ్నిగుండంలో ప్రవేశించి సాయంత్రం కొర్లగుట్ట మీదుగా జలధికి వెళ్లడంతో గూగూడు బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

ప్రత్యేక అలంకరణలో ఆంజనేయుడు

పూజలందుకున్న కుళ్లాయిస్వామి పీర్లు

మహిళా సంఘాల్లో.. ప్రయోగాత్మకంగా ఐదు సంఘాల్లో పూర్తి

మొబైల్ బుక్‌కీపింగ్ అమలు!

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: లెక్కల్లో పారదర్శకత, రుణాల చెల్లింపుల్లో కచ్చితత్వం ఉండాలనే ఉద్దేశంతో మహిళా సంఘాల్లో మొబైల్ బుక్ కీపింగ్ విధానం అమలు చేసే యోచనలో ఉన్నారు. గతంలో బుక్ కీపర్లు సక్రమంగా వివరాలు నమోదు చేయకపోవడంతో పొదుపు సొమ్ము, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ సొమ్ము స్వాహా చేయడంతో సభ్యులు ఆర్థికంగా ఇబ్బంది పడేవారు. అనంతపురం జిల్లాలో ప్రయోగాత్మకంగా మొదట ఐదు గ్రామైక్య సంఘాలకు మొబైల్ బుక్‌కీపింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ విధానం కొనసాగించే అంశం, లోటుపాట్లు తదితర అంశాలను చర్చించడానికి సెర్ప్ ఆధ్వర్యంలో ఈ నెలలో తిరుపతిలో సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

గ్రామైక్య సంఘం	సంఘాలు
శ్రీభవాని	51
పెద్దమ్మ	50
భరతమాత	28
ప్రశాంతి	35
అరుణోదయ	19
మొత్తం:	183

యాప్‌లో అనుసంధానం

✦ యాప్‌లో సంఘానికి సంబంధించి లావాదేవీలు అన్నీ అనుసంధానం చేయడంతో ప్రతి పైసా గురించి సభ్యులు అందరికి తెలుస్తుంది.

✦ తన చరవాణిలోనే ఎంత చెల్లించింది ఇంకా ఎంత అప్పు ఉన్నదో ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

✦ పారదర్శకతకు అవకాశం ఉంటుంది.

✦ సంఘం ప్రతి నెలా ఎక్కడ కూర్చొని సమావేశాలు నిర్వహిస్తారో అందుకు సంబంధించిన లొకేషన్, ఫేసియల్ రికగ్నేషన్ సమాచారం తెలుసుకోవచ్చు.

✦ తీసుకున్న రుణం, చెల్లింపులు, కొత్త రుణం వివరాలన్నీ చరవాణిలోనే చూసుకోవచ్చు.

✦ గతంలో మహిళా సంఘాల రుణాలు స్వాహా చేస్తే ఆలస్యంగా వెలుగులోకి వచ్చి పూడ్చుకోలేని నష్టం జరిగేది. ఈ విధానం వల్ల ఏదైనా లోటుపాట్లు, తప్పిదాలు, సొమ్ము అతిక్రమణల వివరాలన్నీ అధికారులు వేగంగా పరిశీలించి రికవరీ చేయవచ్చు.

సమావేశమైన సభ్యులు

స్పందించు.. సంధించు!

ఈనాడు మీ తోడు

పాఠకులారా..! మీలో సామాజిక స్పృహ.. ఏదైనా మంచి చేయాలన్న తపన ఉందా? అన్యాయాలను నిగ్గదీసి ప్రశ్నిస్తారా? సమస్యలను మీ చేతుల మీదుగా పరిష్కారం చూపాలని ఆరాటపడుతున్నారా? ఏ వర్గానికైనా అత్యంత విలువైన సమాచారం చేరవేయాలని అనుకుంటున్నారా? మీ చుట్టుపక్కల ఆహ్లాదకర.. ఆసక్తిదాయక.. ఆదర్శప్రాయమైన అంశాలు నలుగురికి పంచాలని ఆశిస్తున్నారా? అయితే ఈ వేదిక మీ కోసమే.. మీ గొంతుకకు **ఈనాడు** తోడు అవుతుంది. ప్రజాశ్రేయస్సు పరమావధిగా మీరు రాసిన అక్షరాలు, తీసిన ఫొటోలకు పత్రికలో సముచిత స్థానం కల్పించేందుకు ముందుకొస్తున్నాం..

ఇంకెందుకు ఆలస్యం.. తీసుకోండి కలం.. పట్టండి కెమెరా.. సమస్యలపై మీదైన శైలిలో ఎక్కుపెట్టండి..!

మీరు చేయాల్సినవి..

- ఏదేని అంశాన్ని పది వాక్యాలకు మించకుండా సూటిగా, స్పష్టంగా రాయడం.
- నాణ్యమైన ఫొటోలు తీసి పంపడం.
- వ్యక్తిగతమైనవి వద్దు.. సమాజశ్రేయస్సుకే **ఈనాడు** వేదిక అనేది మదిలో మెదలాలి.

★ మీరు పంపిన అంశాలను పరిశీలించి.. అర్హత ఉన్నవి ప్రచురిస్తాం.

పోస్టు చేయాల్సిన నంబరు **93901 60428**

చెట్టంత మమకారం

హౌసింగ్‌బోర్డు కాలనీలో ప్రధాన రహదారి పక్కన ఓ ఇల్లు ఉంది. రోడ్డు వెడల్పులో భాగంగా ఇంటి గోడను తీసేయాల్సి వచ్చింది. అక్కడే ఉన్న కొబ్బరి చెట్టును ఇంటి నిర్మాణానికి అడ్డంగా ఉంది. అయితే చెట్టుపై మమకారంతో దీన్ని కొట్టేయకూడదని యజమాని నిర్ణయించారు. తన ఇంటిలోనే ఒక భాగంగా చేసి అక్కడ ఏటీఎం కోసం చిన్న షెడ్డులా నిర్మించారు. - **ఈనాడు అనంతపురం**

దిమ్మెలు తొలగించేదెన్నడు?

అనంతపురం(మూడోరోడ్డు), న్యూస్‌టుడే: రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారాలు మారడానికి పాతవంతెన స్థానంలో నూతన వంతెనను ఏర్పాటు చేశారు. ఈ వంతెన ఏడాది క్రితమే ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. గతంలో ఉన్న పాత వంతెనను ఇటీవల కొంతమేర తొలగించారు. పాత వంతెన కోసం ఏర్పాటు చేసిన ఇనుప దిమ్మెలను ఇప్పటికీ తొలగించలేదు. ఈ దిమ్మెలు నాలుగు, మూడు ప్లాట్‌ఫారంపై అధిక స్థలాన్ని ఆక్రమించాయి. దీనికి తోడు పాత వంతెన దిమ్మెలు అడ్డుగా ఉండటంతో నూతనంగా ఏర్పాటు చేసిన వంతెన కూడా సరిగా కనిపించడం లేదు. కొత్తగా వచ్చిన ప్రయాణికులు వంతెన ఎక్కడుందో వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. పాత వంతెన దిమ్మెలను తొలగించాలని పలుమార్లు పర్యటనల్లో భాగంగా డివిజన్ స్థాయి అధికారులు ఇంజినీర్లకు ఆదేశించారు. ఆరు మాసాలు గడుస్తున్నా ఇప్పటికీ వీటిని తొలగించలేదు. స్టేషన్‌లో పాత వంతెన దిమ్మెలు దిష్టి బొమ్మల్లా కనిపిస్తున్నాయి. వీటిని తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్లాట్‌ఫాంపై అసౌకర్యంగా పాత వంతెన దిమ్మెలు

పండగలా మెగా పీటీఎం

కలెక్టర్ వినోద్‌కుమార్ వెల్లడి

జిల్లా సచివాలయం, ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఈనెల 10న జిల్లా వ్యాప్తంగా మెగా తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాన్ని (పీటీఎం) పండగ వాతావరణంలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా రికార్డు స్థాయిలో జరపడానికి ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆదివారం రెవెన్యూ భవన్‌లో డీఈఓ ప్రసాద్‌బాబు, డీవీఈఓ వెంకటరమణనాయక్, సమగ్ర శిక్షా ఏపీసీ శైలజతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతకు ముందు కలెక్టర్ నిర్దేశిత శాఖల అధికారులతో జూమ్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గతేడాది డిసెంబరులో పీటీఎం సమావేశాన్ని జరిపాం. దీనికి రెట్టింపు స్థాయిలో ఈనెల 10న మెగా పీటీఎం-2.0 కార్యక్రమ నిర్వహణకు సకల ఏర్పాట్లు వేగంగా చేస్తున్నామని చెప్పారు. విద్య, ఇంటర్, ఎస్ఎస్ఏ, ఆరోగ్య, పోలీసు, సచివాలయాలు, అటవీ, ఉపాధి.. వంటి శాఖలను పూర్తి స్థాయిలో భాగస్వామ్యం చేస్తున్నామని పేర్కొన్నారు.

‘బైకుల స్కామ్‌లో వైకాపా నాయకులే కీలకం’

తాడిపత్రి, న్యూస్‌టుడే: ఫైనాన్స్ కంపెనీలను మోసం చేసి బైకులను కాజేసిన స్కామ్‌లో తాడిపత్రి వైకాపా నాయకులే కీలక పాత్ర పోషించారని మున్సిపల్ వైస్‌ఛైర్మన్ షేక్షావలి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జేసీ నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే తాడిపత్రిలో నంబర్ ప్లేట్లు లేకుండా వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతున్నాయని పోలీసులకు ఫిర్యాదు అందించామన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రస్తుతం స్కామ్‌లో బయటపడిన నిందితులు వైకాపా నాయకులేనన్నారు. ఇంకా సమగ్ర విచారణ చేస్తే పెద్దారెడ్డి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి కూడా బయట పడతారన్నారు. వైకాపా నాయకులు జావీద్, బాబా వంటి వారు ఉన్నారని ఆయన వివరించారు. వైకాపా వారిని విచారించి తదుపరి చర్యలు తీసుకోవాలని, లేకుంటే తెదేపా ముస్లిం సోదరులంతా డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన చేస్తామని ఆయన హెచ్చరించారు. నాయకులు అయూబ్, ఖాదర్ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌ఛైర్మన్ షేక్షావలి

ప్రశాంతి నిలయంలో నేటి నుంచి అంతర్జాతీయ వైద్యశిబిరం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: గురుపౌర్ణమిని పురస్కరించుకుని ప్రశాంతి నిలయంలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు అంతర్జాతీయ వైద్యశిబిరం నిర్వహించనున్నారు. శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో వివిధ దేశాలకు చెందిన వైద్యులు రోగులకు సేవలందించనున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు రోగులకు వైద్యసేవలందించి, ఉచితంగా మందులు, అవసరమైన పరికరాలు అందించనున్నారు. ఇందుకోసం ట్రస్టు వర్గాలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మార్మోగిన సాయి విఠల నామస్మరణ

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభా మండపం సాయి విఠల నామస్మరణతో మార్మోగింది. మహారాష్ట్ర, గోవా భక్తుల దిండి పర్తియాత్ర, ఆషాఢ ఏకాదశి వేడుకల్లో భాగంగా రెండో రోజు ఆదివారం రెండు రాష్ట్రాల భక్తులు, బాలవికాస్ విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి దిండి పాల్కీ, పల్లకీల ఊరేగింపుతో సాయి విఠల రాకను సూచిస్తూ సాయి కుల్వంత్ సభా మండపానికి చేరుకున్నారు. ఉదయం వేద పఠనానంతరం బాలవికాస్ విద్యార్థులు ప్రదర్శించిన కథా సంకీర్తనా కార్యక్రమాలు, నృత్యాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం భక్తిగీతాల భజన కార్యక్రమం నిర్వహించారు. మంగళహారతి తర్వాత భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

సాంస్కృతిక కార్యక్రమంలో ఓ సన్నివేశం

హెచ్చెల్సీ డిస్ట్రిబ్యూటరీలకు మహర్దశ పట్టేనా?

➩ తొలగని కంపచెట్లు, పూడిక
➩ ఆందోళనలో అన్నదాతలు

ఎస్ఆర్ఎన్ క్యాంపు వద్ద కంపచెట్లతో మూసుకుపోయిన 6బీ డిస్ట్రిబ్యూటరీ కాలువ

కణేకల్లు, బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: తుంగభద్ర హెచ్చెల్సీ కణేకల్లు సబ్ డివిజన్ పరిధిలోని కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, విడపనకల్లు మండలాల్లోని బ్రాంచి కాలువలు కంపచెట్లతో నిండిపోయాయి. పూడిక చేరి, పలుచోట్ల డ్రాప్‌లు, లైనింగ్ దెబ్బతిని అధ్వానంగా తయారయ్యాయి. కాలువలకు నీరు విడుదల చేస్తే.. పంట పొలాలకు చేరేందుకు ఇబ్బందులు తప్పేలా కనిపించడం లేదని రైతున్నలు ఆందోళన చెందుతున్నారు.

★ కణేకల్లు సబ్‌డివిజన్ కింద రెండు మండలాల్లో 15 బ్రాంచి కాలువలు ఉన్నాయి. ఆయా డిస్ట్రిబ్యూటరీల కింద 36 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. చివరి ఆయకట్టుకు సక్రమంగా నీరు అందాలంటే ఈ కాలువలే ప్రధాన ఆధారం. గత వైకాపా ప్రభుత్వం హెచ్చెల్సీ నిర్వహణకు చిల్లిగవ్వ నిధులు మంజూరు చేయలేదు. దీంతో కాలువలు నీరు ప్రవహించలేనంత అధ్వానంగా తయారయ్యాయి.

ఎక్కడెక్కడంటే: బొమ్మనహాళ్ మండలంలోని దేవగిరి-1 డిస్ట్రిబ్యూటరీలో హెచ్ బ్రాంచి కాలువలో డ్రాప్‌లు దెబ్బతిని, కంపచెట్లు పెరిగాయి. లైనింగ్ లేదు. 1-ఆర్, 2-ఆర్ పరిస్థితి ఇలాగే ఉంది. 2, 2ఏ డిస్ట్రిబ్యూటరీలో చెర్లోపల్లి, ఉద్దేహాళ్, బండూరు రైతులు సాగునీటికి అవస్థలు పడాల్సిన దుస్థితి. 10 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న 9వ డిస్ట్రిబ్యూటరీ పరిస్థితి దారుణంగా తయారైంది.

★ కణేకల్లు మండలంలోని 6బి డిస్ట్రిబ్యూటరీలో ఉపాధి కింద కొంతమేర కంప తొలగింపు పనులు జరిగినా ఎస్ఆర్ఎన్ క్యాంపు ఎగువన పంట పొలాలకు వెళ్లే వంతెన వద్ద మట్టి గట్టు కోతకు గురై రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. క్యాంపు వద్ద శింగేపల్లి దారిలో కాలువకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు ముళ్లపొదను తలపిస్తున్నాయి.

★ 6-ఏ, 8 డిస్ట్రిబ్యూటరీలోనూ కంపచెట్లు పెరిగి నీటి ప్రవాహానికి సమస్యలు తలెత్తి, ఆయకట్టుకు నీరందని దుస్థితి నెలకొనే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

★ ఉపాధి హామీ కింద పలుచోట్ల కంప, పూడిక తొలగింపు చేపట్టినా పూర్తి స్థాయిలో పనులు జరగలేదు. జలాశయానికి భారీగా వరద నీరు చేరుతుండటంతో ప్రధాన కాలువకు జులై 10న నీటిని విడుదల చేసేలా అధికారులు ఇప్పటికే తేదీలు ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో నీటి ప్రవాహానికి ఇబ్బందులు కలగకుండా పంట కాలువలను బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

- దివాకర్‌రెడ్డి, హెచ్చెల్సీ డీఈ

ఉపాధిహామీ కింద 15 డిస్ట్రిబ్యూటరీల్లో కంపచెట్ల తొలగింపు పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. వివరాలు సంబంధిత ఎంపీడీఓలకు నివేదించాం. ఇప్పటికే 7, 6బి డిస్ట్రిబ్యూటరీల కింద పనులు జరిగాయి. పర్యవేక్షించి మిగతా చోట్ల పనులు చేపట్టేలా చూస్తాం. రైతులకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయిస్తాం.

దాచమంటే.. దోచేశారు!

➤ పోస్టాఫీసుల్లో ఖాతాలకు జమకాని సొమ్ము
➤ సిబ్బంది సొంత అవసరాలకు రూ.లక్షల్లో స్వాహా

పుట్టపర్తి, కదిరి, న్యూస్‌టుడే: భవిష్యత్తు అవసరాల కోసం పోస్టాఫీసుల్లో దాచుకుంటున్న సొమ్ముకు భరోసా లేకుండా పోయింది. ఖాతాదారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న తపాలాశాఖలోని కొందరు ఉద్యోగులు రూ.లక్షల్లో స్వాహా చేశారు.

★ నేటి పొదుపుతో రేపటి అవసరాలు తీరుతాయన్న ఆశతో ప్రజలు పోస్టాఫీసుల్లో ఆర్డీ, ఎఫ్‌డీ, ఆర్పీఎల్ఐలకు డబ్బులు కడుతున్నారు. బీపీఎం, క్షేత్రస్థాయి సిబ్బంది ఆ సొమ్మును ఖాతాలకు జమ చేయకుండా మోసగిస్తున్నారు. ఖాతాదారుడి పుస్తకంలో మాత్రమే రాసి సొమ్మును కాజేసి, సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న ఖాతాదారులు లబోదిబోమంటున్నారు.

తనిఖీల్లో బయటపడని తప్పులు

సాధారణంగా పోస్టాఫీసుల్లో త్రైమాసిక, వార్షిక తనిఖీలు చేస్తారు. ఆ సమయంలో ఎలాంటి తప్పులు బయటపడటం లేదు. కాలపరిమితి ముగిసిన డిపాజిట్‌దారులు నగదు కోసం వెళ్లినప్పుడు దోపిడీ పర్వాలు వెలుగు చూస్తున్నాయి. మొన్న బుక్కపట్నం మండలం పాముదుర్తి, నిన్న నల్లమాడ మండల కేంద్రం, నేడు అమడగూరు మండలం పూలకుంటపల్లి పోస్టాఫీసుల్లో ఖాతాదారుల సొమ్ము రూ.లక్షలు స్వాహాకు గురవుతున్నా ఉన్నతాధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

- అమడగూరు మండలం పూలకుంటలో ప్రజలు కట్టిన నెలవారి పొదుపు నగదును సబ్‌పోస్టు మాస్టర్ ఖాతాలకు జమ చేయకుండా స్వాహా చేశాడు. వందలాది మంది ఖాతాదారులు రూ.20 లక్షలకు పైగా చెల్లించారు. జనం ఇచ్చిన మొత్తాలను వినియోగదారుల పుస్తకంలో రాసి సీల్లు వేసి, సంతకం పెట్టాడు. ఆ సొమ్మును సొంత అవసరాలకు వాడుకున్నాడు. పొదుపు కాలం పూర్తి కావడంతో.. నగదు ఇవ్వాలని ఖాతాదారులు కోరారు. రేపు మాపంటూ తప్పించుకు తిరుగుతున్న అతన్ని నిలదీయడంతో స్వాహా పర్వం వెలుగులోకి వచ్చింది.
- నల్లమాడ మండల కేంద్రంలో ఖాతాదారులు పొదుపు చేసుకున్న నగదును సబ్‌పోస్టుమాస్టర్ జమ చేయకుండా, దాదాపు రూ.8 లక్షలు పైగా స్వాహా చేశాడు. బాధితులు తపాలా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి, కేవలం అతణ్ని సస్పెండ్ చేసి చేతులు దులుపుకొన్నారు. కొంత మందికి మాత్రమే సొమ్ము చెల్లించారు

బాధ్యులపై చర్యలు చేపట్టాం

అమడగూరు మండలం పూలకుంటపల్లి, నల్లమాడ పోస్టాఫీసుల్లో జనం సొమ్మును ఖాతాలకు జమ చేయకుండా వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు బయట పడింది. దీంతో వారిద్దరినీ సస్పెండ్ చేశాం. పూలకుంటపల్లిలో విచారణ చేపట్టాం. డబ్బులు కట్టిన వారు ఖాతా పుస్తకాలు చూపితే ఎంత మొత్తం అవినీతి జరిగిందో తేలుతుంది. నల్లమాడలో రూ.6 లక్షల పైచిలుకు కాజేసినట్లు గుర్తించాం. ఇప్పటికే రూ.1.50 లక్షల వరకు రాబట్టాం. ఖాతాదారులకు న్యాయం జరిగేలా చూస్తాం. **- గోవర్ధన్‌నాయక్, పోస్టల్ ఇన్‌స్పెక్టరు, కదిరి**

అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక నిధులు

ఐసీడీఎస్ శాఖకు రూ.1.94 కోట్లు

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టింది. కేంద్రాల నిర్వహణ కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిధులు రూ.1.94 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వు జారీ చేసింది. ఇందులో అనంతకు రూ.62.84 లక్షలు, శ్రీసత్యసాయి జిల్లాకు రూ.1.30 కోట్లు కేటాయించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఏనాడూ అంగన్‌వాడీ కేంద్రాలే కాదు.. ఐసీడీఎస్ కార్యాలయాల నిర్వహణకు నయాపైసా ఇవ్వలేదన్న విమర్శను మూటగట్టుకుంది. కనీసం తెల్లపేపరు, రిజిస్టర్లు, పెన్నులు, ర్యాపర్, చాక్‌పీసులు, ఫినాయిల్ వంటి కనీస స్టేషనరీ, ఇతరాత్ర సామగ్రి కొనుగోలుకు డబ్బులు ఇవ్వలేదు. ఎక్కడికక్కడే ఉద్యోగులు సొంత నిధులు ఖర్చు పెట్టాల్సిన దుస్థితి ఉండేది. ఈ పరిస్థితి నుంచి కూటమి ప్రభుత్వం గట్టెక్కించింది. అనేక రకాల వస్తువులు, స్టేషనరి కొనుగోలు కోసం త్రైమాసిక వారీగా బడ్జెట్ కేటాయించింది. వీటి సరఫరాకు ఏకంగా టెండర్లను సైతం ఆహ్వానించడం విశేషం. ఈ విషయాన్ని అనంత ఐసీడీఎస్ పీడీ నాగమణి పేర్కొన్నారు. ప్రతి మూడు మాసాలకోసారి నిర్దేశిత సామగ్రిని నేరుగా కేంద్రాలకు పంపిణీ చేస్తామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశిత నిధులు కూడా మంజూరు అయ్యాయి.

ఏ జిల్లాకు ఎంతెంత!

★ అనంత జిల్లా పరిధిలో మొత్తం 2,302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉంటే.. ఒక్కో కేంద్రానికి ఏడాదికి రూ.2 వేలు చొప్పున రూ.46.04 లక్షలు, పీడీ కార్యాలయం, 11 ఐసీడీఎస్ కార్యాలయాలు, బాల సదన్, సర్వీసు హోం.. వంటి వాటికి రూ.1.2 లక్షలు ప్రకారం రూ.16.8లక్షలు కేటాయించారు. ఇలా మొత్తం కలిపి ఏడాదికి రూ.62.84 లక్షలు విడుదల చేశారు.

★ శ్రీసత్యసాయి జిల్లాల్లోని 2,824 కేంద్రాలకు రూ.1.13 కోట్లు, పీడీ కార్యాలయం, 12 ప్రాజెక్టులు, ధర్మవరం, హిందూపురం బాలసదన్‌లకు రూ.17.8 లక్షలు ఇవ్వనున్నారు. ఈ జిల్లాలో త్వరలోనే టెండర్లు ఆహ్వానిస్తారు. ఇందుకు సంబంధించి కసరత్తు చేస్తున్నారు. టెండర్లు ఖరారు కాగానే నిర్దేశిత వస్తు సామగ్రి పంపిణీ చేస్తారు.

జూనోసిస్ వ్యాధి సంక్రమణపై అప్రమత్తత ముఖ్యం

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు జూనోసిస్ వ్యాధి సంక్రమిస్తుందని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ టీవీ.సుధాకర్ పేర్కొన్నారు. పెంపుడు జంతువుల యజమానులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా పశువైద్యశాలల్లో జూనోసిస్ దినోత్సవం జరుపుకొన్నారు. కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. జేడీఏహెచ్ టీవీ సుధాకర్, వ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు రవిబాబు, ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువైద్యులు శృతి, దిలీప్, మహేశ్, సుచరిత, పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

సాయినగర్‌లో కుక్కకు టీకా వేస్తున్న జేడీఏహెచ్ డాక్టర్ సుధాకర్

(c) eenadu

గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీలపై వీడని సందిగ్ధం!

కౌన్సెలింగ్ పూర్తయినా అందని బదిలీ ఉత్తర్వులు

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంలకు గత నెల 30న జూమ్ కాన్ఫరెన్స్ ప్రక్రియ బదిలీల కౌన్సెలింగ్ పూర్తైనా సంబంధిత వారికి ఇప్పటివరకూ బదిలీ ఉత్తర్వులు అందలేదు. మొత్తంగా 803 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి నిబంధనల ప్రకారం నూతన స్థానాలను కేటాయించారు. రీడీప్లాయిమెంట్ కింద పనిచేస్తున్న ఎంపీహెచ్ఏ మహిళల స్థానాలపైనా, ఇటీవల పదోన్నతి పొందిన గ్రేడ్-3 రెగ్యులర్ అయిన ఏఎన్ఎంలు గతంలో పనిచేస్తున్న స్థానాల్లోనే కొనసాగుతుండగా తాజాగా నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆ పోస్టులన్నీ ఖాళీగా చూపించారు. ఖాళీలను బట్టి గ్రేడ్-3 ఏఎన్ఎంలు ఇచ్చిన ఆప్షన్ల ప్రకారం బదిలీలు చేశారు. ఖాళీ పోస్టుల ఉన్న ఏఎన్ఎంల స్థానాల్లోకే ప్రస్తుత కౌన్సెలింగ్‌లో కొంతమందిని అదే స్థానాలకు కేటాయించారు. ఉన్నతాధికారులు కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించి తదుపరి ఆదేశాలు ఇస్తామని అప్పటి వరకూ బదిలీ ఉత్తర్వులు ఇవ్వొద్దని ఆదేశించగా ప్రస్తుతం సందిగ్ధత నెలకొంది. ఈ అంశంపై డీఎంహెచ్‌వో ఈ.బి.దేవి మాట్లాడుతూ సమస్యను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కలెక్టర్ నిర్ణయం మేరకు కౌన్సెలింగ్‌ను రద్దు చేసి నూతనంగా నిర్వహించటమా? లేక పాత వారిని వేరే ప్రాంతాలకు సర్దుబాటు చేయటామా? తెలుస్తుందని వెల్లడించారు. ఏఎన్ఎంలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బదిలీలకు సంబంధించిన సమాచారం ముందుగా తెలియజేస్తామని తెలిపారు.

వర్షాధార అభివృద్ధి పథకానికి మోక్షమెన్నడో?

● 31 మండలాల్లో అమలుకు కార్యాచరణ ● అడుగులు ముందుకు పడని తీరు

గుత్తి, న్యూస్‌టుడే : కరవు జిల్లా రైతులకు బహుళ ప్రయోజనం చేకూర్చే వర్షాధార అభివృద్ధి పథకం అమలు కావడం లేదు. పథకాన్ని గతేడాది ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికీ వ్యవసాయశాఖ, భూసార సంరక్షణ విభాగం అధికారులు పట్టించుకోలేదు. జిల్లాలోని 31 మండలాల్లో పథకాన్ని అమలు చేయాల్సి ఉంది. ఆదిశగా అడుగులు పడటం లేదు.

గుత్తి మండలంలోని అబ్బేదొడ్డిలో సాగులో ఉన్న చీనీతోట

620 హెక్టార్ల లక్ష్యం ..

ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి వ్యవసాయం, ఉద్యాన పంటలసాగుతో పాటు తేనెటీగల పెంపకం, వానపాముల ఎరువు తయారీ చేపట్టాల్సి ఉంది. జిల్లా మొత్తం మీద 620 హెక్టార్లలో పథకాన్ని అమలు చేసేందుకు నిర్ణయించారు. హెక్టారుకు రూ.20 వేలు రైతులకు ఇచ్చి ప్రోత్సహించాల్సి ఉంది.

క్షేత్రస్థాయిలో అన్నీ పూర్తయినా..

● వర్షాధార పథకం కింద రైతులకు ప్రయోజనం కల్పించేందుకు ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేశారు. రైతులను కూడా గుర్తించారు. రైతులకు హెక్టారుకు రూ.20 వేలు ఇవ్వాలన్నది పథకం ఉద్దేశం. ఈపథకం కింద గుత్తి మండలంలోని అబ్బేదొడ్డి, పామిడిలో ఎద్దులపల్లి, పెద్దవడుగూరులో క్రిష్టిపాడు, యాడికిలో చందన, శింగనమలలో వెస్ట్ నరసాపురం ప్రాంతాలను ఎంపిక చేశారు. ఇలా జిల్లా మొత్తం మీద గ్రామాల ఎంపికతోపాటు లబ్ధిదారులను గుర్తించారు. ఈనెల 8న జిల్లాలో జాతీయ ఉపాధిహామీ పథకం కింద డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద పండ్ల మొక్కలను నాటించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే పథకం అమలులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఖరీఫ్ వచ్చినా పథకాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. రైతులు పథకం అమలు కోసం ఎదురు చూస్తున్నారు.

● ఈవిషయమై వ్యవసాయ సహాయ సంచాలకుడు వెంకట్రాముడు మాట్లాడుతూ పథకం అమలుకు ఏర్పాట్లు చేశాం. భూసార సంరక్షణ విభాగం అధికారులు అమలు చేయాల్సి ఉంది. త్వరలోనే అమలులోకి వస్తుందన్నారు.

గూగూడుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఆర్టీసీ సహాయ కేంద్రంలో అధికారులు, సిబ్బంది

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: కుళ్లాయిస్వామి (బ్రహ్మోత్సవాల్లో) భాగంగా భక్తుల సౌకర్యార్థం సాధారణ చార్జీలతో గూగూడుకు వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. మొహర్రం సందర్భంగా నార్పల మండలం గూగూడు కుళ్లాయిస్వామిని దర్శించుకోవడానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం నుంచి ఆదివారం 65 బస్సులను ఏర్పాటు చేశారు. సోమవారం అగ్ని గుండ ప్రవేశం, జలధి ఉండటంతో 75 బస్సులు నడపనున్నారు. ఏదైనా సమాచారం కోసం గూగూడులో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు.

న్యాయాధికారుల నమూనా పరీక్ష

అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే: బాధితులకు న్యాయం జరిగినప్పుడే న్యాయవాద వృత్తిపై విశ్వాసం పెరుగుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురుప్రసాద్ అన్నారు. బార్ అసోసియేషన్ సమావేశమందిరంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ అధ్వర్యంలో ఆదివారం న్యాయాధికారుల పోటీ పరీక్షల అభ్యర్థులకు నమూనా పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు సీతారాం మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు నమూనా పరీక్ష ఎంతో దోహద పడుతుందన్నారు. న్యాయవాదుల సమస్యలు, సంక్షేమానికి సంఘం కృషి చేస్తుందన్నారు. నమూనా పరీక్ష పేపరును గురుప్రసాద్‌తోపాటు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ధర్మసింగ్, ప్రధాన కార్యదర్శి వెంకట్రాముడు, ఐలు అధ్యక్ష, కార్యదర్శులు వీరమాసప్ప, సతీష్‌లు విడుదల చేశారు.

ఆపస్‌లో చేరిక

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్)లో ఆదివారం చేరారు. ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ సమక్షంలో ప్రాథమిక సభ్యత్వం తీసుకున్నారు. రామన్నను జిల్లా ఉపాధ్యక్షులుగా ప్రకటించారు.

రైతులను దగా చేసింది వైకాపా ప్రభుత్వమే : ఎంపీ

రొద్దం, న్యూస్‌టుడే : ఉమ్మడి అనంతపురం జిల్లాలో మామిడి రైతులతో పాటు ఇతర పంటలను పండించే వారిని దగా చేసింది వైకాపా ప్రభుత్వమేనని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ఆరోపించారు. ఆదివారం రొద్దం పంచాయతీలోని ఆర్.మరువపల్లిలో ఆయన పర్యటించారు. వరి సాగుకు సిద్ధం చేస్తున్న పొలం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎం.కొత్తపల్లి, మొపర్లపల్లి, రొద్దం గ్రామాల రైతులు, నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మామిడికాయల, ఇతర పంటల దిగుబడిని కొనుగోలుచేసే ఫ్యాక్టరీల యాజమాన్యం సిండికేటు కావడానికి వైకాపా సానుభూతిపరులే కారణమని ఆరోపించారు. వైకాపా పాలనలో ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధర దక్కక అన్నదాతలు నష్టాలు చవిచూశారని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమతోనే అభివృద్ధికి బాటలు వేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, ఎంకొత్తపల్లి, నాగరాజు, రాజప్ప తదితర రైతులు పాల్గొన్నారు.

ఆర్పీలకు ఉద్యోగ భద్రత!

గత ప్రభుత్వం తెచ్చిన మూడేళ్ల కాలపరిమితి రద్దు

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లోని రిసోర్స్ పర్సన్లకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రిసోర్స్ పర్సన్లు (ఆర్పీలు) మూడు సంవత్సరాలు మాత్రమే విధుల్లో ఉండాలనే నిబంధనలు విధించారు. దాంతో ఎప్పుడు తొలగిస్తారో అన్న భయం ఆర్పీలను వెంటాడేది. వైకాపా నేతలకు భయపడి వారు చెప్పినట్లే ఆయా సంఘాలకు పని చేసే దయనీయ పరిస్థితి ఉండేది. ఎన్నికల సందర్భంగా ఆర్పీల బాధకు ఉపశమనం కల్పిస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు.

ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు

ప్రాంతం	ఆర్పీలు
అనంతపురం జిల్లా	
అనంతపురం	129
తాడిపత్రి	45
గుంతకల్లు	73
గుత్తి	29
కళ్యాణదుర్గం	39
రాయదుర్గం	42
శ్రీసత్యసాయి జిల్లా	
పుట్టపర్తి	25
హిందూపురం	81
ధర్మవరం	69
కదిరి	50
మడకశిర	24
పెనుకొండ	24

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో మూడేళ్ల కాలపరిమితి నిబంధనను తాజాగా తొలగిస్తూ ఉత్తర్వు జారీ చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు భవిష్యత్తుకు భరోసా కల్పించడంతో ఆర్పీల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

మహిళా సంఘాల సమన్వయంలో ప్రధాన భూమిక

ఆర్పీలు ఆయా నగర, పురపాలికల్లోని స్వయం సహాయక సంఘాలకు సంధానకర్తగా పని చేస్తారు. మహిళలను సంఘటితం చేయడంతో పాటు ఆదాయం పెంచడంలో సంఘాలను సమన్వయం చేస్తారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు, ఒనగూరే ప్రయోజనాలను ఒక్కో ఆర్పీ కనీసం 25 నుంచి 30 సంఘాల్లోని సభ్యులకు వివరిస్తారు. మెప్మా ద్వారా రూ.8 వేలు, సంఘాలు పొందిన ఆదాయం నుంచి రూ.2 వేలు ప్రతి నెలా గౌరవ వేతనం అందజేస్తారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం Cell: 7382114647.

FINANCIAL SERVICES

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్. +91 99669 10410.

TO LET

COMMERCIAL

ATP టౌన్, NH.44, సుధీర్ లారీ కాటా వెనుక, D Mart Lane/ రిలయన్స్ డిజిటల్/ ట్రెండ్స్ ప్రక్కన ఉన్న రెస్టారెంట్/ 70 సెంట్ల ఖాళీ స్థలం బాడుగకు ఇవ్వబడును. Cell: 6305772976.

JOBS

ఆలమూరు రోడ్డులో ప్లాటింగులో గార్డెన్ పనికి మగ మనిషి కావలెను (పార్ట్/ఫుల్ టైం). ఫోన్: 7093037333

ప్రముఖ E-Kart's, వాటి అనుబంధ సంస్థలలో పర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. అర్హత 10th, డిగ్రీ. జీతం 18000 నుంచి కలదు. 79756 91563.

Airtel Wifi అనంతపురం పట్టణంలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్ కావలెను. జీతం: 16,500 + ఇన్సెంటివ్స్. ఆండ్రాయిడ్ ఫోన్ ఉండవలెను. సంప్రదించండి: 9492404313

FACULTY/ TEACHERS

Wanted Teacher: To Teach Computer Faculty & Fluency in English Language for Academic Side. Well will Pay-Attractive Payment Cont: 79810 51091.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అభిషేక్‌రెడ్డి, పృథ్వీరాజ్‌లు శతకాల జోరు

భారీస్కోరు దిశగా చిత్తూరు జట్టు

ఎం.అభిషేక్‌రెడ్డి పృథ్వీరాజ్ షరీఫ్

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: సౌత్‌జోన్ అంతర్ జిల్లా మూడు రోజుల సీనియర్ క్రికెట్ పోటీలో చిత్తూరు జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. తొలిరోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు అనంతపురం జట్టుపై 81 ఓవర్లలో 3 వికెట్లకు 316 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంత క్రీడాగ్రామంలో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు 38 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో బ్యాటింగ్‌కు దిగిన అభిషేక్‌రెడ్డి (160), కేఎన్ పృథ్వీరాజ్ (125) అజేయ శతకాలతో భారీ స్కోరుకు పునాది వేశారు. నాలుగో వికెట్‌కు 280 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పడం విశేషం. అనంత బౌలర్లు దీపక్ 2 వికెట్లు, ప్రదీప్‌రెడ్డి ఒక వికెట్ కూల్చారు. చిత్తూరు జట్టు రెండోరోజు మరిన్ని పరుగులు జోడించి అనంత జట్టుపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. మరో పోటీలో నెల్లూరు జట్టు కడప జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో 65.5 ఓవర్లలో 288 పరుగులకు ఆలౌటైంది. నారాయణ (52), సుబ్రహ్మణ్యం (51)లు బ్యాటింగ్‌లో రాణించడంతో గౌరవప్రదమైన స్కోరు లభించింది. కడప బౌలరు షరీఫ్ 5 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టు బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ఆరంభించిన కడప జట్టు ఆటముగిసే సమయానికి 12.2 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 47 పరుగులు చేసింది. రెండోరోజు కడప బ్యాటర్లు క్రీజులో కుదురుకుంటే మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించే అవకాశం ఉంది.

టమాటాల వాహనం బోల్తా

శెట్టూరు మండలం యాటకల్లు, మంగంపల్లి గ్రామాల నుంచి టమాటాల లోడుతో వెళ్తున్న వాహనం సంపదకేంద్రం మలుపు వద్ద అదుపుతప్పి ఆదివారం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదు. టమాటాలు చెల్లాచెదరుగా పడిపోవడంతో సుమారు రూ.లక్ష నష్టపోయినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

- న్యూస్‌టుడే, శెట్టూరు.

వచన శతకం చెట్టు పుస్తకావిష్కరణ

అనంత సాంస్కృతికం: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అనంతపురం శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం కవి డా. జూటూరు షరీఫ్ రచించిన 'చెట్టు' (వచన శతకం) పుస్తకావిష్కరణ జరిగింది. గౌరవాధ్యక్షుడు ఉప్పరపాటి వెంకటేశులు సభాధ్యక్షత వహించారు. విమలా శాంతి సాహిత్య సామాజిక సాంస్కృతిక సమితి అధ్యక్షుడు డా. శాంతి నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అరసం రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గౌరవ అతిథిగా పాల్గొనగా, పుస్తక సమీక్షకుడుగా కవి డా. అంకె శ్రీనివాసులు వ్యవహరించారు. సాహితీ మిత్రులు షరీఫ్‌ను ఘనంగా సన్మానించారు.

పుస్తకావిష్కరణలో రచయితలు

కుదుటపడని విద్యార్థినుల ఆరోగ్యం

హిందూపురం, న్యూస్‌టుడే: సోమందేపల్లి మండలం పాపిరెడ్డిపల్లి కస్తూర్బా విద్యాలయంలో అస్వస్థతకు గురై హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఐదుగురు విద్యార్థినుల ఆరోగ్యం కుదుట పడక విరేచనాలు, కడపునొప్పితో ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజుల నుంచి ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నా విరేచనాలు తగ్గలేదని విద్యార్థినులు విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని వైద్యులకు తెలియజేస్తే అనంతపురానికి వెళ్లమంటున్నారని అంతదూరం వెళ్లలేమని, ఇక్కడే మెరుగైన వైద్యం అందించాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ చేతన్ ఆదేశాల మేరకు ఉప తహసీల్దార్ మైనుద్దీన్, ఎంఈవో ఏహెచ్ గంగప్ప ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి ఆరోగ్యస్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. ఐదుగురిలో ఇద్దరికి విరేచనాలు తగ్గలేదని వారు చెప్పటంతో మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

మురడి ఆంజనేయస్వామికి జిల్లా అదనపు జడ్జి పూజలు

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా అదనపు జడ్జి శ్రీమతి సత్యవాణి ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి మురడి శ్రీఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ గంగాధర్, సర్పంచి గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అదనపు జడ్జి సత్యవాణికి స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

హాకీ.. దుర్గం విద్యార్థుల చలాకీ

ఉచిత శిక్షణతో జాతీయ స్థాయిలో రాణింపు

శిక్షణకు హాజరైన క్రీడాకారులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: చదువుతోపాటు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ దుర్గం విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. గత ఐదేళ్లుగా కళ్యాణదుర్గం పట్టణంలోని కరణం చిక్కప్ప క్రీడా మైదానంలో హాకీలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు 230 మంది శిక్షణ పొందారు. వీరిలో జాతీయ స్థాయిలో 12 మంది, రాష్ట్రస్థాయిలో 70 మంది వరకు హాకీ టోర్నీలో పాల్గొనడం విశేషం. 15 రోజుల కిందట అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో హాకీ అకాడమీకి క్రీడాకారుల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఆరిఫా, సనాతాజ్, సాయిప్రజ్ఞ, సిమ్రాన్‌తాజ్, స్వాతిక ఎంపికైనట్లు హాకీ కళ్యాణదుర్గం, మారెంపల్లి క్లబ్ అసోసియేషన్ అధ్యక్షులు తిమ్మరాజు, బాబు, కోచ్ అక్రమ్ తెలిపారు.

జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యం

నాన్న మరణించడంతో అమ్మ టైలర్ పని చేస్తూ నన్ను చదువు, క్రీడల్లో ప్రోత్సహిస్తోంది. ఉచితంగా హాకీలో శిక్షణ పొందుతూ రాష్ట్రస్థాయిలో టోర్నీలో రెండుసార్లు పాల్గొని మొదటి, రెండు స్థానాలు సాధించాను. జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. - ఆరిఫా, పదోతరగతి

గోల్‌కీపర్‌గా ఆడుతున్నా..

తండ్రి కూలీ పనులు చేస్తున్నారు. కుటుంబం గడవడం కష్టంగా ఉన్నా నన్ను చదివిస్తున్నారు. హాకీలో ఉభయ జిల్లాల అండర్-12 స్థాయి విభాగంలో పాల్గొని విజయం సాధించాం. నేను జట్టులో గోల్‌కీపర్‌గా ఆడుతున్నాను. దేశస్థాయిలో రాణించాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నా. - సనాతాజ్, 8వ తరగతి

క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలని..

నాన్న హమాలి పని చేస్తూ నన్ను చదివిస్తూనే కుటుంబాన్ని పోషిస్తున్నారు. జిల్లా, రాయలసీమ స్థాయి టోర్నీల్లో రెండుసార్లు పాల్గొని ప్రతిభ చూపాను. క్రీడాకోటాలో ఉద్యోగం సాధించాలనే తపనతో కష్టపడుతున్నాను. - స్వాతిక, 7వ తరగతి

విద్యార్థుల్లో క్రీడానైపుణ్యాన్ని వెలికితీసేందుకే..

హాకీలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని పిల్లలకు శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థుల్లో దాగిన క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కృషి చేస్తున్నాం. పిల్లలు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. రాష్ట్రస్థాయిలో చక్కటి ప్రతిభ కనబరుస్తున్నారు. హాకీలో అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి తీసుకురావాలనే సంకల్పంతో ఉన్నాం. - శంకర్, శిక్షకుడు, ఆర్డీటీ హాకీ అకాడమీ, అనంతపురం

పోలీసుల అదుపులో హత్యకేసు నిందితుడు?

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం గీతానగర్‌కు చెందిన రమాదేవి హత్య కేసులో నిందితుడిని ధర్మవరం ఒకటో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. గత నెల 29న గీతానగర్ ఇంట్లో రమాదేవి గాయాలతో అపస్మారక స్థితిలో ఉండటం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే ఆమెను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 4న మృతిచెందారు. కేసు నమోదు చేసిన పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. రమాదేవి ఇంటి ఎదురుగా నివాసం ఉన్న రాజశేఖర్ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. రమాదేవిని ఆసుపత్రిలో చేర్పించిన రోజు నుంచి మృతిచెందిన అనంతరం శవ పంచనామా వరకు రాజశేఖర్ వెళ్లారు. రాజశేఖర్ ప్రవర్తనలో మార్పు కనిపించడంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ చేశారు. మృతురాలి ఎదురింటిలో నివాసముంటున్న రాజశేఖర్‌ను తిట్టిందనే కారణంతో దాడి చేసి, తువ్వాలుతో గొంతును బిగించినట్లు పోలీసుల విచారణలో నిందితుడు వెల్లడించినట్లు సమాచారం.

చెత్త గుట్ట.. కదలని మురుగు

మున్సిపల్ వాహనాలకు మాత్రమే చెత్త చెదారాన్ని అందించాలని పలుమార్లు అధికారులకు సూచించినా కొంత మంది మారలేదు. ఇష్టానుసారంగా ప్లాస్టిక్ సీసాలు, ఇళ్లల్లోని వ్యర్థాలను మురుగు కాలువల్లో పడేస్తున్నారు. తాడిపత్రిలోని చింతలరాయుని పాళెం ప్రధాన వీధిలో ఉన్న మురుగు కాలువలో భారీగా చెత్త పేరుకుపోయింది. దీనిపై మున్సిపల్ ఏఈ నాగేంద్రను వివరణ కోరగా వెంటనే కార్మికులను పంపి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే తాడిపత్రి

కళ్లలో కారం కొట్టి బంగారు గొలుసు చోరీ

మొరసనపల్లి(చిలమత్తూరు), న్యూస్‌టుడే: గడ్డిమోపుతో ఇంటికి వస్తున్న మహిళ కళ్లలో దుండగులు కారం కొట్టి బంగారు గొలుసు అపహరించిన ఘటన చిలమత్తూరు మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. మొరసనపల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, శాంతమ్మలు జీవనాధారం కోసం రెండు ఆవులను పోషిస్తున్నారు. వాటికి గడ్డి తేవడానికి శాంతమ్మ ఆదివారం పొలానికి వెళ్లింది. మేతను కోసుకుని గ్రామంలోకి చేరుకునే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కళ్లలోకి కారం కొట్టి దాదాపు మూడు తులాల బంగారు గొలుసును తెంచుకొని పారిపోయారు. గ్రామస్థులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. 108 వాహనంలో బాధితురాలిని చిలమత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఫిర్యాదు తీసుకున్న పోలీసులు దీనిపై విచారణ ప్రారంభించారు.

వాహనంలో బాధితురాలు

జల్సాల కోసమే వృద్ధురాలి హత్య

మడకశిర, న్యూస్‌టుడే : మడకశిర మండలం మణూరులో జూన్ 28న ఇంటిలో ఒంటరిగా ఉన్న ముత్తక్క(71)ను అదే గ్రామానికి చెందిన చౌడప్ప, బిహార్‌కు చెందిన ఊర్మిళాదేవిలే హత్యచేశారని పోలీసులు వెల్లడించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ నరసింగప్ప, సీఐలు నాగేష్‌బాబు, రాజకుమార్‌లు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొన్నేళ్ల నుంచి చౌడప్ప, బిహార్‌కు చెందిన ఊర్మిళాదేవితో వివాహేతర సంబంధం ఉంది. వీరిద్దరూ వ్యసనాలకు బానిసై వారి జల్సాలకు అవసరమైన డబ్బు కోసం ఒంటరిగా ఉన్న ముత్తక్కను హత్య చేసేందుకు పథకం పన్నారు. పథకం ప్రకారమే ఇంటిలోకి దూరి మంచంపై నిద్రిస్తున్న ముత్తక్కను కిందకు ఈడ్చి అరవకుండా నోటిపై తలదిండు పెట్టి గట్టిగా ఇనుప రాడ్డుతో ఆమె గొంతుపై నొక్కి చంపారు. అనంతరం మెడలో ఉన్న బంగారు గొలుసు, వెండి పట్టీలు, బీరువాలోని రూ.25వేల నగదును దోచుకుని పరారైనట్లు విచారణలో ఒప్పుకొన్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి సోమవారం మడకశిర కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప, సీఐలు నాగేష్‌బాబు, రాజకుమార్

రైల్లో నుంచి పడి ప్రయాణికుడి మృతి

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి-పామిడి రైల్వేస్టేషన్ల మధ్య రైల్లో నుంచి జారిపడి ఓ ప్రయాణికుడు మృతిచెందాడు. గుత్తి-బెంగళూరు రైలుమార్గంలో శనివారం రాత్రి గుర్తు తెలియని ప్రయాణికుడు(35) రైలు బోగీలో వాకిలి వద్ద కూర్చోగా కుదుపులకు పట్టుతప్పి కిందపడి మృతిచెంది ఉండవచ్చని జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని ఆదివారం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒకరిపై కత్తితో దాడి

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని సుంకులమ్మపాళెంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి సుంకులమ్మపాళెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రఫీక్ తన భార్యతో గొడవ పడుతుండగా అదే కాలనీకి చెందిన రఫీ ఆపేందుకు వెళ్లాడు. ఈక్రమంలో రఫీక్ వద్ద ఉన్న కత్తితో దాడి చేసినట్లు తెలిపారు. గాయపడిన రఫీక్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరికీ గత కొంత కాలంగా గొడవలు న్నాయి. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి హఠాన్మరణం

క్రికెట్ ఆడుతూ ఉన్నట్టుండి కుప్పకూలిన విద్యార్థి

యోగానందరెడ్డి

గోరంట్ల, న్యూస్‌టుడే: నిండూనూరేళ్లు ఆయురారోగ్యాలతో కుటుంబానికి ఆసరాగా నిలవాల్సిన 19 ఏళ్ల విద్యార్థి హఠాన్మరణం చెందడం మండలంలోని కళ్లగేరి గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు విశ్వనాథరెడ్డి, సుజాతమ్మల రెండో కుమారుడు యోగానందరెడ్డి(19) డిగ్రీ రెండోసంవత్సరం చదువుతున్నాడు. గ్రామంలో శనివారం తోటి యువకులతో కలిసి క్రికెట్ ఆడుతుండగా ఉన్నపళంగా కిందపడిపోయాడు. వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. గుండె సంబంధ సమస్యగా గుర్తించిన వైద్యసిబ్బంది పుట్టపర్తికి పంపించారు. అక్కడికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని సమీప బంధువులు తెలిపారు.

మొహర్రంలో విషాదం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులోని కూరగాయల మార్కెట్ దగ్గర తాటకుల వీధిలో ఖయ్యూం(46) మృతిచెందాడు. ఈఘటన ఆదివారం ఉదయం జరిగింది. ఫక్కీరప్ప కాలనీకి చెందిన ఖయ్యూం పెద్దపీర్లను మోశాడు. తరవాత పక్కన ఉన్నవారికి పీర్లను అప్పగించి ఛాతిలో నొప్పి ఉందంటూ కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న అతని కుమార్తెలు కేకలు వేయడంతో స్థానికులు గమనించి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు చేయగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

ప్రారంభోత్సవానికి ముహూర్తం ఎప్పుడు?

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని 43కె. ఉడేగోళం గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవన నిర్మాణం పూర్తయి ఏడాది గడిచినా నేటికీ ప్రారంభించలేదు. దీంతో పాత పంచాయతీ భవనంలోనే సచివాలయ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఏడాదిగా లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. అధికారులు, పాలకులు స్పందించి భవనం ప్రారంభించి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఒంటికాళ్లపై నిరసన

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: సత్యసాయి నీటి పథకంలో పనిచేస్తున్న వారికి నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో రెండోరోజు ఆదివారం పంప్ హౌస్ వద్ద ఒంటి కాళ్లపై కార్మికులు నిరసన చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు వన్నూరప్ప, తిప్పేస్వామి, పరుశురాం, ఎర్రిస్వామి, వినోద్, శివన్న, వెంకటేశులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

రాయదుర్గం పట్టణం: అప్పుల బాధతో ఓ యువకుడు(20) రైలు కిందపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం మొలకాల్మూరు రోడ్డులో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. గ్యాస్ గోదాం ఏరియాలో బేల్దారి పనిచేసుకొంటూ జీవించే చాంద్‌బాష(20) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో అప్పులు పెరిగిపోవడంతో.. తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం తెల్లవారుజామున మొలకాల్మూరు రోడ్డు పైతోట సమీపంలోని రైల్వే పట్టాలపైకి వెళ్లడంతో గూడ్సు రైలు ఢీకొంది. చికిత్స నిమిత్తం ఆయనను బళ్లారికి తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

తీగల చోరీ

కళ్యాణదుర్గం గ్రామీణం: ముదిగల్లు- మల్లాపురం గ్రామాల్లోని బోరు బావులకు అమర్చిన సర్వీసు తీగలు చోరీ అయ్యాయని రైతులు వాపోతున్నారు. సురేష్, వెంకటేశులు, మంజుల వ్యవసాయ వ్యవసాయ క్షేత్రాల్లో మూడు బోరు బావులకు సంబంధించి 60 మీటర్ల సర్వీసు తీగను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితులు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పనిచేయని పాల వెల్లువలు

■ ఇబ్బందుల్లో పాడి రైతులు

న్యూస్‌టుడే, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, కణేకల్లు: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా రైతులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం చేపట్టిన 'పాల వెల్లువ మహిళా డెయిరీ సహకార కేంద్రాలు' ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో పాలను అమ్ముకోవడానికి రైతులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రుణాలు తీసుకుని పాడిన కొనుగోలు చేసిన రైతులు నెలవారీగా కంతులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు.

ఉంతకల్లులో సిబ్బంది నియామకం లేక మూసి ఉన్న కేంద్రం

పాల ఉత్పత్తులు ఎక్కువ ఉన్నా...

బొమ్మనహాళ్, దేవగిరి, లింగదహాళ్, యర్రగుంట, కణేకల్లు, నాగలాపురం, హనుమాపురం శ్రీరంగాపురం, ఎల్‌బీనగర్, శ్రీధరఘట్ట గోవిందవాడ, దర్గాహొన్నూరు తదితర హెచ్చెల్సీ ఆయకట్టు ఉన్న గ్రామాల్లో పాడి పశువుల పెంపకం ఎక్కువగా ఉంటోంది. ఇక్కడ పశుగ్రాసానికి కొదవ లేకపోవడంతో రైతులు ఎక్కువగా పశువులను సాకుతారు. గ్రామాల్లో పాల ఉత్పత్తి ఎక్కువగా ఉన్నా ప్రభుత్వ డెయిరీలు లేకపోవడంతో దళారులకు, ప్రైవేటు వ్యక్తులకు తక్కువ ధరలకే అమ్ముకోవాల్సి వస్తుంది. కొన్ని మండలాల్లో భవనాల పనులు పూర్తయినా.. పాల సేకరణకు సిబ్బంది లేకపోవడంతో మూసేసే ఉన్నాయి. బొమ్మనహాళ్, ఉద్దేహాళ్‌లో రెండు ప్రైవేటు పాల కేంద్రాలు ఉండటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అక్కడే పాలు పోస్తున్నారు. అక్కడ లీటరు రూ.32 నుంచి రూ.35 వరకు మాత్రమే ధర ఇస్తున్నట్లు పలువురు వాపోయారు.

ఏళ్లుగా ప్రారంభ గ్రహణం

రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్, డి.హీరేహాళ, కణేకల్లు మండలాల్లో 20 వరకు 'పాల వెల్లువ' (డెయిరీ) కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఒక్కొక్క పాల కేంద్రానికి రూ.10 లక్షల చొప్పున నిధులిచ్చారు. బొమ్మననహాళ్ మండలానికి మంజూరైన రెండు కేంద్రాల్లో ఉంతకల్లులో భవనం పూర్తవగా.. ఏళంజిలో పునాదుల్లోనే పనులు నిలిచాయి. కణేకల్లు మండలంలోని 17 కేంద్రాల్లో యర్రగుంట సచివాలయాల పరిధిలోని రెండు కేంద్రాల ఏర్పాటుకు స్థలసేకరణ పూర్తయిన పనులు మొదలవ్వలేదు. డి.హీరేహాళ్ మండలం మడేనహళ్లిలో భవనం పనులు తుది దశకు చేరుకున్నాయి. ఫ్లోరింగ్, విద్యుత్తు, పనులు మిగిలి ఉన్నాయి. ఉంతకల్లులో భవనం పనులు పూర్తయినా.. ప్రారంభించలేదు.

ఆదేశాలు రాగానే తగు చర్యలు

ఉంతకల్లులో భవనం పూర్తయినా పాల సేకరణకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందలేదని పశువైద్యాధికారి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఏళంజిలో భవనం పనులు పునాది దశలోనే ఉన్నాయని పీఆర్ జేఈ జగదీష్ తెలిపారు.

శిథిలావస్థలో వీరగల్లుల విగ్రహాలు!

కుందుర్పి పాఠశాలలో అస్తవ్యస్తంగా...

కుందుర్పి, న్యూస్‌టుడే: సైనికులు వీరోచితంగా పోరాడిన వీరగల్లుల శిలా విగ్రహాలు ప్రస్తుతం కుందుర్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్లక్ష్యంగా పడేశారు. ఎండకు ఎండుతూ.. వర్షాలకు తడుస్తుండటంతో వాటి రంగుమారి శిథిలావస్థకు చేరాయి. రాజుల పాలనలో రాజ్యాల రక్షణ కోరుతూ శత్రువులతో పోరాడి అసువులు బాసిన సైనికాధికారులు, వీర సైనికుల త్యాగాలను భవిష్యత్తుతరాలకు అందించేందుకు రాజులు వీటిని ఏర్పాటు చేయించినట్లు చరిత్రకారులు తెలిపారు. ఏడు దశాబ్దాల కిందట కుందుర్పి పాఠశాల నిర్మాణ సమయంలో తవ్వకాల్లో బయల్పడిన విగ్రహాలను గదుల వద్దే ప్రతిష్ఠించారు. రెండేళ్ల కిందట నిర్వహించిన 'నాడు- నేడు' పథకంలో భవనాల మరమ్మతుల పేరిట ఈ శిలావిగ్రహాలను కదిలించి ఓ మూలన పడేశారు. ఇప్పటికైనా ఈ విగ్రహాలను ఓచోట ప్రతిష్ఠించి చరిత్రను కాపాడాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.

రక్తదానం జీవితాలను కాపాడుతుంది

కంబదూరు, న్యూస్‌టుడే: రక్తదానం ఎంతోమంది జీవితాలను కాపాడుతోందని బాబురామ్‌సింగ్‌జీ పేర్కొన్నారు. ఆదివారం గుద్దెళ్ల గ్రామం 'రాధాస్వామి సోమ అజాయిబ్ కృపా ఆశ్రమం'లో దుర్గం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆ ట్రస్టు అధ్యక్షుడు కంబాల తిమ్మారెడ్డి, కార్యదర్శి ఉదయ్‌కుమార్ రెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు చిత్తప్ప పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు: అమిలినేని

కుందుర్పి, న్యూస్‌టుడే: వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే లబ్ధిదారులను అక్కడి ఉద్యోగులను లంచాల పేరుతో పీడిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, వారిపై కఠిన చర్యలు తప్పవని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హెచ్చరించారు. ఆదివారం మలయనూరులో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధి బిల్లులు చేయడానికి సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు కూలీలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే సదరు ఉద్యోగితో చరవాణిలో మాట్లాడి హెచ్చరించారు. అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు చేయాలని సిబ్బంది కోరగా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీశంకర్‌ను ఆదేశించారు. ఉద్యోగులు పద్ధతి మార్చుకుని ప్రజలు, లబ్ధిదారులకు న్యాయం చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ లక్ష్మీశంకర్, మండల తెదేపా అధ్యక్షుడు దనంజయ, నాయకులు గంగాధర, వీరాంజి, సంజీవస్వామి పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న అమిలినేని

సంక్షేమ పథకాలు వివరిస్తున్న కాలవ

'చంద్రబాబు నాయుడు కాలనీ'లో ఇళ్లు కూల్చనివ్వం: కాలవ

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని 13వ వార్డులో ఇళ్లు కూల్చకుండా చర్యలు తీసుకుంటానని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం చంద్రబాబు నాయుడు కాలనీలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైకాపా పాలనలో చంద్రబాబు నాయుడు కాలనీ వాసులను ఖాళీ చేయించే ఎత్తుగడను తాను దగ్గరుండి తిప్పి కొట్టానన్నారు. కాలనీ నుంచి రైల్వే వంతెన వెళ్తున్నందున కొందరు అనవసర భయాలు సృష్టిస్తున్నారన్నారు. రైల్వే అధికారులు పంపే నోటీసులకు భయపడవద్దని, అవసరమైతే సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. రైల్వే వంతెనకు అడ్డుగా ఉన్న ఇళ్ల వారికి అనువైన స్థలంలో మళ్లీ ఇళ్లు కట్టి ఇప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతరెడ్డి, జనసేన నాయకుడు మంజునాథగౌడ్, వార్డు ఇన్‌ఛార్జి నాగరాజు, హనుమంతు, పురుషోత్తం, నాగరాజు, లోకేష్, పైతోట అంజి పాల్గొన్నారు.

ధరలేక.. పొగాకు రైతుల దిగాలు!

శెట్టూరు, న్యూస్‌టుడే: మార్కెట్లో ధరలు లేకపోవడంతో శెట్టూరు మండలంలోని పలు ప్రాంతాల్లో సాగైన పొగాకు కొనుగోలు చేసేవారే లేరని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గొల్లపల్లి, ముచ్చర్లపల్లి, చింతర్లపల్లి, చెర్లోపల్లి, బచ్చేహళ్లి తదితర గ్రామాల రైతులు పొగాకును ఎక్కువగా సాగు చేస్తుంటారు. కంపెనీవారే విత్తనం ఇచ్చి సేద్యం చేయించినప్పటికీ ప్రస్తుతం ధరలు లేవని తామే కొనుగోలు చేయకుండా ముఖం చాటేశారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో రైతు సుమారు మూడు నుంచి పదెకరాల దాకా పొగాకు పంటను సాగు చేశారు. మూడు దశల్లో ఆకును తొలగించి నీడలో ఆరబెట్టి మూటలు కట్టి కర్నూలు, గుంటూరు మార్కెట్లకు తరలిస్తే.. అక్కడ డిమాండ్ లేకపోవడంతో రైతులకు నిరాశ తప్పడం లేదు. చివరికి చేసేదేమి లేక దారుల్లో, అటవీ ప్రాంతాల్లో పొగాకును పడేస్తున్నట్లు రైతులు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని పలువురు విన్నవిస్తున్నారు.

అడవిలో పడేసిన పొగాకు

సైనిక కుటుంబాల శ్రేయస్సే లక్ష్యం

సమావేశంలో మాజీ ఆర్మీ ఉద్యోగులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫలాలను సాధించుకోవడంతోపాటు సైనిక కుటుంబాల శ్రేయస్సుకు కృషి చేద్దామని సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు అమర్‌నాథ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన ఆర్మీ విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దత్తయ్య, కార్యదర్శి నారాయణస్వామి, సలహాదారులు శ్రీనివాసమూర్తి, సీనియర్ సైనికులు పాల్గొన్నారు.

'పాత వారికే గుర్తింపు ఇవ్వాలి'

బొమ్మనహాళ్: కష్టకాలంలో తెదేపా కోసం పనిచేసిన కార్యకర్తలను వదిలిపెట్టి వైకాపా నుంచి వచ్చిన వారిని మండల కన్వీనర్‌గా నియమించడం ఏంటని ఆ పార్టీ నాయకుడు ప్రేమకుమార్ ఆదివారం ప్రశ్నించారు. యువతకు న్యాయం జరగలేదని, ఈ విషయం అధిష్ఠానం దృష్టికితీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో పారిశుద్ధ్య ప్రత్యేక కార్యాచరణ కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం హోతూరు దారిలోని కాలువను శుభ్రం చేయించారు. పట్టణంలోని అన్ని కాలనీల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోనున్నట్లు కార్యదర్శి గౌస్ సాహెబ్ తెలిపారు.

యోగా పోటీలకు ఏర్పాట్లు

ఉరవకొండ, న్యూస్‌టుడే: అనంతపురం, ఉరవకొండ యోగా సమాఖ్యల ఆధ్వర్యంలో 'యోగాసన భారత్' ఆధ్వర్యంలో ఆగస్టు 3 నుంచి నిర్వహించే జిల్లాస్థాయి పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రతినిధులు రాజశేఖర్‌రెడ్డి, దివాకర్, మారుతీప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో యోగా సమాఖ్య ప్రతినిధులు సుధాకర్‌రెడ్డి, వెంకట, దివాకర్, ఓబులేసు, గణేశ్‌బాబు, మారుతి, శ్రీదేవి, శైలజ, లాలెప్ప పాల్గొన్నారు.

ఘనంగా గ్రామీణాభివృద్ధి దినోత్సవం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: వివిధ గ్రామాల్లో ఆదివారం ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవాన్ని పంచాయతీరాజ్ ఉద్యోగులు, సర్పంచులు, ఎంపీటీసీలు, గృహనిర్మాణ, వైద్య, వెలుగు, రెవెన్యూ శాఖల అధికారులు జరుపుకొచ్చారు. నేమకల్లు, కురువళ్లి, ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట గోవిందవాడ తదితర గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించారు. ఎంపీడీవో విజయభాస్కర్ పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా?

డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురంలోని కళ్లివోణి ఏరియాలో రోడ్డుపై మురుగు చేరడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మురుగులో ఈగలు, దోమలు, పందుల ఉద్ధృతి పెరగడంతో ప్రజలు తరచుగా అనారోగ్యానికి గురవుతున్నారు. డిప్యూటీ ఎంపీడీవో యోగానంద 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ రోడ్డు మరమ్మతులకు తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, డి.హీరేహాళ్

దారులు నిర్మించరూ..

పట్టణంలోని భంభం బాబా, ఇందిరమ్మ కాలనీ ఏర్పడి ఇరవై ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ సీసీ దారులు, మురుగు కాలువల నిర్మాణం లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నిత్యం ఇళ్ల నుంచి వస్తున్న వ్యర్థపు నీరు రోడ్డుపై నిలిచి అపరిశుభ్రంగా మారుతుంది. ఈ విషయమై కమిషనర్ దివాకర్‌రెడ్డి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ కాలనీల్లో వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

ఇరువైపుల పొదలు.. రాకపోకలకు కష్టాలు

విడపనకల్లు మండలం పొలికి నుంచి హంచనహాళ్ వెళ్లే ప్రధాన దారికి ఇరువైపుల పొదలు, ముళ్ల జాతి చెట్లు పెరగడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దారి అంచులకు వెళ్తే కంప గుచ్చుకుని ప్రమాదాలకు గురికావాల్సి వస్తోంది. రాత్రిపూట ప్రయాణికుల రాకపోకలకు మరింత కష్టంగా మారుతుంది. వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులు దారికి ఇరువైపుల ఉన్న పొదలు, కంపను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, విడపనకల్లు(ఉరవకొండ)

ఎరక్కపోయి వస్తే... ఇరుక్కుపోతారు!

మొలకాల్మూరు రోడ్డుకు వెళ్లే బైపాస్ దారిలో రైల్వే అండర్ బ్రిడ్జి ఎత్తు తక్కువగా ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వంతెన కింది భాగంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా సాఫీగా వెళ్లేందుకు దారి ఎత్తును పెంచారు. దీంతో లోడుతో వచ్చే వాహనాలు బిడ్జి కింద నుంచి వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో వాహనాలు బ్రిడ్జి కింద ఇరుక్కుపోతుండటంతో వచ్చిపోయే వారికి ఇబ్బందిగా మారుతోంది. సంబంధిత అధికారులు గేటు ఎత్తు తగ్గించి భారీ లోడుతో వెళ్లే వాహనాలు బిడ్జి వరకు చేరకుండానైనా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలతోపాటు వాహనదారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం.

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పండగ సందర్భంగా కోట లక్ష్మీనరస్వామి, అనంతపురం, రాయదుర్గం రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు కొనసాగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకొనేందుకు తరలివచ్చారు.

శెట్టూరు: శెట్టూరు మండలం యాటకల్లులోని కుణే రామాలింగేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం పట్టణం బళ్లారి రోడ్డులోని ఆలయంలో శ్రీరుక్మిణి, పాండురంగ స్వాములకు ప్రత్యేక పూజలు, పల్లకీసేవ నిర్వహించారు.

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ బ్రాహ్మణ వీధిలోని పాండురంగని ఆలయంలో భక్తులు వైభవంగా పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగించారు. అలాగే పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ పూజలు కొనసాగాయి. కార్యక్రమంలో వేద పండితులు ఫణిరాజాచార్యులు, ప్రసాద్, బద్రినాథ్ పాల్గొన్నారు.

శ్రీరుక్మిణి, పాండురంగ స్వామి

ఉరవకొండలో...

ఉంతకల్లు(బొమ్మనహాళ్), న్యూస్‌టుడే: ఉంతకల్లులో వెలసిన రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. స్వామిని పల్లకిలో ఉంచి అశేష జనవాహిని మధ్య ఊరేగించారు. అలాగే బొమ్మనహాళ్, ఉప్పరహాళ్ గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు వైభవంగా సాగాయి.

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు

రాయదుర్గం, రాయదుర్గం గ్రామీణం, కళ్యాణదుర్గం గ్రామీణం, ఉరవకొండ, బొమ్మనహాళ్: పెద్ద సరిగెత్తు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గొంది బావి, పెద్ద మసీదు, పీర్ల చావిడి, చమ్మా పీర్లు, వన్నూరు స్వామికట్ట, ఊరువాకిలి, ఉచ్చా బావి పీర్లను సందర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు.

పీర్ల సందర్శనానికి బారులు తీరిన భక్తులు

● పల్లేపల్లి, మల్లాపురం, మెచ్చిరి, చదం, కొంతానపల్లి, కదరంపల్లి, డి.కొండాపురం, జుంజురాంపల్లి గ్రామాల్లో పీర్లకు ప్రార్థనలు చేశారు. ● కొత్తూరు, మోరేపల్లి, దురదకుంట పీర్లను ఊరేగించారు. ● చాపిరిలో పీర్ల సరిగెత్తును నిర్వహించారు. ● ఉరవకొండలో ఊరేగింపు సందడిగా సాగింది. ఆమిద్యాలలోని లాలుస్వామి, చక్రాలు కలిగిన పీర్లు ఆకట్టుకున్నాయి.

ఆభరణాలు అందజేత: ఉరవకొండ మండలం ఆమిద్యాలకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రుషేంద్ర- ప్రశాంతి దంపతులు రూ.2.5 లక్షలు విలువైన ఆభరణాలను అందించారు. ● ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట, శింగానహళ్లి, గోవిందవాడ, దేవగిరి, లింగదహాళ్, కురువళ్లి, చంద్రగిరి, శిద్దరాంపురం, దర్గాహొన్నూరు, హరేసముద్రం గ్రామాల్లో సరిగెత్తు వైభవంగా సాగింది.

కొంతానపల్లిలో కొలువైన పీర్లు

అప్రమత్తతతోనే వ్యాధులు దూరం

కుక్కకు టీకా వేస్తున్న వైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: జంతువుల నుంచి మానవులకు సంక్రమించే వ్యాధుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని పశుసంవర్ధకశాఖ సహాయ సహాయ సంచాలకులు శ్రీనివాస గుప్తా పేర్కొన్నారు. ఆదివారం సుమారు 50 కుక్కలకు టీకాలు వేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు కమిటీ వైస్ ఛైర్మన్ రాజశేఖర్, సిబ్బంది రామ్మూర్తి, గుల్షాద్‌బేగం, వెంకటరమణ, శివకుమార్, ఎన్.టిచౌదరి, జంతుపోషకులు పాల్గొన్నారు.

రాయదుర్గం గ్రామీణం: ప్రాంతీయ పశువైద్యశాలలో ఆదివారం రాయదుర్గం మండల వైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. రాయదుర్గంలోని పలు పెంపుడు కుక్కలకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. సంక్రమిత వ్యాధుల నుంచి జంతువులను రక్షించండి అంటూ పశువైద్యులు, సిబ్బంది, ప్రజలు నినాదాలు చేశారు.

కలగా.. ఉద్యానవనాల ఏర్పాటు

ఉరవకొండ, న్యూస్‌టుడే: అనువైన స్థలాలు ఉన్నా.. ఉద్యాన పార్కులు ఏర్పాటు చేయడంలో అధికార యంత్రాంగం చొరవ చూపడం లేదు. ఉరవకొండలో 20 కాలనీల్లో సుమారు 50 వేల జనాభా ఉంది. అయితే పట్టణవాసులు సేద తీరడానికి ఉద్యాన పార్కులు లేకపోవడం గమనార్హం. దీంతో ప్రజలు వారాంతం, సెలవుల్లో ప్రజలంతా ఇళ్లకే పరిమితం కావాల్సి వస్తోంది. కనీసం పిల్లలు ఆడుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోతుంది. రోడ్లపైనే ఉదయం, సాయంత్రం నడక కొనసాగించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.

ఖాళీగా ఉన్న స్థలం

అనువైన స్థలాలు ఉన్నా..

ఉరవకొండ పట్టణంలోని పలు కాలనీల్లో పార్కుల ఏర్పాటుకు సుమారు 50కి పైగా ఒక్కోచోట కనీసం 25 సెంట్ల అనువైన స్థలాలు ఉన్నాయి. ఇక్కడ ఉద్యానవనాల ఏర్పాటుకు అవకాశం ఉన్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. పలు సందర్భాల్లో పంచాయతీలో తీర్మానాలు చేసినా.. ఆచరణ రూపం దాల్చడం లేదు. ఇప్పటికైనా అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పార్కుల ఏర్పాటుకు చర్యలు

-గౌస్‌సాహెబ్, పంచాయతీ కార్యదర్శి

గ్రామాల్లోని పలు కాలనీల్లో పార్కులు ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటాం. కొన్ని ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయనే సమాచారం ఉంది. వాటి రక్షణకు తగు చర్యలు తీసుకుంటాం.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి

ఉరవకొండ: తొలి ఏకాదశి సందర్భంగా ఉరవకొండ ఎరుకల సేవా సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ఏపీ ఎరుకల సేవా సంఘం ప్రతినిధులు వసంత్, వీరేంద్ర, వీరేశ్, ఆంజనేయులు, రాజు, సత్తి, శేఖర్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం గ్రామీణం: ఉప్పొంకలో సబ్‌డివిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్, ఎరుకల సంఘం నాయకులు పెద్ద ఎర్రిస్వామి కేకు కోసి సంబరాలు చేసుకొన్నారు. అనంతరం విద్యార్థులకు రాతపుస్తకాలు అందజేశారు. ఆర్డీటీ ఆస్పత్రి వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. ఆ సంఘం నాయకులు చంద్ర, మనోజ్, మల్లికార్జున, నాగేంద్ర, రవి, రాజేష్, నరేంద్ర పాల్గొన్నారు.

కంబదూరు: స్థానిక పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేసిన ఏకలవ్య విగ్రహానికి సర్పంచి పద్మావతమ్మ భర్త తిమ్మప్ప, ఎరుకల సంఘం మండల అధ్యక్షుడు సుబ్బరాయుడు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు రమేష్, సభ్యులు వెంకటేశప్ప, తిరుపాల్, రామలింగప్ప, నాగేంద్ర పాల్గొన్నారు.

పూలమాల వేసి నివాళి అర్పిస్తూ...

చిన్నపాటి వర్షానికే.. చిత్తడి!

శెట్టూరు, న్యూస్‌టుడే: చిన్నపాటి వర్షానికే వరద నీరు రోడ్డుపై గుంతల్లో చేరడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని శెట్టూరు మండలం ములకలేడు గ్రామ పంచాయతీ శివారు రంయపాళ్యం ప్రజలు వాపోతున్నారు. శివారు గ్రామం కావడంతో పట్టించుకునే వారే లేరన్నారు. గతంలో పలుసార్లు రోడ్డు సమస్య పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఈ సమస్యపై ఈవోఆర్డీ రఘురామ్‌రావు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ దారి మరమ్మతుకు ప్రతిపాదనలు పంపుతామని, నిధులు మంజూరయ్యాక పనులు చేయిస్తామని తెలిపారు.

గుంతలుగా మారిన రోడ్డు

(c) eenadu

గుంతకల్లు

●గుంతకల్లు ●శింగనమల ●తాడిపత్రి

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు

పెంపుడు కుక్కలను పరిశీలిస్తున్న ఏడీఏ రత్నకుమార్ తదితరులు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : పెంపుడు కుక్కలకు టీకాలు వేయించడం ద్వారా ప్రమాదకర రేబిస్ వ్యాధిని పూర్తిగా తరిమి కొట్టవచ్చని బుక్కరాయసముద్రం పశువైద్య సహాయ సంచాలకులు రత్నకుమార్ తెలిపారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. పశువైద్యులు గోవిందరాజులు, వైద్య సిబ్బంది రామాంజనేయులు, భానుప్రకాశ్ పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

గురువులతో కలిసి పూర్వ విద్యార్థులు

యాడికి, న్యూస్‌టుడే: యాడికి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1979-80 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. అప్పటి గురువులు భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కేశవరెడ్డిలను పూర్వ విద్యార్థులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు చవ్వాగోపాల్‌రెడ్డి, ఈశ్వరయ్య, మల్లికార్జునరావు, చవ్వాగోపాల్‌రెడ్డి, జనార్దనశర్మ, ధ్రువనారాయణ, సాధుశేఖర్, మాబూపీరా, సుమతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: తాడిపత్రిలోని తూర్పుపాళెంలో వీధి ట్యాంకు నిరుపయోగంగా ఉంది. - **సాయినాథ్‌రెడ్డి, స్థానికుడు**

సమాధానం: వీలైనంత త్వరగా వెంటనే కాలనీలో పరిశీలించి తాగునీటి ట్యాంకును వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. - **తేజ, మున్సిపల్ ఏఈ**

- న్యూస్‌టుడే తాడిపత్రి

సమస్య: గుంతకల్లులో ఆదివారం ఆర్‌టీ గుప్త ఆసుపత్రి దగ్గర రహదారి మలుపులో మురుగు రోడ్డుపైకి వస్తుండటంతో పాదచారులు అవస్థ పడుతున్నారు. - **వెంకటేశులు.**

సమాధానం: మురుగు తొలగించి సమస్యను పరిష్కరిస్తాం. - **వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పురపాలక సంఘం.**

- న్యూస్‌టుడే గుంతకల్లు పట్టణం

సమస్య: శింగనమల మండలం కల్లుమడి గ్రామంలో వెళ్లే ప్రధాన రోడ్డు వర్షం పడి బురదమయంగా మారుతోంది.
- **మహేశ్, కల్లుమడి**

సమాధానం: గ్రామీణ రోడ్ల నిర్మాణం కోసం నివేదికలు తయారు చేశాం. త్వరలో కల్లుమడి గ్రామంలో రహదారులను సీసీ రోడ్లుగా పరిష్కరిస్తాం. - **కృష్ణజ్యోతి, డీఈ, పంచాయతీరాజ్, శింగనమల**

సమస్య: శింగనమల మండలం సలకంచెరువు బస్టాండ్ వద్ద మురుగు నిల్వ ఉంటోంది. - **రాజకుళ్లాయి, సలకంచెరువు**

సమాధానం : త్వరలోనే మురుగు కాలువల నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం.
- **భాస్కర్, ఎమ్పీడీవో, శింగనమల**

– న్యూస్‌టుడే శింగనమల

యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు

● పంచాయతీ ఆదాయానికి గండి ● వ్యాపారుల ఇష్టారాజ్యం

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా దర్జాగా వెంచర్లు వేసి ప్రజలకు అంటగడుతున్నారు. దీంతో గ్రామ పంచాయతీలకు వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారు. వెంచర్లను మురుగు కాలువలు, రహదారులు, విద్యుత్తు, తాగునీటి సంబంధించిన స్థలాలు కేటాయించకుండానే వేస్తున్నారు. ఇదంతా తెలియని ప్రజలకు అధిక ధరలకు అమ్మేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

● గుత్తి మండలంలో ముఖ్యంగా వన్నెదొడ్డి, ఊబిచెర్ల, కొత్తపేట, బాచుపల్లి, కరిడికొండ పెద్దవడుగూరు రోడ్డులో అక్రమ వెంచర్లు వెలిశాయి.

రోడ్డు పక్కన పొలాలే లక్ష్యం

గుత్తి మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ పొలాలను తక్కువ ధరకు విక్రయించి లేఅవుట్లు వేస్తున్నారు. కనీసం పంచాయతీ అధికారుల అనుమతి లేకుండా ముందుకెళ్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి లేఅవుట్లు వేయాలి. గ్రామ పంచాయతీకి 10శాతం స్థలాన్ని వదలాలి. లేఅవుట్‌లో 30 అడుగుల రోడ్డుకు స్థలాన్ని వదలాలి. ఇవన్నీ రికార్డులో ఉన్నట్లు చూపిస్తూ క్షేత్రస్థాయిలో మాత్రం నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ● మార్కెట్ ధరకు అనుగుణంగా ప్రభుత్వానికి వెంచర్ యజమానులు పన్ను చెల్లించడం లేదు. వన్నెదొడ్డి గ్రామంలో సచివాలయం వెనక ఎకరా స్థలంలో నాలుగేళ్ల కిందట అనుమతులు లేకుండా లేఅవుట్ వేశారు.

● అదే గ్రామంలో 22-ఎలో ఉన్న 30 సెంట్ల స్థలాన్ని ప్రస్తుతం లేఅవుట్‌గా మార్చారు.

● రజాపురం గ్రామ సమీపంలోని 67 జాతీయ రహదారికి ఆనుకొని ఎలాంటి అనుమతులు లేకుండా మూడు చోట్ల లేఅవుట్లు వేశారు. అహుడా అనుమతి లేదని పంచాయతీ అధికారులు నోటీసులు అందజేసినా పట్టించుకోవడం లేదు.

వన్నెదొడ్డిలో అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్

● పెద్దవడుగూరు, అనంతపురం రోడ్డులో అక్రమ వెంచర్లు పెద్ద ఎత్తున వెలిశాయి. బాచుపల్లి గ్రామంలో పదుల సంఖ్యలో ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేసి మరీ వెంచర్లు వేశారు. పంచాయతీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీలకు రూ.లక్షల్లో ఆదాయానికి గండికొడుతున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం

అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తే చర్యలు తీసుకుంటాం. వన్నెదొడ్డిలో వెంచర్లు వేసిన విషయం తెలిసింది. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

-నరసింహారెడ్డి, ఈవోఆర్డీ, గుత్తి

‘ప్రజలు సుభిక్షంగా ఉన్నారు’

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, పాల్గొన్న తెదేపా నాయకులు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో రాష్ట్రంలో ప్రజలు ఆనందంగా, సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మండలంలోని నక్కనదొడ్డి గ్రామంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామంలో ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల్లో భాగంగా తల్లికి వందనం, పింఛన్ల పంపిణీ, ఉచిత గ్యాస్ సిలిండర్ వంటి అమలు చేస్తున్నామన్నారు. గ్రామ సర్పంచు వరలక్ష్మి, గుంతకల్లు ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, మండల అధ్యక్షుడు రామ్మన్న చౌదరి, మస్తానప్ప, గురుస్వామి, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మకాన్ నిర్మాణానికి విరాళం

నక్కనదొడ్డి గ్రామంలో పీర్ల మకాన్ నిర్మాణానికి రూ.5 లక్షలను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదివారం అందజేశారు. పీర్ల మకాన్‌లో స్వామివారికి చక్కెర చదివింపులు చేయించి మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు బళ్లారి గ్రామీణ ఎమ్మెల్యే నాగేంద్ర సహకారంతో నగదును అందజేశామన్నారు. నారాయణస్వామి, నక్కనదొడ్డి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్లకు పూజలు

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. పలు వీధుల్లోని చావిడుల్లో కొలువుదీరిన పీర్లను భక్తులు ప్రత్యేకంగా దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఆయా ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

- న్యూస్‌టుడే బృందం

ఊటకల్లులో పీర్ల స్వాములు

యాడికిలో ప్రత్యేక అలంకరణలో బడేఆలం పీర్లు

నృత్య ప్రదర్శనకు విశేష స్పందన

నృత్య నీరాజనంలో పాల్గొన్న శాస్త్రీయ నృత్య కళాకారులు

పామిడి, న్యూస్‌టుడే : పామిడి పట్టణంలోని విఠోబ దేవాలయంలో ఆదివారం ఆషాఢ మాస బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అరవింద్ నృత్య అకాడమీలో శిక్షణ తీసుకుంటున్న చిన్నారులు నృత్యం చేశారు. చిన్నారులు చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చింది. అన్నమయ్య కీర్తనలు, త్యాగరాజ కీర్తనలు, స్వామి హారతి పాటకు చేసిన నృత్య కళారీతులు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయ ఈవో కృష్ణయ్య, ఆలయ కార్యవర్గ సభ్యులు నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులను ప్రశంసా పత్రం, జ్ఞాపికలతో సత్కరించారు. నృత్య కళారీతుల్లో శిక్షణ ఇస్తున్న గురువు సురేశ్‌ను సత్కరించి పలువురు అభినందించారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భాజాపా నాయకులు

తాడిపత్రి, న్యూస్‌టుడే: జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను భాజపా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక భాజపా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భాజపా రాష్ట్ర నాయకుడు అంకాల్‌రెడ్డి, నాయకులు గంగాధర్‌యాదవ్, సింగరి లక్ష్మీనారాయణ, కృష్ణమోహన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో కలెక్టర్

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని ఆదివారం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రదక్షిణలు అనంతరం ఆయన స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారి కుటుంబ సభ్యుల పేరిట ప్రత్యేక అర్చనలు చేసి స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పర్యవేక్షకుడు వెంకటేశులు, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ కలెక్టర్‌కు స్వామి శేషవస్త్రాలు, చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, తహసీల్దారు రామాదేవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మన్రో వర్ధంతి

గుత్తి, న్యూస్‌టుడే : దత్త మండలాల ప్రిన్సిపల్ కలెక్టర్‌గా పని చేసిన మన్రో వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం ఘన నివాళి అర్పించారు. కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ సభ్యులు మన్రో సమాధిపై పూలు చల్లి నివాళి అర్పించారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఏర్పాటు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి మండల ఎమ్మార్పీఎస్ కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. మండల కమిటీ గౌరవ అధ్యక్షుడిగా జి.ఓబులేసు, అధ్యక్షుడిగా రాజు, ఉపాధ్యక్షుడిగా రూపేశ్, అధికారప్రతినిధిగా సూర్యనారాయణ,ప్రధాన కార్యదర్శిగా సునీల్, కార్యదర్శిగా రవీంద్ర, సహాయ కార్యదర్శిగా నాగేంద్ర బాబులను ఎన్నిక చేశారు. జిల్లా నాయకులు హరగోపాల్,సుబ్బారావు, సీనియర్ నాయకులు ఈరన్న పాల్గొన్నారు.

కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని గుంతకల్లులో ఆదివారం బీటీ పక్కీరప్ప భవనంలో కార్మిక సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. హమాలీ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహేశ్, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు సురేశ్, కార్యదర్శి ఈశ్వరయ్య, ఐఎఫ్‌టీయూ పట్టణ కార్యదర్శి రామదాసు, తదితర కార్మిక సంఘాలు పాల్గొన్నారు.

బీమా సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పంటరుణాలు తీసుకునే ప్రతి రైతు తప్పక బీమా సౌకర్యం చేయించుకోవాలని పెద్దవడుగూరు యూనియన్ బ్యాంకు మేనేజరు శేషగిరి తెలిపారు. ప్రస్తుతం పంటల బీమాను ప్రభుత్వం ప్రకటించినందున ఎకరాకు పత్తి పంటకు రూ. 1,140 చొప్పున సొంతంగా ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు.

ఎస్ఎస్ ట్యాంకుల పరిశీలన

గుంతకల్లు పట్టణం : గుంతకల్లులో ఆదివారం ప్రజాఆరోగ్యం సాంకేతిక శాఖ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, ఈఈ ఆదినారాయణ, మున్సిపల్ అధికారులు పట్టణానికి చెందిన సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, ఫిల్టర్‌బెడ్లు, సంపులను పరిశీలించారు. నీటి నిల్వ శాతాన్ని పరిశీలించారు. పలు ఆర్వో ప్లాంట్లను తనిఖీ చేశారు. ఎస్ఈ మాట్లాడుతూ ఐదుగురు కలుషితం నీరు తాగి అస్వస్థతగా గురైన విదితమే. ఆ బాధితులంతా ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. కొత్తకేసులు నమోదు కాలేదన్నారు.

క్షేత్రం వద్ద పానకాలతో భక్తులు

మొక్కు చెల్లిస్తున్న ఓ భక్తుడు

కుళ్లాయిస్వామి ఉత్సవం.. భక్తజన పరవశం

వెల్లివిరిసిన మతసామరస్యం

కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పెద్దసరిగెత్తును ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో గూగూడు వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామిని భక్తితో కొలిచారు. గాజుల అంగళ్లు, రంగుల రాట్నాలు, ఇతరత్రా దుకాణాలతో ఆలయ చుట్టు పరిసరాలన్నీ కళకళలాడాయి. పానకాలు, చక్కెర, కొబ్బరి తదితరాలు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించారు. –న్యూస్‌టుడే, నార్పల, ఈనాడు–అనంతపురం

గొరవయ్యల సందడి

భక్తులతో కిక్కిరిసిన వీధులు

తెదేపా మండల కన్వీనర్ పదవికి పోటాపోటీ

కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు మల్లికార్జున

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : బుక్కరాయసముద్రం తెదేపా మండల కన్వీనర్‌గా మాజీ సర్పంచి లక్ష్మీనారాయణకు అవకాశం ఇవ్వాలని 95 శాతం మంది కార్యకర్తలు, నినాదాలు చేస్తూ మద్దతు ప్రకటించారు. ఆదివారం దేవరకొండ వద్ద మండల కన్వీనర్ ఎంపిక చేయడానికి పార్టీ పెద్దలు మల్లికార్జున ద్విసభ్య కమిటీ సభ్యులు నరసానాయుడు, కేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు సమావేశమయ్యారు. ఎన్నికల పరిశీలకులు మల్లికార్జున మండల కన్వీనర్‌గా ఎన్నిక కావడానికి దరఖాస్తులు స్వీకరించగా నలుగురు దరఖాస్తులు ఇచ్చారు. పార్టీ పెద్దల ఆదేశాలతో నారాయణస్వామి, మల్లికార్జున రెడ్డి బరిలో నుంచి వైదొలిగారు. బుక్కరాయసముద్రం చెందిన లక్ష్మీనారాయణ, రేగడికొత్తూరు ఈశ్వరయ్య బరిలో నిలిచారు. సమావేశానికి హాజరైన 95 శాతం మంది కార్యకర్తలు, నాయకులు మండల కన్వీనర్‌గా లక్ష్మీనారాయణను ఎంపిక చేయాలని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటాడని పెద్దఎత్తున నినాదాలు చేసి, తమ అభిప్రాయాన్ని పార్టీ పెద్దలకు తెలిపారు.

ఎన్నికల పరిశీలకులు మల్లికార్జున మాట్లాడుతూ కార్యకర్తల అభిప్రాయాన్ని పార్టీ పెద్దలకు తెలిపి త్వరలోనే మండల కన్వీనర్ పేరు ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో తెదేపా నాయకులు రామలింగారెడ్డి, శ్రీరామిరెడ్డి, అశోక్, రవీంద్ర, పెద్దప్ప, కేశన్న, నారాయణస్వామి ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

‘గుర్తుతెలియని వ్యక్తులతో జాగ్రత్త’

లాడ్జీల యజమానులతో మాట్లాడుతున్న గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి

తాడిపత్రి, న్యూస్‌టుడే: లాడ్జీల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తాడిపత్రి గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి హెచ్చరించారు. తాడిపత్రిలోని పలు లాడ్జీల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లాడ్జీల్లో ఎలాంటి జూదం ఆడినా చర్యలు తప్పవన్నారు. అంతేకాకుండా లాడ్జీల్లోకి వచ్చే వారి వద్ద నుంచి తప్పకుండా గుర్తింపు కార్డు తీసుకోవాలని, అనుమానంగా కనపడితే తెలియజేయాలన్నారు.

బాధితులను పరామర్శించిన అధికారులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో తిలక్‌నగర్‌లో 11వార్డులో కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైనవారిని ఆదివారం ప్రజాఆరోగ్యం సాంకేతిక శాఖ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, ఈఈ ఆదినారాయణ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గీత, దీపిక, భరత్‌ను పరామర్శించారు. మున్సిపాలిటీ నీరు తాగడం వల్ల వాంతులు అయినట్లు చెప్పలేమని ఎస్ఈ అన్నారు. కమిషనర్ నాయిమ్ అహ్మద్, ఇంజినీర్లు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరానికి విశేష స్పందన

పామిడి, న్యూస్‌టుడే : పామిడి పట్టణ లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతపురం ప్రఖ్యాత్ దంత వైద్యశాల వైద్య నిపుణులు డాక్టర్ అభిషేక్, ఇందు రాధా, మోబీసామోయిన్ 120 మంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. విరూపాక్షి రెడ్డి ,పామిడి, గుత్తి లయన్స్ క్లబ్ సభ్యులు, లక్ష్మీ, ప్రఖ్యాత్ ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కుంటను తలపిస్తున్న రహదారి

నిత్యం వాహనాల రద్దీతో ఉన్న గార్లదిన్నెలో ప్రధాన రోడ్డుపై వర్షంనీరు నిల్వ ఉండటంతో కుంటను తలపిస్తోంది. ద్విచక్రవాహనదారులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నీరు నిల్వ ఉండటంతో తారురోడ్డు గుంతలు పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. ఈసమస్య ఈవోఆర్‌డీ దామోదరమ్మ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే తాత్కాలిక పనులు చేపట్టి శాశ్వత పనుల కోసం ఆర్అండ్‌బీ అధికారులకు నివేదిక పంపుతామన్నారు.

– న్యూస్‌టుడే గార్లదిన్నె

ఆదమరిస్తే అంతే

తాడిపత్రిలోని సుంకులమ్మపాళెం కూడలిలో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. యల్లనూరు రోడ్డు నుంచి పలు కాలనీలకు భారీగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎవరైనా ఆదమరించి మ్యాన్‌హోల్ వైపు వెళ్తే ప్రమాదం తప్పదు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై మున్సిపల్ ఏఈ నాగేంద్రను వివరణ కోరగా వెంటనే మ్యాన్‌హోల్‌ను సరిచేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే తాడిపత్రి

పాండురంగస్వామి గ్రామోత్సవం

పురవీధుల్లో ఊరేగుతున్న రుక్మిణీ సమేత పాండు రంగస్వామి

పామిడి, న్యూస్‌టుడే: ఆషాఢ మాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు తొలి ఏకాదశి సందర్భంగా ఆలయంలో ధ్వజారోహణం చేసి రుక్మిణీ సమేత పాండురంగ స్వామిని గరుడ వాహనంపై పురవీధుల్లో తీసుకెళ్లారు. రంగ సుభే భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో భగవాన్ దాసు ఆలయం నుంచి ఊరేగింపు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈకార్యక్రమంలో భావసార క్షత్రియ సమాజ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలవ్యాప్తంగా తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అశ్వర్థ ఆలయంలోని అశ్వర్థనారాయణ స్వామి, శ్రీచక్రభీమలింగేశ్వరస్వామి వారికి అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించారు.

సమస్యలు.. స్పందించని అధికారులు

తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు, ప్రజలు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: మెలిక పెట్టేది అధికారులే కానీ కార్యాలయాల చుట్టూ తిరిగేది ప్రజలు. గత వారం రోజుల నుంచి తహసీల్దార్ కార్యాలయం వద్ద వందల సంఖ్యలో ప్రతి రోజు ప్రజలు, రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కొందరు అధికారులు కావాలనే రైతుల భూములను సమస్యల్లోకి నెట్టుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. బ్రహ్మణపల్లికి చెందిన నలుగురు రైతుల భూములు ఆన్‌లైన్‌లో పేర్లను లాక్ వేసి పెట్టారు. కొన్ని నెలల నుంచి కార్యాలయానికి తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అలాగే మరో గ్రామంలో ఓ రైతు 5 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. దాన్ని కాస్త ఆర్మీ అధికారులకు పంపిణీ చేసే భూముల్లోకి నెట్టారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల నుంచి ప్రతి రోజు వందల సంఖ్యలో రైతులు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

కలగా.. జూనియర్ కళాశాల ఏర్పాటు

● హామీలన్నీ నీటి మూటలేనా?
● ఇంటర్ విద్యకు దూరమవుతున్న విద్యార్థులు

ఇటీవల ఉన్నత విద్య కోసం రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

యాడికి, న్యూస్‌టుడే : జిల్లాలో పెద్ద మండలంగా పేరున్న యాడికిలో సర్కారు జూనియర్ కళాశాల లేకపోవడంతో నిరుపేద విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యకు దూరమవుతున్నారు. చేనేత వృత్తిపై ఆధారపడిన కుటుంబాలతో పాటు పరిశ్రమల్లో అనేక మంది కార్మికులు మండలంలో నివసిస్తున్నారు. ఇటువంటి చోట కళాశాల లేనికారణంగా ఏటా అనేక మంది పదో తరగతికే చదువులు మానేసే పరిస్థితి కొనసాగుతోంది.

ఎటువెళ్లాలన్నా.. 30 కి.మీ.ల ప్రయాణం

● ఎటు వెళ్లాలన్నా 30 కిలో మీటర్లు దూరంలోని పట్టణాలకు వెళ్లాల్సి రావడం, ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఖర్చుతో కూడుకున్న పనితో విద్యార్థులను పంపలేక తల్లిదండ్రులు మధ్యలోనే చదువును మాన్పించేస్తున్నారు. గతంలో నాయకులు ఘనంగా ప్రకటించినా ఐదేళ్ల కాలంలో ఆ ఊసే ఎత్తలేదు. బడిబాటలో భాగంగా నాణ్యమైన విద్యను అందించే సర్కారు కళాశాలలు, బడుల్లో తమ పిల్లలను చేర్పించాలని ప్రభుత్వం తరచూ చెబుతోంది. కళాశాలే లేకుంటే ఎక్కడ చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

యాడికి మండలంలో ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలు ఎనిమిది, ప్రైవేట్‌వి ఏడు ఉన్నాయి. ఈసారి పదో తరగతి పరీక్షలకు 707 మంది విద్యార్థులు హాజరుకాగా, 547 మంది ఉత్తీర్ణులు కావడంతో 73 శాతం నమోదైంది. దీంతో 70 శాతం వరకు ఉన్నత విద్యకు చేరాలి. కళాశాల లేనందున తల్లిదండ్రులు పిల్లలను ఇతర ప్రాంతాలకు పంపలేకపోతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉన్నత విద్యకు వెళ్లాల్సిన విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇక్కడ జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

వారం సంతల ఆదాయం తగ్గుముఖం

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే : నగరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గత జూన్ నెల నుంచి పశువులు, గొర్రెలు, మేకలు వారం సంతల ఆదాయం తగ్గు ముఖం పట్టింది. తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి వ్యాపారులు సంతలకు రాకపోవడమే ఆదాయం తగ్గడానికి ప్రధాన కారణమని యార్డు అధికారులు పేర్కొంటున్నారు. ఈనెల 5, 6 తేదీల్లో నిర్వహించిన సంతల్లో మొత్తం రూ.2,87,530 ఆదాయం వచ్చింది. శనివారం గొర్రెలు, మేకల సంతలో రూ.1,77,830 ఆదాయం రాగా, ఆదివారం పశువుల సంతలో రూ.1,09,700 ఆదాయం వచ్చిందని యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలియజేశారు.

తన్మయం.. స్పర్శదర్శనం

అనంత సాంస్కృతికం: రాంనగర్ రుక్మిణీ సమేత పాండురంగ స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు మూలమూర్తుల పాదస్పర్శ దర్శనం చేసుకున్నారు. ఏటా ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున భక్తులను గర్భగుడిలోకి అనుమతించి దర్శన భాగ్యం కల్పించడం ఆనవాయితీ. భావసార క్షత్రియ సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతి రావు, ఆనందరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. భావసార క్షత్రియ మహిళామండలి రాష్ట్ర అధ్యక్షురాలు ప్రశాంతిబాయిపాల్గొన్నారు.

అలంకరణలో రుక్మిణీసమేత పాండురంగస్వామి

రూ.లక్షలు వెచ్చించినా.. నిర్మాణాలు నిరుపయోగం

ఆత్మకూరు మండలంలోని తలుపూరులో గ్రామ సచివాలయం, రైతుసేవా కేంద్రాన్ని లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించారు. పాఠశాల స్థలంలో నిర్మించారంటూ గతంలో కోర్టులో పిల్ వేయడంతో వాటిని ప్రారంభించేందుకు వీలుపడలేదు. రూ.45 లక్షలు ఖర్చు చేసి గత 5 సంవత్సరాల నుంచి వృథాగా ఉండటంతో నిర్మాణాలు దెబ్బతింటున్నాయి. ఇప్పటికే కిటికీలు, మెట్లు లాంటివి పలు చోట్ల పగిలిపోయాయి. అధికారులు స్పందించి సచివాలయం, రైతుసేవా కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువస్తే ఎంతో ఉపయోగం ఉంటుంది. - న్యూస్‌టుడే, ఆత్మకూరు

ప్లాస్టిక్ అంతానికి అనంత పరిరక్షక్!

● వాహనంతో పాటు వివిధ విభాగాలతో టాస్క్‌ఫోర్స్

అశోక్‌నగర్, న్యూస్‌టుడే: అనంతలో ప్లాస్టిక్ విక్రయం, వినియోగం ఏమాత్రం తగ్గడం లేదు. అధికార యంత్రాంగం అప్పుడప్పుడు దాడులు చేస్తున్నా ఫలితాలు ఇవ్వడం లేదు. అధికారులు దాడులు చేసినప్పుడు మాత్రమే ఆపేసి ఇతర పనుల్లో ఉండటాన్ని ఆసరాగా చేసుకొని మళ్లీ విక్రయాలు కొనసాగిస్తున్నారు. యంత్రాంగం దాడులు చేసి అపరాధ రుసుం విధిస్తున్నా పూర్తి స్థాయిలో కట్టడి చేయలేక పోతున్నారు.

● అనంతపురంలో ప్లాస్టిక్ రక్కసిని రూపుమాపడానికి కలెక్టరు నేతృత్వంలో ప్రత్యేక ఆలోచన తీసుకొచ్చారు. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్‌ను నివారించడానికి పలు అనుసంధాన శాఖలతో ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్సు కమిటీ ఏర్పాటు చేశారు.

సిద్ధం చేసిన అనంత పరిరక్షక్ వాహనం

ఏడు రోజులు.. ఏడు బృందాలు

మొత్తం ఏడు బృందాలు రోజు ఒక బృందం నగరంలో పర్యటించే విధంగా షెడ్యూల్ సిద్ధం చేస్తూ కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మంగళవారం నగరపాలక, బుధవారం కమర్షియల్ ట్యాక్స్, గురువారం ఎక్సైజ్‌తో పాటు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ శుక్రవారం ఆహార భద్రత తనిఖీ అధికారులు, శనివారం రెవెన్యూ విభాగం, ఆదివారం టూరిజం విభాగం అధికారులు నగరంలో పర్యటిస్తారు. ఆయా శాఖల అధికారులు ప్లాస్టిక్ నియంత్రణకు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం అపరాధ రుసుం విధించడంతో పాటు చర్యలకు ఉపక్రమించాల్సి ఉంటుంది. టాస్క్‌ఫోర్స్ బృందం షెడ్యూల్ ప్రకారం దాడులు నిర్వహిస్తే ప్రయోజనం ఉంటుందే గాని కేవలం ఉత్తర్వులు ఇచ్చి వదిలేస్తే పెద్దగా ప్రయోజనం ఉంటుందా అన్న ప్రశ్న తలెత్తుతోంది.

నిరంతరం కొనసాగిస్తాం

ఆయా శాఖల అధికారులు షెడ్యూల్ ప్రకారం దాడులు నిర్వహిస్తాం. ఈ ప్రక్రియ నిరంతరం ఉంటుంది. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్‌ను విక్రయించే వారిపై ప్లాస్టిక్ నియంత్రణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. - బాలస్వామి, నగర కమిషనరు

కాలువలో తీసిన మట్టిలో గుట్టలుగా పోగైన ప్లాస్టిక్ కవర్లు

దాడులు.. అపరాధ రుసుం

ఎన్‌క్యాప్ నిధులతో కొనుగోలు చేసిన వాహనాన్ని 'అనంత పరిరక్షక్' సిద్ధం చేశారు. అధికార యంత్రాంగం ప్లాస్టిక్ విక్రేతలపై దాడులు చేసి అపరాధ రుసుం విధిస్తారు. స్వాధీనం చేసుకున్న వాటిని వాహనంలో తరలిస్తారు. సాధారణంగా పోలీసులు ప్రజల పరిరక్షణ కోసం రక్షక్ వాహనం వినియోగిస్తే నగరపాలక ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌ను నివారించడానికి అనంత పరిరక్షక్ వాహనం వినియోగిస్తారు. వాహనం రాగానే ప్లాస్టిక్ విక్రేతల్లోనూ, వాటిని వినియోగించే వారిలో కూడా ఓ విధమైన భయం ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఇద్దరికి పదోన్నతులు

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ధర్మవరం, ఉరవకొండ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పనిచేసే ఇద్దరికి పదోన్నతులు దక్కాయి. ఈ మేరకు ఆదివారం మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రామాంజనేయులు (కడప) ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మవరం యార్డులో ఎల్‌డీసీగా పని చేస్తున్న మల్లికను రాప్తాడు సూపర్‌వైజర్‌గాను, ఉరవకొండలో గ్రేడర్‌గా పనిచేస్తున్న హాజీబాబాను పెనుకొండ సూపర్‌వైజర్‌గా పదోన్నతులు కల్పించారు.

కోలాహలంగా ఏకలవ్య జయంత్యుత్సవం

అనంత సాంస్కృతికం: నగరంలోని నవోదయ కాలనీలో ఆదివారం ఎరుకల కుల దైవం ఏకలవ్య మహరాజ్ జయంత్యుత్సవం సందడిగా జరిగింది. ఏపీ ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు సాకే రాజశేఖర్, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు సాకే రాధిక ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకల్లో ఏకలవ్య చిత్రపటానికి పూజలు చేసి కేక్ కోసి పంపిణీ చేశారు.

శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే కుటుంబం

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే : ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం తిరుమల, కాణిపాకం క్షేత్రాలను దర్శించుకున్నారు. తొలుత కాణిపాకంలో వినాయకున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తిరుమలలో కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి దర్శించుకున్నారు. పరిటాల శ్రీరామ్ కుమారుడు జూనియర్ పరిటాల శ్రీరామ్, కుమార్తె అమైరా రవీంద్రకు కేశఖండన చేయించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది వర్షాలు కురిసి బాగా పంటలు పండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు.

తిరుమలలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే పరిటాలసునీత, శ్రీరామ్

లైటు వెలిగింది

స్పందనకు వందనం

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరంలోని శారదానగర్ ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాల్ పక్క వీధిలో లైటు మరమ్మతు చేశారు. ఈ నెల 4 న మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో డీఈ దాక్షాయణి స్పందించారు. సిబ్బందిని పంపి లైటు వెలిగేలా చేశారు.

చరవాణిలో మాట్లాడుతూ ప్రయాణమా?

జాతీయ రహదారిపై పలువురు ఇష్టారాజ్యంగా వ్యవహరించే ధోరణులు మితిగా వాహన చోదకుల ఇబ్బందులు తెచ్చి పెడుతున్నాయి. నిబంధనల్ని అతిక్రమిస్తూ ప్రమాదకర పరిస్థితులను కొని తెచ్చుకుంటున్నారు. అనంతపురం నుంచి గుత్తి వెళ్తున్న దారిలో వాహనంపై వేగంగా వెళ్తూ కూడా చరవాణిలో మాట్లాడుతూ వెళ్లడం కనిపించింది. ఇలాంటి వారిపై ఏమాత్రం పర్యవేక్షణ లేకపోతే పెను ప్రమాదం సంభవించే ఆస్కారముంది.

- ఈనాడు, అనంతపురం.

శాంతినగర్ 4వరోడ్డులో పీర్లు

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మాసుమా బీబీ మకాన్ పీర్లు

ఊరేగింపులో పాపాస మకాన్ పీర్లు

జలధికి తరలిన పెద్దపీర్లు

అనంత సాంస్కృతికం: మొహర్రం పురస్కరించుకుని నగరంలోని పలు ప్రాంతాల్లో పీర్లు ఆదివారం జలధికి తరలాయి. ముఖ్యంగా పాతూరులోని పాపాస, ముచ్చల, బందేవాన్ సాహెబ్ మకాన్, మాసుమా బీబీ మకాను, శాంతినగర్‌లోని 4వ క్రాస్ రోడ్డులోని అస్సానే అలి బర్గ మకాన్ పీర్లు జలధిలో పాల్గొన్నాయి. పలు రకాల పుష్పాలు, ఖరీదైన నగలతో అలంకరించారు. పీర్లను అగ్నిగుండాలు చుట్టూ ప్రదక్షిణలు చేయించి వీధుల్లో ఊరేగించారు. హిందూ ముస్లింలు చక్కెర చదివింపులు చేసుకున్నారు.

పెద్ద సరిగెత్తు కార్యక్రమంలో ముచ్చల మకాన్ పీర్లు

బందేవాన్ పీర్లు

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు

అనంత సాంస్కృతికం: ఆషాఢ శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం నగరంలోని పలు దేవాలయాల్లో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. స్థానిక అశోక్‌నగర్‌లోని సత్యదేవాలయం, హౌసింగ్‌బోర్డు, తపోవనం, రాంనగర్‌లోని వేంకటేశ్వరాలయాలు, శిర్డీ సాయిబాబా ఆలయాలతో పాటు తదితర చోట్ల ఈ వ్రతాలు జరిగాయి.

సత్యదేవుని సన్నిధిలో వ్రతంలో భక్తులు

వైభవంగా తొలి ఏకాదశి

అనంత సాంస్కృతికం: తొలి ఏకాదశి (శయనైకాదశి)ని పురస్కరించుకొని ఆదివారం నగరంలోని పలు వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాంనగర్, హౌసింగ్‌బోర్డు, ఆర్ఎఫ్ రోడ్డులలోని వేంకటేశ్వరాలయాలు, పాండురంగస్వామి దేవాలయం, ఇతర ఆలయాల్లో అభిషేకాది కార్యక్రమాలు జరిగాయి.

రాంనగర్ వేంకటేశ్వరుడు

పంపనూరులో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు పండగ జరుపుకొన్నారు. మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది వర్షాలు విరివిగా కురిసి పంటలు బాగా పండాలని అర్చకులు పూజలు చేశారు. మలహోబుల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తులు ఆవు నెయ్యితో దీపారాధన, పసుపు రంగు పువ్వులు, తులసీ దళాలతో పూజించుకున్నారు.

మూలమూర్తులకు ప్రత్యేక అలంకరణ

అధిక వడ్డీల నుంచి కాపాడండి

అనంతపురం (కమలానగర్): పేద ప్రజలను అధిక వడ్డీల పేరుతో వేధిస్తున్న వడ్డీ వ్యాపారుల నుంచి ప్రజలను కాపాడాలని అధిక వడ్డీల వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో అధిక వడ్డీల వ్యతిరేక పోరాట కమిటీని ఎంపిక చేశారు. కమిటీ అధ్యక్షుడిగా సాకే హరి, ఉపాధ్యక్షుడు దాసగాని కుళ్లాయప్ప, ప్రధాన కార్యదర్శి సింగం సదాశివరెడ్డి, కార్యదర్శి కేఎం బాషా, సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి మనోహర్‌రెడ్డిని ఎంపిక చేశారు. అధిక వడ్డీలతో ఇబ్బందులు పడుతున్న బాధితుల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. సభ్యులు మహమ్మద్, రామరాజు, రఫీక్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నూతనంగా ఎంపికైన అధిక వడ్డీల వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు

కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త సమ్మె

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: భాజపా ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి వెల్లడించారు. నగరంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సమ్మెకు సంబంధించిన ప్రచార కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. రాజారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెను చేపట్టాయన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, నాయకులు రాజు, కృష్ణానాయక్, అక్బర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్ : 9440247485
తపోవనం: 8008573010
రుద్రంపేట: 8008550310

సమస్య: జీసస్‌నగర్ రేణుకా యల్లమ్మ ఆలయం సమీపంలో ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు పెరిగి అసౌకర్యంగా ఉంది. - శేషప్ప

సమాధానం: పిచ్చి మొక్కల్ని తొలగిస్తాం.

సమస్య: కళ్యాణదుర్గం బైపాస్ నుంచి లక్ష్మీనగర్ వైపు వెళ్లే వంతెన వద్ద చికెన్ వ్యర్థాలు పడేయడంతో దుర్వాసన వస్తోంది. - చంద్రశేఖర్

సమాధానం: వ్యర్థాలు తొలగించి అక్కడ వేయకుండా తగు చర్యలు తీసుకుంటాం.

(పై ప్రశ్నలకు నగరపాలక ప్రజారోగ్య అధికారి రంగస్వామి సమాధానాలు ఇచ్చారు) - న్యూస్‌టుడే, అశోక్‌నగర్

తెదేపా మండల కన్వీనర్ పదవికి పోటాపోటీ

బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం తెదేపా మండల కన్వీనర్‌గా మాజీ సర్పంచి లక్ష్మీనారాయణకు అవకాశం ఇవ్వాలని 95 శాతం మంది కార్యకర్తలు, నినాదాలు చేస్తూ మద్దతు ప్రకటించారు. ఆదివారం దేవరకొండ వద్ద మండల కన్వీనర్ ఎంపిక చేయడానికి పార్టీ పెద్దలు మల్లికార్జున ద్విసభ్య కమిటీ సభ్యులు నరసానాయుడు, కేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు సమావేశమయ్యారు. ఎన్నికల పరిశీలకులు మల్లికార్జున మండల కన్వీనర్‌గా ఎన్నిక కావడానికి దరఖాస్తులు స్వీకరించగా నలుగురు దరఖాస్తులు ఇచ్చారు. పార్టీ పెద్దల ఆదేశాలతో నారాయణస్వామి, మల్లికార్జున రెడ్డి బరిలో నుంచి వైదొలిగారు. బుక్కరాయసముద్రం చెందిన లక్ష్మీనారాయణ, రేగడికొత్తూరు ఈశ్వరయ్య బరిలో నిలిచారు. సమావేశానికి హాజరైన 95 శాతం మంది కార్యకర్తలు, నాయకులు మండల కన్వీనర్‌గా లక్ష్మీనారాయణను ఎంపిక చేయాలని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటాడని పెద్ద ఎత్తున నినాదాలు చేసి, తమ అభిప్రాయాన్ని పార్టీ పెద్దలకు తెలిపారు. ఎన్నికల పరిశీలకులు మల్లికార్జున మాట్లాడుతూ కార్యకర్తల అభిప్రాయాన్ని పార్టీ పెద్దలకు తెలిపి త్వరలోనే మండల కన్వీనర్ పేరు ప్రకటిస్తామని హామీ ఇచ్చారు.

బిందెలపై మోగిన అందెలు

శిల్పారామంలో ఆదివారం రాత్రి జరిగిన సాంస్కృతిక సంబరాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాలు ఔరా అనిపించాయి. బాలికలు చేసిన శాస్త్రీయ నృత్యాలు అబ్బుర పరిచాయి. బిందెలపై చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు. - న్యూస్‌టుడే, తపోవనం (అనంత గ్రామీణం)

వారి నిర్లక్ష్యం.. వాహనదారులకు కష్టం

నగరంలోని రామచంద్రనగర్‌లో ఓ హోటల్ నిర్వాహకుల నిర్లక్ష్యానికి రోడ్డుపై నీరు నిలిచాయి. నీటిపై చెత్త చెదారం పడి మురుగు నీటిని తలపిస్తున్నాయి. అటుగా వెళుతున్న వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హోటల్ నిర్వాహకులు తమ సామగ్రిని శుభ్రం చేసి రోడ్డుపైకి నీరు వదలడం వల్ల ఈ సమస్య తలెత్తింది. నగర పాలిక అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు. - న్యూస్‌టుడే, కమలానగర్

నిత్యావసర వస్తువుల లారీ ఎదుట నిర్వాహకులు

శిర్డీలో 4 రోజులు అనంతవాసుల అన్నదానం

అనంత సాంస్కృతికం: గురుపౌర్ణమి పురస్కరించుకుని సాయినాథుడి దర్శనానికి శిర్డీకి వెళ్లే భక్తులకు నాలుగు రోజులపాటు అన్నదానం చేసేందుకు అనంతపురానికి చెందిన 500 మంది బాబా సేవకులు ఆదివారం బయలుదేరి వెళ్లారు. ఉమానగర్ శిర్డీ సాయి అన్నదాన సేవా సంఘం ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమం 2013 నుంచి ఏటా గురుపౌర్ణమి శిర్డీలో జరుపుతున్నట్లు వారు తెలిపారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురంలో నీట్ ర్యాంకర్ అభినవ్‌ను జిల్లా గాండ్ల సంఘ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ధర్మవరం అబ్కారీ సీఐ చంద్రమణి మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షలో అభినవ్ 231 ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు అభినవ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. గాండ్ల సంఘ నాయకులు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన ప్రభాకర్, సుజాత దంపతుల కుమారుడైన అభినవ్ జాతీయ స్థాయిలో రాణించడం గొప్ప విషయమన్నారు. మారుమూల ప్రాంతంలో జన్మించినప్పటికీ విద్యలో రాణించి ఉన్నతమైన ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు.

పెంపుడు శునకాల సందడి..

నగరంలో పలు పశు వైద్య శాలల్లో కుక్కలకు వ్యాక్సినేషన్ చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల పెంపుడు శునకాలు, పిల్లులు సందడి చేశాయి. - ఈనాడు, అనంతపురం.

పెయింటర్ అనుమానాస్పద మృతి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని అరవిందనగర్‌లోని స్థానిక వార్డు సచివాలయం వద్ద చంద్రశేఖర్ (43) ఆదివారం మృతి చెందారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. మృతుడు నగరంలోని మారుతీనగర్‌లో నివాసముంటూ పెయింటర్‌గా జీవనం సాగించేవారు. మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని ఐదేళ్ల క్రితం భార్య పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్లింది. చంద్రశేఖర్ మద్యం తాగి ఇంటికి వెళ్లకుండా రోడ్డుపై నిద్రించేవాడు. ఆదివారం ఉదయం అచేతనంగా పడి ఉన్న అతన్ని చూసి వాకింగ్‌కు వచ్చిన కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుని భార్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇతనికి భార్య శాంతాబాయి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నివాళి అర్పిస్తున్న మేయర్ వసీం, ఉపమేయర్ వాసంతి, కార్పొరేటర్లు

జగ్జీవన్‌రామ్ కృషి ఎనలేనిది

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: అణగారిన వర్గాల అభివృద్ధి కోసం బాబూ జగ్జీవన్ రామ్ చేసిన కృషి ఎనలేనిదని మేయర్ వసీం, ఉపమేయర్ వాసంతి కొనియాడారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా నగరపాలక సమీపంలో ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్పొరేటర్లు శ్రీనివాసులు, కమల్ భూషణ్, ఇషాక్, నరసింహులు, రహంతుల్లా పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలు భరించలేక ఆత్మహత్య

రాప్తాడు, న్యూస్‌టుడే: అనంతపురం టౌన్ హమాలి కాలనీకి చెందిన విజయ్‌శేఖర్‌రెడ్డి ఆరోగ్య సమస్యలు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ప్రసన్నాయపల్లి పంచాయతీలో ఆదివారం చోటు చేసుకుంది. భార్య మీనా పోలీసులకు తెలిపిన వివరాల మేరకు.. భర్త విజయ్‌శేఖర్‌రెడ్డి 2015 సంవత్సరంలో మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి తలకు, వెన్నెముకకు దెబ్బలు తగలడంతో బెంగళూరులో చూపించారు. ఈ సమస్యలు తట్టుకోలేక 2018, 2019లో రెండుసార్లు పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబీకులు చికిత్స చేయించి బతికించుకున్నారు. ఈ నెల 4న తల్లిదండ్రులు ఇంటి వద్దకు వెళ్లి వస్తానని ఎలక్ట్రికల్ ఆటో తీసుకొని వెళ్లి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో బంధువులు అందరూ వెతికినా కనపడలేదు. 6న ఉదయం తమకు వరసకు మామ అయిన రామకృష్టారెడ్డి ఫోన్ చేసి ప్రసన్నాయపల్లి గ్రామపంచాయతీ సమీపాన ఆటోలో వెనక వైపు విగతజీవిగా పడి ఉన్నట్లు తెలిపారు. మృతదేహం వద్ద మద్యం బాటిళ్లు, విషగుళికలు కనిపించాయి. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు.

గూడే మాకు పొదరిల్లు

పిచ్చుకలు గూడు అల్లడంలో నేర్పరులు.. బయట నుంచి లోపలకు శత్రువులు రాకుండా ఉండేందుకు రెండు ద్వారాలను ఏర్పాటు చేసుకుంటాయి. లోపల ఉన్న గుడ్లు లేదా పిల్లలకు పూర్తి రక్షణగా గూడుని అల్లేస్తున్నాయి. వర్షం పడినా చుక్క నీరు లోపలికి రాదు. ఇలా విభిన్న ఆకృతులతో పిచ్చుకలు అల్లుకున్న గూళ్ల ఆత్మకూరు పక్కన చెరువు పరిసరాల్లో కనిపించాయి.

- న్యూస్‌టుడే, ఆత్మకూరు

వంతెనకు ఏకలవ్య పేరు పెట్టాలి

కమలానగర్, న్యూస్‌టుడే : నగరంలో నిర్మించిన వంతెనకు ఏకలవ్య పేరు పెట్టాలని ఎరుకుల సంఘం నాయకులు పేర్కొన్నారు. ఏకలవ్య జయంతి సందర్భంగా 28వ డివిజన్ అశోక్‌నగర్‌లో ఆయన చిత్రపటానికి ఎరుకుల సంఘం నాయకులు వెంకటరామయ్య, రామాంజనేయులు, మనోహర ఆధ్వర్యంలో నివాళులర్పించారు. నాయకులు చిరంజీవి, గోవిందు, శ్రీరాములు, వీర పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగర శివారులోని టీవీ టవర్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ఓ మహిళను ఎక్సైజ్ విజిలెన్స్ విభాగం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఆమె నుంచి 430 గ్రాముల బరువున్న 87 పొట్లాల పొడి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆమె గంజాయి వ్యాపారుల నుంచి రహస్యంగా కొనుగోలు చేసి, వాటిని ఐదు గ్రాములుగా విభజించి పొట్లాలు కట్టి ఇంట్లోనే విక్రయిస్తోంది. ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపి సరఫరా చేసేది. ఆమెపై నిఘా ఉంచి విజిలెన్స్ అధికారులు సినీఫక్కీలో దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసి అనంతపురంలోని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఆమెపై కేసు నమోదు చేశారు. దాడుల్లో అధికారులు అన్నపూర్ణ, హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ విజిలెన్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

నకిలీ విద్యార్థి సంఘాలపై ఫిర్యాదు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: నకిలీ విద్యార్థి సంఘాలు వేధిస్తున్నాయని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాల యాజమాన్య సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రతి రోజూ ఏదో ఒక సంఘం ప్రైవేటు పాఠశాలల వద్దకు వెళ్లి ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు.

(c) eenadu

దారి బాగు... కాటేసే కాళనాగు

● సూచికల్లేక... ప్రమాదమెరుగక ● ఏడాదిలో 33 మంది మృత్యువాత

42వ నంబరు జాతీయ రహదారి

● అనంతపురం నుంచి మదనపల్లె మీదుగా చిత్తూరుకు వెళ్లే జాతీయ రహదారి మృత్యుమార్గంగా మారింది. ఆరు నెలల కాలంలో మదనపల్లె నుంచి ములకలచెరువు వరకు ఉన్న జాతీయ రహదారి-42లో 48 కిలోమీటర్ల పరిధిలో 33 ప్రమాదాలు జరగ్గా ఇందులో 33 మంది మృత్యువాత పడ్డారు. 85 మంది క్షతగాత్రులయ్యారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించకపోవడం, రహదారిపై సరైన సూచికలు, వేగ నిరోధకాలు లేకపోవడమే ప్రమాదాలకు కారణంగా నిలుస్తోంది. సురక్షిత ప్రయాణానికి అనువుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, మదనపల్లె నేరవార్తలు, బి.కొత్తకోట, ములకలచెరువు

ములకల చెరువు

■ మార్గం : బి.కొత్తకోట మండలం తుమ్మనగుంట నుంచి ములకలచెరువు వరకు
■ కిలోమీటర్లు : 22, ■ ప్రమాదాలు: 12
■ మృతులు : 16 మంది
■ క్షతగాత్రుల సంఖ్య : 21

వేగం మరణ శాసనం

బి.కొత్తకోట మండలం తుమ్మనగుంట నుంచి ములకలచెరువు వరకు ఉన్న రహదారి నాలుగు వరుసలుగా విస్తరణ జరుగుతోంది. రహదారి పక్కన ఎలాంటి సూచికలు లేకపోవడంతో వాహన చోదకులు మృత్యువాత పడుతున్నారు. చక్కటి మార్గంపై అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనం అతివేగంగా నడపడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని మినీ లారీ ఢీకొట్టడంతో దంపతులతో పాటు వారి ఇద్దరు పిల్లలు మృతి చెందారు. **పరిష్కారం :** రోడ్డు విస్తరణ పనులతో వాహనదారులు వేగంగా వెళ్తున్నారు. సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలి.

శిరస్త్రాణాలు లేక మృత్యు కేక

కురబలకోట మండలంలోని జాతీయ రహదారిపై ఇంజినీరింగ్ విద్యార్థులు ఆధునిక వాహనాలపై అతివేగంగా ప్రయాణిస్తున్నారు. శిరస్త్రాణం ధరించకపోవడం వల్ల మృత్యువాతపడుతున్నారు. ఇటీవల అంగళ్లులో ఒకే ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు విద్యార్థులు ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. విద్యార్థులు కిందపడగానే వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ విద్యార్థిపై దూసుకెళ్లడంతో అక్కడికక్కడే అతను మృత్యువాత పడ్డాడు. **పరిష్కారం :** ఇంజినీరింగ్ కళాశాలలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో వాహన చోదకులు శిరస్త్రాణం ధరించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలి. ట్రిబుల్ రైడింగ్ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి.

కురబల కోట

■ కురబలకోట మండలంలోని కంటేవారిపల్లె నుంచి బి.కొత్తకోట మండలం తుమ్మనగుంట వరకు
■ : 09, ■ : 11
■ : ఆరుగురు, ■ : 20

ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాలివే...

మదనపల్లె నుంచి ములకలచెరువు వరకు జాతీయ రహదారి 42 వెళ్తుంది. ఇందులో మదనపల్లె ఒకటో పట్టణ స్టేషన్ పరిధిలో అన్నమయ్య కూడలి, అమ్మచెరువు మిట్ట, మదనపల్లె రూరల్ స్టేషన్ పరిధిలో వై-జంక్షన్, కొండామారిపల్లె క్రాస్, మొలకలదిన్నె క్రాస్, కురబలకోట మండల పరిధిలో అమ్మచెరువుమిట్ట డౌన్, దొమ్మన్నబావి, బి.కొత్తకోట మండలంలో కనికలతోపు, కొత్తపల్లె క్రాస్, ములకలచెరువు మండలంలో వేపూరికోట క్రాస్‌లను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సోమశేఖర్ కుటుంబం (పాత చిత్రం)

దారి తెలియక... ప్రయాణం తికమక

మదనపల్లె నుంచి అంగళ్లు వరకు ఉన్న జాతీయ రహదారిపై లింకురోడ్లు ఎక్కువగా ఉన్నాయి. వై-జంక్షన్, రాయల్ వుడ్, అన్నమయ్య కూడలి, అమ్మచెరువు మిట్ట, విశ్వం కళాశాల మలుపులో రహదారులు ఎక్కువగా ఉండటంతో వాహన చోదకులు తికమక పడుతున్నారు. ఇటీవల రాయల్‌వుడ్ వద్ద రెండు కార్లు, ఓ ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురయ్యాయి. ఇందులో ముగ్గురు మృతి చెందగా 8 మంది గాయపడ్డారు. **పరిష్కారం :** సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు గజిబిజిగా ఉన్న రహదారుల వద్ద పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయి.

■ మదనపల్లె నుంచి కురబల కోట మండలం కంటేవారిపల్లె
■ : 17
■ : 11
■ : 11 మంది
■ : 44

మదన పల్లె

నిత్యం ప్రమాదాలకు నిలయమైన మదనపల్లె బైపాస్ రోడ్డులోని ప్రాంతం ఇదే

నివారణ చర్యలు తీసుకుంటున్నాం

తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాలతో బ్లాక్ స్పాట్లను గుర్తించి ఆ ప్రాంతంలో సూచిక బోర్డులు, వేగ నిరోధకాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వేశాం. జాతీయ రహదారిపై ఎక్కువగా ద్విచక్ర వాహన ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక తనిఖీలు చేస్తున్నాం. శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడిపే వారికి జరిమానాలు విధిస్తున్నాం. ప్రజలు కూడా వేగాన్ని అదుపులో ఉంచుకుని వాహనాలు నడపాలి. - **మహేంద్ర, డీఎస్పీ, మదనపల్లె**

పుట్టేవన్నీ పెయ్యలే.. ఇచ్చేవన్నీ పాలే!

● రూ.150కే మేలు జాతి వీర్యం
● 28,500 ఇంజెక్షన్లు వేయడమే లక్ష్యం

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: పాడి రైతుల ఆర్థికాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పాల దిగుబడి కూడా పెంచాల్సిన అవసరం ఉంది. ఇందుకు కూటమి ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసి కీలక నిర్ణయం తీసుకుంది. మేలుజాతి పశు సంతతిని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రత్యేక ప్రణాళిక చేపట్టింది. మేలు జాతి పెయ్య దూడలు జన్మించే విధంగా పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సాధారణంగా 50 శాతం ఆడ, 50 శాతం మగ దూడలు జన్మిస్తాయి. కానీ మేలు జాతి వీర్యాన్ని వినియోగించడం వల్ల 90 శాతం పెయ్య దూడలు జన్మించే అవకాశం ఉంది. జిల్లాలో సుమారు 80 వేల చూడి పాడి పశువులున్నట్లు అధికారులు తెలిపారు. ఆయా పశువులకు పరీక్షలు నిర్వహించి, వీర్యాన్ని ఎక్కిస్తున్నారు. పశువైద్య సిబ్బంది క్షేత్ర స్థాయికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 28,500 ఇంజెక్షన్లు వేయాలన్నదే లక్ష్యం.

● **స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యంతో ముందుకు:** స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యంతో ప్రభుత్వం ఆడ పెయ్య దూడల సంతతిని పెంచే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. అందుకు అనుగుణంగా పాల ఉత్పత్తిని పెంచాలని భావిస్తోంది. ఇందులో భాగంగా నూతన సాంకేతికతతో పెయ్య దూడలు జన్మించేలా వీర్యాన్ని అందించే ప్రయత్నం చేస్తోంది. ఏటా 15 శాతం పాల దిగుబడిని పెంచాలని పశు సంవర్ధకశాఖ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి అన్ని పశువైద్య కేంద్రాల్లో మేలు జాతి వీర్యాన్ని ఉంచి, పశువులకు వేయడానికి సిద్ధం చేసినట్లు జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్ పిళ్లై తెలిపారు. మండలాల్లో చూడి పశువుల సంఖ్య ఆధారంగా వీర్యాన్ని అందజేస్తున్నామని చెప్పారు. గతంలో మేలు జాతి వీర్యాన్ని రూ.500లకు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం మేలు జాతి పెయ్యల వృద్ధి సంఖ్యను పెంచాలనే ఉద్దేశంతో రూ.150కే వీర్యాన్ని అందిస్తోంది. ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ధర తగ్గించడం వల్ల ఎక్కువ మంది పాడి రైతులు ఇంజెక్షన్ కోసం ముందుకు వచ్చే అవకాశం ఉంది.

●**సద్వినియోగం చేసుకోవాలి :** జిల్లాలోని పాడి రైతులు మేలు జాతి వీర్యాన్ని చూడి పశువులకు వేయించాలి. పాడి రైతులు అవకాశాన్ని సద్వియోగం చేసుకుంటే మేలు జాతి ఆడ దూడలను పొందవచ్చు. పశు వైద్య కేంద్రాలు, ఆర్‌ఎస్‌కేలలో వీర్యాన్ని అందుబాటులో ఉంచాం. దీనిపై క్షేత్రస్థాయిలో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మేలు జాతి పెయ్య దూడలు జన్మిస్తే, భవిష్యత్తులో పాల దిగుబడి పెరుగుతోంది.
- **గుణశేఖర్ పిళ్లై, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, అన్నమయ్య జిల్లా**

తొలి ఏకాదశి... ఆలయాలు కిటకిట

తొలి ఏకాదశి పండగను పురస్కరించుకుని జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఒంటిమిట్ట కోదండ రామాలయంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం వేదపండితుల మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తొలుత గర్భాలయంలో కొలువైన సీతారామ లక్ష్మణ మూర్తులను పట్టువస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. సహస్రనామార్చన, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. రాములోరి సన్నిధిలో 108 బంగారు పుష్పాలతో స్వర్ణ పుష్పార్చన కైంకర్యం చేశారు. జగదభిరాముడి దర్శనం రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో కోలాహలం నెలకొంది. ఇష్టదైవం శ్రీరామచంద్రమూర్తిని దర్శించిన సందర్శకులు ఆధ్యాత్మిక దివ్యానుభూతి పొందారు. - **న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**

పట్టాలు నకిలీ... రెవెన్యూకు మకిలీ

● బద్వేలులో ఆగని అక్రమాల ఉదంతం
● అయోమయంలో అసలు లబ్ధిదారులు

- న్యూస్‌టుడే, బద్వేలు, కలసపాడు

బద్వేలు నకిలీ పట్టాల తయారీలకు అడ్డాగా మారింది. నియంత్రించాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రేక్షక పాత్రలో ఉండిపోవడంతో నకిలీ పట్టాలు కుప్పలుతెప్పలుగా పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వ ఖాళీ స్థలాలు, అసలు పట్టాలకు దీటుగా నకిలీ పట్టాలు తయారవుతున్నాయి. వీటిని ఓ ముఠా కొన్నేళ్లుగా విక్రయిస్తోంది. గతంలో ఈ వ్యవహారంలో చిక్కి కటకటాల పాలైనవారు బెయిలుపై వచ్చి మళ్లీ ఈ దందా కొనసాగిస్తున్నారు. కొందరు రెవెన్యూ సిబ్బంది, అధికారులు నకిలీ పట్టాల తయారీ ముఠాతో లాలూచీ పడటంతో ఈ వ్యవహారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా వర్ధిల్లుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2022లో అప్పటి ఆర్డీవో ఆకుల వెంకట రమణ నకిలీ పట్టాలకు సంబంధించి 17 మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో పది మంది బడా నాయకుల పేర్లు తొలగించారు. వీరి విషయం బయటపడుతుందనే ఉద్దేశంతో కేసు పూర్తి విచారణ సాగకుండా వైకాపా రాజకీయ పెద్దలు అడ్డుపడ్డారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ కేసును బయటకు రానీయకుండా తొక్కిపెట్టారన్న ఆరోపణలున్నాయి.

● **పంచాయతీల పేరిట ముఠాల దందా :** బద్వేలు, గోపవరం మండలాల్లో పెద్ద ఎత్తున నకిలీ పట్టాలను తయారు చేసి విక్రయించినట్లు సమాచారం. ఎన్‌జీవో కాలనీలో ప్రభుత్వ అవసరాలకు తీసిపెట్టిన ఖాళీ స్థలాలు, ప్లాట్లు, ఓ స్కూల్ పరిసర ప్రాంతాల్లోని స్థలాలకు నకిలీ అనుబంధ పత్రాలు తయారు చేసినట్లు సమాచారం.

బద్వేలులోని ఎన్‌జీవో ప్లాట్లలో వెలసిన షెడ్లు

● కలసపాడు మండలంలో పనిచేస్తున్న ఓ వీఆర్వో, బద్వేలుకు చెందిన మరో ముగ్గురు నకిలీ పట్టాల తయారీలో సిద్ధహస్తులు. గతంలో ఈ వ్యవహారానికి సంబంధించి వీరు జైలుకు వెళ్లి వచ్చారు. బయటకు వచ్చి మళ్లీ నకిలీ పట్టాల తయారీకి తెరలేపారు. అసలు పట్టాదారులు, నకిలీ పట్టాలు కొనుగోలు చేసినవారు ఇంటి స్థలాలు తమవంటే తమవంటూ నిత్యం పోలీసు స్టేషన్‌కు వస్తున్నారు. ఇందుకు సంబంధించిన విషయమై ఘర్షణపడిన ఘటనలు లేకపోలేదు. అసలు పట్టాదారులను ఇంటి పనుల నిర్మాణం చేయనీకుండా నకిలీ పట్టాదారులు అడ్డుపడటం, దౌర్జన్యం చేసి పగలగొట్టి బెదిరింపు చర్యలకు దిగడం, ఆ తర్వాత సెటిల్‌మెంట్‌కు వచ్చి రూ.లక్షలు చేతులు మారడం జరుగుతోంది. ఇలాంటి వ్యవహారాలను కొన్ని ముఠాలు ముందుండి నడిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు నకిలీ పట్టాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటే తప్ప దీనికి అడ్డుకట్ట పడేది ఉండదు.

తలపై గండం... తలపుల్లో పాఠం

ఒంటిమిట్ట మండలంలోని నర్వకాటిపల్లె అరుందతీ కాలనీ (రైల్వేకాలనీ) ప్రాథమిక పాఠశాల నిర్వహణకు రెండు తరగతి గదులున్నాయి. ప్రస్తుతం 1-5వ తరగతి వరకు 39 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 1989 ఫిబ్రవరి 5న ప్రారంభించిన భవనం వరండా పైకప్పు పూర్తిగా దెబ్బతింది. సిమెంటు పెచ్చులు రాలిపోయి ఇనుప చువ్వలు బయటపడటంతో ప్రమాదకరంగా మారింది. వర్షం కురిస్తే ధారలా కారుతోంది. గోడల నిండా తేమ ఉంటుంది. ఇక్కడ చదువుకోవాలంటే భావి పౌరులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏలుబడిలో కూలి'పోతేపోనీ' మాకేంటి అనే ధోరణిలో జిల్లా యంత్రాంగం ఉండటంతో బడి బాగుపడలేదు. కూటమి ప్రభుత్వమైనా చొరవ తీసుకొని దెబ్బతిన్న తరగతిని బాగు చేయించాలని విద్యార్థులు విన్నవిస్తున్నారు.
- **న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**

గదుల్లేక వరండాలోనే పాఠాలు

అదిగో గండం: ఒంటిమిట్ట మండలం నర్వకాటిపల్లె అరుందతీ కాలనీలో దెబ్బతిన్న పైకప్పును చూపుతున్న విద్యార్థులు

హంస వాహనం... సౌమ్యనాథుడి రాజసం

హంస వాహనంపై సరస్వతి అలంకారంలో సౌమ్యనాథస్వామి

నందలూరు, న్యూస్‌టుడే: నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సౌమ్యనాథస్వామి హంసవాహనంపై సరస్వతీదేవి అలంకారంలో కొలువుదీరి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం తిరుమంజనం, పల్లకీ సేవ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు సునీల్ కుమార్, పండితులు రఘునందన్, పవన్ కుమార్, మనోజ్ కుమార్‌ల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం పాల్గొన్నారు. ఉదయం స్వామి వారిని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ దర్శించుకున్నారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం పల్లకీసేవ గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రికి సింహ వాహనంపై స్వామి వారు కొలువు దీరుతారని ఆలయ అధికారులు తెలిపారు.

టమాట... ధర దోబూచులాట

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం కిలో టమాట అత్యల్పంగా రూ.20 నుంచి నాణ్యమైన టమాట అత్యధికంగా రూ.36 వరకు పలికింది. గత నాలుగు రోజుల కిందట కిలో రూ.43 వరకు పలికిన ధరల మూడు రోజులుగా తగ్గుముఖం పడుతున్నాయి. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా పంట దిగుబడిలో నాణ్యత తగ్గడంతోనే ధరల్లో కూడా స్వల్పంగా మార్పు వచ్చిందని అధికారులు చెబుతున్నారు. మార్కెట్‌కు మదనపల్లె, పుంగనూరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల నుంచి రైతులు 1,192 టన్నులు తీసుకొచ్చారు. ఈ మేరకు మొదటి రకం టమాట కిలో రూ.30 నుంచి రూ.36 వరకు, రెండో రకం టమాట కిలో రూ.20 నుంచి రూ.29 వరకు పలికాయి. సగటున కిలో రూ.26 నుంచి రూ.34తో వ్యాపారులు రైతుల నుంచి కొనుగోలు చేశారని మార్కెట్‌యార్డు కార్యదర్శి జగదీష్ పేర్కొన్నారు.

జిల్లా సమీక్షా కమిటీ సమావేశం రేపు

ఈనాడు, కడప: జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్సీ) సమావేశం కడపలో మంగళవారం జరగనుంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత అధ్యక్షతన జరిగే సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల సమక్షంలో జరిగే ఈ సమావేశంలో జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మంత్రి సమీక్షించి దిశానిర్దేశం చేయనున్నారు.

మొహర్రం... పీర్ల జలధివాసం

చిన్నమండెం, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా కులమతాలకతీతంగా మొహర్రం భక్తి శ్రద్ధలతో జరుపుకొంటున్నారు. చిన్నమండెంలో గంధం పీరుకు భాషికం సమర్పించే కార్యక్రమం ఆద్యంతం భక్తిశ్రద్ధలతో సాగింది. శనివారం అర్ధరాత్రి బెంగళూరుకు చెందిన ఓ భక్తుడు దర్గాలో పూజలు చేసి భాషికాన్ని ఊరేగింపుగా తీసుకుని బయలుదేరారు. ఈ సందర్భంగా స్టేట్‌బ్యాంకు, బ్రాహ్మణ వీధి, కోటవీధి, కువైట్ మసీదు, మెయిన్‌బజారు మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున పెద్ద మకానుకు చేర్చగా కమిటీ సభ్యులు భాషికాన్ని గంధం పీరుకు అలంకరించారు. అనంతరం చిన్నమండెంలోని ప్రధాన వీధుల్లో గంధం పీరును ఊరేగించారు. ఉమ్మడి కడప జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సాయంత్రం పీర్లు జలధికి వెళ్లే కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయచోటి గ్రామీణ సీఐ వరప్రసాద్, ఎస్సై సుధాకర్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గంధం పీరుకు భాషికాన్ని తీసుకొస్తున్న భక్తుడు

తొలి త్రైమాసికం... ఆశాజనకం

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో రిజిస్ట్రేషన్ల శాఖ మెల్లగా కోలుకుంటూ లక్ష్యం దిశగా అడుగులు వేస్తోంది. జిల్లాలో మొత్తం 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటిలో స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఆదాయ లక్ష్యాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఏప్రిల్ ఒకటి నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభం అయింది. ఈ మేరకు జిల్లాలో స్టాంపుల విక్రయాలు, రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఆర్థిక సంవత్సరంలో రూ.258 కోట్లు వసూలు లక్ష్యంగా నిర్ణయించారు. తొలి త్రైమాసికంలో మూడు నెలలకు రూ.59.49 కోట్లు వసూలు లక్ష్యంగా కాగా, ఇప్పటి వరకు రూ.42.78 కోట్లు వసూలయ్యాయి.

లక్ష్య సాధన దిశగా అడుగులు : ఈ-స్టాంపులు కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కార్యాలయాలకు వచ్చి వేచి చూసే అవసరం లేకుండా రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్ బుకింగ్ చేసుకోవడానికి అవకాశం కల్పించాం. నిర్ధారించిన తేదీ నాటికి కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. సెలవు దినాల్లో కూడా రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి అవకాశాలు కల్పిస్తున్నాం. ఈ ఏడాది చివరి నాటికి లక్ష్యం మేరకు రాబడి సాధిస్తాం.
- **మూర్తి, జిల్లా సబ్ రిజిస్ట్రార్**

తొలి త్రైమాసికంలో రాబడి ఇలా...

నెల	లక్ష్యం	వసూలు
ఏప్రిల్	రూ.20.69 కోట్లు	రూ.13.23 కోట్లు
మే	రూ.18.11 కోట్లు	రూ.13.57 కోట్లు
జూన్	రూ.20.69 కోట్లు	రూ.15.98 కోట్లు
మొత్తం	రూ.59.49 కోట్లు	రూ.42.78 కోట్లు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాల్లో కూడా అర్జీలు సమర్పించవచ్చన్నారు. వాటిని పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన అర్జీలుగానే పరిగణించి పరిష్కరిస్తామని ఆయన స్పష్టం చేశారు.

బద్వేలు రోడ్డులో నానుబాలపల్లెకు వెళ్లే దారికి పడమర భాగంలో ఒరిగిన స్తంభాలు

కబళిస్తేనే... కదిలొస్తారా?

మైదుకూరు-బద్వేలు రహదారి నుంచి నానుబాలపల్లెకు వెళ్లే దారికి ఇరువైపులా పొలాల్లో ఒరిగిన విద్యుత్తు స్తంభాలు దర్శనమిస్తున్నాయి. పంటలు లేని సమయంలో స్తంభాల పునరుద్ధరణకు ఇదే సరైన సమయం. ఒరిగిన స్తంభాలతో తీగలపై భారంపడి తెగిపోవచ్చు. ఫలితంగా ప్రమాదాలు తలెత్తవచ్చు. ముందు జాగ్రత్తలతో స్తంభాల పునరుద్ధరణకు అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. - **న్యూస్‌టుడే, మైదుకూరు**

సీట్లు మిగిలిపాయె... రెండో విడత భర్తీకి వేళాయె!

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కార్యాలయం

వేంపల్లె, న్యూస్‌టుడే : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు ట్రిపుల్ ఐటీలలో 600 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి విద్యార్థుల మెరిట్ జాబితాను తయారు చేసి ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి మొత్తం 4,400 సీట్లున్నాయి. ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1,100 సీట్లుండగా దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ కోటా కింద 360 సీట్లు పోనూ నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1,010 చొప్పున 4,040 సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీల్లో ఉన్న సీట్లకు మెరిట్ జాబితా విడుదల చేసి జూన్ 30 నుంచి జులై 5వ తేదీ వరకు ఇడుపులపాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేశారు. ● ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో జాప్యం, ఇక్కడి విద్యపై ఆసక్తి లేని కారణంగా చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడంతో 600 సీట్లు ఖాళీగా ఉన్నాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీ కేంద్రంగా రెండో విడత ప్రవేశాలకు సంబంధించి రెండో జాబితాను అధికారులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

ట్రిపుల్ ఐటీల వారీగా ఖాళీలివి..

పేరు	మొత్తం సీట్లు	భర్తీ అయినవి	మిగులు
ఇడుపులపాయ	1,010	878	132
నూజివీడు	1,010	869	141
శ్రీకాకుళం	1,010	867	143
ఒంగోలు	1,010	826	184

11, 12 తేదీల్లో రెండో విడత ప్రవేశాల జాబితా : ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో మిగిలిపోయిన 600 సీట్ల భర్తీకి తదుపరి మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 11, 12 తేదీల్లో వెబ్‌సైట్‌లో వివరాలు వెల్లడిస్తాం. ఈ మేరకు రెండో విడత జాబితా సిద్ధం చేసే పనిలో సిబ్బంది ఉన్నారు. షెడ్యూలు ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. ఆ లోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తాం.
- **ఆచార్య సంధ్ర అమరేంద్ర కుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ**

MIOT HOSPITALS
OUTREACH CLINIC
TIRUPATI

కాలేయ వ్యాధులు మరియు కాలేయ మార్పిడిపై నిపుణుల అభిప్రాయం పొందండి...

MIOT ప్రత్యేకతలు
- కాలేయ మార్పిడి
- చిన్నపిల్లల కాలేయ మార్పిడి.
- కాలేయ క్యాన్సర్ మార్పిడి.
- కాలేయ నిర్వాహణయొక్క సిర్రోసిస్
- తీవ్రమైన కాలేయ వైకల్యం
- ఫ్యాటీ లివర్

లక్షణాలు
- వైరల్ హెపటైటిస్ (హెపటైటిస్ బి మరియు సి)
- నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి (NAFLD) / నాన్-ఆల్కహాలిక్ స్టీటో హెపటైటీస్ (NASH)
- లైసో సోమల్ స్టోరేజీ వ్యాధులు • ఆల్కహాలిక్ లివర్ వ్యాధి (ALD)

డా॥ పి. వెంకటసాగర్ MBBS, MS (General Surgery), Fellowship HepatoBiliary & Liver Transplant
లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్

సంప్రదించవలసిన చిరునామా: MIOT హాస్పిటల్స్ అవుట్రీచ్ క్లినిక్
D No 20-3-129/1, తిరుమల బైపాస్ రోడ్, శివజ్యోతి నగర్, తిరుపతి, తిరుపతి జిల్లా - 517501

తేదీ మరియు సమయం: 9 జూలై 2025 బుధవారం (10am - 5pm)
కన్సల్టేషన్ ఫీజు: Rs. 400/-
అపాయింట్‌మెంట్‌ల కొరకు*: +91 70953 85111 +91 70953 85333

*ముందస్తు అపాయింట్‌మెంట్ తప్పనిసరి. ఒకవేళ అవసరం అనుకుంటే, దయచేసి ఇంతకు ముందు వైద్య రికార్డులను, తీసుకుని రావలసినదిగా మనవి
Email: tic@miotinternational.com | www.miotinternational.com

(c) eenadu

పెండింగ్ కేసుల పరిష్కారంలో పురోగతి అవసరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక

న్యాయ సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక

హాజరైన వివిధ కోర్టుల న్యాయమూర్తులు

చిత్తూరు (న్యాయవిభాగం), న్యూస్‌టుడే: పెండింగ్ కేసుల పరిష్కారంలో నిర్దేశిత ప్రగతిని సాధించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక పేర్కొన్నారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని న్యాయమూర్తులకు ఆదివారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక మాట్లాడుతూ... హైకోర్టు నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం పెండింగ్ కేసులు వెంటనే పరిష్కరించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతానికి 96,739 పెండింగ్ కేసులు ఉండగా.. ఇందులో 48,751 సివిల్ కేసులు, 47,988 క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి అనుసరించాల్సిన పద్ధతులు, ప్రణాళికపై సందేహాలు నివృత్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న కాపీ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని, సాంకేతిక మాధ్యమాల కేసులను సుప్రీంకోర్టు ఆదేశాలు, తీర్పులను అనుసరించి విచారణ, నమోదు చేపట్టాలన్నారు. గణాంకాలు, రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. కేసుల పరిష్కారంతో పాటు న్యాయమూర్తులు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు. కేసుల నమోదు, విచారణ, తీర్పులు తదితర పలు అంశాలపై సమగ్రంగా వివరించారు. ఈ సదస్సులో మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రమేష్, మూడో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి గురునాథ్, నాలుగో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి అర్చన, ఐదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రాంగోపాల్, ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి, 10వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రామచంద్రుడు, 12వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసనాయక్, ఉమ్మడి జిల్లాలోని సీనియర్, జూనియర్ న్యాయమూర్తులు కోర్టు అధికారులు పాల్గొన్నారు.

ఆపదలో వైద్యం.. ఆపన్నహస్తం

◆ ప్రమాద బాధితులకు ప్రభుత్వం అండ

◆ గాయపడినా... మరణించినా సాయం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో ఏటా వందల మంది మృతి చెందుతుండగా వేలాది మంది క్షతగాత్రులై, దివ్యాంగులుగా మారి దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. ఇందులో గుర్తు తెలియని వాహనాలు ఢీకొని అనేక మంది మృతి చెందుతున్నారు. ప్రమాదాల్లో గాయపడి అవిటివారిగా మిగిలిపోయిన వారి ఆలనాపాలన చూసుకునే వారు లేకపోగా, చివరకు కుటుంబ సభ్యుల ఆదరణ కరవై మానసికంగా కృంగిపోతున్నారు. ఇలాంటి వారిని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం రెండు పథకాలను తీసుకొచ్చింది. రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందినా, గాయపడినా ఆ కుటుంబానికి ఆర్థిక సహకారం అందనుంది. క్షతగాత్రులైన వారికి సాంత్వన కలిగించే విధంగా, మరణించిన వ్యక్తి కుటుంబానికి ఆలంబనగా నిలిచేలా ఈ పథకాలను రూపొందించారు.

ఏమిటీ పథకాలు

● **రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స (క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ ఆఫ్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్) :** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందాలంటే ఖర్చుతో కూడుకున్న పని. పేదలు రూ. లక్షలు ఖర్చు పెట్టి బాధితులను కాపాడుకోలేని పరిస్థితి. దీంతో గాయపడిన ఆ వ్యక్తి అవిటివాడిగానే మిగిలిపోతున్నారు. ఇలాంటి వారిని ఆదుకోవడానికి ఈ పథకాన్ని తీసుకొచ్చారు. జాతీయ రహదారిపై ప్రమాదం జరిగి క్షతగాత్రులైన వారికి ముందుగా నోటిఫైడ్ ఆసుపత్రుల్లో చికిత్స అందించడానికి నగదు రహిత వైద్య సేవలు అందడానికి ఈ పథకం కింద రూ.1.50 లక్షలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. ఈ పథకం కింద వైద్య సేవలు పొందడానికి ఎలాంటి దరఖాస్తు చేసుకోవాల్సిన పనిలేదు. ఆసుపత్రిలో చేర్చిన వెంటనే చికిత్సలు అందించవచ్చు. అయితే బాధితుడికి సంబంధించిన కొన్ని ఆధారాలు ఉండాలి.

ములకలచెరువు సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం

● **హిట్ అండ్ రన్ :** గుర్తు తెలియని వాహనం ఢీకొని మరణించిన వారికోసం 'హిట్ అండ్ రన్' పథకాన్ని తీసుకొచ్చింది. రోడ్డుపై నడిచి వెళ్తున్న సమయంలో లేదా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలోనో గుర్తు తెలియని వాహనం ఢీకొని మరణిస్తే మృతుని కుటుంబానికి రూ.2 లక్షలు, తీవ్రంగా గాయపడినట్లైతే రూ.50 వేలు ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఈ నెల 11వ తేదీన జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఈ పథకాలను పటిష్ఠంగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లాస్థాయి అధికారులకు సూచించారు.

● **పథకాల అమలుకు జిల్లా స్థాయి కమిటీ :** హిట్ అండ్ రన్ పథకాన్ని అమలు చేయడానికి జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఛైర్‌పర్సన్‌గా క్లెయిమ్స్ సెటిల్‌మెంట్ కమిషనర్‌ను నియమించగా, మరో ఆరుగురు సభ్యులు ఇందులో ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వంచే నియమించిన క్లెయిమ్స్ విచారణ అధికారి, జిల్లా ఎస్పీ, లేదా అదనపు ఎస్పీ, జిల్లా చీఫ్ మెడికల్ ఆఫీసర్, రీజనల్ ట్రాన్స్‌పోర్టు అధికారి (ఆర్టీవో), ఛైర్‌పర్సన్ ద్వారా నియమించబడ్డ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, సాధారణ బీమా కౌన్సిల్‌చే నియమించబడ్డ అధికారి సభ్యులుగా ఉంటారు. ఎవరైతే రోడ్డు ప్రమాదంలో మరణిస్తారో లేదా గాయపడి ఉంటారో వారి కుటుంబ సభ్యులు ఆధారాలతో సహా దరఖాస్తు చేసుకుంటారో వారికి జిల్లాస్థాయి కమిటీ పరిశీలించి మరణించిన వారికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు మంజూరు చేస్తుంది.

● **ఏటా 500 మందికి పైగా మృత్యువాత** జిల్లాలో ఏటా 450 నుంచి 500 మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారు. క్షతగాత్రుల సంఖ్య ఇందుకు నాలుగు రెట్లు అధికంగా ఉంటోంది. పోలీసు, రవాణాశాఖ అధికారులు ప్రమాదాల రేటును తగ్గించడానికి అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నా అవి తగ్గుముఖం పట్టడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఈ రెండు పథకాలను తీసుకు రావడం వల్ల క్షతగాత్రులకు, మృతుల కుటుంబాలకు ఎంతో సాంత్వన కలిగే అవకాశం ఉంది.

● **పథకాలను సద్వినియోగం చేసుకోవాలి :** కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలు చేయనున్న క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ ఆఫ్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్, హిట్ అండ్ రన్ పథకాలను బాధితులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రమాదంలో గాయపడిన బాధితులకు మెరుగైన వైద్యచికిత్స చేయించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

– అశోక్‌ప్రతాప్‌రావు, ఆర్డీవో, మదనపల్లె

జేవీవీ నాయకులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తెదేపా నేత ప్రసాద్‌బాబు

మహాసభల గోడ పత్రాల ఆవిష్కరణ

రాయచోటి, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభల గోడపత్రాలను శనివారం తెదేపా నేత సుగవాసి ప్రసాద్‌బాబు ఆవిష్కరించారు. ఈ నెల 12, 13 తేదీల్లో కడపలో నిర్వహించే 18వ రాష్ట్ర మహాసభలకు రావాలని కేవీవే నాయకులు ఆయన్ను కోరారు. ప్రజల్లో మూఢ నమ్మకాలను తొలగించడం, విద్యార్థులలో శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందింపచేయడమే జేవీవీ లక్ష్యమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు పి.సనావుల్లా, రాష్ట్ర కోశాధికారి జి.రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు కె.భాస్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులతో అప్రమత్తత అవసరం

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: పెంపుడు జంతువులతో మనుషులకు ప్రాణాంతక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని.. జాగ్రత్తగా ఉండాలంటూ జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆదివారం జంతు సంబంధిత వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పశువైద్య సిబ్బంది పెంపుడు శునకాలకు యాంటీ రేబిస్ టీకాలు ఉచితంగా వేశారు. పెంపుడు జంతువులకు తప్పనిసరిగా సమయానికి విధిగా టీకాలు వేయించాలని ఆయన సూచించారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శివారెడ్డి, లోకేశ్, పశువైద్యులు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న జేడీ గుణశేఖర్ పిళ్లై, అధికారులు

పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ ఆందోళన

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: భాజపా సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ద్రోహం చేస్తోందని ఏఐటీయూసీ జిల్లా ఉప కార్యదర్శి సలీంబాషా, నియోజకవర్గ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి ఆరోపించారు. కార్మికుల పనిగంటల పెంపు నిర్ణయాన్ని నిరసిస్తూ ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించి కరపత్రాలను ఆదివారం బి.కొత్తకోటలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె.బాలకృష్ణ, ఎస్.గఫూర్, ఖాదర్ బాషా, బాలాజీ, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో సాగు లాభదాయకం

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలు మామిడితో పాటు సీజనల్ వారీగా పంట ఉత్పత్తులు సేకరించాలని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ చిరంజీవి చౌదరి అన్నారు. పీలేరు మండలం తలపులలోని అన్నమయ్య రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసుకున్న ప్యాక్ హౌస్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మామిడి, పొగాకు, కోకో పంటలకు రూ.550 కోట్ల ప్రోత్సాహక రాయితీలను రైతుల ఖాతాలకు జమ చేసిందన్నారు. ఉత్పత్తిదారుల సంఘాలు మామిడితో పాటు వేరుసెనగ, టమాట, ఇతర పంట ఉత్పత్తులను సేకరించి మార్కెటింగ్ చేస్తేనే లాభాల బాటలో పయనిస్తారని స్పష్టం చేశారు. రైతుల ఆలోచనల్లో మార్పు వస్తే మెరుగైన పంట దిగుబడి వచ్చి లాభాలు వస్తాయన్నారు. అన్నమయ్య రైతు ఉత్పత్తుల సంఘంలో 750 మంది రైతులుండటం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారిణి సుభాషిణి, డివిజన్ అధికారి సుకుమార్‌రెడ్డి, అన్నమయ్య రైతు ఉత్పత్తుల సంఘం అధ్యక్షుడు జయబ్బనాయుడు, సురేంద్ర నాయుడు, రామ్మోహన్‌నాయుడు, దినకర్‌రెడ్డి, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శీతల గిడ్డంగిని పరిశీలిస్తున్న ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శి చిరంజీవి, అధికారులు

ఆలయంలో ధ్వజారోహణం గావిస్తున్న వేద పండితులు

చెన్నకేశవ, సిద్ధేశ్వర స్వామి ఆలయాల్లో ధ్వజారోహణం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం తాళ్లపాకలోని సిద్ధేశ్వర, చెన్నకేశవ స్వామి ఆలయాల వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన పండితులు ఉత్సవాల ప్రారంభం సూచికగా సర్వ దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం కార్యక్రమం చేపట్టారు. ప్రతి రోజూ ఉదయం స్వామి వారికి పల్లకీ సేవ, అభిషేకాలు, గ్రామోత్సవాలు ఉంటాయని ఆలయ అర్చకులు వివరించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, ఆలయ పండితులు భక్తవత్సలం, వేదపారాయణ కృష్ణ, మహేష్, ఆలయ ఇన్స్‌పెక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

తోతాపురి మామిడి రైతులను ఉపశమనం

రాయచోటి, న్యూస్‌టుడే: తోతాపురి మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకునే చర్యలు చేపట్టడం ఆదర్శనీయమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శనీయమన్నారు. గత నెల 5వ తేదీ నుంచే కిలోకు రూ.4 చొప్పున మద్దతు ధర ప్రకటించిందన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు 20 ప్రాసెసింగ్ యూనిట్లకు అదనపు మొత్తం సేకరణ ప్రయోజనం కోసం టాప్ అప్ నగదును ఇచ్చామన్నారు. దిగుబడి మొత్తాన్ని అమ్ముకునే వెసలుబాటును కల్పించామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో బోర్‌వెల్స్ నిర్వాహకుడి దుర్మరణం

రాయచోటి, చిన్నమండెం, న్యూస్‌టుడే: కడప-బెంగళూరు జాతీయ రహదారిలోని చిన్నమండెం మండలం తూర్పుపల్లి క్రాస్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కలకడ మండలం బాగిమానిరెడ్డివారిపల్లెకు చెందిన రెడ్డిశేఖరరెడ్డి (47) కొంతకాలంగా రాయచోటిలో నివాసం ఉంటూ బోర్‌వెల్స్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం చిన్నమండెం మండలం వండాడి గ్రామానికి వ్యక్తిగత పని నిమిత్తం కారులో వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెడ్డిశేఖర్‌రెడ్డి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. చిన్నమండెం ఎస్సై సుధాకర్ ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తెదేపా నియోజకవర్గ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన వాహనం...
(అంతర్‌చిత్రంలో) మృతుడు రాజశేఖర్‌రెడ్డి

పోలీసులు స్పందించి ఉంటే మా నాన్న బతికేవారు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : పోలీసుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంతో ఒక నిండుప్రాణం బలైనట్లు బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం రాచపల్లె బీసీ కాలనీకి చెందిన లాలయ్య మృతదేహంతో ఒంటిమిట్ట పోలీస్‌స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు ఆదివారం ధర్నా చేశారు. కడప-రేణిగుంట జాతీయ రహదారిపై మృతదేహాన్ని ఉంచి ఆందోళనకు దిగారు. ఆత్మహత్య చేసుకున్న లాలయ్య కుమారుడు రఫీ కథనం మేరకు.. రాచపల్లె బీసీ కాలనీలోని తమ ఇంటికి ఈ నెల 2న రాత్రి సీతాపురానికి చెందిన ఖాదర్‌బాషా వచ్చారు. మా తల్లితో కొన్ని రోజులుగా వివాహేతర సంబంధం ఉంది. ఇకపై ఇక్కడికి రావొద్దని మందలించి పంపించామన్నారు. మరుసటి రోజు ఖాదర్‌బాషా తనతో పాటు మా తండ్రి లాలయ్యను మీ అంతు చూస్తాం అంటూ బెదిరించాడు. ఆయన నుంచి రక్షణ కల్పించాలని పోలీసుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తే న్యాయం చేయలేదని వాపోయారు. మా అమ్మ పీరమ్మ ఫిర్యాదుపై పోలీసులు మమ్మల్ని స్టేషన్‌కు రావాలని ఒత్తిడి చేశారు. తప్పుడు కేసు పెట్టాలని కుట్రపన్నారు. తీవ్ర మనస్తాపం చెందిన నా తండ్రి అవమానం భరించలేక శనివారం రైలు కిందపడి తనువు చాలించాడని ఆవేదన వ్యక్తం చేశారు. మా నాన్న మృతిపై మా తల్లి పీరమ్మ, ఖాదర్‌బాషాపై అనుమానాలున్నాయన్నారు. మేం ఫిర్యాదు ఇచ్చిన వెంటనే పోలీసులు స్పందించి సమస్యపై దృష్టి సారించి ఉంటే మా తండ్రి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చేది కాదని కంటతడి పెట్టారు. విషయం తెలుసుకున్న సీఐ బాబు అక్కడికి చేరుకుని బాధితులకు సర్దిచెప్పడానికి ప్రయత్నం చేశారు. ఖాదర్‌బాషా, పీరమ్మపై కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు శాంతించి ఆందోళనను విరమించారు.

లాలయ్య మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

అప్పుల బాధ తాళలేక ప్రభుత్వ ఉద్యోగి అదృశ్యం

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : అప్పుల బాధ తాళలేక ఓ ప్రభుత్వ ఉద్యోగి అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్సై రాజరాజేశ్వర రెడ్డి తెలిపారు. కడప జయనగర్ కాలనీకి చెందిన **వనిపెంట అంజాద్‌ఖాన్** (41) తెలుగుగంగలోని జలవనరులశాఖలో పని చేస్తున్నారు. ఇటీవల ఆయన బద్వేలుకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో అంజాద్‌ఖాన్ తన కుటుంబ అవసరాల నిమిత్తం తెలిసిన వారి వద్ద అప్పులు చేశారు. అప్పులిచ్చిన వారు డబ్బులు చెల్లించాలని అడగడంతో గత నెల 28న బద్వేలుకు వెళ్తున్నానని చెప్పి సాయంత్రం ఇంటికి వచ్చారు. పనిపై తెలుగు గంగ కార్యాలయానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లారు. అప్పటి నుంచి తిరిగి రాలేదన్నారు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల నివాసాల్లో గాలించారు. ఎక్కడా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పు చెల్లించమన్నందుకే దారుణ హత్య

పులివెందుల, న్యూస్‌టుడే : పులివెందులలో అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన కేసును పోలీసులు ఛేదించారు. దుండగులు రూ.2 లక్షల కోసం మహిళను హత్య చేసినట్లు నిర్ధారించారు. పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ వివరాల ప్రకారం.. పులివెందులకు చెందిన హసీనా (45) కువైట్‌కు వెళ్లి వచ్చి ఇటీవల పులివెందులలో స్థిరపడ్డారు. డబ్బులు వడ్డీకి ఇస్తూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో దేవిరెడ్డి కరుణకుమారితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఇటీవల తన కుమారుడి చదువు కోసం హసీనా వద్ద కరుణకుమారి రూ.2లక్షలు అప్పుగా తీసుకున్నారు. డబ్బును తిరిగి చెల్లించాలని హసీనా ఒత్తిడి చేయడంతో కరుణకుమారి తన కుమారుడితో కలిసి హసీనాను ఇంట్లోనే కాళ్లకు, చేతులకు తొడుగులు వేసి మెడపై కత్తితో పొడిచి హత్య చేసినట్లు పేర్కొన్నారు. కరుణకుమారి కుమారుడు లిఖిత్‌కుమార్‌రెడ్డిని పులివెందులలోని ఉలిమెల్ల రింగ్‌రోడ్డులో అరెస్టు చేసినట్లు వివరించారు. కరుణకుమారి పరారీలో ఉందని, ఆమెను కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. హసీనాను హత్య చేసి బీరువాలోని బంగారం, ప్రామిసరీ నోట్లు, బాండ్లు, చరవాణిని పూర్తిగా కాల్చేసినట్లు పేర్కొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న పులివెందుల డీఎస్పీ మురళీనాయక్

EENADU e Classifieds

BUSINESS SERVICES

FREE JOBS: తిరుపతిలోని మా సంస్థ కొరకు, కంప్యూటర్ ఆపరేటర్లు, HR Recruiters, Counsellors, Tele Callers, BDMలు కావలెను. జీ: 15-35 వేలు. ✆ 99906 78818.

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

ENGINEERING

Faculty Requirement Physics, English, Mathematics (CSC, ECE, EEE). Acharya College of Engineering D.Agraharam, B.Matam (M). Cell : 8341847444, 9052208001.

FINANCIAL SERVICES

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

JOBS

ప్రముఖ లిమిటెడ్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు జిల్లాలోని అన్ని మండలాల నుండి ప్రాంతాల వారీగా M/F అభ్యర్థులు కావలెను. అనుభవమును బట్టి 25 వేల జీతం+మంత్లీ ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. 73968 87685.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే

Contact: KDP: 9989997626, 8008514248 PDTR: 8008597620

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

రెవెన్యూ వినతులా.. మూసేద్దాం!

◆ సగానికి సగం దరఖాస్తులకు కలగని మోక్షం ◆ ఆన్‌లైన్‌లో అన్ని పరిష్కరించినట్లు నమోదు

● ఓబులవారిపల్లె మండలానికి చెందిన రైతు చనిపోయిన తన భార్య పేరిట ఉన్న 4 ఎకరాల భూమిని మ్యుటేషన్ చేయాలని ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో అర్జీ ఇచ్చారు. క్షేత్ర స్థాయి అధికారులు పరిష్కరించకుండానే సమస్య తీరినట్లు చూపి మూసేశారు.

● ఓబులవారిపల్లెలో ఓ రైతు తమ పొలానికి దారి కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఆ రైతులకు దారి కేటాయించకుండానే దరఖాస్తును పరిష్కరించినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

ఓబులవారిపల్లె మండలంలోని రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

– న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె

అధికారులకు వచ్చే ఫిర్యాదుల్లో 70-80 శాతం రెవెన్యూకు సంబంధించినవే ఉంటున్నాయి. వీటిని సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో పని చేసి వాటన్నింటినీ పరిష్కరించాలి. ఆరు రోజుల కిందట 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఇవి. ఓ వైపు సీఎం ఆదేశాలిస్తుంటే క్షేత్రస్థాయిలో మాత్రం భిన్నమైన పరిస్థితి నెలకొంటోంది. ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను పరిష్కరించకుండానే అంతా చేశామన్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

రెవెన్యూ సదస్సుల దరఖాస్తులు, పురోగతి ఇలా..

● జిల్లా వ్యాప్తంగా వచ్చిన అర్జీలు: 15,231
● పరిష్కారమైనట్లు చూపినవి : 15,231
● రీఓపెన్ అయినవి : 45
● అధికారుల పరిశీలనలో ఉన్నవి : 76

45 రోజుల గడువు విధించడంతో..

రెవెన్యూ గ్రామసభల్లో వచ్చిన అర్జీలు 45 రోజుల్లోగా పరిష్కరించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో దీర్ఘకాలిక సమస్యలు కనీసం చూడకుండా మూసేశారు. తహసీల్దార్లు, వీఆర్వోలకు గడువు ఇస్తే కొంత వరకైనా పరిష్కారమయ్యేవి. ఓ రకంగా ఇలాంటి ఇబ్బందులకు ఉన్నతాధికారులూ ఓ కారణమే. ఏదో ఒకటి చేయిండని చెబుతుండటంతో బాధితులకు న్యాయం జరగడం లేదు.

వంద శాతం కొలిక్కి వచ్చాయట

కూటమి ప్రభుత్వం వచ్చాక తొలుత రీసర్వే గ్రామసభలు, తర్వాత రెవెన్యూ గ్రామసభలు నిర్వహించింది. ఈ రెండిటిలో దాదాపు 40 శాతం మంది సమస్యలు విన్నవించారు. ఇవి పరిష్కారమైతే ప్రతి సోమవారం కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాలకు అర్జీలతో రావాల్సిన అవసరమే ఉండదు. రెవెన్యూ గ్రామసభల్లో జిల్లా వ్యాప్తంగా 15,231 దరఖాస్తులు సమర్పించగా వాటిలో అన్ని కొలిక్కి తెచ్చామని చెబుతుండగా పీజీఆర్ఎస్‌లో 76 వరకు దరఖాస్తులు మళ్లీ వస్తున్నాయి.

దీర్ఘకాలిక సమస్యలకు కారణాలు ఇలా..

● కార్యాలయాల్లో పూర్తి స్థాయిలో రికార్డులు లేకపోవడం ● వారసత్వ ఆస్తులు మిగులు భూముల్లో కలిపేయడం ● ఆర్‌హెచ్, ఈసీలతో వారసత్వం నిరూపించుకోలేకపోవడం ● రిజిస్ట్రేషన్, భాగ పరిష్కారాలు కొరవడటం ● నకిలీ పాసు పుస్తకాల బెడద ● కలెక్టరేట్ స్థాయిలో ఎక్కువగా పరిష్కారం ముడిపడి ఉండటం

తల్లిదండ్రులకు విద్యార్థిని అప్పగింత

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : మదనపల్లె పట్టణంలోని ఓ కళాశాలలో చదువుతూ.. తనను అవమానించారని ఆత్మహత్య చేసుకుంటున్నానని లేఖ రాసి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన విద్యార్థినిని పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మదనపల్లె మండలానికి చెందిన విద్యార్థిని అదృశ్యం కావడంపై ఆమె తల్లిదండ్రులు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విద్యార్థిని కోసం గాలింపు చేపట్టారు. సాంకేతిక పరంగా విచారించి విద్యార్థిని తిరుమలలో ఉన్నట్లు గుర్తించి ఆదివారం ఉదయం మదనపల్లెకు తీసుకొచ్చారు. అనంతరం ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి తహసీల్దార్ ఎదుట హాజరుపర్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్

మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి

రాయచోటి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, మధుసూదన్‌లు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 జులై నుంచి పీఆర్సీ అమలు కావడం లేదన్నారు. పీఆర్సీ ఆలస్యమైనందున వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండు చేశారు. 12వ పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు మధ్యంతర భృతి కోరుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ సరెండర్ లీవు బకాయిలు విడుదల చేయాలన్నారు. ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలుకు చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు. ఆంగ్ల మాధ్యమంతో పాటు సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, కడియాల మురళి, రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రవీంద్రారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహులు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

(c) eenadu

మదనపల్లె
•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె

సూచిక.. కనిపించక!

పీలేరుకు రెండు కిలోమీటర్ల దూరం బోడుమల్లువారిపల్లె వద్ద రాయచోటి మార్గం జాతీయ రహదారి పక్కన సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. దానిపై తీగలు అల్లుకోవడంతో సూచిక బోర్డు కనిపించడం లేదు. రహదారి నిర్వహణ అధికారులు సూచికపై ఉన్న తీగలు తొలగించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. - న్యూస్‌టుడే, పీలేరు

గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలి

మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసులు

మదనపల్లె పట్టణం : గిరిజనులు విద్య, ఆర్థికరంగాల్లో రాణించాలని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. గిరిజన ఉద్యోగులు, గిరిజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏకలవ్య జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఉద్యోగులు, కులసంఘం నాయకులు ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా గొల్లపల్లె లోని సమావేశం వేదిక వద్దకు వెళ్లారు. పంచాయతీరాజ్ ఏఈ పి.వి.రమణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ప్రతిభావంతులైన గిరిజన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. సమావేశంలో రాష్ట్ర గిరిజన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేటి దివాకర్, అధ్యాపకులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యం

రామసముద్రం, న్యూస్‌టుడే: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని తెదేపా సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గురుమూర్తి, సురేష్‌రాజు, శ్రీనివాసులునాయుడు కోరారు. రామసముద్రం మండలంలో జరుగుతున్న తెదేపా సంస్థాగత ఎన్నికలను ఆదివారం వారు పరిశీలించారు. అనంతరం తెదేపా మండల నాయకులతో సమావేశమయ్యారు. రామసముద్రం మండల కేంద్రంలో తెదేపా గ్రామకమిటీ అధ్యక్షుడిగా బండ్ల జనార్దన్, ఆర్.నడింపల్లెకు వెంకటేశు, ఎలవానెల్లూరుకు గంగప్ప, కురిజలకు శంకర్‌నాయుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెదేపా మండల అధ్యక్ష పోటీలో ఉన్న విజయ్‌కుమార్‌గౌడు, శివారెడ్డి, చలపతినాయుడు, సీఆర్ నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డిలతో చర్చలు జరిపారు. సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఏకాభిప్రాయానికి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మదనపల్లె పట్టణం : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని ఎన్నికల పరిశీలకుడు మల్లికార్జునరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం మదనపల్లె పురపాలకసంఘం పరిధిలోని 14వ వార్డులో ఆయన పర్యటించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణాచారి, నాగూర్‌వలి, కుమార్, రాజేశ్, వాసు, రవి, చలపతి, సుజాత, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో... వసతులు ఎప్పటికో!

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పట్టణ ప్రాంతంలోని పేదప్రజల సొంతింటి కల నెరవేర్చడానికి ప్రభుత్వం గృహసముదాయ నిర్మాణ పనులు ప్రారంభించింది. మదనపల్లెలోని తిరుపతి రోడ్డు ఎర్రగానిమిట్ట వద్ద టిడ్కో గృహసముదాయం ప్రారంభించారు. లబ్ధిదారులు సొంతింటి కల నెరవేరినా, మౌలిక వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రధానంగా

టిడ్కో పరిసరాల్లో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన షెడ్డు

తాగునీటి కోసం వారు అవస్థలు పడుతున్నారు.

● మదనపల్లె పురపాలకసంఘంలో పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారిని ఎంపిక చేశారు. 35 వార్డుల్లో 1872 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. వీరికి తిరుపతి రోడ్డు ఎర్రగానిమిట్ట వద్ద టిడ్కో గృహసముదాయం నిర్మించారు. ఒక్కో ప్లాటు 300 చదరపు అడుగులు ఉండే విధంగా నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణ పనులు పూర్తి కావడంతో అరకొర సౌకర్యాలతో లబ్ధిదారులు తమ ప్లాట్లలో నివాసం ఉంటున్నారు. కాలనీలో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల పనులు పూర్తయ్యాయి. అలాగే మురుగునీటి శుద్ధిప్లాంటు నిర్మాణపనులు పూర్తయినా వినియోగంలోకి తీసుకురాలేదు. ప్రజలకు తాగునీటిని అందించడానికి పైప

టిడ్కో సముదాయంలో అసంపూర్తిగా ఈఎల్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణం

లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. తాగునీటి కోసం స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. తాగునీటిని కొనుగోలు చేస్తున్న దుస్థితి నెలకొంది. తాగునీటి సరఫరా కోసం ఈఎల్ఎస్ఆర్ ట్యాంకు నిర్మించాల్సి ఉండగా, అది పిల్లర్ల వరకు వచ్చి ఆగిపోయింది. టిడ్కో ఇళ్ల సముదాయ ప్రాంతంలో రోడ్డు పక్కనున్న స్థలాలను ఆక్రమించి రేకుల షెడ్లను ఏర్పాటు చేశారు. చాలా మంది ఇలా ఆక్రమించుకున్న స్థలాలకు సరిహద్దులను ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై చర్యలు తీసుకుని వాటిని తొలగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

స్పందనకు వందనం

● మదనపల్లె పట్టణంలోని ఎన్వీఆర్ విస్తరణలో కార్మికులు చెత్తదిబ్బలను, కాలువల్లో పూడిక తొలగింపు పనులను చేపట్టారు. ఇక్కడి సమస్యపై ఈ నెల 3న మేమున్నాం.. మీకు తోడుగాలో భాగంగా ప్రచురితమైంది. స్పందించిన పురపాలక కమిషనర్ ప్రమీల సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు.

● మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్లు అధ్వానంగా ఉండటంపై ఈ నెల 3న మేమున్నాం.. మీకుతోడుగాలో భాగంగా ప్రచురితమైంది. అధికారులు స్పందించి మరుగుదొడ్లను శుభ్రం చేయించారు.

● మదనపల్లె మండలం సీటీఎం రోడ్డు నేతాజీకాలనీ సమీపంలోని చెత్తదిబ్బలను కార్మికులు తొలగించారు. ఇక్కడున్న సమస్యపై ఈ నెల 3న మేమున్నాం.. మీకుతోడుగాలో భాగంగా ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో తాజ్‌మస్రూర్ పంచాయతీ కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయించారు.

● బసినికొండ పంచాయతీ నిమ్మనపల్లె రోడ్డులో కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ ప్రాంతంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంపై ఈ నెల 3న మేమున్నాం మీకు తోడుగాలో భాగంగా సమస్య ప్రచురితమైంది. స్పందించిన ఈవోపీఆర్డీ అబ్దుల్‌షకూర్ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు.

?: పట్టణంలోని ఎన్వీఆర్ విస్తరణ, రాజీవనగర్ విస్తరణ ప్రాంతాల్లో రోడ్లపై చెట్ల ఆకులతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. గడ్డి పేరుకుపోయింది. - గౌస్‌పీర్, ఎన్వీఆర్ వీధి

✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - ప్రమీల, పురపాలక కమిషనర్, మదనపల్లె

?: రాజీవ్‌నగర్‌లోని ప్రధాన మార్గంలో పలు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ రాకపోకలు సాగించాలంటే మహిళలు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. - నూర్, రాజీవ్‌నగర్

✓: మరమ్మతులు చేయించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - శ్రావణి, పురపాలక సంఘం డీఈ, మదనపల్లె

?: తాళ్లసుబ్బన్నకాలనీ విస్తరణ ప్రాంతంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. రోడ్లపై, ఇళ్ల మధ్య మురుగు నిలిచి దోమలకు నిలయంగా మారింది. - శివకుమార్, స్థానికుడు

✓: పారిశుద్ధ్య పనులు చేయించి సమస్య లేకుండా చూస్తాం. - తాజ్‌మస్రూర్, ఎంపీడీవో - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రం లక్ష్మీజనార్దన స్వామి ఆలయంలో ఆదివారం ఏకాదశి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి పూల అలంకారం చేసి భక్తులకు దర్శనయోగం కల్పించారు.

పూజలందుకుంటున్న లక్ష్మీజనార్దనస్వామి

పెద్దమండ్యం, న్యూస్‌టుడే: మండలంలోని చెరువుకిందపల్లి లోని వెంకటేశ్వరస్వామికి తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

రెడ్డెమ్మ దేవతకు...

గుర్రంకొండ : చెర్లోపల్లె సమీపంలోని రెడ్డెమ్మ దేవతకు ఆదివారం వరపడు పూజ ఘనంగా నిర్వహించారు. ప్రధానాలయం ఎదురుగా ఊయలలు కట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దర్శనమిస్తున్న రెడ్డెమ్మదేవత

భక్తి శ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

మదనపల్లె తాటిమాను మకాన్‌లో పూల అలంకరణ

చింతపర్తిలో దర్శనమిస్తున్న పీర్లు

బి.కొత్తకోట: గట్టులో..

పీలేరులో ఊరేగుతున్న పీర్లు

కలకడ: ఎర్రకోటపల్లెలో..

పెద్దతిప్పసముద్రం: కందుకూరులో..

మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల వ్యాప్తంగా మొహర్రం సందర్భంగా ఆదివారం పీర్ల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కులమతాలకతీతంగా ప్రజలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. ఆయా గ్రామాల్లో పీర్లను ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం ఊరేగింపుగా పీర్లను సమీపంలో జలధికి తీసుకెళ్లారు. - న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం

దారంతా కంకర... ప్రయాణం వంకర

కంకర పరిచిన రోడ్డుపై రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. మదనపల్లె మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ వెంకప్పకోట గ్రామానికి వెళ్లేందుకు గత వైకాపా ప్రభుత్వ హయాంలో గుత్తేదారులు దాదాపు రెండు కిలో మీటర్ల పొడవున రోడ్డు పనులు ప్రారంభించి కంకర పరచి వదిలేశారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి గాయాల పాలవుతున్నారు. ఆటో వాహనాలు వెళ్లాలంటే చక్రాలు దెబ్బతింటున్నాయి. కూటమి ప్రభుత్వమైనా ఈ సమస్యను పరిష్కరిస్తుందని గ్రామస్థులు ఆశిస్తున్నారు. - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

చెత్త.. తొలగించక అవస్థ

పీలేరు పంచాయతీ కొత్తపల్లె మార్గం రాజీవ్‌నగర్ దిగువన తాగునీటి శుద్ధికేంద్రం సమీపంలో చెత్త పేరుకుపోతోంది. ఇక్కడ పంచాయతీ వారు చెత్త డబ్బా ఏర్పాటు చేస్తే అందులో చెత్త వేసేందుకు సౌకర్యంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పీలేరు పంచాయతీ పారిశుద్ధ్య అధికారి నౌషాద్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పరిశీలించి చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, పీలేరు

మలుపు... ప్రమాదాల పిలుపు

కలకడ-గుర్రంకొండ మార్గంలోని బుడ్డతలావ వంక మలుపు ప్రమాదకరంగా మారింది. మలుపులో రోడ్డు పక్కన కంపచెట్లు పెరిగి రోడ్డు పైకి రావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురెదురుగా వాహనాలు వస్తే మలుపులో ప్రమాదాలు జరిగి మృత్యువాత పడిన ఘటనలున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న కంపచెట్లు తొలగించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కలకడ

భరతనాట్యంలో బంగారు పతకం

పురస్కారం అందుకుంటున్న రియాజుల్లా

కలికిరి, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రం సేలంలో నిర్వహించిన ప్రపంచ భరత నాట్య పోటీల్లో కలికిరి పట్టణానికి చెందిన ఎస్. రియాజుల్లా ఏకధాటిగా నాట్యం చేసి బంగారు పతకం సాధించారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచే కాకుండా విదేశాల నుంచి 3 వేల మంది నృత్య కళాకారులు పాల్గొన్నారు. పోటీల్లో సత్తాచాటిన రియాజుల్లాను నిర్వాహకులు సత్కరించి పతకం అందజేశారు.

ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు వినతి

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పీలేరులో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోడేపవలి కోరారు. ఈ మేరకు ఆదివారం పీలేరు పర్యటనకు వచ్చిన ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ చిరంజీవి చౌదరికి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో రూ.5 కోట్ల వ్యయంతో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ స్థాపన ప్రారంభ దశకు వచ్చి ఆగిపోయిందన్నారు. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేస్తే రైతులకు ప్రయోజనం కలగడంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై ప్రచారం

తరిగొండలో కరపత్రాలు అందిస్తున్న తెదేపా నాయకులు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని బెంగళూరురోడ్డు పరిసర ప్రాంతాల్లో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పట్టణ తెదేపా నాయకులు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంజి మోహన్, నారాయణ, కిట్టన్న, రవికుమార్, ఎండీ మస్తాన్, నాసీర్, తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండ : కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని తెదేపా మండలశాఖ అధ్యక్షుడు నాయిని జగదీష్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తరిగొండ పంచాయతీలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ నౌషాద్‌అలీ, నాయకులుఎల్లుట్ల మురళి, మహాత్మరెడ్డి, చంద్రబాబు, చలమారెడ్డి, సుధాకర్, నారాయణ, బాషా తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే : ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు బ్రహ్మారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని తీతవగుంటపల్లె పంచాయతీ కుమ్మరపల్లెలోని వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 60 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు జిలానీ, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పురపాలకసంఘం పరిధిలోని శేషప్పతోటలోని సమస్యలు పరిష్కరించడానికి అసోసియేషన్ కృషి చేస్తోందని సంఘం అధ్యక్షుడు గొల్లపూతి తిరుపతిరావు తెలిపారు. ఆదివారం మదనపల్లెలో అసోసియేషన్ సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన పురపాలకసంఘం వైస్‌ఛైర్మన్ జింకా వెంకటచలపతి మాట్లాడుతూ.. శేషప్పతోటలోని సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి తన వంతు కృషిచేస్తానన్నారు. సమావేశంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు క్రిస్టఫర్ జేసుదాసన్, నరసింహులు, ఉపాధ్యక్షుడు తిలక్, సెక్రటరీ రిచర్డ్స్, సంయుక్త కార్యదర్శి సరస్వతమ్మ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు

కలికిరిలో కుక్కకు టీకా వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్‌పిళ్లై

ములకలచెరువు, న్యూస్‌టుడే: ములకలచెరువు, తంబళ్లపల్లె మండలాల పరిధిలో పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారులు విక్రమ్‌రెడ్డి, నివేదిత పేర్కొన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉచితంగా టీకాలు వేసినట్లు స్పష్టం చేశారు.

కలికిరి : పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్‌పిళ్లై సూచించారు. కలికిరి పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు టీకా వేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటమునినాయుడు, పశువైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె వైద్యం : పెంపుడు కుక్కల సంరక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ నీరజ, సహాయ సంచాలకులు డాక్టర్ రోహిణి అన్నారు. మదనపల్లె పశువైద్యశాలలో ఆదివారం కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రసాద్, పశువైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

గుర్రంకొండ : స్థానిక పశువైద్య కేంద్రంలో పెంపుడు జంతువులకు వైద్య సిబ్బంది జగదీష్, సునీల్‌నాయక్ టీకాలు వేశారు. రేబిస్ టీకా ఉచితంగా వేస్తున్నామన్నారు.

పెన్షనర్ల హక్కులకు పోరాటం

సమావేశమైన సంఘం నాయకులు

కలికిరి, న్యూస్‌టుడే: పెన్షనర్ల హక్కుల కోసం పోరాటం సాగిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఎంప్లాయీస్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం కలికిరి ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో ఆ సంఘం కోశాధికారి మస్తాన్‌ఖాన్ ఆధ్వర్యంలో సభ్యులతో సమావేశం నిర్వహించారు. పింఛనర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. సభ్యులు రమణ, నారాయణరెడ్డి, సరోజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలపై చర్యలకు డిమాండ్

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కళాశాల వద్ద ఆందోళన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అధికంగా వసూలు చేస్తూ విద్యార్థులను వేధిస్తున్నారని ఆరోపించారు. కళాశాలలో ఫీజుల వేధింపులు తాళలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంటానని లేఖ రాసిన ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

దారి విషయమై ఇరువర్గాల ఘర్షణ

రామసముద్రం, న్యూస్‌టుడే : దారి విషయమై మండల పరిధిలోని ఊలపాడు గ్రామపంచాయతీలోని ఎత్తూరుపల్లె, నరసాపురం గ్రామస్థుల మధ్య ఆదివారం ఘర్షణ చోటుచేసుకుంది. ఘర్షణలో ఐదుగురు గాయపడ్డారు. వారిని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు విచారిస్తున్నారు.

యువకుడిపై దాడి

మదనపల్లె నేరవార్తలు : మద్యం దుకాణం వద్ద జరిగిన వివాదంలో ఓ యువకుడిపై ముగ్గురు దాడి చేసిన ఘటన మదనపల్లె పట్టణంలో ఆదివారం రాత్రి జరిగింది. పట్టణంలోని జగన్‌కాలనీకి చెందిన కార్తీక్ పెయింటర్‌గా పనిచేస్తాడు. ఇతను ఇంటికి వెళ్తూ మద్యం కొనుగోలు కోసం నక్కలదిన్నె వద్ద ఉన్న వైన్ షాపునకు వెళ్లాడు.నీ సమయంలో గాంధీపురానికి చెందిన గౌతమ్‌తో వివాదం ఏర్పడింది. దీంతో గౌతమ్ అతని స్నేహితులు అతడిపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన కార్తీక్‌ను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అనాథల విద్యాభివృద్ధికి కృషి

మైఫోర్స్ నూతన అధ్యక్షుడు ఉమేశ్‌ను సన్మానిస్తున్న సభ్యులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : అనాథల విద్యాభివృద్ధికి మైఫోర్స్ కృషి చేస్తోందని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మహేశ్ తెలిపారు. ఆదివారం మదనపల్లెలో జరిగిన మైఫోర్స్ సమావేశంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. మైఫోర్స్ నూతన కమిటీ అధ్యక్షుడిగా ఉమేశ్, ఉపాధ్యక్షులుగా ఫాజిల్‌ఖాన్, నితిన్‌రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా విద్యాసాగర్, సందీప్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా మధుసూదన్, మేకల వెంకటరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కె.సురేశ్, డి.రేవంత్‌కుమార్, వర్కింగ్ సెక్రటరీగా మనోజ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. అలాగే అనుబంధ సంఘాల సభ్యులను ఎన్నుకున్నారు. తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలుగా దామోదర్, గంగాధర్, నవీన్‌కుమార్‌లు ఎంపికయ్యారు. వీరికి మైఫోర్స్‌మహేశ్ నియామకపత్రాలు అందజేసి అభినందించారు.

కుంగిన రహదారి.. పొంచి ఉన్న ప్రమాదం


బావుగారిపల్లె వద్ద కుంగిన సిమెంటు రహదారి అడుగుభాగం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం పంచాయతీ బావుగారిపల్లె వద్ద వంతెనపై వేసిన సిమెంటు రహదారి కుంగిపోతోంది. నిర్మాణ పనుల్లో భాగంగా అడుగుభాగంలో వేసిన రాళ్లు, మట్టి కొట్టుకుపోవడంతో వంతెనతో పాటు రహదారి రూపురేఖలను కోల్పోయింది. గుమ్మసముద్రంరోడ్డు నుంచి బావుగారిపల్లె వరకు ఉన్న 1.40 కి.మీల రహదారిని రూ.1.11 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. పంచాయతీరాజ్‌శాఖ 2021 సంవత్సరంలో ఈ పనులను పూర్తి చేసింది. అప్పట్లో నాణ్యతా ప్రమాణాలను పాటించలేదు. గుమ్మసముద్రంచెరువు రెండు మొరవల నుంచి వర్షపునీరు జోరుగా రావడంతో వంతెన దెబ్బతింది. ఈ క్రమంలో సిమెంటు కట్టడాలు కోసుకుపోయాయి. మళ్లీ వర్షాలు కురిస్తే వంతెనతో పాటు రహదారి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే బావుగారిపల్లెతో పాటు పలుప్రాంతాలకు వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. వంతెనతో పాటు రహదారి మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గురువులతో సమావేశమైన పూర్వ విద్యార్థులు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : వాల్మీకిపురం ప్రభుత్వ పీవీసీ ఉన్నత పాఠశాలలో 1980లో పదోతరగతి పూర్తి చేసుకున్న వారు ఆదివారం విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆప్యాయంగా పలకరించుకున్నారు. జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, మాకం సదర్శన్, రఘురాం, రామిశెట్టి మనోహర్, డాక్టర్ జానం గంగిరెడ్డి, ఎంఈవో సుబ్రహ్మణ్యం, విజయ్‌రెడ్డి, ఉప సర్పంచి కేశవరెడ్డి, ఇస్రో హరినాథశర్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గజ్జెలవాండ్లపల్లిలో తాగునీటి ఎద్దడి

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ గజ్జెలవాండ్లపల్లిలో గత 15రోజులుగా మంచినీటి ఎద్దడి నెలకొందని గ్రామస్థులు వాపోయారు. అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోలేదని ఆరోపించారు. మంచినీటి కోసం వ్యవసాయ పొలాల వద్దకు వెళ్తున్నారు. ఈ విషయమై గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారి బాలచంద్రాచారిని వివరణ కోరగా.. రెండు రోజుల నుంచి ట్యాంకుల ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు. బోరుబావి తవ్వకానికి ప్రతిపాదనలు పంపామన్నారు.

అక్రమ కేసుల నమోదుపై నిరసన

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : బాస్ అధ్యక్షుడు శివప్రసాద్‌తో పాటు నాయకులపై పోలీసులు బనాయించిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండు చేస్తూ బి.కొత్తకోటలో ఆదివారం నిరసన కార్యక్రమం జరిగింది. స్థానిక జ్యోతి బస్టాండులో బాస్ కార్యకర్తలు రాస్తారోకో చేసి వాహనాల రాకపోకలను నిలిపేశారు. మదనపల్లెలో బుద్ధునికొండపై విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలని బాస్ అధ్యక్షుడితో పాటు కార్యకర్తలు శాంతియుతంగా ధర్నా చేస్తే పోలీసులు అక్రమంగా కేసును బనాయించడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు కేవీ రమణ, సింగన్న సచిన్, రామచంద్ర, మాధవ, వెంకటేశులు పాల్గొన్నారు.

10న విద్యారంగ సమస్యపై మహాధర్నా

రాజంపేట, న్యూస్‌టుడే: విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 10న విజయవాడలో తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర పిలుపునిచ్చారు. రాజంపేటలో మహాధర్నాకు సంబంధించిన గోడపత్రాలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: సమాజంలో 'లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్' సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. రాయచోటిలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ పేదలకు తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం క్లబ్ నూతన కార్యవర్గ అధ్యక్షుడు శ్యామ్, కార్యదర్శి షేక్ ఇందాద్ అహమ్మద్, కోశాధికారి మనోహర్ రాజు, ఇతర సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు హరినాథరెడ్డి, శివారెడ్డి, గౌతమ్, చిన్నపరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి

శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేటలో జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని భాజపా నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మన్నూరు, పట్టణంలోని పార్టీ కార్యాలయాల్లో వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, ఆదినారాయణ, వై.సురేష్‌రాజు, పి.నాగేశ్వరరావు, నరేంద్రరాజు, షబ్బీర్‌అహమ్మద్, సునీతనారాయణవర్మ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

స్థానికులతో కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, నాయకులు

పుల్లంపేట, న్యూస్‌టుడే: ఎన్డీయే ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. మండలంలోని కేతరాజుపల్లి, దళవాయిపల్లి, శ్రీరాములపేట, కొమ్మనవారిపల్లి గ్రామాల్లో ఆదివారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. తెదేపా నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, ఆదినారాయణరెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రాయచోటి: కూటమి ప్రభుత్వంతోనే పేదల సంక్షేమమని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.నాగేంద్రయాదవ్ పేర్కొన్నారు. రాయచోటిలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రాయచోటి నియోజకవర్గంలో రూ.345 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రాయచోటి పురపాలకలో రూ.32 లక్షలతో మురుగునీటి కాలువలు, సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు జరిగాయన్నారు. పల్లె పండగ కింద రూ.33.96 కోట్లు సీసీ రోడ్లు నిర్మాణాలు చేపట్టారన్నారు.

ముగిసిన కట్ట పుట్టాలమ్మ జాతర

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: మంగంపేటలో జరుగుతున్న కట్ట పుట్టాలమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. భక్తుల కోర్కెలు తీర్చే అమ్మవారిని చూడటం కోసం భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి తరలి వచ్చారు. మంగంపేట కట్టపుట్టాలమ్మ జాతరలో అమ్మవారికి పొంగళ్లు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రత్యేక అలంకారంలో పుట్టాలమ్మ

ధర దిగాలు... రైతు కుదేలు

- పూర్తి కావొస్తున్న మామిడి పంట
- మద్దతుకు అన్నదాతల ఎదురుచూపు

దిగుబడులు మార్కెట్ యార్డుకు తెచ్చిన రైతులకు రసీదులిస్తున్న ఉద్యానశాఖ అధికారి వెంకట భాస్కర్

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: ఎన్నో ఆశలతో ఏడాది పాటు ఎదురు చూసిన మామిడి పంట రైతులను నష్టాలనే మిగులుస్తోంది. గతంలో ఎప్పుడూ లేని ధరలతో సాగుదారులు ఈ ఏడాది తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ముఖ్యంగా తోతాపురి రకం సాగు చేసిన వారు బాధపడుతున్నారు. పంట దిగుబడులకు ప్రాముఖ్యమైన ఈ రకం ప్రస్తుతం టన్ను రూ.2 వేలు పలుకుతోంది. సీజన్ ప్రారంభంలో రూ.12 వేలు పలికిన రకాలు రోజులు గడిచేకొద్దీ దిగజారిపోయాయి. ఈ పరిస్థితిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులకు కిలోకు రూ.4 చొప్పున మద్దతు ధర ప్రకటించింది. ఉద్యాన, వ్యవసాయ సిబ్బందిని ఏర్పాటు చేసి మామిడి కాయలు యార్డులకు వచ్చే దిగుబడులు, పండించిన రైతుల వివరాలను సమగ్రంగా నమోదు చేయిస్తోంది. స్వయాన కలెక్టర్ ఆయా ప్రాంతాల్లో పర్యటించి రైతులకు ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. అయితే ప్రభుత్వం నుంచి మద్దతు ధర ఎప్పుడు అందుతుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

తగ్గిన దిగుబడులు

జూన్ నెల 9వ తేదీ నుంచి ప్రభుత్వం రైతుల వివరాలను నమోదు చేయడం ప్రారంభించింది. నెల రోజుల కిందట రోజుకు 700 నుంచి 1000 మెట్రిక్ టన్నుల మామిడి కాయలు యార్డులకు వచ్చేవి. రానురాను కోతలు పూర్తయ్యే దశకు చేరుకుంటున్నాయి. ప్రస్తుతం రోజుకు 200 నుంచి 300 మెట్రిక్ టన్నులు మాత్రమే వస్తున్నాయని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. చిత్తూరులోని పండ్ల రసాల పరిశ్రమల యాజమాన్యాలు దిగుబడులను కొనుగోలు చేయకపోవడంతో కొందరు తోటల్లోనే కాయలను వదిలేస్తున్నారు. కోత కూలీలు, రవాణా ఖర్చులైనా తగ్గుతాయని భావిస్తున్నారు.

కోలుకోలేకపోతున్నాం

ఈ సంవత్సరం అన్ని పంటలూ రైతులను వేధిస్తున్నాయి. ఏడాది మొదట్లో సాగు చేసిన దోస, కర్బూజ పంటలు సరైన ధరలు లేక, కొనే వారు లేక పొలాల్లోనే వదిలేయాల్సి వచ్చింది. మామిడిపై ఆశలు పెట్టుకుంటే ధరలు పలకకపోవడంతో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మామిడికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర త్వరితగతిన ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- ఆర్.శివరాజు, మామిడి రైతు

ప్రక్రియ కొనసాగుతోంది

రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, చిట్వేలి మండలాలకు సంబంధించి ఇప్పటి వరకు 12 వేల మెట్రిక్ టన్నుల దిగుబడులు, వాటికి చెందిన 1,800 మంది రైతులను నమోదు చేశాం. ఈ వివరాలు ప్రతి రోజూ మారుతుంటాయి. మన ప్రాంతంలో పంట దాదాపు పూర్తి కావొచ్చింది. చిత్తూరు జిల్లాలో ఇంకా సగం పంట కోతల దశలో ఉంది. అది కూడా పూర్తయిన మీదట ప్రభుత్వం మద్దతు ధర చెల్లించే కార్యక్రమం చేపడుతుందని భావిస్తున్నాం. పూర్తి వివరాలను ప్రతి రోజు ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. **- ఎం.వెంకటభాస్కర్, ఉద్యాన శాఖ అధికారి, రైల్వేకోడూరు**

పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా ప్రమాద బీమా

కార్మికులకు ప్రమాద బీమా బాండ్లను పంపిణీ చేస్తున్న బత్యాల చంగల రాయుడు

రైల్వేకోడూరు, రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగలరాయుడి పుట్టిన రోజు వేడుకలను ఆదివారం రైల్వేకోడూరులో ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు నిర్వహించారు. స్థానిక బత్యాల భవన్‌లో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కోడూరు పంచాయతీ పరిధిలో పని చేస్తున్న 80 మంది పారిశుద్ధ్య కార్మికులకు బత్యాల దుస్తులు పంపిణీ చేశారు. వారికి రూ.10 లక్షల చొప్పున టర్మ్ పాలసీ ద్వారా వ్యక్తిగత ప్రమాద బీమా చేయించారు. బీమాకు సంబంధించిన బాండ్లను కార్మికులకు అందజేశారు. రాజంపేట మండలం తాళ్లపాక, బోయనపల్లి ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగలరాయుడు పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.

తెదేపా కార్యకర్తకు ఆర్థిక సాయం

నందలూరు, న్యూస్‌టుడే: ఆడపూరు హరిజనవాడకు చెందిన తెదేపా కార్యకర్త వెంకటసుబ్బయ్య అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారు. తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి విజయశేఖర్ రెడ్డి రూ.20 వేల నగదును వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు.

వెంకటసుబ్బయ్యను పరామర్శిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

వైభవంగా తొలి ఏకాదశి పూజలు

లక్ష్మీనరసింహస్వామి

కోదండరామ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

వివిధ రకాల పుష్పాలతో దర్శనమిస్తున్న శ్రీ వేంకటేశ్వరుడు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినం నేపథ్యంలో పట్టణంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త బండాత్మకూరు సుదర్శనశర్మ, అర్చకుడు మణికంఠశర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచే అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

చిన్నమండెం: మండల పరిధిలోని దేవగుడిపల్లెలో వెలసిన శ్రీమండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో అర్చకులు ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాజంపేట గ్రామీణ : కూచివారిపల్లిలో శ్రీకోదండరామస్వామి ఆలయంలో అర్చకులు గోపాల్ ప్రత్యేక పూజలు చేశారు.

నర్వకాటిపల్లె దశ తిరిగేనా?

కంకర తేలి అధ్వానంగా ఉన్న నర్వకాటిపల్లె- కొత్తమాధవరం రహదారి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట మండలం నర్వకాటిపల్లె పంచాయతీలో అభివృద్ధి పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. సమస్యలు చాలా ఉన్నా పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు గట్టిగా కృషి చేయడం లేదు. నర్వకాటిపల్లె నుంచి కొత్తమాధవరం వరకు వెళ్లే మట్టి దారి కంకర తేలి అధ్వానంగా ఉంది. గ్రామ సచివాలయం నుంచి 710 మీటర్ల పొడవున్న ఈ మార్గాన్ని విస్తరణ, అభివృద్ధి చేయాలని 2018 మే 28న రూ.61.40 లక్షలకు పచ్చజెండా ఊపారు. వైకాపా పాలనలో బిల్లుల భయంతో మొదలు పెట్టలేదు. సీసీ రోడ్డు వేస్తే ప్రయాణం సాఫీగా సాగుతుందని ప్రజలు ఆశించారు. ఆరేళ్లుగా ఎలాంటి కదలిక లేదు. ఆరోగ్య కేంద్రం నిర్వహణకు భవన నిర్మాణ పనులను చేపట్టి నిధుల్లేక మధ్యలోనే ఆపేశారు. పైకప్పు వేసి వదిలేశారు. రెండేళ్లుగా పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నా ముందుకు సాగడం లేదు. ఊర్లో ఉన్న తాగునీటి ట్యాంకులోకి నీరు సరఫరా కావడం లేదు. కొన్ని నెలలు అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. మనబడి 'నాడు-నేడు' రెండో విడతలో మౌలిక వసతులు కల్పించాలని అనుమతిచ్చినా కొంత మేర చేసి నిలిపివేశారు. అరుంధతీకాలనీ (రైల్వేకాలనీ)లో నీటి నిల్వ కోసం ఎలాంటి ట్యాంకు లేదు. కరెంటు ఉంటేనే నీరందుతోంది. లేదంటే కన్నీటి కష్టాలే. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ రక్షణ గోడను నిర్మించాలని అడుగుతున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. శ్మశానం స్థలం ఆక్రమణకు గురి కాకుండా ప్రహరీ నిర్మించాలని, తాగునీటి వసతి కల్పించాలని వేడుకుంటున్నా ఉలుకుపలుకు లేదు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి

టీకా వేస్తున్న పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ప్రతాప్, సిబ్బంది

రాజంపేట, వీరబల్లి, చిన్నమండెం, న్యూస్‌టుడే: పెంపుడు జంతువులతో యజమానులు జాగ్రత్తగా ఉండాలని.. వాటికి వ్యాధులు రాకుండా చూసుకోవాలని రాజంపేట పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ తెలిపారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం శునకాలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. పశువైద్యులు భాగ్యవతి, వేదవతి, జూనియర్ వెటర్నరీ అధికారి ఎం.వరదయ్య పాల్గొన్నారు.

* వీరబల్లిలోని పశు వైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాధి రాకుండా పశువైద్యులు గణేష్ ఉచితంగా టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. చిన్నమండెం పశు వైద్యశాల ఆవరణలో వైద్యుడు భాస్కర్ ఆధ్వర్యంలో రేబిస్ టీకాలు వేశారు.

ప్రైవేటీకరణ నిలిపేయాలని డిమాండ్

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : విద్యుత్తు సంస్థలను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని విద్యుత్తు ఉద్యోగుల ఒప్పంద ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిస్కం అధ్యక్షుడు శివశంకర్ పేర్కొన్నారు. ఒంటిమిట్ట 33/11కేవీ విద్యుత్తు ఉప కేంద్రంలో కార్మిక సంఘం నాయకులు ఆదివారం సమావేశమై ఈ నెల 9న నిర్వహించే సమ్మెను జయప్రదం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. శ్రీనివాసులు, శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలని యత్నించడం దారుణమని మండిపడ్డారు. అనంతరం డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.పెద్దయ్య, ప్రధాన కార్యదర్శిగా ప్రేమ్‌కుమార్, కోశాధికారిగా రాంప్రసాద్ ఎన్నికయ్యారు.

రాజంపేట పట్టణంలో కొలువున్న పీర్లు

వంగిమళ్లలో భక్తుల మధ్య ఊరేగింపు

చిన్నమండెంలో జలధికి తరలుతూ...

భక్తిశ్రద్ధలతో మొహర్రం

పలు గ్రామాల్లో అగ్నిగుండాల ప్రవేశం

వై.కోటలో పీర్లతో అగ్నిగుండంలోకి ప్రవేశిస్తున్న భక్తులు

రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు గ్రామాల్లో అగ్నిగుండాలు ఏర్పాటు చేసి భక్తులు వాటిలోకి ప్రవేశించారు. ప్రధానంగా వీరబల్లి మండలం వంగిమళ్లలో పీర్లను ప్రత్యేకంగా అశ్వవాహనంపై ఊరేగించారు. దాతలు అన్నదానం ఏర్పాటు చేయించారు. రామాపురం మండలం చిట్లూరు కస్పాలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఓబులవారిపల్లె మండలం వైకోట గ్రామ వీధుల్లో పీర్లను ఊరేగించారు. రాజంపేటలో పీర్ల ఊరేగింపు వైభవంగా జరిగింది. పుల్లంపేట మండలంలోని కోనయ్యగారిపల్లి, కేతరాజుపల్లి, దళవాయిపల్లి, ఎ.పుత్తనవారిపల్లి, కృష్ణంపల్లి తదితర ప్రాంతాలలో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.

- న్యూస్‌టుడే, రాయచోటి కల్చర్ బృందం

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

గాలివీడు, న్యూస్‌టుడే: అరవీడు పంచాయతీ మలసానివాండ్లపల్లెకు చెందిన గోపాల్ (37) తన భార్య కాపురానికి రాలేదని మనస్తాపానికి గురై ఆదివారం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారని ఎస్సై రామకృష్ణ ఆదివారం తెలిపారు. గోపాల్ మద్యానికి బానిస కావడంతో దంపతుల మధ్య కలహాలు ఏర్పడ్డాయి. దీంతో ఆమె మూడు నెలల కిందట పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు, దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట పట్టణం మార్కెట్‌కు సమీపంలో సెంట్రల్ లైటు ఆదివారం అకస్మాత్తుగా కిందపడిపోయింది. ఆ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సెంట్రల్ లైట్లను తరుచూ పరీక్షించాలని స్థానికులు కోరారు.

ప్రథమ వర్ధంతి

ప్రేమానురాగాలకు మారుపేరైన మిమ్మల్ని కోల్పోయిన అభాగ్యులం. మీ మమతకు, ఆదరణకు దూరమై అనాథలమై విలపిస్తున్నాము. మీరు లేని లోటు తీరనిది. మీ ఆశీస్సులే మాకు శ్రీరామరక్ష. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... మీ కిదే మా అశ్రునివాళి

భార్య : ఉల్చి పద్మజ
కుమార్తె : ఉల్చి కిరణ్మయి
కుమారులు : ఉల్చి నాగశ్రీనివాసరాజు (16 సం॥)
ఉల్చి వెంకటసాయి చైతన్యరాజు (15 సం॥)

స్వర్గీయ ఉల్చి వెంకట రమణరాజు గారు
జననం: 1969 ★ మరణం: 2024

BR

18వ వర్ధంతి

మీ ఆత్మీయ పలకరింపులు, ఉన్నత వ్యక్తిత్వం, నిరాడంబరత, ప్రేమాభిమానాలు మా హృదయాలలో ఎప్పటికీ మరువలేని మధుర జ్ఞాపకాలు. మీ వర్ధంతి సందర్భంగా మీ పవిత్రాత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థిస్తున్నాము.

కీ॥శే॥ గునిపాటి రంగమ్మ గారు
మంగంపేట, ఓబులవారిపల్లి (మం)
మరణం : 7.7.2007

మనుమడు :
గునిపాటి చెన్నరాయుడు
Ex. Vice MPP
తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు
మంగంపేట
మరియు కుటుంబ సభ్యులు

కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ 9న సమ్మె

నినాదాలు చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

రాజంపేట, న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, సి.రవికుమార్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు గాలి చంద్రయ్య పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం అన్ని సంఘాలతో సమావేశం నిర్వహించి సార్వత్రిక సమ్మెపై చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన సమ్మెకు అన్ని సంఘాలు మద్దతు తెలపాలన్నారు. కార్మికులు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సికిందర్, పి.మణి, నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకుడు పి.వి.రమణ, యూటీఎఫ్ నాయకుడు శ్రీహరి పాల్గొన్నారు.

రాయచోటి గ్రామీణ: లేబర్ కోడ్లు రద్దు చేయాలంటూ ఈ నెల 9న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త సమ్మెనే విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు పని గంటలు పెంచి జీతం పెంచకపోవడం దుర్మార్గమన్నారు.

10న విద్యారంగ సమస్యపై మహాధర్నా

రాజంపేట, న్యూస్‌టుడే: విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 10న విజయవాడలో తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర పిలుపునిచ్చారు. రాజంపేటలో మహాధర్నాకు సంబంధించిన గోడపత్రాలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ఇప్పటి వరకు విద్యారంగ సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పాఠశాలల విలీన ప్రక్రియ కారణంగా వేలాది పాఠశాలలు మూతపడ్డాయన్నారు. ఇలాంటి ఎన్నో సమస్యలపై చేపట్టిన మహాధర్నాకు జిల్లా వ్యాప్తంగా ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వెంకటరమణ, వరుణ్, కిశోర్, తరుణ్ పాల్గొన్నారు.

అదృశ్యంపై కేసు నమోదు

సుండుపల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత (28) అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని ఎస్సై ఎం.శ్రీనివాసులు తెలిపారు. భర్తతో కలహాల నేపథ్యంలో శనివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె తండ్రి ఆదివారం ఫిర్యాదు చేశారు.

దంపతులకు గాయాలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఒంటిమిట్ట అలుగువంక వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్దవటం మండలం పార్వతీపురానికి చెందిన సురేంద్ర, ఉమాదేవి దంపతులు గాయపడ్డారు. ఓబులవారిపల్లెకు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా రాజంపేట నుంచి కడప వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో గాయపడ్డారు.

CHANGE OF NAME

I, **NAGARIPATI SUBRAMANYAM** (Old Name), S/o Nagiripati Ananthaiah, R/o D.No : 8/296-3, Gandhi Nagar, Kodur, Kodur (M), Annamayya Dist., A.P-516101. I changed my name to Nagiripati Subramanyam. Henceforth, I will be known as **NAGIRIPATI SUBRAMANYAM** (New Name).

CHANGE OF NAME

I, **NAGARIPATI LEELA** (Old Name), W/o Nagiripati Subramanyam, Passport No : H3898698, R/o D.No : 8/296-3, Gandhi Nagar, Kodur, Kodur (M), Annamayya Dist., A.P-516101. I changed my name to Nagiripati Leela. Henceforth, I will be known as **NAGIRIPATI LEELA** (New Name).

LOST OF MARKS LIST

KAVETI MANOJ KUMAR, S/o KAVETI CHALAPATHI, RLY.KODUR (ML), KUKKALADODDI, BHUVANAGIRI PUBLIC SCHOOL, KADAPA DIST., I AM LOST MY 10th CLASS MARKS LIST (U.I.No : 6809198 & INDEX No : 1184081/028) YEAR 2018 BATCH. WHILE I AM TRAVELLING FROM RESIDENCE TO RLY.KODUR. IF ANYONE FOUND PLEASE INFORM ABOVE ADDRESS.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
(యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా స్పాన్సర్ చేయబడిన ప్రభుత్వ సంస్థ)
ఓబులవారిపల్లి బ్రాంచ్
డిమాండ్ నోటీసు - సెక్షన్ 13(2) ప్రకారం
The Securitisation and Reconstruction of Financial Assets and Enforcement of Security Interest Act, 2002

To:

Borrower	Co-Obligant/Guarantor	Mortgager/s
1. Smt. రాజబోయిన జయశ్రీ W/o శ్రీ కృష్ణమూర్తి, H.No.6-19, కొత్తవీధి, పాపనాయుడు పేట, వికృతామల, తిరుపతి -517526 2. Sri. రాజబోయిన కృష్ణమూర్తి, S/o శ్రీ గంగయ్య, H.No.6-19, కొత్తవీధి, పాపనాయుడు పేట, వికృతామల, తిరుపతి- 517526	3. Sri. బొమ్మి శివయ్య, S/o శ్రీ రామయ్య, బొంతలవారిపల్లి, ఓబులవారిపల్లి మండలం, అన్నమయ్య జిల్లా - 516108	Smt. రాజబోయిన జయశ్రీ, W/o శ్రీ కృష్ణమూర్తి, H.No.6-19, కొత్తవీధి, పాపనాయుడు పేట, వికృతామల, తిరుపతి-517526

Sir/Madam,

మీరు నం. 1, 2, 3 (లేదా మీరే అయితే) ఓబులవారిపల్లి బ్రాంచ్ నుండి క్రింది క్రెడిట్ ఫెసిలిటీలు పొందినట్లు బ్యాంక్ వద్ద రికార్డులు ఉన్నాయి:
- **ప్రగతి స్వగృహ స్కీమ్** (రూ. 22,40,000/-)
- **ప్రగతి కిసాన్ క్రెడిట్ కార్డు** (రూ.1,80,000/-) **మొత్తం రూ.** 24,20,000/- (ఇరవై నాలుగు లక్షల ఇరవై వేల రూపాయలు మాత్రమే) **గృహ నిర్మాణం మరియు కిసాన్ అవసరాల కోసం. రుణం/అప్పు అకౌంట్ నెం :** 91112181776 మరియు 91002081695.

Property Particulars:	D.No 7-82-a2a, RCC house building (G+1)
Location:	Balijapalli Road, 7th ward, Rajampeta
Survey No.:	513 paiki
Extent:	96.8 Sq. Yards
Owner's Name:	రాజబోయిన జయశ్రీ
Boundaries:	East: ఉప్పరపల్లి, ఆదిలక్షుమ్మ ఇల్లు West: A.శివ ప్రసాద్ గౌడ్ ఇల్లు North: రోడ్డు South: M.S.నాయుడు ఇంటి స్థలం

మీరు తీసుకున్న లోన్/ఫెసిలిటీని విడతల వారీగా లేదా వడ్డీతో సహా చెల్లించకపోవడంతో, ఈ లోన్లు 21-05-2025న NPA (Non - Performing Asset)గా గుర్తించబడ్డాయి. అందువల్ల మీరు ముగ్గురు కలిసి **రూ. 22,20,905/- (ఇరవై రెండు లక్షల ఇరవై వేల తొమ్మిది వందల ఐదు రూపాయలు మాత్రమే)**ను 22-05-2025 నాటి వరకు వడ్డీతో మరియు ఒప్పందంలోని ఇతర ఖర్చులు సహా చెల్లించాల్సి ఉంటుంది.

మీరు ఈ నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజుల్లోగా పై పేర్కొన్న మొత్తం వడ్డీతో సహా చెల్లించాలి. లేకపోతే, బ్యాంక్ మీకు ముందుగా కోర్టు జోక్యం లేకుండా క్రింద పేర్కొన్న చర్యలు తీసుకునే హక్కును కలిగి ఉంటుంది. (Securitisation and Reconstruction of Financial Assets and Enforcement of Security Interest Act, 2002 ప్రకారం):
- మాకు (పైన వివరించిన) ఇచ్చిన ఆస్తిని స్వాధీనం చేసుకోవడానికి మరియు ఆ మొత్తాన్ని తిరిగి పొందడానికి అమ్మడానికి, లీజుకు ఇవ్వడానికి లేదా కేటాయించడానికి.
- వ్యాపార ఆందోళనల నిర్వహణను స్వాధీనం చేసుకుని, విక్రయించడం, లీజుకు ఇవ్వడం లేదా బకాయి ఉన్న మొత్తాన్ని తిరిగి పొందడం కోసం కేటాయించడం.
- ఆస్తి లేదా వ్యాపార సమస్యలను నిర్వహించడానికి ఏదైనా వ్యక్తిని నియమించడం.
- బ్యాంకు, ఒక పేపర్ ప్రకటనను జారీ చేయడం ద్వారా వ్యాపార సంస్థల నిర్వహణను స్వాధీనం చేసుకున్న తర్వాత, డైరెక్టర్లతో సహా వ్యాపార సంస్థల నిర్వహణలోని వ్యక్తులను తొలగించవచ్చు

మీ ఆస్తిని పొందిన వేరే ఎవరైనా ఉంటే లేదా బ్యాంకుకు డబ్బు చెల్లించాల్సిన వారు ఉంటే, వారు కూడా ఈ మొత్తం చెల్లించాల్సి ఉంటుంది.

ఈ చర్యలకు సంబంధించి వచ్చిన ఖర్చులు అమ్మకానికి వచ్చిన మొత్తం నుంచి తీసుకోబడతాయి. కానీ అమ్మకాల ద్వారా వచ్చిన మొత్తం పూర్తిగా బ్యాంక్ బాకీని తీర్చలేకపోతే, బ్యాంక్ మిగతా మొత్తానికి సంబంధించి న్యాయపరమైన చర్యలు తీసుకోవచ్చు. అందరూ సంయుక్తంగా మరియు వేరువేరుగా బాధ్యత వహించాల్సి ఉంటుంది.

"ఈ నోటీసు అందిన తరువాత, చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం, మీరు బ్యాంకు అనుమతి లేకుండా పై తెలిపిన ఆస్తులను అమ్మడం లేదా వాటితో లావాదేవీలు చేయడం నిషేధించబడుతుంది."

చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకటనల ప్రకారం, మీరు బ్యాంకుకు బాకీ మొత్తం మరియు బ్యాంకు ఖర్చు చేసిన అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలను చెల్లించడం ద్వారా, సురక్షిత ఆస్తులను వేలం లేదా బహిరంగంగా లేదా ప్రైవేట్ ఒప్పందం ద్వారా లీజు, అప్పగింత లేదా అమ్మకం కోసం ప్రకటన వెలువడే తేదీకి ముందే, ఆ ఆస్తిపై మీ రిడెంప్షన్ హక్కును వినియోగించుకోవచ్చు.

ఈ నోటీసు ఇతర చట్టాల ప్రకారం బ్యాంకుకు లభ్యమయ్యే హక్కులను ప్రభావితం చేయకుండా జారీ చేయబడింది.

Authorized Officer
Andhrapradesh Grameena Bank, Obulavaripalli Branch.

(c) eenadu

తొలి పండగ.. అమ్మ నిండుగా..

మండలంలోని చందోలు, గోకరాజు నల్లిబోయినవారిపాలెం, పిట్లలవాని పాలెంలోని బండమ్మ ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి కావటంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందోలు బండమ్మ ఆలయంలో వారాహి నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం సందర్భంగా అమ్మవారు నిజరూపంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. - పిట్లలవానిపాలెం, న్యూస్‌టుడే

నారసింహా.. నమో నమః

తొలి ఏకాదశి సందర్భంగా మంగళగిరి పానకాల లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి దిగువ సన్నిధిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామిని భక్తులు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లు బంగారు గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ సహాయ కమిషనర్ కోగంటి సునీల్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, నగర ప్రముఖులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, మంగళగిరి

రహదారిపై చీకట్లు.. ప్రమాద కుంపట్లు

న్యూస్‌టుడే, కనగాల, గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ)

జూన్ మొదటి వారంలో చెరుకుపల్లిలో అర్ధరాత్రి దాటిన తర్వాత జాతీయ రహదారిపై ఓ మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి కొన్ని మీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. ప్రమాదంలో మహిళ మృతిచెందగా, మృతదేహం గుర్తు పట్టలేనంతగా ఛిద్రమైంది. హైవేపై వీధి దీపాలు రాత్రి సమయంలో వెలగకపోవటం ఇందుకు కారణమైంది.

గుళ్లపల్లి వద్ద చీకట్లో జాతీయ రహదారి

❖ కనగాల బైపాస్ వద్ద మలుపు ఉండటంతో వేగంగా వచ్చే వాహనదారులు దానిని గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిళ్లు వీధి దీపాలు వెలగకపోవడంతో చోదకులు మలుపును గుర్తించలేకపోతున్నారు. తీరా దగ్గరకు వచ్చాక ఆకస్మాత్తుగా మలుపు తిరగాల్సి రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ జరిగే ప్రమాదాలు కేవలం చీకట్లో రాత్రి సమయంలోనే జరుగుతున్నాయి.

❖ నిత్యం వందల వాహనాలతో ఒంగోలు-కత్తిపూడి జాతీయ రహదారి రద్దీగా మారింది. వాహనదారులు ప్రయాణం సాఫీగా సాగేందుకు హైవేపై వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఇవి రాత్రంతా వెలగడం లేదు. దీంతో జాతీయ రహదారిపై ఏ మలుపు ఎక్కడుందో? ఎక్కడ ప్రమాదకర ప్రాంతాలున్నాయో? చోదకులు గుర్తించడం కష్టంగా మారుతోంది. చీకట్లో ప్రయాణంతో అనేక కుటుంబాల్లో అంధకారం అలముకుంటోంది.

రాత్రి 10 గంటలు దాటితే చీకటే

జాతీయ రహదారిపై వీధి దీపాలను అధికారులు సాయంత్రం 6 గంటలకు వెలిగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి 9గంటల వరకు, పట్టణ ప్రాంతాల్లో రాత్రి 10గంటల వరకు మాత్రమే వెలుగుతున్నాయి. ఆ సమయం దాటాక ఆపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు గంటలు, పట్టణ ప్రాంతాల్లో కేవలం నాలుగు గంటలు మాత్రమే వీధిదీపాలు వెలుగుతున్నాయి. ఈ క్రమంలో జాతీయ రహదారిపై ఆయా పట్టణ పరిసరాల్లో చీకట్లోనే ప్రయాణించాల్సి వస్తోంది.

నిబంధనలు ఏం చెబుతున్నాయి..

జాతీయ రహదారిపై వీధి దీపాలు నివాస ప్రాంతాలు, కూడళ్లు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న చోట్ల ఏర్పాటు చేస్తారు. వీటిని సూర్యాస్తమయం నుంచి సూర్యోదయం వరకు వెలిగించాలనే నిబంధనలు ఉన్నాయి. ముఖ్యంగా మలుపులు, కూడళ్లు ఉన్న చోట వీటిని ఏర్పాటు చేసి తెల్లవారే వరకు వెలిగించాలి. కారణం ఇక్కడే ప్రమాదాలు జరిగే అవకాశం అధికం. రాత్రిళ్లు వీధి దీపాలు వెలిగించకపోవటంతో కనగాల బైపాస్ మలుపు వద్ద తరచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.

కనగాల వద్ద హైవేపై..

❖ సమస్యపై జాతీయ రహదారి రేపల్లె పర్యవేక్షక ఏఈ పురుషోత్తమరావు మాట్లాడుతూ రాత్రంతా దీపాలు వెలిగించాలని గుత్తేదారు అనేకమార్లు చెప్పామని, సమస్య ఉన్నట్లుగా మా దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు.

పెరుగుతున్న సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం వారం రోజులుగా సుమారు 12 అడుగులు పెరిగింది. ప్రస్తుతం జలాశయంలో 160.0644 టీఎంసీలు ఉన్నాయి. ఎడమ కాలువకు 2985, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 1275, ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 4,403 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 56,674 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. నేడో రేపో శ్రీశైలం క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ జలాశయానికి భారీగా వరద నీటిని వదిలే అవకాశం ఉంది. ఇదే వరద మరో వారం రోజులు కొనసాగితే సాగర్ జలాశయ నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరువ కానుంది.

ఉండలేరు.. వెళ్లలేరు!

పేదల కాలనీల్లో వసతుల లేక అగచాట్లు

న్యూస్‌టుడే, బాపట్ల, రేపల్లె అర్బన్

గత ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన లేఅవుట్లలో (జగనన్న కాలనీలు) కనీస వసతులు కల్పించలేదు. అప్పులు చేసి గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 288 లేఅవుట్లు వేసి జగనన్న కాలనీల పేరుతో 42 వేల మందికి ఇళ్ల స్థల పట్టాలు 2020 డిసెంబరులో పంపిణీ చేశారు. భూసేకరణలోనూ అధికారులు, వైకాపా నేతలు కలిసి రూ.కోట్లు దోచేశారు. నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో లేఅవుట్లు వేసి పట్టాలిచ్చి చేతులు దులిపేసుకున్నారు. వసతులు లేని ప్రాంతాల్లో స్థలాలు కేటాయించటంతో కొన్ని చోట్ల లబ్ధిదారులు పక్కాగృహాలు నిర్మించుకోలేకపోయారు. కర్లపాలెంలో జగనన్న కాలనీ లేఅవుట్ ప్రస్తుతం చిట్టడవిని తలపిస్తోంది.

బాపట్ల ప్యాడిసన్‌పేట లేఅవుట్‌లో ఇళ్ల మధ్య వర్షపు నీరు (పాత చిత్రం)

కర్లపాలెంలో చిట్టడవిని తలపిస్తున్న జగనన్న కాలనీ

❖ బాపట్ల, అద్దంకి, రేపల్లె ప్రాంతాల్లో పట్టణ శివారున లేఅవుట్లు వేసి మెరక వేయకుండా పేదలకు స్థలాలు కేటాయించారు. రోడ్లు, మురుగు కాలువలు నిర్మించలేదు. వర్షాకాలంలో పేదల కాలనీల్లో మోకాళ్లలోతున నీరు నిలిచి అవస్థలు పడుతున్నారు. ఆ సమయంలో అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి.

❖ కొన్నిచోట్ల వ్యయ ప్రయాసల కోర్చి పేదలు ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశారు. పైపులైన్లు వేయకపోవటంతో తాగునీరందక ఇబ్బంది పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా అరకొరగా సరఫరా చేస్తున్న నీటితో సరిపెట్టుకుంటున్నారు. జిల్లా కేంద్రం బాపట్లలో ప్యాడిసన్‌పేట, బేతనీకాలనీ, మూలపాలెం లేఅవుట్లలో 2 వేలకు పైగా పక్కా గృహాలు లబ్ధిదారులు నిర్మించుకున్నారు. గత ప్రభుత్వం ఒక్క రోడ్డు కూడా నిర్మించలేదు. వర్షాలకు కాలనీలు ముంపు బారినపడుతున్నాయి.

➡ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న కాలనీల పేరును ప్రధానమంత్రి పట్టణ ఆవాస యోజన గృహకల్ప నగర్‌లుగా మార్చింది. మురుగుకాలువలు, సిమెంటు రోడ్ల నిర్మాణానికి జిల్లాకు రూ.కోట్లలో నిధులు కావాల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోని కాలనీల్లో ఉపాధి హామీ పథకం కింద సిమెంట్ రోడ్లు, కాలువలు, పైప్‌లైన్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. మురుగు సమస్య పరిష్కారానికి ఇంకుడు గుంతలు, సామాజిక ఇంకుడు గుంతలు తవ్వాలని నిర్ణయించారు. పట్టణాల పరిధిలోని కాలనీల్లో పురపాలక సంఘాల నిధులతో అంతర్గత రోడ్లు నిర్మించాలని భావించినా సుమారు రూ.80 కోట్లకు పైగా నిధులు కావాల్సి ఉంది. అయితే పురపాలికల ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉంది. కాలనీల్లో సమస్యలపై గృహ నిర్మాణ శాఖ పీడీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేదల కాలనీల్లో రోడ్లు, సిమెంటు కాల్వల నిర్మాణానికి రూ.93 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపించామన్నారు. జల్‌జీవన్ మిషన్ నిధులతో పైప్‌లైన్లు వేసి తాగునీరందించటానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పనులు చేపడుతున్నారని చెప్పారు. పట్టణాల పరిధిలోని కాలనీల్లో వసతుల కల్పన బాధ్యత పురపాలక సంఘాలపై ఉందన్నారు.

10న మెగా పీటీఎం 2.0

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ నెల 10న మెగా పీటీఎం 2.0 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం ద్వారా విద్యాసంస్థలతో వారి బంధం బలోపేతం అవుతుందన్నారు.

కలెక్టర్ వెంకటమురళి

ఎలాంటి లోపాలు లేకుండా సమావేశాలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమం విజయవంతం అయ్యేలా తహసీల్దార్లు, డీవైఈవోలు, ఎంఈవోలు, ఎంపీడీవోలు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. విద్యార్థులతో స్వయంగా ఆహ్వానపత్రికలు తయారు చేయించి మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులను పీటీఎంకు ఆహ్వానించాలన్నారు. షైనింగ్ స్టార్ పురస్కారాలు అందుకున్న విద్యార్థులను ప్రత్యేకంగా ఆహ్వానించాలని తెలిపారు.

సమస్యలపై ఆన్‌లైన్లో అర్జీల స్వీకరణ

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రజలు తమ సమస్యలపై అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవటానికి మీ కోసం వెబ్‌సైట్ ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించిందని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ప్రజలు నమోదు చేసిన అర్జీల స్థితికి సంబంధించి సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100కు ఫోన్ చేయవచ్చన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల్లో సోమవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సమస్యలపై అర్జీలను కార్యాలయాల్లో నేరుగా అందజేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

గ్రామ దేవతలకు ప్రణమిల్లి..

గ్రామ దేవతలకు ఆషాఢం చీర, సారె సమర్పించేందుకు మేళతాళాలతో బయలుదేరిన భక్తులతో కొల్లూరులో కోలాహలం నెలకొంది. పాడిపంటలు, సిరిసంపదలతో తులతూగుతూ ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని కోరుతూ చింతలమ్మ, అంకమ్మ, సీతమ్మ, భవాని గ్రామ దేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.
- న్యూస్‌టుడే, కొల్లూరు

సమ్మెటవారిపాలెంలో నారుమడి

నారు మడి.. ట్యాంకర్‌తో నీటి తడి

కర్లపాలెం మండలం సమ్మెటవారిపాలెం కృష్ణా పశ్చిమ డెల్టాలో చివరి ఆయకట్టు ప్రాంతం. కాలువ నీరుతో నారు పోసి నాట్లు వేసేసరికి ఆగస్టు చివరి వారం అవుతుంది. మూడేళ్లుగా నవంబరు, డిసెంబరులో వరికోతల ముందు కురుస్తున్న భారీవర్షాలతో పంటలు నీటమునిగి, ధాన్యం రంగు మారి రైతులు నష్టపోతున్నారు. వరి సాగులో ఏటా పెట్టుబడి ఖర్చు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రతాపరెడ్డి, ఫకీర్‌రెడ్డి అనే రైతులు ట్యాంకర్ల నీరుతో ముందుగా నారు పోసి పెంచుతున్నారు. మిగతా రైతుల కన్నా నెల ముందుగా వరి సాగు చేపట్టడంతో కూలీలకు డిమాండ్ ఉండదని, అలాగే డిసెంబరులో భారీవర్షాలు కురిసే వేళకు వరి కోతలు, నూర్పిడి పూర్తిచేసి ధాన్యాన్ని ఇంటికి తరలిస్తామని తెలిపారు. నారుమడులకు ట్యాంకర్ నీటితో ఆరంభంలో కొంత ఖర్చు అయినా ముందు సాగుతో ఇతర ఖర్చులు కలిసి వస్తాయని చెబుతున్నారు.
– న్యూస్‌టుడే, బాపట్ల

టీకాలతో రేబీస్ నివారణ

మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి వేణుగోపాల్

బాపట్ల, న్యూస్‌టుడే: టీకాలు వేయటం ద్వారా పశువులు, పెంపుడు జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా ఉంటాయని జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి వేణుగోపాల్ అన్నారు. ప్రాంతీయ పశు వైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేబీస్ నివారణకు పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. జంతువులకు ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా పశువైద్యశాలకు తీసుకువచ్చి వైద్యం చేయించాలని పేర్కొన్నారు. శునకాలకు రేబీస్ నిరోధక వ్యాక్సిన్లు వేశారు. ఏడీ శ్రీనివాసరావు, పశువైద్యులు కిరణ్, సాహిత్య, రేచల్ దివ్య పాల్గొన్నారు.

యువతలో మార్పు తీసుకొచ్చేందుకు కృషి

గుంటూరు, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు బానిసలై నిర్వీర్యమైపోతున్నారని ఏపీ ఈగల్ వింగ్ అధిపతి, ఐజీ ఆకే రవికృష్ణ తెలిపారు. గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో డ్రగ్స్ నివారణపై యువతకు అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఆకే రవికృష్ణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్లే సమాజంలో నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. నేరాలను అరికట్టేందుకు ఏపీ ప్రభుత్వం ప్రత్యేక ఈగల్ పోలీసు విభాగాన్ని ఏర్పాటు చేసిందన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, గంజాయి సాగు చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈగల్ వింగ్ పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో మత్తు పదార్థాలను అధిక శాతంలో వినియోగిస్తున్న వారిలో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులు ఉండడం దురదృష్టకరమన్నారు. దీనిని నివారించే నిమిత్తం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలు వివరిస్తున్నామన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన రెడ్‌క్రాస్ రాష్ట్ర కోశాధికారి రామచంద్రరాజు మాట్లాడుతూ చెడు వ్యసనాల బారిన పడిన యువతలో మార్పు తీసుకొచ్చేందుకు ఈగల్ వింగ్ అధిపతి ప్రత్యేక చొరవతో శ్రమిస్తున్నారన్నారు. ఏపీ పోలీసు ఈగల్ వింగ్, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముందుగా మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల విద్యార్థులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆకే రవికృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మట్టుపల్లి మోహన్, ఈగల్ వింగ్ ఎస్పీ నగేష్‌బాబు, డీఎస్పీ అరవింద్, తెనాలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ భానుమతి తదితరులు పాల్గొన్నారు.

చెప్పింది చేయలేక.. చేసింది చెప్పలేక!

పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శుల పాట్లు

ఈనాడు, బాపట్ల, న్యూస్‌టుడే, అద్దంకి

ఉన్నతస్థాయి అధికారులు చెప్పిన ఆదేశాలు వారు అమలు చేయలేకపోతున్నారు. క్షేత్రస్థాయిలో కొందరు సర్పంచులు సృష్టిస్తోన్న అడ్డంకులు, చేస్తోన్న పనులు పైస్థాయిలో చెప్పలేక మదనపడుతున్నారు. మొత్తంగా బాపట్ల జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నారు. చెత్త రహిత జిల్లా లక్ష్యంగా బాపట్ల కలెక్టర్ అడుగులు వేస్తున్నారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని భావించిన కలెక్టర్ వెంకటమురళి పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ క్రమంలోనే విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్న విషయం తెలిసిందే. ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, గ్రామ కార్యదర్శులతో బాపట్లలో మే 22న ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, గ్రామాల్లో పారిశుద్ధ్యంపై వారికి అవగాహన కల్పించారు. రహదారుల వెంట చెత్త కనిపించరాదంటూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. నెల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టగా.. చెత్త డంప్ చేయడానికి స్థలాలు లేని చోట తక్షణమే భూమి కేటాయించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వారితోనే సమస్య

కలెక్టర్ తమదైన రీతిలో పారిశుద్ధ్య నిర్వహణకు కృషి చేస్తుంటే కొన్ని గ్రామాల్లో సర్పంచుల నుంచి ప్రతికూల పరిస్థితి ఎదురవుతోంది. స్థానికంగా ఉండే హరిత రాయబారులకు జీతాలు చెల్లించే విషయంలో మెలిక పెడుతుండటంతో అక్కడ పారిశుద్ధ్య నిర్వహణకు అవరోధాలు ఎదురవుతున్నాయి. వారికి పంచాయతీ కార్యదర్శులు నచ్చజెప్పినా వినకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతోంది. ఆదేశాలు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలవ్వాలని ఎంపీడీవోలు ఒత్తిడి తెస్తుంటే, తాము చెప్పిందే నెగ్గాలని కొందరు సర్పంచులు పంతం పడుతున్నారు. దీంతో ఏం చేయాలో అర్థం కాక పంచాయతీ కార్యదర్శులు తలపట్టుకుంటున్నారు. ఓ దశలో నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్ వేటు వేస్తామంటూ హెచ్చరికలు వినిపిస్తున్న క్రమంలో ఆందోళనకు గురవుతున్నారు. ఏం చేయాలో అర్థం కాక సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్‌లో తమ గోడు చెప్పుకొనేందుకు కొందరు పంచాయతీ కార్యదర్శులు సిద్ధమైనట్లు సమాచారం.

మరోసారి ఏఎన్ఎంల కౌన్సెలింగ్

గుంటూరు వైద్యం: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏఎన్ఎం గ్రేడ్-3గా పని చేస్తున్న వారికి తిరిగి సోమవారం కౌన్సెలింగ్ ఏర్పాటు చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయలక్ష్మి ఆదేశాలిచ్చారు. గత వారం రోజుల నుంచి రాత్రింబవళ్లు కార్యాలయంలో కూర్చొని బదిలీల కౌన్సెలింగ్ పూర్తి చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏఎన్ఎం గ్రేడ్-3గా పని చేస్తున్న సుమారు 200 మందికి ఇటీవలే పదోన్నతులిచ్చి వివిధ చోట్ల నియమించారు. అయినా ఇటీవల నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్‌లో వీరు పదోన్నతిపై పని చేస్తున్న స్థానాలను కూడా ఖాళీల జాబితాలో చూపించారు. చాలామంది వాటిని ఎంపిక చేసుకున్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఇది సరైన విధానం కాదని, కౌన్సెలింగ్‌ను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని ఆదేశించారు. మళ్లీ 900 మంది ఏఎన్ఎంలకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జడ్పీ భూమి స్వాధీనానికి అడుగులు

ఆర్అండ్‌బీకి కేటాయించిన గత ప్రభుత్వం

గుంటూరు, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వ హయాంలో జిల్లా పరిషత్తుకు చెందిన భూమిని ఆర్అండ్‌బీ శాఖకు కేటాయించగా.. దానిని తిరిగి జడ్పీ సొంతం చేసుకునేలా అడుగులు పడుతున్నాయి. గత పాలకులు రూ.కోట్ల విలువైన భూమిని నామమాత్రపు ధరకు ఆర్అండ్‌బీ శాఖకు కట్టబెట్టి జడ్పీకి నష్టం చేకూర్చారు. నాటి జీవో రద్దు చేయాలని పల్నాడు జిల్లా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు లేఖ రాయడంతో జడ్పీ అధికారులు ప్రభుత్వానికి అప్పీల్ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

టోల్ ప్లాజా కోసం లీజుకు..

పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు సర్వే నంబరు 251లో జడ్పీకి 2.71 ఎకరాల భూమి ఉంది. దానిని మెస్సర్స్ నామ్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్‌కు చెందిన టోల్ ప్లాజా నిర్వహణ కోసం ఏడాదికి రూ.2,43,900 చెల్లించేలా 2013లో కేటాయించారు. 2018, అక్టోబరు 31 వరకు జడ్పీకి లీజు చెల్లించారు. 1, నవంబరు 2018 నుంచి 31, అక్టోబరు 2021 వరకు ఏడాదికి రూ.3,25,192 చొప్పున లీజు నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినా చెల్లించలేదు. 31, అక్టోబరు 2021తో లీజు గడువు పూర్తయింది. 1, నవంబరు 2023 వరకు రూ.12,64,546 నామ్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. ❖ జడ్పీకి చెందిన 2.71 ఎకరాల భూమికి రవాణా, ఆర్అండ్‌బీ శాఖ రూ.9.50 లక్షలు జిల్లా పరిషత్‌కు చెల్లించేలా రెవెన్యూ శాఖ జీవో ఎం.ఎస్.నం.76 జారీ చేసింది. జడ్పీకి ప్రమేయం లేకుండానే ఆ ప్రక్రియ కొనసాగడం గమనార్హం. వైకాపా ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి సిఫార్సుతో భూమిని బదలాయించారనే ప్రచారం ఉంది.

యరపతినేని లేఖతో..

గత ప్రభుత్వం జడ్పీ భూమిని ఆర్అండ్‌బీకి కేటాయించడంపై విచారణ చేసి జీవో రద్దు చేయాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు జడ్పీ సీఈవో వి.జ్యోతిబసుకు ఇటీవల లేఖ రాశారు. ఈ నెల 4న జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశం అజెండాలో దానిని చేర్చినప్పటికీ చర్చించలేదు. చర్చ జరగకున్నా అజెండాలో చేర్చినందున జీవోని పునః సమీక్షించాలని ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు సీఈవో జ్యోతిబసు 'న్యూస్‌టుడే'కి తెలిపారు.

నేలపట్టులా.. సంరక్షణకు మెట్టులా!

- ఉప్పలపాడు పక్షుల కేంద్రం అభివృద్ధిపై అటవీ శాఖ దృష్టి
- బర్డ్ కన్జర్వేషన్ రిజర్వ్ కింద నోటిఫై చేయాలని ప్రతిపాదన

ఈనాడు, అమరావతి

తిరుపతి జిల్లా నేలపట్టు బర్డ్ శాంక్చుయరీ తరహాలో పెదకాకాని మండలం ఉప్పలపాడు వలస పక్షుల రక్షిత కేంద్రాన్ని అభివృద్ధి చేసే దిశగా అటవీ శాఖ అడుగులు వేస్తోంది. ఈ కేంద్రాన్ని వన్యప్రాణుల సంరక్షణ చట్టం- 1972ని అనుసరించి 'ఉప్పలపాడు బర్డ్ కన్జర్వేషన్ రిజర్వ్' కింద నోటిఫై చేయాలని అధికారులు ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

ప్రయోజనం ఏంటి?

- పక్షుల రక్షిత కేంద్రం అంటే ఎవరూ వాటిని వేటాడకుండా, పట్టుకోకుండా రక్షించే ప్రదేశం మాత్రమే. ప్రస్తుతం ఉప్పలపాడు ఆ కోవలోనే ఉంది.
- కన్జర్వేషన్ రిజర్వ్ కింద చేర్చితే ఆ ప్రాంత పర్యావరణ వ్యవస్థను కాపాడి పక్షుల సంఖ్య పెరగడానికి చర్యలు తీసుకుంటారు. అవి ఆరోగ్యకరంగా జీవించే పరిస్థితులు కల్పిస్తారు. సుదీర్ఘకాలం అక్కడి వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తారు.
- పరిసర ప్రాంతాల్లో పక్షులకు అనువైన వ్యవసాయం చేసేలా చూడడం, కాలుష్యాన్ని తగ్గించడం, వాటి రక్షణ పరంగా ప్రజల్లో అవగాహన పెంపొందించడం వంటివి చేపడతారు.

రక్షిత కేంద్రంలో పక్షులు

- ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన వెళ్లింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆమోద ముద్ర వేస్తే.. భవిష్యత్తులో కేంద్ర అటవీ శాఖ నుంచి ఈ కేంద్రం అభివృద్ధికి విరివిగా నిధులు మంజూరవుతాయి.

ఏడాదికి రూ.6 లక్షల ఆదాయం

- సుమారు 9.52 ఎకరాల విస్తీర్ణంలో ఉప్పలపాడు విదేశీ పక్షుల రక్షిత కేంద్రం ఉంది. 25 రకాల పక్షి జాతులు ఆశ్రయం పొందుతున్నాయి.
- 1996-97 నుంచి ఇది రాష్ట్ర అటవీ శాఖ పర్యవేక్షణలో ఉంది. పక్షుల సంరక్షణ, సంతానోత్పత్తి పరంగా స్థానికులు భాగస్వామ్యం వహిస్తున్నారు.
- 2024-25లో ఈ కేంద్రం ద్వారా రూ.6 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.
- దీనిని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా అధ్వానంగా మారింది. చెరువు గుర్రపుడెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది.

ఎన్నో సారూప్యతలు

నేలపట్టు, ఉప్పలపాడు కేంద్రాలకు సారూప్యతలున్నాయి. రెండూ చెరువులు. చుట్టూ పొలాలు, జాతీయ రహదారికి ఆనుకుని ఉన్నాయి. పక్షులు రెండుచోట్లా సంతానోత్పత్తి చేస్తున్నాయి. ప్రస్తుతం దీనిని అభివృద్ధి చేయాలని అటవీ శాఖ ప్రణాళిక రూపొందించింది. దీనిపై గుంటూరు జిల్లా అటవీ శాఖ అధికారిణి హిమశైలజ 'ఈనాడు' మాట్లాడుతూ.. ఉప్పలపాడు వలస పక్షుల రక్షిత కేంద్రాన్ని బర్డ్ కన్జర్వేషన్ రిజర్వ్ కింద నోటిఫై చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిపారు.

ఎగిరే ఇంజినీర్లు.. గిజిగాళ్లు

చెట్టుకు వేలాడుతున్న గూళ్లు

పచ్చని చెట్టుపై వేలాడుతున్న గూళ్లు గిజిగాడి పక్షుల ఇంజినీరింగ్ అద్భుతానికి మచ్చుతునకలు. నేటి ఆధునిక జీవన విధానం కారణంగా ఈ పక్షి గూళ్లు గ్రామాల్లోనూ కనుమరుగవుతున్నాయి. గ్రామాలకు దూరంగా ప్రశాంత వాతావరణంలో మాత్రమే ఇవి కనిపిస్తున్నాయి. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం అనమనమూరులో గుండ్లకమ్మ జలాశయం సమీపంలో ఇవి చూపరులకు కనువిందు చేస్తున్నాయి. వీటి నిర్మాణ శైలి అద్భుతంగా ఉంటుంది. సమాజంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగైపోతున్నాయి. కానీ గిజిగాడి పక్షులు మాత్రం ఎక్కడైనా సామూహికంగానే జీవిస్తాయి. కలిసికట్టుగానే ఉంటాయి. - న్యూస్‌టుడే, మేదరమెట్ల

ఇలాగైనా ఉపయోగపడుతున్నాయ్

గత వైకాపా హయాంలో ప్రజల సొమ్ము అప్పనంగా అన్ని విధాలా దోచేశారు. ప్రచార పిచ్చితో జగనన్న భూ హక్కు. సర్వేరాళ్లను కూడా వాడుకున్నారు. గ్రానైట్ కంపెనీలకు టెండర్లు ఇచ్చి రాళ్లను తయారు చేయించారు. కూటమి ప్రభుత్వ రాకతో జగనన్న భూ హక్కు. చట్టం రద్దైంది. దీంతో బల్లికురవ ప్రాంతంలోని గ్రానైట్ ఫ్యాక్టరీల్లో నిరుపయోగంగా ఉన్న సర్వే రాళ్లను ఆ వ్యాపారులతో మాట్లాడుకుని స్థానికులు నిర్మాణాలకు వినియోగించుకుంటున్నారు. చివరికి ఇవి ఇలా ఉపయోగపడుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. -బల్లికురవ, న్యూస్‌టుడే

ఆటపాటలతో బోధిస్తూ.. ఆసక్తి కల్పిస్తూ

❖ భవిత కేంద్రాల్లో ప్రత్యేక చిన్నారులకు భరోసా

❖ జిల్లా వ్యాప్తంగా 146 మంది చేరిక

పర్చూరు, న్యూస్‌టుడే

జిల్లాలో భవిత కేంద్రాలు	25
లబ్ధిపొందుతున్న చిన్నారులు	3253
సహిత విద్య ఉపాధ్యాయులు	49
ఇటీవల గుర్తించిన చిన్నారులు	146

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దాలనే లక్ష్యంతో భవిత కేంద్రాలకు కూటమి ప్రభుత్వం భారీ ఎత్తున నిధులు విడుదల చేసింది. వాటితో చిన్నారులకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేసి అందించింది. జిల్లా వ్యాప్తంగా మే 13 నుంచి జూన్ 9వ తేదీ వరకు సర్వే చేసి, తల్లిదండ్రులకు సహిత విద్యపై అవగాహన కల్పించారు. దీంతో 146 మంది ప్రత్యేక అవసరాల చిన్నారులు చేరారు. ప్రతి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఈ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వీటికి వచ్చే విద్యార్థులకు చిత్రాలతో పాటు ఆట పాటలతో కూడిన విద్యను బోధిస్తున్నారు. వస్తువులు, వాటి వినియోగాలు, పాటలతో పాటు వాటిలో అర్థం తెలిసేలా ప్రత్యేకంగా శిక్షణ పొందిన సహిత ఉపాధ్యాయులు బోధిస్తూ చదువుపై వారిలో ఆసక్తి పెంపొందిస్తున్నారు. మూడు మండలాలకు కలిపి ఓ ఫిజియోథెరపిస్టును నియమించారు. దివ్యాంగులైన పిల్లల్లో కాళ్లు, చేతుల్లో కదలికలు వచ్చేలా వారానికి ఒకసారి ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు.

కొరిశపాడులోని కేంద్రంలో చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న సిబ్బంది

రూ.25 లక్షల విలువైన పరికరాలు అందజేత

జిల్లా వ్యాప్తంగా సమగ్రశిక్షా అభియాన్ ద్వారా చిన్నారులకు అవసరమైన రూ.25 లక్షల విలువైన పరికరాలు పంపిణీ చేశారు. వినికిడి, చక్రాల కుర్చీలు, మూడు చక్రాల ఎలక్ట్రికల్ సైకిళ్లు, ఆట వస్తువులు అందించారు. తల్లిదండ్రుల సాయంతో వచ్చే పిల్లలకు నెలకు రూ.300, బడికి రాలేని స్థితిలో ఉన్న వారికి ఇంటివద్ద ఇంటి అలవెన్స్ కింద రూ.200 అందిస్తున్నారు. అంతేకాకుండా ప్రయాణ ఖర్చులను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుండటంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తల్లిదండ్రులకు ఆసక్తి

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. వారికి చదువుతో పాటు సమాజంపై అవగాహన కల్పించేలా చిత్రాలు, ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నాం. ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వైద్య సదుపాయం అవసరమైన చిన్నారులకు ఇళ్ల వద్దనే సేవలు అందిస్తున్నాం. దీంతో కేంద్రాలకు తమ బిడ్డలను పంపాలని తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.
- ఎం.జ్యోత్స్న, జిల్లా సమన్వయకర్త, విద్య, సమగ్రశిక్షా అభియాన్

పొగాకు కొనుగోలు వేగవంతం చేయాలి

జె.పంగులూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయడం శుభపరిణామం అని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య అన్నారు. పంగులూరులో ఆదివారం పర్యటించిన ఆయన మాట్లాడుతూ పొగాకు కొనుగోలు కేంద్రాలు పెంచాలని, కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కొక్క కేంద్రం నుంచి రోజుకు 1000 చెక్కులు కొనాలన్నారు. నాణ్యత పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా మానవీయకోణంలో ఆలోచించి, ఆదుకోవాలని సూచించారు. కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది లేకుండా అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు ఉన్నారు.

తొమ్మిది ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఈపూరుపాలెం ఆటోనగర్ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల కాలంలో ఈపూరుపాలేనికి చెందిన వ్యాపారులు అక్రమంగా ఇసుక రవాణా పెంచడంతో పోలీసులు బాపట్ల, చీరాల సరిహద్దులో పోలీస్ గస్తీ ఏర్పాటు చేశారు. దీంతో ఇసుక రవాణా రెండు రోజుల పాటు నిలిచిపోయింది. ఆదివారం గుట్టు చప్పుడు కాకుండా తిరిగి ప్రారంభించడంతో పోలీసులు అప్రమత్తమై తనిఖీలు పెంచారు. అనుమతి పత్రాలు లేని తొమ్మిది ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత ప్రవేశాలు

వేంపల్లె, న్యూస్‌టుడే

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కార్యాలయం

నాలుగు చోట్ల మిగులు సీట్లు 600

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 600 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన వారి వెయిట్ మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి విద్యార్థుల మెరిట్ జాబితాను తయారు చేసి ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి మొత్తం 4400 సీట్లు ఉన్నాయి. ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1100 సీట్లు ఉండగా దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ కోటా కింద 360 సీట్లు పోను నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1010 చొప్పున 4040 సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలలో ఉన్న సీట్లకు మెరిట్ జాబితా విడుదల చేసి జూన్ 30 నుంచి జులై 5వ తేదీ వరకు ఇడుపులపాయలో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేశారు. కౌన్సెలింగ్ తర్వాత ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 878 సీట్లు భర్తీ కాగా 132 సీట్లు మిగిలిపోయాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలో 1010కి 869 భర్తీ కాగా 141 సీట్లు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 867 భర్తీ కాగా 143, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు 826 సీట్లు భర్తీకాగా 184 సీట్లు మిగిలాయి. ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో జాప్యం, ఇప్పటికే విద్యపై ఆసక్తి లేని కారణంగా చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడంతో 600 సీట్లు ఖాళీ ఏర్పడింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ కేంద్రంగా రెండో విడత ప్రవేశాలకు సంబంధించిన రెండో జాబితాను అధికారులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

11, 12 తేదీల్లో ఆన్‌లైన్‌లో వివరాలు

ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలలో మిగిలిపోయిన 600 సీట్ల భర్తీకి తదుపరి మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 11, 12 తేదీల్లో వెబ్‌సైట్‌లో వెల్లడిస్తాం. ఈ మేరకు రెండో విడత జాబితా సిద్ధం చేసే పనిలో తమ సిబ్బంది ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. ఆ లోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తాం. - ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ

చిరుధాన్యం.. ఆరోగ్యభాగ్యం

న్యూస్‌టుడే, చీరాల అర్బన్, వేటపాలెం

చిరుధాన్యాలతో చేసిన ఇన్‌స్టంట్ పౌడర్ల ప్యాకెట్లు

కొవిడ్ అనంతరం ప్రతి ఒక్కరిలోనూ ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది... ఇదే సమయంలో ఆహార విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో చిరుధాన్యాల వాడకంపై పలువురు ఆసక్తి చూపుతున్నారు... వీటితో తయారుచేసే ఆహార పదార్థాలు, పౌడర్లు, ఇతర తినుబండారాలు స్వీకరిస్తున్నారు.. దీంతో జిల్లాలో వీటి వినియోగం ఇప్పుడిప్పుడే పెరుగుతోంది.

చిరు ధాన్యాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యపరంగా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే ఏటా డిసెంబరు 19న ప్రపంచ చిరు ధాన్యాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాలో వీటిని వాడేవారి సంఖ్య పెరుగుతోంది. దీంతో ప్రధాన పట్టణాలైన బాపట్ల, చీరాల, అద్దంకి ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ముఖ్యంగా షాపింగ్ మాల్స్‌లో విక్రయాలు మొన్నటి వరకు ఉన్నా ఒక మోస్తరుగా ఉండే చిల్లర దుకాణాల్లో ప్రస్తుతం ఇవి లభిస్తున్నాయి. ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేయడానికి పలువురు ముందుకొస్తున్నారు. అలాగే వీటితో తయారు చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలు అందుబాటులోకి వచ్చాయి. ఉదయం నడకదారులు, ప్రజల కోసం రాగిజావ, ఇతర పదార్థాలను తోపుడు బండ్లపై ఉంచి విక్రయిస్తున్నారు. చీరాల పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్న కొత్తపేటలో ఏడాది క్రితం ఓ మహిళ స్వయం ఉపాధి కింద వీటితో తయారు చేసిన పౌడర్లు అప్పటికప్పుడు వంట చేసుకొని, తినేందుకు వీలుగా ప్యాకెట్లలో నింపి విక్రయిస్తున్నారు. మన ప్రాంతంతో పాటు తెలంగాణలోనూ వీటి అమ్మకాలను ఆమె ప్రారంభించారు.

అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నాం

చిరుధాన్యాల సాగుపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలోని కర్లపాలెం సమీపంలో రాగులు ఎక్కువగా పండిస్తారు. వీటి సాగుకు పెద్దగా ఖర్చు ఉండదు. పురుగు మందులు వాడాల్సిన అవసరం లేదు. ప్రకృతి సేద్యం విధానంలో వీటి సాగుకు ప్రయత్నాలు చేస్తున్నాం.
- వై.రామకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, బాపట్ల

త్రివిక్రమస్వామి సేవలో మంత్రి సతీమణి

హరితరెడ్డికి సారె అందజేస్తున్న ఈవో నాగేశ్వరరావు

చెరుకూరు(పర్చూరు), న్యూస్‌టుడే: ప్రసిద్ధ వైష్ణాలయమైన మండలంలోని చెరుకూరులోని శ్రీత్రివిక్రమస్వామి గుడిలో ఆదివారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సతీమణి హరితరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో దామా నాగేశ్వరరావు స్వాగతం పలికారు. స్వామివారికి పూజలు చేయటంతో పాటు మాంగళ్యపూజ, పారాయణను వేదపండితులు శాస్త్రోక్తంగా హరితరెడ్డి బృంద సభ్యులతో చేయించారు. ఆలయ విశిష్టతను ఈవో వారికి వివరించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అంతర్జాలంలోనే రవాణా సేవలు

జిల్లా అధికారి కృష్ణ పరంధామిరెడ్డి

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: రవాణా శాఖ ద్వారా అన్ని కార్యకలాపాలకు అంతర్జాలం సదుపాయం కల్పించినట్లు జిల్లా రవాణా శాఖాధికారి టి.కృష్ణ పరంధామిరెడ్డి అన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాల్లో ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న జిల్లా రవాణా శాఖాధికారి దంపతులకు అధికారులు మర్యాద పూర్వక స్వాగతం పలిపారు. రెండు ఆలయాల్లో పూజల అనంతరం శేషవస్త్రం అందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా కార్యాలయానికి కేవలం పరీక్షల నిమిత్తం మాత్రమే రావాలని, ఇతరత్రా సేవలన్నీ అంతర్జాలంలో ఉంచామని చెప్పారు.

రైతులకు సకాలంలో ఎరువులు అందించాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలోని రైతులకు సకాలంలో ఎరువులు అందించేలా ముందస్తు ప్రణాళికతో ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి వజ్రాణం హరిబాబు అన్నారు. జిల్లా కోర్టు రోడ్డులోని సహకార మార్కెటింగ్ సొసైటీ కార్యాలయంలో డీసీఎంఎస్ ఉద్యోగుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వజ్రాణం హరిబాబు మాట్లాడుతూ రైతులకు డీసీఎంఎస్ అండగా నిలవాలన్నారు. ఉద్యోగులం దరూ క్రమశిక్షణతో పని చేసి రైతులకు సేవలందించాలన్నారు. సొసైటీల వ్యాపారాల్లో అవినీతిని ఉపేక్షించేది లేదని, గతంలో ఎవరైనా అటువంటి మార్గంలో ఉంటే వెంటనే ప్రవర్తన మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ బీఎం హరిగోపాలం, ఇఫ్కో జిల్లా మేనేజర్ రఘుసురేంద్ర, డీసీఎంఎస్ ఆఫీస్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో నీట మునిగిన యువకుడిని కాపాడిన పోలీసు సిబ్బంది

ఉదయ్‌తేజకు ప్రాథమిక చికిత్స చేస్తున్న గజ ఈతగాళ్లు

బాపట్ల, న్యూస్‌టుడే: సూర్యలంక బీచ్‌లో స్నానం చేస్తూ అలల ఉద్ధృతికి ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి కొట్టుకుపోతున్న గుంటూరు యువకుడిని బీచ్ పోలీసులు ఆదివారం కాపాడారు. ప్రగతి నగర్‌కు చెందిన పెనుమాక ఉదయ్‌తేజ స్నేహితులతో కలిసి సూర్యలంక బీచ్‌కు విహారానికి వచ్చాడు. సముద్రంలో స్నానం చేస్తుండగా ఒక్కసారి వచ్చిన పెద్ద అలలకు కింద పడి నీటిలో మునిగిపోయాడు. సముద్రం లోపలికి కొట్టుకుపోతూ రక్షించమంటూ కేకలు వేశాడు. బీచ్ అవుట్‌పోస్టు వద్ద విధుల్లో ఉన్న మెరైన్, గ్రామీణ బాపట్ల పోలీసులు వెంటనే స్పందించి గజ ఈతగాళ్లను రంగంలోకి దించారు. నీటిలో మునిగిన ఉదయ్‌తేజను గత ఈతగాళ్లు రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చి ప్రాథమిక చికిత్స చేశారు. యువకుడి ప్రాణాపాయం తప్పిందని మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు. అతడిని చికిత్స నిమిత్తం బాపట్ల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

కోటప్పకొండపై భక్త జన సందోహం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి ఆలయం తొలి ఏకాదశి సందర్భంగా భక్తుల రాకతో ఆదివారం సందడిగా మారింది. తెల్లవారుజామున స్వామికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. జలం, పాలు, పెరుగు, భస్మం, పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకం చేశారు. తొలి అభిషేకం అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. పర్వదినం కారణంగా భక్తులు మూలవిరాట్టుకు కాకుండా అభిషేక మండపంలో అభిషేకాలు చేయించుకున్నారు. స్వామికి పొంగళ్లు సమర్పించి నివేదన చేశారు.

వేమూరులో ఇతిహాసపు ఆనవాళ్లు

ఆ గ్రామ చరిత్రపై గ్రంథావిష్కరణ

'వేమూరు విజ్ఞాన సర్వస్వం'ను ఆవిష్కరించిన హరికృష్ణ, చెన్నారెడ్డి, సుభాష్‌బాబు, అరుణ, లక్ష్మీప్రమీల, తిరుమలరావు, మల్లీశ్వరి, కృష్ణ

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: 'చాలా ఊర్లు, ప్రాంతాలు, నాగరికతలను గురించి వింటుంటాం. అలాగే మన ఊరి విశేషాలను తెలుసుకోవాలన్నా.. ఊరి లోతుల్లోకి వెళ్లాలన్నా.. నాగరికత ఆనవాళ్లు, ఇతిహాసపు చీకటి కోణాలు తెలుసుకోవాలన్నా.. సమగ్రమైన చారిత్రక పరిశోధన అవసరం' అని 'ఈటీవీ' వార్తా ఛానళ్ల చీఫ్ ప్రొడ్యూసర్ అమిర్నేని హరికృష్ణ అన్నారు. శివసత్యనారాయణ స్మృతిలో రచయిత్రి డా.కోనేరు (కోగంటి) లక్ష్మీప్రమీల రచించిన 'వేమూరు విజ్ఞాన సర్వస్వం' ఆవిష్కరణ సభ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆదివారం రాత్రి హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగింది. నరసం అధ్యక్షురాలు, రచయిత్రి (ఒంగోలు) తేళ్ల అరుణ అధ్యక్షతన జరిగిన సభలో వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, పరిశోధకుడు ఆచార్య డా.పేదారపు చెన్నారెడ్డి ఆ గ్రంథాన్ని ఆవిష్కరించారు. అమిర్నేని హరికృష్ణ గ్రంథాన్ని పరిచయం చేస్తూ.. 'లక్ష్మీప్రమీల అయిదు పదులు దాటిన వయసులో చదువుకుంటానని తన భర్త సత్యనారాయణతో చెప్పినప్పుడు 'నా వంశానికి ఉపయోగపడే, పేరు తీసుకొచ్చే పని చేయమని చెప్పారట. ఆ మాటను నిలబెట్టుకోవడానికి కష్టపడి చదివి, పీహెచ్‌డీ పూర్తి చేయడమే కాదూ పరిశోధించి 'వేమూరు విజ్ఞాన సర్వస్వం' తీసుకొచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వేమూరుకు అయిదు వేల సంవత్సరాల చరిత్ర ఉందని, ద్వాపర యుగంలో అభిమన్యుడి కుమారుడు పరీక్షిత్తు మహారాజు రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ప్రతిష్ఠించారని శోధించి చెప్పారు. మాది వేమూరు కాబట్టి ఈ గ్రంథం చదివినప్పుడు మా ఊరికి ఇంత ఘనమైన చరిత్ర ఉందా అనిపించింది. ఎన్‌జీ రంగా, కొణిజేటి రోశయ్య, నాదెండ్ల మనోహర్ వంటి ఎంతోమంది ప్రముఖులను సమాజానికి అందించిన నేల అది. ఏదైనా పరిశోధన చేస్తే ఎన్నో చారిత్రక అంశాలు వెలుగులోకి వస్తాయ'న్నారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన పేదారపు చెన్నారెడ్డి మాట్లాడుతూ.. గ్రామచరిత్ర, సంస్కృతిని గురించి లోతుగా పరిశోధించి సమగ్రంగా రాశారన్నారు. జానపద పరిశోధకుడు, కవి, చరిత్రకారుడు ఆచార్య జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ.. గ్రామ చరిత్ర రచనకు ప్రత్యేకంగా మెథడాలజీ అనేది లేదు, కానీ ఈ పుస్తకంలో అది కనిపించింది. మనిషిలాగే గ్రామానికి చరిత్ర, పుట్టుక, అభివృద్ధి, వైభవ దశ ఉంటాయి. ఏదైనా చరిత్రను రాయడానికి రచయిత, పరిశోధకుడికి స్ఫూర్తి కూడా అవసరం అన్నారు. అరుణ అధ్యక్షోపన్యాసంలో గతం అనే అద్దంలో వర్తమానాన్ని వీక్షించుకుంటూ.. భవిష్యత్తుకు బాటలు వేయడమే నిజమైన చరిత్రకారుడి పని అన్నారు. ముఖ్యఅతిథి, సీనియర్ జర్నలిస్టు ఆలూరి సుభాష్ బాబు, గౌరవ అతిథి, భాషా పరిశోధకురాలు రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి, కవి, విమర్శకుడు బిక్కి కృష్ణలు రచయిత్రి కృషిని అభినందించారు. రచయిత్రి లక్ష్మీప్రమీల తన కృషిని వివరించారు.

హక్కుల సాధనకు సమైక్యంగా పోరాడదాం

అరండల్‌పేట, న్యూస్‌టుడే: హక్కుల సాధనకు ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లు సమైక్య పోరాటానికి సిద్ధం కావాలని మాజీ డీజీపీ, ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ(ఏఐబీఎస్పీ) జాతీయ సమన్వయకర్త డాక్టర్ జె.పూర్ణచంద్రరావు అన్నారు. గుంటూరు శ్రీనగర్‌లోని మండల్ స్టడీ సర్కిల్‌లో ఏఐబీఎస్పీ రాష్ట్ర మహాసభ ఏర్పాట్లపై ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం రావాలన్నదే లక్ష్యమని, ఆ దిశగా పోరాడేందుకు ప్రతి ఒక్కరు సన్నద్ధం కావాలన్నారు. తమిళనాడు తరహాలో మన దగ్గర కూడా ఉద్యమం మొదలవ్వాలన్నారు.

బాలుడిపై కుక్క దాడి

మార్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని ద్రోణాదులలో శారీరక, మానసికంగా ఎదుగుదల లోపించిన బాలుడిపై వీధి కుక్కదాడి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన 12ఏళ్ల బాలుడి తలభాగంలో కుక్క కరవటంతో వైద్యసేవలకు మార్టూరు సీహెచ్‌సీకి తరలించగా మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు సూచించటంతో 108లో తీసుకెళ్లినట్లు చెప్పారు.

రక్త మార్పిడి సమయంలో అప్రమత్తత అవసరం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: రక్త మార్పిడి విషయంలో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంగళగిరి ఎయిమ్స్ అదనపు ఆచార్యులు చైతన్యకుమార్ సూచించారు. గుంటూరు వైద్య కళాశాల పెథాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రాంతీయ వైద్య విద్య కార్యక్రమం జింకానా ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా చైతన్య కుమార్ మాట్లాడుతూ రక్త మార్పిడి సమయంలో వచ్చే చర్యలపై జాగ్రత్త వ్యవహరించాలన్నారు. సురక్షితమైన రక్తాన్ని అందుబాటులో ఉంచడం అందరి కర్తవ్యంగా భావించాలన్నారు. రక్తానికి ప్రత్యామ్నాయాలను అభివృద్ధి చేయడంలో శాస్త్రవేత్తలు చేస్తున్న కృషితో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ప్రయోగశాలలో తయారుచేసిన కృత్రిమ రక్తం.. ఇప్పటి వరకు మన దేశంలో అందుబాటులోకి రాలేదన్నారు. రవికిరణ్, రంజిత వివిధ అంశాలపై ప్రసంగించారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారు. కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ శ్రీధర్, పూర్వ ప్రిన్సిపల్ పద్మావతిదేవి, ఆచార్యులు విజయశ్రీ, పూర్ణమ్మ, సహాచార్యులు రమణకుమారి, వివిధ వైద్య కళాశాలల విద్యార్థి వైద్యులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 107, రిటైల్ ధర - 129, చికెన్ విత్‌స్కిన్ - 187, చికెన్ స్కిన్‌లెస్ - 213.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 106, 114, 125 చికెన్ విత్ స్కిన్ - 204 చికెన్ స్కిన్‌లెస్ - 214.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 570 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

BUSINESS OFFER

టైలరింగ్ వర్క్స్ ఇంటి వద్దనే పనిచేసే స్త్రీలు కావలెను. వారికి క్లాత్ ఇచ్చుటకు స్టాక్ పాయింట్స్ పెట్ పార్టనర్స్ కావలెను. ✆ 7093632399.

FINANCIAL SERVICES

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

REAL ESTATE

GENERAL

A.P. రాజధాని అమరావతిలో ల్యాండ్ పూలింగ్‌లో గజం 5000/-, కాజాలో గజం 10,000/-, అమరావతిలో గజం 7000/-, మంగళగిరిలో గజం 12000/- 96035 30555.

HOUSE FOR SALE

GENERAL

బాపట్ల పట్టణము మెయిన్‌రోడ్ మరియు నేషనల్ హైవే మధ్యగల రోడ్డు ప్రక్కన గల పటేల్ నగర్ 1వలైనులో బిజెపి ఆఫీస్ ప్రక్కన 5.5 సెంట్ల విస్తీర్ణములో గల 2 అంతస్థుల డాబా అమ్మకమునకు కలదు. ✆ 99498 43944, 94416 49539.

PLOT FOR SALE

GENERAL

విశాఖలో/ అనకాపల్లిలో NRI ఫామ్ ల్యాండ్స్ వేయుటకు ఇన్వెస్ట్ పార్టనర్స్ కావలెను. సంప్రదించండి. ✆ 73864 14017/ 70936 32399.

JOBS

Wanted B-Pharmacy/ D-Pharmacy candidates to work in a pharmacy in Guntur city. Pci registration mandatory. And wanted packing & delivery boys, Q: 10th. 63009 75241.

Wanted Primary, High School Telugu, English and Physics Teachers Contact Immediately. Perecherla Ph : 97017 59405, 99123 77669.

Required Accountant with Tally Knowledge for a Company Salary: 20000 to 30000. Contact: 95023 82228.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో + వ + మంచి జీతం+ఇన్సెంటివ్స్ కలవు. 99590 21122 / 99590 31122.

గుంటూరు నగరంలో ప్రముఖ స్కూల్లో Classical Dance, Western Dance, Chess Masters & Primary Teachers కావలెను. ✆ 9447660603

అకౌంటెంట్ కమ్ ఆఫీసు అసిస్టెంట్ కావలెను. బి.కాం., 3 సం॥లు కంప్యూటర్ అకౌంట్స్‌పై అనుభవం. తెలుగు, ఇంగ్లీష్ భాషలపై పరిజ్ఞానం. రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

గుంటూరులోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వారి APCRDA అప్రూవ్డ్ ప్లాట్లు మార్కెటింగ్ చేయుటకు టీం లీడర్స్ & ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. ఆకర్షణీయమైన జీతం/ మంచి కమీషన్ ఇవ్వబడును. ✆ 95731 51860.

త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 85209 80099, 85208 74499.

గుంటూరులోని ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనిలో పనిచేయుటకు సూపర్ వైజర్ కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత కలదు. ✆ 70753 38338.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

WANTED

పల్నాడు జిల్లా వినుకొండలోని ప్రభుత్వ చీఫ్ విప్ గారి కార్యాలయంలో ఈ క్రింద పేర్కొన్న ఉద్యోగాలకు దరఖాస్తులు కోరటమైనది. ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును ఈ క్రింది మొబైల్ నెంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపగలరు. అనుభవం మరియు అర్హతను బట్టి మంచి జీతం ఇవ్వబడును.

ఖాళీలు
1. పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ & సోషల్ మీడియా స్పెషలిస్ట్
2. కంప్యూటర్ ఆపరేటర్ (ఇంగ్లీష్ డ్రాఫ్టింగ్)
3. వ్యక్తిగత సర్వర్

దరఖాస్తులు పంపవలసిన మొబైల్ నెంబర్: 96183 22244
కావున ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 12వ తేదీలోగా మీ దరఖాస్తులు పంపవలసినదిగా కోరటమైనది.

ENGINEERING

పల్నాడు జిల్లా తాళ్లపల్లె గ్రామం మాచర్ల దగ్గర్లో పనిచేయుటకు సివిల్ ఇంజనీర్ కావలెను. Exp 3 సం॥ జీతం: 35000/-. Cont: 8688010673

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

91.9FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నివాసంలో తెదేపా నేత శివప్రసాద్ ఆదివారం మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ కుటుంబ సభ్యుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.30,786 చెక్కు అందజేశారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి

వేమూరు, న్యూస్‌టుడే: మాజీ ఉప ప్రధాని, బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని మండలంలోని జంపనిలో తెదేపా, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక రావులమ్మ చెరువు కూడలిలోని బాబూ జగ్జీవన్ రామ్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వి.యోబు, వేల్పుల రవిప్రసాద్, జయప్రకాష్‌బాబు, క్రిస్టియన్ యువత పాల్గొన్నారు.

సేవాభావంతో గుర్తింపు

నగరం, న్యూస్‌టుడే: సేవాభావంతో పని చేస్తే గుర్తింపు ఉంటుందని చినమట్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ సకీనా అన్నారు. స్థానిక పాఠశాలలో దీర్ఘకాలం పని చేసి ఇటీవల బదిలీ అయిన ఇమాముద్దీన్ బాధరిని గ్రామస్థులు, విద్యార్థులు ఆదివారం సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ఈసందర్భంగా పలువురు కొనియాడారు.

పోషకాహారం పంపిణీ

అమృతలూరు: మోపర్రులోని ఏఆర్ట్‌ వసతి గృహం విద్యార్థులకు ఆదివారం అమృతలూరుకు చెందిన గ్రంథి సురేష్ పోషకాహారం పంపిణీ చేశారు. నెలరోజులు సాయంత్రం వేళ అల్పాహారంగా విద్యార్థులకు అందించేందుకు బిస్కెట్లు, బఠానీ, శనగలను నిర్వాహకులకు అందించారు.

ధర్మ పరిరక్షణకు సేవక్ సంఘ్ కృషి

చెరుకుపల్లి న్యూస్‌టుడే: దేశ రక్షణ, ధర్మ పరిరక్షణకు నిరంతరం తపించేది రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మాత్రమేనని సంస్థ జిల్లా కార్యవాహ వరికూటి శివగోపీ అన్నారు. ఆదివారం సంస్థ చెరుకుపల్లి రామాలయంలో గురుపూజోత్సవం నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు పాల్గొని కాషాయ ధ్వజానికి వందన సమర్పణ చేశారు. ఆర్ఎస్ఎస్ ఏర్పడి శత వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి సంస్థ సాధించిన విజయాలను గుర్తు చేస్తూ విజయోత్సవాలు నిర్వహించాలని కోరారు.

ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని ఏపీ ఎరుకల ఆత్మగౌరవ సేవా సంఘం నాయకులు కోరారు. రేపల్లె ఏడో వార్డులో ఆదివారం ఏకలవ్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్యుని విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళి అర్పించారు. రాష్ట్ర ఎరుకల సేవా సంఘం ఉపాధ్యక్షుడు బొద్దు కోటేశ్వరరావు, ఎరుకల ఆత్మగౌరవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి మద్దుల అంకాలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

✔ రేపల్లె 25వ వార్డు రామకోటిపేటలో మురుగు కాలువల్లో నీరుపారక దుర్వాసన వస్తోంది. -వెంకటేశ్వరరావు, స్థానికుడు

✔ మురుగు కాలువల్లో పేరుకున్న వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. -రామచంద్రరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రేపల్లె -న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

✔ రేపల్లె- నిజాంపట్నం ప్రధాన రహదారిలో సామాజిక వైద్యశాల దాటాక ముళ్ల మొక్కలు రహదారి మీదకు వాలాయి. -స్థానికుడు

✔ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. -విద్యాసాగర్, ఆర్అండ్‌బీ ఏఈ, నిజాంపట్నం -న్యూస్‌టుడే, నిజాంపట్నం

✔ మండలంలోని మంతెనవారిపాలెం గ్రంథాలయం పక్కన చెట్టు వద్ద చెత్త చెదారం వేయటంతో స్థానికులు, పాఠశాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. -వెంకటరాజు ✔ పరిశీలించి వెంటనే తొలగిస్తాం. -వసుంధరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, మంతెనవారిపాలెం -న్యూస్‌టుడే పిట్టలవానిపాలెం

వాన జాడ లేదు.. సాగునీరు రాదు

వెద రైతులకు తప్పని కష్టాలు

వేమూరు, న్యూస్‌టుడే

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. డెల్టా ప్రాంతంలో ముమ్మరంగా వెద పద్ధతిలో అన్నదాతలు వరి విత్తుకుంటున్నారు. జులై మొదటి వారం పూర్తైనా వర్షం ముఖం చాటేయడంతో సాగునీటి కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబరుల్లో కురిసిన వర్షాలకు వేలాది ఎకరాల వరి పైరు దెబ్బతింది. దాన్ని దృష్టిలో ఉంచుకున్న రైతులు ఈ ఏడాది ముందుగానే సాగు ప్రారంభించారు. వారం రోజుల క్రితం వర్షం జల్లులు మాత్రమే కురవడంతో వ్యవసాయ బోర్లు అందుబాటులో లేని వారు సైతం వెద పద్ధతిలో వరి విత్తారు. కాలువల ద్వారా సాగునీరు అందితే విత్తిన వరిని కాపాడుకోవాలని చూస్తున్నారు. సాగునీటి శాఖ అధికారులు కాలువలకు నీరు విడుదల చేసినా ఇంకా పంట పొలాల వద్దకు చేరలేదు. అధికారులు పరిస్థితిని గమనించి నీటి విడుదల సామర్థ్యం పెంచాలని అన్నదాతలు కోరుతున్నారు.

★ వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 1.18లక్షల హెక్టార్ల సాగుభూమి ఉంది. వేమూరు, కొల్లూరు, చుండూరు చెరుకుపల్లి తదితర మండలాల్లో 90శాతం వెదసాగు ద్వారా వరి విత్తారు. వాతావరణం అనుకూలంగా ఉంటే మిగతా ప్రాంతాల్లో కూడా ఇదే పద్ధతిలో విత్తడం పూర్తవుతుందని చెబుతున్నారు.

పెట్టుబడి తగ్గించుకోవడానికి..

వాస్తవంగా సాధారణ పద్ధతి ద్వారా నాటు వేయాలంటే దుక్కితో పాటు పొలాన్ని నీటితో తడిపి, రెండు సార్లు దమ్ము చేయాలి. దాని కంటే ముందుగా ఎకరానికి 20కిలోల చొప్పున వరి విత్తనాలు విక్రయించి నారుమడి పోయాలి. దాన్ని 25 రోజుల పాటు పెంచిన తర్వాత పీకి నాటు వేయాలి. దీనంతటికీ ఎకరాకు రూ.10వేల చొప్పున ఖర్చు అవుతుంది. అదే వెద పద్ధతిలో అయితే 17కిలోల విత్తనాలు సరిపోతాయి. దుక్కి, వెదగొర్రు ఖర్చు మొత్తం కలిపి రూ. 3 వేల్లో పనైపోతుందని రైతులు చెబుతున్నారు. అందుకే ఈ పద్ధతి వైపు మొగ్గు చూపుతున్నారు.

యంత్రం ద్వారా వెద పద్ధతిలో సాగు

వర్షంపై ఆధారపడి వరి విత్తా



వారం రోజుల క్రితం చెదురు మదురు జల్లులు పడడంతో వర్షం కురుస్తుందని భావించి, నాకు వున్న సాయి బోరు లేకపోయినా ఐదు ఎకరాల్లో వరి విత్తా. ఇప్పటికి నాలుగు రోజులు అవుతున్నా వర్షం కురవలేదు. కనీసం కాలువల ద్వారా నీరు వస్తే పొలం తడుపుదామని అనుకున్నా. పరిస్థితి ఇలాగే ఉంటే విత్తనాలు దెబ్బతింటాయని భయంగా ఉంది. - కొడాలి వెంకట్రావు, రైతు జంపని

సైడ్ ఛానల్ పక్కనే ఉన్నా..

నా 12ఎకరాల పొలంతో పాటు ఇంకో 6ఎకరాలు కౌలుకు తీసుకుని వెదపద్ధతిలో సాగు చేశా. పొలం చుండూరులోని తుంగభద్ర సైడ్ ఛానల్ పక్కనే ఉంది. వర్షం కురవక పోయినా కాలువ ద్వారా నీరు వస్తుందని భావించా. ఇంకా నీటి జాడ కనపడటం లేదు. - జె.శివకోటేశ్వరరావు, చుండూరు

నిధులు మంజూరు చేయాలని వినతి

బాపట్ల, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.97.18 కోట్లు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కోరారు. ఉండవల్లిలో సీఎంను ఎమ్మెల్యే ఆదివారం కలిశారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో బాపట్లలో చేపట్టిన అభివృద్ధి పనులను సీఎంకు ఎమ్మెల్యే వివరించారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు తెలియజేసి అభివృద్ధి పనుల ప్రతిపాదనలు అందజేశారు. పీ-4లో భాగంగా పట్టణంలోని బేతని కాలనీలో ఎస్సీ చిన్నారులు సందీప్, హేమశ్రీని దత్తత తీసుకుని చదివిస్తున్నట్లు తెలిపారు. కూటమి నేతలను సమన్వయం చేసుకుని నియోజకవర్గంలో పార్టీలో బలపేతం చేసి 2029 ఎన్నికల్లో విజయం సాధించాలని సీఎం చెప్పారని ఎమ్మెల్యే తెలిపారు. రాజకీయంగా దూకుడు పెంచాలని చెప్పినట్లు తెలిపింది. పనుల్లో నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకుని పీ-4లో మార్గదర్శిగా ఉండటానికి ముందుకువచ్చిన నరేంద్రవర్మను సీఎం అభినందించారు.

సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

రాష్ట్ర ప్రగతి తెదేపాతోనే

రహదారులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్య ఆనందబాబు

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సుబ్బయ్య

మోపర్రు, (అమృతలూరు), రేపల్లె అర్బన్, కావూరు (చెరుకుపల్లి (గ్రామీణ), నిజాంపట్నం, న్యూస్‌టుడే: అభివృద్ధి మారుపేరు తెదేపా అని ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికీ తెదేపా కార్యక్రమం అమృతలూరు మండలం మోపర్రు, రేపల్లెలో నిర్వహించారు. మోపర్రులో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు జడ్పీ రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైకాపా హయాంలో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోనే రహదారుల అభివృద్ధి జరిగిందన్నారు. రేపల్లె 28వ వార్డు, మండలంలోని పిరాట్లంకలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. చెరుకుపల్లి మండలం కావూరులో పార్టీ సీనియర్ నేత మండవ తాతాజీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య పేర్కొన్నారు. నిజాంపట్నంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు.

రేపల్లెలో..

పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

చుండూరు: ఇమామ్ ఖాన్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని సర్పంచి ముంతాజ్ తెలిపారు. యడ్లపల్లి ముస్లిం కాలనీకి చెందిన 75మంది విద్యార్థులకు ఇమామ్ ఖాన్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా రాత పుస్తకాలు, 14 మందికి ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున నగదు ప్రోత్సాహం అందజేశారు. దాత ఖాసిమ్ ఖాన్, తాజుద్దీన్‌ఖాన్, స్థానిక మసీదు పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందిస్తున్న దాత ఖాసిమ్‌ఖాన్

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

బాపట్ల, న్యూస్‌టుడే: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 14 వ వార్డు కారుమూరి హనుమంతరావునగర్‌కాలనీలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మూర్తిజుల క్రితం పర్యటించారు. వార్డులో నీటి సమస్య ఉందని ఎమ్మెల్యేకు స్థానికులు తెలిపారు. ఆయన వెంటనే స్పందించి ప్రత్యేకంగా పైప్‌లైన్ వేయాలని పురపాలక అధికారులను ఆదేశించారు. తవ్వ కాలువ వంతెన నుంచి కారుమూరి హనుమంతరావు నగర్ కాలనీ వరకు రూ.21 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణ పనులను పురపాలక అధికారులు చేపట్టారు. పనులను డీఈ కృష్ణారెడ్డి ఆదివారం పర్యవేక్షించారు. నాలుగు రోజుల్లో పూర్తి చేసి కాలనీవాసులకు తాగునీటి సరఫరా మెరుగుపరుస్తామని డీఈ తెలిపారు.

పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న పురపాలక డీఈ కృష్ణారెడ్డి

9న జరిగే సమ్మె విజయవంతం చేయండి

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: కార్మికులకు నష్టం కలిగించే 4 లేబర్ కోడ్స్ అమలు చేయొద్దని ఈనెల 9న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. రేపల్లె సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, రైతు కూలీ సంఘ నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. కార్పొరేట్ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, కార్మికుల వేతనం రూ.26 వేలకు పెంచాలని, 8 గంటల పని పద్ధతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రణాళిక అమలుపై శిక్షణ

చెరుకుపల్లి న్యూస్‌టుడే: పంచాయతీ అభివృద్ధి ప్రణాళికకు సంబంధించి నూతనంగా ఏర్పాటైన పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0పై ఈనెల 8న మండల పరిషత్తు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుబానీ తెలిపారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, ఏఎన్ఎమ్‌లు సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు. శిక్షణ 8న 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

కొల్లూరు, న్యూస్‌టుడే: మొహర్రం పర్వదినాన్ని స్థానిక ముస్లింలు ఆదివారం భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. అలంకరించిన పీర్లను జెండా చెట్టు వద్ద నుంచి పురవీధుల్లో ఊరేగించిన అనంతరం పీర్ల చావిడిలో భద్రపరచారు.

పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

ఆర్వోబీ నిర్మించరూ!

కంకటపాలెం రైల్వే గేటు వద్ద నిలిచిన వాహనాలు

పట్టణ శివారున కంకటపాలెం రైల్వే గేటు అరగంటకు పైగా మూసి ఉండటం వల్ల వాహనదారులు వేచి ఉండటానికి ఇబ్బంది పడుతున్నారు. బాపట్ల నుంచి కంకటపాలెం, నరసాయపాలెం, పర్చూరుకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తాయి. విజయవాడ- చెన్నై ప్రధాన రైల్వే మార్గం కావటం, మూడు రైల్వే ట్రాక్‌లు ఉండటంతో ప్రతి ఎనిమిది నుంచి పది నిమిషాలకు రైళ్లు వెళ్తున్నాయి. ఒకసారి గేటు పడితే మూడు నుంచి నాలుగు రైళ్లు వెళ్లే వరకు తెరవటం లేదు. ఉదయం, సాయంత్రం పాఠశాలలు, కళాశాలల బస్సులు సైతం 30 నుంచి 40 నిమిషాలు గేటు వద్ద నిలిచిపోతున్నాయి. ఆర్వోబీ నిర్మించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రత్యేక చొరవ చూపి రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి ఆర్వోబీ నిర్మాణానికి అనుమతి, నిధులు మంజూరు చేయించాల్సి ఉంది. -న్యూస్‌టుడే, బాపట్ల

నీరు ముందుకు కదిలేనా!

మండల పరిధిలో 12 వేల ఎకరాలకు ప్రధాన మురుగునీటి పారుదల వ్యవస్థగా ఉన్న ఉత్తర మురుకుండపాడు కాలువ అధ్వానంగా ఉంది. గుర్రపు డెక్క, తూటుకాడ పెరిగి మురుగునీటి ప్రవాహానికి అడ్డుగా మారింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు పొలాలను దుక్కులు దున్ని, వరి నారుమడులు పోయటానికి, వెద పద్ధతిలో నేరుగా విత్తనాలు నాటేందుకు సన్నద్ధమవుతున్నారు. భారీవర్షం కురిస్తే నరసాయపాలెం, కంకటపాలెం, మురుకుండపాడు, వెదుళ్లపల్లి, బేతపూడి పరిధిలో వేల ఎకరాల్లో పంటలు ముంపు బారినపడే ప్రమాదముంది. మురుగునీటి పారుదల అధికారులు వెంటనే స్పందించి కాలువలో పూడిక తీయించాలని రైతులు కోరుతున్నారు. -బాపట్ల, న్యూస్‌టుడే

ఆదమరిస్తే అంతే

రేపల్లె 13వ వార్డు శివారులోని మురుగు కాలువపై నిర్మించిన వంతెనకు రెండు వైపులా రక్షణ గోడ కవచాలు పాడై ప్రమాదకరంగా మారాయి. ఓ వైపున్న రక్షణ కవచం సగానికిపైగా కూలిపోయింది. రాకపోకల సమయంలో ద్విచక్రవాహన చోదకులు ఆదమరచి నడిపితే నేరుగా కాలువలో పడితే ప్రాణాపాయం తప్పదని భయపడుతున్నారు. దీనికితోడు వంతెనపై వేసిన రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో రాత్రివేళ రాకపోకల సమయంలో ఏ ప్రమాదానికి గురవుతామోనని భయపడుతున్నారు. అధికారులు స్పందించి వంతెనకు రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.-రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే

కాలువలు తీయించండి

జంపని నుంచి మూల్పూరు వెళ్లే మార్గంలో, రోడ్డుకు ఇరు వైపులా ఉన్న కాలువలు పూడికతో నిండాయి. దీంతో ఇళ్లలో వాడిన నీరు రోడ్డుపైకి చేరుతోంది. దీంతో ఈ మార్గాన ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఏఈ విద్యాసాగర్ మాట్లాడుతూ రోడ్డుకు రెండు వైపులా మురుగు పోయేందుకు కాలువలు తీయించాలని పంచాయతీ అధికారులకు చెబుతామని తెలిపారు. –న్యూస్‌టుడే, వేమూరు

ఘనంగా తొలి ఏకాదశి

అల్లూరమ్మ

తొలి ఏకాదశి సందర్భంగా బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పలు ఆలయాల్లో అన్నదానం నిర్వహించారు. పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు, గోకరాజునల్లిబోయినవారిపాలెం, పిట్టలవానిపాలెంలోని బండ్లమ్మ ఆలయాల్లో, బాపట్ల పట్టణంలోని భావనారాయణ స్వామి, చీలురోడ్డు పాండురంగస్వామి, పాత బస్టాండ్, టీనగర్ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణ, సామూహిక పూజలు చేశారు. –న్యూస్‌టుడే బృందం

అమృతలూరులో..

రేపల్లెలో సామూహిక పూజలు

నడింపల్లిలో రెడ్డంకమ్మ

నూకాలమ్మ తల్లి

వైభవంగా అమ్మవారి కొలుపులు

బాపట్ల, న్యూస్‌టుడే: భర్తిపూడిలో నూకాలమ్మ కొలుపులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద సంతర్పణ చేశారు.

తెదేపా కార్యకర్త మృతికి నివాళి

నడింపల్లి (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: నడింపల్లికి చెందిన తెదేపా కార్యకర్త వాకా సూర్యతేజ (25) ఈనెల 5న పొన్నూరు వద్ద విద్యుదాఘాతంతో మృతి చెందారు. మృతదేహాన్ని ఆదివారం నడింపల్లి తీసుకువచ్చారు. తెదేపా సీనియర్ నేత అనగాని శివప్రసాద్, రేపల్లె మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ గోగినేని వసుధ, పార్టీ మండల అధ్యక్షుడు తాతా ఏడుకొండలు, ఇతర నేతలు మృతదేహానికి నివాళి అర్పించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అడుగడుగునా ప్రమాదం.. అయినా తప్పని ప్రయాణం

రాళ్లు లేచిన తోకలవారిపాలెం- కిష్కిందపాలెం రహదారి

భట్టిప్రోలు, కొల్లూరు, న్యూస్‌టుడే : కృష్ణానది పరివాహక లంక గ్రామాల్లోని రహదారులు రూపురేఖలు కోల్పోయి అడుగడుగునా ప్రమాదాలకు నిలయమయ్యాయి. భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని వరద ప్రభావానికి రహదారులు కోసుకుపోయి గుంతలు పడ్డాయి. కొల్లూరు మండల పరిధిలో తిప్పలకట్ట- కిష్కిందపాలెం, జువ్వలపాలెం- తడికలపూడి, భట్టిప్రోలు మండల పరిధిలో పెసర్లంక- కోళ్లపాలెం, పెదలంక-ఓలేరు రహదారులపై రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడాల్సిందే. కల్వర్టులు కూడా కుంగడంతో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని గ్రామస్థులు భయపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అసలు పట్టించుకోలేదు. దీంతో రాత్రి సమయంలో ప్రమాదాల బారిన పడినవారు అనేకం. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారులను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

బాపట్ల, న్యూస్‌టుడే: మండలంలో మేజర్ గ్రామ పంచాయతీలను అనుసంధానం చేస్తూ రైతులకు ఉపయోగపడేలా 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం డొంక రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. మెటల్ వేశారు. తారు రోడ్డు నిర్మించే లోగా అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పనులు పూర్తిగా రద్దు చేసింది. జమ్ములపాలెం-కంకటపాలెం, మురుకుండపాడు- కుంకులమర్రు మధ్య ఉన్న డొంక రహదారులను పక్కాగా రోడ్లుగా నిర్మించటానికి రూ. 8 కోట్లు మంజూరు చేసింది. పనులు రద్దు కావటంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. 15 వేల ఎకరాలకు విత్తనాలు, ఎరువులు, పంట ఉత్పత్తులు తరలించటానికి ఈ డొంక రోడ్లే కీలకం. వర్షాలు కురిస్తే చిత్తడిగా మారి వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి రహదారుల నిర్మాణం పూర్తి చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

జమ్ములపాలెం- కంకటపాలెం డొంక రోడ్డు

కమ్మేసిన కంపచెట్లు.. రాకపోకలకు ఇక్కట్లు

మండలంలోని రెడ్డిపాలెం కూడలి వద్ద జాతీయ రహదారి నుంచి ఖాజీపాలెం వెళ్లే ప్రధాన రహదారిపై ముళ్లపొదలు పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రెండు లైన్ల రహదారి కస్తా ముళ్లపొదలు కమ్మేయటంతో సాధారణ రహదారిగా మారింది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాల నుంచి తప్పకోవాలంటే భయాందోళన కలుగుతుందని వాహన చోదకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారిపై వాలిన ముళ్లపొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం)

పంటల బీమా.. రైతుకు ధీమా

చెరుకుపల్లి: ఆరుగాలం కష్టించే రైతు ప్రకృతి వైపరీత్యాల కారణంగా తరచు నష్టపోతున్నాడు. దీన్ని అధిగమించే దిశగా కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన రైతులకు వెన్నుదన్నుగా నిలవనుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఎంపిక చేసిన పంటలు సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకొన్న కౌలు రైతులతో సహా రైతులందరూ ఈ పథకంలో చేరటానికి అర్హులు. నామమాత్రపు ప్రీమియం చెల్లిస్తే వాస్తవ ప్రీమియంలో రైతు చెల్లించగా మిగిలిన మొత్తాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా బీమా కంపెనీలకు చెల్లిస్తాయి.

దరఖాస్తు చేసే విధానం.. రైతులు పంట రుణాలు తీసుకొన్న సందర్భంలో సంబంధిత బ్యాంకు యాజమాన్యాలే ప్రీమియం వసూలు చేసి బీమా కంపెనీకి చెల్లిస్తాయి. పంట రుణం తీసుకోని రైతులు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్‌లో ఆధార్ నకలు, పట్టాదారు పాసుపుస్తకం నకలు, కౌలు రైతు అయితే కౌలు రైతు ధ్రువపత్రం సమర్పించి ఆన్‌లైన్ ద్వారా ప్రీమియం చెల్లించి రసీదు తీసుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. సకాలంలో ప్రీమియం చెల్లించాలి. బీమా చేసిన పంట వివరాలు ఈ క్రాప్‌లో సరిగా నమోదు అయిందా లేదా సరిచూసుకోవాలి. ప్రస్తుత ఖరీఫ్ వరిసాగు చేసే రైతులు బీమా సదుపాయం పొందాలంటే ఆగస్టు 15లోగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ తెలిపారు.

వంతులు వీడండి.. సమస్య పరిష్కరించండి

న్యూస్‌టుడే, చందోలు (పిట్టలవానిపాలెం)

రహదారి పక్కన వేసిన వ్యర్థాలు తొలగించడానికి రెండు శాఖల అధికారులు ఒకరిపై మరొకరు వంతులు వేసుకోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చందోలులో చెత్త, వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు చందోలు- బాపట్ల రహదారి పక్కన తెనాలి డ్రెయిన్ కట్టపై వేసి పొక్లెయిన్‌తో డ్రెయిన్‌లోకి రెండేళ్ల నుంచి నెట్టడంతో డ్రెయిన్ సగానికి పైగా పూడిపోయింది. ఇలా ఉంటే డ్రెయిన్ పరిధిలోని పదివేల ఎకరాలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతారని మార్చి 6న 'కాలువ పూడ్చి.. ప్రమాదం పెంచి..' శీర్షికతో 'ఈనాడు'లో కథనాన్ని ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ వెంకటమురళి తెనాలి డ్రెయిన్‌ను పరిశీలించి పంచాయతీ, మురుగు నీటి పారుదల శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగునీటి పారుదల శాఖ అధికారులు వెంటనే పొక్లెయిన్ సాయంతో డ్రెయిన్‌లోని చెత్త, వ్యర్థాలను తొలగించి రహదారి పక్కన వేశారు.

చందోలు-బాపట్ల రహదారి పక్కన వ్యర్థాలు

వ్యర్థాలు ఎవరు తొలగించాలి

కలెక్టర్ ఆదేశంతో డ్రెయిన్‌లోని చెత్త వ్యర్థాలను మురుగు నీటి పారుదల శాఖ అధికారులు పొక్లెయిన్ సాయంతో తొలగించి రహదారి పక్కన వేశారు. రహదారి పక్కన వేసిన చెత్త, వ్యర్థాలను ఎవరు అక్కడ నుంచి తొలగించాలని పంచాయతీ, డ్రెయినేజీ అధికారులు పంతానికి పోయి అలాగే వదిలేశారు. దీంతో రహదారిపై వెళ్లే వాహన చోదకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ చెప్పి మూడు నెలలైనా ఇంత వరకు చెత్త వ్యర్థాలను పూర్తి తొలగించలేదు. ఈ విషయమై పంచాయతీ, డ్రెయినేజీ అధికారులు మాకు సంబంధం లేదన్న విధంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెత్త, వ్యర్థాలను తొలగించి సమస్యను పరిష్కారించాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

(c) eenadu

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

భరద్వాజ రచనలు సందేశాత్మకం

చీరాల, న్యూస్‌టుడే : సమాజంలోని ఆకలి, ఆవేదన, కష్టాలు, కన్నీళ్లు, దోపిడీ వంటి వాటిని కథాంశాలుగా తీసుకొని భరద్వాజ రాసిన రచనలన్నీ సమకాలీన సందేశాలుగా నిలిచాయని డాక్టర్ బీరం సుందరరావు పేర్కొన్నారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ రావూరి భరద్వాజ జయంతి ఆదివారం వృద్ధుల సంక్షేమ భవనంలో నిర్వహించారు. ఎ.నాగవీరభద్రాచారి, బత్తుల బ్రహ్మారెడ్డి, యల్లమంద, జగదీష్‌కుమార్, ప్రభాకర్, రాజ్‌వినయ్‌కుమార్, గాదె హరిహరరావు, ఎ.రామారావు, వడలి రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

కొత్త కార్యవర్గ సభ్యులు

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండ ప్రసన్నాంజనేయ నిత్యాన్నదాన సత్రం నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. శింగరకొండ సత్రంలో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఆదిపూడి మోహనరావు, పమిడిఘంటం చంద్రశేఖర్, కోశాధికారిగా ధేనువకొండ సుబ్బారావు ఎంపికయ్యారు. వేదపండితులు వంగల హరిశంకరావధాని పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? కనక నాగవరపమ్మ గుడికి వెళ్లే దారిలో రైల్వే గేటు దాటిన తరువాత ఉన్న విద్యుత్తు స్తంభానికి బిగించిన ట్యూబ్ లైటు సెట్టు మాత్రమే ఉంది. బల్బు లేదు. దాని స్థానంలో ఎల్ఈడీ దీపం ఏర్పాటు చేస్తే రాత్రులు ఇబ్బంది ఉండదు. **- సుబ్బారావు, స్థానికుడు**

✔ సిబ్బందిని పంపి అక్కడ లైటు ఏర్పాటు చేయిస్తా.
- ఎన్.చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శి, రామన్నపేట.

– న్యూస్‌టుడే, వేటపాలెం

రూ.1.25 లక్షల ఎల్‌వోసీ మంజూరు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: మండలంలోని పంగులూరులో వడ్డెంపూడి శ్రీకాంత్ మోకీలు శస్త్ర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.25 లక్షల చెక్కును మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంజూరు చేయించారు. మంత్రి ఆదేశాలతో పంగులూరు గ్రామ తెదేపా అధ్యక్షులు బాచిన త్రివేణిబాబు, బాచిన చౌదరిబాబు ఆదివారం చెక్కును శ్రీకాంత్‌కు అందజేశారు.

మినీ బైపాస్ దిశగా అడుగులు

అద్దంకి, న్యూస్‌టుడే

అద్దంకి పట్టణ ప్రజల సౌకర్యార్థం మినీ బైపాస్ నిర్మాణం దిశగా అడుగులు పడుతున్నాయి. నాలుగేళ్ల క్రితం ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. వైకాపా హయాంలో నిధులు మంజూరు కానందున అడుగులు ముందుకు పడలేదు. కూటమి ప్రభుత్వం రావటంతో ముందుకు కదిలింది. తొలుత ప్రభుత్వ నిధుల కోసం ప్రతిపాదించారు. నిధుల లేమి కారణంగా పీ3(ప్రైవేటు పబ్లిక్ పార్టనర్‌షిప్)తో నిర్మాణానికి ప్రతిపాదించారు. రూ.15 కోట్ల అంచనాతో దీన్ని నిర్మించనున్నారు.

పట్టణంలోని రామ్‌నగర్ రెస్టారెంట్ నుంచి కాకానిపాలెం గరటయ్య కాలనీ వరకు ఎన్నెస్పీ కాలువ కట్టపై మినీ బైపాస్ నిర్మించనున్నారు. ఇక్కడ 1.6 కి.మీ. నిడివి మేర ఉన్న కాలువ కట్టను 74 అడుగుల మేర ఆధునికీకరించనున్నారు. కాలువకు ఇరువైపులా రహదారి

మినీ బైపాస్ నిర్మించే ఎన్నెస్పీ కాలువ కట్ట ఇదే..

రూ.15 కోట్లతో అంచనాల తయారు.. నిర్వాసితుల కోసం స్థలం కేటాయింపు

నిర్మాణం, కట్ట బలోపేతం చేపట్టనున్నారు. కాలువ రివిట్‌మెంటు పనులు 18 అడుగుల వెడల్పుతో చేపడతారు. రోడ్డుకు ఇరువైపులా కలిపి 23 అడుగుల చొప్పున నిర్మించనున్నారు. కాలువ చివరన వీధి దీపాలు, సైడు కాలువలు, మొక్కలు పెంచనున్నారు. దీనికి అనుసంధానంగా కాలువ అటు ఇటు కలిపి 26 చోట్ల కల్వర్టులు నిర్మించనున్నారు. ఇది పూర్తయితే పాఠశాలలు, కళాశాలల బస్సులకు, రామ్‌నగర్ నుంచి రేణంగివరం వైపు వెళ్లే వాహనాలకు ఉపయోగంగా ఉంటుంది. భవిష్యత్తులో దీన్ని కాకానిపాలెం నుంచి శింగరకొండ వరకు విస్తరించే ఆలోచనలో అధికార యంత్రాంగం ఉంది.

మంత్రి చొరవతోనే..

రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవతో మినీ బైపాస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా నిర్మాణం చేపట్టాలని ఆకాంక్షించారు. ఆ మేరకు కాలువ కట్టపై నివసించే 75 మందికి ఒక్కొక్కరికి రెండు సెంట్ల చొప్పున శింగరకొండపాలెం సమీపంలో ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నారు. వాటిలో మౌలిక సదుపాయాల కల్పనకు స్థానిక దాతల్ని యంత్రాంగం కోరింది. ఈ విషయమై పురపాలక కమిషనర్ డి.రవీంద్ర మాట్లాడుతూ ప్రాజెక్టు రిపోర్టు వచ్చిందని, దాని ప్రకారం నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

‘పీ4’ విజయవంతానికి సహకారం అవసరం

రుణాలు అందజేస్తున్న అమర్‌నాథ్, తదితరులు

చీరాల, న్యూస్‌టుడే: పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం పీ4 పథకాన్ని అమలు చేస్తోందని, దీన్ని విజయవంతం చేసేందుకు సహకారం అందజేయాలని తెదేపా యువనేత ఎం.అమర్‌నాథ్ పేర్కొన్నారు. మహాత్మాగాంధీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్వయం ఉపాధి పథకం కింద లబ్ధిదారులకు వడ్డీలేని రుణాలు, ల్యాప్‌టాప్‌లు, మిషన్లు, గ్రెండర్లు తదితర వస్తువులు అందజేశారు. ముంతావారి కూడలిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అమర్‌నాథ్ హాజరయ్యారు. ఎంజీసీ అధ్యక్షుడు చంద్రశేఖరరావు, మురళీకృష్ణ, రమేష్, ఎం.సుబ్బారావు, రామవిజేత, కౌన్సిలర్లు సుబ్బయ్య, ప్రభాకరరావు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన

పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

మార్టూరు, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర బైండ్ల కులస్థులు సంక్షేమ సంఘం, కాటూరి వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మార్టూరుతో పాటు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు హాజరై వైద్యసేవలు పొందారు. గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, గర్భకోశ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి, ఉచిత మందులు అందజేశారు. కొందర్ని మెరుగైన వైద్యసేవల నిమిత్తం కళాశాలకు సూచించారు. శిబిరాన్ని మందపాటి అంజయ్య, ఎస్.వి శేషయ్య, వి.డి తిరుపతిరావులు పర్యవేక్షించగా తెదేపా నేతలు ఆదినారాయణ, రజాక్, శివనాగేశ్వరరావు, కాకోలు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీఐ మల్లికార్జునరావు

చీరాల: పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని తెదేపా నాయకులు పేర్కొన్నారు. మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని ముక్కోణం పార్కు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈసందర్భంగా ఏఎంసీ ఛైర్మన్ కె.జనార్దన్, అమర్‌నాథ్ మాట్లాడారు. పురుషోత్తం, వెంకటేష్, కె.పద్మిని పాల్గొన్నారు.

మేదరమెట్ల: ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మణీయమని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు అన్నారు. కొరిశపాడులో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తేళ్ల మారుతీప్రసాద్, సర్పంచి ఈపూరి విజయ్‌కుమార్, నేత నివాసరావు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే

అసలు నంబరే లేదు

డిప్యూటీ సీఎం తాలుకా అంటూ నంబర్లు చిన్నవి

ద్విచక్రవాహనదారులు ఇష్టానుసారంగా వాహనాలకు నంబర్లు వేసుకుని తిరుగుతున్నారు. కొన్నింటికి అసలు నంబర్లే ఉండడంలేదు. ఒకవేళ ఉన్నా ఒకటే పెద్దదిగా రాసి మిగిలినవి కనబడకుండా వేస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఇటీవల రాజకీయ నాయకుల తాలుకా అని రాసేసుకుంటున్నారు. ఇన్ని జరుగుతున్నా రవాణా శాఖాధికారులు పట్టించుకోవడంలేదు. దీనివల్ల రంగు రంగుల పేర్లతో ఉన్న అక్షరాలతో నంబర్లు వేసుకుని తిరుగుతున్నారు. అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే ఆ వాహనం నంబరు గుర్తించడం కష్టంగా మారుతోంది. ఫలితంగా బాధితులకు న్యాయం జరగని పరిస్థితి నెలకొంటోంది. మోటారు వాహనాల చట్టం 1988-89 ప్రకారం అన్ని వాహనాలకు హైసెక్యూరిటీ రిజిస్ట్రేషను ప్లేట్(హెచ్ఎస్ఆర్‌పీ) అమర్చుకోవాలి. వాహనాన్ని బట్టి ఏ మేరకు ప్లేటు సైజులు ఉండాలో ఇందులో స్పష్టంగా వివరించారు. అలాగే తెల్లని ప్లేటుపై ప్రెస్ చేసిన అక్షరాలు నలుపు రంగులోనే రాయాలి. వీటిని రవాణా శాఖ తయారు చేసి వాహనదారులకు అందజేస్తోంది. దీని కోసం ప్రత్యేకంగా రుసుం వసూలు చేస్తోంది. క్షేత్రస్థాయిలో చాలామంది ఇటువంటి ప్లేట్లు తీసుకున్నా వాటిని పక్కన పెడుతున్నారు. ఇదే సమయంలో ఇష్టం వచ్చిన రంగులో వేసుకుని తిరుగుతున్నారు. వీటి గురించి పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా నంబరు ప్లేట్లు బిగించుకుని వాహనదారులు రోడ్లపైకి వచ్చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇటువంటి వారిని గుర్తించి జరిమానా వేస్తే మార్పు వస్తోందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రం

పంచాయతీకి ఆదాయం కల్పించాలనే లక్ష్యంతో నిర్మించిన కారంచేడులోని చెత్తసంపద కేంద్రం అధ్వాన్నస్థితికి చేరింది. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించి అందులో ఏర్పాటు చేసిన చెత్తశుద్ధి, చెత్తను విడదీసి, ముక్కలు చేసే యంత్రాలు ఎక్కడికక్కడ పాడై మూలకు చేరాయి. ఊరిలోని చెత్తను ఈ కేంద్రానికి తరలించకుండా కేంద్రానికి కొద్దిదూరంలోని వాగు వెంబడి పడేసి కాలుస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. దీనిపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో మరుగుదొడ్లకు ఉండే తలుపులు విరిగిపోయాయని, రాత్రి వేళల్లో ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ప్రజలు తెలుపుతున్నారు. ఇకనైనా అధికారులు దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో కె.నేతాజీని వివరణ కోరగా వారం రోజుల్లో కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. **-న్యూస్‌టుడే, కారంచేడు**

పావులూరు కాలువకు మోక్షం

పొక్లెయిన్‌తో పూడిక తొలగింపు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: పావులూరు మైనరు సాగరు కాలువలో పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. కోటపాడు మేజరులో దిగువన ఇంకొల్లు మండలం పావులూరుకు పడమర పొలిమేర నుంచి గొల్లపాలెం చెరువు వరకు 13 కిలోమీటర్ల మేర సాగరు కాలువ ఆయకట్టు ఉంది. ప్రస్తుతం హనుమోజిపాలెం పొలిమేర వరకు 11 కిలోమీటర్ల మేర కాలువ కట్టలకు రెండు వైపులా అడవితుమ్మ, ఇతర వ్యర్థాలను తొలగించారు. ప్రస్తుతం కాలువలో అడుగుమేర పూడిక తీస్తున్నారు. కట్టలు బలహీనంగా ఉన్న ప్రాంతాలు గుర్తించి పటిష్ఠం చేస్తున్నారు. ఇడుపులపాడు డొంక సైఫన్ నుంచి పాతచెన్నై రహదారి వరకు పనులు జరుగుతున్నాయి.

పెంపుడు జంతువులపై అప్రమత్తత అవసరం

టీకా వేస్తున్న డాక్టరు చిట్టిబాబు

చీరాల అర్బన్, అద్దంకి, కారంచేడు, న్యూస్‌టుడే: పెంపుడు జంతువులపై యజమానులు జాగ్రత్తలు పాటించాలని, క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు ఇప్పించడంతో పాటు ఆహారాన్ని తగిన మోతాదులో అందించాలని చీరాల, అద్దంకి పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టరు సజ్జా చిట్టిబాబు, డాక్టర్ కేవీ.బ్రహ్మయ్య పేర్కొన్నారు. జూనోసిస్ డేను పురస్కరించుకుని ఆదివారం వైకుంఠపురం, అద్దంకిలోని పశువైద్యశాలల వద్ద కుక్కలకు రేబీస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. పెంపుడు జంతువులకు రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని కారంచేడు పశువైద్యశాల డాక్టర్ భాగ్యరాజ్ తెలిపారు.

పాత చెన్నై రహదారికి మరమ్మతులు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు-పర్చూరు మధ్య పాత చెన్నై రహదారికి మరమ్మతులు ప్రారంభమయ్యాయి. 19 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణకు రూ.23 కోట్లు మంజూరు చేశారు. సాగరు కాలువలు, వాగులు ఉన్నచోట ఇప్పటికే వంతెనల నిర్మాణం పూర్తి చేశారు. రహదారి విస్తరణకు మేలో భూమి పూజచేసి ప్రస్తుతం ప్యాచ్‌వర్కు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 5.5 మీటర్ల రహదారిని ఏడు మీటర్లకు విస్తరించనున్నారు. ఇంకొల్లు నుంచి వంకాయలపాడు పొలిమేర వరకు 11 కిలోమీటర్లు ముందుగా మరమ్మతులు పూర్తిచేసి, అనంతరం పూర్తిస్థాయిలో రహదారి నిర్మాణం చేపడతారు. ప్రస్తుత మరమ్మతులతో వాహనదారులకు కొంతమేర ఉపశమనం కలిగింది.

చినగంజాంలో భగవద్గీత పఠిస్తున్న వాసవీ వనితా క్లబ్ మహిళలు

చింతపల్లిపాడులో చెన్నకేశవస్వామి

పంగులూరులో రామలింగేశ్వర స్వామి

అద్దంకిలో.. మాధవస్వామి

చీరాల: వీరరాఘవస్వామివారు

వైభవంగా తొలి ఏకాదశి

చీరాల, చీరాల అర్బన్, వేటపాలెం, పర్చూరు, మార్టూరు, యద్దనపూడి, కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం, అద్దంకి, జె.పంగులూరు, సంతమాగులూరు, బల్లికురవ, న్యూస్‌టుడే: చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లోని ప్రజలు ఆదివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేసి ప్రత్యేకాలంకరణలో స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని పలువురు భక్తులు అమ్మవారికి పసుపు,కుంకుమ, చీరలతో కూడిన సారెను అందజేశారు. మహిళలు ప్రత్యేకించి ఆయా దేవాలయాల్లో మాంగళ్య పూజలు, విష్ణు సహస్రనామ పారాయణ, భగవద్గీత పఠించారు. కొన్నిచోట్ల ఏకాహం నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో ఆలయ అభివృద్ధి కమిటీలు, ఈవోలు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కాపాలాలేని పశువుల కట్టడికి వినతి

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు మండలంలో కాపలా కాయకుండా వదిలేస్తున్న పశువుల కారణంగా ఖరీఫ్ సాగు ఆలస్యం అవుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో పశుపోషకులు రబీ పంటలు పూర్తయ్యాక పశువులను పొలాల్లోకి వదలేస్తుంటారు. జూన్, జులైలో ఖరీఫ్ పైర్లు వేసే వరకు ఇవి పొలాల్లోనే తిరుగుతుంటాయి. ప్రస్తుతం వర్షాలు కురిసి పైర్లు వేసుకునేందుకు అనుకూలమైన వాతావరణం ఏర్పడింది. ప్రస్తుతం ఖరీఫ్ పంటలుగా పెసర, మొక్కజొన్న, పశుగ్రాసం, పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలంటే పశువులను పొలాల్లోకి వదలకుండా కట్టడి చేయాలని, తహసీల్దార్, గ్రామ కార్యదర్శులకు వివిధ గ్రామాల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చదువుతో పాటు సాంస్కృతిక కళా నైపుణ్యం

పాఠశాల ఆవరణలో కోలాటం నేర్పిస్తూ..

బల్లికురవ, న్యూస్‌టుడే: బల్లికురవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వినూత్న కార్యక్రమం చేపట్టారు. చదువుతో పాటుగా సాంస్కృతిక కళా నైపుణ్యాన్ని పిల్లలకు నేర్పిస్తున్నారు. విద్యాలయం ఆవరణలో తరగతులు పూర్తయ్యాక పిల్లలకు కోలాటం నేర్పిస్తూ చిన్ననాటి నుంచే సాంస్కృతిక కార్యక్రమాల వైపు నడిపించే దిశగా ఉపాధ్యాయ బృందం ప్రోత్సహిస్తోంది.

రోటరీ శిక్షణ శిబిరం

పర్చూరు, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ భవనంలో ఆదివారం 2025-26 సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికలు, అమలుతీరు విధానాలపై శిక్షణ శిబిరం నిర్వహించారు. చీరాల, వేటపాలెం, బాపట్ల, పర్చూరు, ఇంకొల్లు, పంగులూరు, క్షీరపురి చీరాల రోటరీక్లబ్ కార్యనిర్వాహకులు చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. తొలుత క్లబ్ వ్యవస్థాపకుడు పాల్‌హారిస్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎన్.శ్రీనివాసరావు, టి.కృష్ణమోహన్, అన్నే రత్నప్రభాకర్ పాల్గొన్నారు.

పాలనలో ప్రభుత్వం విఫలం

మార్టూరు, న్యూస్‌టుడే: ప్రజారంజక పాలనలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైకాపా నియోజకవర్గ బాధ్యుడు గాదె మధుసూదనరెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక ఇంటూరి ఫంక్షన్ హాలులో ‘బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ’ మండలస్థాయి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉప్పలపాటి చంగళయ్య, తాటి వెంకట్రావు, జంపని వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

విస్తృత సేవలతో మరింత గుర్తింపు

పూర్వపు రోటరీక్లబ్ బాధ్యులకు సత్కారం

అద్దంకి: వినూత్న, విస్తృత సేవలు అందించడం ద్వారా రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండకు మరింత గుర్తింపు లభించిందని పూర్వపు విశ్రాంత సహాయ గవర్నర్ వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య) అన్నారు. శనివారం రాత్రి చుండూరి రామసుశీల నిలయం వద్ద జరిగిన రోటరీ క్లబ్ అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చప్పిడి వీరయ్య, చుండూరి మురళీసుధాకరరావు, బాచిన శివధర పూర్ణచంద్రరావు, అళహరి హరిప్రసాద్ పాల్గొన్నారు.

అవీ ఇవీ

వృద్ధులకు అన్నదానం

పర్చూరు, న్యూస్‌టుడే: స్థానిక నేతాజీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మొహర్రం సందర్భంగా ముస్లింలు ఆదివారం అన్నదానం చేశారు. షేక్ నబీ, షాహిద్, మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: మున్నంవారిపాలెం గ్రామానికి చెందిన ఆసోది దశరథరామిరెడ్డి (ప్రైవేటు బడి ఉపాధ్యాయుడు) రెండో వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు స్థానిక ఆశ్రమంలోని 30 మంది వృద్ధులకు అన్నదానం చేశారు. ఆశ్రమం నిర్వాహకురాలు లక్ష్మి, సూపర్‌వైజర్ గాజుల సోమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సోదరభావంతో మెలగాలి

కారంచేడు, న్యూస్‌టుడే: గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ వివాదాలు, ఘర్షణలకు పాల్పడకుండా సోదరభావంతో మెలగాలని ఎస్సై ఖాదర్‌బాషా సూచించారు. ఆదివారం మండలంలోని పోతినవారిపాలెంలో విజిబుల్ పోలీస్ నిర్వహించారు. సమ్మె జయప్రదం కోరుతూ ప్రదర్శన

అద్దంకి: జాతీయ స్థాయిలో ఈనెల 9న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలంటూ సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహన ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శననుద్దేశించి సీఐటీయూ నేత తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి భవానీ కూడలి, గాంధీబొమ్మ కూడలి మీదుగా తిరిగి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన సాగింది.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

బల్లికురవ: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి, ఊరేగించారు.

రేపు ఉపాధి పనులపై ప్రజా వేదిక

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులపై ఈనెల 8న స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. దీనికి సంబంధించి గత నెల 23 నుంచి గ్రామ స్థాయిలో ప్రత్యేక బృందాలు సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నాయని చెప్పారు.

చీరాల, న్యూస్‌టుడే: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ స్ఫూర్తితో ప్రతి భాజపా కార్యకర్త పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని ఆ పార్టీ పార్లమెంటరీ కన్వీనర్ బి.హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. శ్యామాప్రసాద్‌ముఖర్జీ జయంతి సందర్భంగా ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులు అర్పించారు. జిల్లా కార్యదర్శి కాకర్ల వెంకటేశ్వర్లు, పట్టణాధ్యక్షురాలు జి.భవాని, మనోహరరెడ్డి, నాగేశ్వరరావు, సాయిరాం, హనుప్రసాద్, ఎల్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కో-ఆప్షన్ మాజీ సభ్యుడు దిల్‌షాద్ మృతికి నివాళి

వేటపాలెం, న్యూస్‌టుడే: మండల కో-ఆప్షన్ మాజీ సభ్యుడు షేక్ దిల్‌షాద్ (56) ఆదివారం మృతిచెందారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. మృతుడికి ముగ్గురు పిల్లలున్నారు. మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, స్నేహితులు సందర్శించి నివాళులు అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మేదరమెట్ల: ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై మహమ్మద్ రఫి తెలిపిన వివరాల ప్రకారం.. ముండ్లమూరు మండలం అగ్రహారం గ్రామానికి చెందిన ఇద్దరూ వ్యక్తులు నామ్ రహదారిపై ద్విచక్ర వాహనం మీదుగా అద్దంకి నుంచి మేదరమెట్ల వైపు వస్తున్నారు. బొడ్డువానిపాలెం వద్ద డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో అద్దంకి వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో చోదకుడికి..

అద్దంకి, న్యూస్‌టుడే: మద్యం మత్తులో జరిగిన ప్రమాదంలో ద్విచక్రవాహన చోదకుడికి గాయాలయ్యాయి. ఆదివారం సాయంత్రం నామ్ రహదారిపై అద్దంకి నుంచి మేదరమెట్ల వైపు వెళుతున్న ద్విచక్రవాహన చోదకుడు ధేనువకొండ పునరావాస కాలనీ వద్ద రోడ్డు విభాగినిని ఢీకొట్టాడు. కిందపడటంతో కంటి వద్ద రక్త గాయాలయ్యాయి. మద్యం మత్తులో ఉన్నందున పేరు చెప్పేందుకు స్పృహలో లేడని, ప్రాథమిక చికిత్స అనంతరం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది హరిబాబు తెలిపారు.

రామన్నపేటలో ‘సుపరిపాలన-తొలి అడుగు’

కరపత్రాలు అందజేస్తున్న తెదేపా నాయకులు

రామన్నపేట(వేటపాలెం), న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక నాగవరపమ్మ ముఖద్వారం వద్ద ఆదివారం ‘సుపరిపాలన-తొలి అడుగు’ కార్యక్రమాన్ని తెదేపా నాయకులు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాదిలో ప్రభుత్వ పరంగా చేపట్టిన పథకాలు వివరించడంతో పాటు కరపత్రాలు అందజేశారు. నాసిక వీరభద్రయ్య, బొగ్గుల పార్థసారథి, ఉమ్మిటి శివశంకరరావు, గొల్లప్రోలు కృష్ణ, కర్న ప్రసాదు, సతీష్, చిన్న సాంబయ్య, కర్ణ తేజ, ఉమ్మిటి వర్మ ఉన్నారు.

శ్రద్ధాంజలి

మరణం : 23-06-2025

కీ॥శే॥ రామిశెట్టి వెంకటేశ్వర్లు గారు
పందిళ్ళపల్లి
హెడ్ మాస్టర్, జెడ్.పి.హెచ్ స్కూల్, ఎనికపాడు,
యస్.యన్.పాడు మండలం, ప్రకాశం జిల్లా.

మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తి..
మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మా ఆరాధ్య దైవం... మీ మరణం మాకు తీరనిలోటు. మీ పవిత్ర ఆత్మకు శాంతికలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
మీ.. కుటుంబ సభ్యులు

పెద్ద కర్మ: తేది: 07-07-2025, సోమవారం, మీనాక్షి ఎన్‌క్లేవ్, విఐపి రోడ్, 5వ లైన్, ఒంగోలు మా స్వగృహమునందు జరుగును. కావున తెలియచేయటమైనది.

(c) eenadu

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: ఎలాంటి టోకెన్లు లేని భక్తులకు 14 గంటల్లో, రూ.300 టికెట్ల భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. శనివారం శ్రీవారిని 87,536 మంది దర్శించుకున్నారు. రూ.3.33 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

ఈ నెలలో రెండుసార్లు గరుడ సేవ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో ఈ నెలలో గురు పౌర్ణమి, గరుడ పంచమి పర్వదినాలను పురస్కరించుకుని తితిదే రెండుసార్లు గరుడ వాహన సేవ నిర్వహించనుంది. 10న గురు పౌర్ణమి, 29న గరుడ పంచమి సందర్భంగా శ్రీమలయప్పస్వామి రాత్రి 7 నుంచి 9 గంటల వరకు గరుడ వాహనంపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం

కాణిపాకం, న్యూస్‌టుడే: ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 16 వరకు జరిగే శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి బ్రహ్మోత్సవాల విజయవంతానికి ఆలయ ఉభయదారులు పూర్తి సహాయ, సహకారాలు అందించాలని ఈవో పెంచల కిషోర్ కోరారు. శ్రీ మణికంఠేశ్వర స్వామి వారి ఆలయంలో ఉభయదారులతో ప్రత్యేక సమావేశాన్ని ఆదివారం నిర్వహించి ఆయన మాట్లాడారు. కాణిపాకం సర్పంచి శాంతిసాగర్‌రెడ్డి, ఉభయదారుల సంఘం అధ్యక్షుడు ఈశ్వరబాబు, మాజీ ఛైర్మన్లు మోహన్‌నాయుడు, జగన్నాథరెడ్డి, మణినాయుడు, మోహన్‌రెడ్డి, ఏఈవోలు రవీంద్రబాబు, ప్రసాద్, ధనపాల్, హరిమాధవరెడ్డి, ధనుంజయ, 14 గ్రామాల ఉభయదారులు పాల్గొన్నారు. సేవ పేరిట వచ్చి శ్రీశైల ఆర్యవైశ్య సత్రం నిర్వాహకులు దాన్ని వ్యాపార కేంద్రంగా మార్చుకున్నారని పలువురు ఉభయదారులు ఆరోపించారు. ఆ సందర్భంగా ఉభయదారులు పలు అంశాలను ప్రస్తావించారు.

ఆహ్వాన పత్రిక చదువుతున్న ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్, చిత్రంలో ఈవో కిషోర్ తదితరులు

పంచాయతీల్లో.. పన్ను దొంగలు

పెద్దఎత్తున పక్కదారి పడుతున్న వసూళ్లు

◆ తిరుచానూరు మేజరు పంచాయతీలో బిల్లు కలెక్టర్ రమేష్ నాయుడు ఏకంగా రూ.22 లక్షల వరకు పన్ను మొత్తం పక్కదారి పట్టించి ఇటీవల అడ్డంగా దొరికిపోయారు. సదరు బిల్‌కలెక్టర్ గతంలోనూ ఇదే తరహాలో అక్రమాలకు పాల్పడి వేటుకు గురైనా తీరు మార్చుకోలేదు. ఈ పంచాయతీలో ఏటా రూ.2 కోట్ల వరకు పన్ను వసూళ్లు ఉంటున్నాయి. ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఖాతాకు జమచేయాల్సి ఉన్నా చేయలేదు. కార్యదర్శి సైతం పట్టించుకోకపోవడంపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

◆ చిత్తూరు జిల్లా వి.కోట మేజర్ పంచాయతీలో గతంలో రూ.20 లక్షల వరకు బిల్లు కలెక్టర్లు స్వాహా చేశారు. నిధులు వాడుకున్నట్లు రుజువు కావడంతో ఇద్దరిపైనా వేటు వేశారు.

పుత్తూరు, న్యూస్‌టుడే: పంచాయతీల్లో పన్ను వసూళ్లు పెద్దఎత్తున పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వం ఎప్పటికప్పుడు సాంకేతిక మార్పులు తీసుకొస్తున్నా అక్రమాలకు తెరపడటం లేదు. మేజరు పంచాయతీల్లో ఈతంతు మరీ ఎక్కువగా ఉంటోంది. కొన్ని చోట్ల కార్యదర్శులు, బిల్లు కలెక్టర్లు మిలాఖత్ కావడంతో అక్రమాలు బయటకు పొక్కడం లేదు. మరికొన్నిచోట్ల ఉన్నతాధికారులకు తెలిసినా సర్దుబాటు చేయడం, నోటీసులతో సరిపెట్టడం వంటివి కొనసాగుతుండటంతో అక్రమాల పర్వం కొనసాగుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

'మేజర్'.. పాట్లు ఇక్కడే..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మేజర్ పంచాయతీలు 30 వరకు ఉన్నాయి. కాణిపాకం, తిరుచానూరు, సత్యవేడు, నాగలాపురం, నారాయణవనం, చంద్రగిరి, కార్వేటినగరం, జీడీనెల్లూరు, బంగారుపాళ్యం, రేణిగుంట తదితర వాటిలో రూ.కోట్లలో ఆదాయం ఉంటోంది. ఇక్కడ గ్రేడ్-1 కార్యదర్శులను నియమించాల్సి ఉన్నా రాజకీయ పలుకుబడితో ఏళ్ల తరబడి ఇన్‌ఛార్జులు కొనసాగడంతో అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతోంది.

2024-25లో వసూళ్లు ఇలా..

ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలు :	1471
పన్ను డిమాండు :	రూ.54 కోట్లు
వసూళ్లు :	రూ.48.75 కోట్లు
బకాయిలు :	రూ.5.25 కోట్లు

సొంత సిబ్బందితో..

అధిక ఆదాయం వచ్చే పలు పంచాయతీల్లో సర్పంచులను కీలుబొమ్మలుగా మార్చేస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ కింద పంచాయతీ పనులు సిబ్బందిని నియమించుకునే అవకాశం గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు ఉంటుంది. ఈ నేపథ్యంలో సొంత అనుచర గణంతో ఆ విభాగాన్ని నింపేసి మన్ని మదింపు నుంచి వసూళ్ల వరకు చేతివాటానికి పాల్పడుతున్నారు. రెగ్యులర్ బిల్లు కలెక్టర్లు వారికి దారులు చూపుతున్నారు. చివరకు ఎవరూ గుర్తించకపోతే దొంగ బిల్లులతో లెక్కా పద్దులు సరిచేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

పర్యవేక్షణ లేకనే..

ప్రధానంగా మేజర్ పంచాయతీలపై ఈవోఆర్డీలు, డీఎల్‌పీవోలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయడం, పన్ను వసూళ్లు వంటి వాటిపై దృష్టి సారించడం చేపట్టాలి. అయితే ఆదిశగా దృష్టి సారించకపోవడం, ఇక్కడి ఆదాయాలపైనే అందరి కళ్లు ఉండటంతో అక్రమాలకు తెరపడటం లేదన్న ఆరోపణలున్నాయి.

పకడ్బందీ చర్యలతో ముందుకు

తిరుచానూరు పంచాయతీలో జరిగిన అక్రమాలపై ఇటీవలే విచారణ పూర్తయింది. వాస్తవాలు నిర్ధారించుకుని బిల్లు కలెక్టర్‌ను సస్పెండ్ చేశాం. ఇకపై తరచూ మేజర్ పంచాయతీల్లో తనిఖీ చేపట్టి ఇలాంటి అక్రమాలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపడుతాం.

– సుశీలాదేవి, జిల్లా పంచాయతీ అధికారిణి, తిరుపతి

కృష్ణమ్మకు.. మరింత ఒరవడి

ఈనాడు– చిత్తూరు, తిరుపతి: కరవు ప్రాంతాలను సస్యశ్యామలం చేసే దిశగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) పెండింగ్ పనులపై ప్రధానంగా దృష్టి సారించింది. మొదటి ఏడాదిలో పుంగనూరు, కుప్పం కాలువలకు నిధుల వరద పారించింది. ఇప్పుడు ప్రధాన, నీవా కాలువల్లోని అసంపూర్తి నిర్మాణాలతోపాటు లైనింగ్‌కు పచ్చజెండా ఊపింది.

తెలుగుదేశం హయాంలో 2014-19 మధ్య హంద్రీ-నీవా ప్రధాన కాలువ 185.32 కి.మీ. మేర తవ్వించి 90 శాతం పూర్తిచేసింది. అప్పట్లో 500 మీటర్లు మాత్రమే పెండింగ్ పనులున్నాయి. వాటిలో అన్నమయ్య జిల్లా చిన్నమండ్యం మండలం పడమటికోన వద్ద 200, కలకడ దగ్గర 300 మీటర్లు మాత్రమే తవ్వాలి. కలకడ మండలం దొడ్డిపల్లి సమీపంలో మూడు కాంక్రీట్ నిర్మాణాలు, మరికొన్ని స్ట్రక్చర్లు, అక్విడక్టుల నిర్మాణం చేపట్టాలి. ఇవి పూర్తి చేసేందుకు ఆరునెలల సమయం సరిపోతుంది. జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న 60 నెలలూ వీటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు.

రెండేళ్లలో జలాలు వచ్చేలా

హంద్రీ- నీవా ప్రధాన కాలువ, నీవా బ్రాంచి కాలువ లైనింగ్ అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపితే ఇప్పటికే సూత్రప్రాయంగా ఆమోదించినందున వెంటనే అనుమతులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. రెండేళ్లలో ఈ పనులు పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు.

హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ప్రధాన కాలువ లైనింగ్‌కు పచ్చజెండా

అంచనాలు రూపొందించే పనిలో అధికారులు

పులిచెర్ల మండలం గుట్టమీద ఎస్టీ కాలనీ సమీపంలోని హంద్రీనీవా కాలువలో పిచ్చిమొక్కలు

బకాయిలు, పనులకు రూ.156 కోట్లు

ప్రధాన కాలువ కింద గతంలో చేసిన పనులకుగాను రూ.61.06 కోట్ల బిల్లులు చెల్లించాలి. పెండింగ్ నిర్మాణాలకు మరో రూ.45.59 కోట్లు అవసరం. శ్రీసత్యసాయి జిల్లాలోనూ బకాయిలు, అసంపూర్తి పనులకు రూ.50 కోట్లు కావాలి. మొత్తంగా రూ.156 కోట్లు ప్రభుత్వం నుంచి విడుదల కావాలి. ఇప్పటికే హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు ఈ విషయమై ప్రభుత్వానికి నివేదించారు. నీవా బ్రాంచి కాలువకు మరో రూ.65 కోట్ల వ్యయమవుతుంది. ఇవి పూర్తయితే పీలేరు, పుంగనూరు, చంద్రగిరి, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల్లో దాదాపు 97 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. చిత్తూరు నగర ప్రజల తాగునీటి ఇక్కట్లు తీరుతాయి.

తల్లికి వందనం.. విజ్ఞప్తులకు పరిష్కారం

వివిధ స్థాయిల్లో పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్: అర్హత ఉన్నప్పటికీ సాంకేతిక సమస్యలతో తల్లికి వందనం నగదు జమ కాని వారికి లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పొరపాట్లు సవరించేలా గ్రామ/వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలో బదిలీల హడావుడిలో కొంచెం జాప్యం జరిగినా.. సమస్యల పరిష్కారంపై జిల్లా అధికార యంత్రాంగం చొరవ చూపి వేగవంతం చేయిస్తున్నారు. తల్లి/సంరక్షకుల ఈకేవైసీ నమోదు కాకపోవడం, తల్లిదండ్రులకు వ్యవసాయ భూమి లేనప్పటికీ ఆన్‌లైన్‌లో చూపడం, తల్లి మరణించడం, ఆదాయ పన్ను రిటర్నులు ఉండటం, ప్రభుత్వ ఉద్యోగిగా నమోదై ఉండటం తదితర సమస్యలపై అర్జీలు వచ్చాయి.

సమస్య-పరిష్కారం ఇలా..

ఈకేవైసీ సమస్యలపై 223 వినతులు అందగా 160 అర్జీలు పరిష్కారమయ్యాయి. ఇంకా 63 పెండింగ్‌లో ఉన్నాయి. తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగిగా నమోదు కావడంపై 604 వినతులు అందగా, వీటిలో పథకానికి 29 మంది అర్హత ఉన్నట్లు గుర్తించారు. ఈ నెల 5వ తేదీ నాటికి డిజిటల్ అసిస్టెంట్/వార్డు విద్య కార్యదర్శి లాగిన్‌లో 368, సంక్షేమ కార్యదర్శుల లాగిన్‌లో 54, వీఆర్వో లాగిన్‌లో 152, తహసీల్దార్ లాగిన్‌లో 28 వినతులు పెండింగ్‌లో ఉన్నాయి. 292 మంది ఆదాయ పన్ను పరిధిలో నమోదై ఉన్నారు. ఈ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఐదు సెక్షన్లు.. ఒకరితోనే బోధన

పుంగనూరులోని కొత్తయిండ్లు మున్సిపల్ ఉన్నత పాఠశాల జిల్లాలోనే విద్యార్థులు అత్యధికంగా ఉన్న పాఠశాలలో ఒకటి. ఇక్కడ 949 మంది విద్యార్థులు ఉండగా 36 మంది ఉపాధ్యాయులకుగాను 17 మంది మాత్రమే ఉన్నారు. దీంతో ఆరో తరగతిలోని ఐదు సెక్షన్ల విద్యార్థులు మొత్తం 170 మందిని ఒకే గదిలో కూర్చోబెట్టి ఒకే ఉపాధ్యాయినితో బోధిస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో నటరాజరెడ్డిని వివరణ కోరగా.. ఆగస్టులో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమిస్తామని పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

బీసీలంటే.. సామాజిక శక్తి

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: బీసీలంటే ఒక సామాజిక శక్తి, బలం, చైతన్యమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం, అంబేడ్కర్ పులే ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలోని ఇందిరా మైదానం వేదికగా ఆదివారం నిర్వహించిన 'బీసీల ఆత్మగౌరవ భరోసా సభ' విజయవంతంగా ముగిసింది. అంతకుముందు బాలాజీకాలనీలోని జ్యోతిబాపులే విగ్రహం నుంచి ఇందిరా మైదానం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మంత్రులు సత్యకుమార్, సవిత, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, యాదవ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌లు నరసింహ యాదవ్, రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, నాయకులు పాల్గొన్నారు.

ఐక్యత చాటుతున్న మంత్రులు సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్, ఎమ్మెల్యే ఆరణి, బీసీ సంఘాల నాయకులు

ద్రవిడ.. కష్టాలు గట్టెక్కేదెలా?



కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: ద్రావిడ భాషలపై విస్తృత పరిశోధనలు జరిపి ద్రవిడ సంస్కృతి.. సంప్రదాయాలను పరిరక్షించాలనే లక్ష్యంతో కుప్పంలో ద్రవిడ విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. ఆ దిశగా అడుగులు ముందుకేస్తున్న వర్సిటీ కొందరు పాలకుల ఇష్టారాజ్యంతో కష్టాల్లో కొట్టుమిట్టాడుతోంది. ఆర్థిక వనరులు లేక కనీసం అక్కడ పనిచేసే పొరుగు సేవల ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి. వారికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తెప్పించి జీతాలు చెల్లించాల్సిన దుస్థితి కొనసాగుతోంది. కొత్తగా రాబోయే వీసీ ద్రవిడ కష్టాలను ఏ విధంగా అధిగమిస్తారో వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏడాది తర్వాత..

కుప్పం ద్రవిడ వర్సిటీలో వైకాపా హయాంలో వీసీగా నియమితులైన ఆచార్య మధుజ్యోతి

దూరవిద్య మూతపడి మరిన్ని సమస్యలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గతేడాది జులై 18న రాజీనామా చేశారు. గ్రంథాలయ శాఖాధిపతిగా విధులు నిర్వహిస్తున్న ఆచార్య దొరస్వామిని ఇన్‌ఛార్జి వీసీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎట్టకేలకు ఏడాది తర్వాత కూటమి ప్రభుత్వం ద్రవిడ వీసీ నియామకానికి సెర్చ్ కమిటీని నియమించింది.

పోస్టుల నియామకంలోనూ జాప్యం

ద్రవిడలో 79 టీచింగ్ పోస్టులు ఉండగా.. ప్రస్తుతం 56 మంది ఉన్నారు. 55 నాన్ టీచింగ్ పోస్టులుండగా.. 43 మంది పని చేస్తున్నారు.

నిధులు ఖాళీ..

విశ్వవిద్యాలయంలో 28 మంది పొరుగు సేవల ఉద్యోగుల నియామకాలకు సంబంధించి మాత్రమే ప్రభుత్వ అనుమతి ఉంది. అయినా. . గత పాలకులు 254 మందిని పొరుగు సేవల కింద నియమించుకున్నారు. వీరందరికీ దూర విద్య ద్వారా వచ్చే నిధుల నుంచి వర్సిటీ జీతాలను చెల్లించుకుంటూ వచ్చింది. ఈ విభాగాన్ని యూజీసీ రద్దు చేయడంతో ఉన్న నిధులు ఖాళీ అయ్యాయి. నాలుగేళ్లుగా జీతాల కోసం ఉద్యోగులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించింది. జీతాల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీ ద్వారా ఆరాతీసి నివేదికను అందించినా.. దానిపై ఇన్‌ఛార్జి వీసీ నిర్ణయం తీసుకోలేకపోయారు. ఈ విషయమై కొత్త వీసీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చర్చనీయాంశంగా మారింది.

పల్లెకు పండగొచ్చింది..

◆ ఉమ్మడి జిల్లాలో రూ.115 కోట్ల బకాయిలు

◆ ఇప్పటివరకూ రూ.45 కోట్లు చెల్లింపు

ఉపాధి నిధులతో నిర్మించిన సిమెంటు దారి

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం కింద పల్లెల్లో సీసీరోడ్లు, కాలువలు, మినీ గోకులాలు తదితర నిర్మాణ పనులు చేపట్టిన వారికి ప్రభుత్వం శుభవార్త చెప్పింది.. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పల్లె పండుగ పనుల బిల్లులు సుమారు ఎనిమిది నెలల నుంచి పెండింగులో ఉన్నాయి.. ఆ పనుల తాలూకా బిల్లులు నిధులు రూ.45 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేశాయి.. పాడి రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్లకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో చెల్లింపులు జరుగుతున్నాయి.

పాత బకాయిలు..

నిధుల విడుదలతో గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిన అభివృద్ధి పనులు వేగం పుంజుకోనున్నాయి. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో ఉపాధి నిధులతో చేసిన పనుల తాలూకా బిల్లులను వైకాపా ప్రభుత్వం చెల్లించకుండా నిలిపివేసి తీవ్ర ఇబ్బందులు పెట్టింది. చిత్తూరులో రూ.1,81,84,376, తిరుపతిలో రూ.2,42,11,799 బిల్లులు చెల్లించలేదు. ఆ బకాయిలు ఇప్పుడు విడుదల చేయడంతో అప్పట్లో పనులు చేసిన వారు ఊపిరి పీల్చుకున్నారు.

ఉపాధి హామీ మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో చేపట్టిన పనులు



ఉపాధి బిల్లు విడుదలైంది

చెల్లింపులు జరుగుతున్నాయి..

పాడి పోషణ ప్రోత్సహించేలా గోకులం షెడ్ల నిర్మాణాల్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. 90 శాతం రాయితీ, 10 శాతం రైతుల వాటాతో షెడ్లు నిర్మించారు. జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన లక్ష్యానికి చేరువయ్యారు. వాటికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో రూ.20.76 కోట్లు బిల్లుల చెల్లింపులకు వివరాలు అప్‌లోడ్ చేశారు. అందులో ఇప్పటి వరకూ రూ.6 కోట్ల మేర లబ్ధిదారులైన రైతుల ఖాతాల్లో జమ కాగా, త్వరలో మిగిలిన వారికీ జమవుతుందని అధికారులు అంటున్నారు.

బకాయిలు జమవుతున్నాయి..

చిత్తూరు జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన సీసీరోడ్లు, బీటీ దారులు, గోకులం షెడ్లు తాలూకు బిల్లులు రూ.57 కోట్లు అప్‌లోడ్ చేశాం. అందులో 50 శాతం ఇప్పటి వరకూ లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యింది. మిగిలిన మొత్తం త్వరలో జమవుతుంది.

– రవికుమార్, పీడీ, డ్వామా

2.3 లక్షల టన్నుల తోతాపురి కొనుగోలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలోని గుజ్జు పరిశ్రమల వద్ద తోతాపురి మామిడి కాయల ట్రాక్టర్లు, లారీలు క్యూ కడుతున్నాయి. గత వారంతో పోల్చితే ప్రస్తుతం పరిశ్రమల వద్ద మామిడి ట్రాక్టర్లు కాస్త తగ్గుముఖం పట్టాయి. గత నెల ఎనిమిదో తేదీ నుంచి గుజ్జు పరిశ్రమలు తోతాపురి కాయల కొనుగోలు ప్రారంభించాయి. ఇప్పటివరకు 32 పరిశ్రమలు 1.7 లక్షల టన్నుల కాయలు 36 వేల మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదనరెడ్డి తెలిపారు. 31 ర్యాంపుల నిర్వాహకులు 14 మంది రైతుల నుంచి 60 వేల టన్నులు కొనుగోలు చేశారన్నారు. ఇప్పటివరకు పరిశ్రమలు, ర్యాంపులు 50 వేల మంది రైతుల నుంచి 2.3 లక్షల టన్నుల కాయలు కొనుగోలు చేశాయన్నారు. ప్రస్తుతానికి జిల్లాలోని కొన్ని మండలాల్లో 70-75 శాతం పూర్తికాగా మరికొన్ని మండలాల్లో 55-65 శాతం తోతాపురి కోతలు పూర్తయ్యాయని చెప్పారు. వారం రోజుల్లో ఇవి చివరి దశకు చేరుకుంటాయని ఆయన తెలిపారు.

రైతులకు ప్రభుత్వం అండ..

పూతలపట్టు, న్యూస్‌టుడే: మామిడి రైతులను అన్ని విధాలా ఆదుకుంటుందని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి తెలిపారు. రంగంపేట క్రాస్ వద్ద ఉన్న గల్లా ఫుడ్స్ పరిశ్రమను ఆయన ఆదివారం సందర్శించారు. మామిడి పల్ప్, జ్యూస్‌పై ఇప్పుడున్న జీఎస్టీ 12 శాతాన్ని.. ఐదు శాతానికి త్వరలో తగ్గించనున్నట్లు చెప్పారు. ఏరోజుకా రోజు టోకెన్లు రైతులకు ఇవ్వాలని స్పష్టం చేశారు. డీడీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

గల్లా ఫుడ్స్‌లో జ్యూస్‌ను పరిశీలిస్తున్న చిరంజీవి చౌదరి

వైకాపా సర్పంచి అరెస్టు

అడ్డదారిలో కుటుంబ సభ్యుల ఆస్తి స్వాహా

యాదమరి, న్యూస్‌టుడే: ఆస్తి విషయంలో కుటుంబ సభ్యులను మోసం చేసిన వైకాపా నాయకుడు, 184. గొల్లపల్లి సర్పంచి పరంధామగౌడ్ అరెస్టయ్యారు. వారసత్వంగా వచ్చిన ఆస్తిని అన్నదమ్ములకు ఇవ్వకుండా, చట్టప్రకారం భాగ పరిష్కారం చేయకుండా, ఆస్తిని పరంధామగౌడ్ తనపై, తన భార్య పేరుపై పాసుపుస్తకంలో నమోదు చేయించుకుని, వాటిని బ్యాంకులో తనఖా పెట్టి రుణాలు తీసుకున్నట్లు గతేడాది అతడి తల్లి యాదమరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై రెవెన్యూ అధికారుల ద్వారా విచారణ చేయించి చట్ట ప్రకారం ఆదివారం సర్పంచి పరంధామగౌడ్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించామని ఎస్సై ఈశ్వర్ స్పష్టం చేశారు. ఎవరైనా తప్పుడు పాసు పుస్తకాలు సృష్టించినా, తప్పుడు వీలునామా చేయించినా వారిపై చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

బడి బాగుచేసుకోండి..

జిల్లాకు రూ.2.86 కోట్లు విడుదల

కూటమి ప్రభుత్వం చొరవ

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. విద్యా సంవత్సరం పునఃప్రారంభమైన 15 రోజులకే నిధులు కేటాయించింది. పాఠశాలల్లో మరమ్మతులు, చాక్‌పీస్‌లు, డస్టర్లు, తదితరాల కొనుగోలు, విద్యుత్తు బకాయిలు తదితరాలకు ఈ నిధులు వినియోగించుకోవచ్చు. నిర్వహణ నిధులు విద్యా సంవత్సరంలో రెండు విడతలుగా విడుదల చేస్తారు. గత వైకాపా పాలనలో ఈ నిధులు విడుదల కాలేదు. దీంతో పాఠశాలల్లో ఏ చిన్న పనికైనా ప్రధానోపాధ్యాయులు సొంత నగదు ఖర్చు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ నిధులు పునరుద్ధరించి గత విద్యా సంవత్సరం నుంచే మంజూరు చేస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే మొదటి విడతగా జిల్లాలోని 2,444 పాఠశాలలకు రూ.2.86 కోట్లు విడుదల చేసింది. పాఠశాలల బ్యాంకు ఖాతాలో నిధులు జమయ్యాయి. జిల్లాకు మొత్తం రూ.5.16 కోట్లు అందులో మొదటి విడతలో పై మొత్తం విడుదలయ్యాయి.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా..

నిర్వహణ నిధులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఒకటి నుంచి 30 మందికి రూ.10 వేలు, 31 నుంచి 100 మందికి రూ.25వేలు, 101 నుంచి 250 మందికి రూ.50వేలు, 251నుంచి వెయ్యి మంది వరకు రూ.75 వేలు ఇంకా ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే రూ.లక్ష వరకు నిధులు ఇస్తారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

104 FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9000180635

MIOT HOSPITALS OUTREACH CLINIC TIRUPATI
కాలేయ వ్యాధులు మరియు కాలేయ మార్పిడిపై నిపుణుల అభిప్రాయం పొందండి...

MIOT ప్రత్యేకతలు
- కాలేయ మార్పిడి
- చిన్నపిల్లల కాలేయ మార్పిడి.
- కాలేయ క్యాన్సర్ మార్పిడి.
- కాలేయ నిర్వాహణయొక్క సిర్రోసిస్
- తీవ్రమైన కాలేయ వైకల్యం
- ఫ్యాటీ లివర్

లక్షణాలు
- వైరల్ హెపటైటిస్ (హెపటైటిస్ బి మరియు సి)
- నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి (NAFLD) / నాన్-ఆల్కహాలిక్ స్టీటో హెపటైటీస్ (NASH)
- లైసో సోమల్ స్టోరేజీ వ్యాధులు • ఆల్కహాలిక్ లివర్ వ్యాధి (ALD)

డా॥ పి. వెంకటసాగర్ MBBS, MS (General Surgery), Fellowship HepatoBiliary & Liver Transplant
లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్

సంప్రదించవలసిన చిరునామా: MIOT హాస్పిటల్స్ అవుట్రీచ్ క్లినిక్
D No 20-3-129/1, తిరుమల బైపాస్ రోడ్, శివజ్యోతి నగర్, తిరుపతి, తిరుపతి జిల్లా - 517501

తేదీ మరియు సమయం: 9 జూలై 2025 బుధవారం (10am - 5pm)
కన్సల్టేషన్ ఫీజు: Rs. 400/-
అపాయింట్‌మెంట్‌ల కొరకు*: +91 70953 85111 +91 70953 85333

*ముందస్తు అపాయింట్‌మెంట్ తప్పనిసరి. ఒకవేళ అవసరం అనుకుంటే, దయచేసి ఇంతకు ముందు వైద్య రికార్డులను, తీసుకుని రావలసినదిగా మనవి
Email: tic@miotinternational.com | www.miotinternational.com

(c) eenadu

కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక, హాజరైన న్యాయమూర్తులు

కేసుల పరిష్కారంలో పురోగతి సాధించాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: పెండింగ్ కేసుల పరిష్కారంలో నిర్దేశిత ప్రగతిని సాధించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక పేర్కొన్నారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని న్యాయమూర్తులకు ఆదివారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ హైకోర్టు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పెండింగ్ కేసులు వెంటనే పరిష్కరించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతానికి 96,739 పెండింగ్ కేసులు ఉండగా.. ఇందులో 48,751 సివిల్ కేసులు, 47,988 క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రమేష్, మూడో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి గురునాథ్, నాలుగో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి అర్చన, ఐదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రాంగోపాల్, ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి, 10వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రామచంద్రుడు, 12వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసనాయక్, ఉమ్మడి జిల్లాలోని సీనియర్, జూనియర్ న్యాయమూర్తులు కోర్టు అధికారులు పాల్గొన్నారు.

చిత్తూరులో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

చిత్తూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలో ఆదివారం టూటౌన్ పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో సీఐ నెట్టికంఠయ్య తన బృందంతో కలిసి ఇరువారం, వైఎస్సార్ కాలనీ, కైలాసపురం, రాజగుడి వెనక వైపు, పోతంబట్టు, బాలంపట్టు, తెనబండ ఖాళీ ప్రాంతాలతో పాటు అటవీ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. డ్రోన్ ద్వారా గంజాయి బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగుతున్నారేమోనని సోదా చేశారు.

ఘనంగా అగ్నిగుండ ప్రవేశ వేడుకలు

అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

ద్రౌపదీదేవి

కార్వేటినగరం, న్యూస్‌టుడే: శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పవిత్ర స్నానమాచరించి పసుపు దుస్తులు, పూలమాలలు ధరించి గోవిందనామ స్మరణల నడుమ అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఈ వేడుకలు తిలకించడానికి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చన నిర్వహించారు. ఆలయ ఆవరణలో మహిళలు పొంగళ్లు పెట్టారు. రాత్రి ద్రౌపదీ సమేత అర్జునుడిని పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి ఊరేగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రవియాదవ్, కార్యదర్శి గౌతంవర్మ, ఉపాధ్యక్షుడు రవిరెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి మొదలియార్, అదనపు కార్యదర్శి సాయిరాయల్ పాల్గొన్నారు.

రాయితీ విత్తనం.. రైతుకు వరం

● పంపిణీకి సిద్ధమవుతున్న ఏపీసీడ్స్

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: అంతర్ పంటలపై రైతులను ప్రోత్సహించాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయి రాయితీతో విత్తనాలు పంపిణీకి సిద్ధమైంది. ఈ మేరకు కందులు, ఉద్దులు, రాగి విత్తనాలు పంపిణీకి సన్నద్ధం కావాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ(ఏపీ సీడ్స్)కు ఆదేశాలు అందాయి. అందుకు తగ్గట్లు విత్తనాల పంపిణీకి కసరత్తును ప్రారంభించింది.

● **రాయితీ ఇలా..:** గతంలో రాయితీ విత్తనాలు ఉన్నా పూర్తి స్థాయిలో ఇచ్చింది అంతంత మాత్రమే. అందులోనూ కందులు ఒక రకం మాత్రమే ఇస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రధాన పంటలే కాకుండా పప్పు దినుసులు, ఇతరత్రా పంటల సాగు పట్ల రైతులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో కందులు, మినుములు, రాగి విత్తనాలు పూర్తి రాయితీపై ఇచ్చేందుకు సిద్ధమైంది.

● **కంది :** 7800 కిట్ల రూపంలో రైతులకు ఇవ్వాలని నిర్ణయించారు. ఒక్కో కిట్ నందు 4 కిలోల విత్తనాలు ఉంటాయి. తద్వారా 312 క్వింటాళ్లు ఉచితంగా ఇవ్వనున్నారు.

● **రాగులు:** 300 కిట్లను ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఒక్కో కిట్‌లో రెండు కిలోల వంతున ఆరు క్వింటాళ్ల విత్తనాలు ఉచితంగా అందించనున్నారు.

ఉద్ది

● **ఉద్ది :** 500 కిట్ల రూపంలో ఇచ్చేలా నిర్ణయించారు. ఒక్కో కిట్ ద్వారా 4 కిలోలు వంతున 20 క్వింటాళ్లు అందజేయనున్నారు.

● **పశ్చిమానికే ప్రాధాన్యం..:** రాయితీ విత్తనాలు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పశ్చిమ ప్రాంత రైతులకు మాత్రమే అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. ఆ మేరకు ఉమ్మడి జిల్లాలోని పలమనేరు, పుంగనూరు, చిత్తూరు, నగరి వ్యవసాయ డివిజన్ల రైతులకు మాత్రమే వీటిని పంపిణీ చేయనున్నారు. జిల్లా వ్యవసాయాధికారుల సూచనల మేరకు రాయితీ విత్తనాల పంపిణీ జరుగుతుందని ఏపీసీడ్స్ అధికారులు తెలిపారు.

జగన్‌కు దమ్ముంటే పెద్దిరెడ్డి పరిశ్రమ వద్ద ధర్నా చేయాలి

● రూ.20 వేలకు ఎందుకు కొనలేదు

● నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ధ్వజం

పుత్తూరు, న్యూస్‌టుడే: రైతులను రాజకీయ కోసం వాడుకోవడం వైకాపా నేత జగన్‌కే చెల్లిందని, ఆయన చేస్తోంది పరామర్శ యాత్ర కాదని.. విధ్వంస యాత్ర అని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దుయ్యబట్టారు. తిరుపతిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా ఐదేళ్ల పాలనలో ఎప్పుడైనా మామిడి రైతులకు ఒక్క పైసా గిట్టుబాటు ధర ఇచ్చారా అని ప్రశ్నించారు. రూ.500 కోట్లు ఖర్చు పెట్టి ప్యాలెస్ కట్టుకున్న జగన్ ఐదేళ్లలో మామిడి రైతులకు ఐదు రూపాయలైనా ఇచ్చారా అని అన్నారు. గత ఐదేళ్లలో మామిడి రైతులకు వైకాపా నేతలు ఏం చేశారో చెప్పాలన్నారు. జిల్లాలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో సహా వైకాపా నాయకులకు మామిడి గుజ్జు పరిశ్రమలు ఉన్నాయని, రైతుల నుంచి తోతాపురి టన్ను రూ.20 వేలకు ఎందుకు కొనలేదన్నారు. వైకాపా పాలనలో ఐదేళ్ళ గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా నేడు విమర్శలు చేయడం సరికాదన్నారు. కొందరు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, రైతులు వారి మాయలో పడొద్దన్నారు. అసలు జగన్ బంగారుపాళ్యం ఎందుకు వస్తున్నాడో..? రైతులను ఏం చేద్దామని వస్తున్నాడో చెప్పాలన్నారు. జగన్‌కు దమ్ముంటే మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం నడిపే గుజ్జు పరిశ్రమ దగ్గరకు వెళ్లి నిరసన చేయగలడా అని ప్రశ్నించారు. సిండికేట్‌గా మారి రైతులను ముంచేసి ఇప్పుడు తీరిగ్గా పరామర్శల పేరుతో వైకాపా నాయకులు డ్రామా ఆడుతున్నారని, రైతులు వాస్తవాలు తెలుసుకోవాలని భానుప్రకాష్ సూచించారు. నేడు పరామర్శల పేరుతో వైకాపా నాయకులు డ్రామాలు ఆడుతున్నారని, రైతులు వాస్తవాలు తెలుసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

నేడు చిత్తూరులో గ్రీవెన్స్

చిత్తూరు కలెక్టరేట్, క్రైమ్, న్యూస్‌టుడే: చిత్తూరులోని కలెక్టరేట్, ఏఆర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా బాధితుల వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. **పోలీస్‌శాఖలో ఒంటి గంట వరకే..:** జిల్లా ఏఆర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినతులు స్వీకరిస్తామని ఎస్పీ మణికంఠ పేర్కొన్నారు.

ఫోన్ల చోరీ ముఠాకు రిమాండ్

సైదాబాద్ (హైదరాబాద్): కర్నూలు నంద్యాలకు చెందిన గరడి మహేశ్ కొత్తపేటలో, చిత్తూరు మంగ సముద్రం రూరల్ నెహ్రూ నగర్ నివాసి జి.రాము, తూర్పు గోదావరి బిక్కవోలుకు చెందిన ఉత్తుకురి ఏసు, అంబటి సుధాకర్ అల్మాస్‌గూడ రాజీవ్ గృహకల్పలో ఉంటున్నారు. ఐదేళ్ల క్రితం పలు కేసుల్లో పట్టుబడి జైలుకు వెళ్లారు. విడుదలయ్యాక ముఠాగా ఏర్పడి ఫోన్ల చోరీ ప్రారంభించారు. గత నెల 22న మాదన్నపేటలో, 26న మీర్‌పేటలో, 30న సైదాబాద్‌లో వృద్ధుల నుంచి ఫోన్లు అపహరించారు. నిఘా పెట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి తొమ్మిది ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని డీఐ ఆనంద్ కుమార్ తెలిపారు.

ఏనుగుల గుంపు హల్‌చల్

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలం పూరేడువారిపల్లె సమీపంలోని పెద్దఒడ్డు చెరువు కట్ట ఎక్కేందుకు యత్నిస్తూ ఆడ ఏనుగు కిందపడి మృతి చెందిన విషయం విదితమే. ఈ క్రమంలోనే ఏనుగు మృతి చెందిన స్థలానికి శనివారం అర్ధరాత్రి 17 ఏనుగుల గుంపు వచ్చింది. సమీప పొలంలోని వరిని తొక్కి నాశనం చేశాయి. ఏనుగు మృతి చెందిన ప్రదేశానికి ఎవరూ వెళ్లొద్దని ఇది వరకే డీఎఫ్‌వో భరణి తెలిపారు. కల్లూరు ఎద్దలవారిపల్లెకు ఆరు ఏనుగులు, పాతపేట సమీపంలోని వ్యవసాయ పొలాల్లోకి రెండు ఏనుగులు చేరాయి. మిగిలిన ఏనుగులు గంటావారిపల్లె సమీప మామిడి తోటల్లో పడ్డాయి. పాతపేట సమీపంలోని రఫికి చెందిన ఐదు మామిడి చెట్లను విరిచాయి. పలువురి రైతులకు పంట నష్టం కలిగించాయి.

వరి పైరును తొక్కి నాశనం చేసిన ఏనుగులు

ఒంటరి ఏనుగు దాడి

రామకుప్పం, న్యూస్‌టుడే: పంటలపై ఒంటరి ఏనుగు తరచూ దాడి దిగడంతో ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం అర్ధరాత్రి మండల పరిధిలోని ననియాల పరిసర ప్రాంతాల్లో ఒంటరి ఏనుగు పంటలపై దాడులు చేసి నాశనం చేసింది. మామిడి కాయలు తిని చెట్ల కొమ్మలు విరిచేస్తోంది. అలాగే కొబ్బరి, టమాటా, వరి, బీన్స్ పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

పశుగణాభివృద్ధిలో.. గ్రాసాల సాగే కీలకం

● నేటి నుంచి వారోత్సవాలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే : పాడి పశువుల పెంపకంలో పోషణ అనేది చాలా కీలకం. పచ్చి మేతకు కొదవ లేకుండా మేసినపుడే రైతుకు పోషణ వ్యయం తగ్గి పాడి పరిశ్రమ గిట్టుబాటు అవుతుంది. పశుగణాభివృద్ధితో పాటు మేలురకం పశుగ్రాసాల సాగుకు ఉన్న ప్రాముఖ్యత గుర్తించి పాడి రైతుల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జులై 7 నుంచి 14 వరకు పశుగ్రాస వారోత్సవాల నిర్వహణకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ప్రతి గ్రామంలోనూ పశుపోషకులకు పశుగ్రాసం సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించి రాయితీ పశుగ్రాస విత్తనాలు అందజేస్తారు.

మేలు రకం పశుగ్రాసం విత్తనాలు జొన్న, మొక్కజొన్న, అలసందలు, సజ్జలు మినీ కిట్లను 75 శాతం రాయితీపై పశువైద్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పశుగ్రాసంలో స్వయం సమృద్ధి, పశుగ్రాసం లభ్యత పెంచడం, పశుపోషణ యాజమాన్య పద్ధతులను తగ్గించేందుకు వంద శాతం రాయితీతో పశుగ్రాసాల అభివృద్ధికి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేశారు. పశుగ్రాసం సాగుకు ఉపాధి హామీ పథకం అనుసంధానం పాడిరైతులకు ఎంతో లాభదాయకమని పశుసంవర్ధక శాఖ ఇన్‌ఛార్జి జేడీ అబ్దుల్ ఆరిఫ్ తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా ప్రతీ గ్రామంలో ఉపాధి నిధులతో పశుగ్రాసాల పెంపకంపై అవగాహన కల్పిస్తామన్నారు. పచ్చిమేతతో సమకూరే ప్రయోజనాలను రైతులకు వివరిస్తామన్నారు. వారోత్సవాల విజయవంతానికి పశువైద్యాధికారులు, సిబ్బంది, రైతులు కృషి చేయాలని ఆయన కోరారు.

తెలుగు భాషాభిమానంపై సదస్సు

పురస్కారాలు అందుకున్న వారితో నిర్వాహకులు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: తెలుగు భాష వికాసానికి మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ గౌరవాధ్యక్షుడు దేవేంద్రరావు అన్నారు. చిత్తూరులోని సమాఖ్య కార్యాలయంలో ఆదివారం 'తెలుగు భాషాభిమానం- వైఎస్సార్ అంతరంగం' అంశంపై సదస్సు నిర్వహించారు. వైఎస్సార్ పరిపాలనపై జరిగిన కవి సమ్మేళనంలో సాహితీవేత్తలు కవితలు ఆలపించారు. అనంతరం సాహిత్య, సామాజిక సేవలు అందిస్తున్న ప్రముఖులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం, మునిరెడ్డి, రమేష్, కోటేశ్వర మొదలియార్, రోహిత్, లక్ష్మీపతి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, ఆశా కార్యకర్తలు

పుత్తూరు, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, రూ.26 వేలు వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. తిరుపతి, కడప జిల్లాల్లో జరిగే రాష్ట్ర మహాసభలకు సంబంధించి కరపత్రాలను స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు ఏఎన్ఎంలుగా ఉద్యోగోన్నతి వెయిటేజీ, ఉద్యోగ భద్రత, టీఏ, డీఏ ఇవ్వాలని, గ్రాట్యూటీ సౌకర్యం కల్పించాలన్నారు. ఖాళీలు వెంటనే భర్తీ చేయాలన్నారు. ఆగస్టు 17న పుత్తూరులో జిల్లా సభ, ఆగస్టు 30, 31వ తేదీల్లో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చాముండేశ్వరి, జిల్లా అధ్యక్షురాలు హేమావతి, వాణి ప్రసన్న, ధనలక్ష్మీ, మారెమ్మ, పెంచలమ్మ, స్వర్ణ వెంకటరమణమ్మ, ఈశ్వరి పాల్గొన్నారు.

కొండంత సమస్యలు..!

* మరుగుదొడ్లు, పార్కింగ్ కొరత * పట్టించుకోని అధికారులు * ఇదీ బోయకొండ తీరు

భక్తుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన చోట మరుగుదొడ్లు, కొండ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని రోజుకో సేవ నిర్వహించి కొండపై ఆధ్యాత్మికతను పెంచి భక్తులను ఆకట్టుకోవాలని ఇటీవల దేవాదాయ శాఖ కమిషనరు ఆలయాన్ని సందర్శించిన సందర్భంలో ఆలయాధికారులకు సూచించారు. అయితే కమిషనరు వచ్చి రోజులు గడుస్తున్నా ఆ దిశగా అడుగులు వేయలేదు. మరో వైపు ఆషాఢమాసం మొదటి ఆదివారం గడిచిపోయింది. సమస్యలు మాత్రం యథాతథంగా ఉన్నాయి. **- న్యూస్‌టుడే, చౌడేపల్లె**

రాష్ట్రంలోని శక్తిక్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన దేవస్థానం బోయకొండ గంగమ్మ ఆలయం. కొండకు సాధారణ సమయంలో కంటే ఈ ఆషాఢ మాసంలోనే ఎక్కువగా వస్తారు. అదే స్థాయిలో ఆదాయం సమకూరుతుంది. అయితే కొండపై కనీస వసతుల కల్పనలో అధికారులు విఫలమవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కల్యాణ కట్ట పక్కనే పడేసిన వెంట్రుకలు, చెత్త

భక్తులు తిరగడానికి స్థలం లేకుండా నిలిపిన కార్లు

సమస్యలివే..

కొండ కింద రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్ల నిర్వహణ లోపం కారణంగా వినియోగానికి దూరంగా ఉన్నాయి. తగినన్ని మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గాలిగోపురానికి సమీపంలోని మరుగుదొడ్లు ఉన్నా వాటికి ఎప్పుడు తాళం వేసి ఉండటం గమనార్హం. అలాగే దేవస్థాన వసతి గృహాల వద్ద అపరిశుభ్ర వాతావరణం ఉంటోంది. కల్యాణ కట్ట, రణబేరి గంగమ్మ ఆలయం పక్కన, పుష్కరిణి, దేవస్థానానికి దక్షిణ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి.

పార్కింగ్ స్థలం కొరత

అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు తమ వాహనాలను నేరుగా కొండపైకి తీసుకెళ్తారు. అక్కడ స్థలం కొరత ఉండటంతో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపుతున్నారు. టోల్ గేటు చెల్లిస్తున్నా వాహనాలు నిలుపుకోవడానికి స్థలం కొరత తీవ్రంగా ఉంది. ఫలితంగా భక్తులు తిరగడానికి ప్రధాన మెట్లు మినహా ఏ దారి లేదు.

ఉన్న స్థలం నిరుపయోగం

అటవీశాఖ నుంచి పార్కింగ్ స్థలానికి సేకరించిన స్థలం నిరుపయోగంగా ఉంది. ఆలయ అధికారులు, పోలీసులు సమన్వయం లేకపోవడంతో వచ్చిన వాహనాలను ఈ స్థలానికి మళ్లించడం లేదు. ఇష్టారీతిన వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

చర్యలు తీసుకుంటాం..

కొండపై నెలకొన్న సమస్యలు వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం.
- ఏకాంబరం, ఈవో, బోయకొండ

క్రికెట్ బ్యాట్‌తో దాడి ముగ్గురికి గాయాలు

వడమాలపేట, న్యూస్‌టుడే: క్రికెట్ బ్యాట్‌తో దాడి చేయడంతో ముగ్గురు గాయపడిన ఘటన ఓబీఆర్‌కండ్రిగలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఓబీఆర్‌కండ్రిగకు చెందిన మోహిత్, నాగరాజు.. తాగునీటి కొళాయి వద్ద గొడవ పడ్డారు. దీంతో మోహిత్ క్రికెట్ బ్యాట్ తీసుకుని.. నాగరాజులు, భాగ్యమ్మ, నాగరాజుపై దాడి చేయగా గాయపడిన ఈ ముగ్గురికీ తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారని, కేసు నమోదు చేశామని ఎస్సై ధర్మారెడ్డి తెలిపారు.

భక్తులపై హిజ్రాల దాడి

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న భక్తులు

బోయకొండ (చౌడేపల్లె), న్యూస్‌టుడే: బోయకొండ భక్తులపై హిజ్రాలు దాడి చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల మేరకు... కర్ణాటకలోని సీకే పల్లెకు చెందిన దేవరాజు, మంగమ్మలతో పాటు మరో కొంతమంది ఆటోలో బోయకొండకు వచ్చారు. గుర్తించిన హిజ్రాలు వీరిని డబ్బులు అడగగా.. ఇవ్వకపోవడంతో వెంటపడి రణబేరి గంగమ్మ ఆలయం వద్ద అడ్డుకున్నారు. భక్తుడు రూ.150లు ఇవ్వగా నిరాకరించి రూ.వెయ్యి ఇవ్వాల్సిందేనని డిమాండు చేశారు. దీంతో హిజ్రాలకు భక్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలోనే వారు భక్తులపై దాడి చేసి గాయపరిచారు. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రతి ఆదివారం ఇదే తంతు జరుగుతున్నా.. పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు.

వినాయకుడిని దర్శించుకున్న సాయిప్రసాద్

తిరుమల: కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే పరిటాల సునీత

గణనాథుడి సేవలో ఎన్నికల కమిషన్ కార్యదర్శి

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యదర్శి(ఎఫ్ఏసీ) జీవీ సాయిప్రసాద్, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈవో పెంచల కిషోర్, అర్చకులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు ఉన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబం, ఐఆర్ఎస్ అధికారి రామకృష్ణ భట్, వైకాపా మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

తవణంపల్లె, న్యూస్‌టుడే: తిరుపతి-బెంగళూరు హైవేలో మండలంలోని కె.పట్నం వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. కుప్పం మండలం తన్నమ్మకొట్టం గ్రామానికి చెందిన దిలీప్(21) బొలెరో వాహనంలో తిరుపతి నుంచి కుప్పం వెళ్తున్నాడు. కె. పట్నం సమీపాన ముందు వెళ్తున్న మామిడి కాయల లోడు లారీని వెనకనుంచి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడని, కేసు నమోదు చేశామని ఎస్సై చిరంజీవి తెలిపారు.

చికెన్ ధరలు

వెన్‌కాబ్ (కిలో రూ.ల్లో)	
బ్రాయిలర్ (రైతు ధర)	102
రిటైల్	124
లేయర్	112
బ్రాయిలర్	180
బ్రాయిలర్ స్కిన్ లెస్	205
లేయర్ మాంసం	190

21న గ్రేడ్-2 జేఎల్ఎంల చలో విజయవాడ

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థలో పనిచేస్తున్న జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 21న నిర్వహించతలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. దీంతో ఈ నెల 8, 9 తేదీల్లో సీఎంకు పోస్టుకార్డు ఉద్యమం, 11న మూడు డిస్కంలలో వినతిపత్రాల సమర్పణ, 14న నల్లబ్యాడ్జీలతో నిరసన, 17న ఉద్యమానికి సంబంధించిన పోస్టర్ల ఆవిష్కరణ, 21న చలో విద్యుత్తు సౌధ పేరుతో విజయవాడలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.

నాలుగు ట్రిపుల్ ఐటీల్లో.. మిగులు సీట్లు 600

వేంపల్లె, న్యూస్‌టుడే : ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 600 సీట్లు మిగిలాయి. 'ఖాళీల భర్తీకి తదుపరి మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 11, 12 తేదీల్లో వెబ్‌సైట్‌లో వెల్లడిస్తాం. ఈ మేరకు రెండో విడత జాబితా సిద్ధం చేసే పనిలో తమ సిబ్బంది ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. ఆ లోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తాం' అని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ తెలిపారు.

పెంపుడు జంతువుల సంరక్షణలో జాగ్రత్తలు తప్పనిసరి

శునకాలకు టీకా వేస్తున్న జేడీ అబ్దుల్ ఆరిఫ్

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: పెంపుడు జంతువుల సంరక్షణలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్ధక శాఖ ఇన్‌ఛార్జి జేడీ అబ్దుల్ ఆరిఫ్ పేర్కొన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక దర్గా కూడలిలోని బహువిధ పశువైద్యశాలలో శునకాలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకా వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువుల పెంపకంపై అవగాహన అవసరమని, శునకాల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సకాలంలో వ్యాధి నిరోధక టీకా, వైద్యసేవలు అందించాలన్నారు. తరచూ రేబిస్ వ్యాక్సిన్ ముందస్తుగా వేయించాలని తద్వారా అన్నిరకాల వ్యాధుల సంక్రమణ నియంత్రించవచ్చని చెప్పారు. వీధి శునకాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. డీడీలు సుబ్బమ్మ, శ్రీలక్ష్మి, ఏడీ రాజశేఖర్‌రెడ్డి, నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి లోకేష్, పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా వరదరాజుని శయనోత్సవం

ఊయలలో ఊగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయానికి అనుబంధ ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వరదరాజస్వామి వారికి కనులపండువగా ఆదివారం రాత్రి శయనోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకం నిర్వహించి, తులసి దళాలతో అర్చన నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉభయదేవేరులతో స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు. ఈవో పెంచల కిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సర్పంచి శాంతిసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

EENADU Classifieds

FINANCIAL SERVICES

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్సియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

అతి తక్కువ ధరల్లో, 42 సులభ వాయిదా పద్ధతిలో, తుడా/ డిటిసిపి అమోదించబడిన స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు : ✆ 91145 61456.

నేషనల్ హైవేకి ఆనుకొని తిరుపతి IIT దగ్గర ఫైనల్ అప్రూవ్డ్ కలిగిన ప్లాట్లు అతి తక్కువ ధరకే ✆ 95027 74175/ 79959 92114.

LEASE/ RENT

GENERAL

SCIENTIFIC Ware Houses with FCI Specification of 13,500 sq.ft East 2 Ware Houses Totaling 27,000 sq.ft are Readily Available for Occupation for Rent at Adjacent National Highway near to the International Airport at Renigunta. PCR Warehousing Ltd., D.No: 3-147, Guravaraju Palli, Tirupati - Srikalahasti Road, Renigunta - 517520 Dist. Chittoor, Andhra Pradesh. ✆ 98490 46567 / 98499 82900, Email: pcrayu.lu@gmail.com, pcrwhltd@gmail.com, web: www.pcrwarehousingltd.com.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

JOBS

GKEY IT SOLUTIONS Pvt. Ltd. Wanted Exp. Tele callers (2) for Software Training & Placements, Qual: Any Degree. # 401, Vignesh Towers, Leelamahal Circle, Tirupati. ✆ 99638 30776 / 95335 34534.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి వారికి లబ్ధి చేకూర్చడానికి చిత్తూరు జిల్లా నందు పనిచేయుటకు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. శాలరీ + ఇన్సెంటివ్. ✆ 77298 93359.

PRIMARY MATHS, UP SCHOOL English, Male Warden Aayaas, Cleaner. MATRUSRI E.M. SCHOOL, Railway Colony, Tirupati. ✆ 73822 88751.

WANTED GRADUATE Trained Teachers for primary Mathematics and EVS, Computer & PET Faculty also Sudhaha Little Citizen's High School, R.C. Road, Tirupati. ✆ 93925 13633.

ప్రముఖ లిమిటెడ్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు జిల్లాలోని అన్ని మండలాల నుండి ప్రాంతాల వారీగా M/F అభ్యర్థులు కావలెను. అనుభవమును బట్టి 25 వేల జీతం+మంత్లీ ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. 73968 87685.

FREE JOBS: తిరుపతిలోని మా సంస్థ కొరకు, కంప్యూటర్ ఆపరేటర్లు, HR Recruiters, Counsellors, Tele Callers, BDMలు కావలెను. జీ: 15-35 వేలు. # ✆ 99906 78818.

MARKETING/ SALES

WANTED MEDICAL REPRESENTATIVES for TIRUPATI Hq. for a leading multinational company.
EuroMedicare INTERNATIONAL
Fresh Graduates with Good English Communication skills may send resume to hreuromedicare@gmail.com or call 9848024034

గమనిక

చిత్తూరు

● చిత్తూరు ● పూతలపట్టు ● గంగాధరనెల్లూరు ● నగరి

ఉద్యోగ మేళా సద్వినియోగం చేసుకోవాలి

వెదురుకుప్పం: మండలంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న ఉద్యోగ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో కోరారు. మండల పరిసర ప్రాంతాల యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

సమ్మె విజయవంతం చేయాలి

చిత్తూరు గ్రామీణ : ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండన్ పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సీఐటీయూ-ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్, నాయకులు దాసరి చంద్ర, రమాదేవి, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పాఠశాలలో తొలగిన చెత్తకుప్పలు

పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనక చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్గంధంగా మారిన సమస్య ప్రచురితమవడంతో మున్సిపల్ అధికారులు స్పందించి వాటిని తొలగింపజేశారు.

- న్యూస్‌టుడే, నగరి

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

న్యూస్‌టుడే, నింద్ర: సమస్య: ఆరూరు పంచాయతీకి చెందిన ఓబుళ్‌రాజుకండ్రిగ నుంచి ప్రధాన రోడ్డు వరకు వీధి లైట్లు ఇటీవల పగలూరాత్రీ తేడా లేకుండా వెలుగుతున్నాయి. - **స్థానికులు**

సమాధానం: సర్పంచితో చర్చించి తాత్కాలికంగా ప్రతి స్తంభం వద్ద స్విచ్‌లు ఏర్పాటు చేయిస్తాం.

- **బాలాజీ, పంచాయతీ కార్యదర్శి, ఆరూరు**

నృత్యం చేస్తున్న బాలికలు

ఉత్సాహంగా శాస్త్రీయ నృత్య పోటీలు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: ప్రజాహిత సేవా సంస్థ, మాదిరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్తూరులోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం ధారావాహిక శాస్త్రీయ నృత్య పోటీలు ఉత్సాహంగా సాగాయి. బాలబాలికలకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు రాజారత్నం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్థసారథి నాయుడు, లీలామనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిరమిడ్ మాస్టర్ ప్రసన్న

ధ్యానంతో ఆరోగ్యం

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: నిరంతర ధ్యాన సాధన ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని సీనియర్ పిరమిడ్ మాస్టర్ ప్రసన్న తెలిపారు. స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో యోగా భవనంపై నిర్మించిన శివానంద పిరమిడ్ కేంద్రంలో ఆదివారం ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ధ్యానంతో జ్ఞాపక శక్తి పెరుగుతుందని, ఆత్మవిశ్వాసం వృద్ధి చెందుతాయన్నారు. దైనందిన జీవితాన్ని ఆనందంగా గడపటానికి ధ్యానం సహకరిస్తుందన్నారు. పీవీకేఎన్ వాకర్స్ సంఘం అధ్యక్షుడు వీకే విశ్వనాథ్, కన్వీనర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత..

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన ప్రముఖులు

నెల్లూరు పర్యటనకు వెళ్లేందుకు ఆదివారం రాత్రి తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న మంత్రి నారా లోకేశ్‌ను ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత కలిసి స్వాగతం పలికారు.

- న్యూస్‌టుడే, పుత్తూరు

కంప్యూటర్లకూ అలుపొచ్చేసింది..

● పడకేసిన పౌర సేవలు ● సచివాలయాల్లో ఇదీ తంతు ● అవస్థల్లో ప్రజలు

గ్రామ సచివాలయంలో పనిచేయని కంప్యూటర్

న్యూస్‌టుడే, చిత్తూరు(జిల్లా పంచాయతీ)

గ్రామ సచివాలయాల్లో మౌలిక వసతుల లేమితో ప్రభుత్వ సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది.. వీటిలో నెలకొన్న వెతల కారణంగా ప్రజలకు, కార్యాలయ సిబ్బందికి తిప్పలు తప్పడం లేదు.. ఇటు పరికరాలు పనిచేయక, అటు అధికారుల ఆదేశాలు కాదనలేక విధి నిర్వహణలో ఉద్యోగులు సతమతమవుతున్నారు.. నెలల తరబడి కంప్యూటర్లు, ప్రింటర్లు మూలకు చేరినా ఆలకించే నాథుడే లేడు.. కొన్ని సచివాలయాల్లో దీపాలు వెలగక, ఫ్యాన్లు తిరగక ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు.. ఫలితంగా సకాలంలో పనులు జరగక ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

● సొంత ల్యాప్‌టాప్‌లు వినియోగిస్తూ..

చిత్తూరు, జీడీనెల్లూరు, నగరి, పూతలపట్టు నియోజకవర్గాల్లో వందకు పైగా గ్రామ సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు మరమ్మతులకు గురయ్యాయని సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చేవారి వివరాలు పొందుపరచడానికి ముందుగా లబ్ధిదారు ఆధార్, ఇతర అర్హత పత్రాలు స్కాన్ చేయాలి. వీటితోపాటు తహసీల్దారు కార్యాలయంలో మంజూరైన ఆధార్, కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువపత్రాలు సచివాలయాల్లోనే ప్రింట్ తీసివ్వాలి. ప్రింటర్, స్కానర్ మొరాయించి సేవలు ఆగడంతో వేరే సచివాలయానికి వెళ్లి వాటిని తీసుకోవాలని సూచిస్తున్నారు. అక్కడా సమస్య తలెత్తితే నెట్, మీ సేవ కేంద్రాలను ఆశ్రయించాల్సిందే. సమస్య అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మార్పులేదు. దీంతో ఉద్యోగులు సొంత ల్యాప్‌టాప్‌లు, చరవాణులు వినియోగిస్తూ విధులు నిర్వర్తిస్తున్నారు. సచివాలయాల్లో మౌలిక వసతులు కల్పించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

● పూతలపట్టు నియోజకవర్గం యాదమరి మండలం కాశిరాళ్ల గ్రామ సచివాలయంలో ఆధార్ సేవలకు సంబంధించి ల్యాప్‌టాప్ పనిచేయక నెల దాటింది. మరమ్మతులు చేయిద్దామన్నా యూఐడీ సేవలకు ఇచ్చిన ల్యాప్‌టాప్ కావడంతో ప్రైవేటు వ్యక్తుల వద్ద మరమ్మతులకు ఇచ్చే అవకాశం లేదు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ ఆలకించలేదు. దీంతో ఆధార్ సేవల కోసం వచ్చే ప్రజలు జోడిచింతల వద్దనున్న యాదమరి సచివాలయానికి వెళ్తున్నారు. అక్కడా సకాలంలో సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

● జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఆరు గ్రామ సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు పని చేయడం లేదు. ఉన్న వాటితోనే సరి పెట్టుకుంటున్నా, ఒక్కోసారి పలువురు సచివాలయ సేవల కోసం వచ్చిన సందర్భాల్లో నిరీక్షిస్తున్నారు. దీంతో ఇటు ప్రజల సమయం వృథా సహా వారికి సర్దిచెప్పేందుకు ఇబ్బంది పడుతున్నామని సిబ్బంది వాపోతున్నారు.

● చిత్తూరు, నగరి నియోజకవర్గాల్లోనూ 27 గ్రామ సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర పరికరాలు పని చేయడం లేదని జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందాయి. వాటిని బాగు చేయించాలని సిబ్బంది విన్నవించినా పరిష్కారం కాలేదు. సర్పంచులతో మాట్లాడి గ్రామ పంచాయతీ నిధులతో బాగు చేయించుకోవాలని సూచిస్తున్నారు. పంచాయతీల్లో సరిపడా 15వ ఆర్థిక సంఘం నిధులు అందుబాటులో లేక వీటి మరమ్మతుకు నిధులు ఇవ్వడం లేదని, ఉన్న వాటితోనే సరిపెట్టుకుని ఆలస్యంగా సేవలు అందిస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు.

సమస్యలు నిజమే..

జిల్లాలో 612 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వాటిలో కొన్నిచోట్ల కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు పనిచేయడం లేదు. బాగున్న వాటితోనే సేవలు అందిస్తున్నారు. మరమ్మతుకు గురైన వాటిని పంచాయతీ నిధులతో మరమ్మతు చేయించుకోవాలి.

- **రవికుమార్, గ్రామ సచివాలయాల జిల్లా సమన్వయకర్త**

చట్టాలు పునరుద్ధరించాలి

పుత్తూరు, న్యూస్‌టుడే: భవన నిర్మాణ రంగ కార్మికుల చట్టాలు పునరుద్ధరించే వరకు పోరాటాలు చేస్తామని ఏఐటీయూసీ పుత్తూరు డివిజన్ అధ్యక్షుడు మహేష్ పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం భవన నిర్మాణ రంగ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకులు గోపీ, హైమావతి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, సెల్వరాజ్ ఆచారి, రవి పాల్గొన్నారు.

శ్రీరామాపురంలో ఎమ్మెల్యే పర్యటన

నింద్ర, న్యూస్‌టుడే: శ్రీరామాపురంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదివారం పర్యటించారు. గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు ప్రసాద్ తమ్ముడు హేమాద్రి ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పరామర్శించారు. మండల తెదేపా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వరావు, విజయ్‌కుమార్, నాయకులు భాస్కర్‌రెడ్డి, మనోహర్‌నాయుడు, మనోజ్‌యాదవ్, దశరథవాసు, రఘురామ్, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

హంస వాహనంపై సీతారామలక్ష్మణుల విహారం

టి.పుత్తూరులోని శ్రీకోదండ రామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సీతారామలక్ష్మణులు హంస వాహనంపై పురవీధుల్లో విహరించారు. ఉదయం ధ్వజారోహణ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ధర్మకర్త సిద్దేశ్వరరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, తవణంపల్లె

మహిళాభ్యుదయమే కూటమి ధ్యేయం

ఐరాల: ఎగువచవటపల్లెలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మహిళాభ్యుదయమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఎగువచవటపల్లె, పందికొట్టూరు, కొండేపల్లె, తిరుమలయ్యగారిపల్లె గ్రామాల్లో నాయకులతో కలిసి ఆదివారం ఆయన ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. ఏడాది పాలనలో నియోజకవర్గంలో రూ.వంద కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు శ్రీధర్, తెదేపా మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు, జడ్పీటీసీ సభ్యురాలు సుచిత్ర, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మేదరమెట్ల మోహన్‌నాయుడు, గిరిధర్‌బాబు, మధుసూదన్‌రావు, లత, హేమాద్రి పాల్గొన్నారు. **పెనుమూరు:** రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యనిర్వాహక కార్యదర్శి లోకనాథ నాయుడు.. కావూరివారిపల్లెలో మండల పార్టీ అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు ఆధ్వర్యంలో ప్రజలకు కరపత్రాలు పంచి పెట్టారు. రెడ్డెప్ప, కేడీనాయుడు, శంకరనాయుడు, ఎండీనాయుడు, శ్రీనివాసులు, బాబునాయుడు, యాగమనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి

నగరి, న్యూస్‌టుడే: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా స్థానిక భాజపా కార్యాలయంలో పార్టీ నాయకులు ఆదివారం ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించి పుష్పాంజలి ఘటించారు. నియోజకవర్గ సీనియర్ నాయకుడు రామమూర్తి యాదవ్‌ను రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎంపిక చేయడంతో ఆయన్ను ప్రత్యేకంగా సత్కరించారు. రామమూర్తి యాదవ్ మాట్లాడుతూ తనకు రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలకం ఈశ్వరప్రసాద్, జిల్లా అధ్యక్షుడు జగదీష్ నాయుడికి కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయుడు, మేకల సుబ్రహ్మణ్యం, బాలకృష్ణ, మండల అధ్యక్షుడు హరి, పుత్తూరు మండల అధ్యక్షుడు గిరి, వడమాలపేట మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు, చిట్టిబాబు, శివకుమార్ యాదవ్, శేఖర్, చంద్రమౌళి, ప్రభాకరనాయుడు, చరణ్‌తేజ పాల్గొన్నారు.

ముఖర్జీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న భాజపా నాయకులు

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 19 మందికి ఎమ్మెల్యే జగన్మోహన్ సీఎం సహాయ నిధి చెక్కులు ఆదివారం లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో అందజేశారు. చిత్తూరు నగరానికి చెందిన తొమ్మిది మందికి, చిత్తూరు గ్రామీణ మండలానికి చెందిన ఏడుగురికి, గుడిపాల మండలానికి చెందిన ముగ్గురికి మొత్తం రూ.13,75,362 విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. నాయకులు జయచంద్రనాయుడు, ఈశ్వర్, మోహన్‌రాజ్, సీఎం విజయ, రఘు, విజయేంద్రవర్మ పాల్గొన్నారు.

సాధన.. పతక పథాన

న్యూస్‌టుడే, చిత్తూరు(క్రీడలు)

సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఈ యువత క్రీడల్లో దీటుగా రాణిస్తున్నారు.. ఒక్కో మెట్టూ అధిరోహిస్తూ రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటారు.. జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించి పతకం సాధిస్తామని దీమా వ్యక్తం చేస్తున్నారు.

క్రీడల్లో సత్తాచాటుతున్న యువత

సాఫ్ట్‌బాల్‌లో మేటిగా..

భూమిక.. సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో సత్తా చాటుతోంది. ఐరాల మండలం నయనంపల్లి స్వగ్రామం. చిత్తూరులో డిగ్రీ చదువుతోంది. తల్లిదండ్రులది వ్యవసాయ నేపథ్యం. పాఠశాల స్థాయి నుంచి సాఫ్ట్‌బాల్ క్రీడలో సాధన చేస్తోంది తను. ఇప్పటివరకు 14సార్లు జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపింది. రెండుసార్లు జాతీయ పోటీల్లోనూ పాల్గొంది. గతేడాది జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో కాంస్య పతకం అందుకుంది. వ్యాయామ శిక్షకురాలిగా సేవలందించడం తన లక్ష్యమంటోంది.

వాలీబాల్‌లో దీటుగా..

హరీశ్ బీటెక్ పూర్తి చేశాడు. చిత్తూరు స్వస్థలం. వాలీబాల్‌లో చిన్ననాటి నుంచి సాధన చేస్తు పలుమార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు గెలిచాడు. జేఎన్‌టీయూ తరపున దక్షిణాది రాష్ట్రాల వాలీబాల్ పోటీల్లో సత్తా చాటాడు. ఒక రజతం, ఒక కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. క్రీడా కోటాలో ఉద్యోగం సాధించడం తన ఆశయమని అంటున్నాడు.

పట్టుతో పతకం..

చిత్తూరుకు చెందిన బద్రీనాథ్.. కుస్తీ(రెజ్లింగ్) క్రీడాకారుడు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో శిక్షకుల పర్యవేక్షణలో నిత్యం సాధన చేస్తున్నాడు. చదువు, క్రీడలకు సమ ప్రాధాన్యం ఇస్తూ ఆటలో ప్రావీణ్యం సాధించాడు. పాఠశాల, ఇంటర్ కళాశాల స్థాయిలో స్కూల్ గేమ్స్, అసోసియేషన్ మీట్‌లో పలు పతకాలు సాధించాడు. గతేడాది దక్షిణ భారత స్థాయిలో బెంగళూరులో జరిగిన యూత్ ఇండియా పోటీల్లో కాంస్య పతకం గెలిచాడు. జాతీయ స్థాయిలో గుర్తింపు సాధిస్తానని దీమా వ్యక్తంచేస్తున్నాడు.

అంతా అనధికారమే..

● దర్జాగా తమిళనాడుకు తరలింపు ● పట్టించుకోని యంత్రాంగం

పిళ్లారిపట్టు వద్ద డంప్ చేసిన ఎర్రమట్టి

న్యూస్‌టుడే, పుత్తూరు

మట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకు పేట్రేగిపోతున్నాయి. నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. అనధికారికంగా ఎర్రమట్టి తరలించి ఇటుకలు తయారు చేస్తున్న వారికి గతంలో నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. ఆపై ఇక పట్టించుకోలేదు. దీంతో వారి ఆగడాలకు అంతే లేకుండా పోతోంది.

నగరి నియోజకవర్గం తమిళనాడు సరిహద్దు కావడంతో ఇటుకల వ్యాపారం జోరుగా సాగుతోంది. తమిళనాడులో ఇసుక, గ్రావెల్, కంకర, మట్టి తరలింపుపై నిషేధం ఉండటంతో అక్కడి వ్యాపారులు ఇక్కడి స్థలాలు లీజుకు తీసుకుని ఇటుకల బట్టీలు ఏర్పాటు చేశారు. ఒక్క పుత్తూరు మండలంలోనే 50కి పైగా బట్టీలు ఉన్నాయి. వీటికి మట్టి అంతా సమీప గోపాలకృష్ణాపురం, కల్యాణ వెంకటేశ్వరపురం, నేసనూరు అటవీ ప్రాంతం నుంచే తరలిస్తున్నారు. అక్రమార్కులు మట్టి తరలించి రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. తిరుపతి-చెన్నై హైవేకి కూతవేటు దూరంలోనే ఈ దందా సాగుతున్నా.. ప్రకృతి సంపద తమిళనాడుకు తరలిపోతున్నా పట్టించుకోవట్లేదు.

అనుమతులు ఎక్కడ..?

మట్టి తరలించాలంటే రెవెన్యూ, మైన్స్ అధికారులు అనుమతి తీసుకోవాల్సి ఉన్నా ఎవరూ అలా చేయడం లేదు. కేసులు నమోదు చేయాల్సిన అధికారులు పట్టించుకోవట్లేదు. దీంతో ఇటుకలు దర్జాగా తమిళనాడుకు తరలిస్తున్నారు.

నోటీసులతో సరి..

గతంలో బట్టీల యజమానులకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. మట్టి కొలతలు తీసి క్యూబిక్ మీటర్ల లెక్కన చెల్లించాలని ఆదేశించారు.. ఆపై రాజకీయ నేతల నుంచి ఒత్తిళ్లు రావడంతో పట్టించుకోవడంలేదు. ఈ నేపథ్యంలో విచ్చలవిడిగా మట్టి తరలిస్తున్నారు.

అనుమతి లేకుండా తరలిస్తే చర్యలు..

అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చర్యలు తప్పవు. పట్టుబడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవర్నీ ఉపేక్షించేది లేదు. తరచూ తనిఖీలు చేసి మట్టి తరలింపును అడ్డుకుంటాం.

- **వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు**

విరాళం అందజేస్తున్న చిన్నస్వామి నాయుడు కుటుంబ సభ్యులు

అన్నదాన పథకానికి విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్యాన్నదాన పథకానికి చిత్తూరుకు చెందిన చిన్నస్వామి నాయుడు రూ.లక్ష చెక్కును ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడుకు ఆదివారం అందజేశారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు.

ఘనంగా మాతమ్మ తిరునాళ్ల

మాతమ్మను దర్శించుకుంటున్న భక్తులు

పుత్తూరు, న్యూస్‌టుడే: పరమేశ్వరమంగళం ఆదిఆంధ్రవాడలో మాతమ్మ తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. గత నాలుగు రోజులుగా గ్రామంలోని మాతమ్మ ఆలయంలో తిరునాళ్ల వైభవంగా సాగుతున్నాయి. అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి అగ్నిగుండ ప్రవేశంతో తిరునాళ్ల ముగిసింది. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అమ్మవారిని దర్శించుకున్నారు. **తవణంపల్లె:** దిగువమాఘంలో జరుగుతున్న మహా భారత యజ్ఞంలో భాగంగా ద్రౌపదీదేవి, పంచ పాండవులకు కల్యాణోత్సవం నిర్వహించారు. అన్నదానం చేశారు. గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు. **పెనుమూరు:** దాసరాపల్లెలో వెలసిన శ్రీవిరూపాక్షమ్మ జాతర వేడుకగా జరిగింది. అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు సమర్పించారు.

పుష్కరిణిలో నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

వినాయకుడికి కళా నివేదన

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారికి బెంగళూరుకు చెందిన వైష్ణవి నాట్యశాలకు చెందిన కళాకారులు పుష్కరిణిలో భరతనాట్య, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. భక్తులు తిలకించి పులకించారు. కళాకారులను ఏఈవో రవీంద్రబాబు సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

హార్సిలీహిల్స్‌లో కలెక్టర్

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్.. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌కు ఆదివారం విచ్చేశారు. వ్యక్తిగత పర్యటనలో భాగంగా కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయన కొండను సందర్శించారు. పాత వ్యూపాయింట్, గాలిబండ ప్రాంతాల నుంచి ప్రకృతి అందాలు వీక్షించారు.

శునకాలకు టీకా

నగరి, న్యూస్‌టుడే: రేబిస్ నివారణకు శునకాలకు ఆదివారం పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఏడీ వాసు ఆధ్వర్యంలో టీకా వేశారు. పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

నగరి, న్యూస్‌టుడే: ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు సీఎం చంద్రబాబు అమలు చేయాలని, ఆయన మేనిఫెస్టో గుర్తు చేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైకాపా కార్యాలయంలో ఆదివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి రోజా మాట్లాడుతూ ప్రజా సంక్షేమం మరిచి కేవలం జగన్‌ని తిట్టడానికి, తప్పుడు కేసులు పెట్టడానికి అధికారం వినియోగిస్తున్నారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట అధికార దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. మహిళలపై దాడులు జరిగినా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించడం లేదన్నారు. నగరి, పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్లు నీలమేఘం, హరి, వైస్ ఛైర్మన్లు జయప్రకాష్, శంకర్, బాలన్, వెంకటరత్నంరెడ్డి, ఎంపీపీలు భార్గవి, మునివేలు, దీప పాల్గొన్నారు. **పాలసముద్రం:** ఎన్నికల హామీలు సీఎం చంద్రబాబు నెరవేర్చాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి డిమాండ్ చేశారు. స్థానిక పంచాయతీ పరిధిలో పార్టీ సమావేశంలో క్యూఆర్‌కోడ్‌తో ఉన్న కరపత్రాలు ఆవిష్కరించారు. కృపాలక్ష్మి, తులసీ యాదవ్, జడ్పీటీసీ అన్బు, మహేష్‌బాబు, అరుళ్ పాల్గొన్నారు.

నగరి.. మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, పక్కనే మాజీ మంత్రి రోజా

ప్రతిభతో పతకాల సాకారం

● రాణిస్తున్న బాలబాలికలు

న్యూస్‌టుడే, చిత్తూరు కలెక్టరేట్

నేటితరం పిల్లలు చదువుతోపాటు సహ పాఠ్యాంశాల్లో రాణిస్తున్నారు.. క్రమశిక్షణతో సాధన చేసి నైపుణ్యాన్ని వృద్ధి చేసుకున్నారు.. జిల్లా గ్రంథాలయ సంస్థతోపాటు జిల్లా బాల భవన్, ఇతర సంస్థలు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించారు.. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో రాణిస్తామని దీమా వ్యక్తంచేస్తున్నారు.

క్రాఫ్ట్స్‌లో మేటిగా..

ప్రణీత.. ఎనిమిదో తరగతి చదువుతోంది. వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవాలని శిబిరంలో చేరి.. పేపర్ క్రాఫ్ట్స్, సంగీతం, కథలు చెప్పడం ఇతర అంశాల్లో శిక్షణ తీసుకుంది. క్రాఫ్ట్స్‌లో చక్కటి ఆకృతులను రూపొందించి ద్వితీయ బహుమతి సాధించి శెభాష్ అనిపించింది.

చిత్రంతో మెప్పించి..

జయప్రకాష్.. చిత్తూరులోని ఓ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. చిత్రలేఖనమంటే ఆసక్తి. ఐదేళ్లుగా సాధన చేస్తున్నాడు. చంద్రయాన్-3, సౌర కుటుంబ వ్యవస్థపై పెయింటింగ్ పోటీల్లో పాల్గొని నోబుల్ వరల్డ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకున్నాడు. జిల్లా గ్రంథాలయ సంస్థ పోటీల్లో ప్రకృతి చిత్రాల్ని గీసి ప్రథమ బహుమతి సాధించాడు.

భగవద్గీత పఠనంలో ప్రతిభ..

లాస్యశ్రీ.. చిత్తూరులోని ఓ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. సహ పాఠ్యాంశాలంటే ఈ బాలికకు అమితమైన ఆసక్తి. ఈ విద్యార్థిని ప్రతిభ గుర్తించిన తల్లిదండ్రులు బాలభవన్‌తో పాటు భగవద్గీత శ్లోక పఠనంలోనూ శిక్షణ ఇప్పించి ఎంతో ప్రోత్సహించారు. భగవద్గీత 3వ అధ్యాయం-కర్మయోగం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రంపై చిత్తూరులో జరిగిన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది. బాలభవన్‌లో జరిగిన చిత్రలేఖన పోటీల్లోనూ ప్రతిభ చూపి పతకాన్ని కైవసం చేసుకుంది.

జగన్ పర్యటన విజయవంతం చేయాలి

పూతలపట్టు, బంగారుపాళ్యం: వైకాపా నేత జగన్ ఈ నెల 9న బంగారుపాళ్యం పర్యటన విజయవంతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సునిల్‌కుమార్ కోరారు. పి.కొత్తకోటలోని శ్రీనివాస కల్యాణ మండపంలో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. ● బంగారుపాళ్యం మండలం పాలేరులో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, లలితకుమారి పాల్గొన్నారు. హైవేలో అరగొండ ఫ్లైఓవర్ సమీపాన హెలిప్యాడ్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు. జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్‌రాజా, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, మండల కన్వీనరు రామచంద్రారెడ్డి, జిల్లా రైతు విభాగ అధ్యక్షులు ప్రవీణ్‌రెడ్డి, థామస్ పాల్గొన్నారు.

తప్పిన పెనుప్రమాదం

తవణంపల్లె: అరగొండ-గాజులపల్లి ప్రధాన రహదారిలో అరగొండ నుంచి ఓ ఆటో గాజులపల్లి వైపు వెళ్తోంది. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్.. అర్ధగిరి సమీపంలో ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న మాధవరం గ్రామానికి చెందిన దిలీప్‌రెడ్డి, దయారెడ్డి, మరొకరికి గాయాలయ్యాయి. వీరిని చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తమకు ఫిర్యాదు అందలేని ఎస్సై చిరంజీవి తెలిపారు.

ఆదమరిస్తే ఆపదే

చిత్తూరులోని ప్రభుత్వ ఆసుపత్రి లోపలికి వెళ్లాలంటే ఆచితూచి అడుగు వేయాల్సిందే. కొత్తగా రాకపోకల కోసం పైపులు వేసినా వాటికి అనుగుణంగా సిమెంట్ వేయకపోవటంతో గోతి ఏర్పడింది. దీంతో పాటు వచ్చి వెళ్లే వాహనాలతో ఉయ్యాలలా పైపులు ఊగుతుండటంతో రోగులు, వారి సహాయకులు భయాందోళనకు గురవుతున్నారు. ఇక నడుచుకుంటు వచ్చే రోగులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది.

- **ఈనాడు, చిత్తూరు**

(c) eenadu

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

సమస్యలుంటే తెలపండి ✦ పలమనేరు డీఎస్పీతో ఫోన్-ఇన్

పలమనేరు, న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చట్టపర పరిష్కారానికి పలమనేరు డీఎస్పీతో 'ఈనాడు' 'ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రజలు తమ సమస్యలను డీఎస్పీ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లవచ్చు. ఇందుకు 94407 96732 నంబరుకు ఫోన్ చేయాల్సి ఉంటుంది.

వివాహ వేడుకలో పాల్గొన్న మంత్రి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో ఆదివారం జరిగిన ఓ వివాహ వేడుకలో తమిళనాడు మంత్రి సుబ్రమణియన్ పాల్గొన్నారు. తెదేపా నాయకులు ఆయనను కలిసి స్వాగతం పలికారు.

టీకాలు తప్పనిసరి

సోమల, న్యూస్‌టుడే: పెంపుడు కుక్కలకు తప్పకుండా రేబిస్ టీకాలు వేయించుకోవాలని పశువైద్యాధికారి చందనప్రియ పేర్కొన్నారు. జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం సోమలతో పాటు, అన్ని పశు వైద్య కేంద్రాల్లో కుక్కలకు టీకాలు వేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సమస్య: చంద్రమాకులపల్లెలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి కాలువలు శుభ్రం చేయాలి. **- రామచంద్రారెడ్డి**

సమాధానం: వీధులు శుభ్రం చేస్తాం.
- లీలామాధవి, ఎంపీడీవో, పుంగనూరు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: పాతపేట గుండూరావు వీధి వద్ద తాగునీటి బోరు మరమ్మతులకు గురైంది. **- ప్రకాష్, కుప్పం**

సమాధానం: బోరును బాగు చేయించి, సమస్య లేకుండా చూస్తాం.
- శ్రీనివాసరావు, కమిషనర్

పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని దండపల్లెక్రాస్ వద్ద మురుగు కాలువలు పూడిపోయాయి.
- ప్రవళిక, పలమనేరు

సమాధానం: పూడిపోయిన కాలువలు శుభ్రం చేయిస్తాం. **- ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్**

స్పందించారు.. పరిష్కరించారు

స్పందనకు వందనం

పుంగనూరు, న్యూస్‌టుడే: పురపాలక పరిధిలో నెలకొన్న సమస్యలను కమిషనరు మధుసూదనరెడ్డి ఆదేశాలతో సంబంధిత అధికారులు పరిష్కరించారు. ● ఈ నెల 4న టిడ్కో గృహాల సముదాయం బ్లాకు 7లో పైపులైన్ పాడైందని 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన వార్త ప్రచురితమైంది. కమిషనరు స్పందించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. ● షిర్డీ సాయినగర్‌లో ఈ-ఆటో రాకపోవడంతో చెత్త నిల్వలు పెరిగాయి. వార్త ప్రచురితం కాగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ● పట్టణ పరిధిలోని ఎన్ఎస్‌పేటలో దెబ్బతిన్న కల్వర్టును బాగు చేశారు.

లక్ష్మీనగర్ కాలనీలో పారిశుద్ధ్య పనులు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలనీలోని కాలువల్లో మురుగు పేరుకుపోవడంతో 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన వార్త ప్రచురితమైంది. అధికారులు ఆ మేరకు స్పందించారు.

కలగానే అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణం

✦ దుస్థితిలో బైరెడ్డిపల్లె-పేర్నంబట్టు రోడ్డు ✦ ప్రజలకు తప్పని కష్టం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ఆంధ్ర-తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన బైరెడ్డిపల్లె నుంచి పేర్నంబట్టు వరకు అంతర్రాష్ట్ర రహదారి ఏర్పాటు ఇక్కడి ప్రజలకు కలగానే మిగులుతోంది. బైరెడ్డిపల్లె మండలం కడపనత్తం అటవీ ప్రాంతం మీదుగా తమిళనాడులోని పేర్నంబట్టు ప్రాంతానికి రహదారి నిర్మాణం కోసం గతంలో తెదేపా ప్రభుత్వం రూ.60 లక్షలు పైగా ఖర్చు చేసి అసంపూర్తిగా వదిలేసింది. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు రహదారి అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. రహదారి అభివృద్ధి జరిగితే అటు తమిళనాడు.. ఇటు ఆంధ్ర సరిహద్దు ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

తమిళనాడులోని పేర్నంబట్టు, పరిసర ప్రాంతాల నుంచి ఆంధ్రలోని బైరెడ్డిపల్లె, పుంగనూరు ప్రాంతాల ప్రజలకు బంధుత్వాలు ఎక్కువగా ఉన్నాయి. బైరెడ్డిపల్లె నుంచి పేర్నంబట్టుకు చేరుకోవాలంటే 21 కి.మీ దూరం మాత్రమే. అటవీ

దుస్థితిలో కడపనత్తం-పేర్నంబట్టు అంతర్రాష్ట్ర రహదారి

సరిహద్దు ప్రాంతాల ప్రజలు పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించాలన్నా సరిహద్దులోని పేర్నంబట్టు దగ్గరగా ఉంటుంది. ఈ అంతర్రాష్ట్ర రహదారి బాగు చేస్తే ప్రజలకు రవాణా ఛార్జీలు కూడా ఆదా అవుతాయి.

రూ.లక్షలు వెచ్చించినా నిరుపయోగమే..

బైరెడ్డిపల్లె-పేర్నంబట్టు అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణానికి గతంలో తెదేపా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కడపనత్తం నుంచి 12 కి.మీ దూరం అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులు జరిగాయి. కడపనత్తం నుంచి తమిళనాడు సరిహద్దు సమీపం తలబుర్ల బావి వరకు రూ.60 లక్షలు పైగా వెచ్చించి అప్పట్లోనే కల్వర్టులు, వంతెనలు, సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కొన్ని కారణాలతో తమిళనాడు సరిహద్దు ప్రాంతానికి రెండు కి.మీ దూరం పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి.

సరిహద్దు ప్రజలకు సౌకర్యం

పేర్నంబట్టు ప్రాంతానికి బైరెడ్డిపల్లె నుంచి రహదారి నిర్మాణం చేపడితే ఇక్కడి ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఇక్కడి పంట ఉత్పత్తులను పేర్నంబట్టు, వేలూరు, చెన్నై నగరాలకు తరలించి విక్రయించుకోవడానికి రవాణా ఖర్చులు తగ్గుతాయి. ప్రభుత్వం అంతర్రాష్ట్ర రహదారి ఏర్పాటుకు కృషి చేయాలి. **- సుబ్రహ్మణ్యం, పాతపేట**

రవాణా సులభతరం

బైరెడ్డిపల్లె-పేర్నంబట్టు రహదారి నిర్మాణం జరిగితే బైరెడ్డిపల్లె మండల వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం బైరెడ్డిపల్లె నుంచి వి.కోట మీదుగా పేర్నంబట్టు చేరుకోవాలంటే 65 కి.మీ దూరం ప్రయాణం సాగించాలి. బైరెడ్డిపల్లె నుంచి కడపనత్తం మీదుగా పేర్నంబట్టుకు వెళ్తే 21 కి.మీ దూరం మాత్రమే. దీంతో సమయంతో పాటు ఛార్జీలు తగ్గుతాయి. **- మంజునాథ్, గౌనితిమ్మేపల్లె**

ఆకట్టుకున్న క్రికెట్ పోటీలు

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: పైపాళ్యంకు చెందిన క్రీడాకారుడు లోకేశ్ ఇటీవల క్యాన్సర్‌తో మృతి చెందారు. ఆ క్రీడాకారుడి మృతికి సంతాపంగా స్థానిక యువత శని, ఆదివారాలు రెండు రోజుల పాటు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొనగా... విన్నర్స్‌గా నిలిచిన పరమసముద్రం జట్టుకు నిర్వాహకులు రూ.22,222/-లు అందించగా... రన్నర్స్‌గా నిలిచిన ఆవులనత్తం జట్టుకు రూ.15,555/-లు నగదు బహుమతులు అందించారు. యువత భరణి, భరత్, నాగ, శక్తివేల్ పాల్గొన్నారు.

ట్రోఫీ అందుకుంటున్న పరమసముద్రం జట్టు

ఉద్యమంలా తెలుగుభాషను కాపాడాలి

పలమనేరు, న్యూస్‌టుడే: తెలుగు భాష, సంస్కృతులను ఉద్యమంలా కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ శతావధాని కొరార్తి ఆముదాల మురళి పేర్కొన్నారు. పట్టణంలోని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో కళా మందిరం మూడో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఈ విషయంలో నడుం బిగిస్తే తప్పా సాధ్యం కాదన్నారు. కాగా తెలుగుభాష రక్షణకు తులసీనాదం నాయుడు దంపతులు చేస్తున్న కృషిని అభినందించారు. బెంగళూరుకు చెందిన శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ... శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించేది మాతృభాష మంచి సాధనమన్నారు. తెలుగు పద్యాలు 50కి పైగా చెప్పిన విద్యార్థులతో పాటు పలువురు రచయితలను సంస్థ నిర్వాహకులు తులసీనాదం నాయుడు దంపతులు సన్మానించి, బహుమతులు అందించారు. ఈ సందర్భంగా రచయిత డాక్టర్ మౌని రచించిన చిన్న ధ్వనుల పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రచయితలు పలమనేరు బాలాజీ, దసం జయ, డాక్టర్ మాధవి, పైనేనిమురళి, ప్రసాద్ పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న చిన్నారులు

సమగ్ర విచారణ జరపాలి

పుంగనూరు, న్యూస్‌టుడే: ఉగ్రవాదుల మూలాలపై సమగ్ర విచారణ జరపాలని భాజపా మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు అయూబ్‌ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయచోటిలో ఉగ్రవాదులు ఇటీవల అరెస్టైన నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం కావాలని కోరారు. నాయకులు నరసింహులు వెంకటప్ప, వెంకటరమణ, నారాయణ పాల్గొన్నారు.

'దోచుకోవడమే వైకాపా ధ్యేయం'

రామకుప్పం: దోచుకోవడం తప్ప వైకాపా ప్రభుత్వం సాధించింది ఏమీ లేదని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏం చేసినా ప్రజాహితం కోసమే చేస్తారని తెలిపారు.

రాజుపల్లెలో సీసీ కెమెరాల ఏర్పాటు

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: మండలంలోని రాజుపల్లెలోని ప్రధాన మార్గంలో ఉన్న ముత్యాలమ్మ ఆలయానికి ఆస్ట్రేలియాలో స్థిరపడిన గ్రామస్థుడు జయరాంరెడ్డి ఆదివారం నాలుగు సీసీ కెమెరాలు వితరణ చేశారు. ఇటీవల పల్లెనిద్రలో భాగంగా పెద్దపంజాణి ఎస్సై ధనంజయరెడ్డి ఆలయాల వద్ద భద్రత చర్యలు తీసుకోవాలని గ్రామస్థులకు సూచించారు. పోలీసుల సూచన మేరకు సీసీ కెమెరాలను అమర్చారు. దాతను పోలీసులు, స్థానికులు అభినందించారు.

భాజపా నాయకుల నివాళులు.. పుంగనూరు, న్యూస్‌టుడే: జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి పట్టణ భాజపా అధ్యక్షుడు జగదీష్‌రాజు ఆధ్వర్యంలో నాయకులు నివాళులు తెలిపారు. నాయకులు బాబు, ప్రసాద్, చంద్రరాజు, వెంకటరెడ్డి, జగన్నాథం పాల్గొన్నారు.

సంక్షేమం.. అభివృద్ధికే.. ప్రాధాన్యం

గంగవరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధికే కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తోందని, ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి చేసి సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మామడుగులో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి అభివృద్ధి సంక్షేమాన్ని వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, నాయకులు ప్రసాద్‌నాయుడు, హరిబాబు, రామ్మోహన్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన పూతలపట్టు ఎమ్మెల్యే

పలమనేరు, న్యూస్‌టుడే: పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్.. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని ఆదివారం కలిశారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో కలిసి ఆయనను సన్మానించారు. అమరనాథరెడ్డి జన్మదినం సందర్భంగా ఇటీవల తాను రాలేకపోయానని అందుకే ఇప్పుడు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు మురళీమోహన్ పేర్కొన్నారు.

అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే

అమ్మవారి నామస్మరణతో మార్మోగిన బోయకొండ

బోయకొండ గంగమ్మ ఆలయం భక్తుల నామస్మరణలతో ఆదివారం మార్మోగింది. ఆషాఢమాసం తొలి ఏకాదశిని పురస్కరించుకుని అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి.
- న్యూస్‌టుడే, బోయకొండ(చౌడేపల్లె)

ప్చ్.. నిత్యం ఇలాగే వెళ్లాలి..!

పెద్దపంజాణి మండలంలోని ఆంధ్ర సరిహద్దు రాజుపల్లె సమీపంలో రోడ్డుకు ఇరువైపులా మట్టి కోతకు గురైంది. దీంతో వాహనాలు ఎదురుపడితే తొలగేందుకు చోదకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే కర్ణాటక మార్గం ఇది. రోడ్డు దిగాలంటే భారీ వాహనాల పరిస్థితి ఈ చిత్రం చూస్తే అర్థమవుతుంది. ఆదివారం సాయంత్రం రాజుపల్లె సమీపంలో ఆటో వస్తున్న సమయంలో బస్సు ఇలా కష్టం మీద రోడ్డు దిగుతూ కనిపించింది.

- న్యూస్‌టుడే, పెద్దపంజాణి

పంట రక్షణకు సంచులు

వన్యప్రాణుల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తిప్పలు పడుతున్నారు. జంగాలపల్లెకు చెందిన కొందరు రైతులు ఇటీవల వేరుసెనగ విత్తనాలు వేశారు. విత్తినప్పటినుంచి మొలకెత్తేంత వరకూ పంటను కాపాడుకోవడానికి రైతులు వివిధ పద్ధతులు పాటిస్తున్నారు. పొలం చుట్టూ అడుగు ఎత్తులో కర్రలు పాతి వాటికి తెల్లటి ప్లాస్టిక్ సంచులు ఏర్పాటు చేశారు. రాత్రిపూట పంటలపై దాడులు చేయడానికి వచ్చే వన్యప్రాణులు సంచులను చూసి మనుషులు ఉంటారని భయపడతాయని, అలాగే గాలి వీచినప్పుడు సంచుల నుంచి శబ్దం రావడంతో వన్యప్రాణులు వెనుతిరిగి వెళ్లిపోతాయని రైతులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, పెద్దపంజాణి**

కూడలిలో ప్రయాణం... ప్రమాదభరితం..!

పెద్దపంజాణి మండలంలోని పుంగనూరు-బైరెడ్డిపల్లె మార్గంలో రాజుపల్లె కూడలి ఉంది. పుంగనూరు నుంచి కర్ణాటక వెళ్లేందుకు ఇక్కడి నుంచే వెళ్లాలి. ఇక్కడ కూడలి ఉన్న ప్రాంతం గుంతలుపడి వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారింది. ఆర్అండ్‌బీ అధికారులు కూడలిలో దెబ్బతిన్న రోడ్డును బాగుచేస్తే సౌకర్యంగా ఉంటుందని చోదకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెద్దపంజాణి**

ఆదమరిస్తే అంతే..!

పురపాలిక కార్యాలయ ఆవరణలో మురుగు నీటి గుంత ప్రమాదకరంగా ఉంది. కాలువపై ఏర్పాటు చేసిన బండలు విరిగిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలోనే పురపాలిక కార్యాలయానికి, దుకాణ సముదాయానికి ప్రజలు వెళ్తుంటారు. గమనించకుంటే ప్రమాదబారిన పడక తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ శ్రీనివాసరావును వివరణ కోరగా.. గుంతను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.
- న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

ఆదర్శ పాఠశాలకు ప్రవేశాల వెల్లువ

కల్లూరు, న్యూస్‌టుడే: విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చలు జరిపి వారి అంగీకారంతో గ్రామాల్లో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు(మోడల్ ప్రైమరీ స్కూల్స్) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లె ప్రాథమిక పాఠశాలను స్థానిక తల్లిదండ్రుల అభిప్రాయం మేరకు మండల ఎంఈవోలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య ఎంపిక చేశారు. కొత్తగా ఎంపికైన ఆదర్శ పాఠశాలకు స్థానిక ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. 47 మంది విద్యార్థులతో ప్రవేశాలు వచ్చాయి. ఇది వరకు పాఠశాలలో 18 మంది ఉండగా, కొత్త ప్రవేశాలతో ఆ సంఖ్య 65కు చేరుకుందని ప్రధానోపాధ్యాయుడు రవి పేర్కొన్నారు.

41 మందికి నేత్ర పరీక్షలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహతి ఫౌండేషన్ సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులు ప్రజలకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య నిపుణులు నిహారిక, మౌనిక, రాజశ్రీ నేతృత్వంలో 41 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కంటి సమస్యతో బాధపడుతున్న ఎనిమిది మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. సంస్థ అధ్యక్షుడు నాగరాజు ఉచిత భోజన సదుపాయం కల్పించారు. నిర్వాహకులు శ్రీనివాసులు, శాంతమ్మ, బుజ్జి పాల్గొన్నారు.

పుంగనూరులో పీర్ల ఊరేగింపు

పుంగనూరు, న్యూస్‌టుడే: మొహర్రం సందర్భంగా ఆదివారం పట్టణంలోని సుబేదారువీధి, కుమ్మరవీధుల్లోని దర్గాల్లో పీర్లకు ప్రత్యేక అలంకరణలు, ప్రార్థనలు చేపట్టారు. పీర్లను సుబేదారువీధిలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. తొమ్మిది రోజుల క్రితం ప్రారంభమైన ప్రార్థనలు ఆదివారంతో ముగిశాయి. హిందూ, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల నిరసన

పలమనేరు: గత సంవత్సరం అక్టోబరు తర్వాత పదవీ విరమణ పొందిన వారికి గ్రాట్యుటీ చెల్లించాలని పెన్షనర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు సోమచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పెన్షనర్ల సర్వీసు సెంటర్ కార్యాలయం వద్ద విశ్రాంత ఉద్యోగులు ఆదివారం నిరసన తెలిపారు. సంఘ సభ్యులు శ్రీనివాసులు, పరశురామ్, జగదీష్, ఉమాపతి, నాగభూషణంరెడ్డి పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

దరఖాస్తుల స్వీకరణ

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: కమ్మనపల్లె గురుకుల బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపల్ శోభ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఆంగ్లం, భౌతికశాస్త్రం, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలు బోధించడానికి అర్హత కలిగిన మహిళా ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



అలరించిన జానపద నృత్య ప్రదర్శన

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన జానపద నృత్య ప్రదర్శన అలరించింది. ఆదివారం బైరెడ్డిపల్లెకు చెందిన కళాతరంగిణి బృందం కళాకారుల నృత్య ప్రదర్శన జరిగింది. పలు జానపద పాటలకు కళాకారులు చేసిన నృత్యాలు సందర్శకులను కనువిందు చేశాయి.

విద్యుత్తు ఉచితం.. రాయితీ అదనం

✦ పీఎం సూర్యఘర్‌తో ఉపశమనం

పుంగనూరు, న్యూస్‌టుడే: ఏళ్ల పాటు కరెంటు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేకుండా పీఎం సూర్యఘర్ పథకం వెసులుబాటు కల్పిస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా ఉచితం, ఓసీల కంటే బీసీలకు 20 వేలు అదనపు రాయితీ ఇస్తోంది. యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు వస్తున్న వారికి విద్యుత్తు అధికారులు బ్యాంకర్ల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తున్నారు. పుంగనూరు విద్యుత్తుశాఖ డివిజన్ పరిధిలోని పుంగనూరు, సదుం, పలమనేరు సబ్‌డివిజన్ల పరిధిలో సౌర ఫలకాల అమరిక నెమ్మదిగా సాగుతోంది. లక్ష్యం మేరకు అమర్చాలంటే పథకంతో కలిగే ప్రయోజనాలను అధికారులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి వినియోగించుకునేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం మరింత వేగవంతం చేయడానికి అధికారులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. పుంగనూరు, పలమనేరు, సబ్ డివిజన్ పరిధిలో 1,70,139 గృహ విద్యుత్తు సర్వీసులు ఉన్నాయి. ఇప్పటి వరకు 16,265 మంది దరఖాస్తు చేసుకోగా... 141 మంది విద్యుత్తు అధికారులతో ఒప్పందం చేసుకున్నారు. 38 మంది అమర్చుకుని విద్యుత్తు వినియోగించుకుంటున్నారు.

పుంగనూరులో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సౌరఫలకం

పుంగనూరు డివిజన్ వివరాలు

సబ్ డివిజన్: పుంగనూరు, సదుం, పలమనేరు	
విద్యుత్తు సర్వీసులు	: 1,70,139
వచ్చిన దరఖాస్తులు	: 16,265
ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు	: 31,024
ఇప్పటివరకు అమర్చినవి	: 38
అమర్చాల్సినవి	: 141

కిలోవాట్‌కు 120 యూనిట్లు

ఒక కిలోవాట్ సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకుంటే నెలకు 120 యూనిట్లు విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ప్రజలు తమ వినియోగం ఆధారంగా ఇంటి పైకప్పుపై రెండు నుంచి మూడు కిలోవాట్ల సౌరవిద్యుత్తు ప్రాజెక్టు ఏర్పాటు చేసుకుంటే అసలు కరెంటు ఛార్జీల భారం ఉండదు. రెండు కిలోవాట్ల ప్రాజెక్టుకు నెలకు 240 యూనిట్లు, మూడు కిలోవాట్ల ప్రాజెక్టుకు 360 యూనిట్లు విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. వినియోగం పోనూ మిగిలిన కరెంటును ఏపీఎస్పీడీసీఎల్ కొనుగోలు చేసి యూనిట్‌కు రూ.2.09చొప్పున చెల్లిస్తుంది. ఒక కిలోవాట్‌కు రూ.70వేలు, రెండు కిలోవాట్లకు రూ.1.40 లక్షలు, మూడు కిలోవాట్లకు రూ.2.10లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా ఉచితం, బీసీలకు సాధారణ రాయితీపై రూ.20వేలు అదనంగా రాయితీ ఇస్తోంది.

అవగాహన కల్పిస్తున్నాం

సౌర విద్యుత్తు ఫలకాలు ఏర్పాటు చేసుకోవడానికి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. అలాగే చౌడేపల్లె, కల్లూరు, పలమనేరు, సోమల మండలాల పరిధిలో రైతుల భూముల్లో, విద్యుత్తు సబ్‌స్టేషన్ల ఆవరణలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. వినియోగదారుల్లో చైతన్యం తీసుకురావడానికి అవగాహన సదస్సులు, కరపత్రాల పంపిణీ కార్యక్రమాలను విస్తృతం చేస్తాం. **- శ్రీనివాసమూర్తి, డీఈ, విద్యుత్తుశాఖ, పుంగనూరు**

పాతకక్షల నేపథ్యంలో దాడి

రామకుప్పం: పాతకక్షల నేపథ్యంలో ఒకరిపై దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు రామకుప్పం పోలీసులు ఆదివారం తెలిపారు. వీర్నమాలకు చెందిన చక్రవర్తి నాయక్, అదే గ్రామానికి చెందిన మంజుకుమార్ నాయక్‌కు రెండు నెలల క్రితం భూ వివాదంలో ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో చక్రవర్తి నాయక్ రిమాండుకు వెళ్లి 15 రోజుల క్రితం వచ్చాడు. ఆదివారం గ్రామస్థుల సమక్షంలో ఇరువర్గాలకు పంచాయితీ ఉండగా చక్రవర్తి నాయక్ ఆలస్యంగా వచ్చాడని మంజుకుమార్ నాయక్ కుటుంబ సభ్యులు దాడికి పాల్పడ్డారు. దీంతో మంజుకుమార్ నాయక్‌తో పాటు కుటుంబ సభ్యులు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై కత్తితో..

పుంగనూరు గ్రామీణ: పట్టణంలోని మేలుపట్లకు చెందిన నారాయణ... మధుకర్‌రెడ్డి అనే వ్యక్తి పొలంలో పని చేస్తున్నారు. ఈ క్రమంలో మేలుపట్లకు చెందిన పవన్, నాని, కిషోర్ తదితరులు పొలంలో మద్యం తాగడానికి రాగా.. ఇక్కడ తాగరాదని.. యజమాని వస్తే గొడవ జరుగుతుందని చెప్పి పంపారు. వెళ్లిపోయిన వారు నారాయణ ఇంటికి వెళ్లి అతనిపై గొడవ పడ్డారు. ఈ క్రమంలో నాని కత్తితో దాడి చేశాడు. ఏఎస్సై అశ్వర్థనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భూ తగాదాతో ఇరువర్గాల ఘర్షణ

పుంగనూరు గ్రామీణ: రామసముద్రం మండలం నరసాపురంలో భూ తగాదాతో ఆదివారం ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. గ్రామానికి చెందిన మునివెంకటప్ప, మోహన్‌లకు గాయాలయ్యాయి. వీరిని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మద్యం మత్తులో వ్యక్తి వీరంగం

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మద్యం మత్తులో భానుప్రకాష్ అనే వ్యక్తి వీరంగం సృష్టించాడు. మండలంలోని కురప్పల్లెకు చెందిన ఇతను ఇంట్లో భార్యతో గొడవపడి తనకు తానే బ్లేడుతో కోసుకుని గొడవ చేశాడు. చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకురాగా.. .. అడ్డొచ్చిన వారిపై దాడికి పాల్పడ్డాడు. భార్యను సర్జికల్ బ్లేడుతో గాయపరిచాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనం ఢీ

పుంగనూరు గ్రామీణ: మార్లపల్లెకు చెందిన అమృతసాగర్ ఆదివారం కర్ణాటకలో కూలీ పనులు వెళ్లి ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటి వస్తుండగా... బోడిబండ సమీపంలోని ఓ పరిశ్రమలో పనిచేసే కూలీ సోమ్‌పండిత్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో సోమ్‌పండిత్ తీవ్రంగా గాయపడ్డారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాయుడు పేర్కొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

పుంగనూరు గ్రామీణ: పుంగనూరు నుంచి మదనపల్లె వెళ్తున్న రామసముద్రానికి చెందిన శివరాజ్ అదుపుతప్పి ద్విచక్ర వాహనంపై భీమగానిపల్లె సమీపంలో కిందపడ్డారు. తీవ్ర గాయాలు కావడంతో మదనపల్లె ఆసుపత్రికి తరలించారని సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

జూదరుల అరెస్టు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: వెంగంవారిపల్లె అటవీ ప్రాంతంలో ఆదివారం జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్సై పరశురాముడు తెలిపారు. నిందితుల నుంచి రూ.3,250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

VEHICLE FOR SALE
LEYLAND
BADA DOST 14
MODEL 2023
REG.No: AP-39-VA-2715
SUNDARAM FINANCE LIMITED
D.No:17-94, 2nd Floor
TEXMO Building
Opp:RTC Bus Stand
Palamaner-517408
Cell : 94409 09748
79016 79186
As is where is Condition

ఆనంద తీరం..

అంతర్వేది సముద్ర తీరంలో ఆదివారం పర్యాటకులతో సందడి నెలకుంది. అనేక ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. పిల్లాపాపలతో ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. పలువురు గుర్రపు స్వారీ, వశిష్ఠ గోదావరిలో బోటింగ్ చేశారు. - న్యూస్‌టుడే, అంతర్వేది

మార్మోగిన అరుణాచలశివ మంత్రం

భజనలు, మేళతాళాలతో ఊరేగింపు

ప్రత్తిపాడు: మండలంలోని శ్రీఅపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అరుణాచల శివ అనే సప్తాక్షరి ఆలయ ప్రాంగణంలో మార్మోగింది. నాయనార్ల విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాల మూడో రోజున స్వామి అనుజ్ఞ, అంకురార్పణ నిర్వహించారు. ప్రవచనకర్త అరుణాచల మాధవి, స్వామి రామానంద వేడుకలు నిర్వహించారు. పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొన్నారు.

ప్రముఖుల హాజరు.. : దేవస్థానాన్ని మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు, అన్నపూర్ణమ్మ దంపతులు, గాయని ఎంఎం శ్రీలేఖ, సినీనటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి తదితరులు విచ్చేశారు.

యథేచ్ఛగా నకిలీ మద్యం దందా..!

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, అల్లవరం : గత ప్రభుత్వ హయాంలో దశలవారీగా మద్య నిషేధం చేస్తామంటూ.. అడ్డగోలుగా ధరలు పెంచి నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాన్ని గుల్ల చేశారు. కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యాన్ని అందుబాటు ధరలో అందించాలని నిర్ణయించి అమలు చేస్తోంది. కానీ తక్కువ సమయంలో ఎక్కువ ధనార్జన చేయాలన్న కుటిల బుద్ధితో కొందరు అడ్డదారులు తొక్కుతూ నకిలీ మద్యం తయారీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల అల్లవరం మండలంలో ఒక ముఠా పట్టుబడగా ఉమ్మడి జిల్లాలోనూ అటువంటి కేంద్రాలున్నాయని పోలీసు నిఘా వర్గాలు చెబుతున్నాయి.

ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా..

హైదరాబాద్ వనస్థలిప్రాంతానికి చెందిన ఇద్దరు వేర్వేరుగా పరిచయం ఉన్న వ్యక్తులను గుర్తించి దందాకు తెరలేపుతున్నారు. ఇటీవల అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో పట్టుబడిన ముఠా ఆ కోవకు చెందినదే. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరికి పాలకొల్లులో దందా చేసే వ్యక్తితో పరిచయం.

జిల్లాలోనూ కేంద్రాలు..?

ఎక్సైజ్ అధికారులు కొమరగిరిపట్నంలో స్వాధీనం చేసుకున్న హైదరాబాద్ నుంచి వచ్చిన స్పిరిట్

స్థానికంగా తయారైన మద్యం సీసా

పాలకొల్లు వ్యక్తి యానంకు చెందిన మరొకరికి అతనికి పరిచయం చేస్తే.. యానం వ్యక్తి అల్లవరం మండలానికి చెందిన వేర్వేరు వారితో దందాకు తెరలేపాడు. ఇందులో ఎవరితో ఎవరికీ నేరుగా పరిచయం లేకున్నా హైదరాబాద్ నుంచి స్పిరిట్, మద్యం రంగు వచ్చేందుకు కారామిల్, ఖాళీ సీసాలు లేబుళ్లు వచ్చేస్తాయి. సీసాలకు సీల్ చేసే మిషన్‌ధర రూ.5 లక్షల వరకు ఉంటే, స్థానిక ముఠా రూ.2 లక్షలు చెల్లిస్తేనే సరఫరా చేశారంటే ఒకరిపై ఒకరికి ఎంత నమ్మకమో తెలుస్తోంది. కోనసీమలో పట్టుబడిన ముఠా ఇచ్చిన సమాచారం ఆధారంగా అనకాపల్లి, నెల్లూరు ప్రాంతాల్లోనూ అక్రమార్కులను పట్టుకున్నారు. హైదరాబాద్ ముఠా సభ్యుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ● స్పిరిట్, ఖాళీ సీసాలు ఇతర పరికరాలను బస్సులు, ఇతర కొరియర్లలో శానిటైజర్, ఆయుర్వేద మందులు, ఇతర పేర్లతో బుకింగ్ చేస్తున్నారు. వీటి లోడింగ్, అన్‌లోడింగ్ సమయాల్లో సరైన తనిఖీలు లేకపోవడంతో వీరి దందాకు అడ్డు లేకుండా పోతోంది.

అసలు ధర కంటే తక్కువకే విక్రయాలు

గ్రామాల్లో తయారు చేస్తున్న నకిలీ మద్యానికి ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఓ బ్రాండు స్టిక్కర్లు అతికించి 180 మి.లీ. సీసాలను అసలు ధరకంటే రూ.40కు తక్కువకు విక్రయిస్తున్నారు. అల్లవరం మండల పరిధిలో సుమారు 500 మద్యం సీసాలు విక్రయించారు. ● కోనసీమ ప్రాంతంలో ఇదే తరహాలో నకిలీ మద్యం తయారీ యూనిట్లు మరి కొన్ని చోట్ల నిర్వహించారని నిఘా వర్గాలకు సమాచారం ఉంది. కొమరగిరిపట్నంలో పట్టుబడటంతో మిగిలిన ముఠాలు తాత్కాలికంగా కార్యకలాపాలు నిలిపేసినట్లు తెలుస్తోంది. ప్రత్యేక బృందాలు గ్రామాల్లో మఫ్టీలో తిరుగుతున్నాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ వరప్రసాద్ తెలిపారు.

అమ్మ ఆరోగ్యం.. కోతలతో ప్రమాదం..

రాష్ట్రంలోనే కోనసీమలో అత్యధికంగా 75 శాతం

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, కంబాలచెరువు : నవమాసాలు మోసి, ప్రసవ వేదనతో బిడ్డకు ఊపిరినిస్తుంది అమ్మతనం. కానీ ప్రస్తుతం పురిటినొప్పుల ప్రసవ వేదన లేకుండానే కోతలతో అమ్మపొత్తిళ్లలోకి శిశుప్రాణం చేరుతుంటే.. చూసి మురిసిపోతున్న తల్లుల సంఖ్యే ఎక్కువగా ఉంటోంది. సిజేరియన్ చేయడమే లక్ష్యంగా కొందరు వైద్యులు జేబులు గుల్ల చేస్తుంటే.. ముహూర్తాలు ఇతర కారణాలతో నిర్దేశిత సమయానికి బిడ్డ జన్మించాలనే ఉత్సుకతతో సిజేరియన్‌ను ప్రోత్సహిస్తున్న పెద్దలూ లేకపోలేదు. అవగాహన, అనుభవంలేని కొందరు వైద్యులు, రిస్క్ ఎందుకని భావిస్తూ కోతలకే ప్రాధ్యామిస్తున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకంటే సిజేరియన్లే అధికంగా చేస్తున్నారన్నది సుస్పష్టం.

అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రసూతి విభాగం

ఏప్రిల్, మే నెలల్లో పరిశీలిస్తే	
కోనసీమ జిల్లా	
ప్రసవాలు	1748
సిజేరియన్	1311
శాతం	75

50 శాతానికి మించి..

ఉమ్మడి జిల్లాలో ఏప్రిల్, మేలో 6,961 ప్రసవాలకు గాను 4,209 సిజేరియన్లు జరిగాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 10 నుంచి 15 శాతానికి మించి ఇవి ఉండకూడదు. కానీ ఉమ్మడి జిల్లాలో 50 శాతానికి మించి జరుగుతుండడం గమనార్హం.

జిల్లాలవారీగా పరిశీలిస్తే..

● ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని కాకినాడ, తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో అత్యధికంగా సిజేరియన్లకు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రభుత్వ గణాంకాల మేరకు (ఏప్రిల్,మేలో) అత్యధికంగా కోనసీమలో 75, తూర్పుగోదావరిలో 60.84, కాకినాడలో 50 శాతం చొప్పున సిజేరియన్లు జరిగాయి.

● డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 528 ప్రసవాలు జరగ్గా 283 (53.60 శాతం) సిజేరియన్లు చేశారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో 1220 ప్రసవాలకు గాను అత్యధికంగా 1,028 (84.26 శాతం) కోతలతో చేయడం ప్రమాదకర స్థాయిని సూచిస్తుంది.

శస్త్రచికిత్స ప్రసవాలతో ఆరోగ్యానికి ఇబ్బందే

సాధారణ ప్రసవం తరువాత మహిళ మూడు గంటల్లో లేచి నడవచ్చు. త్వరగా కోలుకుంటారు. సిజేరియన్ల తో ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదముంది. రక్తస్రావం అధికమై తీవ్ర ఇబ్బందులయ్యే ఆస్కారం లేకపోలేదు. మొదటిసారి శస్త్రచికిత్స చేసి పురుడు పోస్తే రెండోసారి గర్భసంచి పగిలిపోయే ప్రమాదముంది. ప్రసవం ముందే చేయాల్సిన పరిస్థితులుంటాయి. అలాంటప్పుడు బిడ్డ ఊపిరితిత్తులు ఎదగకుండానే ప్రసవం చేసి ఎన్‌ఐసీయూ, ఎస్‌ఎన్‌సీయూలో బిడ్డను ఉంచాల్సి ఉంటుంది. మరోవైపు బాలింతలు నెలల తరబడి విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల ఒబేసిటీ పెరిగి మరిన్ని అనారోగ్య సమస్యలొస్తాయి. జీజీహెచ్‌లో 40 వారాలయ్యాకనే నొప్పులు వచ్చేందుకు మందులిచ్చి సాధారణ ప్రసవం చేస్తాం. అది కుదరని పక్షంలో శస్త్రచికిత్సకు వెళ్తాం. ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రుల్లో 36 వారాలకే నొప్పులకు మందులిచ్చి సాధారణ ప్రసవం కుదరదని సిజేరియన్ చేసేస్తున్నారు.

- బసా అక్కమాంబ, హెచ్‌వోడీ, ప్రసూతి వైద్యవిభాగం, రాజమహేంద్రవరం జీజీహెచ్

ఎర్ర గోదారి వచ్చేస్తోంది..

వరదనీరు చేరడంతో వైనతేయ గోదావరి నదీపాయ క్రమేపీ ఎరుపు రంగును సంతరించుకుంటోంది. అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానానికి సమీపంలో ఉన్న స్నానఘట్టం వద్ద ఈ రంగుమారిన నీటిని అంతా ఆసక్తిగా తిలకిస్తున్నారు. పోటునీటి ప్రభావంతో మధ్యలో ఉన్న ఇసుక తిన్నెలన్నీ మునిగిపోవడంతో నది నిండుగా కనిపిస్తోంది.

- న్యూస్‌టుడే, మామిడికుదురు

ఏటీఎస్ కేంద్రంలోనే వాహన సామర్థ్య ధ్రువపత్రాలు

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : రవాణా వాహనాలకు సామర్థ్యం ధ్రువపత్రాలను అమలాపురం మండలం ఎ.వేమవరంలో ఏర్పాటు చేసిన ఆటోమేటెడ్ టెస్టింగ్ మిషన్ (ఏటీఎస్) కేంద్రం ద్వారా ఈ నెల 9 నుంచి జారీ చేస్తారని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. వాహన సామర్థ్యానికి సంబంధించిన స్లాట్లు ఏటీఎస్ కేంద్రంలో నమోదు అవుతాయని వెల్లడించారు. లారీ ఓనర్ల యూనియన్ సభ్యులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

అరటి రైతు దిగాలు

– న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం, పట్టణం

అరటి ధర ఎప్పుడు ఎలా ఉంటుందో అర్థంకాక సాగుచేస్తున్న రైతులు తల పట్టుకుంటున్నారు. ఆ నెల భారీగా ఉంటే.. మరుసటి నెల పడిపోవడంతో పెట్టుబడులు సైతం రాని పరిస్థితి నెలకొనడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు, అంబాజీపేటల్లో అరటి యార్డులు ఉన్నాయి. ఇక్కడ నిత్యం పెద్దఎత్తున విక్రయాలు సాగుతుంటాయి. రాష్ట్రంలోనే అతి పెద్దదైన రావులపాడు యార్డుకు వర్తకులు అధికంగా రావడంతో రైతులు సైతం ఇక్కడికే ఎక్కువగా దిగుబడులు తీసుకొస్తుంటారు. గత జులైలో రోజుకు 15 వేలకు పైగా గెలలు ఎగుమతులు జరగ్గా ప్రస్తుతం 10 వేలకు పడిపోవడంతో ఆ ప్రభావం రైతులపై పడి నష్టాలు చవి చూస్తున్నారు. ఈ మార్కెట్ నుంచి అత్యధికంగా ఒడిశాకు ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం అక్కడ డిమాండ్ లేకపోవడంతో ఎగుమతులు తగ్గిపోయి ధరలు పడిపోయాయి. గతనెల కర్పూర గెల ఒకటి రూ.600 వరకు ధర పలికింది. ప్రస్తుతం రూ.300 మించి రావడం లేదు. ఎర్ర చక్రకేళీ గతనెల రూ.700 పలకగా ప్రస్తుతం రూ.250 మాత్రమే రావడంతో గెల ఒకటికి రూ.450 వరకు నష్టపోతున్నారు.

రావులపాడు మార్కెట్ యార్డులో ఎగుమతికి సిద్ధంగా ఉన్న గెలలు

మిగిలిన రకాల ధరలు పెద్దగా తేడా లేకపోవడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు.

దుకాణానికి రూ.3.38 లక్షల విద్యుత్తు బిల్లు

మలికిపురం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండల కేంద్రంలోని ఓ వస్త్ర దుకాణానికి ఏకంగా రూ.3,38,496 విద్యుత్తు బిల్లు వచ్చింది. స్థానిక కూడలిలో కుంపట్ల యువకుమార్ చిన్న వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. జూన్ నెలకు సంబంధించి సర్వీసు నంబరు 1414380613002892 పెద్ద మొత్తంలో బిల్లు రావడంతో ఆయన ఆశ్చర్యానికి గురయ్యారు. ప్రతినెలా రూ.500-800 మధ్య వచ్చేదని, ఈసారి ఏకంగా రూ.లక్షల్లో వచ్చిందని వాపోయారు. దీనిపై కస్టమర్ కేర్‌కి ఫిర్యాదు చేశానన్నారు. స్థానిక విద్యుత్తు శాఖ కార్యాలయంలోనూ ఫిర్యాదు చేస్తానని చెప్పారు. స్మార్ట్‌మీటర్‌తో ప్రతినెలా తన చరవాణికి నేరుగా బిల్లు వస్తుందన్నారు.

బాధితురాలి బంధువులతో చర్చిస్తున్న ఎస్సై రవీంద్రబాబు

పుట్టిన కొద్దిసేపటికే శిశువు మృతి

సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: టి.కొత్తపల్లి సామాజిక ఆసుపత్రిలో శిశువు మృతితో బంధువులు ఆందోళనకు దిగారు. గర్భిణి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదమడికి చెందిన ధరణి శనివారం ఉదయం ఆసుపత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చారు. సిజేరియన్ అనంతరం బిడ్డను సిబ్బందికి అప్పగించారు. కొద్ది సేపటి తర్వాత కుటుంబ సభ్యులు చూడగా పసికందులో ఎలాంటి కదలికలు లేకపోవడంతో వైద్యసిబ్బందికి చెప్పారు. వారు వచ్చి పరీక్షించకుండానే నిర్లక్ష్యంగా వెళ్లిపోయారని వాపోయారు. ఇంతలో కాళ్లు నీలం రంగులోకి మారడంతో అమలాపురంలోని ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం టి.కొత్తపల్లి ఆసుపత్రికి చేరుకుని ఆందోళన చేశారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే బిడ్డ మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఐ.పోలవరం ఎస్సై రవీంద్రబాబు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. ఫిర్యాదు అందజేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటారని ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నేడు అర్జీల స్వీకరణ

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ మహేష్‌కుమార్‌తో పాటు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజలు తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసవెళ్లి పరిష్కార మార్గాలు పొందవచ్చని పేర్కొన్నారు.

రండి.. రికార్డు సృష్టిద్దాం

పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశానికి ఏర్పాట్లు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

గతంలో ఎన్నడూలేని విధంగా.. ఈ ఏడాది మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్(పీటీఎం) నిర్వహించేందుకు విద్యా శాఖ ఏర్పాట్లు చేస్తోంది. చదువును చక్కదిద్ది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దీనిని వేదికగా వినియోగించుకోవాలని భావిస్తున్నారు. ఈ నెల 10న ఈ సమావేశం నిర్వహించేలా రూపకల్పన చేశారు. తల్లి పేరిట మొక్కలు నాటడం, బృంద చిత్రాలు తీసుకోవడం, ఫొటోలు తీసి యాప్‌లో నమోదు చేయడం ద్వారా గిన్నిస్ రికార్డు సాధన వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లాలోని 2,150 పాఠశాలల్లో దీనికి సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు 1.50 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

● ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోనూ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

అల్లవరంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

పాఠశాలల వారీగా నిధులు సైతం విడుదల చేశారు. ఆ డబ్బులతో తాగునీరు, మధ్యాహ్న భోజనం, కుర్చీలు తదితర ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. బృంద చిత్రాలు.. పాఠశాలల ఆవరణలో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు బృంద చిత్రాలు తీసుకునే విధంగా ఫొటో స్పాట్‌లను ఏర్పాటు చేస్తారు. డ్రీమ్ వాల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులతో వారి లక్ష్యాలను దానిపై రాయిస్తారు. నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు తల్లి పేరిట మొక్కలు నాటే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు.

గిన్నిస్ రికార్డు సాధించేలా..

ఈ సారి నిర్వహించే సమావేశం గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కేలా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సమావేశానికి ఒక వ్యక్తి సాక్ష్యంగా ఉండేలా యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయాలి. ఆ వ్యక్తి ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు తీసి యాప్‌లో నమోదు చేయాలి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కాకుండా బయట వ్యక్తులు ఎవరైనా ఈ ఫొటోలు అప్‌లోడ్ చేయవచ్చు. ఇది కేవలం గిన్నిస్ బుక్ రికార్డు కోసమేనని అధికారులు తెలిపారు.

నిర్వహణ ఇలా..

● విద్యార్థి ఎలా చదువుతున్నాడు, మరింత నాణ్యమైన విద్యనందించేందుకు ఎలాంటి మార్పులు చేయాలనే అంశాలపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయాలు పంచుకుంటారు.

● పరీక్షల్లో సాధిస్తున్న మార్కులు, ఆరోగ్య సమాచారంతో కూడిన సమగ్ర ప్రగతి పత్రం తల్లిదండ్రులకు అందజేస్తారు. ● పిల్లలు పాఠశాలల్లో ఉంటున్న తీరు, తోటి వారితో ఏవిధంగా ప్రవర్తిస్తున్నారనే విషయాలను తల్లిదండ్రులకు వివరిస్తారు. ● ఆ రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమావేశం జరుగుతుంది. 'సమావేశాల్లో విద్యార్థుల ప్రవర్తన, అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రగతిపై చర్చిస్తారు. దీని ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది.' అని డీఈవో సలీం బాషా అని అన్నారు.

నవ చైతన్యంతోనే బంగారు భవిత : ఎస్పీ

కృష్ణారావు

ఈనాడు డిజిటల్, అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే : చెడు వ్యసనాల బారి యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని ఎస్పీ కృష్ణారావు అన్నారు. రాష్ట్రంలో పాఠశాలలు, కళాశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో యువత పక్కదారి పట్టకుండా పోలీసు శాఖ ఎటువంటి చర్యలు తీసుకుంటుందో 'ఈనాడు' నిర్వహించిన ముఖాముఖిలో వివరించారు.

రహదారుల ప్రమాదాల నియంత్రణపై దృష్టి

రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నాం. ద్విచక్ర వాహన దారులు నిర్లక్ష్యంగా చరవాణి మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారు. దీంతో వెనుక నుంచి వచ్చే వాహనాలను గుర్తించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, అధిక వేగం, మద్యం మత్తులో వాహనాలు నడపడంతో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన కూడళ్ల వద్ద వేగ నియంత్రణలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.

చట్టాలపై అవగాహన అవసరం

కళాశాలలకు వచ్చే విద్యార్థులు తోటి విద్యార్థులతో ఎలా ఉండాలన్న అంశంపై జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతాం. సాధారణంగా పదో తరగతి ఉత్తీర్ణులై ఇంటర్‌లో చేరగానే విద్యార్థులు ఆకర్షణకు గురవుతుంటారు. ర్యాగింగ్‌కు పాల్పడితే ఎటువంటి చర్యలు ఉంటాయో వివరిస్తున్నాం. చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం.

శక్తి యాప్‌తో భద్రత

ఆకతాయిల వల్ల విద్యార్థినులు, మహిళలు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పుడు అందరి చేతిలో స్మార్ట్ ఫోన్‌లు ఉంటున్నాయి. ఎవరైనా విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించినా భయపడకుండా ఫోన్‌లో శక్తియాప్‌ను ఉపయోగించి ఫిర్యాదు చేయవచ్చు. దీంతో కొంత వరకు నేరాలు అరికట్టే అవకాశం ఉంటుంది.

డ్రోన్ కెమెరాతో పర్యవేక్షణ

ప్రస్తుతం గంజాయి వినియోగం పాఠశాల విద్యార్థులకు కూడా అలవాటు చేస్తున్నారు. దీని వినియోగం, విక్రయాలపై డ్రోన్ కెమెరాతో పర్యవేక్షణ చేపడుతున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎలా వ్యవహరించాలో తగు సూచనలు చేస్తాం. ప్రాథమిక స్థాయిలోనే దీనిని కట్టడి చేయాలి. లేకుంటే అది ప్రమాదకరంగా మారుతుంది.

పేపరుమిల్లు కార్మికుల సమ్మె

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఆంధ్రా పేపరుమిల్లు కార్మికులు మళ్లీ సమ్మెకు దిగారు. విధులు బహిష్కరించి లోపలే బైఠాయించారు. దీంతో ఉత్పత్తి నిలిచిపోయింది. తక్షణం శాశ్వత, ఒప్పంద కార్మికులకు వేతన ఒప్పందం చేయాలంటూ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. 2020 జులై 1 నుంచి 2023 వరకు వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని ఇక్కడి కార్మికులు చాలాకాలంగా పోరాటం చేస్తూనే ఉన్నారు. గతేడాది ఏప్రిల్‌లో 24 రోజులపాటు మిల్లులో సమ్మె చేయగా వేతన ఒప్పందం చేస్తామని మిల్లు యాజమాన్యం అప్పటి జిల్లా కలెక్టర్ సమక్షంలో రాతపూర్వకంగా అంగీకరించి దానిని అమలు చేయలేదు. దీంతో ఈ ఏడాది జనవరిలో మరోసారి నాలుగు రోజుల పాటు కార్మికులు ఆందోళన చేశారు. దీంతో వేతన ఒప్పందాన్ని అమలు చేసేందుకు యాజమాన్యం మళ్లీ అంగీకరించింది. నేటికీ దానిని అమలు చేయకుండా యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, చట్టప్రకారం చేయాల్సినవి కూడా చేయకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

(c) eenadu

సిద్ధివినాయక.. శుభప్రదాయక

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధివినాయకస్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా వివిధ జిల్లాల నుంచి పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు నిండిపోయాయి. వివిధ రుసుముల ద్వారా రూ.4,49,089 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

అమ్మవారికి వజ్రాల లాకెట్ నెక్లెస్ అందజేత

లాకెట్ నెక్లెస్

అన్నవరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ అమ్మవారి అలంకరణకు వజ్రాల లాకెట్ నెక్లెస్‌ను దాత ఆదివారం అందజేశారు. పెద్దాపురం శ్రీ లలితా ఎంటర్ ప్రైజెస్ ఇండస్ట్రీస్ ఎండీ మట్టే సత్యప్రసాద్, సూర్యకమల దంపతుల కుమారుడు ఆదిశంకర్, స్రవంతి పేరు మీద ఇచ్చారు. సుమారు రూ.19.09 లక్షలతో బంగారం, వజ్రాలతో తయారు చేయించిన సుమారు 122 గ్రాముల బరువున్న ఆభరణంలో 174 వజ్రాలు ఉన్నాయి. ప్రత్యేక పూజలు అనంతరం ఈవో సుబ్బారావు సమక్షంలో దాత కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి అందించారు. వైదిక బృందం ఆధ్వర్యంలో అమ్మవారికి ఆభరణాన్ని అలంకరించారు. మట్టే సత్యప్రసాద్ గతంలో రూ.కోట్ల వ్యయంతో స్వామి, అమ్మవార్లకు వజ్ర కిరీటాలను, వజ్రాలు పొదిగిన కర్ణాభరణాలను కూడా ఇచ్చారు. ఈ ఆభరణాల అలంకరణతోనే స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తున్నారు.

వజ్రాల లాకెట్ నెక్లెస్‌ను ఈవో సుబ్బారావుకు అందిస్తున్న దాత మట్టే ఆదిశంకర్ దంపతులు

అధికారుల నిర్లక్ష్యం.. భక్తులకు శాపం

అయినవిల్లి, న్యూస్‌టుడే: రద్దీకి అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రతిసారీ అవస్థలు తప్పడం లేదు. ఆదివారం తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో క్యూలైన్లలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆలయ పరిసరాల్లో ఎక్కడికక్కడ ఆటోలు, వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహన పూజ కోసం వచ్చిన ఓ భారీ లారీ రహదారి మధ్యలో ఇరుక్కుపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. క్యూలైన్ల నిర్వహణ సైతం సక్రమంగా లేకపోవడంతో గంటల తరబడి దర్శనానికి నిరీక్షించాల్సి వచ్చింది. దీంతో అధికారుల తీరుపై పలువురు భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

ఆలయం వద్ద రహదారి మధ్యలో ఇరుక్కుపోయిన లారీ

జేఎన్‌టీయూకేకి ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్, రెక్టార్ల నియామకం

గాంధీనగర్(కాకినాడ): పరిపాలనా సంస్కరణల్లో భాగంగా జేఎన్‌టీయూకే ఉపకులపతి సీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆదేశాల మేరకు జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్, ఇన్‌ఛార్జి రెక్టార్‌లను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వుల జారీ చేశారు. యూసీఈకే ఈఈఈ విభాగం ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.శ్రీనివాసరావును ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న వి.రవీంద్రనాథ్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. జేఎన్‌టీయూకే యూసీఈకే మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్‌గా ఉన్న వి.వి.సుబ్బారావును ఇన్‌ఛార్జి రెక్టార్‌గా నియమించారు. ప్రస్తుత రెక్టార్ కె.వి.రమణను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. వీరిని ఉపకులపతి ప్రసాద్, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, డైరెక్టర్లు, యూనివర్సిటీ అధికారులు అభినందించారు.

సాయి వేంకటేశ్వర ఎం.ఎం.ఎ. కో- ఆపరేటివ్ సొసైటీ దేవిచౌక్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

సాయి వేంకటేశ్వర ఎం.ఎం.ఎ. కో-ఆపరేటివ్ సొసైటీ, దేవిచౌక్ వద్ద తాకట్టు పెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
09/2025	01-09-2023 to 30-06-2024

ఆసక్తి గలవారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 రాజమండ్రి. చైర్మన్: సాయి వేంకటేశ్వర ఎం.ఎం.ఎ. కో-ఆపరేటివ్ సొసైటీ

ప్రభాకర నిధి లి., దేవిచౌక్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

ప్రభాకర నిధి, దేవిచౌక్ వద్ద తాకట్టుపెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
08/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గలవారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 రాజమండ్రి. చైర్మన్, ప్రభాకర నిధి లి.

సాయి వేంకటేశ్వర ఫైనాన్స్, మెయిన్‌రోడ్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

సాయి వేంకటేశ్వర ఫైనాన్స్, మెయిన్ రోడ్ వద్ద తాకట్టుపెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
06/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గలవారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 రామచంద్రపురం. భరత్‌కుమార్ ప్రభుత్వం నియమించిన వేలందారు మెయిన్‌రోడ్, రామచంద్రపురం

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, ప్రకాష్‌నగర్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, ప్రకాష్ నగర్ వద్ద తాకట్టు పెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
07/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గల వారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 రామచంద్రపురం. భరత్‌కుమార్ ప్రభుత్వం నియమించిన వేలందారు మెయిన్‌రోడ్, రామచంద్రపురం

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, దేవిచౌక్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, దేవిచౌక్ వద్ద తాకట్టు పెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
05/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గల వారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 రామచంద్రపురం. భరత్‌కుమార్ ప్రభుత్వం నియమించిన వేలందారు మెయిన్‌రోడ్, రామచంద్రపురం

విదేశీ విహంగం.. వచ్చింది పుణ్యక్షేత్రం

రాజానగరం, న్యూస్‌టుడే: ఆ పక్షులను దేశాల సరిహద్దులు ఆపలేవు.. వేల మైళ్లు సునాయాసంగా ప్రయాణిస్తాయి. ఏడాదిలో ఆరు నెలలు వాటికి రాజానగరం మండలం పుణ్యక్షేత్రం గ్రామం విడిది. సైబీరియా వంటి సుదూర ప్రాంతాల నుంచి పక్షులు ఏటా జూన్, జులై మాసంలో ఈ గ్రామానికి వేలాదిగా వలస వచ్చి తిరిగి డిసెంబరు మాసంలో స్వస్థలాలకు చేరుకుంటాయి. దాదాపు 125 సంవత్సరాల నుంచి అవి ఈ ప్రాంతాలకు వస్తుండడం రివాజు అని స్థానికులు అంటున్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే వీలు ఉన్నప్పటికీ వన్యప్రాణి సంరక్షణ విభాగం ఈ పక్షులకు రక్షణ కల్పించలేకపోతోంది.

బహుదూరపు బాటసారులు..

నీలిరంగు జరీచీరకు వెండి అంచు వేసి అలంకరించినట్టు ఈ విదేశీ విహంగాలు ఆకాశంలో గుంపులుగా సాగిపోయే రమణీయ దృశ్యం ఈ ప్రాంతంలో కనువిందు చేస్తుంది. ఏటా మృగశిరకార్తె ప్రవేశించగానే ఈ పక్షులు వేల మైళ్లు ప్రయాణించి ఇక్కడికి వస్తాయి. నత్తగుల్ల కొంగలు, చిల్లుముక్కు కొంగలు అని ముద్దుగా పిలుచుకునే వీటి అసలు పేరు ఓపెన్ బిల్ బర్డ్స్. ఇవి వస్తూ వస్తూ వానమబ్బులను వెంట వేసుకుని వస్తాయని గ్రామస్థుల ప్రగాఢ విశ్వాసం. ఈ విదేశీ అతిథులు తమ ప్రాంతంలో విడిది చేయడం వల్ల శుభం కలుగుతుందని స్థానికులు భావిస్తారు. వీటిని ఎవరైనా వేటాడటం కనిపిస్తే బడితెపూజ చేస్తారు.

పుణ్యక్షేత్రంలో సందడి చేస్తున్న విదేశీ పక్షులు

ఇక్కడే జత కడతాయి..

ఇక్కడికి చేరుకున్న తరువాత ఆడ, మగ కొంగ జత కడతాయి. అప్పటి నుంచి ఆ జత విడవకుండా అన్యోన్యంగా ఉంటాయి. రెండూ కలిసి ఆకులు, కొమ్మలు తెచ్చి గ్రామంలోని ఊరచెరువు చుట్టూ ఉన్న తుమ్మ చెట్లపై గూళ్లు కట్టుకుంటాయి. వీటిలో మగ కొంగ ఆహారం కోసం వెళ్తుంది. ఆడ కొంగ గుడ్లు పొదిగిన తరువాత రెండూ కలిసి పిల్ల కొంగలకు ఆహారం తెస్తాయి. ఈ పక్షులు ఏ చెట్టు మీద వాలితే ఆ చెట్టు మళ్లీ పూత పూయదు, కాయలు కాయదు. అవి వేసే రెట్ట వేడిమికి ఇలా జరుగుతుందంటారు.

రక్షణకు అటవీశాఖ చర్యలు..

ఈ పక్షులు ఉండే తుమ్మ చెట్ల మీదుగా హైటెన్షన్ విద్యుత్తు తీగలు వెళ్లడంతో వాటిని తగిలి ప్రాణాలు కోల్పోతున్నాయి. వీటి రక్షణకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇవి ఉండే చెరువును అభివృద్ధి చేయడం, వచ్చే సందర్శకులు చెరువు చుట్టూ తిరిగేందుకు చిన్నపాటి రహదారి ఏర్పాటు, పైనుంచి వలస పక్షుల చిలిపి చేష్టలను వీక్షించేందుకుగాను వ్యూపాయింట్ తదితర ఏర్పాట్లు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దొడ్డిగంగాలమ్మకు ఆషాఢ సారె

మామిడికుదురు, న్యూస్‌టుడే: నగరంలో కొలువైన దొడ్డి గంగాలమ్మ వారికి ఆషాఢ మాస సారెను మహిళలు భక్తిప్రపత్తులతో ఆదివారం సమర్పించారు. పలు రకాల తినుబండారాలు, పండ్లను కలశాల్లో నింపి స్థానిక భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం నుంచి 216 జాతీయ రహదారి మీదుగా మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చారు. సమరసత సేవా సంఘంతో పాటు పలు భక్త సంఘాల నిర్వాహకులు పాల్గొన్నారు.

13న జిల్లా కుమ్మర శాలివాహన సంఘ సమావేశం

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట మండలం మాచవరంలో ఈ నెల 13న కోనసీమ జిల్లా కుమ్మరశాలివాహన సంఘ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు మానేపల్లి వీరబ్రహ్మం, దాలిపర్తి భీమేశ్వరరావు తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటలకు జరిగే సమావేశానికి మండల శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, సంఘ పెద్దలు, యువకులు తరలిరావాలని కోరారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ కుటుంబాలకు చేయూత

ఆలమూరు, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో భాగంగా హైదరాబాద్ వెళ్తూ గత నెల 26న కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆలమూరు ఎస్సై అశోక్, కానిస్టేబుల్ క్రిస్టన్ జీవన్ కుటుంబానికి 2009 బ్యాచ్ ఎస్సైస్ వెల్ఫేర్ సొసైటీ(తెలంగాణ, ఆంధ్ర) అండగా నిలిచింది. ఆదివారం ఆలమూరులోని జీవన్ కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కు అందజేశారు. నరసాపురంలోని అశోక్ కుటుంబాన్ని పరామర్శించి రూ.26 లక్షల చెక్కు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సొసైటీని 2020లో ఏర్పాటు చేశామని, బ్యాచ్‌లోని కుటుంబాలను ఆదుకునేందుకు ఇప్పటివరకు రూ.2 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలమూరులో కానిస్టేబుల్ జీవన్ కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న సొసైటీ సభ్యులు

ఏడాది పాలన.. గాడిలో పడిన రాష్ట్రం: ఎంపీ

రాయవరం, న్యూస్‌టుడే: గత వైకాపా పాలకుల ఆర్థిక వైఫల్యాలను అధిగమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గాడిలో పెట్టారని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. ఆదివారం రాయవరం మండలం సోమేశ్వరంలో అమలాపురం పార్లమెంట్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వైకుంఠ పరమహంస ఆధ్వర్యంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి ఎంపీ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందాయా? ఇందులో ఎలాంటి సమస్యలు ఉన్నాయనే అంశాలపై ఇంటింటా వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ శెట్టిబలిజపేట, నాగవంశీయులపేట, మాచవరంలో స్థానికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. తొలుతగా బాలత్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెదేపా నాయకులు శాకా శ్రీనివాస్, రావూరి సత్యనారాయణ, గుత్తుల శ్రీనివాస్, కడియాల వెంకటరమణ, కె.వెంకటేష్, అంబటిపల్లి సత్యనారాయణ, కనకాల సత్యనారాయణ, దుండగి స్యామా, శాకా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● రాయవరం మండలం మాచవరంలో ఎమ్మెల్యే వేగుళ్ల ఇంటింటా తిరిగి పథకాలపై అవగాహన కల్పించారు. వీవర్స్ కాలనీలో స్థానిక సమస్యలపై ఆరా తీశారు.

సోమేశ్వరంలో కరపత్రం అందిస్తున్న ఎంపీ హరీష్, చిత్రంలో ఎమ్మెల్యే వేగుళ్ల

ఆధ్యాత్మిక సంబరం

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తొలి ఏకాదశి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిత్య నృసింహ హోమంలో పాల్గొన్నారు. ఆలయ ఏసీ ప్రసాద్ ఏర్పాట్లు చేశారు.

వంతెన.. నిలిచేనా

ఇది అవిడి గ్రామ శివారు రేవడి ప్రాంతంలోని వంతెన. మూడు గ్రామాల రైతులు నిత్యం తమ వ్యవసాయ ఉత్పత్తులను దీని మీదుగానే తీసుకొస్తుంటారు. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ప్రస్తుతం పూర్తిగా శిథిల స్థితికి చేరింది. దీన్ని పునర్నిర్మించాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ర.భ.శాఖ అధికారి రాజేంద్రను వివరణ కోరగా నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, కొత్తపేట

ఉద్యమ స్ఫూర్తి.. పదవులకు వన్నె

● కోనసీమ కలల ప్రతిరూపం 'కళా' జీవితం ● నేడు 125వ జయంత్యుత్సవం

అంబాజీపేట, పి.గన్నవరం, న్యూస్‌టుడే: కోనసీమకు బయట ప్రపంచంతో సంబంధం కలిగించిన మహామనిషి కళా వెంకటరావు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించి, రైతు బాంధవుడిగా పేరు సంపాదించారు. కోనసీమ అభివృద్ధికి నిచ్చెనలు వేసిన సిద్ధాంతం, రావులపాలెం వంతెనల రూపశిల్పి ఆయన. అంబాజీపేట మండలం ముక్కామలలో 1900 సంవత్సరంలో జులై 7న కళా బ్రహ్మయ్య, వెంకటలక్ష్మి దంపతులకు ఆయన జన్మించారు.

చిన్ననాటి నుంచే రాజకీయాలు..

వెంకటరావు చిన్న నాటి నుంచే రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారు. అప్పట్లో తాలూకా బోర్డు ఎన్నికల్లో పోటీచేసిన తన మామ విజయానికి కృషి చేయడంతో కళాశాల నుంచి ఆయనను సస్పెండ్ చేశారు. అనంతరం మచిలీపట్నంలో నోబుల్ కళాశాలలో చేరినా చదువు సరిగా సాగలేదు. 1929లో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ఉద్యమంలో పాల్గొనడంతో ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించారు. అమలాపురంలో 1937లో నిర్వహించిన సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించి 6 నెలలు జైలు కెళ్లారు.

పదవులకు కళ...

జాతీయ కాంగ్రెస్ పార్టీలో ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర, ఏపీ రాష్ట్ర ప్రభుత్వాల్లో కళా అనేక పదవులు నిర్వహించారు. మద్రాస్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో అమలాపురం నియోజకవర్గం నుంచి పిఠాపురం యువరాజుతో పోటీపడి తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో రామస్వామి రెడ్డియార్ మంత్రివర్గంలో మంత్రిగా, నీలం సంజీవరెడ్డి ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా పనిచేశారు. సిద్ధాంతం, రావులపాలెం వంతెనల నిర్మాణాలకు 1959 డిసెంబరులో శంకుస్థాపన చేశారు. రావులపాలెం కళా వెంకటరావు సర్కిల్ వద్ద సోమవారం ఉదయం ఆయన విగ్రహానికి ప్రముఖులు వచ్చి నివాళి అర్పిస్తారు. సభ అనంతరం, అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అలనాటి ప్రముఖులతో వెంకటరావు

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

టైలరింగ్ వర్క్స్ ఇంటి వద్దనే పనిచేసే స్త్రీలు కావలెను. వారికి క్లాత్ ఇచ్చుటకు స్టాక్ పాయింట్స్ పెట్ పార్ట్‌నర్స్ కావలెను. ✆ 7093632399.

FINANCIAL SERVICES

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలలోపు ఫైనాన్స్ చేయబడును. అన్ని తరగతుల వారు బ్యాంకులో స్థిరాస్తిపై లోన్ తీసుకున్న వారికి Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ చేయబడును. ✆ 96665 47338.

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

విశాఖలో/ అనకాపల్లిలో NRI పామ్ ల్యాండ్స్ వేయుటకు ఇన్వెస్ట్ పార్టనర్స్ కావలెను. సంప్రదించండి. ✆ 73864 14017/ 70936 32399.

TO LET

COMMERCIAL

FOR OFFICES, Banks, Dental & Cosmetology convience place with parking in Danavaipeta, 1600 Sft., 1st Floor. Rjy, Cont: 94 90 811 769.

JOBS

Wanted Duty Doctors, O.T. Nurse & Technician. C.E.M. Hospital. ✆91002 75777 & Teachers, Cook, Aayas. Jaya High School, Dowleswaram, ✆ 63049 94974.

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్లు సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో. వ. + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ✆ 92814 52845, 82475 00574.

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.

ప్రభాకర నిధి, దేవిచౌక్, రాజమండ్రి నందు బిజినెస్ ప్రమోషన్ చేయుటకు అభ్యర్థులు కావలెను. ఆసక్తిగలవారు సంప్రదించండి. సెల్: 79952 33384.

రాజమండ్రిలో ప్రముఖ ఇంటీరియర్ షాప్‌లో హెల్పర్స్ కావలెను. 10 Members, జీతం: Start 13,000/- + ఇన్సెంటివ్స్ + ట్రావెల్ అలవెన్స్ ఇవ్వబడును. ✆ 99564 77177.

Managers కావలెను. ప్రముఖ Life Insurance నందు ఇంటి నుండి పనిచేయు సదావకాశము. Salary, Incentives, Promotions, Foreign Trips, 40 సం॥లు పైబడినవారు మాత్రమే. ✆ 98494 21277.

త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 85209 80099, 85208 74499.

వర్క్ ఫ్రం హోమ్ డేటా ఎంట్రీ: ప్రముఖ ఔట్‌సోర్సింగ్ సంస్థ నందు ఇంటి వద్ద ఉండి పార్ట్/ ఫుల్ టైం ప్రాజెక్ట్ వర్క్ చేయుటకు Laptop/Desktop, స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు కావలెను. ✆ 95534 29994.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-35 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	23,500
పాతకాయ: గండేరా	25,000
గటగట	26,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	19,000-22,000
కొత్త (పచ్చి) కాయ	19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	4,500
కిలో	300

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	102-00
రిటైల్ లైవ్	124-00
డ్రెస్డ్	180-00
స్కిన్‌లెస్	205-00

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

మామిడికుదురు, న్యూస్‌టుడే: కర్బలా పుణ్యభూమిలో సాహసోపేతంగా ధర్మపోరాటం చేసి అమరత్వాన్ని పొందిన హజ్రత్ ఇమామ్ హుస్సేన్, ఆయన 72 మంది పరివారానికి నివాళులర్పిస్తూ మామిడికుదురు మండలం నగరంలో ముస్లిం సోదరులు ఆదివారం మొహర్రం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని 36 పంజాల నుంచి తీసిన పీర్లు, గుమ్మటాలను ఊరేగించారు. మాతం చేసి రక్తాన్ని చిందించారు. పలువురు పీర్ల వద్ద సంప్రదాయబద్ధంగా మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక పెదపంజేషా వద్ద జరిగిన షహదత్ మజ్లిస్‌లో ప్రబోధకుడు మహ్మద్‌అలీ జాఫరీ మొహర్రం గురించి అందరికీ వివరించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ముస్లిం సోదరులతో గ్రామంలోని రెండోవీధి కిక్కిరిసింది.

పీర్లు, గుమ్మటాలను ఊరేగిస్తూ మాతం చేస్తున్న ముస్లిం సోదరులు

సొంత నిధులతో డొక్కా సీతమ్మ విగ్రహం

సర్పవరం జంక్షన్: ఆంధ్రుల అన్నపూర్ణగా పేరుపొందిన డొక్కా సీతమ్మ విగ్రహాన్ని కాకినాడ గ్రామీణం రమణయ్యపేటలోని ఏపీఎస్పీ జిల్లా పరిషత్ పాఠశాల తెలుగు స్కూల్ అసిస్టెంట్ ముత్యా వెంకటరామలక్ష్మి సొంత నిధులు సుమారు రూ.80 వేలు వెచ్చించి తయారుచేయించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు డొక్కా సీతమ్మ పేరిట మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోంది. డొక్కా సీతమ్మ దాతృత్వం గురించి విద్యార్థులు, భావితరాలు తెలుసుకుని ఆమె అడుగుజాడల్లో నడవాలనే ఉద్దేశంతో పాఠశాలలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఉపాధ్యాయిని రామలక్ష్మి తెలిపారు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో శిల్పి రాజకుమార్ వుడయార్ వద్ద తయారుచేయించిన ఈ విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే పంతం నానాజీ ఆవిష్కరించనున్నారు.

ఉపాధ్యాయిని వెంకటరామలక్ష్మి

బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు 13న

పిఠాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 13న రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు హాజరయ్యేవారు 2007 జనవరి ఒకటో తేదీ తరువాత పుట్టినవారై ఉండాలన్నారు. ఒరిజినల్ పుట్టిన తేదీ, ఆధార్ ధ్రువపత్రాలు తీసుకురావాలని కోరారు. ఎంపికైన జట్లు ఆగస్టు 14 నుంచి 17 వరకు పిఠాపురంలో జరిగే రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో తలపడతాయని పేర్కొన్నారు.

జిల్లా స్థాయి ఈత పోటీల ఎంపికలు

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలబాలికలకు జిల్లా స్థాయి ఈత పోటీలు స్థానిక డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో జరిగాయని సంఘ అధ్యక్షకార్యదర్శులు పి.సతీష్, ఐ.రాజు ఆదివారం తెలిపారు. ముఖ్యఅతిథులుగా డీఎస్‌డీవో శ్రీనివాస కుమార్, జాతీయ మారథాన్ స్విమ్మర్ గోలి శ్యామల హాజరై పోటీలు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లానుంచి 70 మంది హాజరయ్యారన్నారు. ఎంపికైన వారు ఈ నెల 19, 20వ తేదీల్లో విశాఖపట్నం, ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే 10వ సబ్ జూనియర్, జూనియర్ అంతర్ జిల్లా ఈత పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సంఘ ముఖ్యసలహాదారు మంగా వెంకట శివరామకృష్ణ, డీఎస్‌ఏ స్విమ్మింగ్ కోచ్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జాతీయ మారథాన్ స్విమ్మర్ శ్యామల

పల్లంలో పిచ్చికుక్క స్వైరవిహారం 18 మందిపై దాడి

కాట్రేనికోన, న్యూస్‌టుడే: పల్లం గ్రామంలో ఆదివారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి 18 మందిపై దాడి చేసింది. చివరకు ఆవులు, మేకలనూ విడిచిపెట్టలేదు. క్షతగాత్రులకు కాట్రేనికోన పీహెచ్‌సీలో డా.నీలిమ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఏఆర్‌వీ వాక్సిన్ వేసి మెరుగైన వైద్యం కోసం 14 మందిని అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రికి, మిగిలిన వారిని కాకినాడ పంపించారు. పిచ్చికుక్క మళ్లీ ఎప్పుడు వచ్చి ఎవరిపై దాడి చేస్తుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో కుక్కల సమస్య ఎక్కువగా ఉందని ప్రజలతో పాటు పశువులపై దాడులు చేస్తున్నాయని పంచాయతీ అధికారులకు తెలియజేసినా ఏమీ చేయలేమని చెబుతున్నారని వాపోతున్నారు.

అమలాపురం ఏరియా ఆసుపత్రిలో క్షతగాత్రులు

(c) eenadu

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

9న సార్వత్రిక సమ్మెకు పిలుపు

కొత్తపేట, న్యూస్‌టుడే: ఈ నెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘం పిలుపునిచ్చింది. ఆదివారం కొత్తపేట పంచాయతీ కార్యాలయం వద్ద అమలాపురం డివిజన్ స్థాయి కార్మికులు సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రాగుల రామన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు రేవు తిరుపతిరావు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాగాబత్తుల రవికుమార్, లంక రమేష్, కొమ్మర ఆనంద్, మర్రా రవీంద్ర కుమార్, నామాల భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

రాజోలు: రాజోలు మోటార్ మెకానిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. శివకోటి మునేశ్వర తల్లి ఆలయం వద్ద రేకపల్లి నాగు అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో అధ్యక్షునిగా బళ్ల శంకర్రావు, ప్రధాన కార్యదర్శిగా రేలంగి సతీష్, ఉపాధ్యక్షులుగా సుంకర రామారావు, ఒడుగుల రాజేష్, కార్యదర్శులుగా కుడుపూడి కృష్ణ, గుబ్బల రవికుమార్‌లు ఎన్నుకున్నారు. పలువురు మెకానిక్‌లు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయాభివృద్ధికి విరాళం

ఆలమూరు, న్యూస్‌టుడే: చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం ఆలమూరుకు చెందిన సత్యలక్ష్మీ రైస్‌మిల్ అధినేత వెల్లా గవరాజు అండ్ పార్టనర్స్ ఆదివారం రూ.1,00,116 విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో వెల్లా నెహ్రూ, సురేష్, రాము, గుప్తా, సూరిబాబు, చింతలూరు నీటిసంఘం అధ్యక్షుడు వైట్ల గంగరాజు, గన్ని సూరిబాబు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి..

ఆత్రేయపురం: వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్మితమవుతున్న వకులమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి యానాం ప్రాంతానికి చెందిన సజ్జ శ్రీనివాస్, సత్యవతి దంపతులు రూ.50,116, ఆత్రేయపురం మండలం వద్దిపర్రుకు చెందిన రాచపాటి గోవిందరావు, రత్నమాల దంపతులు రూ.30,001 విరాళాలు అందించారు. వీరికి ఈవో స్వామినాయుడు చిత్రపటాన్ని అందించారు.

జంతు వ్యాధులతో అప్రమత్తత అవసరం

ఆలమూరు, మలికిపురం: జంతువుల నుంచి సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలంతా అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డా.ఎల్.అనిత సూచించారు. ఆదివారం ఆలమూరు వెటర్నరీ ఆసుపత్రి ప్రాంగణంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం, ఉచిత టీకాల కార్యక్రమం నిర్వహించారు. రాబిస్ టీకాలు వేశారు. ● మలికిపురం, గుడిమెళ్లంక, లక్కవరం పశువైద్యశాలల ఆధ్వర్యంలో కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. పశువైద్యాధికారులు డి.శివకుమార్, పి.సూర్యనారాయణరావు, ఎస్.వెంకటేశ్వరరావు, స్వప్నిక, ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, సర్పంచి నల్లి విజయకుమారి, ప్రసాద్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తొలి ఏకాదశి.. భక్తుల సందడి

అంబాజీపేట, రాజోలు, మామిడికుదురు, అయినవిల్లి, ఆత్రేయపురం, పి.గన్నవరం, ఆలమూరు, రావులపాలెం పట్టణం: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆలయాలు కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మామిడికుదురులోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం నుంచి అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానం వరకు మహిళలు సామూహికంగా పాదయాత్ర చేశారు.

రావులపాలెంలో..

ర్యాలి జగన్మోహిని కేశవస్వామి

అంబాజీపేటలో భూసమేత వెంకటేశ్వరస్వామి

వాడపల్లిలో..

కాలినడకన అప్పనపల్లి వెళ్తున్న భక్తులు

చింతలూరులో..

వాడపల్లిలో గరుడ వాహన సేవ

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884
ఉ॥ 10 - మ॥ 1

కాలువలో పూడికతీత

రావులపాలెం గ్రామీణం: పొడగట్లపల్లి శివారు ముర్రావుపేట డ్రెయిన్లో పూడిక పేరుకుపోవడంతో మురుగునీరు నిలిచిపోయి దోమలు విజృంభిస్తున్నాయి. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి సుధాకర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సిబ్బందిని పంపి పనులు చేయించారు.

తుప్పల తొలగింపు

మలికిపురం: మలికిపురం పంచాయతీ కార్యాలయం ఎదుట కాలువ గట్టుపై తుప్పలను తొలగించి శుభ్రం చేశారు. ఇక్కడ అపరిశుభ్రంగా ఉన్న సమస్యను సర్పంచి గెడ్డం రాజ్యలక్ష్మి, కార్యదర్శి తాడి ఏసు దృష్టికి తీసుకురాగా స్పందించి వాటిని సిబ్బందితో తీయించారు.

మండల తెదేపా అధ్యక్షునికి సత్కారం

అంబాజీపేట: అంబాజీపేట మండల తెదేపా అధ్యక్షుడిగా ఎన్నికైన గుడాల ఫణిని ఆదివారం పూర్వ విద్యార్థులు సత్కరించారు. అంబాజీపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95లో పదోతరగతి చదివిన వారంతా గంగలకుర్రు అగ్రహారంలో కలుసుకుని ఫణి దంపతులను ఘనంగా సన్మానించారు.

వారధి.. దాటే దారేది?

– న్యూస్‌టుడే, అంబాజీపేట, అయినవిల్లి, రాజోలు

రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాల్లో వంతెనలు శిథిల స్థితికి చేరాయి. వీటిపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికీ పరిస్థితుల్లో ప్రయాణం సాగించాల్సి వస్తోంది. ప్రస్తుత వర్షాకాలంలో మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. అధికారులు వీటిపై దృష్టిపెట్టి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి

● అయినవిల్లి విలస చానల్‌పై వంతెన నిర్మించి ఆరు దశాబ్దాలు దాటింది. ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోయాయి. స్లాబు ఊడుతుండటంతో ఇనుప చువ్వలు బయటపడ్డాయి. ఏ క్షణంలోనైనా కూలిపోయే విధంగా మారింది. దీని మీదుగా నేదునూరు, అమలాపురం, ముక్కామల వైపు రాకపోకలకు ఎంతో అనువుగా ఉంటుంది. ఇక్కడ పండే వ్యవసాయ ఉత్పత్తులు బయటి ప్రాంతాలకు తీసుకువెళ్లే వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది.

● రాజోలు మండలం చింతలపల్లి ప్రధాన రహదారిపై వంతెన రక్షణగోడ కూలింది. రాత్రి సమయంలో వాహనదారులు నేరుగా కాలువలోకి దూసుకెళుతూ గాయాల పాలవుతున్నారు.

● సోంపల్లిలో పంటకాలువ రెయిలింగ్ కూలింది. నిత్యం వేలాది వాహనాలు దీనిపై రాకపోకలు సాగిస్తుంటాయి.

● మలికిపల్లి కాడలిలో మురుగు కాలువపై వంతెన రెయిలింగ్ దెబ్బతింది. ఇక్కడ వాహనదారులు జంకుతూ వెళ్తున్నారు.

● వేగివారిపాలెం వెళ్లే ప్రధాన రహదారిపై కల్వర్టు రక్షణగోడ కూలి ప్రమాదకరంగా ఉంది.

● తాటిపాక కాలువ నుంచి నగరం వెళ్లే జాతీయ రహదారిపై వంతెన శిథిల స్థితికి చేరింది. నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉంటుంది.

● కొండుకుదురు, సిరిపల్లి గ్రామాల్లోను, అంబాజీపేట మండలంలోని సందడపూడి, వ్యాఘ్రేశ్వరం వంతెనలు పాడయ్యాయి.

వ్యాఘ్రేశ్వరంలో ఇలా..

అయినవిల్లిలో ప్రమాదకరంగా..

ప్రతిపాదనలు పంపాం

ప్రధాన పంటకాలువలపై శిథిల వంతెనలకు సంబంధించి గతంలో ఉన్నత ప్రతిపాదనలు తయారు చేసి పంపాం. నిధులు విడుదల కాలేదు. తిరిగి వీటికోసం ప్రతిపాదనలు తయారు చేసి పంపుతాం. నిధుల లభ్యతను బట్టి మరమ్మతులు చేపడతాం. కొత్త వంతెనల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

- రమేష్, ర.భ.శాఖ జేఈ, అమలాపురం

శ్యామాప్రసాద్ సేవలు మరువలేం

కొత్తపేటలో నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

కొత్తపేట, రాజోలు, న్యూస్‌టుడే: శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేమని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం అన్నారు. ఆదివారం ఆయన జయంతిని పురస్కరించుకుని కొత్తపేటలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆంజనేయులు, గొలకోటి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. ● శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు రాజోలులో భాజపా ఆధ్వర్యంలో నిర్వహించారు. వడ్లమూడి ప్రభాకర్‌రావు, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, నార్కెడుమిల్లి బాలకృష్ణ, కొమ్ముల శ్రీను, పితాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజ్యసభ సభ్యుడికి సత్కారం

ఆలమూరు: జొన్నాడ బీసీ సామాజిక భవనం వద్ద బీసీ సంఘం, కూటమి నాయకులు ఆదివారం రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణను సత్కరించారు. ముందుగా ఆయన మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి, శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొత్తపేట భాజపా కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబుగౌడ్, రాష్ట్ర గౌడ సంఘం కన్వీనర్ మట్టా వీరబాబు గౌడ్, చింతలూరు గౌడ సంఘం నాయకులు, జొన్నాడ తెదేపా నాయకులు తాడి శ్రీనివాసరెడ్డి, గోదావర్తి బాబీ తదితరులు సత్యనారాయణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడపాటి కృష్ణారెడ్డి, వాకా గోవిందరావు, వీరి గోపాలకృష్ణ, సందీప్, కట్ట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాకా సత్యనారాయణతో నాయకులు

యువతకు ఏకలవ్యుడు ఆదర్శం

అంబాజీపేట, పి.గన్నవరం, న్యూస్‌టుడే: ఏకలవ్యుడిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఆయన జయంతి సందర్భంగా అంబాజీపేట ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భారతి వాసు, మానుపాటి గోవింద్, గాడా గణేష్, బండారు సత్యనారాయణ, గాడా పోను పాల్గొన్నారు. ● పి.గన్నవరం మండల ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పి.గన్నవరం అక్విడక్టు వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బండారు మానేశ్వరరావు, మానుపాటి శివయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంబాజీపేట: కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు

పుష్కరాల రేవు.. అపరిశుభ్రతకు తావు

ఆత్రేయపురం అత్రి మహాముని పుష్కరాల రేవు చెత్తాచెదారం, తుప్పలతో అపరిశుభ్రంగా తయారైంది. గ్రామ ప్రజలు ఇక్కడి గోదావరిలో నిత్యం పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. ప్రస్తుతం వరద ఈ రేవుకు చేరువవుతోంది. ఈ విషయాన్ని ఈవోపీఆర్డీ చంద్రశేఖర్ వద్ద ప్రస్తావించగా, శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. - న్యూస్‌టుడే, ఆత్రేయపురం

గుర్రపుడెక్క.. తీయక తంటా

లక్కవరంలోని చింతలపల్లి పంటకాలువలో గుర్రపుడెక్క విస్తారంగా పెరిగింది. ఈ కాలువ నుంచి గూడపల్లి-1, 2, బట్టేలంక-1, 2, కత్తిమండ-1, 2 బ్రాంచ్ కాలువల ద్వారా వరిచేలకు సక్రమంగా సాగునీరందని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను జలవనరుల శాఖ ఏఈ రమేశ్‌బాబు దృష్టికి తీసుకువెళ్లగా.. గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. - న్యూస్‌టుడే, మలికిపురం

కాలువ పొంగి.. ఇళ్లలోకి చేరి

రాజోలులోని మట్టపర్రి కాలువ పొంగి సమీపంలోని ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో ఆయా కుటుంబాలు తీవ్ర అవస్థలు పడుతున్నాయి. గత కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి ఉందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జలవనరులశాఖ ఏఈ రమేష్ బాబును వివరణ కోరగా శివారు ప్రాంతాల్లోని పంటలకు నీరందించడం కోసం ఎక్కువగా విడుదల చేయడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. పరిశీలించి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. - న్యూస్‌టుడే, రాజోలు

చివరి దశలో నిలిచి.. పనులు మరిచి

ఈదరాడలో రూ.21 లక్షలతో నిర్మించిన రైతుసేవా కేంద్రం పనులు చివరి దశలో నిలిచిపోవడంతో ఏళ్లుగా నిరుపయోగంగా ఉంది. దీనికి విద్యుత్తు సరఫరా ఉంటే చాలు అందులో కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని సంబంధిత వ్యవసాయశాఖ సిబ్బంది చెబుతున్నా ఆ దిశగా చర్యలు కానరావడం లేదు. మెట్లు, వరండా అంతా పిచ్చి మొక్కలు మొలిచి దుర్భరంగా మారింది. పంచాయతీ కార్యదర్శి వీవీ ఆదికి రాజులు వివరణ కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడి కార్యాచరణ జరిగేలా చూస్తామన్నారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

మురుగునీరు తాగేదెలా?

పొదలాడలో తాగునీటి కొళాయి నుంచి మురుగునీరు వస్తోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలుషితమైన నీరు తాగేదెలా అని ప్రశ్నిస్తున్నారు. గత పది రోజులుగా ఇదే పరిస్థితి అని వాపోతున్నారు. రెండు రోజులకు ఒకసారి ఇచ్చే తాగునీరు సక్రమంగా ఇవ్వాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి బొంతు శ్రీనివాస్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, రాజోలు

ఆర్థిక సాయం అందజేత

సఖినేటిపల్లి: అంతర్వేది పల్లిపాలేనికి చెందిన కామాడి దుర్గాప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు చిన్నపిల్లలు, తల్లి ఉన్నారు. బాధిత కుటుంబాన్ని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాస్ ఆదివారం పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆరు నెలలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేస్తానని చెప్పారు. సర్పంచి ఒడుగు శ్రీను పాల్గొన్నారు.

మలికిపురం: అనారోగ్యంతో బాధపడుతున్న బోసుకొండ పాండురంగారావు(అడవిపాలెం), రాచపల్లి దుర్గాప్రసాద్ వైద్యచికిత్స నిమిత్తం వసుధ ఫౌండేషన్(హైదరాబాద్) ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం సమకూర్చింది. మలికిపురంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాలను లబ్ధిదారులకు సంస్థ ప్రతినిధులు జంపన బుజ్జిరాజు, బోణం రాజు చేతుల మీదుగా అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి తీవ్ర గాయాలు

అంబాజీపేట: గంగలకుర్రుఅగ్రహారం శివారు పెట్రోలుబంకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబాజీపేట శివారు కొర్లపాటివారిపాలేనికి చెందిన మిండుగుదటి పవిత్రధనలక్ష్మి, ఆమె సోదరి సాయిచంద్రలేఖ, సోదరుడు సిద్ధివినయ్‌లు ఈ నెల 5న ద్విచక్రవాహనంపై అమలాపురం వెళుతున్నారు. ఇదే సమయంలో స్థానిక పేర్రాయిపాలెం రహదారి నుంచి ఓ వ్యక్తి ద్విచక్రవాహనంతో వీరిని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన పవిత్రధనలక్ష్మిని చికిత్స నిమిత్తం తొలుత అమలాపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, అనంతరం కాకినాడ తరలించారు. సిద్ధివినయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు ఆదివారం చెప్పారు.

జూదరుల అరెస్టు

ఆలమూరు: రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ ఆదివారం తన సిబ్బందితో జరిపిన దాడిలో జొన్నాడలో ముగ్గురిని, సంధిపూడిలో ఏడుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.13,900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆలమూరు పోలీసులు తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయుడు

మామిడికుదురు, అయినవిల్లి, అంబాజీపేట, పి.గన్నవరం, కొత్తపేట, న్యూస్‌టుడే: బాబూ జగ్జీవన్ రామ్ అందరి హృదయాల్లో చిరస్మరణీయుడిగా నిలిచారని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా నాయకులు తెలిపారు.

పి.గన్నవరంలో విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

మామిడికుదురులో..

ఆయన వర్ధంతి సందర్భంగా మామిడికుదురు 216 జాతీయ రహదారి కూడలిలోని విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి నూటుకుర్తి సత్యనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు జాలెం శ్రీనివాస రాజా, నాయకులు ఉండ్రాజవరపు శివ, నూటుకుర్తి సత్యనారాయణ, చుట్టుగుల్ల కిషోర్, ముస్కూడి నరసింహస్వామి, మంద గాంధీ, శెట్టిం రమేష్, యార్లగడ్డ రవి, ఆకుమర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● అయినవిల్లిలో జరిగిన కార్యక్రమంలో వస్కా శ్యామ్‌సుందర్, మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, నేదునూరి నాని తదితరులు పాల్గొన్నారు.

● అంబాజీపేట ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న విగ్రహానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నివాళులర్పించారు. దండోరా నాయకులు ఉందుర్తి నాగబాబు, నేదునూరి ఏసు, దిగుమర్తి చిట్టిబాబు, తొత్తరమూడి గోవిందు, కూటమి నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొర్లపాటి గోపి, గణపతి వీరరాఘవులు, పేరాబత్తుల పెద్ద సుబ్బరాజు, అరిగెల సూరిబాబు, మహిపాల తాతాజీ పాల్గొన్నారు.

● పి.గన్నవరం అక్విడక్టు వద్ద ఉన్న విగ్రహానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి వాసంశెట్టి కుమార్, యల్లమెల్లి చిట్టిబాబు, పాలూరి ఫణి తదితరులు పాల్గొన్నారు.

● కొత్తపేట రెడ్డప్పవారిపేట వద్ద గల విగ్రహానికి తెదేపా నాయకుడు కంఠంశెట్టి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

హామీలన్నీ నెరవేరుస్తాం

సఖినేటిపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి సంక్షేమ ప్రభుత్వంగా చాటి చెబుతామని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం, మోరి గ్రామాల్లో ఆదివారం చేపట్టారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ముప్పర్తి నాని, తాడి సత్యనారాయణ, అబ్దుల్ రహీం, ఎనుముల రమణ, శ్రీహరిరాజు, చాగంటి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కేశవదాసుపాలెంలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల

రోటరీ సేవలు ప్రశంసనీయం

ప్రమాణ స్వీకారం చేసిన నూతన కార్యవర్గం

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు రోటరీక్లబ్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని క్లబ్ ఇనస్టలేషన్ అధికారి పి.డి.జి. ఎల్.సత్యనారాయణ(టిక్కు) అన్నారు. ఆదివారం క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోటరీ చేస్తున్న సేవలకు సమాజంలోని అందరూ చేయూతనివ్వాలన్నారు. కొత్త కార్యవర్గం మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా సోమిశెట్టి ఆంజనేయులు, కార్యదర్శిగా నామన షణ్ముఖేశ్వరరావు, కోశాధికారిగా చిట్నీడి లక్ష్మణరావు, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. గౌరవ అతిథి గన్నాబత్తుల సత్యవతి, కాసు శ్రీనివాస్, కోదాటి సోమరాజు, దార్ల పెదబాబు, బసవా వరహాలు, ఏడిద కవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సైకిళ్లు.. పంపిణీకి మీనమేషాలు

న్యూస్‌టుడే, పి.గన్నవరం

పి.గన్నవరం నియోజకవర్గంలోని విభిన్న ప్రతిభావంతులకు పంపిణీ చేసేందుకు పి.గన్నవరం మండలానికి నెల రోజుల క్రితం సాధారణ, బ్యాటరీతో నడిచే మూడు చక్రాల సైకిళ్లు, వివిధ పరికరాలు వచ్చాయి. భారత ప్రభుత్వానికి చెందిన లింబ్స్ కార్పొరేషన్ ద్వారా వీటిని కేటాయించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఖాళీ లేకపోడంతో సమావేశ మందిరంలో, ఆరుబయట ఉంచారు. ఏదైనా సమావేశం జరిగినప్పుడు వాటిని బయట పెట్టాల్సి వస్తోంది. ఇప్పటికైనా వీటిని లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆరుబయట ఉంచిన మూడుచక్రాల సైకిళ్లు

చర్యలు చేపడతాం

వీటిని త్వరలో లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని పూర్వ తూర్పుగోదావరి జిల్లా విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు, సీనియర్ సిటిజన్ల ఎ.డి. శ్రీనివాస్ తెలిపారు.

నాగబాబుకు పౌర సన్మానం

పి.గన్నవరం: రాష్ట్ర అటవీశాఖ ఐటీ ప్రాజెక్ట్స్ ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన పెన్నమరెడ్డి నాగేశ్వరరావు(నాగబాబు)కు ఆయన స్వగ్రామం ఊడుమూడిలో ఆదివారం పౌరసన్మానం జరిగింది. నగరం ఎ.ఎం.సి. ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, సర్పంచి నూకపెయ్యి ప్రసన్నకుమార్, కూటమి నాయకులు గంధం పల్లంరాజు, కల్వకొలను తాతాజీ, గణపతి వీర్రాఘవులు, గుత్తుల చంటి, రాణి శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న కూటమి నాయకులు

భూములు కౌలుకు టెండర్-కం-బహిరంగ వేలం ప్రకటన

దేవదాయ ధర్మదాయ శాఖ

తీపర్రు (గ్రా), పెరవలి (మం), తూ.గో.జిల్లా

దేవదాయ ధర్మదాయ శాఖ, తూర్పుగోదావరి జిల్లా, పెరవలి మండలం, తీపర్రు గ్రామంలో గల శ్రీమతి ఈదుపుగంటి రత్తమ్మ సత్రం యొక్క సంపూర్ణ హక్కుభుక్తములో గల డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రావులపాలెం మండలం, పొడగట్లపల్లి గ్రామం నందు గల ఈ క్రింద ఉదహరించిన వ్యవసాయ భూమి 2025-2026 నుండి 2027-2028 సంవత్సరం వరకు అనగా మూడు సంవత్సరములు కౌలుహక్కు పొందుటకు గాను ది.18-07-2025 శుక్రవారం ఉదయం 10.00 గంటలకు పొడగట్లపల్లి గ్రామం నందు శ్రీ ఉప్పలపాటి జానకి అమ్మ అన్నదాన సత్రం వద్ద దేవదాయ శాఖ అధికారుల సమక్షమున సదరు సత్రం కార్యనిర్వహణాధికారి వారిచే టెండర్-కం-బహిరంగ వేలం నిర్వహించబడును. ఆసక్తిగలవారు సదరు టెండర్-కం-బహిరంగ వేలంలో పాల్గొనవలసినదిగా కోరడమైనది.

కౌలు భూముల షెడ్యూలు

వ. నెం.	భూమియున్న గ్రామం	రి.స. నెంబరు	భూమి విస్తీర్ణం య.సెంట్లు	పాట ధరావతు
1	డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం, పొడగట్లపల్లి గ్రామం	190/7	1.36	5,000/-

ముఖ్య షరతులు: 1. ప్రతి పాటదారుడు పాటకు ముందు పాట ధరావతు రూ.5,000/-లు చెల్లించి పాటలో పాల్గొనవలెను. 2. సత్రమునకు ఏవిధమైన బకాయి ఉన్నవారు గాని, సత్రముతో ఇతర ఎట్టి లావాదేవీలు ఉన్నవారు గాని పాటలో పాల్గొనరాదు. 3. హెచ్చు పాటదారుడు ఒక సంవత్సరం పాట సొమ్మును అడ్వాన్సుగా చెల్లించవలెను. 4. ఇతర పాట షరతులు పాటకు ముందు చదివి వినిపించబడును.

ఇతర వివరములకు సత్రం కార్యాలయంలో సంప్రదించవలెను.

తీపర్రు,
ది.06-07-2025.

కార్యనిర్వహణాధికారి
సెల్: 98484 22289

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

వక్ఫ్‌బోర్డు నుంచి నిధుల విడుదల

ముస్లిం పెద్దలకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

కాట్రేనికోన: రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడు హాజీ ముక్రం హుస్సేన్ విన్నపం మేరకు జిల్లాలోని 60 ఆషుర్ ఖానాలు(పీర్ల పంజాలు) నిర్మాణానికి రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ రూ.3 లక్షలు కేటాయించారని ముస్లిం సంఘ నాయకులు తెలిపారు. ఆదివారం చెయ్యేరులో నగదు అందజేశారు.

అల్లవరం:. ఎమ్మెల్యే ఆనందరావు ముస్లిం పెద్దలకు రూ. 5వేలు చొప్పున అందజేశారు. వక్ఫ్ బోర్డు సభ్యుడు ముక్రం హుస్సేన్, బషీర్, లియాకత్ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, బీఏఎంఎస్, వెటర్నరీ కోర్సుల్లో ప్రవేశానికి నీట్ అర్హత సాధించిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సెన్‌టాక్ కోఆర్డినేటర్ కోరారు. ప్రభుత్వ కోటా, మైనారిటీ తెలుగు, క్రిస్టియన్ విభాగాలు, జాతీయ స్థాయిలో యాజమాన్య కోటా, ఎన్నారై కోటా ద్వారా ప్రవేశానికి ఈ నెల 14లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది జనవరి ఒకటి తర్వాత తీసుకున్న పుదుచ్చేరి స్థానిక నివాస ధ్రువీకరణ పత్రాల్ని స్థానికులు సమర్పించాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అమలాపురం పట్టణం: 79939 35935
గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718
ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044
ఉప్పలగుప్తం: 91548 46716

సమస్య: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది.
-కె.రామలింగేశ్వరరావు, స్థానికులు

సమస్య: నగర పంచాయతీ పరిధిలోని పల్లిపాలెం డ్రెయిన్‌లో పూడిక తీయడం లేదు. మురుగు నిలిచిపోయి దోమలు విజృంభిస్తున్నాయి. -బి.నాగేశ్వరరావు, స్థానికుడు

పరిష్కారం: నగర పంచాయతీలోని మార్కెట్ ప్రాంతం, పల్లిపాలెంలో పారిశుద్ధ్య సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో వాటిని తొలగించారు.

-న్యూస్‌టుడే, ముమ్మిడివరం

సమస్య: అమలాపురం-చల్లపల్లి పంటకాలువలో గోపవరం వద్ద చెట్లు కూలిపోయి సాగునీటి ప్రవాహ వేగానికి ఆటంకంగా మారాయి. వాటిని తొలగించాలి.

పరిష్కారం: సమస్యను ఇరిగేషన్ జేఈ శివ రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందితో వాటిని తొలగించారు. - న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

మత్తులోనే రయ్.. రయ్..!

✦ పెరుగుతున్న మద్యం తాగి వాహనాలు నడిపేవారి సంఖ్య

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

రహదారి ప్రమాదాల నియంత్రణకు పోలీసులు కొన్నాళ్లుగా తనిఖీలు విస్తృతంగా చేపడుతున్నారు. ఈ సందర్భంగా మద్యం తాగి పట్టుబడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. బ్రీత్‌ఎనలైజర్ పరికరం ద్వారా మద్యం తాగిన వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో ఈ తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు. దీంతోపాటు ఐ.పోలవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో తరచూ ఈ తనిఖీలు జరుగుతున్నాయి.

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో కేసులు ఇలా..

పోలీస్‌స్టేషన్	2024	2025 (జూన్ వరకు)
అమలాపురం పట్టణం	130	93
అల్లవరం	20	24
అమలాపురం తాలూకా	28	36
ఉప్పలగుప్తం	13	27
ముమ్మిడివరం	83	224
ఐ.పోలవరం	136	320
కాట్రేనికోన	17	108

తున్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీలు, ఆటోలనూ తనిఖీ చేస్తున్నారు. మద్యం మత్తులో చిక్కితే కేసులు నమోదు చేయడంతో పాటు కోర్టులో పరుస్తున్నారు. గతేడాది ఆగస్టు వరకు రూ.5వేలలోపే ఉండే జరిమానాలు అక్టోబరు నుంచి గణనీయంగా పెరిగాయి. ప్రస్తుతం మద్యం తాగిన స్థాయిని బట్టి జరిమానాలు విధించడంతోపాటు జైలు శిక్ష సైతం విధిస్తున్నారు.

ఉప్పలగుప్తం మండలంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

అమలాపురం సబ్ డివిజన్‌లో..

అమలాపురం పట్టణం, గ్రామీణం, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నారు. అమలాపురం శివారు ప్రాంతాల్లో బృందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీ చేపడ

రెండేళ్లలో 1259 కేసులు

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలోని ఏడు పోలీస్‌స్టేషన్ల వారీగా డ్రంక్‌అండ్‌డ్రైవ్ కేసులను పరిశీలిస్తే.. రెండేళ్ల కాలంలో 1259 నమోదు చేశారు. తాగిన మద్యం స్థాయి బట్టి జరిమానాలు విధించడంతోపాటు జైలు శిక్ష పడుతోంది. ఐ.పోలవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో గతేడాది అత్యధికంగా 136 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది జూన్ నాటికి అదే పోలీస్‌స్టేషన్‌లో ఆ సంఖ్య 320కు పెరిగింది. మిగతా పోలీస్‌స్టేషన్ల పరిధిలోనూ ఇదే పరిస్థితి ఉంది.

కఠిన చర్యలు తీసుకుంటున్నాం

మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటున్నాం. తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తులకు రూ.10 వేల వరకు జరిమానా విధిస్తున్నాం. జైలు శిక్ష సైతం పడుతుంది. ఈ విషయాలను వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. రహదారి ప్రమాదాల నివారణకు ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. అమలాపురం సబ్‌డివిజన్ పరిధిలో గత రెండేళ్లలో 1259 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశాం.

-టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, డీఎస్పీ, అమలాపురం

యానాం వద్ద గౌతమి గోదావరిలో వరద ప్రవాహం

ఎరుపెక్కిన 'గౌతమి'

యానాం: మహారాష్ట్ర, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరికి నీటి ప్రవాహం పెరిగింది. ఆదివారం యానాం వద్ద గౌతమి గోదావరి నీరు ఎరుపెక్కింది. జీఎంసీ బాలయోగి వారధి వద్ద గోదావరి అందాల్ని చూసేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. యానాం పరిసర ప్రాంతాల మత్స్యకారులు పులస చేపల రాకకోసం ఎదురు చూస్తున్నారు.

రాజీవ్‌బీచ్‌లో సందర్శకుల సందడి

యానాం: యానాం పట్టణంలోని ప్రధాన పర్యాటక ప్రదేశం రాజీవ్ రివర్‌బీచ్‌లో ఆదివారం సందర్శకులు సందడి చేశారు. బోటింగ్ చేసేందుకు సందర్శకులు ఆసక్తిచూపారు. సీగల్స్ బోట్ హౌస్ వద్ద రద్దీ కనిపించింది. జీసస్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మూత్రశాల తలుపులు తీయకపోవడంతో పర్యాటకులు అసౌకర్యానికి గురయ్యారు.

సైకిళ్లపై తిరుపతి పయనం

తాళ్లరేవు: పాత కోరింగకు చెందిన తెదేపా నాయకులు కోడూరి ఆదినారాయణ చౌదరి, జవ్వాది తాతాజీ, చంద్రాల బుజ్జి, చల్లా బాలాజీ, దండు సత్యనారాయణరాజు, రాజు ఆదివారం ఉదయం తాళ్లరేవు నుంచి తిరుపతి ద్విచక్రవాహనాలపై బయలుదేరారు. తెదేపా అధికారంలోకి వస్తే తిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటామని మొక్కుకోవడంతో ఈ యాత్ర చేపడుతున్నట్లు వారు తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం కొత్తలంకలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. త్వరలో అన్నదాత-సుఖీభవ పథకంలో రైతులకు డబ్బులు అందుతాయన్నారు. ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. కొత్తలంకలోని రామ సత్యనారాయణ స్వామి కిసాన్ గ్రూపు సభ్యులకు 80 శాతం రాయితీపై వ్యవసాయశాఖ మంజూరు చేసిన డ్రోన్‌ను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, గోల కోటి దొరబాబు, అర్ధాని శ్రీనివాసరావు, తోలేటి రాంబాబు, వంగా బాబులు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

డ్రోన్ పనిచేసే విధానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

హామీలు అమలు చేస్తున్నాం..

అల్లవరం: రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. ఆదివారం అల్లవరం మండలం ఎస్.పల్లిపాలెంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెట్ల రమణబాబు, దెందుకూరి సత్తిబాబు రాజు, యార్లగడ్డ కామేశ్వరరావు, కుడి వెంకటేశ్వరరావు, గోపీ రాజు, శ్రీనివాస్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం గ్రామీణం: పేద ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. నడిపూడిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. త్వరలో అమలాపురం నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపిస్తానని భరోసా ఇచ్చారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు అధికారి జయ వెంకటలక్ష్మి, బాబ్జీ, చొల్లంగి సాయిబాబా, మట్ట మహాలక్ష్మీప్రభాకరరావు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం సరిపల్లిలో పర్యటించారు.

కూటమితోనే సంక్షేమం

కాట్రేనికోన: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధితో పాటు సంక్షేమం సాధ్యపడుతుందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి నాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం కాట్రేనికోనలో 76వ బూత్ పరిధిలో నాయకులు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందించారు. రాజేశ్వరరావు, అప్పాజి, బుజ్జి, సత్తాల ప్రసాద్, జంగా శ్రీను నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవం విజయవంతానికి పిలుపు

అమలాపురం పట్టణం: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని, మందకృష్ణ మాదిగ పుట్టిన రోజును విజయవంతం చేయాలని జిల్లా సమన్వయకర్త జేబీ మధు మాదిగ పిలుపునిచ్చారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గంపల సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురంలో జిల్లా ఎంఆర్‌పీఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి మాట్లాడుతూ స్థానిక గడియార స్తంభం కూడలిలో సోమవారం కార్యక్రమం జరుగుతుందని, అధిక సంఖ్యలో మాదిగ సామాజికవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. నేదునూరి నతానీయులు, లూటుకుర్తి చిన్నా, కొడమంచలికృష్ణ, లక్ష్మణరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశరావు సేవలు ప్రశంసనీయం

యానాం: యానాం నవోదయ విద్యాలయ అభివృద్ధికి టీవీఎస్ ప్రకాశరావు ఎంతో కృషి చేశారని పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కొనియాడారు. షిల్లాంగ్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ హోదాలో గత నెలలో ఉద్యోగ విరమణ చేసిన టీవీఎస్ ప్రకాశరావు, సరస్వతి దంపతులు యానాం వచ్చిన సందర్భంగా నవోదయలో సన్మానించారు. ప్రిన్సిపల్ శరత్‌చంద్రరెడ్డి, ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రకాశరావు దంపతుల్ని సత్కరిస్తున్న మల్లాడి

లక్ష్మణరావు సేవలు మరువలేనివి

యానాం: యానాం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా యర్రా లక్ష్మణరావు చేసిన సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు. పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక యర్రాగార్డెన్స్‌లో లక్ష్మణరావు సంస్మరణ సభ నిర్వహించారు. యానాం ఓల్డేజ్‌హోం అధ్యక్షుడిగా, జనతా పార్టీ కన్వీనర్‌గా లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఆయన అందించిన సేవలను వక్తలు వివరించారు. యర్రా సుబ్బారాయుడు, జగన్నాథరావు, శామ్యూల్, శివగణేష్, ముకుందకుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు

కాట్రేనికోనలో పండువారిచెరువు నుంచి వెంకమ్మ చెరువుకు వెళ్లే రోడ్డులో విద్యుత్తుతీగలు చేతికందే ఎత్తులో ఉన్నాయి. ఇవి తగిలి ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, కాట్రేనికోన

వ్యర్థాలతో నిండిన రహదారి

అమలాపురం ఎస్‌బీఐ కాలనీ పక్క రోడ్డు నుంచి నారాయణ పేటకు వెళ్లే రోడ్డు వ్యర్థాలు, పిచ్చి మొక్కలతో నిండి ఉంది. ఈ రోడ్డుకు ఒక వైపు పేరూరు పంచాయతీ, మరో పక్క అమలాపురం పురపాలక సంఘం పరిధిలో ఉన్నాయి. అటు పంచాయతీ, ఇటు పురపాలక సంఘ సిబ్బందిలో ఒక్కరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

శిథిల భవనంలో విధులు

ఉప్పలగుప్తం మండలం విలస విల్లిలోని రైతు సేవా కేంద్రాన్ని శిథిల భవనంలో నిర్వహిస్తున్నారు. స్లాబు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. అందులోనే సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నాయి. అక్కడే కార్యాలయ సామగ్రి, ఎరువులు, పురుగు మందులు భద్రపరుస్తున్నారు. వర్షాలకు స్లాబు నుంచి నీరులీకై గదుల్లో చేరుతోంది. నూతన భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తేవాలని స్థానిక రైతులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

పునాదుల్లోనే నిలిచిన నిర్మాణం

ముమ్మిడివరం మండలం అన్నంపల్లిలో వైకాపా ప్రభుత్వ హయాంలో రూ.40 లక్షలతో హెల్త్ సెంటర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పునాది స్థాయి వరకు పనులు చేసి వదిలేశారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఇలాంటి నిర్మాణాలను అప్పట్లో ఆపేశారు. ఇనుప ఊచలు తుప్పు పట్టి పాడైపోతున్నాయి.

– న్యూస్‌టుడే, ముమ్మిడివరం

కేకు కోస్తున్న అయ్యాజీవేమ, సత్యనారాయణ

ఏకలవ్యుడి జయంతి వేడుకలు

అమలాపురం పట్టణం: విలువిద్యలో ఏకలవ్యుడు గొప్పవాడని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమ కొనియాడారు. ఆదివారం అమలాపురంలో భాజపా జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గసభ్యుడు నల్లా పవన్‌కుమార్ ఇంటి వద్ద మన్నే రామదాసు ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతి నిర్వహించారు. అయ్యాజీవేమ, జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ కేకు కోశారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం పట్టణం: బాబూ జగ్జీవన్ రామ్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కోరారు. అమలాపురం గడియారస్తంభం కూడలిలో మాదిగల పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. మడికి సత్యనారాయణ, శ్రీరాములు, వై.రవీంద్ర, నవుండ్రు నాని, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం గ్రామీణం: మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని శ్రీశైలం ట్రస్టీబోర్డు మాజీ సభ్యుడు చింతా శంకరమూర్తి కొనియాడారు. ఆదివారం బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి పెనుమాల సునీత, పిచ్చిక శ్యామ్, జీవరత్నం, మాడా మాధవి తదితరులు పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్‌కు నివాళి

అమలాపురం పట్టణం: స్థానిక భాజపా కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భాజపా కిసాన్ మోర్చా నాయకుడు నల్లా పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

✦ అమలాపురం ఏఎస్ఎన్ కళాశాలలో మేరా యువ భారత్ మహాన్ కార్యక్రమం నిర్వహించారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ దేశం కోసం చేసిన సేవలను భాజపా జిల్లా కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ వివరించారు. ప్రిన్సిపల్ కిషోర్, సూర్యనారాయణ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మూడు తాటాకిళ్లు దగ్ధం

అమలాపురం గ్రామీణం: కామనగరువు పంచాయతీ పరిధిలోని జంగంపాలెంలో ఆదివారం విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా మూడు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో వాసంశెట్టి మంగతాయారు, నాగలక్ష్మి, కుంచే వెంకటేశ్వరరావు, కుంచే శాంతమ్మకు చెందిన తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు. రూ.6 లక్షల విలువైన గృహోపకరణాలు, కార్పెంటరీ సామగ్రి, 30 కొబ్బరి చెట్లు దగ్ధమయ్యాయని అగ్నిమాపక అధికారి ఎం.రాజా తెలిపారు. బాధితులను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, సర్పంచి నక్కా అరుణకుమారి, శేఖర్ పరామర్శించారు.

కామనగరువులో కాలిపోతున్న తాటాకిళ్లు

యోగా పోటీల్లో ప్రతిభ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఒత్తిడి మనిషిని శారీరకంగా, మానసికంగా దెబ్బ తీస్తున్న నేపథ్యంలో యోగాసనాల ద్వారా ఆరోగ్యం సాధించవచ్చని రోటరీక్లబ్ అధ్యక్షుడు ఆర్డీఎస్ ప్రసాద్ అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం కె.అగ్రహారం రోటరీక్లబ్‌లో ఆదివారం స్వామి వివేకానంద యోగా ఆశ్రమం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు ఆకుల శ్రీనివాస్, యోగా జడ్జి కేఎన్‌వీ శ్రీధర్‌ల పర్యవేక్షణలో 10 నుంచి 80 ఏళ్ల విభాగంలో స్త్రీ, పురుషులు యోగాసనాలు వేశారు. వివిధ జిల్లాల నుంచి సుమారు 150 మంది పాల్గొన్నారు. విజేతలకు ప్రసాద్, కార్యదర్శి అకొండి పవన్, కోశాధికారి కూచిమంచి శశిధర్, కంకటాల వెంకటేశ్వరరావు, అప్పన్న వీరన్న తదితరులు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు.

విజేతలతో ఆర్డీఎస్ ప్రసాద్, సభ్యులు

అమలాపురం రోటరీక్లబ్‌లో యోగాసనాలు

ఆరోగ్యం, ఆనందం అందరి సొంతం

క్రమం తప్పకుండా ఆసనాలు వేయడం ద్వారా అనారోగ్యంగా ఉండవచ్చు. ధ్యానంతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుంది. వయసుతో సంబంధం లేకుండా అందరూ నిత్యం సాధన చేయాలి. విధుల్లో ఏకాగ్రతతో, చురుకుదనం అలవడతాయి. మధుమేహం, వెన్నునొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.

-ఇంజమూరి మాధవరావు, తిరుపతి

రోజంతా ఉత్సాహంగా ఉంటుంది

ఆరోగ్యానికి యోగా ఔషధంలా పని చేస్తుంది. ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. ఒక పద్ధతి ప్రకారం సాధన చేస్తే ఎంతో ప్రయోజనం కలుగుతుంది. దీనిపై అందరికీ అవగాహన కల్పించాలి. మహిళలు అర్ధ చక్రాసనంతో పాటు సూక్ష్మవ్యాయామాలు, ప్రాణాయామం, ధ్యానం చేస్తే ఎంతో మేలు జరుగుతుంది.

-యర్రంశెట్టి సునీత, యర్రంశెట్టివారి పాలెం, పి.గన్నవరం మండలం

కామాక్షి అమ్మవారికి సారె సమర్పణ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఆషాఢమాసం తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం అమలాపురం కె.అగ్రహారంలోని కామాక్షి అమ్మవారికి భక్తులు చీరలు, సారె సమర్పించారు. మంగళవాయిద్యాలు, కలసాలతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బృందాలుగా ఏర్పడి అమ్మవారికి నాలుగు బంగారపు మంగళసూత్రాలు బహూకరించారు. అమ్మవారికి పూలు, గాజులు, స్వీట్లు, చీరలు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సరిపెల్ల అనంతలక్ష్మి, విజయకుమారి, బాలిరెడ్డి రాధిక, రత్న రాధిక, వక్కలంక వాణి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కామాక్షి అమ్మవారికి పూజలు

శాకంబరిగా సత్తెమ్మతల్లి

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలోని సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. గుమ్మళ్ల రాము సమకూర్చిన వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. తొలి ఏకాదశి సందర్భంగా ముమ్మిడివరంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. విష్ణాలయం, ఉమాసూర్యేశ్వర స్వామి ఆలయం, చినకొత్తలంక, ఠాణే లంక, అనాతవరం, అన్నంపల్లి, సోమిదేవరపాలెం గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

శాకంబరిగా సత్తెమ్మతల్లి, విజయలక్ష్మీదుర్గ, శారదాదేవి

యానాం: గోపాల్‌నగర్‌లోని శారదాదేవి అమ్మవారిని ఆదివారం వివిధ రకాల కాయగూరలతో శాకంబరిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

కాట్రేనికోన: తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం మండల వ్యాప్తంగా ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. చింతలమెరకలోని విజయలక్ష్మీదుర్గ అమ్మవారికి అర్చకులు ఆకొండి శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

అమలాపురం పట్టణం: అమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీరామాలయం, శేషశయన మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద రాత్రి మహిళలు దీపాలు వెలిగించారు.

కుక్కల దాడిలో 25 మందికి గాయాలు

అమలాపురం పట్టణం: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 25 మంది కుక్కల దాడిలో గాయపడ్డారు. వీరిలో కాట్రేనికోన మండలం నుంచే 16 మంది ఉన్నారు. చిందాడగరువు, కంశాలవారి వీధి, గోపవరంలో ఒకొక్కరు చొప్పున కుక్కల దాడికి గురయ్యారు. అమలాపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో 9 మందిపై కుక్కలు దాడి చేశాయి. వీరంతా ఆదివారం అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందారు. వీరందరికీ వ్యాక్సిన్ చేసినట్లు డాక్టర్ కారెం రవితేజ తెలిపారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్మితమవుతున్న వకులమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి యానాం ప్రాంతానికి చెందిన సలాది శ్రీనివాస్, సత్యవతి దంపతులు రూ.50,116, ఆత్రేయపురం మండలం వద్దిపర్రుకు చెందిన రావిపాటి గోవిందరావు, రత్నమాల దంపతులు రూ.30,001 విరాళాలు అందించారు. వీరికి ఆలయ ఈవో స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

కాట్రేనికోన: చెయ్యేరు సహా మండల వ్యాప్తంగా పలుచోట్ల ముస్లింలు మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొహర్రం సంతాప దినాలు ఆదివారంతో ముగిశాయి. పీర్ల పంజాలలో పీర్లను ఊరేగించారు. వివిధ గ్రామాలకు చెందిన షియా ముస్లింలు పాల్గొన్నారు.

పశుసంక్రమిత వ్యాధులపై అప్రమత్తం

అమలాపురం పట్టణం: పశువులు, పక్షుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సూచించారు. ప్రపంచ పశుసంక్రమిత వ్యాధుల నివారణ దినం సందర్భంగా అమలాపురం ప్రాంతీయ పశువైద్యశాల వద్ద ఆదివారం అవగాహన సదస్సు, కుక్కలకు ర్యాబీస్ నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు ఎల్.విజయరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆనందరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకట్రావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి ప్రారంభించారు. ప్రజా విరాళం రూ.60వేలతో నిర్మించిన పశువుల షెడ్డును మెట్ల రమణబాబు ప్రారంభించారు. రైతులకు 50 శాతం రాయితీపై రెండు టన్నుల పశువుల దాణా పంపిణీ చేశారు. సోమ, మంగళవారాల్లోనూ కుక్కలకు టీకాలు వేస్తామని విజయరెడ్డి తెలిపారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకట్రావు, పశువైద్యులు డాక్టర్ నారాయణరావు, కావ్య, మాధురి, హెబ్సిబా, వాసవి తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

యానాం: దరియాలతిప్ప ఏటిగట్టు మార్గంలోని ఐస్ ఫ్యాక్టరీ సమీపంలోని జెట్టీ వద్ద గోదావరి నీటిలో ఓ మహిళ మృతదేహాన్ని ఆదివారం గుర్తించినట్లు ఔట్‌పోస్టు ఏఎస్సై సబతి వెంకటేశ్వరారావు తెలిపారు. ఆమె వయసు 40 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. యానాం ఆసుపత్రి నుంచి వచ్చిన వైద్యులు మృతదేహాన్ని పరిశీలించారని, మృతి చెంది నాలుగు రోజులై ఉంటుందని అంచనా వేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఏఎస్సై తెలిపారు.

(c) eenadu

మండపేట

•మండపేట •రామచంద్రపురం

రాజ్యసభ సభ్యుడికి సత్కారం

ఆలమూరు, న్యూస్‌టుడే: జొన్నాడ బీసీ సామాజిక భవనం వద్ద బీసీ సంఘం, కూటమి నాయకులు ఆదివారం రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణను సత్కరించారు. ముందుగా ఆయన మహాత్మా జ్యోతిబా పులె విగ్రహానికి, శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొత్తపేట భాజపా కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబుగౌడ్, రాష్ట్ర గౌడ సంఘం కన్వీనర్ మట్టా వీరబాబుగౌడ్, చింతలూరు గౌడ సంఘం నాయకులు, జొన్నాడ తెదేపా నాయకులు తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి బాబి తదితరులు సత్యనారాయణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడపాటి కృష్ణారెడ్డి, వాకా గోవిందరాజు, వీరి గోపాలకృష్ణ, సందీప్, కట్టా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

మండపేట, న్యూస్‌టుడే: డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా 8వ వార్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మండపల్లి రవికుమార్, కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, నేతలు జొన్నపల్లి సత్తిబాబు, యరమాటి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న కౌన్సిలర్లు

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు | ఉ॥ 10 - మ॥ 1
ద్రాక్షారామ : 80085 74192
ద్వారపూడి : 91543 96553

కుక్కలతో బెంబేలు

సమస్య: రామచంద్రపురం పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలోనూ విద్యార్థులను భయపెడుతున్నాయి.

- వెంకటేశ్, రామచంద్రపురం

సమాధానం: పట్టణంలోని శునకాలను వెంటనే పట్టిస్తాం.. ప్రభుత్వ కళాశాలలో ఈ సమస్య మా దృష్టికి వచ్చింది. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

- డేవిడ్‌రాజు, రామచంద్రపురం

– న్యూస్‌టుడే, రామచంద్రపురం

వ్యర్థాలు తొలగించారు

సమస్య: మండపేట మండలం ద్వారపూడి కెనాల్‌రోడ్డులో వ్యర్థాలను వేస్తున్నారు. దీంతో దుర్వాసనతో పాటు రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

- కె.దుర్గారావు, ద్వారపూడి

పరిష్కారం: రహదారి పక్కన వేస్తున్న వ్యర్థాల విషయాన్ని పంచాయతీ కార్యదర్శి ఆకుల రమణ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించారు. సిబ్బందిని పంపించి వాటిని తొలగింపజేశారు.

– న్యూస్‌టుడే, ద్వారపూడి

డ్రెయినేజీని శుభ్రం చేశారు..

స్పందనకు వందనం

రాయవరం: సోమేశ్వరం నాగవంశీయులపేట డ్రెయినేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. సమస్యను స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి పి.వెంకటరత్నం దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై కార్యదర్శి స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో డ్రెయినేజీని శుభ్రం చేయించారు.

ఖాళీ స్థలాలు.. మశక నిలయాలు

✦ ప్రస్తుత వర్షాలతో తీవ్రమవుతున్న దోమలు

మండపేట, ద్వారపూడి, రామచంద్రపురం న్యూస్‌టుడే: మండపేట పట్టణంతో పాటు మండలంలోని శివారు ప్రాంతాల ఖాళీ స్థలాలు వ్యాధుల వ్యాప్తికి కారణమవుతున్నాయి. ప్రధానంగా పారిశుద్ధ్య లోపాలతో గ్రామస్థులకు కష్టాలు తప్పడంలేదు. వాటిలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగి దోమలు, విష పురుగులుకు ఆవాసాలుగా మారుతున్నాయి. మండపేట పురపాలక సంఘం అంచనా ప్రకారం పట్టణంతో పాటు మండలంలో 2,500 పైగా ఇలాంటి స్థలాలు ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నీరు చేరి రోజుల తరబడి నిలిచిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. అలాగే పరిసరాల్లోని స్థానికులు చెత్త, పనికిరాని వ్యర్థాలను వేస్తుండడంతో సమస్య మరింత తీవ్రంగా మారుతోంది. దోమలతో రాత్రి సమయాల్లో కంటి మీద కునుకు కరవవుతోందని స్థానికులు వాపోతున్నారు. ఓవైపు కాలానుగుణ వ్యాధులు, మరోవైపు విష జ్వరాలు విజృంభిస్తుండటంతో ఆసుపత్రుల పాలవుతున్నామని చెబుతున్నారు.

మండపేట పట్టణంలోని విజయలక్ష్మీనగర్, లక్ష్మీనగర్, గొల్లపుంత తదితర ప్రాంతాలు, మండలంలో ద్వారపూడి శివారు వేములపల్లి, మారేడుబాక సాయినగర్, మహిళానగర్, కేశవరం, ఏడిద, అర్తమూరు తదితర గ్రామాల శివారు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. ఆయా చోట్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. అలాగే క్రిమికీటకాలు వ్యాపిస్తున్నాయి. కొన్ని సమయాల్లో పాములు సైతం ఇళ్లలోకి వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఆయా స్థలాల యజమానులకు సమస్య వివరించి వారితో పిచ్చిమొక్కలు తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మండపేటలో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు

అవగాహన కల్పిస్తున్నాం..

పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరగకుండా నియంత్రించాలని యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆయా చోట్ల దోమలు వృద్ధి చెందకుండా నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో ఆయిల్‌బాల్స్ వేయిస్తున్నాం. డ్రైనేజీలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించే పనులు చేయిస్తున్నాం. సమస్య తీవ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేస్తాం.

- దాసరి శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో

రామచంద్రపురంలో..

పట్టణంలోని పలు ప్రైవేటు ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. వాటిలోంచి దోమలు, పురుగులు వ్యాపిస్తున్నాయి. స్థానిక రాజకోటవీధితో పాటు లక్ష్మీగణపతి దేవస్థానం సమీపంలోని స్థలాల్లో పారిశుద్ధ్యం లోపించి దుర్గంధం వెదజల్లుతోంది. దోమల నివారణకు మొక్కుబడిగా గత నెలలో ఒకరోజు పొగ యంత్రం తిప్పారని స్థానికులు చెబుతున్నారు. దీనిపై కమిషనర్ కె.వి.ఆర్.ఆర్.రాజును వివరణ కోరగా ఖాళీ స్థలాల యజమానులకు పట్టణ ప్రణాళికా విభాగం నుంచి నోటీసులు జారీ చేస్తామని వివరించారు.

మూడుసార్లు ఉపయోగిస్తే షెడ్డుకే..

మండపేట పట్టణంలో ఫాగింగ్ యంత్రాలు ప్రస్తుతం రెండే ఉన్నాయి. వీటిని మూడుసార్లు వినియోగిస్తే మరమ్మతులకు గురవుతున్నాయి. కొంత వెచ్చించి పెట్టి బాగుచేయిస్తే మళ్లీ అదే పరిస్థితి. ప్రస్తుతం రెండు యంత్రాలు నిర్వహణ లేకుండా పది రోజులుగా ఏ వార్డులోనూ వినియోగించడం లేదు.

భగవద్గీత చదవండి..

మండపేట, న్యూస్‌టుడే: భగవద్గీతను చదవండి.. శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీత పారాయణంలో తెలిపినట్లు నేర్చుకోండి.. అంటూ పట్టణానికి చెందిన పండ్ల వ్యాపారి, భగవద్గీత పాఠశాల వ్యవస్థాపకుడు బళ్ల నాగు ప్రచారం చేస్తున్నారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆయన కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రతి ఆదివారం ఉదయం 4 గంటల నుంచి 6 గంటల మధ్య ద్వారపూడి చెరువు సమీపంలోని సంతాన గణపతి ఆలయం వద్ద భక్తప్రహ్లాద భగవద్గీత పాఠశాలలో ఉచితంగా నేర్చుకోవాలని కోరారు.

స్వర్ణపతక విజేతకు అభినందనలు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని వెస్ట్‌బెరిజ్ సావరానికి చెందిన పెద్దిరెడ్డి ధనశ్రీ విజయవాడలోని లయోలా కళాశాలలో బీటెక్ కోర్సులో బంగారు పతకం సాధించింది. కాకినాడ జేఎన్‌టీయూ ప్రాంగణంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఈ పతకం అందుకున్నారు. ఆమెను నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పట్టణ జనసేన నాయకులు సత్యనాథ శ్రీహరిరాజు తదితరులు అభినందించారు.

గురువుని దైవంగా భావించిన ఏకలవ్యుడే ఆదర్శం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: గురువుని దైవంగా భావించి అకుంఠిత దీక్షతో విలు విద్య అభ్యసించిన ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం కోరారు. ద్రాక్షారామ నన్నయవీధిలో ఎరుకల సామాజిక వర్గం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఏకలవ్యుడి జయంతి సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఏకలవ్యుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఎరుకల తెగకు సంబంధించిన కొన్ని సమస్యలను నిర్వాహకులు ఆయన దృష్టికి తెచ్చారు. అధికారులు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. సర్టిఫికెట్లు లేక సంక్షేమ పథకాలు అందడం లేదనగా మంత్రి సుభాష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

మండపేట: ఎరుకల సామాజిక వర్గాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అమలాపురం పార్లమెంటు సభ్యుడు గంటి హరీష్ మాధుర్, ఎన్‌ఆర్‌ఐ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం 26వ వార్డులోని కనకదుర్గ ఆలయం సమీపంలో ఏకలవ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ గురుభక్తిలో ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కౌన్సిలర్ అమలదాసు లక్ష్మి, కోనసీమ ఎరుకుల సంఘం జిల్లా కార్యదర్శి సమతం చిన్న పాపారావు, మండల అధ్యక్షుడు అమలదాసు రుద్రమూర్తి, కార్యదర్శి సింగం రాంబాబు, అమలదాసు చిన్నబ్బులు, గోవిందు, అన్నవరం తదితరులు పాల్గొన్నారు

ఏకలవ్యుడి జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న సత్యం

కేక్ కట్‌చేస్తున్న ఎంపి, ఎమ్మెల్యే, కౌన్సిలర్

ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి

రాయవరం: గిరిజన, ఎరుకల ఉపకులాల ప్రయోజనార్థం ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయాలని తూర్పుగోదావరి, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎరుకల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మానుపాటి రామకృష్ణ, సంగాడ వెంకటరమణ, మానుపాటి గోవింద కోరారు. ఆదివారం రాయవరంలో మండల ఎరుకల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాడా పట్టాభిరామయ్య అధ్యక్షతన నిర్వహించిన ఏకలవ్యుడి జయంతి వేడుకల్లో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గిలకా గోవిందు, సింగం శ్రీను, గాడా రామచంద్రం, గాడా వెంకట్రావు, వివిధ మండలాల సంఘం నాయకులు పాల్గొన్నారు.

జంతు వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఆలమూరు, మలికిపురం: జంతువుల నుంచి సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలంతా అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డా.ఎల్.అనిత సూచించారు. ఆదివారం ఆలమూరు వెటర్నరీ ఆసుపత్రి ప్రాంగణంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం, ఉచిత టీకాల కార్యక్రమం నిర్వహించారు. ర్యాబిస్ టీకాలు వేశారు. ● మలికిపురం, గుడిమెళ్లంక, లక్కవరం పశువైద్యశాలల ఆధ్వర్యంలో కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలు వేశారు. పశువైద్యాధికారులు డి.శివకుమార్, పి.సూర్యనారాయణరాజు, ఎస్.వెంకటేశ్వరరావు, స్వప్నిక, ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, సర్పంచి నల్లి విజయకుమారి, ప్రసాద్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

ద్వారపూడి, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని సంవత్సరంలోనే అభివృద్ధి బాటపట్టించి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం సత్తా చాటుతోందని అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ మాధుర్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఏడిద గ్రామంలో ఎన్‌ఆర్‌ఐ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భవిష్యత్తులో చేసే అభివృద్ధిని ప్రజలకు వివరించారు. స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, గ్రామ అధ్యక్షుడు పర్వతిన వీర్రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏడిదలో దివ్యాంగుడితో ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు

అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం ముందంజ

మండపేట: అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో రాష్ట్రం ముందంజలో ఉందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని 7వ వార్డులో ఇంటింటా పర్యటించి ఆయన కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కౌన్సిలర్ సవరపు సతీష్, తెదేపా పట్టణ మాజీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు పాల్గొన్నారు.

కాలువ వెంబడే చెత్త

వెల్ల రోడ్డులోని పంటకాలువ వెంబడి చెత్త తొలగించిన కార్మికులు ఆ వ్యర్థాలను అక్కడే వదిలేయడంతో సర్వత్రా విమర్శలొస్తున్నాయి. చెత్త మళ్లీ కాలువలోకి చేరి ప్రవాహానికి అడ్డంకులు తెచ్చే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. తొలగించిన చెత్తను వెంటనే తరలించి ఉంటే ఇలాంటి ఇబ్బందులు తలెత్తవని చెబుతున్నారు. ఈ విషయమై శానిటరీ తనిఖీదారు డేవిడ్‌రాజును వివరణ కోరగా చెత్తను వెంటనే అక్కడి నుంచి తరలించామని, ఇంకా మిగిలి ఉంటే వెంటనే తొలగించే పనులు చేయిస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, రామచంద్రపురం

ఆలయాల్లో ఆషాఢ పూజలు

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరం మండలంలో వెదురుపాక-ఆరికిరేవుల రహదారిలో పంటపొలాల మధ్య కొలువైన కొర్లవారి సత్తెమ్మతల్లి ఆదివారం శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని సత్తెమ్మతల్లిని శాకాంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మాచవరపు వెంకటసురేష్ ఆధ్వర్యంలో జరిగిన పూజాల్లో వి.సావరం గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి కాకి వెంకటసత్యసాయి మణికంఠ 50 కేజీల కూరగాయలు అందించారు. పుట్టకొండ విజయదుర్గా పీఠం గురువు దంగేటి త్రిమూర్తులు గురుభవాని పర్యవేక్షణలో పూజలు జరిపించారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి పర్వదినాన అమ్మవారిని దర్శించుకోడానికి భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో మాచవరపు సత్యనారాయణ, లక్ష్మి దంపతులు, వెదురుపాక, వి.సావరం, మెళ్లూరు, ఆరికిరేవుల గ్రామాల భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

● తొలి ఏకాదశిని పురస్కరించుకుని వైష్ణవ, శైవ క్షేత్రాలు ఆదివారం భక్తులతో సందడిగా మారాయి. వెదురుపాక విజయదుర్గా పీఠం, రాయవరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, వెంటూరు, సోమేశ్వరంలోని అష్టసోమేశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ద్వారపూడి: తొలి ఏకాదశి సందర్భంగా మండపేట మండలం ద్వారపూడిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని ఆదివారం శాకాంబరిగా అలంకరించారు. గ్రామంలోని ఆర్యవైశ్య ప్రముఖులు, కమిటీ సభ్యులు అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు శ్రీహరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు మహిళలు కుంకుమపూజలు చేశారు.

వెదురుపాకలో సత్తెమ్మతల్లి

ద్వారపూడిలో వాసవీమాత

వైభవంగా తొలి ఏకాదశి

మండపేట, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి సందర్భంగా మండపేటలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. మహావిష్ణువు యోగనిద్రకు ఉపక్రమించే సమయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాల్లో అర్చనలు జరిపించారు. స్థానిక కలువపువ్వు సెంటరులోని వేంకటేశ్వర స్వామి ఆలయం, జనార్దనస్వామి ఆలయం, స్టేట్ బ్యాంకు సమీపంలోని పురాతన శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తాంజనేయస్వామి ఆలయంలో..

పామర్రు: తొలి ఏకాదశి రోజున జరుపుకొనే ఏకలవ్యుడి జయంతిని కె.గంగవరం మండలం పామర్రు హైస్కూలు ఆవరణలో ఆదివారం ఏపీ ఎరుకల ఏకలవ్య యూత్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహాభారతంలో ఏకలవ్యుడి పాత్ర, అతని చరిత్రను కుల పెద్దలు వివరించారు. బీసీ 'ఏ' గ్రూపునకు చెందిన పాములు పట్టేవారు ఎస్టీలుగా కుల ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారని, తమకు అన్యాయం జరుగుతోందని వాపోయారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బి.గోవిందు, కార్యదర్శి ఎస్.రాజు, ఉపాధ్యక్షుడు ఎం.రాంబాబు, ఉమ్మడి తూర్పుగోదావరిలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: తొలి ఏకాదశి సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో కొలువైన లక్ష్మీనారాయణస్వామి, వెలంపాలెంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో, కందులపాలెం, ద్రాక్షారామలోని శ్రీభూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు ఆలయాలను సందర్శించారు.

వెలంపాలెం శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో విశేష అలంకరణలో స్వామివారు

సార్వత్రిక సమ్మె విజయవంతానికి కృషి

ద్వారపూడి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న నిర్వహించే జాతీయ కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ద్వారపూడి గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్.నాగరాజు, పి.వెంకటరావు, బి.రామకృష్ణ, కె.కృపానందం, ఎ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ద్వారపూడిలో ప్రచారం చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

భక్తిశ్రద్ధలతో ఇమాం హుస్సేన్ సంతాప దినం

ద్రాక్షారామ: త్యాగానికి ప్రతీకగా నిలిచే మొహర్రం సంతాప దినాల్లో 11వ రోజును ద్రాక్షారామలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్లను అలంకరించి ఊరేగించారు. ఇమాం హుస్సేన్ వీరమరణం (అషురా) రోజైన ఆదివారం పెద్దమసీదు సెంటరు నుంచి హజరత్ అబ్బాజ్ రోడ్డు వరకు ఛాతీపై రక్తం చిందేలా మాతం నిర్వహించి భక్తిని చాటారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. లక్‌నవూ నుంచి వచ్చిన మతగురువు మౌలానా మొహమ్మద్ షంసీ సాహెబ్ మాట్లాడుతూ మొహర్రం ప్రాధాన్యతను వివరించారు.

రాయవరం: పసలపూడిలో మోహరం సంతాప దినాలు ఆదివారం కొనసాగాయి. మోహరం నెల పదకొండో రోజును పురస్కరించుకుని అగ్నిగుండంలో నడిచి భక్తులు తమ సంతాపం వ్యక్తం చేశారు. షేక్ బుల్‌బాజీ ఆధ్వర్యంలో ఆలంలను పూలహారాలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం గ్రామ ఆనవాయితీ ప్రకారం ప్రాథమిక సహకార సంఘం మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి (చినకాపు) ఇంటి వద్దకు చేరుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. రాయవరం జడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, భక్తులు పాల్గొన్నారు.

మండపేట: బలిదానానికి మొహర్రం ప్రతీకగా నిలుస్తుందని జామియా మసీదు ఇమామ్ మొహ్మద్ ముర్షిద్ రజ్వీ అన్నారు. ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇస్లామ్ ఆచారం ప్రకారం 5 పూటలా సమాజ్ ఆచరించాలని తెలిపారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: హజరత్ అబ్బాస్ పంజా వద్ద మాతంలో భక్తులు

హామీలన్నీ నెరవేరుస్తాం

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి సంక్షేమ ప్రభుత్వంగా చాటి చెబుతామని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం, మోరి గ్రామాల్లో ఆదివారం చేపట్టారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ముప్పర్తి నాని, తాడి సత్యనారాయణ, అబ్దుల్ రహీం, ఎనుముల రమణ, శ్రీహరిరాజు, చాగంటి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె ముగిసింది.. తొలగనున్న అంధకారం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: పట్టణంలో దాదాపు 50 రోజులుగా వార్డుల్లో అంధకారం అలముకుంది. సరిగా వెలగని వీధి దీపాలకు సకాలంలో రెగ్యులర్ సిబ్బంది మరమ్మతులు చేయకపోవడం.. ఔట్‌సోర్సింగ్ కార్మికులు 45 రోజులుగా సమ్మెలో కొనసాగడంతో పట్టణంలోని పలు వీధుల్లో దీపాలను పట్టించుకునే నాథుడే కరవయ్యారు. తాజాగా కార్మికులు సమ్మె విరమించడంతో పట్టణంలో వెలుగులు పర్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. రామచంద్రపురం పట్టణంలో కొత్త లేఔట్లతో కలిపి 2,750 వీధి దీపాలున్నాయి. వీటిలో నిత్యం 2,150 దీపాలు వెలుగుతుండగా శివారు ప్రాంతాల్లో దాదాపు 600 దీపాలు వెలగడం లేదు. వీటికి విద్యుత్తు తీగలు వేయాల్సి ఉంది. ఇక 2,150 దీపాల్లో ప్రస్తుతం 1500 దీపాలు వెలుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. మిగిలిన 650 లైట్లకు మరమ్మతులు చేయాల్సి ఉందని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. సూర్యానగర్, అంకంవారివీధి, వైఎస్సార్‌నగర్, లలితానగర్, హౌసింగ్‌బోర్డు, రత్నంపేట, ముచ్చుమిల్లిరోడ్డు, ముచ్చుమిల్లి కె.ఎస్.ఆర్.నగర్, చింతపల్లి సూరన్ననగర్ ప్రాంతాల్లో ఎక్కువ వీధులు చీకటిలో మగ్గుతున్నాయి. మిగిలిన వార్డుల్లో అక్కడక్కడా వెలగడం లేదు. వీటికి తోడు బాక్సుల మరమ్మతులు ఎక్కువగా ఉన్నాయి. ఒక్కో బాక్సుపై సుమారు 20 నుంచి 25 దీపాలు వెలగక ఆయా ప్రాంతాలన్నీ అంధకారంలో చిక్కుకున్నాయి. కార్మికుల సమ్మె ముగిసిన కారణంగా మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది స్పందించాలని, చీకట్లో ఉన్న వీధుల్లో వెలుగులు నింపాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

విద్యుత్తు స్తంభంపై పనులు చేస్తున్న సిబ్బంది

మూడు రోజుల్లో పరిష్కారం..

కార్మికులు సమ్మె వీడిన కారణంగా మరో మూడు రోజుల్లో ఈ సమస్యకు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపిస్తాం. సమ్మె ముగిసిన శనివారమే పట్టణంలోని 1, 2, 3, 4 వార్డుల్లో దీపాలను బాగు చేయించాం. ముందుగా బాక్సుల పనులు ప్రారంభించాం. దీనివల్ల ఒకేసారి అధిక సంఖ్యలో దీపాలు వెలిగే అవకాశం ఉంది. అవసరమైన సామాగ్రి ఉంది..

- సునీల్, మున్సిపల్ ఏఈ

భక్తురాలిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

19న భద్రాద్రిరాముడి కల్యాణం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామలోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సప్తసప్తాహ మహోత్సవాల్లో భాగంగా ఈనెల 19న భద్రాద్రిరాముడి కల్యాణం నిర్వహిస్తామని శ్రీప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడు బోణం శ్రీనివాసు తెలిపారు. భద్రాద్రి నుంచి తీసుకొచ్చిన విగ్రహాలకు ఆ దేవస్థానం అర్చక స్వాములతో కల్యాణవేడుక జరిపిస్తామని ఆయన వివరించారు. సప్తసప్తాహాలు ముగింపు సందర్భంగా 21న ఊరేగింపు, 5వ వారం సప్తాహ మహోత్సవం ముగింపు సందర్భంగా భీమవరం మండలం శృంగవృక్షం ప్రాంతానికి చెందిన భక్తురాలు కటిక శ్రీదేవిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సన్మానించి జ్ఞాపిక అందించారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళి

ద్వారపూడి, న్యూస్‌టుడే: జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను మారేడుబాక గ్రామంలో ఆదివారం భాజపా మండల శాఖ అధ్యక్షుడు పాలిక రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బుద్ధవరపు రాజు, శర్మ, హర్ష, సూరిబాబు, రాంబాబు, వీర్రాజు పాల్గొన్నారు.

మండపేట: పట్టణ భాజపా అధ్యక్షుడు ఫణిప్రకాష్ ఆధ్వర్యంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పందిరి వీర్రాజు, కార్యదర్శి కోటిపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **MELLIM SRINIVAS RAO,** S/o Surayya, resident of D.No. 9-14, Rayavaram Village, Chellayamma Colony, Rayavaram Mandal, Dr. B.R Ambedkar Konaseema District, A.P. I have Changed my name from **MELLEM JOHN** (Old Name) to **MELLIM SRINIVAS RAO** (New Name). Hence I am being called **MELLIM SRINIVAS RAO** As per Affidavit dated 05-07-2025 for all Purpose.

(c) eenadu

సూదితో టీకా.. శునకం ఎంచక్కా

ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం గోకవరం బస్టాండ్ సమీపంలోని పశువైద్య శాలలో పెంపుడు జంతువులకు ఉచిత టీకాలు వేశారు. నగరవాసులు తాము పెంచుకుంటున్న శునకాలను పెద్ద సంఖ్యలో తీసుకురావడంతో సందడి నెలకొంది. వివిధ జాతుల కుక్కపిల్లలను పలువురు ఆసక్తిగా తిలకించారు. అల్లారు ముద్దుగా, కుటుంబంలో ఒకరిగా పెంచుకుంటున్న వాటికి సూదిమందు వేస్తుంటే చిన్నపిల్లల మాదిరిగా జంతు ప్రేమికులు ఊరడించారు. యజమానులకు సైతం టీకాలు వేశారు.

- న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

రూ.కోట్లు.. ఉపాధికి తూట్లు..!

సామాజిక తనిఖీల్లో గుర్తించినా రికవరీకి మీనమేషాలు

ఈనాడు, రాజమహేంద్రవరం : కూలీలకు పని కల్పించాలన్న మహోన్నత లక్ష్యంతో అమలవుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొందరు అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. రూ.కోట్లలో నిధులు పక్కదారి పట్టించినట్లు సామాజిక తనిఖీల్లో గుర్తించినా.. రికవరీ మాత్రం చేసిన దాఖలాలు లేవు. దీనికి బాధ్యులు క్షేత్రస్థాయి సిబ్బంది అవుతున్నా.. అక్రమాల వెనుక కొందరు రాజకీయ నాయకులు, అధికారుల పాత్ర ఉండటం వల్లే చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

అవినీతి మొక్కలు.. మస్తర్లలో దొంగ లెక్కలు

ఉపాధిహామీలో చేపట్టిన పనులు, నిర్మాణాలు, మొక్కల పెంపకానికి సంబంధించి అక్రమాలు చోటు చేసుకున్నాయి. కూలీలు పనులకు రాకపోయినా దొంగ మస్తర్ల నమోదు చేశారు. చేయని పనులకు బిల్లులు చెల్లింపు, తక్కువ పని చేసి ఎక్కువగా నమోదు చేయడం తదితర అక్రమాలకు పాల్పడ్డారు. కూలీలతో చేసే పనులు, ఇతర శాఖలతో చేపట్టే నిర్మాణాల్లోనూ పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టాయి. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు ఏపీవోలు, ఏపీడీలు తనిఖీలు చేయకపోవడంతోనే అక్రమార్కులు రెచ్చిపోతున్నారన్న విమర్శలున్నాయి.

ఇదీ అక్రమాల వరుస..

సంవత్సరం: 2022 నుంచి 2025 (మార్చి)

గుర్తించిన అక్రమాలు : రూ.9,97,32,049

స్వాధీనం : రూ.20.04 లక్షలు

గోకవరం మండలం కొత్తపల్లి చెరువులో ఉపాధి పనులు

● మొక్కల నాటే పనుల్లో రూ.4.17 కోట్లు అక్రమాలు గుర్తించగా వీటిలో రూ.3.2 కోట్ల వరకు సరిదిద్దే తప్పులుగా చెబుతున్నారు. 100 మొక్కలునాటితే తనిఖీల సమయంలో 60 మాత్రమే కనిపంచాయి. మిగిలినవి చనిపోయాయి. వాటి స్థానంలో కొత్తవి నాటి ఫొటోలు తీసి, సరిచేసే అవకాశం ఉంది. దీనిని అదునుగా చేసుకుని ఎక్కువ పనులు ఈ విభాగంలోనే చేపట్టారు.

● నిర్మాణ పనులకు సంబంధించి మూడేళ్లలో రూ.5.80 కోట్లు అక్రమాలు చేస్తే సరిదిద్దే తప్పులుగా రూ.5.10 కోట్లుగా నమోదు చేశారు. ఇప్పటికీ పరిష్కారం మాత్రం కాలేదు. నిర్ణీత సమయంలోపు సరి చేయపోతే తప్పనిసరిగా రికవరీ చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు లేకపోవడం గమనార్హం.

సాధారణ ప్రసవాలు అంతంతే..!

'అమ్మ' ఆరోగ్యం..'కోత'లతో ప్రమాదం

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, కంబాలచెరువు : నవ మాసాలు మోసి, ప్రసవ వేదనతో బిడ్డకు ఊపిరినిస్తుంది అమ్మతనం. కానీ ప్రస్తుతం పురిటినొప్పుల ప్రసవ వేదన లేకుండానే కోతలతో అమ్మపొత్తిళ్లలోకి శిశుప్రాణం చేరుతుంటే.. చూసి మురిసిపోతున్న తల్లుల సంఖ్యే ఎక్కువగా ఉంటోంది. సిజేరియన్ చేయడమే లక్ష్యంగా కొందరు వైద్యులు జేబులు గుల్ల చేస్తుంటే.. ముహూర్తాలు ఇతర కారణాలతో నిర్దేశిత సమయానికి బిడ్డ జన్మించాలనే ఉత్సుకతతో సిజేరియన్‌ను ప్రోత్సహిస్తున్న పెద్దలూ లేకపోలేదు. అవగాహన, అనుభవంలేని కొందరు వైద్యులు, రిస్క్ ఎందుకని భావిస్తూ కోతలకే ప్రాధ్యామిస్తున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకంటే సిజేరియన్లే అధికంగా చేస్తున్నారన్నది స్పష్టం.

జీజీహెచ్ మాతాశిశు విభాగంలో బాలింతలు

50 శాతానికి మించి..

ఉమ్మడి జిల్లాలో ఏప్రిల్, మేలో 6,961 ప్రసవాలకు 4,209 సిజేరియన్లు జరిగాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 10 నుంచి 15 శాతానికి మించి ఉండకూడదు. ఉమ్మడి జిల్లాలో 50 శాతానికి మించి జరుగుతుండడం గమనార్హం.

● తూర్పుగోదావరి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 952 ప్రసవాలకు 444 (46.64 శాతం) సిజేరియన్ కాగా, ప్రైవేటు ఆసుపత్రుల్లో 1441కు గాను 1,012 (70.23 శాతం) కోతలతోనే చేశారు.

ఏప్రిల్, మే నెలల్లో పరిశీలిస్తే

తూర్పుగోదావరి జిల్లా	
ప్రసవాలు	2393
సిజేరియన్	1456
శాతం	60.84

శస్త్రచికిత్స ప్రసవాలతో ఆరోగ్యానికి ఇబ్బందే

సాధారణ ప్రసవం తరువాత మహిళ మూడు గంటల్లో లేచి నడవచ్చు. త్వరగా కోలుకుంటారు. సిజేరియన్ల తో ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదముంది. రక్తస్రావం అధికమై తీవ్ర ఇబ్బందులయ్యే ఆస్కారం లేకపోలేదు. మొదటిసారి శస్త్రచికిత్స చేసి పురుడుపోస్తే రెండోసారి గర్భసంచి పగిలిపోయే ప్రమాదముంది. ప్రసవం ముందే చేయాల్సిన పరిస్థితులుంటాయి. అలాంటప్పుడు బిడ్డ ఊపిరితిత్తులు ఎదగకుండానే ప్రసవం చేసి ఎన్ఐసీయూ, ఎస్ఎన్‌సీయూలో బిడ్డను ఉంచాల్సి ఉంటుంది. మరోవైపు బాలింతలు నెలల తరబడి విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల ఊబకాయం వచ్చి మరిన్ని అనారోగ్య సమస్యలొస్తాయి. జీజీహెచ్‌లో 40 వారాలయ్యాకనే నొప్పులు వచ్చేందుకు మందులిచ్చి సాధారణ ప్రసవం చేస్తాం. అది కుదరని పక్షంలో శస్త్రచికిత్సకు వెళ్తాం. ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రుల్లో 36 వారాలకే నొప్పులకు మందులిచ్చి సాధారణ ప్రసవం కుదరదని సిజేరియన్ చేసేస్తున్నారు.

- బసా అక్కమాంబ, హెచ్‌వోడీ, ప్రసూతి వైద్యవిభాగం, రాజమహేంద్రవరం జీజీహెచ్

కులవృత్తులకు ప్రభుత్వం అండ

మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్, వేదికపై ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు

దేవీచౌక్ న్యూస్‌టుడే, ఈనాడు డిజిటల్(రాజమహేంద్రవరం): కుల వృత్తులు, చేతి వృత్తిదారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో పట్టణ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో రజక ఆకాంక్ష సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ కుల వృత్తులపై ఆధారపడే వారికి సముచిత స్థానం ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. రజకులు గ్రామాల్లోని చెరువుల్లో తమ వృత్తిని కొనసాగించుకునే విధంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు. కేంద్రమంత్రి భూపతి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశంపై కేంద్ర సామాజిక సాధికార మంత్రితో రజక ప్రతినిధుల సమావేశాన్ని ఏర్పాటుచేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ రజక సంఘ డిమాండ్లను పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం ముందుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విశ్వకర్మ పథకంలో భాగంగా నైపుణ్యాభివృద్ధిని అందిపుచ్చుకోవాలని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ మాట్లాడుతూ కులాల కార్పొరేషన్‌కు రాజ్యాంగ భద్రత లేకపోవడంతో బడ్జెట్‌లో రూ.వంద కోట్లు కేటాయించినా, రూ.2 కోట్లను మాత్రమే ఇచ్చే పరిస్థితి ఉందన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఆసుపత్రుల్లో, హాస్టల్‌లో, రైళ్లలో ఉపయోగించే బెడ్ షీట్లు శుభ్రం చేసి ఉపాధి పొందే అవకాశం దేశవ్యాప్తంగా రజక కార్పొరేషన్‌కు ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తామని పేర్కొన్నారు. రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సావిత్రి మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలోని ధోబీ పోస్టులు, కాంట్రాక్టులు రజకులకు కేటాయించేలా ప్రత్యేక జీవో తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గల్లా మాధవి, మాజీ ఎమ్మెల్సీ రామారావు, రాజమహేంద్రవరం రజక సేవా సంఘం గౌరవాధ్యక్షుడు వెంకట్రావు, అధ్యక్షుడు బి.శ్రీనివాస్, రజక కార్పొరేషన్ డైరెక్టర్లు, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాస ప్రయాణం..!

నగరాల్లో కానరాని సిటీ బస్సులు

ఈనాడు, కాకినాడ
– న్యూస్‌టుడే, వీఎల్‌పురం

నగరం: రాజమహేంద్రవరం	డివిజన్లు: 50	జనాభా: 5 లక్షలు

ప్రధాన కూడళ్లు: దేవీచౌక్, కంబాలచెరువు, కోటిపల్లి బస్టాండ్, నందం గనిరాజు సెంటర్, తాడితోట, డీలక్స్ సెంటర్, పుష్కర్ ఘాట్, ట్యాంకు బండ్‌రోడ్డు, గోకవరం బస్టాండ్, శ్యామల కూడలి, పేపర్‌మిల్లు ప్రాంతం, లాలా చెరువు, ఏవీ అప్పారావు రోడ్డు, మోరంపూడి కూడలి.

ఉమ్మడి జిల్లాలో కీలకమైన కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో దశాబ్దాలుగా సిటీ బస్సు సౌకర్యం లేదు. దీంతో ప్రతి అవసరానికి ద్వి, త్రిచక్ర లేదా నాలుగు చక్రాల వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రజల అవసరమే ఆసరాగా వేలాది ప్రైవేటు వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. ఈ పరిస్థితితో రాకపోకల్లో వ్యయప్రయాసలతోపాటు..కాలుష్య, ట్రాఫిక్ చిక్కులు ఎక్కువవుతున్నాయి.

ప్రైవేటు పోటీ తట్టుకోలేక..: కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో ప్రైవేటు, ఆర్టీసీ సిటీ బస్సులు 2000 సంవత్సరం వరకు తిరిగేవి. ఆ తర్వాత ప్రైవేటు బస్సులకు ప్రభుత్వ అనుమతులు నిలిపివేస్తే.. 7 సీట్ల ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలు వేలాదిగా రోడ్డెక్కడంతో పోటీ తట్టుకోలేక, గిట్టుబాటు కాక.. ఆర్టీసీ సిటీ బస్సులు ఆపేయాల్సి వస్తోంది.

అవసరమే అయినా..: పెరుగుతున్న జనాభాకనుగుణంగా తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం లాంటి ప్రధాన నగరాల తరహాలో కాకినాడ, రాజమహేంద్రవరంనగరాల్లోనూ సిటీ బస్సులు తిప్పాలన్న వాదన వినిపిస్తోంది. పారిశ్రామిక, విద్య, వైద్య కేంద్రంగా ఉన్న కాకినాడ నగరంలో నిత్యం 15వేల వరకు ఆటోలు తిరుగుతున్నాయి. వాణిజ్య కేంద్రం రాజమహేంద్రవరంలో ఆ సంఖ్య 20వేల వరకు ఉంది. సొంత, ప్రైవేటు వాహనాలు అదనం. పల్లె వెలుగు బస్సులు తిరుగుతున్నా.. అన్ని కూడళ్లలో ఆగని పరిస్థితి. దీంతో ఆర్టీసీకి రూ.10 చెల్లించాల్సిన టికెట్‌కు.. ఆటోలు ఇతర ప్రైవేటు వాహనాలకు రూ.20 నుంచి రూ.150 వరకు చెల్లించాల్సి వస్తోంది.

కాగితాల్లోనే విద్యుత్తు బస్సులు

కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలకు 50 చొప్పున విద్యుత్తు బస్సులు మంజూరు చేయాలన్న ప్రతిపాదన ఏళ్లుగా ఉంది. ఇవి మంజూరై, ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తే నగరంలోని ప్రధాన కూడళ్లను కలుపుతూ తిప్పొచ్చనే ఆలోచన కార్యరూపం దాల్చాల్సి ఉంది.

'రాజమహేంద్రవరం డిపో నుంచి గతంలో ఆర్టీసీ సిటీ బస్సు సర్వీసులు నడిపినప్పటికీ ఆదరణ లేకపోవడం.. టికెట్ సర్వీసు లేక సంస్థకు నష్టాలు రావడం తదితర కారణాల వల్ల నిలిపివేశాం. ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ పథకాన్ని త్వరలో అమలు చేయనున్నందున ప్రస్తుతం దానిపై దృష్టిసారించాం. సిటీ సర్వీసులు నడిపే ప్రతిపాదనలేమీ ప్రస్తుతానికి లేనప్పటికీ ప్రయాణికుల నుంచి ఏమైనా వినతులు వస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిశీలన చేస్తాం.' అని రాజమహేంద్రవరం ఆర్టీసీ డీఎం మాధవ్ అన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) సోమవారం జరుగుతుందని కలెక్టర్ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జరిగే జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్‌తోపాటు రెవెన్యూ డివిజన్, మున్సిపల్, మండల కేంద్ర కార్యాలయాల్లోనూ అధికారులు అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. ప్రజలు తమ సమీపంలోని కార్యాలయాల్లో అర్జీలు అందించవచ్చని, ప్రభుత్వ కార్యాలయాల వరకు రాలేనివారు మీకోసం పోర్టల్‌లో లేదా 1100 టోల్‌ఫ్రీ నంబరులో ఫిర్యాదులు తెలియజేయవచ్చని చెప్పారు.

సాంకేతిక సాయం.. ఉపాధికి మార్గం!

'డిజి లక్ష్మి'తో ఆర్థిక స్వావలంబన

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం)

స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ)లోని విద్యావంతులైన మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా డిజీ లక్ష్మి కార్యక్రమం ద్వారా నగరం, పట్టణ ప్రాంతాల్లోని ఎస్‌హెచ్‌జీ సభ్యుల్లో డిగ్రీ చదివిన వారిని గుర్తించి వారికి శిక్షణ అందిస్తున్నారు. అనంతరం వారితో కామన్ సర్వీసు సెంటర్లు (సీఎస్‌సీ) ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో నగరం, రెండు పట్టణాల పరిధిలో 10,787 స్వయం సహాయక సంఘాలు ఉండగా మొత్తం 1,07,870 మంది సభ్యులు ఉన్నారు.

ఇంటి వద్దే..

మహిళలు తమ ఇంటి వద్దే కామన్ సర్వీసు సెంటర్ నిర్వహించుకునేలా ప్రోత్సాహం అందిస్తున్నారు. శిక్షణ పూర్తయిన వారికి ఐడీలు జారీ చేయడంతోపాటు లాగిన్ల ద్వారా సీఎస్‌సీ సేవలు ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎస్‌సీలు ఏర్పాటు చేయనున్న మహిళలకు మెప్మా ఆధ్వర్యంలో ఇటీవల డిజైజర్లు అందించినట్లు మెప్మా పీడీ బి.ప్రియంవద, సీఎంఎం రామలక్ష్మి తెలిపారు. ల్యాప్‌టాప్, ప్రింటర్, ఇతర పరికరాలు సమకూర్చుకునేందుకు రూ.2 లక్షల చొప్పున బ్యాంకు రుణాలను కూడా త్వరలో అందించనున్నారు. సీఎస్‌సీల నిర్వహణ ద్వారా ఎస్‌హెచ్‌జీ మహిళలు వివిధ సేవలు అందించి ప్రతినెలా రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

శిక్షణ పొందుతున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు

నగరం, పట్టణం	ఎంపిక లక్ష్యం	గుర్తించిన మహిళలు	శిక్షణ ఇచ్చింది
రాజమహేంద్రవరం	269	170	101
కొవ్వూరు	24	10	06
నిడదవోలు	26	16	08

సాంకేతిక సహకారమిలా..

కామన్ సర్వీసు కేంద్రాల్లో ఈ-గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ సాంకేతిక సహకారం అందిస్తుంది. సీఎస్‌సీల్లో రేషన్, పాన్‌కార్డులు, పాస్‌పోర్టు, జనన, మరణ ధ్రువపత్రాలు, ఓటరు కార్డు నవీకరణ, బ్యాంకు ఖాతాలు తెరవడం, డబ్బులు డిపాజిట్ చేయడం, ఇతర బ్యాంకింగ్ సేవలు అందించవచ్చు. అసంఘటిత రంగ కార్మికులను ఈ శ్రమ్‌లో నమోదు చేసేందుకు ఇటు కార్మిక శాఖతో, వివిధ పన్నులు కట్టించుకునే సేవలకు సంబంధించి అటు పురపాలక శాఖతోనూ మెప్మా అవగాహన ఒప్పందం చేసుకుంది. వీటిని కూడా సీఎస్‌సీ కేంద్రాల ద్వారా అందించవచ్చు. ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న జిల్లాలో 115 మందికి గుర్తింపు కార్డులు జారీ చేశారు.

పేపరుమిల్లు కార్మికుల సమ్మె

తక్షణం వేతన ఒప్పందం అమలుకు డిమాండ్

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం)

రాజమహేంద్రవరం ఆంధ్రా పేపరుమిల్లు కార్మికులు మళ్లీ సమ్మెకు దిగారు. విధులు బహిష్కరించి లోపలే భైఠాయించారు. దీంతో ఉత్పత్తి నిలిచిపోయింది. తక్షణం శాశ్వత, ఒప్పంద కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయాలంటూ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. 2020 జులై 1 నుంచి 2023 వరకు వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని ఇక్కడి కార్మికులు చాలాకాలంగా పోరాటం చేస్తూనే ఉన్నారు. అనేకసార్లు ఆందోళనలు చేశారు. గతేడాది ఏప్రిల్‌లో 24 రోజులపాటు మిల్లులో సమ్మె చేయగా వేతన ఒప్పందం చేస్తామని మిల్లు యాజమాన్యం అప్పటి జిల్లా కలెక్టర్ సమక్షంలో రాతపూర్వకంగా అంగీకరించి దానిని అమలు చేయలేదు. దీంతో ఈ ఏడాది జనవరిలో మరోసారి నాలుగు రోజులపాటు కార్మికులు ఆందోళన చేయడం, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో కమిటీ వేశారు. ప్రజాప్రతినిధులు, జాయింట్ లేబర్ కమిషనర్ సమక్షంలో వేతన ఒప్పందాన్ని అమలు చేసేందుకు యాజమాన్యం మళ్లీ అంగీకరించింది. నేటికీ దానిని అమలు చేయకుండా యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, చట్టప్రకారం చేయాల్సినవి కూడా చేయకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యం తీరును నిరసిస్తూ మళ్లీ సమ్మెకు దిగి శనివారం బి-షిఫ్ట్ నుంచి విధులు బహిష్కరించారు. మిల్లు లోపలే భైఠాయించిన విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది.

విధులు బహిష్కరించి ఆందోళన చేస్తున్న కార్మికులు

సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ

ఆంధ్రాపేపరు లిమిటెడ్ యాజమాన్యం నిరంకుశ వైఖరి వీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఈ విషయంలో కార్మిక శాఖ, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, పూర్ణిమ రాజు, కార్యదర్శి పవన్, నాయకులు సోమేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు డిమాండ్ చేశారు. కార్మికుల పోరాటానికి వారు మద్దతు ప్రకటించారు.

బడి బలోపేతం.. భవిత నందనం

పాఠశాలల్లో మార్పునకు శ్రీకారం ✦ 10న మెగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం

న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్

ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఈ ఏడాది బడుల పునఃప్రారంభరోజునే పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, సామగ్రి అందజేసింది. మధ్యాహ్న భోజనంలోనూ మార్పులు చేసింది. సన్నబియ్యంతో అన్నం వండడంతో పాటు రాగిజావ, వేయించిన గుడ్డును అందిస్తోంది. తల్లికి వందనం పేరుతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎక్కడ చదివినా, ఎంతమంది పిల్లలున్నా లబ్ధి అందజేసింది. విద్యార్థుల్లో క్రమశిక్షణ, చదువులో మెరుగైన ఫలితాలను విద్యావ్యవస్థలో మార్పును తీసుకువచ్చేందుకు తాజాగా ఈ నెల 10న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించేందుకు సమాయత్తమవుతోంది. దీంతో పాఠశాలల్లో పండగ వాతావరణం నెలకొంది.

ఆహ్వానపత్రికలు తయారుచేసిన విద్యార్థులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (పీటీఎం)ను ఏర్పాటు చేయగా ఈసారి ప్రైవేటు పాఠశాలల్లోనూ, జూనియర్ కళాశాలల్లోనూ నిర్వహించనున్నారు. రాజమహేంద్రవరం నగరంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు సుమారు 165 ఉన్నాయి. ఇక్కడ 43వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 10న జరిగే సమావేశంలో ముఖ్యంగా విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయటంతో పాటు విద్యార్థి నడవడిక, వారి తీరుతెన్నులు, ప్రతిభపై తల్లిదండ్రులతో చర్చించనున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం ఉచితసీట్లు కేటాయింపుపై అవగాహన కల్పిస్తారు. గతేడాది పరీక్షల్లో తమ విద్యార్థి సాధించిన మార్కులు, హాజరు వంటి అంశాలను హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదుచేసి అందజేస్తారు. రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం, ఆరోగ్య పరిరక్షణ బుక్‌లెట్‌ను అందజేస్తారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలున్నా తల్లిదండ్రులు తెలియజేస్తే, వాటి పరిష్కారంపై చర్చిస్తారు.

సెల్ఫీపాయింట్లు, ఆహ్వానపత్రాలు

మెగా పీటీఎం సమావేశాన్ని నిర్వహించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేస్తున్నారు. పిల్లలు పాఠశాల ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు రకరకాల తోరణాలను తయారుచేస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బృంద చిత్రాలు, సెల్ఫీలు తీసుకునేలా ఫొటో స్పాట్‌లు, విద్యార్థి లక్ష్యాలు తెలుసుకునేందుకు డ్రీమ్‌వాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. తల్లిదండ్రులను ఆహ్వానించేందుకు ప్రత్యేకంగా గ్రీటింగ్‌కార్డులను తయారు చేస్తున్నారు. అమ్మ పేరిట మొక్కలు నాటనున్నారు. తల్లిదండ్రులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తారు. అనంతరం పాఠశాల కమిటీ అధ్యక్షుడి ఉపన్యాసం, తల్లిదండ్రుల ప్రార్థన, సూచనలు, సహపంక్తి భోజనాలతో కార్యక్రమం ముగియనుంది. సమావేశాలను విజయవంతం చేయాలని డీఎస్ఈఓ కె.వాసుదేవరావు సూచించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

రంగు మారింది..

పశ్చిమ డెల్టా ప్రధానకాలువలో రంగుమారిన నీరు, (అంతర చిత్రం) నిన్నటివరకు పచ్చగా నీరు

నిడదవోలు, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో గోదావరికి వరద చేరడంతో నీరు ఎర్రబడింది. సాధారణంగా జులై మొదటి, రెండో వారాల్లో గోదావరికి ఎర్రనీరు వస్తుంది. ప్రస్తుతం ఎర్రనీరు చేరడంతో తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాల ప్రధాన కాలువల ద్వారా ప్రవహించే నీరు పూర్తిగా రంగుమారింది. నిన్నటి వరకు కాస్త ఆకుపచ్చగా ఉన్న నీరు ప్రస్తుతం పూర్తిగా ఎర్రరంగులోకి మారింది. మూడు డెల్టాల పరిధిలోని 10.50 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు పలు పట్టణాలు, డెల్టా మండలాల పరిధిలోని ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చే కాలువలో ఎర్రనీరు అక్టోబరు చివరి వరకు ఉంటుందని జల వనరుల శాఖ అధికారులు చెప్పారు.

(c) eenadu

కోటసత్తెమ్మకు ఆషాఢ సారె

నిడదవోలు: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ అమ్మవారికి కైకలూరు, కలిదిండికి చెందిన 100 మంది భక్తులు ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం చీరె, సారె సమర్పించారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దేవుల పల్లి రవిశంకర్, ఆలయ ఈవో, సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకుడు ఎస్వీకేపీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి అలంకరణకు వజ్రాభరణం

అన్నవరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుని దేవేరి అనంత లక్ష్మీ అమ్మవారి అలంకరణకు వజ్రాల లాకెట్ నెక్లెస్‌ను దాత ఆదివారం అందజేశారు. పెద్దాపురం శ్రీ లలితా ఎంటర్ ప్రైజెస్ ఇండస్ట్రీస్ ఎండీ మట్టే సత్యప్రసాద్, సూర్యకమల దంపతుల కుమారుడు ఆదిశంకర్, స్రవంతి పేరు మీద ఇచ్చారు. సుమారు రూ. 19.09 లక్షలతో బంగారం, వజ్రాలతో తయారు చేయించిన సుమారు 122 గ్రాముల బరువున్న ఆభరణంలో 174 వజ్రాలు ఉన్నాయి. ప్రత్యేక పూజలు అనంతరం ఈవో సుబ్బారావు సమక్షంలో దాత కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి అందించారు. వైదిక బృందం ఆధ్వర్యంలో అమ్మవారికి ఆభరణాన్ని అలంకరించారు. మట్టే సత్యప్రసాద్ గతంలో రూ. కోట్ల వ్యయంతో స్వామి, అమ్మవార్లకు వజ్ర కిరీటాలను, వజ్రాలు పొదిగిన కర్ణాభరణాలను కూడా ఇచ్చారు. ఈ ఆభరణాలు అలంకరించుకున్న స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శనమిస్తున్నారు.

హారాన్ని ఈవో సుబ్బారావుకు అందిస్తున్న దాత మట్టే ఆదిశంకర్ దంపతులు

చదరంగం పోటీలో చిన్నారుల ప్రతిభ

శ్యామలాసెంటర్: జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో అండర్-13 జిల్లాస్థాయి బాల, బాలికల పోటీలు నగరంలోని ది హార్వెస్ట్ మెయిన్‌బర్గ్ మర్చెంట్స్ అసోసియేషన్‌హాల్‌లో ఆదివారం జరిగాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో నికేష్ జమ్మలమడక ప్రథమ, బాలికల విభాగంలో సత్యశ్రీ ద్వితీయ బహుమతి, అండర్-11 బాలుర విభాగంలో సుజయ్ ప్రథమ, అండర్-9లో హంసిక ద్వితీయ, అండర్-7లో కేతన్‌సాయి, లక్ష్మీచైతన్య ద్వితీయ, బాలికల విభాగంలో టి.వరలక్ష్మి ప్రథమ బహుమతి సాధించారని నిర్వాహకులు కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బహుమతులు సాధించిన క్రీడాకారులు

బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు 13న

పిఠాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 13న రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు హాజరయ్యేవారు 2007 జనవరి ఒకటో తేదీ తరువాత పుట్టినవారై ఉండాలన్నారు. ఒరిజినల్ పుట్టిన తేదీ, ఆధార్ తదితర ధ్రువపత్రాలు తీసుకురావాలని పేర్కొన్నారు. ఎంపికైన జట్లు ఆగస్టు 14 నుంచి 17 వరకు పిఠాపురంలో జరిగే రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో తలపడతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని తెలిపారు.

పుణ్యక్షేత్రం.. వలస పక్షుల ధామం

రాజానగరం, న్యూస్‌టుడే: ఆ పక్షులను దేశాల సరిహద్దులు ఆపలేవు.. వేల మైళ్లు సునాయాసంగా ప్రయాణిస్తాయి. ఏడాదిలో ఆరు నెలలు వాటికి రాజానగరం మండలం పుణ్యక్షేత్రం గ్రామం విడిది. సైబీరియా వంటి సుదూర ప్రాంతాల నుంచి పక్షులు ఏటా జూన్, జులై మాసంలో ఈ గ్రామానికి వేలాదిగా వలస వచ్చి తిరిగి డిసెంబరు మాసంలో స్వస్థలాలకు చేరుకుంటాయి. దాదాపు 125 సంవత్సరాల నుంచి అవి ఈ ప్రాంతాలకు వస్తుండడం రివాజు అని స్థానికులు అంటున్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే వీలు ఉన్నప్పటికీ వన్యప్రాణి సంరక్షణా విభాగం ఈ పక్షులకు రక్షణ కల్పించలేకపోతోంది.

బహుదూరపు బాటసారులు..

నీలిరంగు జరీచీరకు వెండి అంచు వేసి అలంకరించినట్టు ఈ విదేశీ విహంగాలు ఆకాశంలో గుంపులుగా సాగిపోయే రమణీయ దృశ్యం ఈ ప్రాంతంలో కనువిందు చేస్తుంది. ఏటా మృగశిర కార్తె ప్రవేశించగానే ఈ పక్షులు వేల మైళ్లు ప్రయాణించి ఇక్కడికి వస్తాయి. నత్తగుల్ల కొంగలు, చిల్లుముక్కు కొంగలు అని ముద్దుగా పిలుచుకునే వీటి అసలు పేరు ఓపెన్ బిల్ బర్డ్స్. ఇవి వస్తూ వస్తూ వానమబ్బులను వెంట వేసుకుని వస్తాయని గ్రామస్థుల ప్రగాఢ విశ్వాసం. ఈ విదేశీ అతిథులు తమ ప్రాంతంలో విడిది చేయడం వల్ల శుభం కలుగుతుందని స్థానికులు భావిస్తారు. వీటిని ఎవరైనా వేటాడటం కనిపిస్తే బడితిపూజ చేస్తారు.

పుణ్యక్షేత్రంలో సందడి చేస్తున్న విదేశీ పక్షులు

ఇక్కడే జత కడతాయి..

ఇక్కడికి చేరుకున్న తరువాత ఆడ, మగ కొంగ జత కడతాయి. అప్పటి నుంచి ఆ జత విడివిడి కుండా అన్యోన్యంగా ఉంటాయి. రెండూ కలిసి ఆకులు, కొమ్మలు తెచ్చి గ్రామంలోని ఊరచెరువు వద్ద ఉన్న తుమ్మ చెట్లపై గూళ్లు కట్టుకుంటాయి. వీటిలో మగ కొంగ ఆహారం కోసం వెళ్తుంది. ఆడ కొంగ గుడ్లు పొదిగిన తరువాత రెండూ కలిసి పిల్ల కొంగలకు ఆహారం తెస్తాయి. ఈ పక్షులు ఏ చెట్టు మీద వాలితే ఆ చెట్టు మళ్లీ పూత పూయదు, కాయలు కాయదు. అవి వేసే రెట్ట వేడిమికి ఇలా జరుగుతుందంటారు.

రక్షణకు అటవీశాఖ చర్యలు..

ఈ పక్షులు ఉండే తుమ్మ చెట్ల మీదుగా హైటెన్షన్ విద్యుత్తు తీగలు వెళ్లడంతో వాటిని తగిలి ప్రాణాలు కోల్పోతున్నాయి. వీటి రక్షణకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇవి ఉండే చెరువును అభివృద్ధి చేయడం, వచ్చే సందర్శకులు చెరువు చుట్టూ తిరిగేందుకు చిన్నపాటి రహదారి ఏర్పాటు, పైనుంచి వలస పక్షుల చిలిపి చేష్టలను వీక్షించేందుకుగాను వ్యూపాయింట్ తదితర ఏర్పాట్లు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యాప్రమాణాల మెరుగుకు చర్యలు: కలెక్టర్

కలెక్టరేట్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగా ఈ నెల 10న మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని కార్యాలయంలో మెగా పేరెంట్, టీచర్స్ సమావేశంపై క్షేత్రస్థాయి విద్య, అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 987 ప్రభుత్వ, 550 ప్రైవేటు పాఠశాలల్లో, 120 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాల ఆధారంగా విద్యాబోధనలో నాణ్యతను అందించేందుకు మెగా పేరెంట్, టీచర్స్ మీట్ ఒక కీలక వేదిక కావాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కూడా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బోధన, భోజనం, మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల బోధన పద్ధతులు, పాఠశాల వాతావరణం వంటి అంశాలపై అభిప్రాయాలు తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లావ్యాప్తంగా ప్రతి పాఠశాల నుంచి కనీసం 50 మంది విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించాలని, వీటిని జిల్లా పాఠశాల విద్యాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో విశ్లేషించి తగిన పరిష్కార చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

అధికారులకు సూచనలిస్తున్న ప్రశాంతి

సాయి వేంకటేశ్వర ఎం.ఎం.ఎ. కో- ఆపరేటివ్ సొసైటీ దేవిచౌక్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

సాయి వేంకటేశ్వర ఎం.ఎం.ఎ. కో-ఆపరేటివ్ సొసైటీ, దేవిచౌక్ వద్ద తాకట్టు పెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
09/2025	01-09-2023 to 30-06-2024

ఆసక్తి గలవారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్చుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 రాజమండ్రి. చైర్మన్: సాయి వేంకటేశ్వర ఎం.ఎం.ఎ. కో-ఆపరేటివ్ సొసైటీ

ప్రభాకర నిధి లి., దేవిచౌక్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

ప్రభాకర నిధి, దేవిచౌక్ వద్ద తాకట్టుపెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
08/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గలవారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్చుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 రాజమండ్రి. చైర్మన్: ప్రభాకర నిధి లి.

సాయి వేంకటేశ్వర ఫైనాన్స్, మెయిన్‌రోడ్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

సాయి వేంకటేశ్వర ఫైనాన్స్, మెయిన్ రోడ్ వద్ద తాకట్టుపెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
06/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గలవారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్చుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 రామచంద్రపురం. భరత్‌కుమార్ ప్రభుత్వం నియమించిన వేలందారు మెయిన్‌రోడ్, రామచంద్రపురం

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, ప్రకాష్‌నగర్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, ప్రకాష్ నగర్ వద్ద తాకట్టుపెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
07/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గల వారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్చుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 రామచంద్రపురం. భరత్‌కుమార్ ప్రభుత్వం నియమించిన వేలందారు మెయిన్‌రోడ్, రామచంద్రపురం

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, దేవిచౌక్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, దేవిచౌక్ వద్ద తాకట్టుపెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
05/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గల వారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్చుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 రామచంద్రపురం. భరత్‌కుమార్ ప్రభుత్వం నియమించిన వేలందారు మెయిన్‌రోడ్, రామచంద్రపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు చేయూత

ఘనంగా గోపాలపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

నల్లజర్ల, గోపాలపురం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పక్షపాతంగా పనిచేస్తున్నాయని రాజమహేంద్రవరం, విజయనగరం ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. గోపాలపురం వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నల్లజర్లలో జరిగింది. ముందుగా నూతన కమిటీ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు గ్రామం ప్రకాశరావుపాలెం నుంచి నల్లజర్ల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడానికి మార్కెట్ కమిటీలు ఎంతో ఉపయోగకరం అన్నారు. రాష్ట్రంలో 329 మార్కెట్‌లు ఉన్నయని వాటిని డిజిటల్ మాధ్యమంగా రూపు దిద్దడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ వైకాపా ఐదేళ్ల పాలనలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు పేరుకే ఉన్నాయని రైతులకు చేసింది ఏమి లేదన్నారు. దీంతో రైతులు తాము పండించిన పంట అమ్ముకోడానికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు, భవన, నిర్మాణ, కార్మిక సంఘం ఛైర్మన్ వలవల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మారాజుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, చిత్రంలో ఎంపీ పురందేశ్వరి, మార్కెట్ కమిటీ నాయకులు

సేవలకు ప్రతిరూపం లయన్స్ క్లబ్: దుర్గేష్

పెరవలి, న్యూస్‌టుడే: సేవలకు ప్రతిరూపంగా లయన్స్ క్లబ్ నిలుస్తోందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పెరవలిలోని దీపిక కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన క్లబ్ 16వ అధ్యక్షుడు దేవరపు కేదారేశ్వర వెంకటరాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి రాజమహేంద్రవరంలో రోటరీ తదితర సంస్థల్లో సభ్యుడిగా సేవలందిస్తూ రాజకీయ రంగంలోకి వచ్చానని చెప్పారు. ముందుగా బీవీరాజు దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడు వెంకటరాయుడు, జయలక్ష్మి దంపతులను సత్కరించారు. పెరవలిలో క్లబ్ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, రాజకుమారి దంపతులు ఆదర్శంగా నడుపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, లయన్స్ సభ్యులు గట్టెం మాణిక్యాలరావు, సలాది ఉదయభాస్కర రావు, ఏడిది వీరవెంకటసత్యనారాయణ మూర్తి, పుట్ట విజయశ్రీ, బూరుగుపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు. పెంపుడు కుక్కలకు ర్యాబిస్ వ్యాక్సిన్‌ను వేసే కార్యక్రమాన్ని మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, తణుకు మున్సిపల్ మాజీ ఛైర్మన్ వంక రాజకుమారి, పశువర్ధక శాఖ జేడీ రిషిప్రసాద్ తదితరులు మాట్లాడారు. అనంతరం భీమవరం బీవీరాజు దంత వైద్యశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏవీ రామరాజు, పశు వైద్యాధికారులు చరణ్, సల్మా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వరప్రసాద్, హేమరాజులను సన్మానించారు.

టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్ తదితరులు

పేపరు మిల్లు విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గం

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: పేపరు మిల్లు రిటైర్డు ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం స్థానిక పేపరుమిల్లు ప్రధాన గేట్ ఎదురుగా ఉన్న శ్రీకృష్ణ సాయి కల్యాణమండపంలో ఈ సమావేశం జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా సి. హెచ్. వి. రామరాజు, అధ్యక్షుడిగా టి.కె. విశ్వేశ్వరరెడ్డి, కార్యదర్శిగా ఎస్. వి. వి. రెడ్డి, కోశాధికారిగా బి. అప్పారావు, ఉపాధ్యక్షులుగా పి. బి. ఎస్. భాస్కరశర్మ, ఎం. భాస్కరరావు, సంయుక్త కార్యదర్శులుగా ఎం. ఆర్. ఎల్. శర్మ, సి. హెచ్. ఎన్. వీరభద్రరావు, ఎ. శివప్రసాద్‌తోపాటు ఎగ్జిక్యూటివ్, అడ్వయిజరీ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. తొలుత ఇటీవల మృతి చెందిన 11 మంది అసోసియేషన్ సభ్యులకు నివాళులర్పించారు. గతంలో కార్యదర్శిగా పనిచేసిన ఎస్. పి. ఎన్. దొర మృతి చెందడటంతో ఆయన కుటుంబానికి అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రామరాజు వ్యక్తిగతంగా రూ.10 వేల ఆర్థికసాయం అందించారు కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత ప్రవేశాలకు వేళాయే..!

మిగులు సీట్లు 600

వేంపల్లె, న్యూస్‌టుడే: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు ట్రిపుల్ ఐటీలలో 600 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి విద్యార్థుల మెరిట్ జాబితాను తయారు చేసి ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి మొత్తం 4400 సీట్లు ఉన్నాయి. ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1100 సీట్లు ఉండగా దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ కోటా కింద 360 సీట్లు పోను నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1010 చొప్పున 4040 సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలలో ఉన్న సీట్లకు మెరిట్ జాబితా విడుదల చేసి జూన్ 30 నుంచి జులై 5వ తేదీ వరకు ఇడుపులపాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేశారు. కౌన్సెలింగ్ తర్వాత ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 878 సీట్లు భర్తీ కాగా 132 సీట్లు మిగిలిపోయాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలో 1010కి 869 భర్తీ కాగా 141 సీట్లు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 867 భర్తీ కాగా 143, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు 826 సీట్లు భర్తీ కాగా 184 సీట్లు మిగిలాయి. ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో జాప్యం, ఇక్కడి విద్యపై ఆసక్తి లేని కారణంగా చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడంతో 600 సీట్లు ఖాళీ ఏర్పడింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ కేంద్రంగా రెండో విడత ప్రవేశాలకు సంబంధించి రెండో జాబితాను అధికారులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

11, 12 తేదీల్లో రెండో విడత ప్రవేశాల జాబితా

ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలలో మిగిలిపోయిన 600 సీట్ల భర్తీకి తదుపరి మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 11, 12 తేదీల్లో వెబ్‌సైట్‌లో వెల్లడిస్తాం. ఈ మేరకు రెండో విడత జాబితా సిద్ధం చేసే పనిలో తమ సిబ్బంది ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. ఆ లోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తాం.

- ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

టైలరింగ్ వర్క్స్ ఇంటి వద్దనే పనిచేసే స్త్రీలు కావలెను. వారికి క్లాత్ ఇచ్చుటకు స్టాక్ పాయింట్స్ పెట్ పార్ట్నర్స్ కావలెను. ✆ 7093632399.

FINANCIAL SERVICES

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలలోపు ఫైనాన్స్ చేయబడును. అన్ని తరగతుల వారు బ్యాంకులో స్థిరాస్తిపై లోన్ తీసుకున్న వారికి Xerox పేపర్స్‌పై 2nd మార్ట్గేజ్ లోన్ చేయబడును. ✆ 96665 47338.

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

విశాఖలో/ అనకాపల్లిలో NRI ఫామ్ ల్యాండ్స్ వేయుటకు ఇన్వెస్ట్ పార్ట్నర్స్ కావలెను. సంప్రదించండి. ✆ 73864 14017/ 70936 32399.

TO LET

COMMERCIAL

FOR OFFICES, Banks, Dental & Cosmetology convience place with parking in Danavaipeta, 1600 Sft., 1st Floor. Rjy, Cont: 94 90 811 769.

JOBS

Wanted Duty Doctors, O.T. Nurse & Technician. C.E.M. Hospital. ✆91002 75777 & Teachers, Cook, Aayas. Jaya High School, Dowleswaram, ✆ 63049 94974.

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్లు సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో. వ. + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ✆ 92814 52845, 82475 00574.

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.

ప్రభాకర నిధి, దేవిచౌక్, రాజమండ్రి నందు బిజినెస్ ప్రమోషన్ చేయుటకు అభ్యర్థులు కావలెను. ఆసక్తిగలవారు సంప్రదించండి. సెల్: 79952 33384.

రాజమండ్రిలో ప్రముఖ ఇంటీరియర్ షాప్‌లో హెల్పర్స్ కావలెను. 10 Members, జీతం: Start 13,000/- + ఇన్సెంటివ్స్ + ట్రావెల్ అలవెన్స్ ఇవ్వబడును. ✆ 99564 77177.

Managers కావలెను. ప్రముఖ Life Insurance నందు ఇంటి నుండి పనిచేయు సదావకాశము. Salary, Incentives, Promotions, Foreign Trips, 40 సం॥లు పైబడినవారు మాత్రమే. ✆ 98494 21277.

త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 85209 80099, 85208 74499.

వర్క్ ఫ్రం హోమ్ డేటా ఎంట్రీ: ప్రముఖ ఔట్‌సోర్సింగ్ సంస్థ నందు ఇంటి వద్ద ఉండి పార్ట్/ ఫుల్ టైం ప్రాజెక్ట్ వర్క్ చేయుటకు Laptop/Desktop, స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు కావలెను. ✆ 95534 29994.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-35 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్ళలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	23,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	25,000
గటగట	26,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	19,000-22,000
కొత్త (పచ్చి) కాయ	19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	4,500
కిలో	300

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	102-00
రిటైల్ లైవ్	124-00
డ్రెస్డ్	180-00
స్కిన్‌లెస్	205-00

ఔషధ దుకాణాల్లో తనిఖీలు

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని పలు మందుల దుకాణాల్లో ఆదివారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు హరిహరతేజ, కళ్యాణి తనిఖీలు చేపట్టారు. ఏలూరు జిల్లాలోని కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం ప్రాంతాల్లో నిషేధిత మందుల విక్రయాలను అక్కడి అధికారులు గుర్తించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఓ వ్యక్తి నుంచి అవి సరఫరా అవుతున్నాయని, నగరంలోనూ పలు దుకాణాలకు అతను వీటిని అందిస్తున్నాడనే సమాచారంతో దుకాణాల్లో పరిశీలన జరిపారు. దేవీచౌక్, బైపాస్‌రోడ్డులోని పలు షాపుల్లో తనిఖీలు చేయగా అలాంటి మందులు దొరకలేదని తెలిసింది. నగరంలో ఆదివారం చాలా ఔషధ దుకాణాలు మూసేసి ఉంటాయి. ఈ సమయంలో మొక్కుబడిగా తనిఖీలు చేపట్టడంలో ఆంతర్యమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పి. ఎస్. మునిరత్నం అన్నారు. ఆదివారం ఆయన రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఇక్కడి ప్రధాన బస్టాండ్, పల్లెవెలుగు సర్వీసులు ప్రాంగణం, కార్గో పార్సిల్ కౌంటర్లను పరిశీలించారు. ప్రయాణికులకు కల్పించిన సౌకర్యాలు, అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం అధికారులు, డిపోలోని ఆయా విభాగాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు అందించారు. మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించనున్నందున దానికి అనుగుణంగా ఏర్పాట్లు సిద్ధం చేయాలని, ఎటువంటి యాంత్రిక లోపాలు లేకుండా బస్సుల కండిషన్ మెరుగుపరచాలని సూచించారు. ప్రమాద రహిత, జీరో బ్రేక్ డౌన్ ధ్యేయంగా సిబ్బంది పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఉద్యోగులు వారి ఆరోగ్యం విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి వై. ఎస్. ఎన్. మూర్తి, రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె. మాధవ్, అధికారులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం ప్రధాన బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఏపీఎస్‌ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ మునిరత్నం, చిత్రంలో డీపీటీవో, డీఎం తదితరులు

ఇంద్ర ఏసీ బస్సులో 15 శాతం రాయితీ

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఆషాఢమాసం సందర్భంగా రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కు ఇంద్ర ఏసీ బస్సులో ప్రయాణించేవారికి 15 శాతం టికెట్ రాయితీ కల్పిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కె. మాధవ్ తెలిపారు. రాజమహేంద్రవరం డిపో నుంచి హైదరాబాద్‌కు ఈ బస్సు ప్రతిరోజూ రాత్రి 9 గంటలకు బయలుదేరుతుంది. సూపర్ లగ్జరీ బస్సు టికెట్ ధరకే ఏసీ బస్సులో ప్రయాణించవచ్చని, ప్రస్తుతం ఏసీ బస్సు టికెట్ ఛార్జీ రూ. 1,060 ఉండగా రాయితీతో రూ. 920 మాత్రమే చెల్లించవచ్చని చెప్పారు. ఇటు నుంచి వెళ్లడంతో పాటు, తిరిగి అటు నుంచి ఇంద్ర ఏసీ బస్సులో ఇక్కడికి వచ్చేవారికి ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపారు.

శిర్డీ సాయి కేంద్రానికి విలువైన ఆస్తి వితరణ

దాతృత్వం చాటుకున్న దంపతులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక, సామాజిక సేవా భావంతో జీవించి తోటివారికి ఆదర్శంగా నిలవడం స్ఫూర్తిదాయకమని శిర్డీసాయి ఆధ్యాత్మిక కేంద్రం గౌరవాధ్యక్షులు, పండితులు దోర్భల ప్రభాకరశర్మ అన్నారు. కొవ్వూరు పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాదులు పడాల భానుప్రసాద్, గంధం విజయశ్రీ దంపతులు రామా సొసైటీ సమీపంలో 256 చదరపు గజాల్లో 'సాయికుటీర్' పేరుతో ఉన్న నివాసాన్ని శిర్డీసాయి ఆధ్యాత్మిక కేంద్రానికి చెందేలా వీలునామా పత్రాలు రాశారు. (దీని విలువ సుమారు రూ. కోటి ఉన్నట్లు సమాచారం.) ఆ దంపతులిద్దరూ ఈ మధ్యనే చనిపోయిన నేపథ్యంలో వారి సంకల్పం మేరకు పత్రాలను రాసి స్థానిక న్యాయవాది దొండపూడి కృష్ణకు అందించారు. ఈ పత్రాలను ఆదివారం కేంద్రం ప్రతినిధులు ప్రభాకర శర్మ దాతల కుటుంబ సభ్యుల సమక్షంలో సమర్పించారు. విజయశ్రీ సోదరుడు శేషసాయి, మేనకోడళ్లు జి. మౌనిక, మృదుల, మేనల్లుడు జీఎం రామకృష్ణ, కేంద్ర ప్రతినిధులు గుడివాక శ్రీనివాస్, సీహెచ్ సుబ్బారావు, కసిరెడ్డి సీతారామ్, సీహెచ్ గణేష్ డి. సురేష్ పాల్గొన్నారు.

ఆస్తి పత్రాలను స్వీకరిస్తున్న శిర్డీ సాయి ఆధ్యాత్మిక కేంద్ర ప్రతినిధులు

(c) eenadu

రాజమహేంద్రవరం

తలసీమియా బాధితులకు రక్తదానం

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: తలసీమియా బాధిత చిన్నారులకు జైన్ సేవాసమితి, రాజస్థాన్ సేవా సమితి, మాగ్నా ఆసుపత్రి, జైన్ ప్రీమియం లీగ్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం స్థానిక నాళం భీమారాజు వీధిలో జైన్ సత్రంలో నిర్వహించారు. సుమారు వంద మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నగర ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ రక్తదాతలను అభినందించారు.

సినిమాలు

కంబాలచెరువు: సూర్యప్యాలెస్, అనుశ్రీ, ఊర్వశి: జురాసిక్ వరల్డ్; రాజా, అప్సర, శివజ్యోతి, శ్యామలా, వీఎస్‌మహల్: తమ్ముడు; అశోక్: కన్నప్ప; సూర్యామినీ: 3బీహెచ్‌కే; స్వామి: కుబేర; రంభ: మార్గన్; మేనక: షోటైం.

చెత్త తొలగిస్తున్న విద్యార్థులు

వాలంటీర్ల శ్రమదానం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు కళాశాల సమీపంలోని ఖాళీ స్థలంలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. గడ్డిమొక్కలను, ప్లాస్టిక్, వ్యర్థపదార్థాలు, చిత్తుకాగితాలను తొలగించి శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ అధికారులు జి.వి.ఎస్.నాగేశ్వరరావు, కె.సుధాకర్ పట్నాయక్, పోలుకొండ సాయి, కె.మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆశయాలు కొనసాగించాలి

టి.నగర్: మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పైరాల అప్పారావు తెలిపారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నగర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తోలేటి రాంప్రసాద్, పైరాల రమేష్, సుధాకర్, ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 83282 39927, 80089 02897

సమస్య: స్థానిక సంజీవయ్యనగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రిపూట రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. - **లక్ష్మీ**

సమస్య : స్థానిక లలితానగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. అంధకారం నెలకొంది. - **శిరీష**

సమాధానం : సిబ్బందిని పంపించి ఆయా ప్రాంతాల్లో వీధిదీపాలకు మరమ్మతులు చేపడతాం.

- విమల, మున్సిపల్ విద్యుత్తు ఏఈ

సమస్య : స్థానిక లాలాచెరువు వద్ద కాలువలో పూడిక పేరుకుపోయింది. దీంతో మురుగంతా రోడ్డుపైకి చేరుతుంది. - **స్థానికులు**

సమాధానం : సిబ్బందిని పంపించి పూడిక తొలగించే చర్యలు తీసుకుంటాం.

- వినూత్న, మున్సిపల్ ఆరోగ్యాధికారిణి

– న్యూస్‌టుడే, టి.నగర్

బిల్లులు రూ.కోట్లు.. అందక పాట్లు

నగరపాలక సంస్థలో ఇదీ పరిస్థితి

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో దస్త్రాలు పేరుకుపోయాయి. గత ప్రభుత్వం చివర్లో చేపట్టిన పనులు, ఆ తర్వాత కూటమి అధికారం చేపట్టాక జరిగిన పనులకు సంబంధించి ఏడాది కాలంలో ఎవరూ పట్టించుకోకపోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఒప్పంద కార్మికులకు చెల్లించాల్సిన జీతాల బిల్లులకు కూడా మోక్షం కలగడం లేదు. అవి కొలిక్కి రాకుండానే ఇటీవల కమిషనర్ బదిలీ అయ్యారు. ఇప్పుడు ప్రత్యేక అధికారిగా కలెక్టర్ నియమితులయ్యారు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ఆమె చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పేరుకుపోయిన దస్త్రాలు

ఇంజినీరింగ్, రెవెన్యూ, ఆరోగ్య విభాగం, పట్టణ ప్రణాళికా విభాగాలకు సంబంధించి 350 ఫైళ్లు పేరుకుపోయాయి. గత ప్రభుత్వం చివరి ఏడాదిలో సుమారు రూ.40 కోట్ల పనులు చేపట్టారు. వీటిలో కొన్ని బిల్లులు మిగిలిపోయాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేసిన వాటికీ బిల్లులు కావాల్సి ఉంది. అప్పటి రాజకీయ నేతల ఒత్తిడితో పనులు ఎటువంటి అనుమతి లేకుండానే చేసేశారు. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో వెళ్లిన కమిషనర్ ముట్టుకోలేదు. ఆ తర్వాత వచ్చిన కమిషనర్ చూద్దామనుకునేలోపే బదిలీ అయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక విజయవాడ వరదలకు ఇక్కడ నుంచి ఆహారం పంపిణీ, ఇతర ఖర్చులకు నగరపాలక సంస్థ ద్వారా రూ.20 లక్షలు అడ్వాన్సు తీసుకొన్నారు. కేవలం అధికారులు తమ మీద భారం వేసుకొన్నారు. వాటికి బిల్లులు తప్ప, నిధులు విడుదలకు ఎటువంటి ప్రభుత్వ జీఓలు లేకపోవడంతో సొమ్ము విడుదలయ్యే మార్గం లేకుండా పోయింది. ఇక ఆరోగ్య విభాగంలో వాహనాల మరమ్మతులు, ఒప్పంద కార్మికులకు సంబంధించి జీతాల బిల్లులు చేయాల్సి ఉంది. ఒక్క ఇంజినీరింగ్ విభాగంలోనే పాత బిల్లులు రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకూ చెల్లించాల్సి ఉంది. తక్కువ సమయంలో కమిషనర్ బదిలీ కావడంతో ఆ భారం ప్రత్యేక అధికారిగా ఉన్న కలెక్టర్‌పై పడింది. ఇక రోజువారీకి సంబంధించి నీటి శుభ్రత, సరఫరా నిమిత్తం ఖర్చు, పారిశుద్ధ్యం నిర్వహణ, వీధి దీపాలకు విద్యుత్తు బిల్లులు చెల్లింపు తదితరాలన్నీ ఎప్పటికప్పుడు జరగాల్సిన పరిస్థితి ఉంది. వీటన్నింటిపై ప్రత్యేకాధికారిగా ఉన్న కలెక్టర్ ఎలా మాత్రం స్పందిస్తారో వేచిచూడాలి.

నగరపాలక సంస్థ కార్యాలయం

వీనుల విందుగా గాత్ర సంగీతం

ఆలపిస్తున్న గాయత్రి విభావరి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీసద్గురు సన్నిధి నెలవారీ సాంస్కృతిక కార్యక్రమం ఆదివారం సాయంత్రం గోదావరిగట్టున శ్రీత్యాగరాజ నారాయణదాస సేవాసమితి ప్రాంగణంలో జరిగింది. బలభద్రపాత్రుని నిఖిల్ రాధాకృష్ణ వేణుగానంతో అలరించారు. అనంతరం చెన్నైకు చెందిన వ్యాకరణం గాయత్రి విభావరి గాత్ర సంగీతం వీనుల విందుగా సాగింది. హైదరాబాద్‌కు చెందిన సరస్వతుల పార్థివ వయోలిన్, విశాఖపట్నానికి చెందిన దువ్వాడ ధర్మారావు మృదంగం, హైదరాబాద్‌కు చెందిన సీతారామ కౌండిన్య ఘటంపై సహకరించారు. నగరానికి చెందిన పలువురు కళాభిమానులు హాజరయ్యారు.

విశిష్ట సేవలకు పురస్కారాలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఎస్వీ కళాకారుల సంఘం వ్యవస్థాపకుడు చల్లగాలి శ్రీనివాస్‌వర్మ నిర్వహణలో శోభిత్‌వర్మ కళాసేవా పురస్కారాల కార్యక్రమం ఆదివారం సరస్వతీఘాట్‌లో జరిగింది. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న కళాకారులు పేరపు నాగ అరసా దుర్గా మణికంఠస్వామి, షణ్ముఖి యశస్విని కావ్య తదితరులకు ముఖ్యఅతిథిగా హాజరైన సినీగేయ రచయిత రసరాజు పురస్కారాలు అందజేశారు. లోలభట్టు శ్రీనివాసరాజు, బి.హెచ్.వి.రమాదేవి, భగీరధరాజు, సీహెచ్.వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

పురస్కారగ్రహీతలతో నిర్వాహకులు

పురందేశ్వరి దంపతుల పరామర్శ

కోనేరు మురళి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పురందేశ్వరి, వెంకటేశ్వరరావు

దేవిచౌక్, న్యూస్‌టుడే: పుత్ర వియోగంతో బాధపడుతున్న తెదేపా నాయకుడు కోనేరు మురళీకృష్ణసాయిని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతులు ఆదివారం పరామర్శించారు. మురళీ తనయుడు సుష్మంత్ వెంకట్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు ఓదార్చి తమ సానుభూతి తెలిపారు. భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులున్నారు.

ముత్యాలమ్మకు సారె

రాజానగరం: స్థానిక గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లికి తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు తీపి కావిళ్లతో సుమారు 1500 కిలోలకు పైగా స్వీట్లను ఆషాడమాసం సారెగా సమర్పించారు. చిన్నారుల కోలాటం, డోలు, సన్నాయి మేళాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకు సాగుతూ ఉన్నతంగా ఎదగాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఆకాంక్షించారు. మంగళవారపుపేట వద్ద ఉన్న ట్రైనింగ్ కళాశాల ఆవరణలోని పాఠశాలలో 1969 అలుమ్ని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదోతరగతిలో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులను న్యాయమూర్తి చేతుల మీదుగా అందజేశారు. సబ్జెక్టుల వారీగా అధిక మార్కులు సాధించిన వారికి ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో అనుకున్న లక్ష్యం చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. ట్రస్ట్ కార్యదర్శులు కె.కె. వెంకటేశ్వర్లు, పి.సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థికి నగదు బహుమతి అందిస్తున్న జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప

మధుర స్వరం.. మంగళంపల్లి సొంతం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : మరపురాని మధుర స్వరం మంగళంపల్లి బాలమురళీకృష్ణ సొంతమని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఏవీఏరోడ్డు శ్రీనివాసా నగర్‌లోని పార్కులో ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేసిన మంగళంపల్లి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన తల్లి వీరాయమ్మ మేయర్‌గా ఉన్న సమయంలో ఈ పార్కు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. బాల్యంలోనే బాలమురళీకృష్ణ సప్త స్వరాలతో అనుబంధం పెంచుకుని అద్భుత కీర్తనలు మనకు అందించారని కొనియాడారు. ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, శిల్పి రాజ్‌కుమార్ వడయార్, కాశీ నవీన్ కుమార్, రెడ్డి మణీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళంపల్లి బాలమురళీకృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు

మానవత సేవలు అభినందనీయం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం వైఎంవీఏ హాలులో ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మానవత సేవలను ప్రశంసించారు. అనాథలకు ఫ్రీజర్ బాక్సులు, శాంతి రథం, జబ్బు పడిన వారికి ఉచిత అంబులెన్స్ సర్వీసు, పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిత్వ వికాసం, నిరుపేదల విద్యకు చేయూత తదితర సేవలు అందించడం అభినందనీయమన్నారు. నూతన అధ్యక్షుడిగా బూరగడ్డ మురళి, కార్యదర్శిగా విశ్వనాథం, ఉపాధ్యక్షుడిగా మెహర్ మధు, సంయుక్త కార్యదర్శిగా అగ్నిహోత్రం శ్రీనివాసన్ తదితరులు ప్రమాణం చేశారు. జిల్లా కేంద్ర సమన్వయ కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఎస్.జానకి రామారావు, డి.బాపిరాజు, రాధామాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణం చేస్తున్న మానవత సభ్యులు

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం 63వ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం లయన్స్ గోదావరి కమ్యూనిటీ హాలులో ఆదివారం ఘనంగా జరిగింది. తొలుత 62వ ఏడాది అధ్యక్షుడు మద్దుల శ్రీరామగుప్తా తన పదవీ కాలంలో చేసిన సేవా కార్యక్రమాలను వివరించారు. పూర్వపు డిస్ట్రిక్ట్ గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎం.ఎన్.వి.కిరణ్ కుమార్, కార్యదర్శిగా తేజ కల్దారి, కోశాధికారిగా తమ్మన అగం ప్రీతమ్, ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. వైస్ గవర్నర్ సీహెచ్.శ్రీనివాస్, కొయ్యాన కుమారి, కొల్లూరు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తొలి ఏకాదశి పర్వదినం.. భక్తజన పరవశం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం నగరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. దేవాదాయశాఖ పరిధిలోని దేవీచౌక్ వేంకటేశ్వర మఠంలో తెల్లవారుజాము నుంచి స్వామివారికి అభిషేకం, అర్చన, విశేష అలంకారం నిర్వహించారు. ఆలయ ఆవరణలోని చెన్నకేశవస్వామి వారికి అభిషేకం, పూజలు జరిగాయి. ఆలయ అర్చకుడు ఖండవల్లి పవన్ కుమార్ ఆచార్యులు నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. ● ఆర్యాపురం సత్యనారాయణ స్వామివారి ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకం, విశేష అలంకరణ చేశారు. ఆలయ ఆవరణలోని వేదికపై స్వామివారికి పూజలు నిర్వహించి భక్తులతో సామూహిక సత్యనారాయణ స్వామివారి వ్రతాలు జరిపించారు. ● నల్లమందుసందులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి తులసి దళార్చన, హారతి వేడుక నిర్వహించారు. ● కోరుకొండ రోడ్డులోని శ్రీవారి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. ● స్థానిక దశావతార రామమందిరంలో తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారికి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ● స్థానిక రామకృష్ణనగర్ పేపరుమిల్లు సొసైటీ బిల్డింగ్‌లోని శ్రీరామాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ఏకాహం నిర్వహించారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మొదలుకుని అర్చకుల ఆధ్వర్యంలో 24 గంటలపాటు నిర్విరామంగా రామనామం జపిస్తూ భక్తిగీతాలను ఆలపించారు.

ఏవీఏ రోడ్డు: దేవిచౌక్ జగన్నాథ ఆలయం వద్ద క్యూలైన్లలో బారులు తీరారు. దేవుని దర్శనానికి చాలా సేపు వేచి ఉండాల్సి వచ్చింది.

దేవీచౌక్ వేంకటేశ్వర మఠంలో స్వామివారికి విశేష అలంకారం

నల్లమందు సందులో సర్వాంగ సుందరంగా..

కంబాలచెరువు వద్ద కల్యాణ వేంకటేశ్వర స్వామి

స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

రామకృష్ణనగర్ రామాలయంలో ఏకాహం కార్యక్రమంలో భక్తులు

ఆర్యాపురం సత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

దేవీచౌక్, న్యూస్‌టుడే: అత్యవసర మరమ్మతుల నిమిత్తం సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

● **ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు:** వెంకటేశ్వరనగర్, వాకర్స్ పార్కు రోడ్డు, మహాలక్ష్మి గుడి వీధి, ఏవీఏ రోడ్డు, వెంకటేశ్వర స్వామి గుడి ప్రాంతం, బాలాజీ వీధి, అద్దేపల్లి కాలనీ, శీలానగర్, శ్రీనివాసగార్డెన్స్, శారదానగర్, గోపాలనగర్ పుంత, విద్యుత్తు కాలనీ, ● **ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు:** తొర్రేడు గ్రామంలోని టిడ్కో గృహ సముదాయం, బాలజీ లేఅవుట్, పెట్రోల్‌బంక్ ప్రాంతం, సాయిబాబా గుడి ప్రాంతం, వెంకటనగరం

మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం

దేవీచౌక్, న్యూస్‌టుడే: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ, మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌లు, ఆ మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని భాజపా నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని భాజపా జిల్లా కార్యాలయంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి, జగ్జీవన్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, భాజపా నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఏ పదవిలో ఉన్నా అంకిత భావంతో పనిచేశారని కొనియాడారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ విలువలకు కట్టుబడిన వ్యక్తి అని తెలిపారు. భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రేలంగి శ్రీదేవి, అడబాల రామకృష్ణారావు, నర్సిపల్లి హారిక, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్, పొట్లూరి రామ్మోహనరావు, జి.వి.రాత్నారెడ్డి, యానాపు ఏసు, లక్ష్మీనారాయణ జవ్వార్, తదితరులు పాల్గొన్నారు.


శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించిన ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, భాజపా నాయకులు

'లేబర్ కోడ్‌లతో కార్మికులకు నష్టం'

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: కార్మిక చట్టాల స్థానంలో కేంద్రం తీసుకురానున్న నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌ల రద్దుకు ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మున్సిపల్ స్టేడియం వద్ద ఉన్న ఏఐటీయూసీ కార్యాలయంలో కేంద్ర కార్మిక సంఘాల సమావేశం జరిగింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.రాంబాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థల లాభాల కోసం కార్మికులను కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందర్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, పూర్ణిమరాజు, ఎస్.ఎస్.మూర్తి, ఐఎఫ్‌టీయూ నాయకులు అప్పారావు, ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కేంద్ర కార్మిక సంఘాల నాయకులు

ఘనంగా గురుపూజోత్సవం

బొమ్మూరు, న్యూస్‌టుడే: ఆర్ఎస్ఎస్ ద్వారా భారతదేశంలో అనేక సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని గోదావరి విభాగ్ సహసంఘ్‌చాలక్ రిమ్మలపూడి సుబ్బరాజు అన్నారు. హుకుంపేట గోదావరి రుచులు ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో గురుపూజ మహోత్సవం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ సర్పంచి దుద్దిపూడి రామకృష్ణ, వివేకాందన సేవ భారతి ప్రెసిడెంట్ సత్యానందమూర్తి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ 1925లో నాగ్‌పూర్‌లో 15 మంది పిల్లలతో డా.కేశవరావు ప్రారంభించారన్నారు. విభాగ్ శారీరక ప్రముఖ్ రాచకొండ ప్రసాద్ మాట్లాడుతూ 2025 విజయదశమికి 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా అనేక కార్యక్రమాలు చేపడతామన్నారు. బొప్పన నానాజీ, దుద్దుపూడి రమేష్, తనుబద్ది సూర్యబాస్కర్, సిద్దాని వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సుబ్బరాజు

పడితే అంతే

నగరంలోని నిత్యం రద్దీగా ఉండే ఆనంద్‌నగర్ డౌన్ ఏరియా మార్గంలో ఫుట్‌పాత్ వెంట ఉన్న చాలా మ్యాన్‌హోల్స్‌కు గ్రిల్స్ పూర్తిగా పాడై, కొన్నింటికి మూతలు లేక ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతంలో పాఠశాలలు ఉండడంతో విద్యార్థులు, పాదచారులు సంచరిస్తుంటారు. ఎవరైనా ఏమరుపాటుగా ఉంటే పెనుప్రమాదం తప్పదు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి నూతన గ్రిల్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు**

తాకితే తంటాయే..!

నగరంలోని చాలా ప్రాంతాల్లో విద్యుత్తు నియంత్రికల వద్ద అమర్చిన ఫ్యూజుబాక్సులకు రక్షణ లేకుండా దర్శనమిస్తున్నాయి. పిల్లలకు సైతం అందే ఎత్తులో ప్రమాదకరంగా ఉండడంతో నగరవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

చందా సత్రం వద్ద బహిరంగంగా ఫ్యూజ్‌బాక్స్


టి.నగర్ ఎస్.ఎన్.టి పాఠశాల రోడ్డులో

పందుల సంచారం.. వ్యాధుల భయం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో పలు చోట్ల పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. అసలే వర్షాకాలం, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వరాహాలతో ప్రజలు ఆందోళన చేస్తున్నారు. వాస్తవంగా పందుల పెంపకందారులకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరానికి దూరం ప్రత్యేకంగా స్థలం కేటాయించారు. చాలామంది అక్కడకు వెళ్లేందుకు ఇష్టపడడం లేదు. శివారు ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి పెంచుతున్నారు. ఉదయం వేళల్లో వాటిని నగరంలోకి వదులుతున్నారు. దీంతో శివారును ఆనుకొని ఉన్న డివిజన్లలో అవి తిరుగుతున్నాయి. వర్షాకాలంలో చెత్త నిల్వ ఉన్న చోట చేరి చెల్లాచెదురు చేస్తున్నారు. ఇప్పటికే అర్బన్‌లో దోమలు పెరిగిపోయి ప్రజలు అనేక రకాలుగా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు పందుల సంచారంతో అపరిశుభ్ర వాతావరణం చోటు చేసుకొంటుంది. ఈ నేపథ్యంలో యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

ముత్యాలమ్మకు ఆషాఢం సారె

రాజానగరం: స్థానిక గ్రామదేవత ముత్యాలమ్మ తల్లికి తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు తీపి కావిళ్లతో సుమారు 1500 కేజీలకు పైగా స్వీట్లను ఆషాఢమాసం సారెగా సమర్పించారు. చిన్నారుల కోలాటం, డోలు, సన్నాయి మేళాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని నూకాలమ్మ తల్లికి సైతం ఆషాఢమాసం సారెను సమర్పించారు.

విశిష్ట సేవలకు పురస్కారాలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఎస్వీ కళాకారుల సంఘం వ్యవస్థాపకుడు వల్లభాని శ్రీనివాసవర్మ నిర్వహణలో కోటీశ్వర్మ కళాసేవా పురస్కారాల కార్యక్రమం ఆదివారం సరస్వతీహాల్‌లో జరిగింది. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న కళాకారులు పేరపు నాగ అరసా దుర్గా మణికంఠస్వామి, షణ్ముఖి యశస్విని కావ్య తదితరులకు ముఖ్య అతిథిగా హాజరైన సినీగేయ రచయిత రసరాజు పురస్కారాలు అందజేశారు. లోలభట్టు శ్రీనివాసరాజు, బి.హెచ్.వి.రమాదేవి, భోగిరదరాజు, సీహెచ్.వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరికి యోగాంధ్ర ప్రశంసాపత్రం

కడియం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం సెంట్రల్ పరిధిలో విజయవంతానికి తనవంతు కృషి చేసిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావుకు యోగాంధ్ర ప్రశంసాపత్రం లభించింది. ఆ మేరకు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో చిలుకూరికి అందించారు.

ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న మంత్రి దుర్గేశ్

ఇంటింటా ప్రచారంలో రుడా ఛైర్మన్ తదితరులు

తెదేపాకు కార్యకర్తలే బలం: బీవీఆర్ చౌదరి

సీతానగరం: కార్యకర్తల త్యాగాల ఫలితంగానే తెదేపా సంస్థాగతంగా బలంగా ఉందని రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి అన్నారు. ఆదివారం లంకూరు, వెలంపేట, సీతానగరం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై ఇంటింటా ప్రచారంలో తెదేపా శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు గెద్దం తిమ్మారావు అధ్యక్షతన ఆదివారం తెదేపా సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆదేశాలను గ్రామం నుంచి నియోజకవర్గ స్థాయి వరకు అన్ని శాఖలు ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. పార్టీ నాయకులు పెందుర్తి అచ్యుతరామారావు, వలవల రాజా, చిట్టూరి రంగారావు, చెరుకూరి ఫణికుమారి, పల్లి శశికళ పాల్గొన్నారు.

కడియం: వేమగిరిలో తెదేపా నాయకుల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవిరామ్‌కిరణ్ మాట్లాడుతూ.. కూటమి పాలనలో ప్రజాసంక్షేమానికి ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల ప్రాధాన్యతను వివరించారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, రాష్ట్ర తెలుగురైతు ఉపాధ్యక్షుడు ఎం సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీను పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం వైఎంవీఏ హాలులో ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మానవత సేవలను ప్రశంసించారు. అనాథలకు ఫ్రీజర్ బాక్సులు, శాంతి రథం, జబ్బు పడిన వారికి ఉచిత అంబులెన్స్ సర్వీస్, పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిత్వ వికాసం, నిరుపేదల విద్యకు చేయూత తదితర సేవలు అందించడం అభినందనీయమన్నారు. నూతన అధ్యక్షుడిగా బూరగడ్డ మురళి, కార్యదర్శిగా విశ్వనాథం, ఉపాధ్యక్షుడిగా మెహర్ మధు, సంయుక్త కార్యదర్శిగా అగ్నిహోత్రం శ్రీనివాసన్ తదితరులు ప్రమాణం చేశారు. జిల్లా కేంద్ర సమన్వయ కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఎస్.జానకి రామరాజు, డి.భాస్కరరావు, రాధామాధవి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా సిద్ధం!

సీతానగరం, న్యూస్‌టుడే: రైతు సమస్యలను గుర్తించిన కూటమి ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని అమలు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. అర్హులైన వారందరికీ సాయం అందించాలని నిర్ణయించింది. ఇప్పటికే లబ్ధిదారుల జాబితాను వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. పథకంలో అర్హులుగా ఉన్నామా? లేదా అనేది ఆర్‌ఎస్‌కే వద్ద ఆధార్ సాయంతో రైతులు తెలుసుకోవచ్చు.

గతం కన్నా ఎక్కువగా..

గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా పథకం ద్వారా రూ.13,500 పెట్టుబడి సాయం అందించారు. వాటిలో పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు అందించగా రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 ఇచ్చేది. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.20వేల సాయాన్ని పెంచింది. గత ప్రభుత్వం కంటే పెట్టుబడి సాయం పెంచడంతో చిన్న, సన్నకారు రైతులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. పథకానికి అర్హత సాధించని రైతులు ఆయా గ్రామ వ్యవసాయ సహాయకులకు అర్జీలు అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో కొత్తగా భూములు కొనుగోలు చేసుకున్న రైతుల వివరాలు నమోదై ఉండేవి కాదు. 2019 వెబ్‌ల్యాండ్ ప్రకారమే అన్నదాత సుఖీభవ ఇచ్చేవారు. దీంతో వేలాది మంది రైతులు ఇబ్బందులు పడేవారు.

కోరుకొండలో వరినాట్లు

డివిజన్ పరిధిలో..

నియోజకవర్గం	అన్నదాత సుఖీభవ అర్హులు	పథకం రూ.లలో
రాజానగరం	26,352	52,70,40,000
రాజమహేంద్రవరం గ్రామీణం	5,655	1,13,10,000
అనపర్తి	17,858	35,71,60,000
గోకవరం	7,824	15,64,80,000

57,689 మంది అర్హులు..

డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో 57,689 మందికి అన్నదాత సుఖీభవ పథకంలో మొదటి విడతగా రూ.7వేలు జమచేయనుంది. అర్హులైన వారికి ఇప్పటికే ఈకేవైసీ పూర్తిచేశారు. ఇప్పటివరకు సొంత భూములు కలిగి వెబ్‌ల్యాండ్ ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం ఇస్తుండగా కౌలుదార్లకు కలిగినవారికి పథకం వర్తింపజేయాలని ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి కేంద్రానికి నివేదికలు ఇచ్చింది. కేంద్రం ఆమోదం వచ్చిన వెంటనే వారికి కూడా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు.

రైతుల ఖాతాల్లో జమ అవుతుంది

అన్నదాత సుఖీభవ పథకం కింద గ్రామాల వారీగా అర్హుల జాబితాలను సిద్ధం చేశాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే లబ్ధిదారుల ఖాతాల్లోకి మొదటి విడత సాయం జమ అవుతుంది. అర్హత వివరాలను రైతులు ఆధార్‌తో ఆర్‌ఎస్‌కేలో తెలుసుకోవచ్చు. అర్హత సాధించని రైతుల అర్జీలను స్వీకరిస్తున్నాం. ఇవన్నీ పూర్తిచేస్తే లబ్ధిదారులు పెరుగుతారు.

-బీకే మల్లికార్జునరావు, ఏడీఏ, వ్యవసాయశాఖ

కార్యక్రమంలో మాట్లాడుతున్న సుబ్బరాజు

గురుపూజ మహోత్సవం

బొమ్మూరు, న్యూస్‌టుడే: ఆర్‌ఎస్ఎస్ ద్వారా భారతదేశంలో అనేక సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని గోదావరి విభాగ్ సహసంఘచాలక్ దిమ్మలపూడి సుబ్బరాజు అన్నారు. హుకుంపేట గోదావరి రయాలు ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో గురుపూజ మహోత్సవం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ సర్పంచి దుద్దిపూడి రామకృష్ణ, వివేకానంద సేవా భారతి ప్రెసిడెంట్ ఈ సత్యానందమూర్తి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 1925లో నాగపూర్‌లో 15 మంది పిల్లలతో డా. కేశవరావు ఆర్‌ఎస్ఎస్ ప్రారంభించారన్నారు. విభాగ్ శారీరక ప్రముఖ్ రాచకొండ ప్రసాద్ మాట్లాడుతూ 2025 విజయదశమికి 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా అనేక కార్యక్రమాలు చేపడతామన్నారు. బొప్పన నానాజీ, దుద్దుపూడి రమేష్, తనుబిద్ది సూర్యభాస్కర్, సిద్దాని వెంకట్ పాల్గొన్నారు.

నేటి నుంచి పశుగ్రాస వారోత్సవాలు

బిక్కవోలు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఆదాయం కల్పించడం కోసం సోమవారం నుంచి పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ సహాయసంచాలకులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ వారోత్సవాలు ఈనెల 14వ తేదీవరకు నిర్వహిస్తామని వెల్లడించారు. సిబ్బంది గ్రామాలకు వెళ్లి పశుగ్రాసాలు పశువులకు బలవర్ధకంగా ఉంటాయో చెప్పి, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరిస్తామని వెల్లడించారు. పశుగ్రాసాలు కొత్తగా సాగు చేపడదలచుకున్న రైతులకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందన్నారు.

నేడు ఉచిత నేత్ర శిబిరం

రంగంపేట: రంగంపేట మండలం వడిశలేరులోని అరుంధతిపేటలో సోమవారం ఉచిత నేత్ర శిబిరం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకుడు దాసరి రవికుమార్ తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నామని, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరై వీటిని ప్రారంభించనునట్టు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి

బొమ్మూరు, న్యూస్‌టుడే: వేంకటేశ్వరస్వామి ఆలయం తొలిఏకాదశి పూజలు బొమ్మూరులో వైభవంగా జరిగాయి. సుప్రభాత సేవ అనంతరం స్వామికి వివిధ కైంకర్యాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్చకుడు వల్లీకాంతచార్యులు భక్తులచేత ప్రత్యేక పూజలు చేయించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో

రాజానగరం: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా పలు గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు బారులు తీరారు. దివాన్‌చెరువు, రాయుడుపాక, చక్రద్వారబంధం, నరేంద్రపురం తదితర గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి వారి విగ్రహాలకు విశేష అలంకరణ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు: బిక్కవోలు: మండలంలోని వైష్ణవ దేవాలయాలు ఆదివారం భక్తులతో కళకళలాడాయి. బలభద్రపురంలోని వేణుగోపాలస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి, బిక్కవోలులోని లక్ష్మీనారాయణ స్వామి తదితర దేవాలయాలు భక్తులతో కళకళలాడాయి. ఉదయం అమ్మవార్లకు, స్వామివారికి పంచామృతాభిషేకంతోపాటు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి విగ్రహాలను ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. బలభద్రపురంలో మహిళలు హాజరై శ్రీవిష్ణుసహస్రనామాలు చదివారు.

పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు

అనపర్తి గ్రామీణం, బిక్కవోలు, కడియం: జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధులపై అప్రమత్తత అవసరమని అనపర్తి ప్రాంతీయ పశువైద్యశాల సహాయసంచాలకుడు డా.వై. శ్రీనివాసరావు అన్నారు. అనపర్తి ప్రాంతీయ పశు వైద్యశాలలో జూనోసిస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కుక్కలకు ఉచితంగా రేబీస్ నిరోధక టీకాలు వేశారు. శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, డా. రామచంద్రరెడ్డి పాల్గొన్నారు. ★ అనపర్తి, బిక్కవోలు మండలాల్లోని 450 పెంపుడు జంతువులకు రేబిస్ వాక్సిన్లు ఉచితంగా వేసినట్లు అనపర్తి పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు తెలిపారు.

★ కడియం పశువైద్యశాలలో ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని ఆ శాఖ ఏడీ డాక్టర్ రవి వర్మ నేతృత్వంలో ఆదివారం జరిగింది. పెంపుడు జంతువులకు ప్రభుత్వం అందించే రేబీస్ వంటి ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ అన్నారు. శునకాలతో పాటు పాడి గేదెలు, ఆవులకు ప్రభుత్వం అందించే టీకాలను ఉపయోగించుకోవాలన్నారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఉపసర్పంచి వెలుగుబంటి రఘురామ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జంతు ప్రేమికులకు సూచనలిస్తున్న డాక్టర్ రవిరామ్ కిరణ్

వ్యాక్సిన్ వేస్తున్న అనపర్తి ఏడీఏ శ్రీనివాసరావు

ఆఖరి మజిలీకి అవస్థలు

గోకవరం, కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని కామరాజుపేట,అచ్యుతాపురం,కొత్తపల్లి, తిరుమలయ్యపాలెం పలు గ్రామాల్లో నేటికి సరైన శ్మశానవాటికలు లేక జనం అవస్థలు వర్ణనాతీతం. వానాకాలం వచ్చిందంటే పరిస్థితి దయనీయం. కనీసం దారి మార్గం లేకుండా ఉన్న శ్మశానవాటికల్లో అంతిమయాత్రకు ప్రజల పాట్లు అన్నీ ఇన్నీ కావు. చాలా గ్రామాల్లో కాలువలు, చెరువుల కళింగలు దాటి వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికే వర్షాలు ప్రారంభం కావడంతో కాలువలు, చెరువులు నీటితో నిండి ఉన్నాయి. నీటి ఉద్ధృతి పెరిగినప్పుడు అంతిమయాత్ర బంధువులకు సవాలుగా మారుతుంది.

అంత్యక్రియలకు కాలువ దాటుతున్న గ్రామస్థులు

కోరుకొండ మండలంలో.. చాలాచోట్ల శ్మశానవాటికలు అభివృద్ధికి నోచుకోలేదు. కోరుకొండలోనే తుప్పలు మొలిచి అధ్వానంగా ఉంది. పశ్చిమగానుగూడెంలో చెరువు గట్టు దాటి వెళ్లాల్సి ఉంది. వర్షాలు పడినప్పుడు ఈ ప్రాంతం నీటితో నిండి అంత్యక్రియలకు ఇబ్బందిగా ఉంది. గతంలో తెదేపా హయాంలో శ్మశానవాటికల అభివృద్ధితోపాటు దహనసంస్కారాలకు అనువుగా పొయ్యిలు, విశ్రాంతి గదులను ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల నిర్మాణాలు మధ్యలో నిలిచాయి. పూర్తి చేయాలని ప్రజలు వేడుకొంటున్నారు.

ఉద్ధృతి తగ్గే వరకు ఆగాల్సిందే

కామరాజుపేట గ్రామంలో వర్షాకాలం వచ్చిందంటే అంత్యక్రియలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి ప్రధాన కారణం అంత్యక్రియలకు బురదకాలువ దాటి వెళ్లాల్సిరావడమే. ఇప్పటికైన అధికారులు చర్యలు చేపట్టి ఈ పరిస్థితి నుంచి మమ్మల్ని కాపాడాలి.

– పైడిమళ్ల లక్ష్మణరావు, కామరాజుపేట

నిధులు మంజూరు

అచ్యుతాపురం గ్రామంలో సమస్య పరిష్కారానికి రూ.22 లక్షలు నిధులను మంజూరు చేశాం. శ్మశానవాటిక వెళ్లే దారిలో తూరలతో పాటు పైన సీసీరోడ్డు నిర్మించి రోడ్డు మార్గం కల్పిస్తాం. శ్మశానవాటికలు అధ్వానంగా ఉన్న చోట ఉపాధిహామీ నిధులలో విశ్రాంతి గది, పొయ్యి, గేటు వంటివి నిర్మించుకునేందుకు రూ.19 లక్షలు మంజూరు చేస్తున్నారు. గోకవరం మండలంలో మూడు గ్రామాలలో ఈ పనులు చేపట్టనున్నాం. ఇక మిగిలిన చోట్ల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం.

– గోవిందు, ఎంపీడీవో, గోకవరం

వీనులవిందుగా గాత్ర సంగీతం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: శ్రీసద్గురు సన్నిధి నెలవారీ సాంస్కృతిక కార్యక్రమం ఆదివారం గోదావరిగట్టున శ్రీత్యాగరాజ నారాయణదాస సేవాసమితి ప్రాంగణంలో జరిగింది. చెన్నైకు చెందిన వ్యాకరణం గాయత్రి విభావరి గాత్ర సంగీతం వీనుల విందుగా సాగింది. హైదరాబాద్‌కు చెందిన సరస్వతుల పార్థివ వయోలిన్, విశాఖపట్నానికి చెందిన దువ్వాడ ధర్మారావు మృదంగం, హైదరాబాద్‌కు చెందిన సీతారామ కౌండిన్య ఘటంపై సహకరించారు.

కోడి పందేల శిబిరాల్లో పది మంది అరెస్టు

రాజానగరం, న్యూస్‌టుడే: పలు గ్రామాల్లోని కోడి పందేల శిబిరాలపై దాడులు చేసి పది మందిని అరెస్టు చేశామని సిఐ ఎస్.ప్రసన్నవీరయ్య గౌడ్ ఆదివారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సంపతనగరంలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రూ.ఏడు వేల నగదు, రెండు కోళ్లు, పాత వెలుగుబందలో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి రూ.3,900ల నగదు, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

గోదాము వినియోగంలోకి వచ్చేనా?

రాజానగరంలోని మండల పరిషత్తు కార్యాలయం వెనుక కానవరం వ్యవసాయ సహకార పరపతి సంఘానికి సంబంధించిన బహుళ ప్రయోజనసౌకర్య గోదాము నిరుపయోగంగా మారింది. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాము నిర్మాణానికి రూ.40 లక్షల నుంచి రూ.42 లక్షల వరకూ నిధులు వెచ్చించి నిర్మించారు. నిర్మాణం పూర్తయి ఏడాదైనా ఇప్పటి వరకూ వాడుకలోకి రాలేదు. సంబధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, రాజానగరం

తాగునీటికి కోటి కష్టాలు..!

గోదావరి పక్కనే ఉన్న ప్రజలు తెల్లవారితే గుక్కెడునీటికోసం అష్టకష్టాలు పడుతున్నారు. రాజానగరం నియోజకవర్గంలో గోదావరి జలాలు సరఫరా చేసే పైపులైన్లు మరమ్మతులతో పలుచోట్ల ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. కోరుకొండ మండలం కోటి గ్రామానికి చెందిన ప్రజలు 12 కిలోమీటర్ల దూరంలోని సీతానగరం మండలం చీపురపల్లి వెళ్లి డబ్బాలతో నీళ్లు తెచ్చుకుంటున్నారు. ద్విచక్ర వాహనాలు లేనివారు ఆటోలు, ఇతరత్రా వాహనాలపై చేరి తాగునీరు తెచ్చుకోవడం తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇతరత్రా బకాయిలు సుమారు రూ.14.56 కోట్లు పెండింగ్‌లో ఉండటం, పలుచోట్ల పైపులైన్లు మరమ్మతులు పెరిగిపోయి తాగునీటికి అవాంతరాలు వస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, సీతానగరం

అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనాలి

కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలో సోమవారం జరుగనున్న పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కూటమి శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కోరారు. గాదరాడలోని తన స్వగృహంలో కూటమి నాయకులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఎంపీ పురందేశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొని రూ.13.14 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. తెదేపా, జనసేన, భాజపా నాయకులు, కార్యకర్తలు హాజరుకావలసిందిగా కోరారు.

కూటమి నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

కడియం: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తామని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణు అన్నారు. ఈ మేరకు శాటిలైట్‌సిటీలో ఆదివారం ఉదయం జరిగిన ఆదర్శ దివ్యాంగుల ఆశ్రమ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.. ఆశ్రమ ఆదాయ వనరుల పెంపుతో పాటు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం దివ్యాంగులకు ఆహారాన్ని వడ్డించారు. అల్లాటి రాజు, ఉగ్గిన శేఖర్, బూసి వజ్రనాథ్, కంది కిశోర్, మనోహర్, రమేశ్, చింతలపాటి శివ పాల్గొన్నారు.

ఆహారాన్ని వడ్డిస్తున్న వేణు

ఫోన్ల చోరీ ముఠాకు రిమాండు

సైదాబాద్ (హైదరాబాద్), న్యూస్‌టుడే: ఫోన్లు చోరీ చేస్తున్న ముఠా సభ్యులను సైదాబాద్ పోలీసులు రిమాండుకు తరలించారు. డీఐ ఆనంద్ కుమార్ కథనం ప్రకారం.. కర్నూలు నంద్యాలకు చెందిన గరడి మహేశ్ (35) కొత్తపేటలో, చిత్తూరు మంగ సముద్రం రూరల్ నెహ్రూనగర్ నివాసి జి.రాము(31), తూర్పు గోదావరి బిక్కవోలుకు చెందిన ఉత్తుకురి ఏసు(33), అంబటి సుధాకర్ (24) అల్మాస్‌గూడ రాజీవ్ గృహకల్పలో ఉంటున్నారు. ఐదేళ్ల క్రితం పలు కేసుల్లో పట్టుబడి జైలుకు వెళ్లారు. విడుదలయ్యాక ముఠాగా ఏర్పడి ఫోన్ల చోరీ ప్రారంభించారు. గత నెల 22న మాదన్నపేటలో, 26న మీర్‌పేటలో, 30న సైదాబాద్‌లో వృద్ధుల నుంచి ఫోన్లు అపహరించారు. నిఘా పెట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి తొమ్మిది ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

'లేబర్ కోడ్‌లతో కార్మికులకు నష్టం'

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: కార్మిక చట్టాల స్థానే కేంద్రం తీసుకురానున్న నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌ల రద్దుకు ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మున్సిపల్ స్టేడియం వద్ద ఉన్న ఏఐటీయూసీ కార్యాలయంలో కేంద్ర కార్మిక సంఘాల సమావేశం జరిగింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, ఏఎన్టీయూసీ జిల్లా కార్యదర్శి కె.రాంబాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థల లాభాల కోసం కార్మికులను కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందర్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, పూర్ణిమరాజు, ఎస్ఎస్.మూర్తి, ఐఎఫ్‌టీయూ నాయకులు అప్పారావు, ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో చర్చిస్తున్న కేంద్ర కార్మిక సంఘాల నాయకులు

మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం

దేవీచౌక్, బొమ్మూరు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ, మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌లు, ఆ మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని భాజపా నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని భాజపా జిల్లా కార్యాలయంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి, జగ్జీవన్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, భాజపా నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ విలువలకు కట్టుబడిన వ్యక్తి అని తెలిపారు. ● అరుంధతిపేటలో బాబు జగజ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా నాయకులు ఆదివారం నివాళి అర్పించారు. యువత బాబు జగజ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమాజసేవకు ఆయన జీవితాన్ని త్యాగం చేసారన్నారు. భీమరశెట్టి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, భాజపా నాయకులు

CHANGE OF NAME

I, PEDAPATI VEERA VENKATA SATYANARAYANA, S/o. Prakasharao, D.No.34-2-22, Bhavana Rushi Temple Street, Mangalavarapupeta, Rajamahendravaram Urban-533101, E.G.Dt. I have changed my name from VEERA VENKATA SATYANARAVAYA PEDAPATI (Old name) to PEDAPATI VEERA VENKATA SATYANARAYANA, (New name) hence forth I am being called PEDAPATI VEERA VENKATA SATYANARAYANA, S/o. Prakasharao, for all purposes.

LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

బ్యాక్ ఆఫీస్, 4వ అంతస్తు, ఉత్తర విభాగం, జీవన్ సమృద్ధి, న్యూ ఇన్వెస్ట్‌మెంట్ భవనం, ఎల్ఐసి ఎనెక్స్ భవనం, తిక్కన్న రోడ్డు, విశాఖపట్నం-530004. ఫోన్ : 0891-2746480.

డిమాండ్ నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింద ప్రకటన)

(I) ఋణగ్రహీత పేరు : శ్రీమతి మాధురీ దేవి మెండి, డి నెం.26-6-14, కొప్పుల వీధి, కంబాల పేట, రాజమండ్రి-533101. మరొక చిరునామా : శ్రీమతి మాధురీ దేవి మెండి, మరొక చిరునామా : 8/P నార్త్-ఈస్ట్ సైడ్, డి నెం.9-6 దగ్గర, ఆర్ ఎస్ నెం. 387/1, 2, కొంతమూరు గ్రామం మరియు కొలమూరు జీపీ, రాజమహేంద్రవరం రూరల్, ఆంధ్రప్రదేశ్-533102.

(II) హౌసింగ్ లోన్ ఖాతా నెం : 711200008638

(III) చెల్లించవలసిన లోన్ బాకీ మొత్తము : రూ. 39,96,673/- (అక్షరాల ముప్పై తొమ్మిది లక్షల తొంభై ఆరు వేల ఆరు వందల డెబ్బై మూడు రూపాయలు మాత్రమే) తేది.12.06.2025 నాటి నుండి వర్తించు తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులతో కలిపి ఈ నోటీసు స్వీకరించిన తేది నుండి 60 దినములలోగా చెల్లించవలెను.

(IV) డిమాండ్ నోటీసు జారీ చేసిన తేది : 11.06.2025 ఎన్‌పిఏ తేది : 10.04.2025

(V) షెడ్యూల్ ఆస్తి వివరములు : కంపెనీ వారికి ఋణము తిరిగి చెల్లింపు కొరకు హామీగా దస్తావేజు నెం.9821/2022 ఈక్విటబుల్ మార్ట్‌గేజ్ ఈ దిగువ చెప్పిన ఆస్తి తనఖా ఉంచినారు.

తూర్పు గోదావరి జిల్లా, పిడింగొయ్యి ఎస్.ఆర్.ఓ పరిధి, రాజమహేంద్రవరం రూరల్ మండలం యొక్క పరిధి, కోలమూరు గ్రామం మరియు గ్రామ పంచాయితీ, ప్లాట్ నెం.8 యొక్క ఉత్తరం-తూర్పు భాగం వైపున పి.ఆర్ నెం.7 మంజూరు చేసిన రెసిడెన్షియల్ ప్లాట్ లే-అవుట్ ప్లాన్, కోలమూరు పంచాయితీ తేది.30.04.1985, సర్వే నెం.387/1 నందు విస్తీర్ణం 7.46 సెంట్లులోని భూమి మరియు ఆర్.ఎస్ నెం.387/2 నందు ఎకరా 2.03 సెంట్లులోని భూమి, మొత్తం విస్తీర్ణం 9.49 సెంట్లులోని అవిభాజ్యమైన మరియు నిర్ధిష్టపరచని వాటాతో ఉన్న విస్తీర్ణం 562.66 చ॥గ॥లుతో డోర్ నెం.115-9-6 దగ్గర, ప్లింత్ ఏరియా 770 చ॥అ॥లుతో బిల్డింగ్ ప్లాన్ మరియు ప్రొసీడింగ్స్ బిఏ నెం.746/2022 తేది.03.06.2022 తో తూర్పు బిట్ విస్తీర్ణం 146.66 చ॥గ॥లు మరియు 122.62 చ॥మీ॥లు మరియు ఉత్తరం బిట్ విస్తీర్ణం 273.99 చ॥గ॥లులోని స్థలం. మొత్తం ఆస్తి హద్దులు : తూర్పు : 30 అ॥ల వెడల్పు రోడ్డు మరియు లే-అవుట్ ప్లాన్ ప్రకారం రోడ్డు, దక్షిణం : శ్రీమతి బొలిశెట్టి రజిత గారికి చెందిన ప్లాట్ నెం.8 యొక్క భాగం, పడమర : శ్రీమతి బొలిశెట్టి రాంబాబు గారికి చెందిన ప్లాట్ నెం.8 యొక్క భాగం, ఉత్తరం : లే-అవుట్ ప్లాన్ ప్రకారం ప్లాట్ నెం.7.

(ఇప్పటి నుండి సెక్యూర్డు ఆస్తి అని పిలువబడును).

పైన చెప్పబడిన ఋణగ్రహీత / సహ-ఋణగ్రహీత LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి నుండి ఇంటి కొరకు ఋణం పొందియున్నారు. సదరు ఋణమునకు పైన పేర్కొన్న ఆస్తిని తనఖాగా ఇచ్చియున్నారు. ఋణము యొక్క నియమ, నిబంధనలను అనుసరించి సకాలంలో బకాయిలు చెల్లించకపోవుటచే సదరు ఖాతాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియమ నిబంధనల ప్రకారము నిరర్ధక ఖాతాగా పరిగణింపబడినది. కావున LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు రిజిస్టర్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసును పంపియున్నారు. పంపించిన డిమాండు నోటీసుకు సంబంధించిన తిరుగు రశీదులు / ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు సంతకములు సరిగా లేకుండా మాకు తిరిగి వచ్చినవి. కనుకనే పత్రికా మూలకముగా మీకు ఈ నోటీసు జారీచేయడమైనది. కావున సదరు ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు పైన పేర్కొన్న మొత్తములను నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా, వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న చట్టము ప్రకారము LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ బకాయిని రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.

తేది : 07.07.2025
స్థలం : విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి
LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

(c) eenadu

కొవ్వూరు

●కొవ్వూరు ●నిడదవోలు ●గోపాలపురం

కోటసత్తెమ్మకు తొలి ఏకాదశి పూజలు

విరాళం అందిస్తున్న మహాలక్ష్మి తదితరులు

నిడదవోలు: తొలి ఏకాదశి సందర్భంగా తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.2,14,011 ఆదాయం సమకూరింది. ప్రత్యేక పూజల్లో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్, ప్రధానార్చకుడు ఎస్వీకేపీ శర్మ పాల్గొన్నారు. ● కోటసత్తెమ్మ ఆలయానికి రాజవరానికి చెందిన గూడవల్లి మహాలక్ష్మి రూ.50 వేల విరాళాన్ని ఈవో వి.హరిసూర్యప్రకాష్‌కు అందించారు.

సిబ్బంది కొరతను తక్షణమే పరిష్కరించాలి

నిడదవోలు: నిడదవోలు ఆర్టీసీ డిపోలో సిబ్బంది కొరత వెంటనే పరిష్కరించాలని కోరుతూ నిడదవోలు ఆర్టీసీ డిపో సాధన, సౌకర్యాల పోరాట సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. కన్వీనర్ జువ్వల రాంబాబు మాట్లాడుతూ బదిలీ అయిన డీఎం స్థానంలో మరొకరిని భర్తీ చేయలేదని, కండక్టర్లు, డ్రైవర్లు బదిలీ అయిన వారి స్థానంలో మరొకరిని నియమించకపోవడం, కొన్ని సర్వీసులు రద్దు చేయడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గంటి కృష్ణ, జి.డానియల్, అంబటి పుల్లారావు, యాసఫ్ షాహి పాల్గొన్నారు.

గజమాలతో ఘన స్వాగతం..

నల్లజర్ల, గోపాలపురం, న్యూస్‌టుడే: గోపాలపురం వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నల్లజర్లలో జరిగింది. ఎమ్మెల్యే, నూతన ఛైర్మన్ల స్వగ్రామం ప్రకాశరావుపాలెం నుంచి నల్లజర్ల వరకు కార్లు, ద్విచక్రవాహనాలతో కూటమి నేతలు భారీగా ర్యాలీ చేపట్టారు. ఎక్కడికక్కడ హారతులు, పూల మాలలు, వాయిద్యాల మధ్య ప్రమాణ స్వీకారం చేసే ప్రాంతానికి తరలివచ్చారు. ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ ఛైర్మన్లకు అభిమానులు రెండు భారీ గజమాలలతో ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, నాలుగు మండలాల అధ్యక్షులు, కూటమిశ్రేణులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెంకటరాజు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బ్రహ్మారాజును గజమాలతో సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

నిఘా నీడలో నిడదవోలు

పట్టణంలో 220 సీసీ కెమెరాల ఏర్పాటు దిశగా అడుగులు

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు పట్టణమంతా సీసీ కెమెరాలు ఏర్పాటు దిశగా పురపాలక సంఘం అడుగులు వేస్తోంది. పట్టణంలో సుమారు 30 ప్రాంతాల్లో గతంలోనే పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో చాలా వరకు మూలకు చేరాయి. రహదారి ప్రమాదాలు, దొంగతనాలకు సంబంధించి కీలక ఆధారాలు కనిపెట్టడం పోలీసులకు తలనొప్పిగా మారుతోంది. పట్టణంలోని గణపతికూడలిలో ప్రజలకు ఆహ్లాదం కల్గించేందుకు నిర్మించిన పార్కులో ఐ లవ్ నిడదవోలు అక్షరాలను ఎల్ఈడీ దీపాలతో ఏర్పాటు చేశారు. దీనిలో కొన్ని అక్షరాలను, విద్యుత్తు తీగలను కొందరు ధ్వంసం చేశారు. ఆర్వోబీ వద్ద పట్టణ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని కొందరు ఛిద్రం చేశారు. ఈ రెండింటిపై పురపాలక అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



నిడదవోలు ఆర్వోబీ వద్ద సీసీ కెమెరాలు

ప్రతిపాదనలు సిద్ధం..

పట్టణమంతా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు, డేటా, సర్వర్ స్టోరేజ్ ఏర్పాటుకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే పలు సంస్థలను సంప్రదించగా ఒక సంస్థ సర్వే నిర్వహించి ప్రధాన కూడళ్లతో పాటు, 28 వార్డుల్లో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుకు 220 సీసీ కెమెరాలు, కేబుల్ వ్యవస్థ, కంట్రోల్ రూం వ్యవస్థ ఏర్పాటుకు రూ.70 లక్షల వరకు అవసరమని ప్రతిపాదనలు తయారు చేశారు. కెమెరాల ఏర్పాటుకు అవసరమయ్యే రూ.70 లక్షలు మంజూరుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బీపీఎస్-2019, ఎల్ఆర్ఎస్-2020 స్కీం ద్వారా నిడదవోలు పురపాలక సంఘానికి రూ.కోటి నిధులు ఈ ఏడాది మార్చి 17న జమయ్యాయి. ఆ నిధుల నుంచి కేటాయించడం గాని, సాధారణ నిధుల నుంచి గాని కేటాయించేందుకు నిర్ణయించారు.

పురపాలక సంఘ వివరాలు..

పట్టణం	నిడదవోలు
జనాభా	50 వేల మంది
విస్తీర్ణం	10.16 చ.కిమీలు
వార్డులు	28
శ్రేణి	ద్వితీయ

కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం..

పట్టణంలో భద్రత, పర్యవేక్షణకు నిఘా వ్యవస్థ ఎంతో అవసరం. అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు, దొంగతనాలు వంటివి కట్టడి చేయడానికి సీసీ కెమెరాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. ప్రస్తుతం పట్టణంలో పూర్తిస్థాయిలో లేకపోవడం వల్ల పురపాలక సంఘ ఆధ్వర్యంలో ఏర్పాటుకు ముందుకు వచ్చాం. కౌన్సిల్ అంతా ఏకగ్రీవంగా ఆమోదించింది.

- భూపతి ఆదినారాయణ, పురపాలక సంఘ ఛైర్మన్, నిడదవోలు

వివక్ష నియంత్రణపై దృష్టి సారిస్తా

కొవ్వూరు పట్టణం: సమాజంలో వివక్ష నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్ అన్నారు. జిల్లా మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కొవ్వూరులో జవహర్‌ను ఆయన నివాసంలో ఆదివారం కలిశారు. అందరికీ అందుబాటులో ఉంటానని, సమాజంపై బాధ్యతతో దళితులకు అండగా నిలిచి న్యాయం చేస్తానన్నారు. ఫెడరేషన్ నాయకులు డాక్టర్ సుబ్బారావు, రాయి రాంబాబు, కొమ్ము సత్యనారాయణ, కన్వీనర్ తాతారావు, వెంకటేష్, రాజమహేంద్రవరం అధ్యక్షుడు కాట్ల ఆశీర్వాదం, బెన్‌జాన్సన్ పాల్గొన్నారు. ● ఉమ్మడి పశ్చిమ, తూర్పు జిల్లాల మాదిగ లాయర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్‌ను ఆదివారం కొవ్వూరులో కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి వారి సమస్యలపై వినతిపత్రం అందించారు. న్యాయవాదులు కె.ప్రసాదరావు, వి.గోపీనాథ్, వీర్రాజు, దయానంద్‌రాజ్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

తుప్పలు తొలగించాలి

సమస్య: మండలంలోని వడ్లూరు, తీపర్రు రహదారికి ఇరుపక్కలా తుప్పలు అలముకున్నాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక సమస్య ఏర్పడింది.

- ఎస్.శ్రీనివాసరాజు, వెలగదుర్రు

సమాధానం: రహదారి వెంబడి పరిశీలించి తుప్పలు తొలగించే ఏర్పాట్లు చేస్తాం.

- సీహెచ్ శ్రీనివాసు, ఆర్అండ్‌బీ ఏఈ

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497 నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

చాగల్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా వెంకట రామారావు

చాగల్లు, న్యూస్‌టుడే: చాగల్లు, నెలటూరు లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం రాత్రి చాగల్లులో క్లబ్ జిల్లా పాత గవర్నర్ వీకే.పంకజాక్షన్ అధ్యక్షతన నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా వి.వెంకట రామారావు, ఉపాధ్యక్షులుగా ఎన్.అప్పారావు, ఏ.సత్తిబాబు, కార్యదర్శిగా కె.అచ్చుతరామ ప్రసాద్‌లతో పాటు పలువురు సభ్యులతో సీనియర్ లయన్ కొత్తపల్లి రవికుమార్ ప్రమాణం చేయించి బాధ్యతలు అప్పగించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన అల్లూరి గౌరిరావు మాట్లాడుతూ క్లబ్ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉత్తమ విద్యార్థులను సన్మానించారు.

సంక్షేమ పథకాల రూపకర్త ఎన్టీఆర్

నిడదవోలు: రాష్ట్రంలో సంక్షేమ పథకాల రూపకర్త మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. గోపవరంలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా తెదేపా స్థాపించారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన ఆనాటి నుంచే ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో సర్పంచి ఆరేపల్లి భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచి పంచదార దుర్గాప్రసాద్, తెదేపా మండల అధ్యక్షుడు వెలగన సూర్యారావు, మహిళా నాయకురాలు నల్లూరి పుష్పావతి, నిడదవోలు డీసీ అధ్యక్షుడు జుజ్జవరపు సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

గోపవరంలో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శేషారావు

రజకుల వృత్తికి ఆర్థికంగా ప్రయోజనం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: రజక చెరువు అభివృద్ధి పనుల వల్ల వృత్తిదారులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో పూడికతీత, అభివృద్ధి పనులు చేపట్టిన రజక చెరువును శేషారావు ఆదివారం పూజలు చేసి ప్రారంభోత్సవం చేశారు. తెదేపా మండలశాఖ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, రజక సేవాసంఘం పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

కొవ్వూరు పట్టణం, పెరవలి, నిడదవోలు, దేవరపల్లి, ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ఆషాఢమాసం తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, శాకాంబరి అలంకరణలు నిర్వహించారు.

కొవ్వూరులో..

ఖండవల్లిలో వేణుగోపాలస్వామి

కుంకుమార్చనలో మహిళలు

మునిపల్లి లక్ష్మీనారాయణస్వామి

పాలంగిలో..

కొవ్వూరులోని గోష్పదేశ్వరునికి లక్షబిల్వార్చన, లలితాపార్వతీదేవికి సహస్ర కుంకుమార్చన చేశారు. ● అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి ఆలయం, ఖండవల్లిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ● నిడదవోలు మండలం గోపవరం వేణుగోపాలస్వామి, మునిపల్లి లక్ష్మీనారాయణస్వామి, దేవరపల్లిలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, పాలంగిలో కనకదుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు.

దేవరపల్లిలో కొలువైన ఉత్సవ విగ్రహాలు

మానవత సంస్థ కార్యవర్గ ఎన్నిక

తాళ్లపూడి: సమాజంలో పేదలకు సాయం చేస్తూ.. ఆపదలో ఉన్నవారిని చేయూతనిచ్చేందుకు మానవత సంస్థ ముందుంటుందని జిల్లా అధ్యక్షుడు డి.భాస్కరరావు తెలిపారు. తాళ్లపూడిలోని స్థానిక కళ్యాణ మండపంలో మానవత సంస్థ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎలుగుబండి శ్రీనివాసరావు, సెక్రటరీ రాజశేఖర్, కోశాధికారిగా అప్పన హనుమంతురావు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సంస్థ గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు ఫ్రీజర్ నిమిత్తం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. జిల్లా నియంత్రణ మండలి ఛైర్మన్ కె.సూర్యనారాయణ, సంస్థ ప్రతినిధులు డి.సూర్యనారాయణ, చంద్రయ్య, బాబులు, సురేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

హత్యాయత్నంపై ఫిర్యాదు

పెరవలి: పెరవలి మండలం ఖండవల్లికి చెందిన కొందరు తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని గ్రామానికి చెందిన కోటిపల్లి అయ్యప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. అయ్యప్ప ఖండవల్లి శివారు తూతాయ మీదుగా తణుకు నియోజకవర్గం ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు సరకుల నిమిత్తం శనివారం రాత్రి వెళుతుండగా దాడిచేసి గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు రక్షణ కల్పించాలని కోరుతూ మంగళగిరిలోని జనసేన ప్రధాన కార్యాలయంలో సంప్రదించారు. ఈ విషయంపై పెరవలి ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నామని వివరించారు.

అతివకు అండగా కుట్టుశిక్షణ

దేవరపల్లి, నల్లజర్ల న్యూస్‌టుడే: ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కూటమి ప్రభుత్వం ఉచిత కుట్టు మిషన్ శిక్షణ అందిస్తుంది. ప్రతి మండలంలో 18 నుంచి 50 సంవత్సరాలు ఉన్న మహిళకు 90 రోజుల పాటు శిక్షణ ఇస్తుంది. ఏప్రిల్-16న ప్రారంభమైన శిక్షణలు ఈ నెల ఆఖరున ముగియనున్నాయి. సంపూర్ణ శిక్షణతో పాటు 75 శాతం హాజరైన మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్‌లు అందజేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతుంది.

దేవరపల్లిలో తర్ఫీదు పొందుతున్న మహిళలు

మండలం	శిక్షణ పొందుతున్న మహిళలు
దేవరపల్లి	141
నల్లజర్ల	78
కొవ్వూరు	90
కొవ్వూరు మున్సిపాలిటీ	124
చాగల్లు	143
తాళ్లపూడి	121
నిడదవోలు	82
నిడదవోలు మున్సిపాలిటీ	142
పెరవలి	125
ఉండ్రాజవరం	118

ట్యూషన్ చెబుతూ..

నేను ఇంటర్ వరకు చదివి ఇంటి దగ్గర ఉంటున్నాను. ఖాళీ సమయంలో ట్యూషన్ చెబుతుంటాను. మిషన్ నేర్చుకోవడం నాకు ఇష్టం. బయట మార్కెట్‌లో కుట్టుమిషన్ శిక్షణ తీసుకుంటే నెలకు రూ.8 వేలు వరకు ఖర్చు అవుతుంది. ప్రభుత్వం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉచితంగా శిక్షణ పొందుతున్నాను.

- మహ్మద్ నజమా, దేవరపల్లి

భర్తకు సాయపడదామని..

నాకు వివాహం అయ్యి సుమారు పది సంవత్సరాలు అవుతుంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. నా భర్త కూలీ పనికి వెళ్లి మమ్మల్ని పోషిస్తున్నారు. నేను ఇంటి వద్దే ఉంటాను. మిషన్ నేర్చుకోవాలని ఆసక్తి ఉన్నా నగదు కట్టే స్తోమత లేక నేర్చుకోలేదు. ఉచిత శిక్షణలో అనేక రకాల దుస్తులు కుట్టడం నేర్చుకున్నాను. శిక్షణ అనంతరం ఇచ్చే మిషన్ ద్వారా నా భర్త సంపాదనకు నేను తోడు అవుతున్నందుకు గర్వంగా ఉంది.

- సుంకవల్లి ధనలక్ష్మి, దుద్దుకూరు

అన్ని రకాలు నేర్చుకుంటున్నారు..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణలో పాల్గొంటున్న మహిళలకు రెండు గ్రూపులుగా శిక్షణ ఇస్తున్నాం. డ్రస్సు, గౌన్, గాగ్ర, నెక్ మోడల్స్, బ్లౌజ్‌లు, చుడీదార్, ప్యాంట్లు ఇలా అనేక రకాలు నేర్చుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ ఎంతో ఆసక్తిగా కుట్టుపై పట్టు సాధిస్తున్నారు.

- లక్కా లక్ష్మీ, శిక్షకురాలు

చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీ పురందేశ్వరి

ఆండ్రు అనిల్‌ని పరామర్శించిన ఎంపీ

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లి మండలం గౌరీపట్నం మాజీ సర్పంచి ఆండ్రు వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన చిత్రపటానికి రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి నివాళి అర్పించారు. ఆయన కుమారుడు తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్‌ను పరామర్శించారు. రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, భాజపా జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర అంజలి ఘటించారు.

శునకాలకు విధిగా టీకాలు వేయించాలి

పాలంగిలో టీకాలు వేస్తూ..

ఉండ్రాజవరం, కొవ్వూరు పట్టణం, చాగల్లు: పెంపుడు కుక్కలకు విధిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని తణుకు లయన్స్‌క్లబ్ జోన్ ఛైర్‌పర్సన్ కెవెన్ పద్మావతి అన్నారు. ఆ క్లబ్ ఆధ్వర్యంలో జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పాలంగిలో కుక్కలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సర్పంచి బొక్కా శ్రీనివాసు, క్లబ్ జిల్లా గవర్నర్ దామెర రంగారావు, అధ్యక్షుడు కె.వి సత్యనారాయణ, కార్యదర్శి రమణ పాల్గొన్నారు. ● మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పశు సంవర్ధకశాఖ, లయన్స్‌క్లబ్ సంయుక్తాధ్వర్యంలో కొవ్వూరు ప్రాంతీయ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలు, మూగజీవాలకు వైద్యాధికారి ఎ.వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో యాంటీ రేబీస్ టీకాలు వేశారు. సూరపనేని చిన్ని, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పెనుమాక జయరాజు, కోశాధికారి పాలడుగుల లక్ష్మణరావు పాల్గొన్నారు. ● చాగల్లు పశు వైద్యశాలలో రేబీస్ వ్యాధి నివారణ టీకాలను మండల పశు వైద్యాధికారి యు.ముఖేష్ చేశారు. 3నెలలు దాటిన 43కుక్కలకు వ్యాక్సిన్ వేశామన్నారు. వైద్యాధికారి టి.మనోజ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వి.వెంకటరామారావు పాల్గొన్నారు.

దేశం గర్వించే మహోన్నత వ్యక్తి జగ్జీవన్‌రామ్

కొవ్వూరు పట్టణం, నిడదవోలు, తాళ్లపూడి, గోపాలపురం, ఉండ్రాజవరం: దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మెరకవీధిలోని విగ్రహానికి ఆయన వర్ధంతి సందర్భంగా ఆదివారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పి.జయరాజు, వేమగిరి వెంకట్రావు, సూరపనేని చిన్ని, మద్దిపాటి సత్యనారాయణ పాల్గొన్నారు. ● నిడదవోలు పట్టణంతో పాటు, సమిశ్రగూడెంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద బాబు యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ● తాళ్లపూడి మండలంలోని మలకపల్లి, పైడిమెట్టలో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మలకపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గెడ్డం వినోద్, నాయకులు రాజు, రమేష్ తదితరులు మాట్లాడారు. ● గోపాలపురం మండలంలోని వాదాలకుంటలో ఎమ్మార్పీఎస్ నాయకులు, యువకుల ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించి మిఠాయిలు పంచారు. ● నేటి తరానికి జగ్జీవన్‌రామ్ ఆదర్శమూర్తి అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చెట్టే సుజనరావు అన్నారు. కాల్దరిలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు చెట్టే నవీన్, సర్వేశ్వరరావు, కె.కృష్ణారావు పాల్గొన్నారు.

కొవ్వూరు పట్టణం: అంజలిఘటిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, నాయకులు

సమిశ్రగూడెంలో..

వాదాలకుంటలో నివాళి అర్పిస్తున్న యువకులు

రాష్ట్రంలో పారదర్శక పాలన

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని 13వ వార్డులో ఆదివారం నిర్వహించారు. ప్రజలకు ఏడాది పాలన, అభివృద్ధిపై ముద్రించిన కరపత్రాలను అందించారు. సూరపనేని చిన్ని ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాల అమలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ, సంస్కరణలపై అవగాహన కల్పించారు. సూర్యదేవర రంజిత్, బర్ల శ్రీను, రాజాన శ్రీను, పేర్రాజు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: తెదేపా నాయకులు వెలగదుర్రు, పసలపూడి, పాలంగి తదితర గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం పథకాల గురించి వివరించారు. ముదునూరి రవీంద్ర రాజు, పాతూరి నరేంద్ర బాబు, వెలిచేటి ప్రసాదు, నాయకులు పాల్గొన్నారు.

వెలగదుర్రులో కరపత్రాలు పంచుతున్న తెదేపా నాయకులు

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేటలో కూటమి నాయకులు బీసీ కాలనీలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందించి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి కూచిపూడి గణపతి, గ్రామ అధ్యక్షుడు హరిప్రసాద్, బూత్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

కొవ్వూరు 13వ వార్డులో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

నిడదవోలు: రాష్ట్రంలో అయిదేళ్ల వైకాపా విధ్వంస పాలన వీడిందని.. ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పాలన సాగుతోందని నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. గోపవరంలో ఆదివారం ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను అందించారు. తెదేపా మండల అధ్యక్షుడు వెలగన సూర్యారావు, సర్పంచి భాగ్యలక్ష్మి, నాయకులు పంచదార దుర్గాప్రసాద్, ఆరేపల్లి తదితరులు పాల్గొన్నారు.

పైళ్లమ్మకు ఆషాఢం సారె

తాళ్లపూడి, న్యూస్‌టుడే: మండలంలోని పైడిమెట్టలో పైళ్లమ్మతల్లికి ఆషాఢమాసం పురస్కరించుకొని ఆదివారం గ్రామస్థులు సారె సమర్పించారు. పైడిమెట్ట ఎత్తిపోతల పథకం మాజీ అధ్యక్షుడు విత్తం పెద్దకాపు ఆధ్వర్యంలో స్థానిక గణపతి ఆలయం నుంచి సారె ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సమర్పించారు.

సొసైటీ సారథులొస్తున్నారు..

త్వరలో త్రిసభ్య కమిటీల ఏర్పాటు

గోపాలపురం, న్యూస్‌టుడే: గ్రామీణ రైతులకు అండదండగా నిలుస్తూ వారి అవసరాలు తీర్చే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(సొసైటీలు)కు నూతన సారథులు రానున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇటీవల డీసీసీబీలకు ఛైర్మన్‌ను నియమించింది. గత కొద్దిరోజుల వరకు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సొసైటీలకు ఎన్నికలు నిర్వహిస్తారా.. లేక వైకాపా ప్రభుత్వం వల్లే త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేస్తారని రైతుల్లో అనుమానాలు ఉండేవి. వాటికి ప్రభుత్వం చెక్ పెట్టి త్రిసభ్య కమిటీ ఏర్పాటుకు పచ్చ జెండా ఊపింది. దానిలో భాగంగా సొసైటీలకు నూతన సారథులు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. 2013లో అప్పటి ప్రభుత్వం ఆధ్వర్యంలో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించారు. 2018లో పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం మొదట్లో సొసైటీలను అసలు పట్టించుకోలేదు. రైతులు, నాయకుల ఒత్తిడితో ఎన్నికలు నిర్వహించకుండా వైకాపా పార్టీకి చెందిన నాయకులతో త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేశారు. వారిని రెండు సంవత్సరాలు ఉంచి మరొకరికి అవకాశం ఇస్తూ, కొందరికి పదవీకాలం పెంచుతూ ఐదేళ్లు గడిపేశారు.

గోపాలపురంలోని సొసైటీ భవనం

మండలం	సంఘాలు	సభ్యులు
గోపాలపురం	2	3430
దేవరపల్లి	7	8196
నల్లజర్ల	2	6510

వచ్చారు మార్పు చేశారు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత త్రిసభ్య కమిటీలను రద్దు చేశారు. పర్సన్ ఇన్‌ఛార్జులుగా ఆ శాఖకు సంబంధించిన అధికారులను నియమించారు. ఒకే అధికారులు రెండుకు మించి ఉండటంతో సొసైటీలపై పర్యవేక్షణ కొరవడుతుందని గ్రహించిన ప్రభుత్వం త్రిసభ్య కమిటీల ఏర్పాటుకు సిద్ధం అయింది. దానిలో భాగంగా గోపాలపురం నియోజకవర్గ పరిధిలోని 11 సొసైటీలకు నూతన కమిటీలు త్వరలో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే అన్ని సొసైటీల్లోని తెదేపా, జనసేన, భాజపా శ్రేణులతో నూతన కమిటీలు ఏర్పాటు చేసి వాటి జాబితాను అధిష్ఠానానికి పంపించారు.

ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

నిడదవోలు, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని ఆదివారం పట్టుకున్నట్లు కొవ్వూరు సబ్ డివిజన్ టాస్క్‌ఫోర్స్ ఏఎస్సై జీఆర్కే గంగాధరరావు తెలిపారు. కొవ్వూరు మండలం ఔరంగబాద్ ఇసుక ర్యాంపులో లోడ్ చేసుకుని ఎలాంటి బిల్లులు లేకుండా తణుకు తరలిస్తుండగా నిడదవోలు మండలం డి.ముప్పవరం వద్ద పట్టుకున్నట్లు వివరించారు. లారీలో పది టన్నుల ఇసుక ఉందని, సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్‌కు వాహనాన్ని తరలించామని తెలిపారు.

జూద శిబిరంపై పోలీసుల దాడి

తాళ్లపూడి, న్యూస్‌టుడే: గజ్జరంలో జూదం ఆడుతున్న స్థావరంపై సమాచారం మేరకు ఆదివారం దాడులు చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నామన్నాని ఎస్సై రామకృష్ణ తెలిపారు. వారి నుంచి రూ.12,340 స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశామన్నారు.

(c) eenadu

రేషన్ తూకాల్లో తేడాలున్నాయా!

డయల్ యువర్ డీఎస్‌వో రేపు

ఈనాడు మీతోడు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రేషన్ సరకులు సక్రమంగా అందడం లేదా? నిత్యావసరాల పంపిణీ తూకాల్లో తేడాలున్నాయా? వృద్ధులు, దివ్యాంగులకు డీలర్లు ఇళ్ల వద్దకు తీసుకొచ్చి సరకులు ఇవ్వడం లేదా? కొత్తగా బియ్యం కార్డులు పొందేందుకు అవస్థలు పడుతున్నారా? బంకుల్లో డీజిల్, పెట్రోలు కొలతల్లో వ్యత్యాసాలున్నాయా? వినియోగదారులకు సదుపాయాల్లేవా? వంటగ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులున్నాయా? ఆయా సమస్యలను నేరుగా జిల్లా పౌరసరఫరాల అధికారి ఇ.విలియమ్స్ దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం కల్పిస్తోంది 'ఈనాడు'. ఇంకెందుకు ఆలస్యం.. ఇక్కడ పేర్కొన్న తేదీన, నిర్ణీత సమయంలో ఫోన్ చేయాల్సిందే!

తేదీ: 08.7.2025 (మంగళవారం)	సమయం: ఉదయం 11 నుంచి 12 గంటల వరకు	ఫోన్ నంబరు 80083 01552

తల్లిదండ్రుల సమావేశాలకు ఏర్పాట్లు: కలెక్టర్

వెట్రిసెల్వి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 10న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మెగా తల్లిదండ్రుల సమావేశాల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక విడిది కార్యాలయం నుంచి విద్యా శాఖాధికారులతో ఆదివారం దూర, దృశ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని 1,810 ప్రభుత్వ, 558 ప్రైవేటు పాఠశాలల్లో, 140 జూనియర్ కళాశాలల్లో కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఆహ్లాద వాతావరణంలో సమావేశాలు జరిగేలా చూడాలన్నారు. పాఠశాలల ఆవరణలో విద్యార్థులతో మొక్కలు నాటించాలని, ఇందుకు అటవీ శాఖాధికారులు 1,64,170 మొక్కలు సిద్ధం చేశారన్నారు. జూనియర్ కళాశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించి, ఆరోగ్య నివేదికలు అందజేయాలన్నారు. కార్యక్రమ పర్యవేక్షణకు కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

రేపట్నుంచి రైల్వే గేటు మూత

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక నిమ్మకాయల మార్కెట్ యార్డు సమీప రైల్వే గేటు మరమ్మతుల నిమిత్తం ఈ నెల 8 నుంచి 17 వరకు మూసివేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సెక్షన్ ఇంజినీర్ ఎస్.లోకేశ్ తెలిపారు. వాహనదారులు, ప్రయాణికులు గమనించి సహకరించాలని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నిండుగా గోదారి

క్రమేపీ పెరుగుతున్న ప్రవాహం

కుక్కునూరు, న్యూస్‌టుడే: గోదావరిలోకి ప్రవాహం క్రమేపీ పెరుగుతోంది. ఆదివారం సాయంత్రం భద్రాచలం వద్ద నీటి మట్టం 19 అడుగులకు చేరింది. కుక్కునూరు వద్ద ఇరువైపులా గట్లు తాకుతూ నది నిండుగా ప్రవహిస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత, శబరి, సీలేరు నదుల నుంచి ప్రవాహం వస్తోండటంతో గోదావరి జలకళ సంతరించుకుంది. దీంతో అధికారులు లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వరద ప్రవాహం భద్రాచలం వద్ద 43 అడుగులు(మొదటి ప్రమాద స్థాయి) దాటితే ఆ గ్రామాలను ఖాళీ చేయించే దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.

తిరిగి నదిలోకి.. **పోలవరం, న్యూస్‌టుడే:** పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద ఆదివారం సాయంత్రానికి 28.25 మీటర్లకు పెరిగింది. 48 గేట్ల నుంచి 2.25 లక్షల క్యూసెక్కులు స్పిల్ ఛానల్ ద్వారా దిగువకు వెళ్తోంది. వరద పెరగడంతో ఎగువ, దిగువ కాఫర్‌డ్యాంల మధ్యలోకి చేరుతున్న నీటిని దిగువ కాఫర్‌డ్యాం వద్ద ఏర్పాటు చేసిన పంపుల ద్వారా తిరిగి గోదావరిలోకి తరలిస్తున్నారు.

16 పంపుల నుంచి 5,600 క్యూసెక్కులు.. పట్టిసీమ ఎత్తిపోతల పథకంలోని 16 పంపుల నుంచి ఆదివారం నీటిని విడుదల చేస్తున్నట్లు పర్యవేక్షణ డీఈ సురేశ్ చెప్పారు. ప్రాజెక్టు కుడి కాలువలోకి డెలివరీ సిస్టమ్ నుంచి 5,600 క్యూసెక్కులు వెళ్తున్నట్లు పేర్కొన్నారు.

మనసారా మారారు!

● సత్ఫలితాలిచ్చిన నవోదయం ● 140 గ్రామాల్లో నిర్మూలన

☛ నూజివీడు మండలం సిద్ధార్థ నగర్‌కు చెందిన రంగమ్మకు భర్త చిట్టిబాబు, ముగ్గురు పిల్లలున్నారు. గతంలో సారా కాసి జీవనోపాధి పొందేవారు. ఆమెపై పలు కేసులున్నాయి. వాటిని తొలగించి, కుటుంబానికి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గం చూపారు. ప్రస్తుతం రంగమ్మ కిరాణా దుకాణం నిర్వహిస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నారు.

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: సారా రక్కసి ఎన్నో జీవితాలు నాశనం చేసింది. మరెన్నో కుటుంబాలను రోడ్డున పడేసింది. వైకాపా పాలనలో మన్యం, మెట్ట ప్రాంతాల్లో ఏరులై పారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు మారాయి. సారా తాగి ఎవరూ మృతి చెందకూడదన్న ఉద్దేశంతో నవోదయ 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సారా తయారీ, విక్రయదారులను గుర్తించి వారికి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు చూపింది.

తొలుత దాడులు.. ఆపై అవగాహన.. మన్యం, మెట్ట ప్రాంతాల్లో ఆబ్కారీ శాఖాధికారులు విస్తృత దాడులు చేశారు. సారా తయారీ, విక్రయదారులను గుర్తించి కేసులు నమోదు చేశారు. వారిలో మార్పు తీసుకొచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ వృత్తిని పూర్తిగా విడనాడాలని ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు చూపుతామని హామీ ఇచ్చారు. జిల్లాలో సారా కార్యకలాపాలు సాగుతున్న 140 గ్రామాలపై దృష్టి సారించారు. అక్కడ దశలవారీగా తయారీ, విక్రయాలకు అడ్డుకట్ట వేశారు.

☛ ద్వారకాతిరుమల మండలం కొదమ మరియమ్మకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు. గతంలో దంపతులు సారా, మద్యం విక్రయించేవారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆర్థిక సాయంతో చికెన్ దుకాణం నిర్వహిస్తున్నారు. సారా అమ్ముతున్నానని చిన్న చూపు చూసేవారని, ప్రస్తుతం సొంత వ్యాపారం చేస్తూ ఆనందంగా జీవిస్తున్నానని మరియమ్మ తెలిపారు.

'సారాను సమూలంగా నిర్మూలించాలన్నదే లక్ష్యం. తదనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాలతో ఎందరికి రుణాలివ్వాలన్న జాబితా రూపొందించాం. వ్యాపారాలు పెట్టుకున్నాక, ఎలా చేస్తున్నారన్న విషయాన్ని పర్యవేక్షిస్తున్నాం' అని జిల్లా ఆబ్కారీ మద్య నిషేధ అధికారి ఎ.ఆవులయ్య తెలిపారు.

తొలి విడతగా 40 మందికి.. తొలి విడతలో సుమారు 40 మందికి పాలు, పూల వ్యాపారం, హోటల్, మాంసం, కిరాణా దుకాణాలు.. ఇలా నచ్చిన రంగంలో ఆదాయ మార్గాలు కల్పించారు. ఇప్పటి వరకు 90 శాతం సత్ఫలితాలు సాధించారు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో వడ్డీలేని రుణాలను ఇటీవల కలెక్టర్ వెట్రిసెల్వి ద్వారా లబ్ధిదారులకు అందజేసి.. అసలైన నవోదయానికి శ్రీకారం చుట్టారు. మిగతా వారికీ రుణాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఏలూరును సారా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నారు.

అపరిష్కృత కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 6,325 కేసులు పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి తెలిపారు. మొత్తం 35 బెంచ్‌లు ఏర్పాటు చేసి, 20 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న కేసుల రాజీకి ప్రాధాన్యమిచ్చామన్నారు. ఇందుకు సహకరించిన అధికారులు, కక్షిదారులకు ఆదివారం ఒక ప్రకటనలో ఆమె కృతజ్ఞతలు చెప్పారు.

పోలీసు శాఖ పరిధిలో 2,841..

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జాతీయ లోక్ అదాలత్‌లో పోలీసు శాఖకు సంబంధించి 2,841 కేసులు రాజీ చేశామని ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ తెలిపారు. మార్చి 16న నిర్వహించిన లోక్ అదాలత్‌తో పోలిస్తే.. ఈ దఫా 30 శాతం అధికంగా కేసులు రాజీ అయ్యాయని చెప్పారు. 827 ఐపీసీ, 417 స్పెషల్ లోకల్, లాస్, 143 ఎక్సైజ్, 1454 పీటీ కేసులు పరిష్కరించినట్లు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పండ్ల మొక్కల పండగ!

రేపు జిల్లా వ్యాప్తంగా నాటేందుకు చర్యలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బృహత్తర కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 2 వేల ఎకరాల్లో 3,500 పండ్ల మొక్కలు నాటనున్నారు. ఇందుకు ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేసింది. ఇందులో కూలీల వేతనాలు, సామగ్రి ఖర్చు ఉండనుంది. సుమారు 2,500 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. జిల్లా, మండలాల వారీగా జరగనున్న కార్యక్రమాలకు మంత్రులు, కలెక్టరు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు.

ఉద్యాన శాఖ భాగస్వామ్యంతో.. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో.. ఉద్యాన శాఖ భాగస్వామ్యంతో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గతేడాది ఆగస్టు 23న రాష్ట్రంలో ఒకేరోజు 4 వేల కి.మీ. మేర రహదారుల నిర్మాణాలు, ఇతర పనులకు తీర్మానాలు చేయించి రికార్డు సృష్టించారు. అదే తరహాలో ఒకే రోజు పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని నిర్ణయించారు. పొలాల్లో ఆయిల్‌పామ్, కోకో, మామిడి, జామ, నిమ్మ, జీడి మామిడి తదితర పండ్ల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేశారు. మొక్కలను నర్సరీల నుంచి ఇప్పటికే సేకరించినట్లు డ్వామా పీడీ సుబ్బారావు తెలిపారు.

10 వేలకు పెంచాలని ఆదేశం.. జిల్లాలో 3,500 పండ్ల మొక్కలు లక్ష్యం కాగా, దాన్ని 10 వేలకు పెంచాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మనోహర్ ఇటీవల అధికారులను ఆదేశించారు. తొలుత విధించిన లక్ష్యాన్ని 8న సాధించేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు. మిగతా మొక్కలు మరో 11 రోజుల్లో నాటాలని నిర్ణయించారు. ఇటీవల ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దాదాపు లక్ష మొక్కలు నాటినట్లు అధికారులు చెబుతున్నారు.

నేత్రపర్వం.. జగన్నాథ రథోత్సవం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: లక్ష్మీపురం వేంకటేశ్వరస్వామి సంతాన గోపాల జగన్నాథస్వామి ఆలయంలో కొలువైన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామి రథోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. పది రోజుల పాటు ఉత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించారు. చివరి రోజు స్వామివారి రథోత్సవం తిమ్మాపురంలో అంగరంగ వైభవంగా జరిగింది. సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామిని పల్లకిలో తోడ్కొని వచ్చి రథంలో కొలువుదీర్చారు. స్వామికి కర్పూర హారతులిచ్చి రథోత్సవాన్ని ప్రారంభించారు.

శ్రీవారి క్షేత్రంలో రద్దీ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: సెలవు రోజు, తొలి ఏకాదశి రెండూ కలిసి రావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి ఆదివారం ద్వారకాతిరుమల క్షేత్రానికి భక్తులు వేలాదిగా తరలి వచ్చి, స్వామిని దర్శించారు. భక్తుల రాకతో శ్రీవారి దర్శన క్యూలు, ప్రసాదాల కౌంటర్లు, అన్నదానం క్యూలు, కేశఖండనశాల, ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. సామాన్య భక్తులు స్వామిని దర్శించుకోవడానికి సుమారు 3 గంటల సమయం పట్టింది.

వన దేవతకు బోనాలు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పలువురు భక్తులు అమ్మవారి ప్రతిమ, బోనాలు, నైవేద్యాలను ఊరేగింపుగా తీసుకు వచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఇన్‌ఛార్జుల ఏలుబడి.. పర్యవేక్షణ కొరవడి

☛ కైకలూరు నియోజకవర్గంలో కైకలూరు ఎంఈవో-1 రామారావు మిగిలిన మూడు మండలాలకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. కైకలూరు ఎంఈవో-2 కలిదిండికి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు.

☛ జిల్లాలో చాలా మండలాల్లో ఎంఈవో-1, 2 పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇన్‌ఛార్జులతో నెట్టుకొస్తున్నారు. ఒక్కొక్కరికి 3 నుంచి 4 మండలాల బాధ్యతలు అప్పగించారు. దీంతో పర్యవేక్షణ కొరవడింది.

ముదినేపల్లి, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం రెండో ఎంఈవో పోస్టు సృష్టించి 2023లో ఎంఈవో-2ని నియమించింది. మండల స్థాయిలో ఎంఈవో-1లకు ఉపాధ్యాయుల జీతాల బిల్లులు, పాలనాపరమైన అంశాల బాధ్యతలను, ఎంఈవో-2లకు విద్యార్థులకు అందించే సంక్షేమ పథకాల అమలు, బడుల్లో అభివృద్ధి పనుల పర్యవేక్షణ బాధ్యత అప్పగించింది. వీరిలో చాలా మంది ఉద్యోగ విరమణ చేయడంతో ఉన్నవారిపైనే మూడు రెట్ల అధిక భారం పడింది. జిల్లాలోని 27 మండలాలకు ఎంఈవో-1, 2లు 54 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 35 మంది ఉన్నారు. డీవైఈవో పోస్టులకు ఎంఈవో-1లే అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

☛ *2023లో ఎంఈవో-2 పోస్టులు సృష్టించినప్పుడు పంచాయతీరాజ్ హెచ్‌ఎం, ఎంఈవోలు తప్పనిసరిగా ఎంఈవో-2గా విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపింది. దీంతో చాలా మంది సీనియర్లు ఎంఈవో-2లుగా డీగ్రేడ్ అయ్యారు. ఆ ఉత్తర్వులు ధిక్కరించిన కొంత మంది ఎంఈవోలను అదే స్థానంలో కొనసాగించడంతోపాటు 3, 4 మండలాలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఎంఈవో-1 పోస్టుల వ్యవహారం న్యాయస్థానం పరిధిలో ఉండటంతో ఖాళీగా ఉన్న ఎంఈవో-2 పోస్టులైనా సీనియర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలతో భర్తీ యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు తెలుపుతున్నారు. దీనిపై డీఈవో వెంకటలక్ష్మమ్మను సంప్రదించగా ఖాళీల వివరాలను ప్రభుత్వానికి నివేదించామని చెప్పారు.*

జాతస్య హి ధ్రువోమృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ !
తస్మాత్ అపరిహార్యే ర్థేన త్వం శోచితుమర్హసి !!

శ్రద్ధాంజలి

కరిగే కాలంలో.. తరగని జ్ఞాపకం మీరు..
కదిలే ఆలోచనలో.. చెరగని స్మృతి మీరు.. మీకు లేదు మరణం...
మా హృదయాలలో మీ జ్ఞాపకాలు చిరస్మరణీయం..

మంచికి, సేవాతత్పరతకు మారుపేరుగా నిలిచి,
ఎంతోమందికి ఉపాధిమార్గం చూపించి,
మరెందరికో ఆదర్శప్రాయులుగా నిలిచి,
అందరి హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించి,
అజరామరమైన కీర్తిప్రతిష్టలను సంపాదించిన మీరు
మానుండి భౌతికంగా దూరమైనందుకు చింతిస్తూ...
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
మీ ఆశయ సాధనలో... ఎల్లవేళలా మీ అడుగు జాడల్లో నడుస్తూ...
మీ...

భార్య: వేగేశ్న అనంతలక్ష్మి సత్యవతి

కుమారుడు	: వేగేశ్న రఘురామరాజు
కోడలు	: వేగేశ్న శ్రవంతి
మనుమరాళ్ళు	: అక్షిత, అంకిత
మనుమడు	: అఖండ సూర్యనంద ఆశ్రితవర్మ
కుమార్తె	: దాట్ల రాధిక
అల్లుడు	: దాట్ల సంజీవ్ కుమార్
మనుమలు	: అఖిల్, అక్షయ్

మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

కీ॥శే॥ వేగేశ్న ఆనందరాజు గారు

జననం: 27-06-1958 స్వర్గప్రాప్తి: 06-07-2025

దశాహం: తేది. 16-07-2025 బుధవారం జరుపబడును.

(c) eenadu

భక్తిశ్రద్ధలతో మొహర్రం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మహ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమాం త్యాగానికి ప్రతీకగా నగరంలో ముస్లింలు మొహర్రంను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పలు మసీదుల్లో మత పెద్దలు ఇస్లాం ప్రవచనాలు, మహ్మద్ ప్రవక్త బోధనలు చేశారు. పోణంగిలోని గాజుల, గన్‌బజారు, వంగాయగూడెం చేపల మార్కెట్ వద్దనున్న పంజాల్లో నిప్పుల గుండం తొక్కారు. నగరంలోని 11 మసీదుల నుంచి ముస్లింలు సోమవారం పీర్లు ఎత్తుకుని ప్రదర్శనగా కర్బలా మైదానానికి చేరుకుంటారని తమ పెద్దలు తెలిపారు.

పోలవరంలో 14.4 మి.మీ. వర్షం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో శనివారం ఉదయం 8.30 నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల మధ్య 0.7 మి.మీ సగటు వర్షపాతం నమోదైందని సీపీవో వాసుదేవరావు తెలిపారు. పోలవరంలో అత్యధికంగా 14.4 మి.మీ. వర్షం కురిసింది. వేలేరుపాడు 3, కొయ్యలగూడెం 1.2, బుట్టాయగూడెం 0.4 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు.

IN THE COURT OF THE CHIEF JUDICIAL MAGISTRATE AT VIJAYAWADA
C.C.No.3959/2018

Between:
M/s. Godrej Agrovet Limited, Rep. by Mr. Narukulla Anil, S/o.Venkateswara Rao, Hindu, aged about 35 years, Authorized Representative / Executive - Legal, having its Branch office at Plot No:111A-135, I.D.A. Kondapalli, Krishna District-521 228 (AP). *(Mr.Narukulla Anil is substituted in place of Mr.Somasi Tulasee Ram as per orders in Crl.M.P.No. 1158/2022, dated 14.07.2022)
...Complainant

AND
Mr. Thota Seethaiah, S/o. Venkateswara Rao, Prop. of Sri Lakshmi Narayana Traders, Hindu Aged about 34 years, Eluru Road, Near Market, KAIKALURU-Krishna District, Andhra Pradesh-521 333.
...Accused

PROCLAMATION ISSUED UNDER SECTION 82 OF THE CRIMINAL PROCEDURE CODE

Whereas complaint has been made before this court that you are suspected to have committed the offence of dishonor of cheque punishable under section 138 of The Negotiable Instruments Act and a Non-Bailable Warrant has been issued to compel your attendance before this court to be examined touching the matter of the said complaint and whereas it has been returned that the said warrant cannot be served/executed, and it has been shown to the satisfaction of this Court that you have been absconding or is concealing yourself to avoid the execution of the said Warrant.

Proclamation is hereby made that you are required to appear before this Court on the 6th day of August, 2025 next at 10.30 am to be examined touching the cheque dishonor i.e., the offence complained of.

Dated this the 27th day of January, 2025.
// By order //

Sd/- Chief Judicial Magistrate,
Vijayawada, Andhra Pradesh

దారి చూపితేనే.. ప్రగతి పరుగు..!

● చివరి దశకు గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు ● అనుసంధాన మార్గాల కోసం రైతుల విన్నపాలు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి వెంబడి ఉన్న పొలాలకు సరైన కల్వర్టులు, దారులు ఇవ్వకపోవడంతో వందలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జంగారెడ్డిగూడెం మండలంలోని పుట్లగట్లగూడెం, లక్కవరం, పేరంపేట, పంగిడిగూడెం, దేవులపల్లి తదితర గ్రామాల్లో పొలాల మధ్య నుంచి జాతీయ రహదారి వెళ్లడంతో ఆయా పొలాలు రెండుగా చీలిపోయాయి. దీంతో పంట సాగు విషయంలో నానా అవస్థలు ఎదుర్కొంటున్నామని కర్షకులు వాపోతున్నారు.

పేరంపేట వద్ద పొలాలకు వెళ్లేందుకు దారి ఇలా..

నిర్మించిన చిన్న తూము వద్ద పేరుకుపోయిన ఇసుక

బాట లేక.. కల్వర్టులు చాలక..

ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద దిగువకు వెళ్లే వీలు లేక తమ పొలాలు ముంపునకు గురవుతున్నాయని చిన్న, సన్నకారు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పొలాలకు అనుకుని పంట బోదెలు ఉండటంతో వచ్చిన వర్షపు నీరు దిగువకు వెళ్లిపోయేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. హైవేకు ఇరువైపులా పంట పొలాలకు వెళ్లేందుకు దారి నిర్మిస్తామని చెప్పి తమ భూములను తీసుకున్నారని.. నేడు హైవే పనులు పూర్తి కావస్తుండటంతో ఆ ఊసే లేదని రైతులు చెబుతున్నారు. కలెక్టర్‌తో పాటు హైవే అధికారులకు తమ సమస్యలపై పలుమార్లు వినతులు సమర్పించినా.. ఫలితం లేదని గగ్గోలు పెడుతున్నారు.

25 కిలోమీటర్లు తిరిగి వెళ్తున్నా..

'నా పొలంలో హైవే నిర్మాణానికి రెండెకరాలు ఇచ్చా. హైవే రాక మునుపు ఇంటి నుంచి పొలం వెళ్లాలంటే కిలోమీటరు ఉండేది. ఇప్పుడు సర్వీసు దారి ఇవ్వకపోవడంతో ఇంటి నుంచి జంగారెడ్డిగూడెం, సీతంపేట, తిరుమలాపురం మీదుగా 25 కి.మీ. తిరిగి పొలానికి వెళ్లాల్సి వస్తోంది.'

- వందనపు సాయిబాబు, పంగిడిగూడెం

గ్రీన్ ఫీల్డ్ హైవే (ఖమ్మం-దేవరపల్లి)

హైవే పేరు	: ఎన్‌హెచ్-365 బీజీ
దూరం	: 162.10 కిలోమీటర్లు
ఏలూరు జిల్లాలో	: రేచర్ల, దేవులపల్లి, పొంగుటూరు (వాహనాలు హైవే ఎక్కేందుకు, దిగేందుకు)
జరగాల్సిన పనులు	: 300 మీటర్ల హెచ్‌టీ విద్యుత్తు లైన్లు ఉన్న చోట పనులు చేయాల్సి ఉంది. భూసేకరణ విషయంలో కోర్టు తీర్పు వెలువడటంతో హైవే పనులు జరగాల్సి ఉంది.
నిర్మాణానికి పట్టే కాలం	: 6 నెలలు

కూలీలు రావడం లేదు..

'పంట చేలకు రావాలంటే దారి లేకపోవడంతో కూలీలు వ్యవసాయ పనులకు సరిగా రావడం లేదు. పంట ఉత్పత్తులు ట్రాక్టర్లలో తరలించాలంటే యాతన పడుతున్నాం.' **- గోలి నర్సిరెడ్డి, పేరంపేట**

టీకా పంపిణీని ప్రారంభిస్తున్న గోవిందరాజు

పెంపుడు శునకాలకు టీకాలు తప్పనిసరి: జేడీ

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: పెంపుడు జంతువుల ఆరోగ్యంపై యజమానులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, శునకాలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు టి.గోవిందరాజు అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక జేడీ కార్యాలయ ఆవరణలో ఆదివారం కుక్కలకు ఉచిత టీకాల పంపిణీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పెంపుడు జంతువులకు ఏటా టీకా వేయించాలని, వాటి వ్యాధులు మనుషులకే సోకే ప్రమాదముందని హెచ్చరించారు. శిబిరంలో 324 కుక్కలకు టీకాలు వేశామన్నారు. పశుసంవర్ధక శాఖ ఏడీ సుబ్రహ్మణ్యం, వీఏఎస్ జ్యోతి స్వరూప్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ ప్రవేశాలకు వేళాయె!

నేటి నుంచి వెబ్ ఆధారిత కౌన్సెలింగ్

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభం కానుంది. ఈ నెల 22న ప్రక్రియ ముగియనుంది. రాష్ట్ర సాంకేతిక విద్యామండలి షెడ్యూల్ విడుదల చేసింది. ఆగస్టు 4న కళాశాలల్లో తరగతులు ప్రారంభిస్తారు.

జిల్లా వివరాలిలా..
- ఇంజినీరింగ్ కళాశాలలు: 6
- వివిధ బ్రాంచుల్లో సీట్లు: 4,920
- ఈఏపీసెట్ రాసింది: 4,700
- అర్హత సాధించింది: 3,409

తేదీల వారీగా షెడ్యూలు ఇదీ
- ☛ 7-16: రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ రుసుము చెల్లింపు
- ☛ 7-17: ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల సమర్పణ
- ☛ 13-18: వెబ్ ఆధారిత ఐచ్ఛికాల నమోదు
- ☛ 19: వెబ్ ఐచ్ఛికాల మార్పునకు అవకాశం
- ☛ 22: సీట్ల కేటాయింపు ☛ 23-26: కళాశాలల్లో ప్రవేశాలు ☛ 4.8.2025: తరగతుల ప్రారంభం

సమర్పించాల్సిన పత్రాలు ఇవీ..

☛ ఆన్‌లైన్‌లో చెల్లించిన ప్రాసెసింగ్ రుసుము రసీదు ☛ ఈఏపీసెట్-2025 ర్యాంకు కార్డు, హాల్ టికెట్ ☛ పదో తరగతి, ఇంటర్ లేదా తత్సమాన మార్కుల జాబితా ☛ 6 నుంచి ద్వితీయ ఇంటర్ వరకు అధ్యయన ధ్రువపత్రాలు ☛ చివరిగా చదివిన కళాశాల నుంచి బదిలీ ధ్రువపత్రం-టీసీ ☛ 1.1.2022 తర్వాత పొందిన ఆదాయ ధ్రువపత్రం ☛ కుల ధ్రువీకరణ పత్రం ☛ 2025-26లో పొందిన ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రం ☛ దివ్యాంగులు, ఎన్‌సీసీ విభాగం వారు, మాజీ సైనికుల పిల్లలు సంబంధిత వైద్య ధ్రువపత్రం ☛ నివాస పత్రం ☛ తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చి స్థిరపడిన అభ్యర్థులు మైగ్రేటెడ్ ధ్రువపత్రం

సహాయ కేంద్రం ఏర్పాటు

విద్యార్థుల సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారానికి సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఏదైనా ఇబ్బంది తలెత్తితే 79956 81678, 79958 65456, 91779 27677 నంబర్లకు ఫోన్ చేయొచ్చు. మరిన్ని వివరాలకు https:/// cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ చూడొచ్చు.

ధ్రువపత్రాల పరిశీలన ఇలా..

తేది	విభాగం	ర్యాంకులు
12	ఎన్‌సీసీ, క్రీడలు	1-60,000
13	ఎన్‌సీసీ, క్రీడలు	60,001-1,00,000
13	మాజీ సైనికులు	1-50,000
14	ఎన్‌సీసీ, క్రీడలు	1,00,001-1,50,000
14	మాజీ సైనికులు	50,001-1,00,000
15	ఎన్‌సీసీ, క్రీడలు	1,50,001 నుంచి చివరి వరకు
15	మాజీ సైనికులు	1,00,001-1,50,000
16	మాజీ సైనికులు	1,50,001 నుంచి చివరి వరకు
16	దివ్యాంగులు	1 నుంచి చివరి వరకు
16	ఆంగ్లో ఇండియన్లు	1 నుంచి చివరి వరకు
16	స్కౌట్స్, గైడ్స్	1 నుంచి చివరి వరకు

★ దివ్యాంగ విభాగం అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు విజయవాడ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లాల్సి ఉంటుంది.

దెందులూరు: ఆషాఢ సారె తీసుకొస్తున్న భక్తులు

ఘనంగా తొలి ఏకాదశి

ఏలూరు నగరం, పెదవేగి, దెందులూరు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఆదివారం తొలి ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. ఏలూరు, పెదవేగి, దెందులూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, కైకలూరు, చింతలపూడి తదితర పట్టణాల్లో ఆలయాలకు భక్తులు తరలివచ్చారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

పెదవేగి: రాట్నాలమ్మ

ఏలూరు: శాకంబరిగా వాసవీమాత

బస్టాండ్ రూపు మార్చేందుకు చర్యలు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరంలో బస్టాండ్‌ను జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు అధికారి ఎస్కే షబ్నం ఆదివారం పరిశీలించారు. జంగారెడ్డిగూడెం డీఎం గంగాధర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వరలక్ష్మితో కలిసి బస్టాండ్ మొత్తం పరిశీలించారు. షెడ్ పై భాగాన చెదకుని చెత్తాచెదారంతో ఉండటంతో ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఐటీడీఏ తూర్పుగోదావరి జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చిన ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.విజయరత్నం ఆకస్మికంగా పోలవరం బస్టాండ్ సందర్శించి ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు పోలవరం వచ్చిన ట్రాన్స్‌పోర్టు అధికారి ఇక్కడి నుంచే ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో చరవాణిలో మాట్లాడారు. బస్సుల రాకపోకలకు అడ్డుగా ఉన్న చెట్లు, షెడ్లు తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. మరుగుదొడ్ల నిర్మాణం చేపడతామని, బస్టాండ్ రూపురేఖలు మార్చేందుకు చర్యలు తీసుకుంటామని షబ్నం వివరించారు. అంతకు ముందు కొయ్యలగూడెం బస్టాండ్‌ను ట్రాన్స్‌పోర్టు అధికారి పరిశీలించినట్లు జంగారెడ్డిగూడెం డీఎం తెలిపారు.

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, దేవిచౌక్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, దేవిచౌక్ వద్ద తాకట్టు పెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
05/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గల వారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025
రామచంద్రపురం.

భరత్‌కుమార్
ప్రభుత్వం నియమించిన వేలందారు
మెయిన్‌రోడ్, రామచంద్రపురం

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, ప్రకాష్‌నగర్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, ప్రకాష్ నగర్ వద్ద తాకట్టుపెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
07/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గల వారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025
రామచంద్రపురం.

భరత్‌కుమార్
ప్రభుత్వం నియమించిన వేలందారు
మెయిన్‌రోడ్, రామచంద్రపురం

సాయి వేంకటేశ్వర ఫైనాన్స్, మెయిన్‌రోడ్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

సాయి వేంకటేశ్వర ఫైనాన్స్, మెయిన్ రోడ్ వద్ద తాకట్టుపెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
06/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గలవారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025
రామచంద్రపురం.

భరత్‌కుమార్
ప్రభుత్వం నియమించిన వేలందారు
మెయిన్‌రోడ్, రామచంద్రపురం

ప్రభాకర నిధి లి., దేవిచౌక్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

ప్రభాకర నిధి, దేవిచౌక్ వద్ద తాకట్టు పెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
08/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గలవారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025
రాజమండ్రి.

చైర్మన్:
ప్రభాకర నిధి లి.

సాయి వేంకటేశ్వర ఎం.ఎం.ఎ. కో- ఆపరేటివ్ సొసైటీ దేవిచౌక్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

సాయి వేంకటేశ్వర ఎం.ఎం.ఎ. కో-ఆపరేటివ్ సొసైటీ, దేవిచౌక్ వద్ద తాకట్టు పెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
09/2025	01-09-2023 to 30-06-2024

ఆసక్తి గలవారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025
రాజమండ్రి.

చైర్మన్:
సాయి వేంకటేశ్వర ఎం.ఎం.ఎ. కో-ఆపరేటివ్ సొసైటీ

నాలుగు ట్రిపుల్ ఐటీల్లో మిగులు సీట్లు 600

రెండో విడత కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు

వేంపల్లె, న్యూస్‌టుడే: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 600 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి విద్యార్థుల మెరిట్ జాబితాను తయారు చేసి ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభిస్తామని, ఆ లోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తామని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు.

రొయ్యల విక్రయానికి వెళ్తూ అనంత లోకాలకు..

కలిదిండి, న్యూస్‌టుడే : మధ్య తరగతి కుటుంబాలు వాళ్లవి. కష్టపడి జీవించే తత్వం. కుటుంబాన్ని పోషించుకోవడానికి ఎంత దూరమైనా వెళ్తారు. అలాంటి ఓ ప్రయాణం వాళ్ల ఉసురు తీసేసింది. కన్నవాళ్లతో సహా ఊరిని కన్నీటి సంద్రంలో ముంచేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కలిదిండి మండలం మూలలంక గ్రామానికి చెందిన కేత సాయి (24), తుట్టా నాగరాజు (18), చిట్టూరి సాయి కలిసి వాహనంలో రొయ్యలు లోడ్ చేయించి శనివారం చెన్నై మార్కెట్‌కు బయలు దేరారు. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం తెట్టు వద్దకు వెళ్లే సరికి వేగంగా వెళ్తున్న లారీ ఆకస్మికంగా బ్రేకులు వేయడంతో వెనుక వెళ్తున్న వాహనం అదుపు తప్పి ఆ లారీని ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో కేత సాయి, తుట్టా నాగరాజు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ఊపిరి వదిలేశారు. వాహనం నడుపుతున్న చిట్టూరి సాయి స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కేత సాయి తండ్రి మూడు నెలల కిందటే మరణించారు. ఆ విషాదం నుంచి ఇంకా కోలుకోని ఆ కుటుంబం ఈ దుర్ఘటనతో మరింత శోకంలోకి వెళ్లిపోయింది. మరోవైపు నాగరాజు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఉప్పుటేరు తీర గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సాయి, నాగరాజు (పాత చిత్రాలు)

చికిత్స పొందుతూ యువకుడి మృతి..

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాకలో ఓ యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. సీఐ కె.కుమారస్వామి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడేనికి చెందిన చింతాకుల సతీష్ (22), తల్లి మంగ, సోదరుడుతో కలిసి ఏడాది కిందట అమ్మమ్మగారి ఊరు ఉపమాక వచ్చి ఇక్కడే నివాసం ఉంటున్నారు. సతీష్ హెటెరో పరిశ్రమలో కాంట్రాక్టర్ వద్ద వెల్డర్‌గా పని చేస్తున్నాడు. ఇతడు మద్యానికి బానిసగా మారడంతో గురువారం తల్లి మందలించింది. అదే రాత్రి మేడ మీదకు వెళ్లిన ఇతడు కొంత సేపటికి కేకలు వేస్తూ వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా, గడ్డిమందు తాగినట్లు గుర్తించారు. వెంటనే నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి తునిలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. ఇతడు చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెచ్‌సీ వెంకటరావు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

సతీష్ (పాత చిత్రం)

మద్యం మత్తులో స్నేహితుల మధ్య ఘర్షణ

ఒకరి మృతి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఇద్దరి స్నేహితుల మధ్య చోటుచేసుకున్న గొడవ హత్యకు దారితీసింది. ఈ ఘర్షణలో పెంటపాడు గ్రామానికి చెందిన రెడ్డి గోవిందు(50) తీవ్రంగా గాయపడి మృతిచెందారు. ఈ ఘటనకు సంబంధించి తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక కొత్తగూడెం ప్రాంతానికి చెందిన గుబ్బల మల్లేశ్వరరావు, రెడ్డి గోవిందు స్నేహితులు. వీరిద్దరూ పెంటపాడులోని ఓ వ్యక్తి వద్ద పశువులకు గడ్డికోసే పని చేస్తుంటారు. ఎప్పటిలాగానే ఆదివారం ఉదయం కూడా పనికి వెళ్లారు. అనంతరం పట్టణంలోని భీమవరం బైపాస్ రోడ్డు వద్దకు వచ్చి మద్యం తాగారు. తాగిన మైకంలో ఒకరితో ఒకరు గొడవకు దిగారు. మల్లేశ్వరరావు సూదిగా ఉన్న రాయితో గోవిందు మెడ భాగం మీద కొట్టడంతో నరం తెగి తీవ్ర రక్తస్రావమైంది. గోవిందును స్థానికులు 108 అంబులెన్సులో తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. ఈ ఘటనపై పట్టణ సీఐ ఆది ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద చనిపోవడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

ముండూరు(పెదవేగి), న్యూస్‌టుడే: అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ ఎస్సై రంజిత్‌కుమార్ కథనం మేరకు.. కామవరపుకోట మండలం తడికలపూడికి ఈడ్పుగంటి వెంకట శ్రీనివాసరావు, దెందులూరు మండలం దోసపాడుకు చెందిన బాలినేని తేజ గ్రామాల్లో రేషన్ బియ్యం సేకరించి బయట అధిక ధరలకు విక్రయిస్తుంటారు. సుమారు 43 క్వింటాళ్ల బియ్యాన్ని లారీలో తరలిస్తుండగా.. మార్గం మధ్యలోని ముండూరు వద్ద పట్టుకున్నారు. లారీ యజమాని షేక్ ఇస్మాయిల్, అక్రమ రవాణాదారులు జంగం సురేశ్, గుడిపూడి రత్నరాజును అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీసులకు అప్పగించారు. సీఎస్ డీటీ వి.వి.రామారావుకు బియ్యం స్వాధీనం చేసినట్లు తెలిపారు. విజిలెన్స్ అధికారుల ఫిర్యాదు మేరకు వారిపై ఆదివారం కేసులు నమోదు చేసినట్లు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

తొమ్మిది మందికి తీవ్ర గాయాలు

జీలుగుమిల్లి(బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: జీలుగుమిల్లిలో ఆదివారం ఉదయం ఒక పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. అది కరవడంతో తొమ్మిది మంది తీవ్ర గాయాలపాలయ్యారు. రాష్ట్ర సరిహద్దులో ప్లాస్టిక్ దుకాణం నిర్వహించే తాటియాకులగూడేనికి చెందిన వృద్ధురాలు భూక్యా నీలిమ, రమణ, భగత్ సింగ్ కాలనీకి చెందిన కె.రాణి, రామన్నపాలేనికి చెందిన కమలమ్మ, ఎస్.భద్రమ్మ, జీలుగుమిల్లికి చెందిన ఎస్.నాగేశ్వరమ్మ, పి.కృష్ణ, దావీదు, సాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. ఒక ఇంటి వద్ద దూడను కరిచే ప్రయత్నం చేయగా, స్థానికులు కుక్కను హతమార్చారు. బాధితులకు స్థానిక పీహెచ్‌సీలో చికిత్సలు చేసి, మెరుగైన వైద్యానికి జంగారెడ్డిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్య

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ఉరేసుకొని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మధురానగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెనుమంట్ర మండలం మాముడూరు గ్రామానికి చెందిన వీరవల్లి పవన్‌కుమార్(24) హైదరాబాద్ అమీర్‌పేట్ సమీప ఎల్లారెడ్డిగూడలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ.. నానక్‌రామ్‌గూడలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడు ఆదివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో స్నానాల గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివాదాస్పదంగా చర్చి డైరెక్టర్ల ఎన్నిక

ఏలూరు టూటౌన్, వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఒకటో పట్టణంలోని ఓ చర్చిలో డైరెక్టర్ల ఎన్నిక ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. సభ్యుల కథనం మేరకు.. కత్తేపు వీధిలోని చర్చిలో మూడేళ్లకోసారి డైరెక్టర్ల ఎన్నిక నిర్వహిస్తారు. మొత్తం 300 మంది సభ్యులుండగా.. ఎన్నిక ప్రక్రియలో భాగస్వాములయ్యేవారు. తాజాగా కొందరికే ఓటు హక్కు కల్పిస్తామని పాస్టర్ చెప్పడంతో.. మిగతా సభ్యులు ఆదివారం చర్చి ఎదుట ఆందోళనకు దిగారు. గత తరహాలో సభ్యులందరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.ల్లో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 110, 118, 129 చికెన్ విత్ స్కిన్ - 210 చికెన్ స్కిన్‌లెస్ - 220.

ఎస్సై కుటుంబానికి రూ.26 లక్షల ఆర్థిక సాయం

నరసాపురం, న్యూస్‌టుడే: విధుల్లో భాగంగా హైదరాబాద్ వెళ్తూ రహదారి ప్రమాదంలో మృతి చెందిన పోలీసు అధికారి కుటుంబానికి ఎస్సై వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు రూ.26 లక్షల ఆర్థిక సాయం అందించారు. నరసాపురం వాసి ముద్దాడ అశోక్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు ఎస్సైగా పనిచేశారు. గత నెలలో హైదరాబాద్ వెళ్తుండగా కోదాడ వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో ఆయనతో పాటు కానిస్టేబుల్ బ్లెస్సన్ జీవన్ మృతి చెందారు. అశోక్ 2009 బ్యాచ్ ఎస్సై. ఆ బ్యాచ్‌కు చెందిన ఉభయ తెలుగు రాష్ట్రాల పోలీసు అధికారులు 2020లో వెల్ఫేర్ సొసైటీని స్థాపించారు. అప్పటి నుంచి ఇబ్బందుల్లో ఉన్న సంఘ సభ్యులకు సొసైటీ ద్వారా సుమారు రూ.2 కోట్ల ఆర్థిక సాయం అందించారు. ఆ సొసైటీ ప్రతినిధులు ఆదివారం నరసాపురంలోని అశోక్ ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చెక్కు అందించారు. అనంతరం ఆలమూరులో కానిస్టేబుల్ బ్లెస్సన్ నివాసానికి వెళ్లి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందించారు.

నమూనా చెక్కు అందజేస్తున్న సొసైటీ సభ్యులు

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

టైలరింగ్ వర్క్స్ ఇంటి వద్దనే పనిచేసే స్త్రీలు కావలెను. వారికి క్లాత్ ఇచ్చుటకు స్టాక్ పాయింట్స్ పెట్ పార్టనర్స్ కావలెను. ✆ 7093632399.

FINANCIAL SERVICES

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

REAL ESTATE

LAND FOR SALE

గుంటూరు, అమరావతి రోడ్, అమరావతి రాజధానికి (25 Km) దగ్గరలో 3.20 ఎకరాలు స్థలము అమ్మకమునకు కలదు. contact: 7702349728

PLOT FOR SALE

విశాఖలో/ అనకాపల్లిలో NRI ఫామ్ ల్యాండ్స్ వేయుటకు ఇన్వెస్ట్ పార్టనర్స్ కావలెను. సంప్రదించండి. ✆ 7386414017/ 7093632399.

JOBS

Wanted teachers of Physical Science, Maths for Classes 6th to 10th. Contact or Send resume through Whatsapp: 98853 47949. Vijaya E.M. School, Penumantra, W.G.Dt.

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్లు సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో. వ. + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ✆ 92814 52845, 82475 00574.

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.

త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 85209 80099, 85208 74499.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.35 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

THE EENADU WAY CLASSIFIEDS

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

జి.ఎస్.టి. 5% అదనం

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

కష్టం తీరి.. అద్దంలా మారి..!

ఉండి, న్యూస్‌టుడే: ఉండి నుంచి ఆకివీడు వెళ్లే 165 జాతీయ రహదారిపై ఆర్వోబీ (రైల్వేపై వంతెన) ప్రాంతంలో రహదారి ధ్వంసం కావడంతో వాహన చోదకులు, ప్రయాణికులు, పాదచారులు ప్రత్యక్ష నరకం చవిచూశారు. గత వైకాపా ప్రభుత్వం కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో వారి కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. వర్షాకాలంలో నీరు నిలిచిపోయి గుంతల్లో రహదారిని వెతుక్కోవాల్సి వచ్చింది. వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురయ్యేవారు. ఆర్వోబీ రహదారి దయనీయ స్థితిపై 'చంద్రయానమే నయం', 'నిరీక్షణతో నరకం', మధ్యలోనే చేతులెత్తేశారు శీర్షికలతో 'ఈనాడు' లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి.

ఆర్నెళ్ల నుంచి కదలిక.. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు చేసిన కృషితో ఉండి రైల్వే గేటుకు ఇరువైపులా జాతీయ రహదారి అభివృద్ధి పనులకు ఆర్నెళ్ల కిందట కదలిక వచ్చింది. ఆర్వోబీ పిల్లర్లకు ఇరువైపులా పూర్తిగా దెబ్బతిన్న రహదారులను యంత్రాల సహాయంతో తొలుత చదును చేశారు. అనంతరం తారుతో అభివృద్ధి పరిచారు. మరోవైపు అంచుల్లో ఎర్ర కంకర, రాళ్లు వేసి బలోపేతం చేశారు. హైవే అధికారుల పర్యవేక్షణలో సుమారు రెండు కిలోమీటర్ల పరిధిలో విస్తరణ పనులు పూర్తి చేశారు. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సుదీర్ఘకాలం తరువాత ఈ రహదారికి కొత్త రూపం వచ్చిందని సంబరపడుతున్నారు.

ఉండి రైల్వే పైవంతెన ప్రాంతంలో...

కొత్తగా వేసిన రహదారి

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉపోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 6304901226

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

విద్యార్థినికి ఆర్థిక సహాయం

నాయుడుగూడెం(పెదపాడు), న్యూస్‌టుడే: నాయుడుగూడేనికి చెందిన విద్యార్థిని దొండపాటి దివ్య జ్యోత్స్న ఇంటర్మీడియట్ చదువుతున్నారు. తల్లిదండ్రులు విడిపోవడంతో అమ్మమ్మ చల్లా రమణమ్మతో కలిసి ఉంటున్నారు. ప్రతిభావంతురాలైన విద్యార్థినికి వల్లూరి సుష్మ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ వల్లూరి వెంకటకృష్ణయ్య, సుభద్రాదేవి దంపతులు రూ.40 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. బాలిక చదువుకు తోడ్పాటునిస్తామని వారు హామీ ఇచ్చారు.

తప్పుడు పత్రాలు సృష్టిస్తే చర్యలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆటో చోదకులు ట్రాఫిక్ పోలీసు క్లియరెన్స్ నంబరు పొందేందుకు తగిన ధ్రువపత్రాలు అందజేయాలని, తప్పుడు పత్రాలు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు హెచ్చరించారు. స్థానిక ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఆటో రిజిస్ట్రేషన్, పర్మిట్, ఫిట్‌నెస్, బీమా, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ తదితరాలను తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. నగర ప్రజల భద్రత, రవాణా వ్యవస్థ మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పుంత రహదారికి మోక్షం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: బురద కయ్యగా మారిన చేబ్రోలు- నారాయణపురం పుంత రహదారికి మోక్షం కలిగింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఎమ్మెల్యే ధర్మరాజు సూచనలతో ఆదివారం ఈ మార్గం బాగుకు శ్రీకారం చుట్టారు. పనులను క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణంరాజు పర్యవేక్షిస్తున్నారు. నారాయణపురం వంతెనకు రంధ్రం పడటంతో.. ఈ దారిలో వాహనాలను మళ్లించారు. రాకపోకలకు అనువుగా మెరక చేసి చదును చేశారు. వర్షాలకు బురదగా మారడంతో.. మళ్లీ బాగు చేస్తున్నారు.

ఏలూరు సినిమా

అంబిక డీలక్స్	లోపలికి రా చెప్తా
అంబిక మినీ	తొలిప్రేమ
సాయిబాలాజీ	జురాసిక్ వరల్డ్ రీబర్త్
బాలాజీ	హౌ టూ ట్రైన్ యువర్ డ్రాగన్
సత్యనారాయణ స్క్రీన్ 1	కన్నప్ప
సత్యనారాయణ స్క్రీన్ 2	మార్గన్
సత్యనారాయణ స్క్రీన్ 3	తమ్ముడు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	కుబేర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	సితారే జమీన్ పర్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	3 బీహెచ్‌కే
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	కుబేర
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	మార్గన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	కన్నప్ప
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	కన్నప్ప

పెంపుడు జంతువులకు టీకాలు

భీమడోలు, న్యూస్‌టుడే: పూళ్ల పశు వైద్యశాలలో ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం నిర్వహించారు. పశు వైద్యురాలు జ్యోతి శునకాలకు ఉచితంగా టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ.. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను 'జూనోటిస్'గా పిలుస్తారన్నారు. దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్పంచి సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలకు డిమాండ్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ పింఛనుదారులకు మెరుగైన సేవలందించాలని ఏఐఎఫ్‌పీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.బాలసుబ్రహ్మణ్యం, డి.సుబ్బారావు డిమాండ్ చేశారు. నగరంలో పింఛనుదారుల సంఘం ఉమ్మడి జిల్లా 37వ వార్షిక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పింఛనుదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎనిమిదో వేతన సంఘం ఛైర్మన్, సభ్యుల నియామకంలో ఆలస్యం, రీవాలిడేషన్ బిల్లు తదితరాలపై మాట్లాడారు. సంఘం బలోపేతానికి సూచనలు, సలహాలు స్వీకరించారు. అనంతరం 12 మంది సభ్యులను ఘనంగా సత్కరించారు.

ఆశలు.. అడియాసలు!

స్పౌజ్ పింఛన్లకు 1,059 మంది ఎదురుచూపులు

'నా భర్త మరణించి ఏడాది పూర్తయింది. ఆయనకొచ్చే పింఛను నాకు ఇస్తానన్నారు. గత నెల 12న పంపిణీ చేస్తామన్నారు. ఇంకా ఇవ్వలేదు. ఈ నెలైనా ఇస్తారని ఆశపడ్డాను. మళ్లీ నిరాశే ఎదురైంది. ఇంత వరకు నగదు ఇవ్వలేదు. అధికారులు న్యాయం చేయాలి' అని ఉంగుటూరుకు చెందిన గండికోట నాగమణి కోరుతున్నారు.

ఏలూరు ఆర్‌ఆర్ పేట, ఉంగుటూరు- న్యూస్‌టుడే: స్పౌజ్ పింఛన్లకు లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. గ్రామాల వారీగా అర్హుల జాబితా సిద్ధం చేసి రెణ్నెల్లు దాటుతున్నా.. నేటికీ నగదు అందలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఎన్టీఆర్ భరోసా పథకంలో స్పౌజ్ పింఛన్ విభాగాన్ని ప్రవేశపెట్టింది. సామాజిక పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే, ఆయన భార్యకు మరుసటి నెల నుంచే స్పౌజ్ పింఛను అందించాలని నిర్ణయించింది.

పింఛన్లు పంపిణీ చేసిన ఎంపీడీవో రాజ్‌మనోజ్

అనివార్య కారణాలతో.. 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య స్పౌజ్ విభాగంలో పింఛన్లు పొందేందుకు అర్హుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. ఉంగుటూరు, ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల్లో 1,059 మందిని అర్హులుగా తేల్చింది. వీరికి జూన్ 12న రాష్ట్ర ప్రభుత్వం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పింఛన్లు అందజేయాలని నిర్ణయించారు. అనివార్య కారణాలతో కార్యక్రమాన్ని వాయిదా వేశారు.

నగదు విడుదలైనా.. జులై ఒకటి తర్వాత పింఛన్లు పంపిణీ చేస్తారని లబ్ధిదారులు ఆశించారు. మూడు నియోజకవర్గాల్లో 1,059 మందికి రూ.42.36 లక్షలు విడుదలైంది. నగదు అందజేతకు ఆదేశాలు రాకపోవడంతో.. మళ్లీ నిరాశ తప్పలేదు. 'ఉన్నతాధికారుల ఆదేశానుసారం త్వరలోనే స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేస్తాం. లబ్ధిదారులు ఆందోళన పడొద్దు' అని ఉంగుటూరు ఎంపీడీవో రాజ్‌మనోజ్ తెలిపారు.

మూడు నియోజకవర్గాల వివరాలిలా..

మండలం	కొత్తగా మంజూరు	నగదు (రూ.లక్షల్లో)
ఏలూరు నగరం	243	9.72
ఏలూరు గ్రామీణ	62	2.48
ఉంగుటూరు	143	5.72
భీమడోలు	102	4.08
నిడమర్రు	67	2.68
గణపవరం	105	4.20
దెందులూరు	102	4.08
పెదవేగి	124	4.96
పెదపాడు	111	4.44

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు టూటౌన్: 80085 74487	ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483	ఉంగుటూరు: 79933 00492

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? పత్తేబాద రైతు బజార్ ప్రధాన గేట్ ఎదుట తోపుడు బండ్లు అడ్డదిడ్డంగా ఉంచుతున్నారు. వినియోగదారులు లోపలికి వెళ్లేందుకు, బయటకొచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. **- శ్రీనివాసరావు**

✔ గేట్‌కు ఎదురుగా నిలుపుదల చేస్తున్న తోపుడు బండ్ల వ్యాపారులతో మాట్లాడతాం. వాటిని తొలగించి వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తాం. **- వినోద్‌బాబు, ఎస్టేట్ అధికారి**

? స్థానిక గో సంరక్షణ సమితి వద్ద మామిడి పండ్ల విక్రయదారులు వరి గడ్డిని కుప్పగా పడేస్తున్నారు. చిన్నపాటి వర్షానికి కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. **- రమణకుమార్**

✔ వరి గడ్డి కుప్పలు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. మరోమారు సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. ఇంకోసారి వేయకుండా చూస్తాం. **- చంద్రయ్య, అదనపు కమిషనర్**

పెదవేగి, న్యూస్‌టుడే: ? తురాయిచెట్టు కూడలికి వెళ్లే మార్గంలో తాగునీటి కుళాయికి అమర్చిన బిరడా దెబ్బతింది. దాంతో తాగునీరు లీకై రోడ్డుపై ప్రవహిస్తోంది. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. **- రాహుల్‌దేవ్, వాహనదారు**

✔ కుళాయికి బిరడా ఏర్పాటు చేస్తాం. నీటి లీకేజీని అరికడతాం. **- ప్రసాద్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి**

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: ?ఎనికేపల్లిలో ట్యాంకు సమీప విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకుపోయాయి. సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. **- సూర్యారావు**

✔ విద్యుత్తు స్తంభాన్ని పరిశీలిస్తాం. సిబ్బందితో పాదులు తొలగింపజేస్తాం. **- ప్రసాద్‌రాజు, విద్యుత్తు ఏఈ**

జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివి: బడేటి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: మాజీ ఉప ప్రధానమంత్రిగా దేశాభివృద్ధికి బాబూ జగ్జీవన్‌రామ్ ఎనలేని సేవలందించారని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా.. స్థానిక అగ్నిమాపక కూడలి సమీపంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళి అర్పించారు. దళిత సంఘాల నాయకులు రవి, ప్రతాప్‌కుమార్, అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు: విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చంటి తదితరులు

భీమడోలు: బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి, వారి అభ్యున్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ అహర్నిశలు శ్రమించారని సర్పంచి షేక్ రహీమా బేగం అన్నారు. పోలసానిపల్లిలోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

గ్రామాల రూపురేఖలు మారుస్తాం: గన్ని

గణపవరం, న్యూస్‌టుడే: గ్రామాల రూపురేఖలు మార్చేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. 'సుపరిపాలనకు తొలి అడుగు'లో భాగంగా వాకపల్లి, వీరేశ్వరపురం గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. రాష్ట్ర టైలర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ ఆకాశపు స్వామితో కలిసి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై రూపొందించిన కరపత్రాలను స్థానికులకు పంచిపెట్టారు. వారి చెప్పిన సమస్యలను తెదేపా యాప్‌లో నమోదు చేశారు. పుంత రహదారులను అభివృద్ధి చేయాలని ఏఎంసీ ఉపాధ్యక్షుడు కూనసాని నాగేశ్వరరావుకు రైతులు విన్నవించారు. నాయకులు ఇందుకూరి రామకృష్ణంరాజు, నండూరి గాంధీ, పెదకాపు, సుబ్బారావు, వీరన్న పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న ఆప్కాబ్ ఛైర్మన్ వీరాంజనేయులు

చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్థానిక అశోక్‌నగర్‌లోని భాజపా జిల్లా కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు కృష్ణప్రసాద్, సత్యనారాయణ, రాంబాబు, సోమశేఖరాచారి తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ నీరుగారి.. ఆహ్లాదం ఆవిరి!

పవరుపేట(ఏలూరు వన్‌టౌన్), న్యూస్‌టుడే

నిర్వహణ లోపంతో స్వచ్ఛభారత్ లక్ష్యం నీరుగారుతోంది. నగరంలో చెత్త కుప్పలు పోగై.. దుర్గంధం వచ్చే ప్రాంతాలను అధికారులు పరిశీలించి, అక్కడ శుభ్రత మెరుగుపరిచే చర్యలు తీసుకున్నారు. స్థానికులు చెత్తాచెదారాలు వేయకుండా ఆహ్లాదం కల్పించారు. అక్కడ ఇనుప కంచెలు ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజల భాగస్వామ్యంతో మినీ ఉద్యానాలు తీర్చిదిద్దారు. ఫల, పుష్ప మొక్కలు నాటారు. ఫలితంగా ఆయా ప్రాంతాలు ఆహ్లాదంగా మారాయి.

కొరవడిన పర్యవేక్షణ.. ప్రస్తుతం మినీ ఉద్యానాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. చెత్త కుప్పలు, వ్యర్థాలు పేరుకుపోయి కనిపిస్తున్నాయి.

మినీ ఉద్యానాల బాగోగులు విస్మరించిన అధికారులు

ప్రస్తుతం రక్షణ కంచెల లోపల మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. పిచ్చిమొక్కలు పెరిగిపోయి సర్పాలకు ఆవాసాలుగా మారాయి. అధికారులు స్పందించి ఆయా ప్రాంతాలను మళ్లీ అభివృద్ధి చేసి మొక్కలు నాటాలని స్థానికులు కోరుతున్నారు. కమిషనర్ భానుప్రతాప్‌ను వివరణ కోరగా.. మినీ ఉద్యానాలను పరిశీలిస్తామని, వాటిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఏలూరు ఒకటో పట్టణం ఎస్‌బీఐ ఎదురు రక్షణ కంచె లోపల పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిన దృశ్యమిది. గతంలో ఇక్కడ చెత్తాచెదారం పేరుకుపోతూ ఉండేది. స్థానికులు వ్యర్థాలు పడేయకుండా నగరపాలక సంస్థ అధికారులు ఇనుప కంచె ఏర్పాటు చేశారు. లోపల మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం పిచ్చిమొక్కలు మొలిచి అధ్వానంగా తయారైంది.

శ్రీవారికి చింతమనేని పూజలు

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి, శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జునస్వామి ఆలయాలను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించారు. తొలి ఏకాదశిని పురస్కరించుకొని ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వారికి స్వామివారి ఆశీర్వచనాలు అందజేశారు. మండలంలోని తెదేపా కార్యకర్తలు పలువురు ఆయన్ను కలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో తెలంగాణలోనూ తెదేపా బలోపేతానికి కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలంతా ఆనందంగా ఉన్నారన్నారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు పానుగంటి రామారావు, నాగుల్‌మీరా, వెంకటేశ్వరరావు, రాంబాబు, నరేష్ పాల్గొన్నారు.

స్వామివారి సేవలో ఎమ్మెల్యే దంపతులు

పూడిక తీయక.. మురుగు కదలక..

ఏలూరు నగరంలోని కొత్తపేట, పవరుపేట ప్రాంతాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఇక్కడి కాలువల్లో ఏరోజుకారోజు పూడిక తీయడం లేదు. ఫలితంగా మురుగు ఎక్కడిక్కడే నిలిచిపోతోంది. దీనికితోడు చెత్తాచెదారం కాలువల్లో పడేస్తుండటంతో.. పరిస్థితి మరింత దుర్భరంగా మారుతోంది. ఏలూరు నుంచి విజయవాడ వైపు ప్రవహించే పంట కాలువలోనూ వ్యర్థాలు పడేస్తున్నారు. ఫలితంగా నీటి ప్రవాహానికి అవరోధంగా ఏర్పడుతోంది. అధికారులు స్పందించి కాలువల్లో పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు. ఆయా ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో పూడిక తీయించేలా సిబ్బందిని ఆదేశాలిస్తానని నగరపాలక కమిషనరు భానుప్రతాప్ తెలిపారు. **- న్యూస్‌టుడే, ఏలూరు అర్బన్**

అపరిశుభ్రంగా.. నిరుపయోగంగా!

ఏలూరు ఇండోర్ స్టేడియం సమీప అన్న క్యాంటీన్ వద్ద నున్న ప్రజా మరుగుదొడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. నగరాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో.. నగర పాలక సంస్థ శౌచాలయాలు నిర్మించారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, గ్రంథాలయాలు అధికంగా ఉన్నాయి. నీటి సౌకర్యం లేకపోవడంతో మరుగుదొడ్ల పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. దీనికి తోడు దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి శౌచాలయాలను వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు నగరం**

రక్షణ లేక.. ప్రమాదాలు ఆగక!

ఏలూరు నగరం ఆదివారపుపేట నుంచి గన్‌బజార్, ఆర్‌ఆర్ పేటకు వెళ్లే రహదారి పక్కన.. మురుగు కాలువ ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ప్రధాన కాలువ వెంబడి రక్షణ గోడ నిర్మించకపోవడంతో సమస్య నెలకొంటోంది. రాత్రివేళ ముందు వెళ్తున్న వాహనాలను అధిగమించే క్రమంలో చోదకులు అదుపు తప్పి.. కాలువలో పడిపోతున్నారు. పాదచారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కాలువ వెంబడి ప్రహరీ ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు నగరం**

అల్లుకున్న తీగలు.. నిర్లక్ష్యపు ఆనవాళ్లు!

ఉంగుటూరు మండలంలోని పలుచోట్ల విద్యుత్తు స్తంభాలు, తీగలకు పాదులు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారాయి. కైకరంలో జాతీయ రహదారి(తాడేపల్లిగూడెం వైపు) పక్కన, ఉంగుటూరు- కాగుపాడు జడ్పీ రహదారి, నారాయణపురం పద్నాలుగో వార్డు(కాలువ గట్టు సమీపం)లో స్తంభాలకు పాదులు ఏపుగా పెరిగిపోయాయి. వీటిని తొలగించడంలో విద్యుత్తు సిబ్బంది మీనమేషాలు లెక్కిస్తున్నారు. చిన్నపాటి వర్షం, గాలులకు సరఫరా నిలిచిపోతోందని, విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు వస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. **- న్యూస్‌టుడే, ఉంగుటూరు**

బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగులు

పెదవేగి, న్యూస్‌టుడే: మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లిన ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. రాట్నాలకుంటకు చెందిన తామరారు త్రిపురాంబ ఇంటి ఎదురు రోడ్డుపై బడ్డీ కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి రెండు సిగరెట్లు తీసుకున్నారు. కొట్టు వద్ద ఆమె ఒంటరిగా ఉండటాన్ని గమనించి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: కొమడవోలు పేదల కాలనీలో జూదం ఆడుతున్న నలుగురిని ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,900 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

ఆటో బోల్తా.. కూలీలకు గాయాలు

దెందులూరు, న్యూస్‌టుడే: గంగన్నగూడెం సమీపంలో కూలీలను తరలిస్తున్న ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటనలో ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

ఉంగుటూరులో కోట్లమ్మ

ఏలూరు: రామావతారంలో పాండురంగడు

తొలి ఏకాదశి.. భక్త సిరి మురిసి!

ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో తొలి ఏకాదశి పూజలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏలూరు పాత బస్టాండ్ సమీప పాండురంగ స్వామి, పవరుపేట సూర్యభగవానుడు, అగ్రహారం జనార్దనస్వామి, సత్రంపాడు లక్ష్మీగణపతి, దొండపాడు శ్రీనం దత్తనాథ క్షేత్రం, ఆర్‌ఆర్ పేట, కొత్తపేట వేంకటేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు తరలివచ్చారు. సౌభాగ్యలక్ష్మీదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరి, అంబికాదేవి, తూర్పువీధి గంగానమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. నిడమర్రు మండలం పెదనిండ్రకొలను పార్వతీ సమేత భీమేశ్వరస్వామి, పెద్దింట్లమ్మ, వేణుగోపాలస్వామి, పెదవేగి మండలం రాట్నాలకుంట రాట్నాలమ్మ దేవాలయాల్లో విశేష అలంకరణలు చేపట్టారు. ఉంగుటూరు మండలం చేబ్రోలు కోట్లమ్మ, గాంధీనగర్ కనకదుర్గమ్మ ఆలయాల్లో అమ్మవార్లకు గ్రామస్థులు సారె సమర్పించారు. కైకరం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నేత్రపర్వంగా వైభవోత్సవాలు నిర్వహించారు. దెందులూరు కనకదుర్గమ్మ, ఏలూరు గ్రామీణం మాదేపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాల్లోనూ విశేష కార్యక్రమాలు జరిగాయి. **- న్యూస్‌టుడే బృందం**

నిడమర్రులో కేశవస్వామి

ఏలూరు: శాకంబరిగా గంగానమ్మ

ఉంగుటూరు: హారతి తీసుకుంటున్న మహిళలు

ఏలూరు: ప్రత్యేకాలంకరణలో అంబికాదేవి

ద్విచక్ర వాహనం దగ్ధం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగర శివారు జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్ర వాహనం దగ్ధమైంది. అగ్నిమాపక శాఖ జిల్లా సహాయాధికారి రామకృష్ణ కథనం మేరకు.. పెదవేగి మండలం అమ్మపాలేనికి చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై ఏలూరు వస్తున్నారు. మార్గం మధ్యలోని చుట్టగుంట వంతెన వద్ద వాహనం ఆగిపోయింది. ఇంజిన్ నుంచి పొగలు రావడంతో వారు అప్రమత్తమై వాహనం దిగి దూరంగా వెళ్లిపోయారు. మంటలు చెలరేగడంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు.

10న మండల సమావేశం

పెదపాడు, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఈ నెల 10న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షేక్ అమిలుజమా తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు విధిగా హాజరు కావాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అనుసంధాన దారి.. అధ్వానంగా మారి!

ఏళ్లుగా అభివృద్ధికి నోచని వైనం

కేశవరం- శీతాలం కొండేపాడు రహదారి అధ్వానంగా మారిన దృశ్యమిది. మండల కేంద్రం గణపవరానికి సుమారు 20 కి.మీ.లకు పైగా దూరం ఉంది. కేశవరం నుంచి శీతాలం కొండేపాడుకెళ్లే ఏకైక అనుసంధాన దారి నామ రూపాల్లేకుండా తయారవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు.

గణపవరం, న్యూస్‌టుడే: గ్రామాల మధ్య అంతరాలు తగ్గి.. ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉండాలన్న ఉద్దేశంతో నిర్మించిన అనుసంధాన రహదారులు అధ్వానంగా మారాయి. సుమారు పదిహేనేళ్ల కిందట 26.4 కిలోమీటర్ల మేర 14 గ్రామాలు కలుపుతూ.. నిర్మించిన రోడ్లు ఛిద్రంగా తయారయ్యాయి. కంకర తేలి, అడుగుకో గుంత చందాన దర్శనమిస్తున్నాయి. ఈ మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు, వాహనదారులు నరకం చూస్తున్నారు.

వ్యవసాయోత్పత్తుల తరలింపునకు.. మండలంలో సుమారు 65 వేలకు పైగా జనాభా ఉన్నారు. అనుసంధాన రహదారులు దుస్థితికి చేరడంతో.. రైతులకూ ఇబ్బందులు తప్పడం లేదు. ఆయా మార్గాల మీదుగా వేలాది ఎకరాల ఆయకట్టు రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉండేది. వ్యవసాయ, ఆక్వా ఉత్పత్తుల తరలింపునకు బాగుండేది. ప్రస్తుత అధ్వాన దారులతో వారంతా అష్టకష్టాలు పడుతున్నారు. అధికారులు స్పందించి అనుసంధాన రహదారులను అభివృద్ధి చేయాలని గ్రామీణులు కోరుతున్నారు.

2 కి.మీ. బాగు చేస్తే.. అప్పన్న పేట, అగ్రహార గోపవరం, ముగ్గళ్ల గ్రామాల మధ్యనున్న రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. గణపవరం నుంచి జల్లికొమ్మర వెళ్లేందుకు వెంకయ్య వయ్యేరు కాలువ గట్టును ఎనిమిదేళ్ల కిందట 4 కి.మీ. మేర అభివృద్ధి చేసి వదిలేశారు. మిగతా 2 కి.మీ. బాగు చేస్తే రైతులు, స్థానికులకు ఉపయుక్తంగా ఉంటుంది. 'రహదారుల స్థితిగతులపై సర్వే చేపట్టాం. నివేదిక ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంది' అని భీమవరం పీఐయూ డీఈ డి.రాంబాబు తెలిపారు.

జల్లికాకినాడ నుంచి అర్ధవరం మీదుగా ఆరేడుకెళ్లే రోడ్డు దుస్థితికి చేరిన చిత్రమిది. సుమారు 12 కి.మీ.ల మేర అడుగుకో గొయ్యి చందాన తయారైంది. రహదారి పూర్తిగా దెబ్బతినడంతో.. వాహనదారులు, ప్రయాణికులు పడుతూ, లేస్తూ గమ్యాలకు చేరుకోవాల్సి వస్తోంది.

'లీజు సొమ్ము చెల్లించే వరకు వదలం'

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: కొల్లేరు ప్రాంతంలో చేపల చెరువుల తవ్వకాలకు అక్కడి నివాసితుల నుంచి మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి తీసుకున్న లీజు సొమ్ము తిరిగి వసూలు చేసే వరకు వదిలేది లేదని ఆ ప్రాంత నాయకుడు సైదు సత్యనారాయణ అన్నారు. స్థానిక తెదేపా జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కొల్లేరు వాసుల నుంచి అక్రమంగా వసూలు చేసిన లీజు సొమ్ము చెల్లించే వరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇటీవల కొండలరావుపాలెంలో నిర్వహించిన వైకాపా జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో అబ్బయ్య చౌదరి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. నాయకులు రవి, బి.సుధాకర్, నాగరాజు, నారాయణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏరు పొంగితే యాతనే!

ఎండిన గుర్రపు డెక్క తొలగింపులో ఉదాసీనత

తంగెళ్లమూడి(ఏలూరు అర్బన్), న్యూస్‌టుడే: నగరం మీదుగా ప్రవహిస్తున్న తమ్మిలేరు.. ప్రజల దుఃఖదాయినిగా మారింది. ఏటా వర్షా కాలంలో ఏటిలో నీటి ఉద్ధృతి పెరిగి, నగరవాసుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రధానంగా శనివారపుపేటకు వెళ్లే దారిలో కాజ్‌వే పైనుంచి నీరు పొంగిపొర్లుతోంది. ఫలితంగా ఉద్ధృతి తగ్గేవరకు ప్రజలు రాకపోకలకు వీలుండటం లేదు. తమ్మిలేరులో నీటి ప్రవాహానికి ప్రధాన అడ్డంకి గుర్రపుడెక్క. దీన్ని ఏటా వేసవి చివరిలో జలవనరుల శాఖ సిబ్బంది తొలగించాల్సి ఉంటుంది.

డ్రోన్లతో పిచికారీ.. ఇటీవల తమ్మిలేరులో గుర్రపు డెక్కపై డ్రోన్లతో రసాయనాలు చల్లారు. ప్రస్తుతం పూర్తిగా ఎండిపోయింది. దాన్ని తొలగించడంలో తాత్సారం ప్రదర్శిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో.. తమ్మిలేరులో నీటి ప్రవాహం సవ్యంగా సాగడం లేదు. అధికారులు స్పందించి ఎండిపోయిన గుర్రపు డెక్క తొలగించాలని నగరవాసులు కోరుతున్నారు. 'ఎండిన గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపడతాం. శనివారపుపేటకు వెళ్లే మార్గంలో కాజ్‌వే స్థానంలో పైవంతెన నిర్మాణానికి ప్రభుత్వం అనుమతించింది. ఈ పనులు పురోగతిలో ఉన్నాయి' అని డ్రెయినేజీ విభాగం ఈఈ సత్యనారాయణ తెలిపారు.

(c) eenadu

పోలవరం

•పోలవరం • చింతలపూడి

ప్రజా శ్రేయస్సే లక్ష్యం

బాలరాజుతో భాజపా నాయకులు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజల శ్రేయస్సు లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని శాసనసభ్యుడు చిర్రి బాలరాజు అన్నారు. కొయ్యలగూడెంలో భాజపా నాయకులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. లోటుపాట్లు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. సమావేశంలో రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు బొల్లిన నిర్మలకిశోర్, భాజపా మండలాధ్యక్షుడు గొలి శెట్టి శ్రీను, జిల్లా కార్యదర్శి కట్టా సత్యనారాయణ, చిరపూరి శ్రీను, బొమ్మా బాబు తదితరులు పాల్గొన్నారు.

కల్కి అవతారంలో జగన్నాథస్వామి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: రథోత్సవాల్లో చివరి రోజు ద్వారకాతిరుమల మండలం లక్ష్మీపురం జగన్నాథస్వామి ఆదివారం కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి దశావతారాల్లో భాగంగా రోజుకో అలంకారంలో కనువిందు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించి తరించారు.

విరాళం అందజేత

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కొమ్ముగూడెం శివారు కమ్మరిగుట్టు వద్ద చేపట్టిన రమా సమేత సత్యనారాయణస్వామి ఆలయ నిర్మాణానికి బుట్టాయగూడెంకి చెందిన తెదేపా మండల మాజీ అధ్యక్షుడు నల్లూరి కృష్ణమోహన్ తల్లి విజయలక్ష్మి రూ.11,116 విరాళంగా అందజేశారు.

దాత గాంధీకి గోసంరక్షణ పథకం పత్రాన్ని అందజేస్తున్న భద్రాజీ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి పథకాలకు రూ.2లక్షల విరాళం సమకూరింది. ముసునూరు మండలం సూరేపల్లికి చెందిన వడ్లపట్ల గాంధీ శ్రీవారి గోసంరక్షణ పథకానికి రూ.లక్ష, గుంటూరు జిల్లా పట్టాభిపురానికి చెందిన కొటాల శ్రీనివాస్ రూ.లక్ష విరాళాలను ఆలయ కార్యాలయంలో ఆదివారం జమ చేశారు. ఈ సందర్భంగా ఆలయ డిప్యూటీ ఈవో భద్రాజీ, సూపరింటెండెంట్ కిశోర్ దాతలను అభినందించి స్వామివారి ప్రసాదాలు, రసీదు పత్రాలను అందజేశారు.

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి ఆలయ అభివృద్ధి కమిటీకి ఆదివారం రూ.2 లక్షల విరాళం సమకూరింది. పట్టణానికి చెందిన ఏలూరి రమేష్ రూ.లక్ష, కావిలిపురి రమేష్ రూ.లక్ష చొప్పున అందజేశారు. అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పేరిచర్ల జగపతిరాజు, ప్రతినిధి వాసవి నగేష్‌లకు వీరు తమ విరాళాన్ని ఆదివారం ఆలయం వద్ద అందించారు.

చింతాలమ్మ ఆలయ నిర్మాణంపై చర్చ

సమావేశమైన గ్రామస్థులు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం గ్రామ దేవత చింతాలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధుల సేకరణ, నూతన ఆలయ నిర్మాణానికి నిధుల సేకరణ తదితర అంశాలపై సమావేశంలో చర్చకు వచ్చింది. అదే సందర్భంలో పోలవరం శాసనసభ్యుడు చిర్రి బాలరాజు ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.1,11,116లను విరాళంగా ప్రకటించారని కమిటీ అధ్యక్షుడు దుగ్గిన శ్రీనివాస్ తెలిపారు.

అపస్ జిల్లా కార్యవర్గ సమావేశం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జంగారెడ్డిగూడెంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సతీశ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి గడ్డి నాగేశ్వరరావు, నాయకులు బీవీఎస్ సూర్యనారాయణ, జి.గణపతి, సాయిబాబా, రవీంద్ర, సిద్దా రాంబాబు, వేదాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా పరిస్థితులు మెరుగు పర్చండి: డీపీటీవో

మాట్లాడుతున్న షబ్నం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం డిపో పరిధిలో బస్సుల రవాణా పరిస్థితులను మరింత మెరుగు పరచాలని జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీవో) ఎస్.కె.షబ్నం అన్నారు. స్థానిక డిపోను ఆదివారం ఆమె పరిశీలించారు. ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న మహిళలకు ఉచిత బస్సు సేవలకు సంబంధించి సన్నద్ధతపైనా పరిశీలించారు. బ్రేక్‌డౌన్‌లు లేకుండా బస్సులను నిర్వహించాలని సూచించారు. [illegible] ఆమె పాల్గొన్నారు. అధికారులు, కార్మికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. డీఎం గంగాధరరావు పాల్గొన్నారు.

ప్రవేశాలు పెంచేందుకు.. ప్రత్యేక కార్యాచరణ

డిగ్రీ కళాశాల అధ్యాపకుల కసరత్తు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పెంచేందుకు అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించారు. డిగ్రీ కళాశాల ఏలూరు జిల్లాలోనే అతి పెద్దది. ఇక్కడ సుమారు 500 మంది విద్యార్థులు ఏటా చదువుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రధాన కళాశాలగా కొనసాగేందుకు విద్యార్థుల సంఖ్య మరింత పెంచుకునేందుకు ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద్‌బాబు సారథ్యంలో అధ్యాపకులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు.

కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

విద్యార్థులను ఆకట్టుకునేలా.. జంగారెడ్డిగూడెం పరిసర మండలాల్లోని జూనియర్ కళాశాలలకు వెళ్లి ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థుల వివరాలు తెలుసుకొని తమ కళాశాలలో డిగ్రీలో చేరాలని కోరుతున్నారు. కళాశాలలో ఉన్న కోర్సులు వివరిస్తున్నారు. ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలు పంచుతున్నారు. ఏజెన్సీ గ్రామాల్లోని విద్యార్థుల ఇళ్లకు సైతం కళాశాలలో ఉన్న కోర్సుల గురించి వివరిస్తున్నారు. ఈ ఏడాది డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతులు రాలేదు. అయినప్పటికీ తమ వంతు కర్తవ్యంగా అధ్యాపకులు విద్యార్థులను ఆకట్టుకునే పనిలో ఇప్పటికే నిమగ్నమయ్యారు.

కోర్సులిలా.. ఈ కళాశాలలో బీఎస్సీ విభాగం (స్ట్రీమ్)లో బోటనీ -జువాలజీ, కంప్యూటర్ సైన్స్ -గణితం, రసాయన శాస్త్రం - గణితం. బీకాం విభాగంలో కామర్స్, బీఏ విభాగంలో ఆంగ్లం - చరిత్ర కోర్సులున్నాయి. వీటిలో ఇప్పటి వరకు 220 సీట్లు ఉండగా అదనంగా మరో 40 సీట్లు కేటాయించాలని కోరినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద్‌బాబు తెలిపారు. ఈ అన్ని సీట్లు భర్తీ చేసేందుకు విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి అధ్యాపకులు అవగాహన కల్పిస్తున్నారన్నారు.

వీరభద్రస్వామి దేవస్థాన భూమి స్వాధీనం

కామవరపుకోట, న్యూస్‌టుడే: స్థానిక వీరభద్రస్వామి దేవస్థానానికి చెందిన స్థలం ఆక్రమించి సిమెంటు తూరల వ్యాపారం నిర్వహిస్తున్న నేపథ్యంలో సదరు స్థలానికి స్వాధీనం చేసుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కలగర శ్రీనివాసు తెలిపారు. ఆదివారం జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర, ఎస్సై చెన్నారావు ప్రత్యేక దళం ఆధ్వర్యంలో ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకుని కంచె ఏర్పాటు చేయమన్నారు.

సారె సమర్పణ

కమ్మరిగుట్టు వద్ద ఊరేగింపుగా వస్తున్న మహిళలు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కొమ్ముగూడెం శివారు కమ్మరిగుట్టు వద్ద ఉన్న విజయగణపతి స్వామి ఆలయంలో ఉమామహేశ్వరీ దేవికి మహిళా భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. బుట్టాయగూడెనికి చెందిన కొండేపాటి రామకృష్ణ, నీలిమ దంపతుల నేతృత్వంలో ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు.

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: లక్ష్మీపురంలోని జగన్నాథస్వామికి పలువురు సారె అందజేశారు. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన తూంపాటి పద్మవరప్రసాద్, గరిమెళ్ల మురళి, పోలిన బాలు, వాసిరెడ్డి రామకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో మిఠాయిలు, వివిధ రకాల పిండి పదార్థాలతో మహిళలు సారె సమర్పించారు.

కామవరపుకోటలో..

కామవరపుకోట, న్యూస్‌టుడే: కామవరపుకోటలోని గంగానమ్మ, ఆడమిల్లి కామాక్షమ్మ అమ్మవార్లకు ఆదివారం పలువురు మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. ముందుగా పూలు, పండ్లు, కానుకలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకున్నారు. పంటలు బాగా పండాలని, అందరూ సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు సారెను అమ్మవార్లకు సమర్పించారు. కాగా ఆషాఢంలో అమ్మవారిని మొదటి రోజు ఆకుకూరలతో అలంకరించారు. రెండో రోజు కాయగూరలు, మూడో రోజు ఎండు ఫలాలను అమ్మవారికి అలంకరించడం ఎప్పటినుంచో ఇక్కడ ఆచారంగా వస్తోందని అర్చకులు తెలిపారు.

పేదల అభ్యున్నతికి తెదేపా కృషి

సీతంపేటలో కరపత్రాలు అందిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పేదల అభ్యున్నతికి తెదేపా కట్టుబడి ఉందని తెదేపా మండలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ అన్నారు. వేగవరంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆలపాటి దుర్గారామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నాయకులు కుక్కల మాధవరావు, బలుసు కిరణ్ కుమార్, బల్లె సత్యనారాయణ, లక్కాబత్తుల స్వామి, కొప్పుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం, న్యూస్‌టుడే: ధర్మాజీగూడెంలో కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. చెరువుగట్టు రామ్మోహనరావు, వేంపాటి ప్రసాద్, మోరంపూడి ప్రసాద్, పాతూరి శ్రీను, గజ్జా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: తెదేపా నియోజకవర్గ పరిశీలకుడు అనపర్తి నారాయణరావు ఆధ్వర్యంలో తెదేపా మండలాధ్యక్షుడు పారేపల్లి నరేశ్‌తో కలిసి సీతంపేటలో తెదేపా నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. కేదాసు చిన్ని, అల్లం నారాయణరావు, రాజులపాటి కృష్ణ, సాయిసూర్య చంద్రరావు, శ్రీను పాల్గొన్నారు.

'అసత్య ఆరోపణలు తగవు'

చింతలపూడి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు చేయడం తగదని ఏఎంసీ మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి అన్నారు. కొన్ని ప్రసార మాధ్యమాల్లో ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఏఎంసీ కార్యాలయం వద్ద తెదేపా నాయకులు ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముత్తారెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రోషన్ కుమార్ చింతలపూడిలో ఇళ్లు తీసుకుని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారన్నారు. ఇసుక, మట్టి దందాలు చేస్తున్నారని అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. రెండేళ్లుగా కుటుంబ సభ్యులను అమెరికాలో వదిలి నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. వారిని చూసేందుకు అమెరికా వెళ్లి పట్టుమని పది రోజులు కాకుండానే ఆయన ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని అవాస్తవాలు ప్రసారం చేస్తున్నారన్నారు. బోడా నాగభూషణం, గరిమెళ్ల చలపతి, తాటి అప్పారావు, చిట్లూరి ధర్మరాజు, కొండ్రు దేవా తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

మందులు అందజేస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల దేవస్థానం ఆధ్వర్యంలో కొండపైన దేవస్థానం కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఏలూరు విజయ ఆసుపత్రి గుండె సంబంధిత వైద్య నిపుణుడు రితీశ్, కంటి సంబంధిత వైద్య నిపుణురాలు పి.తేజస్వి దేవాలయ ఉద్యోగులు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో భాగంగా 200 మందికి గుండె వైద్య పరీక్షలు, 160 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆలయ డిప్యూటీ ఈవో భద్రాజీ పాల్గొన్నారు.

ప్రాంతీయ ఆసుపత్రిలో వైద్య సేవల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పిచ్చి కుక్క దాడిలో గాయపడిన వారికి వైద్యం అందించడంలో తీవ్ర అలసత్వం వహించారని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆదివారం జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రి వద్ద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో పిచ్చి కుక్క దాడికి గురైతే సాయంత్రం వరకూ బాధితులకు సరైన వైద్యం చేయలేదని ఆయన ఆరోపించారు. జీలుగుమిల్లి, తాటియాకులగూడెంలో ఆదివారం సుమారు 14 మంది పిచ్చి కుక్క దాడిలో గాయపడ్డారు. వీరిలో 9 మందిని జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వీరిలో కొందరు తమకు వైద్యం సరిగా అందడం లేదని ఎమ్మెల్యే బాలరాజుకు ఫోన్ చేయడంతో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆయన ఆసుపత్రికి వచ్చి రోగులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్క కాటు బాధితులకు సరైన వైద్యమే చేయలేదన్నారు. సూపరింటెండెంట్ బేబి కమలతో ఫోన్‌లో మాట్లాడి వైద్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెట్రిసెల్వికి ఫిర్యాదు చేస్తానన్నారు. ఆ తరువాత కలెక్టర్, మంత్రుల దృష్టికి కూడా ఇక్కడి పరిస్థితిని ఎమ్మెల్యే బాలరాజు తీసుకెళ్లినట్లుగా సమాచారం. కుక్కకాటు బాధితులకు డ్యూటీ డాక్టర్ ర్యాబిస్ వ్యాక్సిన్ ఇచ్చారని, పిచ్చి కుక్క అన్న అనుమానం ఉండటంతో గాయానికి కూడా వైద్యం చేశామని సూపరింటెండెంట్ పేర్కొన్నారు. టీకాతో పాటు గాయానికి ఇంజెక్షన్ చేయాలన్నారు. ఇలా చేయడంతో బాధితులు ఇది వైద్యంలో భాగమని తెలియక అపోహ పడ్డారన్నారు.

పైపు పగిలి.. నీరు కలుషితమై

పోలవరం పంచాయతీ పరిధి జగన్నాథపేటలో సత్యసాయి మంచినీటి పథకం ద్వారా ట్యాంకుకు తాగునీరు సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పైపులైన్ కొన్ని చోట్ల బద్దలైంది. పైపు డ్రెయిన్‌లో ఉండటంతో నీరు కలుషితమవుతుందని చెప్పడంతో పైకి తీసి కర్ర ముక్కలు పెట్టి డ్రెయిన్‌పైనే ఉంచారు. అయినా వర్షం కురిసినప్పుడు పైపు మునిగి నీరు కలుషితమవుతుంది. ఆ నీటినే పట్టుకుని తాగుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పగిలిన చోట్ల సైకిల్‌ట్యూబ్, వస్త్రం కట్టారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగరాజు మాట్లాడుతూ.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, పోలవరం**

వంతెన.. ప్రమాదపుటంచున

ఏలూరు- జంగారెడ్డిగూడెం రహదారిలో ఆడమిల్లి పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న వంతెన ప్రమాదాలకు నెలవుగా మారింది. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు కూలి చాలా కాలమైంది. దానికి మరమ్మతులు చేసే నాథుడు లేక ప్రయాణికులు నిత్యం భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. **- న్యూస్‌టుడే, కామవరపుకోట**

ప్రభుత్వ స్థలమే అడ్డా.. అడ్డుకునేదెవరంట

పీహెచ్‌సీ ఆవరణలో ఇసుక, నిలిపిన వాహనం

మండల కేంద్రం లింగపాలెం పీహెచ్‌సీ ఆవరణంలో ఓ ప్రైవేటు వ్యక్తి ఇసుక డంపింగ్ చేసి వ్యాపారం సాగిస్తున్నాడు. ఇసుక రవాణా చేసే వాహనాన్ని సైతం అక్కడే పార్కింగ్ చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం ఇసుక నిమిత్తం వచ్చిన వాహనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా సిబ్బంది వాహనాలు, 104 వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు. ప్రైవేటు వ్యక్తి ప్రభుత్వ భూమిని వ్యాపారానికి వినియోగించుకోవడంపై కొందరు నాయకులు, స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. **- న్యూస్‌టుడే, లింగపాలెం**

ఈ మడుగులో దారెక్కడ?

అనేక మారుమూల గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పులిరాముడుగూడెం- చింతపల్లి మార్గంలో కన్నారప్పాడు- ముంజులూరు మధ్య ఏర్పడిన పెద్ద పెద్ద గోతుల్లో వర్షపు నీరు నిలిచి దారంతా మడుగుల్లా మారింది. వాటిని దాటి వెళ్లేందుకు పక్క నుంచి కూడా వీలులేక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, బుట్టాయగూడెం**

భాజపా నుంచి దేశాన్ని కాపాడాలి: సీపీఐ

మాట్లాడుతున్న వనజ

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: భాజపా నుంచి దేశాన్ని కాపాడాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. చింతలపూడిలో జరుగుతున్న జిల్లా ద్వితీయ మహాసభలో ఆమె ఆదివారం మాట్లాడుతూ.. వ్యవస్థలను తన గుప్పెట్లో పెట్టుకుని భాజపా అరాచక పాలన చేస్తోందన్నారు. సమాజాన్ని విభజించాలని భాజపా చూస్తోందని విమర్శించారు. ప్రకృతి వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ప్రసాద్, డేగా ప్రభాకర్, మన్నవ కృష్ణచైతన్య, వసంతరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ వర్ధంతి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: తెదేపా కార్యాలయంలో ఆదివారం బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెదేపా ఎస్సీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు దిద్దే దుర్గారావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, తెదేపా కార్యనిర్వహణ కార్యదర్శి బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశ భక్తి పారాయణుడు శ్యామాప్రసాద్

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

జంగారెడ్డిగూడెం, కుక్కునూరు, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: దేశ భక్తి పారాయణుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని భాజపా జంగారెడ్డిగూడెం పట్టణ మాజీ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు అన్నారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం జంగారెడ్డిగూడెంలోని ఓ కళాశాలలో నిర్వహించారు. శ్యామాప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ✦ దాచారంలో ఛత్రపతి శివాజీ శక్తికేంద్రంలో భాజపా కోశాధికారి లక్ష్మణాచార్యులు, నాయకులు సతీష్‌కుమార్, బొల్లు రాము, బాలాజీ వేడుకలు నిర్వహించారు. ✦ బయ్యనగూడెంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్నారు. భాజపా మండల ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి బాలం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు డిమాండ్

పోలవరం, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ డిమాండ్ చేశారు. మండలంలోని గూటాలలో అరుణోదయ కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ సమావేశం ఆదివారం రమణజు సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బాలకోటయ్య, రాజు, శ్రీను, సూర్యప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

తొలి ఏకాదశి.. ఆలయాల్లో భక్తుల సందడి

జంగారెడ్డిగూడెం: శాకాంబరిగా విజయదుర్గమ్మ

కొయ్యలగూడెంలో చందనోత్సవం

జంగారెడ్డిగూడెం, పోలవరం, కొయ్యలగూడెం గ్రామీణ, ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి సందర్భంగా చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. జంగారెడ్డిగూడెం పట్టణంలోని గంగానమ్మను వందలాది మంది దర్శించి పూజలు చేశారు. విజయదుర్గమ్మ అమ్మవారిని కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో శాకాంబరిగా అలంకరించారు. రామచంద్రపురంలోని రామాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించారు. ✦ పోలవరంలోని పాండురంగ స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కల్యాణ క్రతువును తిలకించారు. ✦ కొయ్యలగూడెం మదన గోపాలస్వామి ఆలయంలో దేవాదాయశాఖ ఈవో టి.లక్ష్మి ఆధ్వర్యంలో స్వామికి చందనోత్సవం నిర్వహించారు. ✦ కొయ్యలగూడెంలో విధమ్మ అమ్మవారికి మహిళలు కుంభాభిషేకం చేశారు. ✦ ఐఎస్ జగన్నాథపురంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి 15 వేల మంది భక్తులు కాలినడకన తరలివచ్చారు. ✦ పారిజాతగిరి వేంకటేశ్వరస్వామిని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజా టికెట్లు, ప్రసాదాల ద్వారా రూ.85 వేల ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

ఐఎస్ జగన్నాథపురంలో..

రక్షిత పథకం.. సేవలు దూరం

రామవరం పంచాయతీ ఊటగుంపులో మినీ సౌరవిద్యుత్తు మంచినీటి ట్యాంకు అయిదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. 20 కుటుంబాలకు అయిదు వేల లీటర్ల సామర్థ్యంతో గత తెదేపా ప్రభుత్వ హయాంలో దీనిని ఏర్పాటు చేశారు. గత వైకాపా హయాంలో నిర్లక్ష్యానికి గురై మండలంలోని పలు గ్రామాల్లో ఇవి మూలకు చేరాయి. ప్రస్తుతం గ్రామస్థులు వాగు నీటిని వినియోగిస్తున్నారు. వరదల సమయంలో వాగులోని మోటార్లు కొట్టుకుపోయి, నీళ్లు రావడంలేదని వారు వాపోతున్నారు. అధికారులు స్పందించి ట్యాంకును వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వేలేరుపాడు గ్రామీణ**

నిరుపయోగంగా సౌరవిద్యుత్తు ట్యాంకు

కుక్కలకు టీకాలు

టీకా వేస్తున్న ఏడీ శేఖర్‌దొర

జంగారెడ్డిగూడెం, చింతలపూడి, కామవరపుకోట, బుట్టాయగూడెం, వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రపంచ పశు సంక్రమిత వ్యాధుల దినోత్సవాన్ని చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. ● జంగారెడ్డిగూడెం ప్రాంతీయ పశు వైద్యశాలలో ఆదివారం పెంపుడు కుక్కలకు ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలను ఏడీ పీఎన్‌వీ శేఖర్‌దొర అందజేశారు. ● చింతలపూడి లయన్స్ క్లబ్, పశు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలో శునకాలు, ఇతర పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. మండల పశు వైద్యాధికారి శివనాగేంద్రబాబు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అడపా శ్రీను తదితరులు పాల్గొన్నారు. ● కామవరపుకోట పశు వైద్యశాలలో పశు వైద్యాధికారి వట్టి ఆదిత్యకుమార్ టీకాలు వేశారు. ● జీలుగుమిల్లి పశు వైద్యశాలలో ఆదివారం పెంపుడు కుక్కలకు టీకాలు వేసే శిబిరాన్ని నిర్వహించారు. పశు గణాంక సహాయకుడు ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు. ● పశు వైద్య సహాయకురాలు భవాని ఆధ్వర్యంలో రుద్రంకోట పంచాయతీ కార్యాలయంలో కుక్కలకు టీకాలు వేశారు.

వైకాపా పట్టణ అధ్యక్షుడిగా గుప్తా

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: వైకాపా పట్టణ అధ్యక్షుడిగా కర్పూరం గవరయ్య గుప్తా ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు.

కల్వర్టు అనుసంధానం.. గుంతలమయం

అంకాలగూడెం కూడలిలో బోడిగూడెం వెళ్లే రహదారిలో కల్వర్టు అనుసంధానం ఛిద్రమైంది. బోడిగూడెం, మంగపతిదేవిపేట, బర్కిట్‌నగరం, నందిగూడెం, తదితర గ్రామాలకు ఇది ప్రధాన రహదారి. ఆయా గ్రామాల ప్రజలు ఆసుపత్రులకు, ఇతర అనేక పనుల నిమిత్తం ఇదే మార్గంలో నిత్యం కొయ్యలగూడెం రాకపోకలు సాగించాల్సి ఉంది. కల్వర్టు అనుసంధానంలో గుంతలు పడటంతో ముఖ్యంగా ద్విచక్రవాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని పంచాయతీ రాజ్ ఏఈ సురేశ్ తెలిపారు. **- న్యూస్‌టుడే, కొయ్యలగూడెం గ్రామీణ**

పింఛనుదారులకు మెరుగైన సేవలందించాలి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ పింఛనుదారులకు మెరుగైన సేవలందించాలని ఏఐఎఫ్‌పీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.బాలసుబ్రహ్మణ్యం, డి.సుబ్బారావు అన్నారు. నగరంలో పింఛనుదారుల సంఘం ఉమ్మడి జిల్లా 37వ వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పింఛనుదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎనిమిదో వేతన సంఘం ఛైర్మన్, సభ్యుల నియామకంలో ఆలస్యం, రీవాలీడేషన్ బిల్లు తదితరాలపై మాట్లాడారు.

బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగులు

పెదవేగి, న్యూస్‌టుడే: మహిళ మెడలోని బంగారు గొలుసు దుండగులు లాక్కెళ్లిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. రాట్నాలకుంటకు చెందిన తామరారు త్రిపురాంబ ఇంటి ఎదురు రోడ్డుపై బడ్డీ కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి రెండు సిగరెట్లు తీసుకున్నారు. కొట్టు వద్ద ఆమె ఒంటరిగా ఉండటాన్ని గమనించి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వృద్ధులకు వితరణ

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రపంచ బిర్యానీ దినోత్సవం పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలోని కల్పవృక్ష వృద్ధాశ్రమం వృద్ధులకు, హమాలీ జట్టు కూలీలకు, పంచాయతీ పారిశుద్ధ్య, రిక్షా కార్మికులకు గ్రామానికి చెందిన మన్నే వెంకటరత్నం ఆదివారం బిర్యానీ పొట్లాలు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడు మాజేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

నూజివీడు
• నూజివీడు • కైకలూరు

తమ్మిలేరు జలాశయం నీరు విడుదల

నీరు విడుదల చేస్తున్న రమేశ్

చాట్రాయి, న్యూస్‌టుడే: తమ్మిలేరు జలాశయం కుడి కాలువ ద్వారా ఆదివారం తమ్మిలేరు నీటి సంఘ అధ్యక్షుడు యర్రా రమేశ్ నీరు విడుదల చేశారు. తొలుత తూము వద్ద ఆయన ఆధ్వర్యంలో రైతులు పూజలు నిర్వహించారు. జలాశయానికి వరద నీరు రాని నేపథ్యంలో ఆయకట్టులో రైతులు నీటిని పొదుపుగా వినియోగించాలని రమేశ్ కోరారు. తెదేపా నాయకులు మరిడి వెంకటేశ్వరరావు, యర్రా ప్రసాద్, వెల్ది రాజారావు, ఈదర సత్యనారాయణరాజు, బిలిగుది జయరాజు, రైతులు పాల్గొన్నారు.

శాకంబరీ దేవిగా విజయ దుర్గామాత

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి విజయదుర్గామాత ఆలయంలో వారాహి మాత వారోత్సవాలు కొనసాగుతున్నాయి. వందలాది మంది భక్తులు పలు రకాల కూరగాయలను వితరణ అందించగా ఆదివారం అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చాగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రీవారి పథకాలకు విరాళాలు

గాంధీకి గోసంరక్షణ పథకం పత్రాన్ని అందజేస్తున్న డిప్యూటీ ఈవో భద్రాజీ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి పథకాలకు రూ.2లక్షల విరాళం సమకూరింది. ముసునూరు మండలం సూరేపల్లికి చెందిన వడ్లపట్ల గాంధీ శ్రీవారి గోసంరక్షణ పథకానికి రూ.లక్ష, గుంటూరు జిల్లా పట్టాభిపురానికి చెందిన కరిటాల శ్రీనివాస్ రూ.లక్ష విరాళాలను ఆలయ కార్యాలయంలో ఆదివారం జమ చేశారు. ఈ సందర్భంగా ఆలయ డిప్యూటీ ఈవో భద్రాజీ, సూపరింటెండెంట్ కిశోర్ దాతలను అభినందించి స్వామివారి ప్రసాదాలు, రసీదులు అందజేశారు.

ప్రజా రవాణా వాహనాలు నిబంధనలు పాటించాలి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రజలను చేరవేసే ఆటో, టాటా మ్యాజిక్ తదితర ప్రజా రవాణా వాహనాలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్సై కె.శుభశేఖర్ స్పష్టం చేశారు. ఆగిరిపల్లిలో ఆదివారం ఆటో డ్రైవర్లు, వాహన యజమానులకు ఎస్సై పలు సూచనలు చేశారు. వాహనాలు తప్పనిసరిగా కండిషన్‌లో ఉండాలని, వాహన రిజిస్ట్రేషన్, పర్మిట్, ఫిట్నెస్, బీమా, పొల్యూషన్ ధ్రువపత్రాలు, చోదకుడికి లైసెన్స్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం

'ఈనాడు' ఫోన్ ఇన్‌కు స్పందనలు

కలిదిండి, న్యూస్‌టుడే : 'ఈనాడు - మీ తోడు'లో కైకలూరు నియోజకవర్గంలో విద్యుత్తు శాఖకు సంబంధించిన సమస్యలపై ఆ శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావుతో జూన్ 5న 'ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహించిన విషయం విదితమే. దీనిలో 17 సమస్యలు అధికారుల దృష్టికొచ్చాయి. ఈఈ

మోటూరు ఛానల్ వద్ద స్తంభాలు నిలుపుతున్న సిబ్బంది

శ్రీనివాసరావు నేతృత్వంలో డీఈఈ బి.రామయ్య పర్యవేక్షణలో తొలి 15 రోజుల్లో 10 సమస్యలు పరిష్కరించారు. మిగిలిన ఏడు సమస్యలను పరిష్కరించడానికి 30 రోజులు గడువు నిర్ణయించారు. ఈ నెల 5వ తేదీతో 30 రోజులు పూర్తయిన నేపథ్యంలో ఐదు సమస్యలకు

కలిదిండి మండలం కొండూరులో కొత్త పరివర్తకం బిగిస్తున్న విద్యుత్తు ఉద్యోగి

పరిష్కారం చూపారు. వీటితో 17కి 15 సమస్యలు పరిష్కరించినట్లైంది. మిగిలిన రెండింటిని మరో 15 రోజుల్లో పరిష్కరిస్తామని డీఈఈ రామయ్య తెలిపారు. కైకలూరు, మండవల్లి ఏఈలు కె.శ్రీనివాసమూర్తి, జి.రామకృష్ణ, జేఈ వీవీ రాఘవులు, సిబ్బంది సేవలందించారు.

రోజులు 30 | సమస్యలు 17 | పరిష్కారం 15

పరిష్కరించిన సమస్యలు

? మూలపేటలో విద్యుత్తు స్తంభాలు మోటూరు ఛానల్‌లోకి ఒరిగిపోయాయి : కె.రామకృష్ణ, ఉనికిలి, మండవల్లి మండలం
✔ ఒరిగిపోయిన స్తంభాలు నిలిపారు.

? లోఓల్టేజీ సమస్య - జి.పవన్, కొండూరు, కలిదిండి మండలం
✔ పాత పరివర్తకం తొలగించి.. కొత్తది ఏర్పాటు చేశారు. సమస్య తీరింది.

? లోఓల్టే సమస్య - గండికోట ఏసుబాబు, సర్పంచి, చినతాడినాడ
✔ కొత్త పరివర్తకం ఏర్పాటుకు రూ.2.50లక్షల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

? విద్యుత్తు తీగలు పాత బడ్డాయి. తెగిపోయే ప్రమాదం ఉంది. - గోదావరి రామారావు, గుర్వాయిపాలెం
✔ కొత్త తీగల ఏర్పాటుకు రూ.1.50 లక్షల అంచనాలతో ప్రతిపాదనలు పంపారు.

? ఇళ్లకు ఆనుకుని విద్యుత్తు ఇనుప స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. - ఉమ్మిడిశెట్టి కృష్ణ, కోటకలిదిండి
✔ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సదరు స్తంభాలు షిఫ్టింగ్ చేయాల్సి ఉన్నందున అర్జీ పెట్టుకుని, నిర్ణీత రుసుం చెల్లించాలని సూచించారు.

కోట సత్తెమ్మకు ఆషాఢ సారె

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ అమ్మవారికి కైకలూరు, కలిదిండికి చెందిన 100 మంది భక్తులు ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం చీరె, సారె సమర్పించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్, ఆలయ ఈవో, సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకుడు ఎస్వీకేపీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కాళికాదేవికి.. కలిదిండి, న్యూస్‌టుడే : సానారుద్రవరంలోని కాళికాదేవికి కోరుకొల్లు నుంచి భక్తులు ఆషాఢ సారె తీసుకెళ్లారు. వంద మందికి

పైగా భక్తులు సారెతో మూడు కిలోమీటర్లు కాలి నడకన వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఇందులో భాగంగా విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో గంగానమ్మకు.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: శ్రీహరిపురంలోని గంగానమ్మకు ఆదివారం భక్తి శ్రద్ధలతో ఆషాఢ సారె సమర్పించారు. గ్రామ మహిళలంతా డప్పు వాయిద్యాల నడుమ గ్రామ వీధిలో సారెతో ఊరేగింపుగా తరలివచ్చారు. అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ చేశారు.

పెద్దింట్లమ్మా.. వందనాలమ్మా.. కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేటి పెద్దింట్లమ్మా.. వేలవేల వందనాలమ్మా.. అంటూ భక్తులు అమ్మవారి నామస్మరణతో తరించారు. ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా మత్స్యకారుల ఆరాధ్య దైవం కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ దేవస్థానం వేలాది మంది భక్తుల రాకతో రద్దీగా మారింది. ఈవో కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ఆలయాల్లో ఆదివారం తొలి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. వడాలిలో చిన్న పూరీగా ప్రసిద్ధిగాంచిన సుభద్ర బలరామ సహిత జగన్నాథ స్వామి ఆలయంలో, ముదినేపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో, సింగరాయపాలెం బాబాజీ మఠంలోని కోదండ రామాలయంలో, గురజ వేణుగోపాలస్వామి ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

కోవెలలో.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో కూటమి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, నెరుసు సతీశ్, చిట్నేని శివరామకృష్ణ, బాబూరావు పాల్గొన్నారు.

బళ్లమ్మా.. శరణు.. కలిదిండి, న్యూస్‌టుడే : తొలి ఏకాదశిని పురస్కరించుకుని కోరుకొల్లులోని బళ్లమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని సారె సమర్పించి.. మొక్కులు తీర్చుకున్నారు.

కూటమి పాలనతో గ్రామాల్లో అభివృద్ధి

కైకలూరు, మండవల్లి, న్యూస్‌టుడే: కూటమి పాలనలో గ్రామీణ ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి సాధిస్తున్నాయని తెదేపా జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీ రాణి, మండల ప్రధాన కార్యదర్శి పి.రాధాకృష్ణ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం మండలంలోని ఆచవరంలో ఇంటింటికీ కరపత్రాలను అందించారు.

పెదలంక (కలిదిండి), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలోనే సుపరిపాలన సాధ్యమని ఏడాదిలో రుజువైందని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంధాబు శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస వర్మ తెలిపారు. పెదలంకలో ఆదివారం 'సుపరిపాలనలో ఏడాది' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. అక్కల వెంకటాచలం, కొప్పిశెట్టి ఆంజనేయులు, దుగ్గిరాల పరమేశ్వరరావు, దున్న భోగేశ్వరరావు, కొల్లాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి, న్యూస్‌టుడే: సుపరిపాలనలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో సంక్షేమం పరుగులు తీస్తోందని, త్వరలోనే శాశ్వత పథకాలను అమలు చేసే రీతిలో అడుగులు వేస్తున్నట్లు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు తెలిపారు. చనుబండలో ఆదివారం ఆయన ఇంటింటా తిరిగి కరపత్రాలు పంచారు.

వైవాక (ముదినేపల్లి), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని పర్యాటకాభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ కొడాలి వినోద్ తెలిపారు. వైవాకలో నాయకులతో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. తెదేపా నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు నరుకుళ్ల బాలాజీ, కార్యదర్శి బోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం గుడిపాడులో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గద్దె రమేష్‌బాబు, గ్రామ

వైవాకలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

అధ్యక్షుడు మండలపు ధర్మరాజు పాల్గొన్నారు. ఏడాది పాలనలో విజయాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: సుపరిపాలనే ధ్యేయంగా చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని మండల తెదేపా అధ్యక్షుడు నక్కనబోయిన వేణు తెలిపారు. ఆగిరిపల్లిలో ఆయన ఆదివారం మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైకాపా విధ్వంసం సృష్టించగా, చంద్రబాబు అభివృద్ధి వైపు నడిపిస్తున్నారని తెలిపారు.

మాతృదేశాన్ని మర్చిపోవద్దు: కామినేని

కైకలూరు, న్యూస్‌టుడే: జీవితంలో ఎంత స్థాయికి ఎదిగినా మాతృదేశాన్ని, మాతృభాషని మర్చిపోవద్దని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. అమెరికాలో నాట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు సంబరాలు కార్యక్రమంలో రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి ఆదివారం పాల్గొన్నారు. ఎన్నో కష్టనష్టాలను దాటుకుని ప్రపంచ దేశాల్లో తెలుగు వారికి ప్రత్యేక స్థానం ఏర్పాటు చేసుకోవడం గర్వకారణమన్నారు. అధికారం స్వీకరించిన వారంలో జన్మనిచ్చిన గ్రామాల అభివృద్ధికి భాగస్వాములు కావాలని సూచించారు. తెలుగువారందరినీ ఒకే వేదికపై చేర్చిన ఉత్తర అమెరికా తెలుగు సంఘం ప్రతినిధులను అభినందించారు.

పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: భూ సేకరణ చట్టం ప్రకారం పేద భూములు పేదలకు ఇవ్వాలని, పేదలు గత 20 ఏళ్లగా సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వకపోవడం దారుణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బి.బలరామ్, జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, సీఐటీయూ జిల్లా నాయకుడు జి.రాజు అన్నారు. ఆగిరిపల్లి మండలం చిన్న ఆగిరిపల్లిలో నిర్వహిస్తున్న భూ పోరాట ప్రాంతంలోని భూముల్లో ఆదివారం దుక్కి దున్ని కందులు, చిక్కుడు గింజలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలు భూముల కోసం పోరాటాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్తు కోటేశ్వరరావు, అర్జున్ రావు, కుమారి, మేరీ, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

భూమిలో గింజలు నాటుతున్న సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు

పరిసరాలు శుభ్రం

కలిదిండి, న్యూస్‌టుడే: 'దినదినగండం పడకేసిన పారిశుద్ధ్యం' శీర్షికతో జూన్ 20న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సర్పంచి ఎం.మారుతీ ప్రసన్న స్పందించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తామని ఆమె తెలిపారు. ఈవో ఉదయ్‌కుమార్ నేతృత్వంలో పారిశుద్ధ్య కార్మికులు లార్వా కాలువ, రైతు బజారు ప్రాంతాల్లోని చెత్తను ఆదివారం తొలగించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సినిమా

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	తమ్ముడు
సత్యనారాయణ మినీ	సోలో బాయ్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	జురాసిక్ వరల్డ్ రీబర్త్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	కుబేర
ద్వారక సినిమాస్ స్క్రీన్ 3	కన్నప్ప
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	తమ్ముడు
కైకలూరు: విజయలక్ష్మి జీ3	తమ్ముడు
మాగంటి సినిమాస్	మార్గన్
శ్రీవెంకటరమణ సినిమాస్	జురాసిక్ వరల్డ్ రీబర్త్
ముదినేపల్లి: పూర్ణిమ	తమ్ముడు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు	:80085 74698	కైకలూరు	:73060 88555
ముసునూరు	:93983 81268	కలిదిండి	:90594 84862

కైకలూరు, న్యూస్‌టుడే: ? ఆలపాడులో పంటకాలువ చెంతనే చెత్త పడేస్తున్నారు. వ్యర్థాలన్నీ కాలువలో చేరి నీరు విడుదల చేసే సమయంలో కలుషితమవుతున్నాయి. - ప్రభాకర్, గ్రామస్థుడు
✔ చెత్త తొలగించి స్థానికులకు అవగాహన కల్పిస్తాం. - కుమారి, పంచాయతీ కార్యదర్శి, ఆలపాడు

చనుబండలో జగ్జీవన్ రామ్ వర్ధంతి

విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వెంకటేశ్వరరావు, శేఖర్ తదితరులు

చాట్రాయి, న్యూస్‌టుడే: చనుబండ గ్రామంలో ఆదివారం బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన సేవలను కొనియాడారు. జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మండల తెదేపా అధ్యక్ష, కార్యదర్శులు ఇజ్జగాని వెంకటేశ్వరరావు, తేళ్లూరి శేఖర్, నాయకులు శిదిరాల మారేశ్వరరావు, మోదుగ ముత్తయ్య, కారుమంచి విస్తరయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలో డా.బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఆదివారం అజరయ్యపేటలో నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి కృపారావు, కె.ఆదినారాయణ, వై.శ్రీనివాసరావు, ఎం.రాము, కె.ఆది సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత 'ఏకలవ్యుడు'

విగ్రహానికి పూల మాల వేస్తున్న శ్రీనివాసచౌదరి

కలిదిండి, న్యూస్‌టుడే : గురువు పట్ల ఎనలేని ఆరాధన, అంకితభావంతో జీవితాన్ని సార్థకం చేసుకున్న ఏకలవ్యుడు నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత అని మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్, తెదేపా సీనియర్ నేత వల్లభనేని శ్రీనివాసచౌదరి(నాని) పేర్కొన్నారు. కలిదిండిలో ఆదివారం ఏకలవ్యుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏకలవ్య సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కుంభా నాగరాజు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, తెదేపా గ్రామ అధ్యక్షుడు అబ్దుల్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

జూనోటిక్ వ్యాధులపై అప్రమత్తతే కీలకం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: జంతువుల నుంచి మనుషులకు సంభవించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులంటారని, వీటిపట్ల అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.జి.రమేశ్ తెలిపారు. ఆదివారం నూజివీడు ప్రాంతీయ పశువైద్యశాలలో జూనోసిస్ డేను సహాయ సంచాలకుడు డా.కె.నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. డా.రమేశ్ మాట్లాడుతూ ర్యాబిస్‌తో పాటు ఆంత్రాక్స్, బ్రోసెల్లోసిస్, లెప్టోస్పైరోసిస్, జపనీస్ యెన్ సెఫిలైటిస్ వంటి పలు వ్యాధులు పశువుల నుంచి మనుషులకు సంక్రమిస్తాయన్నారు. డా.కె.నరసింహారావు మాట్లాడుతూ యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేసిన 30 రోజుల తరువాత బూస్టర్ డోస్ వేయించాలన్నారు. ప్రాంతీయ వైద్యశాల వైద్యుడు దినేశ్, డా.హరికృష్ణ, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు కోలాహలం ప్రసాద్, అదనపు కార్యదర్శి బీఎన్ఎస్‌టీ సాయి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా.మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు, న్యూస్‌టుడే: పెంపుడు జంతువుల ఆరోగ్యంపై వాటి యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు పి.ముస్తఫా ఖాన్ అన్నారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కైకలూరు, ప్రాంతీయ పశు వైద్యశాలల పరిధిలోని గ్రామాల్లో పెంపుడు శునకాలకు యాంటీ ర్యాబిస్ టీకాలను ఉచితంగా వేశారు. కైకలూరు, కలిదిండి మండలాల్లో 241 శునకాలకు టీకాలు అందించినట్లు తెలిపారు. మరో మూడు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. పశువైద్య సిబ్బంది లీలా ఉషారాణి, అబ్దుల్ ఘనీ, జయరాం, లోకేశ్, గంగాధర్, మనోజ్, ప్రసాద్ పాల్గొన్నారు.

నూజివీడు: కుక్కకు టీకా వేస్తున్న రమేశ్, నరసింహారావు తదితరులు

మండవల్లి, న్యూస్‌టుడే: పశుసంవర్ధక శాఖ ఏడీ వరప్రసాద్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో శునకాలకు ర్యాబిస్ టీకాలు వేశారు. ర్యాబిస్, ఆంత్రాక్స్, క్షయ, తామర, మెదడువాపు వంటి వ్యాధులు పశుపక్ష్యాదుల నుంచి మానవుడికి సంక్రమించే అవకాశం ఉందన్నారు. పెంపుడు జంతువులు ఉన్న ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతను నిరంతరంగా అలవర్చుకోవాలని సూచించారు. మండల వ్యాప్తంగా 126 పెంపుడు శునకాలకు టీకాలు వేసినట్లు తెలిపారు.

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పెంపుడు జంతువుల సంరక్షణలో అప్రమత్తత అవసరమని, అది కొరవడితే ప్రాణాలకు ముప్పు తప్పదని పశువైద్యాధికారి క్రాంతికుమార్ తెలిపారు. ముదినేపల్లి పశు వైద్యశాలలో ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా కుక్కలకు ఉచిత టీకాల కార్యక్రమం నిర్వహించారు. అభిమానంగా పెంచుకునే శునకాల నుంచి ర్యాబిస్.. పశువులు, గొర్రెలు, మేకలు తదితర జంతువుల నుంచి ఆంత్రాక్స్ వంటి వ్యాధులు సోకుతాయని అవగాహన కల్పించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

విగ్రహం వద్ద నాయకులు

చాట్రాయి, న్యూస్‌టుడే: కోటపాడులో ఆదివారం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరించారు. విగ్రహ దాత మారుమూడి థామస్, నక్కా రాము, రాచప్రోలు విజయ్ రాజ్, పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో వేధింపులు

కలిదిండి, న్యూస్‌టుడే : యువతిని ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. సున్నంపూడి గ్రామానికి చెందిన యువతి(18)ని ప్రేమిస్తున్నానంటూ అదే గ్రామానికి చెందిన సతీశ్ (19) కొంతకాలంగా వెంట పడుతున్నాడని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 3న సాయంత్రం 5.30 గంటల సమయంలో ఆ యువతి అదే గ్రామంలోని తన పెద్దమ్మ ఇంటికి వెళ్తుండగా, మార్గమధ్యలో సతీశ్ ఆమెను ఓ ఇంట్లోకి లాక్కెళ్లి బలత్కారం చేయబోయాడని యువతి ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. ఆ సమయంలో ఆమె గట్టిగా కేకలు వేయగా, చుట్టుపక్కల వాళ్లు రావడంతో ఆ యువకుడు పారిపోయినట్లు ఎస్సై తెలిపారు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

ఒంటరి మహిళను.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: భర్తతో మనస్పర్థలు వచ్చి ఒంటరిగా నివసిస్తున్న మహిళను వేధిస్తున్న సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. వణుదుర్రుకు చెందిన విజయలక్ష్మి భర్తతో మనస్పర్థలు వచ్చి ఒంటరిగా నివసిస్తున్నారు. ముదినేపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా చేస్తూ డ్యూటీకి వెళ్లి వస్తున్న సమయంలో గ్రామానికి చెందిన గండేపూడి రవిశంకర్ గత నెల 30న తనను ప్రేమించాలని, లేకుంటే అల్లరి చేస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తే ఓడిస్తారు: మాజీ ఎమ్మెల్యే

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మోసగించిన వైనాన్ని వైకాపా నాయకులు, కార్యకర్తలు గ్రామ గ్రామాన ప్రజలకు తెలియజేయాలని నూజివీడు మాజీ ఎమ్మెల్యే ఎంవీ ప్రతాప అప్పారావు తెలిపారు. ఆదివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో నాయకులు కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రజలను మభ్యపెట్టి మోసం చేసే నాయకులు ఎవరైనా సరే ప్రజలు చిత్తుచిత్తుగా ఓడిస్తారన్నారు. రెండు సంవత్సరాల్లోనే తెదేపా తునాతునకలవుతుందని జోస్యం చెప్పారు. తమ హయాంలో ఎమ్మార్ అప్పారావు కాలనీలో ఆస్పత్రి నిర్మించగా, నేటికి ప్రారంభానికి నోచుకోలేదన్నారు. కేంద్రీయ విద్యాలయం కోసం 7 సంవత్సరాలు కష్టపడి మంజూరు చేయిస్తే ప్రారంభించలేదని విమర్శించారు. తాను ఉన్నంత కాలం నూజివీడు ప్రజలను కాపాడతానని ప్రతాప అప్పారావు తెలిపారు. కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, వంక రవీంద్రనాథ్, నాయకులు పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి

నూజివీడు రూరల్ , న్యూస్‌టుడే: నూజివీడు భాజపా పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి ఆధ్వర్యంలో భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఆదివారం నూజివీడులో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.రాజశేఖర్, ఎం.రవికాంత్, ఎం.ప్రసాద్, ఎస్.వసుంధర దేవి, ఎ.నాగేశ్వరరావు, డి.రవికిశోర్, డి.మల్లికార్జున, జగదీశ్ పాల్గొన్నారు.

★ మండల భాజపా కన్వీనర్ నక్కా నాగశివ ఆధ్వర్యంలో దేవరగుంటలో ముఖర్జీ జయంతి నిర్వహించారు. నక్కా శ్రీనివాసరావు, కృష్ణారావు, బి.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు, న్యూస్‌టుడే: సమైక్య భారతదేశం కోసం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ కొనసాగించిన ఉద్యమం మరువలేనిదని భాజపా జిల్లా కార్యదర్శి మాగం వాసు అన్నారు. ఆదివారం ముసునూరు భాజపా కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ.. దేశ సమైక్యత, సమగ్రత కోసం ప్రాణాలర్పించిన ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. వెంకటరత్నం, చింతయ్య, శ్రీరామ్, తిరుపతయ్య పాల్గొన్నారు.

మండవల్లి, కైకలూరు, న్యూస్‌టుడే: భారతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ భారతదేశ అభ్యున్నతికి

నూజివీడులో నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు, కార్యకర్తలు

అందించిన సేవలు అజరామరమని భాజపా నేతలు గంగునేని వరప్రసాద్, బండి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా కైకలూరు మండలం ఆలపాడులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బండి దివాకర్,శ్రీనివాసరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లిలోని భాజపా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ ఆధ్వర్యంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగలక్ష్మి, నాగరాజు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: డా.శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని భాజపా మండల నాయకులు ఆదివారం ఆగిరిపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో భాజపా మండల కన్వీనర్ రంగారావు, ఎం.వెంకటేశ్వరరావు, దొడ్డా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరే దిక్కాయే..!

పోతుమర్రులోని మంచినీటి చెరువు

కలిదిండి, న్యూస్‌టుడే : ఉప్పుటేరు తీర ప్రాంతాల ప్రజలు శుద్ధ జలం తాగేందుకు ఏమాత్రం నోచుకోవడం లేదు. ఏటికి కూతవేటు దూరంలో ఉన్న పోతుమర్రు గ్రామానికీ అదే పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో 3,500 జనాభా ఉంది. 10 ఎకరాల్లో మంచినీటి చెరువు ఉంది. ఈ ప్రాంతంలో కొంతకాలంగా ఆక్వా సాగు గణనీయంగా విస్తరించడంతో భూగర్భ జలాలు కలుషితంగా మారాయి. ఈ ప్రభావం తాగునీటి చెరువుల పైనా పడింది. ఈ నేపథ్యంలో చెరువుల పర్యవేక్షణ మరింత బాధ్యతగా నిర్వహించాల్సి ఉంది. ఈ పంచాయతీ పరిధిలోని దుంపలకోడుదిబ్బ గ్రామంలో మైక్రో ఫిల్టరు ద్వారా తాగునీరు సరఫరా చేస్తుండటంతో అక్కడ సమస్య లేదు. పోతుమర్రులో కలుషిత నీటి సమస్యతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ బండి రమేశ్‌బాబు స్పందిస్తూ.. ఇటీవలే చెరువులో నీరు నింపామని తెలిపారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని వివరించారు.

గుంతల దారి.. గుండెలు జారి..!

వట్టిగుడిపాడులో ఇలా..

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: నూజివీడు-విజయవాడ ప్రధాన రహదారి విస్తరణ పనులు నిలిచి పోవడంతో ఈ రహదారిలో ప్రయాణం ప్రహసనంగా మారింది. గత వైకాపా పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడు, ఈదులగూడెం, చొప్పరమెట్ల గ్రామాల్లో రహదారి గుంతలతో ఛిద్రమైంది. మోస్తరు వర్షం కురిసినా. . వాటిల్లో నీరు చేరుతోంది. వాహన చోదకులు గుంతలు తప్పించుకుని రహదారి అంచుల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. తరచుగా ఈ రహదారిలో ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారులకు తమ కష్టాలు చెబుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ విషయాన్ని ఆర్అండ్‌బీ డీఈ బాబురావు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా త్వరలో రహదారి పనులు పూర్తి చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మురుగు కదలదు.. అడుగు పడదు

డ్రెయినేజీ వ్యవస్థ లేక సీసీ రోడ్డుపై నిలిచిన నీరు

కైకలూరు, న్యూస్‌టుడే: చిరుజల్లులకే వెలమపేట గీతా మందిరానికి వెళ్లే ప్రధాన రోడ్డు నీట మునుగుతోంది. భారీ వర్షం పడితే అంతే సంగతులు ఇక్కడ రోడ్డు ఉందనే సంగతి మరచిపోవాల్సిందే. వెలమపేట చేరుకునేందుకు దగ్గర మార్గం కావడంతో వందలాది మంది ఇటుగా రాకపోకలు సాగిస్తుంటారు. రోజుల తరబడి మురుగునీరు రోడ్డుపై నిలిచే ఉండటంతో చిన్నారులు, విద్యార్థులు, గర్భిణులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. మురుగు తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ దోమలు అధికమై అంటు రోగాలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానిక నివాసితులు వాపోతున్నారు. వేసవిలోనూ మురుగుతో ఇబ్బందులు పడుతున్నా.. అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పదేపదే విన్నవించగా కంటి తుడుపు చర్యగా బ్లీచింగ్ చల్లి మమ అనిపిస్తారని చెబుతున్నారు. దీనిపై కైకలూరు పంచాయతీ ఈవో వై.ప్రసాద్‌ను సంప్రదించగా రోడ్డుపై నీరు మళ్లించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు.

(c) eenadu

కాకినాడ సిగలో భారతమాల..!

ఈనాడు, కాకినాడ

- వాకలపూడి-అన్నవరం నాలుగు వరుసల రహదారిలో కదలిక
- రూ.1,040 కోట్లతో మరోసారి టెండర్లకు ఆహ్వానం

రూపు మారనున్న కాకినాడ వాకలపూడి మీదుగా అన్నవరం వెళ్లే మార్గం

ప్రాజెక్టు	: భారతమాల పరియోజన
రహదారి	: వాకలపూడి లైట్ హౌస్ - అన్నవరం
పొడవు	: 40.62 కి.మీ.
వెడల్పు	: 45 మీటర్లు (నాలుగు వరుసలు)
నిర్మాణం విలువ	: రూ.1,438 కోట్లు
టెండర్ విలువ	: రూ.1,040.20 కోట్లు
అవసరమైన భూమి	: 454 ఎకరాలు
భూసేకరణ విలువ	: రూ.230 కోట్లు

కాకినాడ నగరాన్ని జాతీయ రహదారులతో అనుసంధానించేలా కీలక మార్గాలు కార్యరూపంలోకి వస్తున్నాయి. ఇప్పటికే అచ్చంపేట నుంచి సామర్లకోట వరకు నాలుగు వరుసల రహదారి పనులు జరుగుతున్నాయి. అటు రాజానగరం నుంచి సామర్లకోట వరకు ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) నిధులతో చేపడుతున్న రహదారి విస్తరణ పనులు దాదాపు కొలిక్కి వచ్చాయి. ఏళ్ల తరబడి నిలిచిన వాకలపూడి, అన్నవరం నాలుగు వరుసల రహదారి పనులు పట్టాలెక్కనున్నాయి. భారతమాల పరియోజనలో చేపట్టే రహదారి నిర్మాణానికి జాతీయ రహదారుల సంస్థ రూ.1,040 కోట్లతో టెండర్లు పిలిచింది. సాగర తీరం వెంబడి కొత్తగా నిర్మించనున్న ఈ రహదారితో ట్రాఫిక్ కష్టాలు తీరడంతోపాటు కాకినాడ, విశాఖ ఓడ రేవులు అనుసంధానం అవుతాయి. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో మన జిల్లాను భాగస్వామ్యం చేస్తూ శ్రీకాకుళం జిల్లా మూలపేట నుంచి కాకినాడ పోర్టు వరకు బీచ్ రోడ్డు అభివృద్ధి చేస్తామని ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో ఇప్పటి వరకు మరుగునపడిన భారతమాల రహదారిలో కదలిక వచ్చింది. కాకినాడ బీచ్ సమీపంలోని వాకలపూడి లైట్ హౌస్ నుంచి కాకినాడ గ్రామీణం, యు.కొత్తపల్లి, తొండంగి, శంఖవరం మండలాల మీదుగా అన్నవరం వద్ద 16వ నంబరు జాతీయరహదారి వద్ద కలిసేలా రహదారి నిర్మించనున్నారు. దీనికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ ఇదివరకే పూర్తి చేశారు. రైతుల నుంచి సేకరించిన 381 ఎకరాలతోపాటు ప్రభుత్వ భూములు కలిపి 454 ఎకరాలు జాతీయ రహదారుల విభాగానికి గతంలోనే అప్పగించారు. టెండర్లు పిలిచి గుత్తేదారుతో ఒప్పందం చేసుకునే సమయంలో సాంకేతిక చిక్కులతో ఈ ప్రక్రియ నిలిచింది. రెండేళ్ల తర్వాత పనులకు మోక్షం లభించింది.

గత అయిదేళ్ల అవస్థలు ఇక దూరం..

నాడు.. తెదేపా హయాంలోనే కాకినాడ పోర్టు జాతీయ రహదారులతో కలిపేలా అచ్చంపేట కూడలి మీదుగా సామర్లకోట వరకు రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు. రాజానగరం, సామర్లకోట మధ్య రహదారి విస్తరణ పనులు చేపట్టారు. వీటి నిర్మాణాలు కొంత మేర జరిగిన తర్వాత వైకాపా అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి నిర్మాణాలు నిలిచిపోయాయి. దుమ్ము, ధూళిలోనే రాకపోకలు సాగిస్తూ ప్రజలు అయిదేళ్లు నరకం చూశారు. కూటమి ప్రభుత్వం ఈ పనులపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఏడీబీ నిధులతో చేపట్టే పనులు దాదాపు పూర్తి చేశారు. అచ్చంపేట నుంచి సామర్లకోట మధ్య పనులు జోరందుకున్నాయి. తాజాగా ఇప్పుడు వాకలపూడి, అన్నవరం రోడ్డు పనులను పట్టాలెక్కిస్తున్నారు. ఆగస్టు నెలాఖరు నాటికి టెండర్లు ఖరారు చేసి రెండేళ్లలో రోడ్డు నిర్మాణం పూర్తిచేయడానికి అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. దీనిపై కలెక్టర్ షాన్‌మోహన్ స్పందిస్తూ.. 'టెండర్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిసింది' అని పేర్కొన్నారు.

డ్రోన్లు.. తీరంలో నిఘా కళ్లు

కాకినాడ బీచ్ ప్రాంతంలో సందర్శకుల రద్దీ దృష్ట్యా భద్రతా చర్యల్లో భాగంగా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాలతో పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. కాకినాడ పోర్టు ప్రాంతం, ఎన్టీఆర్ బీచ్, లైట్‌హౌస్, తూర్పుతీరం తదితర ప్రాంతాల్లో డ్రోన్‌లతో నిఘా ఏర్పాటు చేశారు. రూరల్ సీఐ చైతన్యకృష్ణ అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టడి చేయడానికి తీరంలో భద్రత కల్పిస్తున్నామన్నారు. – న్యూస్‌టుడే, మసీదు సెంటర్(కాకినాడ)

పంపా జలాశయానికి గేట్ల బెంగ

గేట్ల వద్దకు చేరిన నీరు

అన్నవరం, న్యూస్‌టుడే : అన్నవరం గ్రామంలోని పంపా జలాశయానికి గేట్ల బెంగ పట్టుకుంది. ఈ ఏడాది భారీ వర్షాలు కురిసి రిజర్వాయర్‌లోకి పెద్దఎత్తున నీరు చేరితే గేటు ఊడిపోయే ప్రమాదకర పరిస్థితి నెలకొంది. ప్రమాదకరంగా ఉన్న గేట్లను తొలగించి కొత్త గేట్లు అమర్చాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలల వ్యవధిలోనే డిసెంబరులో రూ.3.36 కోట్లు నిధులు మంజూరు చేసింది. కొత్త గేట్లు, రోలర్స్, రోప్ రింగ్, కవర్ డ్రైవర్ యూనిట్, కొత్త జనరేటర్, విద్యుత్తు పనులు, సైరన్, విద్యుత్తు ప్యానల్ తదితర పనులు చేపట్టాల్సి ఉంది. నిధులు మంజూరైనా అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారించకపోవడం, టెండర్లలో కాలయాపన చేశారు. ఖరీఫ్‌కి పూర్తిచేయాల్సి ఉన్నా పనులు పూర్తికాలేదు. కనీసం ప్రమాదకరంగా ఉన్న గేట్లకు మరమ్మతులు చేయాలని భావించి పనులు ప్రారంభించిన గేట్ల వద్దకు 91.3 అడుగులకు నీరు చేరింది. దీంతో గేట్ల మరమ్మతులు నిలిపేశారు. పూర్తిస్థాయిలో నీరు చేరితే ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న ఆందోళన నెలకుంది.

98 అడుగులు దాటితే ఇక అంతే..

రిజర్వాయర్ నీటి మట్టం 105 అడుగులు. 103 అడుగులకు నీరు చేరితే ముందు జాగ్రత్త చర్యగా వరద గేట్లు ద్వారా నీటిని విడుదల చేస్తుంటారు. 2023లో మిగ్‌జాం తుపాను సమయంలో గరిష్ఠ స్థాయికి నీరు చేరింది. గేట్లు ఎత్తారు. 2,4 గేట్లు అదుపుతప్పాయి. గేట్లు కొట్టుకుపోయే పరిస్థితి వచ్చింది. ఎంతోకాలంగా గేట్లు ప్రమాదకరంగా ఉన్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. 2021 లోనే నిపుణులు నివేదిక ఇచ్చినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేసింది. అయితే గేట్లు ప్రమాదకరంగా ఉండటంతో నీటి నిల్వలు ఉంచే పరిస్థితి లేదు. గరిష్ఠ స్థాయికి చేరకుండా 96-98 అడుగులకు చేరితేనే అప్రమత్తమై నీరు వృథాగా విడుదల చేయాల్సిన పరిస్థితి ఉంది. 4వ నంబరు గేటు కింద భాగం ట్రాక్‌లో లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉంది. గేట్లు ప్రమాదకరంగా ఉండటంతో అప్రమత్తంగా ఉన్నామని, గరిష్ఠ స్థాయికి నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఈఈ శేషగిరిరావు తెలిపారు.

దప్పిక తీర్చే నీరు.. దారిని ముంచిన తీరు

ఈ రహదారిపై ప్రవహిస్తున్నది వర్షపు నీరనుకుంటే పొరపాటే. పైపు లైన్ లీకేజీతో ఇలా వస్తోంది. పోనీ ఇదేమన్నా మారుమూల దారనుకుంటే.. అదీ కాదు. కాకినాడ మీదుగా వెళ్తున్న 216 జాతీయ రహదారి. తిమ్మాపురం కూడలి వద్ద పండూరు నుంచి తిమ్మాపురం పరిసర ప్రాంతాలకు భూగర్భ మార్గంలో వెళ్లే భారీ పైపులైన్ పగిలి ఏడాదిగా నీరు వృథాగా పోతోంది. వాహనదారులు పడిపోతున్నా.. పట్టించుకునేవారే కరవయ్యారు. అధికారులు తక్షణం స్పందించాల్సిన అవసరం ఉంది. – ఈనాడు, కాకినాడ

పేదలకు దత్తత భాగ్యం

జిల్లాలో పీ4లో 1,108 కుటుంబాలకు మేలు

జగ్గంపేట ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, అధికారులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు మానసపుత్రికగా పేర్కొంటున్న పీ4 అమలుకు జిల్లాలో వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఉగాది రోజున ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినా జిల్లాలో అమలు ఆలస్యమైంది. పారిశ్రామిక, కార్పొరేట్ విద్యా, వైద్యసంస్థలు పేద కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని కలెక్టర్ షాన్‌మోహన్ స్వయంగా లేఖలు రాసినా ఫలితం అంతగా రాలేదు. దీంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి అధికారులు పీ4 కు ఎంపికైన పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని కోరారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో కలిసి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, పేద కుటుంబాల దత్తతకు శ్రీకారం చుట్టాలని సూచించారు. దీంతో ఇప్పటికే మూడు నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించారు. జగ్గంపేట నియోజకవర్గంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ రెండు పేద కుటుంబాలను దత్తత తీసుకోగా, ఆ నియోజకవర్గంలోని అధికారులు, ఉద్యోగులు 119 కుటుంబాలను స్వీకరించారు. కాకినాడ నగర నియోజకవర్గంలో అత్యధికంగా 633, కాకినాడ గ్రామీణంలో 122 పేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, మూడు మండలాల పరిధిలో 1,02,450 పేద కుటుంబాలను పీ4 పరిధిలోకి తెచ్చారు. వీటిలో 2,77,240 మంది సభ్యులున్నారు. ఇప్పటికి 1,108 పేద కుటుంబాల దత్తత స్వీకారం పూర్తయ్యింది. ఇంకా 1,01,342 కుటుంబాల దత్తతకు కృషి చేస్తున్నారు. జిల్లాలోని ఐఏఎస్, ఐపీఎస్, అఖిల భారత సర్వీసుల ఉద్యోగులను పీ4 కార్యక్రమంలో భాగస్వాములను చేసేలా కలెక్టర్ ప్రయత్నాలు ఆరంభించారు. వివిధ కార్పొరేట్ సంస్థలు, ఎన్ఆర్ఐలు, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు పేద కుటుంబాలను దత్తత తీసుకునేలా సంప్రదింపులు చేస్తున్నారు. దీనిపై జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి త్రినాథను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. వీలైనంత త్వరగా ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. పీ4 కు గుర్తించిన కుటుంబాలను సమాజంలో ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యాచరణ అమలు చేయనున్నారని చెప్పారు.

వివరాలు ఇవీ..

నియోజకవర్గం/ మండలం	గుర్తించిన పీ4 కుటుంబాలు	దత్తత పూర్తయినవి
జగ్గంపేట	11,294	121
కాకినాడ నగరం	13,977	633
కాకినాడ గ్రామీణం	11,693	122
పెద్దాపురం	12,803	98
పిఠాపురం	14,774	79
ప్రత్తిపాడు	14,774	8
తుని	13,219	31
పెదపూడి(అనపర్తి)	4,192	5
తాళ్లరేవు(ముమ్మిడివరం)	3,183	0
కాజులూరు(రామచంద్రపురం)	2,585	11

అరుణాచలేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తజనం

మార్మోగిన అరుణాచలశివ మంత్రం

తమిళనాడులోని ఆధ్యాత్మిక సంస్థల స్వామీజీలు..

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీఅపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అరుణాచల శివ అనే సప్తాక్షరి ఆలయ ప్రాంగణంలో మార్మోగింది. దేవస్థానంలో భక్తాగ్రేసరులైన 63 మంది నాయనార్ల విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాల మూడో రోజున స్వామి అనుజ్ఞ, అంకురార్పణ అనంతరం అశ్వ పూజ, కాలపూజ నిర్వహించారు. అశ్వంతో ఆలయ వీధుల్లో ఊరేగింపు సాగింది. ప్రవచనకర్త అరుణాచల మాధవి, స్వామి రామానంద ఈ వేడుకలను నిర్వహించారు. దక్షిణామూర్తి, సూర్యభగవానుడు తదితర తొమ్మిది విగ్రహాల ప్రతిష్ఠకు సంబంధించిన పూజలు నిర్వహించారు. తమిళనాడులోని ధర్మపురి ఆధీనం ఉత్తరపీఠాధిపతి చొక్కలింగస్వామి స్వామిని దర్శించి, క్షేత్ర విశేషాలను పరిశీలించారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఉత్సవాల్లో పాల్గొన్నారు.

ప్రముఖుల హాజరు..

అరుణాచలేశ్వరస్వామి దేవస్థానాన్ని మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు, అన్నపూర్ణమ్మ దంపతులు, గాయని ఎంఎం శ్రీలేఖ, సినీనటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి తదితరులు అరుణాచల క్షేత్రానికి విచ్చేశారు. శేఖర్ స్వామి సంగీత విభావరి భక్తులను అలరించాయి.

నెలాఖరులోగా ప్రసాద్ పనులు ప్రారంభం

పనులపై చర్చిస్తున్న అధికారులు

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వ పథకం 'ప్రసాద్' ద్వారా వివిధ అభివృద్ధి పనుల నిర్మాణాలను ప్రారంభించేందుకు ప్రణాళిక చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎస్ఈ ఈశ్వరయ్య తెలిపారు. ప్రసాద్ ద్వారా రూ.18.97 కోట్ల వ్యయంతో అన్నదాన సముదాయం, క్యూకాంప్లెక్స్, మరుగుదొడ్లు నిర్మించే ప్రదేశాలను ఆదివారం దేవస్థానం ఈఈ నూకరత్నం, అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల ప్రారంభంలో జాప్యంపై గత నెల 26న 'అన్నవరం ప్రసాద్ పనులకు గ్రహణం' శీర్షికతో 'ఈనాడు'లో కథనం రావడంతో అధికారులు స్పందించి చురుగ్గా చర్యలు చేపడుతున్నారు. అన్నదాన భవనాన్ని తొలగించిన తితిదే భవనం స్థలం, క్యూకాంప్లెక్స్‌ను ప్రస్తుతం అన్నదాన భవనం వద్ద నిర్మించనున్నారు. ఆయా పనులకు టెండర్ల ప్రక్రియ మరో వారం రోజుల్లో పూర్తవుతుందని ఎస్ఈ తెలిపారు. ఛైర్మన్ ఐ.వి.రోహిత్, ఈవో సుబ్బారావులతో సమావేశమై పనులపై చర్చించారు. ఏపీటీడీసీ డీఈ సత్యనారాయణ, ఏఈ వెంకటేష్‌లు పాల్గొన్నారు.

13న బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

పిఠాపురం: రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 13న రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు హాజరయ్యేవారు 2007 జనవరి ఒకటో తేదీ తరువాత పుట్టినవారై ఉండాలన్నారు. ఒరిజినల్ పుట్టిన తేదీ, ఆధార్ ధ్రువపత్రాలు తీసుకురావాలని కోరారు. ఎంపికైన జట్లు ఆగస్టు 14 నుంచి 17 వరకు పిఠాపురంలో జరిగే రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో తలపడతాయని పేర్కొన్నారు.

అమ్మ ఆరోగ్యం.. కోతలతో ప్రమాదం..

తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో 60.84, 51.13 శాతం నమోదు

– ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, కంబాలచెరువు

నవమాసాలు మోసి, ప్రసవ వేదనతో బిడ్డకు ఊపిరినిస్తుంది అమ్మతనం. కానీ ప్రస్తుతం ప్రసవ వేదన లేకుండానే కోతలతో అమ్మ పొత్తిళ్లలోకి శిశుప్రాణం చేరుతుంటే.. చూసి మురిసిపోతున్న తల్లుల సంఖ్యే ఎక్కువగా ఉంటుంది. సిజేరియన్ చేయడమే లక్ష్యంగా కొందరు వైద్యులు జేబులు గుల్ల చేస్తుంటే.. ముహూర్తాలు ఇతర కారణాలతో నిర్దేశిత సమయానికి బిడ్డ జన్మించాలనే ఉత్సుకతతో సిజేరియన్‌ను ప్రోత్సహిస్తున్న పెద్దలూ లేకపోలేదు. అవగాహన, అనుభవంలేని కొందరు వైద్యులు, రిస్క్ ఎందుకని భావిస్తూ కోతలకే ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకంటే సిజేరియన్లే అధికంగా చేస్తున్నారన్నది సుస్పష్టం.

50 శాతానికి మించి..

ఉమ్మడి జిల్లాలో ఏప్రిల్, మేలో 6,961 ప్రసవాలకు గాను 4,209 సిజేరియన్లు జరిగాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 10 నుంచి 15 శాతానికి మించి ఉండకూడదు. ఉమ్మడి జిల్లాలో 50 శాతానికి మించి జరుగుతుండడం గమనార్హం.

జిల్లాలవారీగా పరిశీలిస్తే..

✦ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని కాకినాడ, తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో అత్యధికంగా సిజేరియన్లకు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రభుత్వ గణాంకాల మేరకు (ఏప్రిల్,మేలో) అత్యధికంగా కోనసీమలో 75, తూర్పుగోదావరిలో 60.84, కాకినాడలో 50 శాతం చొప్పున సిజేరియన్లు జరిగాయి. ✦ కాకినాడ జిల్లాలో ప్రభుత్వ దవాఖానాల్లో 2045 ప్రసవాలకు గాను 825 (40.34 శాతం), ప్రైవేటు ఆసుపత్రుల్లో 775 ప్రసవాలకు 617 (79.61 శాతం) చొప్పున సిజేరియన్లు చేశారు.

ఏప్రిల్, మే నెలలో పరిశీలిస్తే

జిల్లా	ప్రసవాలు	సిజేరియన్	శాతం
కాకినాడ	2820	1442	51.13

శస్త్రచికిత్స ప్రసవాలతో ఆరోగ్యానికి ఇబ్బందే

సాధారణ ప్రసవం తరువాత మహిళ మూడు గంటల్లో లేచి నడవచ్చు. సిజేరియన్ల తో ఇన్‌ఫెక్షన్లు, అధిక రక్తస్రావాలకు ఆస్కారం లేకపోలేదు. రెండోసారి సిజేరియన్ చేయాల్సివస్తే గర్భసంచి పగిలిపోయే ప్రమాదం ఉండడంతో ప్రసవం ముందే చేయాల్సిరావచ్చు. అలాంటప్పుడు బిడ్డ ఊపిరితిత్తులు ఎదగకుండానే ప్రసవం చేసి ఎన్ఐసీయూ, ఎస్ఎన్‌సీయూలో ఉంచాల్సిఉంటుంది. బాలింతలకు నెలల తరబడి విశ్రాంతి అవసరమవుతుంది. దాంతో ఒబేసిటీతో అనారోగ్య సమస్యలొస్తాయి. జీజీహెచ్‌లో 40 వారాలయ్యాకే నొప్పులకు మందు లిచ్చి సాధారణ ప్రసవం చేస్తాం. కుదరని పక్షంలోనే శస్త్రచికిత్సకు వెళ్తాం. ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రుల్లో 36 వారాలకే సిజేరియన్ చేసేస్తున్నారు. - బసా అక్కమాంబ, గైనిక్ హెచ్‌వోడీ, రాజమహేంద్రవరం జీజీహెచ్

గేటును పరిశీలిస్తున్న స్టేషన్ మేనేజర్ రమేష్

సిగ్నల్ వ్యవస్థలో సాంకేతిక లోపం

ప్రత్యామ్నాయ రైల్వే గేటు ఏర్పాటు

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోట రైల్వే గేటు మరమ్మతులకు గురవడంతో సిగ్నల్ వ్యవస్థలో సాంకేతిక లోపం ఏర్పడింది. రైళ్ల రాకపోకలకు ఇబ్బంది లేకుండా మరో గేటు ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నం సామర్లకోట రైల్వే గేటు వద్ద సిగ్నల్ వ్యవస్థ పనిచేయకపోవడంతో స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ సిగ్నలింగ్ వ్యవస్థ ఇంజినీరింగ్ సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది గేటు వద్దకు చేరుకుని సాయంత్రానికి మరమ్మతులు పూర్తిచేశారు. అప్పటి వరకు మరో గేటును సిగ్నల్ వ్యవస్థకు అనుసంధానం చేయడంతో రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగించాయి.

నేడు కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడలోని కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి రాలేనివారు eekosam.ap.gov.in అర్జీలు దాఖలు చేయవచ్చునని తెలిపారు. అర్జీ స్థితిని 1100 కాల్ సెంటర్‌కు ఫోనుచేసి తెలుసుకునే అవకాశం కల్పించారని తెలిపారు.

జల సంరక్షణకు అడుగులు

తుని మండలం డి.పోలవరంలో తవ్విన పంట కుంట

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో జల సంరక్షణకు అడుగులు పడుతున్నాయి. జల పుష్కరిణి ద్వారా పెద్దఎత్తున చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టగా, పంట కుంటల తవ్వకాలు జోరందుకున్నాయి. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ద్వారా జల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆయన జిల్లా మంత్రి కావడంతో ఎక్కువ కుంటలు తవ్వేలా ప్రోత్సహిస్తున్నారు.

జిల్లాలో పంట కుంటల వివరాలు

నియోజకవర్గం	లక్ష్యం	తవ్వినవి
ప్రత్తిపాడు	845	241
తుని	475	167
జగ్గంపేట	460	95
పెద్దాపురం	145	48
పిఠాపురం	150	47
కాకినాడ గ్రామీణం	30	6
తాళ్లరేవు	10	9

తవ్వకాలు ఇలా..

20 అడుగుల వెడల్పు, పొడవు, రెండు అడుగుల లోతుతో కుంటల తవ్వకాలకు అనుమతించారు. తక్కువ విస్తీర్ణం ఉన్న భూముల్లో 5 అడుగుల వెడల్పు, పొడవు, 2 అడుగుల లోతుతో తవ్వుతారు. దీనికి రూ.1.40 లక్షల నుంచి రూ.60వేలు వెచ్చిస్తారు. రూ.307 సగటు వేతనంతో ఉపాధి కూలీలతో తవ్విస్తున్నారు. 20 అడుగుల వెడల్పు, పొడవు, రెండు అడుగుల లోతులో తవ్వే వాటికి 225 ఎం.ఎం రాతికట్టడాలను ఏర్పాటు చేస్తున్నారు. దీనికి రూ.1.40లక్షలు కేటాయిస్తున్నారు.

2,115 పంట కుంటలే లక్ష్యం..

2025-26లో రాష్ట్రం లోని రైతుల భూముల్లో లక్ష పంట కుంటలు తవ్వినందుకు జాతీయ వాటర్ మిషన్ నుంచి ప్రశంసలు దక్కాయి. అందులో భాగంగా ఈ ఏడాది జిల్లాలోని 20 మండలాల్లోని 385 గ్రామాల్లో 2,115 పంట కుంటలు తవ్వాలని లక్ష్యంగా చేసుకున్నారు. ఇప్పటివరకు 1,462 పనులకు కలెక్టర్ పరిపాలనా ఆమోదం ఇవ్వగా 16 మండలాల్లో 613 పంట కుంటలు తవ్వారు. ఇంకా 849 తవ్వాలి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ 30లోగా 1,462 కుంటలు పూర్తి చేయాలని భావించారు. జిల్లాలోని మెట్ట ప్రాంతంలో వీటి తవ్వకాలకు పరిస్థితులు అనుకూలించకపోవడంతో లక్ష్యాలు కుంటుపడ్డాయి. ఆగస్టు నాటికి జిల్లా వ్యాప్తంగా సన్న, చిన్నకారు రైతుల భూముల్లో 2,115 కుంటలు తవ్వాలని భావిస్తున్నారు. దీనిపై డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మిని న్యూస్‌టుడే సంప్రదించగా వీలైనంత త్వరగా లక్ష్యాలు పూర్తి చేస్తామన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
Union Bank of India
ప్రాంతీయ కార్యాలయం,మెయిన్‌రోడ్,కాకినాడ.

కాంట్రాక్ట్ పద్ధతిన కాకినాడలోని ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలకు ఫైనాన్షియల్ లిటరసీ కౌన్సెలర్ పోస్టు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాము.

అర్హత ప్రమాణాలు :
1. వయస్సు – 35 సంవత్సరాల నుండి 64 సంవత్సరాల వరకు, 65 సంవత్సరాలు పూర్తయ్యేవరకు పనిచేయడానికి అనుమతి ఉంది.
2. విద్యార్హత – గ్రాడ్యుయేట్.
3. పదవీ విరమణ/ స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన బ్యాంక్ ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. అయితే పదవీ విరమణ చేసిన బ్యాంక్ ఉద్యోగి అందుబాటులో లేకుంటే, బ్యాంకింగ్ మరియు ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో పరిజ్ఞానము ఉన్నవారు / సంబంధిత ఐఐబిఎఫ్ కోర్సులను పూర్తిచేసిన అభ్యర్థులు పరిగణించబడతారు.
4. కంప్యూటర్ నందు కనీస పరిజ్ఞానము కలిగి ఉండి, ఇంటర్నెట్ పై అవగాహన కూడా ఖచ్చితంగా ఉండాలి.
5. నియమితులైన ప్రాంతం యొక్క స్థానిక భాష యందు ఖచ్చితంగా అవగాహన ఉండాలి.
నియామకం తొలుత ఒక సంవత్సరం పాటు కాంట్రాక్ట్ పద్ధతిన ఉంటుంది మరియు తదుపరి పొడిగింపబడవచ్చు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు తిరిగి ఇవ్వబడని ఫీజు రూ. 1000.00 లను డీడీ రూపంలో రీజనల్ ఆఫీస్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాకినాడ పేరు మీద సమర్పించాలి.
ఎంపికైన అభ్యర్థి తప్పనిసరిగా బ్యాంకు పేరుమీద చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్ రూ. 30000.00 రీఫండబుల్ సెక్యూరిటీగా అందించాలి. పారితోషకం నెలకు రూ. 20,000/- (స్థిరమైన) + షరతులు నెరవేర్చడం పై ఇతర భత్యాలు ఉంటాయి.
దరఖాస్తులు స్వీకరణకు చివరి తేదీ: 28.07.2025, తదుపరి వివరముల కొరకు సంప్రదించవలసిన మొబైల్ నెం.లు : 98667 33826, 9441726055, 9908810010.
తేది : 05.07.2025 సం/- రీజనల్ హెడ్, ప్రాంతీయ కార్యాలయం, కాకినాడ.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

తలుపులమ్మకు లక్ష తులసి పూజ

తుని గ్రామీణం: తలుపులమ్మ లోవ దేవస్థానంలో ఆషాఢమాస ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఆలయ వేద పండితులు అర్చకులు లక్ష తులసి పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవారి అలంకరణకు వజ్రాభరణం

అన్నవరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుని దేవేరి అనంత లక్ష్మీ అమ్మవారి అలంకరణకు వజ్రాల లాకెట్ నెక్లెస్‌ను దాత ఆదివారం అందజేశారు. పెద్దాపురం శ్రీ లలితా ఎంటర్ ప్రైజెస్ ఇండస్ట్రీస్ ఎండీ మట్టే సత్యప్రసాద్, సూర్యకమల దంపతుల కుమారుడు ఆదిశంకర్, ప్రవంతి పేరు మీద ఇచ్చారు. సుమారు రూ. 19.09 లక్షలతో బంగారం, వజ్రాలతో తయారు చేయించిన సుమారు 122 గ్రాముల బరువున్న ఆభరణంలో 174 వజ్రాలు ఉన్నాయి. ప్రత్యేక పూజలు అనంతరం ఈవో సుబ్బారావు సమక్షంలో దాత కుటుంబసభ్యులతో కలిసి ఆలయానికి అందించారు. వైదిక బృందం ఆధ్వర్యంలో అమ్మవారికి ఆభరణాన్ని అలంకరించారు. మట్టే సత్యప్రసాద్ గతంలో రూ. కోట్ల వ్యయంతో స్వామి, అమ్మవార్లకు వజ్ర కిరీటాలను, వజ్రాలు పొదిగిన కర్ణాభరణాలను కూడా ఇచ్చారు. ఈ ఆభరణాల అలంకరణతోనే స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తున్నారు.

హారాన్ని ఈవో సుబ్బారావుకు అందిస్తున్న దాత మట్టే ఆదిశంకర్ దంపతులు

శ్రీవారి చెంత సంపూర్ణ గీతా పారాయణం

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడకు చెందిన శ్రీకృష్ణ పరివార్ సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు సుధామాధురి ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలోని నాద నీరాజనం వేదికపై సంపూర్ణ గీతా పారాయణం చేశారు. దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కురుక్షేత్ర, ఉడిపి, శ్రీకాళహస్తి, మధుర, ధర్మస్థల, అరుణాచలం తదితర పుణ్యక్షేత్రాల్లో 99 సంపూర్ణ గీతా పారాయణాలు పూర్తి చేశామని సుధామాధురి తెలిపారు. 100వ పారాయణం ఆదివారం 300 మందితో చేశామని పేర్కొన్నారు.



తిరుమల నాదనీరాజనం వేదికపై కాకినాడ శ్రీకృష్ణ పరివార్ సేవాసంఘం సభ్యులు

గృహ నిర్మాణశాఖ అధికారికి రెడ్‌క్రాస్ అవార్డు

సత్యనారాయణ, హౌసింగ్ పీడీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా గృహనిర్మాణ అధికారి ఎన్వీవీ సత్యనారాయణ రాష్ట్ర స్థాయి రెడ్‌క్రాస్ అవార్డుకు ఎంపికయ్యారు. కాకినాడ జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆయన రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వాల ద్వారా నిధుల సమీకరణలో చూపిన చొరవకు ఆంధ్రప్రదేశ్ రెడ్‌క్రాస్ శాఖ ఈ అవార్డు ప్రకటించింది. ఈ నెల 9న విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో ఆయనకు పురస్కారం అందజేస్తారని పేర్కొన్నారు.

సాయి వేంకటేశ్వర ఎం.ఎం.ఎ. కో- ఆపరేటివ్ సొసైటీ, దేవిచౌక్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

సాయి వేంకటేశ్వర ఎం.ఎం.ఎ. కో- ఆపరేటివ్ సొసైటీ, దేవిచౌక్ వద్ద తాకట్టు పెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
09/2025	01-09-2023 to 30-06-2024

ఆసక్తి గలవారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ. 10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 చైర్మన్:
రాజమండ్రి. సాయి వేంకటేశ్వర ఎం.ఎం.ఎ. కో-ఆపరేటివ్ సొసైటీ

ప్రభాకర నిధి లి., దేవిచౌక్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

ప్రభాకర నిధి, దేవిచౌక్ వద్ద తాకట్టు పెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడ పైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
08/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గలవారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ. 10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 చైర్మన్:
రాజమండ్రి. ప్రభాకర నిధి లి.

సాయి వేంకటేశ్వర ఫైనాన్స్, మెయిన్‌రోడ్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

సాయి వేంకటేశ్వర ఫైనాన్స్, మెయిన్ రోడ్ వద్ద తాకట్టు పెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
06/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గలవారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ. 10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 భరత్‌కుమార్
రామచంద్రపురం. ప్రభుత్వం నియమించిన వేలందారు
మెయిన్‌రోడ్, రామచంద్రపురం

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, ప్రకాష్‌నగర్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, ప్రకాష్ నగర్ వద్ద తాకట్టు పెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
07/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గల వారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ. 10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 భరత్‌కుమార్
రామచంద్రపురం. ప్రభుత్వం నియమించిన వేలందారు
మెయిన్‌రోడ్, రామచంద్రపురం

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, దేవిచౌక్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, దేవిచౌక్ వద్ద తాకట్టు పెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
05/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గల వారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ. 10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 భరత్‌కుమార్
రామచంద్రపురం. ప్రభుత్వం నియమించిన వేలందారు
మెయిన్‌రోడ్, రామచంద్రపురం

ఆపద తీర్చేరు.. అక్కున చేర్చేరు

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్ (కాకినాడ)

తల్లిదండ్రులు పట్టించుకోక, వృద్ధాప్యంలో పిల్లలకు భారంగా భావించి.. ఇలా కారణమేదైనా సమాజంలో అనేక మంది వృద్ధులు, మహిళలు, పిల్లలు అనాథలుగా వీధులే ఆవాసాలుగా మార్చుకుంటున్నారు. అలాంటి వారిని గుర్తించి అధికారులు రక్షణ కల్పిస్తూ.. అభినందనలు అందుకుంటున్నారు. సకాలంలో వైద్యం, ఆహారం అందించి బాధితులను కుటుంబసభ్యులకు అప్పగిస్తుండడం విశేషం. ఎవరూ లేనివారిని ప్రభుత్వ హోమ్‌లు, వృద్ధాశ్రమాల సంరక్షణలో ఉంచుతున్నారు. ఇలా మహిళాభివృద్ధి-శిశుసంక్షేమశాఖ, బాలల పరిరక్షణ విభాగం చొరవ ఎందరినో కాపాడుతోంది.

కృషి అభినందనీయం..

రోడ్డుపై పడి ఉన్న వృద్ధుడ్ని వివరాలు అడుగుతున్న బాలల పరిరక్షణ విభాగం అధికారి వెంకటరావు

- ఈ ఏడాది ఫిబ్రవరిలో సామర్లకోటకు చెందిన బుద్ధి మాంద్యం కలిగిన 14 ఏళ్ల బాలుడు రైలెక్కి ఒడిశా వెళ్లాడు. అక్కడి రైల్వే రక్షణ దళం(ఆర్పీఎఫ్), జీఆర్పీ అధికారులు బాలుడ్ని గుర్తించి కాకినాడ జిల్లా బాలల పరిరక్షణ విభాగం(డీసీపీయూ) అధికారులకు తెలిపారు. తక్షణమే స్పందించి బాలుడ్ని తీసుకువెళ్లి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు.
- మే నెలలో కాకినాడ ఆర్టీసీ బస్టాండు వద్ద ఓ తల్లి తన ముగ్గురు పిల్లలతో వర్షంతో తడుస్తూ ఆకలితో అలమటించింది. అనారోగ్యంతో ఉన్న పిల్లలు, నిస్సహాయ స్థితిలో ఉన్న తల్లి పరిస్థితిని స్థానికులు చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి విజయకు సమాచారం అందించారు. ఆమె తన బృందంతో వెళ్లి వారిని అక్కున చేర్చుకున్నారు. రోదిస్తున్న తల్లికి ధైర్యం చెప్పి ఆహారం, తాగునీరు అందించారు. ప్రస్తుతం ఆ తల్లి పిల్లలతో వన్‌స్టాప్ సెంటర్‌లో క్షేమంగా ఉంది.
- ఇటీవల ఓ వృద్ధుడు కాకినాడ వివేకానంద ఉద్యానం వద్ద రహదారిపై సొమ్మసిల్లి పడిపోయారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి వెంకటరావు అతనికి సపర్యలు చేసి జీజీహెచ్‌కు తరలించి వైద్యం అందేలా చేశారు.

వన్‌స్టాప్ సెంటర్ వద్ద తల్లీబిడ్డలతో అధికారులు (పాత చిత్రం)

పిల్లలకు అక్షర వెలుగులు..

కుటుంబ పరిస్థితులు, ఇతరత్రా కారణాలతో బాలలతో భిక్షాటన చేయించడం, బాల కార్మికులుగా మార్చడం వంటి వాటికి బాలల పరిరక్షణ విభాగం అడ్డుకట్ట వేస్తోంది. ఉపాధి నిమిత్తం వలస వచ్చిన కార్మికుల పిల్లలే ఎక్కువగా బాధితులుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారికి సామర్లకోట, కాకినాడ శివారు అచ్చంపేట, వాకలపూడి ప్రాంతాల్లో విద్యాశాఖ అధికారుల సహకారంతో టెంట్ స్కూల్ ఏర్పాటు చేసి చదువు చెప్పడంతోపాటు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల 40 మందిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించినట్లు జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి సీహెచ్ వెంకటరావు తెలిపారు.

తైక్వాండో క్రీడాకారులకు జ్ఞాపికల అందజేత

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తైక్వాండో క్రీడాకారులు ఇటీవల అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 11వ సారి జిల్లాకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించడం అభినందనీయమని కాకినాడ డీఎస్పీ శ్రీనివాసకుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీనగర్ నగరపాలక సంస్థ పాఠశాలలో జాతీయ, రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు సంఘ కార్యదర్శి అధ్యక్షతన ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు. జీజీహెచ్ వైద్యురాలు డా. ప్రమీల, సంఘ అధ్యక్షుడు మధుసూదనరావు హాజరయ్యారు. ఇటీవల హరిద్వార్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో 3 బంగారు, ఒక రజత, 8 కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులు, రాష్ట్ర స్థాయి పోటీల్లో 67 పతకాలు సాధించినవారు తదితరులను అభినందించారు. సత్యనారాయణ, తులసి, రత్నం, అఖిల, తేజ, అరుణ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ముగింపు కార్యక్రమంలో క్రీడాకారులు

ముగిసిన హాకీ జట్టు శిక్షణ

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణంలోని హాకీ కోర్టులో పది రోజులుగా త్వరలో చెన్నైలో జరిగే మురుగప్ప గోల్డ్ కప్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఆల్ ఇండియా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్(సీబీఐసీ) హాకీ జట్టు సన్నాహక శిక్షణ జరుగుతోంది. 30 మందికి జట్టుకు తర్ఫీదు కార్యక్రమం ఆదివారంతో ముగిసిందని నిర్వాహకులు తెలిపారు. కలెక్టర్ షాన్ మోహన్ అనుమతితో కాకినాడ కోస్టల్ క్లబ్ సహకారంతో శిక్షణ జరిగిందని సీబీఐసీ చీఫ్ కోచ్ రవిచంద్ర తెలిపారు. ఆయనతోపాటు సీనియర్ కోచ్ అజయ్‌శర్మను జిల్లా హాకీ సంఘం తరపున వి.రవిరాజు చేతులమీదుగా సత్కరించారు. ఆల్ ఇండియా జట్టులో స్థానం సాధించిన స్థానిక క్రీడాకారులు కిరణ్‌తేజ, గణేష్‌లనూ సత్కరించారు. సూరిబాబు, అవినాష్, గంగాధర్, అజయ్‌కుమార్, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఈత పోటీల ఎంపికలు

మాట్లాడుతున్న జాతీయ మారథాన్ స్విమ్మర్ శ్యామల

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలబాలికలకు జిల్లా స్థాయి ఈత పోటీలు స్థానిక డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో జరిగాయని సంఘ అధ్యక్షకార్యదర్శులు పి.సతీష్, ఐ.రాజు ఆదివారం తెలిపారు. ముఖ్యఅతిథులుగా డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, జాతీయ మారథాన్ స్విమ్మర్ గోలి శ్యామల హాజరై పోటీలు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి 70 మంది హాజరయ్యారన్నారు. ఎంపికైన వారు ఈ నెల 19, 20వ తేదీల్లో విశాఖపట్నం, ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే 10వ సబ్ జూనియర్, జూనియర్ అంతర్ జిల్లా ఈత పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సంఘ ముఖ్యసలహాదారు మంగా వెంకట శివరామకృష్ణ, డీఎస్‌ఏ స్విమ్మింగ్ కోచ్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో డొక్కా సీతమ్మ విగ్రహం

ఉపాధ్యాయిని వెంకటరామలక్ష్మి

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: ఆంధ్రుల అన్నపూర్ణగా పేరు పొందిన డొక్కా సీతమ్మ విగ్రహాన్ని కాకినాడ గ్రామీణం రమణయ్యపేటలోని ఏపీఎస్పీ జిల్లా పరిషత్ పాఠశాల తెలుగు స్కూల్ అసిస్టెంట్ ముత్యా వెంకటరామలక్ష్మి సొంత నిధులు సుమారు రూ. 80 వేలు వెచ్చించి తయారుచేయించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు డొక్కా సీతమ్మ పేరిట మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోంది. డొక్కా సీతమ్మ దాతృత్వం గురించి విద్యార్థులు, భావితరాలు తెలుసుకుని ఆమె అడుగుజాడల్లో నడవాలనే ఉద్దేశంతో పాఠశాలలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఉపాధ్యాయిని రామలక్ష్మి తెలిపారు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో శిల్పి రాజకుమార్ వుడయార్ వద్ద తయారుచేయించిన ఈ విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే పంతం నానాజీ ఆవిష్కరించనున్నారు.

జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్, రెక్టార్‌ల నియామకం

వి.వి.సుబ్బారావు

ఆర్.శ్రీనివాసరావు

గాంధీనగర్(కాకినాడ), న్యూస్‌టుడే: పరిపాలనా సంస్కరణల్లో భాగంగా జేఎన్‌టీయూకే ఉపకులపతి సీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆదేశాల మేరకు జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్, ఇన్‌ఛార్జి రెక్టార్‌లను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వుల జారీ చేశారు. యూసీఈకే ఈఈఈ విభాగం ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.శ్రీనివాసరావును ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న వి.రవీంద్రనాథ్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. జేఎన్‌టీయూకే యూసీఈకే మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్‌గా ఉన్న వి.వి.సుబ్బారావును ఇన్‌ఛార్జి రెక్టార్‌గా నియమించారు. ప్రస్తుత రెక్టార్ కె.వి.రమణను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా నియమితులైన ఆర్.శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి రెక్టార్‌గా నియమితులైన వి.వి.సుబ్బారావులను ఉపకులపతి ప్రసాద్, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, డైరెక్టర్లు, యూనివర్సిటీ అధికారులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది అభినందించారు.

ప్రణాళిక లోపం.. భక్తులకు అసౌకర్యం

- సత్యదేవుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రత్యేక దర్శనం కోసం అనివేటి మండపం ద్వారం వద్ద వేచి ఉన్న భక్తులు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు ఏర్పాట్లలో ప్రణాళిక లోపంతో అసౌకర్యం ఎదురైంది. దర్శన సమయంలో ఇబ్బందులు పడ్డారు. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామి దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. ఉదయం నుంచి క్యూలైన్లు, వ్రతమండపాలు కిక్కిరిశాయి. రూ. 200 టికెట్టు ప్రత్యేక దర్శనానికి వెళ్లేందుకు భక్తులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. తూర్పురాజగోపురం వద్ద క్యూలైన్లలోకి వెళ్లేందుకు భక్తుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. అనివేటి మండపం ద్వారం వద్ద పెద్దసంఖ్యలో భక్తులు గుమిగూడారు. మండపం లోపల క్యూలైన్ వద్ద (రూ. 1,500 వ్రతమండపం వద్ద) కూడా స్వల్ప తోపులాటలో ఇబ్బందులు పడ్డారు. సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రతాలోపం కనిపించింది. ప్రకాష్ సదన్ కూడలి, పశ్చిమ రాజగోపురం, క్యూలైన్ల వద్ద ఎక్కడా భద్రతా సిబ్బంది కనిపించలేదు. వాహనాలను తనిఖీ చేయకుండానే పైకి అనుమతించారు. ట్రాఫిక్‌తో వాహనాలను సత్యగిరికి మళ్లించారు. అక్కడ నుంచి ఉచిత బస్సుల్లో రత్నగిరికి భక్తులను తెచ్చినా సరిపోలేదు. దీంతో అనేక మంది నడిచి వచ్చారు. వసతిగదులకు డిమాండ్ ఏర్పడింది. 10 గంటల వరకే భక్తులకు పులిహోర, దద్దోజనం పంపిణీ చేశారు. అధికారుల పర్యవేక్షణ లేదు. ఏకాదశి సందర్భంగా స్వామి, అమ్మవారు, పరమేశ్వరుల మూలవిరాట్‌కు స్వర్ణపుష్పార్చన జరిగింది. ఆలయ ప్రాంగణంలో కళావేదికపై సూర్యనమస్కారాలు పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు.

1.20 లక్షల ప్రసాదం ప్యాకెట్లు విక్రయం

అన్నవరం: అన్నవరం సత్యదేవుని గోధుమ నూక ప్రసాదం ప్యాకెట్లు అత్యధికంగా 1.20 లక్షలు ఆదివారం విక్రయించారు. తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకుంది. ఆషాఢమాసం ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు.

లోక్‌అదాలత్‌లో 1304 కేసుల పరిష్కారం

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 5న జరిగిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో 1,304 పోలీసు కేసులు పరిష్కారమయ్యాయని ఎస్పీ బిందుమాధవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా న్యాయస్థానంలో ఫిర్యాదుదారులు, కక్షిదారులకు కేసుల నుంచి ఉపశమనం లభించిందన్నారు. కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. జిల్లాలో అత్యధికంగా జగ్గంపేట పీఎస్ పరిధిలో 116, గండేపల్లి పీఎస్‌లో 116, అన్నవరం పీఎస్ పరిధిలో 106 కేసులు పరిష్కారమయ్యాయన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

టైలరింగ్ వర్క్స్ ఇంటి వద్దనే పనిచేసే స్త్రీలు కావలెను. వారికి క్లాత్ ఇచ్చుటకు స్టాక్ పాయింట్స్ పెట్ పార్టనర్స్ కావలెను. ✆ 7093632399.

FINANCIAL SERVICES

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలలోపు ఫైనాన్స్ చేయబడును. అన్ని తరగతుల వారు బ్యాంకులో స్థిరాస్తిపై లోన్ తీసుకున్న వారికి Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ చేయబడును. ✆ 96665 47338.

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

విశాఖలో/ అనకాపల్లిలో NRI ఫామ్ ల్యాండ్స్ వేయుటకు ఇన్వెస్ట్ పార్టనర్స్ కావలెను. సంప్రదించండి. ✆ 73864 14017/ 70936 32399.

TO LET

COMMERCIAL

FOR OFFICES, Banks, Dental & Cosmetology convience place with parking in Danavaipeta, 1600 Sft., 1st Floor. Rjy, Cont: 94 90 811 769.

JOBS

Wanted Duty Doctors, O.T. Nurse & Technician. C.E.M. Hospital. ✆91002 75777 & Teachers, Cook, Aayas. Jaya High School, Dowleswaram, ✆ 63049 94974.

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లల్లో వృద్ధులు, పేషంట్లు సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో. వ. + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ✆ 92814 52845, 82475 00574.

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లల్లో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.

ప్రభాకర నిధి, దేవిచౌక్, రాజమండ్రి నందు బిజినెస్ ప్రమోషన్ చేయుటకు అభ్యర్థులు కావలెను. ఆసక్తిగలవారు సంప్రదించండి. సెల్: 79952 33384.

రాజమండ్రిలో ప్రముఖ ఇంటీరియర్ షాప్‌లో హెల్పర్స్ కావలెను. 10 Members, జీతం: Start 13,000/- + ఇన్సెంటివ్స్ + ట్రావెల్ అలవెన్స్ ఇవ్వబడును. ✆ 99564 77177.

Managers కావలెను. ప్రముఖ Life Insurance నందు ఇంటి నుండి పనిచేయు సదావకాశము. Salary, Incentives, Promotions, Foreign Trips, 40 సం॥లు పైబడినవారు మాత్రమే. ✆ 98494 21277.

త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 85209 80099, 85208 74499.

వర్క్ ఫ్రం హోమ్ డేటా ఎంట్రీ: ప్రముఖ ఔట్‌సోర్సింగ్ సంస్థ నందు ఇంటి వద్ద ఉండి పార్ట్/ ఫుల్ టైం ప్రాజెక్ట్ వర్క్ చేయుటకు Laptop/Desktop, స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు కావలెను. ✆ 95534 29994.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-35 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	23,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	25,000
గటగట	26,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	19,000-22,000
కొత్త (పచ్చి) కాయ	19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	4,500
కిలో	300

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	102-00
రిటైల్ లైవ్	124-00
డ్రెస్డ్	180-00
స్కిన్‌లెస్	205-00

92.7 FM Rajamahendravaram Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact

9000180626, 9989993175

మాకు న్యాయం చేయరూ..!

ఇంటి వద్ద ఫ్లెక్సీ పెట్టి నిరసన తెలుపుతున్న బాధితుడి కుమార్తె

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: పోలవరం కాలువ నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వపరంగా అందాల్సిన ఆర్ఆర్ ప్యాకేజీ తమకు అమలు చేయలేదని గ్రామానికి చెందిన జి.సతీష్ తన ఇంటి ముందు వివరాలు తెలియజేస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి కుటుంబ సభ్యులతో నిరసన చేపట్టారు. ఈ కాలనీలో సుమారు 39 ఏళ్ల నుంచి ఉంటున్నామన్నారు.

చమురు నిల్వ పరిశ్రమలో మాక్ డ్రిల్

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: ప్రమాదాల నివారణపై కాకినాడ గ్రామీణం సూర్యారావుపేటలోని ఎస్‌సీఎస్ చమురు నిల్వ పరిశ్రమలో ఆదివారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఫ్యాక్టరీల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో పరికరాలు, మాక్ డ్రిల్ పరిశీలించారు. ప్రమాదాలు జరిగినప్పుడు రెస్క్యూ ఆపరేషన్ వైద్యసహాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్ఆర్ హెడ్ పీఎస్ఎన్ మూర్తి, టెర్మినల్ మేనేజర్లు విజయ్‌కుమార్, భోగేశ్వరరావు, సాయికృష్ణ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపాదికన మౌలిక వసతులు కల్పించాలి

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: పోలవరం కాలువ నిర్మాణంలో తొలగించనున్న కుమ్మరిలోవ కాలనీవాసులకు పునరావాస కాలనీలో యుద్ధప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించాలని జేసీ రాహుల్‌మీనా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన కుమ్మరిలోవ వాసుల పునరావాస కాలనీ పనులతీరును పరిశీలించారు. విద్యుత్తు, తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. మరోవైపు ఈ నెల 9కి కాలనీ సమీపంలో బాంబులతో కొండను పేల్చే పనులు జరిపేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నట్లు గ్రామలో టాంటాం వేయించడం విశేషం. తహసీల్దారు ప్రసాద్, విద్యుత్తు శాఖ అధికారులు ఉన్నారు.

పశు మాంసం స్వాధీనం నలుగురి అరెస్టు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: చెందుర్తి శివారులో పశువులను వధించి రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన సుమారు 1000 కేజీల మాంసాన్ని, తొట్టె ఆటో, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున సిబ్బందితో దాడి చేసి ఆరుగుల తాతయ్యలు, గుడివాడ గున్నయ్య, వాసా జగదీష్, మిరియాల రమేష్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. పశుమాంసాన్ని పూడ్చివేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జైలు యాత్రల్లో జగన్: మంత్రి సుభాష్

ఇంద్రపాలెంలో వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న మంత్రి సుభాష్, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: వివిధ కేసుల్లో జైలులో ఉన్నవారిని పరామర్శించడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జైలు యాత్రలు చేస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విమర్శించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని మందలిస్తుంటే ఆయనకు నొప్పి కలుగుతోందన్నారు. ప్రతిపక్ష హోదా కూడా లేని వైకాపా నాయకులు, జగన్ రాష్ట్ర ప్రభుత్వంపై విషప్రచారం చేస్తూ కుల, మతాల వారీగా ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఏడాది పాలనలో అందించిన సంక్షేమాభివృద్ధి, సుపరిపాలన చూసి ఓర్వలేక కుయుక్తులు పన్నుతున్నారన్నారు. ఆదివారం కాకినాడ గ్రామీణం ఇంద్రపాలెంలో నియోజకవర్గ తెదేపా సమన్వయకర్త పిల్లి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మితో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. పథకాల గురించి వివరించి కరపత్రాలు పంచారు. నాయకులు డా.చప్పిడి వెంకటేశ్వరరావు, వెంకే శ్రీనివాసబాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్, రామకృష్ణ, పాలిక ఉషారాణి, పలివెల గాయత్రి, పితాని అప్పన్న పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సమస్యలపై చర్చ

మసీదు సెంటర్, కాకినాడ నగరం: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం కాకినాడ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం కూర్మారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఉన్నత పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. రాష్ట్ర స్థాయిలో పాఠశాలల నిర్మాణంలో చేసిన మార్పుల్లో కొత్తగా క్లస్టర్లను ఏర్పాటు చేశారన్నారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడిని అధికారిగా పరిగణిస్తామని చెబుతున్నప్పటికీ స్థాయిని గ్రేడ్-1కు పెంచి ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరుతున్నామన్నారు. బదిలీల ప్రక్రియ ప్రారంభించినప్పటి నుంచీ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారన్నారు. 2024-25 ఏడాదికి పాఠశాల నిధులు కేవలం 50 శాతం మాత్రమే ఇచ్చారని, వెంటనే బకాయిలతోపాటు 2025-26 విద్యా సంవత్సరానికి నిధులు విడుదల చేయాలన్నారు. సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి పుల్లయ్య, కోశాధికారి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, శేఖర్, సుబ్బరెడ్డి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ

రైతు బజార్‌లో నిన్నటి ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాటా- 22, 24, వంకాయలు- 36, 40, 50, బెండకాయలు- 36, పచ్చిమిర్చి- 56, కాకరకాయ- 40, బీర- 44, 50, క్యాబేజీ- 30, క్యారెట్- 36, దొండకాయలు- 38, 44, బంగాళాదుంప- 20, 22, 29, ఉల్లి- 20, 23, 29, గోరుచిక్కుడు- 38, దోసకాయలు- 14, చిక్కుడు- 54, చేమదుంపలు- 40, బీట్‌రూట్- 34, కీరదోస- 40, బీన్సుకాయలు- 100, అల్లం- 50, క్యాప్సికం- 74, బొబ్బర్లు- 40, బెండ దుంపలు- 36, ఒకటి చొప్పున ఆనపకాయ- 12, 17, పొట్లకాయ- 20, 24, అరటికాయ- 7, 8, 9, మనగాడ- 10, 12, మామిడికాయ- 10, 12, నిమ్మకాయలు(డజన్)- 24, 36, 48.

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్స్- తమ్ముడు, జురాసిక్ వరల్డ్ రీబర్త్, కన్నప్ప, కుబేర, మార్గన్, సోలోబాయ్, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్స్- తమ్ముడు, కన్నప్ప, 3బీహెచ్‌కే, షోటైమ్, లక్ష్మీ- తమ్ముడు, సత్యగౌరి- జురాసిక్ వరల్డ్ రీబర్త్, తిలక్‌మహల్- తమ్ముడు, సినీపొలిస్ 1- తమ్ముడు, సినీపొలిస్ 2- తమ్ముడు, శ్రీప్రియ- జురాసిక్ వరల్డ్ రీబర్త్, పద్మప్రియ- తమ్ముడు, సూర్య1(వాకలపూడి)- జురాసిక్ వరల్డ్ రీబర్త్, సూర్య 2- తమ్ముడు.

కాలువలో మురుగుపారేలా చేశారు..

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. స్థానిక వెంకటేశ్వరనగర్ ప్రధాన రహదారిపై కాలువలోని చెత్తాచెదారం, గడ్డి, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. కొంతకాలంగా ఇదే పరిస్థితి నెలకొంది. దాంతో మురుగు పారే వీలులేకుండా పోయింది. దీనిపై 'ఈనాడు'లో ఈ నెల 4న కాలువ ఇలా.. మురుగు పారేదెలా.. శీర్షికతో చిత్ర కథనం ప్రచురితమైంది. సంబంధిత అధికారులు స్పందించి కాలువలోని చెత్తాచెదారం, గడ్డి, ఇతర వ్యర్థాలు తొలగించడంతో సమస్య పరిష్కారమైంది.

ఖాళీ స్థలాలు.. రోగకారకాలు

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఖాళీ స్థలాలు ప్రజలను భయపెడుతున్నాయి. నివాసిత కాలనీల్లో ఇళ్ల మధ్యలో నిర్మాణాలు చేయక వదిలేసిన స్థలాలు, చెత్త, ఇతర వ్యర్థాలకు స్థావరాలుగా మారాయి. చినుకుపడితే నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ఎక్కువ శాతం ప్రైవేటు వ్యక్తుల ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. వాటిలో పేరుకుపోయిన చెత్త కుళ్లి దుర్వాసన వ్యాపిస్తోందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో నగరపాలక అధికారులు ఆయా ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కొందరు స్థల యజమానులను స్పందించి మట్టితో మెరక చేయించుకోవడం, కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయడం చేశారు. మిగిలిన స్థల యజమానులు స్థానికంగా అందుబాటులో లేకపోవడం, చిరునామా తెలియకపోవడం వంటి కారణాలతో ఏళ్ల తరబడి స్థలాలు మురికి కూపాలుగానే దర్శనమిస్తున్నాయి.

పళ్లంరాజునగర్‌లో చిన్నపాటి చెరువులా..

శివారు ప్రాంతాల్లో అధికంగా..

ఖాళీ స్థలాలు నగర శివారు ప్రాంతాల్లో అధికంగా ఉన్నాయి. నగరం మధ్యలో మాత్రం తక్కువగానే ఉన్నాయి. నగరంలో సుమారు 750కుపైగా ఖాళీ స్థలాలున్నాయి. ప్రధానంగా శశికాంత్‌నగర్, సురేష్‌నగర్, పళ్లంరాజునగర్, జయేంద్రనగర్, ఆదిత్యనగర్, అయోధ్యనగర్, సిద్ధార్థనగర్, మధురానగర్ తదితర ప్రాంతాల్లో ప్రైవేటు వ్యక్తుల స్థలాలు అధికంగా ఉన్నాయి. చాలా వాటిలో వర్షపు నీరు నెలల తరబడి నిల్వ ఉండి దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో దోమలు విజృంభించి అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వాటిలోంచి పాములు, విషకీటకాలు ఇళ్లల్లోకి వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు.

పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తున్న సిద్ధార్థనగర్‌లో స్థలం

చర్యలు తీసుకోండి

ఎన్నో ఏళ్లుగా స్థలాలను వాటి యజమానులు పట్టించుకోవడం లేదు. అందులో నిల్వ నీరుండి దుర్వాసన వస్తోంది. పాముల బెడద అధికంగా ఉంటోంది. ఏడాదికి ఒకసారైనా శుభ్రం చేయిస్తే కొంతవరకు సమస్య తీవ్రత తగ్గుతుంది. వర్షాల నేపథ్యంలో అధికారులు వీటిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి. - ప్రకాశరావు, శశికాంత్‌నగర్

వైభవంగా తొలి ఏకాదశి పూజలు

శేషశయన అలంకారంలో వేణుగోపాలస్వామి



వెంకటేశ్వరస్వామి

గాంధీనగర్: తొలి ఏకాదశి పర్వదినాన్ని నగరంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. మెయిన్‌రోడ్డులోని సీతారామాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. గాంధీనగర్, జగన్నాథపురంతో పాటు వెంకటేశ్వరనగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. భానుగుడిసెంటర్‌లోని శివాలయంలో భానులింగేశ్వరుడు, ఉమాపారాజేశ్వరి అమ్మవార్లకు కుంకుమార్చనలు జరిగాయి.

వైకాపాది తప్పుడు ప్రచారం: వీర్రాజుచౌదరి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కూటమి పాలనపై వైకాపా కుట్ర రాజకీయాలు చేస్తోందని తెదేపా కాకినాడ జిల్లా మీడియా కోఆర్డినేటర్ పూడిపల్లి వీర్రాజుచౌదరి అన్నారు. వైకాపా సాగిస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల సామాజిక పింఛన్లను పెంపుదల చేసిందన్నారు. నిరుద్యోగుల కోసం 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నారన్నారు. పేద పిల్లల చదువును ప్రోత్సహించేందుకు ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం అమలు చేస్తున్నామన్నారు. ఇవి చెప్పకుండా వైకాపా కూటమి పాలనపై బురద జల్లుతోందన్నారు.

పీ4తో పేదరికం దూరం

కాకినాడ నగరం: సీఎం చంద్రబాబు దూరదృష్టితో అమలు చేస్తున్న పీ4 కార్యక్రమంతో పేదరికం దూరమవుతుందని నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సబ్బు అన్నారు. స్థానిక పెద్ద మార్కెట్‌లో ఫౌండేషన్ కార్యాలయంలో తన మాతృమూర్తి రామమ్మ వర్ధంతి సందర్భంగా పేద పిల్లలకు ఉపకార వేతనాలు, విద్యకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. తమ ఫౌండేషన్ ద్వారా నలుగురు పేద విద్యార్థులను చదవించనున్నట్లు వెల్లడించారు. బత్తుల సూర్యప్రసాద్, అడపా జగదీష్, మండపాక నాగబాబు, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న వీసీ ప్రసాద్, ఇతర అధికారులు

జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘసంస్కర్త

గాంధీనగర్, న్యూస్‌టుడే: బాబూ జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘ సంస్కర్త, స్వాతంత్య్ర సమరయోధుడని, బీహార్‌లో వెనుకబడిన వర్గాల ఉన్నతికోసం అహర్నిశలు శ్రమించారని జేఎన్‌టీయూకే ఉపకులపతి ప్రసాద్ అన్నారు. జేఎన్‌టీయూకే ప్రాంగణంలోని వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ జగ్జీవన్‌రామ్ దేశంలో కరువు సమయంలో అందించిన కార్యక్రమాలు వివరించారు. ఓఎస్‌డీ కోటేశ్వరరావు, డైరెక్టర్లు, యూసీఈకే ప్రిన్సిపల్, మాజీ ఉపకులపతులు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

జంతువుల నుంచి వ్యాధులు సంక్రమించకుండా జాగ్రత్త

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ శ్రీసత్య దంత వైద్యశాల సమావేశ మందిరంలో ఐడీఏ ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ... జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా ఉండేందుకు టీకాలు వేయించుకోవాలని ... సూచించారు. ... మన్నారు. 1885లో లూయిస్ పాశ్చర్ మొదటిసారిగా విజయవంతమైన రేబిస్ టీకా కనుగొన్న రోజును పురస్కరించుకుని ఏటా జులై 6న జూనోసిస్ దినోత్సవం చేస్తున్నామన్నారు. కుక్కకాటుకు గురైన వెంటనే గాయాన్ని సబ్బుతో 10 నిమిషాల పాటు కడిగి వెంటనే వైద్యుడిని సంప్రదించి టీకా వేయించుకోవాలన్నారు. ఐడీఏ సభ్యులు డా.కార్తిక్, డా.స్వరూప్, డా.శ్రీవల్లి, డా.యేరూష, భవానీ తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజల ఉన్నతికి పాటుపడదాం

మసీదు సెంటర్, కాకినాడ నగరం: శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయ సాధనకు కృషి చేసి, శెట్టిబలిజ జాతి ఔన్నత్యానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మంత్రి సుభాష్ పిలుపునిచ్చారు. ఆదివారం రామారావుపేటలోని శెట్టిబలిజ సంఘం భవనంలో రోటరీక్లబ్ ఆఫ్ కాకినాడ గ్రీన్ సిటీ, పలువురు దాతల ఆర్థిక సహకారంతో ... ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ చొల్లంగి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్, డా.కాద వెంకటరమణ, నేతలు వెంకటేశ్వర్లు, వెంకట లక్ష్మి, గోవింద్, దాతలు వేణుబాబు, వీరేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పరుపులు అందజేస్తున్న మంత్రి సుభాష్

కాకినాడ కలెక్టరేట్: తాను ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నానని, భర్త అనారోగ్యం పాలయ్యారని, ఆదుకోవాలని వేడుకున్న మహిళకు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆర్థిక సాయం అందించారు. ఆదివారం ఆయన కాకినాడలో పర్యటించగా స్థానిక సంజయ్‌నగర్‌కు చెందిన దమ్ము లక్ష్మి తన సమస్యలు మంత్రికి వివరించింది. దీంతో ఆయన రూ.10 వేల చెక్కును ఆమెకు అందించారు. ఆయన వెంట సత్తిబాబు, వేణుగోపాల్, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న బాలకృష్ణ

సభ్యులంతా సేవల్లో భాగస్వాములు కావాలి

గాంధీనగర్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగే సేవా కార్యక్రమాల్లో సభ్యులంతా భాగస్వామ్యం కావాలని లయన్స్‌క్లబ్ జిల్లా పూర్వపు గవర్నర్ బాదం బాలకృష్ణ కోరారు. ఆదివారం లయన్స్‌హాల్లో లయన్స్‌క్లబ్ కాకినాడ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా బాలకృష్ణ సభ్యులతో ప్రమాణం చేయించారు. అనంతరం మాట్లాడుతూ కార్యవర్గ సభ్యుల విధులు, బాధ్యతలు వివరించారు. సేవకు అంకితమైన అంతర్జాతీయ సంస్థ లయన్స్ అని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రస్తుత అధ్యక్షుడు మోహన్‌కుమార్ ఏడాదిగా చేపట్టిన కార్యక్రమాలు వివరించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎస్.పాపారావు, కార్యదర్శిగా కె.కుమార్, కోశాధికారిగా వి.నూకాజీ ఇతర కార్యవర్గ సభ్యులు అందరి సహకారంతో తాము లయన్స్ క్లబ్ కాకినాడ పేరుప్రఖ్యాతులు నిలుపుతామన్నారు. పుత్రరావు, పద్మతులసి, రామలక్ష్మి, సుబ్రహ్మణ్యం, మురళీకృష్ణ, సునీత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు కృషి

సాంబమూర్తినగర్: కాకినాడ నగరం పళ్లంరాజునగర్ ప్రాంతంలో ఆల్‌ఈజ్‌వెల్ సంస్థ ఆదివారం శ్రమదానం నిర్వహించింది. సంస్థ అధ్యక్షుడు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యుల బృందం పళ్లంరాజునగర్ ఉద్యానంతోపాటు శిర్డీసాయి మందిరం దారిలో పలు రకాల మొక్కలు నాటారు. పరిసరాలు శుభ్రం చేసి చెత్త తొలగించారు. ఈ సందర్భంగా కిషోర్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంస్థ సభ్యులతో పాటు అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న సంస్థ బృందం

కార్యక్రమంలో సొసైటీ సభ్యులు

మసీదు సెంటర్(కాకినాడ): కాకినాడ జగన్నాథపురంలోని ఆంధ్ర పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో వన్‌స్టాఫ్ టువార్డ్స్ సొసైటీ సభ్యులు సుమారు 100 బాదం మొక్కలను ఆదివారం నాటారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు జోగా రామకృష్ణ మాట్లాడుతూ మొక్కలు పెంచితే కాలుష్యం తగ్గిస్తాయని, చల్లని నీడని, గాలినిస్తాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషిలో ఇది భాగమన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రామరాజు, ఆనంద్, పవన్, స్వర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి..

కాకినాడ సిద్ధార్థనగర్‌లోని ఓ వీధిలో సిమెంటు దారిని తవ్వేసి అధ్వానంగా ఉంది. గతంలో పైపులైనుకు మరమ్మతులు చేసి అనంతరం పూడ్చి తిరిగి నిర్మించకుండా వదిలేశారు. దాంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మసీదుసెంటర్

కాలువపై స్లాబురాయి ఏది..?

కాకినాడ భాస్కర్‌నగర్ ప్రధాన రహదారి పక్కన ఫుట్‌పాత్ కాలువపై స్లాబురాయి లేక ప్రమాదకరంగా మారింది. కొంత కాలంగా ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. ఫుట్‌పాత్ ఉన్న మేరకు పలుచోట్ల స్లాబురాయి లేకుండా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మసీదుసెంటర్

నిరుపయోగంగా సామాజిక మరుగుదొడ్లు

స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కాకినాడలో జన రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సామాజిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. రెండేళ్ల కిందట ఏర్పాటు చేసిన ఇవి కొద్దికాలం బాగానే పనిచేశాయి. వీటికి నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. దాంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఈ దొడ్లను వినియోగించుకునేవారు. ఆ తరువాత నిర్వహణపై నిర్లక్ష్యం వహించడంతో ఎక్కడికక్కడ మరుగున పడ్డాయి. ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

- న్యూస్‌టుడే, కాకినాడ నగరం

అనధికారికం.. ఇబ్బందికరం

నగర పరిధిలోని 47వ డివిజన్ జీపీటీ వెనుక ఉన్న నగరపాలక సంస్థ మస్తరు కార్యాలయ ఆవరణలో ప్రైవేటు వ్యక్తులు అనధికారికంగా తమ కార్లను పార్కింగ్ చేస్తున్నారు. ఆవరణకు ప్రహరీ, గేటు ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు గేటు ద్వారాన్ని పడగొట్టేశారు. దాంతో సమీప ప్రాంతాలకు చెందిన వ్యక్తులు లోపల కార్లను పార్కింగ్ చేస్తున్నారు. ఇది ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- న్యూస్‌టుడే, కాకినాడ నగరం

తాకితే ప్రమాదమే..

మసీదు సెంటర్(కాకినాడ): నగరంలోని పళ్లంరాజునగర్‌లోని ఓ పార్కు వద్ద రహదారి పక్కన విద్యుత్తు స్తంభానికి అమర్చిన ఫ్యూజ్‌బాక్స్ మూతలేకుండా ప్రమాదకరంగా మారింది. చేతికి అందే ఎత్తులో ఉండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పక్కనే పార్కు ఉండటంతో ఆ దారి గుండా అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలం నేపథ్యంలో ఆదమరిచి ఎవరైనా తాకితే ప్రాణాపాయం తప్పదు. సంబంధిత అధికారులు తక్షణం పరిస్థితి చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

భాజపా సెంట్రల్ మండలాధ్యక్షురాలిగా సత్యవతి

గాంధీనగర్, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీలో సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసే దిశలో భాగంగా పలు మండలాలు, ఇతర కమిటీలను ఎంపిక చేస్తున్నారు. ఈ క్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు పరిశీలకుడిగా కాకినాడ నగర సెంట్రల్ మండల అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కార్పొరేషన్ ఎన్నికల్లో భాజపా తరపున ప్రజలు తనను గెలిపించారన్నారు. పార్టీలోని ప్రముఖులు, కూటమి నాయకుల సహకారంతో సెంట్రల్ మండలంలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు, పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తానన్నారు. నాయకులు యెనిమిరెడ్డి మాలకొండయ్య, శర్మ, యార్లగడ్డ రాంకుమార్, జ్యోతుల రాజేష్, రమేష్, భీమశంకర్, గౌతు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

సెలూన్, స్పా కేంద్రాల్లో సోదాలు

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ నగరంలోని సెలూన్‌లు, స్పా లలో ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాలతో పోలీసులు ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్‌పాటిల్ ఆధ్వర్యంలో కాకినాడ వన్, టు, త్రీటౌన్లు, పోర్టు, సర్పవరం పోలీసుస్టేషన్ల పరిధిలోని అన్ని కేంద్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. అనుమతి లేని స్పా సెంటర్లలో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు చెక్ పెట్టేలా యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటున్నారు.

9న సమ్మెను జయప్రదం చేయాలి

గాంధీనగర్: కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని తదితర డిమాండ్లతో కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఇంద్రపాలెం వంతెన వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆటో ప్రచారాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జీ ప్రారంభించారు. నాయకులు మాట్లాడుతూ జిల్లాలో 50 వేల మంది కార్మికులు సమ్మెకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు కల్పించాలని డిమాండ్ చేశారు. కాకినాడ పోర్టులో ఎగుమతి, దిగుమతి ట్రాన్స్‌పోర్టు స్థానిక లారీలకే ఇవ్వడం ద్వారా డ్రైవర్లు, క్లీనర్లకు ఉపాధి కల్పించేలా చూడాలన్నారు. రాజ్‌కుమార్, రమణ, చంద్రమళ్ల పద్మ, పలివెల వీరబాబు, పద్మావతి, వెంకటలక్ష్మి, రాజశేఖర్, తోకల ప్రసాద్, తాళ్లూరి రాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడి బోధనలు అనుసరణీయం

కాకినాడ కలెక్టరేట్: బుద్ధుడి బోధనలు అనుసరణీయమని సామాజిక న్యాయ సేవాసమితి అధ్యక్షురాలు డాక్టర్ భానుమతి అన్నారు. ఆదివారం స్థానిక ఎస్.అచ్యుతాపురంలోని అంబేడ్కర్-బుద్ధవిహార్‌లో బుద్ధ వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ చదివిన కొలంబియా వర్సిటీని ఇటీవల సందర్శించామని, అక్కడి విశేషాలను వివరించారు. అంబేడ్కర్ బౌద్ధాన్ని స్వీకరించి, ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ నెల 10న ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఇక్కడ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. నేలపూడి పెద్దిరాజు, పి.శ్రీలక్ష్మి, నిర్మల, డాక్టర్ సుధాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న డాక్టర్ భానుమతి

వర్షాకాలం.. వ్యాధులపై అప్రమత్తత

ర్యాలీగా సాగుతున్న ఆదిత్య విద్యార్థులు

గాంధీనగర్: వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు వ్యాప్తిచెందకుండా ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ అప్రమత్తంగా ఉండాలని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీ నిర్వహించారు. నాయుడు మాట్లాడుతూ వర్షాకాలంలో తడి ప్రాంతాలు దోమలకు అవాసంగా మారతాయని, సీజనల్ వ్యాధులకు ఆస్కారం ఉంటుందన్నారు. వైద్యుల సూచనల మేరకు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంట్లో వాడిపడేసిన పాత టైర్లు, ప్లాస్టిక్ వస్తువులు తొలగించాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తేజేశ్వరరావు జాగ్రత్తలు వివరించారు. విద్యార్థుల అవగాహన ర్యాలీ శాంతినగర్, కొత్త కాకినాడ, అయోధ్యనగర్ మీదుగా లక్ష్మీనారాయణ నగర్‌కు చేరుకుంది. వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు అశ్విని, సీనియర్ వాలంటీర్ కల్యాణ్ పాల్గొన్నారు.

ఉద్యోగానికొచ్చి.. తనువు చాలించి

బాలానగర్(హైదరాబాద్): సొంతూరు నుంచి ఉద్యోగం కోసమొచ్చిన ఓ వ్యక్తి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బాలానగర్ ఠాణా పరిధిలో జరిగింది. సీఐ టి.నర్సింహరాజు కథనం ప్రకారం.. కాకినాడకు చెందిన ఉప్పాల తరుణ్‌కుమార్(49) రెండేళ్ల క్రితం నగరంలో ప్రైవేటు కొలువు చేసి ఊరెళ్లిపోయాడు. పని లేకపోవడం.. ఆర్థిక ఇబ్బందులు పెరుగుతుండటంతో ఐదు రోజుల క్రితం ఉద్యోగం కోసం నగరానికి వచ్చాడు. ఫిరోజ్‌గూడలోని ఓ లాడ్జిలో గది తీసున్నాడు. ఉద్యోగం దొరక్కపోవడం, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఈ నెల 4న నిద్రమాత్రలు వేసుకున్నాడు. లాడ్జి నిర్వాహకులు గమనించి సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి అన్న సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతికూలతలెన్నున్నా.. పరిశుభ్రతకే ప్రాధాన్యం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడ నగరంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి (ఎంహెచ్‌వో) డా.పృథ్వీచరణ్ తెలిపారు. సిబ్బంది కొరత, ఇతర సమస్యలు ఉన్నప్పటికీ ప్రత్యేకాధికారి, కలెక్టర్ షాన్‌మోహన్, కమిషనర్ భావన సహకారంతో పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ప్రధానంగా కాలువల శుభ్రత, దోమల నివారణ, ఎప్పటికప్పుడు చెత్త సేకరణ తదితర అంశాలపై దృష్టి పెట్టామన్నారు. 'న్యూస్‌టుడే'తో ఆయన ముఖాముఖి మాట్లాడారు.



ముఖాముఖి

- వర్షాకాలం నేపథ్యంలో ముంపు సమస్యల నివారణకు కాలువల్లో పూడిక తీయిస్తున్నాం. ఇప్పటికే నగర పరిధిలో 600 కి.మీ. మేజర్, మైనర్ కాలువల్లో పూడిక తీశాం. కల్వర్టుల కింద తీయాల్సిఉంది. నగరంలో దాదాపు 500 కల్వర్టులు ఉంటాయి.
- నగర పరిధిలో 130 నుంచి 140 మెట్రిక్ టన్నుల వరకు రోజువారీ చెత్త సేకరిస్తున్నాం. ఇందులో 50 టన్నుల మేర తడి చెత్త ఉంటోంది. తడి చెత్తతో సంజయ్‌నగర్, రెవెన్యూకాలనీల వద్ద ఎరువు తయారీ యూనిట్లు నిర్వహిస్తున్నాం. ఇందుకు రోజుకు 10 టన్నుల చెత్తను వినియోగిస్తున్నాం. మరికొన్ని ప్లాంట్లను ఏర్పాటు చేయాల్సిఉంది.
- సంజయ్‌నగర్ వద్ద డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్తను పర్యావరణ హితంగా నిర్వహించేందుకు టెండర్లు పిలిచి జ్ఞానేశ్వర్ సంస్థకు అప్పగించాం. ఆ సంస్థ కొద్దిపాటి చెత్తను నిర్వహించి తప్పుకొంది. సదరు సంస్థకు ఎలాంటి నిధులు విడుదల చేయలేదు. యార్డులో పేరుకుపోయిన చెత్తను నిర్వహించేందుకు త్వరలో వేస్ట్ ఎనర్జీ పవర్‌ప్లాంట్ ఏర్పాటు కానుంది. అది వినియోగంలోకి వస్తే రోజుకు 900 మెట్రిక్ టన్నుల చెత్త బూడిదగా మారుతుంది.
- నగరంలో 30 వరకు సామాజిక మరుగుదొడ్లున్నాయి. వీటి కాంట్రాక్టు ముగియడంతో ప్రస్తుతం వినియోగానికి దూరంగా ఉన్నాయి. నిర్వహణకు త్వరలో టెండర్లు పిలవనున్నాం. నగర పరిధిలోని అన్ని సామాజిక మరుగుదొడ్లను వినియోగంలోకి తెస్తాం.
- పారిశుద్ధ్య విభాగంలో కార్మికుల కొరత ఉంది. ఉద్యోగ విరమణలతో ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం శాశ్వత, ఒప్పంద పద్ధతి కార్మికులు కలిపి వెయ్యి మంది పనిచేస్తున్నారు. వీరిలో రోజుకు 10 నుంచి 15 శాతం మంది సెలవుల్లో ఉంటుంటారు. పారిశుద్ధ్యం పర్యవేక్షించాల్సిన ఇన్‌స్పెక్టర్లలో ఆరుగురు పనిచేస్తున్నారు. 7 ఖాళీలున్నాయి.
- నగరంలో డంపర్ బిన్‌ల కొరత ఉండడం వాస్తవం. పాడైన 40 బిన్‌లకు ఇటీవల మరమ్మతులు చేయించాం. మరో 50 బాగు చేయాల్సిఉంది. చెత్తను ప్రజలు కాలువలు, రోడ్లపై కాకుండా బిన్‌లలోనే వేయాలి.
- దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ప్రధానంగా ఫాగింగ్‌కు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. సర్కిళ్లవారీగా ఫాగింగ్ చేయనున్నాం. ఇందుకు 30 మంది సిబ్బందితో టీం ఏర్పాటు చేశాం.
- అక్టోబరు 2 నుంచి నగరంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించాం. ప్లాస్టిక్ వస్తువులను విక్రయించే వ్యాపార సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రకటన

నా క్లయింటు అయిన కాకినాడ జిల్లా, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ సిటీ, కొండయ్యపాలెం కాపురస్తులు పోల (లేటు) చిన్న నారాయణ గారి కుమారుడు **పోల అప్పలనాయుడు** గారు నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికీ తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు పశ్చిమగోదావరి జిల్లా, విజ్జేశ్వర మండలం, విజ్జేశ్వర గ్రామం కాపురస్తులు చట్టి (లేటు) లక్ష్మీనరసింహారావు గారి కుమారుడు చట్టి హనుమంతరావు గారి వద్ద నుండి ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనుగోలు చేయుటకు ది.07-06-2025న ఒక క్రయ అగ్రిమెంటు ఏర్పాటు చేసుకున్నారు. కాగా సదరు ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు అనగా ది.27-10-1976 సం॥రం తేదీన నా క్లయింటు ప్రొపోజ్డ్ వెండార్ అయిన చట్టి హనుమంతరావు గారు బంగారు వాసుదేవమూర్తి గారి వద్ద నుండి దస్తావేజు నెం.**4330/1976** (SRO కాకినాడ) కొనుగోలు చేసిన దస్తావేజు ఎక్కడో పడిపోయినది అని చెప్పియున్నారు. సదరు విషయమై సర్పవరం పోలీస్ వారికి కంప్లయింట్ చేయగా వారు దొరకలేదు అని ది.10-03-2025వ తేదీన నాన్ ట్రేసబుల్ సర్టిఫికెట్ కూడా ఇచ్చియున్నారు.

నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా RASMECC బ్రాంచ్ వద్ద తనఖా పెట్టుటకు నిర్ణయించుకున్నారు. సదరు విషయమై ఎవరికైనను ఏ విధమైన అభ్యంతరములు గాని ఆక్షేపణలు గాని, క్లయిములు గాని ఉన్న యెడల ఈ ప్రకటన ప్రచురించిన వారం రోజుల్లో ఈ క్రింది అడ్రసుకు లిఖితపూర్వకముగా తెలియజేయవలెను. లేనియెడల తదుపరి వచ్చు క్లయిములు నా క్లయింటును బైండు చేయజాలవు.

షెడ్యూలు: కాకినాడ జిల్లా, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ రిజిస్ట్రారులో చేరిన కాకినాడ మున్సిపల్ కార్పోరేషన్ ఏరియాలోని, మున్సిపల్ వార్డు నెం.29రు, బ్లాకు నెం.64రు, కాకినాడ సిటీ, గాంధీనగరం శివారు, శిరివెళ్ళ అచ్యుతాపురంలోని టి.ఎస్.నెం.55/2రు దాఖలా మాలో 1 మరియు 2 వారల రాలూకు ఏక ప్రతిగా గల 241 చ॥గ॥లు లేక 201.50 చ॥మీ॥లు స్థలం అందలి డోర్ నెం.64-10-23 మరియు 64-10-23/1లు గల బంగాళా పెంకుటిళ్ళకు ఏక ప్రతిగా హద్దులు. కొలతలు వివరం: **తూర్పు:** అ.66.0లు లేక 20.25 మీ. - బంగారు కృష్ణమూర్తి గారి గోడ, **పడమర:** అ.66.0లు లేక 20.10 మీ. - చట్టి నరసింహామూర్తి గారి ఆస్తి, **ఉత్తరం:** అ.32.9లు లేక 10.00 మీ. - యితురుల ఆస్తి, **దక్షిణం:** అ.32.9లు లేక 10.00 మీ. - రాజవీధి. యావత్తు యాజిమెంటు హక్కులతో సర్వం సహా.

కాకినాడ
ది.06-07-2025

K.V.S.V.లక్ష్మాజీరావు (వేణు)
అడ్వకేట్, డో.నెం.6-1-9/1, దూసర్లపూడివారి వీధి,
కాకినాడ, సెల్: 9866211196

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన

సామర్లకోట గ్రామీణం: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమైందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆదివారం పవర, పండ్రవాడలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, నాయకులు తోటకూర శ్రీనివాస్, శ్రీనుబాబు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: స్థానిక సమస్యను పరిష్కారిస్తామని మాజీ ఎమ్మెల్యే చెల్లె వివేకానంద, తెదేపా రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి అన్నారు. పాతకోరంగిలో వెంటపల్లి ఉమామహేశ్వరి, ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.

సామర్లకోటలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

సామర్లకోట: సబ్ స్టేషన్ పరిధిలో నియంత్రికల మార్పు, మరమ్మతులు కారణంగా సామర్లకోట పట్టణంలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ ఏపీఎన్‌డీఎస్ ప్రభాకర్ తెలిపారు. ఎమ్మార్వో ఆఫీసు ఫీడర్ పరిధి కొత్తపేట, చిన్నవీధి, కోటపేట, సంగీతరావుపేట, వీర్రాఘవపురం, నీలమ్మ చెరువు, ఇందిరా కాలనీ, ఫెన్సన్‌లైన్, ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో ఈటీసీ, వీబీఆర్ఐ, అన్నపూర్ణమ్మ ఆలయం ఫీడర్ పరిధిలో విఘ్నేశ్వర థియేటర్, మఠం సెంటర్, కొత్తూరు, నిమ్మతోట, సంపంగితోట, రైల్వే స్టేషన్ ఫీడర్, బీబీఆర్ ఫీడర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325 పెద్దాపురం: 80085 74198 పిఠాపురం: 80085 65544

సమస్య: పెద్దాపురం పట్టణం సత్తిరెడ్డిపేటలోని కాలువలో మురుగు నిలిచిపోయి దోమల బెడద అధికంగా ఉంది. **- ప్రసాద్, పెద్దాపురం**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలుపగా కార్మికులతో శుభ్రం చేయించారు.

సమస్య: కరప మండలం గురజనాపల్లి గ్రామ సచివాలయం ఎదుట పట్టపగలు వీధి దీపాలు వెలుగుతుండటంతో విద్యుత్తు వృథా అవుతోంది. **- వెంకట్రావు**

పరిష్కారం: డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో మాట్లాడి వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

సమస్య: గొల్లప్రోలు ఈబీసీ కాలనీలో కాలువ పూడుకుపోయి రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది.**- స్థానికులు**

పరిష్కారం: ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ సిబ్బందిని పంపి పూడిక తీయించారు.

సమస్య: పిఠాపురంలోని ఆదర్శ పాఠశాల సమీపంలో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. రోడ్డుపక్కనే తుప్పలు పెరిగిపోయాయి. **- రమేష్**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్‌తో చెప్పగా కాలువల్లో పూడికలు, తుప్పలు తొలగించే పనులు చేపట్టారు.

– న్యూస్‌టుడే, పెద్దాపురం, పిఠాపురం, కరప, గొల్లప్రోలు

సాగుజలం.. సేద్యానికి సిద్ధం

న్యూస్‌టుడే, పిఠాపురం

పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాలకు సంబంధించి పిఠాపురం బ్రాంచి కెనాల్ (పీబీసీ), ఏలేరు ప్రాజెక్టు నుంచి నీటి విడుదల మొదలైంది. వరి నారుమళ్లు వేసేందుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో మే నెలాఖరు నుంచి మొదలైన కాలువల్లో పూడిక, గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు చివరిదశకు చేరాయి. పీబీసీపై 126 పనులకు రూ.4.50 కోట్లు విడుదల చేశారు. ఇందులో 70 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ఏలేరు కింద పిఠాపురం, పెద్దాపురం పరిధిలో 30 వేల ఎకరాలు, పీబీసీపై 29 వేల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. వ్యవసాయ అధికారులు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేశారు. వెంటనే పనులు చేపట్టాలని, ఆలస్యమైతే అక్టోబరు, నవంబరులో వరదలకు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని సూచిస్తున్నారు.

మండలాలవారీగా...

మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
పిఠాపురం	7,960
గొల్లప్రోలు	4,300
కొత్తపల్లి	4,483
కాకినాడ గ్రామీణ	1,780
కరప	5,868
సామర్లకోట	7,361
పెద్దాపురం	4,150
తాళ్లరేవు	3,529
కాజులూరు	7,570

వరదలతో జలాశయాల్లోకి నీరు..

ప్రస్తుతం గోదావరికి వరద నీరు పోటెత్తడంతో పీబీసీ ఆయకట్టుకు సాగు నీటి ఎద్దడి ఉండదని చెబుతున్నారు. ఇప్పటికే 400 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నారు. ఏలేరు ప్రాజెక్టులో 77.85 మీటర్ల స్థాయిలో 10.56 టీఎంసీలు ఉంది. అయినప్పటికీ వరదలు వస్తే ప్రాజెక్టులోకి నీరు చేరుతుందనే ఉద్దేశంతో విడుదల మొదలైంది. నారుమళ్లకు సరిపోయేలా 800 క్యూసెక్కుల వంతున నీటి సరఫరా చేస్తున్నారు.

చిత్రాడ వద్ద పీబీసీ కాలువలో నీరు

పనులు మొదలుపెట్టాలి

రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి. అడ్డుకట్టలు వేయకుండా శివారుకు నీరు చేరేలా సహకరించుకోవాలి. ఇతర అవసరాలకు మళ్లించొద్దు. కాలువల శుభ్రత పనులు దాదాపు పూర్తయ్యాయి. గుర్రపుడెక్క తొలగింపు కూడా చేపడతాం. ఇప్పటికే పీబీసీ నీరు పొలాలకు చేరింది. రెండు రోజుల్లో ఏలేరు నీరు వస్తుంది.

- సంతోష్‌కుమార్, పీబీసీ డీఈ,
- ప్రసన్నకుమార్ ఏలేరు ఏఈ, పిఠాపురం

పాడాలో అర్జీల స్వీకరణ..

పిఠాపురం: పిఠాపురంలోని పాడా కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని పీడీ చైత్రవర్షిణి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఇచ్చిన అర్జీలకు గడువులోగా పరిష్కారం దొరుకుతుందని, వాటిని మళ్లీ ఇవ్వనసరం లేదని తెలిపారు. డివిజినల్, నియోజకవర్గస్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

వైద్య శిబిరంలో పరీక్షలు

సామర్లకోట, న్యూస్‌టుడే: ఫ్రెండ్స్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతినెలా తొలి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేశారు. దాత కేతినీడి శ్రీనివాసరావు సహకారంతో సుమారు 80 మందికి రక్తపోటు, మధుమేహం తదితర పరీక్షలు నిర్వహించారు. వాకర్స్ సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి పిలుపు

పెద్దాపురం: ఈ నెల 9న కార్మికుల సమస్యలను పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని సంఘం అధ్యక్షురాలు దాడి బేబీ కోరారు. స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు స్మారక భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కార్మిక చట్టాలను రద్దు చేసి కోడ్‌లుగా మార్పు చేయాలని కేంద్రంలో భాజపా ప్రయత్నం చేస్తోందన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: పెద్దాపురం మరిడమ్మ జాతరలో భాగంగా రెండో ఆదివారం అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి రవికలు, చీరలు, పండ్లు, కోళ్లు సమర్పించారు.

శాకంబరిగా కరప గ్రామదేవత ఉప్పాలమ్మ

శాకంబరి అలంకారంలో ఉప్పాలమ్మ

కరప: గ్రామదేవత ఉప్పాలమ్మతల్లిని భక్తులు సమర్పించిన కూరగాయలు, ఆకుకూరలతో ఆదివారం రాత్రి శాకంబరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిన్నారి ఆనందమూర్తి, గొర్రెల వెంకన్న, నక్కా సత్యప్రసాద్, కాకినాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సతీష్‌బాబు చొరవతో ఇంటి నిర్మాణం

కరప, న్యూస్‌టుడే: బాధిత కుటుంబానికి సానా సతీష్‌బాబు ఫౌండేషన్ అండగా నిలిచి సొంతింటి కల సాకారం చేయడం అభినందనీయమని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డా. చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. వేములవాడ శివారు సిరిగినపల్లిలంకలో భర్తను కోల్పోయి ఇద్దరు కుమార్తెలతో ఇబ్బందులు పడుతున్న కడిపికి లక్ష్మి ఆర్థిక పరిస్థితిని కార్యకర్తల ద్వారా తెలుసుకున్న రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు తన ఫౌండేషన్ ద్వారా ఇంటి నిర్మాణం చేపట్టాలని ఛైర్మన్ టి.హరీష్‌ను ఆదేశించారు. ఈ మేరకు డా. వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నులుకుర్తి వెంకటేశ్వరరావు చేతులమీదుగా ఆదివారం భూమిపూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. పలువురు వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

సర్పవరం జంక్షన్, పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, పెద్దాపురం, కరప, పెదపూడి, తాళ్లరేవు, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం, పెద్దాపురం, పిఠాపురం నియోజకవర్గాల్లోని ఆలయాల్లో ఆదివారం తొలి ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సర్పవరంలోని స్వయంభూ రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి, పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామి, రాజరాజేశ్వరి, పురుహూతిక అమ్మవారు, దత్తాత్రేయ స్వామి, పంచారామ క్షేత్రం సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం, ప్రసన్నాంజనేయస్వామి, పెద్దాపురం మండలం తిరుపతి శ్రీశృంగార వల్లభస్వామి, గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణాదేవి, దుర్గాడ శివాలయాల్లో భక్తులు పోటెత్తారు. పిఠాపురం పాండురంగడిని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఆయన తనయుడు రంగనాగ్ స్వామి వారిని దర్శించుకున్నారు. పెద్దాపురం, పిఠాపురం, సామర్లకోట పట్టణాలు, కరప, పెదపూడి, తాళ్లరేవు, కాజులూరు మండలాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పిఠాపురంలో వేణుగోపాలస్వామి

పాదగయలో నందీశ్వరుడికి అలంకరణ

ప్రత్యేక అలంకరణలో సర్పవరంలోని భావనారాయణస్వామి, పెద్దాపురంలో కన్యకాపరమేశ్వరి, వేంకటేశ్వరస్వామి, యండమూరులోని మీసాల వెంకన్నస్వామి, తాటిపర్తిలో అపర్ణాదేవి, దుర్గాడ శివాలయంలో రామలింగేశ్వరస్వామి

బాక్సింగ్ పోటీలు హోరాహోరీ

పిఠాపురం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి బాక్సింగ్ సబ్ జూనియర్, జూనియర్స్ ఓపెన్ విభాగాల్లో పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన పోటీలు హోరాహోరీగా సాగాయి. కాకినాడ జిల్లా నలుమూలల నుంచి 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన వారు ఈ నెల 12, 13వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి పాల్గొంటారు. విజేతలకు జిల్లా సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి పి.లక్ష్మణరావు, అడ్వొకేట్ శ్రీనివాస్ పతకాలు ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా జి.శివప్రసాద్, పి.కృష్ణప్రసాద్ వ్యవహరించారు. బాలుర విభాగం 37 కేజీల్లో డీవీఎస్ పవన్‌కుమార్ (కొమరగిరి), 43 కేజీల్లో కేకే వీరారెడ్డి (కాకినాడ), 46 కేజీల్లో బోను జయదీప్ (పిఠాపురం), 70 కేజీల్లో సీహెచ్ లోహిత్ (పిఠాపురం), బాలికలు 40 కేజీల విభాగంలో కేజీ షేక్ హమీద (పిఠాపురం) బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని నిర్వాహకులు చెప్పారు. జూనియర్స్ ఓపెన్ విభాగంలో జె.గౌతమ్ (కొమరగిరి), పి.తేజ (పిఠాపురం), జేఆర్ అరుణ్ (పిఠాపురం) బంగారు పతకాలు సాధించారు.

పతకాలు సాధించిన క్రీడాకారులతో నిర్వాహకులు

రహదారిపై గుంతలు పూడ్చేదెప్పుడో..?

పెద్దాపురం మండలం ఆర్బీకొత్తూరు నుంచి పెద్దాపురం పట్టణానికి వచ్చే రహదారి గుంతలమయంగా తయారవడంతో రాకపోకలకు ద్విచక్ర వాహన చోదకులు పాట్లు పడుతున్నారు. వర్షం వస్తే గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా ఉంటోంది. పెద్దాపురం మండలంలోని ఆర్బీపట్నం, సీబీ దేవం, రంగంపేట మండలం మర్రిపూడి, సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామాలకు వెళ్లే వారికి దగ్గర మార్గం కావడంతో రద్దీగా ఉంటుంది. ఈ సమస్యను డీఈఈ రాఘవరావు దృష్టికి తీసుకువెళ్లగా, రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, పెద్దాపురం**

ఇరుకు దారి.. దాటాలంటే కష్టమే మరి

పిఠాపురంలోని కోటగుమ్మం సెంటర్ నుంచి తెదేపా కార్యాలయం రోడ్డులో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పాఠశాల బస్సులు, ఇతర వాహనాలు ఒకేసారి రాకపోకలు సాగిస్తుండటంతో తాగునీటి ట్యాంకు వద్ద నిలిచిపోతున్నాయి. సమయానికి పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను సీఐ శ్రీనివాస్‌కు చెప్పగా, ఆ ప్రాంతంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, పిఠాపురం**

తాగునీరు వృథా.. పరిసరాలు బురద

కరప మండలం జడ్. భావారం రైతు సేవా కేంద్రం వద్ద కుళాయికి మూత లేకపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. సకాలంలో కుళాయిలకు మూతలు ఏర్పాటు చేయకపోవడంతో నీరంతా వృథాగా పరిసరాల్లో చేరి బురదగా తయారవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వర్ధన్ దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీ అధికారులతో మాట్లాడి కుళాయిలకు మూతలు ఏర్పాటు చేసి తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- న్యూస్‌టుడే, కరప**

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోట శ్రీభీమేశ్వర లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా అమలకంటి శ్రీనివాసరావు, కార్యదర్శిగా బడుగు సీతారామరాజు, కోశాధికారిగా రమేష్ ఆదివారం రాత్రి స్థానిక భీమేశ్వర లయన్స్ క్లబ్ భవనంలో ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా పూర్వ గవర్నర్లు బాదం బాలకృష్ణ, బీవీఎన్ రెడ్డి హాజరయ్యారు. లయన్స్ క్లబ్ భవనం పైఅంతుస్తులో కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న క్లబ్ అధ్యక్షులను నిమ్మకాయల రంగనాగ్ శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. లయన్స్ గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, జిల్లా ఛైర్మన్ చిత్తులూరి వీర్రాజు, క్లబ్ ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం అనంతరం మాట్లాడుతున్న కార్యవర్గ సభ్యులు

ఘనంగా ఏకలవ్య జయంతి

పిఠాపురం: పట్టణంలోని జగ్గయ్యచెరువులో ఆదివారం ఎరుకుల ఆత్మగౌరవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతి నిర్వహించారు. ఏకలవ్యుడి చిత్రపటానికి సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావాడ పోశయ్య పూలమాల వేసి నివాళి అర్పించారు. వీరలంక, రాజేంద్ర, ఈశ్వరరావు, నూకరాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో మురుగు ముంపు

తాళ్లరేవు: కోరింగ పంచాయతీ బొడ్డువానిలంక రెండో వీధిలో రహదారి మధ్యలో మురుగు నిలిచిపోయింది. సమీపంలోని కొళాయిల్లోని నీటి ద్వారా పురుగులు వస్తున్నాయంటూ మహిళలు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిపై నిలిచిన మురుగును తొలగించాలని డిమాండ్ చేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

కాజులూరు: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం గొల్లపాలెంలో ఆయన వాహనాల తనిఖీలు చేపట్టారు. చోదకులకు శ్వాస పరీక్షలు నిర్వహించారు. ప్రైవేట్ ట్రావెల్ బస్సుల డ్రైవర్లకు జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల తీరు వివరించి పలు సూచనలు చేశారు. మద్యం తాగినట్లు వెల్లడైన వారిపై కేసులు నమోదుచేశారు.

8 మంది జూదరుల అరెస్టు

గొల్లప్రోలు: గొల్లప్రోలు శివారున ఆదివారం రాత్రి జూద శిబిరంపై దాడి చేసి 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. వారి నుంచి రూ.22,590 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సెలూన్, స్పా కేంద్రాల్లో సోదాలు

మసీదు సెంటర్(కాకినాడ): కాకినాడ నగరంలోని సెలూన్‌లు, స్పా లలో ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాలతో పోలీసులు ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్‌పాటిల్ ఆధ్వర్యంలో కాకినాడ వన్, టు, త్రీటౌన్లు, పోర్టు, సర్పవరం పోలీసు స్టేషన్ల పరిధిలోని అన్ని కేంద్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. అనుమతి లేని స్పా సెంటర్లలో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు చెక్ పెట్టేలా యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటున్నారు.

తాటాకిల్లు దగ్ధం

కాజులూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో కోలంక నామావారివీధిలో కొడగాల వెంకటేశ్వర్లుకు చెందిన తాటాకు ఇల్లు ఆదివారం దగ్ధమైంది. కాకినాడ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది చేరుకునే సమయానికి ఇల్లు పూర్తిగా దగ్ధమయింది. చుట్టుపక్కల ఇళ్లకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. ఇంట్లో వెంకటేశ్వర్లు, చిన్న కుమారుడు వీరబాబు కుటుంబంతో ఉంటున్నారు. సామగ్రి పూర్తిగా కాలిపోవడంతో రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక శాఖ సహాయ అధికారి బి.ఏసుబాబు తెలిపారు.

విస్తీర్ణం అధికం.. పారిశుద్ధ్య లోపం

న్యూస్‌టుడే, పెద్దాపురం

కాకినాడ జిల్లాలో ఏ పురపాలక సంఘంలోనూ లేని విధంగా పెద్దాపురం పట్టణంలో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య తక్కువగా ఉంది. ద్వితీయ శ్రేణి పురపాలకసంఘం పెద్దాపురంలో

ప్రధాన రహదారిపై వ్యర్థాలు

✦ కార్మికుల లేమితో ఇక్కట్లు

29 వార్డులు, సుమారు 60 వేల జనాభా ఉంటారు. పట్టణ విస్తీర్ణం సుమారు 43 చదరపు కిలోమీటర్లు. పట్టణంలో సుమారు 15 అభివృద్ధి కాలనీలు, దాదాపు 12 బలహీనవర్గాల కాలనీలు, పట్టణానికి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో టిడ్కో, ఎన్టీఆర్ కాలనీలు ఉన్నాయి. సామర్లకోట రహదారిలో ప్రసన్నాంజనేయస్వామినగర్ వరకు పట్టణం విస్తరించి ఉంది. పారిశుద్ధ్య విభాగంలో శాశ్వత 26, ఒప్పంద 60 మంది కలిపి మొత్తం 86 మంది కార్మికులు ఉన్నారు. ఈ సిబ్బందిలో కొంత మంది డ్రైవర్లు, మేస్త్రీలుగా పురపాలకసంఘ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. శాశ్వత సిబ్బంది ఉద్యోగ విరమణ చేస్తే.. కొత్తవారిని నియమించడం లేదు. తక్కువ మంది కార్మికులతో పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ కష్టసాధ్యంగా మారింది. పారిశుద్ధ్య మెరుగుపడాలంటే ఇంకా 40 మంది కార్మికులు అవసరం. కనీసం ఒప్పంద పద్ధతిలోనైనా సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఒప్పంద కార్మికుల నియామకానికి చర్యలు

ఉన్న సిబ్బందితో సాధ్యమైనంత వరకు పారిశుద్ధ్య నిర్వహణ చేస్తున్నాం. శాశ్వత కార్మికుల నియామకం లేదు. ఒప్పంద కార్మికులు సుమారు 20 మందిని నియమించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ విషయం పాలకమండలి దృష్టికి తీసుకువెళ్లగా ఆమోదించింది. పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రజల సహకారం ఎంతో అవసరం.

- శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

రక్తదానానికి మించింది మరొకటి లేదు

పెద్దాపురం: రక్తదానానికి మించింది మరొకటి లేదని, ప్రాణాపాయస్థితిలో ఉన్న వారికి దానం చేయడం వల్ల ప్రాణం నిలిపినవారవుతారని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక దర్గానగర్‌లో బాధ్యత సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మన ఇల్లు ప్రారంభించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ఇల్లు పేరుతో చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. సుమారు 125 మంది రక్తదానం చేశారు. డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, డీఎస్పీ డి.శ్రీహరిరాజు, పురపాలకసంఘ మాజీ ఛైర్మన్ రాజాసూరిబాబురాజు, ఉపాధ్యక్షుడు నెక్కంటి సాయిప్రసాద్, సంస్థ నిర్వాహకులు సత్యనారాయణ, రోటరీ బ్లడ్ బ్యాంకు నుంచి వడ్లమూరు చౌదరి, రోటరీ క్లబ్ సభ్యులు తుమ్మల దొరబాబు, సత్యనారాయణ, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

సామర్లకోట: లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆదివారం సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రోగుల సౌకర్యార్థం లయన్స్ క్లబ్ సభ్యుడు, దాత వీర వెంకటసూర్యనారాయణమూర్తి ఆర్థిక సహకారంతో నిర్మించిన ఓపీ షెడ్డు, 108 సిబ్బందికి అవసరమైన గది, రోగుల సహాయకులు వేచి ఉండే హాలు, తాగునీటి ఆర్వో, కూలింగ్ ప్లాంటును ఆయన ప్రారంభించారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

సర్పవరం జంక్షన్, పిఠాపురం: కాకినాడ గ్రామీణం రమణయ్యపేటలో భాజపా జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు డా. శ్యామాప్రసాద్‌ముఖర్జీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పిఠాపురం సూర్యరాయ గ్రంథాలయంలో శ్యామాప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శులు గండి కొండలరావు, డీవీఎస్ రాజు, పట్టణాధ్యక్షుడు వెంకటేశ్వరరావు నివాళి అర్పించారు.

సైకిళ్లపై తిరుపతి పయనం

తాళ్లరేవు: పాత కోరింగకు చెందిన తెదేపా నాయకులు కోడూరి ఆదినారాయణ చౌదరి, జవ్వాది తాతాజీ, చంద్రాల బుజ్జి, చల్లా బాలాజీ, దండు సత్యనారాయణ రాజు, రాజు ఆదివారం ఉదయం తాళ్లరేవు నుంచి తిరుపతికి ద్విచక్రవాహనాలపై బయలుదేరారు. తెదేపా అధికారంలోకి వస్తే వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటామని మొక్కుకోవడంతో ఈ యాత్ర చేపడుతున్నట్లు వారు తెలిపారు.

పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి

గొల్లప్రోలు: పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించడం ద్వారా వాటి నుంచి మనుషులకు వ్యాధులు వ్యాపించకుండా అరికట్టవచ్చని పశు సంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేశారు.

గొల్లప్రోలులో శునకానికి టీకా వేస్తున్న ఏడీ శ్రీనివాసరావు

సామర్లకోట: కుక్కల యజమానులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. జూనోసిస్ డే సందర్భంగా పశువుల ఆసుపత్రిలో లయన్స్‌క్లబ్ ఏర్పాటు చేసిన ఉచిత వ్యాక్సిన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పశుసంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ కృష్ణమూర్తి, ఏడీలు ప్రమీల, వరప్రసాద్, పశువైద్యులు, ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: పటవల, ఇంజరం, తాళ్లరేవులో పెంపుడు శునకాలకు రేబిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేశారు. పశువైద్యులు దవులూరి సుధ, బ్రహ్మవేద, శుభశ్రీ, వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.

ధర్మరాజు సేవలు ప్రశంసనీయం

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: పట్టు పరిశ్రమ సాంకేతికాధికారిగా శైల ధర్మరాజు 41 ఏళ్లపాటు రైతులకు విశేష సేవలందించారని పలువురు అధికారులు, రైతులు ప్రశంసించారు. ఆయన ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ధర్మరాజు దంపతులను తాటిపర్తిలోని కల్యాణ మండపంలో ఆదివారం సన్మానించారు. కళారంగంలోనూ ధర్మరాజు అందించిన సేవలను కొనియాడారు. జిల్లా పట్టు పరిశ్రమ అధికారి పాల్‌రాజు, విశ్రాంత డీఎస్‌వోలు రామరాజు, శరత్‌బాబు, సుధాకర్‌రెడ్డి, రాంబాబు, సత్యనారాయణ, కోటేశ్వరరావు, విశ్రాంత ఏడీ మురళీకృష్ణ, అల్లూరి సీతారామరాజు జిల్లా డీఎస్‌వో కోనేటి అప్పారావు, జడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల నాగలోవరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మడికి సన్యాసిరావు పాల్గొన్నారు.

ధర్మరాజు దంపతులను సన్మానిస్తున్న అధికారులు

(c) eenadu

ఘనంగా గురుపూజోత్సవం

తుని పట్టణం: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో బ్యాంకు కాలనీలోని శ్రీసరస్వతీ శిశు మందిర్‌లో గురుపూజోత్సవం ఆదివారం జరిగింది. తునిఖండ కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్ కందెం సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు దేశభక్తి కలిగి ఉండాలన్నారు. రాబోయే విజయదశమి నాటికి ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 ఏళ్లు పూర్తి అవుతాయన్నారు. కార్యక్రమంలో చదరం శివాజీ, ములగాల ఉదయ్ కుమార్, పర్వత బాబూరావు, స్వామి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: వీరేంద్రకుమార్, రవీంద్ర ఆర్థిక సహకారంతో అందించిన మొక్కలను ఆదివారం ఏలేశ్వరంలోని షిర్డీ నగర్‌లో పర్యావరణ పరిరక్షణ సంఘం సభ్యులు నాటారు. మొక్కల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఆ సంఘం అధ్యక్షుడు ఎస్.విజయబాబు, కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

జగపతినగరంలో నాయకులు, కార్యకర్తలు

శ్యామాప్రసాద్ సేవలు చిరస్మరణీయం

కిర్లంపూడి, న్యూస్‌టుడే: భాజపా జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని జగపతినగరం గ్రామంలో భాజపా శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు తదితరులు శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. గోకవరం మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు అల్లు శివరామకృష్ణ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

బంగారు కుటుంబాలతో ఆర్థిక అసమానతలు దూరం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో 14 వేల బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని ఆర్థిక అసమానతలు తగ్గించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర 2047 దార్శనిక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ ప్రైవేటు ప్రజల భాగస్వామ్యం (పీ4) అమలుకు సంబంధించి ఒమ్మంగి కల్యాణమండపంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆదివారం సమావేశం జరిగింది. ఎమ్మెల్యే సత్యప్రభ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆర్థికంగా స్థితిమంతులు, సేవాభావం ఉన్నవారు సర్వేలో గుర్తించిన 14 వేల పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. ఈ బృహత్తర ప్రయత్నంతో నియోజకవర్గం రూపురేఖలు మారతాయన్నారు. ప్రత్యేక అధికారి, బీసీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దార్శనిక ప్రణాళికను వివరించారు. రౌతులపూడి ఎంపీపీ రాజ్యలక్ష్మి, ఎంపీడీవోలు, ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ, రెవెన్యూ అధికారులు, కూటమి నాయకులు మేడిశెట్టి సూర్యకిరణ్, సత్యంశెట్టి సీతారామం, బద్ది రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రమణయ్యపేటలో సుపరిపాలనలో తొలి అడుగు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ఏలేశ్వరం మండలం రమణయ్యపేటలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే సత్యప్రభ హాజరై ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

వార్డులన్నీ నిండుగా.. జ్వరాలతో విలవిల

పరిశీలన

న్యూస్‌టుడే – తుని

అసలే వర్షాకాలం. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ ఏపాటో తెలియని విషయం కాదు. దీంతో తుని పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలోని వార్డులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. జూన్‌లో 198 మంది జ్వరాలతో రాగా వీరిలో 90 మంది టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారు. జులైలో ఇప్పటివరకు 58 మంది జ్వరాలతో రాగా, వీరిలో 16 మంది వైరల్, టైఫాయిడ్‌తో చేరారు. జ్వరాలు, కీళ్ల నొప్పులు, వాంతులు, విరోచనాలు తదితర అనారోగ్య సమస్యలతో పెద్ద సంఖ్యలో బాధితులు రావడంతో వార్డులు, గదులు సరిపోవడంలేదు. దీంతో చేసేది లేక వరండాలు, మెట్ల మార్గం కిందనున్న ఖాళీ స్థలంలో మంచాలు వేసి సెలైన్లు, ఇంజక్షన్లు చేస్తున్నారు. ఇక్కడ పంకాలు లేక రోగులే తమ ఇళ్ల నుంచి తెచ్చుకుని వేసుకుంటున్నారు. జ్వరాలతో వస్తున్నవారికి అన్ని రకాల పరీక్షలు చేస్తున్నామని, మందులు అందుబాటులో ఉన్నాయని సూపరింటెండెంట్ ఎస్.స్వప్న తెలిపారు.

గండేపల్లి: పీహెచ్‌సీలో ఫార్మాసిస్ట్ లేక మందులు అందజేస్తున్న స్టాఫ్‌నర్స్

వీరవరపు పేట, సీతారాంపురం పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రోజూ ఆయా మురికివాడల నుంచి సుమారుగా 100 మంది వస్తుండగా వీరిలో 15 మంది వరకు జ్వరపీడితులు ఉంటున్నారని వైద్యులు హరికృష్ణ, గౌస్ తెలిపారు. అన్ని రకాల పరీక్షలు చేసి, మందులు ఇస్తున్నామన్నారు.

తుని: ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో మెట్లకింద మంచాలు వేసిన వైనం..

సిబ్బంది కొరతతోనే పాట్లు

గండేపల్లి: సీజనల్ వ్యాధులన్నింటికి పీహెచ్‌సీలో మెరుగైన వైద్యం అందుబాటులో ఉంది. గండేపల్లి పీహెచ్‌సీలో సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, విరోచనాలు, టైఫాయిడ్ వంటి రోగాలకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలియజేస్తున్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. ఈ ఆసుపత్రిలో మందులు ఇచ్చేందుకు ఫార్మాసిస్ట్, రాత్రి సమయాల్లో అటెండర్ లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. రోజుకు సుమారు 80 నుంచి 100 మంది వరకు రోగులు వస్తున్నారని, డయాబెటిక్, తీవ్ర ఒత్తిడి, కీళ్ల నొప్పులు తదితర వ్యాధులతో ఎక్కువ మంది వస్తున్నారని వైద్య అధికారి నరేష్ తెలిపారు.

భజనలు, మేళతాళాలతో ఊరేగింపు

అన్ని దారులు రాచపల్లి వైపే..

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వర క్షేత్రంలో నాయనార్ల విగ్రహాల ప్రతిష్ఠ సోమవారం భారీ సంఖ్యలో భక్త జనం రానున్నందున పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మెట్టప్రాంతంలోని ఆలయాల్లో, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ వస్తారని సమాచారం. ప్రముఖులు ఉత్సవంలో పాల్గొంటున్నందున భారీగా పోలీసులను మోహరిస్తున్నారు. మండలంలోని గ్రామాలకు రాచపల్లి మీదుగా రాకపోకలను అనుమతించేదిలేదని, ప్రత్తిపాడు హైవేపై వివేకానంద బొమ్మ నుంచి లంపకలోవ మీదుగా వెళ్లాలని ఎస్సై లక్ష్మీకాంతం తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి దారిమళ్లింపు అమల్లోకి వస్తుందన్నారు. మండలంలోని గ్రామస్థులు ఉత్తరకంచి, లంపకలోవ మీదుగా ప్రత్తిపాడు చేరుకోవాలన్నారు.

లోవ రాజగోపురం వద్ద బారులు తీరిన భక్తులు

అమ్మ సన్నిధి... భక్తుల పెన్నిధి

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా విరాజిల్లుతున్న తలుపులమ్మ సన్నిధి భక్తుల పెన్నిధిగా తాండవించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో దేవస్థానం ప్రాంగణంలో వసతి గదులు, క్యూలైన్లు నిండిపోవడంతో భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న చెట్లకింద వంటావార్పు చేసుకున్నారు. ఈ ఒక్కరోజే సుమారు 33 వేలకు పైబడి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో దేవస్థానానికి రూ.8.50 లక్షలు ఆదాయం సమకూరినట్లు దేవస్థానం డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు. కాకినాడ పట్టణ శాసనసభ్యుడు వనమాడి కొండబాబు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు

తుని, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి సందర్భంగా పురపాలక సంఘం కార్యాలయం ప్రాంగణంలో ఉన్న నింబలక్ష్మీ, అశ్వత్థనారాయణల కల్యాణం ఘనంగా జరిగింది. పురపాలక ఛైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, రత్నాజీ దంపతులు ఈ కార్యక్రమం నిర్వహించారు. కుసుమంచి శోభారాణి, వారాధి జ్యోతి, వాసంశెట్టి శ్రీను, ముల్లేటి గణేష్ పాల్గొన్నారు.

కల్యాణంలో పాల్గొన్న ఛైర్‌పర్సన్ దంపతులు, భక్తులు

శ్రీరామగిరిపై పూజలు: రౌతులపూడి: ములగపూడి శ్రీరామగిరిపై ఉన్న కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిర్లంపూడి: చిల్లంగిలోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తామరాడలో కల్యాణవేంకటేశ్వరస్వామివారిని నిర్వాహకులు సుందరంగా అలంకరించారు.

జగ్గంపేట గ్రామీణం: కాట్రావులపల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. స్వామిని రథంపై గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించుకున్న దేవాదాయ కమిషనర్

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యనారాయణ స్వామిని దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఈయనకు ఈవో సుబ్బారావు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. స్వామి దర్శనం అనంతరం ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం గావించారు. స్వామి ప్రసాదం, చిత్రపటాన్ని ఈవో అందించారు. భక్తులకు అందిస్తున్న సౌకర్యాలు, క్యూలైన్లు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర వాటిపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. పూర్వపు కమిషనర్ ఎస్.సత్యనారాయణ కూడా స్వామిని దర్శించుకున్నారు. మాజీ పార్లమెంటు సభ్యుడు, తితిదే మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

కమిషనర్‌తో ఈవో, ఆలయాధికారులు

సత్యదేవుని రథ సేవ: అన్నవరం: సత్యదేవుని రథ సేవ ఆదివారం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఆసీనులను చేసి అర్చకులు పూజలు చేశారు. వేదమంత్రోచ్చరణ, మంగళవాయిద్యాలతో ఆలయ ప్రాకారం చుట్టూ మూడు సార్లు ఊరేగించారు. ఈవో సుబ్బారావు దంపతులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మల్లేపల్లి: తొలిఅడుగులో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

సంక్షేమం, అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం

గండేపల్లి, జగ్గంపేట, న్యూస్‌టుడే: సుపరిపాలన సంక్షేమం, అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం దూసుకుపోతుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మల్లేపల్లిలో సుపరిపాలనపై తొలి అడుగులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఏడాది పాలన బేష్ అనిపించుకుంటుందని అన్నారు. పోతుల మోహనరావు, జాస్తి వసంత్, దొమ్మ శ్రీను, భద్రరావు, పాల్గొన్నారు.

★ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ ఏర్పాటుచేశామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఆదివారం తెదేపా కార్యాలయంలో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు.

కిర్లంపూడి, తొండంగి: ఏడాదిలో ప్రజలకు అభివృద్ధి పథకాలు, గ్రామాలకు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి జనరంజక పాలన సాగిస్తుందని కిర్లంపూడి మండల పార్టీ అధ్యక్షుడు చదరం చంటిబాబు, పేర్కొన్నారు. జగపతినగరం, చిల్లంగి, రాజుపాలెం, సోమరాయణింపేటల్లో తొలిఅడుగు నిర్వహించారు.

తొండంగి మండలం బుచ్చియ్యపేటలో తెదేపా మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, చంద్రరావు తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు.

హడావుడిగా ప్రారంభించి వదిలేశారు..!

శంఖవరం మండలం మండపం గ్రామంలో ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం నిర్మించిన తాగునీటి వాటర్ ట్యాంకు వినియోగంలో లేక ఇబ్బందులు తప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే హడావుడిగా ప్రారంభించి నిరుపయోగంగా వదిలేశారు. కూటమి ప్రభుత్వమైనా మిగిలిన పనులు పూర్తి చేసి ఇంటింటికీ తాగునీరు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి జగదీష్‌ను వివరణ కోరగా పైపులైను పనులు చేయాల్సి ఉందని త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. – న్యూస్‌టుడే, శంఖవరం

నీటి వృథా అరికట్టరూ..!

జగ్గంపేట గ్రామీణం కాట్రావులపల్లి పెట్రోలు బంకు సమీపంలో రక్షిత మంచినీటిని సరఫరా చేసే పైపులైనుకు లీకులు పడడంతో నీరు వృథాగా పోతోంది. భావవరం రక్షిత పథకం ద్వారా మండల ప్రజలకు తాగునీటిని అందించేందుకు మండలంలోని అన్ని గ్రామాలకు పైపులైన్లు ఏర్పాటు చేశారు. వీటి పర్యవేక్షణ కోసం సిబ్బందిని సమకూర్చినప్పటికీ పూర్తిస్థాయిలో పర్యవేక్షణ లేక తరచూ లీకులు పడుతున్నాయి. రాజపూడి శివారు సీతారాంపురం వద్ద పెద్ద రంధ్రం పడడంతో నీరు వృథాగా పోయిన పరిస్థితి నెలకొంది. కాట్రావులపల్లి గ్రామస్థులకు రక్షిత నీరు అందని పరిస్థితి. పైపులైనుకు లీకులు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం**

నిర్లక్ష్యం అల్లుకుపోతోంది

విద్యుత్తు శాఖ అధికారుల నిర్లక్ష్యం గ్రామీణ ప్రజలకు శాపంగా మారింది. తరచు విద్యుత్తు అంతరాయం ఏర్పాడటంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఎస్.అన్నవరం శివారు ప్రాంతాల్లోని ఉన్న విద్యుత్తు నియంత్రిక, స్తంభాలు, తీగలపై పాదులు అల్లుకపోవడంతో కొద్ది పాటివర్షానికే విద్యుత్తు అంతరాయం ఏర్పాడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, తుని గ్రామీణం

కార్యాలయానికి వెళ్లేది ఎలా?

జగ్గంపేటలో విద్యుత్తుశాఖ కార్యాలయం వర్షపు నీటితో స్వాగతం పలుకుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు వాననీరు వెళ్లే మార్గం లేకపోవడంతో అక్కడే నిలుస్తుంది. దీంతో వినియోగదారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వర్షపునీరు వెళ్లే మార్గం ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జగ్గంపేట

శిబిరంలో పాల్గొన్న అధికారులు, క్యాడెట్లు

ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

గండేపల్లి, న్యూస్‌టుడే: గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో కొన్ని రోజులుగా జరుగుతున్న 18వ ఆంధ్ర బెటాలియన్ నేవీ ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసినట్లు మేజర్ మహ్మద్ ఆసీఫ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా సైబర్ నేరాలు, డ్రోన్, దేశరక్షణ, రక్తదానం వంటి అంశాలపై క్యాడెట్లకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి 570 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారని అన్నారు. ముగింపు కార్యక్రమంలో గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్, కమాండింగ్ అధికారి అజయ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నియోజకవర్గస్థాయి సమావేశం

గండేపల్లి, జగ్గంపేట, న్యూస్‌టుడే: జగ్గంపేట గోకవరం రోడ్డులో ఉన్న సాయిబాలాజీ కల్యాణమండపం వద్ద ఆదివారం వైకాపా నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ జిల్లా వైకాపా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పాల్గొన్నారు. రాజా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం నరసింహం పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. సమావేశంలో నాయకులు దాట్ల సూర్యనారాయణరాజు, తోట రాంజీ, ఒమ్మి రఘురామ్, రావుల గణేష్‌రాజా పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాజా, చిత్రంలో తోట నరసింహం తదితరులు

సర్వే శిలలపై పేర్లు తొలగింపు

న్యూస్‌టుడే–ప్రత్తిపాడు

ఈ రాళ్లు.. సమగ్ర భూసర్వే ఆనవాళ్లు! రైతుల భూహద్దు తెలిపే సూచీలకు బదులు వేసిన శిలలపైనా తమ పేరు ఉండిపోవాలని గత పాలకులు తపించిపోయారు. వైఎస్సార్ జగనన్న భూరక్ష 2020 అని ప్రతి శిలకు నామకరణం చేశారు. అప్పట్లో ఈ రాళ్లను రాజస్థాన్, గుజరాత్‌ల నుంచి తెప్పించారు. ఒక్కో రాయి పాతడానికి రూ.150లు చొప్పున చెల్లించారు. ఇలా రాష్ట్రంలో రూ.వందల కోట్లు వెచ్చించారు. కొన్ని చోట్ల పాతేందుకు నిధులు కేటాయించక, సర్వే పూర్తిచేయక వృథాగా గుట్టలుగా ఉండిపోయాయి.

లంపకలోవలో.. రౌతుపాలెంలో..

ఇందుకు మళ్లీ నిధులు వెచ్చించాల్సి వస్తోంది. మండలానికి 2 వేల నుంచి 3 వేల సర్వే రాళ్లపై పేర్లు చెరిపేసే పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. గత పాలనలో పొరపాట్లు ప్రభుత్వానికి ఆర్థికంగా భారం అవుతున్నాయడానికి ఇదొక ఉదాహరణ..! కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని లంపకలోవ, రౌతుపాలెం గ్రామాల్లోని చిత్రాలివీ.. వీటిని ఇళ్ల ముందు మెట్లుగా, మురుగు కాలువలు దాటే పలకలుగా, దుస్తులు ఉతుక్కునే బండలుగా వాడుకుంటున్నారు. రైతుల హద్దురాళ్లపై అనవసర సమాచారం ఎందుకని కూటమి ప్రభుత్వం వాటిని చెరిపిస్తోంది.

ఆకర్షణీయం.. చిత్రరాజసం

పట్టణాన్ని పరిశుభ్రం... ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు పురపాలక సంఘం కృషి చేస్తోంది. రోజూ రద్దీగా ఉండే జీఎన్‌టీరోడ్డు రైల్వే ఫ్లైఓవర్ వంతెన గోడలపై వివిధ రంగుల చిత్రాలు గీయించారు. యోగా, వివిధ అంశాలపై అవగాహన కల్పించేలా ఉన్న చిత్రాలను జనం ఆసక్తిగా తిలకిస్తున్నారు. – న్యూస్‌టుడే, తుని

జడ్.రాగంపేట: సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు

కార్యకర్తల అభ్యున్నతికి కొండయ్యదొర కృషి

జడ్.రాగంపేట, మురారిల్లో వర్ధంతి కార్యక్రమాలు

గండేపల్లి, న్యూస్‌టుడే: తెదేపా అభివృద్ధి కోసం, కార్యకర్తల సంక్షేమం కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి కందుల కొండయ్యదొర అని నాయకులు కందుల చిట్టిబాబు, జాస్తి వసంత్‌లు అన్నారు. జడ్.రాగంపేట, మురారి గ్రామాల్లో ఉన్న కొండయ్యదొర విగ్రహాలకు కుటుంబసభ్యులు, తెదేపా నాయకులు ఆదివారం నివాళులు అర్పించారు. చిట్టిబాబు, వసంత్‌లు మాట్లాడుతూ తెదేపా పార్టీ ఆవిర్భావం నుంచి పదవులతో సంబంధం లేకుండా పార్టీ కోసం, కార్యకర్తల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. జగ్గంపేట నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి, ఉమ్మడి జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ డైరెక్టరు, గృహనిర్మాణశాఖ డైరెక్టర్, జగ్గంపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఇలా భిన్న పదవుల్లో రాణించిన మహోన్నత వ్యక్తి కొండయ్య దొర అని ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కోర్పు లచ్చయ్య, కందుల విజయ్, వినయ్, కొండయ్య చౌదరి, కంటే సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తుని, న్యూస్‌టుడే: తుని జీఆర్పీ పరిధిలో రేగుపాలెం-నర్సీపట్నం రోడ్డు స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా విశాఖపట్టణం వైపునకు వెళ్లే రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యకి (50) మృతి చెందాడని ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. మృతుడు ఎవరనేది తెలియరాలేదని, మృతదేహం పూర్తిగా ఛిద్రం కాగా, తుని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. వివరాలకు జీఆర్పీ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

కత్తిపూడిలో చోరీ

శంఖవరం: కత్తిపూడిలో ఆదివారం తెల్లవారుజామున ఓ ఇంట్లో చోరీ జరిగింది. రెండు రోజుల నుంచి తన అన్నయ్య ఇంటి వద్ద ఉంటున్నామని దుండగులు ఇంట్లో చొరబడి 50 తులాల వెండి, రూ.10 వేలు నగదు, ఒక టి.వి అపహరించుకుపోయారని బాధితుడు శివ తెలిపారు. ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

27 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు సిద్ధం

గండేపల్లి, న్యూస్‌టుడే: ప్రస్తుత తొలకరి జల్లులకు మెట్టలో నారుమడులను రైతులు సిద్ధం చేస్తున్నారు. ఆరోగ్యకరమైన నారుమడి మంచి దిగుబడి ఇస్తుందని రైతులు, వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు.

మురారిలో సాగుకు నారుమడి

నారుమడికి ముందు ఇలా..

నారుమడికి ముందు దుక్కి దున్ని ఎకరానికి ఐదు టన్నుల వరకూ ఎరువు వేసి పొలంలో పదవ భాగాన్ని నారుకు ఎంపిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అందులో ఐదు నుంచి పది సెం.మీ. నీటితో నింపి కలిపి దమ్ముచేసి గడ్డి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దమ్ము చేసిన అనంతరం 10మీటర్ల పొడవు, ఒక మీటరు వెడల్పుతో నారుమడిని వేయాలి. మడిలో నీరు పోషకాలు బయటకు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నారుమడిలో 20 సెం.మీ. వెడల్పుతో కాలువ తీసి చదును చేయాలి.

మండలం	రైతులు	ఖరీఫ్ అంచనా (ఎకరాల్లో)
జగ్గంపేట	6945	9,800
గండేపల్లి	5210	7,200
కిర్లంపూడి	6340	10,500

ఎరువులు వాడాలిలా..

ఐదు సెంటీమీటర్ల నారుమడికి ఒక కిలో నత్రజని వేయాలి. నారు విత్తిన 12 నుంచి 14 రోజులకు మరొక కిలో నత్రజని వేయాలి. ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాషియం ఎరువులను వేయాలి. నారు మొలకలు వచ్చిన తర్వాత జింకు లోపం సంభవిస్తే విత్తిన పది రోజులకు కార్బొఫ్యూరాన్ 3జి గుళికలను ఒక సెంటుకు 160 గ్రాములు వరకూ చల్లాలి.

విత్తన ఎంపిక కీలకం

సాధారణంగా ఖరీఫ్‌లో ఎంటీయు 7029, 1318, బీపీటీ 5204, ఆర్‌జీఎల్ 2537, బీపీటీ 1224, 1262 రకాలు అనువుగా ఉంటాయి. కిలో విత్తనానికి 2.5 గ్రాముల కార్బన్‌డిజం లేదంటే సూడోమోనోస్ కలిపి నారుమడి వేసిన 24 గంటల తర్వాత నారుమడిలో చల్లాలి. దీంతో నారుమడికి వ్యాధులు రాకుండా నివారించవచ్చు.

– శ్రీరామ్, వ్యవసాయ అధికారి, గండేపల్లి

(c) eenadu

శభాష్.. నీరజ్‌చోప్రా

భారత క్రీడా చరిత్రలో కొత్త అధ్యాయం

తొలి మూడు స్థానాలు సాధించిన విజేతలతో గవర్నర్ థావర్‌చంద్‌గహ్లోత్, సీఎం సిద్ధరామయ్య తదితరులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత ప్రపంచ నెం.1 జావెలిన్ త్రో ఛాంపియన్ నీరజ్‌చోప్రా తన ప్రతిభా సామర్థ్యంతో బెంగళూరు క్రీడాభిమానుల ప్రశంసలందుకున్నారు. శనివారం రాత్రి జరిగిన నీరజ్‌చోప్రా క్లాసిక్ ఈవెంట్‌లో స్టార్ క్రీడాకారుడు నీరజ్ చోప్రా తన క్రీడా సామర్థ్యంతో అగ్రస్థానం చేపట్టి బంగారు పతకాన్ని సాధించి తన సత్తాను నిరూపించుకున్నారు. అతని పేరుతోనే ఈ పోటీలు నిర్వహించడంతో నీరజ్ విజేతగా నిలవడం అభిమానులకు ఆనందాన్ని కలిగించింది. ఈ పోటీల ముగింపు వేడుకల్లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, గవర్నర్ థావర్‌చంద్‌గహ్లోత్, హోంమంత్రి జి.పరమేశ్వర్ నీరజ్‌చోప్రా ప్రతిభను వీక్షించి హర్షం వ్యక్తం చేశారు. విజేతలకు సీఎం, గవర్నర్ తదితర ప్రముఖులు జ్ఞాపికను, బంగారు, రజత, కాంస్య పతకాలు ప్రదానం చేశారు. పేరొందిన విదేశీ దిగ్గజుల క్రీడా సామర్థ్యానికి వేదికైన ఈ పోటీల నిర్వహణతో సీఎం, గవర్నర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి ప్రతిష్ఠాత్మకమైన క్రీడాపోటీల నిర్వహణతో యువతరానికి క్రీడల్లో ఆసక్తి పెరిగేలా అవుతుందని అభిప్రాయాలను వెల్లడించారు. భారత క్రీడా ఇతిహాసంలోనే కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిన ఘనత కంఠీరవ క్రీడాప్రాంగణానికి దక్కింది. తొలిసారిగా ఈ పోటీల నిర్వహణతో స్టేడియం అభిమానులతో కిక్కిరిసింది. నీరజ్‌చోప్రా తన అద్భుతమైన ప్రదర్శనతో అభిమానుల ప్రశంసలు అందుకున్నాడు. కెన్యాకు చెందిన జులియస్‌యోగో రెండోస్థానం, శ్రీలంకకు చెందిన రుమేష్‌పతిరాగే మూడోస్థానం చేపట్టారు. ముగింపు వేడుకల్లో కర్ణాటక ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కె.గోవిందరాజు, ఎమ్మెల్యే రిజ్వాన్‌అర్షద్ పాల్గొన్నారు.

'ఆరు వేల పోస్టులు భర్తీ చేస్తాం'

కలబురగి, న్యూస్‌టుడే: అటవీశాఖలో ఖాళీగా ఉన్న 6 వేల పోస్టులతో పాటు ఒప్పంద పద్ధతిలో సేవలు అందించేందుకు అవకాశం ఉన్న పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టామని అటవీ శాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే వెల్లడించారు. ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, ఇటీవల 341 పోస్టులను భర్తీ చేసి, 540 పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభించామని చెప్పారు. సిబ్బందికి ప్రతి నెలా 5వ తేదీ నాటికి వేతనాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పలు దశాబ్దాలుగా అటవీశాఖకు చెందిన 2 లక్షల ఎకరాల భూమి కబ్జాకు గురైందన్నారు. అటవీ విస్తీర్ణం తగ్గుముఖం పడుతూ ఉండడంతోనే అడవుల నుంచి వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయని చెప్పారు. బెంగళూరు పరిధిలో 248 ఎకరాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 6231 ఎకరాల అటవీ భూమిని కబ్జాదారుల నుంచి జప్తు చేసుకున్నామని చెప్పారు. ఈ భూమి విలువ రూ.10 వేల కోట్లు ఉంటుందని వివరించారు.

రాత్రికి రాత్రే పంట కోసుకెళ్లారు

దావణగెరె, న్యూస్‌టుడే: తన తోటలోకి వచ్చిన దొంగలు రాత్రికి రాత్రి రూ.7.5 లక్షల విలువైన దానిమ్మ కాయలు కోసుకొని పరారయ్యారని హిరే మల్లనగౌడకు చెందిన రైతు రవికుమార్ ఆక్రోశించారు. అప్పు తీసుకుని తన రెండెకరాల పొలంలో ఐదు టన్నుల దానిమ్మను పండించారు. శుక్రవారం రాత్రి తోటలోకి ట్రక్కులతో వచ్చిన నిందితులు తన పంటను మొత్తం కోసుకు వెళ్లారని జగళూరు ఠాణాలో ఫిర్యాదు చేశారు.

చీర లాగారని ఆరోపణ

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే: భాజపా అధికార ప్రతినిధి బీఆర్ లోహిత్, అతని ఆరుగురు అనుచరులు తన చీర పట్టుకుని లాగారని కర్ణాటక షెడ్యూల్డు కులాల, సంచార జాతుల అభివృద్ధి వేదిక అధ్యక్షురాలు పల్లవి ఆరోపించారు. శివానంద కూడలి వద్ద గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లోహిత్ తనపై దాడి చేసి చీర పట్టుకుని లాగి అవమానించారని హైగ్రౌండ్స్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సీఎం పీఠం మార్పుపై ఎడతెగని రాజకీయం

- ఖర్గే రాష్ట్ర రాజకీయాల్లోకి వస్తారా!
- అధికారపార్టీలో లుకలుకలు

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: ఐదేళ్లూ తానూ ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య ప్రకటించిన అనంతరం తాను చేసేది ఏమీ లేదని ఆ పీఠంపై కన్నేసిన డీకే శివకుమార్ నిర్వేదంతో వ్యాఖ్యలు చేశారు. తాను చేసిన ప్రయత్నాలు విఫలమైనా, ప్రార్థనలు విఫలం కాలేదని ఆయన పేర్కొన్నారు. రెండున్నరేళ్ల అనంతరం ముఖ్యమంత్రి పీఠం మార్పు ఉంటుందని కాంగ్రెస్ అధికారంలో వచ్చినప్పటి నుంచి ప్రచారం జరుగుతోంది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు కూడా దాన్నే విశ్వసిస్తున్నారు. అధికార మార్పిడికి సంబంధించి అంతర్గతంగా ఒప్పందాలు కుదుర్చుకోలేదని ప్రధాన నేతలు మేకపోతు గాంభీర్యాన్ని ప్రకటిస్తున్నారు. సిద్ధరామయ్యను గద్దె నుంచి కిందుకు దించితే పార్టీ రెండుగా చీలిపోతుందన్న భయం అధిష్ఠానం మదిలో ఉంది. కర్ణాటక రాజకీయాల్లో చక్రం తిప్పిన నేతలుగా గుర్తింపు ఉన్న రామకృష్ణ హెగ్డే, జేహెచ్ పటేల్, హెచ్‌డీ దేవెగౌడ ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలు అందించిన అనుభవంతో పాటు వారి నుంచి చాణక్యతను సిద్ధు ఒంటబట్టించుకున్నారు. ఏఐసీసీ వెనుకబడిన వర్గాల జాతీయ సలహా మండలికి అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించి, తనను జాతీయ రాజకీయాల్లోకి పంపిస్తున్నారని జరుగుతున్న ప్రచారాన్ని సీఎం ఇప్పటికే ఖండించారు. తనకు రాష్ట్ర రాజకీయాలు మినహా, ఇతర పదవులు, జాతీయ రాజకీయాల్లోకి వెళ్లాలన్న ఆలోచన లేదని ఆయన స్పష్టం చేశారు. ఓబీసీ మండలిలో ఇతర నేతలతో పాటు తాను సభ్యునిగా మాత్రమే ఉన్నానని స్పష్టం చేశారు. పాలనావధి తర్వాత ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకుంటానని ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించారు. తన మనవడికి రాజకీయ భవిష్యత్తు అందించేందుకు, పార్టీ నేతలకు తలలో నాలుకలా వ్యవహరించేందుకు తన శేష జీవితాన్ని కేటాయిస్తానని ఆయన పునరుద్ఘాటించారు. అందుకే తనను ఐదేళ్ల పాటు సీఎంగా కొనసాగించాలని, తనను బాధ్యతల నుంచి తప్పిస్తే 2028లో మళ్లీ అధికారాన్ని చేపట్టడం కష్టమని పార్టీ అధిష్ఠానానికి ఆయన వివరించినట్లు సమాచారం. వీరిద్దరి మధ్య సయోధ్య కుదిర్చే బదులుగా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్న ప్రచారం పార్టీ శ్రేణులు బలంగా విశ్వసిస్తున్నాయి.

సిద్ధు, శివుడి సఖ్యతే సుస్థిర పాలనకు సంకేతమా?

డీకేశివుకు ఇస్తే తీవ్ర పరిణామాలు?

ఉప ముఖ్యమంత్రి శివకుమార్‌కు ముఖ్యమంత్రిగా బాధ్యతలు అప్పగిస్తే పార్టీలో చీలికలు ఎక్కువ అవుతాయన్న భయం పార్టీ అధిష్ఠానాన్ని వెంటాడుతోంది. కేపీసీసీ అధ్యక్షుడిగా అందరినీ కలుపుకొని వెళ్లడంతోనే పార్టీకి 135 స్థానాలు వచ్చాయని శివకుమార్ వర్గం నేతలు వాదిస్తున్నారు. ముఖ్యమంత్రి పీఠం ఖాళీగా లేకపోయినా విపక్ష నేతలు తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారని సహకార మంత్రి రాజణ్ణ దుయ్యబట్టారు. సెప్టెంబరులో కర్ణాటక రాజకీయాల్లో మార్పు వస్తుందని అనుకున్నప్పటికీ, ఆ మార్పు ఇంకా త్వరగా వస్తుందని వ్యాఖ్యలు చేశారు. అధికార పార్టీలో అంతర్గత పోరులో కొందరు ఎమ్మెల్యేలు తమవైపు వస్తే కుమారస్వామిని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టి, తాము పాలన కొనసాగించవచ్చని కాషాయ పార్టీ నేతలు తమలో తాము లెక్కలు వేసుకుంటున్నారు. కుమారస్వామి ముఖ్యమంత్రి పీఠాన్ని ఎక్కేందుకు ఉవ్విళ్లూరుతూ కొత్త సూటు కుట్టించుకునేందుకు సిద్ధమయ్యారని శివుడు ఇప్పటికే వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

నిర్ణయం అధిష్ఠానానిదే

రామనగర: లింగాయత, ఒక్కలిగ సముదాయం వారంతా జాతీయ స్థాయిలో ఓబీసీలని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. కనకపుర తాలూకా బిజ్జహళ్లిలో విలేకరులతో ఆదివారం మాట్లాడుతూ ఓబీసీ సలహా సమితి సభలను ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి సిద్ధరామయ్యను పంపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. ఓబీసీల్లో జైన, సిక్కు ధర్మాలకు చెందిన వారు కూడా ఉంటారని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న బాళెహొన్నూరు రంభాపురి మఠాధిపతి వీర సోమేశ్వర స్వామి మాట్లాడుతూ శివకుమార్ త్వరలో ముఖ్యమంత్రి కావాలని ఆశీస్సులు అందించారు. తాను ముఖ్యమంత్రి కావాలని మఠాధిపతి ఆశీస్సులు అందించడంలో తప్పేముందని శివకుమార్ ప్రశ్నించారు. పార్టీలోనూ పలువురు నేతలు, ప్రజలు ఇదే కోరుకుంటున్నప్పటికీ ఏ నిర్ణయాన్ని అయినా పార్టీ అధిష్ఠానం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంతనాలు జరుపుతున్న సీఎం సిద్ధరామయ్య (పాతచిత్రం)



కలబురగిలో ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

భక్తి ప్రపత్తులతో మొహర్రం

బెంగళూరు (శివాజీనగర): త్యాగానికి ప్రతీక అయిన మొహర్రంను ముస్లిం సోదరులు ఆదివారం భక్తి ప్రపత్తులతో నిర్వహించుకున్నారు. గొలుసులు, ఇనుప బద్దెలతో ఒంటిపై కొట్టుకుంటూ నినాదాలు చేసుకుంటూ వీధుల్లో జాతా నిర్వహించారు. ఒంటిని హింసించుకుంటూ వెళుతున్న యువతకు ఇతర ముస్లిం సోదరులు మద్దతు ఇస్తూ, ఛాతీలపై చరుచుకుంటూ నినాదాలు చేశారు.

ఇనుప బద్దెలతో హింసించుకుంటున్న యువకులు

పిచ్చికి పరాకాష్ఠ

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే ఆర్ఎస్ఎస్‌పై నిషేధాన్ని విధిస్తామని ప్రియాంక్ ఖర్గే వ్యాఖ్యానించడం పిచ్చికి పరాకాష్ఠ అని మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప వ్యాఖ్యానించారు. పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ చలువాది నారాయణస్వామితో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రతి భాజపా నేత ఆర్ఎస్ఎస్ గోదాలోనే పెరిగామని చెప్పారు. క్రమశిక్షణ, ఉత్తమ పాలన, దేశభక్తికి పెద్ద పీట వేసే ఆర్ఎస్ఎస్‌పై అక్కసు ఎందుకని ప్రశ్నించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం కలలో కూడా సాధ్యం కాదని ఎద్దేవా చేశారు. దేశంలో మూడు రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉన్న కాంగ్రెస్ త్వరలో అక్కడ కూడా కనుమరుగువుతుందని జోస్యం చెప్పారు.

చిత్రపటంపై పూలు చల్లి నివాళి అర్పిస్తున్న యడియూరప్ప

స్పందించు.. సంధించు!

పాఠకులారా..! మీలో సామాజిక స్పృహ.. ఏదైనా మంచి చేయాలన్న తపన ఉందా? అన్యాయాలను నిగ్గదీసి ప్రశ్నిస్తారా? సమస్యలను మీ చేతుల మీదుగా పరిష్కారం చూపాలని ఆరాటపడుతున్నారా? ఏ వర్గానికైనా అత్యంత విలువైన సమాచారం చేరవేయాలని అనుకుంటున్నారా? మీ చుట్టుపక్కల ఆహ్లాదకర.. ఆసక్తిదాయక.. ఆదర్శప్రాయమైన అంశాలు నలుగురికి పంచాలని ఆశిస్తున్నారా? అయితే ఈ వేదిక మీ కోసమే.. మీ గొంతుకకు ఈనాడు తోడు అవుతుంది. ప్రజాశ్రేయస్సు పరమావధిగా మీరు రాసిన అక్షరాలు, తీసిన ఫొటోలకు పత్రికలో సముచిత స్థానం కల్పించేందుకు ముందుకొస్తున్నాం..

ఇంకెందుకు ఆలస్యం.. తీసుకోండి కలం.. పట్టండి కెమెరా..
సమస్యలపై మీదైన శైలిలో ఎక్కుపెట్టండి..!

మీరు చేయాల్సినవి..

- ఏదేని అంశాన్ని పది వాక్యాలకు మించకుండా సూటిగా, స్పష్టంగా రాయడం.
- నాణ్యమైన ఫొటోలు తీసి పంపడం.
- వ్యక్తిగతమైనవి వద్దు.. సమాజశ్రేయస్సుకే ఈనాడు వేదిక అనేది మదిలో మెదలాలి.

★ మీరు పంపిన అంశాలను పరిశీలించి.. అర్హత ఉన్నవి ప్రచురిస్తాం.

పోస్టు చేయాల్సిన వాట్సప్ నంబరు: 93901 60428

వందేళ్ల అనంతరం ఆలయంలోకి ప్రవేశం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: గూళ్య గ్రామంలో వందేళ్ల క్రితం నిర్మించిన హెగడ్లమ్మ దేవాలయంలోకి దళితులను అనుమతించారు. ఆలయంలోకి తమనూ అనుమతించాలని ఇన్నేళ్లుగా కోరుతున్నా, అగ్రవర్ణాలకు చెందిన వారు అనుమతించ లేదు. పూజలు చేసుకునేందుకు వస్తే ఆలయం ఆవరణ వెలుపలే నిలిపి హారతి ఇచ్చేవారు. దీనిపై జిల్లాధికారికి ఫిర్యాదు చేసిన అనంతరం గ్రామసభలు నిర్వహించింది. తహసీల్దారు నేతృత్వంలో వరుసగా గ్రామంలో జాగృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఎట్టకేలకు జాగృతితో పరిస్థితులు మారిపోయాయి. ఇకపై అందరినీ ఆలయంలోకి అనుమతిస్తామని చెప్పడంతో వందేళ్ల అనంతరం దళితులు హెగడ్లమ్మను దర్శించుకునేందుకు అవకాశం కలిగింది.

గుండెపోటుతో ఇద్దరి మృతి

చిక్కమగళూరు, న్యూస్‌టుడే: మూడిగెరె తాలూకా భారిబైలు నివాసి మీనాక్షి (27), హొసళ్లికి చెందిన సుమిత్రగౌడ (75) ఇద్దరూ గుండెపోటుతో మరణించారు. రక్తపోటు పడిపోవడంతో మీనాక్షిని చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువెళుతుండగా, మార్గంమధ్యలో మరణించారు. సుమిత్రగౌడ వయోసహజ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటూ గుండెపోటుతో మరణించిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

'అబ్బే.. నాకేం తెలియదు'

పార్టీ పదవిపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టీకరణ

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ఏఐసీసీ వెనకబడిన వర్గాల జాతీయ సలహా మండలి ఏర్పాటు, దానికి తనను అధ్యక్షుడిగా నియమించడం తనకు తెలియదని, ఈ విషయంపై సమాచార మాధ్యమాల ద్వారా తెలుసుకున్నానని, పార్టీ అధిష్ఠానంతో మాట్లాడతానని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. రాష్ట్రంలో సెప్టెంబరులో రాజకీయ విప్లవం వస్తుందని, రాష్ట్ర కాంగ్రెస్‌లో బలమైన మార్పులు వస్తాయన్న ప్రచారం సాగుతున్న సమయంలో ఏఐసీసీ వెనకబడినవర్గాల జాతీయ సలహా మండలి అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను నియమించినట్లు ప్రచారం వైరల్ కావడం రాజకీయ రంగంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఆదివారం ఇక్కడ విధానసౌధ వద్ద మాజీ ఉప ప్రధాని దివంగత డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఏఐసీసీ వెనకబడిన వర్గాల జాతీయ సలహా మండలి అధ్యక్షుడిగా నియామకంపై ముఖ్యమంత్రి స్పందిస్తూ మాట్లాడారు. మండలికి తనను అధ్యక్షుడిగా చేయాలని తాను కోరలేదన్నారు. తాను పత్రికల్లో చదివి తెలుసుకున్నట్లు తెలిపారు. అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను స్వీకరిస్తారా? అని పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ బాధ్యతలు అప్పగిస్తే చేపట్టాల్సిన అవసరం ఉందని, దాన్ని నుంచి వెనక్కి వెళ్లడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. అధిష్ఠానంతో చర్చించి తనకు ఇచ్చిన బాధ్యతలు, పదవి నిర్వహణ తదితర వాటిపై చర్చిస్తానని తెలిపారు. గతంలో ఏఐసీసీ ఓబీసీ విభాగం అధ్యక్షుడు తనను కలిసి కర్ణాటకలో సమావేశం నిర్వహించేందుకు అవకాశం ఇవ్వాలని కోరగా తాను ఈనెల 15వ తేదీ నిర్ణయించినట్లు చెప్పారు. ఇప్పుడు అధిష్ఠానం మండలి ఏర్పాటుచేసి దానికి అధ్యక్షుడిగా చేయడంపై అధిష్ఠానంతో చర్చిస్తానని తెలిపారు.

విధానసౌధ వద్ద డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలు వేస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రులు డాక్టర్ మహదేవప్ప, కె.హెచ్.మునియప్ప, బైరతి సురేష్, తదితరులు

గ్యారంటీ పథకాలు నిలపబోం

రాష్ట్రంలో అమలులో ఉన్న గ్యారంటీ పథకాలను నిలిపే ప్రశ్నే లేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేశారు. పేదల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి గ్యారంటీ పథకాలను అమలులోకి తెచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో రహదారులు, వంతెనలు అభివృద్ధికి కాంగ్రెస్, భాజపా, జేడీఎస్ ఇలా పార్టీలకు అతీతంగా నిధులు విడుదల చేస్తానని తెలియజేశారు. హరిత విప్లవానికి మాజీ ఉపప్రధాని దివంగత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ నాంది పలికారని గుర్తు చేశారు. దేశాభివృద్ధికి ఆయన అపారమైన సేవలు చేశారని తెలిపారు. మంత్రులు డాక్టర్ హెచ్.సి.మహదేవప్ప, కె.హెచ్.మునియప్ప, బైరతి సురేష్, మాజీ మంత్రి ఆంజనేయ తదితరులు హాజరయ్యారు.

అధ్యక్షుడిగా నియమించలేదు

ఏఐసీసీ వెనకబడిన వర్గాల జాతీయ సలహా మండలి అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను నియమించలేదని ముఖ్యమంత్రి సచివాలయం స్పష్టం చేసింది. అందుకు సంబంధించి ఆదివారం ఇక్కడ సీఎం మాధ్యమ విభాగం ప్రకటన విడుదల చేసింది. సలహా మండలి అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను పార్టీ అధిష్ఠానం నియమించినట్లు సాగుతున్న ప్రచారం వాస్తవం కాదన్నారు. సలహామండలి సభ్యుల్లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఒక్కరని తెలిపారు. సలహా మండలి సమావేశాన్ని బెంగళూరు నగరంలో సలహా మండలి సమావేశం ఈనెల15న ఏఐసీసీ ఓబీసీ విభాగం అధ్యక్షుడు డాక్టర్ అనిల్‌జైహింద్ అధ్యక్షతన జరుగుతుందని, సమావేశానికి అతిథ్యం ముఖ్యమంత్రి ఇస్తున్నారని, కేపీసీసీ భారత్ జోడో భవన్‌లో సమావేశం జరుగుతుందని వివరించారు. వివిధ రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులు, ఎంపీలు, మాజీ ఎంపీలు శాసనసభ్యులు తదితర 50 మంది హాజరవుతారని తెలిపారు. ఇప్పటికే అధ్యక్షుడిగా నియమించడం గురించి తనకు తెలియని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

'నేనే మొదటి నటిని'

మడికేరి, న్యూస్‌టుడే: కొడవ సముదాయం నుంచి చిత్ర పరిశ్రమకు వచ్చిన మొదటి నటిని తానేనని రశ్మికా మందణ్ణ వ్యాఖ్యానించారు. ఒక ఛానెల్‌కు ఇచ్చిన ముఖాముఖిలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై నటి సముదాయానికి చెందిన వారు, నెటిజన్లు విమర్శించారు. గతంలో తాను హైదరాబాద్ యువతినని చెప్పుకోవడం, తనకు కన్నడ భాష రాదని చెప్పడంతో ట్రోలింగ్‌కు గురయ్యారు. కొడగు జిల్లా నుంచి పలువురు చిత్రపరిశ్రమకు వచ్చి తారలుగా గుర్తింపు పొందగా, తానే మొదటి నటిని అని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని నెటిజన్లు విమర్శలు గుప్పించారు. గతంలో తానే కొడగు నుంచి వచ్చిన మొదటి నటిని అని భావించేదాన్నని, తన కన్నా ముందే పలువురు భారతీయ వెండి తెరపై కనిపించారని సీనియరు నటి ప్రేమ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మీరు అధికారంలోకి వస్తే కదా..

మైసూరు, న్యూస్‌టుడే: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధిస్తామని మంత్రి ప్రియాంక్ ఖర్గే చేసిన వ్యాఖ్యలను భాజపా నాయకుడు శ్రీవత్స ఖండించారు. మైసూరులో విలేకరులతో మాట్లాడుతూ, కేంద్రంలో కాంగ్రెస్ ఇకపై ఎప్పుడూ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు. ప్రియాంక్ ఒక గంట పాటు ఏదైనా ఆర్ఎస్ఎస్ శాఖకు వెళ్లి వస్తే అక్కడ ఏం జరుగుతుందో తెలుస్తుందని హితవు పలికారు. ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ దేశ వ్యతిరేక పనులు చేయలేదన్నారు. గతంలో సంఘ పరివార్‌పై నిషేధాన్ని విధించిన కాంగ్రెస్ అనంతరం తన తప్పు తెలుసుకుని దాన్ని తొలగించిందని గుర్తు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

బెళగావి: అథణి తాలూకా మురగుండి సమీపంలో ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో గిరీశ్ బళ్లోరగి, రాహుల్ మ్యాలేశి, సంగు అమరగొండ అనే వ్యక్తులు మరణించారు. అఫ్జలపురకు చెందిన వీరు మహారాష్ట్రలోని కొల్హాపురలో మహాలక్ష్మి దేవిని దర్శించుకుని కారులో ఇంటికి తిరిగి వస్తుండగా, ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. కారులో ఉన్న రాధికా మ్యాలేశి తీవ్రంగా గాయపడ్డారు.

మెట్రోలో వెళ్దాం.. విమానమెక్కేద్దాం

- సిద్ధమవుతున్న నీలి రంగు మార్గం
- వచ్చే ఏడాదికి రైలు పరుగులు

బెమల్ తయారు చేయనున్న నీలి మెట్రో రైలు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి మెట్రో రైల్లో ప్రయాణికులు సంచరించే రోజులు ఎంతో దూరం లేవు. మెట్రో నీలిమార్గం నిర్మాణ పనులు శరవేగంతో సాగుతున్నాయి. 2027 కల్లా ఈ మార్గంలోని ఉపరితల వంతెనపై మెట్రో రైలు సంచరించే విధంగా నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నట్లు బీఎంఆర్‌సీఎల్ వెల్లడించింది. సిల్క్‌బోర్డు కూడలి నుంచి కె.ఆర్.పురం వరకు 18.20 కిలోమీటర్ల, కె.ఆర్.పురం నుంచి విమానాశ్రయం వరకు 37 కిలోమీటర్ల పనులు సాగుతున్నాయి. ఉపరితల వంతెనపై నీలి రంగు మెట్రో రైలు సంచరించనుంది. వాటికి సంబంధించిన నీలి మెట్రోకోచ్‌లను బీఈఎంఎల్ (బెమల్) తయారు చేయడం ప్రారంభించింది. 85 నుంచి 95 కిలోమీటర్ల వేగంతో సంచరించే విధంగా 96 మెట్రో కోచ్‌లను నిర్మిస్తున్నారు. ఆరు కోచ్‌లు కలిగిన రైల్లో రెండు కోచ్‌లను మహిళలకు కేటాయించే విధంగా నిర్మించనున్నారు. అందుకు సంబంధించిన బీఎంఆర్‌సీఎల్, బెమల్ మధ్య ఒప్పందం జరిగింది. అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హెబ్బాళ్ వరకు ఉపరితల వంతెన నిర్మాణ పనులు సాగుతున్నాయి. హెబ్బాళ్ నుంచి కె.ఆర్.పురం, కె.ఆర్.పురం - సిల్క్‌బోర్డు కూడలి వరకు ఉపరితల వంతెన పనులు దాదాపు 65 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మార్గంలో రైలు సంచారం ప్రారంభమైతే అవుటర్ రింగ్ రోడ్డులో సంచార రద్దీ సగం వరకు అదుపులోకి వస్తుందని అంచనా వేశారు. విమానాశ్రయం ప్రయాణికులకు అనుకూలం కానుంది. దేశంలో రద్దీ కూడళ్లలో ఒకటైన సిల్క్‌బోర్డు కూడలిలో సంచార రద్దీ అదుపులోకి వస్తుందని నిపుణులు తెలిపారు.

కె.ఆర్.పురం మార్గంలో సాగుతున్న నీలి మార్గం మెట్రో రైలు ఉపరితల మార్గం

విమానాశ్రయం మార్గంలో మెట్రో రైలు ఉపరితల వంతెన

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

చరిత ఆనవాళ్లు.. జ్ఞానపు ఇల్లు

ఆకట్టుకుంటున్న వస్తు సంగ్రహాలయం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: పూర్వీకులు వినియోగిస్తున్న వస్తువులు, సాంస్కృతిక పారంపర్యంగా మన ఐతిహాసాన్ని తెలిపే పురాతనమైన వస్తువులు, గత కాలంలో వినియోగించిన వస్తువులు, ఇతర సామగ్రి వాటి కథలను తెలిపేందుకు మంగళూరుకు చెందిన జాన్ ఎఫ్. కెనడీ నేతృత్వంలో రూపొందించిన జ్ఞానదమనే (జ్ఞానపు ఇల్లు) వస్తు సంగ్రహాలయం సందర్శకులకు ఆశ్చర్యం, ఆనందం కలిగిస్తోంది. ఈ జ్ఞానదమనే తుళు ప్రాంతానికి చెందిన ఐతిహాసం, సంస్కృతిని ప్రతిబింబించేలా అపూరూపమైన సంగ్రహాలయంగా ఆకట్టుకుంటోంది. అలనాటి ఐతిహాసం తెలిపే ఖజానాగా ప్రతి వస్తువు తరతరాల కథను తెలిపేలా ప్రదర్శనలో పొందుపరిచారు. ఆధునిక ప్రపంచంలో నేటి యువతరానికి అపూరూపమైన వస్తువుల ఐతిహాసాన్ని తెలియచేస్తోంది. గొప్ప జ్ఞానభండారంగా రూపుదిద్దుకున్న ఈ వస్తు సంగ్రహాలయాన్ని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో సందర్శకులు విచ్చేస్తున్నారు. పదహారేళ్ల నుంచి పురాతన వస్తువులను సేకరించి ఈ మ్యూజియం సిద్ధం చేశారు. జాన్ ఎఫ్. కెనడీ, సోదరుడు జెరాల్డ్‌డిసౌజా శ్రమకు విశేష స్పందన లభిస్తోంది. అనేక మంది సందర్శకులు వస్తువులను చూసి చాలా ఆనందాన్ని కలిగిస్తోందంటున్నారు. ఇక్కడి పురాతన వస్తువుల వీక్షకుల వచ్చేవారందరికీ అపూర్వమైన జ్ఞానాన్ని ఇస్తుందన్నారు. ఈ వస్తు సంగ్రహాలయాన్ని వీక్షించేందుకు ప్రవేశం ఉచితంగా ఉంటుంది.

16 ఏళ్ల శ్రమకు ఫలితం..

మంగళూరు సూరత్కల్ ఇందిరాక్యాంటీన్ సమీపంలో జ్ఞానదమనే వస్తు సంగ్రహాలయం సిద్ధమైంది. జాన్ ఎఫ్ కెనడీ 16 ఏళ్ల శ్రమ ఫలితంగా వేల ఏళ్ల కిందట వినియోగించిన పాత వస్తువులు, పూర్వీకుల జీవిత కథలను తెలిపేలా మ్యూజియంను సిద్ధం చేశారు. కృషికి సంబంధించిన పరికరాలు, ఇతర సామగ్రి, కార్మికుల వస్తువులు, దార్శిక, సాంస్కృతిక, పూజా సామగ్రి, వివిధ రకాల దీపాలు, ఏనుగులాంటి గంటలు, 1914లో వినియోగిస్తున్న పూజా పుస్తకం, పాత సాంకేతిక వస్తువులు గ్రామ్‌ఫోన్, రేడియో, ఫ్యాన్, వివిధ రకాల పాత గడియారాలు, కెమెరా, ఇస్త్రీపెట్టె, 900 - 1000 ఏళ్ల నాటి పాత నాణేలు, ఆరువందల ఏళ్ల కిందట ఏనుగుల మేడతో చేసిన బొమ్మలు, 1940లో ఉన్న మిలిటరీ పెట్టె, పౌరాణిక జాతక పుస్తకాలు, నక్షత్ర దడ్డీ, కీ చైన్, పాత సీసాలు, లోటాలు, పూలకుండీలు, వెండితో చేసిన బుట్టలు ఇలా అన్ని వస్తువులను చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఇవన్నీ దాదాపుగా వందేళ్ల కిందట ఉన్న వస్తువులు. తుళునాడు జీవనశైలి, కృషి, ధర్మం ప్రతీకగా ఉన్న చిత్రాలు ఈ జ్ఞానదమనెలో పొందుపరిచారు. ఈ వస్తు సంగ్రహాలయం మొత్తం జాన్ ఎఫ్. కెనడీ. ఓ చర్చికి కెనడీ వెళ్లినప్పుడు అక్కడ ప్రదర్శనలో ఉంచిన పాత వస్తువులను చూసి తాను కూడా ఇలాంటి పూర్వీకుల పురాతనమైన వస్తువులను సంగ్రహించాలని సంకల్పించారు. అప్పట్లో ఆయన సంకల్పంతో నేటి తరాలకు పురాతనమైన వస్తు సంగ్రహాలయం వీక్షించేందుకు సాధ్యమవుతోంది. నేడు జ్ఞానపు భాండాగారంగా పేరుపొందింది. అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెనడీ స్వర్గంగా ఆయన మృతి చెందిన రోజు, ఆయన పుట్టిన సందర్భంలో ఇతని తండ్రి చర్చి గురువులు ఇతనికి జాన్ ఎఫ్. కెనడీగా పేరుపెట్టారు. బుధవారం రోజున ఈ వస్తు సంగ్రహాలయం వీక్షించేందుకు ప్రవేశం ఉచితంగా ఉంటుంది. ఇతర రోజుల్లో ఫోన్ చేసి రావాలి. ఎలాంటి ప్రవేశ రుసుం లేదు. ఈ జ్ఞానదమనే వస్తు సంగ్రహాలయం కాదు. తుళు కుటుంబాల జీవనశైలి, సంస్కృతి, ఐతిహాసం దాఖలాలకు ఇది నిదర్శనంగా ఉంది.

పూర్వీకులు వాడిన తామ్రపాత్రలు, టార్చిలైట్లు, అలనాటి వివిధ రకాల దీపాలు

అలనాటి వంట సామగ్రిని చూపుతున్న జాన్ కెనడీ

వస్తు సంగ్రహాలయంలో ఆకట్టుకుంటున్న మట్టికుండలు, పురాతనమైన వస్తువులు

పాతకాలం రేడియోల సేకరణ

కానిస్టేబుల్‌పై పోక్సో కేసు

హుబ్బళ్లి, న్యూస్‌టుడే: ఆరేళ్ల బాలికపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడిన ఆరోపణలపై మంటేకెరె ఠాణాలో కానిస్టేబుల్ హజరత్ మిట్టిబాన్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. తన భర్త నిత్యం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఒక మహిళతో పరిచయం పెంచుకుని హజరత్ ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఇంటికి వచ్చి వెళుతూ ఆమె ఆరేళ్ల కుమార్తెతో అసభ్యంగా ప్రవర్తించాడు. తన కుమార్తెను లైంగికంగా వేధిస్తున్నట్లు గుర్తించిన ఆమె తండ్రి ఠాణాలో రుజువులతో సహా ఫిర్యాదు చేయడంతో అతని అకృత్యం వెలుగులోకి వచ్చింది.

ప్రేమ సందేశాన్ని పంపించిన పీడీవో

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: రాళ్లేరుపల్లి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలికి పీడీఓ అశోక్ ఐ లవ్ యూ అంటూ సందేశాన్ని పంపించాడు. అధ్యక్షురాలు, అశోక్ ఇద్దరూ వివాహితులే. అశోక్, పంచాయతీ మాజీ అధ్యక్షురాలి భర్త ఏఎన్ బాబు రెడ్డి, ఇప్పటి సభ్యుడు నాగేశ్ ముగ్గురూ కలిసి బసవప్రకాశ్ అనే వ్యక్తిని బెదిరించి, ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించుకున్నారని, కులం పేరిట దూషించారని ఆమె ఆరోపించారు. ఇదే విషయాన్ని తాను చేకూరు ఠాణాలో ఫిర్యాదు చేయడంతో ఐ లవ్ యూ అంటూ సందేశాన్ని పంపించాడని బాధితురాలు ఆరోపించారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

ఉడుపి, న్యూస్‌టుడే: చిక్కమగళూరు నుంచి కళసలో పర్యటనకు వచ్చిన ఒక యువతి (22)కి వంద రూపాయలతో మత్తు మందు కలిపి స్పృహ తప్పిన అనంతరం అత్యాచారానికి పాల్పడిన సంజయ్ రేర్కర్ (28) అనే నిందితుణ్ని కళస ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు 2024 జులై 11న అత్యాచారానికి పాల్పడ్డాడు. స్పృహ వచ్చిన అనంతరం ఆ యువతి జరిగిన విషయాన్ని గుర్తించి గొడవ చేయగా, నిన్ను వివాహం చేసుకుంటానని నమ్మించాడు. స్థానిక ఆలయానికి తీసుకువెళ్లి నుదుట కుంకుమ పెట్టి, పూలహారం వేసి వివాహం అయిపోయిందని చెప్పాడు. కుటుంబ సభ్యులతో కలిసి మంచి ముహూర్తం పెట్టించి మనం వివాహం చేసుకుందామని చెప్పి పంపించాడు. ఇటీవల యువతితో నిశ్చితార్థం చేసుకున్నాడని తెలుసుకున్న యువతి, అతన్ని నిలదీసింది. నీకూ నాకూ సంబంధం లేదని చెప్పడంతో అతనిపై ఫిర్యాదు చేసింది. నిందితుణ్ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

ప్రశ్నించినందుకు తల్వార్లతో దాడి

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే: మోదీ గార్డెన్ వద్ద పాలికెకు చెందిన స్థలంలో గ్యారేజ్ నిర్మిస్తున్న సైపుల్లా అనే రౌడీషీటరు, అతని అనుచరులను ప్రశ్నించిన ఇద్దరు యువకులపై తీవ్రంగా దాడి చేసి కొట్టారు. దాడిలో తీవ్రంగా గాయపడిన నవీన్, ప్రభు ఇద్దరినీ చికిత్స కోసం నిమ్హాన్స్‌లో చేర్పించారు. ఫిర్యాదు తీసుకునేందుకు డీజేహళ్లి ఠాణా పోలీసులు నిరాకరించడంతో బాధితుల తల్లిదండ్రులు నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్‌కు ఫిర్యాదు చేశారు.

గుండెపోటుతో యోధుడి మృతి

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: భారతీయ సైన్యంలో సేవలు అందిస్తున్న గంగాధరప్ప (54) గుండెపోటుతో మరణించారు. సెలవుపై చిక్కబళ్లాపురకు వచ్చిన ఆయనకు ఛాతీలో నొప్పి రావడంతో చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువెళుతుండగా మార్గం మధ్యలో మరణించారు.

చిక్కబళ్లాపురలో చెడ్డీ గ్యాంగ్

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్న చెడ్డీ గ్యాంగ్ ఇప్పుడు గౌరీబిదనూరులో తిరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిక్కర్లు మాత్రమే వేసుకుని, నలుగురు దుండగులు మారణాయుధాలతో తిరుగుతున్నట్లు రైల్వే స్టేషన్ సమీపంలోని సీసీ కెమెరాలో ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే తక్షణమే ఠాణాలో ఫిర్యాదు చేయాలని పోలీసులు కోరారు.

ఇద్దరి అరెస్టు

కార్వార, న్యూస్‌టుడే: భట్కళ తాలూకా ముండళ్లి సమీపంలోని సీరుగద్దె గ్రామంలో దున్నపోతు తల నరికి తీసుకువెళ్లిన ఆరోపణలపై అబ్దుల్ హుసేన్ (22), మహ్మద్ ఇబ్రహీం (55)లను పోలీసులు అరెస్టు చేశారు. హావేరి జిల్లా హానగల్‌కు చెందిన అబ్దుల్ హుసేన్ స్థానిక మదర్‌సాలో బోధకునిగా పని చేస్తున్నాడని భట్కళ గ్రామీణ ఠాణా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ హొన్నావర చుట్టుపక్కల పలు ఆవులను చంపి, మాంసాన్ని తీసుకువెళ్లారని ప్రాథమిక విచారణలో గుర్తించారు.

పోలీసు నివాసం ముందు ధర్నా

దావణగెరె, న్యూస్‌టుడే: చెన్నగిరి తాలూకా సోమలాపుర గ్రామంలో పోలీసు సిబ్బంది శివు నివాసం ముందు అతని భార్య విద్య (24) మృతదేహంతో కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. వివాహం చేసుకున్న ఆరు నెలల్లోనే ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించడంతోనే తమ కుమార్తె విద్య హాసన జిల్లా అరసికెరె స్టేషన్ వద్ద రైలుకు ఎదురుగా వెళ్లి బలవన్మరణానికి పాల్పడిందని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. శివు, అతని కుటుంబ సభ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే శివును అరెస్టు చేశామని పోలీసులు చెప్పడంతో మృతదేహానికి శనివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

భక్తులపై హిజ్రాల దాడి

బోయకొండ(చౌడేపల్లె), న్యూస్‌టుడే: బోయకొండ భక్తులపై హిజ్రాలు దాడి చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. కర్ణాటకలోని సీకే పల్లెకు చెందిన దేవరాజు, మంగమ్మలతో పాటు మరో కొంతమంది ఆటోలో చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలోని బోయకొండ అమ్మవారి దర్శనానికి వచ్చారు. గుర్తించిన హిజ్రాలు వీరిని డబ్బులు అడగగా.. ఇవ్వకపోవడంతో వెంటపడి రణబేరి గంగమ్మ ఆలయం వద్ద అడ్డుకున్నారు. భక్తుడు రూ. 150లు ఇవ్వగా నిరాకరించి రూ.వెయ్యి ఇవ్వాల్సిందేనని డిమాండు చేశారు. దీంతో హిజ్రాలకు భక్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలోనే వారు భక్తులపై దాడి చేసి గాయపరిచారు. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రతి ఆదివారం ఇదే తంతు జరుగుతున్నా.. పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు.

దేవతా విగ్రహాల ధ్వంసం

విరూపమైన విగ్రహాలు

శివమొగ్గ: రాగిగుడ్డ పరిధి శాంతినగర వార్డు బంగారప్ప లేఅవుట్‌లోని వినాయకుడు, నాగ శిలలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. నిందితులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని భాజపా అధ్యక్షుడు విజయేంద్ర, హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. హిందువులు, ఆలయాలపై దాడులు, విగ్రహాలను ధ్వంసం చేస్తున్న వారిని ప్రభుత్వం ఉపేక్షించడంతోనే ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని విజయేంద్ర దుయ్యబట్టారు. సీనియరు పోలీసు అధికారులు ఘటన జరిగిన ప్రాంతానికి వచ్చి విగ్రహాలను పరిశీలించారు. శాంతిభద్రతలను కాపాడేదిశలో ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని స్థానికులను కోరారు. ప్రస్తుతానికి పరిస్థితులు అదుపులో ఉన్నాయని పోలీసు అధికారులు తెలిపారు.

మరో ఇద్దరి అరెస్టు : శివమొగ్గ బంగారప్ప లేఅవుట్‌లో వినాయకుడు, నాగశిలను విరూపం చేయడం, కాలితో తన్నడం, నాగశిలను మురుగు కాలువలో పడేసిన ఆరోపణలపై ఇద్దరు యువకులను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. స్థానిక సీసీ కెమెరా, వీడియో ఫుటేజ్ ఆధారంగా వారిని అదుపునకు తీసుకుని విచారణ చేపట్టారు.

యువకుడ్ని దోచుకున్న యువతి

దావణగెరె: మ్యాట్రిమోనీలో పరిచయం అయిన యువతి వివాహం చేసుకుంటానని నమ్మించి ఒక యువకుడ్ని (29) దోచుకుంది. క్రిప్టో కరెన్సీలో మదుపు చేస్తే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి ఆ యువ ఇంజనీరు నుంచి రూ.9.34 లక్షల నగదును తన ఖాతాకు బదిలీ చేయించుకుంది. ఇప్పుడు చరవాణి స్విచ్ ఆఫ్ చేసి, మెయిల్‌కు స్పందించకపోవడంతో బాధితుడు సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

సంతోష్ జార్కిహోళి కోసం గాలింపు

బెళగావి: గోకాక లక్ష్మీదేవి జాతరలో గాల్లోకి తూటా పేల్చిన ఎమ్మెల్యే రమేశ్ జార్కిహోళి కుమారుడు సంతోశ్ జార్కిహోళి పరారీలో ఉన్నాడని పోలీసులు గుర్తించారు. తూటా పేల్చిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో అతను పరారయ్యాడు. చట్టప్రకారమే సంతెశ్‌పై పోలీసులు చర్యలు తీసుకుంటారని హోం మంత్రి పరమేశ్వర్ ఇప్పటికే స్పష్టం చేశారు.

దర్శన్ నివాసంలో పూజలు

మైసూరు: నటుడు దర్శన్ మైసూరులోని తన నివాసంలో, ఫాంహౌస్‌లో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేసుకున్నారు. ప్రతి ఏటా ఆషాఢ మాసంలో చాముండేశ్వరి పూజను తన నివాసంలో చేయించుకోవడం ఆనవాయితీగా చేయించుకుంటూ వస్తున్నారు. సిద్ధార్థ లేఅవుట్‌లోని నివాసంలో చాముండి మాత విగ్రహానికి పూల అలంకరణ చేసి, పూజలు చేశారు. తల్లి మీనా తూగుదీప, సోదరుడు దినకర్, భార్య విజయలక్ష్మితో కలిసి పూజల్లో పాల్గొన్నారు. అక్కడి నుంచి తన ఫాంహౌస్‌లో పూజలు చేసుకున్నారు.

EENADU Classifieds
FINANCIAL SERVICES
రుణాలు, వృత్తిగత, వ్యాపార, ఇతర రుణాల కోసం సంప్రదించండి. +91 99669 10410.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలు ప్రకటనదారుల బాధ్యత. ప్రకటనల్లోని విషయాలకు ఈనాడు బాధ్యత వహించదు. పాఠకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలు ఇప్పుడు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి.
బళ్లారి : 9121167525
బెంగళూరు : 9121167527

విశ్రాంత అధికారులకు ప్రత్యేక శిబిరం

నేత్ర పరీక్ష చేయించుకుంటున్న సైనికుని తల్లి

బెళగావి, న్యూస్‌టుడే: సైన్యం నుంచి పదవీ విరమణ చేసిన సైనికులు, వారి కుటుంబ సభ్యులు, వీరనారీల కోసం మద్రాస్ రెజిమెంటల్ సెంటర్‌లో శౌర్య సంప్రవాహ్ పేరిట ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. లెఫ్టినెంట్ కర్నల్ కలామ్ సింగ్, బ్రిగేడియర్ కృష్ణేందు దాస్‌లు శిబిరాన్ని ప్రారంభించారు. వీరనారి, వీరమాతలకు స్మరణికలు వితరణ చేశారు. నేత్ర, దంత వైద్య పరీక్షలు, ఈసీజీ పరీక్షలు చేయించుకున్నారు. పింఛను, ఇతర సమస్యలకు సంబంధించి విశ్రాంత సైనికులు, వారి కుటుంబాల నుంచి వినతిపత్రాలు అందుకున్నారు. ధార్వాడ, హుబ్బళ్లి, గదగ, ప్రాంతాల నుంచి విశ్రాంత సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.

స్మరణిక అందిస్తున్న అధికారులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

నిప్పులగుండంలో నడిచిన భక్తులు

బళ్లారి: నగరంలో పీర్ల ఊరేగింపు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లావ్యాప్తంగా మొహర్రంను శనివారం భక్తిశ్రద్ధలతో ఆచరించారు. తోరణగల్లు, కుడతిని, సండూరు, కుడతిని తదితర ప్రాంతాల్లో పీర్లను సుందరంగా అలంకరించి చావడిలో కూర్చోపెట్టి పూజలు చేశారు. బళ్లారి నగరంలోని మిల్లర్‌పేటె, పింజారి వీధి, ఆలదహళ్లి, భత్రి, మహనంది కొట్టం, బ్రూస్‌పేటె, వడ్డరబండ ప్రాంతాల్లో పీర్లకు హిందూ, ముస్లిం సోదరులు బెల్లం, చక్కెర చదివించారు. పుష్పాలు, గుర్రాలు, ఊయల, దుస్తులు, గొడుగులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రధాన వీధుల్లో చేపట్టిన పీర్ల ఊరేగింపులో యువకులు పులి వేషాలు ధరంచి చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం తెల్లవారుజామున పీర్లను ఎత్తుకున్న భక్తులు నిప్పుల గుండంలో నడిచారు. ముందుజాగ్రత్తగా జిల్లావ్యాప్తంగా ఎస్పీ నేతృత్వంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బళ్లారి గ్రామీణ: పీర్లకు రజత కవచం, పుష్పాలతో అలంకరణ

బళ్లారి గ్రామీణ: బళ్లారి గ్రామీణ ప్రాంతాల్లో చావడిలో పుష్పాలు, రజత కవచాలతో అలంకరించి ఉంచిన పీర్లకు గ్రామస్థులు పూజలు చేసి చక్కెర చదివించారు. ఆయా గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. పీర్లను ఎత్తుకున్న భక్తులు నిప్పుల్లో నడిచారు. బళ్లారి నగరంలోని పింజారవీధి, రామయ్యకాలనీ, హుసేన్ నగర్, పటేల్‌నగర్, శ్రీరాంపురం కాలనీ, వడ్డరబండ, బోయవీధి, మిల్లరుపేట, కొలిమిబజార్ తదితర ప్రాంతాల్లో పీర్ల ఊరేగింపు ఆకట్టుకుంది.

చెళ్లకెర (చిత్రదుర్గం): చిత్రదుర్గం జిల్లా బాధ్య మంత్రి డి. సుధాకర్ మొహర్రం పర్వదినంలో పాలుపంచుకున్నారు. శనివారం రాత్రి ఆయన హిరియూరులో పీర్లను దర్శించుకొని అగ్నిగుండాన్ని సందర్శించారు. చెళ్లకెర తాలూకా కేంద్రంలో పీర్లను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని పూజలు చేశారు.

సిరుగుప్ప: తాలూకావ్యాప్తంగా పీర్ల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ మసీదులు, చావడిలో పీర్లను కూర్చోపెట్టి పూజలు చేశారు. పలు మసీదుల సమీపంలో అగ్నిగుండాలు ఏర్పాటు చేశారు. పీర్ల ఊరేగింపులో యువత, పిల్లలు పులి వేషాలు ధరించి డప్పుల్ల మోతకు అనుగుణంగా నృత్యం చేస్తూ అలరించారు.

శ్రీరామనగర్: గంగావతి తాలూకా ఢణాపుర గ్రామంలో పీర్లను ఊరేగించారు. హళె అయోధ్య వరకు సాగిన ఊరేగింపులో కళాకారులు, పులి వేషగాళ్లు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అక్కడి నుంచి తిరిగి గ్రామానికి వచ్చిన పీర్లు రాజవీధి మార్గంలో ఊరేగాయి. ఢణాపుర, హెబ్బాళ, హళె అయోధ్య గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పీర్లను దర్శించుకొని పూజలు చేశారు.

కంప్లి: కంప్లి తాలూకాలో మొహర్రం సందర్భంగా శనివారం రాత్రి భక్తులు జాగరణ చేశారు. పీర్లకు భక్తులు ఎర్ర చక్కెర చదివించారు. అగ్నిగుండంలోని నిప్పులపై కొందరు భక్తులు నడిచి మొక్కులు తీర్చుకున్నారు. తాలూకాలోని గోనాళలో మినహా కంప్లి పట్టణంతో పాటు ఇతర గ్రామాల్లో 38 చోట్ల పీర్లను కూర్చోపెట్టి పూజలు నిర్వహించారు.

మాన్వి, న్యూస్‌టుడే : మాన్వి, సిరివార, లింగసుగూరు తాలూకాల్లో హిందూ, ముస్లింలు మొహర్రం ఘనంగా ఆచరించారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పీర్లను వైభవంగా ఊరేగించారు. భక్తులు అగ్నిగుండాలు దాటే దృశ్యాలు కనువిందు చేశాయి. శనివారం రాత్రి కత్తల్‌రాత్రిని నిర్వహించారు. యువకులు నృత్యాలు చేశారు. భక్తులు పొర్లదండాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. కోనాపూరు పేట సిట్టినదేవరు (హుసేని ఆలం)ను మంత్రి ఎన్.ఎస్.బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్ సందర్శించుకొని ఆశీర్వాదం తీసుకున్నారు.

సిరుగుప్ప: సింగిరిలో పులివేషగాళ్ల సందడి

బళ్లారి: కురుగోడులో పీర్లను దర్శనం చేసుకుంటున్న భక్తులు

కంప్లి: నిప్పుల గుండంలో నడుచుకుంటూ వెళుతున్న భక్తుడు

శ్రీరామనగర్: పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

చెళ్లకెర: అగ్నిగుండానికి నమస్కరిస్తున్న మంత్రి సుధాకర్

అగ్నిగుండంలో పడిన భక్తుడు

లింగసుగూరు, (మాన్వి) : తాలూకాలోని యరగుంటి గ్రామంలో మొహర్రం సందర్భంగా అపశ్రుతి చోటు చేసుకుంది. అగ్నిగుండం దాటే వేళ హనుమంత (40) అనే వ్యక్తి అదుపుతప్పి గుండంలో నిప్పుల్లో పడిపోయాడు. ఇమామ్‌సాబ్ అనే యువకుడు బయటికి తీశాడు. క్షతగాత్రున్ని వెంటనే లింగసుగూరు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం రాయచూరు జిల్లాసుపత్రికి తరలించారు. హనుమంత పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని స్థానిక పీఐ పండలీక పటాతార్ పరిశీలించారు.

సిట్టినదేవరును దర్శించుకున్న మంత్రి బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్

ముఖ్యమంత్రి క్షమాపణలు చెప్పాలి

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: కర్ణాటకలో పలు జిల్లాల్లో సంభవిస్తున్న గుండెపోటు మరణాలకు కొవిడ్ సమయంలో వేయించుకున్న కొవిడ్-19 వ్యాక్సిన్ కారణమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొనడాన్ని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఖండించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమితితో పాటు కేంద్ర ఆరోగ్య శాఖ కూడా గుండెపోటు మరణాలకు జీవన, ఆహార శైలి మార్పులే కారణమని స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బెంగళూరులో విలేకరులతో ఆదివారం మాట్లాడుతూ, నిరాధారమైన వ్యాఖ్యలు చేసిన సీఎం ప్రతి ఒక్కరికీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో 110-120 కోట్ల మంది వ్యాక్సిన్ వేయించుకున్నారని గుర్తు చేశారు. సిద్ధరామయ్య దేశీయ వ్యాక్సిన్ వేయించుకున్నారా విదేశీ టీకా వేయించుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్న సిద్ధరామయ్యపై కేసు ఎప్పుడు నమోదు చేస్తారో చెప్పాలని మంత్రి ప్రియాంక్ ఖర్గేను విపక్ష నేత అశోక్ ప్రశ్నించారు.

ఎమ్మెల్యే నివాసంలో హైడ్రామా

బీదర్, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే ప్రభు చౌహాన్ కుమారుడు ప్రతీక్ చౌహాన్‌కు మహారాష్ట్రలోని ఉద్దగీర్‌కు చెందిన యువతితో కొద్ది నెలల క్రితం నిశ్చితార్థం జరిగింది. వివాహం చేసుకోకుండా కాలం వెళ్లదీస్తున్నారంటూ యువతి తల్లిదండ్రులు, బంధువులు ఔరాద్ తాలూకా బోంతి తాండాలోని ప్రభు చౌహాన్ నివాసానికి వచ్చారు. మాటలు పతాక స్థాయికి చేరుకుని ఒకరిని మరొకరు దూషించున్నారు. ఒకరిని మరొకరు తోసుకోవడంతో కొందరు గాయపడ్డారు. సమాచారం అందుకుని ఔరాద్ ఠాణా పోలీసులు అక్కడకు వెళ్లే సరికి పరిస్థితి సద్దుమణిగింది. మీ సంబంధం వద్దంటూ యువతి తరపు వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

వై.ఎస్.రామ్ హీరో గణేశ్

ప్రముఖ హీరో గణేశ్ ఆంజనేయుడి అవతారంలో 'వై.ఎస్.రామ్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. గణేశ్ పుట్టిన రోజు సందర్భంగా ఆంజనేయుడి పాత్రతో కూడిన పోస్టర్‌ను విడుదల చేశారు. ది రాయల స్టుడియో బ్యానర్‌పై చిత్రాన్ని నిర్మిస్తున్నారు సంగీతం జైఅనూప్ సీళిన్ అందిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో పలుదృశ్యాలను చిత్రీకరిస్తున్నారు. ఏడాది ఆఖరిలో విడుదలకు సిద్ధం చేస్తున్నారు.

ఆంజనేయ పాత్రలో హీరోగణేశ్

ప్రతిభావంతుల్ని ప్రోత్సహిద్దాం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన, ఆదివాసీల కుటుంబాల్లో ప్రతిభావంత విద్యార్థులు చదువుకునేందుకు ప్రతి ఒక్కరూ సాయం చేయాలని లోకాయుక్త విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సంతోశ్ హెగ్డే పిలుపునిచ్చారు. కష్టపడి ఉన్నత స్థానానికి, స్థాయికి చేరుకున్న వారు తమ సముదాయంలోని ఇతరులకు ఆపన్న హస్తాన్ని చాచాలని హితవు పలికారు. మూలనివాసి అంబేడ్కర్ సంఘం సభ్యులు పది, పీయూసీలో ఉత్తమ మార్కులు, ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరించి, ప్రోత్సాహకాలు వితరణ చేసి మాట్లాడారు. విద్యతోనే పేదరికం, అస్పృశ్యత తొలగిపోతాయని తెలిపారు. సంఘం అధ్యక్షుడు మునిరామప్ప, కర్ణాటక జనపర సంఘం అధ్యక్షుడు జె.శ్రీనివాస్, నటి అనుష్క శెట్టి తండ్రి విఠల శెట్టి, ఆయా రంగాలకు చెందిన బీఎన్‌ఎస్ రెడ్డి, రంగప్ప, హూడి విజయకుమార్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జస్టిస్ సంతోష్ హెగ్డే, ఇతర ప్రతినిధులతో సత్కారం అందుకున్న విద్యార్థులు

బళ్ళారి
● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

వివిధ దేవతల చిత్రపటాలకు పూజలు

వైభవంగా గురు పౌర్ణమి

సాలుంచిమరక్యాంపు (కారటగి): కారటగి తాలూకా లోని సాలుంచిమర క్యాంపులోని శిర్డీ సాయిబాబా ఆల యంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ ఉదయం వినాయక, వివిధ దేవతలకు పూజలు, ఆలయ యాగశాల ప్రదక్షిణ, అఖండ దీపారాధన కార్యక్ర మాలు నిర్వహించారు. సాయంత్రం వాస్తు పూజ, అగ్ని సంస్కారం, గణపతి హోమం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ సమితి సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నేడు పత్రికా దినోత్సవం

బళ్లారి, న్యూస్‌టుడే: కర్ణాటక కార్యనిరత పత్రక ర్తర సంఘం జిల్లా శాఖాధ్వర్యంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు పాత డీసీ కార్యాలయ ఆవరణలోని గాంధీ భవనంలో పత్రికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వీరభద్ర గౌడ తెలిపారు. ఆయన ఆదివారం ఇక్కడ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి మాధ్యమ సలహాదారుడు కె.వి.ప్రభా కర, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివానంద తగడూరు, ఆచార్యులు శివకుమార కణసోగి, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, ఎమ్మెల్సీ సతీష్ ఏచరెడ్డి, మేయర్ ముల్లంగి నందీశ్, డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఎస్పీ శోభారాణి తదితరులు హాజరవుతారని వెల్లడిం చారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సీనియర్ పాత్రికేయులకు సన్మానం జరుగుతుందని చెప్పారు.

కళాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

బళ్లారి, న్యూస్‌టుడే: వార్త సార్వజనీన సంపర్క శాఖాధ్వర్యంలో ప్రభుత్వ పథకాలను వీధి నాటకాలు, జానపద, సంగీత కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడానికి జానపద, సంగీత కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు ఆ శాఖ అధికారి తుకారామ్ తెలిపారు. జిల్లా నుంచి మూడు వీధి నాటకాలు, మూడు జానపద, సంగీత బృందాలను ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తు లను ఈ నెల 21లోపు వార్త సార్వజనీన సంపర్క కార్యాలయానికి పంపాలని ఆయన కోరారు.

పంటల బీమాలో పేర్లు నమోదు చేసుకోండి

కర్ణాటక రైతు సురక్ష పీఎం ఫసల్ బీమా పథకం లబ్ధి పొందడానికి, 2025-26 ఏడాది ఖరీ ఫ్‌లో పంటలు సాగుచేసిన అర్హులైన కర్షకులు పేర్లు నమోదు చేసుకోవాలని ఉద్యానవన శాఖ ఉపనిర్దేశకుడు సంతోష్ సప్పండి సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి, అనావృష్టి, ఈదురు గాలులు, వరద ప్రవాహం తదితరాలతో పంటలు నష్టపోయే అన్నదాతలు బీమా పొందడానికి ఈ పథకం అనుకూలంగా ఉంటుందన్నారు. ఆసక్తిగల రైతులు తమ పరిధిలోని బ్యాంకులు, రైతు సంపర్క కేంద్రాలను సంప్రదించాలన్నారు.

ఒకే రోజు ఐదు ఇళ్లలో చోరీ

లింగసుగూరు (మాన్వి) : పట్టణ పురపాలక సంఘం పరిధిలోని కరడకల్‌లో ఐదు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. మొహర్రం సందర్భంగా శని వారం రాత్రి కత్తల్‌రాత్రి పూజలో ప్రజలందరూ నిమగ్నమై ఉండగా.. దొంగలు ఇళ్లలోకి చొరబడ్డారు. తలుపులు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దోపిడీకి పాల్పడ్డారు. రుద్రయ్యస్వామి అనే వ్యక్తి ఇంట్లో నాలుగున్నర తులాల బంగారం ఆభర ణాలు, 15 తులాల వెండి ఆభరణాలు, రూ.60 వేల నగదు దొంగిలించారు. గుండయ్యస్వామి, పవాడప్పనాయక్, మహాంతేశ్ కుంబార్ ఇళ్లలో చోరీ చేశారు. ఇద్దరు చోరులు ద్విచక్రవాహ నంపై వచ్చినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. స్థానిక పోలీసులు స్థల పరిశీలన చేసి బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు.

దారి మళ్లించారు... పాడుచేశారు

మరమ్మతుల ఆలస్యంతో చోదకులకు తిప్పలు

కేసీ మార్గంలో బయటకు వచ్చిన ఇనుప కడ్డీలు

ఆర్‌కే కాంప్లెక్స్ ముందు మలుపులో ఇలా..

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రధాన రహదారి మర మ్మతుల కోసం వాహనాల రాకపోకలను మరో దారికి మళ్లించడంతో అది పాడైన దుస్థితి బళ్లారి నగరంలో చోటుచేసుకుంది. నగరం నడిబొడ్డు నున్న గడిగి చెన్నప్ప కూడలి రహదారి 24 గంటలూ సంచార రద్దీతో ఉంటుంది. కొన్ని రోజుల కిందట చెన్నప్ప కూడలి రహదారికి అధి కారులు మరమ్మతులు చేపట్టారు. ఈ నేప థ్యంలో ఆ మార్గంలో వెళ్లే వాహనాల రాకపోక లను కృష్ణమాచారి(కేసీ) రోడ్డుకు మళ్లించారు. ఈ మార్గంలో సంచరించే వాహనాలు ఇందిరా కూడలి (సంగమ) నుంచి దర్గా మీదుగా జేడీ(ఎస్) కార్యాలయం, మీనాక్షి కూడలి, బళ్లారి జిల్లా వాణిజ్య, పరిశ్రమల సంస్థ కార్యాలయం, పాత పురపాలిక ముందు స్టేషన్ రహదారికి చేరుకుంటాయి. ఒకప్పుడు కేసీ రోడ్డు అద్దంలా ఉండేది. ఈ మార్గంలోకి వాహనాలను మళ్లించ డంతో భారీ వాహనాల రాకపోకలు పెరిగాయి. ఫలితంగా కేసీ రోడ్డు గుంతలమయంగా మారింది. దాదాపు మూడడుగుల లోతున గుంతలు పడటంతో కంకర తేలింది. తారు మొత్తం పగుళ్లిచ్చింది. వాహనచోదకులు దాన్ని గుర్తించడానికి కొందరు రాళ్లు పెట్టారు. రాత్రివే ళల్లో ఆ రాళ్లు కనబడక వాహనచోదకులు ప్రమా దాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో కేసీ రహదారిలో ఉన్న విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో కొనుగోలు చేయడానికి వస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కేసీ రోడ్డును బాగుచేయడంతో పాటు గడిగి చెన్నప్ప కూడ లిలో చేపట్టిన మరమ్మతులను త్వరగా పూర్తిచే యాలని వాహనచోదకులు, స్థానికులు అధికారు లను కోరుతున్నారు.

అర్బన్ ఆరోగ్య కేంద్రం ముందు రహదారి దుస్థితి

బళ్లారి వాణిజ్య, పరిశ్రమల సంస్థ కార్యాలయం వద్ద గుంతలు

నేడు సరఫరా నిలిపివేత

రాయచూరు: ఇక్కడి ఏపీఎంసీ యార్డు ఉప కేంద్రం పరిధిలో విద్యుత్తు నియంత్రిక మార్పుల్ని ఉన్నందున నగరం లోని కొన్ని ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండ దని అధికారులు తెలిపారు. ఎల్‌బీఎస్, సంతోషి, మైలార్ నగర్‌లు, అల్లం ప్రభు, విశ్వనాథ్, ఆశ్రయ కాలనీలు, చంద్రబండ రహదారి వీటి చుట్టు పక్కల ప్రదేశాల్లో విద్యుత్తును నిలివేస్తారు. అంతరాయానికి నగర పౌరులు సహకరించాలని జెస్కాం నగర ఇంజినీర్లు ఒక ప్రకటనలో కోరారు.

ఘనంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

కారటగి, న్యూస్‌టుడే: కార టగిలో భాజపా కార్యాల యంలో ఆదివారం జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా ఆచరించారు. ఆయన చిత్రప టానికి పూలు సమర్పించి నివా ళులర్పించారు. ఈ సంద ర్భంగా పార్టీ మండల అధ్య క్షుడు మంజునాథ మస్కి మాట్లాడుతూ భారతీయ జనసంఘ్‌ను స్థాపించిన ఆయన దేశానికి అందించిన సేవలను ఎవరూ మరువలేరన్నారు. కార్యక్రమంలో యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శశిధర్, ఓబీసీ జిల్లా కార్యదర్శి శరణబసవ తదిత రులు పాల్గొన్నారు.

కారటగి: శ్యామాప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పించిన భాజపా నాయకులు

గంగావతి, న్యూస్‌టుడే: గంగావ తిలోని భాజపా కార్యాలయంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్ర సాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటా నికి నాయకులు పూలమాలలు వేసి నమస్కరించుకున్నారు. శాసనసభ మాజీ సభ్యుడు పరణ్ణ మునవళ్లి ఈ సందర్భంగా శ్యామాప్రసాద్ దేశానికి చేసిన సేవల గురించి వివ రించారు. దేశ సమగ్రత కోసం ముఖర్జీ జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు.

పనులు త్వరగా పూర్తిచేయండి

కంప్లి, న్యూస్‌టుడే: పనులు వేగంగా పూర్తి చేసి తుంగభద్ర కుడి దిగువ ప్రధాన కాలు వకు నీరు వదలాలని రైతు సంఘం, హసిరు సేన నాయుకులు డిమాండు చేశారు. కాలువ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని వారు ఆది వారం వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లాధ్యక్షుడు బి.వి.గౌడ మాట్లా డుతూ కాలువ 9, 15వ కి.మీ. వద్ద పనులు జరుగుతున్నాయని అధికా రులు తెలిపార న్నారు. 9వ కి.మీ. వద్ద పనులు పూర్తవగా, 15వ కి.మీ. వద్ద ఇంకా చేస్తూనే ఉన్నార న్నారు. వాటిని త్వరగా ముగించి కాలువకు నీరు వదిలితేనే అన్నదాతలకు ప్రయోజనక రంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం జలాశయం నిండడంతో నదికి నీరు వదులుతున్నారని గుర్తుచేశారు. కాలువ పనులు త్వరగా ముగించి ఉంటే నీరు వృథా అయ్యేది కాదన్నారు. ఇప్ప టికైనా పనులు ముగించి కాలువకు నీరు వద లాలని ఆయన కోరారు.

ప్రధాన కాలువ వద్ద రైతు సంఘం నాయకులు

మంత్రికి ఆటోచోదకుల వినతి

అసంఘటిత రంగ కార్మికుల కిందకు వచ్చే ఆటో చోదకులకు ప్రభుత్వం ప్రకటించిన వివిధ సామాజిక భద్రత పథకాలు సక్రమంగా చేరడం లేదని బళ్లారి చోదకుల సంఘం అధ్యక్షుడు హుండేకర్ రాజేశ్ ఆరోపించారు. ఆయన ఆధ్వ ర్యంలో ఆటో చోదకులు కార్మిక శాఖ మంత్రి సంతోష్ ఎస్.లాడ్‌కు ఈమేరకు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. ప్రయాణికు లను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చడానికి 24 గంటల పాటు శ్రమిస్తున్న ఆటో చోదకులకు పథ కాలు సక్రమంగా అందేలా చూడాలని కోరారు. అధి కారులు డ్రైవింగ్ లైసెన్సుల సర్టిఫికేట్ ఇవ్వడం లేదని మంత్రికి ఫిర్యాదు చేశారు. -న్యూస్‌టుడే, బళ్లారి

కిష్కింధలోని ఆలయాల సందర్శన

కొప్పళ జిల్లా పాలనాధికారి సురేశ్ ఇట్నాళ ఆదివారం కిష్కింధలోని పలు ఆలయాలను సందర్శించారు. అంజనాద్రి కొండపై పూజలు చేశారు. అక్కడ రోప్‌వే, ప్రసాదం పథకం, యాత్రి నివాస్ నిర్మాణాన్ని పరిశీలించారు. తదుపరి పంపాసరోవరం ఆలయానికి వెళ్లి పునరుద్ధరణ పనులను పరిశీలించారు. మేగోట దుర్గమ్మను దర్శించి అక్కడి గోశాల వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట అదనపు జిల్లాధికారి సిద్రామేశ్వర, తహసీల్దార్ యు.నాగ రాజ్, గ్రామాధికారి చెన్నప్ప ఉన్నారు. -న్యూస్‌టుడే, గంగావతి

బాబు జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయుడు

బళ్లారి: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పి స్తున్న వెంకటేశ్ హెగ్డే తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: దేశ తొలి ఉపప్రధాని డా.బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిపారు. కేపీసీసీ వ్యాఖ్యాత, న్యాయవాది వెంకటేశ్ హెగ్డే నేతృ త్వంలో నాయకులు ఆనంద్‌బాబు, రాజు, హులు గప్ప, లోకేష్, సీన, రమేష్, నాగ, మదన్ తదిత రులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. జగ్జీవన్‌రామ్ 30 ఏళ్ల పాటు కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా దేశా భివృద్ధికి శ్రమించారని గుర్తుచేశారు. ఆయన సేవలు, ఆదర్శాలు అంద రికీ అనుసరణీయమని పేర్కొన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు హెచ్.హనుమంతప్ప ఆధ్వర్యంలో సభ్యులు ఈశ్వరప్ప, మల్లికార్జున, యంకమ్మ, సోమశేఖర్, తిప్పేస్వామి, ముక్కణ్ణ, బాబు, హొన్నూరప్ప, నాగరాజ్ తదితరులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా యంత్రాంగం, జడ్పీ, కన్నడ సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో డా.బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. మండలి రాష్ట్ర అధ్యక్షుడు ముండరగి నాగ రాజ, జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జడ్పీ సీఈవో మహమ్మద్ హ్యారీస్ సుమైర్, సమాజ కల్యాణశాఖాధికారి మల్లికార్జున, దళిత సంఘర్ష సమితి సంచాలకులు ఎ.మానయ్య తది తరులు పాల్గొన్నారు.

సిరుగుప్పలో అధికారులు, సంఘ, సంస్థల ప్రతినిధుల నివాళి

సిరుగుప్ప, న్యూస్‌టుడే: బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు ఎన్నటికీ మరువలే మని సాంఘిక సంక్షేమ శాఖ సహాయక నిర్దేశ కుడు సిద్ధయ్య అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం, సంఘ, సంస్థలు కలిసి నిర్వహించిన జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా కూడలిలోని ఆయన విగ్రహా నికి సిద్ధయ్య పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశ తొలి ఉప ప్రధానిగా పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమంతో పాటు దేశాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. నివాళుల ర్పించినవారిలో ఉప తహసీల్దార్ సిద్ధార్థ కారంజ, నగరసభ ఆరోగ్యాధికారి రంగస్వామి, తాలూకా పంచాయతీ నోడల్ అధికారి బసవరాజ్, డీఎస్ ఎస్ సంచాలకుడు గంగప్ప, నగరసభ సభ్యుడు చిదానంద రాయుడు, అధికారులు, సంఘ, సంస్థల ప్రతినిధులున్నారు.

● భాజపా కార్యాలయంలో పార్టీ తాలూకా అధ్యక్షుడు కుంట్నాళ్ మల్లికార్జునస్వామి, జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు ఎం.ఎస్.సిద్ధప్ప, నగ రసభ సభ్యులు బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి, జన సంఘ వ్యవస్థాపకుడు డా.శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలు సమర్పించి నివాళుర్పించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బస్సు

చోదకుడి మృతి, బస్సుకు మంటలు

అగ్నికీలల్లో కాలిపోతున్న బస్సు

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఓ ప్రైవేటు బస్సు ఢీకొనడంతో బచ్చబోరనహట్టి గ్రామవాసి, చోద కుడు రమేశ్(32) మృతి చెందగా, అగ్నికీలల్లో బస్సు చిక్కుకున్న ఘటన పుణె-బెంగళూరు జాతీయ రహదారిలో మదకరిపురం గ్రామం వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. బస్సు లోని ప్రయాణికులు త్రుటిలో పెను ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హొసపేటె నుంచి బెంగళూరుకు వెళుతున్న బస్సు మదకరిపురం వద్ద ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. చీకటిలో జరిగిన ఈ ఘటన బస్సు చోదకుడి దృష్టికి రాక పోవడంతో కింద చిక్కు కున్న ద్విచక్ర వాహనాన్ని, దాని చోదకుడు రమేశ్‌ను అలాగే ఈడ్చు కుంటూ కొద్ది దూరం నడిపాడు. ఫలితంగా ద్విచక్ర వాహనం పెట్రోలు ట్యాంకు పగిలి ఇంధనం కారింది. బస్సు చక్రాల రాపిడికి రాజుకున్న నిప్పు మంటలుగా మారి ద్విచక్ర వాహనంతో పాటు రమేశ్, బస్సు టైర్లకు వ్యాపించాయి. మంటలను గుర్తించిన బస్సు చోదకుడు దాన్ని రోడ్డుకు పక్కగా నిలిపాడు. వెంటనే బస్సులో ఉన్న 40 మంది ప్రయాణి కులు తమ సామగ్రితో కిందికి దిగడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం మంటలు బస్సు మొత్తం వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంట లను ఆర్పారు. దానికింద చిక్కుకొని మరణించిన రమేశ్ మృతదేహం గుర్తుపట్టడానికి వీలులేనం తంగా కాలిపోయింది. జిల్లా ఎస్పీ రంజిత్‌కు మార్ బండారు ప్రమాద స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. రమేశ్ మృతదేహాన్ని బయటకు తీసి శవపరీక్ష నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇద్దరు యువకుల దుర్మరణం

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు తాలూకా గుండా గ్రామం వద్ద ప్రధాన రహదారిపై ఆదివారం వేకు వజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . దేవీక్యాంపు వాసి కరణ్‌కుమార్ (25), సింధ నూరులోని గోడె కట్టువ వీధికి చెందిన రమేశ్(26) స్నేహితులు. ఇద్దరూ కలిసి శని వారం రాత్రి ముద్గల్‌లో మొహర్రం పీర్లను చూడ టానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. అనంతరం ఆదివారం వేకువన తిరిగి అదే వాహనంపై సింధ నూరు బయలుదేరారు. సింధనూరు శివారు గ్రామం గుండా వద్దకు చేరుకుంటుండగా రోడ్డుపై పడిన గుంతకు అడ్డుగా ఉంచిన రాళ్లను గమనించక ఢీకొని అమాంతం గాల్లోకి ఎగిరి కిందపడి పక్కకు దొర్లారు. వారి తలలకు పెద్ద దెబ్బలు తగిలి తీవ్ర రక్తస్రావం కావడంతో చనిపోయారు. ఉదయం అటుగా వెళుతున్న ప్రజలు మృతదేహా లను చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సింధనూరు తాలూకా తుర్విహాల ఎస్సై సుజాత ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నిస్వార్థ సేవకు రూపమే పాత్రికేయ వృత్తి

పత్రికా దినోత్సవంలో మాట్లాడుతున్న అభినవ గవిసిద్ధేశ్వర స్వామి

హొసపేటె, న్యూస్‌టుడే: పాత్రికేయ వృత్తి నిస్వార్థ సేవకు ప్రతి రూపమని, సంఘాన్ని తీర్చిదిద్దే బాధ్యత పాత్రికేయులపై ఉంటుందని కొప్పళ గవిమఠం అభినవ గవిసిద్ధేశ్వర స్వామి అన్నారు. విజయనగర జిల్లా పాత్రికేయుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి పత్రికా దినోత్స వంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కత్తికన్నా పదునైన కలాన్ని మంచికి వినియోగించాలని సూచించారు. వార్తల సేకరణ సమయంలో చాలా సందర్భాల్లో పాత్రికేయులు కష్టాల్లో పడు తుంటారని, వాటిని చాకచక్యంగా దాటుకోవాల న్నారు. ఎమ్మెల్యే గవియప్ప మాట్లాడుతూ దేశా భివృద్ధిలో పాత్రికేయుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్రాధ్యక్షుడు శివా నంద్ తగడూర్, జిల్లా పాలనాధికారి ఎం.ఎస్. దివాకర్, ఎస్పీ శ్రీహరిబాబు, హుడా అధ్యక్షుడు మహ్మద్ ఇమామ్ నియాజి, నగరసభ అధ్య క్షుడు రూపేశ్‌కుమార్, వార్తాధికారి ధనంజ యప్ప, సంఘం జిల్లాధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. తొలుత పది, పీయూ సీలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులు, సీనియర్ పాత్రికేయులను సన్మానించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

సిరుగుప్ప, న్యూస్‌టుడే: వైద్యులు మెరుగైన సేవలందించినప్పుడే ప్రజలు గుర్తిస్తారని ఎమ్మెల్యే బి.ఎం.నాగరాజు పేర్కొన్నారు. సిరు గుప్ప పట్టణంలోని విజయమేరి పాఠశాల రహ దారిలో కొత్తగా ఏర్పాటు చేసిన సురక్ష ఆసుప త్రిని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లా డారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ అధునాతన సౌకర్యాలతో ఆసుపత్రి పెట్టి ప్రజ లకు వైద్య సేవలు అందించడం అభినందనీయ మన్నారు. అత్యవసర సమయాల్లో రోగులు, బాధితులు మెరుగైన వైద్యం కోసం బళ్లారి, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఇక్కడే ఉత్తమ వైద్య సేవలు లభిస్తే ప్రజలకు ఉపయోగంగా ఉంటుంద న్నారు. తొలుత వైద్య దంపతులు కృష్ణవంశీ, స్నిగ్ధ కొడాలి ఎమ్మెల్యేకు మొక్క అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో పికార్డ్ బ్యాంకు అధ్యక్షుడు బసవనగౌడ, భాజపా నాయకుడు ధరప్పనాయక్, కమ్మవారి సంఘం అధ్యక్షుడు జాలాది రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు తాతినేని ప్రసాద్, కార్యదర్శి పోతుగుంట సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు కోనేరు గోపాలకృష్ణ, నిర్దేశ కులు వై.సత్యనారాయణ, ఎం.ప్రసాదరావు, వైద్యులు డా.మధుసూదన కారిగనూరు, రాజేశ్, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

రిబ్బన్ కత్తిరిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు తదితరులు

9న అఖిలభారత సార్వత్రిక సమ్మె

బళ్లారి, న్యూస్‌టుడే: కార్మికులను బాని సత్వంలోకి నెట్టే నాలుగు కార్మిక చట్టా లను రద్దు చేయాలంటూ కార్మిక సంఘాల ఉమ్మడి కమిటీ (జేసీటీయూ) పిలుపుతో 9న అఖిలభారత సార్వత్రిక సమ్మెకు పిలు పునిస్తున్నట్లు కార్మిక నేతలు సత్యబాబు, ఆదిమూర్తి, ప్రమోద్ తెలిపారు. వారు ఆది వారం బళ్లారిలో విలేకరులతో మాట్లా డారు. సమ్మెకు కార్మికులు, రైతులు, వివిధ ఉద్యోగ సంఘాలు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. ఆరోజు గడిగి చెన్నప్ప కూడలి నుంచి డీసీ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టి, జిల్లా పాలనాధికారికి వినతిపత్రం ఇస్తా మన్నారు. అనంతరం డీసీ కార్యాలయం ముందు సమావేశం నిర్వహిస్తామన్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మికు లను బలి చేయడానికే కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాలు తెచ్చిందని మండిపడ్డారు. పని గంటలు, వేతనం, సామాజిక భద్రత తదితరా లతో పాటు కార్మికుల ప్రాథమిక హక్కులకు ఈ చట్టాలతో భంగం కలుగుతుందని ఆరోపిం చారు. సమావేశంలో కార్మిక నాయకులు సూర్యనారాయణ, మల్లికార్జున, సోమశేఖర్ గౌడ, హనుమంతప్ప, సంగనకల్లు కృష్ణప్ప, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

రిబ్బన్ కత్తిరిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు తదితరులు

నేత్రపర్వంగా తొలి ఏకాదశి పూజలు

బళ్లారి గ్రామీణం: శ్రీరాంపురం కాలనీలో ప్రత్యే కాలంకారంలో పాండురంగడు, అమ్మవారు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి (శయన ఏకాదశి)ని పురస్కరించుకుని బళ్లారి నగరం, గ్రామీణంలోని వైష్ణవ ఆలయాల్లో వైభ వంగా పూజలు జరిగాయి. కమింగు రోడ్డులోని ఆలయంలో రుక్మిణీ, పాండురంగస్వామి విగ్రహా లను అర్చకులు పంచామృతాలతో అభిషేకిం చారు. తులసీ, పుష్పాలు, ఆభర ణాలతో స్వామివార్లను అలంక రించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించు కున్నారు. శ్రీరాంపురం కాలనీ, గుగ్గరట్టిలోని పాండురంగ, బ్రాహ్మణ వీధిలో చెన్నకేశవ స్వామి, ఇంద్ర నగర్‌లో పాండు రంగ, బాలాజీ క్యాంపులో లక్ష్మీ, బాలాజీ, పద్మావతి ఆలయాల్లో విశేషంగా స్వామివార్లను అలంక రించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భగవద్గీత పఠనం, భక్తి గీతాలు ఆలపిం చారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త సురేంద్ర రావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కంప్లి, న్యూస్‌టుడే: పండరీపురంలో బ్రహ్మ రథో త్సవం సందర్భంగా ఆషాఢ ఏకాదశిని పురస్కరించు కొని కంప్లిలోని రుక్మిణీ సమేత పాండురంగ ఆల యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు గంగ పూజ అనంతరం పల్లకీ, అఖండ విఠలవీణ సేవలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి సందర్భంగా శ్రీరామనగర్‌లోని గ్రామాలు, క్యాంపుల్లోని రామాలయాలు, వేంకటేశ్వర దేవస్థానాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం అభిషేకం అనంతరం విగ్రహా లను పూలు, పండ్లతో అలంకరించి భక్తు లకు దర్శన భాగ్యం కల్పించారు. కోటయ్య క్యాంపులోని కోదండ రామాలయం, శ్రీరా మనగర్, జంగమర కల్లుడి, గుండూరు క్యాంపు, హొసకేర క్యాంపు తదితర గ్రామా ల్లోని వైష్ణవ ఆలయాల్లో వివిధ ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

బళ్లారి గ్రామీణం: స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కంప్లిలో విశేషాలంకారంలో రుక్మిణీ, పాండురంగ స్వామి

శ్రీరామనగర్: కోటయ్య క్యాంపులో పూజలందుకున్న సీతారామలక్ష్మణ విగ్రహాలు

తుంగభద్ర జలాశయం నీటిమట్టం		
పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు		
6-07-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1625.26	1593.19
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	72,490	25,556
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	62,444	190
నీటి నిల్వ (టి.ఎం.సి)	77.343	13.901
గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు)	వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు	



చరిత్ర ఆనవాళ్లు.. జ్ఞానపు ఇల్లు

● ఆకట్టుకుంటున్న వస్తు సంగ్రహాలయం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: పూర్వీకులు వినియోగిస్తున్న వస్తువులు, సాంస్కృతిక పారంపర్యాగా మన ఇతిహాసాన్ని తెలిపే పురాతనమైన వస్తువులు, గత కాలంలో వినియోగించిన వస్తువులు, ఇతర సామగ్రి వాటి కథలను తెలిపేందుకు దక్షిణకన్నడ మంగళూరుకు చెందిన జాన్ ఎఫ్. కెనడీ నేతృత్వంలో రూపొందించిన జ్ఞానదమనే (జ్ఞానపు ఇల్లు) వస్తు సంగ్రహాలయం సందర్శకులకు ఆశ్చర్యం, ఆనందం కలిగిస్తోంది. ఈ జ్ఞానదమనే తుళు ప్రాంతానికి చెందిన ఇతిహాసం, సంస్కృతిని ప్రతిబింబించేలా అపురూపమైన సంగ్రహాలయంగా ఆకట్టుకుంటోంది. అలనాటి ఇతిహాసం తెలిపే ఖజానాగా ప్రతి వస్తువు తనదైన కథను తెలిపేలా ప్రదర్శనలో పొందుపరిచారు. ఆధునిక ప్రపంచంలో నేటి యువతరానికి అపూరూపమైన వస్తువుల ఇతిహాసాన్ని తెలియచేస్తోంది. గొప్ప జ్ఞానబండారంగా రూపుదిద్దుకున్న ఈ వస్తు సంగ్రహాలయాన్ని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో సందర్శకులు విచ్చేస్తున్నారు. పదహారేళ్ల నుంచి పురాతన వస్తువులను సేకరించి ఈ మ్యూజియం సిద్ధం చేశారు. జాన్ ఎఫ్. కెనడీ, సోదరుడు జెరాల్డ్‌డిసౌజా శ్రమకు విశేష స్పందన లభిస్తోంది. అనేక మంది సందర్శకులు వస్తుండటం మాకు చాలా ఆనందాన్ని కలిగిస్తోందంటున్నారు. ఇక్కడి పురాతన వస్తువుల వీక్షణకు వచ్చేవారందరికీ అపూర్వమైన జ్ఞానాన్ని ఇస్తుందన్నారు. ఈ వస్తు సంగ్రహాలయాన్ని వీక్షించేందుకు ప్రవేశం ఉచితంగా ఉంటుంది.

వస్తు సంగ్రహాలయంలో ఆకట్టుకుంటున్న మట్టికుండలు, పురాతనమైన వస్తువులు

16 ఏళ్ల శ్రమకు ఫలితం..

మంగళూరు సూరత్కల్ ఇందిరాక్యాంటీన్ సమీపంలో జ్ఞానదమనే వస్తు సంగ్రహాలయం సిద్ధమైంది. జాన్ ఎఫ్ కెనడీ 16 ఏళ్ల శ్రమ ఫలితంగా వేల ఏళ్ల కిందట వినియోగించిన పాత వస్తువులు, పూర్వికుల జీవిత కథలను తెలిపేలా మ్యూజియంను సిద్ధం చేశారు. కృషికి సంబంధించిన పరికరాలు, ఇతర సామగ్రి, కార్మికుల వస్తువులు, ధార్మిక, సాంస్కృతిక, పూజా సామగ్రి, వివిధ రకాల దీపాలు, ఏనుగులాంటి గంటలు, 1914లో వినియోగిస్తున్న పూజా పుస్తకం, పాత సాంకేతిక వస్తువులు గ్రామ్‌ఫోన్, రేడియో, ఫ్యాన్, వివిధ రకాల పాత గడియారాలు, కెమెరా, ఇస్త్రీ పెట్టె, 900 - 1000 ఏళ్ల నాటి పాత నాణేలు, ఆరువందల ఏళ్ల కిందట ఏనుగుల పేడతో చేసిన బొమ్మలు, 1940లో ఉన్న మిలిటరీ పెట్టె, పౌరాణిక జాతక పుస్తకాలు, నశ్యం డబ్బి, కీ చైన్, పాత సీసాలు, లోటాలు, పూలకుండీలు, బెండుతో చేసిన బుట్టలు ఇలా అన్ని వస్తువులను చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఇవన్నీ దాదాపుగా వందేళ్ల కిందట ఉన్న వస్తువులు, తుళునాడు జీవనశైలి, కృషి, ధర్మం ప్రతీకగా ఉన్న చిత్రాలు ఈ జ్ఞానదమనేలో పొందుపరిచారు. ఈ వస్తు సంగ్రహాలయం మొత్తం జాన్ ఎఫ్. కెనడీదే. ఓ చర్చికి కెనడీ వెళ్లినప్పుడు అక్కడ ప్రదర్శన ఉంచిన పాత వస్తువులను చూసి తాను కూడా ఇలాంటి పూర్వీకులు పురాతనమైన వస్తువులను సంగ్రహించేందుకు సంకల్పించారు. అప్పట్లో ఆయన సంకల్పంతో నేటి తరాలకు పురాతనమైన వస్తు సంగ్రహాలయం వీక్షించేందుకు సాధ్యమవుతోంది. నేడు జ్ఞానపు బాండాగారంగా పేరుపొందింది. అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెనడీ స్మరణార్థంగా ఆయన మృతి చెందిన రోజు, ఆయన పుట్టిన సందర్భంలో ఇతని తండ్రి చర్చి గురువులు ఇతనికి జాన్ ఎఫ్. కెనడీగా పేరుపెట్టారు. బుధవారం రోజున ఈ వస్తు సంగ్రహాలయం వీక్షించేందుకు ప్రవేశం ఉచితంగా ఉంటుంది. ఇతర రోజుల్లో ఫోన్ చేసి రావాలి. ఎలాంటి ప్రవేశ రుసుం లేదు. ఈ జ్ఞానదమనే వస్తు సంగ్రహాలయం కాదు. తుళు కుటుంబాల జీవనశైలి, సంస్కృతి, ఇతిహాసం దాఖాలాలకు ఇది నిదర్శనంగా ఉంది.

పాతకాలం రేడియోల సేకరణ

పూర్వీకులు వాడిన తామ్రపాత్రలు, టార్చిలైట్లు, అలనాటి వివిధ రకాల దీపాలు

అలనాటి వంట సామగ్రిని చూపుతున్న జాన్ కెనడీ

కానిస్టేబుల్‌పై పోక్సో కేసు

హుబ్బళ్లి, న్యూస్‌టుడే: ఆరేళ్ల బాలికపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడిన ఆరోపణలపై మంటికేరి ఠాణాలో కానిస్టేబుల్ హజరత్ మిట్టేఖాన్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. తన భర్త నిత్యం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఒక మహిళతో పరిచయం పెంచుకుని హజరత్ ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఇంటికి వచ్చి వెళుతూ ఆమె ఆరేళ్ల కుమార్తెతో అసభ్యంగా ప్రవర్తించాడు. తన కుమార్తెను లైంగికంగా వేధిస్తున్నట్లు గుర్తించిన ఆమె తండ్రి ఠాణాలో రుజువులతో సహా ఫిర్యాదు చేయడంతో అతని అకృత్యం వెలుగులోకి వచ్చింది.

ప్రేమ సందేశాన్ని పంపించిన పీడీవో

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: రాశ్వేరువు గ్రామ పంచాయతీ అధ్యక్షురాలికి పీడీఓ అశోక్ ఐ లవ్ యూ అంటూ సందేశాన్ని పంపించాడు. అధ్యక్షురాలు, అశోక్ ఇద్దరూ వివాహితులే. అశోక్, పంచాయతీ మాజీ అధ్యక్షురాలి భర్త ఏఎన్ బాబు రెడ్డి, ఇప్పటి సభ్యుడు నాగేశ్ ముగ్గురూ కలిసి భానుప్రకాశ్ అనే వ్యక్తిని బెదిరించి, ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించుకున్నారని, కులం పేరిట దూషించారని ఆమె ఆరోపించారు. ఇదే విషయమై తాను చేళూరు ఠాణాలో ఫిర్యాదు చేయడంతో ఐ లవ్ యూ అంటూ సందేశాన్ని పంపించాడని బాధితురాలు ఆరోపించారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

ఉడుపి, న్యూస్‌టుడే: చిక్కమగళూరు నుంచి కళసలో పర్యటనకు వచ్చిన ఒక యువతి (22)కి పండ్ల రసంలో మత్తు మందు కలిపి స్పృహ తప్పిన అనంతరం అత్యాచారానికి పాల్పడిన సంజయ్ కర్కేర (28) అనే నిందితుడ్ని కళస ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు 2024 జులై 11న అత్యాచారానికి పాల్పడ్డాడు. స్పృహ వచ్చిన అనంతరం ఆ యువతి జరిగిన విషయాన్ని గుర్తించి గొడవ చేయగా, నిన్నే వివాహం చేసుకుంటానని నమ్మించాడు. స్థానిక ఆలయానికి తీసుకువెళ్లి నుదుట కుంకుమ పెట్టి, పూలహారం వేసి వివాహం అయిపోయిందని చెప్పాడు. కుటుంబ సభ్యులతో కలిసి మంచి ముహూర్తం పెట్టించి ఘనంగా వివాహం చేసుకుందామని చెప్పి పంపించాడు. ఇటీవల మరో యువతితో నిశ్చితార్థం చేసుకున్నాడని తెలుసుకున్న యువతి, అతన్ని నిలదీసింది. నీకూ నాకు సంబంధం లేదని చెప్పడంతో అతనిపై ఫిర్యాదు చేసింది. నిందితుడ్ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

ప్రశ్నించినందుకు తల్వార్లతో దాడి

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే: మోదీ గార్డెన్ వద్ద పాలికెకు చెందిన స్థలంలో గ్యారేజ్ నిర్మిస్తున్న సైపుల్లా అనే రౌడీషీటరు, అతని అనుచరులను ప్రశ్నించిన ఇద్దరు యువకులపై తీవ్రంగా దాడి చేసి కొట్టారు. దాడిలో తీవ్రంగా గాయపడిన నవీన్, ప్రభు ఇద్దరినీ చికిత్స కోసం నిమ్హాన్స్‌లో చేర్పించారు. ఫిర్యాదు తీసుకునేందుకు డీజేహళ్లి ఠాణా పోలీసులు నిరాకరించడంతో బాధితుల తల్లిదండ్రులు నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్‌కు ఫిర్యాదు చేశారు.

గుండెపోటుతో యోధుడి మృతి

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: భారతీయ సైన్యంలో సేవలు అందిస్తున్న గంగాధరప్ప (54) గుండెపోటుతో మరణించారు. సెలవుపై చిక్కబళ్లాపురకు వచ్చిన ఆయనకు ఛాతీలో నొప్పి రావడంతో చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువెళుతుండగా మార్గం మధ్యలో మరణించారు.

చిక్కబళ్లాపురలో చెడ్డీ గ్యాంగ్

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్న చెడ్డీ గ్యాంగ్ ఇప్పుడు గౌరీబిదనూరులో తిరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిక్కర్లు మాత్రమే వేసుకుని, నలుగురు దుండగులు మారణాయుధాలతో తిరుగుతున్నట్లు రైల్వే స్టేషన్ సమీపంలోని సీసీ కెమెరాలో ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే తక్షణమే ఠాణాలో ఫిర్యాదు చేయాలని పోలీసులు కోరారు.

ఇద్దరి అరెస్టు

కార్వార, న్యూస్‌టుడే: భట్కళ తాలూకా ముండళ్లి సమీపంలోని నీరుగద్దె గ్రామంలో దున్నపోతు తల నరికి తీసుకువెళ్లిన ఆరోపణలపై అబ్దుల్ హుసేన్ (22), మహ్మద్ ఇబ్రహీం (55)లను పోలీసులు అరెస్టు చేశారు. హావేరి జిల్లా హానగల్‌కు చెందిన అబ్దుల్ హుసేన్ స్థానిక మదర్‌సాలో బోధకునిగా పని చేస్తున్నాడని భట్కళ గ్రామీణ ఠాణా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ హొన్నావర చుట్టుపక్కల పలు ఆవులను చంపి, మాంసాన్ని తీసుకువెళ్లారని ప్రాథమిక విచారణలో గుర్తించారు.

పోలీసు నివాసం ముందు ధర్నా

దావణగెరె, న్యూస్‌టుడే: చెన్నగిరి తాలూకా సోమలాపుర గ్రామంలో పోలీసు సిబ్బంది శివు నివాసం ముందు అతని భార్య విద్య (24) మృతదేహంతో కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. వివాహం చేసుకున్న ఆరు నెలల్లోనే ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించడంతోనే తమ కుమార్తె విద్య హాసన జిల్లా అరసికెరె స్టేషన్ వద్ద రైలుకు ఎదురుగా వెళ్లి బలవన్మరణానికి పాల్పడిందని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. శివు, అతని కుటుంబ సభ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే శివును అరెస్టు చేశామని పోలీసులు చెప్పడంతో మృతదేహానికి శనివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

భక్తులపై హిజ్రాల దాడి

బోయకొండ(చౌడేపల్లె), న్యూస్‌టుడే: బోయకొండ భక్తులపై హిజ్రాలు దాడి చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. కర్ణాటకలోని సీకే పల్లెకు చెందిన దేవరాజు, మంగమ్మలతో పాటు మరో కొంతమంది ఆటోలో చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలోని బోయకొండ అమ్మవారి దర్శనానికి వచ్చారు. గుర్తించిన హిజ్రాలు వీరిని డబ్బులు అడగగా.. ఇవ్వకపోవడంతో వెంటపడి రణబేరి గంగమ్మ ఆలయం వద్ద అడ్డుకున్నారు. భక్తుడు రూ. 150లు ఇవ్వగా నిరాకరించి రూ. వెయ్యి ఇవ్వాల్సిందేనని డిమాండు చేశారు. దీంతో హిజ్రాలకు భక్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలోనే వారు భక్తులపై దాడి చేసి గాయపరిచారు. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రతి ఆదివారం ఇదే తంతు జరుగుతున్నా.. పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు.

దేవతా విగ్రహాల ధ్వంసం


విరూపమైన విగ్రహాలు

శివమొగ్గ: రాగిగుడ్డ పరిధి శాంతినగర వార్డు బంగారప్ప లేఅవుట్‌లోని వినాయకుడు, నాగ శిలలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. నిందితులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని భాజపా అధ్యక్షుడు విజయేంద్ర, హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. హిందువులు, ఆలయాలపై దాడులు, విగ్రహాలను ధ్వంసం చేస్తున్న వారిని ప్రభుత్వం ఉపేక్షించడంతోనే ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని విజయేంద్ర దుయ్యబట్టారు. సీనియరు పోలీసు అధికారులు ఘటన జరిగిన ప్రాంతానికి వచ్చి విగ్రహాలను పరిశీలించారు. శాంతిభద్రతలను కాపాడేదిశలో ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని స్థానికులను కోరారు. ప్రస్తుతానికి పరిస్థితులు అదుపులో ఉన్నాయని పోలీసు అధికారులు తెలిపారు.

మరో ఇద్దరి అరెస్టు : శివమొగ్గ బంగారప్ప లేఅవుట్‌లో వినాయకుడు, నాగశిలను విరూపం చేయడం, కాలితో తన్నడం, నాగశిలను మురుగు కాలువలో పడేసిన ఆరోపణలపై ఇద్దరు యువకులను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. స్థానిక సీసీ కెమెరా, వీడియో ఫుటేజ్ ఆధారంగా వారిని అదుపునకు తీసుకుని విచారణ చేపట్టారు.

యువకుడ్ని దోచుకున్న యువతి

దావణగెరె: మ్యాట్రిమోనీలో పరిచయమైన యువతి వివాహం చేసుకుంటానని నమ్మించి ఒక యువకుడ్ని (29) దోచుకుంది. క్రిప్టో కరెన్సీలో మదుపు చేస్తే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి ఆ యువ ఇంజనీరు నుంచి రూ.9.34 లక్షల నగదును తన ఖాతాకు బదిలీ చేయించుకుంది. ఇప్పుడు చరవాణి స్విచ్ ఆఫ్ చేసిస్పందించకపోవడంతో బాధితుడు ఠాణాలో ఫిర్యాదు చేశారు.

విశ్రాంత అధికారులకు ప్రత్యేక శిబిరం

నేత్ర పరీక్ష చేయించుకుంటున్న సైనికుని తల్లి

బెళగావి, న్యూస్‌టుడే: సైన్యం నుంచి పదవీ విరమణ చేసిన సైనికులు, వారి కుటుంబ సభ్యులు, వీరనారీల కోసం మద్రాస్ రెజిమెంటల్ సెంటర్‌లో శౌర్య సంప్రవాహ్ పేరిట ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. లెఫ్టినెంట్ కర్నల్ కలామ్ సింగ్, బ్రిగేడియర్ కృష్ణేందు దాస్‌లు శిబిరాన్ని ప్రారంభించారు. వీరనారి, వీరమాతలకు స్మరణికలు వితరణ చేశారు. నేత్ర, దంత వైద్య పరీక్షలు, ఈసీజీ పరీక్షలు చేయించుకున్నారు. పింఛను, ఇతర సమస్యలకు సంబంధించి విశ్రాంత సైనికులు, వారి కుటుంబాల నుంచి వినతిపత్రాలు అందుకున్నారు. ధార్వాడ, హుబ్బళ్లి, గదగ, ప్రాంతాల నుంచి విశ్రాంత సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.

స్మరణిక అందిస్తున్న అధికారులు

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	95
క్యారెట్-	105
బీరకాయలు-	55
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	35
సొరకాయ-	45
దొండకాయలు-	45
పొట్లకాయ-	35
టమాటా(నాటు)-	25
టమాటా(సాధారణ)-	20
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	30
ఉల్లి(మేలురకం)-	30
ఉల్లి(సాధారణ)-	25
వెల్లుల్లి-	190
సాంబారు ఉల్లి-	170
బీట్‌రూట్-	40
వంకాయలు-	60
బెండకాయలు-	55
ముల్లంగి-	45
నిమ్మకాయ-	280

పండ్లు,ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	420
సిమ్లా ఆపిల్-	285
గ్రీన్ ఆపిల్-	395
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	45
బొప్పాయి-	35
ఆరంజి-	195
బత్తాయి-	95

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

రూ.30 వేల జరిమానా

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: తెల్లని దుస్తులను డ్రై క్లీనింగ్‌కు ఇస్తే బూడిద రంగుకు మారిపోయాయని గాయత్రి అనే గృహిణి వినియోగదారుల న్యాయస్థానంలో ఫిర్యాదు చేశారు. ఆమె నుంచి తీసుకున్న రూ.845 రుసుముతో పాటు రూ.30 వేలు పరిహారంగా ఇవ్వాలని రిచ్‌మండ్ కూడలిలోని ఐలాండ్రీ డ్రైక్లీనర్‌ను వినియోగదారుల కోర్టు అధ్యక్షురాలు కె అనితా శివకుమార్ ఆదేశించారు. వినియోగదారురాలు చేసిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకోకుండా, ఐల్యాండ్రీ ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని వినియోగదారుల కోర్టు గుర్తించింది.

బెంగళూరు మాకు ప్రత్యేక హబ్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: బెంగళూరు నగరం తమకు ప్రత్యేక హబ్‌గా ఉందని జమ్ము-కశ్మీరు విద్యార్థులు పేర్కొన్నారు. ఎంఈఐటీ పూర్వ విద్యార్థుల సంఘం ఆదివారం ఇక్కడ సమావేశమై వేడుకలను ఆచరించుకుంది. బెంగళూరులో విద్యాభ్యాసాన్ని చేసిన తాము దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల్లోనూ ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ముందంజలో ఉన్నామని ఇస్రోలో శాస్త్రవేత్తగా సేవలు అందిస్తున్న నమిత్ రారోత్రా తెలిపారు. ప్రస్తుతం ఎంఐఈటీలో 350 మంది జమ్ము-కశ్మీరుకు చెందిన వారు ఉన్నారని గుర్తు చేశారు. విశ్రాంత మేజర్ జనరల్ ఎస్‌కె శర్మ, సంఘం అధ్యక్షుడు మోహిత్ గుప్త తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

జమ్ము, కశ్మీరు విద్యార్థులు

ఎమ్మెల్యే నివాసంలో హైడ్రామా

బీదర్, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే ప్రభు చౌహాన్ కుమారుడు ప్రతీక్ చౌహాన్‌కు మహారాష్ట్రలోని ఉద్గీర్‌కు చెందిన యువతితో కొద్ది నెలల క్రితం నిశ్చితార్థం జరిగింది. వివాహం చేసుకోకుండా కాలం వెళ్లదీస్తున్నారంటూ యువతి తల్లిదండ్రులు, బంధువులు ఔరాద్ తాలూకా బోంతి తాండాలోని ప్రభు చౌహాన్ నివాసానికి వచ్చారు. మాటలు పతాక స్థాయికి చేరుకుని ఒకరిని మరొకరు దూషించుకున్నారు. ఒకరిని మరొకరు తోసుకోవడంతో కొందరు గాయపడ్డారు. సమాచారం అందుకుని ఔరాద్ ఠాణా పోలీసులు అక్కడకు వెళ్లే సరికి పరిస్థితి సద్దుమణిగింది. మీ సంబంధం వద్దంటూ యువతి తరపు వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

● నిప్పులగుండంలో నడిచిన భక్తులు

బళ్లారి గ్రామీణ: గ్రహం రోడ్డులో పీర్లకు రజత కవచం, పుష్పాలతో అలంకరణ

బళ్లారి: కురుగోడులో పీర్లను దర్శనం చేసుకుంటున్న భక్తులు

బళ్లారి: బళ్లారి జిల్లావ్యాప్తంగా మొహర్రంను శనివారం భక్తిశ్రద్ధలతో ఆచరించారు. తోరణగల్లు, కుడతిని, సండూరు, కుడతిని తదితర ప్రాంతాల్లో పీర్లను సుందరంగా అలంకరించి చావడిలో కూర్చోపెట్టి పూజలు చేశారు. బళ్లారి నగరంలోని మిల్లర్‌పేటె, పింజారి వీధి, ఆలదహళ్లి, భత్రి, మహనంది కొట్టం, బ్రూస్‌పేటె, వడ్డరబండ ప్రాంతాల్లో పీర్లకు హిందూ, ముస్లిం సోదరులు బెల్లం, చక్కెర చదివించారు. పుష్పాలు, గుర్రాలు, ఊయల, దుస్తులు, గొడుగులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రధాన వీధుల్లో చేపట్టిన పీర్ల ఊరేగింపులో యువకులు పులి వేషాలు ధరించి చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం తెల్లవారుజామున పీర్లను ఎత్తుకున్న భక్తులు నిప్పుల గుండంలో నడిచారు. ముందుజాగ్రత్తగా జిల్లా వ్యాప్తంగా ఎస్పీ నేతృత్వంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముఖ్యమంత్రి క్షమాపణలు చెప్పాలి

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: కర్ణాటకలో పలు జిల్లాల్లో సంభవిస్తున్న గుండెపోటు మరణాలకు కొవిడ్ సమయంలో వేయించుకున్న కొవిడ్-19 వ్యాక్సిన్ కారణమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొనడాన్ని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఖండించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమితితో పాటు కేంద్ర ఆరోగ్య శాఖ కూడా గుండెపోటు మరణాలకు జీవన, ఆహార శైలి మార్పులే కారణమని స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బెంగళూరులో విలేకరులతో ఆదివారం మాట్లాడుతూ, నిరాధారమైన వ్యాఖ్యలు చేసిన సీఎం ప్రతి ఒక్కరికీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో 110-120 కోట్ల మంది వ్యాక్సిన్ వేయించుకున్నారని గుర్తు చేశారు. సిద్ధరామయ్య దేశీయ వ్యాక్సిన్ వేయించుకున్నారా విదేశీ టీకా వేయించుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్న సిద్ధరామయ్యపై కేసు ఎప్పుడు నమోదు చేస్తారో చెప్పాలని మంత్రి ప్రియాంక్ ఖర్గేను విపక్ష నేత అశోక్ ప్రశ్నించారు.

ప్రతిభావంతుల్ని ప్రోత్సహిద్దాం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన, ఆదివాసీల కుటుంబాల్లో ప్రతిభావంత విద్యార్థులు చదువుకునేందుకు ప్రతి ఒక్కరూ సాయం చేయాలని లోకాయుక్త విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సంతోశ్ హెగ్డే పిలుపునిచ్చారు. కష్టపడి ఉన్నత స్థానానికి, స్థాయికి చేరుకున్న వారు తమ సముదాయంలోని ఇతరులకు ఆపన్న హస్తాన్ని చాచాలని హితవు పలికారు. మూలనివాసి అంబేడ్కర్ సంఘం సభ్యులు పది, పీయూసీలో ఉత్తమ మార్కులు, ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరించి, ప్రోత్సాహకాలు వితరణ చేసి మాట్లాడారు. విద్యతోనే పేదరికం, అస్పృశ్యత తొలగిపోతాయని తెలిపారు. సంఘం అధ్యక్షుడు మునిరామప్ప, కర్ణాటక జనపర సంఘం అధ్యక్షుడు జె. శ్రీనివాస్, నటి అనుష్క శెట్టి తండ్రి విఠల శెట్టి, ఆయా రంగాలకు చెందిన బీఎన్ ఎస్ రెడ్డి, రంగప్ప, హూడి విజయకుమార్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జస్టిస్ సంతోష్ హెగ్డే, ఇతర ప్రతినిధులతో సత్కారం అందుకున్న విద్యార్థులు

సంతోశ్ జార్కిహొళి కోసం గాలింపు

బెళగావి, న్యూస్‌టుడే: గోకాక లక్ష్మీదేవి జాతరలో గాల్లోకి తూటా పేల్చిన ఎమ్మెల్యే రమేశ్ జార్కిహొళి కుమారుడు సంతోశ్ జార్కిహొళి పరారీలో ఉన్నాడని పోలీసులు గుర్తించారు. తూటా పేల్చిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో అతను పరారయ్యాడు. చట్టప్రకారమే సంతోశ్‌పై పోలీసులు చర్యలు తీసుకుంటారని హోం మంత్రి పరమేశ్వర్ ఇప్పటికే స్పష్టం చేశారు.

దర్శన్ నివాసంలో పూజలు

మైసూరు: నటుడు దర్శన్ మైసూరులోని తన నివాసంలో, ఫాంహౌస్‌లో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేసుకున్నారు. ప్రతి ఏటా ఆషాఢ మాసంలో చాముండేశ్వరి పూజను తన నివాసంలో చేయించుకోవడం ఆనవాయితీగా చేయించుకుంటూ వస్తున్నారు. సిద్ధార్థ లేఅవుట్‌లోని నివాసంలో చాముండి మాత విగ్రహానికి పూల అలంకరణ చేసి, పూజలు చేశారు. తల్లి మీనా తూగుదీప, సోదరుడు దినకర్, భార్య విజయలక్ష్మితో కలిసి పూజల్లో పాల్గొన్నారు.

EENADU Classifieds

FINANCIAL SERVICES

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్సియల్ సర్వీసెస్. -91 99669 10410.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

11న దూరతీర మానదలి రాక

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ప్రముఖ హీరోయిన్ శృతిహరిహరన్ నటిస్తున్న 'దూరతీర మానదలి' చిత్రం రాష్ట్రవ్యాప్తంగా ఈనెల11న విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వచ్చిందని దర్శకుడు మంసోరె తెలిపారు. శృతిహరిహరన్ ప్రత్యేక గౌరి పాత్రను పోషిస్తున్నారు. గౌరి చిత్రకథకు ప్రధానమన్నారు. ఆపాత్ర చుట్టు చిత్రకథ తిరుగుతుందన్నారు.

దూరతీర మానదలి చిత్రంలో శృతిహరిహరన్

'తిప్పారళ్ళిలి తిమ్మణడాక్రు' టీజర్ వచ్చేసింది

బెళగావి పారిశ్రామిక వేత్త గిరీశ్ ప్రకాశ్ భస్మె హీరోగా నటిస్తున్న 'తిప్పారళ్ళిలి తిమ్మణ్ణ డాక్రు' చిత్రం టీజర్ విడుదలైంది. రేణుకాంబ స్టుడియోలో టీజర్ కార్యక్రమం జరిగింది. టీజర్ విడుదలైన కొన్ని గంటల్లో ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వచ్చిందని దర్శకుడు కె. మోహన్ కుమార్ తెలిపారు. హీరోయిన్ పావని, మైసూరు రమానంద, అలిశా, సతీశ్‌గౌడ తదితరులు నటిస్తున్నారు. బెంగళూరు, రామనగర, కుందలగెరె, మైసూరు తదితర ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరించనున్నారు.

తిప్పారళ్ళిలి తిమ్మణ్ణ డాక్రు చిత్రబృందం

ఓమై ఇండియా పాటలు టీజర్‌విడుదల కార్యక్రమంలో చిత్రబృందం

ఓమై ఇండియా పాటలు విడుదల

కొత్త నటులతో ఓ మై ఇండియా' చిత్రం పాటలను చాముండేశ్వరి స్టుడియోలో జరిగిన కార్యక్రమంలో టీజర్ ఇటీవల విడుదల చేశారు. దేశాభివృద్ధి కోసం నేటి యువత ఏమి చేయాలి. సమాజాన్ని మార్చేందుకు యువత ఎలా శ్రమించాలనే సందేశాన్ని చిత్రం ద్వారా అందిస్తున్నట్లు దర్శకుడు జి. ఎన్. కృష్ణమూర్తి తెలిపారు. ప్రత్యేక పాత్రలో ప్రముఖ నటుడు సాయికుమార్ నటిస్తుండగా అవినాశ్, సుచేంద్రప్రసాద్, చిత్రాశెణై, ఇషాద్ అహ్మద్ తదితరులు నటిస్తున్నారు. జి. భట్ సంగీతం అందిస్తున్నారు.

వై.ఎస్.రామ్ హీరో గణేశ్

ప్రముఖ హీరో గణేశ్ ఆంజనేయుడి అవతారంలో' వై. ఎస్. రామ్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. గణేశ్ పుట్టిన రోజు సందర్భంగా ఆంజనేయుడి పాత్రతో కూడిన పోస్టర్‌ను విడుదల చేశారు. దిరాయల స్టుడియో బ్యానర్‌పై చిత్రాన్ని నిర్మిస్తున్నారు సంగీతం జైఅనూప్ సీళిన్ అందిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో పలుదృశ్యాలను చిత్రీకరిస్తున్నారు. ఏడాది ఆఖరిలో విడుదలకు సిద్ధం చేస్తున్నారు.

ఆంజనేయ పాత్రలో హీరోగణేశ్

బెంగళూరు

• బెంగళూరు • కోలారు • మైసూరు • హోసూరు • చిక్కబళ్లాపుర • తుమకూరు

పాండురంగ విఠల్‌కు ప్రత్యేక పూజలు

పాండురంగ విఠల విగ్రహానికి పూజలు చేస్తున్న డీకే శివకుమార్, తదితరులు

బెంగళూరు (అడుగోడి), న్యూస్‌టుడే : ఆషాఢ ఏకాదశి సందర్భంగా ఆదివారం ఇక్కడి రాజాజీనగరలోని దాసాశ్రమ అంతర్గత ట్రస్టు ఆవరణలో ఉన్న పాండురంగ విఠల్ విగ్రహానికి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమంలో ఉన్న విఠల్ మహాస్వాములను కలిసి పాదాభిషేకం చేశారు. అనంతరం ట్రస్టు నిర్వహిస్తున్న కార్యకలాపాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని డీకే శివకుమార్ హామీ ఇచ్చారు.

ఉద్యానవనానికి 'కెంపేగౌడ'గా నామకరణం

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే : బెంగళూరు నగర నిర్మాత కెంపేగౌడను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని దాసరహళ్లి ఎమ్మెల్యే మునిరాజు సూచించారు. ఆదివారం శెట్టిహళ్లి వార్డులోని భైరేశ్వర నగరలో నూతనంగా నిర్మించిన ఉద్యానవనానికి కెంపేగౌడ ఉద్యానవనంగా నామకరణం చేశారు. ఈ సందర్భంగా పౌరకార్మికులను సత్కరించి వారికి బహుమతులు, కెంపేగౌడ చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖులు సోమశేఖర్, మంజునాథ్, లలితమ్మ, గౌరమ్మ, అబ్బిగెరె మంజు, రమేష్ పాల్గొన్నారు.

సురేష్ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మునిరాజు, తదితరులు

హో సూ రు క బు ర్లు

హోసూరు అభివృద్ధికి తిలోదకాలు

విలేకరులతో మాట్లాడుతున్న మనోహరన్, తదితరులు

హోసూరు, న్యూస్‌టుడే : చెందుతున్న నగరాల్లో హోసూరు 18వ స్థానంలో ఉండగా, ఇక్కడి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని హోసూరు మాజీ ఎమ్మెల్యే కె.ఎ.మనోహరన్ ఆరోపించారు. ఆదివారం స్థానిక హోసూరు కామరాజ కాలనీలోని ఐ.ఎన్.టి.యు.సి. కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హోసూరు నగరానికి నిత్యం వేలాది మంది ప్రయాణికులు వస్తుంటారని, బస్టాండ్‌లో రద్దీ కారణంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫ్లైఓవర్ మీద బీటలు ఏర్పడిన కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం నెలకొంటోందన్నారు. పట్టణ మధ్యలో రింగ్‌రోడ్డుకు వాహనాలు మళ్లించడంతో ఆ మార్గంలో రద్దీ అధికమైందన్నారు. కలెక్టర్, అధికారులు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఇన్‌ఛార్జి మంత్రి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. హోసూరు అభివృద్ధికి పలు పథకాలు అమలు చేస్తున్నప్పటికీ.. ఒరిగింది శూన్యమన్నారు. మౌలిక సమస్యలపై కలిసొచ్చిన నాయకులు, అధికారులు మూడు, నాలుగో పారిశ్రామికవాడలను ఏర్పాటు చేస్తామని విస్మరించారని మనోహరన్ ఎద్దేవా చేశారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సత్యమూర్తి, ఎం.మునిరాజ్, చిన్నగుట్టప్ప, విద్యా సంస్థల ప్రతినిధి మారెప్ప తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

300 మందికి డీఎంకే సభ్యత్వాలు

కార్యకర్తలతో ఎమ్మెల్యే, మేయర్, ఉప మేయర్

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు-తళి రోడ్డులోని మెనిక మహల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎ.ఐ.ఎ.డి.ఎం.కె, ఇతర పార్టీలకు చెందిన 300 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే వై.ప్రకాష్, మేయర్ ఎస్.ఎ.సత్య, ఉప మేయర్ సి.ఆనందయ్య సమక్షంలో డీఎంకే పార్టీలో చేరారు. వీరికి సభ్యత్వాలు ఇచ్చి పార్టీలోకి ఆహ్వానించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇతర పార్టీ కార్యకర్తలు డీఎంకేలో చేరేందుకు కృషి చేసిన కార్పొరేటర్లు చిన్నరాజు, మంజుళ మునిరాజ్‌ను నాయకులు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజప్ప, మునిరాజ్‌నాగేష్, రామచంద్రప్ప, ప్రకాష్, హనుమంతప్ప, టైలర్ ప్రకాష్‌బాబు, మురుగన్, శ్రీరామ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామకోటి వార్షికోత్సవాలు

పూజల్లో సాధుమాత వెంకటమ్మ, లగుమప్పస్వామి, భక్తులు

యలచేపల్లి, (బేలెకె), న్యూస్‌టుడే : శూలగిరి యూనియన్ యళచేపల్లి గ్రామంలోని పుట్టలింగేశ్వర స్వామి ఆలయంలో రామకోటి వార్షికోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త సాధుమాత వెంకటమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో దేవతామూర్తులకు అభిషేకం, పూల అలంకరణ, అర్చనలు, వివిధ పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ దేవతలను ప్రతిష్ఠించారు. నారాయణస్వామి మంజమ్మ రామలింగేశ దీపోత్సవంతో నిండుకలశం తలపై మోస్తూ ఆలయ ప్రదర్శన, గోపూజ చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు లగుమప్పస్వామి, నారాయణస్వామి, మంజమ్మ, లగుమప్పగౌడు, భక్తులు పాల్గొన్నారు.

పాదచారి ఆక్రమణల తొలగింపు ముమ్మరం

కుందనపురలో పాదచారి మార్గంలో ఉన్న బంకు తొలగిస్తున్న సిబ్బంది

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : నగరంలోని వివిధ ప్రాంతాల్లో పాదచారి ఆక్రమణలను తొలగించే పాలికె అధికారులు కొనసాగిస్తున్నారు. పాదచారులు సంచరించేందుకు అడ్డువచ్చే వస్తువులు, బంకులు, తోపుడు బండ్లు, కట్టడాలను కూల్చివేస్తున్నారు. వస్తువులను ట్రాక్టర్లలో పాలికె కార్యాలయానికి తరలిస్తున్నారు. మహదేవపుర, బొమ్మనహళ్లి విభాగాల పరిధిలో వైట్‌ఫీల్డ్, కుందాపుర, కోడిగేహళ్లి, అంజనాపుర, జన్నేరుఘట్ట రహదారి తదితర ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగింపు ఆదివారం కూడా కొనసాగించారు. పాదచారి మార్గాలను పూర్తిగా ఆక్రమించుకుని అక్కడ వ్యాపారం చేస్తున్నారు. ప్రజలు వాహన సంచార మధ్య రహదారుల్లో సంచరిస్తున్నారు. ఆసమయంలో రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ముందస్తు హెచ్చరికలు చేయకుండా పాదచారి మార్గాలలో ఉన్న బంకులను జేసీబీ యంత్రాల సాయంతో తొలగిస్తున్నారు.

కట్టడాలను జేసీబీ యంత్రం ద్వారా కూల్చివేతలు

వ్యాపారం కోసం నిర్మించిన చిన్న తరహా కట్టడాలను కూల్చివేయడం మొదలు పెట్టారు. బీబీఎంపీ అధికారి మహేశ్వరరావు పాలికె చీఫ్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి ఆయన పాదచారి మార్గాల ఆక్రమణలపై దృష్టి సారించారు. వారానికి రెండు రోజులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి పాదచారి మార్గాల ఆక్రమణలను పరిశీలించి తొలగించాలని ఆదేశిస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి ఆక్రమణలను గుర్తించి పాదచారి మార్గాలను ఇప్పుడు మొత్తం తొలగించారు. తొలగించిన పాదచారి మార్గాలను బాగు చేసి ప్రజలు సంచరించేందుకు అవకాశం కల్పిస్తున్నారు.

తుమకూరు: జ్యోతిని వెలిగిస్తున్న మంత్రి పరమేశ్వర్, ఎమ్మెల్యే జ్యోతి గణేశ్, జిల్లాధికారి శుభకల్యాణ్ తదితరులు

చిత్రదుర్గం : చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తాజ్‌పీర్ తదితరులు

మహనీయుల జీవితాలు స్ఫూర్తిదాయకం

తుమకూరు, న్యూస్‌టుడే : తుమకూరు నగరంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు అయ్యే ఖర్చును తానే భరిస్తామని హోం మంత్రి డా.జి.పరమేశ్వర్ హామీ ఇచ్చారు. జిల్లాధికారి కార్యాలయ సభాప్రాంగణంలో ఆదివారం మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ వర్ధంతిని జ్యోతి వెలిగించి చిత్రపటానికి పుష్పార్చన చేసి మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చే ప్రజల ఆశయాలు నెరవేరాలని జగ్జీవన్‌రామ్ పేర్కొన్నారన్నారు. దేశనాయకుల వర్ధంతులు, జయంతులు వారి ఆశయాలు, ఆదర్శాలను గుర్తు చేస్తాయన్నారు. వారి జీవిత చరిత్రలు రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. సముదాయ భవనం, విగ్రహ ప్రతిష్ఠాపన పనులను త్వరగా చేపట్టాలని, ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని జిల్లాధికారి శుభకళ్యాణ్‌కు మంత్రి సూచించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలో మన ప్రభుత్వం అంతర్గత రిజర్వేషన్ అమలు చేయడం తథ్యమని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2.50 లక్షల ఉద్యోగాల నియామకం చేపట్టాల్సి ఉందని, పోలీస్ శాఖలో 18 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. కారాగారాల్లో 38 శాతం ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని, ఆరోగ్యశాఖ, విద్యాశాఖలో నియామకాలు జరగాల్సి ఉందన్నారు. అంతర్గత రిజర్వేషన్ వ్యవహారాలు పూర్తి అయ్యే వరకు నియామకాలు, పదోన్నతులు వద్దని ప్రభుత్వం తీర్మానించినట్లు మంత్రి పరమేశ్వర్ వివరించారు. కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే జ్యోతిగణేశ్, జిల్లాధికారి శుభకళ్యాణ్, ఎస్పీ అశోక్, సీఈవో ప్రభు, అదనపు జిల్లాధికారి తిప్పేస్వామి, ఏసీ నాహిదా జమ్‌జమ్, సాంఘిక సంక్షేమశాఖ అధికారి కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

చిత్రదుర్గం : మాజీ ఉప ప్రధానమంత్రి దివంగత బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయశాఖ మంత్రిగా వ్యవసాయ రంగానికి ఇచ్చిన ప్రోత్సాహంతో అప్పట్లో దేశ ప్రజలు ఎదుర్కొన్న ఆహార ధాన్యాల సమస్యను పరిష్కరించారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాజ్‌పీర్ తెలిపారు. ఆదివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతిని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, ఉపాధ్యక్షులు మైలారప్ప తదితరులు పాల్గొన్నారు.

తుమకూరులో ఊరేగింపుగా సాగుతున్న పీర్లు

భక్తిశ్రద్ధలతో మొహరం

తుమకూరు, న్యూస్‌టుడే : మొహరం సందర్భంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా హిందూ, ముస్లింలు భక్తిశ్రద్ధలతో పీర్లకు మొక్కులు తీర్చుకున్నారు. వారం రోజులుగా పీర్లను ప్రతిష్ఠించి నిత్యం పూజలు చేశారు. నగరంలోని శాంతినగర్, దాంబివి చౌక్, రాజీవ్‌గాంధీ నగర, వీరసాగర్‌లతో పాటు వివిధ బడావణల్లో పీర్లను చిక్కపేటె బాబయ్య గుడికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ప్రార్థనలు అనంతరం అగ్నిగుండం ప్రవేశం జరిపింది.

వ్యాధులను నిర్లక్ష్యం చేయకూడదు

సమావేశంలో వైద్యులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : వివిధ వృత్తుల్లో పని చేసే వారికి వచ్చే శరీరబాధలను నొప్పికి గురవుతుంటాయని ప్రముఖ వైద్యుడు డాక్టర్ సుధీర్ దారా తెలిపారు. దీర్ఘకాలంగా నొప్పులను ఎదుర్కొంటున్న వారు సొంత, నాటు వైద్యాలపై ఆధారపడకుండా, వైద్యుడిని త్వరగా సంప్రదించాలని సూచించారు. సహకార నగరలో తమ ఐసియాన్ శాఖను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు తమ ఆసుపత్రి వైద్యులు 35 వేలకు పైగా బాధితులకు చికిత్సలు అందించామని చెప్పారు. ఒకే చోట కూర్చుని పని చేసేవారు, కంప్యూటర్లను వినియోగించేవారు, శరీరక శ్రమతో పనిచేసేవారు, నడక తీరులో మార్పు చేసుకోని వారు, ఊబకాయులు వెన్నెముక నొప్పి, ఇతర అస్థి సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. సమావేశంలో ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ శ్రీహర్ష, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాదబ్రహ్మ విఠలోత్సవం

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : ఉడుపి పేజావర మఠాధిపతి విశ్వప్రసన్నతీర్థ ఆదేశం మేరకు ఇక్కడి కత్రిగుప్పెలోని శ్రీపూర్ణప్రజ్ఞ విద్యాపీఠంలక్ష ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా నాదబ్రహ్మ విఠలోత్సవం పేరిట ఏర్పాటు చేసిన వినూత్న సంగీత కార్యక్రమం సాహిత్యాభిమానులను ఆకట్టుకుంది. విదూషి దివ్యాగిరిధర్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తులందరినీ అలరింపచేసింది. పక్కవాద్యాల్లో విద్వాన్ చిదంబర జోషి-హార్మోనియం, తబలావాదన-విద్వాన్ ప్రమోద్‌గబ్బూర్, తాళం-విద్వాన్ వెంకటేష్ పరోహిత్‌నాథ్ సాథ్ వీనులవిందు చేశారు.

చిట్టీ పేరిట వంచించి పరారీ

బెంగళూరు (జేపీనగర): జరగనహళ్లికి చెందిన సుధ అనే గృహిణి తన భర్తతో కలిసి చిట్టీల వ్యాపారం చేసేది. గత రెండు దశాబ్దాలుగా చీటీ వ్యాపారం చేస్తున్న ఆమె ఇప్పటి వరకు నగదు చెల్లింపుల్లో పారదర్శకంగా వ్యవహరించిందని 600 మంది కొత్తగా చీటీలు వేశారు. ఒక ఏడాది నుంచి చిట్టీ పాడుకున్న వారికి నగదు ఇవ్వకుండా కథలు చెబుతూ వచ్చింది. పాట పాడుకున్న వారి నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో ఇల్లు ఖాళీ చేసి, కుటుంబ సభ్యులతో కలిసి ఆమె అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. బాధితుల ఫిర్యాదుతో పుట్టేనహళ్లి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

శరణ్ పంప్‌వెల్‌పై నిషేధం

చిక్కమగళూరు, న్యూస్‌టుడే: హిందూ సంఘాల నాయకుడు శరణ్ పంప్‌వెల్ చిక్కమగళూరు జిల్లాలోకి అడుగుపెట్టకుండా పోలీసులు నిషేధాన్ని విధించారు. యువకులను హిందూ సంఘాల్లో కార్యకర్తలుగా చేర్చేందుకు శరణ్‌తో బహిరంగ సభలను నిర్వహించాలని కొందరు నేతలు ప్రణాళికను రూపొందించుకున్నారు. ఆగస్టు 4 వరకు జిల్లాలోకి ఆయన అడుగుపెట్టకుండా పోలీసులు నిషేధాజ్ఞలు జారీ చేశారు.

శ్రీమఠంలో కన్నడ నటుడు యువరాజ్

మఠం ప్రాకారంలో కన్నడ నటుడు యువరాజ్ కుమార్

మంత్రాలయం, న్యూస్‌టుడే: బృందావనాన్ని దర్శించుకోవడానికి కన్నడ సూపర్ స్టార్ దివంగత డాక్టర్ రాజ్‌కుమార్ మనవడు, రాఘవేంద్ర రాజ్‌కుమార్ కుమారుడు యువరాజ్ కుమార్ ఆదివారం మంత్రాలయం వచ్చారు. శ్రీమఠం తరఫున వీరికి అధికారులు ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూల బృందావనం దర్శించుకున్నారు. యువరాజ్ కుమార్‌తో ఫొటోలు దిగేందుకు కన్నడ భక్తులు పోటీపడ్డారు. ఆయన నటించిన రెండో చిత్రం ఈనెల 18న విడుదల సందర్భంగా వారు మంత్రాలయం చేరుకొని బృందావనానికి పూజలు నిర్వహించారు.

జాలహళ్లిలో వైమానిక దళం అథ్లెటిక్స్ పోటీలు

అథ్లెటిక్స్ మారథాన్ విజేతల ఆనందహేల

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : ఎయిర్‌ఫోర్స్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్, హెడ్ క్వార్టర్స్ ట్రైనింగ్ కమాండ్ ఆధ్వర్యంలో జరిగిన అథ్లెటిక్స్ మారథాన్ పోటీలు ఆసక్తికరంగా జరిగాయి. ఇక్కడి జాలహళ్లి క్రీడాప్రాంగణంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ఈ క్రీడల్లో తూర్పు ఎయిర్ కమాండ్ క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. మారథాన్ పోటీల్లో కూడా ఈ జట్టు క్రీడాకారులే విజయం సాధించారు.

మీరు అర్హులా.. ఇప్పుడూ దరఖాస్తు చేసుకోవచ్చు

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న పంచ గ్యారంటీ పథకాలకు సంబంధించి అర్హులు ఇప్పుడు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా హామీ పథకాల అమలు అథారిటీ ఛైర్మన్ యలువనహళ్లి రమేశ్ తెలిపారు. జిల్లా పరిపాలన, జిల్లా పంచాయతీతో కలిపి గ్యారంటీ పథకాల జారీకి సంబంధించిన నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులకు ఎప్పుడూ అన్యాయం జరగకుండా తమ సమితి చర్యలు తీసుకుంటోందని వివరించారు. సమితి ప్రతినిధులు సుబ్బారెడ్డి, రామకృష్ణప్ప, ఆదిరెడ్డి, జయరామ్, మునిరారయణప్ప తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

భైరసంద్రలో ఇ.ఖాతా పత్రాల పంపిణీ

లబ్ధిదారులకు పత్రాలు అందిస్తున్న నాగరాజు, తదితరులు

బెంగళూరు (కుమారస్వామి లేఅవుట్): ఆస్తులు సంరక్షణ కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ-ఖాతా పథకం ద్వారా లబ్ధిదారులకు అందించే కార్యక్రమాన్ని ఆదివారం ఇక్కడ ప్రభుత్వ గ్యారంటీ పథకాలు అమలు సమితి అధ్యక్షుడు ఎన్.నాగరాజు ప్రారంభించారు. జయనగర, జేపీనగర, భైరసంద్ర తదితర ప్రాంతాల్లో ఆయన ఇంటింటికీ వెళ్లి ఇ.ఖాతా పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఆస్తుదారులు తమ ఆస్తులు సంరక్షణ కోసం ఇ-ఖాతాను ఎలాంటి ఫీజులు తీసుకోకుండా ప్రభుత్వం ఉచితంగా చేసి లబ్ధిదారులకు అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

లోక్ అదాలత్ సేవలు వినియోగించుకోండి

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి భవాని, శిల్ప

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : ఈ నెల 12న నిర్వహించే లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవల ప్రాధికార అధ్యక్షురాలు, న్యాయమూర్తి నెరెలే వీరభద్రయ్య భవాని పిలుపునిచ్చారు. న్యాయమూర్తి విలేకర్లతో మాట్లాడుతూ కోర్టుల్లో పరిష్కారం కాని సివిల్, చెక్కు బౌన్సు, విద్యుత్తు బోర్డుకు సంబంధించిన కేసులను అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని గుర్తు చేశారు. అవసరానికి అనుగుణంగా ప్రభుత్వ న్యాయవాదుల సేవలను కక్షిదారులు ఉచితంగా వినియోగించుకోవచ్చన్నారు. సమావేశంలో ప్రాధికార సభ్య కార్యదర్శి శిల్ప పాల్గొన్నారు.

ఉడుపి శ్రీకృష్ణమఠంలో తప్త ముద్రాధారణ

స్వామీజీతో ముద్రాధారణ చేయించుకుంటున్న భక్తుడు

భక్తులకు ముద్రాధారణ చేస్తున్న సుగుణేంద్రతీర్థ, సుశీంద్రతీర్థ

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : ఉడుపి శ్రీకృష్ణ మఠంలో తొలి ఏకాదశి నేపథ్యంలో ఆదివారం తప్త ముద్రాధారణ కార్యక్రమాన్ని ఘనంగా ఆచరించారు. పర్యాయ పుత్తిగె మఠాధిపతి సుగుణేంద్రతీర్థ శ్రీపాదరు, జూనియర్ స్వామీజీ సుశీంద్ర తీర్థ భక్తులకు తప్తముద్రాధారణ చేశారు. శ్రీకృష్ణమఠం ఆవరణంలో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో వేలాది మంది భక్తులు బారులు తీరారు. ఉదయం సుదర్శన హోమం తర్వాత స్వామీజీలు భక్తులకు తప్తముద్రాధారణ చేపట్టారు.

చామరాజపేట శ్రీపాదరాజర మఠంలో..

ఆషాడమాసం తొలి ఏకాదశి సందర్భంగా ఇక్కడి చామరాజపేట రాఘవేంద్రకాలనీలోని ముళబాగిలు శ్రీపాదరాజర మఠంలో ఆదివారం తప్తముద్రాధారణలో వేలాది మంది భక్తులు శ్రీపాదరాజర మఠాధిపతి శ్రీసుజయనిధి తీర్థ శ్రీపాదరుముద్రాధరణతో తప్తముద్రాధరణ చేయించుకున్నారు.

జయనగర, బసవనగుడి మఠాల్లో ..

వైష్ణవ సంప్రదాయంలో ముద్రాధారణ పరమ పవిత్రమైనది. ఆషాడమాసం తొలి ఏకాదశి ఆదివారం వివిధ మాధ్వ మఠాల్లో భక్తులకు ఆయా మఠాధిపతులు, స్వామీజీలు ముద్రాధారణ చేశారు. జయనగర నంజనగూడు రాఘవేంద్రస్వామి మఠంలో మంత్రాలయం స్వామీజీ సుబుదేంద్రతీర్థరు, బసవనగుడి నేషనల్ కళాశాల సమీపంలోని ఉత్తరాధిమఠంలో సత్యాత్మతీర్థ శ్రీపాదంగళవరు, పేజావరమఠాధిపతి విశ్వప్రసన్నతీర్థరు ముద్రాధారణ చేయించారు. వేలాది మంది భక్తులు ముద్రలు వేయించుకున్నారు.

ముద్రాధారణకు వేచి ఉన్న భక్తులు

రహదారులకు ఇరువైపుల వృక్షాల పందిర్లు

అభివృద్ధి పథకాల కోసం నరికివేసిన చెట్లు

వృక్షాల నరికివేత.. పర్యావరణానికి ముప్పు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : బెంగళూరు నగరంలో వివిధ అభివృద్ధి పథకాలు అమలు కోసం గత 15 ఏళ్లలో 50 వేల చెట్లను నరికివేశారు. దీని వల్ల ఆయా ప్రాంతాల్లో వాతావరణంలో మార్పులు వస్తున్నట్లు పరిసరవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్లను నరికివేయడం వల్ల వాతావరణం మార్పులకు లోనవుతుందని పరిసరవాది డాక్టర్ యల్లప్పరెడ్డి తెలిపారు. రహదారులు విస్తరణ, వంతెనల నిర్మాణం, కట్టడాలు, నమ్మ మెట్రో, సబర్బన్ రైలు పథకం, ఇన్నర్ రైలు మార్గం తదితర పథకాలకు చెట్లు బలైనట్లు గుర్తించారు. ప్రస్తుతం సబర్బన్ రైలు పథకం కోసం వేయి చెట్లు నరికివేతకు సిద్ధంగా ఉన్నారు. కంటోన్మెంట్ కాలనీలో వాణిజ్య భవనాల నిర్మాణం కోసం ఆరు వందల చెట్లను నరికివేస్తామని ప్రకటించారు. లేఅవుట్‌ల నిర్మాణం సమయంలో చెట్లను తొలగించారు. తొలిదశ నమ్మమెట్రో నిర్మాణం కోసం ఐదు వేల చెట్లను నరికివేసిన విషయం తెల్సిందే. ఇప్పుడు కొత్తగా చేపట్టిన మెట్రో పథకాలు అమలుకు మూడు వేలు చెట్లను తొలగించేందుకు పాలికె అనుమతులు కోరారు. ఇలా చెట్లను నరుక్కుంటూ పోతే వాతావరణంలో తీవ్ర పరిణామాలు సంభవిస్తామని పరిసర నిపుణులు హెచ్చరిస్తున్నారు.

దావణగెరె బడావణె ఎస్సై ఆత్మహత్య

నాగరాజు

తుమకూరు, న్యూస్‌టుడే : తుమకూరు నగరంలోని ద్వారక హోటల్ గదిలో దావణగెరె బడావణె పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై నాగరాజు (55) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆయన ఈ నెల 1వ తేదీ హోటల్‌లో గది అద్దెకు తీసుకొన్నారు. ఆదివారం ఉదయం దుర్వాసన వస్తుండడంతో హోటల్ సిబ్బంది గది పైభాగం నుంచి చూడగా ఆత్మహత్య వెలుగుచూసింది. గదిని బుక్ చేసుకొన్నప్పటి నుంచి ఎస్సై బయటికి రాలేదని, చరవాణికి ఫోన్ చేసినా స్పందన లేదని, గదిని శుభ్రం చేయడానికి వెళ్లగా తెరవక పోవడంతో సిబ్బందికి అనుమానం వచ్చి యజమానికి సమాచారం ఇచ్చారు. ఫ్యాన్‌కు ఉరి వేసుకొని చనిపోయినట్లు గుర్తించారు. కుటుంబ కలహాలతో.. రెండు పేజీల లేఖ రాసి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ గోపాల్ పరిశీలించారు. తుమకూరు నగర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఊహాతీత కథనాలు ప్రమాదకరం

సత్కారం పొందిన పాత్రికేయులతో మంత్రులు, ఎమ్మెల్యే, అధికారులు

తుమకూరు, న్యూస్‌టుడే : కన్నడ పత్రికోద్యమానికి రెండు వందల సంవత్సరాల చరిత్ర ఉందని, ప్రింటింగ్, ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో ఊహాతీత కథనాలు ప్రమాదకరమని ముఖ్యమంత్రి మాధ్యమ సలహాదారుడు కె.వి.ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. తుమకూరు నగరంలోని జిల్లా పంచాయతీ సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన పత్రికా దినోత్సవంలో పాత్రికేయులను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ రక్షణకు, మానవహక్కుల సంరక్షణకు పత్రికోద్యమం కీలకపాత్ర పోషిస్తోందన్నారు. కేంద్ర మంత్రి వి.సోమణ్ణ మాట్లాడుతూ పత్రికోద్యమం ఆలోచనలు దేశంలోని అనేక సమస్యలకు పరిష్కారం లభించినట్లు గుర్తుచేశారు. సత్య, వాస్తవ విషయాలను సమాజానికి తెలపడమే మాధ్యమం కర్తవ్యమన్నారు. దేశ ప్రగతికి ఆశాకిరణాలు పత్రికలన్నారు. మంత్రి పరమేశ్వర్ మాట్లాడుతూ 180 దేశాల్లో మనదేశం 159వ స్థానంలో మన జర్నలిజం నిలవడంపై ఆలోచించాలన్నారు. పత్రికలు వాస్తవాలను స్పష్టంగా తెలియజెప్పే విధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే జ్యోతిగణేష్, జిల్లాధికారి శుభాకల్యాణ్, సీఈవో ప్రభు, ఎస్పీ అశోక్, ఎ.సి.నాహిదా జమ్‌జమ్, తహసీల్దార్ రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యే గంగహనుమయ్య, ఎడిటర్ నాగణ్ణ, జిల్లా పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు పురుషోత్తమ్, ప్రధానకార్యదర్శి రఘురాం, పాత్రికేయులు పాల్గొన్నారు.

హంతకుని అరెస్టు

చామరాజనగర, న్యూస్‌టుడే: నిండు గర్భిణి శోభ (25)ను ఆమె భర్త మహేశ్ దారుణంగా హత్య చేశాడు. మృతురాలి సోదరి ఫిర్యాదుతో చామరాజనగర తూర్పు ఠాణా పోలీసులు కార్యాచరణ హంతకుడ్ని అరెస్టు చేశారు. భార్య నడవడికను అనుమానిస్తూ ఆమెను శారీరకంగా, మానసికంగా హింసిస్తూ వచ్చాడు. ఒకదశలో సహనాన్ని కోల్పోయి తీవ్రంగా కొట్టడంతో ఆమె మృతి చెందిందని ప్రాథమిక విచారణలో గుర్తించారు.

కోరమంగళలో దిబేర్‌హౌస్ ప్రారంభం

బెంగళూరు (అడుగోడి), న్యూస్‌టుడే : నూతన దుస్తులకు ఖ్యాతి పొందిన దిబేర్‌హౌస్ నగరంలోని కోరమంగళలో ప్రారంభమైంది. వివిధ బ్రాండ్ల దుస్తులను వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. నగరంలో తొలిసారిగా దుస్తులు దుకాణాన్ని ప్రారంభించామని దిబేర్ హౌస్ వ్యవస్థాపకులు హర్ష, తన్వి సోమయ్య తెలిపారు. ప్రస్తుతం ప్రజలు ఇష్టపడుతున్న దుస్తులను అందుబాటులోకి తెచ్చామని ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు మెచ్చే వివిధ బ్రాండ్ల దుస్తులు ఉన్నట్లు తెలిపారు. బెంగళూరుతో పాటు హైదరాబాద్, పుణెలో తమ దుకాణాలు ఉన్నట్లు చెప్పారు.

సౌందర్య సాధనాల విడుదల

బెంగళూరు (న్యాతిప్పసంద్ర) : అమెజాన్ సంస్థ సౌందర్య సాధనాల కోసం బ్యూటివర్క్ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈనెల 12 నుంచి ప్రారంభం కానున్న ప్రైమ్ డేకు ముందు బ్యూటీవర్క్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆసంస్థ డైరెక్టర్ సిద్ధార్థ భగత్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఆరువందలకు పైగా మోడల్స్, బాలీవుడ్ తారలు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ సౌందర్య సాధనాలను విడుదల చేస్తామని ప్రకటించారు.

(c) eenadu

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

అధ్యక్షుడిగా నియమించలేదు

బెంగళూరు(యశ్వంతపుర): ఏఐసీసీ వెనకబడిన వర్గాల జాతీయ సలహా మండలి అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను నియమించలేదని ముఖ్యమంత్రి సచివాలయం స్పష్టం చేసింది. ఆదివారం ఇక్కడ సీఎం మాధ్యమ విభాగం ప్రకటన విడుదల చేసింది. సలహా మండలి అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను పార్టీ అధిష్ఠానం నియమించినట్లు సాగుతున్న ప్రచారం వాస్తవం కాదన్నారు. సలహామండలి సభ్యుల్లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఒకరని తెలిపారు. సలహా మండలి సమావేశాన్ని బెంగళూరులో ఈనెల15న ఏఐసీసీ ఓబీసీ విభాగం అధ్యక్షుడు డాక్టర్ అనిల్‌జైహింద్ అధ్యక్షతన జరుగుతుందని, జేసీన్ భారత్ జోడో భవన్‌లో సమావేశం జరుగుతుందని వివరించారు.

'నేనే మొదటి నటిని'

మడికేరి, న్యూస్‌టుడే: కొడవ సముదాయం నుంచి చిత్ర పరిశ్రమకు వచ్చిన మొదటి నటిని తానేనని రశ్మిక మందణ్ణ వ్యాఖ్యానించారు. ఒక ఛానెల్‌కు ఇచ్చిన ముఖాముఖిలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈమె వ్యాఖ్యలకు కొడవ సముదాయానికి చెందిన వారితో పాటు, నెటిజన్లు కూడా విమర్శించారు. గతంలో తాను హైదరాబాద్ యువతినని చెప్పుకోవడం, తనకు కన్నడ భాష రాదని చెప్పడంతో ట్రోలింగ్‌కు గురయ్యారు. కొడగు జిల్లా నుంచి పలువురు చిత్రపరిశ్రమకు వచ్చి తారలుగా గుర్తింపు పొందగా, తానే మొదటి నటిని అని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని నెటిజన్లు విమర్శలు గుప్పించారు. గతంలో తానే చేదానన్ని, తన కన్నా ముందే పలువురు భారతీయ వెండి తెరపై కనిపించారని సీనియర్ నటి ప్రేమ ఈ సందర్భంలో పేర్కొన్నారు.

బిరబిరా పరుగెడుతున్న కృష్ణమ్మ

రాయచూరు, న్యూస్‌టుడే: ఎగువన జోరు వానలతో కృష్ణవేణమ్మ పరుగులు తీస్తోంది. జలాశయాల్లోని బంధనాలుతెంచుకుని ముందుకు ఉరుకుతోంది. వరద పోటు తాకిడికి ఆలమట్టి ఆనకట్ట (ఆదివారం సాయంత్రంకు) 89.268 టీఎంసీలతో కళకళలాడుతోంది. ఒక రోజు సమయంలో 1.276 శతకోటి ఘనపుటడుగుల వరద నీరు చేరింది. మరో 33.813 టీఎంసీల (పూర్తి సామర్థ్యం 123. 081) నీళ్లు వస్తే నిండిపోతుంది. ఈ జలాశయం లోకి 1,24,666 క్యూసెక్కుల ఉద్ధృతి కొనసాగుతుండగా.. దిగువన నదికి 1,15,000 క్యూసెక్కులను పంపారు. గత రోజు కంటే అవుట్‌ఫ్లో, ఇన్‌ఫ్లో పెరిగింది. నారాయణపుర డ్యామ్ 30 గేట్లను ఎత్తి జల విద్యుత్తు కేంద్రానికి, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు(గద్వాల్ జిల్లా, తెలంగాణ)లోకి 1,12,577 క్యూసెక్కులు వదిలారు. 1,15,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రస్తుతం నారాయణపురలో 26.74 టీఎంసీల (గరిష్ఠ మట్టం 33.313) నీటి నిల్వ ఉంది. ఈ నెల 8న రెండు ఆనకట్టల పరిధిలోని కాలువలు, ఉపకాలువలకు నీటిని విడుదల చేయనున్నారు. తొలి సాగుకు నాలుగు నెలలు సరఫరా చేస్తారు. డ్యామ్‌లు క్రమేపీ నిండుతున్నందున ఉత్తర కర్ణాటక రైతాంగం ఆనందంగా ఉంది. చివరి ఆయకట్టు ప్రాంతానికి సక్రమంగా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

'అబ్బే.. నాకేం తెలియదు'

పార్టీ పదవిపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టీకరణ

విధానసౌధ వద్ద డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలు వేస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రులు డాక్టర్ మహదేవప్ప, కె.హెచ్.మునియప్ప, భైరతి సురేశ్, తదితరులు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ఏఐసీసీ వెనకబడిన వర్గాల జాతీయ సలహా మండలి ఏర్పాటు, దానికి తనను అధ్యక్షుడిగా నియమించడం తనకు తెలియదని, ఈ విషయంపై సమాచార మాధ్యమాల ద్వారా తెలుసుకున్నానని, పార్టీ అధిష్ఠానంతో మాట్లాడతానని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. రాష్ట్రంలో సెప్టెంబరులో రాజకీయ విప్లవం వస్తుందని, రాష్ట్ర కాంగ్రెస్‌లో బలమైన మార్పులు వస్తాయన్న ప్రచారం సాగుతున్న సమయంలో ఏఐసీసీ వెనకబడినవర్గాల జాతీయ సలహా మండలి అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను నియమించినట్లు ప్రచారం వైరల్ కావడం రాజకీయ రంగంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఆదివారం ఇక్కడ విధాన సౌధ వద్ద మాజీ ఉప ప్రధాని దివంగత డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఏఐసీసీ వెనకబడిన వర్గాల జాతీయ సలహా మండలి అధ్యక్షుడిగా నియామకంపై ముఖ్యమంత్రి స్పందిస్తూ మాట్లాడారు. మండలికి తనను అధ్యక్షుడిగా చేయాలని తాను కోరలేదన్నారు. తాను పత్రికల్లో చదివి తెలుసుకున్నట్లు తెలిపారు. అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను స్వీకరిస్తారా? అని పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ బాధ్యతలు అప్పగిస్తే చేపట్టాల్సిన అవసరం ఉందని, దాని నుంచి వెనక్కి వెళ్లడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. అధిష్ఠానంతో చర్చించి తనకు ఇచ్చిన బాధ్యతలు, పదవి నిర్వహణ తదితర వాటిపై చర్చిస్తానని తెలిపారు. గతంలో ఏఐసీసీ ఓబీసీ విభాగం అధ్యక్షుడు తనను కలిసి కర్ణాటకలో సమావేశం నిర్వహించేందుకు అవకాశం ఇవ్వాలని కోరగా తాను ఈనెల 15వ తేదీ నిర్ణయించినట్లు చెప్పారు. ఇప్పుడు అధిష్ఠానం మండలి ఏర్పాటుచేసి దానికి అధ్యక్షుడిగా చేయడంపై అధిష్ఠానంతో చర్చిస్తానని తెలిపారు.

గ్యారంటీ పథకాలు నిలపబోం

రాష్ట్రంలో అమలులో ఉన్న గ్యారంటీ పథకాలను నిలిపే ప్రశ్నే లేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేశారు. పేదల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి గ్యారంటీ పథకాలు అమలులోకి తెచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో రహదారులు, వంతెనలు అభివృద్ధికి కాంగ్రెస్, భాజపా, జేడీఎస్ ఇలా పార్టీలకు అతీతంగా నిధులు విడుదల చేస్తున్నామని తెలియజేశారు. హరిత విప్లవానికి మాజీ ఉపప్రధాని దివంగత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ నాంది పలికారని గుర్తు చేశారు. దేశాభివృద్ధికి ఆయన అపారమైన సేవలు చేశారని తెలిపారు. మంత్రులు డాక్టర్ హెచ్.సి.మహదేవప్ప, కె.హెచ్.మునియప్ప, భైరతి సురేష్, మాజీ మంత్రి ఆంజనేయ తదితరులు హాజరయ్యారు.

విద్యాలయాన్ని సమష్టిగా అభివృద్ధి చేద్దాం

ప్రసంగిస్తున్న ఉప కులపతి శివానంద, ఆచార్యులు

రాయచూరు, న్యూస్‌టుడే: మహర్షి వాల్మీకి విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా నియమితులైన డాక్టర్ శివానంద కెళగినమని శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ముందు ఉప కులపతిగా పనిచేసిన డాక్టర్ సుయిమీంద్ర కులకర్ణి, రిజిస్ట్రార్ డాక్టర్ చెన్నప్ప తదితరులు కొత్త వీసీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శివానంద మాట్లాడుతూ వర్సిటీని ప్రగతి పథంలో నడిపించేందుకు నిబద్ధత, నిష్ఠ, క్రమశిక్షణతో శ్రమిస్తానని ప్రకటించారు. విశ్వవిద్యాలయానికి రాష్ట్ర స్థాయిలో మంచి పేరు తేవటానికి మెరుగైన సలహాలు, సూచనలు ఇవ్వాలని, అధ్యాపకులు, సిబ్బంది ఒక కుటుంబంగా కలసి పనిచేద్దామన్నారు. సుయిమీంద్ర మాట్లాడుతూ ఉప కులపతి ఆశయాన్ని నెరవేర్చేందుకు సంపూర్ణంగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. రిజిస్ట్రార్ చెన్నప్ప మాట్లాడుతూ బోధనా ప్రమాణాలను పునరుద్ధరించేందుకు కృషి చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. విద్యాభివృద్ధి చేస్తూ, మౌలిక వసతులను సమకూర్చుకుని ఆదర్శ వీసీగా మారాలని ఆయ కులపతి లక్ష్యానికి అండగా నిలుద్దామన్నారు. కార్యక్రమంలో డీన్‌లు ఆచార్య పార్థసారథి, భాస్కర్, కళాశాల అభివృద్ధి మండలి నిర్దేశకుడు డాక్టర్ రాఘవేంద్ర ఫత్తేపూర, ఆర్థిక విభాగం అధికారి డాక్టర్ వెంకటేష్, అతిథి అధ్యాపకుడు శరణప్ప పాల్గొన్నారు.

శభాష్.. నీరజ్‌చోప్రా

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత ప్రపంచ నెం.1 జావెలిన్ త్రో ఛాంపియన్ నీరజ్‌చోప్రా తన ప్రతిభా సామర్థ్యంతో బెంగళూరు క్రీడాభిమానుల ప్రశంసలందుకున్నాడు. శనివారం రాత్రి జరిగిన నీరజ్‌చోప్రా క్లాసిక్ ఈవెంట్‌లో స్టార్ క్రీడాకారుడు నీరజ్‌చోప్రా తన క్రీడా సామర్థ్యంతో అగ్రస్థానం చేపట్టి బంగారు పతకాన్ని సాధించి తన సత్తాను నిరూపించుకున్నాడు. అతని పేరుతోనే ఈ పోటీలు నిర్వహించడంతో నీరజ్ విజేతగా నిలవడం అభిమానులకు ఆనందాన్ని కలిగించింది. ఈ పోటీల ముగింపు వేడుకల్లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, గవర్నర్ థావర్‌చంద్‌గహ్లోత్, హోంమంత్రి జి.పరమేశ్వర్ నీరజ్‌చోప్రా ప్రతిభను వీక్షించి హర్షం వ్యక్తం చేశారు. విజేతలకు సీఎం, గవర్నర్ తదితర ప్రముఖులు జ్ఞాపికను, బంగారు, రజత, కాంస్య పతకాల బహుమతులు ప్రదానం చేశారు. పేరొందిన విదేశీ దిగ్గజుల క్రీడా సామర్థ్యానికి వేదికైన ఈ పోటీల నిర్వహణతో సీఎం, గవర్నర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి ప్రతిష్ఠాత్మకమైన క్రీడాపోటీల నిర్వహణతో యువతరాలకు క్రీడల్లో ఆసక్తి పెరిగేలా అవుతుందనే అభిప్రాయాలను వెల్లడించారు. భారత క్రీడా ఇతిహాసంలోనే కొత్త అధ్యయనానికి శ్రీకారం చుట్టిన ఘనత కంఠీరవ క్రీడాంగణానికి దక్కింది. క్రీడానగరంగా పేరుగాంచుతున్న ఉద్యానవనగరంలో తొలిసారిగా ఈ పోటీల నిర్వహణతో స్టేడియం మొత్తం అభిమానులతో కిక్కిరిసింది. నీరజ్‌చోప్రా తన అద్భుతమైన ప్రదర్శనతో అభిమానుల ప్రశంసలు అందుకున్నాడు. కెన్యాకు చెందిన జులియన్‌యోగో రెండోస్థానం, శ్రీలంకకు చెందిన రుమేష్‌పతిరాగే మూడోస్థానం చేపట్టారు. ముగింపు వేడుకల్లో కర్ణాటక ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కె.గోవిందరాజు, ఎమ్మెల్యే రిజ్వాన్‌అర్షద్, క్రీడాశాఖ అధికారులు పాల్గొన్నారు.

నీరజ్‌చోప్రా తదితరుల మధ్య క్రీడాప్రాంగణంలో ఈటెను విసిరేందుకు ప్రయత్నిస్తున్న సీఎం

భారత క్రీడా చరిత్రలో కొత్త అధ్యాయం

గవర్నర్, సీఎం, గోవిందరాజు, పరమేశ్వర్‌తో తొలి మూడు స్థానాలు చేపట్టిన విజేతలు

వందేళ్ల అనంతరం ఆలయంలోకి ప్రవేశం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: గూళ్య గ్రామంలో వందేళ్ల క్రితం నిర్మించిన హెగడ్లమ్మ దేవాలయంలోకి దళితులను అనుమతించారు. ఆలయంలోకి తమనూ అనుమతించాలని ఇన్నేళ్లుగా కోరుతున్నా, అగ్రవర్ణాలకు చెందిన వారు అనుమతించలేదు. పూజలు చేసుకునేందుకు వస్తే ఆలయం ఆవరణ వెలుపలే నిలిపి హారతి ఇచ్చేవారు. దీనిపై జిల్లాధికారికి ఫిర్యాదు చేసిన అనంతరం గ్రామసభలు నిర్వహించింది. తహసీల్దారు నేతృత్వంలో వరుసగా గ్రామంలో జాగృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఎట్టకేలకు జాగృతితో పరిస్థితులు మారిపోయాయి. ఇకపై అందరినీ ఆలయంలోకి అనుమతిస్తామని చెప్పడంతో వందేళ్ల అనంతరం దళితులు హెగడ్లమ్మను దర్శించుకునేందుకు అవకాశం కలిగింది.

ప్రాధాన్యంతో కూడుకున్న బసవతత్వాలు

వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

కలబురగి (రాయచూరు, న్యూస్‌టుడే) : బసవణ్ణ తత్వాలు, సిద్ధాంతాలను జీవితంలో అలవరచుకుంటే ఆదర్శవంతమైన సమాజ నిర్మాణం సాధ్యపడుతుందని మాజీ ఎమ్మెల్సీ అమరనాథ్ పాటిల్ పేర్కొన్నారు. కలబురగిలోని బసవ మంటపంలో శనివారం గురు సేవా ప్రతిష్ఠాన నాల్గో వార్షికోత్సవాన్ని, అధ్యాత్మికవేత్త శరణ బసవరాజ నాగూర ఐదో స్మరణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరనాథ్ మాట్లాడుతూ బసవతత్వంలోని వచనాలు, విచారాలు ఎంతో ప్రాధాన్యతతో కూడుకున్నాయని వివరించారు. రాష్ట్రంలో ఒకప్పుడు మూడు కోట్ల జనాభ కలిగిన లింగాయత్‌ల సంఖ్య తగ్గడం విచారకరమన్నారు. మన సామాజికవర్గం శక్తిని పెంచుకోవాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ప్రత్యేక ఉపన్యాసం చేసిన డాక్టర్ నీలాంబికా పోలిస్ పాటిల్ మాట్లాడుతూ శరణ పరివార్ సామాజిక వర్గాలు ఒక్కటైతే సమాజంలో ఐక్యత ఏర్పడుతుందన్నారు. శరణ చింతకుడు ఆచార్య సంజయ్ మాకల్, జాతీయ బసవదళ జిల్లా అధ్యక్షుడు ఆర్.జి.శెటగార, వచనోత్సవ ప్రతిష్ఠాన కార్యదర్శి బసవరాజ ధూళాగండి, స్వామీజీ శరణబసవ, ప్రముఖులు రవీంద్ర, శరణబసప్ప సాగూరు, డాక్టర్ మల్లికార్జున పాలమూరు పాల్గొన్నారు.

ఒకే రోజు ఐదు ఇళ్లల్లో చోరీ

లింగసుగూరు, (మాన్వి) : పట్టణ పురపాలక సంఘం పరిధిలోని కరడకల్‌లో ఐదు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. మొహర్రం సందర్భంగా శనివారం రాత్రి కత్తల్‌రాత్రి ప్రార్థనల్లో ప్రజలందరూ మునిగి ఉండగా.. చోరులు ఇళ్లలోకి చొరబడ్డారు. తలుపులు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దోపిడీకి పాల్పడ్డారు. రుద్రయ్యస్వామి అనే వ్యక్తి ఇంట్లో నాలుగున్నర తులాల బంగారం ఆభరణాలు, 15 తులాల వెండి ఆభరణాలు, రూ.60 వేల నగదు దొంగిలించారు. గుండయ్యస్వామి, పవాడప్పనాయక్, మహంతేశ్ కుంబార్ ఇళ్లలో చోరీ చేశారు. ఇద్దరు చోరులు ద్విచక్రవాహనంపై వచ్చినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. స్థానిక పోలీసులు స్థల పరిశీలన చేసి బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు.

నేడు సరఫరా నిలిపివేత

రాయచూరు, న్యూస్‌టుడే : ఇక్కడి ఏపీఎంసీ యార్డు ఉప కేంద్రం పరిధిలో విద్యుత్తు నియంత్రిక మార్చాల్సి ఉన్నందున నగరంలోని కొన్ని ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. ఎల్‌బీఎస్, సంతోషి, మైలార్ నగర్‌లు, అల్లం ప్రభు, విశ్వనాథ్, ఆశ్రయ కాలనీలు, చంద్రబండ రహదారి వీటి చుట్టు పక్కల ప్రదేశాల్లో విద్యుత్తును నిలివేస్తారు. అంతరాయానికి నగర పౌరులు సహకరించాలని జెస్కాం నగర ఇంజినీర్లు ఒక ప్రకటనలో కోరారు.

చీరపట్టుకుని లాగారని ఆరోపణ

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే: భాజపా అధికార ప్రతినిధి బీఆర్ లోహిత్, అతని ఆరుగురు అనుచరులు తన చీర పట్టుకుని లాగారని కర్ణాటక షెడ్యూల్డు కులాల, సంచార జాతుల అభివృద్ధి వేదిక అధ్యక్షురాలు పల్లవి ఆరోపించారు. శివానంద కూడలి వద్ద గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లోహిత్ తనపై దాడి చేసి చీర పట్టుకుని లాగి అవమానించారని హైగ్రౌండ్స్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గుండెపోటుతో ఇద్దరి మృతి

చిక్కమగళూరు, న్యూస్‌టుడే: మూడిగెరె తాలూకా భారిబైలు నివాసి మీనాక్షి (27), హాసళ్లికి చెందిన సుమిత్రగౌడ (75) ఇద్దరూ గుండెపోటుతో మరణించారు. రక్తపోటు పడిపోవడంతో మీనాక్షిని చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువెళుతుండగా, మార్గంమధ్యలో మరణించారు. సుమిత్రగౌడ వయోసహజ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటూ గుండెపోటుతో మరణించిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

రాత్రికి రాత్రే కోసుకెళ్లారు

దావణగెరె, న్యూస్‌టుడే: తన తోటలోకి వచ్చిన దొంగలు రాత్రికి రాత్రి రూ.7.5 లక్షల విలువైన దానిమ్మతో పరారయ్యారని హిరే మల్లనగౌడకు చెందిన రైతు రవికుమార్ ఆక్రోశించారు. అప్పు తీసుకుని తన రెండెకరాల పొలంలో ఐదు టన్నుల దానిమ్మను పండించారు. శుక్రవారం రాత్రి తోటలోకి ట్రక్కులతో వచ్చిన నిందితులు తన పంటను మొత్తం కోసుకువెళ్లారని జగళూరు ఠాణాలో ఫిర్యాదు చేశారు.

మొహరంలో అపశ్రుతి

లింగసుగూరు, (మాన్వి) : తాలూకాలోని యరగుంటి గ్రామంలో మొహరం సందర్భంగా అపశ్రుతి చోటు చేసుకుంది. అగ్నిగుండం దాటే వేళ హనుమంత (40) అనే వ్యక్తి అదుపుతప్పి గుండంలో నిప్పుల్లో పడిపోయాడు. ఇమామ్‌సాబ్ అనే యువకుడు బయటికి తీశాడు. క్షతగ్రాతున్ని వెంటనే లింగసుగూరు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం రాయచూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. హనుమంత పరిస్థితి ఆందోళకరంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని స్థానిక పీఐ పండలీక పటాతార్ పరిశీలించారు.

మీరు అధికారంలోకి వస్తే కదా...

మైసూరు: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం విధిస్తామని మంత్రి ప్రియాంక్ ఖర్గే చేసిన వ్యాఖ్యలను భాజపా నాయకుడు శ్రీవత్స ఖండించారు. మైసూరులో విలేకరులతో మాట్లాడుతూ, కేంద్రంలో కాంగ్రెస్ ఇకపై ఎప్పుడూ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు.

భక్తి ప్రపత్తులతో మొహరం

మొహరం జాతాలో భక్తులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: త్యాగానికి ప్రతీక అయిన మొహరాన్ని ముస్లిం సోదరులు ఆదివారం భక్తి ప్రపత్తులతో నిర్వహించుకున్నారు. గొలుసులు, ఇనుప బద్దెలతో ఒంటిపై కొట్టుకుంటూ నినాదాలు చేసుకుంటూ వీధుల్లో జాతా నిర్వహించారు. ఒంటిని హింసించుకుంటూ వెళుతున్న యువతకు ఇతర ముస్లిం సోదరులు మద్దతు ఇస్తూ, ఛాతీలపై చరుచుకుంటూ నినాదాలు చేశారు.

మాన్విలో..

మాన్వి: మాన్వి, సిరివార, లింగసుగూరు తాలూకాల్లో హిందూ, ముస్లింలు మొహరం ఆచరించారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పీర్లను ఊరేగించారు. భక్తులు అగ్నిగుండాలు దాటే దృశ్యాలు కనువిందు చేశాయి. శనివారం రాత్రి కత్తల్‌రాత్రిని నిర్వహించారు. యువకులు నృత్యాలు చేశారు. భక్తులు పొర్లదండాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. కోనాపూరు పేట సిట్టినదేవరు (హుసేని ఆలం)ను మంత్రి ఎన్.ఎస్. బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్ సందర్శించుకొని ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమాల్లో మైనార్టీ ప్రముఖులు, దర్గాల నిర్వాహకులు పాల్గొన్నారు.

సిట్టినదేవరును దర్శించుకున్న మంత్రి బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు

నివాళులర్పిస్తున్న మంత్రి బోసురాజు, అధికారులు

రాయచూరు, న్యూస్‌టుడే : మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ కూడలిలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజు, జిల్లా పాలనాధికారి నితీష్, నగరపాలక సంస్థ కమిషనర్ జుబిన్ మహాపాత్ర, జిల్లా దళ్(ఎస్) అధ్యక్షుడు ఎం.విరూపాక్షి, దళపతులు నరసప్ప ఆశాపూర్, రామకృష్ణ, ఎస్.రాజు, ప్రకాష్, అలంబాబు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, వివిధ శాఖల మంత్రిగా జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు.

పశువులు తరలించడానికి కార్యాచరణ

జైన్ టెంపుల్ రహదారిలో ఆవుల మంద

రాయచూరు, న్యూస్‌టుడే : 'నగరంలో సంచరిస్తున్న పశువులను వాటి యజమానులు వారం రోజుల్లో స్వాధీనం చేసుకోవాలి. అలా చేయకపోతే గోశాలకు తరలిస్తాం. తిరిగి అప్పగించేందుకు జరిమాన విధిస్తామని' గత నెల నగర పాలక సంస్థ హెచ్చరించింది. తరచూ ఇలాంటి ప్రకటనలు విన్న యజమానులు తేలికగా తీసుకుని రహదారి మీదకు వదిలేస్తున్నారు. పౌర సంఘాలు, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత కన్పించడంతో కమిషనర్ జుబిన్ మహాపాత్ర గంభీరంగా తీసుకున్నారు. బెడదను అరికట్టేందుకు చర్యలకు ఉపక్రమించారు. శనివారం రాత్రి సిబ్బంది కార్యాచరణను ఆరంభించారు. 70 పశువులను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక హిందీ వర్ధమాన పాఠశాలకు తరలించారు. అప్పగించాలని ముందుకొచ్చిన 11 మందికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా విధించారు. మరోసారి రహదారి కన్పిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిగిలిన వాటిని కలబురగిలోని కల్యాణ కర్ణాటక గోశాలకు వాహనాల్లో తరలించారు. సులువుగా గుర్తించేందుకు పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఫొటో తీసుకుని ట్యాగ్ జత చేసింది. గత కార్యాచరణ సమయంలో స్వాధీన పరుచుకున్న పశువులను మహిళా సమాజంలో కట్టేశారు. మేత లేకపోవడంతో వదిలేశారు. ఈ సారి ప్రణాళిక ప్రకారం చేస్తున్నందున ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల మీద కన్పిస్తే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అడ్డదిడ్డంగా సంచరించడం, రహదారి మీద బైఠాయించడంతో అనేక సార్లు ప్రమాదాలు తప్పిపోయాయి.

స్వైర విహారం చేస్తున్న శునకాలు

నగరంలో శునకాలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ప్రధాన రహదారులు, శివారు ప్రాంతాల్లో గుంపులుగా వెళుతూ, కొరకొర చూపులతో భయపెడుతున్నాయి. ఏ శునకం ఎప్పుడు దాడి చేస్తుందన్న భీతితో ప్రజలు సంచరిస్తున్నారు. రాత్రి 11 గంటల తర్వాత శివారు కాలనీలకు ద్విచక్ర వాహనంపై వెళ్లలేకపోతున్నారు. వీటిని పట్టుకుంటామని నగర పాలక సంస్థ అధికారుల ప్రకటనలు కార్యరూపంలోకి రావడం లేదు. ఆదివారం మధ్యాహ్నం నగరంలోని ఎనిమిదో వార్డు గాలిబ్‌నగర్‌లో ఆడుకుంటున్న నాలుగేళ్ల చిన్నారులపై శునకాలు దాడి చేసి గాయపరిచాయి. రజా ముస్తఫా, మహ్మద్ సోమన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదే ఏడాది మడ్డిపేటలో కుక్కల దాడిలో ఒక యువతి చనిపోయింది. తరచూ ఇలాంటి సంఘటనలు ఎక్కడో ఒక చోటు జరుగుతున్నాయి. పునరావృతం కాకుండా శునకాల బెడదను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శునకాల దాడిలో గాయపడ్డ బాలిక

ఘనంగా వైద్యుల దినోత్సవం

సన్మాన కార్యక్రమంలో వైద్యులు

రాయచూరు, న్యూస్‌టుడే : కళా సంకుల సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆశాపూరు రహదారికి దగ్గర్లోని ఒక ప్రైవేటు హోటల్ సభా భవన్‌లో ఆదివారం వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రముఖ వైద్యుడు సి.ఆర్.చంద్రశేఖర్ పలువురు డాక్టర్లకు వైద్యరత్న పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ జంక్ ఆహారాన్ని అధికంగా తీసుకోవడం, వ్యాయామం లేనందున, ఒత్తిళ్లు అధికమైనందున, ధూమపానం సేవనంతో హృద్రోగాలు, క్యాన్సర్, చక్కెర తదితర రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు చికిత్స ఇవ్వటానికి సకాలంలో స్పందిస్తున్నా.. కొందరు దురుసుగా ప్రవర్తిసున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీహెచ్‌ఓ డాక్టర్ సురేంద్రబాబు, రిమ్స్ ప్రిన్సిపల్ రాహుల్, కళా సంకుల సంస్థ అధ్యక్షురాలు రేఖా పాటిల్, కార్యదర్శి మారుతి బడిగేరా, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ శావంతగేరా మాట్లాడారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

శిబిరంలో ప్రసంగిస్తున్న చంద్రశేఖర్

రాయచూరు, న్యూస్‌టుడే : దురాశ, దుఃఖం, కోపం, క్రోధం, లోభం, భయం తదితర కారణాలు మనిషి అనారోగ్యానికి ప్రధాన హేతువులని పద్మశ్రీ గ్రహీత డాక్టర్ సి.ఆర్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. వాటిన్నటినీ పక్కన పెట్టి, ఆహార పద్ధతులు, జీవన శైలిని మార్చుకుంటే ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చన్నారు. బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం ధ్యాన మందిరం ఆవరణలో ఆదివారం ఎముకల సాంద్రత, సాధారణ ఆరోగ్య పరీక్షల ఉచిత శిబిరాన్ని నిర్వహించారు. చంద్రశేఖర్ జ్యోతిని వెలిగించి మాట్లాడారు. ఆరోగ్యాన్ని మించిన భాగ్యం లేదన్నారు. ఎంత సంపాదించినా, పేరు గడించినా అనారోగ్యానికి గురైతే ఏమి సాధించలేమని తెలుసుకోవాలని కోరారు. వైద్యం ఖరీదైనందున ఎక్కడ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎముకల్లోని కాల్షియం పరీక్షించుకోవాలని సలహా ఇచ్చారు. తగినంత కాల్షియం లేకపోతే, థైరాయిడ్ హార్మోన్లు సాధారణం కంటే ఎక్కువగా ఉంటే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. విశ్వవిద్యాలయం సంచాలకురాలు స్మితా మాట్లాడుతూ ప్రతి నిత్యం ధ్యానం చేయాలని, వైద్యుల సలహాలు పాటిస్తే అనారోగ్యం దరి చేరదన్నారు. ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ అనిరుద్ కులకర్ణి నేతృత్వంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఔషధాలను ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్ విశాలక్ష్మి, డాక్టర్ మనోహర్ పత్తార్, శారదా, ఎస్.బి.పాటిల్ పాల్గొన్నారు.

రోగులకు సలహాలిస్తున్న వైద్యురాలు



(c) eenadu

జనగళం వినిపించాలి..
జలకష్టం తీర్చాలి

గాజులదిన్నె ప్రాజెక్టు

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే : జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల సమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తి.. పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంది. కర్నూలు కలెక్టరేట్‌లో సోమవారం నీటి పారుదల సలహా మండలి (ఐఏబీ) సమావేశం జరగనుంది. ఈ సమావేశాన్ని మొక్కుబడిగా కాకుండా సాగునీటి కష్టాలు తీర్చేలా అర్థవంతంగా నిర్వహించాలని రైతులు పేర్కొంటున్నారు. ఎమ్మెల్యేలు హాజరై వివిధ అంశాలపై స్పష్టంగా చర్చించి.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గేట్లు బిగించి చేతులు దులిపేసుకున్నారు

గాజులదిన్నె జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 4.500 టీఎంసీలు కాగా 5.500 టీఎంసీలకు పెంచేందుకు గత ప్రభుత్వం రూ.137 కోట్ల నిధులు విడుదల చేసింది. ఒక టీఎంసీ నీటిని అదనంగా నిల్వ చేసేందుకు 410 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా ఒక్క సెంటు కూడా సేకరించలేదు. జీడీపీ అధికారులు రూ.51 కోట్ల విలువైన పనులు పూర్తిచేశారు. గేట్లు బిగించి మిగతా పనులు చేయకుండా చేతులు దులిపేసుకున్నారని రైతులు విమర్శిస్తున్నారు.

గుండ్రేవుల కల సాకారమవ్వాలి

■ తుంగభద్ర జలాలను నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో ఏటా వందల టీఎంసీల నీటిని సుంకేసుల ద్వారా దిగువకు విడుదల చేయాల్సి వస్తోంది. గుండ్రేవుల జలాశయాన్ని నిర్మిస్తే నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. దీనిపై సమగ్రంగా చర్చించాలి.

■ గాజులదిన్నె ప్రాజెక్టులో ఈ ఏడాది 3 టీఎంసీల నీరు నిల్వ చేయకపోతే వచ్చే వేసవిలో మంచి నీటికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. హంద్రీనీవా కాల్వకు నీటిని విడుదల చేసినప్పటి నుంచే రోజుకు 250- 300 క్యూసెక్కుల వరకు విడుదల చేసి ఈ ప్రాజెక్టులో నిల్వ చేయాలి.

■ హంద్రీనీవా ప్రాజెక్టు పరిధిలో కర్నూలు జిల్లాలో 60 వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేయాల్సి ఉంది. పందికోన జలాశయం కింద 46 వేల ఎకరాల ఆయకట్టుకు నీటి విడుదల నిలిచిపోయింది. ఈ అంశాలపై చర్చించాలి. హంద్రీనీవా కాల్వ నుంచి 68 చెరువులు నింపే ప్రాజెక్టు నిర్వహణ రూ.1.60 కోట్లు విడుదల చేయాలి.

కంకర కుప్పలు.. రాకపోకలకు తిప్పలు

కర్నూలు నగరంలోని ధర్మపేట సమీపంలో కేసీ కాలువ వెంబడి బంగారుపేటకు వెళ్లే దారిలో కంకరను కుప్పలుగా పోసి వదిలేశారు. కొన్ని నెలలుగా ఇలానే ఉంది. అభివృద్ధి పనుల కోసం తెచ్చిన కంకరను సగం రోడ్డుపై కుప్పలుగా వేశారు. పనులు మాత్రం చేయలేదు. ఫలితంగా వాహనదారులు రాకపోకలు సాగించడం చాలా ఇబ్బందికరంగా మారింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
– కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే

ఆక్రమణలకేసీ చూడరు

■ యథేచ్ఛగా భవన నిర్మాణాలు

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: కర్నూలు మీదుగా ప్రవహించే కర్నూలు కడప (కేసీ) కాలువకు సంబంధించిన స్థలాలు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయి. అయినప్పటికీ జలవనరుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధానంగా కేసీసీ కర్నూలు సబ్ డివిజన్‌కు ఏడాదిగా రెగ్యులర్ డీఈఈ లేకపోవడం.. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా కేసీ కాలువ స్థలాలపై పర్యవేక్షణ కరవైంది.

ఫిర్యాదు చేసినా..

కేసీ కాలువ స్థలాల్లో అక్రమ కట్టడాలపై గతంలో కర్నూలు పట్టణ పౌరహక్కుల సంఘం నేతలు పలుమార్లు జలవనరుల శాఖ అధికారులకు వినతిపత్రాలు అందించారు. కానీ తీసుకున్న చర్యలు శూన్యమే. కేసీ కాలువ శుభ్రతకు సంబంధించి మంత్రి టీజీ భరత్ చొరవ చూపడంతో నిధులు మంజూరయ్యాయి. ఇదే తరహాలోనే కాలువ వెంబడి అక్రమ కట్టడాలు, కబ్జాలపై దృష్టి సారించాల్సి ఉంది. ఈనెల 7వ తేదీన కర్నూలు కలెక్టరేట్‌లో జరిగే ఐఏబీ సమావేశంలో దీనిపై సమీక్షిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

నిబంధనలకు విరుద్ధంగా..

జిల్లా కేంద్రమైన కర్నూలు మీదుగా కేసీ కాలువ 5 కి.మీ. మేర ప్రవహిస్తుంది. ప్రధానంగా జొహరాపురం, ధర్మపేట, బంగారుపేట, స్వామిరెడ్డినగర్ కాలనీలతోపాటు నగర శివారులోని మామిదాలపాడు, మునగాలపాడు ప్రాంతాల్లో కాలువ గట్ల స్థలాలను కొందరు ఆక్రమించుకుని పక్కా కట్టడాలు చేపట్టినా అధికారులు పట్టించుకోవడం లేదు. కొందరు బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా చోద్యం చూస్తున్నారు. జొహరాపురం వంతెన సమీపంలో కొందరు ఏళ్ల కిందట స్థలాన్ని కబ్జా చేసినా కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. కొందరు సిబ్బంది ఆక్రమణదారులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

☛ గతంలో పనిచేసిన కొందరు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలకు సంబంధించి ఎన్‌వోసీలు ఇచ్చారని.. ఇందులో తామెందుకు తల దూర్చాలన్న ధోరణిలో ప్రస్తుత ఇంజినీర్లు వ్యవహరిస్తున్నారనే చర్చ కొనసాగుతోంది.

ప్రత్యేక క్యూలైన్లలో దర్శనానికి వెళ్తున్న భక్తులు

శ్రీమఠం.. భక్తజన సంద్రం

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో మఠం ప్రధాన ముఖ ద్వారం ముందు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని అదుపుచేస్తూ శీఘ్ర దర్శనం పేరుతో వేల మహుళ్లు పొల్లొందుతున్న వారికి శ్రీమఠం అధికారులు అడ్డుకట్ట వేశారు. పీఠాధిపతి ఉత్తర్వుల మేరకు ఏఏవో మాధవ శెట్టి, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు ప్రత్యేక దృష్టి సారించారు. అక్రమ వసూళ్లు పాల్పొందుతున్న వారిపై నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు.

లోపలి పేజీల్లో
రెండో విడత ప్రవేశాలకు వేళాయే 6
నిపుణులు లేరు.. ప్రాణాలు నిలపరు 6

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజలు, బాధితుల నుంచి సోమవారం వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

మెగా పీటీఎం నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా. చిత్రంలో జేసీ డా.నవ్య,

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న మెగా పేరెంట్స్ టీచర్ సమావేశానికి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఆదివారం మెగా పేరెంట్స్ టీచర్ సమావేశం 2.0పై నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, మండల విద్యాశాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమావేశాలకు ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తప్పక హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయించాలన్నారు. ఇందుకోసం సరిపడా బియ్యం, సరకులు సరఫరా చేయాలని డీఈవోను ఆదేశించారు. అదే రోజు విద్యార్థులంతా తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటేలా చర్యలు తీసుకోవాలని డీఎఫ్‌వో, డ్వామా పీడీలను ఆదేశించారు. మెగా పేరెంట్స్ టీచర్ సమావేశానికి సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లలో పురోగతిని పర్యవేక్షించాలని ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీవోలను ఆదేశించారు. జేసీ డా.బి.నవ్య మాట్లాడుతూ అర్హులెవరూ తల్లికి వందనం పథకానికి దూరం కాకుండా చూడాలని చెప్పారు. తల్లికి వందనం రానివారి జాబితా తయారు చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ హుసేన్‌పీరా, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, కర్నూలు, పత్తికొండ ఆర్డీవోలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్, డీఈవో శామ్యూల్‌పాల్, డీవీఈవో సుధీర్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి, ఉప కలెక్టర్లు వెంకటేశ్వర్లు, అనురాధ, డీఎఫ్‌వో శ్యామల, నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

చిప్పగిరిలో..

త్యాగాలకు ప్రతీక మొహర్రం

చిప్పగిరి, న్యూస్‌టుడే : త్యాగాలకు ప్రతీక మొహర్రం అని సయ్యద్‌షా వంశీయులు సయ్యద్ ఆరీవుద్దీన్ షమ్స్ ఖాద్రి, సయ్యద్ రజాక్ పీర్ ఖాద్రి, సయ్యద్ అర్షద్ ఖాద్రి అన్నారు. చిప్పగిరిలో ఆదివారం నిర్వహించిన మొహర్రం పీర్ల ఊరేగింపు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాది మంది తరలిరావడంతో చిప్పగిరిలోని సయ్యద్‌షా ప్రాంగణం భక్తులతో నిండిపోయింది.

వైభవంగా తొలి ఏకాదశి

మద్దికెర, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా తొలి ఏకాదశిని ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. పెరవలి శ్రీరంగనాథస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శేష వాహనంపై పవళించిన స్వామి, అమ్మవార్లను చూసేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.



కరపత్రం అందజేస్తున్న మంత్రి టి.జి.భరత్

చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రాభివృద్ధి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : విజనరీ నాయకుడైన సీఎం చంద్రబాబునాయుడి నాయకత్వంలోనే రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధిలో ముందుకు వెళ్తుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. కర్నూలు నగరం అశోక్ నగర్ పరిధిలోని భగత్‌సింగ్ నగర్ చర్చి ప్రాంతంలో ఆదివారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేస్తామన్నారు. తొలి అడుగు కార్యక్రమంలో ప్రజలు చెప్పిన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మాణిక్యమ్మ, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ తెదేపా నాయకులు, బూత్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

ఇదే మెనూ.. పెట్టిందే తిను

■ వసతిగృహాల్లో అమలుకాని వైనం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని బీసీ, సాంఘిక సంక్షేమ, గిరిజన వసతి గృహాల విద్యార్థులకు మెరుగైన మెనూ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అధికారుల పర్యవేక్షణ లేక ఆహారంలో నాణ్యత కరవవుతోంది. ఆదివారం మధ్యాహ్న భోజనంలో, మంగళ, శుక్రవారాల్లో రాత్రి వేళల్లో చికెన్ ఇవ్వాలి. ప్రతి విద్యార్థికి 100 గ్రాములు పెట్టాలి. కానీ కొన్ని ప్రాంతాల్లో సగటున ఒక్కో విద్యార్థికి 70 నుంచి 80 గ్రాముల మధ్యే ఇస్తున్నారు.

నాణ్యత అంతంతే

చాలా వసతిగృహాల్లో ఆదివారం చికెన్ బిర్యానీకి బదులు కర్రీతోనే సరిపెడుతున్నారు. ఎక్కడా చికెన్ బిర్యానీ ఇవ్వడం లేదు. బిర్యానీకి తగ్గట్టు ఆహార పదార్థాల సరఫరా లేకపోవడంతో చికెన్, పలావ్ అన్నంతో సరిపెడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నాసిరకంగా వడ్డిస్తూ 'ఆదా' చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చికెన్ బిర్యానీతోపాటు రైతా ఇవ్వడం లేదు. కేవలం గోంగూర చట్నీతో మమ అనిపించేస్తున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వసతిగృహాల వివరాలు

జిల్లా	బీసీ	ఎస్సీ	గిరిజన
కర్నూలు	31	29	6
నంద్యాల	22	25	10

కానరాని పరిశుభ్రత

వసతి గృహాల్లోని వంట గదుల్లో శుచి శుభ్రత కానరావడం లేదు. అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం వండుతున్నారు. నంద్యాలలోని బీసీ బాలుర వసతిగృహంలో భవనాలు ఇప్పటికే శిథిలావస్థకు చేరుకోగా ఇక్కడే భోజనాలు తయారవుతున్నాయి. దుమ్ము కొట్టుకుపోయిన గదుల్లో ఆహారం సిద్ధం చేస్తున్నారు. వంట గదుల్లో పరిశుభ్రత కానరావడం లేదు. అద్దె భవనాల్లోని వసతి గృహాల్లో పరిస్థితులు మరింత అధ్వానంగా ఉంటున్నాయి.

గదుల కొరతతో ఇబ్బందులు

వసతిగృహంలో గదుల కొరత తీవ్రంగా ఉంది. కనీసం సామగ్రి పెట్టుకునేందుకు స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రాంగణంలో గతంలో నిర్మించిన 12 మరుగుదొడ్ల సమూహం నిరుపయోగంగా ఉంది. వాటిని కూల్చేసి కొత్తవి నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థినుల సంఖ్యకు తగ్గట్టు వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, డోన్ పట్టణం

కేవలం 26 మందే..

డోన్ పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో 396 మంది ఉంటున్నారు. హాస్టల్‌ను ఆదివారం పరిశీలించగా 28 మంది విద్యార్థినులు కనిపించారు. 26 మంది బాలికలు భోజనం చేశారు. 30 మంది హాజరైనట్లు వసతిగృహం ఇన్‌ఛార్జి సంరక్షకురాలు తెలిపారు. చికెన్ బాగానే ఉన్నా అన్నం కాస్త మెత్తగా ఉండటంతో పిల్లలు సరిగా తినలేని పరిస్థితి నెలకొంది.

చెలగాటమాడితే.. చెరసాలకే!

☛ పోక్సో కేసుల్లో శిక్షలతో నేరాల నియంత్రణ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో బాలబాలికలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. కొందరు వనితల మానప్రాణాలు తీస్తూ సభ్య సమాజానికి తలవంపులు తెస్తున్నారు. ఆదోనిలో శనివారం ఓ బాలికపై ఆటో డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. పోక్సో చట్టం కింద బాలురు మొదలుకొని వృద్ధుల వరకు నిందితులవుతున్నారు. నిత్యం కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ఈ కేసులకు సంబంధించి కర్నూలులో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేశారు. ఫలితంగా త్వరితగతిన విచారణ జరిపి తీర్పులు వెలువడేందుకు దోహదపడుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో పోలీసులు నిందితులపై నిఘా పెడుతున్నారు.

ప్రత్యేక నిఘాకు చర్యలు

ఉమ్మడి జిల్లాలో పోలీసు అధికారులతోపాటు న్యాయమూర్తులు పోక్సో చట్టంపై పెద్దఎత్తున సదస్సులు నిర్వహిస్తూ విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు. మహిళల భద్రత కోసం ఏర్పాటుచేసిన శక్తి టీంలు సైతం పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్నాయి. ఆపద సమయాల్లో శక్తియాప్, శక్తి వాట్సప్ నంబరును సంప్రదించాలని సూచిస్తూ బాలికల భద్రతకు సంబంధించి తగిన చర్యలు చేపడుతున్నారు. కర్నూలు జిల్లాలో ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ప్రత్యేకంగా పాఠశాలలు, కళాశాలల వద్ద ప్రతిరోజూ నిఘా పెట్టి 38 బీట్లు ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నారు. ఈ ఏడాది జూన్ వరకు జిల్లా వ్యాప్తంగా 17,467 మంది ఆకతాయిలను గుర్తించిన పోలీసు అధికారులు మంత్రణం చేసి హెచ్చరికలు జారీ చేశారు.

ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

– సీవీ శ్రీనివాసులు, పోక్సో కోర్టు పీపీ

లైంగిక వేధింపులు, దాడులు జరుగుతున్న నేపథ్యంలో పిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. ఏదైనా ఘటన జరిగితే ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసుల్లో నేరం రుజువై శిక్షలు పడితేనే సమాజంలో ఈ ఘోరాలు తగ్గుముఖం పడతాయి. కేసులు దర్యాప్తు చేసే పోలీసు అధికారులు సాంకేతికత అందిపుచ్చుకుని సాక్ష్యాధారాలు సేకరించి అభియోగం దాఖలు చేస్తే బాధితులకు కోర్టులో న్యాయం జరుగుతుంది.

కొన్ని తీర్పులు.. శిక్షలు

- పగిడ్యాల మండలంలో ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో 75 ఏళ్ల వృద్ధుడికి కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది.
- బాలికను వేధించిన కేసులో ఆదోని మండలం పెద్దహరివాణం ప్రాంతానికి చెందిన రామకృష్ణారెడ్డిపై పోక్సో చట్టం కింద రెండేళ్ల జైలుశిక్ష పడింది.
- ఓ చిన్నారిపై అత్యాచారం చేసిన కేసులో బనగానపల్లి మండలం తమ్మడపల్లికి చెందిన రుద్రేష్‌కు 20 ఏళ్ల జైలుశిక్ష పడింది.
- ప్రేమ పేరుతో వంచించి అఘాయిత్యానికి పాల్పడిన కేసులో ఆదోనికి చెందిన షేక్ చాంద్ బాషాకు 20 ఏళ్ల జైలు, జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు తీర్పు ఇచ్చింది.

పరిశోధనలకు ప్రభుత్వాలు నిధులివ్వాలి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : సమాజంలోని మూఢ నమ్మకాలను రూపుమాపే సైన్స్ పరిశోధనలకు ప్రభుత్వాలు నిధులు ఇవ్వాలని తెలంగాణ జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకుడు డాక్టర్ మురళీధర్ కోరారు. నగరంలోని హార్ట్ ఫౌండేషన్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ధర్మా సురేష్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు జరిగాయి. జవివే సీనియర్ నాయకుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి, క్లస్టర్ యూనివర్శిటీ డీన్ అండ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ అఖ్తర్‌బాను మాట్లాడారు. జవివే సమత నాయకురాలు డాక్టర్ అరుణ, జాతీయ నాయకులు మహమ్మద్ మియా, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ మురళీధర్

విత్తగించరు.. మాట సాయమందించరు

■ వ్యవసాయశాఖలో గాడి తప్పిన పాలన
■ రైతులకు అందని సేవలు

కర్నూలు, నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : వ్యవసాయ శాఖలో పాలన గాడి తప్పుతోంది. ఇటీవల జరిగిన బదిలీల్లో కొందరు అధికారులుకోరుకున్న స్థానాలకు బదిలీ అయ్యారు. రైతుల గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. ఖరీఫ్ సీజన్‌లో కర్షకులకు అందుబాటులో ఉండి. విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాల్సిన అధికారులు పత్తా లేకుండా పోయారు.

సాగు అరకొరే..

కర్నూలు జిల్లాలో 4.20 లక్షల హెక్టార్ల సాధారణ సాగు కాగా ఇప్పటి వరకు అన్నిరకాల కలిపి 1.15 లక్షల హెక్టార్లలో రైతులు పంటలు వేశారు. నంద్యాల జిల్లాలో సాధారణ సాగు 2.38 లక్షల హెక్టార్లు కాగా ఇప్పటివరకు 36,288 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో అన్నదాతలు సాగుకు సన్నద్ధమవుతున్నారు.

దృష్టంతా వసూళ్లపైనే..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,200 విత్తన దుకాణాలు, 1,600 ఎరువుల దుకాణాలు ఉన్నాయి. 3,200 దుకాణాల్లో పురుగు మందులు విక్రయిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు డిమాండ్ ఉంది. ఇదే అదనుగా సిబ్బంది కొందరు విత్తనాలు, ఎరువుల దుకాణాల నుంచి మామూళ్ల వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పంపిణీ అధ్వానం

జాతీయ ఆహార భద్రత పథకం, నూనె గింజల అభివృద్ధి పథకాల ద్వారా వేరుసెనగ విత్తనకాయలు, కందులు తదితర మినీ కిట్లు ఉచితంగా పంపిణీ చేయాల్సి ఉండగా ఉమ్మడి జిల్లాలో ఆ ఊసే లేకుండా పోయింది. వ్యవసాయశాఖ ఏపీ సీడ్స్ ద్వారా రాయితీపై వేరుశనగ, కందులు, మినుములు తదితర విత్తనాలను రాయితీపై పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటింది. కర్నూలు జిల్లాలో 9,009 క్వింటాళ్ల వేరుసెనగ కాయలు రాయితీపై ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు 6,594 క్వింటాళ్లు మాత్రమే పంపిణీ చేశారు. నంద్యాల జిల్లాలో 2,759 క్వింటాళ్లకుగాను 1,814.50 క్వింటాళ్ల విత్తన పంపిణీ జరిగింది.

⏩ కర్నూలు జిల్లాలో కంది విత్తనాల పంపిణీ మొదలే కాలేదు. నంద్యాల జిల్లాలో మాత్రం 27 క్వింటాళ్లు అందించారు. అదను దాటిన తర్వాత విత్తనాలు ఇచ్చినా ప్రయోజనం ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎరువులపై పర్యవేక్షణ ఏదీ..

గతంలో వరితోపాటు మరికొన్ని పంటలకే యూరియా వినియోగించేవారు. ప్రస్తుతం రైతులు అన్నిరకాల పంటలకు యూరియా వాడుతున్నారు. ఫలితంగా రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక సహకార సంఘాలు, డీసీఎంఎస్‌ల్లో సరిపడా యూరియా నిల్వలు ఉండటం లేదు.

- వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం ఎక్కడా ఎరువుల కొరత లేదని, అవసరానికి మించి నిల్వలు ఉన్నట్లు చెబుతుండటం గమనార్హం.
- కర్నూలు జిల్లాలో అన్ని మండలాలకు కలిపి 8,728.83 టన్నుల యూరియా కేటాయించారు. ఇందులో ప్రైవేటు డీలర్లకు 6,290, ప్రాథమిక సహకార సంఘాలకు 232, డీసీఎంఎస్ కేంద్రాలకు 79.02, రైతు సేవా కేంద్రాల హబ్‌లకు 25.12, రైతు సేవా కేంద్రాలకు 882.135, మాన్యుఫ్యాక్చర్ అవుట్‌లెట్లకు 1,142.325, ఇతరులకు 76.79 టన్నులు కేటాయించారు.
- నంద్యాల జిల్లాకు యూరియా, డీఏపీ, మిశ్రమ ఎరువులు కలిపి 93,994 టన్నులు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు.

సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళతానని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. నంద్యాలలోని వివేకానంద ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావిస్తామని హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా.వి.రవికుమార్, బెనహర్, కోశాధికారి డి.శేషన్నలు పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97628
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 13479

(c) eenadu

పాఠాల ఉపాధ్యాయిని.. ఫలితాల కల్యాణి

☛ పల్లెబడిని మార్చిన గురువు ☛ గిరిజన విద్యార్థుల్లో వెలుగు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: తండాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతూ వచ్చింది. గ్రామంలో పాఠశాల కొనసాగింపు ప్రశ్నార్థకంగా మారింది. అలాంటి పరిస్థితులు ఉన్న తండాలోని పాఠశాలకు కల్యాణికుమారి ఉపాధ్యాయినిగా 2017 సంవత్సరంలో బదిలీపై వచ్చారు. పాఠశాల పరిస్థితిని ఓ వారం రోజుల పాటు క్షుణ్ణంగా పరిశీలించారు. ఉన్న ఒకరిద్దరు పిల్లలను వెంట పెట్టుకొని విద్యార్థుల తల్లి దండ్రులను కలిశారు. అప్పటి వరకు పిల్లల్ని పాఠశాలకు పంపడం ఇష్టంలేని తల్లిదండ్రులకు ఉపాధ్యాయినిపై నమ్మకం కుదిరింది. ఒక్కొక్కరూ విద్యార్థులు పాఠశాలకు రావటం పెరిగింది. ఇది ఎనిమిదేళ్ల కిందటి మాట. ఇద్దరు ఉన్న పాఠశాలలో ప్రస్తుతం 45 మందికి పైగా విద్యార్థులు ఉన్నారంటే అది టీచరమ్మ ఘనతే అని గ్రామస్థులు చెబుతున్నారు. ఉపాధ్యాయిని సేవలను గుర్తించిన ప్రభుత్వం, సేవా సంస్థలు, ఉన్నతాధికారుల నుంచి అవార్డులు, ప్రశంసలు అందుకుంటున్నారు. ఇటీవలే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నుంచి 'షైనింగ్ టీచర్' అవార్డు అందుకున్నారు.

ల్యాప్‌టాప్‌తో విద్యార్థులకు బోధిస్తున్న కల్యాణికుమారి

అలా మొదలైంది..

కల్యాణి కుమారి 2010 నవంబరులో హొళగుంద మండలం నాగరకన్వి గ్రామంలో ఎస్జీటీ ఉపాధ్యాయినిగా వృత్తి జీవితం ప్రారంభించారు. 2015లో పత్తికొండ పట్టణం రాజీవ్‌నగర్ ప్రాథమిక పాఠశాల, 2017లో జేఎం.తండాకు బదిలీపై వెళ్లారు. తండాలో పరిస్థితులను అధ్యయనం చేశారు. క్రమం తప్పకుండా పాఠశాలకు రావడం, శుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పించారు. చదువు ప్రాధాన్యం వివరించారు. పాఠ్యాంశాలను నల్లబల్లాలపైనే కాకుండా వారికి చిత్ర సహితంగా ల్యాప్‌టాప్‌ను వినియోగిస్తూ బోధన సాగించారు. పుట్టిన రోజులు పిల్లలకు గుర్తుండిపోయేలా ఆమె సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నారు. గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇవ్వటం, ఉచితంగా విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా 33 మంది గురుకుల పాఠశాలలో, ఒకరికి నవోదయ సీటు వచ్చేలా కృషి చేశారు. వారాంతపు పరీక్షలు నిర్వహిస్తూ.. వారిని ప్రోత్సహిస్తున్నారు.

సామాజిక బాధ్యతగా స్వీకరించా

- కల్యాణికుమారి, ప్రధానోపాధ్యాయిని, జేఎం తండా

ఉపాధ్యాయ వృత్తి అంటే కేవలం కొలువు మాత్రమే కాదని, సామాజిక బాధ్యతగా భావించా. ఉన్న ఒకరిద్దరు పిల్లలతో ఎలా బోధన అని ఆలోచించా. గ్రామం నుంచి పాఠశాల తరలిపోకుండా ఉండాలంటే ఏదైనా చేయాలనుకున్నా. నా సంకల్పానికి గ్రామస్థుల సహకారం తోడైంది. గ్రామస్థులు, యువత, విద్యార్థుల్లో మార్పు వచ్చింది. ఇటీవలే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలవటం, విద్యాభివృద్ధికి అనుసరించాల్సిన విధానాలను నాతో చర్చించడం, షైనింగ్ టీచర్ అవార్డుతో సత్కరించడం జీవితంలో మరచిపోలేని అనుభూతులను నింపాయి. ఇటీవల ఉపాధ్యాయుల సాధారణ బదిలీల్లో భాగంగా మండలంలోని పుచ్చకాయలమడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు కేటాయించారు. నా స్థానంలో ఇంకా ఎవ్వరూ విధుల్లో చేరకపోవటంతో జేఎం తండాలోనే పనిచేస్తున్నా. ఎక్కడ పనిచేసినా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా.

పొగాకు రైతులను ఆదుకోవాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: పొగాకు రైతులను ఆదుకోవాలని మంత్రి ఎన్‌ఎండీ.ఫరూక్‌కు ఏపీ రైతు సంఘం నాయకులు, పొగాకు రైతులు కోరారు. స్థానిక మంత్రి కార్యాలయంలో ఆదివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ..రెండు నెలల నుంచి పొగాకు రైతులు ఆందోళన చేస్తుంటే ప్రైవేటు వ్యాపారులు జూన్ నెలాఖరులోగా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి కొనుగోలు చేయలేదని అన్నారు. ఇతర జిల్లాల్లో పొగాకు కొనుగోలు కేంద్రాలు పెట్టి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో కొనుగోలు చేయడం లేదన్నారు. మంత్రి జోక్యం చేసుకొని క్వింటాలు రూ.15 వేల చొప్పున కొనుగోలు చేయించి రైతులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి, క్యాబినెట్ సమావేశంలో చర్చించి చర్యలు తీసుకుంటా అన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, సురేశ్, సీపీఎం నాయకులు పి.నరసింహ, రైతులు వెంకటేశ్వర గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి ఫరూక్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి పేర్కొన్నారు. ఓర్వకల్లు మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో కష్టపడుతున్నారని చెప్పారు.

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

రెండో విడత ప్రవేశాలకు వేళాయే

☛ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో మిగులు సీట్లు 600

వేంపల్లె, న్యూస్‌టుడే : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 600 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి విద్యార్థుల మెరిట్ జాబితాను తయారు చేసి ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచేందుకు చర్యలు చేపట్టారు. ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి మొత్తం 4400 సీట్లు ఉన్నాయి. ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1100 సీట్లు ఉండగా దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ కోటా కింద 360 సీట్లు పోను నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1010 చొప్పున 4040 సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలలో ఉన్న సీట్లకు సంబంధించి మెరిట్ జాబితా విడుదల చేసి జూన్ 30 నుంచి జులై 5వ తేదీ వరకు ఇడుపులపాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేశారు. కౌన్సెలింగ్ తర్వాత ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 878 సీట్లు భర్తీ కాగా 132 సీట్లు మిగిలిపోయాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలో 1010కి 869 భర్తీ కాగా 141 సీట్లు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 867 భర్తీ కాగా 143, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు 826 సీట్లు భర్తీ కాగా 184 సీట్లు మిగిలాయి. ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో ప్రాధాన్యం, ఇక్కడ విద్యపై ఆసక్తి లేని కారణంగా చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడంతో 600 సీట్లు ఖాళీ ఏర్పడింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ కేంద్రంగా రెండో విడత ప్రవేశాలకు సంబంధించిన రెండో జాబితాను అధికారులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు.



ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కార్యాలయం

11, 12 తేదీల్లో..

ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలలో మిగిలిపోయిన 600 సీట్ల భర్తీకి తదుపరి మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 11, 12 తేదీల్లో వెబ్‌సైట్‌లో వెల్లడిస్తాం. ఈ మేరకు రెండో విడత జాబితా సిద్ధం చేసే పనిలో మా సిబ్బంది ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. ఆ లోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను సరైన సమయంలో పూర్తి చేస్తాం.

- ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ

జంతువుల నుంచి సోకే వ్యాధులపై అప్రమత్తం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి (జేడీ) డా.జి శ్రీనివాస్ సూచించారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలులోని బహుళార్థ పశు వైద్యశాలలో ఉప సంచాలకులు డా. హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ టీకాలు వేసే కార్యక్రమాన్ని జేడీ ప్రారంభించారు. కర్నూలు నగరానికి చెందిన సుమారు వంద వరకు పెంపుడు కుక్కలు, పిల్లులకు టీకాలు వేశారు. ప్రతిరోజూ రేబిస్ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డా.రాజశేఖర్, కర్నూలు డివిజన్ డీడీ డా.దుర్గాప్రసన్నబాబు, జిల్లా పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డా.ఎన్.రామచంద్ర, కర్నూలు నగరపాలక ప్రజారోగ్యాధికారి డా.కె.విశ్వేశ్వరరెడ్డి, కరుణా ఇంటర్నేషనల్ సంస్థ అధ్యక్షుడు మణిలాల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

శునకానికి యాంటీ రేబిస్ టీకా వేస్తున్న జేడీ డా. శ్రీనివాస్, పక్కన డీడీ డా.హేమంత్‌కుమార్ తదితరులు

అరటి, వేరుసెనగ, పత్తి పంటలకు బీమా చేయించుకోండి

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంటల బీమా పథకానికి జులై 15వ తేదీ చివరి రోజు అని, రైతులందరూ ఉపయోగించుకోవాలని వ్యవసాయ బీమా జిల్లా కో ఆర్డినేటర్ సునీల్ కోరారు. ఆదివారం ఆయన మండలంలోని మిట్నాల, పుసులూరు, పాణ్యం, బనగానపల్లెలోని మండలాల్లో పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ..పత్తి, అరటి, వేరుసెనగ పంటలకే కేంద్ర ప్రభుత్వం పంటల బీమా ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో భాగంగా పత్తి పంటకు ఎకరాకు రూ. 1600, అరటికి ఎకరాకు రూ.2750, వేరుసెనగకు రూ..560 చెల్లించి బీమా పొందాలని సూచించారు. బీమా పొందడానికి ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, భూమి పాసు పుస్తకం, పంట వేసినట్లు ధ్రువీకరించే పత్రాలు సమర్పించాలన్నారు. మండల కోఆర్డినేటర్లు వినయ్, పవన్, నరేంద్ర ఆయా గ్రామాల రైతుల పాల్గొన్నారు.

నిపుణులు లేరు.. ప్రాణాలు నిలపరు

ఆదోని పాత పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో పశ్చిమ ప్రాంత ప్రజలకు అత్యవసర వైద్యం అందక ప్రాణాలు పోతున్నాయి. చుట్టూ 15 మండలాలతోపాటు పక్కనే ఉన్న కర్ణాటక సరిహద్దు గ్రామ ప్రజలకు ఆదోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రే దిక్కు. రోజువారీ ఓపీ సంఖ్య 500కుపైగా ఉంటుంది. ఐపీ 30కి పైగా నమోదవుతోంది. ఆస్పత్రిలో రెగ్యులర్ వైద్యులు 78 మందికిగాను 19 మంది, సీనియర్ రెసిడెంట్ వైద్యులు 58 మంది ఉండాలి.. కానీ ఒక్కరు కూడా లేరు. ఈఎన్‌టీ, ఆప్తమాల్, జనరల్ సర్జన్ తదితరులు మాత్రమే ఉన్నారు. రేడియాలజిస్ట్, మైక్రోబయాలజిస్ట్, పల్మనాలజిస్ట్, ఫోరెన్సిక్ తదితర వైద్య నిపుణులు అవసరం. వైద్య కళాశాల నిర్మాణం పూర్తికాకపోయినప్పటికీ గత వైకాపా ప్రభుత్వం పలువురు వైద్య నిపుణులు, ప్రొఫెసర్లు, సహాయ ప్రొఫెసర్లను నియమించి ఆదోని ఆస్పత్రిలో ఏడాదిపాటు కూర్చోబెట్టి జీతాలిచ్చింది. తీరా కేంద్ర వైద్యాధికారుల బృందం వైద్య కళాశాలను పరిశీలించింది. పనుల్లో పురోగతి లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసింది. వైద్య కళాశాల నిర్మాణం పూర్తికాకపోవడంతో కూటమి ప్రభుత్వం పలువురు వైద్యాధికారులను ఇతర వైద్య కళాశాలలకు బదిలీ చేసింది. ఫలితంగా ఈ ప్రాంతంలో వైద్య సేవలు అగమ్యగోచరంగా మారాయి.

నెల	ఓపీ	ఐపీ	రెఫర్ కేసులు
మే	14,493	1,135	51
జూన్	16,193	1,238	74

ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సిందే

గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాల సమస్యలతోపాటు రహదారి ప్రమాదాల్లో గాయపడినవారు తదితరులను నిత్యం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుంటారు. ఆదోని సర్వజన ఆస్పత్రిలో అవసరమైన నిపుణులు లేకపోవడంతో ప్రాథమిక వైద్యం మాత్రమే అందించి మెరుగైన చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాలని వైద్యులు సిఫారసు చేస్తున్నారు. దీంతో బాధితులను వంద కి.మీ. దూరంలో ఉన్న కర్నూలు, బళ్లారి (80 కి.మీ.), హైదరాబాద్ (310 కి.మీ.)కు తీసుకెళ్లాల్సి వస్తోంది. కర్నూలు, బళ్లారికి అంబులెన్సులో తీసుకెళ్లాలంటే రూ.4 వేలకు పైగా ఖర్చవుతోంది. హైదరాబాద్, బెంగళూరుకు వెళ్లాలంటే రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు భరించాల్సిందే. ఇది పేదలకు ఆర్థిక భారంగా మారుతోంది.

వైద్య కళాశాల పనుల్లో జాప్యం

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రాంతీయ ఆస్పత్రిని జిల్లా సర్వజన ఆస్పత్రిగా స్థాయికి పెంచారు. వంద నుంచి 350 పడకలకు పెరిగింది. అంతకుముందే ఆస్పత్రి స్థాయి పెంచాలనే ఉద్దేశంతో 2014-19 మధ్యలో తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.10 కోట్లతో ఆస్పత్రి భవనం విస్తరించాలని నిర్ణయించింది. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం పనులు పూర్తి చేయడంలో ఆలస్యం చేసింది. అదే సమయంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యశాలలను కేంద్రం మంజూరు చేసింది. ఆదోని ఆస్పత్రిని జిల్లా సర్వజన ఆస్పత్రిగా మార్చేందుకు అవకాశం కల్పించింది. రూ.200 కోట్లు వెచ్చించి మండలం పరిధిలోని అరేకల్లు గ్రామ సమీపంలో వైద్య కళాశాల పనులు ప్రారంభించారు. వైకాపా ప్రభుత్వం దిగిపోయేనాటికి కేవలం 18 శాతం పనులు మాత్రమే జరిగాయి.

ఆదోని పట్టణంలో 35వ వార్డు సచివాలయ మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్న దివ్య ఆడ శిశువుకు జన్మనిచ్చారు. గత నెల 29వ తేదీన ఆమెకు ఆయాసం రావడంతో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకుగానీ.. హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చుంటే.. వైద్య నిపుణులు అందుబాటులో ఉంటే.. ఈ పరిస్థితి ఉండేది కాదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదోని ఆస్పత్రిలో కిటకిటలాడుతున్న ఓపీ విభాగం

పెళ్లికి నిరాకరించారని యువజంట ఆత్మహత్య

ప్యాపిలి, గిద్దలూరు పట్టణం, కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే : తమ వివాహానికి పెద్దలు అనుమతించడం లేదని ఓ యువ జంట బలవన్మరణానికి పాల్పడింది. మృతిచెందిన వారిలో ఒకరు వివాహిత కావడం గమనార్హం. ప్రకాశం జిల్లా కొమరోలు ఎస్.ఐ.నాగరాజు వెల్లడించిన వివరాల ప్రకారం..కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం మాధవరానికి చెందిన కంబగిరి పాపయ్య కుమారుడు రాముడు(25) లారీ చోదకుడిగా పనిచేస్తున్నారు. వారి ఇంటికి సమీపంలోనే భారతి ఉంటున్నారు. ఆమె రెండేళ్ల క్రితం ఆమెను మేనమామ కుమారుడు శివప్రసాద్‌ను ఇచ్చి పెళ్లి చేశారు. అయితే భర్తతో విభేదాల కారణంగా ఆమె కొంతకాలంగా తల్లిదండ్రుల వద్దే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో కంబగిరి రాముడు..భారతి కొంతకాలంగా సన్నిహితంగా ఉంటున్నారు. తామిద్దరూ ప్రేమించుకుంటున్నామని, పెళ్లి చేసుకుంటామని వారు తల్లిదండ్రులకు చెప్పగా..వారు వరుస కాదంటూ మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన రాముడు, భారతితో కలసి శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై కొమరోలు మండలం అక్కపల్లె వద్దకు బయలుదేరి వెళ్లారు. శనివారం సాయంత్రం రాముడు తండ్రికి ఫోన్ చేసి తాము చనిపోతున్నామని చెప్పి, వెంటనే తామున్న ప్రాంతాన్ని కూడా వాట్సాప్ చేశాడు. దీంతో ఆందోళనకు గురైన ఇరు కుటుంబాల వారు ఆదివారం ఉదయం కొమరోలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ నాగరాజు, సిబ్బందితో హుటాహుటిన కొమరోలు శివారు ప్రాంతానికి వచ్చి పరిశీలించగా..రాముడు, భారతి మృతదేహాలు చెట్టుకు వేలాడుతున్నాయి. వెంటనే వారు మృతదేహాలను గిద్దలూరు వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం చేయించారు. అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించగా, వారు మాధవరానికి తరలించారు. ఒకే ప్రాంతానికి చెందిన వారు బలవన్మరణానికి పాల్పడటంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

చదరంగం క్రీడతో మెదడుకు పదును

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: చదరంగం క్రీడ మెదడుకు పదును పెట్టి బాలల మేధో సంపత్తి పెంచుతుందని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.రవి కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నెరవాటి పాఠశాలలో 13ఏళ్ల లోపు బాలబాలికలకు జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు.

రిమాండ్ ఖైదీ మృతిపై విచారణ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నెల్లూరు జిల్లా కావలి పరిధిలోని వెంగళరావుకాలనీకి చెందిన రిమాండ్ ఖైదీ పోతురాజు శాంతిపవన్‌కుమార్ అలియాస్ వసంత్ (59) మృతి చెందడం వివాదాస్పదంగా మారింది. తక్కువ ధరకు బంగారు విక్రయిస్తామంటూ విజయవాడకు చెందిన డాక్టర్ రాజేంద్రప్రసాద్ నుంచి రూ.7.32 కోట్లు తీసుకుని మోసగించడంతో పాటు బెదిరించి మరో రూ.50 వేలు వసూలు చేసిన ఆరోపణలపై నెల్లూరు జిల్లాకు చెందిన ఏడుగురిపై కర్నూలు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన పోతురాజు రతన్‌కుమార్, ఇతని తండ్రి పోతురాజు శాంతిపవన్‌కుమార్, శ్రీకాంత్, పాలకీర్తి జశ్వంత్‌ను ఈ ఏడాది జూన్ 30న కర్నూలు పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌పై జిల్లా కారాగారానికి పంపారు. వీరిలో మాజీ పోలీసు అధికారైన పోతురాజు శాంతిపవన్‌కుమార్ మూత్రపిండాల సమస్యతో బాధపడుతుండగా ఆసుపత్రిలో చేర్పించారు. ఈనెల 4న కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. దీనిపై జిల్లా కారాగారం ఇన్‌ఛార్జి పర్యవేక్షణాధికారి ఎరికినాయుడు ఫిర్యాదు మేరకు కర్నూలు మూడో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆదివారం భారీ పోలీసు బందోబస్తు మధ్య కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో ఆయన మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి ప్రత్యేక వాహనంలో స్వగ్రామానికి పంపారు.

అదృశ్యమైన విద్యార్థి.. ఉరేసుకుని ఆత్మహత్య

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పొలానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన విద్యార్థి పొలాల్లో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం ఆలూరులో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆలూరు మండలం కురువళ్లి గ్రామానికి చెందిన హనుమంతప్ప, అంపమ్మకు దంపతులకు ఇద్దరు కుమారులు చిన్నవాడు విజేంద్ర(16) ఆలూరులోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గత నెల 29న ఉదయం పొలానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు. ఇంటికి తిరిగిరాలేదు. అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లిదండ్రులు ఈ నెల 2వ తేదీన ఆలూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో, అదృశ్యం కేసు నమోదు చేశారు. బాలుడు పొలంలో చెట్టుకు ఉరేసుకుని వేలాడుతుండటాన్ని గొర్రెల కాపరులు ఆదివారం చూసి గ్రామస్థులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని కిందకు దింపి శవపంచనామా నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్సై మహబూబ్‌బాషా తెలిపారు.



విజేంద్ర (పాత చిత్రం)

ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

ఎమ్మిగనూరు గ్రామీణం, ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థిని ఆదివారం ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలానికి చెందిన బాలిక ఎమ్మిగనూరులోని కళాశాలలో ఇంటర్ చదువుతోంది. వారం కిందటే కళాశాలలో చేరింది. స్వగ్రామానికి కళాశాల దూరం కావడం, ఇక్కడ చదువుకునేందుకు అమ్మాయికి ఇష్టం లేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు ఆదివారం వచ్చి కుమార్తెకు నచ్చజెప్పి సాయంత్రం వెళ్లిపోయారు. ఇంతలో విద్యార్థినీ చున్నీతో ఉరేసుకుంది. తోటి విద్యార్థినులు గమనించి కళాశాల అధ్యాపకులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి గ్రామీణ ఎస్సై శ్రీనివాసులు చేరుకొని పరిశీలించారు. విద్యార్థిని మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే బి.వి.జయనాగేశ్వరరెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వ్యవసాయానికి కృషి విజ్ఞాన కేంద్రం

☛ కొత్త వంగడాల సాగు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, నూతన వంగడాలు అందించి వారి ఆదాయాన్ని పెంపొందించేందుకు 'బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం' కృషి చేస్తోంది. పంట ఉత్పాదకతను పెంచడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. ఈ ఏడాది పలు కొత్త వంగడాలను రైతులకు అందజేశారు.

ఖరీఫ్‌లో అందజేసినవి..

- **కొర్ర-3156 రకం:** ప్రాంతీయ పరిశోధన స్థానం నంద్యాల సహకారంతో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా 30మంది రైతులకు కొర్ర విత్తనాలు పంపిణీ చేశారు. ఈ రకం పంట కాలం 85-90రోజులు. ఎకరాకు 11నుంచి 13క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అధిక గింజ దిగుబడి రకం. వెర్రికంకి తెగులు తట్టుకుంటుంది.
- **కంది ఎల్ఆర్జీ-454 రకం:** ప్రాంతీయ పరిశోధన స్థానం లాంఫామ్ గుంటూరు సహకారంతో పది మంది రైతులకు ప్రదర్శన క్షేత్రాల కోసం విత్తనాలు అందజేశారు. పంట కాలం 155-160 రోజులు. ఎకరానికి 8-10క్వింటాళ్ల దిగుబడి. ఎండు తెగులు, వెర్రి తెగులు తట్టుకుంటుంది.
- **వరి ఆర్‌జీఎల్-7034రకం:** పంట కాలం 130-140 రోజులు. మధ్యస్థ సన్నబియ్యం రకం. దిగుబడి ఎకరానికి 26క్వింటాళ్లు. గాలులకు నేలవాలదు. ఉల్లి కోడు, అగ్గి తెగులు, దోమోపాటు, ఎండాకు తెగులు తట్టుకుంటుంది.
- **వరి ఆర్‌జీఎల్-7038, 7039 రకాలు:** పంట కాలం 140-145 రోజులు. దిగుబడి ఎకరానికి 26 క్వింటాళ్లు. 30మంది రైతులకు ప్రదర్శన క్షేత్రాలు కోసం విత్తనం అందజేశారు.
- **వరి ఎన్ఎల్ఆర్-3648 రకం:** 130రోజులు పంట కాలం. గింజ సన్నగా ఉంటుంది. ఎకరాకు 30క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అగ్గి తెగులు తట్టుకుంటుంది. పది మంది రైతులకు ప్రదర్శన క్షేత్రాలు కింద విత్తనం వేశారు.
- **సజ్జలు-ఏపీహెచ్‌బీ-126 రకం:** పంట కాలం 126రోజులు. వర్షాధారంగా ఎకరానికి పది క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. నీటి పారుదల కింద ఎకరానికి 13నుంచి 14క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.
- **ఉదలు సీబీవైఎంవీ-1రకం:** పంట కాలం 90రోజులు. ఎకరానికి 4-5క్వింటాళ్ల దిగుబడి. తుప్పుతెగులు తట్టుకుంటుంది.

వేరుసెనగ ప్రదర్శన క్షేత్రంలో కేవీకే శాస్త్రవేత్తలు

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన బి.మహేశ్(13) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృత్యుఒడికి చేరాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దతుంబళం గ్రామంలో నివాసం ఉంటున్న బేల్దారు హనుమంతరెడ్డి, అంజినమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. పెద్దకుమారుడు బి.మహేశ్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. నిర్మిస్తున్న ఇంటికి క్యూరింగ్ చేయాలని, విద్యుత్తు మోటర్ తీసుకురమ్మని తండ్రి హనుమంతరెడ్డి కుమారుడు మహేశ్‌కు చెప్పారు. ఈ క్రమంలో మహేశ్ అప్పటికే స్విచ్‌ఆన్‌లో ఉన్న విద్యుత్ మోటరు తెస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీమున్నీరుగా విలపించారు.

మహేశ్ (పాత చిత్రం)

మహిళపై అత్యాచారయత్నం.. ఆపై దాడి

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని మండలానికి చెందిన ఓ మహిళపై జాలిమంచి గ్రామానికి చెందిన వీరేశ్ అత్యాచారయత్నానికి పాల్పడి, దాడి చేశాడని పెద్దతుంబళం పోలీసులు తెలిపారు. వీరేశ్ ద్విచక్రవాహనంపై ఆదోని వైపు వెళ్తుండగా ఓ మహిళ లిఫ్ట్ అడిగారు. ఆ మహిళను ఆదోని వైపు కాకుండా సమీపంలోని పొలాల్లోకి తీసుకెళ్లి బలవంతం చేయబోగా.. ఆమె కేకలు వేయడంతో మహిళపై వీరేశ్ దాడి చేశాడు. అంతలోనే సమీప పొలాల్లోని వారు అక్కడికి రావడంతో వీరేశ్ పరారయ్యాడన్నారు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన డోన్ జాతీయ రహదారిలోని యు.కొత్తపల్లి వద్ద నున్న ఓ దాబా వద్ద జరిగింది. సీఐ ఇంతియాజ్ బాషా కథనం ప్రకారం... పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఇమామ్ బాషా(30) మొహర్రం సందర్భంగా తన స్వగ్రామమైన కొత్తబురుజుకు ఆదివారం తన ద్విచక్రవాహనంపై బయలుదేరారు. యు.కొత్తపల్లి వద్ద లారీ ఢీకొనడంతో ఇమామ్ బాషా అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు పట్టణంలోని కంబాలపాడు సర్కిల్ వద్ద ఉన్న మసీద్ సమీపంలో ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వెలుగోడులో అగ్నిప్రమాదం

వెలుగోడు, న్యూస్‌టుడే: వెలుగోడు పట్టణంలోని సీపీనగర్‌లో ఉన్న కార్పెంటర్ షెడ్డులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బండిఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన జయరాజు పదేళ్లుగా వెలుగోడులోని సీపీనగర్‌లో కార్పెంటర్ షెడ్డు ఏర్పాటు చేసుకొని ఫర్నిచర్ తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగించేవారు. శనివారం అర్ధరాత్రి విద్యుదాఘాతంతో మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక వాహన సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక వాహనం వచ్చి మంటలు ఆర్పేలోగా నష్టం జరిగినట్టుగా స్థానికులు చెప్పన్నారు. ప్రమాదంలో రూ.15లక్షల విలువైన కలప, కోతమిషన్లు, రేకుల షెడ్డు కాలిబూడిదైనట్లు, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు జయరాజు తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

FINANCIAL SERVICES

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్సియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

REAL ESTATE

FLAT FOR SALE

కర్నూలు, సుంకేసుల రోడ్ నందు గల గాంధీ టవర్స్ నందు 2 BHK 203 ప్లాట్ మరియు జనప్రియ అపార్ట్ మెంట్ నందు గల ఫ్లాట్ 507, 3 BHK ఫ్లాట్లు అమ్మకమునకు కలవు. సంప్ర: 99514 71799.

HOUSE FOR SALE

రోహిణి ఇన్‌ఫ్రా వారి నూతన ప్రాజెక్ట్ కామధేను నివాస్ - 2, బెంగుళూరు రోడ్డు లక్ష్మీపురం దగ్గర ఇండిపెండెంట్ హౌసెస్ కలవు. అనూష: 91600 38988, 88866 62148.

JOBS

టైలర్లు & మాస్టర్లు కావలెను. శ్రీవేద డిజైనర్స్, ప్రకాష్ నగర్, కర్నూలు. కట్టింగ్ & స్టిచింగ్ పని. మగ వారు/ఆడ వారు కావలెను. సంప్ర॥ 94913 43898.

We are Hiring! Telecallers (Female), Marketing Executives & Accountant. Prior Experience in a Similar role in the Real Estate Industry is Preferred. Job Location: Kurnool. Contact us on: 77300 55888.

FACULTY/ TEACHERS

Wanted Experienced Teacher for Social Students Cont. Vijetha High School, Near Krishna Nagar, ITC, Kurnool. Cell No: 94921 98651.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఆదోని
• ఆదోని • ఆలూరు • పత్తికొండ

యూరియా ఎరువుల కొరత లేదు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని మండలంలో యూరియా ఎరువులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆదోని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఆదోని మార్కెట్ యార్డులోని డీసీఎంఎస్ గోదాములో 15 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 620 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. సోమవారం నుంచి డీసీఎంఎస్ గోదాము, రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు సరఫరా చేసేందుకు సుమారు 200 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచామని.. రైతులు అవసరానికి అనుగుణంగా కొనుగోలు చేయాలని సూచించారు. ఎరువుల సరఫరాలో ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించినా, ఇతర ఉత్పత్తులను కలిపి అమ్మినా, ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు విక్రయించే డీలర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నీటి ట్యాంకులో పాము

దేవనకొండ, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీకి సంబంధించిన నీటి ట్యాంకులో పాము పడటంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. నీటి ట్యాంకు దిగువన ఉండటంతో పాము వచ్చినట్లు స్థానికులు తెలిపారు. దిగువన ఉన్న నీటి ట్యాంకు ఎత్తు పెంచాలని స్థానికులు అన్నారు. పంచాయతీ సిబ్బంది పాములు పట్టేవారికి సమాచారం ఇవ్వగా.. పట్టుకొని అడవిలో వదిలేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణం సట్టాబజారులోని మురుగు కాలువలు వ్యర్థాలతో పేరుకుపోయాయి. దీంతో వర్షం వచ్చిన సమయంలో మురుగు నీరంతా రహదారులపై ప్రవహిస్తోంది. కాలువలను శుభ్రం చేయాలి. **- రాజు, ఆదోని**

✔: ప్రజారోగ్య విభాగం వారికి సూచించి సమస్య పరిష్కరిస్తాం. **- కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం**

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని ఎర్రిస్వామి ఇంటి వద్ద ఉన్న నీటి పథకం నిరుపయోగంగా మారింది. **- రామాంజులు, మద్దికెర**

✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- సుహాసిని, సర్పంచి, మద్దికెర**

హొళగుంద: ?: హొళగుంద ఈబీసీ కాలనీలో మురుగు కాల్వలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉంటోంది. **- రాజణ్ణ, హొళగుంద**

✔: పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించి పరిష్కరిస్తాం. **- రంగమ్మ, సర్పంచి**

బకాయిల చెల్లింపుపై జాప్యం తగదు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లింపుపై చేస్తున్న జాప్యం తగదని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ మహదేవప్ప అన్నారు. ఆదివారం ఆదోని ఎస్టీయూ కార్యాలయంలో ఆదోని, కౌతాళం మండలాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడిలో అదనపు సమయాలు పని చేయాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు సుంకన్న, రామాంజనేయులు, భాస్కర్, గణేశ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

చేతివృత్తిదారుల సమస్యలు పరిష్కరించండి

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: చేతి వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేస్తూ.. ఈ నెల 8వ తేదీన ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు చేనేత వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.కారన్న, సీపీఐ పట్టణ కార్యదర్శి వీరేశ్ తెలిపారు. ధర్నాకు సంబంధించి కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, కొత్తూరు గంగన్న, శివ, రాముడు, హనుమంతు, చిన్న ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

కాస్త అరకొర.. మెరుగవ్వాలి ఇంకాస్త

☛ విద్యార్థులకు సరిపోని భోజనం ☛ మొహర్రం ఉండటంతో గ్రామాలకు

పరిశీలన

భోజనం వడ్డించుకుంటున్న విద్యార్థులు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఈ వసతి గృహంలో మధ్యాహ్నం విద్యార్థులకు చికెన్ బిర్యానీ, గోంగూరు చెట్నీ, మజ్జిగ వడ్డించారు. ఈ వసతి గృహంలో వంద మంది విద్యార్థుల సామర్థ్యం ఉండగా.. ఇప్పటి వరకు 84 మంది చేరారు. ఆదివారం మొహర్రం కావడంతో కొందరు విద్యార్థులు సెలవు పెట్టి ఇళ్లకు వెళ్లారు. 56 మంది విద్యార్థులు వసతి గృహంలో భోజనం చేశారు. నిర్వాహకులు 12 కిలోల బియ్యం, 6 కిలోల చికెన్‌తో ప్రభుత్వం సరఫరా చేసిన సన్నబియ్యంతో చికెన్ బిర్యానీ, గోంగూరు చెట్నీ, మజ్జిగ తయారు చేసి వడ్డించారు.

వసతి గృహం: ❁
మొత్తం విద్యార్థులు: ❖
ఆదివారం హాజరైంది: ▼

❁ ఎస్సీ బాలుర వసతి గృహం-I, ఆదోని
❖ 84 మంది ▼ 56 మంది

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులంతా మొహర్రం ఉండటం వల్ల వారి గ్రామాలకు వెళ్లారు. తక్కువ మంది ఉండటం వల్ల నాణ్యమైన భోజనం వడ్డించారని విద్యార్థులు చెబుతున్నారు.

❁ సమీకృత వసతిగృహం, ఆలూరు
❖ 230 మంది ▼ 65 మంది

❁ బీసీ వసతి గృహం, మద్దికెర
❖ 170 మంది ▼ 11 మంది

మద్దికెర, న్యూస్‌టుడే: విద్యార్థుల సంఖ్య పూర్తి తక్కువగా ఉండటం వల్ల భోజనం నాణ్యతగా ఉంది. గృహంలో చిన్నపాటి సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఉన్న విద్యార్థులకు 8 కిలోల చికెన్ తెచ్చి, ఒక్కొక్కరికి వంద గ్రాములు వడ్డించారు. పెరుగు పచ్చడి, గోంగూర చెట్నీ చేశారు.

❁ సాంఘిక సంక్షేమ సమీకృత వసతి గృహం, పత్తికొండ
❖ 380 మంది ▼ 80 మంది

పేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వసతి గృహాల నిర్వహణపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని అందే ఆహారం మెనూను సైతం మార్చింది. ఆదివారం చికెన్ బిర్యానీ వడ్డించాలని ఆదేశించింది. కొన్ని వసతి గృహాల్లో పొలావ్, చికెన్ కరీతో సరిపెట్టగా.. పలు గృహాల్లో పక్కాగా అమలు చేశారు. 'న్యూస్‌టుడే' ఆదివారం వసతి గృహాలను పరిశీలించింది.

భోజనం చేస్తున్న విద్యార్థులు

ఐదుగురే..!

ఆస్పరి, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన సమయంలో ఐదుగురు విద్యార్థులే మాత్రమే ఉన్నారు. మొహర్రం పండగ ఉండటంతో అందరూ ఇళ్లకు వెళ్లినట్లు వసతిగృహ తాత్కాలిక సంరక్షకులు నాగరాజు తెలిపారు.

❁ ఎస్సీ బాలురు వసతిగృహం, ఆస్పరి
❖ 64 మంది ▼ 05 మంది

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని ఫెయిత్ హోమ్ అనాథ పిల్లల ఆశ్రమంలో చదువుతున్న విద్యార్థులకు ఆదివారం నంద్యాలకు చెందిన చైతన్య కళాభారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఎస్‌ఐ సీడబ్ల్యూటీ, యూకే వారి ఆర్థిక సహకారంతో పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్. బిషప్ డానియల్ ప్రేమ్‌కుమార్, సంస్థ అధ్యక్షుడు విజయ భాస్కర్, వరలక్ష్మి, మహేశ్వరమ్మ పాల్గొన్నారు.

నాలుగు కి.మీ. దారికి.. 8కి.మీ. ప్రయాణం

ఆస్పరి మండలం కారుమంచి గ్రామం నుంచి ములుగుందం గ్రామానికి వెళ్లాలంటే సుమారు 4కి.మీ. మట్టి రహదారి ఉంది. ఆ దారంతా గుంతల మయంగా మారింది. వర్షం కురిస్తే చాలు గుంతల్లో నీరు చేరి, ప్రమాదకరంగా మారుతోంది. నాలుగు కి.మీ. మీటర్ల రహదారి బాగు చేస్తే.. ఆస్పరికి వెళ్లేందుకు సుమారు 8కి.మీ. దూరం తగ్గుతుందని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆస్పరి

మోడు కూలుతుంది.. మాడు జాగ్రత్త

ఆదోని పట్టణంలోని పలు ప్రాంతాల్లో మోడుబారిన వృక్షాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. గాలివానల కాలం కావడంతో వాహనదారులు, పాదచారుల మీద కూలితే ప్రమాదం తప్పలేదని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఎవరి ప్రాణం మీదకు తెస్తాయోనని భయం భయంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తిరుమల నగర్ సమీపంలో కర్నూలు రహదారితో పాటు పట్టణంలో ఆంధ్రాబ్యాంకు ముందు భాగంలో, శివాలయం మోటారు వాహన కార్యాలయం ప్రాంతంలో రాయచూర్ రహదారిలో ఇలా పలు చోట్ల వృక్షాలు ఎండాయి. ఇవి కూలకముందే సంబంధిత అధికారులు వీటిని తొలగించి, ప్రమాదాలు నివారించాలని జనం కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆదోని పాతపట్టణం

సిమెంటు చెదిరి.. మట్టి తేలి

రహదారి నిర్మాణంలో సిమెంటు కలపకుండానే పనులు పూర్తి చేశారేమో అనే సందేహం కలగక మానదు ఈ దారి చూస్తే. మద్దికెర రైల్వే స్టేషన్ ఎదురుగా నిర్మించిన ఈ దారి సిమెంటు కలిసిన ఆనవాళ్లే లేవు. రూ.5 లక్షలతో నిర్మాణం పూర్తి చేశారు. అనతి కాలంలోనే శిథిలావస్థకు చేరింది. కేవలం కంకర, ఇసుక మాత్రమే కలిపి పరిచారు. ఆపై క్యూరింగ్ వదిలేశారు. దీనిపై ఎలాంటి వాహనాలు నడవకుండానే ఇది దెబ్బతినిందంటూ ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. – న్యూస్‌టుడే, పత్తికొండ

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ.. విధి నిర్వహణలో ఉండగా గత మే నెలలో రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ శేఖర్ మృతిచెందారు. ఆయన కుటుంబానికి మిత్ర బృందం అండగా నిలిచారు. 2018లో నియామకంలో భాగంగా నెల్లూరులో శిక్షణ పొందిన మిత్ర బృందం సేకరించిన రూ.1.50లక్షలు మృతుడు శేఖర్ భార్య పిల్లలకు ఆయన స్వగ్రామం మద్దూరు గ్రామంలో అందజేసినట్లు పత్తికొండ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తెలిపారు.

అభివృద్ధి పనుల్లో అవినీతికి తావులేదు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: పట్టణంలో జరిగే అభివృద్ధి పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి హెచ్చరించారు. ఆదివారం శివారులోని అమరావతినగర్‌లో రూ.15 లక్షలతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సామూహిక శౌచాలయ నిర్మాణానికి భూమి పూజ చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఇబ్బందులను తొలగించేందుకు వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేస్తే, వాటిని నాటి వైకాపా వార్డు కౌన్సిలర్లు దిగమింగారన్నారు. ప్రస్తుతం విజిలెన్స్ విచారణ జరుగుతోందన్నారు. నివేదిక వచ్చాక అక్రమార్కుల భరతం పడతమన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలరు లలితామధుసూదన్‌శర్మ, సురేశ్, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్రకుమార్, ఇన్‌ఛార్జి ఎం.ఈ వెంకటచలపతి, తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే డా.పార్థసారథి

కూటమితోనే దివ్యాంగుల సంక్షేమం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: దివ్యాంగుల సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఆదోనికి చెందిన దివ్యాంగుల సాధికారిత ఫోరం రాష్ట్ర కార్యదర్శి కురువ వెంకటేష్ అన్నారు. ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో దివ్యాంగుల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి ధన్యవాద సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులకు రూ.3వేల నుంచి రూ.6వేలకు, మంచానికి పరిమితమైన వారికి రూ.10వేల నుంచి 15 వేలకు పింఛను పెంచిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి దక్కుతుందన్నారు. సంక్షేమానికి పాటు పడుతున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తెదేపా నాయకులు వెంకటేశ్‌ను సన్మానించారు.

వెంకటేశ్ సన్మానిస్తున్న తెదేపా నాయకులు

ప్రాణ త్యాగం చేసిన మహోన్నతుడు ముఖర్జీ

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఒకే దేశం రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదని డా.శ్యామప్రసాద్ ముఖర్జీ పోరాటం చేసి, ప్రాణ త్యాగం చేశారని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి అన్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ముఖర్జీ జయంతి పురస్కరించుకుని పార్టీ నాయకులతో కలిసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సభ్యులు విట్ట రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్రకుమార్, అసెంబ్లీ కోకన్వీనర్ నాగరాజుగౌడ, రవిశంకర్, కిరణ్‌కుమార్, మహేష్‌నాయక్, నాగేష్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రాం సేవలు మరువలేనివి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్‌రాం అని జైభీమ్ ఫౌండేషన్ నాయకులు ఆవుల సోమన్న అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా పత్తికొండ సాంఘిక సమీకృత వసతి భవనంలో ఆదివారం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వసతి గృహ అధికారి నాగరాజు, విద్యార్థులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుందలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కెంచప్ప, చిదానంద, దుర్గాప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

త్యాగాల ప్రతీక.. మొహర్రం

చిప్పగిరి: చిప్పగిరిలో సయ్యద్‌షా అబ్దుస్ సత్తార్ హాదీ ఖాద్రి ఉరుసు సందర్భంగా గంధోత్సవం కనులపండువలా నిర్వహించారు. సయ్యద్‌షా వంశీయులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఆదోని ఖాజీపురలో మాతం నిర్వహిస్తున్న ముస్లింలు

ఆస్పరి: ఆస్పరిలో ఊరేగింపు

పల్లెలు, పట్టణాల్లో ఆదివారం మొహర్రం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కొలువుదీరిన పీర్లను భక్తులు దర్శించుకుని ఫాతేహాల్ సమర్పించారు. గ్రామాల్లో ఊరేగించారు. ఆదోనిలో షియా వర్గం ముస్లింలు మాతం నిర్వహించారు. గ్రామాల్లో యువకులు విచిత్ర వేషాలు ప్రదర్శించారు. చిప్పగిరిలో అత్యధికంగా భక్తులు హాజరు కావడం ప్రత్యేకతను చాటింది. పెద్ద సరిగెత్తు సందర్భంగా మసీదులు భక్తులతో కిటకిటలాడాయి. ఆదోని పట్టణం, మండలంతో పాటు పత్తికొండ, వెల్దుర్తి, తుగ్గలి, కృష్ణగిరి, ఆలూరు, ఆస్పరి, హొళగుంద, హాలహర్వి, దేవనకొండ, మద్దికెర, చిప్పగిరి మండలాల్లో మొక్కులు తీర్చుకొనేందుకు భక్తులు బారులు తీరారు. అనంతరం అగ్నిగుండాలు చుట్టూ ప్రత్యేక నృత్యం చేశారు. – న్యూస్‌టుడే, బృందం

ఆదోని పట్టణం కల్లుబావి ప్రాంతం పీర్ల ఊరేగింపు

దేవనకొండ: విచిత్ర వేషధారణలో యువకులు

హాలహర్వి: కామినహల్‌లో ఆలూరు, మంత్రాలయం ఎమ్మెల్యేలు విరుపాక్షి, బాలనాగిరెడ్డి ప్రార్థనలు

కృష్ణగిరి: కంబాలపాడు గ్రామంలో ఊరేగింపు

తొలి ఏకాదశి.. వెల్లివిరిసిన భక్తసిరి

ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పాండురంగస్వామి విఠల ఆలయాలు, శ్రీకృష్ణ, వేంకటేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తులు భజనలు చేస్తూ.. ఉత్సవ మూర్తులకు పల్లకోత్సవం చేపట్టారు. ఆదోని, ఆలూరు రుక్మిణి, పాండురంగస్వామి, పత్తికొండ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి మద్దికెర మండలం పెరవలి శ్రీరంగనాథస్వామి ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. – న్యూస్‌టుడే, బృందం

ఆదోని పట్టణం ఇందిరానగర్‌లో వేంకటేశ్వరస్వామి

ఆదోనిలో భజనలు చేస్తూ ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఆదోని నల్లకొండ ప్రాంతంలో ఆలయం వెలుపల దర్శనానికి వరుసలో నిల్చొన్న భక్తులు

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మిరియాల రాంప్రసాద్

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మిరియాల రాంప్రసాద్ ఎన్నికయ్యారు. స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో సంఘం అధ్యక్షతన ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష స్థానం బరిలో టీ.జీ.శ్రీనివాసులు, మిరియాల రాంప్రసాద్ నిల్చున్నారు. మిరియాల రాంప్రసాద్ 94 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. మూడేళ్ల పాటు అధ్యక్ష స్థానంలో కొనసాగనున్నారు. పలువురు కొత్త అధ్యక్షుడిని సన్మానించి అభినందనలు తెలిపారు.

రాంప్రసాద్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

అత్యాచార నిందితుడిని శిక్షించాలి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో విద్యార్థినిపై అత్యాచారం చేసిన ఆటో డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, ఏఐఎస్ఎఫ్ మండల కోశాధికారి శేఖర్ డిమాండు చేశారు. ఆదివారం పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థులు ఆదోని పట్టణంలోని ఎమ్మిగనూరు కూడలిలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, శివ తదితరులు పాల్గొన్నారు.

రాంపల్లిలో పోలీసు బందోబస్తు

రాంపల్లి(తుగ్గలి), న్యూస్‌టుడే: మొహర్రం సందర్భంగా రాంపల్లి గ్రామంలో రెండు రోజులుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పత్తికొండ పట్టణ సీఐ జయన్న, తుగ్గలి ఎస్సై బాల నరసింహులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు చేపట్టారు. సమస్యాత్మక గ్రామం కావడంతో పెద్ద సరిగెత్తు నేపథ్యంలో ఆదివారం గుండం వద్ద తప్పెట్లతో ఆడేందుకు పోలీసులు యువకులకు అనుమతి ఇవ్వలేదు. చిన్న సరిగెత్తు రోజు ఆడే విషయంలో ఇరువర్గాల నాయకుల అనుచరులు వాగ్వాదానికి దిగడంతో పోలీసులు ఈ చర్యలు తీసుకొన్నారు.

సలకలకొండ.. నిండని నీటి కుండ

☛ వానాకాలంలోనూ తప్పని తిప్పలు ☛ నీరు కొంటేనే దాహం తీరేది

సలకలకొండ (ఆదోని ఎస్కేడీ కాలనీ), న్యూస్‌టుడే: వర్షాకాలం మొదలైనా.. ఆ గ్రామంలో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామంలో అధికారులు ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు కానీ.. తాగునీరు సరఫరా చేయడం లేదు. గ్రామంలో 2వేల జనాభా, 500 కుటుంబాలు ఉన్నాయి. పెసలబండ నీటి పథకం నుంచి సరఫరా చేయాలి ఉంది.

తాగునీటి సమస్యను విన్నవిస్తున్న సలకలకొండ గ్రామస్థులు

ఆదోని మండలం సలకలకొండ గ్రామంలో నెలలో ఒకటి రెండు సార్లు మాత్రమే తాగునీరు సరఫరా చేస్తున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఆ నీరు కూడా ఎప్పుడు వస్తుందో తెలియడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. తాగునీటి కోసం ఒక్కో క్యానుకు రూ.10 వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పశువులను గ్రామ పొలాల్లోని బోర్ల వద్దకు తీసుకెళ్లి తీరు తాపుతున్నామని చెబుతున్నారు. అధికారులు స్పందించి మా గ్రామంలో పర్యటించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఒక్క క్యాను
రూ.10

నెలలో రెండుసార్లే.. - రాముడు, సలకలకొండ

గ్రామంలో నెలకు ఒకటి రెండుసార్లు మాత్రమే తాగునీరు సరఫరా చేస్తున్నారు. దీంతో తాగునీటి క్యానుకు రూ.10 చొప్పున కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని నెలలుగా ఈ సమస్య నెలకొన్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. మా కష్టాలు ఎవరికి చెప్పాలో అర్థం కావడంలేదు.

అధికారులు స్పందించాలి - ఉరుకుందప్ప, సలకలకొండ

మా గ్రామ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించడంలేదు. కుళాయికి నీటి సరఫరా ఎప్పుడు చేస్తారో తెలియని పరిస్థితి. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదు. పశువుల దాహం తీర్చేందుకు గ్రామ సమీపంలోని పొలాల్లోని బోర్ల వద్దకు వెళ్తున్నాం. సమస్య పరిష్కరించాలి.

పేదల సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం

తుగ్గలి, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయమని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకటరాముడు అన్నారు. శభాష్‌పురం గ్రామంలో ఆదివారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొని కరపత్రాలు ప్రజలకు అందజేశారు. పార్టీ నాయకులు వెంకటస్వామి, బాలన్న, తిరుపాల్‌నాయుడు, మోహన్, ఆదినారాయణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు అందజేస్తున్న తెదేపా నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకటరాముడు, తదితరులు

శాకాహారంతోనే ఆరోగ్యం

కలుగొట్ల(వెల్దుర్తి), న్యూస్‌టుడే: శాకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ధ్యాన ప్రచార కార్యదర్శి బంగా ఆంజనేయరెడ్డి, వెంకట్రాముడు అన్నారు. కలుగొట్ల గ్రామంలో పిరమిడ్ మాస్టర్లు సరస్వతి, వెంకట్రాముడు దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం శాకాహార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ఇందుమతి, పద్మజ్యోతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న ధ్యాన కేంద్రం నిర్వాహకులు

(c) eenadu

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

సరదా పడితే ప్రమాదమే..

తుంగభద్ర నది ప్రవాహంలో దిగుతున్న భక్తులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: కర్ణాటక నుంచి దిగువకు వస్తున్న వరద నీరు మంత్రాలయం చేరుకుంది. దీంతో చాలా రోజుల తర్వాత తుంగభద్ర నది నిండు కుండలా ప్రవహిస్తోంది. దీంతో భక్తులతో పాటు గ్రామస్థులు నదీ తీరం చేరుకుని సరదాగా గడుపుతున్నారు. 80 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలడంతో వరద నీరు అధికంగా ప్రవహిస్తోంది. భక్తులు చిన్న పిల్లలతో కలిసి నదిలోకి వెళ్లి పుణ్యస్నానాలు చేస్తున్నారు. వరద ఉద్ధృతికి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

స్వల్పంగా తగ్గిన వరద

సుంకేసుల(గూడూరు గ్రామీణం), న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయానికి ఆదివారం ప్రవాహం స్వల్పంగా తగ్గింది. శనివారం 72 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ప్రస్తుతం 65,200 క్యూసెక్కులు ఉన్నట్లు జలాశయ ఇంజినీరు మహేందర్ రెడ్డి తెలిపారు. 17 గేట్లు మీటర్ ఎత్తు తెరిచి నది దిగువకు 67,218 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఎమ్మిగనూరు గ్రామీణం	కోసిగి
80085 73794	9550434095

నందవరం, న్యూస్‌టుడే: ?: మండల పరిధిలోని ముగతి గ్రామంలో భీమేష్ ఇంటి పక్కనే రహదారిపై మురుగు ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి మురుగును శుభ్రం చేయాలి. - బాలు, కాలనీవాసులు

✔: విషయం సంబంధిత అధికారులకు తెలియజేసి, సమస్యను పరిష్కరించేలా చూస్తాం. - విరుపాక్షిరెడ్డి, సర్పంచి ముగతి

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: మండలంలోని నౌలేకల్ గ్రామంలో చాలా రోజుల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. దీంతో కాల్వలు నిండి మురుగు రహదారులపై చేరి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఉన్నతాధికారులు స్పందించి మురుగు కాల్వలను శుభ్రం చేయించాలి. -గ్రామస్థులు, నౌలేకల్.

✔: గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రత సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. పంచాయతీలో నిధులను అనుసరించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. -ప్రభావతిదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు.

శ్రీమఠంలో కన్నడ నటుడు యువరాజ్

మంత్రాలయం, న్యూస్‌టుడే: బృందావనాన్ని దర్శించుకోవడానికి కన్నడ సూపర్ స్టార్ దివంగత డాక్టర్ రాజ్‌కుమార్ మనవడు, రాఘవేంద్ర రాజ్ కుమార్ కుమారుడు యువరాజ్ కుమార్ ఆదివారం మంత్రాలయం వచ్చారు. శ్రీమఠం చేరు

మఠం ప్రాకారంలో కన్నడ నటుడు యువరాజ్ కుమార్

కున్న వీరికి అధికారులు ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూల బృందావనం దర్శించుకున్నారు. యువరాజ్ కుమార్‌తో ఫొటోలు దిగేందుకు కన్నడ భక్తులు పోటీపడ్డారు. ఆయన నటించిన రెండో చిత్రం ఈనెల 18న విడుదల సందర్భంగా వారు మంత్రాలయం చేరుకొని బృందావనానికి పూజలు నిర్వహించారు.

సగం నీళ్లతో.. సరిపడకుండా..

✦ వసతిగృహాల్లో అరకొరగా వడ్డించిన మాంసాహారం

పరిశీలన

ఎమ్మిగనూరు, కోసిగి, న్యూస్‌టుడే: వసతిగృహాల్లో ఉండే విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం మెనూను రూపొందించింది. దాని ప్రకారం విద్యార్థులకు తప్పకుండా భోజనం అందించాలి. కానీ కొన్ని వసతిగృహాల్లో మెనూను సరిగా పాటించడం లేదు. ఆదివారం కోడి మాంసంతో భోజనం వడ్డించాల్సి ఉంది. కానీ కొన్నింటిలో తక్కువ పరిమాణంలో, నీళ్లలాంటి చారుతో విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఎమ్మిగనూరు పట్టణంలోని బీసీ వసతి గృహంలో ఆదివారం కోడికూర వడ్డించినప్పటికీ ఎక్కువగా నీళ్లే కనిపించాయి. విద్యార్థికి 150 గ్రాములు వడ్డించాలి. నీళ్ల చారే అధికంగా కనిపించింది. కోసిగి బీసీ బాలుర వసతి గృహంలో సరిపడా పెట్టలేదు. ఆదివారం 'న్యూస్‌టుడే' పరిశీలనలో వెలుగుచూసిన విషయాలు..

వసతి గృహం: బీసీ వసతి గృహం ఎమ్మిగనూరు
మొత్తం విద్యార్థులు: 180, **ఆదివారం హాజరైంది:** 70
మాంసాహారం పెట్టారా: కోడిమాంసం వడ్డించారు.

నాణ్యత ఎలా ఉంది: విద్యార్థుల సంఖ్య తగ్గింది. ప్రస్తుతమున్న వారికి 8 కిలోల కోడి మాంసం వండినట్లు చూపించారు. కొందరికి తక్కువగా ముక్కలు వేసినట్లు, నీళ్ల చారే కనిపించాయి. కొందరు వాటిని సరిగా తినక పారబోశారు.

బీసీ వసతి గృహంలో కోడిచారు వడ్డిస్తున్న వంట నిర్వాహకులు

వసతి గృహంలో సమస్యలు: అద్దె భవనంలో వసతి గృహం నడుస్తోంది. విద్యార్థులకు తాగేందుకు నీటి వసతి ఉన్నా కుళాయిలు తక్కువగా ఉన్నాయి. 30 గదుల ఉన్నా... కొన్నింటికి పైన ఉన్న వాటికి సరైన వెలుతురు లేదు. విద్యార్థులకు వసతులు కల్పిస్తే మేలు.

కోసిగి బీసీ బాలుర వసతి గృహం ★ 40 మంది విద్యార్థులు ★ 21 మంది హాజరు ★ కోడి కూర పెట్టారు ★ విద్యార్థులకు ఏ మాత్రం సరిపోలేదు

కోసిగి మండల కేంద్రంలో ఉండే బీసీ బాలురు వసతి గృహ విద్యార్థులకు 27 మందికి రెండున్నర కిలోల చికెన్ వడ్డించడంతో విద్యార్థులకు ఏ మాత్రం సరిపోలేదు. వసతిగృహంలో 40 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆదివారం 21 మంది హాజరయ్యారు. వీరికి కనీసం 5 కిలోల చికెన్ వడ్డించాల్సి ఉండగా కేవలం రెండున్నర కిలోలతో అరకొరగా సరిపెట్టారు. కనీసం తిన్నంత అన్నం కూడా పెట్టడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు తక్కువ వడ్డించి రికార్డుల్లో ఎక్కువ చూపిస్తూ.. అధిక బిల్లును

భోజనం చేస్తున్న విద్యార్థులు

చేసుకుంటున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. చికెన్ నామమాత్రంగా పెడుతున్నారని.. పెద్దగా రుచిగా ఉండదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వసతి గృహం వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రాష్ట్రవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఈనెల 9న జరిగే రాష్ట్రవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అంజిబాబు కోరారు. మంత్రాలయంలో ఆదివారం సీపీఎం మండల నాయకుడు జయరాజు, ఇతర నాయకులతో కలిసి గోడ పత్రికలను విడుదల చేశారు.

యూరియా ఉన్నా.. తప్పని నిరీక్షణ

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉప విభాగంలోని రైతులు బస్తా యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. ఆదివారం డీసీఎంఎస్‌కు 4 లారీల్లో 1160 బస్తాల యూరియా వచ్చింది. కానీ పంపిణీ చేయక యూరియా

డీసీఎంఎస్ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న రైతులు

కోసం వచ్చిన రైతులు గంటల తరబడి నిరీక్షించి వెనుదిరిగారు. అధికారులు పంపిణీ చేయవద్దని చెప్పారని.. సోమవారం యూరియా పంపిణీ చేస్తామని డీసీఎంఎస్ మేనేజరు, సహాయకులు చెబుతున్నారని రైతులు పేర్కొన్నారు. యూరియా కోసం కొందరు రైతులు వారం రోజులుగా తిరుగుతున్నా లభించక అవస్థలు పడుతున్నారు. డీసీ ఎంఎస్‌కు జులై 2 నుంచి ఆదివారం వరకు మొత్తం 1720 బస్తాల యూరియా వచ్చినట్లు మేనేజరు సత్యనారాయణ తెలిపారు. శనివారం వరకు 1160 బస్తాలు రైతులకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

నాలుగు రోజులుగా తిరుగుతున్నా

-పెద్దయ్య, ఎస్.నాగలాపురం

ఆరు ఎకరాలు పత్తి, రెండు ఎకరాలు వేరుశనగ వేశాను. యూరియా కోసం నాలుగు రోజులుగా తిరుగుతున్నా. వర్షంలో గంటల తరబడి నిరీక్షించినా టోకెన్లు రాసే సమయంలో యూరియా నిల్వ అయిపోయింది. రేపు రమ్మని పంపారు. ఈ రోజు యూరియా నిల్వ ఉన్నా అధికారులు పంపిణీ చేయలేదు.

రైతులు ఆందోళన చెందవద్దు: ఏడీఏ

యూరియా పుష్కలంగా ఉంది. రైతులెవరూ ఆందోళన చెందవద్దని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, మండల వ్యవసాయ అధికారి శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎరువు డీలర్ల దగ్గర యూరియా ఉందని, డీసీఎంఎస్‌కు ఆదివారం 1160 బస్తాల యూరియా వచ్చిందని తెలిపారు. డీలర్లు తమ దగ్గర ఉన్న యూరియా రైతులకు ఎలాంటి లింక్ పెట్టకుండా ఎమ్మార్పీ ధరలకు మించకుండా అమ్మాలని సూచించారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకొని లైసెన్సు రద్దు చేస్తామన్నారు.

ఘనంగా ఏకాదశి వేడుకలు

కృష్ణదొడ్డి (సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని కృష్ణదొడ్డి గ్రామంలో కొండపై వెలసిన ప్రఖ్యాత వైష్ణవ క్షేత్రం కొన వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఏకాదశి పురస్కరించుకొని ప్రత్యేక అభిషేక పూజలు జరిపారు. భక్తులు భారీ సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

కొన వెంకటేశ్వర స్వామి

సి.బెళగల్, న్యూస్‌టుడే: ఏకాదశి సందర్భంగా ఆదివారం సి.బెళగల్ ఆంజనేయస్వామి భజన బృందం సంకీర్తనలు పాడుతూ 2 కిలోమీటర్లు పాదయాత్రగా వెళ్లి కృష్ణదొడ్డి కొన వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

ఎమ్మిగనూరు,న్యూస్‌టుడే: పట్టణంలో ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం స్వామికి ప్రత్యేకంగా అలంకరించారు.

కోడుమూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: గోరంట్ల శ్రీలక్ష్మి మాధవ స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లను పట్టు వస్త్రాలతో అలంకరించి పూజలు నిర్వహించారు.

వెంకటేశ్వరుడికి ప్రత్యేక అలంకరణ

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరు రాజవీధిలోని అంబా భవాని దేవాలయంలో శ్రీరుక్మిణి సహిత పాండురంగ స్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అంతకుముందు పట్టణంలోని పురవీధుల గుండా చిన్నారుల నృత్యాలతో, భజనలతో స్వామి చిత్రపటంతో ఊరేగింపుగా వెళ్లారు. ఎస్‌ఎస్‌కే సమాజ్ సభ్యులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

భక్తులకు నిజ బృందావన దర్శనం

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఏకాదశి పురస్కరించుకొని శ్రీమఠంలో నిజ బృందావన రూపంలో భక్తులకు రాఘవేంద్రస్వామి దర్శనం ఇచ్చారు. ఆదివారం ఏకాదశి పురస్కరించుకొని శ్రీమఠంలో నిత్య పూజలకు విరామం ఇచ్చారు. బెంగళూరులోని రాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఏకాదశి పూజలు నిర్వహించారు. మరోవైపు సప్త రాత్రోత్సవాలకు అధికారులు శ్రీమఠంను రంగులతో ముస్తాబు చేస్తున్నారు. మధ్యారాధనకు ఇరువైపులా రంగులు వేయడం మొదలు పెట్టారు. విద్యుత్తు దీపాలను అలంకరించనున్నారు.

రాఘవేంద్రస్వామి నిజ బృందావన రూపం

మంత్రాలయం, న్యూస్‌టుడే: శ్రీమఠం ప్రాకారంలో విధుల్లో లేని సిబ్బంది, వీవీఐపీ గేటు దగ్గర భక్తులను దర్శనానికి పంపించే సిబ్బందిపై చర్యలు తీసుకున్నట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. గత కొద్ది రోజులుగా అలాంటి వారిని గమనించి కార్యాలయానికి పిలిచి వివరణ అడిగితే సరిగా స్పందించలేదని.. వారిపై చర్యలు తీసుకున్నామని అన్నారు.

మేళతాళాలతో పీర్ల ఊరేగింపు

మంత్రాలయం: పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

గూడూరు (గ్రామీణం, గోనెగండ్ల, పెద్దకడబూరు, సి.బెళగల్, కౌతాళం, కోడుమూరు (గ్రామీణం, న్యూస్‌టుడే: మొహర్రం సందర్భంగా పలు మండలాల్లోని గ్రామాల్లో కొలువుదీరిన పీర్లను భక్తులు దర్శించుకుని ప్రార్థనలు చేశారు. పీర్లకు బాసింగాలు, దట్టీలు, వెండి గొడుగులు సమర్పించారు. గోనెగండ్ల, చనుగొండ్ల గ్రామంలో మహిళలు పీర్లకు ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం పీర్లను మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. మండలంలోని ముచ్చిగిరి, నౌలేకల్ గ్రామాల్లో పీర్ల పొలిమేరలు చుట్టించారు. సి.బెళగల్‌లో 7 పీర్లచావిడిల్లో కంబయ్య, కొత్తకొండలయ్య, పాతకొండలయ్య, పెద్దవిమానఖాసిం, చిన్నల్లా స్వామి, చిన్న విమానఖాసిం, పెద్ద దేవుడు దస్తగిరయ్య, దర్గా, సుల్తానమ్మలకు మొక్కులు చెల్లించుకున్నారు. కౌతాళం మండలంలోని హాల్వి గ్రామంలో పెద్ద బస్సప్ప అనే వృద్ధుడు విచిత్ర వేషధారణతో మొక్కులు చెల్లించుకుంటున్నాడు. కోడుమూరు మసీదులో కొలువైన తల్లిపీరు, చిలకలయ్య, దస్తగిరయ్య, గొకారమయ్య, ఇమాం, సొట్టకట్టలయ్య పీర్లను భక్తులు దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు.

అడిగేవారు లేరు.. కొనేవారు రారు

మండలంలోని రైతులు గత ఏడాది పొగాకు సాగు చేశారు. దాన్ని కొనుగోలు చేసేవారు లేకపోవడంతో రైతులు పొలాల్లో అలాగే వదిలేశారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ కళాశాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేసుకున్న పొగాకు కల్లాల్లో ఆరబెట్టారు. మద్దతు ధర లేకపోవడం, కనీసం వాటిని అడిగేవారు లేరని, అందుకే పూర్తిగా వదిలేశామని రైతులు వాపోతున్నారు. పొగాకు కంపెనీదారులు ఈ నిల్వలను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులు రైతులు కోరుతున్నారు.-న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

దారికి రావాలంటే కష్టమే

ఎమ్మిగనూరు-కోసిగి రహదారి అధ్వానంగా మారింది. ఈ దారి వెంట కోసిగి, మంత్రాలయం, పెద్దకడబూరు, కౌతాళం, నందవరం, మండలాల పరిధిలో దాదాపు 85 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. నిత్యం దాదాపు 85 బస్సు సర్వీసులు, 300కు పైగానే ట్రాక్టర్లు, 3వేలు పైగానే ఆటోలు, పదివేల వరకు ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. అధికారులు చొరవ తీసుకొని రహదారులు బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

ప్రారంభించారు.. పక్కన పెట్టారు

మండలంలోని కంబళదిన్నె గ్రామంలో గత వైకాపా పాలనలో అసంపూర్తిగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎన్నికల ముందు అట్టహాసంగా

ప్రారంభించారు. ఇప్పటికి 16 నెలలు కావస్తున్నా.. ఇంత వరకు కేంద్రం తలుపులు తెరవలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చొరవ చూపి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. సమస్యను మండల వ్యవసాయాధికారిణి సుచరిత దృష్టికి తీసుకెళ్లగా.. గుత్తేదారు నాసిరకంగా పనులు చేయడంతో ప్రారంభంలోనే బండ పరుపు కుంగిపోయిందని తెలిసింది. సమస్యను గుత్తేదారు దృష్టికి తీసుకెళ్లి.. పనులు పూర్తిచేసి తక్షణమే కేంద్రంలో సేవలు అందిస్తామని చెప్పారు.
-న్యూస్‌టుడే, కంబళదిన్నె(పెద్దకడబూరు)

ఒరిగిన స్తంభం.. పడితే ప్రమాదం

కోడుమూరు చిన్నబోయగేరిలో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా మారింది. స్తంభం నెరలు విచ్చుకొని ఓ వైపు ఒరిగిపోవటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఈదురుగాలులతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు. సంబంధిత అధికారులు కొత్త విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేయాలని బోయ గేరి ప్రజలు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పొన్నకల్లు గ్రామంలో వికలాంగుడైన మిన్నెల్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజాసమస్యల పరిష్కారమే తెదేపా లక్ష్యమని, అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం గూడూరు మండలంలోని పొన్నకల్లు గ్రామంలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. నేతలు రామాంజనేయులు, సురేష్, బొజుగు సృజన్, రేమట వెంకటేష్, మిన్నెల్ల, సుకుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు

పెంచికలపాడు(గూడూరు గ్రామీణం), న్యూస్‌టుడే: పెంచికలపాడులోని బీసీ కాలనీలో తెదేపా కన్వీనరు జె.సురేష్ ఇంటింటికి తిరిగి పథకాలపై ప్రజలకు వివరించారు.

పోలకల్ (సి.బెళగల్),న్యూస్‌టుడే: పోలకల్ గ్రామంలో మండల తెదేపా కన్వీనరు బి.చంద్రశేఖర్ ఇంటింటికి వెళ్లి పథకాలు వివరించారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: బాబు జగ్జీవన్ రాంను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని తెదేపా పట్టణ అధ్యక్షులు మహేష్ పిలుపునిచ్చారు. తెదేపా కార్యాలయంలో నివాళిలర్పించారు.

వాల్మీకీలను ఎస్టీ జాబితాలో చేర్చండి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వాల్మీకీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం సీనియర్ నాయకుడు హనుమంతప్ప డిమాండ్ చేశారు. శ్రీరామాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నాయకులందరూ వాల్మీకులకు ఇచ్చిన హామీని నెరవేర్చటం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఈ నెల 12వ తేదీన నిర్వహించే మండల సభను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు గోపాల్‌నాయుడు, మహేష్‌నాయుడు పాల్గొన్నారు.

ఆదివారం అవస్థలే..

◆ పీహెచ్‌సీలో సదుపాయాలు లేక రోగులకు ఇబ్బందులు

కల్లుదేవకుంట (మంత్రాలయం), న్యూస్‌టుడే: కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రానికి 20 గ్రామాల నుంచి ఆశా కార్యకర్తలు గర్భిణులు, బాలింతలను తీసుకువస్తారు. ఓపీలు, జనరల్ పరీక్షలు తప్ప, స్కానింగ్‌లు, ఎక్స్‌రేల సదుపాయం లేకపోవడంతో మండల పరిధిలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గర్భిణులకు తీవ్ర ఇక్కట్లు

అత్యవసర పరిస్థితుల్లో ఆయా గ్రామాల ప్రజలు 15 నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎమ్మిగనూరుకు కానీ, 45 కి.మీటర్ల దూరంలో ఉన్న ఆదోనికి తీసుకువెళ్లక తప్పని పరిస్థితి. ప్రాథమిక కేంద్రంలో వివిధ రకాల పరీక్షలు లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారు ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగానే దారిలోనే ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు చాలా ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా 24 గంటలు వైద్య సేవలు అందించడంతో

గర్భిణిని ఆటోలో ఎమ్మిగనూరుకు తీసుకువెళ్తున్న కుటుంబ సభ్యులు

పాటు వివిధ రకాల పరీక్షలు నిర్వహించాలని, ఆదివారం కూడా మెడికల్ అధికారులు అందుబాటులో ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఆదివారం చిలకలదోణ గ్రామం నుంచి అనురాధ అనే 6 నెలల గర్భిణి తీవ్ర ఇబ్బందులతో ఆటోలో కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. ఆదివారం సెలవు కావడంతో వైద్యులు ఎవరూ లేరు. స్టాఫ్ నర్సు మాత్రమే విధుల్లో ఉన్నారు. దీంతో చేసేదేమీ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న గర్భిణిని 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎమ్మిగనూరుకు ఆటోలో తరలించారు. ఇక్కడే పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

సం క్షి ప్త స మా చా రం

నందవరం, న్యూస్‌టుడే: ఉద్యాన పంటలతో తక్కువ ఖర్చుతో నిత్యం అధిక లాభాలు ఆర్జించవచ్చని క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ అధికారి బషీర్‌అహ్మద్, ఏపీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం నందవరంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు పంపిణీ చేశారు. నందవరం మండలంలోని కొబ్బరి, జమ, సపోటా, మామిడి, అంజీర, బత్తాయి మొత్తం 5600 మొక్కలు 44 మంది చిన్న సన్నకారు రైతులకు పంపిణీ చేశారు. ఉద్యాన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సి.బెళగల్ ,న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా కడియం నుంచి మామిడి, సపోటా, దానిమ్మ మొక్కలు సి.బెళగల్‌కు తెప్పించినట్లు ఈసీ రంగస్వామి తెలిపారు. సి.బెళగల్‌లో బస్టాండు సమీపంలో చింతమానుపల్లె, సంగాల, ఇనగండ్ల, గుండ్రేవుల, కంబదహల్, కె.శింగవరం, ముడుమాల, పోలకల్, పలుకుదొడ్డి, తిమ్మందొడ్డి గ్రామాలకు చెందిన 31మంది రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశం ప్రగతి పథంలో నడుస్తోందని కౌన్సిలరు దయాసాగర్, భాజపా నాయకుడు లలిత్‌కుమార్‌జైన్ అన్నారు. మోదీ పాలన 11సంవత్సరాలు పూర్తయినా సందర్భంగా ఆదివారం పట్టణంలోని 31వార్డులో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు పంపన్నగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు.

నందవరం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన నందవరంలో ఎద్దుల బండి కిందపడి తెదేపా నాయకులు లచ్చప్ప మనవడు భరత్‌కుమార్ అనే బాలుడు గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి బాలుడిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గూడూరు మండల తహసీల్దారు వెంకటేష్ నాయక్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే వినతులు ఇచ్చి పరిష్కారం చేసుకోవాలని సూచించారు.

సి.బెళగల్ ,న్యూస్‌టుడే: సి.బెళగల్‌లో తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు వెంకటలక్ష్మి అధ్యక్షతన ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఉప తహసీల్దారు పురుషోత్తమ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే వినతులు ఇచ్చి పరిష్కారం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

సి.బెళగల్: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం వైద్యాధికారి మిథున్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయుష్ వైద్యాధికారి ప్రసాదరెడ్డి తెలిపారు. గ్రామాల్లోని గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోలకల్: గ్రామంలో సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయం ధర్మకర్త పద్మనాభరెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొనాలన్నారు.

తుంగలో కలిసిన కొలత బావులు

✦ నిర్వహణ లేక పెరిగిన కంప చెట్లు

ఎమ్మిగనూరు గ్రామీణం న్యూస్‌టుడే: తుంగభద్ర దిగువ కాల్వ(ఎల్లెల్సీ) జిల్లా పశ్చిమ ప్రాంతానికి జీవనాడి. ఎగువన కర్ణాటకలో జల చౌర్యం కారణంగా నీటి వాటా సక్రమంగా అందడంలేదు. నిర్దేశించిన ఆయకట్టుకు సరిగా సాగు నీరందని పరిస్థితి. నీటి ప్రవాహం తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన నీటి కొలతల బావుల నిర్వహణ వైకాపా హయాంలో గాలికి వదిలేశారు. దీంతో కంప చెట్లు పెరిగి నిరుపయోగంగా మారాయి. రూ.లక్షలతో ఏర్పాటు చేసిన లక్ష్యం నీరుగారింది.

గుడేకల్ వద్ద ఎల్లెల్సీ ప్రధాన కాల్వ చెంతన ఏర్పాటు చేసిన నీటి కొలత బావి

ప్రధాన కాల్వ పొడవునా ఏర్పాటు

తుంగభద్ర దిగువ కాల్వ ద్వారా జిల్లాలోని ఖరీఫ్, రబీలో 1.51లక్షల ఎకరాలకు సాగు నీరందుతోంది. ఎల్లెల్సీ ప్రధాన కాల్వ చెంతనే ప్రధానంగా డిస్ట్రిబ్యూటర్లు ఉన్న చోట గతంలో తెదేపా హయాంలో కొలత బావులు ఏర్పాటు చేశారు. ఆరు చోట్ల ఒక్కోటి దాదాపు రూ.80వేల వ్యయంతో నిర్మించారు. వీటి ద్వారా ప్రధాన కాల్వలో నీటి ప్రవాహం శాస్త్రీయంగా తెలుస్తుంది. నిర్దేశించిన ఆయకట్టుకు నీటిని పిల్ల కాల్వల ద్వారా మళ్లించి పంటలు దెబ్బతినకుండా నీటి తడులు అందించవచ్చు. కొలతల బావులను ప్రధాన కాల్వ చెంతనే తవ్వి అక్కడ సోలార్ పలక ఏర్పాటు చేశారు. చుట్టూ కంచెను ఏర్పాటు చేసిన రక్షణ కల్పించారు. వైకాపా హయాంలో నిర్వహణ లేక మూలన పడింది. దీంతో అవన్నీ ఇప్పుడు ముళ్ల కంప పెరిగి వృథాగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్నందున నీటి కొలతల బావులను వినియోగంలోకి తేవాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. దీనిపై సంబంధిత అధికారుల వివరణ కోరగా.. గుత్తేదారుడికి నిర్వహణ బాధ్యత అప్పగించామన్నారు. కానీ నిర్దేశించిన సమయం అయిపోవడంతో గుత్తేదారుడు తప్పుకున్నట్లు తెలియజేశారు.

బాబు జగ్జీవన్‌రాంకు ఘన నివాళి

మంత్రాలయం, నందవరం, న్యూస్‌టుడే: బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా మంత్రాలయంలో ఆయన విగ్రహానికి జైభీం ఎమ్మార్పీయస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం

విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జానయ్య, హనుమన్న

జానయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. నందవరం తహసీల్దారు కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి ఉప తహసీల్దారు శశిశేఖర్‌రావు తదితరులు నివాళులర్పించారు.

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా కార్యాలయంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి మాజీ ఎంపీ బుట్టా రేణుక నివాళులర్పించారు. బుట్టా శివనీలకంఠ.నాగేశప్ప, బజార్‌రెడ్డి, విరుపాక్షిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

మంత్రాలయం, న్యూస్‌టుడే: శ్యామాప్రసాద్ జయంతి వేడుకలు మాధవరంలో ఘనంగా నిర్వహించారు. భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి విష్ణువర్ధన్ రెడ్డి శ్రేణులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురురాజ, అయ్యన్న, ఉస్మాన్, నరసింహులు, రోబో తదితరులు పాల్గొన్నారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: డా.శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి భాజపా గూడూరు అర్బన్ మండల అధ్యక్షుడు నవీన్ వేదవ్యాస్, రూరల్ అధ్యక్షుడు వెంకటేష్ నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ వికాస సమితి జిల్లా అధ్యక్షుడు సురేష్, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ నాయుడు, మధు, తారక్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

కర్నూలు

• కర్నూలు • పాణ్యం

డాక్టర్ వసంతకుమార్‌ను సన్మానిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, వైద్యులు

రక్తపోటుతో పక్షవాతం ముప్పు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : రక్తపోటు నియంత్రణలో లేకపోతే పక్షవాతం బారినపడే ప్రమాదం ఉందని హృద్రోగ నిపుణుడు డాక్టర్ వసంతకుమార్ చెప్పారు. ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో ఆదివారం హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షతన రక్తపోటుపై అవగాహన కార్యక్రమం జరిగింది. రక్తపోటుకు దారితీసే అలవాట్లు, దాని నియంత్రణకు అనుసరించాల్సిన జీవనశైలిలో మార్పుల గురించి డాక్టర్ వసంతకుమార్ వివరించారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కర్నూలు మండల తెదేపా నాయకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని 40వ వార్డు స్టాంటన్‌పురంలో వార్డు బాధ్యుడు కెకె బాషా ఆధ్వర్యంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. తెదేపా నాయకులు ఇనోస్, విజయ్‌కుమార్, షేక్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణం : 85010 05408, ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : ?: అశోక్ నగర్‌లో వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. **- మహేశ్, స్థానికుడు**

?: వాణిజ్యనగర్‌లో తాగునీటి సమస్య ఉంది. సక్రమంగా సరఫరా చేయాలి. **- సుజాత, స్థానికురాలు**

✔: సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం. **- నగరపాలక అధికారులు**

హామీల అమలుకు ప్రాధాన్యం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. కల్లూరు పట్టణం 37వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీలోని వాటర్ ట్యాంక్ వీధిలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేసి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తెదేపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు, తితిదే బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, నంద్యాల పార్లమెంటు మహిళా విభాగం అధ్యక్షురాలు పార్వతమ్మ, ఏపీ టూరిజం డైరెక్టర్ ముంతాజ్‌బేగం, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ముక్కబడి భోజనం.. పర్యవేక్షణ శూన్యం

☛ మెనూ ప్రకారం అందని మాంసాహారం

☛ వసతిగృహ విద్యార్థులకు తప్పని నిరాశ

పరిశీలన

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందడం లేదు. అరకొర తిండితో పిల్లలు అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం వసతిగృహాల్లోని విద్యార్థులకు చికెన్ బిర్యానీ, రైతా, గోంగూర చట్నీ ఇవ్వాల్సి ఉండగా.. ఉడికీ ఉడకని అన్నంలో.. చిన్న పరిమాణంలో కత్తిరించిన కొన్ని చికెన్ ముక్కలు వేసి.. నీళ్లచారు వడ్డించారు. పిల్లల సంఖ్యకు సరిపడా చికెన్ కొనుగోలు చేయకపోవడంతో ముక్కల కోసం పిల్లలు వెతుక్కోవాల్సి వచ్చింది. దీంతో పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరని పరిస్థితి నెలకొంది.

– న్యూస్‌టుడే, కర్నూలు సంక్షేమం

బి.క్యాంపులోని డాక్టర్స్ కాలనీలోని బీసీ కళాశాల వసతిగృహంలో సుమారు 100 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఆదివారం కళాశాలలకు సెలవు కావడంతో 45 మంది మాత్రమే ఉన్నారు. వారికి ఒక్కొక్కరికి 100 గ్రాముల చికెన్ చొప్పున 4.5 కిలోలు వండాల్సి ఉంది. 2 కిలోల చికెన్ మాత్రమే వండారని విద్యార్థులు చెబుతున్నారు. వార్డన్ మరో వసతిగృహానికి ఇన్‌ఛార్జి కావడంతో అక్కడికి వెళ్లారు.

బీసీ కళాశాల వసతిగృహంలో ఒకట్రెండు ముక్కలే గతి

● సన్నబియ్యంతో వండటంతో కలర్ రైస్ బాగుంది. కానీ చికెన్‌కూర చాలా నీళ్లగా వండారు. అతిచిన్న పరిమాణంలో ఉన్న ఒకట్రెండు ముక్కలు మాత్రమే వేశారు. అన్నంలోకి కూర వేయగానే నీళ్లు మాత్రమే ఉన్నాయని, ముక్కల కోసం వెతకాల్సి వచ్చిందని విద్యార్థులు వాపోయారు. వీటికితోడు నీళ్లమజ్జిగ, గోంగూరు చెట్నీ పెట్టి మమ అని పించారు.

● బి.క్యాంపులోని ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహం-1లో సుమారు 200 మంది విద్యార్థినులు ఉంటున్నారు. ఆదివారం 150 మంది ఉన్నారు. వారికి కలర్‌రైస్, చికెన్ కూర వడ్డించారు. అన్నం బాగున్నా.. చికెన్ నీళ్లగా ఉందని విద్యార్థులు చెప్పారు.

● బి.క్యాంపులోని ఎస్సీ కళాశాల వసతిగృహం-2లో వార్డన్ లేరు. ఇక్కడ 250 మందికి గాను 150 మంది విద్యార్థినులే ఉన్నారు. వీరికి బిర్యానీ వడ్డించాల్సి ఉండగా కలర్‌రైస్, చికెన్ కర్రీతో సరిపెట్టారు. గతంలో మిగిలిపోయిన పాతబియ్యంతో వండటంతో కలర్‌రైస్ ముద్దగా ఉంది. చికెన్‌కూర, నీళ్ల మజ్జిగ ఇచ్చారు.

● బీసీ బాలుర పోస్టు మెట్రిక్ వసతిగృహంలో 200 మంది ఉంటున్నారు. ఆదివారం 100 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వీరికి చికెన్‌కర్రీ, కలర్‌రైస్ వండారు. గోంగూరు చెట్నీ లేదు. మజ్జిగ ఇస్తామని వర్కర్ చెప్పారు. వార్డెన్ బయటికి వెళ్లారు.

క్రీడలతో స్నేహబంధం బలోపేతం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : క్రీడలు స్నేహబంధాన్ని బలోపేతం చేస్తాయని డీఈవో శామ్యూల్‌పాల్ పేర్కొన్నారు. నగరంలోని ఎస్టీయూ భవనంలో 'ఈనాడు' ఛాంపియన్ పోటీల్లో భాగంగా ఉపాధ్యాయులకు ఆదివారం చెస్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రికెట్, కబడ్డీ, క్యారమ్స్, షటిల్ వంటి క్రీడలు ఆడితే మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. శరీరం దృఢంగా మారుతుందని వివరించారు. చెస్ పోటీల్లో తెలుగు ఉపాధ్యాయుడు బి.సర్వాగ్నమూర్తి ప్రథమ, సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు కె.కోటయ్య ద్వితీయ బహుమతులు గెలుపొందారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ సేవాలాల్‌నాయక్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో డీఈవో శామ్యూల్‌పాల్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే : తొలి ఏకాదశి సందర్భంగా కర్నూలులోని ప్రధాన ఆలయాలు ఆదివారం భక్తులతో రద్దీగా మారాయి. ప్రధానంగా వైష్ణవాలయాల్లో పూజలు, వ్రతాలు నిర్వహించారు. సంకల్‌బాగ్‌లోని గీతా ధామంలో గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం జరిగింది. ప్రవచనకర్త శ్రీనివాస రామానుజ దాసు ప్రసంగించారు.

◆ హరిహర క్షేత్రం, కృష్ణానగర్‌లోని శ్రీనివాస మందిరం, వెంకటరమణ కాలనీలోని వేంకటేశ్వరాలయంలో ప్రత్యేకపూజలు జరిగాయి. వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. సూర్యనారాయణ స్వామి ఆలయంలో పూజలు జరిగాయి.

◆ నగర శివారులోని గోదాగోకుల క్షేత్రంలో ఆదివారం నుంచి అఖండ విష్ణు పారాయణం ప్రారంభమైంది. 63 రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ వ్యవస్థాపకుడు మారం నాగరాజుగుప్తా తెలిపారు.

గోదాగోకులంలో అఖండ పారాయణం చేస్తున్న భక్తులు

సూర్యనారాయణస్వామి ఆలయంలో భక్తుల పూజలు

ప్రజలకు ఎల్లవేళలా అండగా నిలుస్తాం

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : ప్రజలకు అన్నివేళలా అండగా ఉంటూ సమస్యలు పరిష్కరిస్తామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ ఛైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి చెప్పారు. కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామ పరిధిలోని గంగమ్మ చెరువు ఆక్రమణలను ఆదివారం వారు గ్రామస్థులతో కలిసి పరిశీలించారు. చెరువులో ఆక్రమణలు తొలగించాలంటూ జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో.. ఇందుకోసం కృషిచేసిన మాజీ ఎంపీపీ రాజవర్ధన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. అధికారులు చెరువులో ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు బుర్ర వెంకటేశ్, కె.రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు మద్దిలేటి, ఏసురాజు, కిశోర్, జైచంద్ర, గ్రామస్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే దస్తగిరి

గెలుపే గోల్.. బరిలో మెరుపుల్

◆ హ్యాండ్‌బాల్ క్రీడలో రాణిస్తున్న విద్యార్థులు

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : ఇంటర్మీడియట్ విద్యార్థులు వినయ్, సుమంత్ హ్యాండ్‌బాల్ క్రీడలో సత్తా చాటుతున్నారు. దూకుడైన ఆటతో ప్రత్యర్థి గోల్స్ సాధించకుండా అడ్డుకట్టవేస్తూ.. జట్టు విజయంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన వీరు.. జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా కఠోర సాధన చేస్తున్నారు.

వినయ్ దూకుడు

కర్నూలు నగరంలో ఇంటర్మీడియట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వినయ్ క్రీడలపై మక్కువతో హ్యాండ్‌బాల్ నేర్చుకున్నారు. శిక్షణ తీసుకుంటూ నిత్యం సాధన చేసి అసోసియేషన్ క్రీడలు, ఎస్‌జీఎఫ్ పోటీల్లో రాష్ట్రస్థాయి ఆడి రాణించాడు. ప్రతిభతో కర్నూలు శాయ్ కేంద్రంలో ప్రవేశం పొంది హ్యాండ్‌బాల్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు.

● 2022లో అనంతపురంలో జరిగిన సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టును మొదటి స్థానంలో నిలపడంలో కీలకంగా ఆడాడు.

● 2022 డిసెంబరులో తెనాలిలో జరిగిన అసోసియేషన్ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జట్టును మూడో స్థానంలో నిలిపాడు.

● 2024 జులైలో అనంతపురంలో జరిగిన సీనియర్ హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో వీరి రెండో స్థానం సాధించింది.

● 2024 జులైలో రాజమహేంద్రవరంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపాడు.

● 2024 ఏప్రిల్‌లో ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.

శెభాష్ సుమంత్

కల్లూరుకు చెందిన సుమంత్ నగరంలో ఇంటర్మీడియట్ సీఈసీ చదువుతున్నాడు. హ్యాండ్‌బాల్ క్రీడలో ప్రతిభ చూపుతున్నాడు. రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో రాణించి కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వసతిగృహంలో ప్రవేశం పొందాడు.

● 2022 నవంబరులో అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి అసోసియేషన్ జూనియర్ పోటీల్లో సత్తాచాటి జిల్లా జట్టును గెలిపించాడు.

● 2022 డిసెంబరులో అనంతపురంలో జరిగిన సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో మూడో స్థానం సాధించారు.

● 2023 సెప్టెంబరులో కడపలో జరిగిన ఎస్‌జీఎఫ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యధిక గోల్స్ చేసి ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపికయ్యాడు.

● 2023 ఆగస్టులో తెనాలిలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీల్లో రజత పతకం సాధించాడు.

● 2024 జులైలో అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ పోటీల్లో కాంస్య పతకం అందుకున్నాడు.

● 2024 జులైలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-17 పోటీల్లో ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపికయ్యాడు.

పత్తిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

శిక్షణలో మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.సుజాతమ్మ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : పత్తి పంటను ఆశించే గులాబి రంగు పురుగు నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.సుజాతమ్మ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం దేశీ కార్యక్రమం కింద ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా పత్తి సాగులో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను వివరించారు. శిక్షణలో దేశీ కార్యక్రమ సమన్వయకర్త డా.జయంద్ర, ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

జానపద గీతాలకు తరగని ఆదరణ

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ జానపద గీతాలకు ఆదరణ ఉందని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి తెలంగాణ, రాయలసీమ జానపద కళాకారుల ఆధ్వర్యంలో సంగీత విభావరి జరిగింది. గాయకులు ప్రేక్షకులను ఆకట్టుకునేలా గీతాలు ఆలపించారు. ఇకపై ప్రతి ఆదివారం సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. అనంతరం గాయకులను సత్కరించి పారితోషికం అందచేశారు. విశ్రాంత ఎస్సై సత్యం, దస్తగిరి, మహ్మద్‌మియ్యా తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాల పంపిణీ

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : స్థానిక సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో ఆదివారం బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు పంపిణీ చేశారు. నగర సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పది, ఇంటర్‌లో 90 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసి సత్కరించారు. విశ్రాంత ప్రిన్సిపల్ రంగనాథశర్మ, వినియోగదారుల న్యాయస్థానం జడ్జి కె.కిశోర్‌కుమార్, డాక్టర్ వేణుగోపాల్, కేవీ సుబ్బారావు, చల్లా నాగరాజశర్మ, రాజశేఖర్, రవిచంద్రవర్మ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి పురస్కారం అందజేస్తున్న అతిథులు

13న హిందూ ధార్మిక సంస్థల సమ్మేళనం

కరపత్రాలు విడుదల చేస్తున్న ధార్మిక సంఘం, వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : హిందూ సమాజ సంఘటన, హిందుత్వ మార్గదర్శకతపై అవగాహన కల్పించడం కోసం ఈనెల 13న హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు లలితాపీఠం వ్యవస్థాపకుడు మేడా సుబ్రహ్మణ్యం తెలిపారు. నగరంలోని పాతబస్తీలో ఉన్న లలితాపీఠంలో జరిగే సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకుడు ప్రతాప్‌రెడ్డి, విశేష సంపర్క ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రముఖ్ నీలి నరసింహ, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు రామాంజనేయులు, గురుస్వామి, లక్ష్మీరెడ్డి, రామచంద్రారెడ్డి, లక్ష్మయ్యలతో కలిసి ఆవిష్కరించారు.

మొక్కే కదాని వదిలేస్తే ముప్పే

కర్నూలు నగరం మధ్యన హంద్రీనది మీదుగా వెళ్లే కేసీ కాల్వ అక్విడెట్ ప్రమాదంలో పడింది. దీని గోడలపై మొక్కలు పెరిగి వాటి వేర్లు నిర్మాణంలోకి చొచ్చుకుపోయాయి. వీటిని తొలగించకుండా ఇలానే వదిలేస్తే నిర్మాణం దెబ్బతిని లీకేజీల రూపంలో నీరు వృథా అయ్యే ఆస్కారం ఉంది. వేల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించే జల వనరును అధికారులు నిర్లక్ష్యం చేయడం పట్ల ప్రజలు విమర్శిస్తున్నారు. – ఈనాడు, కర్నూలు

నిధులు మింగిన గుంతలు

కర్నూలు నగరం లేబర్‌కాలనీ సమీపంలో రహదారి గుంతలమయంగా మారింది. వీటి వల్ల వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారినపడుతున్నారు. నగరపాలక నిధులతో ఇటీవల నగరంలోని పలు రహదారులకు మరమ్మతులు చేశారు. చాలాచోట్ల గుంతలను పూడ్చకుండానే నిధులు పక్కదారి పట్టించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా నగరవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలకసంస్థ

బురోద.. తీరని వ్యథ

కల్లూరు అర్బన్ పరిధి.. రేడియోస్టేషన్ పక్కనున్న శాంతినగర్‌లో పలు సమస్యలు నెలకొన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే చాలు రహదారులు బురదమయంగా మారుతున్నాయి. కర్నూలు-బళ్లారి రోడ్డు నుంచి వర్షం నీరు, మురుగు వరదలా వచ్చి చేరుతోంది. కాలనీలో సీసీ రహదారులు, మురుగు కాల్వలు నిర్మించాలని కోరుతూ నగరపాలక అధికారులకు ఏళ్లుగా విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

మొక్కలు ఎండి.. ఖాళీగా కుండీ

కర్నూలు నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని పాలకులు, అధికారులు తరచూ చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. అరకొరగా మొక్కలు నాటినా వాటి సంరక్షణను గాలికొదిలేశారు. ఫలితంగా పలు ప్రాంతాల్లో కుండీలలో నాటిన మొక్కలు ఎండిపోయాయి. ఖాళీ కుండీలు దర్శనమిస్తున్నాయి. ధర్మపేట సమీపంలో కేసీ కాలువ వంతెనపై పాదబాటలో మొక్కలు లేక వెలవెలబోతున్న కుండీలను చిత్రంలో చూడొచ్చు. – న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలకసంస్థ

శిలాఫలకాలు వేశారు.. చేతులు దులిపేసుకున్నారు

◆ నెలలు గడుస్తున్నా మొదలవని అభివృద్ధి పనులు

◆ పట్టించుకోని నగరపాలక అధికారులు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. శిలాఫలకాలు వేస్తున్నారే తప్ప నిర్మాణాలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. పాలకులు మాత్రం నగరాన్ని అభివృద్ధి చేస్తాం.. మౌలిక సదుపాయాలు కల్పిస్తామని గొప్పలు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపించడంతో పనుల్లో పురోగతి కరవవుతోంది. రూ.కోట్ల విలువైన పనులు పెండింగ్‌లోనే ఉన్నా అధికారులకు పట్టడం లేదు.

ముందుకురాని గుత్తేదారులు

పనులు దక్కించుకున్న గుత్తేదారుల్లో చాలామంది నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. బిల్లులు రాకపోవడంతో పనులు చేయలేమని చేతులెత్తేస్తున్నారు.

● కొంతమంది గుత్తేదారులు రూ.కోట్ల విలువైన పనులు దక్కించుకుని నిర్మాణాలు ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

● బిల్లులు త్వరగా మంజూరు చేయకపోవడం.. క్వాలిటీ కంట్రోల్ బాధ్యత ఇతరులకు అప్పగించే నిర్ణయాన్ని విరమించుకోవాలని ఇటీవల పలువురు గుత్తేదారులు పనులు నిలిపివేస్తూ సమ్మె చేపట్టారు.

ఎక్కడికక్కడ నిలిచిపోయాయ్

కర్నూలు నగరంలోని 52 వార్డుల పరిధిలో 6.5 లక్షల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. పలు కాలనీల్లో మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. ప్రజలకు సౌకర్యాలు కల్పించే ఉద్దేశంతో పలు కాలనీల్లో చేపట్టిన పనులు కొన్ని నెలలుగా మందకొడిగా సాగుతున్నాయి. పలు చోట్ల అసంపూర్తిగా నిలిచిపోయాయి.

● నగర పరిధిలో దాదాపు రూ.35 కోట్ల పనులు ఆగిపోయాయి. ఒప్పందం చేసుకున్న గుత్తేదారులు వాటిని చేపట్టడం లేదు. నిర్ణీత గడువులోగా పనులు ప్రారంభించాల్సి ఉన్నా నగరంలో ఆ ఊసే లేదు.

కల్లూరు పట్టణం 31వ వార్డు బద్రినాథ్‌నగర్, శరీన్‌నగర్‌లలో రూ.83.90 లక్షలతో కాలువలు, కల్వర్టులు నిర్మించేందుకు ఏప్రిల్ 3న శిలాఫలకం ఆవిష్కరించారు. మూడు నెలలైనా పనులు మాత్రం ప్రారంభించలేదు.

అశోక్‌నగర్‌లో నిలిచిపోయిన మురుగునీటి కాలువల పనులు

స్వలాభంపైనే దృష్టి..

కర్నూలు నగరంలో రూ.కోట్లలో పనులు నిలిచిపోయినా అధికారులకు మాత్రం పట్టడం లేదు. తక్షణం పూర్తిచేయాలని పాలకులు సమావేశాల్లో అధికారులకు సూచిస్తున్నా క్షేత్రస్థాయిలో కదలిక కరవైంది. ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు అరకొరగా సాగుతున్నాయి. ప్రజాప్రయోజనాల కంటే అధికారులకు లాభాలు వచ్చే పనులను మాత్రమే చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు తీరుతో నగరాభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంజన్న హత్య కేసులో నిందితుల విడుదల

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని శరీన్‌నగర్‌కు చెందిన తెదేపా నాయకుడు కాశపోగు సంజన్న హత్య కేసులో నిందితులు విడుదలయ్యారు. మార్చి 14న రాత్రి స్థానిక శరీన్‌నగర్‌లోని అల్లీపీరా వీరాస్వామి భజన మందిరంలో భజన పూర్తి చేసుకుని ఇంటికి వెళ్తున్న సంజన్న (55)పై హంతకులు దాడిచేసి నరికి చంపారు. హతుడి కుమారుడైన కార్పొరేటర్ జయరాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వడ్డె రామాంజనేయులు అలియాస్ వడ్డె అంజి, ఇతని కుమారులు, భార్య, అల్లుడిపై కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్ కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌పై జైలుకు పంపారు. ఇదివరకే సంజన్న భార్య సావిత్రి, అశోక్ బెయిల్‌పై విడుదలయ్యారు. శనివారం వడ్డె రామాంజనేయులు, కుమారులు శివకుమార్, రేవంత్‌కుమార్, తులసీకుమార్‌లకు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. శనివారం రాత్రి నిందితులు కర్నూలు మండలం పంచలింగాల పరిధిలోని జిల్లా కారాగారం నుంచి విడుదలయ్యారు. అప్రమత్తమైన పోలీసు అధికారులు నిందితులు శరీన్‌నగర్ కాలనీలోకి వెళ్లకుండా ముందుజాగ్రత్త తీసుకున్నట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ పాతబస్తీ వాసి మృతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని పాతబస్తీ కల్లావీధికి చెందిన పఠాన్ బషీర్‌ఖాన్ (35) చికిత్స పొందుతూ మృతి చెందారు. అనారోగ్య, మానసిక సమస్యల కారణంగా జీవితంపై విరక్తి చెంది శనివారం ఆత్మహత్యా యత్నం చేశారు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: ఇళ్లల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాముడు, రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏడాదిలో వివిధ ప్రభుత్వ శాఖల్లో సుమారు 3లక్షల ఉద్యోగాలు ఊడగొట్టిందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, అబ్దుల్లా ఆరోపించారు. జులై 11, 12తేదీల్లో నిర్వహించే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగునీటి అవసరాలకు తగ్గట్టు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపకుడు మైల శ్రీహర్ష ప్రభుత్వాన్ని కోరారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా వ్యవసాయ కార్యాలయంలో రూ.95లక్షల కుంభకోణానికి కారకులైన అధికారులు, ఉద్యోగులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం డిమాండ్ చేశారు.

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని కాల్వబుగ్గ వద్ద ఉన్న ఏపీ గురుకుల పాఠశాలలో పూర్వవిద్యార్థులు ఉచిత వైద్యశిబిరంను ఏర్పాటు చేశారు. ఆదివారం వైద్య బృందం శిబిరంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు.

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్ కోసం భూములిచ్చిన రైతుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 85 శాతం ఉద్యోగాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు.

కర్నూలు సంక్షేమం, న్యూస్‌టుడే: గిరిజనుల సంక్షేమం కోసం అందించే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రకటనలకే పరిమితం కావడం బాధాకరమని గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ నాయకులు రామరాజు, వెంకటేష్, రామకృష్ణ, సాయికిరణ్, తిరుపాలు పాల్గొన్నారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: కార్మికుల హక్కులను కాలరాస్తే సహించేదేలేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు గణేశ్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేశ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం స్థానిక రాజవిహార్ కూడలి వద్ద జులై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: లక్ష్మీనగర్‌లోని క్రిస్టియన్ అసెంబ్లీ ప్రార్థన మందిరంలో ఆదివారం ప్రార్థనలు నిర్వహించకుండా రెవెన్యూ అధికారులు, పోలీసులు మూసివేశారు. చర్చిలో ఇరువర్గాల గొడవ కారణంగా కార్యక్రమాలను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.

(c) eenadu

కాలువలకు జలసిరి

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ శబరి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్యలు ఆదివారం కాలువలకు నీటిని విడుదల చేశారు. నీరు విడుదలవడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. – న్యూస్‌టుడే, నందికొట్కూరు

మరమ్మతులు చేయక.. వృథా అరికట్టలేక

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద సాగు నీటిని నీటిని బనకచర్లకు వదిలారు. గేట్లు సరిగా లేకపోవడంతో 10, 7, 3 గేట్ల నుంచి జలాలు కిందకు వెళుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వం మరమ్మతుల విషయమై పట్టించుకోక నీరంతా వృథాగా పోయే పరిస్థితి ఉందని పలువురు పేర్కొంటున్నారు. – న్యూస్‌టుడే, నందికొట్కూరు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. స్థానిక సెంటినరీ హాలులో ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆదివారం చెప్పారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మున్సిపాలిటీ, నియోజకవర్గ, మండల స్థాయిలోనూ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్జీదారులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా కూడా అందజేయొచ్చని తెలిపారు. తమ సమస్యలు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించి తెలుసుకోవచ్చని చెప్పారు.

నవాబు కోట వద్ద మాతం చేస్తున్న షియా మతస్థులు

■ మాతంను తిలకించేందుకు తరలివచ్చిన జనం

పాల్గొన్న నవాబు మీర్ ఫజిల్ అలీఖాన్

భక్తిశ్రద్ధలతో మొహర్రం

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి పట్టణంలో మొహర్రంను ఆదివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పీర్లను ఏటికి పంపే కార్యక్రమాన్ని నవాబు కోటలో నవాబు మీర్ ఫజిల్ అలీఖాన్ ప్రారంభించారు. అనంతరం పీర్లను ఆస్థానం, సర్కిల్ కార్యాలయం, పాత బస్టాండు మీదుగా జుర్రేరు వాగు వరకు తీసుకెళ్లి ఏటికి పంపే కార్యక్రమం నిర్వహించారు. నవాబు మీర్ ఫజిల్ అలీ ఖాన్ మాతంలో పాల్గొని సంప్రదాయాన్ని పాటించారు. షియా మతస్థులు మాతం చేస్తూ పీర్లను ఏటికి పంపారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. పాత బస్టాండు సమీపంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ ఆధ్వర్యంలో పానీయం పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐలు ప్రవీణ్ కుమార్, ప్రభాకర్‌రెడ్డి, మంజునాథరెడ్డి, ఎస్సై దుగ్గిరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఇదే మెనూ.. పెట్టిందే తిను

■ వసతిగృహాల్లో అమలుకాని వైనం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని బీసీ, సాంఘిక సంక్షేమ, గిరిజన వసతి గృహాల విద్యార్థులకు మెరుగైన మెనూ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అధికారుల పర్యవేక్షణ లేక ఆహారంలో నాణ్యత కరవవుతోంది. ఆదివారం మధ్యాహ్న భోజనంలో, మంగళ, శుక్రవారాల్లో రాత్రి వేళల్లో చికెన్ ఇవ్వాలి. ప్రతి విద్యార్థికి 100 గ్రాములు పెట్టాలి. కానీ కొన్ని ప్రాంతాల్లో సగటున ఒక్కో విద్యార్థికి 70 నుంచి 80 గ్రాముల మధ్యే ఇస్తున్నారు.

నాణ్యత అంతంతే

చాలా వసతిగృహాల్లో ఆదివారం చికెన్ బిర్యానీకి బదులు కర్రీతోనే సరిపెడుతున్నారు. ఎక్కడా చికెన్ బిర్యానీ ఇవ్వడం లేదు. బిర్యానీకి తగ్గట్టు ఆహార పదార్థాల సరఫరా లేకపోవడంతో చికెన్, పలావ్ అన్నంతో సరిపెడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నాసిరకంగా వడ్డిస్తూ 'ఆదా' చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చికెన్ బిర్యానీతోపాటు రైతా ఇవ్వడం లేదు. కేవలం గోంగూర చట్నీతో మమ అనిపించేస్తున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వసతిగృహాల వివరాలు

జిల్లా	బీసీ	ఎస్సీ	గిరిజన
కర్నూలు	31	29	6
నంద్యాల	22	25	10

కానరాని పరిశుభ్రత

వసతి గృహాల్లోని వంట గదుల్లో శుచి శుభ్రత కానరావడం లేదు. అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం వండుతున్నారు. నంద్యాలలోని బీసీ బాలుర వసతిగృహంలో భవనాలు ఇప్పటికే శిథిలావస్థకు చేరుకోగా ఇక్కడే భోజనాలు తయారవుతున్నాయి. దుమ్ము కొట్టుకుపోయిన గదుల్లో ఆహారం సిద్ధం చేస్తున్నారు. వంట గదుల్లో పరిశుభ్రత కానరావడం లేదు. అద్దె భవనాల్లోని వసతి గృహాల్లో పరిస్థితులు మరింత అధ్వానంగా ఉంటున్నాయి.

గదుల కొరతతో ఇబ్బందులు

వసతిగృహంలో గదుల కొరత తీవ్రంగా ఉంది. కనీసం సామగ్రి పెట్టుకునేందుకు స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రాంగణంలో గతంలో నిర్మించిన 12 మరుగుదొడ్ల సమూహం నిరుపయోగంగా ఉంది. వాటిని కూల్చేసి కొత్తవి నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థినుల సంఖ్యకు తగ్గట్టు వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, డోన్ పట్టణం

కేవలం 26 మందే..

డోన్ పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో 396 మంది ఉంటున్నారు. హాస్టల్‌ను ఆదివారం పరిశీలించగా 28 మంది విద్యార్థినులు కనిపించారు. 26 మంది బాలికలు భోజనం చేశారు. 30 మంది హాజరైనట్లు వసతిగృహం ఇన్‌ఛార్జి సంరక్షకురాలు తెలిపారు. చికెన్ బాగానే ఉన్నా అన్నం కాస్త మెత్తగా ఉండటంతో పిల్లలు సరిగా తినలేని పరిస్థితి నెలకొంది.

వైభవంగా తొలి ఏకాదశి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా తొలి ఏకాదశిని ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. నంద్యాల పట్టణంలోని పలు ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. సంజీవనగర్‌లోని కోదండ రామాలయం, కోట వీధిలోని రామాలయం, చిత్తలూరివారి వీధిలోని శ్రీకృష్ణ మందిరం తదితర ఆలయాల్లో వేకువజామునే పంచామృత అభిషేకాలు, అర్చనలు చేశారు.

నంద్యాల : అలంకరణలో వేంకటేశ్వర స్వామి

మద్దతు ఇచ్చి.. చెల్లింపుల్లో పేచీ

■ జొన్న రైతులకు తప్పని ఇబ్బందులు

నంద్యాల పట్టణం, పాణ్యం, న్యూస్‌టుడే : జిల్లాలో రైతుల నుంచి పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేసిన జొన్నలకు ఇప్పటివరకు చెల్లింపులు జరగలేదు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజను ప్రారంభమవడంతో పెట్టుబడులకు అందక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో జొన్నల కొనుగోళ్లు జరిగినా 70 శాతం మందికి ఇంకనూ చెల్లింపులు చేయలేదు.

రైతులను ఆదుకునే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం జొన్నలు క్వింటా రూ.3,370 మద్దతు ధర ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లకు చర్యలు చేపట్టింది. 30 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యం నిర్దేశించారు. తొలుత ప్రభుత్వ గోదాముల వద్దే కొనుగోళ్లు జరిగినా.. రైతుల నుంచి వచ్చిన స్పందనతో ప్రైవేటు గోదాములను అద్దెకు తీసుకుని మే 16వ తేదీ వరకు సరుకు తీసుకున్నారు. నంద్యాల సెంట్రల్ వేర్‌హౌస్ గోదాములు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, గోస్పాడు, కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు గోదాములతోపాటు దీబగుంట్ల, గడిగరేవులలో ప్రైవేటు గోదాముల వద్ద మార్క్‌ఫెడ్ అధికారులు, సిబ్బంది సరకు సేకరించారు.

కొనుగోలు సమయంలో జొన్నల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

సర్దుబాటు చేయలేక..

బహిరంగ విపణిలో అన్నిరకాల ధరలు పడిపోయాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ఈ ఏడాది పెద్దఎత్తున ధాన్యం కొనుగోలు చేసింది. ఇదే క్రమంలో జొన్నల కొనుగోళ్ల సమయంలో నిర్ణీత లక్ష్యానికన్నా ఎక్కువగా కొనుగోలు చేసేలా ప్రజాప్రతినిధులపై రైతులు ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో పౌరసరఫరాల శాఖ ముందుగా అనుకున్న లక్ష్యానికన్నా ఎక్కువగా కొనుగోళ్లు జరిపింది. అందుకనుగుణంగా నిధులను సర్దుబాటు చేయలేకపోయింది.

రెండు నెలలుగా ఎదురుచూస్తున్నాం

– వెంకటేశ్వర్‌రెడ్డి, బిలకలగూడూరు

జొన్నలు విక్రయించేందుకు ఇబ్బందులు పడ్డాం. నగదు కోసమూ అవస్థలు తప్పడం లేదు. దిగుబడులు వేసి రెండు నెలలైంది. ఇంతవరకు డబ్బులు రాలేదు. నాతో పాటు కుటుంబ సభ్యుల పేరుతో సుమారు 150 క్వింటాళ్ల వరకు విక్రయించా. రూ.5 లక్షల వరకు నగదు రావాల్సి ఉంది. వెంటనే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

రూ.71 కోట్ల మేర బకాయిలు

నంద్యాల సెంట్రల్ వేర్‌హౌస్, దీబగుంట్ల, గడిగరేవుల గోదాముల వద్ద సరకు అమ్మిన రైతులకు సంబంధించిన బకాయిలు మాత్రమే విడుదల చేశారు. మిగతాచోట్ల రైతుల నుంచి కొనుగోళ్లు జరిపినప్పటికీ డబ్బులు మాత్రం రాలేదు. మొత్తం రూ.101 కోట్ల విలువ చేసే జొన్నలు కొనుగోళ్లు జరగ్గా.. రూ.30 కోట్లు మాత్రమే ఖాతాల్లో జమయ్యాయి. దాదాపు ఒకటిన్నర నెలవుతున్నా నగదు ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట సాగు సమయంలో కోవెలకుంట్ల, నందికొట్కూరు, గడివేముల, పాణ్యం, ఆత్మకూరు, మిడుతూరు, పాములపాడు, కొత్తపల్లె, దాగమర్రి, సంజామల, కొలిమిగుండ్ల, డోన్, ప్యాపిలి తదితర మండలాలకు చెందిన రైతులు బ్యాంకు ద్వారా రుణాలు తీసుకున్నారు. ప్రస్తుతం రుణాలు చెల్లింపులు ఆలస్యమవుతుండటంతో బ్యాంకర్ల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. పాత రుణాలు చెల్లిస్తేనే కొత్త రుణాలు తీసుకునే అవకాశం ఉంటుంది. మార్క్‌ఫెడ్ అధికారులపైనా ఒత్తిడి అధికమవడంతో వారు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

చెలగాటమాడితే.. చెరసాలకే!

■ పోక్సో కేసుల్లో శిక్షలతో నేరాల నియంత్రణ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో బాలబాలికలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. కొందరు వసతుల మానప్రాణాలను తీస్తూ సభ్య సమాజానికి తలవంపులు తెస్తున్నారు. ఆదోనిలో శనివారం ఓ బాలికపై ఆటో డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. పోక్సో చట్టం కింద బాలురు మొదలుకుని వృద్ధుల వరకు నిందితులవుతున్నారు. ఈ కేసులకు సంబంధించి కర్నూలులో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేశారు. ఫలితంగా త్వరితగతిన విచారణ జరిపి తీర్పులు వెలువడేందుకు దోహదపడుతున్నాయి.

ప్రత్యేక నిఘాకు చర్యలు

ఉమ్మడి జిల్లాలో పోలీసు అధికారులతోపాటు న్యాయమూర్తులు పోక్సో చట్టంపై సదస్సులు నిర్వహిస్తూ విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు. మహిళల భద్రత కోసం ఏర్పాటుచేసిన శక్తి టీంలు సైతం పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్నాయి. ఆపద సమయాల్లో శక్తి యాప్, శక్తి వాట్సాప్ నంబరును సంప్రదించాలని సూచిస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ప్రత్యేకంగా పాఠశాలలు, కళాశాలల వద్ద ప్రతి రోజూ నిఘా పెట్టి 38 టీంలు ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నారు. ఈ ఏడాది జూన్ వరకు జిల్లా వ్యాప్తంగా 17,467 మంది ఆకతాయిలను గుర్తించి పోలీసులు మంత్రణం చేసి హెచ్చరించారు.

కొన్ని తీర్పుల వివరాలు

- పగిడ్యాల మండలంలో ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో 75 ఏళ్ల వృద్ధుడికి కోర్టు పదేళ్ల జైలుశిక్ష విధించింది.
- బాలికను వేధించిన కేసులో ఆదోని మండలం పెద్దహరివాణం ప్రాంతానికి చెందిన రామక్రిష్ణారెడ్డిపై పోక్సో చట్టం కింద రెండేళ్ల జైలుశిక్ష పడింది.
- ఓ దివ్యాంగురాలిపై అత్యాచారం చేసిన కేసులో బనగానపల్లి మండలం తమ్మడపల్లికి చెందిన రుద్రేష్‌కు 20 ఏళ్ల జైలుశిక్ష పడింది.
- ప్రేమ పేరుతో వంచించి అమాయకురాలిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఆదోనికి చెందిన షేక్ చాంద్ బాషాకు 20 ఏళ్ల జైలు, జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు తీర్పు ఇచ్చింది. మరికొన్ని కేసుల్లోనూ నిందితులకు శిక్షలు పడ్డాయి.

ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

– సీవీ శ్రీనివాసులు, పోక్సో కోర్టు పీపీ

లైంగిక వేధింపులు, దాడులు జరుగుతున్న నేపథ్యంలో పిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. ఏదైనా ఘటన జరిగితే ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసుల్లో నేరం రుజువై శిక్షలు పడితేనే సమాజంలో ఈ ఘోరాలు తగ్గుముఖం పడతాయి. కేసులు దర్యాప్తు చేసే పోలీసు అధికారులు సాంకేతికత అందిపుచ్చుకుని సాక్ష్యాధారాలు సేకరించి అభియోగం దాఖలు చేస్తే బాధితులకు కోర్టులో న్యాయం జరుగుతుంది.

ఉంగరానిగుండ్ల వద్ద రహదారి పక్కన ఉంచిన పైపులు

రూ.కోట్లు ఖర్చు.. నీళ్లిస్తే ఒట్టు

■ సాగుతున్న పైపులైను పనులు

డోన్, న్యూస్‌టుడే : డోన్ నియోజకవర్గ పరిధిలోని 131 గ్రామాలతో పాటు వెల్దుర్తి మండలంలో 4, బనగానపల్లి.. 2 గ్రామాలు, పాణ్యం మండల పరిధిలో ఒక గ్రామానికి గోరకల్లు జలాశయం ద్వారా తాగునీరు అందించేందుకు వాటర్‌గ్రిడ్ పథకాన్ని రూపొందించారు. 2021లో పనులకు శ్రీకారం చుట్టారు. రూ.351 కోట్లతో పైపులైను పనులు చేపట్టగా రూ.230 కోట్ల మేర నిధులు ఖర్చు చేశారు.

నిబంధనల ప్రకారం ఈ ఏడాది నవంబరు చివరి నాటికి గుత్తేదారుడు పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఆలస్యంగా జరుగుతుండటంతో వచ్చే వేసవి నాటికైనా పూర్తవుతాయా అన్నది సందేహంగా మారింది. సుమారు 591 కిలోమీటర్ల మేర పైపులైను వేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 410 కి.మీ.ల వరకు వేశారు. ఇంకనూ 181 కి.మీల. మేర పూర్తి చేయాల్సి ఉంది.

అటవీ అనుమతులు రాక..

డోన్ మండలంలోని పలు ప్రాంతాల్లో పనులు చేపట్టేందుకుగాను పైపులు సరఫరా వేశారు. రహదారి పక్కనే అలానే ఉంచేశారు. డోన్ సమీపంలోని నగరవనం, డోన్ కొండతోపాటు పలు చోట్ల అటవీ అనుమతులు రాకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం బేతంచెర్ల మండలంలోని బేతంచెర్ల పట్టణంతో పాటు పలు గ్రామాలకు మాత్రమే గోరకల్లు నీరు సరఫరా అవుతోంది. సిద్ధనగట్టు, గార్లదిన్నె, ఏనుగుమర్రి తదితర ప్రాంతాల్లో ట్యాంకుల నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది. 2023లోనే పనులు పూర్తి చేసి తాగునీరు అందించాల్సి ఉండగా ఇంకనూ సాగుతూనే ఉండటం గమనార్హం.

గడువు పెంచుకుంటూ..

పట్టణ ప్రాంతంలో ఒక్కొక్కరికి 135 లీటర్లు, గ్రామాల్లో 100 లీటర్ల మేర తాగునీరు ఇవ్వాల్సి ఉంది. గోరకల్లు జలాశయం నుంచి 0.50 టీఎంసీని తీసుకునేలా ప్రణాళికలు రూపొందించారు. వాస్తవానికి పనులు ఎప్పుడో పూర్తవ్వాల్సి ఉండగా.. గడువు పెంచుకుంటూనే వెళుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

వజ్రకవచధరా... ప్రహ్లాదవరదా

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే : అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో జ్యేష్ఠాభిషేక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ఆలయ ముఖద్వార మండపంలో కొలువుదీర్చి పంచామృతాలతో అభిషేకించారు. స్వామికి చందనం, సుగంధ ద్రవ్యాలు పూసి ధూపదీపాలతో మహా మంగళహారతి ఇచ్చారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు వజ్రకవచం ధరింపజేసి బంగారు ఆభరణాలతో అలంకరించారు. ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

విత్తగించరు.. మాట సాయమందించరు

■ వ్యవసాయశాఖలో గాడి తప్పిన పాలన
■ రైతులకు అందని సేవలు

కర్నూలు, నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : వ్యవసాయ శాఖలో పాలన గాడి తప్పుతోంది. ఇటీవల జరిగిన బదిలీల్లో కొందరు అధికారులు ఎత్తుకు పైఎత్తులు వేసి కోరుకున్న స్థానాలకు బదిలీ అయ్యారు. రైతుల గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. ఖరీఫ్ సీజన్‌లో కర్షకులకు అందుబాటులో ఉండి.. విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాల్సిన అధికారులు పత్తా లేకుండా పోయారు. కర్నూలు జిల్లాలో 4.20 లక్షల హెక్టార్ల సాధారణ సాగు కాగా ఇప్పటివరకు 1.15 లక్షల హెక్టార్లలో, నంద్యాల జిల్లాలో 2,38 లక్షల హెక్టారకుగాను 36,288 హెక్టార్లలో మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి.

యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

దృష్టంతా వసూళ్లపైనే..

ప్రస్తుతం విత్తనాలు, ఎరువులకు డిమాండ్ ఉంది. ఇదే అదనుగా సిబ్బంది కొందరు విత్తనాలు, ఎరువుల దుకాణాల నుంచి మామూళ్లు వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

పంపిణీ అధ్వానం

జాతీయ ఆహార భద్రత పథకం, నూనె గింజల అభివృద్ధి పథకాల ద్వారా వేరుసెనగ విత్తనకాయలు, కందులు తదితర మినీకిట్లు ఉచితంగా పంపిణీ చేయాల్సి ఉండగా ఉమ్మడి జిల్లాలో ఆ ఊసే లేకుండా పోయింది. వ్యవసాయశాఖ ఏపీ సీడ్స్ ద్వారా రాయితీపై వేరుసెనగ, కందులు, మినుములు తదితర విత్తనాలను రాయితీపై పంపిణీ చేయాలని నిర్ణయించింది. కర్నూలు జిల్లాలో 9,009 క్వింటాళ్ల వేరుసెనగ కాయలు ఇవ్వాల్సి ఉండగా 6,594 క్వింటాళ్లు మాత్రమే పంపిణీ చేశారు. నంద్యాల జిల్లాలో 2,759 క్వింటాళ్లకుగాను 1,814.50 క్వింటాళ్ల పంపిణీ జరిగింది.

ఎరువులపై పర్యవేక్షణ ఏదీ..

- గతంలో వరితోపాటు మరికొన్ని పంటలకే యూరియా వినియోగించేవారు. ప్రస్తుతం రైతులు అన్నిరకాల పంటలకు యూరియా వాడుతున్నారు. ఫలితంగా సరిపడా నిల్వలు ఉండటం లేదు.
- వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం ఎక్కడా ఎరువుల కొరత లేదని, అవసరానికి మించి నిల్వలు ఉన్నట్లు చెబుతుండటం గమనార్హం.
- కర్నూలు జిల్లాకు 8,728.83 టన్నుల యూరియా కేటాయించారు. ఇందులో ప్రైవేటు డీలర్లకు 6,290, ప్రాథమిక సహకార సంఘాలకు 232, డీసీఎంఎస్ కేంద్రాలకు 79.02, రైతు సేవా కేంద్రాల హబ్‌లకు 25.12, రైతు సేవా కేంద్రాలకు 882.135, మాన్యుఫ్యాక్చర్ అవుట్‌లెట్లకు 1,142.325, ఇతరులకు 76.79 టన్నులు కేటాయించారు.
- నంద్యాల జిల్లాకు యూరియా, డీఏపీ, మిశ్రమ ఎరువులు కలిపి 93,994 టన్నుల వరకు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో 29,840 టన్నులు విక్రయించినట్లు వివరిస్తున్నారు. యూరియా 18,390 టన్నుల నిల్వ ఉందని పేర్కొంటున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళతానని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. నంద్యాలలోని వివేకానంద ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావిస్తామని హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా.వి.రవికుమార్, బెనహర్, కోశాధికారి డి.శేషన్నలు పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం జిల్లా నూతన సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.యశ్వంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఆర్.అంకన్న తదితరులు ఎన్నికయ్యారు.

శ్రీగిరిలో భక్తజనం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. తొలి ఏకాదశి పర్వదినం కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచి జనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు భక్తులు శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆన్‌లైన్‌లో రూ.500 టిక్కెట్లు తీసుకున్నవారు స్వామివారి స్పర్శ దర్శనం చేసుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించుకున్నారు. దేవస్థానం అన్నపూర్ణ భవన్‌లో భక్తులు భోజనాలు చేశారు. దర్శనం ముగిసిన తర్వాత క్షేత్ర పరిధిలోని ఉపాలయాలను సందర్శించారు. సోమవారం సైతం భక్తుల రద్దీ కొనసాగనుంది.

కాలువలకు నీటి విడుదల

అవుకు, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో వరి సాగుకు వీలుగా అవుకు జలాశయం నుంచి ఆయకట్టు కాల్వలకు ఆదివారం నీటిని విడుదల చేశారు. తిమ్మరాజుచెర్వు పరిధిలోని తూముకు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి గేటు తెరిచారు. ప్రస్తుతం రైతులు నారుమళ్లు వేసేందుకు వీలుగా కాల్వకు 30 క్యూసెక్కులు విడుదల చేశారని, పాలేరు తూముల నుంచి కాల్వలకు ఇప్పటికే ప్రవాహం కొనసాగుతోందన్నారు. అవసరాన్ని బట్టి నీటి ప్రవాహాన్ని పెంచనున్నట్లు ఏఈ సుధాకర్ తెలిపారు. గోరుకల్లు నుంచి ఎస్సార్బీసీ ద్వారా అవుకు జలాశయానికి దాదాపు ఒక టీఎంసీ నీరు సమకూరిందని చెప్పారు. అవుకు జలాశయంలో పూర్తి నిల్వ సామర్థ్యం 4.14 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.69 టీఎంసీలు ఉన్నట్లు చెప్పారు.

సాగు నీరు అందాలి.. కష్టాలు తొలగాలి

అవుకు జలాశయం నుంచి ఎస్సార్బీసీ (మైలవరం కాల్వ) 13 ప్యాకేజీ కాలువకు నీటిని వెంటనే విడుదల చేయాలని దిగువ ప్రాంత రైతులు కోరుతున్నారు. అవుకు, సంజామల మండలాల్లో బోర్ల ఆధారంతో ఇప్పటికే మొక్కజొన్న విస్తృతంగా సాగు సాగైంది. వానలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని శింగనపల్లె, ఆకుమళ్ల రెడ్డిపల్లె, సుంకేసుల గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97628
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 13479

పెద్దకర్మ

మంచితనానికి మారుపేరుగా నిలిచి, మాకు ప్రేమ, ఆప్యాయత, అనురాగాలను పంచి, మా ఉన్నతికి కృషిచేసిన "శ్రీ కట్టా రామకృష్ణుడు" గారి మరణం మాకు తీరనిలోటు. మీ ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...
భార్య: శ్రీమతి కట్టా లక్ష్మిదేవి
కుమారుడు - కోడలు
కట్టా రామచంద్రకుమార్-కట్టా అనూష
కుమార్తెలు - అల్లుళ్లు
ఉప్పల జయలక్ష్మి-ఉప్పల శ్రీధర్
గంజి మాధవి-గంజి హరిప్రసాద్
మనుమళ్లు: కట్టా దీక్షిత్‌రామ్, కట్టా చేతన్ షణ్ముఖరామ్, ఉప్పల దేవనృసింహ, గంజి మేఘవీరభద్ర
మనుమరాళ్లు: ఉప్పల సాయి సాహితి, గంజి తేజస్విని
కీ॥శే॥ శ్రీ కట్టా రామకృష్ణుడు గారు
రిటైర్డ్ హెడ్మాస్టర్, ఆళ్లగడ్డ
జననం: 10-08-1955
నిర్యాణం: 27-06-2025
గమనిక: 7-7-2025వ తేది సోమవారం ఉదయం 9 గం॥లకు మా స్వగృహం, ఇంటి నెం. 8/12/13, విద్యానగర్, ఆళ్లగడ్డ నందు పెద్దకర్మ జరుగును.
సెల్: 89858 58451, 73307 25781

(c) eenadu

నిపుణులు లేరు.. ప్రాణాలు నిలపరు

ఆదోని పాత పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో పశ్చిమ ప్రాంత ప్రజలకు అత్యవసర వైద్యం అందక ప్రాణాలు పోతున్నాయి. చుట్టూ 15 మండలాలతోపాటు పక్కనే ఉన్న కర్ణాటక సరిహద్దు గ్రామ ప్రజలకు ఆదోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రే దిక్కు. రోజువారీ ఓపీ సంఖ్య 500కుపైగా ఉంటుంది. ఐపీ 30కి పైగా నమోదవుతోంది. ఆస్పత్రిలో రెగ్యులర్ వైద్యులు 78 మందికిగాను 19 మంది, సీనియర్ రెసిడెంట్ వైద్యులు 58 మంది ఉండాలి.. కానీ ఒక్కరు కూడా లేరు. ఈఎన్‌టీ, ఆప్తమాల్, జనరల్ సర్జన్ తదితరులు మాత్రమే ఉన్నారు. రేడియాలజిస్ట్, మైక్రోబయాలజిస్ట్, పల్మనాలజిస్ట్, ఫోరెన్సిక్ తదితర వైద్య నిపుణులు అవసరం. వైద్య కళాశాల నిర్మాణం పూర్తికాకపోయినప్పటికీ గత వైకాపా ప్రభుత్వం పలువురు వైద్య నిపుణులు, ప్రొఫెసర్లు, సహాయ ప్రొఫెసర్లను నియమించి ఆదోని ఆస్పత్రిలో ఏడాదిపాటు కూర్చోబెట్టి జీతాలిచ్చింది. తీరా కేంద్ర వైద్యాధికారుల బృందం వైద్య కళాశాలను పరిశీలించింది. పనుల్లో పురోగతి లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసింది. వైద్య కళాశాల నిర్మాణం పూర్తికాకపోవడంతో కూటమి ప్రభుత్వం పలువురు వైద్యాధికారులను ఇతర వైద్య కళాశాలలకు బదిలీ చేసింది. ఫలితంగా ఈ ప్రాంతంలో వైద్య సేవలు అగమ్యగోచరంగా మారాయి.

నెల	ఓపీ	ఐపీ	రెఫర్ కేసులు
మే	14,493	1,135	51
జూన్	16,193	1,238	74

ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సిందే

గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాల సమస్యలతోపాటు రహదారి ప్రమాదాల్లో గాయపడినవారు తదితరులను నిత్యం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుంటారు. ఆదోని సర్వజన ఆస్పత్రిలో అవసరమైన నిపుణులు లేకపోవడంతో ప్రాథమిక వైద్యం మాత్రమే అందించి మెరుగైన చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాలని వైద్యులు సిఫారసు చేస్తున్నారు. దీంతో బాధితులను వంద కి.మీ. దూరంలో ఉన్న కర్నూలు, బళ్లారి (80 కి.మీ.), హైదరాబాద్ (310 కి.మీ.)కు తీసుకెళ్లాల్సి వస్తోంది. కర్నూలు, బళ్లారికి అంబులెన్సులో తీసుకెళ్లాలంటే రూ.4 వేలకు పైగా ఖర్చవుతోంది. హైదరాబాద్, బెంగళూరుకు వెళ్లాలంటే రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు భరించాల్సిందే. ఇది పేదలకు ఆర్థిక భారంగా మారుతోంది.

వైద్య కళాశాల పనుల్లో జాప్యం

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రాంతీయ ఆస్పత్రిని జిల్లా సర్వజన ఆస్పత్రిగా స్థాయికి పెంచారు. వంద నుంచి 350 పడకలకు పెరిగింది. అంతకుముందే ఆస్పత్రి స్థాయి పెంచాలనే ఉద్దేశంతో 2014-19 మధ్యలో తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.10 కోట్లతో ఆస్పత్రి భవనం విస్తరించాలని నిర్ణయించింది. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం పనులు పూర్తి చేయడంలో ఆలస్యం చేసింది. అదే సమయంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యశాలలను కేంద్రం మంజూరు చేసింది. ఆదోని ఆస్పత్రిని జిల్లా సర్వజన ఆస్పత్రిగా మార్చేందుకు అవకాశం కల్పించింది. రూ.200 కోట్లు వెచ్చించి మండలం పరిధిలోని అరేకల్లు గ్రామ సమీపంలో వైద్య కళాశాల పనులు ప్రారంభించారు. వైకాపా ప్రభుత్వం దిగిపోయేనాటికి కేవలం 18 శాతం పనులు మాత్రమే జరిగాయి.

ఆదోని పట్టణంలో 35వ వార్డు సచివాలయ మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్న దివ్య ఆడ శిశువుకు జన్మనిచ్చారు. గత నెల 29వ తేదీన ఆమెకు ఆయాసం రావడంతో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకుగానీ.. హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చుంటే.. వైద్య నిపుణులు అందుబాటులో ఉంటే.. ఈ పరిస్థితి ఉండేది కాదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదోని ఆస్పత్రిలో కిటకిటలాడుతున్న ఓపీ విభాగం

రహదారి నిర్మాణానికి మోక్షం

అవుకు, న్యూస్‌టుడే: అవుకు-ప్యాపిలి మండలాల్లోని గ్రామీణరహదారి నిర్మాణానికి మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి చొరవతో చలనం వచ్చింది. అధికారులు స్థలపరిశీలన చేపట్టారు. మారేముగుల సమీపంలోని కొండప్రాంతాన్ని పరిశీలించారు. మండలంలో చిట్టచివరి గ్రామమైన మారేమడుగల నుంచి ప్యాపిలి మండలం బూర్గల వరకు రహదారి నిర్మించాలంటూ ఆయా గ్రామాలవాసులు అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పురోగతిలేదు. మంత్రి చొరవతో ఎట్టకేలకు కదలిక వచ్చింది. మారేమడుగల నుంచి బూర్గుల వరకు దాదాపు ఆరు కిలోమీటర్లు రహదారి నిర్మించడం ద్వారా అవుకు-ప్యాపిలి, అనంతపురం జిల్లా యాడికి మండలాలకు చెందిన గ్రామీణులకు మేలు చేకూరనుంది. ప్రస్తుతం ప్యాపిలి మండలంలోని సరిహద్దు గ్రామాలకు చెందిన జనం అవుకు మండలంలోని గ్రామాలకు రావాలంటే దాదాపు 40 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి. ఈ రహదారి నిర్మిస్తే చుట్టూ తిరిగే ప్రయాస తగ్గుతుందని మండల తెదేపా నాయకుడు ఆకుల నాగిరెడ్డి అన్నారు. పంచాయతీరాజ్ అధికారులతో కలిసి దాదాపు మూడున్నర కిలోమీటర్లు కాలినడకన వెళ్లి స్థల పరిశీలన చేశారు. దీంతో రెండు మండలాల్లోని దాదాపు 12 గ్రామాలవాసులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. సమయం, రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేశామని ఉన్నతాధికారుల నుంచి అనుమతి లభిస్తే నిర్మాణానికి మార్గం సుగమం అవుతుందని పంచాయతీరాజ్ ఏఈ సుబ్రమణ్యం వెల్లడించారు. బూర్ల నుంచి మూడు కిలోమీటర్ల మేర రహదారి ఫార్మేషన్ జరిగిందని మరో మూడున్నర కిలోమీటర్లు నిర్మిస్తే అవుకు-ప్యాపిలి మండలాలకు రవాణా సౌకర్యం పూర్తిగా ఏర్పడుతుందన్నారు.

మానవత్వం చాటిన మంత్రి బీసీ

● క్షతగాత్రుడిని తన కాన్వాయ్‌లో ఆస్పత్రికి తరలింపు

బనగానపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం మంత్రి బనగానపల్లి నుంచి కర్నూలు వెళ్తుండగా మార్గమధ్యంలో ఒర్వకల్లు సమీపాన ఓ గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురి కావడం చూశారు. వెంటనే కాన్వాయ్‌ను ఆపి బాధితుడి దగ్గరకు వెళ్లారు. హుటాహుటిన గాయపడిన వ్యక్తిని తన కాన్వాయ్‌లోని ఓ వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. స్వయంగా మంత్రి వైద్యులకు ఫోన్ చేసి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. బాధితుణ్ని ఆసుపత్రిలో చేర్పించేందుకు తన వెంట ఉన్న సహాయకుణ్ని పురమాయించి వైద్యం పూర్తయ్యేవరకు కర్నూలులో ఉండాలని మంత్రి ఆదేశించి వెళ్లారు.

బాధితుడితో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

చదరంగం క్రీడతో మెదడుకు పదును

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: చదరంగం క్రీడ మెదడుకు పదును పెట్టి బాలల మేధో సంపత్తి పెంచుతుందని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. రవికృష్ణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నెరవాటి పాఠశాలలో 13ఏళ్ల లోపు బాలబాలికలకు జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. డా. రవికృష్ణ ప్రారంభించి మాట్లాడుతూ.. మచిలీపట్నంలో ఆగస్టు 2, 3వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. వంద మంది చదరంగం క్రీడాకారులు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పాల్గొన్నట్లు తెలిపారు. చెస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, నెరవాటి పాఠశాల కరస్పాండెంట్ కృష్ణసాయి రోహిత్, డా. నీలా ప్రసాద్, సభ్యులు భరత్, సుజాత, రాజా, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న డా.రవికృష్ణ

పాఠాల ఉపాధ్యాయిని.. ఫలితాల కల్యాణి

☛ పల్లెబడిని మార్చిన గురువు ☛ గిరిజన విద్యార్థుల్లో వెలుగు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆ తండా పేరు చెబితే నాటుసారా ఘాటు గుప్పుమంటుంది.. అక్షరాల ఊసేలేని జనం.. ఉద్యోగాలు సాధించిన వారు అంతంత మాత్రమే.. నాటుసారా తయారీనే వృత్తిగా మార్చుకునే వారే అధికం.. చదువు ప్రాధాన్యం తెలిసిన వారు అతి తక్కువ మంది పిల్లలను పత్తికొండకు తీసుకెళ్లి చదివించేవారు. తండాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతూ వచ్చింది. అప్పటి వరకు ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేసినా.. తర్వాత పరిస్థితులను బట్టి ఏకోపాధ్యాయ పాఠశాలకు మార్చారు. గ్రామంలో పాఠశాల కొనసాగింపు ప్రశ్నార్థకంగా మారింది. అప్పటి వరకు అక్కడ విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు వేరే గ్రామాలకు బదిలీపై వెళ్లారు. అలాంటి పరిస్థితులు ఉన్న తండాలోని పాఠశాలకు కల్యాణి కుమారి ఉపాధ్యాయినిగా 2017 సంవత్సరంలో బదిలీపై వచ్చారు.

తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగేలా..

పాఠశాల పరిస్థితిని ఓ వారం రోజుల పాటు క్షుణ్ణంగా పరిశీలించారు. ఉన్న ఒకరిద్దరు పిల్లలను వెంట పెట్టుకొని విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల కొనసాగడానికి సహకరించాలని కోరారు. అప్పటి వరకు పిల్లల్ని పాఠశాలకు పంపడం ఇష్టంలేని తల్లిదండ్రులకు ఉపాధ్యాయినిపై నమ్మకం కుదిరింది. ఒక్కొక్కరూ విద్యార్థులు పాఠశాలకు రావటం పెరిగింది. ఇది ఎనిమిదేళ్ల కిందటి మాట. ఇద్దరు ఉన్న పాఠశాలలో ప్రస్తుతం 45 మందికి పైగా విద్యార్థులు ఉన్నారంటే అది టీచరమ్మ ఘనతే అని గ్రామస్థులు చెబుతున్నారు. ఓ మారుమూల గిరిజన గ్రామ పాఠశాల పేరు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మారుమోగుతోంది. ఉపాధ్యాయిని సేవలను గుర్తించిన ప్రభుత్వం, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు, రాజకీయ పార్టీల నాయకులు, ఉన్నతాధికారుల నుంచి అవార్డులు, ప్రశంసలు అందుకుంటున్నారు. ఇటీవలే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ నుంచి 'షైనింగ్ టీచర్' అవార్డు అందుకుంది.

ల్యాప్‌టాప్ ద్వారా విద్యార్థులకు బోధిస్తున్న కల్యాణికుమారి

అలా మొదలైంది..

కల్యాణి కుమారి 2010 నవంబరులో హోళగుంద మండలం నాగరకన్వి గ్రామంలో ఎస్జీటీ ఉపాధ్యాయినిగా వృత్తి జీవితం ప్రారంభించారు. 2015లో పత్తికొండ పట్టణం రాజీవ్‌నగర్ ప్రాథమిక పాఠశాల, 2017లో జేఎం.తండాకు బదిలీపై వెళ్లారు. తండాలో పరిస్థితులను అధ్యయనం చేశారు. పిల్లలను సక్రమంగా పాఠశాలకు వచ్చేలా చేశారు. శుభ్రతపై అవగాహన కల్పించారు. చదువు ప్రాధాన్యం వివరించారు. పాఠ్యాంశాలను నల్లబల్లాలపైనే కాకుండా వారికి చిత్ర సహితంగా ల్యాప్‌టాప్‌ను వినియోగిస్తూ బోధన సాగించారు. పుట్టిన రోజులు పిల్లలకు గుర్తుండిపోయేలా ఆమె సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇవ్వటం, ఉచితంగా విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా 33 మంది గురుకుల పాఠశాలలో, ఒకరికి నవోదయ సీటు వచ్చేలా కృషి చేశారు.

సామాజిక బాధ్యతగా స్వీకరించా

- కల్యాణికుమారి, ప్రధానోపాధ్యాయిని, జేఎం తండా

ఉపాధ్యాయ వృత్తి అంటే కేవలం కొలువు మాత్రమే కాదని, సామాజిక బాధ్యతగా భావించా. ఉన్న ఒకరిద్దరు పిల్లలతో ఎలా బోధన అని ఆలోచించా. గ్రామం నుంచి పాఠశాల తరలిపోకుండా ఉండాలంటే ఏదైనా చేయాలనుకున్నా. నా సంకల్పానికి గ్రామస్థుల సహకారం తోడైంది. గ్రామస్థులు, యువత, విద్యార్థుల్లో మార్పు వచ్చింది. ఇటీవలే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలవటం, విద్యాభివృద్ధికి అనుసరించాల్సిన విధానాలను నాతో చర్చించడం, షైనింగ్ టీచర్ అవార్డుతో సత్కరించడం జీవితంలో మరచిపోలేని అనుభూతులను నింపాయి. ఇటీవల ఉపాధ్యాయుల సాధారణ బదిలీల్లో భాగంగా మండలంలోని పుచ్చకాయలమడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు కేటాయించారు. నా స్థానంలో ఇంకా ఎవ్వరూ విధుల్లో చేరకపోవటంతో జేఎం తండాలోనే పనిచేస్తున్నా. ఎక్కడ పనిచేసినా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా.

రెండో విడత ప్రవేశాలకు వేళాయే

☛ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో మిగులు సీట్లు 600

వేంపల్లె, న్యూస్‌టుడే : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు ట్రిపుల్ ఐటీలలో 600 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి విద్యార్థుల మెరిట్ జాబితాను తయారు చేసి ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి మొత్తం 4400 సీట్లు ఉన్నాయి. ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1100 సీట్లు ఉండగా దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ కోటా కింద 360 సీట్లు పోను నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1010 చొప్పున 4040 సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలలో ఉన్న సీట్లకు మెరిట్ జాబితా విడుదల చేసి జూన్ 30 నుంచి జులై 5వ తేదీ వరకు ఇడుపులపాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేశారు. కౌన్సెలింగ్ తర్వాత ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 878 సీట్లు భర్తీ కాగా 132 సీట్లు మిగిలిపోయాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలో 1010కి 869 భర్తీ కాగా 141 సీట్లు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 867 భర్తీ కాగా 143, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు 826 సీట్లు భర్తీ కాగా 184 సీట్లు మిగిలాయి. ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో జాప్యం, ఇక్కడి విద్యపై ఆసక్తి లేని కారణంగా చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడంతో 600 సీట్లు ఖాళీ ఏర్పడింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ కేంద్రంగా రెండో విడత ప్రవేశాలకు సంబంధించి రెండో జాబితాను అధికారులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కార్యాలయం

11, 12 తేదీల్లో..

ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలలో మిగిలిపోయిన 600 సీట్ల భర్తీకి తదుపరి మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 11, 12 తేదీల్లో వెబ్‌సైట్‌లో వెల్లడిస్తాం. ఈ మేరకు రెండో విడత జాబితా సిద్ధం చేసే పనిలో తమ సిబ్బంది ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. ఆ లోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను సరైన సమయంలో పూర్తి చేస్తాం.

- ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ

పొగాకు రైతులను ఆదుకోవాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: పొగాకు రైతులను ఆదుకోవాలని మంత్రి ఎన్ఎండీ.ఫరూక్‌ను ఏపీ రైతు సంఘం నాయకులు, పొగాకు రైతులు కోరారు. స్థానిక మంత్రి కార్యాలయంలో ఆదివారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ..రెండు నెలల నుంచి పొగాకు రైతులు ఆందోళన చేస్తుంటే ప్రైవేటు వ్యాపారులు జూన్ నెలాఖరులోగా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి కొనుగోలు చేయలేదన్నారు. ఇతర జిల్లాల్లో పొగాకు కొనుగోలు కేంద్రాలు పెట్టి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నారన్నారు. నంద్యాల జిల్లాలో కొనుగోలు చేయడం లేదన్నారు. మంత్రి జోక్యం చేసుకొని క్వింటాలు రూ.15 వేల చొప్పున కొనుగోలు చేయించి రైతులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి, క్యాబినెట్ సమావేశంలో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, సురేశ్, సీపీఎం నాయకులు పి.నరసింహా, రైతులు వెంకటేశ్వర గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అరటి, వేరుసెనగ, పత్తి పంటలకు బీమా చేయించుకోండి

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంటల బీమా పథకానికి జులై 15వ తేదీ చివరి రోజు అని, రైతులందరూ ఉపయోగించుకోవాలని వ్యవసాయ బీమా జిల్లా కో ఆర్డినేటర్ సునీల్ కోరారు. ఆదివారం ఆయన మండలంలోని మిట్నాల, పుసులూరు, పాణ్యం, బనగానపల్లె లోని మండలాల్లో పలు గ్రామాల్లో విస్తృంగా పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ..పత్తి, అరటి, వేరుసెనగ పంటలకే కేంద్ర ప్రభుత్వం పంటల బీమా ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో భాగంగా పత్తి పంటకు ఎకరాకు రూ.1600, అరటికి ఎకరాకు రూ.2750, వేరుసెనగకు రూ..560 చెల్లించి బీమా పొందాలని సూచించారు. బీమా పొందడానికి ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, భూమి పాసు పుస్తకం, పంట వేసినట్లు ధ్రువీకరించే పత్రాలు సమర్పించాలన్నారు. మండల కోఆర్డినేటర్లు వినయ్, పవన్, నరేంద్ర ఆయా గ్రామాల రైతుల పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న సునీల్

వైకాపా పాలనలో ప్రాజెక్టుల నిర్వహణపై నిర్లక్ష్యం

పాములపాడు, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో సాగునీటి ప్రాజెక్టుల గేట్ల గ్రీస్ నిధులు కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యేలు జయసూర్య, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బనకచర్ల క్రాస్‌రెగ్యులేటర్ నుంచి వారు ఆదివారం నీటిని విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు నుంచి 6వేల క్యూసెక్కుల నీరు బనకచెర్లకు చేరుకోగా.. 5వేల క్యూసెక్కుల నీరు తెలుగుగంగ కాలువకు, వెయ్యి క్యూసెక్కుల నీరు కేసీ కాలువకు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం రైతులకు సాగు నీరు అందించేందుకు ప్రత్యేక దృష్టి సాధించి.. గత ప్రభుత్వం కంటే ముందుగానే నీటిని విడుదల చేస్తుందన్నారు.


బటన్ నొక్కి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు

పెళ్లికి నిరాకరించారని యువజంట ఆత్మహత్య

☛ మృతురాలు వివాహిత

ప్యాపిలి, గిద్దలూరు పట్టణం, కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే : తమ వివాహానికి పెద్దలు అనుమతించడం లేదని ఓ యువ జంట బలవన్మరణానికి పాల్పడింది. మృతి చెందిన వారిలో ఒకరు వివాహిత కావడం గమనార్హం. ప్రకాశం జిల్లా కొమరోలు ఎస్.ఐ.నాగరాజు వెల్లడించిన వివరాల ప్రకారం. .కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం మాధవరానికి చెందిన కంబగిరి పాపయ్య కుమారుడు రాముడు(25) లారీ చోదకుడిగా పని చేస్తున్నారు. వారి ఇంటికి సమీపంలోనే భారతి ఉంటున్నారు. ఆమె రెండేళ్ల క్రితం ఆమెను మేనమామ కుమారుడు శివప్రసాద్‌ను ఇచ్చి పెళ్లి చేశారు. అయితే భర్తతో విభేదాల కారణంగా ఆమె కొంతకాలంగా తల్లిదండ్రుల వద్దే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో కంబగిరి రాముడు..భారతి కొంతకాలంగా సన్నిహితంగా ఉంటున్నారు. తామిద్దరూ ప్రేమించుకుంటున్నామని, పెళ్లి చేసుకుంటామని వారు తల్లిదండ్రులకు చెప్పగా. .వారు వరుస కాదంటూ మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన రాముడు, భారతితో కలసి శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై కొమరోలు మండలం అక్కపల్లె వద్దకు బయలుదేరి వెళ్లారు. శనివారం సాయంత్రం రాముడు తండ్రికి ఫోన్ చేసి తాము చనిపోతున్నామని చెప్పి, వెంటనే తామున్న ప్రాంతాన్ని కూడా వాట్సాప్ చేశాడు. దీంతో ఆందోళనకు గురైన ఇరు కుటుంబాల వారు ఆదివారం ఉదయం కొమరోలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా, ఎస్ఐ నాగరాజు, సిబ్బందితో హుటాహుటిన కొమరోలు శివారు ప్రాంతానికి వచ్చి పరిశీలించగా..రాముడు, భారతి మృతదేహాలు చెట్టుకు వేలాడుతున్నాయి. వెంటనే వారు మృతదేహాలను గిద్దలూరు వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం చేయించారు. అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించగా, వారు మాధవరానికి తరలించారు. ఒకే ప్రాంతానికి చెందిన వారు బలవన్మరణానికి పాల్పడటంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

వ్యవసాయానికి కృషి విజ్ఞాన కేంద్రం

☛ కొత్త వంగడాల సాగు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, నూతన వంగడాలు అందించి వారి ఆదాయాన్ని పెంపొందించేందుకు 'బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం' కృషి చేస్తోంది. పంట ఉత్పాదకతను పెంచడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. ఈ ఏడాది పలు కొత్త వంగడాలను రైతులకు అందజేశారు.

ఖరీఫ్‌లో అందజేసినవి..

● **కొర్ర-3156 రకం:** ప్రాంతీయ పరిశోధన స్థానం నంద్యాల సహకారంతో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా 30మంది రైతులకు కొర్ర విత్తనాలు పంపిణీ చేశారు. ఈ రకం పంట కాలం 85-90రోజులు. ఎకరాకు 11నుంచి 13క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అధిక గింజ దిగుబడి రకం. వెర్రికంకి తెగులు తట్టుకుంటుంది.

● **కంది ఎల్ఆర్‌జీ-454 రకం:** ప్రాంతీయ పరిశోధన స్థానం లాంఫామ్ గుంటూరు సహకారంతో పది మంది రైతులకు ప్రదర్శన క్షేత్రాల కోసం విత్తనాలు అందజేశారు. పంట కాలం 155-160 రోజులు. ఎకరానికి 8-10క్వింటాళ్ల దిగుబడి. ఎండు తెగులు, వెర్రి తెగులు తట్టుకుంటుంది.

● **వరి ఆర్‌జీఎల్-7034రకం:** పంట కాలం 130-140 రోజులు. మధ్యస్థ సన్నబియ్యం రకం. దిగుబడి ఎకరానికి 26క్వింటాళ్లు. గాలులకు నేలవాలదు. ఉల్లి కోడు, అగ్గి తెగులు, దమోపాటు, ఎండాకు తెగులు తట్టుకుంటుంది.

● **వరి ఆర్‌జీఎల్-7038, 7039 రకాలు:** పంట కాలం 140-145 రోజులు. దిగుబడి ఎకరానికి 26 క్వింటాళ్లు. 30మంది రైతులకు ప్రదర్శన క్షేత్రాలు కోసం విత్తనం అందజేశారు.

● **వరి ఎన్ఎల్ఆర్-3648 రకం:** 130రోజులు పంట కాలం. గింజ సన్నగా ఉంటుంది. ఎకరాకు 30క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అగ్గి తెగులు తట్టుకుంటుంది. పది మంది రైతులకు ప్రదర్శన క్షేత్రాలు కింద విత్తనం వేశారు.

● **సజ్జలు-ఏపీహెచ్‌బీ-126 రకం:** పంట కాలం 126రోజులు. వర్షాధారంగా ఎకరానికి పది క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. నీటి పారుదల కింద ఎకరానికి 13నుంచి 14క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

● **ఊదలు సీబీవైఎంవీ-1రకం:** పంట కాలం 90రోజులు. ఎకరానికి 4-5క్వింటాళ్ల దిగుబడి. తుప్పుతెగులు తట్టుకుంటుంది.

వేరుసెనగ ప్రదర్శన క్షేత్రంలో కేవీకే శాస్త్రవేత్తలు

వెలుగోడులో అగ్నిప్రమాదం

వెలుగోడు, న్యూస్‌టుడే: వెలుగోడు పట్టణంలోని సీపీనగర్‌లో ఉన్న కార్పెంటర్ షెడ్డులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బండిఆత్మకూరు మండలం నారాయణాపురం గ్రామానికి చెందిన జయరాజు పదేళ్లుగా వెలుగోడులోని సీపీనగర్‌లో కార్పెంటర్ షెడ్డు ఏర్పాటు చేసుకొని ఫర్నిచర్ తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగించేవారు. శనివారం అర్ధరాత్రి విద్యుదాఘాతంతో మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక వాహన సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక వాహనం వచ్చి మంటలు ఆర్పేలోగా నష్టం జరిగినట్టుగా స్థానికులు చెప్తున్నారు. ప్రమాదంలో రూ.15లక్షల విలువైన కలప, కోతమిషన్లు, రేకుల షెడ్డు కాలిబూడిదైనట్లు, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు జయరాజు తెలిపారు.

కాలిపోయిన షెడ్డు

లారీ ఢీకొని యువకుడి మృతి

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన డోన్ జాతీయ రహదారిలోని యు.కొత్తపల్లి వద్ద నున్న ఓ దాబా వద్ద జరిగింది. సీఐ ఇంతియాజ్ బాషా కథనం ప్రకారం... పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఇమామ్ బాషా(30) మొహర్రం సందర్భంగా తన స్వగ్రామమైన కొత్తబురుజుకు ఆదివారం తన ద్విచక్రవాహనంపై బయలుదేరారు. యు.కొత్తపల్లి వద్ద లారీ ఢీకొనడంతో ఇమామ్ బాషా అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు పట్టణంలోని కంబాలపాడు సర్కిల్ వద్ద ఉన్న మసీద్ సమీపంలో ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


ఇమామ్ బాషా (పాత చిత్రం)

రిమాండ్ ఖైదీ మృతిపై విచారణ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నెల్లూరు జిల్లా కావలి పరిధిలోని వెంగళరావుకాలనీకి చెందిన రిమాండ్ ఖైదీ పోతురాజు శాంతిపవన్‌కుమార్ అలియాస్ వసంత్ (59) మృతి చెందడం వివాదాస్పదంగా మారింది. తక్కువ ధరకు బంగారు విక్రయిస్తామంటూ విజయవాడకు చెందిన డాక్టర్ రాజేంద్రప్రసాద్ నుంచి రూ.7.32 కోట్లు తీసుకుని మోసగించడంతో పాటు బెదిరించి మరో రూ.50 వేలు వసూలు చేసిన ఆరోపణలపై నెల్లూరు జిల్లాకు చెందిన ఏడుగురిపై కర్నూలు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన పోతురాజు రతన్‌కుమార్, ఇతని తండ్రి పోతురాజు శాంతిపవన్‌కుమార్, శ్రీకాంత్, పాలకీర్తి జశ్వంత్‌ను ఈ ఏడాది జూన్ 30న కర్నూలు పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌పై జిల్లా కారాగారానికి పంపారు. వీరిలో మాజీ పోలీసు అధికారైన పోతురాజు శాంతిపవన్‌కుమార్ మూత్రపిండాల సమస్యతో బాధపడుతుండగా ఆసుపత్రిలో చేర్పించారు. ఈనెల 4న కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. దీనిపై జిల్లా కారాగారం ఇన్‌ఛార్జి పర్యవేక్షణాధికారి ఎరికినాయుడు ఫిర్యాదు మేరకు కర్నూలు మూడో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆదివారం భారీ పోలీసు బందోబస్తు మధ్య కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో ఆయన మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి ప్రత్యేక వాహనంలో స్వగ్రామానికి పంపారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సరోజనమ్మ ఆసుపత్రికి వచ్చి విచారణ చేపట్టారు. మృతుడి భార్య ప్రద్యుల్లత, వైద్యుల నుంచి వాగ్మూలం తీసుకున్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

We are Hiring! Telecallers (Female), Marketing Executives & Accountant. Prior Experience in a Similar role in the Real Estate Industry is Preferred. Job Location: Kurnool. Contact us on: 77300 55888.

BUSINESS OFFER

FACULTY/ TEACHERS

Wanted Experienced Teacher for Social Students Cont. Vijetha High School, Near Krishna Nagar, ITC, Kurnool. Cell No: 94921 98651.

FINANCIAL SERVICES

REAL ESTATE

FLAT FOR SALE

HOUSE FOR SALE

JOBS

అన్నికాలాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

సాయిబాబా ఉత్సవ విగ్రహం

వైభవంగా గ్రామోత్సవం

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: పట్టణంలోని బొమ్మలసత్రంలో షిర్డీసాయిబాబా గ్రామోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈనెల 10న జరిగే గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా ఆలయం నుంచి బొమ్మలసత్రం, ఎమ్ఎస్‌నగర్, మూలసాగరం మీదుగా గ్రామోత్సవం సాగింది. సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఊరేగిస్తూ యాత్ర నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్సై సురేష్ పేర్కొన్నారు. వెలుగోడు మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మంత్రణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి ప్రశాంత జీవితం సాగించాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: ?: జుమ్మా మసీద్ ఎదురుగా ఉన్న వీధిలో కుక్కల బెడద అధికంగా ఉంది
– సురేష్, స్థానికుడు.
?: వివేకానందనగర్‌లో కుక్కలు బెడద అధికంగా ఉంది. –శ్రీధర్, స్థానికుడు.
✔: త్వరలోనే కుక్కలను పట్టించి సమస్యలు పరిష్కరిస్తాం. – లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

రాష్ట్రంలో అభివృద్ధి లక్ష్యంగా పాలన

తమడపల్లె(మహానంది), న్యూస్‌టుడే: రాష్ట్రంలో చీకటి పాలన అంతరించి వెలుగు పాలనతో అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. మహానంది మండలం తమడపల్లె గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని స్థానిక నాయకుడు జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయన వెంట కేసీ కెనాల్ నంద్యాల ప్రాజెక్టు ఛైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, మండలాధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్వినీ, తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో బుడగ జంగాల కాలనీలో తెదేపా సీనియర్ నాయకులు గోవిందు, మద్దిలేటిగౌడు, ఉశేనాళం ఆధ్వర్యంలో తెదేపా నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తెదేపా కార్యకర్తలు నరసింహ, స్వామన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి

పగిడ్యాల: పగిడ్యాలలో తెదేపా నాయకులు దామెదర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీసీ కాలనీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు అందజేశారు

లక్ష్మాపురంలో కరపత్రం అందజేస్తున్న తెదేపా నాయకులు

మెనూపై మీమాంసం!

పరిశీలన

ప్రభుత్వ బీసీ, సాంఘిక సంక్షేమ, గిరిజన వసతి గృహాల్లోని విద్యార్థులకు మెనూ సరిగా అందడం లేదు. నిబంధనల ప్రకారం ఆదివారం మధ్యాహ్నం చికెన్ బిర్యానీ, గోంగూర పచ్చడి, రైతా వడ్డించాలి. కానీ, ముద్దగా ఫలావు అన్నం, చికెన్ కర్రీ, గోంగూర పచ్చడి చేసి.. రెండు, మూడు ముక్కలు మాత్రమే వేశారు. వసతి గృహాల్లో మెనూ నిర్వహణపై 'న్యూస్‌టుడే' బృందం పరిశీలన కథనం..

కానరాని పర్యవేక్షణ

◆ ప్రభుత్వ వసతి గృహాలపై నిర్లక్ష్యం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల దేవనగర్‌లోని బీసీ బాలుర వసతి గృహంలో 35మంది విద్యార్థులుండగా.. ఆదివారం మధ్యాహ్నం 15 మంది మాత్రమే భోజనం చేశారు. ఆహార పట్టికలో చికెన్ బిర్యానీ, రైతా, గోంగూర చట్నీ ఇవ్వాలని ఉన్నా.. పలావ్ అన్నం, చికెన్ కూర వడ్డించారు. వార్డెన్ లేరు. మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులే ఆహారాన్ని అందించారు.

దేవనగర్‌లోని బీసీ బాలుర వసతి గృహంలో చికెన్, అన్నం వేర్వేరుగా వండిన నిర్వాహకులు

తక్కువ వడ్డింపు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆత్మకూరు పట్టణంలోని బాలికల వసతిగృహంలో 120 మంది విద్యార్థులు ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం 98మంది భోజనం చేశారు. వారికి చికెన్ కూర, పెరుగు, గోంగూర చెట్నీ పెట్టారు. వంట మనుషులు కొంచెం తక్కువ వడ్డించారు.

ఇవ్వని పండ్లు, రైతా

◆ ఆదివారం బిర్యానీ పెట్టాల్సినా కూరతో సరి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: బొమ్మలసత్రం ఎస్సీ వసతి గృహం-1లో 130 మంది, ఎస్సీ-2 వసతి గృహంలో 140మంది విద్యార్థులు ఉంటున్నారు. ఆదివారం రెండు వసతి గృహాల్లో కలిపి 100మంది విద్యార్థులు ఉన్నారు. తక్కువ పరిమాణంలో చికెన్ కూర మాత్రమే ఇస్తున్నారని విద్యార్థులు చెబుతున్నారు. రైతాతోపాటు రాత్రి పండ్లు కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు.

◆ బొమ్మల సత్రం ఎస్టీ వసతి గృహంలో 70 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఆదివారం 50మంది తిన్నారు. చికెన్ కర్రీ తక్కువ వేయడంతో అన్నం పడేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగడానికి నీళ్లు లేవు. దీంతో వసతి గృహ అధికారులతో వాగ్వాదానికి దిగారు.

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో 77మంది విద్యార్థులు ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం భోజనంలో చికెన్ కూర సరిపడా వేయడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. తమకు మెనూ పెంచాలని కోరుతున్నారు.

బొమ్మలసత్రం ఎస్సీ వసతి గృహం-1లో ముద్దగా అన్నం, ప్లేట్‌లో లేని చికెన్ ముక్కలు

చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భాజపా నాయకులు

శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలోని అన్నపూర్ణాదేవి ఆశ్రమంలో ఆదివారం జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి జరిగింది. స్థానిక భాజపా నాయకులు, సంఘ్ కార్యకర్తలు శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అఖండ భరత్ కోసం ఆయన పార్టీని స్థాపించి పోరాటాలు చేశారని జిల్లా భాజపా ప్రధాన కార్యదర్శి అంతిరెడ్డి అరవింద్‌రెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మహానంది, న్యూస్‌టుడే: మహానంది మండలం బుక్కాపురం అంగన్‌వాడీ కేంద్రం-1లో హెల్పర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ మండల పర్యవేక్షకురాలు తోట కవిత తెలిపారు. ఎస్సీ కేటగిరిలోని గ్రూప్-3కి రోస్టర్ పాయింట్ ప్రకారం కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో మాల, మాల అయ్యావారు, మాలదాసరి, మాలదాసు వంటి కులాలకు వర్తిస్తుందని చెప్పారు. 21 నుంచి 35ఏళ్ల వయసు కలిగిన మహిళలు ఈనెల 10వ తేదీలోగా ఆత్మకూరులోని సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మహానందిలో పూజలు చేస్తున్న పండితులు, అధికారులు

నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ కోదండరామాలయంలో సత్యనారాయణ వ్రతపూజల్లో భక్తులు

రంగరాజు వీధిలో రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయంలో స్వామి, అమ్మవారు

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం నియోజకవర్గాల్లోని ఆలయాలు ఆదివారం కిటకిటలాడాయి. తొలి ఏకాదశిని పురస్కరించుకొని భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉపవాసాలు, ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. – న్యూస్‌టుడే బృందం

భక్తిశ్రద్ధలతో మొహర్రం

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం నియోజకవర్గాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో మొహర్రం నిర్వహించారు. పీర్లచావిడిల వద్ద పీర్లకు ఫాతెహాలు చదివించారు. పూల చాదర్‌లు, చక్కెర సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ఊరేగింపులు నిర్వహించారు. – న్యూస్‌టుడే బృందం

నంద్యాల పట్టణంలో రెడ్డిచావిడి నుంచి ఊరేగింపుగా వెళుతున్న పీర్లు

సింగవరంలో పీర్లకు ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్థులు

శాతనకోట గ్రామంలో ఏటికి తరలుతున్న పీర్లు

సంక్షిప్త సమాచారం

శ్రీశైలం ఆలయం: శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 24న దేవస్థానం ఆధ్వర్యంలో కౌండిన్య గౌడ సత్రానికి సంబంధించిన ప్రత్యేక సమావేశం జరుగుతున్నట్లు ఈవో ఎం.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సత్రం నిర్వహణలో అభిప్రాయభేదాలు తలెత్తిన ఈ నేపథ్యంలో సమావేశం జరుగుతుందన్నారు. దేవస్థానం సిబ్బంది సమక్షంలో కౌండిన్యగౌడ సత్రానికి నూతన తాత్కాలిక కార్యనిర్వాహక వర్గం ఏర్పాటు చేయడానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

నంద్యాల పట్టణం: నంద్యాల మిడ్‌టౌన్ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం ఎర్రమఠం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి స్టీల్ ప్లేట్లను వితరణ చేశారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు డీవీ.సుబ్బయ్య సౌజన్యంతో అధ్యక్ష, కార్యదర్శులు కేశవమూర్తి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం ప్రధానోపాధ్యాయులు శివయ్యకు ప్లేట్లు అందజేశారు.

గడివేముల: తిరుపాడు గ్రామంలో నంద్యాల ఇండస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ గుండెవైద్యులు డా. మురళీకృష్ణ, స్త్రీవ్యాధి నిపుణులు డా.తనూజ రోగులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు.

నంద్యాల రైతునగరం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9న నంద్యాలలో చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం సీపీఎం నాయకులు ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ..కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయరాదన్నారు.

డోన్: డోన్‌లో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు త్వరగా అందజేయాలని నంద్యాల జిల్లా ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఈనాగరాజు కోరారు. ఆయన మాట్లాడుతూ.. టైలర్స్ కాలనీలో నిర్మించిన టిడ్కోగృహాలను ఇంతవరకు ప్రారంభించలేదన్నారు. ఎమ్మెల్యే జయసూర్యప్రకాశ్‌రెడ్డి చొరవ తీసుకోవాలన్నారు.

జగ్జీవన్‌రామ్ వర్ధంతి

విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : సున్నిపెంటలోని జగ్జీవన్‌రామ్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయన వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ శ్రీశైలం మండల మాజీ అధ్యక్షుడు నాగేళ్ల సురేష్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు చిలక రాబిన్‌సన్ మాదిగ, శ్రీశైలం పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ డీన్ ఎం.శ్రీనివాసరావు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయం నుంచి బస్టాండ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి.. బస్టాండ్ సర్కిల్‌లో ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటరమణ మాదిగ, లక్ష్మయ్య, ఆశీర్వాదము, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై రయ్ రయ్

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు నియోజకవర్గంలో రూ.కోట్లతో నిర్మిస్తున్న బీటీ రహదారులు పూర్తయ్యాయి. ఇక నుంచి రహదారులపై రయ్ రయ్ వెళ్లవచ్చునని వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిధుల మంజూరు ఇలా..

- నియోజకవర్గంలో పీఐయూ ఆధ్వర్యంలో 6.10కి.మీ రూ.2.6కోట్ల వ్యయంతో బీటీ నిర్మాణం చేపట్టారు.
- కొత్తపల్లి మండలంలో పీఎంజీఎస్‌వై ఆధ్వర్యంలో సంగమేశ్వరం నుంచి జానాలగూడెం వరకు రూ.3.4కోట్లతో బీటీ నిర్మాణం చేపట్టారు.
- పగిడ్యాల మండలంలో ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో ముచ్చుమర్రి నుంచి నందికొట్కూరు మండలం కొణిదేల వరకు రూ.4కోట్లతో బీటీ రహదారి వేశారు. మిడుతూరు నుంచి గడివేముల మండలాలను కలుపుతూ సుమారు 7.9కోట్లతో బీటీ నిర్మాణం పూర్తయ్యింది. మిడుతూరు నుంచి ఓర్వకల్లు మండలం శకునాల వరకు సుమారు రూ.6కోట్లతో బీటీ పూర్తి చేశారు.
- ప్రస్తుతం పీఐయూ ఆధ్వర్యంలో నందికొట్కూరు నుంచి నాగటూరు గ్రామం వరకు రూ.38 లక్షలు, ఆత్మకూరు నుంచి కొక్కెరంచ వరకు రూ.2కోట్లు, పాములపాడు మండలం కృష్ణరావుపేట నుంచి తుమ్మలూరు వరకు రూ.34.4లక్షలు, వేంపెంట నుంచి సుంకులమ్మ కొట్టాల వరకు రూ.40లక్షలు, నందికొట్కూరు నుంచి అల్లూరు వరకు ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో రూ.50లక్షల వ్యయంతో బీటీ పనులు చేపట్టారు.

నాగలూటి-పైపాలెం గ్రామాల మధ్య నూతనంగా వేసిన రహదారి

పనులు జరుగుతుండగానే పగుళ్లు



కర్నూలు దోర్నాల మధ్య జరుగుతున్న జాతీయ రహదారి 340సీ పనుల్లో అక్కడక్కడ నాణ్యత లోపించింది. ఆత్మకూరు పట్టణ శివారులో చరకాకాలనీకి వెళ్లే మార్గంలో పైవంతెన పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఫ్లైఓవర్‌కు రెండవ వైపున వంతెన నిర్మాణం జరుగుతుంది. దీని నుంచి కిందికి దిగుతున్న ప్రాంతంలో తారు రోడ్డుపై చీలికలు ఏర్పడ్డాయి. రోడ్డు నిర్మాణం సమయంలో రోలింగు సక్రమంగా చేపట్టక, మట్టి కుంగకపోవటంతో చీలికలు ఏర్పడినట్లు తెలుస్తోంది. పైవంతెన ప్రారంభమై వేల సంఖ్యలో భారీ వాహనాలు తిరిగితే ఈ చీలికలు పెరిగే అవకాశం ఉంది.

– న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

నారు మడులు సిద్ధం

పొగాకు పంట సాగు కోసం అన్నదాతలు నారు మడులు సిద్ధం చేసుకుంటున్నారు. పట్టణం శివారులోని అల్లూరు రహదారి, మిడుతూరు మండలం పరిధిలో నారు మడులు తయారు చేసుకుని పొగాకు విత్తనాలు చల్లుకుంటున్నారు. గతేడాది చుక్కబర్లీ పొగాకు పంటను ఆరు మండలాల్లో సుమారు 3,280 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేసుకున్నారు. పంటను విక్రయించేందుకు అష్టకష్టాలు పడ్డారు. ఈ ఏడాది మళ్లీ పొగాకు సాగుకు నారు పెంచేందుకు మడులు తయారు చేసుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, నందికొట్కూరు

సీపీఐ మహాసభలు జయప్రదం చేయండి

పగిడ్యాల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగానాయుడు, మండల కార్యదర్శి అబ్దుల్‌మజీద్ ఆధ్వర్యంలో సీపీఐ రెండవ మండల మహాసభ

మాట్లాడుతున్న రామాంజనేయులు

కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ వ్యవస్థను ప్రోత్సహిస్తూ పేదలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈనెల 30, 31న డోన్‌లో జరిగే సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల నందిపైపుల ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. నంది సంస్థల అధినేత్రి సుజల పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు వంశీధర్ మాట్లాడుతూ..ఈ పోటీలకు జిల్లా నుంచి సుమారు 300మంది క్రీడాకారులు పాల్గొనట్లు తెలిపారు. జిల్లా అసోసియేషన్ సభ్యులు శేషిరెడ్డి, సంజీవరెడ్డి, డా.జనార్దన్‌రెడ్డి, శిక్షకులు నాగార్జున, చైతన్య పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేస్తున్న సుజల

అమ్మవారికి లక్ష్మీకాసుల హారం బహూకరణ

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన కామేశ్వరీదేవి అమ్మవారికి కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గంగి వెంకటసుబ్బయ్య, వెంకటసుబ్బమ్మ దంపతులతోపాటు రామేశ్వరం అమ్మవారికి లక్ష్మీకాసుల దండను బహూకరించారు. అందజేశారు. ఆదివారం తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని దైవదర్శనం చేసుకున్న అనంతరం 23 తులాల పరిమాణంగల లక్ష్మీకాసుల దండను ఏఈవో ఎర్రమల మధు, అర్చకులు రాజమాణిక్యశర్మ, కొమ్మద్ది సుబ్బయ్యలకు దాతలు అందజేశారు. అమ్మవారికి రూ. 3,500 విలువగల పట్టుచీరను సమర్పించారు.

అధికారులకు హారం, పట్టుచీరను అందజేస్తున్న దాతలు

◆ మహానంది దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలలోని గోవుల సంరక్షణ నిధికిగాను వినుకొండ, వడ్డెంగుంట గ్రామస్థురాలు మిలియంపల్లి సాన్విక రూ. 10,116 విరాళాన్ని ఏఈవో ఎర్రమల మధుకు అందజేశారు.

పంటకాల్వల్లో ఉపాధి పనులు చేయండి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని నారాయణాపురం గ్రామంలోని బ్రాహ్మణ చెరువు పంటకాల్వలో ఉపాధి పనులు చేపట్టాలని సాగునీటి సంఘం అధ్యక్షుడు పాలశంకర్‌తోపాటు రైతులు కోరారు. వారు మాట్లాడుతూ..ఈ కాల్వ ద్వారా సుమారు వంద ఎకరాలకు సాగునీరు చెరువు నుంచి విడుదలవుతుందని, ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావస్తున్నా ఉపాధి పనుల సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. ఈ విషయమై ఏపీవో వసుధారెడ్డిని వివరణ కోరగా చెరువులకు ఉన్న పంటకాల్వలను గుర్తించి రెండు రోజుల్లో పనులు సాగిస్తామని వివరించారు.

పశువుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: పశువుల వ్యాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి గోవిందనాయక్ అన్నారు. ఆదివారం నంద్యాలలోని పశువైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం నిర్వహించారు. కుక్కలకు టీకాలను వేసి వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఉప సంచాలకులు శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు సుబ్బారెడ్డి, వైద్యులు శ్రీనివాసరెడ్డి, శివానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కలకు సూదులు వేస్తున్న గోవిందనాయక్

కార్యకర్త మృతదేహానికి ఎమ్మెల్యే నివాళి

లింగాపురం(బండిఆత్మకూరు): మండలంలోని లింగపురం గ్రామానికి చెందిన తెదేపా బూత్ కమిటీ నాయకుడు దర్జీ షఫివుల్లా అనారోగ్యంతో మృతిచెందాడు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల సురేష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు లాయర్ కృష్ణారెడ్డి, కంచర్ల మనోహర్ చౌదరి, ఉప సర్పంచి కంచర్ల లింగారెడ్డి తదితరులు నివాళి అర్పించారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పర్యావరణానికి హాని కలిగించే రంగు విగ్రహాలు స్థానంలో మట్టి విగ్రహాలను పూజించాలని గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గౌరి ఉస్సేన్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని సౌత్‌ఇండియా కార్యాలయంలో ఆదివారం కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణపై సభ్యుల నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు.

నాడు నేడు.. నేలపైనే తరగతులు

ఈనాడు డిజిటల్, నంద్యాల: నాడు- నేడు పథకం ద్వారా గత వైకాపా ప్రభుత్వం కొన్ని పాఠశాల్లో పనులను నాసిరకంగా చేసి వదిలేసింది. కొండంత రాగం తీసి గోరంత పాట పాడారని అన్నట్లుగా ప్రస్తుతం జిల్లాలోని పాఠశాలల పరిస్థితి అలానే ఉంది. బడుల రూపురేఖలను మర్చేశామని గొప్పలు చెప్పుకొనే వారికి ఈ పాఠశాలల పరిస్థితులే సమాధానం ఇస్తాయి. బడుల్లో తాగునీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుద్దీకరణ, మరమ్మతు పనులు తూతూమంత్రంగా చేశారు.

☛ మారని పాఠశాలల రూపురేఖలు

శిథిలావస్థలో పాఠశాల

బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థలో ఉంది. 40 మందికిపైగా పిల్లలున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో రూ.లక్షలు వెచ్చించి నాడు నేడు కింద పనులు చేశారు. కనీసం పిల్లలు కూర్చోవడానికీ బల్లలు లేవు. దీంతో అపరిశుభ్రంగా ఉన్న ఆరుబయటే చదువుతున్నారు. ప్రవేశద్వారంలో కనీసం గేటు కూడా లేదు. పాఠశాలలో కేవలం రెండు గదులు ఉండగా.. వాటిలో అన్ని తరగతుల పిల్లలకు పాఠాలు చెబుతున్నారు. పైకప్పు పెచ్చులు ఊడేట్లు ప్రమాదకరంగా ఉంది. వీటి మధ్యనే విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువుతున్నారు.

కింద కూర్చున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు

పేరుకు ఆదర్శం.. వసతులు అధ్వానం

వెలుగోడు మండలంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల. నాడు నేడు పథకం ద్వారా గతంలో పనులు చేసినప్పటికీ ఈ పాఠశాలలో కనీసం బెంచీలు కూడా లేవు. మొత్తం 103 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు తగిన సౌకర్యాలు లేవు.

చదువులు ఎలా?

శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను ఎలా చదివించాలంటూ విద్యార్థుల తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాడు నేడు పథకం ద్వారా వచ్చిన నిధుల వరకు గుత్తేదారులు పనులు చేసి ఆపేశారు. ప్రస్తుతం పాఠశాలల స్థితిగతులను ఉన్నతాధికారులకు తెలియజేశామని ఉపాధ్యాయులు, విద్యాధికారులు తెలిపారు.

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

మార్కెట్ స్థలంలో షెడ్లు ఏర్పాటు చేయాలి

నిరుపయోగంగా ఉన్న మార్కెట్ యార్డు

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే : రేనాటి చంద్రుడు బుడ్డా వెంగళరెడ్డి స్మారక కూరగాయల మార్కెట్ యార్డు కోసం దాతలు బుడ్డా విశ్వనాథరెడ్డి, బుడ్డా నలపురెడ్డి, బుడ్డా సుబ్బలక్ష్మమ్మ, బుడ్డా ఈశ్వరరెడ్డి కలిసి ఎకరా స్థలం వితరణగా ఇచ్చారు. వైకాపా ప్రభుత్వంలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ఎంపీ నిధుల నుంచి రూ. 30 లక్షలు ఖర్చు చేసి మార్కెట్ చుట్టూ ప్రహరీ నిర్మించారు. దాంతో దాతలు ఇచ్చిన స్థలంలో కూటమి ప్రభుత్వమైనా మార్కెట్ షెడ్లను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

టిడ్కో గృహాలు అందజేయాలి

డోన్, న్యూస్‌టుడే: డోన్‌లో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు త్వరగా అందజేయాలని నంద్యాల జిల్లా ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఈనాగరాజు కోరారు. ఆయన మాట్లాడుతూ.. టైలర్స్ కాలనీలో నిర్మించిన టిడ్కో గృహాలను ఇంతవరకు ప్రారంభించలేదన్నారు. ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, ఎల్లకృష్ణ, చిన్నమద్దయ్య, విజయుడు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

డబ్ల్యూగోవిందిన్నె (దొర్నిపాడు), న్యూస్‌టుడే: ?: డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో మురుగు కాల్వలో పూడికతో నిండి అధ్వానంగా మారింది. - **సుధాకర్, డబ్ల్యూగోవిందిన్నె.**

✔: మురుగు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - **శివ ప్రసాద్, ఈవోపీఆర్డీ.**

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: మండలంలోని గోవిందపల్లె నూతన ఎస్సీ కాలనీలో విద్యుత్తు తీగలు కిందకు ఉన్నాయి. - **వెంకటేశ్వరమ్మ.**

✔: విద్యుత్తు తీగలను ఎత్తు పెంచేలా చర్యలు తీసుకుంటాం. - **లక్ష్మీ మనోహర్, పంచాయతీ కార్యదర్శి, గోవిందపల్లె.**

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని సుంకులమ్మ గుడి ఎదురుగా ఉన్న వీధిలో సీసీ రోడ్డు అసంపూర్తిగా నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. -**సుబ్బరాయుడు, స్థానికుడు**

✔: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. -**ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో**

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ?: బనగానపల్లి మండల పరిధిలోని కటికవానికుంట గ్రామంలో ప్రధాన రహదారిపై మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. - **రాజు, కటికవానికుంట**

✔: గ్రామంలోని సమస్యను గుర్తించి చర్యలు తీసుకుంటాం. - **నాగరాజు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, బనగానపల్లి.**

కోవెలకుంట్ల గ్రామీణం,న్యూస్‌టుడే: ?: కోవెలకుంట్ల నుంచి బనగానపల్లి ప్రధాన రహదారిలో టీచర్స్ కాలనీ సమీపంలో రహదారిపై మట్టి చేరి ప్రమాదకరంగా వుంది. -**రాజేష్ స్థానికుడు**

✔: పరిశీలించి మట్టిని తొలగించే ఏర్పాట్లు చేస్తాం. - **ప్రకాష్‌నాయుడు.ఈవోఆర్డీ**

రేబిస్ టీకాతో పెంపుడు జంతువులకు రక్షణ

విద్యార్థినులకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఏడీ నాగరాజు

డోన్, న్యూస్‌టుడే: జూనోటిక్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధకశాఖ ఏడీ నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జూనోటిక్ వ్యాధుల పట్ల విద్యార్థినీలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ వ్యాధులు 280 వరకు ఉన్నాయన్నారు. అనంతరం స్థానిక పశువైద్యశాలలో 45 పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధిటీకాలు వేశారు. కార్యక్రమంలో డా.పద్మావతి, డా.గౌసియా, డా.రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: గ్రామాల్లో పెంపుడు జంతువల పట్ల యజమానులు జాగ్రత్త వహించాలని పశు సంవర్ధక శాఖ ఏడీ వరప్రసాద్ సూచించారు. జూనోసిస్ డే సందర్భంగా చాగలమర్రిలోని పశువైద్యశాలలో కుక్కలకు రాబిస్ టీకాలను వేశారు. పెంపుడు జంతువుల ప్రేమికులకు పలు సూచనలిచ్చారు.

ఆళ్లగడ్డ: ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి జంతువులను రక్షించుకునేందుకు రేబిస్ టీకా వేయించుకోవాలని పశు వైద్య ఉప సంచాలకుడు డాక్టర్ ఎం.వై.వరప్రసాద్ సూచించారు. జూనోసిస్ డే సందర్భంగా పట్టణంలోని పశువైద్యశాలలో రేబిస్ టీకా వేయించే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జంతు పరిరక్షణ సమితి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులు, లైవ్ స్టాక్ సహాయకుడు సద్దాం హుస్సేన్ పాల్గొన్నారు.

నాణ్యతకు తిలోదకాలు..

● ప్రభుత్వ వసతి గృహాల్లో నాసిరకం భోజనం
● నిర్వాహకుల తీరుతో విద్యార్థులకు ఇక్కట్లు

సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వం ఆదేశించినా క్షేత్రస్థాయిలో పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉంటున్నాయి. చాలా చోట్ల బాలబాలికలకు అందించే ఆహారంలో నాణ్యత ఉండటం లేదు. వసతి గృహాల్లో సరైన వసతులు లేవు. ఆదివారం 'న్యూస్‌టుడే' పలు వసతి గృహాలను సందర్శించగా నిర్వహణలో పలు లోపాలు బయటపడ్డాయి.
- డోన్‌పట్టణం, సంజామల, న్యూస్‌టుడే:

వసతులు అధ్వానం

డోన్ నియోజకవర్గంలోని కొండపల్లి బాలుర వసతిగృహంలో మొత్తం 179 మంది విద్యార్థులకు కేవలం ఏడుగురు మాత్రమే చికెన్ తో కూడిన భోజనం తిన్నారు. మొత్తం 17 మంది ముఖ ఆధారిత హాజరు వేసినట్లు ట్యూటర్ ఆంజనేయులు చెప్పారు. మిగతా పిల్లలంతా మొహర్రం సందర్భంగా వారి స్వగ్రామాలకు వెళ్లినట్లు తెలిపారు. వసతిగృహంలో మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. విద్యార్థుల గదుల సన్‌షెడ్ పెచ్చులు ఊడిపోయి ఇనుప చువ్వలు బయటపడ్డాయి. బాలికల వసతి గృహంలోనూ ఇదే పరిస్థితి.

సంజామల: భోజనం చేస్తున్న విద్యార్థులు

కమాటే వంటమనిషి

సంజామలలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహంలో వంటమనిషికి బదులు కమాటి భోజనం తయారు చేసి పిల్లలకు వడ్డిస్తున్నారు. భోజనం నాణ్యంగా ఉండటం లేదని విద్యార్థులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం ఒక వంట మనిషి, కమాటి, రాత్రి వాచ్‌మెన్ ఉండాలి. కానీ వంటమనిషి లేడు. ఆదివారం తొలి ఏకాదశితో పాటు మొహర్రం ఉండటంతో 73 మంది విద్యార్థులకుగాను 23 మంది విద్యార్థులు మాత్రమే భోజనం తిన్నారు. వసతి గృహం ప్రహరీ శిథిలమైంది. కాలువలోని మురుగు నీరు వసతి గృహంలోకి రావటంతో పాటు జమ్ము పెరగటంతో విషపురుగులతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

ముగిసిన జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

క్రీడాకారిణికి ప్రశంసపత్రం, జ్ఞాపిక అందజేస్తున్న సుజల

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల నందిపైపుల ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. నంది సంస్థల అధినేత్రి సుజల పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు వంశీధర్ మాట్లాడుతూ.. ఈ పోటీలకు జిల్లా నుంచి సుమారు 300మంది క్రీడాకారులు పాల్గొనట్లు తెలిపారు. జిల్లా అసోసియేషన్ సభ్యులు శేషిరెడ్డి, సంజీవరెడ్డి, డా. జనార్దన్‌రెడ్డి, శిక్షకులు నాగార్జున, చైతన్య పాల్గొన్నారు.

రహదారులపై గుంతలు.. ప్రజలకు అవస్థలు

డోన్ నుంచి యు.కొత్తపల్లెలోకి వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. ఆ మార్గంలో రోడ్డుపై గుంతలు ఏర్పడి రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రాత్రివేళ అదుపుతప్పితే పక్కనే ఉన్న జాతీయరహదారిపై పడి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, డోన్

అరచేతిలో ఆరు ప్రాణాలు

వాహన చోదకులు నిబంధనలను గాలికి వదిలేశారు. పరిమితిని మించి ఒక వాహనంపై ముగ్గురు, నలుగురు చొప్పున ప్రయాణిస్తున్నారు. కొందరైతే ఏకంగా చిన్నపిల్లలతో వెళ్తున్నారు. ఏ మాత్రం పట్టు తప్పిన చిన్నారులకు ప్రమాదం తప్పదు. మండలంలోని దొరపల్లి క్రాస్ వద్ద ఆదివారం ద్విచక్రవాహనంపై ఐదుగురు చిన్నారులు, ఓ వ్యక్తి కలసి వెళుతూ న్యూస్‌టుడేకు చిక్కారు. - న్యూస్‌టుడే, డోన్ నేరవిభాగం

ప్రహరీకి మరమ్మతులు కరవు

పట్టణానికి 5కి.మీ.ల దూరంలో ఆదర్శ పాఠశాల ఉంది. ఆ పాఠశాలలో 500 లకు పైగా విద్యార్థులు ఉన్నారు. పాఠశాల గేటు పక్కన ప్రహరీ కూలిపోయింది. రెండేళ్లు కావస్తున్నా.. మరమ్మతులు చేపట్టేవారే కరవయ్యారు. పాఠశాలకు భద్రత లేకుండా పోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలిన ప్రహరీని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే డోన్‌పట్టణం

రహదారికి ఇరువైపులా కంపచెట్ల తొలగింపు

సంజామల, న్యూస్‌టుడే: మండలంలోని రామభద్రుని పల్లె నుంచి గిద్దలూరు, కానాల మీదుగా వెళ్లే రహదారికి ఇరువైపులా కంపచెట్లు అల్లుకుపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ద్విచక్ర వాహనచోదకుల అవస్థ అంతా ఇంతా కాదు. ఈ విషయమై ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించారు. రహదారికి ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించారు. దీంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పేదల సంక్షేమమే కూటమి ధ్యేయం

అలేబాద్ (ప్యాపిలి), న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెదేపా సీనియర్ నాయకుడు అలేబాద్ పరమేశ్, సర్పంచి హరికుమార్ అన్నారు. ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని అలేబాద్ గ్రామంలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలచంద్రశేఖర్, సంజన్న తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తోందని టీడీపీ నియోజకవర్గ కో-కన్వీనర్ వీఆర్ లక్ష్మిరెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఏడాదిలో చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. పథకాలు అందరికీ అందాయా లేదా అని అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో సర్పంచి బోయ శివశంకర్, తెదేపా నాయకులు వెంకటమాల్లారెడ్డి, పెద్దిరెడ్డి, తలారి ఓబులేసు, ఎంపీటీసీ సభ్యుడు పెద్దన్న పాల్గొన్నారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా నాయకులు మాజీ జడ్పీటీసీ సభ్యుడు యామా గురప్ప, ఉల్లి వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. సుపరిపాలన తొలిఅడుగులో భాగంగా పలు కాలనీల్లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు. అనంతరం కాలనీల్లో పర్యటించి సంక్షేమ పథకాలు, అమలు తీరును వివరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు అబుబకర్ సిద్దిక్, అల్లా బకాస్ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పర్యావరణానికి హాని కలిగించే రంగు విగ్రహాలు స్థానంలో మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించాలని గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గౌరి ఉస్సేన్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని సౌత్‌ఇండియా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణపై సభ్యుల నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. రాఘవరెడ్డి, పుల్లారెడ్డి, గాజుల హరికృష్ణ, నాగరాజు, మధుమోహన్‌రెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ సభ్యులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గురువులతో పూర్వ విద్యార్థులు

సిమెంట్‌నగర్(బేతంచెర్ల), న్యూస్‌టుడే: మండల పరిధిలోని సిమెంట్‌నగర్ గ్రామంలో గల పాణ్యం సిమెంట్ ఉన్నత పాఠశాలలో 2004-05 సంవత్సరం పదో తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయుల యోగ క్షేమలు అడిగి తెలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమ గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, కిరణ్ కుమార్, మహేష్ బాబు, రవికుమార్, నవీన, సురేఖ, మాధూరి, శశిరేఖ, శకుంతల పాల్గొన్నారు.

డోన్ : కూటమి ప్రభుత్వ ఏడాది పాలన కార్పొరేట్లకు వరాలు, పేదలకు శాపాలుగా మారిందని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ విమర్శించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై పార్టీ ముద్రించిన బుక్‌లెట్‌లను ఆయన విడుదల చేశారు.

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల మైదానంలో పూర్వ విద్యార్థులు, ఆటల కోసం మైదానానికి వచ్చిన విద్యార్థులు ఆదివారం ఉదయం శ్రమదానం చేశారు. పూర్వ విద్యార్థులు బుగ్గన నాగభూషణంరెడ్డి, చంద్రారెడ్డి, వార్డు కౌన్సిలర్ ఇబ్రహీంతో పాటు పెద్దసంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొని శ్రమదానం చేశారు.

సంక్షిప్త సమాచారం

బనగానపల్లి గ్రామీణం: ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని జేకేఆర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు బ్రహ్మానందచారి కోరారు. మండల పరిధిలోని పలుకూరు గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో భక్తి, సేవా భావనపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయంలో రూ. 25వేలు విలువ చేసే పాలిష్ బండ వేయించిన దాత హనుమంతును సన్మానించారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పశువుల నుంచి సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడీ వసంత లక్ష్మి సూచించారు. బేతంచెర్ల పశువైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహించారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ పరికరాలు ఇచ్చేందుకు ఈ నెల 8న బనగానపల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వరప్రసాదరావు ఆదివారం తెలిపారు.

బత్తలూరులో కృష్ణ జింక మృతి

బత్తలూరు(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే : ఆళ్లగడ్డ మండలంలోని బత్తలూరు గ్రామ పొలాల్లో కృష్ణ జింక మృతి చెందింది. స్థానికుల సమాచారంతో అటవీశాఖ అధికారులు జింక మృతదేహానికి పశువైద్యాధికారితో శవపరీక్ష నిర్వహించారు. వీధీ కుక్కలు జింకపై దాడి చేయడంతో షాక్‌కు గురై మృత్యువాతపడినట్లు అహోబిలం అటవీశాఖ డీఆర్వో ముర్తుజావలి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జింక కలేబరాన్ని ఖననం చేసినట్లు తెలిపారు.

బహుజనుల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్

డోన్: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని అమలు చేస్తూ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త జి.మద్దులేటి స్వామి అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: దళిత నేత బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక డోన్ క్రాస్‌రోడ్డులో ఉన్న విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కుల సంఘాల నాయకులు మేకల నాగరాజు, రూబెన్, రామసుబ్బయ్య, రవీంద్ర నాయక్‌లు పాల్గొని ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు గురువులే మార్గదర్శకులు

శంకరయ్యగౌడ్ దంపతులను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు మార్గదర్శకులు గురువులేనని మండల విద్యాధికారి-2 రామనరస్సప్ప పేర్కొన్నారు. ప్యాపిలి మండలంలోని చిన్నపూదెళ్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన శంకరయ్యగౌడ్ ఇటీవల పదవీ విరమణ పొందారు. ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు ఎం.వెంకటసుబ్బారెడ్డి అధ్యక్షతన శంకర్‌గౌడ్ దంపతులను సన్మానించారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు ఎనలేనివి


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: శ్యామాప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు ఎనలేనివని డోన్ అసెంబ్లీ కన్వీనర్ సందు వెంకటరమణ తెలిపారు. ముఖర్జీ 125వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక కార్యాలయంలో భాజపా పట్టణ అధ్యక్షుడు బద్రి సుధాకర్, నాయకులతో కలిసి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వెంకటరమణ మాట్లాడుతూ.. ముఖర్జీ భారతదేశంలో రెండు జెండాలు.. రెండు రాజ్యాంగాలను వ్యతిరేకిస్తూ మంత్రిపదవిని తృణప్రాయంగా వదిలేశారన్నారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్రకౌన్సిల్ సభ్యురాలు గాజుల ఉషాలక్ష్మీ, జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్, పట్టణ ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, పట్టణ ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

న్యూస్‌టుడే విభాగం : మొహర్రంను పురస్కరించుకుని మండలాల్లో ఆదివారం పీర్ల ఊరేగింపు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పీర్ల చావిళ్లకు వెళ్లి పీర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కులమతాలకు అతీతంగా మొహర్రంను సాంప్రదాయబద్ధంగా జరుపుకొన్నారు. పీర్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు. పెద్దసంఖ్యలో ప్రజలు తిలకించారు. ఫతేహాల్లో పాల్గొన్న వారికి నిర్వాహకులు చక్కెర చదివింపులు కానుకగా ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

బేతంచెర్లలో కోలాహలంగా..

కోవెలకుంట్లలో..

సంజామలలో..

వెంగళాంపల్లె గ్రామంలో..

వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు

ఆర్.కృష్ణాపురం(ఆళ్లగడ్డ గ్రామీణం), ఉయ్యాలవాడ, డోన్, బనగానపల్లి గ్రామీణం, ఆర్ఎస్ రంగాపురం : ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రసిద్ధ ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. దేవాలయాలలో స్వామి, అమ్మవార్లకు వేద పండితులు పంచామృత అభిషేకం చేసి నూతన వస్త్రాలతో అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. బేతంచెర్ల మండలంలోని ఆర్ ఎస్ రంగాపురం గ్రామంలో ఆదివారం నుంచి నాలుగు నెలల పాటు కార్తీక శుద్ధ ఏకాదశి వరకు యోగ నిద్రలో వెళ్లే క్రమంలో ఆలయంలో శయన భంగిమలో స్వామివారి ఉత్సవ మూర్తిని కొలువుంచి పూజలు నిర్వహించారు.

వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న గ్రామస్థులు

రుక్మిణి, పాండురంగస్వామి

రక్తదానం మహాదానం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : రక్తదాతలు సమాజానికి నిజమైన హితులని డీఎస్పీ కె. ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. పట్టణానికి చెందిన 'ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 65 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేటి సమాజానికి రక్తదాతల ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సాటి మనిషికి తమ వంతు సేవలు అందించాలన్న లక్ష్యంతో ఉండాలన్నారు. రక్తదానం చేసిన వారికి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో 'ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం' అధ్యక్షుడు మహమ్మద్ హుస్సేన్, ప్రజ్ఞ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శివరామిరెడ్డి, నంద్యాల బ్లడ్ సెంటర్ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో డీఎస్పీ

అత్యవసర వేళల్లో అవస్థలే..!

■ మరుగుదొడ్లు లేక అధ్వానంగా పారిశుద్ధ్యం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే : మారుతున్న కాలంతోపాటు గ్రామాలలో జనాభా పెరిగి ఖాళీ స్థలాలు సైతం ఆవాసాలు, దుకాణాలుగా మారుతున్నాయి. రద్దీ ప్రాంతాల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కోవెలకుంట్ల, బనగానపల్లిలో ఈ పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ఆ ప్రాంతాల్లో మరుగుదొడ్ల వసతి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

రద్దీగా ఉండే గ్రామపంచాయతీ కూడలి

శౌచాలయాలు ఏర్పాటు చేయాలి

కోవెలకుంట్ల మండలంలోని అన్ని గ్రామాలలో సుమారు 55వేలకు పైగా జనాభా ఉంది. సంజామల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాల నుంచి పనుల నిమిత్తం ప్రజలు కోవెలకుంట్లకు వస్తుంటారు. ప్రజలు వారి పనుల కోసం రోజుకు సుమారు 3వేల నుంచి 5వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఆ ప్రాంతాల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో జనం ఇబ్బందులకు గురవుతున్నారు. ముదిగేడు మలుపు నుంచి ఎస్ఎల్వీ టాకీసు వరకు జనాభా రద్దీగా ఉంటారు. శుక్రవారం వారం సంత కావడంతో రద్దీ మరింత పెరుగుతోంది. ఐదేళ్ల కిందట గ్రామపంచాయతీ తరపున మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపారు. నార్త్ ఇండియాకు చెందిన నిర్మల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ మరుగుదొడ్ల ఏర్పాటుకు ముందుకొచ్చింది. స్థలాలను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపగా కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా రద్దీ ప్రాంతాల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రద్దీ ప్రాంతాల్లో ఇబ్బందే

బనగానపల్లిలో సుమారు 40వేల జనాభా ఉంది. మండలంలో 40గ్రామాలు ఉండగా సుమారు 1లక్షకు పైగా జనాభా ఉంది. వారి అవసరాల కోసం ప్రతిరోజూ 5వేలమందికి పైగానే బనగానపల్లికి వస్తుంటారు. ప్రధానంగా పెట్రోల్ బంకు, జీఎం టాకీసు, పాత బస్టాండు అవుకు మెట్ట ప్రాంతాల్లో జనం రద్దీగా ఉంటారు. ఆ ప్రదేశంలో మరుగుదొడ్ల వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు.

పల్లె కబుర్లు

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండల పరిధిలోని నందవరంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయాభివృద్ధికి నంద్యాలకు చెందిన రితేష్‌రెడ్డి కుటుంబసభ్యులు రూ.25వేలు విరాళాన్ని ఆలయ అర్చకులకు ఆదివారం అందజేశారు. దాతలు అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అర్చకులు దాతలను సత్కరించి ప్రసాదాలు అందించారు.

అలేబాద్ (ప్యాపిలి), న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెదేపా సీనియర్ నాయకుడు అలేబాద్ పరమేశ్, సర్పంచి హరికుమార్ అన్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని అలేబాద్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.

చింతలచెరువు(చాగలమర్రి), న్యూస్‌టుడే : మండలంలోని చింతలచెరువు గ్రామంలో వెలసిన గంగమ్మ ఆలయంలో గంగమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో భక్తులు పెద్దఎత్తున చేరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డబ్ల్యూగోవిందిన్నె (దొర్నిపాడు), న్యూస్‌టుడే: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సదరు ప్రాంతాల నుంచి వాహనాల ద్వారా పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకొని ముక్కులు తీర్చుకున్నారు.

(c) eenadu

5 గంటలు నిలిచిపోయిన వాహనాలు

ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్సులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడ- సునాబెడ జాతీయ రహదారిపై శనివారం ఐదు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. బహుడా యాత్రలో భాగంగా సిమిలిగుడ గుండిచా మందిరం నుంచి రథం సునాబెడ హాల్ టౌన్‌షిప్ వరకు 6 కిలోమీటర్లు లాగేటప్పుడు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ట్రాఫిక్ జామ్‌లో నాలుగు అంబులెన్స్‌లు సైతం చిక్కుకున్నాయి. సుమారు మూడు కిలోమీటర్ల వరకు వందలాది వాహనాలు నిలిచిపోయాయి. సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఏటా రథయాత్ర, బహుడా యాత్ర సందర్భంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

ఉస్తపల్లిలో ప్రబలిన అతిసారం

ఒకరి మృతి: పది మందికిపైగా అస్వస్థత

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా దిగపొహండి సమితిలో సహదేవ్ టికరపడ పంచాయతీలోని ఉస్తపల్లిలో అతిసారం ప్రబలింది. వ్యాధితో దాస సబర (60) అనే వృద్ధుడు మృతి చెందగా, మరో పది మందికిపైగా బాధితులు ఆదివారం దిగపొహండిలోని ఆరోగ్య కేంద్రంలో చికిత్స కోసం చేరారు. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్థులు డోలీ కట్టి బాధితులు ఒక్కొక్కరిని మోసుకుంటూ గ్రామానికి కొంత దూరం వరకూ మోసుకొచ్చి అంబులెన్స్ ఎక్కించి ఆసుపత్రికి తరలించారు. బాధితుల్లో ఇద్దరి ఆరోగ్యం విషమించడంతో వారిని ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించారు. దీనిపై గంజాం జిల్లా ముఖ్య వైద్యం, ప్రజారోగ్య అధికారి (సీడీఎం, పీహెచ్‌వో) డాక్టర్ సుశాంతకుమార్ నాయక్ సాయంత్రం 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. జిల్లా ర్యాపిడ్ రెస్పాన్స్ బృందం (ఆర్ఆర్‌టీ) ఆదివారం గ్రామానికి వెళ్లి పరిస్థితిని అధ్యయనం చేస్తోందని చెప్పారు. బృందం వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. ఉస్తపల్లి గ్రామంలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు సెలయేరు, చెరువు నీటిని తాగుతున్నట్లు తెలుస్తోంది.

ఓ బాధితుడ్ని డోలీలో మోసుకొంటూ అంబులెన్స్ వద్దకు తీసుకువచ్చిన గ్రామస్థులు

దిగపొహండి ఆరోగ్య కేంద్రంలో ఓ బాధితురాలు

ప్రమాదస్థాయికి దిగువన నదులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మహానది, బ్రాహ్మణి, వైతరణి, సువర్ణరేఖ తదితర నదులు, వాటి ఉపనదులు ప్రమాదస్థాయి దిగువన ప్రవహిస్తున్నాయని జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీరు చంద్రశేఖర్ పాడి ఆదివారం భువనేశ్వర్‌లో విలేకర్లకు చెప్పారు. హిరాకుడ్ రిజర్వాయరు నీరు మహానదిలో చేరినా ఇబ్బందులుండవన్న అంచనా ఉందన్నారు. డెంకనాల్ వద్ద రెంగాలి జలాశయంలో వరదనీరు ప్రవేశించినందున రెండు గేట్లు తెరిచి నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వరద పరిస్థితిపై గట్టి నిఘా ఉంచినట్లు చెప్పారు.

చంద్రశేఖర్ పాడి

వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని పురాతన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం విశేష పూజలు, స్వామివారికి పంచామృతాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానం అర్చకులు దామర్ల శ్రీనివాస్ రమేష్ ఆధ్వర్యంలో వేద పండితులు ఆయా కార్యక్రమాలు నిర్వహించారు. జై జై గోవిందా అన్న నామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. శ్రీభూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి అభిషేక మహోత్సవాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

పశ్చిమ జిల్లాలను అప్రమత్తం చేసిన ఐఎండీ

గోపాలపూర్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో గడచిన మూడు రోజులుగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు కాగా, ఆదివారం బంగాళాఖాతంలో పశ్చిమ బెంగాల్‌లోని గాంగేయ తీరంలో అల్పపీడనం ఏర్పడినట్లు గోపాలపూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) అధికారి ఎస్.కె. మూర్తి సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. దీని ప్రభావం పశ్చిమ జిల్లాలపై ఎక్కువగా ఉంటుందన్నారు. సోమవారం మయూర్‌భంజ్, కేంఝర్, సుందర్‌గఢ్, సంబల్‌పూర్ జిల్లాల్లో అతిభారీ వర్షాలకు అవకాశం ఉన్నందున 'రెడ్' హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఝార్సుగుడ, బరగఢ్, బొలంగిర్, సోన్‌పూర్, బౌద్ధ్, దేవ్‌గఢ్, అనుగుల్, ఢెంకనాల్, ఉత్తరకోస్తాలోని జాజ్‌పూర్, బాలేశ్వర్, భద్రక్, కొంధమాల్, కలహండి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశామన్నారు. కేంద్రపడ, జగత్సింగ్‌పూర్, కటక్, నయాగఢ్, నువాపడ, రాయగడ, కొరాపుట్, నవరంగ్‌పూర్, మల్కాన్‌గిరి జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయన్న అంచనాతో 'ఎల్లో' హెచ్చరికలు జారీ చేశామన్నారు. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు క్రియాశీలకంగా ఉన్నందున ఈ నెల 12 వరకు వర్షాలకు అవకాశం ఉందన్నారు.

గడచిన 24 గంటల్లో వర్షం (సెం.మీ.లలో)	
ఝార్సుగుడలో	31
సంబల్‌పూర్‌లోని బమరాలో	29
సుందర్‌గఢ్‌లో	22
కేంఝర్‌లో	21
అనుగుల్ జిల్లాలో	9
బరగఢ్‌లో	8
మిగతా చోట్ల 6 నుంచి 7 సెంటీమీటర్లు నమోదైంది.	

కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డు

కేంఝర్ జిల్లా తెల్కోయిలో ఆదివారం తెల్లవారు జాము 106 మిల్లీమీటర్ల (భారీ) వర్షం కురిసింది. దీంతో చమంద వద్ద డైవర్షన్ రోడ్ కొట్టుకుపోయింది. తెల్కోయి, జగ్గీహన్‌పూర్ మధ్య రాకపోకలు తెగిపోయాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాపనులు, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులకు ఫిర్యాదు చేశారు. వానలు కురుస్తున్నందున ఈ మార్గంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు చవిచూస్తున్నారు.

-న్యూస్‌టుడే, భువనేశ్వర్

కొట్టుకుపోయిన రహదారి

ఝార్సుగుడ జిల్లాలో వాన బీభత్సం

మూడు సమితులపై తీవ్ర ప్రభావితం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఝార్సుగుడ జిల్లాలో ఆదివారం భారీ వర్షాలు కురిశాయి. 218.44 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో లైకెరా, కిర్మిరా, కొలాబిరా సమితులు ప్రభావితమయ్యాయి. లైకెరా వద్ద హతియా నది నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. చవులీ ముహాల్ వద్ద రోడ్డు కొట్టుకుపోయింది. ఝార్సుగుడ రైల్వే కాలనీ, బెహరామల్, ఇతర లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. జనజీవనం ప్రభావితమైంది. ఝార్సుగుడ పాలనాధికారి అబోలి సునీల్ నర్వాణె విలేకర్లతో మాట్లాడుతూ పరిస్థితి నియంత్రణలో ఉందని, స్వల్ప నష్టాలు వాటిల్లాయన్నారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు జరుగుతాయని ఆమె చెప్పారు.

లైకెరా రోడ్డుపై వరదనీరు

గోడ కూలి అత్తాకోడలు మృతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: నువాపడ జిల్లా పాతపరవెల్లి గ్రామంలో కోళ్లఫారం గోడ కూలి ఆదివారం మధ్యాహ్నం ఇద్దరు మహిళలు మృతిచెందారు. మరో అయిదేళ్ల బాలిక గాయపడింది. మృతులు అత్తా, కోడలు కావడం విశేషం. వీరిద్దరూ పనులు చేస్తున్న సమయంలో భారీ వర్షం వల్ల ప్లాస్టరింగ్ చేయని ఇటుకల గోడ కూలింది. ఇద్దరూ ఘటనా స్థలంలో మృతిచెందారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

గ్రామంలో బిజద ప్రతినిధుల బృందం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: మార్గమధ్యంలో మొరాయించిన 108 అంబులెన్స్‌తో శంకర మహరణా (19) అనే యువకుడి మృతి చెందడానికి కారకులైనవారిపై చర్యలు తీసుకోవాలని బిజద ప్రతినిధుల బృందం డిమాండు చేసింది. ఆదివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో నిజ నిర్ధారణ ప్రతినిధుల బృందం గంజాం జిల్లా కళ్లికోట ఠాణా పరిధిలోని బిరిపూర్ గ్రామంలో పర్యటించింది. మృతుడు శంకర మహరణా కుటుంబ సభ్యుల్ని పరామర్శించిన నేతలు సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. బృందంలో బ్రహ్మపుర మాజీ ఎంపీ చంద్రశేఖర సాహు, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ రమేష్‌చంద్ర ఛ్యపపట్నాయక్, బిక్రం కుమార్ పండా, సూర్యమణి బైద్య, మంజులా స్వాయిన్, సుభాష్ బెహరా, బీఈఎంసీ మేయరు సంఘమిత్ర దొళాయి తదితరులున్నారు. వారు విలేకరులతో మాట్లాడుతూ అంబులెన్స్‌ల మరమ్మతుల గురించి నిర్వాహకులకు సిబ్బంది తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. ఇందులో ప్రభుత్వ బాధ్యత కూడా ఉందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని బిజద నేతలు పేర్కొన్నారు. ఇటీవల గ్రామంలో క్రికెట్ ఆడుతున్న శంకర్ ఉదరానికి పైభాగంలో బంతి బలంగా తగలడంతో అస్వస్థతకు గురయ్యాడు. బల్లుగాం ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్‌లో బ్రహ్మపురలోని ఎమ్కేసీజీ ఆసుపత్రికి ఆయనను తరలిస్తుండగా మార్గమధ్యమంలో కళ్లికోట ఘాటీపై అంబులెన్స్ మరమ్మతుకు గురై మూడు గంటలపాటు నిలిచిపోయింది. అనంతరం ఎమ్కేసీజీ ఆసుపత్రిలో చేర్పించిన మహరణా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బిజద నేతలు

సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.4 లక్షల నష్టపరిహారం

చికిత్సకు ఆసుపత్రికి తరలిస్తుండగా శంకర మహరణా అనే యువకుడు మృతి చెందినట్లు తెలుసుకున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సంతాపం వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి కార్యాలయవర్గాలు శనివారం రాత్రి 'ఎక్స్'లో పేర్కొన్నాయి. బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.4 లక్షలు నష్టపరిహారాన్ని ఆయన ప్రకటించారని అందులో వెల్లడించాయి.

దేవతలు, శక్తులకు స్వామి అధరపాణా

నేడు రథయాత్రలో మరో విశిష్ట వేడుక

గోపాలపూర్, న్యూస్‌టుడే: జగన్నాథ, బలభద్ర, సుభద్రల నందిఘోష్, తాళధ్వజ, దర్పదళన్ రథాల ప్రతిష్ఠ అనంతరం వాటికి దేవతలు, శక్తులు రక్షణగా ఉంటాయని పండితులు చెబుతారు. యాత్ర చివరిలో వాటికి స్వామి తాను చుంబించిన అధరపాణా (పంచామృతం) పంచుతాడు. పురుషోత్తముడు ఎంగిలి చేసిన పంచామృతాన్ని తాగే దేవతలు, శక్తులు ఆనందంతో తమ తమ లోకాలకు చేరుకుంటాయని భక్తుల నమ్మకం.

నిలువెత్తు కుండలతో పాణా

ఆషాఢ శుక్లపక్షమి ద్వాదశి తిథిని పురస్కరించుకుని సోమవారం రాత్రి పూరీలోని శ్రీక్షేత్రం ఎదురుగా రథాలపై అధరపాణా ఉత్సవం జరగనుంది. నిలువెత్తు మట్టికుండల్లో పాలు, జున్ను, కొబ్బరి, పళ్లు, బెల్లం, యాలకులు, పచ్చకర్పూరం తదితర పరిమళ సామగ్రితో పాణా తయారు చేస్తారు. రథాలపై దారు విగ్రహాల అధరాలు తాకే ఎత్తులో మూడేసి కుండల్లో పాణా నింపుతారు. తర్వాత స్వామికి నైవేద్యం అర్పించి ఆ కుండలను పగలగొడతారు. పంచామృతం చెల్లాచెదురుగా పారుతుంది. దీన్ని దేవతలు, శక్తులు సేవిస్తారన్న నమ్మకం భక్తులలో ఉంది. ఈ వేడుక తిలకించడానికి పెద్దసంఖ్యలో భక్తులు వస్తారు.

జగన్నాథుని ఎదురుగా పాణా కుండలు

హిరాకుడ్ నుంచి నీరు విడుదల

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సంబల్‌పూర్ చేరువలోని బుర్లా వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు హిరాకుడ్ జలాశయం నుంచి నీరు మహానదికి విడుదల చేశారు. చీఫ్ ఇంజినీరు సుశీల్‌కుమార్ బెహరా ఆధ్వర్యంలో ఆనవాయితీ ప్రకారం జలాశయం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం 7వ నెంబరు స్విస్‌గేటు తెరిచారు. దశలవారీగా 20 గేట్లు తెరిచారు. సుశీల్ విలేకర్లతో మాట్లాడుతూ హిరాకుడ్‌లో నీటిమట్టం 609.54 అడుగులుగా ఉందన్నారు. ఎగువ నుంచి వరద నీరు చేరుతున్నందున దశలవారీగా 12 గేట్లు తెరిపించి సెకనుకు 2 లక్షల క్యూసెక్కుల నీరు మహానదికి విడుదల చేయాలని నిర్ణయించామన్నారు.

జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

రూ.లక్షలు వ్యయం... నిరుపయోగం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఉద్యాన రైతుల సంక్షేమం కోసం నిర్మిస్తున్న ప్యాక్ హౌస్‌లు నిరుపయోగంగా మారుతున్నాయి. లక్షల రూపాయల రాయితీని కల్పిస్తూ చేపడుతున్న వీటి నిర్మాణాలను గాలికొదిలేస్తున్నారు. దీంతో ఇలాంటి ప్యాక్ హౌస్‌ల వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. పలుచోట్ల నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వివిధ రకాల కూరగాయలు, పండ్ల ఉత్పత్తుల గ్రేడింగ్, ప్యాకింగ్, నిల్వ ఉంచడం తదితర కార్యకలాపాల కోసం వీటిని నిర్మిస్తున్నట్లు ఉద్యానశాఖ వర్గాలు పేర్కొన్నాయి. జిల్లాలోని కొల్నార సమితి ముకుందపూర్ పంచాయతీ కారుబాయి గ్రామంలో రూ.4 లక్షల వ్యయంతో నిర్మించిన ప్యాక్ హౌస్ పరిస్థితిని చిత్రంలో చూడవచ్చు.

ప్యాక్ హౌస్ ఎదుట పెరిగిన పనికిరాని మొక్కలు

నేడు సీఎం వినతుల స్వీకరణ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్ యూనిట్-2 పరిధిలోని సీఎం వినతుల స్వీకరణ కార్యాలయంలో సోమవారం(7న) ముఖ్యమంత్రి మోహన్ చరణ్‌మాఝి, ఇతర శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు ప్రజల ఇబ్బందులు వింటారు. వాటికి పరిష్కారాలు చూపిస్తారని సీఎంవో అధికారవర్గాలు శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపాయి.

అంధకారంలో జాతీయ రహదారి

రహదారిపై వెలగని లైట్లు

జయపురం, న్యూస్‌టుడే: పట్టణంలో క్రిస్టియన్‌పేట నుంచి తేలిగూడ చౌక్ వరకు ఉన్న జాతీయ రహదారి-26 అంధకారంలో మగ్గుతోంది. జాతీయ రహదారి నిర్మాణ శాఖ సోలార్ లైట్లను ఏర్పాటు చేసింది. కొద్ది రోజులుగా పలుచోట్ల లైట్లు మరమ్మతులకు గురవ్వడంతో ఆ ప్రాంతాల్లో చీకట్లు అలుముకుంటున్నాయి. శాఖ తరపున ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' సబ్ కలెక్టర్ సస్యరెడ్డిని అడగ్గా, ఆ శాఖాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జగన్నాథుని కోటి సూర్యప్రభ

'సున్నాభెషా'కు పూరీకి పోటెత్తిన భక్తులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని దివ్య దర్శనానికి పూరీలో భక్తులు పోటెత్తారు. కోటి సూర్యప్రభతో ప్రకాశించిన జగన్నాథుడ్ని తిలకించడానికి అయిదారు కిలోమీటర్లు నడిచి వచ్చారు. ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించింది. నియంత్రణకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. రథయాత్రకు మించి 15 లక్షల మంది వచ్చారని స్వయంగా న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఆదివారం సాయంత్రం విలేకర్లకు చెప్పారు.

పూరీ ఆనందసాగరం

బహుడా యాత్రకు పూరీ వచ్చిన వారంతా తిరుగుముఖం పట్టలేదు. ఆదివారం సెలవు కావడంతో పుణ్యధామంలో మకాం వేశారు. మరోవైపు శనివారం రాత్రి నుంచి భక్తులు పూరీ చేరుకున్నారు. దీంతో ఆదివారం ఉదయం 11 నుంచి ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. శాంతిభద్రతల ఏడీజీ దయాల్ గంగువార్, పూరీ ఎస్పీ పినాక మిశ్ర, ఇతర అధికారుల పర్యవేక్షణలో 50 ప్లటూన్ల జవానులు ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మాలతీ పట్టపూర్, బలియాపండ, చక్రతీర్థ రోడ్, పెంటకోట తదితర ప్రాంతాల్లో వాహనాలు నిలిపివేశారు. దీంతో భక్తులు అయిదారు కిలోమీటర్లు నడక మార్గంలో బొడొదండొకు రాగా సాయంత్రం 5 గంటలకు ఆ ప్రాంతం జనసంద్రాన్ని తలపించింది.

4.30 నుంచి అలంకరణ

4.30 గంటలకు జగన్నాథుని రత్నభాండాగారాన్ని గట్టి బందోబస్తు మధ్య తెరిచారు. సేవాయత్‌లు స్వామి ఆభరణాలు భక్తులకు చూపిస్తూ నందిఘోష్, తాళధ్వజ, దర్పదళన్ రథాలపైకి తీసుకెళ్లారు. అనంతరం పురుషోత్తమ, బలభద్ర, సుభద్రలకు వాటిని అలంకరించారు. ఈ ప్రక్రియ 6.30 గంటలకు ముగిసింది. మంగళహారతి, ఇతర సేవల తర్వాత వేచి చూస్తున్న భక్తులు తనివితీరా స్వామిని చూసి పులకించారు.

స్వామి ఆభరణాలు తీసుకొస్తున్న సేవాయత్‌లు

రాత్రి 10.30 వరకు దర్శనాలు

జైజగన్నాథ్, హరిబోల్ ధ్వనులు, పురుషోత్తమ కీర్తనలు బొడొదండొలో సర్వత్రా మార్మోగాయి. రథాలపై కొలువుదీరిన దివ్యరూపాలను భక్తులు మరోసారి తిలకించి ప్రార్థనలు చేశారు. రాత్రి 10.30 గంటల వరకు సున్నాభెషా నేత్రపర్వం చేసింది. బొడొదండొలో అడుగడుగునా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. శ్రీక్షేత్ర పాలనాధికారి అరవిందపాడి విలేకర్లతో మాట్లాడుతూ స్వామి కృపతో సేవలన్నీ నిర్ణీత వేళల్లో జరిగాయన్నారు. ఎన్నడూ లేనంతగా భక్తులు పూరీ వచ్చారని చెప్పారు.

బలభద్రుడికి ఆభరణాల అలంకరణ

అలంకరణలో జగన్నాథుడు

అడుగు పడదు... వాహనం కదలదు

అధ్వాన రహదారులతో ప్రజల ఇక్కట్లు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కొంధమాల్ జిల్లాలోని మారుమూల, కొండపైనున్న గ్రామాలకు నేటికీ రహదారి సౌకర్యం కలగానే మిగిలింది. జిల్లాలోని ఫిరింగియా సమితిలో సుమరబంధ పంచాయతీలోని గ్రామాలకు పక్కా రోడ్డు లేక ప్రజలు పడుతున్న కష్టాలు అంతా ఇంతా కాదు. వర్షాకాలంలో ఆయా గ్రామాల ప్రజల వెతలు వర్ణనాతీతం. ఈ సమితిలోని కటాపంగ నుంచి డమాంగపదర్ వరకూ రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయమైంది. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా గ్రామాల్లో ఎవరైనా అస్వస్థతకు గురైతే వారిని సుమారు ఆరు కిలోమీటర్ల వరకూ మోసుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. బురద రహదారుల వల్ల ఈ ప్రాంతానికి వాహనాలు తేవడానికి అంబులెన్స్ సిబ్బంది కూడా నిరాకరిస్తున్నారని సుమరబంధ సర్పంచి సుశీల్ కహర్, స్థానిక యువ నాయకులు దేబేశ్వర ద్వీప్, ప్రశాంత్‌లు 'ఈటీవీ భారత్'కు చెప్పారు. కటాపంగ నుంచి డమాంగపదర్ వరకూ రహదారి నిర్మాణానికి రూ. 2021-22 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.4 కోట్లు మంజూరయ్యాయని వారు పేర్కొన్నారు. పనులు చేపట్టిన గుత్తేదారు మట్టి రోడ్డు వేసి, తర్వాత పనులు చేపట్టలేదని, దీంతో వర్షాలు పడితే ఈ రోడ్డుపై ప్రయాణం నరకంగా మారుతోందని వారు పేర్కొన్నారు. ఇటీవల పంచాయతీలోని మురడి గ్రామానికి చెందిన గర్భిణి ఝిమి మల్లిక్ (26) పరిస్థితి విషమించడంతో ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్‌కు ఫోను చేసినా బురదతో నిండిన రోడ్డుపై గ్రామానికి వచ్చేందుకు సిబ్బంది నిరాకరించారని తెలిపారు. దీంతో కర్రలకు మంచాన్ని డోలీగా కట్టి, అందులో ఆరు కి.మీ. అడుగు తీసి అడుగు వేయలేని బురదలో నడుచుకుంటూ డమాంగ్‌పదర్ వద్ద నున్న అంబులెన్స్ వద్దకు తీసుకెళ్లామని వివరించారు. అక్కడి నుంచి గర్భిణిని ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతా

కటాపంగ నుంచి డమాంగపదర్ వరకూ రహదారి నిర్మాణానికి 2021-22 ఆర్థిక సంవత్సరంలో నిధులు మంజూరయ్యాయని, గ్రామీణాభివృద్ధి శాఖ ఈ పనులు చేస్తోందని ఫిరింగియా సమితి అభివృద్ధి అధికారి (బీడీవో) అనూప్ బెహరా 'ఈటీవీ భారత్'కు చెప్పారు. సుమారు అయిదు కిలోమీటర్ల ఈ రహదారిలో కల్వర్టు నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. ఘాటీ రోడ్డులో పలుచోట్ల రహదారులను అనుసంధానించే పనులు ఇంకా జరగలేదని ఆయన తెలిపారు. సమితిలోని నాలుగైదు పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొందని, అందులో సుమరబంధ ఒకటని ఆయన తెలిపారు. ఈ పరిస్థితిపై జిల్లాస్థాయి సమీక్షా సమావేశంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని ఆయన పేర్కొన్నారు.

మంచాన్ని డోలీగా కట్టి గర్భవతిని మోసుకుంటూ వెళ్తున్న గ్రామస్థులు

బురదలో చిక్కుకున్న ఆటోను నెడుతున్న గ్రామస్థుడు

(c) eenadu

కొరాపుట్ కాఫీ రుచి అద్భుతం: ధర్మేంద్ర

సిమిలిగుడ, కొరాపుట్,జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ కాఫీ రుచి, నాణ్యత అద్భుతమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. కొరాపుట్ జిల్లాలో రెండోరోజు పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం జయపురం వెళ్తూ మంత్రి కొరాపుట్ సమీపంలో కాఫీ తోటలు చూశారు. కేంద్ర మంత్రితో రాష్ట్ర మంత్రులు సూర్యవంశీ సూరజ్, నిత్యానంద గోండ, గోకులనంద మల్లిక్, ఎంపీ బలభద్ర, కొరాపుట్, కొట్పాడ్ ఎమ్మెల్యేలు రఘురామ్ మచ్చో, రూప బొత్రా, పాలనాధికారి కీర్తీవాసన్ తదితరులు ఉన్నారు. ● కొరాపుట్ జిల్లాలో పర్యటిస్తున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆదివారం స్థానిక 3వ బెటాలియన్ వద్ద మొక్కలు నాటి ప్రసంగించారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌లో పర్యటించి ఉద్యోగులతో మాట్లాడారు. దేశ రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. ● జయపురం పట్టణంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతుల మీదుగా కేంద్రీయ విద్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. రాష్ట్ర మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి ధర్మేంద్ర తదితరులు

పిటిషనర్లపై బలవంతపు చర్యలు తగదు

రాయగడలో సామాజిక కార్యకర్తల ప్రవేశాల నిషేధంపై హైకోర్టు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: పిటీషనర్లపై బలవంతపు చర్యలకు పాల్పడరాదని హైకోర్టు చెప్పింది. రాయగడలో సామాజిక కార్యకర్తలు రెండు నెలలపాటు ప్రవేశించకుండా జారీ చేసిన నిషేధ ఉత్తర్వులను సవాల్ చేస్తూ వేసిన వ్యాజ్యంపై స్పందిస్తూ ఈమేరకు స్పష్టం చేసింది. నర్మదా బచావో ఉద్యమకారిణి, ప్రముఖ సామాజిక కార్యకర్త మేధాపాట్కర్, ప్రఫుల్లకుమార్ సామంత్రాయ్ తదితర 21 మందికి రాయగడలో రెండు నెలలపాటు ప్రవేశాన్ని నిషేధిస్తూ కలెక్టర్ పరుల్ పట్వారీ జూన్ 4న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆదిత్యకుమార్ మహాపాత్ర్ పరిశీలించి ఈమేరకు తీర్పునిచ్చారు. జులై 28న తదుపరి విచారణ వరకు పిటీషనర్లకు తాత్కాలిక మధ్యంతర రక్షణ కల్పించాలంటూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

హైకోర్టు

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

రాయగడ పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: వర్షాకాలం నేపథ్యంలో కురుస్తున్న వర్షాలకు మలేరియా, డెంగీ, అతిసారం వంటి కాలానుగుణ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పరుల్ పట్వారీ అన్నారు. ఈమేరకు ఆరోగ్య, సమగ్ర గిరిజనాభివృద్ధి, సమితులు, ఇతరత్రా అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యం పనులు సక్రమంగా అమలు చేయాలని, అందరూ దోమతెరలు వినియోగించేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏడీఎం నిహార్‌రంజన్ కొహార్, ఐటీడీఏ పీఏ చంద్రకాంత్ మాఝి తదితరులు పాల్గొన్నారు. ● ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలను పట్టిపీడిస్తున్న మలేరియా, డెంగీ, అతిసారం వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగించాలని రాయగడ సబ్ కలెక్టర్ రమేష్ కుమార జెనా అన్నారు. జిల్లా పాలనాధికారి ఫరుల్ పట్వారి ఆదేశాల మేరకు అదివారం కాశీపూర్ సమితి కేంద్రంలో వైద్య బృందంతో సమావేశం నిర్వహించారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టరు రమేష్ కుమార

అధికారులతో సమావేశమైన ఫరుల్

జిల్లా జూనియర్ బ్యాడ్మింటన్ విజేతలు

బహుమతులతో విన్నర్, రన్నర్ బాలబాలికలు. చిత్రంలో అతిథులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర ఇంజినీరింగ్ స్కూల్ క్రీడామైదానలోని ఇండోర్‌హాల్లో రెండురోజులుగా జరిగిన జిల్లాస్థాయి జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. ఇందులో అండర్-11, 13, 15 కేటగిరీలలో నిర్వహించిన బాలబాలికల సింగిల్స్ తుదిపోరులో శ్రియాన్ సువార్, తేజస్ జెనా, సాకేత్ పట్నాయక్, అర్పిస పండా విజేతలుగా నిలిచారు. రన్నర్‌లుగా బినిత్‌కుమార్, రైకా, ఆయుష్మాన్ సెఠి, దాసు సాయి హేమంత్, ప్రసిద్ధి ప్రియ నిలిచారు. మాజీ ఎమ్మెల్యే బిక్రంకుమార్ పండా, కార్పొరేటరు మలయ బిశోయి, దుర్గాకుమార్ లాయక్‌లు విన్నర్, రన్నర్ బాలలకు బహుమతులందజేశారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో అనిమేష్ కుజుర్ సత్తా

అనిమేష్ కుజుర్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: గ్రీస్‌లో ఈ నెల ఒకటి నుంచి 5వ తేదీ వరకు జరిగిన డ్రోమియ అంతర్జాతీయ స్ప్రింట్స్, రిలే పోటీల్లో రాష్ట్ర అథ్లెట్ అనిమేష్ కుజుర్ సత్తా చాటారు. పోటీల్లో ఒడిశా రిలయన్స్ ఫౌండేషన్ అథ్లెటిక్స్ హెచ్‌పీసీ కేంద్రానికి చెందిన అనిమేష్ 100 మీటర్ల పరుగులో మొదటిస్థానంలో నిలిచి కొత్త రికార్డు నెలకొల్పారు. రిలే రేస్‌లో రెండోస్థానంలో నిలిచాడు. రాష్ట్ర క్రీడాశాఖ ఆదివారం ఆయా వివరాలను 'ఎక్స్' వేదికగా పోస్టు చేస్తూ విజేత అనిమేష్‌కు అభినందనలు తెలిపింది.

అవిభక్త కొరాపుట్‌లో అపురూప అందాలు...

ప్రకృతి అందాలకు నెలవు అయిన అవిభక్త కొరాపుట్ జిల్లాలో వర్షాలు కూడా అపురూప అందాలను తెచ్చిపెడుతున్నాయి. చుట్టూ పచ్చని కొండల నడుమ బిర బిర పరుగులు తీస్తున్న మత్స్యగెడ్డ ప్రకృతి ప్రేమికులను అమితంగా ఆకట్టుకుంటోంది. దీంతో పర్యాటకులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఈ ప్రదేశాన్ని సందర్శిస్తున్నారు.

– న్యూస్‌టుడే,మాచ్‌ఖండ్

ఆభరణాలు ధరించి మెరిసిన జగన్నాథుడు

న్యూస్‌టుడే బృందం: ఏకాదశి సందర్భంగా ఆదివారం సున్నాబెషా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా రథంపై ఉన్న దేవతా మూర్తులకు బంగారు ఆభరణాలతో అలంకరించారు. ప్రత్యేకంగా పూజలు జరిపించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలుచోట్ల వర్షం కురిసినా భక్తుల రద్దీ తగ్గలేదు. ఆలయాల ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

పర్లాఖెముండిలో బంగారు అలంకరణలో జగన్నాథుడు

గుణుపురం జగన్నాథ ఆలయంలో సహస్రనామాలు చదువుతున్న మహిళలు

రాయగడలో బంగారు ఆభరణాలతో దేవతామూర్తులు

కొరాపుట్‌లో అలంకరణలో జగన్నాథుడు

పర్లాఖెముండిలో రథంపై పూజలు అందుకుంటున్న జగన్నాథ స్వామి

గోపాల్‌పూర్‌లో ముగ్గురుమూర్తుల సున్నాభెషా

గ్రంథాలయం ప్రారంభం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తన ఎంపీ ల్యాడ్ నిధులు రూ.46 లక్షల వ్యయంతో భువనేశ్వర్ పరిధిలోని బెగునియాలో నిర్మాణమైన గ్రంథాలయ భవనాన్ని ఆదివారం భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి ప్రారంభించారు. కార్యక్రమంలో ఖుర్దా ఎమ్మెల్యే ప్రశాంత్ జగ్‌దేవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. గ్రంథాలయానికి పుస్తకాలు, ఇతర సామగ్రిని సాంస్కృతిక, సమాచార, పౌరసంబంధాల శాఖ కేటాయిస్తున్నట్లు ఎంపీ అపరాజిత తెలిపారు.

భవనం ప్రారంభిస్తున్న భువనేశ్వర్ ఎంపీ

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

పుట్టగొడుగులు తిన్న పదహారు మందికి అస్వస్థత

రాయగడ పట్టణం, నవరంగపూర్, న్యూస్‌టుడే: కాశీపూర్ సమితి టికరపొడ గ్రామానికి చెందిన పదిమంది ఆదివారం రాత్రి అటవీ పుట్టగొడుగులను కూర వండుకొని తిన్నారు. ఆ తరువాత వారికి వాంతులు, విరోచనాలు కావడంతో అస్వస్థతకు గురయ్యారు. బాధితులను ఒషాపొడలో ఆసుపత్రిలో చికిత్స అందించారు. బాధితుల్లో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు.

● నవరంగపూర్ జిల్లా రాయ్‌ఘర్ సమితి గంజపరా పంచాయతీ మారంగపల్లి గ్రామంలో పుట్టగొడుగులు వండుకొని తిని ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. వారంతా రెండు కుటుంబాలకు చెందిన వారిగా గుర్తించారు. ఆదివారం శివలాల్‌గండ్, బుదురామ్ గండ్ అడవికి వెళ్లి పుట్టగొడుగు సేకరించి ఇంటికి తీసుకొచ్చి వండి, తినగానే కుటుంబీకులు వాంతులు చేసుకున్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారి పరిస్థితి కుదుటపడిందని వైద్యులు తెలిపారు.

మందిరంలో చోరీ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా రంభ ఠాణా పరిధిలోని 16వ నెంబరు జాతీయ రహదారిపై సన్నా ఘాటీ సమీపాన రహదారి పక్కన నిర్మానుష్య ప్రాంతంలో ఉన్న డాలిఖాయి అమ్మవారి మందిరంలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు మందిరం వద్దకు చేరుకుని శాస్త్రీయ బృందంతో ఆధారాలు సేకరించారు. మందిరంలో అమర్చిన సీసీటీవీ కెమెరాల్లో దొంగతనం చేస్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. పోలీసులు ఆ ఫుటేజీలు సేకరించి, దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మందిరంలోకి ప్రవేశించిన కొందరు దొంగలు, ఆవరణలో ఉన్న పూజారిని నిర్బంధించారు. అమ్మవారికి అలంకరించిన ఆభరణాలతోపాటు ఒక హుండీలో భక్తులు కానుకలుగా వేసిన సొమ్ము తదితరాలు పట్టుకుపోయారు.

సీసీటీవీ కెమెరాకు చిక్కిన దొంగలు

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దిలీప్‌ఘోష్

శ్యామాప్రసాద్ ముఖర్జీ విగ్రహావిష్కరణ

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ జైహింద్‌నగర్ ధోబీఘాట్ ప్రాంతంలో ఆదివారం జనసంఘ్ స్థాపకుడు డా॥శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని నిర్మించిన ఆయన విగ్రహాన్ని మాజీ ఎంపీ దిలీప్‌ఘోష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామప్రసాద్ ముఖర్జీ జీవితం ఆయన ఆశయాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పలువురు భాజపా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

వైద్యురాలు కన్నుమూత

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా డాబుగావ్ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డా. దీప్తి విశాఖపట్నంలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందారు. వైద్యురాలు **దీప్తిమయి పట్నాయక్** (28) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 1న మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం వెళ్లారు. ఆమె మృతితో సమితిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమె సేవలు మరువలేనివని స్థానికులు వాపోతున్నారు.

ధర్మపారాయణి కన్నుమూత

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం బర్నిపుట్ ప్రాంతానికి చెందిన ధర్మపారాయణి సురేఖమిశ్ర(88) శనివారం రాత్రి కన్నుమూశారు. ఆరోగ్యం క్షీణించి గత వారం రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచినట్లు వైద్యులు ప్రకటించారు. ఆదివారం ఉదయం చంపకుపులి శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

భక్తునికి గాయాలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: సున్నాభెషా తిలకించడానికి పూరీ వచ్చిన భక్తుడొకరు ఆదివారం సాయంత్రం రాధావల్లభ మఠం పైకప్పు ఎక్కుతూ జారిపడి గాయపడ్డాడు. ఆయనను వెంటనే ఆసుపత్రిలో చేర్పించారు.

సామూహికంగా సత్యనారాయణ స్వామి పూజలు

పూజల్లో పాల్గొన్న స్థానికులు

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం పవిత్ర ఏకాదశి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు సురేష్‌కుమార్ శర్మ ఈపూజలు చేయించారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంలోని కెవిటి వీధిలో ప్రసన్న వేంకటేశ్వర మందిరంలో స్వామివారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా విశేష అలంకరణలో శ్రీ ప్రసన్న వెంకటరమణుడు భక్తులకు దర్శనమిచ్చారు. పురోహితులు రాజగోపాలాచారి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

ప్రపంచ పోలీసు క్రీడల్లో రాష్ట్ర పోలీసులకు పతకాలు

పసిడిపతకంతో అశోక్‌దండసేన (మధ్యలో). చిత్రంలో ఇతర విజేతలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బర్మింగ్‌హాంలో జరిగిన ప్రపంచ పోలీసు, అగ్నిమాపక క్రీడల్లో రాష్ట్ర పోలీసులు సత్తా చాటి పతకాలు సాధించారు. పోటీల్లో అథ్లెటిక్స్ పురుషుల విభాగంలో నిర్వహించిన 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ అంశంలో అశోక్‌దండసేన మొదటిస్థానంలో నిలిచి పసిడి పతకం గెలుచుకున్నారు. మహిళా విభాగం 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో సుశ్మిత తిగ్గ మొదటిస్థానం పొంది పసిడి పతకం కైవసం చేసుకున్నారు. 4x100 మీటర్ల రిలేలో సుశ్మిత తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకం గెలుచుకున్నారు. కరాటేలో రితేష్ రాయ్ పసిడి పతకం గెలుచుకోగా, అభిషేక్ పట్నాయక్ కాంస్య పతకం చేజిక్కించుకున్నాడు.

పసిడి పతకంతో సుశ్మిత తిగ్గ

బంగారు మెడల్‌తో రితేష్ రాయ్

కాంస్యంతో అభిషేక్ పట్నాయక్

కోతకు గురైన చంద్రపూర్ బిజపూర్ ప్రధాన రోడ్డు

జంఝావతికి వరదనీరు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు ప్రధాన నదులైన నాగావళి, జంఝావతిలోపాటు ఉపనదుల్లో వరదనీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతంలో జోరుగా వర్షాలు పడుతున్నాయి. రాయగడ వద్ద జంఝావతి నది పొంగి ప్రవహిస్తోంది. దాంతో రాయగడ సమితిలో లోతట్టు ప్రాంతాల ప్రజలను జిల్లా యంత్రాంగం అప్రమత్తం చేసింది. నాగావళిలో పెరుగుతున్న నీటిమట్టంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని పాలనాధికారి పరుల్ పట్వారి అదేశించారు. కాశీపూర్ సమితిలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. చంద్రపూర్ నుంచి బిజపూర్‌కి వెళ్లే ప్రధాన రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది.

కార్మికులంతా ఐక్యంగా ఉండాలి

గుణుపురం, న్యూస్‌టుడే: జిల్లాలో కార్మిక శక్తి అంతా ఐక్యంగా ఉండాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు తిరుపతి గమాంగ్ అన్నారు. ఆదివారం ఉదయం గుణుపురం మోటార్ వర్కర్స్ సంఘం కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ నెల 9వ తేదీన దేశం వ్యాప్తంగా జరగనున్న సమ్మెకు అందరూ సహకరించాలని గమాంగ్ విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్మిక సంఘాలు, శ్రామికులు పాల్గొనాలని కోరారు.

గుణుపురం మోటార్ వర్కర్స్ కార్యాలయంలో జరిగిన సభలో వర్కర్లు, నాయకులు తిరుపతి గమాంగ్

గాంధీ విగ్రహం విరగ్గొట్టిన యువకుడి అరెస్టు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ పట్టణంలో గాంధీచౌక్ వద్ద ఉన్న గాంధీ విగ్రహాన్ని విరగ్గొట్టిన కేసులో పోలీసులు యువకుడిని అరెస్టు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత మున్నాత్రిపాఠి విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని కాంగ్రెస్ శ్రేణులతో ఆందోళన చేశారు. బట్టశాలగూడ ప్రాంతానికి చెందిన చందన్‌దాస్ శనివారం సాయంత్రం మద్యం మత్తులో గాంధీ విగ్రహం వద్ద దుర్భాషలాడుతూ, రాయితో విగ్రహాన్ని విరగ్గొట్టాడు. నేతలు ఆందోళన చేయడంతో సబ్ కలెక్టర్ ప్రకాష్ మిశ్ర, తహసీల్దార్ కైలాస్ చంద్రత్రిపాఠి, ఐఐసీ సంబిత్ బెహరా ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన కారులను నచ్చజెప్పి నిందితుడ్ని అరెస్టు చేశారు. విరిగిన విగ్రహం స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

గాంధీ చౌక్ వద్ద ఆందోళన చేస్తున్న మున్నా త్రిపాఠి, కాంగ్రెస్ నేతలు

బ్రహ్మపుర ఎంపీ ప్రదీప్ పాణిగ్రహి, చికిటి ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన్ సామంత్రాయ్‌లపై పూలవర్షం కురిపిస్తూ స్వాగతిస్తున్న ప్రజలు

బ్రహ్మపుర ఎంపీ, చికిటి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా చికిటి అసెంబ్లీ నియోజకవర్గంలో శనివారం వివిధ అభివృద్ధి పథకాల ప్రారంభోత్సవాలు జరిగాయి. బ్రహ్మపుర ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రహి, చికిటి ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన్‌సామంత్రాయ్ పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో వారికి ప్రజలు ఘన స్వాగతం పలికి పూలు జల్లారు. సుర్లా, సుమండి, కోటిలింగి, సురంగిలలో కొత్తగా నిర్మాణమైన ఆరోగ్య కేంద్ర భవనాలను ఎంపీ పాణిగ్రహి, ఎమ్మెల్యే ధ్యాన్‌సామంత్రాయ్ ప్రారంభించారు. చికిటి సమితి ఆవరణలో సుభద్రా శక్తి కేంద్రం తదితరాలు వారు ప్రారంభోత్సవం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మీనా ధ్యాన్‌సామంత్రాయ్, వై.సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలుగా మీనాక్షి

మీనాక్షి వాహినిపతి

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం ఎమ్మెల్యే తారాప్రసాద్ వాహినిపతి భార్య మీనాక్షి వాహినిపతిని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా నియమిస్తున్నట్లు ఏఐసీసీ కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నేతలు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

EENADU Classifieds

FINANCIAL SERVICES

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్సియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

JOBS

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డులు కావలెను. అర్హత: 10th, హిందీ మాట్లాడాలి, జీ18 వేలు+రూమ్, విజయనగరం జిల్లా గరివిడి ఫెకర్ కంపెనీలో డ్యూటీ. Ct. RSR ✆ 7702959468, 8790411889.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిముల‌తో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకులు అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్ లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రశాంతంగా హోంగార్డుల ఉద్యోగ పరీక్ష

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పోలీసు జిల్లాలో హోంగార్డుల నియామకం కోసం ఆదివారం రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఎనిమిది కేంద్రాల్లో ఇవి ఏర్పాటయ్యాయని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు జిల్లాలోని పన్నెండు పోలీసు స్టేషన్ల పరిధుల్లో 105 మంది నియామకానికి ప్రకటన ఇచ్చామని, 4,097 దరఖాస్తులు అందాయని తెలిపారు. రాత పరీక్షలకు (తొలి దశ) 3,428 అభ్యర్థులు హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు.

పరీక్ష రాస్తున్న అభ్యర్థులు. పర్యవేక్షిస్తున్న ఎస్పీ శరవణ వివేక్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

ఎమ్మెల్యే పవిత్రకు వినతిపత్రం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

అన్నదాతలను ప్రోత్సహించాలి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా వ్యవసాయానికి పుట్టినిల్లు అని, ఇక్కడ రైతులకు ఈ ఖరీఫ్ సీజన్ కోసం రైతులను ప్రోత్సహించాలని లోక్‌వికాస్ మంచ్ డిమాండ్ చేసింది. ఈమేరకు ఆదివారం లక్ష్మీపూర్‌లో ఎమ్మెల్యే పవిత్ర శాంతాను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రైతులను ప్రోత్సహించి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసినట్లు కృష్ణకిలో తెలిపారు. బ్లాక్ ప్రతినిధులు రమియల్ కులదీప్, నర్సింగ్ ముకునా పాల్గొన్నారు.

సీఎం మోహన్‌ను కలిసిన అనిల్

ప్రముఖ రచయిత, చరిత్ర పరిశోధకుడు, కళింగ హెరిటేజ్ ప్రిజర్వేషన్ అధ్యక్షుడు అనిల్‌దే శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవాభవన్‌లో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇద్దరూ కొద్దిసేపు ముచ్చటించుకున్నారు.

– న్యూస్‌టుడే, భువనేశ్వర్

(c) eenadu

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

పలాస, న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో ఆధ్యాత్మికతో నిండుకుంది. ఆదివారం తొలి ఏకాదశి నాడు తెల్లవారుజాము నుంచే మహిళలు విష్ణు దేవాలయాలకు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. పలాస వెంకటేశ్వరాలయం, కాపువీధి, కాశీబుగ్గలో పూజారివీధిలో విష్ణు, శ్రీనివాసనగర్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయాలు కిటకిటలాడాయి.

పలాస వెంకటేశ్వరాలయంలో తొలి ఏకాదశి పూజల్లో పాల్గొన్న భక్తులు

వంతెన.. నిర్వహణ ఇంతేనా..?

ఆంధ్రా- ఒడిశా ప్రధాన రహదారిలో మెళియాపుట్టి మహేంద్రతనయ వంతెనపై పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. నిర్వహణ లోపంతో ఈ పరిస్థితి నెలకొందని ప్రయాణికులు వాపోతున్నారు. కొన్ని నెలలుగా పరిస్థితి ఇలాగే ఉన్నా. పట్టించుకునే వారే లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ర.భ.శాఖ డీఈ సాగర్ చెప్పారు. – న్యూస్‌టుడే, మెళియాపుట్టి

వేంకటేశ్వర కల్యాణం

గరుగుబిల్లి, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర తిరుపతిగా ప్రసిద్ధి చెందిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామ స్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి పూజలు ఆదివారం వేడుకగా నిర్వహించారు. అర్చకులు వి.వి. అప్పలాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామివారి కల్యాణం నిర్వహించారు.

తాళిబొట్టు చూపుతున్న అర్చకులు

తోటపల్లి జలాలతో మూడు జిల్లాలు సస్యశ్యామలం

మంత్రి సంధ్యారాణి

నీటికి పూజలు చేస్తున్న మంత్రి, ప్రభుత్వ విప్ తదితరులు

పార్వతీపురం, గరుగుబిల్లి, న్యూస్‌టుడే: జల వనరులను మెరుగుపర్చి వ్యవసాయానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు. ఆదివారం గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి జలాశయం కుడి కాలువ నుంచి సాగు జలాలను ప్రభుత్వ విప్ జగదీశ్వరితో కలిసి విడుదల చేశారు. ఈ కాలువ ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యంలోని 84 వేల ఎకరాలకు నీరు వెళ్తుందన్నారు. అనంతరం రైతులతో సమావేశమై మాట్లాడారు. జిల్లాలో అన్ని జలాశయాల పరిధిలో నిర్వహణ పనుల కోసం లస్కర్లను నియమించాల్సి ఉందన్నారు. మొత్తం ఎంతమంది అవసరమో తెలియజేస్తే చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో ఒడిశాతో వివాదంలో ఉన్న జంఝావతి, కొరియా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. త్వరలో ఒడిశా ముఖ్యమంత్రితో చర్చించే అవకాశాలు ఉన్నాయన్నారు. పూర్ణపాడు-లాబేసు వంతెన పనుల పూర్తికి చర్యలు చేపడతామని మంత్రి పేర్కొన్నారు.

గుక్కెడు నీటికి..

గట్టూ పుట్టా దాటాల్సిందే

ఆ గిరిజన గ్రామస్థుల దాహం తీరాలంటే బహుదూరం ప్రయాణించాల్సిందే. గుక్కెడు నీటి కోసం గట్టూ పుట్టా దాటాల్సిందే. మెళియాపుట్టి మండలం పెద్దకేదారి ప్రజల పరిస్థితి ఇది. ఇక్కడ 27 కుటుంబాలు, సుమారు 100 మంది ఉంటున్నారు. స్థానికంగా ఉన్న బోర్ల నుంచి అరకొరగా నీరు వస్తుండటంతో గ్రామానికి సుదూరంలో ఉన్న బావే శరణ్యం. రహదారులు సైతం అధ్వానంగా మారడంతో అవస్థలు పడుతున్నారు. చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో నరసింహప్రసాద్ పండా పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, మెళియాపుట్టి

పోషక వనం.. ఆరోగ్యకరం!

అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో కూరగాయల పంటలు

న్యూస్‌టుడే, జి.సిగడాం, పొందూరు

ఎచ్చెర్ల కేంద్రంలో సాగవుతున్న పంటలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తూ చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి సాధిస్తున్నా ఐసీడీఎస్ అధికారులు మరో అడుగు ముందుకు వేసి కేంద్రాల వద్ద పోషక వనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. తొలివిడతలో సొంత భవనాలున్న కేంద్రాలను ఎంపిక చేసి వనాలను పెంచుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో తాజాగా కూరగాయాల పెంపకం ప్రారంభించారు. రక్తహీనత, అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు పోషక వనాలు ఉపయోగపడతాయని అధికారులు చెబుతున్నారు.

ఎచ్చెర్ల, రణస్థలం ఐసీడీఎస్‌ల పరిధిలో..

నియోజకవర్గంలో ఎచ్చెర్ల, రణస్థలం ఐసీడీఎస్‌ల పరిధిలో 210 అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనాల్లో నడుస్తున్నాయి. తొలి దశలో గతేడాది డిసెంబరులో కిచెన్ గార్డెన్ల పేరుతో పోషణ్ వాటిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రాజెక్టు పరిధిలో జి.సిగడాంలో గొబ్బూరు, ఎచ్చెర్లలో ఎచ్చెర్ల, ఎం.రుప్పపేట, లావేరులో లావేరు-3, గోవిందపురం, బొంతుపేట, రణస్థలంలో 14 కేంద్రాలకు ఎంపిక చేసి అక్కడే ఆకుకూరలు, వివిధ రకాల కూరగాయాలు పెంచుతున్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గం వివరాలు

మండలం	కేంద్రాలు	ఎంపికైనవి
జి.సిగడాం	73	1
ఎచ్చెర్ల	106	2
లావేరు	108	3
రణస్థలం	126	14

నిర్వహణకు రూ.10 వేలు

ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక వనాలకు రూ. 10 వేలు అందిస్తున్నారు. ఈ నగదుతో విత్తనాలు కొనుగోలు చేయడంతోపాటు ఇతర ఖర్చులతో ఆకు కూరలు, కూరగాయాలు పండాల్సి ఉంది. మునగ, కరివేపాకు, మెంతి, పాలకూర, తోటకూర వంటి పంటలను పండిస్తూ పిల్లలకు చక్కటి పౌష్టికాహారం అందిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..

పోషక వనాల ఏర్పాటుతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తున్నాం. కేంద్రాల పరిధిలో కూరగాయలు పెంచి, పోషక విలువలపై అవగాహన కల్పిస్తున్నాం. – పాపినాయుడు, రూపలత, ఐసీడీఎస్ సీడీపీవోలు ఎచ్చెర్ల, రణస్థలం

శ్రీరంగనాథుడిగా దర్శనమిచ్చిన జగన్నాథుడు

సోంపేట, పలాస, న్యూస్‌టుడే: ఆలయానికి చేరుకున్న జగన్నాథ, బలభద్ర, సుభద్రలకు ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోంపేటలో నాలుగు రోజులపాటు ఆలయంలో నిర్వహించే దివ్య అవతారాల్లో భాగంగా శ్రీరంగనాథుడిగా స్వామిని అలంకరించి పూజలు నిర్వహించారు. ★ పలాసలో రథయాత్ర పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమైన జగన్నాథుడు ఆలయ ప్రవేశం కోసం ఆరుబయటే వేచి ఉంచారు. ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రవేశం లేకపోవడంతో పురోహితులు రథంపైనే జగన్నాథ, బలభద్ర, సుభద్ర విగ్రహాలను ఉంచి పూజలు చేశారు. ఆలయంలోకి సోమవారం సాయంత్రం 6 గంటలకు ప్రవేశం ఉంటుందని అంతవరకు రథంపైనే కొలువు తీరుతారని తెలిపారు.

పలాస రైల్వేకాలనీలో సీతారామాలయం ముందు ఉన్న జగన్నాథ, బలభద్ర, సుభద్రలు

● శ్రీకాకుళం నగరం పీఎన్‌కాలనీకి చెందిన ఓ విశ్రాంత రెవెన్యూ ఉద్యోగికి కుక్కలు, పిల్లుల పెంపకం, సంరక్షణ అంటే మక్కువ. వాటిపై ఎంతో ఇష్టంతో అవసరమైనవి తీసుకొచ్చేవారు. అవన్నీ కలిపి 15 వరకు ఉండేవి. కాకపోతే నిర్దేశ సమయంలో వాటికి టీకాలు వేయించడంలో ఏమరుపాటుగా ఉండేవారు. అదే ఆయన పాలిట శాపంగా మారింది. వ్యాధుల బారిన పడి చివరి రోజుల్లో చాలా ఇబ్బంది పడాల్సి వచ్చింది.

● టెక్కలికి చెందిన ఓ వ్యాపారి ఇంట్లోని కుక్క విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో దాని కాలికి ఎలర్జీ వచ్చింది. దాన్ని గమనించకుండానే ఆయన రెండో కుమారుడు ఆ కుక్కతో సైతం ఆడుకునేవాడు. కొన్నాళ్లకు ఆ అబ్బాయికి సైతం కాలిపై ఎలర్జీ రావడంతో వైద్యుడిని సంప్రదించారు. కుక్కకు వచ్చిన ఎలర్జీని నిర్లక్ష్యం చేయడంతోనే ఇలా జరిగిందని చెప్పారు.

వాత్సల్యం పెంచుకోండి.. వ్యాధుల్ని కాదు..

న్యూస్‌టుడే, పాతశ్రీకాకుళం, పలాస

..మనుషులు, జంతువుల మధ్య ఒకసారి అనుబంధం ఏర్పడితే అది చాలా కాలం కొనసాగుతుంది. మూగజీవాలు కనబరిచే ఆత్మీయత, విశ్వాసం ఎంతో ఉల్లాసాన్నిస్తుంటాయి. అందుకే చాలా ఇళ్లలో వాటిని కుటుంబ సభ్యులతో సమానంగా చూసుకుంటారు. ఆహారం తినిపించడం, పక్కనే పడుకోబెట్టుకోవడం వంటివి చేస్తుంటారు. ఇటీవల పెంపుడు జంతువులకు పుట్టిన రోజు వేడుకలు సైతం జరుపుతున్నారంటే ఎంతలా అనుబంధం పెనవేసుకుందో అర్థం చేసుకోవచ్చు. ఈ బంధం వెనక ప్రాణాలను హరించే అంటువ్యాధుల ప్రమాదం పొంచి ఉందనే విషయాన్ని గ్రహించక ఎంతో మంది లేనిపోని వ్యాధులబారిన పడి ఇబ్బందులు పడుతున్నారు.

నిర్లక్ష్యంతో కలిగే నష్టాలివి..

- పెంపుడు జంతువులను అతిగా దగ్గరకు తీసుకోవడంతో గజ్జి, తామర వంటి చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది.
- కుక్కల్లో రోగనిరోధక శక్తి పెరిగినప్పుడు వాటిలోని రేబిస్ వైరస్ మెదడుకు చేరి, సమీపంలోని వారిని కరిచేందుకు ప్రయత్నిస్తుంటాయి. క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయిస్తే వైరస్ తీవ్రత తగ్గిపోతుంది.
- పెంపుడు జంతువు సలైవా(నోటి నీరు) ద్వారానే రేబిస్ వ్యాధి సంక్రమిస్తుంది. పొరపాటున కూడా దాన్ని తాకకూడదు. అది సోకితే ప్రాణాలకే ముప్పు వాటిల్లొచ్చు.
- పశు, పెంపుడు జంతువుల వైద్యులు గ్లౌజులు వేసుకోకుండా చికిత్స చేయడం, తర్వాత అవే చేతులతో మరో దానికి చికిత్స చేయడంతో బ్రూసిల్లోసిస్ అనే వ్యాధి సోకుతుంది. దీని ఫలితంగా పెంపుడు జంతువులతో దగ్గరగా ఉండేవారి పిల్లలు పుట్టే అవకాశాలు బాగా తగ్గిపోతాయి. కొన్నిసార్లు మెదడు వాపు, గాలికుంటు, క్షయ, ఆంత్రాక్స్, గ్లాండర్స్ వ్యాధులు ప్రబలుతుంటాయి.

- జిల్లాలో 35 వేల వరకు పెంపుడు శునకాలు ఉన్నాయని అంచనా.
- 50 గ్రామీణ, 90 పశువైద్య కేంద్రాల్లో వ్యాక్సిన్ ఉచితంగా వేస్తారు.
- శ్రీకాకుళంలోని అంబేడ్కర్ కూడలి సమీపంలోని జిల్లా పశు ఆసుపత్రిలో వ్యాక్సిన్ వేస్తారు.
- టీకాలు అన్ని పశువైద్య కేంద్రాల్లోనూ వేస్తారు.

అవగాహనకో రోజు

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారు. వాటి నివారణతో పాటు అవగాహన కల్పించేందుకే ఏటా కార్యక్రమం నిర్వహిస్తుంటారు. జిల్లాలో పెంపుడు జంతువులకు ఏడాది పొడవునా వైద్యసేవలు అందిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలి..

పెంపుడు జంతువులను పెంచేవారు వాటికి తరచూ డీవార్మింగ్ మాత్రలు వేస్తుండాలి. ముందస్తుగానే రేబిస్ వ్యాక్సిన్ వేయిస్తే అన్నిరకాల వ్యాధుల సంక్రమణను నియంత్రించవచ్చు. పుట్టాక 40 రోజులు, తర్వాత 90 రోజులకు, అనంతరం ఏడాదికోసారి తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయిస్తుండాలి. అన్నింటికీ మించి రోజూ స్నానం చేయించడం, మంచి ఆహారం పెట్టడంతో పాటు ఇతర జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. వ్యాక్సిన్ వేయించిన జంతువులు కరిచినా, వాటి ఉమ్మి మనిషి చర్మం మీద పడినా ఎలాంటి ఇబ్బంది ఉండదు. – కంచరాన రాజగోపాలరావు, సంయుక్త సంచాలకుడు, పశుసంవర్ధక శాఖ, శ్రీకాకుళం

వంశధారలో ఇసుకాసురుల రాజ్యం..!

● రేవుల్లో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు ● చోద్యం చూస్తున్న యంత్రాంగం

న్యూస్‌టుడే, కొత్తూరు, హిరమండలం, ఎల్‌ఎన్‌పేట

వంశధార నదిలో ఇసుకాసురులు బరితెగిస్తున్నారు. ఇష్టానుసారం తవ్వకాలతో నదీ తీర గ్రామాల్లోని ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. రేవులను దక్కించుకున్న గుత్తేదారులు ఒకవైపు, దొరికిన దగ్గర దొరికినట్లుగా మరికొందరు ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తున్నారు. అధికారుల అండతో నిబంధనలు విస్మరిస్తున్నారు. పాలక, ప్రతిపక్ష నాయకులు చోద్యం చూస్తున్నారే తప్ప ప్రశ్నించేవారే లేరు. కొత్తూరు, హిరమండలం, ఎల్‌ఎన్‌పేట మండలాల్లోనూ ఇదే దందా సాగుతోంది..

వసప వద్ద పొక్లెయిన్లతో నదిలో ఇసుక తవ్వకాలు

అనుమతి లేకపోయినా ఒడిశాకు తరలింపు..

పాతపట్నం నియోజకవర్గంలో వంశధార నది పరిధిలో రెండు చోట్ల మాత్రమే తవ్వకాలకు అనుమతులున్నాయి. కొత్తూరు మండలంలోని నివగాం, బంకి, కడుము, కుంటిభద్ర, హిరమండలంలోని గొట్టాబ్యారేజీకి సమీపంలో ఇష్టారాజ్యంగా యంత్రాలతో తవ్వేస్తున్నారు. భగీరథపురం, పింద్రువాడ, అక్కరాపల్లి, రెల్లివలస, సుభలాం, పాతహిరమండలం, గులుమూరు, కొండరాగోలు, ఎల్‌ఎన్‌పేట మండలంలోని దబ్బపాడు, బసవరాజుపేట గ్రామాల వద్ద దందా కొనసాగుతోంది. ఇక్కడి నుంచి ఒడిశాకు ఇసుక వెళ్లకూడదనే నిబంధన ఉన్నా పెద్దసంఖ్యలో ట్రాక్టర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొత్తూరు మండలం పొన్నుటూరు వద్ద నదీ గర్భంలోకి ఏకంగా రహదారిని నిర్మించి ఇసుక తరలిస్తున్నారు. కొందరు దళారులు దేవుడి పేరుతో ట్రాక్టర్ల యజమానుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు.

పేరొకటి.. రేవొకటి..

రాష్ట్ర సరిహద్దులోని కొత్తూరు మండలంలోని బలద, అంగూరు గ్రామాల వద్ద ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ రేవుల పేరుతో ఆకులతంపర, వసప వద్ద యంత్రాలతో తవ్వకాలు చేస్తున్నారు. వసప వద్ద నదిలోకి రహదారి నిర్మించి తవ్విన ఇసుకను ప్రధాన పీహెచ్ రహదారిలోకి నిల్వ చేస్తున్నారు. దీనికి ఆవతలి వైపు మాతల ఎత్తిపోతల పథకం ఉండటం గమనార్హం. మనుషులతో తవ్వి ట్రాక్టర్లతో ఇసుకను స్టాక్ పాయింట్‌కు చేర్చాలి. అక్కడ నుంచి లారీలకు లోడు చేయాలి. ఇలా జరగకపోవడంతో నదీ గమనంలో మార్పు వచ్చే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నా పట్టించుకునేవారు కరవయ్యారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

కొత్తూరు, హిరమండలం, ఎల్‌ఎన్‌పేట మండలాల్లో ఇసుక తవ్వకాలపై నిఘా వేస్తాం. ఒడిశాకు ఇసుక రవాణా చేయకూడదు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ర్యాంపుల్లో నిబంధనలకు లోబడి తవ్వకాలు చేయాలి. విస్మరించిన వారిని విచారించి, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. – కె.బాలకృష్ణ, హనుమంతురావు, ఈశ్వరమ్మ, తహసీల్దార్లు కొత్తూరు, హిరమండలం, ఎల్‌ఎన్‌పేట

మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు

సోంపేట, న్యూస్‌టుడే: మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని సెర్ప్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూలపొలం ప్రాజెక్టును ఆదివారం పరిశీలించారు. సముద్రపు నాచు తయారీ, చేపల పెంపకం, ఇతర ప్రాజెక్టుల విషయమై అధికారులతో చర్చించారు. జీవనోపాధుల కల్పనకు సంఘాలు చేపట్టే కార్యక్రమాలు, వార్షిక రుణ ప్రణాళిక తదితర అంశాలపై మాట్లాడారు. డీపీఎం పి.రవికుమార్, ఏపీఎం ఎస్.ప్రసాదరావు, సీసీలు టి.శ్రీనివాసరావు, వి.మోహన్‌రావు, వీవోఏ ఉదయ్, ఆక్వా సిబ్బంది పాల్గొన్నారు.

శుద్ధజలం కరవు

మందస మండలం బహాడపల్లిలోని శుద్ధజల కేంద్రం ఇది. సాంకేతికంగా పాడై చాలా కాలమైనా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తెదేపా హయాంలో ఉద్దానం గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేశారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక ఇవి చాలా వరకు పాడయ్యాయి. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ ప్రసన్న తెలిపారు. – న్యూస్‌టుడే, హరిపురం (మందస)

మురుగు పారక.. నడిచే దారి లేక

ఇచ్ఛాపురం మండలం బాలకృష్ణాపురంలో ఎక్కడ పడితే అక్కడ ఇళ్ల మధ్య మురుగు నిల్వ ఉంటోంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై నీటి నిలిచిపోయింది. దీంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో కె.రామారావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

చిన్నారుల చెంత ప్రమాదం

కవిటి మండలం నెలవంకలో జిల్లా, మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రమాదకరంగా ఉంది. ట్యాంకు పిల్లర్లు అడుగు భాగంలో పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థకు చేరుకుంది. నిత్యం చిన్నారులుండే ప్రాంగణం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

కోతకు గురై.. ప్రమాదకరంగా మారి

వజ్రపుకొత్తూరు మండలంలోని ఒంకులూరు రాకాసి గెడ్డ వంతెన రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. దీంతో దారి మధ్యలో పొడవుగా కాలువలా మారి ప్రమాదకరంగా ఉంది. ఏ మాత్రం ఆదమరిస్తే ప్రమాదం తప్పదన్నట్లు మారింది. వంతెన పనులు జరుగుతున్న చోట కూడా రహదారి బురదతో అధ్వానంగా తయారైంది. పరిశీలించి చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ శాఖ డీఈఈ రవిబాబు తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

పనికిరాని మొక్కలు తొలగించరూ..

ఇచ్ఛాపురం మండలం ఎం.తోటూరులో ప్రధాన వీధుల మధ్య ఇళ్లకు ఆనుకుంటూ పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. రాత్రి వేళల్లో విషసర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఈవోపీఆర్డీ కృష్ణ వద్ద ప్రస్తావించగా పనికిరాని మొక్కలు తొలగించి సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

పంటల బీమా.. రైతుకు ధీమా

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పిస్తోంది. ఖరీఫ్ సీజన్-2025కు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై), వాతావరణ పంటల బీమా (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) పథకాలను ప్రవేశ పెట్టింది. రైతులు గడువులోపు ఈ బీమాలు తీసుకుని పంట నష్టపోయినప్పుడు ఆర్థిక సాయం పొందొచ్చు. గ్రామాన్ని బీమా యూనిట్‌గా పరిగణిస్తారు.

పడిపోయిన వరి చేలను నిలబెడుతున్న రైతులు (పాత చిత్రం)

నమోదు ఇలా...

ఈ పథకం కింద దిగుబడి ఆధారంగా వరి పంటలను ఖరీఫ్ కాలానికి గుర్తించారు. నేషనల్ క్రాప్ ఇన్స్యూరెన్స్ పోర్టల్‌లో ఖరీఫ్ నుంచి నమోదు చేసుకోవచ్చు. జూన్ నుంచి పంట రుణాలు తీసుకున్న రైతులకు బీమాకు ప్రీమియం సొమ్మును బ్యాంకు సిబ్బందే రుణం నుంచి జమ చేస్తారు. బీమా వద్దనుకున్న రైతులు ఒక దరఖాస్తు ఫారంలో బ్యాంకు వారికి చివరి తేదీకి వారం ముందే సమర్పించాలి.

ఇచ్ఛాపురం నియోజకవర్గ వివరాలు

మండలం	వ్యవసాయ భూమి (హెక్టార్లల్లో)	రైతులు
కవిటి	1,132	7,094
ఇచ్ఛాపురం	3,127	6,608
కంచిలి	3,486	8,629
సోంపేట	3,555	8,132

కావాల్సిన పత్రాలు

రైతులు ఆధార్‌కార్డు, భూమి పాస్ పుస్తకం, కౌలు రైతులైతే సీసీఆర్‌సీ పత్రం, రైతు డిక్లరేషన్ లేని పక్షంలో పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రం(రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బంది జారీ చేస్తారు), ఈ- పంట నమోదు పత్రం, మొబైల్ నంబరు, సేవింగ్ బ్యాంక్ ఖాతా మొదటి పేజీ అవసరం. వరి పంటకు బీమా హెక్టారుకు రూ. 1,05,000.. ఇందులో రైతులు కట్టాల్సిన ప్రీమియం సొమ్ము హెక్టారుకు రూ. 420, ఎకరానికైతే రూ. 168.

అవగాహన కల్పిస్తున్నాం

పంటల బీమాకు సంబంధించి గ్రామాల్లో వ్యవసాయాధికారులు, వ్యవసాయ సహాయకులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాన్ని యూనిటుగా పరిగణించి బీమా చెల్లింపులు జరుగుతాయి. పంట నష్టపోయిన ప్రతి రైతుకు బీమా వర్తిస్తుంది. – టి.భవానీ శంకరరావు, ఏడీ, సోంపేట

పెంపుడు జంతువులతో అప్రమత్తంగా ఉండాలి

పలాస ప్రాంతీయ పశువైద్యశాలలో రేబిస్ వ్యాధినిరోధక టీకాలు వేస్తున్న సహాయ సంచాలకులు డాక్టర్ రవి కృష్ణ

పలాస, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: పెంపుడు జంతువులపై ప్రజల్లో అవగాహన పెంచితేనే ప్రభుత్వ లక్ష్యాలు చేరుకోగలమని టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. ఆదివారం పలాస ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణలో ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రవికృష్ణ, పి.చంద్రశేఖరరావు, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, కౌన్సిలర్ సూర్యనారాయణ, తెదేపా పట్టణ కార్యదర్శి నవీన్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ పి.విఠల్, ఎంవీఏస్ వైద్యులు దేవి, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ కల్యాణి, పవన్, సిబ్బంది పాల్గొన్నారు. ★ పెంపుడు జంతువుల నుంచి వ్యాధులు వ్యాపించకుండా వాటి యజమానులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధకశాఖ జేఈవో పురుషోత్తం అన్నారు. కవిటి పశువైద్య కేంద్రం వద్ద పెంపుడు జంతువులకు టీకాలు వేయించారు.

(c) eenadu

అఖండ దీపాన్ని వెలిగిస్తున్న శ్రీకృష్ణదేవరాయలు, జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు

తొలి పండగ.. మది నిండుగా

తొలి ఏకాదశి సందర్భంగా వినుకొండపై రామలింగేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. క్యూలైన్లలో వచ్చి శివపార్వతుల ఉత్సవ మూర్తులతో పాటు వినాయకుడు, నందీశ్వరుడు, శివలింగాన్ని దర్శించుకున్నారు. పండితుల మంత్రోచ్ఛరణలతో సాయంత్రం 6.30 గంటలకు హిమాలయ గురూజీ శిష్యబృందం ఆధ్వర్యంలో అఖండ దీపం వెలిగించారు. అఖండ దీపాన్ని పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి వెలిగించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ అచ్యుత కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. - **వినుకొండ, న్యూస్‌టుడే**

శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు అలంకరణ

నేరస్థులపై డ్రోన్ అస్త్రం

సాంకేతికత వినియోగిస్తున్న పోలీసులు

✦ నరసరావుపేట ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్ఎస్ఎన్ కళాశాల సమీపంలోని ఓ శ్మశాన వాటికలో ఆకతాయిలు గంజాయి, మత్తు పదార్థాలు, మద్యం తాగుతున్నారనే సమాచారంతో డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేశారు. దీంతో వ్యసనపరులు అటుగా వెళ్లాలంటేనే భయపడుతున్నారు.

✦ ఇటీవల వినుకొండలో ఇద్దరి వ్యక్తుల మధ్య వివాదం రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. దీన్ని పసిగట్టిన పోలీసులు ఆ ప్రాంతంలో డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేశారు. దీంతో ఇరువర్గాల వారు భయంతో పారిపోయారు.

న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట)

నేరాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు పోలీసులు సాంకేతిక బాట పట్టారు. తరచూ దొంగతనాలు జరిగే ప్రదేశాలు, గంజాయి, మద్యం తాగే ప్రాంతాలు, ఖాళీ భవనాలు గుర్తించి అక్కడ డ్రోన్ నిఘా ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో మారుమూల ప్రాంతాల్లోనూ అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పర్యవేక్షిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో నేరాలు నియంత్రించేందుకు డ్రోన్ పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రత్యేకంగా పల్నాడు జిల్లాలో ప్రతి పోలీసు స్టేషన్‌కు ఒక డ్రోన్ కెమెరా అందుబాటులో ఉంచారు. దీని కోసం స్టేషన్‌కు ఇద్దరు సిబ్బందిని ఎంపిక చేసి వారం పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో డ్రోన్ ఎగరవేయడం, జన సమూహం ఉన్నప్పుడు ఎలా ఫొటోలు, వీడియోలు తీయాలో నేర్పారు. రోజూ అనుమానిత ప్రదేశాల్లో ఒకటి నుంచి రెండుగంటల సేపు డ్రోన్‌తో నిఘా నిర్వహిస్తున్నారు.



వినుకొండలో డ్రోన్ చిత్రం

జిల్లాలో మొత్తం పోలీసు స్టేషన్లు:	34
డ్రోన్ ఎగరేసేందుకు శిక్షణ పొందిన సిబ్బంది:	68
గంజాయి అనుమానిత ప్రదేశాలు :	36
దొంగతనాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలు:	18
ఖాళీ స్థలాలు, శిథిల భవనాలు :	25
బహిరంగంగా మద్యం తాగే ప్రదేశాలు:	77

కట్టడి ఇలా.. ముందుగా ఆయా స్టేషన్ల పరిధిలో దొంగతనాలు జరిగే ప్రాంతాలు, ఖాళీ స్థలాలు, శిథిల భవనాలు, గంజాయి, బహిరంగంగా మద్యం తాగే ప్రదేశాలు గుర్తిస్తారు. ఏ సమయంలో ఈ కార్యకలాపాలు జరుగుతున్నాయో తెలుసుకుని ఆ సమయానికి డ్రోన్ ప్రయోగిస్తారు. అసాంఘిక కార్యకలాపాలు చేస్తూ డ్రోన్ కెమెరాకు చిక్కిన వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపుతున్నారు. ఇదే తప్పు మళ్లీ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. పండగలు, తిరునాళ్లు, సభలు ఏర్పాటు చేసినప్పుడు, ట్రాఫిక్ నియంత్రణకు ఈ డ్రోన్ పరిజ్ఞానం ఉపయోగపడుతుందని పోలీసులు తెలిపారు.

జనవరి నుంచి అందుబాటులోకి తెచ్చాం

జిల్లాలో తొలి ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం 24 ఆలయాల వద్ద డ్రోన్‌తో నిఘా నిర్వహించాం. సిబ్బంది వెళ్లలేని ప్రదేశాల్లోనూ ఈ డ్రోన్ ఎగరేసి సమాచారం తెలుసుకుంటున్నాం. జనవరి నుంచి డ్రోన్ వినియోగం అందుబాటులోకి తెచ్చాం. పాతనేరస్థులు, రౌడీషీటర్లు, గంజాయి విక్రేతలపై ప్రత్యేక నిఘా పెట్టాం. - **కంచి శ్రీనివాసరావు, ఎస్పీ, పల్నాడు జిల్లా**

లక్ష్యం కొండంత.. పంపిణీ కొసరంత

కౌలుదారులకు అందని సాగు హక్కు పత్రాలు

కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాల (సీసీఆర్ కార్డులు) పంపిణీ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ఫలితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రయోజనాలకు వారు దూరమవుతున్నారు. జిల్లాలోని 370 రెవెన్యూ గ్రామాల పరిధిలో 67 వేల మందికి పంపిణీ చేయాల్సి ఉండగా.. 13 శాతమే జారీ చేశారు. పిడుగురాళ్ల, గురజాల, నూజండ్ల, రెంటచింతల, నరసరావుపేట, దుర్గి, చిలకలూరిపేట మండలాల్లో 5 శాతం కూడా ఇవ్వలేదు. సత్తెనపల్లి మండలంలో అత్యధికంగా 2,178 (68.60 శాతం) మందికి జారీ చేశారు.

న్యూస్‌టుడే, నరసరావుపేట

రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ఇప్పటికే అర్హులు ఎంపిక చేసింది. ఇందులో కౌలుదారులకు చోటు దక్కలేదు. సీసీఆర్ కార్డులు జారీ చేసిన తరువాత పథకం లబ్ధికి కౌలుదారులకు కూడా అవకాశం కల్పిస్తారని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు.

సీసీఆర్ కార్డుతో ఉపయోగాలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు (పాత చిత్రం)

అనేక ప్రయోజనాలు... భూమి కలిగిన యజమాని హక్కులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కేవలం 11 నెలలు.. అదీ పంటపైనే హక్కు ఉండేలా కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు పంపిణీ చేస్తున్నారు. కార్డుతో పంట పెట్టుబడి రుణాలు, ఉచిత బీమా, రాయితీ విత్తనాలు, ఎరువులు అందుకోవచ్చు. విపత్తులు, వరదలతో పంట నష్టపోయినప్పుడు పరిహారం అందుతుంది. కౌలు రైతులు సాగు హక్కు పత్రాలు తీసుకునేందుకు ముందుకు రావాలని వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు కోరుతున్నారు.

జిల్లాలో ఇలా..
సీసీఆర్ కార్డుల లక్ష్యం: 67,000
ఇప్పటివరకు మంజూరు: 8,738

వీరు వెళ్లరు.. వారు రారు.. పంట సాగు హక్కు పత్రాల జారీకి గతంలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించేవారు. తహసీల్దార్‌తో పాటు వీఆర్‌వోలు గ్రామాలకు వెళ్లి కౌలుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించేవారు. సీసీఆర్ పత్రాలు జారీ చేసేవారు. వివిధ కారణాలతో ఈ సంవత్సరం గ్రామ సభలు జరగలేదు. సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలకు వారు వెళ్లి పత్రం కోసం దరఖాస్తు చేసుకునే అవకాశమున్నా కౌలురైతులు ముందుకు కదలట్లేదు. ఫలితంగా లక్ష్యం మేరకు సాగు హక్కు పత్రాల జారీలో ప్రగతి కనిపించడం లేదు.

జడ్పీ భూమి స్వాధీనానికి అడుగులు

ఆర్‌అండ్‌బీకి కేటాయించిన గత ప్రభుత్వం

గుంటూరు, న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వ హయాంలో జిల్లా పరిషత్తుకు చెందిన భూమిని ఆర్‌అండ్‌బీ శాఖకు కేటాయించగా.. దానిని తిరిగి జడ్పీ సొంతం చేసుకునేలా అడుగులు పడుతున్నాయి. గత పాలకులు రూ.కోట్ల విలువైన భూమిని నామమాత్రపు ధరకు ఆర్‌అండ్‌బీ శాఖకు కట్టబెట్టి జడ్పీకి నష్టం చేకూర్చారు. నాటి జీవో రద్దు చేయాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు లేఖ రాయడంతో జడ్పీ అధికారులు ప్రభుత్వానికి అప్పీల్ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

తొలుత టోల్ ప్లాజా కోసం లీజుకు..

పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామం సర్వే నంబరు 251లో జడ్పీకి 2.71 ఎకరాల భూమి ఉంది. దానిని మెసర్స్ నామ్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్‌కు చెందిన టోల్ ప్లాజా నిర్వహణ కోసం ఏడాదికి రూ.2,43,900 చెల్లించేలా 2013లో కేటాయించారు. 2018, అక్టోబరు 31 వరకు జడ్పీకి లీజు చెల్లించారు. 1, నవంబరు 2018 నుంచి 31, అక్టోబరు 2021 వరకు ఏడాదికి రూ.3,25,192 చొప్పున లీజు నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినా చెల్లించలేదు. 31, అక్టోబరు 2021తో లీజు గడువు పూర్తయింది. 1, నవంబరు 2023 వరకు రూ.12,64,546 నామ్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ బకాయిలు చెల్లించాల్సి ఉంది.

✦ జడ్పీకి చెందిన 2.71 ఎకరాల భూమికి రవాణా, ఆర్‌అండ్‌బీ శాఖ రూ.9.50 లక్షలు జిల్లా పరిషత్‌కు చెల్లించేలా రెవెన్యూ శాఖ జీవో ఎం.ఎస్.నం.76 జారీ చేసింది. జడ్పీకి ప్రమేయం లేకుండానే ఆ ప్రక్రియ కొనసాగడం గమనార్హం. వైకాపా ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి సిఫార్సుతో భూమిని బదలాయించారనే ప్రచారం ఉంది. అప్పటి పల్నాడు జిల్లా కలెక్టరు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. జడ్పీ అధికారులూ మిన్నకుండిపోయారు.

యరపతినేని లేఖతో వెలుగులోకి

గత ప్రభుత్వం జడ్పీ భూమిని ఆర్‌అండ్‌బీకి కేటాయించడంపై విచారణ చేసి జీవో రద్దు చేయాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు జడ్పీ సీఈవో వి.జ్యోతిబసుకు ఇటీవల లేఖ రాశారు. ఈ నెల 4న జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశం అజెండాలో దానిని చేర్చినప్పటికీ చర్చించలేదు. చర్చ జరగకున్నా అజెండాలో చేర్చినందున జీవోని పునః సమీక్షించాలని ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు సీఈవో జ్యోతిబసు 'న్యూస్‌టుడే'కి తెలిపారు.

వరుసగా డ్రమ్ము.. నీటి కోసమే నమ్ము

అంబేడ్కర్ నగర్‌లో డ్రమ్ములు ఇలా..

సత్తెనపల్లి రైల్వేగేటు సమీపంలోని అంబేడ్కర్‌నగర్, వావిలాలనగర్‌లలో తాగునీటికి జనం ఇబ్బందులు పడుతున్నారు. వందల కుటుంబాలు నివసించే ఈ ప్రాంతంలో తాగునీటి పైప్‌లైన్ లేదు. మున్సిపాలిటీ నుంచి వచ్చే ట్యాంకర్లే దిక్కు. అవి మూడురోజులకు ఒకసారి రావడంతో నీటి కష్టాలు తప్పడం లేదు. ఈ క్రమంలోనే ట్యాంకర్ల నీటిని పట్టుకోవడానికి స్థానికులు డ్రమ్ములు ఏర్పాటు చేసుకున్నారు. తాగునీటి పైప్‌లైన్లు వేసి సమస్య తీర్చాలని వారు కోరుతున్నారు.

- **ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, సత్తెనపల్లి**

అధికారి లేక.. అవస్థలు తీరక..

రెండు నెలలుగా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కుర్చీ ఖాళీ

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: జిల్లాలో గ్రామీణ నీటిపారుదల శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) ఈఈ లేక రెండు నెలలవుతున్నా భర్తీ చేయలేదు. ఫలితంగా క్షేత్రస్థాయిలో పనులపై పర్యవేక్షణ ఉండటం లేదు. పనులు పూర్తి కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈఈగా ఉన్న విజయ్‌కుమార్ ఏప్రిల్ 30న ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం బాపట్ల ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అనంతరాజు ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. రెండు జిల్లాల్లో పూర్తిస్థాయిలో పనుల పర్యవేక్షణకు ఆయనపై పనిభారం పెరుగుతోంది.

గ్రామాల్లో నీటి ఎద్దడి.. పల్నాడు జిల్లా విస్తీర్ణం ఎక్కువ. చెరువులే తాగునీటి వనరులు. బొల్లాపల్లి, వెల్దుర్తి మండలాల్లోని 80 శాతం గ్రామాల్లో నీటి ఎద్దడి ఉంటుంది. ఎప్పటికప్పుడు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసేలా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలి. ప్రస్తుత వర్షాకాలం చెరువుల్లో నీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయిస్తూ ఉండాలి. ఆయా ఫలితాల్ని బట్టి క్లోరినేషన్ చేయడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఈ పనులన్నీ ఈఈ ఆధ్వర్యంలో జరుగుతూ ఉంటాయి. ప్రస్తుతం స్టాప్ డయేరియా కార్యక్రమం నడుస్తోంది. ఇది ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ శాఖల సమన్వయంతో సాగాలి. ఈఈ లేనందున కేవలం డీపీవోనే పర్యవేక్షిస్తున్నారు. అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ.. రెండు జిల్లాల్లో అన్ని పనుల్ని పర్యవేక్షిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఈఈ అనంతరాజు తెలిపారు.

బీమా.. సద్వినియోగంతోనే ధీమా!

ఎన్నో ప్రయోజనాలున్నా లక్షల మంది దూరం

న్యూస్‌టుడే, నరసరావుపేట

కుటుంబంతో సినిమాకు వెళ్తే ఎంత అవుతుంది? వారాంతంలో హోటల్‌కు వెళ్తే అయ్యే ఖర్చెంత? ఆ రెండింటితో బేరీజు వేసుకుంటే కష్టకాలంలో కుటుంబానికి ధీమా ఇచ్చే బీమా ప్రీమియాలకు వెచ్చించే ఖర్చు చాలా తక్కువ. ఏడాదికి కేవలం రూ.456 చెల్లిస్తే ఊహించని ప్రమాదం జరిగినప్పుడు, సహజ మరణం సంభవించినప్పుడు ఆర్థిక భరోసా లభిస్తుంది. అయితే అవగాహన రాహిత్యం, ఉదాశీనతతో చాలామంది ప్రధాన మంత్రి జీవన జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష బీమా పథకాల ప్రయోజనాలకు దూరంగా ఉంటున్నారు. మహిళలకు బ్యాంకింగ్ సేవలు చేరువ చేయాలని జన్‌ధన్ ఖాతాల్ని పైసా ఖర్చు లేకుండా కేంద్ర ప్రభుత్వం తెరిపిస్తే వాటి వినియోగంలోనూ వెనుకబడ్డారు. అందరికీ బ్యాంకు ఖాతాలతో పాటు బీమా, జన్‌ధన్ ఖాతాలు తెరిపించడం, ఇప్పటికే ఉన్న ఖాతాలు వినియోగంలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి ప్రత్యేక కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చింది.

పథకాల ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం

పథకం పేరు -	పీఎంజేజే	పీఎంఎస్‌బీ
ఏడాదికి ప్రీమియం	రూ.436	రూ.20
ప్రయోజనం	ఏడాదికి రూ.2 లక్షల జీవిత బీమా	రూ.2 లక్షల ప్రమాద బీమా
జిల్లాలో అర్హులు	20,59,025 మంది	20,59,025 మంది
ఇప్పటికే నమోదైన వారు	4,11,255	11,27,205
రెన్యువల్ చేయించుకుంది	2,29,728	8,49,757

❖ జిల్లాలోని 526 గ్రామ పంచాయతీలు, ఆరు పట్టణాలు, రెండు నగర పంచాయతీల పరిధిలో గ్రామీణ బ్యాంకులు 109, సెమీ అర్బన్ 132, పట్టణ ప్రాంతాల్లో 59 కలిపి మొత్తం 300 బ్యాంకు శాఖలున్నాయి. జులై ఒకటి నుంచి సెప్టెంబరు 30 వరకు మూడు నెలల కార్యక్రమం ద్వారా బ్యాంకింగ్ సేవలు అందరికీ చేరువ చేయనున్నారు.

జిల్లాలో మొత్తం జనధన్ ఖాతాలు :	6,76,137
ఆధార్ అనుసంధానమైనవి	4,34,920
అనుసంధానం కానివి	2,41,217 (ఇవి వినియోగంలో లేవు)

బ్యాంకు ఖాతా కీలకం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాల లబ్ధి అందుకునేందుకు పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ బ్యాంకు ఖాతాలు కీలకం. ప్రభుత్వాలు డైరెక్ట్ బెనిఫిట్ స్కీమ్(డీబీటీ)తో నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే నగదు బదలాయిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ఖాతాల్లేని వారు పైసా ఖర్చు లేకుండా జన్‌ధన్ ఖాతాల్ని కొత్తగా తెరిచే అవకాశాన్ని ప్రస్తుతం కల్పిస్తున్నారు. జిల్లాలోని ప్రజలందరికీ బ్యాంకింగ్ సేవల్ని మరింత చేరువ చేస్తామని లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.శ్రీనివాస రామ్‌ప్రసాద్ తెలిపారు.

పెరుగుతున్న సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం వారం రోజులుగా సుమారు 12 అడుగులు పెరిగింది. ప్రస్తుతం జలాశయంలో 160.0644 టీఎంసీలు ఉన్నాయి. ఎడమ కాలువకు 2985, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 1275, ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 4,403 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 56,674 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. నేడో రేపో శ్రీశైలం క్రస్టుగేట్ల ద్వారా సాగర్ జలాశయానికి భారీగా వరద నీటిని వదిలే అవకాశం ఉంది. ఇదే వరద మరో వారం కొనసాగితే సాగర్ జలాశయ నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరువ కానుంది.

కోటప్పకొండపై కోలాహలం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయం తొలి ఏకాదశి సందర్భంగా భక్తుల రాకతో ఆదివారం సందడిగా మారింది. తెల్లవారుజామున స్వామికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. జలం, పాలు, పెరుగు, భస్మం, పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకం చేశారు. తొలి అభిషేకం అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. పర్వదినం కారణంగా భక్తులు మూలవిరాట్టుకు కాకుండా అభిషేక మండపంలో అభిషేకాలు చేయించుకున్నారు. స్వామికి పొంగళ్లు సమర్పించి నివేదన చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నేపథ్యంలో పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు వసతులు కల్పించారు. దేవస్థానం ఈవో దాసరి చంద్రశేఖరరావు, అధికారులు పర్యవేక్షించారు.

కుంకుమ, పసుపుతో అభిషేకం

స్వామి దర్శనానికి భక్తుల క్యూ

పాఠశాలల్లో మెగా పండగ

10న తల్లిదండ్రులతో సమావేశం

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతో పాఠశాలలను మరింత బలోపేతం చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సమష్టి కృషితో బడుల్లో నాణ్యమైన విద్య, పథకాల అమలులో పారదర్శకత, అభివృద్ధి పనుల వేగవంతానికి దోహదపడేలా మెగా పీటీఎం (పేరెంట్స్, టీచర్స్ మీటింగ్) 2.0 కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈనెల 10న జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమానికి 1.46 లక్షల మంది తల్లిదండ్రులు హాజరు కానున్నారు.

నిరుడు తల్లిదండ్రుల సమావేశంలో భోజనం చేస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్, రొంపిచర్ల, గురజాల

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేశారు. ఉపాధ్యాయులకు పలు రకాల పనులు అప్పగించి ఒత్తిడికి గురిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తెచ్చింది. బడుల నిర్వహణలో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసేందుకు ఏటా మెగా పేరెంట్స్ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. మెగా పీటీఎం 2.0 కార్యక్రమం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. మధ్యాహ్న భోజనం, విద్యార్థి మిత్ర కిట్లు, తరగతుల నిర్వహణ, హాజరు, పిల్లల నమోదు, అభ్యసన సామర్థ్యాలు తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేయాలి. అనంతరం విద్యార్థులకు సంబంధించి అన్ని వివరాలతో కూడిన ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేస్తారు.

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు:	2,038
ఒకటి నుంచి పది వరకు చదివే విద్యార్థులు:	2,70,968

తల్లి పేరిట మొక్క

'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థి తల్లి పేరుతో మొక్క నాటి పెంచేందుకు అవసరమైన మొక్కలను పంపిణీ చేయనున్నారు. విద్యార్థులు మొక్కను వారి ఇంటి వద్ద, లేదా పాఠశాలల్లో నాటి సంరక్షించాల్సి ఉంటుంది. ఇందుకుగాను విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టు జారీ చేస్తారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మొక్కను పరిశీలించి విద్యార్థులకు గ్రీన్‌పాయింట్లు కేటాయిస్తారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

సమాజ భాగస్వామ్యంతోనే ఏ రంగమైనా అభివృద్ధి సాధ్యమవుతుంది. పాఠశాలల విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారం అవసరం. తల్లిదండ్రుల సమావేశాలను పండగలా నిర్వహిస్తున్నాం. ఇప్పటికే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ పూర్తి చేశాం. - **అరుణ్‌బాబు, కలెక్టర్, పల్నాడు జిల్లా**

నిర్మించి.. వినియోగం మరిచి..

దుర్గి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిస్థితి ఇదీ

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, దుర్గి

నిరుపయోగంగా షెడ్లు

రూ.కోట్లతో నిర్మించిన దుర్గి మార్కెట్ యార్డును అందుబాటులోకి తీసుకురావాలని పల్నాడు వాసులు కోరుతున్నారు. తెదేపా హయాంలో నిర్మించి ప్రారంభోత్సవం చేశారనే కారణంతో దీన్ని గత అయిదేళ్లు వైకాపా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురాలేదు. వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకోలేక రైతులు ఇబ్బందులు పడ్డారు. మాచర్ల నియోజకవర్గం దుర్గి మండల కేంద్రంలో 2019 ఫిబ్రవరిలో అప్పటి సభాపతి కోడెల శివప్రసాదరావు వ్యవసాయ మార్కెట్‌యార్డుకు ప్రారంభోత్సవం చేశారు. తర్వాత వెంటనే ప్రభుత్వం మారడంతో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం శీతకన్ను వేసింది. కూటమి ప్రభుత్వమైనా మార్కెట్‌యార్డునుమిర్చి యార్డుగా మార్చి అందుబాటులోకి తీసుకురావాలని మాచర్ల, గురజాల నియోజకవర్గ వాసులు కోరుతున్నారు.

☛ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే మిర్చిని అమ్ముకునేందుకు నల్గొండ, మహబూబ్‌నగర్, మాచర్ల, గురజాల రైతులు గుంటూరు వెళ్లకుండా రవాణా భారం తగ్గించేందుకు దుర్గిలో మిర్చి మార్కెట్‌యార్డు నిర్మాణానికి అడుగులు పడ్డాయి. విభజన తర్వాత 2014లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెదేపా ప్రభుత్వం 20 ఎకరాల్లో దీని నిర్మాణం పూర్తి చేసింది. తారకరామారావు మార్కెట్‌యార్డుగా నామకరణం చేసి 2019లో ప్రారంభోత్సవం చేశారు.

అన్నిరకాల వసతులు.. ఈ మార్కెట్‌యార్డుకు అన్ని రకాల వసతులు సమకూర్చారు. తారు రోడ్లు, విద్యుత్తు, నీటి సౌకర్యం కల్పించారు. మిర్చి మార్కెట్‌యార్డుగా అందుబాటులోకి తీసుకురావడానికి అదనంగా ఎటువంటి పనులు చేయాల్సిన పనిలేదు. నరసరావుపేట-మాచర్ల ప్రధాన రోడ్డుకు పక్కనే ఉంటుంది. అందుబాటులోకి తీసుకొస్తే రైతులకు రవాణా ఖర్చులు పూర్తిగా తగ్గుతాయి. దీనిపై వ్యవసాయ మార్కెటింగ్ జిల్లా అధికారి ఉపేంద్రను సంప్రదించగా.. ఈ ప్రాంత వాసులకు సమీపంలో దాచేపల్లిలో మిర్చి మార్కెట్‌యార్డు ఉందని.. అయినా దుర్గి మార్కెట్‌యార్డును సందర్శించి అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తానని చెప్పారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80085 10541

(c) eenadu

కొండకు పోటెత్తిన భక్తులు

విద్యుత్తు ప్రభలు

పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

వినుకొండ, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా వినుకొండ తిరునాళ్లలో ఆదివారం కొండపైకి భక్తులు పోటెత్తారు. సుమారు 30వేల మందికి పైగా రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. సతీసమేతంగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి దంపతులు శివపార్వతులకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆర్టీసీ బస్సులో కొండపైకి చేరుకున్న వారికి దేవదాయ శాఖాధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. పూజల అనంతరం వారిని ఆలయ కమిటీ చైర్మన్ అమృత కోటేశ్వరరావు శాలువా కప్పి పూలదండలతో సత్కరించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి మేడం రమేష్ వారి వెంట ఉన్నారు. నరసరావుపేట ఆర్డీవో మధులత, డీఎస్పీ నాగేశ్వరరావు వేర్వేరుగా ఆలయాన్ని సందర్శించారు.

సులువుగా రాకపోకలు

కాలినడకన వచ్చే భక్తులకు మెట్ల రోడ్డులో మంచినీటి సరఫరా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొండపైన ఆలయ కమిటీ, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సుమారు 25వేల మందికి అన్నదానం చేశారు. ఆర్టీసీ బస్సులు, పోలీసు వాహనాలు మినహా ప్రైవేటు వాహనాలను అనుమతించలేదు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఇతర నాయకులు బస్సులోనే వెళ్లారు. దీంతో ఘాట్ రోడ్డులో వాహన రద్దీ తగ్గి రాకపోకలకు సులువైంది. వాతావరణం చల్లగా ఉండటంతో భక్తులు ఎక్కువ మంది నడక మార్గంలో చేరుకున్నారు. ఆర్టీసీ బస్టాండు నుంచి కొండ వరకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారు.

ప్రత్యేక స్థలంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ఎన్నెస్పీ కాలనీ వద్ద విద్యుత్తు ప్రభలు ఏర్పాటు చేసి ఆర్కెస్ట్రాతో డ్యాన్సులు ప్రదర్శించారు. జూనియర్ కళాశాల మైదానంలో నాటకాలు, కోలాటాలు, భజనలు జతర సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ప్రత్యేకంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలో వాహనాలు అపకుండా కట్టుదిట్టం చేశారు.

40 బస్సులు

కొండపైకి ఆర్టీసీ 40 బస్సు సర్వీసులను నడిపింది. పైన, కింద బస్టాండ్లు ఏర్పాటు చేసి ప్రయాణికులను గమ్యం చేర్చారు. ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు 700 సింగిల్ ట్రిప్పులు వేసినట్లు డిపో మేనేజర్ జవ్వాజి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక డిపోతో పాటు పిడుగురాళ్ల ఇతర ప్రాంతాల నుంచి బస్సులను రప్పించామని చెప్పారు.

సతీసమేతంగా పూజా సామగ్రి తెస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, చిత్రంలో జీడీసీసీబీ చైర్మన్ ఇన్‌ఛార్జి మక్కెన

దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు

ఆదమరిస్తే యమపాశమే

జిల్లాలో ఏటా విద్యుత్తు ప్రమాదాలు ★ వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

పొలాల్లో విద్యుత్తు నియంత్రికలు, తీగలతో పొంచి ఉన్న ప్రమాదాలు (పాతచిత్రం)

ముప్పాళ్ల మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ వెంకటశివ వేడినీళ్లతో స్నానం చేసేందుకు హీటర్ పెట్టుకున్నాడు. పొరపాటున అది తీయకుండానే బకెట్‌లో చెయ్యి పెట్టగా విద్యుత్తు షాక్‌కు గురై మృతి చెందాడు. ఇదే గ్రామంలో అంతకు ముందు నియంత్రిక వద్ద విద్యుత్తు తీగ లాగుతూ స్థానికుడు బాషా మృత్యువాత పడ్డాడు.

★ సత్తెనపల్లి పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని ఓ హోటల్‌లో గ్రైండర్ వద్ద పని చేస్తూ విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. ముప్పాళ్ల మండలంలోని బొల్లవరంలో మూడో తరగతి విద్యార్థి తడిచేతులతో మోటారు ఆన్ చేసి విద్యుత్తు షాక్‌కు గురై మృత్యువాత పడ్డాడు. ★ విద్యుత్తుతో ఎన్ని ఉపయోగాలున్నాయో ఏమరపాటు, నిర్లక్ష్యంతో అంతే ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పొలాలు, ఇళ్లు, వ్యాపార సంస్థల్లో విద్యుదాఘాతంతో మృతి చెందేవారి సంఖ్య జిల్లాలో ఏటా పెరుగుతోంది. వర్షాలు ప్రారంభమయ్యే తరుణంలో విద్యుత్తు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యుత్తు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రమాదాల్ని తప్పించుకునేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యుత్తు శాఖ జిల్లా టెక్నికల్, కన్‌స్ట్రక్షన్ ఈఈ కె.రామసుబ్బారావు తెలిపారు. ఆ జాగ్రత్తలు ఇవే..

జిల్లాలో వివిధ విద్యుత్తు కనెక్షన్లు ఇలా..	
ఇళ్లు : 6,00,737	వ్యవసాయం : 94,329
పరిశ్రమలు : 2,842	వ్యాపార, వాణిజ్య సంస్థలు : 67,141
ఇతర కనెక్షన్లు (దేవాలయాలు, ప్రార్థన మందిరాలు తదితరాలు : 11,594	

★ ఐ.ఎస్.ఐ. గుర్తు ఉన్న ఎలక్ట్రికల్ వైర్లు, ఉపకరణాలు మాత్రమే వినియోగించాలి. ★ ఎర్త్ నిరోధకతను తరచూ తనిఖీ చేస్తూ ఉండాలి. ★ లోడ్ కరెంట్‌ను పరిమితం చేసేందుకు ప్రతి సర్క్యూట్‌లో తగిన ఎంసీబీని ఉపయోగించాలి. ★ ఎలక్ట్రికల్ పనులు చేసేటపుడు చెప్పలు ధరించాలి. లేదా రబ్బరు చాపపై నిలబడి పనులు చేయాలి. ★ ఎలక్ట్రికల్ హీటర్ ప్లగ్, సాకెట్ కాంటాక్ట్ ఉపరితలాన్ని శుభ్రం చేయాలి. ప్రతి రెండేళ్లకు సాకెట్ మార్చాలి.

రైతులూ.. పొలాల్లో జాగ్రత్త..

★ వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి మోటరు స్టార్లర్లు, స్విచ్‌లు ఉన్న ఇనుప బోర్డులను విధిగా ఎర్తింగ్ చేయాలి. ★ పొలాల్లో తెగిన లేదా జారి తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్తు వైర్లకు దూరంగా ఉండాలి. వెంటనే విద్యుత్తు సిబ్బందికి సమాచారం అందించి వాటిని సరి చేయించుకోవాలి. ★ పొలాలకు రక్షణగా జంతువులు రాకుండా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌కు విద్యుత్తు సరఫరా చేయకూడదు. ★ వైర్లకు ఇన్సులేషన్ ఊడిపోతే ఇన్సులేషన్ టేపుతో చుట్టాలి. ★ తడి చేతులతో, నీటిలో నిలబడి విద్యుత్తు మోటర్లను, స్విచ్చులను, పరికరాలను తాకకూడదు. విద్యుత్తు షాక్ కొట్టకుండా 30 మిల్లీ యాంప్స్ సామర్థ్యం కలిగిన ఆర్‌సీసీబీని మాత్రమే ఉపయోగించాలి.

ఇళ్లలో వీటిని మరచిపోవద్దు

★ ఇంటికి ఎర్తింగ్ ఇచ్చినప్పుడు కనీసం రెండు ఎర్త్ ఎలక్ట్రోడులు బిగించుకోవాలి. విద్యుత్తు పరికరం పని చేయకపోతే సొంతగా మరమ్మతులు చేయకుండా ఎలక్ట్రీషియన్‌ను సంప్రదించాలి. ★ గృహ విద్యుత్తు ఉపకరణాలు వాడేటప్పుడు మూడు పిన్నుల ప్లగ్ సాకెట్లనే వాడాలి. మూడో పిన్నును తప్పనిసరిగా ఎర్తింగ్ చేయాలి. ★ గ్రైండర్, ఏసీ, రిఫ్రిజిరేటర్ల నుంచి అసాధారణ శబ్దాలు వస్తుంటే నిర్లక్ష్యం చేయకుండా నైపుణ్యం కలిగిన వారితో తనిఖీ చేయించుకోవాలి. ★ ఒకే ప్లగ్ పాయింట్ నుంచి లూజు వైర్లు, తాత్కాలికంగా అనేక పరికరాలకు కలపకూడదు. ప్లగ్ తీసేటప్పుడు వైర్లను పట్టుకుని లాగకూడదు.

జనం మధ్యకు జగన్నాథుడు

రథంపై జగన్నాథుడు, బలభద్ర, సుభద్ర

భక్తుల కోలాహలం నడుమ రథయాత్ర

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలో బరంపేట ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో పట్టణంలో జగన్నాథ రథయాత్ర ఘనంగా నిర్వహించారు. బరంపేట నుంచి ప్రధాన రహదారులపై రథయాత్ర సాగింది. ఇస్కాన్ మందిరంలో విశేష అర్చనల అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేక రథంపైకి చేర్చి రథయాత్ర నిర్వహించారు. ఆర్వోబీ కూడలి, శివుని విగ్రహం సెంటర్ మీదుగా పల్నాడు సెంటర్ వరకు చేపట్టారు. భక్తులు హారతులు సమర్పించి జగన్నాథ, బలభద్ర, సుభద్రలకు స్వాగతించారు. అనంతరం మహారాజభోగ నివేదన తదితర కార్యక్రమాలు చేపట్టారు.

పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి

పెంపుడు కుక్కకు వ్యాక్సిన్ వేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామారావు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: పెంపుడు జంతువుల యజమానులు నిరంతరం అప్రమత్తంగా ఉండటంతో పాటు వాటికి క్రమం తప్పకుండా వ్యాక్సిన్లు వేయించాలని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ రామారావు సూచించారు. జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకొని రేబిస్ వ్యాధి నిరోధక టీకా కనుగొన్న శాస్త్రవేత్త లూయీ పాశ్చర్ చిత్రపటానికి పూలమాల వేసి ఆదివారం నివాళులర్పించారు. స్థానిక ఏరియా పశు వైద్యశాలలో పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య, పురపాలక శాఖల ఆధ్వర్యంలో యాంటీ రేబిస్ టీకాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతు సంక్రమిత వ్యాధులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. యాంటీ రేబిస్ టీకాలు వేయించడంతో జంతువుల నుంచి వ్యాధులు మనుష్యులకు రాకుండా ఉంటాయన్నారు. జిల్లాలో 1326 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ నుంచి డాక్టర్ హనుమకుమార్, ఏరియా పశువైద్యాధికారి డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్ ప్రీతి, శ్రీరామ్, సాయి ప్రవీణ్, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పండగ వేళ విషాదం / ట్రాక్టర్ కిందపడి చిన్నారి మృతి

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: ఆ కుటుంబాలు సంతోషంగా తొలి ఏకాదశి పండగ జరుపుకొంటున్నాయి. కొత్తగా కొనుగోలు చేసిన ట్రాక్టరుకు పొలంలో పూజలు చేసి, వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు వెళ్లారు. అంతలోనే ఊహించని ప్రమాదం చోటుచేసుకుంది. ఆ కుటుంబాల్లో విషాదం అలుముకుంది. మండలంలోని నార్నెపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి, కొండారెడ్డి సోదరులు. వీరిలో ఒకరు సత్తెనపల్లిలో, మరొకరు నరసరావుపేటలో నివాసముంటున్నారు. వెంకటేశ్వరరెడ్డి కొత్త ట్రాక్టర్ కొనుగోలు చేసి, తొలి ఏకాదశికి వ్యవసాయ పనులు ప్రారంభించాలని నార్నెపాడుకు వచ్చారు. సోదరుడి కుటుంబం కూడా ఊరికి రావడంతో అంతా కలసి పండగ చేసుకున్నారు. తమ్ముడి ఐదేళ్ల కుమార్తె దీక్షిని ట్రాక్టర్‌పై ఎక్కించుకుని పొలంలో పూజకు వెంకటేశ్వరరెడ్డి వెళ్లాడు. పొలం నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా ట్రాక్టర్‌పై నుంచి చిన్నారి ప్రమాదవశాత్తు జారి కింద పడింది. ట్రాక్టర్ చక్రం బాలిక తలపై నుంచి వెళ్లింది. తీవ్రంగా గాయపడిన బాలికను నరసరావుపేటకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పండగరోజు ఊహించని ప్రమాదంతో ఆ కుటుంబాల్లో విషాదం అలుముకుంది.

పెదకూరపాడులో పిచ్చికుక్క దాడి

గాయపడిన చిన్నారి అమన్

పెదకూరపాడు, న్యూస్‌టుడే: పెదకూరపాడు ముస్లిం కాలనీలో ఆదివారం పిచ్చికుక్క స్థానికులను పరుగులు పెట్టించింది. వీధిలో ఆడుకుంటున్న చిన్నారులపై దాడి చేసింది. నలుగురిని తీవ్రంగా గాయపరిచింది. నాలుగేళ్ల వయసున్న పఠాన్ మహమ్మద్ అమన్ గాయపడటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. వృద్ధుడు షేక్ ఖాసిం, పారిశుద్ధ్య సిబ్బంది హుస్సేన్, వ్యాపారి ఖాసిం కుక్కకాటుకు గురయ్యారని వైద్యులు చైతన్య పేర్కొన్నారు. గ్రామంలో కుక్కల బెడదపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితులు, వారి కుటుంబ సభ్యులు వాపోయారు. గత నెల 18న పాటిబండ్ల గ్రామంలో పిచ్చికుక్క 12 మందిని గాయపరిచింది.

ప్రైవేటు పాఠశాల డైరెక్టర్ బలవన్మరణం

ఆర్థిక సమస్యలే కారణమని అనుమానాలు

శ్రీధర్ (పాత చిత్రం)

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: భవిష్య శ్రీధర్‌గా పల్నాడు ప్రాంతంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఎందరికో విద్యాబుద్ధులు నేర్పారు. అప్పుల ఊబిలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అవుతూ.. చివరికి బలవన్మరణం పొందారు. గుంటూరు నగరానికి చెందిన శ్రీధర్(50) సత్తెనపల్లికి చెందిన ఉమాకల్యాణిని ప్రేమ వివాహం చేసుకున్నారు. 2000 సంవత్సరం నుంచి సత్తెనపల్లిలో నివాసం ఉంటూ.. ఇద్దరూ ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేశారు. 2013లో సొంతంగా విద్యాసంస్థను నడపాలనే ఆలోచనతో భవిష్య పాఠశాలను ఏర్పాటు చేశారు. వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. పాఠశాలకు ఈఎస్ఐ, పీఎఫ్ బకాయిలు ఉండటంతో ఇటీవలే ఆ శాఖ అధికారులు వచ్చి ఓ భవనానికి తాళంవేసి వెళ్లారు. దీనికితోడు ఆర్థిక సమస్యలు పెరగడంతో ఆయన కొంతకాలంగా మనోవేదన చెందుతున్నారని స్నేహితులు తెలిపారు. ఈక్రమంలోనే శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన సాయంత్రం వరకు తిరిగి రాలేదు. ఆయన భార్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అదృశ్యం కేసు నమోదు చేశారు. అనంతరం శనివారం రాత్రి విజయవాడ నగరంలోని ప్రకాశం బ్యారేజీపై ద్విచక్ర వాహనం నిలిపి కృష్ణానదిలోకి ఓ వ్యక్తి దూకాడని అటుగా వెళ్తున్న వాహన చోదకులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఆ వాహనం చిరునామా ఆధారంగా అది శ్రీధర్‌కు చెందినదిగా పోలీసులు గుర్తించి సత్తెనపల్లి స్టేషన్‌కు సమాచారం అందించారు. ఆదివారం ఉదయం ఈతగాళ్లతో నదిలో గాలించగా మృతదేహం లభ్యమైంది. విజయవాడ వన్‌టౌన్ పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు సంతానం కాగా, పెద్ద కుమార్తె తేజస్విని అమెరికాలో ఎంఎస్ పూర్తిచేసి ఉద్యోగ అన్వేషణలో ఉంది. రెండో కుమార్తె నవ్యస్విని గుంటూరులో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతోంది. ప్రైవేట్ పాఠశాలల సంఘం సత్తెనపల్లి తాలుకా బాధ్యుడిగా ఆయన క్రియాశీలకంగా ఉన్నారు. లయన్స్‌క్లబ్‌లో కీలక బాధ్యతలు చేపట్టి సామాజిక సేవలోనూ పాలు పంచుకుంటున్నారు. పేద విద్యార్థుల చదువులకు ఫీజుల విషయంలోనూ ఉదాసీనంగా ఉంటారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన దాసరి శ్రీను(45) అదే గ్రామంలోని ఒక ప్రయివేట్ పాఠశాల బస్సు సహాయకుడిగా పని చేసేవాడు. మేరికపూడిలో మొహర్రం వేడుకలకు మరో ముగ్గురితో కలిసి ఆటోలో శనివారం వచ్చారు. కాసేపటికి ఇంటికి బయలుదేరారు. గ్రామ శివారున నరసరావుపేట నుంచి గుంటూరు వెళ్తున్న మినీ లారీ అతివేగంగా వస్తూ ముందు వెళ్తున్న బస్సును అధిగమించబోయి ఢీ కొనడంతో ఆటో పల్టీ కొట్టింది. చోదకుడు శ్రీనుకు తీవ్ర, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం శ్రీనును మరో ఆటోలో నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి శ్రీను అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన మినీ లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతుడికి భార్య పద్మ, కుమార్తె ఉన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బస్సు ఢీకొని ఇటుకల వ్యాపారి..

రామిరెడ్డి (పాత చిత్రం)

మాచర్ల (కారంపూడి): తొలి ఏకాదశి పురస్కరించుకుని అడిగొప్పల అమ్మవారిని దర్శించుకునేందుకు స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లిన వ్యక్తిని మృత్యువు బస్సు రూపంలో కబళించింది. ఈ ఘటన మాచర్ల శివారులో చోటు చేసుకుంది. మాచర్లకు చెందిన ఇటుకల వ్యాపారి రామిరెడ్డి (55) స్నేహితుడు వెంగళరెడ్డితో కలిసి అడిగొప్పలకు బయలుదేరాడు. పట్టణ శివారులో ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో రామిరెడ్డి బస్సు వెనక టైరు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందాడు. మృతుడి కుమారుడు నరేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సంధ్యారాణి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత ప్రవేశాలు

వేంపల్లె, న్యూస్‌టుడే

ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కార్యాలయం

నాలుగుచోట్ల మిగులు సీట్లు 600

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు ట్రిపుల్ ఐటీలలో 600 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి విద్యార్థుల మెరిట్ జాబితాను తయారు చేసి ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి మొత్తం 4400 సీట్లు ఉన్నాయి. ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1100 సీట్లు ఉండగా దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ కోటా కింద 360 సీట్లు పోను నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1010 చొప్పున 4040 సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలలో ఉన్న సీట్లకు మెరిట్ జాబితా విడుదల చేసి జూన్ 30 నుంచి జులై 5వ తేదీ వరకు ఇడుపులపాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేశారు. కౌన్సెలింగ్ తర్వాత ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 878 సీట్లు భర్తీ కాగా 132 సీట్లు మిగిలిపోయాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలో 1010కి 869 భర్తీ కాగా 141 సీట్లు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 867 భర్తీ కాగా 143, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు 826 సీట్లు భర్తీకాగా 184 సీట్లు మిగిలాయి. ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో జాప్యం, ఇక్కడి విద్యపై ఆసక్తి లేని కారణంగా చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడంతో 600 సీట్లు ఖాళీ ఏర్పడింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ కేంద్రంగా రెండో విడత ప్రవేశాలకు సంబంధించి రెండో జాబితాను అధికారులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

11, 12 తేదీల్లో ఆన్‌లైన్‌లో వివరాలు

ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలలో మిగిలిపోయిన 600 సీట్ల భర్తీకి తదుపరి మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 11, 12 తేదీల్లో వెబ్‌సైట్‌లో వెల్లడిస్తాం. ఈ మేరకు రెండో విడత జాబితా సిద్ధం చేసే పనిలో తమ సిబ్బంది ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. ఆ లోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తాం. **- ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ**

బ్రాయిలర్ ధరలు (కిలో ।కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 107, రిటైల్ ధర - 129, చికెన్ విత్‌స్కిన్ - 187, చికెన్ స్కిన్‌లెస్ - 213.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 106, 114, 125 చికెన్ విత్ స్కిన్ - 204 చికెన్ స్కిన్‌లెస్ - 214.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 570 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

ఆటోను ఢీకొన్న కారు.. అయిదుగురికి గాయాలు

కాలువలోకి బోల్తా కొట్టిన ఆటో

తుళ్లూరు, న్యూస్‌టుడే: సీడ్ యాక్సెస్ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో అయిదుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట సమీపంలోని మురికిపూడికి చెందిన కుటుంబ సభ్యులు తాళ్లాయపాలెం శైవక్షేత్రానికి వచ్చారు. అక్కడి ఆలయంలో స్వామిని దర్శించుకుని వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి సీడ్ యాక్సెస్ రహదారిపై ఆటోలో బయలుదేరారు. అదే సమయంలో వెంకటపాలెం వైపు నుంచి గుంటూరు వల్లూరివారితోటకు చెందిన కె.హరినాథ్ భార్యతో కలసి కారులో వస్తూ ఆటోను ఢీ కొట్టారు. దీంతో ఆటో పల్టీకొట్టి పక్కన కాలువలోకి బోల్తా కొట్టింది. కారు చక్రం ఊడి ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులకు గాయాలు కావటంతో వారిని ట్రాఫిక్ పోలీసులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

91.9 FM Vijayawada — ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

BUSINESS OFFER

టైలరింగ్ వర్క్స్ ఇంటి వద్దనే పనిచేసే స్త్రీలు కావలెను. వారికి క్లాత్ ఇచ్చుటకు స్టాక్ పాయింట్స్ పెట్ పార్ట్‌నర్స్ కావలెను. ✆ 7093632399.

FINANCIAL SERVICES

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్సియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

REAL ESTATE

GENERAL

A.P. రాజధాని అమరావతిలో ల్యాండ్ పూలింగ్‌లో గజం 5000/-, కాజాలో గజం 10,000/-, అమరావతిలో గజం 7000/-, మంగళగిరిలో గజం 12000/- 96035 30555.

HOUSE FOR SALE

GENERAL

బాపట్ల పట్టణము మెయిన్‌రోడ్ మరియు నేషనల్ హైవే మధ్యగల రోడ్డు ప్రక్కన గల పటేల్ నగర్ 1వలైనులో టిజెపి ఆఫీస్ ప్రక్కన 5.5 సెంట్ల విస్తీర్ణములో గల 2 అంతస్థుల డాబా అమ్మకమునకు కలదు. ✆ 99498 43944, 94416 49539.

PLOT FOR SALE

GENERAL

విశాఖలో/ అనకాపల్లిలో NRI ఫామ్ ల్యాండ్స్ వేయుటకు ఇన్వెస్ట్ పార్ట్‌నర్స్ కావలెను. సంప్రదించండి. ✆ 73864 14017/ 70936 32399.

JOBS

Wanted B-Pharmacy/ D-Pharmacy candidates to work in a pharmacy in Guntur city. Pci registration mandatory. And wanted packing & delivery boys, Q: 10th. 63009 75241.

Wanted Primary, High School Telugu, English and Physics Teachers Contact Immediately. Perecherla Ph : 97017 59405, 99123 77669.

Required Accountant with Tally Knowledge for a Company Salary: 20000 to 30000. Contact: 95023 82228.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. బో + వ + మంచి జీతం+ఇన్సెంటివ్స్ కలవు. 99590 21122 / 99590 31122.

గుంటూరు నగరంలో ప్రముఖ స్కూల్లో Classical Dance, Western Dance, Chess Masters & Primary Teachers కావలెను. ✆ 9447660603

అకౌంటెంట్ కమ్ ఆఫీసు అసిస్టెంట్ కావలెను. బి.కాం., 3 సంII కంప్యూటర్ అకౌంట్స్‌పై అనుభవం, తెలుగు, ఇంగ్లీష్ భాషలపై పరిజ్ఞానం, రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

గుంటూరులోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వారి APCRDA అప్రూవ్డ్ ప్లాట్లు మార్కెటింగ్ చేయుటకు టీం లీడర్స్ & ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. ఆకర్షణీయమైన జీతం/మంచి కమీషన్ ఇవ్వబడును. ✆ 95731 51860.

త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ వంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 85209 80099, 85208 74499.

గుంటూరులోని ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనిలో పనిచేయుటకు సూపర్ వైజర్ కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత కలదు. ✆ 70753 38338.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

WANTED

పల్నాడు జిల్లా వినుకొండలోని ప్రభుత్వ చీఫ్ విప్ గారి కార్యాలయంలో ఈ క్రింద పేర్కొన్న ఉద్యోగాలకు దరఖాస్తులు కోరటమైనది. ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును ఈ క్రింది మొబైల్ నెంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపగలరు. అనుభవం మరియు అర్హతను బట్టి మంచి జీతం ఇవ్వబడును.

ఖాళీలు
1. పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ & సోషల్ మీడియా స్పెషలిస్ట్
2. కంప్యూటర్ ఆపరేటర్ (ఇంగ్లీష్ డ్రాఫ్టింగ్)
3. వ్యక్తిగత సర్వర్

దరఖాస్తులు పంపవలసిన మొబైల్ నెంబర్: 96183 22244
కావున ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 12వ తేదీలోగా మీ దరఖాస్తులు పంపవలసినదిగా కోరటమైనది.

ENGINEERING

పల్నాడు జిల్లా తాళ్లపల్లె గ్రామం మాచర్ల దగ్గర్లో పనిచేయుటకు సివిల్ ఇంజనీర్ కావలెను. Exp 3 సంII జీతం: 35000/-. Cont: 8688010673

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

నరసరావుపేట

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

ఘనంగా ఏకలవ్యుడి జయంతి

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతిని ఆదివారం నిర్వహించారు. ఎన్ఆర్‌టీ కూడలి వద్ద ఏకలవ్యుడి విగ్రహానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పూలదండ వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలోని బొప్పూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన షాహెన, ఇమ్రాన్‌లకు క్షత్రియ సేవాసమితి నాయకులు అల్లూరి సీతారామరాజు, కృష్ణమూర్తి రాజు ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేశారు. విశ్రాంత హెచ్.ఎం బి. వెంకటేశ్వర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'రోటరీ' కార్యవర్గం

చిలకలూరిపేట పట్టణం: చిలకలూరిపేట రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం రోటరీ కమ్యూనిటీ హాలులో జరిగింది. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఉప్పుటూరి ప్రసాద్, బోడి రామసుబ్బారావు, కోశాధికారిగా కుకల శివరామప్రసాద్‌తో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు పూర్వ అధ్యక్షులు అందజేసిన రూ.25వేల నగదు ఆర్థిక సాయం పంపిణీ చేశారు. పండరీపురం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బోనం వెంకటేశ్వరరావు, దొడ్డ మనోజ్‌కుమార్, కోశాధికారిగా జంపని శివాజీ సరాఫ్ ఎన్నికయ్యారు. ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పాల్గొని నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156

యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలో ప్రకాష్‌నగర్ రిక్షా సెంటర్‌లో రోజూ సాయంత్రం సమయంలో దుకాణాల ఎదుట వాహనాలు నిలిపేస్తున్నారు. దీంతో బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్ వెళ్లే మార్గంలో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- ప్రసాద్** ✔ ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యకు కారణమయ్యే వారిని గుర్తించి జరిమానా విధిస్తాం. మరోసారి నిలపకుండా చర్యలు తీసుకుంటాం. **- లోకనాథం, ట్రాఫిక్ సీఐ** - న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్

? పట్టణంలో సాంబశివనగర్ నీళ్ల ట్యాంక్ బజారులో పగటిపూటే విద్యుత్తు స్తంభాలకు దీపాలు వెలుగుతున్నాయి. **- వెంకట్రావు** ✔ పరిశీలించి విద్యుత్తు వృథా అరికట్టేందుకు చర్యలు చేపడతాం. **- అల్తాఫ్, పురపాలకసంఘ ఏఈ** - న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

? మండలంలో జగ్గాపురం ఎస్సీ కాలనీలోని శ్మశానవాటికలో కంప చెట్లు మొలిచి అంత్యక్రియలకు ఇబ్బందిగా ఉంది. **- స్థానికులు** ✔ శ్మశానవాటికలో చెట్లను తొలగించి ఇబ్బంది లేకుండా చూస్తాం. **- నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, యడ్లపాడు

? పట్టణంలో బరంపేట శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవస్థానం ఎదుట డ్రెయినేజీలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. **- లక్ష్మి, భక్తురాలు** ✔ సిబ్బందిని పంపి పూడిక తీయిస్తాం. **- సురేష్, 33వ వార్డు పారిశుద్ధ్య అధికారి** - న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట)

? గ్రామంలో అన్ని వీధుల్లో విద్యుత్తు బల్బులు నిరంతరాయంగా వెలుగుతూనే ఉన్నాయి. పగలు ఆర్పే విధంగా ఏర్పాటు చేయాలి. **- గ్రామస్థులు, నరగాయపాలెం** ✔ బల్బులు ఆఫ్, ఆన్ చేసేందుకు సాంకేతిక సమస్య ఉంది. త్వరలో పరిష్కరిస్తాం. **- సుందరరెడ్డి, ఈవోపీఆర్డీ** - న్యూస్‌టుడే, వినుకొండ రూరల్

? నరసరావుపేట శ్రీరాంపురం మార్కెట్‌కు వెళ్లే దారిలో రోడ్డుపైనే చెత్త డబ్బాలు ఉంచుతున్నారు. వాహనాల రాకపోకల్లో ఇబ్బందిగా ఉంటుంది. **- రామారావు, వాహనచోదకుడు** ✔ సిబ్బందిని చెప్పి డబ్బాలు రోడ్డు పక్కన పెట్టిస్తాం. **- రమాదేవి, పారిశుద్ధ్య అధికారి** - న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట)

? నూజండ్లలో కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో చిన్నారులు, వృద్ధులు ఇంటి నుండి బయటకు రావాలంటే జంకుతున్నారు. **- వెంకట్రావు, నూజండ్ల** ✔ కుక్కలను పట్టించి అడవుల్లో వదిలివేస్తాం. సంతాన నిరోధక చికిత్సలు చేయిస్తాం. **- ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, నూజండ్ల

జగ్జీవన్‌కు ఘన నివాళి

వినుకొండ, న్యూస్‌టుడే: బాబూ జగ్జీవన్‌రామ్ పాలన దక్షుడిగా పేరు తెచ్చుకున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. జగ్జీవన్ వర్ధంతి సందర్భంగా పురపాలకసంఘ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జీడీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావు, జాషువా సమాఖ్య అధ్యక్షుడు జాన్‌సుందరరావు ఉన్నారు.

పోరాట పటిమ చాటుతాం

థల్‌సైనిక్ శిబిర సన్నాహక పోటీలకు నరసరావుపేట క్యాడెట్లు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే

ఎన్‌సీసీ అధికారులతో క్యాడెట్లు

నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ఎన్‌సీసీ డైరెక్టరేట్ పరిధిలో అంతర్గత పోటీల్లో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంతో కఠినమైన థల్‌సైనిక్ శిబిరానికి క్యాడెట్లను ఎంపిక చేసేందుకు రాష్ట్రస్థాయి పోటీలను నేటి నుంచి ఈనెల 16వ తేదీ వరకు అనంతపురంలో శిబిరం నిర్వహించనున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 500 మంది క్యాడెట్లు పోటీలకు హాజరవుతారు. గుంటూరు గ్రూపు నుంచి 700 మంది క్యాడెట్లకు గాను 42 మందిని ఎంపిక చేశారు. వారిలో ఎన్‌సీసీకి చెందిన పది మంది ఉన్నారు. జాతీయ స్థాయి థల్‌సైనిక్ శిబిరానికి ఎంపిక చేసేందుకు వివిధ అంశాల్లో క్యాడెట్లకు పోటీలు నిర్వహిస్తారు. వాటిలో అడ్డంకుల పరుగు, పర్వతారోహణ, మ్యాప్ రీడింగ్, దేహదారుఢ్యం, మానసిక సామర్థ్యం, దూరాన్ని అంచనా వేయడం, వివిధ వాతావరణాల్లో గుడారాల ఏర్పాటు, ఫైరింగ్ పోటీలు ఉంటాయి. వాటిల్లో ప్రతిభ చాటిన క్యాడెట్లను దిల్లీలో నిర్వహించే థల్ సైనిక్ శిబిరానికి ఎంపిక చేస్తారు. సైన్యంలో చేరాలనుకునే వారికి మంచి అవకాశంగా థల్‌సైనిక్ శిబిరాన్ని భావిస్తారు. సన్నాహక పోటీలకు వెళుతున్న వారిలో పలువురి మనోగతం ఇలా..

సైనికాధికారి కావడం లక్ష్యం

మాది వ్యవసాయ కుటుంబం. చిన్నతనం నుంచి సైన్యంలో చేరాలన్న కోరిక ఉంది. అందుకే ఎన్‌సీసీ శిక్షణ తీసుకుంటున్నా. ఏడాదిగా కంపెనీ మేజర్ సార్జెంట్ (సీఎంఎస్)గా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. భవిష్యత్తులో సైన్యంలో చేరి దేశరక్షణ బాధ్యతల్లో భాగం పంచుకోవాలన్నదే లక్ష్యం. 2024లో కర్ణాటకలో వైట్ వాటర్ ర్యాఫ్టింగ్ శిబిరంలో పాల్గొన్నాను.

- సీహెచ్ మణికుమార్, బీటెక్ (ద్వితీయ, సైబర్ సెక్యూరిటీ), అచ్చయ్యపాలెం, రొంపిచర్ల మండలం

దేశసేవ చేస్తా

మాది వ్యవసాయ కుటుంబం. విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచడంతో పాటు ఎన్‌సీసీ క్రమశిక్షణ నేర్పుతుంది. సార్జెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. సైన్యంలో చేరి సాంకేతిక విభాగంలో సేవలందిస్తా. 2024లో కర్ణాటకలో వైట్ వాటర్ ర్యాఫ్టింగ్ శిబిరంలో పాల్గొన్నాను.

- జి.కిశోర్‌బాబు, బీటెక్ (ద్వితీయ, ఈసీఈ), కనపర్రు, నాదెండ్ల మండలం

ఉన్నతాధికారినవుతా

పాఠశాల స్థాయి నుంచి ఎన్‌సీసీలో ఉన్నాను. చదువుతో పాటు ఆత్మవిశ్వాసంతో ఉండడం, సమస్యను ధైర్యంగా ఎదుర్కోవడం అలవడుతాయని కళాశాలలో ఎన్‌సీసీలో చేరా. జూనియర్ అండర్ ఆఫీసర్ బాధ్యతలు నిర్వహిస్తున్నాను. జాతీయస్థాయి బాలికల ట్రెక్కింగ్ శిబిరానికి వెళ్లా. ప్రభుత్వ రంగంలో ఉన్నతాధికారి కావాలన్నదే లక్ష్యం.

- పి.గీతాసాయి శ్రీవల్లి, బీటెక్ (ద్వితీయ, సీఎస్ఈ), చిలకలూరిపేట

ముందు జాగ్రత్తలతో తిరునాళ్ల విజయవంతం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ముందు జాగ్రత్త చర్యలతో తొలి కొండ తిరునాళ్లను ఆదివారం ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేశామని అదనపు ఎస్పీ సంతోష్ తెలిపారు. శనివారం రాత్రి నుంచి కొండపైన, పట్టణంలో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని ముఖ్య కూడళ్లతో పాటు జనం రద్దీగా ఉండే చోట్ల 11 లా అండ్ ఆర్డర్ పికెట్లు, 45 ట్రాఫిక్ పాయింట్లు, 10 సంచార (ద్విచక్ర వాహనాలతో) బృందాలు, ఎస్సైల పర్యవేక్షణలో ఆరు ప్రత్యేక బృందాలు, నాలుగు చక్రాల వాహనాలతో మూడు బృందాలు, కొండపైన వాలింటరీ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కొండకు వచ్చే వారితో పాటు అవసరమైన చోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఆరు పార్కింగ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. నిర్దిష్ట సమయానికి యాత్రికులు, హోటళ్లు మూసి అందరూ సహకరించినట్లు చెప్పారు. తనతో పాటు నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, పట్టణ, రూరల్ సీఐలు శోభన్‌బాబు, ప్రభాకర్ నిత్యం అన్ని ప్రాంతాల్లో తిరుగుతూ సిబ్బందికి సూచనలు చేశారన్నారు. గత అనుభవాల దృష్ట్యా పట్టు ప్రభలకోసం ప్రాంతాల వారీగా విభజించి బందోబస్తు ఏర్పాటు చేయడంతో సత్ఫలితాలు ఇచ్చాయని డీఎస్పీ పేర్కొన్నారు. రాత్రి 8 గంటల నుంచి జూనియర్ కళాశాల, ఎన్ఎస్పీ మైదానంలో 50 శాతం సిబ్బంది ఉండేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా రద్దీ నియంత్రణ

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా కోటప్పకొండకు భక్తులు పోటెత్తారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా గ్రామీణ పోలీసులు చర్యలు చేపట్టారు. నరసరావుపేట, చిలకలూరిపేట వైపు నుంచి కోటప్పకొండ వచ్చే వాహనాలను కొండ దిగువన కొండకావూరు వెళ్లే మార్గం నుంచి పార్కింగ్ ప్రాంతానికి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. పార్కింగ్ ప్రాంతం వద్ద నుంచి బస్సుల్లో కొండపైకి భక్తులు చేరుకున్నారు. పెట్లూరివారిపాలెం వైపు నుంచి వచ్చే వాహనాలను కొండ దిగువన పార్కింగ్ ప్రాంతంలో నిలిపి అక్కడి నుంచి భక్తులను బస్సుల్లో కొండపైకి పంపారు. దీంతో భక్తులు ప్రశాంతంగా స్వామిని దర్శించుకున్నారు.

నేటి నుంచి పశుగ్రాస వారోత్సవాలు

శావల్యాపురం: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో సోమవారం నుంచి ఈనెల 14 వరకు పశు గ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు, వేల్పూరు పశువైద్యశాల వైద్యాధికారి పాలపర్తి గణేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పశు పోషకులు, రైతులకు వివిధ రకాల గడ్డి పెంపకంతో పాటు, అధిక పాల ఉత్పత్తికి దోహదపడే మేలైన గడ్డి జాతుల గురించి వివరిస్తామన్నారు.

తెదేపా నేతకు సీఎం పరామర్శ

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ (రాము)ను సీఎం చంద్రబాబు ఆదివారం పరామర్శించారు. ఆయన తండ్రి జేడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్మన్ నల్లపాటి శివరామచంద్రశేఖరరావు ఇటీవల మృతి చెందారు. ఈనేపథ్యంలో రాముకు సీఎం ఫోన్ చేసి మాట్లాడారు. శివరామ చంద్రశేఖరరావు ఆరోగ్య పరిస్థితి, అందించిన వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన సంతాపం తెలిపారు. చంద్రశేఖరరావు మరణం బాధాకరమని, ధైర్యంగా ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కూటమి ప్రభుత్వ పాలనతో నవశకం

చిలకలూరిపేట పట్టణం, రొంపిచర్ల, నూజండ్ల, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనతో నూతన శకం ప్రారంభమైందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో 21, 23, 24 వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కాలువల్లో పూడిక తీయకపోవడంపై పురపాలక సిబ్బందిని ప్రశ్నించారు. రొంపిచర్ల మండలం అలవాల, కొనకంచివారిపాలెంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. నూజండ్ల మండలం తలార్లపల్లెలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు వైకాపా హయాంలో అరాచక రాజ్యమేలిందన్నారు. ఆయన వెంట జీడీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ఉన్నారు.

చిలకలూరిపేట: మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

కరపత్రం అందజేస్తున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల, మార్కెట్‌యార్డు ఛైర్మన్ రాణి తదితరులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

రొంపిచర్ల, నూజండ్ల, న్యూస్‌టుడే: మతసామరస్యం, త్యాగానికి ప్రతిరూపమైన మొహర్రం పండగను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లో ముస్లింలు సంతాప దినాలు ఆచరించారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. పీర్లు ఎత్తుకొని యువకులు గ్రామాల్లో డప్పులతో ఊరేగించారు. నిప్పుల గుండాలను ఏర్పాటు చేసి అందులో నడిచి భక్తిని చాటారు.

రొంపిచర్ల: విద్యుత్తు దీపాల అలంకరణలో పీర్లచావిడి

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

చిలకలూరిపేట గ్రామీణ: మండలంలో పసుమర్రు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల దృష్ట్యా పెదనందిపాడు రోడ్డు, మానుకొండవారిపాలెం రోడ్డు, పసుమర్రు రోడ్డు, గొట్టిపాడు రోడ్డులోని శీతల గిడ్డంగులు, చిన్న, భారీ పరిశ్రమలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, నాదెండ్ల ఉపకేంద్రం పరిధిలో ఫీడర్ల మరమ్మతుల దృష్ట్యా చిరుమామిళ్ల, జంగాలపల్లి, సంకురాత్రిపాడు గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు.

సర్పాలకు ఆవాసం కాదా?

నరసరావుపేట పట్టణంలో ఖాళీ స్థలాలు చిట్టడవుల్లా మారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నరసరావుపేట ఎస్టీవో కాలనీ ఐదో లైనులో ఈ పరిస్థితి ఉంది. పిచ్చిమొక్కల మధ్య విషసర్పాలు ఆవాసం ఏర్పరుచుకుని సమీప ఇళ్లలోకి వస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు వాపోతున్నారు. అధికారులను అడిగితే యజమానులకు నోటీసులు ఇస్తున్నామని చెబుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పారిశుద్ధ్య అధికారి రామకోటయ్యను అడగ్గా పిచ్చిమొక్కలు తొలగిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట)

ఆదమరిస్తే.. అంతే

చిలకలూరిపేట పట్టణం సుగాలీకాలనీ ప్రధాన రహదారి నుంచి ఆది ఆంధ్రా కాలనీకి వెళ్లే మూల మలుపు వద్ద మురుగు కాలువ ప్రమాదకరంగా మారింది. రెండు రోడ్లు కలిసే ప్రాంతంలో కాలువ వెడల్పుగా ఉండడం, దానిపై ఎలాంటి సిమెంట్ దిమ్మెలు లేకపోవడంతో మలుపు తిరిగే సమయంలో వాహనాలు కాలువలోకి దూసుకెళ్తున్నాయి. సమస్యను పురపాలక సంఘ ఏఈ అల్తాఫ్ దృష్టికి తీసుకెళ్లగా కాల్వపై దిమ్మె ఏర్పాటు చేసి ప్రమాదం లేకుండా చూస్తామన్నారు. - న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

కాలువ ఇలా... వ్యాధులు ప్రబలవా..?

చిలకలూరిపేట పట్టణం నుంచి నరసరావుపేట వెళ్లే మార్గంలో బైపాస్ సమీపంలో ప్రధాన కాలువలో రోజుల తరబడి మురుగునీరు నిల్వ ఉండి పచ్చగా మారింది. దీని వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. కాలువ పిచ్చిమొక్కలు, పూడికతో నిండి ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై పారిశుద్ధ్య అధికారి రమణరావును సంప్రదించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

కర్ర పుల్లతో ప్రమాదం ఆగేనా!

నరసరావుపేట పట్టణం బాలయ్య నగర్ చివరి లైనులో భూగర్భ డ్రెయినేజీపై మూత పూర్తిగా పగిలిపోయింది. దీంతో ఓ కర్రకు ఎర్రవస్త్రం కట్టి గుంతలో ఉంచడమే కాక రాయి అడ్డుగా ఉంచారు. ఈ గుంత వీధి మలుపులో ఉండటం రాత్రిళ్లు సరిగా కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయని ద్విచక్ర వాహన చోదకులు వాపోతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ ఏఈ జ్యోతి దృష్టికి తీసుకెళ్లగా డ్రెయినేజీపై మూత ఏర్పాటు చేస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

పదిలో ప్రతిభావంతులకు చేయూత

సాయం అందుకున్న విద్యార్థులు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : చిలకలూరిపేటలోని శ్రీవిద్య మిత్రమండలి ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన 34 మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను ఆదివారం అందజేశారు. స్థానిక పింఛనర్ల సంఘ భవనంలో జరిగిన కార్యక్రమంలో శ్రీవిద్య మిత్ర మండలి అధ్యక్షురాలు మర్రి లలిత మాట్లాడుతూ పేద విద్యార్థులకు మిత్రమండలి ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. 75 మంది మహిళలు గ్రూపుగా ఏర్పడి 2008 నుంచి ఏటా క్రమం తప్పకుండా సాయం అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రతిభ చూపిన 33 మంది విద్యార్థులలకు ఒక్కొక్కరికి రూ.5వేలు వంతున, నియోజకవర్గ ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినికి రూ.10వేలు మొత్తం రూ.1,75,000 అందజేశారు. కార్యక్రమంలో మండలి కోశాధికారి కృష్ణకుమారి, సభ్యులు ధనలక్ష్మి, ఉషారాణి, లక్ష్మీప్రసన్న, పద్మావతి, రాజేశ్వరి, సుభాషిణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న తెదేపా నేతలు

నూజండ్ల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, జీవీ ఆంజనేయులు ప్రభుత్వ చీఫ్‌విప్‌గా ఎన్నికైనందున ముప్పరాజుపాలెం గ్రామస్థులు మొక్కులు తీర్చుకున్నారు. పీర్ల స్వామి గుడి వద్ద 108 కొబ్బరి కాయలు కొట్టారు. మాజీ ఎంపీపీ బొట్ల అంజయ్య, సర్పంచి నిడమానూరి మాధవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బొప్పూడి కొండపై వెంకన్న కల్యాణం

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని చిలకలూరిపేట మండలం బొప్పూడి కొండపై కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో కొండపై పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

అలంకృతుడైన కల్యాణ వేంకటేశ్వరస్వామి

కొండపైకి వెళుతున్న భక్తులు

అభిషేకం.. అలంకారం.. అర్చన

వైభవంగా తొలి ఏకాదశి పర్వదినం

చిలకలూరిపేట పట్టణం, వినుకొండ, రొంపిచర్ల, యడ్లపాడు, నూజండ్ల, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లోని మండలాల్లో పలు దేవాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినుకొండలో కొండ మెట్ల వద్ద వరసిద్ధి వినాయక ఆలయంలో మూలవిరాట్‌ను అలంకరించారు. లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్ఫటిక లింగేశ్వరస్వామికి అభిషేకం నిర్వహించారు. బోసుబొమ్మ సెంటర్లోని శిర్డీసాయి మందిరంలో 151 కలశాలతో తెచ్చిన పంచామృతాలతో అభిషేకం చేశారు. చిలకలూరిపేట ఆర్యవైశ్య కల్యాణ మండపంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు పేలాల పిండిని ప్రసాదంగా అందజేశారు. యడ్లపాడు మండలంలో వైష్ణవాలయాల్లో స్వామికి అలంకరణ చేశారు. రొంపిచర్ల, నూజండ్ల మండలాల్లో పలు ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు సాగాయి.

ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరుడు

నూజండ్ల చెన్నకేశవస్వామికి పూజలు

రొంపిచర్లలో శంకరస్వామికి విశేష అలంకరణ

ఆకట్టుకున్న మొక్కుబడి ప్రభ

వినుకొండ, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి సందర్భంగా వినుకొండ తిరునాళ్లకు ఇద్దరు యువకులు తయారు చేసిన మొక్కుబడి ప్రభ చూపరులను ఆకట్టుకుంది. పాతమార్కెట్ బజారులోని పానుగంటి రామారావు కాంప్లెక్స్‌లో ఉంటున్న సేతుమాధవ్ ఆయన బంధువు చిలకలూరిపేటకు చెందిన ఉమాశంకరశాస్త్రి వెదురు దబ్బలతో ప్రభ, చెక్కలతో రథం తయారు చేసి దానికి అట్టలతో మందిరం కట్టి బల్బులు ఏర్పాటు చేశారు. ఇందుకు సుమారు రూ.25వేలు ఖర్చయిందని తెలిపారు.

స్వచ్ఛంద సేవలు.. కొండపైన వీహెచ్‌పీ, ఆలయ కమిటీ సంయుక్తంగా భారీ అన్నదానం నిర్వహించగా హనుమాన్‌నగర్ వద్ద పేలాల పిండి, కారంపూడి రోడ్డులో రెడీమేడ్ వ్యాపారుల సంఘం అల్పాహారం, బాలాజీ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో పాయసం పంపిణీ చేశారు.

చీకటిగా వీధులు.. రెచ్చిపోతున్న చోరులు

జిల్లా కేంద్రంలో ప్రజల బెంబేలు

☛ నరసరావుపేటలోని పాతూరు గానుగల బజార్‌లో వారం క్రితం ఓ ఇంటి తాళాలు పగలగొట్టి దుండగులు బంగారం, వెండి ఆభరణాలు అపహరించారు. ఆ వీధిలో దీపాలు వెలగక అంధకారంగా ఉండడంతో వారి పని మరింత సులువైంది.

☛ పట్టణంలో బరంపేట మూడు బావుల సెంటర్ వద్ద దుండగులు వెలుగుతున్న వీధి దీపాలు ఆపి ఓ ఇంటి ముందు ద్విచక్రవాహనం తీసుకెళ్లారు.

బాలయ్య నగర్‌లో పట్టపగలే వెలుగుతున్న వీధి దీపం

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేటలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. శివారు ప్రాంతాల్లో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతుండడంతో విద్యుత్తు వృథా అవుతోంది. ఇదిలా ఉంటే ప్రధాన రహదారుల్లో రాత్రిళ్లు దీపాలు వెలగడం లేదు. దీంతో దొంగల స్వైరవిహారం, కుక్కల బెడదతో అల్లాడుతున్నామని, రాత్రిళ్లు కుక్కలు వెంట పడి కరుస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొన్నిసార్లు ద్విచక్రవాహనాలకు కుక్కలు అడ్డు రావడంతో కింద పడి గాయాలపాలవుతున్నామని, అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

అరండల్‌పేట ఓ వీధిలో వెలగని దీపాలు

తరచూ దొంగతనాలు

ఇటీవల పట్టణంలో దొంగతనాలు పెరిగిపోతున్నాయి. ఇళ్ల ముందు నిలిపి ఉంచిన బైక్‌లు చోరీ అవుతున్నాయి. సకాలంలో విద్యుత్తు బిల్లులు, పన్నులు చెల్లిస్తున్నా వీధి దీపాల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పగటి వెలుగులు ఎక్కడంటే..

పట్టణ శివారు ప్రాంతాల్లో ఎన్టీఆర్ నగర్, ఎస్ఆర్‌కేటీ, కోడెల శివప్రసాదరావు కాలనీ, బాలయ్య నగర్, శ్రీనివాస గిరిజన, బరంపేట తదితర ప్రాంతాల్లో పట్టపగలు వీధి దీపాలు వెలుగుతూ విద్యుత్తు వృథా అవుతుంది. ఈ ప్రాంతాల్లో వీధి దీపాల నిర్వహణపై అధికారులను అడిగితే మున్సిపల్, పంచాయతీ సిబ్బంది ఒకరిపై ఒకరు సాకులు చెబుతున్నారని స్థానికులు తెలిపారు.

సక్రమ నిర్వహణపై దృష్టి

పట్టణంలో వీధి దీపాలు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తున్నామని వీధి దీపాల నిర్వహణాధికారి శేఖర్ తెలిపారు. వెలగని వీధి దీపాలు గుర్తించి కొత్తవి అమర్చుతామన్నారు. పగటి సమయంలో విద్యుత్తు వృథా కాకుండా అరికడతామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

శిలాఫలకం ధ్వంసంపై ఫిర్యాదు

రొంపిచర్ల, న్యూస్‌టుడే: మండలంలోని వీరవట్నంలో నీటి వినియోగదారుల సంఘ కార్యాలయం ఎదుట ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు వెలగటూరి వెంకట నారాయణ తెలిపిన మేరకు వివరాలు.. గ్రామంలో 2016వ సంవత్సరంలో అప్పటి శాసన సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు చేతుల మీదుగా నీటి వినియోగదారు సంఘం కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దీనిని గ్రామానికి చెందిన ముగ్గురు గడ్డపారలతో పూర్తిగా ధ్వంసం చేశారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని గ్రామంలో శాంతి భద్రతలను కాపాడాలని ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

మల్లమ్మసెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: పట్టణంలో కాకుమాను వీధికి చెందిన 17ఏళ్ల బాలిక అదృశ్యంపై ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఈనెల 5వతేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన కుమార్తె తిరిగి రాలేదని, బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ లభించలేదని బాలిక తల్లి ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేల్పూరులో నేత్రదానం

వేల్పూరు(శావల్యాపురం), న్యూస్‌టుడే : మండలంలో వేల్పూరుకు చెందిన **ఓబూరి రామాంజనేయులు** (55) అనారోగ్య కారణాలతో ఆదివారం మృతిచెందారు. ఆయన నేత్రాలు దానం చేసేందుకు నిర్ణయించిన కుటుంబ సభ్యులు అమ్మ, అవయవ, శరీరదాన ప్రోత్సాహక సంఘం పల్నాడు జిల్లా కోఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావును సంప్రదించగా ఆయన పెదకాకాని శంకర కంటి నేత్రాలయం వారికి సమాచారం ఇచ్చారు. వైద్యాధికారి బృందం గ్రామానికి చేరుకుని మృతుడి నుంచి కార్నియా సేకరించారు. నేత్రదానం చేసిన రామాంజనేయులు కుటుంబ సభ్యులను గ్రామపెద్దలు అభినందించారు.

(c) eenadu

సత్తెనపల్లి
• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

మస్తాన్ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న వాసుబాబు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ తరఫున అప్రైజర్ మస్తాన్ కుటుంబానికి రూ.1.05 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు ఆ సంఘ రాష్ట్ర నూతన అధ్యక్షుడు శిరసాల వాసుబాబు తెలిపారు. ఆదివారం బాధితులకు సొమ్ము అందజేశారు.

పేదల అభ్యున్నతికి కృషి

తమ్మవరం(పెదకూరపాడు): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యం అని పెదకూరపాడు మండల తెదేపా అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. ఆదివారం తమ్మవరం, కాశిపాడు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.

అచ్చంపేట: కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిలో ముందంజలో ఉందని మండల తెదేపా అధ్యక్షుడు ఆళ్వారం, నాయకుడు కోటయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం అచ్చంపేట వాగుఒడ్డు 58వ వార్డులో ఇంటింటా ప్రచారం చేశారు. ఏడాదిలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శామ్యూల్, సుబ్బారావు, ఆంజనేయులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? మాచర్ల పాతూరు రథం సెంటర్లో దోమలు ఎక్కువగా ఉన్నాయి. ప్రజలు జ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. దోమల నివారణ చర్యలు చేపట్టాలి. - **రత్తయ్య, మాచర్ల** ✔ దోమల నివారణ చర్యలకు ఉపక్రమిస్తున్నాం. సోమవారం నుంచి అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. - **వేణుబాబు, కమిషనర్** ? నాగిరెడ్డి వాగు వంతెనపై విద్యుత్తు దీపాలు లేక రాత్రి వేళల్లో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. - **అమరయ్య, కారంపూడి** ✔ వంతెనపై దీపాలు ఏర్పాటు చేస్తాం. - **కె.వెన్నానాయక్, కార్యదర్శి - న్యూస్‌టుడే, మాచర్ల (కారంపూడి)**

? ఒటువేమనపల్లి బీసీ కాలనీలో బోరులో నీరు సక్రమంగా రావడం లేదు. సమస్యను పరిష్కరించాలి. - **వెంకటేశ్వర్లు, ఆ ప్రాంత వాసి** ✔ విషయం నా దృష్టికి వచ్చింది. ప్రత్యామ్నాయ మార్గం చూసి, నీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. - **గోపాల్ సింగ్, ఏఈ** ? అడిగొప్పలలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మురుగు కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోయింది. - **శ్రీనివాసరావు** ✔ వెంటనే సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయిస్తాం. - **దుర్గారావు, కార్యదర్శి - న్యూస్‌టుడే, దుర్గి**

? దరివేకోటలోని కొండవీటి నగర్లో విద్యుత్తు తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. - **కాలనీ వాసులు** ✔ సిబ్బందిని పంపి వెంటనే తీగలు సరిచేసి సమస్య పరిష్కరిస్తాం. - **రవికిరణ్, ఏఈ - న్యూస్‌టుడే, అమరావతి**

? గురజాల దండివాగుపై వీధి దీపాలు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. వంతెన పరిసరాలు పుట్‌పాత్ పాడైపోయింది. నడవడానికి ఇబ్బందిగా ఉంది. - **రామకృష్ణారావు, గురజాల** ✔ వంతెనపై దీపాలు ఏర్పాటు చేస్తాం. పుట్‌పాత్‌పై గోతులను పూడ్పిస్తాం. - **శివన్నారాయణరావు, కమిషనర్ - న్యూస్‌టుడే, గురజాల**

? సొరంగపల్లి అగ్రహారం గ్రామంలో పలు వీధుల్లో మురుగు కాలువలు పూడికతో నిండిపోయాయి. దుర్వాసనతోపాటు దోమలు పెరుగుతున్నాయి. - **రాజేష్, స్థానికుడు** ✔ సిబ్బందితో వెంటనే మురుగు కాలువల్లో పూడిక తొలగించేలా చర్యలు తీసుకుంటాం. దోమల నివారణ పనులు చేస్తాం. - **సైదా రాజు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, దాచేపల్లి**

? వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రుళ్లు ఇబ్బందులు పడుతున్నాం. - **శివలింగాపురం వాసులు** ✔ త్వరలో దీపాలు ఏర్పాటు చేయిస్తాం. - **చంద్రయ్య, కార్యదర్శి - న్యూస్‌టుడే, వెల్దుర్తి**

సేంద్రియం.. ఆరోగ్యకరం

ఇంట్లోనే ఎరువు తయారీ
ప్రభుత్వ ప్రోత్సాహం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పెరటి తోటల పెంపకానికి ఎరువు అవసరం. ఎక్కడికో వెళ్లి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఎరువు సేకరణలో తలెత్తే ఇబ్బందుల కారణంగా చాలా మంది పెరటి తోటల పెంపకానికి దూరంగా ఉంటున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సంకల్ప సాధనలో భాగంగా కూటమి ప్రభుత్వం ఇంటి వ్యర్థాలతో సేంద్రియ ఎరువును ప్రతిఒక్కరూ తయారు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. వ్యర్థాలు, పశువులు, కోళ్ల మలమూత్రాన్ని సేంద్రియ ఎరువుగా మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఇంటి పెరట్లో, పశువుల షెడ్డుల్లో, తోటల వద్ద ప్రత్యేక గుంతల్ని తవ్వించేందుకు కార్యాచరణ సిద్ధమైంది.

ఎరువు తయారీకి తీసిన గుంతలు

పైసా ఖర్చు లేకుండా..

పైసా ఖర్చు లేకుండా ఉపాధి హామీ నిధులతో సేంద్రియ ఎరువు తయారీ గుంతల్ని గ్రామీణ ప్రాంత ప్రజలు నిర్మించుకోవచ్చు. ప్రతి ఇంటి ఆవరణలో ఖాళీ స్థలం ఉంటుంది. అక్కడ గుంతల నిర్మాణానికి అనుమతి ఇస్తారు. కంపోస్టు (ఎరువు) గుంతలను రెండు రకాలుగా నిర్మిస్తున్నారు. ఇళ్ల వద్ద మీటరు వ్యాసార్థంతో వృత్తాకారంలో మూడు అడుగుల లోతున రెండు గుంతల్ని నరేగా సిబ్బంది తవ్విస్తున్నారు. వీటి మధ్య అడుగు నిడివి ఉంటుంది. ఇంట్లోని చెత్తాచెదారం, రాలిన ఆకులు, కుళ్లిన కూరగాయలు, పండ్లు, పొట్టు తదితర వాటిని గుంతలో వేసి నిండిన తరువాత మట్టితో కప్పేస్తారు. వెంటనే రెండో గుంతను వినియోగంలోకి తెస్తారు. ఆ వ్యర్థాలు మూడు నెలల్లో ఎరువుగా మారుతుంది. దాన్ని పూల మొక్కలు, ఆకు కూరలు, కూరగాయల మొక్కలకు వినియోగిస్తే నాణ్యమైన దిగుబడులు వస్తాయి.

➠ పశువులశాల, తోటల్లో 1.5 మీటర్ల చతురస్రాకారంలో మూడు అడుగుల లోతున గుంతను తవ్వి, అందులో పశువుల పేడ, మూత్రంతో తడిసిన చెత్త వేస్తారు. మూడు నెలలకు అది ఎరువుగా తయారవుతుంది. దీనిని సొంత పంటలకు వినియోగించుకునే వెసులుబాటు రైతులకు ఉంటుంది.

రెండురకాల ఉపయోగాలు

కంపోస్టు గుంతల ఏర్పాటు పనులపై అధికారులు దృష్టి సారించారు. వాటి ద్వారా రెండు రకాల ఉపయోగం ఉంటుంది. చెత్త, వ్యర్థాలు బయట వేయకపోవడంతో పారిశుద్ధ్యం మెరుగు పడుతుంది. అలాగే సేంద్రియ ఎరువుతో ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయి. జిల్లాలో 20 వేల కంపోస్టు గుంతల నిర్మాణం లక్ష్యంకాగా ఇప్పటివరకు 320 పూర్తి చేశారు. 1458 గుంతల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. కంపోస్టు గుంతల నిర్మాణాల్ని ప్రోత్సహిస్తున్నట్లు డ్వామా ఏపీడీ వెంకట నారాయణ చెప్పారు. రైతులు, పాడిపోషకులు, పర్యావరణ ప్రేమికులు ముందుకు రావాలని ఆయన కోరారు.

వ్యాయామ పరికరాలకు మరమ్మతు

స్పందనకు వందనం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: 'కదలని పరికరం. . ఆగిన వ్యాయామం' శీర్షికన ఈనాడులో గత నెల 24న కథనం ప్రచురితమైంది. దానికి స్పందించిన మున్సిపల్ అధికారులు బహిరంగ వ్యాయామశాలలో పరికరాలకు మరమ్మతులు చేయించారు. డబుల్ ఎయిర్ వాకర్‌కు బేరింగులు తెప్పించడానికి ఆర్డర్ పెట్టినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. అవి రాగానే పూర్తిస్థాయిలో బిగిస్తామని చెప్పారు. దీంతో పట్టణ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

అమరావతి, న్యూస్‌టుడే: బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు అమరావతి వ్యవసాయ పరిశోధన క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ద్రవ రూప జీవన ఎరువుల తయారీ విధానంపై అధికారి రవీంద్రరెడ్డి వివరించారు. ద్రవ రూప జీవన ఎరువుల వాడకంతో పంటలకు కలిగే లాభాలు వివరించారు. 168 మంది విద్యార్థులు హాజరయ్యారు. కళాశాల అధ్యాపకులు జాకబ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సత్కారం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు సాల్మన్‌రాజును స్థానిక బాగ్స్ మెమోరియల్ సెంటినరి బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా సంఘ స్వరం అనేక ఆధ్యాత్మిక మాసపత్రికను ఆవిష్కరించారు. రెవ.ఇశ్రాయేలు, రవిరాజు, కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు

కారంపూడి: జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ టీకాల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వైద్యులు దిలీప్ మాట్లాడుతూ పెంపుడు జంతువుల ద్వారా వ్యాధులు సంక్రమించకుండా టీకాలు వేస్తున్నామన్నారు.

గురజాల గ్రామీణ: గురజాల ప్రభుత్వ పశువుల వైద్యశాలలో ప్రత్యేక టీకా శిబిరం శిబిరాలు నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ ఏడీఏ సరోజదేవి ఆధ్వర్యంలో కుక్కలకు టీకాలు వేశారు. సుమారు 17 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేశామని వైద్యులు తెలిపారు.

ఇంటింటా సంక్షేమం.. కూటమి లక్ష్యం

అమరావతి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరాయని, అందుకే తమది మంచి ప్రభుత్వమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చావపాడులో సుపరిపాలనలో తొలిఅడుగు.. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. మహిళల నుంచి చక్కటి స్పందన లభించింది. పేదలను అభివృద్ధి వైపు తీసుకెళ్లాలని చంద్రబాబు తీసుకున్న పీ4 విజయవంతంగా అమలు అవుతుందన్నారు. తెదేపా నేతలు వెన్నా సాంబ శివారెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు రాజ, ధర్మారావు, నరేంద్ర, బాలరాణి పాల్గొన్నారు.

కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

రాష్ట్రంలో ప్రగతి పరుగులు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డితో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం 7వ మైలు, తాళ్లపల్లి, భైరవునిపాడు గ్రామాల్లో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలన గురించి వివరించారు. రాష్ట్ర తెదేపా ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్, అంజయ్య, పుల్లయ్య, శివారెడ్డి, వీరాస్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం అందజేస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

రూ.5.83 కోట్లతో భవన నిర్మాణాలకు శంకుస్థాపన

విజయపురిసౌత్: విజయపురిసౌత్‌లోని ఏపీఆర్‌జేసీలో రూ.5.83 కోట్లతో నూతనంగా నిర్మించే భవనాలకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఆచార్య నాగార్జునుడు నడయాడిన ప్రదేశంలో ఉన్న ఏపీఆర్‌జేసీ కళాశాల ఎంతో ప్రతిష్ఠాత్మకమైందన్నారు. 50 ఏళ్లు పూర్తి చేసుకోబోతున్న కళాశాలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఏపీఈడబ్ల్యూ ఐడీసీ ఛైర్మన్ రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపల్ సరోజిని, పూర్వ విద్యార్థుల సంఘం సెక్రటరీ వీరనంది, సైదారెడ్డి పాల్గొన్నారు.

మాచర్ల (కారంపూడి): ప్రజలతో మమేకమై ప్రజల అవసరాలకు తగ్గట్టుగా సంక్షేమ పథకాలు అందించటానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మాచర్ల పట్టణంలోని 9వ వార్డు కోడెల శివప్రసాదరావు కాలనీ సుపరిపాలనలో తొలిఅడుగు.. ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు.

తెదేపా మండల అధ్యక్షుడికి అభినందన

పెదకూరపాడు, న్యూస్‌టుడే: తెదేపా మండల అధ్యక్షుడిగా పెదకూరపాడుకు చెందిన సీనియర్ నాయకుడు ఏటుకూరి బ్రహ్మయ్య నియమితులయ్యారు. అందర్నీ సమన్వయం చేసుకుని మండల స్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఎమ్మెల్యే ప్రవీణ్ ఆయనకు సూచించారు. గతంలో ఆయన క్రోసూరు మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా పనిచేశారు. ఇప్పటివరకు అర్తిమళ్ల రమేష్ పార్టీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. ఈయన 22 ఏళ్లు సేవలు అందించారు. ఆదివారం పలువురు నాయకులు నూతన అధ్యక్షుడిని సత్కరించారు.

భక్తులతో కిటకిటలాడిన అమ్మసన్నిధి

దుర్గి, న్యూస్‌టుడే: నిదానంపాటి అమ్మవారి సన్నిధి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అమ్మసన్నిధిలో పొంగళ్లు చేసి, మొక్కులు చెల్లించారు. అమ్మవారి బిందె తీర్థం, అభిషేకాలు, నక్షత్రహారతి, చండీహోమం, పల్లకి సేవ కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు పోటీ పడ్డారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈవో ఆదిశేషనాయుడు పర్యవేక్షించారు.

వైద్య శిబిరానికి స్పందన

అమరావతి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని నెమలికల్లులో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో తెదేపా నేత యడ్లపల్లి రామ్మోహనరావు సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 250 మంది రోగులు హాజరుకాగా వైద్యులు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అహల్యా నర్సింగ్ హోమ్ వైద్యుడు ఉదయ్‌శంకర్ సూచించారు.

పుంత రోడ్డుకు మోక్షం

గ్రామీణ ప్రాంతాల్లోని పుంత రహదారులకు మోక్షం కలిగింది. పంట పొలాలకు వెళ్లే దారులు గుంతలతో నిండాయి. పంట ఉత్పత్తులను తరలించేందుకు అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిపై దృష్టి సారించింది. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చొరవతో జడ్పీ నిధులు రూ.30 లక్షలు కేటాయించగా బుచ్చయపాలెంలో 3 కిలోమీటర్ల డొంక రోడ్డు పనులు చేపట్టారు. హుస్సేన్‌నగరం తారురోడ్డు నుంచి బుచ్చయపాలెం ఎన్టీఆర్ విగ్రహం తీర్చిదిద్దారు. -న్యూస్‌టుడే, పెదకూరపాడు

పాచి పట్టిందయ్యా!

మండల పరిధిలోని యర్రబాలెం గ్రామంలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే ట్యాంకు పాచిపట్టి, అపరిశుభ్రంగా మారింది. నీరు కలుషితమై జనం రోగాల బారిన పడుతున్నారు. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం ఇది. అధికారులు స్పందించి ట్యాంకును శుభ్రం చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వెల్దుర్తి**

పాఠశాలలో వసతులు కల్పించరూ..

నకరికల్లు, న్యూస్‌టుడే: నకరికల్లులోని యానాది కాలనీ ప్రాథమిక పాఠశాలలో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ 40 మంది విద్యార్థులు ఉన్నారు. తరగతి గదిలో బండలు కుంగి, కూర్చోవడానికి అవస్థలు పడుతున్నారు. పురుగులు, కీటకాలు వస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఒక్కరే ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. తరగతి గదికి మరమ్మతులు చేయించాలని, మరో ఉపాధ్యాయుడిని నియమించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎంచక్కా ఆడుకోవచ్చు

9న ఇండోర్ స్టేడియం ప్రారంభానికి సన్నాహాలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పల్నాడు ప్రాంతంలో క్రీడాభివృద్ధికి పెద్దపీట వేసేలా చేపట్టిన మేజర్ స్టేడియం నిర్మాణంపై గత వైకాపా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. 2019లో సార్వత్రిక ఎన్నికలతో చివరి దశలో ఆగిన పనుల గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్టేడియం నిర్మాణంపై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దృష్టి సారించారు. ఇండోర్ స్టేడియాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు శాప్ అధికారులతో మాట్లాడారు. సుమారు రూ.6 లక్షలతో పనులు పూర్తి చేశారు. ఈనెల 9న రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి రాంప్రసాదరెడ్డితో ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరం కానుంది.

సిద్ధమైన షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి దేశ తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన కృషి మరువలేనిదని వక్తలు అన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలతోపాటు దళిత సంఘాలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాల్ని నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని ప్రజావేదికలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు.

మాచవరం: జగ్జీవన్ రామ్ వర్ధంతి ఆదివారం పిన్నెల్లి ఎస్సీ కాలనీలో నిర్వహించారు. కార్మిక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ అమర్‌నాథ్, కాలనీ పెద్దలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు దానయ్య, అన్నారావు, బాబారావు, సైదులు, ప్రభుదాసు పాల్గొన్నారు.

క్రోసూరు(అచ్చంపేట): దళితుల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి చేశారని మండల భాజపా అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాచవరం: మోర్జంపాడు బుగ్గమల్లేశ్వరుడు


సత్తెనపల్లిలో వేంకటేశ్వరుడు

పెదకూరపాడు: శాకంబరిగా దేశమ్మతల్లి

సత్రశాల మల్లయ్య స్వామి

పిడుగురాళ్ల: రాజరాజేశ్వరి దేవి

జంగమహేశ్వరపురంలో నరసింహస్వామి

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం అన్ని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు బారులు తీరి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. **- న్యూస్‌టుడే, బృందం**

కారంపూడి: లక్ష్మీనరసింహస్వామికి పూజలు

కేంద్ర బృందం పర్యటన

మాచవరం, న్యూస్‌టుడే: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ కేంద్ర బృందం మండలంలో పర్యటించింది. బృంద సభ్యులు మాచవరం, పిన్నెల్లి గ్రామాల్లో పర్యటించి డంపింగ్ యార్డులు, ప్రభుత్వ కార్యాలయాలు, లబ్ధిదారుల గృహాలను సందర్శించారు. వారి వెంట సర్పంచి నరేష్, పంచాయతీ కార్యదర్శులు కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు ఉన్నారు.

గంగమ్మ తల్లికి బోనాలు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: ఆషాఢమాసం ఆదివారం, తొలి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని గంగమ్మతల్లికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కనకదుర్గమ్మ ఆలయంలోనూ బోనాలు సమర్పించారు.


పిడుగురాళ్ల: గంగమ్మ తల్లి

రెంటచింతల: జెట్టిపాలెంలో బోనాల పండగ కనుల పండువగా చేశారు. నీలంపాటి అమ్మకి మొక్కులు చెల్లించారు.

జెట్టిపాలెంలో బోనాలతో ఊరేగింపు

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం జరుపుకొంటున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మాచర్లలోని పీర్ల అలంకరణకు సంబంధించిన సామగ్రిని ఆయన ప్రదర్శనగా తీసుకొచ్చి సమర్పించారు. పాతూరులోని పెదపీర్ల చావిడి ప్రధాన ద్వారం ఏర్పాటుకు రూ.70 వేలను ఎమ్మెల్యే అందించారు. అలాగే జెండా చెట్టు వద్ద ఉన్న చినపీర్ల చావిడి నిర్వహణకు రూ.40 వేల సాయాన్ని అందజేశారు.

అచ్చంపేట: స్థానిక గ్రామ పంచాయతీ సమీపంలోని పీర్ల చావిడిలో పీర్లను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. మొహర్రం సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.

బెల్లంకొండ: స్థానికులు పీర్లతో అగ్ని గుండాల చుట్టూ ప్రదక్షిణ జరిపి, ప్రత్యేకంగా అలంకరించారు. యువత వివిధ వేష ధారణతో ఆకట్టుకున్నారు.

పీర్ల అలంకరణ వస్తువులు తీసుకొస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి తదితరులు

మాచవరం: కుల, మతాలకు అతీతంగా పల్లెల్లో మొహర్రం నిర్వహించారు. ఆదివారం మాచవరం, గంగిరెడ్డిపాలెం, పిన్నెల్లి, తురకపాలెం, వేమవరం, రేగులగడ్డ, పిల్లుట్లలో పీర్లను ఊరేగించారు. గుండం చుట్టూ యువకులు అలావ్ తొక్కారు.

అదృశ్యమై.. కృష్ణానదిలో ప్రాణాలొదిలి!

రాజు (పాత చిత్రం)

అమరావతి, న్యూస్‌టుడే: ఇంటి నుంచి వెళ్లిన యువకుడు కనిపించకుండా పోయాడు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మరుసటి రోజు కృష్ణానదిలో శవమై తేలాడు. ఈ ఘటన వైకుంఠపురంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన కాశిమాల రాజు (33) శనివారం ఇంటి నుంచి వెళ్లాడు సాయంత్రం వరకు తిరిగిరాక పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్రంగా గాలించారు. లంక వైపు వెళ్లి ఉంటాడేమోనని ఆదివారం కృష్ణానదిలో వెతుకుతుండగా మృతదేహం నీటిపై తేలి కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వగా, మృతదేహాన్ని వెలికితీశారు. మృతికి కారణాలు తెలియరాలేదు.

ఆటో బోల్తా: ఒకరికి గాయాలు

కారంపూడి: పిడుగురాళ్ల మండలం గుత్తికొండ బిలానికి వెళ్లి వస్తున్న వెల్దుర్తి మండలం కండ్లకుంట గ్రామానికి చెందిన ఆటో బోల్తాపడి ఒకరికి గాయాలయ్యాయి. కండ్లకుంటకు చెందిన ఆటో డ్రైవర్ వీరయ్య తన కుటుంబంతో గుత్తికొండ వెళ్లి వస్తుండగా.. మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కకు పల్టీ కొట్టింది. ఈ ఘటనలో వీరయ్యకు గాయాలయ్యాయి.

ఇకపై పొదుపు సొమ్ము భద్రం

పెదకూరపాడు, న్యూస్‌టుడే

పెదకూరపాడులో స్త్రీనిధి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సీసీ ప్రసాద్

అందుబాటులోకి స్త్రీనిధి పేమెంట్ యాప్

స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి, రుణాల చెల్లింపుల్లో అక్రమాలకు తావులేకుండా కూటమి ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తోంది. డ్వాక్రా సంఘ సభ్యులు బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి రుణ వాయిదాల సొమ్ము ప్రతి నెలా సంఘ అధ్యక్షురాలు లేదా సీపీలకు అప్పగిస్తున్నారు. కొన్నిసార్లు ఆ సొమ్మును బ్యాంకుల్లో జమ చేయకుండా సీసీలు, కొందరు సంఘ సభ్యులు సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. కొన్నాళ్లకు విషయం వెలుగులోకి వచ్చినా, ఆ మొత్తాన్ని రికవరీ చేయడం కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నగదు రహిత సేవలకు ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా స్త్రీనిధి పేమెంట్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 1057

స్త్రీనిధి రుణానికి అర్హత సాధించిన సభ్యులు: 12,273

2025-26లో స్త్రీనిధి లక్ష్యం: రూ.122.60 కోట్లు

చరవాణిలో వివరాలు

బ్యాంకు, స్త్రీనిధి రుణ వాయిదాలను బ్యాంకుల్లో చెల్లిస్తున్నారు. ఆటో డెబిట్, పేటీఎంల ద్వారా కూడా చెల్లింపులు జరిగేవి. కొత్తగా స్త్రీనిధి పేమెంట్ యాప్‌తో సభ్యులు నెలవారీ వాయిదాలను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. వెంటనే చరవాణికి సంక్షిప్త సందేశం వస్తుంది. వెలుగు సంఘాల సభ్యులు ఈ యాప్‌ను ప్లే స్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గ్రామ సంఘాలు, స్వయం సహాయక సంఘాల వాయిదా చెల్లింపులు ఎలా జరుగుతున్నాయనే విషయాన్ని యాప్ ద్వారా తెలుసుకునే వీలుంది.

నగదు రహిత లావాదేవీలకు చర్యలు

నగదు రహిత లావాదేవీలే లక్ష్యంగా ప్రభుత్వం స్త్రీనిధి యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మహిళలకు అవసరమైన రుణాలను మొబైల్ టెక్నాలజీ, బయోమెట్రిక్ వంటి ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా 48 గంటల్లోనే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. **- నరసింహారావు, స్త్రీనిధి జిల్లా ఏజీఎం**

తూ.కొ.శాఖ అధికారుల దాడులు

పిడుగురాళ్ల: పట్టణంలోని చికెన్ దుకాణాలపై తూనికల కొలతల శాఖ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో ఎలక్ట్రానిక్ కాటాలను పరిశీలించగా.. తూకాల్లో మోసం చేస్తున్నారని గుర్తించారు. నలుగురు దుకాణాల యజమానులపై ఇన్‌స్పెక్టర్ షేక్ సైదా కేసులు నమోదు చేశారు.

యువకుడిపై దాడి

మాచవరం, న్యూస్‌టుడే: మాచవరం ఎస్సీ కాలనీకి చెందిన సాగర్‌పై శనివారం రాత్రి అదే కాలనీకి చెందిన జార్జి, మరో ఇద్దరు కలిసి ఇనుప రాడ్డుతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో సాగర్‌కు దెబ్బలు తగిలాయి. వెంటనే కుటుంబ సభ్యులు పిడుగురాళ్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతిరావు తెలిపారు.

ఏకదశ దినకర్మ

జననం 03-01-1971
మరణం 27-06-2025
కీ॥శే॥ మోడేపల్లి నాగభూషణ చారి
తండ్రి: కీ॥శే॥ మోడేపల్లి ఆంజనేయా చారి
చిరునవ్వుకు ప్రతిరూపమై అందరినీ ఆప్యాయంగా పలకరించి, కుటుంబ ఉన్నతికి శ్రమించిన మీ అకాల మరణం మమ్మల్ని కలచివేస్తుంది. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ.... శోకతప్త హృదయాలతో
భార్య : మోడేపల్లి పద్మ
కూతుళ్ళు - అల్లుడు
నాగప్రసన్న - -
రాజీ - శివ
అక్కలు: లక్ష్మమ్మ, సుందరమ్మ, అనంతమ్మ
మేనల్లుళ్ళు : K.V. రామాచారి, P. శ్రీరంగచారి
మనుమళ్ళు, మనుమరాళ్ళు మరియు బంధుమిత్రులు
వినాయకగుట్ట, మాచర్ల

(c) eenadu

పాఠం.. పడుకోవడం అంతా ఇందులోనే..!!

ఒకే గదిలో పాఠాలు, వసతి

అసంపూర్తిగా అదనపు భవనం

తరగతి

ఇదేంటి.. చూస్తే తరగతి గదిలా ఉంది. చుట్టూ దుస్తులు ఎందుకు ఆరేసి ఉన్నాయి? ఇదేగా మీ సందేహం. పాలకొండ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో గిరిజన ఆశ్రమ సంక్షేమ పాఠశాలలో దుస్థితి ఇది. ఇక్కడ 240 మంది విద్యార్థులు చదువుతున్నారు. వసతి గదులు చాలక.. తరగతుల నిర్వహణ, భోజనం, నిద్ర ఒకే గదిలో చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం పైఅంతస్తులో అదనపు భవనాల నిర్మాణానికి రూ.44 లక్షలు ఇస్తామని రూ.6.60 లక్షలు మాత్రమే విడుదల చేసింది. దీంతో పనులు కొంతమేరే జరిగాయి. ప్రాంతీయాసుపత్రి సమీపంలో రూ.8 కోట్లతో ప్రారంభించిన శాశ్వత భవన సముదాయ నిర్మాణం స్థల వివాదంతో పునాదుల్లోనే ఆగిపోయింది. అటు శాశ్వత వసతి సమకూరక.. ఇటు అదనపు భవనాలు పూర్తికాక విద్యార్థులు ఇలా ఇబ్బంది పడుతున్నారు. విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు కె.వరప్రసాదరావు వద్ద ప్రస్తావించగా సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించామన్నారు. - న్యూస్‌టుడే, పాలకొండ, గ్రామీణం

అన్ని కార్యాలయాల్లో పీజీఆర్ఎస్

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించాలని ఆదేశిస్తూ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

నిమ్మ.. ధర రాలేదమ్మా!

సీతంపేట : మన్యంలో విస్తారంగా పండే నిమ్మకాయలకు గిట్టుబాటు ధర రాక గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. కొండపోడు, ఇళ్ల వద్ద ఉండే చెట్ల నుంచి సేకరించిన నిమ్మకాయలను అమ్మకం కోసం సీతంపేట గిరిజన వారపు సంతకు ఆదివారం తీసుకువచ్చారు. కాయల నాణ్యత, పరిమాణం బట్టి కిలో రూ.10 నుంచి రూ.15 లోపే పలికాయని గిరిజనులు చెప్పారు. చెట్ల నుంచి సేకరించి తీసుకువచ్చినా కూలి సైతం లభించని విధంగా పరిస్థితి తయారైందని ఆవేదన చెందారు.

సింహభాగం సీఎస్ఈ.. అనుబంధమే

ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు వేళాయె..

న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

ఇంజినీరింగ్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తర్వాత వెబ్ ఐచ్ఛికాలు నమోదు మేరకు సీట్ల కేటాయింపు ఉంటుంది. జేఎన్‌టీయూ, గురజాడ పరిధిలో నాలుగు జిల్లాల్లోని 26 కళాశాలల్లో 23,430 సీట్లలో ప్రవేశాలకు ఏఐసీటీఈ ఆమోదం తెలిపింది. డిమాండు నేపథ్యంలో కళాశాలల్లో 61.20 శాతం సీట్లు సీఎస్ఈ, వాటి అనుబంధ కోర్సులే ఉన్నాయి. కౌన్సెలింగ్ వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కోర్సులు, అవకాశాలపై జేఎన్‌టీయూ అధ్యాపక బృందం ఏం చెబుతోందంటే..

కొత్తగా క్వాంటమ్

అనుబంధ కళాశాలల్లో డేటా సైన్స్, ఏఐఎంఎల్(కృత్రిమ మేధ-మెషిన్ లెర్నింగ్), బ్లాక్ చైన్, ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ కోర్సులను రెండేళ్ల క్రితమే పరిచయం చేశాం. ఈ ఏడాది అన్ని బ్రాంచిలకు మైనర్ కోర్సుగా క్వాంటమ్ టెక్నాలజీని అందుబాటులోకి తెస్తున్నాం. బీటెక్ కోర్సుల్లో ఏఐఎంఎల్‌ను పెట్టే విషయం పరిశీలనలో ఉంది.

- డి.రాజ్యలక్ష్మి, ఉప కులపతి, జేఎన్‌టీయూ, గురజాడ

ఈ అంశాలు గమనించాలి..

ఐచ్ఛికాల సమయంలో అభ్యర్థులు ఆసక్తి ఉన్న కోర్సుల్ని పెట్టుకోవాలి. ప్యాకేజీ, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, అక్రిడేషన్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌ను పరిశీలించాలి. గతంలో ప్రాంగణ నియామకాలు.. ఉద్యోగాలు పొందిన వారి వివరాలు తెలుసుకోవాలి.

- ఆర్.రాజేశ్వరరావు, ప్రధానాచార్యులు, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల

'కోర్' కే ఎక్కువ ప్యాకేజీ..

సీఎస్ఈ, ఐటీకి ప్రాంగణ నియామకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గతేడాది ఎల్అండ్‌టీ, రఫ్మీ, క్యూస్ స్పైడర్, కాగ్నిజెంట్, మేధో సర్వో, ఇన్ఫోసిస్ కంపెనీల్లో 64 మందికి అవకాశాలు లభించాయి. వీటిలో కోర్ బ్రాంచిలకు ఎక్కువ ప్యాకేజీతో విద్యార్థులు ఎంపికయ్యారు. రఫ్మీ గ్రూపు కంపెనీకి రూ.12 లక్షల ప్యాకేజీతో తొమ్మిది మంది మెకానికల్ అభ్యర్థులకు అవకాశాలు వచ్చాయి. మెకానికల్‌లో 20, సీఎస్ఈలో 18, సివిల్‌లో ఒకరు, ఈఈఈలో ఎనిమిది మందికి కొలువులు దక్కాయి.

- డా.వకుళ, శిక్షణ-ప్రాంగణ నియామకాల అధికారిణి

జేఎన్‌టీయూ పరిధి కళాశాలల్లో సీట్ల వివరాలు..

బ్రాంచి	మొత్తం సీట్లు
సీఎస్ఈ	7,800
సీఎస్ఈ అనుబంధం	5,940
ఐటీ	600
కెమికల్	60
సివిల్	990
ఈసీఈ	4,290
ఈఈఈ	1,680
మెకానికల్	2,070

ఆన్‌లైన్‌లో పరిశీలన..

ధ్రువపత్రాల పరిశీలన పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తారు. కళాశాలల జాబితాను దగ్గర ఉంచుకోవడం మేలు. వీలైనన్ని ఎక్కువ కళాశాలలకు ఐచ్ఛికాలివ్వడం మంచిది. ఆన్‌లైన్‌లో సమాచారం తప్పుగా ఉంటే సహాయక కేంద్రం నుంచి చరవాణి ద్వారా తెలుసుకుని సరి చేస్తాం. లేని పక్షంలో సహాయ కేంద్రానికి రావాల్సి ఉంటుంది.

- విలియం కేరీ, నిపుణులు, కౌన్సెలింగ్ సహాయక కేంద్రం

తోటపల్లి జలాలతో సస్యశ్యామలం

మంత్రి సంధ్యారాణి

నీటికి పూజలు చేస్తున్న మంత్రి, ప్రభుత్వ విప్ తదితరులు

పార్వతీపురం, గరుగుబిల్లి, న్యూస్‌టుడే: జల వనరులను మెరుగుపర్చి వ్యవసాయానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు. గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి జలాశయం కుడి కాలువ నుంచి సాగు జలాలను ప్రభుత్వ విప్ జగదీశ్వరితో కలిసి ఆదివారం ఆమె విడుదల చేశారు. ఈ కాలువ ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 84 వేల ఎకరాలకు నీరు వెళ్తుందన్నారు. అనంతరం రైతులతో సమావేశమై మాట్లాడారు. జలాశయాల పరిధిలో నిర్వహణ పనుల కోసం లస్కర్లను నియమించాల్సి ఉందన్నారు. జిల్లాలో ఒడిశాతో వివాదంలో ఉన్న జంఝావతి, కొరియా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. పూర్ణపాడు-లాబేసు వంతెన పనుల పూర్తికి చర్యలు చేపడతామని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఎస్ఈ స్వర్ణకుమార్, తెదేపా నాయకులు వీరేశచంద్రదేవ్, లావణ్య, వెంకటనాయుడు, పురుషోత్తమనాయుడు, ఎం.తవిటినాయుడు, డి.రామకృష్ణ, ఎన్. మధుసూదనరావు, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

లొద్ద గ్రామానికి వెళ్లే రహదారి

గిరి దారి.. గండాల మారి!

రాళ్లు తేలిన చిలకమెండంగి- సిరివర రోడ్డు

సాలూరు మండలంలోని చిలకమెండంగి-సిరవర రోడ్డు అత్యంత దయనీయంగా మారింది. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ మార్గానికి శంకుస్థాపన చేశారు. 6.6 కిలోమీటర్ల మేర రూ.9 కోట్లతో గతేడాది సెప్టెంబరులో పనులు ప్రారంభించారు. వర్షాల కారణంగా ప్రస్తుతం పనులు ఆపేశారు. వాన నీటికి రోడ్డంతా కోతకు గురై మట్టి లోయలోకి జారిపోయింది. రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద రాళ్లు తేలిపోయాయి. ఇటువైపు ప్రయాణమంటేనే స్థానికులు భయపడుతున్నారు.

◆ పర్యాటక ప్రాంతం లొద్ద జలపాతానికి వెళ్లే రహదారి పరిస్థితీ ఇంతే. రూ.6 కోట్లతో నిర్మిస్తున్న ఈ రోడ్డు కోతకు గురై అధ్వానంగా తయారైంది. కనీసం కాలినడనక వెళ్లాలన్నా గుబులు రేపుతోంది. వాహనాలు వెళ్లలేని పరిస్థితి. నంద-పగులుచెన్నూరు ప్రధాన రహదారి నుంచి లొద్ద వరకూ ఇంతే. పంచాయతీరాజ్ (ప్రాజెక్ట్స్) ఏఈ శంకరరావు మాట్లాడుతూ చిలకమెండంగి-సిరవర రోడ్డులో ఎర్త్‌వర్క్ జరిగిందని, త్వరలో పనులు ప్రారంభించి ఆరునెలల్లో పూర్తి చేస్తామన్నారు. రక్షణ గోడలు ప్రతిపాదనల్లో లేవని, కొండల వైపు కాలువలు నిర్మించి వర్షపు నీరు వెళ్లేలా చూస్తామన్నారు.

- న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

అందరికీ అన్నదాత సుఖీభవ

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

జిల్లాలో లక్ష మందికి ప్రయోజనం

ప్రభుత్వ భూమి సాగు చేస్తున్న రైతులకు తప్ప మిగిలిన అందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సంబంధిత సమాచారం జిల్లాలకు పంపించిందని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు. ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20 వేలు అందిస్తారన్నారు. జాబితాల్లో కొందరి పేర్లు కనిపించడం లేదని, అలాంటి లోపాలను సరిచేస్తామన్నారు. ఇంకా ఆయన ఏం చెప్పారంటే..

జిల్లాలో సాధారణ సాగు భూమి 2.70 లక్షల ఎకరాల్లో ఉంది. మొత్తం 1.40 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరిలో లక్ష మంది వరకు అన్నదాత సుఖీభవ కోసం నమోదు చేసుకున్నారు. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే నమోదు చేసుకోవాలి. తప్పులు సరిదిద్దుకోవాలి.

ఇవీ నిబంధనలు

◆ అటవీ భూములు సాగు చేస్తున్నవారు, కౌలు రైతులు, డీ పట్టాదారులు, అసైన్డ్, ఇనాం భూముల్లో వ్యవసాయం చేస్తున్నవారు పథకానికి అర్హులు. ◆ దేవాదాయ భూములు సాగు చేస్తున్న వారికి కౌలు రైతులతో కలిపి రెండు విడతలుగా అక్టోబరు, జనవరి నెలల్లో సాయం అందిస్తారు. ◆ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కుటుంబంలో ఒకరికి మాత్రమే వర్తిస్తుంది.

సరిదిద్దుకునే అవకాశం..

◆ పలువురి ఆధార్ నమోదు సక్రమంగా జరగలేదు. భూమిని వేరే ఆధార్ నంబరుతో లింక్ చేసినవారు రెవెన్యూ సిబ్బందిని సంప్రదించి తప్పులు సరిదిద్దుకోవాలి. భూమిని వేరే ఆధార్‌తో లింక్ చేసినా, మృతిచెందిన వారి భూమి మ్యుటేషన్ జరగాల్సి ఉన్నా వెబ్‌ల్యాండ్‌లో ఆధార్ జతకాకపోవడం, ఇతర కారణాలు ఏవైనా ఉంటే వీఆర్వో, తహసీల్దారును సంప్రదించాలి. తర్వాత రైతు సేవా కేంద్రంలోని సహాయకుడిని సంప్రదించి గ్రీవెన్స్ మాడ్యుల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ◆ అటవీ భూమి సాగుదారుల గిరి భూమి పోర్టల్‌కు సంబంధించిన సమస్యలను గిరిజన సంక్షేమ శాఖకు పంపించారు. తప్పుడు ఆధార్, మ్యుటేషన్ తదితర సమస్యల పరిష్కారానికి సంబంధిత పీవోను సంప్రదించాలి. ◆ రైతుల పేర్లు పరిశీలనకు రాకపోతే వారి భూమి రెవెన్యూ వెబ్ ల్యాండ్‌లో ఆధార్‌తో జతకాలేదని గుర్తించాలి. అలాంటివారు సంబంధిత రెవెన్యూ అధికారిని సంప్రదించి ఆధార్‌ను వెబ్‌ల్యాండ్‌లో లింక్ చేసుకోవాలి.

పార్వతీపురం గ్రామీణం, పట్టణం, న్యూస్‌టుడే: జునోసిస్ డే సందర్భంగా ఆదివారం జిల్లావ్యాప్తంగా 3,726 శునకాలకు వ్యాధి నిరోధక టీకాలు వేశామని జిల్లా పశు సంవర్ధక అధికారి ఎస్.మన్మథరావు చెప్పారు. మరో వారంపాటు టీకాలు వేస్తామన్నారు. ఏడీ దీనకుమార్ మాట్లాడుతూ.. పెంపుడు జంతువుల యజమానులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జంతువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

3,726 శునకాలకు టీకాలు

టీకాల కోసం శునకాలను తీసుకొచ్చిన యజమానులు

కూనేరు మార్గం.. ప్రత్యక్ష నరకం

పార్వతీపురం నుంచి కొమరాడ మండలంలోని కూనేరు వెళ్లే మార్గం దారుణంగా మారింది. గోతుల దారిలో వర్షం నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు నరకం చూస్తున్నారు. ఇటీవల ఈ మార్గంలో వరుసగా భారీ వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. ఆదివారం అర్తాం-సోమినాయుడువలస మధ్యలో పార్వతీపురం నుంచి రాయగడ వెళ్తున్న ఓ లగేజీ వ్యాన్ బోల్తా పడింది. వాహనంలోని కూరగాయలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. రోడ్డు బాగు చేయాలని చోదకులు కోరుతున్నారు.- న్యూస్‌టుడే, కొమరాడ

రాజూ నేనే.. మంత్రీ నేనే..

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

సాలూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్యవైశ్య ధర్మశాలలో ఆదివారం రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు చదరంగం పోటీలు జరిగాయి. చెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సురేష్ వీటిని ప్రారంభించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి అండర్-16 విభాగంలో బాలురు, బాలికలు 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కేవీవీ శర్మ పర్యవేక్షించారు. జిల్లాల వారీగా విజేతలకు పట్టణ తెదేపా అధ్యక్షులు ఎన్.చిట్టి, ఎం. వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జగదీష్, ఎం.కృష్ణారావు, మార్టిన్ లూథర్, శ్రీనివాసరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ఇన్‌స్పైర్ చేద్దాం రండి

గతేడాది ప్రాజెక్టుల ప్రదర్శనలో విద్యార్థులు

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

పిల్లలు చదువులకే పరిమితం కాకుండా కొత్తగా ఆలోచిస్తున్నారా.. దీనికోసం ఇంట్లో ఉన్న సామగ్రిని చిందరవందర చేస్తున్నారా.. అయితే అలాంటి వారిపై విసుగు చెంది.. వారి ఆలోచనలకు అడ్డుకట్ట వేయొద్దు. ఎవరికి తెలుసు.. వారిలోనూ ఓ శాస్త్రవేత్త ఉన్నారేమో! ఇలాంటి విద్యార్థుల కోసమే కేంద్ర ప్రభుత్వం ముందుకు వస్తోంది. పిల్లల్లో ప్రాథమిక దశలోనే శాస్త్రీయ, వైజ్ఞానిక సృజనాత్మకతను వెలికితీసి, భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేలా శాస్త్ర, సాంకేతిక విభాగం ఆలోచన చేసింది. ఏటా ఇన్‌స్పైర్ మనక్ పురస్కారాల ఎంపికలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి నామినేషన్లను స్వీకరిస్తోంది.

వీరు అర్హులు..

మన్యం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర యాజమాన్య పాఠశాలలు 1720 వరకు ఉన్నాయి. 1.30 లక్షల మంది విద్యార్థులున్నారు. 6 నుంచి 10 మధ్య చదువుతున్న 60 వేల మంది ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంది. ఒక్కో ఉన్నత పాఠశాల నుంచి 5, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 చొప్పున నామినేషన్లు పంపించవచ్చు.

గత మూడేళ్లలో ఇలా..

సంవత్సరం	నామినేషన్లు	ఎంపికలు	
		జిల్లా	రాష్ట్రం
2022	897	86	9
2023	962	87	9
2024	1,005	95	10

రిజిస్ట్రేషన్ సులువు.. ఆసక్తి ఉన్నవారు వివరాలను www.inspireawardsdst.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. పాఠశాల అథారిటీ ఐచ్ఛికంతో వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ చేసిన అనంతరం విద్యాలయం వివరాలు పొందుపర్చాలి. విద్యాశాఖ ఆమోదం లభించాక ఈ-మెయిల్, యూజర్ ఐడీ లింకు, పాస్‌వర్డ్ సహాయంతో ప్రాజెక్టు వివరాలు పొందుపర్చాలి. ప్రాజెక్టు రైటప్, చిత్రాలు లేదా 300 పదాలకు మించకుండా వివరణను అప్‌లోడ్ చేయాలి. నామినేషన్ గడువు సెప్టెంబరు 15.

అంశాలివీ..

స్వచ్ఛభారత్, మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా, సమాజాభివృద్ధి, క్లీన్ ఇండియాపై ప్రాజెక్టులు చేయాల్సి ఉంటుంది.

రాష్ట్రపతి భవన్‌కు వెళ్లొచ్చు..

ఎంపికైతే జిల్లా స్థాయిలో రూ.10 వేలు, రాష్ట్ర- రూ.25 వేలు, జాతీయస్థాయిలో రూ.50 వేల వరకు గెలుచుకోవచ్చు. అక్కడ అర్హత సాధిస్తే రాష్ట్రపతి భవన్, జపాన్ పర్యటనకు అవకాశం లభిస్తుందని, పేటెంట్ హక్కులు పొందితే ఇతర ప్రోత్సాహకాలు వస్తాయని సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు తెలిపారు.

యువతకు ఉద్యోగం హక్కు కావాలి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్.శర్మ

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: దేశంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాన్ని ఓ హక్కుగా మార్చాలని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ డిమాండు చేశారు. 'నిరుద్యోగ సమస్య- యువత భవిష్యత్తుకు శాస్త్రీయ పరిష్కారం' అంశంపై ఆదివారం విజయనగరంలోని ఏపీఎన్జీవో హోంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వాలు అవలంబిస్తున్న నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలు నేటితరానికి ఉపాధి కల్పించే విధంగా లేవని అభిప్రాయపడ్డారు. మానవ శ్రమను వినియోగంలోకి తెచ్చి, సంపద సృష్టికి ఉపయోగపడే విధానాలు అవసరమని సూచించారు. అప్పుడే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. నాయకులు ఎంవీఎన్.వెంకటరావు, రమణ ప్రభాత్, చిన్నారి, వి.రాజ్‌గోపాల్, కె.శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకోక ప్రవాహానికి వదిలేశారు

నాగావళి నదిపై సంతకవిటి మండలం నారాయణపురం వద్దనున్న ఆనకట్ట ఇది. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలోని ఏడు మండలాల్లో 50 వేల ఎకరాలకు ఖరీఫ్‌లో సాగునీరు అందించే ప్రధాన జలవనరు. ఆనకట్టపై ఉన్న 118 షట్టర్లలో సగానికిపైగా పాడైపోయాయి. వాటిని మార్చేందుకు ఇటీవల అధికారులు కొత్తవి తయారు చేయించారు. నదిలో వరద రాకముందే అమర్చాలి. సకాలంలో చర్యలు చేపట్టకపోవడంతో నీరంతా ఇలా వృథాగా దిగువకు వెళ్లిపోతోంది. షట్టర్లు అమర్చి ఉంటే కొంతనీరైనా ఆయకట్టు రైతులకు ఉపయోగపడేది. ప్రవాహం తగ్గాక బిగిస్తామని ప్రాజెక్టు ఏఈ రామశివ తెలిపారు. - న్యూస్‌టుడే, సంతకవిటి

వాహనంతో వెళ్లలేం.. దిగి నడవలేం

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఏళ్ల నాటివి కావడంతో తారు ఊడి, మట్టి తేలింది. దీంతో వర్షాలకు ఇలా బురదమయంగా మారి, ప్రయాణికులకు నరకం చూపుతున్నాయి. ● సంతకవిటి మండలం పీజేపేట- రంగరాయపురం గ్రామాల మధ్యగల రోడ్డు విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలను కలుపుతుంది. వర్షాలకు, వాహనాల రాకపోకలతో వెళ్లే వీలు లేకుండా మారిపోయింది. అటుగా ప్రయాణమంటేనే చోదకులు హడలిపోతున్నారు. బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఏఈ రియాజ్ తెలిపారు. ● మెంటాడ మండలంలోని ఆంధ్ర నుంచి కుంబివలసకు వెళ్లే మార్గం చిత్తడిగా తయారైంది. పనసలవలస, కొండజీరికివలస, వేపగుడ్డి, కుంబివలస, దోనుబిల్లి, పాచిపెంట మండలంలోని పలు గ్రామాలవారికి ఇదే దిక్కు. శనివారం ఓ ఆటో ఆగిపోవడంతో గిరిజనులు ఇలా తోస్తూ కనిపించారు. రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని ఇంజినీరింగ్ అధికారి గౌతమ్ చెప్పారు. - న్యూస్‌టుడే, సంతకవిటి, మెంటాడ

చిత్తడిగా పీజేపేట రోడ్డు

ఆంధ్ర- కుంబివలస దారిలో బురదలో నుంచి ఆటోను తోస్తున్న గిరిజనులు

నగర వనం.. అందాల ఆతిథ్యం

- న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

చుట్టూ పచ్చని అందాలు.. పక్షుల కిలకిల రావాలు.. రాత్రి వేళ వెలుగునిచ్చే మిణుగురులు.. పరుగు తీసే జంతువులు.. అంతర్గత రహదారులు.. జిమ్‌లు.. ఆట పరికరాలు.. వాకింగ్ ట్రాక్‌లు.. వివిధ రకాల ప్రదర్శన శాలలు.. ఇలా ఒక్కటేమిటి ఆనందలోగిలికి హద్దుల్లేకుండా.. ఆత్మీయ వేడుకకు వేదికయ్యేలా విరాజిల్లుతున్నాయి నగరవనాలు. శుభకార్యమైనా.. సమావేశమైనా.. కుటుంబంతో వచ్చినా.. స్నేహితులంతా కలిసి వెళ్లినా ఆత్మీయతను పొందే సౌకర్యాలు కల్పిస్తామని చెబుతోంది అటవీశాఖ. రండి.. తక్కువ ధరకే మా ఆతిథ్యం పొందండని పిలుపునిస్తోంది.

● వేడుకల నిర్వహణకు అవకాశం

● తక్కువ ధరలకే అందుబాటులో..

సారిపల్లిలోని నగరవనంలో సేదదీరుతున్న సందర్శకులు

ప్రకృతిని కాపాడేందుకు, అడవులపై అవగాహన కల్పించేందుకు కేంద్రం అన్ని రాష్ట్రాల్లో నగరవనాలను అభివృద్ధి చేస్తోంది. జిల్లాలోని సారిపల్లి, బేతనపల్లి, కొండవెలగాడలో ఉన్న రిజర్వ్ అటవీ ప్రాంతంలో సరికొత్త నిర్మాణాలు వెలిశాయి. ఈమేరకు రూ.6 కోట్ల మేర ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే సారిపల్లి క్షేత్రం అందుబాటులోకి రాగా.. మిగిలిన రెండు ప్రాంతాల్లో పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం కొన్నిరోజులుగా సారిపల్లి వనం పర్యాటకులతో సందడిగా మారుతోంది.

సందర్శకులు..

నెల	సంఖ్య
ఏప్రిల్	260
మే	370
జూన్	475

సందర్శకుల తాకిడి.. గతేడాది నవంబరులో సారిపల్లి నగరవనాన్ని ప్రారంభించారు. పదెకరాల్లో ఇది విస్తరించింది. చుట్టూ ముచ్చటగొలిపేలా అడవి ఉంటుంది. వివిధ రకాల జంతువుల ప్రతిమలతో పాటు వృద్ధులకు ఉపయోగపడేలా విశ్రాంత గదులు, యోగా మందిరం, వ్యాయామ శాల, పిల్లల పార్కు ఏర్పాటు చేశారు. అటవీ జాతులతో పాటు వివిధ ప్రాంతాల్లో లభించే మొక్కలను చూడొచ్చు. రచ్చబండలు, పాకలు, ఎక్కడికక్కడే బెంచీలు పెట్టారు. అన్ని రకాల సదుపాయాలను సమకూర్చారు.

తక్కువ ధరలకే శుభకార్యాలు..

ఇక్కడ తక్కువ ధరలకే శుభకార్యాలు, అన్ని రకాల కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చు. ముందుగానే నిర్వాహకులకు తెలియజేయాలి. ఆమేరకు ధర నిర్ణయిస్తారు. సాధారణంగా అయితే పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10 తీసుకుంటున్నారు. గత మూడు నెలల్లో 1105 మంది సందర్శించారు. టిక్కెట్ల ద్వారా రూ.22,100 వచ్చినట్లు అటవీ అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక వ్యూపాయింట్..

ఇక్కడికి రావడం ఓ విహార యాత్రే. కాలుష్యానికి దూరంగా రోజంతా సందడి చేయొచ్చు. ఎలాంటి ఇబ్బంది ఉండదు. ప్రజలను అడవులకు రప్పించడమే మా ప్రధాన ధ్యేయం. సదుపాయాలు బోలెడు. 50 హెక్టార్ల పరిధిలోని అటవీ సంపదను చూసేందుకు ప్రత్యేక వ్యూపాయింట్ సైతం ఉంది. పక్షులు, వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు నీటి కుంటలను ఏర్పాటు చేశాం. సుమారు 2 వేల జాతుల మొక్కలు పెంచుతున్నాం. కుటుంబంతో వచ్చినా, సమూహంగా చేరుకున్నా ఏర్పాట్లు చేస్తాం. సద్వినియోగం చేసుకోవాలి. - ఆర్.కొండలరావు, డీఎఫ్‌వో

పెంపుడు జంతువులతో జాగ్రత్త

కుక్కకు టీకా వేస్తున్న జేడీ వైవీ.రమణ

విజయనగరం వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: పెంపుడు జంతువుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అప్రమత్తతతో వ్యాధుల నుంచి దూరం కావొచ్చని పశుసంవర్ధకశాఖ విజయనగరం జిల్లా అధికారి వై.వి.రమణ సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని బహుళార్థ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలను ఉచితంగా వేశారు. అంతకు ముందు శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేబిస్, మెదడు వాపు, బర్డ్‌ఫ్లూ, ఎబోలా, ప్లేగు, ఆంత్రాక్స్ తదితర రకాల వ్యాధులు పెంపుడు జంతువుల ద్వారా సంక్రమించే ప్రమాదం ఉందన్నారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, సకాలంలో టీకాలు వేయడం తదితర చర్యలతో ఇబ్బంది ఉండదన్నారు. ఉచితంగా మందులు, వివిధ ఆహార పదార్థాలు అందజేశారు. మూడు నెలల వయసు దాటిన 584 జంతువులకు టీకాలు వేశామన్నారు. ఉప సంచాలకులు జి.మహాలక్ష్మి, ఏడీలు సన్యాసినాయుడు, కె.వి.రమణ, కిషోర్, ధర్మారావు, పశువైద్యులు మోహన్, హిమజ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	98	166	176

విమర్శలకు అభివృద్ధే సమాధానం: నాగార్జున

చీపురుపల్లి, న్యూస్‌టుడే: 'అయ్యా బొత్స.. మీరు, మీ పార్టీ నాయకులు విమర్శిస్తూ వెళ్లండి.. మేం అభివృద్ధి చేసుకుంటూ సాగుతాం' అని డీసీసీబీ ఛైర్మన్, తెదేపా విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. ఆదివారం చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష నేత ఇటీవల కూటమి ప్రభుత్వంపై చేసిన విమర్శలను ఆయన ఖండించారు. బొత్స సత్యనారాయణ మాటలు విడ్డూరంగా ఉన్నాయని, ఎన్నికల హామీలు అమలు చేయడం లేదని వ్యాఖ్యానించడం సిగ్గు చేటన్నారు. ఆ పార్టీ నాయకులు గ్రామాల్లోకి వెళితే ప్రజలే నిజాలు చెబుతారన్నారు. సూపర్- 6 పథకాల అమలుపై ప్రజలు, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై రైతులు, అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి రూ.15కే మూడు పూటలా భోజనం పెడుతున్నామని పేదోళ్లు ఆనందంగా ఉన్నారన్నారు.

కబడ్డీ ప్రోబబుల్స్ జట్టుకు మన్యం యువకుడు

మణికంఠను సత్కరిస్తున్న కబడ్డీ అసోసియేషన్ నాయకులు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: భారత కబడ్డీ ప్రోబబుల్స్ జట్టుకు సీతంపేట మండలం జిల్లేడుపాడు గ్రామానికి చెందిన గిరిజన యువకుడు పాలక మణికంఠ ఎంపికయ్యాడు. ఆదివారం ఆయనను కబడ్డీ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు పల్లా కొండబాబు, కార్యదర్శి వి.చంద్రశేఖర్ పాలకొండలో సత్కరించారు. ఈ ఏడాది అక్టోబరులో జరగనున్న ఆసియా కప్ పోటీల్లో పాల్గొనేందుకు 22 మందిని ఇటీవల హరిద్వారాలో ఎంపిక చేశారు. మణికంఠ ఉత్తమ ప్రతిభ చూపి చోటు దక్కించుకున్నాడు. కబడ్డీ ప్రీమియర్ లీగ్‌లో ఆడించేందుకు పట్నా జట్టు ఇప్పటికే ఈ క్రీడాకారుడితో ఒప్పందం కుదుర్చుకుంది. తల్లిదండ్రులు చిన్నారావు, విశ్వనాథమ్మ వ్యవసాయం చేస్తున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.సుధ, కోశాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సఖితో బాలికలకు అభయం

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: అవగాహన లేకపోవడం, అపరిచితులను నమ్మడం, సమాజ పోకడలు, సామాజిక మాధ్యమాల అధిక వినియోగం.. తదితర కారణాలతో ప్రస్తుత సమాజంలో చాలా మంది బాలికలు, మహిళలు వేధింపులకు గురవుతున్నారు. కొందరు మోసాల బారిన పడుతున్నారు. ఇంకొందరు కుటుంబాలకు దూరమవుతున్నారు. ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట పడేలా, వారిలో చైతన్యం కలిగించేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి(వన్‌స్టాప్ సెంటర్) కేంద్రాలు నడుస్తున్నాయి. బాధితులకు సహాయం అందించేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అవసరం మేరకు న్యాయ, వైద్య, పోలీసు, వసతి తదితర సౌకర్యాలను ఉచితంగా అందిస్తున్నాయి.

అందుబాటులో నంబర్లు..

ఇబ్బందులకు గురైతే 181 హెల్ప్‌లైన్ నంబరును సంప్రదించవచ్చు. సంబంధిత సిబ్బంది సఖి కేంద్రానికి తెలియజేస్తారు. నేరుగా వన్‌స్టాప్ సెంటరుకు సైతం వెళ్లొచ్చు. ఇప్పటివరకు 2013 ఫిర్యాదులు అందినట్లు అధికారులు చెబుతున్నారు.

బాధితులను గుర్తించిన వెంటనే కౌన్సెలింగ్ ఇస్తారు. ఇంట్లో ఉండేందుకు ఇష్టం లేకపోతే వసతి కల్పిస్తారు. గాయాలపాలైతే తగిన వైద్యం అందిస్తారు. రక్షణకు పోలీసులను నియమిస్తారు. న్యాయ సహాయాన్ని సైతం పొందవచ్చని **విజయనగరంలోని సఖి కేంద్రం పరిపాలనాధికారిణి పి.సాయి విజయలక్ష్మి** 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈమేరకు పాఠశాలలు, కళాశాలలు, సచివాలయాలు, పని ప్రదేశాలు తదితర చోట్ల అవగాహన కల్పిస్తున్నామని, వారానికి సుమారు 20 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న వన్‌స్టాప్ కేంద్రం సిబ్బంది

వాణిజ్యపన్నుల శాఖ జేసీగా రామకోటేశ్వరరావు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: వాణిజ్య పన్నుల శాఖలో పలు విభాగాల వారిని ప్రభుత్వం బదిలీ చేసింది. విజయనగరం డివిజన్ సంయుక్త కమిషనరుగా పి.రామకోటేశ్వరరావు నియమితులయ్యారు. ఈయన ఏలూరు నుంచి రానున్నారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన బి.నాగార్జునరావు ఆయన స్థానంలో వెళ్లనున్నారు. రాజమహేంద్రవరంలో డిప్యూటీ కమిషనరుగా విధులు నిర్వహిస్తున్న జి.నిత్యజ్యోతిని ఇక్కడ డీసీగా నియమించారు. ఇక్కడి డీసీ పి.భాస్కరరావుకు అనంతపురం జిల్లాకు స్థానచలనమైంది.

ఏసీల స్థానాల్లో మార్పులు..

విజయనగరం తూర్పు సర్కిల్లో పనిచేస్తున్న జి.ఉదయ్య విశాఖ-2 స్పెషల్‌సెల్ సర్కిల్‌కు వెళ్తున్నారు. ఆయన స్థానంలో మాడుగుల నుంచి వి.జ్యోతి రానున్నారు. దక్షిణ సర్కిల్‌కు చెందిన జి.రమేష్‌కుమార్ విశాఖ-2 విమానాశ్రయ సర్కిల్‌కు, అచ్యుతాపురం నుంచి డి.శ్వేత ఆ స్థానానికి, పశ్చిమలోని శిరీషాపురం వెంకటరమణ విజయనగరం డివిజన్ కార్యాలయ ఇంటెలిజెన్స్ ఏసీగా.. ఆ స్థానంలో గాజువాకలో విధులు నిర్వర్తించే ఎం.వెంకటేశ్వర్లు, ఆమదాలవలస సర్కిల్‌కు చెందిన కొండమ్మ విశాఖ-1(సిరిపురం)కు, శ్రీకాకుళంలో ఉన్న జి.రాణిమోహన్ పలమనేరు సర్కిల్‌కు బదిలీ అయ్యారు. వీరి స్థానాల్లో ఇంకా ఎవరినీ నియమించలేదు. పార్వతీపురం, నరసన్నపేట, కాశీబుగ్గ సర్కిళ్లలో ఏసీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

23 నుంచి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

క్రీడావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని డీఎస్‌వో ఇండోర్ స్టేడియంలో ఈనెల 23 నుంచి 25 వరకు ఉమ్మడి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కేఏ.నాయుడు ఆదివారం తెలిపారు. అండర్- 11, 13, 15, 17, 19 స్త్రీ, పురుష విభాగాల్లో టోర్నమెంటు సాగుతుందని, ఈనెల 20లోగా పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు 94405 05275, 79811 11705 నంబర్లను సంప్రదించాలని సూచించారు. సంఘం గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపు రెడ్డి జగదీష్, వీఎస్.ప్రసాద్, నున్న సురేష్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి విద్యాలయాల్లో..

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జనాభా దినోత్సవాన్ని(జులై 11) పురస్కరించుకుని ఈనెల 7న మండల, 9న జిల్లాస్థాయిలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో యు.మాణిక్యం నాయుడు తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, పురపాలక విద్యాలయాల్లో ఎనిమిది నుంచి పదోతరగతి చదువుతున్నవారు అర్హులని పేర్కొన్నారు. మండలస్థాయిలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారు జిల్లాస్థాయికి వెళ్తారని చెప్పారు. పొగాకు, మత్తు పదార్థాల నివారణపై చిత్రలేఖనం, 'లింగ సమానత్వం-గౌరవ మర్యాదలు' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలని, అందరూ పాల్గొనేలా చూడాలని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

శిరస్త్రాణం మరవద్దు: ఎస్పీ

విజయనగరం నేరవార్తల విభాగం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల్లో 50 శాతం మంది శిరస్త్రాణాలు లేకపోవడంతో మరణిస్తున్నారని చెప్పారు. ధరించనివారిపై ఈ-చలానాలు విధించాలని సిబ్బందిని ఆదేశించారు.

ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత ప్రవేశాలు

వేంపల్లె, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు విద్యాలయాల్లో 600 సీట్లు మిగిలాయి. 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్నవారిని పరిగణనలోకి తీసుకుని సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి జాబితాను తయారు చేసి ఈనెల 11 లేదా 12వ తేదీల్లో అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. కౌన్సెలింగ్ తర్వాత ఇడుపులపాయలో 132, నూజివీడులో 141, శ్రీకాకుళంలో 143, ఒంగోలులో 184 సీట్లు ఉండిపోయాయి.

జంఝావతికి భారీగా వరద

కొమరాడ, న్యూస్‌టుడే: ఒడిశాలోని రాయగడ జిల్లాలో పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నాగావళి, జంఝావతితో పాటు ఉపనదుల్లో పెద్దఎత్తున వరదనీరు చేరుతోంది. ఎగువ ప్రాంతంలో జోరుగా వర్షాలు పడుతున్నాయి. రాయగడ వద్ద జంఝావతి పొంగి ప్రవహిస్తోంది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. నాగావళిలో నీటిమట్టంపై ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తున్నారు.

క్షణికావేశం.. తీసింది ప్రాణం

ఇంటిపెద్ద ఆత్మహత్య..

సత్య వరప్రసాద్ (పాతచిత్రం)

కొత్తవలస, న్యూస్‌టుడే: చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొత్తవలస మండలంలోని ఉమాదేవినగర్ సమీపంలో చోటుచేసుకుంది. సీఐ షణ్ముఖరావు వివరాల ప్రకారం.. గంట్యాడ మండలం లక్కిడాం గ్రామానికి చెందిన జి.గౌరి శివసత్య వరప్రసాద్(38) ఇరవై ఏళ్ల క్రితం కొత్తవలసకు వలస వచ్చారు. రాజన్న కాలనీలో ఇటుకల బట్టీ నిర్వహిస్తూ.. కుటుంబంతో నివాసముంటున్నారు. ఆదివారం ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ఉమాదేవినగర్ సమీపంలోని మామిడితోటలో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. స్థానికులు చూసి, పోలీసులకు సమాచారం అందించారు. ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఓ మహిళ కారణంగానే తన భర్త ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అతని భార్య ఎర్రమ్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు కిందపడి వృద్ధుడు..

సీతారామయ్య (పాతచిత్రం)

కొత్తవలస, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కొత్తవలసలో చోటుచేసుకుంది. ఆర్పీఎఫ్ ఏఎస్సై ఉమామహేశ్వరరావు వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా గోపాలపట్నం సమీపంలోని లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన సీహెచ్.సీతారామయ్య(77) విశాఖపట్నం డాక్ యార్డులో ఉద్యోగం చేసి విరమణ పొందారు. ఆదివారం కొత్తవలస పట్టణంలోని చేపల దుకాణాల వెనుక విజయనగరం నుంచి కొత్తవలస వస్తున్న గూడ్సు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు విజయనగరంలోని ప్రభుత్వ రైల్వే పోలీసు స్టేషన్‌కు, బాధిత కుటుంబానికి సమాచారం అందించామని ఏఎస్సై చెప్పారు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారావు కేసు నమోదు చేశారన్నారు. లేఖ రాసిన అనంతరం మరణించాడన్నారు.

వేధింపులు తాళలేక మహిళ..

పాచిపెంట, న్యూస్‌టుడే: అత్తింటి వేధింపులు తాళలేక గిరిజన మహిళ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పాచిపెంట మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై వెంకట సురేష్ వివరాల మేరకు.. గుమ్మడిగుడ పంచాయతీ పాచిలవలస గ్రామానికి చెందిన ఎరకయ్యతో ఎగువ చింతలవలసకు చెందిన పి.సీతమ్మ(18)కు ఏడాది కిందట వివాహమైంది. కొన్ని నెలల తరువాత భర్త, అత్తామామలు వేధించడంతో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. ఆమెను ఇబ్బంది పెట్టమని వారు పెద్దల ముందు అంగీకరించారు. మళ్లీ వేధింపులకు పాల్పడడంతో తట్టుకోలేక నాలుగైదు రోజుల కిందట గ్రామ సమీపంలోని కొండపై చెట్టుకు ఉరేసుకుంది. విషయం తెలుసుకున్న తల్లి పైడితల్లి బోరున విలపించింది. తమ కుమార్తె మృతికి ఆమె భర్త, అత్తామామలే కారణమని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటి కథలు భావితరాలకు చేరాలి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బాబూరావు తదితరులు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: చరిత్ర, సామాజిక సమస్యల గురించి భవిష్యత్తు తరాలకు తెలియజేయాలంటే కథలు, సరికొత్త రచనలు అవసరమని విజయవాడకు చెందిన చారిత్రక పరిశోధక రచయిత సాయి పాపినేని అన్నారు. నగరానికి చెందిన జీవీ.శ్రీనివాస్ రచించిన 'చరిత్ర చెప్పిన కథలు(కథా సంపుటి)' పుస్తకాన్ని ఆదివారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో విజయనగరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజాన్ని ప్రభావితం చేసే ఏ విషయాన్నైనా పుస్తక రూపంలోకి తేవాలంటే దానిపై ఎంతో పరిశోధన అవసరమన్నారు. ఈ సంపుటిలో విలువలతో కూడిన కథలున్నాయని, ప్రతిఒక్కరూ చదివి.. వారి పిల్లలకు తెలియజేయాలన్నారు. కథలు, రచనలు, కళలకు ఉత్తరాంధ్ర నిలయమని శ్రీనివాస్ పేర్కొన్నారు. రచయితలు చీకటి దివాకర్, యార్లగడ్డ బాబూరావు, అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, రాణిశర్మ, మంజరి తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BATH CLEANING

శ్రీ కనకదుర్గ హౌస్‌కీపింగ్ సర్వీస్ మీ ఇంటి వద్దకు వచ్చి పరిశుభ్రంగా సకాలంలో చేయబడును. (టాయిలెట్, హౌస్, సోఫాసెట్, డస్ట్, గ్లాస్, వాటర్ ట్యాంక్ etc.,) Cell: 8520804641, 9959138591.

REAL ESTATE

PLOT FOR SALE

116 Sq. Yards Plot No.24, Sarvani Nagar. Contact: 8374612225.

FINANCIAL SERVICES

ఋణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, ఋణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్సియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

JOBS

ప్రముఖ సెల్ షోరూమ్‌లో సేల్స్ చేయుటకు ఆసక్తిగల యువతీయువకులు కావలెను. వయస్సు: 18-35 సం॥, విద్య: 10+, జీతం: 10 వేలు, రూమ్ & భోజన వసతి సదుపాయం కలదు. & కమీషన్. ఆడ పనిమనుషులు కావలెను. వయస్సు: 18+, జీతం: 10,000/- ✆ 9848380275/ 8074447933.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80081 11237

(c) eenadu

పశువుల శాల కాదు.. పాఠశాల

సాలూరు పట్టణంలోని గుమడాం పాఠశాల భవనం నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. పాత గదులు శిథిలావస్థకు చేరడంతో గత ప్రభుత్వ పాలనలో రూ.23 లక్షలు మంజూరు చేశారు. పనులు చేయగా రూ.10లక్షలు మాత్రమే విడుదలవడంతో సగంలో ఆపేశారు. అసంపూర్తి భవనంలో ప్రస్తుతం పశువులు కడుతున్నారు. ఈ పనులు పూర్తికి ప్రతిపాదనలు చేస్తామని ఎంఈవో వెంకటరావు తెలిపారు. - న్యూస్‌టుడే, సాలూరు

ఓని దారిలో ముక్కు మూసుకోవాల్సిందే!

పాలకొండ పట్టణంలో ఇళ్ల నుంచి సేకరిస్తున్న వ్యర్థాలు ఓని గ్రామ రహదారి పక్కన నిత్యం వేస్తున్నారు. దీంతో చెత్త కుప్పలుగా పేరుకుపోతోంది. వర్షాలకు కుళ్లి దుర్గంధం వస్తోందని, దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్‌యార్డు కోసం స్థల సేకరణ జరుగుతోందని, బ్లీచింగ్ చల్లుతామని నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజ్ తెలిపారు. - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

మలుపు.. ప్రమాదాలకు పిలుపు

కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి నుంచి పొడి, నగర మీదుగా పెద గొత్తిలి, నీలకంఠాపురం వెళ్లే మార్గంలో మలుపులు ప్రమాదకరంగా మారాయి. రోడ్డుకు ఇరువైపులా పికిలాల పొదలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు. పరిశీలించి సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని ర.భ.శాఖ జేఈ సుశీల తెలిపారు. - న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

వరండాలోనే చదువులు

పాచిపెంట మండలంలోని మతుమూరు పాఠశాలలో గదులు సరిపోక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలను ఐదేళ్ల క్రితం అప్‌గ్రేడ్ చేశారు. ఇక్కడ 166 మంది చదువుతున్నారు. కానీ సరిపడా గదులు లేక వరండాలో బోధిస్తున్నారు. వర్షం పడితే అవస్థలు తప్పడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. దీనిపై ఎంఈవో పి.సతీష్ కుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా అదనపు గదులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. - న్యూస్‌టుడే, పాచిపెంట

లతలు తొలగించరూ..!

పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల ఆలయం సమీపంలో ఉన్న విద్యుత్తు నియంత్రిక, స్తంభాలకు లతలు అల్లుకున్నాయి. ప్రస్తుత వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు వస్తున్నాయని తెలిపారు. ప్రమాదం జరగక ముందే శుభ్రత పనులు చేపట్టాలని కోరుతున్నారు. విషయం ఏఈ రామారావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

అధ్యాపకుల పోస్టులకు ముఖాముఖి

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన అధ్యాపక పోస్టులు భర్తీ చేస్తామని ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్.చలపతిరావు తెలిపారు. పొలిటికల్ సైన్స్, జువాలజీ పోస్టుల కోసం ఈనెల 9న ఉదయం 10 గంటలకు ముఖాముఖి ఉంటుందని చెప్పారు. పీజీలో 55 శాతం మార్కులతో పాటు పీహెచ్‌డీ, నెట్, సెట్‌కు ప్రాధాన్యం ఇస్తామన్నారు. వివరాలకు 98495 05940ను సంప్రదించాలని సూచించారు.

జగ్జీవన్‌రామ్ వర్ధంతి

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ ప్రధాని, దివంగత జగ్జీవన్‌రామ్ దళిత మేధావి అని మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు పేర్కొన్నారు. పార్వతీపురం మండలంలోని కృష్ణపల్లి గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ● పట్టణంలోని సౌందర్య కూడలిలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద పట్టణ ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ పోరాట యోధుడని కొనియాడారు. నాయకులు కె. విజయ్, పి.జయప్రసాద్, సల్మాన్, నిర్మలాకుమారి, సురేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలల భవితకు రక్షణేదీ..?

గుమ్మలక్ష్మీపురం, కురుపాం గ్రామీణం, సీతంపేట, న్యూస్‌టుడే: ఒక ఇల్లు కడితేనే చుట్టూ ప్రహరీ నిర్మిస్తాం. బయటి వ్యక్తులు రాకుండా.. దొంగతనాలకు ఆస్కారం లేకుండా పక్కాగా చర్యలు చేపడతాం. కానీ వందల మంది విద్యార్థులు చదువుతున్న గిరిజన సంక్షేమ వసతి గృహాలకు మాత్రం రక్షణ కరవవుతోంది. ఏళ్లుగా గోడలు లేక నిత్యం భయాందోళనతో ఉంటున్నారు. పాముకాటుతో పలువురు ప్రాణాలు సైతం కోల్పోతున్నారు.

కురుపాం ఆశ్రమ పాఠశాలకు రక్షణగా కర్రలు

పనులు చేపట్టేలా చూస్తాం..

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు రక్షణ గోడ నిర్మాణంపై దృష్టి పెడతాం. ఇప్పటికే పాఠశాలలకు పెద్ద ఎత్తున ప్రహరీలు నిర్మించారు. గతంలో మంజూరై అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తిపై దృష్టి సారించాలని అధికారులకు ఆదేశిస్తాం.

- టి.జగదీశ్వరి, ప్రభుత్వ విప్

కర్రల కంచెలే దిక్కు..

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు రక్షణ గోడల నిర్మాణానికి 2019లో నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభించిన కొన్ని రోజులకే బిల్లులు చెల్లించలేదని ఆపేశారు. సుమారు ఆరేళ్లు అవుతున్నా నిర్మాణాలు ముందుకు కదల్లేదు. చేసేది లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు కర్రలతో కంచెలు ఏర్పాటు చేసుకున్నారు. మరికొన్ని చోట్ల మొండి గోడలే దర్శనమిస్తున్నాయి.

మండలాల్లో పరిస్థితి..

● గుమ్మలక్ష్మీపురం మండలంలోని కొత్తగూడ, టిక్కబాయి, తాడికొండ ఆశ్రమ పాఠశాలలకు రక్షణ గోడలు లేవు. ఆరేళ్ల క్రితమే ప్రారంభించినా నేటికీ పనులు పూర్తి కాలేదు. దీంతో కర్రలనే కంచెలుగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ 3 పాఠశాలల్లో 800 మందికి పైగా విద్యార్థులు భయాందోళనతో గడుపుతున్నారు. ● కురుపాం ఆశ్రమ పాఠశాలలో సుమారు 400 మంది చదువుతున్నారు. పక్కనే ఉన్న జ్యోతిబాపులే పాఠశాల విద్యార్థి పాము కాటుతో మృతి చెందడంతో రక్షణ గోడ నిర్మించారు. కానీ ఆశ్రమ పాఠశాలను పట్టించుకోలేదు. ● ధర్మలక్ష్మీపురంలో గోడ పునాది స్థాయిలో వదిలేశారు. ఇక్కడా 400 మందికి పైగా విద్యార్థులున్నారు.

సీతంపేట బాలుర గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో రక్షణ గోడ పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, పోస్టుమెట్రిక్ వసతి గృహానికి ప్రహరీలు లేవు.

విషసర్పాలకు నిలయం..

అటవీ ప్రాంతానికి సమీపంలో వసతి గృహాలు ఉండటంతో విషసర్పాలు దర్శనమిస్తున్నాయి. కురుపాం వసతి గృహంలో పాము కాటుకు గురై ఓ విద్యార్థి గతంలో మృతి చెందాడు. గుమ్మలక్ష్మీపురం మండలం దుడ్డుఖల్లు ఆశ్రమ పాఠశాలలో రెండేళ్ల క్రితం ఓ విద్యార్థి పాముకాటుతో అస్వస్థతకు గురయ్యాడు. 2023 ఆగస్టులో టిక్కబాయిలో ఇలానే మరో విద్యార్థి ప్రాణాలొదిలేశాడు. పశువులు, మేకలు సైతం ఆవరణలోకి వచ్చి మొక్కలను తినేస్తున్నాయి. ఏనుగుల సంచారంతో రాత్రి వేళల్లో విద్యార్థులు బయటకు రావాలంటే భయపడుతున్నారు.

తొలి అడుగులో ప్రజా సంక్షేమం

కొమరాడ, న్యూస్‌టుడే: గత ఐదేళ్లలో జరగని అభివృద్ధి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసి చూపించిందని మంత్రి సంధ్యారాణి, విప్ తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. క్రమశిక్షణ, విజన్ ఉన్న నాయకత్వంలో పని చేస్తున్నామని, ఎవరికైనా కష్టం వస్తే సాయం చేయడమే లక్ష్యమన్నారు. ఏడాదిలో జరిగిన అభివృద్ధిని వివరించారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. గిరి శిఖర గ్రామాల్లో రోడ్లు వేసి డోలీ మోతలు తగ్గించామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక వైకాపా నాయకులు కడుపు మండిపోతోందని, వారికి రాష్ట్రంలో ఉన్న ఇసుక ప్రాజెక్టు సంపాదించారని విమర్శించారు. కార్యక్రమంలో ట్రైకార్ ఛైర్మన్ లావణ్య, తెదేపా రాష్ట్ర కార్యదర్శి వీరేశ్ చంద్రదేవ్, మండల కన్వీనర్ శేఖర్‌పాత్రుడు, నాయకులు డి.వి.నాయుడు, ఎస్.మధు, జి.త్రినాథ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల కరపత్రాలు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి, విప్ జగదీశ్వరి, నాయకులు

10న వినియోగదారుల సదస్సు

వీరఘట్టం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన వీరఘట్టం ఉప విద్యుత్తు కార్యాలయంలో వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. సీజీఆర్‌ఎఫ్ ఛైర్మన్ బి.సత్యనారాయణ, కమిటీ సభ్యులు సుబ్బారావు, మురళీకృష్ణ పాల్గొంటారని చెప్పారు. విద్యుత్తు సరఫరాలో సమస్యలు, బిల్లుల్లో తేడాలు, సంబంధిత శాఖకు సంబంధించి ఏవైనా లోపాలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కనీస వేతనం అమలుకు డిమాండు

పార్వతీపురంలో సమావేశమైన నాయకులు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: కార్మికులకు పని గంటలు తగ్గించి కనీస వేతనం అమలు చేయాలని సిటు జిల్లా కార్యదర్శి మన్మథరావు డిమాండు చేశారు. పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో ఆదివారం ప్రజా సంఘాల నాయకులు సమావేశమయ్యారు. వక్తలు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈనెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఐఎఫ్‌టీయూ నాయకులు పి.ఈశ్వరరావు, ఎం.కృష్ణమూర్తి, ఆర్.శ్రీదేవి పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీవారి కల్యాణం

తోటపల్లిలో తాళిబొట్టు చూపుతున్న అర్చకులు

గరుగుబిల్లి, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర తిరుపతిగా ప్రసిద్ధి చెందిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామ స్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి పూజలు ఆదివారం వేడుకగా నిర్వహించారు. అర్చకుడు వి.వి.అప్పలాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ● సీతానగరం: మండల కేంద్రంలోని వేణుగోపాలునికి ఆదివారం తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో మూల విరాట్‌ను పూలమాలలతో అలంకరించారు. ● బలిజిపేట: బలిజిపేటలోని వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారిని అర్చకులు పుష్పాలు, తులసిదళాలతో అలంకరించారు. శ్రీనివాసుడు, సీతారామలక్ష్మణులకు వేర్వేరుగా పూజలు చేశారు. ● సాలూరు: పట్టణంలోని పెదకోమటిపేట రామమందిరంలో చతుర్మాస దీక్ష పూజలు ప్రారంభించారు. సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. మహిళలు విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. ● **వారాల పండగ.. వీరఘట్టం:** మండలంలోని నడిమికెల్లలో ఆదివారం వారాల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఘటాలతో ఊరేగింపు చేపట్టారు. అనంతరం భక్తులు అమ్మవారి గుడికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ● **పాలకొండ గ్రామీణం:** పాలకొండ సత్యనారాయణ ఆలయంలో సత్యనారాయణ వ్రతాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు.

సాలూరులో లలితా సహస్ర పారాయణం చేస్తున్న మహిళలు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)	
పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? ఎన్‌కేరాజపురం, అంపిలి రక్షిత పథకాలు తరచూ మొరాయిస్తున్నాయి. - **లక్ష్మీదేవి**

❖ అంపిలి వద్ద పైపులు పాడయ్యాయి. బాగు చేసి నీరందిస్తాం. - **రత్నరాజ్, కమిషనరు**

– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? కన్నపుదొర వలస నడిమివీధిలో కుళాయికి ట్యాప్పు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. – **స్థానికులు** ❖ గ్రామంలో పరిశీలించి ట్యాపులు బిగిస్తాం. - **రాజేష్, పంచాయతీ కార్యదర్శి** – జియ్యమ్మవలస

? బూర్జ పంచాయతీలో శివారు ప్రాంతాలకు కుళాయిల నుంచి నీటి సరఫరా అరకొరగా ఉంది. - **అప్పలనాయుడు** ❖ పూర్తిస్థాయిలో నీటి సరఫరాకు చర్యలు చేపడతాం. - **పవన్‌కుమార్, ఏఈ** – న్యూస్‌టుడే, సీతానగరం

? చినగుడబ పంచాయతీ గదబవలసలో మినీ రక్షిత పథకం, బోరు పరిసరాల్లో మురుగు నిల్వ చేరింది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - **గ్రామస్థులు** ❖ పరిశీలించి శుభ్రం చేయిస్తాం. - **భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, గరుగుబిల్లి

? పార్వతీపురం, శ్రీకాకుళం రోడ్డుపై బంటువానివలస గ్రామానికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన సూచిక తుప్పల మధ్య ఉంది. కొత్తగా వచ్చేవారు అయోమయానికి గురవుతున్నారు. - **నాగరాజు** ❖ పరిశీలించి తుప్పలు తొలగించేలా చూస్తాం. - **అప్పాజీ, డీఈఈ, ర.భ.శాఖ**

– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

? ఉదయపురం పంచాయతీ కేంద్రం నుంచి కాకితాడ వెళ్లే రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. – **భూషణరావు** ❖ బాగు చేసేందుకు ప్రతిపాదించాం. నిధులొస్తే పనులు చేస్తాం. - **అప్పారావు, ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారి** – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

? బాలేరు పంచాయతీలోని గొల్లకాలనీ, మజ్జల, పైడి వీధులు, ఆసుపత్రి ముందు మురుగు రోడ్డెక్కుతోంది. - **మన్మథరావు** ❖ పారిశుద్ధ్య పనులు చేపడతాం. - **కృష్ణారావు, ఈవోపీఆర్డీ** – న్యూస్‌టుడే, భామిని

నేడు సీతంపేటలో పీజీఆర్‌ఎస్

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు. పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి, పలు శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని తెలియజేశారు. అన్ని గ్రామాల గిరిజనులు వ్యక్తిగత, గ్రామాలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు అందజేసుకోవచ్చని సిబ్బంది తెలిపారు. 1100 నంబరులోనూ ఫిర్యాదు చేయొచ్చని సూచించారు.

పల్లెదారులకు మోక్షం

పార్వతీపురం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారుల ప్రాజెక్టు (ఏపీఆర్‌ఆర్‌పీ) కింద చేపట్టిన రోడ్లు, వంతెనల పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గత వైకాపా పాలనలో నిలిచిపోయాయి. వీటి కొనసాగింపునకు పీఆర్ ఇంజినీరింగ్ శాఖ మార్గదర్శకాలు జారీ చేయడంతో ఆ పరిధిలో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణం పూర్తయిన దోకిశిల- లిడికివలస రహదారి

ఇవీ మార్గదర్శకాలు..

● ప్రభుత్వం నిర్దిష్టంగా కేటాయించిన నిధులకు అనుగుణంగా పనులను మూడు విభాగాలుగా కేటాయిస్తూ పూర్తి చేయనున్నారు. ● డబ్ల్యూబీఎం, ఆపై స్థాయిలో ఉన్న రోడ్లను అంచనాలకు అనుగుణంగా చేయాలి. ● ప్రగతిలో ఉన్న వంతెనల పనులు అంచనాల మేరకు చేపట్టాలి. ● ప్రారంభమై, మట్టి పని లేదా, జీఎస్‌బీ వేసిన వాటిని సురక్షిత స్థాయికి చేర్చాలి. ● బీటీ, సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు జిల్లాలో అందుబాటులో ఉన్న నిధులను వినియోగించాలి. మిగిలినవి రద్దు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రూ.5.56 కోట్లతో చేపట్టేలా..

● ఈ పథకం కింద పార్వతీపురం డివిజన్‌లో 10 రహదారులు మంజూరయ్యాయి. వీటిలో పార్వతీపురం మండలంలోని దోకిశిల- లిడికివలస, తాళ్లబురిడి- డిములగ, గోచెక్క- బొడ్డవలస రోడ్ల పనులు పూర్తయ్యాయి. ● మిగిలిన 7 ప్రస్తుతం విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేయనున్నారు. డబ్ల్యూబీఎం వరకు పనులు జరిగిన వాటిల్లో మక్కువ మండలం దబ్బగడ్డ- డి.శిర్లాం, మక్కువ- గోపాలపురం రహదారులు మాత్రమే ముందుకు సాగే వీలుంది. వీటికోసం రూ.4.92 కోట్లు ఖర్చు చేయనున్నారు. ● మిగిలిన వాటి కోసం రూ.64 లక్షలు వెచ్చించి సురక్షిత స్థాయికి చేర్చేందుకు అనుమతి ఇచ్చారు.

పాలకొండ డివిజన్ పరిధిలో..

పూర్వ శ్రీకాకుళం జిల్లా పరిధిలోని పాలకొండ మండలంలో 2, సీతంపేటలో 1, వీరఘట్టంలో 2, భామినిలో 8 రోడ్లు మంజూరయ్యాయి. ఇవి రూ.15.90 కోట్లతో చేయాల్సి ఉంది. ● వీటిలో నాలుగైదు చివరి దశలో ఉన్నాయి. మిగిలిన వాటిని సురక్షిత స్థాయికి తీసుకురావాల్సి ఉంది. నిర్వహణకు రూ.6.46 కోట్లు ఖర్చు చేసేందుకు ఆ శాఖ అధికారులు అనుమతి ఇచ్చారు.

ఆదేశాల మేరకు చేస్తాం..

ఏపీఆర్‌ఆర్‌పీ కింద మంజూరైన రహదారులకు సంబంధించి ఇంజినీరింగ్ ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు వచ్చాయి. ఏ పనులు కొనసాగించాలి, వేటిని నిలిపివేయాలి అనే అంశంపై వచ్చిన ఆదేశాల మేరకు ముందుకు వెళ్తాం. జిల్లాలో అందుబాటులో ఉన్న నిధుల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- **వి.ఎస్.నగేష్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి, పార్వతీపురం మన్యం**

తెరపై ఈనాడు

పార్వతీపురం: **శ్రీ వీరభద్ర సినిమా:** కన్నప్ప, మార్గన్ ★ **టీబీఆర్:** తమ్ముడు, కుబేర ● **పాలకొండ: రామకళామందిర్-** కన్నప్ప ★ **వెంకటగౌరి (స్క్రీన్1)** - తమ్ముడు, **(స్క్రీన్2)** - కుబేర ● **సాలూరు: శ్రీరామ-** తమ్ముడు, **లక్ష్మి-** కుబేర, **శ్రీలక్ష్మి-** కన్నప్ప – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, పాలకొండ, సాలూరు

ఏకలవ్యుని జయంతి

సీతానగరం, న్యూస్‌టుడే: మండలంలోని సీతారాంపురంలో ఏకలవ్యుని జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎరుకుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జి.పోలీసు, మహిళా అధ్యక్షురాలు సుజాత ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సంగమేష్, హరి, పి.శంకరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సర్పంచి మృతికి సంతాపం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కృష్ణపల్లి సర్పంచి బోను రాము అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మరణం తీరని లోటని మాజీ ఎమ్మెల్యే ఎ.జోగారావు అన్నారు. టిడ్కో మాజీ ఛైర్మన్ జె.ప్రసన్నకుమార్, నాయకులతో కలిసి సంతాపం తెలిపారు. ఆయన భార్య లక్ష్మికి ధైర్యం చెప్పారు.

కూటమితో అభివృద్ధి సాధ్యం

కురుపాం గ్రామీణం, బలిజిపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతో సాధ్యమయ్యాయని తెదేపా మండల కన్వీనర్ కె.కొండయ్య అన్నారు. ఆదివారం కురుపాంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఏఎంసీ మాజీ అధ్యక్షుడు కె.రంజిత్‌కుమార్, నాయకులు శ్రీను, రామకృష్ణ, మురళి, త్రినాథ తదితరులు పాల్గొన్నారు. ● బలిజిపేట మండలంలోని గళావల్లిలో నాయకులు వి.అప్పలనాయుడు, డి.జనార్దన్, శ్రీనివాసరావు, బి.చంటి ఆధ్వర్యంలో సుపరిపాలన కార్యక్రమం జరిగింది. చిలకలపల్లిలో తెదేపా మండలాధ్యక్షుడు పి.వేణుగోపాలనాయుడు, నాయకులు రామ్మోహనరావు, రాంబాబు, సంజీవిరావు తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరు గురించి వివరించారు.

బలిజిపేట మండలంలోని చిలకలపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న తెదేపా నాయకులు

కొండపై ఏనుగులు

సీతంపేట, న్యూస్‌టుడే: మండలంలోని గోరపాడు- చిన్నబగ్గకాలనీ కొండపై నాలుగు ఏనుగుల గుంపు సంచరిస్తోంది. కొండపోడులో ఆదివాసీలు పండించే అనాస, అరటి, కొండ చీపుర్లు, ఇతర పంటలను నాశనం చేస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయం, ఇతర పనులకు బయటకు వెళ్లలేకపోతున్నామని పలువురు వాపోతున్నారు.

అధికారులను నియమించాలి

సాలూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ కార్మిక శాఖ కార్యాలయాలు ఇన్‌ఛార్జి అధికారులతో కొనసాగుతున్నాయని, పూర్తి స్థాయి అధికారులను నియమించాలని సీఐటీయూ నేత ఎన్‌వై నాయుడు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. జీగిరాం జూట్ మిల్లు మూసేశారని, అధికారులు లేక కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు.

సీతానగరం మండలం చిన బోగిల సమీపంలో 36వ రాష్ట్ర రహదారి అధ్వానంగా మారింది. రైల్వే మూడో లైను పనులు నిమిత్తం అర కిలోమీటరు మేర ప్రత్యామ్నాయ రోడ్డు వేశారు. ప్రస్తుతం అండర్ పాస్ వంతెన నిర్మిస్తున్న చోట రోడ్డు గుంతలుగా మారింది. భారీ వాహనాల రాకపోకల సమయంలో ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రైల్వే గుత్తేదారుతో మాట్లాడి మరమ్మతులు చేయిస్తామని డీఈఈ అప్పాజీ తెలిపారు. – న్యూస్‌టుడే, సీతానగరం

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

పాచిపెంట, న్యూస్‌టుడే: బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల తెగుళ్ల నివారణతో పాటు పంటలకు రక్షణ కలుగుతుందని ఏపీసీఎన్‌ఎఫ్ జిల్లా ప్రబంధకుడు ఎం.శ్రావణకుమార్ తెలిపారు. పాంచాలిలో రైతులకు ఆదివారం విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. 10 కిలోల ఆవుపేడ, 5 లీటర్ల పంచామృతం, 100 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని డ్రమ్ములో వేసి ఒకరోజు నానబెట్టాలని సూచించారు. సర్పంచి యుగంధర్, ఏవో తిరుపతిరావు, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ద్రావణం తయారీని వివరిస్తున్న అధికారులు

రెవెన్యూ అధికారులకు సత్కారం

అధికారులకు సన్మానం చేసిన ఉద్యోగులు

వీరఘట్టం, న్యూస్‌టుడే: తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన ఎ.సాయికామేశ్వరరావు, బదిలీపై వెళ్తున్న ఉప తహసీల్దారు చందక సత్యనారాయణను అధికారులు ఆదివారం సత్కరించారు. అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని తహసీల్దారు పేర్కొన్నారు. రీసర్వే డీటీ ప్రసాదరావు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.సింహాచలం, వి.రమేష్‌నాయుడు, జి.రాజేంద్ర, పీవీ రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయుడు సోమేశ్వరరావు

పాలకొండ, న్యూస్‌టుడే: ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ సోమేశ్వరరావు అందరికీ ఆదర్శమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఆయనను పాలకొండ పట్టణంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఉపవిద్యాశాఖాధికారి పద్రి కృష్ణమూర్తి, ఎంఈవో సోంబాబు, జిల్లా పూర్వపు విద్యాశాఖాధికారి పగడాలమ్మ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, ఐ.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరరావుకు జ్ఞాపిక ఇస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు

టీకాలతో పెంపుడు జంతువులకు ఆరోగ్యం

కురుపాం గ్రామీణం, సీతానగరం, బలిజిపేట, న్యూస్‌టుడే: సంక్రమిత వ్యాధులు రాకుండా పెంపుడు జంతువుల యజమానులు జాగ్రత్తలు పాటించాలని కురుపాం పశు వైద్యురాలు కె.శైలజ సూచించారు. జూనోసిస్ డే సందర్భంగా 56 పెంపుడు శునకాలకు టీకాలు వేశారు. ● సీతానగరం, నిడగల్లు, బగ్గందొరవలసలో టీకాలు వేసినట్లు ఏడీ శ్రీనివాసరావు, వైద్యులు రామారావు, గణేష్ చెప్పారు. ● బలిజిపేట పశువైద్య కేంద్రంలో 60 కుక్కలకు వైద్యుడు గణేష్ ఆధ్వర్యంలో టీకాలు వేశారు. ● పాలకొండ, గుమ్మలక్ష్మీపురం, పాచిపెంట: పెంపుడు శునకాలకు టీకాలతోనే రక్షణ ఉంటుందని జిల్లా పశువైద్యాధికారి డా.ఎస్.మన్మథరావు పేర్కొన్నారు. ఆదివారం పాలకొండ ప్రాంతీయ పశువైద్య కేంద్రంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా 45 పెంపుడు శునకాలకు వ్యాక్సిన్లు వేశారు. ఏడీ డా.మాణిక్యరావు, వీరఘట్టం పశువైద్యాధికారి డా.చైతన్యశంకర్ పాల్గొన్నారు. ● గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి పశువైద్యశాలలో వైద్యుడు లక్ష్మణరావు, పాచిపెంట, పాంచాలిలో పశువైద్యులు వెంకటరమణ, ప్రియాంక కుక్కలకు టీకాలు వేశారు.

పాలకొండలో టీకా వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి మన్మథరావు

కురుపాం పశువుల ఆసుపత్రిలో..

(c) eenadu

ఫ్లోరైడ్ సమస్యకు పరిష్కారం చూపుతాం

▶ ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో కనిగిరిలో అధికారుల పర్యటన

కనిగిరి, న్యూస్‌టుడే: ఫ్లోరైడ్ సమస్య తీవ్రతను అంచనా వేసేందుకు రాష్ట్రస్థాయి అధికారుల బృందం కనిగిరిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పర్యటించింది. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సంచాలకులు షణ్ముఖ్‌కుమార్, అదనపు కమిషనర్ ఎన్.శివప్రసాద్, ఇతర అధికారులు... కమ్మవారిపల్లెలో డీప్‌బోర్ నీటి నమూనాను పరిశీలించి ఫ్లోరైడ్ శాతం 15.7గా ఉన్నట్లు గుర్తించారు. పునుగోడు, ఎస్టీ కాలనీల్లోనూ ఏడు శాతం మేర ఉన్నట్లు తేల్చారు. సమీపంలో కుంటలను సందర్శించి నమూనాలు సేకరించారు. గురవాజీ పేటలో వాటర్ షెడ్ పనితీరును పరిశీలించారు. ఫ్లోరైడ్ తీవ్రత అధికంగా ఉన్నందున ఆయా ప్రాంతాలకు పైపులైన్ ద్వారా తాగునీరందేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలను గుర్తించి జల్ జీవన్ మిషన్ ద్వారా రక్షిత జలాలు అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మూడు రోజుల క్రితం మార్కాపురం పర్యటనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి కనిగిరిలోని ఫ్లోరైడ్ సమస్యను ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తీసుకెళ్లారు. ఆయన స్పందించి శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. ఆ మేరకు వెంటనే రాష్ట్ర స్థాయి అధికారుల బృందంతో పరిశీలన చేయించడంపై ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, ఈఈ సురేష్‌బాబు, డీఈఈ విశ్వనాథరెడ్డి, డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మవారిపల్లెలో కుళాయి నీటి నమూనాలు సేకరిస్తున్న రాష్ట్ర అధికారుల బృందం

తొలి ఏకాదశి... ఆలయాల్లో సందడి

పెళ్లూరు: జాలాముఖి అమ్మవారి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ఒంగోలు: మురళీ కృష్ణుడి మందిరంలో అలంకరణ

పొదిలి: శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

తొలి ఏకాదశి వేడుకను ఆదివారం వైభవంగా నిర్వహించారు. త్రిపురాంతక క్షేత్రం, ఒంగోలు, మార్కాపురం, పొదిలి, కనిగిరి, పామూరు తదితర ప్రాంతాల్లోని దేవస్థానాలకు భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనానికి బారులు తీరారు. పలు చోట్ల సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా చేపట్టారు. పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. ఉత్సవ ప్రాధాన్యాన్ని అర్చకులు వివరించారు. - న్యూస్‌టుడే బృందం

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మొహర్రంను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తర్లుపాడు మండలం తుమ్మలచెరువు దర్గాలో కొలువుదీరిన ఖాసింస్వామి దర్శనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. అగ్నిగుండం చుట్టూ పీర్ల కవాతు నిర్వహించి పురవీధుల్లో ఊరేగించారు. పొదిలి కొత్తూరులో పీర్ల అగ్నిగుండ ప్రవేశం తిలకించేందుకు పరిసర గ్రామాల వారు తరలివచ్చారు. - న్యూస్‌టుడే, పొదిలి

పొదిలి: గుర్రపు బగ్గీపై పీర్ల అలంకరణ సామగ్రి తరలింపు

గిద్దలూరులో ఎక్కువ వర్షపాతం నమోదైనా చుక్కనీరు లేని సగిలేరు

లోటు వర్షం... పాతాళానికి జలం!

▶ దోర్నాల మండలంలో సమస్య తీవ్రం

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విరివిగా వర్షాలు పడుతుండగా జిల్లాలో మాత్రం భిన్నమైన పరిస్థితి నెలకొంది. సగానికి పైగా మండలాల్లో సాధారణ వర్షపాతమూ నమోదు కాకపోవడం గమనార్హం. గత ఏడాదిగా ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో ఆ ప్రభావం భూగర్భజలాలపైనా పడింది. - న్యూస్‌టుడే గిద్దలూరు పట్టణం

తీవ్ర లోటు వర్షపాతం (మి.మీ.ల్లో) ఉన్న మండలాలు...

మండలం	సాధారణ	పడినది	లోటు%
తాళ్లూరు	74.3	8.4	88.7
మర్రిపూడి	66.9	15.1	77.4
ముండ్లమూరు	75.7	18.9	75
బేస్తవారపేట	82.9	30	63.8
కొత్తపట్నం	68.9	26.7	61.2
పొదిలి	59.9	23.9	60.1

జూన్ నుంచి జాడ లేదు...

ఈ ఏడాది మే నెలలో వర్షాలు ఆశాజనకంగా ఉండడంతో పంటల సాగుకు ఢోకా ఉండదని రైతులు భావించారు. తరువాత జూన్ నెలారంభం నుంచి ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ జల్లు ఒక్కటీ పడలేదు. సాగుకు కీలకమైన ఈ సమయంలో 70.40 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 45.90 మి.మీ. మాత్రమే పడింది. జిల్లాలోని 22 మండలాల్లో లోటు, మరో పది మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. తాళ్లూరులో అత్యధికంగా 88.70 శాతం లోటు ఉండగా... గిద్దలూరులో మాత్రమే సాధారణానికి మించి 24.9 శాతం అధికంగా వర్షాలు పడ్డాయి. ముండ్లమూరు, పొదిలి, తాళ్లూరు, మర్రిపూడి, బేస్తవారపేట, కొత్తపట్నం మండలాల్లోనూ లోటు ఎక్కువగానే ఉంది. దీంతో ఆయా ప్రాంతాల్లోని చెరువులు, ఇతర జలవనరులు ఒట్టిపోయాయి.

భూగర్భ జలాలపైనా ప్రభావం...

వర్షాభావ పరిస్థితులు జిల్లాలోని భూగర్భ జలాలపైనా ప్రభావం చూపాయి. గత ఏడాది జూన్‌తో పోలిస్తే పలు మండలాల్లో ఏకంగా పది మీటర్ల కంటే ఎక్కువ లోతుకు పడిపోయాయి. ముఖ్యంగా దోర్నాలలో 59.60 నుంచి 64.75 మీటర్లకు; త్రిపురాంతకంలో 6.75 నుంచి 18.97; యర్రగొండపాలెంలో 39.13 నుంచి 44.74 మీటర్ల లోతుకు దిగజారాయి.

ఇనాం ఉచ్చు... పట్టా భూమికి చిక్కు!

▶ జిల్లా వరకు 50 వేల ఎకరాల్లో సమస్య
▶ గత ప్రభుత్వ నిర్వాకంతో రైతులకు ఇక్కట్లు

గత వైకాపా ప్రభుత్వంలో చోటుచేసుకున్న ఫ్రీహోల్డ్ భూముల అక్రమ వ్యవహారం... నేడు సాధారణ రైతులకు కొత్త చిక్కులు తెచ్చిపెడుతోంది. 2024 ఎన్నికలకు ముందు అసైన్డ్ నిబంధనలను సవరించి... 2003కు ముందు అసైన్డ్ చేసిన భూములపై అనుభవదారులకు హక్కులు కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మాటున వైకాపా నాయకులు చక్రం తిప్పారు. అర్హత లేకున్నా పెద్ద ఎత్తున భూములను ఫ్రీహోల్డ్ కింద చేర్చి... లోపాయికారీ ఒప్పందాలతో దొడ్డిదారిన రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. కొందరు రెవెన్యూ అధికారులూ ఇందుకు సహకరించారు. తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ అక్రమాల నిగ్గు తేల్చేందుకు నిర్ణయించింది. అసైన్డ్, ఇనాం భూములను నిషేధిత జాబితాలో చేర్చింది. దీంతో ఇనాంగా నమోదైన రైతువారీ పట్టా భూముల క్రయ, విక్రయాలు సైతం నిలిచిపోయాయి. అవసరాలకు అమ్ముకోలేక కొందరు... ఆస్తుల భాగ పంపిణీ చేసుకోలేక మరికొందరు ఇబ్బంది పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్ చుట్టూ తిరిగినా ఫలితం ఉండడం లేదు.

టంగుటూరు రెవెన్యూ గ్రామ సర్వే నం.609/3లో ఇనాంగా నమోదైన రైతు వారీ పట్టా భూమి

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపు...

గత ప్రభుత్వ హయాంలో భూదస్త్రాల స్వచ్ఛీకరణ చేపట్టారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా పాత దస్త్రాల ఆధారంగా ఇష్టానుసారంగా వివరాలు మార్పు చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 50 వేల ఎకరాల వరకూ ఇనాం భూములుగా మారిపోయాయి. రైతులు పంట రుణాల కోసం అడంగల్ తీసుకున్నా ఇనాం భూములుగా చూపడంతో చిక్కులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో పట్టా భూములకు సడలింపు విషయమై ప్రభుత్వ నిర్ణయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

▶ కొండపి మండలం పెరిదేపిలో గత ప్రభుత్వం నిర్వహించిన భూముల రీసర్వేలో... కనీస పరిశీలన లేకుండా నాలుగో వంతు విస్తీర్ణాన్ని ఇనాం భూములుగా నమోదు చేశారు. దీంతో రైతువారీ పట్టా భూములు సైతం అమ్మకానికి అవకాశం లేక... రెండేళ్లుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.

▶ టంగుటూరు రెవెన్యూ గ్రామ సర్వే నం.609/3లో సుమారు ఇరవై ఎకరాలు ఇనాం భూమిగా నమోదైంది. ఇందులోనే జమ్ములపాలేనికి చెందిన కాకుమాని వెంకటేశ్వర్లుకు 3.30 ఎకరాలు ఉంది. ఆయన మృతి చెందడంతో ముగ్గురు కుమారులు ఆ స్థలాన్ని భాగ పంపకాలు చేసుకున్నా... వెబ్‌ల్యాండ్‌లో ఇనాంగా నమోదు కావడంతో రిజిస్ట్రేషన్‌కు ఆటంకం ఏర్పడింది. - న్యూస్‌టుడే, ఒంగోలు కలెక్టరేట్

ట్రిపుల్ ఐటీల్లో మిగులు సీట్లు 600

వేంపల్లె, న్యూస్‌టుడే: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిశాక ఈ నాలుగు ప్రాంగణాల్లో మొత్తం 600 సీట్లు మిగిలాయి. వీటి భర్తీకి సంబంధించి తదుపరి మెరిట్ జాబితాను ఈ నెల 11 లేదా 12 తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచుతారు. ఇడుపులపాయలో 132, నూజివీడులో 141, శ్రీకాకుళంలో 143, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 184 సీట్లు మిగిలాయి. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాల్సి ఉన్నందున ఆలోపే ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తామని రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు.

వారు వద్దంటారు... వీరు కట్టేస్తారు!

▶ పొదిలి వక్ఫ్ భూముల్లో చిత్రం

ఇదేదో నూతనంగా వెలుస్తున్న కాలనీ కాదు. పొదిలి వక్ఫ్‌బోర్డు భూముల్లో వెలుస్తున్న నిర్మాణాలు. ఇక్కడి ఆక్రమణల తొలగింపుపై యంత్రాంగం ఓవైపు కసరత్తు చేస్తుండగా... మరోవైపు అదే స్థాయిలో కొత్త కట్టడాలు చేపడుతుండడం గమనార్హం. వారం రోజుల క్రితమే తాత్కాలికంగా వేసిన పాకలు, అనధికారిక రహదారిని పొదిలి నగర పంచాయతీ అధికారులు తొలగించారు. కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్, జిల్లా ఇన్‌స్పెక్టర్, ఇతర అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆక్రమణదారులు ఎంతమంది ఉన్నారు, ఎందరికి నోటీసులు ఇచ్చారన్న విషయాలను ఆరా తీశారు. కొత్తగా నిర్మాణాలు చేపట్టొద్దని ఆదేశించారు. అయినప్పటికీ ఆక్రమణల పరంపర ఆగడం లేదు. పెపెచ్చు సిమెంట్ ఇటుకలతో శాశ్వత కట్టడాలు చేపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించకపోతే విలువైన వక్ఫ్ బోర్డు భూములు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని పట్టణవాసులు వ్యాఖ్యానిస్తున్నారు. - న్యూస్‌టుడే, పొదిలి


సాగుకు సిద్ధం చేసిన కాసరి కుంట భూమి

కుంటను మింగిన ఘనులు

మార్కాపురం, న్యూస్‌టుడే: పశుపోషకులకు, రైతులకు ఉపయుక్తంగా ఉన్న కుంటను కొందరు వైకాపా నాయకులు దర్జాగా కబ్జా చేసి పంటలు సాగు చేస్తున్నారు. వెబ్‌ల్యాండ్‌లో నేటికీ కుంట భూమిగానే చూపుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అది కానరావడం లేదు. జలవనరుల శాఖ అధికారులూ పట్టించుకోవడం లేదు. మార్కాపురం మండలం చింతకుంటలో చోటుచేసుకున్న చోద్యమిది. గ్రామ సర్వే నంబరు 71లో 2.98 ఎకరాల్లో కాసరి కుంట విస్తరించి ఉంది. జీవాలు, పశువుల దాహార్తితో పాటు రైతుల అవసరాలు తీర్చేందుకు అరవై ఏళ్ల క్రితం ప్రభుత్వమే దీనిని ఏర్పాటు చేసింది. చింతకుంట, ఎల్.బి.ఎస్.నగర్, అయ్యవారిపల్లె, బడేఖాన్‌పేట తదితర గ్రామాల పశు పోషకులకు ఉపయుక్తంగా ఉండేది. వర్షాల సమయంలో నీరు చేరి సమీప పొలాల్లోని బోర్లకు పుష్కలంగా భూగర్భ జలాలు అందేవి. ఇంతటి ప్రాధాన్యమున్న కుంటపై గత ప్రభుత్వ హయాంలో కొందరు వైకాపా నాయకులు కన్నేశారు. అయిదు సెంట్లు మినహా మిగతా స్థలమంతా ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. అటుగా పశువులను సైతం వెళ్లనీయడం లేదని కొందరు స్థానికులు వాపోతున్నారు. రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు స్పందించి కుంటను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఉప తహసీల్దారు శ్రీనివాసులును వివరణ కోరగా... క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రూ.15 కోట్ల స్థలంపై కన్ను!

▶ కనిగిరి పాల కేంద్రం భూముల ఆక్రమణకు యత్నం ▶ ఇప్పటికే విలువైన పరికరాల అపహరణ

పరికరాలు అపహరించడంతో మిగిలిన గోడలు

ఒకప్పుడు పాడి రైతులకు కల్పతరువుగా గుర్తింపు పొందిన కనిగిరిలోని పాల శీతలీకరణ కేంద్రం... యంత్రాంగం నిర్లక్ష్యంతో నేడు ఆ ప్రాభవం కోల్పోయింది. కార్యకలాపాలు నిలిచిపోవడంతో విలువైన పరికరాలు అపహరణకు గురయ్యాయి. తాజాగా... అక్కడున్న విలువైన భూములపైనా అక్రమార్కుల కన్నుపడింది. - న్యూస్‌టుడే, వెలిగండ్ల, కనిగిరి

నిర్వహణ లేక నిరుపయోగం..

కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలు, ఆ సమీప ప్రాంతాల్లోని వందలాది మంది పాడి రైతుల నుంచి నిత్యం వేలాది లీటర్ల పాలు సేకరించేవారు. వీటిని ఈ కేంద్రంలోనే శీతలీకరించి ప్రధాన డెయిరీకి తరలించేవారు. కాలక్రమంలో నిర్వహణ కొరవడడం, రైతులకు రూ.30 లక్షల మేర బకాయిలు చెల్లించకపోవడం వంటి కారణాలతో మూతపడింది. తెదేపా ప్రభుత్వ హయాంలో కేంద్రం పునరుద్ధరణకు కొంత ప్రయత్నం జరిగినా... తరువాత వచ్చిన వైకాపా సర్కారు పట్టించుకోకపోవడంతో పూర్తిగా నిరుపయోగంగా మారింది. ఆవరణంతా చిల్లచెట్లు పెరిగి మందుబాబులు, జూదరులకు అడ్డాగా మారింది. అసాంఘిక కార్యకలాపాలూ చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే కేంద్రంలో ఉన్న దాదాపు రూ.30 లక్షల విలువైన యంత్రాలు, విద్యుత్తు, ఇతర పరికరాలను దొంగలు అపహరించుకుపోయారు.

ఆక్రమణలో ఉన్న పాల కేంద్రం భూమి

ప్లాట్లుగా విక్రయించేందుకు యత్నం...

మొత్తం అయిదు ఎకరాల విస్తీర్ణంలో పాల శీతలీకరణ కేంద్రం విస్తరించి ఉంది. ఈ స్థలం విలువ రూ.15 కోట్లకు పైమాటే. ప్రస్తుతం పాల సేకరణ లేకపోవడం, యంత్రాంగమూ పట్టించుకోకపోవడంతో కొందరు అక్రమార్కులు ఈ భూములపై కన్నేశారు. కేంద్రం వెనుక భాగంలో కొంతమేర ఆక్రమించి హద్దు గోడ నిర్మించారు. ప్లాట్లుగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇంతజరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. విషయాన్ని ఒంగోలు డెయిరీ సీఈవో రాజ్‌మోహన్ దృష్టికి తీసుకువెళ్లగా... కేంద్రంలోని కొన్ని పరికరాలను భద్రపరిచామన్నారు. స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తొట్టెల నిర్మాణం... జీవాలకు వరం

▶ జిల్లాలో 1,226 పనుల పూర్తి

న్యూస్‌టుడే - ఒంగోలు గ్రామీణం

జిల్లాలో పాడి పోషణ ఎక్కువ. వర్షాభావ ప్రాంతం కావడంతో వేసవిలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు వీలుగా... కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం అనుసంధాన నిధులతో నీటి తొట్టెల నిర్మాణాలకు ప్రాధాన్యమిచ్చింది. వీటి నిర్వహణ బాధ్యతను పశు సంవర్ధక, పంచాయతీ రాజ్ శాఖల అధికారులకు అప్పగించడంతో చాలా వరకు సమస్య తీరింది.

యర్రగొండపాలెం మండలం మొగుళ్లపల్లిలో నిర్మించిన పశువుల నీటి తొట్టె

ఎండిపోయిన వనరులు...

ఈ ఏడాది వేసవి సీజన్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వర్షాకాలం ఆరంభమైనా వడగాలుల తీవ్రత కొనసాగుతోంది. గత ఏడాది డిసెంబర్ తర్వాత ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ వర్షాలు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, వాగులు ఎండిపోయాయి. ఈ నేపథ్యంలో జీవాలు మేతకు వెళ్లే ప్రాంతాల్లో నీటి తొట్టెల నిర్మాణానికి నిర్ణయించి... జిల్లాలోని 729 పంచాయతీల్లో వీటి ఏర్పాటుకు డ్వామా అధికారులు ప్రతిపాదించారు. ఆ మేరకు ఒక్కో నిర్మాణానికి రూ.36,900 చొప్పున... 1,376 తొట్టెల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 1,226 పనులు పూర్తికాగా... మరో 148 పురోగతిలో ఉన్నాయి. పనులు పూర్తయిన చోట నీటి వసతి కల్పించడంతో వేసవిలో పశువుల దాహార్తి తీరింది.

పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సాంక్రమిక వ్యాధులపై అందరూ అవగాహన పెంచుకోవాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా సంతపేటలోని జిల్లా పశు వైద్యశాలలో యాంటీ రేబిస్ ఉచిత టీకా శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయిస్తున్నట్లు తెలిపారు. పెంపుడు జంతువుల యాజమానులు వాటి వివరాలను నగరపాలక సంస్థ కార్యాలయంలో నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బి.రవి, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, యూబీఐ ఆర్.ఎం. రవికుమార్, వీపీసీ డీడీ ఎన్.జగత్ శ్రీనివాస్, వైద్యాధికారులు పాల్గొన్నారు. మొత్తం 320 పెంపుడు శునకాలకు టీకాలు వేశారు. ఆచార్య ఎన్జీ రంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశాలకు 30 కుర్చీలు అందజేశారు. ముందుగా డాగ్ స్క్వాడ్ నిర్వహించిన వందన సమర్పణ ఆకట్టుకుంది.

డాగ్ స్క్వాడ్‌తో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 9701112824

(c) eenadu

సాగర్‌లో ఆశల నాట్లు..

జిల్లాలోని సాగర్ ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కృష్ణా నదీ పరివాహకంలో వర్షాలు కురిసి శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు వరద పోటెత్తుతుండటంతో జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. దీంతో సాగు నీటి విడుదలపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం

కృష్ణా బేసిన్‌లో ఎగువ కురుస్తున్న వానలతో శ్రీశైలం జలాశయానికి పెద్దఎత్తున వరద నీరు చేరుతోంది. ప్రస్తుతం దాదాపు 1,35,000 క్యూసెక్కుల ప్రవాహం వస్తోందని రెండు మూడు రోజుల్లో గేట్లు ఎత్తే అవకాశముందని సాగర్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే శ్రీశైలం జలాశయంలో జల విద్యుత్తు ద్వారా నాగార్జున సాగర్ జలాశయానికి 56,000 క్యూసెక్కుల నీరొస్తోందని వారంటున్నారు. ఈ నేపథ్యంలో సాగర్ జలాశయంలోనూ జలకళ కన్పిస్తోంది. ఈ మేరకు దిగువకు నీటిని విడుదల చేసే అవకాశముందని చెబుతున్నారు. ఈ అంచనాలతో జిల్లాలోని సాగర్ ఆయకట్టు ప్రాంతంలో పంటలు వేసుకునేందుకు రైతన్నలు సమాయత్తమవుతున్నారు.

నిండుకుండలా శ్రీశైలం జలాశయం

నారుమడులకు శ్రీకారం

జిల్లాలో 2,55,699 ఎకరాల సాగర్ ఆయకట్టు ఉండగా.. అందులో 1,03,123 ఎకరాల మాగాణి కాగా మిగతా 1,52,576 ఎకరాలు ఆరుతడి భూములు. గతేడాది సాగర్ ఆయకట్టులో 23,504 ఎకరాల్లో వరి సాగైంది. ఈ సారి శ్రీశైలం జలాశయం ముందుగా నిండటంతో ముందస్తుగానే సాగు నీరు విడుదలయ్యే అవకాశముంది. దీంతో బోరు బావులున్న రైతులు నారుమడులు సిద్ధం చేస్తున్నారు.

కంభంలో నేతల తూట్లు

కరవుతో అల్లాడే పశ్చిమ ప్రకాశంలో నీరంతా వృథాగా కడలి పాలవుతోంది. ప్రతి నీటి బొట్టును ఆదా చేసుకోవాల్సిన తరుణంలో.. అధికారుల నిర్లక్ష్యంతో కష్టాలు తప్పడం లేదు. ఇప్పటి వరకూ సరైన వానలు కురవలేదు. వాగులు, వంకలు ముందుకు సాగలేదు. కంభం చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని కొంతమంది కోసం వదిలేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తటాకం ఖాళీ అయ్యే పరిస్థితి ఉందని స్థానికులు, రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, కంభం

చిన్నకంభం తూము కాలువ ద్వారా వృథాగా పోతున్న జలం

కంభంలోని చారిత్రక చెరువు నుంచి నీళ్లు వృథాగా పోతుండటంతో గ్రామాల్లోని వాసులు ఆందోళన చెందుతున్నారు. దీనివల్ల కంభం, బేస్తవారపేట పట్టణాలతో పాటు పరిసర ప్రాంతాల్లోని సుమారు ఇరవై గ్రామాలవారికి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదముంది. చెరువులో ప్రస్తుతం 5 అడుగుల మేర మాత్రమే నీరుంది. చెరువుకు ఉన్న మూడు ప్రధాన తూముల నుంచి లీకేజీల ద్వారా నిత్యం సుమారు 25 క్యూసెక్కుల జలం కడలి పాలవుతోంది.

నాయకులు చెప్పారని..!

దరగా గ్రామ పరిసరాల్లో కొందరు వేసవి పత్తి పంట సాగు చేశారు. కొందరు ముఖ్యమైన నాయకులు చెప్పారనే ఉద్దేశంతో నీటి పారుదల శాఖ అధికారులు నీటిని వదిలేస్తున్నారు. వేల కుటుంబాలకు ఆధారమైన నీటిని వదిలేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. చెరువు ఖాళీ అయితే భూగర్భ జలాలు అడుగంటిపోయి తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల కిందట ఇలాగే తూము ఎత్తి నీటిని వృథా చేశారు. ఇటీవల కాలంలో చింతలపాలెం సమీపంలోని చీతిరాల కతువ గేట్లు ఎత్తి జలం వదిలేశారు. దాంట్లో చాలా వరకూ నీటిమట్టం తగ్గిపోయింది. ఇక్కడ జలం నిలిచిపుంటే బేస్తవారపేట, సోమవారపేట, చింతలపాలెం, దరగా, నేకునాంబాద్, హజరత్ గూడెం తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. దరగా గ్రామ రైతులు అడిగితే నీటిని విడుదల చేశామని నీటి పారుదల శాఖ డీఈ వేమారెడ్డి తెలిపారు.

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

కేంద్ర ప్రభుత్వ తీరుపై పోరాటం

పామూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న లేబర్ కోడ్ చట్టాలు రద్దయ్యే వరకూ పోరాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ తెలిపారు. లేబర్ కోడ్ రద్దుకై దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ జీపు జాత ప్రచార యాత్ర ఆదివారం పామూరు సుందరయ్య భవనం కూడలిలో కె.మాల్యాద్రి అధ్యక్షతన జరిగింది. ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక రంగాన్ని కాపాడుకోవడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నల్లగుంట్లలో పోలీసు పికెటింగ్

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: నల్లగుంట్లలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన వ్యక్తి హత్య నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. గ్రామంలో ముగ్గురు పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తుంటారని ఎస్సై మహేష్ తెలిపారు. ఉద్రిక్తత తగ్గే వరకు పికెటింగ్ కొనసాగిస్తామన్నారు. నిందుతుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు.

వసతిగృహ సంక్షేమాధికారుల కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు గ్రామీణం, బేస్తవారపేట, న్యూస్‌టుడే : జిల్లా బీసీ సంక్షేమ శాఖ వసతి గృహ సంక్షేమాధికారుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా బీసీ సంక్షేమాధికారి నిర్మలాజ్యోతి తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ఒంగోలుకి చెందిన ముత్యాల ప్రసాద్, కార్యదర్శిగా బేస్తవారపేటకు చెందిన కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి, కోశాధికారిగా కనిగిరికి చెందిన పూజల వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా తర్లుపాడుకు చెందిన భూమా సురేష్‌లతో పాటు మిగతా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైద్యులు, పలువురు ప్రతినిధులు

కత్తి చంద్రయ్య నేటి తరానికి స్ఫూర్తి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా తొలి కలెక్టర్ కత్తి చంద్రయ్య 101వ జయంతిని పురస్కరించుకుని స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం [illegible] పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా [illegible] విశేషమైన సేవలు అందించడంతోపాటు; బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. పాలనా పరమైన విధానాలతో పాటు ఆయన దూరదృష్టిని వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత పాటిబండ్ల ఆనందరావు, వైద్యులు రావిపాటి ప్రసాద్‌రావు, విజయ రాఘవరావు, మెప్మా పూర్వ పీడీ టి.రవికుమార్, బీరం సుందరరావు, శ్రీపతి ప్రకాశం, చావలి సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీతో పచ్చదనం పెంపు

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గుండ్లకమ్మ జలాశయాన్ని ఆదివారం రాష్ట్ర ఉపాధి హామీ డైరెక్టర్ షణ్ముఖ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీవారి వనం పరిసరాలను హరితవనంగా మార్చడంపై శ్రీవారి వనం కమిటీ సభ్యులను అభినందించారు. ఆలయ ప్రాంగణంలోని కోనేరు అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా మొక్కలు నాటి అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామన్నారు. నర్సరీ ఏర్పాటుచేసి భక్తులకు మొక్కలు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు ఆయన జలాశయం చెంతన ఉన్న వేంకటేశ్వర ఆలయాన్ని సందర్శించి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, ఎంపీడీవో జ్యోతి, ఏపీవో ధనుంజయ వర్మ, శ్రీవారి వనం కమిటీ గౌరవ అధ్యక్షుడు కాపూరి వాసు, అధ్యక్షులు మార్నేని కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి బోయపాటి రవి, సర్పంచి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు

మల్లవరంలోని శ్రీవారి ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న రాష్ట్ర ఉపాధి హామీ డైరెక్టర్ షణ్ముక్ కుమార్, అధికారులు

ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ అమలుతో పాటు; 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 11వ వేతన సవరణ గడువు ముగిసి రెండేళ్లు కావస్తున్నా ఇంతవరకు 12వ వేతన సవరణ కమిషన్ నియామకం పట్ల దృష్టి సారించకపోవడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది దాటినా ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలపై నోరు మెదపకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పాఠశాలల పునర్విభజన ప్రక్రియ కారణంగా చాలాచోట్ల ఖాళీలున్న నేపథ్యంలో డీఎస్సీలో పోస్టుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.యర్రయ్య, నాయకులు అశోక్‌బాబు, నరసింహారెడ్డి, హజరత్తయ్య, మౌలాలి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

వీరభద్రస్వామి మూలవిరాట్టు

దర్శనానికి బారులుతీరిన భక్తులు

పరవశించిన పాలంక

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: వీరభద్రస్వామి తిరునాళ్ల సందర్భంగా నల్లమలలోని పాలంక క్షేత్రం పరవశించింది. ఈ సందర్భంగా తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరిగింది. లోతట్టు అటవీ ప్రాంతంలోని క్షేత్రానికి భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సంతానం లేనివాళ్లు చుక్కల పర్వతం కింద తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. లోయలోని కొండ చరియ కింద వెలసిన వీరభద్రుడు, భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వచ్చిన భక్తులకు పలువురు దాతలు అన్నసంతర్పణ, నీటి వసతి ఏర్పాటు చేశారు. అధికారులు వైద్యశిబిరం నిర్వహించారు.

దంత వైద్యంలో ఆధునిక విధానాలపై అవగాహన

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: రూట్ కెనాల్ చికిత్సలో ఆధునిక విధానాలపై అవగాహన పెంచుకుని అనుసరించాలని ప్రముఖ దంత వైద్యులు దిల్లీ గురుగ్రామ్ నుంచి వచ్చిన ఆగం భట్నాకర్ కోరారు. దంత వైద్యంలో ఆధునిక పద్ధతులు, శస్త్రచికిత్సలపై నగరంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ఐఎంఏ హాలులో ఏర్పాటు చేసిన సదస్సుకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తుమ్మల రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి భట్నాకర్ రూట్ కెనాల్ చికిత్సపై యువ వైద్యులకు అవగాహన కల్పించారు. పవర్‌పాయింట్ ద్వారా కొన్ని అంశాలు తెలియజేశారు. పీడీసీసీబీ ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఏపీ ఎంసీఏ డైరెక్టర్ డాక్టర్ సుబ్బానాయుడు సదస్సుకు అతిథులుగా హాజరయ్యారు. వృత్తి నైపుణ్యాలు పెంచుకోవడానికి ఇలాంటి సదస్సులు దోహదపడతాయన్నారు. డాక్టర్ సీతారామయ్య మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సదస్సును నగరంలో నిర్వహించడం పట్ల అసోసియేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, డెంటల్ హెచ్‌వోడీ డాక్టర్ నామినేని కిరణ్, డెంటల్ అసోసియేషన్ కార్యదర్శి మండవ సుభాష్, కళ్యాణ్‌వర్ధన్ పాల్గొన్నారు.

అతివల నైపుణ్య వెలుగులు

● స్కిల్‌హబ్ శిక్షణలతో ఉపాధి

న్యూస్‌టుడే, సంతనూతలపాడు

ఉచిత శిక్షణతో నిరుద్యోగ యువతులు ఆర్థికంగా స్థిరపడుతూ కుటుంబానికి కొండంత అండగా నిలుస్తున్నారు. పదుల సంఖ్యలో ఉద్యోగాలను సాధించి సత్తా చాటుతున్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అందిస్తున్న శిక్షణ వారికి వరంగా మారింది. స్కిల్ హబ్ పేరుతో ఉచితంగా కంప్యూటర్, టైలరింగ్‌లో శిక్షణ అందిస్తున్నారు. [illegible] మహిళా ప్రాంగణంలో స్కిల్‌హబ్ ద్వారా 15 నుంచి 45 ఏళ్లలోపు నిరుద్యోగ మహిళలకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. మూడు నెలల పాటు శిక్షణ కొనసాగుతోంది. ఇప్పటి వరకు ప్రాంగణంలో 13 బ్యాచ్‌ల్లో 336 మంది నిరుద్యోగ మహిళలు కంప్యూటర్, టైలరింగ్‌లో తర్ఫీదు పొందారు. ప్రస్తుతం 28 మంది కంప్యూటర్‌లో శిక్షణ పొందుతున్నారు. [illegible] ఎంఎస్ ఆఫీస్, ఎక్సెల్, అకౌంటింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇది పూర్తి చేసుకున్న వారు ఉద్యోగాలు, ఉపాధి పొంది తమ జీవితాల్లో వెలుగులు నింపుకుంటున్నారు. పలు కంపెనీలు ఎంపికలు చేపట్టగా పలువురు మహిళలు ఉద్యోగాలు పొందారు. గ్రామీణ నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఉచిత శిక్షణలు అందిస్తున్నట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ యాదవ్ తెలిపారు. మూడు నెలల పాటు ప్రతి బ్యాచ్‌కు 30 మందికి తర్ఫీదు ఇస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో స్కిల్‌హబ్‌తో వీటిని కొనసాగిస్తున్నామన్నారు.

మహిళా ప్రాంగణంలో ఉచిత శిక్షణ

మంచి జీవితం పొందా

డిగ్రీ పూర్తి చేసిన కుంచాల గీత మహిళా ప్రాంగణంలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ పొందారు. సంతనూతలపాడుకు చెందిన ఆమె [illegible] నుంచి అన్ని అంశాలు తెలుసుకున్నారు. అనంతరం [illegible] ఒంగోలులోని కౌన్సిలర్, కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉద్యోగం సాధించి నెలకు రూ.18వేల జీతాన్ని పొందుతున్నారు.

ఆదమరిస్తే అంతే

పొదిలి : ఒంగోలు – పొదిలి మార్గంలో చిన్న బస్టాండ్ సమీపంలో రహదారిపై భారీ గుంతలు పడ్డాయి. అక్కడ తరచూ ప్రమాదాలు జరిగి పలువురు గాయాల పాలవుతున్నారు.

ఆర్వీపాలెంలో ఇరు వర్గాల ఘర్షణ

తాళ్లూరు: [illegible]

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

[illegible]

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

చెన్‌ఫామ్: బ్రాయిలర్ ధర - 110, [illegible] - 182, [illegible] - 191, [illegible] - 218

వైభవంగా సాయి రథోత్సవం

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: భగవాన్ సత్యసాయి బాబా జయంతి సందర్భంగా ప్రేమ వాహిని రథోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం స్థానిక మంగమూరు రోడ్డులోని సత్యసాయి బాబా మందిరం నుంచి రథయాత్ర ప్రారంభమై నగర పురవీధుల్లో సాగింది. సీతారాములు, ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి వేషధారణలో చిన్నారులు అలరించారు. నృత్యాలు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రథయాత్రలో నృత్యం చేస్తున్న చిన్నారులు

సీఎస్ పురంలో కిలేడీలు

● రెండు దుకాణాల్లో బంగారం, వెండి చోరీ

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: సి.ఎస్.పురంలోని రెండు బంగారు దుకాణాల్లో వ్యాపారుల కళ్లుగప్పి ఇద్దరు మహిళలు బంగారు, వెండి వస్తువులను చోరీ చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సి.ఎస్.పురంలోని టీఎన్ఆర్ జ్యూయలరీకి ఈ నెల 3న ఇద్దరు మహిళలు బంగారు కమ్మలు కొనుగోలు చేసేందుకు వచ్చారు. యజమాని తోట నాగేశ్వరరావు వేరే వారికి పట్టీలు చూపిస్తున్న సమయంలో సదరు మహిళలు అయిదు జతల కమ్మలను దొంగిలించి వాటి స్థానాల్లో నకిలీవి పెట్టి ఉడాయించారు. కొద్దిసేపటి తర్వాత సీసీ ఫుటేజీ పరిశీలించగా..ఇద్దరు మహిళలు బంగారు కమ్మలు చోరీ చేస్తున్న విషయాన్ని గుర్తించారు. వాటి విలువ రూ.1.50 లక్షలని వ్యాపారి చెప్పారు. గత 9న సి.ఎస్.పురంలోని లక్ష్మీ చంద్రిక జ్యూయలరీలో రూ.1.5 లక్షల విలువైన వెండి పట్టీలను ఇదే విధంగా తస్కరించారని దుకాణ యజమాని వడ్డమాని నారాయణచారి తెలిపారు. ఈ మేరకు ఆయా దుకాణ యజమానులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గుంటిగంగలో టిప్పరు బోల్తా

తాళ్లూరు, న్యూస్‌టుడే: తాళ్లూరు మండలం గుంటిగంగ వద్ద ఆదివారం సాయంత్రం ఓ టిప్పరు బోల్తా పడింది. అయితే ఎలాంటి ప్రాణాపాయం సంభవించలేదు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు..విజయవాడ-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే రహదారి నిర్మాణంలో భాగంగా ఓ గుత్తేదారు సంస్థకు చెందిన టిప్పరు గుంటిగంగ నుంచి తాళ్లూరు రహదారిలోకి వస్తోంది. వాహనం వేగం అదుపు కాక రహదారి పక్క బోల్తాపడింది. దీంతో వాహన చోదకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండ మండలంలోని ఊళ్లపాలెంలో ఆదివారం ఉదయం విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..ఊళ్లపాలెంలో ఉంటున్న గౌరవరపు సునీల్ నివాసముంటున్న ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అయితే ఇంట్లోని సామగ్రి కాలిబూడిదైంది. రూ.3 లక్షల ఆస్తినష్టం సంభవించిందని బాధితుడు వాపోయారు.

పెళ్లికి నిరాకరించారని యువజంట ఆత్మహత్య

గిద్దలూరు పట్టణం, కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే : తమ వివాహానికి పెద్దలు అనుమతించడం లేదని ఓ యువ జంట బలవన్మరణానికి పాల్పడింది. మృతిచెందిన వారిలో ఒకరు వివాహిత కావడం గమనార్హం. కొమరోలు ఎస్.ఐ.నాగరాజు వెల్లడించిన వివరాల ప్రకారం..కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం మాధవరానికి చెందిన కంబగిరి పాపయ్య కుమారుడు రాముడు(25) లారీ చోదకుడిగా పని చేస్తున్నారు. వారి ఇంటికి సమీపంలోనే భారతి ఉంటున్నారు. ఆమెకు రెండేళ్ల క్రితం ఆమెను మేనమామ కుమారుడు శివప్రసాద్‌ను ఇచ్చి పెళ్లి చేశారు. అయితే భర్తతో విభేదాల కారణంగా ఆమె కొంతకాలంగా తల్లిదండ్రుల వద్దే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో కంబగిరి రాముడు..భారతి కొంతకాలంగా సన్నిహితంగా ఉంటున్నారు. తామిద్దరూ ప్రేమించుకుంటున్నామని, పెళ్లి చేసుకుంటామని వారు తల్లిదండ్రులకు చెప్పగా..వారు వరుస కాదంటూ మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన రాముడు, భారతితో కలిసి శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై కొమరోలు మండలం అక్కపల్లె వద్దకు బయలుదేరి వెళ్లారు. శనివారం సాయంత్రం రాముడు తండ్రికి ఫోన్ చేసి తాము చనిపోతున్నామని చెప్పి, వెంటనే తామున్న ప్రాంతాన్ని కూడా వాట్సాప్ చేశాడు. దీంతో ఆందోళనకు గురైన ఇరు కుటుంబాల వారు ఆదివారం ఉదయం కొమరోలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా, ఎస్ఐ నాగరాజు, సిబ్బందితో హుటాహుటిన కొమరోలు శివారు ప్రాంతానికి వచ్చి పరిశీలించగా..రాముడు, భారతి మృతదేహాలు చెట్టుకు వేలాడుతున్నాయి. వెంటనే వారు మృతదేహాలను గిద్దలూరు వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం చేయించారు. అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించగా, వారు మాధవరానికి తరలించారు. ఒకే ప్రాంతానికి చెందిన వారు బలవన్మరణానికి పాల్పడటంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

మనస్తాపంతో వివాహిత బలవన్మరణం

దొనకొండ, న్యూస్‌టుడే: మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన దొనకొండ మండలంలోని వెంకటాపురంలో చోటు చేసుకుంది. ఎస్సై త్యాగరాజు తెలిపిన వివరాల ప్రకారం..వెంకటాపురం ఎస్సీ కాలనీకి చెందిన జెల్ది వెంగళమ్మ(36)ను 18 ఏళ్ల క్రితం తెల్లబాడుకు చెందిన మరియదాసుకు ఇచ్చి వివాహం చేశారు. కొంతకాలానికి భర్తతో విభేదాలు తలెత్తడంతో ఆమె కుమారుడిని తీసుకొని తల్లిదండ్రుల వద్దకు చేరారు. కూలి పనులకు వెళుతూ కుమారుడిని చదివించుకుంటున్నారు. కాలనీలో మూడేళ్ల క్రితం గృహం నిర్మించుకున్నారు. ఒంటరి జీవితం, ఇతర సమస్యలతో మనస్తాపానికి గురై శనివారం రాత్రి ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీనిపై బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES | PEOPLE CARE | PLOT FOR SALE

BUSINESS OFFER
టైలరింగ్ వర్క్స్ [illegible] 7093632399.

OLD AGE HOME
[illegible] 95052 76677, 82474 49036.

PLOT FOR SALE
[illegible] 73864 14017/ 70936 32399.

JOBS
[illegible] 88198 23130. [illegible] 98453 15403.

FINANCIAL SERVICES
[illegible] +91 99669 10410.

REAL ESTATE
[illegible] 96035 30555.

HOUSE FOR SALE
[illegible] 98660 26220, 94934 00834.

97011 12824 ఒంగోలు
80087 09902 మార్కాపురం
80081 11050

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500
Colour : రూ. 700

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
[illegible]

మార్కాపురం

•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం

సార్వత్రిక సమ్మె జయప్రదానికి పిలుపు

జీపుజాత కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న కె.వి.పి.ఎస్, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

పొదిలి, యర్రగొండపాలెం పట్టణం, త్రిపురాంతకం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ పిలుపునిచ్చారు. పొదిలి పట్టణంలోని పలు ప్రాంతాల్లో నాయకులతో కలిసి జీపుజాత చేపట్టారు. కార్మిక సంఘాలు, హమాలీలతో మాట్లాడారు. ❖ యర్రగొండపాలెం సీఐటీయూ కార్యాలయంలో బాలాల రామయ్య, సీపీఎం నాయకులతో కలిసి సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ❖ సీఐటీయూ ఆధ్వర్యంలో త్రిపురాంతకంలోని బస్టాండ్‌లో కె.వి.పి.ఎస్, ఏఐటీయూసీ నాయకులు జీపుజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకమైన లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి కృషి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం గిద్దలూరులోని రాచర్ల రహదారిలోని ఎస్టీ కాలనీలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోందని తెలియజేశారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

కంభం, రాచర్ల, పొదిలి, మార్కాపురం పట్టణం, త్రిపురాంతకం (గ్రామీణం), పెద్దదోర్నాల: తొలి ఏకాదశి పండగను ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ❖ పొదిలి పట్టణంలోని శ్రీదేవీభూదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయానికి ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ❖ కంభం పట్టణంలోని కాశ వీధిలో కొలువైన వెంకటేశ్వర స్వామిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ❖ రాచర్ల, కంభం మండలాల్లోని గ్రామాల్లోని వైష్ణవ ఆలయాల్లో స్వామివారికి పూజలు చేశారు. ❖ మార్కాపురం పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో భగవద్గీత 18 అధ్యాయాల పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్టును ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కంభం రోడ్డులోని ప్రసన్న వెంకటేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. ❖ త్రిపురాంతకంలో తొలిఏకాదశి సందర్భంగా ఆదివారం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని దూపాడు, గణపవరం, అన్నసముద్రం, మేడపి శివాలయాలు భక్తులతో సందడిగా మారాయి. ❖ యర్రగొండపాలెం మండలం అటవీ ప్రాంతంలో వెలసిన పాలంక క్షేత్రంలో కూడా భక్తులతో కిటకిటలాడింది ❖ పెద్దదోర్నాల మండలంలోని లక్ష్మీనరసింహ స్వామి, అయ్యప్పస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మార్కాపురం పట్టణం: అలంకరణలో లక్ష్మీచెన్నకేశవస్వామి

త్రిపురాంతకేశ్వర స్వామి

మొక్కజొన్న సాగుకు మొగ్గు

❖ మిరపపై ఆసక్తి చూపని రైతులు

త్రిపురాంతకం (గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లాలో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగువైపు ఆసక్తి చూపుతున్నారు. మిరపలో నష్టాలు మూటగట్టుకోవడంతో ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారించారు. 130 రోజులకు పంట పూర్తవడంతో పాటు మూడేళ్లుగా మద్దతు ధరలు లభిస్తుండటంతో మొక్కజొన్న సాగుకు అన్నదాతలు మొగ్గుచూపుతున్నారు.

ఎకరాకు రూ.50 వేల ఆదాయం: మిరపలో నష్టాల మాట దేవుడెరుగు ఆ పంటను చాలా వరకు తగ్గించి మొక్కజొన్న సాగుకు ఉపక్రమించారు. ఈ సీజన్‌లో మండలంలోని కె.అన్నసముద్రం, ఎండూరివారిపాలెం, మేడపి, గణపవరం, సోమేపల్లి, కంకణాలపల్లి, ముడివేముల, ఒడ్డుపాలెం, త్రిపురాంతకం తదితర గ్రామాల్లో జిల్లాలోని సాగర్ ఆయకట్టు, మెట్ట ప్రాంతాల్లోని బోరు బావులు ఉన్న ప్రాంతాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఎకరా సాగుకు దుక్కులు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కలుపు తీత, కూలీలకు రూ.20వేల వరకు పెట్టుబడి వెచ్చిస్తున్నారు. 25 క్వింటాళ్ల నుంచి 35 క్వింటాళ్ల వరకు దిగుబడి లభిస్తుంది. ఈక్రమంలో క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2,100 నుంచి రూ.2,200 వరకు లభిస్తుంది. పెట్టుబడులు పోనూ రైతుకు సుమారు రూ. రూ. 50వేల వరకు ఆదాయం సమకూరుతుంది.

ఖరీఫ్‌లో సాగు తీరు

సంవత్సరం	సాధారణ (విస్తీర్ణం ఎకరాల్లో)	సాగైన
2024	7,800	1,092
2025 (జూన్ ఆఖరికి)	7,800	1,200

కంకణాలపల్లిలో మొక్కజొన్న పంట

200 ఎకరాల్లో వేశారు..

గత ఏడాది ఐదు ఎకరాల్లో మిర్చి వేశాను. ధరలు లేక నష్టాలు రావడంతో ప్రత్యామ్నాయంగా ఆరెకరాల్లో నెల క్రితం మొక్కజొన్న సాగు చేశా. మా గ్రామంలో మిరప సాగు తగ్గించి దాదాపు 200 ఎకరాల్లో మొక్కజొన్న వేశారు.

- వంకాయలపాటి నాగేశ్వరరావు, రైతు, కె.అన్నసముద్రం, త్రిపురాంతకం మండలం

ప్రత్యేక అలంకరణలో ముద్దసానమ్మ

మార్కాపురం పట్టణం, పొదిలి, కంభం: ఆదివారం ఆషాఢమాసంతో పాటు తొలి ఏకాదశి పర్వదినం కావడంతో మార్కాపురం మండలంలోని జమ్మనపల్లె సమీపంలో వెలసిన ముద్దసానమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు భక్తులకు మహా వారాహి రూపంలో దర్శనమిచ్చారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తర్లుపాడు రోడ్డులోని అల్లూరిపోలేరమ్మ ఆలయం భక్తులతో నిండిపోయింది. ❖ పొదిలి మండల పరిధిలోని కాటూరివారిపాలెంలో ఆదివారం చీతాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం నడిబొడ్డున చీతాలమ్మతల్లి (బొడ్డురాయి) ప్రతిష్ఠాపన జరిగి ఏడేళ్లు పూర్తయింది. నిర్మాణ దాతలు మాకినేని అమరసింహం, కుటుంబసభ్యులు, గ్రామస్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ❖ కంభం సమీపంలోని కోటా సత్యమాంబదేవికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

ఘనంగా పెద్ద షరగత్

తుమ్మలచెరువు దర్గా వద్ద భక్తుల సందడి

మార్కాపురం పట్టణం: తూర్పువీధిలో పీర్ల ఊరేగింపు

తర్లుపాడు, పొదిలి, మార్కాపురం పట్టణం, పెద్దదోర్నాల, రాచర్ల, కంభం : తర్లుపాడు మండలంలోని తుమ్మలచెరువు ఖాసిం స్వామి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మత సామరస్యానికి ప్రతీక అయిన మొహర్రంను ఘనంగా నిర్వహించారు. స్థానికులతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి నైవేద్యం తయారు చేసి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెదేపా, వైకాపా పార్టీలు పాట కచేరీలు ఏర్పాటు చేశారు. ఆదివారం మంగళకుంట నుంచి చిన్న ఖాసింస్వామి పీరు వచ్చిన తర్వాత తుమ్మలచెరువు దర్గాలోని పీర్లను భక్తుల దర్శనార్థం బయటకు తీశారు. దర్గా లోని అగ్నిగుండం చుట్టూ పీర్ల కవాతు నిర్వహించి అనంతరం భక్తుల దర్శనార్థం పురవీధుల్లో ఊరేగించారు. ❖ మొహర్రం సందర్భంగా పొదిలిలో ఆదివారం రాత్రి పెద్దషరగత్‌ను నిర్వహించారు. పట్టణంలోని తూర్పుపాలెం, పడమటిపాలెంలోని పీర్ల చావిడిల వద్ద సందడి వాతావరణం నెలకొంది. రాత్రికి పీర్లు అగ్నిగుండప్రవేశం చేశాయి. ❖ మార్కాపురం పట్టణంలోని తూర్పువీధిలో ఆదివారం పీర్ల ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ❖ దోర్నాల మండలం చిలకచెర్లలో వేకువ జామున భక్తులు అగ్నిగుండంలో పీర్లను ఎత్తుకుని నడిచారు. సాయంత్రం ఏటికి పంపారు. ❖ కొనకనమిట్ల, రాచర్ల, కంభం మండలంలో ఆదివారం పెద్ద షరగత్‌ను నిర్వహించారు. పీర్లను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.

అందుబాటులోకి రాదా..!

ఈ చిత్రంలో కనిపిస్తున్నది త్రిపురాంతకం మండల కేంద్రంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పౌర సరఫరాల గోదాము వద్ద గత ప్రభుత్వం నిర్మించిన విలేజ్ క్లినిక్ భవనం. ఈ భవనానికి రంగులు వేసి ఆర్భాటాలు చేసినప్పటికీ అప్పటి పాలకులు, అధికారులు ప్రారంభించలేదు. ఈ విలేజ్ క్లినిక్‌ను అప్పట్లోనే ప్రారంభించి సిబ్బందిని కేటాయించి ఉంటే జాతీయ రహదారిపై చోటుచేసుకునే ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు కనీసం ప్రథమ చికిత్స అందించే అవకాశం ఉండేదని స్థానికులు, ప్రయాణికులు పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వమైనా ఈ విలేజ్ క్లినిక్‌కు సిబ్బందిని కేటాయించి ప్రారంభించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, త్రిపురాంతకం

సారూ.. మా బాధ చూడరూ..!

ఎటు చూసినా గోతులతో కనిపిస్తున్న ఈరోడ్డు వై.పాలెం మండలాన్ని రాజధానికి అనుసంధానించే రాష్ట్రీయ రహదారి. వై.పాలెం నుంచి త్రిపురాంతకం ఆలయం దాకా ఎటు చూసినా గోతులతో నిండిపోయింది. 18కి.మీ దూరం ప్రయాణించడానికి ముప్పావు గంట సమయం పడుతుండటమే కాకుండా నడుములు గల్లవుతున్నాయంటూ వాహనదారులు గగ్గోలుపెడుతున్నారు. అధికారులు, నాయకులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– యర్రగొండపాలెం, న్యూస్‌టుడే

గోతులమయమైన వై.పాలెం–త్రిపురాంతకం రహదారి

ఆత్మానంద అవదూత స్వామి ఉత్సవాలు

యర్రగొండపాలెం పట్టణం : బోయలపల్లెలో మూడు రోజులపాటు నిర్వహించే శ్రీఆత్మానంద అవదూతస్వామి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

ఏకలవ్యునికి ఎమ్మెల్యే నివాళి : గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరులోని రాచర్ల రహదారిలోని ఎస్టీకాలనీలో ఆదివారం నిర్వహించిన ఏకలవ్య జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు.

PUBLIC NOTICE

Under the instructions of my client Shriram Finance Ltd. Rep. by it's Branch Manager, **Markapur** Branch, Prakasam District, I issue the following **PUBLIC NOTICE** to general public.

One **Shaik Ameenabi, W/o Nabi,** Indiranagar, Yerragondapalem -Town, Post and Mandal, Prakasam District **intends to** create Equitable Mortgage over the following schedule property of **her**. As such if any one have any claims, charges, mortgages, sale agreements, Court attachments, Court disputes etc. should be informed by them to me within seven days from the date of this public notice. Otherwise later objection will not bind my client in this regard.

SCHEDULE : Prakasam District, Ongole Registration District, Yerragondapalem Sub-District, Yerragondapalem Mandal, Yerragondapalem Grama Panchayaty and Revenue Village Limits, **Vacant site bearing Plots No.15 and 16,** At Inner Eastern side of Tripuranthakam Road, Indiranagar, near Door No.11-142, measuring East to West : 50 feet, North to South : 24 feet, to the extent of **133.33 sq.yards** or 111.99 sq.meters, in Sy.No.74/2, Bounded by **East :** 20 feet width road, **West :** Site of Mallapalem Masthan, **North :** Site bearing Plot No.17 sold by Kothamasu Chinna Venkateswarlu, **South :** Site of 4th Executant (Kokkera Rajaiah, S/o Avulaiah) bearing Plot No.14.

Sd/- SHAIK YUSUF ALI, B.Com, LL.B., Advocate & Legal Advisor for Shriram Finance Ltd., 10th ward, Markapur -533316, Prakasam District , (Cell No. 9440565787)

Markapur
Date: 06-7-2025

PUBLIC NOTICE

Under the instructions of my client Shriram Finance Ltd. Rep. by it's Branch Manager, **Markapur** Branch, Prakasam District, I issue the following **PUBLIC NOTICE** to general public.

One **Dudekula Nabemma, W/o Khasim Peera,** Door No.11-198, Indira Nagar, Yerragondapalem Town, Post and Mandal, Prakasam District **intends to** create Equitable Mortgage over the following schedule property of **her.** As such if any one have any claims, charges, mortgages, sale agreements, Court attachments, Court disputes etc. should be informed by them to me within seven days from the date of this public notice. Otherwise later objection will not bind my client in this regard.

SCHEDULE : Prakasam District, Ongole Registration District, Yerragonda palem Sub-District, Yerragondapalem Mandal, Yerragonda palem Grama Panchayaty and Revenue Village Limits, near Door No.11-262, **Vacant site bearing Plot No.7** measuring East to West 50 feet, North to South : 15 feet, to the extent of **83.33 sq.yards** out of 1288.8 sq.yards in Sy. No.72/1, Bounded by **East :** 18 feet width road, **West :** 18 feet width road, **North :** Vacant site bearing Plot No.6 of Syed Kalimuddin Khadri, **South :** Executant's (Chedella Venkata Subba Rao) site bearing Plot No.8.

Sd/- SHAIK YUSUF ALI, B.Com, LL.B., Advocate & Legal Advisor for Shriram Finance Ltd., 10th ward, Markapur -533316, Prakasam District , (Cell No. 9440565787)

Markapur
Date: 06-7-2025

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే:



?: పట్టణంలోని సబ్‌కలెక్టర్ బంగ్లా వద్ద నీటి పైపు పగిలి నీరంతా వృథాగా పోతోంది. – **వెంకటేశ్వర్లు, స్థానికుడు.**

✓: వెంటనే సిబ్బందిని పంపి పైపులకు మరమ్మతు చేయిస్తాం.– **నారాయణరావు, మున్సిపల్ కమిషనర్, మార్కాపురం.**

?: పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో కాలువ లేకపోవడం వల్ల మురుగునీరు రహదారిపైకి వస్తోంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. – **సాగర్. స్థానికుడు.**

✓: కాలనీలో పక్కా కాలువను నిర్మించే ఏర్పాటు చేస్తాం – **నారాయణరావు, మున్సిపల్ కమిషనర్, మార్కాపురం.**

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే:

?: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని పారిశ్రామిక వాడలో వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో అక్కడి ప్రజలు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. – **ఎస్.వెంకటేశ్వర్లు, స్థానికుడు**

✓: సమస్య మా దృష్టికి రాలేదు. వెంటనే సిబ్బందిని అక్కడకు పంపించి లైట్లు బాగుచేయించి సమస్యను పరిష్కరిస్తాం. – **డీవీఎస్.నారాయణరావు, మున్సిపల్ కమిషనర్, మార్కాపురం**

అక్రమంగా వెదురు బొంగుల రవాణా

❖ ప్రయాణికులకు తప్పని అవస్థలు

హుబ్లీ – విజయవాడ రైల్లో తలుపు వద్ద అడ్డంగా వేసిన వెదురు బొంగులు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : నల్లమల అటవీప్రాంతం నుంచి వెదురు బొంగులు, చిట్టెలను రైలు బోగీల్లో మరుగుదొడ్ల వద్ద వేసి అక్రమంగా మార్కాపురం వైపునకు తరలిస్తున్నారు. ప్రతి రోజు రాత్రి, తెల్లవారుజామున వెళ్లే రైళ్లలో నంద్యాల జిల్లా చెలమ, మన జిల్లాలోని దిగువ మెట్ట రైల్వేస్టేషన్లలో రైలు ఆగిన సమయంలో వెదురు బొంగులను సాధారణ బోగీల్లోని మరుగుదొడ్లు, సీట్ల కింద, డోర్ల వద్ద వేసి తరలిస్తున్నారు. మరుగుదొడ్లలో వేసి తలుపు వేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రైలు ఎక్కేందుకు, దిగేందుకు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా రైల్వే పోలీసులు, అటవీశాఖ సిబ్బంది రైల్లో వెదురుబొంగుల అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైలు ప్రయాణికులు కోరుతున్నారు.

సంపు వద్దకొస్తేనే దాహం తీరేది..!

పొదిలి ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. దర్శి వేసవి జలాశయం నుంచి సక్రమంగా నీరు రాకపోవడంతో వారం, పది రోజులకొకసారి మాత్రమే తాగునీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రజలు పెద్ద ఎత్తున దర్శి మార్గంలోని ఎన్ఏపీ సంపు వద్దకు వచ్చి నీటిని తీసుకెళుతున్నారు. - **పొదిలి, న్యూస్‌టుడే**

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

కంభం : బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కంభం, న్యూస్‌టుడే : భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలోని ఆయన విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు షాలెంరాజు బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకుడు నేదరపల్లి జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

పొదిలి, న్యూస్‌టుడే: బడుగు, బలహీనవర్గాల హక్కుల కోసం విశేష కృషి చేసిన మహనీయులు బాబూ జగ్జీవన్‌రామ్ అని పలువురు వక్తలు అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా పొదిలి ఏబీఎం పాఠశాల వద్ద ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉపప్రధానిగా దేశానికి చేసిన సేవలను గుర్తుచేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వి.సురేష్, బి.బెంజమెన్, కె.శామ్యూల్, ఎ.రవి, ఎం.శ్యామ్, ఇమ్మానియేలు, బాలసాని, జడ్సన్, తదితరులు పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

మార్కాపురం పట్టణం: పట్టణంలోని భాజపా కార్యాలయంలో ఆదివారం శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాజపా ఇన్‌ఛార్జి పి.వి.కృష్ణారావు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు ఎస్.సరోజిని, ఎం.లక్ష్మీదేవి, షబానా, పి.ఆంజనేయులు, డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కంభం, న్యూస్‌టుడే : జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివని భాజపా నాయకుడు పల్లెం శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకొని స్థానిక ఆల్ఫా పాఠశాల రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు కొనియాడారు.

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి భాజపా కార్యాలయంలో ఆదివారం శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని నిర్వహించారు. భాజపా జిల్లా అధికార ప్రతినిధి బి.విజయలక్ష్మి మాట్లాడుతూ కశ్మీర్ కోసం ఆయన చేసిన పోరాటాలు దేశభక్తులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన జీవనమార్గం ఈతరం యువతకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు ఖాదర్‌బాషా, డి.రమణారెడ్డి, వై.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

కంభం, న్యూస్‌టుడే : పట్టణ సమీపంలోని అమరావతి- అనంతపురం జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొంది. దాంతో కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల నుంచి నంద్యాల జిల్లా మహానందికి వెళ్లే క్రమంలో రహదారిని సరిగా గుర్తించలేక వాహనం అదుపుతప్పి డివైడర్ పైకి ఎక్కింది. కారు ముందు భాగం దెబ్బతింది.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి...

మార్కాపురం, న్యూస్‌టుడే : పట్టణంలో రాజ్యలక్ష్మీకాలనీకి చెందిన ఎం.వీరనారాయణ ఆదివారం స్నేహితుడిని కలవడానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. తర్లుపాడు రహదారి వద్ద అదుపుతప్పి బోల్తాపడటంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. సమీపంలోని ఉన్న కానిస్టేబుల్ అతడికి సీపీఆర్ చేసి ఎస్ఐకి సమాచారం అందించడంతో ఆయన జీపులో అక్కడి చేరుకొని క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రాణాపాయం ఏమి లేదని చెప్పారు. షాక్‌లో ఉన్నందున మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రైతుబజార్లు లేక అవస్థలు

❖ రోడ్డు పక్క అమ్మకాలు ❖ ఇబ్బందులు పడుతున్న రైతులు, చిరువ్యాపారులు

రోడ్డు అంచుల్లో తాటాకు పందిరి వేసుకుని చేపలు అమ్ముకుంటూ..

పొదిలి, న్యూస్‌టుడే:

పొదిలి నగర పంచాయతీలో రైతు బజార్లు లేకపోవడంతో కూరగాయలు, చేపలు, మాంసం, పండ్ల వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. నగర పంచాయతీకి స్థాయికి ఎదిగిన పట్టణంలో చేపలు, మటన్, కూరగాయల మార్కెట్ కేంద్రాలు లేవు. ఒంగోలు రోడ్డులో పీర్లమాన్యం రోడ్డు పక్కనే జాలర్లు చేపలు అమ్ముకోవాల్సి వస్తోంది. సీటీబీసీ చర్చి సమీపంలో పెద్దచెరువు అలుగు వాగు స్థలంలో మటన్ మార్కెట్ కొనసాగుతుంది. కాటూరివారిపాలెం ఎస్టీకాలనీ, జాఫ్లాపురం కాలనీ వాసులు, బెస్తపాలెం వాసులకు చేపల వేట ప్రధాన జీవనాధారం. సుమారు వంద కుటుంబాలకు పైగా వీరు మూడు దశాబ్దాలుగా చేపలు అమ్ముకుని జీవిస్తున్నారు. వీరితోపాటు పొదిలిలో జాలర్ల సంఘం ఉంది. వారు కూడా ఇతర ప్రాంతాల నుంచి చేపలను తెచ్చి పలుచోట్ల అమ్ముకుంటున్నారు.

చెరువుల్లో నీరు లేక...

గతంలో వీరు పొదిలి పెద్దచెరువు, చిన్నచెరువుల్లో చేపలు పెంచి రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేశారు. ప్రస్తుతం చెరువుల్లో నీరు లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి చేపలను దిగుమతి చేసుకుని అమ్ముకుంటున్నారు. ఇక కూరగాయలకు సంబంధించి ప్రైవేటు గదుల్లోనే వ్యాపారాలు జరుగుతున్నాయి. ఇటీవల రోడ్డు అంచుల్లో ఉన్న కాలువల్లో పూడికతీత, రహదారి అంచుల్లో ఉన్న తాత్కాలిక దుకాణాలను చిన్నపాటి దుకాణాలు సైతం తీసివేయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు నగర పంచాయతీలో రైతుబజారు ఏర్పాటు చేస్తే పట్టణంలోని చిరువ్యాపారులు పండ్లు, కూరగాయాలు అమ్ముకునే అవకాశం ఉంటుంది. చుట్టుపక్కల కూరగాయాలు పండించుకునే రైతులకు పట్టణంలో రైతుబజారు ఉంటే నేరుగా వినియోగదారులకు అమ్ముకునే వెసులుబాటు ఉంటుంది. బాలికల ఉన్నత పాఠశాల ముందు నగర పంచాయతీకి చెందిన పాత గదులను తొలగించారు. ఆ స్థానంలో కొత్త గదులు ఏర్పాటు చేస్తే చిరు వ్యాపారులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. నగర పంచాయతీకి ఆదాయం వస్తుంది. నగర పంచాయతీ అధికారులు రైతు బజారు నిర్మాణానికి కృషి చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

బిరియాని డే శుభాకాంక్షలు
సిరి ఫ్యామిలి రెస్టారెంట్
ఒంగోలు రోడ్ - గిద్దలూరు.
A/c& Non A/c
డోర్ డెలివరి సౌకర్యం కలదు
Cell Number
9966961133
9885210073

బిరియాని డే శుభాకాంక్షలు

మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు బిరియాని డే శుభాకాంక్షలు
మా వద్ద రుచికరమైన వెజ్ & నాన్‌వెజ్ ఫుడ్ లభించును
ప్రొ॥ మర్రి వెంకటేశ్వర్లు
పూజిత రెస్టారెంట్, బేస్తవారిపేట
సెల్: 8074294640

అశ్రునివాళి

ఉన్నత వ్యక్తిత్వం, మహోన్నత దృక్పదం మంచితనం, మానవత్వం అందరినీ తన వారిగా భావించే మనస్తత్వం అయినటువంటి కీ॥శే॥ ఈదుల విజయకుమార్‌రెడ్డి గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ ఈదుల విజయకుమార్‌రెడ్డి గారు
గిద్దలూరు
జననం: 08-06-1966 మరణం:29-6-2025

భార్య: సీతామహాలక్ష్మి
కుమార్తెలు- అల్లుళ్ళు మరియు మనుమడు,బంధుమిత్రులు

గమనిక: పెద్దకర్మ: తేది: 07-07-2025 సోమవారం గిద్దలూరు పట్టణం (VS HILLS APTS.. పాండురంగారెడ్డినగర్)లోని మా స్వగృహం నందు జరుగును.

(c) eenadu

కనిగిరి

•కనిగిరి •దర్శి •కొండపి

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన

టంగుటూరు, న్యూస్‌టుడే: మండలంలోని మర్లపాడులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని తెదేపా నాయకులు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలవీరాంజనేయ స్వామి పాల్గొన్నారు. ప్రభుత్వం ఏడాది పాలనపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకుల ముత్తినేని హరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు వేణు, కాకాని సురేష్, నాగభూషణం, జలదంకి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

◗ పీసీపల్లి: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. పీసీపల్లిలో ఆదివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు.

మర్లపాడులో మహిళకు కరపత్రం అందిస్తున్న మంత్రి స్వామి

పీసీపల్లిలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

తొలుత కాటావద్ద కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీలో కష్టపడినవారికి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు వేమూరి రామయ్య, నాయకులు యారవ శ్రీనివాస్, నాగేశ్వరరావు, నాగరాజు, మాచర్ల, రత్తయ్య, అంజయ్య, హనుమారెడ్డి, నరసింహారెడ్డి, ప్రతాప్ పాల్గొన్నారు.

◗ దర్శి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన సాగుతుందని మాజీ ఎమ్మెల్యే పాపారావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని లంకోజనపల్లిలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, అంకయ్య, రామారావు, మధు, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు బహుమతి

టంగుటూరు: జరుగుమల్లికి చెందిన మేడికొండ ఐశ్వర్య కె.బిట్రగుంటలోని కేజీబీవీ పాఠశాలలో చదివి పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించింది. ఆదివారం టంగుటూరులో ఆమె సన్మాన కార్యక్రమాన్ని స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవాధ్యక్షుడు బి.వి.రావు నిర్వహించారు. రూ.10 వేల ప్రోత్సాహక నగదు బహుమతి అందించారు.

రాత పుస్తకాల పంపిణీ

సింగరాయకొండ గ్రామీణం: స్థానిక శ్రీరామనగర్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ప్రధానోపాధ్యాయురాలు సునందగ్రేస్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో సమకూర్చిన రూ.40 వేల విలువైన రాత పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై మహేంద్ర మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాతలు రమణయ్య, వెంకయ్య, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, ఏడుకొండలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారులు ఛిద్రం.. పట్టించుకోక నరకం

న్యూస్‌టుడే, కొండపిగ్రామీణం, సి.ఎస్.పురం, హనుమంతునిపాడు

కనిగిరి, కొండపి నియోజకవర్గాల్లోని పలు రహదారులు గుంతలతో అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీళ్లు చేరి ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రూ.పది లక్షలతో పనులు చేసినా..

కొండపి మండలం నేతివారిపాలెం, జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామాల మధ్యలో చెరువు వద్ద రోడ్డు దెబ్బతింది. అసలే మలుపులు.. ఆపై భారీ గుంతలు ఏర్పడి వాహనదారులను భయాందోళనకు గురిచేస్తుంది. వర్షాలు పడితే గుంతలు నీటి కుంటలను తలపిస్తున్నాయి. ఈ రహదారిలో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో గుంతలు గమనించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఏడాదిన్నర క్రితం ఓ గుత్తేదారుడు సుమారు రూ.10 లక్షలతో ప్యాచ్ వర్క్ పనులు చేపట్టారు. కాలపరిమితి కాకముందే రోడ్డు మళ్లీ యథాస్థితికి చేరింది. ఈ విషయంపై సింగరాయకొండ సెక్షన్ ర.భ.శాఖ ఏఈఈ మాధవరావుని వివరణ కోరగా.. తొందర్లోనే గుత్తేదారుడితో మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

సీఎస్‌పురం ఏనిమెట్ట వీధిలో రహదారిపై నిలిచిన నీరు

చినుకు పడితే నీటి కుంటను తలపించేలా..

మండల కేంద్రం సి.ఎస్.పురంలోని ఏనిమెట్టవీధిలో చిరుజల్లులు పడినా సిమెంట్ రహదారిపై వర్షపు నీరు నిలుస్తోంది. తహసీల్దార్, మండల పరిషత్తు, వ్యవసాయ శాఖ కార్యాలయాలకు, సచివాలయానికి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఇదే మార్గం. విద్యార్థులు, వృద్ధులు ఇలా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ.. రోడ్డుకు మరమ్మతులు చేయించి అక్కడ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేతివారిపాలెం, కామేపల్లి మధ్య రోడ్డుపై ఏర్పడిన గుంత

నడిచేందుకు వీలు లేకుండా..

హనుమంతునిపాడు మండలంలో 23 పంచాయతీలు, 56 గ్రామాలు ఉన్నాయి. అంతర్గత రహదారులు ఏళ్లతరబడి మరమ్మతులకు నోచుకోలేదు. రెండు రోజులుగా కురిసిన వర్షానికి ఈ రహదారుల్లో కనీసం నడిచేందుకు వీలులేకుండా ఉంది. హెచ్‌ఎంపాడు, వేములపాడు బస్టాండ్లు గుంతలుపడి అధ్వానంగా మారాయి. కనిగిరి-కంభం రెండు వరుసల రోడ్డు పనులు నిలిచిపోయాయి. కొత్తూరు హాజీపురం, ఉమ్మనపల్లి ఉసుళ్లపల్లి, ఆవులవారిపల్లి మల్లవరం, దాసరిపల్లి ఎస్సీకాలనీ, కిష్టంపల్లి, దొడ్డిచింతల రహదారులు అధ్వానంగా మారాయి. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ బ్రహ్మయ్యను వివరణ కోరగా.. ఇప్పటికే కొన్ని గ్రామాల రోడ్లకు మరమ్మతులు చేశామన్నారు. అంచనాలు రూపొందించిన రహదారులకు నిధులు విడుదల కాగానే పనులు మొదలు పెడతామన్నారు

పోలేరమ్మకు పొంగళ్లు

పూరిమెట్లలో నైవేద్యాలతో అమ్మవారి ఆలయానికి బయలుదేరిన మహిళలు, భక్తులు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: మండలంలోని పూరిమెట్లలో కొలువుదీరిన పోలేరమ్మ, అంకాలమ్మ, నాంచారమ్మ అమ్మవార్ల కొలుపులు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలో అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించి నెల రోజులైన సందర్భంగా నెల పొంగళ్లు సమర్పించారు.

◗ కొండపి గ్రామీణం: మండలంలోని పెట్లూరు సహజానంద స్వామి దేవస్థానంలో ఈవో కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి బాలవీరాంజనేయ స్వామి, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, ఆలయ కమిటీ సభ్యులు మూలె రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామి తిరునాళ్ల..

మర్రిపూడి: మండలంలోని జువ్విగుంటలో మొగిలిపూరి దత్తాత్రేయస్వామి తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగాయి. మంత్రి స్వామి, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య ప్రత్యేక పూజలు చేశారు.

సందడిగా పీర్ల ఊరేగింపు

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలో ఆదివారం మొహర్రం సందర్భంగా ముస్లిం సోదరులు పీర్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. స్థానిక పామూరు బస్టాండ్‌లో యువకులు పీర్లు ఎత్తుకుని డప్పులతో ఊరగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు. కోఆప్షన్ సభ్యుడు చింతం శ్రీను అన్నదాన ఏర్పాటు చేశారు. ◗ హనుమంతునిపాడు: హనుమంతునిపాడు, హాజీపురం, రామాయపల్లి, సీతారంపురం, వాలిచెర్ల, నందనవనం గ్రామాల్లో మొహర్రం సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి పీర్ల చావిళ్లవద్దకు భారీగా చేరుకున్న భక్తులు పొంగళ్లు సమర్పించారు. పీర్లు ఎత్తుకొని నిప్పుల గుండాల్లో నడిచారు. ఆయా గ్రామాల్లో అన్నదానాలు ఏర్పాటు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

◗ ముండ్లమూరు: మండలంలోని పులిపాడు, మక్కెనవారిపాలెం గ్రామాల్లో పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మత పెద్దలు పీర్లతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కనిగిరిలోని పామూరు బస్టాండ్‌లో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న పట్టణవాసులు

వైభవంగా తొలి ఏకాదశి పూజలు

దర్శి, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శి పట్టణంలోని రామాలయం, కనకదుర్గమ్మ, పోలేరమ్మ, వెంకన్న ఆలయాలతోపాటు.. మండలంలోని వెంకటాచలంపల్లి కొండపై వెలసిన పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ విశేష పూజలు జరిగాయి.

బీకేపాడులో మాధవస్వామి

◗ సి.ఎస్.పురం: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్టును వివిధ రకాల పూలతో అలంకరించారు. దేవస్థానంలో అర్చకులు గోపూజ చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యనిర్వహణాధికారి ఎస్.నరసింహబాబు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. సి.ఎస్.పురంలోని గంగమ్మ అమ్మవారికి భక్తులు ఆషాఢ మాసం సారె సమర్పించారు.

◗ తాళ్లూరు: తాళ్లూరు, మాధవరం, బొద్దికూరపాడు, గుంటిగంగలోని వివిధ ఆలయాల్లో దేవతామూర్తులను అలంకరించారు. బొద్దికూరపాడులో మాధవ స్వామి గ్రామోత్సవం వైభవంగా సాగింది.

సీఎస్‌పురంలో గంగమ్మ తల్లి

పెదఉల్లగల్లులో వేంకటేశ్వరస్వామి

◗ ముండ్లమూరు: మండలంలోని పెదఉల్లగల్లు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు నరసింహమూర్తి స్వామివారికి అభిషేకాలు చేశారు. ముండ్లమూరు, పసుపుగల్లు, రెడ్డినగర్, కెల్లంపల్లి తదితర గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు.

నమో సత్యదేవాయ!

పామూరు, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక రమా సమేత వీరవెంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో సామూహిక వ్రతాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పంచామృత అభిషేకం, కుంకుమపూజ చేశారు. అనంతరం 124 మంది దంపతులతో అర్చకులు కార్తీక్, కృష్ణసాయిలు వేద మంత్రాలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, భక్తులు పాల్గొన్నారు.

రమాసమేత సత్యనారాయణ స్వామివారు

సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: ముండ్లమూరు మండలం శంకరాపురం-నూజెళ్లపల్లి గ్రామాల మధ్య ఎస్‌ఎల్‌సీ కాలువ కట్ట వద్ద పైపులైన్ లీకు కారణంగా తాగునీరు వృథాగా పోతుంది. దీంతో నూజెళ్లపల్లి, భట్లపల్లి, సుంకరవారిపాలెం గ్రామాలకు నీరు సక్రమంగా అందడం లేదు. – వీరనారాయణ, శంకరాపురం

✓: సిబ్బందిని పంపించి పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తా. – హనుమాన్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

?: మర్రిపూడి మండలం కొత్తపన్నూరు బీసీ కాలనీలో వీధి దీపాలు మరమ్మతులకు గురికావడంతో రాత్రి పూట ఇబ్బందిగా ఉంటుంది. –వాలకొండయ్య, స్థానికుడు

✓: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. –జగదీష్, ఎంపీడీవో

?: కనిగిరి పట్టణంలోని సుభాష్‌రోడ్డులో వారం రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదు. రాత్రి పూట ఇబ్బందులు పడుతున్నాం. – లక్ష్మణ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

✓: మా సిబ్బందిని పంపించి వీధిలైట్లు వెలిగేలా చూస్తాం. – మాధవరావు, ఇన్‌ఛార్జి కమిషనర్

?: పీసీపల్లి మండలం తలకొండపాడు పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీ, పాలేటిపల్లి, తలకొండపాడు, చిరుతానివారిపల్లి గ్రామాల్లోని వీధుల్లో వర్షపునీరు నిలిచిపోయింది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. బ్లీచింగ్ చల్లించాలి. -స్థానికులు

✓: రెండు రోజుల్లో బ్లీచింగ్ చల్లి దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. –తిరుపతమ్మ సర్పంచి, తలకొండపాడు

-న్యూస్‌టుడే, ముండ్లమూరు, మర్రిపూడి, కనిగిరి, పీసీపల్లి

అవిశ్రాంత సేవ!

న్యూస్‌టుడే, కనిగిరి

ఉద్యోగ విరమణ చేసిన తర్వాత.. ఎవరైనా మనవళ్లు, మనవరాళ్లతో సరదాగా గడుపుతూ కాలక్షేపం చేస్తుంటారు. కనిగిరి పట్టణం కొత్తపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పాపసాని కిచ్చారెడ్డి మాత్రం నలుగురికి ఉపయోగపడే పనులు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. 68 ఏళ్ల వయసులో సమాజానికి ఏదో ఒకటి తనవంతుగా చేయాలని నిరంతరం తపిస్తున్నారు.

కనిగిరి-పామూరు రోడ్డులో గుంత పూడుస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు కిచ్చారెడ్డి

రోడ్లపై వంద గుంతలు పూడ్చివేత..

ఉద్యోగ విరమణ పొందినప్పటి నుంచి ఏదో ఒక సామాజిక సేవ చేస్తూనే ఉన్నారు. ఏటా వేసవిలో మజ్జిగ కేంద్రాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేసి పట్టణవాసులు, బాటసారుల దాహార్తి తీర్చేవారు. వీధుల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తే వెంటనే తొలగించేవారు. ఈ ఏడాది పట్టణంలోని సీసీరోడ్లపై గుంతలు పూడ్చే పని మొదలు పెట్టారు. సుమారు పది వార్డుల్లోని సిమెంట్ రహదారులపై ఏర్పడిన గుంతలను సొంతంగా పూడ్చివేశారు. తనకు పింఛను ద్వారా వచ్చే డబ్బులతో కొంత మొత్తం కేటాయించి సిమెంట్, ఇసుక, కంకర కొనుగోలు చేస్తారు. తానే స్వయంగా సైకిల్‌పై వాటిని తీసుకెళ్లి వందకు పైగా గుంతలను పూడ్చి తాపీ పట్టి మరీ చదును చేశారు. చిన్నారులు, వాహనదారులు రోడ్లపై ఏర్పడిన గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారని, వాటిని పూడ్చడితే ఇబ్బందులు తొలగుతాయనే తాను ముందుకు వచ్చినట్లు కిచ్చారెడ్డి తెలిపారు. పదిమందికీ ఉపయోగపడే పనులు చేయడంలోనే ఆనందం ఉందన్నారు.

చెత్త.. ఎన్నాళ్లు ఇలా?

పొన్నలూరు మండలంలోని రావులకొల్లు గ్రామంలో చెత్త సేకరణ కొరవడడంతో ఎక్కడికక్కడే వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామస్థులు చెత్తను రోడ్డుపైనే వేస్తున్నారు. దీంతో గాలులు, వర్షాలకు పాలేరు వాగులో కలుస్తోంది. దీనివల్ల నీరు కలుషితమవుతోందని స్థానికులు చెబుతున్నారు. గ్రామానికి వెళ్లే దారిలోనే చెత్త వేయడంతో వాహనదారులు, బాటసారులు ముక్కుమూసుకోవాల్సి వస్తోంది. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకొని చెత్తను సంపద కేంద్రాలకు తరలించే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునను వివరణ కోరగా.. రెండు రోజుల్లో చెత్త తొలగించి బ్లీచింగ్ చల్లిస్తామని తెలిపారు.

–న్యూస్‌టుడే, పొన్నలూరు

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

పామూరు, న్యూస్‌టుడే: మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌రామ్‌కు రాజకీయ పార్టీల నాయకులు నివాళి అర్పించారు. ఆయన వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కనున్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, తెదేపా నాయకులు అమీర్, హరిబాబు, టి.రవి పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి..

పామూరు, న్యూస్‌టుడే: భారతీయ జన్ సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని భాజపా నియోజకవర్గ కన్వీనర్ కొండిశెట్టి వెంకటరమణయ్య కొనియాడారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు జేసీ సుబ్బయ్య, పి.శ్రీనివాసులు, బి.హజరత్‌కుమార్, పి.అరవింద్, రాము, రమణాచారి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి అభినందనీయం

దర్శి: ఉపాధ్యాయుడిగా పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల శ్రేయస్సుకు బసవయ్య చేసిన సేవలు మరువలేనివని పారిశ్రామికవేత్త శిద్దా సుధీర్ అన్నారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో బసవయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పాపారావు, సుధీర్‌లు మాట్లాడుతూ 39 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా సేవలు అందించిన బసవయ్య ఇతరులకు ఆదర్శనీయులని కొనియాడారు. ఎంఈవోలు రఘురామయ్య, రమాదేవి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ సుబ్బారావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనార్దనరెడ్డి, ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతరావు పాల్గొన్నారు.

◗ పామూరు: అంకితభావంతో విధులు నిర్వహించి విద్యాభివృద్ధికి కృషిచేసిన ప్రధానోపాధ్యాయిని గండికోట వెంకట పద్మావతి అని పీసీపల్లి ఎంఈవో ఆర్.శ్రీనివాసరావు, విశ్రాంత ఎంఈవో ఎం.నరసింహారావులు అన్నారు. స్థానిక ఎస్టీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఆమె సన్మాన సభ ఆదివారం పామూరులో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు.

ఉపాధ్యాయుడు బసవయ్యను సత్కరిస్తున్న సుధీర్, మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు

ఏకలవ్య జయంతి వేడుకలు

దర్శి, న్యూస్‌టుడే: ఆదివాసుల ఎరుకల సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఏకలవ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ ఛైర్మన్ నాగవేణి సుబ్బారావు సహకారంతో 20 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కోనేటి శ్రీను, లోకసాని రత్నం, రామారావు, జీవి.రత్నం, కోటేశ్వరరావు, ఇతరులు పాల్గొన్నారు. ◗ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రేమ్‌కుమార్, గోవింద ప్రసాద్, ఇర్మియా పాల్గొన్నారు.

హెచ్‌ఎంపాడు స్టేషన్‌లో 35 కేసులు పరిష్కారం

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: స్థానిక పోలీస్ స్టేషన్‌లో రెండేళ్లుగా 175 కేసులు నమోదుకాగా శనివారం కనిగిరిలో జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 35 కేసులు పరిష్కారం అయ్యాయని ఎస్సై మాధవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న ఘర్షణలు, కొట్లాటలు ఆవేశంతో పెట్టుకున్న కేసులు రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని కోరారు.

సార్వత్రిక సమ్మె జయప్రదానికి వినతి

కనిగిరి, న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ చేపట్టిన ప్రచార జాతా ఆదివారం కనిగిరి పట్టణానికి చేరింది. ఆ సంఘ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. కార్మికులకు వ్యతిరేకమైన లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దుచేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కేశవరావు, మాలకొండయ్య, మాల్యాద్రి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

◗ కురిచేడు: సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య కోరారు. ఆదివారం కురిచేడులో ప్రచార వాహనం ద్వారా ఆయన మాట్లాడారు. సీఐటీయూ నాయకులు రమేష్, రూబెన్, నారాయణ, సాల్మన్ పాల్గొన్నారు.

◗ సింగరాయకొండ గ్రామీణం: దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సింగరాయకొండలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాము, మోజెస్ పాల్గొన్నారు.

◗ దర్శి: కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలపై జరిగే జాతీయ సమ్మెతో మోదీ ప్రభుత్వంపై సమరశంఖం పూరిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ తెలిపారు. ప్రచార జీపు యాత్రలో గడియారస్తంభం కూడలిలో ఆయన మాట్లాడారు. నాయకులు రంగారావు, నారాయణ, పిచ్చయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ

రేబిస్ రాకుండా టీకాలు వేయించండి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: పెంపుడు కుక్కలకు యాజమానులు టీకాలు వేయించాలని డీజీపేట పశువైద్యాధికారి షేక్ మునీర్ సూచించారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఆసుపత్రిలో కుక్కలకు ఉచితంగా టీకాలు వేశారు. 9 పెంపుడు కుక్కలు, 14 వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ చేసినట్లు తెలిపారు. పశువైద్య సిబ్బంది బి.శివనారాయణ, వెంకటేశ్వర్లు, వినీత్, హనుమంత్, నవీన్ పాల్గొన్నారు.

◗ దర్శి: పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో పశుసంవర్ధక శాఖ ఏడీ పురుషోత్తంరాజు ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేశారు. మాజీ ఎమ్మెల్యే పాపారావు, బొట్లపాలెం పశువైద్యుడు బసవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

◗ సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: నివాసాల్లోని పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని, రేబిస్ వ్యాధి ప్రాణాంతకమని పశువైద్యుడు హజరత్తయ్య తెలిపారు. స్థానిక ఆసుపత్రి వద్ద 76 పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు అందించారు. పశువైద్య సహాయకులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న పశువైద్యుడు హజరత్తయ్య

సాగు సమయం.. జాగ్రత్తలు అవసరం

న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

ఖరీఫ్ సాగుకు రైతులు పంట పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఇందులో కీలకమైంది విత్తన ఎంపిక. మార్కెట్‌లో ఎన్నో నకిలీ విత్తనాలు దుకాణాల్లోకి వచ్చేస్తున్నాయి. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పెట్టుబడి, సమయం, శ్రమ వృథాకాక తప్పదు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

పంట పేరు	ఎకరాకు ప్రీమియం (రూ.లలో)
కంది	430
వరి	860
సజ్జ	156
ఎర్ర మిరప	4,500
మినుము	205

పరిశీలించకుంటే మోసమే..

ఖరీఫ్‌లో కనిగిరి, కొండపి, దర్శి నియోజకవర్గాల్లో కంది, వరి, మినుము, ఎండు మిరప, సజ్జ పంటలను సాగు చేస్తుంటారు. అందుకోసం అనేక మంది రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్దే విత్తనాలు కొనుగోలు చేస్తుంటారు. నేరుగా దుకాణాలకు వెళ్లి పంట పేరు చెప్పి విత్తనాలు కొనుగోలు చేస్తుంటారు. విత్తన నాణ్యత, రసీదులు పరిశీలించకపోతే మోసపోయే ప్రమాదం ఉంది. ● ప్రతి రైతు రసీదుతో పాటు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి.

● విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు విత్తన రకం చెప్పి కొనుగోలు చేయాలి.

● రసీదు, బ్యాగులు భద్రపరుచుకోవాలి.

● విత్తనాలు కొనుగోలు సంచిపై నంబరు, ప్యాకింగ్ చేసిన తేదీని సరిచూసుకోవాలి.

పంటల బీమా నమోదు తప్పనిసరి

రైతులు సాగు చేసిన పంటలకు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అందువల్ల పంటల బీమా చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ-క్రాప్‌లో నమోదు చేసుకుంటేనే పథకాలు, పరిహారం అందుతాయని చెబుతున్నారు.

పెద్దకండ్లగుంటలో కంది పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నిర్మల(పాత చిత్రం)

రాయితీ విత్తనాలు తీసుకోవాలి

ప్రభుత్వం రైతులకు రాయితీపై అందిస్తున్న విత్తనాలను కొనుగోలు చేస్తే పంట నష్టం ఉండదు. ఒకవేళ పంటకు నష్టం కలిగినా పరిహారం లభిస్తుంది. ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేసి ఉంటే రసీదులు, సంచులు భద్రపరచాలి. నకిలీ విత్తనాలు అని తేలితే ఫిర్యాదు చేసి నష్టపరిహారం పొందవచ్చు. పంటలకు తెగుళ్లు వ్యాపించినప్పుడు వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే తగిన సూచనలు, సలహాలు పొందవచ్చు. –మాల్యాద్రి, మండల వ్యవసాయ అధికారి, కొండపి

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

సమస్యల పరిష్కారానికి కృషి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: 'సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ తెదేపా' లో భాగంగా ఒంగోలు 47వ డివిజన్‌లోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల; 48వ డివిజన్ చంద్రయ్య నగర్ ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీ నాయకులు కొఠారి నాగేశ్వరరావు, కమ్మ వెంకటేశ్వర్లు, పాదర్తి సుబ్బారావు, గుమ్మళ్ల సుబ్బారావు, వేమూరి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

సంక్షేమ కార్యక్రమాలపై ప్రచారం

చీమకుర్తి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తూ..స్థానికుల సమస్యలు వింటూ.. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ సుపరి పాలన కార్యక్రమం నిర్వహించారు. చీమకుర్తి పురపాలక సంఘంలోని నెహ్రూనగర్‌లో ఆదివారం రాత్రి కార్యక్రమం జరిగింది. మార్కెట్ కమిటీ ఛైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాదు, పట్టణ పార్టీ అధ్యక్షులు ముప్పూరి చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి నెహ్రూనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్

◗ మద్దిపాడు, న్యూస్‌టుడే: సంతనూతలపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సలహాదారుడు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో బసవన్నపాలెంలో ఘనంగా తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి దేవబత్తిన ప్రసాద్, యూనిట్ ఇన్‌ఛార్జి మండవ గోపి పాల్గొన్నారు.

బసవన్న పాలెంలో కరపత్రాలు అందజేస్తున్న మండవ జయంత్‌బాబు

సార్వత్రిక సమ్మె విజయవంతానికి పిలుపు

ఒంగోలు గ్రామీణం: ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చీకటి శ్రీనివాసరావు, ఉదయకిరణ్, ఆంజనేయులు, గురవరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్టు పరీక్షల్లో ప్రతిభ

ఒంగోలు క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తథాగత్ బోధిసత్వ షటోరియా కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఒంగోలు భాగ్యనగర్‌లో క్రీడాకారులకు బెల్టు టెస్టులు నిర్వహించారు. ఈ పరీక్షలకు జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. మాస్టర్లు డి.వెంకటేష్ (బ్లాక్‌బెల్ట్ 7వడాన్), కఠారి రాజు (బ్లాక్‌బెల్ట్ 5వడాన్) పర్యవేక్షణలో బెల్టు పరీక్షలు జరిగాయి. వీటిలో షేక్ సుమయ్ ఫాతిమా, చిట్టెం లక్కీ షాలోమ్ అద్భుత ప్రదర్శనతో బ్లాక్‌బెల్ట్ మొదటి డాన్ సాధించారు. విజేతలను సీఐ మేడా శ్రీనివాసరావు అభినందించారు.

క్రీడాకారులను అభినందిస్తున్న ఒంగోలు రెండో పట్టణ సీఐ మేడా శ్రీనివాసరావు

పర్యవేక్షణ శూన్యం.. పంపిణీ అధ్వానం

◗ తప్పని తాగునీటి కష్టాలు

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

నగర ప్రజలకు రానున్న నాలుగు నెలలకు సరిపోయే నీరు అందుబాటులో ఉన్నా నిర్వహణ లోపంతో తాగునీటి సరఫరా సక్రమంగా జరగడంలేదు. దాదాపు 20 రోజులుగా రామతీర్థం జలాశయం నుంచి నీరు రావడంతో రెండు వేసవి చెరువులు పూర్తి సామర్థ్యం మేరకు నింపారు. వాటితోపాటు వెంగముక్కపాలెం, చెరువుకొమ్ముపాలెం, అగ్రహారం, పెళ్లూరు చెరువులు నింపడం పూర్తయింది. నగర ప్రజలకు రోజుకు 40 మిలియన్ లీటర్ల చొప్పున విడుదల చేస్తున్నారు. ఆ విధంగా ప్రస్తుతం చెరువుల్లో ఉన్న నీరు సెప్టెంబర్ ఆఖరు వరకు వస్తుందని అంచనా. అప్పుడు మళ్లీ సాగర్ నీరు విడుదల చేస్తే మళ్లీ చెరువులు నింపుతారు. ఓవైపు పరిస్థితి ఇలా ఉంటే మరోవైపు అధికారులు పర్యవేక్షణ చేపట్టడంలో పూర్తి విఫలమవుతున్నారు.

ఒకటో వేసవి చెరువులో పూర్తి సామర్థ్యంలో సాగర్‌నీరు

గొడుగుపాలెంలో పైపులైన్‌లో అడ్డుపడిన వ్యర్థాలు తొలగించేందుకు తవ్విన గుంట

పచ్చటి రంగులో వస్తున్నాయి

కొత్త ఫిల్టర్‌బెడ్ నుంచి అందిస్తున్న నీరు పచ్చని రంగులో వస్తున్నాయి. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి రెండో డివిజన్‌కు వెళ్లిన సమయంలో ప్రజలు ఈ విషయాన్ని తెలియజేశారు. పంపిణీలో ఎదురవుతున్న సమస్యలన్నీ త్వరలో పరిష్కరించడానికి ఎమ్మెల్యే దామచర్ల అధికారులకు ఆదేశాలిచ్చారు. గుండ్లకమ్మ నీటిని తీసుకోవడం ప్రస్తుతానికి నిలిపివేసినందున త్వరలో రంగు మారిన నీటి సమస్యకూడా పరిష్కారమవుతుందని అధికారులు చెబుతున్నారు.

పైపుల్లోకి చేరిన చెత్త

నీటివనరులు ఉన్నప్పటికీ కుళాయిల ద్వారా సరఫరా చేయడంలోనే నిత్యం సమస్యలు తలెత్తుతున్నాయి. విద్యుత్తు సమస్య, లీకుల రిపేర్ల వల్ల వచ్చే ఆటంకాలు సాధారణంగా జరిగేవే. అవికాక కొత్తగా జేసీబీలతో కేబుల్ తవ్వకాలు, రోడ్డు విస్తరణ పనుల్లో తగిన జాగ్రత్తలు పాటించనందున నీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నెలన్నర క్రితం సీవీఎన్ రీడింగ్ రూం వద్ద నుంచి కోర్టు సెంటర్ వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టారు. దానిలో భాగంగా మాతాశిశువైద్యశాల ప్రహరీ పక్కన గల మరుగుదొడ్డిని జేసీబీతో తొలగించే సమయంతో తాగునీటి పైపులైన్ పగిలిపోయింది. దానిని గమనించకుండా నీరు విడుదల చేయడంతో చెత్తాచెదారం అంతా పైపుల్లోకి చేరింది. దీనివల్ల రాజపానగల్‌రోడ్డు, గొడుగుపాలెం తదితర ప్రాంతాలవారికి అప్పటి నుంచి కుళాయిల్లో నీరు రావడంలేదు. కోరిన వారికి ట్యాంకర్లు పంపుతున్నారు. పైపులైన్‌లో ఎక్కడ బ్లాక్ అయిందో కనుగొనేందుకు ఏడుచోట్ల గుంటలు తవ్వి పైపుల్లో చెత్తను తొలగించారు. సోమవారం ట్రయల్ రన్‌వేసి సజావుగా ఉంటే తీసిన గుంతలు పూడుస్తారు.

పేదలకు వైద్య సేవలే లక్ష్యం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక సంతపేటలోని తితిదే కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 1565 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరం కన్వీనర్ మాదాల వెంకటరావు మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. వైద్యులు జి.శివన్నారాయణ, బి.హరిబాబు, కె.శ్రీధర్, రంజిత్ బాషా, సుందర ప్రసాద్, సమీర్ రోగులకు పరీక్షలు నిర్వహించారు.

◗ సంతనూతలపాడు, న్యూస్‌టుడే: గ్రామంలోని గోగినేని సుబ్బయ్య ఆధ్వర్యంలో స్మార్ట్ విజన్ కంటి వైద్యశాల, చైతన్య కార్డియాక్ సెంటర్ ఒంగోలు వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పి.ఎన్.శ్యామల వైద్య పరీక్షలు నిర్వహించారు.

రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తెగితే ప్రమాదం.. తెలిసీ నిర్లక్ష్యం

కొత్తపట్నం గ్రామంలోని ప్రధాన రహదారితో పాటు పలు చోట్ల విద్యుత్ స్తంభాలకు పరిమితికి మించి విద్యుత్ సరఫరా వైర్లు, కేబుల్ తీగలు చుట్టేస్తున్నారు. కనెక్షన్లు ఇచ్చేస్తున్నారు. దీంతో ఓవైపు వీధి దీపాలు ఆపివేసే వీలులేక పగలూ, రాత్రి వెలుగుతూ విద్యుత్ వృథా అవుతుంటే మరో వైపు తీగలు ఊగుతూ తెగి ఎప్పుడు ఎవరి మీద పడతాయోననే ఆందోళనకు గురిచేస్తున్నాయి. మరోవైపు పంచాయతీకి బిల్లుల భారం పెరుగుతోంది. వెంటనే అధికారులు స్పందించి వీధి దీపాల నిర్వహణ, తీగల ఏర్పాటు సక్రమంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, కొత్తపట్నం

చెట్లు ఇలా.. నీరు పారేదెలా..

ఏళ్లుగా మరమ్మతులకు నోచక పోవడంతో మండల పరిధిలోని సాగరు కాలువలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. డ్రాప్ నుంచి తూములు, గేట్ల వరకు పూర్తిగా పాడైపోతున్నాయి. ప్రజలు, రైతులు మరమ్మతులు చేపట్టాలని ప్రజా ప్రతినిధులను, అధికారులను అడిగితే నిధుల సమస్యతో దాటవేస్తున్నారు. వీటికి బడ్జెట్ రాలేదు సరే.. కనీసం కాలువ నీటికి అవరోధంగా నిలుస్తున్న అటూ, ఇటు పెరిగిన చిల్ల చెట్లను సైతం తొలగించడంలో అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు చాలా అవసరం. కానీ ప్రస్తుతం ఎన్ఎస్పీ కాలువలు పూర్తిగా చిల్ల చెట్లతో దర్శనమిస్తున్నాయి. మేజరు నుంచి మైనర్ కాలువ వరకు ఇదే పెద్ద సమస్యగా నిలిచింది. కనీసం వాటిని తొలగించడంలో నైనా అధికారులు దృష్టి సారించి, ఖరీఫ్ సాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, సంతనూతలపాడు

బలహీనవర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఎన్.లక్ష్మానాయక్ కొనియాడారు. మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక నెల్లూరు బస్టాండ్‌లోని ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్తగా పేరొందారన్నారు. కార్యక్రమంలో సంక్షేమశాఖ అధికారులు బేగం, మధుసూదనరావు, పలు సంఘాల నాయకులు బ్రహ్మయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఎన్.లక్ష్మానాయక్ తదితరులు

బదిలీ అధికారికి ఆత్మీయ సన్మానం

కొత్తపట్నం: మండలం వ్యవసాయ శాఖ అధికారిగా పని చేసి బదిలీపై వెళ్లిన మోహన్ రెడ్డికి వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపట్నం హార్టికల్చర్ ఫామ్ వద్ద ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి హాజరై, వ్యవసాయ ఏవో కిషోర్ బాబు, వ్యవసాయ సిబ్బంది కలిసి ఆయనను శాలువతో సన్మానం చేశారు.

ఎలైట్ సిటిజన్స్ నూతన కార్యవర్గ ఎన్నిక

ఒంగోలు గ్రామీణం: లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ నూతన కార్యవర్గాన్ని స్థానిక మంగమూరుడొంకలోని హోటల్‌లో ఆదివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా గ్రంధి పార్థసారధి, ప్రధాన కార్యదర్శిగా బొమ్మిరెడ్డి లక్ష్మస్వామి, కోశాధికారిగా పద్మనాభుని సందిపరాజ్‌తోపాటు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు కూరపాటి రమేష్, గోపాలస్వామి, టి.అంజనేయులు, పి.జనార్దన్, బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలం.. సాకారం ఎన్నడో..

న్యూస్‌టుడే, చీమకుర్తి:

సాగర్ జలాలు తమకు ఎప్పుడు సాకారం అవుతాయోనని కేవీ పాలెం, ఏలూరివారి పాలెం గ్రామాల ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆయా గ్రామాలకు సాగర్ నీరు అందజేసేందుకని రూ.35 లక్షలు వెచ్చించి పైపులైను మరమ్మతుల తదితర పనులు చేపట్టినా.. ఫలితం లేక పోవడంతో.. తాజాగా ప్రవాస భారతీయుని చొరవతో సంపు నిర్మాణం, మోటార్లు ఏర్పాటు పనులు జరుగుతున్నాయి.

తుది దశలో మర్రిపాలెంలో సంపు నిర్మాణ పనులు

పుష్కర కాలంనుంచి ఇదే పరిస్థితి: చీమకుర్తి మండలంలోని కె.వి.పాలెం రక్షిత మంచినీటి పథకం ద్వారా రామతీర్థం జలాశయం నుంచి మండలంలోని సుమారు 20 గ్రామాలకు రక్షిత మంచినీటిని సరఫరా చేస్తున్న సంగతి తెలిసిందే. పదకొండేళ్ల క్రితం కె.వి.పాలెం పేరు పెట్టారు కానీ ఆ గ్రామానికి మాత్రం ఇంత వరకు రామతీర్థం జలాశయం ద్వారా సాగరు నీరు అందడం లేదు. పుష్కర కాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు రావడంతో ఆ రెండు గ్రామాల మధ్య మధ్య పైపులైను మరమ్మతులు, ఇతర నిర్మాణ పనులు జలజీవన్ మిషన్ కింద రూ.35 లక్షలతో పూర్తి చేశారు. అయినా ఆశించిన లక్ష్యం నెరవేరలేదు.

ప్రవాస భారతీయుడి చొరవతో సంపు నిర్మాణం: కొత్తగా మర్రిపాలెం వద్ద సంపు, భారీ సామర్థ్యం గల మోటారు ఏర్పాటు చేస్తే కె.వి.పాలెంతదితర గ్రామాలకు రామతీర్థం జలాలు అందే అవకాశం లేదని తేల్చారు. ఇందు కోసం మరో రూ.12 లక్షలకు పైగా ఖర్చు చేయాల్సి ఉంటుందని లెక్కలు తేల్చారు. మండల పరిషత్ నుంచి ఈనిధులు విడుదలలో జాప్యం నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రవాసభారతీయులు నల్లూరి వెంకట శేషయ్య తమ సొంత నిధులు వెచ్చించి మర్రిపాలెం వద్ద సంపు నిర్మాణం పూర్తి చేయించారు. ప్రస్తుతం మోటార్లు ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆతర్వాత కె.వి.పాలెంలోని ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీరు ఎక్కించడం మోటార్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులన్నింటిని సత్వరం పూర్తి చేస్తే కె.వి.పాలెంతో పాటు మరికొన్ని గ్రామాలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా తాగునీటిని సరఫరా చేసేందుకు మార్గం సుగమం అవుతుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

సదారామక్షేత్రం, ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు

మాట్లాడుతున్న అహోబిల మఠ జీయరు స్వామి

వేడుకల్లో శ్రీ సీతారామ బాలభక్త సమాజం సభ్యులు

సంతనూతలపాడు: గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దామోదరరావు, రామారావు, అంజయ్యల బృందం ఉదయం నుంచి రాత్రి వరకు భజనలు చేశారు.

● మద్దిపాడు: మద్దిపాడులో సుదర్శన లక్ష్మీ నారసింహ హోమం అహోబిల జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఘనంగా జరిగింది. అనంతరం ఆయన గ్రామంలోని కోదండ రామాలయం సందర్శించారు. [illegible] సాతులూరి నాగేశ్వరరావు, రామాలయం ప్రధాన అర్చకుడు [illegible] పాల్గొన్నారు.

● ఒంగోలు గ్రామీణం: అగ్రహార బాల భక్త సమాజం ఆధ్వర్యంలో ఒంగోలు మండలం కొప్పోలు గ్రామంలో కోదండ రామస్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

● ఒంగోలు సాంస్కృతికం: సదారామనామ క్షేత్రంలో అనంతశయన రామస్వామి దేవస్థానం దర్శనాన్ని భక్తులకు అనుగ్రహించారు. కేశవస్వామిపేటలో శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. కమ్మపాళెం అమ్మవారికి పూజలు చేశారు. పప్పు బజార్‌లో శ్రీ సీతారామస్వామి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి.

సంతనూతలపాడులో ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరుడు

ఒంగోలు గ్రామీణం: ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మున్సిపల్ మాజీ ఛైర్మన్ యక్కల తులసీరావు, బంగారయ్య తదితరులు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం: 8008564455
ఒంగోలు అద్దంకి రోడ్డు: 8247324766
ఒంగోలు కర్నూల్ రోడ్డు: 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే:

?: నిడమానూరు గ్రామంలోని చర్చి సెంటర్‌లో మురుగు కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో మురుగు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. – శ్రీను, గ్రామస్థుడు

✓: పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.
– మురళీమోహన్, ఈవోఆర్డీ

కొత్తపట్నం, న్యూస్‌టుడే:

?: కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం గ్రామంలో డ్రైనేజీ కాలువలు లేక ఇంటి నుంచి వచ్చే మురుగు నీరు రోడ్డు మీద పారుతోంది. పక్క ఇళ్లలోకి పోతున్నాయి. అనేక సార్లు కాలువలు ఏర్పాటు చేయాలని కోరినా పట్టించుకున్న వారు లేరు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలువలు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.
– గొల్లపోతు పరమేశ్వరరావు, స్థానికుడు

✓: కాలువల విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. ప్రపోజల్ పెట్టాం. రాగానే కాలువలు ఏర్పాటు చేస్తాం.
– సంపత్, పంచాయతీ కార్యదర్శి

చెత్త దిబ్బ తొలగించాలని నిరసన

చీమకుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని కె.అగ్రహారం సమీపంలో ఏర్పాటు చేసిన చీమకుర్తి పురపాలక సంఘం డంపింగ్‌యార్డుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అగ్రహారం వాసులు ఆదివారం చెత్త యార్డు వద్ద నిరసన వ్యక్తం చేశారు. యార్డులో చెత్తను తగుల బెట్టే సమయంలో దట్టమైన పొగ రావడంతో స్థానికులు యార్డు వద్దకు చేరుకున్నారు. తక్షణం ఈప్రాంతం నుంచి చెత్త యార్డును తొలగించే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో వాడపల్లి ఏడుకొండలు, పల్లాపల్లి సుబ్బారావు, కోనంకి తిరుమల, తొట్టెంపూడి రామారావు, పల్లాపల్లి ఆంజనేయులు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు వద్ద అగ్రహారం ప్రజలు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కొత్తపట్నం: 33 కెవి విద్యుత్తు లైన్ మరమ్మతుల కారణంగా సోమవారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. మండలం మడనూరు, టేటుపురం, ఈతముక్కల, రాజుపాలెం, గుమ్మళ్లపాలెం, పల్లెపాలెం, వజ్జిరెడ్డి గ్రామాల్లో వ్యవసాయ, ఆక్వా విద్యుత్తు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అంతరాయం ఏర్పాడుతుందని విద్యుత్తు ఏఈ చంద్రకాంత్ తెలిపారు.

వంతెనలు శిథిలం.. రాకపోకలు ఆందోళనకరం

న్యూస్‌టుడే, సంతనూతలపాడు:

◗ కుంగినా స్పందించని అధికారులు

కర్నూల్ రోడ్డుపై ప్రధాన వంతెనలు ప్రమాదకర స్థాయికి చేరాయి. ఎప్పుడు పడిపోతాయో అన్నట్లుగా ఆందోళన కలిగిస్తున్నా అధికారులు మరమ్మతులకు చర్యలు తీసుకోవడంలేదు. వీటిపై నిత్యం టన్నుల కొద్దీ బరువులున్న లారీలు, బస్సులు, ట్రాక్టర్లు, గ్రానైట్ టిప్పర్లు తిరుగుతున్నా, ప్రమాదకర పరిస్థితులున్నా.. పాలకులు కానీ, అధికారులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం మరమ్మతులకు సైతం నోచుకోవడం లేదు. వైకాపా ప్రభుత్వంలో అధికారులు ఎన్ని సార్లు ప్రతిపాదనలు పంపినా రూపాయి ఇచ్చిన దాఖలాలు లేవు. ప్రస్తుతం వచ్చిన కూటమి ప్రభుత్వంలోనైనా మోక్షం లభించాలని వాహనదారులు కోరుతున్నారు.

సంతనూతలపాడు సమీపంలో ప్రమాదకరంగా వంతెన

రాళ్లు, మట్టి వేసి మమ అనిపిస్తున్నారు: స్థానిక ఎండ్లూరుడొంక సమీపంలోని వంతెన తీవ్రంగా దెబ్బతింది. తొలుత రంధ్రం పడింది. దానిలో రాళ్లు వేసి మమ అనిపించారు. మళ్లీ రోడ్డు కుంగింది. ఆ సమయంలోను మట్టి, రాళ్లు పోసి సరిపెట్టారు. ఇలా పలు మార్లు కేవలం, మట్టి రాళ్లు వేయడంతోనే సరిపోతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం వాహన చోదకులకు ఇబ్బందులు లేకుండా కాస్తంత రోడ్డుకు మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చేశారు. కానీ రోడ్డు మాత్రం పూర్తిగా కుంగింది. పైగా పక్కనేనున్న ట్రిపుల్ ఐటీ కళాశాల నుంచి పెద్ద ఎత్తున మురికి నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఎప్పుడు కూలుతుందో, ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

ఇనుప రాడ్లతో కూడిని దిమ్మెలు వేశారు: సంతనూతలపాడు సమీపంలో కర్నూల్ రోడ్డు పైనున్న పెద్ద వంతెన ఏళ్ల క్రితం కుంగింది. కింద ఇనుప రాడ్లతో కూడిన దిమ్మెలను ఏర్పాటు చేసి వదిలేశారు. తరువాత దాని గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. నిత్యం టన్నుల కొద్దీ బరువులున్న గ్రానైట్ లారీలు తిరగడంతో ఎప్పుడు కూలుతుందోనని పలువురు వాపోతున్నారు. జిల్లా అధికారుల నుంచి మంత్రులు, ప్రజాప్రతినిధుల వరకు ఈ రహదారిపైనే ప్రయాణిస్తుంటారు. కానీ వీటి గురించి మాత్రం పట్టడం లేదని విమర్శిస్తున్నారు.

విద్యార్థులకు అన్న సంతర్పణ

చీమకుర్తి: చీమకుర్తిలోని ఎస్‌కెఆర్ బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు సంతనూతలపాడు వాసవీక్లబ్, మహిళా క్లబ్‌మాజీ అధ్యక్షులు గ్రంధి బదరీనారాయణ పద్మజలు ఆదివారం అన్న సంతర్పణ చేశారు. క్లబ్ సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాదు, జీఎల్.ప్రసాదరావు, వేమూరి వెంకట శేషారావు, వి.ఆంజనేయులు, పి.సుధాకర్, ఎస్.అంజిరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

కీ॥శే॥ రామిశెట్టి వెంకటేశ్వర్లు గారు
పందిళ్ళపల్లి
హెడ్ మాస్టర్, జెడ్.పి.హెచ్ స్కూల్, ఎనికపాడు,
యస్.యన్.పాడు మండలం, ప్రకాశం జిల్లా.
మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తి.
మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మా ఆరాధ్య దైవం... మీ మరణం మాకు తీరనిలోటు. మీ పవిత్ర ఆత్మకు శాంతికలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
మీ.. కుటుంబ సభ్యులు
పెద్ద కర్మ: తేది: 07-07-2025, సోమవారం, మీనాక్షి ఎన్‌క్లేవ్, విఐపి రోడ్, 5వ లైన్, ఒంగోలు మా స్వగృహమునందు జరుగును. కావున తెలియచేయటమైనది.

ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం జులై 7, 2025 5

నిధుల సంతర్పణ.. తప్పని రవాణా!

ఈ చిత్రంలో కనిపించేవి కావలి వైకుంఠపురంలో నీళ్ల ట్యాంకర్ల కోసం ఇళ్ల ముందు ఉంచిన డ్రమ్ములు. ట్యాంకర్లతో రవాణా నిలుపుదల చేసి.. ఇకపై పైపులైన్ల ద్వారానే నీటిని సరఫరా చేస్తామంటున్న పురపాలక అధికారుల హామీ అమలు కావడం లేదు. అమృత్ పనుల ఆలస్యంతోనే ఇలా జరుగుతోంది. ఎనిమిదేళ్లుగా జాప్యంతో పురపాలకానికి ఆర్థికభారం, ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు.

● పట్టణంలోని పెదపవని మార్గంలో పైపులైన్ల ఏర్పాటు పూర్తికాకపోవడంతో ట్యాంకర్ల నీరు అనివార్యమవుతోంది. ముసునూరు, ఇందిరమ్మకాలనీ, వైకుంఠపురం, ఎస్సీకాలనీ తదితర ప్రాంతాల్లో ట్యాంకర్లతో నీటిని అందిస్తున్నారు.

న్యూస్‌టుడే, కావలి : పట్టణంలో అమృత్ పథకం పనులు ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. పూర్తయ్యాక పథకాన్ని పురపాలకానికి అప్పగించాలి. గత వైకాపా పాలనలో నిధులు మంజూరు చేయలేదు. ఆ ప్రభుత్వ ఒత్తిడితో పురపాలకమే తనఖాగా అమృత్‌కు అవసరమైన రూ.51కోట్లు బ్యాంకు రుణంగా సేకరించింది. తీసుకున్న రుణాన్ని గుత్తేదారుడికి ముందుగానే సమర్పించారు. తీరా చూస్తే పనులు ఏళ్ల తరబడి కొలిక్కి రావడం లేదు. మరో పక్క బ్యాంక్ నుంచి తీసుకున్న రుణానికి ప్రతి నెలా రూ.35లక్షల వరకు వాయిదాలతో వడ్డీ, అసలు చెల్లిస్తున్నారు. ఇంకోవైపు పైపులైన్ల అమరిక లేక చాలా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అదనపు వ్యయం తప్పడం లేదు.

160 కి.మీ. పైపులైన్లు

పురపాలక సంఘంలో అమృత్ కింద 160 కి.మీ. వరకు పైపులైన్లు వేయాలి. అందులో సగభాగం వరకు అమరిక జరిగింది. మిగతావి పూర్తి చేయడంలో గుత్తేదారు జాప్యం చేస్తున్నారు. ముందుగానే డబ్బులు తీసుకున్నా.. పనులు చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి. దాంతో ట్యాంకర్ల ద్వారా నీటి రవాణా తప్పడం లేదు. రోజూ గరిష్ఠంగా 200కు పైగానే ట్రిప్పుల వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని రవాణా చేస్తున్నారు. అసలు ట్రిప్పుల కంటే నకిలీ సంఖ్యతో చలామణీ అవుతూ ఖజానాకు గండి కొడుతున్నఉదంతాలు అనేకం. మరోవైపు పేదల నివాసిత ప్రాంతాల్లో నీటి పంపిణీ అంతంత మాత్రంగానే ఉంటోంది.

అమృత్ పథకానికి మంజూరైన నిధులు:	59.30 కోట్లు
ఏటా ట్యాంకర్లకు కేటాయిస్తున్నది:	రూ.1.9 కోట్లు
పాత పైపులైన్లు	187 కి.మీ.
అమృత్ పథకం పైపులైన్లు	160 కి.మీ.
ప్రస్తుతం వేసినవి	76 కి.మీ.
వేయాల్సింది	84 కి.మీ.
పాత కుళాయి కనెక్షన్లు:	6,200
అమృత్ పథకంలో..	8,530

నీటికి ఇబ్బంది లేదు

పురపాలక సంఘంలో నీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అమృత్ పథకం పనులు త్వరలోనే పూర్తికానున్నాయి. ఇప్పటికే నీళ్ల ట్యాంకర్లను చాలా వరకు తగ్గించాం.

– సాయిరాం, డీఈఈ, కావలి పురపాలక సంఘం

నగరంలో సోమవారం జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం రాత్రి నెల్లూరు అనిల్ గార్డెన్‌కు చేరుకున్న మంత్రి లోకేశ్‌కు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(నవాబుపేట)

వరాలు.. భక్తి పరవళ్లు

ప్రారంభమైన బారాషహీద్ దర్గా రొట్టెల పండగ

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే

'బారాషహీద్ అస్సలామ అలైకుమ్' అంటూ భక్తులు మతాలకతీతంగా బారాషహీద్ దర్గా రొట్టెల పండగ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు ముజావర్లు సమాధులను గంధ లేపనం చేయడంతో పండగ మొదలైంది. దర్గా ఆవరణ, స్వర్ణాల చెరువుకు భక్తులు పోటెత్తారు. అంచనాకు మించి దర్శనాలు, రొట్టెల మార్పిడికి భక్తులు తరలివచ్చారు. దర్గా ఆవరణ సమీపంలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పార్కింగ్ ప్రదేశాలు, రోడ్ల పైనే విశ్రాంతి తీసుకుంటున్నారు. వంటలు చేసుకుంటున్నారు. నగరంలో ఏ రోడ్డు చూసినా జనమే. విద్యుద్దీపకాంతుల్లో దర్గా వెలిగిపోతోంది. భక్తి పారవశ్యంతో పగలు, రాత్రి తేడా లేకుండా భక్తులు దర్శనం చేసుకుంటున్నారు. బారాషహీదుల సమాధులను దర్శించుకుని స్వర్ణాల చెరువులో స్నానాలు ఆచరించి రొట్టెలు మార్చుకుంటున్నారు. దర్శనానికి మూడు గంటల సమయం పడుతోంది. సీసీ కెమెరాల్లో ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

దర్గాలోని మినార్

క్యూలైన్‌లో దర్శనానికి బారులు

దర్గాలో విద్యుత్ శోభ

భక్తులతో కిటకిటలాడుతున్న దర్గా ప్రాంగణం

గంధ మహోత్సవం నేడు

బారాషహీదుల గంధమహోత్సవం సోమవారం రాత్రి జరగనుంది. 12 మంది షహీద్‌లు (వీర మరణం) పొందిన రోజు. కోటమిట్ట అమీనియా మసీదు నుంచి 12 బిందెల్లో గంధం దర్గాకు తీసుకొస్తారు. మంగళవారం తెల్లవారుజామున కడప పెద్దదర్గా పీఠాధిపతి మాలిక్ ఆరీఫ్‌వుల్లా హుస్సైనీ ప్రత్యేక ప్రార్థనలు చేసి గంధాన్ని బారాషహీదులకు లేపనం చేసిన తర్వాత భక్తులకు పంచుతారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బారాషహీదుల గంధ మహోత్సవాన్ని వీక్షించేందుకు దర్గా ఆవరణలో వేచి ఉన్నారు.

ఉద్యోగం, పెళ్లి రొట్టెలకు డిమాండ్

రొట్టెల పండగలో ఉద్యోగం, గృహ, పెళ్లి రొట్టెలకు డిమాండ్ ఏర్పడింది. ఎక్కువ మంది సంతానం, సౌభాగ్యం, వ్యాపారం, ఆరోగ్యం రొట్టెలు ఇచ్చి ఉద్యోగ, గృహ, పెళ్లి రొట్టెలు పట్టుకునేందుకు స్వర్ణాల చెరువు వద్ద ఆరా తీస్తున్నారు. ఉద్యోగ రొట్టె కనీసం చిన్న ముక్కైనా దొరుకుతుందేమోనని నిరుద్యోగ యువత వెతుకుతోంది.

బారాషహీదులకు మొక్కుతూ

రొట్టె కోసం మహిళల పోటీ

ధర దిగువన.. రైతు ఆవేదన

గిట్టుబాటుకాని పొగాకు సాగు
ఆందోళన బాట

న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం, కలిగిరి

రెండేళ్లుగా ఆశాజనకంగా ఉన్న పొగాకు ధరలు.. ఈ ఏడాది రైతులను నిరాశకు గురిచేశాయి. కనీస మద్దతు ధర కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోగ్రేడ్ ధరలు నానాటికీ పతనం కావడమే కాదు.. ఇటీవల నోబిడ్లు అధికవుతున్నాయని వాపోతున్నారు. ఈ ఏడాది మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు వచ్చే సీజన్‌లో బ్యారన్, పొలాలు కౌలుకు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. మరోపక్క ఇటీవల గుంటూరులో జరిగిన బోర్డు సమావేశంలో రాబోయే సీజన్‌లో ఉత్పత్తిని కుదిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

కందుకూరు-2 వేలం కేంద్రంలో నిరసన తెలుపుతున్న రైతులు (పాత చిత్రం)

భారీగా ఉత్పత్తి

రెండేళ్లుగా పొగాకు రైతులకు మంచి లాభాలు వచ్చాయి. దాంతో ఈ ఏడాది కూడా వస్తాయన్న ఆశతో బ్యారన్ రూ.2.5 లక్షలు నుంచి రూ.3లక్షలు వరకు, ఎకరా పొలం రూ.30వేల వరకు కౌలుకు తీసుకుని భారీగా సాగు చేశారు. దీంతో ఎస్ఎల్ఎస్ రీజియన్‌లో ఉండే జిల్లాలోని కందుకూరు-1, కందుకూరు-2, కలిగిరి, డీసీపల్లి వేలం కేంద్రాల పరిధిలో సుమారు 50 మిలియన్ కిలోలకు పైగా ఉత్పత్తి వచ్చింది. హైగ్రేడ్ రకం కిలో రూ.280 పలకగా.. ఇప్పటికీ ఆ రకానికి అంతకుమించి ధర పెరగలేదు. లోగ్రేడ్ రకం మొదట్లో కిలో రూ.200 పలకగా, ప్రస్తుతం రూ.160 ఉంది. ఒక్కోసారి ఆ ధరకైనా కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో ఎక్కువశాతం నోబిడ్లు పడుతున్నాయి. ఈక్రమంలో గతనెల 28న కందుకూరు-2 వేలం కేంద్రంలో లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల రైతులు వేలాన్ని అడ్డుకుని రోడ్డుపై నిరసన తెలిపారు. గతేడాది లోగ్రేడ్ కిలో రూ.320 పలికింది. ఈ ఏడాది ఉత్పత్తి పెరగడం, అంతర్జాతీయంగా మార్కెట్ లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ధరలు ఇలాగే ఉంటే బ్యారన్‌కు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు నష్టం వచ్చే పరిస్థితి ఉంది. ఈ ప్రభావం వచ్చే సీజన్‌లో పొలాల కౌలు, బ్యారన్‌లపై చూపనుంది. ఎకరా రూ.30వేలు ఉండే కౌలు, ప్రస్తుతం రూ.20వేలకు తీసుకునేందుకు కూడా రైతులు ముందుకు రావడం లేదు.

36 క్వింటాళ్లకు పరిమితం

రెండేళ్లుగా ఉన్న ధరలు చూసి రైతులు ఈ ఏడాది భారీగా సాగు చేస్తారన్న ఉద్దేశంతో బోర్డు 2024-25 సంవత్సరంలో ఎస్ఎల్ఎస్, ఎస్‌బీఎస్ రీజియన్ల పరిధిలో 105.27 మి.కిలోలకు అనుమతిచ్చినా.. అధిక మొత్తంలో సాగు చేయడంతో భారీగా ఉత్పత్తి వచ్చింది. ప్రస్తుతం కొనుగోళ్లు మందకొడిగా జరుగుతున్నాయి. దీంతో వేలం పూర్తయ్యేందుకు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జూన్ నెలాఖరులో గుంటూరులో జరిగిన బోర్డు సమావేశంలో రాబోయే సీజన్‌లో పంట ఉత్పత్తి తగ్గించాలని నిర్ణయించారు. 2025-26 సీజన్‌కు ఎస్ఎల్ఎస్, ఎస్‌బీఎస్ రీజియన్లకు 90.20 మి.కిలోలకే అనుమతించారు. తద్వారా సుమారు 15 మి.కిలోలు పంట ఉత్పత్తి తగ్గించారు. అలాగే బ్యారన్‌కు గతంలో 42 క్వింటళ్లు ఉన్న అనుమతిని రాబోయే సీజన్‌కు 36 కింటాళ్లకు పరిమితం చేశారు.

చదువుల గుడి.. పనులు వడివడి

ఎన్సీఈఆర్టీ భవన నిర్మాణాలకు రూ.347.96 కోట్లు మంజూరు

జాతీయ విద్యా పరిశోధనా శిక్షణ సంస్థ (ఎన్సీఈఆర్టీ) ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. తొమ్మిదేళ్ల కిందట విద్యాకేంద్రం ఏర్పాటుకు శంకుస్థాపన చేసినా.. భూసేకరణ, పరిహారం మంజూరులో నిర్లక్ష్యం, నిధుల కేటాయింపులో జాప్యం వెరసి... నేటికీ శిలాఫలకానికే పరిమితమైంది. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చొరవతో ప్రస్తుతం నిధులు మంజూరయ్యాయి.

న్యూస్‌టుడే, వెంకటాచలం

జిల్లాలో జాతీయ స్థాయి విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో మాజీ రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని ఎన్సీఈఆర్టీ ప్రాంతీయ విద్యా సంస్థను నెల్లూరుకు మంజూరు చేయించారు. భవన నిర్మాణానికి వెంకటాచలం మండలంలోని చవటపాళెం వద్ద జాతీయ రహదారికి కి.మీ. దూరంలో 50 ఎకరాలు కేటాయించారు. భవన నిర్మాణానికి 2016 డిసెంబర్ 27న కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో వెంకయ్యనాయుడు, అప్పటి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవడేకర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.

శిలాఫలకం వద్ద కేంద్ర అధికారులు (పాత చిత్రం)

ఏడాదిగా కదలిక

శంకుస్థాపన సమయంలో సంస్థకు అనుబంధంగా సీబీఎస్ఈ సిలబస్ బోధించే పాఠశాల ఏర్పాటు చేయాలని, అక్కడ ప్లస్ టూ వరకు రెండువేల మంది విద్యార్థులకు ఉచితంగా బోధిస్తారని చెప్పారు. 2017 నుంచే పాఠశాల ప్రారంభించాలని అప్పట్లో ఆదేశించారు. తొలినాళ్లలో హడావుడి చేసి తరువాత మిన్నకుండిపోయారు. వెంకయ్య నాయుడు చొరవతో ఏడాది నుంచి పనుల్లో కదలిక వచ్చింది. 2023 అక్టోబర్‌లో మైసూర్‌లోని ఎన్సీఈఆర్టీ ప్రాంతీయ విద్యా సంస్థ అధికారులు వచ్చి భూములు పరిశీలించారు. గత ఏడాది డిసెంబర్ నుంచి నెల్లూరులోని వీఆర్ కళాశాల తాత్కాలిక భవనాల్లో ఎన్సీఈఆర్టీ పాఠశాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని అన్ని అనుమతులు త్వరితగతిన అందించడంతో పాటు రైతులకు సుమారు రూ.9.50 కోట్ల వరకు పరిహారం విడుదల చేయగా.. . ఆరు నెలల కిందట వారికి అందజేసి భూములు స్వాధీనం చేసుకున్నారు.

తొలివిడత నిధులు..

భవన నిర్మాణాలకు రూ.938 కోట్లు అవసరం. తొలి విడతగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ.347.96 కోట్లు విడుదల చేసింది. వీటితో పాఠశాల, అకడమిక్ భవనాలు, గ్రంథాలయం, ల్యాబ్‌లు, సిబ్బంది నివాస గృహాలు, విద్యార్థులకు వసతి గృహాలు తదితర భవనాల నిర్మాణాలు చేపట్టనున్నారు. భవన నిర్మాణ పనులను సీపీడబ్ల్యూడీకి అప్పగించగా... టెండర్లు పిలిచారు. మొదటి దశ పనులు పూర్తయితే తరువాత రెండు విడతల్లో మిగిలిన నిధులు విడుదల చేయనున్నారు. మొత్తం 60 నెలల్లో భవన నిర్మాణాలు పూర్తి చేయాలన్నది లక్ష్యం.

త్వరలో పనులు ప్రారంభం

ఎన్సీఈఆర్టీ ప్రాంతీయ కేంద్ర భవన నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం తొలి విడతగా నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నాయి. వచ్చే నెల నుంచి పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మూడు దశల్లో సుమారు రూ.950 కోట్లు వరకు మంజూరుకానున్నాయి. – రమేశ్, ఎన్సీఈఆర్టీ ప్రాంతీయ కేంద్ర ఓఎస్డీ

కేంద్ర సహకార బ్యాంకు రుణ లక్ష్యం రూ.2,900 కోట్లు

న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతి సెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రైతుల కోసం నిరంతరం పనిచేస్తోందని ఆ బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జిల్లా రుణ లక్ష్యం రూ.2900 కోట్లు కాగా.. అందులో రూ.2,200 కోట్లు వ్యవసాయ అనుబంధ రంగాలకు, రూ.700 కోట్లు డిపాజిట్లు సేకరించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయంలో పెట్టుబడుల కోసం రైతులకు వ్యవసాయ పంట రుణాలు, వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రత్యేకంగా రూ.2200 కోట్లు రుణాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రైతులకు రూ.5 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు 12 శాతం వడ్డీతో దీర్ఘకాలిక రుణాలు, చిన్న, సన్నకారు రైతులకు క్రాప్ లోన్లు రూ.3 లక్షల వరకు ఇస్తామన్నారు. తీసుకున్న రుణం సకాలంలో చెల్లిస్తే రైతుకు 4 శాతం వడ్డీ రాయితీ ఇస్తామని వెల్లడించారు. రైతులు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ప్రాథమిక సహకార సంఘాలు, కేంద్ర సహకార బ్యాంకుకు చెందిన 23 శాఖల్లో రుణం తీసుకోవచ్చన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోనలో శయన అలంకారం.. హాజరైన భక్తులు

కోనలో తొలి ఏకాదశి వేడుకలు

మండలంలోని పెంచలకోనలో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. అభిషేకంతో పాటు ప్రత్యేక పుష్పాలతో చెంచులక్ష్మి ఆదిలక్ష్మి సమేత పెంచలస్వామి శయన అలంకరణలో ఆస్థానం నిర్వహించారు. రాత్రి మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శేషవాహన సేవ వైభవంగా జరిగింది. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. ఆలయ ఉప కమిషనర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొని భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, రాపూరు

వీఆర్ హైస్కూల్‌కు పూర్వ వైభవం

నేడు ప్రారంభించనున్న మంత్రి లోకేశ్

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ఎంతోమంది ప్రముఖులకు చదువులు అందించి.. గత ప్రభుత్వ పాలకుల నిర్వాకంతో ఐదేళ్లుగా మూతబడిన వీఆర్ హైస్కూల్ పునః ప్రారంభానికి సిద్ధమైంది. 1875లో నగరం నడిబొడ్డున 12 ఎకరాల్లో ఏర్పాటై జిల్లాతోపాటు పొరుగు జిల్లాల విద్యార్థులకు సైతం విద్య నేర్పిన వీఆర్ హైస్కూల్‌ను సోమవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించనున్నారు. ఇక్కడే చదువుకుని రాష్ట్ర పురపాలక శాఖామంత్రిగా ఉన్న నారాయణ చొరవ తీసుకుని పాఠశాలకు రూ.15 కోట్లతో అత్యాధునిక మౌలిక వసతులు కల్పించారు. అంతేకాదు నిరుపేద విద్యార్థులు 1050 మందిని చేర్చుకునేలా చేశారు. ఇక్కడ అంతర్జాతీయ విద్యావిధానాలతో కూడిన ఉచిత విద్య అందిస్తారు. విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నారు. సైకిళ్లు, భోజనం, స్నాక్స్, ఉచిత పుస్తకాలు, దుస్తులు అందించారు. పాఠశాల ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాట్లు పూర్తిచేశారు.

సిద్ధమైన వీఆర్ హైస్కూల్

పైలాన్ నిర్మాణం పట్టించుకోరేం?

లోకేశ్ ఆవిష్కరించగా.. వైకాపా ప్రభుత్వంలో కూల్చివేత

'కావలిలో అక్రమాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ భూములతో పాటు సాగునీటి వనరులను ఆక్రమించారు. చివరకు అమృత్ పనులకు గుర్తుగా వేసిన శిలాఫలకం పైలాన్‌ను ధ్వంసం చేశారు. వచ్చే ఎన్నికల్లో గెలిచేది కూటమి ప్రభుత్వమే. దౌర్జన్యంగా కూల్చేసిన పైలాన్ నిర్మించుకుందాం. రెవెన్యూ అక్రమాలకు పాల్పడిన, సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుందాం.' – ప్రతిపక్ష హోదాలో కావలి వచ్చినప్పుడు నారా లోకేశ్ అన్న మాటలు ఇవి.



కావలిలో ఏర్పాటు చేసిన అమృత్ పైలాన్(పాత చిత్రం)

ఈనాడు, నెల్లూరు, న్యూస్‌టుడే, కావలి

కావలి పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించేందుకు గతంలో తెదేపా ప్రభుత్వంలో ప్రారంభమైన అమృత్ పనులను వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. అంతటితో ఆగకుండా పథకానికి సంబంధించి 2018 జనవరి 8న కావలి ట్రంకురోడ్డులోని తహసీల్దార్ కూడలి వద్ద భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన పైలాన్‌కు కూల్చేశారు. దీన్ని అప్పటి ఐటీ, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి హోదాలో నారా లోకేశ్ ప్రారంభించారు. పైలాన్ ధ్వంసం కేసును కొద్దిరోజులు హడావుడి చేసి వదిలేశారు. ఆ కేసులో పలువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపగా.. కీలకపాత్రధారులు, అభియోగాలు ఎదుర్కొంటున్న వైకాపా నాయకులను వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై మంత్రి లోకేశ్ దృష్టి సారించాలని తెదేపా అభిమానులు కోరుతున్నారు.

ప్రెస్‌క్లబ్ పేరిట ధ్వంసం..

ప్రెస్‌క్లబ్ నిర్మాణం కోసమని 2020 ఏప్రిల్ 30న అర్ధరాత్రి విద్యుత్తు సరఫరా నిలిపివేయించి జేసీబీలతో పైలాన్ ధ్వంసం చేశారు. శిథిలాలను పురపాలక ట్రాక్టర్లలో తీసుకెళ్లి మందాటి చెరువులో వేశారు. దీనిపై అప్పటి మున్సిపల్ కమిషనర్‌కు, కావలి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినా.. పెద్దగా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెదేపా కార్యకర్తలంతా దీన్ని మళ్లీ నిర్మిస్తారని భావించారు. కావలి నుంచి ఎమ్మెల్యేగా దగ్గుమాటి కృష్ణారెడ్డి విజయం సాధించినా.. ప్రస్తుతం దానిపై మాట్లాడకపోవడం.. తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో అసంతృప్తి నెలకొంది. దీంతో పాటు.. అమృత్ శిలాఫలకం పడగొట్టిన చోటే తిరిగి నిర్మిస్తామని చెప్పినా.. ఆ ప్రాంతంలో 'ఐలవ్ కావలి' పేరుతో జాతీయ జెండాను ఏర్పాటు చేయడం గమనార్హం.

120 ఎకరాల ప్రభుత్వ భూమి సంగతేంటి.?

వైకాపా ప్రభుత్వంలో కావలి నియోజకవర్గంలో పెద్దఎత్తున రెవెన్యూ అక్రమాలు జరిగాయి. లేఅవుట్లకు అనుమతి తీసుకోక పోగా.. చెరువులు, కాలువలు, కుంటలు, ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. దీనిపై కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విచారణ చేసి.. అక్రమ లేఅవుట్లలో 120 ఎకరాల ప్రభుత్వభూమి ఆక్రమణలో ఉన్నట్లు గుర్తించారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. చివరకు యువగళం సభలో బహిరంగంగా ఓ రెవెన్యూ అధికారిని తీవ్రంగా విమర్శించగా.. ప్రస్తుతం ఆ అధికారికి ఉన్నత పోస్టు కల్పించేందుకు కూటమి నేతలే సహకరించడం గమనార్హం.

సమన్వయంతో ఎర్రచందనం అక్రమ రవాణా కట్టడి

రాపూరు, న్యూస్‌టుడే: అడవుల సంరక్షణకు నెల్లూరు-అన్నమయ్య జిల్లాల పరిధిలోని అటవీ అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆ శాఖ పీసీసీఎఫ్ ఏకే నాయక్ అన్నారు. ఆయన ఆదివారం రెండు జిల్లాల అధికారులతో కలిసి జిల్లా సరిహద్దు ప్రాంతంలోని అడవులు తనిఖీ చేశారు. ముఖ్యంగా ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు సిబ్బంది అంకితభావంతో పని చేయాలని కోరారు. ప్రత్యేకించి అడవుల్లోని వన్యప్రాణులకు అవసరమైన తాగునీటి వసతి కల్పిస్తే దాహార్తి కోసం గ్రామాల్లోకి రాకుండా ఉంటాయన్నారు. దస్త్రాలు పరిశీలించి పలు సూచనలిచ్చారు. ఆయన వెంట జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్‌బాషా, రాపూరు, చిట్వేలి రేంజర్లు రవీంద్రబాబు, ధీరజ్‌తో పాటు ఎఫ్‌బీవోలు, బీవోలు, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

(c) eenadu

త్యాగానికి ప్రతీక మొహర్రం

అమరుల త్యాగానికి ప్రతీక మొహర్రం అని ముస్లిం మత పెద్దలు తెలిపారు. మండల పరిధిలోని కాగితాలపూరులో ఆదివారం పీర్లను ముస్తాబు చేసి ఊరేగించారు. ఇమామ్ హుస్సేన్ జ్ఞాపకార్థం ఏటా ఇక్కడ మొహర్రం నిర్వహిస్తున్నారు. విషాదానికి చిహ్నంగా దర్గాలను నలుపు రంగు జెండాలతో అలంకరించారు. మొహర్రం సంతాప దినాలు పాటిస్తూ చివరి రోజు దర్గా ప్రాంగణంలో తాజియా(రెండు వేళ్ల మధ్య బ్లేడు ఉంచుకొని ఛాతిపై కొట్టుకుంటూ రక్తం చిందించడం) నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

– న్యూస్‌టుడే, మనుబోలు

పంట కాలువ ఇలా.. సాగునీరెలా

కలువాయి చెరువు నుంచి పొలాలకు వెళుతున్న సాగునీటి కాలువ పిచ్చి మొక్కలు, గుర్రపు డెక్కతో నిండి అధ్వానంగా మారింది. ఆయకట్టుకు సరిగా నీరందక ఇబ్బందులు పడుతున్నామని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని సాగుదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సాగునీటి కాలువ శుభ్రం చేయాలని రైతులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కలువాయి, కోవూరు

చిట్టడవిని తలపిస్తున్నా పట్టించుకోరా..

బుచ్చి మండలం రేబాలలో గత ప్రభుత్వం నిర్మించిన కాలనీలో ఎవరూ నివాసం లేక చిట్టడవిని తలపిస్తోంది. గత వైకాపా పాలనలో నాయకులు నిధులు దోచుకున్నారే తప్ప పేదల సమస్యలు పట్టించుకోలేదు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఎవరూ నివాసం ఉండటం లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా ఉన్నతాధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

ఉద్యోగుల సేవలు ఎనలేనివి

రవీంద్రబాబును సత్కరిస్తున్న ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, నాయకులు

నెల్లూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకుల సేవలు ఎనలేనివని ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ తెలిపారు. ఆదివారం నగరంలోని ఏసుగు సుందరరామిరెడ్డి కల్యాణ మండపంలో ఏపీజీఈఏ నాయకులు బొప్పా రవీంద్రబాబు, ఏసుగు రమణారెడ్డి, యడవల్లి మల్లికార్జున, గునుపాటి శ్రీనివాసులురెడ్డి, ఎ.గిరిబాబు ఉద్యోగ విరమణ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం యు.మల్లికార్జున కార్యదర్శిగా జిల్లా ఏపీజీఈఏకు అనుబంధంగా పెన్షనర్ల విభాగాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి జి.నాగసాయి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సుధాకర్ రెడ్డి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెగా వేడుక.. విద్యా వేదిక

న్యూస్‌టుడే, విద్య(నెల్లూరు), దుత్తలూరు, బుచ్చి

ప్రభుత్వ పాఠశాలలతో పాటు కళాశాలల్లో చదివే విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. చదువుతోపాటు క్రమశిక్షణలో మెలగడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం అవసరమని భావిస్తోంది. తరగతి గదిలో గురువులు విద్యార్థులను పర్యవేక్షించినా మిగిలిన సమయంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండేలా ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద ఎత్తున తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల (పీటీఎం) సమావేశాలను చేపట్టింది. ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమాన్ని ఈనెల 10వ తేదీ నిర్వహించాలని నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలలతోపాటు ఈ ఏడాది కళాశాలలు, ప్రైవేటు పాఠశాలల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈక్రమంలో జిల్లాలోని అన్ని విద్యా సంస్థల్లో ఈ కార్యక్రమాన్ని పెద్ద వేడుకగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

● విద్యార్థుల నడవడిక, తీరుతెన్నులు, వివిధ అంశాల్లో ప్రతిభపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభిప్రాయాలు పంచుకుంటారు. విద్యార్థి ప్రవర్తన, చదువులో రాణింపు, క్రమశిక్షణ తదితర అంశాలపై చర్చిస్తారు.

10న పీటీఎం సమావేశం

విద్యా హక్కు చట్టం, ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు ఉచిత సీట్ల కేటాయింపు అంశాలపై అవగాహన కల్పిస్తారు. విద్యార్థులకు సంబంధించిన హోలిస్టిక్ ప్రగతి కార్డులు తయారుచేసి తల్లిదండ్రులకు అందజేస్తారు. రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం గురించి వివరించి ఆరోగ్య పరీక్షలకు సంబంధించిన బుక్‌లెట్లు పంపిణీ చేస్తారు.

ఏర్పాట్లు చేస్తున్నాం : ఆర్.బాలాజీరావు, జిల్లా విద్యాశాఖాధికారి

ఈ నెల పదో తేదీ గురువులు, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థుల ప్రవర్తన, చదువు, క్రమశిక్షణ తదితర అంశాలపై చర్చిస్తాం. ఈ సమావేశానికి తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్నాం.

ప్రత్యేక కార్యక్రమాలు

విద్యాసంస్థల ప్రాంగణాల్లో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి చిత్రాలు తీసుకునేలా ఫొటో స్పాట్లు ఏర్పాటు చేస్తున్నారు. డ్రీమ్‌వాల్స్ ఏర్పాటుచేసి విద్యార్థులతో వారి లక్ష్యాలను దానిపై రాయిస్తారు. అమ్మ పేరిట మొక్కలు నాటేలా ప్రోత్సహిస్తారు. పాఠశాల ప్రగతి వెల్లడిస్తారు. తల్లిదండ్రులకు వివిధ రకాల ఆటల పోటీలు కూడా నిర్వహించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతోపాటు మాదకద్రవ్యాలతో అనర్థాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ఈకార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో తల్లిదండ్రులను ఆహ్వానించేందుకు విద్యార్థులతో ఆహ్వాన పత్రికలను కూడా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సిద్ధం చేస్తున్నారు.

విజయవంతంగా నిర్వహిస్తాం

– వెంకటసుబ్బయ్య, ఏపీసీ, ఎస్ఎస్ఏ

మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. సమావేశాల నిర్వహణకు పాఠశాలలకు నిధులు కూడా విడుదల చేస్తున్నాం. ఈ కార్యక్రమంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య సమన్వయం పెరుగుతుంది.

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు : 3,555 ● జూనియర్ కళాశాలలు : 143 ● పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు : 3.70 లక్షలు

తొలిరోజు ప్రశాంతంగా..

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన నెల్లూరు బారాషహీద్ దర్గా రొట్టెల పండగ తొలిరోజు పోలీసు శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంది. దీంతో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్ల నిఘాతో దర్గా పరిసర ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ దర్గా పరిసర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన తాత్కాలిక కమాండ్ కంట్రోల్ రూంలో నుంచి 24 గంటలూ పర్యవేక్షించేలా ఆదేశాలు జారీ చేశారు. దర్గాలోని ప్రవేశ మార్గం, నిష్క్రమణ ప్రాంతాల్లో బారికేడింగ్, రొట్టెల మార్పిడి ప్రాంతాలను పోలీసులు సందర్శించారు. మూడు పీటీజెడ్ కెమెరాలు, 67 సీసీ కెమెరాలు, 10 డ్రోన్లు, నాలుగు రిపీటర్లు, నాలుగు స్టాటిక్ సెట్స్, 300 మాన్ ప్యాక్‌సెట్లతో నిఘా ఏర్పాటు చేశారు.

జేబు దొంగ పట్టివేత: దర్గా పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్న జేబు దొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి స్వాధీనం చేసుకున్న ఒక బ్యాగ్, మొబైల్, ఏటీఎం కార్డును సీసీఎస్ పోలీసులు బాధితుడికి అందజేశారు. తప్పిపోయిన 28 మంది చిన్నారులను తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. తొలి రోజు మూడు వేల వాహనాలను పార్కింగ్ చేయించగలిగారు.

భక్తుల సంతృప్తే ప్రధాన లక్ష్యం

దర్గాలో పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(కలెక్టరేట్): సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తుల సంతృప్తే లక్ష్యంగా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. ఆదివారం ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి దర్గా ప్రాంగణంలో పరిశీలించారు. పోలీసు కంట్రోల్ రూం, స్వర్ణాల చెరువు ఘాట్ పరిసరాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది కేటాయించిన ప్రాంతాల్లో విధులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. అన్ని శాఖల ఉన్నతాధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. క్యూలైన్ల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, త్వరితగతిన దర్శనం చేయించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సింధుప్రియ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రూ.1,275 కోట్లతో ప్రతి ఇంటికి తాగునీరు

కొలగట్ల ఎస్సీ కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

సంగం, న్యూస్‌టుడే: ఆత్మకూరు నియోజకవర్గంలో రూ.1275 కోట్లతో ప్రతి ఇంటికి తాగునీటి సదుపాయం కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొలగట్లలో పర్యటించారు. మంత్రి మాట్లాడుతూ నీటి సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. సోమశిల జలాశయం, సంగం బ్యారేజి ద్వారా నీటిని సేకరించి, శుద్ధి చేసి సరఫరా చేస్తామన్నారు. ఒక్కో మండలానికి రూ.15 కోట్ల వంతున నియోజకవర్గానికి రూ.90 కోట్ల మేర నిధులు మంజూరు చేయాలని కోరగా ఆయన సుముఖత వ్యక్తం చేశారన్నారు. సంగం బ్యారేజి నుంచి ముంబయి జాతీయ రహదారికి నేరుగా రోడ్డు నిర్మాణానికి రూ.76 కోట్ల వ్యయంతో ఆమోదం లభించిందని, త్వరలో టెండర్లు పిలుస్తారని చెప్పారు. తరతరాలుగా వరద పీడిత గ్రామంగా ఉన్న వీర్లగుడిపాడుకు బొగ్గేరు వాగు మీద రూ.25 కోట్ల వ్యయంతో వంతెన, నెల్లూరు ముంబయి జాతీయరహదారికి అనుసంధాన రహదారి నిర్మించేందుకు పరిశీలన, ప్రతిపాదనలు పూర్తయ్యాయని తెలిపారు. స్థానికులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీసీసీబీ అధ్యక్షుడు ధనుంజయరెడ్డి, నాయకులు గిరినాయుడు, రవీంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రాధాకృష్ణారెడ్డి తదితరులు హాజరయ్యారు.

తల్లిని కాపాడబోయి తనయుడి దుర్మరణం

పొదలకూరు, న్యూస్‌టుడే: వాషింగ్ మెషిన్‌లో ఉన్న దుస్తులను తల్లి తీగలపై ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై పెద్దగా కేకలు వేసింది.. తనయుడు గమనించి కాపాడబోయి మృత్యువాత పడటంతో స్థానికంగా విషాదం నెలకొంది... పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.... పొదలకూరు మండలం మరుపూరు ఎస్సీ కాలనీలో ఆదివారం ఉదయం తల్లి లక్ష్మమ్మ దుస్తులు వాషింగ్ మిషన్‌లో వేశారు. వాటిని తీగపై ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై పెద్దగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న కుమారుడు **వంశీ**(23) అప్రమత్తమయ్యారు. ఒక్కసారిగా తల్లిని నెట్టేశారు. ఆ తీగ తగిలి ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి పొదలకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మార్గమధ్యలోనే మృతిచెందినట్లు నిర్ధారించారు. తల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఇటీవల వివాహమవడంతో నెలల వయసు గల కుమారుడున్నారు. వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ ఎంతో అండగా ఉన్న యువకుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసునమోదు చేసి పంచనామా నిమిత్తం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై హనీఫ్ తెలిపారు.

పండగకు నిరంతర విద్యుత్తు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: నగరంలోని దర్గామిట్టలో బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగకు నిరంతర విద్యుత్తు అందించేలా ఆశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రాంగణంలో ప్రత్యేక సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించేలా అధికారులకు డ్యూటీలు వేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌టీ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీనారాయణ టీం దర్గాలోని ప్రతి షాపులో వైరింగ్‌ను తనిఖీ చేసింది. కార్యక్రమంలో నోడల్ అధికారి బాలచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ. 9,332
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 74,656
వెండి గ్రాము :	రూ. 114.10

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	107
రిటైల్	129
లేయర్	112
బ్రాయిలర్స్	186
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	213
లేయర్ మాంసం	190
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	125
లేయర్	112
బ్రాయిలర్స్	228
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	250
లేయర్ మాంసం	190

జూనోసిస్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి

పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న అధికారులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: జూనోసిస్ (సంక్రమణ) వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు పేర్కొన్నారు. జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని జిల్లా పశు వైద్య శాఖ కార్యాలయంలో పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ టీకా కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.రమేష్‌నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వి.సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ జేడీ మాట్లాడుతూ జిల్లాలో 50 వేల డోసుల యాంటీ రేబిస్ టీకాలను జిల్లాలోని అన్ని పశు వైద్యశాలల్లో అందుబాటులో ఉంచామన్నారు. డీఎంహెచ్‌వో సుజాత మాట్లాడుతూ పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ టి.సోమయ్య, అడిషనల్ డీఎంహెచ్‌వో ఎస్.కె.ఖాదర్‌వలి, డాక్టర్ జె.చైతన్యకిషోర్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం.. అపహరణకు యత్నం

న్యూస్‌టుడే, వెంకటాచలం

హౌసింగ్ కార్యాలయం వెనుక వినియోగించకుండా వదిలేసిన ట్రాక్టర్

పల్లెలను ఆదర్శంగా... స్వచ్ఛతగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో వెంకటాచలం మండలానికి ప్రభుత్వం ఆరు కొత్త ట్రాక్టర్లను మంజూరు చేసింది. మార్చి 24న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్వయంగా అందజేశారు. అయిదు ట్రాక్టర్లను పంచాయతీ అధికారులు తీసుకెళ్లారు. వెంకటాచలం పంచాయతీకి కేటాయించినది మాత్రం అధికారులు హౌసింగ్ కార్యాలయం వెనుక వైపు నిర్లక్ష్యంగా వదిలేశారు. నాలుగు నెలలుగా ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తుప్పు పడుతోంది. ఇటీవల రెండు సార్లు గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్‌లోని బ్యాటరీతో పాటు, ఇతర వస్తువులు అపహరించేందుకు యత్నించారు. అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. గతంలో ఈప్రాంతంలో ఉంచిన గృహోపకరణ వస్తువుల తయారీ పరికరాలు అపహరణకు గురయ్యాయి. జిల్లా అధికారులు స్పందించి ట్రాక్టర్‌ను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

10న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఈనెల పదో తేదీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించాలని కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. ఆదివారం నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 3,600 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. సుమారు 3.50 లక్షల మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

కామాక్షితాయి సేవలో జిల్లా న్యాయమూర్తి

ఆలయంలో కుటుంబ సభ్యులతో జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆదివారం ఈవో శ్రీనివాసులురెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

న్యూరో వైద్యుల ప్రదర్శన

ప్రదర్శన చేస్తున్న వైద్యులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నెల్లూరు న్యూరో క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి 32వ న్యూరోకాన్ సదస్సు సందర్భంగా ఆదివారం నగరంలో న్యూరో వైద్యులు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. వీఆర్సీ కూడలి నుంచి నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఈ ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ, నారాయణ హాస్పిటల్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ సంపత్‌కుమార్, న్యూరో సెన్సెస్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, అపోలో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించండి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: అగ్రిగోల్డ్ బాధితుల సమస్య వెంటనే పరిష్కరించాలని ఆ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు అన్నారు. ఆత్మకూరులో అగ్రిగోల్డ్ వినియోగదారులు, ఏజెంట్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దీనిపై 11 ఏళ్లుగా పోరాడుతున్నామని, పది లక్షల మంది కుటుంబాలకు రూ.906 కోట్లు అందజేసినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం ఈ సమస్యను ఎన్నికల ప్రణాళికలో పెట్టిందని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి అధికారులతో కమిటీలు వేసి సమస్యలు తెలుసుకుంటున్నారని చెప్పారు. సత్వర పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని చెప్పినందుకు ధన్యవాదాలు తెలిపారు. సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

EENADU eClassifieds

EDUCATION

LAST CHANCE: 10TH-INTER, DIRECT DEGREE (Discontinue), BA, B.Com., B.Sc., BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc., MBA, MCA, B.Ed., and Nursing Regular/Lateral Entry. Ph.No: ✆ 93812 87629.

COACHING CENTRES

A Well Known Coaching Center at B.V. Nagar Require Teachers for Hindi-1, Study Hour-1, Contact: 99599 22164, 99858 41390

FINANCIAL SERVICES

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలలోపు ఫైనాన్స్ చేయబడును. అన్ని తరగతుల వారు బ్యాంకులో స్థిరాస్తిపై లోన్ తీసుకున్న వారికి Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్‌లోన్ చేయబడును. ✆ 96665 47338.

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

REAL ESTATE

HOUSE FOR SALE

నెల్లూరు కల్లూరుపల్లి AP హౌసింగ్ బోర్డు కాలనీ నందు 16.66 అంకణాల స్థలంలో 733.60 sq.ft. గ్రౌండ్ ఫ్లోర్ + 733.60 sq.ft (1st ఫ్లోర్) అమ్మకమునకు కలదు. Rs. 45,00,000/- సంప్రదించండి. ✆ 98666 71279, 91500 38374

నెల్లూరు లేక్వ్యూ కాలనీ 13వ వీధి నందు 18 అంకణాలు & 30 అంకణాలు స్థలంలో పాత ఇల్లు (తూర్పు ఫేసింగ్)తో సహా అమ్మకమునకు కలదు. సంప్రదించండి. ✆ 94402 36236, 70369 58958

JOBS

శ్రీ బాలాజీ సర్వీసెస్ నెల్లూరు నందు పనిచేయుటకు అనుభవం గల కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Cont: ✆ 92814 44699, 92814 44701.

ప్రముఖ కంపెనీ తరపున పనిచేయుటకు బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. వయస్సు: 22-30 సం||లోపు. విద్యార్హత 10th/ ఏదైన డిగ్రీ. ✆ 79890 48868

Wanted Lectures for Degree College. Subjects : Computer Science, Accounts, Reasoning, Arithmetic. Salary 25000 to 35000 thousand. Contact No. 79934 99360

FREE JOBS: తిరుపతిలోని మా సంస్థ కొరకు, కంప్యూటర్ ఆపరేటర్లు, HR Recruiters, Counsellors, Tele Callers, BDMలు కావలెను. జీ: 15-35 వేలు. # ✆ 99906 78818.

లేడీ టెలికాలర్స్ కావలెను. ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ నందు జాబ్ చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. అర్హత : ఏదైనా డిగ్రీ, జీతం – ఇన్సెంటివ్స్ ✆ 91772 34987

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే వివరాలకు.. నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

గుడ్లూరు: ముందు వెళుతున్న పార్శిల్ లారీ ఒక్కసారిగా పక్కకు తిరగగా.. వెనుక నుంచి వచ్చిన ట్రక్కు వాహనం ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ఘటన గుడ్లూరు మండలంలోని తెట్టు వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఎస్సై వెంకట్రావు అందించిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా కలిదిండి మండలం మూలలంక గ్రామానికి చెందిన కేతా సాయి(24), తుట్టా నాగరాజు(19)లు చోదకుడు సాయినాథ్‌తో కలిసి ట్రక్కు వాహనంలో రొయ్యల లోడుతో చెన్నై బయల్దేరారు. ఈ క్రమంలోనే తెట్టు వద్ద ముందు వెళుతున్న పార్శిల్ లారీ ఒక్కసారిగా పక్కకు తిరగడంతో ట్రక్కు బలంగా ఢీకొట్టింది. సాయి, నాగరాజు అక్కడికక్కడే మృతిచెందారు. సాయినాథ్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాలను కందుకూరు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. లారీ చోదకుడు జయదీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన యువకుడు శవమై కనిపించాడు

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్పకు చెందిన ఇరగలదిన్నె నాని(21) శనివారం అదృశ్యం కాగా ఆదివారం అల్లూరు చెరువులో శవమై కనిపించారు. బిట్రగుంట పోలీసుల వివరాల మేరకు నాని.. శనివారం తన ఇంటి వద్ద ఉండగా అల్లిమడుగు సంఘానికి చెందిన సముద్రాల పృథ్వీరాజ్, మదన్, షేక్ సుల్తాన్, తమ్మిశెట్టి విశాల్ కారులో యువకుడి ఇంటికి వెళ్లారు. అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్ చూసిన వారు ఎక్కడిదని ప్రశ్నించారు. వేరే అనే అన్న ఇచ్చాడని చెప్పడంతో లాక్కుని వెళ్లిపోయారు. మరో గంట తర్వాత ఫోన్ ఇప్పిస్తామని చెప్పి కారులో ఎక్కించుకుని తీసుకువెళ్లారు. ఆదివారం ఉదయం వరకు రాకపోవడంతో యువకుడి తల్లి నలుగురి వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు చివరకూ అల్లూరు చెరువులో మృతదేహాన్ని గుర్తించారు. అగ్నిమాపకదళ సిబ్బంది, గజ ఈతగాళ్లు, యువకుల సాయంతో గుర్రపుడెక్కల అడుగున శరీరంపై దుస్తులు లేకుండా ఉన్న స్థితిలో మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కావలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బిట్రగుంట ఎస్సై నక్కా ప్రభాకర్ తెలిపారు.

వదిలేస్తారా.. పూర్తిచేస్తారా..?

న్యూస్‌టుడే, వెంకటాచలం

వర్షాకాలంలో నీటి నిల్వ చేసుకొని... భూగర్భ జలాలు అడుగంటకుండా.. వేసవిలో నీటిఎద్దడి లేకుండా చేసేందుకు ప్రభుత్వం పంట కుంటలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తోంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా వీటిని ఏర్పాటు చేస్తారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి పనులు కల్పిస్తూ వారితో తవ్వించాలి. పరిశ్రమల కేంద్రంలో ఇష్టారాజ్యంగా చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కలెక్టర్ ఆదేశాల మేరకు..

వెంకటాచలం మండలం గొలగమూడి రోడ్డు వద్ద జాతీయ రహదారి పక్కన 80 ఎకరాల్లో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పరిశ్రమల కేంద్రం ఏర్పాటు చేశారు. కనుపూరు కాలువకు రెండు వైపులా వందకుపైగా పలు రకాల పరిశ్రమలున్నాయి.. వేసవి కాలంలో ఇక్కడ నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటోంది. కాలువ ఉత్తరం వైపు చెరువు ఉండగా, దక్షిణం వైపు పరిశ్రమలకు నీటి లభ్యత తక్కువగా ఉంది. నీటి ఎద్దడి కొంత వరకైనా తీర్చాలని అధికారులు నిర్ణయించారు. సంబంధిత అధికారులు పరిశ్రమల కేంద్రంలో నీటి నిల్వ గుంతలు తవ్వించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన ఆయన ఉపాధి హామీ పథకంలో అవసరమైన మేర మేరకు ఏర్పాటు చేయాలని డ్వామా అధికారులకు సూచించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ఉపాధి హామీ అధికారులు... పరిశ్రమల శాఖ అధికారుల సూచనల మేరకు అయిదు గుంతలు తవ్వాలని నిర్ణయించారు.

అడుగులోతు కూడా లేని గుంత

అడుగు మేర తవ్వి...!

పరిశ్రమల శాఖ అధికారులు చెప్పిన చోట మూడు వారాల క్రితం కూలీలతో గుంతల తవ్వకాలు చేపట్టారు. కేవలం అడుగు మేర కూడా తవ్వకుండా వదిలేశారు. సుమారు రెండు మీటర్లు లోతు ఉండేలా(ఆరు అడుగులు పైగా) తవ్వాలి. ఒక గుంతకు రూ.2 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు చెల్లించనున్నారు. దీనిపై ఉపాధి హామీ సాంకేతిక సహాయకులు బాలకృష్ణ మాట్లాడుతూ... జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నీటి నిల్వ గుంతలు తవ్విస్తున్నామన్నారు. కూలీలు రెండు రోజులు పని చేశారని, తరువాత వర్షాలు రావడంతో నిలిపేశామని, త్వరలో పూర్తిస్థాయిలో చేస్తామని పేర్కొన్నారు.

రాజకీయాలకతీతంగా న్యాయవ్యవస్థ: ఆనం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: న్యాయవ్యవస్థ రాజకీయాలకతీతంగా ఉండాలని.. రాజకీయాల్లోని కుమ్ములాటలు, కొట్లాటలు న్యాయవ్యవస్థలో ఉండకూడదని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభిప్రాయపడ్డారు. రాజకీయ వ్యవస్థ కన్నా న్యాయవ్యవస్థ ఉన్నతమైనదని.. బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నూతనంగా ఎన్నికైన నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యులు నగరంలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాన్యులు ఇంకా న్యాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. తాను కూడా 1977లో లా పట్టా పొందినా రిజిస్టర్ చేసుకోలేదన్నారు. రాజ్యాంగ పీఠికలో సనాతన, హిందూ ధర్మం గురించి చర్చించారన్నారు. పరిస్థితుల దృష్ట్యా నేడు వాటి గురించి చర్చించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బార్ అసోసియేషన్ తరఫున ఎన్నికైన సభ్యులకు సన్మానం జరిగింది. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు అయ్యప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగరాజు, సంయుక్త కార్యదర్శి నారాయణ, లాయర్లు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కావలి

•కావలి • ఉదయగిరి • కందుకూరు

అక్కరకు రాని భవనం

నిరుపయోగంగా భవనం

న్యూస్‌టుడే, కలిగిరి

కృష్ణారెడ్డిపాలెంలో రూ.40లక్షలతో నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. నిబంధనలు విస్మరించి ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో సచివాలయ భవనాన్ని గత వైకాపా ప్రభుత్వంలో నిర్మించారు. కోర్టు జోక్యంతో తిరిగి పాఠశాలకు అప్పగించారు. నాలుగేళ్లు పూర్తయినా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ప్రజా ధనం వృథా అయిందని పలువురు విమర్శలు చేస్తున్నారు.

అధికారుల ప్రేక్షకపాత్ర

విద్యాలయాల ప్రాంగణాల్లో ఎలాంటి ఇతర నిర్మాణాలు చేపట్టకూడదనే మౌలిక సూత్రాన్ని పట్టించుకోకుండా సచివాలయాన్ని నిర్మించారు. అధికారులు అప్పట్లో ప్రేక్షక పాత్ర పోషించారు. నిర్మాణం పూర్తయి ప్రారంభ దశలో ఉండగా కోర్టు ఆదేశాలతో చివరకు పాఠశాలకే అధికారులు అప్పగించాల్సి వచ్చింది. సచివాలయ నమూనాతో నిర్మించిన భవనం పాఠశాలకు పెద్దగా ఉపయోగపడడం లేదు. పైగా ప్రాథమిక పాఠశాలలో పిల్లలు కేవలం 10 మందే ఉన్నారు. ఇప్పటికే అక్కడ 3 భవనాలు ఉన్నాయి. దాంతో ఇది వారికి అక్కరకు రాకుండా అయింది. మరోపక్క సచివాలయ పరిధిలో సుమారు 4వేలకు పైగా జనాభా ఉంది. ప్రస్తుతం పాత పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది అరకొర వసతులతో విధులు నిర్వహిస్తున్నారు. భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. పీఆర్ ఏఈ రవీంద్రను వివరణ కోరగా న్యాయస్థానం పరిధిలోని అంశమని, ఈ విషయం ఇప్పటికీ ఒక కొలిక్కి రాలేదన్నారు.

ఏళ్లు గడిచినా..మరమ్మతులు శూన్యం

జలదంకి, న్యూస్‌టుడే: మూడేళ్ల క్రితం నిర్మించిన బ్రాహ్మణక్రాక, బిట్రగుంట ర.భ శాఖ రోడ్డు.. కమ్మవారిపాలెం పేరపు నాయుడు చెరువు సమీపంలో రోడ్డు నిలువునా పగిలాయి. మార్జిన్‌కు గ్రావెల్ తోలి రివిట్‌మెంట్ పనులు చేయకపోవటంపై వాహన చోదకులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు తొమ్మిదోమైలు సెంటర్ నుంచి బిట్రగుంట మీదుగా నెల్లూరుకు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏ మాత్రం ఆదమరిచినా వాహనాలు వాగులో పడే ప్రమాదం తప్పదంటూ స్థానికులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ర.భ శాఖ ఏఈ అహ్మద్‌బాషా మాట్లాడుతూ కోతకు గురైన రోడ్డు పనులకు ప్రతిపాదనలు పంపి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఇన్‌ఛార్జి డీఆర్వోగా హుస్సేన్ సాహెబ్

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లా ఇన్‌ఛార్జి డీఆర్వోగా హుస్సేన్ సాహెబ్‌ను నియమిస్తూ కలెక్టర్ ఆనంద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈయన తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్‌గా పనిచేస్తుండగా.. అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ మేరకు ఉత్తర్వులు విడదలయ్యాయి.

తీరనున్న ట్రాఫిక్ ఇక్కట్లు

న్యూస్‌టుడే, కావలి

కావలి పట్టణంలో ట్రాఫిక్ ఇక్కట్లు తీరనున్నాయి. ఇటీవల పురపాలకం పరిధిలో బైపాస్ రహదారి మంజూరు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయడంతో ప్రధాన రోడ్లల్లో రద్దీ లేని ప్రయాణానికి అడుగులు పడతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త మార్గం ఇలా..?

సీతారామపురం- కావలి మార్గంలో వచ్చే వాహనాలు పట్టణంలోని బొట్లగుంట ప్రగతినగర్ వరకు కొనసాగుతాయి. అక్కడ బైపాస్ రోడ్డును నిర్మించి జాతీయ రహదారికి అనుసంధానం చేసేలా త్వరలో అధికారులు డీపీఆర్‌ను రూపొందించనున్నారు. వెంగళరావునగర్, తుపాన్‌నగర్, ఇందిరమ్మకాలనీ, జగనన్నలేఅవుట్, రైల్వేక్రాస్ మీదుగా నిర్మించనున్నారు. సుమారుగా పది కిలోమీటర్ల దూరంతో బైపాస్ ఉండొచ్చని అంచనాగా అధికారులు చెపుతున్నారు. త్వరలో భూసేకరణ ప్రక్రియ చేపట్టనున్నారు.

త్వరలో బైపాస్ నిర్మాణం

బొట్లగుంట నుంచి బైపాస్‌గా అభివృద్ధి చెందనున్న మార్గం ఇదే

నిత్యం అవస్థలే..

ఇప్పటి వరకు సీతారామపురం- కావలి మార్గంలో వస్తున్న వాహనాలన్నీ పట్టణంలోని బొట్లగుంట, జనతాపేట కూడలి మీదుగా ఉదయగిరి వంతెన నుంచి జాతీయ రహదారికి చేరుకుంటున్నాయి. ఈ క్రమంలో ఉదయగిరి వంతెన కూడలి వద్ద నిత్యం రద్దీ ఎక్కువగా ఉంటోంది. అక్కడ నుంచి కొన్ని వాహనాలు మాత్రమే తుమ్మలపెంట బస్టాండ్ కూడలి మీదుగా జాతీయ రహదారిపైకి వెళుతున్నాయి. ఒంగోలు దిశగా భారీ వాహనాలు సైతం చాలా సందర్భాల్లో ట్రంకురోడ్డు మీదుగానే వెళుతుండటంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. దీంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

కావలిలో వాహన సంచారం ఇలా..
కార్లు : సుమారుగా 3 వేలు
ఆటోలు : 1250, బైకులు : 18 వేలు
భారీ వాహనాలు: 150–200 వరకు

డీపీఆర్ రూపొందిస్తాం

బొర్రా నాగిరెడ్డి, డీఈఈ, జాతీయ రహదారుల సంస్థ, నెల్లూరు

కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రకటన వచ్చిన దృష్ట్యా త్వరలోనే డీపీఆర్ రూపొందిస్తాం. భారీ వాహనాలు నేరుగా జాతీయ రహదారికి చేరుతాయి. పట్టణ ప్రజల ట్రాఫిక్ ఇబ్బందులు తీరుతాయి. ఇంతేగాక, సీతారామపురం- కావలి మార్గంలో వచ్చే వాహనాలు తక్కువ వ్యవధితో నెల్లూరు వైపు చేరే వీలుంది.

ఆర్థికసాయం అందజేత

కావలి, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన పొన్నూరు మహాలక్ష్మమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆర్యవైశ్య నాయకులు ఆదివారం ఆర్థిక సాయం చేశారు. అమరావేదగిరిగుప్తా మిత్రులు రూ.30వేలు, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు తటవర్తి రమేష్ రూ.10వేలు అందజేశారు. నాయకులు పాదర్తి నాగరాజు, ఓరుగంటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: స్థానిక పాత రైల్వే రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదు.రాత్రిళ్లు ఇబ్బందిగా ఉంటోంది **- సలీంబాషా, ఉపాధ్యాయుడు**

సమాధానం: పరిశీలించి వెలిగించే ఏర్పాటు చేస్తాను. **- వీరయ్య, పంచాయతీ కార్యదర్శి, - న్యూస్‌టుడే, ఉలవపాడు**

? స్థానిక కమ్మపాలెం, యాదవబజారులో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. రాత్రి సమయంలో ట్యూషన్ నుంచి వచ్చే విద్యార్థులకు ఇబ్బందిగా ఉంది. **- ఎన్.అక్షయ పూర్ణిమ**

✓ పంచాయతీ సర్పంచితో చర్చించి వాటి నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వరరావు, ఎంపీడీవో**

? స్థానిక గాంధీ బొమ్మ ఎదురు వీధి దీపాలు వెలగడం లేదు. **- యు.మౌనిక, పదోతరగతి**

✓ రెండు రోజుల్లో వెలిగించేలా చర్యలు తీసుకుంటాను. **- నరేశ్, పంచాయతీ కార్యదర్శి, - న్యూస్‌టుడే, గుడ్లూరు**

? చెన్నూరులో రహదారుల పక్కన చెత్త వేస్తున్నారు. రాకపోకలు చేసేసమయంలో దుర్వాసన వెదజల్లుతోంది. **- వెంకటయ్య, చెన్నూరు**

✓ వెంటనే పరిశీలించి సిబ్బందికి తెలిపి చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- అక్బర్ బాషా, సచివాలయం కార్యదర్శి, - న్యూస్‌టుడే, దగదర్తి**

? కావలి పట్టణం బాపూజీనగర్ ఆశానికేతన్ కాలనీ ప్రాంతంలో వీధి లైట్లు వెలగడం లేదు. రాత్రి వేళల్లో అంధకారం అలుముకుంటుంది. **- రామనాథం**

✓ సిబ్బందికి తెలిపి ఆ ప్రాంతంలో వీధి దీపాలు తిరిగి వెలిగేలా చూస్తాం. **- శ్రావణ్‌కుమార్,కమిషనర్, పురపాలకసంఘం - న్యూస్‌టుడే, కావలి**

సాగునీటి కాలువ బాగుచేయరూ..!

చెంచిరెడ్డిపాలెం వద్ద ఉన్న రాళ్లపాడు సాగునీటి కాలువను చిల్లచెట్లు కమ్మేశాయి. రామానగర్ నుంచి చెంచిరెడ్డిపాలెం వరకు కి.మీ పొడవున్న కాలువకు రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ రోడ్డు పది అడుగులు వెడల్పు మాత్రమే ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కాలువలో పడిపోతున్నాయి. రహదారి అంచులను సరిచేసి రక్షణ గోడలు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. జలవనరుల శాఖ జేఈ మనోహర్ మాట్లాడుతూ పరిశీలించి నివేదిక అందజేస్తాన్నారు. **- న్యూస్‌టుడే, గుడ్లూరు**

అధ్వాన దారిలో ప్రయాణమెలా..?

కొత్తూరు నుంచి అనంతపురం-శిద్ధనకొండూరు ర.భ శాఖ ప్రధాన రహదారిని కలిపే రోడ్డు గుంతలమయంగా ఉంది. వాహనదారులు రాకపోకలు చేయాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు బాగుపడితే అయిదు పంచాయతీలకు తక్కువ సమయంలో వెళ్లవచ్చు. నిత్యం వందలాది వాహనాలు సాఫీగా ప్రయాణం చేసే అవకాశముంటుంది. ఇప్పటికైనా దీన్ని అభివృద్ధి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కలిగిరి**

నీటి వృథాకు అడ్డుకట్టేది

ఉదయగిరి- గండిపాళెం మార్గంలో సున్నంవారి చింతల వద్ద రోడ్డుపై పైపు లైను పగిలి నీరు వృథాగా ప్రవహిస్తుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్డంతా గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర సమస్యగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఉదయగిరి**

నాణ్యత లేని నిర్మాణమా

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లెలమూడి శివారులోని చెత్తసంపద కేంద్రం కేవలం గుత్తేదారులకు కాసులు కురిపించేందుకే అన్నట్లుగా ఉంది. ప్రస్తుతం గోడలు, తొట్టెలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. నిర్మాణాలు చేసే సమయంలో పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించటంతో నేడు ఈ పరిస్థితి నెలకొంది. ప్రజాధనం దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఏకలవ్య జయంతి

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలో ఏకలవ్య జయంతి వేడుకలను ఆదివారం బాలకృష్ణారెడ్డినగర్‌లో ఏపీ ఎరుకల, గిరిజనసంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి కల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు గుత్తికొండ కిశోర్, జ్యోతి బాబురావు, శ్రీహరినాయుడు, రమణమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా ఆక్రమణలు

కావలి మందాటి చెరువు నుంచి వెలుపలకు వచ్చే అలుగు వాగు కుచించుకుపోయేలా చేస్తున్న నిర్మాణం ఇది. చెరువు నిండినప్పుడు అదనపు జలాలు ఈ అలుగు ద్వారానే పాపిరెడ్డి గుంతకు చేరుతాయి. వరదలొచ్చినప్పుడల్లా అలుగు ప్రవాహం పక్కదారి పడుతోంది. ఈక్రమంలో మందాటి చెరువు నుంచి వచ్చే అదనపు నీరు ట్రంకురోడ్డుపైకి చేరుతోంది.

కావలి, న్యూస్‌టుడే

పట్టణంలో ఉండే సందులు, వాగులు, కాలువలు కబ్జా చేసేస్తున్నారు. మున్సిపల్ అధికారులకు మాత్రం పట్టడం లేదు. నిర్మాణాలకు ప్రణాళికా విభాగం అనుమతి తప్పనిసరి. కళ్లెదుటే కబ్జా చేస్తున్నా మున్సిపల్ యంత్రాంగం చోద్యం చూస్తోంది. అక్రమ కట్టడాలతో ప్రధాన వీధుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. పట్టణంలోని ట్రంకురోడ్డు సహా ఇతర ప్రధాన వీధుల్లో పార్కింగ్ వసతులు లేవు. రద్దీ వేళల్లో వాణిజ్య ప్రాంతాల్లో టాఫిక్ సమస్య జటిలంగా మారుతోంది. దుకాణదారులు, వాహనదారులకు మధ్య వివాదం.. ఆపై పోలీసు కేసుల వరకు కూడా వెళుతున్నా, మున్సిపల్ స్పందన కరవే. అధికారులు స్పందించి ఆక్రమణలు అడ్డుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

● ఈ విషయమై కావలి పట్టణ ప్రణాళికాధికారి వివేక్ స్పందిస్తూ ఎవరైనా మార్గదర్శకాల ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

భక్తిశ్రద్ధలతో షహదత్

సీతారామపురంలో సలాం అందుకుంటున్న పీర్లు

సీతారామపురం, న్యూస్‌టుడే: సీతారామపురంలో పెద్దసరిగెత్తులో భాగంగా ఆదివారం తెల్లవారుజామున సీతారామపురం, ఎగువపాళెంపీర్లు ఓవైపు, నారాయణప్పపేట, తురకపాళెం పీర్లు మరోవైపు ఉండి సలాం అందుకునే కార్యక్రమం నిర్వహించారు. పీర్లను ఊరేగించారు. పెద్దసంఖ్యలో హాజరైన ప్రజలతో ప్రధానవీధి జనసంద్రమైంది. **ఉదయగిరి:** పట్టణంలోని ఆస్థాన ఖాదరియా, అబ్దుల్ ఖాదర్‌ఖాన్ దర్గాలో ఆదివారం యౌమె ఆషురా కార్యక్రమాన్ని నిర్వహించారు. అఖిల భారత సూఫీ సజ్జదా నషీన్ కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అహ్మద్‌బాషా ఖాలిది, మైనార్టీ నాయకుడు రియాజ్, ఖాదరియా తదితరులు పాల్గొన్నారు. **దుత్తలూరు:** లక్ష్మీపురం, కమ్మవారిపాలెం, నందిపాడుల్లో మొహర్రం ప్రార్థనలు చేశారు. పీర్ల ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

ఘనంగా తొలి ఏకాదశి

సీతారామపురం, బిట్రగుంట, కావలి, గుడ్లూరు, దుత్తలూరు, ఉదయగిరి న్యూస్‌టుడే: తొలిఏకాదశి సందర్భంగా ఆదివారం ఘటికసిద్ధేశ్వరంలో ఇష్టకామేశ్వరీదేవి అమ్మవారిని, పరమశివుడుని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిలకూటక్షేత్రం కొండబిట్రగుంట ప్రసన్నవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి సహస్ర బిల్వపత్రార్చన శాస్త్రోక్తంగా జరిగింది. కావలి పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. రైల్వే రోడ్డు గీతామందిరంలో మహిళలు సామూహిక అర్చనలు చేపట్టారు. ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ● గుడ్లూరులోని వేణుగోపాలస్వామి, తెట్టు లక్ష్మీనరసింహస్వామి, రాజమాత బండ్లమాంబ ఆశ్రమంలో వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు విశేషపూజల్లో పాల్గొన్నారు. నర్రవాడలోని వెంగమాంబ అమ్మవారి దేవస్థానంతోపాటు జనార్దన స్వామి ఆలయంలో తొలిఏకాదశి వేడుకలు జరిగాయి. ● ఉదయగిరి మండలంలో గండిపాళెం, ఉదయగిరి, ఎర్రపల్లిగడ్డ, అప్పసముద్రం, గుడినరవ, లింగాలదొన ఆలయాల్లో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు.

బిట్రగుంట: ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

గుడ్లూరు: పుష్పాలంకరణలో వేణుగోపాలస్వామి

పేదల సంక్షేమమే ధ్యేయం

గుడ్లూరు: కరపత్రాలు అందజేస్తున్న కూటమి నాయకులు..తిరుమలాపురంలో

గుడ్లూరు, జలదంకి, బిట్రగుంట, ఉదయగిరి, న్యూస్‌టుడే: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మండల తెదేపా బాధ్యుడు జనిగర్ల నాగరాజు అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఆదివారం చెమిడిదిపాడులో నిర్వహించారు. ఇంటింటికి తిరిగి పథకాల కరపత్రాలను అందజేశారు. నాయకులు వెంకట్రావు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. బోగోలులో మండల తెదేపా అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి చిలకపాటి వెంకటేశ్వర్లు ప్రజలకు కరపత్రాలు పంచారు. రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి సుపరిపాలన వైపు మళ్లించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే సాధ్యమైందని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు పి.మధు మోహన్‌రెడ్డి అన్నారు. జలదంకి, నెహ్రూనగర్ గిరిజన కాలనీలో ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఉదయగిరి తెదేపా మండల కన్వీనరు చింతనబోయిన బయ్యన్న ఆధ్వర్యంలో తిరుమలాపురం పంచాయతీ ఎస్టీ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.

బాకీ విషయమై ఘర్షణ

సీతారామపురం, న్యూస్‌టుడే: బాకీ నగదు విషయమై ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకోగా గాయాలపాలైన సంఘటన పబ్బులేటిపల్లిలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హుస్సేనయ్యకు తన బంధువైన రామస్వామి మధ్యవర్తిగా ఉండి రూ.20వేలు నగదు ఇప్పించారు. ఈ విషయమై రామస్వామి ఆదివారం నగదు చెల్లించాలని అడిగారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం తలెత్తింది. పరస్పరం దాడులు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకృష్ణారెడ్డి తెలిపారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతో మేలు

శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కావలి, న్యూస్‌టుడే: క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించడం ఎంతో సముచితమని నిర్ధారణ పరీక్షలతో ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి అన్నారు. మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని కావలి ఐఎంఏ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రెడ్‌క్రాస్‌భవన్‌లో ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి ప్రారంభించారు.

గోదాములేక ఇబ్బందులు

అల్లూరు, న్యూస్‌టుడే: అల్లూరు మండలంలో బట్రకాగొల్లు ప్రాంతంలో ధాన్యం నిల్వ ఉంచుకునేందుకు గోదాముల వసతులు లేకపోవటంతో పాత విధానాన్ని ఈ ప్రాంత రైతులు వినియోగిస్తున్నారు. గడ్డితో తయారు చేసిన వాటిల్లో నిల్వ ఉంచుతున్నారు. అధిక వర్షాల సమయంలో పూర్తి స్థాయి రక్షణ లేకపోయినా ఇలానే వినియోగించాల్సి వస్తుంది. అల్లూరు ప్రాంతానికి ధాన్యం తీసుకువచ్చేందుకు రవాణా వ్యయం ఎక్కువ అవుతుంది. ఈ ప్రాంతంలో వరిసాగు సుమారు వెయ్యి ఎకరాల్లో సాగవుతుంది. కొంత మంది రైతులు పచ్చిధాన్యం అమ్మకాలు చేస్తుండగా, కొంత మంది నిల్వ ఉంచుతున్నారు. ధరలు అనుకూలంగా ఉన్న సమయంలో అమ్మకాలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో గోదాములు నిర్మాణాలు చేస్తే అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

నిల్వ ఉంచిన ధాన్యం

లోతుగా విచారిస్తే అక్రమాలు వెలుగులోకి..

గుడ్లూరు, న్యూస్‌టుడే: గుడ్లూరులో శనివారం నకిలీ మద్యం తయారీ కేంద్రం గుర్తించడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. ప్రధానవీధిలోని గ్రంథాలయం సమీపంలో ఓ గృహంలో నకిలీ మద్యం తయారీ కేంద్రాన్ని నిర్వహించడం చర్చనీయాంశమైంది. చుట్టు పక్కల గృహాల వారికి అనుమానం రాకుండా తయారు చేసే పదార్థాలు, సీసాలు, స్పిరిట్, నిల్వచేసి మద్యం తయారు చేస్తుండటంతో భయభ్రాంతులకు గురయ్యారు. మద్యం తయారీ ఆలోచన ఎలా వచ్చింది. ఇందుకు ఎవరు ప్రేరేపించారనేది విచారణ చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటివరకు తయారు చేసిన మద్యం స్థానికంగా విక్రయించారా అనేది తేలాల్సి ఉంది. మద్యం ఎక్కడకు సరఫరా చేశారు. ఎంతమేరకు నగదు చెల్లింపులు జరిగాయనేది తెలియక పోవడంతో పెద్ద మొత్తంలో మద్యం తయారీ జరిగి ఉంటుందనేది స్థానికుల అభిప్రాయం.

సూత్రధారులను గుర్తించాలి

మద్యం తయారీలో పట్టుబడిన వ్యక్తి స్థానికంగా ఎపుడో ఒకసారి వచ్చి పోతుంటాడు. గుడ్లూరు వచ్చినపుడు ఇంత పెద్దమొత్తంలో మద్యం తయారీ చేసేందుకు అవకాశం లేదు. అతనికి సహకరిస్తున్న వారు ఎవరనేది ఎక్సైజ్ పోలీసులు గుర్తించాలి. అలాగే ఎస్టీ కాలనీలో ఖాళీ సీసాలు నిల్వ చేసి ఉంచిన గృహం వారికి కూడా తయారీ గురించి తెలిసి ఉంటుంది. వారిని కూడా విచారించాల్సిన అవసరం ఉంది. పోలీసులు ఆ దిశగా ప్రయత్నించినట్లు లేదు. గ్రామాల్లో చిన్నపాటి తగాదాలు, కొట్లాటలు జరిగినా తెలుసుకునే ఇంటెలిజెన్సు వ్యవస్థ.. నకిలీ మద్యం తయారుచేస్తున్నా గుర్తించలేక పోవడం గమనార్హం.

నకిలీ మద్యం తయారీకి సహకరించింది ఎవరు?

తనిఖీలు లేకనే

మద్యం దుకాణాల నుంచి ఎంత మొత్తం విక్రయాలు జరుగుతున్నాయి... ఎక్కడకు మద్యం సరఫరా అవుతుందనే విషయాలను ఎప్పటికప్పుడు ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేస్తుండాలి. దీనికి తోడు నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో రెండు నుంచి అయిదు వరకు మద్యం గొలుసు దుకాణాలున్నాయి. వాటిలో అమ్మకం చేసే సీసాలను పరిశీలించినా నకిలీ మద్యం తయారీ గుర్తించే అవకాశం ఉంది. అయినా వారు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి.

సరఫరాలో అంతరాయాలు.. తప్పని తిప్పలు

న్యూస్‌టుడే, బిట్రగుంట

విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియంత్రికలు తరచూ కాలిపోతున్నాయని, పంటకు నీరందని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోగోలు, విశ్వనాథరావుపేట పెద్ద పంచాయతీల్లో పెరిగిన విద్యుత్తు అవసరాలకు తగ్గట్టు అదనంగా నియంత్రికల ఏర్పాటు, పాత స్తంభాలు, తీగల మార్పు చేయకపోవడంతో సమస్యలు జటిలమయ్యాయి. విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలో మరమ్మతులకు గురైన నియంత్రిక స్థానంలో కొత్తది ఏర్పాటు చేసినా గంటల వ్యవధిలోనే కాలిపోయింది.

ఇలా చేస్తేనే..

చిన్న సమస్య తలెత్తినా 25వేల మంది జనాభా ఉన్న పెద్ద పంచాయతీలకు విద్యుత్తు సరఫరా నిలిపివేసి పరిష్కరించాల్సిన పరిస్థితి నెలకొంది. చెంచులక్ష్మీపురంలోని విద్యుత్తు ఉపకేంద్రంలో అదనంగా నియంత్రికను ఏర్పాటు చేస్తే అక్కడి నుంచి ప్రాంతాల వారీగా వినియోగానికి తగ్గట్టుగా మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉంచి మెరుగైన విద్యుత్తు అందించాల్సి ఉంది. అవసరమైన చోట మరమ్మతులు చేసుకోవడానికి తగ్గట్టుగా ఏబీ స్విచ్ఛ్‌లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏఈ జడరాయ స్పందిస్తూ మెరుగైన విద్యుత్తు అందించాలని ఉన్నతాధికారుల సూచనతో కార్యాచరణ చేపట్టాం. కొద్ది రోజుల్లో సమస్యలు తొలిగి పోనున్నాయి.

ఉపకేంద్రాన్ని ముట్టడించిన రైతులు

ఉలవపాడు: సక్రమంగా విద్యుత్తు సరఫరా చేయడంలేదంటూ మండలంలోని అలగాయపాలెం ఉపకేంద్రాన్ని ఆదివారం రైతులు ముట్టడించారు. రెండు రోజులుగా ఈదురు గాలుల సాకుతో టెంకాయచెట్లపాలెం ఫీడరులో విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నారని తుంపర సేద్యం ద్వారా పైర్లకు నీరు పెట్టడం సాధ్యం కావడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి పగలు తొమ్మిది గంటల పాటు విద్యుత్తును అందించాల్సి ఉండగా.. దాదాపుగా మూడు నుంచి గంటలపాటు నిలిచిపోతోందని వాపోతున్నారు. ఈ ఫీడరు పరిధిలో సుమారు రెండు వందల ఎకరాలకు పైగా వేరుసెనగ వేశామని సరఫరాలో అంతరాయంతో పైరు వాడుముఖం పడుతోందని దిగుబడులు తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. ఉపకేంద్రం వద్ద సిబ్బంది తప్ప అధికారులు ఎవరూ లేకపోవడంతో చేసేదిలేక వెనుదిరిగారు. గాలల తీవ్రత అధికంగా ఉండడం వల్ల సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సాయంత్రం ఒక గంటపాటు సరఫరా చేస్తున్నామని డీఈఈ యుంగధర్ తెలిపారు.

(c) eenadu

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య : మర్రిపాడు మండలం అల్లంపాడులో నిర్మించిన చెత్త సంపద సృష్టి కేంద్రం నిరుపయోగంగా ఉంది. **- బాషా, స్థానికుడు.**

సమాధానం : వినియోగంలోకి తెస్తాం. **- ప్రియాంక, పంచాయతీ కార్యదర్శి**

? మర్రిపాడు మండలం పొంగూరు కండ్రికలో కాలువలు లేక ఇళ్లలోని నీరు వీధుల్లోకి చేరుతోంది. **- వెంకటేశ్, స్థానికుడు**

✓ కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం. **- భరత్, పంచాయతీ కార్యదర్శి**

? సంగంలో దువ్వూరు కాలువ(బండారుమిట్ట) వంతెన రక్షణగోడ దెబ్బతింది. **- పృథ్వి, స్థానికుడు**

✓ పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. **-వినయ్‌కుమార్, జలవనరుల శాఖ ఏఈ**

? అనంతసాగరం ఎస్సీ కాలనీ వద్ద రోడ్డు పక్కనే వ్యర్థాలు వేస్తున్నారు. వర్షమొస్తే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. **- స్థానికులు**

✓ వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపడతాం. **- రమణరావు, పంచాయతీ కార్యదర్శి**

? బుచ్చి ఒకటో వార్డు మూడో వీధిలో కాలువలో పూడిక తీయడం లేదు. **- అభిషేక్**

✓ చర్యలు తీసుకుంటాం. **- బాలకృష్ణ, కమిషనర్**

? కొడవలూరు మండలం ఎన్టీఆర్ నగర్‌లో మురుగు కాలువలో సక్రమంగా లేక దుర్వాసన వస్తోంది. **- శీను, స్థానికులు**

✓ చర్యలు తీసుకుంటాం. **- సుబ్బారావు, ఎంపీడీవో**

? పొదలకూరు రూరల్ పరిధిలోని పలు కాలనీల్లో కోతుల బెడద అధికంగా ఉంది. **- స్థానికులు**

✓ చర్యలు తీసుకుంటాం. **- నరసింహారావు, ఎంపీడీవో**

? మనుబోలు మండలంలోని కాగితాలపూరులో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కాలువల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. **- వెంకటేశ్వర్లు, స్థానికుడు**

✓ శుభ్రం చేయిస్తాం. **- నారాయణ, డిప్యూటీ ఎంపీడీవో**

? విడవలూరు మండలం వరిణి గ్రామానికి విద్యుత్తు శాఖ లైన్‌మ్యాన్ లేక ఇబ్బందులు పడుతున్నాం. **- గ్రామస్థులు**

✓ సమస్య పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం. **- శ్రీనివాసులు, డిస్కం ఏఈ**

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: ఇందుకూరు పేట మండలం పల్లిపాడులోని పినాకిని గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు చేశారు. భయన చిరంజీవి గాంధీ విగ్రహానికి నూలుమాల, ఖాదీ వస్త్రాలు సమర్పించారు. పొనకా కనకమ్మ విగ్రహానికి ఆశ్రమ కమిటీ సభ్యురాలు మంజుల పట్టు వస్త్రాలు, నూలుమాల సమర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగవరపమ్మ ఆలయంలో మంత్రి ఆనం పూజలు

సంగం : కొలగట్లలో పెన్నానది తీరంలో నాగవరపమ్మ ఆలయాన్ని ఆదివారం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దర్శించారు. ఆలయ మర్యాదలతో నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పీ-4 పథకంలో భాగంగా జంగాలకండ్రికకు చెందిన విజయచంద్ర కొలగట్లలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక, తరుణవాయి జడ్పీ ఉన్నత పాఠశాలలకు ప్యాన్లు, తాగునీటి పథకం, విద్యాబోధన సామగ్రిని మంత్రి ద్వారా అందించారు. తహసీల్దారు సోమ్లానాయక్, ఎంపీడీవో షాలెట్, ఎంఈవో మల్లయ్య, నాయకులు హాజరయ్యారు.

ఇద్దరి అదృశ్యంపై ఫిర్యాదు

రాపూరు : మండల పరిధిలోని గిరిమెనపెంటకు చెందిన ఒక యువతి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. సిద్దవరం గ్రామానికి చెందిన మరో యువతి కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కాజ్‌వే నిర్మాణంతో తొలగనున్న కష్టాలు

న్యూస్‌టుడే, విడవలూరు

విడవలూరు మండలం ఊటుకూరు పల్లిపాలెం వద్ద చింతపంటి ఏరు ప్రతి ఏడాది వర్షాలకు, వరదలకు దెబ్బతిని ముంపునకు గురై రాకపోకలు నిలిచిపోయి అవస్థలు పడుతున్నారు. మూడేళ్ల క్రితం వచ్చిన వరదలకు కొట్టుకుపోయి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గత ప్రభుత్వం తాత్కాలికంగా తూములు వేసి మమ అనిపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లోని రోడ్లతోపాటు వంతెనల నిర్మాణానికి, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ❖ ఊటుకూరు పల్లిపాలెం వద్ద చింతపండు ఏరుపై కాజ్‌వే నిర్మాణానికి

పల్లిపాలెంలో గత ప్రభుత్వంలో నిర్మించిన తాత్కాలిక వంతెన

జిల్లా కలెక్టర్ కోటి రూపాయలు మంజూరు చేశారు. ఊటుకూరు నుంచి పల్లిపాలెం, విడవలూరు- తుమ్మగుంట రోడ్డు నిర్మాణాలకు రూ.3.5 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ❖ విడవలూరులో మలిదేవి వాగుపై వంతెన శిథిలావస్థకు చేరడంతో నాబార్డు నిధులు రూ.6 కోట్ల అంచనా వ్యయంతో విడవలూరు మలిదేవి వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు.

❖ ర.భ ఏఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ... ఊటుకూరు పల్లిపాలెం వద్ద కాజ్‌వే నిర్మాణం, రోడ్డు పనులు త్వరలో చేపడతామన్నారు. మలిదేవి వాగుపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, ఇప్పటికే అన్నారెడ్డిపాలెం-వరిణి, ఇనమడుగు నుంచి ముదివర్తి మీదుగా ఊటుకూరు క్రాస్ రోడ్డు వరకు రోడ్లు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

ప్రజల సమస్యలు నేరుగా తెలియజేయండి

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో జరుగుతోందని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. రేబాలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాశాఖామంత్రి నారా లోకేశ్‌బాబు సారథ్యంలో ప్రభుత్వ పాఠశాలలు బాగుపడ్డాయన్నారు. కోవూరు నియోజకవర్గంలో అభివృద్ధి కోసం సీఎస్సార్ నిధులను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, గ్రామాల్లో ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేయాలని కోరారు. నాయకులు గోవర్ధన్‌రెడ్డి, జగదీశ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ఏఎస్‌పేటలో భక్తులకు అన్నదానం

అనుమసముద్రంపేట : రొట్టెల పండగ సందర్భంగా ఏఎస్‌పేట దర్గాకు ఆటోలు, ఇతర వాహనాల్లో వస్తున్న వారంతా జాగ్రత్తలు పాటించాలని ఎంవీఐ రాములు చెప్పారు. ఏఎస్‌పేటలో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. అనంతరం నగారాఖానా వద్ద ఆటో డ్రైవరు, యూనియన్ నాయకులతో మాట్లాడారు. భక్తులను ఆటోల్లో పరిమితికి మించి ఎక్కించుకోవద్దని, వెనుక డోర్ తీయొద్దని సూచించారు. అధిక ఛార్జీలు వసూలు చేయొద్దని కోరారు. ఏఎస్‌పేట క్రాస్‌రోడ్డు వద్ద ఆటోలను జాగ్రత్తగా నడపాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

▼ ఏఎస్‌పేటలో పేదలకు, యాత్రికులకు అన్నదానం నిర్వహించారు. రాగిచెట్టు సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో అన్నదానంతో పాటు పానకం పంపిణీ చేశారు.

9న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

తోటపల్లిగూడూరు, మనుబోలు, న్యూస్‌టుడే: ఆటో డ్రైవర్ల మెడకు ఉరితాడు బిగించి, రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే మోటారు వాహన చట్టం రద్దు చేయాలని ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మారుబోయిన రాజా డిమాండ్ చేశారు. ఆదివారం పిడూరు, మనుబోలు, కాగితాలపూరు గ్రామాల్లో సమ్మె కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జులై 9న దేశవ్యాప్త సమ్మెలో ఆటో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, వాహన కొనుగోలుకు బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తలారి దేవదానం, ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

కసుమూరుకు పోటెత్తిన జనం

వెంకటాచలం, న్యూస్‌టుడే: నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండగకు హాజరైన భక్తులు, యాత్రికులు మండలంలోని కసుమూరు మస్తాన్‌వలి దర్గాకు ఆదివారం అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వెంకటాచలం-కసుమూరు మార్గంలో వాహనాలు బారులు తీరాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తుల సౌకర్యార్థం నెల్లూరు నుంచి కసుమూరుకు ప్రత్యేక బస్సులు నడిపారు. దర్గా ప్రాంగణంతోపాటు, చందన్‌మహల్ వద్ద, చెరువు కట్టపై సేదతీరారు. అయితే చెరువు కట్టపై షెడ్లను స్థానికులు ఆక్రమించి దుకాణాలు నిర్వహిస్తుండటంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.

GENERAL NOTICE

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా Client అయిన SPSR Nellore జిల్లా, కోవూరు మండలం, చిన్నపగుడుపాడు కాపురస్తురాలైన **కత్తి ప్రశాంతి W/o ఆవుల వెంకట రాజేష్** గారు, SPSR నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీ, అలిచర్ల బంగారుపాళెం గ్రామం కాపురస్తురాలైన **వాయిలి వెంకటేశ్వర్లు** గారి భార్య **వాయిలి పల్లవి** గారి వద్ద నుండి ఈ క్రింది షెడ్యూలు దాఖలు ఆస్తిని కొనుగోలుచేయుటకు నిర్ణయించుకున్నారు. సదరు షెడ్యూల్ దాఖలు **ఆస్తి నిర్మల నారాయణశెట్టి** గారు 22-06-2011 తేదీన **వల్లెపు మునిచంద్ర** గారి దగ్గర రిజిష్టర్ విక్రయ పత్రం ద్వారా Document No: 1585/2011 of SRO Kovur ద్వారా కొనుగోలు చేసి 11-11-2024 తేదీన సదరు **వాయిలి పల్లవి** గారికి రిజిష్టర్ సెటిల్‌మెంట్ పత్రం ద్వారా చెందచేసినారు. ఇప్పుడు **వాయిలి పల్లవిగారు** చెప్పడంలో 22-06-2011 తేదీన **నిర్మల నారాయణశెట్టి** గారు కొనుగోలు చేసిన రిజిష్టరు విక్రయ పత్రం కనబడుటలేదని తెలియజేసినారు. కావున దీనిమీద ఎవరికైనను అభ్యంతరములు ఉన్నయెడల ఈ క్రింది అడ్రస్సుదారుకు లిఖిత పూర్వకముగా ఈ దినము నుండి 10 రోజుల లోపు తెలియజేయవలెను. లేనియెడల ఎవ్వరికినీ ఎటువంటి అభ్యంతరములు లేవని నా Client **వాయిలి పల్లవి** గారి దగ్గర నుండి రిజిష్టరు విక్రయపత్రం పొందుతారు. తరువాత వచ్చు ఏ అభ్యంతరములైననూ నా Clientను బద్ధగించవు.

ఆస్తి షెడ్యూలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు రి॥డి॥ ఇలాకా కోవూరు స॥రి॥లో చేరిన కోవూరు మండలం, పడుగుపాడు గ్రామ పంచాయితీ, పడుగుపాడు గ్రామం ఎల్.పి.నెం.13రు లోకి రాబడిన సర్వే నెం. 13/3రు లోని అనగా 1వ వార్డు ఆర్.యఫ్.రోడ్డుకు దక్షిణపు శ్రేణిలో గల బండారుమాన్యం అను ప్రదేశములో డోర్ నెం. 1-1/106రు పాత అసెస్మెంట్ నెం. 249, ప్రస్తుత అసెస్మెంట్ నెం. 263ర్లు గాగల స్లాబు ఇల్లు, స్థలమునకు **హద్దులు:- తూర్పు:** సారాయి రమణయ్య గారి ఇల్లు, **దక్షిణం:** సుబ్బారావు గారి ఇల్లు, **పడమర:** గుంజి మస్తానమ్మ గారి ఇల్లు, **ఉత్తరం:** రోడ్డు. ఈ హద్దులలోని 10 అంకణములు లేక 80 చ.గ. లేక 66.90 చ.మీ. స్థలమున్నూ ఇందులో కట్టియున్న 34'9''X18'6"=642.87 చ.అ.స్లాబు ఇల్లున్నూ, ఈ ఇంటికి అమర్చియున్న తలుపులు, ద్వారబందరములు, కిటికీలు, అలమరలు యావత్తు పై కప్పు సామగ్రి కరెంటు సర్వీసు నెం.3221302000644రు, ఎలక్ట్రికల్ ఫిట్టింగులు, పంచాయితీ కుళాయి వగైరాలతో సహా, ఈ ఆస్తికి సంబంధించిన మామూలు రాకపోకలు వగైరా యావత్తు ఈజ్‌మెంట్ హక్కులతో సహా.

P.Sunil Kumar, B.L., I.R.P.M., Advocate, Kovur. **Cell: 98853 20582**

పత్రికా ప్రకటన

నా కక్షిదారుడు అయినటువంటి భోగ్యం వెంకటేశ్వర్లు S/o. లక్ష్మయ్య, రాజుపాళెం గ్రామం, మర్రిపాడు మండలం, SPSR నెల్లూరు జిల్లా వారి తరపున తెలియజేయడమేమనగా, ఈ క్రింద చూపిన షెడ్యూలు ఆస్తికి, నా కక్షిదారుడు యజమాని అయి ఉండి, షెడ్యూలు ఆస్తి మొత్తాన్ని అనుభవించుకొనుచున్నాడు. ఇలా ఉండగా నా కక్షిదారుడు నెం.1 షెడ్యూలు ఆస్తిని అనుభవించటంలో కొండూరు వేమయ్య మరియు అతని అనుచరులు ఆటంకం కల్గించగా, నా కక్షిదారుడు గౌరవ ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో పైన తెల్పిన వారిపై O.S.No. 93/2024 అను దావా వేసి ఇంజక్షను ఆర్డరు కోరియున్నారు. ప్రస్తుతం ఆ కేసు కోర్టులో పెండింగ్‌లో ఉన్నది. అలాగే, నెం.2 షెడ్యూలు ఆస్తిని అనుభవించుటలో కొండూరు రాధాకృష్ణ మరియు కొంతమంది ఆటంకం కల్గించగా, నా కక్షిదారుడు గౌరవ ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో పైన తెల్పిన రాధాకృష్ణ మరియు కొంతమందిపై O.S. No. 36/2025 అను దావా వేసి ఇంజక్షను ఆర్డరు కోరియున్నారు. మరియు ఆ కేసు పెండింగులో ఉన్నది. ఇలా వుండగా నా కక్షిదారునికి తెలియడంలో, కోర్టులో కేసులు పెండింగులో ఉన్న విషయాన్ని మభ్యపెట్టి నా కక్షిదారుని ప్రత్యర్థులు క్రింద చూపిన షెడ్యూలు ఆస్తికి సంబంధించి రెవెన్యూ రికార్డులు మార్చివేయుటకు ప్రయత్నించుచున్నారు అని, అంతేగాక షెడ్యూలు ఆస్తి తమదిగా చెప్పుకొని అన్యాక్రాంతము చేయుటకు ప్రయత్నించు చున్నారని తెలిసినది. నెం.2 షెడ్యూలు ఆస్తి నందు నా కక్షిదారుడు ఫెన్సింగ్ వేసి నిమ్మ మొక్కలను కూడ నాటి ఉన్నాడు. కాని ప్రత్యర్థులు మొక్కలు వారివే అని చెప్పి అన్యాక్రాంతము చేయుటకు ప్రయత్నించుచున్నారని తెలిసినది. కావున షెడ్యూలు ఆస్తి మొత్తమునకు నా కక్షిదారుడు భోగ్యం వెంకటేశ్వర్లు మాత్రమే హక్కుదారుడు మరియు అనుభవదారుడు. కావున ఇతరులు ఎవరికి కూడా క్రింద చూపిన షెడ్యూలు ఆస్తి నందు హక్కు మరియు అనుభవం లేదు. నా కక్షిదారునికి తెలియకుండా షెడ్యూలు ఆస్తిపై ఎటువంటి లావాదేవీలు జరిపినను అవి నా కక్షిదారునిపై బద్ధగించవు. మరియు నా కక్షిదారుడు తీసుకొను చట్టరీత్యా చర్యలకు వారు బాధ్యులవుతారు.

షెడ్యూలు

SPSR నెల్లూరు జిల్లా రిజిష్టరు - ఉదయగిరి సబ్ రిజిష్టరు - మర్రిపాడు మండలం - చుంచులూరు గ్రామం.

Item No-1: సర్వే నెంబరు 466, 3.00 ఎకరాల విస్తీర్ణం గల మెట్ట భూమికి హద్దులు. **తూర్పు:** చెరువు అలుగు, **దక్షిణం:** నెల్లూరు - ముంబయి రోడ్డు, **పడమర:** కొండూరు నాగరాజు భూమి, **ఉత్తరం:** చెరువుకట్ట.

Item No-2: సర్వే నెంబరు 465-3, 4.00 ఎకరాల విస్తీర్ణం గల మెట్ట భూమికి హద్దులు. **తూర్పు:** కొండూరు నాగరాజు భూమి, **దక్షిణం:** నెల్లూరు - ముంబయి రోడ్డు, **పడమర:** ఆదిమూల శ్రీనివాసులు భూమి, **ఉత్తరం:** PWD కాలువ.

ఇట్లు: **షేక్ సుభాన్‌బాష,** న్యాయవాది, ఉదయగిరి

వేగ నిరోధకాలు..ప్రమాద కారకాలు

పొదలకూరులోని ప్రతి వీధిలో వేగ నిరోధకాలు ప్రమాదాలకు సూచికగా మారాయి. శ్రీనివాసపురంలోని ఒక వీధిలో ప్రారంభం నుంచి చివరి వరకు ఏడు వేగ నియంత్రికలుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు మురుగు కాలువల ఏర్పాటు కోసం రోడ్డును తవ్వి, సిమెంట్ దిమ్మె లాగా వేయడంతో దాన్ని అధిగమించాలంటే వృద్ధులు, పాదచారులకు కష్టతరంగా మారింది. అధికారులు అనవసరమైన వాటిని తొలగించాలని విన్నవిస్తున్నారు.

- న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

పరిమితికి మించి తరలిస్తున్నా పట్టదా..?

పొదలకూరు నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుక, మట్టి, కంకర తరలించే వాహనాలు పరిమితికి మించి అధిక లోడుతో వెళుతున్నాయి. వాటిపై కనీసం పరదాలు సైతం కప్పకుండా నిబంధనలకు విరుద్ధంగా వెళుతుండటంతో చోదకులు అవస్థలు పడుతున్నారు. సంగం రోడ్డు కూడలి వద్ద టిప్పర్ కంకరతో వెళుతుండగా రోడ్డుపై పడుతోంది. వెనుక వస్తున్న ద్విచక్రవాహన దారులు ఈ మార్గంలో వెళ్లే వాహనచోదకులు అదుపు తప్పి పడుతున్నారు. పోలీసులు, రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, తోటపల్లిగూడూరు

ప్రమాదాల దారి

ముత్తుకూరులోని ప్రధాన రోడ్డు కొన్ని చోట్ల గుంతలు పడి అధ్వానంగా ఉంది. పోర్టు, ఇతర పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులంతా ఈ మార్గంలో ఎక్కువ మంది వస్తుంటారు. ధ్వంసమైన చోట రోడ్డుకు కనీసం మరమ్మతులు చేయకపోడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉన్న మార్గంలో రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయాలని స్థానికులు విన్నవిస్తున్నారు.

- న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, ముత్తుకూరు

పురుగుల మందుతాగి యువకుడు మృతి

సైదాపురం, న్యూస్‌టుడే : సైదాపురానికి చెందిన మురళి(28) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు... కుటుంబ కలహాల కారణంగా శనివారం సదరు యువకుడు పురుగుల మందు తాగాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబీకులు పోలీసులకు సమాచారమిచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు..

ఆత్మకూరు, న్యూస్‌టుడే: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందరాని ఆత్మకూరు ఎస్‌ఐ సాయిప్రసాద్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. .. నెల్లూరుపాళెంలో జి.శ్రీకాంత్(37) అనే యువకుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దంపతుల వివాదంలో భార్య పుట్టింటికి వెళ్లగా.. మనోవేదనతో ఉరేసుకున్నాడు. ❖ బట్టేపాడుకు చెందిన సుబ్రహ్మణ్యం(47) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందారు. భార్య మృతిచెందగా, మరో మహిళతో వివాహేతర సంబంధముంది. ఆమె వెళ్లిపోవడంతో మద్యం మత్తులో ప్రమాదవశాత్తు శుక్రవారం బావిలో పడి మృతిచెందారు. ఆదివారం మృతదేహం నీటిపై తేలడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

అనుమసముద్రంపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, మర్రిపాడు, అనంతసాగరం, న్యూస్‌టుడే: ఏఎస్‌పేట మండలం చిరమనలో పీర్ల పండగ భక్తి శ్రద్ధలతో శనివారం నిర్వహించారు. గ్రామంలోని పీర్ల చావిడిలో ప్రతిష్ఠించిన పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ◗ తోటపల్లిగూడూరు, ముత్తుకూరులో భక్తులతో పీర్ల వద్ద సందడి నెలకొంది. అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ◗ మర్రిపాడు మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం పురస్కరించుకొని పీర్ల చావిడి ఎదుట అగ్నిగుండాలు ఏర్పాటు చేశారు. నందవరం, మర్రిపాడు, పి.ఎన్.పల్లి, కదిరినేనిపల్లి, నాగినేనిగుంట గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ◗ చేజర్లలో సామూహిక ప్రార్థనలు చేశారు. ◗ సోమశిల గ్రామంలోని బస్టాండ్ సెంటర్లో బాదుల్లా సాహెబ్ దర్గాలో జరిగిన కార్యక్రమానికి తెదేపా నాయకురాలు మేకపాటి శాంతి కుమారి ఆదివారం హాజరయ్యారు. పర్వదినాల్లో నిర్వహిస్తున్న అన్నదానానికి ఆమె రూ.25 వేలు నగదును నిర్వాహకులకు అందజేశారు. దర్గా వద్ద రేకుల షెడ్డును ఏర్పాటు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. స్థానికుల ఆహ్వానం మేరకు సందర్శించినట్లు వివరించారు.

చికెన్ వ్యర్థాల దుర్వాసన భరించలేకున్నాం

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: చికెన్ వ్యర్థాలు కాగులపాడు-జొన్నవాడరోడ్డులో విచ్చలవిడిగా వెళుతున్నాయని స్థానికులు కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి తెలియజేశారు. చికెన్ వ్యర్థాలను ఆపాలని ఆదేశించిన ఎమ్మెల్యేకు స్థానిక మహిళలు చికెన్ వ్యర్థాలతో భోజనం చేయలేకున్నామని ఆదివారం ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా విన్నవించారు. అక్కడే ఉన్న సీఐ శ్రీనివాసులరెడ్డిని పిలిపించారు. చికెన్ వ్యర్థాల రవాణాపై కఠినచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

ప్రతిభా పురస్కారాల అందజేత

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు పట్టణంలోని జేబీఆర్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్, జేవీవీ సంయుక్తంగా పదోతరగతిలో ప్రతిభచూపిన విద్యారులకు పురస్కారాలు, నగదు బహుమతులు అందించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో మండలంలో పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలువాయిలో పూరిల్లు దగ్ధం

కలువాయి, న్యూస్‌టుడే: కలువాయిలోని ఎస్టీ కాలనీలో ఆదివారం విద్యుదాఘాతంతో సుంకర బుజ్జమ్మకు చెందిన ఇల్లు దగ్ధమైంది. ఇంట్లో వస్తువులన్నీ కాలిపోయాయి.

పేదలకు అండగా నిలుస్తాం

చేజర్ల: తెదేపా పేదలకు అండగా ఉంటుందని పార్టీ నాయకులు పెంచలరెడ్డి అన్నారు. చేజర్ల, తిమ్మాయిపాలెంలో ఆదివారం పాల్గొని సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..!

నామమాత్రంగా జరుగుతున్న మండల సర్వసభ్య సమావేశాలు

న్యూస్‌టుడే, సైదాపురం, మనుబోలు

మా గ్రామంలో సమస్యను సర్పంచి పరిష్కరిస్తారు.. ప్రాదేశిక పరిధిలోని సమస్యలు ఎంపీటీసీ సభ్యులు పరిష్కారం చూపుతారు. తద్వారా గ్రామాల్లో అభివృద్ధి సాధిస్తాయన్న ప్రజల ఆశలు అడియాశలుగానే మిగులుతున్నాయి. మూడు నెలలకు ఒక సారి జరిగే సర్వసభ్య సమావేశాల్లో గ్రామాల్లో సమస్యలపై ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తెచ్చినా పరిష్కరించడం లేదు. తాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్తు, వ్యవసాయం, పంచాయతీరాజ్ శాఖలతో పాటు మహిళాభివృద్ధి, ఉపాధిహామీ పథకాల అమలుతీరుపై చర్చించాల్సి ఉన్నా ఎక్కడా అలా జరగడం లేదు. గత వైకాపా ప్రభుత్వంలో స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులను మళ్లించడంతో సమస్యలు పరిష్కరించలేకపోయామని సర్పంచులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిధులు కేటాయిస్తుండటంతో గ్రామాల్లో అప్పటికప్పుడే సమస్యలు పరిష్కరిస్తున్నారు.

ఉపాధి పథకంలో మళ్లీ.. మళ్లీ చేస్తున్న కుంటల పనులు

అధికారులు లేకుండానే...

సర్వసభ్య సమావేశానికి ప్రధాన శాఖల అధికారులు గైర్హాజరవుతున్నారని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పదేపదే చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సైదాపురం మండలంలో ఏడాది కాలంలో జరిగిన పలు సమావేశాలకు ప్రధాన శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. వారిపై చర్యలు చేపట్టాలని తీర్మానాలు చేసినా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. ఒక సమస్య చెబితే సంబంధిత అధికారి లేనప్పుడు సమావేశాలు ఎందుకని సభలో ప్రశ్నిస్తున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

ప్రధాన శాఖల్లో వీడని నిర్లిప్తత

నియోజకవర్గంలోని పలు మండలాల్లో నీటిసరఫరా విభాగానికి సంబంధించి ఇటీవల వరకు పర్యవేక్షించే అధికారులే లేరు. సైదాపురం మండలంలో ఇటీవల వరకు నీటిసరఫరా విభాగం ఇంజినీరు లేరు. గ్రామాల్లో బోర్లు మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. నీటి పథకాలను ప్రతి 15 రోజులకో సారి శుభ్రం చేసి ప్రజలకు సురక్షిత నీరందించాల్సి ఎవరూ పట్టించుకోకపోవడంతో పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు.

వైద్య సేవలు గగనం...

ప్రజల ఆరోగ్య సమస్యల్ని గుర్తించి ఎప్పటికప్పుడు వైద్యసేవల్ని అందించాల్సిన వైద్యారోగ్య శాఖ సిబ్బంది గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదు. సచివాలయాల్లో వైద్యసిబ్బంది ఉన్నా ప్రజల నాడి పట్టిన దాఖలాలు లేవు. వారు పల్లెలకు చుట్టపు చూపుగా వెళ్లడంతో వైద్యసేవలు నామమాత్రంగా ఉన్నాయి. గ్రామాల్లో రోగమొస్తే పట్టణాల్లో ప్రైవేటు ఆసుపత్రులకు ప్రజలు పరుగులు తీయాల్సిన పరిస్థితి మండలంలో నెలకొంది.

పనులు యంత్రాలతో..లెక్కల్లో కూలీలు

పేదలందరికి పనులు కల్పించేందుకు ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. పేదలందరికి పనులు కల్పించడంతో పాటు గ్రామంలోని ప్రజలకు ఉపకరించే పనులు చేయాలి. గ్రామాల్లో ఈ పథకం ద్వారా యంత్రాలతో పనులు చేసి కూలీలతో చేసినట్లు నమోదు చేస్తున్నారు. చేసిన పనులే మళ్లీ చేస్తూ నిధులు కాజేస్తున్నారు. అధికారుల మొక్కుబడి తనిఖీలతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. గ్రామాల్లో సాగే వివిధ రకాల పనుల్లో ఫొటోల మాయాజాలాన్ని ప్రదర్శించడం ఇక్కడ పరిపాటిగా మారింది.

(c) eenadu

నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

రికార్డు స్థాయిలో తల్లికి వందనం నిధులు: ఎమ్మెల్యే

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రికార్డు స్థాయిలో తల్లికి వందనం నిధులు తల్లుల ఖాతాలకు జమ చేశామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఎన్‌సీసీ కాలనీలో ఆదివారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి మన్నేపలి రఘు, కో క్లస్టర్ ఇన్‌ఛార్జి పల్నాటి మస్తాన్‌నాయుడు, కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని 47వ డివిజన్ మహాలక్ష్మీ దేవాలయం ప్రాంతంలో సుపరిపాలనలో తొలిఅడుగు తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో తెదేపా బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు పాల్గొన్నారు.

చదువుతో ఉన్నత స్థానం

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలంటే చదువే మార్గమని కలెక్టర్ ఒ.ఆనంద్, నగర మేయర్ పొట్లూరి స్రవంతి తెలిపారు. ఆదివారం నగరంలోని అనగుంటలోని గిరిజన భవన్‌లో అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్, ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు కార్యక్రమంలో నిర్వాహకులు బషీర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలను అందిస్తున్న కలెక్టర్ ఆనంద్, మేయర్ స్రవంతి

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: సమస్య: ఇస్కాన్ సిటీ 4, 5 వీధుల మధ్యలోని ఎంసీఎన్18/26జడ్45 స్తంభానికి విద్యుద్దీపం వెలగడం లేదు. 20 రోజులుగా చీకటి నెలకొంది. ఇబ్బందులు పడుతున్నాం. –సుబ్బయ్యగౌడ్

సమాధానం : విద్యుద్దీపాన్ని ఏర్పాటుచేస్తాం.
– నందన్, నగరపాలక సంస్థ కమిషనర్

? ఎన్టీఆర్ నగర్‌లో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. –లలితమ్మ, స్థానికురాలు

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం.
– డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

వీఆర్‌లో బాలుడికి విద్యావకాశం

బాలుడు వెంకటేశ్వర్లుతో కమిషనర్ నందన్

నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: యాచక వృత్తి ద్వారా జీవనం సాగిస్తున్న నగరంలోని వెంకటేశ్వరపురానికి చెందిన బాలుడు వెంకటేశ్వర్లుకు వీఆర్ పాఠశాలలో విద్యావకాశం కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ వైవో నందన్ తెలిపారు. ఆదివారం వీఆర్ కళాశాల ప్రాంగణంలో అతనికి బ్యాగ్, పుస్తకాలు, ఇతర సామగ్రి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల క్రితం వెంకటేశ్వర్లు, అతని మిత్రుడు పెంచలయ్య వీఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో తనను కలిసి పాఠశాలలో చేర్చుకోవాలని కోరారని తెలిపారు. పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ సూచనల మేరకు నగరవ్యాప్తంగా యాచక వృత్తిలో ఉన్న ఇలాంటి చిన్నారులను గుర్తించి వారికి ఈ పాఠశాలలో ప్రవేశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రతిపాదనల్లో స్టేషన్లు.. ఆగని నేరాలు

● నగరంలోని వెంకటేశ్వరపురం జనార్దన్ రెడ్డి కాలనీలో రూ.8 లక్షలతో అవుట్ పోస్టు ఏర్పాటుచేశారు. నిర్మించి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు.

● వేదాయపాలెం పోలీసుస్టేషన్ పరిధి ప్రాంతంలోని బీవీ నగర్‌లో అవుట్ పోస్టు ఏర్పాటుచేయాలని గతంలో అధికారులు భావించినా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

● నెల్లూరు గ్రామీణ మండలంలో ఒక్కటే పోలీసుస్టేషన్. ఈ క్రమంలో ధనలక్ష్మీపురంలో మరో స్టేషన్ ప్రతిపాదన ఉన్నా కార్యరూపం దాల్చలేదు.

ప్రారంభానికి నోచుకోని అవుట్‌పోస్ట్

న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

నగరం విస్తరిస్తోంది. జనాభా పెరుగుతుంది. అదేస్థాయిలో నేరాలు పెరుగుతున్నాయి. నగర జనాభా 10 లక్షలపైనే ఆమేరకు పోలీసు స్టేషన్లు పెరగకపోవడం గమనార్హం. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో నేరాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఠాణాల సంఖ్య పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నగరంలో చిన్నబజారు, నవాబుపేట, సంతపేట, దర్గామిట్ట, వేదాయపాలెం, బాలాజీనగర్ పోలీసు స్టేషన్లతో పాటు నెల్లూరుగ్రామీణంలో ఒకటి ఉంది. ఇవి కాకుండా ట్రాఫిక్‌కు రెండు, సీసీఎస్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. శాంతి భద్రతల పరిరక్షణకు నగరంలో ఆరు, గ్రామీణంలో ఒక పోలీసుస్టేషన్ అందుబాటులో ఉంది. నగరంలోని స్టేషన్ల పరిధిలో నేరాలతో పాటు అల్లర్లు, గొడవలు, దొంగతనాలు, భార్యాభర్తల గొడవలు, ఆస్తి వివాదాలు లాంటి సివిల్ కేసులు ఎక్కువగా జరుగుతుంటాయి. వేదాయపాలెం పోలీసుస్టేషన్, నెల్లూరు గ్రామీణం పోలీసుస్టేషన్ అంటేనే పోలీసులు భయపడతారు. ఇక్కడ పని చేయాలంటే కత్తి మీద సామే. నగరంలోని ఏ స్టేషన్‌కు లేని పరిధులు ఉండడమే దీనికి కారణం. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గతంలో వేదాయపాలెం పోలీసు స్టేషన్‌కు అదనంగా బీవీ నగర్‌లో, నెల్లూరుగ్రామీణ పోలీసు స్టేషన్‌కు అదనంగా ధనలక్ష్మీపురంలో ఏర్పాటుచేయాలని పోలీసు ఉన్నతాధికారులు ప్రతిపాదించారు. దీనికి ఉన్నతాధికారుల నుంచి స్పందన లేకపోవడంతో అవన్నీ బుట్టదాఖలయ్యాయి. దీంతో ఈ రెండు పోలీసు స్టేషన్లలో నిత్యం నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పోలీసు స్టేషన్లు కాకున్నా కనీసం అవుట్ పోస్టు అయినా ఏర్పాటు చేస్తే ఫలితముంటుంది. ఆ దిశగా కూడా పోలీసు అధికారులు ప్రయత్నాలు చేయడం లేదు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

– జి.కృష్ణకాంత్, ఎస్పీ

అదనపు పోలీసుస్టేషన్లపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఫైనాన్స్ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. నవాబుపేట అవుట్ పోస్టు ప్రారంభంపై సంబంధిత ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడతాం.

అంతర్జాతీయ ప్రమాణాలతో బోధన

విద్యార్థులతో కలిసి మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : మూతపడిన వీఆర్ హైస్కూల్‌ను పునఃప్రారంభించేందుకు ఆ పాఠశాలలో చేసిన వసతులను మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ఈ పాఠశాలలో ఆధునిక టెక్నాలజీతో అంతర్జాతీయ ప్రమాణాలతో బోధన చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. 150 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ పాఠశాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే పేద విద్యార్థులను గుర్తించి వారికి ఇక్కడ అడ్మిషన్లు ఇచ్చామన్నారు. వీరికి రవాణా వసతి కల్పిస్తామని, దగ్గరలోని కొంతమందికి సైకిళ్లు అందించనున్నామని తెలిపారు. ఈ తరహాలోనే నగరంలోని అన్ని స్కూళ్లు, జిల్లాలోని కొన్నింటిని తీర్చిదిద్దనున్నామని తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రెండు స్కూళ్లు దత్తత తీసుకున్నారని వీటిలో అత్యాధునిక వసతులు కల్పించనున్నామని తెలిపారు. సోమవారం ఈ పాఠశాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించనున్నారని తెలిపారు. ఏర్పాట్లను తన కుమార్తె శరణితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్‌అజీజ్, కార్పొరేషన్ కమిషనర్ నందన్, డిప్యూటీమేయర్ రూప్‌కుమార్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనురాధ పాల్గొన్నారు. **నెల్లూరు (జడ్పీ):** రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణను ఆదివారం కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్టు, ఆధ్వర్యంలో పలువురు కళా సంస్థల ప్రతినిధులు కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సూపర్ సిక్స్ పథకాల ప్రచార బ్రోచర్‌ను మంత్రితో విడుదల చేయించారు.

ఈ బోరెందుకో!

నగరంలోని ముత్యాలపాలెంలోని పోస్టాఫీసు వీధిలో చేతి పంపు సంవత్సరాలుగా పనిచేయడం లేదు. గతంలో దీని నుంచి ముత్యాలపాలెం పరిసర ప్రాంతాల్లోని ప్రజలు నీరు తీసుకెళ్లేవారు. ఇది మరమ్మతులకు గురవడంతో నీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు (విద్య)

ఇష్టారాజ్యంగా భవన నిర్మాణ సామగ్రి

నగరంలోని మన్సూర్ నగర్‌లో రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధాన రోడ్డుపైనే ఇసుక, కంకర, ఇనుము వేయడంతో వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారింది. మూడు నెలలుగా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

రోడ్డు ఛిద్రం.. రాకపోకలకు కష్టం

నగరంలోని ఖుద్దూస్‌నగర్‌లో నెల రోజుల క్రితం తాగునీటి పైపులైను మరమ్మతుల కోసం రోడ్డును తవ్వారు. పనులు పూర్తయిన తర్వాత శిథిలాలతో పూడ్చి చేతులు దులుపుకొన్నారు. కాలువపై ఉన్న వంతెన పక్కనే ఛిద్రంగా మారడంతో ఏ మాత్రం వాహనచోదకులు అదుపు తప్పినా కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది.

– న్యూస్‌టుడే, నెల్లూరు (పొదలకూరు రోడ్డు)

విద్యార్థులు పర్యావరణాన్ని కాపాడాలి

విద్యార్థులు విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎన్‌సీసీ అధికారి నరేంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని వెంగళరావునగర్ మున్సిపల్ స్కూల్లో ఎన్‌సీసీ విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. మండల విద్యాశాఖాధికారి హమీద్, ప్రధానోపాధ్యాయురాలు మంజులవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (విద్య)

వాహనం నిలిపేదెలా?

రొట్టెల పండగతో నగరంలోని వీధులు వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ వాహనాలను నిలుపుకొనేందుకు దర్గాకు దగ్గర వీధుల్లో ఎక్కడ స్థలం కనిపిస్తే అక్కడే నిలుపుతున్నారు. నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయం రోడ్డు, గణేశ్ ఘాట్, వాకర్స్ రోడ్డు, బట్వాడిపాలెం, మాగుంట లేఅవుట్, పొదలకూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో వీధులన్నీ వాహనాలతో నిండిపోయాయి. చోటు లేకపోవడంతో ఎంతోమంది రోడ్ల పక్కన నిలిపేశారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

బలహీనవర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని వైకాపా కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కాకాణి పూజిత, వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి, బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, సత్తార్, స్వర్ణ వెంకయ్య, లక్ష్మీసునంద, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు

నెల్లూరు(నగరపాలకసంస్థ): బారాషహీద్ దర్గా రొట్టెల పండగకు వచ్చే భక్తుల దాహార్తి తీర్చేందుకు నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి కేంద్రాలకు ఆదరణ లభిస్తోంది. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చొరవతో స్వచ్ఛమైన తాగునీటిని అందించేలా చర్యలు తీసుకున్నారు. దర్గా ఆవరణతో పాటు పార్కింగ్ ప్రదేశాల్లో ప్రత్యేకంగా 26 తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ప్రాతినిధ్యం కల్పించాలి

నెల్లూరు(టౌన్): బారాషహీద్ దర్గా గంధ మహోత్సవంలో తమకు ప్రాతినిధ్యం కల్పించాలని బంధానవాజి పీఠాధిపతి కేఎస్ఎస్ బాబాసాహెబ్ కోరారు. ఆదివారం నెల్లూరు పెద్దదర్గా ఖాజాపీర్ మకాన్ ఆవరణలో పీఠాధిపతులు, మషాకల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిపారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు గంధం కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. సమావేశంలో పలువురు పీఠాధిపతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు (క్రీడా విభాగం) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో ఆదివారం వాకర్లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కిలారి వెంకటస్వామినాయుడు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు తిరుపతి నాయుడు దాతలుగా వ్యవహరించి 300 మంది వాకర్లకు రక్తపోటు, చక్కెర వ్యాధి పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పాబోలు సత్యనారాయణ, కార్యదర్శి స్నేహ సురేష్, వేలూరు రంగారావు, బాసం శేషగిరిరావు, రఘురామ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

చలో కర్నూలుపై కరపత్రాలు విడుదల

తెలుగు భాష రాష్ట్ర సదస్సు కరపత్రాలు విడుదల చేస్తున్న కవులు

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: తెలుగు భాష పరిరక్షణకు కర్నూలులో నిర్వహించే సభకు రావాలని పలువురు కవులు కరపత్రాలు విడుదల చేశారు. ఆదివారం నెల్లూరు టౌన్‌హాలులో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.అన్నపూర్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం హిందీ, బెంగాలీ, తమిళం, మలయాళం, మరాఠీ భాషలే మిగిలి ఉన్నాయని మిగతా మాతృ భాషలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కర్నూలులో ఈనెల 12,13 తేదీల్లో ఏర్పాటు చేసే సమావేశానికి భాషాభిమానులు రావాలని పిలుపునిచ్చారు.

పరిమళించిన మానవత్వం

అంబులెన్స్‌లో మహిళను ఎక్కిస్తూ..

నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నిండు గర్భిణి.. బతుకుదెరువుకు నగరానికి వచ్చింది. అర్ధరాత్రి పురిటినొప్పులు రావడంతో కుప్పకూలిపోయింది. అదే సమయంలో అటుగా వెళుతున్న కోటంరెడ్డి బ్రదర్స్ టీమ్ సభ్యుడు బిరదాల సుభాష్ గమనించి సపర్యలు చేశారు. వివరాల మేరకు.. గుంటూరు నుంచి ఓ మహిళ బారాషహీద్ దర్గాలో పని కోసం వచ్చింది. శనివారం అర్ధరాత్రి దాటాక రెండు గంటల సమయంలో అకస్మాత్తుగా పురిటి నొప్పులు వచ్చి కింద పడిపోయింది. రక్తస్రావం అవుతుండగా.. అటుగా వెళుతున్న సుభాష్‌కు తాను గర్భవతిని చెప్పగా.. 108, అక్కడే ఉన్న పోలీసులు, వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. అరగంట పాటు సేవలు అందించి అంబులెన్స్‌లో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా విరాటపర్వం

విరాటపర్వం ఘటంలో ధర్మరాజుస్వామి

నెల్లూరు (జడ్పీ), న్యూస్‌టుడే: నగరంలోని మూలాపేటలో ద్రౌపది సమేత శ్రీకృష్ణ ధర్మరాజ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం చప్పర వాహనంపై శ్రీకృష్ణుడు, ధర్మరాజు, ద్రౌపదిని ఘనంగా ఊరేగించారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భారతంలో విరాటపర్వం ఘట్టం నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట: బారాషహీద్ దర్గా ప్రాంగణంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్యశిబిరాన్ని ఆదివారం రాత్రి డీఎంహెచ్‌వో వి.సుజాత పరిశీలించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స శిబిరం, అంబులెన్స్‌లు, యూత్ రెడ్‌క్రాస్, విపత్తుల నివారణ కార్యక్రమాలను 100 మంది రెడ్‌క్రాస్ సహకారంతో ప్రారంభించారు.

గరుడ వాహనంపై రంగనాథస్వామి విహారం

నెల్లూరు (జడ్పీ), న్యూస్‌టుడే: తొలి ఏకాదశి వేడుకలు నగరంలో వైభవంగా జరిగాయి. శబరి శ్రీరామక్షేత్రంలో రామయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. మాగుంట లేఅవుట్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో 108 లీటర్ల పాలతో అభిషేకాలు, తిరుమంజన సేవ నిర్వహించారు. సాయంత్రం రంగనాథుడు బంగారు గరుడ వాహనంపై ఊరేగారు. ఈవో అర్ల శ్రీనివాసులు రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇన్‌ఛార్జి డీఆర్వోగా హుస్సేన్ సాహెబ్

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లా ఇన్‌ఛార్జి డీఆర్వోగా హుస్సేన్ సాహెబ్‌ను నియమిస్తూ కలెక్టర్ ఆనంద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్‌గా పనిచేస్తుండగా.. అదనపు బాధ్యతలు అప్పగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన వైనమిది. పోలీసుల కథనం మేరకు.. గత నెల 26న వెంకటేశ్వరపురం వంతెన వద్ద గుర్తుతెలియని వ్యక్తి (45) అపస్మారక స్థితిలో పడిపోయారు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అతన్ని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నమ్మకంగా ఉంటూ.. ఇంట్లో చోరీ

వివరాలు వెల్లడిస్తున్న వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రావు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: ఇంట్లో నమ్మకంగా ఉంటూనే నగలు కాజేసిన ఘటనలో నిందితుడిని వేదాయపాలెం పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి 34 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఆదివారం వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు వెల్లడించారు. వెంగళరావునగర్ 'ఎ' బ్లాక్‌లో విశ్రాంత రైల్వే ఉద్యోగులు వెంకటేశ్వర్లు, కొండమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. గత నెల 29న బీరువాలోని తన బంగారు బ్రాస్‌లెట్, రెండు చైన్లు కోసం చూడగా కనిపించలేదు. దీనిపై ఈ నెల నాలుగో తేదీ వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ఎస్సై డి.విజయకుమార్ తన సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. విచారణలో ఇంట్లో పనిచేసే పని మనిషి గణపతే నిందితుడని తేలడంతో ఆదివారం అతన్ని అదుపులోకి తీసుకున్నారు. వెంగళరావునగర్ ప్రాంతానికి చెందిన అతను కొంతకాలంగా వెంకటేశ్వర్లు ఇంట్లో పనిచేస్తూ నమ్మకంగా ఉండేవాడు. గత నెల 28న యజమానులు ఇంటి బయట ఉండగా బీరువాలోని 34 గ్రాముల రెండు బంగారు గొలుసులు, బ్రాస్‌లెట్ అపహరించారు. విచారణలో ఈ మేరకు నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రెండు పూరిళ్లు దగ్ధం

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధమైన ఘటన నగరంలోని మద్రాసు బస్టాండ్ సమీపంలోని జూబ్లీ ఆసుపత్రి రోడ్డులో ఆదివారం చోటు చేసుకుంది. సరోజినీనగర్‌లో చెంచులక్ష్మి, లక్ష్మి పక్క పక్క ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. ఆదివారం వారు పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా.. వారు వాహనంతో వచ్చి మంటలను ఆర్పారు. ఒక్కో ఇంట్లో రూ.లక్షకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

పాతపాటి ప్రభాకర్ అరెస్టు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: జనసేన నాయకుడు శ్రీపతి రాము అన్న కుమారుడు వరుణ్‌సాయిని అపహరించిన కేసులో ఏ2గా ఉన్న పాతపాటి ప్రభాకర్‌ను ఆదివారం నెల్లూరు గ్రామీణ పోలీసులు అరెస్టు చేశారు. న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ కేసులో అయిదుగురు నిందితులు ఉన్నారు.

తెరపై ఈనాడు

ఎం.ి సినిమాస్.: స్క్రీన్. 1 జురాసిక్ వరల్డ్.3డి, తెలుగు, నాలుగు షోస్ స్క్రీన్ ..2. తమ్ముడు, తెలుగు, నాలుగు షోస్ స్క్రీన్..3.కుబేర, తెలుగు రెండు, షోస్, కన్నప్ప తెలుగు రెండు షోస్ **స్పైస్.సినిమాస్:** స్క్రీన్ 1. .కుబేర, తెలుగు రెండు, షోస్, కన్నప్ప తెలుగు రెండు షోస్ స్క్రీన్..2 ఎఫ్1, ఇంగ్లీషు ఒక షో, సోలో బాయ్ తెలుగు ఒక షో, షోటైం, తెలుగు రెండు షోస్‌లు స్క్రీన్..3. మార్గన్, తెలుగు ఒకషో, 3బి,హెచ్‌కె తెలుగు మూడు షోస్, స్క్రీన్..4 జురాసిక్ వరల్డ్ 3డి, తెలుగు మూడు షోస్, జురాసిక్ వరల్డ్ 3డి, ఇంగ్లీషు ఒక షో స్క్రీన్..5 తమ్ముడు, తెలుగు, నాలుగు షోస్ **రెయిన్ సినిమా:** స్క్రీన్ 1.. జురాసిక్ వరల్డ్ 3డి, జురాసిక్ వరల్డ్ 3డి, ఇంగ్లీషు స్క్రీన్..2. తమ్ముడు, (తెలుగు), స్క్రీన్..3.. కన్నప్ప,తెలుగు, కుబేరా తెలుగు, ఎఫ్1, ఇంగ్లీషు, స్క్రీన్..4..మార్గన్ తెలుగు, షోటైం తెలుగు, 3బిహెచ్‌కె, తెలుగు **సిరిమల్టీప్లెక్స్:** స్క్రీన్ 1 తమ్ముడు స్క్రీన్ 2 కన్నప్ప మూడు షోస్, కుబేరా 1షో స్క్రీన్ 3 3బిహెచ్‌కె, నాలుగు షోస్ స్క్రీన్ 4 కుబేర 2షోస్, మార్గన్ 2షోస్



ప్రథమ వర్ధంతి

ప్రేమానురాగాలకు మారుపేరైన
మిమ్మల్ని కోల్పోయిన అభాగ్యులం. మీ మమతకు,
ఆదరణకు దూరమై అనాథలమై విలపిస్తున్నాము.
మీరు లేని లోటు తీరనిది.
మీ ఆశీస్సులే మాకు శ్రీరామరక్ష.
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని
ప్రార్థిస్తూ... మీ కిదే మా అశ్రునివాళి

భార్య : ఉల్చి పద్మజ
కుమార్తె : ఉల్చి కిరణ్మయి
కుమారులు : ఉల్చి నాగశ్రీనివాసరాజు (16 సం॥)
ఉల్చి వెంకటసాయి చైతన్యరాజు (15 సం॥)

స్వర్గీయ ఉల్చి వెంకట రమణరాజు గారు
జననం: 1969 ★ మరణం: 2024

BR

వరాల రొట్టె.. తరతరాల నమ్మకం

న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ, మార్కెట్ సెంటర్)

నాలుగు శతాబ్దాలుగా నమ్మకం.. తరాలు మారినా చెరగని భక్తిభావం. . ఇవే బారాషహీద్ దర్గా వైపునకు నడిపిస్తున్నాయని రొట్టెల పండగకు వచ్చిన భక్తులు చెబుతున్నారు. తాత. . ముత్తాతల నుంచి వస్తున్న ఈ పండగను ఎంతో వైభవంగా చేసుకొంటున్నామని, తమ కష్టాలను బారాషహీదులకు చెప్పుకొని వాటి నుంచి విముక్తి పొందుతున్నామని భక్తులు వివరిస్తున్నారు.

పండగపై విశ్వాసంతో

– షబానా, నాగ్‌పూర్

గత ఏడాది వచ్చి రొట్టెలు పట్టుకున్నాం. అన్ని కోరికలు తీరాయి. అయిదేళ్లుగా వస్తున్నాం. పెళ్లి, ఆరోగ్యం, చదువు, వ్యాపారం ఇలా అన్ని రకాల రొట్టెలు పట్టుకుంటున్నాం. కోరికలు నెరవేరుతుండడంతో పండగపై నమ్మకం కలిగింది. ప్రస్తుతం మా అబ్బాయి ఆరోగ్య కోసం పట్టుకున్నాం. దర్గాలో సౌకర్యాలు బాగున్నాయి.

మా జీవితం సంతోషంగా ఉంది

– చందు, ఈక్షిత– విజయవాడ

భక్తిశ్రద్ధలతో ఏటా వస్తున్నాం. మా కోరికలు నెరవేరుతున్నాయి. గతంలో ఉద్యోగం, పెళ్లి, సంతానం రొట్టెలు పట్టుకున్నాం. కోరికలు నెరవేరుతున్నాయి. బారాషహీదుల మహిమలతో మా జీవితం సంతోషంగా ఉంది.

సౌకర్యాలు అద్భుతం

– షఫీయుద్దీన్–హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం బారాషహీద్ దర్గా రొట్టెల పండగను చాలా బాగా నిర్వహిస్తోంది. లక్షలాది మందికి కల్పించిన సౌకర్యాలు బాగున్నాయి. ఏడాదికేడాది భక్తుల రాక పెరుగుతోంది. నేను 15 ఏళ్లుగా వస్తున్నాను.

పెళ్లి కావాలని..

– సల్మా, బెంగళూరు

మా తల్లిదండ్రులు ఏటా వచ్చి కోరికల రొట్టెలు పట్టుకుంటున్నారు. అన్నీ నెరవేరాయి. నేను పెళ్లి రొట్టె పట్టుకునేందుకు వచ్చాను. ప్రభుత్వం సౌకర్యాలు బాగా కల్పించింది. గతంలో కంటె మెరుగైన వసతులు ఉన్నాయి.

ఆరోగ్యం బాగుపడాలని..

శివశంకర్, తనూజ– శ్రీకాకుళం

గతంలో మా అత్తమామలు వచ్చి ఆరోగ్య రొట్టె పట్టుకున్నారు. ఆరోగ్యం కుదుట పడింది. ఇప్పుడు మా బాబు ఆరోగ్య కోసం రొట్టె పట్టుకున్నాం. కోరికలు నెరవేరుతుండడంతో దర్గాపై నమ్మకం కలిగింది. ఏటా పండగకు రావాలని మేమంతా నిర్ణయించుకున్నాం.

(c) eenadu

సీఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టండి

జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష

కొత్తచెరువు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 10వ తేదీ కొత్తచెరువులో పర్యటించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్పీ రత్న, జేసీ అభిషేక్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ ఆదివారం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10న కొత్తచెరువు జడ్పీ బాలురు, బాలికలు, శ్రీసత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే మెగా పీటీఎం 2.0 కార్యక్రమంలో సీఎం పాల్గొనే అవకాశం ఉందన్నారు. పర్యటనను విజయవంతం చేయడానికి అధికారులకు అప్పగించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ, జేసీ, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి బాలురు, బాలికలు, కళాశాల భవనాల్లోని తరగతి గదులు, ప్రాంగణాల్లోని మైదానాలను పరిశీలించారు. అంతకు ముందు పుట్టపర్తి విమానాశ్రయాన్ని కలెక్టర్ పరిశీలించి అక్కడి అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, పుట్టపర్తి, ధర్మవరం ఆర్డీవోలు సువర్ణ, మహేశ్, డీఈవో కిష్టప్ప, సమగ్రశిక్షా ఏపీసీ దేవరాజ్, డీపీవో సమత, డీఎస్‌వో వంశీకృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సీపీవో విజయకుమార్, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరు రాజు, జిల్లా రవాణాధికారి శ్రీనివాస్, తహసీల్దార్ బాలఆంజనేయులు, ఎంపీడీవో నటరాజ్, సీఐ మారుతి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మైదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న, జేసీ అభిషేక్‌కుమార్

సాంస్కృతిక కార్యక్రమంలో ఓ సన్నివేశం

మార్మోగిన సాయి విఠల నామస్మరణ

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభా మండపం సాయి విఠల నామస్మరణతో మార్మోగింది. మహారాష్ట్ర, గోవా భక్తుల దిండి పర్తియాత్ర, ఆషాఢ ఏకాదశి వేడుకల్లో భాగంగా రెండో రోజు ఆదివారం రెండు రాష్ట్రాల భక్తులు, బాలవికాస్ విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి దిండి పాల్కీ, పల్లకీల ఊరేగింపుతో సాయి విఠల రాకను సూచిస్తూ సాయి కుల్వంత్ సభా మండపానికి చేరుకున్నారు. ఉదయం వేద పఠనానంతరం బాలవికాస్ విద్యార్థులు ప్రదర్శించిన కథా సంకీర్తనా కార్యక్రమాలు, నృత్యాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం భక్తిగీతాల భజన కార్యక్రమం నిర్వహించారు. మంగళహారతి తర్వాత భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

రుచించని వంట.. మసకబారిన గదులు

■ వసతి గృహాల్లో పాకశాలలు అధ్వానం

జిల్లాలోని బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో సగానికిపైగా వంటశాలలు అపరిశుభ్రంగా, ఇరుకుగా ఉన్నాయి. పొడిపొడిగా సున్నం రాలుతోంది. గోడలు మసకబారాయి. పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. గదులకు ఏళ్లుగా సున్నం వేయలేదు. అక్కడక్కడ బూజు పట్టి అధ్వానంగా మారాయి. ఇటువంటి పాకశాలల్లో వంట ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఆదివారం 'న్యూస్‌టుడే' వసతిగృహాలను పరిశీలించింది.

హిందూపురం ముక్కడిపేటలోని బీసీ వసతిగృహంలో వంటశాల దుస్థితి

హిందూపురం, పెనుకొండ, న్యూస్‌టుడే: వసతి గృహాలు, వంటశాలలను శుభ్రం చేయించాలని ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశించినా ఎక్కడా పాటించిన దాఖలాలు లేవు. చాలాచోట్ల అపరిశుభ్రంగా కనిపించాయి. కొన్ని గదులు ఇరుకుగా ఉండటంతో సిబ్బంది వంట చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. హిందూపురం పట్టణం రహమత్‌పూర్‌లో ఉన్న కళాశాల ఎస్సీ బాలుర వసతి గృహంలో ఆర్వో ప్లాంటు దాదాపు ఏడాదిన్నర నుంచి మరమ్మతుకు నోచుకోక నిరుపయోగంగా ఉంది. దాంతో 55 మంది విద్యార్థులకు రోజూ రూ.50 వెచ్చించి తాగునీటిని కొనుగోలు చేస్తున్నారు. విద్యార్థులకు రుచి, శుచికర భోజనం అందాలంటే తొలుత వంటగదిని శుభ్రంగా ఉంచాలి. సంబంధిత అధికారులు దీనిపై తక్షణం దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

బీసీ వసతిగృహాల డివిజన్లు :	హిందూపురం	పెనుకొండ
వసతిగృహాలు :	13	16
విద్యార్థులు :	1,200	1,465

వెంటనే శుభ్రం చేయిస్తాం

- గంగాధర్, నరసింహారావు, ఏఎస్‌డబ్ల్యూవోలు

వసతిగృహాల్లో వంట గదులు శుభ్రంగా ఉంచేలా ఇప్పటికే వార్డెన్లకు ఆదేశాలు జారీ చేశాం. మరమ్మతులకు నిధులు అవసరమైతే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పాం. పాకశాలలను పరిశీలించి వాటికి అవసరమైన మరమ్మతులు, సున్నం వేయించి శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటాం. కళాశాల ఎస్సీ వసతి గృహంలో ఆర్వో ప్లాంటుకు మరమ్మతు చేయిస్తాం.

ఎస్సీ వసతిగృహాల
డివిజన్ : హిందూపురం
మొత్తం మండలాలు : 11
వసతిగృహాలు : 9

కస్తూర్బా విద్యాలయంలో జేసీ విచారణ

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పాపిరెడ్డిపల్లి కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదివారం విచారణ చేపట్టారు. ఎస్‌వో అనిత, వంట సిబ్బందితో పలు విషయాలపై క్షుణ్నంగా విచారణ చేపట్టారు. పరిసరాలను పరిశీలించారు. ప్రస్తుతం ఇద్దరికి సోమందేపల్లి పీహెచ్‌సీలో వైద్య చికిత్సలు అందిస్తున్నామని.. మరో నలుగురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థత కారణంగా శుక్రవారమే హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడి వైద్యులతో మెరుగైన వైద్య చికిత్సలు చేయిస్తున్నట్లు వైద్యాధికారి ఓంకార్ జేసీకి వివరించారు. వండుతున్న ఆహారం కలుషితం కాకుండా, పరిసరాలు శుభ్రంగా ఉంచాలని జేసీ సిబ్బందికి సూచించారు.

ఎస్‌వో, వంట సిబ్బందిని విచారిస్తున్న సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్, పక్కన ఆర్డీవో ఆనంద్‌కుమార్

స్పందించు.. సంధించు!

పాఠకులారా..! మీలో సామాజిక స్పృహ.. ఏదైనా మంచి చేయాలన్న తపన ఉందా? అన్యాయాలను నిగ్గదీసి ప్రశ్నిస్తారా? సమస్యలను మీ చేతుల మీదుగా పరిష్కారం చూపాలని ఆరాటపడుతున్నారా? ఏ వర్గానికైనా అత్యంత విలువైన సమాచారం చేరవేయాలని అనుకుంటున్నారా? మీ చుట్టుపక్కల ఆహ్లాదకర.. ఆసక్తిదాయక.. ఆదర్శప్రాయమైన అంశాలు నలుగురికి పంచాలని ఆశిస్తున్నారా? అయితే ఈ వేదిక మీ కోసమే.. మీ గొంతుకకు **ఈనాడు** తోడు అవుతుంది. ప్రజాశ్రేయస్సు పరమావధిగా మీరు రాసిన అక్షరాలు, తీసిన ఫొటోలకు పత్రికలో సముచిత స్థానం కల్పించేందుకు ముందుకొస్తున్నాం..

ఇకెందుకు ఆలస్యం.. తీసుకోండి కలం.. పట్టండి కెమెరా.. సమస్యలపై మీదైన శైలిలో ఎక్కుపెట్టండి..!

మీరు చేయాల్సినవి..

- ఏదేని అంశాన్ని పది వాక్యాలకు మించకుండా సూటిగా, స్పష్టంగా రాయడం.
- నాణ్యమైన ఫొటోలు తీసి పంపడం.
- వ్యక్తిగతమైనవి వద్దు.. సమాజశ్రేయస్సుకే ఈనాడు వేదిక అనేది మదిలో మెదలాలి.

★ మీరు పంపిన అంశాలను పరిశీలించి.. అర్హత ఉన్నవి ప్రచురిస్తాం.

పోస్టు చేయాల్సిన నంబరు **93901 60428**

ప్రశాంతి నిలయంలో నేటి నుంచి అంతర్జాతీయ వైద్యశిబిరం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: గురుపౌర్ణమిని పురస్కరించుకుని ప్రశాంతి నిలయంలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు అంతర్జాతీయ వైద్యశిబిరం నిర్వహించనున్నారు. శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో వివిధ దేశాలకు చెందిన వైద్యులు రోగులకు సేవలందించనున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు రోగులకు వైద్యసేవలందించి, ఉచితంగా మందులు, అవసరమైన పరికరాలు అందించనున్నారు. ఇందు కోసం ట్రస్టు వర్గాలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పీ4కు 54,601 కుటుంబాల ఎంపిక

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పని చేస్తోంది. ధనవంతులు పేద కుటుంబాలను దత్తత తీసుకుని జీవన ప్రమాణాలను మెరుగుపర్చేలా ప్రణాళిక రూపొందించింది. జిల్లాలో ఇప్పటికే సర్వే నిర్వహించి 54,601 బంగారు కుటుంబాలను (నిరుపేదలను) గుర్తించారు. నియోజకవర్గాల వారీగా జాబితాలు సిద్ధమయ్యాయి. ఆపన్నహస్తాలు అందించేందుకు సంపన్న వర్గాలు ముందుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇది వరకే పిలుపునిచ్చారు. పేద కుటుంబాలను దత్తత తీసుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, సంపన్నులకు అవగాహన కల్పిస్తుండటంతో.. ముందుకు వస్తున్నారు. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల్లో శ్రీసత్యసాయి జిల్లా ఒకటి. ప్రభుత్వ లెక్కల ప్రకారం దారిద్ర్య రేఖకు దిగువన లక్షల కుటుంబాలు ఉన్నాయి. ఇందులో అత్యంత నిరుపేదలకు తొలుత సాయం అందించేలా కార్యాచరణ రూపొందించారు.

నియోజకవర్గం	కుటుంబాలు
ధర్మవరం	9,584
హిందూపురం	7,915
కదిరి	9,632
మడకశిర	8,318
పెనుకొండ	7,268
పుట్టపర్తి	8,391
రాప్తాడు	3,493

ఇప్పటికే సాయం చేసేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. జిల్లాలో 54,601 కుటుంబాలు, 1,56,985 మంది సభ్యులు ఉన్నట్లు గుర్తించాం. సర్వే పూర్తయిందని, మండలాల వారీగా దాతల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని సీపీవో విజయ్‌కుమార్ తెలిపారు.

దాచమంటే.. దోచేశారు!

■ పోస్టాఫీసుల్లో ఖాతాలకు జమకాని సొమ్ము
■ సిబ్బంది సొంత అవసరాలకు రూ.లక్షల్లో స్వాహా

పుట్టపర్తి, కదిరి, న్యూస్‌టుడే: భవిష్యత్తు అవసరాల కోసం పోస్టాఫీసుల్లో దాచుకుంటున్న సొమ్ముకు భరోసా లేకుండా పోయింది. ఖాతాదారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న తపాలాశాఖలోని కొందరు ఉద్యోగులు రూ.లక్షల్లో స్వాహా చేశారు.

★ నేటి పొదుపుతో రేపటి అవసరాలు తీరుతాయన్న ఆశతో ప్రజలు పోస్టాఫీసుల్లో ఆర్డీ, ఎఫ్‌డీ, ఆర్పీఎల్ఐలకు డబ్బులు కడుతున్నారు. బీపీఎం, క్షేత్రస్థాయి సిబ్బంది ఆ సొమ్మును ఖాతాలకు జమ చేయకుండా మోసగిస్తున్నారు. ఖాతాదారుడి పుస్తకంలో మాత్రమే రాసి సొమ్మును కాజేసి, సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న ఖాతాదారులు లబోదిబోమంటున్నారు.

తనిఖీల్లో బయటపడని తప్పులు

సాధారణంగా పోస్టాఫీసుల్లో త్రైమాసిక, వార్షిక తనిఖీలు చేస్తారు. ఆ సమయంలో ఎలాంటి తప్పులు బయట పడటం లేదు. కాలపరిమితి ముగిసిన డిపాజిట్‌దారులు నగదు కోసం వెళ్లినప్పుడు దోపిడీ పర్వాలు వెలుగు చూస్తున్నాయి. మొన్న బుక్కపట్నం మండలం పాముదుర్తి, నిన్న నల్లమాడ మండల కేంద్రం, నేడు అమడగూరు మండలం పూలకుంటపల్లి పోస్టాఫీసుల్లో ఖాతాదారుల సొమ్ము రూ.లక్షలు స్వాహాకు గురవుతున్నా ఉన్నతాధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

● అమడగూరు మండలం పూలకుంటలో ప్రజలు కట్టిన నెలవారి పొదుపు నగదును సబ్‌పోస్టు మాస్టర్ ఖాతాలకు జమ చేయకుండా స్వాహా చేశాడు. వందలాది మంది ఖాతాదారులు రూ.20 లక్షలకు పైగా చెల్లించారు. జనం ఇచ్చిన మొత్తాలను వినియోగదారుల పుస్తకంలో రాసి సీల్లు వేసి, సంతకం పెట్టాడు. ఆ సొమ్మును సొంత అవసరాలకు వాడుకున్నాడు. పొదుపు కాలం పూర్తి కావడంతో.. నగదు ఇవ్వాలని ఖాతాదారులు కోరారు. రేపు మాపంటూ తప్పించుకు తిరుగుతున్న అతన్ని నిలదీయడంతో స్వాహా పర్వం వెలుగులోకి వచ్చింది.

● నల్లమాడ మండల కేంద్రంలో ఖాతాదారులు పొదుపు చేసుకున్న నగదును సబ్ పోస్టుమాస్టర్ జమ చేయకుండా, దాదాపు రూ.8 లక్షలు పైగా స్వాహా చేశాడు. బాధితులు తపాలా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి, కేవలం అతన్ని సస్పెండ్ చేసి చేతులు దులుపుకొన్నారు. కొంత మందికి మాత్రమే సొమ్ము చెల్లించారు

బాధ్యులపై చర్యలు చేపట్టాం

- గోవర్దన్‌నాయక్, పోస్టల్ ఇన్‌స్పెక్టరు, కదిరి

అమడగూరు మండలం పూలకుంటపల్లి, నల్లమాడ పోస్టాఫీసుల్లో జనం సొమ్మును ఖాతాలకు జమ చేయకుండా వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు బయట పడింది. దీంతో వారిద్దరినీ సస్పెండ్ చేశాం. పూలకుంటపల్లిలో విచారణ చేపట్టాం. డబ్బులు కట్టిన వారు ఖాతా పుస్తకాలు చూపితే ఎంత మొత్తం అవినీతి జరిగిందో తెలుతుంది. నల్లమాడలో రూ.6 లక్షల పైచిలుకు కాజేసినట్లు గుర్తించాం. ఇప్పటికే రూ.1.50 లక్షల వరకు రాబట్టాం. ఖాతాదారులకు న్యాయం జరిగేలా చూస్తాం.

భక్తజన సందోహం

భక్తుల పొర్లు దండాలు

భక్తిశ్రద్ధలతో కుళ్లాయిస్వామి పెద్దసరిగెత్తు

నేడు జలధికి తరలనున్న పీర్లు

నార్పల, న్యూస్‌టుడే : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయి స్వామి క్షేత్రంలో పెద్దసరిగెత్తును అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కుళ్లాయిస్వామి పెద్దసరిగెత్తును తిలకించడానికి భక్తులు ఆంధ్ర, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచి విశేషంగా తరలివచ్చారు. ఆదివారం ఉదయం నుంచే భక్తులు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి జంట దేవాలయాల్లో పూజలు చేసి గోవిందనామస్మరణను మారుమోగించారు. వివాహం కాని యువత, రోగపీడితులు, సంతానం లేక బాధపడుతున్న నూతన దంపతులు అగ్నిగుండం ముందు పొర్లుదండాలతో మొక్కులు తీర్చుకున్నారు. గూగూడు చుట్టుపక్కల గ్రామాలైన రంగాపురం, నరసాపురం, మూగేతిమ్మంపల్లి, నడింపల్లి, గంగనపల్లి గ్రామాల నుంచి భక్తులు మట్టికుండలతో పానకాలు తీసుకువచ్చి అగ్నిగుండంలో వేసి మొక్కులు చెల్లించారు. చిరకాల కోరికలు తీరిన భక్తులు చక్కెర, కొబ్బెర చదివింపులతో పాటు హుండీల్లో కానుకలు సమర్పించారు. కల్యాణకట్ట వద్ద భక్తులు తలనీలాలు సమర్పించి, కోనేరులో స్నానాలు ఆచరించారు. ఆదివారం రాత్రంతా భక్తులు గూగూడు పీర్లచావిడి ముందు జాగారం చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత కుళ్లాయిస్వామిని పీర్ల చావిడి నుంచి బయటకు తీసుకొచ్చి గ్రామంలో ఊరేగించారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు పీర్లు అగ్నిగుండంలో ప్రవేశించి సాయంత్రం కొర్లగుట్ట మీదుగా జలధికి వెళ్లడంతో గూగూడు బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

ప్రత్యేక అలంకరణలో ఆంజనేయుడు

పూజలందుకున్న కుళ్లాయిస్వామి పీర్లు

నేడు కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (జీపీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. కదిరి, పెనుకొండ, ధర్మవరం ఆర్డీవో కార్యాలయాలతోపాటు మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లోనూ సంబంధిత అధికారులు వినతులు స్వీకరిస్తారన్నారు. మరింత సమాచారం తెలుసుకునేందుకు కాల్ సెంటర్ 1100 నంబరుకు సంప్రదించవచ్చన్నారు. ఫిర్యాదుదారుడు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ రత్న తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక నిధులు

ఐసీడీఎస్ శాఖకు రూ.1.94 కోట్లు

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టింది. కేంద్రాల నిర్వహణ కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిధులు రూ.1.94 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వు జారీ చేసింది. ఇందులో అనంతకు రూ.62.84 లక్షలు, శ్రీసత్యసాయి జిల్లాకు రూ.1.30 కోట్లు కేటాయించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఏనాడూ అంగన్‌వాడీ కేంద్రాలే కాదు.. ఐసీడీఎస్ కార్యాలయాల నిర్వహణకు నయాపైసా ఇవ్వలేదన్న విమర్శను మూటగట్టుకుంది. కనీసం తెల్ల పేపరు, రిజిస్టర్లు, పెన్నులు, ర్యాపర్, చాక్‌పీసులు, ఫినాయిల్ వంటి కనీస స్టేషనరీ, ఇతరాత్ర సామగ్రి కొనుగోలుకు డబ్బులు ఇవ్వలేదు. ఎక్కడికక్కడే ఉద్యోగులు సొంత నిధులు ఖర్చు పెట్టాల్సిన దుస్థితి ఉండేది. ఈ పరిస్థితి నుంచి కూటమి ప్రభుత్వం గట్టెక్కించింది. అనేక రకాల వస్తువులు, స్టేషనరీ కొనుగోలు కోసం త్రైమాసిక వారీగా బడ్జెట్ కేటాయించింది. వీటి సరఫరాకు ఏకంగా టెండర్లను సైతం ఆహ్వానించడం విశేషం. ఈ విషయాన్ని అనంత ఐసీడీఎస్ పీడీ నాగమణి పేర్కొన్నారు. ప్రతి మూడు మాసాలకోసారి నిర్దేశిత సామగ్రిని నేరుగా కేంద్రాలకు పంపిణీ చేస్తామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశిత నిధులు కూడా మంజూరు అయ్యాయి.

ఏ జిల్లాకు ఎంతెంత!

★ అనంత జిల్లా పరిధిలో మొత్తం 2,302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉంటే.. ఒక్కో కేంద్రానికి ఏడాదికి రూ.2 వేలు చొప్పున రూ.46.04 లక్షలు, పీడీ కార్యాలయం, 11 ఐసీడీఎస్ కార్యాలయాలు, బాల సదన్, సర్వీసు హోం.. వంటి వాటికి రూ.1.2 లక్షలు ప్రకారం రూ.16.8లక్షలు కేటాయించారు. ఇలా మొత్తం కలిపి ఏడాదికి రూ.62.84 లక్షలు విడుదల చేశారు.

★ శ్రీసత్యసాయి జిల్లాల్లోని 2,824 కేంద్రాలకు రూ.1.13 కోట్లు, పీడీ కార్యాలయం, 12 ప్రాజెక్టులు, ధర్మవరం, హిందూపురం బాలసదన్‌లకు రూ.17.8 లక్షలు ఇవ్వనున్నారు. ఈ జిల్లాలో త్వరలోనే టెండర్లు ఆహ్వానిస్తారు. ఇందుకు సంబంధించి కసరత్తు చేస్తున్నారు. టెండర్లు ఖరారు కాగానే నిర్దేశిత వస్తు సామగ్రి పంపిణీ చేస్తారు.

చెత్త మేటలు.. కరిగేదెన్నడు!

డంపింగ్ యార్డుల్లో పేరుకుపోతున్న గుట్టలు

ధర్మవరంలోని డంపింగ్‌యార్డులో వ్యర్థాలు

కదిరి, ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: చేయి, చేయి కలుపుదాం.. స్వచ్ఛత పాటిద్దాం.. చెత్తతో సంపద సృష్టిద్దామన్న పాలకుల ఆలోచన మందగించింది. వీధులు ఊడ్చి, ఇళ్లలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. అందుకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. వ్యర్థాలకు అర్థం చేకూర్చటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చాలాచోట్ల వ్యర్థాలతో విద్యుదుత్పత్తి, వర్మీకంపోస్టు తయారు చేస్తుండగా. జిల్లాలోని మున్సిపాలిటీల్లో మాత్రం తిరిగి ఉపయోగించుకునే దిశగా ఆలోచనలకు అడుగులు పడటం లేదు. ఫలితంగా డంపింగ్ యార్డుల్లో దశాబ్దాలుగా చెత్త గుట్టలు పేరుకున్నాయి. చెత్తకు నిప్పుతో ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరుగా మారుతోంది.

● కదిరి మున్సిపాలిటీలో చెత్త తరలింపునకు రెండు డంపింగ్ యార్డులు ఉన్నాయి. వీటికి గుట్టల మధ్య స్థలం ఇవ్వటంతో చదును చేయడం, ప్రహరీల నిర్మాణమంటూ సుమారు రూ.30 లక్షలకుపైగా ఖర్చు చేశారు. ముత్యాలచెరువు సమీపంలోని డంపింగ్ యార్డుల్లో 22 వేల మెట్రిక్ టన్నులు, సున్నపుగుట్టతండా సమీపంలోని కొత్త డంపింగ్ యార్డులో 10 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వ్యర్థాలకు నిప్పు పెడుతుండటంతో పొగ వ్యాపించి రోగాల బారిన పడుతున్నామని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా పాత డంపింగ్ యార్డులో వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం. కొత్త డంపింగ్ యార్డును పరిశీలించి, నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

● ధర్మవరం మున్సిపాలిటీలో చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అక్కడ రీసైక్లింగ్ ప్రక్రియ జరుగుతున్నా, వ్యర్థాల గుట్టలు మాత్రం తరగటం లేదు. పనులు దక్కించుకున్న గుత్తేదారులు రోజుకు 700 టన్నులు మాత్రమే రీసైక్లింగ్ చేస్తున్నారు. దీంతో అక్టోబరు 2 నాటికి ప్రభుత్వం నిర్దేశించిన 23 వేల మెట్రిక్ టన్నుల చెత్తను రీసైక్లింగ్ సాధ్యమనిపించటం లేదు. అధికారులు, గుత్తేదారులతో పనులు చేయించటంలో అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ విషయాన్ని కమిషనర్ ప్రమోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా నిర్ణీత గడువులోపు లక్ష్యాన్ని పూర్తి చేస్తామని చెప్పారు.

మున్సిపాలిటీ	కదిరి	ధర్మవరం
రోజుకు చెత్త ఉత్పత్తి:	38.5 మెట్రిక్ టన్నులు	72 మెట్రిక్ టన్నులు
కార్మికులు:	126	254
ఏడాదికి వేతనాలు:	రూ.3.73 కోట్లు	రూ.8 కోట్లు
ఏడాదికి వాహనాలకు ఇంధనం ఖర్చు:	రూ.60.72 లక్షలు	రూ.60 లక్షలు
డంపింగ్ యార్డులు:	2	1
యార్డుల్లో నిల్వ చెత్త:	32 వేల మెట్రిక్ టన్నులు	250 మెట్రిక్ టన్నులు

జూనోసిస్ వ్యాధి సంక్రమణపై అప్రమత్తత ముఖ్యం

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు జూనోసిస్ వ్యాధి సంక్రమిస్తుందని జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ టీవీ.సుధాకర్ పేర్కొన్నారు. పెంపుడు జంతువుల యజమానులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా పశువైద్యశాలల్లో జూనోసిస్ దినోత్సవం జరుపుకొన్నారు. కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. జేడీఏహెచ్ టీవీ సుధాకర్, వ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు రవిబాబు, ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువైద్యులు శృతి, దిలీప్, మహేశ్, సుచరిత, పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

సాయినగర్‌లో కుక్కకు టీకా వేస్తున్న జేడీఏహెచ్ డాక్టర్ సుధాకర్

గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీలపై వీడని సందిగ్ధం!

కౌన్సెలింగ్ పూర్తయినా అందని బదిలీ ఉత్తర్వులు

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంలకు గత నెల 30న జూమ్ కాన్ఫరెన్స్ ప్రక్రియ బదిలీల కౌన్సెలింగ్ పూర్తైనా సంబంధిత వారికి ఇప్పటివరకూ బదిలీ ఉత్తర్వులు అందలేదు. మొత్తంగా 803 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి నిబంధనల ప్రకారం నూతన స్థానాలను కేటాయించారు. రీడీప్లాయిమెంట్ కింద పనిచేస్తున్న ఎంపీహెచ్ఏ మహిళల స్థానాలపైనా, ఇటీవల పదోన్నతి పొందిన గ్రేడ్-3 రెగ్యులర్ అయిన ఏఎన్ఎంలు గతంలో పనిచేస్తున్న స్థానాల్లోనే కొనసాగుతుండగా తాజాగా నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆ పోస్టులన్నీ ఖాళీగా చూపించారు. ఖాళీలను బట్టి గ్రేడ్-3 ఏఎన్ఎంలు ఇచ్చిన ఆప్షన్ల ప్రకారం బదిలీలు చేశారు. ఖాళీ పోస్టుల ఉన్న ఏఎన్ఎంల స్థానాల్లోకే ప్రస్తుత కౌన్సెలింగ్‌లో కొంతమందిని అదే స్థానాలకు కేటాయించారు. ఉన్నతాధికారులు కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించి తదుపరి ఆదేశాలు ఇస్తామని అప్పటి వరకూ బదిలీ ఉత్తర్వులు ఇవ్వొద్దని ఆదేశించగా ప్రస్తుతం సందిగ్ధత నెలకొంది. ఈ అంశంపై డీఎంహెచ్‌వో ఈ.బి.దేవి మాట్లాడుతూ సమస్యను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కలెక్టర్ నిర్ణయం మేరకు కౌన్సెలింగ్‌ను రద్దు చేసి నూతనంగా నిర్వహించటమా? లేక పాత వారిని వేరే ప్రాంతాలకు సర్దుబాటు చేయటామా? తెలుస్తుందని వెల్లడించారు. ఏఎన్ఎంలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బదిలీలకు సంబంధించిన సమాచారం ముందుగా తెలియజేస్తామని తెలిపారు.

వర్షాధార అభివృద్ధి పథకానికి మోక్షమెన్నడో?

- 31 మండలాల్లో అమలుకు కార్యాచరణ
- అడుగులు ముందుకు పడని తీరు

గుత్తి, న్యూస్‌టుడే : కరవు జిల్లా రైతులకు బహుళ ప్రయోజనం చేకూర్చే వర్షాధార అభివృద్ధి పథకం అమలు కావడం లేదు. పథకాన్ని గతేడాది ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికీ వ్యవసాయశాఖ, భూసార సంరక్షణ విభాగం అధికారులు పట్టించుకోలేదు. జిల్లాలోని 31 మండలాల్లో పథకాన్ని అమలు చేయాల్సి ఉంది. ఆదిశగా అడుగులు పడటం లేదు.

గుత్తి మండలంలోని అబ్బేదొడ్డిలో సాగులో ఉన్న చీనీతోట

620 హెక్టార్ల లక్ష్యం ..

ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి వ్యవసాయం, ఉద్యాన పంటలసాగుతో పాటు తేనెటీగల పెంపకం, వానపాముల ఎరువు తయారీ చేపట్టాల్సి ఉంది. జిల్లా మొత్తం మీద 620 హెక్టార్లలో పథకాన్ని అమలు చేసేందుకు నిర్ణయించారు. హెక్టారుకు రూ.20 వేలు రైతులకు ఇచ్చి ప్రోత్సహించాల్సి ఉంది.

క్షేత్రస్థాయిలో అన్నీ పూర్తయినా..

- వర్షాధార పథకం కింద రైతులకు ప్రయోజనం కల్పించేందుకు ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేశారు. రైతులను కూడా గుర్తించారు. రైతులకు హెక్టారుకు రూ.20 వేలు ఇవ్వాలన్నది పథకం ఉద్దేశం. ఈపథకం కింద గుత్తి మండలంలోని అబ్బేదొడ్డి, పామిడిలో ఎద్దులపల్లి, పెద్దవడుగూరులో క్రిష్టిపాడు, యాడికిలో చందన, శింగనమలలో వెస్టు నరసాపురం ప్రాంతాలను ఎంపిక చేశారు. ఇలా జిల్లా మొత్తం మీద గ్రామాల ఎంపికతోపాటు లబ్ధిదారులను గుర్తించారు. ఈనెల 8న జిల్లాలో జాతీయ ఉపాధిహామీ పథకం కింద డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద పండ్ల మొక్కలను నాటించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే పథకం అమలులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఖరీఫ్ వచ్చినా పథకాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. రైతులు పథకం అమలు కోసం ఎదురు చూస్తున్నారు.
- ఈవిషయమై వ్యవసాయ సహాయ సంచాలకుడు వెంకట్రాముడు మాట్లాడుతూ పథకం అమలుకు ఏర్పాట్లు చేశాం. భూసార సంరక్షణ విభాగం అధికారులు అమలు చేయాల్సి ఉంది. త్వరలోనే అమలులోకి వస్తుందన్నారు.

గూగూడుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఆర్టీసీ సహాయ కేంద్రంలో అధికారులు, సిబ్బంది

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తుల సౌకర్యార్థం సాధారణ ఛార్జీలతో గూగూడుకు వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. మొహర్రం సందర్భంగా నార్పల మండలం గూగూడు కుళ్లాయిస్వామిని దర్శించుకోవడానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం నుంచి ఆదివారం 65 బస్సులను ఏర్పాటు చేశారు. సోమవారం అగ్ని గుండ ప్రవేశం, జలధి ఉండటంతో 75 బస్సులు నడపనున్నారు. ఏదైనా సమాచారం కోసం గూగూడులో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు.

న్యాయాధికారుల నమూనా పరీక్ష

అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే: బాధితులకు న్యాయం జరిగినప్పుడే న్యాయవాద వృత్తిపై విశ్వాసం పెరుగుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురుప్రసాద్ అన్నారు. బార్ అసోసియేషన్ సమావేశమందిరంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ అధ్వర్యంలో ఆదివారం న్యాయాధికారుల పోటీ పరీక్షల అభ్యర్థులకు నమూనా పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు సీతారాం మాట్లాడుతూ.. పోటీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు నమూనా పరీక్ష ఎంతో దోహద పడుతుందన్నారు. న్యాయవాదుల సమస్యలు, సంక్షేమానికి సంఘం కృషి చేస్తుందన్నారు. నమూనా పరీక్ష పేపరును గురుప్రసాద్‌తోపాటు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు దర్శనింగ్, ప్రధాన కార్యదర్శి వెంకట్రాముడు, ఐలు అధ్యక్ష, కార్యదర్శులు వీరమనప్ప, సతీష్‌లు విడుదల చేశారు.

ఆపస్‌లో చేరిక

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్)లో ఆదివారం చేరారు. ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ సమక్షంలో ప్రాథమిక సభ్యత్వం తీసుకున్నారు. రామన్నను జిల్లా ఉపాధ్యక్షులుగా ప్రకటించారు.

రైతులను దగా చేసింది వైకాపా ప్రభుత్వమే : ఎంపీ

రొద్దం, న్యూస్‌టుడే : ఉమ్మడి అనంతపురం జిల్లాలో మామిడి రైతులతో పాటు ఇతర పంటలను పండించే వారిని దగా చేసింది వైకాపా ప్రభుత్వమేనని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ఆరోపించారు. ఆదివారం రొద్దం పంచాయతీలోని ఆర్. మరువపల్లిలో ఆయన పర్యటించారు. వరి సాగుకు సిద్ధం చేస్తున్న పొలం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎం.కొత్తపల్లి, మొపర్లపల్లి, రొద్దం గ్రామాల రైతులు, నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మామిడికాయలు, ఇతర పంటల దిగుబడిని కొనుగోలుచేసే ఫ్యాక్టరీల యాజమాన్యం సిండికేటు కావడానికి వైకాపా సానుభూతిపరులే కారణమని ఆరోపించారు. వైకాపా పాలనలో ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధర దక్కక అన్నదాతలు నష్టాలు చవిచూశారని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమంతోనే అభివృద్ధికి బాటలు వేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, ఎంకొత్తపల్లి, నాగరాజు, రాజప్ప తదితర రైతులు పాల్గొన్నారు.

ఆర్పీలకు ఉద్యోగ భద్రత!

గత ప్రభుత్వం తెచ్చిన మూడేళ్ల కాలపరిమితి రద్దు

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లోని రిసోర్స్ పర్సన్లకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రిసోర్స్ పర్సన్లు (ఆర్పీలు) మూడు సంవత్సరాలు మాత్రమే విధుల్లో ఉండాలనే నిబంధనలు విధించారు. దాంతో ఎప్పుడు తొలగిస్తారో అన్న భయం ఆర్పీలను వెంటాడేది. వైకాపా నేతలకు భయపడి వారు చెప్పినట్లే ఆయా సంఘాలకు పని చేసే దయనీయ పరిస్థితి ఉండేది. ఎన్నికల సందర్భంగా ఆర్పీల బాధకు ఉపశమనం కల్పిస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు.

ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు

అనంతపురం జిల్లా	
ప్రాంతం	ఆర్పీలు
అనంతపురం	129
తాడిపత్రి	45
గుంతకల్లు	73
గుత్తి	29
కళ్యాణదుర్గం	39
రాయదుర్గం	42
శ్రీసత్యసాయి జిల్లా	
పుట్టపర్తి	25
హిందూపురం	81
ధర్మవరం	69
కదిరి	50
మడకశిర	24
పెనుకొండ	24

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో మూడేళ్ల కాలపరిమితి నిబంధనను తాజాగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు భవిష్యత్తుపై భరోసా కల్పించడంతో ఆర్పీల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

మహిళా సంఘాల సమన్వయంలో ప్రధాన భూమిక

ఆర్పీలు ఆయా నగర, పురపాలకల్లోని స్వయం సహాయక సంఘాలను సుదూరకర్తగా పని చేస్తారు. మహిళలను సంఘటితం చేయడంతో పాటు ఆదాయం పెంచడంలో సంఘాలను సమన్వయం చేస్తారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు, ఒనగూరే ప్రయోజనాలను ఒక్కో ఆర్పీ కనీసం 25 నుంచి 30 సంఘాల్లోని సభ్యులకు వివరిస్తారు. మెప్మా ద్వారా రూ.8 వేలు, సంఘాలు పొందిన ఆదాయం నుంచి రూ.2 వేలు ప్రతి నెలా గౌరవ వేతనం అందజేస్తారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER
మీ బంగారు, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నచో ... Cell: 7382114647.

FINANCIAL SERVICES
... +91 99669 10410.

TO LET

COMMERCIAL
ATP టౌన్, NH-44, ... D Mart Lane/ ... Cell: 6305772976.

JOBS
... పోన్: 7093037333
ప్రముఖ E-Kart's ... 10th, డిగ్రీ, జీతం 18000 ... 79756 91563.
Airtel Wifi ... జీతం: 16,500 ... 9492404313

FACULTY/ TEACHERS
Wanted Teacher: To Teach Computer Faculty & Fluency in English Language for Academic Side. Well will Pay Attractive Payment Cost: 79810 51091.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలు ప్రకటించే ముందు ... ఈనాడు యాజమాన్యానికి ఎటువంటి సంబంధం లేదు. ...

6 లైన్ల ప్రకటన కేవలం రూ.395/- మాత్రమే
వివరాలకు : 8008709784

అభిషేక్‌రెడ్డి, పృథ్వీరాజ్‌లు శతకాల జోరు

భారీస్కోరు దిశగా చిత్తూరు జట్టు

ఎం.అభిషేక్‌రెడ్డి పృథ్వీరాజ్ షరీఫ్

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: సౌత్‌జోన్ అంతర్ జిల్లా మూడు రోజుల సీనియర్ క్రికెట్ పోటీలో చిత్తూరు జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. తొలిరోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు అనంతపురం జట్టుపై 81 ఓవర్లలో 3 వికెట్లకు 316 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంత క్రీడాగ్రామంలో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు 38 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో బ్యాటింగ్‌కు దిగిన అభిషేక్‌రెడ్డి (160), కేఎన్ పృథ్వీరాజ్ (125) అజేయ శతకాలతో భారీ స్కోరుకు పునాది వేశారు. నాలుగో వికెట్‌కు 280 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పడం విశేషం. అనంత బౌలర్లు దీపక్ 2 వికెట్లు, ప్రదీప్‌రెడ్డి ఒక వికెట్ కూల్చారు. చిత్తూరు జట్టు రెండోరోజు మరిన్ని పరుగులు జోడించి అనంత జట్టుపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. మరో పోటీలో నెల్లూరు జట్టు కడప జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో 65.5 ఓవర్లలో 288 పరుగులకు ఆలౌటైంది. నారాయణ (52), సుబ్రహ్మణ్యం (51)లు బ్యాటింగ్‌లో రాణించడంతో గౌరవ ప్రదమైన స్కోరు లభించింది. కడప బౌలరు షరీఫ్ 5 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టు బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ఆరంభించిన కడప జట్టు ఆటముగిసే సమయానికి 12.2 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 47 పరుగులు చేసింది. రెండో రోజు కడప బ్యాటర్లు క్రీజులో కుదురుకుంటే మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించే అవకాశం ఉంది.

టమాటాల వాహనం బోల్తా

శెట్టూరు మండలం యాటకల్లు, మంగంపల్లి గ్రామాల నుంచి టమాటాల లోడుతో వెళ్తున్న వాహనం సంపదకేంద్రం మలుపు వద్ద అదుపుతప్పి ఆదివారం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదు. టమాటాలు చెల్లాచెదరుగా పడిపోవడంతో సుమారు రూ.లక్ష నష్టపోయినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

- న్యూస్‌టుడే, శెట్టూరు.

వచన శతకం చెట్టు పుస్తకావిష్కరణ

అనంత సాంస్కృతికం: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అనంతపురం శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం కవి డా. జూటూరు షరీఫ్ రచించిన 'చెట్టు' (వచన శతకం) పుస్తకావిష్కరణ జరిగింది. గౌరవాధ్యక్షుడు ఉప్పరపాటి వెంకటేశులు సభాధ్యక్షత వహించారు. విమలా శాంతి సాహిత్య సామాజిక సాంస్కృతిక సమితి అధ్యక్షుడు డా. శాంతి నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అరసం రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గౌరవ అతిథిగా పాల్గొనగా, పుస్తక సమీక్షకుడుగా కవి డా. అంకె శ్రీనివాసులు వ్యవహరించారు. సాహితీ మిత్రులు షరీఫ్‌ను ఘనంగా సన్మానించారు.

పుస్తకావిష్కరణలో రచయితలు

కుదుటపడని విద్యార్థినుల ఆరోగ్యం

హిందూపురం, న్యూస్‌టుడే: సోమందేపల్లి మండలం పాపిరెడ్డిపల్లి కస్తూర్బా విద్యాలయంలో అస్వస్థతకు గురై హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఐదుగురు విద్యార్థినుల ఆరోగ్యం కుదుట పడక విరేచనాలు, కడపునొప్పితో ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజుల నుంచి ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నా విరేచనాలు తగ్గలేదని విద్యార్థినులు విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని వైద్యులకు తెలియజేస్తే అనంతపురానికి వెళ్లమంటున్నారని అంతదూరం వెళ్లలేమని, ఇక్కడే మెరుగైన వైద్యం అందించాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ చేతన్ ఆదేశాల మేరకు ఉప తహసీల్దార్ మైనుద్దీన్, ఎంఈవో ఏహెచ్ గంగప్ప ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి ఆరోగ్యస్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. ఐదుగురిలో ఇద్దరికి విరేచనాలు తగ్గలేదని వారు చెప్పటంతో మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

మురడి ఆంజనేయస్వామికి జిల్లా అదనపు జడ్జి పూజలు

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా అదనపు జడ్జి శ్రీమతి సత్యవాణి ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి మురడి శ్రీఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ గంగాధర్, సర్పంచి గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అదనపు జడ్జి సత్యవాణికి స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

హాకీ.. దుర్గం విద్యార్థుల చలాకీ

ఉచిత శిక్షణతో జాతీయ స్థాయిలో రాణింపు

శిక్షణకు హాజరైన క్రీడాకారులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: చదువుతోపాటు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ దుర్గం విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. గత ఐదేళ్లుగా కళ్యాణదుర్గం పట్టణంలోని కరణం చిక్కప్ప క్రీడా మైదానంలో హాకీలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు 230 మంది శిక్షణ పొందారు. వీరిలో జాతీయ స్థాయిలో 12 మంది, రాష్ట్రస్థాయిలో 70 మంది వరకు హాకీ టోర్నీలో పాల్గొనడం విశేషం. 15 రోజుల కిందట అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో హాకీ అకాడమీకి క్రీడాకారుల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఆరిఫా, సనాతాజ్, సాయిప్రజ్ఞ, సిమ్రాన్‌తాజ్, స్వాతిక ఎంపికైనట్లు హాకీ కళ్యాణదుర్గం, మారెంపల్లి క్లబ్ అసోసియేషన్ అధ్యక్షులు తిమ్మరాజు, బాబు, కోచ్ అక్రమ్ తెలిపారు.

జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యం

నాన్న మరణించడంతో అమ్మ టైలర్ పని చేస్తూ నన్ను చదువు, క్రీడల్లో ప్రోత్సహిస్తోంది. ఉచితంగా హాకీలో శిక్షణ పొందుతూ రాష్ట్రస్థాయిలో టోర్నీలో రెండుసార్లు పాల్గొని మొదటి, రెండు స్థానాలు సాధించాను. జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. **- ఆరిఫా, పదోతరగతి**

గోల్‌కీపర్‌గా ఆడుతున్నా..

తండ్రి కూలీ పనులు చేస్తున్నారు. కుటుంబం గడవడం కష్టంగా ఉన్నా నన్ను చదివిస్తున్నారు. హాకీలో ఉభయ జిల్లాల అండర్-12 స్థాయి విభాగంలో పాల్గొని విజయం సాధించాం. నేను జట్టులో గోల్‌కీపర్‌గా ఆడుతున్నాను. దేశస్థాయిలో రాణించాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నా. **- సనాతాజ్, 8వ తరగతి**

క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలని..

నాన్న హమాలి పని చేస్తూ నన్ను చదివిస్తూనే కుటుంబాన్ని పోషిస్తున్నారు. జిల్లా, రాయలసీమ స్థాయి టోర్నీల్లో రెండుసార్లు పాల్గొని ప్రతిభ చూపాను. క్రీడాకోటాలో ఉద్యోగం సాధించాలనే తపనతో కష్టపడుతున్నాను. **- స్వాతిక, 7వ తరగతి**

విద్యార్థుల్లో క్రీడానైపుణ్యాన్ని వెలికితీసేందుకే..

హాకీలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని పిల్లలకు శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థుల్లో దాగిన క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కృషి చేస్తున్నాం. పిల్లలు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. రాష్ట్రస్థాయిలో చక్కటి ప్రతిభ కనబరుస్తున్నారు. హాకీలో అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి తీసుకురావాలనే సంకల్పంతో ఉన్నాం. **- శంకర్, శిక్షకుడు, ఆర్డీటీ హాకీ అకాడమీ, అనంతపురం**

పోలీసుల అదుపులో హత్యకేసు నిందితుడు?

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం గీతానగర్‌కు చెందిన రమాదేవి హత్య కేసులో నిందితుడిని ధర్మవరం ఒకటో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. గత నెల 29న గీతానగర్ ఇంట్లో రమాదేవి గాయాలతో అపస్మారక స్థితిలో ఉండటం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే ఆమెను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 4న మృతిచెందారు. కేసు నమోదు చేసిన పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. రమాదేవి ఇంటి ఎదురుగా నివాసం ఉన్న రాజశేఖర్ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. రమాదేవిని ఆసుపత్రిలో చేర్పించిన రోజు నుంచి మృతిచెందిన అనంతరం శవ పంచనామా వరకు రాజశేఖర్ వెళ్లారు. రాజశేఖర్ ప్రవర్తనలో మార్పు కనిపించడంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ చేశారు. మృతురాలి ఎదురింటిలో నివాసముంటున్న రాజశేఖర్‌ను తిట్టిందనే కారణంతో దాడి చేసి, తువ్వాలుతో గొంతును బిగించినట్లు పోలీసుల విచారణలో నిందితుడు వెల్లడించినట్లు సమాచారం.

చెత్త గుట్ట.. కదలని మురుగు

మున్సిపల్ వాహనాలకు మాత్రమే చెత్త చెదారాన్ని అందించాలని పలుమార్లు అధికారులకు సూచించినా కొంత మంది మారలేదు. ఇష్టానుసారంగా ప్లాస్టిక్ సీసాలు, ఇళ్లల్లోని వ్యర్థాలను మురుగు కాలువల్లో పడేస్తున్నారు. తాడిపత్రిలోని చింతలరాయుని పాళెం ప్రధాన వీధిలో ఉన్న మురుగు కాలువలో భారీగా చెత్త పేరుకుపోయింది. దీనిపై మున్సిపల్ ఏఈ నాగేంద్రను వివరణ కోరగా వెంటనే కార్మికులను పంపి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే తాడిపత్రి

కళ్లలో కారం కొట్టి బంగారు గొలుసు చోరీ

మొరసనపల్లి(చిలమత్తూరు), న్యూస్‌టుడే: గడ్డిమోపుతో ఇంటికి వస్తున్న మహిళ కళ్లలో దుండగులు కారం కొట్టి బంగారు గొలుసు అపహరించిన ఘటన చిలమత్తూరు మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. మొరసనపల్లి గ్రామానికి చెందిన కృష్టారెడ్డి, శాంతమ్మలు జీవనాధారం కోసం రెండు ఆవులను పోషిస్తున్నారు. వాటికి గడ్డి తేవడానికి శాంతమ్మ ఆదివారం పొలానికి వెళ్లింది. మేతను కోసుకుని గ్రామంలోకి చేరుకునే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కళ్లలోకి కారం కొట్టి దాదాపు మూడు తులాల బంగారు గొలుసును తెంచుకొని పారిపోయారు. గ్రామస్థులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. 108 వాహనంలో బాధితురాలిని చిలమత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఫిర్యాదు తీసుకున్న పోలీసులు దీనిపై విచారణ ప్రారంభించారు.

వాహనంలో బాధితురాలు

జల్సాల కోసమే వృద్ధురాలి హత్య

మడకశిర, న్యూస్‌టుడే : మడకశిర మండలం మణూరులో జూన్ 28న ఇంటిలో ఒంటరిగా ఉన్న ముత్తక్క(71)ను అదే గ్రామానికి చెందిన చౌడప్ప, బిహార్‌కు చెందిన ఊర్మిళాదేవిలే హత్యచేశారని పోలీసులు వెల్లడించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ నరసింగప్ప, సీఐలు నాగేష్‌బాబు, రాజకుమార్‌లు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొన్నేళ్ల నుంచి చౌడప్ప, బిహార్‌కు చెందిన ఊర్మిళాదేవితో వివాహేతర సంబంధం ఉంది. వీరిద్దరూ వ్యసనాలకు బానిసై వారి జల్సాలకు అవసరమైన డబ్బు కోసం ఒంటరిగా ఉన్న ముత్తక్కను హత్య చేసేందుకు పథకం పన్నారు. పథకం ప్రకారమే ఇంటిలోకి దూరి మంచంపై నిద్రిస్తున్న ముత్తక్కను కిందకు ఈడ్చి అరవకుండా నోటిపై తలదిండు పెట్టి గట్టిగా ఇనుప రాడ్డుతో ఆమె గొంతుపై నొక్కి చంపారు. అనంతరం మెడలో ఉన్న బంగారు గొలుసు, వెండి పట్టీలు, బీరువాలోని రూ.25వేల నగదును దోచుకుని పరారైనట్లు విచారణలో ఒప్పుకొన్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి సోమవారం మడకశిర కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప, సీఐలు నాగేష్‌బాబు, రాజకుమార్

రైల్లో నుంచి పడి ప్రయాణికుడి మృతి

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి-పామిడి రైల్వేస్టేషన్ల మధ్య రైల్లో నుంచి జారిపడి ఓ ప్రయాణికుడు మృతిచెందాడు. గుత్తి-బెంగళూరు రైలుమార్గంలో శనివారం రాత్రి గుర్తు తెలియని ప్రయాణికుడు(35) రైలు బోగీలో వాకిలి వద్ద కూర్చోగా కుదుపులకు పట్టుతప్పి కిందపడి మృతిచెంది ఉండవచ్చని జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని ఆదివారం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒకరిపై కత్తితో దాడి

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని సుంకులమ్మ పాళెంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి సుంకులమ్మపాళెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రఫీక్ తన భార్యతో గొడవ పడుతుండగా అదే కాలనీకి చెందిన రఫీ ఆపేందుకు వెళ్లాడు. ఈక్రమంలో రఫీక్ వద్ద ఉన్న కత్తితో దాడి చేసినట్లు తెలిపారు. గాయపడిన రఫీక్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరికీ గత కొంత కాలంగా గొడవలు న్నాయి. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి హఠాన్మరణం

క్రికెట్ ఆడుతూ ఉన్నట్టుండి కుప్పకూలిన విద్యార్థి

యోగానందరెడ్డి

గోరంట్ల, న్యూస్‌టుడే: నిండూనూరేళ్లు ఆయురారోగ్యాలతో కుటుంబానికి ఆసరాగా నిలవాల్సిన 19 ఏళ్ల విద్యార్థి హఠాన్మరణం చెందడం మండలంలోని కళ్లగేరి గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు విశ్వనాథరెడ్డి, సుజాతమ్మల రెండో కుమారుడు యోగానందరెడ్డి(19) డిగ్రీ రెండోసంవత్సరం చదువుతున్నాడు. గ్రామంలో శనివారం తోటి యువకులతో కలిసి క్రికెట్ ఆడుతుండగా ఉన్నపళంగా కిందపడిపోయాడు. వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. గుండె సంబంధ సమస్యగా గుర్తించిన వైద్యసిబ్బంది పుట్టపర్తికి పంపించారు. అక్కడికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని సమీప బంధువులు తెలిపారు.

మొహర్రంలో విషాదం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులోని కూరగాయల మార్కెట్ దగ్గర తాటకుల వీధిలో ఖయ్యూం(46) మృతిచెందాడు. ఈఘటన ఆదివారం ఉదయం జరిగింది. ఫక్కీరప్ప కాలనీకి చెందిన ఖయ్యూం పెద్దపీర్లను మోశాడు. తరవాత పక్కన ఉన్నవారికి పీర్లను అప్పగించి ఛాతిలో నొప్పి ఉందంటూ కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న అతని కుమార్తెలు కేకలు వేయడంతో స్థానికులు గమనించి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు చేయగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు.

(c) eenadu

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

పెనుకొండ, న్యూస్‌టుడే: ఈనెల 9న దేశ వ్యాప్తంగా చేపట్టబోయే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కరపత్రాలను ప్రదర్శించారు. ఏఐటీయూసీ జిల్లా సహాయకార్యదర్శి రమేశ్, నగరపంచాయతీ యూనియన్ నాయకుడు కరణ్ పాల్గొన్నారు.
● పట్టణంలోని గాంధీ కూడలిలో దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బాబావలి ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. సీఐటీయూ నాయకులు, నగరపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

హిందూపురం

● హిందూపురం ● పెనుకొండ ● మడకశిర

కదిరేపల్లిలో జ్యోతులతో వస్తున్న మహిళలు

ఉట్ల పరుష మానుకు పూజలు చేస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 80085 73018
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య : నాగిరెడ్డిపల్లి నుంచి రొద్దానికి వెళ్లే మట్టి రోడ్డులో కల్వర్టు దెబ్బతింది. **-గోవిందప్ప**
సమాధానం : కల్వర్టును పరిశీలించి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపిస్తాం. **-వెంకటరానాయణ, మండల ఇంజినీరు**
సమస్య : బూచెర్ల చెరువు సమీపంలోని నియంత్రిక చుట్టూ కంపచెట్లు పెరిగాయి. **-పోతన్న**
సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకొంటాం. **-శ్రీనివాసమూర్తి, ఏఈ, విద్యుత్తు శాఖ, రొద్దం**
సమస్య: సింగేపల్లి గ్రామంలోని ప్రధాన రోడ్డుపై మురుగు ప్రవహిస్తుంది. **-రంగదామ**
సమాధానం: హరితరాయబారులతో తొలగిస్తాం. **-రెడ్డిప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి.**
సమస్య: పూజారిపల్లిలో కుళాయిలకు బిరడాలు లేక నీరు వృథా అవుతోంది. **-రంగనాథ్**
సమాధానం: బిరడాలు బిగించి వృథాను అరికడతాం. **-కవిత, సర్పంచి, కొంకల్లు.**
–న్యూస్‌టుడు, రొద్దం, గుడిబండ

తీగల చోరీలు.. హడలిపోతున్న రైతులు

పంచాయతీల బోర్లనూ వదలని దొంగలు

కాగనపల్లి వద్ద పట్టుబడిన చోరుల వద్ద లభించిన తీగలు

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల మండలంలోని వివిధ పంచాయతీల పరిధిలో విద్యుత్తు సర్వీసు తీగల చోరీలతో అటు రైతులు, ఇటు పంచాయతీ సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. సాగుచేసిన పంటలు నష్టపోతుండడంతో పాటు రూ.వేలల్లో అదనపు భారం పడుతోందని రైతులు వాపోతున్నారు. అసలే నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీ సర్పంచులు చోరీలకు గురవుతున్న రక్షిత మంచినీటి పథకాల విద్యుత్తు మోటార్ల వద్ద మళ్లీ అమర్చలేక తలలు పట్టుకొంటున్నారు. గోరంట్ల మేజర్ పంచాయతీలో ఆ సమస్య మరీ కష్టతరంగా ఉందని సిబ్బంది అంటున్నారు. ఎలా కట్టడి చేయాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బూదిలి, నార్సింపల్లి పంచాయతీల్లో చోరీలు ఎక్కువగా జరిగినట్లు రైతులు కన్నీరు పెడుతున్నారు. కాగానపల్లి వద్ద ఇటీవల ఇద్దరు కేబుల్‌తీగల చోరులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

మొదటిసారి చోరీ జరిగిన వెంటనే ఫిర్యాదు చేయాలి. అలాగే ఉండిపోరాదు. ఫిర్యాదు అందితే తగు చర్యలు తీసుకుంటాం. **-శేఖర్, సీఐ**

గడిచిన రెండు నెలల్లో జరిగినవి

● గోరంట్ల పంచాయతీ ప్రజలకు మంచి నీరు అందిస్తున్న మరవ ఆంజనేయస్వామి బోరువద్ద జూన్ నెలలో అయిదుసార్లు సర్వీస్ తీగ చోరీ జరిగింది. మిలిటరీ ఫక్రుద్దీన్ పొలంవద్ద, ఆర్కే థియేటర్ ప్రాంతాల్లో ఉన్న పంచాయతీ బోర్లవద్ద తీగలు చోరీలకు గురయ్యాయి.
● బూదిలి పంచాయతీ కాగానపల్లి గ్రామానికి నీరందిస్తున్న రక్షిత మంచినీటి పథకపు కేబుల్ నాలుగుసార్లు, బూదిలి ప్రాథమిక పాఠశాల సమీపంలో, తండా సమీపంలోని బోర్ల వద్ద కత్తిరించడంతో రూ.రెండు లక్షల వరకు ఖర్చుపెట్టినట్లు సర్పంచి రామాంజనేయులు వివరించారు.
● కాగానపల్లి సమీపంలో రైతుల బోర్ల వద్ద తరచూ సర్వీసు తీగల చోరీలు జరుగుతున్నట్లు రైతు దివాకరరెడ్డి పేర్కొన్నారు.
● ఎర్రబల్లి, నార్సింపల్లి గ్రామ సమీపాల్లో బోర్లు, వ్యవసాయ మోటార్ల వద్ద చోరీలు జరిగినట్లు రైతులు సురేంద్రనాథరెడ్డి, గంగాధర్ తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి ఏకాదశి పూజలు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: కదిరేపల్లిలో తొలి ఏకాదశి పండగ నేపథ్యంలో ఆదివారం లక్ష్మీనరసింహస్వామికి మహిళలు, యువతులు జ్యోతులు సమర్పించారు. ఎంపీ బీకే పార్థసారథి, జిల్లా నాయకులు నరసింహులు, గోపాల్, కదిరప్ప తదితరులు స్వామి వారిని దర్శించుకొని విశేష పూజలు చేశారు. అనంతరం సోమవారం నిర్వహించనున్న ఉట్ల పరుష మానుకు ఎంపీ, గ్రామ పెద్దలు, నాయకులు జయరామిరెడ్డి, సంజీవరెడ్డి, రామకృష్ణ, శరత్‌చంద్రారెడ్డి తదితరులు పూజలు చేశారు.

గోరంట్ల : తొలిఏకాదశి సందర్భంగా గుంతపల్లిలో మహిళలు జ్యోతులతో ఆలయం వరకు ఊరేగింపుగా తరలివచ్చారు. పెరుమాళ్లపల్లిలో కార్యక్రమాలు వైభవంగా ప్రారంభించారు. గోరంట్లలోని ఆలయాల్లో పెద్దసంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు.

రొద్దం : నారనాగేపల్లిలోని వీరజిన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏకాదశి సందర్భంగా ఎడ్లబండ్ల ప్రదర్శన వైభవంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో రైతులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

గుంతపల్లిలో జ్యోతులతో ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న మహిళలు

నారనాగేపల్లిలో ఎడ్లబండ్ల ప్రదక్షిణ

దేవరపల్లిలో పారిశుద్ధ్య చర్యలు

హిందూపురం గ్రామీణం : ప్రజా ఆరోగ్యం దృష్ట్యా తూముకుంట పంచాయతీలోని దేవరపల్లి గ్రామంలో రెండు రోజులుగా పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. 'మెరుగుపడని పారిశుద్ధ్యం' శీర్షికన 'ఈనాడు'లో చిత్ర వార్త ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. అన్ని ప్రాంతాల్లో చెత్తను తొలగించారు. బ్లీచింగ్ పౌడర్ వేయించి, దోమల నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. ఎంపీడీవో సరస్వతి, ఈవోఆర్‌డీ శివకుమార్ పర్యవేక్షించి గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలు కూడా ముందుకురావాలన్నారు. సర్పంచి రత్నమ్మ, గ్రామ కార్యదర్శి కెంచరాయప్ప పాల్గొన్నారు.

స్పందనకు వందనం

రొద్దం : బూచెర్లలో పెద్దమ్మ ఆలయం వద్ద నుంచి రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు సమస్యను పంచాయతీ కార్యదర్శి జ్యోతి పరిష్కరించారు. రొద్దం బస్టాండులో ప్రధాన రహదారి మధ్యలో నిలిచిన మురుగును ఈవోపీఆర్డీ గోవిందప్ప పంచాయతీ వర్కర్ల ద్వారా తొలగింపజేశారు. రొద్దం శుద్ధ జల కేంద్రాంలో నీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

నేడు అగళి మండలంలో ఎమ్మెల్యే పర్యటన

అగళి : మండలంలో పలు గ్రామాల్లో నేడు మడకశిర శాసనసభ్యుడు ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పర్యటించనున్నట్లు మండల తెదేపా కన్వీనర్ తిప్పేస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. పీ.బ్యాడిగెర, హెచ్‌డీపల్లి, కెంకెర గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

గోరంట్ల: రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని మండల రజక సంఘం సభ్యులు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవిని శనివారం కార్యాలయంలో కలిసి వినతి అందజేసినట్లు తెలిపారు. రజకులను ఎస్టీల్లో చేర్చాలని, ప్రతిమండల కేంద్రంలో రజక కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలని, శిథిలావస్థలో ఉన్న ధోబీ ఘాట్లకు మరమ్మతులు చేస్తూ నూతన నిర్మాణాలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు.

ఐదులాంతర్ల సర్కిల్‌లో పీర్లు

గుడ్డంపల్లిలో పీరుతో అగ్నిగుండంలో నడుస్తున్న భక్తుడు

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వారం రోజుల నుంచి పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం వేకువజామున పీర్లను ఐదులాంతర్ల సర్కిల్‌కు చేర్చారు. అక్కడ భక్తులు చక్కెర చదివింపులు, పుష్పాల సమర్పణ, పొర్లుదండాలు వేసి తమ మొక్కులు తీర్చుకున్నారు.

అగళి: మండల పరిధిలోని ఆలాది గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో మొహర్రం నిర్వహించారు. పీర్లను గ్రామంలో ఊరేగించారు.

మడకశిర గ్రామీణం : గుడ్డంపల్లి గ్రామంలో పీర్లను మోసుకుని బాబయ్యస్వామిని స్మరించుకుంటూ భక్తులు అగ్ని గుండంలో నడిచారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని చక్కెర చదివించి పూలు వేసి మొక్కులు తీర్చుకున్నారు.

పరిగి : పరిగి మండలంలోని శీగుపల్లి, పరిగి, తదితర గ్రామాల్లో ఆదివారం పీర్లకు ప్రార్థనలు చేశారు. ఆదివారం జలధికి తరలించారు.

జలధికి తరలింపు..

పెనుకొండ : పట్టణంలోని బాబయ్యస్వామి దర్గాలోని దివాన్‌ఖానలో ఐదురోజులుగా పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం పీర్ల స్వాములను ఊరేగిస్తూ జలధికి తరలించారు. జలధి అనంతరం సాంప్రదాయ తీపి(చవంగాలు)రొట్టెలు పంపిణీ చేశారు.

అగ్ని గుండం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న యువకులు

లేపాక్షి చిత్ర, శిల్పకళా సౌందర్యం అద్భుతం

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయంలోని పురాతన చిత్ర, శిల్పకళా సౌందర్యం ఎంతో అద్భుతంగా ఉందని మాజీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. ఆదివారం పుట్టినరోజు సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారిని ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ, ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ వారసత్వ కట్టడాల తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకున్న లేపాక్షిలో పర్యాటకులకు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, పార్లమెంట్ సభ్యుడు కలిసి ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. యునెస్కో మార్గదర్శకాలకు అనుగుణంగా ఇక్కడ ఏర్పాట్లు చేసినట్లైతే ఇది యునెస్కో శాశ్వత జాబితాలో చేరే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్, భాజపా నాయకులు పార్థసారథి, దేవానంద్, ఆదర్శకుమార్, బద్రి, నరసింహమూర్తి, పరిగి వేణుగోపాల్‌రావు, తదితరులు ఉన్నారు.

ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో జీవీఎల్ నరసింహారావు

పరిగిలో ఉచిత వైద్య శిబిరం

పరిగి, న్యూస్‌టుడే: పరిగిలో స్థానిక షాదీ మహల్‌లో ఆదివారం వైకాపా ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డా. రామ్‌కుమార్, డా.షాహిద్‌ల ఆధ్వర్యంలో రోగులకు గుండె, కంటి వైద్య పరీక్షలు చేశారు. స్థానిక వైకాపా నాయకులు సలీం, శివశంకర్, పి.శంకర్ పాల్గొన్నారు.

బ్రహ్మరథోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

వైభవంగా రుక్మిణీ పాండురంగడి రథోత్సవం

హిందూపురం అర్బన్, గ్రామీణం(ముద్దిరెడ్డిపల్లి): పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లిలోని రుక్మిణీ పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తజన సమూహం నడుమ బ్రహ్మరథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చిన్నారులు చేసిన చెక్కభజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్, ఆలయ గౌరవాధ్యక్షుడు మద్దన జయరాములు, అధ్యక్షుడు పద్మశ్రీకుమార్, కార్యదర్శి శ్రీరాములు, ధర్మకర్త చింతా గోపాల్, ట్రెజరర్ చింతా రామాంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

పేట వేంకటరమణుడికి ప్రత్యేక అలంకరణ

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని పేట వేంకటరమణస్వామి ఆలయంలో ఆదివారం తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రాతఃకాలంలో, విఠల పాండురంగడి అలంకరణ చేశారు. మహిళలు ఉదయం నుంచి రాత్రి వరకు విష్ణుసహస్రనామ పారాయణం చేశారు.

విఠల పాండురంగడిగా స్వామి

అక్రమ వాహనదారుల గుండెల్లో దడ

హిందూపురం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం నడిపేందుకు లైసెన్సులు లేని, రికార్డులు లేని ద్విచక్రవాహన దారులకు పురం పోలీసులు భారీగా అపరాధ రుసుం విధించారు. ఆదివారం సాయంత్రం టూటౌన్ సీఐ అబ్దుల్‌కరీం, సిబ్బంది రహమత్‌పూర్ కూడలిలో ద్విచక్రవాహనాలను తనిఖీ చేశారు. నూతన వాహనా చట్టం మేరకు ఒక్కో వాహనదారుడికి రూ.5వేల అపరాధ రుసుము విధించటంతో ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

పట్టుదలతో విద్యను అభ్యసించండి

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి పోటీతత్వం అర్థం చేసుకుని విద్యనభ్యసిస్తే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు వస్తాయని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జేపీకే రాము పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో రెండో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న 58 మంది ఆర్యవైశ్య విద్యార్థినీ విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి కేపీఈ శ్రీకాంత్, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడి మృతి

హిందూపురం, న్యూస్‌టుడే: ఆదివారం సాయంత్రం స్థానిక రైల్వేస్టేషన్‌లోని ఒకటో ప్లాట్‌ఫారం షెడ్ కింద గుర్తుతెలియని వృద్ధుడు(68) మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. ఇతని వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవని, ఇతను ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా తెలుస్తోందన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, ఇతడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని కోరారు.

డబ్బు వివాదంతో హత్యాయత్నం

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణంలోని అహ్మద్‌నగర్‌కు చెందిన నూర్‌మహ్మద్, రాఖీ మధ్య శనివారం రాత్రి డబ్బు విషయంలో వివాదం తలెత్తింది. ఆ సమయంలో మద్యం తాగి ఆగ్రహానికి గురైన రాఖీ కత్తితో నూర్‌మహ్మద్ గొంతుకోశాడు. కొనఊపిరితో ఉన్న అతను అరవటంతో సమీపంలో ఉన్న వారు రక్షించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యసేవలకు బెంగళూరుకు తరలించారు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోతిచేష్టలతో మహిళకు గాయాలు

పెనుకొండ: కోతి చేష్టలకు ఓ మహిళ గాయపడిన ఘటన పెనుకొండలో ఆదివారం చోటుచేసుకుంది. పట్టణంలోని పాత తపాలా కార్యాలయం వద్ద ఉన్న జువ్విచెట్టుపై కోతులు గెంతుతున్న సమయంలో గాలులు వీయడంతో కొమ్మలు విరిగి నడుతచుకుంటూ వెళుతున్న ఎగువగడ్డకు చెందిన రుక్మిణమ్మపై పడ్డాయి. ప్రమాదంలో తలకు తీవ్రగాయాలవ్వడంతో స్థానికులు ఆమెను ఆటోలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. నగరపంచాయతీ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని రోడ్డుపై అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి రాకపోకలకు ఇబ్బందిలేకుండా చేశారు. పట్టణంలో కోతులతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి కోతులు ఇళ్ల వద్దకు రాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా గుడ్డద రంగప్పస్వామి ఉత్సవం

అగళి న్యూస్‌టుడే: తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని హెచ్‌డీపల్లిలో వెలసిన గుడ్డద రంగప్పస్వామి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. తెదేపా మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, జెడ్పీటీసీ ఉమేశ్, కన్వీనర్ తిప్పేస్వామి, మాజీ కన్వీనర్ కుమారస్వామి పాల్గొన్నారు.

11న వాసవీమాతకు పూజలు

హిందూపురం అర్బన్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈనెల 11న వాసవీమాతకు అభిషేకార్చనలు, రుద్రస్వాహాకార, మృత్యుంజయ, 108 కమలాలతో హోమాలు, మహాపుష్పయాగం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జేపీకే రాము ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అనంత సాహితీ ఉత్సవ పురస్కారం

లేపాక్షి, న్యూస్‌టుడే: మండలంలోని చోళసముద్రం ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న హరిప్రసాద్‌కు ఆదివారం అనంత సాహితీ ఉత్సవ పురస్కారం దక్కింది. లేపాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో హరిప్రసాద్ పాల్గొని యోగాంధ్రపై కవితను వినిపించారు. ఇందుకు ఫౌండేషన్ ప్రతినిధులు సుధాకర్ మిత్ర బృందం కలిసి జ్ఞాపికను అందించి సన్మానించారు.

అధ్వాన రహదారితో అవస్థలు

కోడూరు నుంచి మధురేపల్లి, సుబ్బరావుపేట, చాగలేరు, పలగలపల్లి తదితర గ్రామాలకు కొన్నేళ్లు మట్టిరోడ్డే దిక్కయ్యింది. పగలు ఎలాగైన ప్రయాణం చేయవచ్చు కాని రాత్రి సమయంలో ప్రజలకు ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే 108 వాహనం కూడా గ్రామానికి రానీ పరిస్థితి ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే తారురోడ్డు వేయించాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, చిలమత్తూరు

ఘనంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

పరిగి: పరిగిలో ఆదివారం స్థానిక భాజపా కార్యాలయంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను నిర్వహించారు. భాజపా నాయకుడు పరిగి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎన్.ఎల్. నరసింహమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, మూర్తి, శ్రీనివాస్, శివకుమార్, సురేంద్ర, జనసేన నాయకుడు అశ్వర్థ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధిపై దృష్టి సారించాలి

గుడిబండ, న్యూస్‌టుడే: అధికారులు సిబ్బంది ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలని ఎంపీడీవో కేశవరెడ్డి తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఆదివారం ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపతహసీల్దార్ రాంభూపాల్‌రెడ్డి, ఈవోఆర్డీ నాగరాజ నాయక్, ఏపీవో జగదీశ్, కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశాలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు

గోరంట్ల: దేశాభివృద్ధికి పల్లెలే పట్టుకొమ్మలని ఎంపీడీవో నరేంద్రకుమార్ పేర్కొన్నారు. ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవాన్ని పురస్కరించుకుని గోరంట్ల ఒకటో సచివాలయంలో ఆదివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కూటమి నాయకులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పగలూరాత్రీ వెలుగులు

పెనుకొండ పట్టణంలోని పలుకాలనీల్లో వీధిదీపాలు రాత్రీ, పగలు తేడాలేకుండా వెలుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీలు తగ్గించి నగరపంచాయతీ ఆదాయం పెంచాలన్న లక్ష్యంతో ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేసినా, ఆన్‌ఆఫ్ స్విచ్‌లు లేకపోవడంతో పట్టణంలోని వజ్రాల పేటలో పలుచోట్ల వెలుగుతూ కనిపించాయి. ఈ విషయాన్ని కమిషనర్ సతీశ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా పట్టణంలో వీధి దీపాలకు మూడోతీగ లేకపోవడంతో సమస్యలున్నాయని, వెంటనే సిబ్బందిని పంపి క్షేత్రస్థాయిలో పరిశీలించి స్విచ్‌లు ఏర్పాటు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పెనుకొండ

మురుగు కాలువలో తాగునీటి పైపులు

ఆమిదాలగొంది గ్రామంలో మురుగు కాలువలో తాగునీటి పైపులు వెళ్లాయి. పైపులు లీకవుతుండటంతో తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు వాపోతున్నారు. సత్వరమే పైపులైన్‌ను వేరే చోటకు మార్చాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాజేశ్‌ను వివరణ కోరగా పైపులైన్ వేరేచోటకు మార్చనున్నట్లు తెలిపారు. –న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం

సాయి సన్నిధి.. సేవా పెన్నిధి

హిందూపురం గ్రామీణం, అర్బన్, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణంలోని లేపాక్షి రోడ్డు సాయినగర్‌లో వెలసిన సాయి మందిరం సేవ మార్గంలో నడుస్తూ ప్రసిద్ధిగాంచింది. 1990లో బాబా సమాధిని ఏర్పాటు చేసి, భక్తుల విరాళాలతో 2002లో స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సాయిసేవా ట్రస్టు తరఫున పేద విద్యార్థులకు రాతపుస్తకాలు ఇవ్వడం, ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సాయం చేస్తున్నారు. దీంతోపాటు ప్రశాంత వాతావరణం కోసం ధ్యానమందిరం నెలకొల్పారు. ఈ స్ఫూర్తితోనే హిందూపురం పరిసరాల్లోని పులమతి, లేపాక్షి, పరిగి, మోదా, ఎస్.సడ్లపల్లి, మిట్టమీదపల్లి, జంగాలపల్లి, ముద్దిరెడ్డిపల్లి, సేవామందిరం, కొటిపి, చిలమత్తూరు, తదితర ప్రాంతాల్లో 30కి పైగా సాయి ఆలయాలు నడిపిస్తున్నారు.

సాయినాథుడి విగ్రహం

విశేష పూజా కార్యక్రమాలు

● శ్రావణమాసంలో నాలుగు గురువారాలు ప్రత్యేక పూజలు చేస్తారు. ● ప్రతి గురువారం భజన కార్యక్రమాలు, ప్రాకారోత్సవం, దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం జరుగుతాయి. ● 2023 నుంచి ప్రతి గురువారం అన్నదాన కార్యక్రమం చేస్తారు.

త్వరలో అన్నసంతర్పణ భవనం ప్రారంభం

భక్తులు, దాతల విరాళాలతో నూతనంగా నిర్మించిన అన్నసంతర్పణ భవనాన్ని త్వరలో ప్రారంభిస్తాం. భవిష్యత్తులో భక్తులను శిర్డీకి తీసుకెళ్లాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

- రంగస్వామి, భక్తప్రతినిధి

భిక్షాటనలో మహిళలు, సాయిభక్తులు

మహిళల భిక్షాటన

హిందూపురం అర్బన్ : గురుపౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని సత్యనారాయణపేటలో ఉన్న సాయిబాబా ఆలయంలో ఆదివారం శిర్డీ శేషసాయి సంస్థాన్ ఆధ్వర్యంలో బాబా చిత్రపటంతో మహిళలు, సాయిభక్తులు 'పుర' వీధుల్లో భిక్షాటన చేశారు. భక్తులు సమర్పించిన బియ్యం, కందిబేడలు, ఇతరత్రావస్తువులన్నీ సేకరించి వాటిని గురుపౌర్ణమి రోజున భక్తులకు ప్రసాదంగా అందజేస్తామని ఆలయ నిర్వాహకులు రమేశ్, సురేఖలు పేర్కొన్నారు. సమదుస్తులు ధరించి పెద్ద సంఖ్యలో మహిళలు భిక్షాటన చేయడం ఆసక్తిగా నిలిచింది.

వైకాపాలో నువ్వా.. నేనా!

పురంలో తారాస్థాయికి వర్గపోరు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం వైకాపాలో నాయకత్వ పోరు తారాస్థాయికి చేరింది. వైకాపాలో ఇక్కడ నాలుగు గ్రూపులుండగా, రెండు గ్రూపులు నాయకత్వం కోసం తీవ్రంగా ఆరాటపడుతున్నాయి. ప్రస్తుతం పార్టీ సమన్వయకర్తగా పనిచేస్తున్న దీపికను తొలగించి ఆ స్థానంలో మరొకరిని నియమించాలని అసమ్మతి నాయకులు అధిష్ఠానం ముందు పంచాయతీ పెట్టారు. ఇదే సమయంలో సీనియర్ నాయకుడు, ప్రముఖ వ్యాపారవేత్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి ఇటీవల జోరు పెంచారు. తాను పార్టీ కోసం పూర్తిస్థాయిలో కష్టపడతానని, వందల కోట్ల రూపాయలు ఆస్తులు ఉన్నాయని, పార్టీ కార్యక్రమాల కోసం సొంతంగా ఖర్చు పెట్టుకొంటానని చెబుతున్నారు. అధిష్ఠానంలోని పలువురు ముఖ్య నేతలను కలిశారు. తనకు పార్టీ బాధ్యతలు అప్పగించాలని కోరారు. పార్టీలోని పలువురు నాయకులను కొద్ది రోజులుగా కలుస్తూ తనకు మద్దతు పలకాలని కోరుతున్నారు. ఆయన గత శుక్రవారం పట్టణంలోని ముస్లిం మైనార్టీల్లో ముఖ్య నాయకులందరినీ కలిశారు. వారితో రాజకీయ చర్చలు జరిపారు. పార్టీ నాయకత్వ బాధ్యతలు తనకు వచ్చే అవకాశముందని, మద్దతుగా నిలవాలని కోరారు. ప్రస్తుతం సమన్వయకర్త దీపికపై అసంతృప్తితో ఉన్న పలువురు నాయకులు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి వర్గంలో ఇప్పటికే చేరిపోయారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని సైతం రెండు వర్గాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. వేడుకల నిర్వహణకు పోటాపోటీగా ఏర్పాట్లు చేస్తున్నారు. జన సమీకరణ కోసం రెండు వర్గాలు శనివారం తమ మద్దతుదారులతో చర్చలు జరిపారు. గత ఎన్నికల్లో కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టిన ప్రస్తుత సమన్వయకర్త దీపిక, ఆమె భర్త వేణురెడ్డికి తాజా పరిస్థితులు మింగుడు పడటం లేదు. ఎన్నికల్లో తాము పనిచేస్తే ప్రస్తుతం నాయకత్వం కోసం కొండూరు వేణుగోపాల్‌రెడ్డి జోరుగా ప్రయత్నాలు చేయడం, పలువురిని కూడగట్టడం, సమావేశాలు నిర్వహించడం వారి వర్గాన్ని తీవ్ర అసంతృప్తికి గురి చేస్తోంది. అధిష్ఠానంలోని ముఖ్య నేతలు, నాయకత్వం కోసం పడుతున్న ఇద్దరికీ జోల పాడుతుండటం వారిని కలవరపరుస్తోంది.

మైనార్టీ నాయకులతో కొండూరు వేణుగోపాల్‌రెడ్డి

(c) eenadu

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

పరీక్షలు చేస్తున్న వైద్యులు

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర ప్రారంభించారు. బెంగళూరు నేత్రజ్యోతి కంటి ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేశారు. దాత పూజారి జగదీశ్‌ను సన్మానించారు. 78 మందికి పరీక్షలు నిర్వహించగా, కంటి శస్త్రచికిత్సలకు 48 మందిని ఎంపిక చేశారు. కార్యదర్శి జయరాం, కోశాధికారి మోహన్, క్యాంపు ఛైర్మన్ చాంద్ బాషా, శ్రీనివాసులు, కౌన్సిలర్ లోకేశ్, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టుపల్లిలో కరపత్రాలు పంచుతున్న తెదేపా నాయకులు

కూటమితోనే సుపరిపాలన

ముదిగుబ్బ: మండలంలోని కొండగట్టుపల్లిలో తెదేపా మండల కన్వీనర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు బాబి, సూర్యశేఖర్‌రాజు, మహబూబ్‌పీరా, త్రిలోక్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

కదిరి, న్యూస్‌టుడే: ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మొదట బ్యాటింగ్ చేసిన కోచింగ్ క్యాంపు ఏ-జట్టు 35 ఓవర్లలో ఐదు వికెట్లను కోల్పోయి 174 పరుగులు చేశారు. తర్వాత బ్యాటింగ్ చేసిన శిక్షణ శిబిరం బీ-జట్టు ఐదు వికెట్ల నష్టానికి 145 పరుగులు మాత్రమే చేసినట్లు కోచ్ నజీర్ తెలిపారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలో సాంస్కృతిక మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మధుమేహ వ్యాధి నిర్ధారణ, థైరాయిడ్ పరీక్షా శిబిరం నిర్వహించారు. గండికోట ఆసుపత్రి వైద్యుడు రాజశేఖర్‌రెడ్డి పరీక్షలు చేశారు. సాంస్కృతిక మండలి అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, వెంకటేశులు, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సుమలత, లక్ష్మి, కోశాధికారి రాజేశ్వరి, క్యాంపు ఛైర్మన్ రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి ఆదివారం పట్టణానికి చెందిన గంగిరెడ్డి రూ.లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ ఛైర్మన్ జగదీశ్వరప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాత పేరున ప్రత్యేక పూజలు చేశారు.

57 కేసులు పరిష్కారం

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ముదిగుబ్బ పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులు లోక్‌అదాలత్‌లో పరిష్కారమైనట్లు పట్టణ సీఐ శివరాముడు తెలిపారు. 27 ఎక్సైజ్, పెట్టి కేసులు కలిపి 57 పరిష్కారమైనట్లు వివరించారు.

అభివృద్ధికి దూరంగా.. శివారు కాలనీలు

● కనిపించని మౌలిక సదుపాయాలు

● కాలనీవాసులకు తప్పని తిప్పలు

7వ వార్డులో పేరుకున్న చెత్తాచెదారం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు శివారు కాలనీలు సమస్యలకు నిలయాలుగా మారాయి. మున్సిపల్ అధికారులు రూ.కోట్లలో పన్నులు వసూలు చేస్తున్న అభివృద్ధి చేయడంలో చొరవ చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కొందరు కౌన్సిలర్లు కాలనీల సమస్యలపై అధికారులతో చర్చిస్తున్నా.. నిధులు మంజూరు చేయడంలో గట్టిగా ప్రయత్నించడం లేదు. రోజురోజుకు పట్టణ శివారు కాలనీలు పెరుగుతున్నా.. జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● పట్టణ శివారు కాలనీలైన ఇందిరమ్మకాలనీ, కేతిరెడ్డి ఎల్1, ఎల్2, ఎల్3, ఎల్‌కేసీ పురం, తిక్కస్వామినగర్, పోతుకుంట కాలనీలతో పాటు పలు కాలనీలు ఏర్పడి సుమారు 20 ఏళ్లు దాటాయి. సరైన దారులు లేకపోవడంతో కాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

● కాలనీల్లో కొన్ని ప్రధాన రహదారులు మాత్రమే సీసీ రోడ్డు నిర్మాణాలు కనిపిస్తాయి. 70 శాతం వీధులకు మట్టి రోడ్లే దిక్కు. గోతులు పడిన దారుల్లో ప్రయాణించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీటి సరఫరా గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిదంటున్నారు. వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే మంచి నీరు సరఫరా అవుతున్నాయి. వీధి దీపాలు వెలగకపోవడంతో చీకట్లోనే సంచారం చేయాలని, విషపురుగులతో సంచరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

● గత మూడు నెలలుగా రాత్రిళ్లు చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. చెత్త సేకరణ ఉండదని, కాలువల్లో మురుగు పేరుకుని దుర్వాసన వెదజల్లుతూ దోమలు దండయాత్ర చేస్తున్నాయి. కాలనీల్లో ఇళ్లకు ఏటా పన్నులు వసూలు చేయడంలో అధికారులు చూపుతున్న ఆసక్తి, అభివృద్ధిని చేయడంలో లేదని వాపోతున్నారు.

విడతల వారీగా అభివృద్ధి

శివారు కాలనీల్లో విడతల వారీగా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నాం. గత నెలలో రూ.3 కోట్లతో సీసీరోడ్లు, కాలువల నిర్మాణాలు చేపట్టాం. మరిన్ని నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

- ప్రమోద్‌కుమార్, పురపాలక కమిషనర్

మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

ధర్మవరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ అన్నారు. ఆదివారం ధర్మవరం పట్టణంలోని లయోలా పాఠశాల ఆవరణలో ఉమ్మడి అనంత జిల్లా అభ్యాసవర్గ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుల బదిలీల్లో ఎస్.జి.టి కోసం మాన్యువల్ కౌన్సెలింగ్‌కు పోరాటం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు చంద్రబాబు, కల్యాణి, కార్యదర్శులు సురేశ్, ఎర్రిస్వామి, రాష్ట్ర కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, భాస్కరయ్య, వెంకటేశ్వరప్రసాద్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్యుడు విలువిద్య ప్రవీణుడు

కదిరి: నివాళి అర్పిస్తున్న ఎరుకల ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు

కదిరి, న్యూస్‌టుడే: ఏకలవ్యుడు విలువిద్య ప్రవీణుడని ఎరుకల ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు. కదిరి ఆర్‌అండ్‌బీ అతిథి భవనంలో ఆదివారం ఏకలవ్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంఘ నాయకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ఏకలవ్యుడు అస్త్ర, శస్త్ర, విలువిద్యలో ప్రవీణుడని కొనియాడారు. ఉపాధ్యాయులు చలపతి, నాగభూషణం, రాజగోపాల్, ఉద్యోగులు రామాంజనేయులు, నారాయణస్వామి, వెంకటరమణ, విశ్రాంత ఏఎస్ఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: ఏకలవ్య జయంతి సందర్భంగా ఆ సంఘం నాయకులు ఆర్డీటీ ఆసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ఎస్ఐ సోమశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై ఏకలవ్యుడి గొప్పతనాన్ని కొనియాడారు. ఏపీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు, జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీకాంతమ్మ, వెంకట్రామయ్య, గోవిందు, చంద్రయ్య, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీ అమలు చేయాలి

మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, నాయకులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయుల 12వ పీఆర్సీని అమలు చేసి, బకాయి డీఏలను విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం నాయకులు సమావేశమయ్యారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయడంలో ఆలస్యమైతే ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, సాయి గణేశ్, వెంకట కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువులో భాజపా మండలశాఖ అధ్యక్షుడు గంగా నాయుడు ఆధ్వర్యంలో డా.శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి మంత్రివర్గంలో పరిశ్రమలశాఖ మంత్రిగా పనిచేసిన ముఖర్జీ, తరువాత జనసంఘ్ పార్టీని స్థాపించారన్నారు. దేశ వ్యాప్తంగా ఒకే పౌరస్మృతి ఉండాలని పోరాడిన హిందుత్వ వాదిగా కొనియాడారు. నియోజకవర్గ కన్వీనర్ శేషాద్రి నాయుడు, ప్రసాద్, రవి, కేశవ, దివాకర్, దస్తగిరి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఘనంగా జగ్జీవన్‌రామ్ వర్ధంతి

ధర్మవరం పట్టణం: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పలు దళిత సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కృషి చేశారని కొనియాడారు.

విష గుళికలు మింగి ఒకరి మృతి

తలుపుల, న్యూస్‌టుడే: ఓదులపల్లి పంచాయతీ దాంపల్లికి చెందిన రమణ (57) అనారోగ్యం కారణంగా విష గుళికలు మింగి మృతిచెందినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది విష గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య గంగాదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వివరించారు.

తల్లీబిడ్డల అదృశ్యం.. కేసు నమోదు

ధర్మవరం: ధర్మవరం పట్టణంలోని ఓ కాలనీకి చెందిన వివాహిత భర్తతో గొడవపడి కుమారుడు, కుమార్తెతో ఆదివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఇంటి ఖర్చులు తగ్గించుకోవాలని భార్య చెప్పగా ఇద్దరి మధ్య గొడవకు దారి తీసిందని, దీంతో వెళ్లిపోయినట్లు భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు రెండో పట్టణ సీఐ రెడ్డెప్ప తెలిపారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి

రామగిరి, న్యూస్‌టుడే : మొహర్రంను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ తెలిపారు. ఆదివారం మండలంలోని మాదాపురం గ్రామంలో పర్యటించారు. మొహర్రంను శాంతియుతంగా జరుపుకోవాలని గ్రామస్థులకు సూచనలు చేశారు. మొహర్రం వేడుకలను సమాజంలో అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో, సామరస్యంగా జరుపుకొనే పండుగని, పీర్ల చావడిల వద్ద భక్తులు వచ్చే సమయంలో నిర్వహకులు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. ఎవరైనా గొడవలు సృష్టించి ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే చర్యలకు దిగితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

వారదయ్యస్వామి రహదారికి మరమ్మతు

కనగానపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని కుర్లపల్లి గ్రామ సమీపంలోని వారదయ్య కొండలో వెలసిన వారదయ్య స్వామి రహదారిని బాగు చేయడంలో దాతలు ఔదార్యం చూపారు. దారికి ఇరువైపులా ముళ్ల కంపలు పెరగడంతో భక్తులు ఆలయానికి వెళ్లడానికి మొహం చాటేస్తున్నారు. కనగానపల్లికి చెందిన నెట్టెం అమర్‌నాథ్, మనుబోలు చంద్రశేఖర్ 7 కి.మీ.మేర పొక్లెయిన్ సాయంతో రాళ్లు, ముళ్లపొదలు తొలగించారు. దీనికి రూ.80 వేలు సొంతంగా వెచ్చించారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

తలుపులకు వచ్చి తిరిగి వెళ్తున్న గంజివారిపల్లి పీర్లు

తలుపుల, న్యూస్‌టుడే: మొహర్రం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పీర్ల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తలుపుల ఎగువపేట పీర్లను కలిసిందేకు 4 కి.మీ.ల నుంచి గంజివారిపల్లి పీర్లను ఆనవాయితీగా తీసుకొచ్చారు. పీర్ల కలయికను చూసేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి చక్కెర చదివించారు. సోమవారం సాయంత్రం పీర్లను జలధికి తీసుకెళ్లనున్నట్లు ముజావర్లు తెలిపారు.

తాడిమర్రి: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో మొహర్రం జరుగుతోంది. ఆదివారం పెద్ద సరిగెత్తు నిర్వహించారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు చక్కెర, బెల్లం చదివించి మొక్కులు తీర్చుకున్నారు.

వెండి గొడుగు వితరణ

బత్తలపల్లి: బత్తలపల్లి ఖాసీంస్వామికి 3.8 కిలోల వెండి గొడుగును గ్రామానికి చెందిన బోయపాటి పుల్లనాయుడు వితరణ చేశారు. దాని విలువ సుమారు రూ.4.5 లక్షలని తెలిపారు. ఆదివారం సాయంత్రం ఊరేగింపుగా చావిడికి చేరుకుని గొడుగును ముజావర్లకు అందజేశారు. అనంతరం చక్కెర చదివించారు.

గొడుగుతో ఊరేగింపుగా వెళ్తున్న పుల్లనాయుడు కుటుంబ సభ్యులు

వైభవంగా ఓబుల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఓబుళ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి మేళతాళాలతో గ్రామ సమీపంలోని కొండకు ప్రదర్శనగా తరలివెళ్లారు. అక్కడ నుంచి స్వామి వారి ప్రతిమలను తీసుకువచ్చి గ్రామ వంకలో గంగపూజ నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూలపల్లకీలో స్వామివారి ప్రతిమను కొలువుదీర్చి విశేష అలంకరణ చేశారు.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

ధర్మవరం: అలంకరణలో పాండురంగస్వామి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: మండలంలోని జగరాజుపల్లి వద్ద కొండపై వెలిసిన ఓబులేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

ధర్మవరం, తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని పాండురంగస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం ఎదుట భక్తులు కీర్తనలు ఆలపించారు.

బుక్కపట్నం: బుక్కపట్నం కోటవీధిలోని ఓబిరెడ్డి స్వామి ఆలయం నుంచి యలగప్పలు యలవ గంపలను భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా చెరువులోని చిక్కవడియార్ ఆలయం దగ్గరకు చేరుకున్నారు. యలగప్పలకు మహిళలు భక్తిశ్రద్ధలతో నిండుబిందెలతో దారి పొడవున నీరు పోసి స్వాగతం పలికారు. చెరువులో అక్కదేవతల ఉత్సవం నిర్వహించారు. ఏడు మంది చిన్నారులతో చాటల చెరువు ఉత్సవం చేశారు. ఈ ఏటా ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని అక్కదేవతలు పలికారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

బుక్కపట్నం: యలువ గంపలతో ఊరేగుతున్న యలగప్పలు

'చంద్రబాబు హామీలు ఇచ్చి మోసం చేశారు'

పుట్టపర్తి, న్యూస్‌టుడే: చంద్రబాబునాయుడు ప్రజలకు హామీలు ఇచ్చి మోసం చేస్తున్న తీరును ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీశ్‌రెడ్డి, జిల్లా పార్టీ పరిశీలకుడు రమేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దుద్దుకుంట క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వైకాపా శ్రేణులతో సమావేశం నిర్వహించారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అంటూ.. చంద్రబాబు ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను గుర్తు చేయాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఆందోళనలు చేయాలని కోరారు. అనంతరం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ స్కాన్‌ను ఆవిష్కరించారు.

టీబీ వ్యాధిని తరిమికొట్టండి

ముదిగుబ్బ: క్షయ వ్యాధిపై ప్రతిఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండలంలోని కాశిరెడ్డినాయన ఆశ్రమంలో ముక్తభారత్‌లో భాగంగా జన భగీదరి కార్యక్రమం నిర్వహించారు. మలకవేముల ప్రాథమిక ఆసుపత్రి వైద్య సిబ్బంది హాజరై క్షయ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎంపీహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ప్రతినిధులు

ధర్మవరం, న్యూస్‌టుడే: సేవ చేసేందుకు లయన్స్ క్లబ్ మంచి వేదిక అని.. యువత, సామాజిక బాధ్యత కలిగిన వారిని సభ్యులుగా చేర్చుకోవాలని లయన్ ఎంజెఎఫ్ గోపా నరసింహులు అన్నారు. ఆదివారం లక్ష్మీచెన్నకేశవపురం లయన్స్ కంటి ఆసుపత్రి ఆవరణలో ధర్మవరం లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గోపా నరసింహులు నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా రమేశ్‌బాబు, కార్యదర్శిగా నాగేంద్ర, కోశాధికారిగా వెంకటేశ్‌కుమార్, సభ్యులుగా బాబు, వెంకట పార్థసారథి, వెంకటేశ్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకుడు వెంకటస్వామి, ప్రతినిధులు వేణుగోపాల్, మోహన్‌దాస్, రాజగోపాల్, శివప్రసాద్, రాధాకృష్ణ, సురేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మానవతా సంస్థ నూతన కార్యవర్గం..

మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ధర్మవరం శాఖ నూతన కమిటీ ఆదివారం స్థానిక ఎన్జీవో సమావేశ భవనంలో ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా వేణుగోపాల్, కార్యదర్శిగా సాయిప్రసాద్, కోశాధికారిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా మంజునాథ్, సంయుక్త కార్యదర్శిగా రామకృష్ణయ్య, ఈసీ అవేర్‌నెస్ డైరెక్టర్లుగా సోమేశ్వరరెడ్డి, రాంప్రసాద్, హెల్త్ డైరెక్టర్‌గా నారాయణమ్మ, ఎమర్జెన్సీ డైరెక్టర్‌గా ఆంజనేయ చౌదరి ప్రమాణం చేశారు. మానవతా సంస్థ కేంద్ర కమిటీ ఛైర్మన్ రామచంద్రారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ధర్మవరం శాఖ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్ నారాయణమూర్తి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

'ప్రతి పల్లెకు సాగునీరు అందించండి'

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

రెక్కమాను (గాండ్లపెంట), న్యూస్‌టుడే: హంద్రీనీవా ద్వారా కదిరి నియోజకవర్గంలో ప్రతి పల్లెకు సాగునీటిని అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం రెక్కమానులో గాండ్లపెంట, ఎన్పీకుంట సీపీఐ మండల మహాసభ నిర్వహించారు. కరవుతో ప్రజలు వలసలు వెళ్తున్నారన్నారు. వలసల నివారణకు చర్యలు చేపట్టి, హంద్రీనీవా ద్వారా చెరువులు నింపి ప్రతి పల్లెకు సాగునీరు అందించాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ గాండ్లపెంట మండల కార్యదర్శి శ్రీరాములు నాయుడు, కదిరి డివిజన్ కార్యదర్శి పవన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప, సభ్యులు మధునాయక్, హసన్, లియాకత్ అలీ, రమణ, గంగులప్ప, సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మమ్మ, ఆదెప్ప, మనోహర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మడుగును తలపిస్తున్న రోడ్డు

తలుపుల మేజర్ పంచాయతీ గంజివారిపల్లికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు మడుగును తలపిస్తోంది. కుళాయిలు, ఇళ్లలోని వృథా నీరంతా అక్కడ నిల్వ ఉంటోంది. దీంతో వాహన చోదకులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీరు నిల్వ లేకుండా చూడాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రమణప్ప నాయుడును వివరణ కోరగా.. సీసీ రోడ్డు నిర్మించేటప్పుడు పల్లంగా నిర్మించడంతో అక్కడ నీరు నిల్వ ఉంటున్నట్లు చెప్పారు. ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. - **న్యూస్‌టుడే, తలుపుల**

నీట్ ర్యాంకర్‌కు ఘన సన్మానం

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురంలో నీట్ ర్యాంకర్ అభినవ్‌ను జిల్లా గాండ్ల సంఘ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ధర్మవరం అబ్కారీ సీఐ చంద్రమణి మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షలో అభినవ్ అత్యుత్తమైన 231 ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు అభినవ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. గాండ్ల సంఘ నాయకులు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన ప్రభాకర్, సుజాత దంపతుల కుమారుడైన అభినవ్ జాతీయ స్థాయిలో రాణించడం గొప్ప విషయమన్నారు. మారుమూల ప్రాంతంలో జన్మించినప్పటికీ విద్యలో రాణించి ఉన్నతమైన ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థి అభినవ్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ల్లా గాండ్ల సంఘంలోని వివిధ శాఖలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

నిధులేవీ.. ఏరు దాటేదారేదీ?

ప్రతిపాదనలకే పరిమితమవుతున్న మద్దిలేరు వంతెన నిర్మాణం

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ఐదేళ్ల కిందట మద్దిలేరువాగు ఉద్ధృతికి నామరూపాలు లేకుండా కొట్టుకుపోయిన వంతెన నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. గత ప్రభుత్వం గాలికి వదిలేయగా.. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు హామీలు ఇస్తున్నారే తప్పా అమలు పరచడంపై దృష్టి సారించలేకపోతున్నారు. ఫలితంగా మద్దిలేరు వాగు నిర్మాణం ప్రజలకు కళగానే మిగిలిపోతోంది.

రెండేళ్ల కిందటే ప్రతిపాదనలు..

మద్దిలేరు వాగులో నీరు ప్రవహించినప్పుడు ప్రస్తుతం ఉన్న కల్వర్టుపై 3 నుంచి 4 అడుగుల ఎత్తు ఉంటుంది. దీంతో లోలెవల్ నుంచి హైలెవల్ వంతెన నిర్మాణానికి రెండేళ్ల కిందట రూ.7.50 కోట్లతో పంచాయతీరాజ్ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అయినా ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో నేటికీ వంతెన నిర్మాణానికి నోచుకోవడంలేదు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో వరదలు వచ్చే ప్రమాదముంది. కదిరి, చుట్టుపక్కల చెరువుల నుంచి వచ్చే నీరంతా మద్దిలేరు వాగు ద్వారా ముదిగుబ్బలోని యోగివేమన జలాశయానికి చేరుతాయి. అక్కడి నుంచి పార్నపల్లి జలాశయంలోకి విడుదల చేస్తారు. ఏటా వర్షాకాలంలో వాగు ప్రవహించినప్పుడు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

శిథిలమైన కల్వర్టు

రాకపోకలకు కష్టాలు..

మద్దిలేరువాగుపై వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో పెద్దవాహనాలు ఇప్పటికీ రాకపోకలు సాగించడం లేదు. అధిక లోడుతో వచ్చే వాహనాలన్నీ జాతీయ రహదారి మీదుగా మరో 10 కి.మీ. చుట్టేసుకుని వెళ్తున్నాయి. 2021లో కల్వర్టు కొట్టుకుపోగా ఏటా తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నారు. మళ్లీ వర్షాలకు యధావిధిగా కొట్టుకుపోతోంది. దీంతో సుమారు 25 గ్రామాల ప్రజలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి వంతెన పూర్తి చేస్తే సమీప గ్రామాల ప్రజలకు కష్టాలు తీరుతాయి.

ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్న ఆటో

నిధులు మంజూరు కావాలి

మొదటి ప్రాధాన్యం కింద మద్దిలేరు వంతెన నిర్మాణం చేపట్టేందుకు రెండేళ్ల కిందటే ఉన్నతాధికారులకు రూ.7.50 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే వంతెన నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నాం.

- రాజేంద్ర, పీఆర్ జేఈ, కదిరి

(c) eenadu

యూరియా కొరత.. అన్నదాతల కలత

ధర పెంచి విక్రయిస్తున్న వ్యాపారులు

లావేరులో మొక్కజొన్న పంటకు నానో యూరియా పిచికారీ చేస్తున్న రైతు

న్యూస్‌టుడే, లావేరు, ఎచ్చెర్ల, పొందూరు

ఖరీఫ్ ప్రారంభంలోనే ఎరువుల కొరత రైతులను కలవరపెడుతోంది. పంటకు వేయడానికి అవసరం మేరకు సరకు అందుబాటులో లేదు. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు ధర పెంచి విక్రయిస్తున్నారు. మరికొందరు పురుగు మందులు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలోని 14 మండలాల్లో సుమారు 10,500 హెక్టార్లలో మొక్కజొన్న సాగుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. యూరియా కొనుగోలు భారంగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు

గ్రామ సచివాలయాల్లో బస్తా యూరియా రూ.275కు లభ్యమవుతుంది. ప్రస్తుతం అందుబాటులో లేకపోవడంతో మార్కెట్‌లో వ్యాపారులు రూ.350 నుంచి రూ.450 వరకు విక్రయిస్తున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఇతర మందులు కొనుగోలు చేస్తే తప్ప కొందరు దుకాణదారులు యూరియా ఇవ్వడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారులు చెప్పిన ప్రకారం నడుచుకోవాల్సి వస్తోందని కర్షకులు వాపోతున్నారు.

మొక్కజొన్న సాగుకే అధికం

జిల్లాలో యూరియా, డీఏపీ, ఎంవోపీ, కాంప్లెక్స్ తదితర ఎరువులన్నీ కలిపి సుమారు 69 వేల మెట్రిక్ టన్నులు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం 35 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. అత్యధికంగా మొక్కజొన్న పంటకు వినియోగిస్తారు.

ప్రతిపాదనల మేరకు పంపుతున్నాం..

జిల్లాలోని 19 మండలాలకు యూరియా సరఫరా చేశాం. వ్యవసాయాధికారుల ప్రతిపాదనల మేరకు పంపుతున్నాం. రైతులు అవసరం మేరకే వినియోగించాలి. వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి. గ్రామ సచివాలయాల్లో ఎరువులు అందుబాటులో ఉంచుతాం.
– త్రినాథస్వామి, జేడీ, వ్యవసాయ శాఖ, శ్రీకాకుళం

● గార మండలంలో వారం రోజులుగా యూరియా 45 కిలోల బస్తా రూ.350 వరకు విక్రయిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

● రణస్థలం మండల పరిధిలో కొందరు ప్రైవేటు వ్యాపారులు రూ.380 నుంచి రూ.450 వరకు విక్రయిస్తున్నారు. కొన్ని దుకాణాల్లో ఇతర మందులు అంటగడుతున్నారు.

● రణస్థలం, లావేరు, పొందూరు, జి.సిగడాం, ఎచ్చెర్ల మండలాల్లో మొక్కజొన్న ఎక్కువగా సాగు చేస్తున్నారు. గ్రామ సచివాలయాల్లో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. కొందరు ఇష్టానుసారం అధిక ధరకు విక్రయిస్తున్నారు. సకాలంలో యూరియా వేయకపోతే పంట పెరుగుదలపై ప్రభావం పడుతుందని దుకాణాలకు పరుగులు పెడుతున్నారు.

దారి చెరువండి.. మా బాధలు చూడండి

కొత్తూరు- పాలకొండ మార్గం అధ్వానంగా మారింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో రోడ్డుపై గొయ్యి ఏర్పడింది. వర్షాలకు అందులో నీరు చేరడంతో చెరువును తలపిస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ సమస్యపై ఆర్అండ్‌బీ డీఈఈ సాగర్‌ను సంప్రదించగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

ట్రిపుల్ ఐటీల్లో మిగులు సీట్లు 600

రెండో విడత ప్రవేశాలకు సన్నాహాలు

వేంపల్లె, న్యూస్‌టుడే: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ముగిశాక నాలుగింట్లో 600 సీట్లు మిగిలాయి. పదో తరగతి మార్కులు, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లు పరిగణనలోకి తీసుకుని కేటాయిస్తారు. ఈ నెల 11 లేదా 12 తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో జాబితా విడుదల చేస్తారు. కౌన్సెలింగ్ తరువాత ఇడుపులపాయలో 132, నూజివీడులో 141, శ్రీకాకుళంలో 143, ఒంగోలులో 184 సీట్లు మిగిలాయి. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాలని.. ఆలోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తామని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు.

పిల్లల పేరిట మేత.. సంక్షేమానికి వాత!

బీసీ వసతిగృహాల నిర్వహణపై కొరవడిన పర్యవేక్షణ

న్యూస్‌టుడే పరిశీలన

న్యూస్‌టుడే, సోంపేట

జిల్లాలో కొన్ని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతిగృహాల నిర్వహణ గాడి తప్పింది. రిజిస్టర్‌లో నమోదైన పిల్లల్లో సగం మంది ఉదయం, రాత్రి భోజనాలకు హాజరు కావడం లేదు. తీర, మైదాన ప్రాంతాల్లో కొన్నిచోట్ల ఇలాంటి పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఏళ్లుగా నడుస్తున్నాయి. చదువు పేరిట ఏటా రూ.లక్షలు వ్యయం చేస్తున్నట్లు లెక్కల్లో చూపుతూ దారి మళ్లిస్తున్నారు. వసతిగృహాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతోనే అక్రమ పర్వం యథేచ్ఛగా సాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

★ కవిటి మండలం పెద్దకర్రివానిపాలెం వసతిగృహంలో 102 మంది విద్యార్థులుండగా ఈ నెల 6న మధ్యాహ్నం 53 మంది భోజనం చేశారు. రాజపురం వసతిగృహంలో 120 మంది పిల్లలు నమోదు కాగా కంచిలి మండలం ఎం.ఎస్.పల్లిలో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న సంక్షేమాధికారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. రాత్రి వేళ పరిశీలిస్తే ఇక్కడ వసతిగృహం ఉందన్న సంగతి తెలియదు.

వాడపాలెం బీసీ బాలికల వసతిగృహంలో ఈ నెల 4న రాత్రి భోజనం చేస్తున్న విద్యార్థినులు

★ సోంపేట మండలం వాడపాలెం బీసీ బాలికల సంక్షేమ వసతిగృహంలో 90 మందికి పైగా విద్యార్థినులుండగా ఉదయం, రాత్రి భోజనానికి 20 మంది కూడా హాజరు కావడం లేదు. ఈ నెల 4న రాత్రి 19 మంది, 6న మధ్యాహ్నం 8 మంది భోజనం చేశారు. రిజిస్టర్‌లో తప్ప ఇక్కడ పిల్లలు కనిపించరు. కొన్నేళ్లుగా ఇదే తంతు కొనసాగుతున్నా వసతిగృహం నిర్వహిస్తున్నారు. ఇక్కడ కొన్నేళ్లుగా సంక్షేమాధికారి పోస్టు ఖాళీగా ఉంది. సోంపేట మేట్రిన్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఎర్రముక్కాంలో వసతిగృహం ఎప్పుడూ తాళం వేసే ఉంటుంది.

ఇదీ పరిస్థితి

★ ఒక్కో విద్యార్థి భోజనానికి ప్రభుత్వం నెలకు రూ.1,400 వెచ్చిస్తోంది. కాస్మోటిక్ ఛార్జీల కింద బాలికలకు రూ.175, బాలురకు రూ.150 మంజూరు చేస్తోంది. ట్యూషన్ పేరిట ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించి వేతనాలు చెల్లిస్తున్నారు. దుప్పట్లు, కంచాలు, గ్లాసులు, ఇతర వసతుల కల్పన, నిర్వహణ పేరిట రూ.లక్షల్లో నిధులు వ్యయం చేస్తున్నప్పటికీ విద్యాభివృద్ధికి ఏమాత్రం ఉపయోగపడటం లేదు.

★ జిల్లాలో 83 బీసీ వసతిగృహాలుండగా పిల్లలు లేకపోవడంతో 3 మూతపడ్డాయి. 37 మంది సంక్షేమాధికారులు ఒక్కొక్కరు రెండు, మూడు హాస్టళ్ల బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. 100 మందికి పైగా విద్యార్థులున్న చోట ఒకరే నాలుగో తరగతి సిబ్బంది ఉండటంతో వారిపైనే మొత్తం భారం పడుతోంది.

★ డి.మత్స్యలేశం, మురపాక, ఏవీపేట, బీవీపేట, పాతటెక్కలి, సంతబొమ్మాళి, కురుడు, బోరుభద్ర, జగన్నాథపురం, మెట్టవలస, కె.మత్స్యలేశం, జీరుపాలెం సహా 20 వసతిగృహాల్లో 2 వేల మందికి పైగా విద్యార్థులు నమోదు కాగా సగం మంది కూడా భోజనం చేయడం లేదు. కొందరి మాయాజాలంతో ఆయా వసతిగృహాలు కొనసాగిస్తున్నారు. సగానికి పైగా ఇన్‌ఛార్జులతోనే నడుస్తుండటం గమనార్హం.

తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులతో చర్చిస్తాం..

స్థానికుల ఒత్తిడి మేరకే తీర ప్రాంతం, కొన్నిచోట్ల వసతిగృహాలను నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది ఒకట్రెండు మూతపడే పరిస్థితి ఉంది. పిల్లలు భోజనానికే వస్తుండటంతో ఇబ్బందులు నెలకొన్నాయి. సంక్షేమాధికారులు, నాలుగో తరగతి ఉద్యోగుల ఖాళీలు ఎక్కువగా ఉండటంతో పర్యవేక్షణ కష్టమవుతోంది. తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి పిల్లలు వసతిగృహాల్లో ఉండేలా చర్యలు తీసుకుంటాం.
– అనురాధ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారిణి, శ్రీకాకుళం

ఉపాధ్యాయులపై అదనపు భారం తగదు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం యాప్‌లతో పని తప్పిస్తున్నామని చెబుతూనే ఉపాధ్యాయులపై అదనపు భారాన్ని మోపుతోందని ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు చింతాడ దిలీప్‌కుమార్ విమర్శించారు. శ్రీకాకుళం నగరంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులపై పని భారం తగ్గిస్తే విద్యార్థులకు పాఠాలు బోధించడానికి అవకాశం ఉంటుందన్నారు. బకాయిలు చెల్లించాలని, ఆర్థిక అంశాలను పరిశీలించి వాటిని పరిష్కరించాలని డిమాండు చేశారు. సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షుడు టి.చలపతిరావు, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, పి.బాలాజీరావు, అనంతాచార్యులు, నవీన్, కృష్ణారావు, జితేంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు దిలీప్‌కుమార్

వంశధారకు జలకళ

వంశధార నదిలో ఆదివారం నీటి ప్రవాహం పెరిగింది. గొట్టా బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 6,500, అవుట్‌ఫ్లో 7,076 క్యూసెక్కులు నమోదైనట్లు డీఈఈ బి.సరస్వతి తెలిపారు. బ్యారేజీ గర్భంలో 38.10 మీటర్లు (గరిష్ఠంగా 0.66 టీఎంసీలు) నీటి నిల్వ కొనసాగిస్తున్నామన్నారు. 10 గేట్లు 20 సెం.మీ. ఎత్తి దిగువకు నీరు వదులుతున్నట్లు చెప్పారు. ఎడమ ప్రధాన కాలువకు సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు. – న్యూస్‌టుడే, హిరమండలం

త్వరలోనే స్మార్ట్‌కార్డులు..!

నూతన పద్ధతిలో రేషన్ పంపిణీ

న్యూస్‌టుడే, లావేరు, జి.సిగడాం

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఉన్న రేషన్ కార్డుల స్థానంలో కొత్తగా స్మార్ట్‌కార్డులను అందుబాటులోకి తీసుకొస్తోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఏటీఎం కార్డు పరిమాణంలో రూపొందిస్తోంది. కార్డు ముందువైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, కుటుంబ పెద్ద చిత్రం, కార్డుదారు, రేషన్ దుకాణం సంఖ్యలు, ఇతర వివరాలుంటాయి. ఈ-పోస్ యంత్రాల సాయంతో కార్డుపై గల క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన, తీసుకునే సరకుల వివరాలు కనిపించేలా డిజైన్ చేశారు.

జాప్యానికి అవకాశం లేకుండా..

జిల్లాలోని 30 మండలాల పరిధిలో కొత్తగా 866 మందికి రేషన్ కార్డులు మంజూరయ్యాయి. వీరందరికీ స్మార్ట్‌కార్డులు సరఫరా చేయనున్నారు. ఇప్పటివరకు ఉన్న 6,60,739 పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్తవి అందజేస్తారు. దుకాణాల్లో బియ్యం, పంచదార, ఇతర సరకులు సులభంగా తీసుకోవచ్చు. కార్డుదారులు దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన అవసరం ఉండదని అధికారులు చెబుతున్నారు.

కార్డుదారులకు మేలు..

స్మార్ట్‌కార్డులు అందుబాటులోకి వచ్చిన తరువాత లబ్ధిదారులకు మేలు జరుగుతుంది. పౌర సరఫరాల సంస్థ ద్వారా పంపిణీ చేసే వివిధ సరకులు, ఇతర వివరాలు కార్డులో పొందుపరుస్తారు. వచ్చే నెలలో కొత్తవి అందజేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.
– జి.సూర్యప్రకాశరావు, డీఎస్‌వో, శ్రీకాకుళం

నేటి నుంచి ఏపీఈఏపీ సెట్ కౌన్సెలింగ్

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో చేరడానికి నిర్వహించనున్న ఏపీఈఏపీ సెట్-2025 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. దీనికి సంబంధించిన వివరాలను శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యులు కె.నారాయణరావు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 7 నుంచి 16 వరకు జరగనున్న కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1,200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.600 ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. సంబంధిత రసీదు, ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యా ధ్రువపత్రాలు, టీసీ, కుల, ఆదాయ ధ్రువపత్రం ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. 13 నుంచి 18 వరకు కళాశాలలు, బ్రాంచిల ఎంపికకు వెబ్‌ఆప్షన్లు (ఐచ్ఛికాలు) నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 19న మార్పునకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. 22న సీట్లు కేటాయింపు వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. 23 నుంచి 26 లోగా సీటు పొందిన కళాశాల్లో విద్యార్థులు రిపోర్టు చేయాలని సూచించారు. వచ్చే నెల 4 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

చూసిన కనులదే భాగ్యం

జిల్లాలో జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న పురుషోత్తముడిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శ్రీకాకుళం నగరం గుజరాతీపేటలోని జగన్నాథ స్వామి ఆలయంలో ఆదివారం స్వామి అనంత శేషంపై శయనించిన విష్ణుమూర్తి రూపంలో దర్శనమిస్తున్న చిత్రమిది.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

ఆక్రమించేయ్.. అడిగేదెవరు..!

నౌపడలో పేట్రేగిపోతున్న మాఫియా

న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

సంతబొమ్మాళి మండలం మూలపేటలో పోర్టు రావడంతో సమీపంలోని ప్రభుత్వ భూములపై ఆక్రమణదారుల కన్ను పడింది. కాలువ గట్లను కూడా వదలకుండా కలిపేసుకుంటున్నారు. నౌపడ, ఇజ్జువరం గ్రామాల్లో చెరువు గర్భాలు, గ్రామకంఠాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇజ్జువరంలో సాగు నీటి వనరులను కప్పేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

★ నౌపడలో సర్వే నంబర్లు 410, 413లో ప్రభుత్వ చెరువులు ఉన్నాయి. వీటిని కొందరు ఆక్రమించారు. చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన యువకులు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఆక్రమణకు గురైన మాణి చెరువు

★ సంతబొమ్మాళి మండలం నౌపడ-టెక్కలి రహదారి ఇజ్జువరం రైల్వే గేటు సమీపంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో ఓ లేఅవుట్ వెలిసింది. ఇక్కడి వంశధార కాలువ, సమీపంలోని 30 సెంట్లకు పైగా ప్రభుత్వ స్థలాన్ని కంకరతో కప్పేసి ఇళ్ల స్థలాలుగా మార్చేశారనే ఆరోపణలు వస్తున్నాయి.

★ నౌపడలో 6 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో మాణి చెరువు విస్తీర్ణం ఉంది. వరద నీరు వెళ్లే మార్గం కనుమరుగవుతోంది. చాలవరకు చెరువు గర్భం ఆక్రమణ చెరలో చిక్కుకుపోయింది. ప్రస్తుతం రెండు ఎకరాల్లోనే చెరువు ఉందని.. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

★ నౌపడలోని ఓ పాఠశాల సమీపంలో 30 సెంట్ల గ్రామ కంఠం స్థలాన్ని అదే ప్రాంతానికి చెందిన పలువురు ఆక్రమించారు. బజారు వీధి నుంచి వరద నీరు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో టెక్కలి సబ్‌కలెక్టర్‌గా పని చేసిన రాహుల్‌కుమార్‌రెడ్డికి స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆయన పరిశీలించారు. ప్రభుత్వ స్థలం చుట్టు కంచె ఏర్పాటు చేశారు. రూ.లక్షల విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణదారుల చెరలో ఉంది. దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు పలుమార్లు కోరినా పట్టించుకునే వారు కరవయ్యారు.

అక్రమ నిర్మాణాలుంటే తొలగిస్తాం..

కాలువలు, ప్రభుత్వ స్థలాలు, చెరువు గర్భాలను ఆక్రమిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ సిబ్బందితో పరిశీలించి అక్రమ కట్టడాలు ఉంటే తొలగిస్తాం. ప్రభుత్వ భూముల సంరక్షణకు పకడ్బందీగా వ్యవహరిస్తాం.
–బి.హేమసుందర్, తహసీల్దారు, సంతబొమ్మాళి

సిగాచీ ఘటనలో జిల్లా యువకుడి గల్లంతు



జి.సిగడాం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలో సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఔషధ పరిశ్రమలో గత నెల 30న చోటుచేసుకున్న భారీ విస్ఫోటంలో జిల్లాకు చెందిన యువకుడు గల్లంతయ్యాడని కుటుంబ సభ్యులు తెలిపారు. జి.సిగడాం మండలం పాలకండ్యాం పంచాయతీ జగన్నాథపురానికి చెందిన **గుండుబిల్లి వెంకటేశ్** ఎమ్మెస్సీ (రసాయనిక శాస్త్రం) చదివారు. నాలుగేళ్ల కిందట ఆ పరిశ్రమలో కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ క్వాలిటీ అషురెన్స్ (క్యూఏ)గా పని చేస్తున్నారు. పరిశ్రమలో జరిగిన దుర్ఘటనను టీవీలో చూసి కుమారుడికి ఫోన్ చేయగా స్పందించకపోవడంతో తల్లిదండ్రులు చిన్నారావు, పద్మావతి ఆందోళనకు గురయ్యారు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లగా ఆచూకీ తెలియలేదని చెబుతున్నారు. ప్రమాదం జరిగిన రోజు అతను విధుల్లో ఉన్నట్లు ఉద్యోగులు హాజరు కాగితం చూపుతున్నారని కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

(c) eenadu

వద్దంటే వినరే.. ప్రమాదం కనరే

రైలు పట్టాల మీదుగా రాకపోకలు సాగించడం చట్టరీత్యా నేరం. కానీ రైలు వచ్చేస్తోందనో, పాదచార వంతెన దాటి వెళ్లేందుకు శక్తి లేదనో.. కొందరు పట్టాల మీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు. ఇలా చేసిన ఎంతోమంది ప్రాణాలు, అవయవాలను కోల్పోవడం జరుగుతున్నా, అదే బాటలో సాహసం చేస్తున్నారు. ప్రాణాలతో ఉంటే ఈ రైలు కాకుంటే మరో రైలులో వెళ్లొచ్చన్న విషయాన్ని మరుస్తున్నారు. ఇచ్ఛాపురంలో రైలు నిలయానికి అటు వైపున 6 కాలనీలు, 19 గ్రామాలు, 3 పుర వార్డులున్నాయి. వీరు పట్టణ కేంద్రానికి చేరాలన్నా, రైలు నిలయానికి రావాలన్నా ఇదే పరిస్థితి. ఇరువైపులా ముఖద్వారాలను దాటించి, పాదచార, ర్యాంప్ వంతెనల నిర్మాణం జరపాలని డీఆర్‌యూసీసీ సభ్యులు కె.సూర్యప్రకాశరావు పలుమార్లు రైల్వే అధికారులకు విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

వీఆర్‌ఏలతో వెట్టి చాకిరీ చేయించడం తగదు

మాట్లాడుతున్న వీఆర్‌ఏల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందిగీకి సాహెబ్

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వీఆర్‌ఏలతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందిగీకి సాహెబ్ అన్నారు. ఆదివారం ఆమదాలవలస మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వీఆర్‌ఏల సంఘం ఏడో విడత జిల్లా మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. తక్షణమే వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం చెల్లించాలని. ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న పే స్కేల్ అందించాలని కోరారు. దేశ వ్యాప్తంగా ఈనెల 9న జరగనున్న సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు అల్లు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు టి.త్రినాథరావు పాల్గొన్నారు.

సరకులు కావాలంటే.. కాళ్లు అరగాలంతే..!

- రేషన్ అందుకునేందుకు గిరిజనులకు తప్పని పాట్లు
- కిలోమీటర్లు నడిచి రావాల్సిందే

ఇదీ పరిస్థితి

మండలం	డిపోలు	కార్డులు
కొత్తూరు	61	22150
హిరమండలం	47	11980
మెళియాపుట్టి	44	16413

కొత్తూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రేషన్ డిపో ద్వారా నిత్యావసర సరకులు పంపిణీ చేస్తోంది. ఈ పద్ధతి బాగానే ఉన్నా.. గిరిజన గ్రామాల్లో ఇబ్బందులు తప్పడం లేదు. పంచాయతీ పరిధిలో ఎక్కువ గ్రామాలు ఉండడం, వాటికి ఒకే రేషన్ దుకాణం నుంచి సేవలందించాల్సి రావడంతో అవస్థలు పడుతున్నారు. శిఖరాగ్ర, మారుమూల గ్రామాలు కావడంతో వ్యయ ప్రయాసలకోర్చి.. కాలినడకన, కొండ మీద నుంచి కిందకు దిగి దూరాన ఉన్న రేషన్ డిపోకు వెళ్లేందుకు ఇక్కట్లు పడుతున్నారు. తమకు ఇంటి వద్దే సరకులు అందించాలని లేదంటే సమీపంలో డిపోలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గొట్టిపల్లిలో రేషన్ దుకాణం నుంచి సరకులు తీసుకువెళ్తున్న గిరిజనులు

ఆ గ్రామాల ప్రజలకు అవస్థలు

కొత్తూరు మండలంలో అడ్డంగి, గొట్టిపల్లి, లబ్బ, అల్తి పంచాయతీల్లో పుల్లగూడ, బూతాలగూడ, పెద్దరాజపురం, చిన్నరాజపురం, ఉల్లిమానుగూడ, ఎగువగూడ, దాపాకులగూడ, చీపురపల్లి, బొందూరు, బాపడుగూడ చిన్నయ్యగూడ, అడ్డంగి, ఎగువముల్లేలగూడ, దిగువముల్లేలగూడ, డెప్పిగూడ, లబ్బ జీసీసీ డిపోకు కారిగూడ పంచాయతీలోని కారిగూడ, చింతమానుగూడ, శ్రీరాములగూడ, బాంద్రగూడ, దొండమానుగూడ, అడ్డాయిగూడ, ఎగువదొండమానుగూడ లబ్ధిదారులు కిలోమీటర్లు నడిచి వచ్చి సరకులు తీసుకెళ్తున్నారు.

■ మెళియాపుట్టి మండలంలోని డబారు డిపోనకు కేరాసింగి, గూడ, అంపురం, రింపి.. నేతబొంతుకు చందనగిరి, గొట్టిపల్లి, ముత్యాలబొంత ఇతర గ్రామాలు, బందపల్లి రేషన్ దుకాణానికి దబ్బగుడ్డి, పెద్దకేదారి, గేటుపేట, అడ్డివాడ నుంచి వస్తున్నారు. వీరికి రానుపోను సుమారు 20 కి.మీ ఉండటంతో బాధలు తప్పడం లేదు.

■ హిరమండలం మండలంలోని పెద్దగూడ రేషన్ దుకాణానికి జన్నోడుగూడ, పొలంగూడ, బలదగూడ, కిరడ ఇతర గ్రామాలతోపాటు మద్రిగూడ జీసీసీ డిపోనకు సుమారు 8 గ్రామాల నుంచి వస్తున్నారు.

కష్టాలను తీర్చాలి: మాది కారిగూడ పంచాయతీలోని చింతమానుగూడ గ్రామం. గతంలో ఇంటి వద్దే సరకులు ఇచ్చేవారు. రెండు నెలలుగా మూడు కిలోమీటర్ల దూరంలో లబ్బ జీసీసీ డిపోనకు వెళ్లి సరకులను తెచ్చుకోవాల్సి వస్తుంది అధికారులు స్పందించి తమ బాధలు తీర్చాలి.

- సవర జూతయ్య, కార్డుదారుడు, చింతమానుగూడ

ఉన్నతాధికారులకు నివేదిక: కొన్ని పంచాయతీల్లో డిపోల ఏర్పాటుకు ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వివరాలు తీసుకుని, ఉన్నతాధికారులకు సమర్పిస్తాం. వారి ఆదేశాల ప్రకారం.. చర్యలు తీసుకుంటాం.

- భీమారావు, పౌరసరఫరాలశాఖ ఉప తహసీల్దారు

సమావేశంలో మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.హరిప్రసన్న తదితరులు

ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయండి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.హరిప్రసన్న, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పూర్వ అధ్యక్షుడు కె.అప్పలరాజులు డిమాండు చేశారు. డీటీఎఫ్ సమావేశం ఆదివారం విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటి నుంచి అనవసరమైన, విద్యార్థులకు ఉపయోగపడని కార్యక్రమాలతో తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. యోగా దినోత్సవం, మెగా పేరెంట్ టీచర్ సమావేశాల పేరిట గిన్నిస్ బుక్ రికార్డుల కోసం విద్యార్థులు, తల్లిదండ్రుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన బకాయిలు చెల్లించకుండా అనవసర కార్యక్రమాలతో బోధనకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. పదోతరగతి పరీక్ష విధులు నిర్వహించిన, మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వసపలో యువకుడి హత్య

మిన్నారావు (పాత చిత్రం)

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని వసపలో ఓ యువకుడు హత్యకు గురైన ఘటన ఆదివారం ఉదయం వెలుగు చూసింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలివి. గ్రామానికి చెందిన లుకలాపు మిన్నారావు (20) పదో తరగతి వరకు చదువుకున్నారు. స్థానికంగా ఉంటూ పౌరసరఫరాల శాఖ గోదాంలో పని చేస్తుంటారు. ఎప్పటిలాగే గ్రామంలోని పీహెచ్ రహదారికి ఆనుకుని ఉన్న ఓ దుకాణంలో తినుబండారాలు తీసుకునేందుకు శనివారం రాత్రి వెళ్లారు. నగదు చెల్లించే విషయంలో దుకాణ యజమానితో చిన్నపాటి ఘర్షణ జరిగింది. గతంలోనూ పలుమార్లు వీరి మధ్య గొడవలు జరిగాయి. మాటామాటా పెరగడంతో క్షణికావేశంలో దుకాణదారుడు సుత్తితో మిన్నారావు తలపై బలంగా కొట్టి, చాకుతో పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం బయటకు పొక్కనీయకుండా మృతదేహాన్ని రహదారికి అవతలి వైపు పడేశారు. ఉదయానికి సమాచారం బయటకు రావడంతో కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్, ఎస్సై అమీర్ ఆలీ, క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. హత్య జరిగినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. యువకుడికి తల్లిదండ్రులు బుడ్డు, లక్ష్మి ఉన్నారు. మృతదేహాన్ని పాతపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

నందిగాం, న్యూస్‌టుడే: మండలంలోని రాంపురం పంచాయతీ జయపురం గ్రామానికి చెందిన రాంపురం రత్నాలు (54) మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రత్నాలుకు రెండు కళ్లు కనిపించక పోవడంతో భర్త విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స చేసినా ప్రయోజనం లేదని వైద్యులు చెప్పడంతో ఇంటికి తీసుకొచ్చారు. దీంతో బతికి ఎవరికి ప్రయోజనమని మనస్తాపానికి గురైన ఆమె శనివారం అర్ధరాత్రి పురుగు మందు తాగారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

రైలు ఢీకొని 17 ఆవులు మృత్యువాత

మృతి చెందిన మూగజీవాలను పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖాధికారులు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలంలో రైలు ఢీకొని 17 ఆవులు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో పూరీ నుంచి గుణుపురానికి వస్తున్న ప్రత్యేక రైలు హరిద్వారం గ్రామానికి సమీపంలో మూగజీవాలను ఢీకొట్టింది. ఘటనా స్థలంలోనే తొమ్మిది ఆవులు మృతి చెందగా.. గాయపడిన మరో 8 కొంత సమయం తరువాత మృత్యువాత పడ్డాయి. పాతపట్నం పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు ఎం.కరుణాకర్ అక్కడకు చేరుకుని వివరాలు నమోదు చేశారు. లుకలాపు ఆదినారాయణకు చెందిన 9 ఆవులు, బి.సోములకు చెందిన రెండు, బి.అప్పలరాజు, జి.సిమ్మయ్య, కె.రమేష్, బి.గిరి, ఎల్.భైరాగి, వి.సింహాచలంకు చెందిన ఒక్కో ఆవు మృతి చెందినట్లు తెలిపారు. వీటికి బీమా లేదని చెప్పారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

వృద్ధుడి ప్రాణం తీసిన గుర్తు తెలియని వాహనం

లొడగల తవుడు

రణస్థలం, న్యూస్‌టుడే : రణస్థలం మండలంలోని నెలివాడ కూడలి వద్ద జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. పైడిభీమవరం పంచాయతీ లొడగలపేటకు చెందిన లొడగల తవుడు (70) రాత్రి భోజనం చేసిన తర్వాత ఇంటి బయట శాలలో పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో లేచి నిద్రమత్తులో నెలివాడ కూడలి వద్ద జాతీయ రహదారిపైకి వచ్చాడు. ఆ సమయంలో శ్రీకాకుళం వైపు నుంచి విశాఖ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. వెంటనే వాహనాలు మృతదేహంపై వెళ్లడంతో నుజ్జయింది. తవుడుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

లంకెలపాలెంలో ఫార్మా ఉద్యోగి..

పరవాడ (విశాఖపట్నం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వవార్డు పరిధిలో రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు దువ్వాడ జీఆర్పీ పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. హిరమండలం మండలం తులగాం గ్రామానికి చెందిన వజ్రారపు సురేశ్(28) పరవాడ మెట్రోకెమ్ ఫార్మా కంపెనీ ప్రొడక్షన్ విభాగంలో పని చేస్తూ లంకెలపాలెంలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో లంకెలపాలెంలో రైలు పట్టాలు దాటుతుండగా విశాఖ నుంచి విజయవాడ వెళ్లే రైలు ఢీకొని మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు ఆదివారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై లక్ష్మి పేర్కొన్నారు.

కశింకోట మండలంలో మరొకరు

కశింకోట, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా కశింకోట మండలం బయ్యవరం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. కశింకోట ఎస్సై కె.లక్ష్మణరావు కథనం ప్రకారం.. నరసన్నపేట మండలం బొరిగివలస గ్రామానికి చెందిన రాజాపు గురన్న (64) రహదారి దాటుతుండగా బొలెరో వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అనకాపల్లి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై మృతుడి గ్రామస్థుడు ముద్దాడ శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ అల్లు స్వామినాయుడుతో సహా ఎస్సై రెండు బృందాలుగా ఏర్పడి పరారైన వాహనం కోసం గాలింపు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

ఏకాదశి పర్వదినం.. కిటకిటలాడిన ఆలయాలు

పి.ఎన్.కాలనీలో నారాయణ తిరుమలలో వేంకటేశ్వరుడి దర్శనం

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా నగరంలో పలు విష్ణు ఆలయాల్లో ప్రత్యేక అర్చన, ఆరాధన పూజలు జరిపారు. అభిషేకం, విశేష అలంకరణ, సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం, భజనలు జరిగాయి. మొండేటివీధిలో శిర్డీసాయి మందిరంలో వెంకటేశ్వరస్వామికి, నారాయణ తిరుమల, అరసవల్లి రహదారిలో రమ్యతిరుమల, బ్యాంకర్స్‌కాలనీ శివబాలాజీ ఆలయం, చిన్నబజారు రహదారి, డీసీసీబీ కాలనీలో వెంకటేశ్వరాలయాల్లో తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. నారాయణ తిరుమల వెంకటేశ్వరాలయంలో జరిగిన పూజల్లో జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డి విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు జి.శ్రీనివాసులు ఆశీర్వచనాలు పలికారు. పలు ఆలయాలు ఆదివారం భక్తులతో కళకళలాడాయి.

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కారవేదిక

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. తమ అర్జీల స్థితిని తెలుసుకోవాలంటే 1100 నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

ఆదిత్యుని ఆదాయం రూ.7.47లక్షలు

క్యూ లైనులో వేచి ఉన్న భక్తులు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి వారిని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. కేశఖండన శాలలో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు మహిళా భక్తులు ఇంద్రపుష్కరిణిలో స్నానాలు ఆచరించి రావి చెట్టు వద్ద, గోశాలలో పూజలు నిర్వహించారు. భక్తుల తాకిడితో ఉచిత, రూ.100, రూ.300లు, కేశఖండనశాల క్యూలైన్లలో రద్దీ నెలకొంది. దర్శన టిక్కెట్లు, ప్రసాదాల విక్రయాలు, ప్రత్యేక పూజల రూపంలో రూ.7.47 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.ప్రసాదరావు తెలిపారు.

రోటరీక్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం

మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రోటరీక్లబ్ సేవలు శ్లాఘనీయమని డీఎస్పీ వివేకానంద అన్నారు. నగరంలో అరసవల్లి కూడలి ఓ హోటల్‌లో రోటరీక్లబ్ శ్రీకాకుళం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపి, రోటరీ సేవలను కొనియాడారు. రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ పూర్వ గవర్నర్ జి.విశ్వనాథ్ శ్రీకాకుళం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బరాటం శ్రీనివాస్, కిల్లాన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా డా. బమ్మిడి సందీప్, కోశాధికారిగా కందుల నవీన్, ఇతర కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించి మాట్లాడారు. శాశ్వత ప్రాజెక్టులు చేపట్టి రోటరీ సేవలు మరింత విస్తృతం చేయాలని కోరారు. కోశాధికారిగా కందుల నవీన్‌కుమార్, మెడికల్ డైరెక్టర్‌గా డా.ఎన్.విజయ్‌కుమార్, లెర్నింగ్ ఫెసిలిటేటర్‌గా అన్నెపు సత్యనారాయణ, యంగ్‌లీడర్‌గా వారణాసి సందీప్, సర్వీస్ ప్రాజెక్టుల డైరెక్టర్‌గా అన్నెపు అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ డాక్ సేవక్‌ల సమస్యలు పరిష్కరిద్దాం

జిల్లా గ్రామీణ డాక్ సేవక్ సంఘం నూతన కార్యవర్గం

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న తపాల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని రాష్ట్ర, జిల్లా సంఘం నాయకులు నిర్ణయించారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ జిల్లా డివిజన్ ద్వైవార్షిక మహా సభలు జరిగాయి. ఈ సభలో నూతన కార్యవర్గానికి నిర్వహించిన ఎన్నికలకు జిల్లా పరిధిలోని సభ్యులందరూ హాజరయ్యారు. రానున్న రెండేళ్ల కాలానికి అధ్యక్ష, కార్యదర్శులుగా బి.అప్పారావు, ఎన్.నందికేశ్వరరావు, కోశాధికారిగా పి.రామకోటేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఈ నెల 9న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పాల్గొన్న రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు.

పెంపుడు శునకాలతో అప్రమత్తత తప్పనిసరి

శునకానికి టీకా వేస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ రాజగోపాల్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: పశువులు, పెంపుడు జంతువుల నుంచి వచ్చే వ్యాధులపై యజమానులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ జేడీ కె.రాజగోపాల్ పేర్కొన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జేడీ కార్యాలయ ఆవరణలో పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకా వేశారు. ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల్లో రేబిస్, మెదడు వాపు వ్యాధి, బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ, ఆంత్రాక్స్ తదితర వ్యాధులు ఉన్నాయన్నారు. ముందస్తు జాగ్రత్తతో ఈ వ్యాధులకు దూరంగా ఉండొచ్చన్నారు. 602 పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో డా.గణపతిరావు, వై.వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో ప్రజలకు వివరిస్తాం

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను క్యూఆర్ కోడ్‌తో ప్రజలకు వివరిస్తామని వైకాపా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంటరీ ఇన్‌ఛార్జి తమ్మినేని సీతారాం, జిల్లా పరిశీలకులు కె.రవిబాబు అన్నారు. ఆదివారం కవిటిలోని అగ్నికుల క్షత్రియ భవనంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ రెండో దశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పి.సాయిరాజ్, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగ పోటీలకు ఎంపిక

పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి అండర్-15 చదరంగం పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం జరిగాయి. శ్రీకాకుళం నగరం నానుబాల వీధి జిల్లా చదరంగ శిక్షణా కేంద్రంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాలబాలికలు పాల్గొన్నారు. బాలుర విభాగంలో డొంకాడ కార్తికేయ, బొల్ల యశ్వంత్, ఎన్‌కేపీ నిహాల్, పొన్నాడ వేదిష్‌లు మొదటి నాలుగు స్థానాలలో నిలిచారు. బాలికల విభాగంలో మెట్ట తీక్షణ, బొల్ల శృతి, జామి వినమ్ర, రిత్వికలు మంచి ప్రతిభతో రాణించారు. వీరందరూ ఈ నెల 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న అండర్-15 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఆల్ ఇండియా చెస్ స్కూల్ కమిటీ సభ్యుడు సనపల భీమారావు బహుమతులు అందజేశారు.

తోటపల్లి జలాలతో మూడు జిల్లాలు సస్యశ్యామలం

పూజలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ జగదీశ్వరి తదితరులు

పార్వతీపురం, గరుగుబిల్లి, న్యూస్‌టుడే: తోటపల్లి జలాలతో మూడు జిల్లాలు సస్యశ్యామలమవుతాయని మంత్రి సంధ్యారాణి అన్నారు. గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి జలాశయం కుడి కాలువ నుంచి ఆదివారం సాగు జలాలను ప్రభుత్వ విప్ జగదీశ్వరితో కలిసి విడుదల చేశారు. ఈ కాలువ ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 84 వేల ఎకరాలకు నీరు వెళ్తుందని తెలిపారు. అనంతరం రైతులతో సమావేశమై మాట్లాడారు. ఒడిశాతో వివాదంలో ఉన్న జంఝావతి, కొఠియా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించే అవకాశాలున్నాయన్నారు. పూర్ణపాడు- లాబేసు వంతెన పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, బలగ, శ్రీకాకుళం వారి సీల్డ్ టెండర్ కొటేషన్స్ కొరకు

ప్రకటన

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, శ్రీకాకుళంనకు ఇంప్లాంట్స్/కంజుంబుల్స్ సరఫరా చేయుటకు టెండర్ కోరడమైనది. ఇతర వివరములు ఈ క్రింది పేర్కొన్న వెబ్‌సైట్‌ను పరిశీలించవలసినదిగా కోరడమైనది. సీల్డ్ టెండర్ కొటేషన్స్ స్వీకరించుటకు తేది. 07-07-2025 నుండి తేది. 14-07-2025 సాయంత్రం 05.00 PM వరకు.

సీల్డ్ టెండర్ కొటేషన్స్ తెరుచుటకు చివరి తేది. 17-07-2025 న 4.00 PM నకు సూపరింటెండెంట్ గారి సమక్షంలో తెరువబడును.

http://www.srikakulam.ap.gov.in

సం/- సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, శ్రీకాకుళం.

EENADU eClassifieds

FINANCIAL SERVICES | HEALTH & CARE | JOBS

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మత్తు వ్యసనాలు నిద్రలేమి అతి ఆలోచనలు డిప్రెషన్ SEX కుటుంబ సమస్యలకు పరిష్కారం MIND POWER డే&నైట్ జంక్షన్, శ్రీకాకుళం 888 55555 13

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

ప్రముఖ సెల్ షోరూమ్‌లో సేల్స్ చేయుటకు ఆసక్తిగల యువతీయువకులు కావలెను. వయస్సు: 18-35 సం॥, విద్య: 10+, జీతం: 10 వేలు, రూమ్ & భోజన వసతి సదుపాయం కలదు. & కమీషన్. ఆడ పనిమనుషులు కావలెను. వయస్సు: 18+, జీతం: 10,000/- ✆ 9848380275/ 8074447933.

మీ మండలంలో మీ చుట్టూ ఉన్న గ్రామాల్లో మార్కెటింగ్ చేస్తూ నెలకు 20 వేలు దాకా సంపాదించుకొనే అవకాశం మార్కెటింగ్ చేయుట ద్వారా పొందవచ్చును. అర్హత పదవ తరగతి ఆపైన 22 సం॥ దాటి బైక్ కలిగి ఉన్న వారికి ప్రాధాన్యత. ✆ 7732057408.

ప్రముఖ Healthy Fruit Bites సంస్థలో పనిచేయుటకు ఆసక్తికల డెలివరీ బాయ్స్ - 2, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (పార్ట్ టైం) కావలెను. సంప్ర: (10AM - 5PM), Ph: 7382218823, 7997045657.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	110	175	195

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80081 11237

టీకా.. వ్యాధులకు టాటా..!

జిల్లాకు 1835 దోసులు మంజూరు

కోటబొమ్మాళిలో సంకరజాతి ఆవులకు టీకాలు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా సంకరజాతి ఆవులు కలిగిన పాడిరైతులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. ఈ ఆవులకు సంక్రమించే థైలేరియాసిస్ వ్యాధినివారణ టీకాలను పశుసంవర్ధకశాఖ ఉచితంగా అందించనుంది. ఈ నెల 10 వరకు ఈ టీకాల కార్యక్రమం నిర్వహిస్తోంది. జిల్లాకు 1835 దోసులు మంజూరయ్యాయి. శ్రీకాకుళం డివిజన్‌కు 350, టెక్కలి డివిజన్‌కు 1485 డోసులు అందజేశారు. 'రక్షావ్యాక్- టి' టీకాగా దీన్ని పిలుస్తారు. ఈ సూదిమందు ఖరీదు 4 నుంచి 5 వేల వరకు ఉంటుంది. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది.

జ్వరం.. రక్తహీనత

థైలేరియాసిస్ అనే వ్యాధి పిరుదులు, కొనుసుల నుంచి వేరే ఆవులకు వ్యాప్తి చెందుతుంది. 105-106 డిగ్రీల జ్వరం, రక్తహీనత, నీరసం, ఆకలి మందగించడం, ఊపిరిభారం, పాల ఉత్పత్తి తగ్గడం, చూడి ఆవుల్లో గర్భ స్రావమై వారంరోజుల వ్యవధిలో మృతి చెందుతాయి.

మూడు వారాలు జాగ్రత్త : ఈ వ్యాధి నివారణ టీకాను వేసిన తదుపరి మూడువారాల వరకు ఆవులను జాగ్రత్తగా చూసుకోవాలి. ఎలాంటి యాంటీబయోటిక్, ఇతర వ్యాధినివారణ టీకాలు వేయకూడదు. యాంటీప్రోటోజోవల్ మందులు వినియోగించొద్దు. **-లకినేని కిరణ్‌కుమార్, పశువైద్యుడు**

తానా సభల్లో సిక్కోలు కళాకారుల నృత్యం

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: ఉత్తర అమెరికా జరుగుతున్న తానా మహాసభల్లో జిల్లాకు చెందిన ప్రసిద్ధ సంప్రదాయం నాట్య గురుకులం సంచాలకుడు, ప్రసిద్ధ నర్తకి స్వాతి సోమనాథ్ బృందం యోగా నృత్యప్రదర్శన జరిగింది. మూడు రోజుల పాటు ప్రదర్శనలిచ్చిన స్వాతి సోమనాథ్ బృందం పలు కూచిపూడి నృత్యాంశాలను నర్తించి ప్రవాసాంధ్రుల ప్రశంసలు అందుకున్నట్లు స్వాతి సోమనాథ్ తెలిపారు. తన బృందాన్ని శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించినట్లు ఆమె పేర్కొన్నారు.

(c) eenadu

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

భక్తిశ్రద్ధలతో శయన ఏకాదశి పూజలు

కంచిలిలో పూజలందుకుంటున్న శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి

శయన ఏకాదశిని పురస్కరించుకుని ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గంలోని అన్ని విష్ణు దేవాలయాల్లో పూజలు చేశారు. ఇచ్ఛాపురం చిన్న గురుస్వామి ఆధ్వర్యంలో వెంకటేశ్వర కళాకారుల బృందం శ్రీవారి కీర్తనలు ఆలపించారు. చిన్నగురుస్వామి, సేవాదళ ప్రతినిధులను సత్కరించారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం, పలాస, కంచిలి


ఇచ్ఛాపురంలో జగన్నాథస్వామి

శ్రీరంగనాథుడిగా జగన్నాథుడు

సోంపేట, పలాస, న్యూస్‌టుడే: ఆలయానికి చేరుకున్న జగన్నాథ, బలభద్ర, సుభద్రలకు ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోంపేటలో నాలుగు రోజులపాటు ఆలయంలో నిర్వహించే దివ్య అవతారాల్లో భాగంగా శ్రీరంగనాథుడిగా స్వామిని అలంకరించి పూజలు నిర్వహించారు. ❖ పలాసలో రథయాత్ర పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమైన జగన్నాథుడు ఆలయ ప్రవేశం కోసం ఆరుబయట వేచి ఉన్నారు. ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రవేశం లేకపోవడంతో సోమవారం సాయంత్రం 6 గంటల వరకు రథంపైనే కొలువు తీరుతారని అర్చకులు తెలిపారు.

సోంపేటలో..

పలాస రథైలలోని..

పలాస, న్యూస్‌టుడే: పలాస సత్యసాయి సేవా సమితిలో సామూహిక లలిత సంకీర్తనలు ఆదివారం నిర్వహించారు. సేవకులతోపాటు బాలవికాస్ విద్యార్థులతో ఓం శ్రీసాయిరాం నామాలను 108 సార్లు లిఖిస్తూ నామసంకీర్తనలు, సాయంత్రం విష్ణు సహస్ర పారాయణం జరిపారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పట్టణంలో ఆదివారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో మొహర్రం నిర్వహించారు. కర్బలాలో సత్యం, ధర్మం, న్యాయం నిలిపేందుకు మహ్మద్ ప్రవక్త మనుమడు హజరత్ ఇమామ్ హుస్సేన్ త్యాగానికి గుర్తుగా మొహర్రం నిర్వహిస్తారని మత పెద్ద జోహార్‌ఖాన్ తెలిపారు. కస్పా మసీదుకు సమీపంలోని మౌలాలి పీర్లపంజా వద్ద నమాజు చేశారు. పవిత్ర వస్తువులను పెట్టె నుంచి తీసి, దర్శనం చేసుకుని, తిరిగి భద్రపరిచారు. హెచ్ఎం అబ్దుల్లా, అమీర్ అలీ, మున్నా బషీర్, జుల్లు అలీ బక్షీ, యూసఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

కుళాయిలు బాగు చేశారు

ఎం.గడూరు సమీప రహదారి వద్ద కుళాయి పనులు అసంపూర్తిగా వదిలేయడంతో తాగునీరు వృథాగా పోతోంది. ఈ సమస్యపై మే 17న 'వృథా కనిపిస్తోందా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి సంబంధితాధికారులు స్పందించారు. కుళాయిల ఏర్పాటుతో పాటు హెచ్‌డీ పైపులు వాలి పోకుండా సిమెంటు దిమ్మెలు వేశారు. - న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం: 9440437129
పలాస: 8008574279
కవిటి గ్రామీణం: 8309639875
పలాస గ్రామీణం: 7386409926
కంచిలి గ్రామీణం: 9704568738

?: ఇచ్ఛాపురం పట్టణం జగన్నాయకులుపేటలో పనికిరాని మొక్కలను తొలగించాలి. - **పేట మహిళలు, ఇచ్ఛాపురం** ● ఈ ప్రాంతంలో పనికిరాని మొక్కలను తొలగించి, శుభ్రం చేస్తాం. - **పి.ఉపేంద్రకుమార్, ఎంఎస్ఐ, ఇచ్ఛాపురం** -న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

?: కాశీబుగ్గ పాత జాతీయ రహదారి ఎరుకోల సత్యారావు క్వార్టర్స్ పక్క వీధుల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. - **స్థానికులు, కాశీబుగ్గ** ● రహదారి నిర్మాణం కోసం టెండర్లు పిలిచాం. త్వరలోనే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. - **కిరణ్‌కుమార్, ఏఈ, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం** - న్యూస్‌టుడే, పలాస

?: ఇద్దివానిపాలెంలో చెత్తను ఇళ్ల సమీపంలో వేస్తుండటంతో దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. - **గ్రామస్థులు** ● చెత్త తొలగించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. - **ఎల్.రాజేష్, పంచాయతీ కార్యదర్శి ఇద్దివానిపాలెం** - న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

?: బైపల్లిలో ఎన్టీఆర్ సుజల ట్యాంకు ద్వారా కొద్దిరోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. - **దున్న లక్ష్మణరావు, గ్రామస్థుడు** ● చర్యలు తీసుకుంటాం. - **సతీష్, గ్రామీణ మంచినీటి పథకం సరఫరా విభాగం జేఈ, వజ్రపుకొత్తూరు** - న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

?: పలాస మండలం శాసనాం ప్రధాన వీధిలో కాలువలు సరిగ్గా లేవు. - **స్థానికులు** ● త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం. - **సద్గుణ, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, లొద్దభద్ర** - న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

అలంకారప్రాయం.. సేవలకు దూరం
రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్‌ల దుస్థితి

- న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

అన్నదాతకు మెరుగైన సేవలందిస్తామని వైకాపా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు (రైతు సేవా కేంద్రాలు) ఏర్పాటు చేసింది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పంట కొనుగోలు తదితరాలు కియోస్క్ యంత్రాల ద్వారా నిర్వహించాలని రూ.లక్షల వ్యయంతో కొనుగోలు చేసి కేంద్రాలకు సరఫరా చేసింది. అవి కొన్ని నెలలకే పనిచేయని దుస్థితి నెలకొంది.

నిర్వహణ కరవై.. నిరుపయోగంగా..

నియోజకవర్గంలో కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట మండలాల్లో 25 రైతు సేవా కేంద్రాలు న్నాయి. వాటికి కియోస్క్ పరికరాలు అందజేశారు. ఒక్కో పరికరానికి రూ. 75 వేలు ఖర్చు చేశారు. వాటిని కొన్ని నెలలపాటు మాత్రమే వినియోగించగా.. అనంతరం క్రమంగా మూలకు చేరాయి. సరైన నిర్వహణ లేక, బ్యాటరీలు పనిచేయక పలు చోట్ల విద్యుత్తు సరఫరా, ఇంటర్నెట్ సౌకర్యం లేక తదితర సమస్యలతో నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం వ్యవసాయశాఖకు సంబంధించిన అన్నిరకాల సేవలు చరవాణుల్లో నిర్వహిస్తున్నారు. అప్పట్లో నాణ్యత లేని యంత్రాలు అందజేయడంతో కొన్ని రోజులకే మూలకు చేరాయని రైతు సంఘాల ప్రతినిధులు విమర్శిస్తున్నారు. ఆయా కంపెనీలకు లబ్ధి చేకూర్చడానికి పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని వృథా చేసిందని ఆరోపిస్తున్నారు.

నియోజకవర్గ వివరాలు

మండలం	ఆర్ఎస్‌కేలు	రైతులు
కవిటి	17	2,794
కంచిలి	22	8,322
ఇచ్ఛాపురం	18	6,743
సోంపేట	24	7,920

బొరివంక రైతు సేవా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్

చరవాణిలో నమోదు చేస్తున్నారు

గ్రామస్థాయిలో పని చేసే వీఏఏలు, ఎంపీఈవోలు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తదితరాలు చరవాణి ద్వారా నమోదు చేస్తున్నారు. కియోస్క్‌లను ఎవరూ వినియోగించడం లేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లి వినియోగంలోకి తెచ్చేలా కృషి చేస్తాం.

- పి.శ్రీదేవి, మండల వ్యవసాయ అధికారిణి, కవిటి

ఇలాగైతే రాకపోకలెలా..!

పలాస మండలం కేదారిపురంలోని పెద్ద వీధి రోడ్డు దారుణంగా తయారైంది. కాలువలు లేకపోవడంతో మురుగు నిరంతరం రహదారి మీదనే పారుతోంది, దానికి తోడు చిన్న వర్షం పడినా రోడ్డంతా బురదమయంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు, రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. ఇదే విషయం పంచాయతీ కార్యదర్శి ఆశ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే కాలువలు, రోడ్డు నిర్మించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. - న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

స్తంభం తీశారు.. దిమ్మె మరిచారు..

సోంపేట ప్రధాన రహదారిపై విద్యుత్తు స్తంభం తొలగించి దిమ్మ వదిలేయడంతో స్థానికులు ప్రమాదాలకు గురవుతున్నారు. దిమ్మెపై ఇనుప స్తంభం ముక్కలు ఉండిపోవడంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పాదచారులు వీటిని తన్నుకొని గాయాల పాలవుతున్నారు. దిమ్మెను తొలగించి ప్రమాదాలు నివారించాలని వేదం ఫౌండేషన్ అధ్యక్షుడు డి.జోగారావు కోరారు. సమస్యను ట్రాన్స్‌కో ఏఈ రామారావు దృష్టిలో ఉంచగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, సోంపేట

చెక్‌డ్యాం శిథిలం

కవిటి మండలంలోని బీల ప్రాంతంలో గొనమారి గెడ్డలో పెద్దకర్రివానిపాలెం వద్ద ఉప్పునీరు సాగు నీటిలో కలవకుండా ఏర్పాటు చేసిన చెక్‌డ్యాం శిథిలావస్థకు చేరింది. కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులు చేయకపోవడంతో రంధ్రాలు ఏర్పడి సాగునీటిలో ఉప్పునీరు కలిసి పంటలకు ఇబ్బందులు కలుగుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ మధుసూదన పాణిగ్రాహిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

మరమ్మతులు చేపట్టరూ...

బలియాపుట్టుగలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల పథకం ఐదేళ్లగా నిరుపయోగంగా ఉంది. దీనిపై ఆధారపడిన పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వినియోగంలో లేకపోవడంతో పథకం చుట్టూ పనికిరాని మొక్కలు దట్టంగా పెరిగాయి. పనికిరాని మొక్కలు తొలగించి, పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పథకాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. - న్యూస్‌టుడే, కంచిలి

ప్రజాజీవనం కన్నా.. దోమల నివాసానికి మిన్న

ఈ గ్రామంలో ఎక్కడ చూసినా మురుగు తాండవిస్తోంది. ప్రజాజీవనం కన్నా దోమల నివాసానికి మిన్న అన్నట్లు ఉంది ఇచ్ఛాపురం మండలం ముచ్చింద్ర గ్రామం దుస్థితి. ఇక్కడ రెండు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొన్నా క్షేత్రస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే రెండు, మూడు రోజులు ఇళ్లకే పరిమితం కావాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ కృష్ణకు వివరణ కోరగా త్వరలోనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

చురుగ్గా సంతకాల సేకరణ

హరిపురం (మందస), న్యూస్‌టుడే: మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో ఉద్దానం గ్రామాల్లో కార్గో విమానాశ్రయం ఏర్పాటును వ్యతిరేకిస్తూ మందస మండలం రాంపురంతోపాటు పరిసర గ్రామాల్లో ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. విమానాశ్రయ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు డి.రామారావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో టి.తుంబనాథం, ఎం.జనార్ధనరావు, జోగారావు, కోదండరావు, వేమయ్య, ముఖలింగం, కాంతారావు, సంతోష్ పాల్గొన్నారు.

సంతకాలు చేస్తున్న మహిళలు

హక్కులు కల్పించకపోతే ఉద్యమిస్తాం

సోంపేట: గత ప్రభుత్వం పేద రైతుల భూములను ఇనాందారీ వారసుల పేరిట నమోదు చేయడంతో రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని, సమస్య పరిష్కరించకపోతే ఉద్యమం చేపడతామని కొర్లాం అగ్రహారం రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక సచివాలయం వద్ద వీరంతా సమావేశమై గత ప్రభుత్వంలో 250 ఎకరాల పంట పొలాలను జమీందార్లకు అప్పగించేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పూర్తిస్థాయి హక్కులు కల్పించి రైతులకు ప్రభుత్వం ఇచ్చే పథకాలు అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కొర్లాంలో ఆందోళన చేస్తున్న రైతులు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

కంచిలి, మందస, ఇచ్ఛాపురం గ్రామీణం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో రాష్ట్రం అభివృద్ధి పరంగా వెనుబడిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక సమస్యలను అధిగమిస్తూ సుపరిపాలన అందించామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన ఇచ్ఛాపురం నియోకవర్గం బాధ్యుడు దాసరి రాజు అన్నారు. ఆదివారం కంచిలి మండలం నారాయణపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ✦ మందస మండలం భోగాపురం, బేతాళపురం, హరిపురంలో ప్రచారం చేపట్టారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టరు దుర్యోధనరావు, డి.తాతారావు, ఎస్.మాధవరావు, నవీన్‌యాదవ్ పాల్గొన్నారు. ✦ ఇచ్ఛాపురం మండలం కొఠారి పంచాయతీలో మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. దక్కత కామేష్ రెడ్డి, బోర ప్రసాద్, పి.చంద్రశేఖర్, లోపింటి పద్మనాభం, సహదేవురెడ్డి, సూర్యనారాయణ పాల్గొన్నారు. ✦ కూటమి ప్రభుత్వంలోనే పాడి రైతులకు మేలు జరుగుతుందని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. ఆదివారం రామయ్యపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయం వద్ద పాడి రైతులకు రాయితీపై దాణా అందజేశారు.

నారాయణపురంలో కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

భోగాపురంలో ప్రచారం చేస్తున్న తెదేపా శ్రేణులు

నాణ్యత లేకపోతే బిల్లులు ఆపేస్తాం

సూచనలు చేస్తున్న పుర కమిషనర్ రామారావు

పలాస, న్యూస్‌టుడే: తోపుడుబళ్ల తయారీలో నాణ్యత లేకుంటే బిల్లులు నిలుపుదల చేస్తామని పలాస-కాశీబుగ్గ పుర కమిషనర్ రామారావు తెలిపారు. కాశీబుగ్గలో పారిశుద్ధ్య పనుల కోసం తయారు చేస్తున్న తోపుడుబళ్లను ఆదివారం పరిశీలించారు. నాణ్యతతో కూడిన సామగ్రి వినియోగించాలని కోరారు. శానిటేషన్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న పీకేఎస్ నాయకులు

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: లేబర్ కోడ్‌లు అమలు చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను వ్యతిరేకిస్తూ ఈనెల 9న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించనున్న

సమ్మె విజయవంతం చేయండి

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య(పీకేఎస్) నాయకులు పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బొడ్డపాడులో పీకేఎస్ నాయకులు ఆదివారం సమావేశమై లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్యోధన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కొండారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సదాస్మరణీయుడు

జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: అణగారిన వర్గాల సంక్షేమం కోసం బాబూ జగ్జీవన్‌రామ్ అలుపెరగని కృషి చేశారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర నాయకుడు యు.అప్పలరాజు అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి నేపథ్యంలో కాశీబుగ్గలోని విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సింహాచలం, ఈశ్వరరావు, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వామనమూర్తి

ఆటో కార్మికులకు న్యాయం జరిగేలా పోరాటం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఆటో యజమాని పేరిట నమోదైనా చిరునామా నుంచి 60 కిలోమీటర్ల లోపే సామర్థ్య పరీక్ష (ఫిట్‌నెస్ టెస్ట్) జరిపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వామనమూర్తి డిమాండ్ చేశారు. ఇచ్ఛాపురంలో సంఘ అధ్యక్షుడు బి.మోహనరావు అధ్యక్షతన ఆటో యజమానులు, కార్మిక సంఘ భవనంలో ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఇచ్ఛాపురంలో ఉండే వాహన సామర్థ్య పరీక్షలను 150 కిలోమీటర్ల దూరంలోని ఎచ్చెర్లలో ఏర్పాటుచేయడం దారుణమన్నారు. ఈ విషయాన్ని రాష్ట్రస్థాయి సమావేశాల్లో చర్చించి, తీర్మానాల ద్వారా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని, ఆటోవాలాలకు అండగా ఉంటామని ఆయన ప్రకటించారు. నాయకులు యర్రయ్యరెడ్డి, హరి, తిరుమల, దుర్యోధన పాల్గొన్నారు.

మహిళలను ఆర్థికంగా ఎదిగేందుకు చర్యలు

సోంపేట, న్యూస్‌టుడే: మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని సెర్ప్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూలపొలం ప్రాజెక్టును ఆదివారం పరిశీలించారు. సముద్రపు నాచు తయారీ, చేపల పెంపకం, ఇతర ప్రాజెక్టుల విషయమై అధికారులతో చర్చించారు. జీవనోపాధుల కల్పనకు సంఘాలు చేపట్టే కార్యక్రమాలు, వార్షిక రుణ ప్రణాళిక తదితర అంశాలపై మాట్లాడారు. డీపీఎం పి.రవికుమార్, ఏపీఎం ఎస్.ప్రసాదరావు, సీసీలు టి.శ్రీనివాసరావు, వి.మోహన్‌రావు, వీవోఏ ఉదయ్, ఆక్వా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూలపొలం మత్స్య అభివృద్ధి బోర్డు కార్యకలాపాలు పరిశీలిస్తున్న సెర్ప్ అధికారులు

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

మందస మండలం బాలిగాం పరిధిలోని మురిపింటి చెరువు ద్వారా దాదాపు 1000 ఎకరాలకు సాగునీరు అందుతుంది. గత వైకాపా హయాంలో చెరువు నుంచి పంట పొలాలకు సరఫరా అయ్యే కాలువ మరమ్మతులు జరగక పనికిరాని మొక్కలు, పూడిక పేరుకుపోయి రైతులకు సాగునీటికి అవస్థలు పడ్డారు. ఈ పరిస్థితిని అన్నదాతలు ఇటీవల ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి చేనుకు నీరు.. ప్రతి చేతికి పని అనే నినాదంతో ఎమ్మెల్యే ఈ కాలువ పనులకు నిధులు మంజూరు చేశారు. ఆ పనులు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి.

- న్యూస్‌టుడే, హరిపురం (మందస)

మార్గదర్శకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: డా.శ్యామాప్రసాద్ ముఖర్జీ సనాతన ధర్మ రక్షణే ధ్యేయంగా భారతీయ జనసంఘ్ పార్టీని స్థాపించారని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వైకుంఠరావు అన్నారు. ముఖర్జీ జయంతి సందర్భంగా కాశీబుగ్గలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వైకుంఠరావు మాట్లాడుతూ ఆయన ఎందరికో మార్గదర్శకులన్నారు. తొలుత శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పద్మావతి, కృష్ణారావు, గజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైకుంఠరావు

కిడ్నీ బాధితురాలి మృతి

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: ఒంకులూరుకు చెందిన దుమ్ము లక్ష్మీదేవి (39) డయాలిసిస్ చేసుకుంటూ ఆదివారం మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న లక్ష్మికి శనివారం పరిస్థితి విషమించడంతో పలాస కిడ్నీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. మృతురాలికి భర్త, ఒక కుమార్తె ఉన్నారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నివాళులు.. పరామర్శలు

పలాస, న్యూస్‌టుడే: విలువలతో కూడిన సుదీర్ఘ రాజకీయం చేసిన నాయకుడు కొల్లకోట నీలకంఠం అని టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. పలాసలో మాజీ సర్పంచి నీలకంఠం సంతాపసభ ఆదివారం నిర్వహించి నివాళులర్పించారు. గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ విఠల్, కౌన్సిలర్ సూర్యనారాయణ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు పాల్గొన్నారు.

సోంపేట, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: మామిడిపల్లికి చెందిన న్యాయవాది లింగరాజు కుటుంబసభ్యులను ఆదివారం ఎమ్మెల్సీ నర్తు రామారావు పరామర్శించారు. లింగరాజు తండ్రి కేశవరావు ఇటీవల మరణించడంతో సర్పంచి శేషగిరి, ఎంపీటీసీ సభ్యుడు డి.మాధవరావు, వైకాపా నాయకులు శివరాం, ఈశ్వరరావు, జయరాం, రామారావు పరామర్శించారు. సోంపేట ఎంపీపీ ఎన్.దాసు, జడ్పీటీసీ సభ్యురాలు యశోద, సర్పంచి జోగారావు, పార్టీ మండలాధ్యక్షుడు భాస్కరరావు సంతాపం తెలిపారు. ❖ కాశీబుగ్గకు చెందిన మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర త్యాడి తల్లి కృష్ణవేణి ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని నాయకులు కామేశ్వరరావు, విఠల్‌రావు, నాగరాజు పరామర్శించారు.

సేతువులు.. ప్రమాద హేతువులు..

- న్యూస్‌టుడే, హరిపురం (మందస)

మందస మండలంలోని రహదారులపై పలు చోట్ల పురాతన వంతెనలు ప్రమాద హేతువులుగా మారాయి. ఇక్కడి చాలా వంతెనలు జమీందారుల పాలనలో శతాబ్దాల కిందట వీటిని నిర్మించినవే. కాలం చెల్లడంతో ప్రమాదకరంగా మారాయి.

ఊగుతూ వణికిస్తున్నాయి

మందస, హరిపురం మధ్య రహదారిలో చాకిరేవుగెడ్డ, సునాముధి గెడ్డలపై ఉన్న వంతెనలు ప్రమాద ఘంటికలుగా మారాయి. వంతెనలపై ఇరువైపులా ఇనుప రాడ్లతో ఏర్పాటు చేసిన రెయిలింగు చాలా వరకు ఊడి పాడయ్యింది. సోంపేట నుంచి మందస మీదుగా మెళియాపుట్టి రహదారిపై హంసారలి, బాలాజీపురం సమీపాల్లో సునాముధి గెడ్డపై వంతెనలు కూడా శతాబ్దాల కిందట నిర్మించినవే. వీటిలో బాలాజీపురం వద్ద వంతెన పూర్తిగా పాడవ్వడంతో రోడ్డు, భవనాలశాఖ అధికారులు పలుమార్లు మరమ్మతులు చేపట్టారు. అయినా ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. పాత జాతీయ రహదారి నుంచి దేవుపురం మీదుగా ఎంఎం రోడ్డు వరకున్న రహదారిలో దేవుపురం సమీపంలోని గెడ్డపై కల్వర్టు ఉంది. ఈ ప్రాంతంలో ఏటా వరదలు పొంగి ప్రవహించడంతో కల్వర్టు పాడైంది. దీన్ని తొలగించి వంతెన నిర్మించాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు. చీపి, బుడంబొ రహదారిపై బొందుకారి వద్ద చీపి గెడ్డపై వంతెన భయాందోళనకు గురిచేస్తుంది. ఒక వైపు గోడ విరిగిపడటంతో వంతెన ఎప్పుడు కూలుతుందోనన్న భయం స్థానికుల్లో నెలకొంది. శిథిలావస్థకు చేరిన ఈ వంతెనలపై ప్రమాదాలు జరగక ముందే మేల్కొని కొత్తవాటిని నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

బొందుకారి వద్ద ప్రమాద ఘంటికలా మారిన వంతెన

ప్రతిపాదనలు పంపించాం

నియోజకవర్గంలోని చాలా రహదారులపై వంతెనలు రాజుల కాలంలో నిర్మించినవే. వాటి కాలపరిమితి ఎప్పుడో అయిపోయింది. కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి పునర్నిర్మాణం కోసం అంచనా విలువలతో కూడిన ప్రతిపాదనలు వారం కిందట ప్రభుత్వానికి పంపించాం. నిధులొస్తే మరమ్మతులు, నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. - విక్రమ్, ఆర్ అండ్‌బీ జేఈ, మందస

పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి

పలాస, కవిటి గ్రామీణం, మందస, న్యూస్‌టుడే: పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలని టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. ఆదివారం పలాస ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశుసంవర్ధకశాఖ ఏడీ రవికృష్ణ పాల్గొన్నారు. ❖ పెంపుడు జంతువుల నుంచి వ్యాధులు వ్యాపించకుండా వాటి యజమానులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధకశాఖ జేఈవో పురుషోత్తం అన్నారు. కవిటి పశువైద్య కేంద్రం వద్ద టీకాలు వేశారు. ❖ మందస పశువైద్య కేంద్రం వద్ద మందస, హరిపురం పశువైద్యాధికారులు డి.శ్రీకాంత్, కె.ఉమాభారతి పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. జంతువుల నుంచి దాదాపు 106 రకాల వ్యాధులు మనుషులకు సోకుతాయని, పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలని సూచించారు.

కవిటిలోని పశువైద్యశాల వద్ద పెంపుడు శునకానికి టీకాలు వేస్తున్న వైద్యులు

జులై 10 లోగా అన్నదాతా సుఖీభవ నమోదు

సోంపేట, న్యూస్‌టుడే: అన్నదాతా సుఖీభవ పథకానికి రైతులు జులై 10 లోగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి తెలిపారు. వెబ్‌ల్యాండ్‌లో 1బి వచ్చిన రైతులు రైతు సేవా కేంద్రాల వద్ద వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఆధార్ కార్డుతోపాటు ఇతర పత్రాలు అందజేసి నమోదు చేయించుకోవాలని సూచించారు.

వాహన చట్టాలపై అవగాహన అవసరం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: మారిన వాహన చట్టాలపై అవగాహన లేక, చాలా మంది కేసుల బారిన పడుతున్నారు. కుటుంబ పరంగా తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు. దీనిని నివారించేందుకు చైతన్య కార్యక్రమాలు అవసరమని, అందుకు పోలీసు శాఖకు తమ క్లబ్ తరఫున సహకారం అందిస్తామని ఇచ్ఛాపురం అలెయన్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. ఈ విషయమై క్లబ్ అధ్యక్షుడు లోపింటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో సభ్యులు ఆదివారం పట్టణ ఎస్సై ఎం.ముకుందరావును కలిశారు. జి.ఉమాశంకర్, బుజ్జి, బాలకృష్ణ, యోగి, వెంకటరావు, రఘు, బాల, గోపి, నరసింహ పాల్గొన్నారు.

(c) eenadu

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

పాతపట్నం నియోజకవర్గంలో సమస్యలా..?

రేపు ఎమ్మెల్యే మామిడి గోవిందరావుతో 'ఈనాడు ఫోన్ ఇన్'

పాతపట్నం నియోజకవర్గంలో అర్హులైనా సంక్షేమ పథకాలు అందడం లేదా? అభివృద్ధి పనులు జరగడం లేదా? సమస్యలపై అధికారులు స్పందించడం లేదా? ఇలా ఎటువంటి ఇబ్బందులైనా నేరుగా నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తుంది.. మీరు చేయాల్సిందల్లా ఒక్కటే. కింద పేర్కొన్న నంబర్లకు ఫోన్ చేసి చెప్పడమే. అలాగే ఆయా సమస్యల చిత్రాలు వాట్సాప్ కూడా చేయవచ్చు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి సంబంధించిన వివిధ శాఖల అధికారులు పాల్గొంటారు. - న్యూస్‌టుడే, పాతపట్నం

ఈనాడు మిత్రుడు

తేదీ: 08.07.2025 (మంగళవారం), సమయం: ఉదయం 9 గంటల నుంచి 10 వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్లు : 80085 52706, 99851 07090

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నరసన్నపేట నేతాజీవీధిలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో..

నరసన్నపేట, కోటబొమ్మాళి, పాతపట్నం, హిరమండలం, కొత్తూరు, జలుమూరు, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. పేదల సంక్షేమానికి పాలకులు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు.

కాగువాడలో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు, కూటమి నాయకులు

మాతలలో తెదేపా శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కలమట నేతృత్వంలో..

ఒకటైనా, రెండైనా ఊపిరి బిగపట్టాల్సిందే

- న్యూస్‌టుడే, సారవకోట, జలుమూరు, నందిగాం, పోలాకి

ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేక ఉద్యోగులకు, వివిధ పనులపై వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆరుబయట మల, మూత్ర విసర్జనను అరికట్టాలనే లక్ష్యంతో ప్రతి కుటుంబం వ్యక్తిగత మరుగు దొడ్డి ఏర్పాటు చేసుకోవాలని గతంలో తెదేపా ప్రభుత్వం పెద్ద సంఖ్యలో నిర్మాణాలు చేపట్టింది. మరో వైపు మండల కేంద్రాల్లో, గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించి దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ మరుగుదొడ్లు లేవు. ముఖ్యంగా మహిళా ఉద్యోగుల బాధలు వర్ణనాతీతం. వివిధ పథకాల కోసం రూ.కోట్లు ఖర్చుచేస్తున్న ప్రభుత్వం ఇప్పటికైనా సమస్యపై దృష్టి పెట్టాలని ప్రజలు, ఉద్యోగులు కోరుతున్నారు.

సారవకోట మండల మహిళా సమాఖ్య భవనంలో తలుపులు, నీటి సౌకర్యం లేని మరుగుదొడ్లు

చర్యలు తీసుకుంటాం

మండల మహిళా సమాఖ్య, ఉపాధి హామీ కార్యాలయాల ఆవరణల్లో మరుగుదొడ్లు ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు నిధులు కేటాయించారు. మిగతా భవనాల సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్తామని సారవకోట ఎంపీడీవో మోహన్‌కుమార్ పేర్కొన్నారు. నందిగాం మండలానికి సంబంధించి ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో కుమార్ పట్నాయక్ చెప్పారు.

ఇదీ పరిస్థితి..

సారవకోటలో మండలంలో మహిళా సమాఖ్య, ఉపాధి హామీ, రెవెన్యూ, ఐసీడీఎస్, సారవకోట పశువైద్య కేంద్రం, నౌతళ, బద్రి పశు వైద్య ఉపకేంద్రాలకు మరుగుదొడ్లు లేవు. చీడిపూడి పశువైద్య కేంద్రంలో ఉన్నా నీటి సదుపాయం లేక నిరుపయోగంగా ఉంది. రెవెన్యూ, తపాలాశాఖ సిబ్బంది మండల పరిషత్తు సమావేశ భవనం ఆవరణలోని మరుగుదొడ్డి వినియోగిస్తున్నారు.

జలుమూరు వ్యవసాయ, విద్యాశాఖ కార్యాలయాలు, పలు సచివాలయాల్లో, జలుమూరు, అల్లాడ, సురవరం పశువైద్య కేంద్రాల్లోనూ అత్యవసరమైతే ఆరుబయటకు వెళ్లాల్సిందే. నందిగాం వ్యవసాయశాఖ, మండల పరిషత్తు, రెవెన్యూ కార్యాలయం, వెలుగు, మండల విద్యా వనరుల కేంద్రం, ఉపాధిహామీ కార్యాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. పోలాకి వ్యవసాయశాఖ కార్యాలయం చిన్నగదిలో కొనసాగుతోంది. నీటి సౌకర్యం లేక మరుగుదొడ్డి వినియోగానికి దూరంగా ఉంది.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఉత్సవం

జలుమూరు, న్యూస్‌టుడే: కూర్మనాథపురంలో ఆదివారం పీర్ల ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇమామ్ షేక్ యాకూబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్థులు అరటి గెలలు సమర్పించి, నూనె దీపాలు వెలిగించారు. సాయంత్రం పీర్లను మంగళవాయిద్యాలతో ఊరేగించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరై రాత్రి నిప్పులపై నడిచారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

? నందిగాం మండలం వజ్జీలపేటలో సుమారు 200 కుటుంబాలున్నాయి. ఒక్కటే చేతిపంపు ఉంది. దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. మరో రెండు ఏర్పాటు చేయాలి. **- పేరాడ లక్ష్మి, స్థానికురాలు**

● తాగునీటి సరఫరా విభాగం అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- కుమారి, పంచాయతీ కార్యదర్శి, కొత్తఅగ్రహారం** - న్యూస్‌టుడే, నందిగాం

ఆర్థిక సాయం అందజేత

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: నౌపడకు చెందిన లోపింటి సోమేశ్వరరావు ప్రమాదవశాత్తు భవనం నుంచి కింద పడటంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. అతని వైద్య ఖర్చులకు అదే గ్రామానికి చెందిన స్నేహితులు రూ.21,500 నగదు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేరాల నియంత్రణ అందరి బాధ్యత

హిరమండలం, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణ అందరి బాధ్యతని ఎస్సై ఎండీ యాసిన్ పేర్కొన్నారు. ఆదివారం సుభలయ గ్రామంలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. వివిధ చట్టాల గురించి వివరించారు. ఎవరైనా మహిళలను వేధిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

కదలని మురుగు.. వీడని దుర్గంధం

సారవకోట మండలంలోని గుమ్మపాడు పంచాయతీ గోపాలపురంలో బీటీ రోడ్డుకు ఇరువైపులా కాలువలు దయనీయంగా ఉన్నాయి. స్థానికంగా రామాలయం వీధికి ఆనుకుని ఉన్న కల్వర్టు శిథిలావస్థలో ఉండటంతో మురుగు దిగువకు ప్రవహించడం లేదని స్థానికులు చెబుతున్నారు. చిన్నపాటి వర్షం పడినా దుర్గంధం, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కార్యదర్శికి తెలియజేసి సమస్యను పరిష్కరిస్తామని ఈవోపీఆర్డీ ప్రసాదరావు తెలిపారు. - న్యూస్‌టుడే, సారవకోట

రహదారి.. అధ్వానంగా మారి

నందిగాం మండలం సైలాడ పంచాయతీ దేవాడ ప్రధాన వీధిలోని సీసీ రోడ్డు అధ్వానంగా మారింది. మట్టి రహదారి కంటే దారుణంగా తయారవడంతో రాకపోకలకు అవస్థలు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాన కురిస్తే వృద్ధులు, చిన్నారులు తరచూ జారి పడుతున్నారని, తక్షణమే రోడ్డు ఎత్తు పెంచి మురుగు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సీహెచ్ రవి మాట్లాడుతూ.. సిబ్బందికి తెలియజేస్తామన్నారు. - న్యూస్‌టుడే, నందిగాం

నిర్మించారు.. వదిలేశారు..!

పశువుల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో నీటి తొట్టెలు నిర్మించారు. వాటిలో నీరు నింపేందుకు చర్యలు తీసుకోక పోవడంతో అలంకారప్రాయంగా మిగిలాయి. ఎల్‌ఎన్‌పేట మండలం మోదుగువలస పునరావాస కాలనీ(దిన్నకొల్లివలస) వద్ద తొట్టెను చిత్రంలో చూడొచ్చు. సంబంధిత అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఏపీవో శ్రీదేవి వద్ద ప్రస్తావించగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, ఎల్‌ఎన్‌పేట

స్పందనకు వందనం

దారి మారింది.. ఇబ్బంది తీరింది

నరసన్నపేట మండలం ఉర్లాం గ్రామంలోని సాయి వీధిలో చిన్నపాటి వర్షానికే రహదారి చిత్తడిగా మారుతుండటంతో స్థానికులు అవస్థలు పడేవారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యపై గత నెల 30న 'అసలే ఇరుకు..ఆపై అధ్వానం' పేరిట ఈనాడులో వార్త ప్రచురించారు. దీనికి స్పందించిన యంత్రాంగం రూ.2 లక్షల పంచాయతీ నిధులతో రహదారిని 60 మీటర్ల మేర అభివృద్ధి చేశారు. ఇబ్బందులు తీరడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

ఎట్టకేలకు శుభ్రం చేశారు

జలుమూరు, న్యూస్‌టుడే: జలుమూరులోని రెవెన్యూ కార్యాలయం వద్ద ఉన్న తాగునీటి బోరు చుట్టూ పనికిరాని మొక్కలు అల్లుకున్నాయి. సంబంధిత సిబ్బంది స్పందించాలని స్థానికులు కోరారు. సమస్యపై ఈనాడులో ఈనెల 5న 'పనికిరాని మొక్కలు తొలగించరూ' శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఎంపీడీవో కె.అప్పలనాయుడు స్పందించారు. సిబ్బందికి తెలియజేయడంతో పనికిరాని మొక్కలు తొలగించారు.

పనికిరాని మొక్కల తొలగింపు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కోటబొమ్మాళి పోలీస్‌స్టేషన్ వెనక అధికారుల విశ్రాంత భవనం చుట్టూ పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. కిటికీలకు పొదలు అల్లుకుపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. సమస్యపై ఈనెల 1న 'విశ్రాంతి తీసుకుందామంటే వణుకే' శీర్షికతో ఈనాడులో వార్త వెలువడింది. దీంతో సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సత్యనారాయణ స్పందించారు. సిబ్బందికి తెలియజేసి పరిసరాలను శుభ్రం చేయించారు.

పోరాటంతోనే సమస్యల పరిష్కారం

సారవకోట, న్యూస్‌టుడే: పోరాటంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని విద్యుత్తు శాఖ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోపాలరావు (1104 యూనియన్) పేర్కొన్నారు. సారవకోటలో విద్యుత్తు శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉప్పాడ రామారావు సన్మాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయాల్లో గ్రేడ్-2 జేఎల్‌ఎంలుగా పనిచేస్తున్న వారిని ఏపీ ఈపీడీసీఎల్‌లోకి తీసుకురావడానికి పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. సంఘ ఉపకార్యదర్శి ఆర్.రాజశేఖరరావు, జిల్లా అధ్యక్షుడు ఎన్.లోకేశ్వరరావు, బ్రాంచ్ అధ్యక్షుడు డి.శేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఇ.ఈశ్వరరావు, ఏఈ రమేష్ పాల్గొన్నారు.

రామారావును సన్మానిస్తున్న విద్యుత్తు శాఖ ఉద్యోగుల రాష్ట్ర సంఘం నాయకులు

ఘనంగా ఏకాదశి పూజలు

అలంకరణలో పూజలందుకుంటున్న జగన్నాథస్వామి

కోటబొమ్మాళి, నరసన్నపేట, ఎల్‌ఎన్‌పేట, కొత్తూరు, సారవకోట, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువ జామునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. గీతా పారాయణం, తులసీ దళార్చన చేపట్టారు. సత్య వ్రతాలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలు జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కిల్లాంలో గీతాపారాయణం చేస్తున్న మహిళలు

మహసింగిలో సత్యవ్రతాల్లో పాల్గొన్న భక్తులు

జంతు ప్రేమికులు జాగ్రత్తలు పాటించాలి

కోటబొమ్మాళిలో పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది, చిత్రంలో కూటమి నేతలు

కోటబొమ్మాళి, పాతపట్నం, టెక్కలి, సారవకోట, న్యూస్‌టుడే: జంతు ప్రేమికులు జాగ్రత్తలు పాటించాలని పశు వైద్యాధికారులు, కూటమి నాయకులు పేర్కొన్నారు. జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కోటబొమ్మాళిలో మాజీ ఎంపీపీ విజయలక్ష్మి, తెదేపా మండలాధ్యక్షుడు బోయిన రమేష్ పాల్గొన్నారు. జంతువుల నుంచి మానవులకు వ్యాపించే వ్యాధుల గురించి ఏడీ లోకనాథం, పశువైద్యాధికారి అభినవ్ కిరణ్‌కుమార్ వివరించారు. ● పాతపట్నం పశువైద్యశాలలో సహాయ సంచాలకుడు ఎం.కరుణాకరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. రేబిస్ వ్యాధి టీకా కనుగొన్న లూయిస్ పాశ్చర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పెద్దసీది పశు వైద్యులు బి. శ్రీవాణి టీకాలు వేశారు. ● టెక్కలి చిన్నబజారులోని పశు వైద్యశాలలో జరిగిన కార్యక్రమంలో తెదేపా మండలాధ్యక్షుడు బగాది శేషగిరి, లవకుమార్ పాల్గొన్నారు. ● సారవకోట మండలంలోని అంగూరు, సారవకోట, నౌతల, చీడిపూడి గ్రామాల్లో పశువైద్య సిబ్బంది కుక్కలకు టీకాలు వేశారు. నౌతలలో జరిగిన కార్యక్రమాన్ని డీడీ నరసింహులు, ఏడీ దేవలక్ష్మి పరిశీలించారు. మండలంలో 43 పెంపుడు పెంపుడు కుక్కలకు టీకాలు వేసినట్లు వైద్యాధికారి కిషోర్ తెలిపారు.



పాతపట్నంలో లూయిస్ పాశ్చర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పశువైద్య సిబ్బంది

వైభవంగా పల్లకీ సేవ

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా బలరాంపురం గ్రామంలో ఆదివారం పల్లకీ సేవ వైభవంగా జరిగింది. కోటబొమ్మాళి సత్యసాయి సేవాసమితి నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

డీడీ విచారణ

సారవకోట, న్యూస్‌టుడే: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇటీవల నౌతల గ్రామాన్ని పరిశీలించిన సమయంలో స్థానిక పశువైద్య కేంద్రం తలుపులు మూసి ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై విచారణకు సంబంధిత శాఖాధికారులను ఆయన ఆదేశించారు. ఈమేరకు డీడీ నర్సింహులు ఆదివారం స్థానిక రైతులతో మాట్లాడి కేంద్రంలో పనిచేస్తున్న జూనియర్ వెటర్నరీ అధికారి (జేవీవో) పనితీరుపై వివరాలు సేకరించారు.

శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

జలుమూరు, న్యూస్‌టుడే: శ్రీముఖలింగేశ్వర స్వామి గ్రామోత్సవం ఆదివారం రాత్రి దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగింది. పరిసర గ్రామాల భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భాజపాతోనే సుస్థిర పాలన

టెక్కలి, న్యూస్‌టుడే: భాజపాతోనే సుస్థిర పాలన సాధ్యమని ఆ పార్టీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు బూరె నరేంద్రచక్రవర్తి అన్నారు. ఆదివారం శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఎన్ని పరమేశ్, జర్జాన రాంజీ, లక్ష్మీనారాయణ, రాములు పాల్గొన్నారు.

కాలం కరిగింది.. జ్ఞాపకం మిగిలింది

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 53 సంవత్సరాల తర్వాత 40 మంది స్నేహితులు కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. సత్యనారాయణ, చంద్రశేఖరం పాల్గొన్నారు.

పక్కకు వెళ్తే ప్రమాదమే..!

నరసన్నపేట మండలం ఉప్పరపేట, డోలపేట, అంబాజీపేట గ్రామాల మీదుగా ఇటీవల నిర్మించిన సీసీ రహదారికి ఇరువైపులా బెర్ములు సరిచేయక పోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్ శాఖ డీఈఈ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

శిథిల భవనంలో చదువులు

నందిగాం మండలంలో బంజీరుపేట ప్రాథమిక పాఠశాల భవనం 1986లో నిర్మించారు. 23 మంది పిల్లలు ఇక్కడ చదువుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తక్షణం కొత్తది నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులకు నివేదించామని నిధులు మంజూరైతే నూతన భవనం నిర్మిస్తామని ఎంఈవో జి.నరసింహులు పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, నందిగాం

సమ్మె విజయవంతం చేయండి

ప్రజా వ్యతిరేక విధానలను అవలంబిస్తున్న ఎన్‌డీఏ ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 9న దేశ వ్యాప్తంగా చేపడుతున్న సమ్మె విజయవంతం చేయాలని సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు పి.ప్రసాదరావు, కె.సూరయ్య కోరారు. చాపర సీఐటీయూ కార్యాలయం ఆవరణలో ఆదివారం సమావేశం నిర్వహించారు. వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, మెళియాపుట్టి

అభివృద్ధి బాట.. సంక్షేమ బావుటా

- న్యూస్‌టుడే, పోలాకి

వైకాపా పాలనలో రహదారుల నిర్వహణను ఐదేళ్ల పాటు గాలికి వదిలేయడంతో అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో రూ.కోట్లు వెచ్చించి రోడ్లను అభివృద్ధి చేయడంతో నేడు అద్దంలా దర్శనమిస్తున్నాయి. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గానికి ఉపాధి హామీ నిధులు రూ.60 కోట్లు మంజూరు చేయించి పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు.

పోలాకి: చింతువానిపేట గ్రామానికి వేసిన బీటీ రహదారి

అసంపూర్తి రోడ్లకు మోక్షం

నియోజకవర్గంలో 116 రహదారుల పనులకు నిధులు కేటాయించారు. ఒక్క పోలాకి మండలంలోనే 48 పనులు గానూ రూ.32 కోట్లు విడుదలయ్యాయి. గొల్లలవలస- డీపీఎన్ రోడ్డు, వనితమండలం-మబుగాం మార్గాలను బీటీలుగా మార్చారు. 13 గ్రామాల్లో సీసీ రహదారులు నిర్మించారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో పనులు ఆపేశారు. సారవకోట మండలంలో 20, జలుమూరు మండలంలో 18 నరసన్నపేట గ్రామీణం పరిధిలో 3 పనులు మంజూరయ్యాయి. ఇవి వివిధ దశల్లో ఉన్నాయి.

మూడు విడతల్లో పనులు

నరసన్నపేట నియోజకవర్గానికి సంబంధించి మూడు విడతల్లో పనులు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటి వరకు 30 శాతం పూర్తయినట్లు పీఆర్ డీఈఈ జి.సత్యంనాయుడు తెలిపారు. బిల్లుల చెల్లింపులు సకాలంలో జరుగుతున్నట్లు చెప్పారు. మిగిలినవి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సారవకోట మండలంలోని పురుషోత్తకర్ర మార్గం

ఇసుక లారీలతో రోడ్డు ధ్వంసం

గొట్టా బ్యారేజీ వద్ద నివగాం గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఆకుల తంపర నుంచి ఇసుక లారీలు రాత్రిపూట రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రోడ్డు బురదమయంగా మారింది. కొండరాగోలు, దుర్బలాపురం, గులుమూరు, ఆకులతంపరతో పాటు పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తామని ర.భ.శాఖ ఏఈ గోపాలరావు చెప్పారు. - న్యూస్‌టుడే, హిరమండలం

పొలం గట్టు విషయంలో అన్నదమ్ముల కొట్లాట

హిరమండలం, న్యూస్‌టుడే: మండలంలోని రెల్లివలస గ్రామంలో పొలం గట్టు విషయంలో అన్నదమ్ముల మధ్య జరిగిన కొట్లాటలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎండీ యాసిన్ ఆదివారం తెలిపారు. దంత తిరుపతిరావు, ఆయన సోదరుడు వైకుంఠరావు మధ్య వివాదం గొడవకు దారి తీసింది. ఈ ఘటనలో తిరుపతిరావు తలకు గాయమైంది. తనపై వైకుంఠరావు కుటుంబ సభ్యులు దాడి చేయడంతో గాయాలైనట్లు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైకుంఠరావు సైతం ఫిర్యాదు ఇవ్వడంతో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.



(c) eenadu

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: రాజీవ్ గృహ కల్ప నివాస

ద్విచక్ర వాహనాల స్వాధీనం

ప్రాంతాల్లో ఆదివారం ఒకటో పట్టణ పోలీసులు కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఎస్సై హరికృష్ణ నేతృత్వంలో పోలీసు బృందాలు ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. అనుమతి పత్రాలు లేని 5 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

శ్రీకాకుళం

• శ్రీకాకుళం • ఆమదాలవలస • ఎచ్చెర్ల

గురుకుల ప్రధానాచార్యుడికి సన్మానం


దేవేందరరావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు

కొల్లివలస(బూర్జ), న్యూస్‌టుడే : కొల్లివలస గురుకులం ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎ.లక్ష్మణరావు అధ్యక్షతన ప్రధానాచార్యుడు దేవేందరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఆదివారం గురుకులం ఆవరణలో జరిగిన ప్రధానాచార్యుల ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, గురుకులం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎన్.సంజీవరావు, జిల్లా సమన్వయకర్త గ్రేస్ పాల్గొని దేవేందరరావు దంపతులను సత్కరించారు.

దుర్వాసన భరించలేకున్నాం..

శ్రీకాకుళం నగరంలోని డే అండ్ నైట్ కూడలి సమీపంలో కొత్త వంతెన వద్ద శ్మశాన వాటిక వైపు నాగావళి నది తీరం పనికిరాని మొక్కలు, వ్యర్థాలతో నిండిపోయింది. కొందరు మాంసం దుకాణ యజమానులు, ఆసుపత్రి యాజమాన్యాలు వ్యర్థాలను అక్కడే పడేస్తుండటంతో భరించలేని దుర్వాసన వస్తోంది. స్థానికులు అక్కడికెళ్తే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి. వి. వి. డి. ప్రసాదరావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

కార్మికుల వేతనాలు పెంచండి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన పథక కార్మికులకు వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.అమ్మన్నాయుడు, మధ్యాహ్నభోజన పథక కార్మిక సంఘ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.సుశీల, ఉత్తర డిమాండు చేశారు. సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు.

కూటమితోనే సుపరిపాలన

వెంగళరావుకాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కూన రవి

ఆమదాలవలస పట్టణం, ఎచ్చెర్ల, లావేరు,(తామాడ), పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే కూన రవి కుమార్ అన్నారు. ఆదివారం ఆమదాలవలసలోని వెంగళరావుకాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎచ్చెర్లలో తెదేపా పూర్వ జిల్లా పార్టీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, లావేరు మండలం తామాడలో తెదేపా మండలాధ్యక్షుడు ముప్పిడి సురేశ్ పాల్గొన్నారు. • తెదేపా కార్యకర్తకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలసలోని ఓ కల్యాణ మండపంలో నియోజకవర్గ పరిశీలకుడు వజ్జ బాబూరావు ఆధ్వర్యంలో తెదేపా పట్టణ స్థాయి సమావేశం నిర్వహించారు. • పొందూరు మండలం వీఆర్‌గూడేం గ్రామానికి చెందిన సువ్వారి శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే కూన రవి సతీమణి ప్రమీల ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.1,08,000 చెక్కును అందజేశారు.

సందడిగా మారు రథయాత్ర

పొందూరు: పొందూరు మహారాజా మార్కెట్ ఆవరణలోని కోదండ రామస్వామి ఆలయంలో తొమ్మిది రోజులుగా నిర్వహించిన జగన్నాథస్వామి రథయాత్ర వేడుకలు ఆదివారం మారు యాత్రతో ముగిశాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. జై జగన్నాథ్ నినాదాలతో రథాన్ని ముందుకు లాగారు. దీంతో మార్కెట్ ఆవరణ సందడిగా మారింది.

శ్రీవారి ఆలయ ఈవోగా నియామకం

ఆమదాలవలస పట్టణం: పుర పరిధిలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవోగా సీహెచ్.ప్రభాకర్ రావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తమ్మినేని రవి పుర కమిషనర్‌గా బదిలీ కావడంతో ఆయనను ప్రభుత్వం నియమించింది.

హరికథా ఉత్సవాలు ప్రారంభం

శ్రీకాకుళం సాంస్కృతికం: పులఖండం శ్రీనివాసరావు సంస్మరణార్థం సుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో బాపూజీకళామందిరంలో తొమ్మిదిరోజుల పాటు నిర్వహించనున్న హరికథా ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కళాసమితి గౌరవాధ్యక్షుడు డా.కొంచాడ సోమేశ్వరరావు, ఉపనిషన్మందిరం సంస్థ అధ్యక్షుడు గుమ్మానగేష్‌లు అతిథులుగా జ్యోతిని వెలిగించి హరికథా ఉత్సవాలను ప్రారంభించారు.

న్యూ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

శ్రీకాకుళం నగరం, సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని న్యూ కాలనీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో బాబా ఆలయం వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులను అందజేశారు.

జూదరుల అరెస్టు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం: నగరంలోని ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జూద గృహంపై పోలీసులు దాడులు నిర్వహించారు. అయిదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హరికృష్ణ తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కారవేదిక

కలెక్టరేట్(శ్రీకాకుళం): జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు.

వీఆర్ఏలతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వీఆర్ఏలతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందిగీకి సాహెబ్ అన్నారు. ఆదివారం ఆమదాలవలస మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వీఆర్ఏల సంఘం ఏడో విడత జిల్లా మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. తక్షణమే వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

ఏకాదశి పర్వదినం.. కిటకిటలాడిన ఆలయాలు

శ్రీకాకుళం సాంస్కృతికం, గార, శ్రీకాకుళం నగరం, ఆమదాలవలస గ్రామీణం: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా నగరంలో ఆదివారం పలు విష్ణు ఆలయాల్లో ప్రత్యేక అర్చన, ఆరాధన పూజలు, అభిషేకం, విశేష అలంకరణ, సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం, భజనలు జరిగాయి. ● అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలోని అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆదిత్యుని కల్యాణాన్ని అర్చకులు నిర్వహించారు. ● గార మండలం శాలిహుండం కొండపై వెలిసిన కాళీయ మర్ధన వేణుగోపాలస్వామి ఆలయంలో ఆషాడశుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.● ఆమదాలవలస జోనల్ పరిధిలోని సత్యసాయి సేవా సమితుల్లో భక్తులు 24 గంటల పాటు ఏకాహం కార్యక్రమాన్ని చేపట్టారు.

పి.ఎన్.కాలనీలో నారాయణ తిరుమలలో వేంకటేశ్వరుడి దర్శనం

ఆదమరిస్తే ఆసుపత్రికే..

శ్రీకాకుళం గ్రామీణ మండలం సింగుపురంలో క్రీడామైదానం సమీపంలో నైర తాగునీటి పైపులైను నెల రోజుల కిందట మరమ్మతులు చేపట్టారు. దీని కోసం తవ్విన భారీ గుంతను ఇప్పటికీ పూడ్చలేదు. రాత్రివేళల్లో తగినంత వెలుతురు లేకపోవడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయమై నైర ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చంద్రకళను 'న్యూస్‌టుడే' సంప్రదించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

–న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

పూజలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ జగదీశ్వరి తదితరులు

తోటపల్లి జలాలతో మూడు జిల్లాలు సస్యశ్యామలం

పార్వతీపురం, గరుగుబిల్లి, న్యూస్‌టుడే: తోటపల్లి జలాలతో మూడు జిల్లాలు సస్యశ్యామలమవుతాయని మంత్రి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి జలాశయం కుడి కాలువ నుంచి ఆదివారం సాగు జలాలను ప్రభుత్వ విప్ జగదీశ్వరితో కలిసి విడుదల చేశారు. ఈ కాలువ ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 84 వేల ఎకరాలకు నీరు వెళ్తుందని తెలిపారు. అనంతరం రైతులతో సమావేశమై మాట్లాడారు. ఒడిశాతో వివాదంలో ఉన్న జంఝావతి, కొఠియా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు.

ఆదిత్యునికి రూ.7.47లక్షల ఆదాయం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి వారిని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. కేశఖండన శాలలో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు మహిళా భక్తులు ఇంద్రపుష్కరిణిలో స్నానాలు ఆచరించి రావి చెట్టు వద్ద, గోశాలలో పూజలు నిర్వహించారు. భక్తుల తాకిడితో ఉచిత, రూ.100, రూ.300లు, కేశఖండనశాల క్యూలైన్లలో రద్దీ నెలకొంది. దర్శన టిక్కెట్లు, ప్రసాదాల విక్రయాలు, ప్రత్యేక పూజల రూపంలో రూ.7.47 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.ప్రసాదరావు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి దుర్మరణం

లొడగల తవుడు

రణస్థలం, న్యూస్‌టుడే : రణస్థలం మండలంలోని నెలివాడ కూడలి వద్ద జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందినట్లు పోలీసుల తెలిపారు. పైడిభీమవరం పంచాయతీ లొడగలపేటకు చెందిన లొడగల తవుడు (70) రాత్రి భోజనం చేసిన తర్వాత ఇంటి బయట శాలలో పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో లేచి నిద్రమత్తులో నెలివాడ కూడలి వద్ద జాతీయ రహదారిపైకి వచ్చాడు. ఆ సమయంలో శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

నందిగాం, న్యూస్‌టుడే: మండలంలోని రాంపురం పంచాయతీ జయపురం గ్రామానికి చెందిన రాంపురం రత్నాలు (54) మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రత్నాలుకు రెండు కళ్లు కనిపించక పోవడంతో భర్త విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స చేసినా ప్రయోజనం లేదని వైద్యులు చెప్పడంతో ఇంటికి తీసుకొచ్చారు. దీంతో బతికి ఎవరికి ప్రయోజనమని మనస్తాపానికి గురైన ఆమె శనివారం అర్ధరాత్రి పురుగు మందు తాగారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

రోటరీక్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం

మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రోటరీక్లబ్ సేవలు శ్లాఘనీయమని డీఎస్పీ వివేకానంద అన్నారు. నగరంలో అరసవల్లి కూడలి ఓ హోటల్‌లో రోటరీక్లబ్ శ్రీకాకుళం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ పూర్వ గవర్నర్ జి.విశ్వనాథ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బరాటం శ్రీనివాస్, కిల్లాన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా బమ్మిడి సందీప్, కోశాధికారిగా కందుల నవీన్, ఇతర కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించి మాట్లాడారు. కోశాధికారిగా కందుల నవీన్‌కుమార్, మెడికల్ డైరెక్టర్‌గా డా.ఎన్.విజయ్‌కుమార్, లెర్నింగ్ ఫెసిలిటేటర్‌గా అన్నెపు సత్యనారాయణ, యంగ్‌లీడర్‌గా వారణాసి సందీప్, సర్వీస్ ప్రాజెక్టుల డైరెక్టర్‌గా అన్నెపు అనంతరావు పాల్గొన్నారు.

రక్తదాతలే నిజమైన ప్రాణదాతలు

రక్తదానం చేస్తున్న మహిళలు

పాతబస్టాండ్, శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: రక్తదాతలు నిజమైన ప్రాణదాతలని రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ఛైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. ఆదివారం స్థానిక పీఎస్ఎన్ఎంహెచ్ పాఠశాల ఆవరణలో గురుపూజ ఉత్సవంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. క్లబ్ వ్యవసాపక అధ్యక్షులు బత్తుల దేవీప్రసాద్, చంద్రమౌళి, భద్రం దాక్షాయిని, కె.సాయి పండా, బి.గారయ్య, బి.రామకృష్ణ, పి.రామకృష్ణ, హనుమంతు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. ● శ్రీకాకుళం నగరంలోని ఆదిత్య జుంబా డ్యాన్స్ సభ్యులు రక్తదానం రక్తదానం చేసినట్లు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మెన్ పి.జగన్మోహనరావు తెలిపారు.

చిన్నారులకు హాస్యవల్లరి పోటీ.. శ్రీకాకుళం సాంస్కృతికం: నగరంలో కలెక్టర్ బంగ్లా సమీపంలోని చిల్డ్రన్స్ లాఫింగ్‌క్లబ్‌లో ఆదివారం చిన్నారులకు హాస్యవల్లరి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ఇచ్చినట్లు నిర్వాహకుడు ఎల్.నందికేశ్వరరావు తెలిపారు కార్యక్రమంలో ● నగరంలో శాంతినికేతన్ కళాశాలలో తెలుగు రచయితల నెలవారీ సాహితీ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. తెరవే అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావిల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి పాల్గొని పలువురు రచయితలు, కవులను సత్కరించారు.

ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయండి

మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.హరిప్రసన్న తదితరులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.హరిప్రసన్న, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పూర్వ అధ్యక్షుడు కె.అప్పలరాజులు డిమాండు చేశారు. డీటీఎఫ్ సమావేశం ఆదివారం విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించారు. పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటి నుంచి అనవసరమైన, విద్యార్థులకు ఉపయోగపడని కార్యక్రమాలతో తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. యోగా దినోత్సవం, మెగా పేరెంట్ టీచర్ సమావేశాల పేరిట గిన్నిస్ బుక్ రికార్డుల కోసం విద్యార్థులు, తల్లిదండ్రుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన బకాయిలు చెల్లించకుండా అనవసర కార్యక్రమాలతో బోధనకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. జిల్లా నాయకులు జి.రాజశేఖర్, ప్రసాద్, గణేష్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

శ్రీకాకుళం నగరం: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ అభివృద్ధికి విశాఖపట్నానికి చెందిన ఎన్.మురళీకృష్ణ, వసంతకుమారిలు రూ.లక్ష విరాళం అందజేశారు. ఆదివారం అనివెట్టి మండపంలో ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్‌కు విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు.

పెంపుడు శునకాలతో అప్రమత్తత అవసరం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: పశువులు, పెంపుడు జంతువుల నుంచి వచ్చే వ్యాధులపై యజమానులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ జేడీ కె.రాజగోపాల్ పేర్కొన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జేడీ కార్యాలయ ఆవరణలో పెంపుడు కుక్కలను ఉచితంగా టీకా వేశారు.

సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, బలగ, శ్రీకాకుళం వారి సీల్డ్ టెండర్ కొటేషన్స్ కొరకు

ప్రకటన

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, శ్రీకాకుళంనకు ఇంప్లాంట్స్/కంజుంబుల్స్ సరఫరా చేయుటకు టెండర్ కోరడమైనది. ఇతర వివరములు ఈ క్రింది పేర్కొన్న వెబ్‌సైట్‌ను పరిశీలించవలసినదిగా కోరడమైనది. సీల్డ్ టెండర్ కొటేషన్స్ స్వీకరించుటకు తేది. 07-07-2025 నుండి తేది. 14-07-2025 సాయంత్రం 05.00 PM వరకు.

సీల్డ్ టెండర్ కొటేషన్స్ తెరుచుటకు చివరి తేది. 17-07-2025 న 4.00 PM నకు సూపరింటెండెంట్ గారి సమక్షంలో తెరువబడును.

http://www.srikakulam.ap.gov.in

సం/- సూపరింటెండెంట్,
ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, శ్రీకాకుళం.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రాష్ట్ర స్థాయి అండర్-15 చదరంగం పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం జరిగాయి. శ్రీకాకుళం నగరం నానుబాల వీధి జిల్లా చదరంగ శిక్షణా కేంద్రంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో నలుగురు బాలురు, బాలికలు రాణించారు. వీరందరూ ఈ నెల 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న అండర్-15 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. – న్యూస్‌టుడే, పాతబస్టాండ్

గ్రామీణ డాక్ సేవక్‌ల సమస్యలు పరిష్కరిద్దాం

జిల్లా గ్రామీణ డాక్ సేవక్ సంఘం నూతన కార్యవర్గం

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న తపాల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని రాష్ట్ర, జిల్లా సంఘం నాయకులు నిర్ణయించారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ జిల్లా డివిజన్ ద్వైవార్షిక మహా సభల్లో కార్యవర్గానికి నిర్వహించిన ఎన్నికలకు జిల్లా పరిధిలోని సభ్యులందరూ హాజరయ్యారు. రెండేళ్ల కాలానికి అధ్యక్ష, కార్యదర్శులుగా బి.అప్పారావు, ఎన్.నందికేశ్వరరావు, కోశాధికారిగా పి.రామకోటేశ్వరరావులను ఎన్నుకున్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	110	175	195



జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

శ్రీకాకుళంఅర్బన్, పాతబస్టాండ్, న్యూస్‌టుడే: నగరంలోని అరసవల్లి కూడలివద్ద దివంగత మాజీ ఉపప్రధాని డాక్టరు బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా దళిత సంఘాలు, స్వచ్ఛంద సేవకులు, వైకాపా నాయకులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘనంగా నివాళులర్పించారు.

తానా సభల్లో సిక్కోలు కళాకారుల యోగా నృత్యం

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: ఉత్తరఅమెరికా జరుగుతున్న తానా మహాసభల్లో జిల్లాకు చెందిన ప్రసిద్ధ సంప్రదాయం నాట్య గురుకులం సంచాలకుడు, ప్రసిద్ధ నర్తకి స్వాతి సోమనాథ్ బృందం యోగా నృత్యప్రదర్శన జరిగింది. మూడు రోజుల పాటు ప్రదర్శనలిచ్చిన స్వాతి సోమనాథ్ బృందం పలు కూచిపూడి నృత్యాంశాలను నర్తించి ప్రవాసాంధ్రుల ప్రశంసలు అందుకున్నట్లు స్వాతి సోమనాథ్ తెలిపారు. తన బృందాన్ని శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించినట్లు ఆమె పేర్కొన్నారు.



(c) eenadu

ఈనాడు తమిళనాడు
సోమవారం జులై 7, 2025

కనులపండువగా గరుడ వాహన సేవ

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నై ట్రిప్లికేన్‌లోని శ్రీ పార్థసారథి ఆలయంలో కొలువైన శ్రీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ స్వామివారిని వివిధ వాహనాలపై ఊరేగిస్తున్నారు. ఉత్సవాల్లో మూడో రోజైన ఆదివారం నరసింహస్వామిని గరుడ వాహనంపై కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గరుత్మంతునిపై నరసింహస్వామి

రాజకీయ, విద్యావేత్త డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ 124వ జయంతి సందర్భంగా గిండీలోని రాజ్‌భవన్‌లో ఆయన చిత్రపటానికి ఆదివారం అంజలి ఘటిస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి - న్యూస్‌టుడే, చెన్నై

జూన్ 28: పెళ్లయి రెండునెలలైనా కాలేదు. 27ఏళ్ల రితన్య తిరుప్పూరులో తన ఊపిరి తీసుకుంది. తాను చనిపోయే కాసేపటి ముందు 'నాన్నా... నన్ను క్షమించు. ఈ చిత్రవధ తట్టుకోలేకపోతున్నాను' అంటూ తండ్రికి ఆడియో సందేశం పంపి ఆత్మహత్యకు పాల్పడింది. భర్త, అత్తమామలు కట్నం కోసం వేధిస్తున్నారని లోకం విడిచింది.

జూన్ 30: చెన్నై సమీపంలోని పొన్నేరిలో 22ఏళ్ల లోకేశ్వరి ఆత్మహత్య చేసుకుంది. 'పెళ్లప్పుడు కొంత బంగారమే ఇచ్చారు. మిగిలిన బంగారం ఎప్పుడిస్తున్నారు' అంటూ భర్త పెట్టిన వేధింపులు తాళలేక తన బిడ్డ ఆత్మహత్య చేసుకుందని తండ్రి గోవర్ధన్ పొన్నేరి పోలీసులకు ఫిర్యాదుచేశారు.

జులై 4: ప్రేమించి మరీ ఈ ఏడాది జనవరిలో పెళ్లిచేసుకున్న యువకుడు.. భార్యకు నరకాన్ని చూపాడు. 'ఇస్తామన్న కట్నం ఏదీ' అంటూ వేధించడాన్ని పోలీసులకు ఇచ్చి ఫిర్యాదుచేశారు. 'ఇక బతకలేను, ఊరేసుకుని చచ్చిపోతున్నా' అని తల్లిదండ్రులకు చెప్పి లోకం వదిలింది 26ఏళ్ల జెమిలా. కన్నియాకుమరి జిల్లా కురుంగల్‌లో ఘటన జరిగింది.

ఊపిరి తీస్తున్న వరకట్న వేధింపులు

రాష్ట్రంలో ఆగని వివాహితల బలవన్మరణాలు // వారం రోజుల్లో కలచివేసిన మూడు ఘటనలు

వారం రోజుల్లో 3 వరకట్న ఆత్మహత్యలు. పెళ్లయిన మహిళలపై ఏ స్థాయి వేధింపులున్నాయో చెప్పటానికి ఇవే ఉదాహరణలు. తమిళనాడులో ఈ తరహా ఘటనలు సంచలనం సృష్టిస్తున్నాయి. వ్యవస్థలో లోపాలు, న్యాయం జరుగుతుందనే నమ్మకం లేకపోవడం వల్ల వేధింపులు వెలుగులోకి రావడంలేదనే ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి.

గత నాలుగేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 74 వరకట్న ఆత్మహత్యలు చోటుచేసుకోగా... అందులో చెన్నై మెట్రో నగరం ముందు వరసలో ఉంది. రెండేళ్లుగా ఆత్మహత్యలు తగ్గినట్లు ప్రభుత్వం గణాంకాలు చూపిస్తున్నా.. వరకట్న వేధింపులు తగ్గడం లేదని చెప్పడానికి నమోదవుతున్న కేసులే నిదర్శనంగా చెప్పొచ్చు. గత మూడేళ్లలో ఏకంగా 2,930 కేసులు నమోదయ్యాయి. వీటిలో చాలా కుటుంబాలు ఇప్పటికీ న్యాయం కోసం తిరుగుతున్నాయి. తాజా ఘటనల నేపథ్యంలో బాధితుల బంధువులతో పాటు సామాజిక కార్యకర్తలు సైతం వ్యవస్థలో లోపాల్ని ఎత్తిచూపుతున్నారు.

కాళ్ల పారాణి ఆరక ముందే నవ వధువులు నిండు జీవితాలను బలి తీసుకుంటున్నారు. వరకట్న వేధింపులు, అత్తింటి వారి చిత్రహింసలతో తనువు చాలిస్తున్నారు. గత వారం రోజుల వ్యవధిలోనే ముగ్గురు వివాహితలు బలవన్మరణం చెందారంటేనే రాష్ట్రంలో గృహ హింస, వరకట్న వేధింపులు ఏమేర ఉన్నాయో అర్థమవుతోంది. - ఈనాడు-చెన్నై

బలహీనంగా చట్టాల అమలు

గతేడాది ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ ఇన్ సైన్సెస్‌లో ప్రచురితమైన ఓ తమిళనాడు పరిశోధన గురించి తెలుసుకుంటే.. రాష్ట్రంలో ఇప్పటికీ వరకట్న వేధింపులు ఉన్నాయని 21-30ఏళ్ల మధ్య యువత అభిప్రాయపడ్డారు. భర్త, అత్తింటివారి వేధింపులతో మహిళలు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సమాచారం మాకొస్తోందని తెలిపారు. పరిశోధకులు ఈ యువత నుంచి పలు కీలక అంశాల్ని సేకరించారు. ఇప్పుడున్న శిక్షలు సరిపోవని ప్రత్యేకించి యువతులు అభిప్రాయపడ్డారు. చట్టాలున్నా బలహీనంగా అమల్లో ఉన్నాయన్నారు. వేధింపులు పెరగడానికి ఇదీ ఓ కారణంగా చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో మహిళలపై వరకట్న వేధింపులు ఎక్కువగా ఉంటున్నాయని సర్వేలో పాల్గొన్నవారు వివరించారు. శిక్షకు భయపడేస్థాయిలో ప్రజల్లో అవగాహన పెంచాలని ఉద్ఘాటించారు.

రాష్ట్రంలో సంవత్సరాలవారీగా నమోదైన వరకట్న మరణాలు				గృహహింస కేసులు		
2021- 27	2022- 29	2023- 11	2024- 7	2022-1043	2023-1017	2024-870

మార్పును కోరుకుంటున్నారు

వరకట్న నిషేధ చట్టాలు స్పష్టంగా ఉన్నాయి. వరకట్న ఆచారం సైతం చట్టప్రకారం నేరమే. దీనిపై మారుమూల ప్రజల్లోనూ అవగాహన కలగాలి. న్యాయవ్యవస్థలో కేసుల సుదీర్ఘ జాప్యం వల్ల తమకు న్యాయం జరుగుతుందనే భావన పోరాడే కుటుంబాల్లో లేదు. పోలీసు విచారణ, న్యాయ వ్యవస్థల్లో వారు మార్పును కోరుకుంటున్నారు. ఇప్పటికీ వరకట్న కేసులు ఆగడంలేదు. ఇలాంటి కుటుంబాలకు న్యాయం జరిగేలా వ్యవస్థ మారాలి.
– అజిత, అడ్వొకేట్

మౌనం వీడాలి

మహిళలపై అత్తింటి వేధింపులు ఆగడం లేదు. కేవలం మనుగడ కోసం వాటిని భరిస్తూ బతకాల్సి వస్తోంది. వారిని చూస్తే ఇంత నరకం ఎలా అనుభవిస్తున్నారనిపిస్తుంది. చదువుకున్నవారు సైతం వేధింపుల్ని దాచిపెడుతున్నారు. హక్కుల్ని శాసిస్తున్నా, చట్టాల్ని ఉల్లంఘిస్తున్నా మౌనంగా ఉండకూడదు. పెళ్లయ్యాక ఎలా నడుచుకోవాలో తెలియజేస్తూ ఆడపిల్లలను తల్లిదండ్రులు పెంచాలి.
– డాక్టర్ అశ్విని, సైకాలజిస్ట్, ముక్తా ఫౌండేషన్ డైరెక్టర్

భాజపా చేస్తున్న ద్రోహానికి పరిహారం లేదు

స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడుకు చేస్తున్న ద్రోహానికి భాజపా పరిహారం వెతుక్కోవాలని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో... హిందీని రుద్దే ప్రయత్నాలను తమిళనాడులో తిప్పికొట్టిన నేపథ్యంలో ప్రస్తుతం మహారాష్ట్రలో పోరాటం కొనసాగుతోందని తెలిపారు. తమిళనాడు పోరాటాల్లో మూడో భాషగా హిందీని చేర్చేందుకు నిధులు కేటాయిస్తామన్న కేంద్రంలోని భాజపా ప్రభుత్వం తన పార్టీ అధికారంలో ఉన్న మహారాష్ట్రలో ప్రజల చైతన్యానికి భయపడి రెండోసారి వెనకడుగు వేసిందన్నారు. ముంబయిలో జరిగిన విజయోత్సాహ సంబరాల ర్యాలీలో ఉద్ధవ్ ఠాక్రే ప్రసంగం ఉత్సాహాన్ని కలిగిస్తోందని తెలిపారు. హిందీ ఆధిక్యతకు వ్యతిరేకంగా తమిళులు చేసే పోరాటం భావోద్వేగమైంది మాత్రమే కాదని, శాస్త్రీయమైందని, తర్కబద్ధమైందని, భారతదేశ బహుముఖ సంస్కృతిని కాపాడేదని పేర్కొన్నారు. తమిళనాడుకు నిధులు కేటాయింపులో వివక్ష, కీళడి నాగరికతను ఆమోదించడానికి నిరాకరించడం వంటి ద్రోహాలకు భాజపా పరిహారం వెతుక్కోవాలని తెలిపారు. లేకుంటే మరోసారి తమిళనాడు గుణపాఠం చెబుతుందని పేర్కొన్నారు.

ప్రజా ధనాన్ని వృథా చేయడం మానుకోవాలి

ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: డీఎంకే ప్రభుత్వం పంచాయతీలు, పంచాయతీ యూనియన్‌ల నిధులను అభివృద్ధి పనులకు ఖర్చు చేయకుండా ప్రకటనలకు ఖర్చు చేస్తోందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి మండిపడ్డారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ప్రజాధనాన్ని వృథా చేసే యత్నాన్ని డీఎంకే ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే త్వరలో ఏర్పడనున్న అధికార మార్పు తర్వాత తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా 10వ తేదీ మేల్‌విషారంలో అన్నాడీఎంకే తరఫున ఆందోళన జరగనున్నట్లు ప్రకటించారు. రాణిపేట్టై జిల్లా మేల్‌విషారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తమ పాలనలో 30 పడకలతో 24 గంటలూ పనిచేసే ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. కొత్త భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించామని అన్నారు. అయితే దీనికి డీఎంకే స్టిక్కర్ అంటించి 2025లో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారని తెలిపారు. అయితే ఆస్పత్రిని సక్రమంగా నిర్వహించటం లేదన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి అక్కడికి వెళ్లగా డాక్టర్లు, నర్సులు లేనట్లు తెలిసిందన్నారు. దీనిని ఖండిస్తూ మంగళవారం ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈపీఎస్ రాష్ట్ర ప్రజలకు రాసిన లేఖలో.. 'మక్కలై కాప్పోమ్- తమిళగత్తై మీట్పోమ్' అనే చైతన్య యాత్రలో మిమ్మల్ని కలవనున్నానని తెలిపారు. మీ సమస్యలు, అవసరాలను విని, మీకు సేవ చేసే సేవకుడిగా ఉంటానని పేర్కొన్నారు. ప్రశాంతమైన తమిళనాడు ఏర్పాటే మన లక్ష్యమని, దీనికి అన్నాడీఎంకే పాలన మళ్లీ ఏర్పడాలని తెలిపారు.

తమిళనాడు యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా సూర్యప్రకాశ్

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా సూర్యప్రకాశ్ ఎన్నికయ్యారు. తమిళనాడు యువజన కాంగ్రెస్ పదవులకు జరిగిన ఎన్నికల్లో తొలి స్థానంలో నిలిచిన సూర్యప్రకాశ్‌ను అధ్యక్షుడిగా, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన అరుణ్ భాస్కర్, దినేశ్‌లను ముఖ్య ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయభాను చిబ్ వెల్లడించారు.

టీవీకే సభ్యత్వ నమోదుకు కార్యశాల

చెన్నై, న్యూస్‌టుడే: టీవీకే సభ్యత్వ నమోదు పనుల కోసం కార్యశాలను మంగళవారం నిర్వహించనున్నారు. పార్టీ ప్రధానకార్యదర్శి బుస్సీ ఆనంద్ విడుదల చేసిన ప్రకటనలో... టీవీకే అధ్యక్షుడి సూచనల మేరకు రాష్ట్రంలో 2కోట్ల నివాసాల్లో 2 కోట్ల మంది పార్టీ సభ్యులు లక్ష్యంతో సభ్యత్వ నమోదు పనులను ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి పనైయూర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.35 గంటలకు కార్యాశాల జరగనుందని వెల్లడించారు.

ఆగస్టు 17న నెల్లైలో భాజపా మహానాడు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర విభాగ మొదటి మహానాడు ఆగస్టు 17వ తేదీ తిరునెల్వేలిలో నిర్వహిస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆదివారం ప్రకటించారు. చెంగల్పట్టు జిల్లా కాట్రాంగొళత్తూర్‌లోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ప్రాంగణంలో బూత్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క పార్టీ నిర్వాహకుడు, కార్యకర్త రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటినుంచే సిద్ధం కావాలన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆగస్టు 17వ తేదీ తిరునెల్వేలిలో మొదటి మహానాడును నిర్వహిస్తామని ప్రకటించారు. 2026లో అన్నాడీఎంకే నేతృత్వంలో ఏర్పడే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కావున ప్రతిఒక్కరు కూటమి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

విజయ్ పార్టీకి తాత్కాలికంగా దూరమైన ప్రశాంత్ కిశోర్

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాట అగ్ర నటుడు విజయ్ ప్రారంభించిన రాజకీయ పార్టీ తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో ఎన్నికల ప్రచార వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌కి తాత్కాలిక ఎడబాటు కలిగింది. ఫిబ్రవరిలో జరిగిన టీవీకే 2వ వార్షికోత్సవంలో ప్రశాంత్ కిశోర్ ప్రత్యేక అతిథిగా పాల్గొని రాష్ట్రంలో మార్పును కలిగించే టీవీకే లక్ష్యానికి తనవంతు సహకారం అందిస్తానని ప్రకటించారు. ఆ మేరకు రాష్ట్రంలో వచ్చే ఏడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల దృష్ట్యా టీవీకేకు తనవంతు సహకారం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో బిహార్ శాసనసభ ఎన్నికల్లో తన జన్ స్వరాజ్ పార్టీ పోటీ చేస్తుండటంతో ఆ ఎన్నికల పనుల్లో ప్రశాంత్ కిశోర్ నిమగ్నమయ్యారు. ఇందుకోసం టీవీకేకు ఎన్నికల ప్రచార వ్యూహాలు రచించడం నుంచి తాత్కాలికంగా తప్పుకున్నారు. బిహార్ ఎన్నికలు ముగిసిన తర్వాత నవంబరులోపు ఆయన మళ్లీ టీవీకేకు సలహాలు ఇస్తారని సమాచారం.

ఆగస్టు 1నుంచి బడికి వెళ్లని పిల్లల గణన

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఆరు నుంచి 18ఏళ్లలోపు వయసుండి పాఠశాలలకు వెళ్లని పిల్లల లెక్కింపు సర్వే ఆగస్టు 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ తెలిపింది. దీని గురించి డైరెక్టరేట్ తరఫున అన్ని జిల్లాల ప్రాథమిక విద్యాధికారులకు పంపిన సర్క్యులర్‌లో... రాష్ట్రంలో పాఠశాలలకు వెళ్లని పిల్లల గణన పనులు ఏటా నిర్వహిస్తున్నామని, బడి ఈడు పిల్లలంతా డ్రాపౌట్స్ లేకుండా విద్యనభ్యసించాలన్నారు. ఈ గణన లక్ష్యం జీరో డ్రాపౌట్స్ సృష్టించడమేనని తెలిపారు. అందులో భాగంగా 2025-26 విద్యా సంవత్సరానికిగాను పాఠశాలలకు వెళ్లని పిల్లలు, డ్రాపౌట్స్ గుర్తించేందుకు గణన పనులు ప్రారంభం కానున్నట్లు వివరించారు.

ఈపీఎస్ పర్యటన అధికార మార్పునకు పునాది

జీకే వాసన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఎడప్పాడి పళనిసామి రాష్ట్రవ్యాప్త పర్యటన అధికార మార్పునకు పునాది వేస్తుందని టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ తెలిపారు. తంజావూర్‌లో టీఎంసీ కొత్త నిర్వాహకుల పరిచయ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఇందులో పాల్గొన్న జీకే వాసన్ విలేకరులతో మాట్లాడుతూ... ప్రస్తుతం తమిళనాడులో బాధాకర ఘటన జరిగిందన్నారు. అది ఆలయ కాపలాదారుడు అజిత్‌కుమార్ మరణమన్నారు. ఇందుకు కారణం రాష్ట్ర ప్రభుత్వ చర్యలేనని ఆరోపించారు. పోలీసుశాఖ ముఖ్యమంత్రి ఆధీనంలోనే ఉన్నా రాష్ట్రంలో శాంతిభద్రతలు క్రమంగా క్షీణిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో మత్తుపదార్థాల చెలామణి, టాస్మాక్ దుకాణాలు పోయేవరకు ఇలాంటి ఘటనలు తగ్గవన్నారు. ఎన్డీయే కూటమికి నేతృత్వం వహిస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి రాష్ట్రవ్యాప్త పర్యటన అధికార మార్పునకు పునాది వేస్తుందన్నారు.

నేడు 113 ఆలయాల్లో మహా కుంభాభిషేకాలు

తిరుచ్చెందూర్ మురుగన్ ఆలయం

కాంచీపురం, న్యూస్‌టుడే: నేడు రాష్ట్రంలోని 31 జిల్లాల్లో ఉన్న 113 ఆలయాల్లో మహాకుంభాభిషేకాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకుగాను ఏర్పాట్లను దేవదాయశాఖ అధికారులు సమీక్షిస్తున్నారు. గత నాలుగేళ్లలో 3,176 ఆలయాలకు మహా కుంభాభిషేకాలను నిర్వహించారు. సోమవారం 3,207వ ఆలయంగా తిరుచ్చెందూర్ మురుగన్ ఆలయంలో కుంభాభిషేకాన్ని వైభవంగా జరుపనున్నారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను దేవదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు, మంత్రి గీతాజీవన్, తూత్తుకుడి ఎంపీ కనిమొళి తదితరులు శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వేర్వేరుగా పరిశీలించారు. అంతేకాకుండా కన్నియాకుమరి జిల్లా వేలిమలై ఇసక్కిఅమ్మవారి ఆలయం, మైలాడుదురై జిల్లా తిరువెణ్‌కాడు శ్వేతారణ్యేశ్వరస్వామి, కాంచీపురం జిల్లా వల్లకోట మురుగన్, తెన్‌కాశి జిల్లా కడైయం నిత్య కళ్యాణి అమ్మవారి ఆలయం, రాణిపేట జిల్లా శోలింగర్ చిన్నమలై యోగాంజనేయ స్వామి ఆలయం మొదలైన 133 ఆలయాల్లో కుంభిషేకాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుచ్చెందూర్ ఆలయంలో సోమవారం ఉదయం 6.15 నుంచి 6.45 గంటల్లోపు మహా కుంభాభిషేకాన్ని నిర్వహిస్తారు.

గస్తీకి జీపీఎస్ పరికరాలు అమర్చిన వాహనాలు

ప్యారిస్: తిరుచ్చెందూర్ ఆలయ కుంభాభిషేకం సందర్భంగా 360 డిగ్రీలు తిరిగే సీసీ కెమెరాలు, జీపీఎస్ పరికరాలు అమర్చిన వాహనాలను ఆదివారం అదనపు డీజీపీ డేవిడ్సన్ దేవాశీర్వాదం ప్రారంభించారు. కుంభాభిషేకానికి వచ్చే భక్తుల భద్రత కోసం మూడు నాలుగు చక్రాల వాహనాలను, 10 ద్విచక్ర వాహనాలను, డ్రోన్ కెమెరాలను తిరుచ్చెందూర్ ఆలయం వద్ద ఆయన ప్రారంభించారు. 24 గంటల పాటు ఇవి షిఫ్టు విధానంలో పనిచేస్తాయి. జీపీఎస్ పరికరం ద్వారా ప్రత్యక్షంగా పోలీసు కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించి, ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే అక్కడికి చేరుకుని నేరాలను అడ్డుకుంటారు. 360 డిగ్రీలు తిరిగే సీసీ కెమెరాల ద్వారా వాహనంలోంచి అనుమానితులను గుర్తించవచ్చు. డ్రోన్ కెమెరాల ద్వారా పైనుంచి నిఘా ఉంచి ముందు జాగ్రత్త చర్యలు చేపడతారు.

జీపీఎస్ పరికరాలు అమర్చిన గస్తీ వాహనాలు

501 అంగన్‌వాడీ కేంద్రాల మూసివేత

సిబ్బంది కొరతతో ప్రభుత్వం నిర్ణయం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: సిబ్బంది కొరతతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కష్టతరంగా మారింది. ఇప్పటికే 501 కేంద్రాలు మూతపడ్డాయి. మరికొన్ని ఉనికిని కోల్పోయే స్థితిలో ఉన్నాయి. కాగా తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపడానికి ఆసక్తి కనబరచట్లేదు. రాష్ట్రంలో మొత్తం 54,483 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 6ఏళ్ల లోపు చిన్నారులను చేర్చుకుంటున్నారు. వారికి పోషకాహారం అందించడం, బాల్య విద్యను బోధించడంతోపాటు మహిళా సంక్షేమాన్ని పర్యవేక్షించడం ఈ కేంద్రాల ముఖ్య ఉద్దేశం. ప్రతి కేంద్రంలో ఒక టీచర్, వంటమనిషి ఉన్నారు. కాగా ఎక్కువ మంది పదవీ విరమణ చేయడంతో ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 9 వేలమంది టీచర్లు, 28 వేల వంటమనుషుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 2018 నుంచి ఈ కేంద్రాలలో పని చేయడానికి కొత్త వారిని ఎంపిక చేయలేదు.

కొన్నిచోట్ల ఒక్కరితోనే..

ఉదాహరణకు చెన్నై ముగప్పేరు కన్నదాసన్ రోడ్డులోని కేంద్రానికి ప్రతిరోజు 15 మంది పిల్లలు వస్తున్నారు. ఉన్న ఒకే టీచర్ పిల్లలకు ఆహారం తయారు చేయడం, గర్భిణులను జాగ్రత్తగా చూసుకోవడం వంటి అన్ని పనులు చూసుకోవాల్సి వస్తోంది. దీంతో పిల్లల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. అందువల్ల ఈ కేంద్రాలకు తమ పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు ఆసక్తి కనబరచడం లేదు. దీని గురించి కొందరు తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ప్రైవేట్ ప్లే స్కూళ్లకు అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్టు గుర్తు చేశారు. పేదలమైన తమకు అక్కడికి పంపే స్థోమత లేదని చెప్పారు. సిబ్బంది కొరత కారణంగా పిల్లలకు భద్రత లేదని వాపోయారు. అందువల్ల పలువురు తల్లిదండ్రులు ఈ కేంద్రాలకు పంపడానికి ఆసక్తి చూపట్లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో తగినంత మంది సిబ్బందిని నియమించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఖాళీలను భర్తీ చేయాలి

రాష్ట్రంలోని ఉన్న 54,483 కేంద్రాలలో 1.04 లక్షల మంది పనిచేయాల్సి ఉండగా 75,468 మంది మాత్రమే పని చేస్తున్నారని ఆ కేంద్రాలలో పనిచేస్తున్న ఉద్యోగులు తెలుపుతున్నారు. 28,532 పోస్టులు ఖాళీగా ఉండగా 3,886 టీచింగ్ పోస్టులు సహా 7,842 పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కేంద్రాలలో చేర్చడానికి ఇష్టపడని నేపథ్యంలో ఈ ఏడాది చెన్నైలో 147 సహా రాష్ట్ర వ్యాప్తంగా 501 కేంద్రాలు మూసేసినట్టు తెలిపారు. ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

పాదాల నొప్పితో ఆస్పత్రిలో చేరిన అజిత్‌కుమార్ సోదరుడు

ప్యారిస్, న్యూస్‌టుడే: పోలీసుల దర్యాప్తు సమయంలో మృతిచెందిన కాపలాదారుడు అజిత్‌కుమార్ సోదరుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శివగంగై జిల్లా తిరుపువనంకి చెందిన కాపలాదారుడు అజిత్‌కుమార్ ఓ చోరీ కేసు దర్యాప్తు సమయంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అతని సోదరుడు నవీన్ మదురై ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం చేరారు. దర్యాప్తు సమయంలో పోలీసులు కొట్టడంతో పాదాల్లో నొప్పి ఉందని, అందుకే వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నట్లు అతని కుటుంబీకులు తెలిపారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆనందన్ తదితరులు

'డీఎంకే వలలో చిక్కుకున్న పొర్కొడి'

వేళచ్చేరి, న్యూస్‌టుడే: డీఎంకే సూచనతోనే ఆర్మ్‌స్ట్రాంగ్ భార్య పొర్కొడి కొత్త పార్టీని ప్రారంభించారని బహుజన్ సమాజ్ పార్టీ తమిళనాడు అధ్యక్షుడు ఆనందన్ ఆరోపించారు. బీఎస్పీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ మొదటి వర్ధంతిని పురస్కరించుకుని శనివారం రాత్రి చెన్నై వేపేరిలోని ఓ ప్రైవేట్ హాలులో కార్యక్రమం నిర్వహించారు. దీనికి ప్రస్తుత అధ్యక్షుడు ఆనందన్ అధ్యక్షత వహించి ఆర్మ్‌స్ట్రాంగ్ చిత్రపటం, విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ సభ్యులు ఆర్మ్‌స్ట్రాంగ్‌పై ఆరోపణలు చేసి జాతీయ అధ్యక్షురాలు మాయావతికి లేఖను పంపిన సమయంలో ఆర్మ్‌స్ట్రాంగ్ మరో మార్గంలో వెళ్లారని మాయావతి ఆయనపై వచ్చిన ఆరోపణలను తిరస్కరించారని తెలిపారు. భార్యతో చెప్పని విషయాలు కూడా తనకు ఆయన చెప్పేవారని అన్నారు. కానీ ఆయన సతీమణి పొర్కొడి డీఎంకే పన్నిన కుట్రలో చిక్కుకుని కొత్త పార్టీని స్థాపించారని ఆరోపించారు. పొర్కొడి చర్యలతో ఆర్మ్‌స్ట్రాంగ్ ఆత్మ క్షోభిస్తుందని తెలిపారు.



విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న మంత్రులు మా.సుబ్రమణియన్, పెరియకరుప్పన్, శేఖర్‌బాబు

సహకార మారథాన్ విజయవంతం

సైదాపేట, న్యూస్‌టుడే: అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని తమిళనాడు సహకారశాఖ తరఫున మినీ మారథాన్ పోటీ ఆదివారం చెన్నై ఐలండ్ గ్రౌండ్స్‌లో నిర్వహించారు. సహకార శాఖ మంత్రి పెరియకరుప్పన్, దేవదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు పోటీని ప్రారంభించారు. ఇందులో 2వేల మందికి పైగా పాల్గొన్నారు. విజేతలకు ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ నగదు బహుమతులు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో జీసీసీ మేయర్ ప్రియ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కార్యనిర్వాహక కమిటీ నుంచి అన్బుమణి తొలగింపు

రామదాస్ సంచలన నిర్ణయం

సైదాపేట, న్యూస్‌టుడే: పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్‌ను పార్టీ కార్యనిర్వాహక కమిటీ నుంచి తొలగిస్తూ ఆయన తండ్రి, పీఎంకే వ్యవస్థాపకులైన రామదాస్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రామదాస్, ఆయన కుమారుడు, పార్టీ అధ్యక్షుడైన అన్బుమణి మధ్య కొన్ని రోజులుగా విభేదాలు నెలకొన్న సంగతి తెలిసిందే. అన్బుమణి చట్టప్రకారం తానే పార్టీ అధ్యక్షుడినని చెబుతుండగా ఆయన్ను అధ్యక్ష పదవి నుంచి తొలగించినట్లు, తన ఊపిరి ఉన్నంతవరకు తానే అధ్యక్షుడినని రామదాస్ ప్రకటించారు. అంతేకాకుండా ఇద్దరూ తమ తమ మద్దతుదారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఒకరి మద్దతుదార్లను మరొకరు పార్టీ పదవుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటనలు చేస్తున్నారు. దీంతో పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. నిర్వాహకులు, కార్యకర్తలు ఎవరివైపు నడవాలనే సందిగ్ధంలో ఉన్నారు. ఇదిలా ఉండగా తాజాగా అన్బుమణిని కార్యనిర్వాహక కమిటీ నుంచి తొలగిస్తూ రామదాస్ చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా కొత్త కమిటీ ప్రకటించారు. కొత్త సభ్యులతో రామదాస్ శనివారం సమావేశం నిర్వహించారు. మంగళవారం ఓమలూరులో కార్యనిర్వాహక కమిటీ సమావేశం జరగనుందని సమాచారం. ఆ సమావేశంలో అన్బుమణి పాల్గొనే అవకాశం ఉందని గౌరవాధ్యక్షుడు జీకే మణి చెప్పడం గమనార్హం.

దర్యాప్తు పేరుతో కొట్టి చంపే హక్కు ఎవరిచ్చారు?

అజిత్‌కుమార్ ఫొటోకి నివాళులర్పిస్తున్న ప్రేమలత

ప్యారిస్, న్యూస్‌టుడే: దర్యాప్తు పేరుతో కొట్టి చంపే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలతా విజయకాంత్ ప్రశ్నించారు. శివగంగై జిల్లా మడపురం ఆలయ కాపలాదారుడు అజిత్‌కుమార్ మృతికి న్యాయం చేయాలని కోరుతూ డీఎండీకే తరఫున తిరుపువనంలో శనివారం ఆందోళన జరిగింది. ఇందులో పాల్గొన్న ప్రేమలత మాట్లాడుతూ... అజిత్‌కుమార్‌ని పోలీసులు కొట్టి చంపారని, అతనిని చంపిన వారికి కూడా ఇలాంటి శిక్షే పడాలన్నారు. చోరీ జరిగినట్లు ఫిర్యాదు చేసిన నికిత గురించి సరిగా దర్యాప్తు చేయలేదన్నారు. ఈ వ్యవహారంలో సీబీఐ నిజానిజాలను బయట పెట్టాలన్నారు. రాష్ట్రంలో ఒక్క వారంలోనే వరకట్న వేధింపులతో నలుగురు మహిళలు ఆత్మహత్య చేసుకున్నారని, మత్తుపదార్థాల వినియోగం ఎక్కువైందని తెలిపారు. మత్తుపదార్థాల కేసులో ఇద్దరు సినీనటులను అరెస్టు చేసి ఈ వ్యవహారాన్ని పక్కదారి పట్టిస్తున్నారన్నారు. అన్ని పోలీస్‌స్టేషన్‌లలో, ఖైదీలను దర్యాప్తు చేసే చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అజిత్‌కుమార్ ఇంటికి వెళ్లి అతని కుటుంబీకులను పరామర్శించారు.

(c) eenadu

ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో చంద్రగుప్తా, అతిథులు

పేద విద్యార్థులకు ఉపకార వేతనాల అందజేత

టీనగర్, న్యూస్‌టుడే: పేదరికంలో ఉన్న ప్రతి విద్యార్థికి సాయం అందించాలన్న ఉద్దేశంతో తాము సేవలందిస్తున్నట్లు కొల్హాపుర మాజేటి జయశ్రీ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీలు డా.చంద్రగుప్తా, తనూజ పేర్కొన్నారు. వారి ఆధ్వర్యంలో ట్రస్టు తరఫున విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ కార్యక్రమం ఆదివారం ఎగ్మూరులోని ఓ ప్రముఖ హోటల్లో జరిగింది. ముఖ్య అతిథిగా ఆదాయపు పన్నుశాఖ కమిషనర్ నంద కుమార్ (ఐఆర్ఎస్), వేప్పేరి అసిస్టెంట్ కమిషనర్ కన్నన్, రమడా హోటల్ మేనేజరు మోహన్‌రాజ్, దేవానంద్ షా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రగుప్తా మాట్లాడుతూ.. ఉపకారవేతనాల కోసం తెలుగు పాఠశాలల నుంచి దరఖాస్తులు వచ్చినందున విద్యార్థులకు ఉపకారవేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కృష్ణా జిల్లాకు చెందిన శ్రీ బాలాత్రిపుర సుందరి స్కూల్ ఆఫ్ కూచిపూడి విద్యార్థుల నృత్య కార్యక్రమాలు అలరించాయి.

పక్కా గృహాలకు తాగునీటి కష్టాలు

■ పాతికేళ్లయినా పైపులైన్ కనెక్షన్లు లేని దుస్థితి ■ వ్యాసార్పాడి 'టీఎన్‌యూహెచ్‌బీడీ' వాసుల ఇక్కట్లు

\- న్యూస్‌టుడే, వడపళని

చెన్నై వ్యాసార్పాడిలోని తమిళనాడు అర్బన్ హాబిటెట్ డెవలప్‌మెంట్ బోర్డ్(టీఎన్‌యూహెచ్‌బీడీ) ఆధ్వర్యంలో నిర్మించిన గృహాలకు 25 ఏళ్ల వుతున్నా పైపులైన్ల ద్వారా తాగునీరు సరఫరా కావట్లేదు. దీంతో స్థానికులు అవస్థలు చవిచూస్తున్నారు. ఇక్కడ దాదాపు 720కి పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. 24వ బ్లాక్ టెనెమెంట్ సెటిల్‌మెంట్‌లో ఉంటున్న 3వేల మంది గృహవాసులకు ఒక్క పైపులైను కనెక్షను కూడా లేదు. వీధి చివరలో ఏర్పాటు చేసిన చేతి పంపులు, కుళాయిల నుంచి నీరు తెచ్చుకోవాలంటే మహిళలు ప్రతిరోజూ 150 మీటర్ల కన్నా ఎక్కువ దూరం నడవాల్సిందే. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు గంటల పాటు నీటి సరఫరా ఉంటుంది. ప్లాస్టిక్ బిందెలతో క్యూలో నిలబడి నీళ్లు పట్టుకెళ్తున్నారు. పై అంతస్తుల్లో ఉండే వారయితే నీటి బిందెలను తాడుతో కట్టి పైకి లాక్కుంటున్నారు. నిత్యం జరిగే ప్రక్రియతో అనేక మంది మహిళలు దీర్ఘకాలిక వెన్నునొప్పితో బాధపడుతున్నారు.

వీధి కుళాయి వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

దీర్ఘకాలిక వెన్నునొప్పులతో..

ఇంట్లో ఏదైనా కార్యక్రమం జరుగుతున్నా తమకు ఈ నీటి కష్టాలు తప్పట్లేదని ఆప్రాంతవాసులు వాపోతున్నారు. కుటుంబంలో ఎవరైనా మరణించినా మహిళలకు నీళ్లు మోసే పని తప్పడం లేదన్నారు. దీనిపై చెన్నై మహానగర నీటి సరఫరా, మురుగు నిర్వహణ మండలి(సీఎండబ్ల్యూఎస్ఎస్‌బీ)కి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా తమ సమస్యలు తీరడంలేదని పేర్కొంటున్నారు. తమ నివాసాలకు దగ్గరగా చేతి పంపులు ఏర్పాటు చేయాలని వినతులు కూడా సమర్పించామని, నిత్యం బిందెలతో నీళ్లు మోస్తూ నడుమునొప్పులతో కాలం గడుపుతున్నామని వివరించారు.

పిల్లలు సైతం..

ఇంట్లో తల్లికి సాయం చేయడానికి తానూ బిందెలతో నీటి కోసం వెళ్తున్నానని, దీంతో పాఠశాలలకు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తోందని కల్యాణపురం పాఠశాలలో చదువుతున్న ఓ బాలిక పేర్కొంది. దీని గురించి సీఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజింగ్ డైరెక్టర్ టీజీ వినయ్ మాట్లాడుతూ. . ఇంజినీర్లను వెంటనే పైపుల కోసం స్థలాన్ని పరిశీలించాల్సిందిగా ఆదేశించామని, తర్వాత చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించిన మీదట కనెక్షన్లు అందిస్తామని తెలిపారు. టీఎన్‌యూహెచ్‌డీబీ ప్రిన్సిపల్ కార్యదర్శి కాకర్ల ఉష వినతులపై స్పందిస్తూ.. జాయింట్ ఆడిట్‌కు ఆదేశించినట్టు చెప్పారు. ఏరియా ఇంజినీరుతో కలిసి పైపులైన్ల గురించి మాట్లాడుతామని పెరంబూరు ఎమ్మెల్యే ఆర్డీ శేఖర్ పేర్కొన్నారు.

మౌంటెన్ రైలుకు అడ్డుగా నిలిచిన ఏనుగు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: మేట్టుపాళయం, సత్యమంగళం, సిరుముగై తదితర ప్రాంతాల్లో ఎండల తీవ్రత అధికం కావడంతో అడవి ఏనుగులు ఆహారం కోసం నీలగిరి జిల్లా వైపు వస్తున్నాయి. ఈ క్రమంలో పశ్చిమ కనుమలకు వచ్చిన ఓ ఏనుగు అక్కడే మకాం వేసింది. ఈ నేపథ్యంలో ఆదివారం కున్నూర్-మేట్టుపాళయం రహదారి మరప్పాలయం వద్ద రైలు పట్టాలపై సంచరించింది. అప్పుడు మేట్టుపాళయం నుంచి ఊటీ వైపు వెళ్తున్న రైలు లోకోపైలట్ ఏనుగును గుర్తించి రైలు నిలిపేశారు. కాసేపటి తర్వాత అడవిలోకి వెళ్లడంతో రైలు బయలుదేరింది.

ఆపరేషన్ త్రిశూలం

పుదుచ్చేరిలో 100మంది రౌడీషీటర్ల అరెస్ట్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో నేరాల నియంత్రణ, రౌడీల ఆగడాలు అరికట్టేందుకు 'ఆపరేషన్ త్రిశూలం'ని పోలీసుశాఖ ప్రారంభించింది. ఇందులో భాగంగా రౌడీషీటర్లపై నిఘా ఉంచడం, వారి ఇళ్లలో తరచూ సోదాలు చేయడం వంటివి చేపట్టి అరెస్ట్ చేస్తున్నారు. ఈ క్రమంలో డీజీపీ షాలినీ సింగ్ ఆదేశాల మేరకు డీఐజీ సత్యసుందరం నేతృత్వంలో పుదుచ్చేరి, కారైక్కాల్‌లోని రౌడీషీటర్ల ఇళ్లలో పోలీసులు ఆదివారం తెల్లవారుజామున ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఒకే సమయంలో 450 మంది రౌడీల ఇళ్లలో జరిపిన సోదాల్లో మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. 100 మందిని అదుపులోకి తీసుకుని 78మందిపై కేసు నమోదు చేశారు.

శుభ్రతా కార్మికులకు సంక్షేమ సాయం పంపిణీ

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై మహానగర కార్పొరేషన్‌తో కలిసి వాష్ ల్యాబ్, స్వచ్ఛతా మిషన్, టీర్, రీసైకిల్ బిన్ సంస్థలు 'టాయిలెట్ ఫెస్టివల్ 3.0' కార్యక్రమాన్ని కలైవాణర్ ఆడిటోరియంలో శనివారం సాయంత్రం నిర్వహించాయి. ఇందులో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పాల్గొని మరుగుదొడ్లలో శుభ్రత పనులు చేపట్టే టాయిలెట్ రేపర్ కాఫీ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఫొటో ప్రదర్శన, స్టాళ్లను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. రాష్ట్ర శుభ్రత కార్మికుల సంక్షేమ బోర్డు వెబ్‌సైట్, డిజిటల్ టూల్ కిట్ వెబ్‌సైట్‌లను ఆవిష్కరించారు. జీసీసీ చెన్నై పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం పరిశుభ్రత గురించి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా శుభ్రత సిబ్బంది సంక్షేమ బోర్డు తరఫున ప్రమాద మరణం, సహజ మరణ నష్ట పరిహారాలు, వివాహం, ప్రసూతి, విద్యా సాయం తదితర సంక్షేమ పథకాల కింద 30 మందికి రూ.12.79 లక్షల విలువైన బ్యాంకు చెక్కులను అందించారు.

సాయం అందజేస్తున్న ఉదయనిధి స్టాలిన్

తాజ్కో ద్వారా కాంచీపురం కార్పొరేషన్‌లో పనిచేసే శుభ్రత కార్మికుల సంఘానికి చిరువ్యాపార రుణంగా రూ.25 లక్షల బ్యాంకు చెక్కును అందించారు. కార్యక్రమంలో మంత్రి పి.కె.శేఖర్‌బాబు, జీసీసీ మేయర్ ప్రియ, ప్రత్యేక పథక పాలన నిర్వాహణశాఖ అదనపు ప్రధానకార్యదర్శి ప్రదీప్ యాదవ్, తమిళనాడు ఆది ద్రావిడుల గృహనిర్మాణం, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఇళయరాజా, శుభ్రత కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ డాక్టర్ తిప్పంపట్టి ఆరుసామి, జీసీసీ కమిషనరు కుమరగురుబరన్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నై విమానాశ్రయానికి బాంబు బెదిరింపులు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై విమానాశ్రయానికి ఆదివారం ఉదయం బాంబు బెదిరింపు ఈ-మెయిల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కొన్ని గంటల పాటు అన్ని రకాల తనిఖీలు క్షుణ్ణంగా చేసిన తర్వాత అది అసత్య మెయిల్‌గా నిర్ధారించారు. ఉదయం 10 గంటలకు చెన్నై ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఓ ఈ-మెయిల్ వచ్చింది. అందులో.. విమానాశ్రయ ప్రాంగణంలో బాంబు ఉందని, పేలుతుందని ఉంది. వెంటనే చెన్నై ఎయిర్‌పోర్ట్ కమిటీ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం జరిగింది. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్), సీఐఎస్ఎఫ్, విమాన సంస్థల ఉన్నత ప్రతినిధులు, ఎయిర్‌పోర్ట్ సీనియర్ మేనేజ్‌మెంట్, విమానాశ్రయ పోలీసులు, కమాండో యూనిట్లు సమావేశంలో పాల్గొన్నారు. బాంబు స్క్వాడ్ నిపుణులు, జాగిలాలతో విమానాశ్రయ ప్రాంగణంలో క్షుణ్ణంగా తనిఖీలు జరిపారు. ప్రయాణికుల లగేజీ తనిఖీలను విస్తృతం చేశారు. దీంతో పాటు కార్గో, పార్కింగ్, ఇంధనాన్ని నింపే స్టేషన్లు, వాహనాల పార్కింగ్ స్థలాల్లో కూడా తనిఖీలు జరిపారు. ఎలాంటి పేలుడు వస్తువులు లభించలేదు. దీనిపై అధికారులు ఎయిర్‌పోర్ట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆస్పత్రిలో చేరిన కె.వీరమణి

వేళచ్చేరి: ద్రావిడ కళగం అధ్యక్షుడు కె.వీరమణి(91) కొద్ది రోజులుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం అస్వస్థతకు గురవడంతో ఆయన్ను కుటుంబీకులు చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు.

ప్రభుత్వ బస్సులో మంత్రి ఆకస్మిక తనిఖీ

డ్రైవర్‌తో మాట్లాడుతున్న మంత్రి శివశంకర్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కోవై కొడిసియా మైదానంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎస్.ఎస్.శివశంకర్ 100 కొత్త బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన రాత్రి తన కారులో అరియలూరుకు బయలుదేరారు. అప్పుడు కరూర్, మాయనూర్ మధ్య ఓ రెస్టారెంట్ వద్ద తన కారు ఆపి టీ తాగారు. ఆ సమయంలో రెస్టారెంట్ వద్ద ప్రభుత్వ బస్సు ఆగి ఉండటాన్ని గమనించారు. రెస్టారెంట్‌లో భోజనం చేసి బయటకు వచ్చిన బస్సు డ్రైవర్, కండక్టర్‌తో మాట్లాడారు. ఆహారం, టీ, కాఫీలు తాగడానికి నిర్దిష్ట స్థలాలను కేటాయించారు, అక్కడ ఆపకుండా ఎలా ఎక్కడ పడితే అక్కడ ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించారు. మంత్రి తెల్ల చొక్కా, జీన్స్ ప్యాంటు ధరించడంతో ఆయన్ను గుర్తించని డ్రైవర్, కండక్టర్ ఆయనను మీకెందుకని, మీ పని చూసుకోండని దురుసుగా మాట్లాడారు. దీంతో ఆయన నేను మీ రవాణాశాఖ మంత్రి శివశంకర్ అని చెప్పడంతో డ్రైవర్, కండక్టర్ ఏం మాట్లాడాలో తెలియక ఆందోళన చెందారు. తరువాత మంత్రి.. నిర్దిష్ట ప్రదేశాల్లోనే బస్సును ఆపి భోజనం చేయాలని డ్రైవరుకు సూచించారు. ఇలాంటి తప్పులు మళ్లీ జరగవని వారు చెప్పడంతో మంత్రి అక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు.

స్పైస్‌జెట్ విమాన ఇంజిన్‌లో సమస్య

వడపళని, న్యూస్‌టుడే: ట్యుటికోరిన్‌కు వెళ్లాల్సిన స్పైస్‌జెట్ విమానం అత్యవసర పరిస్థితుల్లో తిరిగి చెన్నై విమానాశ్రయంలో దిగింది. ఆదివారం ఉదయం 10.10 గంటలకు విమానం 65 మంది ప్రయాణికులు, 5 మంది సిబ్బందితో బయలుదేరింది. రన్‌వే-7 నుంచి టేకాఫ్ అయ్యే సమయంలో పైలట్ ఇంజిన్‌లో లోపాన్ని గుర్తించారు. టేకాఫ్‌ను తక్షణమే నిలిపేశారు. ఎయిర్ ట్రాఫిక్ విభాగాన్ని అప్రమత్తం చేసి విమానాన్ని బే-51కి తీసుకొచ్చారు. ప్రయాణికులను కిందకు దించిన తర్వాత లాంజ్‌లో వారికి బస ఏర్పాటు చేశారు. మరో స్పైస్‌జెట్ విమానం ద్వారా ప్రయాణికులను పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

గరుడ వాహనంపై

వరదరాజుని వైభవం

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం వరదరాజ పెరుమాళ్ ఆలయంలో 'పెరియాళ్వార్ అవతార దినోత్సవం' సందర్భంగా శనివారం సాయంత్రం ఆణి గరుడోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ముందుగా వరదరాజ పెరుమాళ్‌ను అలంకరించి వాహన మండపానికి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ అలంకరించిన బంగారు గరుత్మత వాహనంపై కొలువుదీర్చి నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

గరుత్మంత వాహనంపై వరదరాజ పెరుమాళ్

నేటి నుంచి ఉత్తర చెన్నైలో ట్రాఫిక్ ఆంక్షలు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై మహానగర కార్పొరేషన్ ఆధ్వర్యంలో వాననీటి సంరక్షణ సంబంధించిన పనులు తిరువొత్తియూరు హైరోడ్డు, ఓల్డ్ వాషర్‌మెన్‌పేట ప్రాంతాల్లోని చిన్న వీధుల్లో జరుగుతున్న కారణంగా 7వ తేదీ నుంచి తాత్కాలికంగా ట్రాఫిక్‌లో మార్పులు చేసినట్లు ట్రాఫిక్ విభాగం ఓ ప్రకటనలో తెలిపింది. సర్ త్యాగరాయ కాలేజీ, తిరువొత్తియూరు హైరోడ్డు, సెమెట్రీ రోడ్డు కూడలి మధ్యన ఉన్న ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయి.

● మింట్ వైపు నుంచి వచ్చే బస్సులు, భారీ వాహనాలు టీహెచ్ రోడ్డు, సెమెట్రీ రోడ్డు కూడలి మీదుగా మళ్లించారు. వాహనాలు సెమెట్రీ రోడ్డు, ఎంఎస్ కోయిల్ వీధి, ఎన్నూర్ చెట్టి రోడ్డు, జీవరత్నం సాలై నుంచి టీహెచ్ రోడ్డు, అపోలో ఆసుపత్రి కూడలి కుడివైపుకు వెళ్లి ఉంటుంది. మింట్ నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలు, తేలికపాటి వాహనాలు టీహెచ్ రోడ్డులో ఎప్పటిలాగానే అపోలో ఆసుపత్రి కూడలికి వెళ్లొచ్చు. అపోలో ఆసుపత్రి కూడలి నుంచి మింట్ వరకు ఎదురుగా వెళ్లే వాహనాలకు ఎలాంటి మార్పులు లేవని అధికారులు తెలిపారు.

ఇద్దరు సాయుధదళ కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ప్యారిస్, న్యూస్‌టుడే: ఖైదీ పరారీ వ్యవహారంలో ఇద్దరు సాయుధదళ కానిస్టేబుళ్లు సస్పెండయ్యారు. తిరునెల్వేలికి చెందిన భగవతిరాజా 2021లో పోక్సో కేసులో అరెస్టు అయ్యాడు. జూన్ 15 నుంచి జైల్లో ఉన్న నేపథ్యంలో శుక్రవారం విచారణ నిమిత్తం సాయుధదళ కానిస్టేబుళ్లు శరవణకుమార్, బాలమురుగన్ అతన్ని తిరునెల్వేలి కోర్టుకి తీసుకెళ్లారు. అనంతరం రాత్రి ముగ్గురు మాట్టుత్తావణి బస్టాండుకి వచ్చారు. అప్పుడు పోలీసుల అజాగ్రత్త కారణంగా భగవతిరాజా తప్పించుకున్నాడు. అతని కోసం పోలీసులు గాలిస్తున్న నేపథ్యంలో శరవణ కుమార్, బాలమురుగన్‌లను సస్పెండు చేస్తూ కమిషనరు లోకనాథన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

దివ్యప్రబంధాన్ని ప్రతిరోజూ పఠించాలి

ఉపన్యసిస్తున్న రంగనాథస్వామి

సైదాపేట, న్యూస్‌టుడే: పన్నెండు మంది ఆళ్వార్లు 108 శ్రీ వైష్ణవ దివ్య క్షేత్రాల్లోని పెరుమాళ్లను కీర్తిస్తూ మంగళశాసనం చేసిన పాశురాలు దివ్యప్రబంధంగా ప్రఖ్యాతి చెందిందని, వాటిని ప్రతిరోజూ పఠించాలని ప్రముఖ అధ్యాత్మిక ఉపన్యాసకులు ఉభయ వేదాంత వేలుకుడి రంగనాథస్వామి హితవు పలికారు. చెన్నై జార్జిటౌన్‌లోని శ్రీ వేంకటేశ్వర సుప్రభాత గోష్టి నిర్వహణలోని శ్రీ వేంకటేశ్వరస్వామి మందిరంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ 41వ వార్షికోత్సవం బుధవారం నుంచి వైభవంగా జరుగుతోంది. ఇందులో భాగంగా దివ్య ప్రబంధం గురించి రంగనాథస్వామి ఉపన్యసిస్తున్నారు. ఈ సందర్భంగా స్వామివారిని ఆదివారం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ నెల 12వ తేదీ వరకు వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

అలంకరణలో స్వామివారు

అంగన్‌వాడీ కేంద్రాల మూసివేత సరికాదు

నయినార్ నాగేంద్రన్

సైదాపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 500కు పైగా అంగన్‌వాడీ కేంద్రాలను మూసేసినట్లు వచ్చిన వార్తలు దిగ్భ్రాంతి కలిగించాయని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తెలిపారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... డీఎంకే ప్రభుత్వం తమ స్వార్థం కోసం నిరాకరిస్తున్న జాతీయ విద్యా విధానంలో అంగన్‌వాడీ సిబ్బందికి ప్రాముఖ్యత ఇచ్చేందుకు, విద్య, పిల్లల సంరక్షణలో శిక్షణ ఇచ్చి అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అయితే డీఎంకే ప్రభుత్వం కేవలం ప్రకటనలకే ప్రాధాన్యం ఇస్తూ అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను తీర్చలేక కేంద్రాలను మూసేందుకు సిద్ధమవుతుందని దుయ్యబట్టారు. గత ఎన్నికల సమయంలో వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఖాళీలను భర్తీ చేయాలి: ఓపీఎస్

సైదాపేట: అంగన్‌వాడీల్లో ఖాళీలను భర్తీ చేయాలని మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... వైద్యులు లేని ఆస్పత్రులు, ప్రొఫెసర్లు లేని విశ్వవిద్యాలయాలు, కాలేజీలు, ఉపాధ్యాయులు లేని పాఠశాలలు, సిబ్బంది లేని ప్రభుత్వ కార్యాలయాల వరుసలో ప్రస్తుతం అంగన్‌వాడీలు చేరాయని ఎద్దేవా చేశారు. గత నాలుగేళ్ల డీఎంకే పాలనలో అంగన్‌వాడీల్లో ఖాళీలను భర్తీ చేయలేదని ఆరోపించారు. అది సరిపోక 500 కేంద్రాలను మూసేసినట్లు వార్తలు వచ్చాయని తెలిపారు. వాటిని మళ్లీ తెరిచేందుకు, సరిపడా సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

14 వైద్య కళాశాలల డీన్‌ల నియామకం రద్దు

సమర్థించిన హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 14 ప్రభుత్వ వైద్య కళాశాలల డీన్‌ల నియామకాలను రద్దు చేయడాన్ని మద్రాసు హైకోర్టు సమర్థించింది. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల్లో డీన్‌ల పోస్టులకు అర్హులని 26 మంది అధ్యాపకుల జాబితాను తయారు చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇందుకుగాను అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరింది. కానీ అభ్యంతరాలు తెలుపకముందే 14 మంది ప్రొఫెసర్లకు పదోన్నతి కల్పించి డీన్‌లుగా నియమిస్తూ 2024 అక్టోబరు 3న ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ప్రొఫెసరు మనోన్మణి మొదలైన నలుగురు మద్రాసు హైకోర్టులో కేసు వేశారు. ఈ కేసుని విచారించిన సింగిల్ జడ్జి 14 ప్రభుత్వ వైద్య కళాశాలల డీన్‌ల నియామకాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన అప్పీల్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తులు.. 14 మంది నియామక ఉత్తర్వులను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి జారీచేసిన ఉత్తర్వులను సమర్థించి, అప్పీల్ పిటిషన్లను కొట్టివేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా సింగిల్ జడ్జి జారీచేసిన ఉత్తర్వుల ప్రాతిపదికన నాలుగు వారాల్లోగా ప్రభుత్వ వైద్య కళాశాలలకు డీన్‌ల పదోన్నతికి సంబంధించిన జాబితాను తయారు చేసి, నియామకం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు.

నేడు ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 440కుపైగా ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో బీఈ, బీటెక్ తదితర కోర్సులలో దాదాపు 2లక్షల సీట్లు జనరల్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తారు. ఇందుకుగాను కౌన్సెలింగ్‌ను రాష్ట్ర ప్రభుత్వం తరఫున సాంకేతిక విద్యా డైరెక్టరేట్ ఏటా నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరానికిగాను బీఈ, బీటెక్ ప్రవేశాలకు కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ మే 7వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక విభాగ కౌన్సెలింగ్ ఆన్‌లైన్ ద్వారా సోమవారం ప్రారంభం కానుంది. జనరల్ కేటగిరి విద్యార్థులకు 14న ఉంటుంది. ఆగస్టు 26 వరకు కొనసాగుతుంది.

పళని గిరివలానికి పోటెత్తిన భక్తులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పళని దండాయుధపాణి ఆలయానికి కొన్నిరోజులుగా కేరళ భక్తుల రాక పెరిగింది. కేరళ రాష్ట్రం తిరుచ్చూర్ ప్రాంతానికి చెందిన 400 మందితో కూడిన భక్తుల బృందం శనివారం పళనికి విచ్చేశారు. ఆ బృందానికి చెందిన ముగ్గురు గోపుర కావడి ఎత్తారు. 10మంది వివిధ దేవతామూర్తుల వేషం ధరించగా భక్తులంతా గిరివలం నిర్వహించారు. గిరివలం ముగిసిన తర్వాత కేరళ భక్తులు కొండపై ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.

EENADU eClassifieds
FINANCIAL SERVICES
రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్సియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.



వివిధ దేవతామూర్తుల వేషధారణలో భక్తులు

రాష్ట్ర హక్కుల కోసం పోరాడేవాళ్లు నక్సలైట్లా?

ఎంపీ కనిమొళి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర హక్కుల కోసం పిలుపునిచ్చే వాళ్లు నక్సలైట్లా? అని ఎంపీ కనిమొళి ప్రశ్నించారు. తమిళనాడు స్టాన్ స్వామి పీపుల్స్ ఫెడరేషన్ తరఫున స్టాన్ స్వామి విగ్రహావిష్కరణ, ప్రజాస్వామ్య తిరుగుబాటు సమావేశం తిరుచ్చిలో శనివారం రాత్రి జరిగింది. పాల్గొన్న ఎంపీ కనిమొళి మాట్లాడుతూ... తనకు పోరాట యోధుడంటే చేగువేరానే గుర్తుకొస్తారని, ఆయన ప్రజల కోసం పోరాడారన్నారు. అదేవిధంగా స్టాన్ స్వామి మన భూమిలో ప్రజల కోసం నిలబడి పోరాడారని చెప్పారు. 84ఏళ్ల స్టాన్ స్వామి టీ తాగడానికి కూడా ఇబ్బంది పడుతున్న సమయంలో అరెస్ట్ చేశారని, దాహం వేసినా నీళ్లు కూడా ఇవ్వలేదన్నారు. దేశంలో కొందరు మత, కులపరమైన రాజకీయాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రాల హక్కులను హరించే ప్రభుత్వం కేంద్రంలో ఉందన్నారు.

'రాష్ట్రంలో భాజపా ఎప్పటికీ పట్టు సాధించదు'

సైదాపేట, న్యూస్‌టుడే: తమిళనాడులో భాజపా ఎప్పటికీ పట్టు సాధించదని అన్నాడీఎంకే ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వర్‌రాజా తెలిపారు. ఓ తమిళ పత్రికతో ఆయన మాట్లాడుతూ... తమిళనాడులో భాజపా ఎప్పటికీ కాలుమోపలేదని స్పష్టం చేశారు. కూటమికి నేతృత్వం వహించేది అన్నాడీఎంకేనేనని, దీన్ని భాజపా అంగీకరించకుంటే రెండు పార్టీల సమన్వయానికి అవకాశం లేదని చెప్పారు. భాజపాతో అన్నాడీఎంకే పొత్తు పెట్టుకున్నందున మైనారిటీల ఓట్లు తగ్గిపోతాయని తెలిపారు. కూటమి పాలన అనే ప్రసక్తే లేదన్నారు. తమిళనాడు ప్రజలు కూడా ఎప్పుడూ దాన్ని ఇష్టపడింది లేదని పేర్కొన్నారు. ఎన్డీయే కూటమిలో ముఖ్యమంత్రి అభ్యర్థి గురించి భాజపా ఎత్తుగడలు ఫలించవని తెలిపారు. పళనిసామే ముఖ్యమంత్రి అభ్యర్థి అని చెప్పారు.

అన్ని ఔషధాలకు దిగుమతి లైసెన్సు తప్పనిసరి: మద్రాసు హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ఆయుర్వేదం మొదలైన అన్ని ఔషధాలకు దిగుమతి లైసెన్సు తప్పనిసరి అని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. సింగపూర్‌కి చెందిన లియుంగ్ కై ఫూక్ అనే ఫార్మాస్యూటికల్ కంపెనీ కొడాలి తైలంని తయారు చేసి భారతదేశంలో విక్రయిస్తోంది. ఈ బామ్‌ని చెన్నై మండైవెళికి చెందిన ఆక్సెస్ మార్కెటింగ్ ఇండియా అనే ప్రైవేటు కంపెనీ దిగుమతి చేసి దేశంలో విక్రయిస్తోంది. ఈ నేపథ్యంలో కొడాలి తైలం దిగుమతికి సంబంధించిన లైసెన్సు డ్రగ్ కంట్రోల్ ఆఫీసర్ సర్టిఫికెట్ పొందాలని ఆక్సెస్ కంపెనీకి నోటీసులు జారీ అయ్యాయి. అదేవిధంగా సింగపూర్ నుంచి దిగుమతి అయిన కొడాలి తైలం ఉన్న బాక్సులను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దిగుమతి అయిన కొడాలి బామ్‌ని అప్పగించాలని కోరుతూ ఆక్సెస్ కంపెనీ మద్రాసు హైకోర్టులో కేసు వేసింది. ఈ కేసుని విచారించిన జస్టిస్ సెంథిల్‌కుమార్ రామమూర్తి శనివారం జారీచేసిన ఉత్తర్వుల్లో... సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు కొడాలి తైలంని కస్టమ్స్ డ్యూటీ పరిధిలోకి తీసుకొచ్చారన్నారు. అదేవిధంగా భారతదేశంలో దిగుమతి అయ్యే ఆయుర్వేద ఔషధాలు పరిశోధనలకు లోబడి ఉంటాయన్నారు. ఔషధ, సౌందర్య సాధనాల ఉత్పత్తుల చట్టం ఆయుర్వేద వస్తువులకు వర్తిస్తుందని, కావున ఆయుర్వేద మొదలైన అన్ని ఔషధ వస్తువులకు దిగుమతి లైసెన్సు తప్పనిసరిగా పొందాలన్నారు. అదేవిధంగా స్వాధీనం చేసుకున్న కొడాలి తైలంని పరిశీలించి అప్పగించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అరుంబాక్కం, తాంబరం ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్తు శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

ప్రజల కోరిక మేరకే ఎడప్పాడికి జడ్‌ప్లస్ భద్రత

ప్యారిస్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజల కోరిక మేరకే కేంద్ర ప్రభుత్వం త్వరలో ముఖ్యమంత్రి కానున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామికి కేంద్రం జడ్ ప్లస్ భద్రత కల్పించిందని మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ పేర్కొన్నారు. మదురైలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... జడ్ ప్లస్ భద్రత కల్పించాలని అమ్మా పేరవై తరఫున తీర్మానం ఆమోదించినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రజలు కూడా కోరారన్నారు. ఈ కోరికను పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం త్వరలో కల్పించిందని తెలిపారు. ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వానికి అమ్మా పేరవై తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.

అఖిల భారత సమ్మెలో పాల్గొంటాం

ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం

ప్యారిస్, న్యూస్‌టుడే: అఖిల భారత సమ్మెలో తమిళనాడు ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం పాల్గొంటుందని సంఘ ప్రధాన కార్యదర్శి సురేష్ తెలిపారు. తమిళనాడు ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం ఉన్నతస్థాయి కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు డేవిడ్ లివింగ్‌స్టన్ అధ్యక్షతన ఆదివారం ఆన్‌లైన్‌లో జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల గురించి ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పాత పింఛను విధానాన్ని అమలుచేయాలని, జాతీయ విద్యావిధానాన్ని వెనక్కి తీసుకోవాలని మొదలైన కోరికలను డిమాండ్ చేస్తూ ఈ నెల 9న జరగనున్న అఖిల భారత సమ్మెలో పాల్గొనేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కళాశాలల అధ్యాపకులు ఎంతో కాలంగా కోరుతున్న డిమాండ్‌లను నెరవేర్చేలా ఉన్నతవిద్యాశాఖ కార్యదర్శి, కళాశాల విద్యా కమిషనరు తదితరులు చర్చలు జరపాలని తెలిపారు.

అమిత్‌షా చెన్నై పర్యటన రద్దు

సైదాపేట, న్యూస్‌టుడే: ఈనెల 7న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చెన్నైకి రానున్నట్లు రాష్ట్ర నేతలు చెప్పగా ప్రస్తుతం పర్యటన రద్దయినట్లు సమాచారం. భాజపా, అన్నాడీఎంకే కూటమి ఏర్పాటైన తర్వాత గత నెలలో అమిత్‌షా మదురైకి వచ్చారు. అప్పుడు ఇకపై తరచూ తమిళనాడు రానున్నట్లు తెలిపారు. ఆ ప్రకారం జులై 7న చెన్నై కాట్టాంగొళత్తూరులో జరిగే కార్యక్రమంలో అమిత్‌షా పాల్గొంటారని గతంలో వార్తలు వచ్చాయి. పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్, అధ్యక్షుడు అన్బుమణి మధ్య సమస్య పరిష్కరించి అమిత్‌షా చెన్నై వచ్చినప్పుడు వారిని కలిసేందుకు ఏర్పాట్లు జరిగాయి. అయితే వారిద్దరూ రాజీ పడకపోవటంతో అమిత్‌షా చెన్నై పర్యటన రద్దయినట్లు సమాచారం.

రితన్య ఆడియో ఆధారాలను నాశనం చేయలేరు

రితన్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పొన్‌మాణిక్యవేల్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రితన్య ఆడియో ఆధారాలను ఎవరూ నాశనం చేయలేరని, ఆధారాలను పరిశీలిస్తే వారికి ఒక వారంలో శిక్ష విధించవచ్చని మాజీ ఐజీ పొన్‌మాణిక్యవేల్ పేర్కొన్నారు. వరకట్న వేధింపులతో అవినాశిలో ఆత్మహత్య చేసుకున్న రితన్య ఇంటికి ఆదివారం వెళ్లిన ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. తనకు రితన్య కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. రితన్య చివరిగా వారి తండ్రికి పంపిన ఆడియో విని వారిని ఓదార్చుదామని వ్యక్తిగతంగా ఇక్కడికి వచ్చానని చెప్పారు. రితన్య ఎఫ్ఐఆర్‌ని చదివానని, 194 సెక్షన్లలో కేసు నమోదై ఉందన్నారు. మానసికంగా, శారీరకంగా ఎవరెవరు హింసించారో ఆడియోలో ఉందన్నారు. ఆమె ఫోన్ కోర్టులో ముఖ్య సాక్ష్యంగా ఉందన్నారు. ఈ ఆధారాలను బట్టి విచారిస్తే ఒక వారంలోపు శిక్ష వేయవచ్చన్నారు. రాష్ట్రంలో పలుచోట్ల వరకట్న వేధింపుల కారణంగా వివాహితలు చనిపోతున్నారని తెలిపారు. ఈ కేసుని జిల్లా ఎస్పీ దర్యాప్తు చేయాలని, సాక్ష్యాలను కాగితంపై రాయకుండా ఆడియో, వీడియో విధానంలో నమోదు చేయాలన్నారు.

నట్టి హీరోగా నీలి

నట్టి

చెన్నై, న్యూస్‌టుడే: ఛాయాగ్రాహకుడు, నటుడైన నట్టి అలియాస్ నట్రాజ్ సుబ్రమణియం హీరోగా రూపొందుతున్న చిత్రం 'నీలి'. ఎంఎస్ఎస్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం సుమారు 2,400 ఏళ్ల క్రితం జరిగిన ఓ యదార్థ ఘటన ఆధారంగా చారిత్రక నేపథ్యంతో రూపొందుతోంది. చిత్రం గురించి దర్శకుడు ఎంఎస్ఎస్ మాట్లాడుతూ... నీలికి సంబంధించిన పలు చారిత్రక విషయాల గురించి అధ్యయనం చేయడంతో పాటు వాటికి కొన్ని కాల్పనిక సంఘటనలనూ జోడించి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. చిత్రంలో ఇద్దరు ముఖ్యమైన నాయికలు నటించనున్నారని పేర్కొన్నారు. భారీస్థాయిలో రూపొందనున్న ఈ చిత్రంలోని ఇతర నటీనటులు, సాంకేతిక కళాకారుల ఎంపిక జరుగుతోందని తెలిపారు.

మణికంఠన్ హీరోగా

మక్కళ్ నాయగన్

మణికంఠన్

చెన్నై: నటుడు మణికంఠన్ హీరోగా నటించిన 'గుడ్ నైట్', 'లవర్', 'కుడుంబస్థాన్' చిత్రాలు హిట్టయిన నేపథ్యంలో మరో చిత్రంలో ఆయన నటించనున్నారు. పా.రంజిత్ వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసిన సంతోష్‌కుమార్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రానికి 'మక్కళ్ నాయగన్' టైటిల్ ఖరారు చేశారు. కులపరంగా జరిగే రాజకీయం ఆధారంగా రూపొందే ఈ చిత్రాన్ని పా.రంజిత్ నిర్మించనున్నారు.

పరందు పోకు అట్లీ ప్రశంసలు

చెన్నై: రామ్ దర్శకత్వంలో మిర్చి శివ, అంజలి, గ్రేస్ ఆంటని, అజు వర్గీస్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించిన 'పరందు పో' చిత్రం సినిమా థియేటర్లలో విడుదలై ప్రేక్షకుల మన్ననలు అందుకుంటోంది. ఈ నేపథ్యంలో చిత్రాన్ని ప్రశంసిస్తూ దర్శకుడు అట్లీ ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. అందులో... 'పరందు పో' చిత్రం చాలా సన్నిహితంగా ఉందన్నారు. తండ్రీకుమారుడు మధ్య అనుబంధాన్ని చాలా అద్భుతంగా చూపించారని తెలిపారు. చిత్రంలోని పాటలు బాగున్నాయని పేర్కొన్నారు. శివ, అంజలి కథాపాత్రలు బాగా నచ్చాయన్నారు.

చిత్రబృందం పంచుకున్న ఫొటో

ఆ హాలీవుడ్ చిత్రాల సీక్వెళ్లలో నటించాలనుంది

అజిత్‌కుమార్



చెన్నై: నటుడు అజిత్‌కుమార్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రం తర్వాత కారు రేసులపై దృష్టి సారించిన విషయం తెలిసిందే. అజిత్‌కుమార్ రేసింగ్ జట్టు విజయాలను తమ ఖాతాల్లో వేసుకుంటోంది. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో జరుగుతున్న కారు రేసులో అజిత్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాఖ్యత లేవనెత్తిన ఓ ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ... తన చిత్రాల్లోని స్టంట్ సన్నివేశాల్లో తానే నటిస్తుండటంతో 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్', 'ఎఫ్1' చిత్రాల సీక్వెళ్లలో నటించాలనే కోరిక ఉందన్నారు. అలాంటి చిత్రాల్లో నటించడానికి ఆహ్వానం వస్తే తప్పక నటిస్తానని తెలిపారు.

నాట్టామై రెండో భాగానికి సన్నాహాలు: శరత్‌కుమార్

టీనగర్, న్యూస్‌టుడే: 'అయ్యా', 'నాట్టామై' తదితర సూపర్ డూపర్ హిట్ చిత్రాలకు రెండో భాగాలు తీయాలన్న కోరిక తనలో ఉందని ప్రముఖ నటుడు శరత్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం తిరునెల్వేలి జిల్లాలోని ఓ సినిమా థియేటరులో జరిగిన '3 బీహెచ్‌కే' చిత్ర ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్ల క్రితం తాను నటించి తెరకెక్కిన 'నాట్టామై' చిత్రం సూపర్ హిట్ కావడంతో పాటు తనకు మంచి పేరు తెచ్చిపెట్టిందన్నారు. ఆ చిత్రం రెండో భాగం తీయాలన్నదే తన చిరకాల కోరికగా ఉందన్నారు. అనంతరం '3 బీహెచ్‌కే' చిత్రం గురించి మాట్లాడుతూ.. కష్టపడితే మనం ఏదైనా సాధించగలమనే సందేశాన్ని తాను ఈ చిత్రం ద్వారా చేరవేస్తున్నట్లు తెలిపారు. అదే కార్యక్రమంలో పాల్గొన్న నటి దేవయాని, నటుడు సిద్ధార్థ్ కూడా చిత్రానికి సంబంధించిన అంశాలపై మాట్లాడారు.

విద్యా సామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరాజన్

టీజేఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో 'ఫ్రెషర్స్ డే'

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపం టీజేఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో ఫ్రెషర్స్ డే ఆదివారం నిర్వహించారు. టీజేఎస్ విద్యా సంస్థల అధినేత, ఎమ్మెల్యే గోవిందరాజన్ అధ్యక్షత వహించి కొత్తగా చేరిన విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ఎండీ ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

భర్త చనిపోయి ఐదు రోజులైనా గుర్తించని భార్య

పక్కింటి వారికి దుర్వాసన రావడంతో వెలుగులోకి

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: భర్త మరణించి ఐదు రోజులైనా భార్య గుర్తించలేదు. పక్కింటివారికి దుర్వాసన రావడంతో ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కోయంబత్తూరు నగరంలోని కొట్టైమేడు ప్రాంతానికి చెందిన అబ్దుల్ షా(48) కార్మికుడు. అతను మద్యానికి బానిసై పనికి వెళ్లేవాడు కాదు. ఇతనికి భార్య, ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. భార్య అనారోగ్యంతో బాధపడుతోంది. పిల్లలు స్థానికంగా ఉన్న అవ్వ ఇంట్లో ఉంటున్నారు. అప్పుడప్పుడు వచ్చి తల్లిదండ్రులను చూసి వెళ్తుంటారు. ఇదిలా ఉండగా ఐదు రోజుల క్రితం అబ్దుల్ షా పక్కింట్లోని వారు అతని కుమారుడు షారూఖ్ ఖాన్‌కి ఫోన్ చేసి వారి ఇంట్లో నుంచి దుర్వాసన వస్తోందని చెప్పారు. వెంటనే ఇంటికి వెళ్లిన షారూఖ్ ఖాన్ తల్లిని అడగ్గా ఎలుక చచ్చిన వాసన అని చెప్పింది. తండ్రి పడక గదిలో పడుకొని ఉండటాన్ని చూసి తిరిగి అవ్వ ఇంటికి వెళ్లాడు. శనివారం దుర్వాసన ఎక్కువగా వస్తోందని పక్కింటివారు ఫోన్ చేసి చెప్పడంతో ఇంటికెళ్లాడు. తండ్రి గదిలో నుంచి దుర్వాసన రావడం గమనించిన కుమారుడు దగ్గరకెళ్లి చూశాడు. తండ్రి మృతిచెందాడని గుర్తించాడు. అతను చనిపోయి ఐదు రోజులైనా భార్య గుర్తించలేదు. తన పనులు తాను చేసుకుంటూ ఉంది. సమాచారం మేరకు పెరియకడైవీధి పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి కోయంబత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మౌలిక వసతులు కల్పించాలని రాస్తారోకో

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు కార్పొరేషన్ నాలుగో జోన్ ముళ్లిపాళైయంలోని డిడిం నగర్‌లో 200కి పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. కొన్ని నెలలుగా ఈ ప్రాంతంలో మురుగు కాలువను శుభ్రం చేయలేదని, దీంతో రోడ్లపై మురుగు పారుతూ ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. శనివారం కార్పొరేషన్ తరఫున సరఫరా అయిన నీటిని తాగిన నలుగురు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆ ప్రాంతవాసులు ఆదివారం వేలూరు-బెంగళూరు రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. తహసీల్దార్ వడివేలు, పోలీసులు అక్కడికి చేరుకుని వారితో చర్చించారు. వెంటనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్థులు

తగ్గిన చేపల ధరలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కాశిమేడు ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం వేకువజాము నుంచే కొనుగోలుదారుల సందడి కనిపించింది. అదే సమయంలో చేపల ధరలు తగ్గడంతో వ్యాపారులు తమకు అవసరమైన చేపలను ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేశారు. చేపల వేటపై నిషేధం ముగియడంతో మత్స్యకారులు వేటకు వెళ్లిన నేపథ్యంలో గత ఆదివారం చేపల ధర కాస్త అధికంగానే ఉంది. ఈ ఆదివారం ధర తగ్గడం, పెద్ద చేపలైన వంజరం, శీలా, వవ్వాల్, పారై తదితరాలు అధికంగా తీరానికి చేరడంతో టోకు, చిల్లర వ్యాపారులు, హోటళ్లకు కొనుగోలు చేసుకుంటున్న వారు, చేపల ప్రియులతో కాశిమేడు ఫిషింగ్ హార్బర్ కళకళలాడింది. హార్బర్‌లో ఇంతకు ముందుకన్నా ప్రస్తుతం చిల్లర దుకాణాలు అధిక సంఖ్యలో వెలిశాయి.

కేరమాళం రోడ్డులో

వాహనాల రాకపోకలకు అంతరాయం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఆసనూర్ నుంచి కేరమాళం వెళ్తున్న రోడ్డుపై చెట్టు కూలడంతో 2 గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. వాహన చోదకులు ఇబ్బందుల పాలయ్యారు. సత్యమంగళం పులుల అభయారణ్యం, ఆసనూర్ అటవీ సర్కిల్‌లో ఆసనూర్ నుంచి కేరమాళం వరకు రోడ్డులో ఎత్తైన త్రైలపు చెట్లున్నాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు-కర్ణాటక రాష్ట్రాలను కలుపుతున్న మార్గం అనే ప్రాంతంలో రోడ్డు పక్కనున్న త్రైలపు చెట్టు ఒకటి కూలిపోయింది. ఈ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకుని అక్కడికి చేరుకున్న అటవీశాఖ సిబ్బంది రెండు గంటలు పైగా శ్రమించి చెట్టును తొలగించారు. ఆ తర్వాత వాహనాలు కదిలాయి.

కూలిన చెట్టును తొలగిస్తున్న అటవీశాఖ సిబ్బంది

జులైలో రెండుసార్లు గరుడ సేవ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో ఈ నెలలో గురు పౌర్ణమి, గరుడ పంచమి పర్వదినాలను పురస్కరించుకుని తితిదే రెండుసార్లు గరుడ వాహన సేవ నిర్వహించనుంది. 10న గురుపౌర్ణమి, 29న గరుడ పంచమి సందర్భంగా శ్రీమలయప్పస్వామి రాత్రి 7 నుంచి 9 గంటల వరకు గరుడ వాహనంపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

'నమ్మైక్కాక్కుం-48' పథకంలో

4వ లక్ష లబ్ధిదారుడికి మంత్రి పరామర్శ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: నమ్మైక్కాక్కుం-48 పథకంలో నాలుగో లక్ష లబ్ధిదారుడిని ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ ఆదివారం నేరుగా వెళ్లి పరామర్శించారు. చెన్నైలోని ఏసీఎస్ వైద్య కళాశాల ఆస్పత్రిలో 'ఇన్నుయిర్ కాప్పోం నమ్మైక్కాక్కుం-48' పథకం కింద చికిత్స పొందుతున్న 4వ లక్ష లబ్ధిదారుడిని ఆదివారం మంత్రి మా.సుబ్రమణియన్ పరామర్శించి, చికిత్స వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ పథకాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి 2021 డిసెంబర్ 18న ప్రారంభించారని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ప్రజాదరణ పొందిన పథకంగా ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడేవారిని వెంటనే కాపాడి రాష్ట్రంలోని 250 ప్రభుత్వ, 473 ప్రైవేట్ ఆస్పత్రులు మొత్తం 7233 ఆస్పత్రులలో వెంటనే చేర్చి 48గంటల్లో వారికి రూ.లక్ష అందించి ప్రాణాలను కాపాడుతున్న అత్యుత్తమ పథకంగా పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ప్రమాదం జరిగిన ఎనిమిది నిమిషాల్లో అంబులెన్స్ ఘటనా స్థలానికి వెళ్లి అత్యవసర చికిత్స అందించడంతోపాటు వెంటనే ఆస్పత్రిలో చేర్పిస్తుందన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శిస్తున్న మంత్రి మా.సుబ్రమణియన్

పూండి నుంచి పుళల్ చెరువుకు నీటి విడుదల

ఊత్తుకోట, న్యూస్‌టుడే: చెన్నై ప్రజల దాహార్తిని తీర్చే ప్రధాన చెరువుల్లో ఒకటైన పూండి చెరువులో వర్షపు నీటితో పాటు తెలుగుగంగ పథకం కింద అందే నీటిని నిల్వజేసి అవసరాల మేరకు పుళల్, చెంబరంబాక్కం చెరువులకు విడుదల చేస్తుంటారు. తెలుగుగంగ పథకం కింద ఈ నెల 21వ తేదీ నుంచి పూండి చెరువుకు నీరు చేరుకుంటోంది. దీంతో పూండి చెరువు నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పూండి నుంచి పుళల్ చెరువుకు లింక్ కాలువ ద్వారా ఆదివారం 300 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. పూండి చెరువు ఎత్తు 35 అడుగులు కాగా 3.231 టీఎంసీల నీటిని నిల్వజేయవచ్చు. ఆదివారం నీటిమట్టం 32 అడుగులుగా నమోదైంది. 2.241 టీఎంసీల నీరు నిల్వఉంది. చెరువుకు 270 క్యూసెక్‌ల నీరు చేరుకుంటోంది. చెన్నై జలమండలికి బేబీ కాలువ ద్వారా 17 క్యూసెక్ నీటిని వదులుతున్నారు.

స్వాధీనం చేసుకున్న ఏనుగు దంతాలను చూపుతున్న అటవీశాఖ సిబ్బంది

ఏనుగు దంతాలు స్వాధీనం

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెన్నైలోని జమాలియా ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి 1983లో పని కోసం నైజీరియా వెళ్లాడు. అక్కడ అతను ఏనుగుల దంతాల అక్రమ రవాణాలో పాల్గొన్నాడు. అక్కడి నుంచి రెండు ఏనుగు దంతాలను తమిళనాడు తీసుకొచ్చాడు. వాటిని 30ఏళ్లుగా విక్రయించకుండా ఇంట్లోనే ఉంచుకున్నాడు. ఇదిలా ఉండగా బెంగళూరుకు చెందిన స్నేహితుడి ద్వారా అతను తిరుచ్చి ప్రాంతంలో ఏనుగు దంతాల స్మగ్లింగ్ ముఠాను పరిచయం చేసుకున్నాడు. వారి ద్వారా తన వద్ద ఉన్న 2 దంతాలను రూ.2 కోట్లకు విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఆ మేరకు శనివారం సాయంత్రం దంతాలను కారులో పెట్టుకుని కుటుంబంతో కలిసి తిరుచ్చికి బయలుదేరాడు. ఈ క్రమంలో ముందస్తు సమాచారం మేరకు చెంగల్పట్టు అటవీశాఖ అధికారులు చెంగల్పట్టు సమీప పరణూర్ టోల్‌గేటు వద్ద రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. వీరి కారుని ఆపి సోదా చేసి 2 ఏనుగు దంతాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఒదుకు సంబంధించి మహిళ సహా 8 మందిని అరెస్టు చేశారు.

రూ.కోటి విలువైన వెండి నగలు...

గుమ్మిడిపూండి: తిరువళ్లూరు జిల్లా ఎళావూరు చెక్‌పోస్టు వద్ద పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ నుంచి చెన్నై మాధవరం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో సోదా నిర్వహించి రూ.కోటి విలువైన 68 కిలోల వెండి నగలను స్వాధీనం చేసుకున్నారు. సరైన దస్త్రాలు లేకుండా తరలిస్తున్న చెన్నై తిరుముల్లైవాయల్‌కు చెందిన యోగేష్, షావుకారుపేటకు చెందిన ప్రదీప్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు. నగలను చెన్నై నుంగంబాక్కంలోని ఆదాయపన్నుల శాఖాధికారులకు అప్పగించారు.

స్వాధీనం చేసుకున్న వెండి నగలు

శ్రీలంకకు తరలిస్తున్న బీడీ ఆకులు...

ప్యారిస్: తూత్తుకుడి సముద్రతీరం గుండా శ్రీలంకకు బీడీ ఆకులను తరలిస్తున్నట్లు క్యూ బ్రాంచ్ పోలీసులకి సమాచారం అందింది. ఆ మేరకు శనివారం రాత్రి సముద్రతీర ప్రాంతాల్లో గస్తీ నిర్వహించారు. అప్పుడు కొంబుతురై తీరం వద్ద పోలీసులు ఉండడాన్ని చూసిన కొందరు లారీని ఆపి పారిపోయారు. పోలీసులు లారీలో తనిఖీ చేయగా బీడీ ఆకులు కనిపించాయి. దీంతో లారీ సహా రూ.60 లక్షల విలువైన బీడీ ఆకులను స్వాధీనం చేసుకున్నారు.

బాణసంచా పరిశ్రమలో పేలుడు

ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు

ప్యారిస్, న్యూస్‌టుడే: బాణసంచా పరిశ్రమలో సంభవించిన పేలుడు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఐదుగురు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు... శివకాశి సమీపం తిరుత్తంగల్‌కి చెందిన గణేశన్‌కి సాత్తూర్ సమీపం కీళతాయిల్పట్టిలో బాణసంచా పరిశ్రమ ఉంది. ఇక్కడున్న 50కి పైగా గదుల్లో 100 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఇదిలాఉండగా ఆదివారం పరిశ్రమలో అకస్మాత్తుగా పేలుడు సంభవించింది. సమాచారం అందిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో బాలగురుసామి అనే కార్మికుడు మృతిచెందగా మరో ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా పరిశ్రమ యజమానులు గణేశన్, కామరాజ్ సహా ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘటనాస్థలి

బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయం వెల్లడి

చెన్నై: దుర్ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలోని మృతుడు బాలగురుసామి (50) కుటుంబానికి రూ.4లక్షలు, తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారికి రూ.50వేలు చొప్పున సీఎం పబ్లిక్ రిలీఫ్ ఫండ్ నుంచి అందించాలని అధికారులను ఆదేశించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

శైలేషిణి (పాతచిత్రం)

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ జిల్లా భవానిసాగర్ సమీపం కొత్తమంగళం గ్రామానికి చెందిన రమేష్, కస్తూరి దంపతులు. వీరి కుమార్తె శైలేషిణి(11) తొట్టంపాలయం ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. ఈమె శనివారం భవానిసాగర్ సాలైలో కామరాజర్‌నగర్ వంతెన వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బనియన్ సంస్థ బస్సు బాలికను ఢీకొంది. ప్రమాదంలో బాలిక అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. భవానిసాగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జలుబు మందు తాగిన ఏడాది బాలుడు...

ఆర్కేనగర్: దిండుక్కల్ జిల్లా నీలకోట సమీపంలోని సి.పుదూర్ ప్రాంతానికి చెందిన చిన్నపాండి (30) ట్యాంకర్ లారీ డ్రైవర్. ఇతనికి భార్య భానుప్రియ, కుమారుడు ప్రణీత్ (1) ఉన్నారు. ఇదిలా ఉండగా గత నెల 26వ తేదీ చిన్నారికి జలుబు చేయడంతో ఆ ప్రాంతంలోని మందుల దుకాణంలో జలుబు మందు తీసుకొచ్చి తాగించి రాత్రి నిద్రపుచ్చారు. మరుసటిరోజు తెల్లవారుజామున చిన్నారి తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో వత్తలంగుండులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మదురై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీని గురించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు పక్కన వ్యక్తి మృతదేహం లభ్యం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నామక్కల్ పరమత్తిసాలై ఈబీ కాలనీలోని డీఎస్పీ కార్యాలయం సమీపంలోని రోడ్డు పక్కన శనివారం ఓ వ్యక్తి కింద పడి ఉండటాన్ని గస్తీలో ఉన్న పోలీసులు గుర్తించారు. అతన్ని నామక్కల్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. మృతుడు తంజావూరు జిల్లా కుంభకోణానికి చెందిన పెయింటర్ ముత్తయ్య(52) అని, భార్యతో విడిపోయి ఒంటరిగా జీవిస్తున్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యాభర్తల బలవన్మరణం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నామక్కల్ తిల్లైపురానికి చెందిన సుబ్రమణియన్(56), ప్రమీల(51) దంపతులు. సుబ్రమణియన్ తిరుచ్చి ఆర్టీఓగా పని చేస్తున్నారు. ప్రమీల ఆండాపురం పంచాయతీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయిని. ఇదిలా ఉండగా ఆదివారం దంపతులు వగురంపట్టి వద్ద రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

పుట్టినరోజుకి కొత్త దుస్తులు తీసివ్వలేదని బాలుడు...

వేలూరు: వేలూరు జిల్లా నెల్‌వాయ్‌కి చెందిన వెంకటేశన్ భవననిర్మాణ కార్మికుడు. ఇతని కుమారుడు ధనశేఖరన్ (15) కనియంబాడిలోని ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. రానున్న పదో తేదీ బాలుడి పుట్టినరోజు కావడంతో శనివారం కొత్త దుస్తులు, చాక్లెట్లు తీసుకునేందుకు తల్లిదండ్రులను డబ్బులు అడిగాడు. ప్రస్తుతం తన వద్ద డబ్బులు లేవని, కూలీ వచ్చిన వెంటనే ఇస్తానని వెంకటేశన్ చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురైన ధనశేఖరన్ గదిలోకెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే వేలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఘటనపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోషకాహార పథక ఆర్గనైజర్...

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: వేలూరు జిల్లా గుడియాత్తంకి చెందిన పారిజాతం (57) నెల్లూర్‌పేటలోని ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో పోషకాహార పథక ఆర్గనైజర్‌గా 30ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఈమె శుక్రవారం రాత్రి తన ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు గదిలో జిల్లా కలెక్టరు, పోలీసు ఇన్‌స్పెక్టరుకు ఆమె రాసిన ఉత్తరాన్ని స్వాధీనం చేసుకున్నారు. అందులో.. బ్లాక్ డెవలప్‌మెంట్ కార్యాలయానికి చెందిన ముగ్గురు అధికారులు తన ఆత్మహత్యకు కారణమని, తన కుమారుడు, కుమార్తెకు దయచేసి ఏదైనా సాయం చేయమని ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మణిమారన్ హత్య కేసులో ముగ్గురు లొంగుబాటు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: తమిళగ వాళ్వురిమై కట్చి కారైక్కాల్ జిల్లా కార్యదర్శిగా వ్యవహరిస్తున్న మణిమారన్ శనివారం దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఘటనతో సంబంధం ఉన్న పీఎంకే నిర్వాహకుడు ప్రభాకరన్ సహా ముగ్గురు నిందితులు సెంబరనార్ కోవిల్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం లొంగిపోయారు. పోలీసులు వారి వద్ద దర్యాప్తు జరుపుతున్నారు.

యువతిపై అత్యాచారం కేసులో

స్నేహితురాలు సహా ఇద్దరి అరెస్టు

మనాసే

ప్యారిస్, న్యూస్‌టుడే: వేలూర్‌కి చెందిన 23 ఏళ్ల యువతి చెన్నైలోని ఓ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగానికి వెళ్తోంది. ఇదిలా ఉండగా పెరంబూర్‌కి చెందిన ఆమె స్నేహితురాలు నుంగంబాక్కంలోని ఓ లాడ్జిలో రెండు గదులు బుక్ చేసి, మద్యం తాగేందుకు పిలవడంతో ఆ యువతి గత నెల 27న వెళ్లింది. అక్కడ స్నేహితురాలితో కలిసి మద్యం తాగింది. అప్పుడు పెరంబూర్‌కి చెందిన యువతి తనకు తెలిసిన ఇద్దరు వ్యక్తులను గదికి పిలిపించింది. నలుగురు కలిసి మద్యం తాగారు. అనంతరం తెల్లవారుజామున లేచి చూడగా వేలూర్‌కి చెందిన యువతి వద్ద మనాసే అనే వ్యక్తి నిద్రపోతున్నాడు. అతను అత్యాచారానికి పాల్పడినట్లు తెలుసుకున్న ఆమె తన స్నేహితురాలు, అతనితో గొడవపడి అక్కడి నుంచి వెళ్లిపోయింది. అనంతరం వేలూర్‌లో పోలీసులకి ఫిర్యాదు చేసింది. ఈ కేసు చెన్నై థౌజండ్‌లైట్ ఆల్ ఉమెన్ పోలీస్‌స్టేషన్‌కి బదిలీ అయింది. అనంతరం పోలీసులు దర్యాప్తు చేసి పెరంబూర్‌కి చెందిన యువతి, మనాసేలను శనివారం అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం ఇద్దరిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించారు. పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

యువతిని మోసగించిన పోలీసు..

అరెస్టయిన సంపత్

వేళచ్చేరి: కడలూర్ జిల్లా సేడపాళ్యం నాగమ్మాళ్ పేటకు చెందిన సంపత్ (28) ఉళుందూర్‌పేటలో 10వ బెటాలియన్ స్పెషల్ పోలీస్‌గా పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా 2023లో తిరునెల్వేలి జిల్లాలో మిగ్‌జాం తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలు ఏర్పడ్డాయి. అప్పుడు 10వ బెటాలియన్ వరద సహాయక చర్యల్లో పాల్గొంది. ఆ సమయంలో సంపత్‌కు తిరునెల్వేలి కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న 28 ఏళ్ల యువతితో పరిచయం ఏర్పడింది. తర్వాత పరస్పరం ప్రేమించుకున్నారు. సన్నిహితంగా మెలిగారు. అనంతరం సంపత్ ఉళుందూర్‌పేటకు బదిలీ అయ్యాడు. 2024లో ప్రేయసిని కడలూర్ తీసుకెళ్లాడు. అక్కడ ఓ హోటల్‌లో నాలుగు రోజులు బసచేశారు. పెళ్లి చేసుకుంటానని ఆమెకు లైంగికంగా దగ్గరయ్యాడు. తరువాత వివాహం గురించి మాట్లాడక పోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మోసపోయినట్లు గ్రహించిన యువతి కడలూర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి సంపత్‌ను అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

వృద్ధురాలిపై దాడిచేసిన ముగ్గురు...

విల్లివాక్కం: ధర్మపురి జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని రాజాజీ ఈత కొలను ఎదురుగా ఉన్న వేలవన్ వీధికి చెందిన చెల్లియమ్మాళ్(61) పండ్ల దుకాణం నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి ఈమె ఇంటికి సమీపంలో ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనాలను నిలిపి పెద్దగా కేకలు వేస్తూ మాట్లాడుకుంటుండగా చెల్లియమ్మాళ్ మందలించింది. దీంతో మద్యం మత్తులో ఉన్న యువకులు ఇనుపరాడ్డుతో ఆమెపై దాడికి పాల్పడ్డారు. స్థానికులు ముగ్గుర్ని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. చెల్లియమ్మాళ్‌ను ఆస్పత్రికి తరలించారు. పోలీసుల దర్యాప్తులో.. నిందితులు వెణ్ణాంపట్టి ప్రాంతానికి చెందిన కేశవమూర్తి(19), విష్ణు(26), నరేంద్రన్(20)గా తెలిసింది.

లారీ టైర్లు చోరీ చేసిన నిందితుడు...

విల్లివాక్కం: నామక్కల్ పట్టణంలోని అన్నానగర్‌కు చెందిన లోకనాథన్(42) లారీ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ఈయనకు సొంతమైన లారీ గత నెల 3వ తేదీ కృష్ణగిరి జిల్లా గురుబరపల్లిలో ప్రమాదంలో చిక్కుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ పరిశీలన అనంతరం లోకనాథన్ లారీని తీసుకొచ్చి నామక్కల్ వళ్లిపురంలోని తన వర్క్‌షాపు ముందు నిలిపారు. ఈ నేపథ్యంలో లారీకి ఉన్న నాలుగు టైర్లు డిస్క్ సహా చోరీకి గురయ్యాయి. గత నెల 29వ తేదీ వళ్లిపురంలోని మరో పార్కింగ్ ప్రాంతంలో తన లారీని నిలపడానికి లోకనాథన్ వెళ్లగా అక్కడ తన లారీ నుంచి దొంగిలించిన మూడు టైర్లను మరో లారీకి అమర్చి ఉండటం గుర్తించారు. దీంతో నల్లిపాలయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టి టైర్లు చోరీ చేసిన తిండమంగళానికి చెందిన లారీ డ్రైవర్ చిన్నరాజా(37)ను శనివారం అరెస్టు చేశారు.

హెడ్‌కానిస్టేబుల్‌పై దాడిచేసి దోపిడీ

దాడికి గురైన పార్తిబన్

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరు క్యూ బ్రాంచ్ పోలీసు ఇన్‌స్పెక్టర్ వాహన డ్రైవర్‌గా హెడ్ కానిస్టేబుల్ పార్తిబన్ పనిచేస్తున్నారు. ఈయన కుటుంబంతో చిన్నియపాళైయంలో నివాసం ఉంటున్నారు. భార్య రేవతి పాఠశాల ఉపాధ్యాయిని. శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై హోటల్‌కి వెళ్లిన దంపతులు తిరిగి ఇంటికి బయలుదేరారు. బైపాస్ రోడ్డులో అడ్డుకున్న ముగ్గురు దుండగులు వారిపై మారణాయుధాలతో దాడిచేశారు. వారి నుంచి ఐదు సవర్ల బంగారు నగలు దోచుకుని పారిపోయారు. గాయపడిన పార్తిబన్ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై సూలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: ఎలాంటి టోకెన్లు లేని భక్తులకు 14 గంటల్లో, రూ.300 టికెట్ల భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. శనివారం శ్రీవారిని 87,536 మంది దర్శించుకున్నారు. రూ.3.33 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

నెలలో రెండుసార్లు గరుడ సేవ

తిరుమలలో ఈ నెలలో గురు పౌర్ణమి, గరుడ పంచమి పర్వదినాలను పురస్కరించుకుని తితిదే రెండు సార్లు గరుడ వాహన సేవ నిర్వహించనుంది. 10వ తేదీన గురుపౌర్ణమి, 29న గరుడ పంచమి సందర్భంగా శ్రీమలయప్ప స్వామివారు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు గరుడ వాహనంపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

ఐక్యత చాటుతున్న రాష్ట్ర మంత్రులు సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్, ఎమ్మెల్యే ఆరణి, బీసీ సంఘాల నాయకులు

బీసీలంటే.. సామాజిక శక్తి

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: బీసీలంటే ఒక సామాజిక శక్తి, బలం, చైతన్యమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం, అంబేడ్కర్ పులే ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలోని ఇందిరా మైదానం వేదికగా ఆదివారం నిర్వహించిన 'బీసీల ఆత్మగౌరవ భరోసా సభ' విజయవంతంగా ముగిసింది. అంతకుముందు బాలాజీకాలనీలోని జ్యోతిరావు పులే విగ్రహం నుంచి ఇందిరా మైదానం వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. మంత్రులు సత్యకుమార్, సవిత, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, యాదవ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్లు నరసింహ యాదవ్, రుద్రకోటి సదాశివం, ఉప మేయర్ ఆర్సీ మునికృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, నాయకులు పాల్గొన్నారు.

ఈనాడు తిరుపతి

పెద్దఎత్తున పక్కదారి పడుతున్న వసూళ్లు
పంచాయతీల్లో.. పన్ను దొంగలు

◆ తిరుచానూరు మేజరు పంచాయతీలో బిల్లు కలెక్టర్ రమేష్ నాయుడు ఏకంగా రూ.22 లక్షల వరకు పన్ను మొత్తం పక్కదారి పట్టించి ఇటీవల అడ్డంగా దొరికిపోయారు. సదరు బిల్‌కలెక్టర్ గతంలోనూ ఇదే తరహాలో అక్రమాలకు పాల్పడి వేటుకు గురైనా తీరు మార్చుకోలేదు. ఈ పంచాయతీలో ఏటా రూ.2 కోట్ల వరకు పన్ను వసూళ్లు ఉంటున్నాయి. ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఖాతాకు జమచేయాల్సి ఉన్నా చేయలేదు. కార్యదర్శి సైతం పట్టించుకోకపోవడంపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

◆ చిత్తూరు జిల్లా వి.కోట మేజర్ పంచాయతీలో గతంలో రూ.20 లక్షల వరకు బిల్లు కలెక్టర్లు స్వాహా చేశారు. నిధులు వాడుకున్నట్లు రుజువు కావడంతో ఇద్దరిపైనా వేటు వేశారు.

పుత్తూరు, న్యూస్‌టుడే: పంచాయతీల్లో పన్ను వసూళ్లు పెద్దఎత్తున పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వం ఎప్పటికప్పుడు సాంకేతిక మార్పులు తీసుకొస్తున్నా అక్రమాలకు తెరపడటం లేదు. మేజరు పంచాయతీల్లో ఈతంతు మరీ ఎక్కువగా ఉంటోంది. కొన్ని చోట్ల కార్యదర్శులు, బిల్లు కలెక్టర్లు మిలాఖత్ కావడంతో అక్రమాలు బయటకు పొక్కడం లేదు. మరికొన్నిచోట్ల ఉన్నతాధికారులకు తెలిసినా సర్దుబాటు చేయడం, నోటీసులతో సరిపెట్టడం వంటివి కొనసాగుతుండటంతో అక్రమాల పర్వం కొనసాగుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

'మేజర్'.. పాట్లు ఇక్కడే..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మేజర్ పంచాయతీలు 30 వరకు ఉన్నాయి. కాణిపాకం, తిరుచానూరు, సత్యవేడు, నాగలాపురం, నారాయణవనం, చంద్రగిరి, కార్వేటినగరం, జీడీనెల్లూరు, బంగారుపాళ్యం, రేణిగుంట తదితర వాటిలో రూ.కోట్లలో ఆదాయం ఉంటోంది. ఇక్కడ గ్రేడ్-1 కార్యదర్శులను నియమించాల్సి ఉన్నా రాజకీయ పలుకుబడితో ఏళ్ల తరబడి ఇన్‌ఛార్జులు కొనసాగడంతో అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతోంది.

2024-25లో వసూళ్లు ఇలా..

ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలు : **1471**

పన్ను డిమాండు : **రూ.54 కోట్లు**

వసూళ్లు : **రూ.48.75 కోట్లు**

బకాయిలు : **రూ.5.25 కోట్లు**

సొంత సిబ్బందితో..

అధిక ఆదాయం వచ్చే పలు పంచాయతీల్లో సర్పంచులను కీలుబొమ్మలుగా మార్చేస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ కింద పన్ను వసూలు సిబ్బందిని నియమించుకునే అవకాశం గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు ఉంటుంది. ఈ నేపథ్యంలో సొంత అనుచర గణంతో ఆ విభాగాన్ని నింపేసి మన్నిమదింపు నుంచి వసూళ్ల వరకు చేతివాటానికి పాల్పడుతున్నారు. రెగ్యులర్ బిల్లు కలెక్టర్లు వారికి దారులు చూపుతున్నారు. చివరకు ఎవరూ గుర్తించకపోతే దొంగ బిల్లులతో లెక్కా పద్దులు సరిచేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

పర్యవేక్షణ లేకనే..

ప్రధానంగా మేజర్ పంచాయతీలపై ఈవోఆర్డీలు, డీఎల్‌పీవోలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయడం, పన్ను వసూళ్ల వంటి వాటిపై దృష్టి సారించడం చేపట్టాలి. అయితే ఆదిశగా దృష్టి సారించకపోవడం, ఇక్కడి ఆదాయాలపైనే అందరి కళ్లు ఉండటంతో అక్రమాలకు తెరపడటం లేదన్న ఆరోపణలున్నాయి.

పకడ్బందీ చర్యలతో ముందుకు

తిరుచానూరు పంచాయతీలో జరిగిన అక్రమాలపై ఇటీవలే విచారణ పూర్తయింది. వాస్తవాలు నిర్ధారించుకుని బిల్లు కలెక్టర్‌ను సస్పెండ్ చేశాం. ఇకపై తరచూ మేజర్ పంచాయతీల్లో తనిఖీ చేపట్టి ఇలాంటి అక్రమాలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపడుతాం.

– సుశీలాదేవి, జిల్లా పంచాయతీ అధికారిణి

దోచిందెవరు.. దాచిందెవరు?

ఏనుగు దంతాల ఘటనపై సర్వత్రా గోప్యత

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: అడవులను, అటవీ సంపదను కాపాడే కార్యాలయంలోనే విలువైన ఏనుగు దంతాలు, తుపాకీ (గన్‌)ని రెండేళ్ల కిందట దొంగలు ఎత్తుకెళ్లిపోతే మొన్నటివరకు ఆ విషయం వెలుగులోకి రానీయలేదు. భాకరాపేట రేంజ్ సమీపంలోని దేవపట్లవారిపల్లె వద్ద విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన ఏనుగు దంతాలు ప్రస్తుతం అక్కడి అటవీ కార్యాలయంలో ఉన్నాయి. తాజా పరిణామ నేపథ్యంలో వాటిని తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలకు తరలించే అవకాశం ఉన్నట్లు రేంజర్ వెంకటరమణ తెలిపారు.

● **కేసు పూర్వాపరాలు..** భాకరాపేట రేంజ్‌లో ఒక ఆడ, రెండు మగ ఏనుగులు మృతిచెందాయి. మగ ఏనుగులకు పోస్టుమార్టం నిర్వహించిన అటవీ అధికారులు రెండు జతల దంతాలను అప్పట్లో భాకరాపేట అటవీశాఖ కార్యాలయంలో భద్రపరిచారు. 2023 సెప్టెంబరు 20వ తేదీన ఏనుగు దంతాలతోపాటు 12 బోర్ పంప్ యాక్షన్ గన్ దొంగతనం అయినట్లు అప్పటి అటవీ అధికారులు భాకరాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అది దొంగతనం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయలేదని, కొన్ని రోజుల తర్వాత సమాలోచనల అనంతరం ఫిర్యాదు చేసినట్లు సమాచారం. 87/2023 కింద ఎఫ్‌ఐఆర్ నమోదు కావడంతో అటవీశాఖ అధికారులు అప్పట్లో పనిచేసిన ఒకరిద్దరు అధికారులకు నోటీసులిచ్చారు తప్పితే శాఖాపరమైన చర్యలు తీసుకోలేదు.

అనుమానాలెన్నో..

లోకేశ్వర్‌రెడ్డిపై భాకరాపేట అటవీశాఖ కార్యాలయంలో ఒక్క కేసు నమోదు కావడంకానీ, అధికారులు అరెస్టు చేసిన దాఖలాలుగానీ లేవు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో మాత్రమే అతనిపై ఎర్రచందనం కేసులు ఉన్నాయి. దంతాలు స్మగ్లర్ల చేతికి ఎలా చేరాయన్న అంశంలో వేళ్లన్నీ అటవీశాఖవైపే చూపుతున్నాయి.

● **బరువులో తేడా ఉందా?..** ఏనుగు దంతాల చోరీ కేసులో ప్రసాద్‌తోపాటు రాయచోటికి చెందిన లోకేశ్వర్‌రెడ్డి అనే ఎర్రచందనం స్మగ్లర్ ప్రమేయం ఉందన్న విషయాన్ని హైదరాబాదు పోలీసులు తేల్చారు. భాకరాపేటలో పోయిన దంతాల పొడవు, చుట్టు కొలతలు వాటితో సరిపోయినా బరువులో తేడా ఉన్నట్లు ఇక్కడి అధికారులు వాదిస్తున్నారు. తమవద్ద పోయిన దంతాలు 5.460 కిలోలు ఉండగా హైదరాబాద్‌లో స్వాధీనం చేసుకున్నవి 5.600 కిలోలు ఉన్నాయని, 140 గ్రాముల వ్యత్యాసం ఉందని చెబుతున్నారు.

పోలీసు విచారణలో స్పష్టత

ప్రాథమిక విచారణలో సరిపోతున్నా కచ్చితంగా చెప్పడానికి లేదు. సాంకేతికంగా నిరూపించాల్సి ఉంటుంది. పోలీసుల విచారణలో స్పష్టత వస్తుంది.

- వివేక్, డీఎఫ్‌వో

సయోధ్య కుదరక..
రోడ్డున పడింది

పాలచ్చూరు వద్ద ఏపీఐఐసీకి కేటాయించిన ర.భ. శాఖ రోడ్డు

నాయుడుపేట, పెళ్లకూరు, న్యూస్‌టుడే: జిల్లాలో ఆరు మండలాలు, మూడు నియోజక వర్గాలను కలిపే కొనేటి రాజుపాళెం-కొణతనేరి ర.భ. శాఖ రోడ్డు రెండు శాఖల సమన్వయ లోపంతో చివరకు వివాదాస్పదంగా మారింది. నాయుడుపేట మండలంలోని కొనేటిరాజుపాళెం నుంచి మేనకూరు పారిశ్రామికవాడ మీదుగా శ్రీకాళహస్తి వరకు 15 కి.మీ. ర.భ. శాఖ రోడ్డు ఉంది. గతంలో వెంకటగిరి, శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోల పరిధిలో ఈ మార్గంలో అధిక సంఖ్యలో బస్సులు నడిపేవాళ్లు. కల్వర్టులు అధ్వానంగా ఉండడం, పాలచ్చూరు నుంచి రహదారి మరమ్మతులు లేకపోవడంతో ఒకటి రెండు బస్సులు మాత్రమే నడుస్తున్నాయి. దీంతో పాలచ్చూరు నుంచి కొనేటిరాజుపాళెం మధ్య భూములను ఏపీఐఐసీ ఇటీవల ఆదిత్య బిర్లా పరిశ్రమకు కేటాయించింది. భూముల మధ్య ఉన్న రోడ్డు కేటాయించడంతో ఇటీవల పనులను ప్రారంభించిన పరిశ్రమ యాజమాన్యం రోడ్డుకు అడ్డుగా ప్రహరీ నిర్మించేందుకు యత్నించడంతో పాలచ్చూరు గ్రామస్థులు ఆందోళన చేశారు. ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏపీఐఐసీ అధికారులు చూపకపోవడం, మరోవైపు ర.భ.శాఖ రోడ్డు మార్గం వెంబడి ఆదిత్య బిర్లా పరిశ్రమ నిర్మాణం చేపడుతుండటంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు సమస్య పరిష్కారానికి ర.భ. శాఖ, ఏపీఐఐసీ అధికారులు చొరవ చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం

ఆహ్వాన పత్రిక చదువుతున్న ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్, చిత్రంలో ఈవో కిషోర్ తదితరులు

కాణిపాకం, న్యూస్‌టుడే: ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 16 వరకు జరిగే శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి బ్రహ్మోత్సవాల విజయవంతానికి ఆలయ ఉభయదారులు పూర్తి సహాయ, సహకారాలు అందించాలని ఈవో పెంచల కిషోర్ కోరారు. శ్రీ మణికంఠేశ్వర స్వామి వారి ఆలయంలో ఉభయదారులతో ప్రత్యేక సమావేశాన్ని ఆదివారం నిర్వహించి ఆయన మాట్లాడారు. కాణిపాకం సర్పంచి శాంతిసాగర్‌రెడ్డి, ఉభయదారుల సంఘం అధ్యక్షుడు ఈశ్వర బాబు, మాజీ ఛైర్మన్లు మోహన్‌నాయుడు, జగన్నాథరెడ్డి, మణినాయుడు, మోహన్‌రెడ్డి, ఏఈవోలు రవీంద్రబాబు, ప్రసాద్, ధనపాల్, హరిమాధవరెడ్డి, ధనుంజయ, 14 గ్రామాల ఉభయదారులు పాల్గొన్నారు. సేవ పేరిట వచ్చి శ్రీశైల ఆర్యవైశ్య సత్రం నిర్వాహకులు దాన్ని వ్యాపార కేంద్రంగా మార్చుకున్నారని పలువురు ఉభయదారులు ఆరోపించారు. అనంతరం పలు సమస్యలను వారు ప్రస్తావించారు.

మనకూ.. మియావాకి



తిరుపతి గ్రామీణ మండలం మల్లంగుంట పంచాయతీ ఉప్పరపల్లి క్రాస్ సమీపంలోని మియావాకి వనం ఇది. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఔషధ గుణాలు, అంతరిస్తున్న జాతులు, ఫల పుష్పాల విభాగాలకు చెందిన 88 పైగా రకాలతో పరిమిత స్థలంలో నాటడంతో అవి నేడు పెరిగి పెద్దవై చిట్టడివిని తలపిస్తున్నాయి. తక్కువ స్థలంలో దట్టమైన అడవిని సృష్టించడానికి జపనీస్ వృక్షశాస్త్రవేత్త అకీరా మియావాకి అభివృద్ధి చేసిన ప్రత్యేక పద్ధతి ఇది. కర్బన ఉద్గారాలు తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షిస్తూ.. జీవవైవిధ్యాన్ని కాపాడటంలో భాగంగా నగరాలు.. కరవు ప్రాంతాల్లో ఎక్కువగా ఈ పద్ధతిని ఉపయోగించి కృత్రిమ అడవులు సృష్టిస్తున్నారు. గత తెదేపా ప్రభుత్వంలో దీనిని ఏర్పాటు చేయగా ఇప్పుడు దాని ఫలితాలు కనిపిస్తున్నాయి. **- ఈనాడు, తిరుపతి**

పల్లెకు పండగొచ్చింది.. ఉపాధి బిల్లు విడుదలైంది

చిత్తూరు, తిరుపతి (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ఉపాధి పథకం కింద పల్లెల్లో సీసీరోడ్లు, కాలువలు, మినీ గోకులాలు తదితర నిర్మాణ పనులు చేపట్టిన వారికి ప్రభుత్వం శుభవార్త చెప్పింది.. జిల్లాలో పల్లె పండుగ బిల్లులు సుమారు ఎనిమిది నెలల నుంచి పెండింగులో ఉన్నాయి.. ఆ పనుల తాలూకా బిల్లులు నిధులు రూ.45 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేశాయి.. పాడి రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్లకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో చెల్లింపులు జరుగుతున్నాయి.

చెల్లింపులు ఇలా..

పాడి పోషణ ప్రోత్సహించేలా గోకులం షెడ్ల నిర్మాణాల్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. 90 శాతం రాయితీతో షెడ్లు నిర్మించారు. వాటికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో రూ.20.76 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. అందులో ఇప్పటి వరకూ రూ.6 కోట్ల మేర రైతుల ఖాతాల్లో జమ కాగా, త్వరలో మిగిలిన వారికీ జమవుతుందని అధికారులు అంటున్నారు.

పాత బకాయిలు..

పల్లెపండగ పేరుతో గత అక్టోబరులో అభివృద్ధి పనులు చేపట్టారు. పల్లెల్లో సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మించారు. రూ.కోట్లు వెచ్చించి పనులు చేసిన వారు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. నిధుల విడుదలతో గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిన అభివృద్ధి పనులు వేగం పుంజుకోనున్నాయి. 2014-19లో తెదేపా ప్రభుత్వ హయాంలో ఉపాధి నిధులతో చేసిన పనుల తాలూకా బిల్లులను వైకాపా ప్రభుత్వం చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులు పెట్టింది. తిరుపతి జిల్లాలో రూ.2,42,11,799 బిల్లులు చెల్లించలేదు. ఆ బకాయిలు ఇప్పుడు విడుదల చేయడంతో అప్పట్లో పనులు చేసిన వారు ఊపిరి పీల్చుకున్నారు.

ఉపాధి నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు

తిరుపతి జిల్లాలో.. ఉపాధి హామీ మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో చేపట్టిన పనులు రూ.లలో

2014-19 మధ్య బకాయిలు:	**2,42,11,799**
మినీ గోకులం షెడ్లు:	**10,91,56,062**
సీసీ, బీటీరోడ్లు:	**44,30,75,706**
మొత్తం:	**57,64,43,567**

● **బకాయిలు జమ.** 50 శాతం ఇప్పటి వరకూ లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యింది. మిగిలిన మొత్తం త్వరలో జమవుతుంది. అందరికీ బకాయి బిల్లులు అందుతాయి.

- రవికుమార్, పీడీ, డ్వామా

కృష్ణమ్మకు.. మరింత ఒరవడి

పులిచెర్ల మండలం గుట్టమీద ఎస్టీ కాలనీ సమీపంలోని హంద్రీనీవా కాలువలో పిచ్చిమొక్కలు

- హెచ్‌ఎన్‌ఎస్ఎస్ ప్రధాన కాలువ లైనింగ్‌కు పచ్చజెండా
- అంచనాలు రూపొందించే పనిలో అధికారులు

● **రెండేళ్లలో జలాలు వచ్చేలా..** హంద్రీ- నీవా ప్రధాన కాలువ, నీవా బ్రాంచి కాలువ లైనింగ్ అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపితే వెంటనే అనుమతులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. రెండేళ్లలో ఈ పనులు పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద వస్తున్నందున.. ప్రధాన కాలువకు ఆ నీటిని విడుదల చేయనున్నారు. సెప్టెంబరు లేదా అక్టోబరు నాటికి చిత్తూరు జిల్లాకు నీరు చేరే అవకాశం ఉంది.

ఈనాడు- చిత్తూరు, తిరుపతి: కరవు ప్రాంతాలను సస్యశ్యామలం చేసే దిశగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కనుంది. హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్ఎస్) ఈప్రాంత ప్రజల వరప్రదాయినిగా నిలవనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ పనులపై ప్రధానంగా దృష్టి సారించింది. మొదటి ఏడాదిలో పుంగనూరు, కుప్పం కాలువలకు నిధుల వరద పారించింది. ఇప్పుడు ప్రధాన, నీవా కాలువల్లోని అసంపూర్తి నిర్మాణాలతోపాటు లైనింగ్‌కు ప్రభుత్వం పచ్చజెండా ఊపడం ఉమ్మడి జిల్లాలో మరో మైలురాయిగా నిలవనుంది.

తెలుగుదేశం అధికారంలో ఉన్న 2014-19 మధ్య హంద్రీ- నీవా ప్రధాన కాలువపై ప్రత్యేక శ్రద్ధ చూపింది. 185.32 కి.మీ. మేర తవ్వించి 90 శాతం పూర్తిచేసింది. 500 మీటర్లు మాత్రమే పెండింగ్ పనులున్నాయి. మూడు కాంక్రీట్ నిర్మాణాలు, మరికొన్ని స్ట్రక్చర్లు, అక్విడక్టుల నిర్మాణం చేపట్టాలి. ఇవి పూర్తి చేసేందుకు ఆరు నెలల సమయం సరిపోతుంది. జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న 60 నెలలూ వీటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు.

బకాయిలు, పనులకు రూ.156 కోట్లు

ప్రధాన కాలువ కింద గతంలో చేసిన పనులకు మొత్తంగా రూ.156 కోట్లు ప్రభుత్వం నుంచి విడుదల కావాలి. ఇప్పటికే హెచ్‌ఎన్‌ఎస్ఎస్ అధికారులు ఈ విషయమై ప్రభుత్వానికి నివేదించారు. నీవా బ్రాంచి కాలువకు మరో రూ.65 కోట్ల వ్యయమవుతుంది. ఇవి పూర్తయితే పీలేరు, పుంగనూరు, చంద్రగిరి, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల్లో దాదాపు 97 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

పీర్ల ఊరేగింపు.. అగ్నిగుండ ప్రవేశం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా మొహర్రంను ఆదివారం ముస్లింలు, హిందువులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరుపతిలో బండ్లవీధి, చింతకాయలవీధి, గాలివీధిలో ఆదివారం తెల్లవారుజామున పీర్లతోపాటు భక్తులు అగ్నిగుండం ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం నగరంలో పీర్లను ఊరేగించారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

బడి బాగుకు..
రూ.2.56 కోట్లు

తిరుపతి విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. విద్యాసంవత్సరం పునఃప్రారంభమైన 15 రోజులకే కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు కేటాయించింది. పాఠశాలల్లో మరమ్మతులు, చాక్‌పీస్‌లు, డస్టర్లు తదితరాల కొనుగోలు, విద్యుత్తు బకాయిలు తదితరాలకు ఈ నిధులు వినియోగించుకోవచ్చు. నిర్వహణ నిధులు విద్యా సంవత్సరంలో రెండు విడతలుగా విడుదల చేస్తారు. గత వైకాపా పాలనలో ఈ నిధులు విడుదల కాలేదు. దీంతో పాఠశాలల్లో ఏ చిన్న పనికైనా ప్రధానోపాధ్యాయులు సొంత నగదు ఖర్చు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ నిధులు పునరుద్ధరించి గత విద్యా సంవత్సరం నుంచే మంజూరు చేస్తోంది.

● **మొదటి విడతగా..** విద్యా సంవత్సరం ప్రారంభంలోనే మొదటి విడతగా జిల్లాలోని 2,289 పాఠశాలలకు రూ.2.50 కోట్లు విడుదల చేసింది. పాఠశాలల బ్యాంకు ఖాతాలో నిధులు జమయ్యాయి. నిర్వహణ నిధులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఒకటి నుంచి 30 మందికి రూ.10 వేలు, 31 నుంచి 100 మందికి రూ.25వేలు, 101 నుంచి 250 మందికి రూ.50వేలు, 251 నుంచి వెయ్యి మంది వరకు రూ.75 వేలు ఇంకా ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే రూ.లక్ష వరకు ఇస్తారు.

నాలుగు ట్రిపుల్ ఐటీల్లో..
మిగులు సీట్లు 600

వేంపల్లె, న్యూస్‌టుడే : ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 600 సీట్లు మిగిలాయి. 'ఖాళీల భర్తీకి తదుపరి మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 11, 12 తేదీల్లో వెబ్‌సైట్‌లో వెల్లడిస్తాం. ఈ మేరకు రెండో విడత జాబితా సిద్ధం చేసే పనిలో తమ సిబ్బంది ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. ఆ లోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తాం' అని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ తెలిపారు.

మామిడి రైతులకు అండగా ఉంటాం

గల్లా ఫుడ్స్‌లో జ్యూస్‌ను పరిశీలిస్తున్న చిరంజీవి చౌదరి

పూతలపట్టు, న్యూస్‌టుడే: మామిడి రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి తెలిపారు. రంగంపేట క్రాస్ వద్ద ఉన్న గల్లా ఫుడ్స్ పరిశ్రమను ఆయన ఆదివారం సందర్శించారు. పల్ప్, జ్యూస్‌పై ఇప్పుడున్న జీఎస్టీ 12 శాతాన్ని.. ఐదు శాతానికి త్వరలో తగ్గించనున్నట్లు చెప్పారు. గుజ్జు పరిశ్రమల వద్దకు వస్తున్న రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఏరోజుకారోజు టోకెన్లు ఇవ్వాలని స్పష్టం చేశారు. అనంతరం పరిశ్రమలో ఉన్న పల్ప్, బేవరేజ్ విభాగాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన బెంగళూరు బయల్దేరి వెళ్లారు. ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

104FM Tirupati

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008555167, 9000180635

MIOT HOSPITALS OUTREACH CLINIC TIRUPATI

కాలేయ వ్యాధులు మరియు కాలేయ మార్పిడిపై నిపుణుల అభిప్రాయం పొందండి...



MIOT ప్రత్యేకతలు
- కాలేయ మార్పిడి
- చిన్నపిల్లల కాలేయ మార్పిడి.
- కాలేయ క్యాన్సర్ మార్పిడి.
- కాలేయ నిర్వాహణయొక్క సిర్రోసిస్
- తీవ్రమైన కాలేయ వైకల్యం
- ఫ్యాటీ లివర్

లక్షణాలు
- వైరల్ హెపటైటిస్ (హెపటైటిస్ బి మరియు సి)
- నాన్-ఆల్కహోలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి (NAFLD) / నాన్-ఆల్కహోలిక్ స్టీటో హెపటైటిస్ (NASH)
- లైసో సోమల్ స్టోరేజీ వ్యాధులు • ఆల్కహోలిక్ లివర్ వ్యాధి (ALD)

డా॥ పి. వెంకటసాగర్ MBBS, MS (General Surgery), Fellowship HepatoBiliary & Liver Transplant
లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్

సంప్రదించవలసిన చిరునామా: MIOT హాస్పిటల్స్ అవుట్రీచ్ క్లినిక్
D No 20-3-129/1, తిరుమల బైపాస్ రోడ్, శివజ్యోతి నగర్, తిరుపతి, తిరుపతి జిల్లా - 517501

తేదీ మరియు సమయం: 9 జూలై 2025 బుధవారం (10am - 5pm)
కన్సల్టేషన్ ఫీజు: Rs. 400/-
అపాయింట్‌మెంట్‌ల కొరకు*: +91 70953 85111 +91 70953 85333

*ముందస్తు అపాయింట్‌మెంట్ తప్పనిసరి. ఒకవేళ అవసరం అనుకుంటే, దయచేసి ఇంతకు ముందు వైద్య రికార్డులను, తీసుకుని రావలసినదిగా మనవి
Email: tic@miotinternational.com | www.miotinternational.com

(c) eenadu

నారా లోకేశ్‌కు ఘనస్వాగతం

స్వాగతం పలుకుతున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. నెల్లూరు పర్యటన నిమిత్తం ఆయన ప్రత్యేక విమానంలో ఆదివారం రాత్రి ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, గాలి భానుప్రకాష్, పులివర్తి నాని, కోనేటి ఆదిమూలం, కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శ్రీధర్‌వర్మ తదితరులు స్వాగతం పలికారు. విమానాశ్రయం బయటకు వచ్చిన ఆయన నాయకులు, కార్యకర్తలను కలిసి వారితో ఫొటోలు దిగారు. కొందరిని పేరుపేరునా పలకరించారు. అనంతరం రోడ్డు మార్గంలో నెల్లూరుకు బయలుదేరి వెళ్లారు.

'శివరాత్రి'ని తలపించిన జనం

● దర్శనానికి తప్పని తిప్పలు

ముక్కంటీశుని దర్శనం కోసం క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వాయులింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తజన సంద్రంగా మారింది. వారాంతం సందర్భంగా ఆదివారం మహాశివరాత్రిని తలపించేలా రద్దీ నెలకొంది. అనుబంధ ఆలయం ధర్మరాజుల స్వామి ఉత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన అగ్నిగుండ మహోత్సవం సందర్భంగా భద్రతా సిబ్బంది చాలా వరకు అక్కడ విధులు నిర్వహించాల్సి వచ్చింది. దీంతో చాలీచాలని సిబ్బందితో ఇబ్బందులు తప్పలేదు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో భక్తులు క్యూలైన్ల గుండా అడ్డదారిన వెళ్లడం, గంటల తరబడి నిరీక్షించలేక పలు దఫాలు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. స్వామి వారి ఆలయం వద్ద అందరు ఒకేసారి దర్శనానికి వెళ్లేందుకు పోటీలు పడటంతో తోపులాట చోటుచేసుకుంది. ఉదయం నుంచి రాత్రి ఆలయం మూత వేసే సమయం వరకు భక్తులు క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది. దాదాపు 30 వేలకు పైగా భక్తులు తరలివచ్చారు. ఇక రాహు, కేతు పూజలు 5,480 జరిగాయి. ప్రత్యేక ప్రవేశం 3,362, శీఘ్ర దర్శనం 4,461, అంతరాలయ దర్శనం 586 టికెట్లు అమ్ముడయ్యాయి. ప్రసాదాలు భారీగా అమ్ముడుపోయాయి.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే పరిటాల సునీత

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబం, ఐఆర్ఎస్ అధికారి రామకృష్ణ భట్, వైకాపా మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు.

రాయితీ విత్తనం.. రైతుకు వరం

ఉద్ది

● పంపిణీకి సిద్ధమవుతున్న ఏపీసీడ్స్

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: అంతర్ పంటలపై రైతులను ప్రోత్సహించాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయి రాయితీతో విత్తనాలు పంపిణీకి సిద్ధమైంది. ఈ మేరకు కందులు, ఉద్దులు, రాగి విత్తనాలు పంపిణీకి సన్నద్ధం కావాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ(ఏపీ సీడ్స్)కు ఆదేశాలు అందాయి. అందుకు తగ్గట్లు విత్తనాల పంపిణీకి కసరత్తును ప్రారంభించింది.

● **రాయితీ ఇలా..:** గతంలో రాయితీ విత్తనాలు ఉన్నా పూర్తి స్థాయిలో ఇచ్చింది లేదు. అందులోనూ కందులు ఒక రకం మాత్రమే ఇస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రధాన పంటలే కాకుండా పప్పు ధాన్యాలు, ఇతరత్రా పంటల సాగు పట్ల రైతులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో కందులు, మినుములు, రాగి విత్తనాలు పూర్తి రాయితీపై ఇచ్చేందుకు సిద్ధమైంది.

● **ఉద్ది:** 500 కిట్ల రూపంలో ఇచ్చేలా నిర్ణయించారు. ఒక్కో కిట్ ద్వారా 4 కిలోల వంతున 20 క్వింటాళ్లు అందజేయనున్నారు.

● **పశ్చిమానికే ప్రాధాన్యం..:** రాయితీ విత్తనాలు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పశ్చిమ ప్రాంత రైతులకు మాత్రమే అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. ఆ మేరకు ఉమ్మడి జిల్లాలోని పలమనేరు, పుంగనూరు, చిత్తూరు, నగరి వ్యవసాయ డివిజన్ల రైతులకు మాత్రమే వీటిని పంపిణీ చేయనున్నారు. జిల్లా వ్యవసాయాధికారుల సూచనల మేరకు రాయితీ విత్తనాల పంపిణీ జరుగుతుందని ఏపీసీడ్స్ అధికారులు తెలిపారు.

● **కంది:** 7800 కిట్ల రూపంలో రైతులకు ఇవ్వాలని నిర్ణయించారు. ఒక్కో కిట్ నందు 4 కిలోల విత్తనాలు ఉంటాయి. తద్వారా 312 క్వింటాళ్లు ఉచితంగా ఇవ్వనున్నారు.

● **రాగులు:** 300 కిట్లను ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఒక్కో కిట్‌లో రెండు కిలోల వంతున ఆరు క్వింటాళ్ల విత్తనాలు ఉచితంగా అందించనున్నారు.

21న గ్రేడ్-2 జేఎల్‌ఎంల చలో విజయవాడ

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థలో పని చేస్తున్న జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 21న నిర్వహించతలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. దీంతో ఈ నెల 8, 9 తేదీల్లో సీఎంకు పోస్టుకార్డు ఉద్యమం, 11న మూడు డిస్కంలలో వినతిపత్రాల సమర్పణ, 14న నల్లబ్యాడ్జీలతో నిరసన, 17న ఉద్యమానికి సంబంధించిన పోస్టర్ల ఆవిష్కరణ, 21న చలో విద్యుత్తు సౌధ పేరుతో విజయవాడలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.

దుకాణాన్ని పరిశీలిస్తున్న తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, సీఐ శ్రీరాముడు తదితరులు

పాపవినాశనంలో నిర్బంధ తనిఖీ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని పాపవినాశనంలో తిరుమల పోలీసు, తితిదే విజిలెన్స్, ప్రభుత్వ అటవీ విభాగం, బాంబ్‌స్క్వాడ్, అగ్నిమాపకశాఖ, రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నిర్బంధ తనిఖీ నిర్వహించారు. ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో అదనపు ఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో 148 దుకాణాలను తనిఖీ చేయగా.. 40 మంది అనధికారికంగా లైసెన్సు లేకుండా దుకాణాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ప్రతి దుకాణానికి తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. తిరుమల టూటౌన్ సీఐ శ్రీరాముడు, అధికారులు పాల్గొన్నారు.

జగన్‌కు దమ్ముంటే పెద్దిరెడ్డి పరిశ్రమ వద్ద ధర్నా చేయాలి

● పెద్దిరెడ్డి రూ.20 వేలకు ఎందుకు కొనలేదు

● నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ధ్వజం

పుత్తూరు, న్యూస్‌టుడే: రైతులను రాజకీయ కోసం వాడుకోవడం వైకాపా నేత జగన్‌కే చెల్లిందని, ఆయన చేస్తోంది పరామర్శ యాత్ర కాదని.. విధ్వంస యాత్ర అని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దుయ్యబట్టారు. తిరుపతిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా ఐదేళ్ల పాలనలో ఎప్పుడైనా మామిడి రైతులకు ఒక్క పైసా గిట్టుబాటు ధర ఇచ్చారా అని ప్రశ్నించారు. రూ.500 కోట్లు ఖర్చు పెట్టి ప్యాలెస్ కట్టుకున్న జగన్ ఐదేళ్లలో మామిడి రైతులకు ఐదు రూపాయలైనా ఇచ్చారా అని అన్నారు. గత ఐదేళ్లలో మామిడి రైతులకు వైకాపా నేతలు ఏం చేశారో చెప్పాలన్నారు. జిల్లాలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో సహా వైకాపా నాయకులకు మామిడి గుజ్జు పరిశ్రమలు ఉన్నాయని, రైతుల నుంచి తోతాపురి టన్ను రూ.20 వేలకు ఎందుకు కొనలేదన్నారు. వైకాపా పాలనలో ఐదేళ్లు గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా నేడు విమర్శలు చేయడం సరికాదన్నారు. కొందరు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, రైతులు వారి మాయలో పడొద్దన్నారు. అసలు జగన్ బంగారుపాళ్యం ఎందుకు వస్తున్నాడో..? రైతులను ఏం చేద్దామని వస్తున్నాడో చెప్పాలన్నారు. జగన్‌కు దమ్ముంటే మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం నడిపే గుజ్జు పరిశ్రమ దగ్గరకు వెళ్లి నిరసన చేయగలడా అని ప్రశ్నించారు. సిండికేట్‌గా మారి రైతులను ముంచేసి ఇప్పుడు తీరిగ్గా పరామర్శల పేరుతో వైకాపా నాయకులు డ్రామా ఆడుతున్నారని, రైతులు వాస్తవాలు తెలుసుకోవాలని భానుప్రకాష్ సూచించారు. నేడు పరామర్శల పేరుతో వైకాపా నాయకులు డ్రామాలు ఆడుతున్నారని, రైతులు వాస్తవాలు తెలుసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పెంపుడు శునకాల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

శునకానికి టీకా వేస్తున్న పశువైద్య వర్సిటీ అధికారులు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: పెంపుడు శునకాల ఆరోగ్యంపై యజమానులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని శ్రీవేంకటేశ్వర పశువైద్య వర్సిటీ డీన్ డా.వీరబ్రహ్మయ్య సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం పశువైద్య వర్సిటీ ఆధ్వర్యంలో పశువైద్య కళాశాల బోధనా సుపత్రిలో పెంపుడు శునకాలకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు వేశారు. పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ జగపతి రామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం 700 పెంపుడు శునకాలకు టీకాలు వేశారు. కళాశాల ఆసుపత్రి విభాగాధిపతి వైకుంఠ రావు, అధ్యాపకులు ధనలక్ష్మి, రఘునాథ్, భారతి, నస్రీన్, శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక, హాజరైన న్యాయమూర్తులు

కేసుల పరిష్కారంలో పురోగతి సాధించాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: పెండింగ్ కేసుల పరిష్కారంలో నిర్దేశిత ప్రగతిని సాధించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక పేర్కొన్నారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని న్యాయమూర్తులకు ఆదివారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ హైకోర్టు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పెండింగ్ కేసులు వెంటనే పరిష్కరించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతానికి 96,739 పెండింగ్ కేసులు ఉండగా.. ఇందులో 48,751 సివిల్ కేసులు, 47,988 క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రమేష్, మూడో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి గురునాథ్, నాలుగో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి అర్చన, ఐదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రాంగోపాల్, ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి, 10వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రామచంద్రుడు, 12వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసనాయక్, ఉమ్మడి జిల్లాలోని సీనియర్, జూనియర్ న్యాయమూర్తులు కోర్టు అధికారులు పాల్గొన్నారు.

గోవింద నామం.. పులకించిన శైవక్షేత్రం

● వైభవంగా అగ్నిగుండ మహోత్సవం

అగ్నిగుండ వాటిక వద్దకు ద్రౌపతమ్మను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

పిల్లలతో అగ్నిగుండ మహోత్సవంలో పాల్గొన్న భక్తుడు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శివకేశవులకు అభేదం లేదన్నట్లు.. గోవిందనామ స్మరణలతో శ్రీకాళహస్తి క్షేత్రం పులకించింది. శ్రీద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి వార్షిక ఉత్సవాల్లో భాగంగా అగ్నిగుండ మహోత్సవం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. దీంతో ఆలయం భక్తజన సంద్రంగా మారింది. ద్రౌపతమ్మ అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకార మండపం నుంచి ఊరేగింపుగా అగ్నిగుండ ప్రవేశ వాటిక వద్దకు తీసుకువచ్చి గుండ వాటికను ప్రదక్షిణం చేసి అమ్మవారిని సింహవాహనంపై ఉంచి వేడుకలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పురుషోత్తం, రవి ఆధ్వర్యంలో గుండ వాటికలోని నిప్పు కణికలను పుష్పాలపై ఉంచి ద్రౌపతమ్మ ఒడిలో ఉంచారు. మల్లెచెండును నిప్పులపై వేసి తొలుత ఆలయ ప్రధాన అర్చకులు గుండవాటికను దాటారు. తరువాత కలశం, అలుగు, పోతురాజు ఇలా భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. మేళతాళాలు, భక్తుల గోవిందనామస్మరణలతో ఆలయ ఆవరణ మార్మోగిపోయింది. ఈ విశేషోత్సవంలో పాల్గొనేందుకు భక్తులు అశేషంగా తరలివచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి, భాజపా రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, ఏఈవోలు హేమమాలిని, లోకేశ్‌రెడ్డి, ఈఈ మురళీధర్‌రెడ్డి, డీఈ శ్రీనివాసులరెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి వెంకటరెడ్డి, డీఎస్పీ నరసింహమూర్తి, సీఐలు నాగార్జునరెడ్డి, గోపి, తిమ్మయ్య, పలువురు అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

అవినీతి.. మారలేదు

● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో ముఖ్యమంత్రులు మారినా అవినీతి మాత్రం మారలేదని, గత ప్రభుత్వంలోని నాయకులంతా తిరిగి కూటమి కండువాలు కప్పుకొని అక్రమాలకు తెరలేపారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. ఆదివారం తిరుపతిలోని ప్రగతినగర్‌లో జరిగిన ఆ పార్టీ శాఖల మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 'స్మార్ట్ మీటర్ల విషయంలో అంతర్జాతీయ స్థాయిలో భారీ ఎత్తున అవినీతి జరిగింది. గత ప్రభుత్వ పాలనలో న్యూయార్క్ వేదికగా నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, అదానీ గ్రూపు సంస్థల మధ్య 25 వేల లక్షల డాలర్ల అవినీతి జరిగింది. గతంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పగలగొట్టాలని నారా లోకేశ్ పిలుపునిచ్చారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు అమర్చే కార్యక్రమం శరవేగంగా జరుగుతోంది. కమ్యూనిస్టులు బలహీనపడటంతో టెర్రరిజం, రౌడీయిజం, భూ, ఇసుక మాఫియా వంటి అరాచక శక్తులు పెరిగిపోతున్నాయి. సహజ వనరులను కూటమి నాయకులు ఇష్టానుసారంగా దోచుకుంటున్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బనకచర్ల, పోలవరం, నగరి-గాలేరు, హంద్రీనీవా ప్రాజెక్టులను పూర్తి చేయాలి. జిల్లా గుజ్జు పరిశ్రమల యజమానులు సిండికేట్ కావడంతోనే మామిడి ధరలు భారీగా తగ్గిపోయాయి. ప్రభుత్వం కిలోకు రాయితీ రూ.4 ఇస్తామని ప్రకటించడం కేవలం కంటితుడుపు ప్రకటన మాత్రమే. ప్రభుత్వాల అవినీతిని ప్రశ్నించాలంటే కమ్యూనిస్టులు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉంది' అని యాన పేర్కొన్నారు. రామానాయుడు, శివారెడ్డి, విశ్వనాథ్, చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, నదియా, బండి చలపతి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టు దారిలో బస్టాప్ కష్టాలు

శ్రీవారిమెట్టు నుంచి సుమారు 300 మీటర్ల దూరంలో నిలిచిన బస్సులు

● చెట్ల కింద బస్సుల కోసం వేచిఉన్న భక్తులు

శ్రీవారి దర్శనార్థం కాలినడకన శ్రీవారి మెట్టు మార్గంలో వెళ్లే భక్తులు బస్టాప్ కోసం ఇబ్బందులు పడుతున్నారు. దర్శనానంతరం తిరిగి మెట్ల మార్గంలో కిందకు వచ్చే భక్తులు శ్రీనివాస మంగాపురం వైపు బస్సు ఎక్కడానికి వచ్చి బస్టాప్ లేక ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు చెట్ల కింద సేద తీరుతున్నారు. తితిదే ఏర్పాటు చేసిన బస్టాప్ వద్దకు బస్సులు వచ్చే అవకాశం లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. అధికారులు పర్యవేక్షించి భక్తులకు అనువుగా స్టాప్ ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు. **- ఈనాడు, తిరుపతి**

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు.

గణనాథుడి సేవలో ఎన్నికల కమిషన్ కార్యదర్శి

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యదర్శి(ఎఫ్ఏసీ) జీవీ సాయిప్రసాద్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు.

ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, ఆశా కార్యకర్తలు

పుత్తూరు, న్యూస్‌టుడే: ఆశ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, రూ.26 వేలు వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. తిరుపతి, కడప జిల్లాల్లో జరిగే రాష్ట్ర మహాసభలకు సంబంధించి కరపత్రాలను స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు ఏఎన్ఎంలుగా ఉద్యోగోన్నతి వెయిటేజీ, ఉద్యోగ భద్రత, టీఏ, డీఏ ఇవ్వాలని, గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలన్నారు. ఖాళీలు వెంటనే భర్తీ చేయాలన్నారు. ఆగస్టు 17న పుత్తూరులో జిల్లా సభ, ఆగస్టు 30, 31వ తేదీల్లో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చాముండేశ్వరి, జిల్లా అధ్యక్షురాలు హేమావతి, వాణి ప్రసన్న, ధనలక్ష్మి, మారెమ్మ, పెంచలమ్మ, స్వర్ణ వెంకటరమణమ్మ, ఈశ్వరి పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు దాడి

రామకుప్పం, న్యూస్‌టుడే: పంటలపై ఒంటరి ఏనుగు తరచూ దాడి దిగడంతో ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం అర్ధరాత్రి మండల పరిధిలోని ననియాల పరిసర ప్రాంతాల్లో ఒంటరి ఏనుగు పంటలపై దాడులు చేసి నాశనం చేసింది. మామిడి కాయలు తిని చెట్ల కొమ్మలు విరిచేస్తోంది. అలాగే కొబ్బరి, టమాటా, వరి, బీన్స్ పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

చికెన్ ధరలు

వెన్‌కాబ్ (కిలో రూ.ల్లో)

బ్రాయిలర్ (రైతు ధర)	102
రిటైల్	124
లేయర్	112
బ్రాయిలర్	180
బ్రాయిలర్ స్కిన్ లెస్	205
లేయర్ మాంసం	190

సర్పంచి సుభాషిణికి ఎమ్మెల్యే నివాళి

సుభాషిణి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: చెర్లోపల్లి పంచాయతీ సర్పంచి సుభాషిణి కర్మక్రియలకు ఎమ్మెల్యే పులివర్తి నాని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హాజరై ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆమె భర్త శుభగిరి నాయుడుకు ధైర్యం చెప్పి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెదేపా మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, చంద్రగిరి మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, శ్రీధర్‌నాయుడు, నాయకులు సుధాకర్, రామానాయుడు, గౌస్‌బాషా, గ్రామీణ మండలం, రామచంద్రాపురం మండలంలోని నాయకులు పాల్గొన్నారు.

పెట్రోల్ పోసుకుంటూ పోలీసు స్టేషన్‌లోకి వెళ్తున్న గణేష్, బాటిల్ లాగేందుకు యత్నిస్తున్న భార్య

గణేశ్‌పై నీరు పోస్తున్న పోలీసులు

పోలీసుస్టేషన్ వద్ద పెట్రోల్ పోసుకుని హల్‌చల్

● చీటీ డబ్బుల వివాదంతో ఘటన

రేణిగుంట, న్యూస్‌టుడే: చీటీల డబ్బు అడిగారని పోలీసుస్టేషన్ ఎదుట ఓ యువకుడు ఆత్మాహత్యాయత్నానికి పాల్పడిన ఘటన రేణిగుంట పట్టణ పోలీసుస్టేషన్ ఎదుట చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు కథనం మేరకు... మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన గణేశ్(30) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ గ్రామంలోనే చిన్న మొత్తంలో చీటీలు నిర్వహించేవాడు. ఇటీవల ఎస్‌యూపురం గ్రామానికి చెందిన షణ్ముగం అనే వ్యక్తి చీటీ డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరాడు. గణేశ్ స్పందించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ అంశంపై గణేష్‌ను విచారణ కోసం స్టేషన్‌కు పిలిపించగా అతను భార్య లక్ష్మి, మామ వెంకటమునితో కలిసి పోలీసుస్టేషన్ వద్దకు చేరుకోగానే వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసుకోవడానికి యత్నించాడు. వెంటనే సిబ్బంది అప్రమత్తమై అతని వద్ద ఉన్న పెట్రోల్ బాటిల్ లాక్కుని నీళ్లు చల్లి ప్రమాదాన్ని నివారించారు. అనంతరం గణేష్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ అంశంపై విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ఎమ్మిగనూరు గ్రామీణం, ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం బనవాసి ఏపీఆర్‌జేసీ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని(17) ఆదివారం ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామానికి చెందిన బాలికకు మూడో విడత కౌన్సెలింగ్‌లో బైపీసీ సీటు వచ్చింది. వారం క్రితమే కళాశాలలో చేరింది. స్వగ్రామానికి కళాశాల దూరం కావడం, ఇక్కడ చదువుకునేందుకు అమ్మాయికి ఇష్టం లేదు. దీంతో ఆదివారం తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి కుమార్తెకు నచ్చజెప్పి సాయంత్రం వెళ్లిపోయారు. ఇంతలో విద్యార్థినీ కళాశాల స్నానాల గదిలో చున్నీతో ఉరేసుకుంది. తోటి విద్యార్థినులు గమనించి కళాశాల అధ్యాపకులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి గ్రామీణ ఎస్సై శ్రీనివాసులు చేరుకొని పరిశీలించారు. విద్యార్థిని మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే బి.వి.జయనాగేశ్వరరెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

తవణంపల్లె, న్యూస్‌టుడే: తిరుపతి-బెంగళూరు హైవేలో మండలంలోని కె.పట్నం వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. కుప్పం మండలం తన్నమ్మకొట్టం గ్రామానికి చెందిన దిలీప్(21) బొలెరో వాహనంలో తిరుపతి నుంచి కుప్పం వెళ్తున్నాడు. కె. పట్నం సమీపాన ముందు వెళ్తున్న మామిడి కాయల లోడు లారీని వెనకనుంచి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడని, కేసు నమోదు చేశామని ఎస్సై చిరంజీవి తెలిపారు.

EENADU Classifieds

FINANCIAL SERVICES

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్సియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

అతి తక్కువ ధరల్లో, 42 సులభ వాయిదా పద్ధతిలో, తుడా/డిటిసిపి అమోదించబడిన స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు : ✆ 91145 61456.

నేషనల్ హైవేకి ఆనుకొని తిరుపతి IIT దగ్గర ఫైనల్ అప్రూవ్ కలిగిన ప్లాట్లు అతి తక్కువ ధరకే ✆ 95027 74175/ 79959 92114.

LEASE/ RENT

GENERAL

SCIENTIFIC Ware Houses with FCI Specification of 13,500 sq.ft East 2 Ware Houses Totaling 27,000 sq.ft are Readily Available for Occupation for Rent at Adjacent National Highway near to the International Airport at Renigunta. PCR Warehousing Ltd., D.No: 3-147, Guravaraju Palli, Tirupati - Srikalahasti Road, Renigunta - 517520 Dist. Chittoor, Andhra Pradesh. ✆ 98490 46567 / 98499 82900, Email: pcrayulu@gmail.com & pcrwhltd@gmail.com, web: www.pcrwarehousingltd.com.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

JOBS

GKEY IT SOLUTIONS Pvt. Ltd. Wanted Exp. Tele callers (2) for Software Training & Placements, Qual: Any Degree. # 401, Vignesh Towers, Leelamahal Circle, Tirupati. ✆ 99638 30776 / 95335 34534.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి వారికి లబ్ది చేకూర్చడానికి చిత్తూరు జిల్లా నందు పనిచేయుటకు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. శాలరీ + ఇన్సెంటివ్. ✆ 77298 93359.

PRIMARY MATHS, UP SCHOOL English, Male Warden Aayaas, Cleaner. MATRUSRI E.M. SCHOOL, Railway Colony, Tirupati. ✆ 73822 88751.

WANTED GRADUATE Trained Teachers for primary Mathematics and EVS, Computer & PET Faculty also Sudhaha Little Citizen's High School, R.C. Road, Tirupati. ✆ 93925 13633.

ప్రముఖ లిమిటెడ్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు జిల్లాలోని అన్ని మండలాల నుండి ప్రాంతాల వారీగా M/F అభ్యర్థులు కావలెను. అనుభవమును బట్టి 25 వేల జీతం+మంత్లీ ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. 73968 87685.

FREE JOBS: తిరుపతిలోని మా సంస్థ కొరకు, కంప్యూటర్ ఆపరేటర్లు, HR Recruiters, Counsellors, Tele Callers, BDMలు కావలెను. జీ: 15-35 వేలు. # ✆ 99906 78818.

MARKETING/ SALES

WANTED
MEDICAL REPRESENTATIVES for TIRUPATI Hq.
for a leading multinational company.
EuroMedicare INTERNATIONAL
Fresh Graduates with Good English Comunication skills may send resume to
hreuromedicare@gmail.com
or call 9848024034

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

తిరుపతి
• తిరుపతి • చంద్రగిరి

పోటెత్తిన భక్తులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: అగ్నిగుండ మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఆలయ ఆవరణ భక్తజనసంద్రంగా మారింది. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం విశేష రీతిలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఆలయ ఆవరణ భక్తులతో కిక్కిరిసి పోయింది. స్థానికులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు వచ్చారు. ఆలయంలో కొలువుదీరిన శ్రీ ద్రౌపది సమేత పంచ పాండవులు, శ్రీకృష్ణుడి ధ్వజ మూర్తులకు విశేష అభిషేకాలు జరిపారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నివేదనలు సమర్పించారు. అగ్నిగుండ మహోత్సవం సందర్భంగా ఎన్నడు లేనివిధంగా భక్తులు రావడంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.

ఉద్యోగాలకు ఎంపిక

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూ స్టూడెంట్స్ వెల్ఫేర్, కెరియర్ అప్‌గైడెన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఎంఆర్‌ఎఫ్ సంస్థ ఉద్యోగ మేళాలో 24 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. కార్యక్రమాన్ని ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, డైరెక్టర్ ఆచార్య మురళీధర్, డాక్టర్ పత్తిపాటి వివేక్ ప్రారంభించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి: 80085 74561
పాకాల : 80085 74563

చంద్రగిరి, న్యూస్‌టుడే: సమస్య: దోర్నకంబాల, గంగుడుపల్లి పంచాయతీల నుంచి కంకర, గ్రావెల్ మట్టి తరలించే భారీ టిప్పర్ల కారణంగా ఆ మార్గంలో రోడ్డు ఛిద్రమైంది. రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. -సుబ్రహ్మణ్యం

సమాధానం: గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లు బాగు చేయడానికి టెండర్లు ఆహ్వానించాం. త్వరలో బాగు చేయిస్తాం. -అజిత్‌కుమార్‌రెడ్డి, ఏఈ, ర.భ.శాఖ

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: సమస్య: కుప్పంబాదూరు వినాయక స్వామి గుడి వీధిలో చేతి బోరు వద్ద నీరు నిల్వ చేరి కుంటను తలపిస్తోంది. -స్థానికులు

సమాధానం: సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటాం. -ఇందిరమ్మ, ఎంపీడీవో

జ్యేష్ఠాభిషేకం ప్రారంభం

ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తిరుపతిలోని శ్రీగోవిందరాజ స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరుగనున్న జ్యేష్ఠాభిషేకం ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఆషాఢ మాసంలో తిరుపతిలోని శ్రీగోవిందరాజ స్వామివారికి జ్యేష్ఠాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. కల్యాణమండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి తిరుచ్చిపై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి

అలిపిరి శ్రీవారి పాదాల మండపం వద్ద భక్తుల రద్దీ

తిరుపతి(తితిదే): తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుమలగిరిలో స్థానిక ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. అలిపిరి కాలినడక మార్గం శ్రీవారి పాదాల మండపం వద్ద భక్తులు బారులుతీరి కన్నించారు. ఆలయం ప్రాంగణంలో తెల్లవారుజాము నుంచే భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: శ్రీకపిలేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 9వ తేదీ వరకు జరుగనున్న పవిత్రోత్సవాలకు ఆదివారం సాయంత్రం అంకురార్పణ చేపట్టారు.

అలరించిన జానపద నృత్య ప్రదర్శన

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన జానపద నృత్య ప్రదర్శన అలరించింది. ఆదివారం చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లెకు చెందిన కళాతరంగిణి బృందం కళాకారుల నృత్య ప్రదర్శన జరిగింది. పలు జానపద పాటలకు కళాకారులు చేసిన నృత్యాలు సందర్శకులను కనువిందు చేశాయి.

వీధి దీపాలపై తేల్చని తితిదే

విద్యుత్తు శాఖకు బకాయిలు

మంగళం-కరకంబాడి మార్గంలో సెంట్రల్ లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలు

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: తిరుపతి-కరకంబాడి మార్గంలో నిత్యం వీవీఐపీలు ప్రయాణిస్తుంటారు. రేణిగుంట వైపు నుంచి తిరుమలకు నిత్యం వేలాది మంది భక్తులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తూ ఉంటారు. భద్రతా కారణాల రీత్యా ఈ మార్గంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులను తితిదే చేపట్టింది. అయితే ఏడాది గడిచిపోతున్నా పనులు కొలిక్కి రావడం లేదు. విద్యుత్తు స్తంభాలు, దీపాల ఏర్పాటు పనులు పూర్తయి మూడు నెలలు కావస్తున్నా ఇప్పటికీ వెలుగులు పంచలేదు.

ఇదీ సంగతి.. తిరుపతి-కరకంబాడి మార్గాన్ని విద్యుదీకరణ చేసే పనులు కొన్నేళ్లుగా జరుగుతున్నాయి. శ్రీకృష్ణదేవరాయ కూడలి నుంచి కరకంబాడి వరకు సెంటర్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసేందుకు గతంలోనే పనులు ప్రారంభించారు. అయితే నగరపాలక సంస్థ పరిధిలోని భూపాల్‌హౌసింగ్(మంగళం సమీపం) కాలనీ వరకు 2017లోనే విద్యుత్తు దీపాల ఏర్పాటు పనులు పూర్తి చేశారు. భూపాల్‌హౌసింగ్ కాలనీ నుంచి మంగళం మీదుగా కరకంబాడి వరకు 6 కిలోమీటర్ల దూరం చేపట్టాల్సిన పనులను పక్కన పెట్టారు. 2023 చివరలో తితిదే ఆధ్వర్యంలో విద్యుత్తు స్తంభాల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. స్తంభాలు, దీపాల అమరిక పనులను పూర్తి చేసి, 2024 ఆగస్టులో స్తంభాలకు విద్యుత్తు కేబుళ్లు, మీటర్ల ఏర్పాటు పనులు ప్రారంభించారు. విద్యుత్తు కేబుళ్ల అమరిక పనులు పూర్తిచేసి, మంగళంలో నిర్వహించిన టెంపుల్ కనెక్ట్ కార్యక్రమం సందర్భంగా విద్యుత్తు దీపాల ట్రయల్ నిర్వహించారు. పూర్తిస్థాయిలో వీధి దీపాలు ఏర్పాటు పనులు పూర్తిచేశారు. అయితే ఇప్పటి వరకు ఉపయోగంలోకి తీసుకురాలేదు. దీంతో వీధి దీపాలున్నా ఈ మార్గం మాత్రం చీకటితో నిండిపోయింది. ఈ కారణంగానే వెంకటాపురం గ్రామం వద్ద రాత్రి సమయంలో ఓ వాహనం విద్యుత్తు స్తంభాన్ని ఢీకొంది. స్తంభం ఒరిగిపోయింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి.

లేఖ రాసినా స్పందన లేదు.. తితిదే చేపట్టిన వీధి దీపాల ఏర్పాటు పనులకు ఏపీఎస్పీడీసీఎల్ పూర్తిస్థాయిలో సహకరించింది. తితిదే ఏపీఎస్పీడీసీఎల్‌కు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.60,800, సర్వీస్ లైన్ ఛార్జీల కింద రూ.11,70,658, డెవలప్‌మెంట్ ఛార్జీల కింద రూ.82 వేలు చెల్లించాల్సి ఉంది. అయితే తితిదే ఆ ఛార్జీలు చెల్లించకుండా ఎటూ తేల్చకుండా ఉండిపోయింది. బకాయిల చెల్లింపుపై ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఏప్రిల్‌లో తితిదేకు లేఖ రాసినా స్పందన కరవైంది.

తమిళనాడు గవర్నర్‌ను కలిసిన తితిదే ఛైర్మన్

గవర్నర్ ఆర్‌ఎన్ రవితో మాట్లాడుతున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, న్యూస్‌టుడే: తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవిని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదివారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసిన గవర్నర్‌ను శ్రీపద్మావతి అతిథిగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శాలువతో సత్కరించారు. తితిదే పాలకమండలి మాజీ సభ్యుడు శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రూ.లక్షలు వృథా

నిరుపయోగంగా రైతు సేవా కేంద్రం

పాకాల, న్యూస్‌టుడే: ప్రభుత్వం వద్ద నిధులు ఉన్నాయని తెలిస్తే చాలు.. అవసరం ఉన్నా లేకున్నా హడావుడిగా ఏవేవో పనులు చేపట్టి ఆ నిధులు కాజేసేందుకు రాబందుల్లా వాలిపోయే నేతలు ఎందరో. మండలంలోని ఇరంగారిపల్లి పంచాయతీ పరిధిలో పాకాల-నేంద్రగుంట రహదారి పక్కన సుమారు రూ.53 లక్షల అంచనాతో పనులు ప్రారంభించి కొంతమేర నిధులు డ్రా చేసుకున్నాక సగంలోనే వదిలిపెట్టిన నిర్మాణాలే ఇందుకు ఉదాహరణలు. గత వైకాపా సర్కారు కాలంలో ఇక్కడ రైతు సేవా కేంద్రం భవనాన్ని నిర్మించారు. ఎన్నికలకు ముందు హడావుడిగా కొబ్బరికాయ కొట్టేశారు. నిధులు డ్రా చేసుకున్నారు. ఇక అంతే. కొంతభాగం పనులు మిగిలి ఉండటంతో వృథాగా తాళం వేసి వదిలిపెట్టారు. పక్కనే కనిపిస్తున్న గ్రామ సచివాలయ భవనానికి కనీసం పూత పనులు కూడా లేకపోవడంతో పాచి పట్టిన ఇటుకల నిర్మాణం రహదారిపై వెళ్లేవారిని వెక్కిరిస్తున్నట్లు కనిపిస్తోంది. ఆ పక్కనే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఏర్పాటైంది. ఇప్పటి వరకు చెత్త నిర్వహణకు మాత్రం నోచుకోలేదు. నిర్మాణాలన్నీ పూర్తయితే అన్ని వసతులు సమకూరుతాయని భావించిన గ్రామ సచివాలయ సిబ్బందికి మాత్రం ఇప్పటికీ అవస్థలు తప్పడం లేదు. అర్ధాంతరంగా పనులు వదిలిపెట్టడంతో గతంలో ఉన్న ఇరుకు భవనంలోనే విధులు నిర్వహిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.

ప్రభుత్వ పథకాల అమలుపై ప్రచారం

తుమ్మలగుంటలో కరపత్రాల పంపిణీలో తెదేపా నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, సిద్ధారెడ్డి తదితరులు

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ ఏడాది సుపరిపాలనలో భాగంగా తుమ్మలగుంటలో తొలి అడుగు కార్యక్రమం గ్రామ కమిటీ అధ్యక్షుడు భరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై, ఎమ్మెల్యే పులివర్తినాని నియోజకవర్గంలో చేపట్టిన పనులపై ప్రజలకు కరపత్రాలు పంచి వివరించారు. నాయకులు సిద్ధారెడ్డి, తులసీరామిరెడ్డి, హనుమంతురెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ● **భాకరాపేట, న్యూస్‌టుడే:** తెదేపా మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి ఆధ్వర్యంలో ఎగవూరు పంచాయతీలో నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. ● **యర్రావారి పాలెం, న్యూస్‌టుడే:** కోటకాడపల్లి పంచాయతీలో కూటమి నాయకులు ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. వీఆర్, ఎస్టీ కాలనీల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదని గ్రామస్థులు తెలపగా. . సత్వరం స్పందించిన తెదేపా యువత వీధి దీపాలను ఏర్పాటు చేశారు.

9న జరిగే సార్వత్రిక సమ్మెకు మద్దతు

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మికుల ప్రయోజనాల వ్యతిరేక విధానాలకు నిరసనగా జులై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెకు తితిదే నుంచి ఎస్‌డబ్ల్యూయూఎఫ్ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు గోల్కొండ వెంకటేశం పేర్కొన్నారు. ఆదివారం దేవస్థానంలోని పలు ఉద్యోగ కార్మిక సంఘాల నేతలతో సమావేశమయ్యారు. నేతలు గుణశేఖర్, పట్నం దయాకర్, పద్మనాభం, వేణుగోపాల్, రవికుమార్, ఆదిలక్ష్మి, ముని కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హర్ష టయోటా షోరూం ప్రారంభం

ప్రారంభిస్తున్న ఆర్టీవో మురళీమోహన్, సీఐ రామ్‌కిషోర్ తదితరులు

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: తిరుపతి కరకంబాడి రోడ్డులో హర్ష టయోటా నూతన షోరూం ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆర్టీవో మురళీమోహన్, అలిపిరి సీఐ రామ్‌కిషోర్, పృథ్వీ షోరూం అధినేత పృథ్వీ రెడ్డి చేతుల మీదగా ప్రారంభించారు. ఇప్పటికే హర్ష టయోటా అనేక మంది కస్టమర్లకు సేవలందిస్తూ విశ్వాసాన్ని పొందిందని షోరూం మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెంకట్రామాపురంలో గల సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిరంజన్ బాబు ఆధ్వర్యంలో విద్యార్థులు, గ్రామస్థులు ఆదివారం గ్రామంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.

కుండీల్లో మొక్కలేవీ?

తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం మెయిన్‌గేటు నుంచి ఎస్వీ వెటర్నరీ విశ్వవిద్యాలయంకు వెళ్లే మార్గంలో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన కుండీల్లో మొక్కలు కన్పించడం లేదు. అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు పర్యవేక్షించి కుండీల్లో మొక్కలు నాటించి.. సంరక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వాకర్స్ కోరుతున్నారు. **-ఈనాడు, తిరుపతి**

పొంచి ఉన్న ప్రమాదం

పాతశానంబట్ల గ్రామంలో రోడ్డు పక్కన 40 ఏళ్ల క్రితం మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ట్యాంకుపై మర్రిచెట్టు ఏపుగా పెరుగుతోందతి. ట్యాంకు లోపల మర్రిచెట్టు వేర్లు విస్తరించి ఉండటంతో ట్యాంకు అడుగు భాగాన పెచ్చులు ఊడిపోతున్నాయి. రానున్న వర్షాకాలంలో పెనుగాలులు వీచే ప్రమాదం ఉంది. గాలివానకు ట్యాంకు కూలిపోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు ట్యాంకును పడగొట్టాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, చంద్రగిరి**

రక్షణకా.. ప్రమాదాలకా?

భాకరాపేట కనుమ రహదారిలో ఎస్ మలుపు పైభాగాన లోయ ఉంది. ఇక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతూ ఉండడంతో అధికారులు ప్రమాదాల నివారణకు రక్షణ గోడతో పాటుగా రైలింగ్‌ను ఏర్పాటు చేశారు. కొద్ది నెలల క్రితం కొన్ని ప్రమాదాలు జరిగి ఆ రైలింగ్ రోడ్డుపైకి వచ్చి చేరింది. అక్కడి నుంచి సంబంధిత అధికారులు తొలగించకపోవడంతో చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పెద్ద ప్రమాదాలు సంభవించక ముందే దానిని అక్కడి నుంచి తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, చంద్రగిరి గ్రామీణ

విద్యతోనే ఉజ్వల భవిత

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు పొందవచ్చని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. ఇటీవల జరిగిన పది పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన 27 మంది జర్నలిస్టు పిల్లలకు ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలతో పాటు, నగదుతో కూడిన అవార్డులను ఆయన అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మురళి, బాలచంద్ర మాట్లాడుతూ నగదు అవార్డులు ఇచ్చేందుకు ముందుకొచ్చిన డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంకి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి

ఏకలవ్యుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: స్థానిక పద్మావతిపురంలోని ఏకలవ్య కాలనీలో ఆదివారం ఏకలవ్యుడు జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఆయన చిత్రపటానికి కాలనీవాసులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాలనీలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు వెంకట్రామయ్య, కృష్ణయ్య, శివశంకర్, గుండాల గోపినాథ్, సుబ్బరామయ్య, పాండురంగయ్య, మల్లికార్జున్, సూర్యప్రకాష్, ఓలుగంగన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో తాత్కాలిక వంతెనలు

▸ తనపల్లికి వెళ్లే మార్గంలో.. ▸ సిమెంటు పైపుల వద్ద ఇసుక బస్తాల దుస్థితి

ఈనాడు, తిరుపతి: 2021 నవంబర్, డిసెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు స్వర్ణముఖినది ఉద్ధృతంగా ప్రవహించడంతో కల్వర్టులు, బ్రిడ్జిలు కొట్టుకుపోయాయి. గత ప్రభుత్వం శాశ్వత నిర్మాణాలు చేపట్టకుండా సిమెంటు పైపులు, ఇసుక, మట్టి బస్తాలతో తాత్కాలిక వంతెనలు ఏర్పాటు చేసింది. సిమెంటు పైపుల వద్ద ఇసుక బస్తాలు చిరిగిపోయి ప్రమాదకరంగా కన్పిస్తున్నాయి. ఈ పరిస్థితి తనపల్లి, రాచంద్రాపురానికి వెళ్లే మార్గంలో ఉంది. వ్యర్థాలు ఇష్టానుసారంగా వేస్తుండటంతో సిమెంటు పైపులు పూడిపోతున్నాయి. వర్షాకాల నేపథ్యంలో భారీ వర్షాలు కురిసి తాత్కాలిక వంతెనలు కొట్టుకుపోకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించి తగు రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి

బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీఎండీ సంతోషరావు

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: నగరంలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం ఆవరణలో ఆదివారం మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీఎండీ సంతోషరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిస్కం డైరెక్టర్లు గురవయ్య, అయూబ్‌ఖాన్, జీఎంలు వెంకటరాజు, జీవీఎస్ఆర్ మూర్తి, మధుసూదన్, పీఎం జైకేష్‌యాదవ్, అంజనప్ప తదితరులు పాల్గొన్నారు. ● **చంద్రగిరి, న్యూస్‌టుడే:** తెదేపా కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కూటమి నాయకులు, దళితసంఘాల నాయకులు నివాళి అర్పించారు. మాజీ సర్పంచి బాలసుబ్రహ్మణ్యం, దళితసంఘాల నాయకులు శంకర్, మండీరావు, హరి, తదితరులు పాల్గొన్నారు.

గోడప్రతుల ఆవిష్కరణ

తిరుపతి(మంగళం): ముఖ్యమంత్రి చంద్రబాబు మేనిఫెస్టోని గుర్తుకు చేస్తూ ప్రత్యేకంగా రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను కలిగి ఉన్న గోడప్రతులను తిరుపతి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆదివారం తన నివాసంలో ఆవిష్కరించారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం .. రేణిగుంట: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక టిప్పర్‌ను పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం విమానాశ్రయం మార్గం కూడలి వద్ద టిప్పర్‌లో ఇసుక తరలిస్తుండటంతో సమాచారం వచ్చింది. దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు.

బహిరంగ ప్రకటన
ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి నా కక్షిదారురాలు **శ్రీమతి ఆర్.క్రిష్ణవేణి భర్త లేట్ రంగప్ప గారి వెంకటమునిరెడ్డి ఆకుతోట వీధి, తిరుపతి టౌన్ - ప్రస్తుత నివాసం విల్లా నెం.3, పి.పి.ఆర్. గోల్డన్ ప్లమ్స్, వేదాంతపురం, తిరుపతి-517501** వారి తరఫు తెలియజేయడం ఏమనగా!
నా కక్షిదారురాల గారి ఏకైక కుమారుడు ఆర్. జ్యోతిప్రకాష్ గారి వివాహ సందర్భంలో మా క్లయింట్స్ యొక్క కొన్ని విలువైన డాక్యుమెంట్స్, సంతకం చేయబడిన ఖాళీ చెక్కులు, సంతకం చేయబడిన ప్రామిసరి నోట్లు, సంతకం చేయబడిన ఖాళీ పత్రములు, మా కక్షిదారురాలు గారి పూర్వీకుల ఆస్తి వగైరాలకు సంబంధించిన మూల పత్రములు ఎంత వెతికిననూ కనబడలేదు. సదరు పత్రములు దొరికినవారు తెచ్చి ఇచ్చినచో తగిన పారి తోషికం ఇవ్వబడును.
ఏవరైన దురుద్దేశ్యపూర్వకముగా తస్కరించి తప్పుడు పత్రములు సృష్టించి, సదరు పత్రములతో పై వ్యవహారాలు జరిపిన యెడల చట్టరీత్యా ఎంత మాత్రము చెల్లనేరవు అట్లు ప్రయత్నించిన వారిపై నా కక్షిదారురాలు తీసుకొను సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగు దురని హెచ్చరించడమైనది.
వై.బి.ఎస్. బాపూజి
అడ్వకేట్, డి.నెం.5-256-3,
ఉల్లిపట్టెడ, ఎం.ఆర్.పల్లి, తిరుపతి
సెల్: 9849219399

సమస్యల నడుమ ఎస్వీనగర్ వాసులు

పట్టించుకోని నగరపాలిక అధికారులు

కంకర తేలిన రోడ్డు

తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే: ముత్యాలరెడ్డిపల్లిలోని ఎస్వీనగర్ వాసులు సమస్యల నడుమ జీవనం సాగిస్తున్నారు. వైకాపా ప్రభుత్వం అభివృద్ధి పేరుతో అరకొరగా పనులు చేసి చేతులు దులుపుకొంది. ఫలితంగా ప్రజలు కంకరతేలిన రోడ్లు, శిథిలమైన మురుగు కాలువలతో ఇబ్బంది పడుతున్నారు. తమకు అనుకూలురున్న చోట సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు చక్కగా మరమ్మతు చేసుకున్నారు. ఐదేళ్లు అసంపూర్తి పనుల గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ముత్యాలరెడ్డిపల్లి పడరమర చర్చికి సమీపంలో ఎస్వీనగర్ ఉంది. ఇక్కడ సుమారు రెండు వేల ఇళ్లు వరకు ఉన్నాయి. కొన్ని చోట్ల సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేశారు. మరికొన్ని వీధులకు యూడీఎస్ ఏర్పాటులో భాగంగా భూగర్భంలో పైపులు ఏర్పాటుచేసి అతుకులు కూడా వేయకుండా అలాగే వదిలేశారు. పది అడుగుల వెడల్పు ఉన్న రోడ్డులో మధ్యలో తవ్వేసి పైపులు వేశారు. చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్డంతా బురదమయంగా మారుతోంది. ద్విచక్రవాహన చోదకులు గుంతల వల్ల రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిపడుతున్నారు. ఇక ఆటోల సంగతి సరేసరి.

దుస్థితిలో మురుగు కాలువలు

పంచాయతీగా ఉన్నప్పుడు నిర్మించిన మురుగు కాలువలు శిథిలావస్థకు చేరాయి. ఏళ్లు గడుస్తున్నా వాటి మరమ్మతు మరిచారు. సాయంత్రం అయితే దోమలతో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. చిన్న మురుగు కాలువలు కావడంతో మురుగు సక్రమంగా పారకుండా ఉంది. ముందుగా మురుగు కాలువలు మరమ్మతుచేసి, తర్వాత యూడీఎస్ పైపులు వేసి, ఆ తర్వాత సిమెంట్ రోడ్డు నిర్మిస్తే వీధులు చక్కగా ఉండేవి. వైకాపా నాయకులు తమకు ఇష్టం వచ్చినట్టు పనులు చేసి వదిలేశారు. ఈ పనులు గురించి నగరపాలిక అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధాన రహదారుల మీద చూపించే శ్రద్ధ లోపల ఉన్న చిన్నవీధులపై చూపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఆకర్షనగరం అని చెప్పుకొంటున్నా, క్షేత్రస్థాయిలో సమస్యలు మాత్రం మారుమూల పంచాయతీని తలపిస్తున్నాయి. నగరపాలిక అధికారులు స్పందించి, యూడీఎస్ పైపులు వేసిన చోట రోడ్డుకు అతుకులు వేసి, సిమెంట్ రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థుల ఘనత

లండన్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధుల సమక్షంలో పాల్గొన్న విద్యార్థులు

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: తిరుపతిలోని స్థానిక యూత్ హాస్టల్ ప్రాంగణంలో 'రాపిడ్ అబాకస్, వేదిక్ మ్యాథమెటిక్స్' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. 250 మంది చిన్నారులు పాల్గొని, అబాకస్, వేదిక్ గణితంపై మౌలిక పరీక్షలను ఏకధాటిగా 30 నిమిషాల పాటు సామూహికంగా నిర్వహించారు. ఈ విశిష్ట కార్యక్రమాన్ని లండన్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు బింగి నరేంద్ర గౌడ్, అరుణ్ కుమార్, రవి కుమార్ పరిశీలించారు. వారు చిన్నారుల ప్రతిభను స్వయంగా పరీక్షించి, గణిత అంశాల్లో ఉన్నత నైపుణ్యాలను గుర్తించారు. ఆర్కే అబాకస్ సంస్థ ఛైర్మన్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. లండన్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తమ సంస్థకు స్థానం లభించడం గర్వకారణమన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ఐఐటీ తిరుపతి ప్రొఫెసర్, డీన్ రామకృష్ణ సాయి గోత్రి, ఆర్కే అబాకస్ డైరెక్టర్ విమల హాజరయ్యారు.

భాకరాపేట కనుమ లోయలో మృతదేహం

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: భాకరాపేట కనుమ రహదారి ఎస్ మలుపు పైభాగాన లోయలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. చంద్రగిరి పోలీసుల వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం కనుమ రహదారిలో సుమారు 35 సంవత్సరాల వయసు గల వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు.

రైల్వేగేట్ వద్ద కత్తితో యువకుడి వీరంగం

చంద్రగిరి: నరశింగాపురం రైల్వేగేట్ వద్ద ఆదివారం సాయంత్రం ఓ యువకుడు కత్తితో వీరంగం సృష్టించి అడ్డుగా వచ్చిన ఓ వ్యక్తిని గాయపరిచాడు. తమిళనాడుకు చెందిన శివ మద్యం మత్తులో మచ్చుకత్తిని చేతపట్టుకుని రైల్వేగేట్ వద్ద వీరంగం సృష్టించాడు. అటుగా వెళ్లే వారిపై దురుసుగా ప్రవర్తిస్తూ అడ్డొచ్చిన వారిపై దౌర్జన్యం చేశాడు. ఈ క్రమంలో శివ అన్నయ్య భాగ్యరాజ్ సర్ది చెప్పే ప్రయత్నం చేయడంతో మత్తులో ఉన్న శివ కత్తితో దాడి చేశాడు. భాగ్యరాజ్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

10వ వర్ధంతి
మంచితనానికి, మానవత్వానికి మారుపేరుగా నిలిచి, మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసిన మా నాన్నగారైన
కీ॥శే॥ సంద్ర రామక్రిష్ణమనాయుడు గారు
మా నుండి దూరమై నేటికి 10 సం॥ కాలం గడిచిననూ మీ జ్ఞాపకాలు మా మదిలో సదా పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...
కీ॥శే॥ సంద్ర రామక్రిష్ణమనాయుడు గారు
వాసు పౌల్ట్రీఫామ్, రాచగున్నేరి, వేడం.
జననం: 22-6-1945. మరణం: 7-7-2015.
భార్య: లీలావతి
కుమారులు: ఎస్.హేమంత్‌కుమార్, ఎస్.వాసు
కోడళ్ళు: ఎస్.వనిత, ఎస్.సుష్మ
మనుమలు: ఎస్.జశ్వంత్, ఎస్.విలోక్ ఆదర్ష్, ఎస్.దివ్వేష్, ఎస్.మేదాన్ష్

(c) eenadu

శ్రీకాళహస్తి
•శ్రీకాళహస్తి • సత్యవేడు

సమస్యలకు సత్వర పరిష్కారం

వినతి పత్రాలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తిగ్రామీణ(ఏర్పేడు),న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి మండలంలోని జగ్గరాజుపల్లిలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సేవ్యస్థలో సోమశిల-స్వర్ణముఖి కాలువ ఏర్పాటు, అపాచీ పరిశ్రమకు భూములు కేటాయించి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పరిహారం అందలేదని.. జీవనాధారం కష్టంగా ఉందని స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. తాగునీరు, పక్కాగృహాలు, ఇంటిస్థలాలు, అంగన్‌వాడీ భవనం వంటి సమస్యల గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. త్వరితగతిన సమస్యలను పరిష్కరించి ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం జాతీయస్థాయి అవార్డు అందుకున్న అంగన్‌వాడీ కార్యకర్త బుజ్జమ్మను అభినందించారు. గర్భిణీలకు సీమంతాలు నిర్వహించి చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, చెంచయ్యనాయుడు, రవీంద్రనాథ్‌రెడ్డి, కామేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితో భేటీ.. శ్రీకాళహస్తి: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి భేటీ అయ్యారు. తిరుపతి పర్యటనకు వచ్చిన మంత్రిని కలిశారు. అభివృద్ధి అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు నేతలు తెలిపారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: కార్మికుల హక్కుల సాధన కోసం ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి బుర్రా కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి: సార్వత్రిక సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు సహకారం అందించాలంటూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య కోరారు. పట్టణంలోని స్థానిక కార్యాలయం నుంచి ఆదివారం పట్టణ వీధుల్లో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.

వైద్యశిబిరం ఏర్పాటు

శ్రీకాళహస్తి: శ్రీద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి వార్షిక ఉత్సవాల్లో భక్తులకు సేవలందించేందుకు స్థానికంగా ఉన్న ఎస్‌.వి.ఐ. దంత వైద్యశాల ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎంజీఎం ఆస్పత్రి తరఫున ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని డిప్యూటీ ఈవో ఎన్‌.ఆర్‌.కృష్ణారెడ్డి, ఏఈవో హేమమాలిని తదితరులు ప్రారంభించారు.

మూతపడిన పాఠశాలలు

• తల్లడిల్లుతున్న పసి హృదయాలు

కేవీబీపురంలో ఈవోపీఆర్‌డీకి వినతిపత్రం అందజేస్తున్న గురుకులకండ్రిగ బాధితులు

కేవీబీపురం, నారాయణవనం, న్యూస్‌టుడే: పల్లెల్లో విద్యాభ్యాసం పొందేందుకు పసి హృదయాలు తల్లడిల్లుతున్నాయి. విద్యాశాఖ అధికారుల తప్పిదాలకు అవగాహన తెలియని చిన్నారులు విద్యకోసం ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వస్తోంది. విద్యాశాఖలో కలిసి నాయకుల స్వార్థానికి పోయి ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఉన్న పాఠశాలలను మూసివేసే దుస్థితి నెలకొంది.

స్థానికులను సంప్రదించకుండానే

పలు పాఠశాలలను మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులను మోడల్ పాఠశాలల్లో కలపడంలో స్థానిక పాఠశాల చైర్మన్లు, సర్పంచులను సంప్రదించకుండానే విద్యాశాఖ గుడ్డిగా విలీనం చేయడంతో సమస్యకు ఆజ్యం పోసిందన్న విమర్శలు వస్తున్నాయి. పలుచోట్ల రవాణా సౌకర్యం లేకుండా నాలుగు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం నడిచి బేసిక్ పాఠశాలలను చేరుకోవాల్సి ఉంది. చిన్నవయసులో అంత దూరం ఎలా నడిచివెళ్లి విద్యను అభ్యసిస్తారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం లేదని ఆవేదన చెందుతున్నారు.

ఫౌండేషన్ పాఠశాలలోనే కొనసాగించాలి

నియోజకవర్గంలో పలు మండలాల్లో ఫౌండేషన్ పాఠశాలలో బేసిక్ పాఠశాలలను కొనసాగించాలన్న నినాదంతో ఆందోళనలు ప్రారంభమయ్యాయి. ఈతరగా చదువు తీసుకుంటే తమ పిల్లలను బడికి పంపుతామని లేకపోతే ఇంటికే పరిమితం చేస్తామని బాధితులు స్పష్టం చేస్తున్నారు.

నియోజకవర్గంలో పరిస్థితి పరిశీలిస్తే

కేవీబీపురం మండలంలోని గురుకులకండ్రిగ, బంగారమ్మకండ్రిగ, జ్ఞానమ్మకండ్రిగ, పాతపాళెం, ఎస్‌ఎస్‌పురం ఎస్టీ కాలనీల్లో పిల్లలను బడికి పంపక పోవడంతో పాఠశాలలను మూసివేశారు. దీంతో పది రోజులుగా ఉపాధ్యాయులు పాఠశాల వద్ద పడిగాపులు కాస్తూ తిరుగుముఖం పడుతున్నారు.

● నారాయణవనంలోని గోవిందప్పనాయుడుకండ్రిగ ఎస్సీ, తుంబూరు ఎస్సీ, విప్పతాంగేశ్, లక్ష్మీపురం ఎస్టీకాలనీల్లోని పాఠశాల విద్యార్థులను పక్క పాఠశాలలకు తరలించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

గోవిందప్పనాయుడుకండ్రిగ ఎస్సీకాలనీలో పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

● వరదయ్యపాళెం మండలంలోని సుబ్బానాయుడుకండ్రిగ, ఎంజీఆర్‌నగర్, కాంబాకం, గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాగలాపురం, పిచ్చాటూరు మండలాల్లో విలీనమైన పాఠశాలల్లో విలీన సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి

విలీనంతో బాధపడుతున్న పాఠశాలలకు సంబంధించిన సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్యను త్వరితగతిన పరిష్కరించి పాఠశాలలను మూతపడకుండా, విద్యార్థులకు సక్రమంగా విద్యాబోధన చేపట్టేలా తగు చర్యలు తీసుకుంటాం.
- లక్ష్మీపతి, ఎంఈవో, కేవీబీపురం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) శ్రీకాళహస్తి: 80085 74555 నాగలాపురం: 98854 43308

న్యూస్‌టుడే, నారాయణవనం: సమస్య: ఎరికంబట్టులో తాగునీటి పైపు లైన్ లీకేజీ కారణంగా తాగునీరు వృథా అవడంతో పాటు కాలువలోని మురుగు పైపుల్లో చేరి తాగునీరు కలుషితం అవుతోంది. - మహేష్, స్థానికుడు

సమాధానం: పైపు లైనును బాగుచేయించి తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటాం. మురుగు నిల్వలేకుండా పరిశుభ్రత చర్యలు చేపడతాం. - అరుణ, ఎంపీడీవో

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: సమస్య: బీఎన్‌కండ్రిగ పంచాయతీ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ వెంట పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. - శ్రీనివాసులు, స్థానికుడు

సమాధానం: త్వరలో పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాలు శుభ్రం చేస్తాం. - వెంకటయ్య, సర్పంచి

తొలగిన మురుగు

ఏర్పేడు, న్యూస్‌టుడే: మునలిపేడు పంచాయతీలో పేరుకుపోయిన మురుగును ఆదివారం తొలగించారు. ఈనాడులో ఇటీవల 'మేమున్నాం- మీకు తోడుగా' శీర్షికతో సమస్యను వివరిస్తూ కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు మురుగును తొలగించారు.

మొక్కలు..

స్పందనకు వందనం

వరదయ్యపాళెం: సీఎల్‌ఎన్‌పల్లి పంచాయతీ చావలి, మిట్ట ఎస్సీకాలనీ, అరుకనేమ మార్గంలో రహదారికి ఇరువైపులా ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలను తొలగించారు. సమస్యను వివరిస్తూ ఈనాడులో మేమున్నాం.. మీకు తోడుగా శీర్షిక వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన సర్పంచి దుద్దు వేణుగోపాల్ ఆదివారం జేసీబీ సాయంతో తొలగించడంతో సమస్య తొలగింది.

వాలీశ్వరుని సేవలో కంచి కామకోటి పీఠాధిపతి

ఆలయ ప్రదక్షిణ చేస్తున్న పీఠాధిపతి శ్రీసత్య చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి

నాగలాపురం, న్యూస్‌టుడే: రామగిరి వాలీశ్వరాలయాన్ని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీసత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి తన శిష్యబృందంతో కలిసి ఆదివారం సందర్శించారు. ఆయనకు ఆలయం వద్ద ఈవో హేమచంద్రరావు, ప్రధానార్చకులు శంకరరాజ్ గురుకుల్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. పల్లవులకాలంలో నిర్మితమైన ఆలయ విశిష్టత, స్థలపురాణాలను అర్చకులు ఆయనకు విశదీకరించారు. అనంతరం నందీశ్వరంలో పాదాలను శుభ్రం చేసుకుని జలాలను సేవించారు. నంది తీర్థజలాల ప్రత్యేకతను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. ఆలయంలోని కాలభైరవస్వామి, వాలీశ్వరస్వామి, మరగతాంబికాదేవిని దర్శించుకున్నారు. పీఠాధిపతిని ఆలయ మర్యాదలతో సన్మానించి తీర్థప్రసాదాలను ఈవో అందించారు.

అమ్మవారికి అంబలి

సత్యవేడు: మండల కేంద్రంలోని సత్యవేడు శ్రీ సదావాలమ్మ గుడి వీధిలో వెలసిన శ్రీశ్రీశ్రీ బాలగంగమ్మ దేవాలయంలో గురుపౌర్ణమి పురస్కరించుకుని వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. శ్రీ బాలగంగమ్మ, గ్రామదేవత సదావాలమ్మ అమ్మవారికి అంబలి పోసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త రేవతి, పాలకమండలి సభ్యులు మురళి, జయచంద్ర, దాములరెడ్డి, సంతోషిమాత తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ క్లబ్ అధ్యక్షులుగా పార్థసారథి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని రిపబ్లిక్ క్లబ్ అధ్యక్షులుగా న్యాయవాది పసుపులేటి పార్థసారథి నియమితులయ్యారు. స్థానిక రోటరీ భవనంలో ఆదివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, రోటరీ జిల్లా గవర్నర్ హరినాథ్ నేతృత్వంలో ఈయన ప్రమాణ స్వీకారం చేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన ఈయనతో పాటు ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాజీ సభ్యులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నేతలు

ఆశయ సాధనకు కృషి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: జనసంఘ్ పార్టీ సంస్థాగత అధ్యక్షులుగా తన కంటూ ప్రత్యేక గుర్తింపును చాటుకున్న డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా జరిపారు. భాజపా రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ నేతృత్వంలో ఆదివారం స్థానిక కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గోపాల్, సుబ్రహ్మణ్యంరెడ్డి, అమర్నాథ్, ఢిల్లీకుమార్, బత్తిన గోపాల్, వాసుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అడుగు వేయాలంటే అవస్థ

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కేంద్రంగా మారిన ఇందిరానగర్ పంచాయతీలో వీధులు అధ్వానంగా ఉన్నాయి. చినుకు పడితే వీధులు బురదమయంగా మారి అడుగు వేయలేనంతగా రొచ్చుగా మారుతున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు ఈ వీధుల్లో నడుస్తూ కాలుజారి పడిన సందర్భాలు లేకపోలేదు. వీధుల దుస్థితిపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీధులను బాగు చేయాలనికి కోరుతున్నారు.

గంగమ్మ కొలువులో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్

గంగమ్మను వీరజాటి వేసుకుని అమ్మవారిని దర్శించుకుంటున్న నరసింహయాదవ్

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలోని పీవీకండ్రిగలో ఆదివారం నిర్వహించిన గంగమ్మ కొలువులో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా వీర జాటీ వేసుకుని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. యాదవుల ఆరాధ్య దైవం, గంగ పెట్టె వద్ద పూజలు నిర్వహించిన గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేపట్టి గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మునస్వామి యాదవ్, ప్రకాష్ యాదవ్, లోకేష్ చౌదరి, దొరబాబునాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన లోకేశ్

ఎమ్మెల్యే ఆదిమూలాన్ని సత్కరిస్తున్న మంత్రి నారా లోకేశ్

నాగలాపురం, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. నెల్లూరు పర్యటనలో భాగంగా విమానాశ్రయానికి చేరుకున్న లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. మంత్రి లోకేశ్ ఎమ్మెల్యే ఆదిమూలంకు శాలువా కప్పి ఆప్యాయంగా సత్కరించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా జూనోసిస్ దినోత్సవం

సత్యవేడు, న్యూస్‌టుడే: పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల్లో రేబీస్ వ్యాధి ఒకటని, నివారించడానికి కుక్కలకు రేబీస్ వ్యాధి టీకాలు వేస్తున్నట్లు ఇరుగుళం పశువైద్యాధికారి డా.దయాకర్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయ ఆవరణలో పెంపుడు కుక్కలకు ఉచిత రేబీస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది సుందరం, విల్‌బీ రాజ్, కోదండ పాల్గొన్నారు.

రాజమోహన్‌బాబు సేవలు చిరస్మరణీయం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: బాబాయ్‌గా పిలువబడుతూ మండలంలోని ఉపాధ్యాయులకు, మండల, జిల్లా అధికారులకు వారధిగా సేవలు అందించిన ప్రధానోపాధ్యాయుడు రాజమోహన్‌బాబు సేవలు చిరస్మరణీయమని ఎంఈవోలు సరస్వతి, మునిసుబ్రహ్మణ్యం అన్నారు. ప్రధానోపాధ్యాయుడు రాజమోహన్ బాబు పదవీవిరమణ సందర్భంగా ఆదివారం స్థానిక ఆర్‌ఆర్ కల్యాణమండపంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, నాయకులు ఆయనను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. మండల తెదేపా అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి పన్నెం నిర్మల్, ప్రధానోపాధ్యాయుడు మొహిద్దీన్, ఉపాధ్యాయులు బందిలకుమార్, తిరుపతినాయుడు, శశి, ఆనంద్, రుషేంద్ర, వెంకటమోహన్, సురేష్‌భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

'రానున్నది వైకాపా ప్రభుత్వమే'

నాగలాపురం, న్యూస్‌టుడే: అబద్ధాలతో అధికారాన్ని సాధించుకున్న కూటమి ప్రభుత్వానికి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గుణపాఠం చెప్పడానికి ప్రజలు ముందస్తుగానే సిద్ధమయ్యారని వైకాపా జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రైవేటు కల్యాణ మండప ఆవరణలో చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ కార్యక్రమం గోడపత్రికలను ఆదివారం ఆవిష్కరించి నియోజకవర్గ వైకాపా నేతలు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ పేరిట రైతులు, మహిళలు, విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం మోసగించి వైకాపా నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, పార్టీ నాయకులు అపరంజిరాజు, చిన్నదురై, శ్యామన్, బీరేంద్రరాజు, సుశీల్‌కుమార్‌రెడ్డి, చలపతిరాజు, దయాకర్‌రెడ్డి, కృష్ణయ్య, మణినాయుడు, సొరకాయలు, దివాకర్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, బాలాజీరెడ్డి పాల్గొన్నారు.

డా.బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

తొట్టంబేడు, న్యూస్‌టుడే: మాజీ ఉప ప్రధాని డా.బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని శ్రీకాళహస్తి కాంగ్రెసు నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సురేంద్రరెడ్డి, ఆంటోనీ, చందు, పురుషోత్తం పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో శ్రీ కన్యకాపరమేశ్వరిదేవి

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని పాపానాయుడుపేటలో వెలసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, క్షీరం, నారికేళం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి వివిధ కూరగాయలతో అలంకరించారు. ఈ పూజల్లో స్థానికులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దేవతామూర్తిని దర్శించుకున్నారు. ఆలయం తరపున ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అగ్నిగుండ సందర్భంగా గుండ వాటిక వద్దకు గేట్లు తోసుకుని వస్తున్న భక్తులు

వ్యూహం.. నిష్ఫలం

అగ్నిగుండ మహోత్సవం సందర్భంగా పోలీసులు పకడ్బందీ వ్యూహ రచన చేశారు. వాటిక వద్దకు ఇబ్బడిముబ్బడిగా భక్తులు రాకుండా కట్టడి చేశారు. అయితే ద్రౌపదమ్మను తీసుకువచ్చే సమయంలో ఒక్కసారిగా భక్తులు అడ్డగోలుగా వచ్చారు. మండపం వద్ద వందల సంఖ్యలో భక్తులు నిలబడిపోవడంతో అతి కష్టం మీద అమ్మవారిని వాటిక వద్దకు తీసుకువచ్చారు. అగ్నిగుండ ప్రవేశం ప్రారంభమయ్యాక భక్తులను కట్టడి చేసేందుకు ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్‌ను దాటి భక్తులు గుండ వాటిక వద్దకు చేరుకునేందుకు ప్రయత్నించడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఎవ్వరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు, ఆలయ భద్రతా సిబ్బంది ఉత్సవాన్ని విజయవంతం చేశారు.
- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

పొంచి ఉన్న ప్రమాదం

మండలంలోని ఆమందూరు బీసీకాలనీలో రోడ్డు పక్కన తక్కువ ఎత్తులో రెండు విద్యుత్తు నియంత్రికలు ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. ఈ రహదారిపై స్థానికులతో పాటు శ్రీ సద్గురు మలయాళస్వామి వ్యాసాశ్రమానికి చెందిన భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. చేతికందే ఎత్తులో తీగలు ఉండటంతో ప్రమాదాన్ని సూచిస్తూ అధికారులు విద్యుత్తు నియంత్రికలు చుట్టూ చిన్నపాటి కాగితపు రిబ్బన్‌ను వలయంగా ఏర్పాటు చేశారు. శాశ్వతంగా సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏర్పేడు

విద్యతోనే రాణించగలం

విద్యార్థికి నగదు అందజేస్తున్న ఎంఈవో జనార్దన్ రాజు

నారాయణవనం: విద్యతోనే కుటుంబం, సమాజం బాగుపడుతుందని ఎంఈవో-2 జనార్దన్ రాజు తెలిపారు. ఆదివారం పాలమంగలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంఘం ఆధ్వర్యంలో ఇటీవల పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు కె.చరిష్మ(రూ.12 వేలు), ఎస్.హరిత(రూ.11వేలు), బి.శరణ్య, యం.ఆశీష్‌కు(రూ.10 వేలు చొప్పున)కు నగదు బహుమతి అందించి వారి తల్లిదండ్రులను సత్కరించారు. పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ డాక్టర్ భాస్కర్ వేడియం, కోకన్వీనర్ మోహన్‌కుమార్, కాళప్ప, నందకుమార్, ఉమాపతి, సుబ్రహ్మణ్యం, నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

సత్యవేడు: జల్సాలకు అలవాటు పడి అప్పు చేసి తిరిగి నగదు చెల్లించలేక ఓ వ్యక్తి పురుగు మందు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం సాయంత్రం జరగగా.. ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. పుత్తూరు మండలం తిరుమలకుప్పానికి చెందిన మునికుమార్(38), ఐదేళ్ల కిందట కువైట్‌లో పనిచేసి, నాలుగేళ్ల క్రితం ఇక్కడి గోళ్లవారికండ్రిగలో సొంతంగా ఇళ్లు నిర్మించుకుని భార్య, బిడ్డలతో జీవనం సాగించేవారు. మద్యానికి బానిసైన మునికుమార్ ఇతర వ్యక్తుల వద్ద నగలు, నగదు అప్పుగా తీసుకుని స్నేహితులకు, బంధువులతో కలిసి మద్యం తాగి జల్సాలు చేసేవారు. పలు మహిళలతో చనువుగా తిరిగేవారు. అప్పు తీసుకున్నవారు తిరిగి ఇవ్వాలని నిలదీయగా మనస్తాపానికి గురై శుక్రవారం సాయంత్రం సత్యవేడు మండలం వీఆర్‌కండ్రిగ చెరువు కట్ట వద్ద పురుగుల మందు తాగి ఇంటికి ఫోన్ చేశారు. దీంతో భార్య, బంధువులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం చెన్నై జీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మునికుమార్‌కు ఇద్దరు భార్యలు, కుమార్తెలు, కుమారులున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రతాప్ తెలిపారు.

బైక్ బోల్తా.. వ్యక్తికి తీవ్ర గాయాలు

తొట్టంబేడు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన రాయిని ఢీకొట్టడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి రేణిగుంట నాయుడుపేట ప్రధాన రహదారిపై తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నాగలాపురం మండలం బైటకొడియంబేడు గ్రామానికి చెందిన సతీష్ చెంబేడు సమీపంలోని పరిశ్రమలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తి వస్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన బండరాయిని ఢీకొట్టాడు. గుర్తించిన స్థానికులు హైవే అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో వారు తీవ్రంగా గాయపడ్డ సతీష్‌ను ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతికి తరలించారని స్థానికులు తెలిపారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం .. రేణిగుంట: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక టిప్పర్‌ను పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారి కథనం మేరకు.. ఆదివారం స్థానిక విమానాశ్రయం మార్గం కూడలి వద్ద ఒక టిప్పర్‌లో ఇసుక తరలిస్తుండటంతో సమాచారం వచ్చింది. దీంతో దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

తొట్టంబేడు : భక్తుల రద్దీలో తప్పిపోయిన బాలుడు పోలీసుల చొరవతో తల్లిదండ్రుల వద్దకు చేరాడు. శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఉత్సవాలకు చిల్లకూరు మండలం రెట్టపల్లికి చెందిన పసుపులేటి స్వామి, కల్పన దంపతులు కుమారుడు కార్తికేయతో కలిసి దర్శనార్థం వచ్చారు. రద్దీలో కార్తికేయ తప్పిపోవడంతో అక్కడ విధులు నిర్వర్తిస్తున్న బీఎన్‌కండ్రిగ సీఐ తిమ్మయ్య బాలుడిని గుర్తించి వివరాలు ఆరా తీసి తల్లితండ్రులకు అప్పగించారు.

ఆగమోక్తంగా పూర్ణాహుతి

భక్తులతో కిక్కిరిసిన ద్రౌపతమ్మ ఆలయం

అగ్నిగుండ వాటిక వద్ద పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: అగ్నిగుండ మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీద్రౌపది సమేత ధర్మరాజులస్వామి ఆలయ ఆవరణ భక్తజనసంద్రంగా మారింది. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం విశేష రీతిలో భక్తులు తరలి వచ్చారు. ఉదయం నుంచి ఆలయ ఆవరణ భక్తులతో కిక్కిరిసిపోయింది. స్థానికులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు వచ్చారు. ఆలయంలో కొలువుదీరిన శ్రీ ద్రౌపది సమేత పంచ పాండవులు, శ్రీకృష్ణుడి ధృవమూర్తులకు విశేష అభిషేకాలు జరిపారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నివేదనలు సమర్పించారు. అగ్నిగుండ మహోత్సవం సందర్భంగా ఎన్నడు లేనివిధంగా భక్తులు రావడంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. అగ్నిగుండ వాటిలో అగ్నిదేవుని ఆవాహిస్తూ వేదపండితులు పూజలు జరిపారు. యాగశాలలోని నిప్పుకణికలను ఊరేగింపుగా తీసుకువచ్చి గుండవాటికలో అగ్నిదేవుని ప్రతిష్ఠించి పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, అధికారులు హేమమాలిని, నాగభూషణం, రవి, లక్ష్మయ్య, దుర్గాప్రసాద్, ఈఈ మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ మలయాళస్వామి ఆరాధనోత్సవం

ఏర్పేడు: శ్రీసద్గురు మలయాళస్వామి 63వ ఆరాధనోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పేడులోని శ్రీవ్యాసాశ్రమంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో స్వామివారికి వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలకరించి దీప, ధూప నైవేద్యాలను సమర్పించారు. ఈ పూజల్లో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, పూర్వవిద్యార్థులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆశ్రమం ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

గురుసేవను మరవద్దు

శ్రీకాళహస్తి: గురుసేవను ఎవరు మర్చిపోకూడదని శ్రీశుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు శ్రీవిద్యా స్వరూపానందగిరి కోరారు. వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీసద్గురు మలయాళ గురుదేవుల ఆరాధనోత్సవం ఆశ్రమం ఆవరణలో ఆదివారం ఘనంగా జరిగింది. తొలుత శివలింగానికి పూజలు, అభిషేకాలు చేసి మలయాళ స్వామి పాలరాతి ప్రతిమకు విశేష పూజలు నిర్వహించారు.

శ్రీకాళహస్తి: శ్రీశుకబ్రహ్మాశ్రమంలో మలయాళస్వామి పూజలు పర్యవేక్షిస్తున్న పీఠాధిపతులు శ్రీవిద్యా స్వరూపానందగిరి

● శ్రీ సద్గురు మలయాళస్వామితోనే ఏర్పేడుకు తగిన గుర్తింపు లభించిందని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆశ్రమ పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పేడులోని ప్రధాన రహదారి పక్కన స్వామివారి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. అవసరమైన స్థలం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపి త్వరలోనే స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు.

ఏర్పేడు: ప్రత్యేక అలంకరణలో శ్రీ మలయాళస్వామి

ఏర్పేడు: పూజల్లో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

10వ వర్ధంతి

మంచితనానికి, మానవత్వానికి మారుపేరుగా నిలిచి, మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసిన మా నాన్నగారైన కీ॥శే॥ సంద్ర రామక్రిష్ణమనాయుడు గారు మా నుండి దూరమై నేటికి 10 సం॥ కాలం గడిచిననూ మీ జ్ఞాపకాలు మా మదిలో సదా పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...
భార్య: లీలావతి
కుమారులు: ఎస్.హేమంత్‌కుమార్, ఎస్.వాసు
కోడళ్ళు: ఎస్.వనిత, ఎస్.సుష్మ
మనుమలు: ఎస్.జశ్వంత్, ఎస్.విలోక్ ఆదర్ష్, ఎస్.దివ్వేష్, ఎస్.మేదాన్ష్
కీ॥శే॥ సంద్ర రామక్రిష్ణమనాయుడు గారు
వాసు పౌల్ట్రీఫామ్, రాచగున్నేరి, వేడం.
జననం: 22-6-1945. మరణం: 7-7-2015.

(c) eenadu

గూడూరు
•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

ముగిసిన క్రికెట్ పోటీలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: మండలంలోని కొణ్ణంబట్టులో మూడు నెలలపాటు నిర్వహించిన వేసవి క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఫైనల్‌లో కొణ్ణంబట్టు జట్టు విజేతగా నిలిచింది. సురేష్ లెవెన్స్ జట్టు రన్నర్స్‌గా నిలిచారు. విజేతలకు సురేష్ బహుమతి, జ్ఞాపిక అందజేశారు. సూర్య, క్రాంతి పాల్గొన్నారు.

జ్ఞాపికతో క్రీడాకారులు, నిర్వాహకులు

గూడూరులో నిమ్మ ధరలు
మొదటి రకం: కేజీ రూ. 21 నుంచి రూ. 25 వరకు
రెండో రకం: కిలో రూ. 15 నుంచి రూ. 20 వరకు

కోళ్ల ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్ (రైతు ధర)	125
లేయర్	112
బ్రాయిలర్స్	228
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	250
లేయర్ మాంసం	190

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

వాకాడు, న్యూస్‌టుడే: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఎంపీడీవో శ్రీనివాసులన్నారు. మండలంలోని పూడిరాయదొరువు, పాములతేరి, వెంకటరెడ్డిపాలెం పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎం.వెంకటరాజు, వై.కిష్టయ్య, యు.హనుమాచార్యులు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం ఆదివారం వాకాడులోని షాదీమంజిల్‌లో నిర్వహించారు. వారిని సత్కరించారు. ఎంఈవోలు కృష్ణయ్య, నశీంఆలీ, పూర్వ ఎంఈవో బాబు, డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

గూడూరు పట్టణం: పట్టణంలోని కటకరాజ వీధిలో వెలసిన శ్రీపాండురంగ విఠలనాథ స్వామి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి రథంపై ఉంచి పురవీధుల్లో భక్తులు పోటాపోటీగా లాగారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోట నుంచి తరలివెళ్లిన తెదేపా నాయకులు

కోట, న్యూస్‌టుడే: మండలంలోని పలు పంచాయతీల నుంచి ఆదివారం రాత్రి మంత్రి నారా లోకేశ్‌కు ఘన స్వాగతం పలికేందుకు స్థానిక తెదేపా మండలాధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యాన ర్యాలీగా వాహనాల్లో పోటుపాళెం సెంటర్‌కు తరలివెళ్లారు.

కలిపేస్తూ.. అక్రమంగా నిర్మిస్తూ

✦ మేనకూరులో పంట కాలువల ఆక్రమణ ✦ కొరవడిన రెవెన్యూ శాఖ పర్యవేక్షణ

నాయుడుపేట, న్యూస్‌టుడే: మండలంలో మేనకూరు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ స్థలాలు, పంట కాలువల ఆక్రమణలకు హద్దే లేకుండా పోయింది. పొలాలకు సాగునీరు సరఫరా చేసే కాలువలు ఆక్రమించి గోడలు నిర్మించడంతో రైతులు సాగుకు విరామం ప్రకటించాల్సి వస్తోంది. ఇంత జరుగుతున్నా.. రెవెన్యూ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.

అస్తవ్యస్తంగా మారి..

మేనకూరు రెవెన్యూ పరిధిలో మాగాణి భూముల్లో రైతులు 1,250 ఎకరాలు వరకు పంటలు సాగు చేసేవారు. పారిశ్రామిక వాడ ఏర్పడిన తర్వాత ఈ ప్రాంతంలో భూములకు డిమాండు పెరగడంతో ఇతర ప్రాంత వ్యాపారులు ఇక్కడ భారీగా భూములు కొనుగోలు చేసి లేఅవుట్లు నిర్మించారు. దీంతో సాగుకు అనుకూలమైన 600 ఎకరాలు లేఅవుట్లుగా మారాయి. చెరువుల నుంచి నీటి సరఫరా చేసే పంట కాలువలను కూడా లేఅవుట్లలో కలిపేశారు. దీంతో పలు చోట్ల కాలువలు ధ్వంసం కావడంతో చెరువు నుంచి సాగు నీరు సాఫీగా వెళ్లే అవకాశం లేకుండా పోయింది. మిగిలిన 650 ఎకరాల్లో పంటలు సాగు చేయాలంటే నీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో రెండేళ్లుగా రైతులు పంటలు సాగు లేక బీడుగా ఉంచేశారు. చెరువు నిండా నీరున్నా కాలువలు ఆక్రమణకు గురై సాగు చేసుకునే అవకాశం లేకుండా ఉందని రైతులు వాపోతున్నారు.

పంటకాలువ వెంబడి నిర్మించిన లేఅవుట్ ప్రహరీ

ఇంకెప్పుడు అరికడతారు?

మేనకూరు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ స్థలాలు, ఎస్టీలకు చెందిన ఇళ్ల స్థలాలను కొందరు భారీగా కబ్జా చేస్తున్నారు. మరో వైపు పంట కాలువలు ధ్వంసం చేస్తున్నా రెవెన్యూ శాఖ అధికారులు నిస్తేజంగా వ్యవహరిస్తున్నారు. అన్ని గ్రామాల్లో రీసర్వే జరిగినప్పటికీ ఇక్కడ కొందరు కబ్జాదారుల అనుకూలమైన వారిని వదిలేశారనే విమర్శలున్నాయి. లేఅవుట్లలో పంట కాలువలు, ప్రభుత్వ స్థలాలు గుర్తించకనే భూమార్పిడికి అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. జిల్లా అధికారులు ఇక్కడ ఆక్రమణలు అరికట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

వెంకటగిరి, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల ముందు భాగంలో చెత్త నిల్వలు పేరుకుపోయాయి. **- వాణి, సంధ్య**

సమాధానం: పరిశీలించి చెత్త నిల్వలు తొలగిస్తాం. **- వెంకట్రామిరెడ్డి, కమిషనర్**

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని పునర్విహ వృత్తి విద్యా జూనియర్ కళాశాల, పద్మావతి ఆసుపత్రి రోడ్డులో రెండు స్తంభాలకు వీధి దీపాలు వెలగడం లేదు. **- సాంబశివరావు, సూళ్లూరు**

సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- కె.చిన్నయ్య, కమిషనర్**

బాలాయపల్లి, న్యూస్‌టుడే: సమస్య: అక్కసముద్రం బస్ షెల్టర్ లోపల చెత్తాచెదారంతో నిండినా తొలగించడం లేదు. **- రామయ్య, అక్కసముద్రం**

సమాధానం: బస్‌షెల్టర్‌లోని వ్యర్థాలను గ్రీన్ అంబాసిడర్‌తో తొలగిస్తాం. పారిశుద్ధ్యం మెరుగు పరుస్తాం. **- పి.దయాకర్, గ్రామ సచివాలయ కార్యదర్శి**

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పేదలకు సేవ చేయాలనే తపన అందరిలోనూ ఉండదని, ఉన్న కొంత మంది ప్రజలకు నిరంతరం సేవ చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేవీ ఆసుపత్రి సహకారంతో వాకర్స్‌కి ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. వైద్యులు గోపాల్, కీర్తి, త్రివిక్రమ్, లక్ష్మీనారాయణ, నాగరాజు, వాకర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

మంత్రి లోకేశ్‌కి ఘన స్వాగతం

నాయుడుపేట, న్యూస్‌టుడే: నెల్లూరు పర్యటనకు వెళ్తున్న మంత్రి నారా లోకేశ్‌కు ఆదివారం రాత్రి రేణిగుంట విమానాశ్రయంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పుష్పగుచ్ఛం అందజేసి మనంగా స్వాగతం పలికారు. నాయుడుపేట వద్ద రహదారి కూడలి వద్ద మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, తెదేపా సీనియర్ నాయకులు పి.శ్రీరామ్‌ప్రసాద్, నాయకులు స్వాగతం పలికారు.

గూడూరు పట్టణం: పట్టణ సమీపం జాతీయ రహదారి కూడలి వద్ద ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో తెదేపా నాయకులు రాత్రి మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం పలికారు. నియోజకవర్గంలోని అధిక సంఖ్యలో తెదేపా నాయకులు తరలిరావడంతో జాతీయరహదారి వద్ద సందడి నెలకొంది. నాయకులని ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి నెల్లూరుకి బయలుదేరారు.

లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, ప్రజలకు మంత్రి అభివాదం

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

వెంకటగిరి: ఒకే పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో ఆదివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటా కరపత్రాలు అందించి ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విభజితో ఒకే పార్టీ ఉంటుందని, అందువల్ల అభివృద్ధి వేగంగా ఉంటుందన్నారు. ఒక్కఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైకాపా రాష్ట్రాన్ని విధ్వంసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తూ.చ. తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఈ క్రమంలో శ్మశానం వాటికకు చుట్టూ ప్రహరీ నిర్మించాలని, చేతిపంపు రిపేరు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. సమీపంలోని డంపింగ్‌యార్డును మార్చాలని కోరారు. చేతిపంపు మరమ్మతులు చేపట్టాలని పుర కమిషనర్ వెంకట్రామిరెడ్డికి సూచించారు. డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు, రాజేశ్వరరావు, ఆనంద్, గంగాధర్, రవి, ఆజయ్, నరసింహులు, మాజీ కౌన్సిలర్ శ్రీదేవి పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రామకృష్ణ

బాలాయపల్లిలో బాలుర వసతి గృహం

బాలాయపల్లి, న్యూస్‌టుడే: బాలాయపల్లిలో బీసీ సంక్షేమ బాలుర వసతి గృహాన్ని స్థాపిస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వెల్లడించారు. తెదేపా నియోజకవర్గ పరిశీలకులు రమణయ్య, జిల్లా మార్కెటింగ్ సహకార సంస్థ అధ్యక్షుడు నాగేశ్వరరావు, నేతలు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణ వ్రతం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆదివారం వైభవంగా చేశారు. ఆధ్యాత్మిక ఉపన్యాసకులు శిరోమణిశర్మ వ్రతం విశిష్టతను తెలియజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అధ్యక్షుడు శివకుమార్, వైద్యులు జనార్దన్‌రెడ్డి, రోహిణి, సభ్యులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయండి

సూళ్లూరుపేట, గూడూరు పట్టణం, వెంకటగిరి, న్యూస్‌టుడే: ఈనెల 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యాన ఆదివారం సూళ్లూరుపేట, వెంకటగిరిలో ద్విచక్ర వాహనాల ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం సమ్మెకు పిలుపునిచ్చినట్లు నేతలు పేర్కొన్నారు.

సీపీఐ జిల్లా మహా సభలను.. తడ: వచ్చే నెల మూడు నుంచి ఐదు వరకు సూళ్లూరుపేటలో నిర్వహించే సీపీఐ జిల్లా రెండో మహా సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి సి.సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులతో ఆదివారం పలు గ్రామాల్లో ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టి ప్రచారం నిర్వహించారు. మండల సీపీఐ కార్యదర్శి కుమార్, నాయకులు శ్రీనివాసులు, చెల్లయ్య, రజని, అరుణాచలం, రమేష్ పాల్గొన్నారు.

పెంపుడు జంతువులపై జాగ్రత్తలు తీసుకోవాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పశు వైద్యశాలలో ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ గూడూరు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం వేశారు. ప్రతి ఒక్కరు పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు.

కుక్కలకి రేబిస్ టీకా వేస్తున్న పశువైద్యులు సురేష్

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: మహనీయులను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని భాజపా పట్టణ అధ్యక్షుడు దయాకర్ తెలిపారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి పురస్కరించుకుని నివాళులర్పించారు. నాయకులు బాలకృష్ణం నాయుడు, శ్రీనివాస్ యాదవ్, సురేష్, శివ, నిరంజన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

మురుగు పారదు.. బాధ తీరదు

✦ నిధుల ఖర్చు తప్ప ప్రయోజనం సున్నా

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పూడికతీత పేరుతో నిధుల స్వాహా తప్ప ఫలితం ఉండటం లేదు. ప్రతి ఆరు నెలలకొకసారి పూడిక తీత చేపడుతున్నా.. మురుగు మాత్రం పారకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు ముందు కాలువల్లో పూడిక తీత చేపట్టాలని మంత్రి నారాయణ ఆదేశాలు జారీ చేయడంతో చేపట్టారు. పురపాలక సంఘం పరిధిలోని డ్రైనేజీ కాలువల్లో పూడిక తీత చేపట్టేందుకు కొన్ని రోజుల కిందట జరిగిన సాధారణ సమావేశంలో రూ.10 లక్షలు ఖర్చు చేసేందుకు సభ్యుల నుంచి ఆమోదం పొందారు. సాంకేతిక అనుమతులు కోసం ప్రయత్నిస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు పది రోజుల నుంచి పూడిక తీత చేపడుతున్నారు.

తూతూమంత్రంగా చేపట్టి..

కాలువల్లో పూడిక తీతను కార్మికులు, రోబోతో చేపడుతున్నారు. కొన్ని నెలల కిందట పురపాలక శాఖ మంత్రి కేటాయించిన రూ.28 లక్షలతో స్వర్ణముఖినది నుంచి విన్నమాల కాలువ వరకు చేపట్టారు. ఈ పని తూతూమంత్రంగా, బిల్లులు కోసం పనులు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలుచోట్ల యంత్రాలతో కొన్ని గంటలు పని చేసినట్లుగా చూపి బిల్లులు పొందుతున్నారు. మిగిలినది కూలీలతో చేపడుతున్నారు. ఈ విషయమై ఏఈ చంద్రను అడగ్గా సాంకేతిక అనుమతులు పొందలేదని, కూలీలతోనే పూడిక తీస్తున్నామన్నారు.

కాలువల్లో పూడికతీత

చెందోడులో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

కోట, న్యూస్‌టుడే: చెందోడు పంచాయతీలో ఆదివారం తెదేపా మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యాన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు ఇంటింటికెళ్లి అభివృద్ధిపై కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు జీతేంద్రరెడ్డి, మర్రిపోలయ్య, మాజీ ఎంపీటీసీ బాలసుబ్రమణ్యం, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెందోడు పంచాయతీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

చోరీ ఇంట్లో నగదు లభ్యం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట మూకాంబిక ఆలయ వీధిలోని హరీంద్రనాయుడు, సునీత దంపతుల నివాసంలో రూ.3 లక్షలు నగదు లభ్యమైంది. శనివారం వీరి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసి 55 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షలు చోరీ జరిగిన విషయం తెలిసిందే. కానీ క్లూస్‌టీం వచ్చి బీరువాలో అంతా పరిశీలించగా. . సదరు నగదు అందులోనే ఉంది.

పాముకాటుతో రైతు మృతి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పుదూరుకి చెందిన ఎం.శంకరయ్య(52) అనే రైతు ఆదివారం పొలాల్లో పశుగ్రాసం కోస్తూ పాము కాటుకు గురై మృతి చెందాడు. వివరాలు.. రైతు సమీప పొలాలకు వెళ్లి పొలం గట్లకు పశుగ్రాసం కోస్తూ ఉండగా పాము కాటు వేసింది. వెంటనే స్థానికుల సాయంతో నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షలు చేస్తుండగానే మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. ✦ **మరొకరు..** ఇదే గ్రామంలో అయ్యప్ప(50) అనే వ్యక్తి ఆలయం వద్ద కూర్చుని ఉండగా ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. ఈయనకు కొంతకాలంగా అనారోగ్యంతో ఉండటంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఆలయం వద్ద అందరితో మాట్లాడుతుండగా పడిపోయి ప్రాణాలు వదిలాడు.

గూడలి భీమేశ్వరస్వామి ఆలయంలో చోరీ యత్నం

కోట, న్యూస్‌టుడే: గూడలిలోని పర్వతవర్ధిని సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో చోరీ యత్నం జరిగింది. వెంటనే వాకాడు సీఐ హుసేన్‌బాషా, ఎస్సై పవన్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వేలిముద్రల నిపుణులను రప్పించి సేకరించారు. పోలీసుల కథనం మేరకు.. శనివారం రాత్రి కొందరు యువకులు ఆలయం గేటు తాళాలు పగులగొట్టి లోపలికెళ్లి ప్రాంగణంలోని సీసీ కెమెరాలు, ఆలయ ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టారు. అయితే ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం ఎలాంటి వస్తువులు చోరీకి గురికాలేదని పూర్తిగా దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

16 ద్విచక్ర వాహనాల సీజ్

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించి 16 ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు సీఐ వెంకటరమణ తెలిపారు. ఎస్పీ ఆదేశాలు మేరకు ఈ కాలనీ పరిధిలో సర్కిల్ సిబ్బంది ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టామన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలను గుర్తించి సీజ్ చేశారని తెలిపారు. ఎస్సైలు ఏడుకొండలు, గోపి తదితరులు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న సీఐ

రహదారిపై నిరసన తెలిపిన వారిపై కేసులు

పెళ్లకూరు: మండలంలో నాలుగు రోజుల కిందట పెళ్లకూరు జాతీయ రహదారిపై దుర్గా అనే మహిళ వేధింపుల కారణంగానే ఆత్మహత్య చేసుకుందంటూ పునబాక ఎస్టీ కాలనీకి చెందిన పలువురు నిరసన చేపట్టారు. ఈనేపథ్యంలో 15 మంది నిరసనకారులపై శనివారం పోలీసులు కేసులు నమోదు చేశారు. స్టేషన్ దిగ్బంధనం చేసి రహదారిపై రాకపోకలకు అంతరాయం కలిగించినందుకు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆఫ్ఘాన్ స్ట్రీట్‌లో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. నిర్వాహకురాలితో పాటు, మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

గౌరవ 7వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు, గూడూరు, తిరుపతి జిల్లా.

E.P.No. 1/2024
O.S.No. 22/2019

Devathi Bala Subrahmanyam ... DHR
Vs.
Tupili Sarojanamma (Died)
Tupili Gopal
Tupili Savithri
Lalapet Santhi
Epuru Pushpa
P. Padmaja
K. Vijaya Lakshmi ... JDR's / Defendants

వేలం ప్రకటన

పై DHR తన మార్ట్‌గేజీ బాకీ రికవరి కొరకు దావా దాఖలు చేసి డిక్రీ పొందియున్నాడు. సదరు దిగువ షెడ్యూలు దాఖలా మార్ట్‌గేజీ ఆస్తిని తేదీ: 07-08-2025న ఉ. 10.30 నుండి సా. 5.00ల లోపు పై గౌరవ కోర్టులో వేలం నిర్వహించబడును. కావలసినవారు షరతులకు లోబడి పాల్గొనవచ్చును.

SCHEDULE OF PROPERTY
(As per Doct. 1468/2008 Followed)

శ్రీ తిరుపతి జిల్లా (గతంలో నెల్లూరు జిల్లా) నాయుడుపేట గ్రామ పంచాయతీ, 3వ వార్డు, 5వ బ్లాక్, రాజగోపాలపురం, నెం. 95 పట్టా దాఖలు సర్వే నెం. 300-7లోని H.No: 3-5-164, విస్తీర్ణం 233.77 Sq. Yds. స్థలమునకు హద్దులు. తూర్పు: జాయింట్ దారి, దక్షిణం: రోడ్డు, పడమర: జువ్వలపాళెం మాధవయ్య స్థలం, ఉత్తరం: తూపిలి క్రిష్ణమాచారి స్థలం. ఈ హద్దులలోని 29 అం॥ 16 చ॥ అడుగుల స్థలం మరియు 233 చ.గ లో 1200 చ॥ అడుగులు లేక 25 అం॥ స్థలం కట్టుబడి కలిగిన MCC పాత ఇల్లునూ అన్ని ఈజ్‌మెంట్ హక్కులతో కలిపి వేలం వేయబడును. అసెస్‌మెంట్ నెం. 1466 (అన్ని ప్రభుత్వ ఛార్జీలకు లోబడి)

DHR Value: 20,00,000/-
Market Value : 40,00,000/-
Ameen Value: 17,69,625/-

S. Ramesh Kumar,
Advocate for DHR, **Cell: 90524 91003.**

నాడు కక్ష.. నేడు రక్ష

● ఐదేళ్ల తర్వాత పారిశ్రామికవాడ అభివృద్ధికి కసరత్తు

నాయుడుపేట, ఓజిలి, న్యూస్‌టుడే: వైకాపా కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఓజిలి మండలం అత్తివరం పారిశ్రామికవాడలో అభివృద్ధి పనులను అసంపూర్తిగా నిలిపేశారు. ప్రస్తుతం కూటమి వచ్చాక వాటిని తిరిగి ప్రారంభించడంతో ఈ ప్రాంతానికి నూతన శోభ సంతరించుకుంది. ఇక్కడ 400 ఎకరాల్లో ఏపీఐఐసీ పారిశ్రామిక వాడ అభివృద్ధి చేసేందుకు 2014లో తెదేపా శ్రీకారం చుట్టింది. రసాయన, ఫార్మా పరిశ్రమలకు అనుగుణంగా పారిశ్రామిక వాడను అభివృద్ధి చేసేందుకు ఏడీబీ ద్వారా రూ.143.53 కోట్లతో పక్కా రోడ్లు, నీటి వసతి, డ్రైయిన్లు, విద్యుత్తు వంటి మౌలిక వసతులు కల్పించేందుకు 2018లో టెండర్లు నిర్వహించగా ఎస్ఆర్ఆర్ నిర్మాణ సంస్థ పనులు దక్కించుకుంది. 2019 నాటికి పనులు పూర్తి కావాల్సి ఉన్నా వైకాపా అధికారంలోకి రావడంతో పనులు నిలిపేశారు. దీంతో పారిశ్రామిక వాడలో సరైన మౌలిక వసతుల్లేక పరిశ్రమ యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి.

అత్తివరం పారిశ్రామిక వాడలో రోడ్లు ❖ కొత్తగా నిర్మిస్తున్న తాగునీటి పథకం

ఎట్టకేలకు మోక్షం

కూటమి వచ్చాక అత్తివరం పారిశ్రామిక వాడలో పనులు ప్రారంభమయ్యాయి. రూ.143.53 కోట్లతో ప్రధాన, అంతర్గత రహదారులు, కలుషిత నీటిశుద్ధి కర్మాగారం, డ్రైయిన్లు నీటి సరఫరాకు సంబంధించి ఓహెచ్ఆర్.. వంటి వసతులు కల్పిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ పది వరకు భారీ మధ్య తరహా పరిశ్రమలుండగా మౌలిక వసతులు ఏర్పడితే మరికొన్ని వచ్చే అవకాశం ఉంటుందని ఏపీఐఐసీ అధికారులు వివరించారు.

ఇవి రోడ్లా.. గాడులా?

నాయుడుపేట అమరాగార్డెన్‌లోని వీధులు, గరిడీ వీధులు గందరగోళంగా మారాయి. ఎక్కడ చూసినా పగుళ్లు బారి ఒరిగిపోయి, కుంగిపోయి గుంతలు పడి, రాళ్లూరప్పలతో రాకపోకలకు అనువుగా లేవు. కొన్నేళ్లుగా రోడ్లు మరమ్మతులకు నోచుకోలేదు. బాగా దెబ్బతిన్న చోట్ల కూడా చేయకపోవడంతో గుంతలమయంగా మారాయి. ప్రజలు, వాహనాలు ముందుకు సాగేందుకు అత్యవసరమైన రోడ్ల బాగుపై ప్రస్తుత ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవడం లేదు. **- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం**

పైన విద్యుత్తు.. కింద నీరు

స్థానిక అగ్రహారపేట ప్రధాన వీధి మలుపులో పాఠశాలలు, కళాశాలలు ఉండే చోట విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ ఇటీవల విద్యుత్తు శాఖ అధికారులు కొత్తది అమర్చారు. ఎర్త్ తీగలు అమర్చేందుకు గోతులు తీశారు. ఈక్రమంలో కుళాయి పైపులు దెబ్బతిని గుంతలో నీరు నిలుస్తోంది. ఈ కుళాయి పైపునకు మరమ్మతులు చేయలేదు. కొన్ని రోజులుగా అలాగే ఉంది. నిత్యం వందలాది విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రమాదాలు జరగక ముందే నివారించాలని స్థానికులు అంటున్నారు. **- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం**

డంపింగ్ యార్డా.. చల్ల కాలువా?

కోటలో నిత్యం 2 టన్నుల చెత్త సేకరిస్తున్నారు. ఐదు ట్రిప్పులతో ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డు లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో పారిశుద్ధ్య కార్మికులు చల్ల కాలువలో డంపింగ్ చేస్తుండటంతో నిండుగా సాగు నీరు వస్తే కలుషితమవుతోంది. అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డు నిర్మించాలని కొన్నేళ్లుగా ప్రతిపాదనలు పంపుతున్నా.. నిధులు మంజూరు కాలేదు. డంపింగ్ యార్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైతే పనులు చేస్తామని ఈవో రాజశేఖర్ తెలిపారు. **- న్యూస్‌టుడే, కోట**

(c) eenadu

సొమ్ము సామాన్యులది.. సోకు దళారులది..!

★ టీడీఆర్ బాండ్ల జారీలో వారికే పెద్దపీట
★ కమీషన్లతో జేబులు నింపుకొంటున్న అధికారులు

ఈనాడు-విశాఖపట్నం: మహా విశాఖ నగర పాలక సంస్థలో దళారుల హవా కొనసాగుతోంది. రోడ్ల విస్తరణలో స్థలాలు కోల్పోయిన బాధితులకు టీడీఆర్ బాండ్లు ఇవ్వకుండా తిప్పించుకుంటున్న అధికారులు, స్థలాలతో సంబంధం లేని దళారులకు మాత్రం వెంటనే మంజూరు చేస్తున్నారు. వారిచ్చే కమీషన్ల కోసమే ఇలా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

★ నగరంపాలెం, రేవళ్లపాలెం పరిధిలో కొన్నేళ్ల కిందట రహదారులు నిర్మించినప్పటికీ ఇప్పుడు టీడీఆర్‌లు మంజూరు చేయిస్తుండటం గమనార్హం. మరికొన్నింటికి రోడ్ల విస్తరణలో తక్కువ పరిహారం ఇచ్చారని, తాజా నిబంధనల ప్రకారం పెంచి ఇవ్వాలంటూ దళారులు స్థలాల హక్కు పత్రాలతో నిత్యం ప్రధాన కార్యాలయంలో దర్శనమిస్తున్నారు.

పదేళ్లలో జారీ చేసిన టీడీఆర్ బాండ్లు: 1035 (2024 డిసెంబరు నాటికి)
వాటి విలువ: రూ.2500కోట్లపైగా
గత వైకాపా హయాంలో ఇచ్చినవి: 700పైగా
వాటి విలువ రూ.1600కోట్లపైగా

అమాయకులను బెదిరించి

ఒప్పందం: 'మీ స్థలం రోడ్డు విస్తరణలో పోతుంది. టీడీఆర్ కోసం మీరు తిరగలేరు. ఇదంతా పెద్ద తతంగం' అని స్థలం యజమానిని దళారులు భయపెడుతున్నారు. తాము ఆ పని చేసిపెడతామని ఒప్పందం చేసుకుంటున్నారు. అధికారులకు లంచాలని, తమకు కమీషన్ అని.. రూపాయి విలువ ఉన్న టీడీఆర్‌కు కేవలం రూ.25పైసలు ఇచ్చేలా ముందస్తుగా అడ్వాన్సు చెల్లిస్తున్నారు. తర్వాత కార్యాలయాల్లో అధికారులను కలిసి బేరం కుదుర్చుకుంటున్నారు. బాండ్లు మంజూరు కాగానే టీడీఆర్ రైట్స్ సైతం దళారుల పేరుపై మార్చుకుంటున్నారు. వాటిని ఎక్కువ మొత్తానికి గుత్తేదారులు, బిల్డర్లకు అమ్మేసుకుంటున్నారు.

ఆఫ్‌లైన్‌లో అక్రమాలకు తెగింపు

ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో జీవీఎంసీ టీడీఆర్‌లు మంజూరు చేస్తోంది. దీంతో బాధితులకు తెలియకుండా వారి స్థలాల సర్వే నెంబర్లను దళారులను సేకరిస్తున్నారు. వాటికి తమ ఆధార్, ఫోన్ నెంబరుతో వాలిడేషన్ చేయించి టీడీఆర్‌లు కొట్టేస్తున్నారు. అసలైన యజమానులు తమ ఫోన్, ఆధార నెంబర్లను వాలిడేషన్ చేయించడానికి వెళితే అప్పటికే టీడీఆర్ ఇచ్చేశారని తెలుసుకుని లబోదిబోమంటున్నారు. 'మా టీడీఆర్ మాకివ్వండి.. మీరు ఎవరికిచ్చారో మాకు తెలియదు' అంటూ కార్యాలయం చుట్టూ బాధితులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

230 టీడీఆర్‌లకు 4రెట్లు అదనం..: ఇప్పటి వరకు జీవీఎంసీ పరిధిలో ఐదు మురికివాడలకు టీడీఆర్‌లు మంజూరు చేశారు. నిబంధనల ప్రకారం మురికివాడలకు 1:1 నిష్పత్తిలో టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉండగా, దళారులు పైరవీలు చేసి నాలుగు రెట్లు అదనంగా మంజూరు చేయించుకున్నారు. ఇటీవల ఓ దేవస్థానికి ప్రత్యామ్నాయ స్థలం జీవీఎంసీ ఇచ్చినప్పటికీ, వాటికి ఆక్రమణదారుల పేరిట మళ్లీ టీడీఆర్ బాండ్లు ఇవ్వడం వివాదాస్పదమైంది. మొత్తం 230 టీడీఆర్‌లను నాలుగు రెట్ల ఎక్కువకు కట్టబెట్టిన విషయం బయటకు రావడంతో హోల్డ్‌లో పెట్టారు. ప్రస్తుతం వాటిని తిరిగి దక్కించుకోవడానికి దళారులు పావులు కదుపుతున్నారు. జీవీఎంసీ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కేతన్‌గార్గ్ దళారులకు అడ్డుకట్ట వేసి అర్హులకు టీడీఆర్‌లు దక్కేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పెంచిన ప్రేమ.. టీకా ఇచ్చేను ధీమా..!

జునోసిస్ డే సందర్భంగా ఆదివారం జిల్లాకోర్టు వద్ద ఉన్న పశువైద్యశాలకు పలువురు పెంపుడు శునకాలు, పిల్లులు, కుందేళ్లను తీసుకొచ్చారు. వైద్యులు టీకాలు వేస్తుండగా కొన్ని మొండికేశాయి. యజమానులు వాటిని బుజ్జగించి టీకాలు వేయించి తీసుకెళ్లారు. – ఈనాడు, విశాఖపట్నం

తెలుసుకోండి.. తెలివిగా ఎంపిక చేసుకోండి

నేటి నుంచి ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ

ఈనాడు, విశాఖపట్నం: ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రారంభం కానుంది. ఈ నెల 10 నుంచి 18 వరకు వెబ్ ఐచ్ఛికాల నమోదుకు అవకాశం కల్పించారు. దీని కోసం విద్యార్థులు ముందుగానే సిద్ధం కావాలని నిపుణులు చెబుతున్నారు. కళాశాలల ర్యాంకింగ్‌లు, ప్రాంగణ నియామకాలు జరుగుతున్న తీరు, గతేడాది ఎంత మంది ఉద్యోగాలు సాధించారు? తదితర వివరాలు తెలుసుకుని ఎంపిక చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో కళాశాలలు: 25
మొత్తం సీట్లు: 14,682
ఈఏపీసెట్‌లో అర్హత సాధించినవారు: 30,521

మూడు హెల్ప్‌లైన్ కేంద్రాలు: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ కెమికల్ కళాశాల, పాడేరు ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాలల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సమస్యలు, సందేహాలు ఉంటే విద్యార్థులు నేరుగా ఆయా కేంద్రాల్లో నివృత్తి చేసుకోవచ్చు. వీటితోపాటు మంగళగిరి హెల్ప్‌డెస్క్‌లోని 7995681678, 7995865456, 9177927677 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

అందుబాటులోకి కొత్త బ్రాంచిలు: ఈ ఏడాది కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) కోర్సులు పెరిగాయి. సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్‌తోపాటు సీఎస్ఈలో ప్రత్యేకంగా కృత్రిమ మేధ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్, క్వాంటం కంప్యూటింగ్ బ్రాంచిలు అందుబాటులోకి వచ్చాయి.

అప్రమత్తంగా వ్యవహరించాలి: బ్రాంచిలు, కళాశాలలను ఎంపిక చేసుకునేటప్పుడు విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలి. రెగ్యులర్ కోర్సులతో పోలిస్తే సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులకు ఫీజు ఎక్కువగా ఉంటుంది. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఏడాది నుంచి క్వాంటం కంప్యూటింగ్ కోర్సును అందుబాటులోకి తీసుకొస్తున్నాం. – **ఆచార్య చిట్టిబాబు, అసిస్టెంట్ ప్రిన్సిపల్, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల**

జాతస్య హి ధ్రువోమృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ !
తస్మాత్ అపరిహార్యే ర్థేన త్వం శోచితుమర్హసి !!



శ్రద్ధాంజలి

కరిగే కాలంలో.. తరగని జ్ఞాపకం మీరు..
కదిలే ఆలోచనలో.. చెరగని స్మృతి మీరు.. మీకు లేదు మరణం...
మా హృదయాలలో మీ జ్ఞాపకాలు చిరస్మరణీయం..

మంచికి, సేవాతత్పరతకు మారుపేరుగా నిలిచి,
ఎంతోమందికి ఉపాధిమార్గం చూపించి,
మరెందరికో ఆదర్శప్రాయులుగా నిలిచి,
అందరి హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించి,
అజరామరమైన కీర్తిప్రతిష్ఠలను సంపాదించిన మీరు
మానుండి భౌతికంగా దూరమైనందుకు చింతిస్తూ...
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
మీ ఆశయ సాధనలో... ఎల్లవేళలా మీ అడుగు జాడల్లో నడుస్తూ...
మీ...

భార్య: వేగేశ్న అనంతలక్ష్మి సత్యవతి

కుమారుడు : వేగేశ్న రఘురామరాజు
కోడలు : వేగేశ్న శ్రవంతి
మనుమరాళ్ళు : అక్షిత, అంకిత
మనుమడు : అఖండ సూర్యనంద ఆశ్రితవర్మ
కుమార్తె : దాట్ల రాధిక
అల్లుడు : దాట్ల సంజీవ్ కుమార్
మనుమలు : అఖిల్, అక్షయ్
మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

కీ॥శే॥ వేగేశ్న ఆనందరాజు గారు

జననం: 27-06-1958 స్వర్గప్రాప్తి: 06-07-2025

దశాహం: తేది. 16-07-2025 బుధవారం జరుపబడును.

ఆర్టీసీ డీఎంతో రేపు 'ఈనాడు- ఫోన్‌ఇన్'

ఈనాడు తోడు

ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్, విజయవాడ, అమరావతి, రాజమహేంద్రవరం, కాకినాడ తదితర సుదూర ప్రాంతాలకు ప్రయాణించే వారి సమస్యల్ని, బస్సుల కండిషన్‌ను, బస్సు డ్రైవర్లు, కండక్టర్ల పని తీరును విశాఖపట్నం డిపో మేనేజర్ కె.గంగాధరరావు దృష్టికి తీసుకెళ్లొచ్చు. ఇందుకు 'ఈనాడు' అవకాశం కల్పిస్తోంది. మీరు ఫోన్ చేసి సమస్య వివరిస్తే.. డీఎం సమాధానం ఇస్తారు. –న్యూస్‌టుడే, మద్దిలపాలెం

సమయం : ఉదయం 10 నుంచి 11 గంటల వరకు
తేదీ : 08-07-2025, మంగళవారం
ఫోన్ నెంబర్లు : 99592 25594, 99121 20229

తాత్కాలిక అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వివిధ విభాగాల్లో పని చేసేందుకు తాత్కాలిక అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్ వెలువడింది. వీటికి సంబంధించిన వివరాలను ఏయూ వెబ్‌సైట్‌లో శనివారం రాత్రి నుంచి అందుబాటులో ఉంచారు. ఏడాది కాల పరిమితితో పని చేసేందుకు యూజీసీ, ఏఐసీటీఈ, పీసీఐ, ఎన్‌సీటీఈ, సీఓఏ నిబంధనలకు లోబడి అర్హతలు కలిగిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అందులో పేర్కొన్నారు.

దివ్యాంగులకు క్షవరం చేస్తున్న సత్యసాయి సేవకులు, అనంతరం స్నానాలు చేయిస్తూ..

అనాథల సేవ.. 'సత్యసాయి' తోవ..

విశాఖ నగరంలో రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లపై బతుకుతున్న అనాథలు, దివ్యాంగులు జుట్టు పెరిగిపోయి, శరీర శుభ్రత లేక వ్యాధుల బారిన పడుతున్నారు. ఇలాంటి 180 మందిని శ్రీసత్యసాయి సేవా సంస్థల యువజన విభాగ సభ్యులు గుర్తించి ఆదివారం జ్ఞానాపురం రైల్వేస్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. శుభ్రంగా క్షవరం చేసి, గోళ్లు కత్తిరించి, వేడినీటితో స్నానం చేయించారు. అంతేకాదు కొత్త దుస్తులు అందజేశారు. తర్వాత కడుపు నిండా భోజనం పెట్టి పంపారు. మానవ సేవే.. మాధవ సేవ అన్న సత్యసాయి సూక్తులను స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమం చేపట్టినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. – ఈనాడు, విశాఖపట్నం

జేసీఐ జోన్-4 అధ్యక్షుని పర్యటన

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జేసీఐ) జోన్-4 జాతీయ అధ్యక్షులు అంకూర్ జున్‌జున్‌వాలా ఆదివారం నగరంలో పర్యటించారు. జేసీఐ ఆధ్వర్యంలో నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించి, సేవా కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. సామాజిక సేవల్ని విస్తృతం చేయాలని సభ్యులకు సూచించారు. వివిధ జోన్ల జేసీఐ అధ్యక్షులు, సభ్యులు సంతోష్ శివకుమార్, చైతన్య, కేవీ.రావు, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బోటనీ మ్యూజియం.. బోలెడంత విజ్ఞానం

భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ నుంచి గుర్తింపు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే

వేల సంవత్సరాల శిలాజాలు.. అరుదైన మొక్కలు, వృక్షాలతో విలసిల్లుతోంది ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని బోటనీ(వృక్షశాస్త్ర) మ్యూజియం. ఇది విద్యార్థులు, పరిశోధకులకు ఎనలేని విజ్ఞానాన్ని సమకూరుస్తోంది. దీనికి ఇటీవల భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ జాతీయ గుర్తింపు ఇచ్చింది. ఈ మ్యూజికం వర్సిటీకే తలమానికంగా నిలుస్తోంది. 1946లో అప్పటి ఆచార్యులు జె.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. 1994-95లో అప్పటి విభాగాధిపతి ఆచార్య ఎం.ఉమామహేశ్వరరావు, క్యూరేటర్ ఆచార్య ఎం.వెంకయ్య ఉన్నతంగా అభివృద్ధి చేశారు. ఏటా మన రాష్ట్రంతో పాటు, ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి వేలాది మంది విద్యార్థులు సందర్శనకు వస్తున్నారంటే మ్యూజియం ఎంతటి గుర్తింపు పొందిందో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ 65మిలియన్ సంవత్సరాల నాటి వృక్షజాతి శిలాజాలను చూడొచ్చు.

65 మిలియన్ సంవత్సరాల నాటి శిలాజం

మ్యూజియంలో ఏమి ఉన్నాయంటే..: మ్యూజియంలో ఆల్గేలు, శిలీంధ్రాలు, బ్రయోఫైట్స్, ఆంజియోస్పెర్మ్స్, వేల ఏళ్లనాటి వృక్షాల శిలాజాలు, భారత కలప, మడ అడవులు, స్థానికంగా అంతరించిపోతున్న వృక్షజాతులు, ఔషధ మొక్కలు, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన హెర్బేరియం మొక్కలు కొలువు దీరాయి. జాతీయ లీడ్ బొటానికల్ గార్డెన్‌తో దీన్ని అనుసంధానించారు. ఇక్కడ ఆచార్య బీర్బల్ సాహ్నీ సేకరణలు పెంటాక్సీలాన్, విలియమ్సోనియా (ఫలదీకరణ), విలియమ్సోనియా(ఆకు), కార్డైట్స్ (కాండం) వంటి ప్రత్యేక శిలాజాలను వీక్షించవచ్చు.

విద్యార్థులకు వివరిస్తున్న క్యూరేటర్ జె.ప్రకాశరావు

మ్యూజియంలో స్థానిక సైకస్ జాతుల సేకరణలు

సముద్రంలోని మొక్కలను చూడొచ్చు..

విద్యార్థులు, పరిశోధకులు, అటవీశాఖ వంటి వృక్షశాస్త్రానికి అనుబంధంగా ఉన్న శాఖలకు ఈ మ్యూజియం ఎంతగానో ఉపయోగ పడుతోంది. అంతరిస్తున్న, అంతరించిపోయిన ఎన్నో వృక్షజాతుల నమూనాలను ఈ మ్యూజియంలో భద్రపరిచాం. భూమిపైన లభించే మొక్కలు, వృక్షాలే కాకుండా సముద్రంలోని మొక్కలను సైతం ఇక్కడ చూడవచ్చు. – ఆచార్య సంధ్య దీపిక, ఏయూ బోటనీ విభాగం

అమృతమూర్తికి అశ్రునివాళి

మంచికి, మమతానురాగాలకు మారుపేరుగా నిలిచి, మా అందరికీ ప్రేమానురాగాలు పంచిన మా ఇంటి మహాలక్ష్మి శ్రీమతి డి. లీల గారు మమ్మల్ని భౌతికంగా దూరమైనందుకు చింతిస్తూ... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

'శోకతప్త హృదయాలతో'

జననం: 02-12-1960 మరణం: 27-06-2025

శ్రీమతి డి. లీల గారు

భర్త: D.V.S.N. ఆచార్యులు

అమ్మ: రమాదేవి

అన్నయ్య - వదిన: డా॥ వై. ప్రభాకరరావు - డా॥ రాధారాణి

తమ్ముడు - మరదలు: వై. రమేష్ - రాజ్యలక్ష్మి

చెల్లెళ్లు - బావలు: ప్రమీల - పి. వెంకటరావు, స్వర్ణలత - కె. ఉపేంద్రరావు

మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

నేడు ఫిర్యాదుల స్వీకరణ

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించేలా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యాలయంతో పాటు, అన్ని జోనల్ కార్యాలయాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందన్నారు. **కలెక్టరేట్‌లో...:** వన్‌టౌన్, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తామని కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఫిర్యాదుల తాజా పరిస్థితి కోసం '1100' నంబరుకు డయల్ చేయాలని కలెక్టర్ సూచించారు.

ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత ప్రవేశాలకు వేళాయే..!

వేంపల్లె, న్యూస్‌టుడే : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 600 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఐదు వరకే ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి విద్యార్థుల మెరిట్ జాబితాను తయారు చేసి ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి మొత్తం 4400 సీట్లు ఉన్నాయి.

నాలుగు ట్రిపుల్ ఐటీల్లో మిగులు సీట్లు 600

ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1100 సీట్లు ఉండగా దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ కోటా కింద 360 సీట్లు పోను మిగిలిన ట్రిపుల్ ఐటీలకు ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1010 చొప్పున 4040 సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీల్లో ఉన్న సీట్లకు మెరిట్ జాబితా విడుదల చేసి జూన్ 30 నుంచి జులై 5వ తేదీ వరకు ఇడుపులపాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేశారు. కౌన్సెలింగ్ తర్వాత ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 132, నూజివీడు ట్రిపుల్ ఐటీలో 141 సీట్లు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 143, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 184 సీట్లు మిగిలాయి.

యోగా సామగ్రి పంపేందుకు ఏర్పాట్లు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : యోగాంధ్ర సందర్భంగా కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో విశాఖకు తీసుకొచ్చిన సామగ్రిలో మిగిలిన వాటిని వెనక్కి పంపనున్నారు. మొత్తం 5 లక్షల యోగా మ్యాట్‌లు, 5 లక్షల టీషర్ట్లు తీసుకొచ్చి ఏయూ ఇంజినీరింగ్ మైదానంలోని భవనంలో భద్రపరిచారు. వాటిల్లో 1.50 లక్షల మ్యాట్లు, 1.50 లక్షల టీషర్ట్లు మిగిలిపోయాయి. తొలుత వాటిని ఉమ్మడి విశాఖ జిల్లా పాఠశాలల విద్యార్థులకు అందజేయాలని జిల్లా యంత్రాంగం భావించింది. తాజాగా కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నుంచి కలెక్టరేట్‌కు వచ్చిన ఆదేశాలతో ఆ సామగ్రిని పది ట్రక్కుల్లో ఢిల్లీకి తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

శేషపాన్పుపై జగన్నాథస్వామి

నేడు ఘనంగా 'తిరుగు రథయాత్ర'

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరం టర్నర్‌చౌల్ట్రీ ఆవరణలో జరుగుతున్న జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారు శేషపాన్పుపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. సెలవు దినం కావడంతో భారీ సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని పూజలు చేశారు. సాయంత్రం చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. ఉత్సవ అధికారి టి.అన్నపూర్ణ, ఆలయ ఈఓ టి.రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

★ స్వామి వారి అలంకరణలు పూర్తయిన నేపథ్యంలో సోమవారం తిరుగు రథయాత్ర ఉంటుందని ఈఓ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు సుభద్ర, బలభద్ర, జగన్నాథస్వామిని రథంపై అధిష్ఠింపజేసి సాయంత్రం వరకు భక్తుల పూజలకు అవకాశం ఇస్తామని, సాయంత్రం 5 గంటలకు చౌల్ట్రీ ఆవరణ నుంచి టౌన్‌కొత్తరోడ్డులోని ఆలయం వరకు తిరుగు రథయాత్ర జరుగుతుందని వివరించారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి

80087 09638

కఠిన ఆంక్షల నడుమ సేవలెలా..?

స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు సూచనలిస్తున్న ట్రాఫిక్, దేవస్థానం అధికారులు

సింహాచలం, న్యూస్‌టుడే: కఠినమైన ట్రాఫిక్ ఆంక్షల నడుమ భక్తులకు సేవలు ఎలా అందించాలని గిరి ప్రదక్షిణలో సేవలకు ముందుకొచ్చిన పలు సేవా సంస్థల ప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. ఆదివారం సింహాచలం దేవస్థానం కార్యాలయం ఆవరణలో సేవా సంస్థల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ నగరవ్యాప్తంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో పాటు సేవా శిబిరాల ఏర్పాటుపై కూడా నియంత్రణ విధిస్తే ఎలాగంటూ ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ ఇలాంటి నిబంధనలు లేవన్నారు. ఆహార పదార్థాలను శిబిరాల వద్దకు తీసుకెళ్లడానికి వాహనాలను అనుమతించాలని కోరారు. వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రాఫిక్ అవాంతరాలకు అవకాశం లేని విధంగా స్టాళ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాహనాల రాకపోకలకు పూర్తిస్థాయిలో అనుమతి లేదని స్టాళ్లు ఏర్పాటు చేసే సంస్థలు ముందు రోజే సామగ్రిని తరలించుకోవాలని సూచించారు. దీనిపై సంస్థల ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓ దశలో ట్రాఫిక్ పోలీసులు, సేవా ప్రతినిధుల మధ్య కొంత వాగ్వాదం జరిగింది. చివరకు పోలీసులు సానుకూలంగా స్పందించినా స్పష్టమైన హామీ ఇవ్వలేదు. సమావేశంలో ఈవో వేంద్ర త్రినాథరావు, ఏఈవో ఆనంద్‌కుమార్, ఈఈ సీహెచ్‌వీ రమణ, డీఈఈ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

నాటక పుస్తకాల డిజిటలీకరణ అభినందనీయం

సీతంపేట, న్యూస్‌టుడే: నాటకం కోసం జీవితాన్ని అంకితం చేసిన బాదంగీర్ సాయి తీపి గుర్తుగా పదివేల నాటక పుస్తకాలు డిజిటలీకరణ చేసి అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని విశ్రాంత ఐఏఎస్ అధికారి గుమ్మళ్ల బలరామయ్య కొనియాడారు. రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అధ్యక్షతన మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మన్నం వెంకటరాయుడుతో కలిసి శ్రీనగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో ఆదివారం 'తెలుగు నాటక డిజిటల్ గ్రంథాలయం' వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బలరామయ్య మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు నాటకాలను అందించడానికి బాదంగీర్ సాయి నాటక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. దాడి వీరభద్రరావు మాట్లాడుతూ నాటకాలను డిజిటలీకరణ చేయడం ప్రశంసనీయమన్నారు. అంతకు ముందు పౌర గ్రంథాలయం ఎదుట సుదర్శన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'టామీ టామీ టామీ' నాటికను ప్రదర్శించారు. విశ్రాంత ఐపీఎస్ అధికారి అత్తిలి సుధాకర్, రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకులు వి.వి.రమణమూర్తి, సినీ దర్శకుడు ఎం.వి.రఘు, కొల్లి మోహనరావు, మేడా మస్తాన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నటులను సన్మానించి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతి అందించారు.

వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు గుమ్మళ్ల బలరామయ్య, సుధాకర్ తదితరులు

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం-2025 కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ఎన్.ప్రేమకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు నేషనల్‌అవార్డ్స్‌టుటీచర్.ఎడ్యుకేషన్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు. జులై 13వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, సందేహాలుంటే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చునన్నారు.

విదేశీ విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన

విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రతినిధి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ఐవీవై ఓవర్సీస్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ దసపల్లాలో నిర్వహించిన గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్-2025కు విశేష స్పందన వచ్చిందని డైరెక్టర్ శ్రీరామ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫెయిర్‌కు యూఎస్‌ఏ, జర్మనీ, ఐర్లాండ్, ఫ్రెంచ్ తదితర యూరప్ దేశాల్లోని యూనివర్సిటీల ప్రతినిధులు 30 మంది హాజరై 250 మందికి పైగా విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించారన్నారు. విదేశాల్లో విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు.

గొలుసు దొంగ అరెస్టు

కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ బి.ఎస్.ఎస్.ప్రకాష్

పీఎంపాలెం, న్యూస్‌టుడే: మధురవాడ ప్రాంతంలో ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు తెంపుకొని పారిపోయిన దొంగను పీఎంపాలెం నేర విభాగం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వివరాలను క్రైం సీఐ బి.ఎస్.ఎస్.ప్రకాష్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. కొమ్మాది వైఎస్సార్ కాలనీకి చెందిన కొత్తకోట వరలక్ష్మి (65) ఈ నెల 2న సాయంత్రం కాలనీలో రోడ్డుపై ఒంటరిగా నడిచి వెళ్తున్నారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి రూ.2 లక్షల విలువ చేసే 2 తులాల బంగారు గొలుసును లాక్కొని ద్విచక్రవాహనంపై పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. భీమిలి మండలం కాపులుప్పాడకు చెందిన గుడ్ల ఆదినారాయణ (25) చోరీకి పాల్పడినట్లు గుర్తించి శనివారం అదుపులోకి తీసుకుని అతని నుంచి బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని రిమాండ్‌కు తరలించి బాధితురాలికి బంగారం గొలుసు అప్పగించామని సీఐ తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన ఏఎస్ఐలు కె.బాబా, అమర్‌శేఖర్, పీసీలు మల్లిక్, గణేష్, రమేష్‌లను ఆయన అభినందించారు.

వాణిజ్య పన్నులశాఖలో ఇష్టానుసార బదిలీలు..!

ఈనాడు, విశాఖపట్నం: ఆర్థికశాఖ విడుదల చేసిన మార్గదర్శకాలకు విరుద్ధంగా వాణిజ్య పన్నులశాఖలో బదిలీలు చేపట్టడం వివాదాస్పదమవుతోంది. కొందరు ఉన్నతాధికారులు తమకు నచ్చినట్లు బదిలీలు చేశారనే విమర్శలు వస్తున్నాయి. అనుకూలంగా ఉన్నవారిని అదే డివిజన్‌లో కొనసాగించడం, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చినా.. అనుకూలంగా లేరని కొందరిని దూర ప్రాంతాలకు బదిలీ చేశారని సమాచారం. విశాఖ-2 డివిజన్‌లోని ఆరు సర్కిళ్లలో కేవలం ఒక సహాయ కమిషనర్ మినహా మిగిలిన వారందర్నీ దూరంగా బదిలీ చేశారు. విశాఖ-1 డివిజన్ పరిధిలో ఏడు సర్కిళ్లు ఉంటే ముగ్గుర్ని ఇక్కడే కొనసాగించారు. ప్రభుత్వం అయిదేళ్లు ఒకే చోట పనిచేసిన వారికి బదిలీ తప్పనిసరి అంటే.. ఇక్కడ ఒక ఏడాది సర్వీసు పూర్తి చేసిన వారికీ స్థానచలనం కలిగించడం గమనార్హం.

జాయింట్ కమిషనర్‌గా శేషాద్రి: ఈశాఖలోని పలువురు అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. విశాఖ-2 డివిజన్ జాయింట్ కమిషనర్‌గా టి.శేషాద్రిని నియమించింది. ఆయన అనంతపురం నుంచి వచ్చారు. విశాఖ-1 డివిజన్‌కు ఇన్‌ఛార్జిగానూ కొనసాగనున్నారు. పలువురు డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లకు స్థానచలనం కలిగింది.

కొండచిలువ కలకలం..!

మల్కాపురం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 63వ వార్డు జైఆంధ్రాకాలనీలోని ఓ ఇంటి మరుగుదొడ్డిలో ఆదివారం పది అడుగుల కొండచిలువను చూసిన కుటుంబ సభ్యులు భయంతో బయటకు పరుగులు తీశారు. స్నేక్ క్యాచర్ నాగరాజుకు సమాచారం ఇచ్చారు. టీం సభ్యులతో అతను కొండచిలువను బంధించి జన సంచారం లేని ప్రాంతంలో విడిచిపెట్టారు.

కొండచిలువతో స్నేక్ క్యాచర్ నాగరాజు, టీం సభ్యులు

త్యాగానికి ప్రతీక.. మొహర్రం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : త్యాగానికి ప్రతీక మొహర్రం అని చెంగలరావుపేట హుస్సైనీ మసీదు అధ్యక్షులు హసీం హుస్సేన్ తెలిపారు. ఆదివారం ఏవీఎన్ కళాశాల ఎదురుగా ఉన్న మసీదు ఆధ్వర్యంలో షియా ముస్లింలు నల్లదుస్తులు ధరించి మాతం (రక్తం చిందిస్తూ) నిర్వహించారు. అనంతరం పాతనగరంలో ర్యాలీ నిర్వహించారు. మసీదు కమిటీ సభ్యులు, స్థానిక ముస్లింలు పాల్గొన్నారు.

మాతం నిర్వహిస్తున్న ముస్లింలు

వీఎంఆర్‌డీఏ ప్రణాళిక విభాగంపై విచారణకు ఆదేశం

ఈనాడు కథనానికి స్పందన

ఈనాడు, విశాఖపట్నం : విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్రణాళిక విభాగంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సంస్థ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ అధికారులను ఆదేశించారు. నివేదికను ఈనెల 25లోగా సమర్పించాలన్నారు. గత నెల 30న 'ఈనాడు'లో 'బాబోయ్ దండుకోవడమే' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ప్రణాళిక విభాగంలో సేవల లోపం, గ్రీవెన్స్‌లో వచ్చే ఫిర్యాదులను పరిష్కరించకపోవడం, అలాగే లేఅవుట్ల అనుమతి, మాస్టర్‌ప్లాన్ అభ్యంతరాలకు సంబంధించి వసూళ్లకు పాల్పడుతుండటంపై దర్యాప్తు జరపనున్నారు.

నేడు మంత్రి పార్థసారథి రాక

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం విశాఖ రానున్నారు. విజయవాడ నుంచి విమానంలో బయలుదేరి ఉదయం 9 గంటలకు నగరానికి చేరుకునే మంత్రి నోవాటెల్ హోటల్‌కు వెళ్తారు. కాసేపటి తర్వాత రోడ్డు మార్గంలో బయలుదేరి 11 గంటలకు అనకాపల్లి జిల్లా మాడుగుల చేరుకుని, అక్కడ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని, రాత్రికి విశాఖ చేరుకుని బస చేస్తారు.

రైలు ఢీకొని ఫార్మా ఉద్యోగి దుర్మరణం

సురేశ్ (పాతచిత్రం)

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వవార్డు పరిధిలో రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు దువ్వాడ జీఆర్పీ పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలం తులగాం గ్రామానికి చెందిన వజ్రారపు సురేశ్(28) పరవాడ మెట్రోకెమ్ ఫార్మా కంపెనీ ప్రొడక్షన్ విభాగంలో పని చేస్తూ లంకెలపాలెంలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో లంకెలపాలెంలో రైలు పట్టాలు దాటుతుండగా విశాఖ నుంచి విజయవాడ వెళ్లే రైలు ఢీకొని మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు ఆదివారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై లక్ష్మి పేర్కొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	86	78
లైవ్	108	98
డ్రెస్డ్	157	166
స్కిన్‌లెస్	178	176

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

Creta 2022 Run 72000 Diesel * TATA Punch 2022 Run 7000 Petrol Owner Dirven for Sale. ✆ 9849113313, 8333859555.

BUSINESS SERVICES

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

BUSINESS OFFER

టైలరింగ్ వర్క్స్ ఇంటి వద్దనే పనిచేసే స్త్రీలు కావలెను. వారికి క్లాత్ ఇచ్చుటకు స్టాక్ పాయింట్స్ పెట్ పార్టనర్స్ కావలెను. ✆ 7093632399.

TENDER

SALVAGE DISPOSAL

Sealed quotations are invited from the prospective salvage buyers on the damaged 8L SS 304L + Hastelloy C-22 Clad Oxidation Reactor along with fire affected accessories, other materials at the premises of M/s. Vasant Chemicals Pvt Ltd., APSEZ, Atchutapuram, Anakapalli Dist.,

Please contact Mr. S. Prasad Raju, (Cell: 91540 30397) for inspection, the sealed quotations may reach to the undersigned within 7 days.

D.S.Prasad Babu
Surveyor/Loss Assessor,
Block-A, Flat No.S-1,
Ramalaxmi Estates,
Pedawaltair,
Visakhapatnam-530 017.
Mobile: 98481 97742

FINANCIAL SERVICES

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలలోపు ఫైనాన్స్ చేయబడును. అన్ని తరగతుల వారు బ్యాంకులో స్థిరాస్థిపై లోన్ తీసుకున్న వారికి Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్‌లోన్ చేయబడును. ✆ 96665 47338.

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్సియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

REAL ESTATE

FLAT FOR SALE

KOMMADI

North East Facing 2BHK 1200 Sft, Pooja, Dressing Room, Car Parking at Kommadi. Rent 7 to 8,000/- PM. Spot Reg. Bank Loan available. Ph: 8121100599.

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

North- East Corner Building for Sale. Ready to Move. 121 Sq.Yds. (Cellar+ G+1) 60 Ft., Double Rd., Facing. Prime Location at Atchutapuram ✆ 9885824528.

PLOT FOR SALE

GENERAL

Prime Site 72 & 54 Cents at Dabbanda Near Simhachalam 18km from RTC Complex, Vizag. Contact: 8333859555, 9440320255.

VUDA approved plots in PM Palam 346 sq.yds and 300 sq.yrds near Sabbavaram for sale. Contact: 8978326333.

విశాఖలో/ అనకాపల్లిలో NRI ఫామ్ ల్యాండ్స్ వేయుటకు ఇన్వెస్ట్ పార్టనర్స్ కావలెను. సంప్రదించండి. ✆ 7386414017/ 7093632399.

SECOND SALE

మిధున్ ఏజన్సీ కొనబడును పాత A/Cలు, సెంట్రల్ A/Cలు, ఇన్వెర్టర్ బ్యాటరీలు, ఫ్రిజ్, వాషింగ్ మిషన్స్, ఫర్నిచర్, ఆన్‌లైన్ UPSలు కొనబడును. Cont : 6309745364.

JOBS

శ్రీరామ్ గ్రూప్‌లో విశాఖజిల్లా అంతటా ఎంప్లాయిస్ కావలెను. BDES-15+ Inc., BDMs-24K+ Inc. Exp. Min. 2 Yrs. Age: 25-35. Any Degree. 9666331353.

TVS షోరూమ్ అనకాపల్లి నందు పనిచేయుటకు ఆటోమొబైల్ రంగంలో అనుభవంగల మేనేజర్స్, అకౌంటెంట్ కావలెను 20000/- + Inct. ఇవ్వబడును. ✆ 8341546429.

త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 85209 80099, 85208 74499.

ప్రైవేటు బ్యాంకులో పనిచేయుటకు క్లర్క్- టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్, BDM, CRMS కావలెను. జీతం 18k, స్పాట్ జాయినింగ్. ✆ 7995439539.

FACULTY/ TEACHERS

Wanted Lecturers Physics Chemistry Computer Science, Civics, Economics, Commerce, English. ✆ 9849216362, 7386487509.

Wanted Exp. Lady Teachers for LKG, UKG & 6th - 9th English, Social & Computers. Cont : Success 'n' Success School, Rly. New Colony, Ph : 9492641179.

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డులు కావలెను. అర్హత: 10th, హిందీ మాట్లాడాలి, జీ॥18 వేలు+రూమ్, విజయనగరం జిల్లా గరివిడి కంపెనీలో డ్యూటీ. Ct. RSR ✆ 7702959468, 8790411889.

TOURS AND TRAVELS

K.S.N. శర్మ టూర్స్. రామేశ్వరం యాత్ర స్పెషల్. శ్రీశైలం, తిరుపతి, అరుణాచలం (గిరి) మొదలగు 23 ప్రదేశములు. ఈ నెల 13 వ తేది రాత్రి బయలుదేరును. Con.: K. సత్యనారాయణ 9440367464. P. సత్యనారాయణ 9948715355.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పెందుర్తి

తెరపై ఈనాడు

పెందుర్తి, న్యూస్‌టుడే

లక్ష్మీకాంత్ స్క్రీన్‌-1- **జురాసిక్ వరల్డ్** (మార్నింగ్, ఫస్ట్ షో), **కన్నప్ప** (మ్యాట్నీ, సెకండ్ షో) స్క్రీన్‌-2 - **తమ్ముడు**

సబ్బవరంలో సినిమా చిత్రీకరణ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో రజనీ కల్యాణం సినిమా చిత్రీకరణ మొదటి షెడ్యూలు పూర్తయినట్లు ఆ సినిమా డైరెక్టర్ రజనీ కల్యాణ్ తెలిపారు. రెండో షెడ్యూల్‌ను అంతకాపల్లి గ్రామంలో మండల మాజీ తెదేపా అధ్యక్షుడు మిడతాడ మహలక్ష్మి నాయుడు ఆదివారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈచిత్రంలో నటీనటులంతా కొత్త ఆర్టిస్టులేనని డైరెక్టర్ పేర్కొన్నారు.

నేటి నుంచి బీఎల్వోలకు శిక్షణ

పెందుర్తి, న్యూస్‌టుడే: భారత ఎన్నికల సంఘం, ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమొక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి బూత్ లెవల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పెందుర్తి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి పి.శేషశైలజ తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 299 మంది బీఎల్వోలు ఉండగా రోజుకు 50మంది చొప్పున బ్యాచ్‌లవారీగా శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఓటరు జాబితాల నిర్వహణ, ఎన్నికల ప్రక్రియపై ఏఈఆర్‌వోలు బీఎల్వోలకు శిక్షణ అందిస్తారని వివరించారు. పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో ప్రారంభించనున్న ఈ శిబిరం ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం నాయుడుపాలెం పంచాయతీ మెట్టపాలెంలోని మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడద వెంటాడుతోంది. -స్థానికులు. ✓: వెంటనే పరిశీలించి పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రత చర్యలు చేపడతాం. -ధర్మారావు, ఈవోపీఆర్డీ, పరవాడ

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం పంచాయతీ సాయినగర్ కాలనీలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. -ఎన్.గోపాల్, సాయినగర్‌కాలనీ, సబ్బవరం. ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతాం. -వై.రాజేశ్వరరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

?: పెదగొల్లలపాలెంలో చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించకుండా గెడ్డలో పడేస్తున్నారు. -స్థానికులు, గొల్లలపాలెం. ✓: ఇక మీదట వ్యర్థాలు గెడ్డలో పడేయకుండా తగిన చర్యలు తీసుకుంటాం. -చైతన్య, ఈవోపీఆర్డీ, సబ్బవరం

వేపగుంట, న్యూస్‌టుడే: ?: ప్రహ్లాదపురం సమీప పల్లినారాయణపురంలో భూగర్భ డ్రైనేజీ గోతులు ప్రమాదకరంగా మారాయి. -నీలకంఠరావు, పల్లినారాయణపురం. ✓: సంబంధిత విభాగం సిబ్బందితో పనులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. -హేమవతి, జోనల్ కమిషనర్

స్పందనకు వందనం

ఎట్టకేలకు వ్యర్థాల తొలగింపు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పెదముషిడివాడ పంచాయతీ నక్కవానిపాలెంలో పేరుకుపోయిన వ్యర్థాలను ఎట్టకేలకు తొలగించారు. ఇక్కడి కాలువల్లో చెత్త నిల్వల కారణంగా దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని ఇటీవల స్థానికులు 'ఈనాడు-మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో అధికారులు స్పందించారు. కాలువల్లోని పూడిక తీయించి శుభ్రత చర్యలు చేపట్టారు.

బోధన భేష్... ఫలితాలు అదుర్స్...

ప్రగతి పథంలో పెదముషిడివాడ జడ్పీ ఉన్నత పాఠశాల

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పెదముషిడివాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రగతి పథంలో పయనిస్తోంది. ఇక్కడ 6 నుంచి పదోతరగతి వరకు 320 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. నాణ్యమైన బోధనతోపాటు అధునాతన సైన్స్ ల్యాబ్‌లు, ఫర్నీచర్, విశాలమైన మైదానం తదితర వసతులు ఉన్నాయి. బాల బాలికలు వీటిని సద్వినియోగం చేసుకుని పదిలో ప్రతిభ చాటడమే కాక జిల్లాస్థాయి కబడ్డీ, ఖోఖో, సైన్స్ ఫెయిర్ పోటీల్లోనూ రాణిస్తూ ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంటున్నారు.

★ 2024-25 విద్యా సంవత్సరంలో 85 మంది పదో తరగతి పరీక్షలు రాయగా 83 మంది పాసై 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 34 మంది 500లకు పైగా మార్కులు సాధించారు. వీరిలో ఆర్సి వెంకటజయ 595, పల్లా అనుష్క 592, డి.మహేశ్వరి 585 మార్కులు సొంతం చేసుకుని కలెక్టరు, డీఈవో చేతులమీదుగా అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో 98శాతం, 2022-23లో 90 శాతం ఉత్తీర్ణత సాధించారు.

★ గత మూడేళ్ల కాలంలో ఈ పాఠశాల నుంచి ట్రిపుల్‌ఐటీకి 17 మంది ఎంపికయ్యారు. 2024-25 విద్యా సంవత్సరంలో వెంకటజయ, అనుష్క, మహేశ్వరి, సునందని, జె.రమ్య, పి.నరేంద్ర ట్రిపుల్‌ఐటీ ప్రవేశాలకు ఎంపికయ్యారు. 2023-24లో అయిదుగురు, 2022-23లో ఆరుగురు అర్హత సాధించినట్లు పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి.

★ కేంద్ర ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు ఏటా నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ ప్రతిభా పాటవ ఉపకార వేతన పరీక్షకు గత నాలుగేళ్ల కాలంలో 13మంది ఎంపికయ్యారు. 2024-25లో ఒకరు, 2023-24లో ఇద్దరు, 2022-23లో 5గురు, 2021-22లో ఐదుగురు అర్హత సాధించారు. వీరికి ఇంటర్మీడియట్ పూర్తయ్యేవరకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.12వేలు చొప్పున నాలుగేళ్లపాటు వీరి బ్యాంకు ఖాతాల్లో నగదు జమవుతుంది.

తరగతి గదిలో విద్యార్థులు

ఉపాధ్యాయుల సమష్టి కృషితో...

విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధించి వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నాం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఎన్‌ఎంఎంఎస్ ఉపకారవేతన పరీక్షకు ప్రత్యేక శిక్షణ, పదోతరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. ఉపాధ్యాయుల సమష్టి కృషితో చక్కటి ఫలితాలు సాధిస్తున్నాం. అన్ని వసతులతో స్థానికంగా ఈ పాఠశాల అందుబాటులో ఉన్నందున 6 నుంచి పదో తరగతి వరకు చదివే పిల్లలంతా వ్యయప్రయాసల కోర్చి దూరప్రాంతాలకు వెళ్లకుండా ఈ బడిని సద్వినియోగం చేసుకోవాలి.

-కె.కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు, పెదముషిడివాడ, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల

వైద్య శిబిరాలకు స్పందన

రక్తదానం చేస్తున్న యువకులు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం వంగలి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో రక్తదాన, ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. తానుల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో 50మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కంటి వైద్య శిబిరానికి 150 మంది రోగులు హాజరయ్యారు. వారికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. స్థానిక నాయకులు సహకరించారు.

బొగ్గు లారీ బోల్తా

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం సోమునాయుడుపాలెం సమీపంలో ఆదివారం ఓ లారీ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాలివీ.. గంగవరం పోర్టు నుంచి బొగ్గు లోడుతో పాలవలసలోని హిందూజా పవర్ ప్లాంటుకు వెళ్తున్న లారీ సోమునాయుడుపాలెం వద్దకొచ్చేసరికి అదుపు తప్పి బోల్తా పడింది. లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

11న కార్మికుల టోకెన్ సమ్మె

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగర పాలక సంస్థ మంచినీటి సరఫరా కార్మికుల వేతనాల పెంపు, బకాయి విడుదలకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో 11న టోకెన్ సమ్మె నిర్వహించి, 16 నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తామని గ్రేటర్ విశాఖ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు, ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యం తెలిపారు. ఇటీవల సమ్మె చేసినప్పుడు మేయర్ ఇచ్చిన హామీ మేరకు సమ్మె విరమించామని, 3వ తేదీ నాటికి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. నేటికీ ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. ఇదే అంశాన్ని మున్సిపల్‌శాఖ కమిషనర్, సంచాలకులు సంపత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లామని జీతాలని కార్మిక నాయకులు పేర్కొన్నారు.

వైకాపా నుంచి తెదేపాలో పలువురి చేరిక

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం వెన్నెలపాలెం గ్రామానికి చెందిన పలువురు వైకాపా నాయకులు ఆదివారం తెదేపాలో చేరారు. వారందరికీ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెదేపా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తెదేపాను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై తెదేపాలో చేరినట్లు వారు వెల్లడించారు.

పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

సంక్షేమానికి కూటమి పెద్దపీట

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక 74వ వార్డులో ఆదివారం సుపరిపాలన-తొలి అడుగు పేరుతో ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచిపెట్టారు.

ముగిసిన నృత్యోత్సవాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : నగరంలోని పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యభామ యువ నృత్యోత్సవాలు ఆదివారం ముగిశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తమిళనాడుకు చెందిన నివేదిత నరేష్‌కుమార్ భరతనాట్య ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దివ్యశ్రీ, జైష్యశ్రీరెడ్డి కూచిపూడి ప్రదర్శనతో సత్తా చాటారు. ప్రతిభ చూపిన వారికి సత్యభామ జాతీయ అవార్డుల పేరిట జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎంవీ.ప్రణవ్‌గోపాల్, నిర్వాహకులు బత్తిన విక్రమ్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడుకు చెందిన నివేదిత ప్రదర్శన

ఏయూ అతిథి అధ్యాపకుల్లో కలవరం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గత కొన్ని నెలలుగా అతిథి అధ్యాపకులు సహా అనుబంధ ఆచార్యులు, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, ఒప్పంద సహాయ ఆచార్యుల పోస్టుల తొలగింపునకు జరుగుతున్న ప్రచారం వాస్తవరూపం దాలుస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఏయూ అధ్యాపకులను వెనక్కి పంపారు. అలాగే ఒప్పంద సహాయ ఆచార్యులు అగ్రిమెంట్లపై సంతకాలు చేయాలన్న విషయం వివాదం కొనసాగుతోంది. తాజాగా తాత్కాలిక ప్రాతిపదికన (ఏదైనా కాలానికి) అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయడంతో వీళ్లంతా కలవరం చెందుతున్నారు.

సుమారు 400 మందిపై ప్రభావం: ఏయూ అధికారులు తాజాగా తీసుకున్న నిర్ణయం కారణంగా సుమారు 400 మంది అతిథి అధ్యాపకులు, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, ఒప్పంద సహాయ, అనుబంధ ఆచార్యులపై ప్రభావం పడనుంది. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న అతిథి అధ్యాపకులను గత ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తొలగించారు. వారంతా ఎన్నో పోరాటాలు చేసి నప్పటికీ విధుల్లోకి తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆచార్య ప్రసాదరెడ్డి వీసీ పదవికి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జి.శశిభూషణరావు ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యుల బృందం వీరందరికీ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని విధుల్లోకి తీసుకున్నారు. ఇప్పుడు వీరంతా బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని ఏయూ అతిథి అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సురేష్ మీనన్ పేర్కొన్నారు.

కొంతమంది స్వచ్ఛందంగానే బయటకు: ఏయూలో ఉత్తరాంధ్ర వాసులకే తొలి అవకాశం ఇవ్వాలని వీరంతా కోరుతున్నారు. వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ ప్రకటించడంతో దేశవ్యాప్తంగా ఎవరైనా వచ్చి చేరే అవకాశం ఉందని అంటున్నారు. ఇంజినీరింగ్ కళాశాలలో ఆచార్య ప్రసాదరెడ్డి సీట్లు భారీగా పెంచారు. దీంతో అదనపు ఫ్యాకల్టీని నియమించుకోవాల్సి వచ్చింది. వివిధ ప్రైవేటు కళాశాలల్లో పనిచేస్తున్న వారి అనుభవం గుర్తించి వారిని విధుల్లోకి తీసుకున్నారు. వారంతా ఎప్పటికైనా తమకు క్రమబద్ధీకరణ జరుగుతుందని ఆశించారు. గత కొన్ని రోజులుగా ఏయూలో జరుగుతున్న పరిణామాలు చూసిన తర్వాత వారిలో కొంత మంది స్వచ్ఛందంగా బయటకు వెళ్లిపోయారు. ఇన్నేళ్లు ఏయూనే నమ్ముకున్న తమను సాగనంపితే కుటుంబాలు వీధిన పడే పరిస్థితి వస్తుందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శునకాలకు యాంటీ రేబిస్ టీకాలు

పెందుర్తి, న్యూస్‌టుడే: ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెందుర్తి ప్రభుత్వ పశు వైద్యశాలలో ఉచిత యాంటీ రేబిస్ టీకాల ప్రక్రియ చేపట్టారు. ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వి.జగన్‌మోహన్‌రావు, సిబ్బంది 327 శునకాలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సబ్బవరం మండలంలో..

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలోని సబ్బవరం, ఆరిపాక, గుల్లేపల్లి, అంతకాపల్లి పశువైద్య కేంద్రాల్లో 97 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేసినట్లు సబ్బవరం ప్రాంతీయ పశు వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ కె.ఉషాకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం పశువుల ఆసుపత్రిలో శునకానికి యాంటీ రేబిస్ టీకా వేస్తున్న డాక్టర్ ఉషాకుమారి

గ్రామాల్లో 'ఇంటింటికీ తెదేపా'..

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలం వాలిమెరక జుత్తాడ గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ తెదేపా కార్యక్రమం జరిగింది. గ్రామంలోని 106, 107 పోలింగ్ బూత్‌ల పరిధిలో సీనియర్ నాయకులు కునిగంటి కనకరాజు, ఎర్ర సత్తిబాబు, ముదునూరి కిరణ్‌కుమార్ రాజు తదితరులు ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో కూటమి పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. నివాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పి.దేవుళ్లు, ఎస్.రాజు, వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వవార్డు పరిధి పెదపాలెంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చిలనాయుడు ఆధ్వర్యంలో తెదేపా శ్రేణులు ఇంటింటికీ తిరిగి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రినాథుడికి వైభవంగా స్వర్ణ తులసీదళార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీవరాహలక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం స్వర్ణ తులసీదళార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేతుడైన గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. బంగారు తులసీదళాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

బంగారు తులసీ దళాలతో స్వామిని పూజిస్తున్న అర్చకుడు

వేడుకగా రథోత్సవం

చింతలగ్రహారం(వేపగుంట), న్యూస్‌టుడే: చింతలగ్రహారంలో జగన్నాథస్వామి తిరుగు రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కృష్ణాలయ ప్రాంగణం నుంచి స్వామివారిని గ్రామంలోని రామాలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చి తిరిగి కృష్ణాలయం వద్దకు తీసుకువచ్చారు. ఉదయం స్వామివారు భక్తులకు కల్కి అవతారంలో దర్శనమిచ్చారు. అనంతరం జరిగిన రథోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కల్కి అవతారంలో జగన్నాథుడు

భక్తిశ్రద్ధలతో సహస్ర ఘటాభిషేకం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం గొర్లెవానిపాలెంలో ఉమారామలింగేశ్వర, లక్ష్మీ సత్యనారాయణస్వామి ఆలయంలో వేద మంత్రాల నడుమ సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త గొర్లి అచ్చింనాయుడు తదితరులు పాల్గొన్నారు. * సబ్బవరంలోని శ్రీకృష్ణ మందిరంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరాడ శ్రీనివాసరావు, పల్లా తాతారావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వేంకటాద్రిపై తొలి ఏకాదశి వైభవం

ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు

పెందుర్తి, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేంకటాద్రిపై కొలువుదీరిన శ్రీనివాసుడి సన్నిధి ఆదివారం భక్తజన సందోహంగా మారింది. అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు జరిపారు. ఈ సందర్భంగా స్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి సహస్రనామార్చన, ధూపదీప సేవలు చేపట్టారు.

★ పెందుర్తి మండలం రాంపురంలోని సాధనామం సమీప శ్రీరమా సత్యనారాయణ స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు మురళీశర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో దేవతామూర్తులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

10న గురు పౌర్ణమి ఉత్సవం

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: ఈ నెల 10వ తేదీన చినముషిడివాడ శ్రమశక్తినగర్ పోర్టుకాలనీ శిరిడీ సాయినాథుడి ఆలయంలో గురు పౌర్ణమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు కాలనీ అసోసియేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా 9వ తేదీన సాయంత్రం 5.30 గంటల నుంచి సాయిబాబా ఉత్సవ విగ్రహంతో 11 సార్లు ఆలయ ప్రదక్షిణ జరుగుతుందన్నారు. 10వ తేదీన ఉదయం క్షీరాభిషేకం తదితర ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అన్నసమారాధన ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా వెంకన్న గిరి ప్రదక్షిణ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఈ.బోనంగి ఫార్మాసిటీ పునరావాసకాలనీ కొండపై కొలువైన శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి ఆలయ గిరిప్రదక్షిణ ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరికృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో దేవతామూర్తులను తొలుత రథంపై ప్రతిష్ఠించారు. సాయంత్రం 4 గంటలకు గిరిప్రదక్షిణ స్వామివారి పాదాల వద్ద ప్రారంభమై తిరిగి అక్కడకు చేరుకోవడంతో పరిసమాప్తమైంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: రవినగర్ శేషాద్రి శిఖరంపై కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలిఏకాదశి పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శేషపాన్పుపై స్వామివారి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. 95వ వార్డు లక్ష్మీపురం పోర్టుకాలనీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.

మరిడిమాంబకు జేజేలు

వరలక్ష్మీనగర్(వేపగుంట), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వవార్డు వరలక్ష్మీనగర్ పరిసర ప్రాంతాల ఆరాధ్యదైవం మరిడిమాంబ అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా జరిగింది. సాయంత్రం పురవీధుల్లో ఊరేగింపు ఘనంగా చేపట్టాక రాత్రి అనుపోత్సవం నిర్వహించారు. కోలాటం తదితర ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్పొరేటర్ ముమ్మన దేముడు, పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, బండారు అప్పలనాయుడు తదితర నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పరవాడ: పరవాడ మండలం రావాడ పంచాయతీ జల్లెలపాలెం పరిసర ప్రజల ఆరాధ్య దేవత శ్రీమరిడిమాంబ అమ్మవారిని ఆదివారం శాకంబరి దేవిగా అలంకరించి పూజించారు.

భీమిలి యువతి అమెరికాలో దుర్మరణం

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భాజపా భీమిలి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు చిన్న కుమార్తె శివాన్విత (18) అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందారు. ఈమె కాలిఫోర్నియా రాష్ట్రంలో తన అక్కతో పాటు నివాసముంటోంది. అక్కడి యూనివర్సిటీలో బీఏ సైకాలజీ రెండో సంవత్సరం చదువుతూ పార్ట్‌టైం ఉద్యోగం చేస్తోంది. ఈమె ఉన్నత విద్యకోసం రెండేళ్ల కిందట అక్కడికి వెళ్లారు. రామానాయుడు కుటుంబం పదేళ్ల కిందట వరకూ అమెరికాలో ఉంటూ.. భీమిలి పరిసర నాలుగైదు మండలాల్లో తమ ప్రతినిధుల ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆ తర్వాత భీమిలికి వచ్చిన ఆయన 2024 ఎన్నికలకు ముందు భాజపాలో చేరారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆయన అమెరికాలోనే ఉన్నారు. రామానాయుడు స్వస్థలం విజయనగరం జిల్లా అన్నంరాజుపేట గ్రామం కాగా వీరి కుటుంబం భీమిలిలో స్థిరపడింది.

చందనం కొనుగోలుకు రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామికి సమర్పించేందుకు చందనం చెక్కల కొనుగోలుకు విజయవాడ కేదేశ్వరపేటకు చెందిన భక్తులు కేవీఎల్ హరినాథ్, కవిత దంపతులు రూ.1,00,001 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో ఆలయ పర్యవేక్షకుడు జీవీఎస్‌కే ప్రసాద్‌కు అందజేశారు. అధికారులు దాత కుటుంబానికి స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అప్పన్న సన్నిధిలో మాజీ మంత్రి కనుమూరి

సింహాచలం, న్యూస్‌టుడే: ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు ఆదివారం సతీసమేతంగా సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం అందజేశారు.

మహిళల సామూహిక పారాయణం

సింహాచలం, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరానికి చెందిన వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలు ఆదివారం సింహగిరిపై సామూహిక పారాయణం చేశారు. ట్రస్ట్ చీఫ్ డైరెక్టర్ సునీత కొఠారి నేతృత్వంలో విష్ణు సహస్రనామాలు, లక్ష్మీ నృసింహ కరావలంబం, అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కో-ఆర్డినేటర్లు మానేపల్లి లక్ష్మి, నాగలక్ష్మి, విజయ, రాధాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ మద్యం సీసాల కలకలం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం నాయుడుపాలెం పంచాయతీ బండారుపాలెం-గంగునాయుడుపాలెం రహదారి పక్కన ఆదివారం పలుచోట్ల గుట్టలుగా ఉన్న ఖాళీ మద్యం సీసాలు కలకలం రేపాయి. ఇటీవల పరవాడ కొత్తకాలనీలోని ఓ ఇంట్లో గుట్టుగా సాగుతున్న నకిలీ మద్యం తయారీని అధికారులు గుట్టు రట్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖాళీ సీసాల గుట్టలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. సబ్బవరం ఆబ్కారీ సీఐ అనిల్ కుమార్ వద్ద విషయం ప్రస్తావించగా ఖాళీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామని అన్నారు.

వెంకటాద్రినగర్‌లో సమస్యల తిష్ఠ

దర్పణం

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని సుజాతనగర్ సీ-2 జోన్ వెంకటాద్రినగర్ రెండవ వీధిలో పలు సమస్యలు తిష్ఠ వేశాయని నివాసితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీ ఏర్పడి ఏళ్లు గడిచిపోతున్నా మౌలిక వసతులు సమకూరడం లేదని వాపోతున్నారు. ఇక్కడి రెండో వీధిలో రోడ్లన్నీ గోతులమయం కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కా కాలువలు లేకపోవడంతో ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోయి దుర్వాసన, దోమల బెడద వెంటాడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీలో రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోయి పాములు, కీటకాల బెడద అధికంగా ఉంటోందని అంటున్నారు. ఇక్కడ వ్యక్తిగత గృహాలతో పాటు బహుళ అంతస్తు భవనాలు అధికమయ్యాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కనీస మౌలిక వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

కాలనీలోని ఓ రహదారి ఇలా..

కాలువ లేకపోవడంతో పేరుకుపోయిన మురుగు

నూతన కార్యవర్గం ఎన్నిక

కొత్తగా ఎన్నికైన సభ్యులు

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ 98వవార్డు సింహపురి లేఅవుట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షులుగా గోవిందరావు, ఉపాధ్యక్షులుగా సిరికినాయుడు, కోశాధికారిగా కొవ్వూరు జగన్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా పడాల ప్రవీణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా కన్నం వెంకటరమణారావు ఎంపికయ్యారు. సభ్యులుగా కె.ఈశ్వరరావు, జి.త్రినాథ్, జీవీవీ హరనాథ్, కె.నాగరాజు, రాఘురాజు; సలహాసంఘ సభ్యులుగా వర్మ, కనికిరెడ్డిలను ఎన్నుకున్నారు. మాజీ సలహాదారు శ్రీనివాసరావు నూతన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: నరవలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి ఆదివారం జరిగింది. స్థానిక పెద్దలు, యువకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీసెల్ అధ్యక్షుడు వంగలపూడి గణేశ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్: జురాసిక్ వరల్డ్- రీబర్త్
రాములమ్మ: మార్గాన్
డ్రాగన్, తాతా : కుబేర
సప్తగిరి : తమ్ముడు

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

మధురవాడ, న్యూస్‌టుడే: మధురవాడ ఉప విద్యుత్తు కేంద్రం పరిధిలోని రేవళ్లపాలెం ఫీడర్ మరమ్మతుల కారణంగా సోమవారం పలుచోట్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.శ్రీనివాసరావు, ఏఈ అల్లు శైలజ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వల్లీనగర్, చంద్రంపాలెం హైస్కూల్ ఏరియా, రేవళ్లపాలెం, పీఎంపాలెం పోలీసు స్టేషన్ పరిసరాలు, ఎంఎస్ఆర్ లేఅవుట్, భాస్కర్‌నగర్, నగరంపాలెం తదితర చోట్ల విద్యుత్తు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, నాయకులు, తదితరులు

ఆనందపురం, న్యూస్‌టుడే: మండలంలోని లొడగలవానిపాలెంలో ఉమా నారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 350 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో జనసేన భీమిలి ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు బమ్మిడి ఉమ, సూర్యనారాయణ దంపతులు, నిర్వాహకుడు శ్రీతారక్, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: తగరపువలస కూడలిలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. - తగరపువలస వాసులు ✓: విద్యుత్ తీగలను కిందకు వేలాడకుండా చర్యలు తీసుకుంటాం. - రవి, విద్యుత్ ఏఈ

?: తారకరామాలేఅవుట్ (రుషికొండ)లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. -నర్సింగరావు, రుషికొండ ✓: వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం.- కిశోర్, ఆరోగ్య అధికారి

?: అల్లూరి కూడలి (సాగర్‌నగర్) నుంచి బీచ్‌కు వెళ్లే దారిలో ఎక్కడికక్కడ వాహనాల పార్కింగ్‌తో ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - ప్రయాణికులు ✓: అనధికారి పార్కింగ్ వాహనాలపై కేసులు నమోదు చేస్తాం.-కె.వి.ఎస్.ఎన్. ప్రసాద్, ఆరిలోవ సీఐ

?: రుషికొండ కూడలిలో రోడ్డు సగ భాగం వరకు వాహనాలను నిలిపేస్తున్నారు. - రామకృష్ణ, రుషికొండ ✓:పరిశీలించి చర్యలు తీసుకుంటాం.-కె.వి.ఎస్.ఎన్.ప్రసాద్, ఆరిలోవ సీఐ

?: దుర్గానగర్ (ఎండాడ) ప్రధాన దారి పక్కన వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. - కాలనీవాసులు ✓: పరిసరాల శుభ్రతకు చర్యలు తీసుకుంటాం. - రవి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

స్పందనకు వందనం

పగటి వెలుగులు ఆగాయి

ఎండాడ, న్యూస్‌టుడే: 8వ వార్డు పరిధి సాగర్‌నగర్ ఎల్ఐజీ గృహ సముదాయంలో ఆరు నెలలుగా పగలూ విద్యుద్దీపాలు వెలుగుతున్నాయని 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఏఈ గాయత్రి తమ సిబ్బందితో చర్యలు చేపట్టి పగలు వెలగకుండా చర్యలు తీసుకున్నారు.

ఆహ్లాదం కనుమరుగు

అభివృద్ధికి నోచుకోని పార్కులు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: చిట్టివలస కొండపేటలోని అంబేడ్కర్ పార్కు, తగరపువలస సంతపేటలోని ఎన్టీఆర్ బాలల పార్కులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. 20 ఏళ్ల క్రితం రూ.25 లక్షలతో ఇక్కడ సౌకర్యాలు కల్పించారు. అయితే ప్రస్తుతం వాటి ఆనవాళ్లు కనిపించకుండా అధ్వానంగా దర్శనమిస్తున్నాయి.

★ **అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా:** చిట్టివలస రెవెన్యూ పరిధిలోని కొండపేట కొండపై అంబేడ్కర్ పార్కుకు వెళ్లేందుకు కొండపేట వాటర్ వర్క్స్ వైపు ఓ దారి, చిట్టివలస జడ్పీ ఉన్నత పాఠశాల వైపు మెట్ల మార్గం ఉంది. మెట్లు శిథిలమయ్యాయి. పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి.

పార్కుపేరు	విస్తీర్ణం	పరిసర జనాభా
ఎన్టీఆర్	1.92 ఎకరాలు	21 వేలు
అంబేడ్కర్	0.60 ఎకరాలు	17 వేలు

సిమెంటు పలకలు ధ్వంసమయ్యాయి. అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. దీంతో ఇక్కడ పార్కు ఉందనే భావన కలగటం లేదు.

★ **ఎన్టీఆర్ పార్కు వెలవెల:** తగరపువలస పట్టణ నడిబొడ్డున సంతపేటలో ఈ పార్కు ఉంది. పిల్లలు ఆటలాడేందుకు ఇనుప జారు బల్లలు, తూగు టుయ్యాలలు వంటివి అప్పట్లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తుప్పు పట్టి విరిగిపోవడంతో తీసేశారు. పార్కు ఆవరణం రాళ్లు, గొయ్యిలతో మారింది. చెట్లు, పచ్చిక, ఆహ్లాదకరమైన వాతావరణం మచ్చుకైనా లేదు. దీంతో పిల్లలు గాయాలపాలవుతున్నారు. కూర్చునేందుకు బల్ల కూడా లేదు.

చిట్టివలస కొండపేట అంబేడ్కర్ పార్కులో దుస్థితి

తగరపువలస సంతపేటలోని ఎన్టీఆర్ బాలల పార్కులో కానరాని ఆట వస్తువులు

★ **సదుపాయాలు కల్పించాలి:** పట్టణంలో నివసిస్తున్న మాలాంటి వారికి మనశ్శాంతిగా పదినిముషాలు కూర్చునే ప్రదేశం లేదు. పేరుకి రెండు పార్కులు ఉన్నాయి. అక్కడ ఒక్క సదుపాయమూ లేదు. పట్టణవాసులు ప్రశాంతంగా, ఆహ్లాదంగా గడిపేందుకు అనుకూలంగా ఇప్పటికైనా పార్కులను తీర్చిదిద్దాలి. - దుర్గా మురళి, (తగరపువలస వర్తక సంఘం అధ్యక్షుడు)

★ **ప్రతిపాదనలు చేస్తాం:** తగరపువలస, చిట్టివలసల్లోని పార్కుల అభివృద్ధికి గతంలోనే ప్రతిపాదనలు పంపించాం. మరోమారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. పార్కుల్లోని సమస్యలు, పరిస్థితులను పరిశీలించి వాటి అభివృద్ధికి సంబంధిత విభాగాల అధికారులతో కలిసి ప్రణాళిక రూపొందిస్తాం. - వి.అయ్యప్పనాయుడు (భీమిలి జోనల్ కమిషనర్)

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

మధురవాడ, న్యూస్‌టుడే: ఈ నెల 10న గురుపౌర్ణమి పురస్కరించుకుని హిందువులంతా జగద్గురువైన శ్రీకృష్ణ పరమాత్మను పూజించి తరించాలని త్రైత సిద్ధాంత - ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక విశాఖ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మధురవాడ పరిధి దుర్గానగర్ కాలనీలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. కమిటీ సభ్యులు మహాలక్ష్మి, మంగ, అప్పారావు, అప్పలనాయుడు, శ్యామ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గానగర్‌లో భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

చురుగ్గా పెంపుడు శునకాలకు టీకాలు

చంద్రంపాలెం పశు వైద్యశాలలో పెంపుడు శునకాలకు టీకాలు వేస్తున్న వైద్యాధికారిణి అనుపమ

కొమ్మాది, న్యూస్‌టుడే: ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధి సోకకుండా పెంపుడు శునకాలకు రక్షణగా యాంటీ రేబిస్ టీకాలను చంద్రంపాలెం పశువైద్యశాలలో ఆదివారం చురుగ్గా వేశారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకుని వైద్యాధికారిణి ఆర్.అనుపమ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. రేబిస్ సోకిన శునకాలు మనిషిని కరిస్తే మెదడు, వెన్నెముక, నాడీమండలం మీద ప్రభావం చూపిస్తుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ పెంపుడు శునకాలకు టీకాలు వేయించాలని సూచించారు.

భీమునిపట్నం, న్యూస్‌టుడే: పెంపుడు కుక్కలకు భీమిలి పశువైద్యశాలలో యాంటీ రేబిస్ టీకాలను పశువైద్యశాల సహాయ సంచాలకుడు డా.వి.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది టీకాలు వేశారు. శునకాల పెంపకంతో పాటు సంరక్షణ గురించి యజమానులకు అవగాహన కల్పించారు.

భీమిలి పశు వైద్యశాలలో...

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

కొమ్మాది, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ అఖిల భారత కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 9న జరగనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు సీఐటీయూ మధురవాడ జోన్ కమిటీ ఆధ్వర్యంలో కొమ్మాది కూడలి నుంచి కారు షెడ్డు కూడలి వరకు ఆదివారం ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు రైల్వే డీఆర్ఎం కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు భారీ ఎత్తున నిరసన ప్రదర్శన ఉంటుందన్నారు. సీఐటీయూ జోన్ అధ్యక్షుడు డి.అప్పలరాజు, పి.రాజ్‌కుమార్, ఎస్.రాంబాబు, డి.సింహాచలం, జి.కిరణ్, సీహెచ్.శేషుబాబు, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాదిలో ద్విచక్రవాహన ర్యాలీలో సీఐటీయూ నాయకులు

శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు ఎనలేనివి

శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భాజపా నాయకులు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: కేంద్ర మాజీ మంత్రి, జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని భాజపా యువ మోర్చా రాష్ట్ర నాయకులు, కోర్ కమిటీ సభ్యులు కె.ఎస్.పి.చక్రవర్తి అన్నారు. ఆరో వార్డు పరిధి పీఎంపాలెం ఆఖరిబస్టాప్ సమీపంలో భాజపా వార్డు అధ్యక్షుడు జి.ఆర్.ఎస్.ఎన్.రాజు అధ్యక్షతన ఆదివారం శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పెండ్యాల శ్రీనివాసరావు, శ్రీరాంకుమార్, జి.చంద్రశేఖర్‌రాజు, కె.రఘునాథ్, టి.వి.సూర్యం, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

కొమ్మాది, న్యూస్‌టుడే: గత ఐదేళ్లలో జరగని అభివృద్ధి.. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే చేసి చూపించిందని తెదేపా 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత పేర్కొన్నారు. 5వ వార్డు సాయిరాంకాలనీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్నక్యాంటీన్ల ఏర్పాటు, తల్లికి వందనంతో పాటు వార్డులో రూ.6 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, కొండపురాజు, తదితరులు పాల్గొన్నారు.

సాయిరాంకాలనీ ఫేజ్-3లో కరపత్రాలను అందజేస్తున్న తెదేపా నాయకులు

కల్యాణ మండపాల పునర్నిర్మాణ పనులకు శ్రీకారం

సాయిరాంకాలనీలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, తెదేపా నాయకులు

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 5, 6 వార్డుల పరిధి కొమ్మాది, సాయిరాంకాలనీలో రూ.1.63 కోట్ల జీవీఎంసీ నిధులతో రెండు కల్యాణ మండపాలకు పునర్నిర్మాణ పనులను కార్పొరేటర్ మొల్లి హేమలత ఆదివారం ప్రారంభించారు. గత ఐదేళ్లు అసంపూర్తిగా ఈ నిర్మాణాలు నిలిచాయి. వీటికి గత తెదేపా ప్రభుత్వంలో రూ.1.30 కోట్లు కేటాయించారు. ఆయా కల్యాణ మండపాల పరిస్థితిపై పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. దీంతో జీవీఎంసీ నిధులు కేటాయించి రెండు చోట్ల పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. తెదేపా రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, విశాఖ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షులు వాండ్రాసి అప్పలరాజు, జి.యోగేశ్వరరావు, బొడ్డేపల్లి రంగారావు, కురుమోజు గోవిందరావు, ఎం.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో బాలిక ప్రతిభ

మధురవాడ, న్యూస్‌టుడే: నగరంలో 11వ సత్యభామ యూనివర్సల్‌స్టార్ పేటిక నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (ఎన్ఎండీఏ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఆల్ ఇండియా ఒలింపియాడ్ -2025 పోటీల్లో మధురవాడ ప్రాంతానికి చెందిన సాయి జైస్యశ్రీరెడ్డి ప్రతిభ చాటింది. జూనియర్ విభాగంలో అత్యుత్తమ నృత్య ప్రదర్శనతో ప్రథమస్థానం దక్కించుకుంది. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహక ప్రతినిధులు, ముఖ్య అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికతో పాటు 'సత్యభామ బాల పురస్కార్-2025' అవార్డును బాలిక అందుకుంది. నెల రోజుల క్రితం భరత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన కూచిపూడి కల్యాణం మహాబృంద నాట్యప్రదర్శనలో పాల్గొని 'గిన్నిస్ ప్రపంచ రికార్డు'ను కైవసం చేసుకుంది.

జ్ఞాపిక అందుకుంటున్న జైస్యశ్రీరెడ్డి

రుషికొండ బీచ్‌లో సందర్శకుల సందడి

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్‌ ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు తరలి రావడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. కోస్టల్ సెక్యూరిటీ పోలీసు టవర్, శివాలయం, మత్స్యకారుల పార్కు, టూరిజం కాటేజీలు, బీచ్‌రోడ్ కంట్రోల్ రూం సమీప ఇసుక తిన్నెలు వంటి ఆహ్లాదకర ప్రదేశాల్లో సంతోషాల నడుమ ఉత్సాహంగా గడిపారు. సముద్ర స్నానాలు చేసే వారిని లోపలికి వెళ్లకుండా ఏపీటీడీసీ బ్లూఫ్లాగ్ బీచ్, జీవీఎంసీ లైఫ్ గార్డులు, మెరైన్ పోలీసులు ప్రచార మాధ్యమాల ద్వారా అప్రమత్తం చేశారు.

తీరంలో సందర్శకులు

తెదేపా కార్యకర్త మృతి

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలికి చెందిన తెదేపా కార్యకర్త దాసరి వేణుగోపాల రావు (88) ఆదివారం మృతి చెందారు. పార్టీ ఆవిర్భావం నుంచి అంకితభావం కలిగిన కార్యకర్తగా కొనసాగారు. కొంతకాలం భీమిలి గ్రామదేవత నూకాలమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యునిగా సేవలు అందించారు. ఆయన మృతి పట్ల తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

రైళ్ల గమ్యస్థానాల కుదింపు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: కొరాపుట్- కిరండూల్ రైలు మార్గం పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో పలు రైళ్ల గమ్యాలు కుదించనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 7న విశాఖ- కిరండూల్ (18515), 8న కిరండూల్- విశాఖ (18516) ఎక్స్‌ప్రెస్ రైళ్లు కొరాపుట్ వరకు రాకపోకలు సాగిస్తాయి. భువనేశ్వర్- జగదల్‌పూర్ (18447), రూర్కెలా- జగదల్‌పూర్ (18108), జగదల్‌పూర్- భువనేశ్వర్ (18448), జగదల్‌పూర్- రూర్కెలా (18108) ఇంటర్ సిటీ రైళ్లు కొరాపుట్ నుంచి రాకపోకలు సాగించనున్నాయి.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

కొమ్మాది, న్యూస్‌టుడే: కొమ్మాది అన్నంరాజు నగర్‌లో కొలువైన శ్రీఅష్టలక్ష్మీదేవాలయంలో తొలి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తిశ్రీధర్‌స్వామి నేతృత్వంలో శ్రీలక్ష్మీనారాయణస్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించి తులసీమాలలతో ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఆలయ ధర్మకర్తలు సత్యనారాయణమూర్తి, రమాదేవి దంపతులతో పాటు అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొమ్మాదిలో లక్ష్మీనారాయణస్వామి

భీమిలిలో కల్యాణ వేంకటేశ్వరుడు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలో ఆషాఢ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ఆదివారం స్వామి వారికి లక్షతులసి పూజలను నిర్వహించారు. కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో దేవాలయ సంక్షేమ సంఘం ప్రతినిధులు జి.అప్పలనాయుడు, ఎం.సత్యానందరావు, కె.ముత్యాలరావు ఆధ్వర్యంలో.. అలాగే ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ట్రస్టీలు కె.శ్రీరామచంద్రమూర్తి, కె.సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం క్షేత్రంలో కొలువై ఉన్న అనంత పద్మనాభ స్వామి వారి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. కొండపైన ఉన్న శ్రీఅనంత పద్మనాభ స్వామి, కొండ దిగువున ఉన్న కుంతీమాధవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

శాకంబరిగా లలితాంబికాదేవి

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఆరో వార్డు హెచ్‌పీసీఎల్ లేఅవుట్‌లో కొలువై ఉన్న లలితాంబిక అమ్మవారు ఆదివారం శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో సుందరంగా అలంకరించారు.

ఘనంగా జగన్నాథుని తిరుగు రథోత్సవం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలో జరుగుతున్న జగన్నాథ కల్యాణ రథోత్సవాలను పురస్కరించుకుని చివరి రోజైన ఆదివారం పట్టణంలో తిరుగు రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇంద్రద్యుమ్న మందిరంలో కొలువైన జగన్నాథుని ఉదయం విష్ణుమూర్తి శేషశయన రూపంలో అలంకరించారు. సాయంత్రం సుభద్ర బలభద్ర జగన్నాథులను రథంపై అధిష్ఠింపజేశారు. పెద్దబజారు నుంచి గంటస్తంభం, సెయింట్ ఆన్స్ హైస్కూలు రోడ్డులో చిన్నబజారు వరకు రథయాత్ర సాగింది.

సింహాద్రినాథుడికి వైభవంగా స్వర్ణ తులసీదళార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామికి ఆదివారం స్వర్ణ తులసీదళార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేతుడైన గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు తులసీదళాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

బంగారు తులసీ దళాలతో స్వామిని పూజిస్తున్న అర్చక స్వామి

నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తజనం

చందనం కొనుగోలుకు రూ.లక్ష విరాళం

దాత హరినాథ్‌కు విరాళం రసీదు అందిస్తున్న పర్యవేక్షకుడు ప్రసాద్

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామికి సమర్పించేందుకు చందనం చెక్కల కొనుగోలుకు విజయవాడ కేదేశ్వరపేటకు చెందిన భక్తులు కేవీఎల్ హరినాథ్, కవిత దంపతులు రూ.1,00,001 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో ఆలయ పర్యవేక్షకుడు జీవీఎస్‌కే ప్రసాద్‌కు అందజేశారు. అధికారులు దాత కుటుంబానికి స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అప్పన్న సన్నిధిలో మాజీ మంత్రి కనుమూరి

సింహాచలం, న్యూస్‌టుడే: ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు ఆదివారం సతీసమేతంగా సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం అందజేశారు.

కప్పస్తంభం వద్ద మొక్కుతున్న మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు దంపతులు

అప్పన్న స్వామికి బంగారు పుష్పం బహూకరణ

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామికి అనకాపల్లి మండలం సిరసపల్లి గ్రామానికి చెందిన భక్తుడు అల్లవరపు త్రిమూర్తులు దంపతులు 17.500 గ్రాముల బరువైన బంగారు పుష్పాన్ని బహూకరించారు. ఆదివారం సింహగిరిపై ఈవో వేంద్ర త్రినాథరావుకు పుష్పాన్ని అందజేశారు. అధికారులు దాత కుటుంబానికి స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఈవో త్రినాథరావుకు బంగారు పుష్పాన్ని అందిస్తున్న దాత త్రిమూర్తులు కుటుంబం

మహిళల సామూహిక పారాయణలు

సింహాచలం, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరానికి చెందిన వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలు ఆదివారం సింహగిరిపై సామూహిక పారాయణలు చేశారు. ట్రస్ట్ చీఫ్ డైరెక్టర్ సునీత కొఠారి నేతృత్వంలో విష్ణు సహస్రనామాలు, లక్ష్మీ నృసింహ కరావలంబం, అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కో-ఆర్డినేటర్లు మానేపల్లి లక్ష్మి, నాగలక్ష్మి, విజయ, రాధాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై సామూహిక పారాయణలు చేస్తున్న మహిళలు

భీమిలి యువతి అమెరికాలో దుర్మరణం

శివాన్విత (పాతచిత్రం)

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భాజపా భీమిలి నియోజకవర్గం కో-ఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు చిన్న కుమార్తె శివాన్విత (18) అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందారు. ఈమె కాలిఫోర్నియా రాష్ట్రంలో తన అక్కతో పాటు నివాసముంటూ శాండీయాగో యూనివర్సిటీలో బీఏ సైకాలజీ రెండో సంవత్సరం చదువుతూ పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నారు. ఈమె ఉన్నత విద్యకోసం రెండేళ్ల కిందట అక్కడికి వెళ్లారు. రామానాయుడు కుటుంబం పదేళ్ల కిందట వరకూ అమెరికాలో ఉంటూ భీమిలి పరిసర నాలుగైదు మండలాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆ తర్వాత భీమిలికి వచ్చిన ఆయన 2024 ఎన్నికలకు ముందు భాజపాలో చేరారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆయన అమెరికాలోనే ఉన్నారు. రామానాయుడు స్వస్థలం విజయనగరం జిల్లా అన్నంరాజుపేట గ్రామం కాగా వీరి కుటుంబం భీమిలిలో స్థిరపడింది.

జూదరుల అరెస్టు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఆరో వార్డు కొమ్మాది శివారు ప్రాంతంలో జనావాసాలు లేని ఓ లేఅవుట్‌లో జరుగుతున్న జూద శిబిరంపై ఆదివారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని పీఎంపాలెం స్టేషన్‌కు తరలించారు. సీఐ జి.బాలకృష్ణ కేసు నమోదు చేశారు. వీరి నుంచి రూ.43 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలో జూదమాడుతున్న ఏడుగురిని విశాఖ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేసి రూ.2.51 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. భీమిలి మినీస్టేడియం ఎదుట ఉన్న అపార్టుమెంట్‌లో జూదమాడుతున్నట్లు వచ్చిన సమాచారంతో సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. కేసును భీమిలి స్టేషన్‌కు అప్పగించారు.

'ఎన్ఎంఎంఎస్'కు ఉచిత శిక్షణ

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ (ఎఫ్ఈఎస్) ఆధ్వర్యంలో జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) 2025-26 బ్యాచ్‌కు ఉచిత శిక్షణ తరగతులు చిట్టివలస జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు బృందంగా ఏర్పడి నిర్వహిస్తున్న ఎఫ్ఈఎస్ ఏటా ఎందరో పేద విద్యార్థులకు శిక్షణ ఇస్తూ ఉపకార వేతనాలను సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం గతేడాది ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన వారిని, ఐఐఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో భీమిలి మండల విద్యాశాఖాధికారిణి ఎం.శివరాణి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, ప్రతినిధులు పొట్నూరు మురళీమోహనరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు, విద్యార్థులు, సొసైటీ ప్రతినిధులు

మొకరకు ఘన నివాళి

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలో పలు ప్రభుత్వ పదవులను నిర్వహించి వాటికి వన్నెతెచ్చిన దివంగత మొకర నారాయణరావు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. భీమిలి కాళ్లవీధి జంక్షన్‌లో ఉన్న ఆయన విగ్రహానికి తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, రాష్ట్ర నాగవంశ సంఘం అధ్యక్షుడు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు గాడు అప్పలనాయుడు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. తెదేపా నాయకులు చురకల రమణ, మారోజు సంజీవ్‌కుమార్, నాగవంశ సంక్షేమ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణరావు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న తెదేపా, నాగవంశ సంక్షేమ సంఘం నాయకులు

(c) eenadu

విశాఖ తూర్పు

రైళ్ల గమ్యస్థానాల కుదింపు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : కొరాపుట్-కిరండూల్ రైలు మార్గం పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో పలు రైళ్ల గమ్యాలు కుదించనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 7న విశాఖ- కిరండూల్ (18515), 8న కిరండూల్-విశాఖ (18516) ఎక్స్‌ప్రెస్ రైళ్లు కొరాపుట్ వరకు రాకపోకలు సాగిస్తాయి. భువనేశ్వర్-జగదల్‌పూర్ (18447), రూర్కెలా- జగదల్‌పూర్ (18108), జగదల్‌పూర్- భువనేశ్వర్ (18448), జగదల్‌పూర్- రూర్కెలా (18108) ఇంటర్ సిటీ రైళ్లు కొరాపుట్ నుంచి రాకపోకలు సాగించనున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
ఎంవీపీ కాలనీ: 8008574768
మద్దిలపాలెం: 9912120229

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెం తాడ్ల పోచారాయ కల్యాణ మండపం సమీప రహదారిపై వ్యర్థాలు పేరుకుపోయాయి. - కుమార్, శివాజీపాలెం. ✓: తక్షణమే సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం. -శ్రీనివాస్, వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: ఏడో వార్డు రాజీవ్‌నగర్, వెటర్నరీకాలనీ లక్ష్మీనారాయణ దేవాలయానికి వెళ్లే అంతర్గత రహదారిలో గోతులు పడి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. -నిర్మలకుమారి, గృహిణి, ఇందిరానగర్. ✓: నిధులు విడుదల కాగానే రహదారి నిర్మిస్తాం. -వెంకటరావు, వర్క్స్ ఏఈ

విశాలాక్షినగర్ న్యూస్‌టుడే: ?: విశాలాక్షినగర్ సమీప కనకమహాలక్ష్మినగర్, గీతాంజలి ఫంక్షన్ హాల్ వీధిలో కుక్కలు అధికమయ్యాయి. వాహనాల వెనుకపడి దాడి చేయడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. - భీమారావు, విశాలాక్షినగర్ ✓: వీధి కుక్కలను పట్టుకునే వాహనాన్ని పంపించి సమస్య పరిష్కరిస్తాం. - డాక్టర్ ఎన్.కోరికుమార్, పశుసంవర్ధక అధికారి

స్పందనకు వందనం

యూజీడీ లీకును అరికట్టారు: విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: జోడుగుళ్లపాలెంలో తరచూ భూగర్భ డ్రైనేజీ లీకవుతుండటంతో దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై 'ఈనాడు మేమున్నాం మీకు తోడుగా' శీర్షికలో ఆదివారం ప్రచురించిన వార్తకు ఏఈ శ్రీనివాస్ స్పందించారు. సిబ్బందిని ఆదేశించి సమస్యను పరిష్కరించేలా చేశారు.

అ వీ ఇ వీ

మాధవ్‌కు అభినందనలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పీవీఎన్.మాధవ్‌ను ఆదివారం తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ.రామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం పిఠాపురంకాలనీలోని మాధవ్ నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి, అభినందనలు తెలిపారు.

మహిళలకు చీరల పంపిణీ

ఆటోమోటివ్(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం మద్దిలపాలెంలోని వైకాపా కార్యాలయంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ విశాఖ సౌత్ నూతన కార్యవర్గం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ విశాఖపట్నం సౌత్ నూతన కార్యవర్గానికి ఆదివారం సిరిపురంలో ఎన్నికలు నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా శివకుమార్ రెడ్డి ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా ఆర్.వి.రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా పి.ప్రభాకర్‌తో పాటు మరికొందరు సభ్యులను ఎన్నుకున్నారు. ఆచార్య వి.సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆచార్య తిమ్మారెడ్డి, రోటరీ పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఛాయాదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామసేవా సంఘ సభ్యుల శ్రమదానం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరు హిడెన్‌స్ప్రౌట్స్ సంస్థ సమీప ఖాళీ స్థలంలో గ్రామ సేవా సంఘం సభ్యులు శ్రమదానం చేశారు. ఇటీవల ఈ స్థలాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు స్థానికుల కోసం కేటాయించడంతో జిమ్, వాకింగ్ ట్రాక్ తదితరాల ఏర్పాటుకు జీవీఎంసీ సిద్ధం చేస్తోంది. సంబంధిత స్థలం పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా ఉన్నందున ఆదివారం ఉదయం గ్రామ సేవా సంఘం సభ్యులు వాటిని తొలగించారు.

ముగిసిన నృత్యోత్సవాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : నగరంలోని పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యభామ యువ నృత్యోత్సవాలు ఆదివారం ముగిశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తమిళనాడుకు చెందిన **నివేదిత సతీష్‌కుమార్** భరతనాట్య ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దివ్యశ్రీ, జైష్యశ్రీరెడ్డి కూచిపూడి ప్రదర్శనతో సత్తా చాటారు. ప్రతిభ చూపిన వారికి సత్యభామ జాతీయ అవార్డులు పేరిట జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎంవీ.ప్రణవ్‌గోపాల్, నిర్వాహకులు బత్తిన విక్రమ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశక్తి పీఠం సందర్శన

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 14వ వార్డు గణేశ్‌నగర్‌లోని శ్రీశక్తి పీఠాన్ని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ సందర్శించారు. ఆదివారం ఉదయం పీఠంలోని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం పీఠాధిపతి కాకరపర్తి సత్యనారాయణమూర్తి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో భాజపా విశాఖ అధ్యక్షులు పరశురామ రాజు, శ్రీ గణేష్ సేవా సంఘం అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న స్వామికి బంగారు పుష్పం బహూకరణ

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామికి అనకాపల్లి మండలం సిరసపల్లి గ్రామానికి చెందిన త్రిపుర్ల అల్లవరపు త్రిమూర్తులు దంపతులు 17.500 గ్రాముల బరువైన బంగారు పుష్పాన్ని బహూకరించారు. ఆదివారం సింహగిరిపై ఈవో వేంకటేశ్వర త్రినాథరావుకు పుష్పాన్ని అందజేశారు. అధికారులు దాత కుటుంబానికి స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఈవో త్రినాథరావుకు బంగారు పుష్పాన్ని అందిస్తున్న దాత త్రిమూర్తులు కుటుంబం

అందని పనిముట్లు.. తప్పని ఇక్కట్లు..!

మద్దిలపాలెం, న్యూస్‌టుడే

జీవీఎంసీ జోన్-3 పరిధిలో పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన పనిముట్లు సరఫరా చేయకపోవడంతో పలువురు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. జోన్ పరిధిలో మొత్తం 14 వార్డులు ఉండగా, 701 మంది సిబ్బంది పని చేస్తున్నారు.

కాలువలు, గెడ్డలు అధ్వానం: విధులకు అవసరమైన పరికరాలు లేకపోవడంతో చాలా ప్రాంతాల్లోని గెడ్డలు, కాలువల్లో పూడికలు తొలగించడం లేదు. దీంతో తీవ్ర దుర్వాసన, దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రక్షణ పరికరాలు లేకుండానే విధులు నిర్వహిస్తుండటంతో ప్రతి వార్డులోనూ ఇద్దరు, ముగ్గురు కార్మికులు అనారోగ్యం బారిన పడి సెలవులు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి... అవసరమైన పరికరాలు సరఫరా చేయాలని సిబ్బంది కోరుతున్నారు.

చెత్త తరలించే రిక్షా ఇలా..

రక్షణ పరికరాలు లేకుండానే పనులు చేస్తున్న సిబ్బంది

త్వరలోనే అందిస్తాం..

కార్మికులకు కొబ్బరి నూనె, కొబ్బరిచీపుళ్లు వంటివి అందజేశాం. మిగిలిన సామగ్రి పంపిణీకి సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, త్వరలోనే పనిముట్లు అందిస్తాం. -బి.ప్రసాదరావు, జోన్-3 సహాయ వైద్యాధికారి

ఇదీ పరిస్థితి..!

★ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో కొబ్బరిచీపుళ్లు, సబ్బులు, కొబ్బరి నూనె అందజేశారు. ఆ తర్వాత వాటి సరఫరా నిలిచిపోయింది. ★ కార్మికులకు బూట్లు, గ్లౌజులు, మాస్కులు, శానిటైజర్, పాద రక్షకులతో పాటు, చెత్తబుట్టలు, పారలు, కొంకేలు, తోపుడుబళ్లు.. తదితర సామగ్రి అందించాల్సి ఉంటుంది. ★ జోన్-3 పరిధిలో కీలకమైన ప్రాంతాలు ఉండటంతో... ఏ ముఖ్య కార్యక్రమమైనా ఇక్కడే నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో సరైన పనిముట్లు లేకపోవడంతో శుభ్రత పనులు చేపట్టడం కష్టతరంగా ఉంటోందని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

11న కార్మికుల టోకెన్ సమ్మె

కార్పొరేషన్, న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థ మంచినీటి సరఫరా కార్మికుల వేతనాల పెంపు, బకాయిల విడుదలకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో 11న టోకెన్ సమ్మె నిర్వహించి, 16 నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తామని గ్రేటర్ విశాఖ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు, ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యం తెలిపారు. ఇటీవల సమ్మె చేసినప్పుడు మేయర్ ఇచ్చిన హామీ మేరకు సమ్మె విరమించామని, 3వ తేదీ నాటికి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పినా.. నేటికీ ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. ఇదే అంశాన్ని మున్సిపల్‌శాఖ కమిషనర్, సంచాలకులు సంపత్‌కుమార్‌కు లేఖ ద్వారా తెలియజేశామని కార్మిక నాయకులు పేర్కొన్నారు.

తవ్వేశారు.. వదిలేశారు..

దర్పణం

ముడసర్లోవ రిజర్వాయర్ చివరి ప్రాంతంలోని రహదారిని తవ్వి వదిలేశారిలా..

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: హనుమంతువాక నుంచి ముడసర్లోవ వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రహదారిలో పలుచోట్ల గోతులు పడటంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి ఎదురుగా ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద, పాత పండలు ఫారం పోలమాంబ ఆలయం, పెదగదిలి, చినగదిలి సాయిబాబా దేవాలయాల వద్ద, ముడసర్లోవ రిజర్వాయర్ వద్ద గోతులు అధికంగా ఉన్నాయి. మరోవైపు తాగునీటి పైపుల ఏర్పాటు కోసం రహదారిని తవ్వి అలాగే వదిలేశారు. దీంతో అవస్థలు రెట్టింపయ్యాయని స్థానికులు వాపోతున్నారు. మరో మూడు రోజుల్లో గిరి ప్రదక్షిణ ఉన్న నేపథ్యంలో గోతులు పూడ్చి సమస్య లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఎక్కడి వ్యర్థాలు అక్కడే..!

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఎంవీపీకాలనీలోని పలు వీధుల్లోని ఫుట్‌పాత్‌లు, ఖాళీ ప్రదేశాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్త పారబోస్తున్నారు. దీంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని చుట్టుపక్కల నివాసితులు వాపోతున్నారు. తితిదే కల్యాణ మండపం ఎదురు నారాయణ టెక్నో స్కూల్ వీధి, రైతుబజారు ఎదురు వీధి, రైతుబజారు కూడలి, పార్వతి మక్కేశ్వర ఆలయం వద్ద కొంతమంది రాత్రి సమయాల్లో గుట్టుచప్పుడు కాకుండా భవన నిర్మాణ వ్యర్థాలు పోసేసి వెళ్లిపోతున్నారు. తక్షణం వాటిని తొలగించి ఇకపై మళ్లీ వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎంవీపీకాలనీ నారాయణ టెక్నో స్కూల్ వీధిలో వ్యర్థాలు

ఏయూ అతిథి అధ్యాపకుల్లో కలవరం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గత కొన్ని నెలలుగా అతిథి అధ్యాపకులు సహా అనుబంధ ఆచార్యులు, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, ఒప్పంద సహాయ ఆచార్యుల పోస్టులను తొలగిస్తారంటూ జరుగుతున్న ప్రచారం కార్యరూపంలోకి వస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఏయూడెడ్ అధ్యాపకులను వెనక్కి సాగనంపారు. అలాగే ఒప్పంద సహాయ ఆచార్యుల అగ్రిమెంట్లపై సంతకాలు చేయాలన్న వివాదం కొనసాగుతోంది. తాజాగా తాత్కాలిక ప్రాతిపదికన(ఏడాది కాలానికి) అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయడంతో వీళ్లందరిలో కలవరం నెలకొంది.

సుమారు 400 మందిపై ప్రభావం: ఏయూ అధికారులు తాజాగా తీసుకున్న నిర్ణయం కారణంగా సుమారు 400 మంది అతిథి అధ్యాపకులు, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, ఒప్పంద సహాయ, అనుబంధ ఆచార్యులపై ప్రభావం పడనుంది. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న అతిథి అధ్యాపకులను గత ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తొలగించారు. వారంతా ఎన్నో పోరాటాలు చేసినప్పటికీ విధుల్లోకి తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆచార్య ప్రసాదరెడ్డి వీసీ పదవికి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి బాధ్యతలు చేపట్టిన ఆచార్య జి.శశిభూషణరావు ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యుల బృందం వీరందరికీ ఇంటర్వ్యూలు నిర్వహించి తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. ఇప్పుడు వీరంతా బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని ఏయూ అతిథి అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సురేష్ మీనన్ పేర్కొన్నారు.

కొంతమంది స్వచ్ఛందంగానే బయటకు: ఏయూలో ఉత్తరాంధ్ర వాసులకే తొలి అవకాశం ఇవ్వాలని వీరంతా కోరుతున్నారు. వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ ప్రకటించడంతో దేశవ్యాప్తంగా ఎవరైనా వచ్చి చేరే అవకాశం ఉందని అంటున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో ఆచార్య ప్రసాదరెడ్డి సీట్లు భారీగా పెంచారు. దీంతో అవసరం మేరకు ఫ్యాకల్టీని నియమించుకోవాల్సి వచ్చింది. వివిధ ప్రైవేటు కళాశాలల్లో పనిచేస్తున్న వారి అనుభవం గుర్తించి వారిని విధుల్లోకి తీసుకున్నారు. వారంతా ఇప్పటికే తమకు క్రమబద్ధీకరణ జరుగుతుందని ఆశించారు. గత కొన్ని రోజులుగా ఏయూలో జరుగుతున్న పరిణామాలు చూసిన తర్వాత వారిలో కొంతమంది స్వచ్ఛందంగా బయటకు వెళ్లిపోయారు. ఇన్నేళ్లు ఏయూనే నమ్ముకున్న తమను సాగనంపితే కుటుంబాలు వీధిన పడే పరిస్థితి వస్తుందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన 'వినోదాల విందు'

సీతంపేట, న్యూస్‌టుడే: (రెన్స్) కామెడీ క్లబ్(విశాఖపట్నం, హైదరాబాద్) సంస్థ ప్రతినిధులు నిర్వహించిన 'వినోదాల విందు' లఘునాటికల కార్యక్రమం ఆదివారం సాయంత్రం విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాశ్, డేవిడ్ రాజు, పోర్టు శేషు, కుమారి, నాయుడు, రామానుజం, భానుప్రకాశ్, సూర్యం, శివజ్యోతి తదితర హాస్యనటుల నటన ఆహూతులను అలరించింది. స్విమ్మింగ్ పూల్, జామచెట్టు, తాగుబోతు, కోడిపందేలు, డాక్టర్ - పేషెంట్, డ్రైవర్ జాబ్, ప్రశాంతత, 2000 నోటు తదితర లఘునాటికలు ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డ్రీమ్ షెల్టర్స్ అధినేత రవిశంకర్, తిలక పట్నాయక్, సన్‌మూర్తి, బి.మాల్యాద్రి తదితరులు పాల్గొని కళాకారులకు మెమోంటోలు అందించారు.

లఘునాటికలో ఒక సన్నివేశం

రాత పుస్తకాల అందజేత

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : విశాఖ జిల్లా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎంవీపీకాలనీలోని గిరిజన ప్రభుత్వ బాలికల వసతి గృహం విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ చేశారు. సంఘాల నాయకులు రామలింగం, ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సభ్యులు దేవేశ్వరరావు, కృష్ణ, అప్పలరాజు, శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

యూజీడీ పనులకు శంకుస్థాపన

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరు కల్యాణమండపం నుంచి హిడెన్‌స్ప్రౌట్స్ సంస్థ వరకు సుమారు వంద మీటర్ల మేర భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనులకు ఆదివారం తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ సుమారు రూ.18 లక్షల జీవీఎంసీ నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ గేదెల లావణ్య, నాయకులు బైరెడ్డి పోతన్నరెడ్డి, గేదెల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజలో పాల్గొన్న స్థానిక తెదేపా నాయకులు

భీమిలి యువతి అమెరికాలో దుర్మరణం

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భాజపా భీమిలి నియోజకవర్గం కో-ఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు చిన్న కుమార్తె శివాన్విత (18) అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందారు. ఈమె కాలిఫోర్నియా రాష్ట్రంలో తన అక్కతో పాటు నివాసముంటూ శాండీయాగో యూనివర్సిటీలో బీఎ సైకాలజీ రెండో సంవత్సరం చదువుతూ పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నారు. ఈమె ఉన్నత విద్యకోసం రెండేళ్ల కిందట అక్కడికి వెళ్లారు. రామానాయుడు కుటుంబం పదేళ్ల కిందట వరకూ అమెరికాలో ఉంటూ భీమిలి పరిసర నాలుగైదు మండలాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆ తర్వాత భీమిలికి వచ్చిన ఆయన 2024 ఎన్నికలకు ముందు భాజపాలో చేరారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆయన అమెరికాలోనే ఉన్నారు. రామానాయుడు స్వస్థలం విజయనగరం జిల్లా అన్నంరాజుపేట గ్రామం కాగా వీరి కుటుంబం భీమిలిలో స్థిరపడింది.

శివాన్విత (పాతచిత్రం)

తీరంలో యువకుల కఠోర శిక్షణ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఆర్మీలో ఉద్యోగం సాధించడం ఈ యువకుల కల. దీని కోసం శిక్షణ పొందుతున్నారు. త్వరలో నిర్వహిస్తున్న అగ్నిపథ్ ర్యాలీకి సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా దేహదారుఢ్యం పెంచుకోవడంపై దృష్టి పెట్టారు. ఆదివారం ఉదయం ఆర్.కె.బీచ్‌లోని ఇసుకలో వివిధ వ్యాయామాలు చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు చెందిన వీరు గాజువాకలోని ఓ కేంద్రంలో శిక్షణ పొందుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

ఎంవీపీకాలనీ ఆలయంలో..

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : ఎంవీపీకాలనీ సెక్టార్-6లో కొలువైన శ్రీ వెంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు వీరభద్రరావు, కమిటీ సభ్యులు ప్రసాదరావు, జయరాం, గౌరీ, లక్ష్మీనారాయణ, జగన్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

శివాజీపాలెం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే : శివాజీపాలెం వినాయక ఆలయంలో ఆదివారం 108 దీపాలతో దీపారాధన చేశారు. అర్చకులు ఉమామహేశ్వరరావు, ఇతర భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌బీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే : ఎంఎంటీసీకాలనీ త్రిమూర్తిక శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. అర్చకులు వెంకట రమణాచార్యులు, గోపాలకృష్ణాచార్యులు పర్యవేక్షించారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ 9, 10 వార్డుల పరిధిలోని వైష్ణవ ఆలయాల్లో ఆదివారం విశేష అర్చనలు, పూజలు నిర్వహించారు. వెటర్నరీకాలనీ లక్ష్మీనారాయణ దేవాలయంలో ప్రధానార్చకులు రాంబాబు ఆధ్వర్యంలో భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం పఠనం జరిపారు. ఇందిరానగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. హనుమంతువాక, విశాలాక్షినగర్, సంజీవ్‌నగర్ కాలనీ, జోడుగుళ్లపాలెంలోని రామాలయాల్లో, ఎంవీపీకాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులకు తీర్థప్రసాదాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

ఆరిలోవ, న్యూస్‌టుడే: చినగదిలి రాధాకృష్ణనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తొలి ఏకాదశి సందర్భంగా స్వామిని తులసి దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

శివాజీపాలెంలో...

చినగదిలి రాధాకృష్ణనగర్‌లో..


ఎంఎంటీసీకాలనీలో...

'కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి'

కొమ్మాది, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ అఖిల భారత కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 9న జరగనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో కొమ్మాది కూడలి నుంచి కారుషెడ్డు కూడలి వరకు ఆదివారం ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు రైల్వే డీఆర్‌ఎం కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు భారీ ఎత్తున నిరసన ప్రదర్శన ఉంటుందన్నారు. సీఐటీయూ జోన్ అధ్యక్షుడు డి.అప్పలరాజు, పి.రాజ్‌కుమార్, ఎస్.రామప్పడు, డి.సూరిబాబు, జి.కిరణ్, సీహెచ్.శేషుబాబు, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన ర్యాలీలో సీఐటీయూ నాయకులు

రుషికొండ బీచ్‌లో సందర్శకుల సందడి

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్‌కు ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు తరలి రావడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. కోస్టల్ సెక్యూరిటీ పోలీసు టవర్, శివాలయం, మత్స్యరాశుల పార్కు, టూరిజం కుటీరాలు, బోటింగ్ కంట్రోల్ రూం సమీప ఇసుక తిన్నెలు వంటి ఆహ్లాదకర ప్రదేశాల్లో సంతోషాల నడుమ ఉత్సాహంగా గడిపారు. సముద్ర స్నానాలు చేసే వారిని లోపలికి వెళ్లరాదంటూ ఏపీటీడీసీ బ్లూఫ్లాగ్ బీచ్, జీవీఎంసీ లైఫ్ గార్డులు, మెరైన్ పోలీసులు ప్రచార మాధ్యమాల ద్వారా అప్రమత్తం చేశారు.

జూదరుల అరెస్టు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఆరో వార్డు కొమ్మాది శివారు ప్రాంతంలో జనావాసాలు లేని ఓ లేఅవుట్‌లో జరుగుతున్న జూద శిబిరంపై ఆదివారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని పీఎంపాలెం స్టేషన్‌కు తరలించారు. సీఐ జి.బాలకృష్ణ కేసు నమోదు చేశారు. వీరి నుంచి రూ.43 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలో జూదమాడుతున్న ఏడుగురిని విశాఖ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేసి రూ.2.51 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. భీమిలి మినీస్టేడియం ఎదుట ఉన్న అపార్టుమెంట్‌లో జూదమాడుతున్నట్లు వచ్చిన సమాచారంతో సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. కేసును భీమిలి స్టేషన్‌కు అప్పగించారు.

'ఎన్‌ఎంఎంఎస్'కు ఉచిత శిక్షణ

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ (ఎఫ్‌ఈఎస్) ఆధ్వర్యంలో జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) 2025-26 బ్యాచ్‌కు ఉచిత శిక్షణ తరగతులు చిట్టివలస జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు బృందంగా ఏర్పడి నిర్వహిస్తున్న ఎఫ్‌ఈఎస్ ఏటా ఎందరో పేద విద్యార్థులకు శిక్షణ ఇస్తూ ఉపకార వేతనాలను సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం గతేడాది ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన వారిని, ఐఐఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో భీమిలి మండల విద్యాశాఖాధికారిణి ఎం.శివరాణి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, ప్రతినిధులు పొట్నూరు మురళీమోహనరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు, విద్యార్థులు, సొసైటీ ప్రతినిధులు

పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి

హెచ్‌బీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే : పెంపుడు జంతువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని జిల్లా పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.కరుణకరరావు అన్నారు. జునోసిస్ డే సందర్భంగా ఆదివారం ఇసుకతోట పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ ఎం.చంద్రశేఖర్, ఎం.ప్రసాదరావు, వైద్యురాలు ఎస్.జి.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఇసుకతోట పశువైద్యశాలలో కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ కరుణాకర్‌రావు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: జునోసిస్ డే సందర్భంగా ఆదివారం తోటగరువులోని ప్రభుత్వ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారి డాక్టర్ ఏ.అప్పారావు వివరించారు. ఏటా తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఆదివారం ఒక్కరోజే 251 కుక్కలకు వ్యాక్సిన్లు వేశామని తెలిపారు. కార్యక్రమంలో ఇతర అధికారులు డాక్టర్ ఎన్.కరుణాకర్, చంద్రశేఖర్, గాయత్రి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

తోటగరువు ప్రభుత్వ పశువైద్యశాలలో..

చందనం కొనుగోలుకు రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామికి సమర్పించేందుకు చందనం చెక్కల కొనుగోలుకు విజయవాడ కేదేశ్వరపేటకు చెందిన భక్తులు కేవీఎల్ హరినాథ్, కవిత దంపతులు రూ.1,00,001 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో ఆలయ పర్యవేక్షకుడు జీవీఎస్‌కే ప్రసాద్‌కు అందజేశారు. అధికారులు దాత కుటుంబానికి స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

(c) eenadu

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

11న కార్మికుల టోకెన్ సమ్మె

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగర పాలక సంస్థ మంచినీటి సరఫరా కార్మికుల వేతనాల పెంపు, బకాయిల విడుదలకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో 11న టోకెన్ సమ్మె నిర్వహించి, 16 నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తామని గ్రేటర్ విశాఖ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు, ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యం తెలిపారు. ఇటీవల సమ్మె చేపనున్నట్లు మేయర్ ఇచ్చిన హామీ మేరకు సమ్మె విరమించామని, 3వ తేదీ నాటికి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పినా... నేటికి ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. ఇదే అంశాన్ని మున్సిపల్‌శాఖ కమిషనర్, సంచాలకులు సంపత్‌కుమార్‌కు లేఖ ద్వారా తెలియజేశామని కార్మిక నాయకులు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 51వ వార్డు కొంగగరంలోని సర్వే నంబర్ 676/బీ/6 నుంచి బీ/8 వరకు ఉన్న మూడు వీధి దీపాలు గత కొన్ని రోజులుగా వెలగడం లేదు. రాత్రుళ్లు అంధకారం నెలకొనడంతో ఇబ్బందులు పడుతున్నాం. - ఆర్.కె.రాజు, స్థానికుడు. ✓: సిబ్బందిని పంపించి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. - జీవన్, వీధి దీపాల నిర్వాహకుడు.

న్యూస్‌టుడే, జగదాంబకూడలి: ?: జీవీఎంసీ 31వ వార్డు ప్రకాశరావుపేట నుంచి డాబాగార్డెన్స్ వెళ్లే రహదారి పూర్తిగా గోతులమయంగా మారింది. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. -నారాయణ, స్థానికుడు. ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి, గోతుల పూడ్చివేతకు చర్యలు తీసుకుంటాం. -శ్రీదేవి, ఏఈ

?: జీవీఎంసీ 30వ వార్డు మక్కామసీదు వెనుక వీధిలోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి... మురుగు ముందుకు వెళ్లడం లేదు. తీవ్ర దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. -కృష్ణ, స్థానికుడు. ✓: సిబ్బందిని పంపి, శుభ్రత పనులు చేయిస్తాం. -ఎస్.శ్రీనివాసరావు, వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

స్పందనకు వందనం

న్యూస్‌టుడే, జగదాంబకూడలి

విశాఖ చేపలరేవు ప్రధాన ద్వారం ఎదురుగా భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ లీకై మురుగు రోడ్డుపైకి చేరుతోందన్న సమస్యపై 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి శుభ్రత పనులు చేపట్టారు.

అస్తవ్యస్త పనులు.. జనం అవస్థలు

కంచరపాలెం, న్యూస్‌టుడే: నగరంలో నిరంతర తాగునీటి సరఫరా కోసం చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయకపోవడం, అరకొరగా చేపట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఊర్వశి కూడలి సర్వీసు రోడ్డులో కొత్తగా వేస్తున్న మంచినీటి పైపులైన్ల పనులతో జనం బెంబేలెత్తుతున్నారు. తారు రోడ్లను ఎక్కడికక్కడ తవ్వేశారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. వేలాది వాహనాల రాకపోకలతో పాటు పలు కళాశాలల విద్యార్థులతో రోడ్డంతా నిత్యం రద్దీగా ఉంటుంది. తవ్విన మట్టిని తరలించకుండా రోడ్డు పక్కనే వదిలేయడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మట్టి కరిగి రహదారిపై బురదలా పేరుకుపోతోంది. పనుల కారణంగా ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు కళాశాలలకు, కార్యాలయాలకు సకాలంలో చేరుకోలేకపోతున్నారు. రోడ్లు తవ్విన చోట రక్షణ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రోడ్డు పక్కనే వదిలేసిన మట్టి

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న కంచరపాలెం సీఐ కె.రవికుమార్

మాధవధార, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కంచరపాలెం పోలీస్‌స్టేషన్ సీఐ కె.రవికుమార్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కష్టపడి పని చేసుకొని, కొత్త జీవితాన్ని ప్రారంభించాలన్నారు. స్టేషన్ పరిధిలో అమ్మవారి పండుగలు, గిరి ప్రదక్షిణ సందర్భంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో..

గురుద్వారా, న్యూస్‌టుడే: సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపు తెచ్చుకోవాలని నాలుగో పట్టణ సీఐ సత్యనారాయణ రౌడీషీటర్లకు సూచించారు. కొంతమంది తగాదాల్లో తలదూర్చుతూ సెటిల్‌మెంట్లు చేస్తున్నారని, అలాంటి వారి మానుకోవాలన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు వచ్చినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్సై వెంకట్రావు పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

ఈనాడు కథనానికి స్పందన

మాధవధార, న్యూస్‌టుడే: సింహాచలం గిరి ప్రదక్షిణ రహదారి ఉత్తరం నియోజకవర్గంలో 12 కిలోమీటర్ల మేర ఉంది. ఈ దారిలోని ఇబ్బందులపై 'భక్తుల మొక్కు.. అవస్థల దిక్కు' శీర్షికతో ఆదివారం 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. కార్య నరసింహనగర్, కైలాసపురం, సీవీఎస్‌ఎఫ్ గృహ సముదాయాల పరిసర ప్రాంతాల్లో తాత్కాలికంగా వీధి దీపాలు ఏర్పాటు చేశారు. పలుచోట్ల రోడ్లకు ఇరువైపులా ఉన్న వ్యర్థాలను తొలగించడంతో పాటు, గోతులను కప్పేలా చర్యలు తీసుకుంటున్నారు.

సీవీఎస్‌ఎఫ్ గృహ సముదాయం వద్ద తాత్కాలికంగా దీపాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశక్తి పీఠం సందర్శన

శ్రీశక్తి పీఠాధిపతి సత్యనారాయణమూర్తితో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్, పరశురామరాజు తదితరులు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 14వ వార్డు గణేశ్‌నగర్‌లోని శ్రీశక్తి పీఠాన్ని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ సందర్శించారు. ఆదివారం ఉదయం పీఠంలోని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం పీఠాధిపతి కాకరపర్తి సత్యనారాయణమూర్తి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో భాజపా విశాఖ అధ్యక్షులు పరశురామరాజు, శ్రీ గణేశ్ సేవా సంఘం అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవుడి సన్నిధిలో చాతుర్మాస వ్రత దీక్షలు

గణేశ్‌నగర్ ప్రముఖ విఘ్నేశ్వర ఆలయంలో..

మురళీనగర్, న్యూస్‌టుడే: ఎన్‌జీజీఓస్ కాలనీ రత్నగిరి వైభవ వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. వైభవుడికి ఉదయం 9 గంటలకు తిరుమంజనంతో అర్చన నిర్వహించారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి కార్తిక శుద్ధ ఏకాదశి వరకు నిర్వహించే చాతుర్మాస వ్రత దీక్షల్లో భాగంగా భక్తులంతా సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నంబాళ్ల శేషాచార్యులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార లోని త్రిమూర్తి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం శ్రీవారికి క్షీరాభిషేకం జరిపి పట్టువస్త్రాలు, ప్రత్యేక హారతి సమర్పించారు. పలు రకాల పుష్పాలు, తులసీదళాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు గోత్రనామాలతో అర్చనలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 14వ వార్డు నరసింహనగర్ శివారు గణేశ్‌నగర్‌లోని ప్రముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో అర్చకులు చొప్పల్లి భాస్కరరావు, వి.ఎస్.కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సహస్రనామాలతో కలిసి రాముడి ఉత్సవ విగ్రహాలకు పాలతో అభిషేకం చేశారు. ఆలయ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి, ఉపాధ్యక్షుడు జి.కృష్ణ, కార్యదర్శి ఎం.ఎస్.ప్రకాశరావు, సంయుక్త కార్యదర్శి టి.వెంకటరావు, కోశాధికారి ఎం.రంగారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విష్ణుసహస్రనామ పారాయణం చేస్తున్న మహిళా భక్తులు

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

అల్లిపురం, న్యూస్‌టుడే: అల్లిపురం సమీప వెంకటేశ్వరమెట్ట బలిగిరి ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం తొలి ఏకాదశి పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు జి.రమునాధాచార్యులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.

ఉచిత వైద్య శిబిరాలకు స్పందన

మురళీనగర్, న్యూస్‌టుడే: మహావారన్ క్లబ్, మాధవధార ఈక్వెస్ట్రయా, నిర్వహణ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో అబ్బులకాలం ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి వైద్యులు ట్రావెన్‌కూర్ శిబిరానికి వచ్చినవారికి పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవ, పి.కమల, డి.శిరీష, సి.హెచ్.వరలక్ష్మి, కె.సుగుణ, ఎస్.పూర్ణిమ, పార్వు, అధ్యక్షుడు బి.మురళీకృష్ణ, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

శిబిరానికి వచ్చిన వారిని పరీక్షిస్తున్న వైద్యుడు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య యువజన సంఘం, శంకర్ ఫౌండేషన్, వి టెండల్, వి 'హెల్త్'ర్ ఆధ్వర్యంలో ఆదివారం పాతగరంలోని వాసవీ భవన్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని నిర్వాహకులు ఎస్.శ్రీనివాసరావు, కె.సూర్యనారాయణ తెలిపారు. శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు పంపిణీ చేశామన్నారు. సంఘం సభ్యులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

దేశ ఐక్యతకు శ్యామాప్రసాద్ ముఖర్జీ కృషి

శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, భాజపా కార్యకర్తలు

గురుద్వారా, న్యూస్‌టుడే: దేశ ఐక్యతకు అసమాన కృషి చేసిన మహోన్నత వ్యక్తి శ్యామాప్రసాద్ ముఖర్జీ అని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు కొనియాడారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా సీతమ్మధార భాజపా కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ముఖర్జీ ఆశయ సాధనను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అరుణ్‌బాబు, ఆశీర్వాదం, అనిల్, దుర్గారావు, ప్రసాద్, నారాయణ రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మురళీనగర్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 49వ వార్డు ఎన్‌జీజీఓస్‌కాలనీలో భాజపా రాష్ట్ర కౌన్సెల్ సభ్యుడు ఒమ్మి నారాయణరావు ఆధ్వర్యంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ రాజీలేని రాజకీయ భావాలతో గొప్ప ఆదర్శవాదిగా ఖ్యాతి గడించారన్నారు. వార్డు అధ్యక్షుడు కొప్పిశెట్టి ప్రసాద్, అరుణ్‌బాబు, ఉప్పిలి అప్పలకొండ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వన్‌టౌన్, న్యూస్‌టుడే : భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు, కేంద్ర మాజీ మంత్రి శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం బీచ్‌రోడ్డులోని ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి నిర్వహించారు. ఏపీ భాజపా వైద్య విభాగం, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ ఆధ్వర్యంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, ఆర్.రవికుమార్, చంద్రశేఖర్, రాంబాబు, గిరిజా, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి చికిత్సాలయంలో నివాళి అర్పిస్తున్న ప్రతినిధులు

జీవీఎంసీ 49వ వార్డు ఎన్‌జీజీఓఎస్ కాలనీలో..

రైళ్ల గమ్యస్థానాల కుదింపు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: కొరాపుట్-కిరండూల్ రైలు మార్గం పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో పలు రైళ్ల గమ్యాలు కుదించనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 7న విశాఖ- కిరండూల్ (18515), 8న కిరండూల్- విశాఖ (18516) ఎక్స్‌ప్రెస్ రైళ్లు కొరాపుట్ వరకు రాకపోకలు సాగిస్తాయి. భువనేశ్వర్- జగదల్‌పూర్ (18447), రూర్కెలా-జగదల్‌పూర్ (18108), జగదల్‌పూర్- భువనేశ్వర్ (18448), జగదల్‌పూర్- రూర్కెలా (18108) ఇంటర్ సిటీ రైళ్లు కొరాపుట్ నుంచి రాకపోకలు సాగించనున్నాయి.

భీమిలి యువతి అమెరికాలో దుర్మరణం

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భాజపా భీమిలి నియోజకవర్గం కో-ఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు చిన్న కుమార్తె శివాన్విత (18) అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందారు. ఈమె కాలిఫోర్నియా రాష్ట్రంలో తన అక్కతో పాటు నివాసముంటూ శాండీయాగో యూనివర్సిటీలో బీఏ సైకాలజీ రెండో సంవత్సరం చదువుతూ పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నారు.

సామాజిక సేవతో ఆత్మసంతృప్తి

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : సామాజిక సేవతో ప్రతి ఒక్కరికీ ఆత్మసంతృప్తి కలుగుతుందని శ్రీ సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎన్.నాయుడు పేర్కొన్నారు. జ్ఞానాపురం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో నిరాశ్రయులకు ఆదివారం సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో పలు రకాల సపర్యలు చేశారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ... బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్, రహదారుల పక్కన ఉండే మానసిక రోగులు, నిరాశ్రయులు సుమారు 180 మందిని గుర్తించామన్నారు. వారికి జుత్తు కత్తిరించి, స్నానాలు చేయించి, దుస్తులు అందించి, భోజనం పెట్టామన్నారు. సభ్యులు సాయి ప్రశాంత్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుస్తులు అందజేస్తున్న సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు

అలరించిన 'వినోదాల విందు'

సీతంపేట, న్యూస్‌టుడే: ఫ్రెండ్స్ కామిడీ క్లబ్ (విశాఖపట్నం, హైదరాబాద్) సంస్థ ప్రతినెలా నిర్వహించే 'వినోదాల విందు' లఘునాటికల కార్యక్రమం ఆదివారం సాయంత్రం విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాశ్, డేవిడ్ రాజు, పోర్టు శేషు, కుమారి, నాయుడు, రామానుజం, భానుప్రకాశ్, సూర్యం, శివజ్యోతి తదితర హాస్యనటుల నటన ఆహూతులను అలరించింది. స్విమ్మింగ్ పూల్, జామచెట్టు, తాగుబోతు, కోడిపందేలు, డాక్టర్ - పేషెంట్, డ్రైవర్ జాబ్, ప్రశాంతత, 2000 నోటు తదితర లఘునాటికలు ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డ్రీమ్ షెల్టర్స్ అధినేత రవిశంకర్, తిలక పట్నాయక్, సన్‌మూర్తి, బి.మాల్యాద్రి తదితరులు పాల్గొని కళాకారులకు మెమెంటోలు అందించారు.

లఘునాటికలో ఒక సన్నివేశం

బడుగుల ఆశాజ్యోతి... బాబూ జగ్జీవన్‌రామ్

అల్లిపురం, న్యూస్‌టుడే : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ సమీప అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విశాల విశాఖ మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ... స్వాతంత్ర్య సమరయోధునిగా, సంఘ సంస్కర్తగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు.

గురుద్వారా, న్యూస్‌టుడే: గురుద్వారా ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. సంస్థ సీజీఎంలు బి.రాంప్రసాద్, బి.అశోక్‌కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేటలోని హరిజన వీధిలో గాంధీ హరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. సింహాచలం దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. భారత తొలి దళిత ఉప ప్రధానిగా జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో జోరీగల గణేశ్, కొమ్మునాగు, ఎం.అప్పలరాజు, జామి ప్రభాకర్, అందులూరి సూరిబాబు, మిర్యాల రవికుమార్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: దళితుల సంక్షేమానికి నిరంతరం పరితపించి వారి అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని వైకాపా విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు పేర్కొన్నారు. 47వ వార్డులోని కప్పరాడలో స్థానిక నాయకుడు కుందిరి సుకుమార్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

నివాళి అర్పిస్తున్న ఈపీడీసీఎల్ సీజీఎంలు, సిబ్బంది

సీతంపేటలో గాంధీ హరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో..

తాకితే ప్రమాదమే...

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార పాత ఏఎంజీ ఆసుపత్రి సమీపంలోని విద్యుత్తు స్తంభానికి ఉన్న తీగ కిందకి వేలాడుతూ ప్రమాదాన్ని తలపిస్తోంది. నిత్యం జన సంచారం ఉండే ప్రాంతం, చేతికి అందే ఎత్తులో ఉండటంతో ఆదమరిస్తే అనుకోని ప్రమాదం సంభవించక తప్పదని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో విద్యుదాఘాతాలు జరిగే అవకాశం ఉందని, ప్రమాదం జరగక ముందే అధికారులు దృష్టిసారించి తీగను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



• 29న మంగళగౌరీ దేవి ఉత్సవం

మురళీనగర్, న్యూస్‌టుడే: మురళీనగర్‌లోని శ్రీగౌరీ సంక్షేమ సేవా సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు పొలమరశెట్టి దశర్న, పెంటకోట నాగలక్ష్మీదేదీప్యలకు పుస్తకాలతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈనెల 29న మంగళగౌరీ దేవి ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు పెంటకోట రామరాజు, గౌరవ అధ్యక్షుడు పెంటకోట వెంకట్రావు, ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శులు మల్ల రమణ, పి.చిన్నా, మహిళా ప్రతినిధులు పి.ఝాన్సీరాణి, ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

• భద్రతా ఏర్పాట్లకు అనుమతి మంజూరు

మురళీనగర్, న్యూస్‌టుడే: మాధవధార గ్రామదేవత కుంచుమాంబ అమ్మవారి ప్రధాన పండుగలో పాల్గొనాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీని గ్రామ పెద్దలు ఆహ్వానించారు. రాత్రి 11 గంటల వరకు ఉత్సవాలు నిర్వహించుకునేందుకు భద్రతా ఏర్పాట్లకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి సంబంధించి సమీప పోలీసుస్టేషన్లకు ఆదేశాలు పంపుతానని సీపీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. జీవీఎంసీ 50వ వార్డు తెదేపా అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, గ్రామపెద్దలు పి.రామచంద్రరావు, ఎస్.డి.వి.రమణమూర్తి, కూన వెంకట్రావు, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

• నేడు మహిళలకు నడక పోటీలు

మురళీనగర్, న్యూస్‌టుడే: వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు నడక పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.ప్రభావతి, ఎం.జయ పేర్కొన్నారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కు ప్రాంగణంలో సాయంత్రం 3:30 గంటలకు వయసుల వారీగా పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన వారికి ఈనెల 15న జరిగే క్లబ్ 23వ వార్షికోత్సవంలో బహుమతులు అందజేస్తామన్నారు.

• సమ్మె విజయవంతానికి పిలుపు

గురుద్వారా, న్యూస్‌టుడే: జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్ 17 ద్వారా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిర్వీర్యమైందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని ప్రకటనలో డిమాండ్ చేశారు.

యోగాలో బాలలకు శిక్షణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం స్వామి వివేకానంద సేవా సంస్థ ఆవరణలో చిన్నారులకు ఆదివారం యోగాతో పాటు భగవద్గీత శ్లోకాల పఠనంపై శిక్షణ ఇచ్చారు. యోగా మాస్టర్ గణేష్ ఆధ్వర్యంలో రోజూ ఉదయం 7 గంటలకు ఉచిత శిక్షణ తరగతులు ఉంటాయని, ఆసక్తి గల వారు పాల్గొనాలని సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు కోరారు. యోగాతో బాలల ఆరోగ్యం మెరుగవుతుందన్నారు.

మెలకువలు నేర్పిస్తున్న శిక్షకుడు గణేష్

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

మాధవధార, న్యూస్‌టుడే: మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం నిలుస్తుందని ముస్లిం పెద్దలు పేర్కొన్నారు. జీవీఎంసీ 53వ వార్డు జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో మసీద్-అల్-ఖదీర్ ఆధ్వర్యంలో ఆదివారం మొహ్రారంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఖురాన్ పఠించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వివిధ పదార్థాలతో తయారు చేసిన ప్రత్యేక ప్రసాదాలను పలువురు ముస్లింలకు అందజేశారు. కార్యక్రమాన్ని మసీదు కమిటీ అధ్యక్షుడు మున్నా, ముస్లిం పెద్దలు పర్యవేక్షించారు.

జాకీర్‌హుస్సేన్ నగర్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ప్రేమ సమాజం డైరెక్టర్‌గా జగన్నాథరావు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: డాబాగార్డెన్స్‌లోని ప్రేమ సమాజం డైరెక్టర్‌గా రామాటాకీస్ ప్రాంతానికి చెందిన జగన్నాథరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం తాటిచెట్లపాలెంలోని గౌరీ సేవా సంఘం కార్యాలయంలో కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధా శివాజీ, సభ్యులు జగన్నాథరావును సత్కరించారు. జగన్నాథరావు మాట్లాడుతూ ప్రేమ సమాజం ఎందరో అభాగ్యులకు ఆసరా ఇస్తుందన్నారు. ప్రేమ సమాజం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో శరగడం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథరావును సత్కరిస్తున్న కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధా శివాజీ, సభ్యులు

'మత్తు'తో జీవితాలు చిత్తు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : యువత ప్రమాదకరమైన మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఒకటో పట్టణ సీఐ జీడీ.బాబు సూచించారు. ఆదివారం పాతనగరంలోని సెయింట్ జోసెఫ్ మైదానంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. మత్తు పదార్థాలతో జీవితాలు నాశనమవుతాయన్నారు. మత్తు పదార్థాలు వినియోగించినా, అక్రమంగా రవాణా చేసినా.. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం యువతతో ప్రతిజ్ఞ చేయించారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

మీ చెరగని చిరునవ్వు మా మనస్సులలో చిరస్థాయిగా నిలిచినా
మీ మరణం మాకు తీరని లోటు. మీరు మానుండి భౌతికంగా
దూరమైనా మీ మధుర స్మృతులు మా మదిలో పదిలం.
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భర్త: బి. జగ్గన్నాయుడు (జగ్గారావు) (లేటు), ల్యాండ్‌లార్డ్

కుమారులు - కోడళ్ళు : బి. రామ్మూర్తినాయుడు - రమ, బి. శ్రీనివాస్ - సునీత

కుమార్తెలు - అల్లుళ్ళు: బి. పద్మావతి - మహేశ్వరరావు, పి. విమల - భవేష్ & ఎస్. విశాలి - శ్రీనివాసరావు

మనుమలు, మనుమరాళ్ళు మరియు బంధుమిత్రులు

పెద్దకర్మ: తేది. 07-07-2025 సోమవారం

జగ్గారావు కాంప్లెక్స్, అక్కయ్యపాలెంలో మా స్వగృహము నందు జరుపబడును.

కీ॥శే॥ శ్రీమతి భీమరశెట్టి మంగతల్లి గారు

జననం: 27-03-1938 మరణం: 27-06-2025

(c) eenadu

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య

కొత్తవలస, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తిచెంది బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు లేఖ రాసి వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొత్తవలసలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై ఉమామహేశ్వరరావు వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా గోపాలపట్నం వద్దనున్న లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన చప్ప సీతారామయ్య (77) ఆదివారం కొత్తవలస పట్టణం లోని చేపల దుకాణాల వెనుక విజయనగరం నుంచి కొత్తవలస వస్తున్న గూడ్సు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. రైలు డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు విజయనగరంలోని ప్రభుత్వ రైల్వే పోలీసు స్టేషన్‌కు, మృతుని బంధువులకు విషయం తెలియజేశారు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారావు కేసు నమోదు చేశారు. సీతారామయ్య విశాఖపట్నం డాక్ యార్డులో ఉద్యోగం చేసి విరమణ పొందారు.

గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం

బ్యాంకు పరిసరాల్లో స్వచ్ఛభారత్

కరాస, న్యూస్‌టుడే: అంతర్జాతీయ సహకార దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం చివరి రోజు మరిపాలెం వుడాలేఅవుట్‌లోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ప్రధాన కార్యాలయం ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, బ్యాంకు సీఈఓ వర్మ, జనరల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు, డీజీఎంలు ఎం.అశోక్‌కుమార్, ఎల్.అప్పలరాజు, ఎం.శ్రీనివాసరావు, విశాఖ డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి, సహకారశాఖ సిబ్బంది, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

సిబ్బందితో కలిసి బ్యాంకు పరిసరాలను శుభ్రం చేస్తున్న కోన తాతారావు

గుట్టుగా తెచ్చి.. గుట్టలుగా పోసి..

బీసీ రోడ్డు గంగవరం పోర్టు వైపు వంతెనపై రాత్రికి రాత్రే గుట్టుగా చెత్త, భవన వ్యర్థాలను తెచ్చి డంప్ చేస్తున్నారు. దీంతో మురుగు ప్రవహించాల్సిన కాలువలు మూసుకుపోయి సమస్య ఏర్పడుతోంది. పెదగంట్యాడ మార్కెట్, ఆటోనగర్ పరిశ్రమల నుంచి వాహనాల్లో తెచ్చి వ్యర్థాలను కింద వదేస్తున్నారు. వంతెనకు ఇరువైపులా ఇనుప జాలీలేక పాడు చేస్తున్నారు. మురుగుపారుదలకు ఆటంకాలు ఎదురవుతున్న దృష్ట్యా నివారణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గాజువాక

పిలుపునకు స్పందించే.. సమస్యలు వినిపించే..

న్యూస్‌టుడే, గాజువాక

'స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగ కల్పనకు యాజమాన్యం నిర్వాసితులను పనుల్లోంచి తీసేస్తోంది. ఉద్యోగ భద్రత కల్పించాలి.. స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. చర్యలు తీసుకోండి... హౌస్ కమిటీ భూ బాధితులను ఆదుకోండి... టీడ్కో ఇళ్లు ఎప్పుడు ఇస్తారు?' ఇలా పెద్దసంఖ్యలో ప్రజలు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఫోన్ చేసి తమ సమస్యలు చెప్పుకున్నారు. 'ఈనాడు' ఎమ్మెల్యేతో నేరుగా మాట్లాడే అవకాశం ఆదివారం ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా కల్పించింది. ఎమ్మెల్యే కూడా ఓపికగా ప్రతి సమస్యను విని పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. సమస్యలను సిబ్బందితో నమోదు చేయించారు. కొన్ని ప్రశ్నలు ఈ విధంగా ఉన్నాయి.

గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో 'ఫోన్ ఇన్'కు విశేష స్పందన

ఈనాడు తోడు

ఉక్కు నిర్వాసితులకు అన్యాయం: వడ్లపూడి ఉక్కు నిర్వాసిత కాలనీల్లో మార్కెట్ మేజర్ సన్స్ కోటాలో ఇళ్లస్థలాలు పొందినా నేటికీ క్రమబద్ధీకరణకు ఇబ్బంది కలిగిస్తున్నారు. కొందరు దళారుల కారణంగా అర్హులైన నిర్వాసితులకు అన్యాయం జరుగుతోంది. –పాగరాజు వెంకటపతి రాజు, వడ్లపూడి

ఎమ్మెల్యే: జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషిచేస్తా.

టీడ్కో ఇళ్లు ఎప్పుడిస్తారు..?: గత ప్రభుత్వ హయాంలో ఇల్లులేని తామంతా డీడీలు చెల్లించి అర్హత పొందినా నేటికీ టిడ్కో ఇళ్లు చేతికి రాలేదు. బ్యాంకులకు ఈఎంఐలు చెల్లించలేక పోతున్నాం. సొంత గూడు సమస్యను తీర్చాలి. –మంగవేణి, పెదగంట్యాడ, మావూరి రాణి, భానోజీ తోట, జి. వెంకటరావు, శ్రీనగర్, ఎం.ప్రసాద్, గాజువాక

ఎమ్మెల్యే: క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరుగుతోంది. రెండు నెలల్లో సమస్య పరిష్కారమవుతుంది.

భూములను పరిరక్షించాలి

ప్రశ్న–1: చినగంట్యాడ రెవెన్యూ సర్వే నెంబర్-56లో ప్రభుత్వ భూములు ఆక్రమణదారుల గుప్పిట్లో ఉన్నాయి. వీటికి విముక్తి కలిగించాలి. –కాకి వెంకటరమణ, తోకాడ

ప్ర–2: దువ్వాడలో తన స్థలం కబ్జా చేసి కొందరు మోసం చేశారు. ఎవరికి చెప్పుకున్నా న్యాయం జరగడం లేదు. సిద్ధేశ్వరంలో రహదారి స్థలంలో తుప్పలు పెరిగాయి. అడవిలా ఉంది. –చూసుకొండ శ్రీనివాస్, వడ్లపూడి, బసా కుసుమ, సిద్ధేశ్వరం

ప్ర–3: దువ్వాడ రోడ్డు ముస్తఫా జంక్షన్ ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి. దారిని ఇరుకుగా మార్చేస్తున్నారు. –గోవిందరాజులు, వడ్లపూడి

ప్ర–4: పెదగంట్యాడ యాతపాలెంలో తనకు చెందిన 100 గజాల స్థలాన్ని వైకాపా నాయకుడు ఆక్రమించారు. సత్యనారాయణపురంలోనూ ఇదే పరిస్థితి. –ఎల్.రమాదేవి, సుందరయ్యకాలనీ, అనురాధ, గాజువాక

ఎమ్మెల్యే పల్లా: మీ సమస్యలు నమోదు చేసుకున్నాను. రెవెన్యూ అధికారులకు చెప్పి ఆక్రమణలపై చర్యలు తీసుకునేలా చేస్తాను.

ఉక్కులో ఉపాధి తీసేశారు..: విశాఖ స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులుగా దశాబ్దాలుగా పనిచేస్తుంటే ఇటీవల సమ్మెలో ఉన్నామని పనిలోంచి తీసేశారు. ప్రస్తుతం ఉపాధి లేకుండా పోయింది. ఆర్.కార్డు హోల్డర్లను తొలగిస్తున్నారు. –విజయ భాస్కర్, ఈశ్వరరావు, ఉరుకూటి అప్పలరాజు, కనకారావు, గోకాడ శ్రీనివాస్, మొల్లి వెంకటరావు, నక్క రాంబాబు, రమేష్, దిబ్బపాలెం, కోన రమణ, కె.రామకృష్ణ, నరేంద్ర కుమార్, ఉక్కునగరం

హౌస్ కమిటీ భూ బాధితులను ఆదుకోండి: గాజువాక హౌస్‌కమిటీ భూ బాధితులకు జీవోనెంబర్ 45 తెచ్చారు. ఇది ఎంతోమందికి మేలు చేస్తుంది. అయితే ఎప్పటి నుంచో ఆక్రమించుకున్న స్థలాన్ని పరిగణలోకి తీసుకోకుండా కేవలం స్ట్రక్చర్ మాత్రమే కొలతలు వేసి క్రమబద్ధీకరిస్తామంటూ రెవెన్యూ సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారు. అలాగే క్రమబద్ధీకరణ దరఖాస్తు చేసి 3 నెలలైంది, ఇంతవరకూ కదలిక లేదు. –ధర్మాప్పమూర్తి పంతులుగారిమేడ, శ్రీనివాస్, గాజువాక, గొలగాని వాసు, బుచ్చిరాజు, కైలాసనగర్, సత్యనారాయణ, హైస్కూల్‌రోడ్డు, కేశవరావు, 67వ వార్డు, అమీన్, అజీమాబాద్

ఎమ్మెల్యే: దీనిపై జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో చర్చించి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తాం.

ఎమ్మెల్యే ఫోన్ ఇన్‌కు వచ్చిన ఫిర్యాదులు విభాగాల వారీగా..	
జీవీఎంసీ	46
వైద్యశాఖ	02
స్టీల్‌ప్లాంటు	22
ఆర్టీసీ	01
భూ సమస్యలు	09
ఉద్యోగ సమస్య	02
ఇళ్లు, పింఛన్లు, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ సమస్యలు	30
మొత్తం	112

ఎమ్మెల్యే: కొందరు దుర్బుద్ధితో ఉక్కును నిర్వీర్యం చేయడానికి సమ్మెల పేరిట నష్టం కలిగిస్తున్నారు. ఆందోళనలు చేయడం వల్ల ఉక్కు మరింత నష్టాల్లోకి వెళ్తుంది. తొలగించిన ఆర్.కార్డు హోల్డర్లను తిరిగి పనిలోకి పెట్టుకునేలా యాజమాన్యంపై ఒత్తిడి తెస్తాం. మిగిలిన వారికి దఫాలుగా న్యాయం జరుగుతుంది. ఎవరూ ఆందోళన చెందనక్కర్లేదు.

ఫోన్‌ఇన్‌లో ఫిర్యాదులను నమోదు చేసుకుంటున్న సిబ్బంది

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గోపాలపట్నం, న్యూస్‌టుడే: **సమస్య:** గోపాలపట్నం కుమారి కళ్యాణ మండపం నుంచి నరసింహనగర్ వెళ్లే రోడ్డులో వీధిదీపాలు ఎక్కడా వెలగడం లేదు. అంధకారంలోనే దేవాలయాలకు రాకపోకలు సాగిస్తున్నారు. –డి.సాయికృష్ణ, ప్రహ్లాదపురం

సమాధానం: ఆ ప్రాంతాన్ని పరిశీలించి దీపాలు మరమ్మతులు చేపడతాం. –గోవిందరావు, వీధిదీపాల నిర్వాహకులు.

మల్కాపురం, న్యూస్‌టుడే: **?:** మల్కాపురం కూడలి నుంచి నేవీ కళ్యాణ్ ఆసుపత్రి ఎదురుగా సేవా రహదారి ఫుట్‌పాత్ ఆనుకుని ఏర్పాటు చేసిన మురుగుకాలువ నిర్వహణ కరవైంది. దుర్వాసన వెదజల్లుతోంది. – జి.రాంబాబు, స్థానికులు

✓: సమస్య మా దృష్టికి రాలేదు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – రాజు, జీవీఎంసీ ఏఎంహెచ్‌ఓ జోన్-5 అధికారి

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

కూర్మన్నపాలెం(వడ్లపూడి), న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నియోజకవర్గ పరిశీలకులు చౌదరి అన్నారు. ఆదివారం వడ్లపూడి తెదేపా కార్యాలయం వద్ద 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్ల, కో-కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలన్నారు.

ఇందిరాకాలనీలో అగ్నిప్రమాదం

సింధియా(ఇందిరాకాలనీ), న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం ఇందిరాకాలనీలో తుంపాల కొండలరావు కుటుంబం నివాసం ఉంటోంది. ఆదివారం ఏకాదశి సందర్భంగా ఇంట్లో పూజచేసి దీపారాధన చేశారు. ఇంటికి తాళం వేసి కుటుంబం బయటకు వెళ్లింది. అయితే ఇంట్లోంచి పొగలు రావడం స్థానికులు గమనించారు. పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. స్థానిక యువకులు మంటలు చెలరేగకుండా అదుపు చేశారు. దేవుడి మందిరంలో కర్టెన్‌కు దీపం తగిలి మంటలకు కారణమైందని గుర్తించారు.

మొక్కలతోనే కాలుష్య నివారణ

గోపాలపట్నం, న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆదివారం 89వ వార్డు చంద్రనగర్‌లో గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. రావి, తురాయి, దేవకాంచన మొక్కలు అందులో ఉన్నాయి.

పోషకాహారంతో ఆరోగ్య బాల్యం

చిన్నారులకు పోషకాహార కిట్లు అందజేస్తున్న భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, తదితరులు

గాజువాక, న్యూస్‌టుడే: ఆరోగ్య బాలభారతం పోషకాహారంతోనే సాధ్యమవుతుందని భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. ఆదివారం శ్రీనగర్‌లోని డిజైర్ అనాథ బాలల ఆశ్రమంలో భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు జన్మదినం పురస్కరించుకుని జీవీఎల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథ బాలలకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. నాయకులు గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, ములకలపల్లి ప్రకాశ్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రదక్షిణకు ముందే పట్టించుకోండి — ఫోకస్

గోపాలపట్నం, న్యూస్‌టుడే : సింహాచలం గిరి ప్రదక్షిణ ఈనెల 9వ తేదీన జరగనుంది. లక్షల సంఖ్యలో భక్తులు సింహాచలం కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. అయితే పశ్చిమ నియోజకవర్గంలో చాలాచోట్ల బి.ఆర్.టి.ఎస్. మీద గోతులు ఉన్నాయి. దీనివల్ల భక్తులకు ఇబ్బందికలిగే అవకాశం ఉంది. దీంతో పాటు ప్రతిరోజు వాహనదారులు ఈ గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. ఎన్ఏడీకూడలి నుంచి బాజీకూడలి సిగ్నల్‌పాయింట్, గోపాలపట్నం పెట్రోల్‌బంకు కూడలి, గోపాలపట్నం రైతుబజార్ ఎదురుగా, ఆర్.ఆర్.వి.పురం కూడలి, డీమార్ట్, స్టేట్‌బ్యాంకు ఎదురుగా ఇలా.. పలుచోట్ల గుంతలు ప్రయాణికులకు పరీక్ష పెడుతున్నాయి. నాలుగు రోజుల్లో గిరి ప్రదక్షిణ ఉన్నందున త్వరగా వీటికి మరమ్మతు చేయాల్సిన అవసరం ఉంది.

ఆర్.ఆర్.వి.పురం బీఆర్టీఎస్‌కూడలిలో ఏర్పడిన గొయ్యి

చేపలమార్కెట్ వద్ద..

గోపాలపట్నం స్టేట్‌బ్యాంకు ఎదురుగా..

కార్మిక చట్టాలను గాలికొదిలేస్తున్నారు : ఏఐటీయూసీ

మల్కాపురం, న్యూస్‌టుడే : పరిశ్రమలు కార్మిక చట్టాలను సరిగా అమలు చేయటం లేదని రాష్ట్ర ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ ఆరోపించారు. 62వ వార్డు త్రినాథపురం కూడలిలో ఆదివారం ఏఐటీయూసీ నాయకులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9వ తేదీన జరగనున్న జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నాయకులు గుడాల రాంబాబు, కార్మిక సంఘాల నాయకులు నరసింహరావు, వీధి విక్రయ కార్మిక సంఘాల నాయకులు సత్యనారాయణ, వర్మ, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

రావులచెరువును అభివృద్ధి చేయాలని వినతి

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: రావులచెరువును సమగ్ర అభివృద్ధి చేయాలని రావులచెరువు రాయల్స్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బొండా యల్లాజీరావు, కె.జనార్ధనరావు, ఎంవీ రమణ, ఎం.బాబూరావులు స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. బోట్ షికారు, యోగా, మెడిటేషన్ సెంటర్, ఇండోర్ స్టేడియం నిర్మాణాలకు చొరవ తీసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో జగన్నాథుని తిరుగు రథయాత్ర

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడిలో శ్రీ జగన్నాథుని తిరుగు రథయాత్ర ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. స్వామి వారు చివరగా కల్కి అవతారంలో దర్శనమివ్వగా ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఇంద్రద్యుమ్న హాలు వద్ద భక్తులకు భారీ ఎత్తున అన్నసమారాధన చేశారు. సాయంత్రం హనుమాన్ కూడలి నుంచి తిరుగు రథయాత్ర మొదలై జాతీయ రహదారి మీదుగా ఆలయం వరకూ సాగింది.

తిరుగు రథయాత్రలో పాల్గొన్న భక్తులు

రేబిస్ టీకా కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.గణబాబు, కార్పొరేటర్ రమణ

చురుగ్గా పెంపుడు శునకాలకు టీకాలు

షిప్‌యార్డుకాలనీ (మల్కాపురం) న్యూస్‌టుడే : ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని.. 40వ వార్డు గాంధీగ్రాం షిప్‌యార్డుకాలనీ పశు వైద్యశాలలో ఆదివారం పశు వైద్యాధికారి డాక్టరు సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత రేబిస్ టీకాలు వేశారు.

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పశువైద్యాధికారిణి పి.లావణ్య ఆధ్వర్యంలో శునకాలకు టీకాలు వేశారు. అఖిలపక్ష నాయకులు బి.సత్యనారాయణ, వై.పెద అప్పారావు, డి.పైడికొండ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే: పెంపుడు జంతువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. ఆదివారం జునోసిస్ డే సందర్భంగా బాజీకూడలి దరి గోపాలపట్నం పశు వైద్యశాలలో ఉచిత రేబీస్ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లా సంయుక్త సంచాలకులు ఎన్.కరుణాకర్‌రావు, ఉపసంచాలకులు ఎన్.చంద్రశేఖర్, కార్యక్రమంలో 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, స్థానిక సహాయ సంచాలకులు ఎ.రవికుమార్, డీఎంహెచ్ జగదీశ్ ప్రసాద్, వైద్యులు ప్రసాదరావు, రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

అగనంపూడిలో కుక్కలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

కరాటే పోటీల్లో ప్రతిభ

పతకం సాధించిన లిఖితతో నిర్వాహకులు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : శ్రీలంకలోని కొలంబోలో జరిగిన 9వ దక్షిణాసియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలో కాపుజగ్గరాజుపేట విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ చదువుతున్న లిఖిత రజిత పతకం సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ బి.అరుంధతి విద్యార్థినిని అభినందించారు.

సంక్షేమానికి కూటమి పెద్ద పీట

ప్రచార ర్యాలీలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తదితరులు

సింధియా, న్యూస్‌టుడే: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో 'సుపరిపాలన-తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పర్యటనలో ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు. తెదేపా సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఆయన వెంట కూటమి నాయకులు మజ్జి సోమేష్, శ్రీలక్ష్మి, నక్క లక్ష్మణరావు, జయశంకర్, రాము, దేవన్‌రాజ్, చింతలపూడి శివ తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక 74వ వార్డు ఆదివారం సుపరిపాలన-తొలి అడుగు పేరుతో ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచిపెట్టారు. సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, వార్డు అధ్యక్ష కార్యదర్శులు పల్లా రమణ, వి.కొండబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి దువ్వి శ్రీను, గంగరాజు, కోనరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

దంతవైద్య శిబిరానికి స్పందన

గాజువాక, న్యూస్‌టుడే: సామాజికసేవలో భాగంగా భానోజీతోటలో గ్రామకమిటీ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వి.డెంటల్ డాక్టర్ కిషోర్ వైద్య బృందం నివాసితులకు దంత పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేసింది. క్రీస్తుసంఘం ప్రతినిధి విశ్వనాథం, కార్పొరేటర్ బీఎన్ పాత్రుడు, నాయకులు మద్దాల అప్పారావు, కొండలరావు, సాధూరావు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలపై పోరు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ఉక్కు నిర్వాసితకాలనీల్లో పెండింగ్ సమస్యలపై కాంగ్రెస్ ఆందోళనలు చేపడుతుందని పీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. ఆదివారం నడుపూరులో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముత్యాలు మాట్లాడుతూ.. ఉక్కు కాలనీల్లో కొద్దిపాటి వర్షాలకే కాలనీలు ముంపునకు గురవుతున్నాయని, పక్కా డ్రైనేజీలు నిర్మించాలని డిమాండు చేశారు. నాయకులు భూలోక వర్మ, రాజబాబు, హరి పాల్గొన్నారు.

భెల్ కార్మికుల సంఘీభావం

అక్కిరెడ్డిపాలెం(నాతయ్యపాలెం), న్యూస్‌టుడే: ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న ఉక్కు పరిరక్షణ దీక్షకు భెల్ కార్మికులు సంఘీభావం ప్రకటిస్తూ ఆదివారం దీక్షలో కూర్చొన్నారు. ఈ సందర్భంగా భెల్ సిటూ కార్యదర్శి జీటీపీ ప్రకాశ్ మాట్లాడుతూ.. కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా కర్మాగార పరిరక్షణకు బలంగా ముందుకు సాగాలన్నారు. భెల్ కార్మికుల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆల్ని అప్పలనారాయణ, నారపురెడ్డి, శివరామ్, నారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉక్కు ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు

ఘనంగా జగ్జీవన్‌రామ్ వర్ధంతి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే : మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఉక్కు సెక్టారు-5లోని బాబూ జగ్జీవన్‌రామ్ పార్కు, సంఘ కార్యాలయ ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. బయ్యే మల్లయ్య, తౌడన్న, సంపూర్ణం, వై.టి.దాసు, సత్యనారాయణ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

తుంగ్లాంలో.. అక్కిరెడ్డిపాలెం(షీలానగర్), న్యూస్‌టుడే: భెల్‌లో భెల్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమంలో భెల్ ఈడీ సుబ్రహ్మణ్యం, హెచ్ఆర్ హెడ్ లీల, కార్యదర్శి కొల్లి దేముడు, అధికారులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు. తుంగ్లాంలో వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, సంఘ నాయకులు, హరిజన జగ్గయ్యపాలెంలో సంఘ నాయకులు, స్థానికులు నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు.

గోపాలపట్నం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 90వ వార్డు ఎస్సీకాలనీలో బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు పాల్గొని మాట్లాడారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: పెదగంట్యాడ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. పెదగంట్యాడ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైకాపా సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మార్డుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, గంగులూరి రోజారాణి, మాజీ కౌన్సిలర్లు పల్లా చినతల్లి, కొయ్య భారతి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక, న్యూస్‌టుడే: జీవీఎంసీ 76వ వార్డు బాబూ జగ్జీవన్‌రామ్‌కాలనీలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలీషా, భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, పలువురు కూటమి, ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

తుంగ్లాంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ గోవిందరెడ్డి, తదితరులు

కొత్త కార్యవర్గం ఏర్పాటు

సింధియా, న్యూస్‌టుడే : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో ఆదివారం సిటూ కార్యవర్గాన్ని కొత్తగా ఎన్నుకున్నారు. మల్కాపురం జోన్ సిటూ కమిటీ అధ్యక్షులుగా బీఎస్ఎన్ రాజు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.లక్ష్మణమూర్తి, కోశాధికారిగా వి.బాబూరావు, ఇతర సభ్యులుగా పి.పైడిరాజు, ఎ.సత్యారావు, కె.పెంటారావు, జి.నరేష్, ఎ.రమణ, ఎం.ఆదినారాయణ, ఆర్.అప్పన్న, ఎస్.ప్రసాద్, ఎం.సత్యనారాయణ, వై.రాజబాబు, ఎన్.ఉమా, రామునాయుడు తదితరులు కొనసాగనున్నట్టు కార్యవర్గ సభ్యులు వెల్లడించారు.

నేటి నుంచి బీఎల్వోలకు శిక్షణ

ఎన్ఏడీకూడలి (కాకానినగర్), న్యూస్‌టుడే: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వార్డుల వారీగా బీఎల్వో(బూత్ స్థాయి అధికారి)లకు ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ సామాజిక భవనంలోని శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గోపాలపట్నం మండల తహసీల్దార్ సీహెచ్‌వీ రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశ్చిమంలోని 221 ఎన్నికల బూత్‌లకు సంబంధించి రోజుకి 50మంది బీఎల్వోల చొప్పున పాల్గొంటారన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొడదాం

సింధియా(జవహర్‌నగర్), న్యూస్‌టుడే : కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదామని జిల్లా సిటూ అధ్యక్షులు కె.ఎం.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సాయంత్రం 61వ వార్డు వెంకన్నపాలెం కార్యాలయంలో జరిగిన మల్కాపురం జోన్ సిటూ 10వ మహాసభలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కుని భాజపా ప్రభుత్వం అమ్మాలనుకోవడం దారుణమన్నారు. తొలుత సీనియర్ నాయకులు కె.నూకరాజు సిటూ పతాకాన్ని ఎగురవేశారు. అమరులకు నివాళులు అర్పించారు. సభలో జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు పాల్గొన్నారు.

సిటూ మహాసభకు హాజరైన ప్రతినిధులు

కరపత్రాలు ఆవిష్కరణ

గాజువాక, సింధియా, న్యూస్‌టుడే: వైకాపా గాజువాక ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో గాజువాక క్లబ్‌లో 'బాబూ ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కరపత్రాలు, బ్రోచర్లు ఆవిష్కరించారు. ★ పశ్చిమ వైకాపా సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ఆదివారం రాత్రి మరిడిమాంబ కల్యాణ మండపంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వైకాపా నగర అధ్యక్షులు కె.కె.రాజు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

గోపాలపట్నం, న్యూస్‌టుడే : గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం పోలీసులు తనిఖీలు నిర్వహించి రెండు బెల్టు షాపుల నుంచి 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సరిగా పత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎన్.వి.ప్రభాకరరావు, ఎస్సైలు అప్పలనాయుడు, రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంలో...: సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం మల్కాపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం యారాడ ఘాట్‌రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఓ ద్విచక్ర వాహనంలో 55 మద్యం సీసాలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని, వాహనాన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసుని సీఐ గొలగాని అప్పారావు పర్యవేక్షణలో ఎస్సై శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు.

నాచు తొలగించరేం.. — దర్పణం

అగనంపూడి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి పాత అగనంపూడిలోని కోనేరును ఏడేళ్ల క్రితం రూ. కోటి వ్యయంతో సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో ఆధునికీకరించారు. వ్యాయామం చేసే పాదచారుల కోసం చుట్టూ నడక మార్గాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళల్లో స్థానికులు సేదతీరడానికి సిమెంట్ బెంచీలు నిర్మించి సోలార్ దీపాలు అమర్చారు. దీంతో అక్కడి వాతావరణ ఆహ్లాదకరంగా ఉండేది. గత కొన్నేళ్లుగా నిర్వహణను పట్టించుకోకపోవడంతో కోనేరులో నీరంతా నాచుపట్టింది. చుట్టూ పిచ్చి తుప్పలు పెరిగిపోయాయి. దీంతో అక్కడికి వెళ్లడానికి స్థానికులు భయపడే పరిస్థితి తలెత్తింది. ఇకనైనా అధికారులు స్పందించి కోనేరును బాగుచేసి పూర్వస్థితి కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

మీ చెరగని చిరునవ్వు మా మనస్సులలో చిరస్థాయిగా నిలిచినా మీ మరణం మాకు తీరని లోటు. మీరు మానుండి భౌతికంగా దూరమైనా మీ మధుర స్మృతులు మా మదిలో పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భర్త: బి. జగ్గన్నాయుడు (జగ్గారావు) (లేటు), ల్యాండ్‌లార్డ్

కుమారులు - కోడళ్ళు : బి. రామ్మూర్తినాయుడు - రమ; బి. శ్రీనివాస్ - సునీత

కుమార్తెలు - అల్లుళ్ళు: బి. పద్మావతి - మహేశ్వరరావు; పి. విమల - భీమేష్ & ఎస్. విశాలి - శ్రీనివాసరావు

మనుమలు, మనుమరాళ్ళు, మరియు బంధుమిత్రులు

స్వ॥ శే॥ శ్రీమతి భీమరశెట్టి మంగతల్లి గారు

జననం: 27-03-1938 మరణం: 27-06-2025

పెద్దకర్మ తేది. 07-07-2025 సోమవారం

జగ్గారావు కాంప్లెక్స్, అక్కయ్యపాలెంలో మా స్వగృహము నందు జరుపబడును.

(c) eenadu

సింహభాగం సీఎస్ఈ, అనుబంధమే

న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

ఇంజినీరింగ్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తర్వాత వెబ్ ఐచ్ఛికాలు నమోదు మేరకు సీట్ల కేటాయింపు ఉంటుంది. జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయం పరిధిలో నాలుగు జిల్లాల్లోని 26 కళాశాలల్లో 23,430 సీట్లలో ప్రవేశాలకు ఏపీసీటీఈ ఆమోదం తెలిపింది. కంప్యూటర్ కోర్సులకు డిమాండు ఉన్న నేపథ్యంలో కళాశాలల్లో 61.20 శాతం సీట్లు సీఎస్ఈ, వాటి అనుబంధ కోర్సులే ఉంటున్నాయి. కౌన్సెలింగ్ నేపథ్యంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కోర్సుల్లో అవకాశాలపై జేఎన్‌టీయూ బృందం సూచనలివి.



జేఎన్‌టీయూ పరిధి కళాశాలల్లో సీట్ల వివరాలు..

బ్రాంచి	మొత్తం సీట్లు
సీఎస్ఈ	7,800
సీఎస్ఈ అనుబంధం	5,940
ఐటీ	600
కెమికల్	60
సివిల్	990
ఈసీఈ	4,290
ఈఈఈ	1,680
మెకానికల్	2,070

ఆన్‌లైన్‌లో పరిశీలన..

ధ్రువపత్రాల పరిశీలన పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తారు. కళాశాలల జాబితాను దగ్గర ఉంచుకోవడం మేలు. వీలైనన్ని ఎక్కువ కళాశాలలకు ఐచ్ఛికాలివ్వడం మంచిది. ఆన్‌లైన్‌లో సమాచారం తప్పుగా ఉంటే సహాయక కేంద్రం నుంచి చరవాణి ద్వారా తెలుసుకుని సరిచేస్తాం. లేని పక్షంలో సహాయ కేంద్రానికి రావాల్సి ఉంటుంది.

– విలియం కేరీ, నిపుణులు, కౌన్సెలింగ్ సహాయక కేంద్రం

కొత్తగా క్వాంటమ్

అనుబంధ కళాశాలల్లో డేటా సైన్స్, ఏఐఎంఎల్(ఆర్టిఫీషియల్, మెషిన్ లెర్నింగ్), బ్లాక్ చైన్, ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ కోర్సులను రెండేళ్ల క్రితమే పరిచయం చేశాం. ఈ ఏడాది అన్ని బ్రాంచిలకు మైనర్ కోర్సుగా క్వాంటమ్ టెక్నాలజీని పరిచయం చేస్తున్నాం. బీటెక్ కోర్సుగా ఏఐఎంఎల్‌ను పెట్టే విషయం పరిశీలనలో ఉంది.

– డి.రాజ్యలక్ష్మి, ఉప కులపతి, జేఎన్‌టీయూ గురజాడ

'కోర్'కే ఎక్కువ ప్యాకేజీ..

సీఎస్‌సీ, ఐటీకి ప్రాంగణ నియామకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గతేడాది ఎల్‌అండ్‌టీ, రష్మీ, క్యూస్ స్పైడర్, కాగ్నిజెంట్, మేథో సర్వే, ఇన్ఫోసిస్ కంపెనీల్లో 64 మందికి అవకాశాలు లభించాయి. వీటిలో కోర్ బ్రాంచిలకు ఎక్కువ ప్యాకేజీతో విద్యార్థులు ఎంపికయ్యారు. రష్మీ గ్రూపు కంపెనీకి రూ.12 లక్షల ప్యాకేజీతో తొమ్మిది మంది మెకానికల్ అభ్యర్థులకు అవకాశాలు వచ్చాయి. 20 మంది మెకానికల్, సీఎస్‌సీలో 18, సివిల్‌లో ఒకరు, ఈఈఈలో ఎనిమిది మందికి కొలువులు దక్కాయి.

– డా.వకుళ, శిక్షణ–ప్రాంగణ నియామకాల అధికారిణి

ఈ అంశాలు గమనించాలి..

ఐచ్ఛికాల సమయంలో అభ్యర్థులు ఆసక్తి ఉన్న కోర్సులే పెట్టుకోవాలి. ఫ్యాకల్టీ, కళాశాలలో మౌలిక సదుపాయాలు, అక్రిడేషన్, ఎన్‌ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌ను పరిశీలించాలి. గతంలో ప్రాంగణ నియామకాలు.. ఉద్యోగాలు పొందిన వారి వివరాలు తెలుసుకోవాలి.

– ఆర్.రాజేశ్వరరావు, ప్రధానాచార్యులు, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల

నేడు తపాలా సేవల నిలిపివేత

విజయనగరం కోట, న్యూస్‌టుడే: విజయనగరం డివిజన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాల్లో సోమవారం సేవలను నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీ 2.0 రోల్ అవుట్ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని, మంగళవారం నుంచి యథావిధిగా కార్యకలాపాలు ప్రారంభమవుతాయన్నారు. అదే రోజు కొత్త సాఫ్ట్‌వేర్ రానుందని చెప్పారు. ఖాతాదారులు గమనించాలని కోరారు.

ప్రతి ఒక్కరికీ జీవిత బీమా

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ జీవిత బీమా పొందాలని కలెక్టర్ అంబేడ్కర్ కోరారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై), ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజన(పీఎంజేజేబీవై), అటల్ పెన్షన్ యోజన(ఏపీవై) ద్వారా అతి తక్కువ ప్రీమియంతోనే ఎక్కువ రక్షణ పొందవచ్చని తెలిపారు. సామాన్య కుటుంబాలకు ఈ పథకాలు ఎంతో ప్రయోజనం చేకూర్చుతాయని పేర్కొన్నారు. వీటిపై అవగాహన కల్పించి, ప్రజలంతా సద్వినియోగం చేసుకునేలా చూడాలని లీడ్ బ్యాంకు, ఇతర బ్యాంకు శాఖలకు ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు.

ట్యాంకు నీరు.. పట్టించుకోరు

న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

గ్రామాల్లో తాగునీటి సరఫరా ట్యాంకులు అధ్వాన స్థితిలో దర్శనమిస్తున్నాయి. మెట్లు లేకపోవడం, వాటి వద్దకు వెళ్లేందుకు సరైన దారి కరవవడం తదితర కారణాలతో ఇప్పటికే చాలావరకు నాచుపట్టాయి. కొన్నిచోట్ల శుభ్రతకు సైతం నోచుకోవడం లేదు. వర్షాకాలం నేపథ్యంలో సమస్య తీవ్రమైంది. గతంలో గుర్ల, పూసపాటిరేగ, ఎస్.కోట తదితర మండలాల్లో పెద్దఎత్తున అతిసారం కేసులు నమోదయ్యాయి. మరణాలు సైతం సంభవించాయి. జిల్లాలోని 1,621 ఆవాస ప్రాంతాల్లో 1,100లకు పైగా పథకాలుండగా వీటిపై రూ.17 లక్షలకు పైగా జనాభా ఆధార పడుతుండడం గమనార్హం.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

సీపీడబ్ల్యూఎస్	30
పీడబ్ల్యూఎస్	934
ఎంపీడబ్ల్యూఎస్	185
చేతిపంపులు	15,468
నేరుగా పంపింగ్	408

చేపట్టాల్సిన పనులిలా..

★ 15 రోజులకోసారి ట్యాంకులను శుభ్రం చేయాలి. ★ కాలాలతో సంబంధం లేకుండా క్లోరినేషన్ తప్పనిసరి ★ క్షేత్రస్థాయిలో ఎంపీడీవోలు, గ్రామీణ నీటి సరఫరా అధికారులు పర్యవేక్షించాలి. ★ వర్షాకాలంలో కాచిన నీటిని ఉపయోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. ★ ఏడాదికి రెండు సార్లు నీటి పరీక్షలు చేసి, లోపాలు సరిచేయాలి. ★ పథకాలు, పైపులైన్లు మరమ్మతులకు గురైతే సకాలంలో బాగుచేయాలి.

ప్రధాన సమస్యలివీ..

- కాలువల్లో పైపులైన్లు
- నెలల తరబడి శుభ్రం చేయకపోవడం
- ఊట బావుల నుంచి నేరుగా ట్యాంకులకు నీరు ఎక్కించడం
- క్లోరినేషన్ ప్రక్రియ కానరాకపోవడం
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడం

నీటి ట్యాంకుల క్షేత్ర పరిశీలన.. 7లో

లోపాలపై దృష్టి.. ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు చేస్తున్నాం. ప్రభావిత ప్రాంతాల్లో తరచూ నమూనాలు సేకరిస్తున్నాం. ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్ ప్రక్రియ నిరంతరం సాగుతున్నాయి. ఎక్కడైనా జరగలేదని తెలిస్తే చర్యలు తీసుకుంటాం. వర్షాల నేపథ్యంలో ఎంపీడీవోలు, కార్యదర్శులను అప్రమత్తం చేశాం. – కవిత, ఎస్‌ఈ, గ్రామీణ నీటిసరఫరా, పారిశుద్ధ్య విభాగం

అభివృద్ధిపై చర్చకు బొత్స సిద్ధమా?

మంత్రి శ్రీనివాస్

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధిపై మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరంలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బొత్స జిల్లా మంత్రిగా ఉన్నప్పుడు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. గత అయిదేళ్లు, తాము అధికారంలోకి వచ్చాక జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. రూ.2 వేల నుంచి రూ.3 వేలు పింఛను సొమ్ము పెంచడానికి వైకాపా ప్రభుత్వ హయాంలో అష్టకష్టాలు పడ్డారని, తొలి ఏడాదిలోనే ఆరు లక్షల పింఛన్లు తీసేశారని ఆరోపించారు. మిగిలిన పథకాలను కొంతమందికే పరిమితం చేశారని విమర్శించారు. కూటమి రాకతో కొత్త లబ్ధిదారులను గుర్తించామన్నారు. కుటుంబంలో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం వర్తింపజేశామన్నారు. మహిళల స్వయం ఉపాధి కోసం రూ.27 వేల కోట్ల రుణాలిచ్చామని చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజలు నీరాజనం పడుతున్నారని పేర్కొన్నారు. తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పూర్తికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు.

తోటపల్లి జలాలతో మూడు జిల్లాలు సస్యశ్యామలం

పార్వతీపురం : జల వనరులను మెరుగుపర్చి వ్యవసాయానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు. గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి జలాశయం కుడి కాలువ నుంచి సాగు జలాలను ప్రభుత్వ విప్ జగదీశ్వరితో కలిసి ఆదివారం ఆమె విడుదల చేశారు. ఈ కాలువ ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 84 వేల ఎకరాలకు నీరు వెళ్తుందన్నారు. నిర్వహణ పనుల కోసం లస్కర్లను నియమించాల్సి ఉందన్నారు.

నీటి విడుదలకు మీట నొక్కుతున్న మంత్రి సంధ్యారాణి, విప్ జగదీశ్వరి, సబ్‌కలెక్టర్ శ్రీవాస్తవ

శ్రీనివాసం.. చిద్విలాసం

ఆషాఢ శుద్ధ(తొలి) ఏకాదశిని పురస్కరించుకుని విజయనగరంలోని తిరుమల తిరుపతి దేవస్థానంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆదివారం పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.వి.నర్సింహాచార్యుల వేదమంత్రాల నడుమ అభిషేకాలు, అర్చనలు జరిగాయి.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

లెక్కల్లోనే యూరియా.. ఇక్కడ లేదయా!

న్యూస్‌టుడే, బొబ్బిలి, రామభద్రపురం, గరివిడి, వ్యవసాయ విభాగం

ఖరీఫ్ ఆదిలోనే రైతులకు యూరియా కష్టాలు మొదలయ్యాయి. రైతు సేవా, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో దొరక్కపోవడంతో ప్రైవేటు డీలర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అదనుగా ప్రైవేటు వ్యాపారులు అధిక ధరలు వసూలు చేయడంతో పాటు అవసరం లేకున్నా.. అదనంగా పురుగు మందులను అంటగుడుతున్నారు.

ఖరీఫ్‌లో సాగు సాగేదిలా..

- వరి సాగు : 91,214 హెక్టార్లు
- మొక్కజొన్న : 12,386 హెక్టార్లు
- యూరియా అవసరం : 25,400 మెట్రిక్ టన్నులు
- జులైలో ఉంచాల్సింది : 6,800 మెట్రిక్ టన్నులు

జిల్లాలో ఈ నెలకు 6,825 టన్నుల యూరియా అవసరం కాగా 11,149 టన్నులు ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ రైతు సేవా కేంద్రాలు, సొసైటీల్లో మాత్రం అందుబాటులో లేదు. కొన్నిచోట్ల గోదాముల వద్దకు రైతులు వెళ్లి అడిగితే సిబ్బంది సమాధానం చెప్పలేక మూసివేస్తున్నారు.

మూసిఉన్న బొబ్బిలి పీఏసీఎస్ గోదాము

ఎరువుల కోసం రైతుల పడిగాపులు

ఇండెంట్ పెట్టక..

ఇటీవల మండల వ్యవసాయశాఖ అధికారులు, సచివాలయ సిబ్బందికి బదిలీలు జరిగాయి. ఇక్కడి వారు వేరే ప్రాంతాలకు వెళ్లిపోగా కొత్తవారు చేరడానికి ముహూర్తాలు వెతుకుతున్నారు. దీంతో ఎన్ని టన్నుల ఎరువులు అవసరమో చెబుతూ ఉన్నతాధికారులకు పంపాల్సిన నివేదిక(ఇండెంట్) పంపక.. కొరత ఏర్పడింది.

క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి

★ గరివిడి మండలానికి చెందిన ఓ రైతు ప్రైవేటు దుకాణాలకు వెళ్తే.. బస్తాకు రూ.320 ధర చెల్లించాలన్నారు. డీఏపీ, పురుగు మందు కూడా కొనుగోలు చేయాలని లింకు పెట్టారు. ★ అయిదు రోజులుగా బొబ్బిలి పీఏసీఎస్ వద్దకు రైతులు వెళ్తున్నా తాళం వేసి ఉంటోంది. ఒకవేళ తెరిచి ఉన్నా సిబ్బంది ఉండడం లేదు. ★ వారంగా రామభద్రపురంలో యూరియా లేక రైతులు సొసైటీ అధికారులను నిలదీస్తున్నారు. ★ బస్తా యూరియాకు రూ.400 చెల్లించాలని వ్యాపారి డిమాండు చేస్తున్నాడని చీపురుపల్లి మండలానికి చెందిన ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యాపారుల బాదుడు..

ప్రస్తుతం 11,149 మెట్రిక్ టన్నుల వరకు సిద్ధం చేసి, 591 మెట్రిక్ టన్నుల యూరియాను ఆర్‌ఎస్‌కేలకు తరలించినట్లు అధికారులు చెబుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో విత్తనాల పంపిణీ జరగడంతో ఎరువును పంపిణీ కేంద్రాలకు తీసుకురాలేదంటున్నారు. ఆర్‌ఎస్‌కేల్లో ఇంకా అందుబాటులోకి రాలేదని తెలుసుకున్న పలువురు ప్రైవేటు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి బస్తా రూ.266 కాగా.. రూ.300 నుంచి రూ.400 వరకు ధర పెంచి విక్రయిస్తున్నారు.

ఆందోళన వద్దు.. ఖరీఫ్ సీజన్‌కు సరిపడా యూరియా అందుబాటులో ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇప్పటికే ఆర్‌ఎస్‌కేలకు 591 మెట్రిక్ టన్నులు పంపించాం. మరో 3,600 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచుతున్నాం. ప్రైవేటు వ్యాపారులు అదనంగా వసూలు చేస్తే రైతులు మా దృష్టికి తీసుకురావాలి. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రైవేటు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి నిల్వలు పరిశీలిస్తాం.

– వీటీ రామారావు, జిల్లా వ్యవసాయాధికారి

శునక సౌందర్యం

తాము పెంచుకుంటున్న శునకంతో యువతులు

గ్రేట్‌డాన్ : నేనే

సైబేరియన్ అస్కీ: పిల్లిని కాను.. కుక్క పిల్లనే

షిడ్జూ: ఎంత అందంగా ఉన్నానో కదా

విజయనగరం వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: జూనోసిస్ దినోత్సవం వేళ నగరంలో సందడి ఇది. జర్మన్ షెపర్డ్, లాబ్రడార్, డాల్మెషన్, గ్రేట్ డాన్, పగ్, పామిరేరియన్, రాట్‌వేలర్, టిబిటియన్ టెరియర్, డాబర్‌మెన్, సైబేరియన్ అస్కీ.. ఇలా పలు శునక జాతులను పెంపకందారులు పట్టణంలో పశుసంవర్ధకశాఖ కార్యాలయ ఆవరణకు తీసుకొచ్చి యాంటీ రేబిస్ టీకాలు వేయించారు. మొత్తం 584 పెంపుడు కుక్కలు, పిల్లులకు సిబ్బంది టీకాలు వేశారు.

రండి.. రండి.. దయచేయండి

తల్లిదండ్రుల సమావేశాలకు సన్నద్ధత

న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

జిల్లాలో ఈనెల 10న మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలను పండగ వాతావరణంలో నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. గతేడాది ప్రభుత్వ పాఠశాలలకే ఈ కార్యక్రమం పరిమితమైంది. ఈసారి ప్రైవేటు విద్యాలయాలతో పాటు కళాశాలల్లోనూ చేపట్టనున్నారు. ఏర్పాట్ల నిమిత్తం సోమవారం అన్ని యాజమాన్యాలతో అధికారులు సమావేశం కానున్నారు.

విద్యార్థులే తల్లిదండ్రులను ఆహ్వానించనున్నారు. ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, గతంలో చదివి ఉన్నత స్థానాల్లో నిలిచినవారిని పిలిచి, సన్మానిస్తారు. బాలలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యస్థితిపై కార్డులిస్తారు. సృజనాత్మకతను వెలికితీసే పోటీలు, తల్లిదండ్రులకు రంగోళి, టగ్ ఆఫ్ వార్, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేయనున్నారు. పర్యవేక్షణకు గానూ గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు 17 కమిటీలను నియమించారు. సంయుక్త కలెక్టర్ ఆధ్వర్యంలో కంట్రోల్‌రూంను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు.

జిల్లాలో ఇలా..

- పాఠశాలలు: 2229
- బాలలు: 2,10,377
- కళాశాలలు: 183
- విద్యార్థులు: 38,475

తల్లి పేరుతో మొక్క

తల్లి పేరుతో మొక్క నాటడాన్ని ఈ ఏడాది ఇతివృత్తంగా తీసుకున్నారు. పాఠశాల ఆవరణ లేదా వారి ఇంటి వద్ద పిల్లలు నాటవచ్చు. 'లీప్' యాప్‌లో లాగిన్ అయి పేరు నమోదు చేసుకోవాలి. పెరుగుతున్న మొక్కను ఏటా చిత్రీకరించి అందులో నవీకరించాలి.

చర్చించే అంశాలివే.. ● పాఠశాల అభివృద్ధి ● మౌలిక సదుపాయాల కల్పన ● విద్యార్థుల చదువు, భవిత, ఆరోగ్యం ● గతేడాది సాధించిన ప్రతిభ, ఈ ఏడాది లక్ష్యం

(c) eenadu

ఇన్‌స్పైర్ చేద్దాం రండి

గతేడాది ప్రాజెక్టుల ప్రదర్శనలో విద్యార్థులు

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

పిల్లలు చదువులతో పరిమితం కాకుండా కొత్తగా ఆలోచిస్తున్నారా.. దీనికోసం ఇంట్లో ఉన్న సామగ్రిని చిందరవందర చేస్తున్నారా.. అయితే అలాంటి వారిపై విసుగు చెంది.. వారి ఆలోచనలకు అడ్డుకట్ట వేయొద్దు. ఎందుకంటే.. వారిలోనూ ఓ శాస్త్రవేత్త ఉన్నారేమో! ఇలాంటి విద్యార్థుల కోసమే కేంద్ర ప్రభుత్వం ముందుకు వస్తోంది. పిల్లల్లో ప్రాథమిక దశలోనే శాస్త్రీయ, వైజ్ఞానిక సృజనాత్మకతను వెలికితీసి, భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రోత్సహిస్తోంది. దీనిలో భాగంగా కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనాక్ పురస్కారాలకు సంబంధించి నామినేషన్లను స్వీకరిస్తోంది.

వీరు అర్హులు..

మన్యం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర యాజమాన్య పాఠశాలలు 1720 వరకు ఉన్నాయి. 1.30 లక్షల మంది విద్యార్థులున్నారు. 6 నుంచి 10 మధ్య చదువుతున్న 60 వేల మంది ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంది. ఒక్కో ఉన్నత పాఠశాల నుంచి 5, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 చొప్పున నామినేషన్లు పంపించవచ్చు.

గత మూడేళ్లలో ఇలా..

సంవత్సరం	నామినేషన్లు	ఎంపికలు	
		జిల్లా	రాష్ట్రం
2022	897	86	9
2023	962	87	9
2024	1,005	95	10

రిజిస్ట్రేషన్ సులువు.. ఆసక్తి ఉన్నవారు వివరాలను www.inspireawardsdst.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. పాఠశాల అథారిటీ ఐడీ ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసిన అనంతరం విద్యార్థుల వివరాలు పొందుపర్చాలి. విద్యాశాఖ ఆమోదం లభించాక ఈ-మెయిల్, యూజర్ ఐడీ లింక్, పాస్‌వర్డ్ సహాయంతో ప్రాజెక్టు వివరాలు పొందుపర్చాలి. ప్రాజెక్టు రైటప్, చిత్రాలు లేదా 300 పదాలు మించకుండా వివరణను అప్‌లోడ్ చేయాలి. నామినేషన్ గడువు సెప్టెంబరు 15.

అంశాలివీ.. స్వచ్ఛభారత్, మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా, సమాజాభివృద్ధి, క్లీన్ ఇండియాపై ప్రాజెక్టులు చేయాల్సి ఉంటుంది.

రాష్ట్రపతి భవన్‌కు వెళ్లొచ్చు.. ఎంపికైతే జిల్లా స్థాయిలో రూ. 10 వేలు, రాష్ట్ర- రూ. 25 వేలు, జాతీయస్థాయిలో రూ.50 వేల వరకు గెలుచుకోవచ్చు. అక్కడ అర్హత సాధిస్తే రాష్ట్రపతి భవన్, జపాన్ పర్యటనకు అవకాశం లభిస్తుందని, పేటెంట్ హక్కులు పొందితే ఇతర ప్రోత్సాహకాలు వస్తాయని సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు తెలిపారు.

పట్టించుకోక ప్రవాహానికి వదిలేశారు

నాగావళి నదిపై సంతకవిటి మండలం నారాయణపురం వద్దనున్న ఆనకట్ట ఇది. విజయనగరం, శ్రీకాకుళం జిల్లా పరిధిలోని ఏడు మండలాల్లో 50 వేల ఎకరాలకు ఖరీఫ్‌లో సాగునీరు అందించే ప్రధాన జలవనరు. ఆనకట్టపై ఉన్న 118 షట్టర్లలో సగానికిపైగా పాడైపోయాయి. వాటిని మార్చేందుకు ఇటీవల అధికారులు కొత్తవి తయారు చేయించారు. నదిలో వరద రాకముందే అమర్చాలి. సకాలంలో చర్యలు చేపట్టకపోవడంతో నీరంతా ఇలా వృథాగా దిగువకు వెళ్లిపోతోంది. షట్టర్లు అమర్చి ఉంటే కొంతనీరైనా ఆయకట్టు రైతులకు ఉపయోగపడేది. ప్రవాహం తగ్గాక బిగిస్తామని ప్రాజెక్టు ఏఈ రామశివ తెలిపారు. – న్యూస్‌టుడే, సంతకవిటి

వాహనంతో వెళ్లలేం.. దిగి నడవలేం

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఏళ్ల నాటివి కావడంతో తారు ఊడి, మట్టి తేలింది. దీంతో వర్షాలకు ఇలా బురదమయంగా మారి, ప్రయాణికులకు నరకం చూపుతున్నాయి. ● సంతకవిటి మండలం పీజేపేట- రంగరాయపురం గ్రామాల మధ్యగల రోడ్డు విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలను కలుపుతుంది. వర్షాలకు, వాహనాల రాకపోకలతో వెళ్లే వీలు లేకుండా మారిపోయింది. అటుగా ప్రయాణమంటేనే చోదకులు హడలిపోతున్నారు. బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఏఈ రియాజ్ తెలిపారు. ● మెంటాడ మండలంలోని ఆండ్ర నుంచి కుంబివలసకు వెళ్లే మార్గం చిత్తడిగా తయారైంది. పసలవలస, కొండజీరికివలస, వేమలిపుట్టి, కుంబివలస, దోనుబిల్లి, పాచిపెంట మండలంలోని పలు గ్రామాలవారికి ఇదే దిక్కు. శనివారం ఓ ఆటో ఆగిపోవడంతో గిరిజనులు ఇలా తోస్తూ కనిపించారు. రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని ఇంజినీరింగ్ అధికారి గౌతమ్ చెప్పారు. – న్యూస్‌టుడే, సంతకవిటి, మెంటాడ

చిత్తడిగా పీజేపేట రోడ్డు

ఆండ్ర- కుంబివలస దారిలో బురదలో నుంచి ఆటోను తోస్తున్న గిరిజనులు

నగర వనం.. అందాల ఆతిథ్యం

- వేడుకల నిర్వహణకు అవకాశం
- తక్కువ ధరలకే అందుబాటులో..

– న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

చుట్టూ పచ్చని అందాలు.. పక్షుల కిలకిల రావాలు.. రాత్రి వేళ వెలుగునిచ్చే మిణుగురులు.. పరుగు తీసే జంతువులు.. అంతర్గత రహదారులు.. జిమ్‌లు.. ఆట పరికరాలు.. వాకింగ్ ట్రాక్‌లు.. వివిధ రకాల ప్రదర్శన శాలలు.. ఇలా ఒక్కటేమిటి ఆనందభోగానికి హద్దుల్లేకుండా.. ఆత్మీయ వేడుకకు వేదికలయ్యేలా విరాజిల్లుతున్నాయి నగరవనాలు.. శుభకార్యమైనా.. సమావేశమైనా.. కుటుంబంతో వచ్చినా.. స్నేహితులంతా కలిసి వెళ్లినా అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తామని చెబుతోంది అటవీశాఖ. రండి.. తక్కువ ధరకే మా ఆతిథ్యం పొందండని పిలుపునిస్తోంది.

ప్రకృతిని కాపాడేందుకు, అడవులపై అవగాహన కల్పించేందుకు కేంద్రం అన్ని రాష్ట్రాల్లో నగరవనాలను అభివృద్ధి చేస్తోంది. జిల్లాలోని సారిపల్లి, బేతనాపల్లి, కొండవెలగాడలో ఉన్న రిజర్వ్ అటవీ ప్రాంతంలో సరికొత్త నిర్మాణాలు వెలిశాయి. ఈమేరకు రూ. 6 కోట్ల మేర ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే సారిపల్లి క్షేత్రం అందుబాటులోకి రాగా.. మిగిలిన రెండు ప్రాంతాల్లో పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం కొన్నిరోజులుగా సారిపల్లి వనం పర్యాటకులతో సందడిగా మారుతోంది.

సందర్శకులు..

నెల	సంఖ్య
ఏప్రిల్	260
మే	370
జూన్	475

సారిపల్లిలోని నగరవనంలో సేదదీరుతున్న సందర్శకులు

తక్కువ ధరలకే శుభకార్యాలు..

ఇక్కడ తక్కువ ధరలకే శుభకార్యాలు, అన్ని రకాల కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చు. ముందుగానే నిర్వాహకులకు తెలియజేయాలి. ఆమేరకు ధర నిర్ణయిస్తారు. సాధారణంగా అయితే పెద్దలకు రూ. 20, పిల్లలకు రూ.10 తీసుకుంటున్నారు. గత మూడు నెలల్లో 1105 మంది సందర్శించారు. టిక్కెట్ల ద్వారా రూ. 22,100 వచ్చినట్లు అటవీ అధికారులు చెబుతున్నారు.

సందర్శకుల తాకిడి.. గతేడాది నవంబరులో సారిపల్లి నగరవనాన్ని ప్రారంభించారు. పదెకరాల్లో ఇది విస్తరించింది. చుట్టూ ముచ్చటగొలిపేలా అడవి ఉంటుంది. వివిధ రకాల జంతువుల ప్రదర్శనతో పాటు వృద్ధులకు ఉపయోగపడేలా విశ్రాంత గదులు, యోగా మందిరం, వ్యాయామ శాల, పిల్లల పార్కు ఏర్పాటు చేశారు. అటవీ జాతులతో పాటు వివిధ ప్రాంతాల్లో లభించే మొక్కలను చూడొచ్చు. రచ్చబండలు, పాకలు, ఎక్కడికక్కడే బెంచీలు పెట్టారు. అన్ని రకాల సదుపాయాలను సమకూర్చారు.

ప్రత్యేక వ్యూపాయింట్..

ఇక్కడికి రావడం ఓ విహార యాత్రే. కాలుష్యానికి దూరంగా రోజంతా సందడి చేయొచ్చు. ఎలాంటి ఇబ్బంది ఉండదు. ప్రజలను అడవులకు రప్పించడమే మా ప్రధాన ధ్యేయం. సదుపాయాలు బోలెడు. 50 హెక్టార్ల పరిధిలోని అటవీ సంపదను చూసేందుకు ప్రత్యేక వ్యూపాయింట్ సైతం ఉంది. పక్షులు, వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు నీటి కుంటలను ఏర్పాటు చేశాం. సుమారు 2 వేల జాతుల మొక్కలు పెంచుతున్నాం. కుటుంబంతో వచ్చినా, సమూహంగా చేరుకున్నా ఏర్పాట్లు చేస్తాం. సద్వినియోగం చేసుకోవాలి. – ఆర్.కొండలరావు, డీఎఫ్‌వో

పెంపుడు జంతువులతో జాగ్రత్త

కుక్కకు టీకా వేస్తున్న జేడీ వైవీ.రమణ

విజయనగరం వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: పెంపుడు జంతువుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అప్రమత్తతతో వ్యాధుల నుంచి దూరం కావొచ్చని పశుసంవర్ధకశాఖ విజయనగరం జిల్లా అధికారి వై.వి.రమణ సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని బహుళార్ధక పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలను ఉచితంగా వేశారు. అంతకుముందు శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేబిస్, మెదడువాపు, బర్డ్‌ఫ్లూ, ఎబోలా, ప్లేగు, ఆంథ్రాక్స్ తదితర రకాల వ్యాధులు పెంపుడు జంతువుల ద్వారా సంక్రమించే ప్రమాదం ఉందన్నారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, సకాలంలో టీకాలు వేయడం తదితర చర్యలతో ఇబ్బంది ఉండదన్నారు. ఉచితంగా మందులు, వివిధ ఆహార పదార్థాలు అందజేశారు. మూడు నెలల వయసు దాటిన 584 జంతువులకు టీకాలు వేశామన్నారు. ఉప సంచాలకురాలు జి.మహాలక్ష్మి, ఏడీలు సన్యాసినాయుడు, కె.వి.రమణ, కిషోర్, ధర్మారావు, పశువైద్యులు మోహన్, హిమజ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	బ్యాగ్‌లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	98	166	176

విమర్శలకు అభివృద్ధే సమాధానం: నాగార్జున

చీపురుపల్లి, న్యూస్‌టుడే: 'అయ్యా బొత్స.. మీరు, మీ పార్టీ నాయకులు విమర్శిస్తూ వెళ్లండి.. మేం అభివృద్ధి చేసుకుంటూ సాగుతాం' అని డీసీసీబీ ఛైర్మన్, తెదేపా విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. ఆదివారం చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష నేత ఇటీవల కూటమి ప్రభుత్వంపై చేసిన విమర్శలను ఆయన ఖండించారు. బొత్స సత్యనారాయణ మాటలు విడ్డూరంగా ఉన్నాయని, ఎన్నికల హామీలు అమలు చేయడం లేదని వ్యాఖ్యానించడం సిగ్గు చేటన్నారు. ఆ పార్టీ నాయకులు గ్రామాల్లోకి వెళితే ప్రజలే నిజాలు చెబుతారన్నారు. సూపర్- 6 పథకాల అమలుపై ప్రజలు, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై రైతులు, అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి రూ. 15కే మూడు పూటలా భోజనం పెడుతున్నామని పేదోళ్లు ఆనందంగా ఉన్నారన్నారు.

సఖితో బాలికలకు అభయం

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: అవగాహన లేకపోవడం, అపరిచితులను నమ్మడం, సమాజ పోకడలు, సామాజిక మాధ్యమాల అధిక వినియోగం.. తదితర కారణాలతో ప్రస్తుత సమాజంలో చాలా మంది బాలికలు, మహిళలు వేధింపులకు గురవుతున్నారు. కొందరు మోసాల బారిన పడుతున్నారు. ఇంకొందరు కుటుంబాలకు దూరమవుతున్నారు. ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట పడేలా, వారిలో చైతన్యం కలిగించేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి(వన్‌స్టాప్ సెంటర్) కేంద్రాలు నడుస్తున్నాయి. బాధితులకు సహాయం అందించేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అవసరం మేరకు న్యాయ, వైద్య, పోలీసు, వసతి తదితర సౌకర్యాలను ఉచితంగా అందిస్తున్నాయి.

అందుబాటులో నంబర్లు..

ఇబ్బందులకు గురైతే 181 హెల్ప్‌లైన్ నంబరును సంప్రదించవచ్చు. సంబంధిత సిబ్బంది సఖి కేంద్రానికి తెలియజేస్తారు. నేరుగా వన్‌స్టాప్ సెంటరుకు సైతం వెళ్లొచ్చు. ఇప్పటివరకు 2013 ఫిర్యాదులు అందినట్లు అధికారులు చెబుతున్నారు. బాధితులను గుర్తించిన వెంటనే కౌన్సెలింగ్ ఇస్తారు. ఇంట్లో ఉండేందుకు ఇష్టం లేకపోతే వసతి కల్పిస్తారు. గాయాలపాలైతే తగిన వైద్యం అందిస్తారు. రక్షణకు పోలీసులను నియమిస్తారు. న్యాయ సహాయాన్ని సైతం పొందవచ్చని **విజయనగరంలోని సఖి కేంద్రం పరిపాలనాధికారిణి పి.సాయి విజయలక్ష్మి** 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈమేరకు పాఠశాలలు, కళాశాలలు, సచివాలయాలు, పని ప్రదేశాలు తదితర చోట్ల అవగాహన కల్పిస్తున్నామని, వారానికి సుమారు 20 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న వన్‌స్టాప్ కేంద్రం సిబ్బంది

వాణిజ్యపన్నుల శాఖ జేసీగా రామకోటేశ్వరరావు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: వాణిజ్య పన్నుల శాఖలో పలు విభాగాల వారిని ప్రభుత్వం బదిలీ చేసింది. విజయనగరం డివిజన్ సంయుక్త కమిషనరుగా పి.రామకోటేశ్వరరావు నియమితులయ్యారు. ఈయన ఏలూరు నుంచి రానున్నారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన బి.నాగార్జునరావు ఆయన స్థానంలోకి వెళ్లనున్నారు. రాజమహేంద్రవరంలో డిప్యూటీ కమిషనరుగా విధులు నిర్వహిస్తున్న జి.నిర్మలజ్యోతిని ఇక్కడ డీసీగా నియమించారు. స్థానిక డీసీ పి.భాస్కరవల్లికి అనంతపురం జిల్లాకు స్థానచలనమైంది.

ఏసీల స్థానాల్లో మార్పులు..

విజయనగరం తూర్పు సర్కిల్‌లో పనిచేస్తున్న జి.అచ్యుయ్య విశాఖ-2 స్టీల్‌ప్లాంటు సర్కిల్‌కు వెళ్లనున్నారు. ఆయన స్థానంలో మాధవధార నుంచి వి.జ్యోతి రానున్నారు. దక్షిణ సర్కిల్‌కు చెందిన జి.రమేష్‌కుమార్ విశాఖ-2 విమానాశ్రయ సర్కిల్‌కు, అచ్యుతాపురం నుంచి డి.శ్వేత ఆ స్థానానికి, పశ్చిమలోని కింజరాపు వెంకటరమణ విజయనగరం డివిజన్ కార్యాలయ ఇంటెలిజెన్స్ ఏసీగా.. ఆ స్థానంలో గాజువాకలో విధులు నిర్వర్తించే ఎం.వెంకటేశ్వర్లు, ఆమదాలవలస సర్కిల్‌కు చెందిన కొండమ్మ విశాఖ-1(సిరిపురం)కు, శ్రీకాకుళంలో ఉన్న జి.రాణిమోహన్ పలమనేరు సర్కిల్‌కు బదిలీ అయ్యారు. వీరి స్థానాల్లో ఇంకా ఎవరినీ నియమించలేదు. పార్వతీపురం, నరసన్నపేట, కాశీబుగ్గ సర్కిళ్లలో ఏసీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

యువతకు ఉద్యోగం హక్కు కావాలి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్.శర్మ

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: దేశంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాన్ని ఓ హక్కుగా మార్చాలని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ డిమాండు చేశారు. 'నిరుద్యోగ సమస్య- యువత భవిష్యత్తుకు శాస్త్రీయ పరిష్కారం' అంశంపై ఆదివారం విజయనగరంలోని ఏపీఎన్జీవో హోంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వాలు అవలంబిస్తున్న నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలు నేటితరానికి ఉపాధి కల్పించే విధంగా లేవని అభిప్రాయపడ్డారు. మానవ శ్రమను వినియోగంలోకి తెచ్చి, సంపద సృష్టికి ఉపయోగపడే విధానాలు అవసరమని సూచించారు. అప్పుడే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. నాయకులు ఎంవీఎన్.వెంకటరావు, రమణ ప్రభాత్, చిన్నారి, వి.రాజ్‌గోపాల్, కె.శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ ప్రోబబుల్స్ జట్టుకు మన్యం యువకుడు

మణికంఠను సత్కరిస్తున్న కబడ్డీ అసోసియేషన్ నాయకులు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: భారత కబడ్డీ ప్రోబబుల్స్ జట్టుకు సీతంపేట మండలం జిల్లేడుపాడు గ్రామానికి చెందిన గిరిజన యువకుడు పాలక మణికంఠ ఎంపికయ్యాడు. ఆదివారం ఆయనను కబడ్డీ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు పల్లా కొండబాబు, కార్యదర్శి వి.చంద్రశేఖర్ పాలకొండలో సత్కరించారు. ఈ ఏడాది అక్టోబరులో జరగనున్న ఆసియా కప్ పోటీల్లో పాల్గొనేందుకు 22 మందిని ఇటీవల హరిద్వారాలో ఎంపిక చేశారు. మణికంఠ ఉత్తమ ప్రతిభ చూపి చోటు దక్కించుకున్నాడు. కబడ్డీ ప్రీమియర్ లీగ్‌లో ఆడించేందుకు పట్నా జట్టు ఇప్పటికే ఈ క్రీడాకారుడితో ఒప్పందం కుదుర్చుకుంది. తల్లిదండ్రులు చిన్నారావు, విశ్వనాథమ్మ వ్యవసాయం చేస్తున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.సుధ, కోశాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శిరస్త్రాణం మరవద్దు: ఎస్పీ

విజయనగరం నేరవార్తల విభాగం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల్లో 50 శాతం మంది శిరస్త్రాణాలు లేకపోవడంతో మరణిస్తున్నారని చెప్పారు. ధరించనివారిపై ఈ-చలానాలు విధించాలని సిబ్బందిని ఆదేశించారు.

ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత ప్రవేశాలు

వేంపల్లె, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు విద్యాలయాల్లో 600 సీట్లు మిగిలాయి. 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్నవారిని పరిగణనలోకి తీసుకుని సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి జాబితాను తయారు చేసి ఈనెల 11 లేదా 12వ తేదీల్లో అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. కౌన్సెలింగ్ తర్వాత ఇడుపులపాయలో 132, నూజివీడులో 141, శ్రీకాకుళంలో 143, ఒంగోలులో 184 సీట్లు ఉండిపోయాయి.

జంఝావతికి భారీగా వరద

కొమరాడ, న్యూస్‌టుడే: ఒడిశాలోని రాయగడ జిల్లాలో పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నాగావళి, జంఝావతితో పాటు ఉపనదుల్లో పెద్దఎత్తున వరదనీరు చేరుతోంది. ఎగువ ప్రాంతంలో జోరుగా వర్షాలు పడుతున్నాయి. రాయగడ వద్ద జంఝావతి పొంగి ప్రవహిస్తోంది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. నాగావళిలో నీటిమట్టంపై ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తున్నారు.

క్షణికావేశం.. తీసింది ప్రాణం

ఇంటిపెద్ద ఆత్మహత్య..

సత్య వరప్రసాద్ (పాతచిత్రం)

కొత్తవలస, న్యూస్‌టుడే: చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొత్తవలస మండలంలోని ఉమాదేవినగర్ సమీపంలో చోటుచేసుకుంది. సీఐ షణ్ముఖరావు వివరాల ప్రకారం.. గంట్యాడ మండలం లక్కిడాం గ్రామానికి చెందిన జి.గౌరి శివసత్య వరప్రసాద్(38) ఇరవై ఏళ్ల క్రితం కొత్తవలసకు వలస వచ్చారు. రాజన్న కాలనీలో ఇటుకల బట్టీ నిర్వహిస్తూ.. కుటుంబంతో నివాసముంటున్నారు. ఆదివారం ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ఉమాదేవినగర్ సమీపంలోని మామిడితోటలో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. స్థానికులు చూసి, పోలీసులకు సమాచారం అందించారు. ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఓ మహిళ కారణంగానే తన భర్త ఆత్మహత్మకు పాల్పడి ఉంటాడని అతని భార్య ఎర్నమ్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు కిందపడి వృద్ధుడు..

సీతారామయ్య (పాతచిత్రం)

కొత్తవలస, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కొత్తవలసలో చోటుచేసుకుంది. ఆర్పీఎఫ్ ఏఎస్సై ఉమామహేశ్వరరావు వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా గోపాలపట్నం సమీపంలోని లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన సీహెచ్.సీతారామయ్య(77) విశాఖపట్నం డాక్ యార్డులో ఉద్యోగం చేసి విరమణ పొందారు. ఆదివారం కొత్తవలస పట్టణంలోని చేపల దుకాణాల వెనుక విజయనగరం నుంచి కొత్తవలస వస్తున్న గూడ్సు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు విజయనగరంలోని ప్రభుత్వ రైల్వే పోలీసు స్టేషన్‌కు, బాధిత కుటుంబానికి సమాచారం అందించామని ఏఎస్సై చెప్పారు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారావు కేసు నమోదు చేశారన్నారు. లేఖ రాసిన అనంతరం మరణించాడన్నారు.

వేధింపులు తాళలేక మహిళ..

పాచిపెంట, న్యూస్‌టుడే: అత్తింటి వేధింపులు తాళలేక గిరిజన మహిళ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పాచిపెంట మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై వెంకట సురేష్ వివరాల మేరకు.. గుమ్మడిగుడ పంచాయతీ పాచిలవలస గ్రామానికి చెందిన ఎరకయ్యతో ఎగువ చింతలవలసకు చెందిన పి.సీతమ్మ(18)కు ఏడాది కిందట వివాహమైంది. కొన్ని నెలల తరువాత భర్త, అత్తామామలు వేధించడంతో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. ఆమెను ఇబ్బంది పెట్టమని వారు పెద్దల ముందు అంగీకరించారు. మళ్లీ వేధింపులకు పాల్పడడంతో తట్టుకోలేక నాలుగైదు రోజుల కిందట గ్రామ సమీపంలోని కొండపై చెట్టుకు ఉరేసుకుంది. విషయం తెలుసుకున్న తల్లి పైడితల్లి బోరున విలపించింది. తమ కుమార్తె మృతికి ఆమె భర్త, అత్తామామలే కారణమని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

23 నుంచి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

క్రీడావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని డీఎస్‌వో ఇండోర్ స్టేడియంలో ఈనెల 23 నుంచి 25 వరకు ఉమ్మడి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కేఏ.నాయుడు ఆదివారం తెలిపారు. అండర్- 11, 13, 15, 17, 19 స్త్రీ, పురుష విభాగాల్లో టోర్నమెంటు సాగుతుందని, ఈనెల 20లోగా పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు 94405 05275, 79811 11705 నంబర్లను సంప్రదించాలని సూచించారు. సంఘం గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, వీఎస్.ప్రసాద్, నున్న సురేష్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి విద్యాలయాల్లో..

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జనాభా దినోత్సవాన్ని(జులై 11) పురస్కరించుకుని ఈనెల 7న మండల, 9న జిల్లాస్థాయిలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో యు.మాణిక్యం నాయుడు తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, పురపాలక విద్యాలయాల్లో ఎనిమిది నుంచి పదోతరగతి చదువుతున్నవారు అర్హులని పేర్కొన్నారు. మండలస్థాయిలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారు జిల్లాస్థాయికి వెళ్తారని చెప్పారు. పొగాకు, మత్తు పదార్థాల నివారణపై చిత్రలేఖనం, 'లింగ సమానత్వం-గౌరవ మర్యాదలు' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలని, అందరూ పాల్గొనేలా చూడాలని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

REAL ESTATE

BATH CLEANING

PLOT FOR SALE

116 Sq. Yards Plot No.24, Sarvani Nagar. Contact: 8374612225.

JOBS

FINANCIAL SERVICES

గమనిక

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80081 11237

నేటి కథలు భావితరాలకు చేరాలి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బాబూరావు తదితరులు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: చరిత్ర, సామాజిక సమస్యల గురించి భవిష్యత్తు తరాలకు తెలియజేయాలంటే కథలు, సరికొత్త రచనలు అవసరమని విజయవాడకు చెందిన చారిత్రక పరిశోధక రచయిత సాయి పాపినేని అన్నారు. నగరానికి చెందిన జీవీ.శ్రీనివాస్ రచించిన 'చరిత్ర చెప్పిన కథలు(కథా సంపుటి)' పుస్తకాన్ని ఆదివారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో విజయనగరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజాన్ని ప్రభావితం చేసే ఏ విషయాన్నైనా పుస్తక రూపంలోకి తేవాలంటే దానిపై ఎంతో పరిశోధన అవసరమన్నారు. ఈ సంపుటిలో విలువలతో కూడిన కథలున్నాయని, ప్రతిఒక్కరూ చదివి.. వారి పిల్లలకు తెలియజేయాలన్నారు. కథలు, రచనలు, కళలకు ఉత్తరాంధ్ర నిలయమని శ్రీనివాస్ పేర్కొన్నారు. రచయితలు చీకటి దివాకర్, యార్లగడ్డ బాబూరావు, అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, రాణిశర్మ, మంజరి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి

ఊరూరా ఉత్సవాలు

ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి

బొబ్బిలి, గుర్ల, రామభద్రపురం, చీపురుపల్లి: కంచరవీధి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం జగన్నాథస్వామి ఉత్సవాలు ముగింపు కార్యక్రమం జరిగింది. చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. విశాఖపట్నానికి చెందిన ఎస్.తిరుమలరావు, నాగరత్న సుమారు రూ.లక్ష విలువైన వెండి వస్తువులు విరాళంగా ఆలయానికి అందజేశారు. రామభద్రపురం మేజర్ పంచాయతీలో దేశమ్మతల్లి, గుర్లలో రాజులమ్మ తల్లి పండగ జరిగింది.

గుర్లలో ఘటాల ఊరేగింపు

బొబ్బిలి పట్టణం కంచరవీధి ఆలయం వద్ద భక్తులు

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో ఆదివారం కూరగాయల ధరలు (కిలో రూ.లో) ★ టమాటా: 34.00, వంకాయలు: 30.00 దొండ: 45.00, బీర: 35.00 ★ బెండ: 25.00 ★ కాకర: 30.00 ★ చిక్కుడు: 25.00 ★ ఆనపకాయ (ఒకటి): 12.00 ★ అరటి (జత): 15.00 ★ మునగ: 70.00 ★ ఉల్లి: 25.00 ★ బంగాళదుంపలు: 20.00 ★ అల్లం: 50.00 ★ వెల్లుల్లి: 80.00 –న్యూస్‌టుడే, రాజాం

తెరపై ఈనాడు

బొబ్బిలిలో..: లక్ష్మీ థియేటర్: కన్నప్ప వాసవి: మార్గన్ టీచర్ స్క్రీన్–1: కుబేర – న్యూస్‌టుడే, బొబ్బిలి

రాజాంలో..: సీతారామ: కుబేర, సీతారామ (మినీ): తమ్ముడు, అప్సర ఎస్‌వీడీ: కన్నప్ప –న్యూస్‌టుడే, రాజాం

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

?: మెంటిపేటలో తాగునీటి సరఫరా సక్రమంగా ఉండడం లేదు. ధార సన్నగా వస్తోంది. -మోహన్, మెంటిపేట ❖ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - వెంకటరామరాజు, ఏఈ –న్యూస్‌టుడే, రాజాం

?: గుర్వసెంతాంపురంలో పాత పంచాయతీ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ రహదారిపై మురుగు నిలిచిపోతోంది. - గ్రామస్థులు ❖ మురుగు నిలవకుండా చర్యలు తీసుకుంటాం. - అనూష, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, సంతకవిటి

?: కరకాం ప్రాథమిక పాఠశాల ముందు కల్వర్టుపై సిమెంటు పలక దెబ్బతింది. -స్థానికులు ❖ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు చెబుతాం. - ఐ.సురేష్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో – న్యూస్‌టుడే, చీపురుపల్లి గ్రామీణం

?: దోలపేట పురుషోత్తమ నగర్ కాలనీ చివరిలోని గెడ్డ వద్ద రెండు ఇనుప విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. - స్థానికులు ❖ కొత్తవి ఏర్పాటు చేస్తాం. - కుమార్, ఏఈ, ఈపీడీసీఎల్ – న్యూస్‌టుడే, రాజాం

?: అరసాడ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తాగునీరు అందించేందుకు కుళాయిలు ఏర్పాటు చేయాలి. - విద్యార్థుల తల్లిదండ్రులు ❖ సర్పంచితో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. - చిన్నయ్య, ఏఈ – న్యూస్‌టుడే, వంగర

రక్షిత పథకం శుభ్రతకు దూరం

మెట్టు శిథిలం: చీపురుపల్లి మండల పరిషత్తు కార్యాలయం వెనుక ఉన్న సుజలధార నీటి పథకానికి సంబంధించి ఓహెచ్ బీఆర్ ట్యాంకు మెట్టు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారాయి. ఇక్కడి నుంచి చీపురుపల్లి, గరివిడి మండలాల్లోని గ్రామాలకు రోజూ లక్షలాది లీటర్ల తాగునీరు సరఫరా చేస్తున్నారు. పాడైపోవడంతో ఓహెచ్‌బీఆర్‌ను సిబ్బంది శుభ్రం చేస్తున్నారో లేదో అని స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. మెట్ల మరమ్మతులకు చర్యలు చేపడతామని ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు ఏఈ యుగంధర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

తేదీలు కానరావు: చీపురుపల్లి పట్టణానికి తాగునీరు సరఫరా చేసే ట్యాంకుల వద్ద వాటిని శుభ్రం చేసిన తేదీల వివరాలు కానరావడం లేదు. గతంలో ఎప్పుడు చేశారో.. భవిష్యత్తులో ఎప్పుడు చేయాలో కూడా ప్రజలకు తెలియడం లేదు. అసలు పట్టణానికి సురక్షిత నీరు అందుతోందా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నామని, వివరాలు నమోదు చేసేలా చర్యలు చేపడతామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐ.రామకృష్ణ తెలిపారు.

శుభ్రత వివరాలు లేని బోర్డు

ఇంత నిర్లక్ష్యమా?: సంతకవిటి మండలం వాసుదేవపట్నం పంచాయతీలోని ట్యాంకును 30 ఏళ్ల కిందట నిర్మించారు. పూర్తిగా దెబ్బతిన్న ట్యాంకుకు లీకేజీ మొక్కలు అల్లుకుపోయినా పట్టించుకున్న నాథుడు లేడు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. గ్రామాల్లోని రక్షిత నీటి పథకాలు శుభ్రం చేయాలని సర్పంచులు, కార్యదర్శులకు చెబుతున్నామని, చర్యలు తీసుకుంటామని ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. గరికిపాడు, మందరాడ, కాకరాపల్లి గ్రామ ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి.

చీపురుపల్లి, సంతకవిటి, వంగర, న్యూస్‌టుడే: వర్షాకాలం మొదలైంది. రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ సమయంలో ప్రజలకు రక్షిత జలం అందించాల్సిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ట్యాంకులు 15 రోజులకు ఓసారి శుభ్రం చేయాల్సి ఉన్నా ఆదిశగా చర్యలు లేవు. చీపురుపల్లి, సంతకవిటి, వంగర తదితర మండలాల్లోని చాలాచోట్ల శుభ్రం చేసిన ఆనవాళ్లు లేవు.

అధ్వానంగా ట్యాంకుల నిర్వహణ

చుట్టూ పిచ్చి మొక్కలే..

వంగర మండలంలోని ఎంఎస్‌పురం, కొండిపాడు, నీలయ్యవలస, సంగాం గ్రామ ట్యాంకులు శుభ్రం చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ట్యాంకుల వద్ద బోర్డుల్లో ఎటువంటి వివరాలు నమోదు చేయలేదు. అంతేకాదు వాటి చుట్టూ పనికిరాని మొక్కలు, గడ్డి పెరిగి అక్కడికి వెళ్లాలంటేనే భయపడేలా ఉన్నాయి. నెలలుగా ట్యాంకులు శుభ్రం చేయడం లేదని స్థానికులు ఈ సందర్భంగా అంటున్నారు. దీనిపై ఏఈ చిన్నయ్యను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. 'స్టాప్' కార్యక్రమంలో భాగంలో అన్ని ట్యాంకులు శుభ్రం చేస్తామని చెప్పారు. క్లోరినేషన్ కూడా చేయిస్తామని పేర్కొన్నారు. దీనిపై త్వరలో పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులతో చర్చిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

సంగీతంతో మానసిక ప్రశాంతత

చిన్నారులతో ఎమ్మెల్యే బేబినాయన తదితరులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి స్వరరాగ సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో కర్ణాటక సంగీతంలో గతేడాది ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే బేబినాయన ఆదివారం కళాభారతిలో ధ్రువపత్రాలను అందజేశారు. సంగీతం మానసిక ప్రశాంతతకు దోహదపడుతుందన్నారు. సంగీతాలయ నిర్వాహకులు వి.సునీత, ఎం.విజయలక్ష్మి, డి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి బాగు చేయండి

రేగిడి, న్యూస్‌టుడే: మండలంలోని ఉణుకూరు రహదారికి తక్షణమే మరమ్మతులు చేయాలని డిమాండు చేస్తూ సిటు ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రహదారి గుంతల్లో మొక్కలు నాటి దుస్థితిని చూడాలంటూ నినాదాలు చేశారు. సీపీఎం నాయకులు పి.శంకరరావు, ఎం.త్రినాథ, భాజపా మండల శాఖ అధ్యక్షుడు వి.లక్ష్మున్నాయుడు తదితరులు మాట్లాడుతూ.. 13వ తేదీలోగా మరమ్మతులు చేయకపోతే భారీగా రాస్తారోకో నిర్వహిస్తామన్నారు.

గోతుల్లో మొక్కలు నాటి నిరసన

పునాదులకే పరిమితం

గుర్ల మండలంలోని ఎస్ఎస్ఆర్‌పేట జగనన్న ఇళ్ల స్థలాల ప్రాంతంలో రహదారి, విద్యుత్తు సదుపాయం కల్పించినా నిర్మాణాలకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. ఇక్కడ ఏడు ఇళ్లు మంజూరయ్యాయి. రెండిళ్లు పునాదుల వరకూ నిర్మించారు. మిగిలిన వారు నిర్మాణాల జోలికి పోలేదు. మౌలిక సదుపాయాలకు రూ.లక్షలు వెచ్చించినా లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడంతో ప్రభుత్వ ధనం బూడిదలో పోసిన పన్నీరైంది. ఈ విషయమై గృహ నిర్మాణ సంస్థ ఏఈ ప్రదీప్‌కుమార్ వద్ద ప్రస్తావించగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులను కోరామన్నారు. –న్యూస్‌టుడే, గుర్ల

పొదల మాటున ప్రమాదం

మెంటాడ మండలం లోతుగెడ్డ గ్రామానికి సమీపంలోని విద్యుత్తు నియంత్రిక పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. చుట్టూ పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. రక్షణ కంచె ఏర్పాటు చేయలేదు. నిరంతరం వందలాది మంది అటువైపు రాకపోకలు సాగిస్తుంటారు. ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. నిర్వహణ పనులు చేయడానికి సిబ్బందికీ ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై ఆ శాఖ ఏఈ రమేష్ వద్ద ప్రస్తావించగా.. నియంత్రిక చుట్టూ ఉన్న మొక్కలు తొలగించి సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, మెంటాడ

లీకులతో తాగునీరు వృథా

బుడతనాపల్లి గ్రామం ఎర్రచెరువు సమీపంలో గోస్తనీ పైపులైనుకు లీకులు ఏర్పడి తాగునీరు వృథాగా పారుతోంది. 13 గ్రామాలకు తాగునీరు అందించే పైపులైను పగలడంతో లీకై, పంట పొలం చెరువును తలపిస్తోంది. రంధ్రం వల్ల తాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని వాపోతున్నారు. మరోపక్క గ్రామాల్లో నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని చెబుతున్నారు. తక్షణమే సిబ్బందిని పంపించి పైపులైను లీకులను అరికడతామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నానిబాబు అన్నారు. – న్యూస్‌టుడే, గంట్యాడ, గ్రామీణం

తుప్పలు తొలగించరూ

మిర్తివలస ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న తుప్పలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డుపైకి వచ్చేస్తున్నాయని, మలుపులో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని చెబుతున్నారు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు కిలోమీటర్ల మేర ఇదే పరిస్థితి ఉందని సర్పంచి ఎం.రాంబాబు అన్నారు. తుప్పలను తొలగించడానికి చర్యలు తీసుకుంటామని ఉపాధి పథకం ఏపీవో త్రినాథరావు 'న్యూస్‌టుడే'కు చెప్పారు. – న్యూస్‌టుడే, రామభద్రపురం

వానొస్తే తడవాల్సిందే!

బొబ్బిలి మండల కేంద్రంలోని పలు కార్యాలయాలు వర్షాలకు కారిపోతున్నాయి. మండల విద్యా వనరుల కేంద్రం, వెలుగు, వ్యవసాయ కార్యాలయాలు చాలా ఏళ్ల క్రితం నిర్మించారు. వాటికి మరమ్మతులు చేయకపోవడంతో బాగా దెబ్బతిన్నాయి. పైకప్పు నుంచి నీరు కారిపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. విద్యా వనరుల కేంద్రం ఎప్పుడు కూలిపోతుందోనని సిబ్బంది భయపడుతున్నారు. వెలుగు కార్యాలయం పైకప్పు నుంచి ఇటీవల పెచ్చులూడి కింద పడ్డాయి. భవనం గురించి అధికారులకు తెలియజేశామని ఎంఈవో చల్లా లక్ష్మణరావు తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

స్పందించారు.. పరిష్కరించారు

ఈనాడు కథనానికి స్పందన

పారిశుద్ధ్య పనులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: జి.అగ్రహారం బ్రాహ్మణవీధి నుంచి ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లే రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలపై స్థానికులు 'మేమున్నాం... మీకుతోడుగా' దృష్టికి తీసుకురావడంతో 6న కథనం ప్రచురితమైంది. స్పందించి పంచాయతీ అధికారులు పరిసరాలను శుభ్రం చేయించారు.

❖ **గంట్యాడ గ్రామీణం:** గొడియాడ సచివాలయ వీధిలో రహదారిపై పారుతున్న మురుగును ఎట్టకేలకు అధికారులు తొలగించారు. కాలువలు లేకపోవడంతో ఇళ్లలోని వాడుక నీరంతా రోడ్డుపైకి చేరడంపై గతనెల 27న 'ఈనాడు' 'మేమున్నాం.. మీకుతోడుగా'లో వచ్చిన వార్తకు స్పందించారు. సిబ్బందితో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు.

❖ **తెర్లాం:** రంగప్పవలస, తమ్మయ్యవలస గ్రామాల్లో ఈవోపీఆర్డీ ఆర్.నీలిమ, సర్పంచి రాంబాబు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇక్కడ సమస్యపై ఇటీవల 'ఈనాడు' 'మేమున్నాం..'లో వచ్చిన వార్తకు స్పందించారు.

❖ **గంట్యాడ గ్రామీణం:** పెణసాంలో అధికారులు ఎట్టకేలకు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సచివాలయం వీధిలో పేరుకుపోయిన వ్యర్థాలతో ఇబ్బందులపై గత నెల 26న 'ఈనాడు' 'మేమున్నాం.. మీకుతోడుగా'లో వచ్చిన వార్తకు స్పందించారు.

❖ **వంగర:** నీలయ్యవలస చెత్త నుంచి సంపద కేంద్రం సమీపంలో చెత్త పడేస్తున్న విషయమై 'ఈనాడు'లో ఈనెల 4న 'చెత్త పోదు.. సంపద రాదు' శీర్షికతో వచ్చిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. చెత్త తీసి, సంపద కేంద్రానికి తరలించారు.

❖ **బొండపల్లి:** దేవపల్లి గ్రామంలో అధికారులు పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఇక్కడ వీధి కాలువల్లో పూడిక, రోడ్డుపై వ్యర్థాలతో ప్రజల ఇబ్బందులపై శుక్రవారం 'ఈనాడు'లో 'ఇలాగైతే రోగాలు రావా' శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించారు. అంతా శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లినట్లు పంచాయతీ కార్యదర్శి వి.సత్యవతి, గ్రామ పెద్ద అచ్చిమినాయుడు చెప్పారు.

సాహసం చేయాల్సిందే ప్రయాణికా!

అధ్వానంగా అలజంగి రహదారి

బొబ్బిలి నుంచి రామభద్రపురం వెళ్లే ప్రధాన రహదారి పాడైపోయింది. గొర్లె సీతారాంపురం, మెట్టవలస, పారాది గ్రామాల మధ్యలో చాలాచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ప్రధాన రహదారి కావడంతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వేలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రయితే చోదకులు గుంతలు తప్పించడానికి పాట్లు పడుతున్నారు. గొర్లెసీతారాంపురం వద్ద శనివారం ఉదయం గోతిలో పడి లారీ మరమ్మతులకు గురైంది. దాన్ని పక్కకు తీయడానికి సాయంత్రమైంది. మరోపక్క రామభద్రపురం-బాడంగి రోడ్డు దుస్థితి ఇలానే ఉంది. అలజంగి, కారాడ రోడ్లు పాడైపోయాయి. బొబ్బిలి నుంచి పాతబొబ్బిలి వెళ్లే రహదారి ఘోరంగా ఉంది. రహదారుల అభివృద్ధికి రూ.9 కోట్లు మంజూరైనా టెండర్ల ప్రక్రియ జరగలేదు. ఈలోపు ఎలాంటి ప్రమాదాలు చూడాల్సి వస్తుందోనని చోదకులు అంటున్నారు. టెండర్ల దశ పూర్తి కాగానే పనులు చేస్తామని ఏఈ రాజు తెలిపారు.
– న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం, రామభద్రపురం

రామభద్రపురం-బాడంగి మార్గం ఇలా..

కూటమితోనే సుపరిపాలన

గజపతినగరం, బొబ్బిలి, గంట్యాడ గ్రామీణం, మెంటాడ: దేశంలో అన్ని రాష్ట్రాల కంటే అధిక మొత్తం సామాజిక పింఛను ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గజపతినగరం మండలం సీతారాంపురం, పిడిశీల, డోలపాలెం గ్రామాల్లో జరిగిన 'తొలి అడుగు' కార్యక్రమంలో మాట్లాడారు. తెదేపాతోనే సుపరిపాలన సాధ్యమన్నారు. ❖ మల్లునాయుడుపేటకు చెందిన రమణకు రూ.1.19 లక్షల సీఎం సహాయనిధి చెక్కును అందించారు. ఏఎంసీ అధ్యక్షుడు పీవీవీ గోపాలరాజు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ❖ బొబ్బిలి 3, 5వ వార్డుల్లో ఎమ్మెల్యే బేబినాయన పర్యటించారు. ఏడాదిలో చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలిపారు. ❖ తెదేపా కార్యకర్త రమేష్ ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కు అందజేశారు. ❖ మెంటాడ మండలం కొంపంగి, గంట్యాడ మండలం నరవలో మండలాధ్యక్షులు సీహెచ్ వెంకటరావు, కె.భాస్కరరావు, రామభద్రపురంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సి.రామకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

కరపత్రాన్ని అందిస్తున్న మంత్రి కొండపల్లి

'పార్టీని ముందుకు తీసుకెళ్దాం'

మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ

బొబ్బిలి, గజపతినగరం, న్యూస్‌టుడే: పార్టీని సంస్థాగతంగా మరింత ముందుకు తీసుకెళ్దామని భాజపా జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ అన్నారు. ఆదివారం రైల్వే స్టేషన్ కూడలిలోని కల్యాణ మండపంలో కార్యకర్తలు, నాయకులతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రామారావు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని చెప్పారు. నాయకులు పెంట స్వామినాయుడు, నిర్మలా చౌదరి, కేశవ తదితరులు పాల్గొని మాట్లాడారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గజపతినగరంలో భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యురాలు రెడ్డి పావని, భాస్కరరావు, ఏడుకొండలు, తవుడు, దొగ్గ దేవుడు తదితరులు శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద అంజలి ఘటించారు.

విశ్వబ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధికి కృషి

చీపురుపల్లి, న్యూస్‌టుడే: కార్పొరేట్ సంస్థలతో విశ్వబ్రాహ్మణుల వృత్తి కనుమరుగై జీవనోపాధి కోల్పోతున్న నేపథ్యంలో ఆర్థిక పరిస్థితుల మెరుగుకు ప్రభుత్వాలు కృషి చేయాలని విశ్వబ్రాహ్మణుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిల్లంపల్లి ఆచారి అన్నారు. స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ మండల నూతన అధ్యక్షుడిగా ఎంపికైన ఎం.చక్రధర్, ఉపాధ్యక్షుడు ఎస్.భాస్కరరావు, కార్యదర్శి పి.ఈశ్వరరావు, సహ కార్యదర్శి బి.గోపి, కోశాధికారి ఎ.రాము, సలహాదారు ఆచారితోపాటు తొమ్మిది మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాజాం, న్యూస్‌టుడే: రాజాంలోని తెలగావీధి కూడలిలో ఆదివారం రాత్రి ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో పట్టణానికి చెందిన సాయి, మనోజ్‌కు గాయాలయ్యాయి. వీరిని రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. పోలీసులకు సమాచారం అందించారు.

బొబ్బిలిలో ఆరుగురి అరెస్టు

బొబ్బిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ వస్త్ర దుకాణం వెనుక జూదం ఆడుతున్న ఆరుగురు వ్యాపారులను ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్లు సీఐ సతీష్ కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.29,800 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

రామభద్రపురం, న్యూస్‌టుడే: తన భర్త బి.ప్రభాకర్ గత నెల 25 నుంచి కనిపించడం లేదని కోటశిర్లాం గ్రామానికి చెందిన కుమారి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

3.5 కిలోల కణితి తొలగింపు

చీపురుపల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ కడుపులోని 3.5 కిలోల కణితిని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్య సిబ్బంది తొలగించారు. బాధితురాలు కడుపునొప్పితో ఆశ్రయించగా కణితి ఉన్నట్లు గుర్తించారు. శస్త్రచికిత్స సాయంతో తొలగించారు.

మొక్కల నాటివేత

మొక్క నాటుతున్న సీఐ సతీష్‌కుమార్

బొబ్బిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని పాతబొబ్బిలిలో సీఐ సతీష్ కుమార్ ఆదివారం మొక్కలు నాటారు. గాంధీ స్మారక నిధి అధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు మింది గుంపస్వామి 90వ జన్మదినం సందర్భంగా బస్ స్టేషన్ వద్ద పలు రకాల మొక్కలు నాటారు. యువ సంకల్ప ఫౌండేషన్ ప్రతినిధులు ఎం.విజయమోహనరావు, రామకృష్ణ, బీహెచ్ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు. ❖ **గరివిడి:** కెనరా బ్యాంకు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చీపురుపల్లి శాఖ, మానవీయత స్వచ్ఛంద సంస్థతో కలిసి గరివిడి అభ్యాస్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎం.వెంకటకుమార్, బీవీ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: చినమధుపాడ పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన బంకపల్లి శివప్రసాద్‌ను ఆదివారం గ్రామస్థులు సత్కరించారు. గతంలో విద్యార్థులు లేక బడి మూతపడే స్థితిలో ఉండగా 14 మందిని చేర్పించారని గ్రామ పెద్దలు ప్రశంసించారు. పి.అప్పలనాయుడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ సహాయ కార్యదర్శిగా శ్రీరాములు

గరివిడి, న్యూస్‌టుడే: వైకాపా పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శిగా మండలంలోని కాపుశంభాం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు లెంక శ్రీరాములు నియమితులయ్యారు. ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామక ప్రతులు అందాయి.

తాగునీటికి మహిళల ఆందోళన

రాజాం, న్యూస్‌టుడే: తాగునీరు సరఫరా చేయడం లేదని ఎస్సీ కాలనీ మహిళలు నిరసన తెలిపారు. రాజాం- బొబ్బిలి ప్రధాన రహదారిపైకి వచ్చి మానవహారంగా ఏర్పడడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు సర్దిచెప్పడంతో విరమించారు. తరువాత సరఫరా చేయడంతో వివాదం సద్దుమణిగింది. సమస్యను పురపాలిక ఏఈ వెంకటరామరాజు వద్ద ప్రస్తావించగా సాంకేతిక కారణాలతో శనివారం సరఫరా చేయలేకపోయామని, ఆదివారం ఉదయం విద్యుత్తు అంతరాయం వల్ల పంపింగ్ జరగలేదన్నారు. విద్యుత్తు సరఫరా పునరుద్ధరించిన వెంటనే నీటిని అందజేశామన్నారు.

ఆదరణ చూపండి.. అప్రమత్తంగా ఉండండి

గరివిడి, రేగిడి, చీపురుపల్లి, బొబ్బిలి గ్రామీణం, రామభద్రపురం, గంట్యాడ, గ్రామీణం, న్యూస్‌టుడే: జంతువులను పెంచుతూ ఆదరణ చూపుతున్న వారంతా జునోటిక్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గరివిడి పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ మక్కెన శ్రీను అన్నారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం గరివిడి పశువైద్య కళాశాలలో 140 వరకు పెంపుడు శునకాలకు టీకాలు వేశారు. ప్రాంతీయ పశువుల ఆసుపత్రి సివిల్ సర్జన్ ఆర్.కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు. ● రేగిడి పశువైద్య కేంద్రంలోనూ రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ● చీపురుపల్లి ప్రాంతీయ పశువైద్య ఆసుపత్రి వద్ద 60 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా టీకాలు వేశారు. పెంపకందార్లకు ఏడీ డా.సీహెచ్ సుబ్రహ్మణ్యం అవగాహన కలిగించారు. ● బొబ్బిలి మండలం పిరిడి, పెంట పశువైద్య ఆసుపత్రుల్లో 210 పెంపుడు కుక్కలకు పశువైద్యులు సుధాకర్, హిరణ్య వ్యాక్సిన్ వేశారు. గజపతినగరంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు చంద్రశేఖర్ కుక్కలు, కోళ్లు తదితర పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. ● రామభద్రపురం పశువైద్య కేంద్రంలో వైద్యాధికారి ఎ.అప్పలనాయుడు ఆధ్వర్యంలో 53 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. ● గంట్యాడ, బుడతనాపల్లి పశువైద్య కేంద్రాల్లో పశువైద్యాధికారులు అంజలి, రెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో 162 కుక్కలకు టీకాలు వేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

పిరిడిలో శునకానికి వ్యాక్సిన్ వేస్తున్న సుధాకర్

గరివిడి పశువైద్య కళాశాలలో..

గిరిజన గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు

మాట్లాడుతున్న అదనపు డీఎంహెచ్‌వో రాణి

రామభద్రపురం, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని అదనపు డీఎంహెచ్‌వో రాణి అన్నారు. రామభద్రపురం మండలం ఎనుబొరువులో ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. గిరిజన గ్రామాల్లో ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వేడినీరు చల్లార్చి తాగాలని గిరిజనుల్ని కోరారు. ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారిణి అపర్ణ, పీహెచ్ఎన్ పద్మావతి, మాజీ ఎంపీపీ లూర్థమ్మ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

బోధనేతర బాధ్యతలు తగ్గించాలి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులపై బోధనేతర బాధ్యతలు తగ్గించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ బుఖారీ బాబు కోరారు. విజయనగరంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. అన్ని కార్యక్రమాలను యాప్‌లో అప్‌లోడ్ చేయమనడం తగదన్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు, ప్రధాన కార్యదర్శి పాల్తేరు శ్రీనివాస్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్‌రావు, జె.సి.రాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకుడు బాబు

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

కూరగాయల ధరలు విజయనగరం రైతు బజారులో ఆదివారం ధరలు (కిలో రూ.లలో)

• వంకాయలు (తెల్లవి): 50, రవికలు: 40, నల్లవి: 32 • టమాటా: 32 • బెండ: 45 • కాకర: 35 • బీర: 40 • క్యాబేజీ: 30 • పొడవుచిక్కుడు: 45 • బరబటి: 50 • క్యారెట్: 45 • దొండ: 50 • బీట్‌రూట్: 40 • ఉల్లి: 23 • బంగాళదుంపలు: 20 • గోరుచిక్కుడు: 35 • క్యాప్సికమ్: 90 • పొటల్స్: 40 • బీన్స్: 90 • ఆగాకర: హైబ్రిడ్- 90, దేశవాళీ- 210 • పందిరిచిక్కుడు: 60 • పచ్చిబఠాణీ: 75.
– న్యూస్‌టుడే, విజయనగరం వ్యవసాయ విభాగం

తెరపై ఈవారం

• ఎన్‌సీఎస్: కన్నప్ప • శ్రీకృష్ణ: జురాసిక్ వరల్డ్ (తెలుగు డబ్బింగ్) • లీలామహల్: కుబేర • రంజని ప్రీమియర్-1: తమ్ముడు • శివరంజని ప్రీమియర్-2: కుబేర • హిమగిరి: తమ్ముడు • సప్తగిరి: మార్గన్ – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	70959 54646

? లక్ష్మీగణపతి కాలనీ-3లో వీధి దీపాలు వెలగడం లేదు. - కోటేశ్వరరావు, స్థానికుడు
• పరిశీలించి, కొత్తవి వేయిస్తాం. - ప్రవంతి, ఏఈ – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం
? పట్టణంలోని రామ్‌నగర్ మొదటి లైనులో వీధి దీపాలు కాలిపోయాయి. - స్థానికులు
• వెంటనే పరిశీలించి, దీపాలు వేయిస్తాం. - అనురాధ, ఈఈ – న్యూస్‌టుడే, శృంగవరపుకోట

పాఠశాల పరిసరాలు శుభ్రం

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: ఎల్.కోట ఉన్నత పాఠశాల పాత సముదాయంలోని భవనాలు అధ్వానంగా మారి నిరుపయోగంగా ఉన్నాయని జూన్ 16న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. భవనాలను పాఠశాల క్లస్టరు సమావేశాలకు వినియోగించుకునేలా పనులు చేపట్టారు. పరిసరాలను యంత్రాలతో శుభ్రం చేయించారు. క్రీడా మైదానంగా ఉపయోగించడానికి చర్యలు తీసుకున్నారు.

ప్రజారోగ్యంతో జలగాటం

వర్షాకాలం ప్రారంభమైంది. పల్లెలు, పట్టణాల్లో తాగునీటి పథకాల నిర్వహణ సక్రమంగా లేకపోతే కాలానుగుణ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. నెల్లిమర్ల, ఎస్.కోట నియోజకవర్గాల్లో చాలా చోట్ల ట్యాంకులు ఎప్పుడు క్లోరినేషన్ చేశారో కూడా తెలియని పరిస్థితి. కొన్ని చోట్ల మంచి నీటి ట్యాంకుల మెట్లు శిథిలావస్థలో ఉన్నాయి. చుట్టూ నాచు పట్టి అధ్వానంగా ఉంటోంది. కుళాయిల నుంచి కలుషిత నీరు సరఫరా అవుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వివరాల నమోదు గాలికి..

లక్కవరపుకోట: తాటిపూడి నుంచి పైలట్ ప్రాజెక్టు ద్వారా ఎల్.కోట మండలంలోని గొల్జాం గ్రామంలోని మంచినీటి పథకం ట్యాంకుకు నీరు సరఫరా అవుతోంది. నిర్వహణ సక్రమంగా లేక లీకేజీలతో నీరు పెద్ద ఎత్తున వృథాగా పోతోంది. దీంతో నీరు సరిపోవడంలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం పంచాయతీ కార్యదర్శి బంగారుతల్లి వద్ద ప్రస్తావించగా.. వృథాను అరికట్టేలా చర్యలు చేపడతామన్నారు. ● కూర్మవరం, సంతపేటలో ట్యాంకుల వద్ద క్లోరినేషన్ వివరాలు నమోదు చేయాల్సిన బోర్డులు ఖాళీగా ఉన్నాయి. ఎప్పుడు క్లోరినేషన్ చేశారో కూడా తెలియని పరిస్థితి. విషయం డిప్యూటీ ఎంపీడీవో కుమార్ వద్ద ప్రస్తావించగా.. వీటి పర్యవేక్షణ బాధ్యత ఇంజినీరింగు సహాయకులకు అప్పగించారన్నారు. ఖాళీ బోర్డులున్న చోట చర్యలు చేపడతామన్నారు.

సంతపేటలో వివరాలు నమోదు చేయని బోర్డు

నెల్లిమర్లలో చంపావతి నదిలో ఊటబావుల చుట్టూ చేరిన నాచు

నిర్వహణలో నిర్లక్ష్యం..

శృంగవరపుకోట: ఎస్.కోట మండలం పెదఖండేపల్లిలో 60 వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత పథకం ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. పిల్లర్లు పెచ్చులూడి.. ట్యాంకు శుభ్రం చేసేందుకు నిర్మించిన మెట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పథకం వద్ద లీకేజీలు, ఓవర్ ఫ్లో కారణంగా నీరు ప్రహరీ వద్ద నిల్వ ఉంటోంది. పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. నిర్ణీత సమయంలో శుభ్రం చేసే వివరాలు పెట్టలేదని గ్రామస్థులు వాపోతున్నారు. విషయం ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సత్యకిశోర్ వద్ద ప్రస్తావించగా. . రూ.2 లక్షలు పంచాయతీ నిధులతో మరమ్మతులకు ప్రతిపాదించామని, మంజూరు కాగానే మరమ్మతులు చేయిస్తామన్నారు.

శిథిలావస్థలో పెదఖండేపల్లి రక్షిత ట్యాంకు మెట్లు

వాల్వుల చుట్టూ నాచు..

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: జరజాపుపేట, నెల్లిమర్ల ప్రాంతాల్లో తాగునీటి పథకాల నిర్వహణ లేదు. ట్యాంకులు క్లోరినేషన్ చేయక.. పైపు లైన్లు పలుచోట్ల పాడై కలుషిత నీరు సరఫరా అవుతోందని నెల్లిమర్లలోని ఏడు వార్డుల ప్రజలు వాపోతున్నారు. జరజాపుపేటలో రిజర్వాయర్‌కు సంబంధించిన మెట్లు పాడవడంతో కనీసం ట్యాంకు శుభ్రం చేయడానికీ వీల్లేని పరిస్థితి. నీరు సరఫరా చేసే వాల్వుల వద్ద నాచు పట్టి ఉంది. వ్యాధుల బారిన పడే ప్రమాదముందని ప్రజలు భయపడుతున్నారు. విషయం ఏఈ రాజా వద్ద ప్రస్తావించగా.. నిర్వహణపై దృష్టి సారించామన్నారు. కుళాయిలు లేని చోట ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు.

న్యూస్‌టుడే పరిశీలన

హక్కులపై అవగాహన కల్పించాలి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: బాల, బాలికలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని జిల్లా పోలీసు సలహాదారుడు వై.పరశురాం పిలుపునిచ్చారు. వారికి అవగాహన కల్పించేందుకు కృషిచేయాలన్నారు. నగరంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కన్వీనర్ కంది వెంకటరమణ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సభ్యులకు నియామక పత్రాలు, గుర్తింపు కార్డులు అందజేశారు. లక్ష్మణరావు, కోఆర్డినేటర్లు పొందూరు రామకృష్ణ, కె.కిశోర్ పాల్గొన్నారు.

పత్రాలు అందజేస్తున్న పరశురాం

డీఆర్డీఏ పీడీకి సత్కారం

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: జిల్లాలోని గంట్యాడ, రాజాం సమాఖ్యలు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆత్మనిర్భర్ సంఘటన్ పురస్కారాలకు ఎంపిక కావడంపై డీఆర్డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తిని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందించారు. ఆదివారం విజయనగరంలో ఆయన్ను సత్కరించారు.

పీడీని సత్కరిస్తున్న మంత్రి కొండపల్లి

కాస్త పట్టించుకోండి సారూ..!

నిత్యం వందలాది మంది రోగులు, వైద్యులు నడిచే దారి ఇది. మహారాజా సర్వజన ఆసుపత్రి, డీసీహెచ్, డీఎంహెచ్‌వో, ఆయూష్, క్షయ, ఔషధ నిల్వల కేంద్రం, డయాలసిస్ సేవలందించే విభాగాలు ఈ దారిలోనే ఉన్నాయి. వర్షం పడితే గుంతల్లో నీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎక్కడ గొయ్యి ఉందో.. ఎక్కడ లోతు ఎక్కువగా ఉందో తెలియడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం సంబంధిత అధికారులకు తెలియజేసి, చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం నేరవార్తా విభాగం

దారి దారుణం.. రాకపోకలకు నరకం

నగరంలో పలుచోట్ల మట్టి దారులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వీటీ అగ్రహారం యాత వీధిలో రహదారులు దారుణంగా ఉన్నాయి. వీధి దారి పొడవునా గోతులే కనిపిస్తున్నాయి. ఇటీవల ఇక్కడ కొత్తగా శాంతినగర్ ఏర్పడింది. అక్కడ కూడా రోడ్లు, కాలువలు లేవు. సామాజిక మరుగుదొడ్డి మరమ్మతులకు గురై ఉంది. రాకపోకలు నిలిచిపోవడంతో రహదారి పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు.
– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

చోదకుల కష్టాలు పట్టవా?

విజయనగరం నుంచి కుమిలి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో ఆర్.ముంగినాపల్లి వద్ద కల్వర్టు శిథిలమై వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. కల్వర్టు పక్కన ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ దారిలో వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో బురదమయమై వాహనాలు కూరుకుపోతున్నాయి. ఈ దారిలో పూసపాటిరేగ, శ్రీకాకుళం వైపు రోజుకు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాని ఎంపీడీవో భవాని తెలిపారు. – న్యూస్‌టుడే, డెంకాడ

జిందాల్ నిర్వాసితుల నిరసన

గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: శాంతియుత పోరాటానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ కొన్ని రోజులుగా వినతిపత్రాలు ఇస్తున్నా.. స్పందించకపోవడంపై జిందాల్ నిర్వాసితులు ఆదివారం బొడ్డవరలో నిరసన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. గాంధీ విధానంలో శాంతియుతంగా పోరాటం చేస్తామని అడిగామని, రాజ్యాంగ హక్కులను పోలీసులు ఉల్లంఘిస్తున్నారని వాపోయారు. అనంతరం ర్యాలీ చేపట్టారు.

ఏకలవ్యునికి నివాళి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఎస్.కోట మండలం పోతనాపల్లిలో ఆదివారం ఏకలవ్యుని జయంతి నిర్వహించారు. రాష్ట్ర ఎరుకల సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏకలవ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు రొంగలి చిన్నరాము మాట్లాడుతూ.. చదువు అనే ఆయుధంతో పేదరికాన్ని జయించవచ్చన్నారు. సభ్యులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా సంఘాన్ని సంప్రదించాలన్నారు. ఉపాధ్యక్షుడు గేదెల సత్తిబాబు, ఉత్తరాంధ్ర ఛైర్మన్ గేదెల లక్ష్మణ్, ఎస్.కోట సర్పంచి సంతోషికుమారి తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనే కూటమి ధ్యేయం

పాటూరులో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భోగాపురం, జామి, న్యూస్‌టుడే: ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జామి మండలం అన్నమరాజుపేటలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, తెదేపా మండలాధ్యక్షుడు పి.స్వామినాయుడు పాల్గొన్నారు. ● మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు భోగాపురం మండలం నందిగాం పంచాయతీలో కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. పార్టీ మండలాధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, నాయకుడు సూర్యతేజ పాల్గొన్నారు. ● వేపాడ: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశ పెడుతున్నట్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. పాటూరులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

జామి, న్యూస్‌టుడే: జామి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని వెంకటరాజుపాలెంలో గ్రేడు- 2 లైన్‌మ్యాన్‌గా పనిచేస్తూ సోమయాజులపాలెంలో విద్యుత్తు స్తంభం పైనుంచి పడి మృతి చెందిన షేక్ రెహమాన్ కుటుంబానికి 1104 యూనియన్ అండగా నిలిచింది. ఆ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వి.ఎస్ నాగేశ్వరావు, వి.ఎస్.ఆర్.కె.గణపతి ఆదివారం అలమండ సంతలో రెహమాన్ ఇంటికెళ్లి కుటుంబ సభ్యులకు రూ.25 వేల చెక్కు అందజేశారు.

పెంపుడు శునకాలకు రేబిస్ టీకాలు

శునకానికి టీకా వేస్తున్న ఏడీ కన్నంనాయుడు

కొత్తవలస, న్యూస్‌టుడే: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ పశువుల ఆసుపత్రిలో 55 పెంపుడు శునకాలకు రేబిస్ నిరోధక టీకాలు వేసినట్లు పశువైద్య శాఖ సహాయ సంచాలకుడు డా.కన్నంనాయుడు తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు వచ్చే వివిధ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ● వేపాడ: వేపాడ పశు వైద్య కేంద్రంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు పశు వైద్యాధికారిణి గాయత్రి రేబిస్ టీకాలు వేశారు. ● శృంగవరపుకోట: ఎస్.కోట సబ్ డివిజన్ పరిధిలో ఏడీ డాక్టరు చలపతిరావు ఆధ్వర్యంలో 300 కుక్కలకు టీకాలు వేశారు. సబ్ డివిజన్‌కు 2,300 రేబిస్ టీకాలు వచ్చాయని, పెంపుడు కుక్కల యజమానులు దగ్గరలోని పశువైద్యశాలకు వెళ్లి టీకాలు వేయించుకోవాలన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: కొండవెలగాడ, నెల్లిమర్ల విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలో సోమవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్తు ఉండదన్నారు. కొండవెలగాడ, చంద్రంపేట, టెక్కలి, ఎల్ఎన్.పురం, తుమ్మలపేట, చినబూరడపేట, పారసాం, గెద్దపేట, భూపాలపురం, గరికిపేట, కొండగుంపాం, పూతికపేట, మొయిద గ్రామాల వినియోగదారులు సహకరించాలన్నారు. ● డెంకాడ: చింతలవలస బెటాలియన్, అక్కివరం విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 7 గంటల నుంచి 10 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పి.అప్పలస్వామినాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. అక్కివరం పరిధిలోని బంటుపల్లి గ్రామీణ ఫీడర్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

జగన్నాథుని మారు రథయాత్ర

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: ఎల్.కోటలో జగన్నాథుని మారు రథయాత్ర ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ● జామి: పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలోని జగన్నాథస్వామికి తొలి ఏకాదశి సందర్భంగా లక్ష తులసి దళాలతో పూజలు చేశారు.

నగర జీవనం.. సమస్యలతో సతమతం

న్యూస్‌టుడే- విజయనగరం పట్టణం

నగరపాలిక పరిధిలోని 37వ డివిజన్‌లో బీసీ కాలనీ మొత్తం విస్తరించింది. ఇక్కడ దీర్ఘకాలిక సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయి. కొత్తగా రిజర్వాయరు నిర్మాణం చేసినప్పటికీ పలుచోట్ల కుళాయి నీటికి ప్రజలు నోచుకోవడంలేదు.

మజ్జుల వీధిలో రోడ్లు, కాలువలు లేవు. దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు తెలిపారు. ● కోటా పార్కు ప్రాంతంలో కొన్ని ఇళ్లకు కుళాయి ద్వారా నీరు రావడంలేదన్నారు. ● బీసీ కాలనీలో పలు ఇళ్ల మధ్య విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ● కోటా పార్కు, బీసీ కాలనీ గణేష్ కోవెల, మజ్జుల వీధి, గాంధీ పార్కు దారిలో వీధి దీపాలు వెలగడం లేదు. కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రామ మందిరం వెనుక లీకుల వల్ల నీరు వృథా అవుతోందని చెప్పారు. ● పాత సచివాలయం శ్రీనివాసనగర్, దుర్గాపార్కు ప్రాంతంలో రోడ్లు, కాలువలు నిర్మించాల్సి ఉంది. దుర్గాపార్కు వెనుక రోడ్డు, కాలువ నిర్మించి పలకలు వేయకపోవడం వల్ల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానిక మహిళలు తెలిపారు. గాంధీ పార్కు దారిలో కాలువలు నిర్మించాలన్నారు.

దుర్గాపార్కు ప్రాంతంలో మట్టిదారి

డివిజన్ విజిట్

● డివిజన్ : 37
● జనాభా : 6,400
● ఇళ్లు : 1655
● ప్రధాన ప్రాంతాలు: బీసీ కాలనీ, శ్రీనివాసనగర్, గాంధీపార్కు, దుర్గాపార్కు, మహిళా ప్రాంగణం వెనుక, మజ్జుల వీధి

చాలా వరకు పరిష్కరించాం..

ఇటీవల డివిజన్‌కు కేటాయించిన రూ.20 లక్షలతో దుర్గాపార్కు, కాంపౌండర్ లైనులో రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రతిపాదించాం. రూ.2.16 కోట్లతో రిజర్వాయరు నిర్మాణం జరిగింది. నెల రోజుల వ్యవధిలో అన్ని కుళాయిల నుంచి నీరు వస్తుంది. సుమారు రూ.3 కోట్లతో డివిజన్ పరిధిలో రోడ్లు, కాలువలు నిర్మించాం. మజ్జుల వీధి, దుర్గాపార్కులో రెండు కల్యాణ మండపాలు, గాంధీ పార్కు శివాలయంలో సొంత నిధులతో నిర్మించాం. ఇళ్ల మీదుగా విద్యుత్తు లైన్లు లేకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రత్యేక దృష్టిపెడతాం.. డివిజన్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. కాలువల శుభ్రత పనులు చేపడతాం. దోమల, కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకుంటాం. వీధి దీపాలు వెలిగేలా చూస్తాం. పార్కుల నిర్వహణ పనులు చేయిస్తాం. నిధుల లభ్యత మేరకు రోడ్లు కాలువలను ప్రాధాన్యతా క్రమంలో నిర్మిస్తాం.
– పి.నల్లనయ్య, కమిషనరు, నగరపాలక సంస్థ

ప్రమాదకరంగా కల్వర్టు

నగరంలో పలుచోట్ల కల్వర్టులు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. వాటి పైనుంచే వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈక్రమంలో కొన్ని సార్లు పలకలు విరిగి, కాలువల్లో పడుతున్నారు. స్థానిక వీటీ అగ్రహారం పరిధిలోని సంతోష్‌నగర్‌లో కాలువపై ఉన్న పలకలు ధ్వంసమయ్యాయి. ఏ క్షణమైనా కుప్పకూలేలా ఉన్నాయి. ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని అక్కడివారు చెబుతున్నారు. పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు.
– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

సమ్మె విజయవంతానికి పిలుపు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నారాయణరావు తదితరులు

విజయనగరం అయ్యన్నపేట, శృంగవరపుకోట, న్యూస్‌టుడే: కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రెడ్డి నారాయణరావు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో ఆటో చోదకులతో కలిసి సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. విజయదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎన్.అప్పలరాజు, బాలి సన్యాసిరావు, చెన్నా ధర్మ, కంది రాము పాల్గొన్నారు. ● అంగన్‌వాడీలను ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు అందించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండు చేశారు. ● జడ్పీ మినిస్టీరియల్ భవనంలో జరిగిన సమావేశంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కో-కన్వీనర్ ఎ.జగన్మోహన్‌రావు తదితరులు గోడప్రతులను ఆవిష్కరించారు. ● నెల్లిమర్ల: సమ్మెకు మద్దతుగా నిరసన ప్రదర్శనలు చేయాలని రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.లెనిన్, మద్దిల ప్రకాష్ పిలుపునిచ్చారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పెండింగులో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలను విడుదల చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ఈనెల 11న తలపెట్టిన మహాధర్నాను విద్యార్థులు విజయవంతం చేయాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్) పిలుపునిచ్చింది. ఆదివారం నగరంలోని ఫెడరేషన్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం, సహాయ కార్యదర్శి పి.గౌరీశంకర్ ఆధ్వర్యంలో పట్టణ నాయకులు ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అధిక సంఖ్యలో హాజరవ్వాలని పిలుపునిచ్చారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77ను రద్దు చేయాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక విజయనగరం విభాగానికి ఆదివారం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. గౌరవాధ్యక్షుడిగా డా.జయపాల్, అధ్యక్షులుగా ఎల్.చిన్నారి, ఉపాధ్యక్షులుగా ఈపు విజయకుమార్, అప్పారావు, గణేష్, మజ్జి కాంతారావు, మీనాకుమారి, సుబ్రహ్మణ్యం, కార్యదర్శులుగా బాలరాజు, పి.వెంకటరావు, ప్రకాష్, పి.మురళీధర్, సతీష్‌కుమార్, శ్రీనివాస్, కోశాధికారిగా కె.ఆదినారాయణను ఎన్నుకున్నారు.

ఘనంగా పీర్ల పండగ

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: మొహర్రంను పురస్కరించుకుని విజయనగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న దర్గాల వద్ద ఆదివారం పీర్ల ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు వివిధ రకాల పీర్లను ఏర్పాటు చేశారు. అయిదు రోజుల తరువాత ఊరేగించనున్నట్లు మత పెద్దలు తెలిపారు.

రామతీర్థంలో చాతుర్మాస దీక్ష

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: రామతీర్థం దేవస్థానంలో ఆదివారం చాతుర్మాస దీక్ష ప్రారంభమైంది. ఉదయం స్వామివారికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించారు. యాగశాలలో సుందరకాండ హవనం చేపట్టారు. ఆస్థాన మండపంలో రామచంద్రస్వామికి నిత్య కల్యాణ వేడుక జరిగింది. అనంతరం ఆషాఢ ఏకాదశిని పురస్కరించుకొని విశ్వక్సేనారాధన చేశారు. సీతారామచంద్ర స్వామివారి శయనమూర్తులను చాతుర్మాస దీక్షతో పవళింపు చేశారు. స్వామివారు తిరిగి కార్తిక శుద్ధ ఏకాదశికి మేల్కొంటారు. సహాయ కమిషనరు వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు భోజనాల ఏర్పాటు

కొత్తవలస, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి సందర్భంగా సుబ్బలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని చైతన్య బధిరులు, మానసిక దివ్యాంగుల పాఠశాలలో 40 మంది విద్యార్థులకు.. బలిఘట్టంలోని న్యూహోప్ అనాథాశ్రమంలోని 35 మందికి మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కనకాల శివ తెలిపారు. బెంగళూరులో ఉంటున్న డి.విజయలక్ష్మి ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు.

నేడు బడి బస్సు ప్రారంభం

వేపాడ, న్యూస్‌టుడే: వేపాడ మండలంలోని సోంపురం- జాకేరు మీదుగా సోమవారం నుంచి సోంపురం, జాకేరు, కరకవలస, చామలాపల్లి, దబ్బిరాజుపేట, వల్లంపూడి, వేపాడ మీదుగా బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాల వరకు ప్రతి రోజూ నడపనున్నట్లు తెలిపారు. ఉదయం 7 గంటలకు బస్సు ప్రారంభమవుతుందన్నారు. బడి బస్సును నడిపేందుకు ఎస్.కోట డిపో మేనేజరు కె.రమేష్ అంగీకరించినట్లు సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు ఆదివారం తెలిపారు.

సర్దుబాటు చేయాలి

విద్యావిభాగం: ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పోస్టులను సర్దుబాటు చేయాలని ఉమ్మడి జిల్లాల ఎంటీఎస్ ఉపాధ్యాయులు కోరారు. ఆదివారం విశాఖపట్నంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవరావును కలిసి వినతిపత్రం అందజేశారు.



పాఠశాలలను కాపాడాలి

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు కోరారు. జిల్లా పరిషత్తు మినిస్టీరియల్ భవనంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు నాణ్యమైన విద్యపై దృష్టి పెట్టాలన్నారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

కొత్తవలస, న్యూస్‌టుడే: తుమ్మికాపల్లిగేటుకు సమీపంలో జనసేన పార్టీ మండల కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. మండల నాయకుడు పిల్ల రామదుర్గ ఆధ్వర్యంలో మండలస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌ఛార్జి వబ్బిన సత్యనారాయణ, నాయకులు గొరపల్లి రవికుమార్ తదితరులు హాజరయ్యారు. కొత్తవలస ఏఎంసీ డైరెక్టర్‌గా నియామకమైన మల్లువలస శ్రీనును సత్కరించారు.

స్వామివారికి 56 రకాల ప్రసాదం

జామి: తొలి ఏకాదశి సందర్భంగా జామి శివాలయంలోని జగన్నాథునికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు బంకుపల్లి విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో స్వామికి 56 రకాల మిఠాయిల నైవేద్యం పెట్టారు.

వెంకన్నకు పూజలు

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా విజయనగరంలోని వివేకానంద కాలనీలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించారు.

సేవలు మరువలేనివి

పూసపాటిరేగ: జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొంతు అప్పలనాయుడు సేవలు మరువలేనివని చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు అన్నారు. పేరాపురంలో అప్పలనాయుడు విగ్రహాన్ని ఆవిష్కరించారు. చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ప్రతి విద్యార్థీ అమ్మ పేరుతో మొక్క నాటాలి : కలెక్టర్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ప్రభుత్వ-ప్రైవేటు పాఠశాలల్లో ఈ నెల 10న నిర్వహించే మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. ఎస్పీ నయీం అస్మి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు తదితరులతో ఆమె ఆదివారం గూగుల్‌మీట్ నిర్వహించి సంబంధిత శాఖాధికారులతో సమీక్షించారు. ప్రతి విద్యార్థీ వారి తల్లి పేరుతో మొక్క నాటేలా చూడాలని తెలిపారు. ● కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్) కొనసాగుతుందని కలెక్టర్ నాగరాణి తెలిపారు. డివిజన్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోనూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

జేసీ ఆకస్మిక తనిఖీ

రైతు బజారులో వ్యాపారితో మాట్లాడుతున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు సరసమైన ధరలకే విక్రయించాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. భీమవరం పట్టణంలోని రైతు బజారును ఆయన ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. అక్కడున్న సౌకర్యాలను పరిశీలించారు. కొంత మంది వినియోగదారులతో మాట్లాడారు. బోర్డులో ఉన్న ధరలకే కూరగాయలు విక్రయిస్తున్నారా లేదా అంటూ ఆరా తీశారు. రైతుబజారు వెలుపల ఉన్న దుకాణాలను వెంటనే ఖాళీ చేయించి వారు లోపలే అమ్ముకునేలా చూడాలని మార్కెటింగ్ శాఖాధికారులను ఆదేశించారు. బజారు లోపల మౌలిక వసతులు పూర్తిగా కల్పించాలన్నారు. డ్రెయినేజీ మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేయించి సమస్య పరిష్కరించాలని సూచించారు.

అందుబాటులో వరి విత్తనాలు

వీరవాసరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధమైంది. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 2,08,736 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేయనున్నారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ మేరకు 10,436 ఎకరాల విస్తీర్ణంలో నారుమడులు వేయాల్సి ఉంది. శనివారం నాటికి జిల్లా వ్యాప్తంగా 7,500 ఎకరాల విస్తీర్ణంలో రైతులు నారుమడులు వేశారు. ఇంకా సుమారు 3 వేల ఎకరాల్లో వేయాల్సి ఉంది.

కొరత రాకుండా.. విత్తనాల కొరత, ఏ రకమైన విత్తనాలు వేయాలనే ఆలోచనతో ఏటా సాగు ఆలస్యమవుతోంది. ఈ ఏడాది అధికారులు ముందస్తుగా ఎంటీయూ 1318, 7029, 1061, 1064 రకాలను సిఫార్సు చేయడంతో రైతులు సాగుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో విత్తనాల కొరత రాకుండా ప్రభుత్వం ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ నుంచి సేకరించిన ఎంటీయూ 1318 రకం విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచింది. ఆధార్, చరవాణితో ఆర్‌ఎస్‌కేలకు వెళ్తే అక్కడ సిబ్బంది డీ-క్రిష్ యాప్‌లో రైతుల వివరాలు నమోదు చేసి కిలో రూ.5 చొప్పున రాయితీపై అందజేస్తారు. 30 కిలోల విత్తనాల సంచి ధర రూ.1,410 కాగా రాయితీపోను రూ.1,260కి రైతులు పొందొచ్చు. జిల్లాలో 1,800 క్వింటాళ్ల ఎంటీయూ 1318 రకం విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

నీటి శుద్ధి అధికారులకెరుక..
ప్రజారోగ్యం దేవుడికెరుక

న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం అర్బన్, భీమవరం పట్టణం, పాలకొల్లు, నరసాపురం, తణుకు

ప్రజలకు సురక్షితమైన తాగు నీటిని సరఫరా చేస్తున్నామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారు. వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పట్టణాల్లోని ఫిల్టరేషన్ ప్లాంట్లలో నీటి శుద్ధి ప్రక్రియ తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆయా ప్లాంట్లలో యంత్రాల నిర్వహణ గాలికొదిలేయడం, అపరిశుభ్ర వాతావరణం చూస్తుంటే వస్తున్న ఆరోపణలకు మరింత బలం చేకూర్చుతోంది.

నిర్వహణకు నోచుకోని ఫిల్టర్‌బెడ్లు

జిల్లాలోని తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు పురపాలక సంఘాల్లోని నీటి శుద్ధి కేంద్రాల్లో ఫిల్టర్ బెడ్‌లు, ఆలం మిక్సింగ్ యూనిట్, సంపులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాల్సి ఉంది. గత వైకాపా ప్రభుత్వంలో కనీస నిర్వహణకు నోచుకోకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఫిల్టర్ బెడ్‌లో ఉండే ఇసుక, రాళ్లను మార్చి ఎంతకాలం అయ్యిందో తెలియని పరిస్థితి. అంతే కాకుండా క్లారిఫైర్ బ్రిడ్జ్, ఫిల్టర్ మీడియాలో అనేక లోపాలున్నాయి. వాటిని త్వరితగతిన చక్కదిద్దాల్సిన అవసరం ఉంది. సరైన నిర్వహణ లేక నీటిని పూర్తిస్థాయిలో శుద్ధి చేయకుండానే సరఫరా చేస్తున్నారు. ఫలితంగా రంగు మారిన నీటిని తాగలేక ప్రజలు ప్రైవేట్ నీటి శుద్ధి కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.

తాడేపల్లిగూడెం పట్టణంలో అపరిశుభ్రంగా ఫిల్టరేషన్ ప్లాంటు

లీకుల బెడద

పూర్తిగా శుభ్రం కాని నీరు కుళాయిల ద్వారా సరఫరా అవుతుంటే లీకుల బెడద ప్రజలను మరింత వేధిస్తోంది. లీకులు అరికట్టే విషయంలో అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఫలితంగా మంచినీరు కలుషితమై సరఫరా అవుతోంది. వర్షా కాలం కావడంతో పరిస్థితి దారుణంగా ఉంది. 'నీటి శుద్ధిపై కమిషనర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తాం' అని మున్సిపల్ ఆర్డీ నాగనరసింహారావు వెల్లడించారు.

పాలకొల్లులో అధ్వానంగా ఆలం మిక్సింగ్ యూనిట్

సిబ్బంది అలసత్వం

నీళ్లలోని వ్యర్థాలు, మలినాలు వేరు చేసేందుకు ఆలం ఎంతగానో ఉపయోగపడుతుంది. నీటి శుద్ధి ప్రక్రియ ఇక్కడి నుంచే ప్రారంభమవుతుంది. పెద్ద ట్యాంకులోకి నీటిని సేకరించి ఆలం మిక్స్ చేస్తారు. క్లారిఫైర్ బ్రిడ్జ్ చుట్టూ తిరుగుతూ నీళ్లను బాగా కలుపుతుంది. కొంత సమయానికి నీళ్లలోని వ్యర్థాలు బయటికొస్తాయి. ఆలం ఎక్కువైనా, తక్కువైనా నీళ్లు పూర్తిస్థాయిలో శుద్ధికావు. ఈ ప్రక్రియ విషయంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. యాంత్రీకరణ పద్ధతిలో ఆలం మిక్సింగ్ చేయాల్సి ఉండగా ఈ విధానాలు సక్రమంగా పాటించడం లేదు.

అపరిష్కృత కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 6,325 కేసులు పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి తెలిపారు. మొత్తం 35 బెంచ్‌లు ఏర్పాటు చేసి, 20 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న కేసుల రాజీకి ప్రాధాన్యమిచ్చామని చెప్పారు.

ప్రత్యేకాలంకరణలో మావుళ్లమ్మ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం మావుళ్లమ్మ దర్శనానికి ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు క్యూలో బారులు తీరారు. ఆలయ సహాయ కమిషనర్ బి.ఎం.నగేష్, సిబ్బంది పర్యవేక్షించారు.

శిశువులకు.. సర్కారు కానుక !

❖ బేబీ కిట్ల పంపిణీకి సన్నాహాలు
❖ ఏటా 8 వేల మందికి లబ్ధి

✪ పోడూరు మండలానికి చెందిన గర్భిణికి ఇటీవల పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో కాన్పు జరిగింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఆ కుటుంబానికి చేయూతనిచ్చాయి. ఇదే ప్రాంతానికి చెందిన మరో గర్భిణిని కాన్పు కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా ఒక రోజంతా చూసి మర్నాడు సిజేరియన్ చేశారు. శిశువుకు ముర్రిపాలు పట్టేందుకు కూడా తల్లికి ఓపికలేక ఆ అవకాశాన్ని కోల్పోయారు. వారం రోజులు ఆసుపత్రిలో ఉంచాక సుమారు రూ.60 వేల బిల్లు వసూలు చేసి ఇంటికి పంపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో కాన్పులకు వ్యత్యాసాన్ని తెలియజేసే ఉదాహరణ ఇది.

పాలకొల్లు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పు చేయించుకున్న వారికి బేబీ కిట్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో పరిశీలిస్తే 7,715 కాన్పులు మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో సుమారు 12 వేల కాన్పులు జరిగాయి. ఈ పథకం అమల్లోకి వస్తే ఏటా సుమారు 8 వేల మందికి లబ్ధి చేకూరే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే బేబీ కిట్‌లో శిశువు ఆరోగ్య పరిరక్షణకు అవసరమయ్యే రూ.3 వేలు విలువచేసే సామగ్రి ఉంటుందని.. వీటికి సంబంధించి ఈ నెలాఖరుకు టెండర్ల ప్రక్రియను పూర్తిచేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

పాలకొల్లు సామాజిక ఆరోగ్య కేంద్రంలో బేబీకేర్

పైసా ఖర్చు లేకుండా..

జిల్లాలోని ప్రాంతీయ ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసూతి, బేబీ కేర్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఎలాంటి ఖర్చు లేకుండానే కాన్పు, తదుపరి చికిత్స పొందవచ్చు. బాలింతకు పోషకాలతో కూడిన ఆహారాన్ని జేఎస్‌ఎస్‌కే ద్వారా ఉచితంగా అందిస్తారు. శిశువు ఆరోగ్యకరమైన జీవనానికి అవసరమయ్యే టీకాలను నిర్ణీత వ్యవధిలో అందిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆరోగ్య ఆసరా పేరిట రూ. 5 వేలు తల్లి ఖాతాలో జమచేస్తారు. గర్భం దాల్చిన నాటి నుంచి కాన్పు జరిగే వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి జేఎస్‌వై పీఎంఎంవై ద్వారా రూ. 6 వేలు అందుతాయి.

నిండుగా గోదారి

క్రమేపీ పెరుగుతున్న ప్రవాహం

కుక్కునూరు, న్యూస్‌టుడే: గోదావరిలోకి ప్రవాహం క్రమేపీ పెరుగుతోంది. ఆదివారం సాయంత్రం భద్రాచలం వద్ద నీటి మట్టం 19 అడుగులకు చేరింది. కుక్కునూరు వద్ద ఇరువైపులా గట్లు తాకుతూ నది నిండుగా ప్రవహిస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత, శబరి, సీలేరు నదుల నుంచి ప్రవాహం వస్తోండటంతో గోదావరి జలకళ సంతరించుకుంది. దీంతో అధికారులు లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వరద ప్రవాహం భద్రాచలం వద్ద 43 అడుగులు(మొదటి ప్రమాద స్థాయి) దాటితే ఆ గ్రామాలను ఖాళీ చేయించే దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.

తిరిగి నదిలోకి.. పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద ఆదివారం సాయంత్రానికి 28.25 మీటర్లకు పెరిగింది. 48 గేట్ల నుంచి 2.25 లక్షల క్యూసెక్కులు స్పిల్ ఛానల్ ద్వారా దిగువకు వెళ్తోంది. వరద పెరగడంతో ఎగువ, దిగువ కాఫర్‌డ్యాంల మధ్యలోకి చేరుతున్న నీటిని దిగువ కాఫర్‌డ్యాం వద్ద ఏర్పాటు చేసిన పంపుల ద్వారా తిరిగి గోదావరిలోకి తరలిస్తున్నారు.

16 పంపుల నుంచి 5,600 క్యూసెక్కులు.. పట్టిసీమ ఎత్తిపోతల పథకంలోని 16 పంపుల నుంచి ఆదివారం నీటిని విడుదల చేస్తున్నట్లు పర్యవేక్షణ డీఈ సురేశ్ చెప్పారు. ప్రాజెక్టు కుడి కాలువలోకి డెలివరీ సిస్టమ్ నుంచి 5,600 క్యూసెక్కులు వెళ్తున్నట్లు పేర్కొన్నారు.

నేత్రపర్వం.. జగన్నాథ రథోత్సవం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: లక్ష్మీపురం వేంకటేశ్వర స్వామి సంతాన గోపాల జగన్నాథస్వామి ఆలయంలో కొలువైన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి రథోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. పది రోజుల పాటు ఉత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించారు. చివరి రోజు స్వామివారి రథోత్సవం తిమ్మాపురంలో అంగరంగ వైభవంగా జరిగింది. సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామిని పల్లకిలో తోడ్కొని వచ్చి రథంలో కొలువు దీర్చారు. స్వామికి కర్పూర హారతులిచ్చి రథోత్సవాన్ని ప్రారంభించారు.

శ్రీవారి క్షేత్రంలో రద్దీ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: సెలవు రోజు, తొలి ఏకాదశి రెండూ కలిసి రావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి ఆదివారం ద్వారకాతిరుమల క్షేత్రానికి భక్తులు వేలాదిగా తరలి వచ్చి, స్వామిని దర్శించారు. భక్తుల రాకతో శ్రీవారి దర్శన క్యూలు, ప్రసాదాల కౌంటర్లు, అన్నదానం క్యూలు, కేశఖండనశాల, ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. సామాన్య భక్తులు స్వామిని దర్శించుకోవడానికి సుమారు 3 గంటల సమయం పట్టింది.

జాతస్య హి ధ్రువోమృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ !
తస్మాత్ అపరిహార్యే ర్థేన త్వం శోచితుమర్హసి !!

శ్రద్ధాంజలి

కరిగే కాలంలో.. తరగని జ్ఞాపకం మీరు..
కదిలే ఆలోచనలో.. చెరగని స్మృతి మీరు.. మీకు లేదు మరణం...
మా హృదయాలలో మీ జ్ఞాపకాలు చిరస్మరణీయం..

మంచికి, సేవాతత్పరతకు మారుపేరుగా నిలిచి,
ఎంతోమందికి ఉపాధిమార్గం చూపించి,
మరెందరికో ఆదర్శప్రాయులుగా నిలిచి,
అందరి హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించి,
అజరామరమైన కీర్తిప్రతిష్ఠలను సంపాదించిన మీరు
మానుండి భౌతికంగా దూరమైనందుకు చింతిస్తూ...
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
మీ ఆశయ సాధనలో... ఎల్లవేళలా మీ అడుగు జాడల్లో నడుస్తూ...
మీ...

కీ॥శే॥ వేగేశ్న ఆనందరాజు గారు

జననం: 27-06-1958 స్వర్గప్రాప్తి: 06-07-2025

భార్య: వేగేశ్న అనంతలక్ష్మి సత్యవతి

కుమారుడు : వేగేశ్న రఘురామరాజు
కోడలు : వేగేశ్న శ్రవంతి
మనుమరాళ్ళు : అక్షిత, అంకిత
మనుమడు : అఖండ సూర్యనంద ఆశ్రితవర్మ
కుమార్తె : దాట్ల రాధిక
అల్లుడు : దాట్ల సంజీవ్ కుమార్
మనుమలు : అఖిల్, అక్షయ్
మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

దశాహం: తేది. 16-07-2025 బుధవారం జరుపబడును.

(c) eenadu

కరపత్రం అందజేస్తున్న తోట సీతారామలక్ష్మి, పీతల సుజాత తదితరులు

శరవేగంగా రాష్ట్రాభివృద్ధి

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: అభివృద్ధి-సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రంలో కూటమి పాలన సాగుతోందని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, ఏపీ మహిళా ఆర్థిక సహకార సంస్థ ఛైర్మన్ పీతల సుజాత అన్నారు. భీమవరం మండలం తోకతిప్పలో ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో ముందడుగు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. గత వైకాపా పాలనలో ఐదేళ్ల రాష్ట్రం నాశనమైందన్నారు. ప్రస్తుత పాలనలో అభివృద్ధి వేగంగా సాగుతోందని.. దానికి అమరావతి, పోలవరం నిర్మాణాలే నిదర్శనమన్నారు. ఇంటింటికీ కరపత్రాలు అందించి ప్రచారం నిర్వహించారు. వివిధ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ యిందుకూరి రామలింగరాజు, తెదేపా మండల అధ్యక్షుడు కొయ్యలగడ్డ గణపతి, ప్రధాన కార్యదర్శి కోళ్ల సీతారాం, అగ్నికుల క్షత్రియ సంస్థ డైరెక్టర్ నాగిడి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

దారి చూపితేనే.. ప్రగతి పరుగు..!

● చివరి దశకు గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు ● అనుసంధాన మార్గాల కోసం రైతుల విన్నపాలు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి వెంబడి ఉన్న పొలాలకు సరైన కల్వర్టులు, దారులు ఇవ్వకపోవడంతో వందలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జంగారెడ్డిగూడెం మండలంలోని పుట్లగట్లగూడెం, లక్కవరం, పేరంపేట, పంగిడిగూడెం, దేవులపల్లి తదితర గ్రామాల్లో పొలాల మధ్య నుంచి జాతీయ రహదారి వెళ్లడంతో ఆయా పొలాలు రెండుగా చీలిపోయాయి. దీంతో పంట

పేరంపేట వద్ద పొలాలకు వెళ్లేందుకు దారి ఇలా..

నిర్మించిన చిన్న తూము వద్ద పేరుకుపోయిన ఇసుక

సాగు విషయంలో నానా అవస్థలు ఎదుర్కొంటున్నామని కర్షకులు వాపోతున్నారు.

బాట లేక.. కల్వర్టులు చాలక..

ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద దిగువకు వెళ్లే వీలు లేక తమ పొలాలు ముంపునకు గురవుతున్నాయని చిన్న, సన్నకారు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పొలాలకు అనుకుని పంట బోదెలు ఉండటంతో వచ్చిన వర్షపు నీరు దిగువకు వెళ్లిపోయేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. హైవేకు ఇరువైపులా పంట పొలాలకు వెళ్లేందుకు దారి నిర్మిస్తామని చెప్పి తమ భూములను తీసుకున్నారని.. నేడు హైవే పనులు పూర్తి కావస్తుండటంతో ఆ ఊసే లేదని రైతులు చెబుతున్నారు. కలెక్టర్‌తో పాటు హైవే అధికారులకు తమ సమస్యలపై పలుమార్లు వినతులు సమర్పించినా. . ఫలితం లేదని గగ్గోలు పెడుతున్నారు.

25 కిలోమీటర్లు తిరిగి వెళ్తున్నా..

'నా పొలంలో హైవే నిర్మాణానికి రెండెకరాలు ఇచ్చా. హైవే రాక మునుపు ఇంటి నుంచి పొలం వెళ్లాలంటే కిలోమీటరు ఉండేది. ఇప్పుడు సర్వీసు దారి ఇవ్వకపోవడంతో ఇంటి నుంచి జంగారెడ్డిగూడెం, సీతంపేట, తిరుమలాపురం మీదుగా 25 కి.మీ. తిరిగి పొలానికి వెళ్లాల్సి వస్తోంది.'

- వందనపు సాయిబాబు, పంగిడిగూడెం

గ్రీన్ ఫీల్డ్ హైవే (ఖమ్మం-దేవరపల్లి)	
హైవే పేరు	: ఎన్‌హెచ్-365 బీజీ
దూరం	: 162.10 కిలోమీటర్లు
ఏలూరు జిల్లాలో	: రేచర్ల, దేవులపల్లి, పొంగుటూరు (వాహనాలు హైవే ఎక్కేందుకు, దిగేందుకు)
జరగాల్సిన పనులు	: 300 మీటర్ల హెచ్‌టీ విద్యుత్తు లైన్లు ఉన్న చోట పనులు చేయాల్సి ఉంది. భూసేకరణ విషయంలో కోర్టు తీర్పు వెలువడటంతో హైవే పనులు జరగాల్సి ఉంది.
నిర్మాణానికి పట్టే కాలం	: 6 నెలలు

కూలీలు రావడం లేదు..

'పంట చేలకు రావాలంటే దారి లేకపోవడంతో కూలీలు వ్యవసాయ పనులకు సరిగా రావడం లేదు. పంట ఉత్పత్తులు ట్రాక్టర్లలో తరలించాలంటే యాతన పడుతున్నాం.' **- గోలి నర్సిరెడ్డి, పేరంపేట**

సభ్యత్వ కార్డు అందజేస్తున్న వేణుమాధవరావు

హక్కులతో పాటు బాధ్యతలు గుర్తించాలి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఉద్యోగులు తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించాలని వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వేణుమాధవరావు అన్నారు. తాడేపల్లిగూడెంలో ఉమ్మడి జిల్లాల వ్యవసాయ విస్తరణాధికారుల కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. అనంతరం ఇటీవల వ్యవసాయ విస్తరణ అధికారులుగా ఉద్యోగోన్నతులు పొందిన ఉద్యోగులకు సంఘ సభ్యత్వ కార్డులు అందజేశారు.

ప్రజారోగ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలిగా రత్నకుమారి

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండల పరిషత్తు కార్యాలయంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య మహిళా సంఘం జిల్లా సమావేశం రాష్ట్ర నాయకురాలు కె.జయమణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు హెచ్‌ఆర్‌ఏ తొలగించడం, ఉద్యోగోన్నతులు, ఎఫ్‌ఆర్‌ఎస్ తదితర అంశాలపై చర్చించారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఆరోగ్య పర్యవేక్షకులు లక్ష్మీకాంతం, పార్వతిలను సత్కరించారు. అనంతరం సంఘ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా జి.రత్నకుమారి, కార్యదర్శిగా కె.హేమకుమారి, కోశాధికారిగా పి.సత్యవతి, గౌరవాధ్యక్షులుగా డి.చంద్రలీల, ఈశ్వరి, మంగతాయారు, నాగమణిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి ఏఎన్ఎంలు, హెల్త్‌విజిటర్లు, నర్సులు, కమ్యూనిటీ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఇంజినీరింగ్ ప్రవేశాలకు వేళాయె!

నేటి నుంచి వెబ్ ఆధారిత కౌన్సెలింగ్

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభం కానుంది. ఈ నెల 22న ప్రక్రియ ముగియనుంది. రాష్ట్ర సాంకేతిక విద్యామండలి షెడ్యూల్ విడుదల చేసింది. ఆగస్టు 4న తరగతులు ప్రారంభిస్తారు.

జిల్లా వివరాలిలా..
- ఇంజినీరింగ్ కళాశాలలు: 6
- వివిధ బ్రాంచుల్లో సీట్లు: 4,920
- ఈఏపీసెట్ రాసింది: 4,700
- అర్హత సాధించింది: 3,409

తేదీల వారీగా షెడ్యూలు ఇదీ

☛ 7-16: రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ రుసుము చెల్లింపు ☛ 7-17: ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల సమర్పణ ☛ 13-18: వెబ్ ఆధారిత ఐచ్ఛికాల నమోదు ☛ 19: వెబ్ ఐచ్ఛికాల మార్పునకు అవకాశం ☛ 22: సీట్ల కేటాయింపు ☛ 23-26: కళాశాలల్లో ప్రవేశాలు ☛ 4.8.2025: తరగతుల ప్రారంభం

సమర్పించాల్సిన పత్రాలు ఇవీ..

☛ ఆన్‌లైన్‌లో చెల్లించిన ప్రాసెసింగ్ రుసుము రసీదు ☛ ఈఏపీసెట్-2025 ర్యాంకు కార్డు, హాల్ టికెట్ ☛ పదో తరగతి, ఇంటర్ లేదా తత్సమాన మార్కుల జాబితా ☛ 6 నుంచి ద్వితీయ ఇంటర్ వరకు అధ్యయన ధ్రువపత్రాలు ☛ చివరిగా చదివిన కళాశాల నుంచి బదిలీ ధ్రువపత్రం-టీసీ ☛ 1.1.2022 తర్వాత పొందిన ఆదాయ ధ్రువపత్రం ☛ కుల ధ్రువీకరణ పత్రం ☛ 2025-26లో పొందిన ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రం ☛ దివ్యాంగులు, ఎన్‌సీసీ విభాగం వారు, మాజీ సైనికుల పిల్లలు సంబంధిత వైద్య ధ్రువపత్రం ☛ నివాస ధ్రువపత్రం ☛ తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చి స్థిరపడిన అభ్యర్థులు మైగ్రేటెడ్ ధ్రువపత్రం

సహాయ కేంద్రం ఏర్పాటు

విద్యార్థుల సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారానికి సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఏదైనా ఇబ్బంది తలెత్తితే 79956 81678, 79958 65456, 91779 27677 నంబర్లకు ఫోన్ చేయొచ్చు. మరిన్ని వివరాలకు https:/// cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ చూడొచ్చు.

ధ్రువపత్రాల పరిశీలన ఇలా..

తేదీ	విభాగం	ర్యాంకులు
12	ఎన్‌సీసీ, క్రీడలు	1-60,000
13	ఎన్‌సీసీ, క్రీడలు	60,001-1,00,000
13	మాజీ సైనికులు	1-50,000
14	ఎన్‌సీసీ, క్రీడలు	1,00,001-1,50,000
14	మాజీ సైనికులు	50,001-1,00,000
15	ఎన్‌సీసీ, క్రీడలు	150,001 నుంచి చివరి వరకు
15	మాజీ సైనికులు	1,00,001-1,50,000
16	మాజీ సైనికులు	150,001 నుంచి చివరి వరకు
16	దివ్యాంగులు	1 నుంచి చివరి వరకు
16	ఆంగ్లో ఇండియన్స్	1 నుంచి చివరి వరకు
16	స్కౌట్స్, గైడ్స్	1 నుంచి చివరి వరకు

★ దివ్యాంగ విభాగం అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు విజయవాడ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లాల్సి ఉంటుంది.

కష్టం తీరి.. అద్దంలా మారి..!

ఉండి, న్యూస్‌టుడే: ఉండి నుంచి ఆకివీడు వెళ్లే 165 జాతీయ రహదారిపై ఆర్వోబీ (రైల్వేపై వంతెన) ప్రాంతంలో రహదారి ధ్వంసం కావడంతో వాహన చోదకులు, ప్రయాణికులు, పాదచారులు ప్రత్యక్ష నరకం చవిచూశారు. గత వైకాపా ప్రభుత్వం కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో వారి కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. వర్షాకాలంలో నీరు నిలిచిపోయి గుంతల్లో రహదారిని వెతుక్కోవాల్సి వచ్చింది. వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురయ్యేవారు. ఆర్వోబీ రహదారి దయనీయ స్థితిపై 'చంద్రయానమే నయం', 'నిత్య నరకం' శీర్షికలతో 'ఈనాడు'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. ఆర్నెల్ల నుంచి కదలిక.. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు చేసిన కృషితో ఉండి రైల్వే గేటుకు ఇరువైపులా జాతీయ రహదారి అభివృద్ధి పనులకు ఆర్నెళ్ల కిందట కదలిక వచ్చింది. ఆర్వోబీ పిల్లర్లకు ఇరువైపులా పూర్తిగా దెబ్బతిన్న రహదారులను యంత్రాల సహాయంతో తొలుత చదును చేశారు. అనంతరం తారుతో అభివృద్ధి పరిచారు. మరోవైపు అంచుల్లో ఎర్ర కంకర, రాళ్లు వేసి బలోపేతం చేశారు. హైవే అధికారుల పర్యవేక్షణలో సుమారు రెండు కిలోమీటర్ల పరిధిలో విస్తరణ పనులు పూర్తి చేశారు. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సుదీర్ఘకాలం తరువాత ఈ రహదారికి కొత్త రూపం వచ్చిందని సంబరపడుతున్నారు.

ఉండి రైల్వే పైవంతెన ప్రాంతంలో...

కొత్తగా వేసిన రహదారి

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, దేవిచౌక్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, దేవిచౌక్ వద్ద తాకట్టుపెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
05/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గల వారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 రామచంద్రపురం. భరత్‌కుమార్ ప్రభుత్వం నియమించిన వేలందారు మెయిన్‌రోడ్, రామచంద్రపురం

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, ప్రకాష్‌నగర్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్, ప్రకాష్ నగర్ వద్ద తాకట్టుపెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
07/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గల వారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 రామచంద్రపురం. భరత్‌కుమార్ ప్రభుత్వం నియమించిన వేలందారు మెయిన్‌రోడ్, రామచంద్రపురం

సాయి వేంకటేశ్వర ఫైనాన్స్, మెయిన్‌రోడ్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

సాయి వేంకటేశ్వర ఫైనాన్స్, మెయిన్ రోడ్ వద్ద తాకట్టుపెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును

కేటలాగు నం.	తేదీలు
06/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గలవారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 రామచంద్రపురం. భరత్‌కుమార్ ప్రభుత్వం నియమించిన వేలందారు మెయిన్‌రోడ్, రామచంద్రపురం

ప్రభాకర నిధి లి., దేవిచౌక్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

ప్రభాకర నిధి, దేవిచౌక్ వద్ద తాకట్టుపెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
08/2025	01-01-2024 to 30-06-2024

ఆసక్తి గలవారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 రాజమండ్రి. ఛైర్మన్: ప్రభాకర నిధి లి.

సాయి వేంకటేశ్వర ఎం.ఎం.ఎ. కో- ఆపరేటివ్ సొసైటీ దేవిచౌక్, రాజమండ్రి

బహిరంగ వేలం ప్రకటన

సాయి వేంకటేశ్వర ఎం.ఎం.ఎ. కో-ఆపరేటివ్ సొసైటీ, దేవిచౌక్ వద్ద తాకట్టు పెట్టిన వస్తువులు కేటలాగు వారీగా 29-07-2025 మ॥ గం॥ 2.00 నుండి సాయి వేంకటేశ్వర ఫైనాన్స్ మేడపైన మెయిన్‌రోడ్, రాజమండ్రి నందు వేలం వేయబడును.

కేటలాగు నం.	తేదీలు
09/2025	01-09-2023 to 30-06-2024

ఆసక్తి గలవారు గుర్తింపుకార్డు మరియు డిపాజిట్టుగా రూ.10,000/-లు చెల్లించవలెను. వేలం నిలుపుదలకు మరియు నియమనిబంధనలు మార్పుటకు సర్వహక్కులు సంస్థకు కలవు.

తేది: 06-07-2025 రాజమండ్రి. ఛైర్మన్: సాయి వేంకటేశ్వర ఎం.ఎం.ఎ. కో-ఆపరేటివ్ సొసైటీ

నాలుగు ట్రిపుల్ ఐటీల్లో మిగులు సీట్లు 600

రెండోవిడత కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు

వేంపల్లె, న్యూస్‌టుడే: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 600 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి విద్యార్థుల మెరిట్ జాబితాను తయారు చేసి ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభిస్తామని, ఆ లోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తామని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు.

రొయ్యల విక్రయానికి వెళ్తూ అనంత లోకాలకు..

కలిదిండి, న్యూస్‌టుడే : మధ్య తరగతి కుటుంబాలు వాళ్లవి. కష్టపడి జీవించే తత్వం. కుటుంబాన్ని పోషించుకోవడానికి ఎంత దూరమైనా వెళ్తారు. అలాంటి ఓ ప్రయాణం వాళ్ల ఉసురు తీసేసింది. కన్నవాళ్లతో సహా ఊరిని కన్నీటి సంద్రంలో ముంచేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. . కలిదిండి మండలం మూలలంక గ్రామానికి చెందిన కేత సాయి (24), తుట్టా నాగరాజు (18), చిట్టూరి సాయి కలిసి వాహనంలో రొయ్యలు లోడ్ చేయించి శనివారం చెన్నై మార్కెట్‌కు బయలు దేరారు. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం తెట్టు వద్దకు వెళ్లే సరికి వేగంగా వెళ్తున్న లారీ ఆకస్మికంగా బ్రేకులు వేయడంతో వెనుక వెళ్తున్న వాహనం అదుపు తప్పి ఆ లారీని ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో కేత సాయి, తుట్టా నాగరాజు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ఊపిరి వదిలేశారు. వాహనం నడుపుతున్న చిట్టూరి సాయి స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కేత సాయి తండ్రి మూడు నెలల కిందటే మరణించారు. ఆ విషాదం నుంచి ఇంకా కోలుకోని ఆ కుటుంబం ఈ దుర్ఘటనతో మరింత శోకంలోకి వెళ్లిపోయింది. మరోవైపు నాగరాజు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఉప్పుటేరు తీర గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సాయి, నాగరాజు (పాత చిత్రాలు)

చికిత్స పొందుతూ యువకుడి మృతి..

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాకలో ఓ యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. సీఐ కె.కుమారస్వామి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడేనికి చెందిన చింతాకుల సతీష్ (22), తల్లి మంగ, సోదరుడుతో కలిసి ఏడాది కిందట అమ్మమ్మగారి ఊరు ఉపమాక వచ్చి ఇక్కడే నివాసం ఉంటున్నారు. సతీష్ హెటెరో పరిశ్రమలో కాంట్రాక్టర్ వద్ద వెల్డర్‌గా పని చేస్తున్నాడు. ఇతడు మద్యానికి బానిసగా మారడంతో గురువారం తల్లి మందలించింది. అదే రాత్రి మేడ మీదకు వెళ్లిన ఇతడు కొంత సేపటికి కేకలు వేస్తూ వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా, గడ్డిమందు తాగినట్లు గుర్తించారు. వెంటనే నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి తునిలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. ఇతడు చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెచ్‌సీ వెంకటరావు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

సతీష్ (పాత చిత్రం)

మద్యం మత్తులో స్నేహితుల మధ్య ఘర్షణ

ఒకరి మృతి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఇద్దరి స్నేహితుల మధ్య చోటుచేసుకున్న గొడవ హత్యకు దారితీసింది. ఈ ఘర్షణలో పెంటపాడు గ్రామానికి చెందిన రెడ్డి గోవిందు(50) తీవ్రంగా గాయపడి మృతిచెందారు. ఈ ఘటనకు సంబంధించి తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక కొత్తగూడెం ప్రాంతానికి చెందిన గుబ్బల మల్లేశ్వరరావు, రెడ్డి గోవిందు స్నేహితులు. వీరిద్దరూ పెంటపాడులోని ఓ వ్యక్తి వద్ద పశువులకు గడ్డికోసే పని చేస్తుంటారు. ఎప్పటిలాగానే ఆదివారం ఉదయం కూడా పనికి వెళ్లారు. అనంతరం పట్టణంలోని భీమవరం బైపాస్ రోడ్డు వద్దకు వచ్చి మద్యం తాగారు. తాగిన మైకంలో ఒకరితో ఒకరు గొడవకు దిగారు. మల్లేశ్వరరావు సూదిగా ఉన్న రాయితో గోవిందు మెడ భాగం మీద కొట్టడంతో నరం తెగి తీవ్ర రక్తస్రావమైంది. గోవిందును స్థానికులు 108 అంబులెన్సులో తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. ఈ ఘటనపై పట్టణ సీఐ ఆది ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద చనిపోవడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

ముండూరు(పెదవేగి), న్యూస్‌టుడే: అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ ఎస్సై రంజిత్‌కుమార్ కథనం మేరకు.. కామవరపుకోట మండలం తడికలపూడికి ఈడ్పుగంటి వెంకట శ్రీనివాసరావు, దెందులూరు మండలం దోసపాడుకు చెందిన బాలినేని తేజ గ్రామాల్లో రేషన్ బియ్యం సేకరించి బయట అధిక ధరలకు విక్రయిస్తుంటారు. సుమారు 43 క్వింటాళ్ల బియ్యాన్ని లారీలో తరలిస్తుండగా.. మార్గం మధ్యలోని ముండూరు వద్ద పట్టుకున్నారు. లారీ యజమాని షేక్ ఇస్మాయిల్, అక్రమ రవాణాదారులు జంగం సురేశ్, గుడిపూడి రత్నరాజును అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీసులకు అప్పగించారు. సీఎస్ డీటీ వి.వి.రామారావుకు బియ్యం స్వాధీనం చేసినట్లు తెలిపారు. విజిలెన్స్ అధికారుల ఫిర్యాదు మేరకు వారిపై ఆదివారం కేసులు నమోదు చేసినట్లు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

తొమ్మిది మందికి తీవ్ర గాయాలు

జీలుగుమిల్లి(బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: జీలుగుమిల్లిలో ఆదివారం ఉదయం ఒక పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. అది కరవడంతో తొమ్మిది మంది తీవ్ర గాయాలపాలయ్యారు. రాష్ట్ర సరిహద్దులో ప్లాస్టిక్ దుకాణం నిర్వహించే తాటియాకులగూడేనికి చెందిన వృద్ధురాలు భూక్యా నీలిమ, రమణ, భగత్ సింగ్ కాలనీకి చెందిన కె.రాణి, రామన్నపాలేనికి చెందిన కమలమ్మ, ఎస్.భద్రమ్మ, జీలుగుమిల్లికి చెందిన ఎస్.నాగేశ్వరమ్మ, పి.కృష్ణ, దావీదు, సాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. ఒక ఇంటి వద్ద దూడను కరిచే ప్రయత్నం చేయగా, స్థానికులు కుక్కను హతమార్చారు. బాధితులకు స్థానిక పీహెచ్‌సీలో చికిత్సలు చేసి, మెరుగైన వైద్యానికి జంగారెడ్డిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్య

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ఉరేసుకొని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మధురానగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెనుమంట్ర మండలం మాముడూరు గ్రామానికి చెందిన వీరవల్లి పవన్‌కుమార్(24) హైదరాబాద్ అమీర్‌పేట్ సమీప ఎల్లారెడ్డిగూడలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ.. నానక్‌రామ్‌గూడలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడు ఆదివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో స్నానాల గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివాదాస్పదంగా చర్చి డైరెక్టర్ల ఎన్నిక

ఏలూరు టూటౌన్, వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఒకటో పట్టణంలోని ఓ చర్చిలో డైరెక్టర్ల ఎన్నిక ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. సభ్యుల కథనం మేరకు.. కత్తేపు వీధిలోని చర్చిలో మూడేళ్లకోసారి డైరెక్టర్ల ఎన్నిక నిర్వహిస్తారు. మొత్తం 300 మంది సభ్యులుండగా.. ఎన్నిక ప్రక్రియలో భాగస్వాములయ్యేవారు. తాజాగా కొందరికే ఓటు హక్కు కల్పిస్తామని పాస్టర్ చెప్పడంతో.. మిగతా సభ్యులు ఆదివారం చర్చి ఎదుట ఆందోళనకు దిగారు. గత తరహాలో సభ్యులందరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 110, 118, 129 చికెన్ విత్ స్కిన్ - 210 చికెన్ స్కిన్‌లెస్ - 220.

ఎస్సై కుటుంబానికి రూ.26 లక్షల ఆర్థిక సాయం

నరసాపురం, న్యూస్‌టుడే: విధుల్లో భాగంగా హైదరాబాద్ వెళ్తూ రహదారి ప్రమాదంలో మృతి చెందిన పోలీసు అధికారి కుటుంబానికి ఎస్సై వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు రూ.26 లక్షల ఆర్థిక సాయం అందించారు. నరసాపురం వాసి ముద్దాడ అశోక్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు ఎస్సైగా పనిచేశారు. గత నెలలో హైదరాబాద్ వెళ్తుండగా కోదాడ వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో ఆయనతో పాటు కానిస్టేబుల్ బ్లెస్సన్ జీవన్ మృతి చెందారు. అశోక్ 2009 బ్యాచ్ ఎస్సై. ఆ బ్యాచ్‌కు చెందిన ఉభయ తెలుగు రాష్ట్రాల పోలీసు అధికారులు 2020లో వెల్ఫేర్ సొసైటీని స్థాపించారు. అప్పటి నుంచి ఇబ్బందుల్లో ఉన్న సంఘ సభ్యులకు సొసైటీ ద్వారా సుమారు రూ.2 కోట్ల ఆర్థిక సాయం అందించారు. ఆ సొసైటీ ప్రతినిధులు ఆదివారం నరసాపురంలోని అశోక్ ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చెక్కు అందించారు. అనంతరం ఆలమూరులో కానిస్టేబుల్ బ్లెస్సన్ నివాసానికి వెళ్లి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందించారు.

నమూనా చెక్కు అందజేస్తున్న సొసైటీ సభ్యులు

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

టైలరింగ్ వర్క్స్ ఇంటి వద్దనే పనిచేసే స్త్రీలు కావలెను. వారికి క్లాత్ ఇచ్చుటకు స్టాక్ పాయింట్స్ పెట్ పార్టనర్స్ కావలెను. ✆ 7093632399.

FINANCIAL SERVICES

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్సియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

REAL ESTATE

LAND FOR SALE

గుంటూరు, అమరావతి రోడ్, అమరావతి రాజధానికి (25 Km) దగ్గరలో 3.20 ఎకరాలు స్థలము అమ్మకమునకు కలదు. contact: 7702349728

PLOT FOR SALE

విశాఖలో/ అనకాపల్లిలో NRI ఫామ్ ల్యాండ్స్ వేయుటకు ఇన్వెస్ట్ పార్టనర్స్ కావలెను. సంప్రదించండి. ✆ 7386414017/ 7093632399.

JOBS

Wanted teachers of Physical Science, Maths for Classes 6th to 10th. Contact or Send resume through Whatsapp: 98853 47949. Vijaya E.M. School, Penumantra, W.G.Dt.

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్లు సేవకు ఇంటి/ వంటపని, బేబికేర్ కొరకు వర్కర్లు కావలెను. భో. వ. + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ✆ 92814 52845, 82475 00574.

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబికేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.

త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 85209 80099, 85208 74499.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.35 పై॥

తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

EENADU THE WAY CLASSIFIEDS

కళాకారుల గడ్డ క్షీరపురి

పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కళలు, కళాకారులకు నిలయమైన పాలకొల్లులో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ స్థాపించాలనే సంకల్పం అభినందనీయమని మాజీ మంత్రి చేగొండి వెంకట హరరామజోగయ్య అన్నారు. పాలకొల్లు నాగరాజుపేటలోని రోటరీ క్లబ్ భవనంలో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆవిర్భావ సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షీరపురి గడ్డకు చెంది ఎంతోమంది కళాకారులు సినీ రంగంలో స్థిరపడి మంచి గుర్తింపు పొందారన్నారు. ఆగస్టు నెలాఖరు లోపు లఘుచిత్రాల పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆగస్టు 10లోగా దరఖాస్తులు పంపించాలన్నారు. ఈ పోటీల బహుమతి ప్రదానోత్సవంలో సినీ రచయిత తనికెళ్ల భరణికి జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేస్తామన్నారు.

పరిషత్ చిహ్నాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి చేగొండి తదితరులు

కార్యవర్గం ఎన్నిక.. ఈ సందర్భంగా జాతీయ తెలుగు సారస్వత పరిషత్ కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా చేగొండి హరరామజోగయ్య, అధ్యక్షుడిగా ముత్యాల శ్రీనివాస్, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా కె.ఎస్.వి.ఎస్.రామప్రసాద్, ఉపాధ్యక్షులుగా రాజా వన్నెంరెడ్డి, చేగొండి సత్యనారాయణమూర్తి, గుడాల హరిబాబు, ప్రధాన కార్యదర్శిగా కె.ఎస్.పి.ఎన్.వర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బోనం వెంకట నరసయ్య, సహాయ కార్యదర్శిగా విన్నకోట వెంకటరమణ, కోశాధికారిగా యిమ్మిడి రాజేశ్‌లను ఎన్నుకున్నారు.

వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమిషనర్ బాధ్యతల స్వీకారం

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: భీమవరం వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమిషనర్‌గా వి.కేదారేశ్వరరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ప్రస్తుతం పని చేస్తున్న సహాయ కమిషనర్ పి.జగదీష్‌బాబు గుడివాడ బదిలీ అయ్యారు. కేదారేశ్వరరావుతోపాటు డిప్యూటీ సహాయ కమిషనర్లుగా టి.కృష్ణతాతాజీ, సుశీల తేజవతి బాధ్యతలు స్వీకరించారు. వారికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

కేదారేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు క్లాసిఫైడ్స్

లీగల్ ప్రకటనలు

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక

జన్మదిన శుభాకాంక్షలు

అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

జీఎస్‌టీ 5% అదనం

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

92.7 FM Rajamahendravaram

ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 6304901226

భీమవరం

● భీమవరం ● ఉండి

సార్వా నాట్లలో జాగ్రత్తలు తప్పనిసరి

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: భీమవరం మండల వ్యవసాయాధికారి ప్రసాద్ ఆదివారం దిర్శుమర్రు తదితర గ్రామాల్లోని వరి నారుమడులను పరిశీలించారు. పొలాల్లో నాట్లు వేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. నారు తీసేటప్పుడు మొక్కలు లేతాకుపచ్చగా ఉంటే మూన త్వరగా వస్తుందన్నారు. నాలుగు నుంచి ఆరు ఆకులున్న నారును ఉపయోగించాలన్నారు. ముదురు ఆకును నాటితే దిగుబడి తగ్గిపోతుందన్నారు. చదరపు మీటరుకు 33 మూనలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఆలస్యంగా నాట్లు వేయడం, ముదురు ఆకులు నాటడం వల్ల పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు.

సంక్షేమ పథకాలపై సంతృప్తి

మత్స్యపురి (వీరవాసరం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెదేపా మండల నాయకుడు చింతా కనకయ్య అన్నారు. ఆదివారం మత్స్యపురిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్నట్లు నాయకులు తెలిపారు

శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం భీమవరం మండలం రాయలంలో నిర్వహించారు. భాజపా ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

అఖిల భారత సమ్మెలో పాల్గొంటాం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఈ నెల 9న జరిగే అఖిల భారత సమ్మెలో పాల్గొంటామని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కుమార్ అన్నారు. భీమవరంలోని యూటీఎఫ్ భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాడి సాధించుకున్న 29 చట్టాలను పునరుద్ధరించే వరకు పోరాటం సాగిస్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాసు, రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.ఎం.సూర్యచంద్రరాజు, భీమవరం శాఖ అధ్యక్షుడు పి.రమేష్‌బాబు, కార్యదర్శి ఎన్.రమేష్, కోశాధికారి జి.నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన ఆటోలు

పంచాయతీలో తొలగనున్న ఇబ్బందులు

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరంలో ఇంటింటి చెత్త సేకరణకు ఇబ్బందులు తొలగనున్నాయి. గ్రామంలో ప్రధాన రహదారులపై పారిశుద్ధ్య సిబ్బంది ట్రాక్టర్‌పై చెత్త సేకరణ చేస్తుంటారు. పలు చోట్ల అంతర్గత రహదారుల వెడల్పు తక్కువగా ఉండడంతో వీలు పడడం లేదు. కొద్ది రోజులుగా ప్రైవేటు కాంట్రాక్టు సిబ్బంది ఆటోల్లో సేకరిస్తున్నారు. దీంతో ప్రతి నెలా పంచాయతీకి రూ.వేలల్లో ఖర్చవుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని సర్పంచి చికిలే మంగతాయారు, పాలకవర్గ సభ్యులు రూ.9 లక్షలతో రెండు ఆటోలు కొనుగోలు చేసినట్లు కార్యదర్శి కె.లక్ష్మి తెలిపారు. గ్రామంలోని చిన్న సందులు, వీధుల్లో చెత్త సేకరణకు ఇబ్బందులు తొలగుతాయని ఆమె తెలిపారు.

రెండేళ్ల శిక్షణతో ఉపాధికి రాచబాట

☛ ప్రాంగణ ఎంపికకే మొగ్గు చూపుతున్న యువత

☛ ఐటీఐల్లో చేరికకు 15 లోపు దరఖాస్తు చేసుకోండి

ఉండి, న్యూస్‌టుడే: పదో తరగతి తరువాత రెండేళ్ల వ్యవధిలోనే ఉపాధికి బాట వేసే వృత్తి శిక్షణ కోర్సుల్లో ప్రధానమైనది ఐటీఐ విద్య. నైపుణ్యం ఉన్న యువతకు క్యాంపస్ సెలక్షన్స్ (ప్రాంగణ ఎంపిక)లోనే ఉద్యోగాలిచ్చేందుకు అనేక కంపెనీలు ముందుకొస్తున్నాయి. స్కిల్ హబ్‌ల ద్వారా నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాల్లోనూ పలువురు ఎంపికవుతుంటారు. దీంతో అత్యాధునికమైన సాంకేతిక శిక్షణ అందిస్తున్నారు. ఐటీఐల్లో చేరేందుకు యువత మొగ్గు చూపుతోంది.

శిక్షణ పొందుతున్న విద్యార్థులు

అందుబాటులో సీట్లు..

ఉండి, ఆచంటలో ప్రభుత్వ ఐటీఐలు ఉన్నాయి. వీటిలో 308 సీట్లకు 126 మంది చేరారు. ప్రైవేటు రంగంలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, పెంటపాడు, అత్తిలి, మార్టేరు, పాలకొల్లు, ఆకివీడు, శివదేవుని చిక్కాల, పెనుమంట్రల్లో 16 ఐటీఐల్లో 2,816 సీట్లకు కేవలం 50 మందే చేరారు. తొలి విడతలో అన్ని ఐటీఐలకు ప్రభుత్వ సంస్థల్లోనే కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. మిగిలిన సీట్లకు ఎక్కడికక్కడ కౌన్సెలింగ్ జరుగుతోంది. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు "https:///iti.ap.gov.in ' ' ఆన్‌లైన్ పోర్టల్‌లో విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఒరిజినల్ ధ్రువపత్రాలతో వెరిఫికేషన్ సమయంలో తగిన రశీదు పొందాలని అధికారులు సూచిస్తున్నారు.

నైపుణ్యతకు పెద్ద పీట..

ఐటీఐ కోర్సుతో పాటు అప్రెంటీస్‌తో వృత్తిలో నైపుణ్యత సాధించిన వారికి ప్రైవేటు కంపెనీలే కాకుండా రైల్వే, ఓఎన్‌జీసీ, విద్యుత్తు, ఆర్టీసీల్లో ప్రభుత్వ శాఖలు ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. రెండేళ్ల ఐటీఐ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు బ్రిడ్జి కోర్సుతో పాలిటెక్నిక్‌లో నేరుగా ప్రవేశం పొందొచ్చు. ఉద్యోగంతో పాటు ఉపాధి మెరుగు పడటంతో ఐటీఐల్లో చేరికలు పెరుగుతున్నాయని ప్రభుత్వ ఐటీఐల జిల్లా ప్రధానాధికారి వేగేశ్న శ్రీనివాసరాజు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467
కాళ్ల	: 80085 74474		

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ? రెండో పట్టణంలోని లోసరి - గుట్లపాడు కాలువగట్టు పనులు జరగడం లేదు. ప్రయాణాలకు ఇబ్బందిగా ఉంది. - **రామకృష్ణ, ప్రైవేటు ఉద్యోగి**

✔ పనులు చేపట్టాలని గుత్తేదారుకు చెప్పాం. - **వై.శ్రీను, పురపాలక డీఈ**

? శ్రీరామపురం రహదారిపై చెత్త వేస్తున్నారు. వెంటనే తరలించడం లేదు. స్థానికులకు ఇబ్బందిగా ఉంది. - **ఆర్.రవి, స్థానికుడు**

✔ రహదారిపై చెత్త వేయకుండా డబ్బాలు ఏర్పాటు చేశాం. - **శ్రీనివాసరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

విద్యుత్తు స్తంభాలను బలోపేతం చేసే పనులు

ఉండి, న్యూస్‌టుడే: ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాలను బలోపేతం చేసే పనులు విద్యుత్తు శాఖ అధికారులు ప్రారంభించారు. "గాలి వీస్తే గల్లంతే..!" శీర్షికన 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఉండి ఏఈ శ్రీనివాసరావు స్పందించారు. బొండాడ మేజర్ డ్రెయిన్ గట్టుతో పాటు పలు ప్రాంతాల్లో బలహీనంగా ఉన్న విద్యుత్తు స్తంభాలను బలోపేతం చేయిస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

ఉండి, న్యూస్‌టుడే: ఉండి ప్రధాన పంట కాలువ వంతెనలు, పైపుల వద్ద అడ్డుగా నిలుస్తున్న గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. 'మేమున్నాం..మీకు తోడు' శీర్షికన ఈనాడులో ఆదివారం ప్రచురితమైన వార్తకు ఉండి జలవనరుల శాఖ ఏఈ ఫణిశంకర్ స్పందించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో వ్యర్థాలను కూలీల సహాయంతో తొలగించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం బల్లిపాడు గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి భీమవరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ఆదివారం ప్రచారం చేశారు. శ్రీకృష్ణుడిని జగద్గురువుగా పూజించే విధానాన్ని వివరించారు. కమిటీ అధ్యక్షుడు ఉదయకుమార్, నాగేశ్వరరావు, వాసుదేవ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఎమ్మెల్యే రామాంజనేయులు

32 మందికి ప్రతిభా పురస్కారాలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: గత విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన 32 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఆదివారం పురస్కారాలు అందజేశారు. భీమవరంలోని తుమ్మలపల్లి మంగరాజు విశ్రాంతి భవనం ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమత్సాక్షి వరప్రసాద్ బాబా ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రామాంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు దాతల ప్రోత్సాహం అభినందనీయమన్నారు. ట్రస్టు అధ్యక్షుడు తుమ్మలపల్లి శివ, నిర్వాహకుడు రంగసాయి మాట్లాడుతూ రూ.2500 చొప్పున 32 మందికి నగదు ప్రోత్సాహకాలు అందించామన్నారు. వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

సంక్రమిత వ్యాధులపై అవగాహన అవసరం

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపట్ల జంతు ప్రేమికులు అవగాహన కలిగి ఉండాలని పశు వైద్యాధికారి సుధీర్ బాబు ఆదివారం అన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో డివిజన్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత టీకాల కార్యక్రమం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా సుమారు 150 కుక్కలకు టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా జంతు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి, గోసంరక్షణ సమితి అధ్యక్షుడు సుంకర దాసు, డాక్టర్లు పుండరీబాబు, వరలక్ష్మి, లలిత తదితరులు పాల్గొన్నారు.

అయిభీమవరం: కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న భార్గవిసత్య

ఆకివీడు, న్యూస్‌టుడే: ప్రపంచ జూనోసిస్ డే పురస్కరించుకుని నగర పంచాయతీ పరిధి, అయిభీమవరం, సిద్ధాపురం తదితర గ్రామాల్లో ఉన్న పశు వైద్యశాలలో ఆదివారం 150 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశామని మండల పశు వైద్యాధికారిణి భార్గవి సత్య తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. జూనోటిక్ వ్యాధులలో రేబిస్ వ్యాధి ప్రమాదకరమని, అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

80 శునకాలకు టీకాలు.. పాలకోడేరు, న్యూస్‌టుడే: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం పాలకోడేరు, మోగల్లు, విస్సాకోడేరులో పశు వైద్యశాలల వద్ద శిబిరాలు నిర్వహించినట్లు మండల పశు వైద్యాధికారిణి హేమ తెలిపారు. 80 పెంపుడు శునకాలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. పాలకోడేరులో శిబిరాన్ని పశ్చిమ డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ మురళీకృష్ణంరాజు ప్రారంభించారు.

కాళ్ల, న్యూస్‌టుడే: ప్రపంచ జంతు సంక్రమణ వ్యాధి నిరోధక దినం (జూనోసిస్ డే) సందర్భంగా ఆదివారం కాళ్ల మండలం పరిధిలో కాళ్ల, జువ్వలపాలెం పశువైద్యశాలలో 65 కుక్కలకు టీకాలు వేసినట్లు మండలం ఇన్‌ఛార్జి పశు సంవర్ధక అధికారిణి కె.భార్గవిసత్య తెలిపారు.

వంతెన దాటాలంటే వణుకే

పెదకాపవరం - పాములపర్రు రహదారిలో వెంకయ్యవయ్యేరు కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంటోంది. కొన్నేళ్లుగా కనీసం మరమ్మతులు లేక వంతెనపై అనేక చోట్ల పెచ్చులూడి పెద్దపెద్ద గోతులు ఏర్పడి ఇనుప ఊచలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరింది. ఈ వంతెనపై నుంచే రోజూ పెదకాపవరం, చినకాపవరం, గుమ్ములూరు, క్రొవ్విడి తదితర గ్రామాల ప్రజలు, విద్యార్థులు భీమవరం వెళ్తుంటారు. వంతెనపై విద్యుత్తు దీపాలు లేవు. దీంతో రాత్రి సమయంలో ప్రమాదాలకు గురవుతామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఆర్అండ్‌బీ ఏఈ కె.శ్రీహరిరాజు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. - **న్యూస్‌టుడే, ఆకివీడు**

ఎండుతూ.. తడుస్తూ..

పాఠశాలల్లో సైకిళ్లు భద్రపర్చుకునేందుకు షెడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఏడు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎక్కడా షెడ్లు లేవు. ఆయా పాఠశాలలకు శివారు గ్రామాల నుంచి విద్యార్థులు నిత్యం సైకిళ్లపై వస్తుంటారు. ఎండలో ఎండుతూ.. వానలో తడుస్తూ సైకిళ్లు తరచూ దెబ్బతింటున్నాయి. వాటికి మరమ్మతులు చేయించుకొని విద్యార్థులు తిరిగి ఇళ్లకు వచ్చేందుకు ఎక్కువ సమయం పడుతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనిపై ఎంఈవో ఎం.శ్రీమన్నారాయణ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే షెడ్లు నిర్మిస్తామన్నారు. - **న్యూస్‌టుడే, వీరవాసరం**

వసతి గృహానికి చెత్త సమస్య

కాళ్ల సమీకృత బాలుర వసతి గృహానికి పారిశుద్ధ్య సమస్య వేధిస్తోంది. చుట్టుపక్కల నివాసం ఉంటున్నవారు చెత్త తీసుకొచ్చి వసతిగృహం ద్వారం వద్ద వేస్తున్నారు. దీంతో దుర్వాసనతోపాటు ప్రాంగణం బురదమయంగా ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ ప్రాంగణంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించారు. అధికారులు స్పందించి చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని, వసతి గృహ ప్రాంగణం శుభ్రం చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు. వెంటనే చర్యలు తీసుకుంటామని గ్రామ కార్యదర్శి బి.సతీష్‌కుమార్ తెలిపారు. - **న్యూస్‌టుడే, కాళ్ల**

ప్రవేశ ద్వారం వద్ద ఇలా..

పర్లమ్మకు ఆడపడుచు సారె

కాళ్ల, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం ఎల్.ఎన్.పురం గ్రామ దేవత పర్లమ్మకు గ్రామస్థులు సామూహికంగా ఆడపడుచు సారె సమర్పించారు. సుమారు 250 మంది మహిళలు గ్రామంలో మేళతాళాలతో పసుపు, కుంకుమ, చీర, గాజులు, సుమారు 350 కిలోల వివిధ రకాల మిఠాయిలు, పండ్లు సారెగా బిందెలు, కావిళ్లతో గ్రామోత్సవం నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. ఉదయం అమ్మవారికి సహస్రనామ కుంకుమ పూజలు చేసి విశేషంగా అలంకరించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వెండి వస్తువుల సమర్పణ

ఆకివీడు, న్యూస్‌టుడే: సంత మార్కెట్ ప్రాంతంలోని రామాలయంలో సీతారామస్వామి వారికి ఆదివారం విజయవాడకు చెందిన కటారి శ్రీను రూ.1 లక్ష విలువైన వెండి వస్తువులు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులకు వెండి శంకు చక్రాలు, అభయ హస్తాలు అందించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వారాహి అమ్మవారికి పూజలు

ఆకివీడు, న్యూస్‌టుడే: పిల్లలమర్రి అగ్రహారం వీధిలోని పార్వతీ సమేత వెంకట లింగేశ్వర స్వామివారి ఆలయంలో వారాహి నవరాత్రులు నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పిండి వంటలు, పండ్లు, పూలు, చీరలతో ప్రదర్శనగా తరలివచ్చి అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

తొలి ఏకాదశి సందర్భంగా భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. పలు చోట్ల అమ్మవార్లను వివిధ కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. ఆలయాల వద్ద ఉదయానికే పెద్ద సంఖ్యలో భక్తులు బారులుతీరారు. కొన్ని చోట్ల తులసీదళార్చన, కుంకుమార్చనతోపాటు ప్రత్యేక అభిషేకలు నిర్వహించారు. ప్రసాదాలు పంపిణీ చేశారు. - **న్యూస్‌టుడే బృందం**



భీమవరం: జేపీ రోడ్డులో అలంకరణలో వేంకటేశ్వరస్వామి

మోగల్లులో: వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

శ్రీరామపురం కూడలిలో

వెలివర్రులో వీరపేరంటాలమ్మ

ఆకివీడు: లక్ష తులసి పూజలో భక్తులు

పీర్లను దర్శించుకుంటున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో పీర్ల సంబరం

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరంలో పీర్ల సంబరాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గాంధీ బొమ్మ సెంటర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంగణంలో ఉంచిన పీర్లను భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు ఉదయం నుంచి ఉపవాస దీక్ష చేసి అర్ధరాత్రి నిప్పుల గుండాన్నితొక్కి దీక్షలు విరమిస్తారని నిర్వాహకులు తెలిపారు.

పెద్ద మసీదులో మొహర్రం ప్రార్థనలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మొహర్రం సందర్భంగా పట్టణంలోని పలు మసీదుల్లో ఆదివారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెద్ద మసీదులో ఇమామ్ ఎండీ మౌజీఆలమ్‌ఫైజీ ప్రత్యేక నమాజు చేసి దేవుని సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా మసీదు ఆవరణలో షర్బత్, మిఠాయిలు పంపిణీ నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు షేక్ రబ్బానీ, పట్టణ ముస్లిం కమిటీ గౌరవాధ్యక్షుడు ఎండీ నౌషాద్, ఉపాధ్యక్షుడు మొహమ్మద్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

షర్బత్ పంపిణీ చేస్తున్న మత పెద్దలు

రాయితో కొట్టాడని ఫిర్యాదు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం రెండో పట్టణం బైపాస్‌రోడ్డులో ఇద్దరి వ్యక్తుల మధ్య వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. ఎస్.సందీప్‌ను తరుణ్ అసభ్యకరంగా తిట్టడంతో ప్రశ్నించినందుకు రాయితో కొట్టి గాయపరిచినట్లు ఫిర్యాదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ ఎస్.ఎన్ భూషణం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులపై .. భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: రెండో పట్టణంలోని దుర్గాపురానికి చెందిన ఎ.నరసమ్మను ఆమె భర్త మావుళ్లు వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారికి 20 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరి మధ్య ఆదివారం ఘర్షణ జరగ్గా ఆమె తలపై కొట్టడంతో గాయపడింది. హెడ్‌కానిస్టేబుల్ ఎన్.స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం స్వాధీనం.. తుందుర్రు(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం తుందుర్రులో అక్రమంగా మద్యం కలిగి ఉన్న ఎం.శ్రీనివాసరావును ఆదివారం అరెస్టు చేసినట్లు భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బలరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అతడి నుంచి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

వ్యర్థాలు తొలగించేదెప్పుడో..?

ఉండి, న్యూస్‌టుడే: నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన ఉండిలో మట్టి, ఇతర వ్యర్థాలను ఇంకెన్నడూ తొలగిస్తారనే ప్రశ్నలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పది రోజుల క్రితం మూడు రహదారుల ప్రధాన కూడలిలో, గణపవరం వెళ్లే మార్గంలో ఆక్రమణల తొలగింపు ప్రక్రియను పూర్తి చేశారు. పేరుకుపోయిన చెత్తా చెదారాలు తొలగించి డ్రెయిన్ ప్రక్షాళన చేశారు. కానీ తీసిన మట్టి, వ్యర్థాలను పూర్తి స్థాయిలో తరలించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుట్టలుగా పేరుకుపోయిన ఈ వ్యర్థాలు ఇటీవల కురిసిన వర్షాలకు చెల్లా చెదురయ్యాయి. అటుగా రాకపోకలు సాగించాలంటే దుర్వాసన వెదజల్లుతోందని పలువురు ఆవేదన చెందుతున్నారు. కాపులపేటకు వెళ్లే రహదారి అంచుల్లో తొలగించిన ఇటుకలు, సిమెంట్ బిల్లలను డ్రెయిన్ పక్కనే వదిలేశారు. దీంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వారు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారి అంచుల్లో ఏ అవరోధాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాపులపేట వెళ్లే మార్గంలో వదిలేసిన ఇటుకలు, ఇతర వ్యర్థాలు

వైద్యులకు సత్కారం

పెరవలి, న్యూస్‌టుడే: పెంపుడు కుక్కలకు వేసే ర్యాబిస్ వ్యాక్సిన్‌ను మంత్రి కందుల దుర్గేష్ విడుదల చేసి టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెరవలిలోని దీపిక కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, తణుకు మున్సిపల్ మాజీ ఛైర్మన్ వంక రాజకుమారి, పశుసంవర్ధక శాఖ జేడీ రిషిప్రసాద్ తదితరులు మాట్లాడారు. అనంతరం భీమవరం బీవీ రాజు దంత వైద్యశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏవీ రామరాజు, పశు వైద్యాధికారులు చరణ్, సల్మా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వరప్రసాద్, హేమరాజులను సన్మానించారు.

పార్కింగ్ ప్రాంతంగా ప్రయాణ ప్రాంగణం

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం బస్టాండ్ ప్రాంగణం స్థానికులకు ద్విచక్ర వాహనాలు భద్రపరచుకునే స్థలంగా మారింది. రెండు దశాబ్దాల కిందట తూర్పు చెరువు సెంటర్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ నిర్మించారు. మొదట్లో భీమవరం ఆర్టీసీ డిపోనకు చెందిన సిబ్బంది పర్యవేక్షణలో ఉండేది. కొన్నాళ్లుగా దీన్ని పట్టించుకోకపోవడంతో స్థానిక వ్యాపారులకు తోపుడు బళ్లు, ద్విచక్ర వాహనాలు నిలిపే ప్రాంగణంగా మారింది. పంచాయతీ అధికారులు, భీమవరం ఆర్టీసీ డిపో అధికారులు బస్టాండ్‌ను పరిరక్షించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాదయాత్ర

పెనుమంట్ర, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ఏటా 150 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు శృంగవృక్షంలోని దత్త పీఠాధిపతి సాయిదత్త నాగానంద సరస్వతి స్వామి తెలిపారు.

అధ్వాన స్థితిలో ఉండి బస్టాండ్

ఉండి, న్యూస్‌టుడే: నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన ఉండిలో ఆర్టీసీ బస్టాండ్ అధ్వానంగా మారింది. 165 జాతీయ రహదారి ఆనుకొని ఉన్న ఈ బస్టాండ్ ప్రాంగణం గుంతలు పడి దయనీయంగా ఉంది. వర్షం పడితే ఆ గుంతల్లో మురుగు నిలిచి మడుగులను తలపిస్తున్నాయి. ఇక్కడ నుంచి ఏలూరు, సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం, ద్వారకతిరుమల, తాడేపల్లిగూడెం, విజయవాడ, నూజివీడు, గుడివాడ, హైదరాబాద్, నరసాపురం, పాలకొల్లు, విశాఖపట్నం, కాకినాడ, భీమవరం, గణపవరం తదితర ప్రాంతాలకు బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో వందలాది మంది ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

పడుతూ.. లేస్తూ .. ప్రయాణం.. వర్షం కురిస్తే చాలు బస్టాండ్ ప్రాంగణంలో అడుగు పెట్టలేనిరీతిలోకి మారుతోంది. బస్టాండ్‌లోకి వెళ్లాలంటేనే కొందరు ప్రయాణికులు హడలిపోతున్నారు. రహదారిపై గుంతలు పూడ్చి పక్కా మార్గాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ఆర్టీసీ భీమవరం డిపో సహాయ మేనేజర్ సురేశ్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఉండి బస్టాండ్‌ను జిల్లా ప్రజా రవాణాధికారి ప్రసాద్, ఇతర ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారని తెలిపారు. సమస్య పరిష్కారానికి సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

గుంతలు పడిన రహదారిలో

రహదారుణాలు

న్యూస్‌టుడే, చినఅమిరం(భీమవరం గ్రామీణ)

పల్లెల్లో పలు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అవి మరింత దారుణంగా మారాయి. ఇళ్ల మధ్య, రహదారి అంచుల్లో నీరు నిలిచిపోయి పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. నీటి నిల్వ వల్ల దోమలు విజృంభిస్తున్నాయని.. వర్షాకాలం కావడంతో వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తక్షణం నీటిని తోడించాలని.. అత్యవసరంగా కనీసం కచ్చా డ్రెయిన్లు అయినా తవ్వించాలని ప్రజలు కోరుతున్నారు.

భీమవరం మండలం కొవ్వాడ పంచాయతీలో రోడ్డు ఇది. బైపాస్ రోడ్డుని ఆనుకొని ఉన్న ఇళ్ల మధ్యలో వర్షం నీటితో రోడ్డు మొత్తం మునిగిపోతోంది. వేరే దారి లేక ప్రజలు అందులోనుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ డ్రెయినేజీ సౌకర్యం లేదు. వర్షం వచ్చిన ప్రతిసారీ నరకం చూస్తున్నామని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇది భీమవరం మండలం చినఅమిరం పరిధిలో యూత్ క్లబ్ రోడ్డు. జిల్లా రవాణా కార్యాలయానికి వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి వర్షం వస్తే దారుణంగా మారుతోంది. వాన నీరు రోడ్డు అంచుల్లో కొన్ని చోట్ల రోడ్డుపైన నిలిచిపోతూ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఒక్కోసారి వాహనచోదకులు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం.. క్షేత్రస్థాయిలో పరిస్థితుల్ని పరిశీలిస్తాం. అవసరమైన చోట్ల కొత్తగా రహదారులు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేయిస్తాం. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటాం. - **మురళీగంగాధరరావు, ఎంపీడీవో**

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

శాకంబరి అలంకరణలో అమ్మవారు

మొగల్తూరు, న్యూస్‌టుడే: ఆషాడ మాసం ఆదివారం సందర్భంగా మొగల్తూరు పరిధి పితానిపాలెం సమీపాన కొలువైన పుంతలో ముసలమ్మవారిని శాకంబరి రూపంలో అలంకరించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు.

మొగల్తూరు, న్యూస్‌టుడే: ముత్యాలపల్లిలో కొలువైన బండిముత్యాలమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. ఆషాడమాసం సందర్భంగా పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాదయాత్ర

యాత్రలో నాగానంద సరస్వతి స్వామి, పీఠం సభ్యులు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ఏటా 150 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు శృంగవృక్షంలోని దత్త పీఠాధిపతి సౌందత్త నాగానంద సరస్వతి స్వామి తెలిపారు. పీఠం నుంచి పిఠాపురం వరకు చేపట్టిన పాదయాత్ర ఆదివారం మండలంలోని పోలమూరుకు చేరింది. స్వామి వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 19 ఏళ్లుగా ఈ పాదయాత్ర చేస్తున్నట్లు చెప్పారు. తుపాకుల గోవిందాచార్యులు, దుర్గాప్రసాద్, మహిళలు, పీఠం సభ్యులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
నరసాపురం: 80085 74504
పాలకొల్లు: 80085 74510
ఆచంట: 91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? పట్టణంలోని కేసరి వారి వీధి సమీపాన రోడ్డుపై చెత్త వేస్తున్నారు. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. - జేకే కృష్ణమూర్తి, నరసాపురం
✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - వి.ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్
? రాయపేటలోని భాస్కర కళాశాల సమీపాన డ్రెయిన్ పూడిపోయి మురుగు నిలిచిపోతోంది. - సిహెచ్ మల్లి, నరసాపురం
✔ పరిశీలించి కాలువను శుభ్రం చేయిస్తాం. - ఎం. అంజయ్య, పురపాలక కమిషనర్
పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ? పాలకొల్లులోని చిన్నివారి వీధిలో కొన్నిరోజులుగా డ్రెయిన్లను శుభ్రం చేయడం లేదు. దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నాం. - ప్రసాద్, స్థానికుడు
✔ డ్రెయిన్లను శుభ్రం చేయిస్తాం. - లక్ష్మణ్, పారిశుద్ధ్య అధికారి
పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ? పాలకొల్లు మండలం అర్థకల్లలో మంచి నీటి ట్యాంక్ వద్ద చెత్త వేస్తున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నాం. - సిహెచ్ ఫణికిరణ్, స్థానికుడు
✔ ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తాం. - మాధవి, పంచాయతీ కార్యదర్శి

చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ నాయకర్

సీఎం సహాయనిధితో భరోసా

మొగల్తూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలకు భరోసా లభిస్తోందని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అనారోగ్యానికి గురై సొంత నిధులతో వైద్యం పొందిన 18 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.11.04 లక్షల విలువైన చెక్కులను ఆయన ఆదివారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. ఆయన వెంట పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు ఉన్నారు.

రాకపోకలకు దారేదీ

పాలకొల్లు, న్యూస్‌టుడే: పట్టణంలోని హనుమాన్ కాలనీలో సీసీ రహదారికి మధ్యలో ఉన్న మట్టి గుట్ట రాకపోకలకు ఆటంకంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల నిర్మించిన ఈ సీసీ రహదారి అంచుల్లో వేసేందుకు తెచ్చిన రద్దును గుట్టగా వేసి అలానే వదిలేశారు. ఇక్కడ రహదారి నిర్మించినా రాకపోకలకు అవకాశం లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు.

తొలి ఏకాదశి.. ఆధ్యాత్మికత వెల్లివిరిసి

పాలకొల్లు: అలంకరణలో వెంకటేశ్వరస్వామి

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా పలు ప్రాంతాల్లో ఆలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి, అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. కూరగాయల బజారు వద్ద వేంకటేశ్వరస్వామిని ఆభరణాలు, పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం వాలమర్రులో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు.

నరసాపురం గ్రామీణ, పెనుగొండ, న్యూస్‌టుడే: యర్రంశెట్టిపాలెంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి, చిట్టవరం పరిధి నగరపేట రామాలయం, వేములదీవి పడమర కాపులకోడపల్లో శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెనుగొండ, కొఠాలపర్రు తదితర గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పెనుమంట్ర, న్యూస్‌టుడే: జుత్తిగ శ్రీఉమావాసుకీ రవి సోమేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో కొలువైన శ్రీలక్ష్మీ జనార్దన స్వామికి పంచామృతాభిషేకాలు, తులసీ దళార్చనలు చేశారు.

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: శ్రీ సూర్యనారాయణ స్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో విశేష పూజలు చేశారు.

కొఠాలపర్రులో కేశవస్వామి

భక్తి శ్రద్ధలతో మొహర్రం

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మొహర్రం సందర్భంగా పాలకొల్లు అమ్మగార్ల పాలెం వద్ద పంజాలో పీర్లను ఆదివారం అలంకరించి ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం సోదరులు ఉపవాసం ఉండి నిప్పుల గుండం తొక్కారు.

ఇల్లు సరే.. మరి వసతులు!

లక్ష్య సాధనకు యంత్రాంగం కసరత్తు

పోడూరు మండలం పెనుమదం వద్ద పేదల కాలనీలో రహదారి దుస్థితి. జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణంలో పోడూరు మండలం బాగా వెనుకబడి ఉంది. కూటమి ప్రభుత్వం అదనపు సాయం అందించినా వసతుల లేమి కారణంగా లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు మొగ్గు చూపడం లేదు.

పాలకొల్లు మండలం పూలపల్లి వద్ద పేదల కాలనీ ఇది. ఇక్కడ కొందరు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. కానీ విద్యుత్తు సౌకర్యం కల్పించకపోవడంతో గృహ ప్రవేశాలకు కొందరు ముందుకు రావడం లేదు.

పాలకొల్లు, న్యూస్‌టుడే

శ్రావణమాసం నాటికి పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం అదనపు సాయం అందించడంతో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమైనా ఆయా లేఅవుట్లలో వసతుల లేమి కారణంగా ఒకింత ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు మాత్రం వారికి నచ్చజెప్పి.. బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పించి నిర్దేశిత లక్ష్యాలను సాధించేదిశగా శరవేగంగా కృషి చేస్తున్నారు.

మొగల్తూరు ముందంజ.. నరసాపురం డివిజన్‌లోని పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజకవర్గాల పరిధిలో మొగల్తూరు మండలంలో 282 ఇళ్ల నిర్మాణాల లక్ష్యం కాగా 60 శాతం పూర్తి చేసి ముందంజలో ఉంది. అత్యధికంగా 549 ఇళ్ల నిర్మాణాల లక్ష్యంగా ఉన్న పోడూరు మండలం 33 శాతంతో చివరి స్థానంలో ఉంది. మిగిలిన మండలాలు లక్ష్యానికి మధ్యలో కొనసాగుతున్నాయి. ఆగస్టునాటికి అన్ని ఇళ్లను వేగేలా గృహ నిర్మాణ సంస్థ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

మండలాల వారీగా నిర్మాణాల స్థితి ఇలా..

మండలం	లక్ష్యం	పూర్తయినవి	శాతం
పోడూరు	549	179	33
పెనుగొండ	429	273	64
యలమంచిలి	359	172	48
పెనుమంట్ర	512	220	43
మొగల్తూరు	282	169	60
ఆచంట	379	208	55
నరసాపురం	412	196	48

సమయానికి పూర్తి.. మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా తగిన ప్రణాళిక అమలు చేస్తున్నాం. ప్రభుత్వం ఇస్తున్న అదనపు సాయాన్ని సద్వినియోగం చేసుకునేలా కొందరు లబ్ధిదారులు పనులు ప్రారంభిస్తున్నారు. శ్రావణ మాసంలో గృహప్రవేశాలకు అనువుగా ఇళ్లన్నీ పూర్తి చేయిస్తాం. - రామయాజం శ్రీమూర్తులు, హౌసింగ్ డీఈ

చెక్కు అందిస్తున్న గంగా వెంకట శివతేజ

వెండి ఆభరణాలకు విరాళం

పెనుగొండ, న్యూస్‌టుడే: వడలిలోని కొలువైన మండపల్లమ్మ వెండి ఆభరణాల తయారీ నిమిత్తం ఆ గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గంగా వెంకట శివతేజ్ తన మొదటి జీతం రూ.87,989 విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు చెక్కును కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందించారు.

మహా రుద్రయాగానికి శ్రీకారం

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంటలో రామేశ్వరస్వామి వారి సత్రం వద్ద శ్రీచండీ సహిత మహారుద్ర యాగానికి ఆదివారం నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు ఉమారామలింగేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో యాగం జరుగుతుందని పేర్కొన్నారు.

నేత్రపర్వంగా గరుడోత్సవం

నరసాపురం, న్యూస్‌టుడే: రుస్తుంబాదలో జగన్నాథస్వామి ఆలయంలో గరుడోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరులోని వన మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం పాండురంగ స్వామి కళ్యాణమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ స్వామిని దర్శించుకున్నారు.

కూటమి పాలనతో ప్రగతి బాట

మొగల్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఏపీఎంఐపీ వైస్ ఛైర్మన్, తెదేపా జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా రామన్నపాలెంలో తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ప్రగతి బాటలో పయనిస్తోందన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. మత్స్యకార సహకార సంఘాల ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, తెదేపా మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, నాయకులు వాతాడి ఉమ, మామిడిశెట్టి సత్యనారాయణ, కత్తిమండ ముత్యాలరావు, బొల్ల చంటి, బళ్ల శ్రీను, కట్టా నాగూర్, కట్టా శ్రీనివాస్, అడ్డగర్ల నాని, పాలా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రామన్నపాలెం: ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న రామరాజు

ఆచంట, న్యూస్‌టుడే: బలహీన వర్గాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెదేపా నాయకులు అన్నారు. ఆచంట వేమవరంలో నాయకులు పితాని వెంకటసురేశ్, జడ్పీటీసీ సభ్యుడు సురేశ్‌బాబు, ఎంపీపీ సూర్యకుమారి, పరిశీలకుడు వెంకటరామరాజు తదితరులు ఆదివారం పర్యటించి సంక్షేమ పథకాల అమలుపై ప్రజలతో మాట్లాడారు.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

పాలకొల్లు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అభివృద్ధితో పాటు పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ అన్నారు. పాలకొల్లు మండలం భగ్గేశ్వరం, దగ్గులూరు గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా పథకాల అమలుపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు.

ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటున్న అంగర

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం బల్లిపాడు గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి భీమవరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ఆదివారం ప్రచారం చేశారు. శ్రీకృష్ణుడిని జగద్గురువుగా పూజించే విధానాన్ని వివరించారు. కమంటీ అధ్యక్షులు ఉదయకుమార్, నాగేశ్వరరావు, వాసుదేవ పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళి

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండలోని ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన జీవిత విశేషాలపై రూపొందించిన వీడియోను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. తొలుత ప్రిన్సిపల్ వైవీవీ అప్పారావు, ఎంఈవో-2 పి.రామకృష్ణ తదితరులు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉద్యోగుల ఘర్షణపై విచారణకు ఆదేశం

తణుకు, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో ఇద్దరు ఉద్యోగుల ఘర్షణపై విచారించి నివేదిక పంపించాలని తణుకు డీఈఈ దివాకర్‌ను ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. ఇది ఇలా ఉండగా దీనికి సంబంధించి పలువురు వ్యక్తులు కేసును రాజీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిపై పూర్తి విచారణ చేస్తే నిజాలు బయటకు వస్తాయని బాధితుడు జూనియర్ లైన్‌మ్యాన్ జగదీశ్ వాపోయారు. తనపై దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రొయ్యల తూకంలో మోసం

యలమంచిలి, న్యూస్‌టుడే: మేడపాడుకు చెందిన ఆక్వా రైతు చెరువు పట్టుబడికి రావడంతో ఒక సంస్థకు చెందిన ఏజెంట్లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. సదరు ఏజెంట్లు తూకంలో మోసానికి పాల్పడినట్లు గుర్తించిన రైతు జైభారత్ క్షీరారామ ఆక్వా సంఘానికి ఫిర్యాదు చేశారు. ఆ సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు మేడపాడుకు వెళ్లి ఏజెంట్ల మోసాన్ని బయటపెట్టారు. ప్రతి 25 కిలోలకు 1800 గ్రాముల మేర తక్కువ చూపుతున్నట్లు గుర్తించారు. దీనిపై రైతు సీహెచ్ దినకర్‌తో కలిసి యలమంచిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో కూలీ మృతి చెందిన ఘటన పాలకొల్లు మండలం దిగమర్రులో చోటు చేసుకుంది. గ్రామీణ పోలీసుల కథనం ప్రకారం.. దిగమర్రుకు చెందిన ఎం.రత్నరాజు(50) కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఆయన ఆదివారం వేకువజామున సైకిల్‌పై చెరువుకు బయలు దేరగా దిగమర్రు బైపాస్‌కు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన రత్నరాజును స్థానికులు పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.సురేంద్రకుమార్ కేసు నమోదు చేశారు.

భయపెడుతున్న శిథిల భవనం

పోడూరు, న్యూస్‌టుడే: పెనుమదంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శిథిలావస్థకు చేరిన పాత భవనం ఇది. దీనిలో తరగతులు నిర్వహించడం లేదు. 'నాడు- నేడు' పనులకు సంబంధించిన సామగ్రి, వంటలకు వినియోగించే కట్టెలను దీనిలో ఉంచారు. దీని పక్కనే వంట షెడ్డు నిర్మించారు. తరచూ విద్యార్థులు అక్కడికి వెళ్తుంటారు. దీనిలో ఉంచిన ఇనుప చువ్వలు విద్యార్థుల రాకపోకలకు అవరోధంగా ఉన్నాయి. వీటి వల్ల ఆటలాడుకునే సమయంలో విద్యార్థులు గాయాలపాలయ్యే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఈ పాఠశాలలో 238 మంది విద్యార్థులు ఉన్నారు. నాడు - నేడులో చేపట్టిన మూడు అదనపు తరగతి గదుల నిర్మాణం ఏడాది నుంచి నిలిచిపోయింది. ఈ అంశంపై హెచ్‌ఎం రామమోహనరావు స్పందిస్తూ సమస్యలను విద్యాశాఖ, ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు.

చెత్తకు నిప్పు.. పొగతో ముప్పు

ఎగిసి పడుతున్న మంటలు

వ్యర్థాల నుంచి సంపద సృష్టి లేకపోగా నిత్యం ఉత్పత్తి అయ్యే చెత్తను బహిరంగ స్థలాల్లో ఇష్టారాజ్యంగా దహనం చేస్తుండటంతో చుట్టుపక్కల వారికి ఇబ్బందులు తప్పడం లేదు. వెలగలేరులో ఉన్న సంపద కేంద్రం ఉన్నా.. దానిని వినియోగంలోకి తెచ్చే ఆలోచన చేయకుండా చెత్తను సమీప శ్మశాన వాటికి పక్కన వేస్తున్నారు. నిత్యం రాత్రి వేళ ఈ చెత్తకు నిప్పు పెట్టడంతో సమీప ప్రాంతాలను పొగ కమ్మేస్తుంది. ఆదివారం రాత్రి సైతం చెత్తకు నిప్పు పెట్టడంతో భారీ స్థాయిలో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో చుట్టుపక్కల నివాసితులు ఆందోళనకు గురయ్యారు. **- న్యూస్‌టుడే, మార్టేరు**

పీ-4 విధానానికి పిలుపు

కరపత్రాలు చూపుతున్న పితాని

ఆచంట, న్యూస్‌టుడే: ఉత్తర అమెరికాలోని టంపా నగరంలో తెలుగు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సభల్లో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా పీ-4 విధానానికి పిలుపునిస్తూ శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆవిష్కరించిన బ్రోచర్‌ను ప్రదర్శించారు. ప్రతిభ చూపుతున్న క్రీడాకారులను దత్తత తీసుకోవాలని పిలుపునిస్తూ స్టాల్ ఏర్పాటు చేశారు.

పెంపుడు జంతువులకు టీకాలు

ఆచంట, న్యూస్‌టుడే: ప్రపంచ అంటు వ్యాధుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆచంట పశువైద్యశాల వద్ద పెంపుడు జంతువులకు ఆదివారం ఉచితంగా టీకాలు వేశారు. పెంపుడు కుక్కల యజమానులు క్రమం తప్పకుండా యాంటీ ర్యాబిస్ డోసులు వేయించాలని పశువైద్యాధికారి ఎల్.ఫణికుమార్ సూచించారు.

పోడూరు, న్యూస్‌టుడే: పెనుమదంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని నీటి సంఘం అధ్యక్షుడు దేవరపు దొరబాబు, సర్పంచి తానేటి బాబూరావు ప్రారంభించారు. పశువైద్యాధికారి మహేశ్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ శ్రీనివాసరావు కుక్కలకు టీకాలు వేశారు.

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సిద్ధాంతం పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని సర్పంచి చింతపల్లి గనిరాజు(చంటి) ప్రారంభించారు.

సరకుల లెక్క ..ఇక పక్కా!

అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ హాజరు

పెనుగొండ, మార్టేరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నారు. కేంద్రాలకు రాలేని వారికి ఇళ్లకు వెళ్లి సరకులు అందించే క్రమంలో పక్కదారి పడుతున్నాయని, లబ్ధిదారులకు అందట్లేదని విమర్శలు ఉన్నాయి. వీటికి అడ్డుకట్ట వేసేలా కేంద్రం సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ముఖ ఆధారిత హాజరు విధానం తీసుకొవచ్చింది. సరకులు అందించే సమయంలో చరవాణి ద్వారా లబ్ధిదారుల ముఖ హాజరు, ఓటీపీ నమోదు చేసే విధానం అమలు చేస్తున్నారు.

పెనుమంట్రలో హాజరు నమోదు

ప్రాజెక్టు	కేంద్రాలు	మినీ
పెనుమంట్ర	199	12
పాలకొల్లు	248	10

పనిచేయని చరవాణులు

గత వైకాపా ప్రభుత్వంలో 2019లో అంగన్‌వాడీ కార్యకర్తలకు చరవాణులు అందించింది. వాటిలో ఎక్కువ శాతం పనిచేయడం లేదు. ప్రభుత్వం నెలకు అందించే 2 జీబీ డేటా సరిపోవట్లేదు. పలు ప్రాంతాల్లో నెట్‌వర్క్ సరిగా లేక సరకుల పంపిణీ సవాలుగా మారింది. ఓటీపీ సమస్య తలెత్తుతోంది. వీటితో గంటల తరబడి సమయం వృథా కావడంతో పాటు సకాలంలో సరకుల పంపిణీ కష్టమవుతుందని, పిల్లలకు పాఠాలు చెప్పే సమయం ఉండటం లేదని కార్యకర్తలు వాపోతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని కార్యకర్తలు కోరుతున్నారు.

నమోదు తప్పనిసరి

ఇప్పటికే ముఖహాజరు విధానం కొనసాగుతున్నా జులై 1 నుంచి పక్కాగా అమలు చేస్తాం. ఈ మేరకు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో 3-6 ఏళ్ల చిన్నారులు ఎంత ఆహారం తీసుకుంటున్నారో తప్పనిసరిగా నమోదు చేయాలి. దీని కోసం పోషణ్ ట్రాకర్ యాప్ అందుబాటులోకి తెచ్చారు. లబ్ధిదారులు విధిగా ఆధార్‌కార్డును అప్‌డేట్ చేయించుకోవాలి.
- ఎ.కృష్ణకుమారి, ఐసీడీఎస్ సీడీపీవో

ఏళ్ల తరబడి అసంపూర్తిగా..!

యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి మండలం ఇలపకుర్రులో వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టి సచివాలయ భవన నిర్మాణం ఇలా అసంపూర్తిగా మిగిలింది. సుమారు రూ. 25 లక్షలు వెచ్చించాక.. నిధుల లేమితో నిర్మాణం ఆగిపోయింది. సచివాలయానికి సొంత భవనం లేకపోవడంతో పంచాయతీ కార్యాలయంలో ఇరుకుగదిలో కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరుచేసి ఈ భవనాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

మెరుగైన సేవలకు డిమాండ్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ పింఛనుదారులకు మెరుగైన సేవలందించాలని ఏఐఎఫ్‌ఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.బాలసుబ్రహ్మణ్యం, డి.సుబ్బారావు డిమాండ్ చేశారు. నగరంలో పింఛనుదారుల సంఘం ఉమ్మడి జిల్లా 37వ వార్షిక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పింఛనుదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎనిమిదో వేతన సంఘం ఛైర్మన్, సభ్యుల నియామకంలో ఆలస్యం, రీవాలిడేషన్ బిల్లు తదితరాలపై మాట్లాడారు.

సమ్మె విజయవంతానికి పిలుపు

నరసాపురం, న్యూస్‌టుడే: అసంఘటిత రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు పిలుపునిచ్చాయరు. పట్టణంలోని మీరా గ్రంథాలయంలో ఆదివారం కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులు హరించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న త్రిమూర్తులు

న్యాయ వ్యవస్థ అవసరం పెరిగింది

తణుకు, న్యూస్‌టుడే: దేశంలో న్యాయ వ్యవస్థ అవసరం పెరిగిందని, ప్రజలకు అత్యున్నత న్యాయాన్ని అందించడంలో ముందంజలో ఉందని తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేశ్ పేర్కొన్నారు. జూనియర్ సివిల్ న్యాయమూర్తుల ఉద్యోగాల కోసం మోడల్ టెస్టును ఆదివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) ఆధ్వర్యంలో స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. ముందుగా మోడల్ టెస్ట్ పేపర్‌ను కామేశ్ ప్రారంభించి మాట్లాడారు. సత్వరమే న్యాయం ప్రజలకు అందాలంటే మండల స్థాయిలో కోర్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐఎల్‌యూ జిల్లా కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామన మునిస్వామి, బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కొండ శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎరువుల కోత విధించడం దారుణం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: నాలుగు లక్షల టన్నుల ఎరువులను కోత విధించేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలపడం దారుణమని రైల్వే గూడ్స్‌షెడ్ వర్కర్స్ యూనియన్ ప్రాంతీయ అధ్యక్షుడు సత్తి కోదండరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక రైల్వే గూడ్స్ షెడ్ల వద్ద ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి నిర్ణయాలతో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిర్ల పుల్లారెడ్డి, కర్రి సాయి రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పూడికతీతతో కొత్తరూపు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక పంట, మురుగు కాలువల ప్రక్షాళనకుచర్యలు చేపట్టింది. మండలంలోని పలు గ్రామాల్లో మేజర్, మీడియం, మైనర్ కాలువల్లో పూడితతీత పనులకు శ్రీకారం చుట్టింది. వేల ఎకరాల ఆయకట్టులో మురుగును వశిష్ఠ గోదావరిలోకి మళ్లించే సరిపల్లి డ్రెయిన్లో పూడికతీత పనులు చేపట్టడంతో ఈ కాలువ కొత్త రూపు సంతరించుకొంది. దీంతో పాటు జాతీయ రహదారి వద్ద టన్నెల్ కింద ఉన్న పూడికను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ముంపు సమస్యను అధిగమించేందుకు సరిపల్లి డ్రెయిన్ వెంబడి గట్టును ఎత్తు చేసే పనులు చేపట్టినట్లు డ్రెయిన్ల శాఖ డీఈఈ బి.మోహనకృష్ణ తెలిపారు.

సరిపల్లి కాలువ ఇలా..

ఆగని వృథా.. తప్పని వ్యధ

నరసాపురం పట్టణం న్యూస్‌టుడే: పట్టణంలో పలు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందక ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మరోవైపు పలు ప్రాంతాల్లో పైపులైన్లు దెబ్బతిని నిత్యం తాగునీరు వృథాగా పోతోంది. పట్టణంలో బాపు ఘాట్ వద్ద పైపులైను లీకేజీతో కొద్దిరోజులుగా నీరు రహదారి మీదుగా ప్రవహిస్తోంది. ఈ అంశంపై పురపాలక ఏఈ కిశోర్ స్పందిస్తూ ఆ ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే మరమ్మతులకు చర్యలు చేపడతామన్నారు.

దేవదాయ ధర్మదాయ శాఖ

టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన

ప॥గో॥ జిల్లా పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామములో గల శ్రీ నందీశ్వరస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో గల ఈ క్రింది ఉదహరించిన పట్టికలో గల షాపులు నందు వ్యాపారం చేసుకునే లైసెన్సు హక్కునకు 2025-2026 నుండి 2027-2028 వరకు అనగా 3 సం॥రాల కాలమునకు ది. 17-07-2025 గురువారం ఉదయం 10.00 గం॥లకు శ్రీస్వామివారి ఆలయ ఆవరణలో శ్రీ తనిఖీదారు తణుకు వారి సమక్షంలో టెండరు కమ్ బహిరంగ వేలం పాట పెట్టబడును. ఆసక్తి గల వారు పాటలో పాల్గొన వచ్చును.

వ నం.	దేవాలయం పేరు	షాపులు ఉన్న గ్రామం	డోర్ నం.	షాపు కొలతలు పొడవు, వెడల్పు	ధరావతు	కాల పరిమితి	వేలం పాట జరుగు తేదీ, సమయం, ప్రదేశం
1	శ్రీ నందీశ్వర స్వామివారి	సిద్ధాంతం	4-48	7x11 డాబా గది షాపు నం.1	12,000/-	2025-26 నుండి	ది.17-07-2025 ఉ॥ 10.00 గం॥లకు
2	దేవస్థానం సిద్ధాంతం	సిద్ధాంతం	4-48	7x11 డాబా గది షాపు నం.2	12,000/-	2027-28 (3 సం॥రాలు)	శ్రీ స్వామి వారి ఆలయ ఆవరణలో

ముఖ్య షరతులు: 1. పాటలో పాల్గొనదలచిన వారు షాపు ఒక్కొక్కటికి రూ.12,000/- ధరావతు చెల్లించవలెను. 2. హెచ్చుపాటదారుడు పాట అయిన వెంటనే ఒక సంవత్సరం లైసెన్స్ ఫీజు అడ్వాన్స్ సొమ్మును వెంటనే చెల్లించు నిర్ణయం. ఇతర వివరాలకు మరియు మిగిలిన నియమ నిబంధనలకు ఆఫీసు పని చేయు వేళలో సంప్రదించి తెలుసుకొనగలరు.

తేది: 06-07-2025, సిద్ధాంతం — సం/- **కార్యనిర్వహణాధికారి**

(c) eenadu

తాడేపల్లిగూడెం

● తాడేపల్లిగూడెం ● తణుకు

న్యాయ వ్యవస్థ అవసరం పెరిగింది

నమూనా పరీక్ష పత్రాన్ని ఆవిష్కరించిన కామేశ్, న్యాయవాదులు

తణుకు, న్యూస్‌టుడే: దేశంలో న్యాయ వ్యవస్థ అవసరం పెరిగిందని తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేశ్ పేర్కొన్నారు. జూనియర్ సివిల్ న్యాయమూర్తుల ఉద్యోగాల కోసం మోడల్ టెస్టును ఆదివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) ఆధ్వర్యంలో స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. ముందుగా మోడల్ టెస్ట్ పేపర్‌ను కామేశ్ ప్రారంభించి మాట్లాడారు. సత్వరమే న్యాయం ప్రజలకు అందాలంటే మండల స్థాయిలో కోర్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐఎల్‌యూ జిల్లా కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామన మునిస్వామి, బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కొండ శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి సత్కారం

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉత్తమ విలువలు నేర్పిన ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ సమాజంలో గౌరవనీయులుగా మెలగుతారని అత్తిలి మండల విద్యాశాఖాధికారి ప్రసాద్ అన్నారు. అత్తిలి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఎనిమిదేళ్ల పాటు ఉపాధ్యాయినిగా పని చేసి ఇటీవల వేలేరుపాడులో ప్రధానోపాధ్యాయినిగా ఉద్యోగ విరమణ పొందిన జీవీ.సుబ్బరాజును ఆదివారం మండలంలో ఉపాధ్యాయులు అత్తిలి పాఠశాలలో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి, మండల విద్యాశాఖాధికారి ప్రసాద్, విశ్రాంత మండల విద్యాశాఖాధికారి శీతలం వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం అర్బన్, పెంటపాడు, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె.నరసింహమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు యాగర్లపల్లి, కొబ్బరితోట, ఏలూరు రోడ్డు, పడాల, భాగ్యలక్ష్మీపేట తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. ★ పెంటపాడు మండలం కస్పాపెంటపాడులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్తు సబ్‌స్టేషన్ పనుల నిమిత్తం జట్లపాలెం, ఉమామహేశ్వరం, మౌంజిపాడు గ్రామాల్లో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పద్దరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జలం.. గరళం

పట్టణ వాసులకు అందని శుద్ధి నీరు

తణుకు, న్యూస్‌టుడే: వర్షాకాలంలో తణుకు పట్టణ ప్రజల ఆరోగ్యం ప్రశ్నార్థకంగా మారింది. పట్టణ వాసులకు శుద్ధ జలం అందించడంలో మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారు. ఫలితంగా అతిసారం తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తాగునీటిని బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమ్మె ప్రభావం.. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె ప్రభావం పట్టణవాసులపై పడింది. గత జూన్ 22 నుంచి జులై 3 వరకు మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం పరిధిలో ఫిట్టర్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, గ్యాంగ్‌మేన్లు, మజ్దూర్లు, పంపు ఆపరేటర్లు, వాల్వు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఎలక్ట్రికల్ సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లు, వాచ్‌మేన్లు, స్టోర్ కీపర్లు, ప్రణాళిక విభాగం చైన్‌మేన్లు, ఆఫీసు అటెండర్లు, జూనియర్ సహాయకులు సమ్మె బాట పట్టారు. ఈ క్రమంలో తాగునీటి, వీధి దీపాల తదితరాల నిర్వహణ లేకపోవడంతో ఈ ప్రభావం పట్టణంలో నివసిస్తున్న సుమారు 1.05 లక్షల మంది జనాభాపై పడింది. జంగంచెరువులో ఉన్న శుద్ధి నీటి ప్లాంటు ద్వారా శుద్ధి నీటిని అందించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇది పట్టణంలోని వడలి వారి వీధిలో కుళాయి ద్వారా వచ్చిన నీరు

వ్యాధులకు అనుకూలం.. వ్యాధుల వ్యాప్తికి ప్రధాన కారణం తాగునీరు. ఒక పక్క ఆరోగ్య సిబ్బంది వర్షాకాలంలో స్వచ్ఛమైన తాగునీటిని మాత్రమే తాగాలని క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా తణుకు పురపాలికలో ప్రజలకు మాత్రం శుద్ధినీరు అందడం లేదు. కలుషిత నీరు తాగడం ద్వారా అతిసారం, టైఫాయిడ్, కలరా తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

దీనిపై మున్సిపల్ కమిషనర్ టి రామ్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు మొన్నటివరకు సమ్మె బాట పట్టడంతో కొన్ని చోట్ల సమస్యలు ఎదురయ్యాయన్నారు. వాటిని పరిష్కరించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	79950 67078
పెంటపాడు	79939 36123
తణుకు	85558 50851
తణుకు గ్రామీణం	63005 79402

పెంటపాడు, న్యూస్‌టుడే : ? పెంటపాడు మండలం బోడపాడు రామాలయం వీధిలో డ్రెయిన్లు వ్యర్థాలతో పూడిపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. **- శ్రీను, స్థానికుడు**

✔ పూడిక తొలగిస్తాం. **- గేదెల శివ, సర్పంచి**

? పెంటపాడు కూనాకరపేట శివారులోని పెట్రోలు బంకు సమీపంలోని ప్రధాన రహదారికి ఆనుకొని కొందరు చెత్త, వ్యర్థాలను వేస్తున్నారు. దుర్వాసనతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. **- రఘు, స్థానికుడు**

✔ రహదారి చెంతన చెత్త, వ్యర్థాలను తొలగిస్తాం. **- బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి**

? పెంటపాడు మండలం బి.కొండేపాడులో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. దుర్వాసన, దోమల ఉద్ధృతితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- శ్రీనివాసులు**

✔ డ్రెయిన్‌లో పూడిక తొలగిస్తాం. **-శేఖర్‌బాబు, పంచాయతీ కార్యదర్శి**

ముఖర్జీ బాటలో నడవాలి

నివాళులర్పిస్తున్న భాజపా శ్రేణులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ బాటలో నాయకులు, కార్యకర్తలు నడవాలని భాజపా జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి సూచించారు. పట్టణంలోని భాజపా కార్యాలయంలో ముఖర్జీ 125వ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్ర పటానికి పార్టీ నేతలు, కార్యకర్తలు నివాళులర్పించారు. అనంతరం శ్రీదేవి మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, నాయకులు నార్ని తాతాజీ, పెదపోలు వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని తాళ్లముదునూరుపాడులో ఆదివారం పారా మెడిక్స్, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ ప్రదాతల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 121 మందికి కన్ను, గుండె, రక్తపోటు, మధుమేహం తదితరాలపై పరీక్షలు నిర్వహించారు.

ఇంటింటికీ సేవలు.. తణుకు, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం ఇంటింటికీ వైద్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, ఎముకల వైద్యుడు నిమ్మగడ్డ అచ్యుతరామయ్య పట్టణంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి మంచానికే పరిమితమైన వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించారు. సభ్యుడు అతికాల ప్రసాద్‌రావు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేశారు.

తొలి అడుగుతో మరింత సంక్షేమం: ఎమ్మెల్యే

పాలూరులో వృద్ధురాలి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న రాధాకృష్ణ

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : సుపరిపాలనకు తొలి అడుగు ద్వారా మరింత సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం అత్తిలి మండలం పాలూరు, కొమ్మర గ్రామాలతో పాటు తణుకు పట్టణంలోని 15, 16 వార్డుల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ సుపరిపాలనకు తొలి అడుగు ద్వారా మరింత సంక్షేమం, అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అందుతున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పాలూరులో రూ.2.50 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు రాబోయే రోజుల్లో మరో రూ.2.16 కోట్ల అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురు యువకులు ఆరిమిల్లి సమక్షంలో తెదేపాలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కొమ్మరలో మినీ గోకులాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. రైతులకు రావాల్సిన ధాన్యం బకాయిలు పది రోజుల్లో అందించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, పాలూరు ఎంపీటీసీ సభ్యుడు శరగడం రామలింగ విష్ణుమూర్తి, ఆనాల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘చంద్రబాబుతోనే సుపరిపాలన’

ఎల్.అగ్రహారంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బాజ్జీ

తాడేపల్లిగూడెం టౌటౌన్, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడితోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని భవన, ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు ఛైర్మన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ అన్నారు. తెదేపా గూడెం మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్ ఆధ్వర్యంలో ఎల్ అగ్రహారం, కొండ్రుప్రోలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన సుపరిపాలనతో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాడపల్లి సుబ్బరాజు, ఆయా గ్రామాల తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక చెట్ల రోడ్డులోని ఉమర్ అలీషా విజ్ఞాన పీఠంలో ఆరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత విద్యార్థులతో గణపతి పూజ నిర్వహించి అనంతరం రాత పుస్తకాలు, ఇతర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో కె.రామకృష్ణ, ముత్యాల కృష్ణ, అపర్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు వృక్షాలే ఆధారం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని మసీదు కూడలిలో జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విరివిగా మొక్కలు నాటాలని సూచిస్తూ చిన్నారులు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం వీధుల్లో మొక్కలు నాటారు. పలువురు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నౌషాద్ మొహిద్దీన్, మహబూబ్ బాషా, నసీమా, రుక్సానా, అస్మ, షాకీరా తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం: ఆరిమిల్లి

తణుకు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తణుకు నియోజకవర్గంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 13న తణుకులో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తణుకు మహిళా కళాశాల ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్, ఫార్మా, నిర్మాణ, ఐటీ, బ్యాంకింగ్ రంగాలకు చెందిన సుమారు 50 పైగా కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ అర్హతలు కలిగిన అభ్యర్థులు హాజరు కావచ్చని చెప్పారు. ఇందుకోసం ఆన్లైన్ రిజిస్ట్రేషన్‌తో పాటు వాట్సప్ గవర్నెన్స్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొనే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాబ్ మేళా కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్ వర్ధంతి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంలోని కడకట్లలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు జగ్జీవన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతో పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో అల్లు నాగు, లోవరాజు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కుక్కకు టీకా వేస్తున్న పశు వైద్యాధికారి

జంతువుల నుంచి సక్రమించే వ్యాధులపై అవగాహన

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం అత్తిలి పశువైద్యశాలలో పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 96 పెంపుడు పశువులకు రేబిస్ వ్యాధులు రాకుండా వ్యాధి నిరోధక టీకాలను అత్తిలి పశువైద్యాధికారి కరణం భావన్నారాయణ వేశారు. కార్యక్రమంలో జిల్లా జంతు సంక్షేమ బోర్డు డైరెక్టర్ అల్తి అజయ్‌కుమార్, అత్తిలి పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ రమణారావు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ దాసం బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెం గ్రామంలోని పశువైద్యశాలలో కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలోని 13 పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు.

ప్రాణాలు పోతున్నాయ్.. పట్టించుకోండి

కానరాని హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రికలు

పెంటపాడు, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పలు రహదారుల్లో ప్రమాదకరమైన మలుపులు, పనికిరాని మొక్కలు ప్రమాదాలకు హేతువులవుతున్నాయి. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో వేగ నిరోధకాలు, సూచిక బోర్డులు ఏర్పాటుచేయకపోవడంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నా అధికారుల్లో మాత్రం చలనం రావట్లేదు.

పనికిరాని మొక్కలతో.. మలుపుల వద్ద పనికిరాని మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. కొన్ని ప్రదేశాల్లో సూచిక బోర్డులు ఉన్నా కనిపించడంలేదని వాహనదారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల ముళ్లపొదల కారణంగా ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణిస్తున్నవారు గాయాలపాలవుతున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు వాపోతున్నారు.

వల్లూరుపల్లిలో పెరిగిన మొక్కలు

ప్రమాదాలు జరిగే ప్రదేశాలివే..

● పెంటపాడు మండలంలోని పెంటపాడు-రాచర్ల వెళ్లే రోడ్డుల్లో మలుపుల వద్ద దట్టంగా ముళ్లపొదలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. ● పెంటపాడు నుంచి ముదునూరు వెళ్లే మార్గంలో పెట్రోలు బంకు వద్ద ఉన్న మలుపులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● పెంటపాడు వెలమయువజన సంఘం భవనం వద్ద ఉన్న మలుపు మూలతూము, కస్పా పెంటపాడు కూడలిలోని మలుపుల వద్ద, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

● తాడేపల్లిగూడెం మండలంలోని ఉప్పరగూడెం -మాధవరం మార్గం, చినతాడేపల్లి నుంచి వీరంపాలెం వెళ్లే మార్గంలోని పలు మలుపుల వద్ద హెచ్చరికబోర్డులు లేకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం.. నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదిస్తాం. ప్రమాదాల నివారణ చర్యలు తీసుకుంటాం.

- రవిబాబు, ఏఈ, ఆర్‌అండ్‌బీ, తాడేపల్లిగూడెం

గొలుసు దుకాణ నిర్వాహకుడి అరెస్టు

తణుకు, న్యూస్‌టుడే: గొలుసు దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తిని శనివారం అరెస్టు చేసినట్లు తణుకు ఎక్సైజ్ సీఐ ఎస్ మణికంఠ రెడ్డి తెలిపారు. తణుకు ఎక్సైజ్ అధికారులు ఆదివారం నిర్వహించిన దాడుల్లో అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇరగవరం మండలం సూరంపూడి గ్రామానికి చెందిన బిళ్ళ రాజును అరెస్టు చేసి అతని నుంచి ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై బి. లక్ష్మి, కానిస్టేబుల్ ఫణి భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

పక్షవాతం బాధితుడికి అండ

తణుకు, న్యూస్‌టుడే: పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తి కుటుంబానికి రేలంగి యువత అండగా నిలిచారు. ఇరగవరం మండల రేలంగి గ్రామానికి చెందిన పట్టిన వెంకటరావు గత కొద్ది రోజులుగా పక్షవాతంతో బాధపడుతూ మంచాన పడ్డారు. వంగవీటి మోహనరంగా జన్మదినాన్ని పురస్కరించుకుని పది నెలల పాటు ప్రతి నెల రూ.3 వేల చొప్పున ఆర్థిక సహాయం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఆదివారం ఈ నెలకు సంబంధించి రూ.3 వేలను, నిత్యావసర సరకులను ఆ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా యువతకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇరగవరం మండలం తెదేపా, జనసేన అధ్యక్షులు గూడూరి నాగరాజు, ఆకేటి కాశీ, చుక్కా సాయిబాబు, కామన రాంబాబు, పసుపులేటి అబ్బులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

నేను తాడేపల్లిగూడెం పట్టణ 1వ వార్డు కాపురస్తుడు బి.సత్యనారాయణ గారి కుమారుడు బి. శ్రీనివాస్ అను నా పేరున ది.25.02.2004 సం॥ం తేదిన తాడేపల్లిగూడెం సబ్- రిజిస్ట్రరు వారి ఆఫీసులో దస్తావేజు నెం. 739/2004 రుగా రిజిస్ట్రరు అయిన ఒరిజినల్ దస్తావేజు ది.01.06.2025 తేదిన జిరాక్స్ తీయించి వస్తుండగా తాలుకా ఆఫీసు సెంటర్ లో పడిపోయినవి. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రసుకు గాని, ఫోన్ నెంబరుకు గాని తెలియపరచిన యెడల తగిన పారితోషికము ఇవ్వబడును.

బి.శ్రీనివాస్. 1వ వార్డు
తాడేపల్లిగూడెం, సెల్ : 95508 66789

వేలం నోటీసు

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్)లో;
ఇ.పి.నెం. 10/2019 ఇన్ ఓ.ఎస్.నెం. 144/2017

బిట్వీన్: సత్తి సరోజ లక్ష్మి ... డి.హెచ్.ఆర్.
మరియు
గురజాడ నాగ బ్రహ్మం ... జె.డి.ఆర్.
S/o శ్రీరాములు, వయస్సు 49, పురుషుడు, వ్యాపారం, ఇంటి నెం. 10-14-7, తాళ్లముదునూరుపాడు, 18వ వార్డు, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా, TPG PJCJC

పై నెంబరు ఇ.పి. నందు జె.డి.ఆర్. యొక్క ఈ దిగువ షెడ్యూలు ఆస్తి ది. 04-08-25వ తేదీన ఉదయం గం. 10-30 ని.ల లగాయితు పై కోర్టు వారి ఎదుట వేలం వేయబడును. ఆసక్తి గలవారు కోర్టువారి వేలం షరతులకు లోబడి పాడుకొనవచ్చును.

షెడ్యూలు: పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రీ, తాడేపల్లిగూడెం మునిసిపాలిటీ, తాళ్లముదునూరుపాడు గ్రామం, 18వ వార్డు, డో.నెం. 10-14-7న గల చ.గ. 120లు ఖాళీ స్థలమునకు హద్దులు: తూర్పు: కొవ్వూరి భామిరెడ్డి, దక్షిణం: మునిసిపల్ రోడ్, పడమర: సత్తి సరోజలక్ష్మి (పాత మల్లిడి వెంకటరెడ్డి), ఉత్తరం: కొవ్వూరి భామిరెడ్డి (పాత కొవ్వూరి వీర్రెడ్డి), ఈ హద్దుల మధ్య గల 120 గజముల స్థలము అందు అసెస్మెంట్ నెం. 1080009272 (పాత అసెస్మెంట్ నెం. 4161), కరెంట్ సర్వీసు నెం. 1541246105000053 (పాత 53) గల ఆస్బెస్టాస్ సిమెంట్ రేకుల షెడ్ వగైరాలతో, అందు యావత్తు ఈజుమెంటు హక్కులతో సహా. జె.డి.ఆర్. యొక్క 1/3వ వంతు అవిభాజ్యపు జాయింటు హక్కు.

డి.హెచ్.ఆర్.విలువ: రూ. 2,00,000/–
అమీనా విలువ: రూ. 2,30,000/–
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

సం/- కొవ్వూరి అప్పిరెడ్డి, న్యాయవాది,
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం - 534102
తేదీ: 05-07-2025 ఫోన్ నెం. 99595 94995, 94401 28616

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పర్వదినం

తాడేపల్లిగూడెం అర్బన్, పెంటపాడు, అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం తొలి ఏకాదశిని పురస్కరించుకుని గూడెం పట్టణంలోని భాగ్యలక్ష్మీపేటలోని విశ్వ దుర్గేశ్వరి అమ్మవారికి ఆదివారం తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో అమ్మవారికి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ప్రదర్శనగా వెళ్లి సారె సమర్పించారు. ● స్థానిక రామారావుపేట కోదండ రామాలయంలో సీతారాముల వారికి క్షీరాభిషేకం నిర్వహించారు. ● పెంటపాడు మండలంలోని కస్పా పెంటపాడు బైరాగి మఠంలోని గోపాలస్వామి, ఆంజనేయస్వామి వార్ల దేవస్థానం, పడమరవిప్పర్రులో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పెంటపాడు బాల వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ● అత్తిలి మండలం ఈడూరులోని వరాల వేంకటేశ్వర స్వామి, అత్తిలిలో శ్రీభూ సమేత వేంకటేశ్వరులను తులసి మాలలు, నెమలి కన్నులతో అలంకరించారు.


బైరాగిమఠంలోని గోపాలస్వామి

ముత్యాలమ్మకు విశేష పూజలు

శాకంబరిగా అమ్మవారు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ముత్యాలంబపురంలో ముత్యాలమ్మవారికి ఆదివారం శాకంబరి దేవిగా అలంకరించారు. భాజపా జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ★ జట్లపాలెంలో పారుపల్లి అమ్మవారికి జనసేన నాయకుడు బొలిశెట్టి రాజేశ్ పట్టువస్త్రాలతో సారె సమర్పించారు. జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ , తోట రాజా, పుల్లా బాబి, కట్టుబోయిన కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతానికి పిలుపు

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తున్న నాయకులు

తణుకు, న్యూస్‌టుడే: పెంచిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తదితర కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9న జరిగే సమ్మెని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, మండల కార్యదర్శి గుబ్బల గోపి విజ్ఞప్తి చేశారు. ఆదివారం పట్టణంలోని పరిశ్రమలకు, ప్రభుత్వ సంస్థలకు సమ్మె నోటీసులు అందజేసి మాట్లాడారు. సోమవారం పట్టణంలోని వీమ్యాక్స్ థియేటర్ నుంచి ప్రారంభమయ్యే ర్యాలీలో కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వి వెంకటేశ్వరరావు, సీహెచ్ రామకృష్ణ, లక్ష్మీనారాయణ, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు. ● కార్మిక హక్కులను హరిస్తూ నరేంద్ర మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు జులై 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు పిలుపునిచ్చారు. ఆదివారం తణుకు అక్కమాంబ టెక్స్‌టైల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ దుర్గా ప్రసాద్, ఫణీంద్ర, దేవ, పెద్దిరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోత విధించడం దారుణం

నిరసన తెలుపుతున్న కార్మికులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: నాలుగు లక్షల టన్నుల ఎరువులను కోత విధించేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలపడం దారుణమని రైల్వే గూడ్స్‌షెడ్ వర్కర్స్ యూనియన్ ప్రాంతీయ అధ్యక్షుడు సత్తి కోదండరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక రైల్వే గూడ్స్ షెడ్ల వద్ద ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి నిర్ణయాలతో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిర్ల పుల్లారెడ్డి, కర్రి సాయి రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఘర్షణపై విచారణకు ఆదేశం

తణుకు, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో ఇద్దరు ఉద్యోగుల ఘర్షణపై విచారించి నివేదిక పంపించాలని తణుకు డీఈఈ దివాకర్‌ను ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. ఇది ఇలా ఉండగా దీనికి సంబంధించి పలువురు వ్యక్తులు కేసును రాజీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిపై పూర్తి విచారణ చేస్తే నిజాలు బయటకు వస్తాయని బాధితుడు జూనియర్ లైన్‌మ్యాన్ జగదీశ్ వాపోయారు. తనపై దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

వైకాపా సమావేశం

తణుకు, న్యూస్‌టుడే: వైకాపా నిర్వహిస్తున్న బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక పద్మశ్రీ ఫంక్షన్ హాల్‌లో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అధ్యక్షతన తణుకు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, కారుమూరి వెంకట నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో నరసాపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి గూడూరి ఉమాబాల, ఎంబీసీ మాజీ ఛైర్మన్ పెండ్ర వీరన్న, రుద్రా ధనరాజు, పంపన అంజిబాబు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాదయాత్ర

పెనుమంట్ర, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ఏటా 150 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు శృంగవృక్షంలోని దత్త పీఠాధిపతి సాయిదత్త నాగానంద సరస్వతి స్వామి తెలిపారు. పీఠం నుంచి పిఠాపురం వరకు చేపట్టిన పాదయాత్ర ఆదివారం మండలంలోని పొలమూరుకు చేరింది.

ప్రకటన

మా క్లయింటున్నూ, తణుకులో యున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మెయిన్ బ్రాంచ్ వారి తరపున అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గారు మాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

తణుకు పట్టణంలోని లక్ష్మణనగర్, డోర్ నెం. 16-1-1 కాపురస్తులు శ్రీ ఉప్పులూరి రామకృష్ణ మరియు శ్రీమతి మలకపల్లి ఝాన్సీగారలు మా క్లయింటు వద్ద నవంబరు 2016లో యిల్లు కట్టుకునే నిమిత్తం లోను తీసుకుని, వారి తాలూకు ది. 28-1-1995 తేదీగల రిజిస్టర్డ్ నెంబరు 284/1995 గల ఒరిజినల్ క్రియ దస్తావేజును మా క్లయింటు వద్ద తనఖా నిమిత్తం డిపాజిట్టు చేసి, ది. 14-11-2016 తేదీన తణుకు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో రిజిస్టర్ నెంబరు 7065/2016గా మెమొరాండం ఆఫ్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్ వ్రాయించి యిచ్చినారు.

దర్మిలా సదరు డాక్యుమెంటు మా క్లయింటు యొక్క కస్టడీలో ఉండగా యితర రికార్డులతో కలసిపోయి కనబడకుండా పోయినది. మా క్లయింటు తాలూకు ఉద్యోగులు ఎంత వెదకిననూ సదరు డాక్యుమెంటు కనిపించి యుండలేదు. మా క్లయింటు సదరు డాక్యుమెంటుకు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో నకలు తీసుకుని, సదరు రామకృష్ణ గారికి, ఝాన్సీ గారికి యిచ్చుటకు ఏర్పాటు చేయుచున్నారు.

కావున సదరు డాక్యుమెంటు ఒరిజినల్ ఎవరి వద్దనైనా వుంటే వారిని తిరిగి మా క్లయింటుకు అప్పగించమని, లేని యెడల ఈ ప్రకటన తేదీ నుండి పది రోజులలో సదరు డాక్యుమెంటు విషయమై ఎట్టి అభ్యంతరములు రాని యెడల మా క్లయింటు సదరు డాక్యుమెంటుకు సర్టిఫైడ్ కాపీ తీసుకుని సదరు రామకృష్ణ గారికి, ఝాన్సీ గారికి యివ్వగలరని, అప్పటినుండి సదరు సర్టిఫైడ్ కాపీ సదరు ఆస్తికి సంబంధించి ఒరిజినల్ దస్తావేజుగా చలామణీ అగునని తెలియపరచడమైనది.

ఆస్తి వివరం: పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మున్సిపాలిటీలోని, తణుకు వేమవరం గ్రామం తాలూకు రి.స.నెం. 27/1A, 27/2 లో గల లేఅవుట్ నెం. 128/1994 దాఖలా 4వ నెంబరు ప్లాటున్నూ మరియు అయిదవ నెంబరు ప్లాటునందు పడమరవైపు భాగమున్నూ కలిపి ఏకప్రతిగా యున్న 324 చ.గ.ల స్థలమునకు హద్దులు:

భాగము–1– 224 చ॥గ॥ల ప్లాటు నెం.4నకు హద్దులు: **తూర్పు:** ప్లాటు నెంబరు 5 -55', **పశ్చిమం:** ప్లాటు నెంబరు 3 - 57', **ఉత్తరం:** పంటబోదె - 36', **దక్షిణం:** 40 అడుగుల వెడల్పు గల రోడ్డు

భాగము–2– 100 చ॥గ॥ల ప్లాటు నెం.5 లో గల పడమర భాగమునకు హద్దులు: **తూర్పు:** ప్లాటు నెంబరు 5లో మిగిలిన భాగము -55', **పశ్చిమం:** 1వ భాగము నందలి స్థలము - 55', **ఉత్తరం:** పంటబోదె - 16'.6", **దక్షిణం:** 40 అడుగుల వెడల్పు గల రోడ్డు

యీ హద్దుల మధ్య గల 324 చ.గ. స్థలం అందులోగల బిల్డింగ్ వగైరాలు

సం/- K.V.N. Kama Sastry,
K.Ravindra, Advocates
26-4-2, N.S.C. Bose Road, Tanuku
Ph: 94400 82000, 94400 52000

తణుకు
6-7-2025

(c) eenadu

ఈనాడు వైఎస్సార్ కడప

సోమవారం జులై 7, 2025

బిరబిరా కృష్ణమ్మ.. తరలి రావమ్మా!

ఒంటిమిట్ట, కొండాపురం, న్యూస్‌టుడే: ఆశ నిరాశల ఆకాశం నుంచి రాలిన నాలుగు వాన చినుకులు రైతులకు భరోసా ఇవ్వడం లేదు. వ్యవసాయం జూదంగా మారింది. కరవు కొమ్ముపై ఎప్పుడూ బతుకు ప్రశ్నలే. ఒకనాడు ముంగారి ముచ్చట్లు, గిత్తల కాలిగిట్టల శబ్దాలతో ప్రతిధ్వనించిన పొలాలు నేడు సేద్యపు జలాలందక నెర్రెలిచ్చాయి. అన్నదాతల ఆకలి దప్పికల ఆర్తనాదాలతో సీమ నడిగడ్డలోని నేలతల్లి దుఃఖిస్తోంది. దుర్భిక్షాన్ని తరిమికొట్టే 'కృష్ణవేణి' జల తరంగాలకు మూగగా ఎదురు చూస్తోంది. కష్టాల కౌగిలి, పుట్టెడు దుఃఖంతో కుంగిపోతున్న కర్షకులు ఈసారైనా ముందస్తుగా సాగునీరు వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.



- శ్రీశైలంలోకి వరద ప్రవాహంతో ఆశలు
- కడప గడపలోకి జలసిరి వచ్చేలా ప్రణాళిక

● జిల్లాలో ఉన్న ప్రధాన జలాశయాలు శ్రీశైలం జలాశయం నుంచి వచ్చే కృష్ణా జలాలపై ఆధారపడి ఉన్నాయి. శ్రీశైలం నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ఆదివారం సాయంత్రం నాటికి 184 టీఎంసీల నీరు ఉంది. ఎగువ నుంచి 1.86 లక్షల క్యూసెక్కుల నీరొస్తుంది. విద్యుదుత్పత్తికి 76 వేల క్యూసెక్కులకు పైగా వినియోగిస్తున్నారు. పోతిరెడ్డిపాడు నీటి నియంత్రణ కేంద్రం నుంచి తెలుగుగంగ పథకం కోసం ఆరు వేల క్యూసెక్కులు విడుదల చేశారు. ఈ వారంలో జీఎన్ఎస్ఎస్‌కు కూడా వదలాలని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో చినుకుల సవ్వడి లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి చూస్తే 65 శాతానికి పైగా లోటు ఉంది. ఎగువన భారీ వర్షాలు కురవడంతో మల్లన్న చెంత ఉన్న శ్రీశైలంలో వరద పోటెత్తింది.

తీరనున్న కన్నీటి వెతలు

కడప గడపలో ప్రతిధ్వనించే కరవు కేకకు శాశ్వత పరిష్కారం చూపాలని గాలేరు-నగరి సుజల స్రవంతి పథకానికి శ్రీకారం చుట్టారు. అవుకు జలాశయం నుంచి జీఎన్ఎస్ఎస్ వరద కాలువలోకి నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. అవుకు నుంచి మైలవరం మండలం లింగాపురం తాండా వరకు 52.875 కి.మీ ఉంది. గండికోటలోకి చేరాలంటే సొరంగంలో 5.4 కి.మీ ప్రవహించాలి. ● గండికోట నుంచి వామికొండ, సర్వరాయసాగర్, పైడిపాళెం, పెంచికల బసిరెడ్డి జలాశయం, మైలవరంలోకి కృష్ణా జలాలను తరలించాల్సి ఉంది. ఈ ఆరింటి నిల్వ సామర్థ్యం 54.297 టీఎంసీలు. ప్రస్తుతం 27.766 టీఎంసీల నీరుంది.

● మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లో తెలుగుగంగ పథకం ద్వారా 12 మండలాల్లో 1.77 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలని లక్ష్యం. ఎస్ఆర్-1, ఎస్ఆర్-2, బ్రహ్మంసాగర్‌లో 22.316 టీఎంసీలు నిల్వ చేసుకోవచ్చు. ప్రస్తుతం 7.673 టీఎంసీల నీరే ఉంది. శ్రీశైలం నుంచి గంగ కాలువకు నీటిని విడుదల చేస్తే కడప గడపలోకి 98.260 కి.మీ వద్ద జలాలు ప్రవేశిస్తాయి. జిల్లాలో ప్రధాన కాలువ వెంట 6,573 ఎకరాలకు నీరందించాలి. ఉప జలాశయాలు నిండిన తర్వాత 140.53 కి.మీ వద్ద ఉన్న బ్రహ్మంసాగర్‌లోకి మళ్లిస్తారు. ప్రధాన, ఉప కాలువల పరిధిలో ఉన్న 183 చెరువుల్లోకి విడుదల చేయనున్నారు.

కేసీ.. కర్షకుల పాలిట కావాలి కల్పవల్లి

ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, కడప, జమ్మలమడుగు 11 మండలాల్లో 92 వేల ఎకరాలకు కేసీ కాలువ నుంచి సేద్యపు జలాలు ఇవ్వాలి. ఖరీఫ్ సీజన్‌లో పూర్తి స్థాయిలో నీరివ్వాలంటే 10 టీఎంసీల నీరు అవసరం ఉంటుంది. కుందూ నుంచి 234.56 కి.మీ వద్ద ప్రధాన కాలువలోకి రాజోలి ఆనకట్ట నుంచి నీటిని మళ్లిస్తారు. కడప నగర శివారు వరకు 305.60 కి.మీ వరకు నీరు చేరాలి. ఉప, పంట కాలువలు మరో 300 కి.మీ పైగా ఉన్నాయి. కేసీ పరిధిలో ఉన్న 12 చెరువులను నింపాల్సి ఉంటుంది.

జలాశయాలను నింపుతాం ; ఎగువ ప్రాంతంలోని శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణా జలాలను జిల్లాకు జీఎన్ఎస్ఎస్, తెలుగుగంగ పథకాల ద్వారా తీసుకొస్తాం. జలాశయాలను పూర్తిస్థాయిలో నింపుతాం. ఆయకట్టుకు నీరిచ్చేలా ప్రణాళికను రూపొందించాం. కాలువల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకుంటాం.
- శ్రీరామచంద్రమూర్తి, సీఈ, నీటిపారుదలశాఖ, కడప

9న సార్వత్రిక సమ్మె

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఈనెల 9న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోనేటి నరసయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటిమిట్టలో ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం నరసయ్య మాట్లాడుతూ కార్మిక, కర్షకుల కష్టాలను కేంద్ర ప్రభుత్వ పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్రం దిగొచ్చేదాకా ఆందోళనలు కొనసాగించాలని పోరాటం చేయడానికి అన్నివర్గాలు కదనోత్సాహంతో కదం తొక్కుతూ ముందుకురావాలని కోరారు.

పచ్చి మేతలతోనే పాడి పరిశ్రమాభివృద్ధి

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే : పచ్చి మేతల పెంపకంతోనే పాడి పరిశ్రమాభివృద్ధి సాధ్యమని కలెక్టర్ శ్రీధర్ సూచించారు. ఆదివారం పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై పశుగ్రాస వారోత్సవాల గోడపత్రాలు ఆవిష్కరించారు. ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు ప్రభుత్వం పశుగ్రాస వారోత్సవాలు చేపట్టిందన్నారు. అనంతరం ప్రపంచ జూనోసెస్ దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రేబిస్ టీకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మ, డీడీలు రంగస్వామి, శ్రీనివాసులరెడ్డి, ఏడీలు సుబ్బరాయుడు, నేతాజీ పాల్గొన్నారు.

పశుగ్రాస వారోత్సవాల గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి

కేసుల పరిష్కారంలో జిల్లాకు మొదటి స్థానం

కడప న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో జిల్లాకు ప్రథమ స్థానం దక్కిందని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ యామిని ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శనివారం మొత్తం 23,284 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. రూ.34,59,61,148 నగదు కక్షిదారులకు చెల్లించాలని ఆదేశించామన్నారు. 22,700 క్రిమినల్ కేసులు, 213 సివిల్ కేసులు, 371 ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. సహకరించిన న్యాయవాదులు, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు, బీమా కంపెనీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

పుట్టేవన్నీ పెయ్యలే.. ఇచ్చేవన్నీ పాలే!

- రూ.150కే మేలు జాతి వీర్యం
- 21,800 ఇంజెక్షన్లు వేయడమే లక్ష్యం

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయం తరువాత స్థానం సంపాదించిన పాడి రంగాన్ని అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గత ప్రభుత్వాలతో పోలిస్తే ఈ ప్రభుత్వం పాడి రైతుకు వరాలు ప్రకటిస్తోంది. జిల్లాలో పాడి పశువుల సంఖ్యను పెంచి అన్నదాతకు ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకుంటోంది ప్రభుత్వం. అందులో భాగంగానే మేలు జాతి వీర్యం తక్కువ ధరకు అందించి అన్నీ పెయ్య దూడలు పుట్టేలా వీర్యం పంపిణీ చేస్తోంది. ● ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని పశువుల వృద్ధి పెంచేలా చర్యలు చేపట్టింది. మేలు జాతి వీర్యం సేకరించి రైతులకు అతి తక్కువ ధరకు అందించి పశువులకు ఎద సూదులు వేసేలా కృషి చేస్తోంది. పశువుల్లో ఒక సూదికే చూడి కట్టవి, రెండు సూదులకు కట్టేవి రెండు విధాలుగా ఉంటాయి. గతంలో ఒక సూది పూర్తి ధర రూ.1,350 ఉండగా అందులో రూ.850 రాయితీ ఇచ్చి మిగిలిన రూ.500లను రైతు ద్వారా వసూలు చేసి పశువులకు ఎద సూదులు వేసేవారు. ఒక సూదికైనా రెండు సూదులకైనా ఇదే మొత్తాన్ని ఇప్పటి వరకు వసూలు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఒక సూదిని రూ.150కే అందిస్తోంది. వంద ఎద సూదులు వేస్తే సుమారు 90 శాతం పెయ్య దూడలు పుడతాయని అధికారులు చెబుతున్నారు. ఆవుల్లో ఎద సూదులు హెచ్ఎఫ్, జెర్సీ, గిర్, సాహీవాల్, గేదెల్లో ముర్రా జాతి రకం వీర్యాన్ని జిల్లాకు పంపించారు. ఇది వరకు క్షేత్రస్థాయిలో ఉన్న ఎద సూదులను కూడా ఈ తగ్గించిన ధరలకే వేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

లక్ష్యం.. : జిల్లాకు 21,800 ఎద సూదులు పశువులకు వేయాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వీటిని 12 వేల నుంచి 15 వేల పశువులకు వేయాలనేది లక్ష్యంగా నిర్దేశించారు. గతంలో ఎద సూదులు వేయగా 50 నుంచి 70 శాతం లోపే పెయ్య దూడలు జన్మించేవి. అలా కాకుండా 90 శాతం ఫలితాలు రావాలని ప్రభుత్వం మేలు జాతి వీర్యాన్ని సరఫరా చేస్తోంది.

అవకాశాన్ని వినియోగించుకోవాలి : పాడి రైతులు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎద సూది ధరలు ప్రభుత్వం తగ్గించింది. మేలు జాతి ఎద సూదులు వేయించి పెయ్య దూడల సంఖ్యను పెంచేందుకు దోహద పడాలి. క్షేత్రస్థాయిలో మా సిబ్బంది దగ్గర సూదులు అందుబాటులో ఉన్నాయి. **- శారదమ్మ, జేడీ (పశుసంవర్ధక)**

పట్టాలు నకిలీ... రెవెన్యూకు మకిలీ

- బద్వేలులో ఆగని అక్రమాల తతంగం
- అయోమయంలో అసలు లబ్ధిదారులు

- న్యూస్‌టుడే, బద్వేలు, కలసపాడు

బద్వేలు నకిలీ పట్టాల తయారీకు అడ్డాగా మారింది. నియంత్రించాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రేక్షక పాత్రలో ఉండిపోవడంతో నకిలీ పట్టాలు కుప్పలుతెప్పలుగా పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వ ఖాళీ స్థలాలు, అసలు పట్టాలకు దీటుగా నకిలీ పట్టాలు తయారవుతున్నాయి. వీటిని ఓ ముఠా కొన్నేళ్లుగా విక్రయిస్తోంది. గతంలో ఈ వ్యవహారంలో చిక్కి కటకటాల పాలైనవారు బెయిలుపై వచ్చి మళ్లీ ఈ దందా కొనసాగిస్తున్నారు. కొందరు రెవెన్యూ సిబ్బంది, అధికారులు నకిలీ పట్టాల తయారీ ముఠాతో లాలూచీ పడటంతో ఈ వ్యవహారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా వర్ధిల్లుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2022లో అప్పటి ఆర్డీవో ఆకుల వెంకటరమణ నకిలీ పట్టాలకు సంబంధించి 17 మందిపై కేసు నమోదు చేశారు. అందులో పది మంది బడా నాయకుల పేర్లు తెరపైకి వచ్చాయి. వీరి విషయం బయటపడటంతో ఉద్యోగులు ఒకరిద్దరు సస్పెండయ్యారు. ఇటీవల ఈ విషయం బయటపడటంతో కేసు పూర్వి విచారణ సాగకుండా వైకాపా రాజకీయ పెద్దలు అడ్డుపడ్డారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ కేసును బయటకు రానీయకుండా తొక్కిపెట్టారన్న ఆరోపణలున్నాయి.

బద్వేలులోని ఎన్జీవో ప్లాట్లలో వెలసిన షెడ్లు

● **పంచాయతీల పేరిట ముఠాల దందా :** బద్వేలు, గోపవరం మండలాల్లో పెద్ద ఎత్తున నకిలీ పట్టాలను తయారు చేసి విక్రయించినట్లు సమాచారం. ఎన్జీవో కాలనీలో ప్రభుత్వ అవసరాలకు తీసిపెట్టిన ఖాళీ స్థలాలు, ప్లాట్లు, ఓ స్కూల్ పరిసర ప్రాంతాల్లోని స్థలాలకు నకిలీ అనుబంధ పత్రాలు తయారు చేసినట్లు సమాచారం.

● కలసపాడు మండలంలో పనిచేస్తున్న ఓ వీఆర్వో, బద్వేలుకు చెందిన మరో ముగ్గురు కలిసి నకిలీ పట్టాల తయారీలో సిద్ధహస్తులు. గతంలో ఈ వ్యవహారానికి సంబంధించి వీరు జైలుకు వెళ్లి వచ్చారు. బయటకు వచ్చి మళ్లీ నకిలీ పట్టాల తయారీకి తెరలేపారు. అసలు పట్టాదారులు, నకిలీ పట్టాలు కొనుగోలు చేసినవారు ఇంటి స్థలాలు తమవంటే తమవంటూ నిత్యం పోలీసు స్టేషన్‌కు వస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు తెలిసినా కూడా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఈ ప్లాట్లలో ఇప్పటికే అక్రమంగా షెడ్లు నిర్మించారు. ఇలాంటి వ్యవహారాలను కొన్ని ముఠాలు ముందుండి నడిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు దృష్టి సారించి నకిలీ పట్టాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటే తప్ప దీనికి అడ్డుకట్ట పడేది ఉండదు.

అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం

బద్వేలు రెవెన్యూ డివిజన్ కేంద్రంలో నకిలీ పట్టాల తయారీదారులపై ఉక్కుపాదం మోపుతాం. తరచూ ఇవి పునరావృతం కాకుండా బాధితులకు న్యాయం చేకూరుస్తాం. 2022లో నకిలీ పట్టాల కేసును తిరగదోడి దోషులను గుర్తిస్తాం. జిల్లా కలెక్టరుతో చర్చించి భవిష్యత్తులో నకిలీ పట్టాల తయారీకి ఆస్కారం లేకుండా చేస్తాం. నిజమైన పట్టాదారులు నష్టపోకుండా చర్యలు చేపడతాం. **- చంద్రమోహన్, ఆర్డీవో బద్వేలు**

ఆలయాల్లో తొలి ఏకాదశి సందడి

తొలి ఏకాదశి పండగను పురస్కరించుకుని జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.. ఒంటిమిట్ట కోదండ రామాలయంలో తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా ఆదివారం వేదపండితుల మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తొలుత గర్భాలయంలో కొలువైన సీతారామ లక్ష్మణ మూర్తులను పట్టువస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. సహస్రనామార్చన, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. రాములోరి సన్నిధిలో 108 బంగారు పుష్పాలతో స్వర్ణ పుష్పార్చన కైంకర్యం చేశారు. జగదభిరాముడి దర్శనం కోసం జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో కోలాహలం నెలకొంది. ఇష్టదైవం శ్రీరామచంద్రమూర్తిని దర్శించిన సందర్భకులు ఆధ్యాత్మిక దివ్యానుభూతి పొందారు. **- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నేడు

జిల్లా సచివాలయం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం కడప కలెక్టరేట్‌లోని సభాభవనంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు పేర్కొన్నారు. ఉదయం పదిన్నర గంటల నుంచి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు స్వీకరిస్తారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, పురపాలక కేంద్రాల్లో ప్రజల అర్జీలను అధికారులు స్వీకరిస్తారన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

పేదల బతుకుల్లో పీ-4 వెలుగులు!

- జిల్లాలో 75 వేల కుటుంబాల ఎంపిక
- నేడు కడపలో స్వర్ణాంధ్ర-2047పై తొలి భేటీ
- మంత్రి సవిత అధ్యక్షతన కీలక సమావేశం

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, కడప

పేదరిక నిర్మూలనకు ప్రైవేట్ పబ్లిక్ పీపుల్స్ పార్టనర్‌షిప్ (పీ-4) కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ దిశగా అడుగులు వేస్తోంది. దారిద్ర్య రేఖకు దిగువనున్న వారిని గుర్తించి వారి అభ్యున్నతికి దాతల ద్వారా సహాయ సహకారాలు అందించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమం కింద జిల్లాలో 58,712 కుటుంబాలను ఎంపిక చేశారు. వీరిని ఆదుకునే దిశగా పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, విదేశాల్లో నివాసం ఉన్నవారిని ఎంపిక చేయడానికి కసరత్తు జరుగుతోంది. సమాజంలో స్థిరపడిన 10 శాతం మంది తమ జన్మభూమిలో నిరుపేదలైన 20 శాతం మందికి చేయూతనిచ్చే విధంగా ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపకల్పన చేసింది. జిల్లాలో పీ-4 కింద గుర్తించిన కుటుంబాలకు బంగారు కుటుంబాలుగా సర్కారు నామకరణం చేసింది.

పరిషత్, మేయర్, పురపాలక ఛైర్మన్లు సభ్యులుగా ఉంటారు. ప్రత్యేక ఆహ్వానితులుగా కొందరిని ఎంపిక చేయగా.. జిల్లా కలెక్టర్ కార్యనిర్వాహక వైస్ ఛైర్మన్, జిల్లా ప్రణాళికాధికారి కన్వీనర్గా వ్యవహరిస్తారు. ఈ కమిటీ తొలి సమావేశం సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరుగుతుంది. స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్ పేరిట జరిగే ఈ సమావేశంలో జిల్లా కార్యాచరణ ప్రణాళిక అమలుపై చర్చిస్తారు. స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా 2029 నాటికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని ఆచరణలో పెట్టే దిశగా ముమ్మర కసరత్తు జరుగుతోంది.

● జిల్లాలో 75,040 బంగారు కుటుంబాలను ఎంపిక చేయగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు 58,713 కుటుంబాలను ప్రస్తుతానికి ఎంపిక చేసుకున్నారు. ఈ కుటుంబాల్లో 320 మంది వరకు మార్గదర్శకులను ఎంపిక చేసుకున్నారు. మిగిలిన కుటుంబాలకు ఎంపిక చేసుకునే దిశగా కసరత్తు జరుగుతోంది. ఎంపిక చేసిన కుటుంబాల్లో పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం, ఉద్యోగ, ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణ ఇప్పించడం, నివాస ప్రాంతాల్లో, ఇంటి ఆవరణలో జీవనానికి వీలుగా మౌలిక సదుపాయాల కల్పన, ఆదాయ పరంగా నిలదొక్కుకోవడానికి అవసర ఆర్థిక సాయానికి ప్రభుత్వం కృషి చేస్తుంది. స్వర్ణాంధ్ర-2029 దిశగా చేపట్టాల్సిన అభివృద్ధి, వృద్ధి రేటు సాధనకు జిల్లా, మండల, గ్రామ స్థాయి ప్రణాళికలు రూపొందించారు.

జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు

పీ-4 కార్యక్రమం అమలు దిశగా జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు జరిగింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత ఛైర్‌పర్సన్ ఉన్న కమిటీలో సభ్యులుగా పార్లమెంటు, రాజ్యసభ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా

ఉంగా.. ఉంగా.. నేడు నిరుపయోగంగా!

పసిడిపురిలో ఆ వీధికి కాన్పుల ఆసుపత్రి వీధని పేరు.. కొప్పరపు బాలయ్య శ్రేష్ఠి కాన్పుల ఆసుపత్రికి ఉచితంగా స్థలాన్ని అందజేశారు. అక్కడ నిర్మితమైన భవనం అది. రోజూ అప్పుడే పుట్టిన పసికందుల ఏడుపులతో కళకళలాడేది. ఈ ఆసుపత్రిలోని వైద్యురాలు కొన్నేళ్ల కిందట ఉద్యోగ విరమణ చేయడంతో కొద్ది రోజుల పాటు రోటరీ క్లబ్ సంస్థ నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. కొద్దిమాసాలకే నిర్వహణ నిలిచిపోవడంతో వైద్యసేవలు నిలిచిపోయాయి. నర్సు, అటెండర్‌లను పట్టణ ఆరోగ్య కేంద్రాలకు పురపాలక అధికారులు బదిలీ చేసి ఆసుపత్రిని మూత వేశారు. ఎందరో పుట్టుకకు కేంద్రం... నేడు భవనం నిరుపయోగంగా ఉండడంతో పట్టణవాసులు ఆవేదన చెందుతున్నారు. **- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం**

పగలు అందం... రాత్రి అంధకారం

కూడలి వద్ద పనిచేయని విద్యుత్తు దీపాలు

కడప-తాడిపత్రి జాతీయ రహదారిపై కొండాపురం మండలం పి.అనంతపురం క్రాస్ వద్ద రాత్రయితే చాలు అంధకారం రాజ్యమేలుతోంది. ఇటీవల ఈ మార్గం నాలుగు వరుసలుగా మారగా నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఒక వైపు కడప.. మరో వైపు తాడిపత్రికి ఇంకో వైపు పులివెందులకు వెళ్లే మార్గం కావడంతో వాహనదారులు రాత్రి సమయంలో విద్యుత్తు దీపాల కాంతులు లేకపోవడంతో కూడలి వద్ద ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కూడలి వద్ద దీపాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కొండాపురం**

తలపై గండం... తలపుల్లో పాఠం

ఒంటిమిట్ట మండలంలోని నర్వకాటిపల్లె అరుంధతీ కాలనీ (రైల్వేకాలనీ) ప్రాథమిక పాఠశాల నిర్వహణకు రెండు తరగతి గదులున్నాయి. ప్రస్తుతం 1-5వ తరగతి వరకు 39 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 1989 ఫిబ్రవరి 5న ప్రారంభించిన భవనం వరండా పైకప్పు పూర్తిగా దెబ్బతింది. సిమెంటు పెచ్చులు రాలిపోయి ఇనుప చువ్వలు బయటపడటంతో ప్రమాదకరంగా మారింది. వర్షం కురిస్తే ధారలా కారుతోంది. గోడల నిండా తేమ ఉంటుంది. ఇక్కడ చదువుకోవాలంటే భావి పౌరులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏలుబడిలో కూలి'పోతేపోనీ' మాకేంటి అనే ధోరణిలో జిల్లా యంత్రాంగం ఉండటంతో బడి బాగుపడలేదు. కూటమి ప్రభుత్వమైనా చొరవ తీసుకొని దెబ్బతిన్న తరగతిని బాగు చేయించాలని విద్యార్థులు విన్నవిస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**

అదిగో గండం: ఒంటిమిట్ట మండలం నర్వకాటిపల్లె అరుంధతీ కాలనీలో దెబ్బతిన్న పైకప్పును చూపుతున్న విద్యార్థులు

కబలిస్తేనే... కదిలొస్తారా?


బద్వేలు రోడ్డులో నానుబాలపల్లెకు వెళ్లే దారికి పడమర భాగంలో ఒరిగిన స్తంభాలు

మైదుకూరు-బద్వేలు రహదారి నుంచి నానుబాలపల్లెకు వెళ్లే దారికి ఇరువైపులా పొలాల్లో ఒరిగిన విద్యుత్తు స్తంభాలు దర్శనమిస్తున్నాయి. పంటలు లేని సమయంలో స్తంభాల పునరుద్ధరణకు ఇదే సరైన సమయం. ఒరిగిన స్తంభాలతో తీగలపై భారంపడి తెగిపోవచ్చు. ఫలితంగా ప్రమాదాలు తలెత్తవచ్చు. ముందు జాగ్రత్తలతో స్తంభాల పునరుద్ధరణకు అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, మైదుకూరు**

సీట్లు మిగిలిపాయె... రెండో విడత భర్తీకి వేళాయె!

వేంపల్లె, న్యూస్‌టుడే : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు ట్రిపుల్ ఐటీలలో 600 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి విద్యార్థుల మెరిట్ జాబితాను తయారు చేసి ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి మొత్తం 4,400 సీట్లున్నాయి. ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1,100 సీట్లుండగా దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ కోటా కింద 360 సీట్లు పోనూ నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1,010 చొప్పున 4,040 సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీల్లో ఉన్న సీట్లకు మెరిట్ జాబితా విడుదల చేసి జూన్ 30 నుంచి జులై 5వ తేదీ వరకు ఇడుపులపాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేశారు.

● ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో జాప్యం, ఇక్కడి విద్యపై ఆసక్తి లేని కారణంగా చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడంతో 600 సీట్లు ఖాళీగా ఉన్నాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీ కేంద్రంగా రెండో విడత ప్రవేశాలకు సంబంధించి రెండో జాబితాను అధికారులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కార్యాలయం

ట్రిపుల్ ఐటీల వారీగా ఖాళీలివి..

పేరు	మొత్తం సీట్లు	భర్తీ అయినవి	మిగులు
ఇడుపులపాయ	1,010	878	132
నూజివీడు	1,010	869	141
శ్రీకాకుళం	1,010	867	143
ఒంగోలు	1,010	826	184

11, 12 తేదీల్లో రెండో విడత ప్రవేశాల జాబితా : ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో మిగిలిపోయిన 600 సీట్ల భర్తీకి తదుపరి మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 11, 12 తేదీల్లో వెబ్‌సైట్‌లో వివరాలు వెల్లడిస్తాం. ఈ మేరకు రెండో విడత జాబితా సిద్ధం చేసే పనిలో సిబ్బంది ఉన్నారు. షెడ్యూలు ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. ఆ లోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తాం.
- ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ

(c) eenadu

నేటి నుంచి బాధ్య మంత్రి జిల్లా పర్యటన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లా బాధ్య మంత్రి సవిత సోమవారం నుంచి రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి పులివెందుల నియోజకవర్గంలో పర్యటిస్తారని, తిరిగి మధ్యాహ్నానికి కడప నగరానికి చేరుకుంటారన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు కడప కలెక్టరేట్‌లో జరిగే విజన్ యాక్షన్‌ప్లాన్‌కు సంబంధించిన సమావేశంలో మంత్రి పాల్గొంటారన్నారు. సాయంత్రం కడప నగరంలో జరిగే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొని రాత్రికి కడప ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బస చేస్తారన్నారు. మరుసటి రోజు ఉదయం కమలాపురం నియోజకవర్గంలోని చెన్నూరులో జరిగే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అక్కడి నుంచి నేరుగా కడప కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా సమీక్షా సమావేశంలో పాల్గొంటారన్నారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుని రోడ్డు మార్గంలో గుంటూరుకు వెళ్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా గత 15 రోజుల్లో అసాంఘిక కార్యకలాపాలపై ముమ్మరంగా దాడులు చేశామని ఎస్పీ అశోక్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. జూదమాడుతున్న 159 మందిని అరెస్టు చేసి, 22 కేసులు నమోదు చేశామని, వారి నుంచి రూ.2,85,645 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. తొమ్మిది మట్కా కేసులను నమోదు చేసి 16 మందిని అరెస్టు చేసి రూ.50,570 నగదు జప్తు చేశామన్నారు. 1.4కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశామని పేర్కొన్నారు.

● బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 986 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 57 మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. కోడిపందేలు ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి రూ.5,050 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి మూడు కేసులు నమోదు చేసి 13.24 లీటర్ల మద్యాన్ని జప్తు చేశామన్నారు.

భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

వసతి గృహంలో అసౌకర్యాలపై ఎమ్మెల్సీ ఆగ్రహం

పులివెందుల, న్యూస్‌టుడే : విద్యార్థులకు వసతుల కొరత లేకుండా చూడాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి గురుకుల పాఠశాల సిబ్బందికి సూచించారు. పులివెందుల సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌తో పలు విషయాలపై చర్చించారు. అనంతరం విద్యార్థుల వసతి గదులు, తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గదిని పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పిల్లలుంటే ఇలాగే ప్రవర్తిస్తారా అని ప్రశ్నించారు. అనంతరం విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

నూతనంగా ఎన్నికైన బీటీయూఏపీ కార్యవర్గం

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే బీటీయూఏపీ లక్ష్యం

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని బహుజన టీచర్స్ యూనియన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (బీటీయూఏపీ) రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున పేర్కొన్నారు. కడప ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం బీటీయూఏపీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా సి.సుదర్శన్‌బాబు, రాష్ట్ర కోశాధికారిగా రాజబాబు, రాష్ట్ర కార్యదర్శులుగా గంగరాజు, గంగాధర్, శ్రీదేవి, ప్రేమసాగర్, నిత్యప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా గంగరాజు, ప్రధాన కార్యదర్శిగా మోహన్‌ను ఎన్నుకున్నారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా కట్టా గంగాధర్, ప్రధాన కార్యదర్శి సురేంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు సమీర్‌బాషా, విక్టర్, సుబ్బరాయుడు, సుభాష్‌బాబు, నరసింహ, డి.శ్రీనివాసలు, జయరాజు, శ్రీరాములు, జయరాముడు పాల్గొన్నారు.

ఏడి పింఛను తగునా!

ఆదుకోవాలంటున్న ఒంటరి మహిళలు

ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ప్రమాదాలకు, అనారోగ్యానికి గురై భర్త మృతి చెంది వితంతువులైన వారు కొందరు... అనర్థాలు, అపార్థాలకు పోయి భర్తను వీడి ఒంటరిగా ఉంటున్న వారు మరికొందరు.. ఆ అభాగ్యులకు ప్రభుత్వం సాయం అనేక ఏళ్లుగా అందడం లేదు. వీరి పట్ల గత వైకాపా సర్కారు చిన్న చూపు చూసి కాలం వెల్లదీసింది. కూటమి ఏలుబడిలోనైనా అందుతుందని ఎదురు చూస్తున్న నేటికీ అందలేదు. కాళ్లు అరిగేలా సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునేవారే లేరు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దయ చూపి పింఛన్లు మంజూరు చేసి మా బతుకుల్లో వెలుగులు నింపాలని వారు కోరుతున్నారు.

రెక్కాడితే గాని డొక్కాడని స్థితి

నా భర్త గపూర్ హమాలి పని చేసేవారు. అనారోగ్యంతో నాల్గేళ్ల క్రితం చనిపోయారు. ఐటీఐ చదివిన పెద్దకుమారుడు గయాజుద్దీన్‌కు కాలు విరిగి ఇంటికే పరిమితమయ్యాడు. చిన్నకొడుకు ఇంతియాజుద్దీన్ ఇంటర్ పాసయ్యాడు. రోజు కూలి కెళ్లగా వచ్చే రూ.200తో జీవనం సాగిస్తున్నాం. పింఛను ఇస్తే కాస్త ఊరట లభిస్తుంది. *-ఎస్.షపున్నిసా, అమృతనగర్*

కాళ్లరిగేలా తిరుగుతున్నా

నా భర్త వెంకటేష్ బేల్దారి పని చేసేవారు. ఏడాది కింద అకస్మాత్తుగా గుండెపోటుతో చనిపోయారు. నలుగురు సంతానమైతే అమ్మాయిలిద్దరికి పెళ్లి చేశాను. ఒక్క అమ్మాయి చదువు మానేసింది. అబ్బాయి పదో తరగతి చదువుతున్నాడు. నేను కూలి పనికెళతాను. కుటుంబ పోషణ భారమైంది. పింఛను కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోలేదు. *-కొమ్మల దుర్గమ్మ, అమృత్ నగర్-2*

భర్త స్థానంలో పింఛన్ ఏదీ?

నా భర్త చాంద్‌బాషా వడదెబ్బకు గతేడాది మృతి చెందారు. ఆయనకు వృద్ధాప్య పింఛన్ వచ్చేది. భర్త స్థానంలో భార్యకు పింఛన్ ఇచ్చామన్నారు. దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇవ్వలేదు. మధుమేహ వ్యాధితో ఏ పని చేయలేను. పింఛను ఇచ్చి ఆదుకోవాలి. *-ప్యారిజాన్, ఇందిరమ్మ కాలనీ-I*

సర్కారే సాయం చేయాలి

నా భర్త ప్రకాశ్ భవన నిర్మాణ కార్మికుడు. ఏమైందో ఏమో గాని రెండు నెలల క్రితం నిద్రలోనే చనిపోయారు. ఇద్దరు పిల్లలు అమ్మాయి తొమ్మిది, అబ్బాయి 4వ తరగతి చదువుతున్నారు. ముగ్గుపిండి పరిశ్రమలోకి పనికెళ్లితే రూ.250 ఇస్తారు. బతుకే గగనమైంది. వితంతు పింఛను ఇచ్చి ఆదుకోవాలి. *-స్వాతి మేరీ, అమృతనగర్*

ఆదరించేవారెవరూ లేరు!

నా భర్త రమణయ్య పూల వ్యాపారం చేసేవారు.. ఆక్సిడెంట్‌లో కాలు విరిగి మంచాన పడ్డ 11 నెలలకు మృతి చెందారు. ఆదరించే వారెవరూ లేరు. నాకిప్పుడు 55 ఏళ్లు కూలిపనికెళ్లి బతుకుతున్నాను. నాకు మధుమేహ వ్యాధి ఉంది మందులక్కూడా డబ్బులుండవు. ఇప్పటికైనా మా బోటి వారికి సీఎం చంద్రన్న పింఛన్ మంజూరు చేసి ఆదుకుంటే రుణపడి ఉంటాం. *-మల్లెపూల లక్ష్మీదేవి, అమృతానగర్-2*

ఆసక్తికరంగా క్రికెట్ పోటీలు

వరుణ్‌సాయి నాయుడు.. మన్విత్

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : ఏసీఏ అండర్-19 పురుషుల మల్టీ డే అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో ఆదివారం జరిగిన పోటీలో కర్నూలుపై అనంతపురం జట్టు విజయం సాధించింది. కేఓఆర్ఎం మైదానంలో జరిగిన మ్యాచ్‌లో 115 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు (ఆదివారం) బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు 51.1 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌటైంది. విష్ణువర్ధన్ నాయుడు 87, మహిత్ 33 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్లలో వరుణ్ సాయి నాయుడు 5, సాయిప్రతాప్‌రెడ్డి 3 వికెట్లు సాధించారు. ఈ మ్యాచ్‌లో అనంతపురం జట్టు ఇన్నింగ్స్ 59 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

● వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలో నెల్లూరు-చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది. వికెట్ నష్టానికి 63 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడోరోజు బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 384 పరుగులకు ఆలౌటైంది. మన్విత్ 97 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లలో సాయిచరణ్, తేజేష్ చెరో మూడేసి వికెట్లు తీసుకున్నారు. చిత్తూరు జట్టు తన రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించి ఆట ముగిసే సమయానికి వికెట్ కోల్పోయి 48 పరుగులు చేసింది. డ్రాగా ముగిసిన ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన నెల్లూరు జట్టుకు మూడు పాయింట్లు రాగా, చిత్తూరు జట్టుకు ఒక పాయింట్ లభించింది.

పీఆర్సీ కమిషన్ ఏర్పాటుకు వినతి

మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, పక్కన నాయకులు

కడప విద్య, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛన్‌దారులకు 12వ పీఆర్సీ కమిషనర్‌ను వెంటనే నియమించి కార్యాచరణను ప్రారంభించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2023 జులై 1న 12వ పీఆర్సీ అమలుకావాల్సి ఉండగా రెండేళ్లు గడిచినా కనీసం పీఆర్సీ కమిషన్ కూడా నియమించకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛన్‌దారులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. పీఆర్సీ కమిషన్ ఛైర్మన్ రాజీనామా చేసి ఏడాది కావస్తున్నా ఇంతవరకూ నూతన ఛైర్మన్‌ను నియమించలేదన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు రాంభూపాల్‌రెడ్డి, అబ్దుల్‌సత్తార్ , జిల్లా కౌన్సిలర్లు రామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతానికి పిలుపు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైల్వే గూడ్స్‌షెడ్ హమాలీ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ యూనియన్, ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు బాదుల్లా, మహబూబ్ బాషా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కడప రైల్వేస్టేషన్‌లోని గూడ్స్‌షెడ్ యూనియన్ కార్యాలయంలో సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేలా మోదీ సర్కార్ కార్మిక చట్టాల్లో మార్పులు చేస్తోందని ఆరోపించారు. రైల్వే గూడ్స్‌షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్, శ్రీను, చిన్న ఓబులేసు, నాగేంద్ర, సూరి తదితరులు పాల్గొన్నారు.

'పోలీసులు స్పందించి ఉంటే మా నాన్న బతికేవారు'

ఒంటిమిట్టలో ఠాణా ఎదుట మృతదేహంతో బాధితుల ఆందోళన

లాలయ్య మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : పోలీసుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంతో ఒక నిండుప్రాణం బలైనట్లు బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం రాచపల్లె బీసీ కాలనీకి చెందిన లాలయ్య మృతదేహంతో ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు ఆదివారం ధర్నా చేశారు. కడప-రేణిగుంట జాతీయ రహదారిపై మృతదేహాన్ని ఉంచి ఆందోళనకు దిగారు. ఆత్మహత్య చేసుకున్న లాలయ్య కుమారుడు రఫీ కథనం మేరకు.. రాచపల్లె బీసీ కాలనీలోని తమ ఇంటికి ఈ నెల 2న రాత్రి సీతాపురానికి చెందిన ఖాదర్‌బాషా వచ్చారు. మా తల్లితో కొన్ని రోజులుగా వివాహేతర సంబంధం ఉంది. ఇకపై ఇక్కడికి రావొద్దని మందలించి పంపించామన్నారు. మరుసటి రోజు ఖాదర్‌బాషా తనతో పాటు మా తండ్రి లాలయ్యను మీ అంతుచూస్తాం అంటూ బెదిరించాడు. ఆయన నుంచి రక్షణ కల్పించాలని పోలీసుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తే న్యాయం చేయలేదని వాపోయారు. మా అమ్మ పీరమ్మ ఫిర్యాదుపై పోలీసులు మమ్మల్ని స్టేషన్‌కు రావాలని ఒత్తిడి చేశారు. తప్పుడు కేసు పెట్టాలని కుట్రపన్నారు. తీవ్ర మనస్తాపం చెందిన నా తండ్రి అవమానం భరించలేక శనివారం రైలు కిందపడి తనువు చాలించాడని ఆవేదన వ్యక్తం చేశారు. మా నాన్న మృతిపై మా తల్లి పీరమ్మ, ఖాదర్‌బాషాపై అనుమానాలున్నాయన్నారు. మేం ఫిర్యాదు ఇచ్చిన వెంటనే పోలీసులు స్పందించి సమస్యపై దృష్టి సారించి ఉంటే మా తండ్రి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చేది కాదని కంటతడి పెట్టారు. విషయం తెలుసుకున్న సీఐ బాబు అక్కడికి చేరుకుని బాధితులకు సర్దిచెప్పడానికి ప్రయత్నం చేశారు. ఖాదర్‌బాషా, పీరమ్మపై కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు శాంతించి ఆందోళనను విరమించారు.

అప్పుల బాధ తాళలేక ప్రభుత్వ ఉద్యోగి అదృశ్యం

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : అప్పుల బాధ తాళలేక ఓ ప్రభుత్వ ఉద్యోగి అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్సై రాజరాజేశ్వరరెడ్డి తెలిపారు. కడప జయనగర్ కాలనీకి చెందిన **వనిపెంట అంజాద్‌ఖాన్** (41) తెలుగుగంగలోని జలవనరుల శాఖలో పని చేస్తున్నారు. ఇటీవల ఆయన బద్వేలుకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో అంజాద్‌ఖాన్ తన కుటుంబ అవసరాల నిమిత్తం తెలిసిన వారి వద్ద అప్పులు చేశారు. అప్పులిచ్చిన వారు డబ్బులు చెల్లించాలని అడగడంతో గత నెల 28న బద్వేలుకు వెళ్తున్నానని చెప్పి సాయంత్రం ఇంటికి వచ్చారు. పనిపై తెలుగు గంగ కార్యాలయానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లారు. అప్పటి నుంచి తిరిగి రాలేదన్నారు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల నివాసాల్లో గాలించారు. ఎక్కడా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

వేంపల్లె, న్యూస్‌టుడే : మండలంలోని నందిపల్లె సమీపంలో ఆదివారం ట్రాక్టర్ అదుపు తప్పి గొర్రెల మందపైకి దూసుకెళ్లడంతో 14 గొర్రెలు మృతి చెందగా 17 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. మండలంలోని తాటిమాకులపల్లె దళితవాడకు చెందిన గుడిసె గంగులయ్య నందిపల్లె సమీపంలో గొర్రెలు మేపుకొంటున్నారు. ఈ క్రమంలో పులివెందుల పట్టణం నగరిగుట్టకు చెందిన ఆనంద్ వేంపల్లె పాపఘ్ని నది నుంచి ఇసుక తీసుకొచ్చేందుకు ట్రాక్టర్‌లో బయలుదేరారు. ఈ మేరకు నందిపల్లె వద్దకు రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో గంగులయ్యకు గాయాలు కాగా, 14 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా 17 గొర్రెలు గాయపడ్డాయి. వేంపల్లె పశువైద్యాధికారి సాదిక్‌బాషా మృతి చెందిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు. విషయం తెలుసుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రామమునిరెడ్డి, తెదేపా నాయకులు మహమ్మద్, నామా వేమకుమార్, మాజీ ఎంపీ తులసిరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యుడు ధ్రువకుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని గొర్రెలను పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ఆనంద్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు.

అప్పు చెల్లించమన్నందుకే దారుణ హత్య

మహిళ అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు

వివరాలు వెల్లడిస్తున్న పులివెందుల డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల, న్యూస్‌టుడే : పులివెందులలో అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన కేసును పోలీసులు ఛేదించారు. దుండగులు రూ.2 లక్షల కోసం మహిళను హత్య చేసినట్లు నిర్ధారించారు. పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ వివరాల ప్రకారం.. పులివెందులకు చెందిన హసీనా (45) కువైట్‌కు వెళ్లి వచ్చి ఇటీవల పులివెందులలో స్థిరపడ్డారు. డబ్బులు వడ్డీకి ఇస్తూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో దేవిరెడ్డి కరుణకుమారితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఇటీవల తన కుమారుడి చదువు కోసం హసీనా వద్ద కరుణకుమారి రూ.2లక్షలు అప్పుగా తీసుకున్నారు. డబ్బును తిరిగి చెల్లించాలని హసీనా ఒత్తిడి చేయడంతో కరుణకుమారి తన కుమారుడితో కలిసి హసీనాను ఇంట్లోనే కాళ్లకు, చేతులకు తాడుగులు వేసి మెడపై కత్తితో పొడిచి హత్య చేసినట్లు పేర్కొన్నారు. కరుణకుమారి కుమారుడు లిఖిత్‌కుమార్‌రెడ్డిని పులివెందులలోని ఉలిమెల్ల రింగ్ రోడ్డులో అరెస్టు చేసినట్లు వివరించారు. కరుణకుమారి పరారీలో ఉందని, ఆమెను కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. హసీనాను హత్య చేసి బీరువాలోని బంగారం, ప్రామిసరీ నోట్లు, బాండ్లు, చరవాణిని పూర్తిగా కాల్చేసినట్లు పేర్కొన్నారు.

మఠంలో అనంతపురంవాసి మృతి

బ్రహ్మంగారి మఠం, న్యూస్‌టుడే: స్థానిక సోమిరెడ్డిపల్లె గ్రామ సచివాలయం-1 వద్ద ఆదివారం అనంతపురం జిల్లా రామదుర్గ్ వీరాపురం బీసీ కాలనీవాసి **పెన్నయ్యగారి గంగాధర్** (33) మృతిచెందారు. ఇతని సంబంధికులు అందుబాటులో లేకపోవడంతో స్థానిక పంచాయతీ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు. తొలుత గుర్తుతెలియని వ్యక్తిగా స్థానికులు భావించారు. స్థానిక పోలీసులు వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించగా ఆధార్‌కార్డు, బ్యాంకు పుస్తకం ఉండడాన్ని చూసి దాని ప్రకారం అనంతపురంవాసిగా నిర్ధారించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

FREE JOBS: తిరుపతిలోని మా సంస్థ కొరకు, కంప్యూటర్ ఆపరేటర్లు, HR Recruiters, Counsellors, Tele Callers, BDMలు కావలెను. జీ: 15-35 వేలు. # ✆ 99906 78818.

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

ENGINEERING

Faculty Requirement Physics, English, Mathematics (CSC, ECE, EEE). Acharya College of Engineering D.Agraharam, B.Matam (M). Cell : 8341847444, 9052208001.

FINANCIAL SERVICES

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపారం, రుణం, తక్కువ వడ్డీ రేటు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న NPA వారు కూడా సంప్ర: గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్. ✆ +91 99669 10410.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చటపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

JOBS

ప్రముఖ లిమిటెడ్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు జిల్లాలోని అన్ని మండలాల నుండి ప్రాంతాల వారీగా M/F అభ్యర్థులు కావలెను. అనుభవమును బట్టి 25 వేల జీతం+మంత్లీ ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. 73968 87685.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే

Contact: KDP: 9989997626, 8008514248 PDTR: 8008597620

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

వయసుకు మించి... బడి సంచి

అధిక బరువులు మోయలేక పిల్లలకు అనారోగ్య సమస్యలు

బరువైన సంచులతో పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

● కమలాపురం పట్టణానికి చెందిన చిన్నారి నిఖిల్ ఏడో తరగతి చదువుతున్నాడు. ఇటీవల తరచూ వెన్నునొప్పి వస్తోందని తల్లిదండ్రులకు చెప్పడంతో వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. వివిధ పరీక్షలు, ఎక్స్‌రే తీసిన వైద్యులు అతడు తీసుకెళ్లే బడి సంచి బరువుతోనే వెన్ను నొప్పి వస్తోందని నిర్ధారించారు. ప్రస్తుతం ఆ బాలుడు పుస్తకాల బరువు మోయలేకపోతుండటంతో అతడి తల్లి సహాయం చేస్తున్నారు.

కమలాపురం, న్యూస్‌టుడే : విద్యార్థులకు పుస్తకాల భారం రోజురోజుకూ అధికమవుతోంది. వివిధ రకాల పుస్తకాలతో బడి సంచి బరువెక్కుతోంది. ఇంటి నుంచి పాఠశాలకు పుస్తకాల సంచిని తీసుకెళ్లడమే కష్టమవుతుంటే.. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో రెండు, మూడు అంతస్థుల మెట్లు ఎక్కాల్సి రావడంతో విద్యార్థులు అనారోగ్యాల బారినపడుతున్నారు. ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులతోనే ఐదు కిలోల పుస్తకాలను మోయిస్తున్నారు. రాష్ట్ర సిలబస్‌కు తోడు ప్రైవేట్ పాఠశాలలు ప్రత్యేకంగా రూపొందించుకునే సిలబస్, ఐఐటీ, జేఈఈ, సివిల్స్, సీబీఎస్ఈ అంటూ రకరకాల పుస్తకాలు ఉంటున్నాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 2,500 వరకు ఉన్నాయి. వాటిల్లో 3.10 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

నో బ్యాగ్ డే అమలెప్పుడు..

పిల్లల్లో ఆహ్లాదం నింపేందుకు అనుభవపూర్వక పాఠాలను నేర్పేందుకు పుస్తకాల్లేని బడి నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం గతేడాది జులైలో మార్గదర్శకాలు జారీ చేసింది. 6 నుంచి 8వ తరగతుల విద్యార్థులకు ఏడాదికి 10 రోజులు బ్యాగుల్లేని బడిని నిర్వహించాలని మార్గదర్శకాలు చేసినా ఎక్కడా అమలు కావడం లేదు. ప్రతి శనివారం నో బ్యాగ్ డే అమలు చేయాలని గత ఫిబ్రవరిలో మంత్రి నారా లోకేశ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ ఏడాదైనా అమలు చేస్తే ఒక్కరోజైనా విద్యార్థులకు బడి సంచి భారం తగ్గుతుంది.

తరగతి	పుస్తకాల బరువు (కిలోల్లో)
నిబంధనల ప్రకారం..	
1-2	1.5
3-5	2.3
5-7	4
8	4.5
9-10	5
వాస్తవంలో ఇలా..	
1-5	5-12
6-10	16-20

విద్యార్థుల్లో ఎదుగుదల లోపం

వయసుకు మించి బరువును పిల్లలు మోస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ప్రధానంగా నాడీ వ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. మెడ, నడుము, భుజాల నొప్పులు వస్తాయి. బ్యాగు ఒక వైపు వేసుకోవడంతో కండరాలు నొప్పి, ఛాతిపై ఒత్తిడి పెరుగుతుంది. వెన్నెముక సమస్యలతో పాటు ఎదుగుదల లోపం వస్తుంది.

- డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఎముకలు, కీళ్ల వ్యాధి నిపుణుడు

హంస వాహనం... సౌమ్యనాథుడి రాజసం

హంస వాహనంపై సరస్వతి అలంకారంలో సౌమ్యనాథస్వామి

నందలూరు, న్యూస్‌టుడే: నందలూరు సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సౌమ్యనాథస్వామి హంసవాహనంపై సరస్వతీదేవి అలంకారంలో కొలువుదీరి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం తిరుమంజనం, పల్లకీ సేవ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు సునీల్ కుమార్, పండితులు రఘునందన్, పవన్ కుమార్, మనోజ్ కుమార్‌ల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం పాల్గొన్నారు. ఉదయం స్వామి వారిని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ దర్శించుకున్నారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం పల్లకీసేవ గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రికి సింహ వాహనంపై స్వామి వారు కొలువు దీరుతారని ఆలయ అధికారులు తెలిపారు.

బకాయిలు చెల్లించాలని డిమాండ్

కడప విద్య, న్యూస్‌టుడే : ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక అంశాలపై కార్యాచరణ రూపొందించి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తామని ఏపీ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం ఆపస్ జిల్లా శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైకాపా విధానాలతో ఉద్యోగులు విసుగు చెందారన్నారు. ప్రభుత్వం స్పందించి రూ.25 వేల కోట్ల ఆర్థిక బకాయిలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు శెట్టెం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, నాయకులు ఎరుకలరెడ్డి, శ్రీనివాసులు, బాలానాయుడు పాల్గొన్నారు.

వేదికపై ఆపస్ నాయకులు

కాలువలిలా.. నీరు పారేదెలా!

పులివెందుల నియోజకవర్గంలోని సాగునీటి కాలువలు అధ్వానంగా మారాయి. దీంతో నీటి పారుదల సక్రమంగా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైడిపాలెం- గంగనపల్లె, బోడివారిపల్లె- భద్రంపల్లె ప్రధాన కాలువలో పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగిపోయాయి. దీంతో పొలాలకు సాగునీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కాలువ డీఈఈ శ్రీనివాసులును వివరణ కోరగా.. కాలువలోని కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలగిస్తామన్నారు. - న్యూస్‌టుడే, తొండూరు

(c) eenadu

ప్రొద్దుటూరు

● ప్రొద్దుటూరు ● జమ్మలమడుగు ● బద్వేలు ● మైదుకూరు

ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావన అవసరం

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక భావనను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని ఎంఎస్ఎస్ ధ్యాన మందిరంలో సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కైవల్యతీర్థ స్వామి బోధించారు. ఆదివారం కైవల్య సత్సంగ్ గురుపూజ వార్షికోత్సవం సందర్భంగా లైట్ పాలెం సెంటర్‌లోని ధ్యాన మందిరంలో ఐదు రోజుల పాటు గురుపూజ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు శిష్య బృందం తెలిపింది.

కాశీ రహస్యం పుస్తకావిష్కరణ

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని త్యాగరాజువీధికి చెందిన డాక్టర్ ఎం.ప్రభాకర్ రచించిన కాశీ రహస్యం పుస్తకాన్ని ఐపీఎస్ అధికారులు కేవీ. మోహన్‌రావు, రామారావు, రైతు సాధికారత శాఖ విశ్రాంత సీఈవో ఎం.రవీంద్రబాబు, విశ్రాంత జేడీ సురేంద్రబాబు, ఐఆర్ఎస్ అదనపు కార్యదర్శి సాయి షణ్ముఖ తదితరులు ఆవిష్కరించారు. విజయవాడలో ఈ కార్యక్రమం జరిగిందని రచయిత తెలిపారు.

ఘనంగా ఏకలవ్య జయంతి

కొండాపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గండ్లూరు ఎస్టీ కాలనీలో ఏకలవ్య జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. గిరిజన సమాఖ్య, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు డేరా జ్యోతి ఏకలవ్యుని జీవిత చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగన్న, మండల అధ్యక్షుడు దాసరి నాగన్న, సునీత తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, నాగన్న తదితరులు

38 మందికి నియామక పత్రాలు

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు రాచపూడి నాగభూషణం డిగ్రీ పీజీ కళాశాలలో సీఈఏటీ కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా జరిగింది. మొత్తం 60 మంది నిరుద్యోగులు హాజరుకాగా 38 ఎంపికయ్యారు. వీరికి నియామక పత్రాలను అందజేశారు. చెన్నైలో ఏడాదికి రూ.3 లక్షల జీతం ఇస్తూ భోజన, రవాణా వసతిని కల్పిస్తామని ఆ కంపెనీ హెచ్ఆర్ హరికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో వెంకటసాయికృష్ణ, అధ్యాపకులు డాక్టర్ అశోక్, లక్ష్మీదేవి, కబీర్ పాల్గొన్నారు.

బద్వేలు ఎన్జీవో సంఘం అధ్యక్షుడిగా నరసింహారెడ్డి

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే : బద్వేలు ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడిగా టి.నరసింహారెడ్డి, కార్యదర్శిగా శివరామిరెడ్డి, సహాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరెడ్డి, మల్లికార్జునరావు, యంగయ్య, బాలుడు, వెంకటమ్మ, హరికృష్ణ ఎన్నికయ్యారు. ఈమేరకు ఎన్నికల అధికారులు నిత్యపూజయ్య, నరసింహారెడ్డి ప్రకటించారు. వీరితో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు కూడా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా నాయకులు అభినందించారు.

నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న జిల్లా నాయకులు

డిపాజిట్ చెల్లించిన పది రోజుల్లోనే విద్యుత్తు కనెక్షన్

✤ అక్రమ వసూళ్లపై క్రిమినల్ చర్యలకు సిఫారసు

'న్యూస్‌టుడే'తో మైదుకూరు విద్యుత్తు డీఈఈ శ్రీకాంత్

-న్యూస్‌టుడే, చాపాడు

విద్యుత్తు కనెక్షన్ల కోసం వినియోగదారులు మండల ఏఈ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అవి సకాలంలో మంజూరు కాక అధికారి ఎందుకు పెండింగ్ పెట్టారో అర్థంకాక రైతులు అగచాట్లు పడిన సందర్భాలు ఉన్నాయి. తమ సమస్య పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని అధికారులకు, అవసరమైతే కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసేవారు. అలాంటి సమస్యలు ఇకపై లేకుండా కొత్త సర్వీసుకు నగదు చెల్లించిన పది రోజుల్లోనే విద్యుత్తు కనెక్షన్ ఇస్తామని విద్యుత్తు శాఖ మైదుకూరు డీఈఈ శ్రీకాంత్ 'న్యూస్‌టుడే' నిర్వహించిన ముఖాముఖీలో వెల్లడించారు.

న్యూస్‌టుడే: విద్యుత్తు సరఫరా చేసే తీగలకు అనుసంధానంగా ఉన్న స్తంభాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఫలితంగా సరఫరాలో ఇబ్బందులున్నాయి?

డీఈఈ : మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, దువ్వూరు మండలాల్లో మూడు నెలల్లో 105 స్తంభాలు బాగు చేశాం. రాతపూర్వక ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తున్నాం. వ్యవసాయపరంగా ఒక నియంత్రిక, మూడు స్తంభాలు ఉచితంగా ఇస్తున్నాం. ఒకే మార్గంలో ఇద్దరు రైతులుంటే ఆరు స్తంభాలకు ఉచిత సదుపాయం ఉంది. గ్రూపుగా వస్తే వారికే మేలు. విద్యుత్తు పరికరాల కొరత లేదు.

న్యూస్‌టుడే: ఇటీవల ఇక్కడ స్వీకరించిన వినతుల్లో బాధితులు పేర్కొన్న అక్రమాలపై చర్యలు తీసుకున్నారా?

డీఈఈ పూర్వ ఇన్‌ఛార్జి ఏఈ రూ.80 లక్షలు అక్రమంగా వసూలు చేసినట్లు బాధితులు ఈనెల 16న రాతపూర్వకంగా 75 వినతులిచ్చారు. క్షేత్రస్థాయిలో పరిశీలించగా రూ.1.15 కోట్లుగా తేలింది. రికవరీకి గడువిచ్చాం. ఆలస్యమైతే క్రిమినల్ కేసు నమోదుకు సిఫారసు చేస్తాం. ఇలాంటి వినతుల స్వీకరణ ఈ నెల 9న దువ్వూరులో, మూడో వారంలో ఖాజీపేటలో నిర్వహిస్తున్నాం.

న్యూస్‌టుడే: చాపాడులో విధులు నిర్వహించేందుకు ఇంజినీర్‌ను కేటాయించారా? గతంలో ఆ బాధ్యతలు నిర్వహించేవారి చరవాణి పనిచేయడం లేదు?

డీఈఈ చాపాడుకు దువ్వూరులో విధులు నిర్వహించే ఇంజినీర్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చాం. ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తున్నాం. దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

న్యూస్‌టుడే: ఉప కేంద్రాల్లో సిబ్బంది కొరతను ఎలా అధిగమిస్తున్నారు?

డీఈఈ ఐదు సెక్షన్లలో పది మంది ఇంజినీర్లు ఉండాలి, అయిదుగురు మాత్రమే ఉన్నాం. దీంతో కొన్ని సేవల్లో జాప్యం జరుగుతోంది. కింది స్థాయిలో కొరత లేదు.

న్యూస్‌టుడే: శిథిలావస్థలోనిఉప కేంద్రాలకు మరమ్మతులు ఎప్పుడు చేస్తారు?

డీఈఈ ఒక్కో కేంద్రానికి రూ.2 లక్షలు చొప్పున పది కేంద్రాలను ఎంపిక చేశాం. త్వరలో పనులు మొదలవుతాయి. వీటిలో అన్నవరం, దువ్వూరు, ఆదిరెడ్డిపల్లె, నాగసానిపల్లె, సింగనపల్లె తదితరాలున్నాయి. మలివిడతలో మరికొన్ని ఎంపిక చేస్తాం.

కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

మైదుకూరు, న్యూస్‌టుడే : కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.ఎన్. నాగసుబ్బయ్య పిలుపునిచ్చారు. అదేరోజు విద్యుత్తు ఎస్ఈ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఆదివారం స్థానిక విద్యుత్తు కార్యాలయం వద్ద సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విష్కరించారు. ఈసందర్భంగా నాగసుబ్బయ్య మాట్లాడుతూ పెండింగులో ఉన్న 4డీఏలను విడుదల చేయాలని, ఈపీఎఫ్, జీపీఎఫ్ అమలు చేయాలని, విశ్రాంత ఈపీఎఫ్ ఉద్యోగులకు వైద్య సౌకర్యం కల్పించాలని, ఒప్పంద, పొరుగుసేవల కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండు చేశారు. యూనియన్ ప్రతినిధులు బి.నాయుడురాజ్, కె.నాగసుబ్బయ్య, జి.సుబ్బరాయుడు, కుమార్‌పాషా, సురేకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోలుకోవాలని పూజలు

రాజుపాళెం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి ఆరోగ్యంగా కోలుకోవాలని ఆదివారం మండలంలోని అర్కటవేముల గ్రామంలోని సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచి కందూకూరు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు జడ్పీటీసీ మాజీ సభ్యుడు మహేశ్వరరెడ్డి, కేసీ కాలువ ఛైర్మన్ రామచంద్రారెడ్డి, మైలవరం డీసీ ఛైర్మన్ జయరామిరెడ్డి, విశ్రాంత పీఈటీ ఓబుళరెడ్డిప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

రాజుపాళెం మండలం టంగుటూరులో..

మహమ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్ త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పీఠాధిపతులు సూచించారు. మానవాళి రక్షణ కోసం కర్బలా మైదానంలో శత్రువులతో పోరాడి ప్రాణత్యాగం చేశారని వివరించారు. మొహర్రం సందర్భంగా ఆదివారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లో భక్తులు పీర్లను ఊరేగించారు. జమ్మలమడుగులో సాయంత్రం పలు చావిళ్లలో ఏర్పాటైన పీర్లను ఏటికి తీసుకెళ్లారు. ఊరేగింపులో కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పీర్లను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. అనేక చోట్ల నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఏటికి తీసుకెళ్లిన తర్వాత పీర్లను శుభ్రం చేసి తిరుగు పయనమయ్యారు. -న్యూస్‌టుడే, బృందం

జమ్మలమడుగులోని గూడుమస్తాన్‌వలి దర్గా వద్ద ఊరేగుతున్న పీర్లు

పోరుమామిళ్ల: టేకూరుపేటలో పీర్ల ఊరేగింపు

ఘనంగా తొలి ఏకాదశి

ఆషాఢ మాస శుద్ధ తొలి ఏకాదశిని పురస్కరించుకొని ఆదివారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో స్వామివారు, అమ్మవారి దేవతా విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. దేవాలయాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని అనేక ఆకారాలు, కూరగాయలతో అలంకరించారు. కుంకుమ అర్చనలు చేసి మంగళహారతి ఇచ్చారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి దర్శించుకున్నారు. బద్వేలులో ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో డీసీసీ బ్యాంకు ఛైర్మన్ ఎం.సూర్యనారాయణరెడ్డి, తెదేపా నియోజక వర్గ ఇన్‌ఛార్జి కె.రితేష్‌రెడ్డి స్వామి వారికి పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, బృందం

సర్వాలంకారభూషితులుగా సీతారామలక్ష్మణ మూర్తులు

ప్రొద్దుటూరులో శాకంబరీ దేవిగా పెద్దమ్మతల్లి

పాతూరు పెద్దమ్మ దేవత దర్శనార్థం బారులు తీరిన భక్తులు

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)

ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు: 9000409516
మైదుకూరు: 8008573447
బద్వేలు గ్రామీణ: 8008573493

స్పందన.. పరిష్కారం

చాపాడు: అల్లాడుపల్లె పంచాయతీ విజయనగరంలో విద్యుత్తు మోటారు దెబ్బతిని నాలుగు రోజులపాటు మరమ్మతుకు నోచుకోలేదు. ఈ సమస్యపై 'ఈనాడు'లో ఈ నెల 3న 'మేమున్నాం మీకుతోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చాం. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహమ్మద్‌హుస్సేన్ స్పందించి శుక్రవారం మోటారుకు మరమ్మతులు చేయించారు.

?: ప్రొద్దుటూరు పట్టణం మేదరవీధిలో కల్వర్టు వద్ద ఉన్న చెత్తంతా రోడ్డుపైకి వస్తోంది. రెండు చెత్తడబ్బాలను ఏర్పాటు చేయాలి. -వెంకటయ్య, సానికుడు, ప్రొద్దుటూరు

✓: చెత్త రోడ్డుపైకి రాకుండా త్వరలో నూతన డబ్బాను మరొకటి ఏర్పాటు చేస్తాం. దుర్వాసన రాకుండా బ్లీచింగ్ పౌడరును ఏర్పాటు చేస్తాం. -సుబ్బరాయుడు, పారిశుద్ధ్య అధికారి ఒకటో డివిజన్, పురపాలక సంఘం

?: ప్రొద్దుటూరు పట్టణం రెండో వార్డు పురపాలక ఉన్నత పాఠశాల వైపు ఉన్న మురుగుకాలువలో వ్యర్థ పదార్థాలు తొలగించాలి. -దస్తగిరి, స్థానికుడు

✓: వ్యర్థ పదార్థాలు వెంటనే తొలగిస్తాం. -నూరిబాషా, పారిశుద్ధ్య అధికారి, ప్రొద్దుటూరు -న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

?: పెద్దశెట్టిపల్లె పంచాయతీలోని కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో స్తంభానికి రెండు ఎల్ఈడీ దీపాలు ఉన్నాయి. వాటిలో ఒకదానిని మలుపు వైపు ఏర్పాటు చేస్తే రాత్రి వేళల్లో వెలుగు ఉంటుంది. -గోపాల్ యాదవ్, నెహ్రూరోడ్డు

✓: పంచాయతీ కార్యదర్శితో స్తంభానికి మలుపు వైపు ఎల్ఈడీ దీపం ఉండేవిధంగా ఏర్పాటు చేస్తాం. -రామాజంనేయరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో, ప్రొద్దుటూరు

?: మిట్టమడివీధిలోని రవీంద్ర పాఠశాల సమీపంలో తాగునీటి వాల్వు ఏర్పాటుకు రోడ్డుపై తవ్విన గుంతపై మట్టి కుంగిపోవడంతో ప్రమాద స్థితిలో గొయ్యి ఏర్పడింది. చోదకులు, పాదచారులకు ముప్పు లేకుండా చర్యలు తీసుకోవాలి. -ఉదయ్, మిట్టమడి వీధి

✓: తమ సిబ్బంది ద్వారా కంకర డస్టుతో గుంత పూడ్చేస్తాం. -సురేంద్రనాథ్‌రెడ్డి, మున్సిపల్ తాగునీటి ఏఈ, ప్రొద్దుటూరు

?: స్థానిక బొజ్జవారిపల్లె ఎస్సీ కాలనీలో సరఫరా వేళలో గొట్టం నుంచి కొంతసేపు రంగుమారి కలుషిత నీరు వస్తోంది. రక్షిత జలం లేక దాహార్తికి వినియోగించడం లేదు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. -రామయ్య, బొజ్జవారిపల్లె

✓: కలుషిత నీటి సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలని అసిస్టెంటు ఇంజినీరింగ్‌ను ఆదేశించాం. యుద్ధప్రాతిపాదిక అమలుతీరుపై పర్యవేక్షిస్తాం. -నాగభరత్‌రెడ్డి, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ప్రొద్దుటూరు - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

?: కొండాపురం మండలం లావనూరు గ్రామంలో కొన్ని వీధుల్లో విద్యుత్తు దీపాలు వెలగక అంధకారం అలముకుంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి -నారాయణ, లావనూరు

✓: గ్రామంలో పని చేయని వీధి దీపాలను గుర్తించి, మరమ్మతులు చేయిస్తాం. అవసరమైన చోట్ల కొత్తవి ఏర్పాటు చేస్తాం. -నాగప్రసాద్, ఎంపీడీవో, కొండాపురం

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు

పెంపుడు జంతువులకు టీకా వేస్తున్న వైద్యులు

ప్రొద్దుటూరు గ్రామీణ, జమ్మలమడుగు గ్రామీణ, ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు మండలం గోపవరంలోని ప్రభుత్వ పశువైద్య కళాశాల అవరణంలో ఆదివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా బోధన, శస్త్ర చికిత్స సముదాయంలో 131 పెంపుడు కుక్కలు, పిల్లులకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేశామని అసోసియేట్ డీన్ శ్రీనివాస ప్రసాదు తెలిపారు. కుక్కలు, పిల్లులు కరిచిన వారికి రేబిస్ వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు ఉపయోగపడతాయన్నారు. హెచ్‌వోడీ అనూష, అసోసియేట్ ప్రొఫెసర్లు సాయికృష్ణ, సురేంద్ర, అంజలి, విద్యార్థులు పాల్గొన్నారు. జమ్మలమడుగు ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సుమారు 200 రకాల వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. వైద్యాధికారులు జాన్ సుధాకర్‌బాబు, సుధాకర్, హిమబిందు, రాఘవేంద్ర, రమేష్, శిరీష, నాగేంద్ర, రమాదేవి, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ప్రొద్దుటూరు శ్రీరాములపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో గీత అవగాహన సమావేశం, వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి భరత్, డిప్యూటీ హెల్త్‌ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: భారతీయ జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. భాజపా మండల అధ్యక్షుడు నాగేంద్ర ఆధ్వర్యంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. నాయకులు నారోజూ వెంకటరమణాచారి, పండరి, శ్రీనివాసులురెడ్డి, బ్రహ్మయ్య, చెన్నయ్య, జయరాం, రమణయ్య, బొల్లు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

చాతుర్మాస దీక్ష ప్రారంభం

వెలిదండ్ల (లింగాల), న్యూస్‌టుడే : రామాయణ, మహాభారతం, భగవద్గీత ప్రతి ఒక్కరికీ జ్ఞానాన్ని ఇస్తాయని వేదపండితుడు దత్తమునీంద్రస్వామి పేర్కొన్నారు. వెలిదండ్ల వరదరాజస్వామి ఆలయం వద్ద ఆదివారం నుంచి నవంబరు 5 వరకు నిర్వహించే చాతుర్మాస దీక్ష, తొలి ఏకాదశి ప్రారంభ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు వెన్నపూస నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్తు కార్మికుల నిరసన

దువ్వూరు, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9వ తేదీన దేశ వ్యాప్తంగా చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయబ్ రసూల్ పిలుపునిచ్చారు. దువ్వూరు విద్యుత్తు ఉప కేంద్రం వద్ద కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా విద్యుత్తు కార్మికులు నిరసన చేపట్టి సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. విద్యుత్తు శాఖలో పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ బదిలీ, పని గంటలకు తగిన వేతనం, ఉద్యోగోన్నతి తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

దేశం గర్వించదగ్గ నేత జగ్జీవన్‌రామ్

జమ్మలమడుగులో నివాళులర్పిస్తున్న ఎంఈఎఫ్ జిల్లాధ్యక్షుడు బాబు, దళిత ప్రజా సంఘాల నాయకులు

జమ్మలమడుగు, కొండాపురం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమర యోధుడు, భారత తొలి ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ దేశానికి ఎనలేని సేవ చేశారని అందుకే ఆయనకు భారతరత్న ఇవ్వాలని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) జిల్లా అధ్యక్షుడు బాబు డిమాండ్ చేశారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక కోర్టు ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నయ్య, నరసింహులు, బాల ఓబయ్య, శింగరయ్య, బిర్రు సంతోష్, ప్రసాద్, నాగన్న, ఓబన్న తదితరులు పాల్గొన్నారు. కొండాపురంలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఏపీ ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల కార్యదర్శి నాగసుబ్బరాయుడు పూలమాలతో నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గొప్ప రాజకీయవేత్తగా, సామాజిక సమానత్వం కోసం జీవిత కాలం పోరాటం చేసిన సంస్కరణశీలిగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉండే గొప్ప దార్శనికుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మనోహర్ బాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు నారాయణ, నాగన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బి.కోడూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతోందని తెదేపా బద్వేలు సమన్వయకర్త రితేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బి.కోడూరు మండలం మున్నెల్లి పంచాయతీ గోవిందాయపల్లె గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ సూర్య నారాయణరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం అయ్యేవిధంగా అధికారులకు చరవాణి ద్వారా తెలియజేశారు. రహదారి మధ్యలో ఆకులు రాలిన చెట్టుకు గ్రామానికి సరఫరా అయ్యేటువంటి విద్యుత్తు తీగలు అల్లుకుని ఉన్నాయి. వాటిని తొలగించి స్తంభాన్ని ఏర్పాటు చేయాలని రితేష్‌రెడ్డికి గ్రామస్థులు చెప్పారు. వెంటనే ఏఈ చిన్నయ్యకు చరవాణి ద్వారా సమాచారం ఇచ్చి వెంటనే ఇక్కడ స్తంభం ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్తు అధికారులకు చెప్పిన గంటలోపు అక్కడ స్తంభం ఏర్పాటు చేసి గ్రామ మధ్యలో ఉన్న చెట్టును తొలగించారు. గత ప్రభుత్వంలో వైకాపా నాయకులు ఎద్దులబీడు భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని రుణాలు తీసుకున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేత బొజ్జా రోశన్న, రాష్ట్రరైతు కార్యదర్శి రమణారెడ్డి, మండల తెదేపా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు అమరన్నాథ్ రెడ్డి, గోడి రమణారెడ్డి, బాలయ్య, రామ్మోహన్‌రెడ్డి, మద్దిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రామసుబ్బయ్య, కృష్ణయ్య యాదవ్, దుగ్గిరెడ్డి, పవన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కూటమి నాయకులు రితేష్‌రెడ్డి, రోశన్న, డీసీసీబీ ఛైర్మన్ సూర్య నారాయణరెడ్డి, నాయకులు

సార్వత్రిక సమ్మె గోడ పత్రాల ఆవిష్కరణ

ప్రొద్దుటూరు: ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్ పిలుపునిచ్చారు. ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెకు పెద్ద ఎత్తున తరలిరావాలంటూ ఆదివారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో సమ్మె గోడ పత్రాలను విడుదల చేశారు. నాయకులు జి.దేవీరాజ్, శ్రీనివాసులు, ప్రసాద్, కిశోర్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాటాలకు సిద్ధం

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని రెడ్డి సామాజిక వర్గాల వారి హక్కుల సాధనకు పోరాటాలకు సిద్ధమవ్వాలని అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్జీవో సభా భవనంలో అఖిల భారత రెడ్డి సంఘం తొలి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి మురుకూటి రామభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్‌కు ఛైర్మన్ నియమించాలన్నారు. రూ.2 వేల కోట్లను బడ్జెట్‌ను కేటాయించి, పేదలకు వ్యక్తిగత రాయితీ రుణాలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రెడ్లకు అన్యాయం జరిగితే సంఘం అన్ని విధాల న్యాయం జరిగేలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లదిమ్మ రెడ్డివెంకటేశ్వరరెడ్డి, మహిళా నాయకులు పొన్నపురెడ్డి శకుంతలరెడ్డి, గజ్జల వేమారెడ్డి, ఎమ్వీ రమణారెడ్డి, బీఎల్.పుల్లారెడ్డి, జ్యోతికరెడ్డి, నంద్యాల చంద్రశేఖర్‌రెడ్డి, బి.నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొండాపురం, న్యూస్‌టుడే: కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలోని కొండాపురం మండలం పి.అనంతపురం క్రాస్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని- కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం హావేరి జిల్లాకు చెందిన రియాజ్, అహమ్మద్ ద్విచక్ర వాహనంపై నెల్లూరు జిల్లాలోని బారాషహీద్ దర్గా రొట్టెల పండగకు వెళ్లి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో ఇరువురు గాయపడ్డారు. క్షతగాత్రున్ని 108 అంబులెన్స్‌లో తాడిపత్రిలోని వైద్యశాలకు తరలించారు.

మద్యం సీసాల స్వాధీనం

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: అక్రమంగా మద్యం తరలిస్తున్న బొజ్జా ప్రసాదును ఆదివారం అరెస్టు చేశామని ఎస్సై కొండారెడ్డి తెలిపారు. అగ్రహారం సమీపంలో బొజ్జా ప్రసాదు 30 మద్యం సీసాలను తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. అతనిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

మాదిగ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

సమావేశంలో పాల్గొన్న మాదిగ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

మైదుకూరు, న్యూస్‌టుడే : మాదిగ ఉద్యోగుల సంఘం మైదుకూరు మండలం కమిటీని ఆదివారం స్థానిక జోసెఫ్‌పేటలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు పిచ్చుకబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్న సమావేశంలో అధ్యక్షుడిగా నారు సురేష్, ఉపాధ్యక్షుడిగా సత్యాల బాలసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శిగా మన్నేపల్లె గోపాల్, సహాయ కార్యదర్శిగా దేవగుడి రామకృష్ణ, కోశాధికారిగా ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా రాజేష్‌లను ఎన్నుకున్నారు. అంతకుముందు బాబుజగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రతినిధులు ఈరీ జోనేష్, హరినాథ్, చుక్కా ఓబులేసు, మున్నెపల్లి లక్ష్మయ్య, యల్లుగాళ్ల బాలాజీ, కొడవకంటి ఆనందరావు, ఎమ్మార్పీఎస్ నాయకుడు మానికింది వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీ అమలేది?

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను ఏ విధంగా మోసం చేస్తున్నదో ప్రజలకు వివరించాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బద్వేలులోని బయనపల్లెలో జరిగిన వైకాపా బద్వేలు నియోజక వర్గ స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయని విషయాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. వైకాపా నాయకులు, కార్యకర్తలపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, వైకాపా నాయకులు ఆదిత్యారెడ్డి, ఏడు మండలాల పార్టీ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రథమ వర్ధంతి

ప్రేమ, ఆప్యాయతలు మాకు పంచి, కుటుంబ ఉన్నతి కోసం అహర్నిశలు శ్రమించి, అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన కీ.శే. కురుకూటి వెంకటరామదాస్ గారు మా మధుర జ్ఞాపకాలు మరువలేకున్నాం.

కీ॥శే॥ కురుకూటి వెంకటరామదాస్
(ఉప్పలూరు దాస్)

ఇట్లు: కుటుంబ సభ్యులు
ఉప్పలూరు, ముద్దనూరు మండలం.

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

పేదల సంక్షేమమే మానవత సంస్థ ధ్యేయం

వేంపల్లె, న్యూస్‌టుడే : పేదల కన్నీరు తుడవడమే మానవత సేవా సంస్థ లక్ష్యమని సంస్థ జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో ఆదివారం మానవత సేవా సంస్థ మండలశాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ యోగీశ్వరబాబు, ఉపాధ్యక్షుడిగా తేజ, కార్యదర్శిగా చైతన్య, కోశాధికారిగా సుభాష్, ఇతర కమిటీ సభ్యులతో జిల్లా అధ్యక్షుడు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ సేవలను విస్తరిస్తామన్నారు. ఆపదలో ఉన్న పేదలను ఆదుకునేందుకు నూతన కార్యవర్గం సాయమందించాలన్నారు. మండల ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, సంస్థ ప్రతినిధులు డాక్టర్ రంగయ్య, డాక్టర్ రాజారాం, కవి వరప్రసాద్‌రావు, భాస్కర్‌రెడ్డి, కావలి కృష్ణతేజ పాల్గొన్నారు.

తిరుమలకు భక్తుల పాదయాత్ర

తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం, న్యూస్‌టుడే : వెంకటేశ్వర స్వామి భక్తులు చేపట్టిన తిరుమల పాదయాత్రకు ఎలాంటి ఆటంకాలు లేకుండా దిగ్విజయంగా సాగాలని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దచెప్పలి పరిసర గ్రామాలకు చెందిన సుమారు 300 మంది భక్తులు ఆదివారం తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. భక్తుల ఆహ్వానం మేరకు పుత్తా హాజరై భక్తులతో కలిసి పెద్దచెప్పలిలోని ఎల్లమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు వాసుదేవరెడ్డి, నాగిరెడ్డి, జయరామిరెడ్డి, రమేష్, తోట వెంకటేష్, సుధాకర్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
కడప: 8008573428, 8074174832
పులివెందుల : 8008573466
కమలాపురం: 8008573475

స్పందనకు వందనం

● వేంపల్లెలోని మౌనీబాబాస్వామి ఆలయం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటికి గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది అడ్డుకట్ట వేశారు. ఈ విషయమై ఈ నెల 5న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన గ్రామపంచాయతీ ఈవో మాధవరెడ్డి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటికి అడ్డుకట్ట వేసి రోడ్డును బాగు చేయించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. **-న్యూస్‌టుడే, వేంపల్లె**

?: వేంపల్లెలోని బొడ్డుచావిడివీధి సర్కిల్‌లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాను. **-వెంకటరమణ, వేంపల్లె.**

✓: వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయిస్తాం. **-మాధవరెడ్డి, గ్రామపంచాయతీ ఈవో, వేంపల్లె.** **-న్యూస్‌టుడే, వేంపల్లె.**

?: కడప కోటిరెడ్డి కూడలి వద్ద సిగ్నల్ లైట్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. చర్యలు తీసుకోవాలి. **- కృష్ణ, కడప**

✓: ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. **- జావెద్, ట్రాఫిక్ సీఐ**

?: కడప రాజారెడ్డివీధిలో మురుగు కాలువలను శుభ్రం చేసి మట్టిని రోడ్డుపైనే వేయడంతో దుర్వాసన వస్తోంది. **- కిరణ్‌కుమార్, రాజారెడ్డి**

?: కడప బీకేఎం వీధిలో కాలువలు పూడికలతో నిండిపోయాయి. దీంతో మురుగు ముందుకు కదలడం లేదు. **- రజనీకాంత్, వ్యాపారి**

✓: మురుగు కాలువల్లో పూడికలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- చంద్రశేఖర్, వైద్యాధికారి, నగరపాలక,** **- న్యూస్‌టుడే, చిన్నచౌకు**

అమ్మ... భౌబోయ్

సభాపతి రోడ్డుపై సంచరిస్తున్న కుక్కల గుంపు

బిల్టప్, కడప న్యూస్‌టుడే : కడప నగరంలో శునకాలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ద్విచక్రవాహనదారులు, పాదచారులపై గుంపులుగా వచ్చి దాడులు చేస్తున్నాయి. దీంతో వీధుల్లో వెళ్లాలంటేనే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడి నుంచి ఏ కుక్క వచ్చి కరుస్తుందోనని హడలిపోతున్నారు. వీటి నియంత్రణకు మున్సిపల్ సిబ్బంది చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. కొత్తవారు వీధుల్లో తిరగాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. నగరంలోని సభాపతి నగర్, రాజారెడ్డివీధి, హౌసింగ్‌బోర్డుకాలనీ, ఓం శాంతినగర్, ఎన్జీవో కాలనీ, మోచంపేట, తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. ఇటీవల మోచంపేటలో కుక్కలు ఓ బాలుడిని వెంటాడి గాయపరిచాయి. రామరాజుపల్లెలో చిన్నారులపై దాడి చేశాయి. ఎన్జీవో కాలనీ, ప్రధాన రహదారిపై ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా నగరపాలక సిబ్బంది నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నగరంలో కుక్కలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే తప్పదు భారీ మూల్యం

కుక్కల దాడిలో గాయపడి సకాలంలో చికిత్స పొందకపోవడంతో కొందరు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా రేబిస్ సోకే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నగరంలోని రాజీవ్ మార్గ్, రామరాజుపల్లి, అశోక్‌నగర్, మోచంపేటలో ఇటీవల కుక్క కాటుకు గురైన బాధితులు అధికమయ్యారు. ఏ కుక్క కరిచినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

నియంత్రణ చర్యలు శూన్యం

నగరంలో కుక్కల సంతతి పెరగకుండా శస్త్ర చికిత్సలు చేయాల్సిన మున్సిపల్ సిబ్బంది అలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. కుక్కల దాడి ఘటనలు జరిగినప్పుడు మాత్రం హడావుడి చేస్తూ కొన్ని కుక్కలను పట్టుకుని శివారు ప్రాంతాల్లో వదిలేస్తున్నారు. అవి కొద్దిరోజులకు మళ్లీ నగరంలోకి వస్తున్నాయి.

ఒంటరిగా వెళ్లాలంటే భయం..భయం..

కుక్కలు గుంపులుగా తిరుగుతూ చిన్నారులు, వృద్ధులపై దాడి చేస్తున్నాయి. రాత్రివేళల్లో పాదచారులు, ద్విచక్రవాహనదారులను వెంటాడుతున్నాయి. వాటి నుంచి తప్పించుకునేందుకు వాహనాల వేగం పెంచి అదుపు తప్పి పలువురు ప్రమాదాల బారినపడుతున్నారు. బయటకు రావాలంటేనే భయంగా ఉంది. అధికారులు స్పందించి తక్షణమే నియంత్రణ చర్యలు తీసుకోవాలి. **- ప్రేమ్‌కుమార్, ఎన్జీవో కాలనీ**

చర్యలు చేపడుతున్నాం

నగరంలో శునకాలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందిస్తున్నాం. కుక్క కాటు బారినపడిన వారు సకాలంలో టీకా చేయించుకోవాలి. వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. **- చంద్రశేఖర్, ఎంహెచ్‌వో, కడప**

తెదేపాలో 16 కుటుంబాల చేరిక

తెదేపాలో చేరిన వారితో పార్థసారథిరెడ్డి, జోగిరెడ్డి

వేముల, న్యూస్‌టుడే : పెండ్లూరులో ఆదివారం 16 కుటుంబాలు తెదేపాలో చేరాయి. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా తెదేపా ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ ఛైర్మన్ జోగిరెడ్డి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏడాది నుంచి పేదల సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. అనంతరం గ్రామానికి చెందిన రామిరెడ్డి, నరసింహారెడ్డితో పాటు మరో 15 కుటుంబాలు తెదేపాలో చేరాయి. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు చంద్రరెడ్డి, భాస్కర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఓబుళరెడ్డియాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండూరులో మస్తాన్ స్వామి ఉరుసు

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : కొండూరులో సోమ, మంగళవారం మస్తాన్ స్వామి ఉరుసు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం గంధం, రాత్రికి స్వామి వారి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నవ దంపతులకు గాయాలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఒంటిమిట్ట అలుగునక వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నవ దంపతులకు గాయాలయ్యాయి. సిద్దవటం మండలం పార్వతీపురం నుంచి నారాయణ సురేంద్ర (26), ఆయన సతీమణి ఉమాదేవి (20) అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లెకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రాజంపేట నుంచి కడప వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీరికి నాలుగు నెలల కిందటే వివాహమైందని కుటుంబ సభ్యులు తెలిపారు.

వేంపల్లెలో గంజాయి పట్టివేత

కడప, న్యూస్‌టుడే : వేంపల్లెకు గంజాయి బ్యాచ్ మూలాలు చేరాయి. పట్టణానికి చెందిన ఇద్దరు యువకుల నుంచి గంజాయి పొట్లాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాలుగు రోజుల కిందట రాత్రి వేళ మార్కెట్ ప్రాంతంలో పోలీసులు గస్తీ తిరుగుతుండగా ఇరువురు యువకులు గంజాయి పొట్లాలతో ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు అప్రమత్తమయ్యేలోగా ఓ యువకుడు పారిపోగా మరో యువకుడు ద్విచక్రవాహనంతో సహా పట్టుబడ్డాడు. సదరు వ్యక్తి ఓ టీవీ ఛానల్‌లో వీడియో గ్రాఫర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం అందింది. వీరికి గంజాయి బ్యాచ్‌తో ఉన్న పరిచయాలు, ఇతరత్రా విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

ఒంటిమిట్టలోని సీతాపురంలో..

కడపలోని పీర్లచావిడి వద్ద ప్రార్థనలు చేస్తున్న తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : మొహర్రంను కులమతాలకతీతంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కడప, కమలాపురం, పులివెందుల నియోజకవర్గాలలోని పీర్ల చావిడి వద్ద స్థానికులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చింతలమడుగుపల్లెలో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కమలాపురంలో..

ఆలయాల్లో పూజలు... తరలి వచ్చిన భక్తులు

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కడప, కమలాపురం, పులివెందులలోని అన్ని ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పలు ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. **- న్యూస్‌టుడే, కడప బృందం**

సిద్దవటంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



కమలాపురంలో పూజలందుకుంటున్న మోక్షనారాయణస్వామి

పెండ్లిమర్రిలోని వెయిమానుల కోనలో లక్ష్మీనరసింహ స్వామి

వైదికాలపల్లెలో పూజలందుకుంటున్న చెన్నకేశవస్వామి

పులివెందులలో సత్యనారాయణ స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

తెదేపా నాయకుల ప్రత్యేక పూజలు

గంగమ్మ ఆలయం వద్ద టెంకాయలు కొడుతున్న తెదేపా నాయకులు

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని మాధవరం-1 పరిధిలోని శీతల గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం తెదేపా నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గానికి తెదేపా ఇన్‌ఛార్జిగా మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడును నియమించాలని కోరుతూ రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ తెదేపా వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి ఎన్ఆర్ఐ చంద్ర 216 టెంకాయలు కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ చంద్ర, తెదేపా రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు భగవాన్ సహాయరెడ్డి, పుత్తా రామచంద్రయ్య మాట్లాడుతూ.. రాజంపేట నియోజకవర్గంలో తెదేపా మరింత బలోపేతం అయ్యేందుకు మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగలరాయుడు సేవలు అవసరమన్నారు. నాయకులు రామమోహన్, శ్రీకాంత్, రవికుమార్, హరి, కిరణ్‌స్వామి, పుత్తా సుధీర్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

మాట్లాడుతున్న తెదేపా పరిశీలకుడు రఘునాథరెడ్డి

వేంపల్లె, న్యూస్‌టుడే : గ్రామాల్లోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెదేపా పరిశీలకుడు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉద్యోగ మేళా నిర్వహించారు. కొప్పర్తి డిక్సన్ టెక్నాలజీ, ఆక్టీక్ ఎలివేటర్స్, శ్రీ వీరాంజనేయ సర్వీస్ కంపెనీలు మేళాలో పాల్గొని 74 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సహకారంతో నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నారాయణరెడ్డి, యల్లమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్లు రామమునిరెడ్డి, బాలస్వామిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, తెదేపా మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, మహమ్మద్, వేమకుమార్, జబీబుల్లా, మడక శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్తు సంస్థల ప్రైవేటీకరణ నిలిపేయాలని డిమాండ్

నినాదాలు చేస్తున్న కార్మికులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : విద్యుత్తు సంస్థలను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని విద్యుత్తు ఉద్యోగుల ఒప్పంద ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిస్కం అధ్యక్షుడు శివశంకర్ పేర్కొన్నారు. ఒంటిమిట్ట 33/11కేవీ విద్యుత్తు ఉప కేంద్రంలో కార్మిక సంఘం నాయకులు ఆదివారం సమావేశమై ఈ నెల 9న నిర్వహించే సమ్మెను జయప్రదం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. శ్రీనివాసులు, శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలని యత్నించడం దారుణమని మండిపడ్డారు. అనంతరం డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.పెద్దయ్య, ప్రధాన కార్యదర్శిగా ప్రేమ్‌కుమార్, కోశాధికారిగా రాంప్రసాద్ ఎన్నికయ్యారు.

జూదరుల అరెస్టు

చెన్నూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బుడ్డాయపల్లె సమీపంలో జూదం ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు సీ.ఐ కృష్ణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వారి నుంచి రూ.34,550 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందుల సమీపంలోని కదిరి రోడ్డులో జూదమాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు పులివెందుల ఎస్ఐ నారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వారి నుంచి నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

వాగ్దేవి ట్రస్టు ఛైర్మన్‌గా సుబ్బారెడ్డి

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : వాగ్దేవి ట్రస్టు ఛైర్మన్‌గా ఐఎఫ్ఎస్ విశ్రాంత అధికారి టీవీ సుబ్బారెడ్డి ఆదివారం సీకేదిన్నె మండలంలోని ఎడిపై పాఠశాలలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాగ్దేవి ట్రస్ట్ ద్వారా సమాజసేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ట్రస్టు కార్యదర్శి మద్దిలేటిరెడ్డి, కోశాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకూ తప్పని అవస్థలు

అపరిశుభ్రంగా శ్మశాన వాటిక

సింహాద్రిపురం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని కొత్తూరు శ్మశానవాటికలో సరైన వసతులు కల్పించకపోవడంతో అంత్యక్రియలు చేసేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వందేళ్లకు పైగా ఈ ప్రాంతాన్నే శ్మశాన వాటికగా వినియోగిస్తున్నారు. అలాంటి ప్రాంతంలో కొన్నేళ్లుగా చెత్తాచెదారాన్ని పడేస్తుండటంతో అపరిశుభ్రత నెలకొంది. మృతదేహాలకు అంత్యక్రియలు చేసేందుకు గోతులు తీస్తే వాటిల్లో మొత్తం చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు బయటకు వస్తున్నాయి. వీటితో పాటు కర్మకాండలు, స్నానాలు చేసేందుకు నీటి వసతి కూడా కల్పించలేదు. శ్మశానవాటిక మొత్తం ముళ్లపొదలతో ఉండటంతో అంత్యక్రియలు చేసేందుకు స్థలం సమస్యగా మారింది. దీంతో గతంలో మృతదేహాలను ఖననం చేసిన చోటే మళ్లీ గుంతలు తవ్వి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. శ్మశానవాటికకు ప్రహరీ లేకపోవడంతో కుక్కలు గుంతలు తవ్వుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై సింహాద్రిపురం ఎంపీడీవో శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలించి వసతుల కల్పనకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామన్నారు.

నియోజకవర్గ బాధ్యతలను బలిజలకు అప్పగించాలని వినతి

మంత్రి నారాయణకు జ్ఞాపిక అందజేస్తున్న తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : పురపాలక శాఖ మంత్రి నారాయణను జిల్లా బలిజ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం నెల్లూరులోని మంత్రి నివాసంలో తెదేపా రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ నేతృత్వంలో బలిజ సంఘం నాయకులు ఆయనను కలిసి పలు సమస్యలను వివరించారు. రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గంలో బలిజలు అధికంగా ఉన్న నేపథ్యంలో నియోజకవర్గ బాధ్యతలను బలిజ సామాజిక వర్గానికి కేటాయించాలని, ఆ దిశగా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం కడప అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. అనంతరం మంత్రిని సత్కరించి జ్ఞాపిక అందించారు. నాయకులు బండిబాబు, బండారు రత్నసభాపతి, విజయభాస్కర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

వేంపల్లె, న్యూస్‌టుడే : వేంపల్లెలో నెలకొన్న తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకొంటున్నట్లు సర్పంచి శీను తెలిపారు. స్థానిక పాపఘ్ని నదిలోని తాగునీటి ఫిల్టర్లలో భూగర్భ జల మట్టం అడుగంటి గండిరోడ్డు, పుల్లయ్యతోట ప్రాంతాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. విషయం తెలుసుకున్న సర్పంచి పాపఘ్ని నదిలోని ఫిల్టర్లను పరిశీలించారు. గండిరోడ్డు, పుల్లయ్యతోట, శ్రీరాంనగర్ వాసులకు ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేశారు. పుల్లయ్యతోటలో ఉన్న తాగునీటి బోరులో అదనపు పైపులు దింపించి సత్వరం తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి కొత్తగా బోర్లు వేయిస్తామని తెలిపారు.

రోటరీక్లబ్ సేవల విస్తరణకు కృషి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : జిల్లాలో రోటరీక్లబ్ సేవలు విస్తరింపజేస్తామని డాక్టర్ వారణాసి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. నాగరాజుపేటలోని వారణాసి హాస్పిటల్‌లో ఆదివారం రోటరీక్లబ్ కాలమానిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ ఏడాది 'యూనిటీ ఫర్ గుడ్' అనే నినాదంతో సేవలు ప్రారంభించామన్నారు. సామాజిక సేవలో రోటరీక్లబ్‌కు ప్రత్యేక ముద్ర కలిగి ఉండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జోనల్ సెక్రటరీ భాస్కర్, రోటరీ ప్రెసిడెంట్ శివరామిరెడ్డి, సెక్రటరీ డా.పవన్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

కడప ఏడురోడ్లు: వైఎస్సార్ ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయ విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కడప నగరంలోని వై.జంక్షన్ వద్ద ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. విద్యార్థులు నాలుగు రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నారన్నారు. వారికి అండగా ఆర్ఎస్‌యూ ఉంటుందన్నారు. ఆర్ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, నగర అధ్యక్షుడు గురుమోహన్, నాయకులు కొండయ్య, లక్ష్మీ చెన్నకేశవ, ప్రమోద్, విశాల్, కరీముల్లా పాల్గొన్నారు.

చాతుర్మాస దీక్ష ప్రారంభం

వెలిదండ్ల (లింగాల), న్యూస్‌టుడే : రామాయణ, మహాభారతం, భగవద్గీత ప్రతి ఒక్కరికీ జ్ఞానాన్ని ఇస్తాయని వేదపండితుడు దత్త మునీంద్రస్వామి పేర్కొన్నారు. వెలిదండ్ల వరదరాజ స్వామి ఆలయం వద్ద ఆదివారం నుంచి నవంబరు 5 వరకు నిర్వహించే చాతుర్మాస దీక్ష, తొలి ఏకాదశి ప్రారంభ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు వెన్నపూస నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

మహారాజశ్రీ జిల్లా ప్రధాన జడ్జి వారి కోర్టు, కడప
E.P.No. 78/2024 / O.S.No. 31/2014

1. కె.వెంకటేశ్వర్లు, తండ్రి కె. నరసింహులు, హిందూ, వయస్సు, సుమారు 42 సం॥లు., ఎలక్ట్రీషియన్, డి.నెం. 19/225-4, సాయిపేట వీధి, కడప సిటీ.
2. ఆర్.భరత్, తండ్రి హెచ్.రమేష్ చౌదరి, హిందూ, వయస్సు సుమారు 19 సం॥లు, డి.నెం. 17/254, బి.కె.యం వీధి, కడప సిటీ.
3. కె.సుబ్బరాయుడు, తండ్రి కె. వెంకటసుబ్బయ్య, హిందూ, వయస్సు సుమారు 39 సం॥లు, డి.నెం. 9/233, సాయిపేట వీధి, కడప సిటీ.
4. కె.మురళి, తండ్రి కె.నరసింహులు, వయస్సు సుమారు 37 సం॥లు, డి.నెం. 9/225, సాయిపేట వీధి, కడప సిటీ. ...పిటీషనర్లు/ DHr's

Vs

కోట సుజాత, భర్త కె. ప్రసాద్, హిందూ, వయస్సు సుమారు 44 సం॥లు, డి.నెం. 17/25, మండీ బజార్, కడప సిటీ. ...రెస్పాండెంట్/ JDr's

నోటీసు

EP షెడ్యూలు దాఖలా ఆస్తిని రిజిస్టరు చేయమని కోరుచూ పిటీషను దాఖలు చేసినందున ఇందు విషయమై ఆక్షేపణలు ఉన్న యెడల 8.7.2025వ తేదీన పగలు గం॥ 10.30 ని॥లకు పై కోర్టులో ఖుద్దున గానీ, వకీలు వారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మాణం చేయుదురని తెలియజేయడమైనది.

సం॥ ఎం. నాగిరెడ్డి, పిటీషనర్ల న్యాయవాది.

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

పులివెందుల, న్యూస్‌టుడే : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పులివెందులలో భాజపా నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పులివెందులలోని విద్యాధరి పాఠశాలలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డి, భాజపా సాంస్కృతిక విభాగం కన్వీనర్ భానుప్రకాష్, నాయకులు తిరుపాల్‌రెడ్డి, తరుణ్, దామోదర్, గణేష్, చరణ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

మహిళకు కరపత్రం అందజేస్తున్న తెదేపా నాయకులు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : ప్రజా సంక్షేమమే తెదేపా లక్ష్యమని తెదేపా నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప నగరం పదో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. నాయకులు రవిశంకర్‌రెడ్డి, మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ గొప్ప దేశ భక్తుడు



కాంగ్రెస్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేంపల్లె, న్యూస్‌టుడే : మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ గొప్ప దేశభక్తుడని మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలలో 50 సీట్లకు మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇచ్చినా దాన్ని వద్దని కూటమి ప్రభుత్వం లేఖ రాయడం సరికాదన్నారు. 2020లో కడపలో ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయం ప్రారంభమైనా ఇంత వరకు దిల్లీలోని కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నుంచి అనుమతి రాలేదన్నారు. జిల్లాపై సీఎంకు ఎందుకంత వివక్ష అని ప్రశ్నించారు. జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, నాయకులు ఉత్తన్న, వేమా రాజా, రాఘవయ్య, పాల్గొన్నారు.

కడప గ్రామీణ, న్యూస్‌టుడే : బాబు జగ్జీవన్‌రామ్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు అలీఖాన్, సిరాజుద్దీన్, ప్రసాద్‌గౌడ్, గౌస్‌పీర్, ముబారక్ పాల్గొన్నారు.

● ఏపీ ట్రాన్స్‌కో సీఈ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఈ కృష్ణకుమార్, ఎస్ఈ మూర్తి, శ్రీనివాసరావు, విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరభద్రయ్య పాల్గొన్నారు.

వేంపల్లెలో బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నమస్కరిస్తున్న తులసిరెడ్డి, నాయకులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu